ఆలోచనలు విరియాలి.. ఆవిష్కరణలు మెరవాలి..!

ప్రతి విద్యార్థిలో ఏదో ఒక ప్రతిభ దాగి ఉంటుంది. పాఠశాల స్థాయిలోనే సృజనాత్మకత వెలికితీసేందుకు 'ఈనాడు వైజ్ఞానిక ప్రదర్శన' నిర్వహిస్తోంది. విద్యార్థి ఆలోచనలతో ప్రయోగాలు చేసేలా ప్రోత్సహిస్తోంది. ఇందులో భాగంగా 'డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ మెమోరియల్ యూనివర్సిటీ హాల్, బుల్లయ్య కాలేజ్ వద్దన, రామా టాకీస్ దరి, విశాఖపట్నం'లో ఫిబ్రవరి 24వ తేదీన మెగా సైన్స్ ఫెయిర్ నిర్వహిస్తోంది.

GGU GODAVARI GLOBAL UNIVERSITY RAJAMAHENDRAVARAM, A.P.

ఈనాడు



నమోదు కొరకు: 8639814432
సమయం: ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గం॥ల వరకు..

నిబంధనలు.. ● 6 నుంచి 10 తరగతుల విద్యార్థులకు మాత్రమే. ● ప్రాజెక్టును ముందుగా నమోదు చేసుకోవాలి. ● ఒక ప్రాజెక్టుకి ఇద్దరు విద్యార్థులకు అనుమతి. ● పాఠశాల/ బ్రాంచ్‌కి ఒక ప్రాజెక్టుకు మాత్రమే అనుమతి. ● మొదటి ముగ్గురు విజేతలకు బహుమతులు ఉంటాయి. ● పాల్గొన్న విద్యార్థులకు సర్టిఫికెట్స్ ప్రదానం. రిజిస్ట్రేషన్ చివరి తేదీ : ఫిబ్రవరి 20

బాలల ఆరోగ్యంపై దృష్టి

విశాఖపట్నం: అంబేడ్కర్ గురుకులాల్లో విద్యార్థుల చదువు, ఆరోగ్యంపై పీజీటీలు ప్రత్యేకంగా దృష్టి సారించాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయ స్వామి సూచించారు. గురుకుల విద్యాలయాల్లో 250 మంది టీజీటీలకు పీజీటీలుగా పదోన్నతి లభించిన సందర్భంగా వారు మంత్రిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

ఈనాడు అల్లూరి సీతారామరాజు

బుధవారం 18 ఫిబ్రవరి 2026

ముత్యమంత పసుపు.. ముమ్మరంగా సేకరణ

రెండేళ్ల తర్వాత పెరిగిన ధర

పాడేరు, న్యూస్‌టుడే

పసుపు సాగు చేస్తున్న గిరి రైతులకు తీపికబురు. రెండేళ్ల తర్వాత ధర పెరిగింది. ప్రస్తుతం కేజీ రూ. 140 వరకు పలుకుతోంది. మూడేళ్లుగా రూ.60కి మించి ధర రాకపోవడంతో రైతులు నష్టపోయారు. ఏజెన్సీలో వాణిజ్య పంటగా పసుపు పండిస్తున్నారు. సుమారు 20 వేల హెక్టార్లలో పసుపు సాగవుతోంది. 2018 వరకు కేజీ ధర రూ.150 ఉండేది. ఆ తర్వాత నుంచి ధర తగ్గుతూ వచ్చింది. రెండేళ్ల కిందటి వరకు కేజీ రూ.80 - రూ.90 వరకు ఉండగా.. ఆ తర్వాత రూ.60 - రూ. 65కి పడిపోయింది.

గూనలంక గ్రామంలో పసుపు తవ్వకాలు చేస్తున్న రైతులు

■ ఏజెన్సీ పసుపు దిగుబడులను విక్రయించేందుకు మార్కెటింగ్ సదుపాయం కల్పించాలని ఎప్పట్నుంచో కోరుతున్నా.. ఫలితం లేదు. సంతల్లో వ్యాపారులు చెప్పిన ధరకు అమ్ముకోవాల్సిన దుస్థితి. ఐటీడీఏ ఆధ్వర్యంలో జీసీసీ కొనుగోలుకు ముందుకు వస్తే మేలు జరుగుతుందని చింతపల్లి మండలం బయలు కించంగికి చెందిన రైతులు నాగేశ్వరరావు, వసంత్‌రాజ్, చిరంజీవి, రాములు పేర్కొన్నారు.

■ మన్యంలో చింతపల్లి, హుకుంపేట, పెదబయలు, జి.మాడుగుల, ముంచంగిపుట్టు, అరకులోయ మండలాల్లో పసుపు అధికంగా సాగవుతోంది. కొద్దిరోజులుగా పసుపు తవ్వకం, ఉడికించడం, ఆరబెట్టే పనుల్లో రైతులు నిమగ్నమయ్యారు. మూడు వారాలుగా హుకుంపేట, పాడేరు, జి.మాడుగుల, చింతపల్లి సంతల్లో వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారు.

■ ఏజెన్సీవ్యాప్తంగా గిరిజనులు పండించే పసుపునకు ప్రత్యేకంగా మార్కెటింగ్ సదుపాయం లేదు. ఫలితంగా రైతులకు గిట్టుబాటు ధర రావడం లేదు. సాగును ప్రోత్సహించేందుకు గిరిజన సహకార సంస్థ (జీసీసీ), ట్రైఫెడ్ రైతులకు విత్తనాలు, పసుపును ఉడికించే యంత్రాలను రాయితీపై అందజేస్తే పెట్టుబడి ఖర్చులు తగ్గి మరింత మంది ముందుకొస్తారు. తద్వారా సాగు విస్తీర్ణం పెరుగుతుంది. ఆ దిశగా జీసీసీ, ట్రైఫెడ్ దృష్టి సారించాల్సిన అవసరముంది.

ఉపాధిలో అద్వితీయం!

వందరోజుల పనిదినాల కల్పనలో జిల్లా ప్రథమం

పాడేరు పట్టణం, న్యూస్‌టుడే

రాష్ట్రంలో ఉపాధి కూలీలకు వంద రోజులు పని దినాలు కల్పించడంలో జిల్లా అగ్రస్థానంలో నిలిచింది. ముఖ్యంగా పనులు, అంచనాలను గుర్తించి లక్ష్యాలను చక్కగా నిర్దేశించుకోవడంతోనే ఈ ఘనత సాధించినట్లు అధికారులు చెబుతున్నారు. కలెక్టర్ దినేష్‌కుమార్ సైతం కూలీలకు వంద రోజుల పని కల్పించడంలో గుర్తింపు లభించినందుకు రాష్ట్ర గణతంత్ర దినవేడుకల్లో పథకం అధికారులు, క్షేత్ర స్థాయి సిబ్బందిని మెచ్చుకున్నారు. ఇదే ఉత్సాహంతో భవిష్యత్తులో మరిన్ని పనులు చేపట్టాలని ఆకాంక్షించారు.

ఉపాధి హామీలో భాగంగా తవ్విన నీటి కుంట

ఉమ్మడి అల్లూరి జిల్లాలో ఉపాధి హామీ అమలు తీరిలా...	
వేతన లక్ష్యం	: రూ. 327 కోట్లు
మెటీరియల్ లక్ష్యం	: రూ.287 కోట్లు
కూలీలు	: 3.27 లక్షలమంది
ఆధారపడిన కుటుంబాలు	: 1.63 లక్షలు
ప్రధాన పనులు : పంట, ఊట కుంటలు, అమృత్ సరోవర్, రాతి కట్టడాలు	

సహజ వనరులు సంరక్షించేలా.. ఉపాధి హామీలో స్థానికంగా ఉన్న సహజ వనరులను సంరక్షించే పనులకు ప్రాధాన్యమివ్వాలి. జిల్లా జల యాజమాన్య సంస్థ (డ్వామా) అధికారులు క్షేత్రస్థాయిలో సర్వే చేపట్టి ఏ పనులు అవసరమో సరిగ్గా అంచనా వేస్తున్నారు. సాగునీటి వనరుల వృద్ధి, సంరక్షణ పనులు ఎక్కువగా చేపట్టడంతో భూసారం పెరిగి వ్యవసాయ, ఉద్యాన పంటలు సమృద్ధిగా పండుతున్నాయి. కూలీలకు ఆటంకం లేకుండా పని లభ్యమవుతోంది. కొన్ని జిల్లాల్లో పనులు గుర్తించడంలో అధికారులు విఫలం చెందడం కారణంగా కూలీలకు పూర్తిస్థాయిలో ఉపాధి దక్కడం లేదు. జిల్లాలో ఈ సమస్య రాకుండా అడిగిన వెంటనే పని కల్పించడంతో కూలీలు సంతృప్తి వ్యక్తపరుస్తున్నారని డ్వామా ప్రాజెక్ట్ డైరెక్టర్ విద్యాసాగరరావు పేర్కొంటున్నారు.

100 రోజులు పని లభించిన కుటుంబాల వివరాలివీ..

సంవత్సరం	కుటుంబాలు
2022-23	15,172
2023-24	43,314
2024-25	48,639
2025-26 (జనవరి నాటికి)	26,097

విద్యుత్తు వినియోగం, వ్యయాల తగ్గింపే లక్ష్యం

విశాఖపట్నం: విద్యుత్తు వినియోగం, వ్యయాల తగ్గింపే లక్ష్యంగా కృషి చేస్తున్నామని ఏపీఈపీడీసీఎల్ సీఎండీ ఇమ్మడి పృథ్వీతేజ్ తెలిపారు. విద్యుత్తు సరఫరాలో వ్యయాలను తగ్గించడంతో పాటు స్థిరమైన గ్రిడ్ నిర్వహణ లక్ష్యంగా 'ఎనర్జీ కాస్ట్ సేవింగ్స్ - డిమాండ్ రెస్పాన్స్'పై ఐఐటీ మద్రాస్‌లోని అంకుర సంస్థ ఎలిమెంట్స్ ఎనర్జీ ఆధ్వర్యంలో ఈపీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయంలో సోమవారం కార్యశాల నిర్వహించారు. విద్యుత్తు వినియోగంపై అవగాహన కల్పించేందుకు ఎలిమెంట్స్ ఎనర్జీ సహకారంతో ప్రజలకు అవగాహన కల్పించనున్నామన్నారు.

మాచ్‌ఖండ్‌లో విద్యుదుత్పత్తి నిలిపివేత

ముంచంగిపుట్టు గ్రామీణం, న్యూస్‌టుడే: ఆంధ్ర, ఒడిశా ఉమ్మడి నిర్వహణలో ఉన్న మాచ్‌ఖండ్ జల విద్యుత్కేంద్రంలో విద్యుదుత్పత్తిని అధికారులు నిలిపివేశారు. ప్రాజెక్టులో విద్యుత్తు ఉత్పత్తికి అవసరమైన నీటిని చేరవేసే టీపీ డ్యాం నుంచి విద్యుత్తు కేంద్రానికి ఆశించిన స్థాయిలో నీరు చేరకపోవడంతో మంగళవారం ఈ నిర్ణయం తీసుకున్నారు. ఉదయం 8 గంటల సమయంలో విద్యుదుత్పత్తిని నిలిపివేసి టీపీ డ్యాంలో నీటి నిల్వలను ఖాళీ చేశారు. నీటి మట్టం తగ్గిన తర్వాత సొరంగ మార్గం వద్ద ఉన్న ట్రాస్ ర్యాక్ (జాలీలు)కు అడ్డుగా తుప్పలు ఉన్నట్లు గుర్తించారు. ప్రాజెక్టు ఈఈ (జనరేషన్) బి.గోవిందరాజులు ఆధ్వర్యంలో సిబ్బంది జాలీలకు అడ్డుగా ఉన్న తుప్పలను తొలగించారు. ఫ్లూమ్ ఛానల్ మార్గంలోనూ చెట్ల కొమ్మలను గమనించి వాటి తొలగింపు చేపట్టారు. ట్రాస్ ర్యాక్స్‌కు తుప్పలు అడ్డుపడటం వల్ల విద్యుదుత్పత్తిని నిలిపివేయాల్సి వచ్చిందని ఈఈ చెప్పారు. బుధవారం సాయంత్రానికి పునరుద్ధరిస్తామని పేర్కొన్నారు. డిప్యూటీ ఈఈ (టెక్నికల్) జి.సత్యకిరణ్, సివిల్ ఏఈ పోలరావు పాల్గొన్నారు.

సొరంగ మార్గంలో జాలీల వద్ద అడ్డుగా తుప్పలు

పడవ చూస్తే గుబులు.. ప్రయాణమంటే గుండె గుభేలు

ముంచంగిపుట్టు, న్యూస్‌టుడే

మత్స్యగెడ్డపై రాకపోకలకు గిరిజనులు నడుపుతున్న పడవ దెబ్బతినడంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు. సుజనకోట పంచాయతీ పరిధిలోని 14 గ్రామాల గిరిజనులు మత్స్యగెడ్డ దాటేందుకు నాటు పడవలు ఆశ్రయించేవారు. ఎనిమిదేళ్ల క్రితం అప్పటి తెదేపా ప్రభుత్వం వీటిని నడపటం ప్రమాదమని గుర్తించి రెండు పడవలు ఉచితంగా మంజూరు చేసింది. తాడుసాయంతో వీటిని నడుపుతూ గిరిజనులు గెడ్డ దాటేవారు. పడవ నడిపేవారు నామమాత్రపు రుసుము తీసుకుంటూ వీటిని నిర్వహించేవారు. కాగా ఈ పడవల్లో గతంలోనే ఒకటి శిథిలమై ప్రవాహంలో కొట్టుకుపోయింది.

పడవలో చేరిన నీటిని తొలగిస్తున్న గిరిజనుడు

ప్రస్తుతం వినియోగిస్తున్నది కూడా మరమ్మతుకు గురైంది. రంధ్రాలు ఏర్పడి గెడ్డనీరు పడవలోకి చేరుతుండటంతో ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు. ఒకవైపు నీటిని తోడి పారబోస్తూ.. తాడు ఆధారం చేసుకుని పడవ ప్రయాణంపై ఆధారపడి రాకపోకలు సాగిస్తున్నారు. వారపుసంతలు జరిగే రోజుల్లో 20 నుంచి 30 మందిని ఒడ్డుకు చేరవేస్తుంటామని స్థానికులు తెలిపారు. కనీసం 500 మంది రోజూ తాడు ఆధారంగా ప్రయాణం చేస్తున్నారన్నారు. కుమ్మరిపుట్టు వద్ద రాకపోకలు సాగించేందుకు ప్రభుత్వం కొత్త పడవలు మంజూరు చేయాలని గిరిజనులు కోరుతున్నారు.

ఉత్సవాల ఆదాయం రూ.17.81 లక్షలు

రావికమతం, న్యూస్‌టుడే: కల్యాణపులోవలో మహాశివరాత్రి సందర్భంగా ఈనెల 15 నుంచి 17 వరకూ మూడు రోజుల పాటు నిర్వహించిన శివరాత్రి ఉత్సవాల ద్వారా ఆలయానికి రూ. 17.81 లక్షల ఆదాయం వచ్చింది. మంగళవారంతో ఉత్సవాలు ముగియడంతో దేవాదాయ శాఖ అధికారుల పర్యవేక్షణలో హుండీ ఆదాయాన్ని లెక్కించారు. హుండీల్లో కానుకల రూపంలో రూ. 11,48,362 వచ్చాయి. ప్రత్యేక దర్శనం టిక్కెట్లు ద్వారా రూ. 3,55,330, ప్రసాద విక్రయం ద్వారా రూ. 1,23,290, కేశఖండన ఆదాయం రూ. 44,275 వచ్చినట్లు ఈవో ఎస్.వి.వి.సత్యనారాయణ మూర్తి తెలిపారు. గతేడాది కంటే రూ. 4,38,477 పెరిగినట్లు ఆయన తెలిపారు.

విన్యాసాలను తిలకించడానికి వచ్చిన నగరవాసులు

విశాఖపట్నం, న్యూస్‌టుడే : అంతర్జాతీయ ఫ్లీట్ రివ్యూ(ఐఎఫ్ఆర్)లో భాగంగా ఆర్కేబీచ్ కేంద్రంగా నిర్వహించే సిటీ పరేడ్, నౌకాదళం విన్యాసాలు, ఫైర్, డ్రోన్ షోల నిర్వహణకు రంగం సిద్ధమైంది. బుధవారం నమూనా విన్యాసాలు నిర్వహించి, గురువారం పూర్తి స్థాయి ప్రదర్శనకు ఏర్పాట్లు పూర్తి చేశారు.

'నౌకా' సంరంభం.. సాగర సంభ్రమం..!

★ సాగరతీరంలో ఇసుక తిన్నెల పైనుంచి చూసేందుకు సాధారణ ప్రజలకు ఉచితంగానే అనుమతి ఉంటుంది. ఎక్కడా తొక్కిసలాటలు లేకుండా ఇనుప గ్రిల్స్‌తో ఎన్‌క్లోజర్లు సిద్ధం చేశారు.

పార్కింగ్.. ఎల్ఈడీ తెరలు

★ నగరం నుంచి బీచ్‌రోడ్డుకు వచ్చే వారు కేజీహెచ్ డౌన్, పందిమెట్ట డౌన్, పాండురంగాపురం డౌన్‌తో పాటు వుడా పార్కు వైపు నుంచి విన్యాసాలు జరిగే ప్రాంగణానికి చేరుకోవచ్చు. ★ ఏపీఐఐసీ స్థలం, కోస్టల్ బ్యాటరీ, ఏయూ మైదానాల్లో వాహనాల పార్కింగ్‌కు అవకాశం కల్పించారు.

★ బీచ్ వరకు రాలేకపోయిన వారికి సిటీ సెంట్రల్‌పార్క్, వుడా పార్క్, సిరిపురం కూడలి గురజాడ ప్రాంగణంలో భారీ ఎల్ఈడీ తెరలు ఏర్పాటు చేశారు.

రాష్ట్రపతి ద్రౌపదీ ముర్మున్కు స్వాగతం పలుకుతున్న మేయర్ పీలా శ్రీనివాసరావు, మంత్రి డీబీవీ స్వామి, ఎంపీ శ్రీభరత్, సీపీ శంఖబ్రత బాగ్చీ, కలెక్టర్ హరేంధిరప్రసాద్



సీఎం చంద్రబాబుకు స్వాగతం పలుకుతున్న జేసీ విద్యాధరి

పాస్‌లు తప్పనిసరి..

★ ఈనెల 19న నిర్వహించే అంతర్జాతీయ సిటీ పరేడ్‌లోని అన్ని కార్యక్రమాలను 18న పూర్తిస్థాయిలో ప్రదర్శిస్తారు. బీచ్ రోడ్డులోని పార్క్‌హోటల్ కూడలి నుంచి కోస్టల్ బ్యాటరీ వరకు సాగే ఈ పరేడ్‌ను రెండు వైపుల నుంచి ప్రజలు, అతిథులు తిలకించేందుకు వీలుగా ఏర్పాట్లు చేశారు.

★ ఆర్కేబీచ్ నుంచి సబ్‌మెరైన్ మ్యూజియం వరకు 15 బ్లాకులు ఏర్పాటు చేశారు. ఆయా బ్లాకులకు అతిథులు, నౌకాదళం ఉద్యోగులు, ఇతర ముఖ్యులకు కేటాయించారు. బ్లాకుల్లోకి వెళ్లాలంటే ప్రతి ఒక్కరికీ పాస్ తప్పనిసరి.

★ ఐఎఫ్ఆర్ నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు
★ పార్క్ హోటల్ నుంచి కోస్టల్‌బ్యాటరీ వరకు సిటీ పరేడ్
★ నేడు నమూనా విన్యాసాలు, రేపు పూర్తి స్థాయి ప్రదర్శన

లేజర్ వెలుగులు.. కట్టిపడేసిన విన్యాసాలు

ఈనాడు-విశాఖపట్నం

అంతర్జాతీయ యుద్ధనౌకల సమీక్ష (ఐఎఫ్ఆర్-2026), మిలన్ వేడుకల్లో భాగంగా తూర్పు నావికా దళం ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన రిహార్సల్స్ అంబరాన్నంటాయి. యుద్ధ విమానాల నుంచి వదిలిన బాంబుల మోతతో తీరం దద్దరిల్లింది. చేతక్, ధ్రువ్, సీకింగ్ హెలికాప్టర్ల రెస్క్యూ, ఆపరేషన్ విన్యాసాలు ఆకట్టుకున్నాయి. యుద్ధ ట్యాంకర్లతో పాటు, శత్రువుల నౌకలను కూల్చే ఆయిల్ రిగ్ పేలుడు విన్యాసాలు ఒళ్లు గగుర్పొడిచాయి. గగనతలంలో మిగ్-29, హాక్ ఫైటర్ జెట్లు, పి-81 బోయింగ్ విమానాల గర్జనలు ఆకర్షణగా నిలిచాయి. సముద్రంలో ఉంచిన 71 యుద్ధనౌకలు విద్యుత్తు దీపాల వెలుగుల్లో నగరవాసులను కట్టిపడేస్తున్నాయి. కొన్ని నౌకల లేజర్ షో ఆకట్టుకుంది. సిటీ పరేడ్ రిహార్సల్స్‌లో భాగంగా ఆర్కే బీచ్ ప్రధాన వేదిక వద్ద రైఫిల్స్‌తో కంటిన్యూటీ డ్రిల్ చేపట్టారు. వివిధ పాఠశాలల విద్యార్థులు, మాజీ సైనికులు, ఎయిర్‌ఫోర్స్ సిబ్బంది బ్యాండ్స్‌తో కవాతు నిర్వహించారు.

భద్రత పటిష్ఠం తూర్పు నౌకాదళం ఆధ్వర్యంలో జరిగే కార్యక్రమాలకు సంబంధించి మూడు వారాల నుంచి జిల్లా అధికార యంత్రాంగం చేపట్టిన ఏర్పాట్లు కొలిక్కి వచ్చాయి. వివిధ దేశాలకు చెందిన యుద్ధనౌకలు, దేశ, విదేశీ ప్రముఖులు, త్రివిధ దళాలకు చెందిన ఉన్నతాధికారులు, విశ్రాంత ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు హాజరవుతున్న నేపథ్యంలో పోలీసు యంత్రాంగం పటిష్ఠ భద్రతా ఏర్పాట్లు చేసింది.

బ్యాండుతో కవాతు నిర్వహిస్తున్న విద్యార్థినులు

ఫ్లీట్ రివ్యూ కోసం బీచ్‌రోడ్డులో ఏర్పాటు చేసిన గ్యాలరీలు

నౌకను ఆయిల్ రిగ్‌తో పేల్చే నమూనా విన్యాసం

ఉత్సాహంగా పయనం.. ఉప్పెనైన శోకం!

✦ రోడ్డు ప్రమాదంలో ముగ్గురు యువకుల దుర్మరణం
✦ జాతర నుంచి తిరిగి వెళ్తుండగా దుర్ఘటన

పాడేరు, న్యూస్‌టుడే: జాతర కళ్లారా చూసి కొండంత ఆనందంతో ఇంటి ముఖం పట్టిన యువకుల బతుకులు మధ్యలోనే తెల్లారిపోయాయి. అతివేగం.. మితిమీరిన ఉత్సాహం కారణంగా మూడు నిండు ప్రాణాలు గాల్లో కలిసిపోయాయి. పాడేరు మండలం గుత్తులపుట్టు పంచాయతీ వంతలగుమ్మి వద్ద ద్విచక్రవాహనం అదుపుతప్పిన ప్రమాదంలో ముగ్గురు యువకులు మృతిచెందారు. పాడేరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హుకుంపేట మండలం గొందిరాప గ్రామానికి చెందిన సూర్యప్రకాశ్ (21), పాడేరు మండలం గేదెలపాడు గ్రామానికి చెందిన గెమ్మెలి రమేష్ (24), తడిగిరి గ్రామ పంచాయతీ పరిధిలోని ముళ్ళుమెట్ట గ్రామానికి చెందిన సీదరి శ్రీధర్‌పాల్ (16) మహా శివరాత్రి సందర్భంగా సోమవారం రాత్రి హుకుంపేట మండలం మత్స్యగుండంలో జరిగిన జాతరకు వెళ్లారు. సాంస్కృతిక ప్రదర్శనలు తిలకించిన అనంతరం అర్ధరాత్రి ఒంటిగంట సమయంలో ఒకే ద్విచక్రవాహనంపై తిరుగు ప్రయాణమయ్యారు. ద్విచక్రవాహనంపై అతివేగంతో వెళ్తూ అదుపు చేయలేకపోవడంతో వంతలగుమ్మి వద్ద రెండు విద్యుత్తు స్తంభాల మధ్య నుంచి దూసుకుపోయి రోడ్డుపక్కనున్న ప్రహరీని బలంగా ఢీకొట్టారు. ప్రమాదంలో సూర్యప్రకాశ్ (21) అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్రంగా గాయపడిన గెమ్మెలి రమేష్, సీదరి శ్రీధర్ పాల్‌ను పాడేరు జిల్లా ఆసుపత్రికి 108 వాహనంలో తరలిస్తుండగా మార్గమధ్యలో ఒకరు, ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరొకరు మృతిచెందారు. పాడేరు సీఐ దీనబంధు ఘటనా స్థలానికి వెళ్లి ప్రమాదానికిగల కారణాలపై ఆరా తీశారు. యువకులు శిరస్త్రాణం ధరించకపోవడం, అతివేగం వల్లే ప్రాణనష్టం సంభవించిందని సీఐ తెలిపారు. మృతుల్లో సూర్యప్రకాశ్ (21) పాడేరు మోదమాంబ డిగ్రీ కళాశాలలో ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. రమేష్ తాపీమేస్త్రిగా పనిచేస్తూ జీవనం సాగిస్తుండగా.. శ్రీధర్‌పాల్ పాడేరులో ఇంటర్ వృత్తివిద్య ప్రథమ సంవత్సరం చదువుతున్నాడు. ఎన్నో ఆశలతో పెంచుకున్న కొడుకులు అనూహ్యంగా దూరమయ్యారని తెలిసి కన్నవారు రోదించిన తీరు చూపరులను కలచివేసింది. ప్రమాద ఘటనపై కేసు నమోదు చేసి కేసు దర్యాప్తు చేస్తున్నామని సీఐ పేర్కొన్నారు. శవ పరీక్షలు నిర్వహించి మృతదేహాలను కుటుంబ సభ్యులకు అప్పగించామన్నారు.

రేగం ప్రకాశ్, సీదరి శ్రీధర్‌పాల్ (పాత చిత్రాలు), ఆసుపత్రిలో గెమ్మెలి రమేష్

మినీ ఆరోగ్య కేంద్రాలుగా అంగన్‌వాడీలు

నర్సీపట్నం, న్యూస్‌టుడే

అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు వైద్య సేవలు అందుబాటులోకి వచ్చాయి. ప్రథమ చికిత్స అందించేందుకు వీటిని మినీ ఆరోగ్య కేంద్రాలుగా తీర్చిదిద్దారు. వైకాపా ప్రభుత్వ ఐదేళ్ల పాలనలో అంగన్‌వాడీ కేంద్రాలు నిర్లక్ష్యానికి గురయ్యాయి. కూటమి సర్కారు వచ్చాక పోషకాహారం అందించడంతోపాటు ఆటపాటలతో పూర్వ ప్రాథమిక విద్య పక్కాగా అమలవుతోంది. ఇప్పుడు పిల్లల ఆరోగ్యానికి ప్రాధాన్యం ఇస్తున్నారు. అన్ని కేంద్రాలకు మెడికల్ కిట్లు అందజేశారు.

మందులను పరిశీలిస్తున్న సీడీపీవో లలితశ్రీ

★ జిల్లాలో 1,908 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. వీటికి ఐదేళ్లలోపు చిన్నారులు 65 వేల మంది వస్తున్నారు. 11 రకాల మందులతో కూడిన కిట్లు ఇటీవల సరఫరా అయ్యాయి. ఆడుకునే సమయంలో పిల్లలు కిందపడి గాయపడితే ప్రథమ చికిత్స అందించేందుకు ఆయింట్‌మెంట్లు, బ్యాండేజ్, కడుపు నొప్పి, జ్వరం, దగ్గు, దురద, విరేచనాలు తగ్గడానికి సిరప్‌లు, చేతుల శుభ్రతకు శానిటైజర్, చెవిపోటు, కళ్లు ఎర్రబడటం వంటి సమస్యల నివారణకు మందులు ఈ కిట్లలో ఉన్నాయి. వీటిని ఎప్పుడు ఎంత మోతాదులో ఉపయోగించాలన్న దానిపై సీడీపీవోలు అంగన్‌వాడీ కార్యకర్తలకు అవగాహన కల్పించారని **పీడీ సూర్యలక్ష్మి** చెప్పారు. గర్భిణులు, బాలింతలకూ ఈ కిట్లను వినియోగించవచ్చన్నారు.

రీసర్వేలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు

పాడేరు, న్యూస్‌టుడే: ఉమ్మడి అల్లూరి జిల్లాలో తహసీల్దార్ల లాగిన్‌లో రీసర్వేకు సంబంధించి పెండింగ్ ఉన్న సమస్యలను గడువులోగా పూర్తి చేయాలని కలెక్టర్ దినేష్‌కుమార్ స్పష్టం చేశారు. కలెక్టరేట్ నుంచి అల్లూరి, పోలవరం జిల్లాల అధికారులతో మంగళవారం దృశ్య మాధ్యమంలో మాట్లాడారు. పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను పరిశీలించి ఆర్డీఓ, జాయింట్ కలెక్టర్ లాగిన్‌కు పంపాలని సూచించారు. నిర్లక్ష్యం వహించే వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు (పీజీఆర్ఎస్) వచ్చే వినతులను సకాలంలో పరిష్కరించాలన్నారు. వారంలో ఒకరోజు వీఆర్వోలు, సర్వేయర్లతో సమావేశం నిర్వహించాలని సూచించారు.

★ గుత్తులపుట్టు గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలలో నులిపురుగుల నిర్మూలనా దిన కార్యక్రమానికి కలెక్టర్ హాజరై విద్యార్థినులకు మాత్రలు వేశారు.

పాడేరు పట్టణం, న్యూస్‌టుడే: పింఛన్ల పంపిణీలో అవకతవకలకు పాల్పడితే సహించేది లేదని, బాధ్యులపై కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ దినేష్‌కుమార్ స్పష్టం చేశారు. అభివృద్ధి పనులపై కలెక్టరేట్ నుంచి మంగళవారం వీసీలో అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఐవీఆర్ఎస్ కాల్స్‌కు సంబంధించి ప్రభుత్వ పథకాల అమలుపై సంతృప్తి చెందితే ఏ బటన్ నొక్కాలో అర్థమయ్యేలా వివరించాలని సూచించారు. పింఛన్ల పంపిణీ అనంతరం మిగిలిన సొమ్మును ప్రభుత్వానికి జమ చేయాలని, లేకుంటే క్రిమినల్ చర్యలు తప్పవని హెచ్చరించారు. వేసవిలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా జల్ జీవన్ మిషన్ పనులను వేగవంతం చేయాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో తాగునీటి సదుపాయం కల్పించడంతోపాటు మరుగుదొడ్లను వినియోగంలోకి తీసుకురావాలన్నారు. ఇన్‌ఛార్జి జేసీ శ్రీపూజ, రంపచోడరం, చింతూరు ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారులు స్మరణ్‌రాజ్, శుభంనొఖ్వాల్, పాడేరు ఇన్‌ఛార్జి డీఆర్ఓ అంబేడ్కర్, ఇన్‌ఛార్జి ఆర్డీవో లోకేశ్వరరావు పాల్గొన్నారు.

గుత్తులపుట్టు బాలికల ఆశ్రమ పాఠశాలలో విద్యార్థినులకు అల్బెండజోల్ మాత్రలు వేస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్, డీఎంహెచ్ఓ కృష్ణమూర్తినాయక్

సందర్భమేదైనా ఈనాడును చేసుకోండి వేదిక

మీ బంధుమిత్రులు, కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషులకు ఈనాడు లో ప్రకటనల ద్వారా తెలియజేయండి

ఈనాడు యాడ్స్ ద్వారా తెలియజేయండి

ప్రకటనల కొరకు సంప్రదించండి

80087 09638

(c) eenadu

పకడ్బందీగా పరీక్షల నిర్వహణ: కలెక్టర్

కలెక్టరేట్, న్యూస్‌టుడే: జిల్లాలో పదో తరగతి, ఇంటర్మీడియట్, ఓపెన్ స్కూల్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ విజయకృష్ణన్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో మంగళవారం పరీక్షల నిర్వహణ ఏర్పాట్లపై సంబంధిత శాఖల అధికారులతో సమీక్షించారు. జిల్లాలో 102 కేంద్రాల్లో పదో తరగతి పరీక్షలు జరుగుతాయన్నారు. రెగ్యులర్ 20,577 మంది, ప్రైవేటు 440 మంది, ఓపెన్ స్కూల్ పదో తరగతి పరీక్షలకు 531 మంది విద్యార్థులు హాజరవుతారన్నారు. ఇంటర్మీడియట్‌కు సంబంధించి ఆరు కేంద్రాల్లో 1398 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు చెప్పారు. అధికారులంతా సమన్వయంతో పనిచేసి పరీక్షల నిర్వహణ విజయవంతం చేయాలన్నారు. విద్యార్థులంతా సకాలంలో కేంద్రాలకు చేరుకొనేలా ఆర్టీసీ బస్సులు నడపాలన్నారు. విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఉండకూడదన్నారు. అన్ని పరీక్షా కేంద్రాలు వద్ద 144 సెక్షన్ అమలు చేయాలన్నారు. పరీక్షా పత్రాలకు, తనిఖీ బృందాలకు ఎస్కార్ట్ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. తపాలా సిబ్బందికి సహకరించాలన్నారు. ప్రైవేటు పాఠశాలల్లో ఎక్కడా మాస్ కాపీయింగ్ జరగకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలన్నారు. సమస్యాత్మక కేంద్రాల్లో అదనపు భద్రతా ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. ఇన్‌ఛార్జి డీఆర్వో వై. శ్రీనివాస్, జిల్లా విద్యాశాఖాధికారి అప్పారావు నాయుడు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ విజయకృష్ణన్

కూడళ్ల వద్ద రక్షణ చర్యలు

స్పందనకు వందనం

అనకాపల్లి కళాశాల కూడలి ఎల్లోమార్కింగ్

అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే: అనకాపల్లిలో జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదాలు నివారించేలా పోలీసులు చర్యలు చేపట్టారు. 'ఈనాడు'లో మంగళవారం 'జంక్షన్.. టెన్షన్!' శీర్షికతో ప్రచురితమైన వార్తకు స్పందించిన పోలీసులు కొత్తూరులోని కళాశాల కూడలిలో బ్లాక్ స్పాట్ తెలిపేలా ఎల్లో మార్కింగ్ వేశారు. రక్షణ చర్యల్లో భాగంగా రహదారిపై మార్కింగ్ వేశారు. రోడ్డు ప్రమాదాలను నివారించేలా బ్లాక్ స్పాట్‌ల వద్ద వాహన రాకపోకలు, రహదారి నిబంధనలు పాటించేలా చూడడంపై ప్రత్యేక దృష్టి సారించినట్లు అనకాపల్లి ట్రాఫిక్ సీఐ వెంకట నారాయణ తెలిపారు.

అచ్యుతాపురంలో భారీ అగ్ని ప్రమాదం

రూ. 2.5 కోట్లకు పైగా ఆస్తి నష్టం

అచ్యుతాపురం, న్యూస్‌టుడే: అచ్యుతాపురం ప్రత్యేక ఆర్థిక మండలి (సెజ్) రోడ్డులో మంగళవారం భారీ అగ్ని ప్రమాదం సంభవించింది. మండలంలోని మోసయ్యపేటకు చెందిన కోన వెంకటరావు పూడిమడక రోడ్డులో దుకాణం అద్దెకు తీసుకుని కేఆర్ మార్ట్ పేరుతో కిరాణా, ప్లాస్టిక్, స్టేషనరీ, హౌస్‌కీపింగ్ సామగ్రి విక్రయించే దుకాణం నడుపుతున్నారు. ఈ దుకాణం వెనుకనే గోదాం ఏర్పాటు చేసుకున్నారు. ఈ గోదాం నుంచి మధ్యాహ్నం సమయంలో పొగ రావడాన్ని ఎదురుగా ఉన్న మరో దుకాణదారుడు గుర్తించి అప్రమత్తం చేశారు. అప్పటికే మంటలు రావడంతో వీటిని అదుపు చేయడానికి యత్నించినా వీలుకాలేదు. దీంతో చేసేదేం లేక విలువైన సామగ్రిని రక్షించుకునే ప్రయత్నం చేశారు.

కంపెనీలను శుభ్రం చేయడానికి ఉపయోగించే రసాయనాలు, ప్లాస్టిక్ వస్తువులకు మంటలు అంటుకోవడంతో క్షణాల్లో దుకాణం, గోదాం మొత్తం వ్యాపించాయి. మండే స్వభావం కలిగిన రసాయనాలు కావడంతో మంటలు ఎగిసిపడ్డాయి. మంటల ధాటికి గోదాం నిర్మించిన ఇనుప రేకులు సైతం కాలిపోయి కరిగిపోయాయి. ఏపీఐఐసీ, ఎలమంచిలి, అనకాపల్లి, విశాఖ, లారస్ పరిశ్రమలకు చెందిన అగ్నిమాపక వాహనాలతో సిబ్బంది మంటలు అదుపు చేయడానికి ఎంతగా ప్రయత్నించినా వీలుకాలేదు. ఎగిసిపడుతున్న మంటలు, దట్టమైన పొగ కమ్మేయడంతో అచ్యుతాపురంలో ప్రజలంతా ఆందోళనకు గురయ్యారు. వందలాదిమంది ఘటనాస్థలానికి చేరుకొన్నారు. ఈ ప్రమాదంలో రూ. రెండున్నర కోట్ల వరకు ఆస్తినష్టం జరిగిందని బాధితులు లబోదిబోమన్నారు. మంటలను అదుపు చేయడానికి వినియోగించే నురగ లేకపోవడంతో అదుపులోకి రాలేదు. వచ్చిన వాహనాలన్నీ నీటితోనే వీటిని ఆర్పడానికి ప్రయత్నించగా వీలుకాలేదు. నీరుపడిన పడిన వెంటనే మంటలు మరింత ఉవ్వెత్తున ఎగిసిపడ్డాయి. నాలుగు గంటలపాటు అగ్నిమాపక సిబ్బంది కష్టపడి మంటలు అదుపులోకి తీసుకొచ్చారు. పరవాడ డీఎస్పీ విష్ణుస్వరూప్, అచ్యుతాపురం సీఐ చంద్రశేఖరరావు, ఎస్సై సుధాకరరావు సంఘటన స్థలానికి చేరుకుని చుట్టుపక్కల ఇళ్లు, దుకాణాలకు మంటలు అంటుకోకుండా జాగ్రత్తలు తీసుకున్నారు.

ప్రమాదంపై ఆరా తీస్తున్న పరవాడ డీఎస్పీ విష్ణుస్వరూప్

దగ్ధమవుతున్న గోదాం, అలుముకున్న పొగ

మాజీ జాయింట్ సబ్‌రిజిస్ట్రార్‌పై చర్యలు నిలిపివేస్తూ ఉత్తర్వుల జారీ

ఎలమంచిలి, న్యూస్‌టుడే: గతంలో ఎలమంచిలిలో సబ్ రిజిస్ట్రార్‌గా పనిచేసిన కె.కె.సత్యనారాయణపై చర్యలు నిలిపివేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. సరిగా పరిశీలించకుండా అమ్మకం రిజిస్ట్రేషన్ చేశారని ఈయనపై అప్పట్లో శాఖాపరమైన చర్యలు తీసుకున్నారు. దీనిపై స్టాంప్స్, రిజిస్ట్రేషన్ శాఖ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్‌ను విచారణాధికారిగా నియమించారు. ఆరోపణలపై దర్యాప్తు జరపగా ఈయన ఉద్దేశపూర్వకంగా తప్పు చేయలేదని తేలడంతో ఈయనపై ఎటువంటి చర్యలు తీసుకోవద్దని ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చింది. విధి నిర్వహణలో నిర్లక్ష్యం కనిపించలేదని పేర్కొంది.

ఘనంగా ముగిసిన పోతురాజుబాబు జాతర

చివరి రోజు పుణ్యస్నానాలు ఆచరిస్తున్న భక్తులు

రావికమతం, న్యూస్‌టుడే: మహాశివరాత్రి సందర్భంగా కల్యాణపులోవలో ఈనెల 15 నుంచి 17 వరకూ వైభవంగా జరిగిన శివరాత్రి ఉత్సవాలు మంగళవారంతో ముగిశాయి. ఈ ఉత్సవాలకు ఉత్తరాంధ్ర జిల్లాల వ్యాప్తంగా 2.5 లక్షల మంది తరలివచ్చి స్వామిని దర్శించుకున్నట్లు దేవాదాయశాఖ అధికారులు తెలిపారు. తొలి రోజు ఆదివారం లక్ష మంది, రెండో రోజు సోమవారం 1.2 లక్షలమంది స్వామి వారిని దర్శించుకోగా చివరిరోజున మంగళవారం 30 వేలమందికి పైగా స్వామి వారిని దర్శించుకున్నారు. ఈ ఏడాది ఉత్సవాలు ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్.రాజు ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. భక్తులు అసౌకర్యానికి గురికాకుండా తగిన ఏర్పాట్లు చేశారు. దాదాపు నెల రోజుల ముందు నుంచి ఎమ్మెల్యే ఎప్పటికప్పుడు ఏర్పాట్లు జరుగుతున్న తీరును సమీక్షించి యంత్రాంగానికి సూచనలు చేశారు. ప్రత్యేకంగా రూట్‌మ్యాప్‌ను ప్రణాళిక ప్రకారం పనిచేశారు.

వాహనాల కోసం ప్రత్యేక రోడ్డు

గత ఏడాది వరకు కల్యాణపులోవలో వాహనాలు నిలిపివేసి అక్కడి నుంచి ఆలయం వద్దకు కాలినడకన వెళ్లేవారు. ఈ ఏడాది పరిస్థితి లేకుండా కల్యాణపులోవ నుంచి ప్రధాన ఆలయం వరకు దగ్గరదారిగా మట్టి రోడ్డు నిర్మించారు. 2 ఎకరాల విస్తీర్ణంలో వాహనాల పార్కింగ్‌ను సౌకర్యం కల్పించారు. ఈ ఏడాది జాతరకు ఆర్టీసీ 80 సర్వీసులు నడిపింది.

భక్తులకు అన్న సమారాధన

జాతర జరిగిన ఆది, సోమ, మంగళవారాల్లో మూడు రోజులపాటు భక్తుల కోసం ఉచిత భోజనం ఏర్పాట్లు చేశారు. ఎమ్మెల్యే రాజు సొంత నిధులతోనే భక్తులకు ఉచిత భోజన వసతి కల్పించారు. ఇందు కోసం వంటశాలలు, భోజనశాలలు ఏర్పాటు చేసి 28 ప్రత్యేక కౌంటర్ల ద్వారా భోజనాలు వడ్డించారు. తెదేపా నాయకులు కార్యకర్తలు బాధ్యతలు సక్రమంగా నిర్వర్తించారు. జాతర సేవలో 500 మంది ఉద్యోగులు పనిచేశారు. జాతర ప్రశాంతం ముగియడంతో భక్తులు అధికారులు, పోలీసుల సేవలను ప్రశంసిస్తున్నారు.

తిరుమల విద్యార్థుల సత్తా

అంకిత్ అభినవ్ అఖిల వెంకటసూర్యకిరణ్

పాయకరావుపేట, న్యూస్‌టుడే: జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో పాయకరావుపేట తిరుమల విద్యా సంస్థ విద్యార్థులు సత్తా చాటారు. సంస్థకు చెందిన కోల అంకిత్ 99.53, దుగ్గాడ అభినవ్ 99.31, ఎల్లపు అఖిల 98.91, గనిరెడ్డి వెంకట సూర్యకిరణ్ 98.13 పర్సంటైల్ సాధించారని ఛైర్మన్ నున్న తిరుమలరావు తెలిపారు. 98 పర్సంటైల్ పైన నలుగురు, 95 పైన 10 మంది, 90 పర్సంటైల్ పైన 28 మంది వచ్చాయని వివరించారు. పాయకరావుపేటలో స్థాపించిన మొదటి బ్యాచ్ కొద్దిమంది విద్యార్థులతోనే అత్యుత్తమ ఫలితాలు సాధించామని తిరుమలరావు అన్నారు. ప్రతిభ చూపిన విద్యార్థులను, అధ్యాపకులను ఆయన అభినందించారు.

గిరిజన బాలికలు క్షేమంగా అప్పగింత

నర్సీపట్నం అర్బన్: అల్లూరి సీతారామరాజు జిల్లా లంబసింగి గిరిజన సంక్షేమ హాస్టల్ నుంచి ఎవరికీ చెప్పకుండా నర్సీపట్నం వచ్చి అనుమానాస్పదంగా తిరుగుతున్న ఇద్దరు బాలికలను స్థానికులు గుర్తించి పోలీసుల దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన సీఐ ఎస్.కె.గఫూర్ సిబ్బందిని అప్రమత్తం చేశారు. ఈ బాలికలను బస్టాండులో గమనించి వీరిద్దరిని సోమవారం రాత్రి పట్టణంలోని గిరిజన సంక్షేమ బాలికల హాస్టల్‌లో ఉంచారు. బంధువులను పిలిపించి బాలికలను అప్పగించారు.

ట్రాలీ బోల్తా.. సహాయకుడి మృతి

జి.మాడుగుల: వంజరి పంచాయతీ ములక్కాయపుట్టు గ్రామానికి సమీపంలో జాతీయ రహదారి నిర్మాణ పనులు చేస్తున్న ట్రాలీ మంగళవారం ప్రమాదానికి గురైంది. అదుపుతప్పి బోల్తాపడటంతో బిహార్‌కు చెందిన సంతోష్‌శర్మ (37) మృతిచెందాడు. డ్రైవర్‌కు గాయాలయ్యాయి. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రాష్ట్రస్థాయి చదరంగం పోటీలకు ఎంపిక

అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే: జిల్లాస్థాయి చదరంగం పోటీల్లో క్రీడాకారులు ప్రతిభ చూపారు. గ్రామీణ ప్రాంతాల క్రీడాకారుల ప్రతిభను వెలికితీసేలా రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న శాప్ లీగ్ క్రీడా పోటీల్లో భాగంగా ఎన్టీఆర్ క్రీడామైదానంలో మంగళవారం జిల్లాస్థాయి చెస్ (చదరంగం) పోటీలు జరిగాయి అండర్ 13, 15, 17, 19 విభాగాల్లో జరిగిన పోటీల్లో ప్రతిభ చూపిన వారిని రాష్ట్రస్థాయికి ఎంపిక చేశారు. వీరు తిరుపతిలో ఈనెల 21, 22 తేదీల్లో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని జిల్లా క్రీడాభివృద్ధి అధికారిణి పూజారి శైలజ తెలిపారు. ఈ నెల 24న అనకాపల్లిలో జిల్లా స్లో సైక్లింగ్ పోటీలు జరుగుతాయని... ఆసక్తి ఉన్న క్రీడాకారులు ఆన్‌లైన్‌లో నమోదుచేసుకోవాలని సూచించారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులను స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి కె.ఎం.ఎల్. నాయుడు, ఎంనాగేశ్వరరావు, సుధీర్, ఎస్.వి.నరసింహరావు అభినందించారు.

చదరంగం ఆడుతున్న క్రీడాకారులు

షూటింగ్ బాల్ పోటీల్లో ఖాజీపాలెం విద్యార్థుల ప్రతిభ

విద్యార్థులను అభినందిస్తున్న పాఠశాల ప్రధానోపాధ్యాయులు శేషు, ఉపాధ్యాయులు

అచ్యుతాపురం, న్యూస్‌టుడే: రాష్ట్రస్థాయి షూటింగ్ బాల్ పోటీల్లో ఖాజీపాలెం జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ చూపించారు. ఈ పోటీలు సత్యసాయి జిల్లాలోని ధర్మవరంలో జరిగాయి. జిల్లా నుంచి పాల్గొన్న బి.నవదీప్, కె.హేమశేఖర్, ఎ.లలితకుమార్, ఎం.భానుప్రసాద్ ప్రతిభ చూపించి బంగారు పతకాలు, ధ్రువపత్రాలు పొందారు. ప్రతిభ చూపించిన విద్యార్థులు, వ్యాయామోపాధ్యాయుడు దినకరన్‌ను పాఠశాల ప్రధానోపాధ్యాయులు శేషు, సర్పంచి పీలా నర్సింగరావు, మాజీ సర్పంచి పీలా తులసీరామ్, ఎంపీటీసీ సభ్యురాలు పీలా ధనలక్ష్మి అభినందించారు.

డీ పట్టా భూముల స్వాధీనం తగదు

రాంబిల్లి, న్యూస్‌టుడే: పంచదార్లలో పేద దళితుల డి.పట్టా భూముల స్వాధీనానికి ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వులను తక్షణమే వెనక్కి తీసుకోవాలని విస్తృత దళిత సంఘాల (విదసం) ఐక్య వేదిక రాష్ట్ర కన్వీనరు డా.బూసి వెంకటరావు డిమాండు చేశారు. పంచదార్లలో దళిత రైతుల దీక్ష శిబిరాన్ని మంగళవారం ఆయన విదసం నాయకులతో కలిసి సందర్శించి సంఘీభావం తెలిపారు. రాష్ట్రంలో లక్షల ఎకరాల ఎసైన్డ్ భూములు అన్యాక్రాంతం అవుతుంటే వాటిని కాపాడలేని అధికార యంత్రాంగం ఇక్కడ దళిత డి.పట్టా భూములను స్వాధీనం చేసుకోవాలని ప్రయత్నించడంలో పెద్ద కుట్ర దాగి ఉందన్నారు. దిబ్బపాలెంలో ఏపీఐఐసీ భూములు 30 ఎకరాలు ఉండగా రెవెన్యూ అధికారులు కన్ను పంచదార్ల దళితుల భూములపై ఎందుకు పడిందని దళిత సంఘాల నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో అనకాపల్లి, విశాఖ జిల్లాల విదసం నాయకులు జాజి ఓంకార్, నేతల నాగేశ్వరరావు, ఐ.దేవుడుబాబు, గోడు వెంకటేశ్వరరావు, బుడతల అప్పారావు, పాము నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

దీక్షలో పాల్గొన్నవారిని ఉద్దేశించి మాట్లాడుతున్న బూసి వెంకటరావు

నూకతాతకు భక్తజన ప్రణామం

ప్రతిమలు ఊరేగింపు

నూకతాత ప్రతిమను స్వాగతిస్తూ తీరంలో పడుకున్న భక్తజనం

నక్కపల్లి, న్యూస్‌టుడే: రాజయ్యపేట గ్రామంలో నూకతాత జాతర మంగళవారం వైభవంగా జరిగింది. గ్రామం మొదలుకొని తీరం వరకు నూకతాత ప్రతిమలను స్వాగతిస్తూ భక్తులు దారిలో పడుకుని స్వాగతం పలికారు. మహిళా పూజారులు, వారిపై నడుచుకుంటూ ముందుకు సాగారు. భక్తులు నూకతాతపై శనగపప్పు చల్లి, నూతన వస్త్రాలను సమర్పించి మొక్కుబడులు తీర్చుకున్నారు. జనంతో రాజయ్యపేట గ్రామం జనసంద్రంగా మారింది. ప్రధాన రహదారి కిక్కిరిసిపోయింది. దాతల ఆధ్వర్యంలో ప్రసాదాలు, అన్న సమారాధన ఏర్పాటు చేశారు. నక్కపల్లికి చెందిన గురుమూర్తి సంగీత విభావరి అందరినీ అలరించింది. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా నర్సీపట్నం డీఎస్పీ ఆధ్వర్యంలో భారీ బందోబస్తు నిర్వహించారు.

ప్రయాణికుల రద్దీకి ప్రత్యేక రైళ్లు

విశాఖపట్నం, న్యూస్‌టుడే: ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని వారాంతపు ప్రత్యేక రైళ్లు అందుబాటులోకి తీసుకురానున్నట్టు వాల్తేర్ సీనియర్ డీసీఎం కె.పవన్‌కుమార్ తెలిపారు. ★ మార్చి 1 నుంచి 8 వరకు ప్రతి ఆదివారం ఎస్ఎంవీ బెంగళూర్- మాల్దాటౌన్ (06565), మార్చి 4 నుంచి 11 వరకు ప్రతి బుధవారం మాల్దాటౌన్-బెంగళూరు (06566) రైళ్లు, ఈనెల 26, మార్చి 1, 5 తేదీల్లో చర్లపల్లి-షాలిమార్ (07512), 27, మార్చి 2, 6 తేదీల్లో షాలిమార్-చర్లపలి (07513) రైళ్లు అందుబాటులో ఉంటాయన్నారు.

కొత్తగా మైనింగ్ లీజులు ఇవ్వలేదు

పాడేరు పట్టణం, న్యూస్‌టుడే: జిల్లాలో బాక్సైట్ తవ్వకాలకు సంబంధించి కొత్తగా మైనింగ్ లీజులు ఇవ్వలేదని ఆ శాఖ అధికారి రహీమ్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఉమ్మడి విశాఖ జిల్లాలో బాక్సైట్ నిక్షేపాలున్న ప్రాంతాలను ప్రభుత్వ రంగంలో మైనింగ్ కోసం రిజర్వు చేసిందన్నారు. చింతపల్లి, జర్రెల ప్రాంతాల్లో ఎంఎండీఆర్ చట్టం, అటవీ సంరక్షణ చట్టం ప్రకారం పర్యావరణ అనుమతులకు లోబడి ఏపీఎస్ఎండీసీకి అనుకూలంగా మైనింగ్ లీజులు మంజూరు చేయడం జరిగిందన్నారు. విధానపరమైన లోపాలు, నిబంధనల ఉల్లంఘనల కారణంగా 2019లో ఆరు మైనింగ్ లీజులు రద్దయ్యాయని చెప్పారు. నాటి నుంచి ఇప్పటివరకు బాక్సైట్ తవ్వకాలకు సంబంధించి లీజులు మంజూరు చేయలేదని పేర్కొన్నారు.

ప్రభుత్వ వైఖరేంటో చెప్పాలి

అరకులోయ పట్టణం, న్యూస్‌టుడే: బాక్సైట్ తవ్వకాలకు సంబంధించి ఖనిజాభివృద్ధి సంస్థ నివేదికపై రాష్ట్ర ప్రభుత్వ వైఖరిని వెల్లడించాలని గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పొద్దు బాలదేవ్ డిమాండు చేశారు. అరకులోయలోని సంఘ కార్యాలయంలో ప్రజాసంఘాల నాయకులతో కలిసి మాట్లాడారు. గిరిజన సంఘం, హైడ్రో ప్రాజెక్టు వ్యతిరేక పోరాట కమిటీ నాయకులు కొండలరావు, సత్యనారాయణ, దశరథ్, సురేష్, సోనియా, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

చలి తగ్గినా తొలగని మంచు

మన్యంలో చలి వాతావరణం తగ్గి ఎండ తీవ్రత పెరుగుతున్నా.. ఉదయం వేళలో మంచు దట్టంగా పడుతోంది. అరకులోయలో మంగళవారం 8.3, చింతపల్లిలో 9.2 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయని చింతపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం వాతావరణ విభాగం నోడల్ అధికారి డాక్టర్ అప్పలస్వామి చెప్పారు.

– న్యూస్‌టుడే, చింతపల్లి

చింతపల్లి - పెంటపాడు మధ్య రహదారిపై పొగమంచు

మహిళల భద్రతకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యం

అచ్యుతాపురం, న్యూస్‌టుడే: మహిళల భద్రతకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని అనకాపల్లి మహిళా పోలీసుస్టేషన్ డీఎస్పీ ఇ.శ్రీనివాసులు తెలిపారు. అచ్యుతాపురం సెజ్‌లోని బ్రాండిక్స్ అపెరల్ సిటీలో మహిళా ఉద్యోగులకు మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మహిళలు నిత్యం అప్రమత్తంగా ఉండాలని, శక్తియాప్‌ను వినియోగించుకోవాలన్నారు. పనిప్రదేశంలో, ప్రయాణంలో ఎటువంటి ఇబ్బంది వచ్చినా తక్షణం 112 నెంబర్‌కు ఫోన్ చేయాలని లేదా శక్తియాప్‌ను వినియోగించుకోవాలన్నారు. అత్యవసర సమయంలో ఉపయోగించుకునే టోల్ ఫ్రీ నంబర్లను వివరించారు. బ్రాండిక్స్ భారతీయ భాగస్వామి దొరస్వామి ప్రోత్సాహంతో శక్తి యాప్‌ను ఇప్పటికే ఇన్‌స్టాల్ చేసుకున్నామని మహిళలు తెలిపారు. ఎస్సై రాములమ్మ, మానవవనరుల విభాగం మేనేజర్ అనూహ్య, శ్యామల తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీనివాసులు

బోర్‌వెల్స్ సామగ్రి ధరలు తగ్గించాలి

చోడవరం గ్రామీణం, న్యూస్‌టుడే: బోర్‌వెల్స్ సామగ్రి ధరలు పెరుగుదలతో నిర్వహణ భారం అధికమైందని ఉమ్మడి జిల్లా బోర్‌వెల్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు నాని పేర్కొన్నారు. మంగళవారం నర్సయ్యపేట గ్రామంలో సంఘం జిల్లా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధరలు పెరుగుదల వల్ల సమ్మె చేపడుతున్నట్లు తెలిపారు. సామగ్రి ధరలు తగ్గించి వినియోగదారులకు అందుబాటులోకి తేవాలని ప్రభుత్వాన్ని కోరారు. రాష్ట్ర విభజన అనంతరం బోర్‌వెల్స్ సామగ్రి తయారీ రంగం తెలంగాణలోకి వెళ్లిపోయిందన్నారు. ఏపీలో కూడా తయారీ పరిశ్రమలు ఏర్పాటుచేసి యువతకు ఉపాధి అవకాశాలను కల్పించాలన్నారు. అనంతరం ధరలు తగ్గించాలంటూ నినాదాలు చేశారు. సభ్యులు శ్రీను, సంతోష్, ప్రసాద్, సురేష్, దిలీప్, రాజేంద్ర, నవీన్‌రెడ్డి, బాలరాజు పాల్గొన్నారు.

మృత శిశువు జననం

సీలేరు, న్యూస్‌టుడే: చింతపల్లి ఆసుపత్రి వైద్యులు సకాలంలో స్పందించి ఉంటే గర్భశోకం ఉండేది కాదని గూడెంకొత్తవీధి మండలం రింతాడ పంచాయతీ కడుగుల గ్రామానికి చెందిన సాగిన పూర్ణసత్యనారాయణ, కల్యాణి దంపతులు మంగళవారం విలపించారు. నెలలు నిండటంతో ఈ నెల 5న చింతపల్లిలోని జనన నిరీక్షణ కేంద్రానికి వచ్చామన్నారు. పురిటినొప్పులు ప్రారంభం కావడంతో కల్యాణిని ఆదివారం ఆసుపత్రికి తీసుకువెళ్లారు. సోమవారం వరకు ఆసుపత్రిలో ఉంచి.. మంగళవారం నర్సీపట్నం ప్రాంతీయ ఆసుపత్రికి తరలించారని సత్యనారాయణ చెప్పారు. అక్కడి వైద్యులు పురుడుపోసి మృత శిశువును బయటకు తీశారని ఆవేదన వ్యక్తం చేశారు.

విలపిస్తున్న సత్యనారాయణ, కల్యాణి

పీఏసీఎస్ ఉద్యోగుల సమ్మెకు సీఐటీయూ మద్దతు

కొత్తూరు (అనకాపల్లి), న్యూస్‌టుడే: ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాల్లో (పీఏసీఎస్‌ల్లో) పనిచేస్తున్న ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వీవీ శ్రీనివాసరావు, ఆర్ శంకరరావు డిమాండ్ చేశారు. అనకాపల్లి సీఐటీయూ కార్యాలయంలో మంగళవారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. పీఏసీఎస్ ఉద్యోగులు రెండు నెలలుగా తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వివిధ రూపాల్లో ఆందోళన చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోక పోవడంతో సోమవారం నుంచి సమ్మె చేస్తున్నారన్నారు. వీరి సమ్మెకు సీఐటీయూ సంపూర్ణ మద్దతు తెలియజేస్తోందని ప్రకటించారు. తాము కూడా నిరనసల్లో పాల్గొంటామని ప్రకటించారు.

లేగదూడల పెంపకంతో ఆర్థిక పరిపుష్టి

పాడిరైతులను సత్కరిస్తున్న రామ్మోహనరావు తదితరులు

కశింకోట, న్యూస్‌టుడే: పాడిరైతులు లేగ దూడలు పెంచడం ద్వారా ఆర్థిక పరిపుష్టి సాధిస్తారని జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి డా.బి.రామ్మోహనరావు సూచించారు. జాతీయ కృత్రిమ గర్భధారణ కార్యక్రమంలో భాగంగా సుందరయ్యపేట గ్రామంలో మంగళవారం ప్రాంతీయ పశువైద్యశాల సహాయ సంచాలకురాలు డా.బి.సౌజన్య ఆధ్వర్యంలో నిర్వహించిన లేగదూడల అందాల, ఆరోగ్య పోటీలను ఉప సంచాలకులు మాదిన ప్రసాదరావుతో కలిసి ప్రారంభించారు. ఈ పోటీలకు 40 లేగదూడలను తీసుకురాగా, అచ్చెర్ల, సుందరయ్యపేట, కన్నూరుపాలెంలకు చెందిన దూడలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందించారు. పాల్గొన్న పాడిరైతులందరికి ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. పశు వైద్యాధికారులు దయానా, చైతన్యమణి, అల్ఫోన్సా జార్జ్, కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఉక్కు సీవీఓగా నీలకంఠరెడ్డి

విశాఖపటం, న్యూస్‌టుడే: ఉక్కు కర్మాగారం చీఫ్ విజిలెన్స్ అధికారిగా సి.నీలకంఠరెడ్డి నియమితులయ్యారు. ఎన్ఎండీసీ పరిశ్రమలో సీవీఓగా పనిచేస్తున్న ఆయనకు ఉక్కు అదనపు బాధ్యతలు అప్పగించారు. 1997వ ఐఆర్ఎస్ బ్యాచ్‌కు చెందిన నీలకంఠరెడ్డి తదుపరి ఉత్తర్వులు వెలువడేవరకు అదనపు బాధ్యతలు నిర్వహించనున్నారు.

Wanted Teachers for Reputed Schools in A.P & Telangana, Contact: Sneha Placements Service. Ph: 94402 46409.

త్రినేత్ర హోంకేర్‌లో వృద్ధులను/పేషెంట్స్‌ను/పిల్లలను చూసుకొనుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఫ్రీ వసతి, భోజనం. జీ: 18K. ✆ 8520980099, 8520874499

హరేకృష్ణ హోంకేర్‌లో వృద్ధులను/ పేషంట్స్/ పిల్లలను చూసుకొనుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఫ్రీవసతి, భోజనం జీ:18-20K ✆ 96404 68899, 96402 58899

పొలాల్లోకి దూసుకెళ్లిన కారు.. డ్రైవర్‌కు గాయాలు

పాడేరు, న్యూస్‌టుడే: కారు అదుపు తప్పి వేగంగా పొలాల్లోకి దూసుకెళ్లింది. పాడేరు మండలం తుంపాడ సమీపంలో మంగళవారం ఈ ఘటన చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పాడేరు నుంచి తుంపాడ వైపు వెళ్తున్న కారు ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనాన్ని తప్పించే క్రమంలో అదుపు తప్పి పొలాల్లోకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో కారు నడుపుతున్న వ్యక్తి గాయపడ్డారు. స్థానికులు అతడిని పాడేరు ఆసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం ఆసుపత్రి నుంచి వెళ్లిపోయాడని వైద్య సిబ్బంది చెప్పారు.

ప్రమాదానికి గురైన కారు

కోర్టు హాల్లో కుప్పకూలిన మహిళ

విశాఖ లీగల్, న్యూస్‌టుడే : కుటుంబ గొడవల నేపథ్యంలో మంగళవారం వాయిదాకు హాజరైన మహిళా కక్షిదారురాలు కోర్టు హాల్లోనే కుప్పకూలిపోవడంతో ప్రధాన కుటుంబం న్యాయస్థానం న్యాయమూర్తి కె.రాధారత్నం స్పందించారు. వైద్యురాలితో ప్రాథమిక వైద్యం చేయించి, అనంతరం కోర్టు ప్రాంగణంలోని న్యాయవాదుల డిస్పెన్సరీలో వైద్యసేవలు అందించాలని ఆదేశించారు. ఆ వివరాలు.. మల్కాపురం ప్రాంతానికి చెందిన ఎస్.జగదీశ్వరి కోర్టు వాయిదాకు హాజరై, ఒక్కసారిగా రక్తపోటు పెరగడంతో తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. మూడు గంటల తర్వాత బాధితురాలు కోలుకోవడంతో కేసు తదుపరి విచారణను వాయిదా వేశారు. సకాలంలో న్యాయమూర్తి స్పందించిన తీరును పలువురు న్యాయవాదులు ప్రశంసించారు.

రోడ్డు ప్రమాదంలో విద్యార్థి మృతి

హైదరాబాద్, న్యూస్‌టుడే: ద్విచక్రవాహనం అదుపు తప్పి విద్యార్థి మృతి చెందిన ఘటన రంగారెడ్డి జిల్లా మీర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం చోటుచేసుకుంది. ఎస్సై సారంగపాణి కథనం ప్రకారం... అనకాపల్లి జిల్లా దేవరాపల్లి మండలం కలిగొట్ల గ్రామానికి చెందిన **జి.వర్ధన్** (19) నాదర్‌గుల్‌లో కృష్ణసాయి కాలనీలో నివాసం ఉంటూ ఓ ప్రైవేటు కళాశాలలో ఐటీఐ చదువుతున్నాడు. ఉదయం ద్విచక్రవాహనంపై కళాశాలకు వెళ్తుండగా, బడంగ్‌పేట ఎస్‌బీఐ సమీపంలో పక్కనే నిలిపి ఉంచిన ఆటో డ్రైవర్ ఒక్కసారిగా రోడ్డుపైకి తీసుకురాగా బైక్‌ను తాకింది. దీంతో అదుపు తప్పి పక్కనే వెళ్తున్న టిప్పర్ ముందు చక్రాల కింద పడి తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు ఆసుపత్రికి తరలిస్తుండగా మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

బైక్‌పై నుంచి జారిపడి మహిళ

కోటవురట్ల, న్యూస్‌టుడే : ద్విచక్ర వాహనంపై నుంచి జారిపడి ఓ మహిళ మృతి చెందింది. ఈ సంఘటన కోటవురట్ల మండలం కె.వెంకటాపురం సమీపంలో ఉన్న జీడిపిక్కల పరిశ్రమ దగ్గర మంగళవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... కొడవటిపూడికి చెందిన **పి.సత్యవతి** (55) తన కుమారుడుతో ద్విచక్ర వాహనంపై మాకవరపాలెం వెళ్లారు. తిరిగి స్వగ్రామానికి వస్తుండగా బైక్ అదుపు తప్పడంతో జారి కింద పడిపోయింది. దీంతో తలకు తీవ్ర గాయమైంది. స్థానికులు కోటవురట్ల ఆసుపత్రికి తరలించారు. వైద్యుల సూచన మేరకు నర్సీపట్నం ప్రాంతీయ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై రమేష్ చెప్పారు.

ఫార్మా కంపెనీలో ప్రమాదం.. ఉద్యోగి దుర్మరణం

రాంబిల్లి: అచ్యుతాపురం నాన్‌సెజ్‌లోని ఇన్నోవేర్ ఫార్మా కంపెనీలో మంగళవారం రాత్రి గ్యాస్ సిలిండర్ పేలింది. ఈ ప్రమాదంలో విధి నిర్వహణలో ఉన్న ఉద్యోగి మృతి చెందాడు. సీఐ నరసింగరావు మాట్లాడుతూ.. కంపెనీ వద్దకు వెళ్లామన్నారు. మృతుడి వివరాలు తెలియాల్సి ఉందన్నారు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము-పశు సంవర్ధక శాఖ

అద్దె రవాణా వాహనము కొరకు ప్రకటన

ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలోని కృత్రిమ గర్భోత్పత్తి కేంద్రాలకు ద్రవనత్రజని, దీర్ఘశీతలీకరణ రవాణా నిమిత్తము 17.7 సైజు గల వాహనము ఒక సంవత్సర కాలము నడుపుటకు సీల్డు టెండర్లు కోరడమైనది. టెండరు ఫారంలు ఈ దిగువ పని దినములలో అనగా తేది 18.02.2026 నుండి 25.02.2026 వరకు లభించును. సంప్రదించవలసిన చిరునామా- కార్యనిర్వాహణాధికారి, జిల్లా పశుగణాభివృద్ధి సంఘం, పోలీస్ క్వార్టర్స్ రోడ్, రామాలయం ఎదురుగా, హనుమంతవాక జంక్షన్, విశాఖపట్నం-530040,

ఫోన్ నెంబర్లు: 8008204158, 7013949375.

కార్యనిర్వాహణాధికారి

జిల్లా పశుగణాభివృద్ధి సంఘం, విశాఖపట్నం-43

కాఫీ తోటల్లో అగ్నిప్రమాదాల నివారణకు చర్యలు

చింతపల్లి, న్యూస్‌టుడే: అటవీ అభివృద్ధి సంస్థ (ఏపీఎఫ్‌డీసీ)కు చెందిన కాఫీ తోటల్లో అగ్ని ప్రమాదాల నివారణకు అధికారులు చర్యలు చేపడుతున్నారు. ఏటా వేసవిలో కాఫీ తోటల్లో ఎండిన ఆకులకు నిప్పంటుకుని అగ్ని ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఈ క్రమంలో ఫైర్‌లైన్ పేరుతో ప్రమాదాల నివారణకు ముందస్తు చర్యలు చేపడుతున్నారు. ఇందులో భాగంగా తోటల్లో అగ్గిబాటలు ఏర్పాటు చేయడం, రాలిన ఎండు ఆకులను తొలగించడం చేస్తున్నారు.

ఫైర్‌లైన్ పనుల్లో కార్మికులు

చికెన్ ధరలు

(కిలోకి - రూ.లలో)

	వెన్‌కాబ్	బ్యాగ్
ఫారం గేటు	115	110
లైవ్	142	130
డ్రెస్డ్	206	230
స్కిన్‌లెస్	234	240

(c) eenadu

చింతపల్లి, న్యూస్‌టుడే: ?: లంబసింగి ఘాట్ రోడ్డులో పలుచోట్ల చెట్ల కొమ్మలు విరిగిపడ్డాయి. వీటివల్ల వాహనాల రాకపోకలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. – శ్రీను, లంబసింగి, ✔: పరిశీలించి విరిగి పడిన చెట్ల కొమ్మల తొలగింపునకు చర్యలు చేపడతాం. – జయరాజు, ఆర్‌అండ్‌బీ జేఈ, ఆర్‌అండ్‌బీ

మేమున్నాం.. మీకు తోడుగా

పాడేరు: 89853 66570 | అరకులోయ: 63034 86346 | చింతపల్లి: 94404 07658

డుంబ్రిగుడ, న్యూస్‌టుడే: ?: డుంబ్రిగుడ సంతబయలులో దుకాణాల వద్ద ప్రజల కోసం ఏర్పాటు చేసిన కుళాయిలకు హెడ్‌లు లేవు. నీరు వృథాగా పోతోంది. – హరీష్, స్థానికుడు, ✔: మూడు రోజుల్లో కుళాయిలకు హెడ్‌లు ఏర్పాటు చేస్తాం. – గౌతమి, పంచాయతీ కార్యదర్శి

పెదబయలు, న్యూస్‌టుడే: ?: అరడకోటలో కల్వర్టుకు ఇరువైపులా రక్షణ గోడలు లేవు. రాకపోకలు సాగించే క్రమంలో వాహనాలు అదుపుతప్పితే ప్రమాద తీవ్రత పెరిగే అస్కారం ఉంది. – బాబూరావు, అరడకోట, ✔: రక్షణ గోడల నిర్మాణానికి ప్రతిపాదనలు పంపాం. – శ్రీదేవి, ఏఈ, ఆర్‌అండ్‌బీ

?: కొత్తసుజనకోట నుంచి కుమ్మరిపుట్టు వెళ్లే మార్గంలో మత్స్యగెడ్డ ఒడ్డు వరకు రాళ్లు తేలి రోడ్డు ప్రమాదకరంగా ఉంది. వాహనాలు తిరగక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. – నరసింహమూర్తి, స్థానికుడు. ✔: కొత్తసుజనకోట నుంచి మత్స్యగెడ్డ ఒడ్డు వరకు రోడ్డు పరిశీలించాం. తారురోడ్డు నిర్మాణానికి ప్రతిపాదనలు పంపించాం. నిధులు విడుదలైతే నిర్మాణం చేపడతాం. – మురళీకృష్ణ, మండల ఇంజినీరు, ముంచంగిపుట్టు

ఉపాధి నిధులు తినేశారు!

పనులు చేయకుండా చేసినట్లు నమోదు
సామాజిక తనిఖీలతో వెలుగులోకి..

చింతపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే

ఉపాధి హామీ పథకం నిధులను సిబ్బంది పక్కదారి పట్టించారు. గ్రామసభల్లో ముందుగా గుర్తించిన పనులను చేపట్టకుండా కొత్తగా మంజూరవుతుండగా కొందరు చేతివాటం ప్రదర్శిస్తున్నారు. పనులకు రాని వారికి మస్తర్లు వేయడం, దస్త్రాల నిర్వహణలో తప్పులు, కొలతల్లో తేడాలు, మొక్కలు మాయమైన ఘటనలు చోటుచేసుకున్నాయి.

1. చింతపల్లి మండలంలోని 17 పంచాయతీల్లో 2024-25 సంవత్సరానికి సంబంధించి రూ.36 కోట్లతో 31 పనులు గుర్తించారు. పలుచోట్ల పనులు చేయకుండానే రూ.46.36 లక్షలకు బిల్లులు చూపారు. సామాజిక తనిఖీల్లో పలు విషయాలు వెలుగుచూశాయి. కిటుమలు పంచాయతీ వనసలబంద నుంచి బీమునిపట్టు వరకు రహదారి నిర్మాణం చేపట్టకుండా రూ.1.78 లక్షలు స్వాహా చేశారు.

సిబ్బందితో మాట్లాడుతున్న పీడీ విద్యాసాగర్

2. గొందిపాకలు పంచాయతీలో బీటీ రోడ్డు పనుల్లో ఎంబుక్ రికార్డు లేకుండా రూ.1.75 లక్షలు, పెదపల్లి పంచాయతీలో రోడ్డు వేయకుండా వేసినట్లు చూపి రూ.1.35 లక్షలు చెల్లింపులు చేశారు.

3. కొత్తపాలెం పంచాయతీలో చెక్‌డ్యాం మరమ్మతు చేయకుండా రూ.1.17 లక్షలు విత్‌డ్రా చేశారు.

4. ఎర్రబొమ్మలు పంచాయతీలో రూ.2.67 లక్షలు, లంబసింగి పంచాయతీలో రూ.5.87 లక్షలు స్వాహా చేశారు. లోతుగెడ్డ పంచాయతీలో సీసీ రోడ్డు వేసినట్లు చూపి రూ.3.93 లక్షలకు బిల్లులు పెట్టారు.

5. ఉపాధి హామీ పథకం పీడీ విద్యాసాగర్ మాట్లాడుతూ.. 2024-25 సంవత్సరంలో రూ.36 కోట్లతో రోడ్లు, చెక్‌డ్యాంలు, నీటి కుంటలు తదితర 31 పనులు చేపట్టాం. రూ.1.28 లక్షలు అదనపు రికవరీ అప్‌లోడ్ చేశారు. పనులు చేయకుండా రూ.46.36 లక్షలు దుర్వినియోగం అయ్యాయి. బాధ్యుల నుంచి రికవరీ చేయడంతోపాటు వారిపై చర్యలు తీసుకుంటాం. ఏపీవో, విజిలెన్స్, క్వాలిటీ కంట్రోల్ అధికారులతో విచారణ చేపట్టి నివేదిక కలెక్టర్‌కు అందజేస్తామన్నారు.

ఈటీవీ 'జబర్దస్త్' జీవితానిచ్చింది

అప్పారావు

చింతపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: ఈటీవీ జబర్దస్త్ జీవితాన్నిచ్చిందని బుల్లితెర నటుడు అప్పారావు పేర్కొన్నారు. లోతుగెడ్డ గ్రామంలో వీరభద్రస్వామి తీర్థమహోత్సవాల్లో పాల్గొనేందుకు వచ్చిన ఆయన చింతపల్లిలోని ప్రైవేటు అతిథిగృహంలో బస చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్వస్థలం అక్కయ్యపాలెం (విశాఖపట్నం). రంగస్థల కళాకారుడిగా రెండు వేలకుపైగా సాంఘిక, నాటక, బుర్రకథ, చిందుభాగవతం ప్రదర్శనలు ఇచ్చానన్నారు. ఈటీవీ జబర్దస్త్, శ్రీదేవి డ్రామా కంపెనీలో అవకాశం రావడంతో జీవితం మలుపు తిరిగింది. మిణుగురులు, చందమామ, మహాత్మ, నేనింతే, సరిలేరు నీకెవ్వరు చిత్రాలు గుర్తింపునిచ్చాయన్నారు. చింతల సాగర్, సర్పంచి సునీల్ ఆధ్వర్యంలో లోతుగెడ్డ గ్రామ జాతరలో ప్రదర్శన ఇచ్చేందుకు వచ్చినట్లు పేర్కొన్నారు.

కేంద్రం ఇలా.. చిన్నారులకు రక్షణ ఎలా?

అంగన్‌వాడీ భవనాలు చిన్నారులు ఆడుకునేందుకు వీలుగా ఉండాలి. పెదబయలు మండలంలో పలు కేంద్రాలు ఇందుకు భిన్నంగా ప్రమాదకరంగా ఉన్నాయి. భవనాల్లో కొన్ని శిథిలావస్థకు చేరగా, మరికొన్ని ఎత్తయిన ప్రాంతాల్లో రక్షణ లేకుండా ఉండటంతో చిన్నారుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. పెదబ గ్రామంలో మూడేళ్లలోపు చిన్నారులు 20 మంది, ప్రీ స్కూలు పిల్లలు 16 మంది, బాలింతలు, గర్భిణులు ఐదుగురు చొప్పున పది మంది ఉన్నారు. ఇక్కడ అంగన్‌వాడీ కేంద్రానికి సొంత భవనం లేదు. అద్దె ఇంట్లో కేంద్రాన్ని నిర్వహిస్తున్నారు. గత ప్రభుత్వంలో భవన నిర్మాణానికి పునాదులు తవ్వి వదిలేశారు. అధికారులు స్పందించి భవన నిర్మాణానికి చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, పెదబయలు గ్రామీణం

బడులకు భవనాలు నిర్మించరూ!

విద్యాభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రూ.కోట్లలో నిధులు మంజూరు చేస్తున్నా.. జిల్లాలో చాలాచోట్ల పాఠశాలలకు భవనాలు లేవు. ఉన్నచోట్ల భవనాలు శిథిలావస్థకు చేరడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. వీటి మరమ్మతులపై సంబంధిత అధికారులు దృష్టిసారించడం లేదు. పెదబయలు మండలంలో 23 పంచాయతీల్లో 200 ప్రాథమిక పాఠశాలలు ఉన్నాయి. వీటిలో 50 పాఠశాలలకు భవనాల్లేవు. ఏటా ప్రతిపాదనలు పంపుతున్నా నిధులు మంజూరు కావడం లేదు. మండల కేంద్రానికి అతి దూరంలో ఉన్న సీకరి పంచాయతీ చిట్టంరాయి ప్రాథమిక పాఠశాల భవనం శిథిలావస్థకు చేరింది. ఇంజరి పంచాయతీ తల్లాలు, వంచుర్బ గ్రామాల్లో భవనాలు లేకపోవడంతో ఓ ఇంటి వరండాలో తరగతులు నిర్వహిస్తున్నారు. వంచుర్బలో చెట్ల కింద బోధన చేస్తున్నారు. అధికారులు స్పందించి భవన నిర్మాణాలకు తొలి ప్రాధాన్యం ఇవ్వాలని ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, పెదబయలు

వంచుర్బలో పాఠశాలకు పాక ఏర్పాటు చేస్తున్న గ్రామస్థులు

అటకెక్కిన స్వచ్ఛ అరకు

మండల పరిషత్తు కార్యాలయ ఆవరణలో రిక్షాలు

అరకులోయ, న్యూస్‌టుడే: గ్రామాల్లో పారిశుద్ధ్యం మెరుగుకు స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ అందజేసిన చెత్త సేకరణ రిక్షాలు మూలకు చేరాయి. చిన్నపాటి మరమ్మతులకు గురైన వాటిని బాగు చేయించకుండా పక్కన పడేసి స్వచ్ఛ అరకు నినాదాన్ని అటకెక్కించారు. అరకులోయ మండలానికి అందించిన వాటిలో కొన్ని పాడయ్యాయి. వీటికి మరమ్మతు చేస్తే చక్కగా వినియోగించవచ్చు. అలా చేయకుండా మండల పరిషత్తు కార్యాలయం ఆవరణలో వదిలేశారు. అధికారులు స్పందించి స్వచ్ఛ అరకు సాధనపై దృష్టిసారించాల్సిన అవసరముంది.

తలుపులు తీయక నెల రోజులు

సీలేరు, న్యూస్‌టుడే: గూడెంకొత్తవీధి మండలం కొత్త వెదురుపల్లిలో అంగన్‌వాడీ కేంద్రం తలుపులు నెల రోజులుగా తీయడం లేదు. ఫలితంగా చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు పోషకాహారం అందడం లేదు. ఈ విషయాన్ని ఐసీడీఎస్ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లగా.. రెండు వారాలుగా అంగన్‌వాడీ కేంద్రం తెరుచుకోలేదని తమ దృష్టికి వచ్చిందన్నారు. కేంద్రాన్ని పరిశీలించి కార్యకర్తకు మెమో జారీ చేయడంతోపాటు కేరిపల్లి అంగన్‌వాడీ కార్యకర్తకు ఇన్‌ఛార్జి బాధ్యతలు అప్పగించినట్లు చెప్పారు.

అంగన్‌వాడీ కేంద్రం వద్ద స్థానికులు

గ్యాస్ కనెక్షన్లు అందజేస్తున్న కూటమి నాయకులు

ఉజ్వల్ గ్యాస్ కనెక్షన్ల పంపిణీ

సీలేరు, న్యూస్‌టుడే: కేంద్ర ప్రభుత్వం ఉజ్వల్ పథకంలో ఉచితంగా అందజేస్తున్న గ్యాస్ కనెక్షన్ల పంపిణీ కార్యక్రమం సీలేరు గ్యాస్ గోడౌన్ ఇన్‌ఛార్జి టి.బంగారయ్య లబ్ధిదారులకు సూచించారు. గోదాము వద్ద మంగళవారం పలువురికి గ్యాస్ కనెక్షన్లు పంపిణీ చేశారు. ఉప సర్పంచి వల్లి ప్రసాద్, నాయకులు రాము, పీలోస్, బాలకృష్ణ, వెంకటరమణ, తరుణ్, సత్యనారాయణ, మింది, అప్పలరాజు, శ్యామలరావు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి సంబంధించి జీసీసీ అధికారులు సర్పంచి, ఇతర పార్టీల నాయకులకు సమాచారం ఇవ్వలేదని డీసీసీ కార్యదర్శి కారే శ్రీనివాస్ ఆరోపించారు. అధికారుల తీరును నిరసిస్తూ గోదాము ఎదుట ఆందోళన చేపట్టారు. సీఐటీయూ నాయకుడు సుభాన్ తదితరులు పాల్గొన్నారు.

అ.వీ.ఇ.వీ

ఆయుష్ ఆసుపత్రిలో అందుబాటులో మందులు

డుంబ్రిగుడ: ఆయుష్ ఆసుపత్రిలో మందుల నిల్వలు అందుబాటులోకి వచ్చాయని వైద్యుడు విజయ్‌భాస్కర్ మంగళవారం చెప్పారు. సాధారణ వ్యాధులతోపాటు కిడ్నీ, గ్యాస్ట్రిక్, కీళ్లనొప్పులకు సంబంధించి మందులు వచ్చాయన్నారు.

నిల్వ మాంసం విక్రయాలు

సీలేరు, న్యూస్‌టుడే: స్థానికంగా మాంసం దుకాణాల్లో నిల్వ మాంసాన్ని విక్రయిస్తున్నారని గ్రామస్థులు ఆందోళన చేపట్టారు. సీలేరులో ఆదివారం మిగిలిపోయిన మేక మాంసాన్ని ఫ్రిజ్‌ల్లో నిల్వ ఉంచి మంగళవారం విక్రయించారన్నారు. పశువైద్య సిబ్బంది స్పందించి దుకాణాల్లో తనిఖీలు చేపట్టాలని డిమాండు చేశారు.

చింతపండుకు మద్దతు ధర ఇవ్వాలని ఆందోళన

అనంతగిరి గ్రామీణం, న్యూస్‌టుడే: రొంపల్లి పంచాయతీ పరిధిలోని గిరిజన గ్రామాలకు చెందిన వారిలో అధిక శాతం చింతపండు సేకరించి సంతల్లో విక్రయిస్తూ జీవనం సాగిస్తున్నారు. జీసీసీ అధికారులు కేజీకి రూ.36 మాత్రమే ఇస్తుండటంతో నష్టపోతున్నామని వారంతా మంగళవారం ఆందోళనకు దిగారు. కేజీ పండు రూ.50 చొప్పున కొనుగోలు చేయాలని డిమాండు చేశారు. మార్కెట్‌లో కేజీకి రూ.60 పలుకుతుందని, జీసీసీ తక్కువ ధరకు కొనుగోలు చేయడం సరికాదని వార్డు సభ్యుడు అప్పలరాజు పేర్కొన్నారు. అధికారులు స్పందించి మద్దతు ధర ఇవ్వాలని కోరారు. పోలమ్మ, పెంటమ్మ తదితరులు పాల్గొన్నారు.

అందరి సహకారంతో బాల్య వివాహాల నిర్మూలన

జి.మాడుగుల, న్యూస్‌టుడే: బాల్య వివాహాల నిర్మూలన అందరి సహకారంతో విజయవంతమవుతుందని సీడ్ ఆర్గనైజేషన్ సమన్వయకర్త నాగమణి చెప్పారు. కొక్కిరాపల్లి, పాలమామిడి, చిన్న బందవీధి గ్రామాల్లో బాల్య వివాహాల వల్ల తలెత్తే అనర్థాలపై మంగళవారం ప్రచార రథం ద్వారా స్థానికులకు అవగాహన కల్పించారు. సీఎస్‌డబ్ల్యూవోలు ఈశ్వరి, రావణకుమారి, ప్రసాద్, సచివాలయ ఉద్యోగులు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

భాజపా కార్యాలయం ప్రారంభం

సీలేరు: స్థానిక మెయిన్ రోడ్డులో భాజపా కార్యాలయాన్ని ఆ పార్టీ మండల కార్యదర్శి కె.అప్పలరాజు మంగళవారం ప్రారంభించారు. నాయకులు మింది తదితరులు పాల్గొన్నారు.

ట్రైసైకిళ్ల పంపిణీ

కొయ్యూరు: స్వర్ణ గ్రామ సచివాలయాలకు ట్రైసైకిళ్లు, డస్ట్ బిన్లను మంగళవారం పంపిణీ చేశారు. కొయ్యూరులో జరిగిన కార్యక్రమంలో ఎంపీపీ రమేష్‌బాబు, ఎంపీడీవో ప్రసాదరావు, జీసీసీ మాజీ ఛైర్మన్ ఎంవీవీ ప్రసాద్ మాట్లాడారు. డిప్యూటీ ఎంపీడీవో శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి చదరంగం పోటీలకు ఎంపిక

విద్యార్థులను అభినందిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్, క్రీడాభివృద్ధి అధికారులు

పాడేరు పట్టణం, న్యూస్‌టుడే: స్థానిక జూనియర్ కళాశాలలో మంగళవారం జిల్లా చదరంగం పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో సత్తా చాటిన వారిని రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. అండర్-13, 17 విభాగాల్లో ఈ నెల 21, 22 తేదీల్లో తిరుపతిలో రాష్ట్ర స్థాయి పోటీలు జరగనున్నాయి. కలెక్టర్ దినేష్‌కుమార్, జిల్లా క్రీడాభివృద్ధి అధికారి జగన్మోహన్‌రావు, స్కూల్ గేమ్స్ జిల్లా కార్యదర్శి సూరిబాబు విద్యార్థులను అభినందించారు.

రైతు నమోదు తప్పనిసరి

జి.మాడుగుల, న్యూస్‌టుడే: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు అమలు చేస్తున్న సంక్షేమ పథకాల్లో లబ్ధి పొందాలంటే సాగుదారులు అందరూ ఫార్మర్ రిజిస్ట్రీ తప్పనిసరిగా చేయించుకోవాలని ఇన్‌ఛార్జి వ్యవసాయాధికారి పాత్రుడు సూచించారు. జి.మాడుగుల మండలం పాలకొండలో రైతు నమోదు కార్యక్రమాన్ని మంగళవారం పరిశీలించారు. మండలంలో ఆరు వేల మంది రైతులు నమోదు చేయించుకోవాల్సి ఉందన్నారు. సచివాలయాలు, సిగ్నల్ పాయింట్ల వద్ద వ్యవసాయ సిబ్బంది నమోదు చేస్తున్నారని చెప్పారు. ఏకారణంతోనైనా నమోదు చేసుకోకపోతే పథకాల లబ్ధి అందదని స్పష్టం చేశారు. వ్యవసాయ సిబ్బంది ప్రశాంత్, ఎంపీఈవోలు పాల్గొన్నారు.

చింతపల్లి, న్యూస్‌టుడే: రైతులంతా తప్పనిసరిగా తమ వివరాలను రైతు రిజిస్ట్రేషన్ కార్యక్రమంలో నమోదు చేసుకోవాలని చింతపల్లి మండల వ్యవసాయాధికారి మధుసూదనరావు అన్నారు. లంబసింగిలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ... ఈనెల 28 లోగా అందరూ నమోదు చేసుకోవాలన్నారు. వివరాలను నమోదు చేసుకోకపోతే భవిష్యత్తులో ప్రభుత్వం, వ్యవసాయశాఖ పరంగా అందించే రాయితీలు, రుణాలు, బీమా వంటి సదుపాయాల కల్పనకు సాంకేతిక ఇబ్బందులు ఎదురవుతాయన్నారు. వీహెచ్‌ఏ చంద్రకళ రైతులు పాల్గొన్నారు.

పాలకొండలో నమోదు కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న ఇన్‌ఛార్జి ఏవో పాత్రుడు

మత్తు పదార్థాలకు దూరంగా ఉండండి

జి.మాడుగుల, న్యూస్‌టుడే: యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఎస్సై సాయిరాం పడాల్ సూచించారు. జి.మాడుగుల సంతబయలు సంతలో మంగళవారం స్థానికులకు అవగాహన కల్పించారు. గంజాయి సాగు, రవాణా, వినియోగం వల్ల కలిగే అనర్థాలు, ఆరోగ్యం, కుటుంబం, సమాజంపై పడే ప్రభావాన్ని వివరించారు. సైబర్ నేరాలు, ఏపీకే ఫైల్స్, ఆన్‌లైన్ మోసాలు, అనుమానాస్పద లింకులు, యాప్‌ల విషయంలో జాగ్రత్తగా ఉండాలన్నారు. రహదారి భద్రతకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని, ద్విచక్ర వాహనచోదకులు విధిగా శిరస్త్రాణం ధరించాలని సూచించారు. పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

పాడేరు, న్యూస్‌టుడే: పిల్లల ఆరోగ్య పరిరక్షణే ధ్యేయంగా నులిపురుగుల నివారణకు ఏటా ఫిబ్రవరి, ఆగస్టు నెలల్లో ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేస్తున్నట్లు కలెక్టర్ దినేష్‌కుమార్ అన్నారు. జాతీయ నులిపురుగుల నిర్మూలన దినం సందర్భంగా మంగళవారం జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేటు విద్యా సంస్థలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో వైద్య సిబ్బంది మాత్రల పంపిణీ చేపట్టారు. పాడేరు మండలం గుత్తులపుట్టు గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలలో కలెక్టర్ దినేష్‌కుమార్ విద్యార్థినులతో మాత్రలు మింగించారు. ఒకటి నుంచి 19 ఏళ్లలోపు వారంతా తప్పనిసరిగా ఈ మాత్రలు వేసుకోవాలని సూచించారు. జిల్లా వైద్యాధికారి కృష్ణమూర్తి మాట్లాడుతూ జిల్లాలో 19 ఏళ్లలోపు వారు 3.26 లక్షల మంది ఉన్నారన్నారు. తొలిరోజు 3.19 లక్షల మందికి మాత్రలు పంపిణీ చేసినట్లు వెల్లడించారు. మిగతా వారికి ఈ నెల 24న వేస్తామన్నారు. మలేరియా విభాగం జోనల్ అధికారిణి డాక్టర్ ప్రభావతి, ఏడీఎంహెచ్‌వో ప్రతాప్, ప్రోగ్రాం మేనేజర్ కిషోర్‌కుమార్, ప్రధానోపాధ్యాయిని, మినుములూరు ఆసుపత్రి సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

కొయ్యూరు, చింతపల్లి గ్రామీణం, మాడుగుల: కొయ్యూరు కేజీబీవీలో బాలికలకు ఎంపీడీవో ప్రసాదరావు, రాజేంద్రపాలెం పీహెచ్‌సీ వైద్యాధికారి జగదీష్‌నాయక్ మాత్రలు వేశారు.

చింతపల్లి ఆశ్రమ పాఠశాలలో బాలికకు ఆల్బెండజోల్ మాత్ర వేస్తున్న వైద్య సిబ్బంది

జి.మాడుగుల మండలం కొత్తూరు బాలుర ఆశ్రమ-2, గురుకుల పాఠశాలలో మాత్రల పంపిణీని ఎన్‌టీఈపీ ప్రతినిధి వి.సౌజన్యలక్ష్మి పరిశీలించారు. వైద్యులు కిషోర్, ఇందిర, ఆర్‌బీఎస్‌కే జిల్లా మేనేజర్ కిషోర్‌కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. చింతపల్లిలో గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాల విద్యార్థినులకు ఆర్‌వీ నగర్ పీహెచ్‌సీ వైద్యురాలు సౌమ్య మాత్రలు వేశారు. హెచ్‌ఎం రాజు, వార్డెన్ నూకరత్నం, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

అరకులోయ, డుంబ్రిగుడ, అనంతగిరి/గ్రామీణం, ముంచంగిపుట్టు, న్యూస్‌టుడే: అరకులోయ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థినులకు సీఐ హిమగిరి, ఎస్సై గోపాలరావు, ప్రిన్సిపల్ భరత్‌కుమార్‌నాయక్, అధ్యాపకులు విజయలక్ష్మి మాత్రలు పంపిణీ చేశారు. డుంబ్రిగుడ బాలికల ఆశ్రమ పాఠశాలలో ఎంపీడీవో ప్రేమ్‌సాగర్, వైద్యాధికారిణి అంబిక, పీహెచ్ఎన్ విజయరత్నకుమారి, ఆరోగ్య సహాయకులు స్వామి, ఎంఎల్‌హెచ్‌పీ శిరీషా, ఏఎన్ఎం ఉమ, ఆశా కార్యకర్త మేరీ విద్యార్థినులతో మాత్రలు మింగించారు. ముంచంగిపుట్టు బాలుర ఉన్నత పాఠశాల-1లో జరిగిన కార్యక్రమంలో తెదేపా మండల అధ్యక్షురాలు సన్యాసమ్మ, హెచ్‌ఎం మహేంద్ర, వైద్య సిబ్బంది జ్యోతి, పుష్పకుమారి పాల్గొన్నారు. అనంతగిరి మండలం జీనబాడులోని ఆశ్రమ బాలికల పాఠశాల, పినకోటలోని బాలుర పాఠశాలలో వైద్యులు రూప్‌చంద్, వెంకటేష్ మాత్రలు పంపిణీ చేశారు. చిలకలగెడ్డ పంచాయతీ కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో జరిగిన మాత్రల పంపిణీలో హెల్త్ అసిస్టెంట్ సింహాచలం, ఉపాధ్యాయులు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

జీనబాడు పాఠశాలలో..

డ్రోన్ టెక్నాలజీపై ప్రత్యేక శిక్షణ

చింతపల్లి, న్యూస్‌టుడే: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డ్రోన్ టెక్నాలజీపై స్వల్పకాలిక కోర్సును ప్రారంభించినట్లు ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.విజయభారతి మంగళవారం చెప్పారు. పీఎం ఉషా పథకంలో భాగంగా పాడేరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల సహకారంతో ఐదు రోజులపాటు ఈ కోర్సును నిర్వహిస్తున్నామన్నారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. శిక్షకులు నర్సింహ, శ్రీకాంత్, వైష్ణవి, పీఎం ఉషా పథకం సమన్వయకర్తలు డాక్టర్ రమణ, వైస్ ప్రిన్సిపల్ శ్రీనివాసపాత్రుడు, పూర్ణారావు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ప్రిన్సిపల్ విజయభారతి, అధ్యాపకులు

భక్తిశ్రద్ధలతో ఆలయ వార్షికోత్సవం

కొయ్యూరు, న్యూస్‌టుడే: చీడిపాలెం పంచాయతీ సింగవరంలో షిర్డీసాయిబాబా ఆలయ వార్షికోత్సవం మంగళవారం ఘనంగా జరిగింది. లక్ష్మీగణపతి హోమం, సాయి గాయత్రి హోమం, మండపారాధన, ఆలయ ప్రదక్షిణ, పూర్ణాహుతి కార్యక్రమాలను ప్రధాన అర్చకులు దన్యంరాజు శ్రీరామచంద్రమూర్తి శర్మ, అశోక్‌కుమార్ శర్మ, త్రినాథ వెంకట్రావుశర్మ నిర్వహించారు. భక్తులతో ఆలయం కిటకిటలాడింది. మధ్యాహ్నం అన్నసమారాధన చేశారు. సాయంత్రం సింగవరం నుంచి రాజేంద్రపాలెం వరకు పల్లకీసేవా నిర్వహించారు. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఆలయ కమిటీ సభ్యులు నాగేశ్వరరావు, వెంకటేశ్వరరావు, కల్యాణం, భద్రం తదితరులు పాల్గొన్నారు.

సాయిబాబా ఆలయంలో భక్తులు

శత శాతం ఉత్తీర్ణతే లక్ష్యం

జి.మాడుగుల, న్యూస్‌టుడే: పదో తరగతిలో శత శాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా విద్యార్థులను పరీక్షలకు సన్నద్ధం చేయాలని ఐటీడీఏ డీడీ పరిమళ ఉపాధ్యాయులకు సూచించారు. కొత్తూరు బాలురు-2, మినీ గురుకులం పాఠశాలలను మంగళవారం సందర్శించారు. విద్యార్థుల ఆరోగ్యం, భద్రత, వసతుల నిర్వహణలో నిర్లక్ష్యం వహించవద్దని స్పష్టం చేశారు. మెనూ ప్రకారం రుచికర భోజనం అందజేయాలన్నారు. అనంతరం పదో తరగతి విద్యార్థులతో మాట్లాడారు. ఏటీడబ్ల్యూవో నాగశిరీష, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జి.మాడుగుల మినీ గురుకుల విద్యార్థులతో డీడీ పరిమళ

సంకల్ప బలంతో పరీక్షలకు హాజరు

డుంబ్రిగుడ, న్యూస్‌టుడే: క్రమశిక్షణ, సంకల్ప బలంతో పరీక్షలు రాయాలని ఏకలవ్య మోడల్ గురుకుల ప్రిన్సిపల్ సుమన్‌కుమార్ సింగ్ విద్యార్థులకు సూచించారు. స్థానిక పాఠశాల నుంచి సీబీఎస్ఈ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు మంగళవారం గుర్తింపు కార్డులతోపాటు వాటర్ బాటిళ్లు అందజేశారు. సమయపాలన పాటిస్తూ అన్ని ప్రశ్నలకు సమాధానాలు రాస్తే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చన్నారు. అనంతరం విద్యార్థులు అరకులోయలోని పరీక్ష కేంద్రానికి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఆర్టీసీ బస్సులో బయలుదేరి వెళ్లారు.

ఘనంగా ముగిసిన గంగమ్మ ఉత్సవాలు

ముంచంగిపుట్టు, న్యూస్‌టుడే: సుజనకోట, కొత్త సుజనకోట గ్రామాల్లో గంగమ్మ ఉత్సవాలు ప్రశాంతంగా ముగిశాయి. మంగళవారం ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించారు. పోతురాజు సహిత గంగమ్మకు ప్రత్యేక పూజలు చేశారు. జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ సుభద్ర, మూర్తి దంపతులు రెండు గ్రామాల్లోనూ అమ్మవారి దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. జి.మాడుగుల సీఐ శ్రీనివాసరావు, తహసీల్దార్ భాస్కర అప్పారావు, ఎంపీడీఓ ధర్మారావు గంగమ్మను దర్శించుకుని పూజలు చేశారు. ఎస్సై నాని ఆధ్వర్యంలో పోలీసులు గస్తీ నిర్వహించారు. ప్రత్యేక పూజలు అనంతరం అనుపోత్సవం నిర్వహించారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా అన్నిశాఖల అధికారులు సహకారం అందించారు.

గంగమ్మ జాతరకు వచ్చిన భక్తులతో రద్దీ

క్రికెట్ పోటీల విజేత పెదగుడ

ముంచంగిపుట్టు, న్యూస్‌టుడే: సుజనకోట గంగమ్మ ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన మండల స్థాయి క్రికెట్ పోటీల్లో పెదగుడ గ్రామానికి చెందిన యువకులు విజయం సాధించారు. మండల పరిధిలోని 23 పంచాయతీలకు చెందిన జట్లు పోటీల్లో పాల్గొనగా.. పెదగుడ, నడుమూరు గ్రామాలకు చెందిన యువకులు ఫైనల్స్‌లో తలపడ్డారు. పెదగుడ జట్టు ప్రథమ స్థానంలో నిలిచి ట్రోఫీతోపాటు రూ.15 వేల నగదు బహుమతి గెలుచుకుంది. రన్నర్స్‌గా నిలిచిన నడుమూరు జట్టుకు ద్వితీయ బహుమతి, ప్రతిభ చూపిన ఆటగాళ్లకు ప్రోత్సాహక బహుమతులు అందించారు.

ట్రోఫీ అందుకుంటున్న పెదగుడ జట్టు

ఒప్పంద కార్మికుడి మృతికి సంతాపం

సీలేరు: జలవిద్యుత్కేంద్రంలో ఒప్పంద కార్మికుడు విధి నిర్వహణలో మృతి చెందడం బాధాకరమని జెన్‌కో ఎస్ఈ (సివిల్) ఎస్‌కే జాకీర్ హుస్సేన్ పేర్కొన్నారు. మంగళవారం ఒప్పంద కార్మికుడు గంగిరి గణేష్ సంతాప సభ ఏర్పాటైంది. ఆయన చిత్రపటానికి ఎస్ఈ పూలమాల వేసి నివాళులర్పించారు. ఎస్ఈ (పంప్డ్ స్టోరేజీ) హనుమ, ఈఈలు రాజేంద్రప్రసాద్, సుబ్రహ్మణ్యం, డీఈఈలు శ్రీనివాసులు, అప్పలనాయుడు, శ్రీధర్‌కుమార్, సత్యనారాయణ, నాగార్జున, ఏఈఈలు సురేష్, నాగబాబు, ఉద్యోగులు, ఒప్పంద కార్మికులు పాల్గొన్నారు.

నివాళులర్పిస్తున్న జెన్‌కో ఉద్యోగులు, సిబ్బంది

డిప్యూటీ డీఈవోగా గ్రూప్2 విజేత

రావికమతం, న్యూస్‌టుడే: గ్రూప్2లో విజేతగా నిలిచిన మేడివాడ ప్రాథమిక పాఠశాల సెకెండరీ గ్రేడ్ ఉపాధ్యాయుడు కన్నూరు పోతన్న డిప్యూటీ డీఈవో కొలువు సాధించారు. పీహెచ్ కోటాలో ఈయన ఎంపికయ్యారు. ఏపీపీఎస్సీ సోమవారం రాత్రి ఇందుకు సంబంధించిన ఫలితాలలను ప్రకటించింది. రాష్ట్ర వ్యాప్తంగా ఎంపికైన 38కి ఈనెల 24న ధ్రువపత్రాల పరిశీలన చేపడతారు.

వాటర్‌షెడ్ పనుల పరిశీలన

కొయ్యూరు: కొయ్యూరు, మంప, మర్రివాడ పంచాయతీల్లో వాటర్‌షెడ్ పథకంలో చేసిన పనులను రీసెర్చ్ అసోసియేట్ (ఎన్ఐఆర్‌డీఆర్, హైదరాబాద్) డాక్టర్ జి.సాంబశివరావు మంగళవారం పరిశీలించారు. నీటి కుంటలు, చెరువుల్లో చేపల పెంపకం వివరాలను అడిగి తెలుసుకున్నారు. నీటి వనరులను వినియోగించుకుంటూ కూరగాయలు పండిస్తున్న రైతులతో మాట్లాడారు. ఆయిల్ ఇంజిన్లు, టార్పాలిన్లకు దరఖాస్తు చేసినా అందజేయలేదని కొంతమంది రైతులు చెప్పగా, వీటికి సంబంధించిన టెండర్ విషయం కోర్టులో ఉండటంతో పంపిణీ కాలేదని ఆయన చెప్పారు. చిరుధాన్యాల ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు చేయాలని రైతులు కోరగా ప్రభుత్వానికి నివేదిస్తామని పేర్కొన్నారు. వాటర్‌షెడ్ పథకం అమలుకు బూదరాళ్ల పంచాయతీని ఎంపిక చేయాలని వార్డు సభ్యుడు సంజీవ్ కోరారు. వాటర్‌షెడ్ పీవో శంకర్రావు, రైతులు పాల్గొన్నారు.

గంగవరంలో చెరువును పరిశీలిస్తున్న సాంబశివరావు

(c) eenadu

రాజధానిలో భూసేకరణకు సిద్ధం

భూసమీకరణలో ఇవ్వని 2,459.88 ఎకరాలకు ప్రణాళిక

ప్రాధాన్యక్రమంలో ప్రకటనల జారీ

ఈనాడు - అమరావతి

నవ్యాంధ్ర రాజధాని అమరావతి నిర్మాణానికి భూసమీకరణలో భూమివ్వని రైతుల నుంచి భూసేకరణ ద్వారా తీసుకునేందుకు ప్రణాళిక సిద్ధమైంది. కొంతమంది రైతులు వివిధ కారణాలతో ఇప్పటికీ భూసమీకరణలో భూములివ్వలేదు. వీరిలో నెలకొన్న సందేహాలను సీఆర్డీఏ అధికారులు పలుమార్లు నివృత్తి చేశారు. భూసమీకరణ కింద ఇన్నేళ్లు ఎక్కువ ప్రయోజనం ఉంటుందని అవగాహన కల్పించారు.

భూయజమానుల్లో కొందరు స్థానికంగా లేకపోవడం, కుటుంబ సభ్యుల మధ్య తగాదాలు, మరికొందరు భూసమీకరణకు ఆసక్తి చూపకపోవడంతో 2459.88 ఎకరాల సమీకరణ సాధ్యం కాలేదు. ఇవి సీఆర్డీఏ నిర్మిస్తున్న రహదారులు, ఎల్పీఎస్ లేఅవుట్లు, రైతులకు కేటాయించిన రిటర్నబుల్ ప్లాట్ల పరిధిలో ఉన్నాయి.

తప్పనిసరి పరిస్థితుల్లో..

రాజధానిలో వివిధ ప్రాజెక్టుల పనులు వేగంగా జరుగుతుండటం, వివిధ సంస్థలు పనులు చేపడుతుండటం, రైతులకిచ్చిన రిటర్నబుల్ ప్లాట్లలో మౌలిక వసతుల కల్పన వీలైనంత తొందరగా పూర్తి చేయాలన్న లక్ష్యంతో చేస్తున్న పనులకు కొన్నిచోట్ల అడ్డంకులు ఎదురవుతున్నాయి. వీటిని అధిగమించడానికి భూసేకరణకు వెళ్లక తప్పని పరిస్థితి. ఇందుకోసం ప్రకటన ప్రక్రియను అధికారులు సిద్ధం చేస్తున్నారు. ప్రాధాన్యక్రమంలో ఆయా అవసరాలకు తగ్గట్టుగా సేకరణ చేపట్టనున్నారు.

* తొలి ప్రాధాన్యతగా.. రాజధానికి జాతీయ రహదారి నుంచి అనుసంధానం చేసే సీడ్ యాక్సెస్ రోడ్డు నిర్మాణానికి అవసరమైన 12.5757 ఎకరాలను సేకరించనున్నారు.
* మలిదశలో ట్రంక్ రోడ్ల నిర్మాణానికి అవసరమైన 216 ఎకరాలకు ప్రకటన ఇవ్వనున్నారు.
* ప్రకటన జారీకి ముందే రైతులు భూసమీకరణలో ఇవ్వడానికి ముందుకొస్తే వారి నుంచి వెంటనే తీసుకుంటారు.
* భూసేకరణ అధికారి నియామకం తర్వాత తదుపరి ప్రక్రియను చేపట్టే దిశగా కార్యాచరణ ప్రణాళికతో ముందుకెళ్తున్నారు. ఇదంతా పూర్తయితే రాజధాని ప్రాంతంలో పనులకు అడ్డంకులు తొలగడంతో పాటు అభివృద్ధి వేగవంతమవుతుందని సీఆర్డీఏ భావిస్తోంది.

సేకరించాల్సిన భూమి వివరాలు..

విభాగం	ఎకరాల్లో
సీడ్ యాక్సెస్ రోడ్డు	12.58
ట్రంక్ రోడ్లు	216.33
ఎల్పీఎస్ లేఅవుట్లు, మౌలికవసతుల కల్పన	396.31
రైతులకు ఇచ్చిన రిటర్నబుల్ ప్లాట్లు	174.35
భూసమీకరణలో ఇవ్వని భూమి	1660.31
మొత్తం భూమి	2459.88

తేరుపై తేజోమూర్తి

హరహర మహాదేవ.. శంభోశంకర నామ స్మరణతో అమరావతి మార్మోగింది. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా కీలక ఘట్టమైన బాలచాముండికా అమరేశ్వరస్వామి దివ్య రథోత్సవం మంగళవారం వైభవంగా నిర్వహించారు. - న్యూస్‌టుడే, అమరావతి

నీరిస్తారా? నీరుగారుస్తారా?

* ఉండవల్లి లిఫ్ట్ వద్ద ఎంబీఆర్‌కు మళ్లింపుతో తప్పని సమస్య
* మూలన పడ్డ రెండు మోటార్లు.. అరకొరగా వచ్చే జలాలే దిక్కు

తక్కెళ్లపాడు నీటి శుద్ధి ప్లాంటు

ఈనాడు - అమరావతి

గుంటూరు నగర ప్రజలకు తాగునీటిని అందిస్తున్న వ్యవస్థల్లో లోపాలు ఇబ్బందికరంగా పరిణమించాయి. అధికారులు తీసుకుంటున్న నిర్ణయాలు నగర వాసుల సమస్యలను మరింత జటిలం చేస్తున్నాయి. ప్రజల అవసరాలకు రోజుకు 215 మిలియన్ లీటర్ల (ఎంఎల్డీ) నీరు అవసరమని అంచనా. ప్రస్తుతం సంగంజాగర్లమూడిలో 25 ఎంఎల్డీ, తక్కెళ్లపాడు నీటిశుద్ధి కేంద్రంలో 45, 45, 42 ఎంఎల్డీ సామర్థ్యం కలిగిన మూడు ప్లాంటులున్నాయి. తక్కెళ్లపాడు కేంద్రానికి ఉండవల్లి వద్ద కృష్ణా నీటిని లిఫ్ట్ చేసి 1600 ఎంఎం డయా పైపులైను ద్వారా తరలిస్తున్నారు. ఈ ఎత్తిపోసే కేంద్రాన్ని అనేక సమస్యలు ఏళ్ల తరబడి వెంటాడుతున్నాయి.

ఇదీ పరిస్థితి

ఉండవల్లి వద్ద కృష్ణా నీటిని తోడడానికి 240 హెచ్‌పీ సామర్థ్యం కలిగిన 5 మోటార్లున్నాయి. వీటిల్లో ఒకటి స్పేర్‌లో ఉండేది. మిగిలిన నాలుగూ పని చేసేలా డిజైన్ చేశారు. ఒక్కో మోటారు రోజుకు 30 ఎంఎల్డీ నీటిని తోడాలన్నది లక్ష్యం. అలా నిత్యం 120 ఎంఎల్డీ తరలించాలి. కొంతకాలంగా రెండు మోటార్లు మూలనపడ్డాయి. దీంతో ఒక్కోటి 60 ఎంఎల్డీ నీటిని తోడేలా రెండు మోటార్లు కొనుగోలుకు అధికారులు సిద్ధమై రీటెండర్లు పిలవకపోవడంతో ఇంకా కొలిక్కి రాలేదు. తోడిన నీటిని సమీపంలోని మాస్టర్ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌కు పంపి.. గ్రావిటీ ద్వారా 1600 ఎంఎం డయా పైపులైన్‌తో తక్కెళ్లపాడుకు చేరుస్తున్నారు. దీని వల్ల పీడనం తగ్గిపోతోందని, కొన్నిసార్లు ఓవర్ ఫ్లో అవుతోందన్నది అధికారవర్గాల మాట. బైపాస్ చేసి మోటార్ల నుంచి నేరుగా పైపులైనుకు అనుసంధానిస్తే నీటి వేగం, ఉద్ధృతి పెరుగుతుందని ఇంజినీరింగ్‌వర్గాలు చాలాకాలంగా చెబుతున్నాయి.

మరి ఎందుకు కట్టినట్టు

ఉపయోగం లేనప్పుడు మాస్టర్ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ ఎందుకు నిర్మించారన్నది మరో ప్రశ్న. మంగళగిరి వద్ద జాతీయ రహదారి పైపులైను నుంచి కొంత నీటిని మళ్లించడం వల్లనే నీరు సరిపోవడం లేదన్నది మరో వాదన. దీంతో తక్కెళ్లపాడులో 132 ఎంఎల్డీ నీటిని శుద్ధి చేయగలిగిన సామర్థ్యం ఉన్నా.. 90 ఎంఎల్డీకే పరిమితమవుతున్నారు.

కొత్తగా 53ఎంఎల్డీ ప్లాంటు

తక్కెళ్లపాడులో రూ.22.50 కోట్ల అంచనా వ్యయంతో కొత్తగా 53 ఎంఎల్డీ ప్లాంటు ఏర్పాటుకు త్వరలోనే శంకుస్థాపన జరగనుంది. [illegible] ఫిల్టర్ బెడ్స్, కెమికల్ హౌస్ తదితరాలను నిర్మిస్తారు. స్థల పరిశీలన జరుగుతోంది. ప్రస్తుతం ఉన్న ప్లాంటుకే నీటి సరఫరా సరిగా రాక అవస్థలు పడుతుంటే.. కొత్త ప్లాంటుకు ఎలా అందిస్తారో అంతుచిక్కని ప్రశ్న. 1600 ఎంఎం డయా పైపులైను నుంచే దీనికి నీరు తీసుకోవాల్సి రావడంతో అధికారులు తలలు పట్టుకుంటున్నారు. ఉండవల్లి ఎత్తిపోతల వద్ద పూర్తిస్థాయిలో సమస్యలు పరిష్కారమైతే తప్ప తక్కెళ్లపాడులో ఇబ్బందులు కొలిక్కి రావు.

మెప్మాలో రుణ బాగోతాలపై విచారణకు కలెక్టర్ ఆదేశం

ఈనాడు కథనాలకు స్పందన

పొన్నూరు, న్యూస్‌టుడే

గత వైకాపా పాలనలో మెప్మా విభాగంలో చోటుచేసుకున్న అవినీతి అక్రమాలకు సంబంధించి 'ఈనాడు'లో ప్రచురితమైన కథనాలపై కలెక్టర్ తమీమ్ అన్సారియా స్పందించి విచారణకు ఆదేశించారు. ఆనాడు నిరుపేద మహిళల ఆర్థిక ఉన్నతికి ఉపయోగపడాల్సిన రుణాలను వైకాపా మహిళా నేతలు, మెప్మాలోని కొంతమంది అధికారులు, ఆర్పీలు మూకుమ్మడిగా మెక్కేశారు. ఇందుకు బినామీ పొదుపు సంఘాలను సృష్టించారు. రుణాల విషయం ఆ సంఘాల్లోని సభ్యులకు తెలియనివ్వలేదు. బకాయిలు చెల్లించకపోవడంతో బ్యాంకు అధికారులు కోర్టు ద్వారా సభ్యులకు నోటీసులివ్వడంతో అసలు విషయం బయటపడింది. వైకాపా మహిళా నేతలు, అప్పటి మెప్మా అధికారులు మోసం చేశారని పొన్నూరు అర్బన్ పోలీసులు, మెప్మా ఉన్నతాధికారులకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు.

కదిలించిన... ఈనాడు

అక్రమాలపై ఈ నెల 12న 'బినామీ గ్రూపులతో దోచేశారు'... 13న 'బినామీలు సృష్టించి.. రుణాలు కొల్లగొట్టి' శీర్షికలతో 'ఈనాడు'లో కథనాలు ప్రచురితమయ్యాయి.

బినామీ గ్రూపులతో దోచేశారు..!

8వ వార్డు ఆర్పీపై పొదుపు సంఘ సభ్యుల ఫిర్యాదు

ఈ నెల 12న ప్రచురితమైన కథనం

వైకాపా పొన్నూరు పట్టణ మహిళా అధ్యక్షురాలు, 8వ వార్డు మాజీ కౌన్సిలర్ మూకిరి అనీలకుమారి 20వ వార్డు శాంతినగర్‌లో సాయిజ్యోతి బినామీ గ్రూపును ఏర్పాటు చేసి రూ.15 లక్షల రుణం తీసుకున్నారు. 8వ వార్డుకు చెందిన అప్పటి ఆర్పీ నిమ్మకాయల నాగసంధ్య సహకారంతో అదే వార్డులో బినామీ గ్రూపులు ఏర్పాటు చేసి సుమారు రూ.40 లక్షలు స్వాహా చేశారని ఆర్పీ పోలీసులకు వాంగ్మూలం ఇచ్చినట్టు సమాచారం.

☛ 'ఈనాడు' కథనాలపై స్పందించిన కలెక్టర్ తమీమ్.. విచారణ బాధ్యతను జిల్లా పరిషత్తు సీఈవో జ్యోతిబసు, పొన్నూరు కమిషనర్ ఎం. రమేష్‌బాబులకు అప్పగించారు. తాజా పరిణామాల నేపథ్యంలో అక్రమార్కులు సమాలోచనలో ఉన్నట్టు సమాచారం.

చిట్టి తల్లులు.. చేదు నిజాలు..

ఉమ్మడి జిల్లాలో సమస్యగా టీనేజ్ ప్రెగ్నెన్సీ కేసులు

ఈనాడు - అమరావతి

చిట్టితల్లులు చిక్కుల్లో పడుతున్నారు.. కౌమార దశలోనే పెద్ద బాధ్యతను కడుపులో మోస్తున్నారు. తల్లిదండ్రుల అవగాహనా రాహిత్యం, అధికారుల నిర్లిప్తత.. కారణాలేమైనా టీనేజ్ ప్రెగ్నెన్సీతో ఇబ్బందులు పడుతున్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో పల్నాడు, బాపట్లలో ఈ సమస్య ప్రమాద ఘంటికలు మోగిస్తుండగా.. గుంటూరు జిల్లాలోనూ తీవ్రత ఉండడం గమనార్హం.

▮ పల్నాడు జిల్లాలో రాష్ట్రంలోనే అత్యధికంగా 14.94 శాతం టీనేజ్ ప్రెగ్నెన్సీ కేసులున్నాయి. ▮ తరువాత స్థానంలో బాపట్ల జిల్లా 12-15 శాతంతో తీవ్ర పరిస్థితిని ఎదుర్కొంటోంది. ▮ గుంటూరు జిల్లాలో 8-10 శాతం మధ్య కేసులున్నాయి. ▮ బాల్య వివాహాలు, అత్యాచారాలు, తెలిసీతెలియని వయసులో క్షణికావేశం.. ఇలా కౌమార దశలో గర్భం దాల్చడానికి కారణమవుతున్నాయి. ▮ 13 నుంచి 19 ఏళ్ల మధ్య వయసున్న ఆడ పిల్లలు ఈ సమస్య ఎదుర్కొంటున్నారు.

నివేదికలు హెచ్చరించినా..

రాష్ట్రంలో బాల్యవివాహాల సగటు 29.3%. ఉమ్మడి జిల్లాలో అత్యధికంగా బాల్యవివాహాలు జరుగుతున్నట్టు మూడేళ్ల క్రితమే పలు నివేదికలు తేల్చి చెప్పాయి. జాతీయ ఆరోగ్య కుటుంబ సర్వే లెక్కల ప్రకారం 2019-20లో 35.4% బాల్య వివాహాలు జరిగాయి. కొవిడ్ అనంతర కాలంలో ఈ శాతం ఏటా పెరుగుతోంది.

ఉమ్మడి జిల్లాలో 2018లో 31, 2019లో 23, 2020లో 34, 2021లో 37 బాల్య వివాహాలను ఐసీడీఎస్ అధికారులు అడ్డుకున్నారు. గత ఐదేళ్లలో ఏటా 20కుపైగానే అడ్డుకున్నట్టు సంబంధిత వర్గాలు చెబుతున్నాయి.

పల్నాడులోనే అత్యధికం

పల్నాడు ప్రాంతంలో బాల్య వివాహాలు అధికమని అధికారులు చెబుతున్నారు. మాచర్ల, దుర్గి, వెల్దుర్తి, పిడుగురాళ్ల, గురజాల, దాచేపల్లి మండలాల్లో, మారుమూల అటవీప్రాంతాల్లో చిన్నారి పెళ్లికూతుళ్లు ఎక్కువగా ఉంటున్నారు. నిరక్షరాస్యత, అవగాహన లేకపోవడం, పేదరికంతోపాటు లైంగిక వేధింపులు, అత్యాచారాల నుంచి బయటపడేందుకు చిన్న వయసులోనే బాలికలకు పెళ్లిళ్లు చేస్తున్నారు.

కమిటీల చొరవ అవసరం

❖ బాల్య వివాహాలను అడ్డుకునేందుకు జిల్లా స్థాయిలో కలెక్టర్, డివిజన్ స్థాయిలో డివిజన్ అధికారి, సబ్ కలెక్టర్లు బాల్య వివాహ నిరోధక అధికారులుగా వ్యవహరిస్తారు. ❖ స్త్రీ, శిశు సంక్షేమశాఖ సీడీపీవో ప్రాజెక్టు స్థాయిలో మూడు నుంచి ఐదు మండలాలకు ఒక బాలల అభివృద్ధి ప్రాజెక్టు అధికారి, మండల స్థాయిలో తహసీల్దారు నేతృత్వంలో పని చేస్తున్నారు.

❖ గ్రామాల్లో సర్పంచి, పంచాయతీ కార్యదర్శి, వీఆర్వో, ఉపాధ్యాయులు, మహిళా వార్డు మెంబర్లు, స్వచ్ఛంద సంస్థ సభ్యులు, అంగన్వాడీ కార్యకర్త.. ఇలా అనేక మంది బాల్య వివాహ నిరోధక కమిటీలో సభ్యులుగా ఉన్నారు.

❖ ఇవి మరింత ప్రత్యేక దృష్టి సారించి బాల్య వివాహాలను అడ్డుకోగలిగితే 'టీనేజ్ ప్రెగ్నెన్సీ'ని కట్టడి చేయడానికి అవకాశం ఉంటుంది.

డీఎంహెచ్‌వోగా వెంకటేశ్వర్లు

విజయలక్ష్మి బదిలీ

ఈనాడు, అమరావతి: జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారిణి డాక్టర్ కె.విజయలక్ష్మి బదిలీ అయ్యారు. ఆమెను ప్రజారోగ్యశాఖ సంచాలకుల కార్యాలయంలో రిపోర్ట్ చేయాలని వైద్యారోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కార్యదర్శి సౌరభ్‌గౌర్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. గుంటూరు డీఎంహెచ్‌వోగా ప్రకాశం జిల్లాలో పని చేస్తున్న డాక్టర్ టి.వెంకటేశ్వర్లును నియమిస్తూ ఆదేశాలు వెలువడ్డాయి.

☛ ఆరు నెలల క్రితం తురకపాలెంలో అంతుచిక్కని మరణాలు, మెలియాయిడోసిస్ కేసుల నమోదు రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన సంగతి తెలిసిందే. ముప్పును సకాలంలో గుర్తించి, ఉన్నతస్థాయికి నివేదించడంలో వైద్యారోగ్యశాఖ అధికారులు, సిబ్బంది విఫలమయ్యారని అప్పట్లో అత్యున్నతస్థాయి వర్గాల నుంచి వినిపించిన మాట. ఈ క్రమంలో ప్రభుత్వం ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి క్షేత్రస్థాయిలో అధ్యయనం చేయించింది. శాఖాపరమైన లోపాలపై సమగ్ర విచారణ చేసినా.. తదనంతరం ఈ అంశం స్తబ్ధుగా ఉండిపోయింది. ఫిబ్రవరి 13న 'మట్టి తవ్వారు.. ఫలితం మరిచారు' శీర్షికన 'ఈనాడు' కథనం ప్రచురించింది. ఈ క్రమంలో డీఎంహెచ్‌వోను ప్రభుత్వం బదిలీ చేసింది. కనీస స్థాయిలో చొరవ చూపని క్షేత్రస్థాయి వైద్యులు, సిబ్బందిపై చర్యలుంటాయా? అన్నది వేచి చూడాల్సిందే.

వచ్చిన మిర్చి వచ్చినట్టే...

విక్రయానికే రైతుల మొగ్గు

ఖాళీ అవుతున్న శీతల గోదాములు

ఈనాడు - అమరావతి



ఎండుమిర్చికి మంచి ధరలు లభిస్తున్న నేపథ్యంలో సరకు విక్రయించడానికే రైతులు మొగ్గు చూపుతున్నారు. గతేడాది శీతల గోదాముల్లో నిల్వ చేసినవారు కూడా సరకు మార్కెట్‌కు తరలిస్తున్నారు. ఫలితంగా గోదాముల్లో నిల్వలు ఖాళీ అవుతుండగా.. కొత్తగా సరకు నిల్వ చేసే పరిస్థితులు కనిపించడం లేదు. ప్రస్తుతం కొన్ని రకాల మిర్చి ధరలు క్వింటాకు రూ.20 వేలకుపైగానే పలుకుతున్నాయి. గరిష్ఠంగా రూ.26 వేల వరకు వెళ్లింది. అందుకే రైతులు వచ్చిన సరకును వచ్చినట్టే అమ్మేస్తున్నారు. గతేడాదితో పోలిస్తే సీజన్ ప్రారంభంలోనే ఈసారి ధరలు బాగుండడం కలిసొచ్చింది.

ప్రస్తుతం మార్కెట్‌కు వస్తున్న మిర్చిలో రోజూ శీతల గోదాముల నుంచి వస్తున్న సరకు సగటున 30 వేల టిక్కీలు. ఇదే పరిస్థితి కొనసాగితే మార్చి 15 నాటికి పాత నిల్వలు పూర్తిగా తగ్గిపోతాయి. 2024, 2025 సీజన్లో నిల్వ చేసిన మిర్చిని ఇప్పుడు విక్రయించకపోతే రంగు మారి నాణ్యత దెబ్బతింటుంది. అందుకే నిల్వ మిర్చి విక్రయాలు జోరందుకున్నాయి.

యార్డుకు వచ్చిన సరకు, అమ్మకాలు, నిల్వలు బస్తాల్లో....

ఫిబ్రవరి	వచ్చింది	విక్రయం	నిల్వలు
10	1,02,248	98,826	21,721
11	1,09,852	1,05,937	25,636
16	87,018	82,824	18,613

17వ తేదీ గరిష్ఠ ధరలు క్వింటాకు..

రకం	రూపాయల్లో
334	21,500
నంబరు-5	22,000
341	24,000
తేజ	18,000
బాడిగి	25,000

నిలకడగా ధరలు

యార్డులో కొన్నాళ్లుగా పెరుగుతూ వచ్చిన ధరలు ప్రస్తుతం నిలకడగా ఉన్నాయి. రంజాన్ నేపథ్యంలో బంగ్లాదేశ్‌కు ఎగుమతులు తగ్గడం, చైనాలో నూతన సంవత్సరం సందర్భంగా సెలవులతోపాటు పాత సరకు మార్కెట్‌కు వస్తుండడం, పాకిస్థాన్‌లోనూ ఇదే పరిస్థితి ఉండడంతో ప్రస్తుతం ఎగుమతులు ఆశాజనకంగా లేవు. దేశీయంగా ఉన్న డిమాండ్ వల్లనే ధరలు నిలకడగా ఉన్నాయి. రెండు రోజులుగా కొన్ని రకాల ధరలు క్వింటాకు రూ.500 వరకు తగ్గాయి.

నిత్యం 95 శాతం బస్తాల విక్రయం

యార్డుకు సాధారణంగా ఫిబ్రవరిలో రోజుకు లక్ష బస్తాలకు పైగా మిర్చి టిక్కీలు రావాలి. ఈసారి ఇప్పటి వరకు కేవలం రెండు రోజుల్లో మాత్రమే లక్ష బస్తాలు దాటాయి. ధరలు బాగున్నందున వచ్చిన సరకులో 95 శాతంపైగా అమ్ముడైపోతున్నాయి. యార్డులో రోజువారీ అమ్మకాల తరువాత ముందురోజు నిల్వలతో కలిసి 25 వేలలోపే బస్తాలుండడం సరకు కొరతకు నిదర్శనం. ప్రస్తుతం పాతవి, కొత్తవి కలిపి శీతల గోదాముల్లో సుమారు 12 లక్షలలోపే బస్తాలుంటాయని అంచనా.

గోదాముల్లోంచి సరకు ఖాళీ అవుతోంది. కొత్త సరకు రానందున ఈసారి గోదాములు నిండే పరిస్థితి లేదు. గతేడాదితో పోలిస్తే సాగు విస్తీర్ణం, సరకు రాక తగ్గడంతో ధరలు పెరిగాయి. - **సురేంద్రబాబు, శీతల గోదాముల సంఘ అధ్యక్షుడు**

ఎయిమ్స్ ప్రస్థానం అద్వితీయం

మంత్రి లోకేశ్

ఘనంగా స్నాతకోత్సవం

ఈనాడు, అమరావతి - న్యూస్‌టుడే, మంగళగిరి, తాడేపల్లి

రాష్ట్ర మంత్రి లోకేశ్‌ను సన్మానిస్తున్న అహెంతమ్ శాంతాసింగ్. వేదికపై కేంద్ర సహాయ మంత్రి అనుప్రియ పటేల్, ఎయిమ్స్ అధ్యక్షుడు తపన్‌కుమార్ సాహా, డీన్ రామ్మోహన్ తదితరులు

మంగళగిరి ఎయిమ్స్ ప్రస్థానం అద్వితీయం. బోధన, పరిశోధన, రోగి సంరక్షణ అనే మూడు స్తంభాలపై నిలిచి ఉంది. నమ్మకం అనే నాలుగో స్తంభాన్ని కూడా చేర్చాలని కోరుకుంటున్నానని రాష్ట్ర ఐటీ, విద్య శాఖల మంత్రి నారా లోకేశ్ ఆకాంక్షించారు. మంగళవారం మంగళగిరి ఎయిమ్స్‌లో నిర్వహించిన రెండో స్నాతకోత్సవంలో ఆయనతోపాటు కేంద్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ సహాయ మంత్రి అనుప్రియ పటేల్ ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. తొలుత ఎయిమ్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అహెంతమ్ శాంతాసింగ్ ఆసుపత్రి ప్రగతి నివేదిక వివరించారు.

ఆకట్టుకున్న వస్త్రాలంకరణ.. ఎయిమ్స్ విభాగాధిపతుల నుంచి వైద్యులు, వైద్య విద్యార్థులు మంగళగిరి చేనేత వస్త్రాలంకరణతో ఆకట్టుకున్నారు. పురుషులు అచ్చమైన పంచెకట్టు, పైజామా ధరించగా.. మహిళలు చేనేత చీరలు ధరించారు. యువ వైద్యులు సైతం సంప్రదాయ వస్త్రధారణతో సందడి చేశారు.

☛ ఎయిమ్స్ అధ్యక్షుడు తపన్‌కుమార్ సాహా, డీన్ రామ్మోహన్, రిజిస్ట్రార్ సత్యనారాయణన్, రీసెర్చ్ డీన్ జాయ్ ఘోష్ తదితరులు పాల్గొన్నారు.

మంగళగిరి ఎయిమ్స్ 2015లో అతి సామాన్యంగా ప్రారంభమైంది. నేడు అండర్ గ్రాడ్యుయేట్, పోస్ట్ గ్రాడ్యుయేట్, పీజీ, సూపర్ స్పెషాలిటీ, నర్సింగ్, అనుబంధ ఆరోగ్య రంగాల్లో 1,300 మందికిపైగా విద్యార్థులతో సమగ్ర సంస్థగా ఎదిగింది. ప్రస్తుతం 650 పడకలున్నాయి. - **మంత్రి నారా లోకేశ్**

ఉత్తమ ప్రతిభ చూపినందుకు..

మంగళగిరి ఎయిమ్స్‌లో 2019 బ్యాచ్‌లో ఎంబీబీఎస్ పూర్తి చేశా. నాన్న పోలినాయుడు బిల్డర్, అమ్మ విజయ గృహిణి. సిద్ధాంతపరమైన పరిజ్ఞానాన్ని రోగులపై ప్రయోగిస్తూ.. క్లినికల్ నైపుణ్యాలు, చికిత్స చేసే విధానంలో ఉత్తమ ప్రతిభ చూపినందుకు బెస్ట్ ఇంటర్న్ కింద బంగారు పతకం అందుకున్నా.

- **డాక్టర్ యోగ్యతా పూజారి, విశాఖపట్నం**

బెస్ట్ ఆల్‌రౌండర్‌గా ఎంపికయ్యా..

పరిశోధన, క్రీడలు, సాంస్కృతిక, ఇతర అంశాలను కూడా పరిగణనలోకి తీసుకుని బెస్ట్ ఆల్‌రౌండర్‌గా ఎంపిక చేసి బంగారు పతకం ఇచ్చారు. ఎయిమ్స్‌లో బోధన చాలా బాగుంది. ప్రస్తుతం గుంటూరు వైద్య కళాశాలలో ఎండీ డెర్మటాలజీ చేస్తున్నా. నాన్న రామకృష్ణారెడ్డి వ్యాపారి, అమ్మ విజయలక్ష్మి గృహిణి.

- **డాక్టర్ విజయలక్ష్మి, రాజమహేంద్రవరం**

అన్ని పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించా

వైద్యుడిగా స్థిర పడతానని ఇంట్లో చెప్పా. కాదనలేదు. అమ్మానాన్నలకిచ్చిన మాట నిలబెట్టడం కోసం కష్టపడి చదివా. 2019 బ్యాచ్‌లో ఎంబీబీఎస్ పూర్తి చేశా. అన్ని పరీక్షల్లో అత్యధిక మార్కులు వచ్చినందుకు అకడమిక్ ఎక్సలెన్స్ కింద బంగారు పతకం దక్కింది. నాన్న తపాలాశాఖలో పని చేస్తారు.

- **డాక్టర్ గౌతమ్ అంబటి, ఉంగుటూరు, ఏలూరు జిల్లా**

విద్యార్థుల సంపూర్ణ ఆరోగ్యానికి ప్రాధాన్యం

వైద్య పరీక్షల వివరాలతో డిజిటల్ హెల్త్ కార్డులు

తుళ్లూరు, న్యూస్‌టుడే: విద్యార్థుల్లో అనారోగ్య సమస్యలు, లోపాలను ప్రాథమిక స్థాయిలో గుర్తించి చికిత్స అందించేందుకు రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమం (ఆర్‌పీఎస్‌కే) కింద నాలుగు కేటగిరీల్లో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నామని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడించారు. విద్యార్థుల సంపూర్ణ ఆరోగ్యం కోసం వైద్య పరీక్షల వివరాలతో కూడిన డిజిటల్ హెల్త్ కార్డులు అందిస్తున్నామని చెప్పారు. అనారోగ్య సమస్యలు ఉన్నవారికి జిల్లాల్లోని ఎర్లీ ఇంటర్వెన్షన్ సెంటర్ల ద్వారా ఉచితంగా చికిత్స అందిస్తున్నామని, పుట్టుకతో వచ్చే లోపాలకు శస్త్ర చికిత్సలు చేయిస్తున్నామన్నారు. జాతీయ నులి పురుగుల నిర్మూలన దినోత్సవాన్ని పురస్కరించుకుని మందడం గ్రామంలోని జిల్లా పరిషత్ పాఠశాల్లో మంగళవారం స్థానిక ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్‌తో కలసి మంత్రి విద్యార్థులకు అల్బెండజోల్ మాత్రలు పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో ఈ ఏడాది 19 ఏళ్ల లోపు ఉన్న 1.11 కోట్ల మందికి మాత్రలు ఇవ్వాలనే లక్ష్యంతో పని చేస్తున్నామని చెప్పారు. నులిపురుగుల వల్ల రక్తహీనత, శారీరక ఎదుగుదల లోపం, కడుపు నొప్పి, వికారం, వాంతులు, బలహీనత వంటి అనారోగ్య సమస్యలు వస్తాయన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, విద్య, వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థికి నులిపురుగు నివారణ మాత్రలు వేస్తున్న మంత్రి సత్యకుమార్, ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్ తదితరులు

జ్ఞానాన్ని పంచొచ్చు.. అభివృద్ధి చేయొచ్చు

ప్రభుత్వ పాఠశాలలకు వరంగా 'విద్యాంజలి 2.0'

దుగ్గిరాల, మంగళగిరి గ్రామీణ, న్యూస్‌టుడే



తమకు విద్యాబుద్ధులు నేర్పిన పాఠశాలల అభివృద్ధికి తోడ్పాటు అందించడంతోపాటు విద్యార్థులకు తమ జ్ఞానాన్ని పంచాలనుకునే వారికి కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న 'విద్యాంజలి 2.0' కార్యక్రమం చక్కటి వేదికగా నిలుస్తోంది. సమాజాన్ని, స్కూలును అనుసంధానం చేసే వారధిలా ఈ పథకాన్ని ప్రవేశపెట్టారు. ఈ నెల 7న జిల్లాలోని అన్ని మండలాల్లో ఆయా హెచ్‌ఎంలకు సమావేశాలు నిర్వహించి ప్రత్యేకంగా రూపొందించిన విద్యాంజలి వెబ్‌సైట్‌పై అధికారులు అవగాహన కల్పించారు. ఉపయోగాలు, స్కూలు వివరాలు నమోదు చేసే విధానాన్ని వివరించారు. జాతీయ విద్యా విధానం 2020 లక్ష్యాలకు అనుగుణంగా ఈ ప్రోగ్రాంను రూపకల్పన చేశారు.

☛ తోడ్పాటు అందించాలనుకునే వారు 'వాలంటీర్లు'గా vidyanjali.education.gov.inలో వివరాలు నమోదు చేయాల్సి ఉంటుంది. ఈ సాయాన్ని రెండు విధాలుగా అందించవచ్చు. ఒకటి, ఏదైనా రంగం లేదా సబ్జెక్టులో నిపుణత ఉంటే ఆయా అంశాలను విద్యార్థులకు బోధించవచ్చు. వారిలో ప్రేరణ నింపవచ్చు. రెండోది, క్రీడా పరికరాలు, కంప్యూటర్లు, పుస్తకాలు వంటివి వస్తు రూపేణా సమకూర్చవచ్చు. తరగతి గదులు, ప్రహరీలు తదితర మౌలిక వసతులు కల్పించవచ్చు.

నమోదు ఇలా..

* వాలంటీర్లు 'విద్యాంజలి' వెబ్‌సైట్‌లో లాగిన్ అయ్యి ఏ రూపేణా సాయం అందించాలని అనుకుంటున్నారో స్పష్టంగా నమోదు చేయాలి. ఫోన్ నంబరు, మెయిల్ ఐడీ వివరాలు పొందుపరచాలి.
* స్కూళ్ల వారీగా ఏమేం అవసరాలు ఉన్నాయో కనిపిస్తుంటాయి. ఆ మేరకు వాలంటీర్లు నేరుగా సాయం అందించవచ్చు. ఆ సాయం నగదు రూపంలో ఉండకూడదు.

ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు రుణాలు

జిల్లాపరిషత్తు, న్యూస్‌టుడే: ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు బ్యాంకులు రుణాలు అందజేసి ప్రోత్సహించేలా చూస్తామని ఎల్‌డీఎం మహిపాల్ రెడ్డి అన్నారు. కలెక్టరు కార్యాలయం ఎస్.ఆర్. శంకరన్ సమావేశ మందిరంలో 'వ్యవసాయ-వ్యవసాయేతర జీవనోపాధులపై గ్రామ సంఘాల అధ్యక్షులు, ఈసీ సభ్యులకు 'ఒక కుటుంబం-ఒక వ్యాపారవేత్త' అంశంపై డీఆర్‌డీఏ, వెలుగు ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమం మంగళవారం జరిగింది. డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టరు వి.విజయలక్ష్మి అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన మహిపాల్‌రెడ్డి మాట్లాడుతూ లఖ్‌పత్ దీదీ పథకంలో మహిళలకు రూ.లక్ష వరకు బ్యాంకర్లు రుణాలు ఇస్తారన్నారు. జీవనోపాధిని కల్పించే యూనిట్లతో వ్యాపారాలు చేసే వారు విధిగా ఆయా బ్యాంకుల్లో కరెంటు అకౌంట్లను తెరిచినట్లయితే వారిని వ్యాపారవేత్తలుగా బ్యాంకులు గుర్తిస్తాయన్నారు. ఆర్థిక సంవత్సరంలో లావాదేవీలు ఆధారంగా నాలుగు రెట్లు రుణం ఇస్తారన్నారు. నాబార్డ్ డీడీఎం శరత్ మాట్లాడుతూ వ్యవసాయ యూనిట్లను ఏర్పాటు చేసే వారికి రూ.5 లక్షల వరకు పూచీకత్తు లేని రుణాలు బ్యాంకులు అందజేస్తాయన్నారు. సమావేశంలో డీఆర్‌డీఏ-వెలుగు జీవనోపాధుల విభాగం డీపీఎం టి.అశోక్ కుమార్, జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు కుంభా పద్మ, జిల్లా పరిశ్రమల కేంద్ర జనరల్ మేనేజర్ జయలక్ష్మి, అధికారి ఆనంద్, డీఆర్‌పీ రామయ్య, పశు వైద్యాధికారి కోటేశ్వరరావు, యూనియన్ బ్యాంకు నుంచి సందీప్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎల్‌డీఎం మహిపాల్‌రెడ్డి

వేసవిలో తాగునీటి ఎద్దడి రానీయొద్దు

కలెక్టరేట్, న్యూస్‌టుడే: రానున్న వేసవిలో ఎక్కడా తాగునీటికి ఎద్దడి రానీయొద్దని కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా ఆదేశించారు. కలెక్టరేట్‌లోని వీసీ హాలులో మంగళవారం జిల్లా నీరు, పారిశుద్ధ్య కమిటీ సమావేశం కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. పంచాయతీల వారీగా నిధుల లభ్యత నివేదిక సమర్పించాలన్నారు. గతంలో ఏ మండలాలు, గ్రామాల్లో తాగునీటి సమస్య వచ్చిందో పరిశీలించి ప్రస్తుత పరిస్థితిని గమనించాలన్నారు. 24 గంటల్లో బోరు బావుల మరమ్మతులు పూర్తి చేయడానికి అవసరమైన విడి భాగాలు సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ కె.కల్యాణచక్రవర్తి మాట్లాడుతూ 113 స్లో సాండ్ ఫిల్టర్ల మరమ్మతులకు రూ.13.81 కోట్లు అవసరమని వివరించారు. 34 స్లో సాండ్ ఫిల్టర్ పనులను రూ.2.67 కోట్ల అంచనా వ్యయంతో ప్రారంభించామని, అందులో 26 పూర్తయ్యాయని తెలిపారు. జడ్పీ సీఈవో వి.జ్యోతిబసు, ఐసీడీఎస్ పీడీ ప్రసూన, డీపీవో నాగసాయికుమార్, వ్యవసాయ శాఖ జేడీ ఎం.పద్మావతి, డీఆర్డీఏ పీడీ వి.విజయలక్ష్మి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కలెక్టర్ తమీమ్

శ్రద్ధాంజలి



కీ॥శే॥ తోట శివమల్లిఖార్జునరావు గారు
లాలుపురం (గ్రా.), గుంటూరు రూరల్ (మం.)
జననం : 1/11/1958 మరణం : 17/2/2026

ప్రేమతో ఆప్యాయతతో అందరి మనస్సులను ఆకట్టుకున్న మీరు ఇక లేరన్న నిజాన్ని నమ్మలేకున్నాము. మీ పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ఆ భగవంతుని ప్రార్థిస్తూ...
- కుటుంబ సభ్యులు

: అంతిమయాత్ర :
ది. 18-2-2026 బుధవారం ఉ॥ 10 గం.లకు గుంటూరు రూరల్ (మం.), లాలుపురం (గ్రా.) లోని మా స్వగృహమునుండి బయలుదేరును.

కలెక్టరేట్(గుంటూరు): ఉగాది నాటికి నిర్దేశిత గృహ నిర్మాణ లక్ష్యాలు పూర్తి చేయాలని కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా ఆదేశించారు. గృహ

ఉగాదికి గృహాలు పూర్తి చేయాలి

నిర్మాణం, జిల్లా నీటి యాజమాన్య సంస్థ పనులపై మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రత్యేకాధికారులు, ఎంపీడీవోలతో సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 22,952 గృహాలు పూర్తి చేయాలని లక్ష్యంగా ఉందని, దీనిని పూర్తి చేయడానికి ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశించారు. బిల్లుల చెల్లింపు వెంటనే జరుగుతుందని లబ్ధిదారులకు స్పష్టంగా అవగాహన కల్పించాలని సూచించారు. ఇళ్ల నిర్మాణాన్ని మధ్యలో ఆపి వెళ్లిన కాంట్రాక్టర్లు ఉంటే క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. పబ్లిక్ పాజిటివ్ పర్సెప్షన్‌లోనూ వివిధ విభాగాల్లో ప్రజల అభిప్రాయాలు సానుకూలంగా కనిపించడం లేదని వాటిని తక్షణం చక్కదిద్దుకోవాలన్నారు. పీఎంఏవై 2.0 కింద యూనిట్ ఖరీదు రూ.2.50 లక్షలతో 1755 గృహాలు మంజూరు చేయడం జరిగిందని, వాటిలో 262 మాత్రమే ప్రారంభించారని, మిగిలినవి వెంటనే ప్రారంభించాలని ఆదేశించారు. జిల్లాలో మంజూరు చేసిన ఉపాధి హామీ పనులను మార్చి 31లోగా పూర్తి చేయాలని ఆదేశించారు. వ్యక్తిగత, సామాజిక మరుగుదొడ్లు, అంగన్‌వాడీ కేంద్రాల్లో తాగునీటి సౌకర్యాల కల్పన నెలాఖరుకు పూర్తి చేయాలన్నారు. చేబ్రోలు, దుగ్గిరాల, తెనాలి మండలాల్లో ప్రగతి బాగా మెరుగు పడాలన్నారు. సమావేశంలో గృహనిర్మాణ సంస్థ పీడీ జె.వి.ఎస్.ఆర్.కె.ప్రసాద్, డ్వామా పీడీ వి.శంకర్, పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారి జి.శ్రీనివాస్ పాల్గొన్నారు.

మల్లేశ్వరా.. పాహిమాం

మంగళగిరి, మంగళగిరి గ్రామీణం: మంగళగిరిలోని శ్రీ గంగా భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి వారి దివ్య రథోత్సవం మంగళవారం సాయంత్రం వైభవంగా సాగింది. 3 గంటలకు మొదలైన ఊరేగింపు ఆంజనేయస్వామి మిద్దె కూడలి వరకు చేరుకుని..అక్కడి నుంచి తిరిగి రథశాలకు చేరుకున్నారు. వేలాది మంది భక్తులు తరలివచ్చారు. ఆలయ పాలక వర్గ సభ్యులు, అధికారులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

స్వామి, అమ్మవార్లు

మంగళగిరి: రథోత్సవంలో భక్తజన సందోహం

కనులపండువగా రథోత్సవం

రథోత్సవాన్ని ప్రారంభిస్తున్న పూర్ణచంద్రరావు, లీలాకుమార్, పాలక మండలి సభ్యులు

రాజరాజేశ్వరీదేవిగా అమ్మవారు

పెదకాకాని, న్యూస్‌టుడే: పెదకాకాని మల్లేశ్వరస్వామి దేవస్థానంలో మహాశివ రాత్రి మహోత్సవాలు పురస్కరించుకుని మంగళవారం గంగా భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి దివ్య రథోత్సవం కనులపండువగా జరిగింది. ఉదయం సుప్రభాత సేవ, మహా హారతులు, మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు నిర్వహించారు. భ్రమరాంబ అమ్మవారు రాజరాజేశ్వరిదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. సాయంత్రం దేవతామూర్తుల రథోత్సవం మేళతాళాలు, బోనాల నృత్య ప్రదర్శనతో వైభవంగా ప్రారంభమైంది. ప్రత్యేక పూజలు నిర్వహించేందుకు భక్తులు పోటీపడ్డారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఆలయ ఛైర్మన్ కోసూరి పూర్ణచంద్రరావు, ఈవో గోగినేని లీలాకుమార్ ఏర్పాట్లను పర్యవేక్షించారు. పాలక మండలి సభ్యులు, తెదేపా నాయకులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

మానవత్వం చాటిన మంత్రి

తాడేపల్లి: రోడ్డు ప్రమాదంలో గాయపడిన వారిని వైద్యశాలకు తరలించి ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ మానవత్వాన్ని చాటుకున్నారు. మంగళగిరి ఎయిమ్స్ సమీపంలో జరిగిన ప్రమాదాన్ని గమనించిన మంత్రి తన వాహనాన్ని నిలిపి స్వల్పంగా గాయపడిన క్షతగాత్రులకు సపర్యలు చేసి ఎయిమ్స్ వైద్యశాలకు అంబులెన్స్‌లో చికిత్స నిమిత్తం తరలించారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు. తమకు సాయం చేసిన మంత్రికి క్షతగాత్రులు కృతజ్ఞతలు తెలిపారు.

క్షతగాత్రుడికి సపర్యలు చేస్తున్న మంత్రి సత్యకుమార్ యాదవ్

20న షర్మిల తెనాలి రాక

తెనాలి(కొత్తపేట): ఉపాధి హామీ పథకం రద్దుతో కలిగే నష్టాన్ని తెలియజేయడానికి కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు వై.ఎస్.షర్మిల ఉపాధి హామీ పరిరక్షణ యాత్ర చేపట్టినట్లు ఆ పార్టీ నాయకులు పేర్కొన్నారు. మంగళవారం వారు తెనాలిలోని పార్టీ కార్యాలయంలో మాట్లాడారు. అఖిల భారత కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన పిలుపు మేరకు అనంతపురంలో ప్రారంభమైన యాత్ర ఈ నెల 20 తెనాలికి చేరనున్నట్లు తెలిపారు. సమావేశంలో ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు సుధీర్, కార్యదర్శి శెట్టి శివరామకృష్ణ ప్రసాద్, గుంటూరు టౌన్ అధ్యక్షుడు ఖలీల్, తెనాలి నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ చందు సాంబశివుడు, పట్టణ అధ్యక్షుడు పొన్నూరు నాగ సూర్యశశిధరరావు, ఉపాధ్యక్షుడు గుర్రపు ద్వారక శ్రీనివాస్ పాల్గొన్నారు.

సభా కార్యక్రమాలపై చిన్నారుల ప్రశ్నలు

విద్యార్థులతో స్పీకర్ అయ్యన్నపాత్రుడు, ఎమ్మెల్యే ఉమామహేశ్వరరావు

పెదకాకాని : 'ప్రజా సమస్యలను శాసనసభలో ఎలా ప్రస్తావిస్తారు? ఎమ్మెల్యేల బాధ్యతలు ఏంటి? యువత రాజకీయాల్లోకి రావాలంటే ఏం చేయాలి?...' అంటూ పలువురు చిన్నారులు ప్రజాప్రతినిధులను ప్రశ్నలు వేసి వివరాలు తెలుసుకున్నారు. మంగళవారం గుంటూరు జిల్లా నంబూరు వివా వరల్డ్ స్కూలు విద్యార్థులు శాసన సభ సమావేశాలకు విచ్చేసి, సభా కార్యక్రమాలు జరుగుతున్న తీరును పరిశీలించారు. సభ అనంతరం స్పీకర్ అయ్యన్నపాత్రుడు, విజయవాడ సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు తదితరులను కలిశారు. ఈ సందర్భంగా వారు అడిగిన ప్రశ్నలకు స్పీకర్ ఓపికగా సమాధానం ఇచ్చారు. ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు విద్యార్థులతో ముచ్చటించారు. చదువులో ప్రతిభ కనబరుస్తూ సమాజంపై అవగాహన పెంచుకుంటే భవిష్యత్తులో మంచి నాయకులుగా ఎదుగుతారంటూ వారిని ప్రోత్సహించారు. సమాజానికి ఉపయోగపడే బాధ్యతాయుత పౌరులుగా ఎదుగుతామని విద్యార్థులు పేర్కొన్నారు.

అన్న క్యాంటీన్ భవనం కూల్చివేత

ప్రభుత్వ ఆస్తికి నష్టం కలిగించిన ఎనిమిది మందిపై కేసు

పట్టాభిపురం, న్యూస్‌టుడే: అన్నక్యాంటీన్ భవనం కూల్చిన ఘటనపై ఎనిమిది మందిపై పట్టాభిపురం పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. 39వ డివిజన్‌లోని గుజ్జనగుండ్ల సెంటర్‌కు సమీపంలో అన్నక్యాంటీన్ భవనం ఉంది. అన్న క్యాంటీన్లు పునఃప్రారంభించిన సమయంలో ఈ ప్రాంతంలో ప్రారంభించ లేదు. అప్పటినుంచి భవనం అంతే ఉంది. ఈ క్యాంటీన్ వెనుక వైపున అన్నపూర్ణ విశ్వేశ్వర ఆలయం ఉంది. ఈ ఆలయానికి అడ్డుగా ఉందని దేవాలయం కమిటీ ఛైర్మన్ గుర్రాల రవి, సభ్యులు గుర్రాల వెంకటేశ్వర్లు, గుర్రాల శివశంకర్, ఆళ్ల మధు, పోగుల వెంకటేశ్వర్లు, పోగుల శివప్రసాద్, గుర్రాల ఉష, పులి కిషోర్ ఈనెల 14న అర్ధరాత్రి సమయంలో పొక్లెయిన్‌తో కూల్చి వేయించారు. అప్పట్లో పోలీసులకు సమాచారం రావడంతో పొక్లెయిన్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఎటువంటి చట్టబద్ధమైన అనుమతి లేకుండా అక్రమంగా భవనాన్ని కూల్చి వేశారని, ప్రభుత్వ ఆస్తికి లక్షలాది రూపాయలు నష్టం కలిగించారని నగరపాలక సంస్థ ఏఈ విజయ్‌బాబు ఫిర్యాదు చేశారు. ఈమేరకు పట్టాభిపురం పోలీసులు ఎనిమిది మందిపై కేసు నమోదు చేశారు.

భవనం శిథిలాలు

ఆర్మీ ర్యాలీ ప్రారంభం



జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న జేసీ అశుతోష్ శ్రీవాస్తవ

ఏఎన్‌యూ, న్యూస్‌టుడే: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో నిర్వహిస్తున్న ఆర్మీ ర్యాలీని జేసీ అశుతోష్ శ్రీవాస్తవ ప్రారంభించారు. మంగళవారం తెల్లవారుజామున జెండా ఊపి అభ్యర్థుల పరుగుపందెంను ఆరంభించారు. ఏఎన్‌యూలోని సింథటిక్ మైదానంలో ఫ్లడ్ లైట్ల వెలుగులో అభ్యర్థులు పరుగు పందెంలో పాల్గొన్నారు. ఈ నెల 27 వరకు ఎంపికలు కొనసాగుతాయని అధికారులు తెలిపారు. శారీరక కొలతలు, ఇతర పరీక్షలు నిర్వహించిన అనంతరం అభ్యర్థులకు పరుగుపందెం పోటీలు నిర్వహించారు.

ప్రణాళిక ప్రకారమే చోరీ..!

ఎమ్మెల్యే మాతృమూర్తి ఇంట్లో భారీ దొంగతనం

పొన్నూరు, న్యూస్‌టుడే: పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ మాతృమూర్తి ధూళిపాళ్ల ప్రమీలాదేవి నాలుగు రోజులుగా గుంటూరులోని కుమారుడి స్వగృహంలో ఉంటున్నారు. ఆమె చింతలపూడిలోని గృహంలో ఉండటం లేదనే విషయాన్ని దొంగలు పసిగట్టి చోరీకి పాల్పడి ఉండవచ్చని.. రెక్కీ నిర్వహించి ఉంటారని పోలీసులు భావిస్తున్నారు. పక్కా ప్రణాళిక ప్రకారం చోరీ జరిగినట్లు భావిస్తున్నారు. ★ ఈ నేపథ్యంలో మంగళవారం ప్రమీలాదేవి ఇంట్లో దొంగతనం జరిగిందని సెక్యూరిటీ సిబ్బంది చూసి వారి కుటుంబ సభ్యులకు సమాచారం చేరవేశారు. దీంతో ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్, మాతృమూర్తి ప్రమీలాదేవి గుంటూరు నుంచి చింతలపూడికి చేరుకున్నారు. వారి ఫిర్యాదు మేరకు పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని ఉన్నతాధికారులకు సమాచారం అందించారు. డాగ్ స్క్వాడ్, వేలిముద్రల నిపుణులతో తనిఖీ చేయించారు. కొంత మంది అనుమానితులను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

బ్రాయిలర్ ధరలు (కిలో 1కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 115, రిటైల్ ధర - 142, చికెన్ విత్‌స్కిన్ - 206, చికెన్ స్కిన్‌లెస్ - 234.

కృష్ణా జిల్లాలో: వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -115 రిటైల్ ధర 142 చికెన్ విత్ స్కిన్ - 206 చికెన్ స్కిన్‌లెస్ - 234.

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 116, 123, 135 చికెన్ విత్ స్కిన్ - 220 చికెన్ స్కిన్‌లెస్ - 230.

ఫెడరల్ బ్యాంక్

ఎల్‌సిఆర్‌డి హైదరాబాద్ డివిజన్ | ఇంటి నెం. 8-3-903/10 | ఫ్లాట్ నెం.20 | 4వ అంతస్తు | ... | హైదరాబాద్ | తెలంగాణ | 500073 | ఈమెయిల్: hydlcrd@federalbank.co.in | Website : www.federal.bank.co.in

HYDLCRD/VWDB/SVT/SN-85 / 2025-26 — 17 ఫిబ్రవరి 2026

అమ్మకం ప్రకటన ఉపసంహరణ

[illegible]

(SARFAESI చట్టం కింద అధీకృత అధికారి)

శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్

నమోదిత కార్యాలయం: శ్రీ టవర్స్, ప్లాట్ నెం.14ఎ, సౌత్ ఫేజ్, ఇండస్ట్రియల్ ఎస్టేట్, గిండి, చెన్నై-600032.

జోనల్ ఆఫీస్ : శ్రీరామ్ ఎన్‌క్లేవ్, అన్నపూర్ణ నగర్, 5వ లేన్, ఇన్నర్ రింగ్ రోడ్డు, గోరంట్ల, గుంటూరు-522034.

డిమాండ్ నోటీసు

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం 2002, సెక్షన్ 13(2) అనుసరించి డిమాండ్ నోటీసును జారీచేయడమైనది.

[illegible]

రుణగ్రహీత(లు)/సహ-రుణగ్రహీత(లు)/హామీదారు(లు) పేరు	ఎన్‌పిఎ తేదీ 31-01-2017	డిమాండ్ నోటీసు తేదీ 13-01-2026
ఎంటర్‌ప్రైజ్ ఫైనాన్స్ రుణ ఖాతా నెం. GNTR4TF1504240003, తేదీ: 28-04-2015. 1) యాగంటి రమేష్ బాబు ... 2) పి. రమణారావు ... గుంటూరు జిల్లా-522005.	రుణం మొత్తం రూ. 8,00,000/-	మొత్తం బకాయి: రూ. 28,00,922/- తేదీ 13-01-2026 నాటికి

ప్రదేశం : గుంటూరు — సం/- అధీకృత అధికారి, శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్

శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్

నమోదిత కార్యాలయం: శ్రీ టవర్స్, ప్లాట్ నెం.14ఎ, సౌత్ ఫేజ్, ఇండస్ట్రియల్ ఎస్టేట్, గిండి, చెన్నై-600032.

జోనల్ ఆఫీస్ : శ్రీరామ్ ఎన్‌క్లేవ్, అన్నపూర్ణ నగర్, 5వ లేన్, ఇన్నర్ రింగ్ రోడ్డు, గోరంట్ల, గుంటూరు-522034.

డిమాండ్ నోటీసు

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం 2002, సెక్షన్ 13(2) అనుసరించి డిమాండ్ నోటీసును జారీచేయడమైనది.

[illegible]

ఎంటర్‌ప్రైజ్ ఫైనాన్స్ రుణ ఖాతా నెం. TENALTF2002150002 & TENALTF2101210013

1వ లోన్ నెం.TENALTF2002150002 యొక్క ఎన్‌పిఎ తేదీ : 31-07-2021. రుణం మొత్తం : రూ.10,00,000/-. డిమాండ్ నోటీసు తేదీ : 15.12.2025

2వ లోన్ నెం.TENALTF2101210013 యొక్క ఎన్‌పిఎ తేదీ : 31-10-2021. రుణం మొత్తం : రూ.8,00,000/-. డిమాండ్ నోటీసు తేదీ : 15.12.2025

ప్రదేశం : గుంటూరు — సం/- అధీకృత అధికారి, శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్

ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్

ప్రభుత్వ రంగ షెడ్యూల్డ్ బ్యాంక్

కృష్ణనగర్, గుంటూరు (7031) బ్రాంచి, ఫోన్: 0863-2233554, మొబైల్: 9390478331, email: bm0031@apgb.bank.in

సర్ఫేసి చట్టం లోని నియమం 4(2ఎ) క్రింద నోటీసు (చరాస్తుల పై)

To,

ఆస్తి యజమానులు: 1) శ్రీమతి పిన్నింటి పద్మావతి, భర్త: శ్రీనివాసరావు, నివాసము: 4-4-173/2, 7/2 చంద్రమౌళినగర్, గుంటూరు. 2) ది డైరెక్టర్: మెస్సర్స్ నంది వర్ధన టెక్స్‌టైల్ మిల్స్ లిమిటెడ్, ఎన్‌హెచ్-16 సర్వీస్ రోడ్డు, తిమ్మాపురం గ్రామం, ఎడ్లపాడు మండలం, పల్నాడు జిల్లా.

[illegible]

తేది : 10-02-2026, ప్రదేశం: గుంటూరు — అధీకృత అధికారి, ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్

SBI స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

స్ట్రెస్డ్ అసెట్స్ రికవరీ బ్రాంచ్ (కోడ్- 05172)

2వ అంతస్తు, టిఎస్‌ఆర్‌టిసి కమ్యూటర్ అమినిటీ సెంటర్, బస్ టెర్మినల్ కాంప్లెక్స్, కోఠి, హైదరాబాద్-500095. టి.ఎస్. ఇ-మెయిల్: sbi.05172@sbi.co.in

స్థిరాస్తుల అమ్మకానికి విక్రయ ప్రకటన

[illegible]

వెబ్‌సైట్: https://baanknet.com ... website URL: https://baanknet.com

అదనపు వివరాలకు దయచేసి దిగువ అధికారులను ఆఫీసు పనివేళల లోగా సంప్రదించండి. 1) సందీప్ పరిడాల, మేనేజర్ ... మొబైల్ నం. 98669 86725.

తేది 17.02.2026 స్థలం: హైదరాబాద్. — సం/- అధీకృత అధికారి, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా.

EENADU e Classifieds

BUSINESS SERVICES

బంగారం బ్యాంకులలో/ ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈరోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్). Ph: 81422 92071.

బంగారం కొనబడును. బ్యాంకులలో ఇతర ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీబంగారం విడిపించి అధిక దరకు కొనబడును (స్పాట్ క్యాష్). ✆ 87907 41166

PROFESSIONAL SERVICES

ASTROLOGY

తమిళనాడు వైదీశ్వరన్ కోయిల్ శ్రీ అగస్త్యే నాడి జ్యోతిష్యాలయం మీ చేతి బొటనవేలు ముద్రతో మీ భవిష్యత్తు పూర్తిగా చెప్పబడును. అన్ని సమస్యలకు పరిష్కారం చెప్పబడును. 89782 15913.

REAL ESTATE

PLOT FOR SALE

GENERAL

Commercial plot 1373 sq.yds Inner Ring road, Guntur, with 1.25 lakhs Rent and bank loan for immediate sale. Call: 9573454266.

గుంటూరులో వెంచర్, RTO ఆఫీస్ నుండి 6 కి.మీ., 40 అ||రోడ్ ఆనుకొని దామరపల్లిలో థారు రోడ్లు, డ్రైనేజ్, ప్రహరీ. చ||గ|| రూ. 11000/-. స్పా.రి. 8317528192.

TO LET

Office Premises is available in Sailok Complex 1st Floor at 6/1 Arundelpet, Guntur with fecilities of Ac, Lift & Both Room, Contact, Cell: 92484 94407.

JOBS

Wanted DRA Tele Callers, Field Executives & Team Leaders Banking Sector Attractive Salaries and Incentives, ✆ 9849394835, 7075345527.

Wanted Teachers for Reputed Schools in A.P & Telangana, Contact: Sneha Placements Service. Ph: 94402 46409.

PROs, Marketing Managers Required. Salary: 27,500/-., NTR Circle, Vijayawada. ✆ 63043 28479.

ప్రముఖ మ్యాన్ పవర్ సెక్యూరిటీ ఏజెన్సీకి డెవలప్‌మెంట్ ఆఫీసర్ కావలెను. ✆ 95029 49415.

గుంటూరు, ఆటోనగర్‌లో H.P. పెట్రోల్ బంక్‌లో పనిచేయుటకు మేనేజర్, పంపు బాయ్స్/ గర్ల్స్ కావలెను. పార్ట్ టైమ్/ ఫుల్ టైమ్. 7799689889, 8074546302.

త్రినేత్ర హోంకేర్‌లో వృద్ధులను/ పేషెంట్స్‌ను /పిల్లలను చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఫ్రీ వసతి, భోజనం. జీ: 18K. ✆ 85209 80099, 85208 74499.

గుంటూరు మాస్టర్‌మైండ్స్ కాలేజి నందు క్లాసు ఇన్‌ఛార్జీస్ మరియు క్యాంపస్ ఇన్‌ఛార్జీస్‌గా పని చేయుటకు పురుషులు కావలెను. జీతము: 14,000/- నుండి 21,000/- వరకు ఇవ్వబడును. అర్హతలు: ఇంటర్ నుండి పి.జి. వరకు. వయస్సు: 22 సంవత్సరాలు నుండి 45 సంవత్సరాలు వరకు ఉండవలెను. గుంటూరు లోకల్ వ్యక్తి అయ్యి ఉండాలి. సంప్ర: ఫోన్ నెం. 8978480435.

గుంటూరు సిటీలోని ప్రముఖ బ్యాంక్ అనుబంధ సంస్థతో కలిసి పని చేయుటకు విశ్రాంత ఉద్యోగులు, హౌస్‌వైఫ్ 10th పాస్, 50సం||పై వయస్సు వారు కావలెను. 7036761665.

అకౌంట్స్ మేనేజర్ కావలెను. బి.కాం., 5 సం||లు అకౌంట్స్‌పై అనుభవం, ఇన్‌కంటాక్స్, GST రిటన్స్ వేయగలిగిన వారు kamathamjob@gmail.com కు పంపగలరు.

ఆఫీస్ స్టాఫ్, నర్సెస్ (MPHW) కావలెను. కొత్తవారికి కూడా ప్రాధాన్యత. అహల్యా నర్సింగ్ హోమ్, శివాలయం వెనుక, కొత్తపేట, గుంటూరు. ✆ 92464 27459.

హరేకృష్ణ హోంకేర్‌లో వృద్ధులను/ పేషంట్స్ / పిల్లలను చూసుకొనుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఫ్రీ వసతి, భోజనం జీ: 18-20K ✆ 96404 68899, 96402 58899

గుంటూరు ఓల్డ్ క్లబ్ రోడ్, ఆపిల్ డెంటల్ కేర్‌లో పని చేయుటకు Male/Female అసిస్టెంట్స్ కావలెను. గుంటూరు లోకల్‌వారు మాత్రమే. ✆ 63022 43437.

గుంటూరు సిటి RTC బస్టాండ్ దగ్గరలో ప్రముఖ బిర్యాని హోటల్ నందు పని చేయుటకు సప్లయిర్ కావలెను. లోకల్ వారికి ప్రాధాన్యత. ✆ 96668 41537.

ప్రముఖ దంత వైద్యశాల నందు పని చేయుటకు అసిస్టెంట్ మరియు రిసెప్షనిస్ట్ స్టాఫ్ కావలెను. సంప్ర|| 78420 31133.

ప్రముఖ విద్యాసంస్థలో పని చేయుటకు రిసెప్షనిస్ట్, టీచర్స్, టీమ్‌లీడర్స్ మరియు మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. ఆకర్షణీయమైన జీతం ఇవ్వబడును. సంప్రదించండి: 87126 18882. గుంటూరు.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

Book your 5 lines Classified Colour Rs.770/- | 3Ads Package Rs.1945/-

5 lines Classified B/W Rs.650/- | 3Ads Package Rs.1625/-

ప్రకటనపై 5% జి.ఎస్.టి. అదనం

తక్కువ బడ్జెట్‌లో మీ అవసరాలు తీర్చే ఏకైక మార్గం.. ఈనాడులో ప్రకటన ఇవ్వటం

పూర్తి వివరాలకు సంప్రదించండి: 8008510541

గుంటూరు తూర్పు

నేటి నుంచి క్రికెట్ టోర్నమెంట్

ఏఎన్‌యూ(పెదకాకాని), న్యూస్‌టుడే: మానసిక ఉల్లాసం కోసం కళాశాల అధ్యాపకులలో గత 28 ఏళ్ల నుంచి జేకేసీ కళాశాల ఆధ్వర్యంలో గుంటూరు చందాస్ సిల్వర్ కప్ క్రికెట్ టోర్నమెంట్ బుధవారం నుంచి ఈనెల 22 వరకు నిర్వహిస్తున్నట్లు జేకేసీ కళాశాల ప్రిన్సిపల్ పి.గోపీచంద్ తెలిపారు. ఈ ఏడాది జరిగే 29వ టోర్నమెంట్‌లో మొత్తం 26 జట్లు పాల్గొంటున్నాయని, జేకేసీ, ఆర్వీఆర్‌జేసీ, జేఎన్ఎన్ స్టేడియం(పేరేచర్ల), విజ్ఞాన్ విశ్వవిద్యాలయం(వడ్లమూడి), చలపతి ఇంజినీరింగ్ కళాశాల(మోతడక) మైదానాల్లో పోటీలు జరుగుతాయని ఆయన చెప్పారు.

ధర వరలు

ఎన్టీఆర్ రైతుబజారులో ధరలు నిన్నటివి.. (కిలో ఒక్కింటికి రూ.ల్లో) టమాట 14, వంగ 28, బెండ 25, పచ్చిమిర్చి 46, కాకర 42, క్యారెట్ 24, క్యాబేజీ 18, బీర 40, దొండ 45, బంగాళదుంప 20, ఉల్లిపాయలు 24, గోరుచిక్కుడు 35, దోస 34, పొట్ల 25, చామ 23, గోంగూర 10, తోటకూర 15, ముల్లంగి 15, మెంతికూర 5, కొత్తిమీర 20, బీట్‌రూట్ 25, కీర 42, క్యాప్సికం 65, అల్లం 75, ఫ్రెంచి బీన్స్ 60, సొర 10, అరటి 8. - న్యూస్‌టుడే, పట్నంబజారు

దావా సమన్సు

IN THE COURT OF THE SPL. JUDICIAL MAGISTRATE OF FIRST CLASS FOR MOBILE, GUNTUR

O.S. No. 1042 / 2022

Between:
State Bank of India, SMEC, Guntur Rep.by its Chief Manager. ...Plaintiff
And
Venukonda Pakeeraiah ...Defendant
To,
Venukonda Pakeeraiah, S/o.Esu, R/o. 7-6-980, 2/3,Vengalarao Nagar, Guntur.

[illegible] తేది.24-02-2026 ఉ॥గం.10-30లకు [illegible]

యన్.హెచ్.ఆర్.కె. గుప్తా
వాది తరపు న్యాయవాది, గుంటూరు. సెల్: 9866630017

మేమున్నాం.. మీకు తోడుగా..

10 AM to 1 PM
94406 38515, 80085 73097

స్పందన: ఇజ్రాయిల్‌పేట ప్రధానరోడ్డులో చెత్తకుప్పలను రెండు రోజులుగా తీయకపోవడంతో పరిసరాలు అపరిశుభ్రంగా మారుతున్నాయని స్థానికుడు కిరణ్ ‘మేమున్నాం.. మీకు తోడుగా..’కు తెలిపారు. సమస్యను శానిటరీ సూపర్‌వైజర్ ఆయుబ్‌ఖాన్ దృష్టికి తీసుకెళ్లడంతో చెత్త కుప్పలు తీయించారు. ☛ సాయినగర్ 2వ లైన్ సైడుకాలువల్లో పూడికలు పేరి మురుగునీటి పారుదలకు ఆటంకం కలగడం వల్ల దోమల వ్యాప్తి అధికంగా ఉంటోందని స్థానికుడు వినోద్ ‘మేమున్నాం.. మీకు తోడుగా’కు ఫిర్యాదు చేశారు. సమస్యను ప్రజారోగ్య విభాగం అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో పూడికలు తీయించారు. - న్యూస్‌టుడే, నగరపాలక సంస్థ

గ్రంథాలయం.. ఉద్యోగ సోపానం

కలెక్టరేట్(గుంటూరు), న్యూస్‌టుడే

స్వాతంత్య్ర ఉద్యమంలో గ్రంథాలయాలు కీలకభూమిక పోషించాయి. అందరినీ చైతన్యపరిచాయి. ఆ గ్రంథాలయాలు నేటి యువతకు కూడా ఆలంబనగా నిలుస్తున్నాయి. నిరుద్యోగ యువతకు ఉద్యోగ సోపానంగా మారాయి. పోటీ పరీక్షలకు సిద్ధమయ్యేందుకు ప్రశాంత వాతావరణం ఉండడంతో గ్రంథాలయాలను నిరుద్యోగులు సద్వినియోగం చేసుకుంటున్నారు. గుంటూరు నగరంలోని ప్రభుత్వ ప్రాంతీయ గ్రంథాలయంలో ఇటీవల జరిగిన పలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ నోటిఫికేషన్లలో పోటీ పడి విజయం సాధించారు. తమ ఉన్నతికి సహకరించిన గ్రంథాలయానికి తమవంతు సహకారంగా ఓల్డ్ లైబ్రరీ ఫ్రెండ్స్ ఆధ్వర్యంలో అవసరమైన పోటీ పరీక్షల పుస్తకాలను అందిస్తున్నారు. గుంటూరు ప్రభుత్వ ప్రాంతీయ గ్రంథాలయంలో చదువుకుని ఇటీవల ఉద్యోగాలు సాధించిన వారిని ఓల్డ్ లైబ్రరీ ఫ్రెండ్స్ ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ సందర్భంగా వారి అభిప్రాయాలను ఈనాడు-ఈటీవీతో పంచుకున్నారు...

గ్రంథాలయంలో చదువుకుని ఉద్యోగం సాధించిన వారిని అభినందిస్తున్న గుంటూరు వెస్ట్ డీఎస్పీ అరవింద్‌బాబు

ఎక్సైజ్ ఎస్సైగా ఎంపికయ్యా: ఉయ్యాల వీరాంజనేయులు

చిన్నతనంలో చదువుమానేసి ఇంట్లో ఉంటే తల్లి తోటి పిల్లలు చదువుకుంటున్నారని తిట్టి బడికి పంపింది. అప్పటి నుంచి ఎంతో ఆసక్తితో చదువుకున్నా. గ్రంథాలయానికి వచ్చిన కొత్తలో కాస్త ఇబ్బందిగా ఉన్నా ఇక్కడి మిత్రులు గ్రూప్ డిస్కషన్స్‌లో అనేక అంశాలను చర్చించుకోవడం ఉద్యోగాన్వేషణలో ఉపకరించాయి. ఇక్కడి మిత్రులతో పాటు సంస్థ సిబ్బంది సహకారంతో గ్రూప్-2లో విజయం సాధించి ఎక్సైజ్‌శాఖలో సబ్‌ఇన్‌స్పెక్టర్‌గా ఎంపికయ్యాను.

ప్రశాంత వాతావరణం విజయానికి దోహదం: సుధాకర్‌రావు

గ్రంథాలయానికి వస్తే చదువుకోవడానికి ప్రశాంత వాతావరణం ఉంటుంది. తద్వారా ఆయా సబ్జెక్టులపై పట్టుసాధించవచ్చు. చుట్టూ ప్రతికూల వాతావరణం ఉన్నా వాటిని పట్టించుకోకుండా లక్ష్యం సాధించడానికి ప్రయత్నం చేయాలి. చదువుతోపాటు ఇక్కడ బ్రేక్ సమయంలో ఆయా సబ్జెక్టులపై జరిగే బృంద చర్చలు పోటీ పరీక్షల్లో ఉపకరిస్తాయి. పుస్తకాలు చదవడంతోపాటు ఆయా అంశాలపై బృందంగా ఏర్పడినప్పుడు చర్చించుకోవడం వలన మరికొన్ని అంశాలు తెలుస్తాయి.

పుస్తకాలు ఎంతో ఉపయోగపడ్డాయి: మౌలాలి

ప్రాంతీయ గ్రంథాలయానికి రావడం వల్లనే నేను ఉద్యోగం సాధించగలిగాను. నా ఉద్యోగ సాధనలో ఎక్కువ శాతం గ్రంథాలయమే ఉపయోగపడింది. ఉద్యోగం చేస్తూ పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే వారికి ప్రాంతీయ గ్రంథాలయంలో అవకాశం ఉంది. ఎందుకంటే అర్ధరాత్రి 12 గంటల వరకు గ్రంథాలయంలో చదువుకునేందుకు అవకాశం ఉంది. పోటీ పరీక్షలకు సంబంధించిన పుస్తకాలు చాలా రేటు ఉంటాయి. దీంతో వాటిని కొనుగోలు చేయలేని వారికి గ్రంథాలయంలోని పుస్తకాలు ఎంతో ఉపయోగపడుతున్నాయి. అన్ని రకాల పుస్తకాలు లభ్యమవుతున్నాయి. వీటితోపాటు ఓల్డ్ లైబ్రరీ ఫ్రెండ్స్ కూడా పుస్తకాలు అందించడం పరీక్షలకు దోహదపడ్డాయి.

మా వంతు సహకారం అందిస్తాం

ఒకప్పుడు మాకు ఉద్యోగ సాధనలో ఉపయోగపడిన గ్రంథాలయానికి ఓల్డ్ లైబ్రరీ ఫ్రెండ్స్ అసోసియేషన్ ఏర్పడి మావంతుగా పుస్తకాలు, ఇతర సదుపాయాలు కల్పిస్తున్నాం. ప్రభుత్వం పోటీ పరీక్షలకు నోటిఫికేషన్ విడుదల చేసిన క్రమంలో గ్రంథాలయాధికారులు, యువతతోనూ చర్చించి అవసరమైన పుస్తకాలను సమకూర్చాం. అవి ఎంతగానో ఉపయోగపడ్డాయి. గ్రంథాలయాలను నిరుద్యోగులు, యువత వినియోగించుకుని జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షిస్తున్నాం. -గుర్రం మురళీమోహన్, ఓల్డ్ లైబ్రరీ ఫ్రెండ్స్ అసోసియేషన్ ప్రతినిధి

IN THE COURT OF THE PRL. JUNIOR CIVIL JUDGE, MANGALAGIRI
E.P.NO. 51/21 IN DISPUTE NO.44/19

Between:-
M/s MARGADARSI CHIT FUND PVT. LTD., Arundelpeta Branch, Guntur. ...Decree Holder
AND
Mr J.ANIL KUMAR & Others ...Judgement Debtors

Jdr No. 1
Mr. Jekki Anil Kumar, S/o Sudhakara Rao, D.No.26-2-151, New D.No.64, 3rd line, Devapuram, GUNTUR.

Please take notice that the Dhr filed the above case in the above Hon'ble Court for recovery of E.P. amount against you. The Hon'ble Court ordered for R-54 notice to you by way of paper publication and also attend before the court on 03.03.26 at 10.30 A.M either personally or through your advocate. If you fail on that day the matter will be treated as exparte basis.

(BY ORDER OF THE HON'BLE COURT)
Lanka Sivaram Prasad
Advocate for Dhr, Mangalagiri, Guntur Dist.

పార్కింగ్ ప్రదేశాలను గుర్తించండి : ఎస్పీ ఆదేశం

గుంటూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఆటోలు, ప్రైవేట్ బస్సులు ఎక్కడపడితే అక్కడ ఉంచకుండా నిర్దిష్ట పార్కింగ్ ప్రదేశాలను కేటాయించాలని ఎస్పీ వకుల్ జిందాల్ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన ద్విచక్రవాహనంపై ట్రాఫిక్ సీఐ ఆశోక్‌కుమార్‌తో కలిసి ట్రాఫిక్ రద్దీ, వాహనాల మళ్లింపు ప్రాంతాలను పరిశీలించారు. కంకరగుంట అండర్‌పాస్, గుజ్జనగుండ్ల సెంటర్, కోరిటిపాడు, ఎన్టీఆర్ స్టేడియం, లక్ష్మీపురం, మూడు వంతెనలు, కొత్తపేట, ఆర్టీసీ బస్టాండ్, ఎంటీబీ కూడలి, మహిళా కళాశాల, నగరంపాలెం తదితర ప్రాంతాల్లో పర్యటించారు. ఎస్పీ మాట్లాడుతూ రహదారులపై ఆక్రమణలను జీఎంసీ అధికారుల సహకారంతో తొలగించాలన్నారు. వ్యాపార సముదాయాల ఎదుట వాహనాలను రోడ్లపై పార్కింగ్ చేయకుండా చర్యలు తీసుకోవాలన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే జరిమానా విధించాలని ఆదేశించారు. ఎస్పీ వెంట ట్రాఫిక్ డీఎస్పీ బెల్లం శ్రీనివాసరావు, ఎస్బీ డీఎస్పీ శ్రీనివాసరావు, సీఐలు సింగయ్య, ఆళహరి శ్రీనివాస్, ఆశోక్‌కుమార్ ఉన్నారు.

ద్విచక్రవాహనంపై ప్రయాణిస్తూ ట్రాఫిక్ పరిశీలిస్తున్న ఎస్పీ వకుల్ జిందాల్, సీఐ ఆశోక్‌కుమార్

మెడికల్ ఎగ్జిబిషన్ 22 వరకు పొడిగింపు

గుంటూరు నగరం, న్యూస్‌టుడే: గుంటూరు ప్రభుత్వ వైద్య కళాశాలలో నిర్వహిస్తున్న మెడికల్ ఎగ్జిబిషన్‌ను ఫిబ్రవరి 22 వరకు పొడిగిస్తున్నట్లు వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సుందరాచారి మంగళవారం తెలిపారు. కళాశాల విభాగాధిపతుల అభిప్రాయం మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. ఇప్పటివరకు 38,120 మంది ఎగ్జిబిషన్‌ను సందర్శించారని వివరించారు. జర్నలిస్టులకు, జిల్లా వైద్య ఆరోగ్య అధికారుల పరిధిలో పని చేసే ఫీల్డ్ వర్కర్స్, మెడికల్ ఆఫీసర్స్, ట్రాఫిక్ పోలీసులకు ఉచిత ప్రవేశం కల్పిస్తున్నట్లు తెలిపారు. వీరు అధికారిక గుర్తింపు కార్డు(ఐడీ) తీసుకురావాలని సూచించారు.

ప్రదర్శన తిలకిస్తున్న విద్యార్థులు

గడువులోగా శంకర్‌విలాస్ ఆర్వోబీ పూర్తికి చర్యలు

నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: శంకర్‌విలాస్ రైల్వే పైవంతెన నిర్మాణం నిర్దేశిత సమయంలోగా పూర్తి చేసేలా గుత్తేదారు ఏజెన్సీని సమన్వయం చేసుకుంటూ ఆర్‌అండ్‌బీ, నగరపాలక సంస్థ అధికారులు అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా చెప్పారు. మంగళవారం శంకర్‌విలాస్ ఆర్వోబీ పనులు, ఏటుకూరు రోడ్డులోని కంపోస్ట్ యార్డును, పొన్నూరు రోడ్డులో మెటీరియల్ రికవరీ ఫెసిలిటీ కేంద్రాన్ని జీఎంసీ కమిషనర్ మయూర్ అశోక్‌తో కలిసి పరిశీలించారు. నగరంలో ఉత్పత్తవుతున్న వ్యర్థాలతో ఏటుకూరు రోడ్డు ట్రాన్సిట్ పాయింట్‌లో 50 టన్నుల విండ్రో, 35 టన్నుల వర్మీ కంపోస్ట్ తయారు చేస్తున్నామన్నారు. ఎరువును మిద్దె తోటల పెంపకానికి, పార్కులు, డివైడర్లలోని మొక్కలకు వినియోగిస్తున్నామని కలెక్టర్ తెలిపారు. ప్లాస్టిక్ వ్యర్థాలను 10 టన్నుల సామర్థ్యం కలిగిన మెటీరియల్ రికవరీ ఫెసిలిటీ కేంద్రం ద్వారా రీసైక్లింగ్‌కు పంపుతున్నామని కమిషనర్ తెలిపారు. కలెక్టర్ తమీమ్ అన్సారియా మాట్లాడుతూ వ్యర్థాల నుంచి ఎరువు తయారీని మరింతగా పెంచాలన్నారు. ఆర్డీవో కె.శ్రీనివాసరావు, జీఎంసీ ఎస్ఈ వెంకటేశ్వరరావు, సీఎంవోహెచ్ డాక్టర్ శంకర్, సూరజ్‌కుమార్, ఏసీపీ రెహ్మాన్, ఈఈలు విష్ణు, వేణు, ఆర్అండ్‌బీ, విద్యుత్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

శంకర్‌విలాస్ ఆర్వోబీ పనులను పరిశీలించి వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా, జీఎంసీ కమిషనర్ మయూర్ అశోక్

మురుగుకాలువ గుంతపై మ్యాన్‌హోల్ ఏర్పాటు

‘ఈనాడు’ కథనానికి స్పందన

పట్నంబజారు, న్యూస్‌టుడే: పాతబస్టాండు సెంటర్లో మురుగుకాలువ గుంతపై మంగళవారం కార్పొరేషన్ అధికారులు మ్యాన్‌హోల్ ఏర్పాటు చేశారు. ఈ నెల 17న ‘ఈనాడు’లో ప్రచురితమైన ‘మూత ఏర్పాటు చేయరూ..’ చిత్ర కథనానికి వారు స్పందించి పనులు చేయించారు.

IN THE COURT OF THE III ADDL. JUNIOR CIVIL JUDGE, GUNTUR
E.P.NO. 64/23 IN DISPUTE NO. 55/19

Between:-
M/s MARGADARSI CHIT FUND PVT. LTD., Arundelpeta Branch, Guntur. ...Decree Holder
AND
Mr. M.RAMESH & Others ...Judgement Debtors

Jdr No. 4
Mr. Ravulapalli Arun Kumar S/o China Venkateswara Rao D.No.24-12-159, opp. 9th line, Nallacheruvu, 3rd line, Workers colony, GUNTUR.

Please take notice that the Dhr filed the above case in the above Hon'ble Court for recovery of E.P. amount against you. The Hon'ble Court ordered for R-54 notice to you by way of paper publication and also attend before the court on 23.02.26 at 10-30 A.M either personally or through your advocate. If you fail on that day the matter will be treated as exparte basis.

(BY ORDER OF THE HON'BLE COURT)
D.S.K.Kumar, Kodali Srinivas, Kodali Seetaramaiah
Advocates for Dhr GUNTUR.
Cell: 9639011171, 9639011172

రోడ్డుకు అడ్డంగా పెడితే రాకపోకలు ఎలా?

నూనెవారి వీధిలో రహదారిపై అడ్డంగా వాహనాలు పార్కింగ్ చేయడంతో సమస్యగా ఉందని స్థానికులు వాపోతున్నారు. వ్యాపార సముదాయాలకు పార్కింగ్ స్థలం కేటాయించకపోవడంతో కొనుగోలుదారులు తమ వాహనాలను రోడ్లపైనే పార్కింగ్ చేస్తున్నారు. ఉదయం, సాయంత్రం వేళల్లో విపరీతమైన రద్దీ కారణంగా ట్రాఫిక్ సమస్యలు ఎదురవుతున్నాయి.
- న్యూస్‌టుడే, గుంటూరు నేరవార్తలు

బోరు.. బాగు చేయించరూ...

నెహ్రూనగర్ 6వ వీధిలో బోరు పంపు శిథిల స్థితికి చేరింది. చుట్టూ పిచ్చిమొక్కలు ఏపుగా పెరిగాయి. మట్టి రాళ్లకుప్పలు వేయడంలో నీరు పట్టుకోవటానికి వీల్లేని పరిస్థితి. బోరును వినియోగంలోకి తెస్తే వేసవిలో నీటి అవసరాలకు ఉపయోగపడుతుంది.
- న్యూస్‌టుడే, నెహ్రూనగర్

పాడైన రోడ్లు.. పట్టించుకోని అధికారులు

శివారు ప్రాంతాల అభివృద్ధిపై అధికారులు నిర్లక్ష్యవైఖరి ప్రదర్శిస్తున్నారు. పాతగుంటూరు బాలాజీనగర్ శివార్లలో అధ్వానంగా ఉన్న రోడ్డే ఇందుకు నిదర్శనం. అవి బురదమయంగా మారి నెలలు గడుస్తున్నా ఇటువైపు కన్నెత్తి చూడటం లేదు. బురదలో నుంచి రాకపోకలు సాగించడం వల్ల వాహనాలు దెబ్బతింటున్నాయని పలువురు వాపోతున్నారు. - న్యూస్‌టుడే, పట్నంబజారు

చోరీ కేసుల్లో నిందితుడి అరెస్టు

పట్నంబజారు, న్యూస్‌టుడే: ఇళ్లల్లో చోరీలకు పాల్పడుతున్న చాగంటి భానుప్రకాష్ అనే యువకుడిని లాలాపేట పోలీసులు అరెస్టు చేశారు. వివరాలను తూర్పు విభాగపు డీఎస్పీ అబ్దుల్ అజీజ్ విలేకరులకు వివరించారు. ఈ నెల 16న లాలాపేట పోలీసులు పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా స్వర్ణభారతినగర్‌కు చెందిన భానుప్రకాష్ పారిపోవడానికి ప్రయత్నించాడు. పోలీసులు అతడిని చాకచక్యంగా పట్టుకుని తమదైన శైలిలో విచారించారు. అతని వద్ద నుంచి ఒక జత వెండి పట్టీలు, వెండి గ్లాసు, వెండి నాణెం, రూ.10 వేల నగదు స్వాధీనం చేసుకున్నారు. భానుప్రకాష్ ఇచ్చిన సమాచారం మేరకు వెంగళాయపాలెంలోని టిడ్కో సముదాయంలో ఉప్పల సురేష్ అనే వ్యక్తి ఇంట్లో తనిఖీ చేయగా.. బంగారపు మినీ నెక్లెస్, జత మ్యాటీలు, మూడు ఉంగరాలు, ఇతర ఆభరణాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వీటిని గత నెల 28న పాతగుంటూరు యాదవబజారులోని ఒక ఇంట్లో సురేష్, భానుప్రకాష్ దొంగిలించినట్టు డీఎస్పీ చెప్పారు. సురేష్ పరారీలో ఉన్నాడన్నారు. వీరిద్దరు 2019 నుంచి చోరీలకు పాల్పడుతున్నారని తెలిపారు. వీరిపై కురిచేడు, అరండల్‌పేట, నల్లపాడు పోలీస్‌స్టేషన్లలో కేసులున్నాయన్నారు.

మాట్లాడుతున్న డీఎస్పీ అబ్దుల్ అజీజ్

ఘనంగా లలితా సహస్ర నామ పారాయణం

పట్నంబజారు, న్యూస్‌టుడే: ఏటుకూరురోడ్డులోని శ్రీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో మంగళవారం శ్రీ కన్యకాపరమేశ్వరి లలితా పారాయణ మహిళా సమాజం ఆధ్వర్యంలో లలితా సహస్రనామ పారాయణం, విష్ణు పారాయణం చేశారు. 25 ఏళ్లుగా ప్రతి మంగళవారం లలితా పారాయణం చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అనంతరం అర్చకులు బుద్ధ విశ్వనాథం, దండిబొట్ల మణిశర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. వేడుకల్లో నూనె జయశ్రీ, పొట్టి రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారికి లలితా సహస్ర పారాయణం చేస్తున్న మహిళలు

విద్యుత్తు బస్సులను ఆర్టీసీ ద్వారానే నడపాలి

రిలే నిరాహారదీక్షలో పాల్గొన్న సంఘాల నాయకులు

పట్నంబజారు, న్యూస్‌టుడే: గుంటూరు-2 ఆర్టీసీ డిపో గ్యారేజీ స్థలాన్ని ఖాళీ చేసి ప్రైవేటు సంస్థకు అప్పగించాలన్న నిర్ణయాన్ని ప్రభుత్వం విరమించుకోవాలని స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎం.అయ్యప్పరెడ్డి డిమాండ్ చేశారు. బస్టాండు వద్ద గుంటూరు-2 డిపో ఆర్టీసీ జేఏసీ ఆధ్వర్యంలో మంగళవారం ప్రారంభమైన రిలే నిరాహార దీక్ష శిబిరంలో ఆయన మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రైవేటీకరణ విధానాల్లో భాగంగానే విద్యుత్తు బస్సుల పేరుతో దొడ్డిదారిన ఆర్టీసీ ప్రైవేటీకరణకు ప్రయత్నిస్తున్నారన్నారు. విద్యుత్తు బస్సుల్ని ఆర్టీసీ ద్వారానే నిర్వహించాలన్నారు. ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు ఎన్.వి.కృష్ణారావు మాట్లాడుతూ గుంటూరు-2 డిపో ఉద్యోగుల జేఏసీ నిర్వహిస్తున్న ఆందోళన కార్యక్రమాలకు సంపూర్ణ మద్దతు ఉంటుందన్నారు. కార్యక్రమంలో త్రిలోచన్ దత్, ఆర్.శ్రీనివాసరావు, ఎం.శ్రీనివాసరెడ్డి, రవిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్తు చౌర్యం.. రూ.4.14 లక్షల జరిమానా

గుంటూరు నగరం, న్యూస్‌టుడే: విద్యుత్తు అక్రమ వినియోగంపై పలు ప్రాంతాల్లో ఆకస్మిక తనిఖీలు చేసి బాధ్యులపై జరిమానా విధించామని విద్యుత్తుశాఖ విజిలెన్స్ విభాగం అధికారులు తెలిపారు. విద్యుత్తు భవన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వివరాలు వెల్లడించారు. సీఆర్డీఏ ఆపరేషన్ విభాగం పర్యవేక్షక ఇంజినీరు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ప్రత్తిపాడు సెక్షన్‌లోని జీపీవీపాలెం, గనికపూడి, కేజీపాలెం, కొండెపాడు, మెదవారిపాలెం, ఎన్ఎన్‌వీ పాలెం, తిమ్మాపురం, తుమ్మలపాలెం, ఎన్‌జీవీపాలెం, వేంగిపురం, యనమదల గ్రామాల్లో తనిఖీలు చేశామన్నారు. మీటరు లేకుండా డైరెక్ట్‌గా విద్యుత్తు చౌర్యానికి పాల్పడుతున్న నలుగురు; మీటరు ఉన్నా.. అక్రమంగా విద్యుత్తు వినియోగిస్తున్న ఐదుగురు; అనుమతించిన కేటగిరీకి బదులుగా ఇతర కేటగిరీలో కరెంటు వాడుతున్నందుకు ఇద్దరు; అనుమతించిన లోడుకంటే అదనంగా వాడుతున్న 61 మందిపై కేసులు నమోదు చేశామన్నారు. వీరందరిపై రూ.4.14 లక్షల అపరాధ రుసుం విధించామన్నారు. విద్యుత్తు చౌర్యం సామాజిక నేరమని ఎక్కడైనా అక్రమంగా వినియోగిస్తుంటే 94408 12263, 94408 12360 నంబర్లకు నేరుగా సమాచారం ఇవ్వొచ్చని, లేదా వాట్సప్ ద్వారా తెలియజేయాలన్నారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు. అధికారులు గురునాథరావు, మల్లికార్జున ప్రసాద్, రవికుమార్, సాంబశివరావు, శివశంకర్, సతీష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వివరాలు వెల్లడిస్తున్న అధికారులు

జేవీవీ ఆధ్వర్యంలో సైన్స్ ప్రయోగాల పోటీలు

నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి సైన్స్ ప్రయోగాల వినూత్న పోటీలు నిర్వహిస్తున్నట్లు జేవీవీ రాష్ట్ర అధ్యక్షుడు కేఎస్ లక్ష్మణరావు తెలిపారు. మంగళవారం యూటీఎఫ్ హాల్‌లో పోటీలకు సంబంధించిన కరపత్రాన్ని ఆవిష్కరించారు. లక్ష్మణరావు మాట్లాడుతూ విద్యార్థుల్లో నైపుణ్యాభివృద్ధి, సైన్స్‌ని మెరుగ్గా అర్థం చేసుకోవడం, చదువులో ఆత్మవిశ్వాసం పెంపొందించడం కోసం ఈ పోటీలు నిర్వహిస్తామన్నారు. ఇన్నోవేషన్ - టెక్నాలజీ, పర్యావరణం - వ్యవసాయరంగం, అపోహలు - శాస్త్రీయ నివారణ అంశాల్లో పోటీలు ఉంటాయన్నారు. 8వ తరగతి నుంచి 10వ తరగతి వరకు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొనవచ్చన్నారు. ప్రయోగాలను వీడియో తీసి మార్చి 8లోగా పంపాలన్నారు. వాటి నిడివి 5 నిమిషాలకు మించి ఉండకూడదని తెలిపారు. వివరాలకు 85009 60840, 93947 82540 నంబర్లలో సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో టి.జాన్‌బాబు, బి.ప్రసాద్, టి.ఆర్.రమేష్, ఎస్ఎం.సుబాని, అనురాధ, గురవయ్య తదితరులు పాల్గొన్నారు.

కరపత్రం ఆవిష్కరిస్తున్న లక్ష్మణరావు

విష సంస్కృతి నుంచి దేశాన్ని కాపాడుకుందాం

నెహ్రూనగర్, న్యూస్‌టుడే: విద్వేషపు విష సంస్కృతి నుంచి దేశాన్ని కాపాడుకుందాం. దేశ సమైక్యతను, సమగ్రతను కాపాడేందుకు లౌకిక శక్తులందరూ కలసి పోరాడాల్సిన అవసరం ఉందని వక్తలు పేర్కొన్నారు. మంగళవారం నగరంలో మతసామరస్య వేదిక ఆధ్వర్యంలో కోవా బన్ను వలికి సంఘీభావం ప్రకటించారు. కార్యక్రమంలో ఆవాజ్ రాష్ట్ర అధ్యక్షుడు చిష్టి, లౌకిక రాజ్యాంగ పరిరక్షణ వేదిక నాయకుడు హనుమంతరెడ్డి, సీపీఎం జిల్లా కార్యదర్శి నేతాజీ, నళినీకాంత్, అరుణ, లక్ష్మణరావు, అజయ్‌కుమార్, ముత్యాలరావు, నీలాంబరం, కృష్ణకాంత్ పాల్గొన్నారు.

కోవా బన్ను వలికి సంఘీభావం తెలుపుతున్న మత సామరస్య, వామపక్ష, ప్రజాతంత్ర, లౌకికవాదులు

వైభవంగా సాయిబాబా ఆలయ వార్షికోత్సవం

నెహ్రూనగర్, న్యూస్‌టుడే: కొత్తపేట గణేశ్వరరావువీధిలోని షిర్డీసాయిబాబా ఆలయ 13వ వార్షికోత్సవం వైభవంగా నిర్వహించారు. భక్తులకు అన్న ప్రసాద వితరణ చేశారు. నిర్వాహకులు రాధాదేవి, జనార్దనరావు, రోజారాణి, నరసింహారావు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

అలాంటి ఏపీకే లింక్‌లు క్లిక్ చేయొద్దు

నెహ్రూనగర్, న్యూస్‌టుడే: ప్రజలు సైబర్ నేరాలపట్ల అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. మంగళవారం తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ ట్రాఫిక్ చలాన్ల పేరుతో వాట్సప్, ఇతర సామాజిక మాధ్యమాల ద్వారా ఆర్టీవో చలానా ఏపీకే, ఈ-చలానా ఏపీకే వంటి అనధికార లింకులు పంపుతున్నారని తెలిపారు. వాటిని క్లిక్ చేస్తే మొబైల్ ఫోన్లు హ్యాక్ అవుతాయన్నారు. వాటిల్లోని వ్యక్తిగత సమాచారం, బ్యాంకింగ్ వివరాలు సైబర్ నేరగాళ్ల చేతికి చేరే ప్రమాదం ఉందన్నారు. వాటిని క్లిక్ చేయొద్దని సూచించారు.

19 నుంచి మారుతి దేవాలయ వార్షిక బ్రహ్మోత్సవాలు

గుంటూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే: స్థానిక మారుతీనగర్ కంచికామకోటిపీఠ శ్రీమారుతి దేవాలయం 40వ వార్షిక బ్రహ్మోత్సవాలు, లక్ష మోదక గణపతి యాగ పురస్సర శ్రీలక్ష్మీగణపతి స్వామి నూతన విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ పాలకమండలి కార్యదర్శి టి.శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 19 నుంచి 27 వరకు ఉత్సవాలు జరుగుతాయి. తొలిరోజున బ్రహ్మోత్సవాల యాగ కార్యక్రమాలను శృంగేరి, వీరూపాక్ష, శ్రీపీఠం పీఠాధిపతి గభీరానంద భారతీస్వామి జ్యోతి వెలిగించి ప్రారంభిస్తారు. అదేరోజు సిద్ధిబుద్ధి సమేత విఘ్నేశ్వర స్వామి కల్యాణం, శుక్రవారం రాజ్యలక్ష్మి సమేత నరసింహస్వామి కల్యాణం, సామూహిక కుంకుమపూజలు, శనివారం సీతారాముల కల్యాణం జరుగుతాయి. ఆదివారం సువర్చలా ప్రసన్నాంజనేయ స్వామి కల్యాణం, మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం ఉంటాయి. సోమవారం గంగాగౌరీసమేత గౌరీశంకరస్వామి కల్యాణం, లక్షబిల్వార్చనలు ఉంటాయి.

మహిళను దూషించిన కేసులో ఇద్దరికి జైలు

పట్నంబజారు, న్యూస్‌టుడే: మహిళను దూషించి, బెదిరించిన కేసులో ఇద్దరి వ్యక్తులకు కోర్టు 6 నెలల జైలు శిక్ష విధించింది. పాతగుంటూరు పోలీసుల కథనం ప్రకారం.. 2020 సెప్టెంబరు 21న ఫ్లాట్ యజమాని సూర్యనారాయణ, కాపలాదారు చెన్నయ్య అసభ్యకరంగా తిట్టారని సీతారామనగర్‌కు చెందిన దాసరి భానుపద్మ అనే మహిళ పోలీసులకు ఫిర్యాదు చేశారు. విచారణ అనంతరం కోర్టు తీర్పు వెలువరించిందని పాతగుంటూరు సీఐ వెంకటప్రసాద్ తెలిపారు.

యువకుడి అదృశ్యంపై కేసు

పట్నంబజారు, న్యూస్‌టుడే: రామనామక్షేత్రం ఒకటో లైనుకు చెందిన చింతలచెరువు రాంబాబు (33) కనిపించటం లేదని మంగళవారం లాలాపేట పోలీసుస్టేషన్‌లో కేసు నమోదైంది. ఈ నెల 7న ఇంటి నుంచి బయటకు వెళ్లిన అతను తిరిగి రాలేదు.

శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్

SHRIRAM Finance

నమోదిత కార్యాలయం: శ్రీ టవర్స్, ప్లాట్ నెం.14ఎ, సౌత్ ఫేజ్, ఇండస్ట్రియల్ ఎస్టేట్, గిండి, చెన్నై-600032.
జోనల్ ఆఫీస్ : శ్రీరామ్ ఎన్‌క్లేవ్, అన్నపూర్ణ నగర్, 5వ లేన్, ఇన్నర్ రింగ్ రోడ్డు, గోరంట్ల, గుంటూరు-522034.

డిమాండ్ నోటీసు

సెక్యూరిటైజేషన్ అండ్ రీకనస్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం 2002, సెక్షన్ 13(2) అనుసరించి డిమాండ్ నోటీసును జారీచేయడమైనది.

మెసర్స్ శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ (గతంలో ‘‘శ్రీరామ్ సిటీ యూనియన్ ఫైనాన్స్ లిమిటెడ్’’ గా పిలువబడేది, ఎన్‌సిఎల్‌టి బ్రాంచ్-II చెన్నై, తేది 9-11-2022 యొక్క ఉత్తర్వుల ప్రకారం శ్రీరామ్ ట్రాన్స్‌పోర్ట్ ఫైనాన్స్ లిమిటెడ్‌లో విలీనమైనది మరియు శ్రీరామ్ ట్రాన్స్‌పోర్ట్ ఫైనాన్స్ లిమిటెడ్‌గా మార్చబడినది) మరియు ఆ తర్వాత (30-11-2022 తేదీనాటి కార్పొరేట్ ఫైనాన్స్ మంత్రిత్వశాఖ లేఖ) ద్వారా శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ గా తిరిగి పేరు పెట్టుటకు ఆమోదం పొందిన మేము కంపెనీల చట్టం, 2013 క్రింద రిజిస్టర్డు కంపెనీ అయి ఉన్నాము మరియు నాన్-బ్యాంకింగ్ ఫైనాన్స్ బిజినెస్‌ను నడుపుటకు ఆర్‌బిఐ వద్ద కూడా రిజిస్టరై ఉన్నాము. శ్రీ టవర్స్, ప్లాట్ నెం.14ఎ, సౌత్ ఫేజ్, ఇండస్ట్రియల్ ఎస్టేట్, గిండి, చెన్నై-600032 వద్ద మరియు మా జోనల్ కార్యాలయం చిరునామా, శ్రీరామ్ ఎన్‌క్లేవ్, అన్నపూర్ణ నగర్, 5వ లేన్, ఇన్నర్ రింగ్ రోడ్డు, గోరంట్ల, గుంటూరు-522034 మరియు బ్రాంచ్ ఆఫీస్ : గుంటూరు-2 వద్ద కలిగి ఉన్న మేము ఈ దిగువ నోటీసును జారీచేయడమైనది. (ఇక పై కంపెనీ/ఋణదాతగా పిలువబడుతుంది).

దిగువ తెలిపిన రుణగ్రహీతలు/సహ రుణగ్రహీతలు/గ్యారంటార్లు/శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ నుండి ఆర్థిక సహాయాన్ని వినియోగించుకొన్నారు. ఆర్థిక సహాయాన్ని వినియోగించుకున్న సదరు రుణగ్రహీతలు/గ్యారంటర్లు గడువు తేదీల ప్రకారం వడ్డీ మరియు అసలు మొత్తాలను తిరిగి చెల్లించుటలో అనేక సార్లు విఫలమైనారని మేము తెలియజేస్తున్నాము. సెక్యూరిటైజేషన్ అండ్ రీకనస్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్ 2002 క్రింద & సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 లోని రూలు 3తో చదువకోవల్సిన సెక్షన్ 13(2) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగించుకుంటూ శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ యొక్క అధీకృత అధికారి సదరు ఖాతాను నిరర్థక ఆస్తిగా వర్గీకరించారు. నోటీసుల స్వీకరణ తేదీ నుండి 60 రోజులలోగా చెల్లింపు తేదీ వరకు నోటీసులలో తెలిపిన మొత్తంపై కాంట్రాక్చువల్ రేటు వంతున తదుపరి వడ్డీతోపాటు నోటీసులలో తెలిపిన మొత్తం మరియు అనుషంగిక ఖర్చులు, వ్యయాలు, చార్జీలు వగైరాను చెల్లించవల్సిందిగా దిగువ తెలిపిన రుణగ్రహీతలు/గ్యారంటర్లు తనఖారుణగ్రస్తులను కోరుతూ SARFAESI చట్టం, 2002 లోని సెక్షన్ 13(2) క్రింద ఇందులో తెలిపిన సంబంధిత తేదీలలో డిమాండ్ నోటీసులు జారీ చేశారు.

వారి చివరిగా తెలిసిన చిరునామాలోని వారికి జారీ చేయబడిన నోటీసులు అందచేయబడక తిరిగి వచ్చినందున సదరు విషయం గురించి బహిరంగ ప్రకటన ద్వారా వారికి సమాచారం ఇవ్వడమైనది. సెక్యూర్డ్ ఆస్తులను విడిపించుకొనుటకు లభించు సమయానికి సంబంధించి చట్టంలోని సెక్షన్ 13 యొక్క సబ్- సెక్షన్ (8) లోని నిబంధనలను చూడవల్సిందిగా ఋణగ్రహీతలకు విజ్ఞప్తి.

ఋణగ్రహీత(లు)/సహ-ఋణగ్రహీత(లు)/హామీదారు(ల) పేరు	ఎన్‌పిఎ తేది 10-05-2025	డిమాండ్ నోటీసు తేది 13-01-2026
ఎంటర్‌ప్రైజ్ ఫైనాన్స్ ఋణ ఖాతా నెం. GNTR4TF2405230001, తేది: 23-05-2024 1) గెల్లి సతీష్ కుమార్, తండ్రి : ప్రసాద్, డి నెం.6-332, అమృతులూరు (పోస్ట్ & మం), గుంటూరు జిల్లా-522325. 2) గెల్లి శుభ లక్ష్మి, భర్త : సతీష్ కుమార్, డి నెం.6-332, అమృతులూరు (పోస్ట్ & మం), గుంటూరు జిల్లా-522325. 3) గెల్లి ప్రసాద్, తండ్రి : సత్యనారాయణ, డి నెం.6-332, అమృతులూరు (పోస్ట్ & మం), గుంటూరు జిల్లా-522325. 4) గెల్లి సత్యనారాయణ, తండ్రి : ప్రసాద్, డి నెం.6-332, అమృతులూరు (పోస్ట్ & మం), గుంటూరు జిల్లా-522325. 5) బొలిశెట్టి శ్రీనివాసరావు, తండ్రి : సత్యనారాయణ, డి నెం.6-282, జంగావారి వీధి, పాత గుంటూరు, గుంటూరు జిల్లా-522001.	రుణం మొత్తం రూ. 75,00,000/- (డెబ్బై ఐదు లక్షల రూపాయలు మాత్రమే)	మొత్తం బకాయి: రూ. 95,72,245/- (అక్షరాల తొంభై ఐదు లక్షలు డెబ్బై రెండు వేల రెండు వందల నలభై ఐదు రూపాయలు మాత్రమే) తేది 13-01-2026 నాటికి

గెల్లి ప్రసాద్ గారికి చెందిన షెడ్యూల్ స్థిరాస్తి వివరములు :

బాపట్ల జిల్లా, అమృతలూరు సబ్ జిల్లా, అమృతలూరు మండలం, అమృతలూరు గ్రామ పంచాయతీ పరిధి, అమృతలూరు గ్రామం, డి నెం.616/A1, పాత డోర్ నెం.12/130, కొత్త డోర్ నెం. 9-71 నందు విస్తీర్ణం 850 చ॥గ॥లు లేదా 710.685 చ॥మీ॥ల ఖాళీ ఇంటి స్థలం. **హద్దులు: తూర్పు:** ఆలపాటి పాములు, నార్ల మల్లికార్జునరావు గార్ల స్థలం – 58.5 అ॥లు, **దక్షిణం:** మహంకాళి రవి గారి ప్రహరీ గోడ– 27.5 అ॥లు, **మరలా తూర్పు:** మహంకాళి రవి ఇతరులు యొక్క స్థలం – 53.00 అ॥లు, **మరలా దక్షిణం:** పంచాయితీ బజార్ – 50.00 అ॥లు, **పడమర:** హైవే రోడ్డు – 118.5 అ॥లు, **ఉత్తరం:** లాం రామ కృష్ణ గారి స్థలం – 82.00 అ॥లు.

పైన చెప్పబడిన విస్తీర్ణం 850 చ॥గ॥లు లేదా 710.685 చ॥మీ॥ల ఖాళీ ఇంటి స్థలం మాత్రమే. (ఈ ఆస్తి S.R.O. అమృతలూరు యొక్క డాక్యుమెంట్ నెం. 69/2018 కి సంబంధించినది).

పైన తెలిపిన పరిస్థితుల దృష్ట్యా, ఈ నోటీసు ప్రచురణ తేదీ నుండి 60 రోజులలోగా భవిష్యత్ వడ్డీ మరియు వర్తించు ఛార్జీలతోపాటు పైన తెలిపిన బకాయి మొత్తాలను చెల్లించవల్సిందిగా పైన తెలిపిన ఋణగ్రహీతలు, సహ-ఋణగ్రహీతలు మరియు/లేదా వారి హామీదారులకు (వర్తింపును బట్టి) ఇందుమూలముగా నోటీసు ఇవ్వడమైనది. లేనిచో, సెక్యూరిటైజేషన్ అండ్ రీకనస్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్ 2002 లోని సెక్షన్ 13(4) క్రింద మరియు ఇందులో వర్తించు నిబంధనల క్రింద రుణగ్రహీతలు మరియు తనఖా రుణగ్రస్తుల యొక్క సెక్యూర్డ్ ఆస్తులు స్వాధీనత చేపట్టడంతో సహా సెక్యూర్డ్ అసెట్స్ మీద ఈ నోటీసు తేదీ నుండి 60 రోజుల అనంతరం తదుపరి చర్యలు చేపట్టబడును. సదరు చట్టంలోని సెక్షన్ 13(13) క్రింద, సెక్యూర్డ్ క్రెడిటార్ యొక్క ముందస్తు వ్రాత పూర్వక సమ్మతి లేకుండా నోటీసులో తెలిపిన తమ సెక్యూర్డ్ అసెట్స్‌ను అమ్మకం, లీజు లేదా మరేదేని ఇతర విధంగా ఏ ఋణగ్రహీతా బదిలీ చేయరాదని గమనించగలరు.

ప్రదేశం : గుంటూరు సం/- అధీకృత అధికారి, శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్

మంగళగిరి

• మంగళగిరి • తాడికొండ • ప్రత్తిపాడు

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM
మంగళగిరి: 80085 73111
ప్రత్తిపాడు: 99596 89564 తాడికొండ: 97053 99233

స్పందన: మంగళగిరి గ్రామీణం, న్యూస్‌టుడే: నీరుకొండ గ్రామంలో దోమల బెడద ఎక్కువగా ఉందని స్థానికులు పంచాయతీ అభివృద్ధి అధికారి సత్యసాయి దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆయన ఫాగింగ్ చేయించారు. ✦ నిడమర్రు గ్రామంలో శివాలయం రోడ్డు సమీపంలో డ్రైనేజీ స్తంభించిందని స్థానికులు శానిటైజేషన్ ఇన్‌స్పెక్టర్ ఇందు దృష్టికి తెచ్చారు. ఆమె వెంటనే స్పందించి పూడిక తీయించారు.

తాడికొండ, న్యూస్‌టుడే: తాడికొండ గ్రామంలోని 16వ వార్డులో మురుగుకాలువలో గడ్డి, వ్యర్థాలు పేరుకుపోయాయని స్థానికులు పంచాయతీ కార్యదర్శి జానీ దృష్టికి తీసుకువెళ్లారు. స్పందించిన ఆయన పూడిక తీయించారు. **తుళ్లూరు, న్యూస్‌టుడే:** తుళ్లూరులో సైడు కాలువల్లో వ్యర్థాలను తొలగించాలని స్థానికులు 'మేమున్నాం మీకు తోడుగా' ద్వారా పంచాయతీ అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. స్పందించిన పంచాయతీ అధికారి ఆర్.రమణ ఆ ప్రాంతాన్ని శుభ్రం చేయించారు.

కంప్యూటర్ పరిజ్ఞానంపై అవగాహన

తాడేపల్లి, మంగళగిరి గ్రామీణం: కంప్యూటర్ పరిజ్ఞానంపై మంగళగిరి మండలం నవులూరులోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు కేఎల్‌యూ ఇంజినీరింగ్ విద్యార్థులు మంగళవారం అవగాహన కల్పించారు. భవిష్యత్తులో కంప్యూటర్ విద్య ప్రాధాన్యతను వివరించారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలను వివరిస్తూ ఆత్మకూరులోనూ ర్యాలీ చేశారు.

వీరి పట్టు.. విజయాల మెట్టు

తైక్వాండోలో విద్యార్థుల ప్రతిభ

మంగళగిరి గ్రామీణం, న్యూస్‌టుడే

ఆత్మరక్షణతోపాటు ఆరోగ్యాన్ని, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించే యుద్ధ కళ 'తైక్వాండో'. మంగళగిరికి చెందిన పలువురు విద్యార్థులు ఈ క్రీడలో పట్టుదలతో సాధన చేస్తూ జాతీయ, రాష్ట్ర వేదికలపై పతకాలు సాధిస్తున్నారు. ప్రస్తుతం ఈ క్రీడపై బాలలు ఆసక్తి చూపుతున్నారని, 2000 సంవత్సరం నుంచి ఒలింపిక్స్‌లో దీనికి చోటు కల్పించారని శిక్షకుడు సుబ్బారావు వివరించారు.

పోలీసు అవ్వాలని..

పెదవడ్లపూడికి చెందిన **పి.రాధిక** విజేత హైస్కూల్‌లో ఆరో తరగతి చదువుతోంది. తండ్రి తాపీ మేస్త్రిగా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. ఇప్పటి వరకు తెనాలి, కాకినాడల్లో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో, గతేడాది పంజాబ్, దిల్లీ, విజయవాడలో జరిగిన జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని సత్తా చాటింది. ఆయా పోటీల్లో బంగారు పతకాలు 5, కాంస్యం 1 సాధించింది. నిత్యం రెండు గంటలు సాధన చేస్తుంటానని, పోలీసు కావడమే తన లక్ష్యమని రాధిక చెబుతోంది.

నిత్యం 2 గంటల సాధన..

పెదవడ్లపూడికి చెందిన **షేక్.ధనిష్ హుస్సేన్** ఇక్కడి నాగార్జున హైస్కూల్‌లో ఏడో తరగతి చదువుతున్నాడు. గతేడాది విజయవాడ, హరియాణాలో జరిగిన జాతీయస్థాయి పోటీల్లో పాల్గొని నాలుగు బంగారు, 4 వెండి, 1 కాంస్య పతకం సాధించి సత్తా చాటాడు. కోచ్ ప్రోత్సాహంతో నిత్యం రెండు గంట సాధన చేస్తుంటానని హుస్సేన్ చెబుతున్నాడు.

ఆర్మీలో చేరుతా..

ఆత్మకూరుకు చెందిన **కె. ప్రేమ్‌రూపేష్** స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్నాడు. గతేడాది విజయవాడలో జరిగిన జాతీయ స్థాయి, ఇతర పోటీల్లో అండర్ 14, 17 విభాగాల్లో 3 బంగారు పతకాలు, 2 కాంస్య పతకాలు కొల్లగొట్టాడు. స్కూలు ముగిసిన తర్వాత నిత్యం గంటపాటు సాధన చేస్తుంటానని, ఆర్మీలో చేరి దేశానికి సేవలందిస్తానని అతడు చెబుతున్నాడు.

అన్నప్రసాద వితరణ

మంగళగిరి, మంగళగిరి గ్రామీణం, న్యూస్‌టుడే: మంగళగిరి శివాలయం వద్ద శ్రీగంగా భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి అన్నదానం ట్రస్ట్ ఆధ్వర్యాన మంగళవారం అన్నదానం నిర్వహించారు. తొలుత స్వామివారికి అన్నాభిషేకం నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు అన్నదానం చేశారు. స్వామివారి రథోత్సవానికి వచ్చిన భక్తులకు ప్రసాదాలను పంపిణీచేశారు. ట్రస్ట్ అధ్యక్షుడు వాకా మంగారావు, కోశాధికారి డాక్టర్ మునగపాటి వెంకటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి టోకిపర్తి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల పరిశ్రమ సందర్శన

ఫిరంగిపురం, న్యూస్‌టుడే: మార్కాపురం ఎన్.ఎస్ వ్యవసాయ కళాశాల విద్యార్థులు పారిశ్రామిక సందర్శనలో భాగంగా మంగళవారం ఫిరంగిపురం పరిధిలోని తులసి సీడ్స్ కంపెనీని సందర్శించారు. ఈ సందర్భంగా కళాశాల అసిస్టెంట్ ప్రొ.ఎం. ఐశ్వర్య, డి. జానకినాథ్‌వర్మ ఆధ్వర్యంలో విత్తనోత్పత్తి, విత్తన పరీక్ష విధానాలు, ల్యాబ్ టెస్ట్, క్వాలిటీ టెస్టింగ్, ప్యాకింగ్ తదితర విభాగాలను సందర్శించారు. ఆ సంస్థ ఛైర్మన్ తులసి రామచంద్ర ప్రభు, తులసి యోగిష్ చంద్ర తదితరులు పాల్గొన్నారు.

వేసవి వస్తోంది.. వాడుకలోకి తెస్తారా..?

ఏళ్లుగా నిరుపయోగంగా శుద్ధ జల కేంద్రాలు

కొర్నెపాడులో పనిచేయని కేంద్రం

వట్టిచెరుకూరు మండలంలోని కొన్ని గ్రామాలలో మంచినీటి శుద్ధ జల కేంద్రాలు సంవత్సరాల తరబడి నిరుపయోగంగా ఉన్నాయి. వీటిని వాడుకలోకి తెస్తే స్థానికులకు శుద్ధ జలం సరఫరా మరింత మెరుగవుతుంది. గ్రామీణ రక్షిత మంచినీటి సరఫరా పథకానికి సంబంధించిన అధికారులు స్పందించి రూ.లక్షల ప్రజాధనంతో నిర్మించిన ఈ కేంద్రాలను వాడుకలోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు.

17 గ్రామాల్లో..23 ప్లాంట్లు.. వట్టిచెరుకూరు మండలంలోని 17 గ్రామాల్లో 23 శుద్ధ జల కేంద్రాలు ఉన్నాయి. ముట్లూరులో అయిదు, వట్టిచెరుకూరు, పుల్లడిగుంటలలో రెండు ఉండగా.. అందులో ఆరు నిరుపయోగంగా మారాయి. అక్కడ వీటి నిర్వహణలో సాంకేతిక సమస్యలు తలెత్తడంతో పనిచేయడం లేదు. ఇందులో ముట్లూరు, వట్టిచెరుకూరు, కారంపూడిపాడు, యామర్రు, పుల్లడిగుంట, కొర్నెపాడు గ్రామాల్లో పనిచేయని శుద్ధ జల కేంద్రాలు ఒక్కొక్కటిగా ఉన్నాయి. వీటిని వాడుకలోకి తేవాలి. దీనిపై ఎంపీడీవో రమేష్‌బాబు మాట్లాడుతూ.. సంబంధిత అధికారులతో మాట్లాడి ప్లాంట్లను వాడుకలోకి తెస్తామని తెలిపారు. -న్యూస్‌టుడే, వట్టిచెరుకూరు

వాసవీమాతకు పూజలు

పెదనందిపాడు: పెదనందిపాడులోని శ్రీ వాసవీకన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయ వార్షికోత్సవం సందర్భంగా మంగళవారం ఆర్య వైశ్య సంఘం ఆధ్వర్యంలో అమ్మవారికి పూజలు, అలంకరణ నిర్వహించారు. తొలుత భక్తులు 108 కలశాలతో గ్రామోత్సవం జరిపారు. సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీధర్, నాయకులు కృష్ణ, శేషగిరిరావు, వీరేంద్ర గుప్త, నాగేశ్వరరావు, వాసుదేవరావు, చంద్రమోహన్ పాల్గొన్నారు.

నాగేంద్ర హారాయ త్రిలోచనాయ

తుళ్లూరు, న్యూస్‌టుడే: మహా శివరాత్రి ఉత్సవాల్లో భాగంగా తాళ్ళాయపాలెం శైవ క్షేత్రంలో మంగళవారం శాంతి కల్యాణం అనంతరం రాజరాజేశ్వరీ దేవి, కోటిలింగేశ్వర స్వామి వార్ల రథోత్సవం వైభవంగా సాగింది. మేళతాళాలు, కేరళ వాయిద్యాలు, కోలాటం నృత్యాల నడుమ ఊరేగింపు నిర్వహించారు. క్షేత్ర పీఠాధిపతి శివస్వామి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అన్న ప్రసాద వితరణ చేశారు.

నులి పురుగుల నివారణ మాత్రల పంపిణీ

దుగ్గిరాల: బాలబాలికలు వ్యక్తిగత, పరిసరాల శుభ్రత పాటించాలని ఎంపీపీ షేక్ జబీన్ అన్నారు. మంగళవారం నులి పురుగుల నిర్మూలన దినం సందర్భంగా స్థానిక బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీని ఆమె ప్రారంభించారు. వైద్యులు, స్థానిక అధికారులు పాల్గొన్నారు.

మంగళగిరి: వీవర్స్ కాలనీ పాఠశాలలో..

ప్రత్తిపాడు, పెదనందిపాడు, వట్టిచెరుకూరు: ప్రత్తిపాడు మండల పరిధిలో గొట్టిపాడు పీహెచ్‌సీ వైద్యాధికారి డా.మేరీ యస్సీన్, డాక్టరు హేమంత్ కుమార్, పెదనందిపాడు పరిధిలో వైద్యాధికారి నంద కుమార్, ఎంఈవో రమేష్ బాబు, తెదేపా నాయకుడు శివరామ కృష్ణయ్య, వట్టిచెరుకూరు, కాట్రపాడు పరిధిలో వైద్యులు వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో నులిపురుగుల నివారణ మాత్రలు పంపిణీ చేశారు.

మంగళగిరి గ్రామీణం, మంగళగిరి, న్యూస్‌టుడే: మంగళగిరి పట్టణ వీవర్స్ కాలనీ నగరపాలక సంస్థ హైస్కూల్లో ఇందిరానగర్ యూపీహెచ్‌సీ డాక్టర్ అనూష, తెదేపా గుంటూరు పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి పోతినేని శ్రీనివాసరావు ఆధ్వర్యంలో 800 మందికి పిల్లలకు మాత్రలు పంపిణీ చేశారు.

ప్రత్తిపాడులో..

మా సమస్యలు పరిష్కరించరూ..!

జనసేన కార్యాలయంలో జనవాణి

తాడేపల్లి, మంగళగిరి, న్యూస్‌టుడే: రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి తమ సమస్యలను విన్నవించేందుకు వచ్చిన వారి నుంచి వినతులు స్వీకరించి వాటిని పరిష్కరించాలని సంబంధిత అధికారులతో ఫోన్లో మాట్లాడి వచ్చిన బాధితులకు ఏపీఎంఎస్ఐడీసీ ఛైర్మన్, ఆ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త చిల్లపల్లి శ్రీనివాసరావు భరోసా కల్పించారు. మంగళగిరిలోని జనసేన కేంద్ర కార్యాలయం వద్ద మంగళవారం ఉదయం నిర్వహించిన 'జనవాణి'లో ఆయన పాల్గొని అర్జీలు స్వీకరించారు. కర్నూలు జిల్లా కలిగిరి గ్రామంలో తాగునీటి సమస్యపై వచ్చిన అర్జీకి సంబంధించి ఆ మండల ఎంపీడీవోతో ఫోన్లో మాట్లాడి పరిష్కరించాలని సూచించారు. తిరుపతి జిల్లా నుంచి వచ్చిన దివ్యాంగుడు శివ పింఛన్ మంజూరు చేయించాలని అర్జీ అందజేశారు. ఏపీ మాదిగ వెల్ఫేర్ కోఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ విజయ్‌శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుడి సమస్యను వింటున్న ఏపీఎంఎస్ఐడీసీ ఛైర్మన్ చిల్లపల్లి

శ్రీ మహంకాళి అమ్మవారి దేవస్థానం
కంచరాజు కొండూరు గ్రామము, దుగ్గిరాల మండలం, గుంటూరు జిల్లా
శ్రీ అమ్మవారి దేవస్థానము నందు కొండవాలు, పాలువాలు ఇతర పట్టు వస్తువులు ది.01-03-2026 నుండి ది.28-02-2027 వరకు సదరవ వేయుటకు దేవస్థానము నందు ది.18-02-2026 నుండి ది.24-02-2026 వరకు రూ.500/-లు చెల్లించి టెండరు షెడ్యూలు పొంది ది.25-02-2026న దేవస్థానము ఆఫీసు నందు గల టెండరు బాక్సు నందు సమర్పించవలెను. పూర్తి వివరములు కోసం దేవస్థానము కార్యాలయము నందు సంప్రదించగలరు.
శ్రీ అమ్మవారి సేవలో
కార్యనిర్వహణాధికారి

ది కరూర్ వైశ్యా బ్యాంక్ లిమిటెడ్
గుంటూరు బ్రాంచ్, 22-04-105, హేమ నర్సింహ కాంప్లెక్స్, ఇన్నర్ రింగ్ రోడ్, లాలాపేట్, గుంటూరు.
సవరణ
ఇందుమూలముగా ది కరూర్ వైశ్యాబ్యాంక్ లిమిటెడ్, గుంటూరు బ్రాంచ్, గుంటూరు వారు ది.09.12.2025న ఈనాడు & ఇండియన్ ఎక్స్‌ప్రెస్ దినపత్రికల యందు ప్రచురించిన ప్రకటనలో "షెడ్యూల్ 4555.70 చ.గజాలు" బదులుగా "4888.4 చ.గజాలు" గా చదువుకొనగలరు.
స్థలం: గుంటూరు, తేదీ: 17-02-2026 సం/- అధీకృత అధికారి

తెదేపా నేత మృతి

గుంటూరు రూరల్: లాలుపురానికి చెందిన తెదేపా నేత తోట శివ మల్లికార్జునరావు(68) మంగళవారం గుండెపోటుతో మరణించారు. ఈయన గుంటూరు మాజీ ఎంపీపీ తోట లక్ష్మీకుమారి భర్త. ఎమ్మెల్యే రామాంజనేయులు, పలువురు పార్టీ నేతలు ఆయన మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.

విధుల్లో అలసత్వం తగదు

మేడికొండూరు, న్యూస్‌టుడే: విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని ఉప ముఖ్య కార్యనిర్వాహణాధికారి (డిప్యూటీ సీఈవో) కృష్ణ సిబ్బందిని హెచ్చరించారు. మేడికొండూరులో మంగళవారం ఆయన పర్యటించారు. ఏకీకృత కుటుంబ సర్వే, ఈకేవైసీ కార్యక్రమాల పని తీరు పరిశీలించారు. ఒకటో గ్రామ సచివాలయంలో 9 మంది సిబ్బందికి గాను విధుల్లో ఆరుగురు మాత్రమే అందుబాటులో ఉన్నట్లు గుర్తించి ఆగ్రహం వ్యక్తం చేశారు. భీమినేనివారిపాలెంలో ప్రభుత్వం చేపట్టిన బంగారు కుటుంబాలు, మార్గదర్శకులతో సమావేశం అయ్యారు.

ఆదర్శ మండలంగా తీర్చిదిద్దుతాం

ప్రత్తిపాడు, న్యూస్‌టుడే: ప్రత్తిపాడు మండలాన్ని అభివృద్ధిలో ఆదర్శ మండలంగా తీర్చిదిద్దుతున్నట్లు ఎంపీడీవో శివపార్వతి చెప్పారు. ప్రత్తిపాడు రామనగర్ కాలనీలో రూ.10 లక్షల వ్యయంతో నిర్మించనున్న సీసీ రోడ్డుకు ఎంపీడీవో మంగళవారం భూమి పూజ చేసి మాట్లాడారు. గ్రామాలలో మౌలిక వసతులు కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. డిప్యూటీ ఎంపీడీవో షేక్ ఆదామ్, తెదేపా మండల అధ్యక్షుడు శివరామ ప్రసాద్, మాజీ ఎంపీపీ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఊరుకు చేరాలనా.. వాగుకు చిక్కాలనా..

వణికిస్తున్న వంతెనలు

ఆత్మకూరు-పెదవడ్లపూడి దారిలో రక్షణ గోడ దెబ్బతిని..

మండల పరిధిలోని పలు వంతెనలు జనాన్ని వణికిస్తున్నాయి. యర్రబాలెం, కృష్ణాయపాలెం గ్రామాల మధ్య కొండవీటి కాలువపై వారధికి రక్షణ గోడలు విరిగిపోయాయి. ఇటుగా సచివాలయం, హైకోర్టు, రాజధాని గ్రామాలకు వెళ్లేవారు రాకపోకలు సాగిస్తుంటారు. రాజధాని ప్రాంతం కావడంతో ఇటీవల సందర్శకుల తాకిడి బాగా పెరిగింది. దీంతో వారంతా బిక్కుబిక్కుమంటూ రాకపోకలు సాగిస్తున్నారు. వంతెనకు ఇనుప ఊచలు సైతం బయటకు కనిపిస్తున్నాయి. రాత్రి వేళల్లో ఏమాత్రం అదుపు తప్పినా సుమారు 30 అడుగుల లోతులో ఉన్న వాగులో పడాల్సిందే. ★ ఆత్మకూరు, పెదవడ్లపూడి మధ్యలో గుంటూరు ఛానల్ కాలువపై వంతెనకు రక్షణ గోడలు కూలిపోయాయి. నిత్యం ఇటుగా వందలాది మంది రాకపోకలు సాగిస్తుంటారు. పైగా గుంతలు రోడ్డు కావడంతో ఎప్పుడు ఏం ముంచుకొస్తుందోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించాలని కోరుతున్నారు. - మంగళగిరి గ్రామీణం, న్యూస్‌టుడే

ఈ వెలుగులు ఎవరి కోసం..?

పేరేచర్ల మూడో లేబొటీలో వీధి దీపాలు పట్టపగలు కూడా వెలుగుతున్నాయి. దీంతో విద్యుత్తు వృథా అవుతున్నాయి. కొన్నిచోట్ల అసలు దీపాలే పనిచేయడం లేదు. - న్యూస్‌టుడే, మేడికొండూరు

తట్ట మట్టినైనా వేయించరూ..

తాడికొండ శివారు కంతేరు రహదారిలో భారీ గుంతలు పడ్డాయి. ప్రధాన మలుపుల వద్ద రోడ్డు కుంగిపోయి ఎగుడుదిగుడుగా మారి ప్రయాణానికి జనం నరకం చూస్తున్నారు. కనీసం తట్ట మట్టినైనా వేసి గోతులు పూడ్చాలని వారు కోరుతున్నారు. - తాడికొండ, న్యూస్‌టుడే

వరాహాల విహారం

మంగళగిరి పట్టణంలో పందులు స్వైరవిహారం చేస్తున్నాయి. పరిసరాలను అపరిశుభ్రంగా మార్చడంతోపాటు రోడ్లపై వెళ్లే వాహనాలకు అడ్డు పడుతున్నాయి. దీంతో ప్రమాదాలు సంభవిస్తున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. - మంగళగిరి గ్రామీణం, న్యూస్‌టుడే

నిత్యం ట్రాఫిక్ కష్టాలే

తుళ్లూరు ప్రధాన రహదారిపై తరచూ ట్రాఫిక్ నిలిచిపోతుంది. ప్రధానంగా లైబ్రరీ సెంటర్ కూడలిలో గోతులు పడటం, రోడ్డు ఇరుకుగా మారడం, భారీ వాహనాల రద్దీతో ఈ పరిస్థితి ఏర్పడింది. లారీలను ఎన్-14 రోడ్డు మీదుగా మళ్లిస్తే ప్రయోజనం ఉంటుంది. - తుళ్లూరు, న్యూస్‌టుడే

గడ్డి తొలగించరూ..

తాడికొండ గ్రామం పరిమి రోడ్డులోని ఎస్సీ కాలనీ మురుగు కాలువలకు ఇరుపక్కలా గడ్డి పెరిగింది. ఇది ప్రవాహానికి అడ్డంకిగా మారి.. దుర్వాసన, దోమలు వ్యాపిస్తున్నాయి. ఇదే కొనసాగితే రోగాల బారిన పడతామని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. - తాడికొండ, న్యూస్‌టుడే

వందేళ్ల చెట్టు..



ఫిరంగిపురంలో ముస్లిం సోదరులు సుమారు 120 సంవత్సరాల మర్రి చెట్టును అపురూపంగా సంరక్షిస్తున్నారు. దీన్ని స్థానికంగా జెండా చెట్టు అని పిలుస్తుంటారు. నిత్యం సాయంత్రం వేళల్లో మతాలకతీతంగా దీని నీడలో సేద తీరుతుంటారు. - ఫిరంగిపురం, న్యూస్‌టుడే

ధ్యానంతో ఒత్తిడి, ఆందోళన దూరం

తాడికొండ, న్యూస్‌టుడే: విద్యార్థులు చదువుతోపాటు మానవతా విలువలు పెంపొందించుకోవాలని హార్ట్‌ఫుల్‌నెస్ మెడిటేషన్ సెంటర్ సభ్యుడు ఎస్.రామకోటేశ్వరరావు పేర్కొన్నారు. లాం చలపతి ఫార్మసీ కళాశాలలో మంగళవారం హార్ట్‌ఫుల్‌నెస్ సంస్థ ఆధ్వర్యంలో 'ప్రకృతితో సమన్వయ జీవనం' అంశంపై వ్యాస రచన పోటీలు నిర్వహించారు. 751 మంది విద్యార్థులు పాల్గొనగా.. ప్రతిభ చూపిన 30 మందికి బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. ముఖ్యఅతిథి రామకోటేశ్వరరావు మాట్లాడుతూ.. ధ్యానం ద్వారా చిత్త స్థిరత్వం, ఆలోచనల్లో స్పష్టత లభిస్తుందన్నారు. ప్రిన్సిపల్ రామారావు మాట్లాడుతూ విద్యార్థుల్లో నైతిక విలువలు పెంపొందించేందుకు చలపతి ఎడ్యుకేషనల్ సొసైటీ కృషి చేస్తుందన్నారు.

విజేతలతో రామకోటేశ్వరరావు, ప్రిన్సిపల్ రామారావు తదితరులు

చెక్కు చెదరని సాక్ష్యం

మేడికొండూరు మండలం మందపాడు గ్రామంలోని చెన్న మల్లేశ్వర స్వామి దేవస్థానాన్ని 400 ఏళ్ల కిందట నిర్మించారు. భారీ కొండ రాళ్లతో తీర్చిదిద్దిన ఈ ఆలయం ఇప్పటికీ చెక్కుచెదరలేదు. ఇప్పటికీ ఆనాటి శిల్పకళలకు సాక్ష్యంగా నిలుస్తోంది. ఏటా శ్రీరామ నవమి ఉత్సవాలు ఇక్కడ ఘనంగా నిర్వహిస్తుంటారు. అందులో భాగంగా నిర్వహించే రథోత్సవానికి భారీగా జనం తరలివస్తుంటారు. ఈ ఆలయాన్ని గ్రామానికి చెందిన మందపాటి వంశస్థులు కట్టించినట్లు ఇక్కడి చారిత్రక ఆధారాల ద్వారా తెలుస్తోంది. అందువల్లే గ్రామానికి మందపాడుగా పేరు వచ్చింది. - న్యూస్‌టుడే, మేడికొండూరు

నగదు దోపిడీ నాటకమే..!

గుంటూరు రూరల్, న్యూస్‌టుడే: జల్సాల కోసం చేసిన అప్పులు తీర్చేందుకు కన్నతండ్రికి డబ్బులు దొంగలు కొట్టేశారని నాటకమాడిన కుమారుడు, అతని స్నేహితులపై నల్లపాడు పోలీసులు కేసు నమోదు చేశారు. పల్నాడు జిల్లా నాదెండ్ల మండలం సాతులూరుకు చెందిన కాసుల వెంకటేశ్వర్లు అలియాస్ వెంకటేష్ ఈ నెల 14న గుంటూరు నుంచి డబ్బులు తీసుకెళుతుండగా దొంగలు వచ్చి కళ్లలో స్ప్రే కొట్టి అపహరించుకెళ్లారని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పల్నాడు జిల్లా నాదెండ్ల మండలం సాతులూరుకు చెందిన కాసుల రామారావు మిర్చి వ్యాపారం చేస్తుంటారు. ఈ క్రమంలో వ్యాపారుల నుంచి తనకు రావాల్సిన డబ్బులు తీసుకొచ్చేందుకు అప్పుడప్పుడు కుమారుడు వెంకటేశ్వర్లు అలియాస్ వెంకటేష్‌ను పంపుతుంటారు. ఈ క్రమంలో ఈ నెల 14న గుంటూరు నుంచి తాను రూ.11 లక్షలు డబ్బులు తీసుకెళుతుండగా దొంగలు నగదు కొట్టేశారని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అతడిపై అనుమానం వచ్చిన పోలీసులు తమదైన శైలిలో విచారించారు. చిలకలూరిపేటకు చెందిన తన స్నేహితులు అనిల్‌కుమార్, శ్రీవాణిలు కలిసి దొంగతనం నాటకం ఆడామని వెంకటేష్ ఒప్పుకొన్నాడు. రామారావు ఫిర్యాదు మేరకు వెంకటేశ్వర్లు, అనిల్‌కుమార్, శ్రీవాణిలపై కేసు నమోదు చేశామని నల్లపాడు పోలీసులు తెలిపారు.

రెవెన్యూ గ్రామసభలు నేడు

పెదనందిపాడు: వరగానిలో ఈ నెల 18న ఉదయం 10 గంటలకు సచివాలయంలో రెవెన్యూ గ్రామసభ నిర్వహించనున్నట్లు తహసీల్దార్ హేనా ప్రియ తెలిపారు. మధ్యాహ్నం 2 గంటలకు పుసులూరు సచివాలయంలో గ్రామసభ ఉంటుందని, ఈ సభలలో రీసర్వే లో భూమి కొలతల వివరాలు తప్పుగా నమోదైన రైతులు తమ పత్రాలను తీసుకువస్తే సరి చేస్తారన్నారు.

మాట్లాడుతున్న డీఈలు, ఏఈలు

విద్యుత్తు చౌర్యం.. సామాజిక నేరం

ప్రత్తిపాడు, న్యూస్‌టుడే: విద్యుత్తు చౌర్యం సామాజిక నేరమని ఆ శాఖ డీఈలు గురునాథరావు, మల్లికార్జున ప్రసాద్, రవికుమార్ తెలిపారు. విద్యుత్ శాఖ విజిలెన్స్ విభాగం, సీఆర్‌డీఏ ఆపరేషన్ విభాగం ఎస్ఈ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ప్రత్తిపాడు మండలంలో మంగళవారం తనిఖీలు నిర్వహించారు. 29 మంది అధికారులు, 87 మంది సిబ్బంది, 29 టీంలుగా ఏర్పడి 1545 మీటర్లను తనిఖీ చేసినట్లు తెలిపారు. మీటరు లేకుండా విద్యుత్తు చౌర్యానికి పాల్పడుతున్న నలుగురికి, మీటరు ఉండి అక్రమంగా విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్న ఐదుగురికి, అనుమతించిన దానిలో కాకుండా ఇతర కేటగిరిలో విద్యుత్ వాడుకుంటున్న ఇద్దరికి, అనుమతించిన లోడ కంటే అదనంగా విద్యుత్ వాడుతున్న 61 మందికి రూ.4.14 లక్షల అపరాధ రుసుము విధించినట్లు వివరించారు. విద్యుత్తు చౌర్యంపై ఫిర్యాదులను 94408 12263, 94408 12360 నంబర్లకు నేరుగా, వాట్సప్ ద్వారా పంపాలని కోరారు. ఏఈలు సాంబశివరావు, శివశంకర్, సతీశ్ కుమార్ పాల్గొన్నారు.

గేదెలకు నిషేధిత ఇంజెక్షన్లు

స్వాధీనం చేసుకున్న పోలీసులు

గుంటూరు రూరల్, న్యూస్‌టుడే: రెడ్డిపాలెంలోని ఓ ఇంటిపై టాస్క్‌ఫోర్స్, స్పెషల్ బ్రాంచి పోలీసులు దాడి చేపి అక్రమంగా నిల్వచేసిన నిషేధిత ఇంజెక్షన్లు స్వాధీనం చేసుకున్నారు. గేదెల నుంచి పాల ఉత్పత్తి పెంచేందుకు వీటిని వినియోగిస్తున్నారని సమాచారం అందడంతో పోలీసులు రెడ్డిపాలేనికి చెందిన పల్లపోతు రేణుక నివాసంపై దాడి చేశారు. ఎలాంటి ముద్రలు లేని డబ్బాల్లో ఉన్న రూ. 2,79,000 విలువైన 1860 ఇంజెక్షన్లు గుర్తించి సీజ్ చేశారు. కృష్ణాజిల్లా ఉయ్యూరుకు చెందిన పున్నారావు అనే వ్యక్తి వీటిని సరఫరా చేసినట్లు గుర్తించారు. తాను స్థానిక పాడి రైతులకు వీటిని రూ.150 చొప్పున విక్రయిస్తున్నట్లు రేణుక అంగీకరించింది.

ఇరువర్గాల స్థల వివాదం

గుంటూరు: స్థలం విషయంలో రెండు వర్గాల మధ్య మరోసారి వివాదం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు మేడికొండూరు ఎస్సీ కాలనీలో ఒక స్థలం కలదు. గతంలో దాని విషయంలో రెండు వర్గాల మధ్య మనస్పర్థలు వచ్చాయి. అప్పట్లో ఇరు వర్గాలు గొడవ పడ్డారు. పరస్పరం ఫిర్యాదు మేరకు అప్పట్లో కేసులు నమోదయ్యాయి. మంగళవారం మరో సారి గొడవ జరిగింది. కాసేపటికి రెండు వర్గాల వారు మేడికొండూరు పోలీస్ స్టేషన్‌కు వచ్చారు. వాదోపవాదాలు జరిగాయి. ఈ క్రమంలో ఓ వర్గంలోని వ్యక్తులు మరో వర్గంలోని యువకుడితో దురుసుగా ప్రవర్తించారు. ఘటనపై అతడి బంధువులు ఫిర్యాదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

(c) eenadu

తెనాలి

•తెనాలి •పొన్నూరు

బాపట్ల నుంచి బస్సు సర్వీసు

బాపట్ల, న్యూస్‌టుడే: బాపట్ల నుంచి తెనాలికి ఈ నెల 19 నుంచి బస్సు సర్వీసు ప్రారంభిస్తున్నట్లు డిపో మేనేజర్ సింహాద్రి రాంబాబు తెలిపారు. ఆయన మంగళవారం మాట్లాడుతూ ప్రజల నుంచి అందిన విజ్ఞప్తుల మేరకు కలెక్టర్ వినోద్‌కుమార్ ఆదేశాలతో జిల్లా ప్రజారవాణాధికారి విమల కొత్త సర్వీసు నడపాలని నిర్ణయం తీసుకున్నారని పేర్కొన్నారు. బాపట్లలో ఉదయం 6.15కి బస్సు ప్రారంభమై అప్పికట్ల, పొన్నూరు, పచ్చలతాడిపర్రు, తొట్టెంపూడి, మామిళ్లపలి, మోదుకూరు, చుండూరు, వేటపాలెం, పెనుకుదురుపాడు, వలివేరు, యడ్లపల్లి, అంగలకుదురు మీదగా తెనాలికి 8.15 గంటలకు చేరుకుంటుందన్నారు. తెనాలి నుంచి 8.30 గంటలకు బయలుదేరి బాపట్లకు 11.15 గంటలకు వస్తుందన్నారు. మళ్లీ సాయంత్రం 4.30కి బయలుదేరి 6.30 గంటలకు తెనాలి వెళ్తుందని పేర్కొన్నారు. అక్కడి నుంచి 6.45కి ప్రారంభమై రాత్రి 8.45 గంటలకు బాపట్ల చేరుకుంటుందన్నారు.

నేటీ నుంచి పీజీ మొదటి సెమిస్టర్ పరీక్షలు

ఏఎన్‌యూ, న్యూస్‌టుడే: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ పరిధిలోని పీజీ కళాశాలలో ఈ నెల 18 బుధవారం నుంచి పీజీ మొదటి సెమిస్టర్ పరీక్షలు నిర్వహించనున్నారు. ఏఎన్‌యూ పరిధిలోని దాదాపు 19 కేంద్రాల్లో పరీక్షలు నిర్వహిస్తున్న పీజీ పరీక్షల విభాగం సమన్వయకర్త ఆచార్య సుబ్బారావు చెప్పారు. పరీక్షలు సజావుగా నిర్వహించేందుకు ప్రత్యేక స్క్వాడ్ బృందాలను, పరిశీలకులను నియమించినట్లు తెలిపారు. చూచిరాతకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవన్నారు.

తెనాలి మార్కెట్ యార్డులో..

నిమ్మకాయల ధరలు రూ.. (క్వింటా)

అత్యధికం: 8600
అత్యల్పం: 7000
సగటు: 8000

– న్యూస్‌టుడే, తెనాలి టౌన్

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

తెనాలి : 80085 73125 పొన్నూరు : 80085 73144

? పొన్నూరు 23వ వార్డు పార్కు రోడ్డులో వీధి దీపం వెలగడం లేదు. రాత్రి సమయంలో రాకపోకలు నిర్వహించడం చాలా ఇబ్బందికరంగా ఉంది. **- డి.రాజారావు, 23వ వార్డు**

✔ వీధిదీపాన్ని బాగు చేసే విధంగా చర్యలు తీసుకుంటాం. **- షేక్ హసీనా, సహాయ ఇంజినీరు**

? పొన్నూరు 7వ వార్డులోని మురుగు నీటి కాలువలో వ్యర్థాలు పేరుకున్నాయి. దుర్వాసన వస్తుంది. **- పి.రామారావు, 7వ వార్డు**

✔ వ్యర్థాలను తొలగించే విధంగా చర్యలు తీసుకుంటాం. **- పోతురాజు, ప్రజారోగ్యశాఖాధికారి**

స్పందన: పట్టణ పరిధిలోని 14వ వార్డులో మూడు రోజులుగా పేరుకుపోయిన చెత్తను కార్మికులు తొలగించారు.

- న్యూస్‌టుడే, పొన్నూరు

ఫార్మసీ పరీక్షల షెడ్యూల్ విడుదల

ఏఎన్‌యూ, న్యూస్‌టుడే: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ పరిధిలోని ఫార్మసీ కళాశాలలో బీ ఫార్మసీ, ఎం ఫార్మసీ, ఫార్మా డీ పరీక్షల షెడ్యూల్‌ను సీఈ ఆలపాటి శివప్రసాద్ మంగళవారం విడుదల చేశారు. ఎం ఫార్మసీ మొదటి సెమిస్టర్ పరీక్షలు, 2022, 23, 24 సంవత్సరంలో సబ్జెక్టులు ఉన్న విద్యార్థులు పరీక్షలు రాసేందుకు అవకాశం కల్పిస్తున్నట్లు సీఈ తెలిపారు. ఫార్మా డీ ఐదు, నాలుగు సెమిస్టర్లు, బీ ఫార్మసీ మొదటి ఏడాది మొదటి సెమిస్టర్, రెండో సెమిస్టర్(సప్లిమెంటరీ), రెండో ఏడాది మూడు, నాలుగు(సప్లిమెంటరీ) సెమిస్టర్, మూడో ఏడాది ఐదో సెమిస్టర్ పరీక్షలను మార్చి 30న నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ పరీక్షలకు మార్చి 16 లోపు ఫీజులు చెల్లించాలని, రూ.100 అపరాధ రుసుంతో అదే నెల 17 లోపు చెల్లించాలని శివప్రసాద్ చెప్పారు.

★ ఎమ్మెస్సీ, ఎంసీఏ మూడో సెమిస్టర్ ఫలితాలు..

ఏఎన్‌యూలోని సైన్స్ కళాశాలలో గతేడాది నవంబరులో నిర్వహించిన ఎమ్మెస్సీ, ఎంసీఏ మూడో సెమిస్టర్ ఫలితాలను సీఈ ఆలపాటి శివప్రసాద్ మంగళవారం విడుదల చేశారు. ఎమ్మెస్సీ సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్‌లో 9 మంది పరీక్ష రాయగా ఏడుగురు, ఎంసీఏ మూడో సెమిస్టర్‌లో 833 మంది పరీక్ష రాయగా 592 మంది, బీటెక్ మూడో ఏడాది రెండో సెమిస్టర్(సప్లిమెంటరీ)లో 74 మంది పరీక్ష రాయగా 42 మంది ఉత్తీర్ణులయ్యారని చెప్పారు. ఎంసీఏ, ఎమ్మెస్సీ జవాబు పత్రాల పునఃమూల్యాంకన కోసం ఒక్కో పేపర్‌కు రూ.1860, బీటెక్ జవాబు పత్రాల పునఃమూల్యాంకనకు ఒక్కో పేపర్‌కు రూ.2070 ఈ నెల 26 లోపు చెల్లించాలన్నారు.

త్వరలో.. తెనాలికి ఈ-ఆటోలు

ఇంటింటి చెత్త సేకరణకు వినియోగం

వెయ్యి కిలోలు తరలించే సామర్థ్యంతో..

తెనాలి(కొత్తపేట), న్యూస్‌టుడే: తెనాలి పురపాలికలో ఇంటింటి నుంచి చెత్త సేకరణకు ఈ ఆటోలు వినియోగించాలని ప్రభుత్వం నిర్ణయించింది. త్వరలో మున్సిపాలిటీకి 25 ఈ ఆటోలు రానున్నాయి. పరిసరాల పరిశుభ్రత, ప్రజారోగ్య పరిరక్షణకు మెరుగైన పారిశుద్ధ్యం అవసరం. గత వైకాపా ప్రభుత్వ హయాంలోనూ ఇంటింటి నుంచి అద్దె ఆటోల్లో చెత్త సేకరించారు. చోదకులకు సకాలంలో వేతనాలు చెల్లించకపోవడంతో విధులకు గైర్హాజరయ్యారు. పట్టణంలో విధించి వసూలు చేసిన చెత్త పన్నులో నుంచి అద్దె ఆటోలకు చెల్లించే వారు. అనంతరం చెత్త పన్ను వసూలు నిలిపివేయడంతో ఆ ప్రభావం ఆటోల అద్దె చెల్లింపులపై పడింది. చోదకులకు వేతనాలు నిలిపివేయడంతో గుత్తేదార్లు చేతులెత్తేశారు. వాటికి తీసుకున్న బ్యాంకు రుణం చెల్లించడం లేదని బ్యాంకు అధికారులు స్వాధీనం చేసుకున్నారు. కూటమి ప్రభుత్వం ఈ ఆటోలు వినియోగించి చెత్త సేకరించాలని సంకల్పించింది.

ఇంటింటి నుంచి చెత్త సేకరణకు వెయ్యి కిలోలు తరలించే సామర్థ్యం కలిగిన నాలుగు చక్రాల వాహనాలు రానున్నాయి. వాహన చోదకుల వేతనాలు, మరమ్మతులు, జీఎస్టీ పన్ను గుత్తేదారులు చెల్లించాల్సి ఉంటుంది. ప్రతి వాహనం రోజుకు 45 కిలోమీటర్లు తిరగాలి. వెయ్యి గృహాల నుంచి చెత్త సేకరించాలి. వీటికి ఏడాదికి నిర్వహణ ఖర్చుల కింద ఒప్పందం ప్రకారం రూ.4,05,00,000 చెల్లించాల్సి ఉంది. ఈ మొత్తాన్ని జిందాల్ పరిశ్రమకు అద్దె కాంపాక్టర్ ద్వారా పంపించేందుకు ఒప్పందం కుదుర్చుకున్నారు మున్సిపల్ అధికారులు. టన్ను చెత్తకు సుమారు రూ.7 వంతున చెల్లించేందుకు పురపాలక అధికారులు ఒప్పందం కుదుర్చుకున్నారు. ఇటీవల నిర్వహించిన కౌన్సిల్ సమావేశం అజెండాలోని ఈ అంశాలకు కౌన్సిలర్లు ఆమోదం తెలిపారు.

ఘనంగా పెద్ద రథోత్సవం

చేబ్రోలు, న్యూస్‌టుడే: గంగా పార్వతీ సమేత నాగేశ్వరస్వామి పెద్ద రథోత్సవం మంగళవారం కనులపండువగా నిర్వహించారు. స్వామివారి కల్యాణోత్సవాల్లో భాగంగా మంగళవారం ప్రత్యేక పూజల అనంతరం ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించిన పెద్ద రథంపై ఉంచి గ్రామ మాడ వీధుల్లో భక్త జనసందోహం మధ్య ఊరేగించారు. ఈ సందర్భంగా మహిళలు, భక్తులు రథం లాగేందుకు ఉత్సాహంగా ముందుకొచ్చారు. ఆలయ ఈవో వినయ్ కృష్ణ, పాలక మండలి సభ్యులు, భక్తులు పాల్గొన్నారు. రథోత్సవం సందర్భంగా శంభుదేవర మఠం ఆధ్వర్యంలో అన్నదానం, పలు యువజన సంఘాల ఆధ్వర్యంలో ప్రసాదాలు పంపిణీ చేశారు.

మాడ వీధుల్లో ఊరేగింపుగా వస్తూ..

అధిక పాల దిగుబడి కోసం గేదెలకు నిషేధిత ఇంజెక్షన్లు

గుంటూరు రూరల్, న్యూస్‌టుడే: రెడ్డిపాలెంలోని ఓ ఇంటిపై టాస్క్‌ఫోర్స్, స్పెషల్ బ్రాంచి పోలీసులు దాడిచేసి అక్రమంగా నిల్వచేసిన నిషేధిత ఇంజెక్షన్లు స్వాధీనం చేసుకున్నారు. గేదెల నుంచి పాల ఉత్పత్తి పెంచేందుకు వీటిని వినియోగిస్తున్నారని సమాచారం అందడంతో పోలీసులు రెడ్డిపాలేనికి చెందిన పల్లపోతు రేణుక నివాసంపై దాడి చేశారు. ఎలాంటి ముద్రలు లేని డబ్బాల్లో ఉన్న రూ. 2,79,000 విలువైన 1860 ఇంజెక్షన్లు గుర్తించి సీజ్ చేశారు. కృష్ణా జిల్లా ఉయ్యూరుకు చెందిన పున్నారావు అనే వ్యక్తి వీటిని సరఫరా చేసినట్లు గుర్తించారు. తాను స్థానిక పాడి రైతులకు వీటిని రూ.150 చొప్పున విక్రయిస్తున్నట్లు రేణుక అంగీకరించింది.

స్వాధీనం చేసుకున్న ఇంజెక్షన్లతో పోలీసులు

'హార్వెస్ట్ ఇండియాపై చేసిన ఆరోపణలు నిరాధారం'

చేబ్రోలు, న్యూస్‌టుడే: హార్వెస్ట్ ఇండియా సంస్థ అనాథలు, వృద్ధులు, పేదలు, వితంతువులకు ఎన్నో సేవాకార్యక్రమాలు చేస్తుందని. . ప్రభుత్వం నుంచి అనేక పతకాలు తీసుకున్న సంస్థపై స్థలం ఆక్రమించారని ఆరోపించడం నిరాధారం అని సంస్థ ఇన్‌ఛార్జి శ్రీనివాసరావు తెలిపారు. క్రాంతిశ్రీ తమ కుటుంబ సభ్యులతో సోమవారం గరువుపాలెం వద్ద రోడ్డుపై కూర్చుని నిరసన వ్యక్తం చేసిన సంగతి తెలిసిందే. దీనిపై సంస్థ ఇన్‌ఛార్జి మంగళవారం మాట్లాడుతూ.. వాకా కోటేశ్వరరావు తమ స్థలాన్ని 1990లో అమ్ముకోగా వారి నుంచి 2003లో తమ సంస్థ కొనుగోలు చేసిందన్నారు. భూమి విలువలు పెరగడంతో తమ స్థలంపై కన్నేసిన క్రాంతిశ్రీ ఆమె కుటుంబ సభ్యులు నకిలీ పత్రాలు సృష్టించారని ఆరోపించారు. 23 సంవత్సరాలుగా స్థలం తమ ఆధీనంలోనే ఉందని.. దీనికి సంబంధించిన అన్ని పత్రాల నకళ్లు తహసీల్దార్‌కు అందజేసినట్లు వివరించారు. తాము చట్టాన్ని గౌరవిస్తామని.. ఈ విషయంపై న్యాయస్థానంలో పోరాటం చేస్తామన్నారు

అక్షరాస్యతపై అవగాహన ర్యాలీ

ర్యాలీలో ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు

ఏఎన్‌యూ, న్యూస్‌టుడే: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని ఇంజినీరింగ్ కళాశాలలోని 3, 5, 6 ఎన్ఎస్ఎస్ యూనిట్ల వాలంటీర్లు అక్షరాస్యతపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఏడు రోజుల శిక్షణ తరగతుల్లో భాగంగా కాజ గ్రామంలో ర్యాలీ నిర్వహించినట్లు అధికారులు తెలిపారు. అక్షరాస్యతే అభివృద్ధికి పునాది అంటూ వాలంటీర్లు ప్రజలకు అవగాహన కల్పించారు. విద్య ప్రాముఖ్యతను ప్రజలకు వివరించారు. అక్షరాస్యత ద్వారానే సామాజిక, ఆర్థిక అభివృద్ధి సాధ్యమని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ అధికారులు సునీత, రాధిక, సుమలత, కాజ వీడీవో సరళాదేవి తదితరులు పాల్గొన్నారు.



(c) eenadu

ప్రతి ముగ్గురిలో ఒక చిన్నారికి భారతీయ టీకాలు

- భారత్ బయోటెక్ ఆధ్వర్యంలో మరో నాలుగు వ్యాక్సిన్లు
- బయో ఆసియా సదస్సులో డాక్టర్ రేచస్ ఎల్ల

సదస్సులో మాట్లాడుతున్న డాక్టర్ రేచస్ ఎల్ల. వేదికపై డాక్టర్ జోస్‌క్యాస్టిల్లో, డాక్టర్ డారిన్ మోరిస్సే, సింప్సన్ వి.ఇమ్మాన్యుయేల్, డాక్టర్ సాయి ప్రవీణ్, డాక్టర్ మాధురి వుసిరికల తదితరులు

ఈనాడు, హైదరాబాద్: ప్రపంచంలోని ప్రతి ముగ్గురు చిన్నారుల్లో ఒకరికి భారత్ నుంచి టీకాలు సరఫరా అవుతున్నాయని భారత్ బయోటెక్ చీఫ్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ డాక్టర్ రేచస్ ఎల్ల తెలిపారు. ప్రపంచ వ్యాక్సిన్ల ఉత్పత్తిలో భారత్ లీడర్‌గా ఉందని, పరిశోధన-అభివృద్ధి (ఆర్‌అండ్‌డీ)లోనూ కీలక భూమిక పోషిస్తోందని చెప్పారు. బయో ఆసియా-2026 సదస్సులో 'భవిష్యత్ తరం బయోలాజికల్ ఔషధాలు, అధునాతన చికిత్స పద్ధతులు, ఔషధాల ఆవిష్కరణ, క్లినికల్ టెస్టింగ్' అంశంపై చర్చా కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. మానవాళిపై విరుచుకుపడుతున్న కొత్త వ్యాధి కారకాలపై పరిశోధనలు, ఔషధాలు, వ్యాక్సిన్ల తయారీలో వేగవంతమైన ప్రతిస్పందన అవసరమని చెప్పారు. భారత్ బయోటెక్ ప్రస్తుతం నాలుగు కొత్త టీకాలకు సంబంధించి మూడో దశ ప్రయోగాలు చేపడుతోందని వెల్లడించారు. క్షయ నివారణకు ప్రపంచంలోనే అతి పెద్ద క్లినికల్ ట్రయల్స్‌ను భారత దేశంలో ప్రారంభించేందుకు ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. దీంతోపాటు గన్యా, టైఫాయిడ్ రహిత సాల్మొనెల్లా, అతిసార వ్యాధికి ప్రధాన కారణమైన షిగెల్లా నివారణ టీకాల కోసం మూడోదశ క్లినికల్ ట్రయల్స్‌ను ప్రారంభిస్తున్నట్లు వెల్లడించారు. వినూత్న ఔషధ ఉత్పత్తుల తయారీలో, ఆవిష్కరణల్లో భారతదేశం ఎదిగేందుకు ఇదే సరైన దశాబ్దం అని, ఈ దిశగా భారత్ బయోటెక్ ఆదర్శంగా నిలుస్తోందని భావిస్తున్నట్లు చెప్పారు. ఈ సదస్సులో... వ్యాక్సిన్లు, సెల్‌జీన్ థెరపీలు, అడ్వాన్స్‌డ్ బయోలాజికల్స్ ఆవిష్కరణలపై పలువురు తమ అభిప్రాయాలను తెలిపారు.

● సదస్సుకు సమన్వయకర్తగా వ్యవహరించిన ఫైర్ గ్లోబల్ హెల్త్ అండ్ పర్పస్ (యూఎస్ఏ) గిల్ బాషే మాట్లాడుతూ.. ఔషధాలు, టీకాలపై పరిశోధనలు, ఆవిష్కరణలు చేయడం సులభమే కానీ.. క్లినికల్ గుర్తింపు, నియంత్రణ, తయారీస్థాయి, ఖర్చు, అందరికీ అందించడం అనేవి సవాలుగా మారాయన్నారు. ప్రస్తుతం ప్రపంచ ఫార్మా మార్కెట్‌లో బయోలాజికల్స్ వాటా 40 శాతం కంటే ఎక్కువ ఉందని, 2 వేల కంటే ఎక్కువ కణ, జన్యు చికిత్సలు అభివృద్ధిలో ఉన్నాయని పేర్కొన్నారు.

● బెల్జియంకు చెందిన క్యాంటూమ్ బయోసైన్సెస్ సీఈవో డాక్టర్ జోస్ కాస్టిల్లో, ఎన్ఐబీఆర్టీ (ఐర్లాండ్) సీఈవో డాక్టర్ డారిన్ మోరిస్సే, అపోలో యాక్సెస్ నుంచి డాక్టర్ సాయి ప్రవీణ్, ఆక్టినియం ఫార్మాస్యూటికల్స్ ఎండీ డాక్టర్ మాధురి వుసిరికల, ఇమ్యూనో యాక్ట్ అధ్యక్షుడు సింప్సన్ వి.ఇమ్మాన్యుయేల్ తదితరులు పాల్గొన్నారు.

మార్చి మొదటివారంలో పదో తరగతి హాల్‌టికెట్లు

ఈనాడు, అమరావతి: పదో తరగతి పబ్లిక్ పరీక్షల హాల్‌టికెట్లు మార్చి మొదటి వారంలో విడుదల చేయనున్నట్లు ప్రభుత్వ పరీక్షల విభాగం సంచాలకుడు కేవీ శ్రీనివాసులురెడ్డి తెలిపారు. వెబ్‌సైట్‌తో పాటు లీప్ యాప్, మన మిత్ర వాట్సప్ నంబరులోనూ అందుబాటులో ఉంటాయని వెల్లడించారు. విద్యార్థుల పేర్లు, ఇంటి పేర్లు, పుట్టిన తేదీ లాంటి తప్పులు ఉంటే వచ్చే నెలలో సవరణకు అవకాశం కల్పిస్తామని, ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు. మార్కుల మెమోలు జారీ చేసే వరకు విద్యార్థుల వివరాలను సరిచేసేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు.

రాయలసీమ థర్మల్ పవర్ ప్రాజెక్టుకు 2.60 టీఎంసీలు

ఈనాడు, అమరావతి: రాయలసీమ థర్మల్ పవర్ ప్రాజెక్టుకు ఏడాదికి 2.60 టీఎంసీల నీటిని కేటాయిస్తూ జలవనరులశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి.సాయిప్రసాద్ మంగళవారం ఉత్తర్వులు ఇచ్చారు. అంతకుముందు శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి రిజర్వాయర్ నుంచి ఏడాదికి 1.40 టీఎంసీలు తీసుకునేందుకు ఇచ్చిన అనుమతిని రద్దు చేశారు. ఇప్పుడు గండికోట లేదా మైలవరం జలాశయం నుంచి తీసుకునేందుకు వీలు కల్పిస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. తాగు, సాగునీటి అవసరాలు తీరిన తర్వాత మాత్రమే ఈ నీటిని ఇవ్వాల్సి ఉంటుందని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

బిల్‌గేట్స్ పర్యటన.. సీఎం విజన్‌కు ప్రపంచవ్యాప్త గుర్తింపు

తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు

ఈనాడు, అమరావతి: గేట్స్ ఫౌండేషన్ ఛైర్మన్ బిల్‌గేట్స్ అమరావతి పర్యటన.. సీఎం చంద్రబాబు విజన్‌కు ప్రపంచ స్థాయి గుర్తింపని తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు అన్నారు. చంద్రబాబు పాలనావిధానం, సాంకేతిక దూరదృష్టిని ఆయన ప్రశంసించడం రాష్ట్రానికి గర్వకారణమని మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. "ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాల్లో పాలన, సాంకేతిక వ్యవస్థల్ని పరిశీలించిన గేట్స్.. చంద్రబాబును ప్రశంసించారు. దేశ డిజిటల్ విప్లవంలో ప్రధాని మోదీతో పాటు సీఎం చంద్రబాబు కూడా కీలక పాత్ర పోషిస్తున్నారు" అని పల్లా శ్రీనివాసరావు తెలిపారు.

రోజూ ఇలా చేయండి

- ✦ ప్రతిరోజూ మీకు సంతోషాన్నిచ్చే పనులు కొన్నైనా చేయండి
- ✦ వ్యక్తిత్వ వికాస పుస్తకాలు చదవండి
- ✦ తగినన్ని నీళ్లు తాగుతుండండి
- ✦ కృతజ్ఞతతో వ్యవహరించండి
- ✦ ధ్యాన సాధన చేయండి

– డెనిస్ వాకర్, ఫిజీషియన్

పర్యాటకానికి 'స్వర్ణ' కళ!

- నేటితో ఏపీటీడీసీకి యాభై ఏళ్లు పూర్తి
- చేదు అనుభవాల నుంచి సందర్శకులకు చేరువగా
- వినూత్న కార్యక్రమాలతో ముందుకు

కృష్ణా నదిలో బోటులో విహరిస్తున్న పర్యాటకులు

ఈనాడు, అమరావతి: వైకాపా హయాంలో నిర్లక్ష్యానికి గురైన రాష్ట్ర పర్యాటక రంగం తిరిగి గాడిలో పడుతోంది. కూటమి ప్రభుత్వం దానికి పారిశ్రామిక హోదా కల్పించి ప్రోత్సాహకాలు ప్రకటించడంతో పెద్ద ఎత్తున పెట్టుబడులొస్తున్నాయి. ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్య (పీపీపీ) విధానంలో హోటళ్లు, రిసార్ట్‌లు సిద్ధమవుతున్నాయి. మరోవైపు వినూత్న కార్యక్రమాలతో రాష్ట్ర పర్యాటకాభివృద్ధి సంస్థ పర్యాటకులను ఆకట్టుకుంటోంది. హౌస్‌బోట్లు, అడ్వెంచర్, కారవాన్, ఆధ్యాత్మిక పర్యాటక సేవలు అందిస్తోంది. రాష్ట్ర పర్యాటక రంగం అభివృద్ధిలో కీలక భూమిక వహిస్తున్న రాష్ట్ర పర్యాటకాభివృద్ధి సంస్థ (ఏపీటీడీసీ) బుధవారం నాటికి 50 ఏళ్లు పూర్తి చేసుకుంటోంది. 1976 ఫిబ్రవరి 18న పరిమిత సేవలతో ప్రారంభమైన ఈ సంస్థ అంచెలంచెలుగా అభివృద్ధి చెందుతోంది.

దేశంలోనే మూడో స్థానంలో ఏపీ

హరిత హోటళ్లు, రిసార్ట్‌ల విస్తరణ, పర్యాటక సర్క్యూట్ల అభివృద్ధి, పాపికొండలకు క్రూయిజ్‌లు, హౌస్‌బోట్లు, స్పీడ్ బోట్లు, హోంస్టే, చారిత్రక ప్రదేశాల్లో సౌండ్, లైట్ షోలు వంటి ఏపీటీడీసీ వినూత్న కార్యక్రమాలతో రాష్ట్రానికి దేశ, విదేశాల నుంచి వచ్చే పర్యాటకుల సంఖ్య పెరుగుతోంది. గతేడాది అత్యధికంగా పర్యాటకులు సందర్శించిన రాష్ట్రాల్లో దేశంలోనే ఆంధ్రప్రదేశ్ మూడో స్థానంలో నిలిచింది. ఏటా సుమారు 27.8 కోట్ల మంది దేశీయ పర్యాటకులు, 1.8 లక్షల విదేశీ పర్యాటకులు రాష్ట్రాన్ని సందర్శిస్తున్నారు. 2025లో ఏపీటీడీసీకి గ్లోబల్ టూరిజం అవార్డు కూడా లభించింది.

కలిసొచ్చిన పారిశ్రామిక హోదా

పర్యాటక రంగానికి పారిశ్రామిక హోదా కల్పించి ప్రోత్సాహకాలు ప్రకటించడంతో పీపీపీ విధానంలో పర్యాటక రంగంలో రూ.17,973 కోట్ల పెట్టుబడులకు 103 ఒప్పందాలు జరిగాయి. వీటి ద్వారా 97,876 మందికి ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. అనేక చోట్ల కొత్త స్టార్ హోటళ్లు, రిసార్ట్‌ల నిర్మాణాలు ప్రారంభమై వివిధ దశల్లో ఉన్నాయి. రాష్ట్ర స్థూల విలువ (జీవీఏ) జోడింపులో ప్రస్తుతం 4.6 శాతంగా ఉన్న పర్యాటక రంగం వాటాను 2029 నాటికి 8 శాతానికి పెంచడమే లక్ష్యంగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. 2028 నాటికి 50 వేల గదులు అందుబాటులో ఉంచాలన్న లక్ష్యంతో కొత్త హోటళ్ల నిర్మాణాలను ప్రోత్సహిస్తున్నారు. పీపీపీ విధానంలో పర్యాటక శాఖ భూములు, స్థలాలు లీజుకి కేటాయిస్తోంది. సొంత భూముల్లో చేపట్టే హోటళ్ల నిర్మాణాలకు రిజిస్ట్రేషన్లలో స్టాంపు డ్యూటీ, విద్యుత్తు ఛార్జీలు, ఆస్తి పన్ను, జీఎస్టీ వంటి విషయాల్లో పలు రాయితీలు అందిస్తోంది.

గత ప్రభుత్వ నిర్ణయంతో కష్టాలు

వైకాపా ప్రభుత్వంలో విశాఖలోని రుషికొండపై హరిత రిసార్ట్‌ను కూల్చి వేయడంతో రాష్ట్ర పర్యాటకాభివృద్ధి సంస్థ 2021 నుంచి ఏటా రూ.6 నుంచి రూ.8 కోట్ల చొప్పున ఆదాయం కోల్పోయింది. సంస్థకు భారీగా ఆదాయం వచ్చిన రిసార్ట్‌లలో ఇది మొదటిది. కూల్చేసిన రిసార్ట్ స్థానంలో రూ.350 కోట్లకు పైగా ప్రజాధనం వెచ్చించి నిర్మించిన ప్యాలెస్‌కు ఇప్పుడు విద్యుత్తు ఛార్జీలు, ఇతరత్రా నిర్వహణ ఖర్చులకే నెలకు రూ.5 లక్షలకు పైగా వెచ్చించాల్సి వస్తోంది. మరోవైపు రాష్ట్ర, రాష్ట్రేతర ప్రాంతాల నుంచి భక్తులను తిరుమలకు బస్సుల్లో తీసుకెళ్లి దర్శనం కల్పించే ప్యాకేజీలు గత ప్రభుత్వంలో దుర్వినియోగమయ్యాయి. ఇందులో పెద్దఎత్తున అవకతవకలు చోటుచేసుకోవడంతో వీటి కట్టడికి కూటమి ప్రభుత్వం ప్యాకేజీలు తాత్కాలికంగా రద్దు చేసింది. వీటి ద్వారా రాష్ట్ర పర్యాటకాభివృద్ధి సంస్థకు నెలకు రూ.6 కోట్ల ఆదాయం వచ్చేది. ప్యాకేజీలు పునరుద్ధరించాలని ప్రభుత్వాన్ని ఏపీటీడీసీ పాలకవర్గం ఇటీవల కోరింది.

'ఆరెంజ్ ఎకానమీ' అభివృద్ధికి త్వరలో వర్క్‌షాపులు

- సాంస్కృతిక శాఖపై సమీక్షలో కందుల దుర్గేష్

సాంస్కృతిక శాఖపై సమీక్షిస్తున్న మంత్రి కందుల దుర్గేష్. చిత్రంలో తేజస్వి పొడపాటి తదితరులు

ఈనాడు, అమరావతి: సాంస్కృతిక, పర్యాటక, ఫిల్మ్ టూరిజం విభాగాల్ని సమన్వయం చేస్తూ 'ఆరెంజ్ ఎకానమీ'ని అభివృద్ధి చేయడమే ప్రభుత్వ లక్ష్యమని ఆ శాఖల మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. ఇందుకోసం జూన్ లేదా జులై నెలల్లో ప్రత్యేక వర్క్‌షాపులు నిర్వహిస్తామని తెలిపారు. విజయవాడలోని ఘంటసాల ప్రభుత్వ సంగీత కళాశాలలో సాంస్కృతిక శాఖ అధికారులతో మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. "ప్రతి వారం దేవాలయాలు, హ్యాపీ సండే లాంటి వేదికల్లో స్థానిక కళాకారులకు ప్రదర్శనలిచ్చే అవకాశం కల్పిస్తాం. ఉగాది పురస్కారాల ఎంపికలో ఎలాంటి సిఫార్సులకు తావులేకుండా ప్రతిభ ఉన్నవారికే అవకాశం కల్పిస్తున్నాం" అని దుర్గేష్ పేర్కొన్నారు. కూచిపూడి నృత్య ఉపాధ్యాయుల పథకం పునరుద్ధరణకు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. రాజమహేంద్రవరంలో 'నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామా' బ్రాంచ్ ఏర్పాటుకు కేంద్రం సుముఖత వ్యక్తం చేసిందన్నారు. కార్యక్రమంలో సాంస్కృతిక సమితి ఛైర్‌పర్సన్ తేజస్వి పొడపాటి, నాటక అకాడమీ ఛైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ, జానపద కళల అకాడమీ ఛైర్మన్ గంగులయ్య, సాంస్కృతిక శాఖ డైరెక్టర్ రేగడి మల్లికార్జునరావు పాల్గొన్నారు.

అమర్‌నాథ్ బృందాన్ని కలవని అంబటి!

- సాయంత్రం పీఏ, మరో ఇద్దరితో మాట్లాడిన రాంబాబు

ఈనాడు, రాజమహేంద్రవరం, కంబాలచెరువు, న్యూస్‌టుడే: రాజమహేంద్రవరం కేంద్ర కారాగారంలో రిమాండ్ ఖైదీగా ఉన్న మాజీ మంత్రి, వైకాపా నేత అంబటి రాంబాబు తమ పార్టీకే చెందిన కొందరు నేతలను ములాఖత్‌లో కలిసేందుకు ఇష్టపడలేదు. మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, మాజీ ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ, విజయనగరం జడ్పీ ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు (చిన్న శ్రీను) కారాగారానికి రాగా ఈ విషయాన్ని జైలు అధికారులు అంబటికి తెలియజేశారు. వారిని కలవడానికి ఆయన ఆసక్తి చూపలేదని జైలు అధికారులు అన్నారు. తర్వాత వెనుదిరిగిన మాజీమంత్రి అమర్‌నాథ్, ఇతర నేతలు.. రాంబాబుకు నీరసంగా ఉందన్నారని, మరోసారి వస్తామని చెబుతూ వెళ్లిపోయారు. సాయంత్రం అంబటి వ్యక్తిగత సహాయకుడు అనిల్‌రెడ్డి, స్థానిక వైకాపా నాయకులు ఆకుల వీర్రాజు, యార్ల సురేష్ మాత్రం రాంబాబును ములాఖత్‌లో కలిశారు.

ఐబొమ్మ రవికి బెయిల్

ఈనాడు, హైదరాబాద్: సినిమాల పైరసీ కేసులో అరెస్టయిన ఐబొమ్మ రవి ఎలియాస్ ఇమ్మంది రవికి మంగళవారం తెలంగాణ హైకోర్టు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. అరెస్టుచేసి 90 రోజులుదాటినా అభియోగపత్రం దాఖలు చేయకపోవడంతో బెయిల్ మంజూరు చేసింది. రవి దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌లపై జస్టిస్ కె.సుజన విచారణ చేపట్టారు. పిటిషనర్ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. దర్యాప్తు పూర్తికాలేదని, గతఏడాది నవంబరు నుంచి పిటిషనర్ జైలులోనే ఉన్నారన్నారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ పల్లె నాగేశ్వరరావు బెయిల్‌ను తీవ్రంగా వ్యతిరేకించారు. ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయమూర్తి నిందితుడికి బెయిల్ మంజూరు చేస్తూ.. రూ.25 వేల వ్యక్తిగత బాండ్‌తోపాటు అంతే మొత్తానికి మరోఇద్దరి పూచీకత్తులు సమర్పించాలన్నారు. అభియోగపత్రం దాఖలుచేసేదాకా ప్రతిరోజు ఉదయం 11 నుంచి సాయంత్రం 5లోగా ఎస్‌హెచ్‌వో ముందు హాజరుకావాలన్నారు. పాస్‌పోర్టును వారంలోగా సంబంధిత కోర్టులో స్వాధీనం చేయాలని, కోర్టు అనుమతి లేకుండా దేశం విడిచి వెళ్లరాదన్నారు. షరతులను ఉల్లంఘిస్తే బెయిల్ రద్దుకు దరఖాస్తు చేసుకోవడానికి ప్రాసిక్యూషన్‌కు అవకాశం ఉందన్నారు.

సామాజిక సేవకులకు రోటరీ పురస్కారాలు

డాక్టర్ చక్రవర్తిని సత్కరిస్తున్న క్లబ్ ప్రతినిధులు

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: రోటరీ క్లబ్ ఆంధ్రాప్యారిస్ సమావేశం సోమవారం రాత్రి పట్టణంలో నిర్వహించారు. వివిధ రంగాల్లో విశిష్ట సేవలు అందిస్తున్న డాక్టర్ చక్రవర్తి, రవికుమార్, మనిపాలెం మనంగా సత్కరించి రోటరీ పురస్కారాలను అందించారు. డాక్టర్ వెంకటప్రసాద్, రాధ కృష్ణ మోహన్, వెంకటపూర్ణచంద్, సాగర్‌బాబు, భానుప్రసాద్, రాజా, ప్రవీణ్‌కుమార్, రోహిత్, సునీల్, దశరథరామయ్య, మహేష్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

రైతన్న ఐడీ.. సంక్షేమ పథకాల జీవనాడి

పొలంబడి కార్యక్రమంలో ఏడీఏ మోహన్‌రావు, ఏవో రమణకుమార్, తదితరులు

పెదకాకాని, న్యూస్‌టుడే: ప్రభుత్వం రైతన్నకు ఇస్తున్న గుర్తింపు సంఖ్య (ఐడీ) సంక్షేమ పథకాల జీవనాడి అని ఏడీఏ ఎన్. మోహన్‌రావు తెలిపారు. ఉప్పలపాడులో మంగళవారం ఏవో రమణకుమార్ అధ్యక్షతన నిర్వహించిన పొలంబడి కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. గ్రామంలోని సంఖ్య నమోదు చేసుకోని రైతుల పేర్లను చదివి వినిపించారు. అనంతరం మినుము పంటను పరిశీలించి.. ఈ నెల 20వ తేదీ లోపు ప్రతిఒక్కరూ పంట నమోదు చేసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో ఉప సర్పంచి బూషిబాబు, సొసైటీ ఛైర్‌పర్సన్ మైలా సుబ్బారావు, రామకృష్ణ, సూరిబాబు, తదితరులు పాల్గొన్నారు.

రహదారి నిర్మాణానికి రూ.2.94 కోట్ల నిధులు మంజూరు

పొన్నూరు, న్యూస్‌టుడే: గత వైకాపా పాలనలో మండల పరిధిలోని జీబీసీ రహదారి నుంచి దొప్పలపూడి మీదుగా మన్నవ గ్రామానికి వెళ్లే రహదారి గోతులమయంగా మారింది. ఆ మార్గంలో రాకపోకలు నిర్వహించడానికి వాహనదారులు నానా ఇబ్బందులు పడ్డారు. నూతన రహదారి నిర్మాణ పనులకు నిధులు మంజూరు చేయాలని దొప్పలపూడి గ్రామస్థులు ఆనాటి పాలకులను కోరారు. అయినా నిధులు మంజూరు చేయకుండా మాటలతోనే కాలయాపన చేశారు. గత ఎన్నికల సమయంలో రహదారి నిర్మాణ పనులకు నిధులు మంజూరు చేయాలని రెండు గ్రామాలకు చెందిన ప్రజలు అప్పటి కూటమి అభ్యర్థి ధూళిపాళ్ల నరేంద్రకుమార్‌ను కోరారు. ఈ క్రమంలో ఇటీవల జీబీసీ రహదారి నుంచి దొప్పలపూడి మీదుగా మన్నవకు వెళ్లే నూతన రహదారి నిర్మాణ పనులకు రూ.2.94 కోట్లు నిధులు మంజూరు చేస్తూ కూటమి ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ప్రస్తుత ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని నెరవేర్చారని రెండు గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మలుపులు.. ప్రమాదాలు

✦ నాలుగు వరుసల రోడ్డులో రక్షణ ఏర్పాట్లు అవసరం

యూటర్న్ వద్ద ప్రమాదకరంగా..

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: తెనాలిలో రాకపోకలకు అత్యంత కీలకమైన, ఇతర నియోజకవర్గాలతో అనుసంధానం చేసే నాలుగు వరుసల రోడ్డులోని రద్దీ ప్రాంతాల్లో 5 చోట్ల యూటర్న్‌లు ఉన్నాయి. అయితే ఆయా మలుపుల వద్ద తగిన రక్షణ ఏర్పాట్లు లేవు. సరిగ్గా ఆ ప్రాంతంలో రెండో వైపు నుంచి వాహనం వస్తుందన్న సంకేతం లేకుంటే, మొదటి రోడ్డు మీద వేగంగా వస్తున్న వాహనదారు అదుపు చేయడం చాలా కష్టం. ఈ క్రమంలో రెండు వాహనాలు ఢీకొనడం, ప్రమాదాలు జరగడం ఈ మార్గంలో నిత్యకృత్యంగా మారింది.

✦ రోజూ వేలాది ద్విచక్రవాహనాలతో పాటు బస్సులు, భారీ లారీలు ఈ మార్గం గుండా వెళ్తుంటాయి. చిన్నపాటి ఏమరుపాటు పెద్ద ప్రమాదాలకు సైతం దారి తీయవచ్చు. ట్రాఫిక్ విభాగానికి సిబ్బంది కొరత నేపథ్యంలో రద్దీ సమయాల్లోనూ పర్యవేక్షించే పరిస్థితి లేదు. సిగ్నల్స్ కూడా వినియోగంలో లేవు.

✦ గతంలో మలుపు వద్ద రోడ్డు విభాజక ఆధారంగా చేసుకుని ట్రాఫిక్ నియంత్రణ బోర్డులు ఉండేవి. కనీసం అవి ఉంటే ఆ బోర్డు కొంత మేర రక్షణగా ఉపయోగపడేది. గత కొన్ని నెలలుగా ఆ ఏర్పాట్లు కానరావడం లేదు. పోలీసులు క్షేత్ర స్థాయిలో ప్రమాదాల తీరుపై అవగాహన ఉన్న వారే అయినందున, కనీసం అందుబాటులో ఉన్న సిబ్బందితో నైనా ఈ ఐదు యూటర్న్‌ల వద్ద రోజూ రద్దీ సమయాల్లో రక్షణ బోర్డులు ఏర్పాటు చేయించేలా ప్రణాళికతో వ్యవహరించాల్సిన అవసరం ఉంది.

నులిపురుగుల నివారణ మాత్రల పంపిణీ

మాత్రలు వేస్తున్న వైద్యురాలు గంటానేహా

కొల్లిపర, న్యూస్‌టుడే: జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని కొల్లిపర మండల పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో, కళాశాలల్లో విద్యార్థులకు మాత్రలు వేశారు. 4200 మంది లక్ష్యంతో కార్యక్రమం చేపట్టామని వైద్యురాలు నేహా తెలిపారు. పర్యటనలో పీహెచ్ఎన్‌లు, ఎన్ఎమ్‌లు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

తెనాలి(కొత్తపేట), న్యూస్‌టుడే: జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా తెనాలి డివిజన్‌లోని వైద్యులు, సిబ్బంది పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించి అర్హులకు నులిపురుగుల నివారణ మాత్రలు వేసినట్లు డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ ఈరుగుల అన్నపూర్ణ తెలిపారు. ఆమె మంగళవారం తెనాలిలో ఈ వివరాలు వెల్లడించారు. వైద్యులు, సిబ్బంది ముందస్తు ప్రణాళికా ప్రకారం కార్యక్రమాన్ని నిర్వహించి విజయవంతం చేసినట్లు పేర్కొన్నారు. ప్రభుత్వ ఆసుపత్రి, యూపీహెచ్‌సీ వైద్యులు హనోక్, మధుబాబు పాల్గొన్నారు.

మున్సిపల్ అధికారులతో కలెక్టర్ సమీక్షా సమావేశం నేడు

తెనాలి(కొత్తపేట), న్యూస్‌టుడే: నియోజకవర్గ విజన్ యాక్షన్ ప్లాన్ యూనిట్ కార్యాలయంలో బుధవారం ఉదయం నిర్వహించనున్న మున్సిపల్ అధికారుల సమీక్షా సమావేశానికి జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా హాజరవుతున్నారు. దీంతో మున్సిపల్ అధికారులు మంగళవారం ఉదయం నుంచి సమావేశానికి కావాల్సిన దస్త్రాలు సిద్ధం చేసే పనుల్లో నిమగ్నమయ్యారు.

వైభవంగా రథోత్సవం

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా తెనాలి మండలం కొలకలూరు శ్రీగంగాపార్వతీ సమేత శ్రీఅగస్త్యేశ్వరస్వామి రథోత్సవం మంగళవారం సాయంత్రం వైభవంగా జరిగింది. సంగంజాగర్లమూడి గ్రామంలోని శ్రీబాలాత్రిపురసుందరి దేవి సమేత శ్రీసంగమేశ్వర స్వామి దేవస్థాన వేడుకల్లో భాగంగా స్వామివారి గ్రామోత్సవం కనుల పండువగా సాగింది. వేడుకల్లో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

కొలకలూరులో..

సంగంజాగర్లమూడిలో..

50 మంది విద్యార్థులకు ఉద్యోగాలు

ప్రముఖ ఎమ్ఎన్‌సీ కంపెనీ సదర్‌ల్యాండ్‌లో ఉద్యోగాలకు తమ కళాశాలలో డిగ్రీ చివరి ఏడాది చదువుతున్న 50 మంది ఎంపికయ్యారని తెనాలి ఏఎస్ఎన్ డిగ్రీ కళాశాల కరస్పాండెంట్, మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్, ప్రిన్సిపల్ డాక్టర్ కొలసాని రాంచంద్ తెలిపారు. కళాశాలలో ఉద్యోగాలు పొందిన విద్యార్థులను మంగళవారం అభినందించారు. - న్యూస్‌టుడే, తెనాలి టౌన్

తిరునాళ్లల్లో పారిశుద్ధ్య కార్మికుల పనితీరు భేష్

కార్మికులతో ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్

చేబ్రోలు, న్యూస్‌టుడే: మహాశివరాత్రి పండగను పురస్కరించుకుని వడ్లమూడి క్వారీ బాలకోటేశ్వర ఆలయం వద్ద జరిగిన తిరునాళ్లలో విధులు నిర్వహించిన ప్రతి ఒక్కరికీ పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ అభినందనలు తెలిపారు. ఆలయం వద్ద విధుల్లో పాల్గొన్న అధికారులు, గ్రామంలో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కృషి చేసిన సర్పంచులు, కమిటీ సభ్యులను మంగళవారం రాత్రి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. తిరునాళ్లల్లో పారిశుద్ధ్య కార్మికుల పనితీరును మెచ్చుకున్నారు. కార్యక్రమంలో తెనాలి డీఎస్పీ జనార్దనరావు, చేబ్రోలు తహసీల్దార్ శ్రీనివాసరావు, ఎంపీడీవో ఉషారాణి, ఆలయ అభివృద్ధి, నిర్వాణ కమిటీ సభ్యులు, తెదేపా మండల అధ్యక్షుడు రామరాజు, ఆయా గ్రామాల కూటమి నాయకులు పాల్గొన్నారు.

రైలు నుంచి జారిపడి వ్యక్తి మృతి

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: రైలు నుంచి అస్సాంకు చెందిన సత్య (43) అనే వ్యక్తి జారిపడి మృతి చెందిన సంఘటన చుండూరు-మోదుకూరు స్టేషన్ల మధ్య సోమవారం అర్ధరాతి తర్వాత చోటుచేసుకుందని తెనాలి రైల్వే పోలీసులు మంగళవారం తెలిపారు. మృతదేహాన్ని వైద్యశాలకు తరలించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చినట్లు చెప్పారు.

పెళ్లి చేసుకుంటానని నగదు తీసుకుని మోసం

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: ఆన్‌లైన్ వివాహ పరిచయ వేదిక ద్వారా పరిచయమైన కొల్లిపర మండలానికి చెందిన వంశీ తనను పెళ్లి చేసుకుంటానని నమ్మించి రూ.12 లక్షల నగదు తీసుకుని మోసం చేశాడని పట్టణానికి చెందిన ఒప్పంద ఉద్యోగిని త్రీ టౌన్ పోలీసులకు మంగళవారం ఫిర్యాదు చేశారు. తనకు ఆస్తులు ఉన్నాయని, తాత్కాలిక వ్యాపార అవసరాలకు నగదు అవసరం అని దశల వారీగా తీసుకున్నాడని, అటుపై అతని ప్రవర్తనపై అనుమానం వచ్చి నగదు తిరిగి అడగడంతో దాడి చేసి కొట్టాడని ఆమె ఫిర్యాదులో పేర్కొన్నారు. కాగా వంశీపై గతంలోనూ ఇదే తరహాలో ఫిర్యాదులు ఉన్నట్లు పోలీసులు విచారణలో గుర్తించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో బాలికకు గాయాలు

చేబ్రోలు, న్యూస్‌టుడే: వడ్లమూడి వద్ద సోమవారం తెల్లవారుజామున రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఒక బాలిక గాయపడిందని పోలీసులు తెలిపారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉందని.. ఈ మేరకు దర్యాప్తు చేస్తున్నట్లు మంగళవారం తెలిపారు.

ప్రమాదం సారూ.. పట్టించుకోండి

తెనాలి మండలం పెదరావూరు 14వ వార్డులో దాదాపు మూడు దశాబ్దాలుగా వినియోగంలో లేని సామాజిక మరుగుదొడ్లు శిథిలావస్థకు చేరాయి. వాటి చెంతనే దాదాపు 20 అడుగుల లోతున ఏర్పాటైన సెప్టిక్ ట్యాంకు పైభాగంలో రక్షణగా ఉన్న రాళ్లూ పగిలి అత్యంత ప్రమాదకర స్థితికి చేరాయి. పంచాయతీ అధికారులు సత్వరం స్పందించి మరుగుదొడ్లను కూల్చివేయడం, ట్యాంకును శాశ్వతంగా మూసివేయకుంటే ప్రమాదాలు జరిగే అవకాశాలు అధికంగా ఉన్నాయి. - **న్యూస్‌టుడే, తెనాలి టౌన్**

మురుగు పోయే మార్గమేది.. ?

తెనాలి పట్టణ ఐతానగర్ కాకుమాను వారి వీధి చివర కాలనీలోని నివాస గృహాల వాడుక నీరు పోయే దారి లేక ఇలా రోడ్డు మీదకు చేరుతున్నాయి. దీని వల్ల దోమలు, దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు వాపోతున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులకు పలుమార్లు విన్నవించామని, కొంత మంది వచ్చి చూసి వెళ్లారు తప్పితే సమస్యకు పరిష్కారం లభించలేదని స్థానికులు చెబుతున్నారు. ఇబ్బందులు మరింత తీవ్రం కాకముందే పరిష్కరించాలని కోరుతున్నారు. - **న్యూస్‌టుడే, తెనాలి టౌన్**

వాహనాలు జారుతున్నాయ్..

తెనాలి మండలం నందివెలుగు వంతెన మలుపు, అంచుల వెంబడి ఇసుక పడి ఉండటంతో వాహనాలు జారి పడిపోతున్నాయి. ఈ వంతెన మీదుగానే కొలకలూరు పరిసర గ్రామాలకు, గుంటూరు వైపునకు వేలాది మంది ప్రయాణిస్తుంటారు. ముఖ్యంగా రాత్రి సమయాల్లో రోజూ ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రమాదాలకు కారణం అవుతున్న ఇసుకను తొలగించి.. తిరిగి పునరావృతం కాకుండా పర్యవేక్షణ చేయించాల్సిన అవసరం ఉంది. - **న్యూస్‌టుడే, తెనాలి టౌన్**

ధర్మ కాటా ఏర్పాటు

స్పందనకు వందనం

ప్రజలు తాము కొనుగోలు చేసిన కూరగాయలు సరైన తూకంలో ఉన్నాయో లేదో సరి చూసుకోవడానికి రైతు బజార్లలో ఇందుకోసం ప్రత్యేకించిన కాటా అందుబాటులో ఉండాలని నిబంధనలు స్పష్టం చేస్తున్నాయి. అయితే తెనాలి ప్రధాన రైతు బజార్‌లో అవి కానరావడం లేదని 'ఈనాడు' ఈ నెల 2వ తేదీన 'ధర్మకాటా ఏదీ?' శీర్షికన వార్త ప్రచురించింది. స్పందించిన పర్యవేక్షక అధికారులు ధర్మ కాటాను ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చారు. - **న్యూస్‌టుడే, తెనాలి టౌన్**

(c) eenadu

గుంటూరు పశ్చిమ

క్రీడాకారులకు కలెక్టర్ అభినందన

కలెక్టరేట్: పవర్‌లిఫ్టింగ్ క్రీడల్లో విజేతలుగా నిలిచిన జిల్లాకు చెందిన విద్యార్థులను కలెక్టర్ ఎ.తమీమ్‌అన్సారియా మంగళవారం తన ఛాంబర్‌లో అభినందించారు. కర్నూలు, హరిద్వార్‌లో జరిగిన పవర్‌లిఫ్టింగ్ పోటీల్లో విజేతలుగా నిలిచిన తుపాకుల నాగజ్యోతి, కె.సత్యరామరాజును కలెక్టర్ అభినందించారు. కోచ్ ఎం.డి.ఖ్రముద్దీన్, క్రీడాకారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ధర వరలు

పట్టాభిపురం, న్యూస్‌టుడే: కృష్ణనగర్ రైతుబజార్‌లో ధరలు(కిలో ఒక్కింటికి రూ.ల్లో) టమాట 14, వంగ 28, బెండ 25, పచ్చిమిర్చి 46, కాకర 40, బీర 35, క్యాలిఫ్లవర్ 26, క్యాబేజీ 18, క్యారెట్ 26, దొండ 43, బంగాళాదుంప 20, ఉల్లిపాయలు 23, గోరుచిక్కుళ్లు 34, దోస 32, సొర 16, పొట్లకాయ 24, అరటికాయ 10, పెద్ద చిక్కుళ్లు 54, చామదుంప 24, బీట్‌రూట్ 24, మునగ 15, కీరాదోసకాయ 40, బీన్స్ 64, క్యాప్సికం 64, కొత్తిమీర 20, ఆకుకూరలు 15, నిమ్మకాయలు 55, అల్లం 75, వెల్లుల్లి 155.

గ్రంథాలయం.. ఉద్యోగ సోపానం

కలెక్టరేట్(గుంటూరు), న్యూస్‌టుడే

స్వాతంత్ర్య ఉద్యమంలో గ్రంథాలయాలు కీలకభూమిక పోషించాయి. అందరినీ చైతన్యపరిచాయి. ఆ గ్రంథాలయాలు నేటి యువతకు కూడా ఆలంబనగా నిలుస్తున్నాయి. నిరుద్యోగ యువతకు ఉద్యోగ సోపానంగా మారాయి. పోటీ పరీక్షలకు సిద్ధమయ్యేందుకు ప్రశాంత వాతావరణం ఉండడంతో గ్రంథాలయాలను నిరుద్యోగులు సద్వినియోగం చేసుకుంటున్నారు. గుంటూరు నగరంలోని ప్రభుత్వ ప్రాంతీయ గ్రంథాలయంలో ఇటీవల జరిగిన పలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ నోటిఫికేషన్లలో పోటీ పడి విజయం సాధించారు. తమ ఉన్నతికి సహకరించిన గ్రంథాలయానికి తమవంతు సహకారంగా ఓల్డ్ లైబ్రరీ ఫ్రెండ్స్ ఆధ్వర్యంలో అవసరమైన పోటీ పరీక్షల పుస్తకాలను అందిస్తున్నారు. గుంటూరు ప్రభుత్వ ప్రాంతీయ గ్రంథాలయంలో చదువుకుని ఇటీవల ఉద్యోగాలు సాధించిన వారిని ఓల్డ్ లైబ్రరీ ఫ్రెండ్స్ ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ సందర్భంగా వారి అభిప్రాయాలను ఈనాడు-ఈటీవీతో పంచుకున్నారు...

గ్రంథాలయంలో చదువుకుని ఉద్యోగం సాధించిన వారిని అభినందిస్తున్న గుంటూరు వెస్ట్ డీఎస్పీ అరవింద్‌బాబు

పుస్తకాలు ఎంతో ఉపయోగపడ్డాయి: మౌలాలి

ప్రాంతీయ గ్రంథాలయానికి రావడం వల్లనే నేను ఉద్యోగం సాధించగలిగాను. నా ఉద్యోగ సాధనలో ఎక్కువ శాతం గ్రంథాలయమే ఉపయోగపడింది. ఉద్యోగం చేస్తూ పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే వారికి ప్రాంతీయ గ్రంథాలయంలో అవకాశం ఉంది. ఎందుకంటే అర్ధరాత్రి 12 గంటల వరకు గ్రంథాలయంలో చదువుకునేందుకు అవకాశం ఉంది. పోటీ పరీక్షలకు సంబంధించిన పుస్తకాలు చాలా రేటు ఉంటాయి. దీంతో వాటిని కొనుగోలు చేయలేని వారికి గ్రంథాలయంలోని పుస్తకాలు ఎంతో ఉపయోగపడతాయి. అన్ని రకాల పుస్తకాలు లభ్యమవుతున్నాయి. వీటితోపాటు ఓల్డ్ లైబ్రరీ ఫ్రెండ్స్ కూడా పుస్తకాలు అందించడం పరీక్షలకు దోహదపడ్డాయి.

ఎక్సైజ్ ఎస్సైగా ఎంపికయ్యా: ఉయ్యాల వీరాంజనేయులు

చిన్నతనంలో చదువుమానేసి ఇంట్లో ఉంటే తల్లి తోటి పిల్లలు చదువుకుంటున్నారని తిట్టి బడికి పంపింది. అప్పటి నుంచి ఎంతో ఆసక్తితో చదువుకున్నా. గ్రంథాలయానికి వచ్చిన కొత్తలో కాస్త ఇబ్బందిగా ఉన్న ఇక్కడి మిత్రులు గ్రూప్ డిస్కషన్స్‌లో అనేక అంశాలను చర్చించుకోవడం ఉద్యోగాన్వేషణలో ఉపకరించాయి. ఇక్కడి మిత్రులతో పాటు సంస్థ సిబ్బంది సహకారంతో గ్రూప్-2లో విజయం సాధించి ఎక్సైజ్‌శాఖలో సబ్‌ఇన్‌స్పెక్టర్‌గా ఎంపికయ్యాను.

ప్రశాంత వాతావరణం విజయానికి దోహదం: సుధాకర్‌రావు

గ్రంథాలయానికి వస్తే చదువుకోవడానికి ప్రశాంత వాతావరణం ఉంటుంది. తద్వారా ఆయా సబ్జెక్టులపై పట్టుసాధించవచ్చు. చుట్టూ ప్రతికూల వాతావరణం ఉన్నా వాటిని పట్టించుకోకుండా లక్ష్యం సాధించడానికి ప్రయత్నం చేయాలి. చదువుతోపాటు ఇక్కడ బ్రేక్ సమయంలో ఆయా సబ్జెక్టులపై జరిగే బృంద చర్చలు పోటీ పరీక్షల్లో ఉపకరిస్తాయి. పుస్తకాలు చదవడంతోపాటు ఆయా అంశాలపై బృందంగా ఏర్పడినప్పుడు చర్చించుకోవడం వలన మరికొన్ని అంశాలు తెలుస్తాయి.

మా వంతు సహకారం అందిస్తాం

ఒకప్పుడు మాకు ఉద్యోగ సాధనలో ఉపయోగపడిన గ్రంథాలయానికి ఓల్డ్ లైబ్రరీ ఫ్రెండ్స్ అసోసియేషన్‌గా ఏర్పడి మావంతుగా పుస్తకాలు, ఇతర సదుపాయాలు కల్పిస్తున్నాం. ప్రభుత్వం పోటీ పరీక్షలకు నోటిఫికేషన్ విడుదల చేసిన క్రమంలో గ్రంథాలయాధికారులు, యువతతోనూ చర్చించి అవసరమైన పుస్తకాలను సమకూర్చాం. అవి వారికి ఎంతగానో ఉపయోగపడ్డాయి. గ్రంథాలయాలను నిరుద్యోగులు, యువత వినియోగించుకుని జీవితంలో ఉన్న స్థాయికి చేరుకోవాలని ఆశిస్తున్నాం. **-గుర్రం మురళీమోహన్, ఓల్డ్ లైబ్రరీ ఫ్రెండ్స్ అసోసియేషన్ ప్రతినిధి**

ముఖ్యమంత్రి సహాయనిధితో పేదలకు భరోసా

లబ్ధిదారులతో ఎమ్మెల్యే గళ్లా మాధవి

పట్టాభిపురం, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి సహాయనిధి కేవలం ఆర్థిక సహాయం మాత్రమే కాదు. ఇది పేదలకు ఒక భరోసా..అని గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి పేర్కొన్నారు. రూ.24 లక్షల ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను 34 మంది లబ్ధిదారులకు ఆమె మంగళవారం అందజేశారు. ఎమ్మెల్యే మాధవి మాట్లాడుతూ సంక్షేమ పాలనకు ముఖ్యమంత్రి సహాయనిధి నిదర్శనం. ఒక్క సంవత్సరంలోనే రూ.400 కోట్లకు పైగా సాయం అందించి ఎంతో మంది జీవితాల్లో వెలుగులు నింపారన్నారు. గుంటూరు పశ్చిమలో ఇప్పటివరకు పేదలకు రూ.6.29 కోట్లకు పైగా సీఎం సహాయనిధి చెక్కులను అందజేశామని వివరించారు.

మెడికల్ ఎగ్జిబిషన్ 22 వరకు పొడిగింపు

గుంటూరు నగరం, న్యూస్‌టుడే: గుంటూరు ప్రభుత్వ వైద్య కళాశాలలో నిర్వహిస్తున్న మెడికల్ ఎగ్జిబిషన్‌ను ఫిబ్రవరి 22 వరకు పొడిగిస్తున్నట్లు వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సుందరాచారి మంగళవారం తెలిపారు. కళాశాల విభాగాధిపతుల అభిప్రాయం మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. ఇప్పటివరకు 38,120 మంది ఎగ్జిబిషన్‌ను సందర్శించారని వివరించారు. జర్నలిస్టులకు, జిల్లా వైద్య ఆరోగ్య అధికారుల పరిధిలో పని చేసే ఫీల్డ్ వర్కర్స్, మెడికల్ ఆఫీసర్స్, ట్రాఫిక్ పోలీసులకు ఉచిత ప్రవేశం కల్పిస్తున్నట్లు తెలిపారు. వీరు అధికారిక గుర్తింపు కార్డు(ఐడీ) తీసుకురావాలని సూచించారు.

IN THE COURT OF THE III ADDL. JUNIOR CIVIL JUDGE, GUNTUR
E.P.NO. 64/23 IN DISPUTE NO. 55/19
Between:-
M/s MARGADARSI CHIT FUND PVT. LTD., Arundelpeta Branch, Guntur. **...Decree Holder**
AND
Mr. M.RAMESH & Others **..Judgement Debtors**
Jdr No. 4
Mr. Ravulapalli Arun Kumar S/o China Venkateswra Rao D.No.24-12-159, opp. 9th line, Nallacheruvu, 3rd line, Workers colony, GUNTUR.
Please take notice that the Dhr filed the above case in the above Hon'ble Court for recovery of E.P. amount against you. The Hon'ble Court ordered for R-54 notice to you by way of paper publication and also attend before the court on 23.02.26 at 10-30 A.M either personally or through your advocate. If you fail on that day the matter will be treated as exparte basis.
(BY ORDER OF THE HON'BLE COURT)
D.S.K.Kumar, Kodali Srinivas, Kodali Seetaramaiah
Advocates for Dhr GUNTUR.
Cell: 9639011171, 9639011172

వేలం ప్రకటన
మహారాజశ్రీ గుంటూరు 1వ అదనపు సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) వారి కోర్టులో
E.P. 119/2021 in O.S.No. 500/2017
BETWEEN:
1)Vadranam Nageswara Rao(Died), 2) Vadranam Chandra Sekhar, 3) Narisetty Venkata Padmini. ...DHR's
and
Komarabathuni Kanakavalli ...JDR
పై నెంబరు ఇ.పి.లో యిస్తీహారు జారీ కాబడి, జప్తు ఖాయమైన జె.డి.ఆర్.తాలుకు దిగువ షెడ్యూలు దాఖలా ఆస్తిని వేలంవేయు టకు శ్రీ కోర్టు వారు **ది.05-03-2026**కి వాయిదావేసినారు. కావున వేలంపాటలో పాల్గొనదలచిన వారు **ది.05-03-2026**న **ఉ.గం.10-30ని.**లకు పై కోర్టువారి యెదుటజరుగు వేలంలోపాల్గొని పాట పాడుకొన వచ్చును మరిన్ని వివరములకు డి.హెచ్.ఆర్. తరపు లాయరు గారిని గాని లేదా శ్రీ కోర్టు వారి నాజరు గారిని గాని సంప్రదించగలరు.
Schedule: Guntur Dt., & Sub Dt., Guntur Municipal Corporation Area, Guntur City, Srinagar locality, Guntur, D.No.173/B2C, an extent of Ac.3.36 cents of land in which an extent of Ac.2.08cents, Municipal Door No.7-18-73, J.R.R. Towers apartment is being bounded by, **East:**Property of Annapureddy Adi Reddy-113'-6", **South:** 40ft, width road,48'-3", **West:** Property of Shaik Jani, 122'-9", **North:**Property of Chadalavada Venkate Swara Rao,67ft., Within these boundaries an extent of 878.49sq. yards of undivided and unspecified site for an extent of 27sq. yards or 22.57sq meters of part and said part as J.R.R. Towers Apartment fourth floors, Flat No.506 is being bounded by:**East:** Open to Sky, **South:**Open to Sky between this Flat and Flat No.504, **West:** Common Comidor, **North:** Open to Sky. Within these boundaries an extent of 890 sq.yards, Old Municipal Asst.No.13886/78, New Municipal Asst. No.49141, J.R.R Towers apart- ment and therein fourth floor Plot No. 506, S.C.No.149500, bathroom, latrine common drainage rights with all apputtenances therm.
(శ్రీ కోర్టు వారి ఉత్తర్వులు ప్రకారం)
డి.హెచ్.ఆర్.విలువ: రూ.13,00,000/-
అమీనా విలువ:రూ.35,00,000/-
వేలం తేదీ:05-03-2026
ఫర్ ధర్ హియరింగ్:12-03-2026
J.J. PRAKASH, Advocate,
4th Line, Railpet, Guntur. Cell: 9110586719

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM
80086 22566, 97042 53525, 80085 74897

? జోసెఫ్‌నగర్‌లోని సైడ్ కాలువలు వ్యర్థాలతో పూడిపోయి మురుగు ముందుకు కదలడం లేదు. **- స్థానికులు**

✔ పారిశుద్ధ్య సిబ్బందితో కాలువలు పూడిక తీయిస్తాం.
- నాగేశ్వరరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్, జీఎంసీ

స్పందన.. ఆకులవారితోట పీకలవాగు దగ్గర రహదారి వెంట చెత్త, వ్యర్థాలు పేరుకుపోవడంతో దోమల వ్యాపిస్తున్నాయని స్థానికులు 'మేమున్నాం.. మీకు తోడుగా' ద్వారా జీఎంసీ శానిటరీ సూపర్‌వైజర్ అంగడి రాజేష్ దృష్టికి తీసుకువెళ్లారు. ఆయన స్పందించి పారిశుద్ధ్య సిబ్బందితో వ్యర్థాలను తొలగించేలా చర్యలు తీసుకున్నారు. -న్యూస్‌టుడే, ఏటీ అగ్రహారం

నేటి నుంచి క్రికెట్ టోర్నమెంట్

ఎస్వీఎన్‌కాలనీ: మానసిక ఉల్లాసం కోసం కళాశాల అధ్యాపకులకు జేకేసీ కళాశాల అధ్వర్యంలో గత 28 ఏళ్ల నుంచి జరుగుతున్న చందూస్ సిల్వర్‌కప్ క్రికెట్ టోర్నమెంట్ బుధవారం నుంచి ఈనెల 22 వరకు నిర్వహిస్తున్నట్లు జేకేసీ కళాశాల ప్రిన్సిపల్ పి.గోపీచంద్ తెలిపారు. ఈ ఏడాది జరిగే 29వ టోర్నమెంట్‌లో మొత్తం 26 జట్లు పాల్గొంటున్నాయని, జేకేసీ, ఆర్వీఆర్‌జేసీ, జేఎన్ఎన్ స్టేడియం(పేరేచర్ల), విజ్ఞాన్ విశ్వవిద్యాలయం(వడ్లమూడి), చలపతి ఇంజినీరింగ్ కళాశాల(మోతడక) మైదానాల్లో పోటీలు జరుగుతాయని ఆయన చెప్పారు. 21న సెమీఫైనల్స్, 22న తుదిపోరు జేకేసీ కళాశాల మైదానంలో జరుగుతాయని వెల్లడించారు.

ఆదర్శదైవం ఆంజనేయుడు

మాట్లాడుతున్న దీక్షిత్

గుంటూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే: ఆంజనేయస్వామి మానవాళి కంతటికీ ఆదర్శ దైవమని సాహితీ వేత్త డాక్టర్ దీవి నారసింహదీక్షిత్ అన్నారు. స్థానిక శ్యామల నగర్ గణేశ గాయత్రి సంతోషిమాత దేవాలయంలో సుందరకాండ పారాయణ, ప్రవచన కార్యక్రమాలు ఏడు రోజులుగా జరుగుతున్నాయి. మంగళవారం రాత్రి ప్రవచనంలో దీక్షిత్ మాట్లాడుతూ మానవ వికాసానికి మూలం ధర్మ సాధన అన్నారు. మనిషి ఎలా జీవించాలో ఆంజనేయస్వామి చేసిన కార్యాలను గమనిస్తే తెలుస్తుందన్నారు. వ్యక్తిత్వ వికాసానికి సంబంధించిన అంశాలన్నీ ఆస్వామిని గమనిస్తే తెలుస్తాయన్నారు. జీవితంలో తీవ్రమైన సమస్యలు ఎన్ని ఎదురైనా..వాటిని అధిగమించి ధైర్యంగా ముందుకు సాగాలనే విషయాన్ని నేటి యువత ఆస్వామిని చూసి నేర్చుకోవచ్చన్నారు. ప్రవచనానికి ముందు భక్తిసంగీత విభావరి, హనుమాన్ చాలీసా పారాయణ జరిగాయి. దేవాలయ పాలకమండలి అధ్యక్షుడు గబ్బిట శివరామకృష్ణప్రసాద్, కార్యదర్శి అన్నా ప్రగడరవి శ్రీనివాస్, కట్టమూరి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

19 నుంచి మారుతి దేవాలయ వార్షిక బ్రహ్మోత్సవాలు

గుంటూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే: స్థానిక మారుతీనగర్ కంచికామకోటిపీఠ శ్రీమారుతి దేవాలయం 40వ వార్షిక బ్రహ్మోత్సవాలు, లక్ష మోదక గణపతి యాగ పురస్సర శ్రీలక్ష్మీగణపతి స్వామి నూతన విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ పాలకమండలి కార్యదర్శి టి.శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 19 నుంచి 27 వరకు ఉత్సవాలు జరుగుతాయి. తొలి రోజున బ్రహ్మోత్సవాల యాగ కార్యక్రమాలను శృంగేరి, వీరూపాక్ష, శ్రీపీఠం పీఠాధిపతి గబీరానంద భారతీస్వామి జ్యోతి వెలిగించి ప్రారంభిస్తారు. అదేరోజు సిద్ధిబుద్ధి సమేత విఘ్నేశ్వర స్వామి కల్యాణం, శుక్రవారం రాజ్యలక్ష్మి సమేత నరసింహస్వామి కల్యాణం, సామూహిక కుంకుమ పూజలు, శనివారం సీతారాముల కల్యాణం జరుగుతాయి. ఆదివారం సువర్చలా ప్రసన్నాంజనేయ స్వామి కల్యాణం, మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం ఉంటాయి. సోమవారం గంగాగౌరీ సమేత గౌరీశంకరస్వామి కల్యాణం, లక్షబిల్వార్చనలు ఉంటాయి. మంగళవారం మహాలింగాత్మక రుద్రకలశాభిషేకం, వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి కల్యాణం, సామూహిక కుంకుమ పూజలు జరుగుతాయి. బుధవారం రుక్మిణి సత్యభామ సమేత శ్రీకృష్ణస్వామి కల్యాణం, గురువారం అనఘాదేవి సమేత దత్తాత్రేయ స్వామి కల్యాణం, సామూహిక లలితా సహస్రనామ కుంకుమ పూజలు జరుగుతాయి. రోజూ తితిదే హిందూ ధర్మ ప్రచార పరిషత్ వారి సాంస్కృతిక కార్యక్రమాలు, లక్ష్మీగణపతి హోమం, నిత్య జప హోమ కార్యక్రమాలు ఉంటాయి. ఈనెల 27న ఉదయం 11.58 గంటలకు యంత్రస్థాపన శ్రీలక్ష్మీ గణపతిస్వామి నూతన విగ్రహ ప్రతిష్ఠ, ధర్మపురి శ్రీమఠం మఠాధిపతి సచ్చిదానంద సరస్వతీ స్వామి ప్రత్యక్ష పర్యవేక్షణలో యాగ పూర్ణాహుతి, మహాకుంభాభిషేకం జరుగుతాయని వెల్లడించారు.

బిల్‌గేట్స్ రాక శుభపరిణామం: మేయర్

పట్టాభిపురం, న్యూస్‌టుడే: అమరావతికి బిల్‌గేట్స్ రాక ఎంతో శుభ పరిణామం అని మేయర్ కోవెలమూడి రవీంద్ర పేర్కొన్నారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ భవిష్యత్తులో విదేశీ ఫౌండేషన్లు క్యూ కడతాయని, అమరావతి వరల్డ్ క్లాస్ సిటీగా అవతరించనుందన్నారు. ఇప్పటికే మన రాష్ట్రంలో కుప్పంలో సంజీవని పైలెట్ ప్రాజెక్ట్‌పై బిల్ గేట్స్ సంతృప్తి వ్యక్తం చేశారన్నారు. ఆయన బృందం చంద్రబాబు ఇచ్చిన ప్రజంటేషన్‌తోపాటు ఆయా అంశాలపై ఎంతో నిశితంగా పరిశీలించి సంతృప్తి చెందారన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబుతో బిల్‌గేట్స్‌కు ఉన్న అనుబంధం, అదేవిధంగా ఆయన దూరదృష్టి, దార్శనికత దృష్ట్యా రానున్న రోజుల్లో ఫండింగ్, ఛారిటీకి ఆర్థిక, సాంకేతిక సహకారం అందిస్తుందన్నారు. ఈ ఫౌండేషన్‌తో విద్య, వైద్యం, వ్యవసాయం బలోపేతం అవుతుందని తెలిపారు.

IN THE COURT OF THE PRL. JUNIOR CIVIL JUDGE, MANGALAGIRI
E.P.NO. 51/21 IN DISPUTE NO.44/19
Between:-
M/s MARGADARSI CHIT FUND PVT. LTD., Arundelpeta Branch, Guntur. **...Decree Holder**
AND
Mr J.ANIL KUMAR & Others ...Judgement Debtors
Jdr No. 1
Mr. Jeldi Anil Kumar, S/o Sudhakara Rao, D.No.26-2-151, New D.No.64, 3rd line, Devapuram, GUNTUR.
Please take notice that the Dhr filed the above case in the above Hon'ble Court for recovery of E.P. amount against you. The Hon'ble Court ordered for R-54 notice to you by way of paper publication and also attend before the court on 03.03.26 at 10.30 A.M either personally or through your advocate. If you fail on that day the matter will be treated as exparte basis.
(BY ORDER OF THE HON'BLE COURT)
Lanka Sivaram Prasad
Advocate for Dhr, Mangalagiri, Guntur Dist.

రహదారికి కోత..రాకపోకలకు వెత

జిల్లాపరిషత్తు: నగరంలోని గుంటూరు- అమరావతి రహదారిలో గుంటూరు వైద్య కళాశాల వసతిగృహం సమీపంలోని వంతెన వద్ద రోడ్డు కోతకు గురవటంతో రోజురోజుకి విరిగి పడుతోంది. రాజధాని అమరావతి, తాడికొండ, రావెల తదితర గ్రామాల నుంచి గుంటూరు వచ్చే వాహనాల రద్దీ ఎక్కువగా ఉండడంతో రోడ్డుపై భారం పడి కోతకు గురవుతోంది. దీంతో ప్రమాదం జరిగే అవకాశం ఉంది. పక్కనే వంతెనతోపాటు వంతెన కింద మురుగు కాలువ ఉండడంతో వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. రోడ్డు కోతకు గురి గాకుండా జీఎంసీ, ఆర్‌అండ్‌బీ అధికారులు సమన్వయంతో శాశ్వత ప్రాతిపదికన మరమ్మతులు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ఇసుక లారీలతో ఇక్కట్లు

స్థానిక నగరాలులోని అమరావతిరోడ్డుపైనే ఇసుక లారీలు నిలిపి ఉంచడంతో ప్రజలు, వాహనచోదకులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుంది. నిత్యం ఇసుకను లారీల్లో నింపుకుని వచ్చి అమరావతిరోడ్డులో నిలిపి ఉంచడంతో రాకపోకల సమయంలో ఇబ్బందులు పడుతున్నామని వాహనచోదకులు అంటున్నారు. అందులోనూ మలుపు ప్రాంతాల్లోనే వాహనాలు నిలిపి ఉంచడంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని చెబుతున్నారు. ఇప్పటికైనా ట్రాఫిక్ పోలీసులు స్పందించి రోడ్డుపై ఇసుక లోడుతో ఉన్న లారీలు నిలపకుండా చూడాలని ప్రజలు, వాహనచోదకులు కోరుతున్నారు. **-గోరంట్ల, న్యూస్‌టుడే**

విద్యార్థినుల వసతిగృహానికి రూ.2.5 లక్షల విరాళం

హరీంద్రనాథ్‌చౌదరికి చెక్కు అందజేస్తున్న సత్యనారాయణ

పట్టాభిపురం, న్యూస్‌టుడే: వచ్చే విద్యా సంవత్సరం నుంచి నూతన భవనంలో విద్యార్థినులకు వసతి కల్పిస్తున్నట్లు కమ్మజన సేవా సమితి అధ్యక్షులు మల్లెల హరీంద్రనాథ్‌చౌదరి తెలిపారు. విశ్రాంత ఉపాధ్యాయుడు ఆర్.సత్యనారాయణతోపాటు ఆయన స్నేహితుడు వసతిగృహాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ రూ.2.5 లక్షల చెక్కును హరీంద్రనాథ్‌చౌదరికి అందజేశారు. హరీంద్రనాథ్‌చౌదరి మాట్లాడుతూ సత్యనారాయణ గతంలో విద్యార్థినుల ఉపకార వేతనాలకు రూ.2 లక్షలు విరాళం ఇచ్చారు. త్వరలో ఒక గది నిర్మాణానికి విరాళం ఇస్తామని చెప్పారన్నారు.

ఉన్నత స్థాయికి ఎదగండి

పట్టా పొందిన విద్యార్థినులతో ప్రిన్సిపల్ సంధ్య, అధ్యాపకులు

గోరంట్ల: గోరంట్లలోని సెయింట్ ఆన్స్ మహిళా కళాశాల స్నాతకోత్సవం మంగళవారం సందడిగా జరిగింది. పీజీ ఎంబీఏ, ఎంసీఏ విద్యార్థినులకు పట్టాలు ప్రదానం చేశారు. కళాశాల ప్రిన్సిపల్ రెవరెండ్ సిస్టర్ సంధ్య మాట్లాడుతూ జీవితంలో అత్యున్నత స్థాయికి ఎదగాలని, విలువలతో కూడిన జీవితాన్ని కొనసాగించాలన్నారు. తల్లిదండ్రులు, ఉపాధి పొందిన సంస్థల పట్ల విశ్వాసపాత్రులుగా మెలగాలన్నారు. మంచి నైపుణ్యాలతో వృద్ధిలోకి రావాలని విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు.

పార్కింగ్ ప్రదేశాలను గుర్తించండి

గుంటూరు నేరవార్తలు: ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఆటోలు, ప్రైవేట్ బస్సులు ఎక్కడపడితే అక్కడ ఆపకుండా నిర్ణీత పార్కింగ్ ప్రదేశాలను కేటాయించాలని ఎస్పీ వకుల్ జిందాల్ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన ద్విచక్రవాహనంపై ట్రాఫిక్ సీఐ అశోక్‌కుమార్‌తో కలిసి ట్రాఫిక్ రద్దీ, వాహనాల మళ్లింపు ప్రాంతాలను పరిశీలించారు. కంకరగుంట అండర్‌పాస్, గుజ్జనగుండ్ల సెంటర్, కొరిటెపాడు, ఎన్టీఆర్ స్టేడియం, లక్ష్మీపురం, మూడు వంతెనలు, కొత్తపేట, ఆర్టీసీ బస్టాండ్ ప్రాంతాల్లో పర్యటించారు.

'అక్రమ కేసులకు భయపడే ప్రసక్తే లేదు'

కలెక్టరేట్(గుంటూరు), న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం వైకాపా నేతలపై అక్రమ కేసులు పెట్టి భయపెట్టాలని చూస్తుందని, కేసులకు తాము భయపడే ప్రసక్తే లేదని మాజీ మంత్రి ఆదిమూలపు సురేష్ అన్నారు. గుంటూరు సిద్ధార్థనగర్‌లోని అంబటి రాంబాబు కార్యాలయంపై జరిగిన దాడి ఘటనను పరిశీలించిన అనంతరం కుటుంబ సభ్యులను సురేష్ పరామర్శించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రశ్నించే వారిని అణగదొక్కే ప్రయత్నం చేస్తుందని ఆరోపించారు. అంబటి రాంబాబుకు, ఆయన కుటుంబానికి అండగా ఉంటామని తెలిపారు. కార్యక్రమంలో వైకాపా నగర అధ్యక్షురాలు నూరిఫాతిమా, నాయకులు పాల్గొన్నారు.

ధ్యానంతో ఒత్తిడి, ఆందోళన దూరం

విజేతలతో రామకోటేశ్వరరావు, ప్రిన్సిపల్ రామారావు తదితరులు

తాడికొండ, న్యూస్‌టుడే: విద్యార్థులు చదువుతోపాటు మానవతా విలువలు పెంపొందించుకోవాలని హార్ట్‌ఫుల్‌నెస్ మెడిటేషన్ సెంటర్ సభ్యుడు ఎస్.రామకోటేశ్వరరావు పేర్కొన్నారు. లాం చలపతి ఫార్మసీ కళాశాలలో మంగళవారం హార్ట్‌ఫుల్‌నెస్ సంస్థ ఆధ్వర్యంలో 'ప్రకృతితో సమన్వయ జీవనం' అంశంపై వ్యాస రచన పోటీలు నిర్వహించారు. 751 మంది విద్యార్థులు పాల్గొనగా.. ప్రతిభ చూపిన 30 మందికి బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. ముఖ్యఅతిథి రామకోటేశ్వరరావు మాట్లాడుతూ.. ధ్యానం ద్వారా చిత్త స్థిరత్వం, ఆలోచనల్లో స్పష్టత లభిస్తుందన్నారు. ప్రిన్సిపల్ రామారావు మాట్లాడుతూ విద్యార్థుల్లో నైతిక విలువలు పెంపొందించేందుకు చలపతి ఎడ్యుకేషనల్ సొసైటీ కృషి చేస్తుందన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీల్లోనూ రాణించాలి

గెలిచినవారితో అఫ్రోజ్‌ఖాన్, రవీంద్రరాజు, షేక్ మీరావలి

గుంటూరు క్రీడలు: రాష్ట్ర స్థాయి చెస్ పోటీల్లోనూ రాణించాలని జిల్లా క్రీడాభివృద్ధి అధికారి అఫ్రోజ్‌ఖాన్ సూచించారు. బి.ఆర్.స్టేడియంలో మంగళవారం జిల్లా స్థాయి చెస్ పోటీలు నిర్వహించారు. అఫ్రోజ్‌ఖాన్ మాట్లాడుతూ రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ ఆదేశాల మేరకు జిల్లాలో 31 క్రీడాంశాల్లో శాప్ లీగ్స్ పోటీలు నిర్వహించాలని నిర్ణయించిన మీదట అండర్-13, 15, 17, 19 కేటగిరీల్లో బాలబాలికల విభాగాల్లో పోటీలు నిర్వహించామన్నారు. పోటీలకు 80 మంది క్రీడాకారులు హాజరయ్యారన్నారు. జిల్లా స్థాయిలో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను 21, 22 తేదీల్లో తిరుపతిలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు పంపడం జరుగుతుందన్నారు. 24న జిల్లా స్థాయి సైక్లింగ్ పోటీలు జరుగుతాయని వివరించారు. విజేతలకు జిల్లా చెస్ అసోసియేషన్ అధ్యక్షులు చల్లా రవీంద్రరాజు, కార్పొరేటర్ మీరావలి పతకాలు, సర్టిఫికెట్లు అందజేశారు. చెస్ చీఫ్ ఆర్బిటర్ అబ్దుల్ నబీ, ఆర్బిటర్ పవన్ తదితరులు పాల్గొన్నారు.

జేకేసీ కళాశాల రోడ్డులో దౌర్జన్యం

పట్టాభిపురం, న్యూస్‌టుడే: కొందరు గుర్తుతెలియని వ్యక్తులు రెచ్చిపోయారు. అక్రమంగా ప్రవేశించి దౌర్జన్యం చేశారు. ఇంట్లో ఉన్న తల్లీ కుమార్తెలపై దాడి చేశారు. ఈ విషయాన్ని బయటకు చెబితే చంపుతామని బెదిరించారు. ఆలస్యంగా వెలుగు చూసిన ఈ ఘటనకు సంబంధించి పోలీసులు ఎట్టకేలకు కేసు నమోదు చేశారు. పట్టాభిపురం పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. జేకేసీ కళాశాల రోడ్డులో నివాసం ఉంటున్న కామాదుల వెంకటేశ్వర్లు 16 సంవత్సరాలుగా పాత ఇనుము స్క్రాప్ వ్యాపారం చేస్తున్నారు. ఈనెల 12న అర్ధరాత్రి 25 మంది గుర్తు తెలియని వ్యక్తులు ఇనుప రాడ్లు, క్రోబార్లు, కర్రలు చేతపట్టుకుని అక్కడకు వచ్చారు. పొక్లెయిన్‌ను కూడా వెంట తెచ్చారు. ఒక దుకాణాన్ని అక్రమంగా కూల్చివేయించారు. వెంకటేశ్వర్లు ఇంటిని కూడా కూల్చివేసేందుకు ప్రయత్నించారు. అడ్డుగా వచ్చిన వెంకటేశ్వర్లు, ఆయన భార్య, కుమార్తెపై దాడి చేశారు. వారికి గాయాలయ్యాయి. చంపుతామని బెదిరించి వెళ్లిపోయారు. ఇంట్లో సామగ్రిని చెల్లాచెదురు చేశారు. ఇంట్లో ఉన్న రూ.1,50,000 నగదు దోచుకుని పోలీసుల రాకతో పరారయ్యారు. దీంతో వెంకటేశ్వర్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కేసు ఉపసంహరించుకోవాలని బెదిరింపులు

పట్టాభిపురం, న్యూస్‌టుడే: ఆస్తి తగాదాలకు సంబంధించిన కేసును ఉపసంహరించుకోమని బెదిరిస్తున్న కొందరిపై అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. భారత్‌పేటకు చెందిన పగడాల సాంబశివరావుకు చిలుమూరి చెన్నమ్మ మధ్య ఆస్తి తగాదాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఆమె కొంతమందితో వచ్చి సివిల్ కేసును ఉపసంహరించుకోమని, లేదంటే చంపుతామని బెదిరించారు. దీంతో సాంబశివరావు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్
చంద్రమౌళి నగర్ బ్రాంచ్, బిషప్ వారి యొక్క ఇంటి కాంపౌండ్, రింగ్ రోడ్డు, చంద్రమౌళి నగర్, గుంటూరు - 522007. ఫోన్: 08632 350085/255024, E-Mail : iob1178@iob.in.

స్థిరాస్తుల అమ్మకం కొరకు ఇ - వేలం బహిరంగ ప్రకటన

(సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 యొక్క రూల్ 8(6)లోని నిబంధనలతో చదువుకోవలసిన సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ & ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 క్రింద స్థిరాస్తుల అమ్మకము కొరకు ఇ-వేలం అమ్మకం ప్రకటన)

సెక్యూర్డ్ క్రెడిటార్ ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్ వారికి దిగువ తెలిపిన ఋణగ్రహీతలు/తనఖాదారులు వారు **తేది:31-01-2026** నాటికి చెల్లించవలసిన బకాయి మొత్తము **రూ.7,74,003.85** పై (అక్షరాల ఏడు లక్షల డెబ్బై నాలుగు వేల మూడు రూపాయల ఎనభై ఐదు పైసలు మాత్రమే) + తదుపరి వడ్డీ, కాస్ట్స్ వసూలు కొరకు సెక్యూర్డ్ క్రెడిటార్ అయిన ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్, చంద్రమౌళి నగర్ బ్రాంచి యొక్క అధీకృత అధికారి వారిచే లాంఛనాత్మక స్వాధీనత పరుచుకోబడిన బ్యాంక్ తనఖా/అధీనంలో నున్న దిగువ వివరించిన స్థిరాస్తి "ఎక్కడ ఎలా వున్నది అలానే" "ఏది ఎలా వుంటే అలానే" మరియు "అక్కడ ఏది ఉన్నదో అది" పద్ధతి పై **తేది.23-03-2026**న విక్రయించబడునని యావన్మంది ప్రజానీకమునకు మరియు ప్రత్యేకంగా ఋణగ్రహీత(లు) మరియు హామీదారు(లు)కు ఇందుమూలముగా సూచించటమైనది.

సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ & ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 (2002 యొక్క నెం.54) క్రింద బ్యాంకుకు తనఖా పెట్టిన స్థిరాస్తుల అమ్మకము. ఇందుమూలంగా యావన్మందికి తెలియజేయునది ఏమనగా ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్ అధికృత అధికారి గారు దిగువ ఋణం సొమ్ము వసూలు కొరకు, బ్యాంకుకు రావలసిన బకాయిలు మరియు దిగువ తెలిపిన వడ్డీతో సహా రాబట్టుకొనుటకు దిగువ ఆస్తులను "ఎక్కడ ఉన్నది అక్కడ అలాగే" & "ఏది ఉంటే అది" అను పద్ధతిలో అమ్మకం చేసే హక్కుతో సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 లోని సెక్షన్ 13(2) ప్రకారం జారీచేసిన నోటీసును అనుసరించి స్వాధీనం చేసుకున్నారు. సదరు బకాయిలు మరియు రావలసిన సొమ్మును చెల్లించనందున, దిగువ సంతకందారు సదరు చట్టంలోని సెక్షన్ 13(4) ప్రకారం సంక్రమించిన అధికారములతో బ్యాంకుకు రావలసిన బకాయి సొమ్ములు మొత్తం రాబట్టుకొనుటకు సదరు ఆస్తి అమ్మకం చేయుటకు నిర్ణయించినారు. దిగువ సంతకందారు వెబ్‌పోర్టల్ https://baanknet.com నందు గల ఇ-వేలం ప్లాట్‌ఫారంపై సదరు అమ్మకంను నిర్వహించెదరు.

ఋణగ్రహీత/తనఖాదారు పేరు & చిరునామా : మెస్సర్స్ హోటల్ సాయి సూర్య (ఋణగ్రహీత), డోర్ నెం.5-94-32, 6/13 క్రాస్ రోడ్డు, వార్డు 37, బ్రాడీపేట, గుంటూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం - 522002. ప్రాతినిధ్యం వహిస్తున్న ప్రొప్రయిటర్ : **శ్రీ మాలంపాటి శ్రీనివాసరావు (ప్రొప్రయిటర్)**, తండ్రి : మాలంపాటి హనుమంతరావు, **శాశ్వత చిరునామా:** ఇంటి నెం.2-35, లింగంగుంట్ల, పెదకూరపాడు, గుంటూరు, ఆంధ్రప్రదేశ్ - 522402. **శ్రీ మాలంపాటి హనుమంతరావు (తనఖాదారు & హామీదారు) శాశ్వత చిరునామా:** ఇంటి నెం.2-35, లింగంగుంట్ల, పెదకూరపాడు, గుంటూరు, ఆంధ్రప్రదేశ్ - 522402.

NPA తేది. 30.09.2022 | డిమాండ్ నోటీసు తేది : 31.08.2024

డిమాండ్ నోటీసు నందు పేర్కొన్న బకాయి : రూ.6,36,112/- + తదుపరి వడ్డీ, కాస్ట్స్, ఇతర ఖర్చులు.

స్వాధీనత నోటీసు తేది: 28.07.2025, | స్వాధీనత నోటీసు పేపరు ప్రచురణ తేది: 31.07.2025

స్వాధీనత నోటీసు నందు పేర్కొన్న బకాయి: రూ.7,03,177/- + తదుపరి వడ్డీ, కాస్ట్స్, ఇతర ఖర్చులు.

స్థిరాస్తి వివరములు: గుంటూరు జిల్లా (ప్రస్తుతం పల్నాడు జిల్లా), నరసరావుపేట డిస్ట్రిక్ట్ రిజిస్ట్రార్, పెదకూరపాడు మండల పరిషత్, లింగంగుంట్ల గ్రామ పంచాయితీ, డోర్ నెం.2-35, లింగంగుంట్ల, సర్వే నెం.122-2 లోని 451 చ॥గ॥లు లేదా 378.84 చ॥మీ॥ల విస్తీర్ణం గల స్థలం అందు గల నివాస భవనం మాలెంపాటి హనుమంతరావు, తండ్రి : శ్రీ మాలెంపాటి సింగారయ్య గారి పేరున కలదు. **హద్దులు: తూర్పు:** బోడపాటి శివయ్య & ఇతరుల గోడ - 107.6 అ॥లు, **దక్షిణం :** వేమా సీతారావమ్మ & ఇతరుల స్థలం, అమ్మకందారుకి చెందిన ఈస్ట్ స్పేస్ - 39.6 అ॥లు, **పడమర :** నూతక్కి శ్రీనివాసరావు మరియు ఇతరుల గోడ - 109 అ॥లు, **ఉత్తరం :** బజారు - 35.6 అ॥లు., మోర్టగేజ్ డీడ్ నెం.2984/2017, తేది.27.11.2017 ప్రకారం.

రిజర్వుధర: రూ.22,61,000/- ధరావత్తు ధర : రూ.2,26,100/- బిడ్ పెంపుదల మొత్తం: రూ.25,000/-

* రూ.50.00 లక్షలు మరియు అంతకంటే ఎక్కువ బిడ్‌తో విజయవంతమైనచో టిడిఎస్ @ 1% వసూలు చేయబడును.

వేలం తేది మరియు సమయం: తేది.23-03-2026, ఉ॥ 11.00 గం॥ల నుండి మ॥ 01.00 గం॥ వరకు మరియు https://baanknet.com ప్లాట్‌ఫాం నందు వేలం పూర్తి అయ్యే వరకు ప్రతి 5 ని॥లకు ఒక సారి ఆటోటైమ్ ఎక్స్‌టెన్షన్ ఉండును.

ధరావత్తు చెల్లించువిధానం : ఆసక్తి గల బిడ్డర్లు / కొనుగోలుదారులు వారి మొబైల్ నెంబర్ మరియు ఇ-మెయిల్ ఐడి ఉపయోగించి https://baanknet.com పోర్టల్ నందు నమోదు చేసుకొనవలెను. తదుపరి అవసరమైన కెవైసి పత్రాలను అప్‌లోడ్ చేయవలసిందిగా కోరడమైనది. కెవైసి పత్రాలను ఇ-వేలం సర్వీస్ ప్రొవైడర్ ధృవీకరించిన తర్వాత (2 పని రోజులు పట్టవచ్చు), ఆసక్తి గల బిడ్డర్లు/కొనుగోలుదారులు సదరు గ్లోబల్ ధరావత్తు వాలెట్ ఖాతా నందు ఆన్‌లైన్ విధానం ద్వారా ధరావత్తు మొత్తాన్ని 23-03-2026, మధ్యాహ్నం 01.00 గంట లోపు బదిలీ చేయవలెను. ఆసక్తి గల బిడ్డర్లు చెల్లుబాటు అయ్యే ఇ-మెయిల్ చిరునామాను కలిగి ఉండవలెను మరియు పైన పేర్కొన్న సర్వీస్ ప్రొవైడర్ యొక్క వెబ్‌సైట్ నందు లాగిన్ అవ్వడం ద్వారా వారి పేరు / ఖాతాను నమోదు చేసుకొనవలెను.

బిడ్ పెంపుదల : పైన తెలుపబడినది | బ్యాంకుకు తెలిసినంత వరకు ఎలాంటి జంఝాటములు (ఎన్‌కంబరెన్స్) : లేదు

ఆస్తుల తనిఖీ తేది మరియు సమయం : ముందుగా బ్యాంకు వారి అనుమతి తీసుకొని బ్యాంకు పనివేళలలో తేది.18-02-2026 నుండి

ఆన్‌లైన్ ద్వారా ధరావత్తుతో కలిపి బిడ్స్ సమర్పించుట: తేది:18-02-2026 నుండి

ఆన్‌లైన్ ద్వారా ధరావత్తుతో కలిపి బిడ్స్ దాఖలు చేయు చివరి తేది.23-03-2026, మ॥ 01.00 గం॥ వరకు

* ప్రభుత్వ స్థానిక పన్నులు (ఆస్తులకు సంబంధించిన స్థానిక పన్నులు, ప్రోపర్టీ టాక్స్, వాటర్, డ్రైనేజ్ నిర్వహణ ఛార్జీలు, ఎలక్ట్రికల్ బిల్స్ మొదలగునవి) పాల్గొనదలిచిన బిడ్డర్ల ద్వారా నిర్ధారించబడాలి. సఫలీకృతులైన బిడ్డరుదారులే భరించాలి.

* చట్టబద్ధ బకాయిలు కన్నా బ్యాంక్ బకాయిలకు ప్రాధాన్యత ఉంటుంది.

అమ్మకం యొక్క సవివరమైన నియమ నిబంధనల కోసం, సర్వీస్ ప్రొవైడర్ యొక్క వెబ్‌సైట్ : https://baanknet.com/eauction-psb/bidder-registration లేదా బ్యాంక్ వెబ్‌సైట్ : www.iob.in/e-Auctions.aspx మరిన్ని వివరముల కొరకు : బ్రాంచి మేనేజర్, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్, చంద్రమౌళి నగర్ బ్రాంచ్, బిషప్ వారి యొక్క ఇంటి కాంపౌండ్, రింగ్ రోడ్డు, చంద్రమౌళి నగర్, గుంటూరు - 522007. ఫోన్: 08632 350085/255024, మొబైల్ నెం.: 8925951178 & E-Mail : iob1178@iob.in లేదా సర్వీస్ ప్రొవైడర్: M/s. Bank Asset Auction Network (BAANKNET), రిజిష్టర్డు ఆఫీస్ : యూనిట్ -1, 3వ ఫ్లోర్, VIOS కమర్షియల్ టవర్, వడాలా ట్రక్ టెర్మినల్ దగ్గర, వడాలా ఈస్ట్, ముంబయి - 400037, email: support.baanknet @psballiance.com (సంప్రదించవలసిన నెం.: 8291220220, హెల్ప్ డెస్క్ పనిచేయు సమయం : ఉ॥ 8.00 గం॥ల నుండి రా॥ 8.00 గం॥ల వరకు) వారిని సంప్రదించగలరు.

తేది : 17-02-2026, ప్రదేశం : గుంటూరు | సం/- అధీకృత అధికారి, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్

మార్చి మొదటివారంలో పదో తరగతి హాల్‌టికెట్లు

ఈనాడు, అమరావతి: పదో తరగతి పబ్లిక్ పరీక్షల హాల్‌టికెట్లు మార్చి మొదటి వారంలో విడుదల చేయనున్నట్లు ప్రభుత్వ పరీక్షల విభాగం సంచాలకుడు కేవీ శ్రీనివాసులురెడ్డి తెలిపారు. వెబ్‌సైట్‌తో పాటు లీప్ యాప్, మన మిత్ర వాట్సాప్ నంబరులోనూ అందుబాటులో ఉంటాయని వెల్లడించారు. విద్యార్థుల పేర్లు, ఇంటి పేర్లు, పుట్టిన తేదీ లాంటి తప్పులు ఉంటే వచ్చే నెలలో సవరణకు అవకాశం కల్పిస్తామని, ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు. మార్కుల మెమోలు జారీ చేసే వరకు విద్యార్థుల వివరాలను సరి చేసేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు.

రాయలసీమ థర్మల్ పవర్ ప్రాజెక్టుకు 2.60 టీఎంసీలు

ఈనాడు, అమరావతి: రాయలసీమ థర్మల్ పవర్ ప్రాజెక్టుకు ఏడాదికి 2.60 టీఎంసీల నీటిని కేటాయిస్తూ జలవనరులశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి.సాయిప్రసాద్ మంగళవారం ఉత్తర్వులు ఇచ్చారు. అంతకుముందు శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి రిజర్వాయర్ నుంచి ఏడాదికి 1.40 టీఎంసీలు తీసుకునేందుకు ఇచ్చిన అనుమతిని రద్దు చేశారు. ఇప్పుడు గండికోట లేదా మైలవరం జలాశయం నుంచి తీసుకునేందుకు వీలు కల్పిస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. తాగు, సాగునీటి అవసరాలు తీరిన తర్వాత మాత్రమే ఈ నీటిని ఇవ్వాల్సి ఉంటుందని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

బిల్‌గేట్స్ పర్యటన.. సీఎం విజన్‌కు ప్రపంచవ్యాప్త గుర్తింపు

తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు

ఈనాడు, అమరావతి: గేట్స్ ఫౌండేషన్ ఛైర్మన్ బిల్ గేట్స్ అమరావతి పర్యటన.. సీఎం చంద్రబాబు విజన్‌కు ప్రపంచ స్థాయి గుర్తింపని తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు అన్నారు. చంద్రబాబు పాలనావిధానం, సాంకేతిక దూరదృష్టిని ఆయన ప్రశంసించడం రాష్ట్రానికి గర్వకారణమని మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. "ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాల్లో పాలన, సాంకేతిక వ్యవస్థల్ని పరిశీలించిన గేట్స్.. చంద్రబాబును ప్రశంసించారు. దేశ డిజిటల్ విప్లవంలో ప్రధాని మోదీతో పాటు సీఎం చంద్రబాబు కూడా కీలక పాత్ర పోషిస్తున్నారు" అని పల్లా శ్రీనివాసరావు తెలిపారు.

రోజూ ఇలా చేయండి

- ప్రతిరోజూ మీకు సంతోషాన్నిచ్చే పనులు కొన్నైనా చేయండి
- వ్యక్తిత్వ వికాస పుస్తకాలు చదవండి
- తగినన్ని నీళ్లు తాగుతుండండి
- కృతజ్ఞతతో వ్యవహరించండి
- ధ్యాన సాధన చేయండి

– డెనిస్ వాకర్, ఫిజీషియన్

ప్రతి ముగ్గురిలో ఒక చిన్నారికి భారతీయ టీకాలు

- భారత్ బయోటెక్ ఆధ్వర్యంలో మరో నాలుగు వ్యాక్సిన్లు
- బయో ఆసియా సదస్సులో డాక్టర్ రేచస్ ఎల్ల

సదస్సులో మాట్లాడుతున్న డాక్టర్ రేచస్ ఎల్ల. వేదికపై డాక్టర్ జోస్‌క్యాస్టిల్లో, డాక్టర్ డారిన్ మోరిస్సే, సింప్సన్ వి.ఇమ్మాన్యుయేల్, డాక్టర్ సాయి ప్రవీణ్, డాక్టర్ మాధురి వుసిరికల తదితరులు

ఈనాడు, హైదరాబాద్: ప్రపంచంలోని ప్రతి ముగ్గురు చిన్నారుల్లో ఒకరికి భారత్ నుంచి టీకాలు సరఫరా అవుతున్నాయని భారత్ బయోటెక్ చీఫ్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ డాక్టర్ రేచస్ ఎల్ల తెలిపారు. ప్రపంచ వ్యాక్సిన్ల ఉత్పత్తిలో భారత్ లీడర్‌గా ఉందని, పరిశోధన-అభివృద్ధి (ఆర్‌అండ్‌డీ)లోనూ కీలక భూమిక పోషిస్తోందని చెప్పారు. బయో ఆసియా-2026 సదస్సులో 'భవిష్యత్ తరం బయోలాజికల్ ఔషధాలు, అధునాతన చికిత్స పద్ధతులు, ఔషధాల ఆవిష్కరణ, క్లినికల్ టెస్టింగ్' అంశంపై చర్చా కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. మానవాళిపై విరుచుకుపడుతున్న కొత్త వ్యాధి కారకాలపై పరిశోధనలు, ఔషధాలు, వ్యాక్సిన్ల తయారీలో వేగవంతమైన ప్రతిస్పందన అవసరమని చెప్పారు. భారత్ బయోటెక్ ప్రస్తుతం నాలుగు కొత్త టీకాలకు సంబంధించి మూడో దశ ప్రయోగాలు చేపడుతోందని వెల్లడించారు. క్షయ నివారణకు ప్రపంచంలోనే అతి పెద్ద క్లినికల్ ట్రయల్స్‌ను భారత దేశంలో ప్రారంభించేందుకు ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. దీంతోపాటు గన్యా, టైఫాయిడ్ రహిత సాల్మొనెల్లా, అతిసార వ్యాధికి ప్రధాన కారణమైన షిగెల్లా నివారణ టీకాల కోసం మూడోదశ క్లినికల్ ట్రయిల్స్‌ను ప్రారంభిస్తున్నట్లు వెల్లడించారు. వినూత్న ఔషధ ఉత్పత్తుల తయారీలో, ఆవిష్కరణల్లో భారతదేశం ఎదిగేందుకు ఇదే సరైన దశాబ్దం అని, ఈ దిశగా భారత్ బయోటెక్ ఆదర్శంగా నిలుస్తోందని భావిస్తున్నట్లు చెప్పారు. ఈ సదస్సులో... వ్యాక్సిన్లు, సెల్‌జీన్ థెరపీలు, అడ్వాన్స్‌డ్ బయోలాజికల్స్ ఆవిష్కరణలపై పలువురు తమ అభిప్రాయాలను తెలిపారు.

- సదస్సుకు సమన్వయకర్తగా వ్యవహరించిన ఫైర్ గ్లోబల్ హెల్త్ అండ్ పర్పస్ (యూఎస్‌ఏ) గిల్ బాషే మాట్లాడుతూ.. ఔషధాలు, టీకాలపై పరిశోధనలు, ఆవిష్కరణలు చేయడం సులభమే కానీ.. క్లినికల్ గుర్తింపు, నియంత్రణ, తయారీస్థాయి, ఖర్చు, అందరికీ అందించడం అనేవి సవాలుగా మారాయన్నారు. ప్రస్తుతం ప్రపంచ ఫార్మా మార్కెట్‌లో బయోలాజికల్స్ వాటా 40 శాతం కంటే ఎక్కువ ఉందని, 2 వేల కంటే ఎక్కువ కణ, జన్యు చికిత్సలు అభివృద్ధిలో ఉన్నాయని పేర్కొన్నారు.
- బెల్జియంకు చెందిన క్యాంటూమ్ బయోసైన్సెస్ సీఈవో డాక్టర్ జోస్ కాస్టిల్లో, ఎన్ఐబీఆర్టీ (ఐర్లాండ్) సీఈవో డాక్టర్ డారిన్ మోరిస్సే, అపోలో యాక్సెస్ నుంచి డాక్టర్ సాయి ప్రవీణ్, ఆక్టినియం ఫార్మాస్యూటికల్స్ ఎండీ డాక్టర్ మాధురి వుసిరికల, ఇమ్యూనోయాక్ట్ అధ్యక్షుడు సింప్సన్ వి.ఇమ్మాన్యుయేల్ తదితరులు పాల్గొన్నారు.

'ఆరెంజ్ ఎకానమీ' అభివృద్ధికి త్వరలో వర్క్‌షాపులు

- సాంస్కృతిక శాఖపై సమీక్షలో కందుల దుర్గేష్

సాంస్కృతిక శాఖపై సమీక్షిస్తున్న మంత్రి కందుల దుర్గేష్. చిత్రంలో తేజస్వి పొడపాటి తదితరులు

ఈనాడు, అమరావతి: సాంస్కృతిక, పర్యాటక, ఫిల్మ్ టూరిజం విభాగాల్ని సమన్వయం చేస్తూ 'ఆరెంజ్ ఎకానమీ'ని అభివృద్ధి చేయడమే ప్రభుత్వ లక్ష్యమని ఆ శాఖల మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. ఇందుకోసం జూన్ లేదా జులై నెలల్లో ప్రత్యేక వర్క్‌షాపులు నిర్వహిస్తామని తెలిపారు. విజయవాడలోని ఘంటసాల ప్రభుత్వ సంగీత కళాశాలలో సాంస్కృతిక శాఖ అధికారులతో మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. "ప్రతి వారం దేవాలయాలు, హ్యాపీ సండే లాంటి వేదికల్లో స్థానిక కళాకారులకు ప్రదర్శనలిచ్చే అవకాశం కల్పిస్తాం. ఉగాది పురస్కారాల ఎంపికలో ఎలాంటి సిఫార్సులకు తావులేకుండా ప్రతిభ ఉన్నవారినే అవకాశం కల్పిస్తున్నాం" అని దుర్గేష్ పేర్కొన్నారు. కూచిపూడి నృత్య ఉపాధ్యాయుల పథకం పునరుద్ధరణకు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. రాజమహేంద్రవరంలో 'నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామా' బ్రాంచ్ ఏర్పాటుకు కేంద్రం సుముఖత వ్యక్తం చేసిందన్నారు. కార్యక్రమంలో సాంస్కృతిక సమితి ఛైర్‌పర్సన్ తేజస్వి పొడపాటి, నాటక అకాడమీ ఛైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ, జానపద కళల అకాడమీ ఛైర్మన్ గంగులయ్య, సాంస్కృతిక శాఖ డైరెక్టర్ రేగడి మల్లికార్జునరావు పాల్గొన్నారు.

అమర్‌నాథ్ బృందాన్ని కలవని అంబటి!

- సాయంత్రం పీఏ, మరో ఇద్దరితో మాట్లాడిన రాంబాబు

ఈనాడు, రాజమహేంద్రవరం, కంబాలచెరువు, న్యూస్‌టుడే: రాజమహేంద్రవరం కేంద్ర కారాగారంలో రిమాండ్ ఖైదీగా ఉన్న మాజీ మంత్రి, వైకాపా నేత అంబటి రాంబాబు తమ పార్టీకే చెందిన కొందరు నేతలను ములాఖత్‌లో కలిసేందుకు ఇష్టపడలేదు. మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, మాజీ ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ, విజయనగరం జడ్పీ ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు (చిన్న శ్రీను) కారాగారానికి రాగా ఆ విషయాన్ని జైలు అధికారులు అంబటికి తెలియజేశారు. వారిని కలవడానికి ఆయన ఆసక్తి చూపలేదని జైలు అధికారులు అన్నారు. తర్వాత వెనుదిరిగిన మాజీమంత్రి అమర్‌నాథ్, ఇతర నేతలు.. రాంబాబు సోదరుడు మురళిని పరామర్శించి వెళ్లిపోయారు. సాయంత్రం అంబటి వ్యక్తిగత సహాయకుడు అనిల్‌రెడ్డి, స్థానిక వైకాపా నాయకులు ఆకుల వీర్రాజు, యార్ల సురేష్ మాత్రం రాంబాబును ములాఖత్‌లో కలిశారు.

ఐబొమ్మ రవికి బెయిల్

ఈనాడు, హైదరాబాద్: సినిమాల పైరసీ కేసులో అరెస్టయిన ఐబొమ్మ రవి ఎలియాస్ ఇమ్మడి రవికి మంగళవారం తెలంగాణ హైకోర్టు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. అరెస్టయిన 90 రోజులు దాటినా అభియోగపత్రం దాఖలు చేయకపోవడంతో బెయిల్ మంజూరు చేసింది. రవి దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌పై జస్టిస్ కె.సుజన విచారణ చేపట్టారు. పిటిషనర్ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. దర్యాప్తు పూర్తికాలేదని, గతడాది నవంబరు నుంచి పిటిషనర్ జైలులోనే ఉన్నారన్నారు. పీపీ ప్రాసిక్యూటర్ పల్లె నాగేశ్వరరావు బెయిలుకు తీవ్రంగా వ్యతిరేకించారు. ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయమూర్తి నిందితుడికి బెయిల్ మంజూరు చేస్తూ.. రూ.25 వేల వ్యక్తిగత బాండ్‌తోపాటు అంతే మొత్తానికి మరోఇద్దరి పూచీకత్తులు సమర్పించాలన్నారు. అభియోగపత్రం దాఖలుచేసేదాకా ప్రతిరోజు ఉదయం 11 నుంచి సాయంత్రం 5లోగా ఎస్‌హెచ్‌వో ముందు హాజరుకావాలన్నారు. పాస్‌పోర్టును వారంలోగా సంబంధిత కోర్టులో స్వాధీనం చేయాలని, కోర్టు అనుమతి లేకుండా దేశం విడిచి వెళ్లరాదన్నారు. షరతులను ఉల్లంఘిస్తే బెయిల్ రద్దుకు దరఖాస్తు చేసుకోవడానికి ప్రాసిక్యూషన్‌కు అవకాశం ఉందన్నారు.

పర్యాటకానికి 'స్వర్ణ' కళ!

- నేటితో ఏపీటీడీసీకి యాభై ఏళ్లు పూర్తి
- చేదు అనుభవాల నుంచి సందర్శకులకు చేరువగా
- వినూత్న కార్యక్రమాలతో ముందుకు

కృష్ణా నదిలో బోటులో విహరిస్తున్న పర్యాటకులు

ఈనాడు, అమరావతి: వైకాపా హయాంలో నిర్లక్ష్యానికి గురైన రాష్ట్ర పర్యాటక రంగం తిరిగి గాడిలో పడుతోంది. కూటమి ప్రభుత్వం దానికి పారిశ్రామిక హోదా కల్పించి ప్రోత్సాహకాలు ప్రకటించడంతో పెద్ద ఎత్తున పెట్టుబడులొస్తున్నాయి. ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్య (పీపీపీ) విధానంలో హోటళ్లు, రిసార్ట్‌లు సిద్ధమవుతున్నాయి. మరోవైపు వినూత్న కార్యక్రమాలతో రాష్ట్ర పర్యాటకాభివృద్ధి సంస్థ పర్యాటకులను ఆకట్టుకుంటోంది. హౌస్‌బోట్లు, అడ్వెంచర్, కారవాన్, ఆధ్యాత్మిక పర్యాటక సేవలు అందిస్తోంది. రాష్ట్ర పర్యాటక రంగం అభివృద్ధిలో కీలక భూమిక వహిస్తున్న రాష్ట్ర పర్యాటకాభివృద్ధి సంస్థ (ఏపీటీడీసీ) బుధవారం నాటికి 50 ఏళ్లు పూర్తి చేసుకుంటోంది. 1976 ఫిబ్రవరి 18న పరిమిత సేవలతో ప్రారంభమైన ఈ సంస్థ అంచెలంచెలుగా అభివృద్ధి చెందుతోంది.

దేశంలోనే మూడో స్థానంలో ఏపీ

హరిత హోటళ్లు, రిసార్ట్‌ల విస్తరణ, పర్యాటక సర్క్యూట్ల అభివృద్ధి, పాపికొండలకు క్రూయిజ్‌లు, హౌస్‌బోట్లు, స్పీడ్ బోట్లు, హోంస్టే, చారిత్రక ప్రదేశాల్లో సౌండ్, లైట్ షోలు వంటి ఏపీటీడీసీ వినూత్న కార్యక్రమాలతో రాష్ట్రానికి దేశ, విదేశాల నుంచి వచ్చే పర్యాటకుల సంఖ్య పెరుగుతోంది. గతేడాది అత్యధికంగా పర్యాటకులు సందర్శించిన రాష్ట్రాల్లో దేశంలోనే ఆంధ్రప్రదేశ్ మూడో స్థానంలో నిలిచింది. ఏటా సుమారు 27.8 కోట్ల మంది దేశీయ పర్యాటకులు, 1.8 లక్షల విదేశీ పర్యాటకులు రాష్ట్రాన్ని సందర్శిస్తున్నారు. 2025లో ఏపీటీడీసీకి గ్లోబల్ టూరిజం అవార్డు కూడా లభించింది.

కలిసొచ్చిన పారిశ్రామిక హోదా

పర్యాటక రంగానికి పారిశ్రామిక హోదా కల్పించి ప్రోత్సాహకాలు ప్రకటించడంతో పీపీపీ విధానంలో పర్యాటక రంగంలో రూ.17,973 కోట్ల పెట్టుబడులకు 103 ఒప్పందాలు జరిగాయి. వీటి ద్వారా 97,876 మందికి ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. అనేక చోట్ల కొత్త స్టార్ హోటళ్లు, రిసార్ట్‌ల నిర్మాణాలు ప్రారంభమై వివిధ దశల్లో ఉన్నాయి. రాష్ట్ర స్థూల విలువ (జీవీఏ) జోడింపులో ప్రస్తుతం 4.6 శాతంగా ఉన్న పర్యాటక రంగం వాటాను 2029 నాటికి 8 శాతానికి పెంచడమే లక్ష్యంగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. 2028 నాటికి 50 వేల గదులు అందుబాటులో ఉండేలా లక్ష్యంతో కొత్త హోటళ్ల నిర్మాణాలను ప్రోత్సహిస్తున్నారు. పీపీపీ విధానంలో పర్యాటక శాఖే భూములు, స్థలాలు లీజుకి కేటాయిస్తోంది. సొంత భూముల్లో చేపట్టే హోటళ్ల నిర్మాణాలకు రిజిస్ట్రేషన్లలో స్టాంపు డ్యూటీ, విద్యుత్తు ఛార్జీలు, ఆస్తి పన్ను, జీఎస్టీ వంటి విషయాల్లో పలు రాయితీలు అందిస్తోంది.

గత ప్రభుత్వ నిర్ణయంతో కష్టాలు

వైకాపా ప్రభుత్వంలో విశాఖలోని రుషికొండపై హరిత రిసార్ట్‌ను కూల్చి వేయడంతో రాష్ట్ర పర్యాటకాభివృద్ధి సంస్థ 2021 నుంచి ఏటా రూ.6 నుంచి రూ.8 కోట్ల చొప్పున ఆదాయం కోల్పోయింది. సంస్థకు భారీగా ఆదాయం వచ్చిన రిసార్ట్‌లలో ఇది మొదటిది. కూల్చేసిన రిసార్ట్ స్థానంలో రూ.350 కోట్లకు పైగా ప్రజాధనం వెచ్చించి నిర్మించిన ప్యాలెస్‌కు పన్నులు, విద్యుత్తు ఛార్జీలు, ఇతరత్రా నిర్వహణ ఖర్చులే నెలకు రూ.5 లక్షలకు పైగా వెచ్చించాల్సి వస్తోంది. మరోవైపు రాష్ట్ర, రాష్ట్రేతర ప్రాంతాల నుంచి భక్తులను తిరుమలకు బస్సుల్లో తీసుకెళ్లి దర్శనం కల్పించే ప్యాకేజీలు గత ప్రభుత్వంలో దుర్వినియోగమయ్యాయి. ఇందులో పెద్దఎత్తున అవకతవకలు చోటుచేసుకోవడంతో వీటి కట్టడికి కూటమి ప్రభుత్వం ప్యాకేజీలను తాత్కాలికంగా రద్దు చేసింది. వీటి ద్వారా రాష్ట్ర పర్యాటకాభివృద్ధి సంస్థకు నెలకు రూ.6 కోట్ల ఆదాయం వచ్చేది. ప్యాకేజీలను పునరుద్ధరించాలని ప్రభుత్వాన్ని ఏపీటీడీసీ పాలకవర్గం ఇటీవల కోరింది.

ప్రభుత్వం స్పందించకుంటే నిరవధిక దీక్ష



పెదనందిపాడు పీఏసీఎస్‌కు తాళాలు వేసి నిరసన

కలెక్టరేట్(గుంటూరు), న్యూస్‌టుడే: తమ సమస్యలపై ప్రభుత్వం స్పందించకుంటే నిరవధిక నిరాహార దీక్షకు దిగుతామని ఉద్యోగ సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు మువ్వా వెంకటేశ్వరరావు తెలిపారు. తాము ప్రభుత్వానికి వ్యతిరేకం కాదని..తమ సమస్యల పరిష్కారం కోసం నిరసన తెలుపుతున్నామని పేర్కొన్నారు. ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల ఉద్యోగులు తమ సమస్యల పరిష్కారం కోరుతూ ఈనెల 16 నుంచి సమ్మెకు దిగారు. దీంతో ఉమ్మడి గుంటూరు జిల్లాలోని 166 సొసైటీ కార్యాలయాలకు తాళాలు వేసి ఉద్యోగులు నిరసనలు తెలుపుతున్నారు. ఈ సందర్భంగా మువ్వా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ గతంలో ఇచ్చిన జీవోలను సైతం ఉన్నతాధికారులు అమలు చేయకపోవడంతో తాము తీవ్రంగా నష్టపోవాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. సహకార సంఘాల ఉద్యోగులకు 2019లో ప్రభుత్వం ఇచ్చిన జీఓ 36ను అమలు చేయాలని డిమాండ్ చేశారు. సంఘాల లాభ నష్టాలతో సంబంధం లేకుండా పనిచేస్తున్న ఉద్యోగులకు డీఎల్ఎస్ఏ ఫండ్‌ను ఏర్పాటు చేయాలని సూచించినా..నేటికీ అమలు చేయలేదని ఫలితంగా ఉద్యోగులు తీవ్రంగా నష్టపోవాల్సిన పరిస్థితి ఉందన్నారు. అదే విధంగా 2019లో సంఘాల కంప్యూటరీకరణ నేపథ్యంలో నియమితులైన ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని తదితర డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

మిర్చి యార్డు సమాచారం (నిన్నటి ధరలు)



వచ్చిన బస్తాలు:	85,520
అమ్మకాలు:	83,205
నిల్వలు:	20,788

నాన్ ఏసీ కామన్ వెరైటీ (క్వింటా రూ.ల్లో)

334	13,500-21,500
నంబర్ 5	13,500-22,000
273	14,000-23,000
341	14,000-24,000

నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ

తేజ	13,000-18,000
బాడిగ	14,000-25,000
దేవనూరు డీలక్స్	15,500- 26,000
ఆర్మూర్	13,000-17,000

ఏసీ కామన్ వెరైటీ

334	13,500-20,000
నెంబర్5	13,000-20,500
341	14,000- 23,000
సూపర్10	13,500-22,500

ఏసీ స్పెషల్ వెరైటీ

తేజ	13,000-17,000
బాడిగ	14,000-23,500
తాలు	7500-12,000

- న్యూస్‌టుడే, మిర్చియార్డు

పసుపు ఎగుమతుల పెంపునకు కృషి

పసుపు కొమ్ములను పరిశీలిస్తున్న సుబ్బారావు, నాయకులు

దుగ్గిరాల, న్యూస్‌టుడే: దుగ్గిరాల మార్కెట్ యార్డు నుంచి పసుపు ఎగుమతుల పెంపునకు కృషి చేస్తామని స్పైసెస్ బోర్డు సభ్యుడు కొత్తూరు సుబ్బారావు తెలిపారు. మంగళవారం ఆయన యార్డును సందర్శించారు. ఛైర్మన్ ఉన్నం రూన్సీరాణి, వ్యాపారులు, రైతులు, హమాలీలతో సమావేశమయ్యారు. దుగ్గిరాల పరిధిలో పాత రకాలైన కడప, టేకూరుపేట విత్తనాల్నే వేస్తుండడం, పసుపులో పురుగు మందుల అవశేషాలు ఉండడంతో అంతర్జాతీయంగా డిమాండ్ ఉండడం లేదని పలువురు వ్యాపారులు ఆయనకు వివరించారు. ఆయా అంశాలను కేంద్రం దృష్టికి తీసుకువెళ్లాలని విన్నవించారు. భాజపా మండల అధ్యక్షుడు అడపా వెంకట్రావ్, యార్డు పాలకవర్గ సభ్యుడు కొంగర జోగేంద్రప్రసాద్, పార్టీ సీనియర్ నాయకుడు చుండూరు ఉమామహేశ్వరరావు, తెదేపా నాయకుడు గూడూరు వెంకట్రావ్ తదితరులున్నారు. అనంతరం సుబ్బారావు పలువురు భాజపా నాయకుల ఇళ్లకు వెళ్లారు. అక్కడ ఆయనను ఘనంగా సత్కరించారు.

కర్ణాటకలో 90 మిలియన్ కిలోల పొగాకు ఉత్పత్తికి ఆమోదం

గుంటూరు(జిల్లాపరిషత్), న్యూస్‌టుడే: కర్ణాటక రాష్ట్రంలో 2026-27 ఏడాదిలో 90 మిలియన్ కిలోల పొగాకు ఉత్పత్తికి భారత పొగాకు బోర్డు పాలక మండలి ఆమోదించింది. పొగాకు బోర్డు ఛైర్మన్ చిడిపోతు యశ్వంత్‌కుమార్ అధ్యక్షతన గుంటూరులోని ప్రధాన కార్యాలయంలో 166వ పొగాకు బోర్డు సమావేశం మంగళవారం జరిగింది. అంతర్జాతీయ మార్కెట్ డిమాండ్, రైతుల వినతి మేరకు 90 మిలియన్ కిలోల సాగుకు తీర్మానం ఆమోదించినట్లు బోర్డు వర్గాలు తెలిపాయి. సమావేశంలో పొగాకు బోర్డు ఈడీ విశ్వశ్రీ, వేలం సంచాలకులు శ్రీనివాస్, వర్చువల్ విధానంలో లోక్‌సభ సభ్యుడు పి.మహేశ్‌కుమార్, రాజ్యసభ సభ్యుడు కె.లక్ష్మణ్, కేంద్ర వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వ శాఖ సంచాలకులు మౌనికా గౌర్ తదితరులు పాల్గొన్నారు.

జడ్పీ ఒకటో స్థాయీ సంఘ సమావేశం 21న

జిల్లాపరిషత్తు, న్యూస్‌టుడే: జిల్లా పరిషత్తు ఒకటో స్థాయీ సంఘ సమావేశం ఈనెల 21వ తేదీ ఉదయం 9.30 నుంచి 10.30 గంటల వరకు నిర్వహించనున్నట్లు జడ్పీ సీఈవో వి.జ్యోతిబసు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి జడ్పీ ఛైర్‌పర్సన్ కత్తెర హెనీక్రిస్టినా అధ్యక్షత వహిస్తారన్నారు.

విద్యార్థినుల భద్రతపై ఉదాసీనత..!

సంక్షేమ వసతిగృహాల యంత్రాంగం తీరుపై విమర్శలు

జిల్లాపరిషత్తు(గుంటూరు), న్యూస్‌టుడే

జిల్లాలోని సంక్షేమశాఖల వసతిగృహాల్లో విద్యార్థినుల భద్రత విషయంలో అధికారులు ఉదాసీనతతో వ్యవహరిస్తున్నారు. విద్యార్థినులు వసతి గృహం నుంచి పాఠశాల, కళాశాలలకు వెళ్లి మళ్లీ సాయంత్రం హాస్టళ్లకు వచ్చిన తర్వాత వారిని బయటకు వెళ్లకుండా చూడాల్సిన అధికారులు నిర్లక్ష్యంతో వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వస్తున్నాయి. తాజాగా తెనాలిలోని వసతి గృహంలో ఇంటర్ చదువుతున్న విద్యార్థిని ఒకరు ఈనెల 15న క్వారీ తిరునాళ్లను చూసేందుకు ద్విచక్ర వాహనంపై వచ్చి రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడడంతో గుంటూరులోని జీజీహెచ్‌లో చేర్పించారు. మూడు రోజులవుతున్నా ఆమె పరిస్థితి ఇబ్బందిగానే ఉంది. జిల్లాలోని హాస్టళ్లలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తున్నామని రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి ప్రకటించారు. గుంటూరులోని సామాజిక పరివర్తన భవన్‌లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. మిగిలిన చోట్ల కూడా ఏర్పాటు చేసినట్లు చెపుతున్నా..కొందరు విద్యార్థినులు అనుమతి లేకుండానే బయటకు వస్తున్నా హాస్టళ్ల హెచ్‌డబ్ల్యూవోలు నియంత్రించకపోవటం విమర్శలకు తావిస్తోంది. విద్యార్థులు అనుమతి లేకుండా బయటకు వెళితే మొదట వారి తల్లిదండ్రులకు సమాచారం ఇవ్వడంతోపాటు స్థానికంగా పోలీసు స్టేషన్లలో ఫిర్యాదు చేయాలని జిల్లా ఉప సంచాలకులు యు.చెన్నయ్య ఉత్తర్వులు జారీ చేసినా అమలుకు నోచుకోవడం లేదు. ఆదేశాలను అమలు చేయని అధికారులపై చర్యలు తీసుకోకుండా ఉన్నతాధికారులు మిన్నకుండడంతో వారు కూడా పట్టించుకోని పరిస్థితి.

- గత ఏడాది గుంటూరులోని రెండు వసతి గృహాల్లో విద్యార్థినులు బయటికి వెళ్లగా తర్వాత వారి ఆచూకీ తెలియలేదు. ఓ హాస్టల్‌లో ఫార్మసీ కోర్సు చదువుతున్న విద్యార్థిని గర్భం దాల్చి నెలలు నిండి బిడ్డను ప్రసవించే వరకు గుర్తించకపోవడం కలకలం రేపింది.
- బీసీ సంక్షేమశాఖ వసతిగృహంలో కొందరు విద్యార్థినులతో గంజాయి బ్యాచ్ పరిచయం ఏర్పరుచుకుంది. అదే హాస్టల్‌లో చదువుతున్న ఓ విద్యార్థిని సోదరి తల్లిదండ్రులకు సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి హెచ్‌డబ్ల్యూవోను ప్రశ్నించే వరకు వారిని గుర్తించలేదు.
- జిల్లా మహిళా ప్రగతి ప్రాంగణంలో సరకులు దారి మళ్లించిన హెచ్‌డబ్ల్యూవోను జిల్లా కలెక్టరు సస్పెండ్ చేశారు. ఈ ప్రాంగణంలో రెండు గిరిజన సంక్షేమ వసతి గృహాలు, జిల్లా మహిళాభివృద్ధి, శిశు సంక్షేమశాఖకు చెందిన కళాశాల విద్యార్థినుల వసతిగృహం, వర్కింగ్ ఉమెన్స్ హాస్టళ్లు ఉన్నాయి. రాత్రి 10 గంటల తర్వాత కూడా కొందరు విద్యార్థినులను వేరే వ్యక్తులు ద్విచక్ర వాహనాలపై వదలి వెళుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.
- జిల్లా కలెక్టరు, ఎస్పీ కార్యాలయాలు, అధికారిక నివాసాలతో పాటు దక్షిణ కోస్తా జిల్లాల డీఐజీ కార్యాలయం ఇక్కడే ఉన్నా ఎలాంటి భయం లేకుండా రాకపోకలు సాగిస్తుండటం గమనార్హం.

ఏఐతో బహుళ ప్రయోజనాలు

మాట్లాడుతున్న శివనారాయణ

జిల్లాపరిషత్తు (గుంటూరు), న్యూస్‌టుడే: అధునాతన సాంకేతిక పరిజ్ఞానం కృత్రిమ మేధ(ఏఐ)ను వ్యవసాయంలో ఉపయోగించటం ద్వారా బహుళ ప్రయోజనాలు పొందవచ్చని ఆచార్య ఎన్.జి.రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం విస్తరణ సంచాలకులు డాక్టర్ జి.శివనారాయణ అన్నారు. మంగళవారం కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ రాజస్థాన్ రాష్ట్రం జైపూర్‌లో భారత్ విస్తార్ కార్యక్రమాన్ని ప్రారంభించగా.. గుంటూరుకు సమీపంలోని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం లాంఫాం ఆడిటోరియం నుంచి వర్చువల్ విధానంలో వర్సిటీ అధికారులు, శాస్త్రవేత్తలు వీక్షించారు. శివనారాయణ మాట్లాడుతూ భారత్ విస్తార్ కార్యక్రమం రైతులకు వారి సొంత భాషలో మొబైల్, సాధారణ ఫోన్ ద్వారా సమాచారాన్ని అందించేందుకు రూపొందించిన ఏఐ ఆధారిత బహుభాషా సాధనమని తెలిపారు. పంట ప్రణాళిక, సేద్య పద్ధతులు, తెగుళ్లు, వాతావరణ సూచనలు, మార్కెట్లు, ప్రభుత్వ పథకాల సమాచారం తదితర వివరాలను అందజేస్తుందని వివరించారు. ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలపై రైతులు, విద్యార్థులు అవగాహన ఏర్పరుచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆంగ్రూ విభాగాల అధిపతులు పి.వి.సత్యనారాయణ, ఎ.మణి, జి.రామచంద్రరావు, డి.సంపత్‌కుమార్, పి.రవి, లాంఫాం ఏడీఆర్ దుర్గాప్రసాద్, రాష్ట్ర బీజేపీ కిసాన్ మోర్చా ప్రధాన కార్యదర్శి వై.వి.సుబ్బారావు, రాష్ట్ర బీజేపీ అధికార ప్రతినిధి రామకృష్ణ, జిల్లా బీజేపీ అధ్యక్షుడు తిరుపతిరావు, శాస్త్రవేత్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.

91.9 FM Vijayawada
ఈ FM 91.9 Mee FM
ఈఎఫ్‌ఎమ్ కార్యక్రమాలు
సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ. 5 - ఉ. 7
ఈ-మార్నింగ్స్	ఉ. 7 - ఉ. 11
నువ్వా నేనా	ఉ. 11 - మ. 2
సత్యభామ	మ. 2 - సా. 5
లైట్ తీస్కో	సా. 5 - రా. 9
సరదాగా కాసేపు	రా. 9 - రా. 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా. 12 - తె. 5

/Eenadufm
For Advertising on Eenadu FM Contact
80080 03297

ఉద్యోగ భద్రత కల్పించండి

తాడేపల్లి, మంగళగిరి: తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ అటవీ శాఖలోని పొరుగు సేవల ఉద్యోగులు మంగళగిరిలోని జనసేన కేంద్ర కార్యాలయం వద్దకు మంగళవారం చేరుకున్నారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా ప్రదేశానికి చేరుకుని వారితో చర్చించారు. ఈ నెల 16వ తేదీ జనసేన కార్యాలయం వద్ద జరిగిన జనవాణిలో తమ డిమాండ్ల పరిష్కారం కోరుతూ వినతిపత్రం అందజేశారు. సమస్యను పరిష్కరిస్తామని వివరించడంతో వెనుతిరిగి వెళ్లిన ఉద్యోగులు తిరిగి మళ్లీ యూనిఫాంలో కార్యాలయ సమీపానికి చేరుకున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు వారితో చర్చించారు. ఉప ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి బయటకు వెళ్లే సమయంలో తమను చూస్తారని రహదారి వెంబడి నిలబడినట్లు పోలీసులకు వివరించారు. యూనిఫాంలో ఉండకూడదంటూ సూచించడంతో తిరిగి వెళ్లి సివిల్ దుస్తుల్లో వచ్చి రహదారి వెంబడి నిలబడ్డారు. ఫారెస్ట్ డిపార్ట్‌మెంట్ ఔట్‌సోర్సింగ్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యాన ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు పోలీసులు తెలిపారు. సీఐ వీరాస్వామి, ఎస్ఐ నాయక్, సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.

అటవీశాఖ ఉద్యోగులతో మాట్లాడుతున్న సీఐ వీరాస్వామి

రక్షణ రంగ బలోపేతానికి సమష్టి పరిశోధనలు అవసరం

డీఆర్డీవో ఛైర్మన్ డా. ఎస్.వి కామత్‌తో సమావేశమైన ఎస్ఆర్ఎం యూనివర్సిటీ ప్రతినిధులు

తుళ్లూరు, న్యూస్‌టుడే: 'దేశ రక్షణ రంగంలో అభివృద్ధి సాధించాలంటే పరిశోధక విద్యా సంస్థలు, పరిశ్రమలు, అంకుర సంస్థలతో కూడిన సమష్టి జాతీయ నమూనా అవసరమని డీఆర్డీవో ఛైర్మన్ డా. ఎస్.వి కామత్ పేర్కొన్నారు. మంగళవారం ఆయన అమరావతిలోని ఏపీ ఎస్ఆర్ఎం వర్సిటీ పరిశోధక అధ్యాపక బృందంతో సమావేశమయ్యారు. ఎస్ఆర్ఎం విద్యా సంస్థల గ్రూప్ రీసెర్చ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఆచార్య నారాయణరావు పర్యవేక్షణలో వర్సిటీ పరిశోధనలపై అధ్యాపక బృందం పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇవ్వగా..కామత్ సంతృప్తి వ్యక్తం చేశారు. 'స్మార్ట్ ఫైబర్ సెన్సార్లపై ప్రొ.మంగళంపల్లి కిరణ్ ప్రదర్శించిన రీసెర్చ్ ప్రాజెక్ట్‌పై కామత్ ఆసక్తి కనబరిచారు. పరిశోధనలకు అవసరమైన సహకారం కోసం డీఆర్డీవో ప్రయోగశాల డైరెక్టర్లను సంప్రదించాలని సూచించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సైబర్ సెక్యూరిటీ, ఏరియల్ వెహికల్స్, క్వాంటం కంప్యూటింగ్ వంటి రంగాలపై డీఆర్‌డీవో ప్రత్యేకంగా దృష్టి సారించిందని తెలిపారు. ఎస్ఆర్ఎం వర్సిటీని పరిశోధనలకు నిలయంగా తీర్చిదిద్దుతున్నామని ఆచార్య నారాయణరావు, వైస్ ఛాన్సలర్ ఆచార్య సతీష్ కుమార్ వివరించారు.

జేఈఈ మెయిన్స్‌లో శ్రీచైతన్య విద్యార్థుల విజయకేతనం

విద్యార్థులను అభినందించిన ఈమని దుర్గాప్రసాద్

పట్టాభిపురం: జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో గుంటూరు శ్రీచైతన్య విద్యాసంస్థల విద్యార్థులు ప్రతిభ కనబరిచి విజయకేతనం ఎగురవేశారని ఎగ్జిక్యూటివ్ ఏజీఎమ్ ఈమని దుర్గాప్రసాద్ తెలిపారు. ఉత్తమ పర్సంటైల్ సాధించిన విద్యార్థులను ఆయన అభినందించారు. దుర్గాప్రసాద్ మాట్లాడుతూ పి.చెన్నకేశవ్ 99.9979, ఎమ్.సాకేత్ 99.9949, పోసా వెంకట్ 98.99 పర్సంటైల్ సాధించి అత్యుత్తమ ప్రతిభ కనబర్చారన్నారు. 99.90 పర్సంటైల్ పైన 11 మంది, 99.5 పైన 23 మంది సాధించారన్నారు. కార్యక్రమంలో డీన్ సురేష్‌బాబు, ఏజీఎమ్ ఎల్‌టీసీ శ్రీనివాస్, పలు క్యాంపస్‌ల ప్రిన్సిపల్స్ తదితరులు పాల్గొన్నారు.

ఈనాడు అమరావతి
కృష్ణా
బుధవారం ఫిబ్రవరి 18, 2026

స్వర్ణ శోభితం

యనమలకుదురు రామలింగేశ్వరస్వామికి పటమటకు చెందిన కొడాలి సీతారాంబాబు, ఉషారాణి దంపతులు మంగళవారం రూ.10 లక్షల విలువైన బంగారు జటాఝూటం, నాగాభరణాలను స్వామి వారికి సమర్పించారు. కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి దాత సంగా నరసింహారావు, ఈవో భవానీ, తదితరులు పాల్గొన్నారు.

- న్యూస్‌టుడే, కానూరు

ఇంద్రకీలాద్రిపై శాస్త్రోక్తంగా పూర్ణాహుతి

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే: ఇంద్రకీలాద్రిపై పాంచాహ్నిక పూర్వక మహాశివరాత్రి కల్యాణ మహోత్సవాలు పూర్ణాహుతి క్రతువుతో మంగళవారం ముగిశాయి. ఈ సందర్భంగా కల్యాణమూర్తులు, రుత్వికులతో కలిసి దుర్గగుడి ఈవో శీనా నాయక్, ఛైర్మన్ రాధాకృష్ణ దుర్గాఘాట్ వద్దకు తీసుకొచ్చారు. భక్తుల ఆనందోత్సాహాల మధ్య వసంతోత్సవం, దుర్గాఘాట్‌లో కల్యాణ మూర్తులకు అవభృత స్నానం నిర్వహించారు. వన్‌టౌన్ సీఐ గుణరామ్ భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షించారు. అవభృత స్నానం చేయించిన అనంతరం కల్యాణమూర్తులను తిరిగి ఇంద్రకీలాద్రిపైకి చేర్చడంతో కల్యాణ మహోత్సవాలు ముగిసినట్లు వైదిక కమిటీ సభ్యులు పేర్కొన్నారు.

పూర్ణాహుతి క్రతువు నిర్వహిస్తున్న రుత్వికులు

సరఫరాలో జాప్యం.. స్పందిస్తే నయం

మిల్లుల్లో చౌక బియ్యం (పాతచిత్రం)

ఈనాడు, అమరావతి

ఫోర్టిఫైడ్ కెర్నల్స్ కొరతతో ఇక్కట్లు

ఉమ్మడి జిల్లాలో మిల్లర్లను ఫోర్టిఫైడ్ రైస్ కెర్నల్స్ కొరత వేధిస్తోంది. కొన్నాళ్లుగా వీటి సరఫరా సరిగాలేక ఇబ్బందులు తప్పడంలేదు. అవి కలిపాకే బియ్యాన్ని మిల్లర్లు సరఫరా చేయాల్సి రావడంతో ఉమ్మడి జిల్లాలో భారీగా నిల్వలు మిల్లుల్లోనే నిలిచిపోయాయి. దీంతో రూ.కోట్లలో వర్కింగ్ ఛార్జీలు ఆగాయని మిల్లర్లు వాపోతున్నారు.

ప్రక్రియకు నెల...

పేదలకు పోషకాలతో కూడిన ఆహారం అందించేందుకు కేంద్ర ప్రభుత్వం రేషన్ బియ్యంలో ఫోర్టిఫైడ్ కెర్నల్స్ కలిపి సరఫరా చేస్తుంది. ★ ఉమ్మడి కృష్ణా జిల్లాకు భోపాల్ గుత్తేదారుడు కెర్నల్స్ సరఫరా చేస్తున్నారు. ★ నిబంధనల మేరకు గుత్తసంస్థ కెర్నల్స్ శాంపిల్ తయారు చేశాక.. ఎఫ్‌సీఐకు పంపాలి. అక్కడ ఆమోదించాక.. దిల్లీలో అధికారులకు శాంపిల్ వెళుతుంది. అక్కడ కూడా ఆమోదం పొందాకే లోడ్ చేసి పంపిస్తారు.. ఈ ప్రక్రియకు నెల పట్టడంతో జాప్యం జరుగుతోంది.

సగమే ఇస్తే ఎలా...

ఉమ్మడి జిల్లాకు నెలకు 20 వేల మెట్రిక్ టన్నుల బియ్యం సరఫరా చేస్తున్నారు. ఇందులో 2,000 టన్నుల కెర్నల్స్ కలపాలి. కానీ నెలకు 1,000 టన్నులు మించి రావట్లేదు. దీంతో ఆ మేరకే బియ్యం సరఫరా చేయడంతో మిల్లుల్లోనే బియ్యం నిల్వలు పెరిగిపోతున్నాయి.

కాపాడటం భారమే...

సాధారణంగా మూడు నెలలకు సరిపడా కెర్నల్స్‌తో కూడిన చౌక బియ్యం లబ్ధిదారులకు సరఫరా చేసేందుకు గిడ్డంగుల్లో ఉంచుతారు. దీంతో కార్డుదారులకు సమస్య రాకున్నా మిల్లర్లే అవస్థలు పడుతున్నారు. ★ కెర్నల్స్ రాకపోవడంతో దాదాపు 2 లక్షల టన్నుల బియ్యం మిల్లుల్లో ఉంది. వాటిని కాపాడటం సమస్యగా మారింది. ★ కెర్నల్స్ కలిపాక బియ్యం తరలిస్తేనే వర్కింగ్ ఛార్జీలు వస్తాయి. తాజాజాప్యంతో మిల్లర్లకు రూ.కోట్ల సొమ్ము ఆలస్యం అవుతోంది.

★ ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల పౌరసరఫరాల అధికారులు మాట్లాడుతూ.. 'కెర్నల్స్ సరఫరా జాప్యమైనా రేషన్ బియ్యం పంపిణీలో ఇబ్బందిలేదు. గతంలో కెర్నల్స్ నమూనాల పరిశీలన స్థానికంగా జరిగేది. ప్రస్తుతం విధానం మారడంతో కొంత ఆలస్యం అవుతోంద'న్నారు.

వర్సిటీ స్థలాల చుట్టూ రక్షణ గోడ నిర్మాణం

గూడూరు, న్యూస్‌టుడే : కృష్ణా విశ్వవిద్యాలయం భూముల చుట్టూ రక్షణ గోడ నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నట్లు వర్సిటీ ఉపకులపతి కూన రాంజీ తెలిపారు. కొందరు విశ్వవిద్యాలయానికి చెందిన భూములు ఆక్రమించి లేఔట్ వేయడంతో పాటు ఒకటి, రెండు చోట్ల ఇంటి నిర్మాణాలు కూడా ప్రారంభించారు. దీనిపై ఇటీవల 'ఈనాడు'లో 'కన్నేసినా ఉలకరు... కాజేసినా పలకరు' అనే శీర్షికన కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన ఆయన రెక్టార్ ఎం.బసవేశ్వరరావు, రిజిస్ట్రార్ ఎన్.ఉష తదితరులతో కలిసి మంగళవారం గూడూరులోని విశ్వవిద్యాలయ భూములను పరిశీలించి, అక్కడి పరిస్థితులపై ఆరా తీశారు. గూడూరు పరాన్‌పేటతో పాటు కోకనారాయణపాలెం రోడ్డులో ఉన్న భూముల చుట్టూ ప్రహరీల ఏర్పాటుకు వెంటనే ప్రతిపాదనలు చేయాలని ఆదేశించారు. ప్రభుత్వం విశ్వవిద్యాలయానికి కేటాయించిన భూములను ఆక్రమిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వర్సిటీ భూముల్లో నిర్మించిన ఒక షెడ్డుకు విద్యుత్తు కనెక్షన్ కూడా ఇచ్చారని, దీనిపై సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసి తగు చర్యలు తీసుకోవాలని సిబ్బందికి చెప్పారు. విశ్వవిద్యాలయ ఇంజినీర్లు నాగేశ్వరరావు, బసవేశ్వరబాబు, పీఆర్వో మత్తే నాగరాజు పాల్గొన్నారు.

భూములు పరిశీలించి ఇంజినీర్లతో మాట్లాడుతున్న ఉపకులపతి రాంజీ

దేశానికి మాజీ సైనికుల సేవలు అమూల్యం

విజయవాడ సిటీ: మాజీ సైనికులు సమాజానికి అందిస్తున్న సేవలు అమోఘమని, దేశ నిర్మాణానికి అందించిన సహకారం అమూల్యమని హోం మంత్రి వంగలపూడి అనిత అన్నారు. మంగళవారం బందర్ రోడ్డులోని ఓ హోటల్‌లో సైనిక్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో 'వెటరన్స్ డే'ని ఘనంగా నిర్వహించారు. వేడుకలకు ముఖ్యఅతిథిగా హాజరైన అనిత మాట్లాడుతూ... దేశ భద్రత కోసం అహర్నిశలు పని చేస్తున్న వీర జవాన్ల వల్లే ప్రజలు ప్రశాంతంగా జీవిస్తున్నారని అన్నారు. కూటమి ప్రభుత్వం మాజీ సైనికుల సంక్షేమం కోసం పలు కార్యక్రమాలు చేపడుతోందని, ప్రత్యేకంగా సైనిక్ వెల్ఫేర్ కార్పొరేషన్ ఏర్పాటు చేసి సమస్యలు పరిష్కరిస్తున్నామని తెలిపారు. యువత మాజీ సైనికుల సేవలను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు.

సిమ్‌లు మారుస్తూ.. సీన్ ఏమారుస్తూ!

ఈనాడు - అమరావతి

పరారీలో కీలక నిందితురాలు ప్రియాంక

సంచలనం రేపిన పిల్లల విక్రయాల కేసులో కీలక నిందితురాలు ప్రియాంక తప్పించుకు తిరుగుతోంది. గత నెలలో మేరఠ్‌లో త్రుటిలో తప్పించుకున్న నిందితురాలు ఇంటికి రాకుండా ఇతర ప్రాంతాల్లో సంచరిస్తోంది. బెజవాడ పోలీసులు గట్టి నిఘా పెట్టడంతో.. సిమ్‌లు మారుస్తూ ఏమారుస్తోంది. దిల్లీ ముఠాకు ఈమే సూత్రధారి. ఈమె దొరికితేనే కేసు సాగేది.

నిరుపేద పిల్లలను తెచ్చి...

ఇప్పటికే అరెస్టయిన నిందితులు.. దిల్లీలో ప్రియాంక నుంచి తాము పిల్లలను తీసుకున్నట్లు వెల్లడించారు. కిరణ్‌శర్మ కూడా ఇదే తెలిపింది. దిల్లీలో కిరణ్‌శర్మ, ప్రియాంక ఒకేచోట ఉండేవారు. పేదింటి బిడ్డలను ఈమె ప్రియాంక నుంచి తీసుకుని.. అమ్మకానికి విజయవాడలో బలగం సరోజినికి చేర్చేది. దీంతో కేసు దర్యాప్తు ప్రియాంక వద్ద ఆగిపోయింది. ఈమె ఎక్కడి నుంచి పిల్లలను తెచ్చిందనేది తేలలేదు. ఉత్తరాది నుంచి పలు ప్రాంతాల కార్మికులు దిల్లీ వచ్చి మురికివాడల్లో ఉంటారు. వీరిలో పోషించే స్థోమత లేని వారి పిల్లలను తీసుకుందని అనుమానిస్తున్నారు.

పాపపు సొమ్ముతో విలాసం..

పిల్లల విక్రయాలతో వచ్చే సొమ్ముతో ప్రియాంక విలాస జీవితం గడిపేది. ఈమెకు దిల్లీ, యూపీలో మేరఠ్‌లోనూ ఇళ్లు ఉన్నాయి. దిల్లీలో పశ్చిమవిహార, హరియాణాలో ఫరీదాబాద్, బెజవాడలో మూడు స్టేషన్లలో కేసులు నమోదయ్యాయి. ప్రియాంక ఫోన్ లొకేషన్‌ను ట్రాక్ చేస్తున్నారు. పాత సిమ్‌ను తీసేసి.. కొత్తది ఉపయోగిస్తోంది. మేరఠ్‌లో బాయ్‌ఫ్రెండ్‌తో టచ్‌లో ఉన్నట్లు గుర్తించారు. తర్వాత కొద్దిరోజులకే ఆ సిమ్ స్విచాఫ్ అయింది. కొత్తది తీసుకున్నట్లు గుర్తించి.. ఆ నెంబరునూ పట్టుకున్నా.. దానినీ మార్చేసింది.

తొలుత మేరఠ్‌కు..

నిందితురాలి బాయ్‌ఫ్రెండ్‌పై నిఘా పెట్టి.. ఆమె వివరాల కోసం రెక్కీ బృందం మేరఠ్ వెళ్లనుంది. అతడిని అదుపులోకి తీసుకుని విషయం తేల్చాక.. మరో బృందం ప్రియాంకను అదుపులోకి తీసుకునేందుకు వెళ్లనుంది. మరోవైపు.. ముంబయి ముఠాలోని కవిత సహాయకురాలు నూరిని అరెస్టు చేయాల్సి ఉంది. థానేలో ఉంటున్నట్లు గుర్తించారు. ఈమె రెండుసార్లు పిల్లలను విజయవాడకు తెచ్చి సరోజినికిచ్చింది. నిందితుడు అనిల్ విచారణలో అతని బంధువు బాబు పేరు బయటకు రాగా.. అతడినీ నిందితుడిగా చేర్చారు. వీరి అరెస్టుకు ముంబయికి మరో బృందం వెళ్లనుంది.

దారంతా డొల్ల... ఒళ్లంతా గుల్ల...!

గన్నవరం మార్కెట్ యార్డు నుంచి బీబీగూడెం వరకు రోడ్డు అధ్వానంగా మారింది. ముఖ్యంగా బీబీగూడెంలో గుంతలమయమై... రాళ్లు తేలి... వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. క్వారీ, మట్టి లారీల రాకపోకలతో దుమ్ము, ధూళి ఎగసిపడుతోంది. ఎన్నిసార్లు గుంతలు పూడ్చినా మళ్లీ మొదటికి వస్తోంది. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి కొత్త రోడ్డు నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు. - ఈనాడు, కృష్ణా

బీబీగూడెం చర్చి ఎదురుగా భారీ గుంతలతో..

గన్నవరం బైపాస్ రోడ్డు సమీపంలో ఇలా..

చేసేది మ్యూల్ వ్యవహారాలు.. చెప్పేది సాఫ్ట్‌వేర్ కొలువు

సూత్రధారి సుబ్రమణి రాజా వెంకట్ కోసం చెన్నైలో వేట

ఈనాడు, అమరావతి: తాను సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌ని అనీ, జీతం నెలకు రూ.30 వేలనీ.. ఇంట్లో అందరినీ నమ్మించాడు. కానీ చేసేది చట్టవిరుద్ధ కార్యకలాపాలే. జీవిక విజయవాడలో వెలుగు చూసిన మ్యూల్ ఖాతాల కేసులో కీలక సూత్రధారి రాజా వెంకట్ వ్యవహారమిది. ఈమధ్య సైబర్ పోలీసులు అరెస్టు చేసిన మ్యూల్ ఎకౌంట్స్ గ్యాంగ్ మూలాలను చెన్నైలో తేలుస్తున్నారు. ఇప్పటికే ఈ కేసులో రవికుమార్, ప్రవీణ్, బాజీ, దుర్గాప్రసాద్‌లు అరెస్టయ్యారు. సూత్రధారి కోసం సైబర్ పోలీసుల ప్రత్యేక బృందం చెన్నై వెళ్లింది. ఇప్పటికే అరెస్టయి రిమాండ్‌లో ఉన్న నిందితుల నుంచి సేకరించిన వివరాల ఆధారంగా చెన్నైకి చెందిన సుబ్రమణి రాజా వెంకట్, ఆకాశ్‌కు అద్దె ఖాతాలు చేరేవని గుర్తించారు.

పరారీలో సూత్రధారి... ఈ వివరాల ఆధారంగా ప్రత్యేక బృందం.. మంగళవారం చెన్నై వెళ్లింది. అక్కడికి వెళ్లేసరికే కీలక సూత్రధారి పరారయ్యాడు. ఇంటి, పరిసర ప్రాంతాల్లో విచారించగా... వెంకట్ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేస్తున్నట్లు చెప్పారు. కుటుంబ సభ్యులకు కూడా అసలు విషయం తెలియకుండా జాగ్రత్తలు తీసుకున్నట్లు తెలిసింది. ప్రాంతాల వారీగా ఏజెంట్లను పెట్టి అద్దె ఖాతాలు తెరిపిస్తున్నట్లు తెలిసింది. ఆకాశ్ వివరాలు తెలియలేదు. తప్పుదారి పట్టించేందుకు నిందితులు అలా చెప్పారా? అనే కోణంలోనూ విచారిస్తున్నారు. సుబ్రమణి రాజా వెంకట్ కుటుంబం.. అద్దె ఇంట్లో ఉంటోంది. నిందితుడి తండ్రి చనిపోయాడు. తల్లి ఉంది. అతనికి వివాహమై.. ఒక పిల్లాడు ఉన్నాడు. నిందితుడి కోసం ఇంకా ఎవరైనా ఉన్నారా? అనే కోణంలో పోలీసులు విచారిస్తున్నారు.

తవ్వుకో రేవంతా.. తోలుకో రోజంతా..

ఈనాడు డిజిటల్, మచిలీపట్నం- న్యూస్‌టుడే, తోట్లవల్లూరు

"ఇసుకాసురుల ధన దాహానికి కృష్ణా నది గుల్లబారిపోతోంది. ఉచిత ఇసుక మాటున భారీ దందా సాగిస్తున్నారు. నేతలు.. అధికారులు ఏకమై ప్రకృతి వనరులను కొల్లగొడుతున్నారు. కళ్లముందే నిబంధనలను పాతరేసినా చర్యలకు పట్టడం లేదు. నేతల అండతో రేవుల్లో అక్రమాలు అంతేలేదు."

"హెవీ మెషినరీ (భారీ యంత్రాలు) పేరిట రేవుల్లో ఇసుక తవ్వకాలకు అనుమతిచ్చారు. ఎక్కడా చిన్న యంత్రాల్లేవ్. అన్నీ భారీ కొండలను కరిగించే పెద్ద యంత్రాలే. నది ఆసాంతం తవ్వేయగా సమీప పొలాలు దెబ్బతింటున్నాయి. దందా వెనుక పెద్దలు ఉన్నారనీ.. అడ్డుకుంటే ఉద్యోగాలకే ఎసరని అధికారులు హడలుతున్నారు."

● రొయ్యూరు ఇసుక రేవుకు 270 సర్వే నంబరులో 25 హెక్టార్లలో 3,75,000 మెట్రిక్ టన్నుల ఇసుక తోడేందుకు అనుమతిచ్చారు. ఈ లెక్క ఎప్పుడో దాటిసి... లెక్కల్లోకి రాకూడదని బిల్లులు ఇవ్వట్లేదు. అనుమతులు మీరి అంతటా తవ్వేస్తున్నారు. 20 అడుగులపైగా గుంతలు పెట్టగా భారీ గుంతల నుంచి నీరు ఊరుతోందిలా.

నిబంధనల పాతర..

✓ అనుమతించినచోట.. ఉదయం 6 - సాయంత్రం 6 లోపు.. అదీ 2, 3 మీటర్ల లోతే తవ్వాలి.
✗ ఏ రేవు చూసినా రాత్రీపగలు తవ్వేస్తున్నారు.
✓ బిల్లులు ఇవ్వకుండా లోడింగ్ చేయకూడదు. పరిమితికి మించి లోడ్ వేయకూడదు. ప్రతి రేవు దగ్గర లోడింగ్ రేటు బోర్డు ఉండాలి. నిబంధనలు మీరితే ఫిర్యాదు చేసే ఫోన్ నంబర్ బోర్డు ఉండాలి.
✗ ఇవేవీ రేవుల వద్ద కనిపించవు.
✓ బిల్లుల్లేకుండా ఇసుక లోడ్ రోడ్డుపైకి వస్తే పోలీసు, రెవెన్యూ, రవాణా, మైనింగ్ అధికారులు జరిమానా వేసి కేసులు పెట్టవచ్చు.
✗ ఇసుక లారీలు ఆపితే జిల్లాలో ఓ పెద్ద నేత బెదిరిస్తున్నారని అధికారులు వణికిపోతున్నారు.

కృష్ణా తీరంలో ఇసుక దందా

● 20 అడుగులలోతు గుంతలు పెట్టి భారీ యంత్రంతో ఇసుక లోడ్ చేస్తున్నది.. పాపవినాశనం రేవులో.. సర్వే నంబరు 176లో 10.3 హెక్టార్లలో 1,54,500 మెట్రిక్ టన్నుల తోడేందుకు సెమీ మెకానిక్ అనుమతిచ్చారు. తొలి నుంచే భారీ యంత్రాలతో తోడేస్తున్నారు. సీఆర్‌జెడ్ పరిధికి దగ్గరగా ఉండే ఈ రేవులో భారీ గుంతలతో ఇప్పటికే పొలాల్లో చేరి.. బోర్లు ఎండిపోతున్నాయి. నిత్యం వందల టిప్పర్ల తాకిడికి డొంక దారులు ధ్వంసమయ్యాయి.

☛ పటమటలంకలో 15 హెక్టార్లలో 2,25,000 మెట్రిక్ టన్నులు.. నార్త్‌వల్లూరులో 25 హెక్టార్లలో 3,75,000 మెట్రిక్ టన్నులు.. చోడవరంలో 7 హెక్టార్లలో 1,05,000 మెట్రిక్ టన్నులు ఇసుక తోడేందుకు అనుమతి ఉంది. ఈ రేవుల్లో ఈ లెక్కలు ఎప్పుడో దాటేసి.. బిల్లులు ఇవ్వకుండా కప్పిపుచ్చుతున్నారు.

☛ ఇసుక రేవుల్లో తనిఖీలు చేసి నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటామని మైనింగ్ శాఖ ఏడీ శ్రీనివాస్ తెలిపారు.

త్వరలో రాయనపాడు రైల్వేస్టేషన్ ప్రారంభం

విజయవాడ, న్యూస్‌టుడే : అమృత్ పథకం కింద ఆధునీకరించిన రాయనపాడు రైల్వేస్టేషన్‌ను త్వరలోనే ప్రధాని మోదీ చేతుల మీదుగా ప్రారంభించనున్నట్లు విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ తెలిపారు. కొండపల్లి రైల్వేస్టేషన్‌లో రెండు ప్లాట్‌ఫాంలను విస్తరించడంతో పాటు మౌలిక సదుపాయాల కల్పన, ఆధునీకరణ పనులకు రూ.10 కోట్లు మంజూరయ్యాయని తెలిపారు. దీన్ని అమృత్ భారత్ పథకం 2.0 కింద కూడా తీసుకురాబోతున్నట్లు చెప్పారు. విజయవాడ డివిజన్‌లో రైల్వే ప్రాజెక్టుల నిర్మాణం, పురోగతిపై మంగళవారం డీఆర్ఎం మహిత్ సోనాకియాతో ఆయన కార్యాలయంలో ఎంపీ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎంపీ శివనాథ్ మాట్లాడుతూ.. నగరంలో ట్రాఫిక్ ఇబ్బందుల దృష్ట్యా రైల్వే లెవల్‌క్రాసింగ్ నంబరు 147 దగ్గర ఆర్వోబీ నిర్మాణానికి టెండర్ ప్రక్రియ పూర్తి చేసి త్వరలోనే శంకుస్థాపన చేస్తామని తెలిపారు. గుణదలలో ఎల్‌సీ నంబరు 8 వద్ద ఆర్వోబీకి నాలుగు రోజుల్లో టెండర్ ప్రక్రియ మొదలవుతుందని.. ఎల్‌సీ నంబరు 148 టెండర్ దశలో ఉన్నట్లు వెల్లడించారు. నగరంలో 50ఏళ్ల క్రితం నిర్మించిన కేఎల్‌రావు (ఎర్రకట్ట) వంతెన ఫిజిబిలిటీ స్టడీ కింద డీపీఆర్ సిద్ధం చేయడానికి బెంగళూరు సంస్థకు అప్పగించినట్లు తెలిపారు. వాంబేకాలనీవాసులు ఎప్పటి నుంచో కోరుతున్న ఆర్‌యూబీ త్వరలోనే ముందుకు రాబోతుందన్నారు. పాత రాజరాజేశ్వరిపేట నుంచి కొత్త రాజరాజేశ్వరిపేట వరకు ఉన్న ఆర్‌యూబీ డిజైన్స్ సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. కొండపల్లి బీ కాలనీ వద్ద ఆర్వోబీకి అనుమతులు లభించాయని చెప్పారు.

ఎన్టీఆర్ కాంప్లెక్స్‌లో తూనికలు.. కొలతల శాఖ దాడులు

గవర్నర్‌పేట, న్యూస్‌టుడే : తూనికలు, కొలతల శాఖ నిబంధనలు ఉల్లంఘించి వ్యాపారం చేస్తున్న గవర్నర్‌పేట ఎన్టీఆర్ కాంప్లెక్సులోని ఎలక్ట్రానిక్ వస్తువుల విక్రయ దుకాణాలపై తూనికలు, కొలతల శాఖ అధికారులు 7 కేసులు నమోదు చేశారు. వినియోగదారుల అవగాహనా రాహిత్యాన్ని వ్యాపారులు సొమ్ము చేసుకుంటూ బ్రాండెడ్ పేరుతో నకిలీవి అంటగడుతున్నారు. వారి మోసాలపై 'చూస్తే తరుగు.. తూస్తే తరుగు' శీర్షికన ఈ నెల 15న 'ఈనాడు'లో కథనం ప్రచురితమైంది. దీనిపై అధికారులు స్పందించారు. తూనికలు కొలతల శాఖ అసిస్టెంట్ కంట్రోలర్ కుమారి తన సిబ్బందితో కలిసి మంగళవారం ఎన్టీఆర్ కాంప్లెక్సులోని పలు దుకాణాల్లో తనిఖీలు చేశారు. పలువురు వ్యాపారులు ప్యాకింగ్ నిబంధనలు ఉల్లంఘించినట్లు గుర్తించారు. తయారీదారుని పేరు, చిరునామా, ప్యాకింగ్ తేదీ వంటి వివరాలు లేకుండా ఎలక్ట్రానిక్ విడిభాగాలను విక్రయిస్తున్నట్లు గుర్తించి.. వారిపై కేసు నమోదు చేశారు. ప్రతి ఒక్కరూ తూనికలు, కొలతల శాఖ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని, తయారీదారుని వివరాలు తప్పనిసరిగా ప్యాకింగ్‌పై ఉండాలని ఆమె సూచించారు.

కేసు నమోదు చేస్తున్న అసిస్టెంట్ కంట్రోలర్ కుమారి

చంద్రబాబుతో రాష్ట్రానికి అంతర్జాతీయ గుర్తింపు

పటమట, న్యూస్‌టుడే: సీఎం చంద్రబాబు నాయకత్వం రాష్ట్రానికి ప్రత్యేక గుర్తింపు తీసుకువచ్చిందని తెదేపా ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షురాలు గద్దె అనురాధ ఓ ప్రకటనలో తెలిపారు. ప్రపంచ ప్రఖ్యాత పారిశ్రామికవేత్త బిల్ గేట్స్ సుమారు 30 ఏళ్ల తర్వాత ఆంధ్రప్రదేశ్‌ను సందర్శించడం వెనుక చంద్రబాబు విజన్, పరిపాలన నైపుణ్యం, అంతర్జాతీయ స్థాయి గుర్తింపు ప్రధాన కారణాలుగా ఉన్నాయని అన్నారు. రాష్ట్రంలో అమలవుతున్న సాంకేతిక, వ్యవసాయ, ఆరోగ్య, విద్యా రంగ సంస్కరణలు అంతర్జాతీయ సంస్థల దృష్టిని ఆకర్షిస్తున్నాయని తెలిపారు. ప్రభుత్వం తీసుకుంటున్న ప్రగతిశీల నిర్ణయాలకు ప్రజలు అండగా నిలవాలని ఆమె కోరారు.

ఎయిమ్స్ ప్రస్థానం అద్వితీయం

మంత్రి లోకేశ్ | ఘనంగా స్నాతకోత్సవం

ఈనాడు, అమరావతి - న్యూస్‌టుడే, మంగళగిరి: మంగళగిరి ఎయిమ్స్ ప్రస్థానం అద్వితీయం. బోధన, పరిశోధన, రోగి సంరక్షణ అనే మూడు స్తంభాలపై నిలిచి ఉంది. నమ్మకం అనే నాలుగో స్తంభాన్ని కూడా చేర్చాలని కోరుకుంటున్నానని రాష్ట్ర ఐటీ, విద్య శాఖల మంత్రి నారా లోకేశ్ ఆకాంక్షించారు. మంగళవారం మంగళగిరి ఎయిమ్స్‌లో నిర్వహించిన రెండో స్నాతకోత్సవంలో ఆయనతోపాటు కేంద్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ సహాయ మంత్రి అనుప్రియ పటేల్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. తొలుత ఎయిమ్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అహెంతమ్ శాంతాసింగ్ ఆసుపత్రి ప్రగతి నివేదిక వివరించారు.

ఆకట్టుకున్న వస్త్రాలంకరణ.. ఎయిమ్స్ విభాగాధిపతుల నుంచి వైద్యులు, వైద్య విద్యార్థులు మంగళగిరి చేనేత వస్త్రాలంకరణతో ఆకట్టుకున్నారు. పురుషులు అచ్చమైన పంచెకట్టు, పైజామా ధరించగా.. మహిళలు చేనేత చీరలు ధరించారు. యువ వైద్యులు సైతం సంప్రదాయ వస్త్రధారణతో కనువిందు చేశారు.

● వైద్య పట్టాలందుకున్నవారు : 58 మంది
● బంగారు పతకాలందుకున్నవారు : ముగ్గురు

మంత్రి లోకేశ్‌ను సన్మానిస్తున్న అహెంతమ్ శాంతాసింగ్. వేదికపై కేంద్ర సహాయ మంత్రి అనుప్రియ పటేల్, ఎయిమ్స్ అధ్యక్షుడు తపన్‌కుమార్ సాహా, డీన్ రామ్మోహన్

"మంగళగిరి ఎయిమ్స్ 2015లో అతి సామాన్యంగా ప్రారంభమైంది. నేడు అండర్ గ్రాడ్యుయేట్, పోస్ట్ గ్రాడ్యుయేట్, పీజీ, సూపర్ స్పెషాలిటీ, నర్సింగ్, అనుబంధ ఆరోగ్య రంగాల్లో 1,300 మందికిపైగా విద్యార్థులతో సమగ్ర సంస్థగా ఎదిగింది. ప్రస్తుతం 650 పడకలున్నాయి."

- నారా లోకేశ్, మంత్రి

"వైద్య విద్య కోసం విదేశాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండానే దేశీయంగా విరివిగా వైద్య కళాశాలలు ఏర్పాటు చేస్తున్నాం. మంగళగిరి ఎయిమ్స్‌లోనూ ఆయుష్ సేవలు మరింత పరిపుష్టం చేస్తాం."

- అనుప్రియ పటేల్, కేంద్ర సహాయ మంత్రి

ఉత్తమ ప్రతిభ చూపినందుకు...

- డాక్టర్ యోగ్యతా పూజారి, విశాఖపట్నం

మంగళగిరి ఎయిమ్స్‌లో 2019 బ్యాచ్‌లో ఎంబీబీఎస్ పూర్తి చేశా. నాన్న పోలినాయుడు బిల్డర్, అమ్మ విజయ గృహిణి. సిద్ధాంతపరమైన పరిజ్ఞానాన్ని రోగులపై ప్రయోగిస్తూ.. క్లినికల్ నైపుణ్యాలు, చికిత్స చేసే విధానంలో ఉత్తమ ప్రతిభ చూపినందుకు బెస్ట్ ఇంటర్న్ కింద బంగారు పతకం అందించారు.

బెస్ట్ ఆల్‌రౌండర్‌గా ఎంపికయ్యా...

- డాక్టర్ విజయలక్ష్మి, రాజమహేంద్రవరం.

పరిశోధన, క్రీడలు, సాంస్కృతిక, ఇతర అంశాలను కూడా పరిగణనలోకి తీసుకుని బెస్ట్ ఆల్‌రౌండర్‌గా ఎంపిక చేసి బంగారు పతకం ఇచ్చారు. ఎయిమ్స్‌లో బోధన చాలా బాగుంది. ప్రస్తుతం గుంటూరు వైద్య కళాశాలలో ఎండీ డెర్మటాలజీ చేస్తున్నా. నాన్న రామకృష్ణారెడ్డి వ్యాపారి, అమ్మ విజయలక్ష్మి గృహిణి.

అన్ని పరీక్షల్లో అత్యధిక మార్కులు

- డాక్టర్ గౌతమ్ అంబటి, ఉంగుటూరు, ఏలూరు జిల్లా

వైద్యుడిగా స్థిర పడతానని ఇంట్లో చెప్పా. కాదనలేదు. అమ్మానాన్నలకిచ్చిన మాట నిలబెట్టడం కోసం కష్టపడి చదివా. 2019 బ్యాచ్‌లో ఎంబీబీఎస్ పూర్తి చేశా. అన్ని పరీక్షల్లో అత్యధిక మార్కులు వచ్చినందుకు అకడమిక్ ఎక్స్‌లెన్స్ కింద బంగారుపతకం దక్కింది. నాన్న తపాలా శాఖలో పని చేస్తారు.

ఫ్యామిలీ సర్వే సమగ్రంగా నిర్వహించండి

కానూరు : యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వే సమగ్రంగా నిర్వహించాలని మెప్మా పీడీ సాయిబాబు తెలిపారు. కానూరులో సచివాలయం, మెప్మా సిబ్బందితో మంగళవారం ఆయన సమావేశం నిర్వహించారు. వీలైనంత త్వరగా సర్వే పూర్తి చేయాలని సూచించారు.

(c) eenadu

మార్చి 15 లోపు 'ఉపాధి' పనులు పూర్తి చేయండి

కలెక్టరేట్(మచిలీపట్నం), న్యూస్‌టుడే: జిల్లా ఉపాధి హామీ పనులను మార్చి 15 నాటికి పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ డీకే బాలాజీ అధికారులకు స్పష్టం చేశారు. కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి మంగళవారం వీసీ ద్వారా అధికారులకు దిశానిర్దేశం చేశారు. క్షేత్రాధికారులతో పనుల పురోగతిని సమీక్షిస్తూ జిల్లా వ్యాప్తంగా రూ.108.44 కోట్ల అంచనా మేరకు ఉపాధి పనులు చేపట్టాల్సి ఉండగా ఇప్పటివరకు రూ.47 కోట్ల పురోగతి సాధించారని చెప్పారు. పూర్తి చేసిన పనుల్లో 43 శాతం బిల్లులను మాత్రమే చెల్లింపుల కోసం అప్లోడ్ చేశారన్నారు. మిగిలిన పనులను ఎట్టి పరిస్థితుల్లోనూ మార్చి 15 నాటికి పూర్తి చేసి అందుకు సంబంధించిన బిల్లులను అప్లోడ్ చేయాలని ఆదేశించారు. ప్రభుత్వం మంజూరు చేసే నిధులను మురిగి పోనీయకుండా సకాలంలో సద్వినియోగం చేసుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. డ్వామా పీడీ శివప్రసాద్, పంచాయతీరాజ్ ఎస్ఈ రమణరావు, ఏపీవోలు, డీఈఈలు, ఏఈలు వీసీలో పాల్గొన్నారు.

మాజీ సర్వేయర్ అక్రమాస్తుల కేసులో చర్యలు

పెనమలూరు, న్యూస్‌టుడే: అక్రమ ఆస్తుల ఆరోపణల నేపథ్యంలో అవినీతి నిరోధక శాఖ తనిఖీల్లో పట్టుబడ్డ పెనమలూరు మండల మాజీ సర్వేయర్ (ప్రస్తుతం మంగళగిరిలోని డైరెక్టర్ అండ్ సెటిల్‌మెంట్ కార్యాలయంలో సర్వేయర్) కొల్లి హరిబాబు కేసులో తదుపరి చర్యలకు రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి జి.సాయిబాబు మంగళవారం ఆదేశాలు జారీ చేశారు. అవినీతి నిరోధక శాఖ ఆయనపై నమోదు చేసిన పలు అభియోగాలపై పది రోజుల్లోగా తన వాదనలను రాతపూర్వకంగా తెలపాలని ఆదేశాల్లో పేర్కొన్నారు. రూ.1.44 కోట్ల అక్రమాస్తులు ఉండడం, ప్రభుత్వ అనుమతుల్లేకుండా, సమాచారం అందించకుండా స్థిరాస్తులు కొనుగోలు చేయడం, 1993 నుంచి 2004 వరకూ 2004, 2006ల్లో ఆస్తులు, ఆదాయాల వివరాలను ప్రభుత్వానికి సమాచారం అందించకపోవడం వంటి అభియోగాలపై హరిబాబు రాతపూర్వక వివరణ ఇవ్వాలని ముఖ్య కార్యదర్శి ఆదేశాల్లో తెలిపారు. హరిబాబుకు గన్నవరం, విజయవాడ పరిసర ప్రాంతాల్లో ఆస్తులు ఉన్నట్లు గతంలో ఏసీబీ అధికారులు అభియోగాలు నమోదు చేశారు.

రాజ్ కెసిరెడ్డి పిటిషన్‌పై విచారణ వాయిదా

ఈనాడు - అమరావతి: మద్యం కేసులో నిందితుడు రాజ్ కెసిరెడ్డి ఆస్తుల ఎటాచ్‌మెంట్ పిటిషన్‌పై విచారణ వాయిదా పడింది. రాజ్ కెసిరెడ్డి ఆస్తులను ఎటాచ్ చేసేందుకు గతంలో సిట్ దాఖలు చేసిన పిటిషన్. . మంగళవారం అనిశా కోర్టులో విచారణకు వచ్చింది. దీనిపై కౌంటర్ దాఖలు చేయాలని నిందితుడి తరఫు న్యాయవాదులను ఆదేశించింది. తదుపరి విచారణను ఈనెల 20కి వాయిదా పడింది.

హోరాహోరీగా మహిళా నెట్‌బాల్ పోటీలు

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: స్థానిక మారిస్ స్టెల్లా కళాశాలలో కృష్ణా వర్సిటీ ఆధ్వర్యంలో జరుగుతున్న అఖిల భారత అంతర్ విశ్వవిద్యాలయాల మహిళా నెట్‌బాల్ పోటీల్లో భాగంగా మంగళవారం జరిగిన పూల్ ఫైనల్స్ మ్యాచ్‌లు హోరాహోరీగా సాగాయి.
- పూల్ 'డి'లో డిఫెండింగ్ ఛాంపియన్‌గా నేరుగా బరిలోకి దిగిన సీహెచ్ చరణ్‌సింగ్ వర్సిటీ (ఉత్తర్‌ప్రదేశ్) జట్టును కాలికట్ వర్సిటీ (కేరళ) జట్టు మట్టికరిపించింది.
- పూల్ 'ఏ'లో నేరుగా పోటీకి దిగిన పంజాబ్ వర్సిటీ (చండీగఢ్) జట్టుకు సావిత్రిబాయి పులే వర్సిటీ (మహారాష్ట్ర) జట్టు షాకిచ్చింది.
- పూల్ 'బి'లో నేరుగా పోటీకి దిగిన దిల్లీ వర్సిటీ (దిల్లీ) జట్టును హేమచంద్ యాదవ్ విశ్వవిద్యాలయం (దుర్గ్) జట్టు ఓడించింది.
- పూల్ 'సి'లో జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో కవికులగురు కాళిదాస్ సంస్కృత విశ్వవిద్యాలయం (మహారాష్ట్ర) జట్టును కృష్ణా వర్సిటీ (ఆంధ్రప్రదేశ్) జట్టు ఓడించి లీగ్ దశలోకి అడుగుపెట్టింది.
- సాయంత్రం ప్రారంభమైన లీగ్ పోటీల్లో కాలికట్, సావిత్రిబాయి పులే వర్సిటీ జట్లు శుభారంభం చేశాయి. కాలికట్ వర్సిటీ... కృష్ణా వర్సిటీ జట్టుపై గెలిచింది. సావిత్రిబాయి పులే, హేమచంద్ యాదవ్ వర్సిటీ జట్ల మధ్య హోరాహోరీగా పోటీ సాగింది. చివరికి సావిత్రిబాయి పులే జట్టు విజయం సాధించింది. లీగ్ పోటీలకు ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్, వర్సిటీ ఉపకులపతి ఆచార్య కూన రాంజీ, కళాశాల ప్రిన్సిపల్ సిస్టర్ జి. ఇన్నాసమ్మ హాజరై క్రీడాకారిణులను పరిచయం చేసుకున్నారు.

పది కేంద్రానికి చేరుకోవడమే ఓ పరీక్ష

సీబీఎస్ఈ విద్యార్థులకు పదో తరగతి పరీక్షలు మంగళవారం ప్రారంభమయ్యాయి. ఆటో నగర్ - కానూరు మధ్యనున్న కేసీపీ సిద్ధార్థ రెసిడెన్షియల్, స్కాట్‌స్పైన్ ఇంటర్నేషనల్ పాఠశాలల్లో పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఎక్కువ మంది తల్లిదండ్రులు కార్లలో, ద్విచక్రవాహనాలపై, పాఠశాలల యాజమాన్యాలు బస్సుల్లో విద్యార్థులను కేంద్రాలకు తీసుకురావడంతో ఒక్కసారిగా పెద్ద సంఖ్యలో ట్రాఫిక్ నిలిచిపోయింది. గంటల తరబడి వాహనాలు కదలలేదు. చేసేది లేక విద్యార్థులు వాహనాలు దిగి ట్రాఫిక్ నుంచి నడుచుకొని పరీక్షా కేంద్రానికి చేరుకున్నారు. కేంద్రాలు ఎక్కడెక్కడ ఏర్పాటు చేశారో గుర్తించి, పరీక్షలు పూర్తయ్యే వరకు ఆయా రహదారుల్లో ట్రాఫిక్ నిలిచిపోకుండా పోలీసులు చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు కోరుతున్నారు. **- ఈనాడు, అమరావతి**

ఆటోనగర్ - కానూరు రహదారిపై భారీగా నిలిచిన వాహనాలు, నడుచుకొని పరీక్షా కేంద్రానికి వస్తున్న విద్యార్థులు

ఉత్సవమూర్తులు

స్ఫటిక మాలలతో అభిషేకం

ముగిసిన సంగమేశ్వరుడి బ్రహ్మోత్సవాలు

సంగమేశ్వరం(నాగాయలంక), న్యూస్‌టుడే: సంగమేశ్వరుడి వసంతోత్సవం నేత్రపర్వంగా జరిగింది. గ్రామంలో వేంచేసి ఉన్న గంగా పార్వతి సమేత సంగమేశ్వర స్వామి వారి బ్రహ్మోత్సవాలు మంగళవారం కోలాహలంగా ముగిశాయి. ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించిన వాహనంలో ఉంచి భక్తులు, గ్రామస్థులు రంగునీళ్ల పరస్పరం చల్లుకుంటూ పురవీధుల్లో స్వామివారిని ఊరేగించారు. అనంతరం సముద్ర విహారయాత్రకు తీసుకు వెళ్లి స్నానం చేయించి ఆలయానికి తీసుకొచ్చి ప్రత్యేక పూజలు చేశారు.

జేఈఈ మెయిన్స్‌లో అవనిగడ్డ విద్యార్థి ప్రతిభ

అవనిగడ్డ, న్యూస్‌టుడే: స్థానిక ఒకటో వార్డుకు చెందిన విశ్వనాధుని రమేష్, యలవర్తి నగరాజకుమారిల చిన్న కుమారుడు జయంత్ సాయి జేఈఈ మెయిన్స్‌లో 99.78 పర్సంటైల్ సాధించి సత్తా చాటాడు. అవనిగడ్డలో 8వ తరగతి వరకు చదివాడు. ఇంటర్ మొదటి సంవత్సరంలో 470కి 464 మార్కులు సాధించాడు. ఐఐటీ సీటు సాధించడమే లక్ష్యంగా పేర్కొన్నాడు.

జయంత్ సాయి

కేంద్రం చుట్టూ అల్లుకుపోయిన తీగ

మంగళవారం ఓ వ్యక్తి మద్యం తాగుతూ...

నిర్లక్ష్యం ముంచెత్త.. సంపద సృష్టి ఎట్లా?!

తోట్లవల్లూరు మండలం తోట్లవల్లూరు గ్రామంలో 2018లో ఉపాధి హామీ పథకం, స్వచ్ఛభారత్‌లో భాగంగా చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. తర్వాత దీని నిర్వహణను గాలికి వదిలేయడంతో ప్రస్తుతం మందుబాబులకు అడ్డాగా మారింది. చెత్తను బయటే వేసి తగులబెడుతున్నారు కానీ.. గ్రేడింగ్ చేసి సంపద తయారీకి ఉపయోగించడం లేదు. ఎక్కడ చూసినా తాగి వదిలేసిన మద్యం సీసాలే కనిపిస్తున్నాయి. ఉపయోగంలోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు. **- ఈనాడు కృష్ణా**

చెత్త గ్రేడింగ్ చేసే చోట మద్యం సీసాల కుప్ప

19న ఏపీ ట్రెజరీ, అకౌంట్స్ అసోసియేషన్ ఎన్నికలు

విజయవాడ(గాంధీనగర్): ఆంధ్రప్రదేశ్ ట్రెజరీ, అకౌంట్స్ గెజిటెడ్ సర్వీసెస్ అసోసియేషన్ రాష్ట్ర సంఘం ఎన్నికలు ఈ నెల 19వ తేదీన గాంధీనగర్‌లోని ఏపీ ఎన్జీవో భవన్‌లో నిర్వహిస్తున్నట్లు ఎన్నికల అధికారి ఎం.జె.వసు దాసు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అధ్యక్షుడు, అసోసియేట్ అధ్యక్షుడు, ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శి, ఆర్గనైజింగ్ కార్యదర్శి, కార్యదర్శులు తదితర 17 పదవులకు ఎన్నికలు జరుగుతాయని చెప్పారు. ఓటర్ల జాబితాను ఈ నెల 2న విడుదల చేసినట్లు తెలిపారు. 19వ తేదీ ఉదయం 9 గంటల నుంచి 10:30 వరకు నామినేషన్ల స్వీకరణ, 12.15 వరకు నామినేషన్ల ఉపసంహరణ, మధ్యాహ్నం 12.30కి పోటీదారుల తుది జాబితా విడుదల చేస్తామన్నారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 వరకు పోలింగ్ జరుగుతుందని వివరించారు. అనంతరం ఓట్ల లెక్కింపు, ఫలితాలు వెల్లడిస్తామని తెలిపారు. అసోసియేషన్ సభ్యులు నిర్ణీత షెడ్యూలును పాటించి, ఎన్నికల ప్రక్రియలో పాల్గొనాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

18న వరుణ్ బజాజ్‌లో ఉద్యోగాలకు ఎంపిక

కలెక్టరేట్(మచిలీపట్నం), న్యూస్‌టుడే: జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ, సీడాప్ ఆధ్వర్యాన కృష్ణా, ఎన్టీఆర్, ఉభయ గోదావరి జిల్లాల్లోని వరుణ్ మోటార్స్‌లో ఉద్యోగాలకు ఈనెల 18న ఎంపిక నిర్వహిస్తున్నట్లు గ్రామీణాభివృద్ధి సంస్థ పీడీ హరిహరనాథ్ తెలిపారు. సేల్స్ ఎగ్జిక్యూటివ్, క్యాషియర్, ఎలివేటర్ సర్వీస్ ఎడ్వైజర్, బ్రాంచి మేనేజర్ ఉద్యోగాల కోసం విజయవాడ బెంజి సర్కిల్ వద్ద ఉన్న వరుణ్ బజాజ్ షోరూంలో ఎంపిక ప్రక్రియ ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నిర్వహిస్తారన్నారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు విద్యార్హత సర్టిఫికెట్లు, ఆధార్, రేషన్ కార్డులు, రెండు పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోలతో హాజరు కావాల్సిఉంటుంది. ఇతర వివరాలకు 92901 11349, 99125 57054 నంబర్లను సంప్రదించవచ్చన్నారు.

విద్యార్థులకు మేలు చేకూర్చేలా ప్రపంచ వర్సిటీలతో ఒప్పందాలు

కృష్ణా యూనివర్సిటీ ఉపకులపతి రాంజీ వెల్లడి

రుద్రవరం(మచిలీపట్నం గ్రామీణ), న్యూస్‌టుడే: విద్య, ఉపాధి, సాంస్కృతిక, క్రీడారంగాల్లో కృష్ణా విశ్వవిద్యాలయాన్ని అభివృద్ధిపథంలో నడిపించడమే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నట్లు ఉపకులపతి కూన రాంజీ తెలిపారు. కృష్ణా విశ్వవిద్యాలయ ఉపకులపతిగా బాధ్యతలు స్వీకరించి ఏడాది పూర్తయిన సందర్భంగా మంగళవారం ఆయన విలేకరుల సమావేశం ఏర్పాటుచేశారు. విద్యార్థులను నైతిక విలువలతో కూడిన విద్యతోపాటు అంతర్జాతీయ సమాజానికి అవసరమైన నైపుణ్యాలను అందించేందుకు ప్రపంచంలోని పలు యూనివర్సిటీలతో ఒప్పందం కుదుర్చుకున్నామన్నారు. విద్యాపరమైన అనేక విషయాల మార్పిడికి జపాన్‌లోని తోయామ విశ్వవిద్యాలయంతో, ఆవిష్కరణ, పరిశోధన, విద్యార్థులు, సిబ్బంది ఎక్స్ఛేంజ్, శిక్షణ కార్యక్రమాల కోసం స్వీడన్‌కు చెందిన లైనస్ విశ్వవిద్యాలయంతో ఎంవోయూ చేసుకున్నట్లు తెలిపారు. రక్షణ, సాంకేతిక నైపుణ్యాలు, శిక్షణ, ఉపాధికి సంబంధించి పలు సంస్థలతోనూ పలు యూనివర్సిటీలతో ఎంవోయూలు చేసుకున్నట్లు చెప్పారు.

విస్తృత ఉద్యోగ అవకాశాల కల్పన: గత ఏడాది విశ్వవిద్యాలయానికి చెందిన విద్యార్థులకు 200 శాతం ఉద్యోగాలు కల్పించామని, ఒక్కొక్కరికి 4- 5 ఉద్యోగాలు లభించినట్లు వివరించారు. మచిలీపట్నంలో పోర్టు నిర్మాణంతోపాటు పలు లాజిస్టిక్ కంపెనీలు రానున్నందున వాటికి అవసరమైన మ్యాన్‌పవర్ అందించేలా సర్టిఫికెట్ కోర్సులను ప్రారంభించబోతున్నామని వెల్లడించారు. విద్యార్థినుల వసతిగృహం, ఫార్మసీ కళాశాల భవనం, ఫుడ్ కోర్టులను ఏప్రిల్‌లో ప్రారంభిస్తామని చెప్పారు. విద్యార్థుల వసతిగృహం, ఇంజినీరింగ్ కళాశాల భవనాలను 2027 నాటికి అందుబాటులోకి తెచ్చేలా ప్రణాళిక రూపొందిస్తున్నామని చెప్పారు. జాతీయ స్థాయి నెట్‌బాల్ పోటీలతో పాటు ఇప్పటికి 15 క్రీడ ఈవెంట్లను విశ్వవిద్యాలయం చేపట్టిందన్నారు. నెట్‌బాల్ పోటీల్లో విశ్వవిద్యాలయ జట్టును నాలుగో స్థానంలో నిలిపిన కోచ్‌లకు అభినందనలు తెలిపారు. డిసెంబర్‌లో నిర్వహించిన కృష్ణాతరంగాలులో విశ్వవిద్యాలయ విద్యార్థులు 14 బహుమతులను సాధించారన్నారు. యూనివర్సిటీ భూముల ఆక్రమణలపై జిల్లా ఎస్పీకి, గూడూరు పోలీస్ స్టేషన్‌లోనూ ఫిర్యాదు చేశామని వెల్లడించారు. గ్రామీణ నీటి సరఫరా పథకం ద్వారా కృష్ణా నది నుంచి యూనివర్సిటీకి రోజుకు రెండు లక్షల లీటర్లు అందేలా ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు. సమావేశంలో రెక్టర్ ఎం.వి.బసవేశ్వరరావు, రిజిస్ట్రార్ ఆచార్య ఉష పాల్గొన్నారు.

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న రాంజీ

పకడ్బందీగా పదో తరగతి పరీక్షల నిర్వహణ

కలెక్టరేట్(మచిలీపట్నం): పదో తరగతి పబ్లిక్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ డీకే బాలాజీ సూచించారు. పరీక్షల నిర్వహణపై కలెక్టరేట్‌లో సోమవారం సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. జిల్లా వ్యాప్తంగా 148 పరీక్షా కేంద్రాల్లో మార్చి 16 నుంచి ఏప్రిల్ 1 వరకు పరీక్షలు నిర్వహించనున్నారు. పబ్లిక్ పరీక్షకు 11,941 మంది బాలురు, 10,291 మంది బాలికలు మొత్తం 22,232 మంది హాజరవుతారన్నారు. అవసరం మేరకు చీఫ్ సూపరింటెండెంట్, డిపార్ట్‌మెంటల్ అధికారులు, రూట్ ఆఫీసర్లు, స్టోరేజ్ పాయింట్ ఆఫీసర్లు, ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు, ఇన్విజిలేటర్లను నియమించినట్లు తెలిపారు. విద్యార్థులతో పాటు ఇన్విజిలేటర్లు, ఇతర సిబ్బంది పరీక్షా కేంద్రాల్లోకి సెల్‌ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలు తీసుకెళ్లరాదన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద జిరాక్స్ కేంద్రాలు మూసి ఉంచాలని, ఆయా కేంద్రాల వద్ద 144 సెక్షను అమలు చేయాలన్నారు. విద్యార్థులకు పరీక్షా కేంద్రాల రూట్లలో ఆర్టీసీ సర్వీసులు నిర్వహించాలన్నారు. పదో తరగతి పరీక్షలకు సమాంతరంగా నిర్వహించే ఓపెన్ స్కూల్ పదో తరగతి, ఇంటర్‌కు 2,235 విద్యార్థులు హాజరవుతారన్నారు. డీఆర్వో చంద్రశేఖరరావు, ఏఎస్పీ వీవీ నాయుడు, డీఈవో యూవీ.సుబ్బారావు, ప్రజారవాణా అధికారి వెంకటేశ్వర్లు, కమిషనర్ బాపిరాజు, తదితరులు సమావేశంలో పాల్గొన్నారు.

సకాలంలో అసలు చెల్లిస్తే రూ.6.08 కోట్ల వడ్డీ మాఫీ

కలెక్టరేట్(మచిలీపట్నం): షెడ్యూల్ కులాల సేవా సహకార సంఘం ద్వారా మంజూరు చేసిన ఎన్ఎస్ఎఫ్‌డీసీ, ఎన్ఎస్‌కేఎఫ్‌డీసీ రుణాలకు సంబంధించి అసలు సకాలంలో చెల్లిస్తే రుణగ్రహీతలకు రూ.6.08 కోట్ల వడ్డీ మాఫీ ప్రయోజనం దక్కుతుందని సంఘ కార్యనిర్వాహక సంచాలకులు రమేష్ తెలిపారు. ఆయా పథకాల రుణగ్రహీతలు బకాయి పడిన అసలు మొత్తాన్ని ఈ ఏడాది ఏప్రిల్ 30 నాటికి చెల్లిస్తే 2025 డిసెంబరు 31 నాటికి వారి రుణఖాతాల్లో జమచేసిన వడ్డీని పూర్తిగా రద్దు పరిచే వెసులుబాటును ప్రభుత్వం కల్పించిందన్నారు. జిల్లాలో ఎన్ఎస్ఎఫ్‌డీసీ ద్వారా 359 మంది లబ్ధిదారులు రూ.6.85 కోట్లు, ఎన్ఎస్‌కేఎఫ్‌డీసీ పథకం ద్వారా 255 మంది రూ. 4.77 కోట్లు రుణం తీసుకున్నారని తెలిపారు.

ఎడ్ల పూటీ లాగు పోటీల్లో విజేత పెద్దపూడి జత

నందిగామ గ్రామీణం, న్యూస్‌టుడే: ఎన్టీఆర్ జిల్లా నందిగామ మండలం దాములూరులో మంగళవారం రాత్రి తెలుగు రాష్ట్రాల స్థాయి ఎడ్ల పూటీ లాగు పోటీలు రసవత్తరంగా సాగాయి. తొలి రోజు సీనియర్ విభాగంలో రెండు క్వింటాళ్ల బరువున్న పూటీని పది నిమిషాల్లో లాగేలా నిర్వహించిన పోటీల్లో బాపట్ల జిల్లా అమృతలూరు మండలం పెద్దపూడి గ్రామానికి చెందిన ఆళ్ల హరి కృష్ణయాదవ్ ఎడ్ల జత 4842 అడుగుల దూరం లాగి ప్రథమంగా నిలిచాయి. బాపట్ల జిల్లా చెరుకుపల్లి మండలం పగడంవారిపాలెనికి చెందిన కుంచల వేదశ్రీలతారెడ్డి ఎడ్లజత 4465 అడుగుల దూరం లాగి ద్వితీయస్థానం, బాపట్ల జిల్లా చిన్నగంజాం మండలం ఆవులదొడ్డి కొత్తపాలెం గ్రామానికి చెందిన గోగినేని జ్ఞానసాయి చౌదరి ఎడ్లజత 4451 అడుగుల దూరంలాగి తృతీయ స్థానంలో నిలిచాయి. కృష్ణా జిల్లా తోట్లవల్లూరు మండలం కల్లం వారిపాలెం గ్రామానికి చెందిన కల్లం విజయలక్ష్మి ఎడ్ల జత 3936 అడుగుల దూరం లాగి నాలుగో స్థానం, కృష్ణా జిల్లా బాపులపాడు మండలం శోభనాద్రిపురం గ్రామానికి చెందిన కొలుసు జస్వంత్ యాదవ్ ఎడ్లజత 3706 అడుగులదూరం లాగి అయిదోస్థానంలో నిలిచాయి. మొత్తం తొమ్మిది జతల ఎడ్లు పోటీల్లో తలపడ్డాయి. విజేతలకు వరుసగా దాల సౌజన్యంతో రూ.35 వేలు, రూ.30 వేలు, రూ.25 వేలు, రూ.20 వేలు, రూ.15 వేలు వంతున నగదు ప్రోత్సాహకాలు, జ్ఞాపికలను అందజేశారు.

ప్రథమంగా నిలిచిన పెద్దపూడి ఎడ్ల జత

నకిలీ మద్యం కేసులో సుదర్శన్‌కు బెయిల్

ఈనాడు - అమరావతి: నకిలీ మద్యం కేసులో నిందితుడు సుదర్శన్ (ఏ21)కు కోర్టు బెయిల్ మంజూరు చేసింది. గత వారం బెయిల్ పిటిషన్లపై ఇరుపక్షాల వాదనలు పూర్తయ్యాయి. దీనిపై మంగళవారం నగరంలోని ఎక్సైజ్ కోర్టు న్యాయాధికారి బెయిల్ ఇస్తూ తీర్పు ఇచ్చారు. ఒక్కొక్కటి రూ.25 వేలు చొప్పున రెండు పూచీకత్తులు సమర్పించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఇదే కేసులో నిందితుడైన సెంథిల్ (ఏ22) కస్టడీ పిటిషన్‌పై నిందితుడి న్యాయవాది కౌంటర్ దాఖలు చేసేందుకు ప్రత్యేక పీపీ నోటీసులు ఇచ్చారు. తదుపరి విచారణకు ఈనెల 19కి వాయిదా పడింది. ● సెంథిల్ తనకు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ పిటిషన్ దాఖలు చేశాడు. ప్రాసిక్యూషన్‌కు నోటీసుల నిమిత్తం కేసును 19వ తేదీకి వాయిదా వేశారు.

భూ సర్వేలో రైతులకు ఇబ్బందుల్లేకుండా చూస్తాం

కలెక్టర్ బాలాజీ

సాలెంపాలెం(కోడూరు), న్యూస్‌టుడే: ప్రభుత్వం చేపట్టిన భూసర్వేలో భూమిపై నిజంగా ఉన్న రైతును నిజనిర్ధారణ చేసి నిబంధనల ప్రకారం రైతులకు ఎలాంటి ఇబ్బందుల్లేకుండా చూస్తామని జిల్లా కలెక్టర్ డీకే.బాలాజీ అన్నారు. కోడూరు మండలం సాలెంపాలెంలో జరుగుతున్న భూ సర్వేను మంగళవారం పరిశీలించారు. రెవెన్యూ అధికారులు రైతులకు నోటీసులు ఇచ్చి ఆ ప్రకారమే హాజరై సర్వే చేస్తున్నారని రైతులు సంతృప్తి వ్యక్తం చేశారని కలెక్టర్ తెలిపారు. కొంతమంది రైతుల పొలాలు 22(ఏ)ల్లో ఉండడం వల్ల ఇబ్బందులు పడుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టిలో పెట్టామని, ప్రభుత్వం దీనిపై సానుకూలంగా ఉన్నట్లు కలెక్టర్ ప్రకటించారు.

కరకోడు పూడికతీత తీయించండి: కోడూరు మండల పరిధిలోని సాలెంపాలెం అవుట్‌ఫాల్ స్లూయిస్ వద్ద నుంచి పిట్టల్లంక కరకట్ట వెంబడి ఉన్న కరకోడు డ్రెయినేజీలో ఆక్వా రైతులు తూములు వేసి పూడ్చటం వలన పూడిపోయి ఉప్పునీటి ప్రభావానికి 750 ఎకరాల రైతులు నష్టపోతున్నారని కలెక్టర్‌కు విన్నవించారు. దీనిపై క్షేత్రస్థాయిలో ఉన్న సమస్యను పరిశీలించి నివేదికను వెంటనే అందించాలని కలెక్టర్ సంబంధిత శాఖాధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో పోతురాజు, జిల్లా అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ సర్వే పి.లక్ష్మణరావు, తహసీల్దార్ జలగం సౌజన్య కిరణ్మయి, అధికారులు పద్మప్రియ, కె.శివ, నేతలు మర్రే గంగయ్య, సర్పంచి కనగాల వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

అధికారులకు సూచనలిస్తున్న కలెక్టర్ బాలాజీ

బ్రాయిలర్ ధరలు (కిలో 1కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -115 రిటైల్ ధర 142 చికెన్ విత్ స్కిన్ - 206 చికెన్ స్కిన్‌లెస్ - 234.
అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 128, 137, 148 చికెన్ విత్ స్కిన్ - 240 చికెన్ స్కిన్‌లెస్ - 250.

చదువుతోపాటు క్రీడలకు ప్రాధాన్యం ఇవ్వాలి

మచిలీపట్నం(కోనేరుసెంటరు), న్యూస్‌టుడే: చదువుతో పాటు క్రీడలకు సమ ప్రాధాన్యం ఇవ్వాలని ఏఎస్పీ సత్యనారాయణ విద్యార్థులకు సూచించారు. జిల్లా క్రీడాప్రాధికార సంస్థ ఆధ్వర్యాన మంగళవారం ఈడేపల్లి ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన జిల్లా స్థాయి చదరంగ పోటీలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. చదరంగం ఆలోచనా శక్తి, సహనం, నిర్ణయ సామర్థ్యాలను అభివృద్ధి చేస్తుందన్నారు. ముందుచూపుతో ఆలోచించే విధానం అలవడుతుందన్నారు. చదరంగ పోటీల్లో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభ చాటిన క్రీడాకారులను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ ఛైర్మన్ గొర్రెపాటి గోపీచంద్, జిల్లా క్రీడాధికారి కె.ఝాన్సీలక్ష్మి, స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి మత్తి అరుణ తదితరులు పాల్గొన్నారు. జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన 155 మంది పోటీల్లో పాల్గొనగా 16 మంది రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వీరు ఈనెల 21, 22 తేదీల్లో తిరుపతిలో నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారు.

మాట్లాడుతున్న ఏఎస్పీ సత్యనారాయణ

చదరంగ పోటీల్లో విద్యార్థులు

APSRTC
టెండరు ప్రకటన పల్లె వెలుగు

కృష్ణా జిల్లాలోని వివిధ డిపోల పరిధిలో గల బస్‌స్టేషన్లలో స్టాల్స్/షాపులు/క్యాంటిన్/ఫాస్ట్‌ఫుడ్స్ మొ॥ వ్యాపారములు నిర్వహించుటకు మరియు క్లాడెడ్ పిల్లర్లపై ప్రకటనలు ఇచ్చుటకు అనుభవము, ఆసక్తి కలిగిన వ్యాపారస్తుల నుండి సీల్డు టెండర్లు ఆహ్వానించడమైనది. (1) టెండరు ఫారములు సంబంధిత డిపో మేనేజర్ల వారి కార్యాలయములలో తేది. 18-02-2026 నుండి 26-02-2026 వరకు ఉ॥గం॥10.30 ని॥ల నుండి సా॥05.00 గం॥ల వరకు అన్ని ఆఫీస్ పనిదినములలో అమ్మబడును. 2) పూర్తిచేసిన టెండరు ఫారములు తేది.27-02-2026న ఉ॥గం॥10.30 ని॥ల నుండి మ॥ 2.00 గంటలలోగా జిల్లా ప్రజా రవాణా అధికారి వారి కార్యాలయం, మచిలీపట్నం నందు ఏర్పాటుచేసిన టెండరు బాక్సులో వేయవలెను. అదేరోజు మ.3.00 గం॥లకు టెండరుదారుల సమక్షములో టెండర్లు తెరవబడును. (3) పూర్తి వివరములకు మా వెబ్‌సైట్ :http://www.apsrtc.ap.gov.in(tenders) ను చూడగలరు. (4) ఎట్టి కారణము చూపకుండానే టెండర్లు అంగీకరించుటకు లేదా తిరస్కరించుటకు APSRTC కి పూర్తి అధికారము కలదు.

నెం.O1/797(01)/2026-DPTO/KRI, తేది:17.02.2026 సం/- జిల్లా ప్రజా రవాణా అధికారి, మచిలీపట్నం, కృష్ణా జిల్లా.

శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి వార్ల దేవస్థానం
శ్రీశైలం-518 101, నంద్యాల జిల్లా.
SRISAILA DEVASTHANAM
ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన

ఆర్.సి.నెం.ఐ4/444814/2026 08-02-2026

శ్రీశైల దేవస్థానము సంబంధించి 2026-27 అనగా 01-05-2026 నుండి 30-04-2027 వరకు ఈ దేవస్థానమునకు అవసరమైన (1) ఎం.వి.ఫామ్స్, (2) స్టేషనరీ వస్తువులు మరియు బయోడిగ్రేడబుల్ కవర్లు సరఫరా చేయుటకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండర్లు కోరబడుచున్నవి. తేది: 20-02-2026 నుండి టెండరు షెడ్యూళ్లను డౌన్‌లోడ్ చేసుకొనవచ్చును.

టెండరు నిబంధనలు మరియు పూర్తి వివరములకు www.apeprocurement.gov.in ద్వారా తెలుసుకొనగలరు. అవసరమైన సమాచారము కొరకు 99634 40246, 94413 35756 కార్యాలయ వేళలలో సంప్రదించవచ్చును.

శ్రీ స్వామి అమ్మవార్ల సేవలో...

యం.శ్రీనివాస రావు, స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ మరియు కార్యనిర్వహణాధికారి

91.9 FM Vijayawada ఈ FM 91.9 Mee FM
ఈఎఫ్ఎమ్ కార్యక్రమాలు
సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ. 5 - ఉ. 7
ఈ-మార్నింగ్స్	ఉ. 7 - ఉ. 11
నువ్వా నేనా	ఉ. 11 - మ. 2
సత్యభామ	మ. 2 - సా. 5
లైట్ తీస్కో	సా. 5 - రా. 9
సరదాగా కాసేపు	రా. 9 - రా. 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా. 12 - తె. 5

/Eenadufm
For Advertising on Eenadu FM Contact 8008003297

EENADU Classifieds

BUSINESS SERVICES

బంగారం కొనబడును. బ్యాంకులలో ఇతరప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీబంగారం విడిపించి ఈరోజు మార్కెట్ ధరకు కొనబడును. స్పాట్‌క్యాష్ ✆81422 92071

బంగారం కొనబడును. బ్యాంకులలో ఇతర ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీబంగారం విడిపించి అధిక ధరకు కొనబడును (స్పాట్ క్యాష్). ✆ 87907 41166

FINANCIAL SERVICES

స్థిరాస్తులపై ఆంధ్రప్రదేశ్ అంతటా మార్ట్‌గేజ్ లోన్స్ మరియు స్థిరాస్తి ఎక్కడ ఉన్నా ఏసంస్థలో ఉన్నా Xerox పేపర్స్‌పై 2nd మార్ట్‌గేజ్ లోన్ ఇవ్వబడును. 50లక్షలులోపు, అయోధ్య కోఆపరేటివ్ బ్యాంక్. ✆ 93969 99669.

REAL ESTATE

FLAT FOR SALE

బందరురోడ్డు, పప్పుల మిల్లు సెంటర్ కాస TVS ప్రక్కన నిర్మించిన 3BHK ఫ్లాట్స్ గృహప్రవేశమునకు సిద్ధముగా వున్నవి. సంప్ర ✆ 94940 51157

BOOK YOUR COLOUR CLASSIFIED ₹1200/- (5 Lines) PH: 98496 97616
ప్రకటనలపై జి.ఎస్.టి. 5% అదనం

HOUSE FOR SALE

గుడివాడ 200 గజాలు, నీలామహల్ దగ్గరలో సూరంవారి వీధి నందు రెండు అంతస్తులు ఇంటితో అమ్మకానికి కలదు. గజం- 75 వేలు. సంప్ర: 81064 03490

PLOT FOR SALE

గజం 11999/- బందర్ రోడ్‌లో 80 ఎకరాల గేటెడ్‌కమ్యూనిటీ స్పోర్ట్స్, స్విమ్మింగ్‌పూల్, హౌసింగ్ 46L గవర్నమెంట్ ఆఫీసులకు దగ్గరలో. ✆ 99495 05050

JOBS

విజయవాడలో కరెంటు మీటర్లు మార్చుటకు అనుభవం కలిగిన ఎలక్ట్రీషియన్స్ కావలెను. వీక్లీ పేమెంట్స్. చదువు అవసరం లేదు. ✆ 97035 51122.

ప్రైవేట్ ప్రీమియం సెలబ్రేషన్ కంపెనీలో సర్వీస్ సపోర్ట్ అసోసియేట్స్ కావలెను. వయస్సు: 20-28. ఇంటర్, పైచదువు పూర్తిచేసిన వారు అప్లై చేయవచ్చు. ఈవెంట్ సెటప్; క్లయింట్ హ్యాండ్లింగ్, టీమ్‌తో సమన్వయం చేయగలగాలి. మాసిక వేతనం ₹ 12000+పనితీరు ఆధారిత బోనస్, గ్రోత్. ✆: 9705054262.

Engineering EEE /Diploma (Boys) ★ Computer Operator Female ★ Office Administrators. Switch Gears, Enikepadu. ✆ 99081 78777

Wanted DRA Tele Callers, Field Executives & Team Leaders Banking Sector Attractive Salaries and Incentives, ✆ 98493 94835, 70753 45527.

Wanted Teachers for Reputed Schools in A.P & Telangana, Contact: Sneha Placements Service. Ph: 94402 46409.

PROs, Marketing Managers Required. Salary: 27,500/-., NTR Circle, Vijayawada. ✆ 63043 28479.

Teaching Staff for Hotel Management College, Vijayawada FO, HK. Service, Kitchen Department, Salary Depend On Experience. Accommodation Available. ✆ 72888 85598.

Wanted Assistant Accountants B.com. Grad. with Tally Knowledge for Office in VJA, Near NTR Circle. Exp. -1 to2Yrs. Freshers can apply ✆ 94910 30372

Gujarat నిస్సానగర్‌లో ఉన్న హాస్టల్‌లో పనిచేయుటకు చెఫ్, మాస్టర్ చెఫ్, హెల్పర్స్ కావలెను. మెన్ కాంట్రాక్ట్‌కి ఇవ్వబడును. సం॥ 95057 01977.

విజయవాడ ప్లాస్టిక్ పరిశ్రమ నందు పనిచేయుటకు హెల్పర్స్ కావలెను. అర్హత: 10th, ఇంటర్, ITI, డిప్లొమా. Email: infoampp2016@gmail.com ✆ 62810 45178. అడ్రస్: అమరావతి పాలీప్యాక్, D.No: 25-38, 4వ క్రాస్ రోడ్, కబేళా, VJA-12.

త్రినేత్ర హోంకేర్‌లో వృద్ధులను/ పేషెంట్స్‌ను/ పిల్లలను చూసుకొనుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఫ్రీ వసతి, భోజనం. జీ: 18K. ✆ 85209 80099, 85208 74499

శ్రీ వెంకటేశ్వర రైస్ ఆగ్రో ఇండస్ట్రీస్ నందిగామ, కృష్ణాజిల్లా. నూకలు,బియ్యం ట్రేడింగ్ ప్రారంభిస్తున్నాము. అనుభవమున్న స్టాఫ్ కావలెను. శాలరీ+ కమీషన్. 8977927069/ 17069, 98481 57069.

ఆటోడ్రైవర్, డెలివరీ బాయ్స్, లేడీ ఆఫీస్ స్టాఫ్ కావలెను. LIC కాలనీ, రమేష్ హాస్పిటల్ రోడ్, విజయవాడ. సంప్రదించండి .✆ 92466 33459

విజయవాడ ఎనికేపాడులో ప్రముఖ సంస్థ నందు పని చేయుటకు ★ అకౌంటెంట్ ★ లేడీ ఫ్రంట్ ఆఫీస్ ఎగ్జిక్యూటివ్ ★ ఆఫీస్ బాయ్ కావలెను. ✆ 83673 36633

అకౌంటెంట్ కమ్‌ఆఫీసు అసిస్టెంట్ కావలెను. బి.కామ్.3 సం॥లు కంప్యూటర్ అకౌంట్స్‌పై అనుభవం, తెలుగు, ఇంగ్లీష్ భాషలపై పరిజ్ఞానం, రెజ్యూములను kamathamjob@gmail.com కు పంపగలరు.

బిజినెస్ ఎగ్జిక్యూటివ్స్/బిజినెస్ మేనేజర్స్ కావలెను. డిగ్రీ, 5 సం॥ల మార్కెటింగ్ రంగంలో అనుభవం, 30 సం॥ల లోపు వారు రెజ్యూములను kamathamjob@gmail.com కు పంపగలరు.

హరేకృష్ణ హోంకేర్‌లో వృద్ధులను/ పేషెంట్స్/ పిల్లలను చూసుకొనుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఫ్రీవసతి, భోజనం జీ:18-20K ✆ 96404 68899, 96402 58899

ప్రముఖ ఆటోఫైనాన్స్ ఆఫీస్ నందు కంప్యూటర్ అనుభవంగల టెలీకాలర్స్(లేడీ) &కలెక్షన్ ఎగ్జిక్యూటివ్స్ (డిగ్రీ, 2వీలర్) కావలెను. ✆ 99495 58181, 81215 58181

సూరంపల్లి కొత్త ఆటోనగర్ ఏరియాలో పనిచేయుటకు సెక్యూరిటీగార్డ్స్ కావలెను 12గం॥ డ్యూటీ శాలరీ: 15వేలు+ P+ESI, అర్హత: 10th,50సం॥ లోపు. ✆ 88014 97437

SSS కంపెనీలో పనిచేయుటకు లేడీస్ & జెంట్స్ కావలెను. మంచి జీతం మరియు అలవెన్సు. టెన్త్ క్లాస్ & above, VJA. ✆ 93985 53721.

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

మచిలీపట్నం

•మచిలీపట్నం •పెడన

ప్రమాదాలతో జీవితం దుర్లభం

తోటమూల జంక్షన్‌లో ప్రదర్శనకు ఉంచిన ఆటో

పెడన, న్యూస్‌టుడే: రహదారి ప్రమాదాలు జీవితాలను దుర్భరం చేస్తాయని ఎస్సై- 2 ఎస్‌కే బషీర్ అన్నారు. ప్రమాదాలపై అవగాహన కల్పించేందుకు స్థానిక తోటమూల జంక్షన్‌లో జాతీయ రహదారి- 216పై గతంలో ప్రమాదానికి గురైన ఆటోను రేడియం స్టిక్కర్లు అంటించి ప్రదర్శనకు ఉంచారు. ఒంగోలు- కత్తిపూడి జాతీయ రహదారిపై ప్రమాదాలు పెరుగుతున్నందున పెడన పోలీసు స్టేషన్ పరిధిలో పూర్తిగా నియంత్రించేందుకు ఈ తరహా కార్యక్రమాలు చేపట్టామని తెలిపారు. జాతీయ రహదారిపై 80 కి.మీ గరిష్ఠ వేగ పరిమితి ఉందని, దీన్ని అతిక్రమిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

ధర వరలు

టమాట 15, వంగ 22, బెండ 24, పచ్చిమిర్చి 46, కాకర 32, క్యాబేజీ 16, క్యారెట్ 26, దొండ 42, బంగాళదుంప 22, ఉల్లిపాయలు 22, గోరుచిక్కుడు 28, దోస 26, సొర 10, అరటికాయ 7.6, చిక్కుళ్లు 26, బీర 28, చామదుంప 24, మునగ 08/10, కంద 40, బీట్‌రూట్ 24, కీరదోస 42, బీన్స్ 54, క్యాప్సికం 60, అలసందలు 28, చిలకడదుంప 30, కొత్తిమీర 12/06, పుదీనా 15/05 బుధవారం రైతుబజారులో ధరలు. గురువారం ఉదయం 7 గంటలవరకు ఈ ధరలు వర్తిస్తాయి. సమస్యలుంటే ఎస్టేట్ అధికారి బలిశెట్టి నాని 9182361295 నంబరులో సంప్రదించొచ్చు.
– మచిలీపట్నం (గొడుగుపేట), న్యూస్‌టుడే

సినిమాలు

రేవతి: కపుల్ ఫ్రెండ్లీ, మినీరేవతి: సీతాపయనం, సిరికృష్ణ: మన శంకరవరప్రసాద్ గారు, సిరివెంకట్: పంబీ

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

మచిలీపట్నం : 80089 02911, పెడన : 63099 94687

స్పందన: నగరంలోని పరాసుపేట కూడలి సమీపంలో రహదారి పక్కన వేసిన చెత్తను తొలగించక పోవడంతో స్థానికులతోపాటు రాకపోకలు సాగించే ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. సమస్యను ఆ ప్రాంతవాసులు 'మేమున్నాం.. మీకుతోడుగా' దృష్టికి తీసుకొచ్చారు. విషయాన్ని అధికారులకు వివరించడంతో సిబ్బందిని పంపి చెత్త తొలగించేలా చర్యలు తీసుకున్నారు. - మచిలీపట్నం కార్పొరేషన్, న్యూస్‌టుడే

★ మండల పరిధి అర్తమూరు పంచాయతీ పరిధిలోని పలు వీధులు నేటికీ మట్టి రోడ్లుగానే ఉన్నాయి. దీంతో స్థానికులు సీసీ రహదారులు నిర్మించాలని 'ఈనాడు' 'మేమున్నాం.. మీకు తోడుగా' ద్వారా అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లారు. ఈ సమస్యపై పలుమార్లు కథనాలు ప్రచురితమయ్యాయి. ఈ నేపథ్యంలో ప్రాధాన్యత క్రమంలో రోడ్ల నిర్మాణ పనులు చేపట్టారు.

★ మండల పరిధిలోని ముంజులూరు- కంచడం రోడ్డు కలిసే కూడలి వద్ద జాతీయ రహదారి- 216పై ఉన్న దీపాలు వెలగడం లేదని ప్రయాణికులు సమస్యను 'మేమున్నాం.. మీకు తోడుగా' ద్వారా సంబంధిత అధికారులకు తెలిపారు. దీనిపై వారు స్పందించి దీపాలు సరి చేయించి వెలిగేలా చేశారు. - న్యూస్‌టుడే, బంటుమిల్లి

★ నందమూరు జడ్పీ పాఠశాలలో రెండో విడత నాడు- నేడు పనుల్లో భాగంగా వంటశాల నిర్మించారు. కానీ కిటికీలు ఏర్పాటు చేయక పోవడంతో లోపలకు కోతులు, ఇతర జంతువులు వస్తున్నాయని ఇటీవల 'ఈనాడు'లో కథనం ప్రచురితమైంది. డీఈవో యూవీ సుబ్బారావు స్పందించి తక్షణమే కిటికీలు ఏర్పాటు చేయాలని ఇన్‌ఛార్జి హెచ్‌ఎం సత్యనారాయణను ఆదేశించారు. దీంతో తాత్కాలికంగా కిటికీలు ఏర్పాటు చేశారు.
- న్యూస్‌టుడే, పెడన గ్రామీణం

గుర్రపుడెక్క తొలగింపు పనులు ప్రారంభం

పెడన గ్రామీణం, న్యూస్‌టుడే : పెడన మండలం చెన్నూరు పంచాయతీలోని ఎస్సీ కాలనీలో ఊర చెరువులో గుర్రపుడెక్క తొలగింపు పనులు మంగళవారం ప్రారంభమయ్యాయి. ఈ చెరువులో రెండేళ్ల నుంచి గుర్రపుడెక్క పేరుకుని పక్కనే ఉన్న మురుగు కలుస్తోందని కాలనీ వాసులు జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేశారు. ఎస్సీవాడలో తమకు పంపు నీరు రావటం లేదని పంచాయతీ చెరువే ఆధారమని వారు పేర్కొన్నారు. చెరువును పంచాయతీ బోర్ స్వీపర్‌గా పని చేసే వ్యక్తి లీజుకు తీసుకుని వాడుకోవడం లేదని వివరించారు. ఈ సమస్యపై కలెక్టర్ బాలాజీ స్పందించి వెంటనే పరిష్కరించాలని మండల అధికారులను ఆదేశించారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

పోతేపల్లి(మచిలీపట్నం రూరల్): పోతేపల్లి గ్రామానికి చెందిన అర్జా లక్ష్మి ఇల్లు ఆదివారం అగ్నిప్రమాదంలో కాలిపోయి తీవ్రంగా నష్టపోగా ఆమె కుటుంబానికి లంకిశెట్టి ఫ్రెండ్స్ సర్కిల్ ఛైర్మన్ లంకిశెట్టి బాలాజీ మంగళవారం రూ.5 వేల నగదు, నిత్యావసరాలు, బట్టలు, వంట సామగ్రి అందచేశారు. బాధితులకు ప్రభుత్వపరంగా పక్కా ఇల్లు నిర్మించి, రూ.లక్ష బ్యాంకు రుణం మంజూరు చేయాలని కోరారు.

కనికరం లేని కార్పొరేషన్.. ప్రయాణికుల పరేషాన్

న్యూస్‌టుడే, మచిలీపట్నం కార్పొరేషన్

నగరంలోని వివిధ ప్రధాన కూడళ్లలో బస్‌షెల్టర్లు లేక ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దశాబ్దాల తరబడి ఇబ్బందులు పడుతున్నా పాలకులు పట్టించుకోవడం లేదు. నిలువ నీడలేక దుకాణాల పంచన, రోడ్ల పక్కన నిరీక్షిస్తూ ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. వేసవి ఎండాకాలం కావడంతో ప్రయాణికులు చెమటలు పడుతూ బస్సుల కోసం నిరీక్షించాల్సి వస్తోంది. షెల్టర్ల నిర్మాణానికి దాతలు ముందుకొచ్చినా కార్పొరేషన్ స్పందించకపోవడం బాధాకరం.

జిల్లా కోర్టు సెంటరులో రోడ్డుపై నిల్చున్న ప్రయాణికులు

షెల్టర్లు లేని ప్రాంతాలు
కోనేరు సెంటరు
జిల్లా కోర్టు ,,
లక్ష్మీ టాకీస్ ,,
జడ్పీ ,,
చల్లపల్లి ,,
కోటవారితుళ్లు ,,

జిల్లా కేంద్రం కావడంతో నగరానికి వివిధ ప్రాంతాల నుంచి ప్రతిరోజూ వేలాదిమంది రాకపోకలు సాగిస్తారు. కేవలం బస్టాండ్ నుంచే కాకుండా వివిధ ప్రాంతాలకు 25 వేల మందికిపైగా రాకపోకలు సాగిస్తే స్త్రీశక్తి పథకం వచ్చాక 35 వేల మంది ప్రయాణిస్తున్నారు. నగరంలోని ఆయా ప్రధాన కూడళ్ల నుంచి 9- 10వేల మంది ఇలా రాకపోకలు సాగిస్తారు.

★ కోనేరు సెంటరులో విజయవాడ, గుడివాడ, తరకటూరు, పామర్రు తదితర ప్రాంతాలకు వెళ్లేవారు ఎండలో నిరీక్షించాల్సిన దుస్థితి. ★ చల్లపల్లి సెంటరు నుంచి మొవ్వ, గూడూరు మండలంలోని ఆయా గ్రామాలకు వెళ్లేవారంతా రోడ్డుపై లేకుంటే దుకాణాల పక్కన నిల్చోవాల్సిన పరిస్థితి. ★ కోటవారితుళ్లు సెంటరులో చల్లపల్లి, అవనిగడ్డ తదితర ప్రాంతాలకు వెళ్లే ప్రజలు రోడ్లపైనే నిలబడుతున్నారు. ★ ఉద్యోగులు, వివిధ కళాశాలల విద్యార్థులు జిల్లా కోర్టు సెంటరు, లక్ష్మీ టాకీసు కూడలి నుంచి రాకపోకలు సాగిస్తారు. ★ నగరంలో ఉన్న ఒకే ఒక షెల్టర్ బస్టాండ్ ప్రాంతంలో రహదారి పక్కన ఉంది. అది అలంకార ప్రాయంగా మారింది.

ప్రతిపాదనలకే పరిమితమా

తెదేపా హయాంలో పలు ప్రాంతాల్లో బస్ షెల్టర్లు నిర్మించడానికి ఒక్కో దాని నిర్మాణానికి రూ.5లక్షలు వెచ్చించడానికి అప్పటి కౌన్సిల్ ఆమోదం తెలిపింది. చిలకలపూడి ప్రధాన కూడలిలో షెల్టర్ నిర్మాణ పనులు ప్రారంభించారు. ఆ తర్వాత వైకాపా పాలనలో పట్టించుకోకపోవడంతో పనులు నిలిచిపోయాయి. మిగిలినవి ప్రారంభం కూడా కాలేదు. క్షేత్ర స్థాయిలో ఉన్న సమస్యను పరిష్కరించేందుకు తనవంతు సహకారం అందిస్తానని నగరంలోని చిన్నాపురం డాక్టరు రాజ్యలక్ష్మి అక్షయసొమ్ము ముందుకు వచ్చారు. 11 కూడళ్లలో నిర్మించాల్సి ఉంటుందని అధికారులు ఆయనకు చెప్పినా, ఇప్పటివరకు ఆయా కూడళ్లలో స్థల సేకరణ చేసి అప్పగించలేదు. ఇప్పటికైనా స్పందించి బస్ షెల్టర్ల నిర్మాణానికి తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కుల పంపిణీ

మచిలీపట్నం కార్పొరేషన్, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి సహాయనిధి పేదలపాలిట వరమని పలువురు కూటమి నాయకులు పేర్కొన్నారు. నగరంలోని వివిధ డివిజన్‌లలో మంగళవారం ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా మంజూరైన సాయాన్ని పంపిణీ చేశారు. 37వ డివిజన్‌లో తెదేపా నగర అధ్యక్షుడు లోగిశెట్టి వెంకటస్వామి, కృష్ణా ఇన్‌ఫ్రా అధ్యక్షుడు హంతి రాజా తదితరులు బాధితులకు చెక్కులు అందజేశారు. గిలకలదిండిలో నాయకులు ఇలియాస్‌పాషా, కొక్కిలిగడ్డ నాగరమేష్, వాడపల్లి రమేష్, వసంతరావు, శేషు, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

వన్నూరుకానూరు(మచిలీపట్నం రూరల్): ఆటో ప్రమాదంలో గాయపడి కాలు కోల్పోయిన చిటికెన్ని శివశంకరరావుకు ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన రూ.23200 చెక్కును తెదేపా జిల్లా ప్రధాన కార్యదర్శి గోపు సత్యనారాయణ మంగళవారం అందచేశారు. శివశంకరరావు కుటుంబసభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో పీత రామ, బొమ్మిడి పెద్ద ఏడుకొండలు, జొన్నల నాగమల్లేశ్వరరావు, బొమ్మిడి స్వామి తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య పనులకు అదనపు కార్మికులు

పెడన, న్యూస్‌టుడే : రంజాన్ మాసం ఈ నెల 19 నుంచి ప్రారంభం కానున్న నేపథ్యంలో పట్టణంలో ప్రత్యేక పారిశుద్ధ్య చర్యలకు పది మంది అదనపు కార్మికులను తాత్కాలికంగా కాంట్రాక్టు పద్ధతిపై తీసుకున్నామని మున్సిపల్ కమిషనర్ కొండయ్య తెలిపారు. వీరు మంగళవారం నుంచి విధులకు రాగా మసీదుల సమీపంలోని రహదారులను శుభ్రం చేస్తారన్నారు. నెల పాటు ఈ కార్మికులు విధుల్లో ఉంటారన్నారు. ప్రజలు ప్రజారోగ్యంపై ఫిర్యాదులను తమ చరవాణి నం.98499 05824కు తెలియజేయాలని సూచించారు.

అనుచిత చర్యను వారించిన డ్రైవర్‌పై దాడి

మచిలీపట్నం(చిలకలపూడి), న్యూస్‌టుడే: ప్రైవేటు ట్రావెల్స్ సర్వీసులో ఓ యువకుడి అనుచిత చర్యను ప్రశ్నించిన డ్రైవర్‌పై దాడిచేసిన సంఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. ఈ నెల 11న హైదరాబాద్ నుంచి మచిలీపట్నం వస్తున్న ప్రైవేటు స్లీపర్ బస్సులో ఓ యువతి ఇద్దర మహిళల పేరిట రెండు సీట్లు రిజర్వ్ చేసుకుంది. బస్సు బయలుదేరే సమయానికి ఆ యువతితోపాటు మరొక యువతి కాకుండా యువకుడు ఉండటాన్ని గమనించిన డ్రైవర్ ప్రశ్నించారు. నిబంధనల ప్రకారం మహిళపక్కన అతను ఉండకూడదని చెప్పడంతో వారిరువురి మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. 12వ తేదీ ఉదయం మచిలీపట్నంలో దిగిన యువకుడు కర్రతో డ్రైవర్‌పై దాడి చేయడంతో ఆయన గాయపడ్డారు. సదరు యువకుడిపై చిలకలపూడి పోలీస్‌స్టేషన్‌లో డ్రైవర్ ఫిర్యాదు చేయగా, ఈ సంఘటన సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతోంది.

వినతులు బుట్టదాఖలేనా?

అధ్వానంగా మారిన పెదకరగ్రహారం నుంచి బందరు నగరానికి వచ్చే రహదారి అభివృద్ధిని మరిచారని గ్రామస్థులు వాపోతున్నారు. ఇదే రోడ్డులో ప్రభుత్వ వైద్యకళాశాల కూడా ఉంది. రాకపోకలు పెరుగుతున్నందున రహదారిని అభివృద్ధి చేసేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. -న్యూస్‌టుడే, మచిలీపట్నం (గొడుగుపేట)

ఇసుక తొలగిస్తే మేలు

నగరంలోని నాయర్ బడ్డీ సెంటరు నుంచి జిల్లా కోర్టు సెంటరుకు వెళ్లే రోడ్డు రహదారి పక్కన వేసిన ఇసుక గుట్ట నుంచి ఇసుక రోడ్డుపైకి చేరింది. రోడ్డులో ఇసుక కారణంగా ద్విచక్రవాహనాలు స్కిడ్ అయి వాహనదారులు పడిపోతున్నారు. ఇసుక రోడ్డుపైకి రాకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులతోపాటు ప్రయాణికులు కోరుతున్నారు. -న్యూస్‌టుడే. మచిలీపట్నం కార్పొరేషన్

తటాకంలో తూడు.. పట్టదా గోడు

నగరంలోని లక్ష్మణరావుపురం, విశ్వబ్రాహ్మణ కాలనీ పరిసర ప్రాంతాల్లోని ఖాళీ స్థలాల్లో ఏర్పడిన మురుగు తటాకాల్లో గుర్రపు డెక్క దట్టంగా అల్లుకుపోయింది. దీంతో రాత్రయితే దోమల దాడితో స్థానికులు అవస్థలు పడుతున్నారు. అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

-న్యూస్‌టుడే. మచిలీపట్నం కార్పొరేషన్

వృథాగా నీరు.. మారని తీరు

జిల్లా కోర్టు కూడలిలో నాయర్‌బడ్డీ సెంటరుకు వెళ్లే రోడ్డు పక్కన పైపులైన్‌కు లీకు ఏర్పడి తాగునీరు వృథాగా పోతోంది. దీంతో శివారు ప్రాంతాల ప్రజలకు తాగునీరు అందక ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి లీకు మరమ్మతులు చేయించాలని ఆ ప్రాంత వాసులు కోరుతున్నారు.
-న్యూస్‌టుడే, మచిలీపట్నం (గొడుగుపేట)

శిథిల భవనం తొలగించాలి

బంటుమిల్లిలో ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఉన్నత పాఠశాలల ప్రాంగణంలో ఐదు శిథిల భవనాలు ఉన్నాయి. సుమారు 20 ఏళ్ల కిందటే శిథిలమైన భవనం ఎప్పుడు కూలుతుందోనని భయపెడుతోంది. ఈ భవనాన్ని పూర్తి స్థాయిలో తొలగించాలని గ్రామస్థులు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, బంటుమిల్లి

హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయరూ..

జాతీయ రహదారి 216 పరిధిలో పెందుర్రు నుంచి ముంజులూరు వరకు సుమారు 12 కల్వర్టులు, దారులు కలిసే ప్రాంతాలు ఉన్నాయి. ఇక్కడ నలువైపులా హెచ్చరిక బోర్డులు ఉండాలి. వివిధ కారణాల వల్ల అవి కానరావడం లేదు. వాహన చోదకులకు కనిపించే విధంగా వాటిని ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు. -న్యూస్‌టుడే, బంటుమిల్లి

అపోహలు వీడాలి.. అవగాహనతో ఉండాలి

లేడియాంప్తిల్ పాఠశాలలో పాల్గొన్న హిమబిందు, తదితరులు

గూడూరు పాఠశాలలో విద్యార్థులకు మాత్రలు వేస్తున్న ఎంపీపీ

మచిలీపట్నం(గొడుగుపేట), గూడూరు, న్యూస్‌టుడే: అపోహలు వీడి.. తల్లిదండ్రులు తమపిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు వేయించాలని ఆర్బీఎస్కే జిల్లా అధికారి డా.హిమబిందు అన్నారు. జాతీయ నులి పురుగుల నిర్మూలన దినం సందర్భంగా నగరంలోని లేడియాంప్తిల్ పాఠశాలలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొని ఆమె అవగాహన కల్పించారు. వైద్యులు అనూష, శ్రీజ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. గూడూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఎంపీపీ సంగా మధుసూదనరావు పాల్గొని విద్యార్థులకు మాత్రలు వేశారు. ఎంఈవో సుబ్రహ్మణ్యం, మల్లవోలు పీహెచ్‌సీ వైద్యులు తరుణ్‌శంకర్ తదితరులు పాల్గొన్నారు.

పెడన: బాలల్లో నులిపురుగులు ఏకాగ్రతకు అవరోధంగా మారతాయని ఎంఈవో సలోమి అన్నారు. జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవాన్ని మండల స్థాయిలో స్థానిక బంగ్లా స్కూల్లో ఆమె మంగళవారం ప్రారంభించారు. ఎంఈవో- 2 వైవీ హరినాథ్, బంగ్లా స్కూలు హెచ్‌ఎం గమిడి భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పెడన : బంగ్లా స్కూల్లో ఎంఈవోలు, హెచ్‌ఎం తదితరులు

గోకవరం (మచిలీపట్నంరూరల్): జాతీయ నులిపురుగుల నివారణ దినం పురస్కరించుకుని మంగళవారం గోకవరంలోని ఎంపీపీ పాఠశాల, అంగన్‌వాడీ పాఠశాలలో ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. ప్రధానోపాధ్యాయురాలు కరుణ, మల్టీపర్పస్ హెల్త్ అసిస్టెంట్ కొమ్ము అనిత, ఆశా వర్కర్ ఝాన్సీ, అంగన్‌వాడీ టీచర్లు పార్వతి, శ్యామల, ఫణిశ్రీ పాల్గొన్నారు.

భక్తులకు భగవంతునికి మధ్య వారధి సనాతన సారథి

మాసపత్రికను ఆవిష్కరిస్తున్న సమితి ప్రతినిధులు

మచిలీపట్నం(గొడుగుపేట), న్యూస్‌టుడే: భక్తులకు భగవంతునికి మధ్య వారధి సనాతన సారథి అని సత్యసాయిసేవా సమితి మచిలీపట్నం కన్వీనర్ పోతుకూచి ఆంజనేయకుమార్ అన్నారు. మంగళవారం నగరంలోని సత్యసాయిమందిరంలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ 1958 ఫిబ్రవరి 16న ప్రశాంతి నిలయంలో సత్యసాయిబాబా సనాతన సారథి అనే మాసపత్రికను ప్రారంభించారన్నారు. సమితి ప్రతినిధులు తుర్లపాటి గిరీష్, బి.శైలజ, వై.సాయిబాబు, కాళికాదేవి తదితరులు పాల్గొని పత్రికను ఆవిష్కరించారు.

చేపల చెరువుల తవ్వకాల అనుమతులు రద్దు కోరుతూ ముట్టడి

గుడ్లవల్లేరు బస్టాండ్ సెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన

అంగలూరు (గుడ్లవల్లేరు), న్యూస్‌టుడే: మండలంలోని అంగలూరులో 25 ఎకరాలలో చేపల చెరువుల తవ్వకాలకు ఇచ్చిన అనుమతులు రద్దు చేయాలని కోరుతూ గ్రామస్థులు మంగళవారం గుడ్లవల్లేరులో బస్టాండ్ సెంటర్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయాన్ని ముట్టడించారు. 9 ఏళ్లుగా అనుమతులు ఇవ్వని ఆ చెరువులకు ఇప్పుడు అక్రమమార్గంలో అధికారులు అనుమతులు ఇవ్వడం ఏమిటని నిలదీశారు. దీంతో గ్రామస్థుల అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకుని వాటి అనుమతులు రద్దు చేయాలని అధికారులకు సిఫార్సులు పంపుతానని హామీ ఇవ్వడంతో విరమించారు. కార్యక్రమంలో బసవ అరుణ, మామిడి బాబూరావు, దావులూరి బుజ్జి, అజయ్‌కర్, మేకల ఏసురత్నం, చాట్ల డానియేలు, చిలుముల తాతారావు, కంచర్ల ప్రసాద్, చేబ్రోలు బుజ్జిబాబు తదితరులు పాల్గొన్నారు.

డిస్కస్‌త్రోలో ప్రతిభ

విజేతను అభినందిస్తున్న కళాశాల కరస్పాండెంట్, ప్రిన్సిపల్ తదితరులు

పెడన: రాజధాని అమరావతిలోని వెల్లూర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(విట్) యూనివర్సిటీలో ఈ నెల 11 నుంచి 17 వరకు నిర్వహించిన తెలుగు రాష్ట్రాల స్థాయి ఇంజినీరింగ్ కళాశాలల క్రీడా, సాంస్కృతిక విభాగాల పోటీల్లో నందమూరు వాసవీ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థి ఎండీ.జమీల్ పాషా(తృతీయ బీటెక్) డిస్కస్ త్రోలో రజత పతకం సాధించినట్లు కళాశాల ప్రిన్సిపల్ డా.బీఆర్ఎస్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా విజేతను కరస్పాండెంట్ కాకి కుమార్‌బాబు, ప్రిన్సిపల్, ఫిజికల్ డైరెక్టర్ రమేష్, అధ్యాపకులు అభినందించారు. ఈ విద్యార్థి గతంలోనూ పలు పతకాలు సాధించినట్లు పీడీ చెప్పారు.

వైభవంగా నాగేశ్వర స్వామి రథోత్సవం

గుడిదిబ్బ(కృత్తివెన్ను): కృత్తివెన్ను గుడిదిబ్బలోని శ్రీదుర్గా పార్వతి సమేత నాగేశ్వర స్వామి దేవస్థానంలో మహాశివరాత్రి మహోత్సవాలు కొనసాగుతున్నాయి. ఈ మేరకు మంగళవారం సాయంత్రం రథోత్సవం ఘనంగా జరిగింది. ఆలయ ఈవో శింగనపల్లి శ్రీనివాసరావు, ఛైర్మన్ చేకూరి వెంకట్రావు, సీఐ నాగేంద్రప్రసాద్, ఎస్సైలు పైడిబాబు, గణేష్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 98496 97616

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు

తరకటూరులో ఏర్పాటు చేసిన బోర్డు వద్ద ఎస్సై, సిబ్బంది

గూడూరు, న్యూస్‌టుడే : రోడ్డు ప్రమాదాల నివారణకు ఎస్పీ విద్యాసాగర్ నాయుడు ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటున్నట్లు ఎస్సై దివ్యప్రకాష్ తెలిపారు. ప్రమాదాల నియంత్రణలో భాగంగా మచిలీపట్నం- విజయవాడ జాతీయ రహదారిపై పలు నినాదాలతో కూడిన బోర్డులు ఏర్పాటు చేశారు. ప్రమాద తీవ్రత తెలియజేసేలా రోడ్డు ప్రమాదంలో నుజ్జయిన కారు ఉంచారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలను విధిగా పాటించాలని ఎస్సై సూచించారు.

బంటుమిల్లి, న్యూస్‌టుడే : ప్రతి ఒక్క వాహన చోదకుడు ఎటువంటి ప్రమాదాలకు గురి కాకుండా ఇంటికి చేరాలని బంటుమిల్లి ఎస్సై గణేష్ కుమార్ అన్నారు. రోడ్డు భద్రత నియమాలు పాటించడం ద్వారానే ఇది సాధ్యపడుతుందని ఆయన తెలిపారు. మండల పరిధిలో వివిధ ప్రమాదాల్లో ధ్వంసమైన వాహనాలను నారాయణపురంలో నాలుగు రోడ్ల కూడలి వద్ద పెట్టారు. ఎస్సై వెంట పలువురు సిబ్బంది ఉన్నారు.

ఏళ్ల తరబడి మొర.. పట్టించుకుంటారా?

మండల పరిధిలోని ఆర్వీపల్లి నుంచి పెడనకు వెళ్లే డొంక రోడ్డును అభివృద్ధి చేయాలని ఆయా గ్రామాల ప్రజలు ఏళ్లుగా మొర పెట్టుకుంటున్నారు. ఈ రహదారి అభివృద్ధి చెందితే పెడన, కప్పలదొడ్డి, ఆకులమన్నాడు పరిసర గ్రామాలకు ప్రయాణం సులభతరమవుతోంది. కానీ దీన్ని పట్టించుకునే వారే కరవయ్యారని ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. - న్యూస్‌టుడే, గూడూరు

మహిళల స్వయం ఉపాధికి బాటలు

కుట్టు మిషన్ల పంపిణీలో ఫాదర్ సునీల్, ప్రేమాంజలి సిస్టర్లు

పెడన, న్యూస్‌టుడే : మహిళల స్వయం ఉపాధి లక్ష్యంగా స్వచ్ఛంద సంస్థ ప్రేమాంజలీ సొసైటీ పలు కార్యక్రమాలు నిర్వహిస్తోందని విజయవాడ డయాసిసన్ స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ ఫాదర్ సునీల్ తెలిపారు. పెడనకు చెందిన ప్రేమాంజలీ స్వచ్ఛంద సంస్థ మహిళా సాధికారత ప్రాజెక్టు కింద 15 మంది మహిళలకు మూడు నెలలు ఉచిత కుట్టు శిక్షణ ఇచ్చింది. ఈ మేరకు మంగళవారం శిక్షణ పూర్తి చేసిన వారికి స్థానిక బంటుమిల్లి రోడ్డులోని ఆర్సీఎం చర్చి ఆవరణలో ఉన్న సంస్థ కార్యాలయంలో కుట్టుమిషన్లు అందజేశారు. ప్రేమాంజలీ సంస్థ సమన్వయకర్తలు సిస్టర్ సెల్వీ, సిస్టర్ ప్రేమ తెలిపారు. కార్యక్రమంలో పలువురు మహిళలు పాల్గొన్నారు.

డిజిటల్ భద్రతపై విద్యార్థులకు అవగాహన

శిక్షణలో పాల్గొన్న వారితో ఆయా విభాగాల అధిపతులు, నిపుణులు

మచిలీపట్నం (గొడుగుపేట), న్యూస్‌టుడే: నగర శివారులోని వైజేఆర్ డీఎంఎస్ ఇంజినీరింగ్ కళాశాలలో విద్యార్థులకు సైబర్ సెక్యూరిటీపై మంగళవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ప్రిన్సిపల్ రవి కుమార్ మాట్లాడుతూ ఐసీటీ అకాడమీ, ఐబీఎం స్కిల్స్ బిల్డ్ సైబర్ సెక్యూరిటీ సంస్థల ఆధ్వర్యంలో నాలుగు రోజులపాటు శిక్షణ అందిస్తాయన్నారు. ఆయా సంస్థలకు చెందిన నిపుణులు శ్రీనివాస్, సయ్యద్ జిషాన్ నెట్‌వర్క్ భద్రత, డేటారక్షణ, ఎథికల్ హ్యాకింగ్ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. వైస్ ప్రిన్సిపల్ బి.నాగజ్యోతి, ఆయా విభాగాల అధిపతులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రైతులు సుభిక్షంగా ఉండాలని..

పెదకళ్లేపల్లి (మోపిదేవి), న్యూస్‌టుడే: పెదకళ్లేపల్లిలో జరుగుతున్న శ్రీదుర్గాపార్వతి సమేత నాగేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆరో రోజైన మంగళవారం వసంతోత్సవం వేడుకగా జరిపారు. రైతులు సుభిక్షంగా ఉండాలని ధాన్యాన్ని రోలులో పోసి రోకళ్లతో దంచి ధాన్యపుటోత్సవం జరిపి స్వామికి నివేదించారు.

రీసర్వేను పరిశీలించిన కలెక్టర్ బాలాజీ

చల్లపల్లి, న్యూస్‌టుడే: చల్లపల్లి మండలం మాజేరు పంచాయతీ పచ్చార్లంకలో జరుగుతున్న భూముల రీసర్వేను మంగళవారం ఉదయం కలెక్టర్ డి.కె.బాలాజీ పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బాలాజీ రైతులు, సర్వేయర్లతో మాట్లాడి సర్వే జరుగుతున్న తీరును తెలుసుకొన్నారు. ప్రణాళికాబద్ధంగా రీ సర్వే నిర్వహించాలని జిల్లా కలెక్టర్ రెవెన్యూ అధికారులకు చెప్పారు. సర్వే ఏడీ లక్ష్మణ్, ఇన్‌ఛార్జి తహసీల్దార్ జి.శ్రీలత, రీసర్వే డీటీ సి.హెచ్.నీలిమ, ఆర్ఐ ఘంటసాల కృష్ణమోహన్, సర్వేయర్ వలి, వీఆర్వో పరిశే కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

నేటి నుంచి శ్రీసంపటాలమ్మ అమ్మవారి వార్షికోత్సవం

శ్రీసంపటాలమ్మ అమ్మవారు

చల్లపల్లి, న్యూస్‌టుడే: చల్లపల్లి గ్రామదేవత శ్రీసంపటాలమ్మ అమ్మవారి ఆలయ 27వ వార్షికోత్సవాలు మూడు రోజుల పాటు జరుగుతాయని ఆలయ నిర్వాహకులు తెలిపారు. బుధవారం ఉదయం 10.25గంటలకు విఘ్నేశ్వరపూజ, గోపూజ, శ్రీఅమ్మవారికి అభిషేకాలతో ఉత్సవాలు ప్రారంభమౌతాయి. 19వతేదీ ఉదయం సామూహిక కుంకమ పూజలు, సాయంత్రం అమ్మవారికి కుంకుమ పూజ, 20వ తేదీన ప్రత్యేక పూజల జరుగుతాయి.

రామలింగేశ్వరుడికి వెండి గొలుసు

బహూకరిస్తున్న దాతలు

కూచిపూడి: పెదపూడికి చెందిన తాడికొండ రంగనాయకమ్మ కుమారుడు అవినాష్, అనూరాధ దంపతులు మారేడు దళాల వెండి గొలుసును రామలింగేశ్వరస్వామికి బహూకరించారు. వారి కుమారుడు మోక్షిశ్రీకర్ జ్ఞాపకార్థం రూ.50 వేల విలువైన 150 గ్రాముల వెండితో తయారు చేసిన గొలుసును పాలకమండలి ఉపాధ్యక్షులు నారాయణమూర్తి, అర్చకుడు సతీష్‌కుమార్‌కు అందజేశారు.

(c) eenadu

పెనమలూరు

• పెనమలూరు • గన్నవరం

విద్యుత్తు సరఫరాకు అంతరాయం నేడు

పెనమలూరు, న్యూస్‌టుడే: స్థానిక 11 కేవీ విద్యుత్తు ఫీడర్ లైన్లకు మరమ్మతుల నిమిత్తం గంగూరులోని ఈపీఎస్, మహిళ మండలి కట్ట ప్రాంతాల్లో బుధవారం ఉదయం 8 నుంచి 11 గంటల వరకు విద్యుత్తు సరఫరా నిలిపి వేస్తున్నట్లు ట్రాన్స్‌కో అధికారులు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

హనుమాన్‌జంక్షన్, న్యూస్‌టుడే: హనుమాన్‌జంక్షన్ ఉపకేంద్రంలో సాధారణ నిర్వహణ, మరమ్మతుల దృష్ట్యా బుధవారం ఉదయం 8 నుంచి 12 గంటల వరకు కృష్ణానగర్, ఎంజీనగర్, ఇందిరానగర్, బీసీ కాలనీ, బైబిల రోడ్డు, నూజివీడు, గుడివాడ రోడ్లలో విద్యుత్తు సరఫరా నిలిపి వేస్తున్నట్లు ఈఈ జి.వి.శ్రీనివాసరావు తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

'వైకాపా నాయకుల తీరు విడ్డూరం'

హనుమాన్‌జంక్షన్, న్యూస్‌టుడే: రాజకీయాలను బూతులు, దాడులమయంగా మార్చిన వైకాపా నాయకులు తనపై కేసులు పెట్టాలని డిమాండ్ చేయడం సిగ్గుచేటని తెలుగుమహిళ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మూల్పూరి కళ్యాణి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబుపై దారుణంగా దూషణలకు పాల్పడిన మాజీ మంత్రి అంబటి రాంబాబు తీరుపై నిరసన వ్యక్తం చేసినందుకు తనపై కేసు పెట్టాలని గన్నవరం జడ్పీటీసీ సభ్యురాలు ఎలిజబెత్‌రాణి ఫిర్యాదు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. గన్నవరం కేంద్రంగా గతంలో నారా భువనేశ్వరిని అవమానించి, చంద్రబాబు, లోకేశ్ సహా తెదేపా నాయకులపై హేయంగా విమర్శలు చేసినప్పుడు, పార్టీ కార్యాలయాన్ని ధ్వంసం చేసినప్పుడు ఎలిజబెత్‌రాణి ఎందుకు నోరు మెదపలేదని ప్రశ్నించారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM
ఉయ్యూరు : 80085 74647 హనుమాన్‌జంక్షన్, 98486 27585

స్పందన: ★ వణుకూరు కాసా, బీసీ కాలనీల్లో దోమల బెడద తీవ్రంగా ఉంది.. ★ ఎస్సీ కాలనీలో రహదారుల వెంట పిచ్చి మొక్కలు, గడ్డి పెరిగి విష పురుగులు, పాములు చేరుతున్నాయంటూ.. ★ వణుకూరులోని పలు ప్రాంతాల్లో వీధి దీపాలు సరిగా వెలగడం లేదంటూ ఆయా ప్రాంతాల నివాసితులు 'మేమున్నాం మీకు తోడుగా' ద్వారా కార్యదర్శి దుర్గాప్రసాద్‌కు ఫిర్యాదు చేశారు. స్పందించిన ఆయన సిబ్బందిని పంపి సమస్యలు పరిష్కరించారు. – న్యూస్‌టుడే, పెనమలూరు

ఉయ్యూరు పరిధిలోని కాటూరు రోడ్డులో అంతర్గత రహదారుల కల్వర్టుల వద్ద నడకదారిలో డ్రెయిన్ల వద్ద రాళ్లు ప్రమాదకరంగా మారాయని స్థానికులు 'మేమున్నాం మీకు తోడుగా' ద్వారా అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై ఏఈ రమ్య స్పందించి ఆయా ప్రాంతాల్లో డ్రెయిన్లపై రాళ్లు ఏర్పాటు చేసి సమస్య పరిష్కరించారు. – న్యూస్‌టుడే, ఉయ్యూరు.

గొంతెండుతోంది.. గుక్కెడు నీళ్లివ్వండి..

రక్షిత మంచినీటి పథకం లేని కాలనీ

ఉయ్యూరు, న్యూస్‌టుడే: ఉయ్యూరు పట్టణంలోని ఒకటో వార్డు పరిధిలోని నాగన్నగూడెం పక్కనే 36.32 ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన జగనన్న కాలనీకి ఇప్పటి వరకు రక్షిత మంచినీటి పథకమే లేదు. అమృత్ పథకంలో నాడు రూ. 2 కోట్లు మంజూరైనా వాటిని వినియోగించుకోలేదు. ఈ కాలనీలో పట్టాలు పొందిన 2004 మందికి ఇళ్ల పట్టాలు కేటాయించారు. ఏళ్ల గడుస్తున్నా మంచినీటి సౌకర్యం లేకపోవడంతో లబ్ధిదారులు నానా ఇబ్బందులు పడుతున్నారు. సొంతంగా బోర్లు వేయిస్తున్నా ఫలితం లేకపోవడంతో అవస్థలు పడుతున్నారు.

పాడైపోయిన మంచినీటి బోరు

నాడు తాత్కాలిక ఏర్పాట్లు....

కాలనీల ఏర్పాటు కోసం రూ. 64 లక్షలతో రక్షిత మంచినీటి అందజేత అంచనాలు రూపొందించి ఎనిమిది బోర్లు ఏర్పాటు చేశారు. దానికి అనుబంధంగా సింథటిక్ ట్యాంకులు ఏర్పాటు చేసి వాటిని తాత్కాలిక పైప్‌లైన్లతో నీళ్లతో నింపారు. కాని కొన్నాళ్లకే ఆ ట్యాంకులు పగిలిపోయి పాడైపోయాయి. బోర్లు కొన్నాళ్లకు పాడై పోయి మూలన పడి ఉన్నాయి. ప్రధాన, అంతర్గత రహదారుల వద్ద 5725 మీటర్ల పైప్‌లైను ఏర్పాటు ప్రతిపాదన చేసి వదిలేశారు.

మంచినీటి ట్యాంకు ఊసేలేదు..

నాగన్నగూడెం రక్షిత పథకం నాగన్నగూడెంతో పాటు ఎనికేపాడు ప్రాంతాల ప్రజలకు మంచినీరందిస్తోంది. ఈ రెండు శివారు ప్రాంతాల మధ్యలో జగనన్న కాలనీ ఏర్పాటు చేశారు. ప్రధాన రహదారి వెంట వెళ్లే ప్రాంతంలో పైప్‌లైనుకు కొన్ని చోట్ల పైపులు ఏర్పాటు చేశారు. ప్రస్తుతం 600 ఇళ్ల నిర్మాణం వివిధ దశల్లో ఉంది. సుమారు 60 కుటుంబాలు నివాసముంటున్నాయి.

★ ప్రధాన రహదారుల్లో పైప్‌లైన్లు ఏర్పాటు చేసి నివాసితులకు ప్రైవేటు కుళాయిల సౌకర్యం ద్వారా నీరు అందిస్తామని పురపాలక సంఘం ఏఈ **రమ్య** తెలిపారు.

నిర్వహణ లోపం.. రైతన్నలకు శాపం

కంకిపాడు, ఉయ్యూరు (గ్రామీణం, న్యూస్‌టుడే

తక్కువ వ్యయంతో ఎక్కువ మంది రైతులకు ఉపయోగపడే పనులకు ప్రాధాన్యం ఇవ్వాలనే మార్గదర్శకాలు ఉన్నా జలవనరుల శాఖ పాటించడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. వేసవి కాలం మూడు నెలలు నియంత్రికలు, పూడికతీత, కట్టల బలోపేతం, కల్వర్టుల మరమ్మతులకు అనువైన సమయం. గత ఖరీఫ్‌లో కురిసిన భారీ వర్షాలకు ఇనుముతో చేసిన పరికరాలు చాలా వరకు తుప్పు పట్టి ఉన్నాయి. తుప్పు తొలగించి రంగు వేయడం, గ్రీజ్, లూబ్రికెంట్ నూనె వేసి పరికరం సవ్యంగా పని చేసే విధంగా చేయడం వంటి పనులు తక్కువ ఖర్చుతో పూర్తవుతాయి. కాలువలకు సక్రమంగా సాగునీటి సరఫరాకు వీలవుతుంది.

★ కంకిపాడు, కోమటిగుంట

కుందేరు కాలువ అనుబంధ నియంత్రిక వద్ద

నీటిని నియంత్రించే 'కోమటిగుంట', సుమారు 1.15 లక్షల ఎకరాల ఆయకట్టు ఉంది. కంకిపాడు లాకుల పరిధిలో చిన్నపాటి నియంత్రికలు, డ్రాప్‌లు దాదాపు 250 వరకు ఉన్నాయి. వీటిలో చాలా వరకు తుప్పు పట్టి దర్శనమిస్తున్నాయి. ప్రధాన కాలువలు నిండుగా ప్రవహిస్తున్నా ఉప, చిన్న కాలువల చివరి భూములకు సాగునీరు అందక, వ్యవసాయ బోర్లే ఉపయోగించుకున్నారు. సాగునీటితో పాటు విద్యుత్తు వ్యయం అయిందని రైతులు చెబుతున్నారు. లాకుల పరిధిలో అదనంగా కృష్ణా డెల్టాలోని 3.65 లక్షల ఎకరాలకు సాగు

తూడు తొలగింపు పనులకే ప్రాధాన్యం

జలవనరుల శాఖలో 50 శాతం నిధులు తూడు తొలగింపు పనులకే కేటాయిస్తున్నారు. లాభసాటిగా ఉండే వీటిని పొందడానికి గుత్తేదార్లు పోటీ పడుతుంటారు. రైతులకు అధిక మేలు చేకూర్చే పనులకు ప్రాధాన్యం ఇచ్చే విధంగా ప్రజాప్రతినిధులు, సాగునీటి సంఘాలు కృషి చేయాలని రైతులు కోరుతున్నారు.

శాసనసభ సమావేశాలను వీక్షించిన విద్యార్థులు

స్పీకర్ అయ్యన్న పాత్రుడు, ఎమ్మెల్యేలు బోడే ప్రసాద్, బొండా ఉమాలతో విద్యార్థులు

పెనమలూరు, న్యూస్‌టుడే: నూతన శాసన సభ సమావేశాలను వీక్షించే అవకాశం పెనమలూరు, పోరంకి జడ్పీ ఉన్నత పాఠశాలల విద్యార్థులకు దక్కింది. మంగళవారం శాసనసభ ప్రాంగణానికి చేరుకొని సమావేశాలను ప్రత్యక్షంగా చూశారు. ఎమ్మెల్యే బోడే ప్రసాద్ ప్రజాస్వామ్యంలో చట్ట సభల ప్రాధాన్యం, చట్టాలకు రూపకల్పన చేసే విధానాలను విద్యార్థులకు వివరించారు. అనంతరం ఆయన శాసనసభ స్పీకర్ అయ్యన్న పాత్రుడుకు విద్యార్థులను పరిచయం చేశారు. ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు ఉన్నారు.

త్వరలో నూతన రోడ్డు అందుబాటులోకి..

కానూరు: రంజాన్ నాటికి సనత్‌నగర్ రోడ్డు నిర్మాణ పనులు పూర్తి చేసి అందుబాటులోకి తీసుకొస్తామని ఎమ్మెల్యే బోడే ప్రసాద్ తెలిపారు. రోడ్డు నిర్మాణ పనులు ఆయన మంగళవారం పరిశీలించారు. రూ. 2.70 కోట్లతో పనులు చేపట్టినట్లు చెప్పారు.

పాలిసెట్‌కు ఉచిత శిక్షణ

గన్నవరం గ్రామీణం: డాక్టర్ బీవీ రాజు ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత పాలిసెట్ శిక్షణ ఇవ్వనున్నట్లు భీమవరం విష్ణు విద్యాసంస్థల ప్రతినిధి అంకమరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఉంగుటూరు మండలం ఆత్కూరు స్వర్ణభారత్ ట్రస్టు ఆవరణలోని సంస్థ విజ్ఞాన కేంద్రంలో ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి ఉచిత శిక్షణ ఇస్తామన్నారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు కొనసాగే శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు చెప్పారు. మరిన్ని వివరాలకు 9100033552 నంబరులో సంప్రదించాలని సూచించారు.

ఆలయ పునర్నిర్మాణానికి విరాళం

నగదు అందజేస్తున్న దాతలు

హనుమాన్‌జంక్షన్, న్యూస్‌టుడే: సింగన్నగూడెంలో పునర్నిర్మిస్తున్న శ్రీగంగా, పార్వతీ సమేత సోమేశ్వరస్వామి ఆలయానికి సోడిశెట్టి రామచంద్రరావు, సత్యవతి జ్ఞాపకార్థం వారి కుమారుడు ప్రభాకరరావు, శ్రీదేవి దంపతులు రూ. 1,15,116 విరాళంగా అందజేశారు. మంగళవారం సాయంత్రం ఆలయాన్ని సందర్శించి, ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఈ మొత్తాన్ని ఉపసర్పంచి బెజవాడ కృష్ణారావు, ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా అర్చకులు నాగేశ్వరశర్మ ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఘనంగా గ్రామోత్సవం

హనుమాన్‌జంక్షన్: పెరికీడులో కొలువై ఉన్న శ్రీముక్తికాంత ముక్తేశ్వర స్వామి గ్రామోత్సవం మంగళవారం రాత్రి వైభవంగా నిర్వహించారు. మహాశివరాత్రి ఉత్సవాల సందర్భంగా ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై ఉత్సవమూర్తులను ప్రధాన వీధుల్లో ఊరేగించారు. భక్తులు ఎక్కడికక్కడ స్వామివారికి ఎదురేగి స్వాగతం పలికారు. ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

వైభవంగా వసంతోత్సవం

యనమలకుదురు: స్థానిక రామలింగేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం వసంతోత్సవం ఘనంగా నిర్వహించారు. కృష్ణానదిలో ఉత్సవ విగ్రహాలకు పుణ్యాహస్నానాలతో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఊరేగింపు కార్యక్రమం చేపట్టారు. సాయంత్రం స్వామికి పవళింపు సేవ, నంది ముద్దలు ద్వాదశ ప్రదక్షిణలు చేశారు. ఆలయ అభివృద్ధి దాత సంగా నరసింహారావు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

వసతిగృహాల్లో ఆహార నాణ్యత పెంచాలి

ఎస్సీ వసతి గృహాన్ని తనిఖీ చేస్తున్న ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు

గన్నవరం గ్రామీణం, న్యూస్‌టుడే: నియోజకవర్గంలోని ప్రభుత్వ బీసీ, ఎస్సీ వసతి గృహాల్లో విద్యార్థులకు ఇస్తున్న ఆహార నాణ్యత మెరుగుపడేలా చర్యలు చేపట్టాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అధికారులను ఆదేశించారు. ఎస్సీ, బీసీ హాస్టళ్ల పనితీరుపై ఆ శాఖ అధికారులు, వార్డెన్‌లతో మంగళవారం సమీక్ష నిర్వహించారు. దావాజీగూడెంలో రెండు వసతి గృహాలను ఆకస్మిక తనిఖీ చేసిన ఎమ్మెల్యే విద్యార్థుల ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులతో నేరుగా ముచ్చటించి భోజనం నాణ్యత, ఇతర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారా అని ఆరా తీశారు. హాస్టల్ విద్యార్థులకు భద్రత పెంచేందుకు ప్రాంగణాలకు ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలంటూ పలు సూచనలు, సలహాలు చేశారు.

నులి పురుగులు నివారిద్దాం


విద్యార్థినికి మాత్రలు వేస్తున్న నాయకులు

హనుమాన్‌జంక్షన్, న్యూస్‌టుడే: చిన్నారుల ఆరోగ్యానికి నులి పురుగుల నివారణ అత్యవసరమని, దీనిపై తల్లిదండ్రులు శ్రద్ధ వహించాలని కూటమి నాయకులు పేర్కొన్నారు. జాతీయ నులి పురుగుల నివారణ కార్యక్రమంలో భాగంగా మండల వ్యాప్తంగా అన్ని అంగన్‌వాడీలు, పాఠశాలల్లోని విద్యార్థులకు మంగళవారం అల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. బాపులపాడు జడ్పీ ఉన్నత పాఠశాలలో రాష్ట్ర మాల కార్పొరేషన్ డైరెక్టర్ దయాల రాజేశ్వరరావు, కూటమి నాయకులు చలమలశెట్టి రమేష్, మూల్పూరి కల్యాణి, అట్లూరి శ్రీను, మొవ్వా వేణుగోపాల్, వరిగంజి కిశోర్, తోట మురళీధర్ విద్యార్థులకు మాత్రలు వేసి ఈ కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు. బాపులపాడు పీహెచ్‌సీ పరిధిలో 9,159 మందికి మాత్రలు పంపిణీ చేస్తున్నట్లు వైద్యాధికారి మధు తెలిపారు.

గన్నవరం గ్రామీణం: గన్నవరం, ఉంగుటూరు మండలాల్లోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో జాతీయ నులి పురుగుల దినోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. స్థానిక ముస్తాబాద, పెద్దఅవుటపల్లి, ఆత్కూరు, ఇందుపల్లి, ఉంగుటూరు పీహెచ్‌సీల ఆధ్వర్యంలో విద్యార్థులకు నులిపురుగు మందులు వేశారు.

విద్యార్థుల చదువులకు భరోసా

రామవరప్పాడు, న్యూస్‌టుడే: ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేసినందుకు మంగళవారం ఎనికేపాడులోని ఎస్ఆర్‌కే కళాశాలలో తెలుగుయువత, ఐటీడీపీ, టీఎన్ఎస్ఎఫ్ నాయకులు విద్యార్థులతో కలిసి మంత్రి లోకేశ్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. వారు మాట్లాడుతూ.. ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను విడుదల చేసి విద్యార్థుల చదువుకు మంత్రి లోకేశ్ భరోసా కల్పించారన్నారు. వైకాపా ప్రభుత్వంలో ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల కాకపోవడంతో విద్యార్థులు అనేక ఇబ్బందులు పడ్డారని పేర్కొన్నారు. నాయకులు సందీప్, సాయిరామ్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రి లోకేశ్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న నాయకులు, విద్యార్థులు

యువత నైతికతతో వ్యవహరించాలి

ఉయ్యూరు, న్యూస్‌టుడే: యువత నైతికతతో వ్యవహరించాలని అది భవిష్యత్తుకు పునాదని కృష్ణా విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ కూన రాంజీ పేర్కొన్నారు. మంగళవారం నిర్వహించిన స్థానిక ఏజీఎస్‌జీఎస్ కళాశాల 51వ వార్షికోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. విలువలతో కూడిన విద్యతో పాటు సామాజిక బాధ్యతను కలిగి ఉండటం వారి బాధ్యతగా భావించాలన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా నూతన సాంకేతికతను అందిపుచ్చుకోవడమే కాకుండా నైపుణ్య సాధన అత్యంత ప్రధానమన్నారు. సిద్ధార్థ అకాడమీ కార్యదర్శి పాలడుగు లక్ష్మణరావు మాట్లాడుతూ.. సిద్ధార్థ అకాడమీ 60 సంస్థలతో అనుసంధానమై విద్యార్థులను సిద్ధం చేస్తుందన్నారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ శివనాథ్ అధ్యక్షత వహించారు. విద్యార్థులకు జ్ఞాపికలు, ధ్రువపత్రాలు అందించారు. దిల్లీలో నిర్వహించిన గణతంత్ర దినోత్సవ వేడుకల్లో ప్రతిభ కనబర్చిన ఎన్‌సీసీ క్యాడెట్ బి.నాగ ఫణీంద్రను అభినందించారు. కార్యక్రమంలో కళాశాల ప్రత్యేకాధికారి సత్యనారాయణ, జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ బుచ్చిరెడ్డి, డైరెక్టర్ జి.జె.పి.వినయ్‌కుమార్ తదితరులు ప్రసంగించారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

మాట్లాడుతున్న కృష్ణా విశ్వవిద్యాలయం ఉపకులపతి రాంజీ

గురుకులంలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

గన్నవరం గ్రామీణం, న్యూస్‌టుడే: గన్నవరం మండలం వీరపనేనిగూడెం డా. బీఆర్. అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో 2026-27 విద్యా సంవత్సరానికి సంబంధించిన ఐదు, ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీసీవో మురళీకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తులకు ఈనెల 19వ తేదీ గడువుగా పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు పాఠశాలలో సంప్రదించాలన్నారు.

పొగతో వాహనదారుల అవస్థలు

ఉయ్యూరు పురపాలక సంఘం పరిధి ఒకటో వార్డులో ఎగినిపాడు, నాగన్నగూడెం, జగనన్న కాలనీలకు వెళ్లే రహదారిలో ఉన్న చెత్తకు నిప్పు పెట్టడంతో పొగ కమ్ముకుంది. దీంతో అటుగా ప్రయాణించే వాహనదారులు దారి కనిపించక ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, ఉయ్యూరు**

అధ్వాన రహదారులు

విజయవాడ-మచిలీపట్నం జాతీయ రహదారిని అనుసంధానం చేసే కోలవెన్ను ప్రధాన రోడ్డు మరమ్మతు పనుల సక్రమంగా లేవని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సుమారు 2 కి.మీ మేర కంకర, క్వారీ పొడి మిశ్రమంతో గుంతల పూడ్చారు. ఆరు నెలలు గడిచినా తారు వేయకపోవడంతో కంకర గుట్టలుగా పేరుకుపోయింది. దీంతో నాలుగు గ్రామాలకు రాకపోకలు సాగించే వాహనదారులు, ఎడ్ల బండ్లు కలిగిన రైతుల ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు చెబుతున్నారు. **- న్యూస్‌టుడే, కోలవెన్ను (కంకిపాడు)**

జేఈఈ మెయిన్ ఫలితాల్లో శ్రీచైతన్య విజయభేరి

అత్యుత్తమ పర్సంటైల్ సాధించిన విద్యార్థిని అభినందిస్తున్న ఏజీఎం మురళీకృష్ణ తదితరులు

బెంజిసర్కిల్ (విజయవాడ సిటీ), న్యూస్‌టుడే : జేఈఈ మెయిన్ పరీక్షా ఫలితాల్లో విజయవాడలోని శ్రీచైతన్య విద్యాసంస్థల విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించారని ఎగ్జిక్యూటివ్ ఏజీఎం మద్దినేని మురళీకృష్ణ అన్నారు. పసల మోహిత్ 100 పర్సంటైల్, కె.హిమకర్, జి.సాయి సాత్విక్, పి.ప్రవీత్ చెన్నకేశవ్ వరుసగా 99.99 పర్సంటైల్ సాధించారని వెల్లడించారు. 99.99 ఆపైన పర్సంటైల్ 21 మంది, 99.98 ఆపైన 34 మంది, 99.97 ఆపైన 46 మంది, 99.96 ఆపైన 59 మంది, 99.95 ఆపైన 71 మంది, 95.0 ఆపైన 800 మంది, 90.0 ఆపైన పర్సంటైల్ 1200 మంది సాధించారని తెలియజేశారు. బెంజి సర్కిల్‌లోని క్యాంపస్‌లో ప్రతిభ చూపిన విద్యార్థులను మురళీకృష్ణ, ఎగ్జిక్యూటివ్ డీన్ పి.వెంకటేశ్వరరావు తదితరులు అభినందించారు.

సీఎం సహాయనిధి పేదలకు వరం

గన్నవరం గ్రామీణం: సీఎం సహాయనిధి పేదలకు ఒక వరం లాంటిదని ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. గన్నవరం తెదేపా కార్యాలయంలో మంగళవారం 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' కార్యక్రమాన్ని నిర్వహించారు. తొలుత ప్రజల నుంచి అర్జీలను స్వీకరించిన ఎమ్మెల్యే వాటిని పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం నాలుగు మండలాలకు చెందిన 32 మంది లబ్ధిదారులకు రూ. 21,69,288 విలువైన ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను అందజేశారు. కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అధిక పాల దిగుబడి కోసం గేదెలకు నిషేధిత ఇంజెక్షన్లు

గుంటూరు రూరల్, న్యూస్‌టుడే: రెడ్డిపాలెంలోని ఓ ఇంటిపై టాస్క్‌ఫోర్స్, స్పెషల్ బ్రాంచి పోలీసులు దాడి చేపి అక్రమంగా నిల్వచేసిన నిషేధిత ఇంజెక్షన్లు స్వాధీనం చేసుకున్నారు. గేదెల నుంచి పాల ఉత్పత్తి పెంచేందుకు వీటిని వినియోగిస్తున్నారని సమాచారం అందడంతో పోలీసులు రెడ్డిపాలేనికి చెందిన పల్లపోతు రేణుక నివాసంపై దాడి చేశారు. ఎలాంటి ముద్రలు లేని డబ్బాల్లో ఉన్న రూ. 2,79,000 విలువైన 1860 ఇంజెక్షన్లు గుర్తించి సీజ్ చేశారు. కృష్ణాజిల్లా ఉయ్యూరుకు చెందిన పున్నారావు అనే వ్యక్తి వీటిని సరఫరా చేసినట్లు గుర్తించారు. తాను స్థానిక పాడి రైతులకు వీటిని రూ. 150 చొప్పున విక్రయిస్తున్నట్లు రేణుక అంగీకరించింది.

క్రీడా పోటీల్లో ప్రతిభ

ధ్రువపత్రాలు అందుకున్న విద్యార్థులతో ఉపాధ్యాయులు

ఉంగుటూరు మండలం పెద్దఅవుటపల్లి జడ్పీ పాఠశాల విద్యార్థులు రగ్బీ పోటీల్లో ప్రతిభ కనబర్చారు. అండర్-12 విభాగంలో నిర్వహించిన జిల్లాస్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులను ఇన్‌ఛార్జి హెచ్‌ఎం విజయలక్ష్మితో కలిసి ఎంఈవో సాంబశివరావు, పీడీ రాంబాబు తదితరులు ప్రత్యేకంగా మంగళవారం అభినందించారు. **- గన్నవరం గ్రామీణం, న్యూస్‌టుడే**

వసతిగృహాలకు సామగ్రి వితరణ

బాలికలకు వస్తువులు అందిస్తున్న ప్రతినిధులు

కలెక్టర్ డీకే బాలాజీ చేపట్టిన 'కృష్ణా సంకల్పం' కార్యక్రమంలో భాగంగా విజయవాడ ఎల్అండ్‌టీ సంస్థ ప్రతినిధులు గన్నవరం మండలం దావాజీగూడెం సాంఘిక సంక్షేమశాఖ వసతిగృహాలకు మంగళవారం రూ. 70 వేల విలువైన క్రీడా సామగ్రి, ఇతర వస్తువులు అందించారు. ఆయా వసతిగృహాల్లో దాదాపు 120 మంది విద్యార్థులు నివసిస్తున్నారు. కార్యక్రమంలో కంపెనీ ప్రతినిధులు ముత్తుకుమార్, సత్యభాస్కర్, హరిప్రసాద్, బాలాజీ, తహసీల్దార్ శివయ్య పాల్గొన్నారు. **- గన్నవరం గ్రామీణం, న్యూస్‌టుడే**

సర్వీస్ రహదారి పక్కన నిర్మాణం అడ్డగింత

ఉయ్యూరు గ్రామీణం, న్యూస్‌టుడే : గండిగుంట పంచాయతీ పరిధిలోని అండర్ పాస్ సమీప సర్వీస్ రోడ్డు పక్కన నిర్మిస్తున్న రేకుల షెడ్డు నిర్మాణ పనులను జాతీయ రహదారుల విభాగం అధికారులు మంగళవారం పరిశీలించారు. కాటూరు రోడ్డు-జాతీయ రహదారి సర్వీస్ రోడ్డు పక్కన కొంత స్థలాన్ని ఆక్రమించి నిర్మాణం జరుగుతున్నట్లు తహసీల్దార్ సురేశ్ కుమార్ ఫిర్యాదు మేరకు సర్వేయర్ శ్యామ్ బాబు.. నిర్మాణం చేపడుతున్న స్థలాన్ని పరిశీలించి నిలిపి వేయాలని సూచించారు. ఇది ప్రైవేట్ స్థలమని.. ఇక్కడ నిర్మిస్తే మీరు ఎందుకు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారని జనసేన నాయకుడు బి.శివప్రసాద్ ప్రశ్నించారు. దీంతో ఉయ్యూరు మండల ఆర్ఐ, సర్వేయర్, రెవెన్యూ సిబ్బందిని పిలిపించి వాటికి సంబంధించిన రికార్డులను శ్యామ్‌బాబు పరిశీలించి వారితో సర్వే చేయించారు. కొలతలు వేసి ఇది జాతీయ రహదారికి చెందిన స్థలమే అని రెవెన్యూ సర్వేయర్, సిబ్బంది నిర్ధారించారు. అయితే స్థలానికి సంబంధించిన డాక్యుమెంట్‌ను శివప్రసాద్ చూపించారు. దీనిపై రెవెన్యూ అధికారుల నుంచి మరిన్ని వివరాలు తీసుకుని ఆక్రమించుకున్న వారందరికీ వారం రోజుల్లో నోటీసులు ఇస్తామని.. తొలగించకపోతే కూల్చి వేస్తామని శ్యామ్ బాబు తెలిపారు.

నిర్మిస్తున్న రేకుల షెడ్డు

పాడి పరిశ్రమకు ప్రోత్సాహకాలను వినియోగించుకోండి

శివాజీకృష్ణకు ప్రథమ బహుమతి అందిస్తున్న జేడీ చిననరసింహులు

హనుమాన్ జంక్షన్, న్యూస్‌టుడే: పెయ్య దూడల ఉత్పత్తి ద్వారా పాడిరైతులకు మరింత ఆర్థిక ప్రయోజనం చేకూరుతుందని పశుసంవర్ధకశాఖ జేడీ చిననరసింహులు పేర్కొన్నారు. రాష్ట్రీయ గోకుల్ మిషన్, పశుగణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం కొత్తపల్లిలో పెయ్యదూడల ప్రదర్శన నిర్వహించారు. 38 మంది రైతులు తమ దూడలతో ఈ పోటీల్లో పాల్గొన్నారు. కన్నికంటి శివాజీకృష్ణ ప్రథమ బహుమతి సాధించగా, వల్లూరుపల్లి నాగరామకృష్ణప్రసాద్ ద్వితీయ, అక్కినేని రవికుమార్ తృతీయ బహుమతి గెలుపొందారు. ఈ సందర్భంగా చిననరసింహులు మాట్లాడుతూ ఏడాదికి ఒక గేదె కచ్చితంగా ఒక పెయ్య దూడకు జన్మనిచ్చేలా కార్యాచరణ చేపట్టామని, ఇందుకోసం మేలుజాతి వీర్యాన్ని అందుబాటులో ఉంచామన్నారు. పాడి పరిశ్రమకు ప్రభుత్వం అనేక ప్రోత్సాహకాలు అందిస్తుందని, వీటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఉప సంచాలకులు నాగభూషణం, సహాయ సంచాలకులు చంద్రమోహన్, ప్రమీలారాణి, వైద్యులు సుధారాణి, ప్రసన్నరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రాయితీపై వ్యవసాయ యంత్ర పరికరాలు

కంకిపాడు, న్యూస్‌టుడే : సాగు ఖర్చులు, నిర్వహణ వ్యయం తగ్గించే లక్ష్యంతో ఉద్యాన శాఖ ద్వారా రాయితీపై యంత్ర పరికరాలు రైతులకు అందజేయడానికి ప్రణాళిక సిద్ధమైందని కంకిపాడు డివిజన్ హెచ్‌వో హరిచంద్ ఒక ప్రకటనలో తెలిపారు. పవర్ స్ప్రేయర్లు, బ్యాటరీ స్ప్రేయర్లు, రోటావేటర్లు, చిన్న ట్రాక్టర్లు (20పీటీవో హెచ్‌పీ లోపు), పవర్ వీడర్లు, ఇరిగేషన్ పంప్ సెట్లు, బుష్ కట్టర్లు ఉన్నాయన్నారు. కావాల్సిన వారు సంబంధిత రైతు సేవా కేంద్రంలో సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, సన్నకారు, మహిళా రైతులకు 50 శాతం, ఇతర రైతులకు 40 శాతం రాయితీ ఉంటుందని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని అర్హులైన రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

పట్టపగలు దర్జాగా చోరీ

పటమట: దుండగుడు రైలులో దిల్లీ నుంచి వచ్చి పట్టపగలే ఇంట్లో చొరబడి నగదు, ఆభరణాలు చోరీ చేసిన ఘటన రామవరప్పాడులో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. దిల్లీకి చెందిన ఇద్దరు దుండగులు ఈ నెల 14న దిల్లీలో రైలు ఎక్కి 15వ తేదీ రాత్రి విజయవాడ చేరుకున్నారు. వన్‌టౌన్‌లోని ఓ హోటల్‌లో గది తీసుకున్నారు. సోమవారం ఉదయం వన్‌టౌన్‌లో బస్సు ఎక్కి రామవరప్పాడులో దిగారు. నడుచుకుంటూ వెళ్లి తాళం వేసిన రెండు ఇళ్లను ఎంచుకున్నారు. ఒకడు రామవరప్పాడు రామాలయం వీధిలోని ఓ ఇంట్లో చొరబడ్డాడు. బీరువాలోని సుమారు 30 గ్రాముల బంగారు ఆభరణాలతో పాటు కొంత నగదు దొంగలించాడు. మరొకడు అదే వీధిలోని మరో నివాసంలో చొరబడ్డాడు. ఆ సమయంలోనే కుటుంబ సభ్యులు ఇంటికి వచ్చి దొంగని గుర్తించారు. అతను పారిపోతుండగా.. గట్టిగా కేకలు వేశారు. స్థానికులు పట్టుకొని పోలీసులకు అప్పగించారు. అతను తన పేరు రాజు అని చెబుతున్నాడు. రామవరప్పాడు ఎందుకు వెళ్లారని అడిగితే పొంతన లేని సమాధానాలు చెబుతున్నాడు. రాజు దొరకగానే మరో వ్యక్తి హోటల్ గదికి వెళ్లి చొక్కా మార్చుకుని దిల్లీ రైలు ఎక్కి వెళ్లిపోయాడు. హోటల్ నిర్వాహకులు గది అద్దెకు ఇచ్చినప్పుడు గుర్తింపు కార్డు కూడా తీసుకోలేదు. ఫలితంగా దర్యాప్తు కష్టమవుతోంది.

దొంగతనం చేసిన ఇంట్లో పగలగొట్టిన బీరువా

ప్రమాదంలో గాయపడిన విశ్రాంత ఉపాధ్యాయుడు

పెనమలూరు, న్యూస్‌టుడే: ఆటో ఢీ కొట్టిన ఘటనలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు వివరాల ప్రకారం.. పోరంకికి చెందిన కాకర్ల సుధాకర్ ప్రభుత్వ విశ్రాంత ఉపాధ్యాయుడు. ఈ నెల 9న పోరంకిలోని క్యాపిటల్ ఆసుపత్రి సమీపంలో ద్విచక్ర వాహనాన్ని పార్క్ చేసి రహదారి అవతలి వైపు ఉన్న హోటల్‌కు వెళ్లి తిరిగి బందరు రోడ్డు దాటుతుండగా ఆటో అతడిని ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆయన తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు గమనించి ఆస్పత్రికి తరలించారు. చికిత్స అనంతరం మంగళవారం పెనమలూరు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రకటన

నా క్లయింట్, కృష్ణా జిల్లా, కంకిపాడు మండలం, కొనతనపాడు గ్రామం, తాళ్లూరి హైట్స్ నివాసులు కొడాలి సాంబశివరావు గారి కుమారుడు కొడాలి విశ్వేశ్వరరావు గారి సంజాయిషీ సంగతులను అనుసరించి తెలియజేయునది.

క్రింది పేర్కొన్న షెడ్యూలు దాఖలా స్థిరాస్తిలో భాగమైన కొనతనపాడు గ్రామ ప్రస్తుత రీ. సర్వే నెం.273రు దాఖలా య. 1.31 సెంట్లు వ్యవసాయ భూమి నా క్లయింట్ సంపూర్ణ స్వాధీన హక్కు భుక్తములతో వుండి వున్నది. క్రింది షెడ్యూలు దాఖలా భూమిని నా క్లయింట్ 1981వ సం. ఏప్రిల్ నెల, 15వ తేదీన జాస్తి రవికుమార్ గారి వలన క్రయము పొంది ద.నెం. 564/1981రుగా విక్రయ దస్తావేజు రీత్యా కంకిపాడు సబ్ రిజిస్ట్రారు వారి ఆఫీసులో రిజిస్టరు కాబడిన స్థిరాస్తి, అందుకు సంబంధించిన ఒరిజినల్ దస్తావేజు నా క్లయింట్ ఫోటోస్టాట్ తీయించు నిమిత్తం కొనతనపాడు నుండి కంకిపాడు వెళ్ళుచుండగా ది. 02-02-2026వ తేదీ సాయంత్రం 4 గం.లకు దారిలో పడిపోయినవి. సదరు డాక్యుమెంట్ పొందుటకు నా క్లయింట్ ప్రయత్నించినప్పటికీ దొరకలేదు. అట్టి దస్తావేజు ఎవరికైనా దొరికిన యెడల క్రింది ఆఫీస్ చిరునామాకు గాని, నా క్లయింట్ ఫోన్ నెం. 93953 62349కు తెలియజేయగలరు. అట్టి దస్తావేజును ఉపయోగించి ఎవ్వరైనా ఎట్టి దావా, తగాయిదాలు జరిపే యెడల అట్టి చర్యలు నా క్లయింటును బైండు చేయజాలవు.

షెడ్యూలు: కృష్ణా జిల్లా, కంకిపాడు మండలం, సబ్ రిజిస్ట్రారు యిలాకా ద.నెం. 5641/1981రు దాఖలా కొనతనపాడు గ్రామ రీ. సర్వే నెం. 68/7, 69/6 ప్రస్తుత రీ. సర్వే నెం. 273రు దాఖలా య.2.82 సెంట్లు వ్యవసాయ సాగు భూమికి **హద్దులు: తూర్పు:** బోదె, **దక్షిణం:** బోదె, **పడమర:** ఉండి ధర్మరాజు భూమి, **ఉత్తరం:** కొడాలి వెంకటేశ్వరరావు భూమి.

వేముల రవీంద్రనాథ్, M.Sc., B.L., న్యాయవాది
ఇ.నెం. 59-II-9, గాయత్రినగర్, పటమట, విజయవాడ- 520 008
విజయవాడ ది.17-2-26 సెల్ నెం. 94922 74299

(c) eenadu

గుడివాడ

•గుడివాడ •పామర్రు •అవనిగడ్డ



యాకమూరులో ప్రత్యేక అలంకరణలో శిర్డీసాయిబాబా

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

యాకమూరు(తోట్లవల్లూరు), న్యూస్‌టుడే: స్థానిక శిర్డీసాయిబాబా ఆలయం ఏడో వార్షికోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. అర్చకులు కాగడ హారతి, క్షీరాభిషేకం జరిపారు. భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు. అనంతరం అన్నదానం చేశారు. కార్యక్రమాలను ఆలయ కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

రామలింగేశ్వరుడికి వెండి మారేడు గొలుసు

కూచిపూడి, న్యూస్‌టుడే: పెదపూడికి చెందిన తాడికొండ రంగనాయకమ్మ కుమారుడు అవినాష్, అనూరాధ దంపతులు మారేడు దళాల వెండి గొలుసును రామలింగేశ్వరస్వామికి బహూకరించారు. వారి కుమారుడు మోక్షిత్రీకర్ జ్ఞాపకార్థం రూ.50 వేల విలువైన 150 గ్రాముల వెండితో తయారు చేసిన గొలుసును పాలకమండలి ఉపాధ్యక్షులు నారాయణ మూర్తి, అర్చకుడు సతీష్‌కుమార్‌కు అందజేశారు.

వెండి గొలుసు బహూకరిస్తున్న దాతలు

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

గుడివాడ: 89775 35999 పామర్రు : 80085 74684 అవనిగడ్డ: 80085 74679

❖ కృష్ణాపురంలో పశువుల ఆస్పత్రి భవనం అధ్వానంగా ఉందని స్థానిక పశుపోషకులు మేమున్నాం...మీకుతోడుగా ద్వారా సమస్యను డా.రామ్‌నరేష్ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన స్పందించి అధికారుల దృష్టికి తీసుకెళ్లానని అక్కడి నుంచి ఉత్తర్వులు రాగానే తగిన చర్యలు తీసుకుంటామన్నారు. ❖ మేడూరు నుంచి ధూళిపూడిపాలెం రోడ్డు సరిగా లేక ఇబ్బంది పడుతున్నామని స్థానికులు పంచాయతీ ఏఈ శరాబందిరాజు దృష్టికి తీసుకెళ్లారు. సమస్యను పరిష్కరిస్తామని అన్నారు. –న్యూస్‌టుడే, పమిడిముక్కల ❖ స్థానిక మచిలీపట్నం రోడ్డులో చెత్త పేరుకుపోయి దుర్గంధం వస్తోందని స్థానికులు 'మేమున్నాం.. మీకు తోడుగా' ద్వారా సమస్యను శానిటరీ ఇన్‌స్పెక్టర్ సుభాకరరావుకు తెలిపారు. స్పందించిన ఆయన సిబ్బందిని పంపి సమస్యను పరిష్కరించారు. ❖ పాత స్టేట్‌బ్యాంకు సెంటర్‌లో డ్రెయినేజీ పొంగి రోడ్డు మీదకు రావడంతో ఇబ్బందులు పడుతున్నామని ప్రాంతవాసులు పంచాయతీ కార్యదర్శి సలీమ్ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన సిబ్బందిని పంపి సమస్యను పరిష్కరించారు. ❖ స్థానిక వీరాంజనేయ కాలనీలో వీధి దీపాలు వెలగడం లేదని కార్యదర్శి సలీమ్‌కు తెలిపారు. సిబ్బందిని పంపి మరమ్మతులు చేయించారు. –న్యూస్‌టుడే, పామర్రు

ఏఐతో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం

అవనిగడ్డ, న్యూస్‌టుడే: కృత్రిమ మేధ (ఏఐ) పరిజ్ఞానంతో విద్యార్థులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని పోటీ ప్రపంచంలో ముందుకు రావాలని టెచ్బీబీ సంస్థ ప్రతినిధి మానేపల్లి మణికంఠ చెప్పారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం కంప్యూటర్ సైన్స్ విభాగం ఆధ్వర్యంలో ఏఐ అవగాహన, ప్లేస్‌మెంట్ శిక్షణ వర్క్‌షాప్‌ను నిర్వహించారు. ప్రిన్సిపల్ ఉమారాణి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో నేటి సాంకేతిక యుగంలో కృత్రిమ మేధస్సు ప్రాముఖ్యతను గురించి ఆయన వివరించారు. విద్య, పరిశ్రమలు, ఆరోగ్య రంగం, కార్పొరేట్ ప్రపంచంలో కీలక పాత్ర పోషిస్తున్నాయని, విద్యార్థులు ఈ నైపుణ్యాలను అంది పుచ్చుకుని ఉపాధి అవకాశాలు పొందాలని సూచించారు. విద్యార్థులు సందేహాలను నివృత్తి చేసుకున్నారు. అధ్యాపకులు ఎన్.స్వర్ణ జ్యోతి, జి.నాగార్జున పాల్గొన్నారు.

కొలిక్కి రాని ఇళ్ల నిర్మాణ పనులు

మంటాడ(పమిడిముక్కల), న్యూస్‌టుడే: గురజాడలోని ఎస్టీ తెగకు చెందిన యానాదుల గృహ నిర్మాణం నాలుగేళ్లుగా నత్తనడకన సాగుతూనే ఉంది. 2022లో కాలనీని సందర్శించిన అప్పటి కలెక్టర్ జె.నివాస్ వీరి సమస్యను గుర్తించి వారికి ఆధార్, జనన తేదీ, పథకాలకు అవసరమైన పత్రాలు తహసీల్దారుతో ఇప్పించారు. అదే సమయంలో వారికి నివేశన స్థలాలు కేటాయించి గృహాలు, పాఠశాల ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. దీంతో 38 కుటుంబాలకు గృహనిర్మాణ సంస్థ నుంచి ఒక్కొక్క ఇంటికి రూ.1.80 లక్షలు, గిరిజన కార్పొరేషన్ నుంచి రూ.63 వేలు కలెక్టర్ మంజూరు చేశారు. కార్పొరేషన్ నుంచి అదనపు సొమ్ము సంస్థకు చేరి నాలుగేళ్లు గడచినా పనులు జరగట్లేదు. కాలనీలో మంజూరైన 37 ఇళ్లలో 13 శ్లాబు వరకు పూర్తికాగా మిగిలినవి వివిధ దశల్లో అసంపూర్తిగా ఉన్నాయి. నీరు, రహదారి సౌకర్యాలు లేకపోవడంతో గృహ నిర్మాణ సామగ్రి తీసుకురావడం కష్టంగా ఉందని కాలనీవాసులు వాపోతున్నారు.

అసంపూర్తిగా ఎస్టీ కాలనీలోని గృహ నిర్మాణాలు

మార్చి లోగా పూర్తి చేస్తాం: దీనిపై మండల గృహనిర్మాణ సహాయక ఇంజినీరు నరేంద్ర మాట్లాడుతూ.. ఆరంభంలో స్థలాల మెరక పనులు కొన్ని కారణాల వల్ల జాప్యం జరిగిందని అన్నారు. అనంతరం లేఅవుట్ చుట్టూ ఉన్న పొలాల్లో నాట్లు కోసం నీరు పెట్టడంతో నివేశన స్థలాల్లో బోర్లు వేసే పనులకు సమయం పట్టిందని తెలిపారు. త్వరలో పనులు మొదలు పెట్టి మార్చి నెలాఖరు లోగా పూర్తి చేయాలని అధికారులను నిర్దేశించారని పేర్కొన్నారు.

వీధి కుక్కల బారి నుంచి కాపాడండి

గుడివాడ, న్యూస్‌టుడే: గుడివాడ పట్టణంలో వీధి కుక్కల బారినుంచి ప్రజలను కాపాడాలని భాజపా గుడివాడ పట్టణ 2వ అధ్యక్షుడు మాచర్ల రామకృష్ణ కోరారు. స్థానిక బంటుమిల్లి రోడ్డులో వీధి కుక్క దాడిలో శనివారం రాత్రి రోడ్డు ప్రమాదానికి గురైన వ్యక్తిని రామకృష్ణ ఆసుపత్రికి తరలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో చాలా ప్రాంతాలలో వీధి కుక్కలు పిల్లలు, పెద్దలపై దాడి చేస్తున్నాయని, నిత్యం ఎక్కడో ఓ చోట కుక్కల దాడి సంభవిస్తోందన్నారు. తక్షణం అధికారులు కుక్కల బారినుంచి ప్రజలను రక్షించాలని కోరారు. ఇప్పటికే పురపాలక అధికారులకు పలు మార్లు వినతిపత్రాలు సమర్పించామని, అయినా ఫలితం లేదన్నారు.

రీసర్వే పరిశీలించిన కలెక్టర్ బాలాజీ

చల్లపల్లి, న్యూస్‌టుడే: చల్లపల్లి మండలం మాజేరు పంచాయతీ పచ్చార్లంకలో జరుగుతున్న భూముల రీసర్వేను మంగళవారం ఉదయం కలెక్టర్ డి.కె.బాలాజీ పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బాలాజీ రైతులు, సర్వేయర్లతో మాట్లాడి సర్వే జరుగుతున్న తీరును తెలుసుకొన్నారు. ప్రణాళికాబద్ధంగా రీసర్వే నిర్వహించాలని జిల్లా కలెక్టర్ రెవెన్యూ అధికారులకు చెప్పారు. సర్వే ఏడీ లక్ష్మణ్, ఇన్‌ఛార్జి తహసీల్దార్ జి.శ్రీలత, రీసర్వే డీటీ సి.హెచ్.నీలిమ, ఆర్ఐ ఘంటసాల కృష్ణమోహన్, సర్వేయర్ వలి, వీఆర్వో పరిశే కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

పచ్చార్లంకలో రీసర్వేను పరిశీలిస్తున్న కలెక్టర్ డి.కె.బాలాజీ

నేటి నుంచి శ్రీసంపటాలమ్మ వార్షికోత్సవం

చల్లపల్లి, న్యూస్‌టుడే: చల్లపల్లి గ్రామదేవత శ్రీసంపటాలమ్మ అమ్మవారి ఆలయ 27వ వార్షికోత్సవాలు మూడు రోజులపాటు జరుగుతాయని ఆలయ నిర్వాహకులు తెలిపారు. బుధవారం ఉదయం 10.25గంటలకు విఘ్నేశ్వరపూజ, గోపూజ, శ్రీఅమ్మవారికి అభిషేకాలతో ఉత్సవాలు ప్రారంభమౌతాయి. 19వతేదీ ఉదయం సామూహిక కుంకుమ పూజలు, సాయంత్రం అమ్మవారికి కుంకుమపూజ, 20వ తేదీన ప్రత్యేక పూజలు జరుగుతాయి.

శ్రీసంపటాలమ్మ అమ్మవారు

రైతులు సుభిక్షంగా ఉండాలని..

పెదకళ్లేపల్లి(మోపిదేవి), న్యూస్‌టుడే: పెదకళ్లేపల్లిలో జరుగుతున్న శ్రీదుర్గాపార్వతి సమేత నాగేశ్వర స్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆరో రోజైన మంగళవారం వసంత్యుత్సవం వేడుకగా జరిపారు. రైతులు సుభిక్షంగా ఉండాలని ధాన్యాన్ని రోలులో పోసి రోకళ్లతో దంచి ధాన్యపుటోత్సవం జరిపి స్వామికి నివేదించారు.

ఆధునిక వ్యవసాయ పద్ధతులు అవలంబించాలి

ఘంటసాల, న్యూస్‌టుడే: ఆధునిక వ్యవసాయ పద్ధతులను అవలంబించడం ద్వారా సత్ఫలితాలు పొందవచ్చని ఘంటసాల కృషి విజ్ఞాన కేంద్రం సమన్వయకర్త డి.సుధారాణి తెలిపారు. మంగళవారం స్థానిక కేవీకేలో భారత్ విస్తార్ యాప్ ప్రారంభ ప్రత్యక్ష ప్రసారంతో రైతులకు అవగాహన కల్పించారు. శాస్త్రవేత్తలు బి.నవీన్, జె.యశ్వంత్ కుమార్, ఎం.వెంకటలక్ష్మి, జి.కృష్ణకుమారి, రైతులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కేవీకే సమన్వయకర్త సుధారాణి

గ్రూప్స్ విజేతలకు సత్కారం

అవనిగడ్డ, న్యూస్‌టుడే: స్థానిక రెండో వార్డుకు చెందిన గ్రూపు-1 విజేత, రాష్ట్ర పన్నుల శాఖ అసిస్టెంట్ కమిషనర్‌గా ఎంపికైన విస్సంశెట్టి భానుప్రకాష్, గ్రూపు-2లో ప్రతిభ కనపరిచి సెక్రటేరియట్‌లో అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్‌గా ఎంపికైన బండే సుధారాణిలను మంగళవారం స్థానిక ఎస్వీఎల్ క్రాంతి కళాశాల యాజమాన్యం ఘనంగా సత్కరించారు. అవనిగడ్డ నుంచి గ్రూపు-1, గ్రూపు-2 పరీక్షలలో ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి ఉద్యోగాలకు ఎంపికైన వారిని ఆదర్శంగా తీసుకోవాలని కరస్పాండెంట్ దుట్టా ఉమామహేశ్వరరావు సూచించారు. కళాశాల ప్రిన్సిపల్స్ రెడ్డొతు బాబూ రాజేంద్రప్రసాద్, జూనియర్ ఎన్వీ.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

విజేతలతో అతిథులు

10 గ్రామాల్లో నూరుశాతం వసూళ్లు

గుడ్లవల్లేరు, న్యూస్‌టుడే: చిన్నారుల్లో రక్తహీనతకు కారణమయ్యే నులిపురుగుల నివారణకు, పేగుల ఆరోగ్యానికి డీవార్మింగ్ ఎంతో మేలు చేస్తుందని ఎంపీడీవో ఎండీ.ఇమ్రాన్ పేర్కొన్నారు. మంగళవారం జాతీయ డీవార్మింగ్‌డే సందర్భంగా స్థానిక హైస్కూల్‌లో విద్యార్థులకు వైద్యులు యశస్వినితో కలసి మాత్రలు వేశారు. అంగలూరులో నిర్వహిస్తున్న స్వర్ణ పంచాయత్ కార్యక్రమంలో భాగంగా ఇంటి పన్ను వసూళ్లను పరిశీలించారు. మండలంలో 10 గ్రామాలలో నూరు శాతం పన్నుల వసూళ్లు జరిగాయన్నారు. డిప్యూటీ ఎంపీడీవో ఎలీషారావు పాల్గొన్నారు.

డ్రెయిన్ నిర్మాణ పనులు వేగవంతం చేయాలి

గుడివాడ, న్యూస్‌టుడే: గుడివాడ పట్టణంలోని దనియాలపేటలో పెండింగ్‌లో ఉన్న డ్రెయిన్‌లు, రోడ్ల నిర్మాణ పనులను వీలైనంత త్వరలో పూర్తి చేయాలని గుడివాడ పురపాలక సంఘ కమిషనర్ సింహాద్రి మనోహర్ పేర్కొన్నారు. స్థానిక దనియాలపేటలో మంగళవారం పర్యటించి ప్రజలను అడిగి సమస్యలు తెలుసుకున్నారు. కొత్త, పాత కాలనీలలో తాగునీటి సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. పైపులైన్ లీకులు వెంటనే అరికట్టి ప్రజలకు స్వచ్ఛమైన నీటిని అందించాలని సిబ్బందికి ఆదేశించారు. అర్బన్ హెల్త్ సెంటర్ నిర్మాణ పనులను పరిశీలించి త్వరితగతిన పనులు పూర్తి చేయాలని కోరారు. అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

తాగునీటి సమస్యలను పరిశీలిస్తున్న కమిషనర్ మనోహర్

సాటివారికి సేవ చేయడం మన బాధ్యత

గుడివాడ, న్యూస్‌టుడే: సమాజంలో మనతో జీవించే సాటి వారికి మన వంతు సాయం అందించడం సామాజిక బాధ్యత అని జిల్లా అగ్నిమాపక సహాయ అధికారి జె.ఆంజనేయులు పేర్కొన్నారు. రక్షణ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో అభాగ్యులకు దుస్తులు, నిత్యావసరాలను మంగళవారం పంపిణీ చేశారు.

దుస్తులను పంపిణీ చేస్తున్న ఆంజనేయులు

నేటి నుంచి విద్యుత్తు సరఫరాలో అంతరాయం

గుడివాడ, న్యూస్‌టుడే: ఏపీ ట్రాన్స్‌కో వారి 220 కేవీ నున్న, గుడివాడ ట్రాన్స్‌మిషన్ లైను ఆధునికీకరణ పనులలో భాగంగా చేస్తున్న సాంకేతిక మరమ్మతుల కోసం ఈనెల 18వ తేదీ నుంచి 23వ తేదీ వరకూ విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగే అవకాశాలు ఉన్నాయని గుడివాడ డీఈఈ శ్రీనివాసరావు తెలిపారు. ప్రతీ రోజూ ఉదయం 7 నుంచి సాయంత్రం 6 గంటల వరకూ పనులు చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేశారన్నారు. దీనిలో భాగంగా 220 కేవీ విద్యుత్ ఉపకేంద్రం గుడివాడలో ఒక సర్క్యూట్ విద్యుత్ సరఫరాను తాత్కాలికంగా నిలుపుచేయడం జరుగుతుందన్నారు. సాధారణ ప్రజలకు ఎలాంటి అంతరాయం లేకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశామన్నారు. అత్యవసరం అయితే.. 220 కేవీ గుడివాడ ఉపకేంద్రం, 132 కేవీ పామర్రు, మచిలీపట్నం, అవనిగడ్డ, చిగురుకోట ఉపకేంద్రాల పరిధిలో విద్యుత్తు సరఫరాను నిలుపుదల చేస్తామన్నారు. ఈ ప్రాంతాలలోని వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

రెండోరోజు జరగని లావాదేవీలు

మోపిదేవి, న్యూస్‌టుడే: ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల్లో పనిచేస్తున్న సీఈవోలు, సహాయ సిబ్బంది తమ డిమాండ్ల సాధనకు చేపట్టిన నిరవధిక సమ్మె మంగళవారం రెండో రోజుకు చేరింది. లావాదేవీలు, రుణాల వసూళ్లు, ఎరువుల అమ్మకాలు తదితర సేవలన్నీ స్తంభించాయి.

అసంపూర్తి తరగతి గదులతో అవస్థలు

మర్రివాడ(పమిడిముక్కల), న్యూస్‌టుడే: స్థానిక మండలపరిషత్తు ప్రాథమికోన్నత పాఠశాలలో 2022లో ప్రారంభించిన అదనపు తరగతి గదుల నిర్మాణ పనులు అసంపూర్తిగా నిలిచిపోవడంతో విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. 8 తరగతులకు 4 గదులే ఉండడంతో విద్యార్థులకు పాఠాలు చెప్పేందుకు ఇబ్బందిగా ఉందని ఉపాధ్యాయులు చెబుతున్నారు. నాడు- నేడులో భాగంగా రూ.24 లక్షలతో మొదలుపెట్టిన రెండు తరగతి గదుల నిర్మాణం అసంపూర్తిగా నిలిచిపోయాయి. కూటమి ప్రభుత్వమైనా చొరవ తీసుకుని తరగతి గదుల నిర్మాణం చేపట్టాలని విద్యార్థులు, ఉపాధ్యాయులు కోరుతున్నారు.

ఆగని ఇసుక అక్రమ రవాణా

నాగాయలంక: నాగాయలంక తీరంలో ఇసుక మాఫియా ఆగడాలు ఆగడం లేదు. నదీ తీరంలోని ఇసుక దిబ్బలను తొలిచేసి పడవల ద్వారా అక్రమ రవాణాను యథేచ్ఛగా చేస్తున్నా అధికార యంత్రాంగం మాత్రం చోద్యం చూస్తోంది. నదిలో దిబ్బల ఇసుకను తోడి పడవలపై తీర ప్రాంతాలకు రవాణా చేస్తున్నారు. ఇసుక అక్రమ రవాణాపై అధికారులు దృష్టి సారించి అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.

పెదపాలెం వద్ద ఇలా..

నది గట్టు విరిగి భయపెడుతోంది!

అవనిగడ్డ గ్రామీణం, న్యూస్‌టుడే: నదీగర్భ గ్రామమైన పాత ఎడ్లంక పరిరక్షణకు నది గట్టు వెంట రాతి పేర్పుడు పనులు చేయడం ద్వారా రక్షణ గోడ నిర్మించాలని గ్రామస్థులు కోరుతున్నారు. కృష్ణానది ఆటుపోట్లకు, ప్రవాహ తీవ్రతకు నది గట్టు అండలుగా విరిగి పడిపోతోందని వాపోతున్నారు. వరదలకు 20కి పైగా గృహాలు, తిరుపతమ్మ ఆలయం నదిలో కలిసిపోయిందని వారు పేర్కొంటున్నారు.

అద్దె భవనంలోనే రైతు సేవా కేంద్రం!

మోపిదేవి, న్యూస్‌టుడే: మోపిదేవి రైతు సేవా కేంద్రం అద్దె భవనంలో నడుస్తోంది. నెలకు రూ.6వేల చొప్పున సంవత్సరానికి రూ.72వేల అద్దెను వ్యవసాయ శాఖ చెల్లిస్తోంది. సచివాలయ వ్యవస్థ ఏర్పడి దాదాపు ఆరు సంవత్సరాలు అయింది. ఈ లెక్కన ఇప్పటికి నాలుగున్నర లక్షల పైనే అద్దె రూపేణా చెల్లించాల్సి వచ్చింది. మోపిదేవిలో ప్రభుత్వ స్థలం 5 సెంట్లలో భవనం నిర్మిస్తే ప్రభుత్వానికి ఆర్థిక భారం తప్పుతుంది.

నాసిరకం రోడ్డుతో సరిపెట్టారు

పెదపారుపూడి, న్యూస్‌టుడే: ఇటీవల పెదపారుపూడి- అప్పికట్ల 4 కిమీ ఆర్అండ్‌బీ రహదారికి ప్రభుత్వం రూ.1.20 కోట్లు నిధులు కేటాయించగా గుత్తేదారుడు ఒక లేయర్ మాత్రమే వేయడంతో రోడ్డు ప్రారంభోత్సవం కాకముందే పాడైపోతుందని అప్పికట్ల గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోవట్లేదని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు రోడ్డు నాణ్యతా ప్రమాణాలను పరిశీలించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

వ్యాపారవేత్త ప్రభాకరరావు మృతి

చల్లపల్లి, న్యూస్‌టుడే: ప్రముఖ వ్యాపారవేత్త, దివి తాలూకా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు వురిమి నాగ వెంకట ప్రభాకరరావు(66) గుండెపోటుతో మృతిచెందారు. హైదరాబాద్‌లో ఉన్న ఆయన సోమవారం రాత్రి ఫోన్‌లో మాట్లాడుతున్న సందర్భంలో హఠాత్తుగా గుండెపోటు రావడంతో మృతిచెందినట్లు బంధువులు తెలిపారు. ఆయన భౌతికకాయాన్ని చల్లపల్లికి మంగళవారం రాత్రి తీసుకువచ్చారు. గతంలో రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షునిగా, అవతార్ మెహెర్‌బాబా కేంద్రం ఉపాధ్యక్షులుగా పనిచేశారు. ప్రభాకరరావుకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

ప్రముఖ రైతు రాధాకృష్ణ..

ఘంటసాల, న్యూస్‌టుడే: ఘంటసాలకు చెందిన ప్రముఖ రైతు వేమూరి రాధాకృష్ణ(71) మంగళవారం హఠాన్మరణం చెందారు. ఘంటసాలలో విద్యుత్ ఉపకేంద్రం నిర్మాణ కమిటీ అధ్యక్షుడిగా రైతులను సంఘటిత పరచి నిర్మింపజేశారు. జలధీశ్వర ఆలయం పునర్నిర్మాణంలో పలు అభివృద్ధి కార్యక్రమాలలో చురుకుగా పాల్గొన్నారు. రాధాకృష్ణ మృతికి జడ్పీ మాజీ ఉపాధ్యక్షుడు గొర్రెపాటి వెంకటరామకృష్ణ సంతాపం తెలిపారు.

ప్రమాదవశాత్తు భవన నిర్మాణ కార్మికుడు..

చల్లపల్లి, న్యూస్‌టుడే: భవన నిర్మాణ కార్మికుడు తాపీ పని చేస్తూ ప్రమాదవశాత్తూ కిందపడి చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన చల్లపల్లిలో చోటుచేసుకుంది. నారాయణ రావు నగర్‌కు చెందిన అవనిగడ్డ శేషగిరిరావు(59) 13న తాపీ పనికి వెళ్లి శ్లాబుకు సీలింగ్ పనులు చేస్తూ ఫ్లోరింగ్‌పై పడటంతో తలకు, గడ్డానికి తలగడంతో అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయాడు. మెరుగైన చికిత్సకు విజయవాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందాడు. మృతునికి భార్య, కుమారుడు ఉన్నారు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 98496 97616

చేపల చెరువుల తవ్వకాల అనుమతులు రద్దు కోరుతూ ముట్టడి

అంగలూరు (గుడ్లవల్లేరు), న్యూస్‌టుడే: మండలంలోని అంగలూరులో 25 ఎకరాలలో చేపల చెరువుల తవ్వకాలకు ఇచ్చిన అనుమతులు రద్దు చేయాలని కోరుతూ గ్రామస్థులు మంగళవారం గుడ్లవల్లేరులో బస్టాండ్ సెంటర్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయాన్ని ముట్టడించారు. 9 ఏళ్లుగా అనుమతులు ఇవ్వని ఆ చెరువులకు ఇప్పుడు అక్రమమార్గంలో అధికారులు అనుమతులు ఇవ్వడం ఏమిటని నిలదీశారు. దీంతో గ్రామస్థుల అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకుని వాటి అనుమతులు రద్దు చేయాలని అధికారులకు సిఫార్సులు పంపుతానని హామీ ఇవ్వడంతో విరమించారు. కార్యక్రమంలో బసవ అరుణ, మామిడి బాబూరావు, దావులూరి బుజ్జి, అజయ్‌కర్, మేకల ఏసురత్నం, చాట్ల డానియేలు, చిలుముల తాతారావు, కంచర్ల ప్రసాద్, చేబ్రోలు బుజ్జిబాబు తదితరులు పాల్గొన్నారు.

గుడ్లవల్లేరు బస్టాండ్ సెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన

ఈ-పంట నమోదు ప్రక్రియ తనిఖీ

మేడూరు(పమిడిముక్కల): సాగు భూముల పైరులకు సంబంధించి ఈ- పంట నమోదును జిల్లా వ్యవసాయాధికారిణి పద్మావతి మంగళవారం మేడూరులో తనిఖీ చేశారు. పంట రకం, సాగు విస్తీర్ణం, రైతు వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ యాప్ ద్వారా రైతు వివరాల నమోదును(ఏపీఎఫ్ఆర్) వారితో చేయించారు. ఇవి చేయించుకుంటేనే పథకాలు వస్తాయని ఆమె స్పష్టం చేశారు. గన్నవరం ఏడీఏ సునీల్, మండల వ్యవసాయాధికారి గణేష్ రెడ్డి, ఏఈఓ సునీల్ గవాస్కర్, రైతులు పాల్గొన్నారు.

మద్యం తాగి వాహనాలు నడిపినందుకు జరిమానా

గుడివాడ: గుడివాడ పట్టణంలోని వివిధ పోలీసు స్టేషన్ల పరిధిలో మద్యం సేవించి వాహనాలు నడిపిన వారికి ఒక్కొక్కరికీ రూ.10వేలను జరిమానాగా విధిస్తూ సెకండ్ క్లాస్ స్పెషల్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ దాసరి సుధాకర్ మంగళవారం తీర్పు చెప్పారు. ఈవిధంగా ఐదుగురికి జరిమానా విధించారు.

శ్మశానవాటికల అభివృద్ధికి చర్యలు

పెదపారుపూడి: గ్రామాలలో శ్మశానవాటికల అభివృద్ధికి చర్యలు చేపడుతున్నట్లు ఎంపీడీవో విమాదేవి అన్నారు. గుర్విందగుంటలో జరుగుతున్న శ్మశానవాటిక అభివృద్ధి పనులను తహసీల్దారు శ్రీనునాయక్‌తో కలిసి మంగళవారం ఆమె పరిశీలించారు. ఎంపీడీవో మాట్లాడుతూ అనేక గ్రామాలలో ఇవి లేకపోవడంతో గ్రామస్థులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. పంచాయితీ కార్యదర్శి విజయ్, గ్రామస్థులు పాల్గొన్నారు.

సీఎస్‌టీఈలో ప్రతిభ చాటిన విద్యార్థులు

పెదపూడి(కూచిపూడి), న్యూస్‌టుడే: ఉయ్యూరు జడ్పీ పాఠశాలలో సోమవారం నిర్వహించిన కంప్యూటర్ సైన్స్ టీచింగ్ ఎక్స్‌లెన్స్ కార్యక్రమంలో పెదపూడి విద్యార్థులు బహుమతులు సాధించారు. మంగళవారం హెచ్ఎం పి.కరుణాకర్‌రెడ్డి, ఉపాధ్యాయులు వారిని అభినందించారు. ఉపాధ్యాయురాలు ఎస్వీ జాన్సీలక్ష్మి ఆధ్వర్యంలో వీరేంద్రబాబు, తనోజ్‌కుమార్, రుషీకేశ్ నాయుడు 'డిస్ట్రిక్ట్ ఏక్‌థాన్' కార్యక్రమంలో పాల్గొని ప్రతిభ కనబరిచారు. విజేతలుగా నిలిచి పాఠశాలకు లాప్‌టాప్ అందించారు. సీఆర్పీలు సమర్పణరావు, ఆంజనేయులు పాల్గొన్నారు.

విద్యార్థులతో హెచ్ఎం, సీఆర్పీలు

గురుకుల విద్యార్థులకు మందుల పంపిణీ

పామర్రుగ్రామీణం: నిమ్మకూరులో గురుకుల వృత్తివిద్యా పాఠశాల, కళాశాల విద్యార్థులకు మంగళవారం ఆయుర్వేద మందులు ఉచితంగా పంపిణీ చేశారు. కాజ ఆయుర్వేద వైద్యాధికారిణి ఎం.భాగ్యలక్ష్మి పాల్గొని విద్యార్థులకు ఆరోగ్య సమస్యలపై సూచనలు ఇచ్చారు. ఆయుష్ ఆధ్వర్యంలో ఔషధాలు అందించారు. పాఠశాల, కళాశాల ప్రిన్సిపల్స్ లక్ష్మీకుమారి, బ్రహ్మేశ్వరి, విద్యార్థులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న వైద్యాధికారిణి భాగ్యలక్ష్మి

ప్రమాదాలపై ప్రజలకు అవగాహన

గుడివాడ, న్యూస్‌టుడే: రోడ్డు ప్రమాదాలు అధిక శాతం నిర్లక్ష్యం వలన సంభవిస్తాయని, వీటిపై ప్రజలు పూర్తి స్థాయిలో అవగాహన కలిగి ఉండాలని గుడివాడ రూరల్ ఎస్.ఐ ఎన్. చంటిబాబు పేర్కొన్నారు. [illegible]

దెబ్బతిన్న వాహనం, ఫ్లెక్సీ ప్రదర్శిస్తున్న రూరల్ ఎస్.ఐ చంటిబాబు, పోలీసులు

[illegible]

'సత్యమే అర్బన్ బ్యాంక్ ఎన్నికలు జరపాలి'

[illegible]

స్మార్ట్ మీటర్ల వినియోగంపై అవగాహన

[illegible]

అవగాహన కరపత్రాన్ని ప్రదర్శిస్తున్న డీఈఈ జి.బి.శ్రీనివాసరావు తదితరులు

నేత్రదానం... ప్రయోజనకరం

పామర్రు: పామర్రుకి చెందిన కాకుమాను ప్రసన్నం(75) మంగళవారం అనారోగ్యంతో మృతి చెందాడు. వాసవీ క్లబ్ కోశాధికారి [illegible]

వేలం ప్రకటన

[illegible]

DHR Value: 3,00,000/-
Advance: 25,000/-
By Court Order
Sri S.N.D.A.V. Prasad
Advocate, Gudivada

(c) eenadu

పట్టుగొమ్మ.. మెరిసెనమ్మా..

కలెక్టరేట్‌లో నిర్వహిస్తున్న ప్రజా సమస్యల పరిష్కార వేదిక ప్రాంగణంలో ప్రజలకు అవగాహన కల్పించడానికి ఏపీ పట్టు పరిశ్రమశాఖ ఆధ్వర్యంలో ఒక స్టాల్‌ని ఏర్పాటు చేశారు. పట్టు ఎన్ని రకాలు, పట్టు పరిశ్రమశాఖ ఇచ్చే రాయితీలను ఇస్తుందో అవగాహన కల్పిస్తున్నారు. కలెక్టరేట్‌లో వినతులు ఇచ్చేందుకు వస్తున్న రైతులు, ప్రజలు ఆసక్తిగా తిలకిస్తున్నారు. - ఈనాడు అమరావతి

పండ్ల గుత్తుల్లా.. టస్సార్ రకం

పట్టు పరిశ్రమశాఖ స్టాల్

దుర్గామల్లేశ్వరా... పాహిమాం...

ఇంద్రకీలాద్రి: ఇంద్రకీలాద్రిపై పాంచాహ్నిక పూర్వక మహాశివరాత్రి కల్యాణ మహోత్సవాలు పూర్ణాహుతి క్రతువుతో మంగళవారం ముగిశాయి. ఈ సందర్భంగా కల్యాణమూర్తులు, రుత్వికులతో కలిసి దుర్గగుడి ఈవో శీనానాయక్, ఛైర్మన్ రాధాకృష్ణ దుర్గాఘాట్ వద్దకు తీసుకొచ్చారు. భక్తుల ఆనందోత్సాహాల మధ్య వసంతోత్సవం, దుర్గాఘాట్‌లో కల్యాణ మూర్తులకు అవభృత స్నానం నిర్వహించారు. తర్వాత కల్యాణమూర్తులను తిరిగి ఇంద్రకీలాద్రిపైకి చేర్చడంతో కల్యాణ మహోత్సవాలు ముగిశాయి.

పూర్ణాహుతి క్రతువు నిర్వహిస్తున్న రుత్వికులు

సరఫరాలో జాప్యం.. స్పందిస్తే నయం

మిల్లుల్లో చౌక బియ్యం (పాతచిత్రం)

ఫోర్టిఫైడ్ కెర్నల్స్ కొరతతో ఇక్కట్లు

ఈనాడు, అమరావతి

ఉమ్మడి జిల్లాలో మిల్లర్లను పోర్టిఫైడ్ రైస్ కెర్నల్స్ కొరత వేధిస్తోంది. కొన్నాళ్లుగా వీటి సరఫరా సరిగాలేక ఇబ్బందులు తప్పడంలేదు. అవి కలిపాకే బియ్యాన్ని మిల్లర్లు సరఫరా చేయాల్సి రావడంతో ఉమ్మడి జిల్లాలో భారీగా నిల్వలు మిల్లుల్లోనే నిలిచిపోయాయి. దీంతో రూ.కోట్లలో వర్కింగ్ ఛార్జీలు ఆగాయని మిల్లర్లు వాపోతున్నారు.

ప్రక్రియకు నెల..

పేదలకు పోషకాలతో కూడిన బియ్యం అందించేందుకు కేంద్ర ప్రభుత్వం రేషన్ బియ్యంలో పోర్టిఫైడ్ కెర్నల్స్ కలిపి సరఫరా చేస్తుంది. ★ ఉమ్మడి కృష్ణా జిల్లాకు భోపాల్ గుత్తేదారుడు కెర్నల్స్ సరఫరా చేస్తున్నారు. ★ నిబంధనల మేరకు గుత్తసంస్థ కెర్నల్స్ శాంపిల్ తయారు చేశాక.. ఎఫ్‌సీఏకు పంపాలి. అక్కడ ఆమోదించాక.. దిల్లీలో అధికారులకు శాంపిల్ వెళుతుంది. అక్కడ కూడా ఆమోదం పొందాకే లోడ్ చేసి పంపిస్తారు.. ఈ ప్రక్రియకు నెల పట్టడంతో జాప్యం జరుగుతోంది.

సగమే ఇస్తే ఎలా..

ఉమ్మడి జిల్లాకు నెలకు 20 వేల మెట్రిక్ టన్నుల బియ్యం సరఫరా చేస్తున్నారు. ఇందులో 2,000 టన్నుల కెర్నల్స్ కలపాలి. కానీ నెలకు 1,000 టన్నులు మించి రావట్లేదు. దీంతో ఆ మేరకే బియ్యం సరఫరా చేయడంతో మిల్లుల్లోనే బియ్యం నిల్వలు పెరిగిపోతున్నాయి.

కాపాడటం భారమే..

సాధారణంగా మూడు నెలలకు సరిపడా కెర్నల్స్‌తో కూడిన చౌక బియ్యం లబ్ధిదారులకు సరఫరా చేసేందుకు గిడ్డంగుల్లో ఉంచుతారు. దీంతో కార్డుదారులకు సమస్య రాకున్నా మిల్లర్లే అవస్థలు పడుతున్నారు. ★ కెర్నల్స్ రాకపోవడంతో దాదాపు 2 లక్షల టన్నుల బియ్యం మిల్లుల్లో ఉంది. వాటిని కాపాడటం సమస్యగా మారింది. ★ కెర్నల్స్ కలిపాక బియ్యం తరలిస్తేనే వర్కింగ్ ఛార్జీలు వస్తాయి. మిల్లర్లకు రూ.కోట్ల సొమ్ము ఆలస్యం అవుతోంది. ★ ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల పౌరసరఫరాల అధికారులు మాట్లాడుతూ.. 'కెర్నల్స్ సరఫరా జాప్యమైనా రేషన్ బియ్యం పంపిణీలో ఇబ్బందిలేదు. గతంలో కెర్నల్స్ నమూనాల పరిశీలన స్థానికంగా జరిగేది. ప్రస్తుతం విధానం మారడంతో కొంత ఆలస్యం అవుతోంద'న్నారు.

మునేరు కరకట్టకు మోక్షం..!

ఈనాడు, అమరావతి - న్యూస్‌టుడే, నందిగామ

గండ్లు పూడ్చేందుకు రూ.2.4 కోట్లు

మునేరు కరకట్టకు పడిన భారీ గండి

2024 వరదలు మునేరు వెన్ను విరిచాయి. కరకట్టకు 23చోట్ల గండ్లు పడ్డాయి. అనేకచోట్ల గట్టు బలహీనపడ్డాయి. భవిష్యత్తు దృష్ట్యా ముందు జాగ్రత్తగా సర్కారు నడుం కట్టింది. గండ్లు పూడ్చే పనులకు రంగం సిద్ధం చేసింది. ఇప్పటికే టెండర్ల ప్రక్రియ పూర్తవగా మార్చిలో పనులు చేపట్టనున్నారు.

16.5 కిలోమీటర్ల మేర పటిష్టం..

- మునేరు ఆనకట్ట సమీపంలో ఏడవ కరకట్టకు 500 మీటర్ల భారీ గండి పడింది.
- ఇదే కరకట్ట పెనుగంచిప్రోలు వైపు సైతం 16 కి.మీ. మేర బలహీన పడింది. ఈ గండ్లు పూడ్చి.. గట్టు పటిష్టానికి రూ.1.2 కోట్లు కేటాయించారు. వేసవిలోగా పనులు పూర్తికి.. టెండర్ల ప్రక్రియ పూర్తి చేసి వర్క్ ఆర్డర్ ఇచ్చారు.
- ఇప్పటికే బుడమేరు గట్టు బలోపేతం, గండ్లు పూడ్చివేతకు రూ.43 కోట్లతో 126 పనులు చేశారు.
- బుడమేరు అనుసంధాన చెరువులు, డ్రెయిన్లు చాలాచోట్ల బలహీనపడగా.. వాటి బలోపేతానికి 140 పనులకు.. రూ.37 కోట్లు మంజూరు చేశారు. వీటినీ త్వరలో మొదలు పెట్టనున్నారు.

ఇసుక మేటలతో ఇక్కట్లు..

- ఈ కాలువ పరిధిలో 5 వేల ఎకరాల ఆయకట్టు ఉంది. 2024లో గండ్లు పడ్డాక రెండుసార్లు వరదలు వచ్చాయి. నిరుడు వరద తీవ్రతకు 100 ఎకరాలకుపైగా పొలాల్లో ఇసుక మేటలు వేసి పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. రైతులు ఇసుక తొలగించి మళ్లీ నాట్లు వేసుకున్నారు.
- వరదల సీజన్ నాటికి గట్టు పటిష్టం చేయకపోతే ఆళ్లూరుపాడు, పాత వేమవరం, ముచ్చింతాల, పెనుగంచిప్రోలు, అనిగండ్లపాడులో పొలాలకు ముంపు ముప్పు తప్పదు.
- జలవనరుల శాఖ పర్యవేక్షక ఇంజినీర్ మోహనరావు మాట్లాడుతూ.. టెండర్లు పూర్తవగానే పనులు మొదలుపెట్టి వేసవిలోగా పూర్తి చేస్తామన్నారు.

సిమ్‌లు మారుస్తూ.. సీన్ ఏమారుస్తూ!

ఈనాడు - అమరావతి

సంచలనం రేపిన పిల్లల విక్రయాల కేసులో కీలక నిందితురాలు ప్రియాంక తప్పించుకు తిరుగుతోంది. గత నెలలో మేరఠ్‌లో తప్పించుకున్న నిందితురాలు ఇంటికి రాకుండా ఇతర ప్రాంతాల్లో సంచరిస్తోంది. బెజవాడ పోలీసులు గట్టి నిఘా పెట్టడంతో.. సిమ్‌లు మారుస్తూ ఏమారుస్తోంది. దిల్లీ ముఠాకు ఈమే సూత్రధారి. ఈమె దొరికితేనే కేసు సాగేది.

పరారీలో కీలక నిందితురాలు ప్రియాంక

నిరుపేద పిల్లలను తెచ్చి..

ఇప్పటికే అరెస్టయిన నిందితులు.. దిల్లీలో ప్రియాంక నుంచి తాము పిల్లలను తీసుకున్నట్లు వెల్లడించారు. కిరణ్‌శర్మ కూడా ఇదే తెలిపింది. దిల్లీలో కిరణ్‌శర్మ, ప్రియాంక ఒకేచోట ఉండేవారు. పేదింటి బిడ్డలను ఈమె ప్రియాంక నుంచి తీసుకుని.. అమ్మకానికి విజయవాడలో బలగం సరోజినికి చేర్చేది. దీంతో కేసు దర్యాప్తు ప్రియాంక వద్ద ఆగిపోయింది. ఈమె ఎక్కడి నుంచి పిల్లలను తెచ్చిందనేది తేలలేదు. ఉత్తరాది నుంచి పలు ప్రాంతాల కార్మికులు దిల్లీ వచ్చి మురికివాడల్లో ఉంటారు. వీరిలో పోషించే స్థోమత లేని వారి పిల్లలను తీసుకుందని అనుమానిస్తున్నారు.

పాపపు సొమ్ముతో విలాసం..

పిల్లల విక్రయాలతో వచ్చే సొమ్ముతో ప్రియాంక విలాస జీవితం గడిపేది. ఈమెకు దిల్లీ, యూపీలో మేరఠ్‌లోనూ ఇళ్లు ఉన్నాయి. దిల్లీలో పశ్చిమవిహార్, హరియాణాలో ఫరీదాబాద్, బెజవాడలో మూడు స్టేషన్లలో కేసులు నమోదయ్యాయి. ప్రియాంక ఫోన్ లొకేషన్‌ను ట్రాక్ చేస్తున్నారు. పాత సిమ్‌ను తీసేసి.. కొత్తది ఉపయోగిస్తోంది. మేరఠ్‌లో బాయ్‌ఫ్రెండ్‌తో టచ్‌లో ఉన్నట్లు గుర్తించారు. తర్వాత కొద్దిరోజులకే ఆ సిమ్ స్విచ్ఛాఫ్ అయింది. కొత్తది తీసుకున్నట్లు గుర్తించి.. ఆ నెంబరును పట్టుకున్నా.. దానినీ మార్చేసింది.

తొలుత మేరఠ్‌కు..

నిందితురాలి బాయ్‌ఫ్రెండ్‌పై నిఘా పెట్టి.. ఆమె వివరాల కోసం రెక్కీ బృందం మేరఠ్ వెళ్లనుంది. అతడిని అదుపులోకి తీసుకుని విషయం తేల్చాక.. మరో బృందం ప్రియాంకను అదుపులోకి తీసుకునేందుకు వెళ్లనుంది. మరోవైపు.. ముంబయి ముఠాలోని కవిత సహాయకురాలు నూరిని అరెస్టు చేయాల్సి ఉంది. థానేలో ఉంటున్నట్లు గుర్తించారు. ఈమె రెండుసార్లు పిల్లలను విజయవాడకు తెచ్చి సరోజినికి ఇచ్చింది. నిందితుడు అనిల్ విచారణలో అతని బంధువు బాబు పేరు బయటకు రాగా.. అతడినీ నిందితుడిగా చేర్చారు. వీరి అరెస్టుకు ముంబయికి మరో బృందం వెళ్లనుంది.

నిఘా నీడలో ఇంటర్ పరీక్షలు

సజావుగా నిర్వహించేందుకు ఏర్పాట్లు : డీఐఈవో

మాచవరం, న్యూస్‌టుడే : జిల్లాలో ఈ నెల 23 నుంచి మార్చి 24వ తేదీ వరకు నిర్వహించే ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలను సీసీ కెమెరాలతో పర్యవేక్షించనున్నట్లు జిల్లా ఇంటర్ విద్యాశాఖాధికారి (డీఐఈవో) బి.ప్రభాకరరావు తెలిపారు. స్థానిక ఎస్సారార్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని కార్యాలయంలో మంగళవారం ఆయన 'న్యూస్‌టుడే'తో మాట్లాడారు. జిల్లాలో మొదటి సంవత్సరం విద్యార్థులు 36,734 మంది, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 39,534 మంది ఉన్నారని చెప్పారు. 98 కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఒక్కో కేంద్రానికి ఒక చీఫ్ సూపరింటెండెంట్, డిపార్ట్‌మెంటల్ అధికారిని నియమించామన్నారు. ముగ్గురు సభ్యులు గల జిల్లా పరీక్షల కమిటీ పర్యవేక్షణలో నాలుగు ఫ్లైయింగ్ స్క్వాడ్‌లు, 3 సిట్టింగ్ స్క్వాడ్‌లు తనిఖీలు నిర్వహిస్తారన్నారు. అన్ని పరీక్షల కేంద్రాల్లో సీసీ కెమెరాలు అమర్చినట్లు తెలిపారు. వీటిని ఇంటర్ ప్రాంతీయ తనిఖీ అధికారి, ఇంటర్ విద్యా మండలి కార్యాలయాలకు అనుసంధానం చేసినట్లు వివరించారు. మంచినీరు, గాలి-వెలుతురు, ఇతర వసతులు ఉండేలా ఏర్పాట్లు చేశామన్నారు. సమీపంలోని జిరాక్స్ దుకాణాలు మూసివేయాల్సి ఉందన్నారు. డీఎం అండ్ హెచ్‌వో ఆధ్వర్యంలో వైద్య బృందం, పోలీస్ బందోబస్తు ఉంటుందన్నారు. పరీక్షలు సజావుగా నిర్వహించేందుకు అన్ని రకాల చర్యలు చేపట్టామని ఆయన వివరించారు. ఒక్క నిమిషం ఆలస్యమైనా విద్యార్థులను అనుమతించమని.. అర్ధ గంట ముందుగానే పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని ఆయన సూచించారు.

చువ్వలు తేలినా చూడరే!

విజయవాడ నుంచి మైలవరం వెళ్లే రహదారిలో ఉన్న రెండు వంతెనలు ప్రమాదకరంగా మారాయి. వెలగలేరు వద్ద పోలవరం కాలువపై ఉన్న నందమూరి తారకరామారావు వంతెన, దానిని ఆనుకుని బుడమేరు కాలువపై ఉన్న వంతెనలపై రోడ్డులో భారీ గుంతలు పడి చువ్వలు తేలాయి. విజయవాడ నుంచి జి.కొండూరు, మైలవరం, విస్సన్నపేట వెళ్లడానికి నిత్యం కొన్ని వందల వాహనాలు రాకపోకలు సాగిస్తాయి. ఇప్పటికైనా మరమ్మతులు చేపట్టకపోతే వాటి మనుగడే ప్రశ్నార్థకంగా మారుతుంది.

- ఈనాడు, అమరావతి

స్వర్ణ శోభితం

యనమలకుదురు రామలింగేశ్వరస్వామికి విజయవాడ పటమటకు చెందిన కొడాలి సీతారాంబాబు, ఉషారాణి దంపతులు మంగళవారం రూ.10 లక్షల విలువైన జటాజూఠము, నాగాభరణాలను స్వామి వారికి సమర్పించారు. కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి దాత సంగా నరసింహారావు, ఈవో భవానీ, తదితరులు పాల్గొన్నారు. - న్యూస్‌టుడే, కానూరు

చేసేది మ్యూల్ వ్యవహారాలు.. చెప్పేది సాఫ్ట్‌వేర్ కొలువు

సూత్రధారి సుబ్రమణి రాజా వెంకట్ కోసం చెన్నైలో వేట

ఈనాడు, అమరావతి: తాను సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌ని అనీ, జీతం నెలకు రూ.30 వేలనీ.. ఇంట్లో అందరినీ నమ్మించాడు. కానీ చేసేది చట్టవిరుద్ధ కార్యకలాపాలే. ఇటీవల విజయవాడలో వెలుగు చూసిన మ్యూల్ ఖాతాల కేసులో కీలక సూత్రధారి రాజా వెంకట్ వ్యవహారమిది. ఈమధ్య సైబర్ పోలీసులు అరెస్టు చేసిన మ్యూల్ ఎకౌంట్స్ గ్యాంగ్ మూలాలు చెన్నైలో తేలుతున్నాయి. ఇప్పటికే ఈ కేసులో రవికుమార్, స్టీవెన్, బాజి, దుర్గాప్రసాద్‌లు అరెస్టయ్యారు. సూత్రధారి కోసం సైబర్ పోలీసుల ప్రత్యేక బృందం చెన్నై వెళ్లింది. ఇప్పటికే అరెస్టయి రిమాండ్‌లో ఉన్న నిందితుల నుంచి సేకరించిన వివరాల ఆధారంగా చెన్నైకి చెందిన సుబ్రమణి రాజా వెంకట్, ఆకాశ్‌కు అద్దె ఖాతాలు చేరేవని గుర్తించారు.

పరారీలో సూత్రధారి... ఈ వివరాల ఆధారంగా ప్రత్యేక బృందం.. మంగళవారం చెన్నై వెళ్లింది. అక్కడికి వెళ్లేసరికే కీలక సూత్రధారి పరారయ్యాడు. ఇంటి, పరిసర ప్రాంతాల్లో విచారించగా.. వెంకట్ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేస్తున్నట్లు చెప్పారు. కుటుంబ సభ్యులకు కూడా అసలు విషయం తెలియకుండా జాగ్రత్తలు తీసుకున్నట్లు తెలిసింది. ప్రాంతాల వారీగా ఏజెంట్లను పెట్టి అద్దె ఖాతాలు తెరిపిస్తున్నట్లు తేలింది. ఆకాశ్ వివరాలు తెలియలేదు. తప్పుదారి పట్టించేందుకు నిందితులు అలా చెప్పారా? అనే కోణంలోనూ విచారిస్తున్నారు. సుబ్రమణి రాజా వెంకట్ కుటుంబం.. అద్దె ఇంట్లో ఉంటోంది. నిందితుడి తండ్రి చనిపోయాడు. తల్లి ఉంది. అతనికి వివాహమై.. ఒక పిల్లాడు ఉన్నాడు. నిందితుడి వెనుక ఇంకా ఎవరైనా ఉన్నారా? అనే కోణంలో పోలీసులు విచారిస్తున్నారు.

నైపుణ్యాలపై పట్టు.. ఉపాధికి మెట్టు

విద్యార్హతలు ఉన్నా నైపుణ్యాలు లేక కొంతమంది విద్యార్థులు కొలువులు సాధించలేకపోతున్నారు. అందుకే పాఠశాల స్థాయిలోనే చదువుతో పాటు నైపుణ్యాల పెంపు, వృత్తి విద్యల్లో శిక్షణ ఇప్పిస్తోంది సమగ్ర శిక్షా. ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యార్థులు రాణించేలా కృషి చేస్తోంది. వృత్తి విద్యా నైపుణ్యాలు వృద్ధి చెందితే స్వయం ఉపాధి దిశగా అడుగులు వేయవచ్చు. ఉద్యోగాలు సాధించవచ్చనే లక్ష్యంతో నిర్ణయం తీసుకుంది.

పీఎంశ్రీ పాఠశాలల్లో వృత్తి విద్యా కోర్సులు..

ద్విచక్ర వాహనానికి మరమ్మతులు చేస్తున్న విద్యార్థులు

43 చోట్ల...

ఎన్టీఆర్ జిల్లాలోని 43 పీఎంశ్రీ పాఠశాలల్లో 9 నుంచి 12వ తరగతి విద్యార్థులకు సమగ్ర శిక్షా అధికారులు వృత్తి విద్య కోర్సులు నేర్పిస్తున్నారు. అనుభవజ్ఞులైన శిక్షకులను నియమించారు. ★ అగ్రికల్చర్, ఆటోమోటివ్, అపరెల్, ఎలక్ట్రానిక్స్, బ్యాంకింగ్, ఐటీ, బ్యూటీ అండ్ వెల్‌నెస్, రిటైల్, హెల్త్ కేర్.. మొత్తం తొమ్మిది ట్రేడుల్లో శిక్షణ ఇప్పిస్తున్నారు. విద్యార్థుల ఆసక్తులు, సామర్థ్యాలకు అనుగుణంగా ఆయా ట్రేడుల్లో తర్ఫీదు పొందవచ్చు. ★ వృత్తి విద్యలో భాగంగా క్షేత్ర స్థాయి అనుభవం కోసం విద్యార్థులు సెలవుల్లో ఇంటర్న్‌షిప్‌నకు వెళ్లారు. తాము నేర్చుకుంటున్న విభాగానికి సంబంధించిన సంస్థలు, పరిశ్రమలను సందర్శించారు. అక్కడ ఉద్యోగులు, యంత్రాల పనితీరు, ఉత్పత్తుల తయారీ తదితర అంశాలను ప్రత్యక్షంగా చూశారు. పుస్తకాలకే పరిమితం కాకుండా ప్రాక్టికల్ నాలెడ్జి పెంపునకు కూడా చర్యలు తీసుకుంటున్నారు. నేర్చుకున్న వృత్తి నైపుణ్యాన్ని ప్రదర్శించేందుకు ఇటీవల ప్రదర్శన కూడా ఏర్పాటు చేశారు. విద్యార్థులు తాము తయారు చేసిన నమూనాలు, ప్రాజెక్టులు, ఉత్పత్తులను ప్రదర్శించారు. బహుమతులు సాధించారు.

పిల్లల భవిత బాగు: విశ్వభారతి, జిల్లా జీసీడీవో

పాఠశాల స్థాయిలోనే చదువుతో పాటు వృత్తివిద్యా కోర్సులు నేర్చుకోవడం వల్ల సృజన, నైపుణ్యాలు మెరుగు పడతాయి. స్వయం ఉపాధి పొందవచ్చు. ఉద్యోగాలు పొందడానికి నైపుణ్యాలు మెరుగు పడతాయి. ఫలితంగా విద్యార్థుల భవిష్యత్తు బాగుంటుంది.

– విజయవాడ సిటీ, న్యూస్‌టుడే

ఎయిమ్స్ ప్రస్థానం అద్వితీయం

మంత్రి లోకేశ్ | ఘనంగా స్నాతకోత్సవం

ఈనాడు, అమరావతి - న్యూస్‌టుడే, మంగళగిరి: మంగళగిరి ఎయిమ్స్ ప్రస్థానం అద్వితీయం. బోధన, పరిశోధన, రోగి సంరక్షణ అనే మూడు స్తంభాలపై నిలిచి ఉంది. నమ్మకం అనే నాలుగో స్తంభాన్ని కూడా చేర్చాలని కోరుకుంటున్నానని రాష్ట్ర ఐటీ, విద్య శాఖల మంత్రి నారా లోకేశ్ ఆకాంక్షించారు. మంగళవారం మంగళగిరి ఎయిమ్స్‌లో నిర్వహించిన రెండో స్నాతకోత్సవంలో ఆయనతోపాటు కేంద్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ సహాయ మంత్రి అనుప్రియ పటేల్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. తొలుత ఎయిమ్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అహెంతమ్ శాంతాసింగ్ ఆసుపత్రి ప్రగతి నివేదిక వివరించారు.

ఆకట్టుకున్న వస్త్రాలంకరణ.. ఎయిమ్స్ విభాగాధిపతుల నుంచి వైద్యులు, వైద్య విద్యార్థులు మంగళగిరి చేనేత వస్త్రాలంకరణతో ఆకట్టుకున్నారు. పురుషులు అచ్చమైన పంచెకట్టు, పైజామా ధరించగా.. మహిళలు చేనేత చీరలు ధరించారు. యువ వైద్యులు సైతం సంప్రదాయ వస్త్రధారణతో కనువిందు చేశారు.

మంత్రి లోకేశ్‌ను సన్మానిస్తున్న అహెంతమ్ శాంతాసింగ్. వేదికపై కేంద్ర సహాయ మంత్రి అనుప్రియ పటేల్, ఎయిమ్స్ అధ్యక్షుడు తపన్‌కుమార్ సాహా, డీన్ రామ్మోహన్

- వైద్య పట్టాలందుకున్నవారు : 58 మంది
- బంగారు పతకాలందుకున్నవారు : ముగ్గురు

"మంగళగిరి ఎయిమ్స్ 2015లో అతి సామాన్యంగా ప్రారంభమైంది. నేడు అండర్ గ్రాడ్యుయేట్, పోస్టు గ్రాడ్యుయేట్, పీజీ, సూపర్ స్పెషాలిటీ, నర్సింగ్, అనుబంధ ఆరోగ్య రంగాల్లో 1,300 మందికిపైగా విద్యార్థులతో సమగ్ర సంస్థగా ఎదిగింది. ప్రస్తుతం 650 పడకలున్నాయి."

- నారా లోకేశ్, మంత్రి

"వైద్య విద్య కోసం విదేశాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండానే దేశీయంగా విరివిగా వైద్య కళాశాలలు ఏర్పాటు చేస్తున్నాం. మంగళగిరి ఎయిమ్స్‌లోనూ ఆయుష్ సేవలు మరింత పరిపుష్టం చేస్తాం."

- అనుప్రియ పటేల్, కేంద్ర సహాయ మంత్రి

ఉత్తమ ప్రతిభ చూపినందుకు...

– డాక్టర్ యోగ్యతా పూజారి, విశాఖపట్నం

మంగళగిరి ఎయిమ్స్‌లో 2019 బ్యాచ్‌లో ఎంబీబీఎస్ పూర్తి చేశా. నాన్న పోలినాయుడు బిల్డర్, అమ్మ విజయ గృహిణి. సిద్ధాంతపరమైన పరిజ్ఞానాన్ని రోగులపై ప్రయోగిస్తూ.. క్లినికల్ నైపుణ్యాలు, చికిత్స చేసే విధానంలో ఉత్తమ ప్రతిభ చూపినందుకు బెస్ట్ ఇంటర్న్ కింద బంగారు పతకం అందించారు.

బెస్ట్ ఆల్‌రౌండర్‌గా ఎంపికయ్యా...

– డాక్టర్ విజయలక్ష్మి, రాజమహేంద్రవరం.

పరిశోధన, క్రీడలు, సాంస్కృతిక, ఇతర అంశాలను కూడా పరిగణనలోకి తీసుకుని బెస్ట్ ఆల్‌రౌండర్‌గా ఎంపిక చేసి బంగారు పతకం ఇచ్చారు. ఎయిమ్స్‌లో బోధన చాలా బాగుంది. ప్రస్తుతం గుంటూరు వైద్య కళాశాలలో ఎండీ డెర్మటాలజీ చేస్తున్నా. నాన్న రామకృష్ణారెడ్డి వ్యాపారి, అమ్మ విజయలక్ష్మి గృహిణి.

అన్ని పరీక్షల్లో అత్యధిక మార్కులు

– డాక్టర్ గౌతమ్ అంబటి, ఉంగుటూరు, ఏలూరు జిల్లా

వైద్యుడిగా స్థిర పడతానని ఇంట్లో చెప్పా. కాదనలేదు. అమ్మానాన్నలకిచ్చిన మాట నిలబెట్టడం కోసం కష్టపడి చదివా. 2019 బ్యాచ్‌లో ఎంబీబీఎస్ పూర్తి చేశా. అన్ని పరీక్షల్లో అత్యధిక మార్కులు వచ్చినందుకు అకడమిక్ ఎక్స్‌లెన్స్ కింద బంగారుపతకం దక్కింది. నాన్న తపాలా శాఖలో పని చేస్తారు.

త్వరలో ప్రధాని చేతుల మీదుగా రాయనపాడు రైల్వేస్టేషన్ ప్రారంభం

- నగరంలో లెవల్ క్రాసింగ్‌లు పూర్తిగా ఎత్తివేత
- విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ వెల్లడి

మాట్లాడుతున్న ఎంపీ శివనాథ్. పక్కన డీఆర్ఎం మోహిత్ సొనాకియా తదితరులు

విజయవాడ(రైల్వేస్టేషన్), న్యూస్‌టుడే : అమృత్ పథకం కింద ఆధునికీకరించిన రాయనపాడు రైల్వేస్టేషన్‌ను త్వరలోనే ప్రధాని మోదీ చేతుల మీదుగా ప్రారంభించనున్నట్లు విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ తెలిపారు. కొండపల్లి రైల్వేస్టేషన్‌లో రెండు ప్లాట్‌ఫారాలను విస్తరించడంతో పాటు మౌలిక సదుపాయాల కల్పన, ఆధునికీకరణ పనులకు రూ.10 కోట్లు మంజూరయ్యాయని తెలిపారు. దీన్ని అమృత్ భారత్ పథకం 2.0 కింద కూడా తీసుకురాబోతున్నట్లు చెప్పారు. విజయవాడ డివిజన్‌లో రైల్వే ప్రాజెక్టుల నిర్మాణం, పురోగాభివృద్ధిపై మంగళవారం డీఆర్ఎం మహిత్ సొనాకియాతో ఆయన కార్యాలయంలో ఎంపీ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎంపీ శివనాథ్ మాట్లాడుతూ.. నగరంలో ట్రాఫిక్ ఇబ్బందుల దృష్ట్యా రైల్వే లెవల్‌క్రాసింగ్ నంబరు 147 దగ్గర ఆర్వోబీ నిర్మాణానికి టెండర్ ప్రక్రియ పూర్తి చేసి త్వరలోనే శంకుస్థాపన చేస్తామని తెలిపారు. గుణదలలో ఎల్‌సీ నంబరు 8 వద్ద ఆర్వోబీకి నాలుగు రోజుల్లో టెండర్ ప్రక్రియ మొదలవుతుందని.. ఎల్‌సీ నంబరు 148 టెండర్ దశలో ఉన్నట్లు వెల్లడించారు. నగరంలో 50ఏళ్ల క్రితం నిర్మించిన కేఎల్‌రావు (ఎర్రకట్ట) వంతెన ఫిజిబిలిటీ స్టడీ కింద డీపీఆర్ సిద్ధం చేయడానికి బెంగళూరు సంస్థకు అప్పగించినట్లు తెలిపారు. వాంబే కాలనీవాసులు ఎప్పటి నుంచో కోరుతున్న ఆర్‌యూబీ త్వరలోనే ముందుకు రాబోతుందన్నారు. పాత రాజరాజేశ్వరిపేట నుంచి కొత్త రాజరాజేశ్వరిపేట వరకు ఉన్న ఆర్‌యూబీ డిజైన్స్ సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. కొండపల్లి బీ కాలనీ వద్ద ఆర్వోబీకి అనుమతులు లభించాయని చెప్పారు.

అత్యాధునిక సౌకర్యాలతో..

విజయవాడ రైల్వేస్టేషన్ ఆధునికీకరణ పనులపై ఇటీవల పార్లమెంటులో ప్రస్తావించగానే.. వెంటనే ఆమోదం తెలిపారని ఎంపీ పేర్కొన్నారు. నీతి ఆయోగ్ నుంచి కూడా అనుమతి లభించినట్లు తెలిపారు. మార్చి 31 నాటికి బిడ్డింగ్ పూర్తయి త్వరలోనే అత్యాధునిక సౌకర్యాలతో విజయవాడ రైల్వేస్టేషన్ రూపుదిద్దుకుంటుందని ఆయన చెప్పారు. భారతదేశంలోనే ఒక ప్రత్యేకత చాటుకోనుందన్నారు. ట్రాఫిక్ రద్దీ నేపథ్యంలో విజయవాడ రైల్వేస్టేషన్‌పై ఒత్తిడి తగ్గించేందుకు నగర శివారులోని శాటిలైట్ స్టేషన్లను పూర్తి స్థాయిలో అందుబాటులోకి తీసుకురానున్నట్లు వివరించారు. విజయవాడలో రైల్వే క్వార్టర్ల సమస్య త్వరలోనే పరిష్కారం అవుతుందని.. జర్నలిస్టుల రైల్వే పాస్‌ల సమస్యలను రైల్వే మంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఎప్పుడు దిల్లీ వచ్చినా.. ఏపీలో రైల్వేకి సంబంధించి సమస్యలపైనే ఎక్కువ దృష్టి పెడతారని, ఇటీవల బడ్జెట్‌లో అమరావతి రైల్వేస్టేషన్, విశాఖ కేంద్రంగా కొత్త రైల్వే జోన్ ఉండేలా కృషి చేసినట్లు తెలిపారు. విజయవాడ నగరం మీదుగా ఎన్నో రైల్వే లైన్లు వెళ్లడం వల్ల డ్రైనేజీ సమస్యలు ఉన్నాయని.. డీఆర్ఎంతో అన్ని విషయాలు కూలంకషంగా చర్చించినట్లు ఎంపీ వెల్లడించారు. ఈ సమావేశంలో వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

చంద్రబాబుతో రాష్ట్రానికి అంతర్జాతీయ గుర్తింపు

పటమట, న్యూస్‌టుడే: సీఎం చంద్రబాబు నాయకత్వం రాష్ట్రానికి ప్రత్యేక గుర్తింపు తీసుకువచ్చిందని తెదేపా ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షురాలు గద్దె అనురాధ ఓ ప్రకటనలో తెలిపారు. ప్రపంచ ప్రఖ్యాత పారిశ్రామికవేత్త బిల్ గేట్స్ సుమారు 30 ఏళ్ల తర్వాత ఆంధ్రప్రదేశ్‌ను సందర్శించడం వెనుక చంద్రబాబు విజన్, పరిపాలన నైపుణ్యం, అంతర్జాతీయ స్థాయి గుర్తింపు ప్రధాన కారణాలుగా ఉన్నాయని అన్నారు. రాష్ట్రంలో అమలవుతున్న సాంకేతిక, వ్యవసాయ, ఆరోగ్య, విద్యా రంగ సంస్కరణలు అంతర్జాతీయ సంస్థల దృష్టిని ఆకర్షిస్తున్నాయని తెలిపారు. ప్రభుత్వం తీసుకుంటున్న ప్రగతిశీల నిర్ణయాలకు ప్రజలు అండగా నిలవాలని ఆమె కోరారు.

(c) eenadu

కొండపల్లి బొమ్మ.. ఖండాలు దాటుతోందమ్మ

సామాజిక మాధ్యమాల్లో విస్తృత ప్రచారం

కొండపల్లి, ఇబ్రహీంపట్నం, న్యూస్‌టుడే

ఆన్‌లైన్ విక్రయాల ద్వారా కొండపల్లి బొమ్మ వివిధ ఖండాలకు విస్తరిస్తోంది. వినియోగదారుల అభిరుచికి తగ్గట్టుగా ప్రస్తుత బొమ్మలు ఆకృతులను మార్చుకుంటూ వారిని చేరుకొంటున్నాయి. గతంలో కొయ్య బొమ్మల కళాకారులు స్థానికంగా ఉన్న కూడలి వద్దనే అమ్మకాలు చేసేవారు. సందర్భానుసారంగా నిర్వహించిన కార్యక్రమాల్లో విక్రయాలు జరిగేవి. దీంతో పాటు ప్రభుత్వ హస్తకళల సంస్థ లేపాక్షి ద్వారా కొంత అమ్మకాలు జరుగుతుండేవి. అయితే ఈ కళపై ఆధార పడిన కుటుంబాలకు ఆ వ్యాపారాలు సరిపడేవి కావు. కరోనా సమయంలో కళాకారులు, వ్యాపారులు.. విక్రయాలు లేక తీవ్ర నిరాశకు లోనయ్యారు. ఆ సమయంలో కొందరు యువకులు ఆన్‌లైన్‌లో వ్యాపారాన్ని ప్రారంభించారు. అయితే ఆరంభంలో ఇది ఆశించిన ఫలితాలు ఇవ్వక పోయినా రెండేళ్ల నుంచి ఊపందుకోంది. ప్రత్యక్షంగా, పరోక్షంగా 32 దేశాలకు కొండపల్లి బొమ్మ చేరుకొంటోంది. దీంతో కొందరు స్థానిక వ్యాపారులతో పాటు ఎక్స్, ఫేస్‌బుక్, వాట్సప్ వంటి సామాజిక మాధ్యమాల్లో వ్యాపారం నిర్వహిస్తున్నారు.

ఆన్‌లైన్ విక్రయదారులతో మాట్లాడుతున్న యూరోపియన్ అంబాసిడర్

ఇండియన్ పోస్టు ద్వారా..

యూఎస్ఏ, కెనడా, జర్మనీ, ఇటలీ, ఆస్ట్రేలియా, న్యూజిల్యాండ్, సింగపూర్, రష్యా, స్కాట్‌ల్యాండ్, యునైటెడ్ కింగ్‌డమ్, నార్తన్ ఐలాండ్, దుబాయ్, సౌదీఅరబ్, నెదర్లాండ్, సౌత్ ఆఫ్రికా తదితర దేశాలకు స్థానిక కళాకారులు, వ్యాపారుల ద్వారా ఆన్‌లైన్ వేదికగా విక్రయాలు జరుగుతున్నాయి. దీంతో పాటు ఎంఎన్‌సీ కంపెనీలు, మరి కొందరు అన్ని రకాల ఆన్‌లైన్ వ్యాపారాలు నిర్వహించే వారు బొమ్మలను కొరియర్ల ద్వారా రవాణా చేస్తున్నారు. స్థానికేతరులు సైతం మరో ఇరవై దేశాలకు బొమ్మల విక్రయాలు చేస్తుండడం విశేషం. సామాజిక మాధ్యమాల్లోని అకౌంట్లలో వ్యాపారులు అందమైన బొమ్మల పోస్టులు పెడుతుంటారు. ఆ అకౌంట్లకు లింకై ఉన్న కస్టమర్లు, వారి స్నేహితులు వీటి కోసం ఆర్డర్లు పెడుతుంటారు. దీంతో వారి చిరునామాకు తగిన సమయంలో డెలివరీ జరుగుతోంది.

గతం కంటే మిన్నగా..

కొయ్య బొమ్మల ఆన్‌లైన్ విక్రయాలు ఆశించిన మేరకు జరుగుతున్నాయి. గతం కన్నా ఇప్పుడు మార్కెట్ విస్తృతమైంది. దీంతో వీటిని ఇండియన్ పోస్టు ద్వారానే డెలివరీ ఇస్తున్నాం. కొందరి ఆసక్తి మేరకు ప్లాస్టాఫ్ ప్యారిస్ బొమ్మలను రవాణా చేస్తున్నాం. ఏడాదికి వందల పార్సిల్స్ వెళ్తున్నాయి. కళాకారులు, బొమ్మల వ్యాపారులే కాకుండా స్థానికేతరులు కూడా ఆన్‌లైన్‌లో బొమ్మల విక్రయాలు చేస్తున్నారు. ప్రభుత్వ ప్రోత్సాహంతో ఆయా కార్యక్రమాలకు కొండపల్లి బొమ్మలే ఇవ్వడం ఆహ్వానించదగ్గ విషయం. - **విజయభార్గవ్, హేమంత్ కుమార్, ఆన్‌లైన్ వ్యాపారులు**

పది కేంద్రానికి చేరుకోవడమే ఓ పరీక్ష

సీబీఎస్ఈ విద్యార్థులకు పదో తరగతి పరీక్షలు మంగళవారం ప్రారంభమయ్యాయి. ఆటో నగర్ - కానూరు మధ్యనున్న కేపీ సిద్ధార్థ రెసిడెన్షియల్, స్కాట్‌స్పైన్ ఇంటర్నేషనల్ పాఠశాలల్లో పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఎక్కువ మంది తల్లిదండ్రులు కార్లలో, ద్విచక్రవాహనాలపై, పాఠశాలల యాజమాన్యాలు బస్సుల్లో విద్యార్థులను కేంద్రాలకు తీసుకురావడంతో ఒక్కసారిగా పెద్ద సంఖ్యలో ట్రాఫిక్ నిలిచిపోయింది. గంటల తరబడి వాహనాలు కదలలేదు. చేసేది లేక విద్యార్థులు వాహనాలు దిగి ట్రాఫిక్ నుంచి నడుచుకొని పరీక్షా కేంద్రానికి చేరుకున్నారు. కేంద్రాలు ఎక్కడెక్కడ ఏర్పాటు చేశారో గుర్తించి, పరీక్షలు పూర్తయ్యే వరకు ఆయా రహదారుల్లో ట్రాఫిక్ నిలిచిపోకుండా పోలీసులు చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు కోరుతున్నారు. - **ఈనాడు, అమరావతి**

ఆటోనగర్ - కానూరు రహదారిపై భారీగా నిలిచిన వాహనాలు, నడుచుకొని పరీక్షా కేంద్రానికి వస్తున్న విద్యార్థులు

డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణానికి కృషి

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే : జిల్లాలో డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణానికి సమష్టిగా కృషి చేద్దామని కలెక్టర్ జి.లక్ష్మీశ పిలుపునిచ్చారు. ఎక్కడైనా డ్రగ్స్ ఆనవాళ్లు కనిపిస్తే 1972 నంబర్‌కు సమాచారం అందించాలని సూచించారు. నగరంలోని కలెక్టరేట్‌లో వివిధ శాఖల అధికారులతో మంగళవారం ఆయన సమావేశం నిర్వహించారు. పోలీసు కమిషనర్ ఎస్.వి.రాజశేఖరబాబు, డీఎల్ఎస్ఏ కార్యదర్శి కె.రామకృష్ణయ్య తదితరులు హాజరయ్యారు. జిల్లా స్థాయి నార్కో కోఆర్డినేషన్ కేంద్ర సమన్వయం, నషా ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మాదక ద్రవ్యాల నియంత్రణ, దుష్ప్రభావాలు, అవగాహన కార్యక్రమాల నిర్వహణ, కౌన్సెలింగ్ సేవలు తదితరాలపై సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. 29 అంశాలతో చేపట్టిన డ్రగ్స్‌పై దండయాత్ర విజయవంతంగా నిర్వహిస్తున్నట్టు తెలిపారు. విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు వివరించారు. జిల్లాలో గుర్తించిన 150 హాట్‌స్పాట్‌లపై దృష్టిపెట్టాలని పేర్కొన్నారు. ఈగల్ ఆధ్వర్యంలో గత ఏడాది 27 కేసులకు సంబంధించి 71 మందిని అరెస్టు చేసినట్టు పేర్కొన్నారు. సీపీ రాజశేఖరబాబు మాట్లాడుతూ.. ప్రత్యేక వెబ్‌సైట్‌ను అందుబాటులో ఉంచామని, ప్రతి ఒక్కరూ రిజిస్ట్రేషన్ చేసుకుని ప్లెడ్జ్ తీసుకోవాలని సూచించారు. సమావేశంలో డ్రగ్స్ వద్దు.. స్కిల్స్ ముద్దు, ఈగల్ టోల్ ఫ్రీ నంబరు 1972, ఈగల్ క్లబ్స్ ప్రచార పత్రాలను ఆవిష్కరించారు. డీసీపీలు కృష్ణకాంత్ పటేల్, కె.జి.వి.సరిత, బి.లక్ష్మీనారాయణ, విభిన్న ప్రతిభావంతుల శాఖ ఏడీ వి.కామరాజు, ఈగల్ అధికారులు ఎం.రవీంద్ర, డి.నాగార్జున, ఎం.వీరాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ప్రచార పత్రాలు ఆవిష్కరిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ, సీపీ రాజశేఖరబాబు తదితరులు

రేణుకను సన్మానిస్తున్న సూర్యనారాయణ

ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షురాలి నియామకం

భవానీపురం, న్యూస్‌టుడే: ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం(ఏపీజీఈఏ) ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షురాలిగా వై.రేణుక నియమితులయ్యారు. వ్యవసాయ శాఖలో సీనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న ఆమెను అధ్యక్షురాలిగా మంగళవారం ఎంపిక చేశారు. ఏపీజీఈఏ రాష్ట్ర అధ్యక్షుడు కె.ఆర్.సూర్యనారాయణ విజయవాడలోని కార్యాలయంలో ఆమెను అభినందించారు. ఈ సందర్భంగా సూర్యనారాయణ మాట్లాడుతూ.. మహిళా ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. సంఘం మహిళా విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హేమలత, కోశాధికారి ఇందిరాదేవి, జిల్లా ఉపాధ్యక్షురాలు సుధాశ్రీనివాస్, షబానా తదితరులు అభినందనలు తెలిపారు.

ఎన్టీఆర్ కాంప్లెక్స్‌లో తూనికలు.. కొలతల శాఖ దాడులు

గవర్నర్‌పేట, న్యూస్‌టుడే : తూనికలు, కొలతల శాఖ నిబంధనలు ఉల్లంఘించి వ్యాపారం చేస్తున్న గవర్నర్‌పేట ఎన్టీఆర్ కాంప్లెక్సులోని ఎలక్ట్రానిక్ వస్తువుల విక్రయ దుకాణాలపై తూనికలు, కొలతల శాఖ అధికారులు 7 కేసులు నమోదు చేశారు. వినియోగదారుల అవగాహనా రాహిత్యాన్ని వ్యాపారులు సొమ్ము చేసుకుంటూ బ్రాండెడ్ పేరుతో నకిలీవి అంటగడుతున్నారు. వారి మోసాలపై 'చూస్తే తరుగు.. తూస్తే తరుగు' శీర్షికన ఈ నెల 15న 'ఈనాడు'లో కథనం ప్రచురితమైంది. దీనిపై అధికారులు స్పందించారు. తూనికలు కొలతల శాఖ అసిస్టెంట్ కంట్రోలర్ కుమారి తన సిబ్బందితో కలిసి మంగళవారం ఎన్టీఆర్ కాంప్లెక్సులోని పలు దుకాణాల్లో తనిఖీలు చేశారు. పలువురు వ్యాపారులు ప్యాకింగ్ నిబంధనలు ఉల్లంఘించినట్లు గుర్తించారు. తయారీదారుని పేరు, చిరునామా, ప్యాకింగ్ తేదీ వంటి వివరాలు లేకుండా ఎలక్ట్రానిక్ విడిభాగాలను విక్రయిస్తున్నట్లు గుర్తించి.. వారిపై కేసు నమోదు చేశారు. ప్రతి ఒక్కరూ తూనికలు, కొలతల శాఖ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని, తయారీదారుని వివరాలు తప్పనిసరిగా ప్యాకింగ్‌పై ఉండాలని ఆమె సూచించారు.

కేసు నమోదు చేస్తున్న అసిస్టెంట్ కంట్రోలర్ కుమారి

బ్రాయిలర్ ధరలు (కిలో కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -115 రిటైల్ ధర 142 చికెన్ విత్ స్కిన్ - 206 చికెన్ స్కిన్‌లెస్ - 234.

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 128, 137, 148 చికెన్ విత్ స్కిన్ - 240 చికెన్ స్కిన్‌లెస్ - 250.

APSRTC పల్లె వెలుగు

టెండరు ప్రకటన

జోనల్ స్టాఫ్ ట్రైనింగ్ కాలేజ్, విజయవాడ నందు క్లీనింగ్/స్వీపింగ్, గార్డెనింగ్, శానిటరీ మెయింటెనెన్స్ మరియు డ్రైనేజి క్లీనింగ్ చేయుటకు అనుభవము, ఆసక్తి గల మ్యాన్‌పవర్ ఏజెన్సీ/కాంట్రాక్టర్ల నుండి సీలు టెండర్లు కోరబడుచున్నవి. (1) టెండరు ఫారములు జోనల్ స్టాఫ్ ట్రైనింగ్ కాలేజ్, విద్యాధరపురం, విజయవాడ, ప్రిన్సిపాల్ వారి కార్యాలయం నందు తేది.18-02-2026 నుండి తేది.26-02-2026 వరకు అన్ని ఆఫీసు పనిదినములలో ఉ॥10.30 గం॥ల నుండి సా॥5.00 గం॥ల వరకు అమ్మబడును. (2) పూర్తి చేసిన టెండరు ఫారములు తేది.27-02-2026న ఉ॥10.30 గం॥ల నుండి మ॥2.00 గం॥ల లోపున జోనల్ స్టాఫ్ ట్రైనింగ్ కాలేజీ, విద్యాధరపురం, విజయవాడ, ప్రిన్సిపాల్ వారి కార్యాలయం నందు ఏర్పాటు చేసిన టెండరు బాక్సులో వేయవలెను. అదేరోజు మ.3.00 గం॥లకు టెండరుదారుల సమక్షములో టెండర్లు తెరువబడును. (3) పూర్తి వివరములకు మా వెబ్‌సైట్ :https://www.apsrtc.ap.gov.in లో tenders ను చూడగలరు. (4) ఏ సమయములోనైనా, ఎట్టి కారణము చూపకుండా టెండర్లు అంగీకరించుటకు లేదా తిరస్కరించుటకు మరియు రద్దుచేయుటకు APSRTC కి పూర్తి అధికారము కలదు.

నెం. P1/122(01)/2026-ZSTC/VJA, తేది:17-02-2026 సం/- ప్రిన్సిపాల్, జోనల్ స్టాఫ్ ట్రైనింగ్ కాలేజ్, విజయవాడ.

వివాహ స్వర్ణోత్సవ శుభాకాంక్షలు

50 వసంతాల దాంపత్య జీవితానికి మూర్తీభవించిన ఆదర్శ దంపతులు మీరు. ప్రేమ, వాత్సల్యాలకు ప్రతీకలు మీరు. మా ఉన్నతికి మార్గదర్శకులైన మా అమ్మానాన్నల వివాహ స్వర్ణోత్సవ వేడుకల వేళ వారికి మా హృదయపూర్వక శుభాకాంక్షలు.

శ్రీ దాసు విష్ణు నాగేశ్వరప్రసాదు
శ్రీమతి సుందరి దాసు

కుమారులు: రవి ప్రసాదు, హరి ప్రసాదు
కోడలు: లక్ష్మీ దాసు
మనుమరాలు: హార్ద్య, మనవడు: హృషి

శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి వార్ల దేవస్థానం
శ్రీశైలం-518 101, నంద్యాల జిల్లా.

SRISAILA DEVASTHANAM

ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన

ఆర్.సి.నెం.బి4/444814/2026 08-02-2026

శ్రీశైల దేవస్థానము సంబంధించి 2026-27 అనగా 01-05-2026 నుండి 30-04-2027 వరకు ఈ దేవస్థానమునకు అవసరమైన (1) ఎం.వి.షాప్స్, (2) స్టేషనరీ వస్తువులు మరియు బయోడిగ్రేడబుల్ కవర్లు సరఫరా చేయుటకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండర్లు కోరబడుచున్నవి. తేది. 20-02-2026 నుండి టెండరు షెడ్యూళ్లను డౌన్‌లోడ్ చేసుకొనవచ్చును.

టెండరు నిబంధనలు మరియు పూర్తి వివరములకు www.apeprocurement.gov.in ద్వారా తెలుసుకొనగలరు. అవసరమైన సమాచారము కొరకు 99634 40246, 94413 35756 కార్యాలయ వేళలలో సంప్రదించవచ్చును.

శ్రీ స్వామి అమ్మవార్ల సేవలో...

యం.శ్రీనివాస రావు, స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ మరియు కార్యనిర్వహణాధికారి

OFFICE OF THE EXECUTIVE ENGINEER
AP EDUCATION & WELFARE INFRASTRUCTURE DEVELOPMENT CORPORATION, NTR DISTRICT, VIJAYAWADA.

'E' Procurement Short Tender Notice

Short Tender Notice. No. 09/DB/EE/APEWIDC/NTR/2025-26. Dated 17-02-2026.

Tenders are invited for Construction of Toilet Block to S.W. Hostel at NTR District Works of 1 No. **(Vide NIT. Nos. 23)** of APEWIDC., Division in NTR District on e-procurement platform of Government of Andhra Pradesh. Further Details are can be viewed 'E' procurement market place i.e., www.apeprocurement.gov.in.

Bid Document Downloading Start Date from : 18-02-2026.
Bid Document Downloading End Date : 25-02-2026 up to 3.00 PM.
Bid Submission Closing Date : 25-02-2026 up to 4.00 PM.
Bid Opening Date : 25-02-2026 @ 4.30 PM.
Note: Tender Published through online Executive Engineer, APEWIDC, Krishna, Machilipatnam

Sd/- Executive Engineer, APEWIDC, NTR, Vijayawada.

इंडियन बैंक ఇండియన్ బ్యాంక్ इलाहाबाद ALLAHABAD

మొఘల్‌రాజ్‌పురం బ్రాంచి
డి.నెం. 40-9-32, ఆచార్య రంగా నగర్, నలంద విద్యానికేతన్ ఎదురు, బెంజిసర్కిల్ దగ్గర, విజయవాడ-520010. ఫోన్ నెం. 0866-2474003

బంగారు ఆభరణాల వేలం ప్రకటన

దిగువ పేర్కొనబడిన ఖాతాదారులకు నోటీసులు పంపినప్పటికీ ఖాతరు చేయని కారణంగా బకాయి వసూలు నిమిత్తం బ్యాంక్ నిబంధనలు ప్రకారం **డి. 24-02-2026,** మంగళవారం మధ్యాహ్నం గం. **3-00** లకు బ్రాంచి ఆవరణములో బహిరంగ వేలం వేసి మా బాకీని చెల్లించు కొందుమని ఈ ప్రకటన ద్వారా తెలియపరచడమైనది. వేలంలో పాల్గొనదలచిన వారు ధరావత్తు **రూ. 5,000/-** చెల్లించవలెను.

క్ర. సం.	ఋణగ్రహీత పేరు	ఋణ ఖాతా నెం.	లోన్ అమౌంట్	స్థూల బరువు (గ్రాములలో)
1	శ్రీమతి కర్నాటి వెంకట రమణ	7609232657	రూ. 2,14,000/-	52.9
2	శ్రీమతి కర్నాటి వెంకట రమణ	7609278852	రూ. 2,02,000/-	50
3	శ్రీమతి కర్నాటి వెంకట రమణ	7770071610	రూ. 5,87,000/-	128
4	శ్రీమతి కర్నాటి వెంకట రమణ	7787723886	రూ. 1,66,000/-	36.6
5	శ్రీమతి కర్నాటి వెంకట రమణ	7787957995	రూ. 3,00,000/-	82.2
6	శ్రీమతి కర్నాటి వెంకట రమణ	7787963806	రూ. 3,00,000/-	96.2
7	శ్రీ కర్నాటి ఫణీంద్ర కుమార్	7620335567	రూ. 4,46,000/-	114.3
8	శ్రీ కర్నాటి ఫణీంద్ర కుమార్	7643888222	రూ. 4,53,000/-	110.6
9	శ్రీ కర్నాటి ఫణీంద్ర కుమార్	7705052630	రూ. 4,74,000/-	109.8
10	శ్రీ కర్నాటి ఫణీంద్ర కుమార్	7705094874	రూ. 3,91,000/-	90.7
11	శ్రీమతి కర్నాటి రమాదేవి	7751830367	రూ. 3,90,000/-	87
12	శ్రీమతి కర్నాటి రమాదేవి	7751837590	రూ. 1,54,000/-	34.3
13	శ్రీమతి కర్నాటి రమాదేవి	7751841358	రూ. 3,15,000/-	70
14	శ్రీమతి కర్నాటి రమాదేవి	7762011175	రూ. 4,92,000/-	110.4
15	శ్రీ జయ సంతోష్ ద్వారం	7787707489	రూ. 2,71,000/-	62.2
16	శ్రీ జయ సంతోష్ ద్వారం	7787848636	రూ. 2,00,000/-	47.2
17	శ్రీ జయ సంతోష్ ద్వారం	7787935788	రూ. 2,28,000/-	53
18	శ్రీ జయ సంతోష్ ద్వారం	7795510222	రూ. 4,19,000/-	104.7

షరతులు & నిబంధనలు: 1) ఆభరణాల నాణ్యత కొరకు బ్యాంక్ బాధ్యత వహించదు. ఆభరణాలు ఉన్నవి ఉన్నట్లుగా వేలం వేయబడతాయి. 2) వేలంలో పాల్గొనుటకు ఆసక్తి గల వ్యక్తులు తెలిపిన టైమ్ షెడ్యూల్ ప్రకారం వేలం తేదీన ఒక ఫోటోగ్రాఫ్ మరియు చెల్లుబాటగు ఫోటో గుర్తింపు రుజువు మరియు చిరునామా రుజువుతో పాటు చెల్లుబాటగు పాన్ కార్డు తీసుకురావాలి. హెచ్చు పాటాదారుడు మొత్తం సొమ్ము అదే రోజు చెల్లించి వస్తువులను పొందవలెను. 3) ఏవిధమైన కారణం చూపకనే షరతులు మార్చుకొనుటకు గాని, వాయిదా వేయుటకు గాని, వేలం ఆపుటకు గాని, రద్దు చేయుటకు గాని బ్యాంక్ వారికి పూర్తి అధికారం కలదు. 4) తాకట్టు పెట్టిన ఆభరణాలు "ఎక్కడ ఎలా ఉన్నవి అక్కడ అలా" ప్రాతిపదికన వేలం వేయబడును. 5) ఋణగ్రహీత మరణించినా, తప్పిపోయినా, స్వస్థలం వెలుపల నివసిస్తున్నా, విదేశాల్లో నివసిస్తున్నా చట్టబద్ధమైన వారసులకు ఈ నోటిఫికేషన్ వర్తిస్తుంది. 6) అప్పు నోటీసులు అందని వారు & తిరస్కరించిన వారు ఈ ప్రకటనను తుది నోటీసుగా భావించి వేలం తేదీలోగా సొమ్ము చెల్లించవలెను. 7) ఈ ప్రకటన ఖర్చు ఇందులో కనబరిచే వారే భరించవలెను.

తేది: 17-02-2026, ప్రదేశము: విజయవాడ బ్రాంచి మేనేజర్, ఇండియన్ బ్యాంక్

సభా కార్యక్రమాలపై చిన్నారుల ప్రశ్నలు

మధురానగర్, న్యూస్‌టుడే : 'ప్రజా సమస్యలను శాసనసభలో ఎలా ప్రస్తావిస్తారు? ఎమ్మెల్యేల బాధ్యతలు ఏంటి? యువత రాజకీయాల్లోకి రావాలంటే ఏం చేయాలి?...' అంటూ పలువురు చిన్నారులు ప్రజాప్రతినిధులను ప్రశ్నలు వేసి వివరాలు తెలుసుకున్నారు. మంగళవారం గుంటూరు జిల్లా నంబూరు వివా వరల్డ్ స్కూల్ విద్యార్థులు శాసన సభ సమావేశాలకు విచ్చేసి, సభా కార్యక్రమాలు జరుగుతున్న తీరును పరిశీలించారు. సభ అనంతరం స్పీకర్ అయ్యన్నపాత్రుడు, విజయవాడ సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు తదితరులను కలిశారు. ఈ సందర్భంగా వారు అడిగిన ప్రశ్నలకు స్పీకర్ ఓపికగా సమాధానం ఇచ్చారు. ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు విద్యార్థులతో ముచ్చటించారు. చదువులో ప్రతిభ కనబరుస్తూ సమాజంపై అవగాహన పెంచుకుంటే భవిష్యత్తులో మంచి నాయకులుగా ఎదుగుతారంటూ వారిని ప్రోత్సహించారు. సమాజానికి ఉపయోగపడే బాధ్యతాయుత పౌరులుగా ఎదుగుతామని విద్యార్థులు పేర్కొన్నారు.

విద్యార్థులతో స్పీకర్ అయ్యన్నపాత్రుడు, ఎమ్మెల్యే ఉమామహేశ్వరరావు

పారిశ్రామికవేత్తలుగా రాణించేందుకు సహకారం

పటమట, న్యూస్‌టుడే: స్వయం ఉపాధి కోసం కేశినేని ఫౌండేషన్ ఆధ్వర్యంలో నైపుణ్యాభివృద్ధి శిక్షణ పొందిన మహిళలు పారిశ్రామికవేత్తలుగా రాణించేందుకు కామన్ ఫెసిలిటీ సెంటర్లు ఏర్పాటు చేసి మార్కెటింగ్ చేసుకోవడానికి సహకారం అందిస్తామని ఎంపీ కేశినేని శివనాథ్ అన్నారు. పలు ఉత్పత్తుల తయారీపై హైదరాబాద్‌లోని ఎన్ఐఆర్‌డీలో శిక్షణ తీసుకున్న స్వయం సహాయక సంఘాల మహిళలతో మంగళవారం గురునానక్ కాలనీలోని ఎన్టీఆర్ భవన్‌లో ఎంపీ సమావేశమయ్యారు. తమకు ముడి సరకు, యంత్రాల కొనుగోలు, మార్కెటింగ్‌కు సహకారం అందించాలని శిక్షణ పొందిన మహిళలు ఎంపీని కోరారు. శివనాథ్ మాట్లాడుతూ.. శిక్షణ పూర్తి చేసి వస్తువులు తయారు చేస్తున్న మహిళలకు మరింత ప్రోత్సాహం అందించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. అందరికీ ఉపయోగపడేలా కామన్ ఫెసిలిటీ సెంటర్ల ఏర్పాటుకు చర్యలు వేగవంతం చేస్తామన్నారు. ప్రతి ఇంటిలో ఓ పారిశ్రామికవేత్త ఉండాలనే సీఎం చంద్రబాబు ఆశయాన్ని స్ఫూర్తిగా తీసుకుని కేశినేని ఫౌండేషన్ ద్వారా మహిళలకు శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. ఎన్ఐఆర్‌డీ అధికారి మురళీకృష్ణ, నాయకులు సొంగా సంజయ్ వర్మ, నరసింహచౌదరి తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎంపీ శివనాథ్. వేదికపై అధికారులు తదితరులు

నులిపురుగుల నిరోధంతో చక్కని ఆరోగ్యం

గవర్నర్‌పేట, న్యూస్‌టుడే : చిన్నారులు, కిశోర బాలికల్లో రక్తహీనత, పోషకాల లోపాలకు కారణమైన నులి పురుగులను నిరోధించేందుకు అల్బెండజోల్ మాత్రలు ఉపయోగపడతాయని కలెక్టర్ జి.లక్ష్మీశ పేర్కొన్నారు. విద్యార్థులు ఈ మాత్ర తప్పనిసరిగా వినియోగించేలా చూడాలని కోరారు. జాతీయ నులి పురుగుల నిర్మూలన దినోత్సవం పురస్కరించుకుని మంగళవారం గవర్నర్‌పేటలోని సీవీఆర్ స్కూల్‌లో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ, విద్యాశాఖల సంయుక్త ఆధ్వర్యంలో నులి పురుగుల నివారణ మాత్రలు పంపిణీ చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ.. చిన్నారుల ఆరోగ్యంపై నులి పురుగులు తీవ్రమైన ప్రభావాన్ని చూపుతాయని చెప్పారు. వీటిని నివారిస్తే పోషకాల లోపం, అలసట, బలహీనత వంటి సమస్యలను అధిగమించవచ్చని వివరించారు. ఏడాది నుంచి 19 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా అల్బెండజోల్ మాత్రలు తీసుకోవాలని సూచించారు. పరిశుభ్రమైన నీటిని తాగడం, చేతులను తరచూ శుభ్రం చేసుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారిణి ఎం.సుహాసిని, విద్యాశాఖాధికారిణి ఎల్.చంద్రకళ, సీనియర్ మెడికల్ ఆఫీసర్ ఎం.ఉషారాణి, ప్రధానోపాధ్యాయుడు సి.హెచ్.సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

దేశానికి మాజీ సైనికుల సేవలు అమూల్యం

విజయవాడ సిటీ: మాజీ సైనికులు సమాజానికి అందిస్తున్న సేవలు అమోఘమని, దేశ నిర్మాణానికి అందించిన సహకారం అమూల్యమని హోం మంత్రి వంగలపూడి అనిత అన్నారు. మంగళవారం బందర్ రోడ్డులోని ఓ హోటల్‌లో సైనిక్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో 'వెటరన్స్ డే'ని ఘనంగా నిర్వహించారు. వేడుకలకు ముఖ్యఅతిథిగా హాజరైన అనిత మాట్లాడుతూ... దేశ భద్రత కోసం అహర్నిశలు పని చేస్తున్న వీర జవాన్ల వల్లే ప్రజలు ప్రశాంతంగా జీవిస్తున్నారని అన్నారు. కూటమి ప్రభుత్వం మాజీ సైనికుల సంక్షేమం కోసం పలు కార్యక్రమాలు చేపడుతోందని, ప్రత్యేకంగా సైనిక్ వెల్ఫేర్ కార్పొరేషన్ ఏర్పాటు చేసి సమస్యలు పరిష్కరిస్తున్నామని తెలిపారు. యువత మాజీ సైనికుల సేవలను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. అనంతరం మాజీ సైనికులను సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. సైనిక్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ అధికారులు పాల్గొన్నారు.

మాజీ సైనికుడికి జ్ఞాపిక అందజేస్తున్న హోం మంత్రి అనిత

హోరాహోరీగా మహిళా నెట్‌బాల్ పోటీలు

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: స్థానిక మారిస్ స్టెల్లా కళాశాలలో కృష్ణా వర్సిటీ ఆధ్వర్యంలో జరుగుతున్న అఖిల భారత అంతర్ విశ్వవిద్యాలయాల మహిళా నెట్‌బాల్ పోటీల్లో భాగంగా మంగళవారం జరిగిన పూల్ ఫైనల్స్ మ్యాచ్‌లు హోరాహోరీగా సాగాయి. ● పూల్ 'డి'లో డిఫెండింగ్ ఛాంపియన్‌గా నేరుగా బరిలోకి దిగిన సీహెచ్ చరణ్‌సింగ్ వర్సిటీ (ఉత్తరప్రదేశ్) జట్టును కాలికట్ వర్సిటీ (కేరళ) జట్టు మట్టికరిపించింది. ● పూల్ 'ఏ'లో నేరుగా పోటీకి దిగిన పంజాబ్ వర్సిటీ (చండీగఢ్) జట్టుకు సావిత్రిబాయి పూలే వర్సిటీ (మహారాష్ట్ర) జట్టు షాకిచ్చింది. ● పూల్ 'బి'లో నేరుగా పోటీకి దిగిన దిల్లీ వర్సిటీ (దిల్లీ) జట్టును హేమచంద్ యాదవ్ విశ్వవిద్యాలయం (దుర్గ్) జట్టు ఓడించింది. ● పూల్ 'సి'లో జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో కవికులగురు కాళిదాస్ సంస్కృత విశ్వవిద్యాలయం (మహారాష్ట్ర) జట్టును కృష్ణా వర్సిటీ (ఆంధ్రప్రదేశ్) జట్టు ఓడించి లీగ్ దశలోకి అడుగు పెట్టింది. ● సాయంత్రం ప్రారంభమైన లీగ్ పోటీల్లో కాలికట్, సావిత్రిబాయి పులే వర్సిటీ జట్లు శుభారంభం చేశాయి. కాలికట్ వర్సిటీ... కృష్ణా వర్సిటీ జట్టుపై గెలిచింది. సావిత్రిబాయి పులే, హేమచంద్ యాదవ్ వర్సిటీ జట్ల మధ్య హోరాహోరీగా పోటీ సాగింది. చివరికి సావిత్రిబాయి పులే జట్టు విజయం సాధించింది. లీగ్ పోటీలకు ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్, వర్సిటీ ఉపకులపతి ఆచార్య కూన రాంజీ, కళాశాల ప్రిన్సిపల్ సిస్టర్ జి.ఇన్నాసమ్మ హాజరై క్రీడాకారిణులను పరిచయం చేసుకున్నారు.

తలపడుతున్న కృష్ణా, కవికులగురు కాళిదాస్ వర్సిటీ క్రీడాకారిణులు

రాజ్ కెసిరెడ్డి పిటిషన్‌పై విచారణ వాయిదా

ఈనాడు - అమరావతి: మద్యం కేసులో నిందితుడు రాజ్ కెసిరెడ్డి ఆస్తుల ఎటాచ్‌మెంట్ పిటిషన్‌పై విచారణ వాయిదా పడింది. రాజ్ కెసిరెడ్డి అస్తులను ఎటాచ్ చేసేందుకు గతంలో సిట్ దాఖలు చేసిన పిటిషన్.. మంగళవారం అనిశా కోర్టులో విచారణకు వచ్చింది. దీనిపై కౌంటర్ దాఖలు చేయాలని నిందితుడి తరఫు న్యాయవాదులను ఆదేశించింది. తదుపరి విచారణను ఈనెల 20కి వాయిదా పడింది.

నకిలీ మద్యం కేసులో సుదర్శన్‌కు బెయిల్

ఈనాడు - అమరావతి: నకిలీ మద్యం కేసులో నిందితుడు సుదర్శన్ (ఏ21)కు కోర్టు బెయిల్ మంజూరు చేసింది. గత వారం బెయిల్ పిటిషన్లపై ఇరుపక్షాల వాదనలు పూర్తయ్యాయి. దీనిపై మంగళవారం నగరంలోని ఎక్సైజ్ కోర్టు న్యాయాధికారి బెయిల్ ఇస్తూ తీర్పు ఇచ్చారు. ఒక్కొక్కటి రూ.25 వేలు చొప్పున రెండు పూచీకత్తులు సమర్పించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఇదే కేసులో నిందితుడైన సెంథిల్ (ఏ22) కస్టడీ పిటిషన్‌పై నిందితుడి న్యాయవాది కౌంటర్ దాఖలు చేసేందుకు ప్రత్యేక పీపీ నోటీసులు ఇచ్చారు. తదుపరి విచారణకు ఈనెల 19కి వాయిదా పడింది. ● సెంథిల్ తనకు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ పిటిషన్ దాఖలు చేశాడు. ప్రాసిక్యూషన్‌కు నోటీసుల నిమిత్తం కేసును 19వ తేదీకి వాయిదా వేశారు.

19న ఏపీ ట్రెజరీ, అకౌంట్స్ అసోసియేషన్ ఎన్నికలు

విజయవాడ(గాంధీనగర్), న్యూస్‌టుడే : ఆంధ్రప్రదేశ్ ట్రెజరీ, అకౌంట్స్ గెజిటెడ్ సర్వీసెస్ అసోసియేషన్ రాష్ట్ర సంఘం ఎన్నికలు ఈ నెల 19వ తేదీన గాంధీనగర్‌లోని ఏపీ ఎన్జీవో భవన్‌లో నిర్వహిస్తున్నట్లు ఎన్నికల అధికారి ఎం.జె.ఏసుదాసు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అధ్యక్షుడు, అసోసియేట్ అధ్యక్షుడు, ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శి, ఆర్గనైజింగ్ కార్యదర్శి, కార్యదర్శులు తదితర 17 పదవులకు ఎన్నికలు జరుగుతాయని చెప్పారు. ఓటర్ల జాబితాను ఈ నెల 2న విడుదల చేసినట్లు తెలిపారు. 19వ తేదీ ఉదయం 9 గంటల నుంచి 10:30 వరకు నామినేషన్ల స్వీకరణ, 12:15 వరకు నామినేషన్ల ఉపసంహరణ, మధ్యాహ్నం 12.30కి పోటీదారుల తుది జాబితా విడుదల చేస్తామన్నారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 వరకు పోలింగ్ జరుగుతుందని వివరించారు. అనంతరం ఓట్ల లెక్కింపు, ఫలితాలు వెల్లడిస్తామని తెలిపారు. అసోసియేషన్ సభ్యులు నిర్ణీత షెడ్యూల్‌ను పాటించి.. ఎన్నికల ప్రక్రియలో పాల్గొనాలని ఆయన విజ్ఞప్తి చేశారు

91.9 FM Vijayawada ఈ FM 91.9 Mee FM

ఈఎఫ్ఎమ్ కార్యక్రమాలు
సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ. 5 - ఉ. 7
ఈ-మార్నింగ్స్	ఉ. 7 - ఉ. 11
నువ్వా నేనా	ఉ. 11 - మ. 2
సత్యభామ	మ. 2 - సా. 5
లైట్ తీస్కో	సా. 5 - రా. 9
సరదాగా కాసేపు	రా. 9 - రా. 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా. 12 - తె. 5

/Eenadufm
For Advertising on Eenadu FM Contact 8008003297

EENADU e Classifieds

BUSINESS SERVICES

బంగారం కొనబడును. బ్యాంకులలో ఇతర ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీబంగారం విడిపించి ఈరోజు మార్కెట్ ధరకు కొనబడును. స్పాట్‌క్యాష్ ✆ 81422 92071

బంగారం కొనబడును. బ్యాంకులలో ఇతర ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీబంగారం విడిపించి అధిక ధరకు కొనబడును (స్పాట్ క్యాష్). ✆ 87907 41166

FINANCIAL SERVICES

స్థిరాస్తులపై ఆంధ్రప్రదేశ్ అంతటా మార్టిగేజ్ లోన్స్ మరియు స్థిరాస్తి ఎక్కడ ఉన్నా ఏసంస్థలో ఉన్నా Xerox పేపర్స్‌పై 2nd మార్టిగేజ్ లోన్ ఇవ్వబడును. 50లక్షలులోపు. అయోధ్య కోఆపరేటివ్ బ్యాంక్. ✆ 93969 99669.

REAL ESTATE

FLAT FOR SALE

బందరురోడ్డు పప్పుల మిల్లు సెంటర్ కాస TVS ప్రక్కన నిర్మించిన 3BHK ఫ్లాట్స్ గృహప్రవేశమునకు సిద్ధముగా వున్నవి. సంప్ర ✆ 94940 51157

BOOK YOUR COLOUR CLASSIFIED
₹1200/- (5 Lines)
PH: 98496 97616
ప్రకటనలపై జి.ఎస్.టి. 5% అదనం

HOUSE FOR SALE

గుడివాడ 200 గజాలు, సీలామహల్ దగ్గరలో సూరంవారి వీధి నందు రెండు అంతస్తులు ఇంటితో అమ్మకానికి కలదు. గజం-75 వేలు. సంప్ర: 81064 03490

PLOT FOR SALE

గజం 11999/- బందర్ రోడ్‌లో 80 ఎకరాల గేటెడ్‌కమ్యూనిటీ స్పోర్ట్స్, స్విమ్మింగ్‌పూల్, హౌసింగ్ 46L గవర్నమెంట్ ఆఫీసులకు దగ్గరలో. ✆ 99495 05050

JOBS

విజయవాడలో కరెంటు మీటర్లు మార్చుటకు అనుభవం కలిగిన ఎలక్ట్రీషియన్స్ కావలెను. వీక్లీ పేమెంట్స్. చదువు అవసరం లేదు. ✆ 97035 51122.

ప్రైవేట్ ప్రీమియం సెలబ్రేషన్ కంపెనీలో సర్వీస్ సపోర్ట్ అసోసియేట్స్ కావలెను. వయస్సు: 20-28. ఇంటర్, పైచదువు పూర్తిచేసిన వారు అప్లై చేయవచ్చు. ఈవెంట్ సెటప్; క్లయింట్ హ్యాండ్లింగ్, టీమ్‌తో సమన్వయం చేయగలగాలి. మాసిక వేతనం ₹ 12000+పనితీరు ఆధారిత బోనస్, గ్రోత్. ✆: 9705054262.

Engineering EEE /Diploma (Boys) ★ Computer Operator Female ★ Office Administrators. Switch Gears, Enikepadu. ✆ 99081 78777

Wanted DRA Tele Callers, Field Executives & Team Leaders Banking Sector Attractive Salaries and Incentives, ✆ 98493 94835, 70753 45527.

Wanted Teachers for Reputed Schools in A.P & Telangana. Contact: Sneha Placements Service. Ph: 94402 46409.

PROs, Marketing Managers Required. Salary: 27,500/-, NTR Circle, Vijayawada. ✆ 63043 28479.

Teaching Staff for Hotel Management College, Vijayawada FO, HK, Service, Kitchen Department, Salary Depend On Experience. Accommodation Available. ✆ 72888 85598.

Wanted Assistant Accountants B.com. Grad. with Tally Knowledge for Office in VJA, Near NTR Circle. Exp. -1 to2Yrs. Freshers can apply ✆ 94910 30372

Gujarat నిస్సాన్‌నగర్‌లో ఉన్న హాస్టల్‌లో పనిచేయుటకు చెఫ్, మాస్టర్ చెఫ్, హెల్పర్స్ కావలెను. మెన్ కాంట్రాక్ట్ ఇవ్వబడును. సం॥ 95057 01977.

విజయవాడ ప్లాస్టిక్ పరిశ్రమ నందు పనిచేయుటకు హెల్పర్స్ కావలెను. అర్హత: 10th, ఇంటర్, ITI, డిప్లొమా. Email: infoampp2016@gmail.com ✆ 62810 45178. అడ్రస్: అమరావతి పాలీప్యాక్, D.No: 25-38, 4వ క్రాస్ రోడ్, కబేళా, VJA-12

త్రినేత్ర హోంకేర్‌లో వృద్ధులను/పేషెంట్స్‌ను/ పిల్లలను చూసుకొనుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఫ్రీ వసతి, భోజనం. జీ: 18K. ✆ 85209 80099, 85208 74499

శ్రీ వెంకటేశ్వర రైస్ అగ్రో ఇండస్ట్రీస్ నందిగామ, కృష్ణాజిల్లా. నూకలు,బియ్యం ట్రేడింగ్ ప్రారంభిస్తున్నాము. అనుభవమున్న స్టాఫ్ కావలెను. శాలరీ+ కమీషన్. 8977927069/ 17069, 98481 57069.

ఆటోడ్రైవర్, డెలివరీ బాయ్స్, లేడీ ఆఫీస్ స్టాఫ్ కావలెను. LIC కాలనీ, రమేష్ హాస్పిటల్ రోడ్, విజయవాడ. సంప్రదించండి ✆ 92466 33459

విజయవాడ ఎనికేపాడులో ప్రముఖ సంస్థ నందు పని చేయుటకు ★ అకౌంటెంట్ ★ లేడీ ఫ్రంట్ ఆఫీస్ ఎగ్జిక్యూటివ్ ★ ఆఫీస్ బాయ్ కావలెను. ✆ 83673 36633

అకౌంటెంట్ కమ్ఆఫీసు అసిస్టెంట్ కావలెను. బి.కామ్,3 సం॥లు కంప్యూటర్ అకౌంట్స్‌పై అనుభవం, తెలుగు, ఇంగ్లీష్ భాషలపై పరిజ్ఞానం. రెజ్యూములను kamathamjob@gmail.com కు పంపగలరు.

బిజినెస్ ఎగ్జిక్యూటివ్స్/ బిజినెస్ మేనేజర్స్ కావలెను. డిగ్రీ, 5 సం॥ల మార్కెటింగ్ రంగంలో అనుభవం, 30 సం॥ల లోపు వారు రెజ్యూములను kamathamjob@gmail.com కు పంపగలరు.

హరేకృష్ణ హోంకేర్‌లో వృద్ధులను/పేషెంట్స్/ పిల్లలను చూసుకొనుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఫ్రీవసతి, భోజనం జీ:18-20K ✆ 96404 68899, 96402 58899

ప్రముఖ ఆటోఫైనాన్స్ ఆఫీస్ నందు కంప్యూటర్ అనుభవంగల టెలీకాలర్స్(లేడీ) &కలెక్షన్ ఎగ్జిక్యూటివ్స్ (డిగ్రీ, 2వీలర్) కావలెను. ✆ 99495 58181, 81215 58181

సూరంపల్లి కొత్త ఆటోనగర్ ఏరియాలో పనిచేయుటకు సెక్యూరిటీగార్డ్స్ కావలెను 12గం॥ డ్యూటీ శాలరీ: 15వేలు+ P+ESI, అర్హత: 10th,50సం॥ లోపు. ✆ 88014 97437

SSS కంపెనీలో పనిచేయుటకు లేడీస్ & జెంట్స్ కావలెను. మంచి జీతం మరియు అలవెన్సు. టెన్త్ క్లాస్ & above, VJA. ✆ 93985 53721.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

తిరువూరు

• తిరువూరు • మైలవరం

గోపాలపురం ప్రాథమిక పాఠశాల తనిఖీ

చిన్నారులతో కలిసి భోజనం చేస్తున్న రమేష్‌బాబు

రెడ్డిగూడెం, న్యూస్‌టుడే : గోపాలపురం లోని ప్రాథమిక పాఠశాలను ఎంఈవో పి.రమేష్‌బాబు మంగళవారం తనిఖీ చేశారు. విద్యార్థుల హాజరు, రికార్డులు పరిశీలించారు. మధ్యాహ్న భోజనాన్ని రుచి చూసి చిన్నారులతో కలిసి భోజనం చేశారు. ప్రతి రోజు మెనూ మేరకు తప్పకుండా విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందజేయాలని ఆయన ఉపాధ్యాయులకు సూచించారు.

ఉపకార వేతనానికి ఎంపిక



విద్యార్థిని దామిని సరయుకి ధ్రువపత్రం అందిస్తున్న ప్రిన్సిపల్ రవి

మైలవరం, న్యూస్‌టుడే : స్థానిక లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీకాం ప్రథమ సంవత్సరం విద్యార్థిని పసుపులేటి దామిని సరయు, రిలయన్స్ ఎడ్యుకేషన్ ఉపకార వేతనానికి ఎంపికైనట్లు ప్రిన్సిపల్ ఇళ్ల రవి తెలిపారు. ఆ సంస్థ నిర్వహించిన పోటీ పరీక్షల్లో ప్రతిభ చాటి ఎంపికైనట్లు ఆయన చెప్పారు. ఆమె పీజీ పూర్తయ్యే వరకు ఆయేడాది పాటు ఏడాదికి రూ.50 వేలు చొప్పున ఆ సంస్థ ద్వారా అందుతుందని తెలిపారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

తిరువూరు: 98853 28820 మైలవరం: 80085 74705

స్పందన: ★ నరసాపురం ఎన్టీఆర్ కాలనీలో చెత్త, పేరుకుపోవడంతో స్థానికులు 'మేమున్నాం.. మీకు తోడుగా' ద్వారా సమస్యను పంచాయతీ అధికారులకు తెలిపారు. ఈవో జి.స్వాతి స్పందించి పారిశుద్ధ్య సిబ్బందిని పంపించి శుభ్రం చేయించి సమస్య పరిష్కరించారు. - న్యూస్‌టుడే, విస్సన్నపేట

★ జి.కొండూరు మండలంలోని గ్రామలైన వెంకటాపురం ఓసీ కాలనీ, మునగపాడు పాలకేంద్రం సమీపంలోని పంచాయతీ బోర్లు మరమ్మతులకు గురై నీటి సరఫరాకు స్థానికులు అవస్థలు పడుతున్నారు. ఈ సమస్యను 'ఈనాడు' 'మేమున్నాం.. మీకు తోడుగా' ద్వారా సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు రాజా, మనోజ్ సిబ్బందితో బోర్లకు మరమ్మతులు చేయించారు. - న్యూస్‌టుడే, జి.కొండూరు

? కొండపల్లి ఆర్టిజన్ స్ట్రీట్ ఆర్చి వద్ద ఎగువ నీరు వచ్చి ఆగిపోతున్నాయి. దీంతో వాహనాల రాకపోకలు సమయంలో బస్సుల కోసం నిరీక్షించే ప్రయాణికులపై బురద నీరు పడుతున్నాయి. - డి.సురేష్, సాలికుడు

✔ ఆ ప్రాంతంలో నిలవకుండా నీరు ప్రవహించేందుకు వీలుగా కల్వర్టు లేనందున వాడుక నీరు ఆలా రహదారిపైకి వస్తున్నాయి. అయితే ఎప్పటికప్పుడు ఆ నీటిని తరలిస్తున్నాం. - పవన్, పారిశుద్ధ్య మేస్త్రీ - న్యూస్‌టుడే, కొండపల్లి

శాస్త్రీయ విజ్ఞానం సమాజ అభివృద్ధికి దోహదం

విస్సన్నపేట, న్యూస్‌టుడే : మండలంలోని పుట్రేల అక్షర హైస్కూల్‌లో మంగళవారం జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో సత్యాన్వేషణ దినోత్సవం జరిగింది. జనవిజ్ఞాన వేదిక జిల్లా కార్యదర్శి ఎల్.గంగాధర్, పాఠశాల ప్రిన్సిపల్ ఎ.శైలజ, జవివే విస్సన్నపేట మండల అధ్యక్ష, కార్యదర్శులు ఎంజీ నాగేశ్వరరావు, కె.రామారావు పాల్గొన్నారు.

తిరువూరు: తిరువూరు గీతమ్స్ పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక జిల్లా ఉపాధ్యక్షుడు ఎమ్.హరికృష్ణ మాట్లాడారు. ప్రతి రోజు జీవితంలో ఎదురయ్యే సమస్యలను, మూఢ నమ్మకాలను దూరంగా ఉంచి పరిశోధనాత్మక ఆలోచనలను అలవర్చుకోవాలని ఆయన విద్యార్థులకు సూచించారు. శాస్త్రీయ విజ్ఞానం సమాజ అభివృద్ధికి దోహదపడుతుందని చెప్పారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నిబంధనలకు విరుద్ధం.. పట్టించుకోని యంత్రాంగం

కాలుష్యం బారిన పడుతున్నామని ప్రజల ఆందోళన

రెడ్డిగూడెం, జి.కొండూరు, న్యూస్‌టుడే

నిబంధనలకు విరుద్ధంగా ఇటుక తయారీ కేంద్రాలు రెడ్డిగూడెం, జి.కొండూరు మండలాల్లోని గ్రామాల్లో పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయి. వీటిని ఆరిక శాతం ఆర్‌ఓబీ రహదారులు అనుకొని ఉన్న పంట పొలాలు, మామిడి తోటల భూముల్లో ఏర్పాటు చేస్తున్నారు. గ్రామాల సమీపంలో బట్టీలు పెట్టడం వల్ల కాలుష్యం పెరిగి అనారోగ్య సమస్యలతో రోగాల బారిన పడుతున్నామని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బట్టీల వద్ద పోస్తున్న ఫ్లైయాష్, ఇటుకలను కాల్చడానికి ఉపయోగించే ఊక వల్ల వచ్చే పొడి గాలి వీచిన సమయంలో రహదారులపై ప్రయాణించే ద్విచక్ర వాహనదారుల కళ్లలో పడుతుండడంతో ప్రమాదాలు వాటిల్లుతున్నాయి.

రంగాపురం సమీపంలో రోడ్డు పక్కన వెలసిన ఇటుక బట్టీలు

పంటకు నష్టం జరుగుతోందని..

బట్టీల యజమానులు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోకుండా ఇష్టానుసారంగా ఇలా చేయడంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. పొలాల దగ్గర ఇటుక తయారీ కేంద్రాలతో పంటలపై దుమ్ము, ధూళి పడి పంటలకు నష్టం వాటిల్లుతోందని అన్నదాతలు చెబుతున్నారు. గతంలో రెండు, మూడు గ్రామాల్లోనే ఒకటి, రెండు బట్టీలే ఉండేవి. ధనార్జనే ధ్యేయంగా నిర్వాహకులు పెద్ద ఎత్తున ఇతర ప్రాంతాల నుంచి కూలీలను తీసుకొచ్చి ఇటుకలు తయారు చేయించి బట్టీలు పెట్టిస్తున్నారు. వీటి తయారీకి చెరువుల్లోని మట్టి అనుమతులు ఉండటంతో ఎలాంటి అనుమతులు లేకుండానే మట్టిని కేంద్రాల వద్దకు తరలిస్తున్నారు.

ఎక్కడ పడితే అక్కడ..

విజయవాడ వయా రెడ్డిగూడెం, విస్సన్నపేట ఆర్‌అండ్‌బీ రహదారిలోని పాత నాగులూరు, కొత్త నాగులూరు, వెలగలగూడెం, బూరుగుగూడెం, రంగాపురం, అన్నేరావుపేట, మద్దులపర్వ గ్రామాలు, నూజివీడు-గంపలగూడెం రోడ్డులో రంగాపురం చెరువు దగ్గర నుంచి కుదప, రుద్రవరం గ్రామాల వరకు, నరుకుళ్లపాడు వెళ్లే కాలువ దగ్గర పెద్ద ఎత్తున ఇటుకల తయారీ కేంద్రాలు ఉన్నాయి. రెడ్డిగూడెం నుంచి కుదప వెళ్లే రోడ్డులో రామాపురం నుంచి కోవగూరు వరకు ఇటుక బట్టీలు వెలిశాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి వీటిపై తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

రెడ్డిగూడెం ఎంఈవో- 1గా శంకరరావు

రెడ్డిగూడెం : రెడ్డిగూడెం మండల ఎంఈవో-1(ఎఫ్ఏసీ)గా కుమ్మరి శంకరరావును నియమిస్తూ మంగళవారం ఉత్తర్వులు వచ్చినట్లు ఎంఈవో- 2 పి.రమేష్ బాబు తెలిపారు. తిరువూరు జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న శంకరరావు ఇప్పటికే విస్సన్నపేట ఎంఈవో- 1(ఎఫ్ఏసీ)గా పని చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆయనకే రెడ్డిగూడెం ఎంఈవో- 1 అదనపు బాధ్యతలు అప్పగించారు.

రోడ్డు ప్రమాదాల నివారణ అందరి బాధ్యత

ప్రసంగిస్తున్న ట్రాఫిక్ ఏసీపీ రామచంద్రరావు

ఇబ్రహీంపట్నం: రోడ్డు ప్రమాదాల నివారణ అందరి బాధ్యత అని ట్రాఫిక్ ఏసీపీ రామచంద్రరావు అన్నారు. ఇబ్రహీంపట్నంపై అవగాహన కార్యక్రమాన్ని పట్టణ ఇబ్రహీంపట్నంలో మంగళవారం రాత్రి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహన చోదకుడు రహదారి భద్రత విషయంలో స్పష్టత కలిగి ఉండాలని కోరారు. సూచించిన ట్రాఫిక్ నిబంధనలను కచ్చితంగా పాటించాలని చెప్పారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఆర్‌ఐ కృష్ణ, ఎస్సై లక్ష్మణరావు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

మాట్లాడుతున్న రుక్సానా సుల్తానాబేగం

జి.కొండూరు, న్యూస్‌టుడే : బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ తోడ్పాటు ఇవ్వాలని జిల్లా మహిళాభివృద్ధి శిశు సంక్షేమ శాఖాధికారి షేక్ రుక్సానా సుల్తానాబేగం కోరారు. కుంటముక్కలలోని డా.బీఆర్ అంబేడ్కర్ గురుకులంలో మంగళవారం నిర్వహించిన బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన సదస్సులో ఆమె పాల్గొని మాట్లాడారు. పలు విషయాలను విద్యార్థులకు తెలిపారు. సీడీపీవో పుష్పలత, జిల్లా బాలల పరిరక్షణ అధికారి ఎం.రాజేశ్వరరావు, వాసవ్య మహిళా మండలి అధికారి శ్రీనివాసులు, ప్రిన్సిపల్ బ్యూలా, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు అన్నామణి, జోజికుమారి, సిబ్బంది పాల్గొన్నారు.

పరీక్షల్లో నూరు శాతం ఉత్తీర్ణత సాధనే లక్ష్యం

పెదకొమిర కేజీబీవీలో విద్యార్థులతో మాట్లాడుతున్న ఏపీసీ రజనీ కుమారి

గంపలగూడెం, న్యూస్‌టుడే : మండల పరిధి పెదకొమిరలోని కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాన్ని సమగ్ర శిక్షా జిల్లా అదనపు పథక సమన్వయకర్త(ఏపీసీ) ఎం.రజనీ కుమారి మంగళవారం సందర్శించారు. విద్యాలయంలో సౌకర్యాలు, పారిశుద్ధ్యం, విద్యార్థులకు మెనూ మేరకు అందిస్తున్న భోజనం, వంట సరుకులు, రికార్డులు పరిశీలించారు. అనంతరం ఇంటర్, పది విద్యార్థులతో సమావేశమై పరీక్షలకు ప్రణాళికాబద్ధంగా చదివి నూరు శాతం ఉత్తీర్ణత సాధించాలని సూచించారు. జీసీడీవో బి.విశ్వభారతి, ప్రిన్సిపల్ ఎం.వెంకటలక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎ.కొండూరు, న్యూస్‌టుడే : స్థానిక కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాన్ని ఏపీసీ ఎం.రజనీ కుమారి తనిఖీ చేశారు. విద్యాలయంలో ఎలుకలు కరిచిన విద్యార్థుల ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. మధ్యాహ్న భోజనం రుచి చూసి బాలికలతో కలిసి తిన్నారు. పాఠశాలలో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. ఇన్‌ఛార్జి ఎంపీడీవో ఎ.సుందర్‌లాల్, జీసీడీవో విశ్వభారతి, ప్రిన్సిపల్ విజయ సుందరి, పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

రక్షణ గోడ నిర్మాణానికి సాయం

సత్యనారాయణను సత్కరిస్తున్న రామకృష్ణ, సురేష్ తదితరులు

జి.కొండూరు, న్యూస్‌టుడే : విజయవాడకు చెందిన ప్రముఖ పారిశ్రామికవేత్త కోగంటి సత్యనారాయణ మంగళవారం ఆత్కూరు గ్రామంలోని సీఎస్ఐ చర్చిని సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన సంఘస్థులు చర్చి రక్షణ గోడ నిర్మాణానికి ఆర్థిక సాయం కావాలని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించి రూ.లక్ష నగదును అందజేస్తానని హామీ ఇచ్చారు. ఈ మొత్తాన్ని త్వరలోనే సంఘస్థులకు అందజేస్తానని ఆయన చెప్పారు. అనంతరం సత్యనారాయణను గ్రామస్థులు సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. ఎన్.రామకృష్ణ, సర్పంచి పోతురాజు సురేష్, పినపాక మాజీ సర్పంచి జైపాల్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగిన అరుణానగర్ వాసుల నిరసన

కొండపల్లి : క్వారీ, క్రషర్ లారీలను నిరోధించాలంటూ కొండపల్లి అరుణానగర్ వాసులు చేస్తున్న నిరసన దీక్ష మంగళవారం మూడో రోజుకు చేరింది. ఈ సందర్భంగా పురపాలక వ్యవహారాల నినాదాలు చేశారు. కార్యక్రమంలో అరుణానగర్ వాసులు, నాయకులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలు లేని సమాజ నిర్మాణానికి కృషి

సైకిల్ యాత్రలో దేవదత్, పోలీసు అధికారులు, విద్యార్థులు

తిరువూరు, న్యూస్‌టుడే : యువత మత్తు పదార్థాల బారి నుంచి కాపాడేందుకు పోలీసు శాఖ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా 'డ్రగ్స్‌పై దండయాత్ర' సైకిల్ ర్యాలీ నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా మంగళవారం తిరువూరు నుంచి చింతలపాడు వరకు సాగిన ప్రదర్శనలో రాష్ట్ర ఆర్గానిక్ సర్టిఫికేషన్ అథారిటీ ఛైర్మన్ శావల.దేవదత్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం చింతలపాడు గ్రామంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. మత్తు పదార్థాలను సమాజం నుంచి దూరంగా తరిమికొట్టాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో తిరువూరు సీఐ.గిరిబాబు, ఎస్సై శాతకర్ణి, సిబ్బంది, విద్యార్థులు, ప్రజలు పాల్గొన్నారు

కళాశాలకు డీవీఆర్ వితరణ

పరికరాన్ని అందజేస్తున్న దాత అనిల్‌కుమార్ రెడ్డి

మైలవరం, న్యూస్‌టుడే : స్థానిక వీరేశ్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సీసీ కెమెరాల నిర్వహణకు అవసరమైన డీవీఆర్ పరికరాన్ని సరస్వతీ సేవా ఫౌండేషన్ ద్వారా ప్రవాస భారతీయ వైద్యుడు కుడుముల అనిల్‌కుమార్ రెడ్డి మంగళవారం అందజేశారు. ఈ మేరకు దాతకు కృతజ్ఞతలు తెలిపి సన్మానించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

సత్తా చాటిన వికాస్ విద్యార్థులు

విస్సన్నపేట: జేఈఈ మెయిన్ ఫలితాల్లో స్థానిక వికాస్ జూనియర్ కళాశాలకు చెందిన పలువురు విద్యార్థులు విశేష ప్రతిభ కనబరిచారు. ఈ సందర్భంగా కళాశాల ఛైర్మన్ నర్సిరెడ్డి, ప్రిన్సిపల్ సీతారామరాజు, వైస్ ప్రిన్సిపల్ శ్రీనివాస్ రెడ్డి, ఐఐటీ ఇన్‌ఛార్జి ప్రవీణ్ కుమార్, బాలికల విభాగం ఇన్‌ఛార్జి శంకర్రావు, ఐఐటీ అధ్యాపకుడు బ్రహ్మారెడ్డి విద్యార్థులను మంగళవారం అభినందించారు.

అనుమతులు ఉండవు.. తోలకాలు ఆగవు

జి.కొండూరు, న్యూస్‌టుడే

మైనింగ్ శాఖ అధికారుల అనుమతులు లేకుండా కొందరు వ్యక్తులు జి.కొండూరు మండలంలో అక్రమ తవ్వకాలు చేపట్టి అక్రమార్జనకు పాల్పడుతున్నారు. తెదేపా హయాంలో జి.కొండూరు శివారు గొల్లగూడెం సమీపంలో పూరుబళ్లు అనే కొండ ప్రాంతాన్ని ఏపీ ఐఐసీకి కేటాయించారు. ఇది కొండ ప్రాంతం కావడంతో గతంలో దిలీప్ క్వారీకు అనుమతులు ఇవ్వగా ఆ ప్రాంతంలోని కంకరను సేకరించి మచిలీపట్నం ప్రధాన రహదారి నిర్మాణానికి ఉపయోగించారు. ఆ రోడ్డు కాస్త వైకాపా ప్రభుత్వంలో పూర్తి కావడంతో క్వారీ అనుమతులు నిలిచిపోయాయి. గతంలో తవ్వి వదిలేసిన తవ్వకాలను సాకుగా చూపుతూ స్థానికంగా కొందరు కొండ చుట్టుపక్కల అక్రమ తవ్వకాలు నిర్వహిస్తున్నారు. తవ్వకాలు చేపట్టగా వచ్చిన గ్రావెల్‌ను అనుమతులు లేకుండా రాత్రుళ్లు నూతనంగా ఏర్పాటు చేస్తున్న వెంచర్ల అభివృద్ధికి తరలిస్తున్నారు. దీంతో అందినకాడికి అమ్ముకొని సొమ్ము చేసుకుంటున్నారు.

జి.కొండూరులో అక్రమ తవ్వకాలు జరిపిన ప్రదేశం

ఒప్పందం చేసుకుని..: అంతేకాక చుట్టు పక్కల గ్రామాల్లో ఎవరికి గ్రావెల్ అవసరమో తెలుసుకుని ముందుగా ఒప్పందం చేసుకుని రాత్రికి రాత్రే అక్రమ తవ్వకాలు చేపడుతున్నారు. ఇంత జరుగుతున్నా అధికారులు అటు వైపు కన్నెత్తి చూడక పోవడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇటీవల ఓ వ్యక్తి పట్టపగలే అనుమతులు ఉన్నాయంటూ సీసీ రోడ్లకు బెర్మాలు పోసేందుకు అక్కడి గ్రావెల్‌ను తరలించినట్లు రైతులు ఆరోపిస్తున్నారు. సిమెంటు రహదారుల నిర్మాణానికి బిల్లులు చెల్లిస్తున్నా ఎటువంటి అనుమతులు లేకుండా గ్రావెల్ తరలించడం ఏమిటని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. సామాన్యులు ఇళ్ల మెరక చేసుకొనేందుకు ఓ ట్రక్కు మట్టి కావాలంటే అధికారులు అనుమతులను నిరాకరిస్తున్నారు.

★ దీనిపై మండల తహసీల్దార్ చాట్ల వెంకటేశ్వర్లు, ఎంపీడీవో బీవీ రామకృష్ణ నాయక్‌ను 'న్యూస్‌టుడే' వివరణ కోరగా ఇలా స్పందించారు. తాము ఎటువంటి అనుమతులు ఇవ్వలేదని, ఇది అక్రమ మైనింగ్ కిందకు వస్తుందని తెలిపారు. మైనింగ్ ఏడీ వీరాస్వామిని వివరణ కోరగా తమకు ఎటువంటి ఫిర్యాదులు రాలేదని చెప్పారు. మైనింగ్ విజిలెన్స్ అధికారులను పంపించి క్షేత్ర స్థాయి పరిశీలన చేపట్టి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

రెడ్డిగూడెంలో అవగాహన కల్పిస్తున్న వైద్యుడు మణిబాబు

కొండపల్లి ఎంపీపీ పాఠశాలలో..

తిరువూరులో..

సత్యాలపాడు జడ్పీ ఉన్నత పాఠశాలలో..

అపోహలు వీడాలి.. అవగాహనతో ఉండాలి

మైలవరం, న్యూస్‌టుడే : జాతీయ నులిపురుగుల నివారణ దినం సందర్భంగా మంగళవారం స్థానిక లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జి.కొండూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర సిబ్బంది ద్వారా అల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. అపోహలు వీడి.. అవగాహనతో ఉండాలని విద్యార్థులకు సూచించారు. ప్రిన్సిపల్ ఇళ్ల రవి, ఉప ప్రిన్సిపల్ రంగారావు, ఎన్ఎస్ఎస్ అధికారి వి.ఫణికుమార్ పాల్గొన్నారు.

రెడ్డిగూడెం,న్యూస్‌టుడే : స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో రెడ్డిగూడెం పీహెచ్‌సీ వైద్యుడు మణిబాబు నులిపురుగుల నివారణపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఎంపీడీవో టి.కె.వి.రమణ, ఎంఈవో పి.రమేష్ బాబు, హెచ్ఎం ధర్మశీల పాల్గొన్నారు. అన్నేరావుపేటలో జరిగిన కార్యక్రమంలో వైద్యురాలు కీర్తి, సిబ్బంది పాల్గొని విద్యార్థులతో బిళ్లలు మింగించారు.

కొండపల్లి, ఇబ్రహీంపట్నం గ్రామీణం : కొండపల్లి పురపాలికతో పాటు ఇబ్రహీంపట్నం గ్రామీణ మండల పరిధిలో నిర్వహించిన కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ చిట్టిబాబు, కమిషనర్ వెంకటరత్నం, కౌన్సిలర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తిరువూరు,న్యూస్‌టుడే : తిరువూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల, ప్రాథమిక పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యురాలు రేష్మా, డీవైఈవో.శ్యామ్‌సుందర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎ.కొండూరు, న్యూస్‌టుడే : స్థానిక కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయంలో జరిగిన కార్యక్రమంలో తహసీల్దార్ అరవింద్, ఎంఈవో కేశవరావు, వైద్యులు వేముల స్వాతి, పి.దివ్య తదిరులు పాల్గొన్నారు.

గంపలగూడెం, న్యూస్‌టుడే : మండలంలోని పాఠశాలల్లో 98 శాతం విద్యార్థులతో అల్బెండజోల్ బిళ్లలు మింగించినట్లు గంపలగూడెం, ఊటుకూరు పీహెచ్‌సీల వైద్యాధికారులు వి.శృతి, వి.విజయ్‌కృష్ణ తెలిపారు.

విస్సన్నపేట, న్యూస్‌టుడే : స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో తహసీల్దార్ కె.లక్ష్మీ కల్యాణి, ఎంఈవోలు కె.శంకరరావు, ఈ.సుధాకర్, హెచ్ఎం శోభారాణి, పలువురు అధికారులు పాల్గొన్నారు.

విస్సన్నపేటలో విద్యార్థినికి మాత్రలు వేస్తూ..

ఏ.కొండూరులో అధికారులు, వైద్యులు

కొండపర్వ గట్టు తిరునాళ్లు..

కొండపర్వలో మల్లేశ్వర స్వామి వారి గ్రామోత్సవం

విస్సన్నపేట, న్యూస్‌టుడే : కొండపర్వ శ్రీ భ్రమరాంబ మల్లేశ్వర స్వామి వారి గ్రామోత్సవం ఊరేగింపు అంగరంగ వైభవంగా జరిగింది. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. మంగళవారం రాత్రి జరిగిన గ్రామోత్సవంతో మూడు రోజులుగా ప్రతిష్ఠాత్మకంగా జరిగిన తిరునాళ్ళు ఘనంగా ముగిసాయి. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ, ట్రస్ట్ సభ్యులు, గ్రామ పెద్దలు, పలు స్వచ్ఛందసంస్థల ప్రతినిధులు, రెండు తెలుగు రాష్ట్రాల నుంచి భక్తులు వేలాదిగా పాల్గొన్నారు.

శివాలయంలో ద్వాదశ ప్రదక్షిణలు

మైలవరం : మహాశివరాత్రి సందర్భంగా మంగళవారం సాయంత్రం స్థానిక భ్రమరాంబిక సమేత మల్లేశ్వర స్వామి ఆలయంలో ద్వాదశ పూజలు నిర్వహించారు. ఉత్సవమూర్తులతో ఆలయంలో ప్రదక్షిణలు చేశారు.

ముగిసిన వెల్వడం ఉత్సవాలు

చింతామణి నాటక ప్రదర్శన చేస్తున్న కళాకారులు

మైలవరం, న్యూస్‌టుడే : మహాశివరాత్రి సందర్భంగా మండలంలోని వెల్వడంలో బాలకోటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన ఉత్సవాలు మంగళవారం రాత్రి ముగిశాయి. ప్రత్యేక పూజలతో పాటు మూడ్రోజులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలను వేలాది మంది ప్రజలు తిలకించారు. అధిక సంఖ్యలో ప్రవాసులు వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు.

ఈ- పంట నమోదుతో లాభాలు

తిరువూరు: తిరువూరు మండలం వామకుంట్ల గ్రామంలో మంగళవారం 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించారు. ఈ- పంట నమోదు వల్ల కలిగే ప్రయోజనాలను ఏవో పి.పద్మ రైతులకు వివరించారు. గ్రామ సర్పంచి సత్యనారాయణ, గ్రామ నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

ఫెర్రీలో భక్తులకు అన్నదానం

ఇబ్రహీంపట్నం: మహాశివరాత్రి సందర్భంగా ఇబ్రహీంపట్నం ఫెర్రీలోని శివాలయంలో భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో తెదేపా సీనియర్ నాయకుడు జంపాల సీతారామయ్య, కొండపల్లి మున్సిపల్ ఛైర్మన్ చిట్టిబాబు, స్థానిక తెదేపా నాయకులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

బత్తుల గిరీష్ (పాత చిత్రం)

జి.కొండూరు, న్యూస్‌టుడే : రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన యువకుడు విజయవాడలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. వివరాల్లోకి వెళ్తే.. మునగపాడు గ్రామానికి చెందిన బత్తుల గిరీష్ (20) మైలవరంలోని ఎల్‌బీఆర్‌సీ కళాశాలలో బీటెక్ చదువుకుంటున్నాడు. ఈ క్రమంలో ఇటీవల కళాశాల నుంచి ఇంటికి తిరిగి వెళ్లే క్రమంలో జి.కొండూరు వరకు చేరుకున్నాడు. అక్కడ నుంచి తన గ్రామానికి చెందిన గంజి స్వామి ద్విచక్ర వాహనంపై వస్తుండగా జి.కొండూరు శివారు గొల్లగూడెం సమీపంలోని ఓ క్వారీ దగ్గర ఎదురుగా వస్తున్న పాఠశాల బస్సు వీరి వాహనాన్ని ఢీకొంది. దీంతో వాహనం నడుపుతున్న స్వామికి స్వల్ప గాయం కాగా, గిరీష్‌కు కాలుకు తీవ్రగాయమై విజయవాడలోని ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందాడు. అతని తండ్రి బాలస్వామి ఫిర్యాదు మేరకు జి.కొండూరు ఎస్సై సతీష్ కుమార్ కేసు నమోదు చేశారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించండి

గంపలగూడెం మండలం నుంచి రణభేరికి తరలిన నాయకులు

విజయవాడ ధర్నా చౌక్ వద్ద విస్సన్నపేట యూటీఎఫ్ శ్రేణులు

గంపలగూడెం, న్యూస్‌టుడే : ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ యూటీఎఫ్ ఆధ్వర్యంలో విజయవాడ ధర్నా చౌక్‌లో మంగళవారం నిర్వహించిన రణభేరి ఉద్యమంలో పాల్గొనేందుకు గంపలగూడెం మండలం నుంచి ఆ సంఘ నాయకులు తరలివెళ్లారు. పీఆర్‌సీ కమిషన్ నియమించాలని, మధ్యంతర భృతి విడుదల చేయాలని, డీఏ బకాయిలు ఇవ్వాలని నినాదాలు చేశారు.

విస్సన్నపేట: విస్సన్నపేట మండలం నుంచి యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి బీసీహెచ్‌వీ సూర్యనారాయణ, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సీహెచ్. చంటిబాబు, ఏ.మురళీకృష్ణ, పి.రామకృష్ణారెడ్డి, ఈ.నాగేశ్వరరావు, వి.రవి తదితరులు తరలివెళ్లారు.

ఇబ్రహీంపట్నంలో పోక్సో కేసు..!

ఇబ్రహీంపట్నం, న్యూస్‌టుడే : ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్‌లో పోక్సో కేసు నమోదు అయినట్లు సమాచారం. హైదరాబాద్‌కు చెందిన యువకుడికి, ఇబ్రహీంపట్నానికి చెందిన బాలిక కొంతకాలం కిందట పరిచయమైంది. ఈ నేపథ్యంలో ఇరువురు ఇబ్రహీంపట్నంలోని ఓ లాడ్జిలో కలిశారు. ఇదిలా ఉంటే కొన్ని రోజుల కిందట బాలిక అస్వస్థతకు గురైంది. విషయం ఏంటని ఆరా తీసిన బాలిక తల్లిదండ్రులకు యువకుడి సంగతి తెలిసింది. అస్వస్థతకు గురైన బాలికను ఆసుపత్రిలో చేర్పించి ఆ యువకుడిపై స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అయితే యువకుడిని అదుపులోకి తీసుకొని నిర్ధారణ చేసుకొన్న తర్వాత మీడియా ముందుకు తీసుకొచ్చే ఆలోచనలో పోలీసులు ఉన్నారు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల
(అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 98496 97616

డీఆర్‌డీఏ కార్యాలయం వద్ద ఆందోళన

అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న డ్వాక్రా మహిళలు

గొల్లపూడి, న్యూస్‌టుడే : స్థానిక డీఆర్‌డీఏ జిల్లా కార్యాలయం వద్ద డ్వాక్రా మహిళలు మంగళవారం ఆందోళనకు దిగారు. ఇబ్రహీంపట్నం మండలం చిలుకూరు గ్రామంలోని 13 స్వయం సహాయక సంఘాలకు సంబంధించిన రూ.11 లక్షల నగదును వీవోఏ కాంద్రు సుమ సొంతానికి వినియోగించుకున్నారు. ఆమె డ్వాక్రా మహిళల నుంచి నెల వారీగా డబ్బులు తీసుకుంటూ బ్యాంకులో జమ చేయక పోవడంతో ఇటీవల ఆ విషయం వెలుగులోకి వచ్చింది. వెంటనే మహిళలు సుమను నిలదీయగా చెల్లిస్తానని చెప్పారు. అయితే ఎంతకు చెల్లించకుండా వాయిదాలు వేయడంతో డ్వాక్రా మహిళలు గొల్లపూడిలోని డీఆర్‌డీఏ కార్యాలయానికి వచ్చారు. అధికారులు సుమను అక్కడకు పిలిపించి విచారించారు. వాడుకున్న నగదులో మొదటి విడతగా రూ.3.5 లక్షలు, రెండో విడతగా రూ.7.5 లక్షలు చెల్లిస్తానని ఆమె అంగీకరించారు. ఆ మేరకు.. లేఖ రాసేందుకు సిద్ధమవుతుండగా ఏపీఎం కారు డ్రైవర్ అక్కడకు వచ్చి సుమను పంపించేశారు. దీంతో డ్వాక్రా మహిళలు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేసి కార్యాలయం వద్ద బైఠాయించి నిరసన తెలిపారు. డ్రైవర్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

డాక్యుమెంట్ పోయినది

కొలకలూరి నిషిన్ నినఖిజ్, తండ్రి. కొలకలూరి రాఘవులు, ఫ్లాట్ నెం.108, శ్రీ బాలాజీ టవర్స్ గొల్లపూడి గ్రామం విజయవాడ రూరల్ మండలం, ఎన్టీఆర్ జిల్లా, మొబైల్ నెం. 98482 82442 వీరు ఇబ్రహీంపట్నం ఎస్.ఆర్.ఓ (S.R.O) పరిధిలోని డాక్యుమెంట్ నెం. 3020/2006, తేదీ: 31-07-2006 ద్వారా శ్రీ బాలాజీ టవర్స్‌లోని ఫ్లాట్ నెం. 108కి యజమానిగా ఉన్నారు. అయితే, ఈ ఆస్తికి సంబంధించిన అసలు (Original) డాక్యుమెంట్ నెం. 3032/2006, ది. 12.10.2025న గొల్లపూడిలోని నివాసం నుండి భవానీపురంలోని జిరాక్స్ షాపునకు వెళ్లే దారిలో పోగొట్టుకోవడం జరిగినది. ఎవరికైనా ఈ పత్రం లభిస్తే దయచేసి పైన పేర్కొన్న చిరునామాలో లేదా ఫోన్ నంబర్ ద్వారా సంప్రదించగలరు.

(c) eenadu

విజయవాడ తూర్పు

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM
కరెస్పాండెంట్:80085 74652

స్పందన: ❖ ఎల్ఐసీ కాలనీలో మూర్తి రైజెస్ మున్సిపల్ పొంగి పొర్లడంపై స్థానిక నివాసి జశ్వంత్‌రావు మేమున్నాం...మీకు తోడుగా ద్వారా ఏఈ దీక్షిత్ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన సిబ్బందిని పంపించి పూడిక తీయించారు. ❖ గుణదల కే హోటల్ సమీపంలోని ఇంద్రలో ఎస్టేట్స్ వద్ద దోమల బెడద ఎక్కువగా ఉందని స్థానిక నివాసి అన్నపూర్ణ మేమున్నాం...మీకు తోడుగా ద్వారా మలేరియా అధికారి శ్రీనివాసరావు దృష్టికి తీసుకెళ్లారు. ఆయన సిబ్బందితో దోమల మందులు చల్లించారు. ❖ కామినేని నగర్ 3-11/15 విద్యుత్ స్తంభానికి ఉన్న వీధి దీపం వెలగడం లేదని స్థానిక నివాసి సదాశివరావు మేమున్నాం...మీకు తోడుగా ద్వారా ఏఈ ప్రకాశ్ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన కొత్త దీపాన్ని ఏర్పాటు చేయించారు. - న్యూస్‌టుడే, కరెన్సీనగర్

జాతీయ వీల్‌చైర్ క్రికెట్ టోర్నీ గోడ పత్రిక ఆవిష్కరణ

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: విశాఖపట్నంలోని గల్లె స్పోర్ట్స్ మైదానంలో ఈ నెల 23 నుంచి 28వ తేదీ వరకు నిర్వహించే 5వ జాతీయ స్థాయి వీల్‌చైర్ క్రికెట్ టోర్నీ గోడపత్రిక కను ఆంధ్ర క్రికెట్ సంఘం అధ్యక్షుడు, ఎంపీ కేశినేని శివనాథ్ మంగళవారం విజయవాడ గురునానక్ కాలనీలోని తన కార్యాలయంలో ఆవిష్కరించారు. టోర్నీ నిర్వాహకులు యడ్లపల్లి సూర్యనారాయణ, ఆంధ్రా దివ్యాంగుల క్రికెట్ సంఘం సభ్యులు మేక శ్రీనివాసరావు, కె.సురేష్ తదితరులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ స్థాయి వెటరన్ టీటీలో ప్రతిభ

సాధించిన పతకాలతో ప్రదీప్, జయరామ్

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: నగరానికి చెందిన వెటరన్ టేబుల్ టెన్నిస్ క్రీడాకారులు కె.జయరామ్, వైవీ ప్రదీప్ అంతర్జాతీయ స్థాయి పోటీలో సత్తా చాటారు. కె.జయరామ్ 60+ సింగిల్స్‌లో రజతం, డబుల్స్‌లో పసిడి, మిక్స్‌డ్‌లో కాంస్య పతకాలు కైవసం చేసుకోగా.. వైవీ ప్రదీప్ 45+ సింగిల్స్‌లో రజతం, డబుల్స్‌లో పసిడి పతకాలు సొంతం చేసుకున్నారు.

నిలబడలేక.. కూర్చోలేక..

బస్ షెల్టర్లు లేక ప్రయాణికుల అవస్థ

పటమట, న్యూస్‌టుడే

బెంజ్ సర్కిల్ నుంచి ఆటో నగర్ బస్ స్టాండ్ వరకు ఆర్టీసీ బస్సులు రోజూ సుమారు 300 సార్లు రాకపోకలు సాగిస్తాయి. దాదాపు లక్ష మంది ప్రయాణిస్తారు. ఆ పరిధిలో రెండువైపులా 12 చోట్ల బస్సులు ఆగుతాయి. బస్ షెల్టర్లు 8 ఉంటే.. 4 శిథిలావస్థకు చేరాయి. 4 నీడనిస్తుంటే.. మరో 4 చోట్ల షెల్టర్లే లేవు. షెల్టరు ఒకచోట ఉంటే బస్సులు మరో చోట ఆపుతున్నారు. బస్ కోసం ఎదురు చూసే ప్రయాణికులు సూర్యుడి తాపానికి గురవుతున్నారు. ● ఆటో నగర్ గేట్, గణపతి సచ్చిదా

ఆటోనగర్ గేట్ వద్ద శిథిలావస్థలో...

పటమట సెంటర్‌లో పరిస్థితి ఇదీ...

నంద ఆశ్రమం, పటమట హైస్కూల్ రోడ్డు, పాత చెక్ పోస్ట్ సెంటర్‌లోని షెల్టర్లు శిథిలావస్థకు చేరాయి. హైస్కూల్ రోడ్డు, చెక్ పోస్ట్ సెంటర్‌లోని షెల్టర్లలో చిరు వ్యాపారులు చేస్తున్నారు. ● చెక్ పోస్ట్ సెంటర్ వద్ద నుంచి రోజూ వేలాది మంది రాకపోకలు సాగిస్తుంటారు. ఇక్కడ బస్ షెల్టర్ లేదు. ఎండలో నిలబడా

ల్సిందే. ఎన్టీఆర్ సర్కిల్, పటమట సెంటర్‌లో రోడ్డుకు ఇరువైపులా నీడ కరవే. ఆయా బస్ షెల్టర్ల సమీపంలో పదికిపైనే కళాశాలలు ఉన్నాయి. చాలామంది విద్యార్థులు బస్సుల్లోనే కళాశాలలకు వచ్చివెళ్తున్నారు. చేసేది లేక ఎండలో నిల్చుంటున్నారు. అధికారులు బస్ షెల్టర్లు నిర్మించాలని కోరుతున్నారు.

ఎండలోనే నిల్చుంటున్నాం

మాది ఉయ్యూరు. నగరంలోని ఓ కళాశాలలో డిగ్రీ చదువుతున్నా. ఆర్టీసీ బస్సులో కళాశాలకు వచ్చి వెళ్తుంటా. మధ్యాహ్నం కళాశాల వదిలాక పటమట సెంటర్‌లో బస్సు ఎక్కుతా. షెల్టర్ లేక ఎండలోనే నిల్చోవాల్సి వస్తోంది.
- దేవరకొండ ప్రత్యూష, ఉయ్యూరు

ఇబ్బంది పడుతున్నాం

నేను ఆటో నగర్‌లో పని చేస్తున్నా. సింగ్‌నగర్ నుంచి రోజూ బస్సులో వచ్చి వెళ్తుంటాను. చెక్ పోస్ట్ వద్ద బస్ షెల్టర్ లేదు. ఎండైనా.. వానైనా ఇబ్బందే. ఇక్కడ చాలా మంది బస్సులు ఎక్కుతారు. షెల్టర్ నిర్మిస్తే బాగుంటుంది.
- కొండలు, పెయింటర్

పది ఫలితాల్లో జిల్లాను అగ్రగామిగా నిలుపుదాం: కలెక్టర్

సూర్యారావుపేట, న్యూస్‌టుడే: పదో తరగతి పరీక్షల కోసం రూపొందించిన వంద రోజుల ప్రణాళికను పక్కాగా అమలు చేసి ఫలితాల్లో జిల్లాను అగ్రగామిగా నిలిపేందుకు కృషి చేయాలని కలెక్టర్ జి.లక్ష్మీశ సూచించారు. మంగళవారం సూర్యారావుపేటలోని కార్పొరేట్ రామ్మోహనరావు స్కూల్‌ను ఆయన పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడారు. గణితం, సైన్సు, సాంఘిక శాస్త్రం పాఠ్యాంశాలకు సంబంధించిన పలు ప్రశ్నలు వేసి.. సమాధానాలు రాబట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో ప్రభుత్వ పాఠశాలల్లో 11,200 మంది, ప్రైవేట్ పాఠశాలల నుంచి 16,000 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలకు సన్నద్ధం అవుతున్నారని తెలిపారు. ఇప్పటికే నేర్చుకున్న విషయ పరిజ్ఞానం ఎప్పటికీ గుర్తుండేలా చదవాలని వివరించారు. విద్యార్థి జీవితాన్ని మలుపు తిప్పేది పదో తరగతి పరీక్షలేనని.. ఇందులో మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధిస్తే ఉన్నత చదువులకు మార్గం సుగమం అవుతుందన్నారు. డీఈఓ ఎల్.చంద్రకళ, ప్రధానోపాధ్యాయిని ఎం.సూర్యప్రభ, తదితరులు పాల్గొన్నారు.

యువతికి నగ్న చిత్రాలు పంపి వేధింపులు

సూర్యారావుపేట: సూర్యారావుపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో నివసించే ఒక యువతికి నగ్న చిత్రాలు, వీడియోలు, మెసేజీలు పంపి వేధిస్తున్న మదన్‌మోహన్ అనే యువకుడిపై పోలీసులు కేసు నమోదు చేశారు. గత నెల 22న మధ్యాహ్నం ఆమె చరవాణికి నగ్న చిత్రాలు, వీడియోలు వచ్చాయి. వీటిని తనకు పరిచయం ఉన్న మదన్‌మోహన్ నంబరు నుంచి వచ్చాయని గుర్తించారు. బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేయగా.. కేసు నమోదు చేశారు.

రిజర్వాయర్ నిర్మాణ పనులు వేగవంతం

నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: రాణి గారితోటలో చేపట్టిన రిజర్వాయర్ నిర్మాణ పనులు వేగవంతం చేయాలని నగర పాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర పేర్కొన్నారు. రిజర్వాయర్ పనులను కమిషనర్ మంగళవారం పరిశీలించారు. ధ్యానచంద్ర మాట్లాడుతూ.. పనులు త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. కృష్ణలంక జాతీయ రహదారి ప్రాంతంలో పచ్చదనం పెంపొందించాలని పేర్కొన్నారు. అన్న క్యాంటీన్‌ను పరిశీలించి పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు.

అన్న క్యాంటీన్‌ను పరిశీలిస్తున్న కమిషనర్ ధ్యానచంద్ర

జోనల్ కమిషనర్ కె.షమ్మీ, సీఎంహెచ్ఓ కె.అర్జునరావు, ఈఈ సామ్రాజ్యం తదితరులు పాల్గొన్నారు.

❖ నగర ప్రజల ఆర్థికాభివృద్ధికి యూసీడీ విభాగం చర్యలు చేపట్టాలని కమిషనర్ ధ్యానచంద్ర పేర్కొన్నారు. నగర పాలక సంస్థ కార్యాలయంలోని తన ఛాంబర్‌లో యూసీడీ విభాగం అధికారులతో మంగళవారం సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరువ చేయాలని ఆదేశించారు. అక్షరాంధ్ర, స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర, పీఎం స్వనిధి, షెల్టర్ హోంలు, వీధి విక్రయదారుల స్థితిగతులపై ఆరా తీశారు. ప్రాజెక్టు అధికారి ఎం.విజయలక్ష్మి, సీడీవోలు శ్రీకాంత్, జగదీశ్వరి తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారుల ప్రతిభకు వన్నె తెచ్చేందుకు కృషి

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: క్రీడాకారుల ప్రతిభకు వన్నె తెచ్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని కలెక్టర్ జి.లక్ష్మీశ పేర్కొన్నారు. జిల్లా క్రీడాప్రాధికార సంస్థ (డీఎస్ఏ) ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక ఐజీఎంసీ స్టేడియంలో నిర్వహించిన శాప్ లీగ్ జిల్లా స్థాయి చెస్ పోటీలు, జిల్లా జట్ల ఎంపిక ముగింపు సభకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లా స్థాయిలో ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 21, 22వ తేదీల్లో తిరుపతిలో జరిగే రాష్ట్ర స్థాయి చెస్ టోర్నీలో పాల్గొంటారని తెలిపారు. అక్కడ కూడా జిల్లా క్రీడాకారులు పతకాలు సాధించాలని ఆకాంక్షించారు. అండర్-13, 15, 17 కేటగిరీ... బాలబాలికల విభాగాల్లో తొలి మూడు స్థానాల్లో నిలిచిన క్రీడాకారులకు పతకాలు, ధ్రువపత్రాలు అందజేశారు. ఉదయం పోటీలను శాప్ ఎండీ ఎస్.భరణి ప్రారంభించారు. అర్జున, ద్రోణాచార్య అవార్డు గ్రహీత అరెకపూడి రమణరావు, శాప్ బోర్డు సభ్యుడు ఎస్.సంతోష్ కుమార్, శాప్ పరిపాలనాధికారి ఆర్.వెంకట రమణనాయక్, డీఎస్‌డీవో కాకర్ల కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

విజేతలతో కలెక్టర్ లక్ష్మీశ, డీఎస్‌డీవో కోటేశ్వరరావు తదితరులు

దుర్వాసన భరించలేకున్నాం..

కృష్ణలంక 20వ డివిజన్‌లోని అంతర్గత దారులను పారిశుద్ధ్య సిబ్బంది రోజూ శుభ్రం చేయడం లేదని ప్రజలు చెబుతున్నారు. శంకర మఠం వీధి - పాలపర్తి వారి వీధి మధ్య అంతర్గత రోడ్డు చెత్త పేరుకుంది. దుర్వాసన వస్తోంది. వ్యర్థాలు తొలగించాలని కోరుతున్నారు.
- కృష్ణలంక, న్యూస్‌టుడే

వాహనాల రాకపోకలకు ఇబ్బంది

11వ డివిజన్ దండమూడి వెంకటరత్నం పార్కు ఎదుట భవన నిర్మాణ సామాన్లు పెట్టారు. పార్కుకు వెళ్లే ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. గోడకు అనుకుని ఇనుప గ్రిల్స్ పెట్టారు. షెడ్ వేశారు. అవి వాహనాల రాకపోకలకు అడ్డుగా ఉన్నాయి. అధికారులు స్పందించాలి - పటమట, న్యూస్‌టుడే

తాగునీరు లీక్..మరమ్మతులు చేయండి

కరెన్సీనగర్ ప్రధాన వీధి గుమ్మడి టవర్స్ సమీపంలో పైపు లీకేజీతో శివారు ప్రాంతాలకు తాగునీరు సక్రమంగా అందడం లేదు. కుళాయిలు సన్నగా, మురికిగా వస్తున్నాయని మహిళలు ఫిర్యాదు చేస్తున్నారు. అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.
- కరెన్సీనగర్, న్యూస్‌టుడే

పేరుకుపోయిన వ్యర్థాలు...

పున్నమ్మ తోటలోని మాంటిస్సోరి కళాశాల పక్క వీధిలో విద్యుత్తు నియంత్రిక వద్ద వ్యర్థాలు వేస్తున్నారు. విద్యుత్తు తీగలు రాసుకొని నిప్పు రవ్వలు పడితే అగ్ని ప్రమాదం జరిగే అవకాశం ఉంది. అధికారులు స్పందించి చెత్త తొలగించాలని స్థానికులు కోరుతున్నారు. - విజయవాడ సిటీ, న్యూస్‌టుడే

జేఈఈ మెయిన్ ఫలితాల్లో శ్రీచైతన్య విజయభేరి

బెంజిసర్కిల్ (విజయవాడ సిటీ), న్యూస్‌టుడే : జేఈఈ మెయిన్ పరీక్షా ఫలితాల్లో విజయవాడలోని శ్రీచైతన్య విద్యాసంస్థల విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించారని ఎగ్జిక్యూటివ్ ఏజీఎం మద్దినేని మురళీకృష్ణ అన్నారు. పసల మోహిత్ 100 పర్సంటైల్, కె.హిమకర్, జి.సాయి సాత్విక్, పి.ప్రవీత్ చెన్నకేశవ్ వరుసగా 99.99 పర్సంటైల్ సాధించారని వెల్లడించారు. 99.99 ఆపైన పర్సంటైల్ 21 మంది, 99.98 ఆపైన 34 మంది, 99.97 ఆపైన 46 మంది, 99.96 ఆపైన 59 మంది, 99.95 ఆపైన 71 మంది, 95.0 ఆపైన 800 మంది, 90.0 ఆపైన పర్సంటైల్ 1200 మంది సాధించారని తెలియజేశారు. బెంజి సర్కిల్‌లోని క్యాంపస్‌లో ప్రతిభ చూపిన విద్యార్థులను మురళీకృష్ణ, ఎగ్జిక్యూటివ్ డీన్ పి.వెంకటేశ్వరరావు తదితరులు అభినందించారు.

అత్యుత్తమ పర్సంటైల్ సాధించిన విద్యార్థిని సత్కరిస్తున్న ఈఏజీఎం మురళీకృష్ణ తదితరులు

నారాయణ విద్యార్థుల ప్రతిభ

కానూరు, న్యూస్‌టుడే : జేఈఈ మెయిన్-2026 ఫలితాల్లో విజయవాడలోని నారాయణ విద్యాసంస్థల విద్యార్థులు మంచి పర్సంటైల్స్ సాధించారని డీజీఎం రవిశంకర్ తెలిపారు. ఫలితాల్లో సంగాజాగృత్ 99.98, వేదచరణ్ 99.97, సాయికుశ్వంత్ 99.96, మహిత 99.95, జగదీష్ 99.94, బస్వంత్ 99.94, ప్రసాద్ రెడ్డి 99.93, యశ్విత 99.90, లోకేశ్వర్ 99.78, జీవన్‌కుమార్ 99.73, అఖిలేష్ 99.73 పర్సంటైల్స్ సాధించారన్నారు. వీరితో పాటు 99 పర్సంటైల్‌లో 110 మంది విద్యార్థులు, 98లో 193, 97లో 276, 96లో 325, 95లో 416, 90 పర్సంటైల్‌లో 680 మంది విద్యార్థులు జాతీయ స్థాయిలో సత్తా చాటారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను డీన్లు, ప్రిన్సిపల్స్, అధ్యాపకులు అభినందించారు.

రాణించిన విద్యార్థులతో డీజీఎం రవిశంకర్ తదితరులు

మెటబాలిక్ సిండ్రోమ్ వ్యాధిపై నిర్లక్ష్యం తగదు

పటమట, న్యూస్‌టుడే: నేటి ఆరోగ్య సమస్యల్లో మెటబాలిక్ సిండ్రోమ్ ఒకటని, దాన్ని నిర్లక్ష్యం చేస్తే గుండె, కిడ్నీ సమస్యలు ఉత్పన్నమవుతాయని వైద్యుడు సమరం అన్నారు. బెంజ్ సర్కిల్ సమీపంలోని వాసవ్య నర్సింగ్ హోమ్‌లో మంగళవారం డాక్టర్ రవికుమార్ అధ్యక్షతన ఆరోగ్య సదస్సు నిర్వహించారు. రవి కుమార్ మాట్లాడుతూ... పొట్ట చుట్టూ కొవ్వు అధికంగా పెరగడం, రక్తపోటు, రక్తంలో చక్కెర స్థాయి పెరగడం, మంచి కొలెస్ట్రాల్ తగ్గడం వంటి అంశాలు కలిసి మెటబాలిక్ సిండ్రోమ్‌గా పేర్కొంటారని తెలిపారు. అసమతుల్య ఆహార అలవాట్లు, ఫాస్ట్‌ఫుడ్, ప్రాసెస్డ్ ఆహారం తినడం మెటబాలిక్ సిండ్రోమ్‌కు ప్రధాన కారణాలని చెప్పారు. ఆరోగ్యకర ఆహార అలవాట్లు, వ్యాయామంతో దీనిని నివారించవచ్చని తెలిపారు.

మాట్లాడుతున్న డాక్టర్ సమరం, పక్కన రవి కుమార్

'ఆరు చరణాలు ఆలపించాలని జీవో విడుదల సరికాదు'

బెంజిసర్కిల్(విజయవాడ సిటీ), న్యూస్‌టుడే : వందేమాతరం గీతాన్ని క్రైస్తవ సమాజం గౌరవిస్తుందని, కానీ ఆరు చరణాలు ఆలపించాలని కేంద్ర ప్రభుత్వం జీవో విడుదల చేయడంపై అభ్యంతరం వ్యక్తం చేస్తున్నామని, దాన్ని ఉపసంహరించుకోవాలని ఆంధ్రప్రదేశ్ క్రిస్టియన్ లీడర్స్ ఫోరం ఛైర్మన్ ఆలీవర్‌రాయ్ అన్నారు. బెంజి సర్కిల్‌లోని ఓ హోటల్లో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఫోరం కార్యదర్శి అరుల్ అరుసు, రాష్ట్ర సమన్వయకర్తలు నెల్లపాటి శామ్యూల్, జ్యోతి ఆనంద్, గ్రేటర్ విజయవాడ పాస్టర్స్ ఫెలోషిప్ అధ్యక్షుడు ఎస్.జయకుమార్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

శుభ్రతతో నులి పురుగుల సమస్య దూరం

నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తే... నులి పురుగుల సమస్య దూరం అవుతుందని నగర పాలక సంస్థ అదనపు కమిషనర్ డి.చంద్రశేఖర్ పేర్కొన్నారు. జాతీయ నులి పురుగుల నివారణ దినం సందర్భంగా మంగళవారం పటమటలోని కె.బి.సి. ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు మాత్రలు పంపిణీ చేశారు. చంద్రశేఖర్ మాట్లాడుతూ.. వేళ్లకు గోళ్లు తీయకపోవడం, ఆహారం తినేటప్పుడు చేతులు శుభ్రంగా కడుక్కోకపోవడం తదితర కారణాలతో నులి పురుగులు శరీరంలోకి వస్తాయని తెలిపారు. అవి శరీరంలోకి వచ్చాక అన్ని విధాలా నష్టం కలిగిస్తాయని పేర్కొన్నారు. సీఎంహెచ్‌వో కె.అర్జునరావు, వైద్యులు గోపాలనాయక్, బి.సోమశేఖరరెడ్డి పాల్గొన్నారు.

మందు వేస్తున్న అదనపు కమిషనర్ చంద్రశేఖర్

బీసీ రిజర్వేషన్లకు ఆద్యుడు కర్పూరీ ఠాకూర్

పటమట, న్యూస్‌టుడే: కర్పూరీ ఠాకూర్ బీసీ రిజర్వేషన్ల అమలుకు ఆద్యుడిగా నిలిచారని, దేశంలోనే తొలి కాంగ్రేసేతర పార్టీ నుంచి ముఖ్యమంత్రి అయిన నేతగా చరిత్రలో నిలిచారని విశ్రాంత ఐపీఎస్ అధికారి ఎం.రవీంద్రనాథ్‌బాబు అన్నారు. మంగళవారం ఠాకూర్ వర్ధంతి సందర్భంగా నగరంలోని నాయీ బ్రాహ్మణ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యాలయంలో ఆయన చిత్రపటానికి నేతలు పూలమాల వేసి నివాళులర్పించారు. రవీంద్రనాథ్ మాట్లాడుతూ ఓబీసీ రిజర్వేషన్ విధానానికి ఠాకూర్ పునాది వేశారని గుర్తు చేశారు. అమరావతిలో ఠాకూర్ విగ్రహాన్ని ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మల్కాపురం కనకారావు, నాయకులు దాలిపర్తి ధన్వంతరి, అన్నవరపు బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

ఠాకూర్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న విశ్రాంత ఐపీఎస్ అధికారి రవీంద్రనాథ్ తదితరులు

పట్టపగలు దర్జాగా దొంగతనం

పటమట, న్యూస్‌టుడే: దుండగుడు రైలులో దిల్లీ నుంచి వచ్చి పట్టపగలే ఇంట్లో చొరబడి నగదు, ఆభరణాలు చోరీ చేసిన ఘటన రామవరప్పాడులో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. దిల్లీకి చెందిన ఇద్దరు దుండగులు ఈ నెల 14న దిల్లీలో రైలు ఎక్కి 15వ తేదీ రాత్రి విజయవాడ చేరుకున్నారు. వన్‌టౌన్‌లోని ఓ హోటల్‌లో గది తీసుకున్నారు. సోమవారం ఉదయం వన్‌టౌన్‌లో బస్సు ఎక్కి రామవరప్పాడులో దిగారు. నడుచుకుంటూ వెళ్లి తాళం వేసిన రెండు ఇళ్లను ఎంచుకున్నారు. ఒకడు రామవరప్పాడు రామాలయం వీధిలోని ఓ ఇంట్లో చొరబడ్డాడు. బీరువాలోని సుమారు 30 గ్రాముల బంగారు ఆభరణాలతో పాటు కొంత నగదు దొంగలించాడు. మరొకడు అదే వీధిలోని మరో నివాసంలో చొరబడ్డాడు. ఆ సమయంలోనే కుటుంబ సభ్యులు ఇంటికి వచ్చి దొంగని గుర్తించారు. అతను పారిపోతుండగా.. గట్టిగా కేకలు వేశారు. స్థానికులు పట్టుకొని పోలీసులకు అప్పగించారు. అతను తన పేరు రాజు అని చెబుతున్నాడు. రామవరప్పాడు ఎందుకు వెళ్లారని అడిగితే పొంతన లేని సమాధానాలు చెబుతున్నాడు. రాజు దొరకగానే మరో వ్యక్తి హోటల్ గదికి వెళ్లి చొక్కా మార్చుకుని దిల్లీ రైలు ఎక్కి వెళ్లిపోయాడు. హోటల్ నిర్వాహకులు గది అద్దెకు ఇచ్చినప్పుడు గుర్తింపు కార్డు కూడా తీసుకోలేదు. ఫలితంగా దర్యాప్తు కష్టమవుతోంది.

పగలగొట్టిన బీరువా

శ్రీశ్రీనివాస గ్రావిటీ విద్యాసంస్థల జయకేతనం

మొగల్రాజపురం (విజయవాడ సిటీ), న్యూస్‌టుడే : జేఈఈ మెయిన్ పరీక్షా ఫలితాల్లో శ్రీశ్రీనివాస గ్రావిటీ విద్యాసంస్థల విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించారని ఫిజిక్స్ అకడమిక్ డైరెక్టర్ సురేశ్‌బాబు, అకడమిక్ డైరెక్టర్ సతీశ్, ప్రిన్సిపల్ వి.ఫణిరాజ్‌కుమార్ అన్నారు. మొగల్రాజపురంలోని కళాశాలలో మంగళవారం వారు మాట్లాడుతూ.. టి.రిషబ్ 99.44 పర్సంటైల్, డీజేపీ దేవకుమార్ 97.93, పి.సీతారాం 97.56, ఎన్.దాన్వి 96.48, ఎస్.మనోజ్‌కుమార్ 96.00, పి.వెంకట నిరంజన్ 95.55 పర్సంటైల్ సాధించారని పేర్కొన్నారు. విజయోత్సవాలు నిర్వహించారు.

విజయ చిహ్నం చూపిస్తున్న డైరెక్టర్లు, విద్యార్థులు

గోడ కట్టారు.. డ్రెయిన్లు మరిచారు

కృష్ణలంక, న్యూస్‌టుడే

కృష్ణా నది ముంపు బారి నుంచి రక్షించడమే లక్ష్యంగా నిర్మించిన రక్షణ గోడ వల్ల ప్రజలు కొన్ని ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గోడ కట్టిన సమయంలోనే సమీప ప్రాంతాల మురుగు, వర్షం నీరు బయటికి వెళ్లేలా డ్రెయిన్లు నిర్మించలేదు. కృష్ణమ్మ వరద నుంచి గోడ కాపాడుతున్నా... వాన నీరు, మురుగు వెళ్లడానికి అవకాశం లేక 16, 17, 18, 20, 21 డివిజన్ల ప్రజలకు ముంపు భయం వెంటాడుతోంది. ● 2014-19 మధ్యలో అప్పటి తెదేపా ప్రభుత్వం కృష్ణా పరీవాహక ప్రాంతాలను నది ముంపు నుంచి కాపాడేందుకు రామలింగేశ్వర నగర్ నుంచి గీతానగర్ వరకు సుమారు 2.75 కి.మీ. మేర రక్షణ గోడ నిర్మించింది. గోడ రక్షణ నిమిత్తం కొంతమేర ఇసుక నింపి రోడ్డు తరహా నిర్మాణం చేపట్టింది.

21వ డివిజన్ రణదివేనగర్ రక్షణ గోడ సమీపంలో ఇసుక నింపిన ప్రదేశం

మురుగుతో సహవాసం: ● అనంతరం అధికారంలోకి వచ్చిన వైకాపా ప్రభుత్వం రక్షణ గోడ వెంబడి ఖాళీ స్థలం మొత్తం ఇసుక నింపింది. 16వ డివిజన్ పోలీస్ కాలనీకి అనుసంధానంగా సుమారు రెండు కి.మీ. మేర ప్రహరీ నిర్మించింది. ఫలితంగా కళానగర్, పోలీస్ కాలనీల్లో వర్షం నీరు బయటకు వెళ్లేందుకు ఏర్పాటు చేసిన డ్రెయిన్లకు అవరోధం కలిగింది. ● 17, 18 డివిజన్ల పరిధిలో డ్రెయిన్ల నిర్మాణంపై శ్రద్ధ చూపకపోవడంతో నదికి వరద వచ్చినపుడు ఊట నీరు, డివిజన్‌లో మురుగు, వరద నీరు కరకట్ట దిగువ ప్రాంతాలైన భూపేష్‌గుప్తానగర్, తారకరామానగర్‌లను ముంచెత్తుతోంది. ● 20వ డివిజన్ రణదివేనగర్ కరకట్ట దిగువున కూడా ఇసుక నింపి వదిలేయడం.. డ్రెయిన్లు నిర్మించకపోవడంతో దిగువ ప్రాంత ప్రజలు మురుగుతో సహవాసం చేస్తున్నారు.

● రూ.కోట్లలో ప్రజాధనం వెచ్చించి రక్షణ గోడ నిర్మించినప్పటికీ.. వరద సమయంలో ఆయా ప్రాంతాలను నీరు ముంచెత్తడం పట్ల స్థానికులు ఆందోళన చెందుతున్నారు. వరద ముంపు నుంచి తప్పించుకునేందుకు డ్రెయిన్లు నిర్మించాలని కోరుతున్నారు.

ఉద్యోగుల కుటుంబాలకు చెక్కుల అందజేత

రైల్వేస్టేషన్: ఇటీవల ప్రమాదంలో మృతి చెందిన నలుగురు రైల్వే ఉద్యోగుల కుటుంబాలకు రైల్వే శాఖ సంయుక్తంగా అమలు చేస్తున్న ఎస్‌బీఐ శాలరీ ప్యాకేజీలో భాగంగా ఒక్కొక్కరికి రూ.కోటి చొప్పున ప్రమాద బీమా చెక్కులు మంగళవారం డీఆర్ఎం మోహిత్ సొనాకియా అందజేశారు. ఏడీఆర్ఎం ఎడ్విన్, సీనియర్ డీపీవో ప్రేమ్‌కుమార్, ఎస్‌బీఐ మేనేజరు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బంగారు గొలుసు అప్పగింత

నిర్మల్ పట్టణం, న్యూస్‌టుడే: వారికి ఏకంగా 13 గ్రాముల బంగారు గొలుసు దొరికింది. ప్రస్తుతం గొలుసు విలువ రూ. 1.70 లక్షలకు పైనే. పోగొట్టుకున్నవారు ఎంత బాధపడుతుంటారో, ఎలాగైనా వారికి అప్పగించేయాలి అనుకున్నారు. అనుకున్నట్లుగానే నిజాయతీగా దాన్ని అప్పగించారు. అందరితో అభినందనలు అందుకున్నారు. ☛ విజయవాడకు చెందిన రోషిణి, మౌర్య ఇద్దరిదీ విజయవాడ. వీరు సోమవారం నిర్మల్ డిపోకు చెందిన అమలాపురం- నిర్మల్ లహరి బస్సులో విజయవాడ నుంచి జేబీఎస్ వరకు వచ్చి అక్కడ దిగిపోయారు. కొంతసేపయ్యాక తమ బంగారుగొలుసు బస్సులోనే మర్చిపోయినట్లు గుర్తించారు. ప్రయాణ సమయంలో జారీచేసిన టికెట్‌పై ఉన్న సంస్థ టోల్‌ఫ్రీ నంబరుకు కాల్‌చేశారు. టికెట్‌పై ఉన్న డ్రైవర్ల సర్వీసు నంబర్ల ఆధారంగా వారి ఫోన్‌నంబరు తీసుకొని కాల్‌చేశారు. గొలుసు తమ వద్ద భద్రంగా ఉందని, అయితే.. అప్పటికే తాము నిర్మల్ చేరుకున్నామని చెప్పారు. దీంతో బాధితులు మంగళవారం నిర్మల్ బస్‌డిపోకు చేరుకున్నారు. డిపో మేనేజర్ కె.పండరి వారికి బంగారుగొలుసును అప్పగించారు. నిజాయతీగా వ్యవహరించిన డ్రైవర్లు టి.రవీందర్, అర్షద్‌ను అభినందించి కృతజ్ఞతలు తెలిపారు.

ప్రకటన ('దస్తావేజులు పోయినవి')

నా క్లయింట్ కొలికిపూడి రామ్‌ప్రసాద్ గారి కుమార్తె దివ్య సిద్ధార్థ్ కొలికిపూడి ప్రస్తుత నివాసం డోర్ నెం. 381, రెండవ అంతస్తు, సిరి రాఘవేంద్ర రెసిడెన్సీ, శ్రీనివాస నగర్, బ్యాంక్ కాలనీ, విజయవాడ - 520 008, ఆం.ప్ర. గారి సంజాయిషీ పొంది యావన్మందికి తెలియజేయునది ఏమనగా... ది. 25-01-2026 ఉదయం సుమారు గం.11.00ల సమయంలో క్రింద ఉదహరించిన దస్తావేజులు తీసుకుని వారి తండ్రిగారైన రామ్‌ప్రసాద్ గారు మహానాడు రోడ్డు కూడలిలోని పవన్ జిరాక్స్ షాపు నందు జిరాక్స్ తీయించుకొను నిమిత్తం ద్విచక్ర వాహనముపై బయలు దేరి వెళ్ళి జిరాక్స్ షాపు దగ్గర దస్తావేజులు ఉంచిన కవర్ (సంచి)ను పరిశీలించగా అందుపెట్టిన దస్తావేజులు నెం.1). 1109/1988, జి.పి.ఏ., 2). 1524/1988, 3). 2570/1992 ఎస్.ఆర్.ఓ, విజయవాడ మరియు దస్తావేజు నెం. 4). 5507/2008 ఒరిజనల్ దస్తావేజులు ఎస్.ఆర్.ఓ, పటమట కనిపించలేదు. మార్గమధ్యములో జారిపోయినవి అని గ్రహించి ఆ పరిసరాలలో ఎంత వెదికిననూ ఫలితం లేకపోయినది. కావున మా యందు ఉంచి పైన ఉదహరించిన దస్తావేజులు ఎవరికైననూ దొరికిన యెడల ఈ క్రింది చిరునామాలో అందజేసి తగిన పారితోషికం పొందగలరు. అట్లు గాక సదరు దస్తావేజులను ఉపయోగించి ఎవరితోనైనా, ఏ విధమైన లావాదేవీలు జరిపిన యెడల అట్టి లావాదేవీలు చెల్లనేరవని, అట్టి వారిపై నా క్లయింటు తీసుకొను చట్టపరమైన చర్యలకు బాధ్యులగుదురని తెలియజేయడమైనది.

పాలడుగు సుబ్బారావు, అడ్వకేట్ & నోటరీ
48-19-5, కెనరా బ్యాంక్ ఎదురు, శ్రీరామ చంద్ర నగర్, విజయవాడ-520 008, ఏ.పి.
సెల్: 9866855790, 8688525678

ప్రకటన

నా క్లయింటు ఇండియన్ బ్యాంక్, మొగల్రాజపురం బ్రాంచి విజయవాడ వారి సంజాయిషీ పొంది యావన్మందికీ తెలియజేయునది ఏమనగా..

ఎన్.టి.ఆర్. జిల్లా, విజయవాడ పటమటలంక, నేతాజీ వీధి, డోర్ నెం: 40-25-17/8రు కాపురస్తులు (లేటు) కోనేరు సుభాష్ చంద్రబోస్ గారి కుమారుడు నరేంద్ర కుమార్ గారికి చెందిన ఈ దిగువ షెడ్యూల్ ఆస్తిని హామీగా వుంచుకొని ఋణమును మంజూరు చేయవలసినదిగా నా క్లయింటు బ్యాంకు వారిని అభ్యర్థించియున్నారు.

ఈ దిగువ షెడ్యూల్ ఆస్తి విజయవాడ కాపురస్తులు కోనేరు వరలక్ష్మీ గారు డాక్టర్ యలమంచిలి శ్రీహరిరావు గారి భార్య విజయలక్ష్మి మరియు పిన్నమనేని చంద్రమోహన్‌రావు గారి భార్య కస్తూరి, కనకమేడల రంగారావు గారి కుమారుడు భరత్ భూషణ్ గార్లచే క్రయమును పొంది వారిచే పటమట సబ్ రిజిస్ట్రారు ఆఫీసులో విక్రయ దస్తావేజు నెం. 305/2003రుగా రిజిస్టర్ చేయించుకొని తదుపరి వారి ఏకైక కుమారుడైన కోనేరు నరేంద్ర కుమార్ గారికి దఖలు పరిచి అందుకుగాను పటమట సబ్ రిజిస్ట్రారు వారు ఆఫీసులో దఖలు దస్తావేజు నెం. 351/2022రుగా రిజిష్టరుగాబడిన రీత్యా నరేంద్ర కుమార్ గారికి సంక్రమించినదని తెలియచేయుచున్నారు. అయితే ఈ దిగువ షెడ్యూల్ ఆస్తికి చెందిన ఒరిజినల్ విక్రయ దస్తావేజు నెం. 305/2003రు చెదపట్టియున్నదని అని తెలియచేయుచున్నారు. అయితే ఈ దిగువ షెడ్యూల్ ఆస్తిని ఇండియన్ బ్యాంక్, మొగల్రాజపురం బ్రాంచి విజయవాడ వారికి హామీగా వుంచి ఋణము పొందుట తప్ప మరి ఏ ఇతర లావాదేవీలు జరిపించుటలేదని తెలియజేయుచున్నారు.

కనుక ఈ షెడ్యూల్ దాఖలా ఆస్తిపై ఎవరికైనా ఎట్టి క్లయిములు, అభ్యంతరములు, సరిహద్దు వివాదములు, భాగలబ్ద తగాయిదాలు గాని, సెక్యూరిటీలు, తనఖాలు గాని, ఈజ్‌మెంట్ హక్కులు గాని ఉన్న యెడల ఈ దిగువ అడ్రసుకు ప్రకటన తేదీ నుండి 7 రోజులలోపు వ్రాత పూర్వకంగా తెలియజేయవలెను. తదుపరి క్లయిములు, అభ్యంతరములు లేవని యెంచి నా క్లయింటు ఇండియన్ బ్యాంకులో ఋణమును పొందగలరు. తదుపరి వచ్చు క్లయిములు, అభ్యంతరములు నా క్లయింట్లును ఏ విధముగానూ బైండు చేయజాలవు.

షెడ్యూలు: ఎన్.టి.ఆర్.జిల్లా, పటమట సబ్ రిజిస్ట్రారు వారి యిలాకా, విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ ఏరియాలో చేరిన విజయవాడ అర్బన్ మండలం పరిధిలోని విజయవాడ టౌన్, పటమట గ్రామ రీ సర్వేనెం. 71/1రు, ప్లాటు నెం. 1రు, డోర్ నెం. 40-25-17/8రు దాఖలా చ॥గ॥ 318.0లులో ఆర్.సి.సి. బిల్డింగుకు **హద్దులు: తూర్పు:** కోనేరు ప్రమీలాదేవి గారి ఆస్తి, **దక్షిణం :** కాజ శేషు ప్రసాద్ గారి ఆస్తి, **పడమర :** రోడ్డు, **ఉత్తరం :** రోడ్డు.
పై నాలుగు హద్దుల మధ్య చ॥గ॥ 318.0లు లేక చ.మీ. 265.88ర్లు స్థిరాస్తి నివేశన స్థలమున్నూ, సదరు స్థలము అందలి యావత్తు యీజ్‌మెంట్ హక్కులతో సహాయున్నూ.

ఇట్లు
M. DURGA PRASAD, Advocate, B.Com, L.L.B.
Door No. 14-20-11, Guru Hotel, Eluru Lakulu, Gandhinagar, VIJAYAWADA-520 003.
తేది : 15-02-2026, స్థలం: విజయవాడ.

ప్రకటన

నా క్లయింటు, క్రాంతి బిల్డర్స్, కానూరు తరపున మేనేజింగ్ పార్టనర్: రాచమళ్ళ కొండలరావు గారి కుమారుడు రాచమళ్ళ సుధాకర్ గారి సంజాయిషీ పొంది తెలియజేయునది ఏమనగా,
ఈ దిగువ షెడ్యూలు ఆస్తిని దుర్భా మోహన రామ వెంకట సుబ్రహ్మణ్యం గారి తల్లిగారైన లక్ష్మీదేవమ్మ గారు ది.22-11-1982న చెన్ను లక్ష్మీ గారి వలన క్రయము పొంది, శ్రీ విజయవాడ సబ్ రిజిస్ట్రారు వారి కార్యాలయములో దస్తావేజు నెం.11559/1982 రుగా రిజిష్టరు చేయించుకొని, సదరు స్థలములో ఒక ఇంటిని నిర్మించుకొని అనుభవించుచూ, ది.18-03-2010న ఒక రిజిష్టర్డు వీలునామాను వ్రాసి, శ్రీ పటమట సబ్ రిజిస్ట్రారు వారి కార్యాలయములో నెం.63/2010రుగా రిజిష్టర్ చేయించి, అదే వారి ఆఖరి వీలునామాగా వుంచి, ది.01-01-2020న మరణించియున్నారు. సదరు వీలునామా ప్రకారము, ఆస్తి అంతయూ దుర్భా మోహన రామ వెంకట సుబ్రహ్మణ్యం గారికి సర్వ హక్కులతో సంక్రమించి, వారి అనుభవములోనే వుండియున్నది. వారు వారి యొక్క ఆస్తిని అమ్మచూపగా, నా క్లయంటు క్రయము పొందుటకుగాను నిర్ణయించుకుని అగ్రిమెంటు అయివున్నారు. కావున సదరాస్తిపై, ఎవరికి ఎటువంటి ఆక్షేపణలు గాని, వాజ్యములు గాని, వివాదములు గాని, మరియే యితర అభ్యంతరములు యున్ననూ, యీ ప్రకటన తేదీ నుండి 10 రోజులలోగా వ్రాతపూర్వకముగా రిజిష్టరు పోస్టు ద్వారా యీ క్రింది చిరునామాకు తెలియచేయవలెను. ఆపై వచ్చు క్లయిములు నా క్లయింటును బైండు చేయజాలవు.
షెడ్యూలు: యన్.టి.ఆర్. జిల్లా, శ్రీ పటమట సబ్ రిజిస్ట్రారు వారి యిలాకా, విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ ఏరియా, విజయవాడ, పటమట, శ్రీ వాసవి నగర్‌లోని, పటమట రీ.సర్వే నెం.143/4రు, యల్.పి. నెం. 2/79రు దాఖలా ప్లాటు నెం.40రు, మున్సిపల్ వార్డు నెం.31ఎ రు, పాత అసెస్మెంటు నెం.34891బి, దరిమిలా అసెస్మెంటు నెం. 268155, డోరు నెం.59ఎ-8/6-7రు దాఖలా చ.గ. 293.33లు స్థిరాస్తియున్నూ, సదరు స్థలములో గల గ్రౌండు, ఫస్టు ఫ్లోర్లుగా గల ఆర్.సి.సి. డాబా యింటితో సహా హద్దులు. **తూర్పు:** మున్సిపల్ కార్పొరేషన్ రోడ్డు- అ.40.0లు, **దక్షిణం:** ప్లాటు నెం.39రు దాఖలా ఆస్తి అ.66.0లు, **పడమర:** ప్లాటు నెం. 29రు దాఖలా ఆస్తి అ.40.0లు, **ఉత్తరం :** ప్లాటు నెం.41రు దాఖలా ఆస్తి- అ.66.0లు, యీ నాలుగు హద్దుల మధ్య చ.గ. 293.33లు లేక చ.మీ. 245.27ర్లుగా గల స్థిరాస్తి స్థలము మరియు అందలి ఆర్.సి.సి. డాబా యింటితో సహా మరియు అందలి యావత్తు యీజ్‌మెంటు హక్కులతో సహా.
ఇట్లు: V.V.P. DHARMA RAYUDU, Advocate
Lotus Land Mark, Sector-1, Road No: 6, House No: 38, Ayodhya Nagar, Vijayawada-520003. Cell: 9849964983

(c) eenadu

నందిగామ

•నందిగామ •జగ్గయ్యపేట

ముక్త్యాల సర్పంచి, కార్యదర్శులకు షోకాజ్ నోటీసులు

జగ్గయ్యపేట గ్రామీణం, న్యూస్‌టుడే: మండల పరిధి ముక్త్యాల గ్రామ పంచాయతీ నిధులను గ్రామ సర్పంచి షేక్ హస్సతున్, కార్యదర్శులు ఎన్.వి నరసింహారావు, శ్రీనివాస్‌రెడ్డిలు భారీగా పక్కదారి పట్టించినట్లు అధికారుల విచారణలో తేలింది. ఈ నేపథ్యంలో నిధులు దుర్వినియోగం చేసిన సర్పంచి, పంచాయతీ కార్యదర్శులకు జగ్గయ్యపేట డిప్యూటీ ఎంపీడీఓ పద్మావతి సోమవారం షోకాజ్ నోటీసులు జారీ చేశారు. నిధుల వ్యయంపై 15 రోజుల్లోగా వివరణ ఇవ్వాలని జిల్లా పంచాయతీ అధికారులు ఆదేశించినట్లు తెలిపారు.

మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి

నందిగామ గ్రామీణం: విద్యార్థులు మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని నందిగామకు చెందిన విశ్రాంత ఉద్యోగి ఏసుదాటి నరసింహారాజు కోరారు. మంగళవారం లింగాలపాడు పీఎంశ్రీ జడ్పీ ఉన్నత పాఠశాలలో మాదకద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలపై అవగాహన సదస్సు నిర్వహించారు.

జేఈఈ మెయిన్‌లో విద్యార్థుల సత్తా

నందిగామ గ్రామీణం, న్యూస్‌టుడే: జేఈఈ మెయిన్‌లో గ్రామీణ విద్యార్థులు సత్తా చాటారు. తల్లిదండ్రుల కలలను సాకారం చేసేలా మెరుగైన పర్సంటైల్ సాధించారు. ఐఐటీలో సీటు సాధించి ఇంజినీర్లుగా ఎదగడం తమ లక్ష్యంగా చెప్పారు.

సింగిరి నాగబృందశ్రీ | 98.92 | కంచికచర్ల
సింగిరి నాగేంద్ర, రత్నాలు | సమయాన్ని వృథా చేయకుండా నిత్యం 12గంటలు చదివాను.
ఐఐటీలో సీటు సాధించి ఉన్నత కొలువులో చేరడం

గర్నిడి లక్ష్మీగణేష్ | 96.71 | తక్కెళ్లపాడు
రాంబాబు, అరుణ | అధ్యాపకుల సూచనలు సంపూర్ణంగా పాటించి వారి మార్గదర్శకత్వంలో పర్సంటైల్ సాధించా.
సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా రాణిస్తా

నూతలపాటి వాహ్నిత | 97.52 | పెనుగంచిప్రోలు | వీరవరప్రసాద్, రమాదేవి
ఐఐటీలో సీటు, సివిల్స్ సాధించడం | నిత్యం 12 గంటలపాటు చదివాను. సమయాన్ని సద్వినియోగం చేసుకున్నా.

మత్తు పదార్థాలు లేని సమాజ నిర్మాణానికి కృషి

తిరువూరు: యువతను మత్తు పదార్థాల బారి నుంచి కాపాడేందుకు పోలీసు శాఖ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా 'డ్రగ్స్‌పై దండయాత్ర' సైకిల్ ర్యాలీ నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా మంగళవారం తిరువూరు నుంచి చింతలపాడు వరకు సాగిన ప్రదర్శనలో రాష్ట్ర ఆర్గానిక్ సర్టిఫికేషన్ అథారిటీ ఛైర్మన్ శావల దేవదత్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం చింతలపాడు గ్రామంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. మత్తు పదార్థాలను సమాజం నుంచి దూరంగా తరిమికొట్టాలని ఆయన సూచించారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM
జగ్గయ్యపేట: 8008 574714, నందిగామ: 8008 574713

నందిగామ గ్రామీణం, న్యూస్‌టుడే: స్పందన: ● లింగాలపాడు శివాలయం సెంటర్‌లో తాగునీటి పైపులైన్ లీకేజీని స్థానికులు పంచాయతీ కార్యదర్శి సీతారామిరెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆయన కార్మికులతో పైపులైన్‌కు మరమ్మతులు చేయించారు. ● రాఘవాపురం ఎస్సీ కాలనీలో వీధి దీపాలు వెలగడంలేదని స్థానికులు పంచాయతీ కార్యదర్శి ఆకుల హనుమంతరావు దృష్టికి తెచ్చారు. స్పందించిన ఆయన ఎల్ఈడీ దీపాలకు మరమ్మతులు చేయించారు. ● మాగల్లు కారంపల్లి బజారులో ప్రధాన రహదారి పక్కన మురుగు నీరు ప్రవహించడం లేదని స్థానికులు పంచాయతీ కార్యదర్శి కనకపూడి నాగరాణి దృష్టికి తీసుకొచ్చారు. స్పందించిన ఆమె పారిశుద్ధ్య కార్మికులను పంపి కాలువల్లో పూడిక తీయించారు.

టోల్ ప్లాజా చెంత.. ప్రమాదాల చింత

న్యూస్‌టుడే, కీసర(కంచికచర్ల)

కీసర టోల్ ప్లాజా ప్రాంతం రహదారి ప్రమాదాలకు నిలయంగా మారింది. గత ఏడాది ఆగస్టు 22న ఇక్కడ బోటు చేసుకున్న రోడ్డు ప్రమాదంలో తల్లీకొడుకులు మూడు నెలల బాలుడు మరణించారు. టోల్ ప్లాజా వద్ద తరచూ ప్రమాదాలు జరగడంపై ప్రజల నుంచి విమర్శలు వ్యక్తమవుతున్నా అధికారులు అందుకు కారణాలు అన్వేషించి పరిష్కరించడం లేదు. ప్రమాదం సంభవించిన సమయంలో తాత్కాలిక హడావుడి చేసే అధికారులు

రహదారికి అడ్డంగా నిలిపిన వాహనాలు

తరువాత భద్రతా చర్యలపై ఎటువంటి చర్యలు పాటించడం లేదు.

కారణాలు గుర్తించారు..

● టోల్ ప్లాజా కీసర గ్రామానికి ప్రధాన కూడలిలో ఉండడం ● కీసరకు రెండు వైపులా ఉన్న గుండెపల్లి, పెండ్యాల గ్రామాల వాహనాలు టోల్ ప్లాజా సమీపంలోనే కీసరకు చేరుకోవడం ● జాతీయ రహదారి మున్నేరు మీద నిర్మించిన వంతెనపై నుంచి వచ్చే వాహనాలు వేగంగా ఈ ప్రాంతానికి చేరుకోవడం ● జాతీయ రహదారిపై పాటించాల్సిన భద్రతా ప్రమాణాలు పాటించకపోవడం. ● టోల్ ప్లాజాకు ఇరువైపులా జాతీయ రహదారిపై ఆక్రమణలు ● ఇక్కడే ఇతర గ్రామాలకు వెళ్లే ఆటోలు, ప్రైవేటు వాహనాలు నిలిపి ఉండడం ● అన్ని వైపులనుంచి ఇష్టారీతిన వచ్చే వాహనాలు ఒక దానిని ఒకటి తప్పించే క్రమంలో ప్రమాదాలు జరుగుతున్నాయి.

ఉత్సాహంగా కొనసాగుతున్న కబడ్డీ పోటీలు

నందిగామ గ్రామీణం, న్యూస్‌టుడే: కేతవీరునిపాడు గ్రామంలో నందిగామ, జగ్గయ్యపేట నియోజకవర్గాల స్థాయి కబడ్డీ పోటీలు రసవత్తరంగా కొనసాగుతున్నాయి. కృష్ణా మిల్క్ యూనియన్ డైరెక్టర్ నెలకుదిటి నాగేశ్వరరావు సోమవారం రాత్రి ఈ పోటీలను ప్రారంభించారు. టోర్నమెంట్‌లో మొత్తం 28 జట్లు తలపడుతున్నాయి. తొలుత కేతవీరునిపాడు, లింగాలపాడు, కనకపూడి, కొనాయపాలెం గ్రామాల జట్లు పోటీపడగా, కేతవీరునిపాడు, కొనాయపాలెం జట్లు ముందంజలో ఉన్నాయి.

ట్రక్కులు అపహరించిన నిందితుడి అరెస్టు

చింతకాని, న్యూస్‌టుడే: ట్రాక్టర్ ట్రక్కులను అపహరించిన ఒకరిని ఖమ్మం జిల్లా చింతకాని పోలీసులు మంగళవారం పట్టుకున్నారు. వత్సవాయి మండలం దబ్బాకుపల్లికి చెందిన చింతల నరేంద్ర, ముక్త్యాల ఉదయ్‌కిరణ్ చింతకాని మండలం ప్రొద్దుటూరులో రెండు, కొణిజర్ల మండలం పెద్దమునగాలలో మరొకటి మొత్తం మూడు ట్రాక్టర్ ట్రక్కులను గత ఏడాది ఆగస్టులో అపహరించారు. నరేంద్రను గతంలోనే అదుపులోకి తీసుకొని రెండు ట్రక్కులను రికవరీ చేశారు. చింతకాని పోలీసులు నామవరం అడ్డరోడ్డు సమీపంలో మంగళవారం వాహనాలు తనిఖీ చేస్తుండగా అటుగా వెళ్తున్న ఉదయ్‌కిరణ్‌ను పట్టుకున్నారు. అనంతరం ట్రాక్టర్ ట్రక్కును రికవరీ చేసి నిందితుడిని కోర్టులో హాజరుపరచగా రిమాండ్ విధించినట్లు ఎస్సై తెలిపారు.

వైభవంగా అంకమ్మ, వీరభద్రస్వామి ప్రభోత్సవాలు

నందిగామ గ్రామీణం, న్యూస్‌టుడే: నందిగామ రెవెన్యూ కాలనీలో సోమవారం రాత్రి అంకమ్మతల్లి తిరునాళ్లలో అంకమ్మ తల్లి, భద్రకాళి సమేత వీరభద్రస్వామి ప్రభోత్సవాలు వైభవంగా నిర్వహించారు.

ప్రభపై అంకమ్మతల్లి

ప్రభోత్సవాన్ని భక్తులు దర్శించుకుని పూజలు చేశారు. హైదరాబాద్ యువ తుల భక్తులు కోలాటం బృందం ఆకట్టుకున్నారు. మంగళవారం అమ్మవారి పేరంటాలు, గొల్ల, బోనాల పాలపొంగళ్లు పట్టణంలోని పలు వీధుల్లో సాగిన సమర్పించారు.

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ

జగ్గయ్యపేట గ్రామీణం, న్యూస్‌టుడే: వత్సవాయి మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 15 మంది లబ్ధిదారులకు మంజూరైన రూ.6.73 లక్షల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య పంపిణీ చేశారు. పార్టీ మండల అధ్యక్షుడు వడ్లమూడి రాంబాబు నివాసంలో మంగళవారం లబ్ధిదారులకు అందజేశారు.

ప్రతిభ చూపిన విద్యార్థులకు సన్మానం

నందిగామ, న్యూస్‌టుడే: జేఈఈ మెయిన్స్‌లో ఎక్కువ పర్సంటైల్ సాధించిన నందిగామ చైతన్య ఎస్సీ క్యాంపస్ కళాశాల విద్యార్థులను ప్రభుత్వ విప్ తంగిరాల సౌమ్య సత్కరించారు. స్థానిక కాకాని నగర్‌లోని ఎమ్మెల్యే కార్యాలయంలో మంగళవారం 99.21 పర్సంటైల్‌తో పశ్చిమ ఎన్టీఆర్ జిల్లాలో ప్రథమ స్థానంలో నిలిచిన ఎమ్.మురళీధర్‌తో ద్వితీయ స్థానంలో ఎక్కువ పర్సంటైల్ సాధించిన ఎ.జయసాహిత్, జె.సాయిశ్రీకాంత్, వి.హేమంత్ సాయి, ఎస్.హనుమాన్‌రెడ్డి, ఎమ్.త్రావణి, జి.చైతన్య, బి.శ్రీనివాస్‌లకు శాలువా కప్పి సన్మానించారు. విజయవాడ విద్యాసంస్థల్లో చదువుతున్న విద్యార్థులు దీటుగా ఫలితాలు సాధించటంపై సౌమ్య సంతోషం వ్యక్తంచేశారు. కళాశాల యాజమాన్యం, అధ్యాపకుల మార్గదర్శకం వల్ల అత్యుత్తమ మార్కులు సాధించారని తెలిపారు. కళాశాల డైరెక్టర్ అమరనేని కార్తిక్ తదితరులు పాల్గొన్నారు.

సన్మానం పొందినవారితో ప్రభుత్వ విప్ తంగిరాల సౌమ్య

అన్నదాతలకు ఉత్తమ సేవలందించాలి

నందిగామ, న్యూస్‌టుడే: నందిగామ సహకార సంఘం ద్వారా రైతులకు ఉత్తమ సేవలందించాలని జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి తంబళ్లపల్లి రమాదేవి కోరారు. సొసైటీ అధ్యక్షుడిగా నియమితులైన కొట్టె హరికృష్ణ విజయవాడలో మంగళవారం మర్యాదపూర్వకంగా ఆమెను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. హరికృష్ణను ఆమె సత్కరించారు. జనసేనకు వచ్చిన అవకాశాన్ని రైతుల సేవకు వినియోగించాలని కోరారు. జుజ్జూరు సొసైటీ అధ్యక్షుడు షేక్ రహంతుల్లా, మార్కెట్ యార్డు డైరెక్టర్ సూర సత్యనారాయణ, జనసేన చందర్లపాడు మండల అధ్యక్షుడు వడ్డెల్లి సుధాకర్, నాయకులు మణికంఠ, కర్రి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

యూరియా నిల్వలు, పంపిణీపై సమీక్షా సమావేశం

జగ్గయ్యపేట గ్రామీణం, న్యూస్‌టుడే: పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో నియోజకవర్గంలోని సహకార సంఘాల ఛైర్మన్లు, వ్యవసాయశాఖ అధికారులతో ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య యూరియా నిల్వలు, పంపిణీపై మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య, సహకార సంఘాల ఛైర్మన్లు, వ్యవసాయశాఖ అధికారులు

ప్రాంతాలకు యూరియా పంపిణీ చేయాలని సూచించారు. రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని సరఫరా వ్యవస్థను మరింత బలోపేతం చేయాలన్నారు. సహకార సంఘాల ఛైర్మన్లు, వ్యవసాయశాఖ అధికారులు, మార్కెట్ యార్డ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. అందుబాటులో ఉన్న నిల్వలను నిరంతరం పర్యవేక్షిస్తూ, అవసరమైన

నదిలో వ్యర్థాలు.. భక్తులకు ఇబ్బందులు

జగ్గయ్యపేట గ్రామీణం, న్యూస్‌టుడే: ముక్త్యాల గ్రామంలో ఈ నెల 12 నుంచి ప్రారంభమైన శివరాత్రి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. మహాశివరాత్రి పర్వదినం రోజు కృష్ణానదిలో భక్తులు పుణ్యస్నానాలు ఆచరించి, పిండప్రదానాలు చేయడంతో నదిలోకి తీసుకెళ్లి, పిండప్రదానాలు చేయడంతో నదికలుషితమైంది. భక్తులు నదిలో విడిచిపెట్టిన వస్తువులు స్నానాలు చేసే ఘాట్ వద్ద ఉండటంతో దుర్వాసన వేస్తున్నాయి. దీంతో భక్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నదిలో వేసిన వస్తువుల ద్వారా చర్మవ్యాధులు వస్తాయని భక్తులు ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నదిలో ఉన్న వస్తువులను, వ్యర్థాలను తొలగించాలని భక్తులు కోరుతున్నారు.

★ శివరాత్రి ఉత్సవాలు ఈనెల 20 వరకు జరగనున్న నేపథ్యంలో శ్రీభవాని ముక్తేశ్వరస్వామిని దర్శించుకుని పుణ్య స్నానాలు ఆచరించడానికి భక్తులు వస్తుంటారు నదిలో భక్తుల రక్షణకు ఏర్పాటు చేసిన ఇనుప కంచెను తొలగించటంపై అధికారుల నిర్లక్ష్యం వ్యక్తమవుతోంది. రక్షణ కంచె తక్షణం ఏర్పాటుచేయాలని భక్తులు కోరుతున్నారు.

ముక్త్యాల ఘాట్ వద్ద పేరుకుపోయి ఇలా..

పొలాలను వదిలి.. ఇళ్లల్లో చొరబడి!

మండలంలోని మాగల్లు గ్రామంలో వానరాలు జనావాసాల్లోకి రావడంతో స్థానికులు ఆందోళనకు గురవుతున్నారు. పొలాల్లో మొక్కజొన్న పంట తినకుండా రైతులు తరుముతుండటంతో ఇవి ఊరిలోకి వచ్చి అందిన వస్తువులను, పరికరాలను, పెరటి తోటలను ధ్వంసం చేస్తున్నాయి. ఊరికి దూరంగా తరమాలని గ్రామస్థులు పంచాయతీ సిబ్బందిని కోరుతున్నారు. న్యూస్‌టుడే, నందిగామ గ్రామీణం

మాగల్లులో సంచరిస్తున్న వానరాలు

పెనుగంచిప్రోలు, న్యూస్‌టుడే: ఆరోగ్యవంతమైన సమాజ స్థాపనకు విద్యార్థి దశ నుంచే ఆరోగ్య సూత్రాలు పాటించాలని జాయింట్ కలెక్టర్ ఇలక్కియా తెలిపారు. పెనుగంచిప్రోలులోని కాకాని వెంకటరత్నం జిల్లా పరిషత్ పాఠశాలలో మంగళవారం విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను ఆమె పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ.. చిన్నారుల్లో రక్తహీనత, పోషక లోపాలకు నులిపురుగులు కారణమన్నారు. పరిశుభ్రంగా ఉండటం వల్ల అనారోగ్యాలు దరిచేరవని చెప్పారు. భోజనానికి ముందు, తర్వాత చేతులను శుభ్రం చేసుకోవాలని సూచించారు. మంచి ఆరోగ్య సూత్రాలు పాటించటం ద్వారా ఆరోగ్యంగా ఉండవచ్చని చెప్పారు. కష్టపడి చదువుకుని ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని ఆకాంక్షించారు. తహసీల్దారు శాంతలక్ష్మి, వైద్యాధికారిణి నాగరాణి, ప్రధానోపాధ్యాయురాలు జలజ తదితరులు పాల్గొన్నారు.

నందిగామ గ్రామీణం: మండలంలోని చందాపురం జడ్పీ

విద్యార్థి దశ నుంచే ఆరోగ్య సూత్రాలు పాటిస్తే మేలు

విద్యార్థినికి ఆల్బెండజోల్ మాత్రలు వేస్తున్న జాయింట్ కలెక్టర్ ఇలక్కియా

ఉన్నత పాఠశాలలో మంగళవారం స్థానిక సీహెచ్‌వో ప్రియాంక విద్యార్థులకు నులిపురుగుల నివారణకు ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. చేతుల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ప్రధానోపాధ్యాయుడు అట్లూరి రాజశేఖర్ విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. నులిపురుగుల నివారణ మాత్రల పంపిణీ

వీరులపాడు, అల్లూరు(వీరులపాడు), న్యూస్‌టుడే: పిల్లలకు సకాలంలో నులిపురుగుల నివారణ మాత్రలు ఇవ్వడం ద్వారా వారి శారీరక, మానసిక అభివృద్ధికి దోహదపడుతుందని ఆర్‌బీఎస్‌కే రాష్ట్ర నోడల్ అధికారి డా.శ్రీకాంత్ అన్నారు. జాతీయ నులిపురుగుల నిర్మూలన దినం సందర్భంగా మంగళవారం పాఠశాలల విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డా.శ్రీకాంత్ హాజరై జయంతి జడ్పీ పాఠశాల విద్యార్థులకు మాత్రలు పంపిణీ చేశారు. వీరులపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో 4,166 మంది, అల్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో 3,298మంది విద్యార్థులకు నులిపురుగుల నివారణ మందులు పంపిణీ చేసినట్లు వైద్యాధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు డా.దీపిక, డా.రవి రెడ్డి, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్ఎమ్‌లు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

ఏకీకృత డిజిటల్ యాప్‌పై అవగాహన

జగ్గయ్యపేట గ్రామీణం, న్యూస్‌టుడే: రైతులకు అవసరమైన వాతావరణ వివరాలు, మార్కెట్ ధరలు, ప్రభుత్వ పథకాల సమాచారం మొత్తం ఒకేచోట అందించాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ఏకీకృత డిజిటల్ ప్లాట్‌ఫాం అందుబాటులోకి తెచ్చిందని కేవీకే ప్రోగ్రాం కో ఆర్డినేటర్ ఉదయబాస్కర్ తెలిపారు. భారత్ విస్తార్ జాతీయస్థాయి ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని గరికపాడు కేవీకే రావు కృషి విజ్ఞాన కేంద్రంలో మంగళవారం నిర్వహించారు. ఈ నూతన సాంకేతిక వేదికను ప్రారంభించిన కృత్రిమ మేధ యాప్‌పై అవగాహన కల్పించారు. రైతులు, శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

ముగిసిన సంగమేశ్వరస్వామి కల్యాణ మహోత్సవాలు

నందిగామ గ్రామీణం, న్యూస్‌టుడే: దాములూరు శివారు కూడలిలో నాలుగు రోజులుగా నిర్వహిస్తున్న సంగమేశ్వరస్వామి కల్యాణ మహోత్సవాలు మంగళవారం రాత్రి ముగిశాయి. వైరా, కట్లేరుల్లో అర్చకుడు దాములూరి శ్రీనివాసశర్మ ఆధ్వర్యంలో వండీశ్వర స్వామి, త్రిశూల స్నానం చేశారు. వసంతోత్సవం నిర్వహించారు. పార్వతీ మాతకు పుష్పాలంకరణ, కుంకుమార్చన చేశారు. రుద్ర హోమం, శ్రీసూక్త, దుర్గాసూక్త హోమాలు నిర్వహించారు. ఆలయ ఛైర్మన్ గింజుపల్లి శ్రీనివాసరావు దంపతులు, ఈవో నారాయణ నరసింహమూర్తి పూర్ణాహుతి ద్రవ్యాలను సమర్పించారు. పుష్పాలంకరణలోని సంగమేశ్వరస్వామి మూలమూర్తిని భక్తులు దర్శించుకుని తరించారు.

పూర్ణాహుతి ద్రవ్యాలు సమర్పిస్తున్న ఛైర్మన్ శ్రీనివాసరావు దంపతులు, ఈవో నరసింహమూర్తి

జగ్గయ్యపేట గ్రామీణం, న్యూస్‌టుడే: ముక్త్యాలలోని కృష్ణానదీ తీరంలో ఉన్న శ్రీభవాని ముక్తేశ్వరస్వామి దేవస్థానంలో మహాశివరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. స్వామి అమ్మవారికి కుంకుమార్చన, ధ్వజారోహణ నిర్వహించారు. మంగళవారం పూర్ణాహుతి, పుట్టాలు దంచుట, వసంతసేవ కార్యక్రమాలు చేపట్టారు. ఆలయ కార్యనిర్వహణాధికారి కానూరి సురేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

నిర్లక్ష్యపు నీడలో ఎస్సీ కాలనీ..!

అల్లూరు(వీరులపాడు), న్యూస్‌టుడే

అల్లూరు ఎస్సీ కాలనీలో మురుగు నీరు పారక ఎక్కడికక్కడ మురుగు తిష్ట వేయడంతో దుర్గంధం వెదజల్లుతోందని స్థానికులు వాపోతున్నారు. కాలువల్లో మురుగు బయటకు వెళ్లే అవకాశం లేక నీరు నిల్వ ఉండి దోమలు, ఈగలు వృద్ధి చెందుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. కాలనీలోని సీసీ రోడ్డుకు ఆనుకొని ఉన్న కాలువను పూడ్చి కొందరు బడ్డీ కొట్టు ఏర్పాటు చేయడం, సీసీ రోడ్డుకు అంతర్గత రోడ్డు అనుసంధానమైన చోట కనీసం తూములు వేయకపోవడంతో ఈ పరిస్థితి తలెత్తిందని చెబుతున్నారు. వర్షాలు పడినప్పుడు కాలువలు పొంగి మురుగు ఇళ్లలోకి చేరుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాలువపై నిర్మించిన బడ్డీ కొట్టును తొలగించాలని, పూడిక తీయించి మురుగు సమస్యను పరిష్కరించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

కాలువ పూడ్చి ఏర్పాటు చేసిన బడ్డీ కొట్టు

ఎడ్ల పూటీ లాగు పోటీల్లో విజేత పెద్దపూడి జత

నందిగామ గ్రామీణం, న్యూస్‌టుడే: దాములూరులో మంగళవారం రాత్రి తెలుగు రాష్ట్రాల స్థాయి ఎడ్ల పూటీ లాగు పోటీలు రసవత్తరంగా సాగాయి. తొలిరోజు సీనియర్ విభాగంలో రెండు క్వింటాళ్ల బరువున్న పూటీని పది నిమిషాల్లో లాగేలా నిర్వహించిన పోటీల్లో బాపట్ల జిల్లా అమృతలూరు మండలం పెద్దపూడి గ్రామానికి చెందిన ఆళ్ల హరికృష్ణచౌదరి ఎడ్ల జత 4842 అడుగుల దూరం లాగి ప్రథమంగా నిలిచాయి. బాపట్ల జిల్లా చెరుకుపల్లి మండలం పగడవారిపాలేనికి చెందిన కంచం వేదశ్రీహర్షరెడ్డి ఎడ్లజత 4465 అడుగుల దూరం లాగి ద్వితీయ స్థానం, బాపట్ల జిల్లా చిన్నగంజాం మండలం ఆవులవారి కొత్తపాలెం గ్రామానికి చెందిన గోగినేని జ్ఞానసాయి చౌదరి ఎడ్లజత 4451 అడుగులు లాగి తృతీయస్థానంలో నిలిచాయి. కృష్ణా జిల్లా తోట్లవల్లూరు మండలం కలివాగారిపాలెం గ్రామానికి చెందిన కల్లం విజయలక్ష్మి ఎడ్ల జత

ప్రథమంగా నిలిచిన పెద్దపూడి ఎడ్ల జత

'షూటింగ్ బాల్'లో ప్రతిభ

గని ఆత్కూరు(కంచికచర్ల), న్యూస్‌టుడే: ఈ నెల 14, 15 తేదీల్లో గుంటూరులో నిర్వహించిన రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ షూటింగ్ బాల్ ఛాంపియన్‌షిప్‌లో తమ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారని గని ఆత్కూరు జడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఓంకార్ తెలిపారు. ఎన్టీఆర్ జిల్లా బాలికల జట్టులో పాఠశాల నుంచి ప్రాతినిధ్యం వహించిన ఎస్.కె.అనీషా రూపియా, ఎం.ప్రతిభ, ఎ.ప్రసన్న, వై.మధుబాల ఉత్తమ ప్రతిభ కనబరచగా, బాలుర జట్టులో ఎం.అజయ్, ఎస్.గణేష్, ఎస్.కె.అఫ్రర్, యు.జగన్ తమ ఉత్తమ ఆటతో జట్టు కాంస్య పతకం సాధించడంలో దోహదపడ్డారని తెలిపారు. ప్రతిభ చాటిన విద్యార్థులను మంగళవారం పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రత్యేకంగా అభినందించారు. పీడీ మోహనలక్ష్మి, ఉపాధ్యాయులు సుజాత, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రతిభ కనబరిచిన విద్యార్థులతో ప్రధానోపాధ్యాయుడు ఓంకార్, పీడీ మోహనలక్ష్మి తదితరులు

మాజీ సైనికులకు మంత్రి సన్మానం

నందిగామ, న్యూస్‌టుడే: విజయవాడలో వెటరన్స్ డే సందర్భంగా మాజీ సైనికులను రాష్ట్ర హోం మంత్రి అనిత సన్మానించారు. మంగళవారం ఓ ప్రైవేట్ హోటల్‌లో జరిగిన వెటరన్స్ డే కార్యక్రమంలో నందిగామ మాజీ సైనికుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు వాసిరెడ్డి ప్రసాదు, మాజీ సైనికులు హోంమంత్రికి బిలేగళ్లతో ఆమె చిత్రపటాన్ని బహూకరించి సత్కరించారు. మాజీ సైనికులకు జ్ఞాపిక ఇచ్చి ఆమె వారిని సన్మానించారు. మాజీ సైనికులు ఎల్.కోటేశ్వరరావు, సీహెచ్ హరికృష్ణ, శంకరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మంత్రి అనితకు చిత్రపటం ఇస్తున్న మాజీ సైనికులు

వినియోగంలోకి తెస్తే మేలు

గండేపల్లి(కంచికచర్ల), న్యూస్‌టుడే: పలు రకాల ప్రభుత్వ సేవలను గ్రామ స్థాయిలోనే అందించాలనే గత వైకాపా ప్రభుత్వం గ్రామ సచివాలయ వ్యవస్థను ప్రవేశపెట్టింది. మహాత్మా గాంధీ ఉపాధి హామీ పథకం నిధులతో సచివాలయ భవనాల నిర్మాణం చేపట్టింది. గండేపల్లిలో నిర్మాణం చేపట్టిన గ్రామ సచివాలయ భవన నిర్మాణం దాదాపు పూర్తయింది. నిర్మాణం చేసే గుత్తేదారులకు బిల్లులు ప్రభుత్వం సకాలంలో నిధులు విడుదల చేయకపోవడంతో భవనాలలో కొంత పనులు ఆగిపోయాయి. దీంతో సచివాలయాన్ని స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో నిర్వహిస్తున్నారు. కూటమి ప్రభుత్వమైనా భవన నిర్మాణం పూర్తి చేసేందుకు అవసరమైన నిధులు కేటాయించి భవనాన్ని వినియోగంలోకి తీసుకురావాలని గ్రామస్థులు కోరుతున్నారు.

జీతాలు పెంపుపై 108 ఉద్యోగుల హర్షం

నందిగామ, న్యూస్‌టుడే: రాష్ట్రంలో 108 అంబులెన్స్ సర్వీసుల ఉద్యోగుల జీతాలు పెంచటంతో టీఎస్‌టీయూసీ, తెలుగునాడు 108 వర్కర్స్ యూనియన్ ప్రతినిధులు నిర్వహణ సంస్థ భవ్య హెల్త్ సర్వీసెస్ యాజమాన్యాన్ని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. 108 ఉద్యోగులకు ఆటోమేటిక్ శాలరీ అప్‌గ్రెడేషన్ విధానాన్ని అమలు చేయటంపై సంఘ నాయకులు సంతోషం వ్యక్తం చేశారు. విజయవాడలో మంగళవారం సంస్థ ఎమ్.డి.నరేన్‌ను టీఎన్‌టీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు గొట్టిముక్కల రఘురామరాజు, తెలుగునాడు 108 వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు పూజారి నాగరాజు, ప్రధాన కార్యదర్శి యుగంధర్, ఉపాధ్యక్షుడు ప్రశాంత్ తదితరులు కలిసి సత్కరించారు.

ఎండీ నరేన్‌ను సన్మానిస్తున్న 108 ఉద్యోగుల సంఘ నాయకులు

తిరునాళ్ల ఆదాయం రూ.12.08 లక్షలు

నందిగామ గ్రామీణం, న్యూస్‌టుడే: కూడలి పార్వతీ సమేత సంగమేశ్వరస్వామి దేవాలయంలో మహాశివరాత్రి తిరునాళ్లను పురస్కరించుకుని భక్తులు సమర్పించిన కానుకలను మంగళవారం లెక్కించారు. దేవాలయ ఈవో ఎన్.నరసింహమూర్తి, ఛైర్మన్ గింజుపల్లి శ్రీనివాసరావు, ధర్మకర్తల మండలి సభ్యుల సమక్షంలో కానుకలను లెక్కించారు. కానుకల ద్వారా రూ.4,58,994, పూజ టిక్కెట్ల విక్రయం ద్వారా రూ.5,77,140, స్వామివారి కల్యాణ కానుకల ద్వారా రూ.12,143, అన్నప్రసాదం విరాళం ద్వారా రూ.లడ్డు, కొబ్బరిచిప్పల వేలం ద్వారా రూ.60,500 ఆదాయం వచ్చిందన్నారు.

స్వామి వారి కానుకలు రూ.5.92 లక్షలు

జగ్గయ్యపేట గ్రామీణం, న్యూస్‌టుడే: మండల పరిధి ముక్త్యాలలోని శ్రీకోటిలింగ మహాక్షేత్ర హుండీలను మంగళవారం లెక్కించారు. పూజా రుసుము, లడ్డు అమ్మకం, విరాళాలు, అభిషేక రుసుము ద్వారా రూ.5.92 లక్షల ఆదాయం సమకూరిందని ఈవో సాయగారి నాగేశ్వరరావు తెలిపారు. అన్నదాన హుండీ ద్వారా రూ.52 వేలు, స్వామివారి హుండీ ద్వారా రూ.3.89 లక్షలు, ఇతర విరాళాల ద్వారా మొత్తం రూ.5.92 లక్షలు వచ్చాయన్నారు.

అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు టిప్పర్లు పట్టివేత

తల్లాడ: అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు టిప్పర్లను మంగళవారం తెల్లవారుజామున ఖమ్మం జిల్లా తల్లాడ పోలీసులు పట్టుకున్నట్లు ఎస్సై ఎన్.వెంకటకృష్ణ తెలిపారు. ఏపీలోని ఎన్టీఆర్ జిల్లా చందర్లపాడు మండలం కస్సాబాద్ నుంచి అక్రమంగా ఇసుక వీటిని కల్లూరు ప్రాంతానికి తరలిస్తుండగా తల్లాడ పోలీస్ స్టేషన్ వద్ద పట్టుకున్నారు. ఇసుక వ్యాపారులు, డ్రైవర్లు అయిన ఆర్.నరసింహారావు, ఎం.సుబ్బారెడ్డి, ఎం.నరసింహారావు, ఇ.రమేష్, బి.వీరకుమార్, ఎం.శ్రీనివాస్‌పై కేసులు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

సత్తుపల్లి: కంచికచర్ల మండలం నుంచి సత్తుపల్లి వైపు ఇసుక తరలిస్తుండగా గంగారం రింగ్ సెంటర్‌లోని చెక్‌పోస్ట్ వద్ద ఒక టిప్పర్‌ను, మరో ట్రాక్టర్‌ను మంగళవారం పోలీసులు పట్టుకుని స్టేషన్‌కు తరలించి సీజ్ చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ఉద్యోగుల సమ్మె.. మూతపడ్డ సహకార సంఘాలు

నందిగామ, పెనుగంచిప్రోలు: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సహకార సంఘాల ఉద్యోగులు రెండు రోజులుగా సమ్మె చేస్తున్నారు. దీంతో సంఘాల పరిధిలోని రైతులు, ఖాతాదారులు, డ్వాక్రా మహిళలు ఇబ్బందులు పడుతున్నారు. నందిగామ, జగ్గయ్యపేట నియోజకవర్గాల పరిధిలోని అన్ని సొసైటీల ఉద్యోగులు సోమవారం నుంచి సమ్మెలోకి వెళ్లారు. దీంతో ఆయా సంఘాల పరిధిలో ఎరువుల విక్రయాలు, రుణాల మంజూరు, వసూళ్ల ప్రక్రియ నిలిచిపోయాయి. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న రెండు పీఆర్సీ బకాయిలను విడుదల చేయాలని, జీతాల ద్యూటీ పద్ధతిలో చెల్లించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. 2019 తర్వాత సంఘాల్లో చేరిన కంప్యూటర్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని కోరుతున్నారు. సమస్యలను ప్రభుత్వం పరిష్కరించే వరకు సమ్మె విరమించేది లేదని ఉద్యోగుల జేఏసీ రాష్ట్ర నాయకుడు కొండలరావు చెప్పారు.

రైతులు పేర్లు నమోదు చేసుకోవాలి

పెనుగంచిప్రోలు, న్యూస్‌టుడే: తిరుపతమ్మ అమ్మవారి చిన్న తిరునాళ్ల సందర్భంగా పసుపు కుంకుమ బండ్లు కట్టే రైతులు పేర్లు నమోదు చేసుకోవాలని ఎస్సై అర్జున్ కోరారు. పోలీస్ స్టేషన్‌లో ఆయన మాట్లాడారు. ఈ నెల 26వ తేదీ సాయంత్రం ఐదు గంటల్లోపు పూర్తి వివరాలతో పోలీస్ స్టేషన్‌లో పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. పుట్టింటి పసుపు కుంకుమ సమర్పించే రోజున బండ్లకు ముందు డీజేలకు అనుమతి లేదన్నారు. లైటింగ్ ఏర్పాటు చేసే ట్రాక్టర్లు, మైక్ అనుమతి కోసం అన్ని వివరాలు ఇవ్వాలన్నారు. అన్ని పరిశీలించాకే అనుమతి ఇస్తామన్నారు.

రైతులకు ఇబ్బందులు రానీయొద్దు

జగ్గయ్యపేట గ్రామీణం: నందిగామ పీఏసీఎస్ ఛైర్మన్ హరికృష్ణ ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ జిల్లా జనసేన అధ్యక్షుడు ఉదయభానును మర్యాద పూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని సూచించారు.

జగ్గయ్యపేటలో ఇంజినీరింగ్ కాలేజీకు సిబ్బంది కావలెను.
» సెక్యూరిటీ వార్డన్
» సివిల్ ల్యాబ్ అసిస్టెంట్
» స్పోకెన్ ఇంగ్లిష్ ట్రైనర్
» నందిగామ నుండి డ్రైవర్
✆ 91212 14607

(c) eenadu

విజయవాడ పశ్చిమ

విద్యుత్తు సరఫరాకు అంతరాయం నేడు

భవానీపురం: విద్యుత్తు లైన్ల మరమ్మతుల కారణంగా భవానీపురం సబ్‌స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో బుధవారం రెండు గంటల పాటు సరఫరాను నిలిపి వేస్తున్నట్లు ఈఈ పి.రవీంద్రబాబు ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్టీసీ వర్క్‌షాపురోడ్డు, డాల్ఫిన్ బార్ రోడ్డు, కోళ్ల ఫారం రోడ్డు, అరుణాచలం వీధి, చర్చి రోడ్డు, గాంధీ బొమ్మ రోడ్డు తదితర ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి 10 గంటల వరకు సరఫరా ఉండదని పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM
విజయవాడ వన్‌టౌన్ : 90320 99986

స్పందన: గొల్లపాలెంగట్టులోని పొట్టి శ్రీరాములు కళాశాల ఎదురు వీధిలోని మురుగు కాలువలో పూడిక పేరుకుందని స్థానికులు మేమున్నాం మీకు తోడుగాకు సమాచారం ఇచ్చారు. దీనికి స్పందించిన పారిశుద్ధ్య అధికారులు కార్మికులతో పూడిక తీయించారు. – న్యూస్‌టుడే, విజయవాడ వన్‌టౌన్

? కేవల్ రావు నగర్ కర్మెల్ చర్చి ఎదురు వీధిలోని మురుగు కాలువలో పూడిక పేరుకుంది. - **రఘురామ్, స్థానికుడు.**
✔ కార్మికులతో పూడిక తీయిస్తాం.- **వేణుగోపాల్, స్థానిక శానిటరీ అధికారి**
? ఎర్రకట్ట పైవంతెన సీఎస్ఐ చర్చి ఎదురు పబ్లిక్ టాయిలెట్స్ ఆవరణలో రోడ్డుపై చెత్త పేరుకుంది. - **రాజేష్, స్థానికుడు**
✔ చెత్త తరలించేందుకు చర్యలు తీసుకుంటాం. - కృష్ణ, స్థానిక శానిటరీ అధికారి. – న్యూస్‌టుడే, విజయవాడ వన్‌టౌన్

అంతర్జాతీయ స్థాయి వెటరన్ టీటీలో ప్రతిభ

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: నగరానికి చెందిన వెటరన్ టేబుల్ టెన్నిస్ క్రీడాకారులు కె.జయరామ్, వైవీ ప్రదీప్ అంతర్జాతీయ స్థాయి పోటీలో సత్తా చాటారు. కె.జయరామ్ 60+ సింగిల్స్‌లో రజతం, డబుల్స్‌లో పసిడి, మిక్స్‌డ్‌లో కాంస్య పతకాలు కైవసం చేసుకోగా.. వైవీ ప్రదీప్ 45+ సింగిల్స్‌లో రజతం, డబుల్స్‌లో పసిడి పతకాలు సొంతం చేసుకున్నారు.

దారంతా ఆక్రమణలు.. అడ్డదిడ్డంగా వాహనాలు

విజయవాడ వన్‌టౌన్, న్యూస్‌టుడే

తారాపేటలో రోడ్డుపైనే నిలిపిన వాహనాలు

రాకపోకలకు తప్పని ఇబ్బందులు

పాతబస్తీ పేరు చెప్పగానే వాహన చోదకులతో పాటు పాదచారులకు గుర్తుకు వచ్చేది ట్రాఫిక్ సమస్య. ఇరుకు రోడ్లతో ఆక్రమణలతో ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. టోకు, రిటైల్ వ్యాపార కూడలి ప్రాంతాలైన సామారంగం చౌకీ, కాళేశ్వర రావు మార్కెట్, జమ్మిదొడ్డి కూడలి, తారాపేట ప్రాంతాల్లో వివిధ అవసరాల నిమిత్తం నిత్యం వేలాది మంది వస్తుంటారు. వారంతా తమ వాహనాలను రోడ్డుకు ఇరువైపులా పార్క్ చేస్తుంటారు. కొందరు దుకాణదారులు రోడ్డును ఆక్రమించి వ్యాపారాలు చేస్తున్నారు. దీని వల్ల ట్రాఫిక్ సమస్యలు తప్పడం లేదని వినియోగదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నియంత్రించాల్సిన ట్రాఫిక్ పోలీసులు నామమాత్రంగా కేసులు రాసి వదిలేస్తున్నారు. వాటిని అరికట్టాల్సిన కార్పొరేషన్ అధికారులు నిబంధనలకు అతిక్రమించి ఆక్రమణదారుల నుంచి నగదు వసూలు చేస్తూ చేతులు దులిపేసుకుంటున్నారు. దీంతో ఆయా మార్గాలలో రాకపోకలు సాగించే వారు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.

ఏయే ప్రాంతాల్లో..

కేఆర్ మార్కెట్, తారాపేట, నెహ్రూబొమ్మ కూడలి, వించిపేట, నైజాంగేటు, గణపతిరావు రోడ్డు, సామారంగం చౌకీ, బ్రాహ్మణవీధి, చిట్టినగర్ ప్రధాన రహదారి మార్గం, ఎర్రకట్టపై వంతెన మార్గం, రథం సెంటర్, వినాయకుడి ఆలయం ప్రాంతాలు.

★ కార్పొరేషన్ అధికారులు పార్కింగ్ పేరిట గుత్తేదారులకు పలు ప్రాంతాలను లీజుకు ఇస్తున్నారు. ఇదే అదునుగా భావించి లీజుకు తీసుకున్న గుత్తేదారులు పార్కింగ్ ప్రదేశాల్లో అధిక రుసుము వసూలు చేస్తున్నారని వాహన చోదకులు వాపోతున్నారు. నడిచేందుకు కూడా దారి ఉండదని స్థానికులు చెబుతున్నారు.

★ సమస్యలను చక్కదిద్దాల్సిన కార్పొరేషన్ అధికారులు తమకు పట్టనట్టు వ్యవహరిస్తున్నారు. పోలీసులు అపరాధ రుసుములతో సరి పెడుతున్నారని ప్రజలు వాపోతున్నారు. అధికారులు ట్రాఫిక్ సమస్యలు పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

క్రీడాకారుల ప్రతిభకు వన్నె తెచ్చేందుకు కృషి

విజేతలతో కలెక్టర్ లక్ష్మీశ, పక్కనే డీఎస్‌డీవో కోటేశ్వరరావు తదితరులు

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: క్రీడాకారుల ప్రతిభకు వన్నె తెచ్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని కలెక్టర్ జి.లక్ష్మీశ పేర్కొన్నారు. జిల్లా క్రీడాప్రాధికార సంస్థ (డీఎస్ఏ) ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక ఐజీఎంసీ స్టేడియంలో నిర్వహించిన శాప్ లీగ్ జిల్లా స్థాయి చెస్ పోటీలు, జిల్లా జట్ల ఎంపిక ముగింపు సభకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లా స్థాయిలో ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 21, 22వ తేదీల్లో తిరుపతిలో జరిగే రాష్ట్ర స్థాయి చెస్ టోర్నీలో పాల్గొంటారని తెలిపారు. అక్కడ కూడా జిల్లా క్రీడాకారులు పతకాలు సాధించాలని ఆకాంక్షించారు.

'పది' ఫలితాల్లో జిల్లాను అగ్రగామిగా నిలుపుదాం

సూర్యారావుపేట, న్యూస్‌టుడే : పదో తరగతి పరీక్షల కోసం రూపొందించిన వంద రోజుల ప్రణాళికను పక్కాగా అమలు చేసి ఫలితాల్లో జిల్లాను అగ్రగామిగా నిలిపేందుకు కృషి చేయాలని కలెక్టర్ జి.లక్ష్మీశ సూచించారు. మంగళవారం సూర్యారావుపేటలోని కర్నాటి రామ్మోహనరావు స్కూలును ఆయన పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడారు. గణితం, సైన్సు, సాంఘిక శాస్త్రం పాఠ్యాంశాలకు సంబంధించి పలు ప్రశ్నలు వేసి.. సమాధానాలు రాబట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో ప్రభుత్వ పాఠశాలల్లో 11,200 మంది, ప్రైవేట్ పాఠశాలల నుంచి 16,000 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలకు సన్నద్ధం అవుతున్నారని తెలిపారు.

మైనార్టీలకు అండగా ప్రభుత్వం

ముస్లిం మహిళలకు కిట్లు పంపిణీ చేస్తున్న ఎంపీ కేశినేని శివనాథ్ తదితరులు

విజయవాడ వన్‌టౌన్, న్యూస్‌టుడే: మైనార్టీలకు అండగా కూటమి ప్రభుత్వం ఉంటుందని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని) అన్నారు. మంగళవారం పాతబస్తీ ముసాఫిర్‌ఖానాలో తెదేపా రాష్ట్ర మైనార్టీ విభాగం ప్రధాన కార్యదర్శి ఎండీ ఫతుల్లా సారథ్యంలో పేదలకు రూ.2500 విలువ గల రేషన్ కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మర్కజ్ ఇమామ్ ఇబ్నేబాజ్ ఎడ్యుకేషనల్ అండ్ వెల్ఫేర్ సొసైటీ ద్వారా ఈ సహకారం చేస్తున్నామని, వారికి ధన్యవాదాలు తెలిపారు. సేవలను మరింతగా విస్తరించాలని కోరారు. విజయవాడ ఆటోమొబైల్ రంగంలో ముస్లిం సోదరుల పాత్ర కీలకంగా ఉందని, నగరాభివృద్ధిలో వారి పాత్ర మరువలేనిదని తెలిపారు. కార్యక్రమంలో సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.

శుభ్రతతో నులి పురుగుల సమస్య దూరం

మందు వేస్తున్న అదనపు కమిషనర్ చంద్రశేఖర్

నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తే.. నులి పురుగుల సమస్య నుంచి దూరంగా ఉండవచ్చని నగర పాలక సంస్థ అదనపు కమిషనర్ డి.చంద్రశేఖర్ పేర్కొన్నారు. జాతీయ నులి పురుగుల నివారణ దినం సందర్భంగా మంగళవారం పటమటలోని కె.బి.సి. ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు మాత్రలు పంపిణీ చేశారు. చంద్రశేఖర్ మాట్లాడుతూ.. చేతులు గోళ్లు తీయకపోవడం, ఆహారం తినేటపుడు చేతులు శుభ్రంగా కడుక్కోకపోవడం తదితర కారణాలతో నులి పురుగులు శరీరంలోకి ప్రవేశిస్తాయని తెలిపారు. అవి శరీరంలోకి వచ్చాక అన్ని విధాలా నష్టం కలిగిస్తాయని పేర్కొన్నారు. సీఎంవోహెచ్ కె.అర్జునరావు, వైద్యులు గోపాలనాయక్, బి.సోమశేఖరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

యువతుల్లో నైపుణ్యాలు పెంచడమే లక్ష్యం

రాఘవయ్యపార్క్ కూడలి(కృష్ణలంక), న్యూస్‌టుడే : యువతుల్లో క్రీడాశక్తి, నైపుణ్యాలు పెంచడమే లక్ష్యమని క్రీడా పోటీల నిర్వహణ కమిటీ కన్వీనర్ కె.స్వరూపరాణి అన్నారు. 'యువతుల క్రీడా వికాసం-గ్రాండ్ స్ప్రింట్ స్పోర్ట్స్-2026' పేరుతో మహిళా సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో నగరంలోని శ్రీదుర్గా మల్లేశ్వర సిద్ధార్థ మహిళా కళాశాలలో ఈ నెల 19, 20వ తేదీల్లో డిగ్రీ, ఇంజినీరింగ్ విద్యార్థినులకు క్రీడా పోటీలు నిర్వహిస్తున్నారు. దీనికి సంబంధించిన ప్రచార పత్రాలను మంగళవారం బాలోత్సవ భవన్‌లో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. క్రీడల్లో పాల్గొనేందుకు యువతులు అనేక అడ్డంకులు ఎదుర్కొంటున్నారని తెలిపారు.

కనులపండువగా నగరోత్సవం

నగరోత్సవంలో ఈవో నటరాజన్ షణ్ముఖం దంపతులు, రుత్వికులు

విద్యాధరపురం, న్యూస్‌టుడే: మహాశివ రాత్రి మహోత్సవాల ముగింపు సందర్భంగా కల్యాణమూర్తులు శ్రీభ్రమరాంబ మల్లేశ్వరస్వామి దేవస్థానంలో భ్రమరాంబ, మల్లేశ్వరస్వామి, భద్రకాళి సమేత వీరభద్రస్వామి, గంగా, పార్వతీ సమేత వసంత మల్లికార్జున స్వామి వార్ల ఉత్సవ మూర్తులను ఎద్దుల బండిపై మంగళవారం కనులపండువగా నగరోత్సవం నిర్వహించారు. వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య ఆలయ ప్రధాన అర్చకులు రుత్వికులు సాయంత్రం ద్వాదశ ప్రదక్షిణాలు, మంత్రపుష్పం, చతుర్వేద స్వస్తి, ఆశీర్వచనం అనంతరం ప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో జిల్లా ఏసీ నటరాజన్ షణ్ముఖం, వసంత మల్లికార్జున స్వామి ఈవో శ్రీనివాసరెడ్డి, గుంటుపల్లి చైర్మన్ సుదర్శనరావు, ఆలయ అర్చకులు నాగరాజశర్మ, రామచంద్రశర్మ, సాయికృష్ణ శర్మ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల కుటుంబాలకు చెక్కుల అందజేత

బాధిత కుటుంబానికి చెక్కు అందజేస్తున్న డీఆర్ఎం మోహిత్ సోనాకియా

రైల్వేస్టేషన్, న్యూస్‌టుడే: ఇటీవల ప్రమాదంలో మృతి చెందిన నలుగురు రైల్వే ఉద్యోగుల కుటుంబాలకు రైల్వే శాఖ సంయుక్తంగా అమలు చేస్తున్న ఎస్‌బీఐ శాలరీ ప్యాకేజీలో భాగంగా ఒక్కొక్కరికి రూ.కోటి చొప్పున ప్రమాద బీమా చెక్కులు మంగళవారం డీఆర్ఎం మోహిత్ సోనాకియా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అనుకోని ప్రమాదంలో మరణించిన కుటుంబాలకు ఎస్‌బీఐ శాలరీ ప్యాకేజీ అండగా నిలుస్తుందన్నారు. నగదును భవిష్యత్తు అవసరాల దృష్ట్యా పొదుపుగా వాడాలని సూచించారు. కార్యక్రమంలో ఏడీఆర్ఎం ఎడ్విన్, ఎస్‌బీఐ డీజీఎం ప్రమోద్‌కుమార్, ఎస్‌బీఐ మేనేజరు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రిజర్వాయర్ నిర్మాణ పనులు వేగవంతం

నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: రాజీగారితోటలో చేపట్టిన రిజర్వాయర్ నిర్మాణ పనులు వేగవంతం చేయాలని నగర పాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర పేర్కొన్నారు. రిజర్వాయర్ పనులను కమిషనర్ మంగళవారం పరిశీలించారు. ధ్యానచంద్ర మాట్లాడుతూ.. పనులు త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. కృష్ణలంక జాతీయ రహదారి ప్రాంతంలో పచ్చదనం పెంపొందించాలని పేర్కొన్నారు. అన్న క్యాంటీన్‌ను పరిశీలించి పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. జోనల్ కమిషనర్ కె.షమ్మీ, సీఎంహెచ్‌ఓ కె.అర్జునరావు, ఈఈ సామ్రాజ్యం తదితరులు పాల్గొన్నారు. ★ నగర ప్రజల ఆర్థికాభివృద్ధికి యూసీడీ విభాగం చర్యలు చేపట్టాలని కమిషనర్ ధ్యానచంద్ర పేర్కొన్నారు. నగర పాలక సంస్థ కార్యాలయంలోని తన ఛాంబర్‌లో యూసీడీ విభాగం అధికారులతో మంగళవారం సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరువ చేయాలని ఆదేశించారు. అక్షరాంధ్ర, స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర, పీఎం స్వనిధి, షెల్టర్ హోంలు, వీధి విక్రయదారుల స్థితిగతులపై ఆరా తీశారు. ప్రాజెక్టు అధికారి ఎం.విజయలక్ష్మి, సీడీవోలు శ్రీకాంత్, జగదీశ్వరి తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కరించాలి

పనులు పరిశీలిస్తున్న ఈఈ-1 శ్రీనివాసరావు, సత్యబాబు

చిట్టినగర్, న్యూస్‌టుడే: తాగునీటి సమస్యతో పాటు ఇతర సమస్యలను వెంటనే పరిష్కరించాలని 50వ డివిజన్ కార్పొరేటర్ బి.సత్యబాబు అధికారులను కోరారు. డివిజన్ పరిధిలోని పలు సమస్యలను నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర దృష్టికి తీసుకు వెళ్లగా సానుకూలంగా స్పందించారని తెలిపారు. ఈ నేపథ్యంలో సర్కిల్-1 ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ శ్రీనివాసరావుతో కలిసి మహంతిపురం, గొల్లపాలెంగట్టు ప్రాంతాల్లో మంగళవారం పర్యటించారు. తాగునీటి సరఫరాలో కలుషిత నీరు వస్తుందని, సరఫరా సమయం తక్కువగా ఉందని స్థానిక ప్రజలు వారిద్దరి దృష్టికి తీసుకొచ్చారు. వేసవిలో నీటి ఎద్దడి లేకుండా చూడాలని విజ్ఞప్తి చేశారు. కొత్తగా తాగునీటి పైపులైన్లు త్వరగా వేయించాలని, డ్రెయినేజీ వ్యవస్థ మెరుగు పరచాలని, మంజూరైన రక్షణ గోడ త్వరగా నిర్మించాలని.. ఈఈని సత్యబాబు కోరారు. కార్యక్రమంలో ఏఈ రాజేష్, సచివాలయం ఇమ్యూనిటీ కార్యదర్శి అశోక్, సీపీఎం నాయకుడు రాజు పాల్గొన్నారు.

వీడని దుర్గంధం

విజయవాడ పాత ప్రభుత్వ ఆసుపత్రిలోని బ్లాక్‌ల్లో మురుగు నీరు లీకై రోడ్డుపైకి చేరుతుంది. భవనం వెనుక నుంచి నడక మార్గంలోకి చేరి అక్కడి నుంచి ఆసుపత్రి ఆవరణలోని పార్కింగ్‌లోకి చేరుతుంది. దీంతో ఆ ప్రాంత పరిసరాల్లో దుర్వాసన వెదజల్లుతుంది. సంబంధిత అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని ఆస్పత్రికి వచ్చే ప్రజలు కోరుతున్నారు. - **న్యూస్‌టుడే, విజయవాడ పాతాసుపత్రి**

రోడ్డు తవ్వి.. కష్టాలు తెచ్చి..

విద్యాధరపురం, న్యూస్‌టుడే: నియోజకవర్గ పరిధి మల్లికార్జునపేటలోని అర్జున వీధి, వడ్డి వారి వీధి, గుంటూరు వారి వీధుల్లో పైపులైను పనుల నిమిత్తం రెండు నెలల కిందట తవ్వారు. ఆరు అడుగుల రోడ్డులో మూడు అడుగుల మేర తవ్వి వదిలి వేయడంతో పాదచారులు నడవడం కూడా కష్టంగా మారింది. నెలల తరబడి పనులు పూర్తి కాక పోవడంతో ద్విచక్ర వాహన చోదకుల అవస్థలు పడుతున్నారు. ఏఈ జనార్దన్ మాట్లాడుతూ.. కనెక్షన్లు ఇచ్చిన తర్వాత తవ్విన రోడ్లను పూడ్చేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

చెత్త తొలగించండి

విజయవాడ వన్‌టౌన్, న్యూస్‌టుడే: పాతబస్తీ వించిపేట ఎస్ఎన్ఎంసీ ఉర్దూ పాఠశాల వెనుక భాగంలోని పక్క కాలువలో గత వారం రోజులుగా పూడిక తీయడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ మార్గంలో నడక మార్గం సాగించాలంటే దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే పలుమార్లు పారిశుద్ధ్య అధికారులకు సమాచారం ఇచ్చినా ఫలితం లేదని వాపోతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని వారంతా కోరుతున్నారు.

వేగనిరోధకాల ఏర్పాటు

భవానీపురం, న్యూస్‌టుడే: బైపాస్ రహదారిపై నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. వీటిపై గతంలో 'ఈనాడు'లో పలుమార్లు కథనాలు ప్రచురితమయ్యాయి. ఈ నేపథ్యంలో విద్యాధరపురం, భవానీపురం పరిధిలో ఉన్న ఈ రహదారిపై ప్రమాదాలను నివారించేందుకు నగరపాలక సంస్థ అధికారులు వేగ నిరోధకాలను ఏర్పాటు చేశారు. చర్చి సెంటర్, హెచ్‌బీ కాలనీ, జోజినగర్ తదితర ప్రాంతాల్లో వేగనిరోధకాలు ఏర్పాటు చేసి జీబ్రా లైన్స్ వేశారు.

చర్చి సెంటర్ వద్ద

23 నుంచి ఆన్‌లైన్ ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ తరగతులు

ప్రచార ప్రతులు ఆవిష్కరిస్తున్న కళాశాల ప్రిన్సిపల్ శరవణకుమార్, అధ్యాపకులు

చిట్టినగర్, న్యూస్‌టుడే: అధ్యాపకులకు పరిశోధన నైపుణ్యాలను అభివృద్ధి చేయడంలో నేటి ఆధునిక శాస్త్రీయ అవసరాలపై అవగాహన పెంచడం వల్ల ఎంతో ప్రయోజనం ఉందని పొట్టిశ్రీరాములు చలవాది మల్లికార్జునరావు ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ ఎస్.శరవణకుమార్ పేర్కొన్నారు. కళాశాల ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ విభాగం, ఎస్‌కేపీవీవీ హిందూ హైస్కూల్స్ కమిటీ సంయుక్త ఆధ్వర్యంలో ఐదు రోజుల పాటు నిర్వహించే ఆన్‌లైన్ ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రచార ప్రతుల ఆవిష్కరణ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈనెల 23 నుంచి 27వ తేదీ వరకు సాయంత్రం 5 నుంచి 9 గంటల వరకు ఆన్‌లైన్ ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ తరగతులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అడ్వాన్స్‌డ్ రీసెర్చ్, పేపర్ రైటింగ్, జర్నల్ సెలక్షన్ తదితర అంశాలపై తరగతులు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు పరిశోధన పత్రాల రచన, స్కాలర్ పరిశోధన టూల్స్ వాడకం, సరైన జర్నల్ ఎంపికపై సమగ్ర శిక్షణ ఉంటుందని వివరించారు. ఈ కార్యక్రమంలో కెనడాకు చెందిన విక్రమ్‌కుమార్ కాంబోజ్(మౌంట్ రాయల్ విశ్వవిద్యాలయం), అమిత్ కోహ్లి (విశ్వవిద్యాలయం కెనడా వెస్టు), సుమన్‌లతా త్రిపాఠి (సింబయాసిస్ ఇంటర్నేషన్ విశ్వవిద్యాలయం), సౌదీ అరేబియాకి చెందిన మజాహర్ హుస్సేన్(కింగ్ ఖాలీద్ విశ్వవిద్యాలయం) హరీష్ వాంచా (లవ్లీ ప్రొఫెషనల్ విశ్వవిద్యాలయం) తదితర ప్రముఖులు తరగతులు నిర్వహిస్తారని వివరించారు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 98496 97616

సినిమాలు

ఫంకీ, ఓం శాంతి శాంతి శాంతి: జీ-3(రాజ్-యువరాజ్), ఊర్వశి ఐనాక్స్(గాంధీనగర్), స్వర్ణాకాంప్లెక్స్(గవర్నర్‌పేట), తారా స్క్రీన్స్, రవీంద్ర సినిమాస్(పాయకాపురం), రామ్ సినిమాస్(గుణదల), సాయిరామ్, సౌమ్య(వన్‌టౌన్), స్వాతి(భవానీపురం), లైలా మాల్, పీవీపీ మాల్, పీవీఆర్ మాల్(బందరు రోడ్డు), ట్రెండ్‌సెట్ మాల్(క్యాపిటల్ సినిమాస్), ఎల్ఈపీఎల్ ఐనాక్స్(పటమట), పవర్ వన్ మాల్(కానూరు), ఏబీఆర్ సినిమాస్(కానూరు). **అమరావతికి ఆహ్వానం, నిలవే, సీతా పయనం, యుఫోరియా:** ఊర్వశి ఐనాక్స్(గాంధీనగర్), స్వర్ణాకాంప్లెక్స్(గవర్నర్‌పేట), రామ్ సినిమాస్(గుణదల), లైలా మాల్, పీవీపీ మాల్, పీవీఆర్ మాల్(బందరు రోడ్డు), ట్రెండ్‌సెట్ మాల్(క్యాపిటల్ సినిమాస్), ఎల్ఈపీఎల్ ఐనాక్స్(పటమట). **స్కై:** ఊర్వశి ఐనాక్స్(గాంధీనగర్), స్వర్ణాకాంప్లెక్స్(గవర్నర్‌పేట), పీవీపీ మాల్, పీవీఆర్ మాల్(బందరు రోడ్డు). **యుఫోరియా, సీతా పయనం:** పవర్ వన్ మాల్(కానూరు), ఏబీఆర్ సినిమాస్(కానూరు). కపుల్ ఫ్రెండ్లీ: శైలజ(గాంధీనగర్). ఫంకీ: అప్సర.
- న్యూస్‌టుడే, విజయవాడ వన్‌టౌన్

ఆయుర్వేద ఆసుపత్రిలో అన్నీ సమస్యలే..

వైద్యుడు కూడా లేని దుస్థితి

చిట్టినగర్, న్యూస్‌టుడే

పొట్టి శ్రీరాములు చలవాది మల్లికార్జునరావు ఇంజినీరింగ్ కళాశాల ప్రధాన గేటు పక్కనే 50వ డివిజన్‌లో నగరపాలక సంస్థకు చెందిన ఆయుర్వేద ఆసుపత్రి అభివృద్ధికి నోచుకోక కునారిల్లుతోంది. బాగా పురాతనమైన రేకుల షెడ్‌లో రోడ్డుకు అతి తక్కువ ఎత్తులో ఉంది. వర్షాకాలంలో కారిపోవడం, వాననీరు ఆస్పత్రిలో చేరడంతో నానా అవస్థలు పడాల్సిన పరిస్థితి. రేకులు తొలగించి కొంచెం ఎత్తు పెంచి కొత్త రేకులు ఏర్పాటు, మరుగుదొడ్లు నిర్మించాలి. అందుకు రూ.11.50 లక్షలతో కార్పొరేటర్ సత్యబాబు భూమిపూజ చేసి సుమారు 6 నెలలు అవుతుంది. ఒక్క అడుగు ముందుకు పడలేదు. 50వ డివిజన్‌కు ఆయుర్వేద ఆసుపత్రి ఇదొక్కటే. ప్రస్తుతం ఈ ఆసుపత్రిలో ఆయుర్వేద వైద్యులు కూడా లేరు. సహాయకుడు మాత్రం రోజు ఆసుపత్రి తెరిచి ఉంచుతున్నారు. అధికారులు దృష్టి సారించి ఆసుపత్రిని అభివృద్ధి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

డివిజన్	: 50
జనాభా	: 25 వేలు
నెలకు ఓపీ	: 1000-1500

★ ఆయుర్వేద ఆసుపత్రి అభివృద్ధి పనుల జాప్యంపై కార్పొరేటర్ సత్యబాబును 'న్యూస్‌టుడే' వివరణ కోరగా.. ఉన్న ఆసుపత్రిలో పనులు ప్రారంభించేందుకు దీన్ని తాత్కాలికంగా వేరే ప్రాంతానికి తరలించాలి. ఎక్కడ ఏర్పాటు చేయాలని ఆలోచిస్తున్నాం. వీలైనంత త్వరగా పనులు ప్రారంభించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూస్తామన్నారు.

జేఈఈ మెయిన్ ఫలితాల్లో నారాయణ ప్రతిభ

అత్యధిక పర్సంటైల్ సాధించిన విద్యార్థులతో నారాయణ డీజీఎం రవిశంకర్ తదితరులు

కానూరు, న్యూస్‌టుడే : జేఈఈ మెయిన్-2026 ఫలితాల్లో విజయవాడలోని నారాయణ విద్యాసంస్థల విద్యార్థులు మంచి పర్సంటైల్స్ సాధించారని డీజీఎం రవిశంకర్ తెలిపారు. ఫలితాల్లో సంగాజాగృత్ 99.98, వేదచరణ్ 99.97, సాయికుశ్వంత్ 99.96, మహిత 99.95, జగదీష్ 99.94, బస్వంత్ 99.94, ప్రసాద్‌రెడ్డి 99.93, యశ్విత 99.90, లోకేశ్వర్ 99.78, జీవన్‌కుమార్ 99.73, అఖిలేష్ 99.73 పర్సంటైల్స్ సాధించారన్నారు. వీరితో పాటు 99 పర్సంటైల్‌లో 110 మంది విద్యార్థులు, 98లో 193, 97లో 276, 96లో 325, 95లో 416, 90 పర్సంటైల్‌లో 680 మంది విద్యార్థులు జాతీయ స్థాయిలో సత్తా చాటారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను డీన్లు, ప్రిన్సిపల్స్, అధ్యాపకులు అభినందించారు.

శ్రీచైతన్య విజయభేరి

బెంజిసర్కిల్(విజయవాడ సిటీ), న్యూస్‌టుడే : జేఈఈ మెయిన్ పరీక్షా ఫలితాల్లో విజయవాడలోని శ్రీచైతన్య విద్యాసంస్థల విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించారని ఎగ్జిక్యూటివ్ ఏజీఎం మద్దినేని మురళీకృష్ణ అన్నారు. పసల మోహిత్ 100 పర్సంటైల్, కె.హిమకర్, జి.సాయి సాత్విక్, పి.ప్రవీత్ చెన్నకేశవ్ వరుసగా 99.99 పర్సంటైల్ సాధించారని వెల్లడించారు. 99.99 ఆపైన పర్సంటైల్ 21 మంది, 99.98 ఆపైన 34 మంది, 99.97 ఆపైన 46 మంది, 99.96 ఆపైన 59 మంది, 99.95 ఆపైన 71 మంది, 95.0 ఆపైన 800 మంది, 90.0 ఆపైన పర్సంటైల్ 1200 మంది సాధించారని తెలియజేశారు. బెంజి సర్కిల్‌లోని క్యాంపస్‌లో ప్రతిభ చూపిన విద్యార్థులను మురళీకృష్ణ, ఎగ్జిక్యూటివ్ డీన్ పి.వెంకటేశ్వరరావు తదితరులు అభినందించారు.

అత్యుత్తమ పర్సంటైల్ సాధించిన విద్యార్థిని సత్కరిస్తున్న ఈఏజీఎం మురళీకృష్ణ తదితరులు

భర్త వేధింపులపై ఫిర్యాదు

భవానీపురం, న్యూస్‌టుడే: భర్త వేధిస్తున్నాడని భార్య పోలీసులకు మంగళవారం ఫిర్యాదు చేశారు. వివరాలిలా ఉన్నాయి... గొల్లపూడి సాయిపురం కాలనీలో శారద, సుధీర్ దంపతులు నివాసం ఉంటున్నారు. వారికి ఆరేళ్ల కిందట వివాహమైంది. కొన్నాళ్లుగా తన సుధీర్ వేరొక మహిళతో అక్రమ సంబంధం పెట్టుకుని తనను శారీరకంగా, మానసికంగా వేధిస్తున్నట్లు భార్య శారద భవానీపురం పోలీసులకు ఫిర్యాదు చేయగా.. భవానీపురం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కేబుల్ దుకాణంలో అగ్నిప్రమాదం

భవానీపురం: భవానీపురం 41వ డివిజన్ బేతపూడి అరుణకుమారి వీధిలోని కేబుల్ దుకాణంలో సోమవారం రాత్రి అగ్ని ప్రమాదం జరిగింది. కేబుల్ దుకాణంలో నుంచి మంటలు రావడాన్ని గమనించిన స్థానికులు అగ్నిమాపక శాఖ వారికి సమాచారం ఇచ్చారు. వారొచ్చి మంటలను ఆర్పారు. దుకాణంలోని ఫర్నీచర్, కేబుల్ వైర్లు, ల్యాప్‌టాప్, తదితర వస్తువులు మంటల్లో కాలిపోయినట్లు అగ్నిమాపక శాఖ అధికారులు తెలిపారు. షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు వచ్చి ఉంటాయని పోలీసులు భావిస్తున్నారు. కేసు నమోదు చేశామని చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో మహిళకు గాయాలు

భవానీపురం: భవానీపురంలోని మీరా సాహెబ్ వీధిలో కుమార్తె మల్లికతో కలిసి తల్లి షేక్ వహీదా నివాసం ఉంటున్నారు. ఈనెల 15వ తేదీ మల్లిక, వహీదా గొల్లపూడిలోని సూపర్ మార్కెట్‌కు వెళ్లి ఇంటికి వెళ్లేందుకు రోడ్డు దాటుతున్నారు. ఆ సమయంలో ద్విచక్రవాహనంపై వెళ్తున్న వ్యక్తి వహీదాను ఢీకొట్టడంతో రోడ్డుపై పడిపోయారు. స్థానికులు ఆమెను సమీపంలోని ఆసుపత్రికి తీసుకు వెళ్లగా చికిత్స పొందుతున్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

22వ వర్ధంతి

కీ॥శే॥ కొనిజేటి కన్నయ్య గారు
మాజీ డిప్యూటీ మేయర్, VMC
వ్యవస్థాపకులు: KKC టార్పాలిన్స్
నివాళులర్పిస్తూ...
కుటుంబ సభ్యులు & స్టాఫ్

In the Court of the Senior Civil Judge: Atmakur
SPSR Nellore District, A.P.
H.M.O.P. No. 59 / 2025
Guduru Lakshmi Priyanka @ Pareddy Lakshmi Priyanka - Petitioner
Vs.
Pareddy Ajay Kumar - Respondent
Notice to Respondent
Pareddy Ajay Kumar
S/o. Pareddy Sadananda Reddy, R/o. H.No. 76/10/3/46, 5th Floor, Bhavani Enclave, Bank Centre, Church Street, Bhavani Puram, Vijayawada - 520012.
పై నెంబరు కేసులో పిటిషనరు మీమీద పై వారి కోర్టులో విడాకులు కోరుచూ H.M.O.P. No. 59 / 2025 పిటిషన్ దాఖలు చేసియున్నారు. సదరు పిటిషన్‌లో మీకు నోటీసు నిమిత్తం తేది. 10-3-2026న వాయిదా వేసియున్నారు. ఆరోజు ఉదయం 10.30 గంటలకు మీరు స్వయంగా గాని వకీలు ద్వారాగాని హాజరై మీ అభ్యంతరాలు తెలుపుకొనవలసింది. లేనియెడల కేసు మీ పరోక్షమున తీర్మానించబడును.
టి.విజయభాస్కర్‌రెడ్డి, B.Com., B.L., పిటిషనరు తరపు అడ్వకేట్, వింజమూరు, ఎ.పి.

CHANGE OF NAME
I, JOSHUA MEKALA (old name), S/o. PARAM JYOTHI, Resident of D.No.4-20-2, Guruswamy Street, 7th day school Backside, Lambadipet, Chittinagar, Vijayawada -520 001, A.P. I have changed my name as **MEKALA. JASHWA** (New name), S/o. Mekala Param Jyothi, Hereafter my name is Known as **MEKALA. JASHWA** (New name) S/o. Mekala Param Jyothi.

38వ వర్ధంతి

కీ॥శే॥ నూకల సుబ్బారావు గారు
K.D.P.M. బోర్డ్ వ్యవస్థాపకులు
మరణం: 18-02-1988
భౌతికంగా మా నుండి దూరమై 38 సం॥లు గడిచినను మీ మధుర స్మృతులు చిరస్మరణీయం.
కుమారులు: నూకల సుబ్రహ్మణ్యం
నూకల నాగేశ్వరరావు, Ex. కార్పొరేటర్
నూకల వెంకట సత్యనారాయణ
(లేటు) ఆది శ్రీనివాస్
(లేటు) గంగాధర్
(లేటు) పూర్ణ వెంకట మురళీకృష్ణ
కుమార్తెలు: కాళంగి రమాదేవి - రామకృష్ణ
చేబ్రోలు సోమశేఖర్ & బ్రదర్స్

విజయవాడ మధ్య

'పది' ఫలితాల్లో జిల్లాను అగ్రగామిగా నిలుపుదాం

విద్యార్థిని నుంచి సమాధానం రాబడుతున్న కలెక్టర్ లక్ష్మీశ

సూర్యారావుపేట, న్యూస్‌టుడే : పదో తరగతి పరీక్షల కోసం రూపొందించిన వంద రోజుల ప్రణాళికను పక్కాగా అమలు చేసి ఫలితాల్లో జిల్లాను అగ్రగామిగా నిలిపేందుకు కృషి చేయాలని కలెక్టర్ జి.లక్ష్మీశ సూచించారు. మంగళవారం సూర్యారావుపేటలోని కర్నాటి రామ్మోహనరావు స్కూలును ఆయన పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడారు. గణితం, సైన్సు, సాంఘిక శాస్త్రం పాఠ్యాంశాలకు సంబంధించి పలు ప్రశ్నలు వేసి. . సమాధానాలు రాబట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో ప్రభుత్వ పాఠశాలల్లో 11,200 మంది, ప్రైవేట్ పాఠశాలల నుంచి 16,000 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలకు సన్నద్ధం అవుతున్నారని తెలిపారు. ఇష్టపడి నేర్చుకున్న విషయ పరిజ్ఞానం ఎప్పటికీ గుర్తుండిపోతుందని వివరించారు. విద్యార్థి జీవితాన్ని మలుపు తిప్పేది పదో తరగతి పరీక్షలేనని.. ఇందులో మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధిస్తే ఉన్నత చదువులకు మార్గం సుగమం అవుతుందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుని ఎంతో మంది ఉన్నత స్థానాలకు ఎదిగారని, వారిని స్ఫూర్తిగా తీసుకుని బాగా చదువుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీఈఓ ఎల్.చంద్రకళ, ప్రధానోపాధ్యాయిని ఎం.సూర్యప్రభ, గోవిందరాజు ధర్మ ఈనాం ట్రస్టు ప్రధానోపాధ్యాయుడు మురాల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేట్‌కు దీటుగా పాఠశాలల అభివృద్ధి

అల్పాహారం అందిస్తున్న ఎమ్మెల్యే ఉమామహేశ్వరరావు, కార్పొరేటర్ బాలస్వామి

సూర్యారావుపేట, న్యూస్‌టుడే : కార్పొరేట్ దీటుగా నగరపాలక సంస్థ, ఎయిడెడ్ పాఠశాలలను అభివృద్ధి చేస్తున్నామని.. పదో తరగతి పరీక్షల్లో విద్యార్థులు మంచి మార్కులు సాధించడమే లక్ష్యంగా పని చేస్తున్నామని ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు పేర్కొన్నారు. బిషప్ అజరయ్య హైస్కూల్‌లో పదో తరగతి విద్యార్థులకు అల్పాహార పంపిణీ కార్యక్రమాన్ని మంగళవారం సాయంత్రం లాంఛనంగా ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. పేద కుటుంబాలకు చెందిన విద్యార్థినులు ఎక్కువగా ఇక్కడ చదువుతున్నారని.. వారికి వెన్నంటి ఉంటామని హామీ ఇచ్చారు. 120 మంది పదో తరగతి విద్యార్థినులకు అల్పాహారం అందించాలని యాజమాన్యం కోరగా.. స్థానిక కార్పొరేటర్ నెల్లిబండ్ల బాలస్వామి స్పందించి ఆ రోజు నుంచి అల్పాహారం అందిస్తున్నారని వివరించారు. విద్యార్థినులు బాగా చదువుకుని మంచి మార్కులు సాధించాలని కోరారు. కార్పొరేటర్ మాట్లాడుతూ.. పాఠశాల అభివృద్ధికి అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తామని పేర్కొన్నారు. ప్రధానోపాధ్యాయురాలు జయశ్రీ తదితరులు పాల్గొన్నారు.

'మై టీడీపీ' యాప్‌పై విస్తృత ప్రచారం

సూర్యారావుపేట, న్యూస్‌టుడే : 'మై టీడీపీ' యాప్.. పార్టీకి డిజిటల్ బలం ఇచ్చే ప్రధాన వేదిక అని ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు పేర్కొన్నారు. గురువారం 23వ డివిజన్‌లో నాయకులు, కార్యకర్తలతో యాప్ వినియోగంపై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ప్రతి బూత్, యూనిట్, క్లస్టర్ స్థాయి నాయకులు తమ పరిధిలోని కార్యకర్తలను యాప్‌లో నమోదు చేయించాలని సూచించారు. సభ్యత్వ నమోదు, సభ్యుల వివరాలు, రోజు వారీ కార్యక్రమాల నమోదు, సమావేశాల వివరాలు, ప్రభుత్వ పథకాల ప్రచారం, ఫొటోలు, వీడియోలను అప్‌లోడ్ చేయాలని పేర్కొన్నారు. కార్యకర్తలు తన బూత్ పరిధిలో జరిగిన కార్యక్రమాన్ని యాప్‌లో నమోదు చేయడం ద్వారా పారదర్శకత, సమన్వయం, సమర్థవంతమైన నిర్వహణ సాధ్యమవుతుందని వివరించారు. ప్రభుత్వం అమలు చేసే సంక్షేమ పథకాల వివరాలు ప్రజలకు చేరవేయడంలో ఈ యాప్ కీలకపాత్ర పోషిస్తుందన్నారు. బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కోరారు. కార్పొరేటర్ నెల్లిబండ్ల బాలస్వామి, తెలుగు యువత నాయకుడు కె.కోటేశ్వరరావు, డివిజన్ అధ్యక్షుడు చింతా దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

పొదుపు పథకాలపై అవగాహన

విజయవాడ(గాంధీనగర్), న్యూస్‌టుడే : యూనియన్ బ్యాంకు 444 రోజుల డిపాజిట్టు పథకం ప్రచారంలో భాగంగా మంగళవారం బీఆర్‌టీఎస్ రోడ్‌లో బ్యాంకు ఉద్యోగులు బైక్ ర్యాలీ నిర్వహించారు. జనరల్ మేనేజరు సి.హెచ్.వి.ఎస్.భాస్కరరావు జెండా ఊపి ప్రారంభించారు. ప్రజల్లో పొదుపు అలవాటు పెంపొందించడం, బ్యాంకు అందిస్తున్న ప్రత్యేక డిపాజిట్టు పథకాలపై అవగాహన కల్పించడం ముఖ్యఉద్దేశమని చెప్పారు. సాధారణ ఖాతాదారులకు 6.60శాతం, సీనియర్ సిటిజన్లకు 7.10 శాతం వడ్డీ ఇస్తున్నామని వివరించారు. రీజనల్ మేనేజరు ఎం.వి.తిలక్, డీజీఎం ఎం.సీతారామరావు, ఏజీఎంలు, అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

విద్యుత్తు సరఫరా నిలిపివేత నేడు

చుట్టుగుంట : సీతారాంపురం సబ్ స్టేషన్ 11 కేవీ మారుతీనగర్ ఫీడర్ పరిధిలోని ఈ నెల 18వ తేదీ ఉదయం 8 నుంచి 10.30 గంటల వరకు సరఫరా నిలిపివేస్తామని ఈఈ పి.రవీంద్ర బాబు తెలిపారు. మారుతీనగర్ కాలువ గట్టు, చుట్టుగుంట కాలువ గట్టు, కాకాని నగర్, బీఎస్ఎన్ఎల్ భవన్, కాకర్లవారి వీధి, వీరయ్య వీధి, మాగంటివారి వీధి, మసీదు వీధి, గద్దె పూర్ణచంద్రరావు వీధి, ప్రకాశరావు వీధి, అనుమోలు శేషగిరిరావు వీధి, గోగినేనివారి వీధి, మిల్క్ బూత్ వీధి, పటేల్ రోడ్డు, ఎస్సారార్ కళాశాల వెనుక ప్రాంతాల్లో విద్యుత్తు ఉండదని పేర్కొన్నారు.

నోళ్లు తెరిచినా.. కళ్లు తెరవరా..?

మధురానగర్, న్యూస్‌టుడే

నగరంలోని ప్రధాన రహదారుల్లో ఉన్న ఓపెన్ డ్రెయిన్లు మూగజీవాల పాలిట ప్రమాదకరంగా మారాయి. ఆహారం కోసం తిరుగుతున్న ఆవులు, గేదెలు వాటిలో పడిపోతున్నాయి. ఇలాంటి ఘటనలు వరుసగా జరుగుతున్నా.. దిద్దుబాటు చర్యలు తీసుకునేందుకు అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారు.

బి.ఆర్.టి.ఎస్. రోడ్డులో ప్రమాద ఘంటికలు

నగరంలో ప్రధాన రహదారుల్లో బి.ఆర్.టి.ఎస్.రోడ్డు ఒకటి. దీనికి పక్కనే సత్యనారాయణపురం రైల్వేకాలనీ ఉంది. బి.ఆర్.టి.ఎస్. రోడ్డులోకి నిత్యం ఆవులు వస్తాయి. రాత్రి వేళ ఇక్కడే ఉంటాయి. రహదారికి పక్కనే ఆరు అడుగుల లోతులో ఓపెన్ డ్రెయిన్ ఉంది. పశువులు తిరుగుతూ అందులో పడిపోతున్నాయి. ఇటీవల రెండు ఎద్దులు డ్రెయిన్‌లో పడిపోయాయి. త్రీ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ సీఐ కిషోర్‌బాబు తన సిబ్బందితో వ్యయ ప్రయాసలు కోర్చి క్రేన్ సాయంతో మూగజీవాలను బయటకు తీశారు.

ఇటీవల ఓపెన్‌డ్రెయిన్‌లో పడిపోయిన ఎద్దులు.. పరిశీలిస్తున్న ట్రాఫిక్ సీఐ కిషోర్‌బాబు

చర్యలు శూన్యం

ఈ సంఘటన జరిగి రోజులు గడిచినా. . అధికారులు ఎలాంటి దిద్దుబాటు చర్యలు తీసుకోలేదు. ఇక్కడ రక్షణ కంచె ఏర్పాటు చేసేందుకు ఇనుప దిమ్మెలు పాతినా.. కంచె నిర్మాణం పూర్తి చేయలేదు. రైల్వేకాలనీలో నుంచి పశువులు ఓపెన్ డ్రెయిన్ వైపు రాకుండా సహాయక చర్యలు తీసుకో

ఓపెన్ డ్రెయిన్లతో జీవాలు, జనాలకు ముప్పు

లేదు. దీంతో ఇక్కడ మూగజీవాలకు రక్షణ లేకుండా పోయింది.

వాహన చోదకులకూ ప్రాణాపాయం

బి.ఆర్.టి.ఎస్. రోడ్డులోనే కాకుండా విశాలాంధ్ర రోడ్డులో ఓపెన్ డ్రెయిన్ ఉంది. ఇక్కడా ఆవులు సంచరిస్తుంటాయి. ఈ ప్రాంతం వాహనచోదకుల పాలిట ప్రమాదకరంగా మారింది. గత ఏడాది సెప్టెంబరు 3న ఒక కారు అదుపు తప్పి ఓపెన్ డ్రెయిన్‌లోకి దూసుకుపోయింది. ప్రాణాపాయం తప్పడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు. అదే ద్విచక్రవాహనం అయితే ప్రాణాలు పోయేవని ప్రత్యక్షసాక్షులు భయాందోళన వ్యక్తం చేశారు. ఓపెన్‌డ్రెయిన్ల వద్ద రక్షణ కంచె ఏర్పాటు చేయకుండా మీన మేషాలు లెక్కిస్తుండటంతో ప్రమాదాలు జరిగే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని స్థానికులు భయపడుతున్నారు. తక్షణం రక్షణ చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

22న మాయాబజార్ 70 ఏళ్ల వేడుక

మంత్రి దుర్గేష్‌కు ఆహ్వాన పత్రిక అందిస్తున్న విజయలక్ష్మి

విజయవాడ సాంస్కృతికం, న్యూస్‌టుడే : మాయాబజార్ చిత్రం విడుదలై 70 ఏళ్లు పూర్తవుతున్న సందర్భంగా నగరంలోని తుమ్మలపల్లి క్షేత్రయ్య కళాక్షేత్రంలో వేడుకలు నిర్వహించనున్నట్లు మహానటి సావిత్రి కళాపీఠం వ్యవస్థాపకురాలు పరుచూరి విజయలక్ష్మి తెలిపారు. మంగళవారం ఘంటసాల సంగీత కళాశాలలోని పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్‌ని ఆమె మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గత 18 ఏళ్లుగా నటీనటుల జ్ఞాపకాలు, నటనా పటిమ, వారిలోని దాతృత్వాన్ని నేటి యువతకు తెలియజేసేందుకు వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ నెల 22న నిర్వహిస్తున్న వేడుకలకు హాజరుకావాలని కోరుతూ ఆమె మంత్రిని ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో గుమ్మడి గోపాలకృష్ణ, దూపాటి శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

జేఈఈ మెయిన్ ఫలితాల్లో శ్రీచైతన్య విజయభేరి

ఉత్తమ పర్సంటైల్ సాధించిన విద్యార్థిని సత్కరిస్తున్న ఈడీఎం మురళీకృష్ణ తదితరులు

బెంజ్‌సర్కిల్(విజయవాడ సిటీ), న్యూస్‌టుడే : జేఈఈ మెయిన్ పరీక్ష ఫలితాల్లో విజయవాడలోని శ్రీచైతన్య విద్యాసంస్థల విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించారని ఎగ్జిక్యూటివ్ ఏజీఎం మద్దినేని మురళీకృష్ణ అన్నారు. మొత్తం 100 పర్సంటైల్ కె.హిమకర్, బి.సాయి సాత్విక్, పి.ప్రవీణ్ చెన్నకేశవ వరుసగా 99.99 పర్సంటైల్ సాధించారని వెల్లడించారు. 99.99 ఆపైన పర్సంటైల్ 21 మంది, 99.98 ఆపైన 34 మంది, 99.97 ఆపైన 46 మంది, 99.96 ఆపైన 59 మంది, 99.95 ఆపైన 71 మంది, 95.0 ఆపైన 800 మంది, 90.0 ఆపైన పర్సంటైల్ 1200 మంది సాధించారని తెలియజేశారు. బెంజ్ సర్కిల్‌లోని క్యాంపస్‌లో ప్రతిభ చూపిన విద్యార్థులను మురళీకృష్ణ, ఎగ్జిక్యూటివ్ డీన్ పి.వెంకటేశ్వరరావు తదితరులు అభినందించారు.

న్యాయవాదులకు సూచనలు

గవర్నర్‌పేట, న్యూస్‌టుడే : ఆంగ్ల భాషపై పట్టులేక చాలా మంది ఉద్యోగావకాశాలు కోల్పోతున్నారని జ్యోతి ఆఫ్ ఇండియా ఏపీ, తెలంగాణ ఎడిటర్ ఇన్‌చార్జి సయ్యద్ అక్బర్ పేర్కొన్నారు. మంగళవారం ఆయన బెజవాడ బార్ అసోసియేషన్ సందర్శించారు. న్యాయవాదులకు పలు సూచనలు చేశారు. సబ్జెక్టుతో పాటు అర్థంపై పట్టు చాలా అవసరమన్నారు. పాత్రికేయునిగా తన అనుభవాలను పంచుకున్నారు. న్యాయవాదులు పెంచుకుని వృత్తిలో విజయం సాధించాలని కోరారు. కార్యక్రమంలో బీబీఏ అధ్యక్షుడు ఎ.కె.బాషా, ఇతర కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

ధర వరలు

వంకాయలు-24/22, టమాటా-14, బెండ-24, పచ్చిమిర్చి-46, కాకర-32, బీర-30/28, క్యాలీ ఫ్లవర్-15/20, క్యాబేజీ-14, క్యారెట్-26, దొండ-40, బంగాళదుంప-21, ఉల్లిపాయల-22, గోరుచిక్కుడు-28, దోస-16/26, సొర-8/10, పొట్ల-30, అరటికాయ-7/6, చామదుంప-24, అల్లం-72, మునగ-10/8, బీట్ రూట్-24, కీరదోస-42, బీన్స్-54/60, క్యాప్సికమ్-60, కొత్తిమీర-5/10, పుదీనా-5/15, ముల్లంగి-8, (నిన్నటివి). నగరంలోని రైతుబజార్లలో ఈ ధరలు (రూ.లో) వర్తిస్తాయి. - న్యూస్‌టుడే, విజయవాడ రైతుబజారు

నారాయణ విద్యార్థుల ప్రతిభ

విద్యార్థులను అభినందిస్తున్న నారాయణ డీజీఎం రవికాంత్ తదితరులు

కానూరు, న్యూస్‌టుడే : జేఈఈ మెయిన్-2026 ఫలితాల్లో విజయవాడలోని నారాయణ విద్యాసంస్థల విద్యార్థులు మంచి పర్సంటైల్స్ సాధించారని డీజీఎం రవికాంత్ తెలిపారు. ఫలితాల్లో సంగాజాగర్ల్ 99.98, వేదవరపు 99.97, సాయికృష్ణ 99.96, మహిత 99.95, జగదీష్ 99.94, బస్వంత్ 99.94, ప్రసాదరెడ్డి 99.93, యశ్వంత 99.90, లోకేశ్వర్ 99.78, జీవన్‌కుమార్ 99.73, అభిలేష్ 99.73 పర్సంటైల్స్ సాధించారన్నారు. వీరితో పాటు 99 పర్సంటైల్‌లో 110 మంది విద్యార్థులు, 98లో 193, 97లో 276, 96లో 325, 95లో 416, 90 పర్సంటైల్‌లో 680 మంది విద్యార్థులు జాతీయ స్థాయిలో సత్తా చాటారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను డీన్లు, ప్రిన్సిపల్స్, అధ్యాపకులు అభినందించారు.

స్వచ్ఛంద సంస్థల సేవలు భేష్

సూర్యారావుపేట, న్యూస్‌టుడే : మాదకద్రవ్యాలపై పోరులో స్వచ్ఛంద సంస్థల భాగస్వామ్యం ప్రశంసనీయమని కలెక్టర్ జి.లక్ష్మీశ పేర్కొన్నారు. ఆ సంస్థల సహకారంతో మాదక ద్రవ్య రహిత సమాజ నిర్మాణానికి కృషి చేస్తున్నామని వివరించారు. మంగళవారం సూర్యారావుపేటలోని అక్షర ఫౌండేషన్ ఆధ్వర్యంలో సిమ్స్ కౌన్సెలింగ్ కేంద్రాన్ని ఆయన సందర్శించారు. మాదకద్రవ్యాల అలవాటు వదిలిన వారికి అందిస్తున్న చికిత్సలు, కౌన్సెలింగ్ విధానాన్ని పరిశీలించారు. అధునాతన ఉపకరణాలు, కిట్లు చూశారు. చికిత్స వివరాలు ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ గర్రె శంకరరావు.. కలెక్టర్‌కు వివరించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. మాదకద్రవ్యాల మహమ్మారి యువత భవిష్యత్తుకు అత్యంత ప్రమాదకరమని.. దీన్ని తుద ముట్టించేందుకు ప్రభుత్వ సంస్థలు ముందుకు రావడం అభినందనీయమని కొనియాడారు. కార్యక్రమంలో సైకాలజిస్టులు డాక్టర్ టి.ఎస్.రావు, నవి తాశ్రీ తదితరులు పాల్గొన్నారు.

చెత్త తొలగించరూ..

స్థానిక 36వ డివిజన్ రామకోటి మైదానం ప్రాంతాల్లో వ్యర్థాలు పేరుకుపోతున్నాయి. నిత్యం తొలగించకపోవడంతో ప్రజలు వ్యాధుల బారిన పడుతున్నారు. ప్రధాన రహదారులపై చెత్త తొలగిస్తుండగా.. అంతర్గత వీధుల్లోకి సిబ్బంది రావడం లేదని వాపోతున్నారు. దుర్వాసన వెదజల్లడమే కాకుండా దోమలు విజృంభిస్తున్నాయి. సంబంధిత అధికారులు స్పందించి ప్రతి రోజూ చెత్త ఎత్తేలా చర్యలు తీసుకోవాలని డివిజన్ ప్రజలు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, గాంధీనగర్

రైల్వే స్థలంలో నిర్మాణం?

స్థానిక బీఆర్‌టీఎస్ రోడ్డు, శారదా జంక్షన్ సిగ్నల్స్ వద్ద శివాజీ విగ్రహ ప్రతిష్ఠకు ఆగమేఘాలపై ఏర్పాట్లు చేస్తున్నారు. గత ఏడాది ఇక్కడే అనుమతి లేకుండా రైల్వే స్థలంలో విగ్రహం ఏర్పాటు చేస్తుండగా.. సంబంధిత అధికారులు అడ్డుకున్నారు. ఇప్పటికే రైల్వే ఆక్రమిత స్థలాల్లో కొందరు యథేచ్ఛగా వ్యాపారాలు చేస్తున్నారు. ఈ ప్రాంతంలో ఇప్పటికే ట్రాఫిక్ ఇబ్బందులు ఏర్పడుతుంగా.. విగ్రహాన్ని ప్రతిష్ఠిస్తే మరిన్ని ఇబ్బందులు తప్పవని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. రైల్వే ఆక్రమిత స్థలంలో నిర్మాణంపై అధికారులు ఆరా తీశారు. - న్యూస్‌టుడే, విజయవాడ

కాలనీలో పొగ కమ్మేస్తోంది..

నందమూరి నగర్, తోటా వారి వీధిలో చెత్తను నిప్పంటిస్తున్నారు. ఫలితంగా రహదారి అంతా పొగ కమ్మేస్తోంది. రాకపోకల సమయంలో ద్విచక్ర వాహనాల చోదకులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వాతావరణం సైతం కలుషితమవుతోందని.. అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు. - న్యూస్‌టుడే, అజిత్‌సింగ్‌నగర్

ప్రచార పత్రాలు విడుదల చేస్తున్న స్వరూపరాణి, బబిత జైన్, ఉషారాజ తదితరులు

యువతుల్లో నైపుణ్యాలు పెంచడమే లక్ష్యం

రాఘవయ్యపార్క్ కూడలి(కృష్ణలంక), న్యూస్‌టుడే : యువతుల్లో క్రీడాశక్తి, నైపుణ్యాలు పెంచడమే లక్ష్యమని క్రీడా పోటీల నిర్వహణ కమిటీ కన్వీనర్ కె.స్వరూపరాణి అన్నారు. 'యువతుల క్రీడా వికాసం-గ్రాండ్ స్ప్రింట్ స్పోర్ట్స్-2026' పేరుతో మహిళా సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో నగరంలోని శ్రీదుర్గా మల్లేశ్వర సిద్ధార్థ మహిళా కళాశాలలో ఈ నెల 19, 20వ తేదీల్లో డిగ్రీ, ఇంజినీరింగ్ విద్యార్థినులకు క్రీడా పోటీలు నిర్వహిస్తున్నారు. దీనికి సంబంధించిన ప్రచార పత్రాలను మంగళవారం బాలోత్సవ భవన్‌లో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. క్రీడల్లో పాల్గొనేందుకు యువతులు అనేక అడ్డంకులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. తల్లిదండ్రులు, సమాజం నుంచి వారికి సరైన ప్రోత్సాహం లభించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సరైన సౌకర్యాలు, క్రీడా సామాగ్రి కొరత, భద్రతా సమస్యలు, ప్రభుత్వం నుంచి ప్రోత్సాహకాలు లేక క్రీడల్లో వెనుకంజవేస్తున్నట్లు తెలిపారు. 19న ఖోఖో, త్రోబాల్, కబడ్డీ, టగ్ ఆఫ్ వార్, 20న వాలీబాల్, బాస్కెట్ బాల్, మ్యూజికల్ ఛైర్స్ పోటీలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఇన్నర్ వీల్ సన్‌షైన్ అధ్యక్షురాలు బబితా జైన్ మాట్లాడుతూ.. క్రీడలు శారీరక శ్రమతో పాటు పాటు ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తాయని పేర్కొన్నారు. వివిధ సంఘాల ప్రతినిధులు పి.విజయ, కె.గీత, పావని, శేషారత్నం, ఉషా రాజ, శ్రీలక్ష్మి, సంధ్యారాణి, లీలా కుమారి తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధి అందజేత

విజయవాడ(గాంధీనగర్), న్యూస్‌టుడే : స్థానిక బీఆర్‌టీఎస్ రోడ్డులోని ఎమ్మెల్యే కార్యాలయంలో 32, 60 డివిజన్ల కార్యకర్తల కుటుంబాలకు మంగళవారం సీఎం సహాయనిధి చెక్కులను ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ.. సీఎం సహాయం ప్రజలకు భద్రత, భరోసా కల్పిస్తుందన్నారు. సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో విజయకృష్ణా సూపర్‌బజార్ కమిటీ ఛైర్మన్ వెలగా సురేష్, నాగవంశ సాధికార ఛైర్మన్ ఎరబోతు రమణారావు, తెదేపా రాష్ట్ర కార్యదర్శి నవనీతం సాంబశివరావు, ఘంటా కృష్ణమోహన్, కంచి ధనశేఖర్, కంచేటి నాగరాజు, ఎస్.కె.గౌస్ బాషా, కబీర్, బొలిశెట్టి శేషుబాబు తదితరులు పాల్గొన్నారు.

కర్పూరీ ఠాకూర్‌కు నివాళి

గవర్నర్‌పేట, న్యూస్‌టుడే : గవర్నర్‌పేటలోని కర్పూరీ ఠాకూర్ ఫౌండేషన్ కార్యాలయంలో మంగళవారం కర్పూరీ ఠాకూర్ వర్ధంతి నిర్వహించారు. ఫౌండేషన్ ఏపీ కో కన్వీనర్ గుంటుపల్లి ఉమామహేశ్వరరావు ఆధ్వర్యంలో ముందుగా ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. సేవలను గుర్తు చేసుకున్నారు. మహాత్మాగాంధీ పోరాటంతో ప్రభావితమై క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొన్న బిహారీ నేత అని కొనియాడారు. స్వాతంత్ర్యం తర్వాత ఉపాధ్యాయుడిగా పని చేశారని.. శాసనసభ్యుడిగా ఎంపికై ప్రజా సమస్యలపై పోరాటం చేశారని గుర్తు చేశారు. ఆయన్ని నేటి తరం నాయకులు స్ఫూర్తిగా తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎన్.వి.రావు, నమ్మి అప్పారావు, బి.శేఖర్‌బాబు, ఎం.ఈ.ఎస్.మూర్తి, ఆకునూరి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

వెంకయ్య కుటుంబ సభ్యులకు పరామర్శ

దుర్గాఅగ్రహారం (సీతారాంపురం): దుర్గాఅగ్రహారంలోని మాజీ ఎమ్మెల్సీ ఐలాపురం వెంకయ్య కుటుంబ సభ్యులను పలువురు మీడియా ప్రతినిధులు మంగళవారం పరామర్శించారు. ఆయన చిత్రపటానికి పూల మాలవేసి నివాళులర్పించారు. ఐజేయూ అధ్యక్షుడు, తెలంగాణ మీడియా అకాడమీ ఛైర్మన్ కె.శ్రీనివాస్‌రెడ్డి, సీవీ రాఘవాచారి మీడియా అకాడమీ ఛైర్మన్ ఆలపాటి సురేష్, ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు ఐవీ సుబ్బారావు, ఐజేయూ జాతీయ కార్యదర్శి సోమసుందర్, ఏపీయూడబ్ల్యూజే అర్బన్ అధ్యక్షుడు చావా రవి, నాయకులు పాల్గొన్నారు.

నులిపురుగుల నివారణతో ఆరోగ్యం

పిల్లలకు మాత్రలు అందిస్తున్న కార్పొరేటర్ సుల్తానా, డాక్టర్ జాహ్నవి

అజిత్‌సింగ్‌నగర్: చేతులు శుభ్రంగా కడుక్కొని ఆహార పదార్థాలు తీసుకోవాలని, నులిపురుగుల నివారణతోనే సంపూర్ణ ఆరోగ్యమని మాజీ కార్పొరేటర్ ఎర్రుబోతు శ్రావణి రామారావు అన్నారు. జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా మంగళవారం 58వ డివిజన్‌లోని వివేకానంద హైస్కూల్, అంగన్‌వాడీ కేంద్రాల్లో విద్యార్థులకు మాత్రలు పంపిణీ చేశారు. డాక్టర్ డి.ఏసోబు కలిసి ఆమె విద్యార్థులకు మాత్రలు వేశారు. ప్రిన్సిపల్ మూర్తి, ఏఎన్ఎం బి.నాగరాణి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

మాచవరం: విద్యార్థినులకు వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు శారీరక ఆరోగ్యం ముఖ్యమని సాంఘిక సంక్షేమ ప్రభుత్వ గురుకుల డిగ్రీ కళాశాల (మహిళల)ప్రిన్సిపల్ వల్లూరి నీరజ పేర్కొన్నారు. కళాశాలలోని విద్యార్థినులకు ప్రాథమిక ఆరోగ్యకేంద్రం సిబ్బందితో కలిసి నులిపురుగుల నివారణ మాత్రలు పంపిణీ చేశారు. ఐక్యూఏసీ సమన్వయకర్త శ్రీఅరుణ, ఎన్ఎస్ఎస్ అధికారి లావణ్య, సుధారాణి తదితరులు పాల్గొన్నారు.

అజిత్‌సింగ్‌నగర్: అల్బెండజోల్ మాత్రలతో నులి పురుగులను నిర్మూలించవచ్చని కార్పొరేటర్ సుల్తానా, డాక్టర్ జాహ్నవి అన్నారు. మంగళవారం అజిత్‌సింగ్‌నగర్‌లోని ఎం.కె.బేగ్ మున్సిపల్ పాఠశాలలో విద్యార్థులకు నులిపురుగుల నివారణ మాత్రలు వారు పంపిణీ చేశారు. కడుపు నొప్పి, ఆకలి లేకపోవడం, బరువు తగ్గడం, చర్మంపై దద్దుర్లు, రక్తహీనత వంటి సమస్యలను అధిగమించవచ్చని చెప్పారు.

బాలికతో అసభ్య ప్రవర్తన.. జైలు

పాయకాపురం, న్యూస్‌టుడే : బాలికతో అసభ్యకరంగా ప్రవర్తించిన కేసులో నిందితుడికి మూడు సంవత్సరాల కఠిన కారాగార శిక్ష, రూ.2500లు జరిమానా విధిస్తూ పోక్సో కోర్టు జడ్జి వేల్పుల భవానీ మంగళవారం తీర్పు ఇచ్చారు. 2014, నవంబరు 7వ తేదీన ఎల్బీఎస్ నగర్‌లో నివసించే బాలిక (17) కళాశాలకు వెళ్లి తిరిగి ఇంటికి వస్తోంది. ఈ క్రమంలో గోగుల మూడి అశోక్ చక్రవర్తి అనే యువకుడు.. ప్రేమిస్తున్నానని ఆమె వెంటపడ్డాడు. బాలిక ఇంటికి వెళ్లి.. ఈ విషయాన్ని తల్లిదండ్రులకు చెప్పింది. వారు చక్రవర్తి తల్లిదండ్రులకు, పెద్దలకు చెప్పి అతడికి కౌన్సెలింగ్ ఇచ్చారు. అదే రోజు.. అతడు బాలిక వద్దకు వెళ్లి ఆమెతో అసభ్యకరంగా ప్రవర్తించడంతో బాధితురాలు నున్న పోలీసులకు ఫిర్యాదు చేసింది. అప్పటి ఎస్సై జయచంద్ర కేసు కట్టి, విచారణ చేపట్టారు. నిందితుడిపై నేరం రుజువైంది. అతడికి జైలు శిక్ష విధిస్తూ మంగళవారం జడ్జి తీర్పు ఇచ్చారు. ఈ కేసులో ప్రాసిక్యూషన్ తరపున స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ గద్దం రాజేశ్వరరావు, సీఎంఎస్ ఇన్‌స్పెక్టర్ జగదీశ్వరరావు, సీఐ కృష్ణమోహన్ పర్యవేక్షణలో ఐదుగురు సాక్షులను విచారించారు.

నిధులు వచ్చేలా చూడండి..

మాట్లాడుతున్న సత్తిబాబు

గవర్నర్‌పేట, న్యూస్‌టుడే : విజయవాడ నగరపాలకసంస్థకు రావాల్సిన నిధులను స్థానిక శాసనసభ్యులు, ఎంపీలు తీసుకువచ్చేలా కృషి చేయాలని సీపీఎం ఫ్లోర్‌లీడర్ బోయి సత్తిబాబు కోరారు. ఈ నెల 18న జరగాల్సిన కౌన్సిల్ సమావేశాన్ని 21కి మార్చడం నిబంధనలకు విరుద్ధమన్నారు. మంగళవారం గవర్నర్‌పేటలోని శ్రీశ్రీభవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. నగరానికి రావాల్సిన నిధుల బకాయిలను విడుదల చేయకుండా కూటమి ప్రభుత్వం మొండి చేయి చూపించిందని విమర్శించారు. నగరపాలకసంస్థ సమావేశాలకు శాసనసభ్యులు హాజరై.. సమావేశం ఎజెండాపై చర్చించలేదన్నారు. నగరంలోని 19 రోడ్లను 24 కిలోమీటర్ల మేర పీపీపీ పద్ధతిలో అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులను కౌన్సిల్‌లో వ్యతిరేకించినప్పటికీ.. అదే మెమో జారీ చేయడం సముచితం కాదన్నారు. ఇప్పటికైనా ఎంపీ, ఎమ్మెల్యేలు ఈ నెల 21న జరిగే సమావేశానికైనా హాజరుకావాలని కోరారు. నగరపాలకసంస్థకు వివిధ పద్దుల కింద రావాల్సిన రూ.1,200 కోట్లు రాబట్టలేకపోవడం దురదృష్టకరమని ఆయన పేర్కొన్నారు.

వేధింపులపై వివాహిత ఆత్మహత్యాయత్నం

భర్త.. అత్త.. మరుదులపై కేసు

మధురానగర్, న్యూస్‌టుడే : పెళ్లై ఆరు సంవత్సరాలైన అదనపు కట్నం తీసుకురావాలని వేధించడమే కాకుండా సమీప బంధువుతోనే వివాహేతర సంబంధం పెట్టుకుని వేధిస్తున్న భర్త, అతని కుటుంబసభ్యులపై ఓ యువతి అజిత్‌సింగ్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. న్యూఆర్‌ఆర్‌పేటకు చెందిన యువతికి.. 2019లో వివాహమైంది. భర్తతో కలిసి కాపురానికి వచ్చింది. నాలుగో రోజే తన భర్త మత్తు బిళ్లలు వేసుకోవడంతో ఆసుపత్రిలో చేర్చారు. తల నొప్పితో బిళ్లలు వేసుకుంటానని చెప్పడంతో ఊరుకున్నారు. తరచూ మద్యం తాగి వచ్చి, గొడవ పెట్టుకునేవాడని వాపోయారు. కట్నం కింద ఇచ్చిన బంగారు ఆభరణాలను అమ్మేశాడని ఆమె ఫిర్యాదులో పేర్కొన్నారు. తన సమీప బంధువైన మహిళతో వివాహేతర సంబంధం కొనసాగిస్తూ.. తనను శారీరకంగా, మానసికంగా వేధిస్తున్నాడని చెబుతున్నారు. అతనికి అత్త, మరుదులు వత్తాసు పలుకుతున్నారని పేర్కొన్నారు. ఇటీవల స్నానం చేసి దుస్తులు మార్చుకుంటుండగా మరిది వచ్చి అసభ్యంగా ప్రవర్తించాడు. అత్తింటి వారి వరుస వేధింపులు తట్టుకోలేక.. ఆత్మహత్యాయత్నం చేశారు. ఆసుపత్రి నుంచి డిశ్చార్జి అయ్యాక.. సోమవారం రాత్రి అజిత్‌సింగ్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈమేరకు వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

యువతికి నగ్న చిత్రాలు పంపి వేధింపులు

సూర్యారావుపేట, న్యూస్‌టుడే : సూర్యారావుపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో నివసించే ఒక యువతికి నగ్న చిత్రాలు, వీడియోలు, మేసేజ్‌లు పంపి వేధిస్తున్న మదన్‌మోహన్ అనే యువకుడిపై పోలీసులు కేసు నమోదు చేశారు. గత నెల 22న మధ్యాహ్నం ఆమె చరవాణికి నగ్న చిత్రాలు, వీడియోలు వచ్చాయి. వీటిని తనకు పరిచయం ఉన్న మదన్ మోహన్ నంబరు నుంచి వచ్చాయని గుర్తించారు. తనను అవమానపరిచేలా, తన గోప్యతకు భంగం కలిగేలా ఫొటోలు, వీడియోలు పంపి వేధిస్తున్నాడంటూ బాధితురాలు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిపై సూర్యారావుపేట పోలీసులు బీఎన్ఎస్ 67ఎ (లైంగిక వేధింపులు) ఐటీఏ 2000-2008 యాక్ట్ ప్రకారం కేసు నమోదు చేశారు.

జిలేబీ బండి ధ్వంసం.. ఆపై బెదిరింపులు

గవర్నర్‌పేట, న్యూస్‌టుడే : బీసెంట్ రోడ్డులో జిలేబీ బండిని ధ్వంసం చేయడమే కాకుండా యజమాని శివరామిరెడ్డి అనే వృద్ధుడిని, సిబ్బందిని చంపుతానంటూ బెదిరించిన ఒగ్గు గణేష్‌పై గవర్నర్‌పేట పోలీసులు సోమవారం రాత్రి కేసు నమోదు చేశారు. భవానీపురానికి చెందిన శివరామిరెడ్డి.. గత 35 సంవత్సరాలుగా బీసెంట్ రోడ్డు మేనకా హోటల్ సమీపంలో జిలేబీ బండి పెట్టుకుని వ్యాపారం చేసుకుంటున్నారు. ఇతని వద్ద ఇద్దరు వ్యక్తులు పని చేస్తున్నారు. గత నెల 24న ఒగ్గు గణేష్ అనే యువకుడు వచ్చి గొడవ పెట్టుకున్నాడు. బండిని అక్కడి నుంచి తీసేయాలని. . లేని పక్షంలో చంపుతానంటూ బెదిరించాడు. బండి అద్దాన్ని పగలకొట్టి.. వెళ్లిపోయాడు. తరచూ వచ్చి.. ఖాళీ చేయమని బెదిరిస్తున్నాడు. శివరామిరెడ్డి గవర్నర్‌పేట పోలీసులకు ఫిర్యాదు చేయగా.. వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆటో డ్రైవర్‌పై కేసు

సూర్యారావుపేట, న్యూస్‌టుడే : మద్యం మత్తులో అతి వేగంగా ఆటోను నడిపి.. బెంజ్ కారును ఢీ కొట్టిన ఆటోడ్రైవర్‌పై సూర్యారావుపేట పోలీసులు సోమవారం రాత్రి కేసు నమోదు చేశారు. కేదారేశ్వరపేటకు చెందిన జగన్నాథ్.. గత నెల 25వ తేదీ సాయంత్రం తన బెంజ్ కారులో దుర్గాపురం వచ్చారు. వాటర్ ప్లాంట్ ఆటో డ్రైవర్ వేగంగా ఆటోను నడుపుతూ కారును ఢీ కొట్టారు. దీనిపై సోమవారం రాత్రి పోలీసులకు ఫిర్యాదు చేయగా.. కేసు నమోదు చేశారు.

14వ అడిషనల్ డిస్ట్రిక్ట్ మరియు సెషన్స్ జడ్జి కోర్టు, విజయవాడ
F.C.O.P. 711/2025
BETWEEN
గంట దుర్గా భవాని ... Petitioner
Vs
గంట శ్రీను - Respondent
పిటిషనర్ తరపున దాఖలు చేసుకున్న పేపరు ప్రకటన
To
రెస్పాండెంట్:
గంట శ్రీను, S/o. కన్న, R/o. A Block, 230, వాంబే కాలనీ, అజిత్‌సింగ్ నగర్, విజయవాడ, కృష్ణా జిల్లా, ఆంధ్రప్రదేశ్- 520 015 యీ పై నెంబరు దావాలో రెస్పాండెంట్ అయిన మీరు శ్రీ కోర్టు వారి ద్వారా ఎన్నిసార్లు నోటీసులు పంపినను తీసుకోనందున యీ పేపరు ప్రకటన ద్వారా మీకు నోటీసులు ఆర్డర్ వేసినారు. ది. 23-02-2026న సదరు దావా వాయిదా అయ్యి ఉన్నది. ఆ రోజున యీ పై కోర్టులో మీరు గాని, మీ తరపు ప్లీడర్ గాని హాజరై మీ ఆక్షేపణలు తెలువగలరు. లేని యెడల, ఈ దావా మీ పరోక్షములో జరుగును.
వాయిదా: 23-02-2026
గంట దుర్గా భవాని, పిటిషనర్

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 98496 97616

ఈనాడు అనకాపల్లి

దిగుబడి పెరిగింది.. ధర తగ్గింది

కేజీ టమాటా రూ. 8

అచ్యుతాపురం, న్యూస్‌టుడే: కలిసి వస్తుందనుకున్న టమాటా సాగు రైతులను నిండాముంచింది. గతంలో ఎన్నడూలేని విధంగా ధర పడిపోవడంతో రైతులు లబోదిబోమంటున్నారు. పంట విస్తారంగా పండటం.. ఒకేసారి దిగుబడులు రావడం ధరలు పడిపోవడానికి కారణమని చెబుతున్నారు. నెల రోజులు క్రితం కేజీ టమాటా రూ. 30 నుంచి రూ. 40 వరకు పలకగా ఇప్పుడు కేజీ రూ. ఎనిమిదికి పడిపోయింది. కళ్లముందు కుళ్లిపోతున్న టమాటాను చూసి ఉండలేక మార్కెట్‌కు తీసుకొచ్చిన రైతులకు బరువుమోత తప్ప మిగిలింది ఏమీ కనిపించడం లేదు. కనీసం రవాణా ఖర్చులూ రాకపోవడంతో పొలం వద్దే కొందరు విడిచిపెడుతున్నారు.

★ జిల్లాలో అచ్యుతాపురం, ఎలమంచిలి, కశింకోట, మునగపాక, నర్సీపట్నం, మాకవరపాలెం, ఎస్.రాయవరం, నక్కపల్లి, పరవాడ మండలాల పరిధిలో మెట్ట భూముల్లో ఎక్కువగా టమాటా సాగు చేస్తుంటారు. వాతావరణ పరిస్థితులు అనుకూలంగా ఉండటం, గతేడాది సాగు కలిసిరావడం, నీరు పెద్దగా అవసరం లేకపోవడంతో రైతులు ఈ ఏడాది కొండంత ఆశతో సాగుకు సిద్ధమయ్యారు. దోసూరు, మడుతూరు, ఆవసోమవరం, భోగాపురం, జంగుళూరు, అచ్యుతాపురం, చోడపల్లి గ్రామాల పరిధిలో భారీగా టమాటా సాగుచేశారు. రైతులు ఎంతో ఆశతో నాటిన పంట ఎటువంటి తెగుళ్లు రాకుండా విస్తారంగా పండినా కనీస ధర రాకపోవడంతో రైతులు ఇబ్బంది పడుతున్నారు.

నాణ్యత డొల్ల.. రోడ్డు గుల్ల

ఈనాడు డిజిటల్, అనకాపల్లి

గత ప్రభుత్వంలో నాయకులు అందినకాడికి జేబులు నింపుకొనే ప్రయత్నాల్లో భాగంగా రోడ్ల నిర్మాణాల్లో అధికారులతో కలిసి నాణ్యతకు నీళ్లొదిలేశారు. దాని ఫలితం

పగుళ్లిచ్చిన బొజ్జన్నకొండ రోడ్డు

ఇప్పుడు కళ్లకు కట్టినట్టు కనిపిస్తోంది. రెండు దశాబ్దాలు నిలవాల్సిన రోడ్డు రెండేళ్లకే బీటలు వారి నాణ్యతాలోపాన్ని ఎత్తిచూపుతోంది.

★ ప్రముఖ బౌద్ధక్షేత్రం బొజ్జన్నకొండ వచ్చే మార్గం గుంతలమయంగా ఉండటంతో పర్యాటకులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. వైకాపా ప్రభుత్వ పాలనాకాలం చివరిలో శంకరం నుంచి బొజ్జన్నకొండ వరకు ఏలేరు గట్టుకు ఆనుకుని ఉన్న మార్గంలో ఎంపీ ల్యాడ్స్ రూ. 97 లక్షలతో రోడ్డు మంజూరు చేశారు. ఈ రోడ్డు పంచాయతీరాజ్ శాఖ పరిధిలో ఉంది. అసెంబ్లీ ఎన్నికలు ఆదరాబాదరాగా చేపట్టి పనులు పూర్తయ్యాయి అనిపించారు.

★ నిబంధనల ప్రకారం ఈ సీసీ రోడ్డు 25 సెంటీమీటర్ల ఎత్తులో వేయాలి. కానీ.. ఎక్కడా అంత ఎత్తు లేదు. సాధారణంగా సీసీ రోడ్డు దాదాపు 20 ఏళ్లపాటు మన్నుతుంది. కానీ.. ఈ రోడ్డు అప్పుడే బీటలువారింది. చాలా చోట్ల అప్పుడే మరమ్మతులు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ రోడ్డు నిర్మాణంలో పంచాయతీరాజ్ అధికారులతో వైకాపా నేతలు కుమ్మక్కై కనీసం నిబంధనలు పాటించకుండా రోడ్డు వేసి జేబులు నింపుకొన్నారని తీవ్రంగా ఆరోపణలు వెలువడ్డాయి.

ధ్వంసమైన చోట్ల బాగుచేయిస్తాం..: శంకరం నుంచి బొజ్జన్నకొండ వరకు గతంలో రోడ్డు వేశాం. భారీ లోడుతో క్వారీ లారీలు రాకపోకలు సాగించడంతో పాడయింది. పూర్తిస్థాయిలో ధ్వంసమైతే బాగుచేయిస్తాం.
– శివప్రసాద్, పంచాయతీరాజ్ ఈఈ

కొరవడిన నిర్వహణ..

కేంద్ర ప్రభుత్వ నిధులతో చేపట్టిన ఈ రోడ్డు నిర్వహణ బాధ్యత ఐదేళ్ల పాటు గుత్తేదారుదే. కానీ అధికారులు కనీసం ఇప్పటికరకు రోడ్డు ఎలా ఉందో పర్యవేక్షించలేదు. గ్రామీణ ప్రాంతం నుంచి క్వారీ నుంచి వాహనాలు రాకపోకలు సాగించేవి. దీంతో రోడ్డు ఏడాదిన్నరకే ఛిద్రం అయ్యింది. దీంతోపాటు రోడ్డుకు ఇరువైపులా వేసిన సోలార్ లైట్లు కొన్నిచోట్ల దొంగతనానికి గురయ్యాయి. మరికొన్ని వెలగడం లేదు. రోడ్డు పాడైన చోట్ల మరమ్మతులు చేపట్టాలని అధికారులు ఇప్పటికీ కనీసం గుత్తేదారుకు నోటీసులు కూడా ఇవ్వలేదు. కొన్నాళ్ల క్రితం శంకరం గ్రామానికి చెందిన కొంత మంది కలెక్టర్‌కు దీనిపై ఫిర్యాదు చేసినా.. ఇప్పటికి ఏ చర్యలూ లేవు.

మినీ ఆరోగ్య కేంద్రాలుగా అంగన్‌వాడీలు

నర్సీపట్నం, బుచ్చెయ్యపేట, న్యూస్‌టుడే

అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు వైద్య సేవలు అందుబాటులోకి వచ్చాయి. ప్రథమ చికిత్స అందించేందుకు వీటిని మినీ ఆరోగ్య కేంద్రాలుగా తీర్చిదిద్దారు. వైకాపా ప్రభుత్వ ఐదేళ్ల పాలనలో అంగన్‌వాడీ కేంద్రాలు నిర్లక్ష్యానికి గురయ్యాయి. కూటమి సర్కారు వచ్చాక పోషకాహారం అందించడంతోపాటు ఆటపాటలతో పూర్వ ప్రాథమిక విద్య పక్కాగా అమలవుతోంది. ఇప్పుడు పిల్లల ఆరోగ్యానికి ప్రాధాన్యం ఇస్తున్నారు. అన్ని కేంద్రాలకు మెడికల్ కిట్లు అందజేశారు.

మందులను పరిశీలిస్తున్న సీడీపీవో లలితశ్రీ

★ జిల్లాలో 1,908 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. వీటికి ఐదేళ్లలోపు చిన్నారులు 65 వేల మంది వస్తున్నారు. 11 రకాల మందులతో కూడిన కిట్లు ఇటీవల సరఫరా అయ్యాయి. ఆడుకునే సమయంలో పిల్లలు కిందపడి గాయపడితే ప్రథమ చికిత్స అందించేందుకు [illegible] జ్వరం, దగ్గు, దురద, విరేచనాలు తగ్గడానికి సిరప్‌లు, చేతుల శుభ్రతకు శానిటైజర్, చెవిపోటు, కళ్ల ఎర్రబడటం వంటి సమస్యల నివారణకు

మందులు ఈ కిట్లలో ఉన్నాయి. వీటిని ఎప్పుడు ఎంత మోతాదులో ఉపయోగించాలన్న దానిపై సీడీపీవోలు అంగన్‌వాడీ కార్యకర్తలకు అవగాహన కల్పించారని **పీడీ సూర్యలక్ష్మి** చెప్పారు. గర్భిణులు, బాలింతలకూ ఈ కిట్లను వినియోగించవచ్చన్నారు.

పరిశ్రమల ప్రవాహం.. ఉపాధికి ప్రోత్సాహం

అచ్యుతాపురం, న్యూస్‌టుడే

కూటమి పాలనలో జిల్లాకు పారిశ్రామిక కళ వచ్చింది. అభివృద్ధి దిశగా వేగంగా అడుగులు వేస్తున్న ప్రభుత్వం పరిశ్రమలు, ఉపాధిపై దృష్టిసారించడంతో జిల్లా ముఖచిత్రమే మారిపోతోంది. పూడిమడక సమీపంలో రూ.1.2 లక్షల కోట్లతో ఎన్టీపీసీ గ్రీన్ హైడ్రోజన్ హబ్ ఏర్పాటుకు ప్రధాని నరేంద్రమోదీ శంకుస్థాపన చేసిన విషయం తెలిసిందే. మొదటి దశ పనులు చురుగ్గా జరుగుతున్నాయి. ఇది పూర్తయితే ప్రత్యక్షంగా 40 వేల మందికి, పరోక్షంగా 25 వేల మందికి ఉపాధి లభిస్తుంది.

➤ నక్కపల్లి వద్ద బల్క్‌డ్రగ్, మిత్తల్ స్టీల్ ప్లాంట్, రాంబిల్లి మండలంలో 160 ఎకరాల్లో గూగుల్ అనుబంధ సంస్థ రైడెన్ సెంటర్లు ఏర్పాటు కానున్నాయి. గతేడాది నవంబరు 11న సీఎం చంద్రబాబునాయుడు అచ్యుతాపురం సెజ్, నాన్‌సెజ్‌ల్లో రూ.1486 కోట్లతో 1,475 మందికి ప్రత్యక్షంగా, 2 వేల మందికి పరోక్షంగా ఉపాధి కల్పించే యొకహోమా టైర్ల తయారీ పరిశ్రమ, లారస్ ల్యాబ్స్ యూనిట్-

బ్లూజెట్ కంపెనీకి కేటాయించిన స్థలం

3, ఎస్ఎంఎస్ఈఏ కార్పొరేషన్ ఎల్ఎల్‌పీ పరిశ్రమలను వర్చువల్‌గా ప్రారంభించారు.

➤ బాలాజీ యాక్షన్ బిల్డ్‌వెల్ కంపెనీ, లారస్ బయో, లారస్ ల్యాబ్స్, లారస్ సింథసిస్, బయోపొర ఇండియా ఫార్మా స్యూటికల్స్, స్టైరెక్స్ లైఫ్ సైన్స్ కంపెనీల ఏర్పాటుకు శంకుస్థాపన చేసి శిలాఫలకం ఆవిష్కరించారు. ఈ ఆరు పరిశ్రమలు ఈ ప్రాంతంలో రూ.2.436 కోట్లు పెట్టుబడులు పెడుతుండగా 2840 మందికి ప్రత్యక్షం, మూడు వేల మందికి పరోక్షంగా ఉపాధి లభించనుంది.

➤ అచ్యుతాపురం, రాంబిల్లి మండలాల పరిధిలో ఏషియన్ పెయింట్స్, సెయింట్‌గోబైన్, పెప్సీ, లారస్, యొకహోమా టైర్ల తయారీ పరిశ్రమ, బ్రాండిక్స్ పార్కు, ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్, బాబా అణువిద్యుత్తు పరిశోధన కేంద్రం (బార్క్) వంటి ఎన్నో ప్రతిష్ఠాత్మకమైన కంపెనీలున్నాయి. బ్రాండిక్స్ అపెరల్ సిటీ పార్కులో 22 వేల మంది మహిళలు పని చేస్తుండగా 50 వేల మంది కార్మికులు సెజ్, నాన్‌సెజ్‌ల్లో ఉన్న 210 పరిశ్రమల్లో ఉపాధి పొందుతున్నారు.

➤ విశాఖ కేంద్రంగా జరిగిన బిజినెస్ సమ్మిట్‌లో ఒప్పందాలు కుదుర్చుకున్న మరికొన్ని పరిశ్రమలు ఇక్కడకు వచ్చే అవకాశముంది. అచ్యుతాపురం నాన్‌సెజ్‌లో 35 ఎకరాలు, సెజ్‌లో 250 ఎకరాలు భూమి ఖాళీగా ఉంది. వీటిలోనూ పరిశ్రమలు ఏర్పాటైతే అచ్యుతాపురం మరింత అభివృద్ధి చెందుతుంది.

28న బ్లూజెట్ పరిశ్రమకు శంకుస్థాపన

రాంబిల్లి మండలం పరిధిలో బ్లూజెట్ ఫార్మా కంపెనీ ఏర్పాటుకు మంత్రి లోకేశ్ ఈ నెల 28న భూమిపూజ చేయనున్నారు. దీని ద్వారా 1,750 మందికి పరోక్షంగా, రెండు వేల మందికి ప్రత్యక్షంగా ఉపాధి లభించనుంది. బ్లూజెట్‌తోపాటు ఈ ప్రాంతంలో 1200 మందికి ఉపాధి కల్పించే రీన్యూ ఫొటోవోల్టిక్ ప్రైవేట్ కంపెనీ, 2,216 మందికి ఉపాధి కల్పించే జుపిటర్ కంపెనీ, 300 మందికి ఉపాధి చూపే రిలయన్స్ కన్స్యూమర్ ప్రొడక్ట్ లిమిటెడ్, 800 మందికి ఉద్యోగాలు కల్పించే సెన్సీరా, 1500 మందికి ఉపాధి చూపే బాలాజీ యాక్షన్ షూ కంపెనీ, 222 మందికి ఉద్యోగులు అందించే కోకాకోలా కంపెనీ ఏర్పాటుకు సన్నాహాలు జరుగుతున్నాయి.

కల్యాణపులోవ ఉత్సవాల ఆదాయం రూ.17.81 లక్షలు

రావికమతం, న్యూస్‌టుడే: కల్యాణపులోవలో మహాశివరాత్రి సందర్భంగా ఈనెల 15 నుంచి 17 వరకు మూడు రోజుల పాటు నిర్వహించిన శివరాత్రి ఉత్సవాల ద్వారా ఆలయానికి రూ.17.81 లక్షల ఆదాయం వచ్చింది. మంగళవారంతో ఉత్సవాలు ముగియడంతో దేవాదాయశాఖ అధికారుల పర్యవేక్షణలో హుండీ ఆదాయాన్ని లెక్కించారు. హుండీల్లో కానుకల రూపంలో రూ. 11,48,362 వచ్చాయి. ప్రత్యేక దర్శనం టిక్కెట్లు ద్వారా రూ. 3,55,330, ప్రసాద విక్రయం ద్వారా రూ. 1,23,290, కేశఖండన ఆదాయం రూ. 44,275 వచ్చినట్లు ఈవో ఎస్.వి.వి.సత్యనారాయణ మూర్తి తెలిపారు. గతేడాది కంటే రూ. 4,38,477 పెరిగినట్లు ఆయన తెలిపారు.

హుండీ ఆదాయం లెక్కిస్తున్న భక్తులు

POLYCAB LT/HT Power & Control Cables
Stockist:

SPARK ENTERPRISES
DABAGARDENS, VISAKHAPATNAM.
CELL: 9963223454, 9849022345
e-mail: spa_ark2004@yahoo.com

డ్వాక్రా మహిళలకు మెరుగైన ఉపాధి అవకాశాలు

అచ్యుతాపురం, న్యూస్‌టుడే: డ్వాక్రా మహిళలకు మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పనే లక్ష్యంగా పనిచేస్తున్నామని జిల్లా జల యాజమాన్య సంస్థ (డీఆర్‌డీఏ) ప్రాజెక్టు డైరెక్టర్ కె.శచీదేవి తెలిపారు. అచ్యుతాపురం మండలం తంతడి - వాడపాలెం మత్స్యకార మహిళలు ఆధ్వర్యంలో జరుగుతున్న సముద్రపు నాచు పెంపకాన్ని జిల్లా మత్స్య అభివృద్ధి అధికారిణి విజయతో కలిసి మంగళవారం పరిశీలించారు. బోటులో వెళ్లి సముద్రపు నాచు పెంచుతున్న ప్రాంతాన్ని పరిశీలించారు. అనంతరం మహిళలతో మాట్లాడారు. సముద్రపు నాచుకి చాలా డిమాండ్ ఉందని.. సద్వినియోగం చేసుకోవాలన్నారు. పిల్లలు, పెద్దల ఆరోగ్యానికి ఇది చాలా మంచిదన్నారు. ఏపీఎం శ్రీనివాసరావు, కూటమి నాయకులు వంకా కృష్ణారావు, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

విన్యాసాలను తిలకించడానికి వచ్చిన నగరవాసులు

విశాఖపట్నం, న్యూస్‌టుడే: అంతర్జాతీయ ఫ్లీట్ రివ్యూ(ఐఎఫ్‌ఆర్)లో భాగంగా ఆర్కేబీచ్ కేంద్రంగా నిర్వహించే సిటీ పరేడ్, నౌకాదళ విన్యాసాలు, ఫైర్, డ్రోన్ షోల నిర్వహణకు రంగం సిద్ధమైంది. బుధవారం నమూనా విన్యాసాలు నిర్వహించి, గురువారం పూర్తిస్థాయి ప్రదర్శనకు ఏర్పాట్లు పూర్తి చేశారు.

‘నౌకా’ సంరంభం.. సాగర సంభ్రమం..!

పాస్‌లు తప్పనిసరి..

★ ఈనెల 19న నిర్వహించే అంతర్జాతీయ సిటీ పరేడ్‌లోని అన్ని కార్యక్రమాలను 18న పూర్తి స్థాయిలో ప్రదర్శిస్తారు. బీచ్‌రోడ్డులోని పార్క్‌హోటల్ కూడలి నుంచి కోస్టల్ బ్యాటరీ వరకు సాగే ఈ పరేడ్‌ను రెండు వైపుల నుంచి ప్రజలు, అతిథులు తిలకించేందుకు వీలుగా ఏర్పాట్లు చేశారు.

రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ముకు స్వాగతం పలుకుతున్న మేయర్ పీలా శ్రీనివాసరావు, మంత్రి డీబీవీ స్వామి, ఎంపీ శ్రీభరత్, సీపీ శంఖబ్రత బాగ్చీ, కలెక్టర్ హరేంధిరప్రసాద్

సీఎం చంద్రబాబుకు స్వాగతం పలుకుతున్న జేసీ విద్యాధరి

★ ఐఎఫ్‌ఆర్ నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు

★ పార్క్ హోటల్ నుంచి కోస్టల్‌బ్యాటరీ వరకు సిటీ పరేడ్

★ నేడు నమూనా విన్యాసాలు, రేపు పూర్తి స్థాయి ప్రదర్శన



భద్రత పటిష్ఠం తూర్పు నౌకాదళం ఆధ్వర్యంలో జరిగే కార్యక్రమాలకు సంబంధించి మూడు వారాల నుంచి జిల్లా అధికార యంత్రాంగం చేపట్టిన ఏర్పాట్లు కొలిక్కి వచ్చాయి. వివిధ దేశాలకు చెందిన యుద్ధనౌకలు, దేశ, విదేశీ ప్రముఖులు, త్రివిధ దళాలకు చెందిన ఉన్నతాధికారులు, విశ్రాంత ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు హాజరవుతున్న నేపథ్యంలో పోలీసు యంత్రాంగం పటిష్ఠ భద్రతా ఏర్పాట్లు చేసింది.

బ్యాండుతో కవాతు నిర్వహిస్తున్న విద్యార్థినులు

పార్కింగ్.. ఎల్ఈడీ తెరలు ★ నగరం నుంచి బీచ్‌రోడ్డుకు వచ్చే వారు కేజీహెచ్ డౌన్, పందిమెట్ట డౌన్, పాండురంగాపురం డౌన్‌తో పాటు వుడా పార్కు వైపు నుంచి విన్యాసాలు జరిగే ప్రాంగణానికి చేరుకోవచ్చు. ★ ఏపీఐఐసీ స్థలం, కోస్టల్‌బ్యాటరీ, ఏయూ మైదానాల్లో వాహనాల పార్కింగ్‌కు అవకాశం కల్పించారు. ★ బీచ్ వరకు రాలేకపోయిన వారికి సిటీ సెంట్రల్‌పార్క్, వుడా పార్క్, సిరిపురం కూడలి గురజాడ ప్రాంగణంలో భారీ ఎల్ఈడీ తెరలు ఏర్పాటు చేశారు.

గ్రేహౌండ్స్ స్పెషల్ ఫోర్సు కవాతు

★ ఇవి కాకుండా సాగరతీరంలో ఇసుక తిన్నెల పైనుంచి చూసేందుకు సాధారణ ప్రజలకు ఉచితంగానే అనుమతి ఉంటుంది. ఎక్కడా తొక్కిసలాటలు లేకుండా ఇనుపగ్రిల్స్‌తో ఎన్‌క్లోజర్లు సిద్ధం చేశారు.

ఫ్లీట్ రివ్యూ కోసం ఆర్కే బీచ్‌రోడ్డులో ఏర్పాటు చేసిన గ్యాలరీలు

నౌకను ఆయిల్ రిగ్‌తో పేల్చే నమూనా విన్యాసం

★ ఆర్కేబీచ్ నుంచి సబ్‌మెరైన్ మ్యూజియం వరకు 15 బ్లాకులు ఏర్పాటు చేశారు. ఆయా బ్లాకులకు అతిథులు, నౌకాదళం ఉద్యోగులు, ఇతర ముఖ్యులకు కేటాయించారు. బ్లాకుల్లోకి వెళ్లాలంటే ప్రతి ఒక్కరికీ పాస్ తప్పనిసరి.

కలెక్టర్ అంటే ఏంటో తెలుసా?

పాఠశాల తనిఖీలో విద్యార్థులకు సూటి ప్రశ్న

అచ్యుతాపురం, న్యూస్‌టుడే: ప్రభుత్వ పాఠశాలల్లో చదివితే ఎందుకు పనికిరామని అనుకోవద్దని.. ఉన్నత స్థానానికి చేరేలా పోటీ పడాలని కలెక్టర్ విజయకృష్ణన్ సూచించారు. అచ్యుతాపురం కస్తూర్బా బాలికా విద్యాలయంలో కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) కింద ఏటీసీ టైర్ల కంపెనీ నిర్మించిన రెండు డార్మెంటరీస్, 120 మంచాలను కలెక్టర్ మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడుతూ భవిష్యత్తులో మీరు ఏమవుతారని అడిగితే వెంటనే చాలామంది కలెక్టర్ అని సమాధానం చెబుతారని.. అసలు కలెక్టర్ అంటే ఏమిటని? ఏయే పనులు చేస్తారని విద్యార్థులను ప్రశ్నించారు. చాలామంది సమాధానం చెప్పలేకపోయారు. కలెక్టర్ అంటే జిల్లాలో ఉండే 91 శాఖలను సమన్వయం చేస్తూ పనిచేయాల్సి ఉంటుందని వివరించారు. విద్య పేదరికాన్ని తొలగించడంతోపాటు గుర్తింపు తీసుకొస్తుందన్నారు. విద్యలో ఎవరూ సాయం చేయరని.. కష్టపడి చదువుకోవడమే మార్గమన్నారు. సోషల్ మీడియా జోలికి పోవద్దని, తప్పుడు ఆలోచనలు చేయవద్దని కోరారు. ఏటీసీ టైర్ల కంపెనీ ప్రతినిధి కృష్ణంరాజు, జిల్లా విద్యాశాఖాధికారి అప్పారావునాయుడు, ఎంఈఓ దేవరాయల్ పాల్గొన్నారు.

విద్యార్థులకు బ్యాగులను అందిస్తున్న కలెక్టర్ విజయకృష్ణన్, ఏటీసీ కంపెనీ ప్రతినిధి కృష్ణంరాజు

శ్రద్ధాంజలి

ఉపాధ్యాయునిగా జీవితం ప్రారంభించి, తదుపరి ఎ.ఎమ్.ఎ.ఎల్. కళాశాలలో లెక్చరర్‌గా, రీడర్‌గా, శాఖాధిపతిగా, ప్రిన్సిపాల్‌గా అంచెలంచెలుగా ఉన్నత శిఖరాలు అధిరోహించి, విద్యార్థులకు, కళాశాలకు, ఎనలేని సేవలందించి.... అందరికీ మార్గదర్శకునిగా నిలిచిన మీరు తేది. 07-02-2026 శనివారం నాడు మమ్మలందరినీ విడిచి శివైక్యం చెందినందుకు చింతిస్తూ... మీ పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తూ...

కీ॥శే॥ శ్రీ మద్దిల శివప్రసాద్‌రావు గారు
1934 - 2026
రిటైర్డ్ ప్రిన్సిపాల్, AMAL కాలేజ్, అనకాపల్లి

భార్య: మద్దిల విజయలక్ష్మి

కుమారులు - కోడళ్ళు:
మద్దిల శివ సూర్యనారాయణ - విష్ణుప్రియ (లేటు)
మద్దిల శివ సుధాకర్ - భవాని
మద్దిల శివ శ్రీధర్ - మంజుల
మనుమలు, మనుమరాళ్ళు: ప్రణీత్, మానస, వికాష్, హర్ష, ప్రసన్న

సోదరుడు: మద్దిల శివశంకరరావు & ఫ్యామిలీ
స్నేహితులు, సహోద్యోగులు
మరియు కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు

పెద్దకర్మ: తేది. 18-02-2026 బుధవారం ఉ॥ 6 గం॥ల నుండి ఐ.ఎన్.ఎస్. కళింగ్ వెనుక, భీమిలి బీచ్‌రోడ్, విశాఖపట్నంలో మా స్వగృహము నందు జరుపబడును. సంతాపసభ అనంతరం నారాయణ సేవ (సంతర్పణ) ఉ॥ 11.00 గం॥ల నుండి హోటల్ విజయ రెసిడెన్సీ, RTC కాంప్లెక్స్ ఎదురుగా, అనకాపల్లి నందు జరుగును. Cell: 9959163395, 9160854226

సందర్భమేదైనా ఈనాడు ను చేసుకోండి వేదిక
మీ బంధుమిత్రులు, కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషులకు
ఈనాడు లో ప్రకటనల ద్వారా తెలియజేయండి
లీగల్ ప్రకటనలు
వేడుక ఏదైనా.. ఈనాడు ను చేసుకోండి వేదిక
జయంతి, వర్ధంతి
అంత్యక్రియలు
ఈనాడు యాడ్స్ ద్వారా తెలియజేయండి
ప్రకటనల కొరకు సంప్రదించండి
80087 09638

జన్మదిన శుభాకాంక్షలు
గౌ॥ శ్రీ డా॥ C.M. రమేష్ గారు
M.P, అనకాపల్లి
చైర్మన్, రైల్వే శాఖ పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ
గౌరవనీయులు గౌ॥ శ్రీ డా॥ C.M. రమేష్ గారికి జన్మదిన శుభాకాంక్షలు
కోరుపోలు రాజేష్
M.Com, Banking
BJP నాయకులు, అనకాపల్లి జిల్లా

జన్మదిన శుభాకాంక్షలు
అనకాపల్లి పార్లమెంట్ సభ్యులు గౌ॥ శ్రీ C.M. రమేష్ గారికి జన్మదిన శుభాకాంక్షలు
నండూరి పవన్‌కుమార్
బి.జె.పి.
గౌ॥ శ్రీ డా॥ C.M. రమేష్ గారు
MP, అనకాపల్లి
చైర్మన్: రైల్వే శాఖ పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ
AMRUTHA EDUCATIONAL INSTITUTIONS
INTERMEDIATE - NURSING - PHYSIOTHERAPY
PENDURTHI, VISAKHAPATNAM

జనహృదయనేతకు జన్మదిన శుభాకాంక్షలు
శ్రీ CM రమేష్ గారు
పార్లమెంట్ సభ్యులు, కేంద్ర రైల్వే బోర్డ్ చైర్మన్, అనకాపల్లి
మీ... KSNS రాజు
చోడవరం

జన్మదిన శుభాకాంక్షలు
మిత్రులు, శ్రేయోభిలాషి, అనకాపల్లి పార్లమెంట్ సభ్యులు గౌ॥ శ్రీ CM రమేష్ గార్కి జన్మదిన శుభాకాంక్షలు
గౌ॥ శ్రీ CM రమేష్ గారు
పార్లమెంట్ సభ్యులు, అనకాపల్లి
ప్రగడ నాగేశ్వరరావు
ఛైర్మన్: రాష్ట్ర రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్
ఇన్‌ఛార్జ్: తెలుగుదేశంపార్టీ, యలమంచిలి నియోజకవర్గం

(c) eenadu

పకడ్బందీగా పరీక్షల నిర్వహణ: కలెక్టర్

కలెక్టరేట్, న్యూస్‌టుడే: జిల్లాలో పదో తరగతి, ఇంటర్మీడియట్, ఓపెన్ స్కూల్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ విజయకృష్ణన్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో మంగళవారం పరీక్షల నిర్వహణ ఏర్పాట్లపై సంబంధిత శాఖల అధికారులతో సమీక్షించారు. జిల్లాలో 102 కేంద్రాల్లో పదో తరగతి పరీక్షలు జరుగుతాయన్నారు. రెగ్యులర్ 20,577 మంది, ప్రైవేటు 440 మంది, ఓపెన్ స్కూల్ పదో తరగతి పరీక్షలకు 531 మంది విద్యార్థులు హాజరవుతారన్నారు. ఇంటర్మీడియట్‌కు సంబంధించి ఆరు కేంద్రాల్లో 1398 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు చెప్పారు. అధికారులంతా సమన్వయంతో పనిచేసి పరీక్షల నిర్వహణ విజయవంతం చేయాలన్నారు. విద్యార్థులంతా సకాలంలో కేంద్రాలకు చేరుకొనేలా ఆర్టీసీ బస్సులు నడపాలన్నారు. విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఉండకూడదన్నారు. అన్ని పరీక్షా కేంద్రాలు వద్ద 144 సెక్షన్ అమలు చేయాలన్నారు. పరీక్షా పత్రాలకు, తనిఖీ బృందాలకు ఎస్కార్ట్ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. తపాలా సిబ్బందికి సహకరించాలన్నారు. ప్రైవేటు పాఠశాలల్లో ఎక్కడా మాస్ కాపీయింగ్ జరగకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలన్నారు. సమస్యాత్మక కేంద్రాల్లో అదనపు భద్రతా ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. ఇన్‌ఛార్జి డీఆర్వో వై. శ్రీనివాస్, జిల్లా విద్యాశాఖాధికారి అప్పారావు నాయుడు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ విజయకృష్ణన్

కూడళ్ల వద్ద రక్షణ చర్యలు

స్పందనకు వందనం

అనకాపల్లి కళాశాల కూడలి ఎల్లోమార్కింగ్

అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే: అనకాపల్లిలో జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదాలు నివారించేలా పోలీసులు చర్యలు చేపట్టారు. 'ఈనాడు'లో మంగళవారం 'జంక్షన్.. టెన్షన్!' శీర్షికతో ప్రచురితమైన వార్తకు స్పందించిన పోలీసులు కొత్తూరులోని కళాశాల కూడలిలో బ్లాక్ స్పాట్ తెలిపేలా ఎల్లో మార్కింగ్ వేశారు. రక్షణ చర్యల్లో భాగంగా రహదారిపై మార్కింగ్ వేశారు. రోడ్డు ప్రమాదాలను నివారించేలా బ్లాక్ స్పాట్‌ల వద్ద వాహన రాకపోకలు, రహదారి నిబంధనలు పాటించేలా చూడడంపై ప్రత్యేక దృష్టి సారించినట్లు అనకాపల్లి ట్రాఫిక్ సీఐ వెంకట నారాయణ తెలిపారు.

అచ్యుతాపురంలో భారీ అగ్ని ప్రమాదం

రూ. 2.5 కోట్లకు పైగా ఆస్తి నష్టం

అచ్యుతాపురం, న్యూస్‌టుడే: అచ్యుతాపురం ప్రత్యేక ఆర్థిక మండలి (సెజ్) రోడ్డులో మంగళవారం భారీ అగ్ని ప్రమాదం సంభవించింది. మండలంలోని మోసయ్యపేటకు చెందిన కోన వెంకటరావు పూడిమడక రోడ్డులో దుకాణం అద్దెకు తీసుకుని కేఆర్ మార్ట్ పేరుతో కిరాణా, ప్లాస్టిక్, స్టేషనరీ, హౌస్‌కీపింగ్ సామగ్రి విక్రయించే దుకాణం నడుపుతున్నారు. ఈ దుకాణం వెనుకనే గోదాం ఏర్పాటు చేసుకున్నారు. ఈ గోదాం నుంచి మధ్యాహ్నం సమయంలో పొగ రావడాన్ని ఎదురుగా ఉన్న మరో దుకాణదారుడు గుర్తించి అప్రమత్తం చేశారు.

ప్రమాదంపై ఆరా తీస్తున్న పరవాడ డీఎస్పీ విష్ణుస్వరూప్

అప్పటికే మంటలు రావడంతో వీటిని అదుపు చేయడానికి యత్నించినా వీలుకాలేదు. దీంతో చేసేదేం లేక విలువైన సామగ్రిని రక్షించుకునే ప్రయత్నం చేశారు.

కంపెనీలను శుభ్రం చేయడానికి ఉపయోగించే రసాయనాలు, ప్లాస్టిక్ వస్తువులకు మంటలు అంటుకోవడంతో క్షణాల్లో దుకాణం, గోదాం మొత్తం వ్యాపించాయి. మండే స్వభావం కలిగిన రసాయనాలు కావడంతో మంటలు ఎగిసిపడ్డాయి. మంటల ధాటికి గోదాం నిర్మించిన ఇనుప రేకులు సైతం కాలిపోయి కరిగిపోయాయి. ఏపీఐఐసీ, ఎలమంచిలి, అనకాపల్లి, విశాఖ, లార్స్ పరిశ్రమలకు చెందిన అగ్నిమాపక వాహనాలతో సిబ్బంది మంటలు అదుపు చేయడానికి ఎంతగా ప్రయత్నించినా వీలుకాలేదు. ఎగిసిపడుతున్న మంటలు, దట్టమైన పొగ కమ్మేయడంతో అచ్యుతాపురంలో ప్రజలంతా ఆందోళనకు గురయ్యారు. వందలాదిమంది ఘటనాస్థలానికి చేరుకొన్నారు. ఈ ప్రమాదంలో రూ. రెండున్నర కోట్ల వరకు ఆస్తినష్టం జరిగిందని బాధితులు లబోదిబోమన్నారు. మంటలను అదుపు చేయడానికి వినియోగించే నురగ లేకపోవడంతో అదుపులోకి రాలేదు. వచ్చిన వాహనాలన్నీ నీటితోనే వీటిని ఆర్పడానికి ప్రయత్నించగా వీలుకాలేదు. నీరుపడిన పడిన వెంటనే మంటలు మరింత ఉవ్వెత్తున ఎగిసిపడ్డాయి. నాలుగు గంటలపాటు అగ్నిమాపక సిబ్బంది కష్టపడి మంటలు అదుపులోకి తీసుకొచ్చారు. పరవాడ డీఎస్పీ విష్ణుస్వరూప్, అచ్యుతాపురం సీఐ చంద్రశేఖరరావు, ఎస్సై సుధాకరరావు సంఘటన స్థలానికి చేరుకుని చుట్టుపక్కల ఇళ్లు, దుకాణాలకు మంటలు అంటుకోకుండా జాగ్రత్తలు తీసుకున్నారు.

దగ్ధమవుతున్న గోదాం, అలుముకున్న పొగ

మాజీ జాయింట్ సబ్‌రిజిస్ట్రార్‌పై చర్యలు నిలిపివేస్తూ ఉత్తర్వుల జారీ

ఎలమంచిలి, న్యూస్‌టుడే: గతంలో ఎలమంచిలిలో సబ్ రిజిస్ట్రార్‌గా పనిచేసిన కె.కె.సత్యనారాయణపై చర్యలు నిలిపివేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. సరిగా పరిశీలించకుండా అమ్మకం రిజిస్ట్రేషన్ చేశారని ఈయనపై అప్పట్లో శాఖాపరమైన చర్యలు తీసుకున్నారు. దీనిపై స్టాంప్స్, రిజిస్ట్రేషన్ శాఖ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్‌ను విచారణాధికారిగా నియమించారు. ఆరోపణలపై దర్యాప్తు జరపగా ఈయన ఉద్దేశపూర్వకంగా తప్పు చేయలేదని తేలడంతో ఈయనపై ఎటువంటి చర్యలు తీసుకోవద్దని ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చింది. విధి నిర్వహణలో నిర్లక్ష్యం కనిపించలేదని పేర్కొంది.

గిరిజన బాలికలు క్షేమంగా అప్పగింత

నర్సీపట్నం అర్బన్: అల్లూరి సీతారామరాజు జిల్లా లంబసింగి గిరిజన సంక్షేమ హాస్టల్ నుంచి ఎవరికీ చెప్పకుండా నర్సీపట్నం వచ్చి అనుమానాస్పదంగా తిరుగుతున్న ఇద్దరు బాలికలను స్థానికులు గుర్తించి పోలీసుల దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన సీఐ ఎస్.కె.గఫూర్ సిబ్బందిని అప్రమత్తం చేశారు. ఈ బాలికలను బస్టాండులో గమనించి వీరిద్దరిని సోమవారం రాత్రి పట్టణంలోని గిరిజన సంక్షేమ బాలికల హాస్టల్‌లో ఉంచారు. బంధువులను పిలిపించి బాలికలను మంగళవారం అప్పగించారు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము-పశు సంవర్ధక శాఖ
అద్దె రవాణా వాహనము కొరకు ప్రకటన
ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలోని కృత్రిమ గర్భోత్పత్తి కేంద్రాలకు ద్రవనత్రజని, వీర్యనాళికల రవాణా నిమిత్తము 17x7 సైజు గల వాహనము ఒక సంవత్సర కాలము నడుపుటకు సీల్డు కవరు టెండర్లు కోరడమైనది. టెండరు ఫారంలు ఈ దిగువ పని దినములలో అనగా తేది.18.02.2026 నుండి 25.02.2026 వరకు లభించును. సంప్రదించవలసిన చిరునామా- కార్యనిర్వాహణాధికారి, జిల్లా పశుగణాభివృద్ధి సంఘం, పోలీస్ క్వార్టర్స్ లేన్, రామాలయం ఎదురుగా, హనుమంతవాక జంక్షన్, విశాఖపట్నం-530043,
ఫోన్ నెంబరు: 8008204158, 7013949375.
కార్యనిర్వాహణాధికారి
జిల్లా పశుగణాభివృద్ధి సంఘం, విశాఖపట్నం-43

ఘనంగా ముగిసిన పోతురాజుబాబు జాతర

చివరి రోజు పుణ్యస్నానాలు ఆచరిస్తున్న భక్తులు

రావికమతం, న్యూస్‌టుడే: మహాశివరాత్రి సందర్భంగా కల్యాణపులోవలో ఈనెల 15 నుంచి 17 వరకు వైభవంగా జరిగిన శివరాత్రి ఉత్సవాలు మంగళవారంతో ముగిశాయి. ఈ ఉత్సవాలకు ఉత్తరాంధ్ర జిల్లాల వ్యాప్తంగా 2.5 లక్షల మంది తరలివచ్చి స్వామిని దర్శించుకున్నట్లు దేవాదాయశాఖ అధికారులు తెలిపారు. తొలి రోజు ఆదివారం లక్ష మంది, రెండో రోజు సోమవారం 1.2 లక్షల మంది వారిని దర్శించుకోగా చివరిరోజు మంగళవారం 30 వేలమంది దర్శించుకున్నారు. ఈ ఏడాది ఉత్సవాలు ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్.రాజు ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. భక్తులు అసౌకర్యానికి గురికాకుండా తగిన ఏర్పాట్లు చేశారు. దాదాపు నెల రోజుల ముందు నుంచి ఎమ్మెల్యే ఎప్పటికప్పుడు ఏర్పాట్లు జరుగుతున్న తీరును సమీక్షించి యంత్రాంగానికి సూచనలు చేశారు. ప్రత్యేకంగా రూట్‌మ్యాప్‌ను ప్రణాళిక ప్రకారం పనిచేశారు.

వాహనాల కోసం ప్రత్యేక రోడ్డు

గత ఏడాది వరకు కల్యాణపులోవలో వాహనాలు నిలిపివేసే అక్కడి నుంచి ఆలయం వరకు నడక కల్పించడం వెళ్లేవారు. ఈ ఏడాది పరిస్థితి లేకుండా కల్యాణపులోవ నుంచి ప్రధాన ఆలయం వరకు దగ్గరదారిగా మట్టి రోడ్డు నిర్మించారు. 2 ఎకరాల విస్తీర్ణంలో వాహనాల పార్కింగ్‌ను సౌకర్యం కల్పించారు. ఈ ఏడాది జాతరకు ఆర్టీసీ 80 సర్వీసులు నడిపింది.

భక్తులకు అన్న సమారాధన

జాతర జరిగిన ఆది, సోమ, మంగళవారాల్లో మూడు రోజులపాటు భక్తుల కోసం ఉచిత భోజనం ఏర్పాట్లు చేశారు. ఎమ్మెల్యే రాజు సొంత నిధులతోనే భక్తులకు ఉచిత భోజన వసతి కల్పించారు. ఐదు చోట్ల వంటశాలలు, భోజనశాలలు ఏర్పాటు చేసి 28 ప్రత్యేక కౌంటర్ల ద్వారా భోజనాలు వడ్డించారు. తెదేపా నాయకులు కార్యకర్తలు బాధ్యతలు సక్రమంగా నిర్వర్తించారు. జాతర సేవలో 500 మంది ఉద్యోగులు పని చేశారు. జాతర ప్రశాంతం ముగియడంతో భక్తులు అధికారులు, పోలీసుల సేవలను ప్రశంసిస్తున్నారు.

తిరుమల విద్యార్థుల సత్తా

అంకిత్ అభినవ్ అఖిల వెంకటసూర్యకిరణ్

పాయకరావుపేట, న్యూస్‌టుడే: జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో పాయకరావుపేట తిరుమల విద్యా సంస్థ విద్యార్థులు సత్తా చాటారు. సంస్థకు చెందిన కోలా అంకిత్ 99.53, దుగ్గాడ అభినవ్ 99.31, ఎల్లపు అఖిల 98.91, గనిరెడ్డి వెంకట సూర్యకిరణ్ 98.13 పర్సంటైల్ సాధించారని ఛైర్మన్ నున్న తిరుమలరావు తెలిపారు. 98 పర్సంటైల్ పైన నలుగురు, 95 పైన 10 మంది, 90 పర్సంటైల్ పైన 28 మందికి వచ్చాయని వివరించారు. పాయకరావుపేటలో స్థాపించిన మొదటి బ్యాచ్ కొద్దిమంది విద్యార్థులతోనే అత్యుత్తమ ఫలితాలు సాధించామని తిరుమలరావు అన్నారు. ప్రతిభ చూపిన విద్యార్థులను, అధ్యాపకులను ఆయన అభినందించారు.

రాష్ట్రస్థాయి చదరంగం పోటీలకు ఎంపిక

చదరంగం ఆడుతున్న క్రీడాకారులు

అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే: జిల్లాస్థాయి చదరంగం పోటీల్లో క్రీడాకారులు ప్రతిభ చూపారు. గ్రామీణ ప్రాంతాల క్రీడాకారుల ప్రతిభను వెలికితీసేలా రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న శాప్ లీగ్ క్రీడా పోటీల్లో భాగంగా ఎన్టీఆర్ క్రీడామైదానంలో మంగళవారం జిల్లాస్థాయి చెస్ (చదరంగం) పోటీలు జరిగాయి అండర్ 13, 15, 17, 19 విభాగాల్లో జరిగిన పోటీల్లో ప్రతిభ చూపిన వారిని రాష్ట్రస్థాయికి ఎంపిక చేశారు. వీరు తిరుపతిలో ఈనెల 21, 22 తేదీల్లో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని జిల్లా క్రీడాభివృద్ధి అధికారిణి పూజారి శైలజ తెలిపారు. ఈ నెల 24న అనకాపల్లిలో జిల్లా స్లో సైక్లింగ్ పోటీలు జరుగుతాయని... ఆసక్తి ఉన్న క్రీడాకారులు ఆన్‌లైన్‌లో నమోదుచేసుకోవాలని సూచించారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులను స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి కె.ఎం.ఎల్. నాయుడు, ఎంనాగేశ్వరరావు, సుధీర్, ఎస్.వి.నరసింహరావు అభినందించారు.

షూటింగ్ బాల్ పోటీల్లో ఖాజీపాలెం విద్యార్థుల ప్రతిభ

విద్యార్థులను అభినందిస్తున్న పాఠశాల ప్రధానోపాధ్యాయులు శేషు, ఉపాధ్యాయులు

అచ్యుతాపురం, న్యూస్‌టుడే: రాష్ట్రస్థాయి షూటింగ్ బాల్ పోటీల్లో ఖాజీపాలెం జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ చూపించారు. ఈ పోటీలు సత్యసాయి జిల్లాలోని ధర్మవరంలో జరిగాయి. జిల్లా నుంచి పాల్గొన్న బి.నవదీప్, కె.హేమశేఖర్, ఎ.లలితకుమార్, ఎం.భానుప్రసాద్ ప్రతిభ చూపించి బంగారు పతకాలు, ధ్రువపత్రాలు పొందారు. ప్రతిభ చూపించిన విద్యార్థులు, వ్యాయామోపాధ్యాయుడు దినకరన్‌ను పాఠశాల ప్రధానోపాధ్యాయులు శేషు, సర్పంచి పీలా నర్సింగరావు, మాజీ సర్పంచి పీలా తులసీరామ్, ఎంపీటీసీ సభ్యురాలు పీలా ధనలక్ష్మి అభినందించారు.

డీ పట్టా భూముల స్వాధీనం తగదు

రాంబిల్లి, న్యూస్‌టుడే: పంచదార్లలో పేద దళితుల డి.పట్టా భూముల స్వాధీనానికి ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వులను తక్షణమే వెనక్కి తీసుకోవాలని విస్తృత దళిత సంఘాల (విదసం) ఐక్య వేదిక రాష్ట్ర కన్వీనరు డా.బూసి వెంకటరావు డిమాండు చేశారు. పంచదార్లలో దళిత రైతుల దీక్ష శిబిరాన్ని మంగళవారం ఆయన విదసం నాయకులతో కలిసి సందర్శించి సంఘీభావం తెలిపారు. రాష్ట్రంలో లక్షల ఎకరాల ఎసైన్డ్ భూములు అన్యాక్రాంతం అవుతుంటే వాటిని కాపాడలేని అధికార యంత్రాంగం ఇక్కడ దళిత డి.పట్టా భూములను స్వాధీనం చేసుకోవాలని ప్రయత్నించడంలో పెద్ద కుట్ర దాగి ఉందన్నారు. దిబ్బపాలెంలో ఏపీఐఐసీ భూములు 30 ఎకరాలు ఉండగా రెవెన్యూ అధికారులు కన్ను పంచదార్ల దళితుల భూములపై ఎందుకు పడిందని దళిత సంఘాల నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో అనకాపల్లి, విశాఖ జిల్లాల విదసం నాయకులు జాజి ఓంకార్, నేతల నాగేశ్వరరావు, ఐ.దేవుడుబాబు, గోడు వెంకటేశ్వరరావు, బుడతల అప్పారావు, పాము నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

దీక్షలో పాల్గొన్నవారిని ఉద్దేశించి మాట్లాడుతున్న బూసి వెంకటరావు

నూకతాతకు భక్తజన ప్రణామం

ప్రతిమలు ఊరేగింపు

నూకతాత ప్రతిమను స్వాగతిస్తూ తీరంలో పడుకున్న భక్తజనం

నక్కపల్లి, న్యూస్‌టుడే: రాజయ్యపేట గ్రామంలో నూకతాత జాతర మంగళవారం వైభవంగా జరిగింది. గ్రామం మొదలుకొని తీరం వరకు నూకతాత ప్రతిమలను స్వాగతిస్తూ భక్తులు దారిలో పడుకుని స్వాగతం పలికారు. మహిళా పూజారులు, వారిపై నడుచుకుంటూ ముందుకు సాగారు. భక్తులు నూకతాతపై శనగపప్పు చల్లి, నూతన వస్త్రాలను సమర్పించి మొక్కుబడులు తీర్చుకున్నారు. జనంతో రాజయ్యపేట గ్రామం జనసంద్రంగా మారింది. ప్రధాన రహదారి కిక్కిరిసిపోయింది. దాతల ఆధ్వర్యంలో ప్రసాదాలు, అన్న సమారాధన ఏర్పాటు చేశారు. నక్కపల్లికి చెందిన గురుమూర్తి సంగీత విభావరి అందరినీ అలరించింది. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా నర్సీపట్నం డీఎస్పీ ఆధ్వర్యంలో భారీ బందోబస్తు నిర్వహించారు.

ప్రయాణికుల రద్దీకి ప్రత్యేక రైళ్లు

విశాఖపట్నం, న్యూస్‌టుడే: ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని వారాంతపు ప్రత్యేక రైళ్ల అందుబాటులోకి తీసుకురానున్నట్లు వాల్తేర్ సీనియర్ డీసీఎం కె.పవన్‌కుమార్ తెలిపారు.
★ మార్చి 1 నుంచి 8 వరకు ప్రతి ఆదివారం ఎస్ఎంవీ బెంగళూర్- మాల్దాటౌన్ (06565), మార్చి 4 నుంచి 11 వరకు ప్రతి బుధవారం మల్దాటౌన్-బెంగళూరు (06566) రైళ్లు, ఈనెల 26, మార్చి 1, 5 తేదీల్లో చర్లపల్లి-షాలిమార్ (07512), 27, మార్చి 2, 6 తేదీల్లో షాలిమార్-చర్లపలి (07513) రైళ్లు అందుబాటులో ఉంటాయన్నారు.

EENADU Classifieds

AUTO

VEHICLES FOR SALE

2025 model Bharat Benz 3532c Tipper, Regn No:AP39WC3439. Contact Sundaram Finance Limited, Gajuwaka. Ph: 9440909746.

Mahindra Alfa-2022 Model-AP39-UE-3003 is for Sale in as is Where is Condition ★Sundaram Finance Ltd. ✆ 94409 09731

BUSINESS SERVICES

లోకేష్ గోల్డ్ లోన్స్ బ్యాంక్/ ప్రైవేట్ తాకట్టులో ఉన్న బంగారాన్ని విడిపించి అదేరోజు మార్కెట్ రేటుకు కొనబడును. ✆ 9848488068, 7799223300.

FINANCIAL SERVICES

స్థిరాస్తులపై ఆంధ్రప్రదేశ్ అంతటా మార్టిగేజ్ లోన్స్ మరియు స్థిరాస్తి ఎక్కడ ఉన్నా ఏసంస్థలో ఉన్నా Xerox పేపర్స్‌పై 2nd మార్టిగేజ్ లోన్ ఇవ్వబడును. 50లక్షలలోపు, అయోధ్య కోఆపరేటివ్ బ్యాంక్. ✆ 93969 99669.

HEALTH & CARE

మద్యపానం మానేయడం ఎలా? బరువు పెరుగుట, జాయింట్‌పెయిన్స్‌కు విశాఖపట్నం: హోటల్ దాక్షాయణి, రైల్వేస్టేషన్ రోడ్, చావులమదుం జంక్షన్, ప్రతీనెల 5,19 తేదీల్లో మందులు

PILES

పైల్స్, భగందరం, ఫిషర్ స్పెషలిస్ట్: Dr.Prem Kumar, Mrs.Deepti వైజాగ్: సింగ్ హోటల్ జంక్షన్, జడ్జికోర్ట్ దగ్గర & గాజువాక: శ్రీహరిపురం చర్చ్‌డౌన్. సంప్రదించండి: 8309200608, 9866070593.

REAL ESTATE

FLAT FOR SALE

NAD

3Bhk 1800 sft flat E/f. 2Bhk 865sft S/f 2Bhk 820sft N/f 5th floor for sale @ 4500 per sft at Vimanagar. ✆ 9446139989

GENERAL

3BHK, North facing 1300 sft with car parking(USD-33.89)2nd floor, 9th sector, Opp.Samata College, MVP Colony. Cont: 9494576200.

LAND FOR SALE

GENERAL

పూసపాటిరేగ 'మం' గోవిందాపురం రోడ్డు హైవేకి 1/2KM తారురోడ్డు ఫేసింగ్ 9&4 ఎకరాలు కొబ్బరితోట అమ్మకం & హోటల్ లీజుకు కలదు. ✆ 9440255187.

PLOT FOR SALE

NAD

160 sq.yrd (35x41) N/F 30ft Rd. 2nd plot Laneno: 10, Vimanagar for sale. Direct parties only. ✆ 9446139989

PENDURTHI

పెందుర్తి BRTS దగ్గరలో ద్వారా ఆఫీస్ దరి N/F 117, 127, 140 చ॥గ॥ 3 బిట్లు లేదా మొత్తంగా అమ్మకం. స్పాట్ రిజిస్ట్రేషన్. ✆ 9985344833.

GENERAL

Plot for Sale – VUDA Approved Open Plots with Residential building Size: 286 Sq.yards, North facing 30 feet Road at Marripalem VUDA Layout, Visakhapatnam for more information: 9959396633

LEASE/ RENT

GENERAL

NAD Kotha Road Rent/Lease 3&4th Floor for Corporate Offices/ Clinics Above SBI 1750Sft Each ✆9985374007, 7989886046.

WANTED

GENERAL

WANTED
One Independent Building for School purpose or old School setup for Long Lease in front of big road within main city of Vizag or 800 to 1500 Sq.yds. Land for Purchase in Yendada or Rushikonda.
Contact Ph:
94408 78272

SECOND SALE

మిథున్ ఏజెన్సీ కొనబడును పాత A/C లు, సెంట్రల్ A/C లు, ఇన్వర్టర్, బ్యాటరీలు, ఫ్రిజ్, వాషింగ్ మిషన్స్, ఫర్నిచర్, మోటార్లు, UPSలు, ఆడియోలు. ✆ 6309745364.

JOBS

Wanted A/C Tech Supervisor / Helpers Project Engineer Diploma Holders for VRV ✆ 9912796400, 9848196400.

Urgent Requirement following Senior Positions * Chief Administration Managers: 5 No's, M/F, Experienced / Retd. in any field. Interviews on: 11th & 12th Feb.26. ✆ 9553021026, 7702999763.

Wanted Teachers for Reputed Schools in A.P & Telangana, Contact: Sneha Placements Service. Ph: 94402 46409.

Office Assistant Qlf: Inter, Basic Computer knowledge Teja Drilling , Nr. Dolphin Hotel. 7675989897, 7675989896.

WANTED
ప్రముఖ ఆటోమొబైల్ షోరూమ్ (2W/3W) సంస్థకి వైజాగ్, గాజువాక, అనకాపల్లి, మధురవాడ ఏరియాలకి సంబంధించి 10th, 12th, Degree చేసిన Freshers / Experienced Male Executives కావలెను.
Srinivasa Rao
Madhurawada, Vizag
9666838334, 8712644055

ఉద్యోగ ప్రకటన. వైజాగ్‌లో ప్రముఖ రియల్ ఎస్టేట్ సంస్థ నందు మార్కెటింగ్ చేయుటకు నిరుద్యోగులు, స్త్రీలు & రిటైర్డ్ పర్సన్స్ కావలెను. ఆకర్షణీయమైన జీతం + ఇన్సెంటివ్స్ ఇంటర్వ్యూ సమయంలో చెప్పబడును. ✆ 8883375999

క్రాంతి రోడ్ ట్రాన్స్‌పోర్ట్ వైజాగ్ ఆటోనగర్ బ్రాంచ్ ఆఫీస్ నందు గుమాస్తాలుగా పనిచేయుటకు 10 ఆపై చదివిన వారు మరియు ట్రాన్స్‌పోర్ట్ రంగంలో అనుభవం కలిగిన అభ్యర్థులు కావలెను సంప్ర: ✆ 70324 00999.

Gujarat నిస్సాన్‌నగర్‌లో ఉన్న హాస్టల్‌లో పనిచేయుటకు చెఫ్, మాస్టర్ చెఫ్, హెల్పర్స్ కావలెను. మెస్ కాంట్రాక్ట్‌కి ఇవ్వబడును. సం॥ 9505701977.

త్రినేత్ర హోంకేర్‌లో వృద్ధులను/ పేషెంట్స్‌ను/పిల్లలను చూసుకొనుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఫ్రీ వసతి, భోజనం. జీ: 18K. ✆ 8520980099, 8520874499

కుక్స్- cook for home with kerala food cusines- కేరళ ఆహార వంటకాల అనుభవంతో వంటవారు. కాల్: 8333840153

ప్రైవేటు బ్యాంకులో పనిచేయుటకు క్లర్క్స్, టెలీకాలర్స్, సిస్టమ్ ఆపరేటర్స్, BDM, CRMS కావలెను. జీతం:18-35K స్పాట్ జాయినింగ్. ✆ 7995439539.

ప్రముఖ సంస్థలో ప్రాజెక్ట్‌వర్క్‌లో పనిచేయుటకు లేడీ మేనేజర్ కావలెను గమనిక:చదువుతూ జాబ్ చేస్తూ ఉమెన్స్ హాస్టల్‌లో ఉండిన మహిళలకు ప్రాధాన్యత 7416304118

బిజినెస్ ఎగ్జిక్యూటివ్స్/ బిజినెస్ మేనేజర్స్ కావలెను. డిగ్రీ, 5 సం॥ల మార్కెటింగ్ రంగంలో అనుభవం, 30 సం॥ల లోపు వారు రెజ్యూములను kamathamjob@gmail.com కు పంపగలరు.

హరేకృష్ణ హోంకేర్‌లో వృద్ధులను/ పేషంట్స్/ పిల్లలను చూసుకొనుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఫ్రీవసతి, భోజనం జీ:18-20K ✆ 96404 68899, 96402 58899

హౌస్‌కీపింగ్స్ కావలెను. జీతం: 10,000/-+4 రోజులు = 11,300/- ASN PVR Inox చిత్రాలయ మాల్, సూర్యాభాగ్, వైజాగ్. ✆ 8978281938, 9440802456

వాచ్‌మెన్ ఫ్యామిలీతో సహా కావలెను. జీతం 23,000/- + ఉచిత వసతి, ఆశానివాస్ 5వ లైన్, ద్వారకానగర్, విశాఖపట్నం. ✆ 9440802452, 9348802456.

FACULTY/ TEACHERS

గాజువాకలో విశాఖ డిఫెన్స్ అకాడమీ కొరకు టెలీకాలర్స్ Female కావలెను. ఇంటర్/ డిగ్రీ, జీ॥ 8K. 9AM to 6PM. 9848577745/ 9666694545

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

మహిళల భద్రతకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యం

మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీనివాసులు

అచ్యుతాపురం, న్యూస్‌టుడే: మహిళల భద్రతకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని అనకాపల్లి మహిళా పోలీసు స్టేషన్ డీఎస్పీ ఇ.శ్రీనివాసులు తెలిపారు. అచ్యుతాపురం సెజ్‌లోని బ్రాండిక్స్ అపెరల్ సిటీలో మహిళా ఉద్యోగులకు మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మహిళలు నిత్యం అప్రమత్తంగా ఉండాలని, శక్తియాప్‌ను వినియోగించుకోవాలన్నారు. పనిప్రదేశంలో, ప్రయాణంలో ఎటువంటి ఇబ్బంది వచ్చినా తక్షణం 112 నెంబర్‌కు ఫోన్ చేయాలని లేదా శక్తియాప్‌ను వినియోగించుకోవాలన్నారు. అత్యవసర సమయంలో ఉపయోగించుకునే టోల్ ఫ్రీ నంబర్లను వివరించారు. బ్రాండిక్స్ భారతీయ భాగస్వామి దొరస్వామి ప్రోత్సాహంతో శక్తి యాప్‌ను ఇప్పటికే ఇన్‌స్టాల్ చేసుకున్నామని మహిళలు తెలిపారు. ఎస్సై రాములమ్మ, మానవవనరుల విభాగం మేనేజర్ అనూహ్య, శ్యామల తదితరులు పాల్గొన్నారు.

పీఏసీఎస్ ఉద్యోగుల సమ్మెకు సీఐటీయూ మద్దతు

కొత్తూరు (అనకాపల్లి), న్యూస్‌టుడే: ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాల్లో (పీఏసీఎస్‌ల్లో) పనిచేస్తున్న ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వీవీ శ్రీనివాసరావు, ఆర్ శంకరరావు డిమాండ్ చేశారు. అనకాపల్లి సీఐటీయూ కార్యాలయంలో మంగళవారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. పీఏసీఎస్ ఉద్యోగులు రెండు నెలలుగా తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వివిధ రూపాల్లో ఆందోళన చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోక పోవడంతో సోమవారం నుంచి సమ్మె చేస్తున్నారన్నారు. వీరి సమ్మెకు సీఐటీయూ సంపూర్ణ మద్దతు తెలియజేస్తోందని ప్రకటించారు. తాము కూడా నిరసనల్లో పాల్గొంటామని ప్రకటించారు.

లేగదూడల పెంపకంతో ఆర్థిక పరిపుష్టి

పాడిరైతులను సత్కరిస్తున్న రామ్మోహనరావు తదితరులు

కశింకోట, న్యూస్‌టుడే: పాడిరైతులు లేగ దూడలు పెంచడం ద్వారా ఆర్థిక పరిపుష్టి సాధిస్తారని జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి డా.బి.రామ్మోహనరావు సూచించారు. జాతీయ కృత్రిమ గర్భధారణ కార్యక్రమంలో భాగంగా సుందరయ్యపేట గ్రామంలో మంగళవారం ప్రాంతీయ పశువైద్యశాల సహాయ సంచాలకురాలు డా.బి.సౌజన్య ఆధ్వర్యంలో నిర్వహించిన లేగదూడల అందాల, ఆరోగ్య పోటీలను ఉప సంచాలకులు మాదిన ప్రసాదరావుతో కలిసి ప్రారంభించారు. ఈ పోటీలకు 40 లేగదూడలను తీసుకురాగా, అచ్చెర్ల, సుందరయ్యపేట, కన్నూరుపాలెంలకు చెందిన దూడలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందించారు. పాల్గొన్న పాడిరైతులందరికి ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. పశు వైద్యాధికారులు దయానా, చైతన్యమణి, ఆల్ఫోన్సా జార్జ్, కూటమి నాయకులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో విద్యార్థి మృతి



హైదరాబాద్, న్యూస్‌టుడే: ద్విచక్రవాహనం అదుపు తప్పి విద్యార్థి మృతి చెందిన ఘటన రంగారెడ్డి జిల్లా మీర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం చోటుచేసుకుంది. ఎస్సై సారంగపాణి కథనం ప్రకారం... అనకాపల్లి జిల్లా దేవరాపల్లి మండలం కలిగొట్ల గ్రామానికి చెందిన **జి.వర్ధన్** (19) నాదర్‌గుల్‌లో కృష్ణసాయి కాలనీలో నివాసం ఉంటూ ఓ ప్రైవేటు కళాశాలలో ఐటీఐ చదువుతున్నాడు. ఉదయం ద్విచక్రవాహనంపై కళాశాలకు వెళ్తుండగా, బడంగ్‌పేట ఎస్‌బీఐ సమీపంలో పక్కనే నిలిపి ఉంచిన ఆటో డ్రైవర్ ఒక్కసారిగా రోడ్డుపైకి తీసుకురాగా బైక్‌ను తాకింది. దీంతో అదుపు తప్పి పక్కనే వెళ్తున్న టిప్పర్ ముందు చక్రాల కింద పడి తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు ఆసుపత్రికి తరలిస్తుండగా మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

బైక్‌పై నుంచి జారిపడి మహిళ



కోటవురట్ల, న్యూస్‌టుడే : ద్విచక్ర వాహనంపై నుంచి జారిపడి ఓ మహిళ మృతి చెందింది. ఈ సంఘటన కోటవురట్ల మండలం కె.వెంకటాపురం సమీపంలో ఉన్న జీడిపిక్కల పరిశ్రమ దగ్గర మంగళవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... కొడవటిపూడికి చెందిన **పి.సత్యవతి** (55) తన కుమారుడుతో ద్విచక్ర వాహనంపై మాకవరపాలెం వెళ్లారు. తిరిగి స్వగ్రామానికి వస్తుండగా బైక్ అదుపు తప్పడంతో జారి కింద పడిపోయింది. దీంతో తలకు తీవ్ర గాయమైంది. స్థానికులు కోటవురట్ల ఆసుపత్రికి తరలించారు. వైద్యుల సూచన మేరకు నర్సీపట్నం ప్రాంతీయ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై రమేష్ చెప్పారు.

బోర్‌వెల్స్ సామగ్రి ధరలు తగ్గించాలి

చోడవరం గ్రామీణం, న్యూస్‌టుడే: బోర్‌వెల్స్ సామగ్రి ధరలు పెరుగుదలతో నిర్వహణ భారం అధికమైందని ఉమ్మడి జిల్లా బోర్‌వెల్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు నాని పేర్కొన్నారు. మంగళవారం నర్సయ్యపేట గ్రామంలో సంఘం జిల్లా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధరలు పెరుగుదల వల్ల సమ్మె చేపడుతున్నట్లు తెలిపారు. సామగ్రి ధరలు తగ్గించి వినియోగదారులకు అందుబాటులోకి తేవాలని ప్రభుత్వాన్ని కోరారు. రాష్ట్ర విభజన అనంతరం బోర్‌వెల్స్ సామగ్రి తయారీ రంగం తెలంగాణలోకి వెళ్లిపోయిందన్నారు. ఏపీలో కూడా తయారీ పరిశ్రమలు ఏర్పాటుచేసి యువతకు ఉపాధి అవకాశాలను కల్పించాలన్నారు. అనంతరం ధరలు తగ్గించాలంటూ నినాదాలు చేశారు. సభ్యులు శ్రీను, సంతోష్, ప్రసాద్, సురేష్, దిలీప్, రాజేంద్ర, నవీన్‌రెడ్డి, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

ఉక్కు సీవీఓగా నీలకంఠరెడ్డి

విశాఖపటం, న్యూస్‌టుడే: ఉక్కు కర్మాగారం చీఫ్ విజిలెన్స్ అధికారిగా సి.నీలకంఠరెడ్డి నియమితులయ్యారు. ఎన్ఎండీసీ పరిశ్రమలో సీవీఓగా పనిచేస్తున్న ఆయనకు ఉక్కు అదనపు బాధ్యతలు అప్పగించారు. 1997వ ఐఆర్ఎస్ బ్యాచ్‌కు చెందిన నీలకంఠరెడ్డి తదుపరి ఉత్తర్వులు వెలువడేవరకు అదనపు బాధ్యతలు నిర్వహించనున్నారు.

ఫార్మా కంపెనీలో ప్రమాదం.. ఉద్యోగి దుర్మరణం

రాంబిల్లి: అచ్యుతాపురం నాన్‌సెజ్‌లోని ఇన్నోవేర్ ఫార్మా కంపెనీలో మంగళవారం రాత్రి గ్యాస్ సిలిండర్ పేలింది. ఈ ప్రమాదంలో విధి నిర్వహణలో ఉన్న ఉద్యోగి మృతి చెందాడు. సీఐ నరసింగరావు మాట్లాడుతూ.. కంపెనీ వద్దకు వెళ్లామన్నారు. మృతుడి వివరాలు తెలియాల్సి ఉందన్నారు.

చికెన్ ధరలు

(కిలోకి - రూ.లలో)

	వెన్‌కాబ్	బ్యాగ్
ఫారం గేటు	115	110
లైవ్	142	130
డ్రెస్డ్	206	230
స్కిన్‌లెస్	234	240

తెరపై ఈనాడు

రాజా: ఫంకీ రామచంద్ర: అమరావతికి ఆహ్వానం వెంకటేశ్వర: స్కయ్, చథా పత్ర సత్యనారాయణ స్క్రీన్1: అనగనగా ఒకరాజు, స్క్రీన్2: యుఫోరియా
పర్తిసాయి: మన శంకర వరప్రసాద్‌గారు
షిర్డిసాయి: విత్‌లవ్
అచ్యుతాపురం: శ్రీబాలాజీ విలేజ్ సినిమా స్క్రీన్-1: కపుల్ ఫ్రెండ్లీ స్క్రీన్-2: ఫంకీ

రిక్వెస్ట్ స్టాప్‌ల ఏర్పాటుకు వినతి

కొత్తూరు (అనకాపల్లి), న్యూస్‌టుడే: చోడవరం రహదారిలో బవులవాడ చెరువు గట్టు, త్రిమూర్తుల దేవాలయం, రిక్షా కాలనీ, ఆర్‌వీఎస్ నగర్, దర్జీనగర్ కాలనీల్లో రిక్వెస్ట్ స్టాప్‌లు ఏర్పాటు చేసి బస్సులన్నీ ఆపేలా చర్యలు తీసుకోవాలని తెలుగు మహిళ అనకాపల్లి మండల శాఖ అధ్యక్షురాలు సిరిగిరిశెట్టి అమరావతి కోరారు. ఈ మేరకు అనకాపల్లి డిపో మేనేజర్ హనుమశ్రీకి మంగళవారం వారు వినతిపత్రం అందజేశారు. జనసేన నాయకురాలు దూడల పద్మ సీతారామలక్ష్మి పాల్గొన్నారు.

అనకాపల్లి

• అనకాపల్లి • ఎలమంచిలి • పాయకరావుపేట

సైతారుపేట చెరువులో అక్రమ తవ్వకాలు

ఎస్.రాయవరం, న్యూస్‌టుడే: మండలంలో సైతారుపేట మసీదు చెరువులో అక్రమ మట్టి తవ్వకాలు జోరుగా సాగుతున్నాయి. నాలుగు రోజులుగా రాత్రి నుంచి తెల్లవారు వరకు చెరువులో పలుచోట్ల మట్టి తవ్వకాలు చేపట్టారు. తవ్విన మట్టిని గ్రామంలోని ప్రైవేట్ స్థలాలు, రోడ్ల నిర్మాణానికి తరలిస్తున్నారు. దీంతో గ్రామానికి చెందిన తుంపాల శ్రీనివాసరావు, సర్పంచి కుమారుడు రాజు సతీష్ చెరువులో రోజూ అక్రమంగా మట్టి తవ్వుతున్నారని జలవనరుల శాఖ, రెవెన్యూ శాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. డీఈఈ సురేష్ కుమార్, జేఈ అమీనా బాను చెరువులో మట్టి తవ్వకాలు జరిగిన ప్రదేశాలను పరిశీలించారు. తవ్వకాలపై తహసీల్దార్, ఎస్.ఐ., ఎంపీడీఓ, పంచాయతీ కార్యదర్శులకు ఫిర్యాదు చేశామని జేఈ తెలిపారు. మట్టి తవ్వకాలు చేపట్టిన వారిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

చెరువును పరిశీలిస్తున్న డీఈఈ సురేష్‌కుమార్

బవులువాడలో సామాజిక తనిఖీ గ్రామసభ

అనకాపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: బవులువాడలో వికసిత్ భారత్ జీరామ్‌జీ పథకానికి సంబంధించి సామాజిక తనిఖీ గ్రామసభ మంగళవారం స్థానిక రామాలయంలో నిర్వహించారు. ఇప్పటివరకు జరిగిన పనుల వివరాలను సోషల్ ఆడిట్ బృంద సభ్యులు చదివి వినిపించారు. అభ్యంతరాలను అడిగి తెలుసుకున్నారు. ఎంపీటీసీ సభ్యుడు విజయ్, సోషల్ ఆడిట్ బృందం సభ్యులు, కూలీలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

హోమియో వైద్యురాలిగా రిషిత

ఎలమంచిలి, న్యూస్‌టుడే: ఎలమంచిలి ప్రభుత్వ హోమియో ఆసుపత్రి వైద్యులుగా లంకా రిషితను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కాకినాడ జిల్లా కేసంకూరులో పనిచేస్తున్న ఈమెను ఇక్కడికి బదిలీ చేస్తునట్లు ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

నేడు కొండుపాలెంలో రీ సర్వే గ్రామసభ

అనకాపల్లి గ్రామీణం: కొండుపాలెంలో రీసర్వే ఆర్‌ఓఆర్‌పై తుది గ్రామసభ బుధవారం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ ఆనందరావు పేర్కొన్నారు. రైతుల నుంచి అభ్యంతరాలు స్వీకరిస్తామన్నారు.

గ్రామాల అభివృద్ధికి ఇళ్ల పన్నులే కీలకం

అనకాపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని 32 పంచాయతీల పరిధిలో రూ.3.73 కోట్ల వసూళ్ల లక్ష్యం కాగా మంగళవారానికి రూ. కోటిపైన వసూలు చేశామని డిప్యూటీ ఎంపీడీవో రాము తెలిపారు. గ్రామాలు, పంచాయతీల అభివృద్ధికి ఇంటి పన్నులు కీలకమన్నారు. పాపయ్యపాలెంలో నూరు శాతం, రొంగలివానిపాలెం, తగరంపూడిలలో 92 శాతం మేర వసూళ్లు చేశామన్నారు.

పేదల దుకాణాలు తొలగించడం దుర్మార్గం

లక్ష్మీదేవిపేట (అనకాపల్లి), న్యూస్‌టుడే: జీవీఎంసీ అధికారులు పట్టణంలోని నాలుగు రోడ్ల కూడలిలో పేదల పూల దుకాణాలను తొలగించడం దుర్మార్గమని ప్రజా సంఘాల నాయకులు పేర్కొన్నారు. దుకాణాలు తొలగించిన ప్రాంతాన్ని మంగళవారం వీరు పరిశీలించారు. ఫోరం ఫర్ బెటర్ ఇండియా అధ్యక్షుడు గుడాల సత్యనారాయణ మాట్లాడుతూ పూల దుకాణం ఉన్న ప్రాంతం జల వనరుల శాఖ అధికారుల పరిధిలో ఉందన్నారు. ఆమ్‌ఆద్మీ పార్టీ కన్వీనర్ కొణతాల హరనాథ్‌బాబు, పలు ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

రహదారి నిర్మాణానికి శంకుస్థాపన

కొత్తూరు (అనకాపల్లి): కొత్తూరు శారదానగర్ 13వ వీధిలో రూ.15 లక్షలతో రహదారి నిర్మిస్తున్నట్లు కూటమి నాయకులు మేడిశెట్టి సత్తిబాబు, పందల సత్య గోవింద తెలిపారు. రహదారి నిర్మాణ పనులకు మంగళవారం భూమి పూజ చేశారు. నాయకులు బర్ల నాగరాజు, కోన శ్రీను పాల్గొన్నారు.

సాగు భూములకు పరిహారం ఇప్పించాలి

నక్కపల్లి, న్యూస్‌టుడే: డి.ఎల్.పురంలో ప్రభుత్వ భూముల్లో సాగులో ఎస్సీలకు పరిహారం ఇప్పించాలని కాపు కార్పొరేషన్ డైరెక్టర్ వీసం రామకృష్ణ కోరారు. ఎస్సీలతో కలిసి మంగళవారం ఉప తహసీల్దారు నారాయణరావును కలిసి వినతిపత్రం అందించారు. 75 మంది సాగుదారులకు న్యాయం చేయాలన్నారు.

రీడ్స్ స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకులు మృతి

ఎలమంచిలి: పట్టణానికి చెందిన రీడ్స్ స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకులు ఓరుగంటి విద్యాసాగర్ (65) సోమవారం హైదరాబాద్‌లో మృతి చెందారు. కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఈయన హైదరాబాద్‌లో చికిత్స పొందుతూ మృతి చెందారు.

ఫార్మ్ రిజిస్ట్రేషన్ తప్పనిసరి

నక్కపల్లి: ప్రభుత్వం అందించే వ్యవసాయ పథకాలు అందాలంటే ప్రతి రైతు ఫార్మ్ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని వ్యవసాయాధికారి ఉమాప్రసాద్ సూచించారు. కాగిత రైతు సేవా కేంద్రంలో మంగళవారం ఉద్యోగులతో సమీక్షించారు. ప్రధానంగా రైతులకు సాంకేతికతను తెలియజేయాలన్నారు. చందనాడ, పాటిమీద గ్రామాల్లో పర్యటించి అపరాల సాగును పరిశీలించి రైతులకు సూచనలు చేశారు. ఏఈఓ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కూటమి ధర్మం పాటించడం తప్పనిసరి

మునగపాక: తెదేపా, భాజపా, జనసేన నాయకులు, కార్యకర్తలు కూటమి ధర్మం పాటించి స్థానిక సంస్థల ఎన్నికల్లో అభ్యర్థుల గెలుపే ధ్యేయంగా పని చేయాలని ఎలమంచిలి నియోజకవర్గం తెదేపా పరిశీలకులు బొండా జగన్ పిలుపునిచ్చారు. తెదేపా కార్యాలయంలో మండల తెదేపా అధ్యక్షుడు పెంటకోట విజయ్ అధ్యక్షతన మంగళవారం కార్యకర్తల సమావేశం జరిగింది. నేతలు సాయికృష్ణ, కాండ్రేగుల శంకర్, జానకి, అనూరాధ తదితరులు పాల్గొన్నారు.

శ్మశానానికి రోడ్డు నిర్మాణం

నక్కపల్లి: ఉపమాక శ్మశాన రహదారి నిర్మాణాన్ని ఉపాధి హామీ నిధులతో మంగళవారం చేపట్టారు. పీఏసీఎస్ అధ్యక్షుడు కొప్పిశెట్టి బుజ్జి, సర్పంచి ప్రగడ వీరబాబు పనులు ప్రారంభించారు.

డ్రిల్‌తో మైమరిచి..కల నెరవేరి..

పేట విద్యార్థిని ఘనత

పాయకరావుపేట, న్యూస్‌టుడే

గణతంత్ర వేడుకలను టీవీల్లో చూసి మైమరిచిపోతాం. రాష్ట్రపతి, ప్రధానమంత్రి సహా విదేశీ అతిథుల ముందు మన దేశ ఖ్యాతిని చాటుతూ అద్భుతమైన పరేడ్ జనవరి 26న సాగుతుంది. సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకలుగా సాగే శకటాలు, సైన్యం చేసే విన్యాసాలు చూసి రోమాలు నిక్కబొడుచుకుంటాయి. వీరితో పాటు ఎన్‌సీసీ, ఎన్‌సీసీ విద్యార్థుల కవాతు మరోవైపు. ప్రతి విద్యార్థికి ఆ వేడుకల్లో తాము సైతం భాగస్వాములు కావాలన్న కల ఉంటుంది. దాన్ని నెరవేర్చుకుంది పాయకరావుపేటలోని స్పేసెస్ డిగ్రీ కళాశాల విద్యార్థిని తుంపాల శ్వేత.

అక్కను స్ఫూర్తిగా తీసుకుని...

ఎలమంచిలి మండలం పులపర్తిలో నివాసం ఉంటున్న తన పెద్దమ్మ కూతురు టి.మాధురి 2015లో రిపబ్లిక్ వేడుకల్లో పాల్గొంది. అక్క స్ఫూర్తితో తానూ అతిరథ మహారథుల ముందు కవాతు చేయాలని లక్ష్యంగా చేసుకుంది. స్పేసెస్ డిగ్రీ కళాశాల ఎన్‌సీసీలో చేరింది. తృతీయ సంవత్సరంలో అవకాశం దక్కింది. కాకినాడ యూనిట్ పరిధిలో తొలి శిబిరానికి 60 మందికి అవకాశం దక్కింది. అక్కడ ప్రతిభ చూపి 15 మందిలో స్థానం దక్కించుకుంది. ఉయ్యూరు, మెహిదీపట్నం (హైదరాబాద్)లలో జరిగిన శిబిరాల్లో సత్తాచాటి ప్రీ రిపబ్లిక్ పరేడ్‌కు అర్హత సాధించింది. మరో క్యాంపులో ప్రతిభ చూపి గణతంత్ర దినోత్సవంలో పాల్గొనే 130 మంది యువతీ యువకుల బృందంలో చోటు దక్కించుకుంది. వేడుకల్లో ప్రాతినిధ్యం వహించాలనే పట్టుదలతోనే అహర్నిశలు శ్రమించి కల నెరవేర్చుకుంది. వేడుకల్లో త్రివర్ణపతాకానికి అభివాదం చేస్తూ కవాతు చేసి ప్రతిభ చాటింది.

డ్రిల్‌లో పాల్గొన్న విద్యార్థులతో...

పట్టుదలే ముందుకు నడిపించింది..

తల్లిదండ్రులు, కళాశాల సిబ్బంది ఇచ్చిన ప్రోత్సాహం మరువలేను. పట్టుదలే నన్ను ఢిల్లీ వెళ్లేందుకు దోహదపడింది. యువకులకు దీటుగా సత్తా యువతులు సైతం సత్తా చాటుతున్నారు. అంచెలంచెలుగా క్యాంపుల్లో సత్తా చాటి కల నెరవేర్చుకున్నా.
– టి.శ్వేత, స్పేసెస్ డిగ్రీ కళాశాల

తాగునీటి కష్టాలు తీరుతున్నాయ్

నక్కపల్లి, న్యూస్‌టుడే: ఉపమాక శివార్లో వైకాపా హయాంలో ఏర్పాటైన కాలనీకి త్వరలో తాగునీటి కష్టాలు తీరనున్నాయి. వైకాపా పాలనలో ఏర్పాటైన ఈ కాలనీలో మౌలిక సదుపాయాలు కల్పించకపోవడంతో ప్రజలు నివాసానికి ముందుకు రాలేదు. కాలనీ లోతట్టు ప్రాంతంలో ఉండటంతో కొద్దిపాటి వర్షానికే ఈ ప్రాంతం చెరువును తలపిస్తుంది. తాగునీటికి స్థానికులు రోజూ రెండు మూడు కిలోమీటర్లు దూరం వెళ్లి ప్లాస్టిక్ టిన్నులతో నీటిని తెచ్చుకుంటున్నారు. ఇక్కడి పరిస్థితులను స్థానిక తెదేపా నాయకులు మంత్రి అనిత దృష్టికి తీసుకెళ్లడంతో ఆమె కలెక్టర్‌తో మాట్లాడి తాగునీటిసరఫరా కల్పనకు నిధులు మంజూరు చేయించారు. సంబంధితశాఖ అధికారులు పనులు మొదలు పెట్టి శరవేగంగా చేయిస్తున్నారు. ఉపమాక నుంచి దాదాపు 1.7కిలోమీటర్ల పైపులైను నిర్మాణం చేయించారు. ఇందుకోసం రూ. 7.5 లక్షలు వెచ్చించారు. ఇది పూర్తయితే ప్రస్తుతం కాలనీలో సుమారు 60 ఇళ్ల వారికి కష్టాలు తీరనున్నాయి. పనులన్నీ పూర్తిచేసి వారం, పది రోజుల్లో నీటి సరఫరా మొదలు పెడతామని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ జి.శివప్రసాద్ తెలిపారు.

పైపులైను నిర్మాణ పనులు

బీమా సౌకర్యం సద్వినియోగం చేసుకోండి

పాయకరావుపేట, న్యూస్‌టుడే: ప్రభుత్వం అమలు చేస్తున్న బీమా సౌకర్యాన్ని భవన నిర్మాణ కార్మికులు సద్వినియోగం చేసుకోవాలని ఎలమంచిలి కార్మిక శాఖ అధికారి కె.బాలకృష్ణ సూచించారు. స్థానిక తాపీమేస్త్రి సంఘ కార్యాలయంలో మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈశ్రమ్ కార్డు పొందాలని పేర్కొన్నారు. అన్ని మండలాల్లోనూ తాపీమేస్త్రిలు, పనివార్లకు అవగాహన కల్పిస్తున్నామని వివరించారు. పేట తాపీ మేస్త్రిల సంఘం అధ్యక్షుడు మజ్జూరి నారాయణరావు, తుని లేబర్ అధికారిణి జుబేదా తదితరులు పాల్గొన్నారు.

అవగాహన కల్పిస్తున్న కార్మికశాఖ అధికారి బాలకృష్ణ

విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

పురుషోత్తపురంలో పరీక్షలు చేస్తున్న వైద్యులు

ఎలమంచిలి గ్రామీణం, న్యూస్‌టుడే: ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులు చదువుతోపాటు ఆరోగ్యంపై దృష్టి సారించాలని ములకలాపల్లి సిమెంట్ కర్మాగారం యూనిట్ హెడ్ బి.రామస్వామి పేర్కొన్నారు. కొత్తలి, బయ్యవరం, ములకలాపల్లి, పురుషోత్తపురం పాఠశాలల్లో మంగళవారం విద్యార్థులకు ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. 215 మందికి ఉచితంగా పరీక్షలుచేసి మందులు అందచేశారు. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత శుభ్రత పాటించడం ద్వారా అనారోగ్యం బారిన పడకుండా ఉంటామన్నారు. సీనియర్ డీజీఎం శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కనీసవేతనాలు ఇవ్వాలని ఆందోళన

అచ్యుతాపురం, న్యూస్‌టుడే: ప్రజలందరి ఆరోగ్యాన్ని కాపాడటానికి నిరంతరం పనిచేస్తున్న తమ ఆకలి తీర్చడానికి ఎవరూ ముందుకు రావడంలేదని పంచాయతీ, పారిశుద్ధ్య కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. కనీస వేతనాలు అమలుచేయాలని కోరుతూ మంగళవారం తహసీల్దార్ కార్యాలయం ముందు నిరసన, ఎంపీడీఓ కార్యాలయం ముట్టడి కార్యక్రమం చేపట్టారు. పంచాయతీ కార్మికులకు నెలకి రూ.10వేలు అందిస్తున్నామని ప్రభుత్వాలు చెప్పడం తప్ప అమలుచేయడంలేదని విచారం వ్యక్తం చేశారు. కార్మికులకు గుర్తింపుకార్డులు అందివ్వాలని, ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యాలు కల్పించాలని కోరారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి రొంగలి రాము, మండల కార్యదర్శి సోమునాయుడు, కార్మికుల సంఘం నాయకులు ఆడారి నాగేశ్వరరావు, వియ్యపు లక్ష్మి, ముప్పిడి కల్యాణి, అప్పారావు పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయం ముందు కార్మికుల ఆందోళన

పాల ధర పెంపు సరికాదు

నిరసన కార్యక్రమంలో ఐద్వా ప్రతినిధులు

కొత్తూరు (అనకాపల్లి), న్యూస్‌టుడే: విశాఖ డెయిరీ యాజమాన్యం ఏకపక్షంగా పాల ప్యాకెట్ల ధరలను పెంచి వినియోగదారులను ఆర్థికంగా ఇబ్బందులకు గురి చేస్తోందని ఐద్వా జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పి మాణిక్యం, డీడీ వరలక్ష్మి ఆరోపించారు. ఈ మేరకు మంగళవారం అనకాపల్లిలో ర్యాలీ నిర్వహించి, ఆర్టీసీ బస్ స్టేషన్‌లో నిరసన ప్రదర్శన చేశారు. ప్రయాణికులతో సమావేశం ఏర్పాటు చేసి వివరించారు. మంగతాయారు, ఆర్ లక్ష్మి, జగదీశ్వరి తదితరులు పాల్గొన్నారు.

నూకాంబిక ఆలయంలో అమావాస్య పూజలు

లక్ష్మీదేవిపేట (అనకాపల్లి), న్యూస్‌టుడే: పట్టణంలోని గవరపాలెం అరుంధతి నగర్‌లో మంగళవారం అమావాస్య పురస్కరించుకుని తెల్లవారుజాము నుంచే నూకాంబిక ఆలయంలో ప్రత్యేక పూజలు చేపట్టారు. మహిళలు వివిధ రకాల పిండి వంటలు తీసుకువచ్చిన నైవేద్యం సమర్పించారు. మధ్యాహ్నం భారీ అన్నసమారాధన నిర్వహించారు.

అలంకరణలో నూకాంబిక

నక్కపల్లి: మహాశివరాత్రి అమావాస్య సందర్భంగా సముద్రతీరాలు భక్తులతో పుణ్యస్నానాలతో పోటెత్తాయి. రాజయ్యపేట, బోయపాడు, దొండవాక తీరాలకు జనం వేలాది తరలివచ్చారు. సీఐ మురళి ఆధ్వర్యంలో పోలీసు గస్తీ చేపట్టారు. రేబాక గూడుపమ్మ ఆలయానికి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు.

మామిడిపాలెంలో ఎడ్లబళ్ల పోటీలను ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యే గోవింద

కొత్తూరు (అనకాపల్లి): మామిడిపాలెంలో ప్రసిద్ధి చెందిన దుర్గాదేవి పండగ మంగళవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా జిల్లా స్థాయి ఎడ్లబళ్ల పరుగు పోటీలను మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ ప్రారంభించారు. తెదేపా మండల శాఖ అధ్యక్షుడు కర్రి సన్యాసినాయుడు, కార్యదర్శి కరణం శ్రీనివాసరావు, సర్పంచి పూడి పరదేశినాయుడు పాల్గొన్నారు.

ఎలమంచిలి, న్యూస్‌టుడే: పట్టణంలోని టిడ్కో కాలనీలో హనుమాన్ ఆలయ వార్షికోత్సవం పురస్కరించుకుని మంగళవారం రాత్రి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు సామూహికంగా ఇక్కడ భక్తిగీతాలు ఆలపించారు. బుధవారం ఇక్కడ ఆలయం వద్ద భారీ తీర్థమహోత్సవాన్ని నిర్వహించడానికి నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు

ఎలమంచిలి, న్యూస్‌టుడే: పట్టణంలోని సూర్య నారాయణ మూర్తి ఆలయంలో మాఘమాస ఉత్సవాలు పురస్కరించుకుని మంగళవారం సౌర హోమం నిర్వహించారు. స్థానిక ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్ సోదరుడు రవికుమార్ దంపతులు హోమం

సూర్యనారాయణమూర్తి ఆలయంలో సౌరహోమం చేస్తున్న రవికుమార్ దంపతులు

తోపాటు ప్రత్యేక పూజలు చేశారు. పట్టణంలోని పలు ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఆలయ అర్చకులు మేకా భగవాన్, కూటమి నాయకులు రమేష్ నాయుడు, కొఠారు శ్రీనివాసరావు, లంకా ఉదయ్‌కుమార్, భీశెట్టి శివ, మోటూరి గోపీ, గుర్రాల శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

కశింకోట: తీడలో కల్యాణ పోతురాజు బాబు ఉత్సవాల్లో భాగంగా పండగ వైభవంగా నిర్వహించారు గ్రామం నుంచి ఘటాలను పంచపాండవుల కొయ్యగుర్రాలు వెంట రాగా దేవాలయానికి ఊరేగింపుగా వెళ్లారు. ఘటాలు ఆలయ ప్రవేశం చేసిన వెంటనే భక్తులను అనుమతించారు. సీఐ అల్లుస్వామినాయుడు ఆధ్వర్యంలో ఎస్సైలు కె.మనోజ్‌కుమార్, లక్ష్మణరావు బందోబస్తు నిర్వహించారు.

పూజలందుకున్న కల్యాణ పోతురాజుబాబు

నులి పురుగుల నివారణ మాత్రల పంపిణీ

పాయకరావుపేట, న్యూస్‌టుడే: విద్యార్థులకు మంగళవారం నులి పురుగుల నివారణ మాత్రల పంపిణీ చేశారు. పేట పట్టణ పరిధిలో 16656 మందికి అల్బెండజోల్ మాత్రలు ఇచ్చామని వైద్యాధికారి వీఎస్ సౌందర్య తెలిపారు.

ఎస్.రాయవరం: పెదగుమ్ములూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఆరోగ్యంపై అవగాహన సదస్సు నిర్వహించారు. వైద్యాధికారులు వాసంతి, విస్తరణ అధికారి నాగేశ్వరరావు, సూపర్ వైజర్ ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు

కశింకోట: స్థానిక జడ్పీ బాలికోన్నతపాఠశాల విద్యార్థులకు పీహెచ్‌సీ వైద్యాధికారి ఎస్.తిరుపతిరావు మాత్రలు వేశారు. ఆరోగ్యకేంద్రం పరిధిలో 11700 మందికి మాత్రలు పంపిణీ చేసినట్లు తెలిపారు.

అచ్యుతాపురం: హరిపాలెం, అచ్యుతాపురం పీహెచ్‌సీల పరిధిలో పాఠశాల విద్యార్థులకు నులి

విద్యార్థులకు మాత్ర వేస్తున్న వైద్యసిబ్బంది

పురుగుల మాత్రలను మిగించారు. అచ్యుతాపురం ఏపీ గురుకుల బాలికల పాఠశాలలో వైద్యాధికారిణి కూండ్రపు శ్రావ్య మాత్రలను చిన్నారులతో వేశారు

కోటవురట్ల, న్యూస్‌టుడే: కొడవటిపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు ప్రతాప్‌కుమార్ ఆధ్వర్యంలో విద్యార్థులకు డీ వార్మింగ్ మాత్రలను సిబ్బంది మణికుమారి, సత్యవతి వేశారు. 5443 విద్యార్థులకు మాత్రలను మింగించినట్లు వైద్యాధికారిణి ధనలక్ష్మి చెప్పారు.

భారత రాజ్యాంగాన్ని గౌరవించి పనిచేయాలి

అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే: ప్రభుత్వాలు భారత రాజ్యాంగాన్ని గౌరవించి పనిచేయాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీపతి ప్రకాశం పేర్కొన్నారు. క్రిస్టియన్ డెమొక్రటిక్ మూవ్‌మెంట్ ఫౌండర్ మిల్కిసెదక్ అధ్యక్షతన రెండో రోజు మంగళవారం 'మత మార్పిడి నిరోధక చట్టాలు' అనే అంశంపై నిర్వహించిన సదస్సులో పలు పార్టీల నాయకులు పాల్గొన్నారు. వైకాపా పట్టణ శాఖ అధ్యక్షులు మందపాటి జానకీరామరాజు మాట్లాడుతూ అన్నివర్గాలను, మతాలను గౌరవిస్తూ రాజ్యాంగం ద్వారా ప్రజలకు సంక్రమించే హక్కులు అందేలా చూడాలన్నారు. సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఏసురత్నం మాట్లాడుతూ అన్ని మతాలను గౌరవించాలని, ఎవరిని కించపర్చకూడదన్నారు. ఆమ్‌ఆద్మీపార్టీ కన్వీనర్ కొణతాల హరనాథబాబు, క్రైస్తవ పెద్దలు, పాస్టర్‌లు శాంసన్, జాన్సన్, సుధాకర్, తిమోతి, శేషుకుమార్ పాల్గొన్నారు.

రైల్వేస్టేషన్‌లో పార్కింగ్‌కు ఏర్పాట్లు

ఎలమంచిలి, న్యూస్‌టుడే: ఎలమంచిలి రైల్వేస్టేషన్‌లో వాహనాల పార్కింగ్ స్థలాన్ని చదును చేసి కాంక్రీట్‌తో నిర్మాణాలు చేపడుతున్నారు. ఇప్పటి వరకూ రైల్వేస్టేషన్ ఆవరణలో వాహనాలు నిలిపేందుకు సరైన స్థలంలేక ప్రయాణికులు ఇబ్బందులు పడేవారు. దీనిని దృష్టిలో ఉంచుకుని ఖాళీ స్థలంలో పార్కింగ్ పనులు చేస్తున్నారు. వీటికి రక్షణగా ప్రహరీ నిర్మిస్తారు.

ఎలమంచిలి రైల్వేస్టేషన్ ఆవరణలో వాహనాలు

కాలువలు ఏవీ?

రహదారిపై ప్రవహిస్తున్న మురుగు

అనకాపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: రేబాక పంచాయతీ శివారు గురజాడ నగర్‌కాలనీ ప్రజలు మురుగు సమస్యతో ఇబ్బంది పడుతున్నారు. ఈ కాలనీలో 70కి పైగా గృహాలు ఉన్నాయి. కాలువలు లేక రహదారిపై మురుగు నిలిచిపోతోందని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాలనీ ఏర్పడి ఏళ్లు గడుస్తున్నా కనీస మౌలిక సదుపాయాలు లేవన్నారు. తక్షణమే కాలనీలో సదుపాయాలు కల్పించాలని కోరుతున్నారు

విద్యార్థిదశ నుంచే కంటి ఆరోగ్యంపై శ్రద్ధ

కశింకోట, న్యూస్‌టుడే: విద్యార్థి దశ నుంచి కంటి ఆరోగ్యంపై శ్రద్ధచూపాలని కంటి వైద్యాధికారి మురళీకృష్ణ సూచించారు. కశింకోట డీపీఎన్ జడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం 380 విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన 22 మందికి కళ్లజోళ్లు అందజేశారు. ప్రధానోపాధ్యాయులు జేఎన్వీ ప్రసాద్, ఆరోగ్య సిబ్బంది, ఉపాధ్యాయులు, ఆశాలు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలోనే పిల్లలను చేర్పించండి

కోటవురట్ల: ప్రభుత్వ పాఠశాలల్లోనే పిల్లలను చేర్పించాలని ఉపాధ్యాయులు తల్లిదండ్రులను కోరారు. రామచంద్రపురం ప్రాథమికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు దేవి ఆధ్వర్యంలో మంగళవారం ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేశారు. యూటీఎఫ్ మండల అధ్యక్షులు నర్సింగరావు మాట్లాడుతూ ప్రైవేట్ పాఠశాలకు దీటుగా మెరుగైన విద్యతో పాటు, రుచికరమైన భోజనాన్ని పెడుతున్నామన్నారు. ఉపాధ్యాయులు జేవీ.ప్రసాద్‌లు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా

అనకాపల్లి- 80085 74722	పాయకరావుపేట- 80085 74750
ఎలమంచిలి- 80085 74726	

అనకాపల్లి, న్యూస్‌టుడే: అనకాపల్లి పరమేశ్వరి పార్కు రహదారిపై కాలువలో తీసిన మట్టిని వేశారు. – కొణతాల చంద్రరావు, అనకాపల్లి. ✔: రహదారిపై వేసిన మట్టి తొలగిస్తాం. – రవికుమార్, శానిటరీ సూపర్‌వైజర్

అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే: పట్టణంలోని నర్సింగరావుపేటలో లంకా జగన్నాథం ఇంటి వీధిలో మురుగు కాలువల్లో నీరు పారడం లేదు. దోమలు పెరిగిపోతున్నాయి.
– ఉడా సత్యనారాయణ, అనకాపల్లి.
✔: సమస్యను పరిష్కరించేలా చర్యలు తీసుకుంటాం. – రవికుమార్, జీవీఎంసీ శానిటరీ సూపర్‌వైజర్, అనకాపల్లి.

పాయకరావుపేట గ్రామీణం, న్యూస్‌టుడే: పాల్తేరు- ఈదటం మార్గంలో రహదారి కిరువైపులా ముళ్ల పొదలు పెరిగిపోయాయి. దీంతో వాహనచోదకులకు అవస్థలు తప్పడం లేదు. రాత్రి వేళ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. – అప్పారావు, ఈదటం
✔: సంబంధిత అధికారులతో చర్చించి తుప్పలు తొలగించేందుకు చర్యలు తీసుకుంటాం
– అప్పన్న, సీఐ

పాయకరావుపేట, న్యూస్‌టుడే: పట్టణంలోని లింగాలతోట కాలనీ చెక్కల మిల్లు ప్రాంతంలో వీధి దీపాలు వెలగడం లేదు. రాత్రులు చీకటిగా ఉంటోంది. – నవీన్, స్థానికుడు ✔: వీధి దీపాలు కొత్తవి వేయిస్తాం. – వై.సత్యనారాయణ, పంచాయతీ ఈవో

ఎలమంచిలి, న్యూస్‌టుడే: ఎలమంచిలి బైపాస్ రోడ్డులో డెబ్రిని గుట్టలుగా పోశారు. తొలగించాలి. – ఎం.వినయ్, ఎలమంచిలి
✔: డెబ్రిని తొలగించే ఏర్పాట్లు చేస్తాం.
– పల్లా శ్రీనివాసరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్

అచ్యుతాపురం, న్యూస్‌టుడే: అందలాపల్లిలో శ్రీభగీరథీ ఆలయానికి వెళ్లే దారిలో విద్యుత్తు దీపాలు లేవు. ఇబ్బంది పడుతున్నాం. – సత్యనారాయణ, అందలాపల్లి ✔: దేవాదాయశాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరిస్తాం. – చిన్నారావు, ఎంపీడీఓ

రఘురాం కాలనీలో రహదారి సమస్యను పరిష్కరించాలి

అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే: అనకాపల్లిలోని రఘురాం కాలనీలో రహదారి సమస్యను పరిష్కరించేలా పాలకులు, అధికారులు చొరవ చూపాలని కాలనీ సంఘ సభ్యుల అధ్యక్షులు కాండ్రేగుల పరమేశ్వరరావు, బొడ్డేడ మోహనరావు కోరారు. మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ 2006లో ఉడా అనుమతితో నెలకొల్పిన లేఅవుట్ రహదారి సమస్య నేటికి తీరడం లేదన్నారు.ం కాలనీ సరిహద్దుల రక్షణలో భాగంగా నెలకొల్పిన గోడను పగలగొట్టాలని జీవీఎంసీ జోనల్ కమిషనర్, ప్రణాళిక విభాగం అధికారులు ప్రయత్నించడం దారుణమన్నారు

క్షయరోగులకు సకాలంలో వైద్య సేవలు

మునగపాక, న్యూస్‌టుడే: క్షయరోగులకు సకాలంలో వైద్యసేవలందించి వివరాలను ఆన్‌లైన్‌లో పొందుపర్చాలని జిల్లా క్షయనివారణ అధికారిణి స్వప్న వైద్యాధికారులకు సూచించారు. మునగపాక, చూచుకొండ ప్రాథమిక ఆరోగ్యక కేంద్రాలను మంగళవారం ఆమె సందర్శించారు. రికార్డులు, మందుల నిల్వలు, అంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలించారు. దగ్గరుండి ఆల్బెండజోల్ మాత్రలు వేయించారు. వైద్యధికారులు విమలగిరి, వై.రామకృష్ణ పాల్గొన్నారు.

కోడి పందేలపై దాడి

అనకాపల్లి పట్టణం: మామిడిపాలెంలో కోడి పందేలపై మంగళవారం గ్రామీణ పోలీసులు దాడిచేశారు. ఇద్దరిని అరెస్ట్‌చేసి, రెండు కోళ్లు రూ.420 నగదు స్వాధీనం చేసుకున్నట్లు గ్రామీణ ఎస్సై రవికుమార్ తెలిపారు.

కాలువ, రోడ్డు నిర్మాణానికి రూ. 30లక్షలతో ప్రతిపాదనలు

నక్కపల్లి, న్యూస్‌టుడే: నక్కపల్లి మండలం ఉద్దండపురం సమీపంలో మెగా తాగునీటి ప్రాజెక్టు ప్రాంతం నుంచి వృథాగా పోతున్న నీటితో ఎదురవుతున్న ఇబ్బందులను తీర్చడానికి రూ.30 లక్షలతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు ఏఈ వంశీప్రియ తెలిపారు. ఇక్కడ నీరు శుద్ధి తర్వాత కొంత వృథాగా పోతుండటంపై 'ఈనాడు'లో ఈనెల 7న ప్రచురితమైన 'శుద్ధ దండగ' కథనంపై స్పందించిన ఆమె ఈ ప్రాంతాన్ని పరిశీలించారు. 'న్యూస్‌టుడే'తో మాట్లాడారు. శుద్ధి చేసే క్రమంలో బయటకు వచ్చే నీటితో ప్రధాన మార్గం మొత్తం బురదమయంగా మారడంతో సమస్య పరిష్కారానికి వీలుగా చర్యలు చేపట్టామన్నారు. ఇందుకోసం 250 మీటర్ల పొడవునా సీసీ రోడ్డు, 350 మీటర్ల మేర కాంక్రీట్ కాలువ నిర్మిస్తామన్నారు. అనుమతులు రాగానే పనులు చేయిస్తామన్నారు. అంత వరకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయడానికి చూస్తున్నట్లు వివరించారు.

14వ వార్షికోత్సవ శుభాకాంక్షలు
మా ప్రియమైన కస్టమర్స్‌కు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు S.V. ఎంటర్‌ప్రైజెస్ (టైల్స్) షాపు వార్షికోత్సవం సందర్భంగా మా హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేస్తూ...


వార్షికోత్సవం సందర్భంగా మన అనకాపల్లిలో SV ట్రేడర్స్ (టైల్స్) "క్లియరెన్స్ సేల్" జరుగుతుంది.
(తక్కువ ధరలు... ఎక్కువ మన్నిక)
ఈ అద్భుత అవకాశాన్ని మా కస్టమర్స్, మిత్రులు శ్రేయోభిలాషులు వినియోగించుకోవలసినదిగా మనవి.
మా వద్ద: టైల్స్, గ్రానైట్స్ క్వార్ట్జ మరియు శానిటరీ ఐటమ్స్ మావద్ద హోల్‌సేల్ & రిటైల్ ధరలకు లభించును.

R.V. నూకరాజు (రాజేష్)
SV ENTERPRISES
SV TRADERS
పూడిమడక రోడ్, ఆదిబాబు మెస్ ప్రక్కన, అనకాపల్లి.
Cell: 9290128781, 9177910098

(c) eenadu

నర్సీపట్నం

• నర్సీపట్నం • చోడవరం • మాడుగుల

తెరపై ఈనాడు

నర్సీపట్నం: శ్రీకన్య ఆడి1: 100 డేస్ లవ్ స్టోరీ, ఒన్ ప్లస్ ఒన్ ఆఫర్, సైకో, అమరావతికి ఆహ్వానం, ఆడి2: యుఫోరియా, ఆడి3: ఫన్‌కీ, ఆడి4: ఓ రోమియో, క్రైం 101. చోడవరం: సాయిలక్ష్మి: ఫన్‌కీ, శ్రీసాయిలక్ష్మి: ఫిబ్-14, పూర్ణా: మన శంకర వరప్రసాద్ గారు

శాంతిభద్రతల పరిరక్షణలో రాజీపడొద్దు

కె.కోటపాడు, న్యూస్‌టుడే: శాంతిభద్రతల పరిరక్షణలో రాజీపడొద్దని ఎస్పీ తుహిన్‌సిన్హా కె.కోటపాడు సీఐ కృష్ణకు సూచించారు. సీఐగా బాధ్యతలు స్వీకరించిన కృష్ణ మంగళవారం ఎస్పీని మర్యాదపూర్వకంగా కలిశారు. సమస్యాత్మక గ్రామాల్లో జరిగే కార్యక్రమాలపై నిఘా పెట్టాలన్నారు.

ఎస్పీతో సీఐ కృష్ణ

సిరిజాంలో ఆధార్ శిబిరం నేడు

చీడికాడ, న్యూస్‌టుడే: చీడికాడ మండలం సిరిజాం గ్రామ సచివాలయం వద్ద బుధవారం ప్రత్యేక ఆధార్ శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు ఎంపీడీఓ హేమసుందరరావు తెలిపారు. పిల్లలకు కొత్తగా ఆధార్ నమోదు, మార్పులు, చేర్పులకు అవకాశం ఉంటుందన్నారు. ఈ అవకాశాన్ని పరిసర గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవచ్చన్నారు.

కొండల అగ్రహారంలో రీసర్వే గ్రామసభ

మాకవరపాలెం, న్యూస్‌టుడే: కొండల అగ్రహారంలో రీసర్వే గ్రామసభ బుధవారం జరగనుంది. రైతులు వ్యక్తిగత వివరాలతోపాటు భూములకు సంబంధించిన సమాచారాన్ని గ్రామసభకు హాజరైన నమోదు చేయించుకోవాలని తహసీల్దారు వెంకటరమణ సూచించారు.

కష్టాలు తీర్చి జనానికి చేరువవుదాం

నర్సీపట్నం, న్యూస్‌టుడే: గెలిపించిన జనం కష్టాలు తెలుసుకొని పరిష్కారానికి కృషి చేస్తేనే వారి అభిమానాన్ని పొందగలుగుతామని నియోజకవర్గం జనసేన పార్టీ ఇన్‌ఛార్జి రాజాన సూర్యచంద్ర అన్నారు. రామారావుపేటలోని జనసేన కార్యాలయంలో మంగళవారం 'జనవాణి' కార్యక్రమాన్ని చేపట్టారు. వచ్చిన 300 దరఖాస్తుల్లో యాభై శాతం వరకు పరిష్కరించామన్నారు. నాయకులు చక్రవర్తి, సురేష్, హరినాథ్, దొరబాబు, పాపారావు తదితరులు పాల్గొన్నారు.

డిప్యూటీ డీఈవోగా గ్రూప్2 విజేత



రావికమతం, న్యూస్‌టుడే: గ్రూప్2లో విజేతగా నిలిచిన మేడివాడ ప్రాథమిక పాఠశాల సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయుడు కన్నూరు పోతన్న డిప్యూటీ డీఈవో కొలువు సాధించారు. పీహెచ్ కోటలో ఈయన ఎంపికయ్యారు. ఏపీపీఎస్సీ సోమవారం రాత్రి ఇందుకు సంబంధించిన ఫలితాలు ప్రకటించింది. రాష్ట్రవ్యాప్తంగా ఎంపికైన 38కి ఈనెల 24న ధ్రువపత్రాల పరిశీలన చేపడతారు.

చకచకా.. సుందరీకరణ దిశగా

నర్సీపట్నం అర్బన్, న్యూస్‌టుడే

నర్సీపట్నం పెద్దచెరువు సుందరీకరణ పనుల పునఃప్రారంభానికి అధికారులు సన్నద్ధమవుతున్నారు. కొద్దిరోజుల క్రితమే రూ. 3.50 కోట్లు విలువైన పనులకు టెండర్లు ఖరారయ్యాయి. పనులు చేపట్టేందుకు గుత్తేదారు ఏర్పాట్లు చేసుకుంటున్నారని ర.భ.శాఖ అధికారులు తెలిపారు. పొలాల వైపు 460 మీటర్ల రక్షణ గోడ నిర్మిస్తారు. దీనిపై ప్లాట్‌ఫాం నిర్మించి టైల్స్ అతికిస్తారు. ఈ గట్టుపై దేశనాయకులు విగ్రహాలు, సందర్శకులు కూర్చునేందుకు బల్లలు ఏర్పాటు చేస్తారు. 121.04 ఎకరాల విస్తీర్ణం కలిగి పట్టణం నడిబొడ్డున ఉన్న ఈ చెరువును హైదరాబాదులోని ట్యాంక్‌బండ్ పార్కు మాదిరి అభివృద్ధి చేయడానికి 2018లో అయ్యన్న మంత్రిగా ఉన్నప్పుడు రూ. 6.15 కోట్లు మంజూరు చేశారు. రూ. 3 కోట్లు వెచ్చించి అప్పట్లోనే రోడ్డు వెడల్పు చేశారు. భూగర్భ డ్రైనేజీకి పైపులు వేశారు. వైకాపా ప్రభుత్వం అధికారానికి వచ్చాక ఈ పనులను కొనసాగించలేదు. కూటమి ప్రభుత్వం అధికారానికి వచ్చాక శాసన సభాపతి అయ్యన్న ఈ ప్రాజెక్టును మరింత ఆధునికీకరించి పూర్తి చేయించాలని లక్ష్యంగా తీసుకున్నారు.

అభివృద్ధి చేయనున్న పెద్దచెరువు గట్టు

» పెద్దచెరువు గర్భంలో శివపార్వతుల భారీ విగ్రహాలు ఏర్పాటు చేయించే పనులకు శ్రీకారం చుట్టారు. ఉత్తరవాహిని తీరంలో సత్యనారాయణస్వామి ఆలయం పక్కన ఖాళీస్థలంలో ఈ విగ్రహాన్ని కేరళకు చెందిన శిల్పుల చేత తయారు చేయించనున్నారు. ఇందుకు సంబంధిచిన పనులకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. చెరువులో వంతెన మాదిరి కట్టడం నిర్మించి చెరువు విగ్రహాన్ని ఏర్పాటు చేయనున్నారు. పురపాలికలో 70వేలకు పైగా జనాభా ఉంది. సాయంత్రం వేళల్లో సేదతీరేందుకు ఉపయోగపడేలా పర్యాటక ప్రాంతాల్లో ఉండే అన్ని సదుపాయాలు ఇక్కడా ఏర్పాటు కానున్నాయి.

» చెరువులో బోటు షికారు ఏర్పాటు చేయాలని యోచిస్తున్నారు. హైదరాబాదుకు చెందిన బోట్ రేసు క్లబ్ ప్రతినిధులు ఇటీవల ఈ ప్రాంతాన్ని చూసెళ్లారు. ఈ సాగునీటి వనరు కింద ఒకప్పుడు 345.26ఎకరాల ఆయకట్టు ఉండేది. పట్టణీకరణ ప్రభావంతో ప్రస్తుతం 140.62 ఎకరాలకు తగ్గిపోయింది. రూ.169 కోట్ల ఖర్చుతో తలపెట్టిన భారీ తాగునీటి పథకం కోసం వేసవి నీటి నిల్వ కేంద్రంగా ఈ చెరువునే ఉపయోగించుకోవడానికి ప్రజారోగ్యశాఖకు రెండేళ్ల క్రితమే జలవనరులశాఖ అధికారులు ఆమోదం తెలిపారు. ఈ పనులన్నీ పూర్తయితే స్వచ్ఛమైన నీటితో చెరువు పరిఢవిల్లనుంది.

ఒకటో తరగతిలో ప్రవేశాలు ఉచితం

పేద విద్యార్థులకు కార్పొరేట్ విద్య

నర్సీపట్నం, న్యూస్‌టుడే

పూర్వ ప్రాథమిక విద్య పూర్తయిన చిన్నారులను ఒకటో తరగతిలో చేర్చేందుకు ఎలాంటి ఫీజులు చెల్లించాల్సిన అవసరం లేదు. విద్యా హక్కు చట్టం 12(1సి) ప్రకారం పేద విద్యార్థులకు కార్పొరేట్ విద్య అందించాలి. దీనిపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించేందుకు విస్తృత ప్రచారం చేస్తున్నారు. ఏటా కార్పొరేట్ విద్యా సంస్థల్లో 25 శాతం మంది పేద పిల్లలకు లాటరీ ద్వారా ఉచితంగా ప్రవేశాలు కల్పిస్తున్నారు. 2026-27 విద్యా సంవత్సరానికి సంబంధించి ప్రవేశాలకు ఏర్పాట్లు చేశారు.

ఒకటో తరగతి చిన్నారులు

✦ విద్యా హక్కు చట్టం నిబంధనల ప్రకారం ఈ నెల 7 నుంచి ఆన్‌లైన్లో పాఠశాలల నమోదు ప్రక్రియ ప్రారంభమైంది. ఈ నెల 16తో గడువు ముగిసింది. సాంకేతిక సమస్యలతో జిల్లాలో 50 పాఠశాలలే నమోదయ్యాయి. గడువు పొడిగిస్తే ఆ సంఖ్య పెరిగే అవకాశముంది. తదనుగుణంగా ఎక్కువ మంది విద్యార్థులు ప్రవేశాలు పొందగలరు. జిల్లాలో గతేడాది 330 పాఠశాలల్లో 2,500 మంది విద్యార్థులు ఉచితంగా ప్రవేశాలు పొందారు. విద్యార్థుల నమోదుకు http:/// cse.ap.gov.in వెబ్‌సైట్ ఈ నెల 20 నుంచి అందుబాటులోకి రానుంది.

✦ మార్చి 10న అర్హతల నిర్ధారణ, 17న తొలి విడత లాటరీ, 25న ప్రవేశాల ధ్రువీకరణ, 26న రెండో విడత లాటరీ, ఏప్రిల్ 12న ప్రవేశాల నిర్ధారణ చేపట్టనున్నారు. కరపత్రాలు పంపిణీ చేస్తున్నారు. వెబ్‌సైట్‌లో పాఠశాలల ఎంపిక జాబితా ఆధారంగా విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చని సమగ్ర శిక్షా ఏపీసీ అప్పారావునాయుడు తెలిపారు.

బాలికలకు వైద్య పరీక్షలు

మాకవరపాలెం, న్యూస్‌టుడే: ఆరోగ్యం విషయంలో బాలికలు మరింత శ్రద్ధ తీసుకోవాలని గైనకాలజిస్ట్ జి.అనీషా సూచించారు. స్థానిక కేజీబీవీలో బాలికలకు మంగళవారం వైద్య శిబిరం నిర్వహించారు. పరీక్షల సమయంలో ఒత్తిడికి గురికావద్దని, రోజు కొంత సమయం వ్యాయమం చేయాలన్నారు. రుతుస్రావ సమస్యలతో బాధపడుతున్న 20 మంది బాలికలను గుర్తించి వారికి అవగాహన కల్పించారు. వైద్యాధికారిణి సీతామహాలక్ష్మి, ప్రిన్సిపల్ త్రివేణి పాల్గొన్నారు.

పరీక్షలు నిర్వహిస్తున్న అనీషా

పెంచిన ధర తగ్గించాలి

దేవరాపల్లి: విశాఖ డెయిరీ పెంచిన పాలధరను వెంటనే తగ్గించాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి.వెంకన్న డిమాండు చేశారు. ఆయన మంగళవారం విలేకరులతో మాట్లాడారు. రూ. కోట్లలో లాభాలను ఆర్జిస్తున్న విశాఖ డెయిరీ యాజమాన్యం ఆర్థిక భారం మోపడం సరికాదన్నారు. తొమ్మిది నెలల కిందట లీటరుపై రూ.2లు పెంచిన మరోసారి పెంచడం సరికాదన్నారు.

కాకరాపల్లికి తారు రోడ్డు పూర్తి

నాతవరం, కోటనందూరు మండలాలను దగ్గర మార్గంలో కలిపే కాకరాపల్లి రహదారి పనులు పూర్తయ్యాయి. శాసన సభాపతి అయ్యన్నపాత్రుడు ప్రత్యేక శ్రద్ధతో ఈ రోడ్డు నిర్మాణం కోసం రూ. కోటికిపైగా నిధులు మంజూరు చేయించారు. గత ఏడాది నవంబరులో ప్రారంభించి ఇప్పటికి పూర్తి చేశారు. నాతవరం, న్యూస్‌టుడే

మాసయ్యపేట నుంచి కాకరాపల్లికి వేసిన రహదారి

క్రీడాకారుడి ప్రతిభకు ప్రశంసలు

ప్రసాద్‌ను అభినందిస్తున్న నాయకులు

చోడవరం, న్యూస్‌టుడే: జాతీయస్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీలకు ఎంపికైన మండలంలోని రాయపురాజుపేట గ్రామానికి చెందిన కేవీవీఎస్ ప్రసాద్‌ను ఎమ్మెల్యే రాజు అభినందించారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి వచ్చిన ప్రసాద్‌ను మంగళవారం రాత్రి స్థానిక నాయకులతో కలిసి సత్కరించి అభినందనలు తెలిపారు. గవర కార్పొరేషన్ డైరెక్టర్ బొడ్డేడ గంగాధర్, సర్పంచి బొడ్డేడ రాముంనాయుడు, ఎంపీటీసీ సభ్యుడు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

చేతికందే ఎత్తులో ప్రమాదం..

కె.కోటపాడు, న్యూస్‌టుడే: మండలంలోని మేడిచర్లలో రోడ్డు పక్కనే ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదకరంగా ఉంది. దీంతో ఈ మార్గంలో రాకపోకలు సాగిస్తున్న రైతులు, బాటసారులు ఆందోళన చెందుతున్నారు. పొరపాటున ఏదైనా వాహనం ఢీకొంటే తీరని నష్టం వాటిల్లుతుందని వాపోతున్నారు. పశువులు మేతకోసం తిరుగుతున్న సమయంలో నియంత్రిక తాకి ప్రమాదానికి గురయ్యే ఆస్కారం ఉందని చెబుతున్నారు. ఎలాంటి ప్రమాదం జరగకముందే అధికారులు మేల్కొని చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

జేఈఈ మెయిన్‌లో తురువోలు బాలిక సత్తా

చీడికాడ: జేఈఈ మెయిన్ పరీక్షలో చీడికాడ మండలం తురువోలు గ్రామానికి చెందిన బాలిక పోతల జ్ఞానహర్షిత సత్తా చాటింది. 2026-జేఈఈ మెయిన్‌లో 'సెషన్-1' ఫలితాల్లో జాతీయ స్థాయిలో 99.78 పర్సంటైల్ సాధించింది. బాలిక గతంలో పాలిసెట్‌లో రాష్ట్రస్థాయిలో మెరుగైన ర్యాంకును సాధించింది. పదో తరగతిలోనూ సీబీఎస్‌ఈ ఫలితాల్లో సైతం 482 మార్కులు సాధించింది. జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో మంచి ర్యాంకు సాధించి ఐఐటీలో సీఎస్‌ఈ చదవాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు బాలిక జ్ఞానహర్షిత 'న్యూస్‌టుడే'తో చెప్పింది. ప్రతిభ చూపిన బాలికను తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు అభినందించారు.

నులి పురుగుల నివారణతో మెరుగైన ఆరోగ్యం

మాకవరపాలెం, రోలుగుంట, న్యూస్‌టుడే: పిల్లల అనారోగ్యానికి కడుపులోని నులిపురుగులే కారణమని జిల్లా ఉప వైద్య, ఆరోగ్య శాఖాధికారి వీరజ్యోతి అన్నారు. మాకవరపాలెం ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు మాత్రలు వేశారు. పిల్లలందరికీ మాత్రలు తప్పని సరిగా వేయాలని వైద్య సిబ్బందిని ఆదేశించారు. వైద్యాధికారి శ్రీనివాస్, సీహెచ్‌ఓ రమేష్, ఎంఎల్‌హెచ్‌పీ సత్యజా తదితరులు పాల్గొన్నారు. బుచ్చెంపేట వైద్యాధికారి డాక్టర్ జానకితో పాటు సిబ్బంది పాఠశాలల్లోని పిల్లలకు అవగాహన కల్పించారు.

రావికమతం, బుచ్చెయ్యపేట, చోడవరం, న్యూస్‌టుడే: కొత్తకోట పీహెచ్‌సీ పరిధిలోని దొండపూడిలోని గ్రామంలోని పాఠశాలలో విద్యార్థులకు అవగాహన, నులి పురుగుల మాత్రలు అందించారు. పీహెచ్‌సీ వైద్యాధికారిణి సురేఖ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. వడ్డాది పీహెచ్‌సీ వైద్యాధికారులు మాధవి, దుర్గ పర్యవేక్షణలో స్థానిక కేజీబీవీ విద్యార్థినులకు మాత్రలు పంపిణీ చేశారు. గవరవరం పీహెచ్‌సీ వైద్యాధికారులు నిర్మల, రవి పర్యవేక్షించారు. బాలికోన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుల అధ్యక్షతన వైద్యాధికారి మేఘన విద్యార్థులకు అవగాహన కల్పించారు. తెరపై చిత్రాలను ప్రదర్శించి చూపించారు. ఎంపీటీసీ సభ్యురాలు కొణ్ణాల రూపాదేవి విద్యార్థులకు నులిపురుగు మందును వేశారు.

విద్యార్థులకు నులిపురుగుల నివారణ మాత్రలు వేస్తున్న వీరజ్యోతి

చీడికాడ, కె.కోటపాడు, గొలుగొండ, దేవరాపల్లి: పిల్లల్లో మానసిక ఎదుగుదల లోపించడానికి నులిపురుగుల ప్రభావం ఎక్కువగా ఉండే అవకాశం ఉందని వైద్యాధికారి శ్యామ్‌కుమారి అన్నారు. కె.కోటపాడులోని ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ఎంపీడీఓ సాంబశివరావు నులిపురుగుల మాత్రలు అందజేశారు. దేవరాపల్లి, వేచలం ఆసుపత్రుల పరిధిలోని వివిధ పాఠశాలల్లో జరిగింది. సర్పంచి పెంటమ్మ, ఎంపీడీఓ సువర్ణరాజు, వైద్యాధికారిణి పూజ్యమేఘన పాల్గొన్నారు. చీడికాడ ఆరోగ్య కేంద్రం పరిధిలోని 3200 మందికి మాత్రలు వేసినట్లు వైద్యాధికారి సునీల్‌కుమార్ చెప్పారు.

నర్సీపట్నం అర్బన్ : శారదానగర్‌లోని ఎంజేపీ గురుకులాన్ని వైద్య ఆరోగ్యశాఖ డీపీఎంవో డాక్టర్ ప్రశాంతి సందర్శించి పిల్లలకు మందులు ఇచ్చారు

ఉత్సాహంగా గుర్రాల పరుగు పోటీలు

రోలుగుంట, న్యూస్‌టుడే: మండలంలోని కొండపాలెంలోని రాజులబాబు పండగను పురస్కరించుకుని మంగళవారం నిర్వహించిన జిల్లాస్థాయి గుర్రాల పరుగు పోటీలు ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి. సర్పంచి బంటు లక్ష్మి, ఉపసర్పంచి చిరంజీవి ఆధ్వర్యంలో తెదేపా నాయకులు గుమ్మలూరు చంద్రపోలో, సుర్ల రామకృష్ణ, పందాడ చంద్రరావు తదితరులు జెండా ఊపి పోటీలను ప్రారంభించారు.

చీడికాడ, న్యూస్‌టుడే: చీడికాడ మండలం తంగుడుబిల్లిలో బుధవారం అభయాంజనేయస్వామి తీర్థం జరగనుంది. ఈ సందర్భంగా మధ్యాహ్నం జిల్లాస్థాయి గుర్రం పరుగు పోటీలను నిర్వహించనున్నారు. విజేతలకు కోలాటం, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు పేర్కొన్నారు.

రోలుగుంటలో పోటీలను ప్రారంభిస్తున్న తెదేపా నాయకులు

రాష్ట్రస్థాయి అబాకస్ పోటీల్లో ప్రతిభ

మాకవరపాలెం, న్యూస్‌టుడే: విశ్వం ఎడ్యుటెక్ ఆధ్వర్యంలో ఈ నెల 14న విజయవాడలో జరిగిన రాష్ట్రస్థాయి అబాకస్ పోటీల్లో మాకవరపాలెంకు చెందిన మాంటిస్సోరి పాఠశాల విద్యార్థులు సత్తా చాటి విజేతలుగా నిలిచారని ప్రిన్సిపల్ రాంప్రసాద్ చెప్పారు. వివిధ పాఠశాలల నుంచి సుమారు 2 వేల మంది విద్యార్థులు పాల్గొన్న ఈ పోటీల్లో మెుహమ్మద్ షన్ కేటగిరీలో దత్తల వెంకట గంగాహేమ్, జూనియర్ విభాగంలో దొండల యోగానృత స్టేట్ ఛాంపియన్ బహుమతి అందుకున్నారు. వీరిని ఉపాధ్యాయులతో కలిసి మంగళవారం అభినందించారు.

విద్యార్థులను అభినందిస్తున్న రాంప్రసాద్

జిల్లాస్థాయి క్రీడల్లో పతకాల పంట

చోడవరం: జిల్లా స్థాయి క్రీడల పోటీల్లో పట్టణానికి చెందిన ఉషోదయ డిగ్రీ కళాశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభచూపి పథకాలు సాధించారు. వీరిని కళాశాల యాజమాన్యం, అధ్యాపకుల బృందం మంగళవారం అభినందించింది. నర్సీపట్నంలో జిల్లాస్థాయి పోటీలను మై భారత్ నిర్వహించింది. ఈ పోటీలలో వాలీబాల్‌లో బాలుర జట్టు ప్రథమస్థానం, కబడ్డీలో బాలికల జట్టు ద్వితీయ స్థానంలో నిలిచాయి. షాట్‌పుట్‌లో కళాశాలకు చెందిన సాయి ప్రథమ, సురేంద్ర ద్వితీయ స్థానాల్లో నిలిచారు. 200 మీటర్ల పరుగు పందెంలో కృష్ణ, శరత్‌లకు విజయం సాధించారు. విజేతలను ఛైర్మన్ జెర్రిపోతుల రమణాజీ, కరస్పాండెంట్ కృష్ణకుమారి, ఎగ్జిక్యూటివ్ సభ్యుడు శ్యాంజీ, డీన్ వాసు, ప్రిన్సిపల్ నాయుడు, వైస్ ప్రిన్సిపల్ దొరబాబు పాల్గొన్నారు.

ప్రతిభ కనబరిచిన క్రీడాకారులతో విద్యా సంస్థల యాజమాన్యం, అధ్యాపకులు

దేవీ ఆలయానికి భారీ షెడ్డు

మాడుగుల, న్యూస్‌టుడే: మాడుగులలో కొలువైన దేవీ ఆలయానికి ఎదురుగా రూ. 5లక్షల వ్యయంతో షెడ్డును నిర్మిస్తున్నారు. విశాఖ డెయిరీ ఛైర్మన్ ఆడారి ఆనందబాబు డైరెక్టరు పిళ్లా రమాకుమారి షెడ్డుకు నగదు సమకూర్చారు. ఏటా దసరా ఉత్సవాలకు వేసే పందిరికి అధికమొత్తంలో డబ్బు ఖర్చవుతుండటంతో దాని స్థానంలో షెడ్డు నిర్మాణం చేపట్టారు. మార్చి 6న దేవీ నూతనంగా నిర్మించిన గోపురం ప్రారంభానికి షెడ్డు పనులు పూర్తి చేయాలని కమిటీ సన్నాహాలు చేస్తోంది.

చింతపండుకు గిట్టుబాటు ధర కల్పించాలి

రావికమతం, న్యూస్‌టుడే: చింత పండుకు గిట్టుబాటు ధర కల్పించాలని ఆదివాసీ మహిళలు మంగళవారం చింతపండు తట్టలను నెత్తిన పెట్టుకొని నేరేడుబందలో ఆందోళన చేశారు. మండలంలోని చీమలపాడు శివారు నేరేడుబంద తదితర గిరిజన గ్రామాల్లో అధికశాతం మంది ఆదివాసీలు కొండ ప్రాంతంలోని చింతచెట్లు పెంచి చింతపండును విక్రయించడం ద్వారా జీవనోపాధి పొందుతున్నారు. కల్యాణపులోవలో గిరిజన సహకార సంస్థ (జీసీసీ)సేల్స్ డిపో ఉంది. జీసీసీ డిపో ద్వారా గిరిజనులు పండించే పంటలు కొనుగోలు చేస్తున్నారు. ప్రస్తుతం చింతపండు సీజన్ నడుస్తుంది. గిరిజనులు పండించిన చింత పండును కేజీ రూ.36కే కొనుగోలు చేస్తున్నారు. ప్రైవేటు మార్కెట్‌లో కేజీ రూ.60కి కొనుగోలు చేస్తుండగా గిరిజన సహకార సంస్థ సేల్స్ డిపోలో రూ.36కే కొనుగోలు చేయాలని నిర్ణయించడం తగదని ఆదివాసీలు వాపోతున్నారు. గిట్టుబాటు ధర కల్పించాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు గోవిందరావు, గిరిజన సంఘం నాయకులు సూరిబాబు, చరణ్ జీసీసీ అధికారులను కోరారు.

తట్టలు ఎత్తుకొని నినాదాలు చేస్తున్న గిరిజనులు

సభ్యులకు బీమా నగదు చెల్లింపు

చోడవరం, న్యూస్‌టుడే: సంఘంలో సభ్యులకు బీమా సదుపాయం కల్పించినట్లు గోవాడ పీఏసీఎస్ అధ్యక్షుడు ఏడువాక శ్రీనివాసరావు తెలిపారు. సభ్యుల సంక్షేమం కోసం కూటమి నేతలు పనిచేస్తున్నారని పేర్కొన్నారు. మంగళవారం సంఘ భవనంలో మృతి చెందిన ఇద్దరు సభ్యుల కుటుంబాలకు బీమా నగదును అందజేశారు. ఈ కార్యక్రమంలో సంఘ సీఈవో గొంతిన అప్పారావు, మాజీ సర్పంచి ఏడువాక లక్ష్మణకుమార్ పాల్గొన్నారు.

25 నుంచి ఉచిత శిక్షణ

నర్సీపట్నం అర్బన్, న్యూస్‌టుడే: నర్సీపట్నం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలోని స్కిల్‌హబ్‌లో ఈనెల 25 నుంచి కంప్యూటర్ కోర్సులకు ఉచిత శిక్షణ ఇస్తామని నైపుణ్యాభివృద్ధి సంస్థ ప్రతినిధి కొర్రా శ్రీనివాసు తెలిపారు. 18 నుంచి 35 ఏళ్లలోపు వయసు కలిగి ఇంటర్మీడియట్, డిగ్రీ, డిప్లమా, బీటెక్ ఉత్తీర్ణులైన వారు అర్హులని తెలిపారు. వివిధ కోర్సులు నేర్చుకోవడానికి ఆసక్తి కలిగిన వారు 9000092227 నెంబరులో సంప్రదించాలని కోరారు.



విద్యుత్తు చౌర్యంపై కేసులు

బుచ్చెయ్యపేట, న్యూస్‌టుడే: పోలేపల్లి గ్రామంలో విద్యుత్తు చోరులపై కేసులు నమోదు చేశారు. సీతా మురళి అనే వ్యక్తి తన లేవుట్‌లోకి అక్రమంగా కనెక్షన్ తీసుకుని విద్యుత్తు వినియోగిస్తున్నారు. రోడ్డు పక్కన పంచాయతీ బోరు కోసం వేసిన కనెక్షన్ నుంచి తీగలు కలిపి విద్యుత్తు వినియోగిస్తున్నారు. అలాగే భూలోకమ్మతల్లి ఆలయం ఎదురుగా ఉన్న బోరుకు మోటారు బిగించి విద్యుత్తు చౌర్యానికి పాల్పడుతున్నారు. దీనిపై కళ్లెదుటే చౌర్యం.. కావాలా సాక్ష్యం శీర్షికన ఆదివారం 'ఈనాడు'లో ప్రచురితమైన వార్తకు ఈపీడీసీఎల్ అధికారులు స్పందించారు. అక్రమ కనెక్షన్లు తొలగించి సీతా మురళీ, సీతా వెంకటరమణపై కేసులు నమోదు చేసి అపరాధ రుసుం విధించినట్లు వడ్డాది సెక్షన్ ఏఈ వెంకటరమణ తెలిపారు.

ఈనాడు కథనాలకు స్పందన

తూకంలో మోసాలపై తనిఖీలు

మాకవరపాలెం, న్యూస్‌టుడే: స్థానిక చేపల మార్కెట్‌లో వ్యాపారులు తప్పుడు తూకాలతో ప్రజలను మోసం చేస్తున్నారన్న ఫిర్యాదుపై నర్సీపట్నంకు చెందిన తూనికలు, కొలతల శాఖ అధికారులు మంగళవారం ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. చేపలు, మాంసం అమ్మకాల్లో తూకంలో మోసాలు జరుగుతున్నట్లు గుర్తించి తొమ్మిది మందిపై కేసులు నమోదు చేసినట్లు అధికారిణి అనురాధ చెప్పారు. ఎల్.మోడ్ కాటాలను ఉపయోగించి వినియోగదారులను మోసం చేస్తున్నట్లు తెలితే కేసు నమోదుతోపాటు కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

చేపల మార్కెట్‌లో తూకం పరిశీలిస్తున్న అధికారులు

మేమున్నాం.. మీకు తోడుగా

నర్సీపట్నం - 80085 74743	చోడవరం - 80085 74732
మాడుగుల - 80085 74740	చీడికాడ - 80085 74742

నర్సీపట్నం అర్బన్, న్యూస్‌టుడే: పెద్దచెరువు గట్టుపై సాయంత్రం వేళ సందర్శకులు కూర్చోవడానికి మున్సిపల్ అధికారులు ఏర్పాటు చేసిన సిమెంటు బెంచీల చుట్టూ తుప్పలు పెరిగిపోయాయి. ఇక్కడి పరిసరాలు అధ్వానంగా ఉన్నాయి. – గవిరెడ్డి నానిబాబు, నర్సీపట్నం, ✔: రెండు రోజుల్లో సిబ్బందిని పంపి తుప్పలు తొలగించడంతో పాటు పరిసరాలు శుభ్రం చేయిస్తాం. – సీహెచ్ చిట్టిబాబు, పారిశుద్ధ్య విభాగం3 అధికారి.

కె.కోటపాడు, న్యూస్‌టుడే: ?: కె.కోటపాడులో ఆర్టీసీ బస్‌షెల్టరు ఏర్పాటు చేయండి. – సీతారామ్, కె.కోటపాడు, ✔: ఈ విషయాన్ని ఆర్టీసీ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకు వెళ్తాం. – రెడ్డి జగన్మోహన్, ఎంపీపీ, కె.కోటపాడు

గొయ్యి పూడ్చివేత

స్పందనకు వందనం

గొలుగొండ, న్యూస్‌టుడే: గింజర్తి-చోద్యం ప్రధాన రహదారి మధ్య మలుపులో భారీ గొయ్యి ఏర్పడింది. దీనిపై ఈ నెల 16న 'మేమున్నాం..మీకు తోడుగా' శీర్షికన 'ఈనాడు'లో చిత్రవార్త ప్రచురితమైంది. స్పందించిన రహదారులు, భవనాలశాఖ అధికారులు భారీ గొయ్యిని పూడ్చి సమస్యను పరిష్కరించారు.

నాగవల్లి వసంతోత్సవం

చోడవరం: చోడవరంలో మంగళవారం వసంతోత్సవం నిర్వహించారు. మహాశివరాత్రి సందర్భంగా గౌరీశ్వర కల్యాణం నిర్వహించిన విషయం విదితమే. కల్యాణఘట్టంలో భాగంగా నాగవల్లి వసంతోత్సవం జరిపారు. బ్యాండు మేళాలతో రంగులు కలిపిన వసంతం ట్రాక్టర్‌పై పట్టణమంతా భక్తులకు జల్లుతూ ఊరేగించారు. ఆలయట్రస్టు బోర్డు ఛైర్మన్ గూనూరు సురేష్, అర్చకులు చలపతి, ట్రస్టు సభ్యులు పాల్గొన్నారు. అంతకుముందు ఆలయంలో గుత్తేదారు సుంకరి సత్తిబాబు, నందవరపు తలుపులనాయుడు పూజల్లో పాల్గొన్నారు.

వసంతం జల్లుతున్న ఆలయ సిబ్బంది

వితంతు పింఛన్లు మంజూరు చేయాలి

నాతవరం, న్యూస్‌టుడే: పేద వితంతువులు పింఛన్ల కోసం ఎదురు చూస్తున్నారని ప్రభుత్వం తక్షణం స్పందించాలని జడ్పీటీసీ సభ్యులు కాపారపు అప్పలనర్స పేర్కొన్నారు. జిల్లాలో 600 మందికి పైగా వితంతు పింఛన్ల కోసం ఎదురు చూస్తున్నట్లు తెలిపారు. వితంతువులకు ప్రభుత్వ సహాయం అవసరమని ప్రభుత్వం మానవత దృక్పథంతో చొరవ చూపాలని కోరారు.

(c) eenadu

తెరపై ఈనాడు

లక్ష్మీకాంత్ స్క్రీన్-1: **ఫంకీ**
స్క్రీన్-2: **మన శంకర వరప్రసాద్ గారు**

అడివివరం పైడితల్లమ్మ పరస రేపు

అడివివరం (సింహాచలం), న్యూస్‌టుడే: సింహాద్రి అప్పన్న స్వామి సోదరి మణి, అడివివరం గ్రామ దేవత శ్రీపైడితల్లి అమ్మవారి పరస మహోత్సవం గురువారం ఘనంగా నిర్వహించనున్నట్లు ఈవో జె.వెంకటరావు తెలిపారు. ఆ రోజు ఉదయం నుంచి అమ్మవారికి విశేష పూజలు జరుగుతాయని వివరించారు. భక్తులకు ఇబ్బంది లేకుండా దర్శనాలు కల్పించేందుకు క్యూలైన్లు, తాగునీరు, ప్రసాద వితరణ, ఇతర సదుపాయాలు కల్పించనున్నట్లు పేర్కొన్నారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

పెందుర్తి

వైభవంగా అమావాస్య తిరువీధి

సింహాచలం, న్యూస్‌టుడే: అమావాస్య తిథిని పురస్కరించుకుని మంగళవారం సాయంత్రం సింహగిరిపై అప్పన్న స్వామి తిరువీధి వేడుకగా జరిగింది. అర్చకులు దేవేరుల సమేతుడైన గోవిందరాజ స్వామిని పట్టు పీతాంబరాలు, ఆభరణాలతో అలంకరించి పల్లకిలో కొలువుదీర్చారు. పండితుల వేద పారాయణాలు, నాదస్వర మంగళవాయిద్యాల నడుమ సింహగిరి మాడవీధుల్లో దేవతామూర్తుల తిరువీధి కోలాహలంగా జరిగింది. భక్తజనం స్వామిని దర్శించుకుని గోవింద నామస్మరణ చేశారు.

మేమున్నాం.. మీకు తోడుగా

80085 74978 సమయం: ఉ॥ 10 నుంచి మ॥ ఒంటి గంట మధ్య

సబ్బవరం, న్యూస్‌టుడే: ?: సాయినగర్ ఎస్సీ కాలనీలో వ్యర్థాలు పేరుకుపోయి దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నాం. -ఎం.శంకరరావు ✓: వెంటనే పరిశీలించి చర్యలు తీసుకుంటాం. -పి.ఆనందరావు, గ్రామ కార్యదర్శి, సబ్బవరం

?: సబ్బవరం బాలికల వసతి గృహం సమీపంలో వ్యర్థాలు పేరుకుపోయి దోమల బెడద వెంటాడుతోంది. -పి.నారాయణరావు ✓: క్షేత్రస్థాయిలో పరిశీలించి సమస్య పరిష్కరిస్తాం. -డి.ప్రసాదరావు, సర్పంచి, సబ్బవరం

వేపగుంట, న్యూస్‌టుడే : ?: సాయిదుర్గానగర్ కాలువల్లో చెత్త పేరుకుపోయింది. -రామారావు, వెంకటరావు, స్థానికులు ✓: వెంటనే సిబ్బందితో వ్యర్థాలు తీయించి సమస్య పరిష్కరిస్తాం. -వెంకటస్వామి, శానిటరీ ఇన్‌స్పెక్టర్

పరవాడ, న్యూస్‌టుడే: ?: పరవాడ మండల పరిషత్తు కార్యాలయ కూడలి సమీప రహదారి అంచులు ప్రమాదకరంగా మారాయి. -అప్పారావు, పరవాడ. ✓: మీప్రాంత సమస్యను పరిష్కరించడానికి చర్యలు చేపడతాం. -లలిత, ఏఈ, ఆర్అండ్‌బి, పరవాడ.

గ్రామాల్లో సౌర వెలుగులు

ఎన్టీపీసీ నిధులతో 71 సోలార్ దీపాల ఏర్పాటు

వాడచీపురుపల్లిలో ఏర్పాటు చేసిన సౌర దీపం

పరవాడ, న్యూస్‌టుడే: పరవాడ సింహాద్రి ఎన్టీపీసీ యాజమాన్యం నిర్వాసిత గ్రామాల్లో సౌర విద్యుత్తు స్తంభాలు ఏర్పాటు చేస్తోంది. గ్రామాల్లోని ముఖ్యమైన ప్రదేశాల్లో ప్రజలకు, వాహనదారులకు రాత్రి వేళ రాకపోకలకు ఇబ్బంది లేకుండా వీటిని సిద్ధం చేస్తున్నారు. సంస్థ సామాజిక బాధ్యత(సీఎస్ఆర్) కార్యక్రమంలో భాగంగా నిర్వాసిత గ్రామాల్లో దశలవారీగా వీటిని ఏర్పాటు చేస్తున్నారు. ప్రస్తుతం సంస్థ సీఎస్ఆర్ నిధులు రూ.40లక్షలు వెచ్చించి కలపాక పంచాయతీలో 35, ముత్యాలమ్మపాలెంలో 10, వెన్నెలపాలెంలో 11, వాడచీపురుపల్లిలో 15 చొప్పున మొత్తం 71 దీపాలు అందుబాటులోకి తెచ్చారు. నెడ్‌క్యాప్ ద్వారా 20వాట్స్ సామర్థ్యం గల సౌర దీపాల పనులు దాదాపు పూర్తి కావడంతో గ్రామాల్లో రాత్రి వేళ వెలుగులు విరబూస్తున్నాయి. గతంలో వాడచీపురుపల్లి, ముత్యాలమ్మపాలెం, వెన్నెలపాలెం, నాయుడుపాలెం, పరవాడ, రావాడ, తిక్కవానిపాలెంలలో 350 సోలార్ దీపాలు ఏర్పాటు చేశారు.

మరోచోట పరికరాలు అమర్చుతున్న సిబ్బంది

చీకటిగా ఉండే ప్రాంతాల్లో..

ముఖ్యంగా వీధిదీపాలు లేకుండా చీకటిగా ఉన్న ప్రాంతాల్లో వీటిని ఏర్పాటు చేశారు. ముఖ్యంగా శ్మశానవాటికలు, రోడ్డు మలుపులు, రైతులు పొలాలకు వెళ్లే మార్గం, ఆలయాల వద్ద విద్యుత్తుదీపాలు లేని చోట్ల, శివారు గ్రామాల్లో వీటిని ఏర్పాటు చేశారు. తొలుత గొయ్యి తవ్వి అందులో స్తంభం నిలబెట్టి సిమెంట్ కాంక్రీటు వేస్తున్నారు. తర్వాత దానిపై సోలార్‌ప్యానల్, ఎల్ఈడీ దీపం బిగించారు. సాయంత్రం చీకటి పడే సమయంలో సోలార్ లైటు వెలిగి, ఉదయం ఆటోమేటిక్‌గా ఆరిపోతుంది. ఈ దీపాలు ఏర్పాటు చేయడంతో ఇప్పటివరకు చీకటిగా ఉన్న ప్రాంతాల్లో వెలుగులు రావడంతో స్థానికులు రాత్రి వేళ సులువుగా రాకపోకలు చేసేందుకు మార్గం సుగమం అయింది.

ప్రయోజనాలేమిటంటే..

సాధారణ దీపాలతో పోల్చుకుంటే సోలార్ దీపాల మన్నిక ఎక్కువగా ఉండి నిర్వహణ భారం తక్కువగా ఉంటుంది. పంచాయతీలకు ముఖ్యంగా విద్యుత్తు బిల్లుల భారం నుంచి ఉపశమనం పొందవచ్చు * వీటిని ఎక్కడైనా ఏర్పాటు చేసుకోవచ్చు. విద్యుత్తు తీగల అవసరం ఉండదు. సాయంత్రం నుంచి ఉదయం వరకు నిరంతరం వెలుగుతాయి. కాలుష్యం సమస్య ఉండదు. గ్రామాల్లో సౌర వెలుగులకు ప్రాధాన్యమిస్తూ దశల వారీగా వీటిని ఏర్పాటు చేస్తున్నామని మున్ముందు గ్రామాల్లో మరిన్ని సోలార్ ఎల్ఈడీ దీపాలు ఏర్పాటు చేస్తామని ఎన్టీపీసీ సీఎస్ఆర్ విభాగ ప్రతినిధి ప్రకాశరావు పేర్కొన్నారు.

ఏయూలో విద్యార్థులు, వాలంటీర్ల ఘర్షణ

ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే: ఆంధ్ర విశ్వవిద్యాలయంలో మంగళవారం సాయంత్రం విద్యార్థులు, వాలంటీర్ల మధ్య వివాదం చోటుచేసుకుంది. ఆ వివరాలిలా..సాయంత్రం ఆరున్నర గంటల సమయంలో బాస్కెట్ బాల్ మైదానంలో ఆర్.ఎస్.ఎస్. వాలంటీర్లు 12 మంది కవాతు చేస్తుండగా ఎస్.ఎఫ్.ఐ విద్యార్థులు వచ్చి అడ్డుకున్నారు. దాంతో ఇరు వర్గాల మధ్య వివాదం చోటు చేసుకుంది. విషయం తెలుసుకున్న ఏయూ సెక్యూరిటీ డీన్ ఇమ్మానియేల్ రాజు సిబ్బందితో వెళ్లి వారిని చెదరగొట్టి పంపించేశారు. తర్వాత రాత్రి 7.30 గంటల సమయంలో ఇరువర్గాలు మళ్లీ వాగ్వాదానికి దిగాయి. ఆ సమయంలో సుమారు 2 వందల మంది విద్యార్థులు అక్కడకు చేరుకోగా.. ఇరువర్గాల మధ్య తోపులాట జరిగి కొందరు స్వల్పంగా గాయపడినట్లు తెలిసింది. వీసీ సూచన మేరకు మూడో పట్టణ పోలీసులు జోక్యంతో గొడవ సద్దుమణిగిందని ఏయూ వర్గాలు తెలిపాయి. ★ ఈ ఘటనపై రాష్ట్ర భాజపా అధ్యక్షుడు పి.వి.ఎన్. మాధవ్ ఓ ప్రకటనలో తీవ్రంగా స్పందించారు. ఆర్.ఎస్.ఎస్. ఒక జాతీయ వాద సంస్థ అని, ఆ సంస్థకు చెందిన సేవకులపై దాడిని ఖండిస్తున్నట్లు తెలిపారు. బాధ్యులను అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.

జాతీయ వీల్‌చైర్ క్రికెట్ టోర్నీ గోడపత్రిక ఆవిష్కరణ

గోడ పత్రిక ఆవిష్కరిస్తున్న ఏసీఏ అధ్యక్షుడు, ఎంపీ శివనాథ్, సూర్యనారాయణ తదితరులు

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: విశాఖపట్నంలోని గుర్రపుస్వారీ స్పోర్ట్స్ మైదానంలో ఈ నెల 23 నుంచి 28వ తేదీ వరకు నిర్వహించే 6వ జాతీయ స్థాయి వీల్‌చైర్ క్రికెట్ టోర్నీ గోడ పత్రికను ఆంధ్ర క్రికెట్ సంఘం అధ్యక్షుడు, ఎంపీ కేశినేని శివనాథ్ మంగళవారం విజయవాడ గురునానక్ కాలనీలోని తన కార్యాలయంలో ఆవిష్కరించారు. టోర్నీ నిర్వాహకుడు యడ్లపల్లి సూర్యనారాయణ, ఆంధ్ర దివ్యాంగుల క్రికెట్ సంఘం సభ్యులు మేక శ్రీనివాసరావు, కె.సురేష్ తదితరులు పాల్గొన్నారు.

విధి నిర్వహణలో అలసత్వం వద్దు

సింహాచలం, న్యూస్‌టుడే: దేవస్థానం వివిధ విభాగాల అధికారులు, సిబ్బంది విధి నిర్వహణలో అలసత్వం వీడాలని ఈవో జె. వెంకటరావు ఆదేశించారు. మంగళవారం ఆయన కొండ దిగువన వివిధ ప్రాంతాల్లో పర్యటించారు. సింహాచలం దేవస్థానం సంస్కృత, వేద పాఠశాలను సందర్శించి భోజన, వసతులు, ఇతర సదుపాయాలపై ఆరా తీశారు. విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనం బస్టాండు ఆవరణలోని భవనంలో తయారు చేయడంపై అసహనం వ్యక్తం చేశారు. పాఠశాల ఆవరణలోనే వంటలు జరిగేలా వంట గది ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. గ్యారేజీని పరిశీలించి బస్సుల నిర్వహణ తీరుపై ఆరా తీశారు. మరమ్మతుకు గురైన బస్సును రెండు రోజుల్లో బాగు చేయించడంతో పాటు కాలం చెల్లిన వాహనాలను వేలం వేసే చర్యలు వేగవంతం చేయాలని ఆదేశించారు. వేంకటేశ్వర స్వామి ఆలయానికి వచ్చే భక్తులకు అసౌకర్యం లేకుండా చూడాలన్నారు. పలుచోట్ల ఆలయ మార్గం తెలిసేలా సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. ఈవో వెంట ఏఈవో రమణమూర్తి, రవాణా విభాగం ఏఈ గోవర్ధన్, పలువురు విభాగాధిపతులు పాల్గొన్నారు.

బస్సుల నిర్వహణపై ఆరా తీస్తున్న సింహాచలం ఈవో వెంకటరావు

ఎట్టకేలకు 'మార్గం' సుగమం

సబ్బవరం, న్యూస్‌టుడే: అసకపల్లి-లంకెలపాలెం రహదారిపై వైకాపా హయాంలో ప్రయాణికులు, వాహన చోదకులు రాకపోకలకు నిత్యం ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కీలకమైన రహదారి శిథిలావస్థకు చేరుకోవడంతో పలుమార్లు విన్నవించినా ఎవరూ పట్టించుకోలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు కృషి మేరకు రూ.2.50 కోట్ల నిధులు మంజూరయ్యాయి. సంబంధిత నిధులతో బీటీ లేయర్ వేయించి రహదారి రూపురేఖలు మార్చడంతో ప్రయాణికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

నులిపురుగుల నివారణ మాత్రల పంపిణీ

పరవాడ, న్యూస్‌టుడే: నులిపురుగుల రహిత సమాజ స్థాపనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ అన్నారు. నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా పరవాడ జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. అనంతరం కలెక్టర్‌తోపాటు డీఎంహెచ్‌వో హైమావతి బాలికలతో ఆల్బెండజోల్ మాత్రలు మింగించారు. స్టేట్ నోడల్ అధికారి నిర్మల గ్లోరీ, డీఈవో అప్పారావునాయుడు, డాక్టర్లు రంజిత్, శాంతి, ఎస్సైలు రాజ్, హారిక, జయశ్రీ, కరిష్మా, ఎంఈవోలు పాల్గొన్నారు. ★ లంకెలపాలెం జడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు వార్డు కార్పొరేటర్ రౌతు శ్రీనివాసరావు మాత్రలు వేశారు. ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు. ★ వాడచీపురుపల్లి పీహెచ్‌సీ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో, పాఠశాలల్లో చిన్నారులకు పీహెచ్‌సీ వైద్యాధికారి కనక మహాలక్ష్మి తదితరులు ఈ మాత్రలు వేశారు. పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థినికి మాత్రలు వేస్తున్న కలెక్టర్ విజయకృష్ణన్

వేపగుంట, న్యూస్‌టుడే: 94వ వార్డు పరిధి వేపగుంట జడ్పీ పాఠశాలలో కార్పొరేటర్ బల్ల శ్రీనివాసరావు, జిల్లా అదనపు వైద్యాధికారి ఆర్. రమేశ్, పాఠశాల ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయుడు సింహాచలం నాయుడు విద్యార్థులకు నులి పురుగుల నివారణ మాత్రలు వేశారు. ఆరోగ్య సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. 93వ వార్డు పరిధి గొల్లనారాయణపురంలో యూపీహెచ్‌సీ వైద్యాధికారిణి జి.ఎస్. సింధూజ, ప్రధానోపాధ్యాయిని కనక రత్నం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. తినడానికి ముందు ప్రతి ఒక్కరూ చేతులు శుభ్రం చేసుకోవాలని సూచించారు. ఏఎన్ఎం, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు

వేపగుంట జడ్పీ పాఠశాలలో..

సబ్బవరం పీహెచ్‌సీ పరిధిలో..

సబ్బవరం, న్యూస్‌టుడే: సబ్బవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో, ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలల్లోని విద్యార్థులకు ఈ మాత్రలు వేశారు. సబ్బవరంలోని డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో డీఎంవో చంద్రశేఖర్ దేవ్ విద్యార్థులకు ఈ మాత్రలు వేశారు. మండలంలో మొత్తం 13,339 మందికి ఈ మాత్రలు వేయాల్సి ఉండగా 12,918 మందికి పంపిణీ చేసినట్లు సబ్బవరం పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ చక్రవర్తి పేర్కొన్నారు. ఎంపీడీవో పి. పద్మజ, ఎంఈవో రవీంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్యసేవలు అందించాలి

పీహెచ్‌సీ వద్ద ఓ రోగి ఆరోగ్య పరిస్థితిపై వివరాలు తెలుసుకుంటున్న డీఎంహెచ్‌వో హైమావతి

వాడచీపురుపల్లి(పరవాడ), న్యూస్‌టుడే: పీహెచ్‌సీకి వచ్చే ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలని డీఎంహెచ్‌వో హైమావతి సూచించారు. పరవాడ మండలం వాడచీపురుపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ)ను మంగళవారం ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలోని దస్త్రాలను, పరిసరాలను, మందుల గదిని పరిశీలించారు. బయోమెట్రిక్ విధానాన్ని విధిగా పాటించాలని, రోగులకు మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. వైద్యులు అప్పారావు, పాతిమాబేగంతో మాట్లాడి పీహెచ్‌సీ వివరాలు తెలుసుకున్నారు. నులిపురుగుల నివారణ మాత్రలు విద్యార్థులందరికీ వేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

నిర్వహణ కొరవడి.. అధ్వానంగా మారి..

96వ వార్డులో దయనీయంగా పార్కులు

పెందుర్తి, న్యూస్‌టుడే: పెందుర్తి జోన్ పరిధిలోని పలు పార్కులను యంత్రాంగం సక్రమంగా నిర్వహించకపోవడంతో దయనీయంగా మారుతున్నాయి. ★ 96వ వార్డు పెందుర్తిలోని సాయి దివ్యనగర్‌లో పార్కు స్థలం నిరాదరణకు గురైంది. ఈ పార్కులో ఒక బోరు, కూర్చునేందుకు బెంచీలున్నాయి. పార్కు చుట్టూ ఎలాంటి రక్షణ గోడ, కంచె లేకపోవడంతో పశువులు సంచరిస్తున్నాయి. ఎక్కడికక్కడ మురుగు నిలిచిపోయి పరిసరాలు అపరిశుభ్రంగా మారాయి. ఆదివారాలు, సెలవు రోజుల్లో యువత ఈ ప్రాంగణంలో క్రికెట్ ఆడుతుంటారు. వినాయక చవితి వంటి ఉత్సవాలు నిర్వహిస్తారు.

ప్రశాంతినగర్‌లో తుప్పు పట్టిన పిల్లల ఆట వస్తువులు

పెందుర్తి సాయిదివ్యనగర్‌లో ఇలా..

ఫోకస్

★ పెందుర్తి ప్రశాంతినగర్‌లోని పార్కు పూర్తిగా నిర్వహణ లోపంతో ఉంది. రక్షణ గోడ లేదు. గతంలో ఏర్పాటు చేసిన పిల్లల ఆట వస్తువులు తుప్పు పట్టి శిథిలావస్థకు చేరి ప్రస్తుతం వినియోగానికి అనుకూలంగా లేవు.

★ ప్రశాంతినగర్ పోర్టు కల్యాణ మండపం పక్కనే ఉన్న మరో పార్కు పూర్తిగా తుప్పలతో నిండిపోయింది. పిచ్చిమొక్కలు, అపరిశుభ్ర పరిసరాలు నెలకొన్నాయి. పాముల సంచారం అధికంగా ఉందని నివాసితులు వాపోతున్నారు. పార్కులో బెంచీలున్నా నిరుపయోగంగా మారాయి. ★ ఆయా పార్కులకు ప్రహరీలు నిర్మించి స్థలాలు కబ్జాకు గురి కాకుండా కాపాడాల్సి ఉంది. అలాగే పిల్లలు, యువత ఆటలాడుకునేందుకు వీలుగా చర్యలు చేపడితే ప్రయోజనకరంగా ఉంటుందని పలువురు అభిప్రాయపడుతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు ఆ దిశగా కృషి చేయాలని కోరుతున్నారు.

పోర్టు కల్యాణ మండపం వద్ద..

ఘనంగా ఐబీఎస్‌సీ వార్షికోత్సవం

పరవాడ, న్యూస్‌టుడే: పరిశ్రమలు, విద్యాసంస్థలను అనుసంధానం చేసేందుకు విశాఖ మెడ్‌టెక్ జోన్‌లో ఇన్నోవేషన్ అండ్ బయోమెడికల్ స్కిల్‌సెంటర్ (ఐబీఎస్‌సీ)ను ఏర్పాటు చేసి ఎనిమిదేళ్లు పూర్తయింది. ఈ నేపథ్యంలో మెడ్‌టెక్ జోన్‌లో నిర్వహించిన ఐబీఎస్‌సీ వార్షికోత్సవంలో మెడ్‌టెక్ జోన్ సీఈవో డాక్టర్ జితేంద్రశర్మ ముఖ్యఅతిథిగా ప్రసంగించారు. ఐబీఎస్‌సీ దేశ వ్యాప్తంగా 133కి పైగా విశ్వవిద్యాలయాలు, సంస్థలతో భాగస్వామ్యం ఏర్పరచుకుందన్నారు. తాజాగా మరో 72 సంస్థలతో అవగాహన ఒప్పందాలు(ఎంవోయూ) చేసుకుందన్నారు. భారత్‌లో మెడ్‌టెక్, బయోమెడికల్ రంగంలో మానవ వనరులను తీర్చిదిద్దేందుకు వీలుగా గత ఎనిమిదేళ్లలో ఈ కేంద్రం ద్వారా 10వేల మందికి శిక్షణ ఇచ్చారన్నారు. నిపుణులు, వైద్య పరికరాల తయారీదారుల నిమిత్తం 65కిపైగా నైపుణ్య శిక్షణ కార్యక్రమాలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ఐబీఎస్‌సీ కార్యనిర్వాహక డైరెక్టర్ నరేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మెడ్‌టెక్‌జోన్ సీఈవో డాక్టర్ జితేంద్రశర్మ

ఉత్తరాంధ్ర బీసీ సంక్షేమ సంఘం యువజన అధ్యక్షుడిగా సంతోష్

సీతంపేట, న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర యువజన అధ్యక్షుడిగా తేజ సంతోష్ నియమితులయ్యారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు చేతులమీదుగా ఇటీవల అమరావతిలో నిర్వహించిన కార్యక్రమంలో నియామక ఉత్తర్వులు అందుకున్నారు. నగరంలోని జిల్లా కార్యాలయంలో మంగళవారం సంతోష్ మీడియా సమావేశం నిర్వహించి మాట్లాడారు. బీసీ సంక్షేమ సంఘాన్ని ఉత్తరాంధ్రలో బలోపేతం చేయడమే లక్ష్యంగా పని చేస్తానన్నారు. కార్యక్రమంలో పలువురు సంఘం నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా పోలమాంబ పండగ

పరవాడ, న్యూస్‌టుడే: పరవాడ మండలం ఈ.భోనంగి ఫార్మాసిటీ పునరావాసకాలనీ ప్రజల ఆరాధ్యదేవత శ్రీపోలమాంబ అమ్మవారి పండగను మంగళవారం ఘనంగా నిర్వహించారు. భక్తులు ఉదయం నుంచే అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. సర్పంచి బొద్దపు శ్రీనివాసరావు, ఆలయ కమిటీ ఛైర్మన్ బుగిడి రామగోవిందరావు, నాయకులు మేడశెట్టి అప్పారావు, మేడశెట్టి బాలాజీనాయుడు, బొండా శ్రీను, చందక గోవిందు, చందక కృష్ణ తదితరులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయం వద్ద భక్తులకు ప్రసాద వితరణ చేపట్టారు. సాయంత్రం అమ్మవారి ఘటాలను మేళతాళాలు, బాణసంచా కాల్పుల నడుమ పురవీధుల్లో ఊరేగించి అనంతరం అనుపోత్సవం నిర్వహించారు. రాత్రి 8గంటల నుంచి సాంస్కృతిక ప్రదర్శనలు జరిగాయి. ఉత్సవకమిటీ ప్రతినిధులు, నిర్వాహకులు పాల్గొన్నారు.

భక్తుల పూజలందుకున్న అమ్మవారు

నూరు శాతం ఉత్తీర్ణతకు కృషి చేయాలి

మాట్లాడుతున్న ఎంపీడీవో పద్మజ

సబ్బవరం, న్యూస్‌టుడే: ఈ ఏడాది పదో తరగతి పరీక్షల్లో నూరు శాతం ఉత్తీర్ణత సాధించేందుకు ఉపాధ్యాయులంతా కృషి చేయాలని సబ్బవరం ఎంపీడీవో పి.పద్మజ సూచించారు. ఆమె మంగళవారం సబ్బవరం మండలం ఆరిపాక జెడ్పీ హైస్కూలును సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. ఎస్.ఎస్.సి. పరీక్షలు మార్చి 16 నుంచి జరగనున్నందున విద్యార్థులు సమయాన్ని వృథా చేయకుండా ప్రణాళికాబద్ధంగా చదువుకోవాలన్నారు. అనంతరం ఆమె మధ్యాహ్న భోజన పదార్థాలను పరిశీలించారు. ఎంఈవో రవీంద్రబాబు, స్కూల్ కమిటీ ఛైర్మన్ మళ్ల యోగి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

న్యాయం చేయాలని ఆందోళన

వన్‌టౌన్, న్యూస్‌టుడే: న్యాయం చేయాలని కోరుతూ బాధిత కుటుంబం ఆందోళన నిర్వహించింది. ఆ వివరాలు...వేపగుంట ప్రాంతానికి చెందిన కె.వెంకట్రావు(65) ఈనెల 14న రోడ్డు ప్రమాదంలో గాయపడడంతో గోపాలపట్నంలోని ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించారు. 16వ తేదీన బాధితుడికి శస్త్రచికిత్స చేయగా, మృతి చెందాడు. ఆసుపత్రి యాజమాన్యం, వైద్యుల నిర్లక్ష్యంతోనే వెంకట్రావు మృతి చెందాడని ఆరోపిస్తూ కుటుంబీకులు ఆందోళన చేశారు. మంగళవారం కేజీహెచ్‌లో మృతదేహానికి శవపరీక్ష పూర్తి చేశారు. ఈ విషయాన్ని కలెక్టర్ హరేంధిరప్రసాద్ దృష్టికి తీసుకెళ్లామని, సంబంధిత ఆసుపత్రిపై విచారణకు ఆదేశించారని మృతుడి కుమారుడు శ్యామ్‌ప్రసాద్ తెలిపారు.

విద్యార్థులకు అవగాహన

సబ్బవరం, న్యూస్‌టుడే: విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సబ్బవరం సీఐ రామచంద్రరావు అన్నారు. సబ్బవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో, డిఫెన్స్ అకాడమీలో మంగళవారం జరిగిన వేర్వేరు కార్యక్రమాల్లో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా వాహనాలు నడిపేటప్పుడు తీసుకోవలసిన జాగ్రత్తలు, పాటించాల్సిన నిబంధనలు వివరించారు. అనంతరం మత్తు పదార్థాలకు దూరంగా ఉంటానని, నిబంధనలు పాటిస్తూ వాహనాలు నడుపుతామని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు.

మాట్లాడుతున్న సీఐ రామచంద్రరావు

వేంకటాద్రిపై నేటి నుంచి ఫాల్గుణ పక్షోత్సవాలు

మహాలక్ష్మి అమ్మవారు

పెందుర్తి, న్యూస్‌టుడే: వేంకటాద్రిపై శ్రీనివాసుడి సన్నిధిలో కొలువైన మహాలక్ష్మి అమ్మవారి తిరునక్షత్రాన్ని పురస్కరించుకుని బుధవారం నుంచి ఫాల్గుణ పక్షోత్సవాలు వైభవోపేతంగా జరుగుతాయని ఆలయ ప్రధానార్చకులు మహర్షి రామానుజాచార్యులు తెలిపారు. మార్చి 3న ఫాల్గుణ పౌర్ణమి నాడు చేపట్టే మహాలక్ష్మి అమ్మవారి జయంతి వరకు ఈ వేడుకలు జరుగుతాయని వివరించారు. ఇందులో భాగంగా ప్రతిరోజు అమ్మవారి సన్నిధిలో శ్రీసూక్త సహిత కుంకుమార్చనలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. మార్చి 3న లక్ష్మీ హవనం, పూర్ణాహుతితో ఈ వేడుకలు పరిసమాప్తమవుతాయని తెలిపారు. భక్తులు ఈ వేడుకలను విజయవంతం చేయాలని కోరారు.

22 నుంచి పైడిమాంబ ఉత్సవాలు

గోడపత్రికలను ఆవిష్కరిస్తున్న గ్రామపెద్దలు, నాయకులు

పరవాడ, న్యూస్‌టుడే: పరవాడ పైడిమాంబ అమ్మవారి ఉత్సవాలు ఈనెల 22 నుంచి 24వ తేదీ వరకు మూడురోజుల పాటు ఘనంగా నిర్వహించనున్నారు. ఈమేరకు సంబంధిత గోడపత్రికలను పంచాయతీ కార్యాలయం వద్ద మంగళవారం సర్పంచి సిరిపురపు అప్పలనాయుడు, ఎంపీటీసీ సభ్యుడు పైలా శ్రీనివాసరావు, ఇతర నాయకులు చుక్క రామునాయుడు, పైలా సన్యాసిరావు చేతులమీదుగా ఆవిష్కరించారు. ఈ వేడుకల సందర్భంగా ఆయా రోజుల్లో ప్రతిరోజు రాత్రి పౌరాణిక, సాంఘిక నాటక ప్రదర్శనలు ఉంటాయన్నారు. ఈనెల 24న ఉదయం 4 గంటల నుంచి అమ్మవారి దర్శనాలు, సాయంత్రం అనుపోత్సవం ఉంటుందని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

పోలమాంబ తొలి ఘటాల వేడుక ప్రారంభం

దేశపాత్రునిపాలెం(పరవాడ), న్యూస్‌టుడే: జీవీఎంసీ 79వవార్డు దేశపాత్రునిపాలెంలో ఈనెల 24వ తేదీన జరగనున్న పోలమాంబ పండగ సందర్భంగా అమ్మవారి తొలిఘటాల వేడుక మంగళవారం రాత్రి ఘనంగా ప్రారంభమైంది. మేళతాళాల నడుమ అమ్మవారి ఘటాలను గ్రామపురవీధుల్లో ఊరేగించారు. భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు. బాణసంచా వెలుగులు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో గ్రామపెద్దలు, ఉత్సవ, ఆలయ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

శ్రీనివాసుడి బ్రహ్మోత్సవాలకు వేళాయె..

నాయుడుతోట(వేపగుంట), న్యూస్‌టుడే: నాయుడుతోట సమీప రవినగర్ శేషాద్రి శిఖరంపై గల కల్యాణవేంకటేశ్వరస్వామి ఆలయంలో ఈనెల 19వతేదీ నుంచి 24వ తేదీ వరకు వైభవంగా నిర్వహించేందుకు దేవాదాయశాఖ అధికారులు, అర్చకులు ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా ఆలయాన్ని విద్యుద్దీపాలతో ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు. ఈనెల 19న సాయంత్రం 3 నుంచి 5 గంటల వరకు రవినగర్ పరిసర కాలనీల్లో స్వామివారి శోభాయాత్రతో వేడుకలు ప్రారంభిస్తారు. అనంతరం యాగశాల ప్రవేశాలు జరగనున్నాయి. ప్రతీరోజూ ఉదయం 5 గంటల నుంచి; సాయంత్రం 4 గంటల నుంచి పూజలు ప్రారంభమవుతాయని నిర్వాహకులు తెలిపారు.

కమనీయం నరహరి నిత్య కల్యాణం

సింహాచలం, న్యూస్‌టుడే: శ్రీవరాహలక్ష్మీ నృసింహ స్వామివారి నిత్య కల్యాణోత్సవం మంగళవారం సింహగిరిపై కమనీయంగా జరిగింది. అర్చకులు స్వామివారి ఉత్సవమూర్తి గోవిందరాజ స్వామిని దేవేరుల సమేతంగా అలంకరించి ఆలయ కల్యాణ మండపంలోని ఉత్సవ వేదికపై ఆశీనులను చేశారు. వేదమంత్రాలు, నాదస్వర మంగళవాయిద్యాల నడుమ దేవతామూర్తుల పరిణయ వేడుకను జరిపించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామిని సేవించారు.



(c) eenadu

కాలుష్యం తగ్గించే.. డీఈఎఫ్ ఆయిల్

పెట్రోలు పంపుల వద్ద ఇప్పుడు కొత్త కంటెయినర్లు కనిపిస్తున్నాయి.. ఏంటా అని ఆరా తీస్తే కొత్త విషయం వెలుగులోకి వచ్చింది. లారీలు, ఇతర వాహనాలు ఎక్కువ దూరం ప్రయాణం చేయాల్సి ఉంటుంది. బీఎస్ 6 వాహనాల నుంచి కాలుష్యం మోతాదును తగ్గించేందుకు ప్రవేశపెట్టిందే ఈ డీఈఎఫ్ ఆయిల్. పొగగొట్టం నుంచి వచ్చే హానికర వాయువుల మోతాదు తగ్గించేందుకు దీన్ని వాడతారు. ప్రస్తుతం ప్రతి బండికి తప్పనిసరిగా పోయించుకోవాలని చెబుతున్నారు. బెంగళూరు-హైదరాబాద్ జాతీయ రహదారిపై ఎస్ యంపేట వద్ద ఏర్పాటు చేయడంతో స్థానికులకు వర్ణ నమూనా తెలిసింది. - ఈనాడు, అనంతపురం

రామం.. ధ్యానం



ధ్యానముద్రలో శ్రీరాముడు.. ఇలాంటి దృశ్యం చాలా అరుదు. కళ్యాణదుర్గం పట్టణం కోటవీధిలో పట్టాభిరామ దేవాలయంలో కనిపిస్తుంది. ఈ విషయం చాలామందికి తెలియదు. శ్రీకృష్ణదేవరాయల సామంతరాజు 14వ శతాబ్దంలో దీన్ని నిర్మించారు. దక్షిణానికి అభిముఖంగా ఉండటం, గర్భగుడి పొడవు, వెడల్పు 14×14 మేరకు ఉంటుంది. స్వామివారు, సీతమ్మవారు, అంజనేయస్వామి పద్మాసనంలో కూర్చొని వేదపఠనం చేస్తున్నట్లుగా దర్శనమిస్తారు. ఇలాంటి విగ్రహాలు ఎక్కడాలేవని చరిత్రకారులు చెబుతున్నారు. ఇటీవల కళ్యాణదుర్గం వచ్చిన ప్రముఖ ప్రవచనకర్త గరికపాటి నరసింహారావు ఆలయం సందర్శించి రాముల వారి ధ్యానముద్ర ఆరుదని కితాబివ్వడం విశేషం. - న్యూస్‌టుడే, కళ్యాణదుర్గం

అనుచరుడి కబ్జా.. ఆక్రమణలో దర్జా!

రుద్రంపేటలో రూ.5 కోట్లు విలువైన స్థలంపై కన్ను

ఆక్రమణకు గురైన ప్రైవేట్ స్థలం

ఈనాడు, అనంతపురం: అనంతపురం అర్బన్ నియోజకవర్గ పరిధిలో అక్రమార్కులు రెచ్చిపోతున్నారు. ఖాళీగా ఉన్న ప్రైవేట్ భూములను అమాంతం మింగేస్తున్నారు. ఓవైపు వివాదాల్లో తలదూర్చి సెటిల్‌మెంట్లు చేస్తున్నారు. లేని వివాదాలను సృష్టించి స్థలాల్లో పాగా వేస్తున్నారు. రుద్రంపేట పంచాయతీ పరిధిలో రూ.5 కోట్ల విలువైన స్థలం ఆక్రమణ ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. 20 ఏళ్ల కిందట కొను గోలు చేసిన 40 సెంట్ల స్థలం చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేయడం కలకలం రేపుతోంది. బాధితులు జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేస్తుండటంతో కబ్జా వ్యవహారం వెలుగులోకి వస్తున్నాయి.

ఎస్పీకి ఫిర్యాదు..
బాధితులు మొదట నాలుగో పట్టణ పోలీసులను ఆశ్రయించారు. వారు ఫిర్యాదును స్వీకరించేందుకు ఇష్టపడలేదని చంద్రశేఖర్ ఆరోపిస్తున్నారు. స్థానిక పోలీసులు పట్టించుకోకపోవడంతో ఈనెల 12న నేరుగా జిల్లా ఎస్పీని కలిసి ఫిర్యాదు చేశారు.

ఎక్కువ ధర ఇవ్వనందుకే
అనంతపురం నగరానికి చెందిన ఎ.చంద్రశేఖర్, కడప జిల్లా ప్రొద్దుటూరుకు చెందిన జానకిరామయ్య కలిసి 2005లో రుద్రంపేట పంచాయతీ పరిధిలోని సర్వే నంబరు 135-13లో 40 సెంట్లు కొనుగోలు చేశారు. ప్రస్తుతం ఆ ప్రాంతంలో సెంటు రూ.12 లక్షల నుంచి రూ.15 లక్షలు పలుకుతోంది. గతేడాది డిసెంబరులో స్థానిక ప్రజాప్రతినిధి అనుచరుడు.. చంద్రశేఖర్‌కు ఫోన్ చేసి 'మీ స్థలం మాకు కావాలి. సెంటుకు రూ.4 లక్షలు ఇస్తాం' అంటూ బేరాలు పెట్టారు. స్థలం అమ్మే ఉద్దేశం తమకు లేదని చెప్పడంతో బెదిరింపులకు పాల్పడ్డారు. ఒప్పుకోకపోవడంతో కబ్జా చేసి 40 సెంట్ల చుట్టూ కంచె వేసి చిన్న గది నిర్మించారు.

ఎక్కడి నుంచో వచ్చి
కబ్జాకు యత్నించిన వ్యక్తి ధర్మవరం నియోజకవర్గం. ఎన్నికల ముందు స్థానిక ప్రజాప్రతినిధి వద్ద చేరారు. రుద్రంపేట పరిధిలో ఎన్నికల బాధ్యతలు నిర్వహించారు. కూటమి గెలుపొందాక కీలకంగా మారాడు. స్థానిక ఎన్నికల్లో తానే సర్పంచిగా పోటీ చేస్తానని ప్రచారం చేసుకుంటున్నారు. రుద్రంపేటలో సెటిల్‌మెంట్లు చేస్తున్నారనే ఆరోపణలున్నాయి.

జంబోరీ.. జయభేరి

గుంతకల్లు రైల్వే ఉన్నత పాఠశాల స్కౌట్ బ్యాండ్ ట్రూప్

గుంతకల్లు, న్యూస్‌టుడే: అంతర్జాతీయ, జాతీయ స్కౌట్స్ అండ్ గైడ్స్‌కు చెందిన రైల్వే ఆంగ్లమాధ్యమం ఉన్నత పాఠశాలకు చెందిన బ్యాండ్ ట్రూప్‌నకు ప్రత్యేకత ఉంది. ఏటా స్కౌట్స్‌కు సంబంధించి జంబోరీల్లో వివిధ రైల్వేలకు చెందిన బ్యాండ్ ట్రూప్‌ల మధ్య మొదటగా పోటీలు జరుగుతాయి. ఇదివరకు మంగళూరులో జరిగిన అంతర్జాతీయ జంబోరీలో గుంతకల్లు ట్రూప్ జయభేరి మోగించింది. రాజస్థాన్, లఖ్‌నవూ, కోల్‌కతా, రెండు సార్లు తిరు

అంశం : బ్యాండ్ ట్రూప్
ఎంతమంది సభ్యులు: 24 మంది
విభాగం : స్కౌట్స్ అండ్ గైడ్స్
పోటీల స్థాయి : అఖిల భారత రైల్వే ఆంగ్ల మాధ్యమ పాఠశాలకు పోటీలు
సాధించిన విజయాలు : గుంతకల్లుకు ఆరుసార్లు ప్రథమస్థానం

చిల్లో జరిగిన జాతీయ జంబోరీల్లో గుంతకల్లు ట్రూప్ మొదటి బహుమతి సాధించింది. బ్యాండ్ ట్రూప్ హనుమేశ్ అనే శిక్షకుడి సారథ్యంలో నడుస్తుంది. రైల్వేలో ఏటా జరిగే స్వాతంత్ర్య, గణతంత్ర సంబరాల్లో ఇక్కడి బ్యాండ్ ట్రూప్ మొదటి స్థానంలో ఉంటుంది.

బొరుగుల ఉండలు.. పెడుతున్నారా?

అనంతపురం (అశోక్‌నగర్), న్యూస్‌టుడే: బొరుగులను వివిధ రకాల ఆహార పదార్థాల వాడకం అనేది ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఎక్కువ. కొన్నేళ్ల కిందట బొరుగులతో తయారు చేసిన కరకర మరమరాల ముద్దలు, ఉండలు నోటిలో వేసుకోగానే కరకరలాడతాయి. చిన్న పిల్లలు ఎంతో ఇష్టంగా తింటారు. దుకాణాల్లో కంటే ఇంట్లో చేసుకొని పిల్లలకు తినిపించడం ఉత్తమం. బొరుగులు, బెల్లంతోపాటు పప్పులు, జీడిపప్పు రుచికరంగా ఉంటాయి.

చేసిన ఉండల్ని పిల్లలు ఇష్టంగా తినేవారు. కాలం మారుతున్న కొద్దీ పాస్తాఫుడ్ అలవాటు పడ్డారు. వీటిని తినడం వల్ల విటమిన్లు అందడం లేదు. బెల్లం బొరుగులు జబ్బలు పడుతున్న సందర్భాలే ఎక్కువ. అయితే సాయంత్రం పూట జంక్ ఫుడ్ తినడం కంటే.. ఎన్నో పోషకాలున్న బెల్లం బొరుగుల ఉండ వంటి ఆహార పదార్థాలను మళ్లీ రుచి చూపించడం ఉత్తమని పలువురు వైద్యులు సూచిస్తున్నారు.

పోషకాలు బోలెడు..
బెల్లంలో : ఐరన్, కాల్షియం, పొటాషియం, మెగ్నీషియం ఉంటాయి. (ఐరన్ శాతం పెరిగి పిల్లల్లో రక్తహీనత సమస్యకు నివారణ మార్గంగా ఉంటుంది) కాల్షియంతో ఎముకల్లో పటుత్వం పెరుగుతుంది. దంతాలు ఆరోగ్యంగా ఉంటాయి. హిమోగ్లోబిన్ పెరుగుతుంది. నీటి సమతుల్యతను, తక్షణ శక్తికి ఉపయుక్తంగా ఉంటుంది. ✦ బొరుగుల ఉండలు బరువు తగ్గడానికి ఉపయోగపడుతాయి.

21 నుంచి పలు రైళ్ల రద్దు

అనంతపురం (రైల్వే), న్యూస్‌టుడే: ధర్మవరం పెనుకొండ మధ్య రైల్వే పనుల నేపథ్యంలో పలు రైళ్లను రద్దు చేశారు. గుంతకల్లు హిందూపురం మధ్య నడిచే 77213/14 రైళ్లు ఈనెల 22 వరకు రద్దు చేసినట్లు తెలిపారు. బెంగళూరు-అనంతపురం మధ్య నడిచే ప్యాసింజర్ రైలు 66559/66560 కూడా ఈనెల 22 వరకు రద్దు చేశారు. మచిలీపట్నం-ధర్మవరం మధ్య నడిచే రైళ్లు ఈనెల 21, 22 తేదీల్లో అనంతపురం దాకా నడుస్తుంది. అనంతపురం నుంచి ధర్మవరం మధ్య రద్దు చేశారు. మచిలీపట్నం నుంచి అనంతపురానికి వచ్చి తిరిగి వెనక్కి వెళుతుంది. అంతరాయాన్ని ప్రయాణికులు అర్థం చేసుకొని సహకరించాలని రైల్వే అధికారులు కోరారు

ఎండు తెగులు.. తడి ఆరని కళ్లు

✦ ఉమ్మడి జిల్లాలో చీనీ సాగు	✦ రైతుల సంఖ్య	✦ ఉమ్మడి జిల్లాలో చీనీ సాగు	✦ తెగుళ్ల సమస్య	✦ చెట్ల నష్టం : ఎకరాకు ఏడాదికి	✦ దిగబడి నష్టం
1,21,105 ఎకరాలు	34,598 మంది	1,21,105 ఎకరాలు	వేరుకుళ్లు, మంగు తెగులు	5వేల ఎకరాల్లో ఎండిపోతున్నాయి	1,21,105 టన్నులు

గార్లదిన్నెలో ఎండిపోతున్న చీనీ చెట్లు చూపుతున్న రైతులు

అనంతపురం (వ్యవసాయం), న్యూస్‌టుడే: కరవెంత ఇబ్బంది పెట్టినా చీనీ తోటలు ఆదుకుంటాయన్న అనంత రైతుల్లో ధీమా ఉండేది. ఇప్పుడు పరిస్థితి మారింది. ఏ రైతు చరిత్ర తడిమినా భయం కొట్టుకొచ్చినంత పనవుతోంది. కన్నబిడ్డల్లా పెంచుకున్న చెట్లు, ఏడో సంవత్సరమే.. నిలువునా ఎండిపోతుంటే ఏమీ చేయలేని నిస్సహాయస్థితి. ఒకే ఒక్క తెగులు చీనీ మనుగడను శాసిస్తోంది. చలి వాతావరణం తొలగి, వేసవి రానున్న క్రమంలో ఈ తెగులు స్వైరవిహారం చేస్తోంది.

పీచు వేరుకు సోకి..
కొన్నేళ్లుగా చీనీ తోటలకు రూట్‌రాట్ అనే వేరుకుళ్లు తెగులు ఆశిస్తోంది. ఎక్కువగా ఫిబ్రవరి నుంచి మార్చి వరకు అత్యధికంగా చెట్లు నిలువునా ఎండిపోతున్నాయి. పీచువేర్లకు ఆశించి క్రమేణా పెద్ద వేర్లకు పాకడంతో అవి కుళ్లి తొందరగా ఎండిపోతాయి. తెగుళ్లు ఆశించిన చెట్లకు విపరీతంగా పూత పూసి కాయలు ముందిరేలోపే చెట్లు ఎండిపోతున్నాయని ఉద్యాన శాస్త్రవేత్తల సైతం ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నేలలో తేమ శాతం తక్కువ ఉండడం, వేర్లకు గాయాలు కావడం, నీటి తడులలో ఎక్కువ వ్యత్యాసాలుండడంతో ఈ తెగులు సోకే అవకాశం ఎక్కువ. ఫలితంగా కాయ నాణ్యత తగ్గి టన్ను ధర రూ.10 వేల దిగువకు చేరుతోంది.

యాజమాన్య పద్ధతులే శరణ్యం

- డాక్టర్ శారద (ప్రధాన శాస్త్రవేత్త), ఉద్యాన పరిశోధన కేంద్రం(రేకులకుంట)

ఆకులు పసుపు రంగులోకి మారి, రాలిపోతాయి. కొమ్మలు పెలుసుగా మారిపోతాయి. తెగులు రాక ముందే పశువుల ఎరువుతో కలిపిన ట్రైకోడెర్మా విరిడి వేసుకోవాలి. చెట్లు మొదళ్లకు కార్బండిజం 2 గ్రాములు లీటరు నీటితో తడిసేలా పిచికారీ చేయాలి.

మురుగుశుద్ధి.. రూ.కోటిన్నర లబ్ధి

యల్లనూరు రోడ్డు వద్ద శుద్ధికేంద్రం

తాడిపత్రి, న్యూస్‌టుడే: మురుగు అన్నది ఇప్పటివరకు ఒక సమస్య. కానీ ఇక నుంచి ఆదాయం. అదెలా అంటారా.. తాడిపత్రికి వెళ్తే అన్నీ అర్థం అవుతాయి. స్థానిక మున్సిపల్ ఛైర్మన్ జేసీ ప్రభాకర్ రెడ్డి 15 ఏళ్లక్రితం చేసిన ప్రణాళిక ఇందుకు దోహదం చేస్తోంది.

ఏం చేశారు: ప్రణాళిక రూపొందించి మురుగు శుద్ధి కేంద్రాలను నిర్మించారు. శుద్ధి అనంతరం వచ్చిన నీటిని స్థానికంగా ఉన్న పరిశ్రమలకు విక్రయించేలా ప్రణాళిక రూపొందించారు.

శుద్ధి ఎలా?: తాడిపత్రి పురపాలికకు సంబంధించి ఎస్పీటీ-2 (సీవేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్)లో రోజూ 3 ఎంఎడీ మురుగు నీటి శుద్ధి చేస్తారు. వాటిని ఇప్పటివరకు చెట్ల పెంపకానికి వినియోగించేలా ఏర్పాట్లు చేశారు. ప్రస్తుతం శుద్ధి చేసిన మురుగు స్థానికంగా ఆర్జాస్ ఉక్కు పరిశ్రమకు సరఫరా చేయాలని నిర్ణయించారు. ఇందుకు సంబంధించి ఎంఓయూను కుదుర్చుకున్నారు.

పండ్లతోటలకు.. ప్రతిరోజూ 3 ఎంఎల్‌డీని సరఫరా చేయడంతో ఏటా రూ.కోటిన్నర వరకు ఆదాయం చేకూరే అవకాశం ఉంది. ఎస్టీపీ-1లో ప్రతిరోజూ 7 ఎంఎల్‌డీ వరకు మురుగు శుద్ధి చేస్తున్నారు. ప్రస్తుతం వాటిని రైతులకు అందించగా పలు రకాల పండ్లతోటలు సాగు చేస్తున్నారు. ఇప్పటికే ఎస్టీపీ-2 నుంచి ఆర్జాస్ పరిశ్రమకు పైప్‌లైను ఏర్పాటుకు అధికారులు చర్యలు చేపట్టారు.

భవిష్యత్తులో..
ప్రస్తుతం మొదటి దశలో 3 ఎంఎల్‌డీ మురుగు శుద్ధి చేసి సరఫరా చేస్తున్నాం. భవిష్యత్తులో ఎస్టీపీ-1, ఎస్టీపీ-2ల నుంచి 10 ఎంఎల్‌డీ వరకు శుద్ధి చేసిన నీటి సరఫరాకు ప్రణాళిక రూపొందించాం. పురపాలిక సాగు చేసే పంటలకు, రైతులకు అందిస్తున్నాం. 400 ఎకరాలకు ఈ నీటినే వినియోగిస్తున్నారు. రెండు నెలల్లో ఎస్టీపీ-2 నుంచి వచ్చే శుద్ధి నీటిని పైపులైన్ ఏర్పాటు చేయించి పరిశ్రమకు చేరేలా చర్యలు తీసుకుంటున్నాం.
- శివరామకృష్ణ, మున్సిపల్ కమిషనర్ తాడిపత్రి

త్రినేత్ర స్వామికి.. బ్రహ్మ రథోత్సవ సేవ

గాంధీకట్ట వద్ద ఊరేగింపు
అంతర్‌చిత్రంలో కల్యాణం చేస్తున్న అర్చకులు

తాడిపత్రి బుగ్గరామలింగేశ్వరస్వామి కల్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. ఉదయం బుగ్గరామలింగేశ్వరుడు, రాజరాజేశ్వరి అమ్మవార్లను అలంకరించి కల్యాణ క్రతువు చేపట్టారు. మున్సిపల్ ఛైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి కుటుంబ సమేతంగా పాల్గొని వీక్షించారు. సాయంత్రం బుగ్గరామలింగేశ్వరుడు, రాజరాజేశ్వరి అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను పట్టువస్త్రాలతో అలంకరించి రథంలో కొలువుతీర్చారు. అనంతరం గాంధీకట్ట వద్ద నుంచి ఆంజనేయస్వామి విగ్రహం వరకు అక్కడి నుంచి తిరిగి గాంధీకట్ట వద్దకు రథోత్సవం కన్నుల పండువగా సాగింది. - న్యూస్‌టుడే, తాడిపత్రి

ఛార్జింగ్ ఈ తీరుగా..

లక్ష్మీనగర్ (అనంతపురం), న్యూస్‌టుడే: కాలుష్య నివారణ, తక్కువ విద్యుత్తు వినియోగం, ఎక్కువ కిలోమీటర్లు మైలేజీ, తక్కువ బరువు, ఆధునికం, ఆకర్షణీయం.. ఈ కారణాలతో ఉమ్మడి అనంతపురం జిల్లాలో అధికశాతం మంది ఎలక్ట్రిక్ వాహనాలను వాడేందుకు మొగ్గు చూపుతున్నారు. బ్యాటరీల వినియోగంలో అవగాహన లేక అనర్థాలు జరుగుతున్నాయి. వినియోగం తీరులో ఎన్నో జాగ్రత్తలు అవసరం

✦ 35 వేలు : ఉమ్మడి అనంతపురం జిల్లాలో విద్యుత్తుతో నడిచే కార్లు, ఆటోలు, ద్విచక్ర వాహనాల సంఖ్య

✦ 45 కిలోవాట్ల సామర్థ్యం: **ఇంతకన్నా** తక్కువ ఉన్న ఎలక్ట్రిక్ వాహనాలకు రిజిస్ట్రేషన్ నిబంధనలు వర్తించవు.

నిర్ణీత సమయం ప్రకారం..
ఎలక్ట్రిక్ వాహనాల కంపెనీలను బట్టి వారు ఏర్పాటు చేసిన బ్యాటరీల సామర్థ్యాన్ని గంట లేదా ఎన్ని గంటలపాటు ఛార్జింగ్ పెట్టాలనేది ఉంటుంది. వాహనం కొనుగోలు చేసే సమయంలో బ్యాటరీ ఎంత కాలం వస్తుంది.. వాటికి రోజుకు ఎన్ని గంటల ఛార్జింగ్ పెట్టాలి.. ఎన్ని యూనిట్లు విద్యుత్తు వినియోగానికి ఎన్ని కిలోమీటర్లు ప్రయాణించవచ్చన్న వివరాలను తెలియజేసే బుక్‌లెట్ ఇస్తారు.

✦ ఈ బుక్‌లెట్‌లో పేర్కొన్న విధంగా మాత్రమే బ్యాటరీ సామర్థ్యాన్ని బట్టి ఛార్జింగ్ పెట్టాలి. అలా కాకుండా కొంతమంది ఛార్జింగ్ పెట్టి కొన్నిగంటలపాటు పట్టించుకోరు. వాహనంలో బ్యాటరీ వేడెక్కి ప్రమాదాలు జరిగే పరిస్థితి వస్తుంది. అవి పాడవటం, మంటలు రావటం వంటి సమస్యలు ఎదురవుతాయి. సాధ్యమైనంత వరకూ ఎలక్ట్రిక్ వాహనాలను నీడలో ఉండేలా చూసుకోవాలి.

✦ తడినేలపై నీటిలో ద్విచక్ర వాహనం నడపకూడదు. బ్యాటరీకి నీరు తగిలితే షార్ట్ సర్క్యూట్ అయి బ్యాటరీ పాడవటం లేదా ఏదైనా ప్రమాదం జరిగే వీలు ఎక్కువగా ఉంటుంది. ఉరుములు, మెరుపులు వచ్చే సమయంలో ఛార్జింగ్ పెట్టకపోవటం మంచిది. ఈ వాహనాల కంపెనీలను బట్టి రూ.35 వేల నుంచి రూ.1.30 లక్షల వరకూ ప్రస్తుతం అందుబాటులో ఉన్నాయి.

అన్నీతానై.. అన్నదానం

పాత్రలు కడుగుతున్న రవిశంకర్

హిందూపురం సాంస్కృతికం, న్యూస్‌టుడే: ఆయన వ్యాపారవేత్త, డాక్టరేట్ అందుకున్నారు.. నిత్యం అన్నదానం చేయాలన్న తపన ఆయనను ఆధ్యాత్మిక మార్గం వైపు నడిపింది. కర్ణాటక శ్రీక్షేత్రం కైవారం తాత గురుసేవకుడిగా హిందూపురం పట్టణానికి చెందిన డాక్టర్ రవిశంకర్ పలు సేవాకార్యక్రమాలను చేపడుతూ ఆదర్శంగా నిలుస్తున్నారు. కైవారం సేవా ట్రస్టు నిర్వాహకులు ఎం.ఆర్.జయరాం, బాలకృష్ణ బాగోతర్ గురువుల ఆశీస్సులతో హిందూపురం శ్రీయోగినారాయణ సేవా సమితి అధ్యక్షుడిగా 2013లో చేరారు. 2019-20లో సమితి ద్వారా రోగులకు సేవలందించారు. ఈ సేవలకు తమిళనాడుకు చెందిన ఓ సంస్థ డాక్టరేట్ పురస్కారం అందజేసింది. 2024లో ప్రజలకు అన్నసంతర్పణ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ప్రారంభంలో వందమందికి ఉచిత భోజనం అందించారు. ప్రస్తుతం రోజుకు 500 మందికి భోజనం చేస్తున్నారు. ప్రతిఫలాపేక్ష ఆశించకుండానే స్వయంగా నిత్యం సరకులను తెచ్చుకొని వంట చేసి ప్రజలకు వడ్డించిన తర్వాత ఆ పాత్రలను తానే శుభ్రం చేయడం మరో విశేషం. అన్నసత్రం కట్టాలన్నది లక్ష్యమని రవిశంకర్ చెబుతున్నారు.

విద్యార్థులకు మాత్రలు వేస్తున్న కలెక్టర్ ఆనంద్

ఉద్యమంలా నులిపురుగుల నివారణ మాత్రల పంపిణీ

బుక్కరాయసముద్రం: జాతీయ నులిపురుగుల నివారణ మాత్రల పంపిణీ కార్యక్రమాన్ని ఉద్యమంలా నిర్వహించాలని కలెక్టర్ ఓ.ఆనంద్ వైద్యాధికారులకు సూచించారు. మంగళవారం కొర్రపాడు బాలికల గురుకుల పాఠశాలలో ఆయన నులిపురుగుల నివారణ మాత్రల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. 19ఏళ్ల లోపు బాలబాలికలకు నులిపురుగుల నివారణ మాత్రలను ఏడాదికి రెండుసార్లు అందిస్తున్నట్లు తెలిపారు.

విద్యార్థుల కడుపులో ఉన్న నులి పురుగులు తీసుకున్న ఆహారాన్ని తినేసి, వారికి శారీరక, మానసిక ఎదుగుదలను నివారిస్తాయి..

చేనేత.. ఇదిగో చేయూత

90 శాతం రాయితీతో ఆధునిక పరికరాలు..

9500 : అనంతపురం జిల్లాలో చేనేత కుటుంబాలు
10,600: మగ్గాల సంఖ్య

అనంతపురం (కమలానగర్), న్యూస్‌టుడే: ఉమ్మడి జిల్లా చేనేతకు ప్రసిద్ధి. ధర్మవరం, సిండికేట్‌నగర్ ప్రాంతాల్లో లభించే చీరలకు మంచి గుర్తింపు ఉంటుంది. వృత్తిపై ఆధారపడి జీవిస్తున్న కుటుంబాలకు మరింత భరోసా కల్పించేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయి. కాలానికి అనుగుణంగా మగ్గాలకు సాంకేతిక నైపుణ్యాన్ని అందిపుచ్చుకోవటానికి 90 శాతం రాయితీతో పరికరాలను అందిస్తూ ప్రభుత్వం అండగా నిలుస్తోంది. చేయాల్సిందల్లా.. జిల్లా చేనేత కార్యాలయంలో సంప్రదించడమే.

క్లస్టర్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్

గుర్తింపు : పెద్దవడుగూరు, తాడిపత్రి, ఉరవకొండ ప్రాంతాలను క్లస్టర్లుగా గుర్తించారు.

పరికరాలు : నేషనల్ హ్యాండ్లూమ్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం (ఎన్‌హెచ్‌డీపీ) పథకం ద్వారా క్లస్టర్ల వారీగా లబ్ధిదారులకు మగ్గాలకు ఉపయోగపడే ఖరీదైన పరికరాలను అందిస్తారు.

చెల్లింపులు : చేనేత కార్మికుడు రూ.10 శాతం చెల్లిస్తే.. 90 శాతం ప్రభుత్వం చెల్లిస్తుంది.

ఇంకా ఏం పొందొచ్చు : ఈ పథకం ద్వారా రూ.3 లక్షలు విలువ చేసే 'ఎలక్ట్రానిక్ జకాడ్లు' శారీరక శ్రమ తగ్గించే 'లిఫ్టింగ్ డివైజ్‌లు', వేగంగా కండెలు చుట్టే 'డబ్బా వైండింగ్ మిషన్లు' ఇతర పరికరాలు..

ఇప్పటిదాకా: పెద్దవడుగూరు క్లస్టర్‌లో 160 మందికి అందించారు.

తక్కువ వడ్డీ: మగ్గానికి, నేసే చీరకు కావలసిన వస్తువుల కొనుగోలు కోసం పెట్టుబడికి డబ్బులు అవసరమైతే బ్యాంకులే తక్కువ వడ్డీకి రుణాలిస్తాయి.

ఉచిత వర్క్ షెడ్లు
సొంత స్థలం ఉండి, ఆర్థిక స్థోమత లేని బీపీఎల్ కుటుంబాలకు మగ్గం వేసుకోవడానికి 'వర్క్‌షెడ్ నిర్మాణానికి హెచ్‌ఎస్‌ఎస్ (హత్కార్గ సంవర్ధక యోజన) పథకం ద్వారా నిధులు అందిస్తారు. ఇది పూర్తిగా ఉచితం,

ప్రయోజనం : 6శాతం వడ్డీతో బ్యాంకులు ఈ రుణాలు చేనేతలకు అందిస్తాయి. తీసుకున్న రుణంలో 'ఇంట్రెస్ట్ సబ్‌వెన్షన్' కింద ప్రభుత్వం బ్యాంకులకు చెల్లిస్తుంది. తీసుకున్న రుణంలో 20 శాతం గరిష్ఠంగా రూ.10 నుంచి 50 వేల వరకు మార్జిన్ మనీ రూపంలో రాయితీ లభిస్తుంది. 2025-26కు చేనేత జౌళిశాఖకు 900 మందికి లక్ష్యంగా నిర్ణయించారు. అనంతపురం జిల్లాలోని యాడికి, తాడిపత్రి, పెద్దవడుగూరు, పప్పూరు, ఉరవకొండలో 80 మంది కావాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం
- వరప్రసాద్, ఏడీ చేనేత జౌళి శాఖ.

ఆలోచన వెలిగింది..

బత్తలపల్లి నుంచి ధర్మవరం వెళ్లే దారిలో వేల్పుమడుగు వద్ద పెద్ద ఇటుక బట్టీ ఉంది. ఇక్కడ రాత్రి పగలు పనులు చేస్తూనే ఉంటారు. రాత్రి వేళ పనులు చేయడానికి విద్యుత్తు దీపాలను అమర్చాలి.. అన్ని విద్యుత్తు స్తంభాలు మంజూరు కష్టం. కానీ ఎలా? యజమానికో ఉపాయం తట్టింది. తన స్థలంలో పెరుగుతున్న తాటి చెట్లును కోయించి ఇటుక బట్టీ చుట్టూ పాతించాడు. ఒక్కో చెట్టు పైన విద్యుత్తు దీపాల్ని అమర్చాడు. అక్కడక్కడ కొన్ని చెట్లుకు సీసీ కెమెరాలను అమర్చాడు. దీంతో పని నిరంతరం కొనసాగుతోంది. ఎవరు ఏమేం పనులు చేస్తున్నారన్నది ఎప్పటికప్పుడు సీసీ కెమెరాల ద్వారా తెలుసుకుంటున్నారు. - ఈనాడు, అనంతపురం

దివ్యాంగులే.. అసాధ్యులు

అనంతపురం క్రీడలు, న్యూస్‌టుడే: చీకటిని తిడుతూ కూర్చునేకంటే చిరుదీపం వెలిగిస్తే జీవితమే ప్రకాశవంతం అవుతుంది. వైకల్యం ఉందని కుంగిపోకుండా నమ్మకం, పట్టుదల, ఆత్మవిశ్వాసంతో అడుగులేశారు ఆ దివ్యాంగులు. యుద్ధకళల్లో ఒకటైన తైక్వాండోలో అంతర్జాతీయ స్థాయిని అందుకున్నారు. వారే నగరానికి చెందిన ప్రశాంత్‌రెడ్డి, బి.గగనకృష్ణరాజు..

పేరు: బి.గగన కృష్ణరాజులు
చదువు: 4వ తరగతి
తండ్రి: నాగేంద్ర ఎలక్ట్రీషియన్

మూడుసార్లు జాతీయస్థాయికి
దిల్లీలో జరిగిన సబ్ జూనియర్ పోటీల్లో స్వర్ణం సాధించాడు. విజయవాడలో జరిగిన ఓపెన్ తైక్వాండో పోటీల్లో కూడా పసిడి పట్టాడు. హరియాణాలో జరిగిన సబ్ జూనియర్ జాతీయ స్థాయి పోటీల్లో రజతం సాధించాడు.

5 పర్యాయాలు ఛాంపియన్: రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ తైక్వాండోలో ఐదుసార్లు బంగారు పతకాలు కైవసం చేసుకున్నాడు. నగరానికి చెందిన ఈ బాలుడు కిక్ కొడితే ప్రత్యర్థులు చిత్తవుతున్నారు. కాకినాడ, ప్రకాశం, విజయవాడల్లో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో మెరుపులు మెరపించాడు. అంతర్జాతీయ వేదికలపై సత్తాచాటి పతకం అందుకోవాలన్నది బాలుడి చిరకాల స్వప్నం.

పేరు: వెన్నపూస ప్రశాంత్‌రెడ్డి, **తండ్రి పేరు:** నరేష్‌రెడ్డి
శిక్షకుడు: ఎం.రామాంజనేయులు



జాతీయస్థాయి విజయాలు: నగరానికి చెందిన ప్రశాంత్‌రెడ్డి ఛాంపియన్ తైక్వాండో అకాడమీలో శిక్షణ తీసుకుని గత ఏడాది పంజాబ్‌లో జరిగిన జాతీయస్థాయి పారా తైక్వాండో పోటీల్లో స్వర్ణం సాధించాడు. 2024లో అక్కడే జరిగిన జాతీయ స్థాయి పోటీల్లో రజతం సాధించి, జైపూర్‌లో జరిగిన జాతీయ పోటీల్లో కూడా స్వర్ణంతో మెరిశాడు.

అంతర్జాతీయస్థాయి పోటీలు
దుబాయ్‌లో జరిగిన ఆసియా పారా యూత్ తైక్వాండోలో, మలేషియాలో జరిగిన ఛాంపియన్‌షిప్ పోటీల్లో, వియత్నాంలో నిర్వహించిన పోటీల్లో దేశం తరఫున ప్రాతినిధ్యం వహించాడు. ✦ గత ఏడాది లఖ్‌నవూలో ఉన్న శాయ్ అకాడమీలో ప్రవేశం కల్పించారు. అంతర్జాతీయ స్థాయిలో పతకం సాధించాలన్నదే ఈ యువకుడి లక్ష్యం.

వేగంగా రెవెన్యూ దస్త్రాల పరిష్కారం

జిల్లా సచివాలయం, న్యూస్‌టుడే: ఎన్నో ఏళ్లుగా మూలన పడేసిన దస్త్రాలకు మోక్షం లభిస్తోంది. 22ఏ నిషేధిత (2వేలున్నట్లు అంచనా), చుక్కల భూముల దస్త్రాలను (5వేలున్నట్లు అంచనా) రెండు దఫాలుగా వెయ్యికి పైగా 22ఏ భూముల దస్త్రాలను పరిష్కరించడంతో ప్రక్రియ ఊపందుకుంది. ఈనెల 12, 13వ తేదీల్లో అనంత కలెక్టరేట్ రెవెన్యూ భవన్‌లో ఏకకాలంలో ఆ రెండు రకాల దస్త్రాల పరిశీలన జరిగింది. కలెక్టర్ ఆనంద్, జేసీ విష్ణు చరణ్, డీఆర్‌ఓ మాలోల మకాం వేసి దస్త్రాలను చూశారు.

✦ 22ఏ నిషేధిత భూముల దస్త్రాల్లో పరిశీలించినవి : 214
పరిష్కారం: 95, తిరస్కరణ 119
✦ 531 చుక్కల భూముల దస్త్రాలను చూడగా..: 158 ఫైళ్లకు ఆమోదం లభించింది.

(c) eenadu

నలుగురికి ఏఈలుగా పదోన్నతి

తపోవనం (అనంత గ్రామీణం), న్యూస్‌టుడే: జడ్పీ యాజమాన్యం కింద పనిచేస్తున్న నలుగురు సీనియర్ సహాయకులకు ఏఈలుగా పదోన్నతి కల్పించారు. ఈమేరకు ఉత్తర్వులను జడ్పీ ఛైర్‌పర్సన్ బి.గిరిజమ్మ, సీఈఓ బి.శివశంకర్, ఉప సీఈఓ జి.వెంకటసుబ్బయ్య చేతుల మీదుగా వారికి అందజేశారు. తనకల్లులోని మండల ప్రజా పరిషత్ సీనియర్ సహాయకుడిగా పనిచేస్తున్న ఆర్.రాజశేఖర్‌ను పుట్లూరు మండల ఏఈగా, బి.మహేష్‌ను గోరంట్ల, పుట్టపర్తిలోని వైకే నరేంద్రరెడ్డిని గాండ్లపెంటకు, కళ్యాణదుర్గం పీఆర్ఐ సబ్-డివిజన్‌లో పనిచేస్తున్న సి.పద్మప్రియను రొద్దం మండల ఏఈగా వేశారు. కార్యక్రమంలో జడ్పీ ఏఓలు విజయభాస్కర్‌రెడ్డి, నియాజ్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

రేపు మత్స్య సంపదకు వేలం

అనంతపురం (వ్యవసాయం): కలెక్టర్ ఆదేశాలతో జీడిపల్లి జలాశయంలోని మత్స్య సంపదకు 19న బహిరంగ వేలం నిర్వహిస్తామని పీఏబీఆర్ మత్స్యక్షేత్రం, మత్స్య అభివృద్ధి అధికారి పెద్దబాబునాయక్ తెలిపారు. జీడిపల్లి జలాశయం పరిధిలో జీడిపల్లి, రామసాగరం, అంకంపల్లి, హనుమిరెడ్డిపల్లి, దుద్దేకుంట గ్రామాలున్నాయి. ఆరోజు ఉదయం 11.30 గంటలకు జీడిపల్లి ప్రభుత్వ పాఠశాల ఆవరణలో వేలం ఉంటుంది. దరఖాస్తుదారులు రూ.5 వేలు రుసుం చెల్లించాల్సి ఉంటుందన్నారు.

అంతుచిక్కని నీటి లెక్కలు

● పీఏబీఆర్ కుడి కాలువ ప్రవాహం అస్తవ్యస్తం ● ఒకచోట 630, మరోచోట 65 క్యూసెక్కులు

అనంతపురం (శ్రీనివాస్‌నగర్), న్యూస్‌టుడే: పీఏబీఆర్ కుడి కాలువ నిర్వహణ అస్తవ్యస్తంగా మారడంతో చివరి ఆయకట్టుకు నీరందడం లేదు. ఈ కాలువ మొదట్లో 2 కి.మీ వద్ద 630 క్యూసెక్కుల ప్రవాహం కొనసాగుతుండగా, బత్తలపల్లి మండలం మల్లేపల్లి సమీపంలో 80 కి.మీ వద్ద కేవలం 65 క్యూసెక్కులే ఉంది. 94 కి.మీ వద్ద చుక్కనీరు కనిపించలేదు. ఈ దయనీయ స్థితి ఎందుకు నెలకొంది ఆ నీళ్లు ఎక్కడికి వెళుతున్నాయి, ఏమవుతున్నాయో హెచ్చెల్సీ అధికారులే చెప్పాలి. వారి పర్యవేక్షణ పూర్తిగా పడకేసిందని, క్షేత్రస్థాయి ఇంజినీర్లు పట్టించుకోవడం లేదని ప్రవాహం లెక్కలే చెబుతున్నాయి. ఈ తతంగాన్ని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ జలవనరుల మంత్రి నిమ్మల రామానాయుడు దృష్టికి తెచ్చారు. ఇదే సందర్భంలోనే అనంత, శ్రీసత్యసాయి జిల్లాల కలెక్టర్లతోనూ ఆయన మాట్లాడారు. కుడి కాలువ నీటి ప్రవాహంలో ఏం జరుగుతోందని సూటిగా ప్రశ్నించారు. ఈక్రమంలో మంగళవారం సాయంత్రం ఆగమేఘాలపై ఇద్దరు కలెక్టర్లు కలిసి హెచ్చెల్సీ అధికారులతో వీక్షణ సమీక్ష నిర్వహించి వాస్తవ పరిస్థితిపై ఆరా తీశారు.

2 కి.మీ వద్ద నీటి ప్రవాహం

50 రోజులైనా గండరగోళమే..

గతేడాది డిసెంబరు 1 నుంచి పీఏబీఆర్ కుడి కాలువకు నీరు విడుదల చేశారు. కాలువ మొదట్లో గండి పడటంతో ఓ పది రోజులు ప్రవాహం బాగా తగ్గింది. ఇప్పటికి 50 రోజులైనా గడిచినా నీటి ప్రవాహం అస్తవ్యస్తంగా, గందరగోళంగా కొనసాగుతోంది. ద్వారం వద్ద చూస్తే 640 నుంచి 700 క్యూసెక్కుల మధ్యలో ప్రవాహం ఉండగా, ఓ 50 కి.మీ దాటాక గణనీయంగా తగ్గుతోంది. అధికారుల మధ్య నీటి లెక్కల్లో లేదు. నార్పల మండలం బి.పప్పూరు చెరువుకు కొద్ది నీరు మాత్రమే దక్కుతోంది. అటు ధర్మవరం, ఇటు తాడిమర్రి వైపు నీరే వెళ్లలేదు. నీటి ప్రవాహం ఇంత దయనీయంగా ఉన్నా అధికార యంత్రాంగం పట్టించుకోవడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

రంధ్రాలు.. గేట్లు ఎత్తేశారా?

నీటి ప్రవాహంపై అనేక అనుమానాలు నెలకొన్నాయి. చాలా ప్రాంతాల్లో పంట కాలువల గేట్లు ఎత్తేస్తున్నారు. కొన్నిచోట్ల కాలువకు గండ్లు, రంధ్రాలు పెట్టి నీటి చౌర్యానికి పాల్పడుతున్నారు. దీని వెనక కొందరు ఇంజినీర్ల పాత్ర ఉందని, రైతుల నుంచి ముడుపులు తీసుకుని చేతులెత్తేస్తున్నారన్న ఆరోపణలు లేకపోలేదు. రాత్రివేళల్లో గేట్లు ఎత్తడం, పగలు కిందికి దించడం జరుగుతోంది. ఫలితంగా నీటి ప్రవాహం ఇబ్బందికరంగా సాగుతోంది. మరోవైపు కాలువలపై నిఘా, పోలీసు, రెవెన్యూ, జలవనరుల బృందాలను నియమిస్తామన్న నిర్ణయం ఊసే లేకపోవడం గమనార్హం.

నీటి ప్రవాహంపై మరింత శ్రద్ధ

కుడి కాలువ నీటి ప్రవాహంలో కొన్ని ఇబ్బందులు తలెత్తిన మాట వాస్తవం. దీన్ని గాడిలో పెడతాం. క్షేత్రస్థాయిలో ముమ్మర తనిఖీలు చేపడతాం. ఆఖరి ఆయకట్టుకు నీళ్లు ఇవ్వడమే కాదు, దిగువ నుంచి చెరువులకూ నీరు కేటాయిస్తూ వస్తాం. రెండు మూడు రోజుల్లో అన్నీ చక్కబడతాయి.

- సుధాకర్‌రావు, ఎస్ఈ, హెచ్చెల్సీ

వదాన్య అండతో జేఈఈ శిఖరాగ్రాన..

చక్కటి పర్సంటైల్‌తో మెరిసిన విద్యార్థులు

జేఎన్‌టీయూ, న్యూస్‌టుడే: వదాన్య జనసొసైటీ సహకారంతో ముగ్గురు పేదింటి విద్యార్థులు జుగేష్‌కుమార్, తులసికార్తిక్, యశ్వంత్‌కుమార్ జేఈఈ మెయిన్స్‌లో 99పైన పర్సంటైల్‌తో సత్తాచాటి అడ్వాన్స్‌డ్‌కు అర్హత సాధించారు. గ్రామీణ ప్రాంతాలు, ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పేద విద్యార్థులకు వదాన్య జనసొసైటీ అండగా నిలుస్తోంది. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ఆ సంస్థ నిరుపేద విద్యార్థుల విద్య కోసం విస్తృత సేవలందిస్తోంది. పిల్లలకు హైదరాబాదులోని ప్రైవేటు జూనియర్ కళాశాల్లో ఇంటర్ చేర్పించి అన్ని వసతులు కల్పిస్తోంది. జాతీయస్థాయి పరీక్షల శిక్షణతో పాటు ఉపకార వేతనాలు ఇస్తోంది. ఈ సందర్భంగా వదాన్య వ్యవస్థాపకుడు పడిపాటి అశోక్ మాట్లాడుతూ 15 ఏళ్ల నుంచి తెలుగు రాష్ట్రాల్లో తమ జనసొసైటీ ప్రతిభావంత పేదింటి విద్యార్థుల విద్యకు తోడ్పడుతోందన్నారు. 2021 నుంచి టాలెంట్ టెస్టులు నిర్వహించి ఎంపికైన వారి ఉజ్వల భవిష్యత్తుకు కృషి చేస్తున్నామన్నారు.

పేదింటి విద్యాకుసుమాలు

- జుగేష్‌కుమార్ జేఈఈ మెయిన్స్‌లో 99.98 పర్సంటైల్ సాధించాడు. తండ్రి పేరు గోపాల్. ధర్మవరం పట్టణానికి చెందిన ఆయన నేత కార్మికుడు. జుగేష్ పది, ఇంటర్లో ఉత్తమ మార్కులు సాధించాడు.
- తులసికార్తిక్ ధర్మవరానికి చెందిన నేత కార్మికుడు నారాయణస్వామి కుమారుడు. జేఈఈ మెయిన్స్‌లో 99.84 పర్సంటైల్ సాధించాడు.
- యశ్వంత్‌కుమార్ 99.78 పర్సంటైల్ తెచ్చుకున్నాడు. కొత్తచెరువుకు చెందిన సదాశివ ఆయన తండ్రి. ప్రైవేటు కళాశాలలో పని చేస్తారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివి ఉత్తమ ప్రతిభచాటి వదాన్య జనసొసైటీ ఇస్తున్న ఉపకార వేతనంతో విద్యనభ్యసిస్తున్నాడు.

తులసికార్తిక్, వదాన్య వ్యవస్థాపకుడు అశోక్, జుగేష్‌కుమార్, యశ్వంత్‌కుమార్

వైభవం.. అగ్నిగుండ మహోత్సవం

అమరాపురం, న్యూస్‌టుడే: అమరాపురం మండలం హేమావతిలోని సిద్ధేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం అగ్నిగుండం మహోత్సవం వైభవంగా జరిగింది. ఉదయం 5 గంటలకే ఈవో నరసింహరాజు, ఉత్సవ కమిటీ ఛైర్మన్ కరేగౌడ్, గ్రామ పెద్దలు అగ్నిగుండానికి పూజలు చేసి వెలిగించారు. జిల్లా నలుమూలలతో పాటు సమీప కర్ణాటక, తమిళనాడు, తెలంగాణ ప్రాంతాల నుంచి దాదాపు 35 వేలకుపైగా భక్తులు హాజరై స్వామివారి దర్శనంతో పాటు అగ్నిగుండంలో ధూపం, రైతులు పండించిన వేరుసెనగ, ఆముదం, కొబ్బరి తదితరాలు వేసి మొక్కు తీర్చుకున్నారు. రాత్రి 10 వరకు రద్దీ కొనసాగింది.

పూజలందుకుంటున్న సిద్ధేశ్వరస్వామి

భారీ బందోబస్తు

ఉత్సవానికి వచ్చిన భక్తులు ఇబ్బందులు కలగకుండా సీఐలు రాజకుమార్, రాఘవన్‌లు దాదాపు వందమంది సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేశారు. సిద్ధేశ్వరస్వామి అన్నదాసోహ సమితి అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు అశ్వర్థనారాయణ హాజరైన భక్తులకు అన్నదానం నిర్వహించారు.

అగ్నిగుండంలో ధూపం వేసి మొక్కులు తీర్చుకుంటున్న భక్తులు

116 మంది బీఎల్‌ఓలకు షోకాజ్ నోటీసులు

అనంతపురం (శ్రీనివాస్‌నగర్), న్యూస్‌టుడే: ఓటరు జాబితా మ్యాపింగ్ పురోగతి సాధనలో నిర్లక్ష్యం చూపారన్న అభియోగంపై అనంత అర్బన్ అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో ఏకంగా 116 మంది బూత్ స్థాయి అధికారులకు (బీఎల్‌ఓ) షోకాజ్ నోటీసులు జారీ చేశారు. ఒకేసారి ఇంతమంది బీఎల్‌ఓలపై చర్యలకు ఉపక్రమించడం కలకలం రేపింది. మంగళవారం అనంత ఆర్డీఓ, ఓటర్ల నమోదు అధికారి(ఈఆర్‌ఓ) కేశవనాయుడు ఈ తాఖీదులు జారీ చేశారు. అనంత అర్బన్ నియోజకవర్గంలో మొత్తం 285 మంది బీఎల్‌ఓలు ఉన్నారు. ప్రతి రోజూ కనీసం 10 నుంచి 20 మంది ఓటర్ల మ్యాపింగ్ చేయాలని అధికారులు నిబంధన పెట్టారు. మంగళవారం ఒక్కరోజే ఐదులోపు మ్యాపింగ్ చేసిన వారిలో ఆ 116 మంది ఉండటం గమనార్హం.

సున్నా మ్యాపింగ్ చేసిన 29 మంది..

ప్రత్యేక సమగ్ర సవరణ-2025(సర్) కార్యక్రమంలో భాగంగా 2002 ఓటర్ల జాబితాను 2025 జాబితాతో మ్యాపింగ్ చేస్తున్న సంగతి తెలిసిందే. మంగళవారం రోజు మ్యాపింగ్ చేసిన సంఖ్యను పరిగణలోకి తీసుకుని ఈ తాఖీదులు జారీ చేశారు. ఆ 116 మందిలో ఒకటి కూడా మ్యాపింగ్ చేయని బీఎల్‌ఓలు 29 మంది ఉన్నారు. వీరిలో బూత్ సంఖ్యల వారీగా 14, 21, 41, 48, 95, 97, 117, 119, 122, 126, 128, 130, 145, 153, 156, 161, 170, 187, 208, 214, 220, 223, 238, 248, 249, 260, 269, 275 పోలింగ్ కేంద్రాల బీఎల్‌ఓలు ఉన్నారు. ఒకటి మాత్రమే చేసిన వారిలో పది మంది ఉన్నారు. షోకాజ్ నోటీసులకు తగిన వివరణ ఇవ్వకపోతే సీసీఎల్ నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని అందులో పేర్కొన్నారు. విచిత్రమేమంటే ఈ ఉత్తర్వు మంగళవారం(17న) జారీ చేయగా, ఇదే నెల 13వ తేదీలోపు వివరణ పంపాలంటూ పేర్కొనడం నిర్లక్ష్యం, బాధ్యతారాహిత్యానికి నిదర్శనంగా నిలిచింది.

తిమ్మమాంబ హుండీ ఆదాయం లెక్కింపు

కానుకలు లెక్కిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

నంబులపూలకుంట, న్యూస్‌టుడే: మహా శివరాత్రి ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన తిమ్మమాంబ హుండీ ఆదాయాన్ని ఆలయ కమిటీ సభ్యులు మంగళవారం లెక్కించారు. హుండీ ఆదాయం రూ.3.62 లక్షలు వచ్చినట్లు వారు తెలిపారు. ఉత్సవాలకు గతంలో కంటే ఎక్కువ సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నట్లు కమిటీ సభ్యులు వివరించారు. ఉత్సవాలను విజయవంతం చేయడానికి కృషి చేసిన ఎమ్మెల్యే కందికుంటకు వారు కృతజ్ఞతలు తెలియజేశారు. వెంకటనారాయణ, శ్రీనివాసులు, నారాయణస్వామి, సర్పంచు విష్ణుమూర్తి, గ్రామస్థులు చౌదరి, యోగీశ్వర పాల్గొన్నారు.

EENADU Classifieds

BUSINESS SERVICES

BUSINESS OFFER

బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్, ఫైనాన్స్‌లో తాకట్టులో ఉన్నవి మా డబ్బుతో విడిపించి కొనబడును. (రిటైర్డ్ పోలీస్ డిపార్ట్మెంట్) గోల్డెన్‌ట్రేడింగ్ కం. ✆ 7382114647.

JOBS

Wanted DRA Tele Callers, Field Executives & Team Leaders Banking Sector Attractive Salaries and Incentives, ✆ 9849394835, 7075345527.

Wanted Teachers for Reputed Schools in A.P & Telangana, Contact: Sneha Placements Service. Ph: 94402 46409.

Job Vacancy: We Hiring Open Positions Himayat Grand Luxury Hotel in Anantapur Contact: 6300123535. Requirements: 1-2 Years Experience in Hotel Industry Good Communication Skills Excellent Computer Skill

త్రినేత్ర హోంకేర్‌లో వృద్ధులను/ పేషెంట్స్‌ను/ పిల్లలను చూసుకొనుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఫ్రీ వసతి, భోజనం. జీ: 18K. ✆ 8520980099, 8520874499

ఎలక్ట్రికల్స్ & ఎలక్ట్రానిక్స్‌లో మార్కెటింగ్ చేయుటకు అనుభవం గల వ్యక్తులు & Office Boys కావలెను. సం||ప్ర: 9440294666.

హరేకృష్ణ హోంకేర్‌లో వృద్ధులను/ పేషెంట్స్‌ను/ పిల్లలను చూసుకొనుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఫ్రీవసతి, భోజనం జీ: 18-20K ✆ 96404 68899, 96402 58899

ప్రముఖ మా సంస్థ యందు వర్క్ చేయుటకు రిసెప్షన్, టెలీకాలర్, ఆఫీస్ అసిస్టెంట్ అర్జెంట్‌గా కావలెను. Q: 10 to డిగ్రీ, జీతం 9K to 25K ✆ 9491555724

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

EENADU Classifieds — 5 లైన్ల ప్రకటన రూ.395/- మాత్రమే

తక్కువ ఖర్చుతో... ప్రతిరోజు క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వండి.... అధిక స్పందనలు పొందండి. వాహనాల అమ్మకం... ఉద్యోగాల భర్తీ... ఇళ్లు, ఫ్లాట్లు, స్థలాల అమ్మకాలు, కొనుగోళ్లు... ఇళ్లు, షాపులు, ఫ్లాట్లు అద్దెకు మరియు అన్నిరకాల బిజినెస్ వ్యవహారాలు...

వివరాలకు: 8008709784

ప్రకటనలపై జి.ఎస్.టి. 5% వర్తించబడును

పప్పుసెనగ పంటకు మద్దతు ధర

క్వింటాలుకు రూ.5,875

అనంతపురం (వ్యవసాయం), న్యూస్‌టుడే: పప్పుసెనగ పంటకు ప్రభుత్వం మద్దతు ధర కల్పించింది. క్వింటా రూ.5,875 చొప్పున కొనుగోలు చేయాలని నిర్ణయించింది. ఏపీ మార్క్‌ఫెడ్‌కు కొనుగోలు బాధ్యతలు అప్పగించారు. ఈమేరకు ప్రభుత్వం అనుమతి ఇచ్చిందని ఏపీ మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్ పెన్నేశ్వరి తెలిపారు. ఈ-పంట నమోదు చేసుకున్న రైతుల నుంచే పప్పుసెనగ కొంటామని, గింజల్లో తేమ 14 శాతం ఉండాలన్నారు. పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్, బ్యాంకు ఖాతా పుస్తకం నకళ్లు తప్పనిసరిగా తేవాలన్నారు. పప్పుసెనగ పంట సాగైన మండలాల్లోని రైతు సేవా కేంద్రాల్లో కర్షకులు పేర్లు నమోదు చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

సబ్‌రిజిస్ట్రార్‌కు పదోన్నతి

తపోవనం (అనంత గ్రామీణం), న్యూస్‌టుడే: అనంతపురం ప్రాంతీయ కార్యాలయంలో చిట్‌ఫండ్స్ సబ్-రిజిస్ట్రార్‌గా పనిచేస్తున్న సి.కుమారస్వామిరెడ్డికి జిల్లా రిజిస్ట్రార్‌గా పదోన్నతి లభించింది. ఆయనను శ్రీకాకుళం జిల్లా రిజిస్ట్రార్‌గా బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. రాయలసీమ జిల్లాల్లో సబ్-రిజిస్ట్రార్‌గా అనేక కార్యాలయాల్లో పని చేసిన ఆయన చిట్స్‌ఫండ్స్ సబ్-రిజిస్ట్రార్‌గా రెండేళ్లుగా అనంతపురంలోనే విధులు నిర్వహించారు. రాష్ట్రవ్యాప్తంగా 18 మంది జిల్లా రిజిస్ట్రార్లుగా పదోన్నతి పొందగా, అందులో అనంతపురం ఉమ్మడి జిల్లా నుంచి కుమారస్వామిరెడ్డి మాత్రమే ఉన్నారు.

సి.కుమారస్వామిరెడ్డి

విశ్రాంత సీఈపై ఏసీబీ విచారణ

అనంతపురం(శ్రీనివాస్‌నగర్), న్యూస్‌టుడే: ఆదాయానికి మించి ఆస్తులున్నాయన్న అభియోగంపై జిల్లా జలవనరుల శాఖ రిటైర్డు చీఫ్ ఇంజినీరు(సీఈ) వీవీ నాగేశ్వరరావుపై సమగ్ర విచారణకు అనంత రేంజ్ ఏసీబీ సీఐ హమీద్‌ఖాన్‌ను నియమించారు. మంగళవారం ఆ శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి జి.సాయిప్రసాద్ ఈమేరకు జీఓ 66 జారీ చేశారు. 2012 డిసెంబరులో సీఈపై అవినీతి అభియోగాలు నమోదైన విషయం తెలిసిందే. శాఖాపరమైన విచారణ ఒకవైపు కొనసాగుతుండగా, మరోవైపు ఏసీబీ విచారణ చేస్తోంది. గత నెలలో అప్పటి ఏసీబీ సీఐ ఖాదర్‌బాషాను నియమించగా, ఆయన మాతృశాఖకు బదిలీ కావడంతో హమీద్‌ఖాన్‌ను వేశారు.

రైల్వేస్టేషన్ ఆవరణలో గడ్డికి నిప్పు

అనంతపురం (మూడోరోడ్డు), న్యూస్‌టుడే: అనంత రైల్వేస్టేషన్ ఆవరణలో గడ్డికి నిప్పు అంటుకుంది. స్టేషన్ వెలుపల భాగంలో పాత రైల్వేగేటు సమీపంలో మంటలు రేగడంతో రైల్వే రక్షక దళం వెంటనే వెళ్లి అదుపు చేసింది. సమీపంలో సిగ్నల్ తీగలకు మంటలు తాకితే రైళ్ల రాకపోకలకు అంతరాయం కలిగేది. స్టేషన్ మేనేజర్ అశోక్‌కుమార్ ఆర్పీఎఫ్ పోలీసులకు సమాచారం అందజేశారు. సీఐ సుదర్శన్‌రావు, ఎస్సై పీకే రెడ్డి సిబ్బందితో వెళ్లి మంటలను ఆర్పారు. రైలు పట్టాల సమీపంలో గడ్డికి ఎవరు నిప్పు పెట్టినా కేసులు నమోదు చేస్తామని ఈ సందర్భంగా ఆర్పీఎఫ్ సీఐ హెచ్చరించారు.

జాతీయ రహదారిపై పూజారి మృతి

డి.హీరేహాళ్: నిత్యం రోజు అమ్మవారికి పూజలు చేసే గుడి పూజారిని మంగళవారం సాయంత్రం రోడ్డు ప్రమాదం మృత్యువు రూపంలో కబళించింది. డి.హీరేహాళ్ మండలం కుంటుమారెమ్మ ఆలయ పూజారి రుద్రప్ప(48)ను జాతీయ రహదారిపై కారు ఢీకొనడంతో దుర్మరణం చెందినట్లు ఎస్సై గురుప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. రుద్రప్ప ప్రతి మంగళ, శుక్రవారం రోజుల్లో గుడిలో పూజలు చేస్తూ జీవనం సాగించేవారు. మంగళవారం సాయంత్రం పూజ నిమిత్తం రహదారిని దాటుతుండగా బెంగళూరు వైపు నుంచి వేగంగా వచ్చిన కారు ఢీకొట్టడంతో తీవ్ర గాయాలతో మృతిచెందాడు. కుటుంబ పెద్ద దిక్కును కోల్పోయామని అతడి భార్య, పిల్లలు కన్నీరుమున్నీరుగా విలపించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

రుద్రప్ప

లాడ్జీలో వృద్ధుడి బలవన్మరణం

అనంత నేరవార్తలు, న్యూస్‌టుడే: నగరంలోని ఆర్టీసీ బస్టాండు సమీపంలోని ఓ లాడ్జీలో వృద్ధుడు ఆత్మహత్యకు పాల్పడ్డారు. వివరాలు..శ్రీసత్యసాయి జిల్లా కొత్తచెరువు మండలం మీర్జాపురానికి చెందిన సంజీవరెడ్డి (72) సోమవారం మధ్యాహ్నం బస్టాండు వద్దనున్న లాడ్జీలో గది అద్దెకు తీసుకున్నారు. మంగళవారం లాడ్జి సిబ్బంది గది తలుపులు కొట్టినా లోపలి నుంచి స్పందన రాలేదు. అనుమానంతో కిటికీ రెక్కలు బద్దలుగొట్టి చూడగా, లోపల ఫ్యాన్‌కు సంజీవరెడ్డి ఉరేసుకొని వేలాడుతూ కనిపించారు. సిబ్బంది అతడిని కిందికి దించి చూడగా అప్పటికే ప్రాణాలు పోయినట్లు గుర్తించారు. లాడ్జి నిర్వాహకులు మూడో పట్టణ పోలీసులకు సమాచారం ఇవ్వగా, వారు ఘటనాస్థలికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ సర్వజనా సుపత్రికి తరలించారు. వృద్ధుడి ఆత్మహత్యకు కారణాలు తెలియాల్సి ఉంది.

ఎప్పుడు వస్తారో.. ఎక్కడికి వెళ్తారో!

ప్రభుత్వ వైద్యకళాశాలలో విద్యార్థులపై కొరవడిన పర్యవేక్షణ

అనంతపురం (వైద్యం), న్యూస్‌టుడే: అనంతపురం ప్రభుత్వ వైద్యకళాశాలలో ఎంబీబీఎస్ చదువుతున్న విద్యార్థులపై పర్యవేక్షణను అధికారులు గాలికొదిలేశారన్న విమర్శలు వస్తున్నాయి. రోజువారీగా కళాశాలకు వస్తున్నారా.. లేదా... తరగతులకు హాజరుకాకుండా ఎక్కడికి వెళ్తున్నారారన్న సమాచారం తెలుసుకోవడం లేదు. దీంతో కొందరు వైద్యవిద్యార్థులు ఎవరికీ చెప్పకుండా బయటకు వెళ్లడం.. వారి పనులు ముగించుకుని తిరిగి నేరుగా వసతిగృహాలకు వెళ్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. మంగళవారం తొమ్మిది మంది ఎంబీబీఎస్ విద్యార్థులు ఈత కొట్టడానికి గార్లదిన్నెకు వెళ్లడం... అక్కడ ఓ విద్యార్థి మృతి చెందటంతో భద్రతపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి. సదరు విద్యార్థులు ఎవరి అనుమతితో వెళ్లారు. అంతమంది తరగతికి హాజరుకాకపోతే బోధకులు ఎందుకు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురాలేదన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఎవరు వచ్చినా రాకపోయినా.. తమ పని తాము చేసుకుని వెళ్లిపోతున్నట్లు వ్యవహరిస్తుండటంతో ఇలాంటి పరిస్థితులు వస్తున్నాయని సర్వత్రా వ్యక్తమవుతోంది.

- ● ఎంబీబీఎస్ చదువుతున్న మొత్తం విద్యార్థులు 850 మంది కాగా వారిలో 90 శాతం మంది ప్రభుత్వ వైద్యకళాశాల వసతిగృహాల్లోనే ఉంటున్నారు. మొదటి సంవత్సరం వారికి ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు.. రెండు నుంచి ఆపై సంవత్సరాల విద్యార్థులకు ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు తరగతులు నిర్వహిస్తారు.
- ● వీరు బయటకు వెళ్లేందుకు అనుమతిచ్చే సమయం: సాయంత్రం 5గంటల పైన, వసతిగృహాల్లోకి రాత్రి తొమ్మిది గంటలలోపు రావాల్సి ఉంటుంది.

విచారణ చేపట్టి.. చర్యలు తీసుకుంటాం

విద్యార్థులు ఎవరి అనుమతితో బయటికి వెళ్లారో సమాచారం లేదు. తొమ్మిది మంది మొదటి సంవత్సరం విద్యార్థులు కళాశాలకు వచ్చారా.. లేదా అనేదానిపై విచారణ చేపడతాం. బాధ్యులు నిర్లక్ష్యంగా వ్యవహరించినట్లు తేలితే తగిన చర్యలు తీసుకుంటాం. పర్యవేక్షణ వ్యవస్థను మరింత పటిష్ఠం చేస్తాం. ప్రస్తుతం విద్యార్థి మృతదేహాన్ని మార్చురీకి తరలించాం. మృతుడి తల్లితండ్రులకు సమాచారం ఇచ్చాం.

- డాక్టర్ విజయశ్రీ, ప్రిన్సిపల్, ప్రభుత్వ వైద్యకళాశాల

ప్రాణం తీసిన ఈత సరదా!

వైద్యవిద్యార్థి మృత్యువాత

గార్లదిన్నె గ్రామీణం, న్యూస్‌టుడే: గార్లదిన్నె సమీపంలోని ఈతకొలనులో ప్రమాదవశాత్తు ఓ వైద్యవిద్యార్థి మృతి చెందిన ఘటన మంగళవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఉమ్మడి ప్రకాశం జిల్లా మార్కాపురంకు చెందిన మోహన్ (19) అనంతపురంలోని ప్రభుత్వ వైద్యకళాశాలలో ఎంబీబీఎస్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. ఎనిమిది మంది సహచర విద్యార్థులతో కలసి మంగళవారం మధ్యాహ్నం గార్లదిన్నెకు వచ్చారు. వారితో కలిసి మోహన్ ఈత కొడుతూ లోపలికి వెళ్లారు. ఎంత సేపటికి రాకపోవడంతో తోటి విద్యార్థులు ఈతకొలనులో వెతకసాగారు. కొలను లోపల ఉండటాన్ని గుర్తించి... బయటికి తీసుకొచ్చారు. తలకు గాయం కావడంతో ఆటోలో సమీపంలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. అనంతరం మృతదేహాన్ని అనంతపురం సర్వజన వైద్యశాలకు తరలించారు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై గౌస్‌బాషా తెలిపారు.

మోహన్

చదువుతో పాటు క్రీడలు తప్పనిసరి

అనంతపురం క్రీడలు, న్యూస్‌టుడే: చదువుతో పాటు ఆటల్లో రాణించే విద్యార్థులు జీవితంలో ఉన్నతస్థాయి అందుకుంటారని అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ తెలిపారు. మంగళవారం డీఎస్‌ఏ ఇండోర్ స్టేడియంలో శాప్ లీగ్ జిల్లాస్థాయి చెస్ పోటీల ప్రారంభోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. క్రీడలను అభివృద్ధి చేయాలనే సంకల్పంతో శాప్ లీగ్ పోటీలకు శ్రీకారం చుట్టామన్నారు. జిల్లాస్థాయిలో విజేతలుగా నిలిచిన వారు రాష్ట్ర స్థాయి పోటీల్లో సత్తాచాటి జిల్లా కీర్తిని ఇనుమడింపజేయాలని పిలుపునిచ్చారు. కలెక్టర్ ఆనంద్ మాట్లాడుతూ జిల్లాస్థాయి పోటీల్లో ఎక్కువమంది పాల్గొనేలా ప్రచారం చేయాలని ఆదేశించారు. ప్రతి పాఠశాల, జూనియర్ కళాశాలకు లీగ్ పోటీలపై అవగాహన కల్పించాలన్నారు. శాప్ డైరెక్టర్ బి.శివ, డీఎస్‌డీఓ ఎస్ఎం మంజుల, పాఠశాల క్రీడా సమాఖ్య జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు, ఎస్ఎస్‌బీఎన్ పీడీ శ్రీవాస్‌రెడ్డి, డీఎస్‌ఏ శిక్షకులు పాల్గొన్నారు. అనంతరం కలెక్టర్, ఎంపీ చదరంగం బోర్డుపై ఎత్తులు వేసి పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఇండోర్ స్టేడియం మరమ్మతులకు నిధులివ్వాలని డీఎస్‌డీఓ మంజుల ఎంపీ అంబికాను అభ్యర్థించగా ఆయన సానుకూలంగా స్పందించారు.

ఎత్తులు వేస్తున్న ఎంపీ అంబికా, కలెక్టర్ ఆనంద్

గొర్రెల పెంపక క్షేత్రం తీరుపై ఆరా

పెనుకొండ, న్యూస్‌టుడే: పట్టణ శివారులోని ప్రభుత్వ గొర్రెల పెంపక క్షేత్రాన్ని మంగళవారం జిల్లా కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన క్షేత్ర విస్తీర్ణం, గొర్రెల సంఖ్య పెంచడానికి వాడుతున్న సాంకేతిక పద్ధతులపై ఆరా తీశారు. క్షేత్రం లక్ష్యాలను, క్షేత్రానికి సంబంధించిన భూమి నుంచి వైద్యకళాశాల, ఎంఐజీ లేఅవుట్‌కు ఎంత భూమి కేటాయించారన్న అంశాలను అడిగి తెలుసున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ క్షేత్రం భూమి అన్యాక్రాంతం కాకుండా రక్షించడానికి పలు సూచనలిచ్చారు. సెమీ కల్చర్ మొక్కల సంఖ్యను పెంచాలని, ఉపాధి హామీ పథకం ద్వారా చెక్‌డ్యామ్‌లు నిర్మాణానికి అవకాశాలు పరిశీలించాలని, క్షేత్రం చుట్టూ కంచె ఏర్పాటు చేయాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా పశువైద్యాధికారి శుభదాస్, డీడీ కాంతమ్మ, పశువైద్యుడు నాగేంద్ర, తహసీల్దార్ స్వాతి పాల్గొన్నారు.

పెనుకొండ శివారులోని గొర్రెలపెంపక క్షేత్రాన్ని సందర్శించిన కలెక్టర్

కారు ఢీకొని ఉపాధ్యాయుడి దుర్మరణం

ద్విచక్రవాహనంపై విధులకు వెళ్తుండగా ప్రమాదం

ధనాపురం (పరిగి), న్యూస్‌టుడే: మండలపరిధిలోని ధనాపురం క్రాస్ వద్ద కొడికొండ నుంచి శిర వెళ్లే జాతీయ రహదారిలో మంగళవారం ఉదయం ద్విచక్రవాహనాన్ని కారు ఢీకొన్న ప్రమాదంలో ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుడు ఆదినారాయణ(56) అక్కడికక్కడే మృత్యువాత పడగా, మరో ఉపాధ్యాయుడు తీవ్రంగా గాయపడ్డాడు. వివరాలిలా.. బుక్కపట్నం మండలం బుచ్చయ్యగారిపల్లికి చెందిన ఆదినారాయణ (47), మరో ఉపాధ్యాయుడు తుమ్మలప్పతో కలిసి ద్విచక్రవాహంలో గుడిబండ మండలం మోపురుగుండు పాఠశాలకు వెళుతున్నారు. మార్గంమధ్యలో ధనాపురం క్రాస్ వద్ద వీరు ప్రయాణిస్తున్న ద్విచక్రవాహనాన్ని ఎదురుగా వస్తున్న కారు వేగంగా ఢీకొట్టడంతో ఆదినారాయణ మృతి చెందారు. గుడిబండ మండలం దిన్నేహట్టి ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న తుమ్మలప్ప తీవ్రంగా గాయపడ్డారు. విషయం తెలుసుకున్న పరిగి 108 వాహన సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని గాయపడ్డ ఉపాధ్యాయుణ్ని చికిత్స కోసం హిందూపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఆదినారాయణ భార్య లలిత పిల్లలు మేనల్లుడు వెంకటేశ్వర్లు తెలిపారు. మృతుడికి భార్యతో పాటు ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. ప్రమాదంపై ఉపాధ్యాయ సంఘాల నేతలు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

ఆదినారాయణ

రోడ్డు దాటుతూ మరొకరు..

హిందూపురం, న్యూస్‌టుడే: హిందూపురం పురపాలక సంఘం పరిధిలోని మోతుకపల్లి వద్ద మంగళవారం రాత్రి రహదారి దాటుతున్న ఆదిరెడ్డి(65)ని ద్విచక్ర వాహనం ఢీకొనడంతో దుర్మరణం చెందారు. పరిగి మండలం శ్రీరంగరాజుపల్లికి చెందిన ద్విచక్ర వాహనదారుడు హిందూపురం నుంచి స్వగ్రామానికి వెళ్తుండగా మార్గమధ్యలో ఈ ఘటన చోటు చేసుకుంది. ఒకటో పట్టణ పోలీస్‌స్టేషన్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి మృతదేహాన్ని ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

భార్య కాపురానికి రాలేదని...

పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నం

రాయదుర్గం గ్రామీణం, న్యూస్‌టుడే: రాయదుర్గం పోలీస్ సర్కిల్ కార్యాలయం ఎదుట వడ్రవన్నూరు గ్రామానికి చెందిన దివ్యాంగుడు చౌడప్ప మంగళవారం ఒంటిపై పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. అప్రమత్తమైన పోలీసులు ఆయన ప్రయత్నాన్ని అడ్డుకుని నీళ్లుచల్లి దుస్తులు మార్పించారు. చౌడప్పకు డి.హీరేహాళ్ మండలం కళ్యం గ్రామానికి చెందిన ఓ మహిళతో కొన్నేళ్ల కిందట వివాహమైంది. ఏడు నెలలుగా వీరు కళ్యంలోని అద్దె ఇంట్లో ఉంటున్నారు. కొన్నాళ్లుగా చౌడప్ప తన స్వగ్రామం వడ్రవన్నూరు వెళ్దామని భార్యకు చెప్పగా ఆమె నిరాకరించడంతో మనస్తాపానికి గురై పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. తన భార్య తరఫున పెద్ద మనుషులు జోక్యం చేసుకుని తనకు అన్యాయం చేస్తున్నారని, తనతోపాటు భార్యను స్వగ్రామానికి పంపించాలని ఆయన పోలీసులను వేడుకున్నాడు. రాయదుర్గం అర్బన్ సీఐ జయనాయక్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

చౌడప్ప

కుమారుడిపై దాడి.. అడ్డుకోబోయి తల్లి మృతి

అనంత నేరవార్తలు: కొడుకుపై జరుగుతున్న దాడిని అడ్డుకోబోయిన తల్లి తీవ్రంగా గాయపడి మృతి చెందిన ఘటన నగరంలో చోటుచేసుకుంది. నాలుగో పట్టణ పోలీసులు తెలిపిన మేరకు.. గౌసియా (56) కుమారుడు ఇమ్రాన్, కోడలు జ్యోతితో కలిసి కోవూరునగర్‌లోని కేకే పార్క్ వ్యూ అపార్ట్‌మెంటులో ఉంటోంది. అదే ప్రాంతంలో నివాసముండే మల్లి, జావిద్ అనే దంపతులు నివసిస్తున్నారు. ప్రస్తుతం జావిద్ దుబాయ్ వెళ్లారు. జావిద్ భార్య జరీనాతో ఇమ్రాన్ సన్నిహితంగా ఉంటున్నాడని జావిద్ బంధువులు కొన్నిరోజులుగా అనుమానిస్తున్నారు. ఈ విషయంపై దుబాయ్ నుంచి జావిద్ ఇమ్రాన్‌కు ఫోన్ చేసి హెచ్చరించారు. తెలిపారు. ఈక్రమంలో సోమవారం రాత్రి జావిద్ కుటుంబ సభ్యులు, బంధువులు ఇమ్రాన్ ఇంటికి వెళ్లి అతడిపై దాడి చేశారు. దాన్ని ఇమ్రాన్ తల్లి గౌసియా అడ్డుకునేందుకు ప్రయత్నించారు. ఆగ్రహంతో వారు ఆమెను కిందకు తోసి తీవ్రంగా కొట్టడంతో అపస్మారక స్థితికి చేరుకుంది. గొడవను గమనించిన చుట్టుపక్కల వారు అక్కడికి చేరుకుని దాడికి దిగిన వారిని తరిమేశారు. అనంతరం గౌసియాను ప్రభుత్వ సర్వజన ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. మంగళవారం ఉదయం ఆమె చనిపోయింది. మృతురాలి కుమారుడి ఫిర్యాదు మేరకు జావిద్ భార్య జరీనా, మల్లి, జావిద్, రవి, ఇంతియాజ్, గౌస్, మరికొందరిపై కేసు నమోదు చేశారు.

గౌసియా

రాయదుర్గం

•రాయదుర్గం •కళ్యాణదుర్గం •ఉరవకొండ

ఓటరు జాబితాలో మార్పులకు సహకరించండి

వివిధ పార్టీల నాయకులతో మాట్లాడుతున్న ఈఆర్వో రవిశంకర్‌రెడ్డి

రాయదుర్గం పట్టణం, న్యూస్‌టుడే: ఓటర్ల జాబితా మ్యాపింగ్ ప్రక్రియ పూర్తిచేయడానికి, తప్పుల్లేని ఓటరు జాబితా తయారీకి రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని ఈఆర్వో రవిశంకర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో తహసీల్దార్ నాగరాజు, కమిషనర్ దివాకర్‌రెడ్డి, ఈడీటీ సుజాత, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

మోసగాళ్ల ఆచూకీకి పోలీసుల గాలింపు!

కళ్యాణదుర్గం గ్రామీణం, న్యూస్‌టుడే: 'కళ్యాణదుర్గంలో సైబర్ మోసం జాడ' అనే శీర్షికన మంగళవారం 'ఈనాడు'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. తెలంగాణ, ఆంధ్ర రాష్ట్రాల సైబర్, సివిల్ పోలీసులు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి నిందితుల కోసం గాలింపు చర్యలు ముమ్మరం చేసినట్లు తెలిసింది. ఇటీవల అంతర్జాలంలో ఫార్చునర్ వాహనాన్ని విక్రయానికి పెట్టి పలువురి నుంచి అడ్వాన్స్‌లు తీసుకుని ఉడాయించిన ఘటనలో పోలీసులు కళ్యాణదుర్గానికి చెందిన ఓ క్యాబ్ డ్రైవర్‌ను నిందితుడిగా గుర్తించినట్లు సమాచారం. ఈ ఘటనలో మోసగాళ్లు పలువురిని నుంచి వసూలు చేసిన రూ.24 లక్షలతో బెంగళూరులో బంగారం కొనుగోలు చేసినట్లు తెలిసిందని స్థానిక పోలీసులు పేర్కొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా

రాయదుర్గం పట్టణం: 9666888046
కళ్యాణదుర్గం గ్రామీణం: 9985668661
ఉరవకొండ: 8008573071

సమస్య: కణేకల్లు విద్యుత్తు ఉపకేంద్ర కార్యాలయం నుంచి ఎంపీడీఓ కార్యాలయం వరకు దారిలో రాత్రిపూట వీధి దీపాలు సక్రమంగా వెలగడం లేదు. -సర్మాస్, స్థానికుడు

సమాధానం: వెంటనే పరిశీలించి వీధి దీపాలకు మరమ్మతు చేయించి వెలిగేలా చూస్తాం. -చంద్రమౌళి, ఇన్‌ఛార్జి, ఈఈ

సమస్య: కణేకల్లు ఆర్టీసీ బస్సు ప్రాంగణంలో తాగునీటి వసతి లేకపోవడంతోపాటు కనీస సౌకర్యాలు లేక ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నాం. - రామయ్య, ప్రయాణికుడు

సమాధానం: బస్టాండ్ ప్రాంగణంలో తాగునీటి క్యాను ఏర్పాటు చేయించేలా తగు చర్యలు తీసుకుంటాం. -శ్రీనివాసులు, డిపో మేనేజరు

– న్యూస్‌టుడే, కణేకల్లు

ప్రాణాలు పోతున్నా.. పట్టించుకోరా?

న్యూస్‌టుడే, కళ్యాణదుర్గం గ్రామీణం

● శిరస్త్రాణం ధరించక 10 మంది మృత్యువాత
● కనీస నిబంధనలు పాటించని యువత

ఎక్కడ చూసినా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి...! వీటిని అరికట్టేందుకు రోడ్డు రవాణా, భద్రత నిబంధనలు పాటించాలని అధికారులు చెబుతున్నా క్షేత్రస్థాయిలో యువత పట్టించుకోవడం లేదు. ద్విచక్రవాహనదారులు శిరస్త్రాణం, కారు, ఇతర పెద్ద వాహనదారులు సీటుబెల్ట్ ధరించాలని చెబుతున్నా తలకెక్కించుకునే వారే కరవయ్యారు. ఇటీవల కళ్యాణదుర్గం నియోజకవర్గంలో జరిగిన పలు ప్రమాదాల్లో 10 మందికిపైగా మృతిచెందగా పలువురు తీవ్రంగా గాయపడిన ఘటనలు ఉన్నాయి.

వేగం కన్నా ప్రాణమే మిన్న

ద్విచక్ర వాహనదారులకు శిరస్త్రాణం ధరించకపోవడమే ప్రమాదాలకు కారణమని ఆర్టీవో, పోలీసులు అధికారులు పేర్కొంటున్నారు. ఇటీవల రోడ్డు భద్రత మాసోత్సవాల్లో ప్రత్యేక కార్యక్రమాలతో అవగాహన, ప్రదర్శనలు చేపట్టారు. కొన్ని స్వచ్ఛంద సంస్థలు యువతకు శిరస్త్రాణాలు ఉచితంగా పంపిణీ చేశాయి. అయినా.. వాహనదారులు నిబంధనలు పాటించకపోతే భారీ మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుందని

ఇటీవలి ఘటనలు కొన్ని..

● జనవరి 24న భట్టువానిపల్లి- లక్ష్మీపురం గ్రామాల మధ్య ఆంజనేయస్వామి ఆలయ సమీపంలో ద్విచక్రవాహనాన్ని బొలెరో ఢీకొన్న ఘటనలో మహేష్(30) దుర్మరణం చెందాడు.

● జనవరి 31న గూబనపల్లి వద్ద రెండు ద్విచక్రవాహనాలు ఢీకొనడంతో గుమ్మఘట్ట మండలం బేలోడుకు చెందిన కుమార్‌రెడ్డి(35) మృతిచెందగా, కళ్యాణదుర్గం మండలం విట్లంపల్లికి చెందిన అశోక్, ముక్కన్నకు తీవ్ర గాయాలయ్యాయి.

● ఫిబ్రవరి 5న దాసంపల్లి వద్ద బొలెరో ఢీకొన్న ప్రమాదంలో గణేష్(18) మృతిచెందాడు.

జనవరి 31న గూబనపల్లిలో రెండు ద్విచక్రవాహనాలు ఎదురెదురుగా ఢీకొనగా.. ఒకరు దుర్మరణం చెందారు.. మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. వీరెవరూ శిరస్త్రాణం ధరించకపోవడం గమనార్హం

చెబుతున్నారు. వీటిని పూర్తిస్థాయిలో కట్టడి చేసేలా ఆయా శాఖల అధికారులు మరింత శ్రద్ధ చూపాలని పలువురు కోరుతున్నారు.

ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నాం

ఇటీవల నిర్వహించిన రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో వాహనాలకు రోడ్డు రవాణా నియమాలు, పాటించాల్సిన పద్ధతులపై అవగాహన కల్పించాం. శిరస్త్రాణం, సీట్‌బెల్ట్ ధరించకపోతే భారీ జరిమానా విధిస్తామని హెచ్చరించాం. వాహనదారుల్లో మార్పు వచ్చేలా ముమ్మర తనిఖీలు చేపట్టి నిబంధనలు తూచాతప్పకుండా పాటించేలా చర్యలు తీసుకొంటాం. **- రవిబాబు, డీఎస్పీ, రమేష్, ఆర్టీఏ**

మిరప రైతులకు దొంగల బెడద

విడపనకల్లు, న్యూస్‌టుడే: విడపనకల్లు మండలంలోని మిరప రైతులకు దొంగలు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నారు. పాల్తూరులోని నాగరాజు, శ్రీనివాసులుకు చెందిన సుమారు 5 క్వింటాళ్ల మిరప పంటను రాత్రిపూట గుర్తుతెలియని దొంగలు ఎత్తుకెళ్లారు. ఎస్సై మురాహరి 'న్యూస్‌టుడే'తో మాట్లాడుతూ రైతుల నుంచి ఎటువంటి ఫిర్యాదు రాలేదన్నారు. అయినప్పటికీ గ్రామాల్లో రైతులు అప్రమత్తంగా ఉండాలని దండోరా వేయించినట్లు పేర్కొన్నారు. రాత్రిపూట గస్తీ ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

ముఖాముఖికి హాజరు కావాలి

రాయదుర్గం, కణేకల్లు, ఉరవకొండ: కళ్యాణదుర్గం, కణేకల్లు ప్రాజెక్టుల పరిధిలోని అంగన్‌వాడీల్లోని పోస్టులకు ఈనెల 20న ఆర్డీవో కార్యాలయంలో నిర్వహించే ఇంటర్వ్యూలకు హాజరు కావాల్సిందిగా ఐసీడీఎస్ సీడీపీవోలు పద్మావతి, నాగమణి పేర్కొన్నారు. ఉరవకొండ పరిధిలోని వారు ఈనెల 19 జరిగే ముఖాముఖికి హాజరు కావాలని సీడీపీవో శ్రీదేవి పేర్కొన్నారు.

మాత్రల పంపిణీ

కళ్యాణదుర్గం, న్యూస్‌టుడే: నులిపురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా ఆర్డీవో వసంతబాబు పాఠశాలలో విద్యార్థులకు మాత్రలు పంపిణీ చేసిన సందర్భంగా మాట్లాడారు.

కళ్యాణదుర్గం గ్రామీణం: వైద్యాధికారి విజయేంద్ర, ప్రత్యూష, ఎంపీడీవో ధనుంజయనాథ్ నులిపురుగుల నివారణ మాత్రలు పంపిణీ చేశారు.

ఉరవకొండ: రాకెట్ల పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ వెంకటేశ్ నాయక్ నులిపురుగుల నివారణ మాత్రలు విద్యార్థులకు పంపిణీ చేశారు.

కుందుర్పి: అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలల్లోని చిన్నారులకు మాత్రలు అందజేశారు.

వజ్రకరూరు, న్యూస్‌టుడే: వజ్రకరూరు కేవీ ఉన్నత పాఠశాలలో హెచ్ఎం స్వర్ణలత, కేటీ రంగప్రసాద్, జిల్లా కుష్ఠు వ్యాధి నివారణ అధికారి జయలక్ష్మి మాత్రలు ఇచ్చారు.

బొమ్మనహాళ్: చిన్నారులకు మాత్రలు వేసినట్లు వైద్యాధికారులు చల్లా శ్రీలక్ష్మి, కుమార్ రాజ తెలిపారు.

డి.హీరేహాళ్: ఓబుళాపురం పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు డి.హీరేహాళ్ పీహెచ్‌సీ వైద్యాధికారి శ్రావణ్‌కుమార్ మాత్రలను పంపిణీ చేశారు.

నేడు మద్దానేశ్వరస్వామి రథోత్సవం

రథోత్సవం ఏర్పాట్లపై ఈఓ నరసింహారెడ్డి, ఆలయ కమిటీ సభ్యులతో చర్చలు జరుపుతున్న సీఐ జయనాయక్

రాయదుర్గం గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని 74ఉడేగోళం సమీపంలోని మద్దానేశ్వరస్వామి రథోత్సవం బుధవారం భక్త జనసందోహం మధ్య వైభవంగా నిర్వహించేందుకు రాయదుర్గం గ్రూపు దేవాలయాల కార్యనిర్వాహణాధికారి నరసింహారెడ్డి, ఆలయ కమిటీ అధ్యక్షుడు బసవరాజు పేర్కొన్నారు. మంగళవారం ఆలయంలో గంగపూజ, గణపతి, నవగ్రహ, రుద్ర, వాస్తు శాంతి హోమంలు పూర్తిచేశారు. రథోత్సవ నిర్వహణపై ఆలయ కమిటీ సభ్యులు, ఈఓతో సీఐ చర్చలు జరిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు జయన్న, అప్పాజి, మల్లికార్జున, సర్పంచి దురుగమ్మ, ఉలిగప్ప పాల్గొన్నారు.

జేఈఈలో మెరిసిన 'దుర్గం' విద్యార్థులు

కళ్యాణదుర్గం, న్యూస్‌టుడే: కళ్యాణదుర్గం పట్టణానికి చెందిన ఉపాధ్యాయులు పొట్ల వెంకటేశులు- సరస్వతి దంపతుల కుమారుడు **చరణ్** జేఈఈ మెయిన్స్ పరీక్షల్లో 99.92 పర్సంటైల్ సాధించాడు. చరణ్ ఐఐటీలో టాప్-10 కళాశాలల్లో సీటు సాధించడమే లక్ష్యంగా చదివినట్లు ఆయన తల్లిదండ్రులు పేర్కొన్నారు.

కళ్యాణదుర్గం గ్రామీణం: కళ్యాణదుర్గం మండలం వర్లి ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు చిన్నరాజన్న- సుజాల కుమారుడు **రాజ్ ఉదీప్** జేఈఈ మెయిన్స్‌లో 99.71 పర్సంటైల్ సాధించాడు. ముంబాయి ఐఐటీలో కంప్యూటర్ సైన్స్ చదవాలనే లక్ష్యంతో ఉన్నట్లు విద్యార్థి పేర్కొన్నారు.

వార్డు సమస్యల పరిష్కారమే లక్ష్యం

పనులు పర్యవేక్షిస్తున్న కమిషనర్ వంశీకృష్ణభార్గవ, తదితరులు

కళ్యాణదుర్గం, న్యూస్‌టుడే: వార్డుల్లో ప్రజా సమస్యలు పరిష్కరించడమే లక్ష్యంగా కృషి చేస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ వంశీకృష్ణభార్గవ తెలిపారు. మంగళవారం మున్సిపాలిటీ పరిధిలోని 11వ వార్డులో సచివాలయ సిబ్బందితో కలిసి ఆయన పర్యటించారు. సమస్యల పరిష్కారానికి ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు తెలియజేశారు. తెదేపా నాయకులు తలారి సోమశేఖర్, తేజా యాదవ్, ఎరికల హరి, ప్రకాష్, రామాంజనేయులు పాల్గొన్నారు.

తక్కువ విస్తీర్ణంలో ఎక్కువ సాగు అభినందనీయం

పంటను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయ అధికారులు

ఉరవకొండ: పరిస్థితులకు అనుగుణంగా తక్కువ విస్తీర్ణంలో ఎక్కువ పంటలను సాగుచేసే పద్ధతులను రైతులు అలవాటు చేసుకోవాలని జిల్లా ఇన్‌ఛార్జి వ్యవసాయాధికారి రవి పేర్కొన్నారు. ఉరవకొండలో జైకిసాన్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు నాగమల్లి ఓబులేసు అక్షయపాత్ర పేరుతో 30 రకాల ఆకుకూరలు, కూరగాయలు, దుంపలు సాగు చేసిన క్షేత్రాన్ని పరిశీలించిన సందర్భంగా పలువురు అధికారులు మాట్లాడారు. ఈ విధానం రైతులు పాటిస్తే ప్రయోజనాలు ఉంటాయని చెప్పారు. ఆయన వెంట ఏవో రామకృష్ణుడు పాల్గొన్నారు.

కళ్యాణదుర్గం గ్రామీణం: ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడులు వస్తాయని రాష్ట్ర ప్రకృతి వ్యవసాయ సిటీఅండ్ఐవో, అనంత, సత్యసాయి జిల్లాల డీపీఎం లక్ష్మానాయక్ పేర్కొన్నారు. మల్లిపల్లిలో చిన్నబసప్ప(యాపిల్‌బేర్, జామ), సత్యనారాయణశెట్టి, మంజమ్మ భాగ్యమ్మ అనే రైతులు 'ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో సాగు చేసిన పంటలు పరిశీలించిన సందర్భంగా మాట్లాడారు. కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారి నవీన్, డీటీటీ శివశంకర్, వన్నూరమ్మ, సత్యనాయక్, ఓబులేసు, నారాయణప్ప, రామాంజనేయులు హాజరయ్యారు.

ఆర్టీటీ పరిరక్షణే ధ్యేయం

అరవిందనగర్(అనంతపురం): ఉమ్మడి అనంత జిల్లాలోని పేదల సంక్షేమానికి కృషి చేస్తున్న ఆర్టీటీ సంస్థకు ఎఫ్‌సీఆర్ఏ పునరుద్ధరించాలని అఖిలపక్ష కమిటీ కన్వీనర్ సాకే హరి కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆయన ఆధ్వర్యంలో వివిధ పార్టీలు, కుల, ప్రజాసంఘాల నాయకులు మంగళవారం కేంద్ర కార్యాలయాల ఎదుట నిరసన తెలిపారు. తొలుత గడియార స్తంభం దగ్గర ధర్నా చేశారు. అనంతరం తపాలా, టెలికాం సంస్థల ప్రధాన కార్యాలయాలకు చేరుకొని లోపలకు వెళ్లడానికి ప్రయత్నించారు.

రైతులు సద్వినియోగం చేసుకోవాలి

కళ్యాణదుర్గం గ్రామీణం: మామిడి రైతులకు ప్రభుత్వం రాయితీపై అందించే రక్షణ తొడుగులను వినియోగించుకుని పంటను రక్షించుకోవాలని ఉద్యానవన అధికారి కృష్ణతేజ మంగళవారం పేర్కొన్నారు. వీటివల్ల మచ్చలు, తేనెమంచు పురుగు తదితరాల నుంచి పంటను కాపాడుకోవచ్చన్నారు. అవసరమైన వారు రైతుసేవా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

రోడ్డు ప్రమాదంలో వివాహిత మృతి

ఉమాదేవి

కణేకల్లు, న్యూస్‌టుడే: 10 రోజుల కిందట రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ఘటనలో గాయపడిన గంగలాపురం గ్రామానికి చెందిన మహిళ ఉమాదేవి(24) చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. ఆమె తన భర్త నవీన్‌తో కలిసి ద్విచక్ర వాహనంపై కణేకల్లు నుంచి స్వగ్రామం వెళ్తుండగా రచ్చుమర్రి నుంచి ఎదురుగా వచ్చిన మరో ద్విచక్ర వాహనం ఢీకొంది. ఆమె తలకు బలమైన గాయాలవడంతో జిల్లా కేంద్రంలోని ఆస్పత్రికి తరలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నాగమధు వివరించారు.

ట్యాంకు చుట్టూ అపరిశుభ్రత

బ్రహ్మసముద్రం పీహెచ్‌సీకి ఎదురుగా ఉన్న బీసీ కాలనీలోని తాగునీటి ట్యాంకు చుట్టూ అపరిశుభ్రత నెలకొంది. పిచ్చి మొక్కలు పెరగడంతోపాటు పారిశుద్ధ్యం అధ్వానంగా మారింది. దీంతో తాగునీరు కలుషితమయ్యే ప్రమాదం ఉందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పుడే కుళాయిల ద్వారా నీరు వృథా అవుతోంది. తాగునీటి పట్టుకునేందుకు మహిళలు నిత్యం అవస్థలు పడుతున్నారు. ట్యాంకు పరిసరాలను శుభ్రత చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, బ్రహ్మసముద్రం

పొదల మధ్యనే నివాసం!

ఉరవకొండ పట్టణంలో బాలికల గురుకులం వెనుక ఉన్న జగనన్న కాలనీలో ఎటు చూసినా కంప విపరీతంగా పెరిగింది. ఇళ్లు నిర్మించుకున్న వారు ముళ్ల పొదల మధ్య జీవించడానికి ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని వీధుల్లో కంప చెట్లు అధికంగా పెరిగాయి. మరోవైపు వీధి దీపాలు లేకపోవంతో రాత్రుళ్లు ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. అధికారులు కంపను తొలగించడంతోపాటు మౌలిక వసతులు కల్పించేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, ఉరవకొండ

వ్యర్థాలన్ని కాలువలోకే...!

రాయదుర్గం పట్టణం లక్ష్మీబజారులోని ప్రధాన మురుగు కాలవ బ్రిడ్జి వద్ద చెత్తదిబ్బను తలపిస్తోంది. పారిశుద్ధ్య కార్మికులు ఈ వ్యర్థాల తొలగింపునకు అవస్థలు పడుతున్నారు. బ్రిడ్జి వద్దకు చెత్త రాకుండా ప్రధాన కాలవలో పలుచోట్ల వ్యర్థాలు అడ్డుకునేందుకు గ్రిల్స్ మాదిరి జాలీలు ఏర్పాటు చేయాల్సి ఉన్నా.. మున్సిపల్ అధికారులు పట్టించుకోవటం లేదు. దీంతో బ్రిడ్జి వద్ద పూడిక పేరుకపోయి నీరు నిలుస్తోంది. ఇకనైనా చెత్తాచెదారం రోడ్డు పక్కన వేయకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, రాయదుర్గం**

ప్రమాదకరంగా అక్విడక్టు

పీఏబీఆర్ కుడి కాలువపై ఎస్కేప్ ఛానల్ వద్ద ఉన్న అక్విడక్టు కింది భాగంలో గోడలపై పెరిగిన చెట్ల వల్ల ప్రమాదం పొంచి ఉంది. ఆ మొక్కలను ఉన్నపుడే తొలగించకపోవడంతో కింది భాగంలో ఇరువైపు ఉన్న గోడలు బీటలు బారుతున్నాయి. వీటిని ఇలాగే వదిలేస్తే అక్విడక్టు కూలే ప్రమాదం ఉంది. గతంలోనే అక్విడక్టు [illegible] గురైన విషయం తెలిసిందే. చెట్లు పెరిగి ప్రమాదకరంగా మారిన తీరును చూస్తున్న హెచ్చెల్సీ అధికారులు కనీసం నివారణ చర్యలు చేపట్టిన దాఖలాలు లేవు.

- న్యూస్‌టుడే, కూడేరు(ఉరవకొండ)

దారిలో మురుగు.. పరుగు

వజ్రకరూరు మండలం కడమలకుంట గ్రామంలోని బీసీ కాలనీలో సిమెంటు దారిపై మురుగు ప్రవహిస్తుండటంతో అపరిశుభ్రంగా మారింది. చిన్నపిల్లలు, వృద్ధులు అటుగా వెళ్లేప్పుడు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీనివల్ల దోమల ఉద్ధృతి పెరిగి రోగాలతో సతమతమవుతున్నారు. విద్యార్థులు నిత్యం పాఠశాలకు ఈ దారి నుంచే వెళ్తారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి మురుగు నివారణకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, వజ్రకరూరు

భాజపా మైనార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా బాబా ఫకృద్దీన్

శెట్టూరు, న్యూస్‌టుడే: భాజపా జిల్లా మైనార్టీ విభాగం ప్రధాన కార్యదర్శిగా శెట్టూరు మండలం చెర్లోపల్లికి చెందిన బాబా ఫకృద్దీన్ ఎన్నికయ్యారు. జిల్లా కేంద్రంలోని భాజపా కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయనకు నియామక పత్రం అందజేసినట్లు ఫకృద్దీన్ తెలిపారు. మైనార్టీల అభివృద్ధికి కృషి చేస్తానని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు.

ఆసుపత్రి నిర్వహణ అస్తవ్యస్తం

ప్రధాన ద్వారంలో రోగులు, సహాయకులు

రాయదుర్గం పట్టణం, న్యూస్‌టుడే: స్థానిక ప్రాంతీయ ఆసుపత్రి నిర్వహణ అస్తవ్యస్తంగా మారుతోంది. రెండు నెలలుగా పరిపాలనాధికారి సెలవులో వెళ్లగా స్థానికంగా ఎవరికివారే యమునాతీరే అన్న చందంగా మారింది. ఆసుపత్రికి నిత్యం 600 నుంచి 800 మంది వరకు రోగులు వస్తుంటారు. వీరిలో 50 మంది ఇన్‌పేషెంట్లుగా చేరుతారు. సోమ, గురు వారాల్లో ఓపీ మరింతగా పెరుగుతోంది. ప్రధాన ద్వారానికి అడ్డుగా ఓపీ కేంద్రం ఉండటంతో లోపలికి వెళ్లేందుకు సిబ్బందితోపాటు రోగులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఒకే మార్గంలో సూదులు వేసే గది, సదరం, ఎన్‌టీఆర్ సేవాకేంద్రాలు ఉండటంతో బారులు పెరిగిపోతున్నాయి. అనుకోని ప్రమాదాలు జరిగితే క్షతగాత్రులను లోపలికి తీసుకెళ్లేందుకు అవస్థలు పడాల్సి వస్తుంది. రక్త పరీక్షల విభాగంలో బెంచీలు లేకపోవడంతో మహిళలు నేలమీదే కూర్చోవాల్సి వస్తోంది.

కొన్ని ఘటనలు ఇలా...

● వారం రోజుల కిందట గుర్తుతెలియని వ్యక్తులు ఓ అట్టపెట్టెలో పామును తీసుకొచ్చి ఆస్పత్రి ఆవరణలో వదిలారు. ఒక్కసారిగా పాము బయటకు రావడంతో పలువురు భయంతో పరుగులు తీశారు.

● నాలుగు రోజుల కిందట ఓ గ్రామానికి చెందిన మహిళకు సెలైన్ ఎక్కించడంలో సిబ్బంది నిర్లక్ష్యం వహించడంతో ఆమె భర్త ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు.

● పట్టణానికి చెందిన ఓ వ్యక్తికి చిన్నపాటి శస్త్ర చికిత్స అవసరం కాగా.. సిబ్బంది నిర్లక్ష్యంగా అతడిని ఇంటికి పంపడంతో ఆయన ఓ ప్రైవేటు ఆస్పత్రికి వెళ్లి వైద్యం పొందాల్సి వచ్చింది.

ఇబ్బందుల్లేకుండా చూస్తాం

ఆస్పత్రికి వచ్చే రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు చర్యలు తీసుకుంటాం. మహిళకు సాయంత్రం పూట చికిత్స వికటించే ప్రమాదం ఉందని సర్ది చెప్పాం. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటాం.

- మెర్సి జ్ఞాన సుధ

అవీ.. ఇవీ.. అన్నీ..

ఉప కాలువల నిర్మాణాలు పూర్తి చేయండి

ఉరవకొండ: హంద్రీనీవా ప్రధాన కాలువకు అనుసంధానంగా ఉప కాలువల నిర్మాణాలను ప్రభుత్వం పూర్తిచేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు కేశవరెడ్డి, నియోజకవర్గ కార్యదర్శి చెన్నరాయుడు కోరారు. మంగళవారం వారు మాట్లాడారు. రెండున్నర దశాబ్దాలు గడుస్తున్నా ఈ పనులు పూర్తి చేయకపోవడం దారుణం అన్నారు. దీనిని ప్రభుత్వం గుర్తించి వాటిని పూర్తిచేయాలని డిమాండ్ చేశారు.

చిరుత సంచారంపై ఆరా

కూడేరు(ఉరవకొండ), న్యూస్‌టుడే: కూడేరు మండలం ముద్దలాపురం, కడదరకుంట గ్రామ పరిసరాల్లో చిరుత సంచారం వదంతులతో స్థానికులు కొన్నాళ్లుగా భయాందోళనకు గురవుతున్నారు. మంగళవారం అటవీ సెక్షన్ అధికారి అక్బర్‌తోపాటు సిబ్బంది చిరుత ఆనవాళ్లను గుర్తించే ప్రయత్నం చేశారు. చిరుత సంచారం కట్టడి చేసే అవకాశాలు పరిశీలిస్తున్నట్లు వారు పేర్కొన్నారు.

బాల్య వివాహాల నివారణకు కృషి

విడపనకల్లు, న్యూస్‌టుడే: విడపనకల్లు మండలం ఉండబండలో బాల్య వివాహాలు జరుగకుండా చూడాలని ఉరవకొండ సీడీపీఓ శ్రీదేవి, ఈఓ నాగరాజు, తెదేపా నాయకులు వన్నూరుస్వామి పేర్కొన్నారు. ఎక్కడైనా జరిగితే 1098 కు ఫోన్ చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్లు పుష్ప, పద్మ, రబియా, హసినా పాల్గొన్నారు.

మట్టి తరలిస్తే చర్యలు తప్పవు

బెళుగుప్ప, న్యూస్‌టుడే: అనుమతులు లేకుండా మట్టి తవ్వకాలు చేపడితే చర్యలు తీసుకుంటామని చిన్ననీటి పారుదలశాఖ ఏఈ విజయ్ కుమార్ హెచ్చరించారు. మంగళవారం గంగవరం చెరువును పరిశీలించిన సందర్భంగా ఆయన మాట్లాడారు.

మోటార్ల తీగలు చోరీ

డి.హీరేహాళ్, న్యూస్‌టుడే: కాదలూరు పంచాయతీ శివారు ప్రాంతంలోని హడిగిలిలో రెండు తాగునీటి బోర్ల విద్యుత్తు మోటార్ల తీగలను గుర్తుతెలియని దుండగులు చోరీ చేసినట్లు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ధనుంజయ తెలిపారు. వెంటనే పరిశీలించి తాగునీటికి ఇబ్బందులు తలెత్తకుండా కొత్త తీగను తెచ్చి అమర్చామని, దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు ఏఈ పేర్కొన్నారు.

రైతు విశిష్ట సంఖ్య తప్పనిసరి

కంబదూరు: ప్రతి రైతుకు విశిష్ట సంఖ్య తప్పనిసరని ఏవో మహేష్ మంగళవారం పేర్కొన్నారు. దీనిఆధారంగానే ప్రభుత్వ పథకాలు అందుతాయని తెలిపారు. రైతులు వ్యవసాయ కేంద్రంలో ఆధార్ కార్డు, పాసుపుస్తకం, ఫోన్ తీసుకెళ్లి నమోదు చేయించుకోవాలని పేర్కొన్నారు.

కారుకు తప్పిన ముప్పు

బెళుగుప్ప, న్యూస్‌టుడే: ఉపాధ్యాయుడు ప్రయాణిస్తున్న కారు అదుపు తప్పిన ఘటన మండలంలోని హనిమిరెడ్డిపల్లి వద్ద చోటుచేసుకుంది. ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి, హెచ్ఎం పాతిరెడ్డి తన కారులో మంగళవారం అనంతపురం నుంచి కళ్యాణదుర్గం వైపు వెళ్తుండగా అదుపుతప్పి రోడ్డు పక్కన పొలాల్లో బోల్తా పడింది. ఎయిర్‌బ్యాగులు తెరచుకోవడంతో ఆయన ప్రాణాలతో బయటపడ్డారు.

వ్యవసాయ మోటారు చోరీ

ఆత్మకూరు: తలుపూరుకు చెందిన శ్రీనివాసులుకు చెందిన మోటారును గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేశారు. కూడేరు రెవెన్యూ గ్రామంలో ఆయన బోరువేసి పంటలు సాగు చేస్తున్నాడు. సోమవారం పనులు ముగించుకొని ఇంటికి వెళ్లాడు. మంగళవారం వెళ్లి చూడగా మోటారు, స్టార్టర్, కేబుల్ వైర్లు, బిందు సేద్య పరికరాలు ఎత్తుకెళ్లినట్లు గుర్తించారు.

వైభవంగా రథోత్సవాలు



ఎణ్ణేరంగనాథేశ్వరస్వామి రథంను లాగుతున్న భక్తులు

డి.హీరేహాళ్, న్యూస్‌టుడే: పులకుర్తిలో శ్రీజంబణ్ణ తాత రథోత్సవం జనసందోహం మధ్య వైభవంగా సాగింది. ఆలయ నిర్వాహకులు మల్లికార్జున స్వామి, సర్పంచి కురుబ దొణప్పల ఆధ్వర్యంలో పూజలు కొనసాగాయి. అనంతరం భక్తులు విగ్రహాన్ని రథంలో కొలువుదీర్చి లాగారు.

గోవిందవాడ(బొమ్మనహాళ్): గోవిందవాడలో వెలిసిన ఎణ్ణేరంగనాథేశ్వరస్వామి రథోత్సవం వైభవంగా సాగింది. తెదేపా నాయకులు సోమనాథ్‌గౌడ్, వేమన్న, వన్నూరుస్వామి పాల్గొన్నారు.

వజ్రకరూరు: తట్రకల్లులో వీరభద్రస్వామి కళ్యాణోత్సవం, రథోత్సవం ఘనంగా నిర్వహించారు. ప్రజలు పెద్దసంఖ్యలో పాల్గొని రథాన్ని లాగారు.

కణేకల్లు: చిక్కణ్ణేశ్వర, సిద్ధప్ప స్వామి ఆలయాల్లో మంగళవారం అమావాస్య ప్రత్యేక పూజలు సాగాయి. ఆకుపూజ, కుంకుమార్చన, పుష్పార్చన తదితర సేవలు కొనసాగాయి.

శ్రీజంబణ్ణ తాత వేడుకలో భక్తులు...

కుందుర్పి: రుద్రంపల్లిలోని శ్రీఈశ్వర స్వామి ఉత్సవాల్లో గొరవయ్యల నృత్యాలు, విన్యాసాలు ఆకట్టుకున్నాయి. ఈ నృత్యాలు తిలకించేందుకు భక్తులు గ్రామాల నుంచి పెద్దఎత్తున తరలివచ్చారు.

ప్రకటన

Ramavath Jayabai W/o Ramavath Lakshma Naik, D.No. 8-1201-A, Devaramma Colony, Kalyandurgam 515761, Doc.No. 898/2019, Survey No. 322-1, Open site - Kalyandurgam. **Boundaries: ఉత్తరం:** 30 feets Road, **దక్షిణం:** Plot No.98, **తూర్పు:** Plot No.84, **పడమర:** 25 feets Road, పై తెలిపిన వివరాలు గల ప్లాటును కళ్యాణదుర్గం శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, కళ్యాణదుర్గం బ్రాంచ్ నందు తాకట్టు పెట్టడం జరుగుచున్నది. ఎవరికైనా అభ్యంతరాలు, తకరారులు ఉన్నచో ఈ ప్రకటన వెలువడిన రోజు నుండి 7 రోజుల లోపల కళ్యాణదుర్గం బ్రాంచ్ మేనేజరును సంప్రదించండి.

కె.మల్లికార్జున, అడ్వకేటు, కళ్యాణదుర్గం

ప్రకటన

G.Nagabhushana S/o G.Nagaraju, D.No. 3-296, Perur - 515621 Doc.No. 843/2017, Survey No. 219-1B House - Perur. **Boundaries: తూర్పు:** తిప్పన్న ఇల్లు, **పడమర:** N.పద్మావతి జమీను, **ఉత్తరం:** రస్తా, **దక్షిణం:** P.W.D. కాలువ పై తెలిపిన వివరాలు గల ప్లాటును కళ్యాణదుర్గం శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, కళ్యాణదుర్గం బ్రాంచ్ నందు తాకట్టు పెట్టడం జరుగుచున్నది. ఎవరికైనా అభ్యంతరాలు, తకరారులు ఉన్నచో ఈ ప్రకటన వెలువడిన రోజు నుండి 7 రోజుల లోపల కళ్యాణదుర్గం బ్రాంచ్ మేనేజరును సంప్రదించండి.

కె.మల్లికార్జున, అడ్వకేటు, కళ్యాణదుర్గం

ప్రకటన

Shek Vahida W/o Shek Salim, D.No. 1-336, Kurakula Veedhi, Kanekal - 515871, Doc.No. 485/2008, Survey No - 877, D.No. 1-320, House - Kanekal. **Boundaries: ఉత్తరం:** రస్తా, **దక్షిణం:** House of Kolimi Mahammad Ali, **తూర్పు:** Z.P.H.School, **పడమర:** రస్తా పై తెలిపిన వివరాలు గల ప్లాటును కళ్యాణదుర్గం శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, కళ్యాణదుర్గం బ్రాంచ్ నందు తాకట్టు పెట్టడం జరుగుచున్నది. ఎవరికైనా అభ్యంతరాలు, తకరారులు ఉన్నచో ఈ ప్రకటన వెలువడిన రోజు నుండి 7 రోజుల లోపల కళ్యాణదుర్గం బ్రాంచ్ మేనేజరును సంప్రదించండి.

కె.మల్లికార్జున, అడ్వకేటు, కళ్యాణదుర్గం

(c) eenadu

గుంతకల్లు

•గుంతకల్లు •శింగనమల •తాడిపత్రి

ప్రత్యేక అలంకరణలో నెట్టికంటయ్య

వజ్రకవచ అలంకరణలో ఆంజనేయస్వామి

గుంతకల్లు పట్టణం, న్యూస్‌టుడే: కసాపురం నెట్టికంటి ఆంజనేయ స్వామి దేవస్థానంలో మంగళవారం స్వామివారు ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనం ఇచ్చారు. అమావాస్య కావడంతో భక్తులు అధిక సంఖ్యలో ఆలయానికి చేరుకుని స్వామివారిని దర్శించుకున్నారు. వేకువ జాము నుంచే స్వామికి అర్చకులు అభిషేకాలు, విశేష పూజలు నిర్వహించారు. వజ్ర కవచ అలంకరణలో స్వామి భక్తులకు దర్శనమిచ్చారు.

మేలుజాతి దూడల ప్రదర్శన

యాడికి, న్యూస్‌టుడే: రాష్ట్రీయ గోకుల్ మిషన్ జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మేలు జాతి దూడల ప్రదర్శన శిబిరం యాడికిలో నిర్వహించారు. ఈ శిబిరంలో 58 మేలు జాతి దూడలు యాడికి, పెద్ద పేట గ్రామాల నుంచి వచ్చాయి. వీటిలో మూడు దూడలకు బహుమతులు ప్రదానం చేశారు. పశుగణాభివృద్ధి సంస్థ రైతులకు నూరు శాతం సబ్సిడీతో అందిస్తున్న లింగనిర్ధారణ వీర్యంతో 90శాతం కచ్చితత్వంతో పెయ్యదూడలు పుట్టే అవకాశం ఉందని ఎగ్జిక్యూటివ్ అధికారి వెంకటేశ్ పేర్కొన్నారు. లేగదూడలకు ప్రతి 20 రోజులకు ఒక్కసారి డీవార్మింగ్ చేయాలని పశుగణాభివృద్ధి సంస్థ డైరెక్టర్ డాక్టర్ రమేశ్‌రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు శ్రీకాంత్, విజయలక్ష్మి, సుబ్బారెడ్డి, పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సామాజిక ఆసుపత్రి తీరుపై కలెక్టర్ ఆరా

రోగులతో మాట్లాడుతున్న కలెక్టర్ ఆనంద్

శింగనమల, న్యూస్‌టుడే: మండల కేంద్రంలోని సామాజిక ప్రభుత్వ ఆసుపత్రిని కలెక్టర్ ఆనంద్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. వైద్య సేవలు, సదుపాయాలు, వైద్యులు అందుబాటులో ఉంటున్నారా అనే వివరాలను రోగులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ.. వైద్యులు 24 గంటలు అందుబాటులో ఉండాలని, రోగులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. అనంతరం కేజీబీవీ పాఠశాలను సందర్శించి పదో తరగతి విద్యార్థుల వంద రోజుల ప్రణాళికను, సక్రమంగా అమలు చేయాలన్నారు. వంట గదిని పరిశీలించి, విద్యార్థులకు నాణ్యత గల ఆహారాన్ని అందిచాలని పాఠశాల ఎస్‌ఓ గీతారాణికి సూచించారు. విద్యార్థులతో చదువు, సదుపాయాలు, సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ శేషారెడ్డి, ఎంపీడీవో భాస్కర్, ఎంఈఓ నరసింహరాజు, ఎస్‌ఓ గీతారాణి తదితరులు పాల్గొన్నారు.

'స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తాచాటాలి'

కార్యక్రమంలో పాల్గొన్న తెదేపా నాయకులు, కార్యకర్తలు

గుంతకల్లు: రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయానికి తెదేపా నాయకులు, కార్యకర్తలు కృషిచేయాలని తెదేపా సమావేశ పరిశీలకురాలు రేష్మాపర్వీన్, పార్టీ పట్టణ ఇన్‌ఛార్జ్ నారాయణస్వామి, పట్టణ అధ్యక్షుడు గుణశేఖర్ అన్నారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంగళవారం పార్టీ కౌన్సిలర్లు, బూత్‌ల కన్వీనర్లు, అనుబంధ కమిటీల నాయకుల సమావేశం నిర్వహించారు. అసెంబ్లీ ఎన్నికల మాదిరి స్థానిక సంస్థల ఎన్నికల్లో కూడా అంకితభావంతో కృషి చేసి సత్తాచాటాలన్నారు. కార్యక్రమంలో యాదవ ఫెడరేషన్ డైరెక్టర్ మస్తాన్‌యాదవ్, తెదేపా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కాలనీ సమస్యలు.. స్థానికుల అవస్థలు

కాలనీలోని ఓ మట్టిరోడ్డు దుస్థితి

★ కాలనీ : హనుమాన్‌నగర్
★ గృహాలు : 1200
★ జనాభా : 5000

గుంతకల్లు, న్యూస్‌టుడే: గుంతకల్లు మున్సిపాలిటీలోని కొన్ని కాలనీల్లో మౌలిక వసతులు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని పనులకు టెండర్లు నిర్వహించినా మున్సిపాలిటీలో నిధులు లేవనే సాకుతో గుత్తేదారులు పనులు ప్రారంభించడంలో జాప్యం వహిస్తున్నారు. కొన్ని పనులకు కౌన్సిల్ సమావేశాల్లో తీర్మానాలు ఆమోదించినా వాటికి టెండర్లు నిర్వహించడంలో ఆలస్యం జరుగుతోంది. పనులను చేపట్టి కాలనీల్లో సౌకర్యాలు కలుగజేయాలని హనుమాన్‌నగర్ కాలనీ వాసులతో పాటు మరికొన్ని కాలనీల ప్రజలు కోరుతున్నారు.

★ గుంతకల్లు పట్టణం కసాపురం రోడ్డు పక్కనున్న హనుమాన్‌నగర్‌లో 15 వీధులున్నా ఒక్క వీధిలో కూడా మున్సిపల్ అధికారులు సిమెంటు రోడ్లను నిర్మించలేదు. వర్షం వచ్చిన సమయంలో మట్టి రోడ్లు బురదమయం అవుతున్నాయి. కొన్ని చోట్ల రోడ్లకు ఇరువైపులా ముళ్లపొదలు, పిచ్చిమొక్కలు పెరుగుతుండడంతో రాత్రి సమయాల్లో ఇబ్బందులు పడుతున్నారు.

★ కాలనీలో మురుగు కాలువలను నిర్మించలేదు. రోడ్లపై మురుగు ప్రవహిస్తోంది. దీంతో స్థానికులు రాకపోకలకు అవస్థలు పడుతున్నారు. కాలువలు లేకపోవడంతో ఇళ్ల మధ్యలో ఉంటున్న మురుగులో పందులు తిష్ఠవేస్తున్నాయి. ఇక్కడ పార్కు, చిన్ననీటి పథకాలు కూడా ఏర్పాటు చేయలేదు. ఇప్పటికైనా అధికారులు సమస్యలను పరిష్కరించి వసతులను కల్పించాలని కాలనీ వాసులు కోరుతున్నారు.

ప్రణాళికలను రూపొందించాం

హనుమాన్‌నగర్‌లో సమస్యలను పరిష్కరించడానికి అవసరమైన ప్రణాళికలను రూపొందించాం. ప్రస్తుతం మున్సిపాలిటీలో నిధుల కొరత ఉంది. ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. మంజూరైన వెంటనే టెండర్లు నిర్వహించి పనులను ప్రారంభిస్తాం. కాలనీవాసులకు మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేస్తాం.

- హరికృష్ణ, ఏఈ, గుంతకల్లు పురపాలక సంఘం

మేమున్నాం.. మీకు తోడుగా

గుంతకల్లు పట్టణం: 80085 73072
తాడిపత్రి: 79950 67001
శింగనమల: 8008612342

సమస్య: బుక్కరాయసముద్రం పంచాయతీలో తహసీల్దారు, ఎంపీడీవో కార్యాలయాల పక్కనే ఉన్న మరువ వంకలో భారీగా పూడిక చేరి, మురుగు ముందుకు కదలడం లేదు.
-నాగేంద్ర, బుక్కరాయసముద్రం

సమాధానం: మరువ వంకలో పూడిక తీయించి ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటాం. -సాల్మన్‌రాజు, ఎంపీడీవో, బుక్కరాయసముద్రం
- న్యూస్‌టుడే, బుక్కరాయసముద్రం

సమస్య: గుంతకల్లులో జి.కొట్టాల రోడ్డులో వ్యర్థాలు అక్కడ వేస్తుండటంతో దుర్వాసన వస్తోంది. -ప్రసాద్, స్థానికుడు

సమాధానం: జేసీబీతో చెత్తకుప్పలను తొలగించడానికి చర్యలు తీసుకుంటాం.- రవికుమార్, శానిటరీ ఇన్‌స్పెక్టర్, గుంతకల్లు పురపాలక సంఘం

సమస్య: గుంతకల్లులో టీబీ రోడ్డులో కృపాకర్ మెడికల్ స్టోర్ దగ్గర కుండీ నిండిపోయి చెత్త రోడ్డుపై పడుతోంది.
-కుమార్, స్థానికుడు

సమాధానం: చెత్తను తొలగించి శుభ్రం చేయిస్తాం. -రాజా, శానిటరీ కార్యదర్శి, 18వ సచివాలయం
- న్యూస్‌టుడే, గుంతకల్లు పట్టణం

జూదరుల అరెస్టు

గుంతకల్లు పట్టణం: గుంతకల్లులో మోదీనాబాదు సమీపంలో మంగళవారం ఆరుగురు జూదరులను అరెస్టు చేసి రూ.16,600 నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఒకటో పట్టణ సీఐ మనోహర్ తెలిపారు. కేసు నమోదు చేసినట్లు సీఐ, ఎస్ఐ కల్యాణ్ తెలిపారు.

దళితుడిపై దాడి

గుత్తి, న్యూస్‌టుడే: గుత్తి మండలంలోని బేతాపల్లికి చెందిన నాగరాజుపై మంగళవారం కొందరు దాడి చేసినట్లు బాధితుడు తెలిపాడు. చిన్నపాటి విషయంపై కర్రలు, రాళ్లతో పదిమంది ఇతర సామాజిక వర్గం వారు దాడిచేసినట్లు బాధితుడు పోలీసులకు తెలియజేశాడు. ఘటనపై పోలీసులు ఆరా తీస్తున్నారు. దాడికి పాల్పడిన వారిపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని ఎమ్మార్పీఎస్ నాయకుడు అంజన్ ప్రసాద్ పోలీసులను కోరారు.

తక్కువ విస్తీర్ణం.. ఎక్కువ పంటల సాగు

ధ్రువీకరణ పత్రాలతో శిక్షణ పొందిన విద్యార్థినులు, అధికారులు

గుంతకల్లు, న్యూస్‌టుడే: తక్కువ విస్తీర్ణంలో అధికంగా పంటలు సాగు చేసి.. ఉత్పత్తులను సాధించడానికి కృషి చేయాలని ఎరీస్ ఆగ్రో ప్రతినిధి శ్రీనివాస్‌నాయుడు, ప్రధానాచార్యుడు లక్ష్మయ్య పిలుపునిచ్చారు. స్థానిక ఎస్‌కేపీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చదువుతున్న విద్యార్థులకు రెండు రోజుల పాటు మైక్రో గ్రీన్స్ వ్యవసాయంపై శిక్షణ జరిగింది. తర్ఫీదు ముగింపు కార్యక్రమంలో వారు మాట్లాడుతూ.. యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు సాధించాలన్నారు. పంటలను లాభసాటిగా ఎలా మార్చుకోవాలన్న దానిపై అవగాహన కల్పించారు. శిక్షణ పొందిన వారికి ధ్రువీకరణ పత్రాలు అధికారులు అందజేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు రవిశంకర్‌శర్మ, జాకీర్ హుసేన్, జమీలాబీబీ, వాణిశ్రీ పాల్గొన్నారు.

రీసర్వే వేగవంతం చేయండి: జేసీ

రీసర్వే పనులు పరిశీలిస్తున్న జాయింట్ కలెక్టర్

శింగనమల, న్యూస్‌టుడే: మండల పరిధిలోని చక్రాయునిపేట గ్రామంలో మంగళవారం రీసర్వే పనులను జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామంలో నాలుగో విడత రీసర్వే వేగవంతం చేసి నిర్దేశించిన సమయానికి పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. రీసర్వే నోటీసులు సక్రమంగా అందుతున్నాయా లేదా అని రైతులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. మండల కేంద్రంలోని సివిల్ సప్లై గోదాములను పరిశీలించారు. కార్యక్రమంలో ఏడీ రూప్లానాయక్, సివిల్ సప్లై డీఎం రమేష్‌రెడ్డి, తహసీల్దార్ శేషారెడ్డి, సర్వేయర్లు, రైతులు పాల్గొన్నారు.

కుంటలు వట్టిపోతున్నాయ్!

ప్రజలకు సాగు, తాగునీరు అందించే కుంటలు పూర్తిగా అంతరించిపోతున్నాయి. గుత్తి మండలంలోని ఎంగిలిబండ, రజాపురం, కొత్తపేట, ఊబిచెర్ల తదితర గ్రామాల్లో ఉన్న కుంటలు ప్రస్తుతం ముళ్లపొదలతో దర్శనమిస్తున్నాయి. కుంటల కట్టలు బలహీనంగా ఉండటంతో వర్షాకాలం గట్టు తెగిపోవడం, నీటిని నిల్వ చేయలేకపోవడంతో ఇలా మారుతోందన్నారు. జలవనరుల శాఖ అధికారులు కనీసం కుంటల వైపు చూడటం లేదు. ప్రభుత్వం స్పందించి చెరువులు, కుంటల మరమ్మతులు చేయాలని రైతులు కోరుతున్నారు. -న్యూస్‌టుడే, గుత్తి గ్రామీణం

పురాతన బావి.. పూడికతో నిండి

గుత్తి పట్టణంలోని వందల ఏళ్లున్న పురాతన బావులు, కుంటలు అధ్వానంగా మారాయి. గుత్తిలోని తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లే దారిలో ఉన్న పీర్ల బావిలో వ్యర్థాలు వేయడంతో దుర్వాసన వెదజల్లుతోంది. మొత్తం పూడిక, జమ్ముతో నిండిపోయింది. మున్సిపాలిటీ కార్యాలయానికి కూతవేటు దూరంలో ఉన్న పట్టించుకోవడం స్థానికులు వాపోతున్నారు. అలాగే ఎన్టీఆర్ కూడలి సమీపంలో ఉన్న వక్కలకుంట వ్యర్థాలతో నిండిపోయింది. వీటిని పరిరక్షించాలని స్థానికులు ప్రజలు కోరుతున్నారు. -న్యూస్‌టుడే, గుత్తి గ్రామీణం

మురుగు పారదు.. దుర్వాసన ఆగదు

గుత్తి పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయం పక్కనే మురుగు నిలిచిపోయింది. దీంతో పరిసర ప్రాంతాల్లో దుర్వాసన వెదజల్లుతోందని కాలనీవాసులు వాపోతున్నారు. కాలువలు లేకపోవడంతో మట్టి కాలువ ద్వారానే మురుగు తరలిస్తున్నారు. కొత్తగా కాలనీకి వెళ్లాలంటే ఈ మురుగును దాటుకొని వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది. ఇప్పటికైనా మున్సిపాలిటీ అధికారులు స్పందించి నూతన కాలువ నిర్మించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు. -న్యూస్‌టుడే, గుత్తి గ్రామీణం

రహదారిపై ఇలా.. వెళ్లేదెలా!

గుత్తిలో దాసరి కాలనీలోని ఓ వీధిలో సీసీరోడ్డు పూర్తిగా ధ్వంసం అయింది. మురుగు కాలువ వద్ద రోడ్డు అధ్వానంగా తయారైంది. కాలనీవాసులు రాత్రివేళ ప్రయాణిస్తున్న సమయంలో గోతుల్లో పడుతున్నారు. పురపాలిక అధికారులు రోడ్డుకు మరమ్మతులు చేయించలేకపోతున్నారు. సమీపంలోని వక్కల కుంట వర్షాలకు నిండినపుడు మరువ నుంచి నీరు వీధిలో రోడ్డు గుండా ప్రవహిస్తోంది. ఇప్పటికైనా పురపాలిక అధికారులు రాకపోకలకు వీలుగా రోడ్డును బాగు చేయాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు. -న్యూస్‌టుడే, గుత్తి

రైతు భరోసా కేంద్రానికి పగుళ్లు

నార్పల కేంద్రంలోని నాలుగో సచివాలయ పరిధిలో ఉన్న రైతు భరోసా కేంద్ర భవనం నాసిరకంగా నిర్మించడంతో పగుళ్లు ఏర్పడినట్లు గ్రామస్థులు తెలిపారు. ఇటీవల నిర్మించిన ఈ భవనంలో గోడలు, మెట్ల వద్ద పగుళ్లు కనిపిస్తున్నాయని వారు వివరించారు. ఇలా ఉంటే రైతులు ఇబ్బందులు పడతారు తక్షణ అవకాశం ఉందని స్థానిక ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి తగిన మరమ్మతులు చేపట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు. -న్యూస్‌టుడే, నార్పల

దివ్యాంగుల సంక్షేమానికి కృషి చేయండి

గుంతకల్లు, న్యూస్‌టుడే : అనేక ఇబ్బందులు గురవుతున్న తమను ఆదుకోవాలంటూ పట్టణానికి చెందిన దివ్యాంగులు మంగళవారం ఆర్డీఓ శ్రీనివాస్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ప్రభుత్వం అందించే పథకాలు తమకు అందించి తమ సంక్షేమానికి కృషి చేయాలని దివ్యాంగుల హక్కుల పోరాట సమితి గుంతకల్లు శాఖ అధ్యక్షురాలు పద్మ అన్నారు. గుంతకల్లులో 200 మంది దివ్యాంగులకు సొంత ఇళ్లు, ఇంటి స్థలాలు, కొందరికి పెన్షన్లు రావడంలేదని పేర్కొన్నారు. అనంతరం తహసీల్దార్ రమాదేవికి కూడా వినతిపత్రాన్ని సమర్పించారు. సమితి నాయకులు శోభ, సురేంద్ర, దేవప్ప, రవిబాబు, ఆసియాబేగం పాల్గొన్నారు.

ముందస్తు ప్రవేశాల కట్టడికి చర్యలు తీసుకోవాలి

గుంతకల్లు, న్యూస్‌టుడే : పట్టణంలోని ప్రైవేట్ విద్యాసంస్థల్లో ముందస్తు ప్రవేశాలు జరగకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ నాయకులు డిమాండ్ చేశారు. వారు మంగళవారం ఆర్డీఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి ఆర్డీఓ శ్రీనివాస్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ప్రస్తుతం 9వ తరగతి చదువుతున్న విద్యార్థులకు అప్పుడే 10వ తరగతి పుస్తకాలను అమ్ముతున్న కార్పొరేట్ విద్యాలయాలపై చర్యలు తీసుకోవాలన్నారు. యూనియన్ వినోద్, రాజేశ్, పవన్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

పరీక్ష కేంద్రాల్లో వసతులు కల్పించాలి

నార్పల, న్యూస్‌టుడే: శింగనమల నియోజకవర్గంలోని ఇంటర్ పరీక్ష కేంద్రాల వద్ద విద్యార్థులకు మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి సూర్యప్రకాశ్ కోరారు. ఫిబ్రవరి 23నుంచి ప్రారంభమయ్యే ఇంటర్ పరీక్షల నేపథ్యంలో విద్యార్థులకు ఉచిత బస్సు సౌకర్యం ఏర్పాటు చేయాలన్నారు. వేసవి తీవ్రత పెరుగుతున్నందున డీహైడ్రేషన్ సమస్యలు తలెత్తకుండా కేంద్రాల వద్ద తాగునీరు వంటివి ఏర్పాటు చేయాలన్నారు.

ప్రభుత్వ పథకాలపై అవగాహన అవసరం

పెద్దవడుగూరు, న్యూస్‌టుడే: మండలంలోని గ్రామాల్లో రబీలో వేసిన వాటిని ఈ-పంట నమోదు ఎలా చేస్తున్నారనే అంశాలపై గుత్తి ఏడీఏ వెంకటరాముడు పరిశీలించారు. మంగళవారం ఈ-పంట నమోదుతోపాటు రైతు సేవాకేంద్రాల్లో సిబ్బంది పనితీరును విశ్లేషించారు. ప్రభుత్వ పథకాలను రైతులకు ఎలా తెలియజేయాలనే అంశాలపై అవగాహన కల్పించారు. పంట వేసిన ప్రతి రైతు ఆధార్‌తో లింకైన ఫోన్ నంబరుతో రైతుసేవాకేంద్రాలకు వచ్చేలా చూడాలన్నారు. ఏవో మునికృష్ణ, సునీత, మానస తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసర సరకుల పంపిణీ

తాడిపత్రి, న్యూస్‌టుడే: తాడిపత్రి పెన్షనర్ల సంఘం ఆధ్వర్యంలో దివ్యాంగులకు నిత్యావసర సరకులు అందజేశారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు సత్యప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ.. పురపాలికలో ఎలాంటి ఆసరా లేని 50 మంది నిరుపేద దివ్యాంగులకు ఒక్కొక్కటి రూ. 400 విలువ చేసే నిత్యావసర సరకుల కిట్లను అందజేశామన్నారు. కార్యక్రమంలో పెన్షనర్ల సంఘం సభ్యులు పాల్గొన్నారు.

ఆర్డీటీ పరిరక్షణే ధ్యేయం

అరవిందనగర్(అనంతపురం): ఉమ్మడి అనంత జిల్లాలోని పేదల సంక్షేమానికి కృషి చేస్తున్న ఆర్డీటీ సంస్థకు ఎఫ్‌సీఆర్ఏ పునరుద్ధరించాలని అఖిలపక్ష కమిటీ కన్వీనర్ సాకే హరి కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆయన ఆధ్వర్యంలో వివిధ పార్టీలు, కుల, ప్రజాసంఘాల నాయకులు మంగళవారం కేంద్ర కార్యాలయాల ఎదుట నిరసన తెలిపారు. తొలుత గడియార స్తంభం దగ్గర ధర్నా చేశారు. అనంతరం తపాలా, టెలికం సంస్థల ప్రధాన కార్యాలయాలకు చేరుకొని లోపలకు వెళ్లడానికి ప్రయత్నించారు.

నాయీబ్రాహ్మణుల సమస్యలు పరిష్కరించండి

సీఎం చంద్రబాబు నాయుడికి వినతిపత్రం ఇస్తున్న ఆదినారాయణ

శింగనమల: రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడిని రాష్ట్ర నాయీబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ ఎమ్ ఆదినారయణ కలిశారు. నాయీబ్రాహ్మణ వర్గంలో విద్య, ఉద్యోగాలు, ఆర్థికంగా వెనుకబడి ఉన్నారని తెలిపారు. సరైన అవకాశాలు లేక సంప్రదాయ వృత్తిని వదిలేస్తున్నారన్నారు. పీ4 ద్వారా ఆర్థికంగా వెనుకబడ్డ వారిని పైకి తీసుకురావాలని వినతి పత్రం అందజేశారు.

ఎట్టకేలకు రహదారికి మరమ్మతులు

మరమ్మతులు చేసిన కసాపురం రోడ్డు

గుంతకల్లు, న్యూస్‌టుడే: ఎట్టకేలకు ఆర్అండ్‌బీ అధికారులు గుంతకల్లు - కసాపురం రోడ్డులోని గుంతలకు మరమ్మతులు చేశారు. రోడ్డులో గుంతకల్లు నుంచి కసాపురం, కసాపురం నుంచి జిల్లా సరిహద్దు వరకు పలుచోట్ల గుంతలు పడి వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా ఉండడమే కాకుండా ప్రమాదాలు జరిగేవి. అధికారులు రూ.10 లక్షలకు పైగా వ్యయంతో మరమ్మతులు చేశారు. ఫలితంగా వాహనదారులు సజావుగా ప్రయాణిస్తున్నారు.

యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా

పామిడి, న్యూస్‌టుడే: పెన్నానదిలో ఇసుక దోపిడికి అంతులేకుండా పోతోంది. అధికారుల కళ్లుగప్పి ఇష్టారాజ్యంగా ఇసుక అక్రమ రవాణా చేస్తున్నారు. పామిడి, వంకరాజుకాలువ గ్రామాల పెన్నా పరివాహక ప్రాంతాల్లో ఉదయం, సాయంత్రం వేళల్లో ట్రాక్టర్లు ఇసుకను జోరుగా తరలిస్తున్నాయి. అధికారుల నిర్లక్ష్యం అక్రమార్కులకు వరంగా మారింది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాలని ప్రజలు కోరుతున్నారు.

నులిపురుగుల నివారణ మాత్రల పంపిణీ

విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

శింగనమల : జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవాన్ని పురస్కరించుకొని మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలో తరిమెల ప్రాథమిక వైద్యాధికారి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో నులిపురుగుల మాత్రలు(ఆల్బెండజోల్) భోజనం తర్వాత పింపిణీ చేశారు. మండలంలోని అన్ని ప్రభుత్వ కళాశాలలు, పాఠశాలలు, అంగన్‌వాడీలలో ఉన్న వారందరికీ ఇచ్చారు. నులిపురుగుల వల్ల కలిగే అనారోగ్య సమస్యలు కలుగుతాయని, అలాగే రక్తహీనత వస్తుందని తెలిపారు. ఎంపీడీఓ భాస్కర్, ఎంఈఓ నరసింహరాజు, కేజీబీవీ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గార్లదిన్నె గ్రామీణం: జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా మంగళవారం పిల్లలకు వైద్యసిబ్బంది నులిపురుగు నివారణ మాత్రలు పంపిణీ చేశారు. మండల పరిధిలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలల్లో ఉన్న 11081మంది పిల్లలను గుర్తించగా 10858మంది పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేసినట్లు వైద్యులు తెలిపారు.

సారూ.. వీధిదీపాలు వెలిగించరూ

తాడిపత్రిలోని పలు కాలనీలలో విద్యుత్తు దీపాలు వెలగడం లేదు. పుట్లూరు రోడ్డు, జయనగర్ కాలనీ చౌడమ్మ దేవాలయం ఎదురుగా వీధిలో ఈ సమస్య నెలకొంది. దీంతో ఆయా కాలనీలలో చీకట్లు అలముకున్నాయి. రాత్రి వేళ బయట కు రావాలంటే స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు. వెంటనే దీపాలను మార్చాలని కాలనీవాసులు అధికారులను కోరారు. దీనిపై మున్సిపల్ ఏఈ ఏక్‌నాథ్‌ను వివరణ కోరగా దీపాలు మార్చి సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు. -న్యూస్‌టుడే, తాడిపత్రి

నెల రోజులుగా నీటి సమస్య!

నీటిని సరఫరా చేసే వాల్వు విరిగిపోయి ఇలా..

గుంతకల్లు, న్యూస్‌టుడే : మండలంలోని దోసలుడికి గ్రామంలో సగం మంది తాగునీటి కోసం అవస్థలు పడుతున్నారు. గ్రామంలోని తాగునీటి ఉపరితల ట్యాంకు నుంచి గ్రామానికి నీటిని సరఫరా చేసే వాల్వులు నెల రోజుల కిందట పాడైపోయాయి. దీనికి మరమ్మతులు చేయకపోవడంతో గ్రామానికి నీరు సరఫరా కావడంలేదని స్థానిక ప్రజలు వాపోతున్నారు. ఫలితంగా వారు పొల్లాలోని బోర్ల వద్దకు వెళ్లి తాగునీటిని తెచ్చుకుంటున్నారు. అలాగే ట్యాంకును శుభ్రం చేయకపోవడంతో కలుషిత నీరు వచ్చేదని గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేశారు. ట్యాంకు నిర్మాణం దెబ్బతినడంతో పైకి ఎక్కి శుభ్రం చేసేందుకు ఎవరూ సాహసించడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్యలను పరిష్కరించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

నాటిన మొక్కలు ఏవి?

నాటిన మొక్కలు లేక బోసిపోయిన రహదారి

గుంతకల్లు పట్టణం, న్యూస్‌టుడే: గత వైకాపా ప్రభుత్వంలో గుంతకల్లులో హనుమాన్ సర్కిల్ నుంచి ఆలూరు, బళ్లారి, ఉరవకొండ పట్టణాలకు వెళ్లే రహదారులను సుందరీకరణ చేయాలని 2023 ఏడాదిలో ఆర్థిక సంఘం నిధులతో మున్సిపల్ అధికారులు మొక్కలు నాటించారు. ప్రతి రోడ్డు మార్గంలో ఇరువైపుల రెండు కిలోమీటర్ల మేర.. తబెబుయా, రోజియ, పెంటాఫోరమ్ తదితర రకాలైన 1760 మొక్కలు నాటారు. ప్రతి మొక్క సంరక్షణకు ట్రీ గార్డును ఏర్పాటు చేశారు. మొక్కల కోసం రూ.26లక్షల వరకు ఖర్చుపెట్టారు. గుత్తేదారు వాటి సంరక్షణ పట్టించుకోకపోవడంతో, నాటిన ఆరు నెలలకే మొక్కలు ఎండిపోయాయి. మొక్కలకు రూ.లక్షల్లో ఖర్చుపెట్టిన ప్రయోజనం లేకుండా పోయిందని ప్రజలు వాపోతున్నారు. బళ్లారి రహదారిలో వట్టినేలగా బోసిపోయింది.

అరకొరగా పాఠశాల గ్రాంటు

గుత్తి, గుంతకల్లు, పామిడి, న్యూస్‌టుడే: పాఠశాలల నిర్వహణకు ప్రభుత్వం తగినన్ని నిధులు ఇవ్వడం లేదు. దీంతో సరైన వసతులులేక విద్యార్థులు అనేక పాట్లు పడుతున్నారు. గుత్తి, గుంతకల్లు, పామిడి పట్టణాలతోపాటు గ్రామాల్లోని పాఠశాలల నిర్వహణ కష్టంగా మారుతోంది. మరుగుదొడ్ల నిర్వహణ, బోధనోపకరణాలు, పాఠశాల్లో మరమ్మతులు, విద్యుత్తు సరఫరాకు, తాగునీటి ప్లాంట్ల నిర్వహణకు గ్రాంటునే వినియోగించాలి.

మండలం	పాఠశాలల సంఖ్య	విద్యార్థుల సంఖ్య
గుత్తి	76	7,402
గుంతకల్లు	93	9,597
పామిడి	45	3,732

* ప్రభుత్వం విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా నిధులు కేటాయిస్తోంది. 1-20 మంది విద్యార్థులుంటే రూ.10వేలు, 20-50 వరకు రూ.25వేలు, 50-100 వరకు రూ.50వేలు, 100-500 వరకు రూ.లక్ష ఇవ్వాల్సి ఉండగా అందులో సగం మాత్రమే ఇచ్చారు. పాఠశాల గ్రాంటు నిర్వహణకు ఏమాత్రం చాలడంలేదు.

మూలన పడుతున్న ఆర్వో ప్లాంట్లు

ప్రభుత్వం పాఠశాలలకు శుద్ధజల ప్లాంట్లు ఇచ్చింది. కొన్నిచోట్ల వాటిని వినియోగిస్తుండగా మరికొన్ని చోట్ల అట్టపెట్టెల్లోనే ఉన్నాయి. పాఠశాలల్లో అధికారులు ప్రజాకుళాయి కనెక్షన్లు ఇచ్చారు. వీటికి సక్రమంగా నీరురావడంలేదు. గుత్తి, గుంతకల్లు మండలాలలోని 23గ్రామాలకు తాగునీరు అందించే వైటీచెరువు నీటి పథకం సక్రమంగా పనిచేయడంలేదు. దీంతో ఆర్వో ప్లాంట్లు మూలనపడుతున్నాయి. పాఠశాలలకు ప్రత్యేకంగా తాగునీటి పథకాలను ఏర్పాటు చేస్తే ప్రయోజనం చేకూరుతుందని ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. ప్రస్తుతం విద్యార్థులు ప్రతిరోజు తమ ఇళ్లనుంచే తాగునీటిని బాటిళ్లల్లో తెచ్చుకుంటున్నారు.

గుత్తిలోని బీసీకాలనీ ప్రాథమిక పాఠశాల

గ్రాంటు వస్తోంది

ప్రభుత్వం నుంచి గ్రాంటు వస్తోంది. ఆగస్టు నెలలో ప్రతి పాఠశాలకు రూ.12,500 చొప్పున ఇచ్చారు. పాఠశాలలకు మరమ్మతులు, తాగునీరు, బోర్డుల ఏర్పాటు, విద్యుత్తు వైరింగ్ పనులకు నిధులను హెచ్ఎమ్‌లు వెచ్చించాల్సి ఉంది. విద్యా సంవత్సరం ముగిసేలోపు మిగతా నిధులు మంజూరు అయ్యే అవకాశం ఉంది.

- రవినాయక్, ఎంఈవో, గుత్తి

శిల్పాకృతి పనుల పరిశీలన

నిర్మాణ పనులు పరిశీలిస్తున్న దాత రాజేంద్ర రెడ్డి, ఈవో విజయరాజు, నారాయణస్వామి

గుంతకల్లు పట్టణం, న్యూస్‌టుడే: కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి దేవస్థానంలో గర్భాలయం, విమానగోపురం, శిఖరం, అర్ధమండపం నిర్మాణానికి రూ.5కోట్ల విరాళం ఇచ్చిన రాయచూర్‌కు చెందిన నవోదయ ఎడ్యుకేషనల్ ఛైర్మన్ దాత రాజేంద్రరెడ్డి మంగళవారం ఆలయాన్ని సందర్శించి స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ బయట జరుగుతున్న శిల్ప నమూనాల ఆకృతుల పనులను దాత ఈవోతో కలిసి పరిశీలించారు. ఎమ్మెల్యే సోదరుడు గుమ్మనూరు నారాయణస్వామి, సుబ్రమణి, తదితరులు పాల్గొన్నారు.

(c) eenadu

అనంతపురం

•అనంతపురం •రాప్తాడు

చిన్నారుల ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలి

ఆత్మకూరు, న్యూస్‌టుడే: ఎదుగుతున్న చిన్నారుల ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలని మండల వైద్యాధికారి సబీహా సుల్తానా సూచించారు. మండలంలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో మంగళవారం చిన్నారులకు అల్బెండజోల్ మందులు అందించారు. చిన్నారుల్లో ఉన్న నులిపురుగుల కారణంగా వారిలో ఎదుగుదల తక్కువగా ఉంటుందన్నారు. చిన్నారులు తీసుకునే ఆహారం వారి శరీరానికి అందకుండా నులిపురుగులు అడ్డుపడతాయని తెలిపారు. ప్రతి 6 నెలలకు ఒకసారి చిన్నారులకు అల్బెండజోల్ మందులు అందించడం ద్వారా నులిపురుగులు పోయి శరీర ఎదుగుదల సజావుగా ఉంటుందన్నారు. మండలంలో 6,626 మంది చిన్నారులకు అల్బెండజోల్ అందించామని తెలిపారు.

మేమున్నాం.. మీకు తోడుగా

అశోక్‌నగర్: 8008573011
రాంనగర్: 8008573001
కమలానగర్: 7032975446

సమస్య: హౌసింగ్ బోర్డులోని రాజీవ్ చిల్డ్రన్ పార్కులో బోర్డున్న మొక్కలకు నీరు సక్రమంగా పెట్టకపోవడంతో పాటు దుమ్మును శుభ్రం చేయడం లేదు. **- సి.ప్రతాప్, స్థానికుడు**

సమాధానం: ఉద్యాన సిబ్బంది సక్రమంగా పనిచేసేలా చూస్తాం.

సమస్య: కమలానగర్ రోటరీ పాఠశాల సమీపంలో రోడ్డు పక్కనే చెత్త కుప్పగా పడేశారు. **- నాగశేషు, స్థానికుడు**

సమాధానం: వెంటనే చెత్తను తరలించేలా చర్యలు తీసుకుంటాం.

(పై ప్రశ్నలకు నగరపాలక ఈఈ షాకీర్, ఇన్‌ఛార్జి ఎంహెచ్‌ఓ నరసింహా సమాధానాలు ఇచ్చారు) **- న్యూస్‌టుడే, అశోక్‌నగర్**

తెరపై ఈనాడు

అనంతపురం(కమలానగర్), న్యూస్‌టుడే: గౌరి: **లవ్‌స్టోరి**, గాయత్రి: **విత్ లవ్, చథా పచ్చ**, నీలిమ: **మనసంతా నువ్వే**, త్రివేణి: **సీతా పయనం**, తేజశ్విని: **నిలవె, అమరావతికి ఆహ్వానం**, ఎస్వీ సినిమా, శాంతి, తరంగిణి: **కపుల్ ఫ్రెండ్లీ, ఫంకీ**, సుధా: **మన శంకర వరప్రసాద్.**

కాయగూరల ధరలు

(అనంతపురం పాతూరు మార్కెట్లో ధరలు కిలో రూ.లలో) టమాటాలు 20, రెండోరకం 10, ఉల్లిగడ్డలు 35, రెండో రకం 25, బంగాళాదుంపలు 35, మిరపకాయలు 60, రెండోరకం 45, బెండకాయలు 25, వంకాయలు 25, ముల్లంగి 20, బీట్‌రూట్ 40, బీరకాయలు 40, కాకరకాయలు 40, చౌళేకాయలు 30, క్యాప్సికమ్ 35, చిక్కుడుకాయలు 35, అనపకాయలు 40, క్యారెట్ 40, బీన్స్ 40, క్యాబేజీ 40, మునగకాయలు 150, నిమ్మకాయలు (వంద) 250, అల్లం 75.

- న్యూస్‌టుడే, అనంతపురం (అరవిందనగర్)

రోడ్డు ప్రమాదంలో ఇంజినీరు మృతి

రాప్తాడు, న్యూస్‌టుడే: ఆర్‌ఆర్‌బీ పరీక్షలు రాయడానికి వెళ్తుండగా రోడ్డు ప్రమాదంలో గాయపడి యువకుడు మృతి చెందాడు. ఈ ఘటన రాప్తాడు మండలం మరూరు టోల్‌గేట్ సమీపంలో జరిగింది. అనంతపురం రూరల్ నారాయణపురం ఇందిరమ్మ కాలనీకి చెందిన శ్రీనివాసులు కుమారుడు **దిలీప్‌కుమార్** (23) బెంగళూరు దొడ్డబళ్లాపురలో ఓ ప్రైవేట్ కంపెనీలో ఎలక్ట్రికల్ ఇంజినీరుగా పని చేస్తున్నాడు. మంగళవారం అనంతపురం చిన్మయ్‌నగర్‌లో 11 గంటలకు ఆర్‌ఆర్‌బీ పరీక్షలు రాయడానికి బెంగళూరు నుంచి వస్తుండగా ఉదయం 8 గంటల సమయంలో మరూరు టోల్‌గేట్ సమీపాన జాతీయ రహదారిపై కుక్క అడ్డు వచ్చింది. అదుపు తప్పి కిందపడి తలకు గాయమైంది. వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా వైద్యుడు పరిశీలించి మృతి చెందాడని చెప్పినట్లు పోలీసులు వివరించారు.

వ్యవసాయ మోటారు చోరీ..

ఆత్మకూరు, న్యూస్‌టుడే: మండలంలోని తలుపూరు గ్రామానికి చెందిన రైతు శ్రీనివాసులు వ్యవసాయ మోటారును సోమవారం రాత్రి చోరీ చేశారు. కూడేరు రెవెన్యూ గ్రామంలో 5 ఎకరాల్లో బోరు వేసి పంట సాగు చేస్తున్నాడు. రోజువారీగా సోమవారం వ్యవసాయ పనులు ముగించుకొని ఇంటికి వెళ్లాడు. మంగళవారం ఉదయం పొలంలోకి వెళ్లి చూడగా మోటారు, స్టార్టర్, కేబుల్ వైర్లు, బిందు సేద్య పరికరాలు ఎత్తుకెళ్లినట్లు గుర్తించారు. రూ.90 వేల వరకూ నష్టపోయినట్లు బాధిత రైతు ఆవేదన వ్యక్తం చేశారు.

స్వర్ణ వార్డు కార్యదర్శులకు తాఖీదులు

అనంత నగరపాలక, న్యూస్‌టుడే: నగరపాలక పరిధిలో అధికారికంగా నిర్వహించిన టెలికాన్ఫరెన్సులో పాల్గొనకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించిన ముగ్గురు స్వర్ణ వార్డు కార్యదర్శులకు నగరపాలిక కమిషనరు జశ్వంత్ రావు తాఖీదులు జారీ చేశారు. వార్డు రెవిన్యూ కార్యదర్శి జ్యోత్స్న, వార్డు శానిటేషన్ కార్యదర్శి మారుతి వరప్రసాద్, వార్డు అమెనిటీ కార్యదర్శి మహమ్మద్ షైపుల్లా తాఖీదులు అందుకున్న వారిలో ఉన్నారు. 24 గంటల్లోగా సంజాయిషీ ఇవ్వాలని అందులో పేర్కొన్నారు.

ఇంటి ఆవరణలో వాహనాలకు నిప్పు

అనంత నేరవార్తలు: దొంగతనానికి వచ్చిన వారు ఇంటి ఆవరణలో వాహనాలకు నిప్పు పెట్టిన ఘటన నగరంలో చోటుచేసుకుంది. వివరాలు.. నగరంలోని అరవిందనగర్‌లో సురేశ్‌బాబు అనే వ్యక్తి ఉంటున్నారు. ఆయన తన కుటుంబ సభ్యులతో కలిసి శివరాత్రి ఉత్సవాల్లో పాల్గొనేందుకు బంధువులతో కలిసి కర్నూలు వెళ్లారు. ఈ నేపథ్యంలో గుర్తుతెలియని వ్యక్తులు సురేశ్‌బాబు ఇంట్లో చోరీకి వచ్చారు. ఇంటికి వేసిన తాళాలను ఎంత ప్రయత్నించినా తెరవలేక పోవడంతో అసంతృప్తికి లోనయ్యారు. ఈక్రమంలో ఇంటి ఆవరణలో ఉంచిన కారు, రెండు ద్విచక్ర వాహనాలకు నిప్పు పెట్టి ఉడాయించారు. మంటలు పెద్దఎత్తున వ్యాపించడంతో గమనించిన బాధితుడి సోదరుడు వేణుగోపాల్ వాటిని అదుపు చేశారు. విషయాన్ని సోదరుడికి తెలిపాడు. కర్నూలు వచ్చిన బాధితుడు మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

జేఈఈ ఫలితాల్లో అనంత మార్కు

జేఎన్‌టీయూ, న్యూస్‌టుడే: జేఈఈ మెయిన్స్ పరీక్షల్లో అనంత విద్యార్థులు మెరిశారు. ముగ్గురు 99పైన, మరో ఇద్దరు 98పైన పర్సంటైల్ సాధించి తమ సత్తా చాటారు. ప్రతిభకు కొదవ లేదని చాటుకున్నారు. వీరిలో పేదింటి బిడ్డలూ ఉన్నారు. ప్రభుత్వ రంగ ఇంజినీరింగ్ విద్యా సంస్థలైన ఎన్ఐటీ, ట్రిపుల్ ఐటీలో చదివేందుకు మార్గం వేసుకున్నారు. త్వరలో జరగనున్న అడ్వాన్స్‌డ్ పరీక్షలకు అర్హత సాధించారు. ఈ సందర్భంగా తమ సాధన ఎలా సాగిందో తెలిపారు. వారి మాటల్లోనే తెలుసుకుందాం రండి.

ఉత్తమ ఇంజినీరు కావడమే లక్ష్యం

మాది నారాయణపురం గ్రామం. నా పేరు **హాజీవలి**. అమ్మానాన్నలు మహబూబ్‌బాషా, ... 98.40 పర్సంటైల్ సాధించా. తండ్రి తాపీ మేస్త్రీగా పనిచేస్తుంటారు. తల్లి గృహిణి. మంచి ఇంజినీరింగ్ కళాశాలలో చేరాలనే లక్ష్యంతో కష్టపడి చదివినందుకు తగిన మార్కులు వచ్చాయి. ఉత్తమ ఇంజినీరుగా ఎదగాలన్నదే నా లక్ష్యం.

మంచి కళాశాలలో సీటు పొందాలి

అనంతపురంలోని గుత్తి రోడ్డులో ఉంటున్నా. నా పేరు **అబుసాజిద్**. నాన్న సర్దార్‌బాబు ప్రభుత్వ ఉపాధ్యాయుడు. అమ్మ ఫరీద గృహిణి. ఇక్కడే నారాయణ కళాశాలలో ఇంటర్ చదువుతున్నా. మెయిన్స్‌లో 99.51 పర్సంటైల్ వచ్చింది. మంచి ఇంజినీరింగ్ కళాశాలలో సీటు సాధించాలన్న లక్ష్యంతో రాత్రింబవళ్లు సాధన చేశా.

కష్టానికి తగిన ఫలం..

నా పేరు **నిశాంత్‌రెడ్డి**. జేఈఈలో 99.71 పర్సంటైల్ తెచ్చుకున్నా. మాది అనంతపురం. నాన్న సుధాకర్‌రెడ్డి ప్రైవేటు ఉద్యోగి. అమ్మ రామతులసి ప్రభుత్వ ఉపాధ్యాయురాలు. వారిద్దరి పర్యవేక్షణలో చిన్నప్పటి నుంచి చదువుపై ధ్యాస పెట్టా. కష్టపడి చదివినందుకు మంచి ఫలితం వచ్చింది.

అమ్మానాన్నల ప్రోత్సాహంతో..

మాది అనంతపురం నగరం. పేరు **నిజర్‌సాయి**. జేఈఈ మెయిన్స్‌లో 99.82 పర్సంటైల్ వచ్చింది. విజయవాడలోని ఓ కార్పొరేట్ కళాశాలలో ఇంటర్ చదువుతున్నా. అమ్మ గాయత్రి ఎస్జీటీ, నాన్న నాగరాజు వ్యాయామ ఉపాధ్యాయులుగా పనిచేస్తున్నారు. వారి ప్రోత్సాహంతో ఇష్టంగా చదవడంతో మంచి శాతం వచ్చింది.

తల్లిదండ్రుల ఆశయం నెరవేర్చాలని..

మాది అనంతపురం గ్రామీణ మండలం నారాయణపురం గ్రామం. నా పేరు **ఫయాజ్ అహమ్మద్**. తల్లిదండ్రులు సిద్దయ్య, మహబూబ్‌బీ. 98.81 పర్సంటైల్ వచ్చింది. తండ్రి దుస్తుల దుకాణంలో పనిచేస్తున్నారు. అమ్మ టైలరింగ్ చేస్తుంది. నేను బాగా చదవాలన్న వారి ఆశయం నెరవేర్చడానికి కష్టపడి చదివి మంచి ఫలితం తెచ్చుకున్నా.

స్వామి సన్నిధిలో..

మొదటి రోడ్డు శివాలయంలో..

ఉదయం 5 గంటలకు అభిషేకం ● 5.30కు సర్వదర్శనం ● 8.00కు మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం ● 8.45కు అలంకరణ సేవ ● 9.00కు వసంతోత్సవం ● 10.00కు రుద్ర హోమం ● 11.00కు ధ్వజావరోహణ ● 11.30కు కలశ ఉద్వాసన రాత్రి 7.30కు శారదా అమ్మవారి దేవస్థానంలో స్వామివారి శయనోత్సవం ● 8.30కు మహా మంగళ హారతులు ● 8.45కు ప్రసాద వితరణ

రైల్వేస్టేషన్ వరసిద్ధి వినాయక దేవస్థానంలో..

ఉదయం 7.00కు సర్వదర్శనం ✦ 8.00కు పంచామృతాభిషేకం ✦ 8.15కు అలంకరణ సేవ ✦ 8.45కు మహా మంగళ హారతులు ✦ సాయంత్రం 5.30కు సర్వ దర్శనం ✦ 9.00కు పవళింపు సేవ, మహా మంగళ హారతులు

- న్యూస్‌టుడే, అనంత సాంస్కృతికం

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

అనంతపురం విద్య, న్యూస్‌టుడే: ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన నాణ్యతలో లోపాలు లేకుండా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ హెచ్చరించారు. పేద విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం అమలు చేస్తోందన్నారు. అధికారులు నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదన్నారు. తల్లిదండ్రుల నుంచి ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. ప్రధానోపాధ్యాయులు, ఎంఈవోలు కచ్చితంగా భోజనం నాణ్యతను పరిశీలించాల్సిందేనన్నారు. తానూ పాఠశాలల్లో ఆకస్మిక తనిఖీలు చేపట్టి భోజనం నాణ్యతను పరిశీలిస్తానని స్పష్టం చేశారు.

ప్రాంగణ నియామకాల్లో పదిమందికి ఉద్యోగాలు

జేఎన్‌టీయూ: జేఎన్‌టీయూ ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించిన ప్రాంగణ నియామకాల్లో 10 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికయ్యారు. హైదరాబాదుకు చెందిన ఎక్సెల్‌ఆర్ అనే సంస్థ ప్రాంగణ నియామకాలు నిర్వహించింది. 225 మంది విద్యార్థులు హాజరయ్యారు. వీరిలో పదిమంది రూ.4లక్షల వార్షికవేతనం ఉద్యోగాలకు, 14 మంది ఇంటర్న్‌షిప్‌కు ఎంపికయ్యారు. వీసీ సుదర్శనరావు, రిజిస్ట్రార్ కృష్ణయ్య, ప్రిన్సిపల్ చెన్నారెడ్డి తదితరులు ఎంపికైన వారిని అభినందించారు.

నులిపురుగుల నివారణతో సంపూర్ణ ఆరోగ్యం

రాప్తాడు, న్యూస్‌టుడే: నులిపురుగుల నివారణతో పిల్లలకు సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని ఎంపీడీవో విజయలక్ష్మి తెలిపారు. రాప్తాడు మండలం కేంద్రం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు మాత్రలు పంపిణీ చేశారు.

ఆర్డీటీ పరిరక్షణే ధ్యేయం

అరవిందనగర్ (అనంతపురం), న్యూస్‌టుడే: ఉమ్మడి అనంత జిల్లాలోని పేదల సంక్షేమానికి కృషి చేస్తున్న ఆర్డీటీ సంస్థకు ఎఫ్‌సీఆర్‌ఏ పునరుద్ధరించాలని అఖిలపక్ష కమిటీ కన్వీనర్ సాకే హరి కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆయన ఆధ్వర్యంలో వివిధ పార్టీలు, కుల, ప్రజాసంఘాల నాయకులు మంగళవారం కేంద్ర కార్యాలయాల ఎదుట నిరసన తెలిపారు. తొలుత గడియార స్తంభం దగ్గర ధర్నా చేశారు. అనంతరం తపాలా, టెలికం సంస్థల ప్రధాన కార్యాలయాలకు చేరుకొని లోపలకు వెళ్లడానికి ప్రయత్నించారు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకొని కార్యాలయాల ప్రధాన ద్వారాలు మూసివేశారు. ఈ సందర్భంగా సాకే హరి మాట్లాడుతూ ఆర్డీటీ 60 ఏళ్లుగా ఉమ్మడి జిల్లాలోని పేదలకు విద్య, వైద్యం, ఉపాధి, క్రీడలు, వ్యవసాయ రంగాల్లో పలు సేవలందిస్తోందన్నారు. ఆ సంస్థ పరిరక్షణే తమ ధ్యేయమని, కేంద్రం అర్థం చేసుకొని ఎఫ్‌సీఆర్‌ఏ రెన్యూవల్‌కు అనుమతి ఇవ్వాలని కోరారు. ధర్నాలో సీపీఐ, కాంగ్రెస్, సీపీఎం, ఐఎఫ్‌టీయూ, ఎమ్మార్పీఎస్ ఐఎంఎం, మాలమహానాడు, బుడగ జంగం, దివ్యాంగుల హక్కుల పోరాట సమితి సంఘాల నాయకులు రమణయ్య, ఇమామ్, సురేశ్, ఓబుళేసు, శ్రీనివాసులు, అంజి, హరినాథ్‌రెడ్డి, జయచంద్రనాయుడు తదితరులు పాల్గొన్నారు.

నిరసన తెలుపుతున్న ప్రజాసంఘాల నాయకులు

నేత్రపర్వం.. పరమేశ్వరుడి అలకోత్సవం

అనంత సాంస్కృతికం, న్యూస్‌టుడే: నగరంలోని మొదటిరోడ్డు శివాలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా పదోరోజు మంగళవారం రాత్రి స్వామి అలకోత్సవం కనువిందు చేసింది. విశ్వేశ్వరుడు అశ్వ వాహనంపై కొలువుదీరి భక్తులకు దర్శనం ఇచ్చాడు. ఆలయ కమిటీ ఛైర్మన్ నరేంద్రచౌదరి, ఈవో నాగేంద్రుడు ఆధ్వర్యంలో ఉదయం స్వామికి మహాన్యాస పూర్వక ఏకవార రుద్రాభిషేకం జరిగింది. రాత్రి దీక్షా హోమం అనంతరం మహదేవుడు పురవీధుల్లో విహరించారు. ఈ సందర్భంగా శ్రీవినాయక నృత్యాలయ నాట్యగురువు విజయకుమార్ సారథ్యంలో పలువురు చిన్నారులు చేసిన కూచిపూడి నృత్యం ఆకట్టుకుంది. అనంతరం ఆలయంలో దశహారతుల క్రతువు నిర్వహించారు. కార్యక్రమాలను ఆలయ ధర్మకర్తలు రాజు, విష్ణు, చరణ్, ఆదిశేషయ్య, అనంతకుమారి, రాధ, రమణమ్మ, శ్రీదేవి, రత్నమ్మ, వనితాబాయి, ఎక్స్ అఫిషియో సభ్యుడు కిషోర్‌కుమార్ తదితరులు పర్యవేక్షించారు.

విశేషాలంకారంలో అమ్మవారు

అనంత సాంస్కృతికం: నగరంలోని రామలింగ చౌడేశ్వరిదేవి అమ్మవారి ఆలయ వార్షికోత్సవం మంగళవారం వైభవంగా జరిగింది. దేవాంగుల ఆధ్వర్యంలోని వృద్ధాశ్రమం ఆవరణలో కొలువుదీరిన అమ్మవారికి గంగ, పంచామృతాభిషేకం, అష్టోత్తరం, పారాయణం, అలంకరణ సేవలు నిర్వహించారు. దేవాంగ సంక్షేమ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు అంపావతి కృష్ణమూర్తి, నిమ్మల సదాశివం, బల్లరామ్మూర్తి ఆధ్వర్యంలో పూజలు జరిగాయి. ఉత్సవమూర్తిని ప్రత్యేక పల్లకీలో ఉంచి ప్రాకారోత్సవం నిర్వహించారు.

గ్రామోత్సవంలో కైలాసనాథుడు

‘మైనార్టీ మోర్చాను బలోపేతం చేయాలి’

తపోవనం (అనంత గ్రామీణం), న్యూస్‌టుడే: భాజపాకు మైనార్టీ వర్గాలను మరింత చేరువ చేయాలని రాష్ట్ర మైనార్టీ మోర్చా ప్రధాన కార్యదర్శి మహమ్మద్ సాదిక్, జిల్లా అధ్యక్షుడు ఎస్.ఇలియాజ్ పిలుపునిచ్చారు. మంగళవారం వారు భాజపా మైనార్టీ మోర్చ జిల్లా కమిటీని ప్రకటించి మాట్లాడారు. మైనార్టీల కోసం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. కాంగ్రెస్ హయాంలో మైనార్టీలను ఓటు బ్యాంకుగా ఉపయోగించుకున్నారని ఎద్దేవా చేశారు. మైనార్టీ కమిటీలో స్థానం సాధించిన సభ్యులు మైనార్టీ వర్గాలకు ప్రభుత్వం అందజేస్తున్న పథకాల గురించి వివరించాలన్నారు. రాష్ట్ర మైనార్టీ మోర్చ కార్యదర్శి జి.మహమ్మద్ రఫీ, భాజపా రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసులు, జిల్లా అధ్యక్షుడు రాజేష్, భాజపా జిల్లా ప్రధాన కార్యదర్శి అశోక్‌రెడ్డి, సభ్యులు మల్లారెడ్డి, బాబాఫక్రుద్దీన్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం నూతన కమిటీ సభ్యులకు పత్రాలు అందజేసి అభినందించారు.

నియామక పత్రాలతో మైనార్టీ మోర్చా జిల్లా కమిటీ సభ్యులు

విజ్ఞాన మేళాకు నమూనాలు పంపరూ..

రుద్రంపేట, న్యూస్‌టుడే: విద్యార్థులకు సైన్స్‌పై అవగాహన కల్పించేందుకు మార్చి నెలలో ‘యురేకా సైన్స్ ఫెయిర్-26’ నిర్వహిస్తున్నట్లు మాజీ ఎమ్మెల్సీ గేయానంద్ తెలిపారు. ఆయన మంగళవారం రుద్రంపేటలోని జడ్పీ ఉన్నత పాఠశాలకు వెళ్లి ప్రధానోపాధ్యాయిని సుమంగళికి ఆహ్వాన పత్రిక అందజేసి మాట్లాడారు. పాఠశాలలో 8, 9వతరగతి చదువుతున్న విద్యార్థులు విజ్ఞానా మేళాలో ప్రదర్శించడానికి నమూనా ప్రాజెక్టులు రూపొందించేలా తర్ఫీదు ఇవ్వాలని కోరారు. మార్చి 8వతేదీలోపు పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రమణారెడ్డి, గురివిరెడ్డి, శారద, అస్వర్థ కుమార్, వేణు, విద్యావతి, ఓబుళపతి పాల్గొన్నారు.

హెచ్‌ఎం సుమంగళికి ఆహ్వాన ప్రతిక అందజేస్తున్న గేయానంద్ తదితరులు

మహాశివోత్సవం విజయవంతానికి కృతజ్ఞతలు

రాంనగర్ (అనంతపురం), న్యూస్‌టుడే: మహాశివరాత్రి సందర్భంగా నగరంలోని శ్రీనగర్‌కాలనీలో నిర్వహించిన శివోత్సవాన్ని విజయవంతం చేసిన వారందరికీ నిర్వాహకుడు, ఏపీఐఐసీ డైరెక్టర్ చల్లా లక్ష్మీప్రసాద్ కృతజ్ఞతలు తెలిపారు. ఆయన మంగళవారం రోడ్లు, భవనాల శాఖ అతిథి గృహంలో నిర్వాహకులు కురుబ నారాయణ స్వామి, గోనుగుంట్ల భూషణం, రెడ్డిపల్లి నాయుడుతో కలిసి విలేకరులతో మాట్లాడారు. ఉత్సవానికి 15 వేలమంది భక్తులు వస్తారని అంచనా వేయగా, 35 వేలమంది హాజరయ్యారన్నారు. ఎక్కడా ఎలాంటి ఇబ్బందులు ఎదురుకాకుండా సౌకర్యాలు కల్పించామన్నారు. 15 వేలమంది భక్తులకు పూజా కిట్లు అందజేశామన్నారు. భక్తులు పూజల్లో క్రమశిక్షణ చూపారని, జిల్లా యంత్రాంగం చక్కగా సహకరించిందన్నారు. రాష్ట్రంలోనే ఇలాంటి కార్యక్రమం జరగలేదని, ఇక్కడ జరగడం తన పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నట్లు తెలిపారు.

మాట్లాడుతున్న నిర్వాహకులు లక్ష్మీప్రసాద్, నారాయణస్వామి, భూషణం

నాయీబ్రాహ్మణుల సమస్యలు పరిష్కరించండి

శింగనమల: రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడిని రాష్ట్ర నాయీబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ ఎమ్ ఆదినారయణ కలిశారు. నాయీబ్రాహ్మణ వర్గంలో విద్య, ఉద్యోగాలు, ఆర్థికంగా వెనుకబడి ఉన్నారని తెలిపారు. సరైన అవకాశాలు లేక సంప్రదాయ వృత్తిని వదిలేస్తున్నారన్నారు. పీ4 ద్వారా ఆర్థికంగా వెనుకబడ్డ వారిని పైకి తీసుకురావాలని వినతి పత్రం అందజేశారు.

సీఎం చంద్రబాబు నాయుడికి వినతిపత్రం ఇస్తున్న ఆదినారాయణ

యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా

పామిడి, న్యూస్‌టుడే: పెన్నానదిలో ఇసుక దోపిడీకి అంతు లేకుండా పోతోంది. అధికారుల కళ్లుగప్పి ఇష్టారాజ్యంగా ఇసుక అక్రమ రవాణా చేస్తున్నారు. పామిడి, వంకరాజుకాలువ గ్రామాల పెన్నా పరివాహక ప్రాంతాల్లో ఉదయం, సాయంత్రం వేళల్లో ట్రాక్టర్లు ఇసుకను జోరుగా తరలిస్తున్నాయి. అధికారుల నిర్లక్ష్యం అక్రమార్కులకు వరంగా మారింది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాలని ప్రజలు కోరుతున్నారు.

ఉచితంగా తుంపర పరికరాల పంపిణీ

రైతులకు తుంపర పరికరాలు అందజేస్తున్న టింబక్టు కలెక్టివ్ సంస్థ ప్రతినిధులు

రామగిరి, న్యూస్‌టుడే : మండలంలోని పలువురు రైతులకు టింబక్టు కలెక్టివ్ సంస్థ చెలిమి కార్యక్రమంలో భాగంగా ఉచితంగా తుంపర సేద్యం పరికరాలు అందజేశారు. మంగళవారం రామగిరిలోని మహిళా శక్తి సొసైటీ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో టింబక్టు సంస్థ ప్రతినిధులు మాట్లాడారు. రైతులు సేంద్రియ వ్యవసాయం వైపు దృష్టి సారించాలన్నారు. దీనివల్ల అధిక దిగుబడులు సాధించడమే కాకుండా, పెట్టుబడి వ్యయం బాగా తగ్గుతుందన్నారు. అనంతరం పోలేపల్లి, దుబ్బార్లపల్లి గ్రామాలకు చెందిన పదహారు మంది రైతులకు ఒక్కో సెట్ తుంపర పరికరాలు అందజేశారు. కార్యక్రమంలో టింబక్టు సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సుకన్య, ప్రతినిధులు పాల్గొన్నారు.

దిమ్మె శిథిలం.. పొంచి ఉన్న ప్రమాదం

శ్రీనగర్‌కాలనీలోని పుట్టపార్కు ముందు భాగంలో రాతితో కట్టిన దిమ్మెపై విద్యుత్తు నియంత్రిక అమర్చారు. అది దుస్థితికి చేరుకోవడంతో నెర్రెలిచ్చింది. పార్కుకు వచ్చే సందర్శకులు ప్రహరీ లేకపోవడంతో తమ ద్విచక్ర వాహనాలను ఆ దిమ్మె వద్దే ఉంచుతున్నారు. మరోవైపు నియంత్రిక తీగలు కిందకు వేలాడుతున్నాయి. విద్యుత్తు షార్ట్‌సర్క్యూట్ అయి మంటలు అంటుకునే ప్రమాదం పొంచి ఉంది. విద్యుత్తు శాఖ అధికారులు స్పందించి కొత్త దిమ్మెను నిర్మించి, నియంత్రిక తీగలు ఎత్తుగా ఉండేలా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

-న్యూస్‌టుడే, రాంనగర్(అనంతపురం)

అరటి తోట దగ్ధం

కనగానపల్లి, న్యూస్‌టుడే: అరటి తోట అగ్నికి ఆహుతైన ఘటన కనగానపల్లి మండల కేంద్రంలో సోమవారం రాత్రి జరిగింది. కనగానపల్లికి చెందిన రైతు శివయ్య ఏడాది కిందట ఐదు ఎకరాల పొలాన్ని కౌలుకు తీసుకొని అరటి పంట సాగు చేశాడు. గుర్తు తెలియని వ్యక్తులు ఎండు గడ్డికి నిప్పు పెట్టడంతో పంటకు మంటలు వ్యాపించాయి. రైతు అప్రమత్తమై అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇచ్చారు. అగ్నిమాపక సిబ్బంది అక్కడకు చేరుకొని మంటలను అదుపు చేసిన రెండు ఎకరాల్లో ఉన్న పంట పూర్తిగా కాలిపోయింది. బిందు సేద్యపు పరికరాలు కాలిపోవడంతో రూ.6 లక్షల వరకు పంట నష్టం వాటిల్లినట్లు బాధిత రైతు వాపోయాడు.

కాలిపోయిన అరటి తోట

చిరుత సంచారంపై ఆరా

కూడేరు(ఉరవకొండ), న్యూస్‌టుడే: కూడేరు మండలం ముద్దలాపురం, కడదరకుంట గ్రామ పరిసరాల్లో చిరుత సంచారం వదంతులతో స్థానికులు కొన్నాళ్లుగా భయాందోళనకు గురవుతున్నారు. మంగళవారం అటవీ సెక్షన్ అధికారి అక్బర్‌తోపాటు సిబ్బంది చిరుత ఆనవాళ్లను గుర్తించే ప్రయత్నం చేశారు. చిరుత సంచారం కట్టడి చేసే అవకాశాలు పరిశీలిస్తున్నట్లు వారు పేర్కొన్నారు.

స్వచ్ఛ సర్వేక్షన్ ఉత్తమ ర్యాంకే ధ్యేయం

అనంత నగరపాలక, న్యూస్‌టుడే: నగరానికి స్వచ్ఛ సర్వేక్షణ్ ఉత్తమ ర్యాంకు సాధించేందుకు శానిటేషన్ విభాగంలోని అన్ని స్థాయిల్లోని అధికారులు కృషి చేయాలని కమిషనరు జశ్వంత్‌రావు సూచించారు. ఆయన మంగళవారం నగరపాలక కార్యాలయంలో స్వచ్ఛ సర్వేక్షణ్‌పై సిబ్బందితో సమావేశమై అవగాహన కల్పించారు. గతేడాది అనంతపురం రాష్ట్ర స్థాయిలో 84, జాతీయ స్థాయిలో 750 ర్యాంకులో నిలిచిందన్నారు. నగరంలో స్వచ్ఛతకు సిబ్బంది గట్టిగా పనిచేస్తే మంచి ర్యాంకు వస్తుందన్నారు. పారిశుద్ధ్యం, మురుగు కాలువలు, మరుగుదొడ్ల నిర్వహణ, రోడ్లు, గోడలు శుభ్రంగా ఉంచాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి ప్రజారోగ్య అధికారి నరసింహా, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ కోఆర్డినేటర్ వెంకటేశ్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కమిషనరు జశ్వంత్‌రావు

స్వర్ణ వార్డు ఉద్యోగుల వినతి: స్వర్ణ వార్డు ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం (ఏపీజీఈఏ) నాయకులు నగరపాలక కమిషనరు జశ్వంత్‌రావును కలిసి విన్నవించారు. సరెండరు లీవులు ఇవ్వాలన్నారు. ఉద్యోగుల సీనియార్టీ జాబితా ఖరారు చేయాలన్నారు. కార్యాలయాల్లో ఉద్యోగులకు అవసరమైన కనీస సౌకర్యాలు కల్పించాలన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు గోపీకృష్ణ, కార్యదర్శి రామునాయక్, రాష్ట్ర కార్యదర్శి హనుమంతు, నాయకులు వరప్రసాద్, తిమ్మరాజు, భగీరథరెడ్డి పాల్గొన్నారు.

కంకర వేసి.. రాకపోకలు ఆపేసి

మురుగు కాలువలో కంకరను తొలగిస్తున్న సిబ్బంది

అనంత నగరపాలక (అశోక్‌నగర్): నగరంలో ఓ ప్రాంతంలో ఇల్లు నిర్మిస్తుంటే, ఆ మార్గంలో రాకపోకలకు అవస్థలు ఎదుర్కోవాల్సిన పరిస్థితి తలెత్తుతోంది. ఇష్టారాజ్యంగా ఇళ్ల నిర్మాణం చేపడుతున్నా, నగర పాలక పట్టణ ప్రణాళిక విభాగం అనుమతులిచ్చేశాం, మాకేం సంబంధమన్న రీతిలో వ్యవహరిస్తుండడమే దీనికి కారణం. ఇళ్ల నిర్మాణ సమయంలో ఇతరులకు ఇబ్బంది కలిగించరాదన్న కనీస ప్రాథమిక సూత్రాన్ని పాటించడం లేదు. దీనివల్ల నెలల తరబడి ఆ ప్రాంతవాసులతో పాటు ఆ మార్గంలో వెళ్లేవారికి ఇబ్బందులు తప్పడం లేదు.

రోడ్డుపై మురుగు ప్రవాహం: రాంనగర్‌లో మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్ చౌదరి ఇంటి వెనుకవైపు ప్రధాన రోడ్డులో ఇంటి నిర్మాణం చేపట్టారు. ఇందుకు తెచ్చిన కంకర మురుగు కాలువకు అడ్డుపడింది. ఫలితంగా ప్రైవేటు పాఠశాల ముందు నుంచి సిద్ధార్థ ఉద్యానం వరకు 200 అడుగుల మేర మురుగునీరు రోడ్డుపై ప్రవహించింది. ఉద్యానంలోకి వెళ్లడానికి ఇబ్బందిగా మారడంతో పలువురు వెనుదిరిగారు. ప్రజలు పడుతున్న ఇబ్బందులను న్యూస్‌టుడే నగరపాలక ఇన్‌ఛార్జి ప్రజారోగ్య అధికారి దృష్టికి తేగా, స్పందించిన ఆయన సిబ్బందిని పంపించి కాలువలో పడిన కంకర, బండలను తాత్కాలికంగా తొలగించారు.

● మరోవైపు రాంనగర్‌లోని పలు వీధుల్లో నగరపాలక ఆధ్వర్యంలో మురుగు కాలువల నిర్మాణం చేపట్టారు. మురుగు నీరంతా రోడ్డుపైకి వదిలేయడంతో భరించలేని దుర్వాసన వస్తోంది. క్రిసెంట్ పాఠశాల వెనుక వైపున, చిన్న పార్కు వద్ద క్రమపద్ధతిలో మురుగు నీరు వెళ్లేలా చర్యలు తీసుకోకపోవడంతో రాకపోకలకు ఇబ్బందిగా మారింది.

సమగ్ర కుటుంబ సర్వేకు సహకరించండి

అనంత నగరపాలక, న్యూస్‌టుడే: నగరంలో నిర్వహిస్తున్న సమగ్ర కుటుంబ సర్వేకు నగరవాసులు సహకరించాలని కమిషనరు జశ్వంత్‌రావు విజ్ఞప్తి చేశారు. ఈ సర్వే సంక్షేమ పథకాలు, ప్రభుత్వ కార్యక్రమాల ప్రణాళిక పారదర్శకతకు చేపట్టారన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకొని ఆయా ప్రాంతాల్లోని స్వర్ణ వార్డు కార్యదర్శులు సర్వే కోసం ఇళ్ల వద్దకు వచ్చి వివరాలు అడిగినప్పుడు సహకరించాలని ఆయన కోరారు.

WANTED TEACHERS
SRI GNANA SARASWATHI - A reputed school in Anantapur, is looking for the **Teaching** and **Non Teaching** Personnel. Academic Coordinator, Receptionist cum Computer Operator, Supporting Teachers, Mother Teacher, English (6th to 10th), Physical Sciences (6th to 10th). Walk in on **Feb.18th, 19th** and **20th** between 10 am and 3 pm.
Qua: PG/ B.Ed.,/D.Ed.,
Contact: 9581515050

(c) eenadu

గుర్తించకుండా! స్పర్శ లేకుండా..

■ 10 నెలల్లో 60 మందికి కుష్ఠు

మదనపల్లె వైద్యం, న్యూస్‌టుడే : కుష్ఠు వ్యాధి చాపకింద నీరులా వ్యాపిస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా కుష్ఠు నిర్మూలనకు ప్రభుత్వం స్పర్శ పేరుతో అవగాహనా కార్యక్రమాలతో పాటు పరీక్షలు నిర్వహిస్తున్నారు. దీంతో గత ఏడాది ఏప్రిల్ నుంచి జనవరి వరకు జిల్లాలో 60 కొత్తకేసులు వెలుగు చూడటంతో వైద్యారోగ్యశాఖ అధికారులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే కుష్ఠు నివారణకు అన్ని రకాల చికిత్సలతో పాటు మందులను ప్రభుత్వం ఉచితంగా అందిస్తోంది. ప్రజల్లో సరైన అవగాహన లేకపోవడం, ఎవరికైనా చెబితే అవమానంగా భావించి చాలా మంది మచ్చల గురించి చెప్పకుండా నిర్లక్ష్యం చేయడం వల్ల కుష్ఠువ్యాధి బారిన పడుతున్నారు.

ఏడాదిలో బయట పడిన కేసులు ఇవే

గత ఏడాది ఏప్రిల్ నుంచి జిల్లాలో ఇంటింటి సర్వే చేస్తున్నారు. ఇందులో భాగంగా ఏప్రిల్‌లో 2, మే 8, జూన్ 3, జులై 5, ఆగస్టు 5, సెప్టెంబరు 2, అక్టోబరు 1, నవంబరు 15, డిసెంబరు 17, జనవరిలో 1 కేసు నమోదు అయ్యాయి. మొత్తం 60 కొత్త కేసులు నమోదు కాగా ప్రస్తుతం జిల్లాలో 73 కుష్ఠు మంది బాధితులు చికిత్స పొందుతున్నారు. అలాగే కుష్ఠు కారణంగా 280 మంది వికలత్వం పొంది రూ.6 వేలు పింఛను పొందుతున్నారు.

మదనపల్లెలో అవగాహన కల్పిస్తున్న బొమ్మనచెరువు పీహెచ్‌సీ సిబ్బంది

● కుష్ఠు బయటపడిన వారికి, శస్త్రచికిత్సకు అనువుగా ఉన్న అంగ వైకల్యాలు సరిచేసుకున్న వారికి రూ.12 వేలు పరిహారం ఇస్తారు. ఏడాదికి రెండు సార్లు ఎంసీఆర్ పాదరక్షలు ఉచితంగా అందజేస్తారు. బాధితులు, వారి పిల్లలకు వృత్తి నైపుణ్యాల్లో ఉచిత శిక్షణ, వసతి గృహ సదుపాయం, తీవ్రమైన వ్యాధి రియాక్షన్లు ఉన్నవారికి ప్రత్యేక ఆసుపత్రిలో వైద్యం అందుబాటులో ఉన్నాయి.

మందులన్నీ ఉచితమే

కుష్ఠువ్యాధి బయట పడిన వారికి ప్రభుత్వం నుంచి ఉచితంగా మందులు అందజేస్తున్నాం. మచ్చలున్న వారు ఆరు నెలలు నుంచి 12 నెలల పాటు మందులు వినియోగించడం వల్ల కుష్ఠు నుంచి బయట పడవచ్చు.

- విష్ణువర్ధన్, కుష్ఠువ్యాధి కేసుల నిర్ధారణ జిల్లా అధికారి

కండెక్టర్లకు పవర్ బ్యాంకులు

కండెక్టరుకు పవర్ బ్యాంకు అందజేస్తున్న ఆర్ఎం రాము

పీలేరు, న్యూస్‌టుడే: జిల్లాలోని అన్ని ఆర్టీసీ డిపోల్లో పనిచేస్తున్న కండెక్టర్లకు టిమ్ ఛార్జింగ్ నిమిత్తం 921 పవర్ బ్యాంకులు వచ్చినట్లు ఆర్ఎం రాము మంగళవారం తెలిపారు. పూర్వ అన్నమయ్య జిల్లాలో 837 మంది కండెక్టర్లు పనిచేస్తుండగా డిపోల వారీగా మదనపల్లె-1 195 మంది కండెక్టర్లకు గాను 214, మదనపల్లె-2 125కు 138, పీలేరు 181 మందికి 199, రాజంపేటకు 150కు 165, రాయచోటి 186కు 205 పవర్ బ్యాంకులు వచ్చినట్లు చెప్పారు. కండెక్టర్లు తమ వద్ద టిమ్‌లకు తామే పవర్ బ్యాంకు ద్వారా ఛార్జింగ్ పెట్టుకునే సౌకర్యం వచ్చినట్లయిందని ఆర్ఎం రాము వివరించారు.

వేడుకగా సిద్ధేశ్వరస్వామి రథోత్సవం

కలకడ, న్యూస్‌టుడే: కలకడ శ్రీసిద్ధేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం రథోత్సవం వేడుకగా సాగింది. శ్రీకామాక్షి సమేత సిద్ధేశ్వరస్వామి ఉత్సవమూర్తులను రథంపై ఉంచి పూలతో అందంగా అలంకరించి ఆలయం చుట్టూ ప్రదక్షిణ చేయించారు. భక్తులు కొబ్బరికాయలు కొట్టి, మిరియాలు చల్లి మొక్కులు తీర్చుకున్నారు. ముందుగా ఆలయంలో స్వామికి మహానివేదన సమర్పించి, త్రినేత్రధారణ నిర్వహించారు. మహానివేదన ప్రసాదానికి భక్తులు పోటీ పడ్డారు. తూపల్లెకు చెందిన భక్తులు దేవరెద్దును ఊరేగింపుగా ఆలయానికి తెచ్చి పూజలు చేయించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త రవీంద్రశర్మ, కమిటీ సభ్యులు, సేవకులు, భక్తులు పాల్గొన్నారు.

కళ్లెదుటే మృగాడు!

■ చిన్నారిని కబలించిన కీచకుడు ■ మదనపల్లె పట్టణంలో దుర్ఘటన

ఈ ప్రశ్నకు బదులేది?

ఆడ పిల్లగా పుట్టడం నేను చేసిన తప్పా అమ్మా!

పట్టపగలు బయట తిరగడం నేరమా నాన్నా!

ఆప్యాయంగా మాట్లాడితే నమ్మడం పాపమా అంకుల్!

పసి మొగ్గలను చిదిమేసే రాక్షస లోకమని తెలియలేదు అన్నా!

ఎదురింట్లోని ఓ మృగాడు కన్నేశాడని.. కాటేయడానికి చూస్తున్నాడని ఊహించలేదు బాబాయ్

● ఇలాగైతే నాలాంటి బాలికలు బయట తిరిగేదెలా? మమ్మల్ని కాపాడటానికి అమ్మా, నాన్న నిత్యం వెంట ఉండలేరే సాధ్యమా! కులవర్ధన్ లాంటి దుర్మార్గుల నుంచి మాకు రక్షణ కల్పించేదెవరు? స్వేచ్ఛగా తిరిగేలా భద్రత కల్పించేదెవరు?

● వినతజీవిగా పడి ఉన్న ఏడేళ్ల చిన్నారి వేస్తున్న ప్రశ్నలివి.. వీటికి సమాధానం చెప్పేదెవరు? ఆడపిల్లకు అండగా నిలిచేదెవరు? మదనపల్లె పట్టణానికి చెందిన చిన్నారి సోమవారం అదృశ్యమై మంగళవారం ఉదయం ఎదురింట్లోని యువకుడి గదిలో నీటి డ్రమ్ములో శవంగా తేలింది.

మానవీయ విలువలకే సమాధి కట్టే.. మనుషులమన్న విషయానికే అనుమానమొచ్చే దుర్ఘటన మంగళవారం మదనపల్లె జిల్లా కేంద్రంలో చోటు చేసుకుంది. మృగాడి వాంఛాగ్నిలో ఓ లేత కలువ కాలిపోయింది. నీరుగట్టువారిపల్లెకు చెందిన కులవర్ధన్ ఏడేళ్ల చిన్నారిపై హత్యాచారానికి పాల్పడిన ఉదంతం ఇది..

- న్యూస్‌టుడే, మదనపల్లె నేరవార్తలు, పట్టణం, గ్రామీణ

జాతీయ రహదారిపై స్థానికుల ఆందోళన

● అభం శుభం తెలియని ఏడేళ్ల చిన్నారిని గంజాయి, మద్యానికి బానిసైన ఓ దుర్మార్గుడు లైంగికంగా దాడి చేయడంతో పాటు నీటి డ్రమ్ములో ముంచేసి చంపేశాడు.. మృతదేహాన్ని ఎవరికీ కన్పించకుండా నీటి డ్రమ్ములో ఉంచి మూతపెట్టి నిద్రపోయాడు. బాలిక కోసం గాలింపు చేపట్టిన పోలీసులు అనుమానంతో అతని ఇంటిని పరిశీలించగా మృతదేహం బయటపడింది. నిందితుడు పరారీలో ఉండగా చిన్నారి మృతదేహాన్ని మార్చురీకి తరలించేందుకు యత్నించిన పోలీసులను ఆమె కుటుంబ సభ్యులతో పాటు పెద్ద సంఖ్యలో ప్రజలు అడ్డుకున్నారు. నిందితుడికి ప్రజా కోర్టులో ఉరి శిక్షయినా, లేదంటే తమకు అప్పగించాలని డిమాండ్ చేస్తూ సాయంత్రం వరకు ఆందోళన చేపట్టారు. దీంతో ఉద్రిక్తతకు దారి తీసింది.

● వీరబల్లి మండలంలోని ఓ గ్రామానికి చెందిన కుటుంబం 15 సంవత్సరాల క్రితం మదనపల్లె పట్టణంలోని ఓ వీధిలో అద్దె ఇంటిలో చేరారు. భార్యాభర్తలు వేర్వేరు పనులు చేసుకుంటూ పిల్లలిద్దరిని స్థానికంగా ఉన్న ఓ ప్రైవేటు పాఠశాలలో చదివిస్తున్నారు. సోమవారం పాఠశాలకు సెలవు కావడంతో బాలిక ఇంటి వద్దనే ఉంది. తల్లి తనతో పాటు రావాలని కోరినా చిన్నారి అవ్వా తాతతో కలిసి ఇంట్లోనే ఉంటానని చెప్పడంతో ఆమె విధులకు వెళ్లి పోయింది.

నిందితుడికి ఉరిశిక్ష విధించాలని వాహనాలపైకెక్కిన నిరసనకారులు

కామం కళ్లనే కాదు మెదడును మూసేస్తుంది
వావి వరసలు కన్పించకుండా చేస్తుంది
కోరిక మనిషినే కాదు.. మానవత్వాన్ని చంపేస్తుంది
చిన్నా.. పెద్దా గౌరవాలను తుంచేస్తుంది.
దుర్మార్గపు ఆలోచన మృగాడిగా మారుస్తుంది.
స్త్రీ అయితే చాలు.. పసిపిల్లలు, ముసలోళ్లు అన్న తేడా లేకుండా చేస్తుంది... ఈ దుర్మార్గుడికి మృగాలోచన వచ్చింది..
మెదడును గంజాయి మత్తు కమ్మేసింది..
మానవత్వాన్ని చంపేసింది.. ఏడేళ్ల చిన్నారిపై హత్యాచారానికి పురిగొల్పింది.

కులవర్ధన్

సోమవారం 4:30 చిన్నారి కన్పించకపోవడంతో అవ్వా, తాత వెతికారు. ఆచూకీ దొరక్కపోవడంతో పనికి వెళ్లిన కోడలికి ఫోన్ చేసి చెప్పారు. తల్లి వెంటనే ఇంటికి వచ్చింది. ఇదే విషయాన్ని భర్తకు తెలియజేసింది. స్థానికుల సాయంతో కుటుంబ సభ్యులంతా కలిసి చుట్టుపక్కల గాలించారు.

6:00 చిన్నారి ఆచూకీ దొరక్కపోవడంతో ఒకటో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. 6.15 గంటలకు ఎఫ్ఐఆర్ నమోదు చేసిన పోలీసులు హెడ్‌కానిస్టేబుల్‌తో పాటు మరో ఇద్దరు సిబ్బంది విచారణ ప్రారంభించారు. సీఐ మహమ్మద్ రఫీ సాంకేతిక బృందంతో చుట్టుపక్కల గాలించారు.

అర్ధరాత్రి 1:30 చిన్నారి ఇంటి ముందున్న కులవర్ధన్ (30)పై అనుమానం రావడంతో అతని ఇంటి తలుపు తట్టారు. తీయకపోవడంతో తలుపుపై భాగంలో ఉన్న కిటికీలో నుంచి చరవాణిలో వీడియో తీశారు. కులవర్ధన్ మంచంపై నిద్రిస్తున్నట్లు గుర్తించారు. మద్యం మత్తులో నిద్రపోయి ఉంటాడన్న అనుమానంతో పోలీసులు వెళ్లిపోయారు.

ఉదయం 7:00 మంగళవారం ఉదయం కులవర్ధన్ ఇంటి వద్దకు చేరుకుని అతన్ని నిద్రలేపే యత్నం చేశారు. నిద్రలేచిన కులవర్ధన్ తలుపు తీసి పోలీసులను బయటకు నెట్టి.. వారిపై దాడికి యత్నించాడు. పారిపోయేందుకు చూశాడు.

7:15 కులవర్ధన్ నిద్రిస్తున్న గదిలోనే ఉన్న ప్లాస్టిక్ డ్రమ్ములో శరీరంపై ఎలాంటి దుస్తులు లేని స్థితిలో చిన్నారి మృతదేహాన్ని గుర్తించారు.

7:40 అప్పటికే విషయం పాకిపోవడంతో పెద్ద సంఖ్యలో జనం అక్కడికి చేరుకుని నిందితుడిని తమకు అప్పగించాలని పోలీసులను అడ్డుకున్నారు. చిన్నారి మృతదేహం ఉన్న ఇంట్లోకి వెళ్లకుండా అడ్డుకున్నారు. బాలిక బంధువులు, స్థానికులు నీరుగట్టువారిపల్లెలోని రహదారిపై బైఠాయించి ఆందోళన చేశారు. ముంబయి- చెన్నై జాతీయ రహదారిపై సాయంత్రం 5 గంటల వరకు ఆందోళన చేశారు. అన్నమయ్య జిల్లా ఇన్‌ఛార్జిగా ఉన్న కడప ఎస్పీ నచికేత్ విశ్వనాథ్ మధ్యాహ్నం 2 గంటలకు అక్కడికి చేరుకున్నారు.

సాయంత్రం 6:35 పోలీసులు చిన్నారి మృతదేహం ఉన్న ఇంట్లోకి వెళ్లి అన్ని పరిశీలించిన అనంతరం 6.42కు పోలీసు బందోబస్తు మధ్య శవాన్ని మదనపల్లె ఆసుపత్రికి తరలించారు.

రాత్రి 8:40 డీఐజీ కోయ ప్రవీణ్ మదనపల్లె చేరుకుని రాత్రి 8 గంటలకు చిన్నారి మృతదేహానికి శవపరీక్ష చేయించి రాత్రి 8.40 గంటలకు కుటుంబ సభ్యులకు అప్పగించారు.

కూడళ్లు.. నరకానికి నకళ్లు

పుంగనూరు, న్యూస్‌టుడే:

◗ పుంగనూరు పట్టణ సమీపంలో వెళ్లే ముంబై-చెన్నై జాతీయ రహదారిలో పలు కూడళ్లు ప్రమాదాలకు నిలయాలుగా మారాయి. మదనపల్లె-పలమనేరు మధ్య గల ఈ జాతీయ రహదారి నిత్యం రద్దీగా ఉంటోంది. పట్టణాన్ని ఆనుకుని 10 కిలోమీటర్ల మేర గల రహదారిపై చౌడేపల్లె, బండ్లపల్లె, లక్కుంట, భీమగానిపల్లె, రాగానిపల్లె కూడళ్లు ప్రమాదభరితంగా మారాయి.

◗ మదనపల్లె వైపు నుంచి పలమనేరు వైపు వెళ్లే భీమగానిపల్లె, చదళ్లమిట్ట, అగ్రహారం మిట్ట, కనుమలో గంగమ్మ గుడి వద్ద గల కూడళ్ల వద్ద రోడ్డు దాటాలంటే వాహనదారులు, పాదచారులు హడలెత్తిపోతున్నారు.

◗ జాతీయ రహదారిపై మితిమీరిన వేగంతో వచ్చే వాహనాలను చూసి ఆయా కూడళ్లను దాటేందుకు ప్రయాణికులు జంకుతున్నారు. వాహనదారుల నిర్లక్ష్యం, అవగాహన లోపం, భద్రతా ఏర్పాట్లు లేకపోవడం వంటి కారణాలతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి.

జిల్లాలో గత మూడేళ్లలో జరిగిన ప్రమాదాలు

ఏడాది	ప్రమాదాలు	మృతులు	క్షతగాత్రులు
2023	699	367	910
2024	643	349	814
2025	715	282	1011

ప్రమాదాలకు కారణాలివి

● ఈ మార్గంలో వివిధ గ్రామాల నుంచి పట్టణంలోకి నిత్యం ద్విచక్ర వాహనదారులు, ట్రాక్టర్లు, ఆటోలు నడుస్తుంటాయి. సొంత పనులపై వచ్చేవారు, వ్యవసాయ ఉత్పత్తులను మార్కెట్‌కు తరలించడానికి వస్తుంటారు. ఈ కూడలిలో ఇరువైపులా వాహనాలు వస్తున్నాయా? లేదానని గమనించి రోడ్డు దాటితే ప్రమాదాలు జరగవు. నేరుగా వచ్చే వాహనదారులకు గుర్తు వచ్చే విధంగా హెచ్చరికలు ఏర్పాటు చేయాలి.

ప్రమాదాలకు కేంద్రమైన యూఎన్ఆర్ కూడలి

● రోడ్డు వెడల్పుగా ఉందని అనవసరంగా వాహనాలను రోడ్డు పక్కలో నిలపడంతో కూడా వెనుక వైపు నుంచి వచ్చే వాహనాలు ఢీకొంటున్నాయి. వేగ నియంత్రణకు ఈ జాతీయ రహదారిపై సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాల్సి ఉంది.

నిశీధి వేళ ఎక్కువ

■ రాత్రి వేళల్లో అయితే ఈ మార్గంలో ప్రాణాలు అరచేతిలో పట్టుకుని వెళ్లాల్సిందే. ఏ మాత్రం ఆదమరచినా వాహనాలు ఢీకొట్టడం ఖాయం. క్రాసింగ్‌ల వద్ద పూర్తిస్థాయిలో హెచ్చరిక బోర్డులు, డేంజర్ లైట్లు, రేడియం స్టిక్కర్లు పూర్తి స్థాయిలో లేకపోవడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ఆందోళన చెందుతున్నారు.

■ మదనపల్లె రోడ్డు, పలమనేరు రోడ్డు క్రాస్‌లలో కొంత దూరం డివైడర్లు ఏర్పాటు చేస్తే కొంత వరకు ప్రమాదాలు నివారించవచ్చని స్థానికులు అభిప్రాయ పడుతున్నారు.

ఎక్కడెక్కడంటే..

● పుంగనూరు పరిధిలో పూజగానిపల్లె, సుగాలిమిట్ట, లక్కుంట క్రాస్, యూఎన్ఆర్, కొత్తపల్లె, కనుమలో గంగమ్మ గుడి మలుపులో ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్నాయి.

● మదనపల్లె పరిధిలో వై జంక్షన్, జిసిని కొండ, కొండామర్రి, తట్టివారిపల్లె మలుపుల్లో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ప్రాణ నష్టం, తీవ్రంగా గాయపడడం జరిగింది.

● తంబళ్లపల్లె పరిధిలో ములకలచెరువు జాతీయ రహదారిపై. వేపురికోట, కాండ్లమడుగు మలుపు, చెన్నమర్రిమిట్ట వద్ద తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి.

● పీలేరు పరిధిలో నాలుగు రోడ్ల కూడలి, ఎంజేఆర్ కళాశాల, యర్రగుంటవారిపల్లె, కుంటలచెరువు మలుపు లో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ మూడు నెలల్లోనే ఈ కూడళ్లలో జరిగిన ప్రమాదాల్లో 10 మంది వరకు మృతి చెందారు.

సూక్ష్మ సేద్యం.. స్వయం జలనం!

☛ ఇంటి నుంచే పంటకు నీటి తడులు

☛ చరవాణికి అనుసంధానంతో ప్రయోజనం

చిన్నమండెం, న్యూస్‌టుడే: బిందు సేద్యంలో కూడా నూతన విధానాలు అందుబాటులోకి వస్తున్నాయి. పంట పొలాల్లో డ్రిప్ పరికరాలు ఏర్పాటు చేసుకొన్న రైతులు ఇకపై అక్కడికి వెళ్లాల్సిన అవసరం ఉండదు. వారి చరవాణి నుంచే నీటి తడులు అందించే నూతన సాంకేతికను అందుబాటులోకి తెచ్చారు. ప్రస్తుతం ఉన్న డ్రిప్ పరికరాలతో పాటు కొత్తగా మంజూరు చేసే సూక్ష్మ సేద్యానికి ఈ కొత్త విధానం అమలు చేయనున్నారు. రైతుల ఆమోదం మేరకు రాయితీపై ఆటోమేషన్ పరికరాన్ని ఏర్పాటు చేస్తారు. మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్టు ద్వారా సన్న, చిన్నకారు రైతులకు 55 శాతం, ఇతర రైతులకు 45 శాతం రాయితీపై ఇచ్చేందుకు శ్రీకారం చుట్టింది.

ఆధునిక సాంకేతిక విధానం

ఆటోమేషన్ పద్ధతి ఆధునిక సాంకేతిక వ్యవస్థ. రైతులు చరవాణిల్లో యాప్ ద్వారా వారి పొలాన్ని ఎక్కడి నుంచైనా నియంత్రించవచ్చు. స్మార్ట్ కంట్రోల్, సెన్సార్లు, వాల్వు కంట్రోల్ యూనిట్లు, మొబైల్ యాప్.. అన్నీ కలిసి ఆటోమేటెడ్ వ్యవస్థగా పనిచేస్తాయి. రైతు యాప్‌లో మోటరు ఆఫ్, ఆన్ చేయవచ్చు. ఏ వాల్యూం ఎపుడు తెరవాలి అనేది కూడా షెడ్యూల్ చేయవచ్చు. ఎంత సేపు నీరు వదలాలో అనేది ఏర్పాటు చేసుకోవచ్చు.

ఇవీ ప్రయోజనాలు

నీటి ఆదా, ఖర్చు తగ్గింపు, దిగుబడి పెరుగుదల, కూలీల మీద ఆధారపడాల్సిన పని ఉండదు. ఇంట్లో నుంచే నియంత్రించే సులభమైన యాప్‌ను సిద్ధం చేశారు. ఆటోమేషన్ ద్వారా మొక్కకు అవసరమైన నీరే అందుతుంది. వ్యవసాయాన్ని ఆధునిక సాంకేతిక ద్వారా లాభసాటిగా మార్చడమే ఈ పథక ఉద్దేశం.

క్షేత్రస్థాయిలో బిందు పరికరాలను పరిశీలిస్తున్న పీడీ లక్ష్మీప్రసన్న

రైతులు దరఖాస్తు చేసుకోవాలి

ఈ పథకానికి డ్రిప్ లాగానే ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. ప్రాజెక్టు వ్యయం రూ.40 వేలు. సన్న, చిన్న కారు రైతులకు 55 శాతం గరిష్ఠంగా రూ.22 వేల వరకు, ఇతర రైతులకు 45 శాతం రాయితీ గరిష్ఠంగా రూ.18 వేల రాయితీ ఉంటుంది. భూమికి సంబంధించిన పత్రాలు, ఆధార్, బ్యాంకు ఖాతా పుస్తకాలతో వెళ్లి దరఖాస్తు చేసుకోవాలి. పూర్తి వివరాలకు ఏపీఎంఐపీ అధికారులను సంప్రదించవచ్చు. **- లక్ష్మీప్రసన్న, ఏపీఎంఐపీ పీడీ**

మాఫియా దందా.. ఆగేదుందా!

☛ సిగరెట్లు.. గుట్కాలు బ్లాక్ ☛ జనవరి నుంచే అక్రమాలకు తెర

విషయం: గుట్కా, సిగరెట్లు బ్లాక్ చేసి అధిక ధరలకు విక్రయం

ఏం చేయాలి: బడ్జెట్‌కు రెండు నెలల ముందే మాఫియా సరకు బ్లాక్ చేసి కృత్రిమ ధరలు సృష్టించి అధిక ధరలకు విక్రయిస్తారు. ఇలాంటి సమయంలోనే వాణిజ్య పన్నులు, విజిలెన్స్ అధికారులు ఆకస్మిక దాడులు చేసి గోదాముల్లో సరకును వెలుగులోకి తీసుకురావాలి.

ఏం చేస్తున్నారు: బడ్జెట్‌కు ముందు, తర్వాత అధిక ధరలకు విక్రయిస్తున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. బహిరంగ విపణిలో కళ్లెదుటే అక్రమాలు కోకొల్లలుగా కన్పిస్తున్నా, జనం విమర్శిస్తున్నా చెవికెక్కించుకోవడం లేదు.

కారణం: గుట్కా మాఫియా నుంచి పోలీసులు మొదలుకుని అన్ని శాఖల అధికారులకు మామూళ్లు ముడుతుండడంతోనే పట్టించుకోవడం లేదన్న విమర్శలున్నాయి. వారి ప్రవర్తనా తీరే అందుకు బలం చేకూరుస్తోంది.

● జిల్లాలో పొగాకు మాఫియాకు కళ్లెం వేసే వారే కరవయ్యారు.. రూ.కోట్లు దోపిడీ సాగిస్తున్నా కళ్లకు గంతలు కట్టుకున్నారు.. మాఫియా ఇచ్చే మామూళ్లకు అలవాటు పడిన అధికారులు యథేచ్ఛగా ధరల బాదుడు కొనసాగుతున్నా అటు వైపు కన్నెత్తి చూడడం లేదు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ఈ దోపిడీ ఏకంగా కోట్లలో సాగుతున్నా నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. గుట్కా, సిగరెట్లు, పాన్ మసాలాల విక్రయాల్లో సాగుతున్న దందా ఇది.

- న్యూస్‌టుడే, మదనపల్లె నేరవార్తలు

■ కేంద్ర బడ్జెట్‌లో గుట్కా, పాన్ మసాలా, సిగరెట్లు, ఇతర పొగాకు ఉత్పత్తులపై ఈసారి భారీగా ధరలు పెంచుతారన్న ఊహాగానాలు ఊపందుకున్నాయి. డిసెంబరు నుంచే వీటిని బ్లాక్ చేయడంపై మాఫియా దృష్టి సారించి కృత్రిమ కొరత సృష్టించారు. జనవరి నాటికి 35 శాతం నుంచి 40 శాతానికి చేరింది. నేటికీ ఈ ధరల బాదుడు నేటికీ కొనసాగుతూనే ఉంది.

■ బహిరంగ విపణిలో రూ.170 ఉన్న సిగరెట్ ప్యాకెట్‌ను రూ.220 నుంచి రూ.240 వరకు విక్రయిస్తున్నారు. రిటైల్ ధర రూ.25గా నిర్ణయించారు. వాస్తవంగా ఎమ్మార్పీ ధరకంటే రూ.10 తక్కువకే డీలర్లు వ్యాపారులు అమ్మాల్సి ఉండగా వారే అత్యధిక ధరలకు విక్రయిస్తున్నారు.

జిల్లాలో అమ్మకాలిలా (రూ.కోట్లలో..)

సిగరెట్ల అమ్మకాలు	80
గుట్కాలు	40
నెలకు విక్రయాలు	120
మాఫియా దోపిడీ	40

■ జిల్లాలో ప్రధానంగా సిగరెట్లు, గుట్కాలు సరఫరా చేసే డీలర్ల వద్ద భారీగా నిల్వలు ఉన్నాయి. పాత సరకును బ్లాక్ చేసి అత్యధిక ధరలకు అమ్ముతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. మదనపల్లె, రాయచోటి, పీలేరు, పుంగనూరుల్లో రూ.కోట్ల సరకును దాచి ఉంచినట్లు సమాచారం.

సర్వదర్శనానికి 8 గంటలు

తిరుమల: శ్రీవారి సర్వదర్శనానికి 8 గంటల్లో, రూ.300 ఎస్ఈడీ టికెట్లు కలిగిన భక్తులకు మూడు గంటల సమయం పడుతోంది. సోమవారం శ్రీవారిని 73,776 మంది భక్తులు దర్శించుకున్నారు. రూ.4.42 కోట్లు హుండీ కానుకలు లభించాయి.

ఇంటర్మీడియట్ పరీక్షలకు పక్కా ఏర్పాట్లు

మదనపల్లె గ్రామీణ, న్యూస్‌టుడే: ఈ నెల 24 నుంచి ప్రారంభం కానున్న ఇంటర్మీడియట్ పరీక్షలకు పక్కా ఏర్పాట్లు చేయాలని అధికారులను డీఆర్వో మధుసూదన్‌రావు ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో అధికారులతో సమీక్షించారు. డీఆర్వో మాట్లాడుతూ.. ఉదయం 9 నుంచి 12 వరకు పరీక్షలు జరుగుతాయన్నారు. మొదటి సంవత్సరం: 14,607 మంది, ద్వితీయ సంవత్సరం: 13,328 మందితో పాటు బ్యాక్‌లాగ్ పరీక్షలకు 615 మంది హాజరుకానున్నట్లు చెప్పారు. మొత్తం 50 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశామని, ఉదయం 8 గంటలకు విద్యార్థులు చేరుకోవాలన్నారు. అన్ని కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఉన్నాయన్నారు. సమస్యలు ఏవైనా ఉంటే కంట్రోల్ రూమ్ నంబరు 98661 12750కు సమాచారం ఇవ్వాలన్నారు. విద్యార్థులకు వీలుగా అదనపు ఆర్టీసీ సర్వీసులు నడపాలని, విద్యుత్తు అంతరాయం లేకుండా చూడాలని అధికారులను ఆదేశించామన్నారు. కార్యక్రమంలో ప్రాంతీయ పర్యవేక్షణాధికారి రవి, డీఈవో సుబ్రహ్మణ్యం, పలు శాఖల అధికారులు ఉత్తన్న, శ్రావణి, రమేశ్‌బాబు, ఎంవీఆర్ రెడ్డి, రామాజనేయులు, నీలిమ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న డీఆర్వో మధుసూదన్‌రావు, పక్కన అధికారులు

నులి పురుగు నివారణ మాత్రలు వేస్తున్న డీఎంహెచ్‌వో లక్ష్మీనరసయ్య

బాలల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి

మదనపల్లె విద్య, న్యూస్‌టుడే : బాలల ఆరోగ్యంపై తల్లిదండ్రులు ప్రత్యేక దృష్టి పెట్టాలని డీఎంహెచ్‌వో డాక్టర్ లక్ష్మీనరసయ్య, రాష్ట్ర పరిశీలకుడు డాక్టర్ హేమంత్ అన్నారు. మంగళవారం జాతీయ నులి పురుగుల నిర్మూలన దినం సందర్భంగా రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని నెహ్రూ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అల్బెండజోల్ 400 మి.గ్రా మాత్రలు వేసే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జిల్లాలో 1 నుంచి 19 సంవత్సరాలలోపు పిల్లలు 3,96,796 మంది ఉండగా 3,93,799 మంది విద్యార్థులకు మాత్రలు ఇవ్వడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఆర్‌బీఎస్‌కే జిల్లా సమన్వయ అధికారి డాక్టర్ శివప్రతాప్, న్యాక్లిస్ మెడికల్ అధికారి విష్ణువర్ధన్‌రెడ్డి, డీపీఎంవో డాక్టర్ రమేష్‌బాబు, డిప్యూటీ హెచ్ఈవో మహమ్మద్‌రఫీ, హెచ్ఎం వేణుగోపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

(c) eenadu

మార్పు రాకపోతే మార్చేస్తాం

ఎమ్మెల్యేలను హెచ్చరించిన ముఖ్యమంత్రి

ఈనాడు, అన్నమయ్య: జిల్లాలోని కొన్ని నియోజకవర్గాల్లో పరిస్థితులు బాగాలేవని, వెంటనే మార్పు రాకపోతే మిమ్మల్ని మార్చేస్తానని ఎమ్మెల్యేలను, తెదేపా నేతలను ముఖ్యమంత్రి చంద్రబాబు కఠినంగా హెచ్చరించారు. మీ సొంత బలం మీద గెలవలేదని, పార్టీ కారణంగా ఎమ్మెల్యేలు అయ్యారని మర్చిపోతే ఎలా అని నిలదీశారు. మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, ఎమ్మెల్యేలు నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి, షాజహాన్ బాషా, పుంగనూరు నియోజకవర్గ నేత చల్లా రామచంద్రారెడ్డితో ఉండవల్లిలో మంగళవారం సమావేశమయ్యారు. బలహీనంగా నియోజకవర్గాల్లోనూ పార్టీకి నష్టం తెస్తున్నారని, బలాలేవి సహించనని హెచ్చరించారు. వైకాపాపై పోరాడకుండా పార్టీ నేతల్ని, కార్యకర్తల్ని అణచివేస్తున్న పరిస్థితులను గమనిస్తున్నట్లు చెప్పారు. 2029 ఎన్నికల వరకు వేచి చూసేది లేదని, ఇటీవలి ప్రత్యామ్నాయం చూసుకుంటామన్నారు. తర్వాత వేర్వేరుగా ముఖాముఖి మాట్లాడి ప్రగతి నివేదిక, లోటుపాట్లను సీల్డ్ కవర్‌లో అందజేశారు. పరిస్థితులను చక్కదిద్దుకోవాలని సూటిగా చెప్పారు. జిల్లా పరిస్థితులపై నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి ప్రత్యేకంగా ముఖ్యమంత్రికి వివరించారు. తంబళ్లపల్లె పార్టీ ఇన్‌ఛార్జి విషయంలో త్వరగా నిర్ణయం తీసుకోవాలని విన్నవించారు. అంతకుముందు ముఖ్యమంత్రితో జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి, కలెక్టర్ నిశాంత్‌కుమార్, ఎస్పీ ధీరజ్ కునుబిల్లి సమావేశమయ్యారు.

అభివృద్ధి పనులకు నిధులు.. రాయచోటి బైపాస్ రోడ్డుకు 5.01 ఎకరాల భూసేకరణకు రూ.9.99 కోట్లు, పట్టణ రహదారులు, కాలువలకు రూ.23 కోట్ల మంజూరుకు ముఖ్యమంత్రి ఆమోదముద్ర వేశారు. ● వెలిగల్లు కుడికాలువ పునరుద్ధరణకు రూ.36.50 కోట్లు కేటాయించారు. తంబళ్లపల్లెలో మూడు కిలోమీటర్ల కాలువల నిర్మాణానికి రూ.కోటి, హంద్రీ-నీవా ప్రాజెక్టు నుంచి పీటీఎం, వ్యాసముద్రం చెరువులకు నీటి తరలింపునకు రూ.88 లక్షలు మంజూరు చేశారు. ● అడవిపల్లి రిజర్వాయర్‌కు హంద్రీ-నీవా నీరు తరలించేందుకు రూ.420 కోట్లు కేటాయించనున్నారు. ● కలికిరి ప్రభుత్వ ఆసుపత్రికి రూ.40 కోట్లు కేటాయించారు. మదనపల్లె-నిమ్మనపల్లె రహదారి విస్తరణకు రూ.55 కోట్లు, మదనపల్లె-రామసముద్రం రహదారికి రూ.44 కోట్లు ప్రతిపాదించగా సీఎం ఆమోదించారు. ● పుంగనూరు- పులిచెర్ల- చిన్నగొట్టిగల్లు వరకు 20 కి.మీ రహదారికి రూ.8 కోట్లు కేటాయింపునకు అంగీకారం తెలిపారు. ● పుంగనూరుకు కొత్తగా డిగ్రీ కళాశాల ఏర్పాటు ప్రతిపాదన చేశారు.

తంబళ్లపల్లెకు రాని పిలుపు

ముఖ్యమంత్రి సమావేశానికి తంబళ్లపల్లె నుంచి ఎవరికీ పిలుపు రాలేదు. అక్కడ పార్టీకి ఇన్‌ఛార్జి లేకపోవడంతో పిలవలేదు. త్వరలోనే ఇన్‌ఛార్జి/ త్రిసభ్య కమిటీ నియామకంపై కసరత్తు జరిగింది. త్వరలో పార్టీ నిర్ణయం తీసుకోవాలనే అభిప్రాయానికి వచ్చారు. కొందరి పేర్లు ప్రస్తావనకు వచ్చినా గతంలో మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కుటుంబ సభ్యులతో అంటకాగిన వారికి అవకాశం ఇవ్వరాదనే నిర్ణయానికి వచ్చారు.

బాలికపై హత్యాచారం.. అట్టుడికిన మదనపల్లె

మదనపల్లె నేరవార్తలు, పట్టణం, గ్రామీణం, రాయచోటి, న్యూస్‌టుడే: రెండో తరగతి విద్యార్థినిపై ఓ మృగాడు హత్యాచారం చేయడంతో మదనపల్లె అట్టుడికింది. ఉదయం నుంచి రాత్రి వరకు ప్రజల ఆందోళనతో దద్దరిల్లింది. నిందితుడు కులవర్శన్‌ను కఠినంగా శిక్షించాలని, ఉరి శిక్ష వేయాలని నిరసనకారులు నినాదాలు చేశారు. రోడ్డుపై బైఠాయించి, వాహనాలను అడ్డగించి ఆగ్రహం వ్యక్తం చేశారు.

రోడ్డుపై బైఠాయించి నిరసన తెలుపుతున్న స్థానికులు

ఇది సాధారణ నేరం కాదు: మంత్రి

మదనపల్లెలో చిన్నారిపై జరిగిన అమానుష ఘటన కలిచి వేసిందని రాష్ట్ర రవాణా యువజన క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి అన్నారు. నిందితుడికి కఠినమైన శిక్ష తప్పక పడుతుందన్నారు. రాష్ట్రంలో మహిళలు, బాలికల భద్రతపై ప్రభుత్వం ఎలాంటి రాజీ పడదన్నారు. ఈ కేసులో న్యాయం ఆలస్యం కాదని, బాధితులకు ఉదాహరణగా నిలిచేలా చేస్తామన్నారు.

ఎన్‌కౌంటర్ చేయండి..

నిందితుడు కులవర్శన్‌ను చట్ట పరిధిలో శిక్ష పడేలా చర్యలు తీసుకుంటామని హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత బాలిక తండ్రికి భరోసా ఇచ్చారు. అన్నమయ్య కూడలిలో జాతీయ రహదారిపై ధర్నా చేస్తున్న సమయంలో తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షుడు శ్రీరామ్‌చినబాబు చరవాణికి ఫోన్ చేసి మాట్లాడారు. ఈ ఘటన దురదృష్టకరమన్నారు. మంత్రి నారా లోకేశ్ సైతం స్పందించారని, ప్రభుత్వపరంగా అన్ని విధాల చర్యలు తీసుకోవాలని సూచించారన్నారు. నిందితుడ్ని వదలకుండా ఎన్‌కౌంటర్ చేయాలని చిన్నారి తండ్రి మంత్రిని విన్నవించారు.

గతంలోనే పలు కేసులు..

డీఐజీ కోయప్రవీణ్ మంగళవారం రాత్రి మదనపల్లె చేరుకున్నారు. ప్రభుత్వాసుపత్రి వద్ద చిన్నారి మృతదేహానికి శవపరీక్షల అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. డీఐజీ మాట్లాడుతూ.. నిందితుడికి కఠిన శిక్ష పడేలా చూస్తామన్నారు. నిందితుడిపై 2025లో ఒకటో పట్టణ స్టేషన్‌లో దాడి కేసు నమోదైనట్లు, లోక్‌అదాలత్‌లో పరిష్కరించుకున్నారు. కొందరు మహిళలతో అసభ్యంగా ప్రవర్తిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. హత్య జరిగిన ఇంటిని క్లూస్ టీం బృందంతో పూర్తి స్థాయిలో తనిఖీ చేస్తామన్నారు. నిందితుడి తల్లి పాత్రపై విచారణ చేపడతామన్నారు. బుధవారం ఉదయం నుంచి పూర్తిస్థాయి విచారణ ప్రారంభిస్తామన్నారు.

ఉరి శిక్ష పడేలా చూస్తా: ఎమ్మెల్యే

చిన్నారి హత్యకేసులో నిందితుడు కులవర్శన్‌కు ఉరిశిక్షపడేలా చూస్తానని, అప్పుడే న్యాయం జరుగుతుందని ఎమ్మెల్యే షాజహాన్ బాషా పేర్కొన్నారు. ఆమె తల్లిదండ్రులతో మాట్లాడి సంతాపం తెలిపారు. ఘటన విషయం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, హోం మంత్రి అనిత దృష్టికి తీసుకెళ్లానన్నారు. ● బాధిత కుటుంబానికి న్యాయం చేస్తామని తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షుడు శ్రీరామ్‌చినబాబు తెలిపారు. చిన్నారి తల్లిదండ్రులను విజయవాడ తీసుకురావాలని మంత్రి లోకేశ్ చెప్పారన్నారు.

అందరూ ఏకమై..

చిన్నారి కుటుంబానికి న్యాయం చేయాలని అన్ని రాజకీయ పార్టీల నాయకులు కలిసి ఆందోళన చేపట్టారు. తెదేపా, సీపీఐ, బీఎస్పీ, వైకాపా నాయకులు బాలిక తల్లిదండ్రులతో మాట్లాడి ఓదార్చారు. నిందితుడికి కఠిన శిక్ష పడేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలన్నారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరగకుండా చూడాలన్నారు. మదనపల్లె ప్రాంతంలో విచ్చలవిడిగా గంజాయి, బెల్టుషాపులు ఉన్నాయని, అరికట్టాల్సిన అవసరం ఉందన్నారు.

శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్

SHRIRAM Finance

రిజిస్టర్డ్ ఆఫీస్: శ్రీ టవర్స్, ప్లాట్ నెం.14ఎ, సౌత్ ఫేజ్, ఇండస్ట్రియల్ ఎస్టేట్, గిండి, చెన్నై- 600032, వెబ్‌సైట్: www.shriramfinance.in. బ్రాంచ్ కార్యాలయము : డి.నెం.1-747, 2వ అంతస్తు, తిరుపతి- మదనపల్లిరోడ్డు, పీలేరు, అన్నమయ్య జిల్లా - 517214

లాంఛనంగా స్వాధీనతా ప్రకటన

శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ (గతంలో శ్రీరామ్ సిటీ యూనియన్ ఫైనాన్స్ లిమిటెడ్‌గా ఉండి శ్రీరామ్ ట్రాన్స్‌పోర్టు ఫైనాన్స్ లిమిటెడ్‌తో విలీనమైన తరువాత ఎన్‌సిఎల్‌టి బెంచ్-2 చెన్నై తేది: 09.11.2022 వారి ఆదేశాలతో శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ గా రూపాంతరం చెందిన తర్వాత కార్పొరేట్ ఫైనాన్స్ మంత్రిత్వ శాఖ లేఖ తేది: 30.11.2022 ద్వారా శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్‌గా పేరు మార్పునకు ఆమోదము లభించినది) ఈ కంపెనీ కంపెనీల చట్టం, 2013 క్రింద రిజిష్టరు కాబడినది మరియు ఆర్‌బిఐ నందు కూడా నాన్ బ్యాంకింగ్ ఫైనాన్స్ వ్యాపార కార్యకలాపాలు నిర్వహించుటకు రిజిష్టరు కాబడి వారి **రిజిష్టరు కార్యాలయం: శ్రీ టవర్స్, ప్లాట్ నెం.14ఎ, సౌత్ ఫేజ్, ఇండస్ట్రియల్ ఎస్టేట్, గిండి, చెన్నై-600032**

సెక్యూరిటైజేషన్ మరియు రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002(యాక్ట్ 54 ఆఫ్ 2002) ప్రకారం శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ (**SFL**) యొక్క అధీకృత అధికారి సదరు చట్టంలోని 13(12)కు అనుబంధమైన సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్ మెంట్) రూల్స్ 2002 నందలి రూలు 3 ప్రకారం సంక్రమించిన అధికారములను వినియోగిస్తూ ఋణగ్రహీత ఈ క్రింది తెలిపిన ప్రకారం బకాయి సొమ్ము మొత్తంను చెల్లించ వలసినదిగా క్రింద ఉదహరించినబడిన తేదీన డిమాండ్ నోటీసు జారీ చేయడమైనది.

బకాయి సొమ్ము చెల్లించడంలో ఋణగ్రహీతలు విఫలమైనందున సదరు చట్టంలోని సెక్షన్ 13(4)తో అనుబంధమైన సదరు రూల్స్ నందలి రూలు8 ప్రకారం సంక్రమించిన అధికారములను వినియోగిస్తూ దిగువ పేర్కొన్న ఆస్తిని **ది.13.02.2026** న లాంఛనంగా స్వాధీనం చేసుకోవడమైనదని ఋణగ్రహీతలకు మరియు సాధారణ ప్రజానీకానికి ఇందుమూలముగా తెలియజేడమైనది.

ఋణగ్రహీత పేరు మరియు చిరునామా:

1) **ఎ.గౌస్ బాషా,** తండ్రి ఎ.బాషా, డి.నెం.2/1559, రాజారెడ్డినగర్, పీలేరు, చిత్తూరు జిల్లా - 517214

2) **జి.వెంకటకుమార్,** తండ్రి జి.వి.క్రిష్ణమూర్తి, డి.నెం.2-1247/5, పద్మావతి నగర్, పీలేరు, చిత్తూరు జిల్లా - 517214

డిమాండ్ నోటీసు అమౌంట్: రూ.25,73,419/- (ఇరవై ఐదు లక్షల డెబ్భైమూడు వేల నాలుగు వందల పంతొమ్మిది రూపాయలు మాత్రమే)

అగ్రిమెంటు నెం: **PILERTF1606110001** డిమాండ్ నోటీసు తేది: **15.10.2025**

స్వాధీనం చేసుకున్న తేది: **13.02.2026**

రుణమొత్తం: **రూ.15,00,000/-** (పదహైదు లక్షల రూపాయలుమాత్రమే)

స్థిరాస్తుల వివరములు

చిత్తూరు జిల్లా, పీలేరు సబ్ జిల్లా, పీలేరు మండలం, పీలేరు గ్రామ పంచాయతీ పీలేరు గ్రామలెక్కదాఖలా వేణుమహల్ థియేటర్ దగ్గర, ఎల్‌బిఎస్‌రోడ్డుకు ఉత్తరం వైపు నున్న దిల్షాద్ నగర్ రెసిడెన్షియల్ ఏరియా, కొత్త డి.నెం.2-1559, అసెస్‌మెంట్ నెం.2331, సర్వేనెం.301-బి2డి5 గల స్థలానికి కొలతలు: తూర్పు నుండి పడమర: 43అ. లేదా 13.115మీ. మరియు ఉత్తరం నుండి దక్షిణం: 33అ. లేదా 10.065మీ. వెరశి 157.66 చ.గ. హద్దులు: తూర్పు: రోడ్డు, పడమర: ఎం.బాబు స్థలం, ఉత్తరం: అత్తార్ బాషా స్థలం దక్షిణం: షుకూర్ పిక్చర్ ప్యాలెస్‌కు వెళ్ళురోడ్డు.

సాధారణ ప్రజానీకానికి తెలియజేయునది ఏమనగా (**SFL**) అధీకృత అధికారి పైన పేర్కొబడిన స్థిరాస్తులను ఋణగ్రహీతల నుండి లాంఛనముగా స్వాధీనత తీసుకొనడమైనది. ఈ నోటీసు తర్వాత ఏ వ్యక్తికి విక్రయించుట గాని, ట్రాన్స్‌ఫర్ చేయుట గానీ, లీజు లేదా తనఖా ఆస్తులను దారి మళ్ళించుటకు గానీ **SFL** వారి లిఖితపూర్వక అనుమతి లేకుండా చేయరాదు.

ప్రదేశం: **తిరుపతి**
తేది: **13.02.2026**

సం/- అధీకృత అధికారి,
శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్

నిమిషం ఆలస్యమైనా అనుమతించం

❖ పక్కాగా ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణ ❖ 'ఈనాడు' ఫోన్ ఇన్‌లో డీఐఈవో రవి

మదనపల్లె విద్య, పట్టణం, గ్రామీణ, న్యూస్‌టుడే: ఈనెల 23 నుంచి ప్రారంభం కానున్న ఇంటర్ పరీక్షలకు ఒక్క నిమిషం ఆలస్యమైనా అనుమతి ఉండదని జిల్లా ఇంటర్మీడియట్ అధికారి రవి పేర్కొన్నారు. మంగళవారం 'ఈనాడు' ఆధ్వర్యంలో జరిగిన ఫోన్‌ఇన్‌లో ఇంటర్మీడియట్ విద్యార్థుల అనుమానాలను నివృత్తి చేశారు.

? కేపీపల్లె నుంచి పీలేరుకు బస్సులు తక్కువ. పరీక్ష సమయంలో ప్రత్యేక బస్సు ఏర్పాటు చేస్తే విద్యార్థులకు ఉపయోగంగా ఉంటుంది. - **భవ్యశ్రీ, కేపీపల్లె** ● పరీక్ష సమయంలో ప్రత్యేక బస్సు నడిపేలా ఆర్టీసీ అధికారులతో చర్చిస్తాం. - **డీఐఈవో**

? పీలేరు గురుకులంలో పరీక్ష కేంద్రం కేటాయించారు. ఎలా వెళ్లాలి. - **శివశంకర్, కేపీపల్లె** ● పీలేరు నుంచి చిత్తూరు వెళ్లే మార్గంలో గురుకులం ఉంది. చాలా వాహనాలు అందుబాటులో ఉంటాయి.

? పరీక్షా కేంద్రంలోకి ఎన్ని గంటలకు అనుమతిస్తారు. - **నిఖిల్‌సాయి** ● ఉదయం 8 గంటలకు కేంద్రానికి చేరుకోవాలి. 9 గంటలకు పరీక్ష ప్రారంభం అవుతుంది. ఒక్క నిమిషం ఆలస్యమైనా అనుమతించరు.

సమస్యలు ఫోన్‌లో వింటున్న డీఐఈవో రవి, వివరాలు నమోదు చేస్తున్న ప్రిన్సిపాళ్లు, సిబ్బంది

ఫోన్-ఇన్

? పరీక్ష కేంద్రానికి తాగునీటి సీసాలు, వాచ్‌లు తీసుకెళ్లవచ్చా. - **శ్రుతిశ్రీ, కేపీపల్లె, చందనప్రియ, మదనపల్లె** ● పరీక్ష కేంద్రాల్లో నీటి వసతి ఉంటుంది. సీసాలు తీసుకెళ్లొచ్చు. వాచీలు, ఎలక్ట్రానిక్ పరికరాలు, స్మార్ట్ వాచ్‌లకు అనుమతి లేదు.

? మదనపల్లె పద్మావతి జూనియర్ కళాశాల, సాయి సిద్ధార్థ జూనియర్ కళాశాల ఎక్కడ ఉన్నాయి. - **గిరిధర్, నరేష్, మదనపల్లె** ● ప్రశాంత్‌నగర్ ప్రాంతంలో పద్మావతి కళాశాల, సిద్ధార్థ కళాశాల ఆవరణలో సాయి సిద్ధార్థ జూనియర్ కళాశాల ఉన్నాయి. విద్యార్థులు గుర్తించేలా బయట బ్యానర్లు ఏర్పాటు చేయిస్తాం.

మరికొన్ని సందేహాలు..

● విద్యార్థులకు ముందస్తు మోడల్ పరీక్ష నిర్వహించాలని రాయచోటి నుంచి రవి సూచించారు. ఇప్పటికే కొన్ని చోట్ల నిర్వహించారు, ఇప్పుడు చేస్తున్నారు. ● హాల్‌టికెట్లు ఎక్కడ తీసుకోవాలని మదనపల్లెకు చెందిన హేమలత అడిగారు.. వెబ్‌సైట్ లేదా మనమిత్ర ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవచ్చన్నారు. ● కేంద్రాల సమీపంలో జిరాక్స్ కేంద్రాలు ఏర్పాటు చేయకుండా చూడాలని మదనపల్లెకు చెందిన రమణ అడిగారు. పరీక్ష సమయంలో కేంద్రాలు తెరిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అధికారి చెప్పారు. ● విద్యార్థుల కోసం ఎలాంటి రక్షణ చర్యలు తీసుకుంటున్నారని ఓ విద్యార్థి తండ్రి ప్రశ్నించగా.. 163 (1) బీఎన్ఎస్ (144 సెక్షన్)తో పాటు పోలీసు సిబ్బంది ఉంటారని డీఐఈవో తెలిపారు.

? పరీక్ష కేంద్రాలలో ఇబ్బందులు, ఆరోగ్య సమస్యలు, హాల్‌టికెట్లు, ప్రశ్నపత్రాల్లో సందేహాలుంటే ఎవరిని సంప్రదించాలి. - **కార్తీక్, అరుణ, లోకేశ్, మదనపల్లె** ● వైద్య సిబ్బందిని అందుబాటులో ఉంచాం. ఇతర సమస్యలు ఉంటే టోల్ ఫ్రీ నంబరు 9866 112750ను సంప్రదించాలి. కేంద్రంలో చీఫ్ సూపరింటెండెంట్ వద్ద ఫోన్ అందుబాటులో ఉంటుంది.

నేడు పారిశ్రామిక వినియోగదారుల పరిష్కార వేదిక

తిరుపతి (జీవకోన), న్యూస్‌టుడే: ఏపీఎస్‌పీడీసీఎల్ సర్కిల్ పరిధిలోని తిరుపతి, చిత్తూరు, నెల్లూరు, కడప, కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీసత్యసాయి, అన్నమయ్య జిల్లాలోని పారిశ్రామిక విద్యుత్ వినియోగదారుల సమస్యల సత్వర పరిష్కారానికి బుధవారం పరిష్కార వేదిక నిర్వహిస్తున్నట్లు సంస్థ సీఎండీ శివశంకర్ తెలిపారు. తిరుపతి కార్యాలయంలో ఉదయం 10.30 నుంచి 11.30 గంటల వరకు ఉంటుందన్నారు. నేరుగా లేదా టోల్‌ఫ్రీ నంబర్లు 1912, 18004251555333ను సంప్రదించవచ్చన్నారు.

మార్చిలో పది విద్యార్థులకు హాల్ టికెట్లు

రాయచోటి, న్యూస్‌టుడే: పదో తరగతి పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు మార్చి మొదటి వారంలో హాల్‌టికెట్లు జారీ చేస్తామని డీఈవో కె.సుబ్రహ్మణ్యం తెలిపారు. బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ ఆంధ్రప్రదేశ్ అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంటాయన్నారు. అదనంగా సంబంధిత పాఠశాలల లాగిన్, లీప్‌యాప్, వాట్సప్ గవర్నెన్స్ ద్వారా హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చని సూచించారు.

కోలాటం నడుమ ఊరేగింపుగా వెళ్తున్న భద్రకాళీ సమేత వీరభద్రస్వామి

పులి వాహనంపై వీరభద్రుడి విహారం

రాయచోటి, న్యూస్‌టుడే: బ్రహ్మోత్సవాల్లో భాగంగా రాయచోటిలో వెలసిన శ్రీభద్రకాళీ సమేత వీరభద్రస్వామి ఆలయంలో ఐదో రోజు పులివాహన సేవను నిర్వహించారు. ప్రధాన ఆలయంలోని వీరభద్రుడు, భద్రకాళీదేవి అమ్మవారికి అర్చనలు, అభిషేకాలు చేశారు. ఉదయం భద్రకాళీ సమేతుడై వీరభద్రస్వామి సింహ, రావణబ్రహ్మ వాహనాలపై విహరించారు. ఆలయ కమిటీ ఛైర్మన్ మనోజ్‌కుమార్, ఈవో వెంకటరమణారెడ్డి, కన్నడ భక్తులు పాల్గొన్నారు.

అనంతపురం గంగమ్మ జాతర ప్రారంభం

లక్కిరెడ్డిపల్లె, న్యూస్‌టుడే: మండలంలోని అనంతపురం గంగమ్మ జాతర మంగళవారం ప్రారంభమైంది. భక్తులకు అన్ని వసతులు కల్పించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. సీఐ కృష్ణంరాజునాయక్, ఎస్సై శోభ బందోబస్తు కల్పించారు. జాతరలో నీటి సమస్య ఎదురవకుండా దాతలు నీటి ప్యాకెట్లు, మజ్జిగ సమకూర్చారు. ఆలయ ప్రాంగణం మొత్తం చలువ పందిళ్లు ఏర్పాటు చేసి చుట్టూ విద్యుత్తు దీపాలను అలంకరించారు. రాత్రి ఆలయం ఎదుట సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన క్యూలైన్లు

ఎత్తులు వేశారు.. చిత్తు చేశారు

మదనపల్లె విద్య, న్యూస్‌టుడే: విద్యార్థులు క్రీడా స్ఫూర్తిని పెంచుకుని చెస్ పోటీల్లో రాణించాలని డీఎస్‌డీవో చంద్రశేఖర్ పేర్కొన్నారు. మంగళవారం విజయభారతి పాఠశాలలో శాప్, జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి చెస్ పోటీలు నిర్వహించారు. డీఎస్‌డీవోతో పాటు పాఠశాల ఛైర్మన్ డాక్టర్ ఎన్.సేతు, భాజపా నాయకుడు నరసింహారెడ్డి, ప్రిన్సిపల్ నిశ్చిత, ఎస్‌జీఎఫ్ కార్యదర్శి నాగరాజు, క్రీడాభారతి నరేష్ పోటీలు ప్రారంభించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి పాల్గొన్న క్రీడాకారులు అండర్-13, 15, 17, 19 విభాగాల్లో తలపడ్డారు. అండర్-13లో హేమకేష్, పరమేశ్‌రెడ్డి, అక్షర, మోక్షిత, అండర్-15లో సుశాంత్‌సాయి, స్వర్జన్, సరయు, లాస్యప్రసాద్, అండర్-17లో సంతోష్ విజేతలుగా నిలిచారు. వీరు ఈనెల 21, 22 తేదీల్లో తిరుపతిలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొననున్నారు. పీడీలు నరేష్‌బాబు, బాలాజీ, విజయ్, శారద, అంజనప్ప, సభ్యులు వెంకటరమణ, మణికంఠ, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

చెస్ పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు

నిర్వాహకులతో రాష్ట్ర జట్టుకు ఎంపికైన క్రీడాకారులు

శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్

SHRIRAM Finance

రిజిస్టర్డ్ ఆఫీస్: శ్రీ టవర్స్, ప్లాట్ నెం.14ఎ, సౌత్ ఫేజ్, ఇండస్ట్రియల్ ఎస్టేట్, గిండి, చెన్నై- 600032, వెబ్‌సైట్: www.shriramfinance.in. బ్రాంచ్ కార్యాలయము : డి.నెం.1-747, 2వ అంతస్తు, తిరుపతి టు మదనపల్లి రోడ్డు, పీలేరు, అన్నమయ్య జిల్లా - 517214

స్వాధీనతా ప్రకటన

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్ 2002(3 ఆఫ్ 2002) క్రింద మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002లోని రూల్ 3తో చదువబడే సెక్షన్ 13(2) క్రింద సంక్రమించిన అధికారములను వినియోగించుకుంటూ **మెస్సర్స్ శ్రీరామ్ సిటీ యూనియన్ ఫైనాన్స్ లిమిటెడ్ (మెస్సర్స్ శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ వారితో విలీనమైనది)** యొక్క అధీకృత అధికారియగు దిగువ సంతకందారు **15.10.2025** తేదిన డిమాండ్ నోటీసు జారీ చేసి **ఋణగ్రహీతలు**

1) ఎస్.అబ్దుల్ ఆదం షరీఫ్ తండ్రి ఎస్.నయామతుల్లా షరీఫ్, డి.నెం.5-122/1, కోనేటి వీధి, కందూరు, చిత్తూరుజిల్లా - 517234 (కస్టమర్)

2) ఎస్.అన్వర్ బాషా సాహెబ్ తండ్రి మహబూబ్ వల్లి, డి.నెం.4-67, బజారు వీధి, కందూరు, చిత్తూరు జిల్లా - 517234 (గ్యారంటారు)

వారిని సదరు నోటీసు అందుకున్న తేది నుండి 60 రోజులలో తేది **15.10.2025** నాటికి నోటీసుతో తెలిపిన మొత్తం **రూ. 51,18,304/- (యాభై ఒక్క లక్షల పద్దెనిమిది వేల మూడు వందల నాలుగు రూపాయలు మాత్రమే)లను మరియు తేది:16.10.2025** నాటి నుండి వడ్డీ మరియు ఇతర ఖర్చులను చెల్లించాల్సిందిగా **తేది:13.12.2013** న ఎంటర్‌ప్రైజ్ ఫైనాన్స్ లోన్ అగ్రిమెంట్ నెం. **PILERTF 1312310007** (మెస్సర్స్ శ్రీరామ్ సిటీ యూనియన్ ఫైనాన్స్ లిమిటెడ్ మునుపు విలీనం కాబడిన మెస్సర్స్ శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్) ద్వారా వారు కోరారు.

శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ (గతంలో శ్రీరామ్ సిటీ యూనియన్ ఫైనాన్స్ లిమిటెడ్‌గా ఉండి శ్రీరామ్ ట్రాన్స్‌పోర్టు ఫైనాన్స్ లిమిలెడ్‌తో విలీనమైన తరువాత ఎన్‌సిఎల్‌టి బెంచ్-2 చెన్నై వారు తేది: 09.11.2022న ఇచ్చిన సి.పి.నెం.69-76 ఆఫ్ 2002లోని ఆదేశాల మేరకు శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్‌గా రూపాంతరం చెందిన తర్వాత కార్పొరేట్ ఫైనాన్స్ మంత్రిత్వ శాఖ లేఖ తేది: 30.11.2022 ద్వారా శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్‌గా పేరు మార్పునకు ఆమోదము లభించినది) ఈ కంపెనీ కంపెనీల చట్టం, 2013 క్రింద రిజిష్టరు కాబడినది

ఋణగ్రహీత మరియు గ్యారంటారు బకాయి వున్న మొత్తాన్ని తిరిగి చెల్లించుటలో విఫలమైనందున సదరు రూల్స్‌లోని రూల్ 8తో చదువబడే సదరు చట్టం లోని సెక్షన్ 13(4) క్రింద అతనికి సంక్రమించిన అధికారములను వినియోగించుకుంటూ దిగువ తెలిపిన ఆస్తిని దిగువ సంతకందారు **13.02.2026** వ తేదీన స్వాధీనపరచు కున్నారని ఋణగ్రహీతకు/ గ్యారంటార్‌కు మరియు సాధారణ ప్రజానీకానికి ఇందుమూలముగా తెలియజేయడమైనది.

సదరు ఆస్తితో వ్యవహారము జరుపరాదని మరియు సదరు ఆస్తితో జరిపే ఏ వ్యవహారములైనా తేది:15.10.2025 నాటికి **రూ. 51,18,304/- (యాభై ఒక్క లక్షల పద్దెనిమిది వేల మూడు వందల నాలుగు రూపాయలు మాత్రమే)** లను + **తేది: 16.10.2025 నాటి నుండి** దానిపై వడ్డీ మరియు ఖర్చులు **మెస్సర్స్ శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్** వారి ఎంటర్‌ప్రైజ్ ఫైనాన్స్ ఋణ ఖాతాకు చెల్లించుటకు లోబడి వుంటాయని ముఖ్యంగా ఋణగ్రహీతను/ గ్యారంటార్‌ను మరియు సాధారణ ప్రజలను ఇందుమూలముగా హెచ్చరించడమైనది.

సెక్షన్ 13 సబ్ సెక్షన్ 8 క్రింద ఋణగ్రహీత తమ యొక్క ఆస్తులను తిరిగి పొందేందుకు సమయం కేటాయించడమైనదని గమనించగలరు.

స్థిరాస్తుల వివరములు

చిత్తూరు జిల్లా, కలికిరి సబ్‌జిల్లా, కలికిరి మండలం, కలికిరి గ్రామ పంచాయతీ మరియు గ్రామలెక్కదాఖలా వార్డునెం.8, రాజువారిపల్లి ఏరియా, బడబల్ల వంక పడమర వైపునకు సమీపంలోని సర్కారుమెట్ట సర్వేనెం.835/2 లో ఎ.1.86 సెంట్లలో 2160చ.అ. లేదా 240 చ.గ. ల ఖాళీ స్థలం, హద్దులు: తూర్పు: నర్సరీ వెంకటరమణారెడ్డి స్థలం, పడమర: మూరె ఆదినారాయణరెడ్డి స్థలం, ఉత్తరం: పలిగట్ల గోవర్ధన & ఇతరుల స్థలం, దక్షిణం: 20అ. వెడల్పు గల రోడ్డు. ఈ హద్దుల మధ్య తూర్పు నుండి పడమర: 24అ. లేదా 7.317మీ. మరియు ఉత్తరం నుండి దక్షిణం: 90అ. లేదా 27.439మీ. వెరశి 2160చ.అ. లేదా 240 చ.గ. ఖాళీ స్థలం మాత్రమే. ఎస్.బి.ఐ. వాయల్పాడు వారి వద్ద ఎస్.టి.ఓ వాయల్పాడు వారికి చెందిన వరుసగా చలాన్ నెం. 4325 మరియు 4826 తో డి.ఎస్.డి., రూ.5000/- మరియు ఆర్.ఎఫ్ రూ.1000/- చెల్లించియున్నారు.

ప్రదేశం: **తిరుపతి**
తేది: **13.02.2026**

సం/- అధీకృత అధికారి,
శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్

మంత్రి నారా లోకేశ్ ఆత్మీయ విందు

కుటుంబ సభ్యులతో హాజరైన ఎమ్మెల్యేలు

ఈనాడు, అన్నమయ్య: తెదేపా జాతీయ ప్రధాన కార్యదర్శి, మంత్రి నారా లోకేశ్ ఉండవల్లిలోని తన నివాసంలో రాజంపేట పార్లమెంట్ పరిధిలోని ఎమ్మెల్యేలకు, కుటుంబ సభ్యులకు మంగళవారం రాత్రి ఆత్మీయ విందు ఇచ్చారు. ప్రత్యేక ఆహ్వానం మేరకు తన ఇంటికి వచ్చిన ప్రతి ఒక్కరినీ మంత్రి సాదరంగా ఆహ్వానించారు. ప్రజాప్రతినిధుల కుటుంబ సభ్యులను పరిచయం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేలు గతంలో వివిధ సందర్భాల్లో ఇచ్చిన వినతుల పరిష్కారం ఏ దశలో ఉందో లోకేశ్‌కు వివరించారు. అందరూ ఒకచోట కూర్చుని కొద్దిసేపు సరదా సంభాషణలతో గడిపారు. అనంతరం అందరితో కలిసి విందు ఆరగించారు. ప్రజాప్రతినిధుల కుటుంబ సభ్యులకు మంగళగిరి చేనేత చీరలను లోకేశ్ బహూకరించారు. ఆత్మీయ సమావేశం ముగిసిన తర్వాత అందరినీ గేటు వరకు సాగనంపారు. మంత్రి రాంప్రసాద్‌రెడ్డి, పీలేరు, మదనపల్లె ఎమ్మెల్యేలు నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి, షాజహాన్ బాషా కుటుంబ సభ్యులతో హాజరయ్యారు.

ఎమ్మెల్యేలు, కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న మంత్రి లోకేశ్

రెక్కీ చేసి.. గొంతుకోసి..

వ్యక్తి దారుణ హత్య

గాలివీడు, న్యూస్‌టుడే: ఉదయపు నడకకు వెళ్లిన వ్యక్తిని దుండగులు గొంతు కోసి హతమార్చారు. రెక్కీ వేసి మరీ హత్య చేసినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. ఈ ఘటన గాలివీడు మండలం వడిశలవంకపల్లిలో చోటుచేసుకుంది. గుర్రం కృష్ణారెడ్డి (58) హత్యకు గురయ్యారు. 'రోజూ మసక ఉండగానే వచ్చేవాడమ్మా.. ఈ పొద్దు ఎండబడ్డాక వచ్చాడమ్మా..' అంటూ భర్త శవం వద్ద భార్య రోదించిన తీరు అందరినీ కలచి వేసింది.

గుర్రం కృష్ణారెడ్డి (పాత చిత్రం)

కృష్ణారెడ్డి, లక్ష్మీదేవి దంపతులు గాలివీడులో ఉంటున్నారు. వారి ఇద్దరు కుమారులు. బెంగళూరులో ప్రైవేటు ఉద్యోగాలు చేస్తున్నారు. కృష్ణారెడ్డి రోజూ మామిడితోటకు వచ్చి ఉదయపు నడక సాగించేవారు. మంగళవారం తోటకు వెళ్లగా గుర్తుతెలియని దుండగులు కత్తితో గొంతు కోసి హత్య చేసి పారిపోయారు.

గుర్తించిన కూలీ

మందు పిచికారీ చేసేందుకు తోటకు కూలీ వెళ్లగా.. కృష్ణారెడ్డి రక్తపు మడుగులో పడి ఉండటాన్ని చూశాడు. ఆయన సమాచారంతో లక్కిరెడ్డిపల్లె సీఐ కృష్ణంరాజునాయక్, ఎస్సై నరసింహారెడ్డి, సిబ్బంది ఘటనా స్థలాన్ని పరిశీలించారు. వ్యక్తిగత కక్షలతో హత్య చేశారని అనుమానిస్తున్నారు. దుండగుల ఆచూకీ కోసం జాగిలాలను రప్పించారు.

మృతదేహం వద్ద రోదిస్తున్న భార్య

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడి దుర్మరణం

సంబేపల్లె, న్యూస్‌టుడే: కర్నూలు - చిత్తూరు జాతీయ రహదారిపై గుర్తు తెలియని వాహనం ఢీకొని వృద్ధుడు మృతి చెందిన ఘటన సంబేపల్లె మండలంలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు కలికిరి మండలం పరపట్లకు చెందిన చామంచుల చంద్ర(79) కలకడ మండలంలో జరిగిన సిద్ధేశ్వరస్వామి ఋరి ఉత్సవానికి వెళ్లారు. అనంతరం సంబేపల్లె మండలం పోతువాండ్లపల్లెలోని బంధువుల ఇంటికి నడిచి వస్తున్నారు. ఈ నేపథ్యంలో దేవపట్ల ఎస్టీ కాలనీ సమీపంలో జాతీయ రహదారిపై వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందారు.

అనుమానాస్పద స్థితిలో కార్మికుడి మృతి

మదనపల్లె నేరవార్తలు, న్యూస్‌టుడే: అనుమానాస్పద స్థితిలో చేనేత కార్మికుడు మృతి చెందారు. తంబళ్లపల్లె మండలం మేకలవారిపల్లెకు చెందిన బయారెడ్డి (47) కొంత కాలం క్రితం కుటుంబంతో వచ్చి నీరుగట్టువారిపల్లె సమీపంలో ఉంటున్నారు. చేనేత పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈనెల 16న ఆయన భార్య నారాయణమ్మ, ముగ్గురు పిల్లలు తంబళ్లపల్లె వెళ్లారు. మంగళవారం ఆమె వచ్చి చూసేసరికి బయారెడ్డి ఉరి వేసుకుని ఉన్నారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లారు. అప్పటికే మృతదేహాన్ని కిందకు దింపేయడంపై ప్రశ్నించారు. అనుమానస్పద మృతిగా కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు పోలీసులు చెప్పారు.

పరారీలో ఉన్న జీవిత ఖైదీ అరెస్టు

రాయచోటి, న్యూస్‌టుడే: హత్య కేసులో జీవిత ఖైదీగా ఉంటూ పరారైన నిందితుడిని కర్ణాటక పోలీసులు మంగళవారం అరెస్టు చేసి తీసుకెళ్లారు. మంగళూరుకు చెందిన యు.ఎం.నస్సీర్(40) పదేళ్ల క్రితం పారిపోయి రాయచోటి వచ్చాడు. పట్టణంలోని కొత్తపల్లి ప్రాంతంలో ఉంటున్నాడు. కొంత కాలం తర్వాత దుబాయ్ వెళ్లిన ఆయన ఇటీవల రాయచోటి వచ్చినట్లు తెలుసుకున్న కర్ణాటక పోలీసులు మంగళవారం స్థానిక పోలీసుల సహకారంతో నస్సీర్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఆయనపై మంగళూరులో సుమారు 20 కేసులు ఉన్నట్లు తెలుస్తోంది. పేరు మోసిన క్రిమినల్‌గా నస్సీర్‌కు గుర్తింపు ఉంది.

EENADU e Classifieds

FINANCIAL SERVICES

స్థిరాస్తులపై ఆంధ్రప్రదేశ్ అంతటా మార్టిగేజ్ లోన్స్ మరియు స్థిరాస్తి ఎక్కడ ఉన్నా ఏ సంస్థలో ఉన్నా Xerox పేపర్స్‌పై 2nd మార్టిగేజ్ లోన్ ఇవ్వబడును. 50 లక్షలులోపు, అయోధ్య కోఆపరేటివ్ బ్యాంక్. ✆ 93969 99669.

REAL ESTATE

FLAT FOR SALE

GENERAL

తిరుపతి, గెస్ట్‌లైన్ హోటల్‌కి ఆనుకొని మాస్టర్ ప్లాన్ 80 feet రోడ్డు ప్రక్కన AB AAVAS Phoenix Tower Smart Homesలో 2, 3 BHK Flats సేల్స్‌కు కలవు. RERA Project. 9505502346

PLOT FOR SALE

GENERAL

నేషనల్ హైవేలకు ఆనుకొని తిరుపతిలో ఫైనల్ అప్రూవ్డ్ ప్లాట్స్ అన్ని సదుపాయాలతో తక్కువ ధరకే, డైరెక్ట్ ఓనర్, స్పాట్ రిజిస్ట్రేషన్ ఫోన్ : 99662 62221/ 95027 74175

JOBS

WANTED MALE Process Associates Qual: Degree/ Diploma with Typing Skills of 25 NWPM, Sal: 14K to 18K. Mob: 80967 30137.

Wanted DRA Tele Callers, Field Executives & Team Leaders Banking Sector Attractive Salaries and Incentives, ✆ 98493 94835, 70753 45527.

Wanted Supervisors for Civil and Electrical Works. Contact: 90005 55035.

Wanted Teachers for Reputed Schools in A.P & Telangana, Contact: Sneha Placements Service. Ph: 94402 46409.

Wanted Marketing Executives. Exp: 2 Years, : Degree & MBA, Office Boy : Inter, Tirupathi ✆ 77992 16807.

G Digital షోరూం మదనపల్లి, వాయల్పాడు నందు పనిచేయుటకు Manager/ Sales Staff కావలెను. M/F, A: 19-35, Q: Inter/Degree ✆91821 25692, 97058 26033.

తిరుపతిలోని ప్రముఖ కంపెనీకి బిజినెస్ పర్సన్స్, రిటైర్డ్ పర్సన్స్, వివాహితులు కావలెను. Age: 30 to 65, Qua: Inter- PG పాన్‌కార్డు తప్పనిసరి ✆ 76750 95860.

B/W 5 లైన్ల ప్రకటన రూ. 500/- Colour 5 లైన్ల ప్రకటన రూ. 600/- మాత్రమే
తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య జిల్లాల్లో అన్ని రకాల బిజినెస్ వ్యవహారాలు
వివరాలకు...
80085 13290
మీ చిన్నారులకు పుట్టిన రోజు శుభాకాంక్షలు ఈనాడు ద్వారా తెలపండి
B/W: రూ. 600 Colour: రూ. 800
ప్రకటనలపై 5% GST వర్తించును

త్రినేత్ర హోంకేర్‌లో వృద్ధులను/ పేషెంట్స్‌ను/ పిల్లలను చూసుకొనుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఫ్రీ వసతి, భోజనం. జీ: 18K. ✆ 85209 80099, 85208 74499

ప్రముఖ విద్యాసంస్థకు లేడీ టెలీకాలర్స్, కౌన్సిలర్స్ & ఫీల్డ్ అనుభవం కల్గిన PROలు కావలెను. ఆకర్షణీయమైన జీతం కల్పించబడును. ✆ 90320 30124

మార్కెటింగ్ Reps/Officers (తిరుపతి టౌన్‌లో పనిచేయుటకు) కావలెను. Qly: MBA/B.Com/ B.Sc, గూడ్స్ ఆటో డ్రైవర్-1 అనుభవం, లైసెన్స్, బ్యాడ్జి కలిగి ఉండవలెను. ✆9703402722

తిరుపతి, NGO's కాలనీ, D.No: 6-8-1113లోని కల్పవృక్ష లగ్జరీ హోమ్‌స్టే నందు పనిచేయుటకు రిసెప్షన్ కమ్ సూపర్‌వైజర్, స్వీపర్లు కావలెను. Cont: గాయత్రి హాస్పిటల్స్, వి.వి.మహల్ రోడ్డు, లలిత జ్యూవెలరీ ప్రక్కన, తిరుపతి. ✆ 98497 55595.

హరేకృష్ణ హోంకేర్‌లో వృద్ధులను/ పేషెంట్స్/ పిల్లలను చూసుకొనుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఫ్రీ వసతి, భోజనం జీ: 18-20K ✆ 96404 68899, 96402 58899

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్-లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

రాయచోటి
• రాయచోటి • పీలేరు

ఘనంగా పొలిమేరమ్మ తిరునాళ్ల

పూజలందుకుంటున్న మూలవిరాట్టు

చిన్నమండెం, న్యూస్‌టుడే: మండల పరిధిలోని చాకిబండ గ్రామం రెడ్డివారి పల్లె సమీపంలో వెలసిన పొలిమేరమ్మ తిరునాల సోమవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఏటా మహాశివరాత్రి పర్వదినం మరుసటి రోజు తిరునాల నిర్వహించడం ఆనవాయితీ. ఈ సందర్భంగా అమ్మవారికి ఉదయం నుంచి అభిషేక పూజలు చేశారు. రాత్రికి మొక్కులున్న భక్తులు ఏర్పాటు చేసిన చాందినీ బండి ఆకట్టుకుంది

యాళి వాహన సేవ

యాళి వాహనంపై కామాక్షి సమేత సిద్ధేశ్వరస్వామి

కలకడ, న్యూస్‌టుడే: బ్రహ్మోత్సవాల్లో భాగంగా కలకడ శ్రీసిద్ధేశ్వరస్వామికి సోమవారం రాత్రి రెడ్డిసంఘం ఆధ్వర్యంలో యాళి వాహనసేవ వేడుకగా నిర్వహించారు. స్వామి అమ్మవార్ల ఉత్సవమూర్తులను పూలతో అలంకరించిన యాళివాహన ప్రభపై ఏర్పాటు చేసి, మంగళ వాయిద్యాలు, చెక్కభజనలు, బాణసంచా పేల్చుతూ వీధుల్లో ఊరేగించారు.

చాగలగుట్టపల్లె గంగమ్మకు పూజలు

లక్కిరెడ్డిపల్లె, న్యూస్‌టుడే: అనంతపురంలో జరిగే గంగమ్మ జాతరకు అమ్మవారి పుట్టినిల్లు, మండల పరిధిలోని కుర్నూతల పంచాయతీ చాగలగుట్టపల్లె అమ్మవారిని మంగళవారం బయటకు తీసి పూజలు చేశారు. అర్ధరాత్రిలో డప్పు వాయిద్యాల నడుమ బయల్దేరి బుధవారం ఉదయం 7 గంటలకు అనంతపురం చేరుకుంటుంది. అప్పటి నుంచి నిండు తిరుణాల ప్రారంభమవుతుంది.

పూజలందుకుంటున్న అమ్మవారు

దాతల విరాళం

ఏసీ రిమోట్ అందజేస్తున్న వీరనాగిరెడ్డి

లక్కిరెడ్డిపల్లె, న్యూస్‌టుడే: మండల పరిధిలోని అనంతపురం గ్రామంలో వెలసిన గంగమ్మ ఆలయానికి లక్కిరెడ్డిపల్లెకు చెందిన వీరనాగారెడ్డి మంగళవారం ఆలయ అర్చకులకు ఏసీ పరికరాన్ని వితరణ చేశారు. రాయచోటికి చెందిన నందిని నవోదయ కోచింగ్ సెంటర్ యజమాని రామయ్య ఆలయ అభివృద్ధికి రూ.10116, మానవత స్వచ్ఛంద సంస్థకు తాగునీటి పంపిణీ కోసం రూ.10116 నగదు అందజేశారు. దాతలకు అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికి పూజలు చేయించారు. కార్యక్రమంలో ఈవో శ్రీనివాసులు, ఉత్సవ కమిటీ ఛైర్మన్ వెంకటేశ్వర్లు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

కన్నేస్తాం.. తవ్వేస్తాం..!

ప్రకృతి వనరులు ధ్వంసమవుతున్నా చర్యలు శూన్యం

గండిమడుగు క్షేత్రానికి వెళ్లే దారిలో అక్రమ తవ్వకాలతో మాయమవుతున్న కొండ

గాలివీడు, న్యూస్‌టుడే: అక్రమార్కుల కన్ను పడితే కొండలు, గుట్టలు, వాగులు మాయమవుతున్నాయి. అనుమతులు లేకుండా యథేచ్ఛగా మట్టి, గ్రావెల్ తవ్వకాలు జరుగుతున్నా అధికారులకు పట్టడం లేదు. ప్రకృతి వనరులు ధ్వంసమవుతున్నా మిన్నకుండిపోవడం చర్చనీయాంశంగా మారింది.

గాలివీడు మండలం కదిరి మార్గంలో వెలిగల్లు జలాశయం సమీపంలో గుర్రాల మిట్ట, గండిమడుగు క్షేత్రం కొండలు, తూముకుంట తొల్లకొండను యంత్రాలతో తవ్వేస్తున్నారు. ఎర్రమట్టిని ట్రాక్టర్లతో తరలిస్తూ ఖజానాకు గండి కొడుతున్నారు. అక్రమార్కులు రూ.లక్షలు ఆర్జిస్తున్నారు.

నిబంధనల ఉల్లంఘన

గాలివీడు, గోరాన్‌చెరువు గ్రామాల పరిధిలో లే అవుట్ల కోసం గుట్టలు, కొండల్లో మట్టిని యంత్రాలతో తవ్వేసి ట్రాక్టర్లతో తరలిస్తున్నారు. గతంలో ఇటుకల బట్టీల కోసం చెరువులో మట్టి భారీగా తవ్వేశారు. ట్రాక్టర్ మట్టి రూ.800 నుంచి రూ.వెయ్యి వరకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. బహిరంగంగా దందా జరుగుతున్నా అధికారులు పట్టనట్లు వ్యవహరిస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు.

పర్యావరణానికి విఘాతం

గండిమడుగు క్షేత్రం దారిని ఆనుకుని రాత్రీపగలు తేడా లేకుండా మట్టి తరలిస్తున్నారు. వెలిగల్లు జలాశయానికి సమీపంలోని గుర్రాలమిట్ట గుట్టలో డీకేటీ పట్టాలు మంజూరు చేశారని.. పరిసరాల్లో చెట్లను అడ్డగోలుగా తొలగిస్తూ పర్యావరణానికి తూట్లు పొడుస్తున్నారు.

ఎవరికీ అనుమతులు ఇవ్వలేదు

గ్రావెల్, మట్టి తరలించడానికి ఎవరికీ అనుమతులు ఇవ్వలేదు. ప్రభుత్వ భవనాల పనులకు అనుమతి మేరకు తీసుకెళ్లొచ్చు. అక్రమంగా తరలించే వారిపై చర్యలు తీసుకుంటాం. వాహనాలను సీజ్ చేస్తాం. - భాగ్యలత, తహసీల్దారు, గాలివీడు

నిందితుడిని కఠినంగా శిక్షించాలి

పీలేరులో కొవ్వొత్తుల ప్రదర్శన

రాయచోటి, న్యూస్‌టుడే: మదనపల్లెలో బాలికను హత్య చేసిన హంతకుడిని కఠినంగా శిక్షించాలని రాజంపేట పార్లమెంట్ నియోజకవర్గ తెదేపా అధ్యక్షుడు సుగవాసి ప్రసాద్‌బాబు తెలిపారు. బాధిత కుటుంబాన్ని మంగళవారం రాత్రి ఆయన పరామర్శించారు. కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. **పీలేరు గ్రామీణ:** బాలిక హత్య ఘటనను నిరసిస్తూ పీలేరులో దళిత బహుజన విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు భానుప్రకాశ్, ఎన్‌ఎస్‌యూఐ నాయకులు అమృతతేజ తదితరులు కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
రాయచోటి : 9703622242
పీలేరు : 8008574958
చిన్నమండెం: 9440170752

న్యూస్‌టుడే, రాయచోటి గ్రామీణ: ? ఎస్‌ఎన్‌కాలనీలో నివాసాల మధ్య ఉన్న ఖాళీస్థలాల్లో చెత్త నిల్వలు పేరుకుపోయి దుర్వాసన వస్తోంది. - రవి, స్థానికుడు

✦ వెంటనే సిబ్బందిని పంపి చెత్త నిల్వలు తొలగింపజేస్తాం. - రవి, కమిషనర్

న్యూస్‌టుడే, పీలేరు గ్రామీణ: ? గూడరేవుపల్లె కస్పా ఎస్సీ కాలనీలో కాలువలు పూడిపోయాయి. - స్థానికుడు

✦ కాలువల్లో పూడిక తొలగించి పారిశుద్ధ్య పనులు చేయిస్తాం. - శివకుమార్, ఎంపీడీవో

ఫలకం సరిచేశారు

స్పందనకు వందనం

కలికిరి, న్యూస్‌టుడే: కలికిరి-కలకడ ప్రధాన రహదారి మధ్య ఉన్న ద్వారకానగర్‌ను గుర్తించే ఫలకం తలకిందులు కావడంతో ఈ మార్గంలో వెళ్లే వారు తికమక పడుతున్నారు. దీనిపై ఈ నెల 16న 'ఊరి పేరు.. తారుమారు' శీర్షికన 'ఈనాడు'లో కథనం ప్రచురితమైంది. స్పందించిన కార్యదర్శి నవాజ్ ఆధ్వర్యంలో సచివాలయ ఉద్యోగులు ఫలకాన్ని సరిచేశారు.

ఆసుపత్రిలో వైద్యసేవలు పెంచండి

పెద్దతిప్పసముద్రం, న్యూస్‌టుడే: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య సేవలు పెంచాలని అభివృద్ధి కమిటీ సభ్యులు సూచించారు. మంగళవారం కమిటీ సమావేశం నిర్వహించారు. ఆసుపత్రి అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. తహసీల్దారు శ్రీరాములు నాయక్ మాట్లాడుతూ.. ఆసుపత్రిలో ప్రజలకు నిరంతరం సేవలు అందించాలని సూచించారు. పరిసరాలు శుభ్రం చేసి, అవసరమైన పరికరాలు అందుబాటులో ఉంచాలన్నారు. ఆసుపత్రిలో నెలకొన్న సమస్యలను వైద్యులు, సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో ఎంపీపీ మహమ్మద్, ఎంపీడీవో ప్రతాప్‌రెడ్డి పాల్గొన్నారు.

విజేతలకు బహుమతుల ప్రదానం

బహుమతులు ప్రదానం చేస్తున్న మాజీ సర్పంచి మహ్మదాలీ, ఉపాధ్యాయులు

మహల్ (కలికిరి), న్యూస్‌టుడే: పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని మాజీ సర్పంచి, తెదేపా సీనియర్ నాయకుడు మహ్మదాలీ విద్యార్థులకు సూచించారు. కలికిరి మండలం మహల్ ఉర్దూ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు మహబూబ్‌బాషా అధ్యక్షతన జరిగిన పాఠశాల వార్షికోత్సవంలో ఆయన మాట్లాడారు. ఆటలు, పాటలు, వక్తృత్వ, వ్యాసరచన పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో తెదేపా నాయకుడు నిజాం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. ✦ **వాల్మీకిపురం:** పదో తరగతి విద్యార్థులు పరీక్షల సమయంలో సహజంగా ఉండే భయం దూరం నెట్టేయాలని ఎంపీడీవో మనోహర్‌రాజు అన్నారు. మంగళవారం స్థానిక పీఎంశ్రీ ఉన్నత పాఠశాల ఆవరణలో పదో తరగతి విద్యార్థులకు మంగళవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. సమయపాలన పాటిస్తూ ఒత్తిడిని అధిగమించే పద్ధతులను అనుసరించాలని విద్యార్థులకు సూచించారు. ఎంఈవో వెంకటరత్నం, ఈవోఆర్డీ సుధాకర్, ప్రధానోపాధ్యాయురాలు వసుంధర, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సగమే మూత.. పడితే అంతే..!

పీలేరు గ్రామీణ, న్యూస్‌టుడే: స్థానిక ఎంపీడీవో కార్యాలయం గేటు వద్ద ఉన్న చేదబావి ప్రమాదకరంగా మారింది. పీలేరు- సదుం రోడ్డు పక్కన ప్రహరీ ఆనుకుని ఉన్న దీనిపై ఒక భాగం వరకు పైమూత లేదు. ఇక్కడున్న ఎమ్మార్సీ కార్యాలయం, భవిత పాఠశాల గేటు ఎప్పుడూ తెరిచే ఉంటోంది. రాత్రి వేళల్లో మందుబాబులు అడ్డాగా మార్చుకుంటున్నారు. ఇక్కడ ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. ప్రస్తుతం ఎంపీడీవో కార్యాలయం అవసరాలకు ఈ బావి నుంచే నీటిని వినియోగిస్తున్నారు.

రోడ్లపై ఆవులు.. ఆదమరిస్తే ప్రమాదాలు

రాయచోటి: రహదారి ప్రమాదాల నివారణకు ప్రభుత్వం విస్తృత చర్యలు చేపడుతోంది. రవాణా, పోలీసు, రెవెన్యూ శాఖలు అప్రమత్తం చేసింది. జిల్లాలో పురపాలికలతో పాటు జాతీయ రహదారులు, మండల కేంద్రాల్లో ఆవులు, పశువులు, ఇతర జంతువుల సంచారం ఎక్కువగా ఉంటోంది. హారన్ మోగించినా అవి తొలగడం లేదు. మరికొన్ని చోట్ల నడి రోడ్డుపైనే విశ్రాంతి తీసుకుంటున్నాయి. కొన్ని సందర్భాల్లో చోదకులు వాహనాలు నిలిపి వాటిని పక్కకు తొలగించాల్సి వస్తోంది. పశువులు రోడ్లపైకి రాకుండా నివారణ చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది.

బస్సుల్లేక ఇబ్బందులు

నీరుగట్టువారిపల్లెలో ఏడేళ్ల బాలిక మృతి చెందిన ఘటనతో ప్రజలు అమ్మచెరువు మిట్టలో ఆందోళనకు దిగడంతో ఈ ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఆర్టీసీ బస్సుల కోసం 1, 2 డిపోల పరిధిలో ప్రయాణికులు మంగళవారం గంటల తరబడి వేచి ఉన్నారు. కదిరి, తంబళ్లపల్లె, రాయచోటి, కడప, బి.కొత్తకోట వైపు వెళ్లే వారు సుమారు 6 గంటల పాటు బస్టాండ్‌లోనే ఉన్నారు. - న్యూస్‌టుడే, మదనపల్లె అర్బన్

రూ.లక్షల వ్యయం.. కానరాని ప్రయోజనం

గుండ్లపల్లెలో రూ.40 లక్షలతో నిర్మించిన సచివాలయ భవనం పూర్తయి ఏడాది గడిచినా నేటికీ ప్రారంభించనోచుకోలేదు. దీంతో పంచాయతీ కార్యాలయంలో అసౌకర్యంగా ఇరుగ్గా ఉండటంతో కష్టాలు పడుతూ ఉద్యోగులు సేవలు అందిస్తున్నారు. ప్రజలు సైతం సరైన వసతి లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధికారులు స్పందించి సచివాలయ కేంద్రాన్ని ప్రారంభించి సేవలు మెరుగుపర్చాలని గ్రామస్థులు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, కలికిరి

రక్తదానం.. నిలుపును నిండుప్రాణం

రక్తదానం చేస్తున్న యువకులు

✦ గ్రామాల్లో విస్తృత అవగాహన ✦ స్వచ్ఛందంగా ముందుకొస్తున్న యువత

రాయచోటి గ్రామీణ, న్యూస్‌టుడే: గతంతో పోలిస్తే ప్రజల్లో రక్తదానంపై అవగాహన, చైతన్యం పెరిగింది.. ప్రాణాపాయ స్థితిలో ఉన్నవారికి అత్యవసరంగా రక్తం అందించేందుకు ఎంతోమంది యువకులు స్వచ్ఛందంగా ముందుకొస్తున్నారు.. మనం ఇచ్చే కొద్దిపాటి రక్తం ఎంతోమంది అభాగ్యులు, వారి కుటుంబాల్లో వెలుగు నింపుతోంది. ఈ విషయంలో పట్టణాల్లో అవగాహన ఉన్నా, కొందరు గ్రామీణుల్లో నేటికీ అపోహలున్నాయి. వీటిని పోగొడుతూ ప్రజల్లో చైతన్యం నింపుతూ వారితో రక్తదానం చేయిస్తూ పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారు కొందరు యువకులు.. వీరిపై స్ఫూర్తిదాయక కథనం.

ప్లేట్‌లెట్లు ఇచ్చి ఆదుకుని..

డాక్టర్ సయ్యద్ మైనుద్దీన్‌ది ఓ-పాజిటివ్ గ్రూప్. ఈ యువకుడు ఇప్పటికి 49 సార్లు రక్తదానం చేశారు. మూడుసార్లు ప్లేట్‌లెట్స్ అందజేశారు. హెల్పింగ్ హ్యాండ్ సంస్థను స్థాపించి ఇప్పటి వరకు సుమారు 10 వేల మందితో రక్తదానం చేయించారు. ఈ సంస్థ తరపున రక్తదానంపై అపోహలు వీడి ప్రజల్లో చైతన్యం కలిగేలా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అతడి సేవలకుగాను ఇప్పటికి మూడు డాక్టరేట్లు, పలు అవార్డులు వరించాయి.

సేవాసంస్థతో చైతన్యపరుస్తూ..

కటారు శివ.. ప్రమాదాల్లో గాయపడిన వారు రక్తం అందక చనిపోతున్న ఘటనలు చూసి చలించిపోయారు. అంతే. వెనుకంజ వేయక రక్తదానం చేసి తన వంతు ప్రాణాలను కాపాడాలని రక్తదానం చేయడానికి ముందుకొచ్చారు. ఏ-పాజిటివ్ గ్రూప్ కలిగిన అతడు.. ఇప్పటికి 50 సార్లు రక్తదానం చేశారు. ఆయుష్ రక్తదాన సేవాసంస్థను స్థాపించి ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నారు. అంతేకాక రక్తదాన శిబిరాలు నిర్వహిస్తున్నారు. ప్రతిఒక్కరూ అపోహలు వీడి రక్తదానం చేయాలని చెబుతున్నాడీ యువకుడు.

స్నేహితుడి మరణంతో చలించి..

అనగాని శ్రీనివాసులు ప్రైవేటు ఉపాధ్యాయుడు. తన మిత్రుడొకరు రోడ్డు ప్రమాదంలో గాయపడి సమయానికి రక్తం అందక చనిపోయారు. దీంతో చలించిపోయిన అతడు.. తన స్నేహితుడిలా ఎవరూ రక్తం అందక ప్రాణాలు కోల్పోరాదని భావించారు. అందుకే స్వచ్ఛందంగా రక్తదానం చేస్తున్నారు. బి-పాజిటివ్ గ్రూప్ కలిగిన అతడు.. ఇప్పటివరకు 20 సార్లు రక్తదానం చేశారు. దీని ఆవశ్యకతపై విద్యార్థులు, ప్రజల్లో అవగాహన కల్పిస్తూ వారితో రక్తదానం చేయిస్తున్నారు.

అపోహలు తొలగిస్తూ..

హరీష్‌ది బి-పాజిటివ్ గ్రూప్. ఇప్పటికి ఈ యువకుడు 12 సార్లు రక్తదానం చేశారు. ప్రజల్లో దీనిపై ఉన్న అపోహలు తొలగించేందుకు తనవంతు కృషిచేస్తున్నారు. అర్హులైన ప్రతి ఒక్కరూ రక్తదానం చేసేలా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ ముందుకు సాగుతున్నారు. లయన్స్ క్లబ్ ద్వారా పేదలకు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

కష్టపడే కార్యకర్తలకు సముచిత స్థానం

ప్రసాద్‌బాబును సత్కరిస్తున్న పుంగనూరు తెదేపా నాయకులు

రాయచోటి: పార్టీ కోసం పనిచేసిన కార్యకర్తలకు సముచిత స్థానం కల్పిస్తామని రాజంపేట పార్లమెంట్ నియోజకవర్గ తెదేపా అధ్యక్షుడు సుగవాసి ప్రసాద్‌బాబు తెలిపారు. రాయచోటిలోని తన కార్యాలయంలో మంగళవారం పుంగనూరు నియోజకవర్గానికి చెందిన పలువురు తెదేపా నాయకులు, కార్యకర్తలు ఆయన్ను సత్కరించారు. పార్టీని బలోపేతం చేసేందుకు అందరూ కష్టపడి పనిచేయాలని తెలిపారు. కార్యక్రమంలో పుంగనూరు మండల తెదేపా అధ్యక్షుడు మాధవరెడ్డి, క్లస్టర్ ఇన్‌ఛార్జి గంగాధర్, రాఘువేంద్ర, భూపతి, రెడ్డెప్ప, చంద్రశేఖర్, వెంకటరమణ, రాంబాబు, సుబ్రహ్మణ్యం, హరినాథ్ పాల్గొన్నారు.

పక్కాగృహాలు త్వరగా పూర్తి చేయండి

చిన్నమండెం: ఎన్టీఆర్ పక్కాగృహాలను త్వరగా పూర్తి చేసుకోవాలని డీఈ చంద్రశేఖరరెడ్డి లబ్ధిదారులకు సూచించారు. మంగళవారం ఏఈ మహేంద్రరెడ్డితో కలిసి కలిబండ, కేశాపురం, చాకిబండ, దిగువ గొట్టివీడు గ్రామాల్లో ఉన్న ఇళ్లను పరిశీలించారు. గోడల దశ నుంచి స్లాబ్ వరకు ఉన్న 96 మంది లబ్ధిదారులు ఉగాదికి పూర్తి చేసి గృహ ప్రవేశాలు చేయాలని తెలిపారు.

చాకిబండలో గోడలదశలో ఉన్న ఇంటిని పరిశీలిస్తున్న డీఈ చంద్రశేఖరరెడ్డి

SUR NAME SPELLING CHANGE

I, PTHAN SHAHINAZ (OLD SUR NAME), R/o D.No. 4/317-1, RAJULA COLONY, CHENNAMUKKAPALLI, RAYACHOTY, ANNAMAYYA DIST., A.P. I changed my sur name to PATHAN SHAHINAZ. Henceforth, I will be known as PATHAN SHAHINAZ (NEW SUR NAME).

CHANGE OF NAME

I, SHAIK SAJIDA (OLD NAME), R/o D.No. 19/84, KOTHAPALLI, RAYACHOTY, ANNAMAYYA DIST., A.P. I changed my name to SHAIK SAJIDA BEGUM. Henceforth, I will be known as SHAIK SAJIDA BEGUM (NEW NAME).

పాస్‌పోర్టు దారిపోయినది

సాకిరేవుపల్లి శివశంకర రెడ్డి
(ఆధార్ నెం:559204635436)
తండ్రి ఆర్.రెడ్డెప్పరెడ్డి, డోర్ నెం: 2/23/A, కొండక్రిందపల్లి గ్రామం, వగళ్ళ (పోస్ట్), కె.వి.పల్లి మండలం, అన్నమయ్య జిల్లా, ఆంధ్రప్రదేశ్. 08-02-2026 న మా ఇంటి నుండి కె.వి.పల్లికి APSRTC బస్సులో వ్యక్తిగత పనికోసం ప్రయాణిస్తున్నప్పుడు నాకు సంబంధించిన పాస్‌పోర్టు నెం.K6430897 పొరపాటుగా దారిపోయినది. ఎవ్వరికైనా దొరికిన యెడల క్రింద తెలిపిన నంబరుకు తెలుపగలరు.
సాకిరేవుపల్లి శివశంకర రెడ్డి
Cell No: 9886278789

దాతల చేయూత అభినందనీయం

మాజీ ఎమ్మెల్యే సమక్షంలో నిత్యావసర సరకులను అందజేస్తున్న దాత సరళ

వాల్మీకిపురం, న్యూస్‌టుడే: స్థానిక శ్రీషిర్డి సాయి నారాయణ సేవా ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిత్యన్నదాన పథకానికి స్వచ్ఛందంగా దాతలు చేయూతనివ్వడం అభినందనీయమని మాజీ ఎమ్మెల్యే, ట్రస్టు అధ్యక్షుడు చింతల రామచంద్రారెడ్డి అన్నారు. కలకడ మండలం కదిరాయి చెరువు పంచాయతీ కోనకు చెందిన దాత సరళ, రవీంద్రబాబు దంపతులు మంగళవారం ప్లేట్లతో పాటు ఐదు రోజులకు సరిపడా నిత్యావసర సరకులను ట్రస్టుకు అందజేశారు. ఈ సందర్భంగా దాతల కుటుంబ సభ్యులను మాజీ ఎమ్మెల్యే అభినందించారు. కార్యక్రమంలో దాత కుటుంబసభ్యులు, జిల్లా మానవతా సంస్థ అధ్యక్షుడు కృష్ణమూర్తి, ఉపసర్పంచి కేశవరెడ్డి, నాయకులు ఆనందరెడ్డి, నీళ్ల భాస్కర్, ఆనంద్, రఘు, చంద్ర పాల్గొన్నారు.

కాలువ పనులకు చర్యలు

పీలేరు, న్యూస్‌టుడే: ఎట్టకేలకు పీలేరు ఆర్టీసీ బస్టాండులో వర్షాకాలంలో నీరు నిలవకుండా కాలువ ఏర్పాటుకు అధికారులు చర్యలు తీసుకున్నారు. ఇక్కడ నీరు వెలుపలకు వెళ్లేందుకు రూ.ఎనిమిది లక్షలతో కాలువ మంజూరైంది. బస్టాండులోని తిరుపతి ప్లాట్‌ఫాం నుంచి ఎల్‌బీఎస్ రోడ్డులోని ప్రధాన కాలువ వరకు 90 మీటర్ల పొడవున కాలువ పనుల్ని గుత్తేదారు మూడు రోజుల్లో ప్రారంభిస్తారని డీఎం రోషన్ తెలిపారు.

ఉన్నత ఆలోచనలతో చక్కని భవిత

మాట్లాడుతున్న కరస్పాండెంట్ శ్రీనివాసులురెడ్డి

రాయచోటి, న్యూస్‌టుడే: విద్యార్థులు ఉన్నత ఆలోచనలతో సాగితే మంచి భవిత ఉంటుందని సీఆర్‌రెడ్డి డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ సి.శ్రీనివాసులు రెడ్డి తెలిపారు. కళాశాల 20వ వార్షికోత్సవం సందర్భంగా మంగళవారం పట్టణంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఉద్యోగ అవకాశాలు దక్కించుకునేందుకు విద్యార్థులు నైపుణ్యాలు వృద్ధి చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ గణేష్‌కుమార్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రతతో ఆరోగ్యం

గూడరేవుపల్లె జడ్పీ ఉన్నత పాఠశాలలో మాత్రలు వేస్తున్న ఎంపీడీవో శివకుమార్

పీలేరు గ్రామీణ, న్యూస్‌టుడే: వ్యక్తిగత పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని పీలేరు ఎంపీడీవో శివకుమార్ అన్నారు. మంగళవారం మండల వ్యాప్తంగా నులి పురుగుల నివారణోత్సవాల సందర్భంగా పాఠశాలల్లో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు మింగించారు. గూడరేవుపల్లెలో జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. **కంభంవారిపల్లి:** మండలంలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలల్లో మంగళవారం నులి పురుగుల మాత్రలను విద్యార్థులకు పంపిణీ చేశారు. ఎంఈవో రెడ్డి బాషా, ఆదర్శ పాఠశాల ప్రిన్సిపల్ శీనూనాయక్, ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ బాలాజీ, వైద్యాధికారులు ప్రవీణ్‌కుమార్, సాయిశిరీష, హరి, రమేష్‌రెడ్డి, రేష్మ, డిప్యూటీ ఎంపీడీవో నాగేంద్ర పాల్గొన్నారు.

అజాగ్రత్తగా వెళ్తే ఆసుపత్రికే..!

గూడరేవుపల్లె వంకపై ప్రమాదకరంగా వెళ్తున్న వాహనాలు

పీలేరు : పీలేరు-తలపుల మార్గం గూడరేవుపల్లె వంకపై ఉన్న వంతెన ప్రమాదకరంగా తయారైంది. వంతెన దెబ్బతినడంతో చిన్నపాటి మరమ్మతులు చేయించారు. వర్షాలకు వంక ఉద్ధృతంగా పారుతున్నందున వంతెనపై వాహనాలు వెళ్లాలంటే చోదకులు భయపడుతున్నారు. రాత్రిపూట ఏమాత్రం అజాగ్రత్తగా వాహనాలు నడిపినా ప్రమాదం జరిగినట్టే. ఏడాది కిందట ఒక ఆటో వంతెన నుంచి వంకలో పడి చోదకుడు మృతి చెందారు. వంకపై ఎత్తుగా వంతెన నిర్మించే విషయంలో పాలకులు తాత్సారం చేస్తున్నారు. ప్రస్తుత పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి కూడా ఇక్కడ వంతెన నిర్మించడానికి ఆర్ అండ్ బీ ఇంజినీర్లతో రూ.4.50 కోట్లతో అంచనాలు వేయించి నిధులకు ప్రతిపాదనలు పంపారు. నిధులు మంజూరై పనులు జరిగే వరకు ప్రజలకు ఇబ్బంది ప్రయాణం తప్పదు.

గుట్టకిందపల్లె ప్రజల గోడు వినేవారు లేరా?

గుంతలు పడిన రహదారి

గుర్రంకొండ, న్యూస్‌టుడే: మండలంలోని టి.పసలవాండ్లపల్లె పంచాయతీ పరిధిలోని గుట్టకిందపల్లె ప్రజల గోడు వినేవారు లేరా అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. పంచాయతీ పరిధిలో 22 పల్లెలున్నాయి. వాటిలో గుట్టకిందపల్లె ఒకటి. పెద్దమండ్యం మండల సరిహద్దులోని రిజర్వ్ అటవీప్రాంతంలో కొండ కింద గుట్టకిందపల్లె ఉంది. ఇక్కడ కనీస సౌకర్యాలు లేవని ప్రజలు వాపోతున్నారు. ఈ పల్లె నుంచి పసలవాండ్లపల్లె రోడ్డుకు రెండు కిలోమీటర్లు కాలినడక సాగించాలి. విద్యార్థులు సైతం ఈ అధ్వాన రహదారిలోనే నడిచి ఉదారవాండ్లపల్లె పాఠశాలకు వెళ్లాల్సివస్తోందని వాపోతున్నారు. తమ పుస్తకాల సంచి తీసుకుని బురద మట్టిలో నడక సాగించడం చాలా ఇబ్బందిగా ఉంటుందని ప్రజలు వాపోతున్నారు. అధికారులు చొరవతీసుకుని రహదారి నిర్మించాలని కోరుతున్నారు.

యూరియా పంపిణీ

గుర్రంకొండ, న్యూస్‌టుడే: ప్రభుత్వం నిర్ణయించిన ధరకే యూరియాను ప్రైవేటు దుకాణాల్లో పంపిణీ చేసినట్లు ఏవో రత్నమ్మ మంగళవారం చెప్పారు. రూ.266.50కి రైతులకు విక్రయించినట్లు తెలిపారు. అవసరమైన మేరకు యూరియాను ప్రభుత్వం పంపుతోందని, రైతులు ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. సచివాలయాల్లో యూరియా విక్రయిస్తామని, అవసరం మేరకు తీసుకోవాలని అన్నారు.

(c) eenadu

మదనపల్లె

• మదనపల్లె • తంబళ్లపల్లె • పుంగనూరు

మారెమ్మకు ప్రత్యేక పూజలు

పుంగనూరు, న్యూస్‌టుడే: పుంగనూరు విరూపాక్షి మారెమ్మకు మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. అమావాస్య కావడంతో ఆలయంలో ఉదయం నుంచి రద్దీ నెలకొంది. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. ★ కల్లూరు (మంగళంపేట): మంగళంపేట ప్రసన్న వేంకటేశ్వర స్వామి ఆలయంలో తితిదే ఆధ్వర్యంలో మహా సంప్రోక్షణ పూజలు మంగళవారం నిర్వహించారు. ప్రదక్షిణ, అంకురార్పణ చేపట్టారు.

ప్రత్యేక అలంకరణలో విరూపాక్షి మారెమ్మ

పత్రపల్లెలో పారిశుద్ధ్య చర్యలు

స్పందనకు వందనం

పుంగనూరు గ్రామీణం: పత్రపల్లెలో మురుగు కాలువలు, వీధుల్లో నిల్వ ఉన్న వ్యర్థాలను తొలగించి పారిశుద్ధ్య చర్యలు చేపట్టినట్లు పంచాయతీ కార్యదర్శి నరసింహులు తెలిపారు. 'ఈనాడు'లో వెలువడిన వార్తకు స్పందించి పారిశుద్ధ్య చర్యలు చేపట్టారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

మదనపల్లె పట్టణం: 80085 74611
తంబళ్లపల్లె: 94416 29636
పుంగనూరు: 80085 74622
(10 AM TO 1 PM)

? మినీ బైపాస్ రోడ్డులో డివైడర్లపై దీపాలు వెలగడం లేదు. - **నారాయణ, మినీ బైపాస్ రోడ్డు** ✦ త్వరలో మరమ్మతు చేయిస్తాం. - **మహేష్, డీఈఈ** – న్యూస్‌టుడే, పుంగనూరు

? కోళ్లబైలు పంచాయతీ వైఎస్సార్ కాలనీలో కాలువలు లేక రోడ్లపై మురుగు పారుతోంది. దుర్వాసన వస్తోంది. - **ఆలంబాషా** ✦ మురుగు కాలువల నిర్మాణాలకు ప్రతిపాదిస్తాం. - **తాజ్‌మస్రూర్, ఎంపీడీవో ?** నిమ్మనపల్లె రహదారిపై చెత్త వేయడంతో పేరుకుపోతోంది. - **రెడ్డెప్ప** ✦ పారిశుద్ధ్య పనులు చేయిస్తాం. - **భారతి, డిప్యూటీ ఎంపీడీవో ?** పుంగనూరు రహదారి బసినికొండ సచివాలయం వద్ద రోడ్డుపై మట్టి దిబ్బలతో ప్రమాదాలు జరుగుతున్నాయి. - **రెహ్మాన్** ✦ మట్టి దిబ్బలు తొలగిస్తాం. - **తిరుపాల్‌నాయక్, డిప్యూటీ ఎంపీడీవో ?** బసినికొండ అగ్గిపెట్టె ఫ్యాక్టరీ, జన్మభూమి కాలనీల్లో వీధి దీపాలు వెలగడం లేదు. రాత్రి వేళల్లో ఇబ్బందులు పడుతున్నాం. - **సురేశ్** ✦ పరిశీలించి దీపాలు బాగు చేస్తాం. - **నాగరాజు, డీఎల్‌పీవో** – న్యూస్‌టుడే, మదనపల్లె గ్రామీణం

? సోమల- నంజంపేట మార్గంలో చర్చి వెనుకవైపు విద్యుత్తు స్తంభానికి లతలు అల్లుకున్నాయి. పశువులు మేత మేసే సమయంలో ప్రమాదాలకు గురయ్యే అవకాశముంది. - **రవీంద్రనాథ్** ✦ తీగలు తొలగిస్తాం. - **మహేంద్రరెడ్డి, ఏఈ** – సోమల

? బి.కొత్తకోట నగర పంచాయతీలోని కురవాని కుంట కాలనీలో బోరు మోటారు పాడైంది. నీటి సమస్యతో ఇబ్బందులు పడుతున్నాం. - **టి.బావాజాన్** ✦ మోటారు బాగు చేయించి సమస్యలు పరిష్కరిస్తాం. - **లోకేశ్‌రెడ్డి, ఏఈ** – న్యూస్‌టుడే, బి.కొత్తకోట

ఆర్టీసీకి శివరాత్రి ఆదాయం రూ.30.29 లక్షలు

మదనపల్లె అర్బన్, న్యూస్‌టుడే: మహాశివరాత్రి సందర్భంగా తంబళ్లపల్లె, అంగళ్లులోని మల్లయ్యకొండలకు బస్సులు నడపడంతో ఆర్టీసీకి రూ.30,29,918 ఆదాయం సమకూరిందని ఒకటో డిపో మేనేజరు ఎం.వి.రమణారెడ్డి తెలిపారు. గతేడాది కంటే రూ.4 లక్షలు పెరిగినట్లు చెప్పారు. సిబ్బంది, చోదకులను అభినందించారు.

మల్లయ్యకొండ ఆలయానికి రూ.18.74 లక్షలు..

నగదు లెక్కిస్తున్న సిబ్బంది

తంబళ్లపల్లె, ములకలచెరువు, న్యూస్‌టుడే: మహాశివరాత్రి సందర్భంగా తంబళ్లపల్లె మల్లయ్యకొండ ఆలయానికి హుండీల ద్వారా రూ.18,74,954 ఆదాయం వచ్చినట్లు ఆలయ ఇన్‌స్పెక్టర్ శివకుమార్, ఈవో మునిరాజా తెలిపారు. నగదుతో పాటు బంగారు, వెండి వస్తువులు భక్తులు సమర్పించినట్లు చెప్పారు. ఎస్సై అనిల్‌కుమార్, తెదేపా నాయకులు తులసీధర్‌నాయుడు, ఉత్తమరెడ్డి, సోముశేఖర్, రామచంద్ర, నారాయణ, వెంకటరమణ, బాలకృష్ణారెడ్డి, భాజపా నాయకులు పాల్గొన్నారు.

15 ఎకరాల్లో మామిడి చెట్లు దగ్ధం.. బి.కొత్తకోట (న్యూస్‌టుడే): మండలంలోని పప్పిరెడ్డిపల్లి వద్ద మంటలు చెలరేగడంతో 15 ఎకరాల్లో మామిడిచెట్లు కాలిపోయాయి. మంగళవారం మధ్యాహ్నం మొరంపల్లి అటవీ ప్రాంతం నుంచి మంటలు ప్రారంభమై క్రమంగా వ్యాపించాయి. గుర్తుతెలియని వ్యక్తులు గుట్టల్లో నిప్పు పెట్టినట్లు స్థానికులు భావిస్తున్నారు. చెట్లు కాలిపోవడంతో రైతులు ఆవేదన చెందుతున్నారు.

పట్టణాల్లో ఎన్నాళ్లీ దారిద్ర్యం

పుంగనూరు, మదనపల్లె పట్టణం, బి.కొత్తకోట, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రామాలు, పట్టణాల్లో గుంతల రోడ్లపై దృష్టి సారించింది. రహదారుల బాగుకు నిధులు మంజూరు చేయడంతో ఏడాదిలోనే రూపుమారాయి. కానీ కొన్ని చోట్ల మాత్రం ఇప్పటికీ మార్పు రాకపోవడంతో పట్టణ ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

నాణ్యత లోపంతో..

పుంగనూరు పురపాలిక పరిధిలో జాతీయ, ప్రధాన రహదారులతో పాటు అంతర రోడ్లు ఉన్నాయి. కొత్తఇండ్లు, నేతాజీ నగర్, కుమ్మర వీధి, ఎన్ఎస్ పేట, భగత్‌సింగ్ కాలనీ, రామసముద్రం, సింగిరిగుంట ప్రాంతాల్లో బాగా దెబ్బతిన్నాయి. ఏళ్లు గడుస్తున్నా బాగుకు నోచుకోలేదు. కొన్ని చోట్ల మరమ్మతు చేసినా నాణ్యత లోపంతో వర్షానికి బురదగా మారాయి. పట్టణంలో రామసముద్రం, సింగిరిగుంట, నక్కబండ, ఎల్ఐసీ కాలనీ ప్రాంతాల్లో సుమారు 5 కిలోమీటర్ల మేర పాడయ్యాయి. ఇటీవల కాలంలో పలువురు ప్రమాదాల బారిన పడుతున్నారు.

పుంగనూరు దర్గా వద్ద రహదారి దుస్థితి

20 కిలోమీటర్ల మేర..

మదనపల్లె పట్టణంలో ప్రశాంత్‌నగర్, దేవళం వీధి, నీరుగట్టువారిపల్లె వీధి, కాట్లాటపల్లె రోడ్డు, రెడ్డీస్ కాలనీల్లో రోడ్లు గుంతలుగానే ఉన్నాయి. పట్టణంలో సుమారు 20 కిలోమీటర్ల మేర ఇదే పరిస్థితి. కొన్ని శివారు కాలనీల్లో ఇప్పటికీ మట్టి రోడ్లు దర్శనమిస్తున్నాయి. కాలువలు సైతం లేకపోవడంతో వర్షాలు పడితే వీధులు బురదగా మారుతున్నాయి. వాహనదారులు, పాదచారులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు.

ఆ ప్రాంతాలకు వెళ్లలేం..

బి.కొత్తకోట నగర పంచాయతీగా మారినప్పటికీ ఎలాంటి అభివృద్ధి పనులు చేపట్టలేదు. పాలకవర్గ ఎన్నికలు జరగకపోవడంతో సమస్యగా మారింది. విస్తీర్ణం తక్కువగా ఉన్నప్పటికీ 7 కిలోమీటర్ల మేర రోడ్లు పాడయ్యాయి. పోకనాటి వీధి, దర్గావీధి, వారపుసంత వీధి, బీసీ కాలనీ, దిగువబస్టాండు ప్రాంతాలకు రాకపోకలు సాగించేందుకు ప్రజలు అవస్థలు పడుతున్నారు.

మరమ్మతులకు చర్యలు..

జిల్లాలోని పట్టణాల పరిధిలో దెబ్బతిన్న రోడ్లు బాగు చేయిస్తాం. తాత్కాలిక మరమ్మతులతో పాటు శాశ్వత అభివృద్ధి పనులకు ప్రణాళికలు రూపొందిస్తాం. పురపాలిక సమావేశాల్లో చర్చించి చర్యలు తీసుకుంటాం. – మధుసూదన్‌రెడ్డి, ప్రమీల, రమాదేవి, కమిషనర్లు, పుంగనూరు, మదనపల్లె, బి.కొత్తకోట

బస్సుల్లేక ప్రయాణికుల ఇక్కట్లు

నీరుగట్టువారిపల్లెలో ఏడేళ్ల బాలిక మృతి చెందిన ఘటనతో ప్రజలు అమ్మచెరువు మిట్టలో ఆందోళనకు దిగారు. దీంతో మదనపల్లె పట్టణానికి వచ్చిన ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఆర్టీసీ బస్సుల కోసం 1, 2 డిపోల పరిధిలో ప్రయాణికులు మంగళవారం గంటల తరబడి వేచి ఉన్నారు. కదిరి, తంబళ్లపల్లె, రాయచోటి, కడప, బి.కొత్తకోట తదితర ప్రాంతాలకు వెళ్లేవారు సుమారు 6 గంటల పాటు బస్టాండ్‌లోనే ఉన్నారు. – న్యూస్‌టుడే, మదనపల్లె అర్బన్

శిథిలావస్థలో పోలీసు గృహ సముదాయం

పుంగనూరు పోలీసు స్టేషన్ ఆవరణలో పోలీసు సబ్ ఇన్‌స్పెక్టర్ కోసం నిర్మించిన గృహ సముదాయం శిథిలమైంది. పెంకులు ఊడిపోయి, కర్రలు చెదలు పట్టేశాయి. ఇదే ఆవరణలో ఇప్పటికే పోలీసు గృహ సముదాయం నడుస్తోంది. 24 కుటుంబాలు ఉండేలా ఇళ్లు నిర్మించారు. ప్రస్తుతం కూలే స్థితిలో ఉండటంతో పోలీసులు వివిధ ప్రాంతాల్లో అద్దెకు ఉంటున్నారు. – న్యూస్‌టుడే, పుంగనూరు గ్రామీణం

రోడ్డు ఛిద్రం.. రాకపోకలు కష్టం

ములకలచెరువు- బి.కొత్తకోట రోడ్డు మార్గంలో రహదారి గుంతలమయంగా మారింది. వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. పీటీఎం మండలం, కమ్మవారిపల్లి సమీపంలో పరిస్థితి మరింత అధ్వానంగా ఉంది. రాత్రి వేళల్లో వెళ్లే ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బెంగళూరుకు వెళ్లే వారు ప్రమాదాల బారిన పడుతున్నారు. గుంతలను పూడ్చివేయాలని పలువురు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, ములకలచెరువు

చెత్త గుట్టగా.. చెరువు గట్టు

మదనపల్లె మండలంలోని కొండామర్రిపల్లె పంచాయతీ పరిధిలోని స్వామిచెరువు 50 ఎకరాల్లో విస్తరించి ఉంది. ఈ చెరువు మీదుగా బసినికొండ బైపాస్‌రోడ్డు నిర్మించారు. ఇక్కడే పురపాలక సంపద కేంద్రం ఉంది. జిల్లా కేంద్రంలోని పలు ప్రాంతాల నుంచి ట్రాక్టర్లు, ఆటోల ద్వారా వ్యర్థాలు తీసుకొచ్చి చెరువులో వేస్తున్నారు. దీంతో నీరు కలుషితం అవుతోందని స్థానికులు వాపోతున్నారు. – న్యూస్‌టుడే, మదనపల్లె గ్రామీణం

ఆరోగ్య కేంద్రానికి చికిత్స చేసే వారేరీ?

సోమల మండలంలోని నంజంపేట ఆరోగ్య ఉపకేంద్రం, సిబ్బంది సముదాయ భవనాలు దెబ్బతిని శిథిలావస్థకు చేరుకున్నాయి. భవనం చుట్టూ పరిసరాలు పిచ్చిమొక్కలతో నిండిపోయాయి. ఆ భవనంలో వైద్యసిబ్బంది సేవలు అందించేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొన్నిసార్లు విషకీటకాలు వస్తున్నాయని వాపోతున్నారు. భవనం బాగు చేయాలని కోరుతున్నారు. – న్యూస్‌టుడే, సోమల

తాగునీరు అందించాలని వినతి

ములకలచెరువు, న్యూస్‌టుడే: మండలంలోని దేవళచెరువు పంచాయతీ, కొత్తపల్లిలో తాగునీరు, రోడ్డు సౌకర్యం లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు గ్రామస్థులు ఎంపీడీవో హరినారాయణకు వినతిపత్రం ఇచ్చారు. మండలంలోని దేవళచెరువు పంచాయతీ, పేయలవానిపెంట నుంచి కొత్తపల్లికి 500 మీటర్ల దూరం ఉందని, రోడ్డు సౌకర్యం లేక అవస్థలు పడుతున్నట్లు చెప్పారు. గ్రామంలో బోరుకు సింగిల్ ఫేజ్ మోటారు అమర్చి కుళాయిలు ఏర్పాటు చేయాలన్నారు. హరి, హేమలత, శంకరమ్మ, శంకరప్ప, శ్రీకాంత్, వెంకటరమణ ఉన్నారు.

హత్య కేసు నిందితులను శిక్షించాలి

చౌడేపల్లె, న్యూస్‌టుడే: మదనపల్లెలో ఏడేళ్ల చిన్నారిని హత్య చేసిన వ్యక్తిని కఠినంగా శిక్షించాలని వైకాపా రాష్ట్ర విద్యార్థి విభాగ కార్యదర్శి కళ్యాణ్ భరత్ డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ.. గంజాయి మత్తులో చిన్నారిపై ఇంత దారుణానికి పాల్పడిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలన్నారు. ఇంకెవరూ ఇలాంటి దుర్మార్గపు పనులు చేయకుండా చూడాలన్నారు. బాలిక కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకోవాలని కోరారు. రాష్ట్రంలో గంజాయి, బెల్టు షాపులు అధికమయ్యాయని ఆరోపించారు.

24 నుంచి కల్యాణ వెంకన్న ఉత్సవాలు

పుంగనూరు, న్యూస్‌టుడే: తితిదే ఆధ్వర్యంలో ఉన్న కల్యాణ వెంకటరమణ స్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు ఈనెల 24 నుంచి మార్చి 5 వరకు నిర్వహిస్తామని ఈవో కృష్ణమూర్తి తెలిపారు. మంగళవారం అర్చకులు, సిబ్బందితో కలిసి గోడప్రతులు ఆవిష్కరించారు. 24న ధ్వజారోహణం, 25న హంస వాహనం, 26న సింహ, 27న హనుమంత, 28న గరుడ, మార్చి 1న సూర్యప్రభ, చంద్రప్రభ వాహనాలపై ఊరేగుతారన్నారు. 2న శ్రీవారి కల్యాణం, 4న రథోత్సవం, ధ్వజావరోహణం, 5న తిరుప్పావడ, శయనోత్సవం జరుగుతాయన్నారు.

మానవ హక్కుల కమిషన్ విచారణ

సోమల, న్యూస్‌టుడే: మండలంలోని 81.ఉప్పరపల్లె పంచాయతీ కమ్మపల్లెకు చెందిన జయంతిపై గ్రామానికి చెందిన పలువురు దాడి చేసి గాయపర్చారు. ఆమె మానవ హక్కుల కమిషన్‌కు ఫిర్యాదు చేయడంతో దిల్లీ నుంచి వచ్చిన సభ్యులు మంగళవారం కమ్మపల్లెలో పర్యటించారు. బాధితురాలితో పాటు స్థానికులను విచారించారు. తహసీల్దార్ మధుసూదన్, ఎస్సై రమేష్ ఉన్నారు.

20న సామాజిక తనిఖీ బహిరంగ సభ

పుంగనూరు, న్యూస్‌టుడే: పుంగనూరు పంచాయతీ రాజ్ అతిథి భవనం ఆవరణలో ఈనెల 20న సామాజిక తనిఖీ బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో అప్పాజీ తెలిపారు. 18వ విడత నిర్వహిస్తున్న సభలో 2024 ఏప్రిల్ 1 నుంచి 2025 మార్చి 31 మధ్య జరిగిన పనులపై పరిశీలన చేపట్టనున్నట్లు చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

ములకలచెరువు, న్యూస్‌టుడే: ద్విచక్ర వాహనాన్ని గుర్తు తెలియని వాహనం ఢీ కొనడంతో యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. మండలంలోని వేపూరికోట ఎస్సీ కాలనీకి చెందిన కార్తిక్ ద్విచక్ర వాహనంపై ములకలచెరువు వెళ్తున్నాడు. గాలేటివారిపల్లి సమీపంలో వాహనం ఢీకొని వెళ్లిపోయింది. స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు చేరుకొని కార్తిక్‌ను ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

108 వాహనంలో ప్రసవం

పెద్దతిప్పసముద్రం, న్యూస్‌టుడే: కాట్నగల్లు పంచాయతీ ఉయ్యాలవాండ్లపల్లెకు చెందిన గర్భిణి గంగాదేవికి పురిటి నొప్పులు రావడంతో ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లేందుకు 108ను ఆశ్రయించారు. బి.కొత్తకోట ఆసుపత్రికి వెళ్తుండగా ఆమె వాహనంలోనే ప్రసవించారు. సిబ్బంది మంజుల, మదన్‌నాయుడును పలువురు ప్రశంసించారు.

కనులపండువగా రథోత్సవం

రామసముద్రం, న్యూస్‌టుడే: రామసముద్రం మండలంలోని మూగవాడిలో మంగళవారం పుండరీశ్వరస్వామి రథోత్సవం వైభవంగా జరిగింది. శివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం ఉదయం స్వామివారి కల్యాణం నిర్వహించారు. సతీసమేతంగా బ్రహ్మరథంపై దేవతామూర్తులను ఊరేగించారు. ☆ **రామసముద్రం:** మండలంలోని ఆర్.నడింపల్లెలో వాలీశ్వర స్వామి రథోత్సవం కనుల పండువగా సాగింది. ఆంధ్ర, కర్ణాటక రాష్ట్రాల నుంచి పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఎస్సై ఉమామహేశ్వరరెడ్డి బందోబస్తు ఏర్పాటు చేశారు. ☆ **పుంగనూరు:** నెక్కుంది పంచాయతీలోని ఆగస్త్యేశ్వర ఆలయంలో రథోత్సవం నిర్వహించారు. కల్యాణం, నంది వాహనోత్సవం తర్వాత రథోత్సవం జరిగింది. చౌడేపల్లె, రామసముద్రం, పెద్దపంజాణి మండలాల నుంచి భక్తులు తరలివచ్చారు.

మూగవాడిలో బ్రహ్మరథంపై పుండరీశ్వరుడు

పుంగనూరులో రథోత్సవం ☆ రామసముద్రంలో రథంపై ఊరేగుతున్న వాలీశ్వరస్వామి

నులి పురుగుల నివారణకు కృషి

పుదిపట్లలో మాత్రలు మింగిస్తున్న వైద్యాధికారిణి సోనియా

కురబలకోట, ములకలచెరువు, న్యూస్‌టుడే: ములకలచెరువు మండలం సోంపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో ఎంపీడీవో హరినారాయణ, ఎంఈవో వెంకటరమణ, అంగళ్లు జడ్పీ పాఠశాలలో తెదేపా నాయకుడు సీతారామ్ బాబు మాత్రలు అందజేశారు. 7,090 మందికి పంపిణీ చేసినట్లు వైద్య సిబ్బంది తెలిపారు. ☆ **సదుం, కల్లూరు, సోమల:** సదుం, చెరువారిపల్లె పాఠశాలల్లో జిల్లా మలేరియా అధికారి ఆర్.రామచంద్రారెడ్డి, ఎంపీడీవో రాధారాణి, డాక్టర్ చరణ్, హెచ్ఎం స్రుబహ్మణ్యం, కల్లూరు, ఎల్లంకివారిపల్లె, పులిచెర్లలో 4,964 మందికి తహసీల్దారు జయసింహ, ఎంపీడీవో రాజశేఖర్‌బాబు, ఎంఈవోలు సిద్ధరామయ్య, తాతయ్య, వైద్యాధికారి వేణుగోపాల్‌రెడ్డి మాత్రలు వేశారు. ☆ మాత్రలపై అపోహలు వద్దని వైద్యాధికారులు జయసింహా, బాలాజీ, విజయలక్ష్మి తెలిపారు. పెద్దఉప్పరపల్లె, కందూరు, సోమల పరిధిలో విద్యార్థులతో మాత్రలు మింగించారు. ☆ **చౌడేపల్లె:** మండలంలోని 4,301 మంది విద్యార్థులకు మాత్రలు వేసినట్లు వైద్యాధికారి సోనియా తెలిపారు. పుదిపట్ల ఉన్నత పాఠశాలలో మాత్రలు అందజేశారు. ☆ **పుంగనూరు:** పట్టణంలోని తూర్పు మొగశాల, రాగానిపల్లెలో 5,507 మందికి మాత్రలు వేసినట్లు వైద్యులు రంజిత, కిరణ్మయి తెలిపారు. ☆ **పెద్దమండ్యం:** మండల కేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో వైద్యాధికారులు హరివర్మ, అశోక్ నులిపురుగుల నివారణ మాత్రలు వేశారు.

IN THE COURT OF THE 2ND ADDITIONAL DISTRICT JUDGE MADANAPALLE

I.A. 49/2019 in A.S. /2019
Petitioner/Appellant:-
Y. Mahadeva Reddy
Respondents:-R.Narasimha Reddy and Others.

NOTICE TO RESPONDENTS 6 AND 7

R6) Ravala Madhu Sree, D/o Late Mohan Reddy R7) Ravala Udaya Sree, D/o Late Mohan Reddy. Both are residing at Samakotavaripalle, H/o Agraharam (Post) Nimmanapalli Mandalam.

పైన తెలిపిన అపీలు నందు ప్రతివాదులు 6 మరియు 7 అయిన మీరు కోర్టు నోటీసులను తీసికోనందున సదరు నోటీసులను మీకు పత్రికాముఖంగా తెలియజేయవలసినదిగా కోర్టు వారు ఉత్తర్వు వేసినారు. కావున మీరు 13-03-2026 నాడు ఉ॥గం॥ 10.30లకు పై కోర్టు నందు హాజరు కావలెను. లేనంతట మీ పరోక్షమున కేసును తీర్మానించబడునని యిందుమూలముగా తెలియజేయడమైనది.

//By Order of the Court//
Y. SAMBA SIVA REDDY, B.A.,B.L.
Advocate for Petitioners/ Appellants,
MADANAPALLE

గురుకులం పిలుస్తోంది.. రారండి

బి.కొత్తకోట, న్యూస్‌టుడే: రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ పరిధిలోని డాక్టర్ అంబేడ్కర్ గురుకుల విద్యాలయాల్లో 2026-27లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానించారు. ఈనెల 19 వరకు గడువు ఇచ్చారు. జిల్లాలోని బి.కొత్తకోట, పీలేరు, మదనపల్లె, బురకాయలకోట, వాల్మీకిపురం, రామాపురం, రాయచోటి, దేవపట్ల, లక్కిరెడ్డిపల్లెలో బాలబాలికలకు వేర్వేరుగా గురుకులాలు ఉన్నాయి.

బి.కొత్తకోట గురుకుల విద్యాలయం

పరీక్ష తేదీ, సమయం ఖరారు చేస్తారు. ప్రవేశ పరీక్షలో విద్యార్థి మార్కులతో పాటు సీట్ల రిజర్వేషన్లను ప్రాతిపదికగా చేసుకుని విద్యాలయాల్లో ప్రవేశం కల్పిస్తారు.

ఇవీ అర్హతలు..

విద్యాలయాల్లో అయిదు నుంచి ఇంటర్మీయట్ వరకు ప్రవేశాలు కల్పిస్తారు. మొత్తం సీట్లలో 75 శాతం ఎస్సీలకు, మిగిలినవి ఇతర కులాల విద్యార్థులకు కేటాయిస్తారు. 2025-26 ఏడాదిలో ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో నాలుగో తరగతి చదివిన విద్యార్థులకు ఉంటుంది. ప్రస్తుత విద్యా సంవత్సరంలో పదో తరగతిలో మొదటిసారి ఉత్తీర్ణులైన వారు ఇంటర్మీయట్‌లో చేరొచ్చు. మిగిలిన తరగతుల్లో ప్రవేశాలకు ఇదే తరహా అర్హతలు ఖరారు చేశారు.

మార్చిలో పరీక్షలు..

మార్చి 1, 2 తేదీల్లో విద్యార్థులకు జిల్లాలోని వివిధ కేంద్రాల్లో ప్రవేశ పరీక్షలు ఉంటాయి. విద్యార్థి తరగతికి అనుగుణంగా

నమోదు ఇలా చేసుకోండి..

ఈనెల 19లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. విద్యార్థి ఆధార్‌కార్డు, పాస్‌పోర్టు సైజ్ ఫొటో, తల్లిదండ్రుల ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాలు సమర్పించాలి. రూ.100 ఫీజు చెల్లించాలి. గ్రామ, వార్డు సచివాలయాలు లేదా సమీప గురుకులంలోనూ దరఖాస్తు చేసుకునే వెసులుబాటు కల్పించారు.

వినియోగించుకోవాలి...

కార్పొరేట్ సంస్థలకు దీటుగా ఆంగ్ల మాధ్యమంలో నాణ్యమైన విద్య అందిస్తారు. వ్యాయామ విద్య, కంప్యూటర్ విద్య, క్రీడలకు ప్రాధాన్యం ఉంటుంది. ఆధునిక పరికరాలు, అధునాతన ప్రయోగశాలలు ఉంటాయి. వసతి గృహం, పోషకాహారం అందజేశారు. నిపుణులైన అధ్యాపకులు ఉంటారు. విద్యార్థులు సౌకర్యాలు వినియోగించుకోవాలి. – **ఎ.ఉదయశ్రీ, జిల్లా సమన్వయ అధికారిణి, ఎన్.ప్రసాద్, ప్రిన్సిపల్, బి.కొత్తకోట గురుకులం**

జేఈఈ మెయిన్స్‌లో ప్రతిభ

వి.ముగ్ధ మేఘన

ఎన్.రామ్ చరణ్‌రెడ్డి

మదనపల్లె విద్య, న్యూస్‌టుడే: జేఈఈ మెయిన్స్‌లో మదనపల్లె శ్రీ సిద్ధార్థ జూనియర్ కళాశాల విద్యార్థులు ప్రతిభ చూపినట్లు ప్రిన్సిపల్ వెంకటరెడ్డి తెలిపారు. వి.ముగ్ధమేఘన 95.92 పర్సంటైల్, ఎన్.రామ్‌చరణ్‌రెడ్డి 91.74, ఎం.అఫ్నాన్‌బేగ్ 89.92, పి.గమ్యశ్రీ 87.166, సి.స్పందన 87.01 పర్సంటైల్ సాధించినట్లు చెప్పారు. విద్యార్థులను ప్రిన్సిపల్, డైరెక్టర్ హేమంత్‌కుమార్ తదితరులు అభినందించారు.

యాళి వాహన సేవ

కలకడ, న్యూస్‌టుడే: కలకడ సిద్ధేశ్వరస్వామికి సోమవారం రాత్రి రెడ్డి సంఘం ఆధ్వర్యంలో యాళి వాహన సేవ వేడుకగా నిర్వహించారు. స్వామి అమ్మవార్ల ఉత్సవమూర్తులను యాళివాహన ప్రభపై ఊరేగించారు.

102వ వ్యవస్థాపక దినోత్సవ శుభాకాంక్షలు

కర్నాటక బ్యాంక్ పి.ఆర్.ఎన్.టవర్స్, Opp. సంఘం ఫంక్షన్ హాల్, కదిరి రోడ్డు, మదనపల్లె. ఫోన్ : 08571-227277

ఖాతాదారుల సేవే పరమావధిగా భావిస్తూ విశిష్ట సేవలందిస్తున్న కర్నాటక బ్యాంక్ 102వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా బ్రాంచి మేనేజర్ శ్రీ వి.సురేష్ గారికి మరియు బ్యాంక్ సిబ్బందికి మా హృదయపూర్వక శుభాకాంక్షలు.

ప్రొ॥ కార్తిక్ సాయి గ్రానైట్స్ హోమ్ ఇండస్ట్రీస్ ఇండస్ట్రియల్ ఎస్టేట్, మదనపల్లె. సెల్: 7013829629.

102వ వ్యవస్థాపక దినోత్సవ శుభాకాంక్షలు **కర్నాటక బ్యాంక్** పి.ఆర్.ఎన్.టవర్స్, Opp: సంఘం ఫంక్షన్ హాల్ కదిరి రోడ్డు, మదనపల్లె. Ph: 08571-227277

ఖాతాదారుల సేవే పరమావధిగా భావిస్తూ.. విశిష్ట సేవలందిస్తున్న కర్నాటక బ్యాంక్ 102వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా బ్రాంచి మేనేజర్ శ్రీ వి.సురేష్ గారికి మరియు బ్యాంక్ సిబ్బందికి మా హృదయపూర్వక శుభాకాంక్షలు

ROSHAN PLASTICS Prop: Syed Ziyaulla Plot. No: 182, బలపల్లి, IDA Madanapalle. Cell: 9866649167

సిటీ యూనియన్ బ్యాంకు లిమిటెడ్ CUB మదనపల్లి బ్రాంచ్, డోర్ నెం. 11-215-2 & 11-214-B, పటేల్ రోడ్, మదనపల్లి, అన్నమయ్య జిల్లా, ఫోన్ : 9347038267

బంగారు నగల వేలంపు ప్రకటన

క్రమ సంఖ్య	బంగారు రుణ ఖాతా సంఖ్య	రుణం తీసుకున్న తేదీ	రుణగ్రహీత పేరు మరియు చిరునామా	బంగారు నగల బరువు గ్రాములలో
1	50211211 3014453	09.02.2024	[illegible]	11.500

మదనపల్లె
తేదీ : 18.02.2026
సం. బ్రాంచి మేనేజర్, సిటీ యూనియన్ బ్యాంక్ లిమిటెడ్, మదనపల్లి.

కరాటేలో సత్తా

పతకాలు చూపుతున్న విద్యార్థులు, చిత్రంలో ఉపాధ్యాయులు

మదనపల్లె, విద్య, న్యూస్‌టుడే: తిరుపతిలో ఇటీవల జరిగిన ఎన్ఎంఏ కరాటే కప్ 2026 పోటీల్లో మదనపల్లె ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు సత్తా చాటారని డైరెక్టర్స్ శ్రీదేవి, అమృతప్రసాద్, ప్రిన్సిపల్ షహనాజ్ తెలిపారు. పాఠశాల నుంచి 17 మంది కటా, కుమితే పోటీల్లో పాల్గొన్నారని చెప్పారు. వీరు మూడు స్వర్ణాలు, ఏడు రజతాలు, 15 కాంస్య పతకాలు సాధించారన్నారు. ఈ సందర్భంగా గెలుపొందిన విద్యార్థులను, కరాటే మాస్టర్‌ను పాఠశాల యాజమాన్యం అభినందించింది.

ఆసుపత్రిలో వైద్య సేవలు మెరుగుపర్చాలి

సమావేశమైన ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు

పెద్దతిప్పసముద్రం, న్యూస్‌టుడే: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య సేవలు పెంచాలని అభివృద్ధి కమిటీ సభ్యులు సూచించారు. మంగళవారం కమిటీ సమావేశం నిర్వహించారు. తహసీల్దారు శ్రీరాములు నాయక్ మాట్లాడుతూ.. ఆసుపత్రిలో ప్రజలకు నిరంతర సేవలు అందించాలని సూచించారు. పరిసరాలు శుభ్రం చేసి, అవసరమైన పరికరాలు అందుబాటులో ఉంచాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ మహమ్మద్, ఎంపీడీవో ప్రతాప్‌రెడ్డి, వైద్యాధికారి, సిబ్బంది పాల్గొన్నారు.

రెడ్‌క్రాస్ సేవలు అభినందనీయం

బాపట్ల, న్యూస్‌టుడే: సమాజానికి రెడ్‌క్రాస్ అందిస్తున్న సేవలు అభినందనీయమని కలెక్టర్ వినోద్‌కుమార్ అన్నారు. రెడ్‌క్రాస్ కార్యాలయంలో నూతనంగా ఏర్పాటు చేసిన శిక్షణ కేంద్రం, సమావేశపు గదిని కలెక్టర్ మంగళవారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ విపత్కర పరిస్థితుల్లో ప్రజల ప్రాణాలు కాపాడటానికి నిష్ణాతులైన స్వచ్ఛంద సమాజ సేవకులను రెడ్‌క్రాస్ సిద్ధం చేస్తుందన్నారు. ప్రకృతి విపత్తుల్లో ప్రాణాపాయ స్థితిలో ఉన్నవారిని కాపాడటమే సంస్థ ముఖ్య ఉద్దేశమన్నారు. నెల రోజుల్లో నాలుగు పర్యాయాలు 60 మందికి శిక్షణ ఇవ్వటానికి రెడ్‌క్రాస్ ప్రణాళికతో పని చేస్తుందన్నారు. ఆర్డీవో గ్లోరియా, పురపాలక కమిషనర్ రఘునాథరెడ్డి, తహసీల్దారు సలీమా, రెడ్‌క్రాస్ ఛైర్మన్ నారాయణభట్టు, ప్రతినిధులు శ్రీమన్నారాయణ, రమణబాబు పాల్గొన్నారు.

చీరాల అన్న క్యాంటీన్ అద్వితీయం

చీరాల గ్రామీణం, న్యూస్‌టుడే: చీరాల అన్న క్యాంటీన్ రాష్ట్ర స్థాయిలో ఉత్తమ పనితీరు కనబరుస్తోంది. ఎనిమిది నెలలుగా క్యాంటీన్ నిర్వాహకుల రేటింగ్ ఇస్తున్నారు. సమయపాలన, పారిశుద్ధ్యం, నిర్వహణ, రుచి వంటి విషయాలను ప్రామాణికంగా తీసుకుని ర్యాంకులు ఇస్తున్నారు. వీటిలో చీరాల ముందంజలో నిలిచి, గుర్తింపు పొందుతోంది. ఈ నెల వెలువరించిన ఫలితాల్లో రెండో ర్యాంకు సాధించడం విశేషం. గతంలో వరుసగా మూడుసార్లు ప్రథమ ర్యాంకు సాధించి మధ్యలో ఒకసారి వెనకబడింది. గత నెలలో ఏడో స్థానంలో ఉండగా తిరిగి రెండో స్థానంలో నిలిచింది. కూటమి ప్రభుత్వం వచ్చాక 2024 ఆగస్టు 16న హైస్కూల్ రోడ్డులో దీన్ని ఏర్పాటు చేశారు. ప్రతిరోజూ ఇక్కడ వెయ్యి మంది వరకు భోజనం చేస్తున్నారు. నిర్వాహకులు దీని నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నారు. నిత్యం సమయపాలనను పాటించడమే కాకుండా.. క్రమశిక్షణతో భోజనం చేసి వెళ్లేలా చొరవ తీసుకుంటున్నారు. నీటి ట్యాంకులు ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉండేలా చూస్తున్నారు. పురపాలక సంఘం తరఫున ప్రత్యేకంగా ఒక ఉద్యోగిని సైతం నియమించి పర్యవేక్షిస్తున్నారు. పురపాలక, రెవెన్యూ అధికారులు తరచూ సందర్శించి రుచి చూడటమే కాకుండా సమస్యలు పరిష్కరిస్తున్నారు.

ఈనాడు బాపట్ల

బుధవారం ఫిబ్రవరి 18, 2026

నీరు చల్లేదెలా.. నిప్పు ఆర్పేదెలా..

జిల్లాలో అగ్నిమాపక శకటాలకు కొరత

న్యూస్‌టుడే, బాపట్ల

జిల్లాలో అగ్నిమాపక వాహనాల కొరత ఉంది. వేమూరు, పర్చూరులో అగ్నిమాపక కేంద్రాలు లేవు. వేమూరు నియోజకవర్గంలో ఎక్కడైనా అగ్నిప్రమాదం సంభవిస్తే తెనాలి నుంచి వాహనం వస్తోంది. పర్చూరులో అగ్నిప్రమాదం జరిగితే దూరంలో ఉన్న చీరాల, చిలకలూరిపేటల నుంచి వాహనాలు రప్పిస్తున్నారు. అవి రావడంలో ఆలస్యమవుతుండటంతో ప్రమాదాల్లో ఆస్తి నష్టం ఎక్కువగా ఉంటోంది. వేసవిలో ఒకేసారి రెండు, మూడుచోట్ల ప్రమాదాలు సంభవిస్తే పరిస్థితి మరింత క్లిష్టంగా మారుతోంది.

జిల్లా కేంద్రంలో ఒకటే అగ్నిమాపక శకటం

పర్చూరులో ఓ టింబర్ డిపోలో గతేడాది భారీ అగ్నిప్రమాదం సంభవించింది. చీరాల, చిలకలూరిపేటల నుంచి అగ్నిమాపక వాహనాలు 20 కి.మీ. దూరం వచ్చి మంటలు ఆర్పటానికి ప్రయత్నించాయి. ఇవి చేరుకోవటానికి అరగంటకు పైగా సమయం పట్టింది. అయినా అదుపులోకి రాకపోవటంతో 30 కి.మీ. దూరంలో బాపట్ల నుంచి మరో వాహనం రప్పించారు. అగ్ని ప్రమాదంలో టింబర్ డిపో యజమాని రూ.2 కోట్లు నష్టపోయారు.

గతేడాది ఏప్రిల్ 13న నరసాయపాలెంలో అగ్ని ప్రమాదం సంభవించడంతో మంటలు ఆర్పటానికి బాపట్ల అగ్నిమాపక వాహనం అక్కడికి వెళ్లింది. అదే సమయంలో మూలపాలెంలో ఓ కౌలురైతుకు చెందిన రెండెకరాల వరి కుప్పపై పిడుగు పడి మంటలు వ్యాపించాయి. స్థానికంగా అగ్నిమాపక శకటం లేకపోవటంతో చీరాల నుంచి అధికారులు పిలిపించారు. అక్కడి నుంచి వాహనం వచ్చేసరికి కుప్పపూర్తిగా బూడిదై కౌలురైతు రూ.లక్షన్నర నష్టపోయాడు.

ఏడాది	ప్రమాదాల సంఖ్య	ఆస్తి నష్టం (రూ.కోట్లలో)
2022–23	340	3.76
2023–24	386	103
2024–25	447	7.24
2025–26	308	6.74

ప్రతిపాదనలు పంపాం

పర్చూరు, వేమూరులకు అగ్నిమాపక కేంద్రాలు, బాపట్లకు రెండో యూనిట్ మంజూరు చేయాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. చీరాల, రేపల్లెకు కొత్త వాహనాలను ప్రభుత్వం కేటాయించింది. ప్రమాదం విషయం తెలిసిన వెంటనే సిబ్బంది సత్వరమే స్పందించి మంటలు ఆర్పటం ద్వారా గత నాలుగేళ్లలో రూ.220 కోట్ల విలువైన ఆస్తి, ఆరుగురు వ్యక్తుల ప్రాణాలు కాపాడాం. **- వినయ్, జిల్లా అగ్నిమాపకశాఖాధికారి**

చీరాలలో ఒకటే వాహనం

చీరాల అగ్నిమాపక కేంద్రంలో డబుల్ యూనిట్ ఉన్నా వాహనం మాత్రం ఒకటే ఉంది. మిస్ట్ వాహనం ఉన్నా అది చిన్నది కావటంతో పెద్ద అగ్నిప్రమాదాల్లో మంటలు ఆర్పటానికి సామర్థ్యం చాలదు. ఈ కేంద్రానికి రెండో అగ్నిమాపక వాహనాన్ని తక్షణమే కేటాయించాల్సిన అవసరం ఉంది. జిల్లా కేంద్రం బాపట్ల అగ్నిమాపక కేంద్రంలో ఒకే యూనిట్, ఒకటే వాహనం ఉన్నాయి. దీనిని డబుల్ యూనిట్‌గా మార్చి రెండో వాహనం, సిబ్బందిని కేటాయించాలి. ఒకేసారి రెండు ప్రమాదాలు లేదా భారీ అగ్నిప్రమాదం సంభవిస్తే త్వరగా మంటలు ఆర్పి నష్ట తీవ్రతను తగ్గించవచ్చని నిపుణులు చెబుతున్నారు.

చిట్టి తల్లులు.. చేదు నిజాలు..

ఉమ్మడి జిల్లాలో సమస్యగా టీనేజ్ ప్రెగ్నెన్సీ కేసులు

ఈనాడు, అమరావతి

చిట్టితల్లులు చిక్కుల్లో పడుతున్నారు. కౌమార దశలోనే పెద్ద బాధ్యతను కడుపులో మోస్తున్నారు. తల్లిదండ్రుల అవగాహనా రాహిత్యం, అధికారుల నిర్లిప్తత.. కారణాలేమైనా టీనేజ్ ప్రెగ్నెన్సీతో ఇబ్బందులు పడుతున్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో పల్నాడు, బాపట్లలో ఈ సమస్య ప్రమాద ఘంటికలు మోగిస్తుండగా.. గుంటూరు జిల్లాలోనూ తీవ్రత ఉండటం గమనార్హం.

✦ పల్నాడు జిల్లాలో రాష్ట్రంలోనే అత్యధికంగా 14.94 శాతం టీనేజ్ ప్రెగ్నెన్సీ కేసులున్నాయి. ✦ తరువాత స్థానంలో బాపట్ల జిల్లా 12-15 శాతంతో తీవ్ర పరిస్థితిని ఎదుర్కొంటోంది. ✦ గుంటూరు జిల్లాలో 8-10 శాతం మధ్య కేసులున్నాయి. ✦ బాల్య వివాహాలు, అత్యాచారాలు, తెలిసీతెలియని వయసులో ఆకర్షణలకు లోనవటం.. ఇలా కౌమార దశలో గర్భం దాల్చడానికి కారణమవుతున్నాయి. ✦ 13 నుంచి 19 ఏళ్ల మధ్య వయసున్న ఆడ పిల్లలు ఈ సమస్య ఎదుర్కొంటున్నారు.

పల్నాడులోనే అత్యధికం

పల్నాడు ప్రాంతంలో బాల్య వివాహాలు అధికమని అధికారులు చెబుతున్నారు. మాచర్ల, దుర్గి, వెల్దుర్తి, పిడుగురాళ్ల, గురజాల, దాచేపల్లి మండలాల్లో, మారుమూల ఆటవీప్రాంతాల్లో చిన్నారి పెళ్లికూతుళ్లు ఎక్కువగా ఉంటున్నారు. నిరక్షరాస్యత, అవగాహనా లేకపోవటం, పేదరికంతో పాటు లైంగిక వేధింపులు, అత్యాచారాల నుంచి బయటపడేందుకు చిన్న వయసులోనే బాలికలకు పెళ్లిళ్లు చేస్తున్నారు.

పల్లెల్లో అదే సమస్య

రాష్ట్రంలో బాల్యవివాహాల సగటు 29.3%. ఉమ్మడి జిల్లాలో అత్యధికంగా బాల్యవివాహాలు జరుగుతున్నట్లు గతంలోనే పలు నివేదికలు తేల్చి చెప్పాయి. జాతీయ ఆరోగ్య కుటుంబ సర్వే లెక్కల ప్రకారం 2019-20లో 35.4% బాల్య వివాహాలు జరిగాయి. కొవిడ్ అనంతర కాలంలో ఈ శాతం ఏటా పెరుగుతోంది. ✦ ఉమ్మడి జిల్లాలో 2018లో 31, 2019లో 23, 2020లో 34, 2021లో 37 బాల్య వివాహాలను ఐసీడీఎస్ అధికారులు అడ్డుకున్నారు. గత ఐదేళ్లలో ఏటా 20కుపైగానే అడ్డుకున్నట్లు సంబంధితవర్గాలు చెబుతున్నాయి.

కమిటీల చొరవ అవసరం

☛ బాల్య వివాహాలను అడ్డుకునేందుకు జిల్లా స్థాయిలో కలెక్టర్, డివిజన్ స్థాయిలో డివిజన్ అధికారి, సబ్ కలెక్టర్లు బాల్య వివాహ నిరోధక అధికారులుగా వ్యవహరిస్తారు.

☛ స్త్రీ, శిశు సంక్షేమశాఖ సీడీపీవో ప్రాజెక్టు స్థాయిలో మూడు నుంచి ఐదు మండలాలకు ఒక బాలల అభివృద్ధి ప్రాజెక్టు అధికారి, మండల స్థాయిలో తహసీల్దారు నేతృత్వంలో పని చేస్తున్నారు.

☛ గ్రామాల్లో సర్పంచి, పంచాయతీ కార్యదర్శి, వీఆర్వో, ఉపాధ్యాయులు, మహిళా వార్డు మెంబర్లు, స్వచ్ఛంద సంస్థ సభ్యులు, అంగన్వాడీ కార్యకర్త.. ఇలా అనేక మంది బాల్య వివాహ నిరోధక కమిటీలో సభ్యులుగా ఉన్నారు.

☛ ఇవి మరింత ప్రత్యేక దృష్టి సారించి బాల్య వివాహాలను అడ్డుకోగలిగితే 'టీనేజ్ ప్రెగ్నెన్సీ'ని కట్టడి చేయడానికి అవకాశం ఉంటుంది.

అమ్మ ఆలయంలో ధాన్యాభిషేకం

బాపట్ల, బాపట్ల వెస్ట్, న్యూస్‌టుడే: జిల్లెళ్లమూడి అమ్మ ఆలయంలో ధాన్యాభిషేకాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. తొలుత నాన్న నాగేశ్వరరావు, అమ్మ అనసూయాదేవి ఉత్సవమూర్తులను పల్లకిపై ఉత్తర వేదిక వద్దకు విశ్వజననీ పరిషత్తు ట్రస్టు ప్రతినిధులు తీసుకువచ్చారు. అమ్మ, నాన్నల విగ్రహాల వద్ద భక్తులు కొత్త ధాన్యంతో అభిషేకం చేశారు. భక్తులు అందజేసిన ధనం, ధాన్యాన్ని అన్నపూర్ణాలయ సంతర్పణకు వినియోగిస్తామని ట్రస్టు ప్రతినిధి బ్రహ్మాండం రవీంద్రరావు తెలిపారు. ఓరియంటల్ కళాశాల విద్యార్థులకు ఉపకార వేతనాలు పంపిణీ చేశారు.

అమ్మవారి ఉత్సవమూర్తిని పల్లకిపై మోస్తున్న భక్తులు

తేరుపై తేజోమూర్తి

హరహర మహాదేవ.. శంభోశంకర నామ స్మరణతో అమరావతి మార్మోగింది. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా కీలక ఘట్టమైన బాలచాముండికా అమరేశ్వర స్వామి దివ్య రథోత్సవం మంగళవారం వైభవంగా నిర్వహించారు. రథాన్ని వివిధ రకాల పుష్పాలతో శోభాయమానంగా తీర్చిదిద్ది ఉత్సవమూర్తులను కొలువుదీర్చారు. శాసనసభ డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణరాజు, ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ హాజరై ప్రత్యేక పూజల అనంతరం సాయంత్రం 4.25గంటలకు రథోత్సవం ప్రారంభించారు. **- న్యూస్‌టుడే, అమరావతి**

19 నుంచి గోవాలో కలెక్టర్ బృందం పర్యటన

బాపట్ల: జిల్లాలో పర్యాటకరంగ అభివృద్ధికి సమగ్ర ప్రణాళికల రూపకల్పనకు, నూతన అంశాలపై అధ్యయనం చేయడానికి కలెక్టర్ వినోద్‌కుమార్ నేతృత్వంలో అధికారుల బృందం ఈ నెల 19 నుంచి 22 వరకు గోవాలో పర్యటించనుంది. కలెక్టర్ వెంట బాపట్ల కమిషనర్ రఘునాథరెడ్డి, జిల్లా పర్యాటక అధికారి అస్గర్ అలీ, చీరాల తహసీల్దారు గోపీకృష్ణ, వేటపాలెం ఎంపీడీవో రాజేష్‌తో పాటు ఏపీటీడీసీ నుంచి ఓ ప్రతినిధి వెళ్తున్నారు. గోవాలో ప్రముఖ బీచ్‌లు సందర్శించి బీచ్ పర్యాటకం, ఆతిథ్యం, పర్యాటకులను ఆకర్షించేలా సదుపాయాల కల్పన, జల క్రీడలు, స్పీడ్ బోట్లలో విహారాన్ని పరిశీలించనున్నారు. సూర్యలంక నుంచి ఓడరేవు, రామాపురం వరకు 15 కి.మీ. కాలుష్య రహిత సుందర బీచ్ ఫ్రంట్ అభివృద్ధి చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేసి గోవాలోని అత్యుత్తమ విధానాలను జిల్లాలో అమలు చేయనున్నారు. కలెక్టర్ నేతృత్వంలో బృందం బుధవారం గోవాకు బయలుదేరి వెళ్లనుంది. నాలుగు రోజులు జేసీ భావనకు జిల్లా ఇన్‌ఛార్జి కలెక్టర్‌గా బాధ్యతలు అప్పగించారు.

వి'జేఈఈ'భవ

మెయిన్స్ ఫలితాల్లో రాణించిన విద్యార్థులు

జేఈఈ మెయిన్స్‌లో బాపట్ల, చినగంజాం ప్రాంత విద్యార్థులు మెరిశారు. అడ్వాన్స్‌డ్‌లోనూ సత్తాచాటి పేరున్న ఐఐటీల్లో చదువుతామని, భవిష్యత్తులో ఉన్నతంగా ఎదగడమే లక్ష్యంగా అడుగులు వేస్తామని చెబుతున్నారు. ఉత్తమ పర్సంటైల్ సాధించిన విద్యార్థులను ఆయా కళాశాలల ప్రతినిధులు అభినందించారు. **- న్యూస్‌టుడే, బాపట్ల, చినగంజాం**

బొమ్మిశెట్టి వరుణ్‌సాయి
99.31 | కర్లపాలెం
తారణ్య, రామకిషోర్
శిక్షణ తీసుకుని రోజూ అయిదు గంటలు ప్రణాళికతో కష్టపడ్డా. అడ్వాన్స్‌డ్‌లో నూరు శాతం పర్సంటైల్ సాధిస్తానన్న నమ్మకం ఉంది.
ఐఐటీలో సీఎస్ఈ ఏఐఎంఎల్ కోర్సు చదివి భవిష్యత్తులో ఏఐ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్

సాయిమోహన మనోజ్
97.16 | కర్లపాలెం
శివపార్వతి, మురళి
రోజూ ఆరు గంటలు చదివా. నెగెటివ్ మార్కుల విషయంలో అప్రమత్తంగా ఉన్నా.
ఐఐటీలో సీటు సాధించి సీఎస్ఈ ఏఐ, సైబర్ సెక్యూరిటీ బీటెక్ పూర్తి చేసి పరిశోధన రంగంలో కొత్త టూల్స్ అభివృద్ధి.

జాలాది రామచంద్ర
95.47 | బాపట్ల
శిరీష, వెంకటేశ్వరరావు
ప్రణాళికబద్ధంగా కృషి చేశా. రెండోసారి మెయిన్స్ రాసి పర్సంటైల్ మెరుగుపరచుకుంటా. అడ్వాన్స్‌డ్‌లో మంచి పర్సంటైల్ సాధిస్తా.
ఐఐటీలో సీఎస్ఈ ఏఐఎంఎల్ బీటెక్ కోర్సు చదువుతా. ఏఐ స్టార్టప్ ప్రారంభిస్తా.

అక్కల అజిత్‌రెడ్డి
99.71 | రాజుబంగారుపాలెం
ఉమామహేశ్వరి, నాగరాజురెడ్డి
మొదటి నుంచి ప్రణాళిక ప్రకారం సాధన చేశా. అధ్యాపకులతో సందేహాలు నివృత్తి చేసుకున్నా.
భవిష్యత్తులో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా స్థిరపడతా.

ఉడతా కిషోర్ కుమార్
95.71 | చీరాల
భార్గవి, విజయ్‌కుమార్
జేఈఈ మెయిన్స్ కోసం రోజూ ఐదు గంటలు కష్టపడి చదివి సాధన చేశా. రెండోసారి మెయిన్స్ రాసి మెరుగైన స్కోర్ సాధిస్తా.
ఐఐటీలో సీఎస్ఈ చదివి భవిష్యత్తులో నూతన సాఫ్ట్‌వేర్‌ల అభివృద్ధిపై పరిశోధనలు చేస్తా.

విద్యార్థి పేరు | పర్సంటైల్ | ఊరు | తల్లిదండ్రులు | శ్రమించిన తీరు | లక్ష్యం

వచ్చిన మిర్చి వచ్చినట్టే..

విక్రయానికే రైతుల మొగ్గు

ఈనాడు, అమరావతి

ఎండుమిర్చికి మంచి ధరలు లభిస్తున్న నేపథ్యంలో సరకు విక్రయించడానికే రైతులు మొగ్గు చూపుతున్నారు. గతేడాది శీతల గోదాముల్లో నిల్వ చేసినవారు కూడా సరకు మార్కెట్‌కు తరలిస్తున్నారు. ఫలితంగా గోదాముల్లో నిల్వలు ఖాళీ అవుతుండగా.. కొత్తగా సరకు నిల్వ చేసే పరిస్థితులు కనిపించడం లేదు. ప్రస్తుతం కొన్ని రకాల మిర్చి ధరలు క్వింటాకు రూ.20 వేలకుపైగానే పలుకుతున్నాయి. గరిష్ఠంగా రూ.26 వేల వరకు వెళ్లింది. అందుకే రైతులు వచ్చిన సరకును వచ్చినట్టే అమ్మేస్తున్నారు. గతేడాదితో పోలిస్తే సీజన్ ప్రారంభంలోనే ఈసారి ధరలు బాగుండడం కలిసొచ్చింది.

ప్రస్తుతం మార్కెట్‌కు వస్తున్న మిర్చిలో రోజూ శీతల గోదాముల నుంచి వస్తున్న సరకు సగటున 30 వేల టిక్కీలు. ఇదే పరిస్థితి కొనసాగితే మార్చి 15 నాటికి పాత నిల్వలు పూర్తిగా తగ్గిపోతాయి. 2024, 2025

సీజన్లో నిల్వ చేసిన మిర్చిని ఇప్పుడు విక్రయించకపోతే రంగు మారి నాణ్యత దెబ్బతింటుంది. అందుకే నిల్వ మిర్చి విక్రయాలు జోరందుకున్నాయి.

నిలకడగా ధరలు.. యార్డులో కొన్నాళ్లుగా పెరుగుతూ వచ్చిన ధరలు ప్రస్తుతం నిలకడగా ఉన్నాయి. రంజాన్ నేపథ్యంలో బంగ్లాదేశ్‌కు ఎగుమతులు తగ్గడం, చైనాలో నూతన సంవత్సరం సందర్భంగా సెలవులతో పాటు పాత సరకు మార్కెట్‌కు వస్తుండడం, పాకిస్థాన్‌లోనూ ఇదే పరిస్థితి ఉండడంతో ప్రస్తుతం ఎగుమతులు ఆశాజనకంగా లేవు. దేశీయంగా ఉన్న డిమాండ్ వల్లనే ధరలు నిలకడగా ఉన్నాయి. రెండు రోజులుగా కొన్ని రకాల ధరలు క్వింటాకు రూ.500 వరకు తగ్గాయి.

17వ తేదీ గరిష్ఠ ధరలు క్వింటాకు...

రకం	రూపాయల్లో
334	21,500
నంబరు-5	22,000
341	24,000
తేజ	18,000
బాడిగి	25,000

వచ్చిన వెంటనే విక్రయం

యార్డుకు సాధారణంగా ఫిబ్రవరిలో రోజుకు లక్ష బస్తాలకుపైగా మిర్చి టిక్కీలు రావాలి. ఈసారి ఇప్పటి వరకు కేవలం రెండు రోజుల్లో మాత్రమే లక్ష బస్తాలు దాటాయి. ధరలు బాగున్నందున వచ్చిన సరకులో 95 శాతంపైగా అమ్ముడైపోతున్నాయి. యార్డులో రోజువారీ అమ్మకాల తరువాత ముందురోజు నిల్వలతో కలిసి 25 వేలలోపే బస్తాలుండడం సరకు కొరతకు నిదర్శనం. ప్రస్తుతం పాతవి, కొత్తవి కలిపి శీతల గోదాముల్లో సుమారు 12 లక్షలలోపే బస్తాలుంటాయని అంచనా.

యార్డుకు వచ్చిన సరకు, అమ్మకాలు, నిల్వలు బస్తాల్లో....

ఫిబ్రవరి	వచ్చింది	విక్రయం	నిల్వలు
10	1,02,248	98,826	21,721
11	1,09,852	1,05,937	25,636
16	87,018	82,824	18,613

'గోదాముల్లోంచి సరకు ఖాళీ అవుతోంది. కొత్త సరకు రానందున ఈసారి గోదాములు నిండే పరిస్థితి లేదు. గతేడాదితో పోలిస్తే సాగు విస్తీర్ణం, సరకు రాక తగ్గడంతో ధరలు పెరిగాయి. **- సురేంద్రబాబు, శీతల గోదాముల సంఘ అధ్యక్షుడు**

గోవాడలో భక్తుల సందడి

గోవాడ (అమృతలూరు), న్యూస్‌టుడే: మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా గోవాడ శైవక్షేత్రం వద్ద జరుగుతున్న అయిదు రోజుల ఉత్సవాల్లో భాగంగా చివరిరోజు మంగళవారం భక్తుల సందడి నెలకొంది. సమీప గ్రామాల నుంచి భక్తులు ట్రాక్టర్లు, ఆటోలపై తరలి వచ్చారు. క్యూలైన్లలో వేచి ఉండి స్వామిని దర్శించుకున్నారు. ధ్వజస్తంభం, ద్వాదశ జ్యోతిర్లింగ ఫలకం, మృత్యుంజయస్వామి విగ్రహం వద్ద కొబ్బరికాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. స్వామివారు ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. స్వామితో పాటు శ్రీవీరభద్రస్వామి, పార్వతీదేవి, క్షేత్రపాలకుడు పూజలందుకున్నారు. నాగశిలల వద్ద భక్తులు పూజలు చేశారు. సోమవారం రాత్రి దేవస్థానం కోనేరులో స్వామివారి ఉత్సవమూర్తులతో తెప్పోత్సవం జరిపారు. కమిటీ ఛైర్మన్ పావులూరి రమేష్, సీఎఫ్‌వో అనుపమ, ఈవో విఠల్ శ్రీనివాసవర్మ, కమిటీ సభ్యులు కార్యక్రమాలను పర్యవేక్షించారు.

ప్రత్యేక అలంకరణలో బాలకోటేశ్వరస్వామి, నాగశిలల వద్ద భక్తుల పూజలు

జడ్పీ ఒకటో స్థాయీ సంఘ సమావేశం 21న

జిల్లాపరిషత్తు, న్యూస్‌టుడే: జిల్లాపరిషత్తు ఒకటో స్థాయీ సంఘ సమావేశం ఈనెల 21వ తేదీ ఉదయం 9.30 నుంచి 10.30 గంటల వరకు నిర్వహించనున్నట్లు జడ్పీ సీఈవో వి.జ్యోతిబసు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి జడ్పీ ఛైర్‌పర్సన్ కత్తెర హెనీక్రిస్టినా అధ్యక్షత వహిస్తారన్నారు.

రాజధానిలో భూసేకరణకు సిద్ధం

భూసమీకరణలో ఇవ్వని 2,459.88 ఎకరాలకు ప్రణాళిక

ఈనాడు, అమరావతి

నవ్యాంధ్ర రాజధాని అమరావతి నిర్మాణానికి భూసమీకరణలో భూములివ్వని రైతుల నుంచి భూసేకరణ ద్వారా తీసుకునేందుకు ప్రణాళిక సిద్ధమైంది. కొంతమంది రైతులు వివిధ కారణాలతో ఇప్పటికీ భూసమీకరణలో భూములివ్వలేదు. వీరిలో నెలకొన్న సందేహాలను సీఆర్డీఏ అధికారులు పలుమార్లు నివృత్తి చేశారు. భూసమీకరణ కింద ఇస్తే ఎక్కువ ప్రయోజనం ఉంటుందని అవగాహన కలిగించారు.

తప్పనిసరి పరిస్థితుల్లో....

రాజధానిలో వివిధ ప్రాజెక్టుల పనులు వేగంగా జరుగుతుండడం, వివిధ సంస్థలు పనులు చేపడుతుండడం, రైతులకిచ్చిన రిటర్నబుల్ ప్లాట్లలో మౌలిక వసతుల కల్పన వీలైనంత తొందరగా పూర్తి చేయాలన్న లక్ష్యంతో చేస్తున్న పనులకు కొన్నిచోట్ల అడ్డంకులు ఎదురవుతున్నాయి. వీటిని అధిగమించడానికి భూసేకరణకు వెళ్లక తప్పని పరిస్థితి. ఇందుకోసం ప్రకటన ప్రక్రియను అధికారులు సిద్ధం చేస్తున్నారు. ప్రాధాన్యక్రమంలో ఆయా అవసరాలకు తగ్గట్టుగా సేకరణ చేపట్టనున్నారు. ❖ తొలి ప్రాధాన్యతగా... రాజధానికి జాతీయ రహదారి నుంచి అనుసంధానం చేసే సీడ్ యాక్సెస్ రోడ్డు నిర్మాణానికి అవసరమైన 12.5757 ఎకరాలను సేకరించనున్నారు. ❖ మలిదశలో ట్రంక్‌రోడ్ల నిర్మాణానికి అవసరమైన 216 ఎకరాలకు ప్రకటన ఇవ్వనున్నారు. ❖ ప్రకటన జారీకి ముందే రైతులు భూసమీకరణలో ఇవ్వడానికి ముందుకొస్తే వారి నుంచి వెంటనే తీసుకుంటారు. ❖ భూసేకరణ అధికారి నియామకం తర్వాత తదుపరి ప్రక్రియను చేపట్టే దిశగా కార్యాచరణ ప్రణాళికతో ముందుకెళ్తున్నారు. ఇదంతా పూర్తయితే రాజధాని ప్రాంతంలో పనులకు అడ్డంకులు తొలగడంతోపాటు అభివృద్ధి వేగవంతమవుతుందని సీఆర్డీఏ భావిస్తోంది.

సేకరించాల్సిన భూమి వివరాలు...

విభాగం	ఎకరాల్లో
సీడ్‌యాక్సెస్ రోడ్డు	12.58
ట్రంక్ రోడ్లు	216.33
ఎల్‌పీఎస్ లేఔట్లు, మౌలికవసతుల కల్పన	396.31
రైతులకు ఇచ్చిన రిటర్నబుల్ ప్లాట్లు	174.35
భూసమీకరణలో ఇవ్వని భూమి	1660.31
మొత్తం భూమి	2459.88

"భూయజమానుల్లో కొందరు స్థానికంగా లేకపోవడం, కుటుంబ సభ్యుల మధ్య తగాదాలు, మరికొందరు భూసమీకరణకు ఆసక్తి చూపకపోవడంతో 2,459 ఎకరాల సమీకరణ సాధ్యం కాలేదు. ఇవి సీఆర్డీఏ నిర్మిస్తున్న రహదారులు, ఎల్‌పీఎస్ లేఔట్లు, రైతులకు కేటాయించిన రిటర్నబుల్ ప్లాట్ల పరిధిలో ఉన్నాయి."

మూగ జీవాలకూ ఆరోగ్య కార్డులు

'భారత్ పశుధన్' యాప్‌లో మరిన్ని సేవలు

న్యూస్‌టుడే, చందోలు (పిట్టలవానిపాలెం)

పశువుల ఆరోగ్య పరిరక్షణకు డిజిటల్ సేవలు అందుబాటులోకి వచ్చాయి. పశుసంవర్ధక శాఖ ప్రక్షాళన, పశు సంపద వృద్ధి, వాటి ఆరోగ్య పరిరక్షణకు కేంద్ర ప్రభుత్వం 'భారత్ పశుధన్' యాప్‌ను ప్రారంభించింది. నేషనల్ డిజిటల్ లైవ్ స్టాక్ మిషన్ (ఎన్‌డీఎల్ఎం) రూపొందించిన ఈ యాప్ ద్వారా వందశాతం పారదర్శకంగా సేవలు అందడంతోపాటు ప్రయోజనాలు చేకూరనున్నాయి. మూగ జీవాలకు ప్రత్యేక డిజిటల్ హెల్త్ కార్డులు జారీ చేయనున్నారు.

❖ జిల్లాలో 3.4 లక్షల కుటుంబాల పోషణలో ఆరు లక్షలకు పైగా మూగ జీవాలున్నాయి. పశుసంవర్ధక శాఖలో ఇన్నాళ్లూ జవాబుదారీతనం లోపించి సేవల్లో జాప్యం, అవకతవకలు జరిగేవి. మూగజీవాలకు వైద్య సేవలు, చికిత్సల్లో అక్రమాలు జరిగేవి. తప్పుడు లెక్కలతో నిధులు స్వాహా చేసేవారు. పశువుల ఆరోగ్య స్థితిగతుల అంచనా తదితర వాటిలోనూ లోపాలు చోటుచేసుకునేవి. వీటన్నింటికీ భారత్ పశుధన్ యాప్‌తో అడ్డుకట్ట పడనుంది. ప్రతి పశువుకు 12 అంకెల గుర్తింపు సంఖ్య కేటాయిస్తారు. ఇవి జన్మించిన నాటి నుంచి పూర్తి సమాచారం ఆన్‌లైన్లో భద్రంగా ఉంటుంది.

❖ గూగుల్ ప్లేస్టోర్ నుంచి యాప్ డౌన్‌లోడ్ చేసుకున్నాక సెల్ నంబరు నమోదు చేస్తే ఓటీపీ వస్తుంది. దీంతో రిజిస్ట్రేషన్ పూర్తవుతుంది. యాప్‌లో యజమాని, పశువుల వివరాలన్నీ నమోదు చేయాలి. ఈ యాప్‌లోని సమాచారం ఆధారంగా భవిష్యత్తులో పశుపోషణకు ఎంత బడ్జెట్ కేటాయించాలన్నది ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందని పీవీపాలెం పశు వైద్యాధికారిణి తిరుమల తేజ తెలిపారు.

❖ పశువులకు బీమా వర్తించడంతో పాటు ఏ కారణంతో అయినా మృత్యువాత పడితే పరిహారం వెంటనే పొందేందుకు ఈ యాప్ దోహదపడుతుంది. పశువుల క్రయ విక్రయాలు, రుణాల మంజూరు, వర్తించే రాయితీలు, పాల దిగుబడి అంచనా తదితర సమస్త సమాచారం తెలుసుకోవచ్చు. ఎక్కడైనా అంటు వ్యాధులు ఇతరత్ర కారణాలతో పశువులు మృతి చెందితే అప్రమత్తం చేస్తూ ఆ ప్రాంతంలోని రైతులకు ఎస్ఎంఎస్‌లు వస్తాయి.

శ్రద్ధాంజలి



ప్రేమతో ఆప్యాయతతో అందరి మనస్సులను ఆకట్టుకున్న మీరు ఇక లేరన్న నిజాన్ని నమ్మలేకున్నాము. మీ పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ఆ భగవంతుని ప్రార్థిస్తూ...

- కుటుంబ సభ్యులు

కీ॥శే॥ తోట శివమల్లిఖార్జునరావు గారు
లాలుపురం (గ్రా.), గుంటూరు రూరల్ (మం.)
జననం : 1/11/1958 మరణం : 17/2/2026

: అంతిమయాత్ర :
ది. 18-2-2026 బుధవారం ఉ॥ 10 గం.లకు గుంటూరు రూరల్ (మం.), లాలుపురం (గ్రా.) లోని మా స్వగృహమునుండి బయలుదేరును.

(c) eenadu

బాపట్ల నుంచి తెనాలికి బస్సు సర్వీసు

బాపట్ల: జిల్లా కేంద్రం బాపట్ల నుంచి తెనాలికి ఈ నెల 19 నుంచి నూతన బస్సు సర్వీసు ప్రారంభిస్తున్నట్లు డిపో మేనేజర్ సింహాద్రి రాంబాబు తెలిపారు. ఆయన మంగళవారం మాట్లాడుతూ ప్రజల నుంచి అందిన విజ్ఞప్తి మేరకు కలెక్టర్ వినోద్‌కుమార్ ఆదేశంతో జిల్లా ప్రజారవాణాధికారి విమల కొత్త సర్వీసు నడపాలని నిర్ణయం తీసుకున్నారన్నారు. బాపట్లలో ఉదయం 6.15 గంటలకు బస్సు ప్రారంభమై అప్పికట్ల, పొన్నూరు, పచ్చలతాడిపర్రు, తొట్టెంపూడి, మామిళ్లపల్లి, మేదురుపాడు, చందూరు, వేటపాలెం, పెనుకుదురుపాడు, పలివెల, యద్దపల్లి, అంగలకుదురు మీదుగా తెనాలికి 8.15 గంటలకు చేరుకుంటుందన్నారు. తెనాలి నుంచి 8.30 గంటలకు బయలుదేరి బాపట్లకు 11.15 గంటలకు వస్తుందని తెలిపారు. మళ్లీ సాయంత్రం 4.30 గంటలకు బయలుదేరి రాత్రి 6.30 గంటలకు తెనాలి చేరుకుంటుందని పేర్కొన్నారు. అక్కడి నుంచి 6.45 గంటలకు ప్రారంభమై రాత్రి 8.45 గంటలకు బాపట్ల చేరుకుంటుందన్నారు. ప్రయాణికులు వినియోగించుకోవాలని కోరారు.

రుణాల పంపిణీ లక్ష్యాలు పూర్తి చేయాలి

మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్‌కుమార్

బాపట్ల, న్యూస్‌టుడే: బ్యాంకులకు నిర్దేశించిన రుణాల పంపిణీ లక్ష్యాలను వంద శాతం పూర్తి చేయాలని కలెక్టర్ వినోద్‌కుమార్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్లో బ్యాంకర్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 2025-2026 ఆర్థిక సంవత్సరంలో డిసెంబరు 31 నాటికి రుణ పంపిణీ లక్ష్యం 15,819.77 కోట్లు కాగా ఇప్పటి వరకు 16,663.34 కోట్లు పంపిణీ చేసి 105 శాతం సాధించినట్లు తెలిపారు. వ్యవసాయం, స్వయం ఉపాధి, మహిళా సంఘాలు, ఎంఎస్ఎంఈలకు రుణాల మంజూరులో బ్యాంకర్లు చురుకుగా వ్యవహరించాలన్నారు. ప్రధానమంత్రి జన్‌ధన్ యోజన, పీఎంఎఫ్‌బీవై, పీఎంఈజీపీ, స్టాండప్ ఇండియా పథకాల్లో పెండింగ్ దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని బ్యాంకు అధికారులను ఆదేశించారు. రైతులకు పంట రుణాలు, కిసాన్ క్రెడిట్ కార్డుల లక్ష్యాలను అనుగుణంగా జారీ చేయాలన్నారు. లీడ్ బ్యాంకు మేనేజర్ శివకృష్ణ, ఆర్‌బీఐ ఎల్డీవో యలమంద, డీసీసీ కన్వీనర్ మాధురి, జేడీఏ విజయనిర్మల, డీఆర్డీఏ, మెప్మా పీడీలు సింగయ్య, ఆనందసత్యపాల్, పశుసంవర్ధక శాఖ జేడీ వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

దేశ భద్రతకు నిధుల కేటాయింపు భేష్

మాట్లాడుతున్న ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్

బాపట్ల: దేశ భద్రత, శాంతి భద్రతల పరిరక్షణ పోలీసు దళాల ఆధునికీకరణ కోసం బడ్జెట్‌లో అధిక నిధులు కేటాయించడం హర్షణీయమని పార్లమెంటరీ హోం వ్యవహారాల స్టాండింగ్ కమిటీ సభ్యుడు, ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్ అన్నారు. కొత్త ఢిల్లీలో నిర్వహించిన పార్లమెంటరీ హోం వ్యవహారాల స్టాండింగ్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. సెంట్రల్ ఆర్మ్‌డ్ పోలీస్ బలగాలు, సెంట్రల్ పోలీస్ ఆర్గనైజేషన్లను మరింత బలోపేతం చేయడానికి రూపొందించిన ప్రణాళికలు బాగున్నాయన్నారు. ఆధునిక సాంకేతిక వినియోగం ద్వారా దళాల మరింత సమర్థంగా పని చేసేలా శిక్షణ ఇవ్వాలన్నారు. మౌలిక సదుపాయాల కల్పనకు అధిక ప్రాధాన్యం ఇవ్వడం అభినందనీయమన్నారు.

రొయ్యల చెరువులో విషప్రయోగం

నగరం, న్యూస్‌టుడే: రొయ్యల చెరువులో విషం కలిపిన ఘటన నగరం మండలం చిలకాలవారిపాలెంలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన చిలకాల పరంధరామయ్య గ్రామంలోని రెండు ఎకరాలు కౌలుకు తీసుకుని ఆక్వా సాగు చేశారు. రెండు రోజుల్లో పంట తీద్దామనుకున్న సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు చెరువులో విషాన్ని కలిపారు. విష ప్రయోగం వల్ల 60 కౌంట్‌కు వచ్చిన రొయ్యలు మొత్తం చనిపోవడంతో రూ.20 లక్షలు నష్టం వాటిల్లిందని బాధిత కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరవుతున్నారు. స్థానిక స్టేషన్లో మంగళవారం ఫిర్యాదు చేసినట్లు బాధితుడు తెలిపారు.

కుమార్తెను దూషించొద్దన్నందుకు తల్లిపై కత్తితో దాడి

నడింపల్లి (చెరుకుపల్లి గ్రామీణ), న్యూస్‌టుడే: మండలంలోని నడింపల్లిలో మహిళపై వ్యక్తి కత్తితో దాడి చేశాడు. వివరాలు ఇలా.. మంగళవారం గ్రామానికి చెందిన సామ్రాజ్యం తన కుమార్తె(16) పొలం వద్ద గడ్డి కోసేందుకు వెళ్లింది. అక్కడ వారి ఇంటి సమీపంలోని సత్యనారాయణ గడ్డి కోసే విషయంపై ఆమె కుమార్తెను దూషించాడు. ఈ నేపథ్యంలో సామ్రాజ్యం ఆయన్ను ఎందుకు దూషించావని ఆయన్ను అడిగింది. తన బిడ్డను దూషించడం పద్ధతి కాదని ఆమె చెప్పగా వారిద్దరికి వాదోపవాదాలు జరిగాయి. తనతో వాదన చేయడాన్ని సహించలేని సత్యనారాయణ విచక్షణ కోల్పోయి చేతిలోని కత్తితో ఆమెపై దాడి చేశాడు. చేతిని అడ్డుపెట్టగా ఆమె చెయ్యికి గాయాలయ్యాయి. చుట్టు పక్కల వారు చికిత్స నిమిత్తం ఆమెను తొలుత గుళ్లపల్లిలోని ప్రైవేట్ వైద్యశాలకు తరలించారు. ఆమె చేతికి 15 కుట్లు పడ్డాయి. అక్కడి నుంచి ఆమెను మెరుగైన చికిత్స నిమిత్తం రేపల్లె ఏరియా వైద్యశాలకు తరలించారు. ఘటనపై తమకు ఫిర్యాదు అందలేదని ఎస్సై అనిల్‌కుమార్ తెలిపారు.

అనుమతులు లేని సంరక్షణ కేంద్రం రద్దు

కొల్లూరు, న్యూస్‌టుడే: కొల్లూరు గాంధీనగర్‌లో కొంతకాలంగా పిల్లల సంరక్షణ కేంద్రం నడుపుతున్నారు. ప్రభుత్వ అనుమతులు లేవని ఉన్నతాధికారులకు ఫిర్యాదు అందడంతో మంగళవారం అమృతలూరు సీడీపీవో లక్ష్మీదేవి ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆ కేంద్రాన్ని ఆకస్మిక తనిఖీ చేశారు. ఎటువంటి అనుమతులు, ఆడిట్ రికార్డులు, పత్రాలు లేకపోవడాన్ని గుర్తించారు. కొన్ని సంవత్సరాలుగా ఆశ్రమం పొందుతున్నామని కొంతమంది పిల్లలు, అందులో పనిచేసే సిబ్బంది తెలిపారు. 2015 సెక్షన్ 41 ప్రకారం రిజిస్ట్రేషన్ లేనటువంటి పిల్లల సంరక్షణ కేంద్రాన్ని మూసివేస్తున్నట్లు సీడీపీవో తెలిపారు.

ఇంటి నుంచి వెళ్లిపోయిన పిల్లలు కాచిగూడలో గుర్తింపు

కాచిగూడ పోలీసుల అదుపులో రాజ్‌కుమార్, యొహోషా

రేపల్లె అర్బన్, న్యూస్‌టుడే: తల్లిదండ్రులు మందలించారని ఇంటి నుంచి వెళ్లిన పిల్లలను తెలంగాణ రాష్ట్రం కాచిగూడ రైల్వే స్టేషన్‌లో పోలీసులు గుర్తించారు. రేపల్లె మండలం పేటేరు ఆంజనేయస్వామికాలనీలో దంపతులు దిడ్ల గోపయ్య, సంధ్య ఇద్దరు కుమారులతో నివసిస్తున్నారు. గోపయ్య ఆటో నడుపుతుండగా సంధ్య మాంట్‌ఫోర్ట్ పాఠశాలలో ఆయాగా పనిచేస్తోంది. అదే పాఠశాలలో రాజ్‌కుమార్, యొహోషా 8, 3 తరగతి చదువుతున్నారు. అన్నదమ్ములిద్దరూ సరిగా చదవడం లేదని ఎప్పుడూ ఆటలు ఆడతున్నారని తల్లిదండ్రి మందలించారు. మంగళవారం ఉదయం 8 గంటల సమయంలో ఇంట్లో నుంచి సైకిల్‌పై బయటకు వెళ్లారు. అమ్మానాన్న ఇద్దరూ తిడుతున్నారు, మేం వెళ్లిపోతున్నాం, మా కోసం వెతకొద్దంటూ ఉత్తరం రాసి వెళ్లిపోయారు. తండ్రి గోపయ్య ఫిర్యాదు మేరకు సీఐ మల్లికార్జునరావు కేసు నమోదు చేశారు. పిల్లల ఆచూకీ కనుగొనేందుకు మూడు బృందాలను ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో కాచిగూడ రైల్వే పోలీసులు నుంచి పిల్లలను కనుగొన్నట్లు సమాచారం అందిందని సీఐ తెలిపారు. అన్నదమ్ములు క్షేమంగా ఉన్నారని తెలియడంతో తల్లిదండ్రులు, పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు.

పాఠశాలల్లో క్రమం తప్పకుండా తనిఖీలు నిర్వహించాలి

బాపట్ల, న్యూస్‌టుడే: స్వర్ణ వార్డుల పరిధిలోని పాఠశాలల్లో ప్రతి సోమ, గురువారాలు వార్డు సంక్షేమ, విద్యా కార్యదర్శులు తప్పనిసరిగా తనిఖీ చేయాలని కలెక్టర్ వినోద్‌కుమార్ అన్నారు. కలెక్టరేట్ నుంచి మంగళవారం నిర్వహించిన వీసీలో ఆయన మాట్లాడారు. పాఠశాలల్లో తనిఖీల సమయంలో బోధన- అభ్యాస వ్యవస్థ, మౌలిక సదుపాయాలు, విద్యార్థుల హాజరు, మధ్యాహ్న భోజన పథకం అమలు, పారిశుద్ధ్య పరిస్థితులు వంటి అంశాలను సమగ్రంగా పరిశీలించాలన్నారు. తనిఖీలు నిర్వహించిన చిత్రాలను ఐఎంఎంఎస్ యాప్‌లో అప్లోడ్ చేయాలని పేర్కొన్నారు. నిర్దిష్ట గడువులోగా నివేదికలు సమర్పించాలని ఆదేశించారు. డీఈవో శ్రీనివాస సింగ్, జీడబ్ల్యూఎస్ జిల్లా సమన్వయకర్త యశ్వంత్ పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు (కిలో 1కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 115, రిటైల్ ధర - 142, చికెన్ విత్‌స్కిన్ - 206, చికెన్ స్కిన్‌లెస్ - 234.

కృష్ణా జిల్లాలో: వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -115 రిటైల్ ధర 142 చికెన్ విత్ స్కిన్ - 206 చికెన్ స్కిన్‌లెస్ - 234.

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 116, 123, 135 చికెన్ విత్ స్కిన్ - 220 చికెన్ స్కిన్‌లెస్ - 230.

బీసీ గురుకులంలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

నిజాంపట్నం, న్యూస్‌టుడే: నిజాంపట్నం బీసీ గురుకుల పాఠశాల, కళాశాలలో 2025- 2026 సంవత్సరానికి గాను 5వ తరగతి, ఇంటర్‌లో ప్రవేశ పరీక్షలకు అర్హులైన వారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ నాగమల్లేశ్వరరావు తెలిపారు. మార్చి 4వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయవచ్చని చెప్పారు. వివరాలకు సెల్‌నెం. 98665 59636 లేదా 73309 20743 సంప్రదించాలన్నారు.

85 శాతం విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ

బాపట్ల: విద్యార్థుల్లో నులి పురుగుల నివారణకు ప్రతి ఆరు నెలలకు ఒకసారి ఉచితంగా ఆల్బెండజోల్ మాత్రలను ప్రభుత్వం పంపిణీ చేస్తోందని డీఎంహెచ్‌వో విజయమ్మ అన్నారు. పాఠశాలలో విద్యార్థులకు నులి పురుగుల నివారణ మాత్రల పంపిణీని ఆమె మంగళవారం పర్యవేక్షించారు. విజయమ్మ మాట్లాడుతూ నులిపురుగుల వల్ల విద్యార్థుల్లో రక్త హీనత సమస్య వచ్చి ఎదుగుదల లోపిస్తోందన్నారు. అనారోగ్యానికి గురై సరిగా చదవలేకపోతున్నారని పేర్కొన్నారు. 85 శాతానికి పైగా విద్యార్థులకు మాత్రలు పంపిణీ చేసినట్లు తెలిపారు. మిగిలిన వారికి ఈనెల 24న అందజేస్తామన్నారు.

ఏకీకృత కుటుంబ సర్వేపై సమీక్ష

వేటపాలెం న్యూస్‌టుడే: సంక్షేమ పథకాలను ప్రతి ఒక్కరికీ అందించాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఏకీకృత కుటుంబ సర్వేను బాపట్ల జిల్లా అభివృద్ధి అధికారి విజయలక్ష్మి సమీక్షించారు. మంగళవారం మండలంలోని కొత్తపేట పంచాయతీ పరిధిలోని స్వర్ణ గ్రామం, స్వర్ణ వార్డు మూడు సచివాలయాల పరిధిలోని సిబ్బంది ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సర్వేను ఆమె సమీక్షించి, త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. సర్వే ముగిసిన అనంతరం ప్రతి కుటుంబానికీ యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వే స్మార్ట్ కార్డులు అందిస్తారన్నారు. ఎంపీడీవో ఎం.రాజేష్‌బాబు, డిప్యూటీ ఎంపీడీవో జున్ను మరియమ్మ పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనం అదుపు తప్పి యువకుడి దుర్మరణం

గణపవరం(చిలకలూరిపేట గ్రామీణ), న్యూస్‌టుడే: ద్విచక్ర వాహనం అదుపు తప్పి రెయిలింగ్‌ను ఢీకొని యువకుడు దుర్మరణం చెందిన సంఘటన నాదెండ్ల మండలం గణపవరం పరిధిలో కొత్త బైపాస్ రహదారిపై మంగళవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. బాపట్ల జిల్లా మార్టూరు మండలం వలపర్లకు చెందిన షేక్ ఖాజావలి (31) కూరగాయల వ్యాపారం చేస్తుంటాడు. అందులో భాగంగా మార్టూరు నుంచి ద్విచక్రవాహనంపై గుంటూరు వెళ్తుండగా అతను నడుపుతున్న ద్విచక్ర వాహనం అదుపుతప్పి గణపవరం బైపాస్ పరిధిలో రెయిలింగ్‌ను ఢీకొట్టింది. దీంతో కిందపడిన ఖాజావలి తలకు తీవ్ర గాయాలై సంఘటనా స్థలంలోనే మృతిచెందాడు. అదే సమయంలో ఖాజావలి జేబులోని సెల్‌ఫోన్ రోడ్డుపై పడిపోవడంతో వాహనాల కింద పడి నుజ్జయింది. పోలీసులు అందులోని సిమ్ తీసి దాని ద్వారా మృతుడి వివరాలు తెలుసుకుని కుటుంబ సభ్యులకు సమాచారమిచ్చారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. మృతుడి సోదరుడు బాషిద్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెంకటేశ్వరరావు తెలిపారు. మరణానంతర పరీక్షల నిమిత్తం మృతదేహాన్ని చిలకలూరిపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

రైలు ఢీకొని విశ్రాంత ఆర్టీసీ ఉద్యోగి మృతి

చీరాల అర్బన్,న్యూస్‌టుడే: రైలు ఢీకొని విశ్రాంత ఆర్టీసీ ఉద్యోగి మృతిచెందిన ఘటన చీరాల ఫైర్ గేటు వద్ద మంగళవారం చోటుచేసుకుంది. రైల్వే ఎస్సై కొండయ్య కథనం మేరకు.. పట్టణంలోని హరిప్రసాద్‌నగర్‌కు చెందిన వల్లెపు ఆనందరావు (64) ఆర్టీసీ సంస్థలో పనిచేసి, ఉద్యోగ విరమణ చెందారు. ప్రస్తుతం అల్పాహారశాల నిర్వహిస్తున్నారు. సరకుల కోసం పట్టణంలోకి వెళ్లే నిమిత్తం ద్విచక్ర వాహనంపై రైలు పట్టాలు దాటుతుండగా.. ఒంగోలు వైపు వెళ్లే రైలు ఢీకొని అక్కడికక్కడే మృతి చెందారు. మృతదేహాన్ని ఏరియా వైద్యశాలకు తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

91.9FM Vijayawada

ఈఎఫ్ఎమ్ కార్యక్రమాలు

సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ. 5 - ఉ. 7
ఈ-మార్నింగ్స్	ఉ. 7 - ఉ. 11
నువ్వా నేనా	ఉ. 11 - మ. 2
సత్యభామ	మ. 2 - సా. 5
లైట్ తీస్కో	సా. 5 - రా. 9
సరదాగా కాసేపు	రా. 9 - రా. 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా. 12 - తె. 5

/Eenadufm

For Advertising on Eenadu FM Contact 80080 03297

శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్

SHRIRAM Finance

నమోదిత కార్యాలయం: శ్రీ టవర్స్, ప్లాట్ నెం.14ఎ, సౌత్ ఫేజ్, ఇండస్ట్రియల్ ఎస్టేట్, గిండి, చెన్నై-600032.

జోనల్ ఆఫీస్: శ్రీరామ్ ఎస్టేట్స్, అన్నపూర్ణ నగర్, 5వ లేన్, ఇన్నర్ రింగ్ రోడ్, గోరంట్ల, గుంటూరు-522034.

డిమాండ్ నోటీసు

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం 2002, సెక్షన్ 13(2) అనుసరించి డిమాండ్ నోటీసును జారీచేయడమైనది.

రుణగ్రహీత(లు)/సహ-రుణగ్రహీత(లు)/హామీదారు(లు) పేరు	ఎన్‌పిఎ తేది 10-05-2025	డిమాండ్ నోటీసు తేది 13-01-2026
ఎంటర్‌ప్రైజ్ ఫైనాన్స్ ఋణ ఖాతా నెం. GNTR4TF2405230001, తేది: 23-05-2024; 1) గెల్లి నవీన్ కుమార్; 2) గెల్లి సుభ లక్ష్మి; 3) గెల్లి ప్రసాద్; 4) గెల్లి సత్యనారాయణ; 5) బొలిశెట్టి శ్రీనివాసరావు	ఋణం మొత్తం రూ. 75,00,000/- (డెబ్భై ఐదు లక్షల రూపాయలు మాత్రమే)	మొత్తం బకాయి: రూ. 95,72,245/- తేది 13-01-2026 నాటికి

ప్రదేశం: గుంటూరు — సం/- అధీకృత అధికారి, శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్

శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్

SHRIRAM Finance

నమోదిత కార్యాలయం: శ్రీ టవర్స్, ప్లాట్ నెం.14ఎ, సౌత్ ఫేజ్, ఇండస్ట్రియల్ ఎస్టేట్, గిండి, చెన్నై-600032.

జోనల్ ఆఫీస్: శ్రీరామ్ ఎస్టేట్స్, అన్నపూర్ణ నగర్, 5వ లేన్, ఇన్నర్ రింగ్ రోడ్, గోరంట్ల, గుంటూరు-522034.

డిమాండ్ నోటీసు

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం 2002, సెక్షన్ 13(2) అనుసరించి డిమాండ్ నోటీసును జారీచేయడమైనది.

రుణగ్రహీత(లు)/సహ-రుణగ్రహీత(లు)/హామీదారు(లు) పేరు	ఎన్‌పిఎ తేది 07-02-2025	డిమాండ్ నోటీసు తేది 14-01-2026
ఎంటర్‌ప్రైజ్ ఫైనాన్స్ ఋణ ఖాతా నెం. PONNRTF2405270002, తేది: 30-05-2024	ఋణం మొత్తం రూ. 25,00,000/- (ఇరవై ఐదు లక్షల రూపాయలు మాత్రమే)	మొత్తం బకాయి: రూ. 33,56,569/- తేది 14-01-2026 నాటికి

ప్రదేశం: గుంటూరు — సం/- అధీకృత అధికారి, శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్

ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్

కృష్ణనగర్, గుంటూరు(7031) ఫోన్: 0863-2233554, మొబైల్: 9390478331, email: bm0031@apgb.bank.in

సర్ఫేసి చట్టం లోని నియమం 4(2)(1) క్రింద నోటీసు (చరాస్తుల పై)

తేది : 10-02-2026, ప్రదేశం: గుంటూరు — అధీకృత అధికారి, ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్

SBI స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

స్ట్రెస్డ్ అసెట్స్ రికవరీ బ్రాంచ్ (కోడ్- 05172)

2వ అంతస్తు, టిఎస్‌ఆర్‌టిసి కమ్యూటర్ అమెనిటి సెంటర్, బస్ టెర్మినల్ కాంప్లెక్స్, కోఠి, హైదరాబాద్-500095. టి.ఎస్. ఇ-మెయిల్: sbi.05172@sbi.co.in

స్థిరాస్తుల అమ్మకానికి విక్రయ ప్రకటన

వివరాలకు https://baanknet.com, website URL: https://baanknet.com

అదనపు వివరాలకు దయచేసి దిగువ అధికారులను ఏ పనిదినంలో అయినా ముందస్తు అనుమతితో 07.03.2026 సా. 5.00 గం. లోగా సంప్రదించండి. 1) సందీప్ పరిడాల, మేనేజర్, మొబైల్ నం. 89859 03747 2) శ్రీ గంజి ప్రసాద్, చీఫ్ మేనేజర్, మొబైల్ నం. 98669 86725.

తేది 17.02.2026 స్థలం: హైదరాబాద్. సం/- అధీకృత అధికారి, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా.SARB-1, హైదరాబాద్.

EENADU Classifieds

BUSINESS SERVICES

బంగారం బ్యాంకులలో/ ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈరోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్). Ph: 81422 92071.

బంగారం కొనబడును. బ్యాంకులలో ఇతర ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీబంగారం విడిపించి అధిక ధరకు కొనబడును (స్పాట్ క్యాష్). ✆ 87907 41166

PROFESSIONAL SERVICES

ASTROLOGY

తమిళనాడు వైదీశ్వరన్ కోయిల్ శ్రీ అగస్త్యే నాడి జ్యోతిష్యాలయం మీ చేతి బొటనవేలు ముద్రతో మీ భవిష్యత్తు పూర్తిగా చెప్పబడును. అన్ని సమస్యలకు పరిష్కారం చెప్పబడును. 89782 15913.

REAL ESTATE

PLOT FOR SALE

GENERAL

Commercial plot 1373 sq.yds Inner Ring road, Guntur, with 1.25 lakhs Rent and bank loan for immediate sale. Call: 9573454266.

గుంటూరులో వెంచర్, RTO ఆఫీస్ నుండి 6 కి.మీ., 40 అ||రోడ్ ఆనుకొని దామరపల్లిలో దారు రోడ్లు, డ్రైనేజ్, ప్రహరీ. చ||గ|| రూ. 11000/-. స్పా.రి. 8317528192.

TO LET

Office Premises is available in Sailok Complex 1st Floor at 6/1 Arundelpet, Guntur with fecilities of Ac, Lift & Both Room, Contact, Cell: 92484 94407.

JOBS

Wanted DRA Tele Callers, Field Executives & Team Leaders Banking Sector Attractive Salaries and Incentives, ✆ 9849394835, 7075345527.

Wanted Teachers for Reputed Schools in A.P & Telangana, Contact: Sneha Placements Service. Ph: 94402 46409.

PROs, Marketing Managers Required. Salary: 27,500/-., NTR Circle, Vijayawada. ✆ 63043 28479.

ప్రముఖ మ్యాన్ పవర్ సెక్యూరిటి ఏజెన్సీకి డెవలప్‌మెంట్ ఆఫీసర్ కావలెను. ✆ 95029 49415.

గుంటూరు, ఆటోనగర్‌లో H.P. పెట్రోల్ బంక్‌లో పనిచేయుటకు మేనేజర్, పంపు బాయ్స్/ గర్ల్స్ కావలెను. పార్ట్ టైమ్/ ఫుల్ టైమ్. 7799689889, 8074546302.

త్రినేత్ర హోంకేర్‌లో వృద్ధులను/ పేషెంట్స్‌ను /పిల్లలను చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఫ్రీ వసతి, భోజనం. జీ: 18K. ✆ 85209 80099, 85208 74499.

గుంటూరు మాస్టర్‌మైండ్స్ కాలేజి నందు క్లాసు ఇన్‌ఛార్జీస్ మరియు క్యాంపస్ ఇన్‌ఛార్జీస్‌గా పని చేయుటకు పురుషులు కావలెను. జీతము: 14,000/- నుండి 21,000/- వరకు ఇవ్వబడును. అర్హతలు: ఇంటర్ నుండి పి.జి. వరకు. వయస్సు: 22 సంవత్సరాలు నుండి 45 సంవత్సరాలు వరకు ఉండవలెను. గుంటూరు లోకల్ వ్యక్తి అయ్యి ఉండాలి. సంప్ర: ఫోన్ నెం. 8978480435.

గుంటూరు సిటీలోని ప్రముఖ బ్యాంక్ అనుబంధ సంస్థతో కలిసి పని చేయుటకు విశ్రాంత ఉద్యోగులు, హౌస్‌వైఫ్ 10th పాస్, 50సం||పై వయస్సు వారు కావలెను. 7036761665.

అకౌంట్స్ మేనేజర్ కావలెను. బి.కాం., 5 సం||లు అకౌంట్స్‌పై అనుభవం, ఇన్‌కంటాక్స్, GST రిటన్స్ వేయగలిగిన వారు kamathamjob@gmail.com కు పంపగలరు.

ఆఫీస్ స్టాఫ్, నర్సెస్ (MPHW) కావలెను. కొత్తవారికి కూడా ప్రాధాన్యత. అహల్యా నర్సింగ్ హోమ్, శివాలయం వెనుక, కొత్తపేట, గుంటూరు. ✆ 92464 27459.

హరేకృష్ణ హోంకేర్‌లో వృద్ధులను/ పేషంట్స్/ పిల్లలను చూసుకొనుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఫ్రీ వసతి, భోజనం జీ: 18-20K ✆ 96404 68899, 96402 58899

గుంటూరు ఓల్డ్ క్లబ్ రోడ్, ఆపిల్ డెంటల్ కేర్‌లో పని చేయుటకు Male/Female అసిస్టెంట్స్ కావలెను. గుంటూరు లోకల్‌వారు మాత్రమే. ✆ 63022 43437.

గుంటూరు సిటీ RTC బస్టాండ్ దగ్గరలో ప్రముఖ బిర్యానీ హోటల్ నందు పని చేయుటకు సప్లయిర్ కావలెను. లోకల్ వారికి ప్రాధాన్యత. ✆ 96668 41537.

ప్రముఖ దంత వైద్యశాల నందు పని చేయుటకు అసిస్టెంట్ మరియు రిసెప్షనిస్ట్ స్టాఫ్ కావలెను. సంప్ర॥ 78420 31133.

ప్రముఖ విద్యాసంస్థలో పని చేయుటకు రిసెప్షనిస్ట్, టీచర్స్, టీమ్‌లీడర్స్ మరియు మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. ఆకర్షణీయమైన జీతం ఇవ్వబడును. సంప్రదించండి: 87126 18882. గుంటూరు.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

Book your 5 lines Classified Colour Rs.770/- | 3Ads Package Rs.1945/-

5 lines Classified B/W Rs.650/- | 3Ads Package Rs.1625/-

ప్రకటనపై 5% జి.ఎస్.టి. అదనం

తక్కువ బడ్జెట్‌లో మీ అవసరాలు తీర్చే ఏకైక మార్గం.. ఈనాడులో ప్రకటన ఇవ్వటం

పూర్తి వివరాలకు సంప్రదించండి: 8008510541

బాపట్ల
•బాపట్ల •రేపల్లె •వేమూరు

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

బాపట్ల : 80085 73141, రేపల్లె : 80085 73136, వేమూరు: 91107 83738

? జంపనిలో హిందూ శ్మశానవాటిక ఎదురు రోడ్డుపై చెత్త వేస్తున్నారు. ఆ మార్గంలో వెళ్లే వారు ఇబ్బంది పడుతున్నారు. **- స్థానికుడు, జంపని** ✔ వెంటనే పంచాయతీ కార్యదర్శితో మాట్లాడి, ప్రజలకు ఇబ్బంది లేకుండా చర్యలు చేపడతాం. **- రవికుమార్, ఎంపీడీవో** –న్యూస్‌టుడే, వేమూరు

? కర్లపాలెం మండల పరిధిలోని పేరలి గ్రామంలో పంచాయతీ కార్యాలయం భవనం మీద ఉన్న వాటర్ ట్యాంక్ నిండి ప్రతీరోజు తాగునీరు వృథాగా పోతున్నాయి. **-అర్జున్‌రెడ్డి, స్థానికుడు** ✔ పంచాయతీ భవనం మీద ఉన్న ట్యాంకులోని నీరు పోకుండా చర్యలు తీసుకుంటాం. **-కె.అరుణ్‌బాబు, కార్యదర్శి** ? బాపట్ల మండల పరిధిలోని తూర్పు పిన్నిబోయినవారిపాలెంలో రెండువైపులా రోడ్డు మీద ఎక్కువగా ఇసుక పేరుకుపోయి ఉంది. వాహనాలు జారి ప్రమాదలు చోటుచేసుకుంటున్నాయి. **-పి.గోపి,స్థానికుడు**
✔ రోడ్లమీద ఉన్న ఇసుక తొలగించేలా చర్యలు తీసుకుంటాం. **-రమేష్, కార్యదర్శి** – న్యూస్‌టుడే, బాపట్ల టౌన్

? ఖాజీపాలెం పంచాయతీ పరిధిలోని మసీదు వీధిలో రహదారి పక్కనే గల ముళ్లపొదల్లో చెత్త వ్యర్థాలు వేస్తున్నారు. **- జమీర్** ✔ పరిశీలించి చెత్త వ్యర్థాలను తొలగించి సమస్య లేకుండా చేస్తాం. **- ప్రసాదరావు, పంచాయతీ కార్యదర్శి, ఖాజీపాలెం**
– న్యూస్‌టుడే, ఖాజీపాలెం (పిట్టలవానిపాలెం)

? రేపల్లె 2వ వార్డు గురుకుల పాఠశాల మార్గం, గూనివారి పాలెం రోడ్డులో రెండు చొప్పున చేతిపంపులు పనిచేయడం లేదు. **-సాగర్, గోపి స్థానికులు** ✔ వెంటనే పాడైన చేతిపంపులు బాగు చేసేలా చర్యలు తీసుకుంటాం. **-శామ్యూల్, మున్సిపల్ ఏఈ రేపల్లె** – న్యూస్‌టుడే, రేపల్లె అర్బన్

స్పందన: చెత్త తొలగింపు .. **రాజోలు (చెరుకుపల్లి గ్రామీణ):** మండలంలోని రాజోలు వద్ద రోడ్డు పక్కనే పేరుకుపోయిన చెత్తకు నిప్పు పెట్టడంతో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. ఈనెల 16న ఈనాడులో 'మేమున్నాం.. మీకు తోడుగా' శీర్షిక ప్రచురితమైన సమస్యపై అధికారులు స్పందించారు. ఈవోపీఆర్‌డీ ఆదేశాలతో పంచాయతీ సిబ్బంది మంగళవారం నిప్పును ఆర్పేశారు. చెత్తను అక్కడి నుంచి తొలగించి చర్యలు తీసుకున్నారు.

ముళ్లపొదలు.. **పిట్టలవానిపాలెం, న్యూస్‌టుడే:** చందోలు మదీనా వీధిలో నివాస గృహాల మధ్య ఖాళీ స్థలాల్లో ముళ్లపొదలు ఉండటంతో స్థానికులు సమస్యను మేమున్నాం మీకు తోడుగా శీర్షికన 'ఈనాడు' దృష్టికి తీసుకురాగా 15వ తేదీన ప్రచురితమైంది. స్పందించిన డిప్యూటీ ఎంపీడీవో సుజాత యంత్రం సాయంతో ముళ్లపొదలు తొలగింపజేశారు.

మురుగు పూడిక తీత.. **భట్టిప్రోలు, న్యూస్‌టుడే:** భట్టిప్రోలు గ్రంథాలయం వద్ద మురుగు స్తంభించి దుర్వాసన వెదజల్లుతుండటంపై మంగళవారం ఈనాడు మేమున్నాం.. మీకు తోడు శీర్షికన ప్రచురితమైన కథనానికి పంచాయతీ అధికారులు స్పందించారు. ఆ ప్రాంతంలో మురుగు తీసి నీరు పారుదలయ్యేలా చర్యలు తీసుకున్నారు.

ఉత్సాహంగా శాప్ లీగ్ పోటీలు ప్రారంభం

బావట్ల, న్యూస్‌టుడే: క్రీడలు విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు పెంపొందించి మనోవికాసాన్ని కలిగిస్తాయని ఆర్డీవో గ్లోరియా అన్నారు. మినీ ఇండోర్ స్టేడియంలో జిల్లా స్థాయి శాప్ లీగ్ పోటీలను ఆమె మంగళవారం ప్రారంభించారు. విజేతలను రాష్ట్ర స్థాయి పోటీలకు పంపిస్తామని డీఎస్డీవో శ్రీనివాసరావు తెలిపారు.

స్త్రీ శక్తి యాప్‌పై అవగాహన ఉండాలి

జంపని (వేమూరు), న్యూస్‌టుడే: బాలికలు స్త్రీ శక్తి యాప్‌పై అవగాహన పెంచుకోవాలని ఎస్సై శ్రీనివాసరావు అన్నారు. జంపని ఉన్నత పాఠశాలలోని బాలికలకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన కల్పించారు. ఆపద సమయంలో స్త్రీ శక్తి యాప్ వినియోగ విధానాన్ని వారికి వివరించారు.

చెరువుల్లో పూడికతీత ఎప్పుడో..?

దోమలకు నిలయంగా మారిన వైనం

న్యూస్‌టుడే, కనగాల, గుళ్లపల్లి (చెరుకుపల్లి గ్రామీణ), రేపల్లె అర్బన్, బాపట్ల

తాగునీటికి.. ఇతర అవసరాల కోసం గతంలో ఏర్పాటు చేసిన గ్రామ చెరువులు నేడు నిరుపయోగంగా మారాయి. వీటిని అధికారులు పట్టించుకోకపోవడంతో గుర్రపు డెక్క, తూటికాడలతో మురుగు కూపాలుగా మారాయి. దీంతో దోమల ఉద్ధృతి పెరిగి ప్రజారోగ్యంపై ప్రభావం చూపుతోంది. చెరుకుపల్లి మండలం కనగాల..గుళ్లపల్లిలోని చెరువులను శుభ్రం చేయాలని స్థానికులు ఎప్పటి నుంచో కోరుతున్నా పాలకులు, అధికారులు పట్టించుకోవడం లేదు. ఈ వేసవిలో అయినా వీటిని శుభ్రం చేసి పూర్వ వైభవం తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

గుళ్లపల్లిలో మురుగు నీటితో నిండి ఇలా..

రోగాల బారిన పడుతున్నారు.. కనగాలలోని ఎల్లప్ప చెరువు దాదాపు మూడు ఎకరాల వరకు ఉంటుంది. చెరువు పూర్తిగా గుర్రపుడెక్కతో నిండిపోయింది. ఏళ్ల తరబడి గ్రామంలోని మురుగు ఇందులోకి వదలడంతో పూర్తిగా అధ్వానంగా మారింది. ఈ చెరువు వల్ల రెండు దశాబ్దాల క్రితం దోమల ఉద్ధృతి పెరిగి బోధ వ్యాధి వచ్చి గ్రామంలో ఎంతో మంది తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు రోగాలకు కారణమైన ఎల్లప్ప చెరువును, దానికి అనుబంధంగా ఉన్న ఎల్లప్ప కాలువను శుభ్రం చేయలేకపోవడం శోచనీయం.

తీరంలో వాడుకలో లేని చెరువులు - దాదాపు	250
పూడిక తీయాల్సినవి -	170
మురుగుతో నిండినవి -	50
ముళ్లచెట్లతో నిండి ఎండిపోయినవి -	30

ఆక్రమణలకు గురవుతూ..

గ్రామంలోని పశువులకు తాగునీరు.. ఇతర అవసరాల కోసం గుళ్లపల్లిలో నూకాలమ్మ ఆలయం ఎదురుగా 70 ఏళ్ల కిందట చెరువును ఏర్పాటు చేశారు. అప్పట్లో దాదాపు 70 సెంట్లకు పైగా విస్తీర్ణంలో ఉండేది. కాలక్రమేణ ఇది ఆక్రమణలకు గురై నేడు పాతిక సెంట్లకు పరిమితమయింది. గత 25 ఏళ్లుగా ఈ చెరువు నిరుపయోగంగా మారింది. చెరువులోకి సాగునీటిని నింపేందుకు ఉపయోగించిన కాలువలు పూడిపోవడంతో గ్రామంలోని మురుగు నీరు అందులోకి వచ్చి చేరుతోంది. దీంతో నేడు మురుగు చెరువుగా మారింది. సమస్యపై చెరుకుపల్లి ఎంపీడీవో మహబూబ్ సుభానీ మాట్లాడుతూ వాడుకలో లేని చెరువుల వివరాలు తెప్పించుకుని ప్రజారోగ్యానికి హానికరంగా మారిన వాటిని గుర్తించి చర్యలు తీసుకుంటామన్నారు. ఉపాధి హామీ పనుల కింద వీటిని శుభ్రం చేయించడంపై అధికారులతో చర్చించి నిర్ణయం తీసుకుంటామని తెలిపారు.

నేతాజీ పాఠశాల విద్యార్థుల క్షేత్ర పర్యటన

రేపల్లె అర్బన్, న్యూస్‌టుడే: పాత రేపల్లె నేతాజీ మున్సిపల్ ఉన్నత పాఠశాల విద్యార్థులు మంగళవారం రాష్ట్ర సచివాలయాన్ని సందర్శించారు. శాసనసభ సమావేశ భవనంలో నిర్వహించిన సమావేశాన్ని వీక్షించారు. గత నెలలో తమ పాఠశాలలో విద్యార్థులు నిర్వహించిన మాక్ అసెంబ్లీ వీడియోను స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు తిలకించి అభినందించారు. కొంచెంసేపు విద్యార్థులతో ముచ్చటించి క్రమశిక్షణతో చదివి ఉన్నతంగా ఎదగాలని ఆకాంక్షించి ఫొటో దిగారు. ప్రధానోపాధ్యాయిని నాగమ్మ, ఉపాధ్యాయుడు పీటా శివరామకృష్ణయ్య ఉన్నారు.

స్పీకర్ అయ్యన్నపాత్రుడుతో ఉపాధ్యాయులు, విద్యార్థులు

ఆలయ నిర్మాణానికి నిధులివ్వాలని వినతి

బాపట్ల, న్యూస్‌టుడే: పట్టణంలో పురాతన సోమేశ్వర స్వామి ఆలయ జీర్ణోద్ధరణ పనుల కింద నూతన ఆలయ నిర్మాణానికి అదనంగా రూ.2 కోట్లు మంజూరు చేయాలని దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డికి ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ విజ్ఞప్తి చేశారు. సచివాలయంలో మంత్రిని ఎమ్మెల్యే మంగళవారం కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. వేగేశన మాట్లాడుతూ గత ప్రభుత్వం కేవలం ఇటుకలతో ఆలయ నిర్మాణానికి రూ.1.10 కోట్లు మంజూరు చేసిందన్నారు. భక్తుల అభిమతం మేరకు ఆలయాన్ని పూర్తిగా రాతి కట్టడంగా నిర్మించాలని నిర్ణయించినట్లు తెలిపారు. గతంలో కేటాయించిన నిధులు సరిపోనందున అదనంగా మంజూరు చేయాలన్నారు. చందోలు బండ్లమ్మ ఆలయంలో నూతన ధ్వజ స్తంభం ఏర్పాటు చేయడానికి అవసరమైన అనుమతులు ఇచ్చి నిధులు కేటాయించాలని కోరారు. బాపట్ల పట్టణంలో తూర్పు సత్రం వెనుక దశాబ్దాలుగా నివాసం ఉంటున్న పది పేద కుటుంబాలకు స్థలాలను రెగ్యులరైజ్ చేయాలని మంత్రికి విజ్ఞప్తి చేస్తూ వినతిపత్రం అందజేశారు.

మంత్రి రామనారాయణ రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న నరేంద్రవర్మ

పనితీరు మార్చుకోకుంటే ఇబ్బందులే

చెరుకుపల్లి: సచివాలయ సిబ్బంది పనితీరు మార్చుకోకుంటే చర్యలు తీసుకుంటామని ఆర్డీవో ఎన్.రామలక్ష్మి హెచ్చరించారు. ప్రజలకు సంతృప్తికర స్థాయిలో చర్యలు అందించడంపై కలెక్టర్ ఆదేశాల మేరకు మంగళవారం చెరుకుపల్లిలో జరిగిన అవగాహన కార్యక్రమంలో ఆర్డీవో పాల్గొని సిబ్బందికి పలు సూచనలు చేశారు. సచివాలయ సిబ్బందిపై 50 శాతం ప్రజలు కూడా సంతృప్తికరంగా లేరన్నది ఐవీఆర్ఎస్ సర్వేలో తేలిందన్నారు. కొంతమందికి వారివారి శాఖల్లో ఏమాత్రం పట్టు లేకపోగా.. వారి విధులు ఏంటో కూడా తెలియడం లేదన్న విషయం కలెక్టర్ దృష్టికి వచ్చిందన్నారు. సంతకం పెట్టాం..సాయంత్రం దాకా సెల్‌తో కాలక్షేపంచేశాం.. వెళ్లాం అంటే కుదరదని హెచ్చరించారు. అనంతరం మండల ప్రత్యేకాధికారిణి పి.పద్మ, తహసీల్దారు సీహెచ్ పద్మావతి, ఎంపీడీవో షేక్ మహబూబ్ సుభానీ తదితరులు పాలనా వ్యవహారాలపై సిబ్బందికి సూచనలు చేశారు. మండల ప్రత్యేకాధికారిణి పద్మ మాట్లాడుతూ ఉద్యోగులు హాజరు వేసి గ్రామాల్లో పర్యటనలకు వెళ్లాల్సివస్తే ఎక్కడికి వెళ్తున్నారు, ఏ పనిపై వెళ్తున్నారనే సమాచారం కూడా రాతపూర్వకంగా తెలియజేయాలన్నారు. పనులకోసం వచ్చే వారిపట్ల మర్యాదగా ఉండాలన్నారు. సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు..

మాట్లాడుతున్న ఆర్డీవో రామలక్ష్మి

నులిపురుగుల నివారణ మాత్రలు పంపిణీ

వేమూరు, కొల్లూరు, వెల్లటూరు(భట్టిప్రోలు),బాపట్ల టౌన్, న్యూస్‌టుడే: విద్యార్థులు ఆరోగ్యం విషయంలో అప్రమత్తంగా ఉండాలని కొల్లూరు తహసీల్దారు వెంకటేశ్వర్లు కోరారు. వేమూరు, కొల్లూరు మండలాల్లోని పలు ఉన్నత పాఠశాలల్లో జాతీయ నులిపురుగుల నివారణలో భాగంగా విద్యార్థులకు నులిపురుగుల మాత్రలు వేశారు. కార్యక్రమంలో పెరవలి పీహెచ్‌సీ వైద్యాధికారిణి సౌమ్య తదితరులు పాల్గొన్నారు. భట్టిప్రోలు మండలం వెల్లటూరు జిల్లా పరిషత్తు పాఠశాలలో ఎంపీపీ దావూరి వెంకటలలితకుమారి వైద్యులతో కలిసి మాత్రలు పంపిణీ చేశారు. బాపట్ల మండలం ముత్తాయిపాలెం ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు మాత్రలు విద్యార్థుల నోట్లో వేశారు.

విద్యార్థినికి మాత్రలు వేస్తున్న తహసీల్దారు వెంకటేశ్వర్లు

యాంత్రీకరణతో సాగు సులువు

బాపట్ల, న్యూస్‌టుడే: వ్యవసాయ యాంత్రీకరణతో పంటల సాగు సులువుగా ఉంటుందని ఎన్టీఆర్ ఏజీ ఇంజినీరింగ్ కళాశాల ఏడీ డీడీ స్మిత్ అన్నారు. చెరుకూరు, కొత్తపాలెంలో వారం రోజులుగా కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు నిర్వహిస్తున్న ప్రత్యేక జాతీయ సేవా శిబిరం మంగళవారం ముగిసింది. ఆధునిక యంత్రపరికరాలు, సులభమైన పనిముట్లను విద్యార్థులు ప్రదర్శించి వినియోగంపై రైతులకు అవగాహన కల్పించారు. ఆచార్యులు రామిరెడ్డి, ఎన్ఎస్ఎస్ అధికారులు విజయ్‌కుమార్, అశోక్‌కుమార్, పీడీ వెంకటేశ్వర రెడ్డి పాల్గొన్నారు.

తెదేపా కార్యకర్తల కుటుంబాలకు పరామర్శ

పెదపులివర్రు (భట్టిప్రోలు), న్యూస్‌టుడే: మండలంలోని పెదపులివర్రుకు చెందిన తెదేపా కార్యకర్త కొనకాల గోపి ఇటీవల అనారోగ్యంతో బాధపడుతూ వైద్యశాలలో చికిత్స పొందాడు. ప్రస్తుతం ఇంటివద్ద విశ్రాంతి తీసుకుంటున్నాడు. ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు మంగళవారం గోపి, వారి కుటుంబ సభ్యులను పార్టీ నాయకులతో కలిసి పరామర్శించారు. అనంతరం గుత్తా గోపి అనారోగ్య సమస్యలతో మృతిచెందాడు. వీరి కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే పరామర్శించారు.

హామీలు అమలు చేయాలి

పేటేరు(రేపల్లె అర్బన్), ఐలవరం (భట్టిప్రోలు): కూటమి ప్రభుత్వం చేనేతలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని చేనేత సంఘాల కార్యాచరణ కమిటీ నేతలు డిమాండ్ చేశారు. చేనేత న్యాయమైన డిమాండ్ల సాధనకు ఈనెల 22న మంగళగిరిలో తలపెట్టిన చేనేత గర్జన విజయవంతం చేయాలని కోరుతూ మంగళవారం రేపల్లె మండలం పేటేరులో ప్రచారం నిర్వహించారు. భట్టిప్రోలు మండలం ఐలవరంలో నాయకులు కరపత్రాలు పంపిణీ చేశారు.

డెక్క పెరిగింది.. నీరు పారనంటోంది

యడ్లపల్లి ఛానల్‌లో గుర్రపుడెక్క పేరుకుపోవడంతో సాగు నీరు ముందుకు కదలడం లేదు. తెనాలి పట్టణంలోని మురుగునీరు యడ్లపల్లి ఛానల్‌లోకి వదలడం వల్ల కాలువలో కలుపు జాతి మొక్కలు, చెత్తాచెదారం చేరుతుందని రైతులు ఆరోపిస్తున్నారు. యడ్లపల్లి, చినపరిమి, పెదగాదెలవర్రు, ఆలపాడు తదితర గ్రామాల పొలాలకు సాగునీరు అందక రైతులు ఇబ్బంది పడుతున్నారు. పరిస్థితి సంబంధిత అధికారులకు తెలిసినా పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నారు. ఈ విషయమై సాగునీటి శాఖ ఏఈ మాట్లాడుతూ పరిశీలించి సాగునీటికి ఇబ్బంది లేకుండా చర్యలు చేపడతామని తెలిపారు.
- న్యూస్‌టుడే, మోదుకూరు (చుండూరు)

రోడ్డుపై పొంచి ఉన్న ప్రమాదం..

ప్రధాన రహదారుల పక్కన ఎండిన చెట్లు ప్రమాదాలకు నిలయాలుగా తయారయ్యాయి. నగరం- ముత్తుపల్లి, నగరం- పూడివాడ ప్రధాన రహదారుల పక్కన ఎండిన చెట్లు, కొమ్మలు విరిగి ప్రయాణికులను గాయాలపాలు చేస్తున్నాయి. ఆయా గ్రామాలకు చెందిన విద్యార్థులు ద్విచక్రవాహనాలు, సైకిళ్లపై నిత్యం నగరం వచ్చిపోతుంటారు. ఎండిన చెట్ల కొమ్మలు ఈదురు గాలులకు విరిగి ప్రయాణికులపై పడుతున్నాయి. అధికారులు స్పందించి రోడ్డు పక్కన ఉన్న ఎండు చెట్లను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, నగరం**

కదలని మురుగు

మండలంలోని సంగుపాలెంలో ప్రధాన రహదారి పక్కన ఉన్న మురుగు కాలువలో వ్యర్థాలు పేరుకుపోవడంతో మురుగు ముందుకు కదలక దుర్వాసన వస్తోందని స్థానికులు ఆవేదన చెందుతున్నారు. పారిశుద్ధ్య పనులు చేపట్టాలని కోరుతున్నారు. ఈ విషయమై డిప్యూటీ ఎంపీడీవో సుజాత మాట్లాడుతూ పంచాయతీ పారిశుద్ధ్య సిబ్బందితో పనులు చేయించి మురుగు ముందుకు పారేలా చర్యలు తీసుకుంటామన్నారు. **- న్యూస్‌టుడే, పిట్టలవానిపాలెం**

దారి.. డంపింగ్ యార్డుగా మారి

అల్లూరు రక్షిత మంచినీటి పథకానికి వెళ్లే రహదారిపై పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులు చెత్త వ్యర్థాలు వేయడంతో రాకపోకలకు ఇబ్బందిగా మారింది. గ్రామంలోని చెత్తను తీసుకువచ్చి రహదారిపై వేసి యంత్రం సాయంతో పక్కకు నెడుతున్నారు. రాకపోకలు సాగించే రైతులు, వాహనచోదకులు దుర్వాసనతో ఇబ్బంది పడుతున్నామని, అధికారులు స్పందించి చెత్త, వ్యర్థాలు వేయకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, అల్లూరు, (పిట్టలవానిపాలెం)**

విషపురుగులకు నిలయంగా మారినా పట్టించుకోరా?

రేపల్లె మండలం విశ్వేశ్వరం ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ప్రాంగణంలో రెండు భవనాలు పిచ్చి మొక్కలతో నిండింది. ఏళ్ల తరబడి నిరుపయోగంగా మారిన భవన పరిసరాలు పాములకు నిలయంగా మారాయి. రాత్రివేళ వైద్యశాలలకు వచ్చి వెళ్లే సమయంలో విష పురుగుల కాటుకు గురవుతామేమోనని రోగులు భయపడుతున్నారు. అధికారులు స్పందించి పిచ్చిమొక్కలు తొలగించేలా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. తద్వారా భవనాలను వినియోగంలోకి తెచ్చేలా చొరవ చూపాలని కోరుతున్నారు.
- న్యూస్‌టుడే, రేపల్లె అర్బన్

ఎడ్ల పూటీ లాగుడు పోటీల్లో విజేత పెద్దపూడి జత

నందిగామ గ్రామీణం, న్యూస్‌టుడే: ఎన్టీఆర్ జిల్లా నందిగామ మండలం దాములూరులో మంగళవారం రాత్రి తెలుగు రాష్ట్రాల స్థాయి ఎడ్ల పూటీ లాగుడు పోటీలు రసవత్తరంగా సాగాయి. తొలిరోజు సీనియర్ విభాగంలో రెండు క్వింటాళ్ల బరువున్న పూటీని పది నిమిషాల్లో లాగేలా నిర్వహించిన పోటీల్లో బాపట్ల జిల్లా అమృతలూరు మండలం పెద్దపూడి గ్రామానికి చెందిన ఆళ్ల హరికృష్ణ యాదవ్ ఎడ్ల జత 4842 అడుగుల దూరం లాగి ప్రథమంగా నిలిచాయి. బాపట్ల జిల్లా చెరుకుపల్లి మండలం పగడంవారిపాలేనికి చెందిన కుంచల వేదశ్రీలతారెడ్డి ఎడ్లజత 4465 అడుగుల దూరం లాగి ద్వితీయస్థానం, బాపట్ల జిల్లా చిన్నగంజాం మండలం ఆవులదొడ్డి కొత్తపాలెం గ్రామానికి చెందిన గోగినేని జ్ఞానసాయి చౌదరి ఎడ్లజత 4451 అడుగుల దూరంలాగి తృతీయస్థానంలో నిలిచాయి. విజేతలకు వరుసగా దాల సౌజన్యంతో రూ.35 వేలు, రూ.30 వేలు, రూ.25 వేలు వంతున నగదు ప్రోత్సాహకాలు, జ్ఞాపికలను అందజేశారు.

పగలే వెలుగులు

తూర్పు బాపట్ల పరిధిలోని హైదరపేటలో పగలే విద్యుత్తు దీపాలు వెలుగుతున్నాయి. గ్రామం మొత్తం వెలగడం వల్ల విద్యుత్తు బిల్లుల భారం పెరగడంతో పాటు బల్బులు ఎక్కువ కాలం రావు. పగటి వెలుగులను ఆపాలని స్థానికులు కోరుతున్నారు. ఈ విషయమై కార్యదర్శి బి.శీనయ్య మాట్లాడుతూ పరిశీలించి వెలగకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు.
- న్యూస్‌టుడే, నందిరాజు తోట (బాపట్ల టౌన్)

చుండూరుపల్లిలో చోరీకి యత్నం

బాపట్ల, న్యూస్‌టుడే: మండల పరిధిలోని చుండూరుపల్లిలో మన్నే ప్రసాద్ ఇంట్లో గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి యత్నించిన ఘటన మంగళవారం వేకువజామున చోటుచేసుకుంది. ప్రసాద్ కుమారుడు ప్రమాదానికి గురికావటంతో శస్త్ర చికిత్స నిమిత్తం పొన్నూరులోని ప్రైవేటు ఆసుపత్రికి కుటుంబం వెళ్లింది. ఇంట్లో ఎవరూ లేకపోవటంతో గుర్తు తెలియని వ్యక్తులు తలుపుల తాళాలు పగులగొట్టి లోపలికి ప్రవేశించారు. బీరువా తాళం పగలగొట్టటానికి ప్రయత్నిస్తుండగా శబ్దం రావటంతో పొరుగింటి వారు కేకలు వేయటంతో దొంగలు పరారయ్యారు. ఘటనపై బాపట్ల గ్రామీణ పోలీసులకు ఇంటి యజమాని ప్రసాద్ మంగళవారం ఫిర్యాదు చేశారు. పొన్నూరు మండలం చింతలపూడిలో ఎమ్మెల్యే నరేంద్రకుమార్ తల్లి ప్రమీల ఇంట్లో భారీ చోరీ ఘటన చోటుచేసుకున్న నేపథ్యంలో పొన్నూరు గ్రామీణ సీఐ కృష్ణయ్య నేతృత్వంలో పోలీసుల బృందం చుండూరుపల్లి వచ్చి చోరీ యత్నం జరిగిన ప్రసాద్ ఇంటిని పరిశీలించి వెళ్లింది. రెండు చోట్ల చోరీకి వచ్చింది ఒకే దొంగల ముఠాయేనా అన్న కోణంలో ఆధారాల సేకరణకు పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

వేధింపులపై కేసు నమోదు

బాపట్ల, న్యూస్‌టుడే: పట్టణంలోని ఆంధ్రకేసరి నగర్‌కు చెందిన మహిళ పాలపర్తి మౌనిక తనను భర్త నల్లబోతుల ప్రశాంత్ వేధింపులకు గురి చేస్తున్నట్లు పట్టణ పోలీసులకు మంగళవారం ఫిర్యాదు చేసింది. నిందితుడిపై వేధింపుల నిరోధక చట్టం కింద కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ రాంబాబు తెలిపారు.

కాలభైరవునికి ప్రత్యేక పూజలు

అమృతలూరు, న్యూస్‌టుడే: స్థానిక అమృతేశ్వరస్వామి దేవస్థానం క్షేత్ర పాలకుడు శ్రీకాలభైరవస్వామికి మాఘ అమావాస్య సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. కాలభైరవ, రుద్ర, అష్ట భైరవ హోమం, స్వామికి అభిషేకం, పలురకాల పుష్పాలు, నిమ్మకాయలతో అలంకరణ చేశారు. అర్చకులు రామకృష్ణ, కుమార్, మరో 10మంది అర్చకులు పూజా కార్యక్రమాలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాద వితరణ చేశారు.

పూజలందుకున్న కాలభైరవుడు

అభయాంజనేయస్వామికి..

వెల్లటూరు(భట్టిప్రోలు), న్యూస్‌టుడే: మండలంలోని వెల్లటూరు గ్రామదేవత శ్రీ కట్లమ్మతల్లి దేవస్థానంలోని అభయాంజనేయస్వామి విగ్రహ 10వ వార్షికోత్సవం పురస్కరించుకుని మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారికి అలంకరణ చేసి ఆకు పూజలు చేశారు. భజన సమాజం వారు హనుమాన్‌చాలీసా పారాయణం చేశారు. వెల్లటూరు, పరిసర ప్రాంతాల భక్తులు స్వామి వారిని దర్శించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

ప్రత్యేక అలంకారంలో స్వామి

వైభవంగా అమావాస్య హోమం

చందోలు (పిట్టలవానిపాలెం): చందోలు బండ్లమ్మ దేవస్థానంలో అమావాస్య హోమం వైభవంగా నిర్వహించారు. ఆలయ ఈవో నరసింహమూర్తి మాట్లాడుతూ మాఘ మాసం అమావాస్య మంగళవారం కావటంతో బండ్లమ్మ 'శివకామసుందరి'గా భక్తులకు దర్శనం ఇచ్చారన్నారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని పూజలు నిర్వహించి కార్యక్రమాలను తిలకించారు. ఆలయ ఛైర్మన్ చక్రధర్‌రెడ్డి, పాలక మండలి సభ్యులు భక్తులకు ఇబ్బందులు లేకుండా పర్యవేక్షించారు.

శివకామ సుందరిగా బండ్లమ్మ

ముగిసిన రథోత్సవం

బాపట్ల, న్యూస్‌టుడే: అప్పికట్లలో కాశీ విశ్వేశ్వరస్వామి రథోత్సవం మంగళవారం ఘనంగా ముగిసింది. ఆలయం నుంచి రథం వేకువజామున గ్రామానికి చేరుకుంది. ఉదయం 8.30 గంటలకు మళ్లీ గ్రామం నుంచి జీబీసీ రోడ్డు మీదుగా 11 గంటలకు ఆలయానికి చేరుకుంది. యువత, పిల్లలు ఉత్సాహంగా రథాన్ని లాగారు. అప్పికట్ల కూడలి వద్ద కాశీ విశాలాక్షి అన్నపూర్ణ సమేత విశ్వేశ్వరస్వామి ఉత్సవమూర్తులకు భక్తులు అఖండ హారతి ఇచ్చారు. ఉత్సవ నిర్వాహకులు భక్తులకు భారీగా అన్నసంతర్పణ చేశారు.

ఘనంగా లలితా సహస్రనామ పారాయణం

అమృతలూరు, న్యూస్‌టుడే: గోవాడ బాలకోటేశ్వరస్వామి దేవస్థానం వద్ద మాఘ అమావాస్య సందర్భంగా మంగళవారం కోటి కుంకుమార్చన, లలితా సహస్రనామ పారాయణం నిర్వహించారు. దాదాపు 500 మంది మహిళలు పారాయణంలో పాల్గొన్నారు. అర్చకుడు పూజా కార్యక్రమాలు జరిపి భక్తులకు తీర్థప్రసాద వితరణ చేశారు.

పారాయణంలో మహిళలు

సస్యరక్షణ చర్యలతో నాణ్యమైన ఉత్పత్తులు

నగరం, న్యూస్‌టుడే: రబీలో సాగు చేసిన మినుము, పెసర, వేరుసెనగ, మొక్కజొన్న పంటల కోతలు, నిర్వహణ, నాణ్యతలపై సజ్జావారిపాలెంలో మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. రేపల్లె సహాయ వ్యవసాయ సంచాలకురాలు లక్ష్మి రైతులతో కలిసి క్షేత్రస్థాయిలో పంటలను పరిశీలించారు. అనంతరం ఆమె రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ మినుము, పెసర పంట కోతల్లో రైతులు తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. 85 శాతం వరకు కాయలు గట్టిపడిన తర్వాత కోతలు ప్రారంభించాలన్నారు. కార్యక్రమంలో ఏవో రమేష్, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

HEALTH HOSPITALS
కిడ్నీ సమస్యలకు...
డయాలసిస్ మరియు అత్యాధునిక వైద్యసేవలు మన హెల్త్ హాస్పిటల్స్ నందు
డా॥ రామలక్ష్మి తుల్లిమల్లి
M.D., D.N.B. (Nephrology)
Consultant Nephrologist and Transplant Physician
ప్రతి రోజు :
సా॥ గం॥ 5-00 ల నుండి
రా॥ గం॥ 8-00 ల వరకు
కిడ్నీ హెల్త్ ప్యాకేజి మరియు డాక్టర్ కన్సల్టేషన్ కేవలం రూ. 1199/- లు మాత్రమే
• హీమో డయాలసిస్
• పెరిటోనియల్ డయాలసిస్
• కిడ్నీ బయాప్సీ
• ఎ.వి. ఫిస్టులా
• అక్యూట్ కిడ్నీ ఫెయిల్యూర్
• క్రానిక్ కిడ్నీ డిసీజ్
24/7
హెల్త్ హాస్పిటల్స్, తెనాలి © 08644 - 222229, 226060 Cell : 7036505555

శ్రద్ధాంజలి

కీ॥శే॥ తేటవర్తి గురవయ్య గారు
బాపట్ల
మరణం: 08-02-2026
మా భవితకు బంగారు బాటలు వేసిన మా బావ గారైన కీ॥శే॥ తేటవర్తి గురవయ్య గారి మరణానికి చింతిస్తూ... దివికేగిన వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తూ... వారి కుటుంబ సభ్యులకు మా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ..
నేరెళ్ళ పెదబాబు (సూరి)
S/o రామబ్రహ్మం, Ex. సర్పంచ్, సిద్ధాపురం
రైల్వే ZRUCC మాజీ మెంబర్, ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా మాజీ మెంబర్,
శ్రీ లక్ష్మీ వెంకట గణేష్ రాఘవ రైస్ మిల్లు,
శ్రీ లక్ష్మీ గణేష్ రాఘవ ట్రేడర్స్, ఆకివీడు, సెల్: 98487 15777

(c) eenadu

చీరాల

•చీరాల •పర్చూరు

చెరువు నింపాలని వినతి

మార్టూరు, న్యూస్‌టుడే: వేసవిని దృష్టిలో పెట్టుకుని విద్యానగర్ ప్రాంతంలో ఉన్న బాలక్రిష్ణ చెరువు నింపాలని కోరుతూ ఆ ప్రాంత వాసులు మంగళవారం రాత్రి ఎంపీడీవో శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేశారు. సీతాదేవి కాలనీ, విద్యానగర్, సంపత్‌నగర్ వాసులకు ఈ చెరువు ఎంతగానో ఉపయోగపడుతుందని, వెంటనే చెరువుకు సాగర్ జలాలు మళ్లించాలని కోరారు. వినతిపత్రం అందజేసినవారిలో బత్తుల హనుమంతరావు, చెరుకూరి అంజిబాబు, కరణం లక్ష్మయ్య, సూరిబాబు తదితరులు ఉన్నారు.

ఇసుక ట్రాక్టరు స్వాధీనం

చీరాల అర్బన్, న్యూస్‌టుడే: కొత్తపందిళ్లపల్లి నుంచి అక్రమంగా ఇసుకను చీరాల తరలిస్తున్న ట్రాక్టరును మంగళవారం చీరాల మహిళా ఎస్సై రాజ్యలక్ష్మి స్వాధీనం చేసుకున్నారు. ట్రాక్టరు డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఆమె తెలిపారు.

హోమియో వైద్యంపై అవగాహన

చీరాల, న్యూస్‌టుడే: రోటరీక్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం మహిళా కళాశాల విద్యార్థులకు హోమియో వైద్యంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు శ్రీనివాస్ హోమియో వైద్యవిధానం, వ్యాధులు నయం చేసే తీరు గురించి వివరించారు. ప్రిన్సిపల్ ఎన్.మురళి, రోటరీ అధ్యక్ష, కార్యదర్శులు జాలాది కృష్ణమూర్తి, లక్ష్మీ ప్రతాప్, విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఈ-పంట నమోదు తప్పనిసరి

చీరాల గ్రామీణం: రైతులు వెంటనే ఈ-పంట నమోదు చేయించుకోవాలని ఏవో నిర్మలాదేవి సూచించారు. చీరాల మండలం బుద్ధావారిపాలెం, పిట్టువారిపాలెం గ్రామాల్లో మంగళవారం పంట పొలాలను వ్యవసాయ బృందం పరిశీలించింది. ప్రతి రైతు పేరును అగ్రిస్టాక్ పోర్టల్‌లో నమోదు చేసి, ఐడీ నంబర్ ఇస్తున్నట్లు తెలిపారు. దీన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. వ్యవసాయ సిబ్బంది గీత, పావని, రాణి పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

చీరాల: 9154846713 వేటపాలెం: 8008574099
చీరాల గ్రామీణం: 6309994673 పర్చూరు: 9063144743
మార్టూరు: 8008574106 ఇంకొల్లు: 8008574102
చినగంజాం: 8008574103

? పెదగంజాం పరిధిలోని ఏటిమొగలో వీధి దీపాలు వెలగడం లేదు. రాత్రులు ఇబ్బందిగా ఉంది. - శ్రీను, స్థానికుడు

✔ ఆ ప్రాంతాన్ని పరిశీలించి, రెండు రోజుల్లో వీధి దీపాలకు మరమ్మతులు చేయిస్తాం. - కె.శ్యామ్‌బాబు, ఇన్‌ఛార్జి గ్రామ కార్యదర్శి, పెదగంజాం - న్యూస్‌టుడే, చినగంజాం

పరిశీలిస్తున్న ఛైర్మన్ సాంబశివరావు, తదితరులు

కాలువల నిర్మాణం పూర్తితో సమస్యల పరిష్కారం

చీరాల, న్యూస్‌టుడే: పట్టణంలో మురుగునీటి సమస్య పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నట్లు మున్సిపల్ ఛైర్మన్ ఎం.సాంబశివరావు తెలిపారు. మంగళవారం పట్టణంలోని పలు వార్డుల్లో జరుగుతున్న కాలువ నిర్మాణాలను ఛైర్మన్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈసందర్భంగా ఛైర్మన్ మాట్లాడుతూ ప్రస్తుతం అనేక ప్రాంతాల్లో కాలువల నిర్మాణాలు జరుగుతున్నాయని, ఇవి పూర్తయితే కొంతమేర సమస్య పరిష్కారం అవుతుందన్నారు. ఏఈ రవికుమార్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

వాహన వలయం.. రద్దీమయం

ముంతావారిసెంటర్ (చీరాల), న్యూస్‌టుడే

పట్టణంలో ట్రాఫిక్ కష్టాలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. ఇరుకురోడ్లు, పెరుగుతున్న వాహనాలు, పార్కింగ్ లేకపోవడం వెరసి సమస్య తీవ్రమవుతుంది. చీరాల పట్టణం కేవలం 13 చదరపు కిలోమీటర్ల పరిధిలోనే ఉంది. లక్ష జనాభా ఉన్నారు. ఇందులో అతి కొద్ది ప్రాంతమే వాణిజ్య, ఇతర అవసరాలకు ఉపయోగించేది. ఇక్కడికే అన్ని అవసరాలకు ప్రజలు వస్తుంటారు. ప్రస్తుతం తీరప్రాంత పర్యాటకం పెరిగిన నేపథ్యంలో బయటనుంచి వచ్చే వాహనాలు బాగా పెరిగాయి. దీనికి తోడు వైద్యశాలలు పెరగడంతో రోగులతో వచ్చే వాహనాలూ అధికమయ్యాయి. ప్రతి రోజు దాదాపుగా 50 వేలకు పైగా వాహనాలు రోడ్లపై తిరుగుతుంటాయి.

పార్కింగ్ సదుపాయం లేక

రాష్ట్రంలోనే పేరొందిన వస్త్ర వ్యాపారంతో పాటు కిరాణా, పెద్దకూరగాయల మార్కెట్, బంగారు దుకాణాలు, ఎలక్ట్రానిక్స్, ఇతర దుకాణ సముదాయాలు అన్నీ కొద్దిప్రాంతంలోనే ఉన్నాయి. వీటితోపాటు విద్యాసంస్థలు, వైద్యశాలలు చాలా వరకు ఇక్కడే ఉన్నాయి. దీంతో ప్రతిరోజూ పెద్దసంఖ్యలో

గోపాలకృష్ణయ్య పార్కు వద్ద పరిస్థితి

బయట ప్రాంతాల నుంచి ద్విచక్రవాహనాలు, కార్లు వేల సంఖ్యలో పట్టణంలోకి వస్తుంటాయి. వీటికి సరైన పార్కింగ్ సదుపాయం లేకపోవడంతో రహదార్లపైనే నిలుపుతున్నారు. దీంతో ట్రాఫిక్ సమస్యలు తీవ్రమవుతున్నాయి. మరి ముఖ్యంగా ఉదయం, సాయంత్రం పాఠశాలలకు, కార్యాలయాలకు వెళ్లి, వచ్చే సమయం, రాత్రి సమయాల్లో పరిస్థితి తీవ్రంగా ఉంటుంది.

సమస్యాత్మక ప్రాంతాలు ఇవే

పట్టణంలో బస్టాండ్, రైల్వేస్టేషన్ దగ్గర ఒకవైపు ఆర్టీసీ బస్సులు, అద్దెవిధంగా నిలిపే ఆటోలు మరీ ముఖ్యంగా రైళ్లు వచ్చిన సందర్భంలో ట్రాఫిక్ సమస్య చాలా తీవ్రంగా ఉంటుంది. కొత్తబజారు ప్రాంతంలో రాత్రి 7నుంచి 9గంటల వరకు ఇదే సమస్య. అదేవిధంగా కూరగాయల మార్కెట్ వద్ద ఆటోలు రోడ్లపై ఇష్టారాజ్యంగా ఉండడంతో ఇక్కడ తరచూ సమస్య వేధిస్తోంది. దర్బార్‌రోడ్డు ప్రాంతాలు రాత్రి సమయంలో ఇబ్బందికరంగా ఉంటున్నాయి. వీటితోపాటు గోపాలకృష్ణయ్య పార్కు, పేరాల కూడలి, కారంచేడు గేటు ప్రాంతాల మీదుగా ప్రయాణించాలంటే నరకం కనిపిస్తోంది. హైదరాబాద్ వెళ్లే ప్రైవేటు బస్సులు ప్రతిరోజూ రాత్రి మున్సిపల్ కార్యాలయం వద్ద నిలుపుతారు. వారు ఒకరితో మరొకరు పోటీ పడి అడ్డదిడ్డంగా నిలపడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. 8 గంటల సమయంలో ఈప్రాంతంలో వెళ్లాలంటేనే నరకం ఉంటోంది. ట్రాఫిక్ పోలీసుల సంఖ్య తక్కువగా ఉండటం.. వారిని తరచూ వివిధ ప్రాంతాలకు విధులు వేస్తుండటంతో పరిస్థితి మరింత దారుణంగా ఉంటుంది. ఇప్పటికైన పాలకులు ట్రాఫిక్ సమస్యపై దృష్టిపెట్టాలని ప్రజలు కోరుతున్నారు.

చురుగ్గా క్రిటికల్ కేర్ వైద్యశాల నిర్మాణం

న్యూస్‌టుడే, చీరాల

కూటమి ప్రభుత్వం పేదల వైద్యానికి అత్యంత ప్రాధాన్యం ఇస్తోంది. ప్రభుత్వ రంగంలో అత్యాధునిక, అత్యవసర వైద్యసేవల చీరాల చుట్టుపక్కల చూస్తే గుంటూరు, ఒంగోలులో మాత్రమే అందుబాటులో ఉన్నాయి. త్వరలో వాటి సరసన క్షేత్రపురి చేరనుంది. ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న క్రిటికల్ కేర్ వైద్యశాల పూర్తయితే అన్ని రకాల అత్యవసర సేవలు అందుబాటులోకి వస్తాయి. జిల్లాలో మొదటగా చీరాలలో ఈ సేవలు అందనున్నాయి. ✦ ప్రస్తుతం జిల్లాలో జాతీయ రహదారుల పరిధి పెరగడంతో వాహనాల వినియోగం ఎక్కువైంది. అదే సమయంలో వేగం పెరిగింది. దీంతో ప్రతిరోజూ ఎక్కడోచోట ప్రమాదాలు జరుగుతున్నాయి. చీరాల బైపాస్ పరిధిలో తరచూ ఏదో ప్రమాదం జరుగుతూనే ఉంది. వీటితో పాటు చుట్టుపక్కల ప్రాంతాల్లోనూ ఎక్కడ ప్రమాదం జరిగినా చీరాల ప్రభుత్వ వైద్యశాలకే తీసుకొస్తారు. ఇక్కడ అత్యాధునిక వైద్య పరికరాలు, సేవలు అందుబాటులో లేకపోవడంతో క్షతగాత్రులను గుంటూరు తరలిస్తున్నారు. ఈ నేపథ్యంలో చాలా కేసుల్లో బాధితులు దారిలోనే మృత్యువాత పడుతున్నారు. వీటికితోడు వాడరేవు-పిడుగురాళ్ల జాతీయ రహదారి పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తే హైదరాబాద్ నుంచి తీరానికి వచ్చే పర్యాటకుల సంఖ్య గణనీయంగా పెరుగుతుంది. ప్రమాదాలు మరిన్ని పెరిగే అవకాశముంది. ఈ పరిస్థితుల్లో ఎమ్మెల్యే ఎం.ఎం.కొండయ్య చొరవతో ప్రభుత్వం చీరాలకు క్రిటికల్‌కేర్ యూనిట్‌ను మంజూరు చేసింది.

క్షతగాత్రులకు సంజీవనే

జిల్లాలో మొదటి క్రిటికల్ కేర్ యూనిట్ చీరాలలో నిర్మాణం జరుగుతోంది. మొత్తం 23.75 కోట్లతో మూడు అంతస్తుల భవనం నిర్మిస్తున్నారు. దీనికి సంబంధించిన పనులు వేగంగా జరుగుతున్నాయి. ఈ నిర్మాణం పూర్తయితే అన్ని రకాల అత్యవసర వైద్యసేవలు 24 గంటలు అందుబాటులో ఉంటాయి. నిపుణులైన వైద్యులతో పాటు అత్యాధునిక వైద్యపరికరాలు ఉంటాయి. ప్రమాద కేసులతోపాటు గుండెపోటు, బ్రెయిన్‌స్ట్రోక్, ఇతర ప్రాణాపాయ కేసులకు చికిత్స లభిస్తుంది. ఆదేవిధంగా ఎముకలు, గుండె, కన్నులకు ఇతర కేసులకు సంబంధించిన మూడు అత్యాధునిక శస్త్రచికిత్స థియేటర్లు అందుబాటులోకి వస్తాయి. అల్ట్రాసౌండ్ స్కాన్, ఎక్సరే సౌకర్యం. వీటితోపాటు రూ. 1.20 కోట్లతో అత్యాధునిక రక్తనిధి కేంద్రం సిద్ధమవుతుంది. మొత్తంగా ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారికి ఈ వైద్యశాల సంజీవనే అని చెప్పాలి.

ఆవును జేసీబీ సాయంతో బయటకు తీస్తున్న సిబ్బంది

గోవును కాపాడిన మున్సిపల్ సిబ్బంది

చీరాల, న్యూస్‌టుడే: ప్రమాదవశాత్తు మురుగు కాలువలో పడిన గోవును స్థానికుల సాయంతో మున్సిపల్ సిబ్బంది కాపాడారు. మంగళవారం సంఘం థియేటర్ సమీపంలో ఇది జరిగింది. ఆవు కాలువలో పడిన విషయాన్ని గమనించిన స్థానికులు సమాచారాన్ని పారిశుద్ధ్య పర్యవేక్షకుడు ప్రవీణ్‌కు తెలిపారు. దీంతో ఆయన సంఘటన స్థలానికి సిబ్బందిని పంపారు. వారు స్థానికులు, జేసీబీ సాయంతో కాలువను స్వల్పంగా పగులగొట్టి, గోవును బయటకు తీసి వైద్య పరీక్షలకు తరలించారు. ఆవును కాపాడిన సిబ్బందిని గోపరిరక్షణ సమితి నాయకులు అభినందించారు.

'ఆంధ్రుల ఆకాంక్షలు ఆవిష్కరించేలా బడ్జెట్'

మార్టూరు, న్యూస్‌టుడే: దగా పడ్డ రాష్ట్రానికి దశ, దిశ చూపి ఐదుకోట్ల ఆంధ్రుల ఆశలు, ఆకాంక్షలను ఆవిష్కరించేలా సీఎం చంద్రబాబునాయుడు నాయకత్వంలో భవిష్యత్తు మార్గదర్శినిగా ఏపీ బడ్జెట్ నిలిచిందని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు తెలిపారు. మంగళవారం అసెంబ్లీ వేదికగా బడ్జెట్‌పై ఎమ్మెల్యే ఏలూరి సుదీర్ఘ ప్రసంగం చేసినట్లు ఆయన క్యాంపు కార్యాలయ వర్గాలు తెలిపాయి. బడ్జెట్ కేవలం ఆదాయం, వ్యయాల లెక్కల సమాహారం మాత్రమే కాదని, ప్రభుత్వ ఆలోచన దిశానిర్దేశ పత్రమని తెలిపారు. ఆర్థిక క్రమశిక్షణ, సామాజిక బాధ్యత, రాజధాని నిర్మాణం, సమగ్రాభివృద్ధి, పారదర్శకతలే లక్ష్యంగా బడ్జెట్ రూపొందించినట్లు చెప్పారు. 30 ఏళ్ల ముఖ్యమంత్రి చంద్రబాబు దగ్గర పనిచేసిన అనుభవంతో ఆర్థికమంత్రి పయ్యావుల కేశవ్, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, మంత్రి లోకేశ్ ఆశయాలు, ఆకాంక్షలకు అనుగుణంగా రాష్ట్రాభివృద్ధికి పెద్దపీట వేశారని ఎమ్మెల్యే ఏలూరి పేర్కొన్నారు.

విద్యార్థులు సేవాభావం అలవర్చుకోవాలి

మాట్లాడుతున్న డాక్టర్ స్మిత్

కొత్తపాలెం (పర్చూరు), న్యూస్‌టుడే: విద్యార్థులు సేవాభావం అలవర్చుకోవాలని బాపట్ల ఏజీ ఇంజినీరింగ్ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ డి.డి స్మిత్ చెప్పారు. వారం రోజులుగా ఆ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు మండలంలోని కొత్తపాలెం, చెరుకూరు గ్రామాల్లో చేపట్టిన ప్రత్యేక శిబిరం మంగళవారం ముగిసింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసినసభలో ఆయన మాట్లాడారు. రైతులు ఆధునిక వ్యవసాయ పరికరాలపై దృష్టి సారించాలన్నారు. చెరుకూరు ఎంపీటీసీ సభ్యుడు పి.వీరయ్య, కొత్తపాలెం సర్పంచి సంపూర్ణమ్మలు మాట్లాడుతూ విద్యార్థులు ప్రజలకు ఆరోగ్యం, విద్య, పచ్చదనంపై అవగాహన కల్పించడం అభినందనీయమన్నారు. గ్రామ పెద్దలు శింగారెడ్డి, వెంకటరెడ్డి, ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్లు డాక్టర్ డి.విజయ్‌కుమార్, డాక్టర్ ఎన్.అశోక్‌కుమార్, పీడీ కె.వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

కొమ్మమూరు కాలువ మరమ్మతులకు ప్రతిపాదనలు

కారంచేడు, న్యూస్‌టుడే: పశ్చిమ బాపట్లలో అన్నదాతలకు సిరులు కురిపిస్తున్న కొమ్మమూరు కాలువ పరిధిలో గుర్రపు డెక్క తొలగింపు, కాలువ గట్ల పటిష్ఠత, కాలువ గేట్ల మరమ్మతుల నిమిత్తం 2026-27 సంవత్సరానికి ప్రతిపాదనలు సిద్ధమయ్యాయి. పర్చూరు నియోజకవర్గంలోని 43 పనులకు రూ.2.58 కోట్లతో సమగ్ర కార్యాచరణ ప్రణాళికలు రూపొందించి, ప్రభుత్వానికి పంపినట్లు ఆ శాఖ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఎన్.కె.వి ప్రసాదరావు తెలిపారు. నీటి సంఘాల బాధ్యుల ద్వారా పనులు జరగనున్నాయని చెప్పారు.

అధ్వానంగా మురుగు కాలువలు

పట్టణంలోని 23వ వార్డు వైకుంఠపురం ప్రధాన రహదారిలో మురుగునీటి కాలువల పరిస్థితి అస్తవ్యస్తంగా మారింది. ఇవి పలుచోట్ల పగిలిపోయాయి. ఈ కాలువలు నిర్మించి ఏళ్లు గడవడంతో వీటి నిర్మాణానికి వినియోగించిన రాళ్లు సైతం పగిలి పూర్తిగా దెబ్బతిన్నాయి. పగిలిన రాళ్లు మురుగు పారుదలకు అడ్డంకిగా మారాయి. మురుగు పారుదల సరిగా జరగక దుర్వాసన వెదజల్లుతున్నాయి. అధిక వర్షం కురిస్తే మురుగంతా రోడ్డు పైకి చేరి, రాకపోకలకు ఇబ్బందిగా మారుతోందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. సమస్యను అనేక సార్లు అధికారుల దృష్టికి తీసుకువెళ్లినప్పటికీ ప్రయోజనం లేదంటున్నారు. సమస్య తీవ్రతను గుర్తించి వీటికి మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, పేరాల

నులిపురుగుల నివారణతో ఆరోగ్యం

ఇంకొల్లు: బాలికకు మాత్ర మింగిస్తున్న తహసీల్దార్ శ్రీనివాస్

ఇంకొల్లు, న్యూస్‌టుడే: నులిపురుగుల నివారణ ఆరోగ్యానికి రక్ష అని తహసీల్దార్ శ్రీనివాస్ పేర్కొన్నారు. జాతీయ నులిపురుగు నివారణ దినోత్సవం సందర్భంగా మంగళవారం గంగవరం ఉన్నత పాఠశాలలోని విద్యార్థులతో ఆల్బెండజోల్ మాత్రలు మింగించారు. ఐసీడీఎస్ సీడీపీవో సులోచనారాణి పావులూరు అంగన్‌వాడీ కేంద్రం పిల్లలతో మాత్రలు మింగించారు. మండల వైద్యాధికారిణి అంజలి అన్ని పాఠశాలలు సందర్శించి చేతుల శుభ్రత గురించి తెలిపారు. మండలంలో 19ఏళ్ల లోపు పిల్లలు 7795 మంది ఉండగా వీరిలో 6851 మందికి మాత్రలు వేశామని, మిగిలిన వారికి ఈనెల 24న అందజేస్తామని అంజలి తెలిపారు. ఎంఈవో శ్రీనివాసరావు, సీహెచ్‌వో కోటేశ్వరరావు పాల్గొన్నారు.

కోలలపూడి (మార్టూరు): మండల పరిధి కోలలపూడి ఉన్నత పాఠశాలలో గ్రామ సర్పంచి ఎం.సతీష్‌కుమార్ విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. సుమారు 150 మందికి అందజేసినట్లు వైద్య సిబ్బంది భవానీ తెలిపారు.

కడవకుదురు (చినగంజాం): సంతరావూరు పీహెచ్‌సీ పరిధిలోని కడవకుదురు, సంతరావూరు, చింతగుంపల, గొనసపూడి గ్రామాల్లోని 1,680 మంది బాలబాలికలతో ఆల్బెండజోల్ మాత్రలు మింగించినట్లు వైద్యాధికారిణి కె.కీర్తిసరోజ్ తెలిపారు. కడవకుదురులోని అంగన్‌వాడీ కేంద్రాన్ని ఎన్‌డీడీ స్టేట్ నోడల్ అధికారిణి డాక్టర్ నాగలక్ష్మి పరిశీలించారు. సిబ్బందికి సూచనలు ఇచ్చారు. వైద్యులు మౌనిక, మనోజ్ పాల్గొన్నారు. చినగంజాం పీహెచ్‌సీ పరిధిలో 4,380 మందితో మాత్రలు మింగించినట్లు వైద్యాధికారి సాయి శ్రీచరణ్ తెలిపారు. కేజీబీవీలోని విద్యార్థినులతో తహసీల్దార్ ప్రభాకరరావు, ఎంపీడీవో ధనలక్ష్మి మాత్రలు మింగించారు. ఎస్‌వో సుమాంజలి పాల్గొన్నారు.

పర్చూరు: పర్చూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని 45 అంగన్‌వాడీ కేంద్రాలు, 20 ఎంపీపీ ప్రాథమిక, ఐదు ఉన్నత పాఠశాలల్లోని 4664 మంది చిన్నారులకు మాత్రలకు అందజేసినట్లు వైద్యులు సాయిప్రశాంతి, పృథ్వీరాజ్‌లు తెలిపారు. ఎంపీహెచ్‌ఈవో సుధాకర్, సీహెచ్‌వో వరలక్ష్మి పాల్గొన్నారు.

సేవ చేస్తూ.. చైతన్యం కల్పిస్తూ..

వారం రోజులపాటు గ్రామాల్లో ఎన్ఎస్ఎస్ విద్యార్థుల ప్రత్యేక శిబిరం

పర్చూరు, న్యూస్‌టుడే

బాపట్లలోని డాక్టర్ ఎన్టీఆర్ వ్యవసాయ ఇంజినీరింగ్ కళాశాల నాల్గో సంవత్సరం విద్యార్థులు పల్లె బాట పట్టారు.. దాదాపు 40 మంది.. పచ్చదనం-పరిశుభ్రత, వ్యవసాయ యాంత్రీకరణ పథకాల విని యోగం, చదువు ఆవశ్యకత, మొక్కల పెంపకం, ఆరోగ్యం, పారిశుద్ధ్య కార్యక్రమాల ప్రాముఖ్యత వంటి అంశాలు వివరిస్తూ రైతులకు, ప్రజలకు చైతన్యం కల్పించారు.. గ్రామంలోనే ఉంటూ కర్షకులు, ఊర్లలోని సమస్యలు తెలుసుకుంటూ వాటి పరిష్కారానికి ఏ శాఖలను సంప్రదించాలో ప్రజలకు తెలియజేశారు. పర్చూరు మండలం చెరుకూరు, కొత్తపాలెం గ్రామ పంచాయతీల్లో జాతీయ సేవా పథకం కింద ఈనెల 13వ తేదీ నుంచి వారం రోజులపాటు చేపట్టిన కార్యక్రమాలు మంగళవారంతో ముగిశాయి. శిబిరం జరిగిన తీరును విద్యార్థులు, గ్రామస్థుల మాటల్లో తెలుసుకుందాం..

ఏడు రోజులు ఉన్నాం

జాతీయ సేవా పథకం కింద చెరుకూరు, కొత్తపాలెం గ్రామాల్లో ఏడు రోజులు ఉన్నాం. స్వచ్ఛభారత్, రక్తదాన శిబిరం, మొక్కలు నాటే కార్యక్రమాలు చేపట్టాం. గ్రామస్థుల సహకారం బాగుంది. ఎన్ఎస్ఎస్‌లో భాగంగా గ్రామంలో సేవా కార్యక్రమాలు చేపట్టడం ఆనందంగా ఉంది. - లీలారాణి, విద్యార్థిని, నాల్గో సంవత్సరం

డ్రైనేజీ సమస్యలు గుర్తించాం

శిబిరంలో భాగంగా గ్రామాల్లో సర్వే చేపట్టాం. డ్రైనేజీ సమస్య ఉన్నట్లు గుర్తించాం. వ్యవసాయంలో సాంకేతిక పరిజ్ఞానంపై రైతులకు అవగాహన కల్పించాం. యంత్రాల కొనుగోలుకు ప్రభుత్వ పథకాలు ఏ విధంగా ఉపయోగపడతాయో వివరించాం. - నితిన్, విద్యార్థి, నాల్గో సంవత్సరం

సమాజంపై బాధ్యత తెలిసేలా

చదువుతోపాటు సమాజంపై అవగాహన, బాధ్యత తెలిసేలా వారం రోజులపాటు గ్రామాల్లో వివిధ కార్యక్రమాలు చేపట్టాం. తమ సొంత గ్రామాలను ఏ విధంగా అభివృద్ధి చేసుకోవాలో ఇటువంటి శిబిరాల ద్వారా విద్యార్థులకు అవగతమవుతుంది. - డాక్టర్ విజయకుమార్, అసిస్టెంట్ ప్రొఫెసర్

గ్రామాల అభివృద్ధిపై అవగాహన



విద్యార్థులు విద్య, వైద్యం, పచ్చదనంపై అవగాహన కల్పించారు. మహిళలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చెరువుల వద్ద మొక్కల పెంపకం, పారిశుద్ధ్యంపై వివరించి ప్రజలకు అవగాహన కల్పించడం ఆనందంగా ఉంది. - కె.వెంకటరెడ్డి, గ్రామస్థుడు, కొత్తపాలెం

పాఠశాలకు వితరణ

మార్టూరు, న్యూస్‌టుడే: మండల పరిధి ద్రోణాదుల జడ్పీ ఉన్నత పాఠశాలలో మౌలిక వసతుల కల్పనకు దాతలు విరాళాలు అందించినట్లు హెచ్‌ఎం పోతురాజు మంగళవారం తెలిపారు. గ్రామానికి చెందిన పి.రమేష్‌బాబు, ఎం.ఉదయభాస్కర్‌లు రూ.20 వేలు, సీసీ కెమెరాల ఏర్పాటుకు రూ.25 వేలను జి.వెంకటనారాయణ, జాతీయజెండా స్తంభం ఏర్పాటుకు పి.బసవయ్య రూ.15 వేలు అందజేశారని చెప్పారు. దాతలు సహకరించేందుకు కృషి చేసిన పీడీ టి.శ్రీనివాసరావును ఉపాధ్యాయులు అభినందించారు.

సాయిబాబు మృతి తీరనిలోటు

మార్టూరు, న్యూస్‌టుడే: ఎమ్మార్పీఎస్ ఉద్యమానికి ఉమ్మడి ప్రకాశం జిల్లాలో ఎన్నో పోరాటాలు, కార్యక్రమాలు చేసిన నేత, బొబ్బేపల్లి గ్రామానికి చెందిన గొల్లమూడి సాయిబాబు మృతి తీరని లోటని ఎమ్మార్పీఎస్ నేతలు మంగళవారం నివాళులర్పించారు. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో ప్రమాదవశాత్తూ రైలు నుంచి జారిపడి మృతిచెందడం బాధాకరమన్నారు. సంతాపం తెలిపిన వారిలో నాయకులు బి.లక్ష్మీనరసయ్య, వందనం, సురేంద్ర, పి.నాని ఉన్నారు.

రణభేరికి తరలిన యూటీఎఫ్ నేతలు

విజయవాడ ధర్నాలో కారంచేడు నాయకులు

కారంచేడు, న్యూస్‌టుడే: యూటీఎఫ్ రాష్ట్ర శాఖ పిలుపు మేరకు విజయవాడలో తలపెట్టిన రణభేరి 2.0కి కారంచేడు మండలం నుంచి నాయకులు తరలివెళ్లారు. ఏటా ఇవ్వాల్సిన డీఏలు ఇవ్వకపోవడం, పీఆర్సీని నేటి వరకు అమలు చేయకపోవడం తదితర డిమాండ్ల సాధనకు రణభేరిలో పాల్గొన్నట్లు నేతలు బి.శ్రీనివాసరెడ్డి, పి.శ్రీనివాసరావు, రమేష్, తిమోతి, హనుమయ్య, చంద్రశేఖర్ తెలిపారు.

షూటింగ్‌బాల్ విజేతలకు అభినందనలు

సాధించిన పతకాలతో క్రీడాకారులు, ప్రతినిధులు

మార్టూరు, న్యూస్‌టుడే: ఈనెల 13,14,15వ తేదీల్లో శ్రీ సత్యసాయి జిల్లా ధర్మవరంలో జరిగిన 44వ రాష్ట్రస్థాయి షూటింగ్‌బాల్ పోటీల్లో పాల్గొన్న అండర్-17 జిల్లా బాలబాలికల జట్లలోని క్రీడాకారులను మంగళవారం మార్టూరులోని జై సూర్య సోలార్ లిమిటెడ్ ఓంకార్ మినరల్స్ డైరెక్టర్ పొత్తూరి శివరావు అభినందించారు. బాలికల జట్టు ద్వితీయస్థానం, బాలుర జట్టు మూడో స్థానం సాధించడంపై ప్రశంసించారు. జి.లక్ష్మీనారాయణ, పి.సురేంద్ర, అనిల్‌కుమార్, కె.ఆర్ ధనలక్ష్మి, అన్నమ్మ పాల్గొన్నారు.

ఎడ్ల పూటీ లాగుడు పోటీల్లో విజేత పెద్దపూడి జత

నందిగామ గ్రామీణం, న్యూస్‌టుడే: ఎన్టీఆర్ జిల్లా నందిగామ మండలం దాములూరులో మంగళవారం రాత్రి తెలుగు రాష్ట్రాల స్థాయి ఎడ్ల పూటీ లాగుడు పోటీలు రసవత్తరంగా సాగాయి. తొలిరోజు సీనియర్ విభాగంలో రెండు క్వింటాళ్ల బరువున్న పూటీని పది నిమిషాల్లో లాగేలా నిర్వహించిన పోటీల్లో బాపట్ల జిల్లా అమృతలూరు మండలం పెద్దపూడి గ్రామానికి చెందిన ఆళ్ల హరికృష్ణయాదవ్ ఎడ్ల జత 4842 అడుగుల దూరం లాగి ప్రథమంగా నిలిచాయి. బాపట్ల జిల్లా చెరుకుపల్లి మండలం పగడంవారిపాలెనికి చెందిన కుంచల వేదశ్రీలతారెడ్డి ఎడ్లజత 4465 అడుగుల దూరం లాగి ద్వితీయస్థానం, బాపట్ల జిల్లా చిన్నగంజాం మండలం ఆవులదొడ్డి కొత్తపాలెం గ్రామానికి చెందిన గోగినేని జ్ఞానసాయి చౌదరి ఎడ్లజత 4451 అడుగుల దూరంలాగి తృతీయస్థానంలో నిలిచాయి. విజేతలకు వరుసగా దాల సౌజన్యంతో రూ.35 వేలు, రూ.30 వేలు, రూ.25 వేలు వంతున నగదు ప్రోత్సాహకాలు, జ్ఞాపికలు అందజేశారు.

ర్యాలీ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

వలపర్ల (మార్టూరు), న్యూస్‌టుడే: యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని వలపర్ల జడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం కల్యాణి చెప్పారు. మంగళవారం పాఠశాలలో 'మాదకద్రవ్యాల దుర్వినియోగం, యువత ఎలా నిర్వీర్యం'పై ప్లకార్డులు చేతబూని అవగాహన ర్యాలీ నిర్వహించారు. పీడీ దేవరాజ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

శాంతి కాముకులై మెలగండి

రాంప్రసాద్‌తో సభ్యులు

వేటపాలెం, న్యూస్‌టుడే: రోటరీ సభ్యులు శాంతి కాముకులై మెలిగితే సంఘంలో గుర్తింపు, గౌరవం లభిస్తుందని రోటరీ జిల్లా 3150 గవర్నర్ డాక్టర్ రాంప్రసాద్ పిలుపునిచ్చారు. వేటపాలెం రోటరీ సామాజిక భవనంలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. ఈ సభకు క్లబ్ అధ్యక్షుడు ఏవీ సురేష్‌బాబు అధ్యక్షత వహించారు. వివిధ రంగాల్లో గుర్తింపు పొందిన డాక్టర్ అందె మురళీ వరప్రసాద్, వడలి రాధాకృష్ణ, బత్తుల బ్రహ్మారెడ్డి, బండ్ల బాపయ్య, పింజల శ్రీనివాసరావు, జరుబుల శ్రావణి, పోకూరు ఆకాష్, యూసుఫ్, సజ్జా పుష్పవల్లి, ఉగ్గిరాల నరసింహారావులను ఒకేషనల్ అవార్డులతో సత్కరించారు. క్యాన్సర్ పీడితుడు గుత్తి పరమేశ్వరరావుకు సజ్జా పుష్పవల్లి రూ.5 వేలు సహాయం అందించారు. అసిస్టెంట్ గవర్నర్ ఎన్.శ్రీనివాసరావు, రోటరీ కార్యదర్శి ఎ.చంద్రశేఖర్‌రెడ్డి, వ్యవస్థాపక అధ్యక్షుడు గోల్లపూడి సీతారాం, ఒకేషనల్ అవార్డుల ఛైర్మన్ బట్ట మోహన్‌రావు, సభ్యులు కారంచేటి శివరామకృష్ణ, కొత్త శ్రీనివాసరావు, ప్రత్తి వెంకట సుబ్బారావు, వెంకటేశ్వర్లు, పి.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నేడు తిరుమలకు కూరగాయల తరలింపు

మార్టూరు, న్యూస్‌టుడే: మండల పరిధి జొన్నతాళిలోని కామేపల్లి గ్రానైట్స్ యజమాని కామేపల్లి లక్ష్మీప్రసాద్ తిరుమలలో నిత్యాన్నదానానికి కూరగాయల వితరణ చాటనున్నారు. బుధవారం ఉదయం తితిదే నుంచి విచ్చేసే ప్రత్యేక వాహనం ద్వారా సుమారు రూ.2 లక్షల వ్యయంతో కూడిన వివిధ రకాల కూరగాయలు అందజేయనున్నారు.

మద్యం మత్తులో దాడి

చీరాల అర్బన్, న్యూస్‌టుడే: మద్యం మత్తులో దాడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాజ్యలక్ష్మి తెలిపారు. మండలంలోని కనకదుర్గ బార్‌లో వైకుంఠపురానికి చెందిన అక్కల శశికిరణ్‌రెడ్డి మిత్రులతో మంగళవారం మద్యం తాగుతున్నాడు. ఇదే సమయంలో పక్కన పట్టణంలోని శాంతినగర్‌కు చెందిన బబ్బులు, మిత్రులు సేవిస్తున్నారు. ఈ సమయంలో శశికిరణ్‌రెడ్డి స్నేహితులతో మాట్లాడుతుండగా బబ్బులు ఏంది పెద్ద పెద్దగా అరుస్తున్నారని మద్యం సీసాతో శశికిరణ్‌రెడ్డిపై దాడి చేశాడని ఎస్సై చెప్పారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రోడ్డు ఇట్లా... ప్రయాణమెట్లా?

పూర్తిగా దెబ్బతిన్న కొత్తపాలెం వెళ్లే ప్రధాన రహదారి

ఈ రహదారిలో కిలోమీటరు ప్రయాణించాలంటే ప్రాణాలు అరచేతిలో పెట్టుకోవాల్సిన దుస్థితి నెలకొంది. ఎక్కడ చూసిన రహదారి గుంతలమయం కావడంతో వాహనదారులు తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. మండలంలోని కొత్తపాలెం గ్రామానికి వెళ్లేందుకు బాపట్ల-చెరుకూరు మార్గమధ్యలో, చెరుకూరు నుంచి వెళ్లేందుకు రెండు రహదారులు ఉన్నాయి. ఈ రెండు మార్గాలు గ్రామానికి ప్రధాన రహదారులు కాగా ఎక్కడికక్కడ పూర్తిగా పాడై అధ్వానస్థితికి చేరాయని గ్రామస్థులు వాపోతున్నారు. పాలకులు, అధికారులు స్పందించి ఈ రోడ్డను పూర్తిస్థాయిలో నిర్మించాలని కోరుతున్నారు. ఈ విషయంపై ఆర్అండ్‌బీ ఏఈ శ్రీకాంత్‌ను వివరణ కోరగా రోడ్డు పూర్తిస్థాయిలో మరమ్మతులకు నిధులు మంజూరు కోరుతూ ప్రతిపాదనలు పంపామని తెలిపారు. – న్యూస్‌టుడే, కొత్తపాలెం (పర్చూరు)

ముగ్గురు వ్యక్తులకు తీవ్ర గాయాలు

దేగరమూడి(మార్టూరు), న్యూస్‌టుడే: జాతీయ రహదారిపై కారు-ద్విచక్రవాహనం ఎదురెదురుగా ఢీకొన్న ప్రమాదంలో ముగ్గురు వ్యక్తులకు తీవ్ర గాయాలయ్యాయి. మంగళవారం దేగరమూడి కూడలి సమీపంలో చిలకలూరిపేట వైపు నుంచి ఒంగోలుకు ప్రయాణిస్తున్న కారును వ్యతిరేక మార్గంలో ముగ్గురు వ్యక్తులు ద్విచక్ర వాహనం వస్తూ బలంగా ఢీకొన్నారు. బైక్‌పైలోని ఓ వ్యక్తి గాల్లోకి ఎగిరి కారు ముందు అద్దంపైపడి పడి రక్తగాయాలయ్యాయి. ఈ ముగ్గురు రాజస్థాన్ ప్రాంతానికి చెందిన వ్యక్తులుగా స్థానికులు తెలిపారు. తీవ్ర గాయాలైన మరో ఇద్దర్ని మెరుగైన వైద్యసేవల కోసం గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించినట్లు చెప్పారు.

బైక్ చోరీపై కేసు

వలపర్ల (మార్టూరు), న్యూస్‌టుడే: వలపర్లకు చెందిన కిశోర్ సూర్య దాబా వద్ద ద్విచక్ర వాహనాన్ని నిలిపి, అల్పాహారం కోసం లోపలికి వెళ్లి వచ్చే సరికి అదృశ్యమైందని ఏఎస్సై మహబూబ్‌బాషా తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

(c) eenadu

అమ్మవారిని ఊరేగిస్తున్న భక్తులు..

ఘనంగా శ్మశాన కొళ్లై..

కుప్పం పట్టణం, న్యూస్‌టుడే: పట్టణంలోని కొత్తపేటలో నెలకొన్న శ్రీ ప్రసన్న అంగాళపరమేశ్వరి దేవాలయ బ్రహ్మోత్సవాలను మంగళవారం నిర్వహించారు. బెస్త కులస్థుల ఆధ్వర్యంలో శ్మశాన కొళ్లై కార్యక్రమాన్ని జరిపించారు. తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుంచి భక్తులు భారీ ఎత్తున తరలివచ్చారు. ఏటా మహా శివరాత్రి మరుసటి అమావాస్య రోజున కుప్పం శ్మశాన వాటికలో సంప్రదాయంగా మంగళ వాయిద్యాల మధ్య అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని ఊరేగించడం ఆనవాయితీ. శ్మశానంలో శ్మశాన కొళ్లై నిమిత్తం అమ్మవారి ప్రతిమను మట్టితో ఏర్పాటు చేశారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు జాటీ దెబ్బలు తిని మొక్కులు తీర్చుకున్నారు. అమ్మవారిపై ఉన్న నిమ్మకాయలు, పసుపు కోసం భక్తులు ఎగబడ్డారు.

జాటీ దెబ్బలు తింటూ మొక్కులు తీర్చుకుంటున్న భక్తులు

నేడు 'పారిశ్రామిక వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక'

చిత్తూరు (మిట్టూరు), న్యూస్‌టుడే: ఏపీఎస్పీడీసీఎల్ సర్కిల్ పరిధిలోని తిరుపతి, చిత్తూరు, నెల్లూరు, కడప, కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీసత్యసాయి, అన్నమయ్య జిల్లాల్లోని పారిశ్రామిక విద్యుత్తు వినియోగదారుల సమస్యల సత్వర పరిష్కారానికి బుధవారం పరిష్కార వేదిక నిర్వహిస్తున్నట్లు సంస్థ సీఎండీ శివశంకర్ లోతేటి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎస్‌ఈల పరిధిలో పరిష్కారం కానీ సమస్యలను నేరుగా తమ దృష్టికి తీసుకురావచ్చన్నారు.

స్థలం: తిరుపతిలోని సంస్థ కార్పొరేట్ కార్యాలయం.
సమయం: ఉదయం 10.30 నుంచి 11.30 వరకు.
సంప్రదించాల్సిన నంబర్లు: టోల్‌ఫ్రీ: 1912, 1800425155333

హాయిగా.. క్షేమంగా

తిరుపతి నుంచి మదనపల్లెకి వెళ్లే మార్గంలో గతంలో నిత్యం ఏదోఒక చోట ప్రమాదాలు జరిగేవి. ఇటువైపు ప్రయాణమంటేనే హడలెత్తిపోయేవారు. ప్రస్తుతం ఆరు వరుసల జాతీయ రహదారి నిర్మాణం జరగడం వాహనదారుల కష్టాలు, భయాలు తీరాయి. అడుగడుగునా ప్రమాద సూచికలు ఏర్పాటు చేశారు. మలుపుల్లోనూ వాహనదారులు అప్రమత్తమయ్యేలా చర్యలు తీసుకున్నారు. రాతి గుట్టలను తొలిచినచోట రాళ్లు జారిపడకుండా.. సిమెంటుతో ప్లాస్టరింగ్ చేశారు. భాకరాపేట వంకర్లు తిరిగిన రహదారి ఆకట్టుకుంటోంది. - ఈనాడు, తిరుపతి

ఆడ పిల్లగా పుట్టడం నేను చేసిన తప్పా అమ్మా!

పట్టపగలు బయట తిరగడం నేరమా నాన్నా!

అప్యాయంగా మాట్లాడితే నమ్మడం పాపమా అంకుల్!

పసి మొగ్గలను చిదిమేసే రాక్షస లోకమని తెలియలేదు అన్నా!

ఎదురింట్లోని ఓ మృగాడు కన్నేశాడని.. కాటేయడానికి చూస్తున్నాడని ఊహించలేదు బాబాయ్

ఈ ప్రశ్నకు బదులేది?

కళ్లెదుటే మృగాడు!

■ చిన్నారిని కబళించిన కీచకుడు ■ మదనపల్లె పట్టణంలో దుర్ఘటన

మానవీయ విలువలకే సమాధి కట్టి.. మనుషులమన్న విషయాన్నే అనుమానించేట్టు దుర్ఘటన మంగళవారం మదనపల్లె జిల్లా కేంద్రంలో చోటు చేసుకుంది. మృగాడి వాంఛాగ్నిలో ఓ లేత కలువ కాలిపోయింది. నీరుగట్టువారిపల్లెకు చెందిన కులవర్ధన్ ఏడేళ్ల చిన్నారిపై హత్యాచారానికి పాల్పడిన ఉదంతం ఇది..
- న్యూస్‌టుడే, మదనపల్లె నేరవార్తలు, పట్టణం, గ్రామీణ

● ఇలాగైతే నాలాంటి బాలికలు బయట తిరిగేదెలా? మమ్మల్ని కాపాడటానికి అమ్మా, నాన్న నిత్యం వెంట ఉండటానికి సాధ్యమా? కులవర్ధన్ లాంటి దుర్మార్గుల నుంచి మాకు రక్షణ కల్పించేదెవరు? స్నేహంగా తిరిగేలా భద్రత కల్పించేదెవరు?

● విగతజీవిగా పడి ఉన్న ఏడేళ్ల చిన్నారి వేస్తున్న ప్రశ్నలివి.. వీటికి సమాధానం చెప్పేదెవరు? ఆడపిల్లకు అండగా నిలిచేదెవరు? మదనపల్లె పట్టణంలోని నీరుగట్టువారిపల్లెకు చెందిన చిన్నారి సోమవారం అదృశ్యమై మంగళవారం ఉదయం ఎదురింట్లోని యువకుడి గదిలో నీటి డ్రమ్ములో శవంగా తేలింది.

➡ అభం శుభం తెలియని ఏడేళ్ల చిన్నారిని గంజాయి, మద్యానికి బానిసైన ఓ దుర్మార్గుడు లైంగికంగా దాడి చేయడంతో పాటు నీటి డ్రమ్ములో ముంచేసి చంపేశాడు.. మృతదేహాన్ని ఎవరికీ కన్పించకుండా నీటి డ్రమ్ములో ఉంచి మూతపెట్టి నిద్రపోయాడు. బాలిక కోసం గాలింపు చేపట్టిన పోలీసులు అనుమానంతో అతని ఇంటిని పరిశీలించగా మృతదేహం బయటపడింది. నిందితుడు పరారీలో ఉండగా చిన్నారి మృతదేహాన్ని మార్చురీకి తరలించేందుకు యత్నించిన పోలీసులను ఆమె కుటుంబ సభ్యులతో పాటు పెద్ద సంఖ్యలో ప్రజలు అడ్డుకున్నారు. నిందితుడిని ప్రజా కోర్టులో ఉరి తీయాలని, లేదంటే తమకు అప్పగించాలని డిమాండ్ చేస్తూ సాయంత్రం వరకు ఆందోళన చేపట్టారు. ఈ ఆందోళన తీవ్ర ఉద్రిక్తతకు దారి తీసింది.

➡ వీరబల్లి మండలంలోని ఓ గ్రామానికి చెందిన కుటుంబం 15 సంవత్సరాల క్రితం మదనపల్లె పట్టణంలోని ఓ వీధిలో అద్దె ఇంటిలో చేరారు. భార్యాభర్తలు వేర్వేరు పనులు చేసుకుంటూ పిల్లలిద్దరినీ స్థానికంగా ఉన్న ఓ ప్రైవేటు పాఠశాలలో చదివిస్తున్నారు. సోమవారం పాఠశాలకు సెలవు కావడంతో బాలిక ఇంటి వద్దనే ఉంది. తల్లి తనతో పాటు రావాలని కోరినా చిన్నారి అవ్వా తాతతో కలిసి ఇంట్లోనే ఉంటానని చెప్పడంతో ఆమె విధులకు వెళ్లి పోయింది.

నిందితుడికి ఉరిశిక్ష విధించాలని వాహనాలపైకెక్కిన నిరసనకారులు

జాతీయ రహదారిపై స్థానికుల ఆందోళన

కులవర్ధన్

కామం కళ్లనే కాదు మెదడును మూసేస్తుంది వావి వరసలు కన్పించకుండా చేస్తుంది కోరిక మనిషినే కాదు.. మానవత్వాన్ని చంపేస్తుంది చిన్నా.. పెద్దా గౌరవాలను తుంచేస్తుంది. దుర్మార్గపు ఆలోచన మృగాడిగా మారుస్తుంది. స్త్రీ అయితే చాలు.. పసిపిల్లలు, ముసలోళ్లు అన్న తేడా లేకుండా చేస్తుంది... ఈ దుర్మార్గుడికి మృగాలోచన వచ్చింది.. మెదడును గంజాయి మత్తు కమ్మేసింది.. మానవత్వాన్ని చంపేసింది.. ఏడేళ్ల చిన్నారిపై హత్యాచారానికి పురిగొల్పింది.

సోమవారం 4:30 చిన్నారి కన్పించకపోవడంతో అవ్వా, తాత వెతికారు. ఆచూకీ దొరక్కపోవడంతో పనికి వెళ్లిన కోడలికి ఫోన్ చేసి చెప్పారు. తల్లి వెంటనే ఇంటికి వచ్చింది. ఇదే విషయాన్ని భర్తకు తెలియజేసింది. స్థానికుల సాయంతో కుటుంబ సభ్యులంతా కలసి చుట్టుపక్కల గాలించారు.

6:00 చిన్నారి ఆచూకీ దొరక్కపోవడంతో ఒకటో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. 6.15 గంటలకు ఎఫ్ఐఆర్ నమోదు చేసిన పోలీసులు హెడ్‌కానిస్టేబుల్‌తో పాటు మరో ఇద్దరు సిబ్బంది విచారణ ప్రారంభించారు. సీఐ మహమ్మద్ రఫీ సాంకేతిక బృందంతో చుట్టుపక్కల గాలించారు.

అర్ధరాత్రి 1:30 చిన్నారి ఇంటి ముందున్న కులవర్ధన్ (30)పై అనుమానం రావడంతో అతని ఇంటి తలుపు తట్టారు. తీయకపోవడంతో తలుపుపై భాగంలో ఉన్న కిటికీలో నుంచి చరవాణిలో వీడియో తీశారు. కులవర్ధన్ మంచంపై నిద్రిస్తున్నట్లు గుర్తించారు. మద్యం మత్తులో నిద్రపోయి ఉంటాడన్న అనుమానంతో పోలీసులు వెళ్లిపోయారు.

ఉదయం 7:00 మంగళవారం ఉదయం కులవర్ధన్ ఇంటి వద్దకు చేరుకుని అతన్ని నిద్రలేపే యత్నం చేశారు. నిద్రలేచిన కులవర్ధన్ తలుపు తీసి పోలీసులను బయటకు నెట్టి.. వారిపై దాడికి యత్నించాడు. పారిపోయేందుకు చూశాడు.

7:15 కులవర్ధన్ నిద్రిస్తున్న గదిలోనే ఉన్న ప్లాస్టిక్ డ్రమ్ములో శరీరంపై ఎలాంటి దుస్తులు లేని స్థితిలో చిన్నారి మృతదేహాన్ని గుర్తించారు.

7:40 అప్పటికే విషయం పాకిపోవడంతో పెద్ద సంఖ్యలో జనం అక్కడికి చేరుకుని నిందితుడిని తమకు అప్పగించాలని పోలీసులను అడ్డుకున్నారు. చిన్నారి మృతదేహం ఉన్న ఇంట్లోకి వెళ్లకుండా అడ్డుకున్నారు. బాలిక బంధువులు, స్థానికులు నీరుగట్టువారిపల్లెలోని రహదారిపై బైఠాయించి ఆందోళన చేశారు. ముంబయి- చెన్నై జాతీయ రహదారిపై సాయంత్రం 5 గంటల వరకు ఆందోళన చేశారు. అన్నమయ్య జిల్లా ఇన్‌ఛార్జిగా ఉన్న కడప ఎస్పీ నచికేత్ విశ్వనాథ్ మధ్యాహ్నం 2 గంటలకు అక్కడికి చేరుకున్నారు.

సాయంత్రం 6:35 పోలీసులు చిన్నారి మృతదేహం ఉన్న ఇంట్లోకి వెళ్లి అన్నీ పరిశీలించిన అనంతరం 6.42కు పోలీసు బందోబస్తు మధ్య శవాన్ని మదనపల్లె ఆసుపత్రికి తరలించారు.

రాత్రి 8:40 డీఐజీ కోయ ప్రవీణ్ మదనపల్లె చేరుకుని రాత్రి 8 గంటలకు చిన్నారి మృతదేహానికి శవపరీక్ష చేయించి రాత్రి 8.40 గంటలకు కుటుంబ సభ్యులకు అప్పగించారు.

నాలుగేళ్లుగా అవస్థల పాఠమే

అసంపూర్తిగా నాడు-నేడు పనులు

పెనుమూరు, న్యూస్‌టుడే: నాటి వైకాపా పాలకులు విద్యాభివృద్ధికి కృషి చేస్తున్నామని గొప్పలు చెప్పి చివరకు విద్యార్థులను అసౌకర్యాల ఊబిలోకి నెట్టారు. పాఠశాలల్లో సౌకర్యాల కల్పన పేరుతో అదనపు గదుల నిర్మాణం చేపట్టి పనులు పూర్తి చేయకుండానే చేతులెత్తేశారు. కొన్నిచోట్ల అవసరం ఉన్నా లేకున్నా పనులు మంజూరు చేసి ప్రారంభించారు. రూ.కోట్లు మంజూరు చేశారు. చివరకు నిధుల కొరత కారణంగా పనులన్నీ అసంపూర్తిగా మిగిలాయి. కనీసం పది శాతం పనులు కూడా పూర్తి కాలేదు.

● పెనుమూరు ఉన్నత పాఠశాలలో రెండు అంతస్తుల భవనం అసంపూర్తిగా ఉంది. రెండు పాత భవనాలపై చేపట్టిన నిర్మాణ పనులు అర్ధాంతరంగా ఆగిపోయాయి. దీంతో పరీక్షల సమయంలో విద్యార్థులు కొంత అసౌకర్యానికి గురికావాల్సి వస్తోంది. ఉన్న గదుల్లోనే సర్దుబాటు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. ఇలాంటి పరిస్థితి జిల్లాలో చాలా చోట్ల నెలకొంది.

పెనుమూరు మండలం ఉగ్రాణంపల్లె ఉన్నత పాఠశాలలో అసంపూర్తి పనులు

● పలమనేరు పట్టణంలోని బాలికల జడ్పీ ఉన్నత పాఠశాలలో దాదాపు 11 వందల మంది విద్యార్థినులు ఉన్నారు. వారికి ప్రస్తుతం 11 గదులు మాత్రమే ఉన్నాయి. వైకాపా పాలనలో నాడు-నేడు కింద రూ.కోటికి పైగా నిధులతో 11 అదనపు గదులు మంజూరు చేశారు. 70 శాతం పనులు మాత్రమే పూర్తయ్యాయి.

● కార్వేటినగరం బాలికల జడ్పీ ఉన్నత పాఠశాలలో వంద మందికి పైగా విద్యార్థినులు విద్య అభ్యసిస్తున్నారు. ఉన్న గదులు చాలకపోవడంతో గత ప్రభుత్వంలో నాడు-నేడు కింద ఒక అదనపు గదిని మంజూరు చేశారు. గుత్తేదారులు పునాదుల వరకు మాత్రమే పనులు చేసి వదిలేశారు. పరీక్షల సమయంలో గదులు చాలక ఇబ్బందులు పడాల్సివస్తోంది.

అవసరం లేకున్నా పనులు

నాడు-నేడు పనులకు సంబంధించి కూటమి ప్రభుత్వం యథాతథ స్థితి(స్టేటస్‌కో)ని కొనసాగించాలని ఆదేశించింది. నిధులున్నా వ్యయం చేయరాదని ఆదేశించింది. కాబట్టి పనులు చేపట్టలేదు. కొన్ని చోట్ల అవసరం లేకున్నా పనులు కేటాయించారని గుర్తించడంతో పనులు ఆగిపోయాయి. ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చాక పనులు చేపడతాం.
- వెంకటరమణ, ఏపీసీ సమగ్ర శిక్షా పథకం

జిల్లాలో నాడు-నేడు వివరాలు
- మంజూరైన అదనపు గదులు: 645
- పనులు ప్రారంభించినవి: 641
- పూర్తయిన పనులు: 27
- వివిధ దశల్లో ఆగినవి: 614

భూతల కైలాసంలో.. భవుని కల్యాణం

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: బ్రహ్మోత్సవాల్లో ప్రధాన ఘట్టం భక్తపరాధీనుడి కల్యాణమే. అన్నీ ఆలయాల్లో ఈ వేడుకలను ఆలయ ఆవరణలో నిర్వహిస్తారు. భక్తుల పాలిట భూతల కైలాసంగా ప్రసిద్ధి చెందిన శ్రీకాళహస్తిలో మాత్రం అందుకు భిన్నంగా అమావాస్య.. అర్ధరాత్రి.. నడివీధిలో భక్తుందరి మధ్యలో ఆయన వివాహం చేసుకోవడం ఇక్కడి ప్రత్యేకత.

ముస్తాబైన పెళ్లిమండపం

వరునిగా కైలాసవాసి, వధువుగా జ్ఞానాంబికల వివాహ మహోత్సవానికి పట్టణంలోని పెళ్లి మండపం వేదికగా ఏర్పాట్లు సిద్ధమయ్యాయి. వేదికను మామిడితోరణాలు, అరటి స్తంభాలు, రంగవల్లులతో ముస్తాబు చేశారు. వివాహ వేదిక వద్దకు సోమస్కందమూర్తి గజ వాహనంపై, జ్ఞానాంబిక సింహవాహనంపై శివపరివారంతో కలసి ఇక్కడకు చేరుకున్నారు.

స్కందరాత్రి వైభవం: తారకాసుర సంహారం.. స్కంద జననం ప్రాధాన్యంగా ఈ వివాహ మహోత్సవం నిర్వహించడం సంప్రదాయంగా వస్తోంది. అందుకే బ్రహ్మోత్సవాల్లో ఈ రాత్రిని స్కందరాత్రిగా పిలుస్తారు. పెళ్లికుమారుడైన శివయ్య వెంట సమస్త దేవతాగణాలన్నీ జయహో శంకరా.. జయజయహో శంకరా అంటూ కీర్తిస్తూ వివాహ వేదిక వద్దకు కదిలారు. ఇనాళ్లు సోమస్కందమూర్తితో భక్తులకు దర్శన భాగ్యం కల్పించిన గంగాదేవిని ఈ వివాహ మహోత్సవం సందర్భంగా కన్పించకుండా అలంకారం చేపట్టడం విశేషం. సర్వేశ్వరి అయిన జ్ఞానాంబికకు వజ్ర, వైడూర్యశోభితమైన ఆభరణాలు, పట్టువస్త్రాలు, దగ్గద్ధాయమైన కిరీటాన్ని, పచ్చలహారన్ని భుజకీర్తులతో హిమవంతుని కుమార్తెగా వివాహ వేదిక వద్దకు తీసుకువచ్చారు.

గజ వాహనంపై పెళ్లి కుమారుడిగా సోమస్కందమూర్తి

సింహ వాహనంపై పెళ్లి కుమార్తెగా జ్ఞాన ప్రసూనాంబిక అమ్మవారు

భక్తులకు అమావాస్య కష్టాలు

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: రాహు, కేతు సర్పదోష నివారణ పూజల కోసం ముక్కంటి ఆలయానికి వచ్చే భక్తులు అవస్థలు పడాల్సి వచ్చింది. అమావాస్య, మంగళవారం కలిసి రావడంతో భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. శివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆలయంలో మహద్వారం లోపల నిర్వహించే రూ.2500, రూ.5 వేల టికెట్ల ద్వారా నిర్వహించే రాహు, కేతు పూజలు రద్దు చేశారు. దీంతో మహద్వారం బయట నిర్వహించే రూ.1500ల రాహు, కేతు పూజలు చేయించుకోవడానికి భక్తులు పోటెత్తారు. ఇక్కడి మండపం చిన్నది కావడం, ప్రత్యామ్నాయ సదుపాయాలు కల్పించని కారణంగా భక్తులకు అవస్థలు తప్పలేదు.

రూ.1500 రాహు, కేతు మండపం వద్ద పూజల నిర్వహణకు నిరీక్షిస్తున్న జనం

బిల్లులు రాక.. పనులు సాగక

నత్తనడకన జేజేఎం పనులు

చిత్తూరు జడ్పీ, న్యూస్‌టుడే: ఇంటింటికి తాగునీరు అందించాలనే లక్ష్యంతో చేపట్టిన జల్‌జీవన్ మిషన్ పనులు నిధుల విడుదలలో ఆలస్యం కారణంగా ముందుకు సాగడం లేదు. 1190 పనులకు 1,049 పనులు పూర్తి కాగా 141 పనులు వివిధ దశల్లో ఉన్నాయి. ఈ పనులకు రూ.49.08కోట్లు అంచనా వ్యయం. ఇప్పటివరకు చేసిన పనులకు రూ.2.83 కోట్ల బిల్లులు అప్‌లోడ్ చేయగా నిధులు విడుదల కాలేదు. నగరి నియోజకవర్గ నింద్ర, విజయపురం, నగరి మండలాలు, చిత్తూరు నియోజకవర్గంలో జల్‌జీవన్ మిషన్ పనులు పూర్తయ్యాయి. గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు నియోజకవర్గాల్లో పెండింగ్ బిల్లులతో సమస్య ఉత్పన్నమైంది.

నియోజకవర్గం	పనులు	పూర్తి	పెండింగ్ బిల్లులు (రూ.కోట్లలో..)
గంగాధరనెల్లూరు	417	372	1.05
పూతలపట్టు	297	282	0.89
చిత్తూరు	72	72	0.28
నగరి	56	56	-----
పలమనేరు263		184	0.33
కుప్పం	85	83	0.27

హనుమాన్ ప్రాజెక్టుతో వన్యప్రాణుల సంరక్షణ

తిరుపతి(జీవకోన),న్యూస్‌టుడే: శేషాచలంలో వన్యప్రాణుల సంరక్షణ, మానవులు, వన్యప్రాణులకు మధ్య జరుగుతున్న ఘర్షణ వాతావరణాన్ని తగ్గించేందుకు ప్రభుత్వం హనుమాన్ ప్రాజెక్టు ప్రారంభించిందని తిరుపతి సర్కిల్ అటవీ సంరక్షణాధికారి (సీఎఫ్) సి.సెల్వం తెలిపారు. తిరుపతి బయోట్రిమ్‌లో మంగళవారం వన్యప్రాణుల రెస్క్యూపై ర్యాపిడ్ రెస్పాన్స్ టీమ్ సభ్యులకు కార్యశాల నిర్వహించారు. చిరుతలు, ఎలుగుబంట్లు, పాములు, ఏనుగులు వంటి వన్యప్రాణుల అదుపు, వాటిపై దాడుల నిర్మూలనే ఈ ప్రాజెక్టు ప్రధాన లక్ష్యమన్నారు. మార్చి 3న ఈ ప్రాజెక్టు ప్రారంభం కానుందని.. అందులో భాగంగా ప్రతి జిల్లాలో ర్యాపిడ్ రెస్పాన్స్ టీమ్‌లు, ప్రత్యేకంగా వన్యప్రాణి అంబులెన్స్‌లు, ప్రత్యేక వాహనాల కేటాయింపు ప్రారంభమైందన్నారు. జిల్లా అటవీ అధికారి వి.సాయిబాబ మాట్లాడుతూ తిరుపతి సర్కిల్ పరిధిలో తిరుపతి, అన్నమయ్య జిల్లాల్లోని రెండు డివిజన్లలో బృందాలు ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు.

లైవ్ క్యాప్చర్ నెట్ గన్ వినియోగాన్ని చూపుతున్న సీఎఫ్ సెల్వం

డీఎంహెచ్‌వోగా భూషణ్‌రెడ్డి

చిత్తూరు(వైద్యవిభాగం), న్యూస్‌టుడే: జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి(డీఎంహెచ్‌వో)గా నాగదసి భూషణ్‌రెడ్డిని నియమిస్తూ ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి సౌరబ్‌గౌర్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. అనంతపురం జిల్లా టీకాల అధికారిగా ఉన్న ఆయన్ను బదిలీ చేసి చిత్తూరు డీఎంహెచ్‌వోగా కేటాయించారు. త్వరలోనే ఆయన చిత్తూరులో బాధ్యతలు స్వీకరించనున్నారు. ప్రస్తుతం డీఎంహెచ్‌వోగా ఉన్న సుధారాణికి ఎలాంటి బదిలీ కానీ, బాధ్యతలు కానీ అప్పగించలేదు.

104FM Tirupati
ఈఎఫ్ఎమ్ కార్యక్రమాలు
సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ॥ 5 - ఉ॥ 7
ఈ-మార్నింగ్స్	ఉ॥ 7 - ఉ॥ 11
నువ్వానేనా	ఉ॥ 11 - మ॥ 2
సత్యభామ	మ॥ 2 - సా॥ 5
లైట్ తీస్కో	సా॥ 5 - రా॥ 9
సరదాగా కాసేపు	రా॥ 9 - రా॥ 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా॥ 12 - తె॥ 5

/Eenadufm
For Advertising on Eenadu FM Contact
8008555167, 9154991499

సర్వదర్శనానికి 8 గంటలు

తిరుమల, తిరుపతి (తితిదే), న్యూస్‌టుడే: శ్రీవారి సర్వదర్శనానికి 8 గంటల్లో, రూ.300 ఎస్ఈడీ టికెట్లు కలిగిన భక్తులకు మూడు గంటల్లో శ్రీవారి దర్శనం లభించనుంది. సోమవారం శ్రీవారిని 73,776 మంది భక్తులు దర్శించుకున్నారు. రూ.4.42 కోట్లు హుండీ కానుకలు లభించాయి.

శ్రీవారి దర్శనానికి సంబంధించి శ్రీనివాసం, విష్ణు నివాసం, భూదేవి కాంప్లెక్స్ వద్ద మంగళవారం భక్తులకు 15 వేల సర్వదర్శన టోకెన్లు జారీ చేశారు. వీరికి బుధవారం వేకువ జామున మూడు గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు దర్శనం కానుంది. శ్రీవారి మెట్టు నడకదారి భక్తులకు మరో 2 వేల టోకెన్లు జారీ చేశారు.

ఉద్యాన పంటలు.. రాయితీలు

పుత్తూరు, న్యూస్‌టుడే: ఉద్యాన పంటల సాగు దిశగా రైతులను ప్రోత్సహించేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. అందులో భాగంగానే పంటలు, పరికరాలపై రాయితీ అందిస్తోంది. రైతు సేవా కేంద్రాల్లో రైతులు దరఖాస్తులు చేసుకోవాలని.. వీటిపై రైతులకు అవగాహన కల్పిస్తున్నట్లు ఉద్యానశాఖ అధికారిణి వెంకట సౌజన్య తెలిపారు.

ప్రోత్సాహం ఇలా..

● తీగ జాతి కూరగాయల పందిరికి ఒక రైతుకు గరిష్ఠంగా 2.50 ఎకరాలకు రూ.2.50లక్షల వరకు రాయితీ ఇస్తోంది. అన్నిరకాల ఉద్యాన మొక్కల ఖరీదు, సేంద్రియ, రసాయన ఎరువులు, సస్యరక్షణకు 40 శాతం వరకు రాయితీ ఉంటుంది.

● ఉద్యాన యాంత్రీకరణలో చిన్న, సన్నకారు, మహిళా రైతులు, ఎస్సీ, ఎస్టీలకు 50 శాతం, ఇతర రైతులకు 40 శాతం రాయితీ.

● శీతల గిడ్డంగి నిర్మాణానికి 35 శాతం, తోటలో 600 చదరపు అడుగుల్లో గదుల ప్యాక్‌హౌస్‌ను నిర్మాణం చేసుకుంటే రూ.2లక్షలు, షెడ్ నెట్, పాలీ హౌస్ నిర్మించుకోవడానికి 50 శాతం వరకు రాయితీలు ఉంటాయి.

హెక్టారుకు రెండేళ్లలో అందించే రాయితీ ఇలా..(రూ.వేలల్లో)

పంట	నాటాల్సిన మొక్కలు	మొదటి ఏడాది	రెండో ఏడాది
మామిడి	178	30,000	20,000
జామ	1,111	48,000	32,000
అరటి	3,086	42,000	28,000
సపోట	400	18,000	12,000
బొప్పాయి	3,086	18,000	12,000
నిమ్మ, దానిమ్మ	667	30,000	20,000

● హైబ్రిడ్ కూరగాయలకు హెక్టారుకు రూ.24వేలు, పూల తోటలకు రూ.20వేలు వంతున రాయితీ మంజూరు చేస్తారు. రైతులు సంఘంగా ఏర్పడి 100 మీటర్ల పొడవు, వెడల్పుతో మూడు మీటర్లు లోతుగా పంట కుంటలను ఏర్పాటు చేసుకుంటే రూ.18 లక్షలు, వ్యక్తిగతంగా అయితే రూ.75వేలు అందిస్తున్నారు.

(c) eenadu

'కైలాస' ప్రాశస్త్యం.. నవసంధి బలం

నవసంధి వినాయకుల్లో ఒక్కరైన నైరుతి గణపతి

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: సమస్త దేవతలు, ఎందరో భక్తులు, వివరకు మూగజీవులకు సైతం ముక్తినిచ్చిన భూతల కైలాసంగా శ్రీకాళహస్తి దినదిన ప్రవర్ధమానం చెందుతోంది. ఏ క్షేత్రంలో లేని విధంగా ఇక్కడి చతుర్మాడ వీధుల్లో నవసంధి గణనాథులు కొలువుదీరడం, క్షేత్ర ప్రాభవానికి ఇదో ప్రత్యేక నిదర్శనంగా చెప్తుంటారు. శ్రీకాళహస్తీశ్వరాలయంలో నిర్వహించే మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల ప్రారంభం సందర్భంగా ధ్వజారోహణం రోజున ఇక్కడి గణనాథులను కార్యక్రమాలకు ఆహ్వానించడం, ధ్వజావరోహణం సందర్భంగా మళ్లీ వీరిని పలకడం ఆనవాయితీ. అలాగే వినాయకచవితి సందర్భంగా ఇక్కడి ఆలయాలకు ముక్కంటీశుని ఆలయం తరపున పట్టువస్త్రాల సమర్పణ జరుపుతారు.

ఒక్కో వీధిలో.. ఒక్కో గణపతి..: శ్రీకాళహస్తి క్షేత్ర సందర్శనకు వచ్చే భక్తుల సంకటాలను తొలగిస్తూ ఇక్కడి క్షేత్ర వైభవం దినదిన ప్రవర్ధమానం కావడానికి ప్రధాన కారణం నవసంధి వినాయకులే. ముక్కంటీశునితో పాటు దేవతా పరివారం చతుర్మాడ వీధుల గుండా ఊరేగుతూ భక్తులకు దర్శనమిస్తుంటారు. ఇక్కడి చతుర్మాడ వీధుల్లో ఒక్కో దిక్కు.. మూలల్లో ఆయా అధిదేవత అంశతో వినాయకులు పూజలు అందుకుంటూ ఇక్కడి క్షేత్ర ప్రత్యేకం. బ్రహ్మోత్సవాల్లో ప్రతి రోజున పురవీధుల్లో ఊరేగే దేవతామూర్తులకు ఆయా ఆలయాల వద్దకు రాగానే సర్కారు హారతి పేరుతో ప్రత్యేక హారతులు ఇస్తుండటం సంప్రదాయం.

కుంభాభిషేక మహోత్సవం జరిగిన అగ్నిగణపతి

చతుర్మాడ వీధుల్లో గణనాథులు

తేరువీధి: వీధి ప్రారంభంలో అన్నీ సంకటహర గణపతి, వరదిండి అంతతో ఉన్న వరుణగణపతి కొలువుదీరారు.

నైరుతివీధి: వాయువ్య మూలలో వాయుగణపతి, ఒకే ఆలయంలో ఇద్దరు గణపతులుగా కొలువుదీరిన కుబేరగణపతులు ఉండటం విశేషం.

నగరివీధి: ఇక్కడి ఈశాన్య మూలలో ఈశానది అంశతో ఉన్న ఈశాన్య గణపతి, ఇంద్ర గణపతులు కొలువుదీరి ఉన్నారు.

బజారువీధి: ఇక్కడి అగ్నియంలో అగ్నిగణపతి, యమ గణపతి, నైరుతిమూలన నైరుతి గణపతి (ఈదున అమ్మవారి తేరు వెనుక ఉన్న మండపంలో ఉంటారు) ఉంటారు.

విజయసిద్ధి.. చండీహోమం ప్రసిద్ధి

శక్తి ఆలయాల్లో చండీ హోమాలు నిర్వహించడం ఆగమ సంప్రదాయంగా వస్తోంది. దేవదాయ శాఖ తరపున ప్రసిద్ధి చెందిన పలు అమ్మవారి ఆలయాల్లో ఈ విశిష్ట సేవ ఆర్జిత సేవగా నిర్వహిస్తున్నారు. శ్రీకాళహస్తీశ్వరాలయంలో భక్తుల సౌకర్యార్థం ఈ సేవను ఏళ్ల క్రితమే అందుబాటులోకి తీసుకువచ్చారు.

చండీహోమాన్ని నిర్వహిస్తున్న వేదపండితులు

టికెట్‌ధర: రూ.1,116
ప్రవేశం: ఇద్దరికి
నిర్వహణ: దక్షిణకాళి ఆలయంలో
ఫలం: ఆరోగ్యసిద్ధి, శత్రుజయం, సంకటహర పరిస్థితుల నుంచి అధిగమించడం, ఆరోగ్యఫలం

సేవల ఫలాలు

ప్రాభవం.. దక్షిణకాళి ఆలయం..: శ్రీకాళహస్తీశ్వరాలయంలో కొలువుదీరిన దక్షిణకాళి ఎంతో శక్తిగల అమ్మవారు. బ్రహ్మోత్సవాల్లో అత్యంత కీలకం, ప్రధాన భూమిక కల్గిన మహాశివరాత్రి, రథోత్సవం, కైలాస గిరి ప్రదక్షిణోత్సవం తదితర ఉత్సవాల సందర్భంగా ఉత్సవమూర్తులను ఇక్కడి ఆలయం వద్దకు తీసుకువచ్చి ప్రత్యేకంగా హారతులు సమర్పించడం ఉత్సవాలకు బయలుదేరడం సంప్రదాయంగా వస్తోంది. మహిమాన్వితమైన అమ్మవారి ఆలయంలో చండీహోమాన్ని అర్చకస్వామి ఆధ్వర్యంలో నిత్యం జరిపిస్తుంటారు. పూజలు ఆచార్యక ఆలయం తరపున తీర్థప్రసాదాలు అందజేస్తారు.

- న్యూస్‌టుడే, శ్రీకాళహస్తి

శ్రీకాళహస్తీశ్వరుడికి పట్టువస్త్రాల సమర్పణ

శ్రీకాళహస్తీశ్వరుడికి పట్టువస్త్రాలు తీసుకెళ్తున్న కాణిపాకం ఆలయ ఛైర్మన్ మణినాయుడు, ఈవో పెంచల కిశోర్ తదితరులు

కాణిపాకం, న్యూస్‌టుడే: శివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా కాణిపాకం స్వయంభు శ్రీవరసిద్ధి వినాయక స్వామి ఆలయం తరపున తిరుపతి జిల్లా శ్రీకాళహస్తీశ్వరుడికి పట్టువస్త్రాలను సమర్పించారు. ఆలయ ఛైర్మన్ మణినాయుడు, ఈవో పెంచల కిశోర్ అక్కడి ఆలయ ఛైర్మన్ కొట్టె సాయిప్రసాద్, ఈవో బాపిరెడ్డికి మంగళవారం అందజేశారు. నూతన వస్త్రాలను స్వామి, అమ్మవార్లకు అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. సంప్రదాయం ప్రకారం వారిని ఆలయ వేద పండితులు ఆశీర్వదించారు. పాలకమండలి సభ్యులు నాగరాజునాయుడు, శివప్రసాద్, నరేష్, సతీష్, వసంతమ్మ, కృష్ణవేణి, చంద్రకళ, అనసూయ, శ్రీవాణి, అధికారులు, అర్చక, వేదపండితులు పాల్గొన్నారు.

మార్కెట్ వాల్యూ ఆడిట్ రిజిస్ట్రార్ నియామకం.. చిత్తూరు (సంతపేట): మార్కెట్ వాల్యూ ఆడిట్ జిల్లా రిజిస్ట్రార్‌గా విజయభాస్కర్ నియమితులయ్యారు. పుత్తూరు సబ్ రిజిస్ట్రార్‌గా పనిచేస్తున్న ఆయన్ను ఉద్యోగోన్నతిపై ఎంవీఅండ్ఏ జిల్లా రిజిస్ట్రార్‌గా నియమించారు.

DRAVIDIAN UNIVERSITY
SRINIVASAVANAM KUPPAM - 517 426.
Auction Notice

Notice for Auction of University Vehicles 5Nos & Scrap Materials
Nos.01 to 02/DU/Engg/25-26 Dated: 13.02.2026.

Public Auction is to be conducted on the D.U.premises at Registrar Office on 26.02.2026. Interested candidates are informed to participate in the auction. The details of the auction can be had from the University web site.

www.dravidianuniversity.ac.in **Registrar**

SHRIRAM Finance
శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్
రిజిస్టర్డ్ ఆఫీస్: శ్రీ టవర్స్, ప్లాట్ నెం.14ఎ, సౌత్ ఫేజ్, ఇండస్ట్రియల్ ఎస్టేట్, గిండి, చెన్నై- 600032, వెబ్‌సైట్:www.shriramfinance.in, బ్రాంచ్ కార్యాలయము : డి.నెం.11/458, వేలూరు కాంప్లెక్స్, 2వ అంతస్తు, ఓటికె రోడ్డు, చిత్తూరు జిల్లా -517001

స్వాధీనతా ప్రకటన

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్ 2002(3 ఆఫ్ 2002) క్రింద మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002లోని రూల్ 3తో చదువబడే సెక్షన్ 13(2) క్రింద సంక్రమించిన అధికారములను వినియోగించుకుంటూ **మెస్సర్స్ శ్రీరామ్ సిటీ యూనియన్ ఫైనాన్స్ లిమిటెడ్ (మెస్సర్స్ శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ వారితో విలీనమైనది)** యొక్క అధీకృత అధికారియగు దిగువ సంతకందారు **16.09.2025** తేదిన డిమాండ్ నోటీసు జారీ చేసి **రుణగ్రహీతలు**
1) ఆర్.శ్రీనివాసులు, తండ్రి లేట్ రాజగోపాల్, డి.నెం.28-1482/2, మహాత్మా నగర్, తేనెబండ, చిత్తూరు, చిత్తూరు జిల్లా - 517001 (కస్టమర్)
2) ఎస్.మహాలక్ష్మి, భర్త శ్రీనివాసులు, డి.నెం.28-1482/2, మహాత్మా నగర్, తేనెబండ, చిత్తూరు, చిత్తూరు జిల్లా - 517001 (గ్యారంటారు & తనఖాదారు)
3) పి.శ్రీధర్, తండ్రి ప్రభాకర్ నాయుడు, డి.నెం.14-498/1, కయిణికట్టు వీధి, చిత్తూరు,చిత్తూరుజిల్లా - 517001 (గ్యారంటారు)
వారిని సదరు నోటీసు అందుకున్న తేది నుండి 60 రోజులలో తేది **16.09.2025 నాటికి** నోటీసుతో తెలిపిన మొత్తం **రూ. 29,20,523/- (ఇరవై తొమ్మిది లక్షల ఇరవై వేల ఐదు వందల ఇరవై మూడు రూపాయలు మాత్రమే)లను మరియు** తేది: 24.09.2025 నాటి నుండి వడ్డీ మరియు ఇతర ఖర్చులను చెల్లించాల్సిందిగా **తేది: 31.10.2021న ఎంటర్‌ప్రైజ్ ఫైనాన్స్ లోన్ అగ్రిమెంట్ నెం.CHTORTF 2110310003** (మెస్సర్స్ శ్రీరామ్ సిటీ యూనియన్ ఫైనాన్స్ లిమిటెడ్ మునుపు విలీనం కాబడిన మెస్సర్స్ శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్) ద్వారా వారు కోరారు.

శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ (గతంలో శ్రీరామ్ సిటీ యూనియన్ ఫైనాన్స్ లిమిటెడ్‌గా ఉండి శ్రీరామ్ ట్రాన్స్‌పోర్టు ఫైనాన్స్ లిమిటెడ్‌తో విలీనమైన తరువాత ఎన్‌సిఎల్‌టి బెంచ్-2 చెన్నై వారు తేది: 09.11.2022న ఇచ్చిన సి.పి.నెం.69-76 ఆఫ్ 2002లోని ఆదేశాల మేరకు శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్‌గా రూపాంతరం చెందిన తర్వాత కార్పొరేట్ ఫైనాన్స్ మంత్రిత్వ శాఖ లేఖ తేది: 30.11.2022 ద్వారా శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్‌గా పేరు మార్పునకు ఆమోదము లభించినది) ఈ కంపెనీ కంపెనీల చట్టం, 2013 క్రింద రిజిస్టరు కాబడినది

రుణగ్రహీత మరియు గ్యారంటారు బకాయి వున్న మొత్తాన్ని తిరిగి చెల్లించుటలో విఫలమైనందున సదరు రూల్స్‌లోని రూల్ 8తో చదువబడే సదరు చట్టం లోని సెక్షన్ 13(4) క్రింద అతనికి సంక్రమించిన అధికారములను వినియోగించుకుంటూ దిగువ తెలిపిన ఆస్తిని దిగువ సంతకందారు **13.02.2026** వ తేదీన స్వాధీనపరచు కున్నారని రుణగ్రహీతకు/ గ్యారంటార్‌కు మరియు సాధారణ ప్రజానీకానికి ఇందుమూలముగా తెలియజేయడమైనది.

సదరు ఆస్తితో వ్యవహారము జరుపరాదని మరియు సదరు ఆస్తితో జరిపే ఏ వ్యవహారములైనా **తేది:16.09.2025** నాటికి **రూ.29,20,523/- (ఇరవై తొమ్మిది లక్షల ఇరవై వేల ఐదు వందల ఇరవై మూడు రూపాయలు మాత్రమే)లను + తేది: 17.09.2025 నాటి నుండి** దానిపై వడ్డీ మరియు ఖర్చులు **మెస్సర్స్ శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్** వారి ఎంటర్‌ప్రైజ్ ఫైనాన్స్ రుణ ఖాతాకు చెల్లించుటకు లోబడి వుంటాయని ముఖ్యంగా రుణగ్రహీతను/ గ్యారంటార్‌ను మరియు సాధారణ ప్రజలను ఇందుమూలముగా హెచ్చరించడమైనది.

సెక్షన్ 13 సబ్ సెక్షన్ 8 క్రింద రుణగ్రహీత తమ యొక్క ఆస్తులను తిరిగి పొందేందుకు సమయం కేటాయించడమైనదని గమనించగలరు.

స్థిరాస్తుల వివరములు
చిత్తూరు జిల్లా, చిత్తూరు సబ్‌జిల్లా, చిత్తూరు మండలం, చిత్తూరు సిటీ మరియు మున్సిపల్ కార్పొరేషన్ ఏరియా, నెం.72, చిత్తూరు గ్రామలెక్కదాఖలా మెట్ట సర్వేనెం.147/4లో ఎ.0.60 సెంట్లు లేదా 0.240 హెక్టార్ల బూమిని మార్పు చేసి వేసిన లేఔట్ ప్లాట్లలో ప్లాటు నెం.7 ఖాళీ స్థలం. హద్దులు: తూర్పుం కటారి గురు స్వామి నాయుడు భూమి, పడమర: 20అ. వెడల్పు గల జాయింట్ రోడ్డు, ఉత్తరం: ప్లాటు నెం.6 లోని స్థలం, దక్షిణం: ప్లాటు నెం.8 లోని స్థలం, ఈ హద్దుల మధ్య తూర్పు నుండి పడమర: ఉత్తరం వైపు 64 1/2అ. లేదా 19.673మీ. దక్షిణం వైపు : 62 1/2అ. లేదా 19.063మీ. ఉత్తరం నుండి దక్షినం: 30అ. లేదా 9.150 మీ. వెరశి 1905 చ.అ. లేదా 211.66 చ.గ. ఖాళీ స్థలం మాత్రమే

ప్రదేశం: చిత్తూరు సం/- అధీకృత అధికారి,
తేది: 13.02.2026 శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్

22న తెదేపా కార్యాలయ భవన నిర్మాణానికి భూమిపూజ

నిర్మాణ స్థలాన్ని పరిశీలిస్తున్న తెదేపా నాయకులు

చిత్తూరు (జిల్లా పంచాయతీ), న్యూస్‌టుడే: తెదేపా జిల్లా కార్యాలయ నూతన భవన నిర్మాణానికి ఈనెల 22న ఉదయం 10 గంటలకు నిర్వహించనున్న భూమిపూజను విజయవంతం చేయాలని తెదేపా చిత్తూరు పార్లమెంటు నియోజకవర్గ అధ్యక్షుడు షణ్ముగరెడ్డి, ప్రధాన కార్యదర్శి సునీల్‌కుమార్‌చౌదరి పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక తెదేపా కార్యాలయంలో నాయకులతో సమావేశమయ్యారు. పూజకు పార్టీ ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజా ప్రతినిధులు, జిల్లా, నియోజకవర్గ, మండల స్థాయి అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, అనుబంధ కమిటీల సభ్యులు, క్లస్టర్, యూనిట్ ఇన్‌ఛార్జులు, నాయకులు అందరూ హాజరు కావాలని వారు విజ్ఞప్తి చేశారు. నాయకులు మోహన్‌రాజ్, ధనుంజయ నాయుడు, రవియాదవ్, మైకేల్, మునిజాన్సుర్‌రాజు, శేఖర్‌బాబు, వెంకటేష్, సాంబశివ, ధరణీప్రకాష్ పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల విక్రయ దుకాణాల ప్రారంభం

చిత్తూరు(వ్యవసాయం), న్యూస్‌టుడే: ప్రకృతి సేద్యం విస్తరణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అధిక ప్రాధాన్యం ఇస్తున్నాయి. ఈ తరుణంలో జిల్లాలో 260 ప్రకృతి వ్యవసాయ క్లస్టర్లు ఉన్నాయి. ప్రతి క్లస్టర్‌లో ప్రకృతి వ్యవసాయ ఉత్పాదకాలు-పంట ఉత్పత్తుల విక్రయ దుకాణాలను ప్రారంభించడానికి చర్యలు చేపట్టినట్లు జిల్లా ప్రకృతి వ్యవసాయ పథకం జిల్లా మేనేజరు శివశంకర్ తెలిపారు. ప్రస్తుతం జిల్లాలో 46 ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల విక్రయ దుకాణాలు ఏర్పాటు చేశామని, మిగతా దుకాణాల ఏర్పాటుకు దృష్టి సారించామన్నారు. ముఖ్యంగా ప్రకృతి వ్యవసాయ విక్రయ దుకాణం ఏర్పాటుకు సంబంధిత వ్యక్తి ప్రకృతి వ్యవసాయదారునిగా ఉండాలన్నారు.

చెరువు మట్టి అక్రమంగా తరలిస్తే ఉపేక్షించం

చిత్తూరు(వ్యవసాయం), న్యూస్‌టుడే: అక్రమంగా చెరువు మట్టిని తరలిస్తే ఉపేక్షించే ప్రసక్తే లేదని జిల్లా జల వనరుల శాఖ ఎస్‌ఈ వెంకటేశ్వర్‌రాజు పేర్కొన్నారు. జిల్లాలోని పలు ప్రాంతాల్లోని చెరువుల్లో అక్రమంగా మట్టిని తరలిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. అనుమతులు లేకుండా మట్టిని తరలిస్తే...వాహనాలను సీజ్ చేసి కేసులు నమోదు చేస్తామని చెప్పారు. చెరువు మట్టిని తీసుకెళ్లాలంటే ముందస్తు అనుమతులను పొందాలన్నారు.

కొత్త రైతుబజార్ల ఏర్పాటుకు కసరత్తు

చిత్తూరు (వ్యవసాయం): రైతులకు గిట్టుబాటు ధర, వినియోగదారులకు సరసమైన ధరలతో నాణ్యమైన కూరగాయలు, పంట ఉత్పత్తులు అందుబాటులో ఉంచేందుకు కొత్త రైతుబజార్ల ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. నియోజకవర్గానికి ఒకటి చొప్పున రైతుబజారు ఏర్పాటుకు కసరత్తు వేగవంతం చేసింది. చిత్తూరు, పలమనేరు నియోజకవర్గాల్లో రైతుబజార్లు అందుబాటులో ఉన్నాయి. నగరి నియోజకవర్గంలో రైతుబజారును పుత్తూరు మార్కెట్ యార్డులో, కుప్పం నియోజకవర్గంలో కుప్పంలో ప్రైవేటు స్థలాన్ని గుర్తించారు. గంగాధరనెల్లూరు నియోజకవర్గంలో ఎస్‌ఆర్‌పురం మండలంలో గుర్తించిన స్థలం కోర్టు వివాదంలో ఉండగా...కోర్టు సమస్య పరిష్కారం కాగానే రైతుబజారును నిర్మించనున్నారు. పూతలపట్టు నియోజకవర్గం పరిధిలో బంగారుపాళ్యంలో రైతుబజారు ఏర్పాటుకు సత్వరమే అర ఎకరం గుర్తించి నివేదించాలని రాష్ట్ర రైతుబజార్ల సీఈవో మాధవీలత మార్కెటింగ్ శాఖ ఏడీ పరమేశ్వరకు ఉత్తర్వులు జారీ చేశారు. రానున్న రోజుల్లో అన్ని నియోజకవర్గాల్లో రైతుబజార్లు అందుబాటులోకి రానున్నాయి.

ఆర్టీసీ కండెక్టర్లకు పవర్‌బ్యాంక్‌ల పంపిణీ

కండెక్టర్లకు పవర్‌బ్యాంక్ అందజేస్తున్న డీపీటీవో రాము తదితరులు

చిత్తూరు (కొంగారెడ్డిపల్లి), న్యూస్‌టుడే: జిల్లాలోని ఆర్టీసీ కండెక్టర్లకు మంగళవారం డీపీటీవో రాము పవర్ బ్యాంక్‌లను పంపిణీ చేశారు. నగరంలోని కొత్త ఆర్టీసీ బస్టాండులో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. బస్సుల్లో టికెట్ పంపిణీకి ఈ-పోస్(ఎలక్ట్రానిక్ టికెట్ యంత్రం) వినియోగిస్తుండగా.. ఛార్జింగ్ సమస్య రాకుండా పవర్‌బ్యాంక్‌లను అందించినట్లు చెప్పారు. చాలా బస్సుల్లో టికెట్ పంపిణీ సమయంలో ఛార్జింగ్ లేని కారణంగా కండెక్టర్లు సమస్యలు ఎదుర్కొంటున్న విషయం తెలిసిందని, నియంత్రణకు పవర్‌బ్యాంకులను పంపిణీ చేసినట్లు తెలిపారు. జిల్లాలో చిత్తూరు-1, చిత్తూరు-2 డిపో, కుప్పం, పలమనేరు, పుంగనూరు డిపోల్లో 736 మంది కండెక్టర్లు ఉండగా.. వారికి సుమారు 791 పవర్‌బ్యాంక్‌లను పంపిణీ చేసినట్లు వివరించారు. చిత్తూరు ఆర్టీసీ రెండో డిపో డీఎం రాజ్రీ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

90 విద్యుత్తు సమస్యల గుర్తింపు

చిత్తూరు (మిట్టూరు), న్యూస్‌టుడే: ఏపీఎస్పీడీసీఎల్ సీఎండీ శివశంకర్ ఆదేశాల మేరకు జిల్లాలో మంగళవారం నిర్వహించిన 'కరెంట్‌తో జనబాట' కార్యక్రమంలో 90 సమస్యలను గుర్తించినట్లు జిల్లా విద్యుత్తు శాఖ ఎస్‌ఈ ఇస్మాయిల్ అహ్మద్ తెలిపారు. నియంత్రికల మరమ్మతులు, సర్వీసు వైర్లు, 11కేవీ లైన్లు, ఎల్‌టీ లైన్ల మార్పు, సరఫరాలో అంతరాయాలు తదితర సమస్యలను గుర్తించామన్నారు.

SHRIRAM Finance
శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్
రిజిస్టర్డ్ ఆఫీస్: శ్రీ టవర్స్, ప్లాట్ నెం.14ఎ, సౌత్ ఫేజ్, ఇండస్ట్రియల్ ఎస్టేట్, గిండి, చెన్నై- 600032, వెబ్‌సైట్:www.shriramfinance.in, బ్రాంచ్ కార్యాలయము : డి.నెం.11/458, వేలూరు కాంప్లెక్స్, 2వ అంతస్తు, ఓటికె రోడ్డు, చిత్తూరు జిల్లా -517001

లాంఛనంగా స్వాధీనతా ప్రకటన

శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ (గతంలో శ్రీరామ్ సిటీ యూనియన్ ఫైనాన్స్ లిమిటెడ్‌గా ఉండి శ్రీరామ్ ట్రాన్స్‌పోర్టు ఫైనాన్స్ లిమిటెడ్‌తో విలీనమైన తరువాత ఎన్‌సిఎల్‌టి బెంచ్-2 చెన్నై తేది: 09.11.2022 వారి ఆదేశాలతో **శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ గా రూపాంతరం చెందిన** తర్వాత కార్పొరేట్ ఫైనాన్స్ మంత్రిత్వ శాఖ లేఖ తేది: 30.11.2022 ద్వారా శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్‌గా పేరు మార్పునకు ఆమోదము లభించినది) ఈ కంపెనీ కంపెనీల చట్టం, 2013 క్రింద రిజిస్టరు కాబడినది మరియు ఆర్‌బిఐ నందు కూడా నాన్ బ్యాంకింగ్ ఫైనాన్స్ వ్యాపార కార్యకలాపాలు నిర్వహించుటకు రిజిస్టరు కాబడి వారి **రిజిష్టరు కార్యాలయం: శ్రీ టవర్స్, ప్లాట్ నెం.14ఎ, సౌత్ ఫేజ్, ఇండస్ట్రియల్ ఎస్టేట్, గిండి, చెన్నై-600032 నందు నమోదు కాబడినదని తెలియజేయడమైనది.**

సెక్యూరిటైజేషన్ మరియు రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 ప్రకారం శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ (యస్‌యఫ్‌ఎల్) యొక్క అధీకృత అధికారి సదరు చట్టంలోని 13(12) కు అనుబంధమైన సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్ మెంట్) రూల్స్ 2002 నందలి రూలు 3 ప్రకారం సంక్రమించిన అధికారములను వినియోగిస్తూ ఋణగ్రహీత ఈ క్రింది తెలిపిన ప్రకారం బకాయి సొమ్ము మొత్తంను చెల్లించ వలసినదిగా క్రింద ఉదహరించబడిన తేదీన డిమాండ్ నోటీసు జారీ చేయడమైనది.

బకాయి సొమ్ము చెల్లించడంలో ఋణగ్రహీతలు విఫలమైనందున సదరు చట్టంలోని సెక్షన్ 13(4)తో అనుబంధమైన సదరు రూల్స్ నందలి రూలు8 ప్రకారం సంక్రమించిన అధికారము లను వినియోగిస్తూ దిగువ పేర్కొన్న ఆస్తిని **డి.13.02.2026న** లాంఛనంగా స్వాధీనం చేసుకోవడమైనదని ఋణగ్రహీతలకు మరియు సాధారణ ప్రజానీకానికి ఇందుమూలముగా తెలియజేడమైనది.

రుణగ్రహీత పేరు మరియు చిరునామా:
1) **ఎస్.హేమంత్‌కుమార్,** తండ్రి సందీప్‌కుమార్, డి.నెం.28-950/1, ధర్మరాజు కాలనీ, చిత్తూరు, చిత్తూరు జిల్లా - 517001
2) **ఎం.లత,** భర్త వెంకటేష్ అనే వెంకటాద్రి, డి.నెం.28-950/1, ధర్మరాజు కాలనీ, చిత్తూరు, చిత్తూరు జిల్లా - 517001
3) **ఎం.ప్రియాంక,** భర్త హేమంత్‌కుమార్, డి.నెం.28-950/1, ధర్మరాజు కాలనీ, చిత్తూరు, చిత్తూరు జిల్లా - 517001
4) **ఎం.ప్రకాష్‌బాబు,** తండ్రి మొరిసి లేట్ కుప్పయ్య, డి.నెం.12/396, సత్యనారాయణపేట, గుంతకల్, అనంతపురం జిల్లా - 515801

డిమాండ్ నోటీసు అమౌంట్: రూ.33,48,272/- (ముప్పై మూడు లక్షల నలభై ఎనిమిది వేల రెండు వందల డెబ్బైరెండు రూపాయలు మాత్రమే)
అగ్రిమెంటు నెం:CHTORTF1904090004 డిమాండ్ నోటీసు తేది: 16.09.2025
రుణమొత్తం: రూ. 10,00,000/- (పది లక్షల రూపాయలుమాత్రమే)
స్వాధీనం చేసుకున్న తేది: 13.02.2026

స్థిరాస్తుల వివరములు
చిత్తూరు జిల్లా, చిత్తూరు సబ్ జిల్లా, చిత్తూరు మండలం, చిత్తూరుమున్సిపాలిటీ నెం.72, చిత్తూరు గ్రామలెక్కదాఖలా సర్వేనెం.355/1, ధర్మరాజు కాలనీ, మున్సిపల్ డి.నెం.28-950/1 గల ఆర్.సి.సి బిల్డింగ్ గ్రౌండ్ ఫ్లోరు మరియు ఎ.సి.సి. రూఫ్‌తో కూడిన ఇల్లు గల 1వ అంతస్తు మరియు ఖాళీ భూమి హద్దులు: తూర్పు: జాయింట్ రోడ్డు, పడమర: డి.నెం.28-950/4 గల మునిరాజ ఇల్లు, ఉత్తరం: శేఖర్ ఇల్లు, దక్షిణం: చాంద్ బాషా మరియు నౌసియా పీర్ ఇల్లు, ఈ హద్దుల మధ్య తూర్పు నుండి పడమర: 46చ.అ. లేదా 13.984 మీ. మరియు ఉత్తరం నుండి దక్షినం: 15చ.అ. లేదా 4.561మీ. వెరశి 690 చ.అ. లేదా 76.66 చ.గ. భూమి మరియు 690చ.అ. భూమిలో ఆర్.సి.సి. గ్రౌండ్ ఫ్లోర్ బిల్డింగ్ మరియు 345 చ.అ. ఆర్.సి.సి. ఫస్ట్ ఫ్లోర్ ఇల్లు మరియు 345 చ.అ. ఎసిసి షీట్ రూఫ్ గల ఇల్లు అన్ని ఫిట్టింగ్‌లు మరియు ఫిక్చర్లు మరియు ఈజ్‌మెంటరీ హక్కులు అనుబంధాలతో సహా.

సాధారణ ప్రజానీకానికి తెలియజేయునది ఏమనగా **(SFL)** అధీకృత అధికారి పైన పేర్కొబడిన స్థిరాస్తులను ఋణగ్రహీతల నుండి లాంఛనముగా స్వాధీనత తీసుకొనడమైనది. ఈ నోటీసు తర్వాత ఏ వ్యక్తికి విక్రయించుట గాని, ట్రాన్స్‌ఫర్ చేయుట గానీ, లీజు లేదా తనఖా ఆస్తులను దారి మళ్ళించుటకు గానీ **SFL** వారి లిఖితపూర్వక అనుమతి లేకుండా చేయరాదు.

ప్రదేశం: చిత్తూరు సం/- అధీకృత అధికారి,
తేది: 13.02.2026 శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్

ఉత్సాహంగా చదరంగం పోటీలు

ఎంపికైన ఆటగాళ్లతో అధికారులు

చిత్తూరు (క్రీడలు), న్యూస్‌టుడే: శాప్ లీగ్‌లో భాగంగా జిల్లా స్థాయి చదరంగం పోటీలు చిత్తూరులోని మెసానికల్ మైదానంలో ఉత్సాహంగా సాగాయి. అండర్-13, 15, 17 విభాగాల్లో జరిగిన పోటీల్లో 48 మంది ఆటగాళ్లు తలపడ్డారు. బాలుర విభాగంలో చైతన్య, యశ్వంత్ సాయిశరత్, సతీష్, గౌతమ్, నాగూర్‌హనీఫ్, బాలికల విభాగంలో అనంతనిత్య, నిక్షిత, టీనాతేజస్వి, అమృత, జస్మిత జిల్లా జట్టుకు ఎంపికైనట్లు డీఎస్‌డీవో బాలాజీ తెలిపారు. వీరు తిరుపతిలో త్వరలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో జిల్లా తరపున ప్రాతినిధ్యం వహించనున్నట్లు డీఎస్‌డీవో తెలిపారు.

జూన్ నుంచి కేంద్రీయ విద్యాలయాల్లో తరగతులు

కలెక్టర్ సుమిత్‌కుమార్

చిత్తూరు కలెక్టరేట్, న్యూస్‌టుడే: చిత్తూరు, కుప్పంలలో కేంద్రీయ విద్యాలయాల్లో జూన్ నుంచి తరగతులు ప్రారంభం కానున్నట్లు కలెక్టర్ సుమిత్‌కుమార్ తెలిపారు. జిల్లా అభివృద్ధి పనులపై కలెక్టరేట్‌లో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 'కేంద్రీయ విద్యాలయాల్లో ప్రవేశాలకు త్వరలో ప్రకటన జారీ కానుంది. కేంద్రీయ విద్యాలయ నిర్మాణ పనులకు రూ.20 లక్షలు కేటాయించాం. చిత్తూరు-తచ్చూరు హైవేలో రెండు వారాల్లో వాహన ప్రయాణాల్ని ప్రారంభిస్తాం. చెన్నై-బెంగళూరు ఎక్స్‌ప్రెస్ వేలో వాహన రాకపోకలు సెప్టెంబర్ నుంచి ప్రారంభించేలా ప్రణాళికలు ఉన్నాయి. కుప్పం నుంచి కర్ణాటక రాష్ట్రంలోని హోసూరు వరకు 60 కి.మీ మేర జాతీయ రహదారి నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేశాం. చిత్తూరు నగరంలో గాంధీ రోడ్డు విస్తరణ పనులు త్వరలో ప్రారంభమవుతాయి. కట్టమంచి-సాంబయ్యకండ్రిగ రోడ్డును పూర్తిచేసి అందుబాటులోకి తీసుకొస్తాం' అని చెప్పారు. ✦ జిల్లాలోని నియోజకవర్గాల అభివృద్ధి ప్రణాళికల సమీక్షలు జరిగాయి. అడవిపల్లి రిజర్వాయర్ నుంచి చిత్తూరుకు తాగునీరు సరఫరా, ట్రామా కేర్ సెంటర్ల ఏర్పాటు, జీడీనెల్లూరు నియోజకవర్గంలో రెండు పారిశ్రామిక పార్కులు, నగరి నియోజకవర్గంలో కోశలనగరం పార్కు, గాలేరు-నగరి సుజల స్రవంతి, పలమనేరులో అలవరదుల ప్రాజెక్టు, కైగల్‌లో తాగునీటి ప్రాజెక్టు నిర్మాణానికి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ✦ 'వేసవిలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు ప్రణాళికలు రూపొందించాం. పడమటి మండలాల్లోని కొన్ని ప్రాంతాల్లో సమస్య ఉంది. అక్కడ సమస్య పరిష్కారానికి ప్రతిపాదనలు రూపొందించాం' అని కలెక్టర్ పేర్కొన్నారు.

ఇద్దరు గంధపు చెట్ల స్మగ్లర్ల అరెస్ట్

స్మగ్లర్లు, దుంగలను చూపుతున్న అటవీశాఖ అధికారులు

తిరుమల, న్యూస్‌టుడే: తిరుమల శేషాచలం అటవీ ప్రాంతంలో గంధపు చెట్లు కొట్టి తరలిస్తున్న ఇద్దరు స్మగ్లర్లను తిరుమల రేంజ్ అటవీ అధికారులు అరెస్టు చేశారు. డీఎఫ్‌వో స్వప్నకుమార్ కథనం మేరకు.. సోమవారం డీఎఫ్‌వోకు అందిన సమాచారంతో తిరుమల బీటు అధికారి, జేస్ క్వాడ్ సిబ్బంది తనిఖీలు చేపట్టారు. సాయంత్రం 5.30 గంటల ప్రాంతంలో పాత పాపవినాశనం వద్ద గంధపు చెట్లు కొస్తున్న ఇద్దరిని గుర్తించారు. వారు ఎర్రావారిపాళెం మండలం చింతగుంటకు చెందిన జి.జయరామయ్య, బంగారుపాళెం మండలం గొల్లపల్లె గ్రామానికి చెందిన పి.ధనంజయగా గుర్తించారు. వారి నుంచి 31.90 కిలోల దుంగలు స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేశారు. ఎఫ్‌బీవో జె.అఖిల్ పాల్గొన్నారు.

రుయా న్యూబ్లాక్ ఆధునికీకరణ

తిరుపతి (వైద్యవిభాగం), న్యూస్‌టుడే: రుయా ప్రభుత్వ ఆస్పత్రి న్యూ బ్లాక్‌లోని వార్డును ఆధునికీకరిస్తున్నారు. ప్లాస్టిక్ సర్జరీ విభాగంలోని బర్న్ వార్డులో పలు సదుపాయాలు అందుబాటులోకి తెచ్చారు. తీవ్రమైన కాలిన గాయాలకు చికిత్స అందించేందుకు వీలుగా హై డిపెండెన్సీ యూనిట్ (హెచ్‌డీయూ) అన్ని వసతులతో నిర్మిస్తున్నారు. రోగులకు అవసరమైన మౌలిక సదుపాయాలు సమకూర్చారు. బర్న్ వార్డుకు వచ్చే రోగులకు నాణ్యమైన వైద్యం, సదుపాయాలు కల్పన కోసం ప్రత్యేకంగా దాతల సహకారంతో యూనిట్ వైద్యాధికారులు చర్యలు చేపట్టారు.

SHRIRAM Finance
శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్
నమోదిత కార్యాలయం : శ్రీ టవర్స్, ప్లాట్ నెం.14ఎ, సౌత్ ఫేజ్, ఇండస్ట్రియల్ ఎస్టేట్, గిండి, చెన్నై-600032.
ప్రాంతీయ కార్యాలయం: డి.నెం.8-115/1, 4వ అంతస్తు, కెనరా బ్యాంక్ పైన, ఎమ్ఎమ్ కాంప్లెక్స్,రాయల్ నగర్, ఆర్‌సి రోడ్డు, తిరుపతి, తిరుపతి జిల్లా -517501
బ్రాంచ్ కార్యాలయం: డి.నెం.1-747, 2వ అంతస్తు, తిరుపతి నుండి మదనపల్లి రోడ్డు, పీలేరు, అన్నమయ్య జిల్లా-517214 వెబ్‌సైట్ : http://www.shriramfinance.in./auction

శ్రీ పి.ముద్దు కృష్ణ గారికి చెందిన స్థిరాస్తుల విక్రయానికి ఇ-వేలం అమ్మకం ప్రకటన

రూల్ 9(1) క్రింద సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్‌తోచదవబడే సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ & ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 క్రింద స్థిరాస్తుల అమ్మకం కోసం ఇ-వేలం అమ్మకం ప్రకటన **25-06-2025 తేదీ గల ఉద్దేశపూర్వక అమ్మకం నోటీసు 30 రోజుల గడువు తీరిన** తర్వాత ఇప్పుడు జారీచేయబడినది. సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని రూల్ 8(6)లో చదువబడు చట్టం 54/2002లోని సెక్షన్13(8) క్రింద పేర్కొన్న విడిపించుకునే హక్కును మీరు వినియోగించుకోవడంలో విఫలమైనందున ఇ-వేలం అమ్మకం కోసం ప్రకటన జారీ చేయబడింది. ఋణగ్రహీతలు/హామీదారులు/తనఖాదారులు/సహ-దరఖాస్తుదారులు/సహ-ఋణగ్రహీతలకు ఇందుమూలముగా తెలియజేయడమైనది.
ఇందుమూలముగా సాధారణ ప్రజానీకానికి ముఖ్యంగా ఋణగ్రహీతలు/హామీదారులు/తనఖాదారులు/సహ-దరఖాస్తుదారులు/సహ-ఋణగ్రహీతలకు నోటీసు ద్వారా తెలియజేయునది ఏమనగా, సర్ఫేసి యాక్ట్ సెక్షన్ 13(2) ప్రకారం, శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, అధీకృత అధికారి జారీచేసిన **డిమాండ్ నోటీసు తేది.23.03.2024** ప్రకారం, **తేది.23.03.2024** నాటికి **రూ.35,26,850/-** మరియు **24.03.2024** నుండి వర్తించు వడ్డీ మరియు కాస్ట్స్ మరియు చార్జీలు మరియు ఖర్చులు రాబట్టుకొనుటకు సెక్యూర్డు క్రెడిటార్‌కు తనఖా పెట్టిన / ఛార్జీ చేసిన దిగువ తెలిపిన స్థిరాస్తులను **"ఎక్కడ ఎలా ఉన్నది" "అక్కడ అలా"** మరియు **"అక్కడ ఏమున్నదో అది"** ప్రాతిపదికన ఇ-వేలం ద్వారా **తేది.25-03-2026 న ఉదయం 11.00 గంటల నుండి మధ్యాహ్నం 01.00 గంటల వరకు** ఆస్తులను విక్రయించేందుకు నిర్ణయించుటమైనది.

అగ్రిమెంట్ నెం : PILERTF2204300004

ఋణగ్రహీత/హామీదారు(లు): 1) పి.ముద్దు కృష్ణ, తండ్రి: మనోహర్, డి.నెం.2-49, పూతలపట్టు, HW చిత్తూరు, చిత్తూరు జిల్లా -517124.(కస్టమర్)
2) పి.మనోహర్, తండ్రి : మునస్వామి(లేటు), డి.నెం.2-49, పూతలపట్టు, HW చిత్తూరు, చిత్తూరు జిల్లా -517124.(హామీదారు)
3) పి.హరి ప్రసాద్, తండ్రి: మనోహర్, డి.నెం.2-49, పూతలపట్టు, HW చిత్తూరు, చిత్తూరు జిల్లా -517124.(హామీదారు)

స్థిరాస్తి వివరములు: (డాక్యుమెంట్ నెం.1584/2022 ప్రకారం శ్రీ పి.ముద్దు కృష్ణ గారికి చెందిన ఆస్తి)
చిత్తూరు జిల్లా, శ్రీ బాలాజీ రిజిస్ట్రేషన్ జిల్లా, పాకాల సబ్ జిల్లా, పూతలపట్టు మండలం, పూతలపట్టు గ్రామ పంచాయితీ మరియు గ్రామ ఖాతాలో, పూతలపట్టు హరిజనవాడ రోడ్ ప్రక్కన, వార్డు నెం.3, సర్కారు డ్రై సర్వే నెం.749/2 లో విస్తీర్ణం ఎ.1.64 సెంట్లు, సర్కారు డ్రై సర్వే నెం.749/1ఎ లో విస్తీర్ణం ఎ.1.82 సెంట్లు, మరియు సర్కారు డ్రై సర్వే నెం.749/1బి లో విస్తీర్ణం ఎ.1.82 సెంట్లు. మొత్తం ఎ.5.28 సెంట్లు భూమి లే అవుట్ క్రింద ఇంటి ప్లాటులుగా మార్చబడినవి. ఆ ప్లాటు నెం.లు 92 మరియు 93. **హద్దులు : తూర్పు :** జి.నుపతి గారి ప్లాటు నెం.98 మరియు పి.సోమశేఖర్ గారి ప్లాటు నెం.99, **పడమర:** 23 అ॥ల వెడల్పు గల లే అవుట్ రోడ్డు, **ఉత్తరం :** జి.జానకి గారి ప్లాటు నెం.94, **దక్షిణం:** యాళ్ళనూరి సుప్రజ గారి ప్లాటు నెం.91. వీటి మధ్యలో **ప్లాటు నెం.92 కొలతలు :** తూర్పు నుండి పడమర 40 అడుగులు లేదా 12.19 మీటర్లు మరియు ఉత్తరం నుండి దక్షిణం 30 అడుగులు లేదా 9.13 మీటర్లు. మొత్తం విస్తీర్ణం 1200 చ॥అ॥లు లేదా 133.33 చ॥గ॥ల ఖాళీ స్థలం మాత్రమే. **ప్లాటు నెం.93 కొలతలు :** తూర్పు నుండి పడమర 40 అడుగులు లేదా 12.19 మీటర్లు మరియు ఉత్తరం నుండి దక్షిణం 30 అడుగులు లేదా 9.13 మీటర్లు. మొత్తం విస్తీర్ణం 1200 చ॥అ॥లు లేదా 133.33 చ॥గ॥ల ఖాళీ స్థలం మాత్రమే. రెండు ఐటమ్‌లు 1 మరియు 2 యొక్క మొత్తం విస్తీర్ణం 266.66 చ॥గ॥ల ఖాళీ స్థలం మాత్రమే

ఎన్‌కంబరెన్స్‌లు ఏమైనా : లేవు

ఆస్థి రిజర్వు ధర	ధరావత్తు మొత్తం	ధరావత్తు సమర్పించు విధానం	బిడ్ పెంపుదల మొత్తం	వేలం తేది	ధరావత్తు సమర్పించుటకు చివరి తేది	ఆస్థి తనిఖీ తేది
రూ.25,92,000/-	రూ.2,59,200/-	శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ పేరున డి.డి సమర్పించాలి	రూ.10,000/-	25.03.2026	24.03.2026	23.03.2026

ఆసక్తిగల బిడ్డర్లు లాగిన్ ఐడి & పాస్‌వర్డ్ సృష్టించడంలో, డేటాను అప్‌లోడ్ చేయడంలో, బిడ్ సమర్పించడంలో, ఇ-బిడ్డింగ్ ప్రక్రియపై శిక్షణలో మొదలగున వాటి సహాయం కొరకు మెస్సర్స్ **శ్రీరామ్ ఆటోమాల్ ఇండియా లిమిటెడ్,** సంప్రదించవలసిన వ్యక్తి : **గౌరవ్ నంబూదిరి, మొబైల్ నెం. 9833922941, గౌరవ్ నంబూదిరి <gaurav.n@samil.in>** నందు సంప్రదించగలరు.
ఆస్తికి సంబంధించిన ఏదైనా సందేహాల కోసం **శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, అధీకృత అధికారి, వి.గోపి** గారిని కార్యాలయ పని దినాలలో **83091 24131** నందు సంప్రదించవచ్చు.
అధీకృత అధికారికి ఏదైనా లేదా అన్ని బిడ్లను తిరస్కరించే హక్కు కలదు. ఆన్‌లైన్ వేలం మా వేలం ఏజెన్సీ శ్రీరామ్ ఆటో మాల్ ఇండియా లిమిటెడ్ వెబ్‌సైట్‌లో **(https://eauctions.Samil.in/home)** నిర్వహించబడుతుంది. టెండర్ సమర్పణ స్థలం/ బిడ్ ఫారమ్ / టెండర్ ఓపెన్ & వేలం పొందడానికి, దయచేసి **https://eauctions.Samil.in/home** వెబ్‌సైట్‌ను సందర్శించండి మరియు అమ్మకం యొక్క వివరణాత్మక నిబంధనలు మరియు షరతుల కోసం దయచేసి శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ వెబ్‌సైట్‌లో అందించిన **https://www.shriramfinance.in/auction** లింక్‌ను చూడండి.
గమనిక: 'చెన్నైలోని NCLT ఆదేశం ప్రకారం "శ్రీరామ్ సిటీ యూనియన్ ఫైనాన్స్ లిమిటెడ్" ను "శ్రీరామ్ ట్రాన్స్‌పోర్ట్ ఫైనాన్స్ లిమిటెడ్"లో విలీనం చేసినట్లు తెలియజేయడమైనది. తదనంతరం 30-11-2022 నాటి పేరు మార్పుకు సంబంధించిన విలీన ధృవీకరణ పత్రం ప్రకారం, 30.11.2022 నుండి "శ్రీరామ్ ట్రాన్స్‌పోర్ట్ ఫైనాన్స్ లిమిటెడ్" పేరును "శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్"గా మార్చడం జరిగింది.

తేది.16.02.2026, ప్రదేశం : తిరుపతి సం/- అధీకృత అధికారి, శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్

EENADU Classifieds

FINANCIAL SERVICES

స్థిరాస్తులపై ఆంధ్రప్రదేశ్ అంతటా మార్టిగేజ్ లోన్స్ మరియు స్థిరాస్తి ఎక్కడ ఉన్నా ఏ సంస్థలో ఉన్నా Xerox పేపర్స్‌పై 2nd మార్టిగేజ్ లోన్ ఇవ్వబడును. 50 లక్షలులోపు, అయోధ్య కోఆపరేటివ్ బ్యాంక్. ✆ 93969 99669.

REAL ESTATE

FLAT FOR SALE
GENERAL

తిరుపతి, గెస్ట్‌లైన్ హోటల్‌కి ఆనుకొని మాస్టర్ ప్లాన్ 80 feet రోడ్డు ప్రక్కన AB AAVAS Phoenix Tower Smart Homesలో 2, 3 BHK Flats సేల్స్‌కు కలవు. RERA Project. 9505502346

PLOT FOR SALE
GENERAL

నేషనల్ హైవేలకు ఆనుకొని తిరుపతిలో ఫైనల్ అప్రూవ్డ్ ప్లాట్స్ అన్ని సదుపాయాలతో తక్కువ ధరకే, డైరెక్ట్ ఓనర్, స్పాట్ రిజిస్ట్రేషన్ ఫోన్ : 99662 62221/ 95027 74175

JOBS

WANTED MALE Process Associates Qual: Degree/ Diploma with Typing Skills of 25 NWPM, Sal: 14K to 18K. Mob: 80967 30137.

Wanted DRA Tele Callers, Field Executives & Team Leaders Banking Sector Attractive Salaries and Incentives, ✆ 98493 94835, 70753 45527.

Wanted Supervisors for Civil and Electrical Works. Contact: 90005 55035.

Wanted Teachers for Reputed Schools in A.P & Telangana, Contact: Sneha Placements Service. Ph: 94402 46409.

Wanted Marketing Executives. Exp: 2 Years, : Degree & MBA, Office Boy : Inter, Tirupathi ✆ 77992 16807.

G Digital షోరూం మదనపల్లి, వాయల్పాడు నందు పనిచేయుటకు Manager/ Sales Staff కావలెను. M/F, A: 19-35, Q: Inter/Degree ✆91821 25692, 97058 26033.

తిరుపతిలోని ప్రముఖ కంపెనీకి బిజినెస్ పర్సన్స్, రిటైర్డ్ పర్సన్స్, వివాహితులు కావలెను. Age: 30 to 65, Qua: Inter- PG పాన్‌కార్డు తప్పనిసరి ✆ 76750 95860.

EENADU THE EE WAY CLASSIFIEDS
B/W 5 లైన్ల ప్రకటన రూ. 500/-
Colour 5 లైన్ల ప్రకటన రూ. 600/- మాత్రమే
తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య జిల్లాల్లో అన్ని రకాల బిజినెస్ వ్యవహారాలు
వివరాలకు...
80085 13290
మీ చిన్నారులకు పుట్టిన రోజు శుభాకాంక్షలు ఈనాడు ద్వారా తెలపండి
B/W: రూ. 600
Colour: రూ. 800
ప్రకటనలపై 5% GST వర్తించును

త్రినేత్ర హోంకేర్‌లో వృద్ధులను/ పేషెంట్స్‌ను/ పిల్లలను చూసుకొనుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఫ్రీ వసతి, భోజనం. జీ: 18K. ✆ 85209 80099, 85208 74499

ప్రముఖ విద్యాసంస్థకు లేడీ టెలీకాలర్స్, కౌన్సిలర్స్ & ఫీల్డ్ అనుభవం కల్గిన PROలు కావలెను. ఆకర్షణీయమైన జీతం కల్పించబడును. ✆ 90320 30124

మార్కెటింగ్ Reps/Officers (తిరుపతి టౌన్‌లో పనిచేయుటకు) కావలెను. Qly: MBA/B.Com/ B.Sc, గూడ్స్ ఆటో డ్రైవర్-1 అనుభవం, లైసెన్స్, బ్యాడ్జి కలిగి ఉండవలెను. ✆9703402722

తిరుపతి, NGO's కాలనీ, D.No: 6-8-1113లోని కల్పవృక్ష లగ్జరీ హోమ్‌స్టే నందు పనిచేయుటకు రిసెప్షన్ కమ్ సూపర్‌వైజర్, స్వీపర్లు కావలెను. Cont: గాయత్రి హాస్పిటల్స్, వి.వి.మహల్ రోడ్డు, లలిత జ్యూవెలరీ ప్రక్కన, తిరుపతి. ✆ 98497 55595.

హరేకృష్ణ హోంకేర్‌లో వృద్ధులను/ పేషంట్స్/ పిల్లలను చూసుకొనుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఫ్రీ వసతి, భోజనం జీ: 18-20K ✆ 96404 68899, 96402 58899

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్-లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

చిత్తూరు

•చిత్తూరు •పూతలపట్టు •గంగాధరనెల్లూరు •నగరి

సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ

చిత్తూరు (జిల్లా పంచాయతీ), న్యూస్‌టుడే: వివిధ అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న వారికి ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు సీఎం సహాయ నిధి చెక్కులను పంపిణీ చేశారు. మంగళవారం స్థానిక లక్ష్మీనగర్ కాలనీలోని కార్యాలయంలో రూ.2,88,348 విలువ గల చెక్కులను బాధిత కుటుంబ సభ్యులకు ఎంపీ అందజేశారు.

చెక్కు అందజేస్తున్న ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు

పాత భవనాల్లో మరమ్మతులు చేపట్టాలి

చిత్తూరు కలెక్టరేట్, న్యూస్‌టుడే: పాత కలెక్టరేట్ ప్రాంగణంలో అవసరమైన భవనాలకు మరమ్మతు పనులు చేయాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు. స్థానిక గిరింపేటలోని పాత కలెక్టరేట్ భవన సముదాయాల్ని మంగళవారం ఆయన పరిశీలించారు. ఎన్‌డీపీఎస్ కేసులకు సంబంధించి సీజ్ చేసిన వస్తువుల భద్రపరిచేందుకు సిద్ధంచేసిన డీఆర్‌డీవో భవనాన్ని తనిఖీ చేశారు. డీఆర్వో మోహన్‌కుమార్, ర.భ. శాఖ ఈఈ శ్రీనివాసులు, చిత్తూరు అర్బన్ తహసీల్దార్ కులశేఖర్ ఉన్నారు.

భవనాలను పరిశీలిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

ఐవీఎఫ్ కేంద్రాలు ఏర్పాటు చేయాలి

పెనుమూరు, న్యూస్‌టుడే: రాష్ట్రంలోని ప్రతి ప్రభుత్వ ఆసుపత్రిలో ఐవీఎఫ్ కేంద్రాలను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్యే థామస్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకెళ్లారు. మంగళవారం శాసనసభలో బడ్జెట్‌పై చర్చలో ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు విజన్ ఉన్న వ్యక్తి అని కొనియాడారు. ఆయన ఆలోచనా విధానాలను అమలు చేస్తున్నారని, ఈ నేపథ్యంలో ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఐవీఎఫ్ కేంద్రాలు ఏర్పాటు చేస్తే పేదప్రజలకు ఎంతో మేలు కలుగుతుందని అభిప్రాయపడ్డారు.

శాసనసభలో ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే థామస్

సమర్థంగా వ్యర్థాల నిర్వహణ

మాట్లాడుతున్న కమిషనర్ నరసింహప్రసాద్

చిత్తూరు నగరం, న్యూస్‌టుడే: ఇంటింటా సేకరించే వ్యర్థాలను తడి, పొడి చెత్తగా వేరు చేసి సేకరించడంపై అవగాహన కల్పించాల్సిన బాధ్యత స్వచ్ఛ మిత్రలపై ఉందని నగరపాలక కమిషనర్ నరసింహ ప్రసాద్ సూచించారు. స్థానిక నగరపాలక కార్యాలయంలో మంగళవారం స్వచ్ఛ మిత్రలకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన ప్రసంగించారు. ఇంటి వద్దే చెత్తను వేరు చేసి సేకరించడం ద్వారా కంపోస్టు యార్డులో సమయాన్ని ఆదా చేయవచ్చన్నారు. అనంతరం పవర్‌పాయింట్ ప్రజంటేషన్ రూపంలో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంహెచ్‌వో లోకేశ్, ప్రజారోగ్య ఇన్‌స్పెక్టర్లు, వార్డు సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

చెలరేగుతున్న ఆకతాయిలు

■ యువకుల మధ్య తరచూ ఘర్షణలు ■ అసభ్య ప్రవర్తనతో మహిళల భయాందోళన

పుత్తూరు, న్యూస్‌టుడే: పుత్తూరు మేజరు పంచాయతీ స్థాయి నుంచి మున్సిపాలిటీగా 20 సంవత్సరాల క్రితం ఆవిర్భవించింది. పట్టణం దినదినాభివృద్ధి చెందుతోంది. పట్టణ పరిధిలో విద్యాకేంద్రాలు వెలుస్తున్నాయి. దీంతో ప్రధాన రహదారుల్లో ఆకతాయిలు రెచ్చిపోతున్నారు. మహిళలు, యువతులను వెంటపడి వేధించడం, అసభ్యంగా ప్రవర్తించడం చేస్తున్నారు. ఉదయం, సాయంత్రం వేళల్లో నిత్యావసరాల కొనుగోలుకు మహిళలు ఇంటి నుంచి బయటకు రావాలంటేనే భయపడుతున్నారు.

పుత్తూరు పట్టణం

గుంపులుగా కూర్చుని టీజింగ్

ప్రధాన కూడళ్లతో పాటు బ్యాంకులు, ఆసుపత్రులు, దుకాణాల వద్ద వీరి చేష్టలతో మహిళలు విసిగి పోతున్నారు. కళాశాల విద్యార్థినులను టీజ్ చేస్తుండటంతో వారి తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. ద్విచక్రవాహనాలపై మితిమీరిన వేగంతో రహదారులపై చక్కర్లు కొడుతున్నారు. కార్వేటినగరం రోడ్డు, బజారువీధి, కాపువీధి, జెండామానుకు ఎక్స్‌టెన్షన్ వీధి, లక్ష్మీనగర్ కాలనీ, కృష్ణానగర్, పట్టణంలోని వివిధ బ్యాంకుల వద్ద తరచూ యువకులు గుంపులుగా కూర్చుంటున్నారు. మహిళలు వచ్చినప్పుడు ద్విచక్రవాహనాలపై అడ్డుగా వెళ్లి భయభ్రాంతులకు గురి చేస్తున్నారు. ఒంటరిగా వెళ్తే మహిళల వద్దకు వెళ్లి అసభ్యంగా ప్రవర్తిస్తున్నారు.

పోలీసులు దృష్టిసారిస్తేనే..

పోలీసుశాఖ ఆకతాయిల విషయంలో మెతకవైఖరి విడనాడాల్సిన అవసరం ఉందని పట్టణ వాసులు కోరుతున్నారు. గతంలో రహదారుల వెంట ద్విచక్రవాహనాలపై ప్రత్యేక దళం పేరుతో పోలీసుశాఖ పర్యటించేది. ఆకతాయిలను తరిమి కొట్టేవారు. ప్రత్యేక డ్రైవ్ నిర్వహించేవారు. ఇటీవల ఇది జరగడంలేదు. దీంతో ఆకతాయిలు రెచ్చిపోతున్నారు. పనిభారం పేరుతో పోలీసు అధికారులు అంతగా దృష్టి సారించడం లేదు.

ఆటోవాలాల ఆగడాలు

మరో వైపు ఆటోవాలాలు కొందరు ఆకతాయిలుగా జతకట్టారు. ఒంటరిగా రహదారిపై వెళ్తున్న మహిళల పక్కన ఆటోలు ఆపి ఆకతాయి చేష్టలు చేస్తున్నారు. ప్రస్తుతం పట్టణంలో ఉన్న ఆటోల సమాచారం పోలీసుల వద్ద ఉందా అంటే లేదని చెప్పక తప్పదు. పట్టణంలో సుమారు రోజూ పుత్తూరు నుంచి వివిధ మార్గాలకు 400 పైగా ఆటోలు రాకపోకలు సాగిస్తున్నట్లు అంచనా. మరి పోలీసు శాఖ వద్ద ఎన్ని ఆటోల సమాచారం ఉందో లేదో లెక్కలు వేసుకుంటే వాస్తవాలు తెలుస్తాయి.

కఠినంగా వ్యవహరిస్తాం

పుత్తూరు సబ్ డివిజన్ పరిధిలో శాంతిభద్రతల విషయంలో కఠినంగా వ్యవహరిస్తాం. పట్టణంలో గస్తీని పటిష్ఠం చేస్తాం. సిబ్బంది కూడా ఎక్కడికక్కడ ఆకతాయిలు కనిపిస్తే కఠిన చర్యలు తీసుకోవాలి.

-రవికుమార్, డీఎస్పీ, పుత్తూరు

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
చిత్తూరు నగరం: 80085 74598
నగరి: 9866112017
గంగాధరనెల్లూరు: 80085 74605
పూతలపట్టు: 9505557466

న్యూస్‌టుడే, తవణంపల్లె: సమస్య: ఒడ్డుపల్లె గ్రామంలో వీధి దీపాలు కొన్ని వెలగడం లేదు. ఆన్‌ఆఫ్ స్విచ్‌లు సరిగా లేనందున సమస్య తలెత్తుతోంది. సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలి. **- స్థానికులు**

సమాధానం: పంచాయతీ పరిధిలోని అధికారులతో మాట్లాడి గ్రామంలో వీధి దీపాలు వెలిగేలా చర్యలు తీసుకుంటాం. **- హరిప్రసాద్‌రెడ్డి, ఎంపీడీవో**

గంగాధరనెల్లూరు, న్యూస్‌టుడే: సమస్య: జీడీనెల్లూరు బస్టాపులోని మాంసపు దుకాణాల్లో రోజూ వెలువడే వ్యర్థాలను రాత్రిళ్లు స్థానిక నీవానదిలో పడేస్తున్నారు. నది పరిసరాల్లో తీవ్రమైన దుర్వాసన రావడంతోపాటు పారిశుద్ధ్యం లోపిస్తోంది. **-నాగమ్మ, స్థానికురాలు**

సమాధానం: దుకాణాల యజమానులు వ్యర్థాలను నదిలో వేయకుండా కఠిన చర్యలు తీసుకుంటాం. **-మనోహర్‌గౌడ్, ఎంపీడీవో**

పాలసముద్రం, న్యూస్‌టుడే: సమస్య: ఎస్‌ఆర్‌ఆర్‌కండ్రిగ పంచాయతీ తొట్టికండ్రిగ గ్రామంలో వీధి దీపాలు లేక రాత్రుల్లో ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. **-వేణు, గ్రామస్థుడు**

సమాధానం: నూతన వీధి దీపాలు ఏర్పాటు చేసి వెలుగునిస్తాం. **-సత్యనారాయణ, డిప్యూటీ ఎంపీడీవో**

వెదురుకుప్పం, న్యూస్‌టుడే: సమస్య: పచ్చికాపల్లంలోని సద్దికూళ్లపల్లె దారిలో ఏర్పాటు చేసిన వీధి దీపాలు 15 రోజులుగా వెలగడం లేదు. **- ఆదెమ్మ, స్థానికురాలు**

సమాధానం: వీధి దీపాల మరమ్మతు చేపట్టి సమస్యను సత్వరమే పరిష్కరిస్తాం. **- వెంకటేశు, పంచాయతీ అభివృద్ధి అధికారి**

కాళికామాత దేవాలయంలో కుంభాభిషేకం

నగరి, న్యూస్‌టుడే: కన్నామిట్ట వద్ద కాళికామాత ఆలయంలో మంగళవారం మహాశివరాత్రి అనంతరం జరిగే అగ్నిప్రవేశం కుంభాభిషేకం మహోత్సవం ఘనంగా నిర్వహించారు. మహిళలు అమ్మవారికి పొంగళ్లు పెట్టారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చారు. అన్నదానం చేపట్టారు.

గజ వాహనంపై శివపార్వతులు

బంగారుపాళ్యం, న్యూస్‌టుడే: మొగిలిలోని కామాక్షి సమేత మొగిలీశ్వరస్వామి ఆలయంలో మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం శివపార్వతుల ఉత్సవ విగ్రహాలను గజ వాహనంపై ఉంచి పురవీధుల్లో ఊరేగించారు. ఉదయం అభిషేకం, ప్రత్యేక పూజలు చేసి భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు.

నంది వాహనంపై విహారం

గంగాధరనెల్లూరు, న్యూస్‌టుడే: వెజ్జుపల్లె, ఎస్ఎస్ కొండ, కొత్రకోన, వేల్కూరు, జీడీనెల్లూరు, మహదేవమంగళం, బాలిరెడ్డికండిగ ఈశ్వరాలయాల్లో మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి శివపార్వతుల కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. మంగళవారం వేకువజాము వరకు గ్రామాల్లో శివపార్వతులను నందివాహనంపై ఊరేగించారు. చివరగా శివపార్వతులను ఆలయానికి తీసుకొచ్చి తీర్థప్రసాద వినియోగం, ధ్వజావరోహణంతో ఉత్సవాలను ముగించారు.

రావణబ్రహ్మపై ఊరేగింపు

తవణంపల్లె, న్యూస్‌టుడే: స్థానిక శ్రీకాళభైరేశ్వరస్వామి ఆలయంలో మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం రాత్రి పార్వతీ పరమేశ్వరులు రావణ బ్రహ్మ వాహనంపై పురవీధుల్లో ఊరేగారు. ఉదయం స్వామి వారికి అభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు.

మామిడిలో అధిక దిగుబడులే లక్ష్యం

వెదురుకుప్పం: మామిడిలో అధిక దిగుబడుల సాధనే లక్ష్యంగా ప్రభుత్వం రైతుల సౌలభ్యం కోసమే ప్రత్యేక చర్యలు చేపడుతోందని తెదేపా మండల అధ్యక్షుడు మోహన్‌మురళి అన్నారు. మంగళవారం స్థానిక మండలాభివృద్ధి కార్యాలయ సమావేశ మందిరంలో మామిడి రైతులకు ఉద్యానశాఖ అధికారులు మామిడిలో పూత, పిందె దశలో చేపట్టాల్సిన సస్యరక్షణ పద్ధతులపై కృషి విజ్ఞాన కేంద్ర శాస్త్రవేత్తలు, ఉద్యాన శాఖ అధికారులు శిక్షణ సదస్సు నిర్వహించారు.

జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో సత్తా

చిత్తూరు విద్య, న్యూస్‌టుడే: జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో తమ కళాశాల విద్యార్థులు జాతీయ స్థాయిలో చక్కటి పర్సన్‌టైల్ సాధించారని నగరంలోని పీఎస్ఎన్ శ్రీవివేకానంద జూనియర్ కళాశాల కరస్పాండెంట్ సత్యనారాయణ, ప్రిన్సిపల్ నాగరాజశెట్టి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను వారు అభినందించారు.

విద్యార్థులను అభినందిస్తున్న కరస్పాండెంట్ సత్యనారాయణ, అధ్యాపకులు

కార్యవర్గ సభ్యులతో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్, జిల్లా అధ్యక్షుడు కోదండన్

వీఆర్ఏల సంఘం మండలాధ్యక్షుడిగా కేశవులు

పూతలపట్టు: ఏపీ వీఆర్ఏల సంఘం మండల శాఖ అధ్యక్షుడిగా కేశవులు ఎన్నికైనట్లు ఆ సంఘం రాష్ట్ర ప్రధానకార్యదర్శి లక్ష్మణ్, జిల్లా అధ్యక్షుడు కోదండన్ తెలిపారు. మండల కేంద్రంలో మంగళవారం ఏఆర్ఏల సంఘం సమావేశం జరిగింది. అనంతరం మండల శాఖ కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ మేరకు ప్రధానకార్యదర్శిగా రాజేష్, ఉపాధ్యక్షుడిగా వరప్రసాద్, కోశాధికారిగా మాధవి, కార్యవర్గ సభ్యులుగా ఢిల్లీజా ఎన్నికయ్యారని పేర్కొన్నారు.

సౌత్‌జోన్ క్రికెట్ పోటీల్లో చిత్తూరు విజయం

గోకుల్ సాయి (95 పరుగులు)

కడప క్రీడలు, న్యూస్‌టుడే: ఏసీఏ సౌత్‌జోన్ అండర్-12 అంతర్ జిల్లాల వన్డే క్రికెట్ పోటీల్లో చిత్తూరు, కర్నూలు జట్లు గెలిపొందాయి. కడప, చిత్తూరు, కర్నూలు క్రీడాకారులు యోగాంజనేయులు, భానువర్షిత్‌రెడ్డి, గోకుల్‌సాయి, ధనుష్, నీలేష్ అర్ధ సెంచరీలు చేసి రాణించారు. వైఎస్ఆర్ఆర్-ఏసీఏ స్టేడియం, కేఎస్ఆర్ఎం క్రికెట్ మైదానంలో మంగళవారం క్రికెట్ పోటీలు జరిగాయి. ● వైఎస్ఆర్ఆర్-ఏసీఏ స్టేడియంలో జరిగిన మ్యాచ్‌లో చిత్తూరు జట్టు 16 పరుగుల తేడాతో గెలుపొందింది. టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ చేసిన ఆ జట్టు నిర్ణీత 35 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 220 పరుగులు చేసింది. జట్టులో గోకుల్ సాయి 95, ధనుష్ 65 పరుగులు చేశారు. 221 పరుగుల విజయ లక్ష్యంతో బ్యాటింగ్‌ను ఆరంభించిన కడప జట్టు 33.3 ఓవర్లలో 203 పరుగులు చేసి ఆలౌట్ అయ్యింది. జట్టులో యోగాంజనేయులు 86, భానువర్షిత్‌రెడ్డి 54 పరుగులు చేసినప్పటికీ జట్టును గెలిపించలేకపోయారు. చిత్తూరు బౌలర్లలో పునీత్‌సాయిరెడ్డి 4, భువన్‌సాయి 3 వికెట్లు తీసుకున్నారు.

మట్టి తరలింపు అడ్డగింత

యంత్రాలను అడ్డుకుంటున్న రెవెన్యూ అధికారులు

పెనుమూరు, న్యూస్‌టుడే: మండలంలోని మోపిరెడ్డిపల్లె గుట్ట నుంచి అక్రమంగా తరలిస్తున్న మట్టి రవాణాను రెవెన్యూ అధికారులు మంగళవారం అడ్డుకున్నారు. మోపిరెడ్డిపల్లె గుట్ట ఉత్తర భాగంలో ఓ వ్యక్తి తవ్వి నుంచి మట్టిని సమీపంలోని ఓ రైతు పొలంలోకి తరలిస్తున్నారు. ఈ విషయం రెవెన్యూ అధికారుల దృష్టికి వెళ్లడంతో ఉదయం ఆర్ఐ లోకేశ్, వీఆర్వో శ్యామ్ సంఘటన స్థలాన్ని పరిశీలించారు. ఆ వ్యక్తి తనకు పట్టా ఉందని తెలిపారని అధికారులు తెలిపారు. రికార్డులు తీసుకుని తహసీల్దార్ వద్దకు రావాలని సూచించామని అన్నారు. ఇదిలా ఉండగా పట్టా భూమితో పాటు పక్కన ఉన్న ప్రభుత్వ భూమిలో కూడా పనులు చేసినట్లు సమాచారం. ఇంతలో ఈ విషయం స్థానిక నాయకుల ద్వారా ఓ మండల నాయకుడి దృష్టికి వెళ్లింది. ఆయన రెవెన్యూ అధికారులను పిలిపించి ఈ విషయంలో మీరెందుకు జోక్యం చేసుకుంటారని ప్రశ్నించినట్లు అధికారులు తెలిపారు.

కర్రే అడ్డు.. పరిష్కారం అడగొద్దు

చిత్తూరు నగరంలోని గాయత్రీ నగర్ కాలనీలో ఉన్న 1వ క్రాస్ ఆరంభంలో కల్వర్టు దెబ్బతినింది. కాలువపై పెద్ద రంధ్రం పడటంతో స్థానికులు రాకపోకల సమయంలో ప్రమాదాల బారిన పడుతున్నారు. దీంతో ప్రమాదాన్ని సూచించే విధంగా అక్కడ ఓ కర్రను ఏర్పాటు చేశారు. దీనిని ఏర్పాటు చేసి వారాలు గడుస్తున్నా నగరపాలిక సంస్థ ఎటువంటి చర్యలు తీసుకోకపోవటంతో రాత్రి సమయాల్లో వచ్చే చోదకులు ఇబ్బందులు పడుతున్నారు. **-ఈనాడు, చిత్తూరు**

ప్రమాదకరంగా ప్రహరీ

ప్రజలను ఆపదల నుంచి రక్షించే రక్షకభట భవన నిలయం రక్షణ గోడ ప్రమాదకరంగా ఉంది. మండలంలోని స్థానిక పోలీస్ స్టేషన్ ప్రహరీ బీటలు వారి పడిపోయే పరిస్థితి నెలకొంది. మండల ప్రజలు వివిధ సమస్యలపై నిత్యం స్టేషన్‌కు వస్తుంటారు. సమస్యలు తెలిపిన అనంతరం ఆరుబయట కూర్చొంటారు. ఏదైనా అనుకోని ఘటన జరగకముందే సంబంధిత అధికారులు స్పందించాల్సి ఉంది. **-న్యూస్‌టుడే, పాలసముద్రం**

పిచ్చిమొక్కలు పెరిగి.. అధ్వానంగా మారి

స్థానిక పున్నమి హోటల్‌కు ఎదురుగా గతంలో తెదేపా హయాంలో ఐ లవ్ పుత్తూరు పేరిట సర్కిల్ ఏర్పాటు చేశారు. అందులో పూల మొక్కలు నాటారు. వాటిని మున్సిపల్ అధికారులు పట్టించుకోకపోవడంతో పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగి అధ్వానంగా తయారైంది. మొక్కలకు నీళ్లు పెట్టకపోవడంతో ఎండిపోతున్నాయి. వాటి స్థానంలో కొత్త మొక్కలు పెంచి సుందరంగా తయారు చేయాల్సిన అవసరం ఉంది. **-న్యూస్‌టుడే, పుత్తూరు**

ఆల్బెండజోల్ మాత్రలతో ఆరోగ్యం

చిత్తూరు(వైద్యవిభాగం), న్యూస్‌టుడే: విద్యార్థులందరూ పాఠశాలల్లో పంపిణీ చేసే ఆల్బెండజోల్ మాత్రలను మింగి.. ఆరోగ్యంగా ఉండాలని జిల్లా లీగల్ సెల్ అథారిటీ కార్యదర్శి, సీనియర్ న్యాయమూర్తి భారతి తెలిపారు. చిత్తూరు నగరం సంతపేటలోని మున్సిపల్ ఉన్నత పాఠశాలలో మంగళవారం జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా మాత్రలు పంపిణీ చేశారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారిణి సుధారాణి మాట్లాడుతూ జిల్లాలో 1 నుంచి 19 సంవత్సరాలలోపు ఉన్న పిల్లలు 3,62,535 మందిని గుర్తించగా.. మంగళవారం ఒక్క రోజులోనే 3,48,365 మంది మాత్రలు అందించినట్లు చెప్పారు. మంగళవారం గైర్హాజరైన పిల్లలకు ఈ నెల 24వ తేదీన మాత్రలను అందించనున్నామని తెలిపారు. నగర మేయర్ అముద, డీసీహెచ్ఎస్ పద్మాంజలి, జిల్లా క్షయ నివారణాధికారి వెంకటప్రసాద్, వైద్యులు గిరి, హనుమంతరావు పాల్గొన్నారు.

విద్యార్థికి మాత్రలు వేస్తున్న అధికారిణి

పని ఒత్తిడి తగ్గించాలి

పుత్తూరు, న్యూస్‌టుడే: వీఆర్వోలపై పని ఒత్తిడి తగ్గించి భద్రత కల్పించాలని రెవెన్యూ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు చిరంజీవి డిమాండ్ చేశారు. పుత్తూరు తహసీల్దార్ కార్యాలయం వద్ద మంగళవారం అమరావతి రెవెన్యూ ఎంప్లాయీస్ ఐకాస ఇచ్చిన పిలుపు మేరకు నిరసన చేపట్టారు. రెవెన్యూ, జీఎస్‌డబ్ల్యూఎస్ అధికారుల మధ్య సమన్వయం లేకపోవడంతో గ్రామస్థాయి సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారన్నారు. వీఆర్వోలు జయపాల్, చంద్రశేఖర్, సుందరం, ఆశ, దాము, సర్వేయర్లు, వీఆర్ఏలు పాల్గొన్నారు.

జాతీయ లోక్‌అదాలత్ విజయవంతానికి పిలుపు

పుత్తూరు, న్యూస్‌టుడే: పుత్తూరు సబ్ కోర్టు ఆవరణలో మార్చి 14న నిర్వహించే జాతీయ లోక్‌అదాలత్‌ను జయప్రదం చేయాలని పుత్తూరు సీనియర్ సివిల్ జడ్జి రాఘవేంద్ర పేర్కొన్నారు. స్థానిక కోర్టులో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాజీ మార్గంలో కేసులు పరిష్కరించుకోవడం ద్వారా విలువైన సమయం, ధనం వృథా కాదన్నారు.

సేవా కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలి

పుత్తూరు: విద్యార్థులు సేవా కార్యక్రమాల్లో భాగస్వామ్యం కావాలని శ్రీవిద్య కళాశాలల ఛైర్మన్ ఉమామహేశ్వర్ పేర్కొన్నారు. నారాయణవనం మండలం పరిధిలోని కళ్యాణపురంలో పుత్తూరు పట్టణంలోని శ్రీవిద్య డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు వారం రోజులు పాటు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. మంగళవారం ముగింపు కార్యక్రమం జరిగింది. ప్రిన్సిపల్ మాణిక్యం, ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ మురగవేలు, కళ్యాణపురం సర్పంచి మునెమ్మ, పంచాయతీ కార్యదర్శి మునిశేఖర్, ఉపాధ్యాయురాలు నాగమ్మ, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

ఇంటి పన్నులు వసూలు చేయాలి.. కార్వేటినగరం: ఇంటిపన్నులను ఈ నెలాఖరులోగా వసూలు చేయాలని డీపీవో సుధాకర్‌రావు అధికారులను ఆదేశించారు. కార్వేటి నగరం పంచాయతీ కార్యాలయాన్ని మంగళవారం ఆయన తనిఖీ చేశారు.

ఇంజినీరింగ్ విద్యార్థిపై దాడి

పూతలపట్టు, న్యూస్‌టుడే: ఎస్వీ ఇంజినీరింగ్ కళాశాలలో ద్వితీయ సంవత్సర విద్యార్థి రాకేష్‌ను అదే కళాశాలకు చెందిన ఫైనల్ ఇయర్ చదువుతున్న విద్యార్థులు తీవ్రంగా కొట్టడంతో గాయలయ్యాయి. సుబ్బారెడ్డి, నాయుడు, రాకేష్‌లకు గతంలో గొడవలున్నాయి. ద్విచక్ర వాహనంపై వారు రాకేష్‌ను చిత్తూరు నగరంలోని కట్టమంచికి తీసుకెళ్లి అక్కడ ముందుగానే ఉన్న వంశీ, అఖిల్, బాబ్జి, శివారెడ్డితో కలిసి కొట్టారు. ఈ ఘటనకు సంబంధించిన వీడియోను బాధితుడు విడుదల చేయగా స్పందించిన పోలీసులు వివరాలు సేకరించారు. దాడికి పాల్పడిన నిందితులపై కేసు నమోదు చేశారు.

ఆటో డ్రైవర్‌పై హిజ్రాలు..

పూతలపట్టు: తేనేపల్లె టోల్‌గేట్ సమీపంలో వాహనాలను ఆపి హిజ్రాలు నగదు వసూలు చేస్తున్నారు. ఈ క్రమంలో పీలేరు నుంచి సరుకులు తీసుకుని చిత్తూరు వైపు వెళ్తున్న ఆటో డ్రైవర్ దామోదర్‌ను వారు ఆపారు. అతను వారికి డబ్బు ఇవ్వకపోవడంతో హిజ్రాలు దాడి చేసి కొట్టి, ఆటోలో ఉన్న వస్తువులను బయట పడేశారు. దీంతో డ్రైవర్ ఆటోను జాతీయ రహదారిపై నిలిపి ధర్నా చేపట్టారు. ఈ సమాచారం సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంతో పోలీసులు ఇరువర్గాలను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

ఆగి ఉన్న వాహనాన్ని ఢీకొన్న లారీ

గంగాధరనెల్లూరు, న్యూస్‌టుడే: చిత్తూరు-పుత్తూరు ప్రధాన రోడ్డుపై ఎట్టేరి సమీపంలో మరమ్మతు కారణంగా ఆగి ఉన్న ఐషర్ వాహనాన్ని మంగళవారం వేకువజామున తీవ్రమైన మంచు కారణంగా ఇదే మార్గంలో వెళ్తున్న లారీ ఢీకొంది. ఐషర్ బోల్తాపడగా డ్రైవర్ బాబుకు గాయాలయ్యాయి. సీఐ ప్రసాద్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఊరికి ఉపకారులు.. మనసున్న రాజులు

■ సొంత నిధులతో దాతృత్వం ■ విద్యాభివృద్ధికి మరింత తోడ్పాటు

పాలసముద్రం, న్యూస్‌టుడే: విద్యావంతులైన వారు సొంతూరు, చదువుకున్న పాఠశాలపై ప్రేమతో అభివృద్ధిలో భాగస్వాములవుతున్నారు. సొంత నిధులతో ప్రజలకు మేలు చేసే పనులు నిర్వహిస్తున్నారు. వారికి కొన్ని చోట్ల గ్రామస్థులు సహకరిస్తున్నారు.

13 పంచాయతీలకు శుద్ధజలం

ఏర్పాటు చేసిన ఆర్వో ప్లాంటు

బాబురాజు

వనదుర్గాపురం పంచాయతీకి చెందిన బాబురాజు బెంగళూరుకు వెళ్లి ఆర్థికంగా స్థిరపడ్డారు. తమకున్న దాంట్లో జన్మభూమికి సహాయపడాలని నిర్ణయించుకున్నారు. మండలంలోని 13 పంచాయతీలకు శుద్ధ నీటి జలం కేంద్రం ఆర్వో ప్లాంటు ఏర్పాటుకు రూ.15 లక్షలు, మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రికి నూతన వైద్య పరికరాలు రూ.14 లక్షలు, మండలంలోని పలు ఉన్నత, ప్రాథమిక పాఠశాలలకు రూ.15 లక్షల విలువతో బెంచీలు, డెస్కులు, రాతపుస్తకాలు అందించారు. స్వగ్రామంలోని ద్రౌపదీ దేవీ ఆలయానికి, ఇతర ఆలయాలకు రూ.30లక్షలు అందించారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలకు లైబ్రరీకి రాక్‌లు అందజేశారు. విద్యార్థులకు చదువే ముఖ్యమని, వారి అభ్యున్నతికి తమ సాయం ఎల్లప్పుడూ ఉంటుందని ఆయన చెబుతున్నారు.

పాఠశాల అభివృద్ధికి చేయూత

విద్యార్థికి ట్యాబ్‌లు అందజేస్తున్న సుందరరాజు తదితరులు

తిరుమల రాజుపురం పంచాయతీ గ్రామానికి చెందిన సుందరరాజు అఖిల భారత క్షత్రియ సంఘం మాజీ అధ్యక్షులు, బెంగళూరు చిన్నస్వామి క్రీడా మైదాన రూపశిల్పి. 15 ఏళ్లుగా పంచాయతీకి, తిరుమలరాజుపురం జడ్పీ ఉన్నత పాఠశాలలకు చిన్నస్వామిరాజు అనేక సేవలందించారు. అతని మృతి అనంతరం అతని కుమారుడు సుందరరాజు(ఏట్రియ ఫౌండేషన్ ఛైర్మన్) సొంత గ్రామానికి, తను చదువుకున్న తిరుమలరాజు పురం జడ్పీ ఉన్నత పాఠశాలకు రూ.10 లక్షలు ఖర్చు చేశారు. పాఠశాల లైబ్రరీకి రూ.3 లక్షలు, ఆడిటోరియానికి రూ.3 లక్షలు, ల్యాబ్‌కు రూ.50 వేలు, తొమ్మిది, పదో తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లు, సరస్వతి విగ్రహం, ఇన్వర్టర్ బ్యాటరీ, క్రీడా పరికరాలు, పుస్తకాలు, మరుగుదొడ్డి నిర్మాణానికి తమవంతు సాయం నిరంతరం అందిస్తున్నారు. గ్రామంలో ఏట్రియా ప్రాజెక్టు పేరుతో 180 ఎకరాల భూమిలో ప్రకృతి వ్యవసాయం, పునరుత్పాదక శక్తి చేపడుతున్నారు.

గోవిందరాజులునాయుడు మృతి తీరని లోటు

పుత్తూరు, న్యూస్‌టుడే: పుత్తూరు మండలం వేపగుంట గ్రామానికి చెందిన తెదేపా సీనియర్ నాయకుడు పల్లింటి గోవిందరాజులునాయుడు మృతి పార్టీకి తీరని లోటని రాష్ట్ర పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ గంజి మాధవయ్య పేర్కొన్నారు. మంగళవారం ఆయన మృతదేహంపై తెదేపా జెండాను కప్పి నివాళి అర్పించారు. కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. తెదేపా మండల అధ్యక్షుడు బాలాజీ, నాయకులు శేఖర్‌నాయుడు, కోటయ్యనాయుడు, మాధవనాయుడు, గుత్తా వనమాలి, మాజీ ఎంపీటీసీ సభ్యురాలు కవిత, బుజ్జిబాబు, నగేష్, రాజముత్తు తదితరులు ఉన్నారు.

తెదేపా జెండా కప్పి నివాళి అర్పిస్తున్న గంజి మాధవయ్య

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

రేణిగుంట, న్యూస్‌టుడే: మండలంలోని కరకంబాడి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా మరొకరు గాయపడ్డారు. స్థానికుల కథనం మేరకు.. వెదురుకుప్పం గ్రామానికి చెందిన బుజ్జమ్మ (58), సుబ్రహ్మణ్యం మంగళవారం దొడ్లమిట్ట గ్రామానికి వచ్చారు. తిరుగు ప్రయాణంలో ఆటోలో వెళుతుండగా కరకంబాడి కూడలి వద్ద కారు వీరిని ఢీకొంది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన బుజ్జమ్మను స్థానిక ప్రైవేటు ఆసుపత్రికి, సుబ్రహ్మణ్యాన్ని రేణిగుంట తిరుపతి మార్గంలో ఉన్న మరో ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. బుజ్జమ్మ చికిత్స పొందుతూ మృతి చెందారు. ఈ ఘటనపై పట్టణ పోలీసులకు ఇంకా ఎటువంటి ఫిర్యాదు అందలేదు.

26వ వర్ధంతి
మా కుటుంబ అభ్యున్నతికి అహర్నిశలు శ్రమించిన మా మామ గారు
కీ॥శే॥ పాలగిరి వెంకట్రాయ ఆచారి గారి
కీ॥శే॥ పి.సరోజమ్మ
26వ వర్ధంతి సందర్భంగా వారి పవిత్రాత్మకు శాంతి కలగాలని ఆ భగవంతుని ప్రార్థిస్తూ... ఇట్లు
ఎస్.ప్రభాకర ఆచారి
శ్రీ లక్ష్మీనారాయణ జ్యూవలర్స్
టి.వి.నాయుడు వీధి, చిత్తూరు.
Cell: 94410 75209
కీ॥శే॥ పాలగిరి వెంకట్రాయ ఆచారి
మరణం: 18-02-2000

(c) eenadu

పలమనేరు

•పలమనేరు • కుప్పం

గురుకులంలో ప్రవేశానికి ఆహ్వానం

బైరెడ్డిపల్లె, న్యూస్‌టుడే: కమ్మనపల్లె గురుకుల బాలికల పాఠశాలలో 2026- 2027 విద్యా సంవత్సరంలో 5వ తరగతిలో ప్రవేశానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించనున్నట్లు ప్రిన్సిపల్ సత్య సుప్రజ మంగళవారం తెలిపారు. 5వ తరగతిలో 80 సీట్లు.. 6, 7 తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి ఉమ్మడి చిత్తూరు జిల్లా (చిత్తూరు, అన్నమయ్య, తిరుపతి) నుంచి ప్రవేశ పరీక్షకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈనెల 18 నుంచి మార్చి 31వ తేదీ లోపు ఏపీఆర్ఎస్.ఏపీసీఎఫ్ఎస్ఎస్.ఇన్ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఏప్రిల్ 24న ప్రవేశ పరీక్ష నిర్వహిస్తామన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

నేడు మామిడి రైతులకు శిక్షణ

రామకుప్పం, న్యూస్‌టుడే: నేడు నియోజకవర్గంలోని మామిడి రైతులకు పూత నుండి కోత వరకు చేపట్టవలసిన యాజమాన్య పద్ధతుల వంటి వాటిపై శిక్షణా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఉద్యాన అధికారి డింపు ప్రియ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. నేడు ఉదయం మండల పరిధిలోని రాజుపేట వద్ద రైతు శరత్‌కు చెందిన మామిడి తోటలో ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి శాస్త్రవేత్త డా. శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా ఉద్యానశాఖాధికారి రామజునులు, కుప్పం ఉద్యాన సహాయ సంచాలకులు పల్లవి తదితరులు హాజరవుతున్నట్లు తెలిపారు.

గ్రామాభివృద్ధిలో కేఎస్ఎస్‌లు కీలక పాత్ర పోషించాలి

మాట్లాడుతున్న మండల అధ్యక్షుడు వెంకటరమణ

రామకుప్పం, న్యూస్‌టుడే: గ్రామాల అభివృద్ధి, మహిళా సాధికారతలో కుటుంబ సాధికార సభ్యులు కీలక పాత్ర పోషించాలని తెదేపా మండల అధ్యక్షుడు వెంకటాచలం, రెస్కో ఉపాధ్యక్షుడు విశ్వనాథ్ పేర్కొన్నారు. మంగళవారం మండల పరిధిలోని ఉన్నిగానిపల్లిలో కుటుంబ సాధికార సభ్యులతో సమావేశం నిర్వహించారు. సాధికార సభ్యులకు కేటాయించిన ఇళ్లకు ప్రతి నెలలో రెండు సార్లు తప్పక పర్యటించాలన్నారు. ప్రజలు ఇచ్చిన సమస్యల ఫిర్యాదులను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించాలన్నారు. రానున్న ఎన్నికలకు సిద్ధంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ సులోచన గుర్రప్ప, వైస్ ఎంపీపీ వెంకట్రామేగౌడు, ఎస్టీసెల్ నియోజకవర్గ అధ్యక్షుడు నరసింహులు, ప్రధాన కార్యదర్శి కామరాజనాయక్, క్లస్టర్ ఇన్‌ఛార్జి నాగభూషణం, మాజీ సర్పంచ్‌లు రామమూర్తి, జయశంకర్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ

చెక్కు అందజేస్తున్న ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు

చిత్తూరు (జిల్లా పంచాయతీ), న్యూస్‌టుడే: వివిధ అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న వారికి ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు సీఎం సహాయ నిధి చెక్కులను పంపిణీ చేశారు. మంగళవారం స్థానిక లక్ష్మీనగర్ కాలనీలోని కార్యాలయంలో రూ. 2,88,348 విలువ గల చెక్కులను బాధిత కుటుంబ సభ్యులకు ఎంపీ అందజేశారు.

చేతికందేలా యమపాశాలు..
గాలిలో దీపంలా ప్రాణాలు

కుప్పం పట్టణం, న్యూస్‌టుడే: విద్యుత్తు సరఫరా కోసం ఏర్పాటు చేసిన వైర్లు.. ప్రజల ప్రాణాలు బలితీస్తున్నాయి. కొన్ని చోట్ల అధికారులు భద్రతా ప్రమాణాలు పాటించకపోవడంతో ప్రమాదాలకు కారణమవుతున్నాయి. కుప్పం పురపాలిక, నియోజకవర్గ పరిధిలోని పలు గ్రామాల్లో విద్యుత్ తీగలు చేతికందే ఎత్తులో ఉన్నాయి. ప్రధానంగా ఎన్టీఆర్ కాలనీ, రాజీవ్ కాలనీ, రామచంద్రారోడ్డు, విజయలక్ష్మీరోడ్డు, కొత్తపేట వీధుల్లో పలు చోట్ల విద్యుత్ తీగలు ఇళ్ల మీదుగా వెళ్లడం.. చేతికందే స్థాయిలో ఉండటంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో తెలియక ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారు.

✣ ప్రమాద నివారణ చర్యలు శూన్యం


ఎన్టీఆర్ కాలనీలో ఇంటిని తాకుతూ ఉన్న విద్యుత్ తీగలు..

ప్రమాదాలు ఇలా..

పట్టణంలోని పురపాలిక పరిధిలో మూడేళ్ల క్రితం తంబిగానిపల్లె శ్మశాన వాటిక వద్ద చేతికందే ఎత్తులో ఉన్న విద్యుత్తు తీగల కారణంగా ముగ్గురిని బలిగొంది. అమరావతి నగర్‌లో నాలుగేళ్ల క్రితం ఇంటి పక్కనే ఉన్న విద్యుత్తు తీగలు తగిలి నాలుగు నెలల క్రితం తీవ్ర గాయాల పాలైంది. పట్టణంలో మిద్దెపై ఆడుకుంటున్న ఓ బాలుడు విద్యుత్తు తీగ ప్రమాదానికి గురై మృతి చెందాడు. ఇంటిపై వెళ్లి విద్యుత్ తీగ తగిలి వి.కోటలలో ఐదేళ్ల క్రితం ఓ బాలికకు గాయాలయ్యాయి. ఇలా పలు సంఘటనల్లో పలువురు గాయాలపాలు కాగా.. మరికొందరు మరణించిన సంఘటనలు ఉన్నాయి.

అధికారుల నిర్లక్ష్యం

నిర్దిష్ట ఎత్తుకంటే తక్కువగా ఉంటూ చేతికందే ఎత్తులో ఉన్న విద్యుత్ తీగలు.. చిన్నపాటి గాలి వీచినా ఒకదానికొకటి తగిలి షార్ట్ సర్క్యూట్‌లు అయిన సందర్భాలు ఉన్నాయి. ఇలా అనేక సంఘటనలు తరచూ జరుగుతూనే ఉన్నాయి. ప్రమాద నివారణ చర్యలు చేపట్టక పోవడంతో తలెత్తే ప్రమాదాలతో అమాయకులు ఇబ్బందులకు గురవుతున్నారు. అయినా అధికారులు మాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు.

పరిశీలించి చర్యలు తీసుకుంటాం..

ఆయా ఇళ్ల ముందు వెళ్లిన విద్యుత్ తీగలకు ప్రమాద నివారణలో భాగంగా ప్లాస్టిక్ పైపులు వేసేందుకు ఇంటి యజమానులు సొంతంగా ముందుకొస్తే వాటికి ఏర్పాటు చేస్తాం. ప్రమాదకరంగా ఉన్న వాటిని పరిశీలించి.. ప్రమాద నివారణకు చర్యలు తీసుకుంటాం.

- సోమశేఖర్, ఎండీ, రెస్కో, కుప్పం

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
పలమనేరు: 80085 74580
కుప్పం పట్టణం: 80085 73490
పుంగనూరు: 80085 74622

పలమనేరు, న్యూస్‌టుడే: ? పట్టణంలోని ముత్తాచ్చారి పాళ్యం వీధిలో పారిశుద్ధ్య పనులు అధ్వాన్నంగా ఉన్నాయి. కాలువల్లో మురుగు పేరుకుపోయి దుర్వాసన వస్తోంది. దోమలు బెడద అధికంగా ఉంది. – సుభాష్, పలమనేరు

సమాధానం: సిబ్బందిని పంపి పారిశుద్ధ్య పనులు చేయిస్తాం. – ఎన్వీరమణారెడ్డి, మున్సిపల్ కమిషనర్, పలమనేరు

రామకుప్పం, న్యూస్‌టుడే: ? మండలంలోని ఆవులకుప్పంలో మురుగు నీరు నిండి రోడ్డుపై ప్రవహిస్తోంది. అధికారులు చర్యలు తీసుకుని మురుగు నీరు పారకుండా చర్యలు తీసుకోవాలి.– వెంకట్, ఆవులకుప్పం

సమాధానం: సిబ్బందితో మురుగును తొలగిస్తాం.

– లక్ష్మీకాంత్, ఎంపీడీవో, రామకుప్పం

కుప్పం పట్టణం, న్యూస్‌టుడే: ? పట్టణంలోని బైరుగానిపల్లెలో మూడు రోజులుగా వీధి దీపాలు వెలుగక పోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. – మహేష్, స్థానికుడు

సమాధానం: వీధి దీపాలను బాగు చేయించి, వెలిగేలా చర్యలు తీసుకుంటాం.

– శ్రీనివాసరావు, కమిషనర్, కుప్పం పురపాలిక

పనులు ప్రారంభం..

స్పందనకు వందనం

కుప్పం పట్టణం, న్యూస్‌టుడే: పురపాలిక పరిధిలోని అర్బన్ కాలనీలో మురుగునీటి కాలువలు లేక రోడ్డుపై మురుగునీరు నిల్వ ఉంటోంది. ఏళ్లు గడిచినా సమస్య పరిష్కారానికి నోచుకోక పోవడంతో స్థానిక ప్రజలు అవస్థలు పడుతుండేవారు. ఈ విషయమై 'ఈనాడు'లో 'ఇలా ఉంటే సంపూర్ణ అనారోగ్యమే..' శీర్షికన వార్తా కథనాన్ని ప్రచురితమైంది. స్పందించిన పురపాలిక అధికారులు నూతన మురుగునీటి కాలువల నిర్మాణానికి పనులు ప్రారంభించారు.

వేడుకగా అమావాస్య పూజలు

ప్రత్యేక అలంకరణలో శ్రీబాటగంగమ్మ

బైరెడ్డిపల్లె, న్యూస్‌టుడే: స్థానిక బాటగంగమ్మ ఆలయంలో మంగళవారం అమావాస్య పూజలు వేడుకగా జరిగాయి. ఆలయంలో అర్చకులు అమ్మవారికి పంచామృతాభిషేకం, పుష్పాలంకరణతో అర్చనలు, పూజలు చేపట్టారు. జానపద కళాకారులు ప్రదర్శించిన కోలాటం, పండరి భజనలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి.

20 నుంచి ఉబ్బదేవర మహోత్సవం

బైరెడ్డిపల్లె, న్యూస్‌టుడే: మండలంలోని నెల్లిపట్లలో వెలసిన వీరభద్ర స్వామి ఆలయంలో ఈనెల 20, 21, 22 తేదీల్లో ఉబ్బదేవర మహోత్సవం వైభవంగా నిర్వహించనున్నట్లు గ్రామస్థులు తెలిపారు. 20న కలశస్థాపన, ధ్వజారోహణం, అభిషేక పూజలు, 21న అభిషేకం, స్వామివారి కల్యాణోత్సవం, 22న ఉబ్బదేవర పూజలు నిర్వహించనున్నారు.

వైభవంగా ప్రాకారోత్సవం

బైరెడ్డిపల్లె, న్యూస్‌టుడే: తీర్థం, కోత్రేపల్లె గ్రామాల మధ్య వెలసిన కాళభైరవేశ్వరస్వామి ఆలయంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో మంగళవారం ప్రాకారోత్సవం వైభవంగా జరిగింది. ఆలయంలో ఉదయం అర్చకులు స్వామివారికి పంచామృతాభిషేకం, పుష్పాలంకరణతో పూజలు జరిపారు. నిత్యహోమం, దోపోత్సవం పూజలను నిర్వహించారు. బెంగళూరుకు చెందిన లీలావతి, శ్రీనివాసులు కుటుంబీకుల ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం నిర్వహించారు.

రామలింగేశ్వర స్వామి రథోత్సవం

ప్రత్యేక పూలతో అలంకరించిన రామలింగేశ్వర స్వామి రథం

రామకుప్పం, న్యూస్‌టుడే: ఆవనిలో వెలసిన శ్రీరామలింగేశ్వర స్వామి రథోత్సవం కన్నుల పండువుగా నిర్వహించారు. మంగళవారం కర్ణాటకలో ముళబాగిలు తాలూకా ఆవనిలో శివరాత్రి పండుగను పురస్కరించుకుని దాదాపుగా లక్షమంది భక్తులతో కిక్కిరిశాయి. ఎటువంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా పోలీసులు పటిష్ఠ బందోబస్తు చేపట్టారు. ఎద్దుల పరుషకు వందలాది ఎద్దులను, పొట్టేళ్లను రైతులు తీసుకుచ్చి క్రయా విక్రయాలు నిర్వహించారు. భారీ ఎత్తున అమ్ముడుపోయినట్లు వ్యాపారులు తెలిపారు.

పుష్పాలంకరణలో రామలింగేశ్వర స్వామి

పాత భవనాల్లో మరమ్మతులు చేపట్టాలి

భవనాలను పరిశీలిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

చిత్తూరు కలెక్టరేట్, న్యూస్‌టుడే: పాత కలెక్టరేట్ ప్రాంగణంలో అవసరమైన భవనాలకు మరమ్మతు పనులు చేయాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు. స్థానిక గిరింపేటలోని పాత కలెక్టరేట్ భవన సముదాయాల్ని మంగళవారం ఆయన పరిశీలించారు. ఎన్‌డీపీఎస్ కేసులకు సంబంధించి సీజ్ చేసిన వస్తువుల భద్రపరిచేందుకు సిద్ధంచేసిన డీఆర్‌డీఏ భవనాన్ని తనిఖీ చేశారు. డీఆర్వో మోహన్‌కుమార్, ర.భ. శాఖ ఈఈ శ్రీనివాసులు, చిత్తూరు అర్బన్ తహసీల్దార్ కులశేఖర్ ఉన్నారు.

ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించాలి

శాంతిపురం, న్యూస్‌టుడే: సేంద్రియ ఉత్పత్తుల కొనుగోలుతో ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించాల్సిన బాధ్యత వినియోగదారులపై ఉందని మండల తెదేపా అధ్యక్షుడు ఉదయ్‌కుమార్, రాష్ట్ర కార్మిక సంక్షేమ బోర్డు డైరెక్టర్ విశ్వనాథనాయుడు, ఏఎంసీ డైరెక్టర్లు హరినాథరెడ్డి, శ్యామల పేర్కొన్నారు. మంగళవారం స్థానికంగా ఏర్పాటు చేసిన ప్రకృతి వ్యవసాయం ఉత్పత్తుల ప్రదర్శన కార్యక్రమాన్ని నిర్వహించారు. సేంద్రియ ఎరువుల వినియోగంతో పండించిన ధాన్యం, పండ్లు, కూరగాయలను ఆహారంగా తీసుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలను ప్రతి ఒక్కరూ గుర్తించాలని కోరారు. నాయకులు రాజేంద్ర, గిరిధర్, మంజునాథ్‌గౌడు, బాలాజీ, ఆదర్శ రైతు శివారెడ్డి, మాజీ సర్పంచి మునిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉత్పత్తుల ప్రదర్శనలో నాయకులు, మహిళా రైతులు

'కుప్పానికి విమానాశ్రయం అవసరమా..?'

మాట్లాడుతున్న కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్

కుప్పం పట్టణం, న్యూస్‌టుడే: వేల కోట్ల రూపాయలు ఖర్చు పెట్టి కుప్పానికి విమానాశ్రయం ఏర్పాటు చేశారు. అయితే అది కేవలం ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకు మాత్రమే ఉపయోగపడుతుంది తప్ప ప్రజలకు ఉపయోగపడటం లేదని కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్ విమర్శించారు. కుప్పంలో మంగళవారం ఆయన విలేకర్ల సమావేశం నిర్వహించారు. రాష్ట్రంలోని వేల కోట్ల రూపాయలు విలువచేసే బస్టాండ్లను లూలూ సంస్థకు, విమానాశ్రయాలను ఆదానీ సంస్థకు విక్రయిస్తున్నారన్నారు. రాష్ట్రానికి వచ్చిన బిల్‌గేట్స్ వల్ల రాష్ట్రానికి ఎలాంటి లాభం లేదన్నారు. బడ్జెట్‌లో ఓబీసీలకు అన్యాయం చేశారన్నారు. కార్యక్రమంలో పార్టీ తిరుపతి జిల్లా ఉపాధ్యక్షుడు సమీఉల్లా తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్తు సరఫరాలో అంతరాయం

కుప్పం పట్టణం, న్యూస్‌టుడే: కుప్పం జమిందార్ పార్క్ అభివృద్ధిలో భాగంగా 11 కేవీ విద్యుత్ లైన్ మార్పు చేస్తుండటంతో సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని రెస్కో ఎండీ సోమశేఖర్ తెలిపారు. బుధవారం ఉదయం 9:30 గంటల నుండి సాయంత్రం 5:30 గంటల వరకు రామచంద్ర రోడ్డు, నేతాజీ రోడ్డు తదితర ప్రాంతాలలో అంతరాయం ఉంటుందన్నారు. ప్రజలు సహకరించాలని కోరారు.

శిథిలావస్థలో నీటి ట్యాంకు

మేలుమాయి పంచాయతీ కొత్తూరులో నిర్మించిన వాటర్ ట్యాంక్ శిథిలావస్థకు చేరుకుంది. గతంలో తెదేపా నిర్మించిన వాటర్‌ట్యాంక్ నిర్మించింది. తరువాత వచ్చిన వైకాపా పట్టించుకోకపోవడంతో ఇప్పుడు ఎందుకూ పనికిరాకుండా దర్శనమిస్తోంది. నీరు వృథాగా పోతున్నాయి. పైపులు మరమ్మత్తుకు గురయ్యాయి. అధికారులకు ఎన్నిసార్లు వినతులు ఇచ్చిన పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. - **న్యూస్‌టుడే, గంగవరం**

సౌత్‌జోన్ క్రికెట్ పోటీల్లో చిత్తూరు విజయం

కడప క్రీడలు, న్యూస్‌టుడే: ఏసీఏ సౌత్‌జోన్ అండర్-12 అంతర్ జిల్లాల వన్డే క్రికెట్ పోటీల్లో చిత్తూరు, కర్నూలు జట్లు గెలిపొందాయి. కడప, చిత్తూరు, కర్నూలు క్రీడాకారులు యోగాంజనేయులు, భానువర్షిత్‌రెడ్డి, గోకుల్‌సాయి, ధనుష్, నీలేష్ అర్ధ సెంచరీలు చేసి రాణించారు. వైఎస్ఆర్ఆర్-ఏసీఏ స్టేడియం, కేఎస్ఆర్ఎం క్రికెట్ మైదానంలో మంగళవారం క్రికెట్ పోటీలు జరిగాయి. ● వైఎస్ఆర్ఆర్-ఏసీఏ స్టేడియంలో జరిగిన మ్యాచ్‌లో చిత్తూరు జట్టు 16 పరుగుల తేడాతో గెలుపొందింది. టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ చేసిన ఆ జట్టు నిర్ణీత 35 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 220 పరుగులు చేసింది. జట్టులో గోకుల్ సాయి 95, ధనుష్ 65 పరుగులు చేశారు. 221 పరుగుల విజయ లక్ష్యంతో బ్యాటింగ్‌ను ఆరంభించిన కడప జట్టు 33.3 ఓవర్లలో 203 పరుగులు చేసి ఆలౌట్ అయ్యింది. జట్టులో యోగాంజనేయులు 86, భానువర్షిత్‌రెడ్డి 54 పరుగులు చేసినప్పటికీ జట్టును గెలిపించలేకపోయారు. చిత్తూరు బౌలర్లలో పునీత్‌సాయిరెడ్డి 4, భువన్‌సాయి 3 వికెట్లు తీసుకున్నారు.

ఇంజినీరింగ్ విద్యార్థిపై దాడి

పూతలపట్టు, న్యూస్‌టుడే: ఎస్వీ ఇంజినీరింగ్ కళాశాలలో ద్వితీయ సంవత్సర విద్యార్థి రాకేష్‌ను అదే కళాశాలకు చెందిన ఫైనల్ ఇయర్ చదువుతున్న విద్యార్థులు తీవ్రంగా కొట్టడంతో గాయలయ్యాయి. సుబ్బారెడ్డి, నాయుడు, రాకేష్‌లకు గతంలో గొడవలున్నాయి. ద్విచక్ర వాహనంపై వారు రాకేష్‌ను చిత్తూరు నగరంలోని కట్టమంచికి తీసుకెళ్లి అక్కడ ముందుగానే ఉన్న వంశీ, అఖిల్, బాబ్జి, శివారెడ్డితో కలిసి కొట్టారు. ఈ ఘటనకు సంబంధించిన వీడియోను బాధితుడు విడుదల చేయగా స్పందించిన పోలీసులు వివరాలు సేకరించారు. దాడికి పాల్పడిన నిందితులపై కేసు నమోదు చేశారు.

జేఈఈలో మదర్‌థెరిసా విద్యార్థుల ప్రతిభ


సాయి షణ్ముకర్

విశాల్

గంగవరం, న్యూస్‌టుడే: జేఈఈ మెయిన్స్ - 2026 తొలి విడత ఫలితాల్లో స్థానిక మదర్‌థెరిసా జూనియర్ కళాశాల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారు. సాయిషణ్ముకర్ 94, విశాల్‌కు 90 పర్సంటైల్ స్కోర్ సాధించినట్లు కరస్పాండెంట్ రవీంద్రబాబు తెలిపారు. 10 మంది విద్యార్థులు 80 పర్సంటైల్ కంటే ఎక్కువ మార్కులు సాధించారన్నారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను కరస్పాండెంట్, ఛైర్మన్ సునీల్, డైరెక్టర్ డాక్టర్ రాజేంద్రరెడ్డి, ప్రిన్సిపల్ దివాకర్‌రెడ్డి అభినందించారు.

అల్బెండజోల్ మాత్రలతో పిల్లల ఎదుగుదలకు కృషి

విద్యార్థులకు అల్బెండజోల్ మాత్రలు వేస్తున్న వైద్య సిబ్బంది

రామకుప్పం, న్యూస్‌టుడే: పిల్లల ఎదుగుదలకు అల్బెండజోల్ మాత్రలు కృషి చేస్తాయని విజిలాపురం వైద్యాధికారిణి పూజిత అన్నారు. మంగళవారం మండల పరిధిలోని కస్తూర్బా, ఆశ్రమ పాఠశాల పాఠశాలలో విద్యార్థులకు నులిపురుగు నివారణ వారోత్సవాల్లో భాగంగా మాత్రలు పంపిణీ చేశారు. వైద్యాధికారిణి మాట్లాడుతూ.. పిలల్లో రక్తహీనత, కడుపునొప్పి, విటమిన్ లోపం వంటి సమస్యల నుంచి కాపాడతాయన్నారు. హెల్ అసిస్టెంట్ బాలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు. ● **పలమనేరు, న్యూస్‌టుడే:** పిల్లలు వ్యక్తిగత శుభ్రతను అలవాటు చేసుకుంటే ఎన్నో రకాల వ్యాధులకు దూరంగా ఉంటారని పట్టణంలోని యూపీఎస్సీ వైద్యాధికారి సురేఖ తెలిపారు. జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా మంగళవారం పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత బాలుర పాఠశాలలో పిల్లలకు అల్బెండజోల్ మాత్రలు వేశారు. కార్యక్రమంలో సబ్‌యూనిట్ అధికారి జయశంకర్, హెల్త్ సూపర్‌వైజర్ ఉషారాణి, ఆరోగ్య సిబ్బంది సుజాత, జగదీశ్వరి పాల్గొన్నారు. ● **గంగవరం, న్యూస్‌టుడే:** విద్యార్థులు నులిపురుగుల మాత్రలు తప్పని సరిగా వేసుకోవాలని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ లహరి పేర్కొన్నారు. మంగళవారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల్లోని విద్యార్థులకు అల్బెండజోల్ మాత్రలను వేశారు. మండలంలోని అంగన్వాడీ కేంద్రాలకు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, జూనియర్ కాలేజీలకు నులిపురుగుల నివారణ మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ● **బైరెడ్డిపల్లె, న్యూస్‌టుడే:** ఆరోగ్యకర సమాజ నిర్మాణమే లక్ష్యంగా ప్రభుత్వం ఎన్నో ఆరోగ్య కార్యక్రమాలను అమలు చేస్తోందని జడ్పీ సీఈవో రవి కుమార్ నాయుడు పేర్కొన్నారు. స్థానిక బాలుర జడ్పీఉన్నత పాఠశాలలో మంగళవారం జాతీయ నులిపురుగుల నివారణ కార్యక్రమాన్ని ఆయన పర్యవేక్షించారు. 1-19 ఏళ్ల లోపు పిల్లలకు మాత్రలు అందజేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఉపేంద్ర, ఏవో ఆనందబాబు, వైద్యాధికారులు విజయ్‌చందర్, శాలిని, ప్రధానోపాధ్యాయిని మనోరంజని, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

దొరికినంత తోడుకో.. ఆపై అమ్ముకో!

మారని ఇసుకాసురుల తీరు

ఇసుక తోడుతున్న అక్రమార్కులు

పలమనేరు, న్యూస్‌టుడే: ఇసుకను హద్దు అదుపు లేకుండా ఇష్టానుసారంగా దోచేస్తున్నారు. ఎవరైతే మాకేంటనే ధోరణి పెరిగిపోతోంది. గత వైకాపా హయాంలో కౌండిన్య నది తీరంలో ఇసుకను ఇష్టానుసారం దందా చేయడం వలన నదిమీద ఉన్న 11 చెక్‌డ్యామ్‌లు దెబ్బతిన్నాయి. చుక్కనీరు కూడా నిలిచే పరిస్థితి లేకుండా పోయింది. దీంతో నీరంతా తమిళనాడు రాష్ట్రానికి చేరిపోతోంది.

అటు నుంచి ఇటు..

పట్టణానికి సమీపంలోని క్యాటిల్ ఫారం వంతెన కింద భాగంలో తోడటం మొదలుపెట్టారు. రెండు నెలల నుంచి వంతెనకు కొంత దూరంలోని బీడు ప్రాంతాల్లో ఇసుక తోడేవారు. ఇక అటు వైపు నీరు ఉండటంతో మెల్లగా వంతెన వైపు తోడటం మొదలు పెడుతున్నారు.

వంతెన కూలితే అంతే..

చెక్‌డ్యామ్‌లను కూల్చేస్తే నీటి కొరత ఏర్పడుతుంది. ఇక వంతెన పిల్లర్ అడుగు భాగంలో ఇసుక తోడేస్తుండటంతో నిర్మాణం మొత్తం దెబ్బతింటోంది. అలా మెల్లగా అడుగు భాగం దెబ్బతిని వంతెన కూలే పరిస్థితికి చేరుకున్నాయి. అదే జరిగితే ఊహించని ప్రమాదం సంభవిస్తుంది.

అడ్డుకునే వారిపై దాడులు..

ఇసుక తోడేవారికి సొమ్ములు సంపాదించడమే ధ్యేయంగా పనిచేస్తున్నారు. టిప్పర్ ఇసుక ప్రస్తుతం సమీపంలోని కర్ణాటక రాష్ట్రంలో రూ.1.5 లక్షలు అమ్ముడుపోతోంది. అంత సొమ్ములు వస్తుండంతో ఎవరికీ భయపడకుండా వారి దోపిడికీ అడ్డు లేకుండా పోయింది. బహిరంగంగా ఒక చిన్న పరిశ్రమను తలపించేలా యంత్రాలతో తోడటం చేస్తున్నారు. వీరిని అడ్డుకోడానికి క్షేత్రస్థాయి అధికారులు సైతం భయపడుతున్నారు. ఇసుక తోడే వారిని ఫొటోలు తీయడానికి వెళ్లేవారి మీద దౌర్జన్యానికి చేస్తున్నారు. వారిపై దాడులకు దిగుతున్నారు. దాంతో ఎవరూ వారిని అడ్డుకునే ప్రయత్నం చేయట్లేదు. కనీసం ప్రభుత్వ ఆస్తులకు నష్టం కలుగకుండా చేయడానికి కూడా అధికారులు సాహసించడంలేదు.

సిబ్బందిని పంపుతాం

కౌండిన్య నదిమీద ఇసుక తోడేవారిని అడ్డుకోడానికి సిబ్బందిని పంపిస్తాం. వంతెనకు ప్రమాదం సంభవించకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటాం. అక్రమ రవాణా అడ్డుకునే ప్రయత్నం చేస్తాం.

- భవాని, ఆర్డీవో పలమనేరు

24 నుంచి కల్యాణ వెంకన్న ఉత్సవాలు

పుంగనూరు, న్యూస్‌టుడే: తితిదే ఆధ్వర్యంలో ఉన్న కల్యాణ వెంకటరమణ స్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు ఈనెల 24 నుంచి మార్చి 5 వరకు నిర్వహిస్తామని ఈవో కృష్ణమూర్తి తెలిపారు. మంగళవారం అర్చకులు, సిబ్బందితో కలిసి గోడప్రతులు ఆవిష్కరించారు. 24న ధ్వజారోహణం, 25న హంస వాహనం, 26న సింహ, 27న హనుమంత, 28న గరుడ, మార్చి 1న సూర్య ప్రభ, చంద్రప్రభ వాహనాలపై ఊరేగుతారన్నారు. 2న శ్రీవారి కల్యాణం, 4న రథోత్సవం, ధ్వజావరోహణం, 5న తిరుప్పావడ, శయనోత్సవం జరుగుతాయన్నారు.

పట్టించుకునే నాథుడు కరవు..!

శాంతిపురం మండలం ఏడో మైలు- కేజీఎఫ్ అంతర్రాష్ట్ర మార్గంలో అప్పయ్యతోపు వద్ద బస్సు షెల్టర్ శిథిలావస్థకి చేరుకుంది. షెల్టరులో రాతి బండలు ధ్వంసం కావడంతో పాటు చుట్టూ పిచ్చి మొక్కలు, పొదల వల్ల ప్రయాణికులు కనీసం నిలబడలేని పరిస్థితి ఏర్పడింది. వేసవి, వర్షాకాలంలో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వాపోతున్నారు. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు. - **న్యూస్‌టుడే, శాంతిపురం**

ప్రభుత్వ సహకారం.. స్వయం ఉపాధి సాకారం

✦ పశు పోషణతో ఆర్థిక స్వావలంబన సాధిస్తున్న మహిళలు

శాంతిపురం, న్యూస్‌టుడే: సామాన్య, మధ్య తరగతి కుటుంబాల్లోని మహిళలు కుటుంబ బాధ్యతలను మోస్తూ.. స్వయం ఉపాధితో ఆర్థిక స్వావలంబనతో ముందుకు సాగుతున్నారు. ప్రభుత్వ తోడ్పాటుతో పశు పోషణతో ఆసరాగా నిలుస్తున్నారు. ఒక్కో సంఘంలో గరిష్ఠంగా పది మంది సభ్యులుగా నమోదై.. మండల, గ్రామ సమాఖ్యలు, స్త్రీనిధి ద్వారా రుణాలను తీసుకొంటూ వ్యాపారాలు సాగిస్తున్నారు. రూ. 30 లక్షల వరకు రుణాలు తీసుకొంటూ ప్రతినెలా నిర్దేశిత గడువులోగా చెల్లిస్తూ మహిళలకు ఆదర్శంగా నిలుస్తున్నారు.

పాడి పరిశ్రమతో కుటుంబానికి తోడ్పాటు

మండల వ్యాప్తంగా 1,337 సంఘాల్లో 13,555 మంది సభ్యులున్నారు. ప్రతి సంఘంలోనూ బ్యాంకు రుణాలు అందుకున్నారు. అత్యధిక శాతం మహిళలు పాడి పరిశ్రమను ఆదరవుగా మలుచుకున్నారు. వ్యవసాయంతో పాటు పశుపోషణ ద్వారా సంపాదన సాగిస్తున్నారు. రోజూ ఉదయం, సాయంత్రం 2 గంటల పాటు కష్టపడితే పశు పోషణతో కుటుంబాల్లో ఆర్థిక స్వావలంబన సాకారం చేసుకోవచ్చని మహిళలు అంటున్నారు.

పశుపోషణతో పిల్లల చదువులు..

పొదుపు సంఘం ద్వారా రూ. 1.50 లక్షల బ్యాంకు రుణం తీసుకున్నాను. మూడు పాడి ఆవుల పోషణతో కుమార్తెను బీటెక్, కుమారుడిని బీకాం చదివిస్తున్నాను. కుటుంబం జీవనంతో పాటు బ్యాంకు రుణం చెల్లింపునకు ఎలాంటి ఇబ్బంది లేదు. మహిళా సంఘాలకు ప్రభుత్వం రాయితీతో పశుగ్రాసాన్ని అందించాలి.

- సునీత, పాడి రైతు

30 ఏళ్లుగా పొదుపులో సభ్యురాలిగా..

నేను 30 ఏళ్ల నుంచి పొదుపు సంఘంలో సభ్యురాలిగా కొనసాగుతున్నాను. బ్యాంకులో రూ.2 లక్షల రుణం తీసుకున్నాను. వ్యవసాయం పనులతో పాటు పాడి ఆవుల పోషణ ద్వారా లభిస్తున్న ఆదాయం కుటుంబ అవసరాలకు సరిపోతోంది. పాలకు గిట్టుబాటు ధరలు ఇచ్చి తోడ్పాటు అందించాలి.

- అనసూయమ్మ, తుమ్మిశి, శాంతిపురం మండలం

(c) eenadu

ఈనాడు
డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ

ఎస్సీ, ఎస్టీలకు ఉచితంగా సోలార్ విద్యుత్తు

అమలాపురం కలెక్టరేట్: జిల్లాలో 200 యూనిట్లలోపు విద్యుత్తు వినియోగం ఉన్న ఎస్సీ, ఎస్టీలకు ప్రభుత్వపరంగా ఉచితంగా సోలార్ యూనిట్లు ఏర్పాటుకు చర్యలు తీసుకున్నట్లు కలెక్టర్ మహేష్‌కుమార్ తెలిపారు. దీనిపై సర్వే జరుగుతుందన్నారు. తొలివిడతగా రామచంద్రపురం డివిజన్ పరిధిలో 4,500 గృహాలను ఎంపిక చేస్తామన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో ట్రాన్స్‌కో అధికారులతో సమీక్ష నిర్వహించారు. జిల్లా వాసులకు నాణ్యమైన విద్యుత్తు అందించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

గడువులోగా అక్విడక్టు మరమ్మతులు

పి.గన్నవరం: పి.గన్నవరం వద్ద వైనతేయ గోదావరి నదిపై డొక్కా సీతమ్మ అక్విడక్టు రోడ్డు వంతెన మరమ్మతు పనులు నిర్ణీత గడువులోగా పూర్తి చేస్తామని జలవనరులశాఖ ధవళేశ్వరం సర్కిల్ ఎస్.ఇ. కె.గోపీనాథ్ వెల్లడించారు. మంగళవారం సాయంత్రం ఆయన ఈ పనులను పరిశీలించి సిబ్బందికి తగు సూచనలు చేశారు. 31 నుంచి 34 ఎక్స్‌పాన్షన్ జాయింట్ల వద్ద అమర్చిన ఇనుప కడ్డీలను, వేరింగ్‌కోట్ వేసే ప్రదేశాలను పరిశీలించి ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో వివరించారు. ఈఈ కె.వెంకటేశ్వరరావు, డీఈఈ భూపతిరాజు రవిప్రసాద్ రాజు, ఏఈఈ బెహరా రమేష్‌బాబు, ఐసీ అసిస్టెంట్ జవ్వాది శ్రీనివాస్ పాల్గొన్నారు.

రికార్డుతో ఆరాశ్రీదత్త

44 సెకన్లు.. 7 శ్లోకాలు

అమలాపురం గ్రామీణం: పాఠశాలలో నేర్పించే శ్లోకాలను ఈ చిన్నారి అలవోగా చెప్పేస్తోంది. కామనగరువుకు చెందిన ముమ్మిడివరపు ఆరాశ్రీ దత్త నాలుగున్నరేళ్ల వయసులోనే ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్సును సొంతం చేసుకుంది. 44 సెకన్లలో ఏడు సంప్రదాయ హిందూ శ్లోకాలను చెప్పి ఈ ఘనత సాధించింది. ప్రస్తుతం నిమిషంలో 12 హిందూ శ్లోకాలను చెబుతున్నట్లు చిన్నారి తల్లిదండ్రులు ప్రదీప్‌కుమార్, ఫణిశ్రీ చెప్పారు. వీరిద్దరూ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లుగా ఉద్యోగం చేస్తూనే చిన్నారితో శ్లోకాలను సాధన చేయిస్తున్నారు. ప్రస్తుతం దిల్లీ పబ్లిక్ స్కూల్‌లో చదువుతోంది. రికార్డు కైవసం చేసుకున్న చిన్నారిని కలెక్టర్ మహేష్‌కుమార్, జేసీ నిశాంతి, ఆర్డీవో మాధవి మంగళవారం అభినందించారు.

విలస @ 1200

ఈ ఏడాది పులసల లభ్యత గణనీయంగా తగ్గిపోయింది. గోదావరి వరదల సమయంలో మత్స్యకారులు ఎంత వేటాడినా వలలకు చిక్కలేదు. ఎక్కడైనా అరకొరగా లభ్యమైనా ఒక్కోటి పరిమాణం బట్టి రూ.15 వేల నుంచి రూ.30 వేల వరకు పలికింది. దీంతో పులసప్రియులు, మత్స్యకారులు తీవ్ర నిరాశ చెందారు. ప్రస్తుతం తేట నీటిలో వలలకు చిక్కుతున్నాయి. వీటిని విలసలుగా పిలుస్తుంటారు. మంగళవారం పి.గన్నవరం మార్కెట్‌కి రెండు విలసలు తీసుకొచ్చి విక్రయించారు. పరిమాణం బట్టి రూ.600 నుంచి రూ.1200 ధరకు విక్రయించారు.

\- న్యూస్‌టుడే, పి.గన్నవరం

రెచ్చగొట్టేలా ఫ్లెక్సీలు ముద్రిస్తే చర్యలు

అమలాపురం కలెక్టరేట్, : ఫ్లెక్సీల ముద్రణలో చట్టపరమైన, సామాజిక బాధ్యత, పర్యావరణ పరిరక్షణకు సంబంధించిన ప్రమాణాలు పాటించాలని కలెక్టర్ మహేష్‌కుమార్ సూచించారు. మంగళవారం కలెక్టరేట్‌లో ఫ్లెక్సీ ప్రింటింగ్ యజమానులతో సమీక్ష చేశారు. ఇటీవల కాలంలో ఫ్లెక్సీల వివాదాల వల్ల కేసులు నమోదయ్యాయని తెలిపారు. ఈ నేపథ్యంలో ఫ్లెక్సీలపై పర్యవేక్షణకు జేసీ ఆధ్వర్యంలో ప్రత్యేక కమిటీని నియమించామన్నారు. ఈ కమిటీ సూచించిన నియమాల ప్రకారమే ముద్రణ చేయాల్సి ఉంటుందన్నారు. ఎస్పీ రాహుల్ మీనా మాట్లాడుతూ వివాదాస్పద వ్యాఖ్యలు రాసి, సామాజిక విద్వేషాలు రెచ్చగొట్టేలా ముద్రిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఫ్లెక్సీ ముద్రణలో పర్యావరణ హితమైన పదార్థాలనే వినియోగించాలన్నారు. కార్యక్రమంలో జేసీ నిశాంతి, డీఆర్వో కె.మాధవి, ఆర్డీవోలు శ్రీకర్, అఖిల తదితరులు పాల్గొన్నారు.

స్వయం ఉపాధికి ఊపిరి

కార్పొరేషన్లకు బడ్జెట్‌లో నిధుల కేటాయింపుతో నెరవేరనున్న కల

న్యూస్‌టుడే, అమలాపురం కలెక్టరేట్

వైకాపా పాలనలో వివిధ కులాల సంబంధించిన కార్పొరేషన్లను అలంకార ప్రాయంగా మార్చేశారు. నిధుల కేటాయింపు కుండా నిర్వీర్యం చేశారు. నిరుద్యోగ యువత ఉపాధి పొందేలా రుణాలు కల్పించేందుకు పైసా విదల్చలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రుణాలు అందించేందుకు అర్హుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో రాష్ట్రంలోని కార్పొరేషన్లకు రూ.994.59 కోట్లు కేటాయించారు. దీంతో దరఖాస్తుదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

అమలాపురంలో దరఖాస్తు చేసుకుంటున్న లబ్ధిదారులు

జిల్లా కేటాయింపుల పైనే..

రుణాలు అందిస్తున్న కార్పొరేషన్లను ఇంకా ఉమ్మడి జిల్లాల ప్రాతిపదికనే నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర వాటాలో జిల్లాకు ఏ మేర నిధులు కేటాయిస్తారనే దానిపైనే రుణాల సంఖ్య ఆధారపడి ఉంది. ఉమ్మడి జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న మంత్రులు, ప్రజా ప్రతినిధులు జిల్లాకు పెద్ద మొత్తంలో నిధులు కేటాయింపులు జరిగేలా కృషి చేస్తే ఎదురుచూస్తున్న నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించే అవకాశం కలుగుతుంది.

దరఖాస్తుల పరిశీలన

ఎస్సీ, బీసీ, కాపు, ఇతర కార్పొరేషన్ల ద్వారా అర్హులకు రుణాలు అందించేందుకు వారి నుంచి 2025 జనవరి నుంచి మార్చి వరకు దరఖాస్తులు స్వీకరించారు. ఉమ్మడి జిల్లాలో 44,156 మంది దరఖాస్తు చేసుకున్నారు. వీటి పరిశీలన పూర్తి చేసి బ్యాంకర్లకు నిర్దేశించిన లక్ష్యాల మేరకు లబ్ధిదారుల వివరాలను పంపారు. జిల్లాలకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన లక్ష్యాలకు అనుగుణంగా నిధులు విడుదల చేస్తే రుణాల మంజూరు ప్రక్రియ ప్రారంభమవుతుంది.

ఉమ్మడి జిల్లా వివరాలు (2026-27)

కార్పొరేషన్	యూనిట్లు	రుణం (రూ.కోట్లలో)
బీసీ	4,682	97.93
ఈ-బీసీ	433	7.50
కాపు కార్పొరేషన్	2,277	82.53
ఎస్సీ కార్పొరేషన్	1,043	43.51
జనరిక్ మెడికల్‌షాపులు	511	13.74

ఆదేశాలు రావాల్సి ఉంది

కార్పొరేషన్ల ద్వారా రుణాలు మంజూరుకు అర్హుల నుంచి దరఖాస్తులు స్వీకరించాం. బడ్జెట్‌లో నిధులు కేటాయించారు. సంబంధిత ఆదేశాలు రావాల్సి ఉంది. జిల్లాల వారీగా నిధులు విడుదలైతే రుణాల మంజూరు ప్రారంభిస్తాం.

\-సత్యవతి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ

ఉక్కిరిబిక్కిరి

విత్తనాల కాలువ గట్టు నుంచి హైవేకు వెళ్లే దారిలో అవస్థలు

అమలాపురంలోని విత్తనాలకాలువ గట్టు నుంచి హైవేకు వెళ్లేదారిలో పరిస్థితి ఇదీ. పట్టణంలో రోజూ టన్నులకొద్దీ సేకరిస్తున్న చెత్తను నిల్వచేసే స్థలం లేక రోడ్డు పక్కన, డంపింగ్‌యార్డులో వేసి నిప్పు పెడుతున్నారు. విపరీతంగా పొగ వ్యాపించి వాహనచోదకులు అవస్థలు పడుతున్నారు. మరోవైపు పర్యావరణానికి ముప్పు ఏర్పడుతోంది. ప్లాస్టిక్‌వ్యర్థాల పొగతో ఆరోగ్యానికి ముప్పు పొంచి ఉంది.

\-న్యూస్‌టుడే, అమలాపురం పట్టణం

పోటీలో నిలబడి.. ఉత్సాహంగా తలపడి

చిన్నారులతో కలిసి చదరంగం ఆడుతున్న కలెక్టర్ దంపతులు

అమలాపురంలో శాప్ లీగ్-2026 మల్టీ స్పోర్ట్స్ లీగ్ పోటీలను మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ దంపతులు చిన్నారులతో సరదాగా చదరంగం ఆడి ఉత్సాహం రేకెత్తించారు. -న్యూస్‌టుడే, అమలాపురం గ్రామీణం

పది, ఇంటర్ పరీక్షల ఏర్పాట్లపై సమీక్ష

అమలాపురం కలెక్టరేట్, న్యూస్‌టుడే: జిల్లాలో పదో తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షలకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ మహేష్‌కుమార్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. జిల్లాలో ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సర పరీక్షలకు 19,310 మంది హాజరు కానున్నట్లు తెలిపారు. వీరికి 108 కేంద్రాలను సిద్ధం చేసినట్లు తెలిపారు. పరీక్షలు ముగిసిన తర్వాత పోలీసు బందోబస్తు నడుమ స్ట్రాంగ్ రూంలకు తరలించాలన్నారు. సమావేశంలో ఎస్పీ రాహుల్ మీనా, జేసీ నిశాంతి, ఇంటర్మీడియట్ అధికారి చంద్రశేఖర్‌బాబు, అధికారులు పాల్గొన్నారు.

నచ్చినట్టు.. దోచిపెట్టు

అమలాపురం, రామచంద్రపురం జగనన్న కాలనీల్లో అక్రమాలు

ఈనాడు, అమలాపురం; న్యూస్‌టుడే, రామచంద్రపురం: గత ప్రభుత్వ హయాంలో పేదలకు ఇళ్ల పేరుతో పెద్దలే బాగుపడ్డారు. స్థలాల సేకరణ నుంచి లేఅవుట్లలో నిర్మాణ పనుల వరకు అవకతవకలే. వైకాపా నేతల అనుయాయులే గుత్తేదారుల అవతారమెత్తారు. ఇళ్లు నిర్మించి ఇస్తామని బిల్లులు చేసుకున్నారు తప్ప అప్పగించలేదు. గృహనిర్మాణ సంస్థ, సచివాలయ ఇంజినీరింగ్ సిబ్బందిలో కొందరు గుత్తేదారులతో చేతులు కలిపారు. అమలాపురం, రామచంద్రపురం పరిధిలోని జగనన్న కాలనీల్లో మాయాజాలం తాజాగా వెలుగులోకి వచ్చింది.

ఇంజినీరింగ్ సహాయకులకు తాఖీదులు

కోనసీమ జిల్లాలో పీఎంఏవై- అర్బన్ పథకం కింద 25,703 ఇళ్లు మంజూరు చేశారు. అమలాపురం, మండపేట, రామచంద్రాపురం పురపాలికల పరిధిలో 2,608 గృహాల నిర్మాణ బాధ్యతను స్థానిక గుత్తేదారులకు అప్పగించారు. కొందరికి ఎటువంటి అనుభవం లేదు. నిర్మాణాలు పూర్తిచేయకుండా లబ్ధిదారుల పేరున మెటీరియల్, బిల్లులు అదనంగా బొక్కేశారు. అక్రమాలు నిజమేనని తాజాగా తేల్చి 20 మందికి పైగా ఇంజినీరింగ్ సహాయకులకు తాఖీదులిచ్చారు. గుత్తేదారులపైనా క్రిమినల్ కేసులు పెట్టనున్నారు.

రామచంద్రాపురానికి సంబంధించి ద్రాక్షారామ-4 సైట్‌లో నిర్మించిన గృహాలివి. ఎక్కువ భాగం ఇలా పునాదుల్లోనే..

తేడాలు గుర్తించారు

గృహనిర్మాణ సంస్థ అధికారి నరసింహారావు వద్ద ప్రస్తావించగా 'ఇళ్ల నిర్మాణ దశల్లో కొంచెం తేడాలున్నట్లు గుర్తించారు. ఆ మేరకు వారిపై చర్యలు తీసుకుంటాం. ఇంజినీరింగ్ సిబ్బందికి తాఖీదులిచ్చాం. మిగిలిన ఇళ్ల నిర్మాణాలు పూర్తిచేయిస్తాం.' అని తెలిపారు.

ఆన్‌లైన్‌లో బొమ్మ చూపించారు

ఇల్లు పునాదుల దశలో ఉంటే లింటల్ స్థాయిలో ఉన్నట్లు, శ్లాబ్ దశలో ఉంటే పూర్తయినట్లు స్టేజ్ కన్వర్షన్ చూపి బిల్లులు చేశారు. ✦ రామచంద్రాపురం పరిధిలో వెంకటరమణ అనే గుత్తేదారుకు 327 ఇళ్ల నిర్మాణం అప్పగించారు. 66 ఇళ్ల పునాదుల స్థాయిలో (బీఎల్) ఉన్నట్లు ఆన్‌లైన్‌లో నమోదుచేశారు. క్షేత్రస్థాయిలో 16 మాత్రమే అలా ఉన్నాయి. పునాదులు మట్టితో నింపినట్లు ఆన్‌లైన్‌లో చూపారు. తనిఖీల్లో 148 ఇళ్ల పునాదులు ఖాళీగానే ఉన్నాయి. 12 నిర్మాణాల్లో నాణ్యతా లోపాలే. ✦ కె.శ్రీనివాస్ అనే వ్యక్తికి 68 ఇళ్ల బాధ్యతలు అప్పగించారు. క్షేత్రస్థాయిలో 38 ఇళ్ల నిర్మాణ దశల్లో తేడాలే.. నాలుగిళ్లలో నాణ్యతా లోపం ఉంది. ✦ అజయ్ వెంచర్స్‌కు 134 ఇళ్ల నిర్మాణం ఇచ్చారు. 104 గృహాల నిర్మాణ దశల్లో తేడాలున్నాయి. అదనంగా బిల్లులు చేసుకున్నారు. మరో 30 నిర్మాణాల్లో లోపాలే. మొన్న డిసెంబర్‌లో తనిఖీలు చేపట్టగా ఇవి బయటపడ్డాయి.

చుట్టేసిన గోదావరి

గండిపోశమ్మ ఆలయం, పంటల మునక

దేవీపట్నం: పోలవరం ప్రాజెక్టు బ్యాక్ వాటర్ (వెనుక జలాలు) కారణంగా వారం రోజులుగా గోదావరి పెరుగుతూనే ఉంది. మంగళవారం సాయంత్రానికి అడుగు మేర నీటి మట్టం పెరగడంతో గండిపోశమ్మ ఆలయాన్ని వరద చుట్టుముట్టింది. భక్తుల క్యూలైన్లు, సమీపంలోని దుకాణాలు ముంపునకు గురయ్యాయి. పోశమ్మగండి నుంచి పి.గొందూరు వైపు పలుచోట్ల ఆర్ అండ్‌బీ రహదారిని ఆనుకుని గోదావరి ప్రవహిస్తోంది. పి.గొందూరు వద్ద వరి చేలు, దండంగి, చినరమణయ్యపేట, కె.వీరవరం పరిసర ప్రాంతాల్లో మొక్కజొన్న చేలు ముంపునకు గురయ్యాయి. దండంగి ఆర్‌అండ్‌బీ రహదారిపై నీరు చేరడంతో వాహనాల రాకపోకలు స్తంభించాయి. పోలవరం ముంపు గ్రామాల్లో తక్కువ పన్నులకు పొలాలు రావడంతో రైతులు మొక్కజొన్న సాగు చేపట్టారు. ఒక్కసారిగా గోదావరి పెరగడంతో నష్టాలు తప్పవని కర్షకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

కొండపై నుంచే పూజలు..

గండిపోశమ్మ వారి ఆలయం వద్ద గోదావరి పెరుగుతున్నా భక్తుల రాక మాత్రం తగ్గలేదు. మంగళవారం మైదాన ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు కొండపై నుంచే అమ్మవారికి పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. కొండ ప్రాంతంలో వంటావార్పు కార్యక్రమాలు నిర్వహించుకున్నారు. గోదావరి వరదల కారణంగా ఏడు నెలలుగా అమ్మవారి దర్శనాలు నిలిచిపోయిన సంగతి తెలిసిందే. దేవస్థానం అధికారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయకపోవడంతో భక్తులకు ఇబ్బందులు తప్పడం లేదు. ఆలయానికి ఆదాయం కూడా తగ్గిపోతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి గండిపోశమ్మ నూతన ఆలయ నిర్మాణాన్ని ప్రారంభించాలని భక్తులు కోరుతున్నారు.

ఆలయాన్ని ముంచెత్తిన గోదావరి

మధ్యాహ్న భోజనం.. సంతృప్తిగా లేం!

ఈనాడు, అమలాపురం: విద్యార్థులకు మెరుగైన విద్య, నాణ్యమైన ఆహారం పాఠశాల స్థాయిలో అందించి వారి సర్వతోముఖాభివృద్ధికి బాటలు వేయాలన్న ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం 'డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం' నిర్వహిస్తోంది. మెనూ పక్కాగా అమలుచేయాలని ఆదేశించింది. అయితే క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ లోపంతో ఇబ్బంది ఏర్పడుతోంది. ప్రజల సంతృప్తి స్థాయి తెలుసుకునేందుకు ప్రభుత్వం 5 ప్రశ్నలతో రాష్ట్ర వ్యాప్తంగా ఇటీవల 2.27 లక్షల మందిని సంప్రదించగా 24.4 శాతం మంది వ్యతిరేకంగా స్పందించారు.

▮ నాణ్యతపై కాకినాడ, తూర్పులో ప్రతికూల స్పందన ▮ విద్యార్థుల తల్లిదండ్రుల అభిప్రాయ సేకరణ

వెనుకబడిన మన జిల్లాలు..

కాకినాడ, తూర్పు గోదావరి జిల్లాల్లో ఆహార పదార్థాల రుచి, నాణ్యతపై ఎక్కువ మంది అసంతృప్తి వ్యక్తంచేశారు. అన్ని విభాగాల్లో కాకినాడ వెనుకబడి రాష్ట్రంలో 26వ స్థానంలో ఉంది. తూర్పు 22, కోనసీమ 16, పోలవరం 4వ స్థానంలో ఉన్నాయి.

కొన్నిచోట్ల ఇలా..

◆ తుని పరిధిలోని కొండవరప్పేట పాఠశాలలో చదువుతున్న 11 మంది విద్యార్థుల తల్లిదండ్రుల అభిప్రాయాలు సేకరించారు. చిక్కీలు బాగున్నాయని 25 శాతం మంది చెప్పగా.. మిగిలిన అన్ని ప్రశ్నలకూ వ్యతిరేకంగానే సమాధానమిచ్చారు. ◆ కాకినాడ జిల్లా గజ్జనపూడి పాఠశాలలో 11 మందిని సంప్రదించగా మెనూ అమలు సరిగా లేదని అందరూ చెప్పారు. 33 శాతం మంది పదార్థాలు రుచిగా ఉంటున్నాయని, 25 శాతం మంది అన్నం బాగుందని మాత్రమే తెలిపారు.

జిల్లాలవారీగా 5 ప్రశ్నలకు విద్యార్థుల తల్లిదండ్రులు ఎలా స్పందించారంటే(శాతాల్లో)

✔ బాగు ✘ లేదు	మెనూ అమలు ✔ – ✘	రుచి ✔ – ✘	నాణ్యత ✔ – ✘	చిక్కీ నాణ్యత ✔ – ✘	అన్నం ✔ – ✘	రాష్ట్రంలో ర్యాంకు
తూర్పు	84.6 – 15.4	73.5 – 26.5	67.7 – 32.3	75.7 – 24.3	67.5 – 32.5	22
కాకినాడ	83.4 – 16.6	75.0 – 25	65.6 – 34.4	77.8 – 22.2	68.3 – 31.7	26
కోనసీమ	85.8 – 14.2	70.3 – 29.7	70.6 –29.4	75.8 – 24.2	69.2 – 30.8	16
పోలవరం	85.6 – 14.4	81.1 – 18.9	76.0 – 24.0	78.5 – 21.5	76.3 – 23.7	4

కొబ్బరి మార్కెట్‌కు తమిళనాడు దెబ్బ

న్యూస్‌టుడే, అంబాజీపేట

కోనసీమలో కొబ్బరి ధరలు ఒక్కసారిగా పతనమయ్యాయి. మహాశివరాత్రి, హోలీ పండగల నేపథ్యంలో ధరలు ఆశాజనకంగా ఉంటాయని భావించిన రైతులు, వర్తకులకు నిరాశే మిగిలింది. మహాశివరాత్రికి అనుకున్నంత లావాదేవీలు జరగకపోవడంతో పాటు పొరుగున ఉన్న తమిళనాడు రాష్ట్రంలో ఏర్పడిన పరిస్థితులే దీనికి కారణమని మార్కెట్ విశ్లేషకులు భావిస్తున్నారు.

ప్రధాన కారణాలు ఇవే..

కొబ్బరి కాయల ఉత్పత్తిలో కోనసీమకు పోటీగా ఉన్న తమిళనాడు ప్రభావం ఇక్కడి మార్కెట్‌పై పడింది. ఆ రాష్ట్రంలో ఉత్పత్తి బాగా పెరగడంతో పాటు పరిమాణం, నాణ్యత మేలు రకంగా ఉండటంతో ఇతర రాష్ట్రాల వ్యాపారులు వాటినే కొనుగోలు చేసేందుకు మక్కువ చూపుతున్నారు. దీంతో కోనసీమ కాయలకు డిమాండ్ తగ్గిపోయింది. పొరుగు రాష్ట్రాల నుంచి వ్యాపారులకు ఆర్డర్లు రావడం లేదు. దీంతో ధర ఒక్కసారిగా తగ్గిపోయింది. గత నెలలో వెయ్యి పచ్చికాయలు రూ.18 వేల నుంచి రూ.20 వేల వరకు పలికింది. బిహార్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాలకు రోజుకు 50 నుంచి 60 లారీల ఎగుమతులు జరిగేవి. ప్రస్తుతం తమిళనాడు కాయలపై వారంతా మక్కువ చూపడంతో వాటినే కొనుగోలు చేస్తున్నారు. ప్రస్తుతం వెయ్యి పచ్చికాయలు రూ.15 వేల నుంచి రూ.17 వేల మధ్య ఉంది. కురిడీలు, కొత్తకొబ్బరి ధరలు కూడా తగ్గినట్లు మార్కెట్ విశ్లేషకులు చెబుతున్నారు. ఎగుమతులు సైతం సన్నగిల్లాయంటున్నారు.

విమానాశ్రయం.. అడుగులెటు!

ఈనాడు, కాకినాడ: కాకినాడ జిల్లాలో అన్నవరం-తుని మధ్య గ్రీన్ ఫీల్డ్ విమానాశ్రయ నిర్మాణంపై ఊగిసలాట కొనసాగుతోంది. గతంలో ఇక్కడ ప్రతిపాదనకు స్థానికుల నుంచి వ్యతిరేకత వ్యక్తమైంది. భూములు ఇవ్వలేమని ఆందోళనలు చేపట్టారు. అదే సమయంలో అక్కడ భూములు విమానాశ్రయానికి అనుకూలంగా లేవని గుర్తించి ప్రతిపాదనను ఉపసంహరించుకున్నట్లు అధికారులు తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఇటీవల ప్రభుత్వశాఖల ముఖ్యకార్యదర్శులతో నిర్వహించిన సమావేశంలో ఈ ఎయిర్‌పోర్టు పరిశీలనలో ఉన్నట్లే చూపించడంతో మరోసారి చర్చల్లోకి వచ్చింది. రాష్ట్రంలో 9 విమానాశ్రయాలను కొత్తగా నిర్మించేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. అందులో తుని, అన్నవరం మధ్య నిర్మాణానికి సవివర నివేదిక (డీపీఆర్) తయారీ దశలో ఉన్నట్లు రాష్ట్ర విమానాశ్రయాల అభివృద్ధి సంస్థ (ఏపీఏడీసీఎల్) పేర్కొంది. రాజమహేంద్రవరం నుంచి గంట ప్రయాణ దూరంలో ఉన్న ఇక్కడ నిర్మిస్తే ఇటు కాకినాడ, అనకాపల్లి, విశాఖ జిల్లాలకు ఉపయుక్తంగా ఉంటుందన్నది ఆలోచన. ఈ విషయంపై తమకు ఎలాంటి సమాచారం లేదని కలెక్టరేట్ వర్గాలు చెబుతున్నాయి.

ఇక్కడే ఎందుకంటే..

● కాకినాడలో ఇటీవల రూ.13 వేల కోట్లతో ఏఎం గ్రీన్ అమ్మోనియా ప్లాంట్‌కు సీఎం శంకుస్థాపన చేశారు. ఉప్పాడ సమీపంలోని నేమాం పరిసరాల్లో ఏఎంజీ మెటల్స్ గ్రీన్ అల్యూమినా కంపెనీ రూ.44 వేల కోట్లతో ఏర్పాటు కాబోతుంది. సెజ్, పోర్టు పరిసరాల్లో భారీ పరిశ్రమలు పెట్టుబడులు పెట్టేందుకు వస్తుండడంతో తుని-అన్నవరం మధ్యలో విమానాశ్రయం ఏర్పాటు అనుకూలమని భావిస్తున్నారు. ● అనకాపల్లిలో ఆర్సెలార్ మిట్టల్ స్టీల్‌ప్లాంట్, నక్కపల్లి బల్క్‌డ్రగ్ పార్క్‌తో భారీ పరిశ్రమలు ఏర్పాటవుతున్న నేపథ్యంలో వాటికీ ఈ విమానాశ్రయం అందుబాటులో ఉంటుందని ప్రభుత్వ ఆలోచన. ఒకవేళ ఈ ప్రాంతంలో స్థానికులు ఒప్పుకోకపోతే పాయకరావుపేట సమీపంలోనైనా నిర్మించి తీరే అవకాశం ఉంది.

కాకినాడ సెజ్‌కు సమీపంలో విమానాశ్రయం నిర్మిస్తే పారిశ్రామికంగా అభివృద్ధితో పాటు కార్గోకు అనుకూలం. పైగా వాకలపూడి-అన్నవరం వరకు తీరం వెంబడి రూ.1440 కోట్లతో కొత్త జాతీయ రహదారి నిర్మాణం జరగబోతుంది. రోడ్డు, పోర్టులతో అనుసంధానానికి వీలుంటుంది.

అన్నవరం భక్తులకు మరిన్ని సౌకర్యాలు

తుని-అన్నవరం మధ్య పరిశీలనలో ఉన్నట్లు ప్రకటన

అన్నవరం, న్యూస్‌టుడే: అన్నవరం వచ్చే భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వం పలు అభివృద్ధి పనులు చేపట్టనుంది. రత్నగిరిపై సీతారామసత్రం నిర్మాణం చేపట్టనుంది. మరోవైపు రెండో మెట్లమార్గం పూర్తైంది. మెట్ల మార్గం ప్రారంభం, వసతి సముదాయం నిర్మాణానికి శంకుస్థాపనను ఈ నెల 22న దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తదితరుల చేతుల మీదుగా చేయడానికి ఏర్పాట్లు చేస్తున్నారు.

❑ రెండో మెట్లమార్గం

కొండ దిగువ నుంచి మరో మెట్ల మార్గం నిర్మాణం పూర్తైంది. ట్రాఫిక్, పార్కింగ్ సమస్యను నియంత్రించేందుకు సుమారు రూ.1.30 కోట్ల వ్యయంతో పనులు చేపట్టారు. ఎగువ ఘాట్ రోడ్డుకు ఆనుకుని (టోల్‌గేటు వద్ద నుంచి) కొండపైన సెంటినరీ కాటేజీ వరకు 250 మీటర్ల పొడవున సుమారు 350 మెట్లు నిర్మించారు. ఒక్కో మెట్టు 14 అడుగుల పొడవు, 1.3 అడుగుల వెడల్పు, 6 అంగుళాల ఎత్తు, 28 ల్యాండింగ్‌లతో నిర్మాణం చేపట్టారు. ఆర్చి నిర్మాణం జరుగుతుంది.

నిర్మించనున్న సీతారామసత్రం నమూనా

❑ రెండు బ్లాకులుగా సీతారామసత్రం

రత్నగిరిపై 105 గదులతో వసతి సముదాయం నిర్మించనున్నారు. 210 గదులతో రెండు బ్లాకులుగా నిర్మాణానికి ప్రణాళిక చేశారు. ముందుగా ఒక బ్లాక్ సుమారు రూ.11.40 కోట్లతో నిర్మాణం చేపట్టనున్నారు. జీప్లస్ 3 భవనంలో ఒక్కో ఫ్లోర్‌లో 35 గదులు, కింద సెల్లారు పార్కింగ్‌కు కేటాయించారు. 1995లో నిర్మించిన సీతారామసత్రం శిథిలావస్థకు చేరడంతో దీన్ని తొలగించి నిర్మాణం చేపట్టనున్నారు.


సమగ్ర శిక్ష మాడ్యూల్‌ను ప్రధానోపాధ్యాయులకు అందజేస్తున్న డీఈవో నాగేశ్వరరావు

ఏటీఎల్‌లతో నూతన ఆవిష్కరణలు

ముమ్మిడివరం, న్యూస్‌టుడే: పరిశోధనా దృక్పథం, నూతన ఆవిష్కరణలు, సృజనాత్మకతకు అటల్ టింకరింగ్ ల్యాబ్‌లు(ఏటీఎల్) వేదిక కావాలని డీఈవో పి.నాగేశ్వరరావు అన్నారు. ముమ్మిడివరంలోని మండల వనరుల కేంద్రం వద్ద జిల్లాలోని 45 ఏటీఎల్ ప్రధానోపాధ్యాయులతో మంగళవారం నిర్వహించిన సమీక్ష సమావేశానికి ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. ఈ ల్యాబ్‌లను వారంలో రెండుసార్లు సందర్శించి నివేదికలు ఇవ్వాలని జిల్లా సైన్సు అధికారి జీవీఎస్ సుబ్రహ్మణ్యంకు సూచించారు. సమగ్ర శిక్ష ఏపీసీ జి.మమ్మీ మాట్లాడుతూ ఏటీఎల్‌లలో దస్త్రాల నిర్వహణ మార్గదర్శకాలకు అనుగుణంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ముమ్మిడివరం ఎంఈఓలు డి.గౌరీశంకర్, రాయుడు ఉదయభాస్కర్, జిల్లాలోని ఏటీఎల్ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించండి
Cell: 80085 97607
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 80082 34669

దిండి-సీతారామపురం మధ్య మార్గం సుగమం

మలికిపురం, న్యూస్‌టుడే: దిండి-సీతారామపురం మధ్య జాతీయ రహదారి నిర్మాణానికి అవసరమైన భూ సేకరణ విషయంలో ఓ రైతు వేసిన పిటిషన్ మంగళవారం సుప్రీం కోర్టు కొట్టివేస్తూ తీర్పు ఇచ్చింది. భూ సేకరణ సమయంలో మలికిపురం మండలం గుడిమెళ్లంక గ్రామానికి చెందిన అల్లూరి విశ్వనాథరాజు తనకు చెందిన భూముల విషయంలో అన్యాయం జరిగిందంటూ గతంలో కోర్టులను ఆశ్రయించారు. దాదాపు 2020 నుంచి అది కోర్టులో పెండింగ్‌లో ఉండగా.. రోడ్డు నిర్మాణ ప్రక్రియ ముందుకు వెళ్లని పరిస్థితి ఏర్పడింది. సఖినేటిపల్లి మండలం రామేశ్వరం, పశ్చిమ గోదావరి జిల్లాలోని రాజుపాలెం మధ్య వశిష్ఠ గోదావరి వంతెన్ని కలుపుతూ.. కోనసీమ జిల్లా దిండిలోని చెక్ పోస్టు వద్ద ఉన్న 216 జాతీయ రహదారి నుంచి పశ్చిమ గోదావరి జిల్లా సీతారామపురం వద్ద ఉన్న 216 జాతీయ రహదారిని కలిపేందుకు ప్రణాళిక సిద్ధం చేశారు. దాదాపు 22 కిలోమీటర్ల మేర ఈ బైపాస్ రోడ్డు(రింగ్ రోడ్డు)నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం సాగరమాల పథకంలో రూ.500 కోట్ల నిధులు మంజూరు చేసింది. విశ్వనాథరాజు వేసిన పిటిషను కారణంగా గత ఆరు సంవత్సరాలుగా వంతెన, రోడ్డు నిర్మాణాలు కొలిక్కి రాలేదు. ప్రజా ప్రయోజనాల దృష్ట్యా కేశవదాసుపాలానికి చెందిన ఎన్నారై యెనుముల వెంకటపతిరాజా ఇంప్లీడ్ పిటిషనర్‌గా చేరి రోడ్డు, వంతెన ప్రయోజనాలను కోర్టుకు వివరించామని అన్నారు. దీంతో సుప్రీంకోర్టు రైతు వేసిన పిటిషన్‌ను కొట్టివేసిందని తెలిపారు. దీనిపై ఎన్‌హెచ్‌ఏ (ఆర్‌అండ్‌బీ) డీఈఈ(భీమవరం) శ్రీనివాస్‌ని వివరణ కోరగా కేసు కొట్టివేసినట్లు తమకు సమాచారం వచ్చిందన్నారు.

గతంలో రూ.500 కోట్లు మంజూరు

(c) eenadu

నాడు నైనై.. నేడు రయ్ రయ్

గత ప్రభుత్వ అయిదేళ్ల పాలనలో రహదారులు పాడై వర్షాకాలంలో తటాకాలను తలపించినా పట్టించుకోలేదు. దీంతో ప్రజలు, వాహనదారులు రాకపోకలకు తీవ్ర అవస్థలు పడ్డారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తరువాత వీరి కష్టాలు ఒక్కొక్కటిగా దూరమవుతున్నాయి. రెండు నియోజకవర్గాలకు అనుసంధానంగా ఉన్న ముక్తేశ్వరం-ముమ్మిడివరం ప్రధాన రహదారిని ముక్తేశ్వరం నుంచి కె.జగన్నాధపురం వరకు రూ.3.20 కోట్లతో తాజాగా ఆధునికీకరించారు. గత నెలలో చేపట్టిన పనులు ప్రస్తుతం పూర్తయ్యాయి. దీంతో హాయిగా ప్రయాణం సాగించేందుకు అవకాశం ఏర్పడిందని అంతా సంతోషిస్తున్నారు. - న్యూస్‌టుడే, అయినవిల్లి

సముద్రుడు.. వెనక్కి మళ్లాడు..!

యు.కొత్తపల్లి మండల పరిధిలోని ఉప్పాడ తీరంలో సముద్రం ఒక్కసారిగా వెనక్కి వెళ్లి ఆశ్చర్యానికి గురిచేసింది. మంగళవారం ఉదయం 9 గంటలప్పుడు కెరటాలు దూసుకొచ్చి రహదారిని తాకాయి. అంతలోనే ప్రశాంత వాతావరణం నెలకొని 50 మీటర్ల దూరం సముద్రం వెనక్కి వెళ్లింది. దీంతో ఆ ప్రాంతంలో జియోట్యూబ్ ఆనవాళ్లు బయటపడ్డాయి. సముద్రంలో ఏర్పడే ఆటు పోటు సమయంలో ఇలా ముందుకు, వెనక్కు వస్తుంటుందని మత్స్యకారులు పేర్కొన్నారు. - న్యూస్‌టుడే, కొత్తపల్లి

దుమ్ము.. దుమారం

ఉండ్రాజవరం మండలంలోని వడ్లూరు, పెరవలి రహదారిలో కాకరపర్రు కాలువ ప్రాంతంలో వాహనాల రాకపోకల సమయంలో రోడ్డుపై నిలువెత్తున దుమ్ము రేగుతోంది. దీంతో వెనుక నుంచి వెళ్లే వారికి కళ్లలో పడుతుండడంతో ఇబ్బందులు తప్పడం లేదు. దుమ్ము తెర కారణంగా ముందు ఏముందో తెలిక అవస్థలు ఎదుర్కొంటున్నారు. కొన్ని సందర్భాల్లో అదుపు తప్పి వాహనాలు బోల్తాపడి ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఆ ప్రాంతంలో రోడ్డు అభివృద్ధి చేయాలని పరిసర గ్రామాల ప్రజలు కోరుతున్నారు. పరిశీలించి చర్యలు తీసుకుంటామని ర.భ.శాఖ ఏఈ శ్రీనివాస్ తెలిపారు. - న్యూస్‌టుడే, ఉండ్రాజవరం

క్రీడా పోటీల్లో ప్రతిభ చాటండి: కలెక్టర్

అమలాపురం గ్రామీణం, న్యూస్‌టుడే: శాప్ లీగ్-2026 పేరుతో ఏడాది పొడవునా నిర్వహించే మల్టీ స్పోర్ట్స్ లీగ్ పోటీల్లో పాల్గొని ప్రతిభను చాటాలని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ పిలుపునిచ్చారు. స్థానిక బి.ఎం.సి.బాలయోగి స్టేడియంలో శాప్ లీగ్ చదరంగం పోటీలను కలెక్టర్ దంపతులు మంగళవారం ప్రారంభించారు. 12 నుంచి 20 ఏళ్ల మధ్య క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ఈ పోటీలను నిర్వహిస్తున్నామని కలెక్టర్ తెలిపారు. ఇందులో 31 క్రీడాంశాలు ఉన్నాయన్నారు. విజేతలకు ఆకర్షణీయమైన ప్రోత్సాహక బహుమతులు అందించడంతోపాటు రాష్ట్రస్థాయి పోటీలకు పంపిస్తామని తెలిపారు. ఈ నెల 24న స్కేటింగ్ పోటీలను బి.ఎం.సి.బాలయోగి క్రీడా మైదానంలో నిర్వహిస్తున్నామన్నారు. చదరంగంలో ప్రతిభ కనబరిచిన వారికి ఈ నెల 28, మార్చి 1న విజయవాడలో జరిగే పోటీల్లో పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో డీఎస్‌డీవో వి.ఆర్.రుద్ర, కార్యదర్శి కె.ఈశ్వరరావు, రమాదేవి, పీఈటీలు బి.ఎస్.ఎన్.మూర్తి, బి.వి.సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి రూ.5 లక్షల విరాళం

ఆత్రేయపురం, న్యూస్‌టుడే: ఆత్రేయపురంలోని శ్రీ రాజరాజేశ్వరి, వేణుగోపాలస్వామి ఆలయ పునర్ నిర్మాణ పనులకు పలువురు దాతలు తమ వంతు చేయూతనందించారు. గ్రామానికి చెందిన సాగిరాజు రామకృష్ణ రాజు(నల్లి) దంపతుల కుమారుడు తేజ్‌వర్మ రూ.5లక్షల విరాళాన్ని అందించారు. చిలువూరి వెంకట్రాజు, నాగమణి దంపతులు కుమార్తె ప్రవాసాంధ్రురాలు దేవీ సునీత భారతి రూ.1,11,116లు విరాళం అందించారు. ఆలయ కమిటీ ఛైర్మన్‌లు వేగేశ్న ప్రసాద్‌రాజు, పులవర్తి కాశీవిశ్వనాధం, వాడపల్లి దేవస్థానం ఛైర్మన్ ముదునూరి వెంకట్రాజు తదితరులు పాల్గొన్నారు.

గంగపుత్రులకు హార్బర్‌లో తప్పని ఇక్కట్లు
తాగునీటి బెంగ

న్యూస్‌టుడే, సఖినేటిపల్లి

అంతర్వేది పల్లిపాలెంలో ఉన్న మినీ ఫిషింగ్ హార్బర్‌కు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి చేపలవేట కోసం వచ్చే గంగపుత్రులకు తాగునీటి కష్టాలు తప్పడం లేదు. ఇందుకోసం రూ.వేలు వ్యయం చేయాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల 60 వేల లీటర్ల తాగునీటి ఓవర్‌హెడ్ ట్యాంకు మంజూరు చేసినా పనుల ప్రారంభంలో జాప్యంతో అవస్థలు తప్పడం లేదు. ప్రస్తుతం వేసవి కాలం వచ్చేసింది. దీంతో మరిన్ని అవస్థలు తప్పవని వాపోతున్నారు.

ట్యాంకుల ద్వారా తాగునీటిని తీసుకొచ్చిన వాహనం

కమిటీని నియమించినా..

మత్స్యకారుల సంక్షేమమే లక్ష్యంగా 2016-19లో అప్పటి తెదేపా ప్రభుత్వం రూ.32 కోట్లు మంజూరు చేసి అంతర్వేదిలో మినీ ఫిషింగ్ హార్బర్‌ను నిర్మించింది. కొన్ని మౌలిక సదుపాయాలు కల్పించింది. మరికొన్ని మిగిలి ఉండగా వైకాపా ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. ఏవిధమైన అభివృద్ధి కార్యక్రమాలపై శ్రద్ధపెట్టలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆరు నెలల కిందట కలెక్టర్ ఛైర్మన్‌గా 14 మంది సభ్యులతో కమిటీని ఏర్పాటు చేసింది. పీపీపీ విధానంలో అభివృద్ధి చేయడానికి టెండర్ ద్వారా ఆర్‌ఆర్ ఏజెన్సీకి బాధ్యతలు అప్పగించింది. అభివృద్ధిలో భాగంగా 60 వేల లీటర్ల తాగునీటి ఓవర్‌హెడ్ ట్యాంకు మంజూరు చేశారు. దీని నిర్మాణానికి ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు మెగా ఇంజినీరింగ్ సంస్థకు అప్పగించారు. రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ భూమిపూజ చేశారు. కేవలం మట్టి పరీక్షలు తప్ప ఇప్పటివరకు పనులు ప్రారంభించలేదు.

ప్రైవేట్‌గా కొనుగోలు చేయలేక..

తాగునీటి సౌకర్యం లేకపోవడంతో ప్రైవేట్ వ్యక్తుల నుంచి లీటరు రూ.1 చొప్పున తెప్పకు రూ.50, ఫైబర్ బోటుకు రూ.600, సోనా బోటుకు రూ.1500 అదనపు ఖర్చు అవుతుందని చెబుతున్నారు. కొందరైతే నగదు ఇవ్వలేక చేపలిస్తుంటారు (వస్తు మార్పిడి పద్ధతి). అదనపు ఖర్చుతో ఇక్కడికి రావడానికి ఆసక్తి చూపక కాకినాడ, మచిలీపట్నం హార్బర్లకు వెళ్లిపోతున్నారు. తాగునీటి సౌకర్యం కల్పిస్తే రోజుకు 200 బోట్ల వరకు వస్తాయని జాలర్లు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

రోజువారీ వచ్చే బోట్ల సంఖ్య: 50-100

ఒక్కో బోటుపై ఉండేవారు: ఆరుగురు

నీటి అవసరం ఇలా.. (లీటర్లు)
- తెప్పబోటుకు (రోజుకు): 50
- ఫైబర్ బోటుకు (4 రోజులకు): 600
- సోనా బోటుకు (వారానికి): 1500

త్వరలో ప్రారంభిస్తాం..

హార్బర్‌లో ఓవర్‌హెడ్ ట్యాంకు నిర్మాణం మెగా ఇంజినీరింగ్ సంస్థ చేపడుతుంది. నిర్మాణ ప్రదేశంలో మట్టి పరీక్షలు జరిగాయి. మత్స్య, పంచాయతీరాజ్ నుంచి ఎన్‌వోసీ ఇవ్వాల్సి ఉంది. ఇచ్చిన వెంటనే పనులు ప్రారంభిస్తాం. మూడు నెలల్లో పూర్తి చేస్తాం.
- మారుతీరావు, డీఈ, ఆర్‌డబ్ల్యూఎస్, రాజోలు

నేటి నుంచి పెద్దింట్లమ్మ జాతర

సఖినేటిపల్లి, న్యూస్‌టుడే: చిన్న కొల్లేరు పెద్దింట్లమ్మ అమ్మవారిగా పిలిచే మెండు పాలెం(కేశవదాసు పాలెం) అమ్మవారి జాతర మహోత్సవాలు నేటి నుంచి ప్రారంభం కానున్నాయి. ఉత్సవాలకు సంబంధించిన ఏర్పాట్లు కమిటీ ఇప్పటికే పూర్తిచేశారు.

ఉదయం అమ్మవారికి దూపదీప నైవేద్యాలు సమర్పించి, పూజలు చేసి ప్రారంభిస్తారు. మార్చి 18వరకు ఈ ఉత్సవాలు నిర్వహించనున్నారు. సుమారు 5లక్షల వరకు భక్తులు వస్తారని అంచనా వేస్తున్నారు.

జేఈఈ మెయిన్ ఫలితాల్లో

తిరుమల ప్రతిభ

కంబాలచెరువు (రాజమహేంద్రవరం), న్యూస్‌టుడే: జేఈఈ మెయిన్ ఫలితాల్లో రాజమహేంద్రవరంలోని తిరుమల ఐఐటీ అండ్ మెడికల్ అకాడమీ విద్యార్థులు ప్రతిభ చాటారని తిరుమల విద్యాసంస్థల ఛైర్మన్ నున్న తిరుమలరావు తెలిపారు.

విద్యార్థులను అభినందిస్తున్న తిరుమల విద్యాసంస్థల అధినేత తిరుమలరావు, తదితరులు

తమ అకాడమీ విద్యార్థి డి.శ్రీవేద్ 99.999 పర్సంటైల్ సాధించి ఎస్సీ కేటగిరీలో ఆలిండియా టాపర్‌గా నిలిచాడన్నారు. ఎం.కృష్ణ శరవణ సాకేత్ 99.99, గన్నమనీడి వాత్సల్య 99.98, జి.ప్రభవ్ తేజ 99.97, ఎం.సోనీష్ శివసాయి శ్రీవాత్స, పి.వెంకట నాగ సూర్య ధావన్, ఎం.వెంకట సత్యవివేక్ 99.95 పర్సంటైల్ చొప్పున సాధించారని వివరించారు. 99.50 పర్సంటైల్‌కు పైగా 57, 99 పర్సంటైల్‌కు పైగా 121, 98 పర్సంటైల్‌కు పైగా 226, 97 పర్సంటైల్‌కు పైగా 323, 96 పర్సంటైల్‌కు పైగా 410, 95 పర్సంటైల్‌కు పై 492, 90 పర్సంటైల్‌కు పైగా 829 మంది చొప్పున సాధించారన్నారు. సుమారు 800 మంది వివిధ ఎన్ఐటీ, ఐఐటీల్లో సీట్లు సాధించగలరన్నారు. అత్యుత్తమ ప్రతిభ చూపిన విద్యార్థులను అకడమిక్ డైరెక్టర్ జి.సతీష్‌బాబు, ప్రిన్సిపల్ వి.శ్రీహరితో కలిసి మంగళవారం అభినందించారు.

శ్రీషిర్డీసాయి జయకేతనం

శ్రీషిర్డీసాయి విద్యార్థులను అభినందిస్తున్న యాజమాన్యం

కంబాలచెరువు(రాజమహేంద్రవరం): జేఈఈ మెయిన్-2026 ఫలితాల్లో రాజమహేంద్రవరంలోని శ్రీషిర్డీసాయి జూనియర్ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చి వివిధ కేటగిరీల్లో అత్యుత్తమ పర్సంటైల్ సాధించారని విద్యాసంస్థల డైరెక్టర్ టి.శ్రీవిద్య మంగళవారం తెలిపారు. తమ లక్ష్య ఐఐటీ అకాడమీలో శిక్షణ పొందుతున్న ఎం.కృష్ణ శ్రీకృతి 99.91, కె.రామకార్తిక్ 99.71, ఎం.శ్రీనివాస్ 99.68, బి.శ్రీనిశాంత్ 99.63, కేవీఎంకే ప్రణీత్ 99.48, కె.సాత్విక్ 99.28, ఎ.లోహిత్‌కుమార్ 99.23, బి.శ్రీనిహాంత్ 99.11 పర్సంటైల్ చొప్పున సాధించారన్నారు. మొత్తం ఎనిమిది మంది 99కి పైగా పర్సంటైల్, 16 మంది 98కి పైగా, 28 మంది 97కిపైగా 52 మంది 95కి పైగా పర్సంటైల్ సాధించారన్నారు. శ్రీషిర్డీసాయి విద్యాసంస్థల ఛైర్మన్ తంబాబత్తుల శ్రీధర్ మాట్లాడుతూ జేఈఈ మెయిన్‌కు హాజరైన 284 మంది విద్యార్థుల్లో 184 మంది అడ్వాన్స్‌డ్‌కు అర్హత సాధించారన్నారు. ప్రతిభ చాటిన విద్యార్థులను, కృషి చేసిన అధ్యాపక బృందాన్ని ఛైర్మన్ శ్రీధర్, లక్ష్య డీన్ చంద్రశేఖర్ ప్రత్యేకంగా అభినందించారు.

మెరిసిన ఆదిత్య

గాంధీనగర్: జేఈఈ మెయిన్-2026 ఫలితాల్లో ఆదిత్య విద్యార్థులు జాతీయస్థాయిలో అత్యుత్తమ పర్సంటైల్స్‌తో సత్తా చాటారని ఛైర్మన్ ఎన్.శేషారెడ్డి మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను అభినందించారు.

శ్రీసాయి వైభవ్ రాఘవరావు
శ్రీజన్ శ్రీరామ్

ఆదిత్య విద్యా సంస్థల కార్యదర్శి ఎన్.కృష్ణ దీపక్ రెడ్డి మాట్లాడుతూ ఎన్.శ్రీసాయివైభవ్ 99.99, వివిఎస్ఎస్ రాఘవరావు, గంజి శ్రీజన్ 99.98, బుడి శ్రీరామ్ 99.97, సత్యం భువనచంద్ర 99.96 పర్సంటైల్‌ను సాధించారన్నారు. మొత్తం 41 మంది విద్యార్థులు 99, ఆపైన పర్సంటైల్‌తో అత్యుత్తమ ప్రతిభ కనబర్చారన్నారు. డైరెక్టర్లు ఎన్.లక్ష్మీరాజ్యం, ఎన్.శృతి, ఎన్.సుగుణ, కోఆర్డినేటర్ కె.లక్ష్మీకుమార్, అకడమిక్ డైరెక్టర్ రాఘవరెడ్డి, గంగిరెడ్డి, ప్రిన్సిపల్స్ జె.మెయిన, పి.సత్యనారాయణరెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ ఫణీంద్ర తదితరులు విద్యార్థులు, అధ్యాపకులను అభినందించారు.

దేహదారుఢ్య పోటీల్లో అదరగొట్టిన కుర్రాళ్లు

విజేతలతో వీసీ ప్రసన్నశ్రీ, అధ్యాపకులు

రాజానగరం, న్యూస్‌టుడే: యువత చదువుతో పాటు అన్నిరంగాల్లో రాణించాలని నన్నయ విశ్వవిద్యాలయం వీసీ ప్రసన్నశ్రీ పేర్కొన్నారు. నన్నయలో మంగళవారం ఇంటర్ కాలేజీమేట్ బెస్ట్‌ఫిజిక్ మెన్ విశ్వవిద్యాలయం ఎంపికలు నిర్వహించారు. వివిధ విభాగాల్లో జరిగిన పోటీలో యూనివర్సిటీ అనుబంధ కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విజేతలకు వీసీ ఎస్.ప్రసన్నశ్రీ చేతుల మీదుగా పతకాలు అందించారు. ఆర్గనైజింగ్ ఛైర్మన్ కె.సుబ్బారావు, కార్యదర్శి వి.సాల్మన్ దేవానంద్, పరిశీలకులు ఆర్.వి.ఎల్.ఎస్.రత్నాకర్, సెలక్షన్ కమిటీ సభ్యులు వై.భాస్కరరావు, వి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

విజేతల వివరాలు: ● 60 కిలోల విభాగం: ఎన్.పూర్ణ సతీష్, కె.జగదీష్‌కుమార్ (డీఎన్‌ఆర్ కళాశాల, భీమవరం), ఆర్.కాశీవిశ్వనాథ్ (ఐడియల్ కళాశాల, కాకినాడ) మొదటి మూడు స్థానాల్లో నిలిచారు. ● 65 కిలోలు: వై.భరత్(ఆదిత్య కళాశాల, ఏలూరు), పి.సూరిబాబు(గోపన్నపాలెం), ఎ.జగదీష్(పాలకొల్లు). ● 70 కిలోలు: ఎల్.వి.సూర్యప్రకాష్, బి.సాయిప్రశాంత్, బి.దుర్గాప్రసాద్(పీఆర్ కళాశాల, కాకినాడ). ● 75 కిలోలు: ఎం.సాయిలోకేష్(సీ.ఆర్.రెడ్డి కళాశాల, ఏలూరు), బి.మహేష్, డి.అరుణ్‌కుమార్ (పీఆర్ కళాశాల, కాకినాడ) తొలి మూడు స్థానాల్లో నిలిచారు. ● 80 కిలోలు: పి.విజయ చాముండేశ్వర్ (పీఆర్ కళాశాల, కాకినాడ) ● 85 కిలోలు: షేక్‌మన్సూర్ (బీవీ రాజు కళాశాల, భీమవరం), 90 కిలోలు: కె.పవన్‌సాయి (పీఆర్ కళాశాల, కాకినాడ), 95 కిలోలు: కె.పాండురంగ వరప్రసాద్ (డా.సీ.ఎస్.కళాశాల, భీమవరం) పతకాలు సొంతం చేసుకున్నారు. ● మిస్టర్ నన్నయ విశ్వవిద్యాలయం 2025-26 ట్రోఫీని కె.పాండురంగ వరప్రసాద్ (డా.సీ.ఎస్.ఎన్.డిగ్రీ అండ్ పీజీ కళాశాల, భీమవరం), ●బెస్ట్‌ఫిజిక్ మెన్ టీమ్ ఛాంపియన్ షిప్ (పి.ఆర్.ప్రభుత్వ కళాశాల, కాకినాడ) కైవసం చేసుకున్నారు.

EENADU Classifieds

AUTO
VEHICLES FOR SALE
శ్రీలలిత రైస్‌మిల్, పెద్దాపురం వారి ఇన్నోవా కార్లు అమ్మకమునకు కలవు. Contact Cell: 94941 54551.

BUSINESS SERVICES
బంగారం బ్యాంకులలో/ ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈరోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్). Ph: 81422 92071.

శ్రీ సాయి గోల్డ్ తాకట్టులో ఉన్న బంగారం ఏ బ్యాంక్/ ప్రైవేట్ సంస్థల నుండి అయినా విడిపించి, ఆ రోజు మార్కెట్ రేట్‌కి కొనబడును. స్పాట్ క్యాష్, ✆ 9493338823.

FINANCIAL SERVICES
స్థిరాస్తులపై ఆంధ్రప్రదేశ్ అంతటా మార్టిగేజ్ లోన్స్ మరియు స్థిరాస్తి ఎక్కడ ఉన్నా ఏ సంస్థలో ఉన్నా Xerox పేపర్స్‌పై 2nd మార్టిగేజ్ లోన్ ఇవ్వబడును. 50 లక్షలులోపు, అయోధ్య కోఆపరేటివ్ బ్యాంక్. ✆ 93969 99669.

REAL ESTATE
LAND FOR SALE
RAJAMAHENDRAVARAM RURAL
కడియం మండలం, మాధవరాయుడు పాలెం పరిధిలో పేపరుమిల్లు వెనుక 3 1/2 ఎకరముల భూమి వ్యవసాయం మరియు పరిశ్రమలకు అనువైనది అమ్మకం. ✆ 7702691117.

PLOT FOR SALE
KAKINADA CITY
Properties Bazar's @ Kakinada Touch Your Luck, Buy Plot & Win Plot, Free Lucky Draw with Guaranteed Prizes. Cell: 9154184236

RAJAMAHENDRAVARAM RURAL
రాజమండ్రి, పిడింగొయ్యి పంచాయతీలో DTCP అప్రూవ్ కలిగిన N/E 272 చ||గ||లు, N/F 272 చ||గ||ల స్థలములు అమ్మకం. Contact: 7382 19 4444.

JOBS
Wanted DRA Tele Callers, Field Executives & Team Leaders Banking Sector Attractive Salaries and Incentives, ✆ 9849394835, 7075345527.

Wanted Teachers for Reputed Schools in A.P & Telangana, Contact: Sneha Placements Service. Ph: 94402 46409.

WANTED: Telecallers for Reputed Overseas Edu Consultancy in Rajahmundry. Experence Preferred. Contact Cell: 98521 59999.

WANTED
we are Hiring
Front Office Staff (Female) - 02 no's
Salary - 12 k
08 Hours Duty
SprintOn, JN Road Rajamahendravaram
✆ 99663 57897

త్రినేత్ర హోంకేర్‌లో వృద్ధులను/ పేషెంట్స్‌ను/ పిల్లలను చూసుకొనుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఫ్రీ వసతి, భోజనం. జీ: 18K. ✆ 8520980099, 8520874499

కాకినాడలోని భానుగుడి జంక్షన్ నందు బట్టల షాపులో పనిచేయుటకు సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. శాలరీ - 15,000/-/ 4 W/O. + ESI + EPFO. సెల్: 9885295999.

బిజినెస్ ఎగ్జిక్యూటివ్స్/ బిజినెస్ మేనేజర్స్ కావలెను. డిగ్రీ, 5 సం||ల మార్కెటింగ్ రంగంలో అనుభవం, 30 సం||ల లోపు వారు రెజ్యూములను kamathamjob@gmail.comకు పంపగలరు.

హరేకృష్ణ హోంకేర్‌లో వృద్ధులను/ పేషంట్స్‌ను/ పిల్లలను చూసుకొనుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఫ్రీవసతి, భోజనం జీ:18-20K ✆ 96404 68899, 96402 58899

WANTED STAFF
★ Pre-Primary Teachers
★ Primary Teachers All Subjects
★ High School Teachers All Subjects
★ Office Assistant -cum-Telecaller
★ Computer Operator
Good Communication skills in English preferred.
Walk-in for Interview
Resume to: 70951 52111
INTERNATIONAL DELHI PUBLIC SCHOOL
Rajanagaram & Rajahmundry

SECURITY GUARDS
Wanted Security Guard: Night Duty 8 pm to 6 am, Salary: Rs.12,000/- Per Month, Work is at Kakinada. Contact: 95020 97778.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర
★ For the Information of Trade & Industry
★ తూర్పుగోదావరి జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు ధర రూ. 5-15 పై॥
అనపర్తి ఆఫీసు: 08857-226908

EENADU for Advertisement Contact: 8008597607

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్-లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

జగనన్న లేఅవుట్లలో విజిలెన్స్ తనిఖీలు

చొల్లంగి జగనన్న లేఅవుట్‌లో విచారణ చేస్తున్న విజిలెన్స్ డీఎస్పీ ఎస్.తాతారావు, అధికారుల బృందం

తాళ్లరేవు, న్యూస్‌టుడే: చొల్లంగి, జి.వేమవరం గ్రామాల్లో 2019-24 వరకు పేదలందరికీ జగనన్న ఇళ్ల స్థలాల భూసేకరణపై విజిలెన్స్ డీఎస్పీ ఎస్.తాతారావు, వివిధ శాఖల అధికారుల బృందం మంగళవారం విచారణ చేపట్టింది. చొల్లంగిలో సర్వే నంబరు 16/23 బి1లో 3.67 ఎకరాల్లో 126 మంది లబ్ధిదారులను ఎంపిక చేశారు. 101 మందికి స్థలాలు మంజూరు చేశారు. వారిలో 44 మంది ఇళ్లు నిర్మించుకున్నారు. అధికారుల బృందం కాలనీలో రహదారుల ఏర్పాటు, స్థలం మెరక పనులను పరిశీలించింది. ఇళ్ల స్థలాలకు సేకరించిన భూమికి సంబంధించి తమకు పూర్తిగా డబ్బులు అందలేదని చొల్లంగికి చెందిన రైతులు దిమ్మల మరిడయ్య, గుమ్మళ్ల నూకరాజు విజిలెన్స్ డీఎస్పీకి ఫిర్యాదు చేశారు. ప్రభుత్వం ఎకరానికి రూ.55 లక్షలకు కొనుగోలు చేసిందని, పూర్తి స్థాయిలో డబ్బులు ఇవ్వలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు.
● జి.వేమవరం సర్వేనంబరు 306/6, 307, 309/2లో 14.15 ఎకరాల్లో 574 మంది లబ్ధిదారులకు ఇళ్ల స్థలాలను కేటాయించారు. ఆ స్థలాలను విజిలెన్స్ బృందం పరిశీలించింది. గృహనిర్మాణ సంస్థ, రెవెన్యూ, ఉపాధి హామీ పథకం, మైన్స్ అధికారులు పాల్గొన్నారు.

ధరవరలు

అంబాజీపేట కొబ్బరి మార్కెట్

కొబ్బరి (క్వింటాళ్లలో)	ధర (రూ॥లలో)
కొత్తకొబ్బరి	18,500
కురిడీ (వెయ్యింటికి):	
పాతకాయ: గండేరా	30,500
గటగట	29,000
కొత్తకాయ: గండేరా	30,000
గటగట	29,000
నీటి కాయ (వెయ్యింటికి):	
పాత (ముక్కుడు) కాయ	20,000-21,000
కొత్త (పచ్చి) కాయ	16,000-17,000
కొబ్బరినూనె మార్కెట్:	
15 కిలోలు	5,000
కిలో	350

గమనిక: అంబాజీపేట కొబ్బరి మార్కెట్ ధరలు ప్రతి బుధ, శనివారాల్లో మాత్రమే మారుతాయి.

వెన్‌కాబ్ చికెన్ ధర కిలోకు రూ॥లో

ఫారంరేటు	115-00
రిటైల్ లైవ్	142-00
డ్రెస్డ్	206-00
స్కిన్‌లెస్	234-00

గోదావరి డెల్టా వ్యవస్థపై క్షేత్రస్థాయి పరిశీలన

కాటన్ అక్విడక్టును పరిశీలిస్తున్న గోదావరి రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు ఛైర్మన్ బి.పి.పాండ్య బృందం

పి.గన్నవరం, న్యూస్‌టుడే: గోదావరి డెల్టా వ్యవస్థ ఏవిధంగా పనిచేస్తుందనే దానిపై గోదావరి రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు(జీఆర్‌ఎంబీ) ఛైర్మన్ బి.పి.పాండ్య బృందం మంగళవారం పరిశీలన చేసింది. ధవళేశ్వరం బ్యారేజీ మొదలుకుని లొల్ల హెడ్‌లాకులు, పి.గన్నవరం వద్ద కాటన్, డొక్కా సీతమ్మ అక్విడక్టులు, అంతర్వేది సాగర సంగమం ప్రదేశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించింది. కాటన్ బ్యారేజీ ద్వారా ఉభయ గోదావరి జిల్లాలకు ఖరీఫ్, రబీ సీజన్లలో అందుతున్న సాగునీరు, ప్రజలకు తాగునీటి సరఫరా, కాలువల వ్యవస్థ తదితర విషయాలను జలవనరులశాఖ ఎస్.ఇ. కె.గోపీనాథ్ వివరించారు. ఈ సందర్భంగా పి.గన్నవరంలో పాండ్య కొద్దిసేపు విలేకరులతో మాట్లాడారు. డెల్టా వ్యవస్థ బాగానే పనిచేస్తోందన్నారు. జీఆర్‌ఎంబీ మెంబర్ సెక్రటరీ కాంబోజ్, ఈఈలు వేణుగోపాలరావు, కె.వెంకటేశ్వరరావు, డీఈఈ భూపతిరాజు రవి ప్రసాద్‌రాజు, ఏఈఈ బెహరా రమేష్‌బాబు, సాగునీటి సంఘాల అధ్యక్షులు చొల్లంగి సత్యనారాయణ మూర్తి, కొల్నాడ సత్యనారాయణరాజు పాల్గొన్నారు.

92.7 FM Rajamahendravaram
ఈఎఫ్ఎమ్ కార్యక్రమాలు
సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ॥ 5 - ఉ॥ 7
ఈ-మార్నింగ్స్	ఉ॥ 7 - ఉ॥ 11
నువ్వా నేనా	ఉ॥ 11 - మ॥ 2
సత్యభామ	మ॥ 2 - సా॥ 5
లైట్ తీస్కో	సా॥ 5 - రా॥ 9
సరదాగా కాసేపు	రా॥ 9 - రా॥ 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా॥ 12 - తె॥ 5

/Eenadufm
For Advertising on Eenadu FM Contact
9000180626, 9989993175

నులిపురుగులను నివారిద్దాం

అంబాజీపేట హడ్కోకాలనీలో చిన్నారులకు మాత్రలు వేసిన ఎంహెచ్ఎన్ జాయింట్ డైరెక్టర్ సతీష్‌కుమార్‌తో స్థానిక వైద్యాధికారులు

అంబాజీపేట, న్యూస్‌టుడే: నులిపురుగులను నివారించేందుకు చిన్నారులకు మాత్రలు వేయడం ఓ ఉద్యమంలా సాగాలని రాష్ట్ర మాతృమరణాల నివారణ సంస్థ(ఎంహెచ్ఎన్) జాయింట్ డైరెక్టర్ సతీష్‌కుమార్ అన్నారు. అంబాజీపేట మండలంలోని వివిధ అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలల్లో చిన్నారులకు వేసిన నులిపురుగుల నివారణ మాత్రల కార్యక్రమాన్ని ఆయన మంగళవారం పరిశీలించారు. అంబాజీపేట పీహెచ్‌సీ పరిధిలో 5,124 మందికి గాను 5,076 మందికి 81 కేంద్రాల ద్వారా మాత్రలను పంపిణీ చేశారు. తొలుత అంబాజీపేట ఉన్నత పాఠశాలలో ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, అంబాజీపేట పీహెచ్‌సీ వైద్యాధికారుల వి.గౌతమి, కె.ఎన్.శ్రీనివాస్, ముక్కామల పీహెచ్‌సీ వైద్యాధికారి టి.దివ్య విద్యార్థులకు వీటిని అందజేశారు. ఆశా, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

రూ.కోట్లు వెచ్చించారు.. మూలకు చేర్చారు

విలసలో పనిచేయని యంత్రం

న్యూస్‌టుడే, అయినవిల్లి

గత ప్రభుత్వ పాలనలో రూ.కోట్లు వెచ్చించి రైతుభరోసా కేంద్రాల్లో ఏర్పాటు చేసిన కియోస్క్‌లు నిరుపయోగంగా మారాయి. రైతులకు మెరుగైన సేవలు అందించేందుకు అప్పట్లో ఆర్భాటంగా వీటిని ప్రారంభించారు. అనేక సమస్యలతో వినియోగానికి దూరమై తుప్పుపట్టి మూలకు చేరాయి. జిల్లాలో సుమారు 450 కియోస్క్‌లు వినియోగంలోకి తీసుకొస్తామని జిల్లా వ్యవసాయాధికారి ఎం.వెంకటరామారావు తెలిపారు.

అంతర్జాలం లేకపోవడంతో..

విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు, బ్యాంకింగ్.. తదితర సేవలకు గత ప్రభుత్వం కియోస్క్‌లను ఆర్‌బీకేల వారీగా సరఫరా చేసింది. అంతర్జాల సౌకర్యం కల్పించకపోవడం, గ్రామీణ ప్రాంతాల్లో నెట్‌వర్క్ సమస్యలతో వీటి వినియోగంలో అనేక ఇబ్బందులు ఎదురయ్యాయి. అప్పట్లో సిబ్బంది తమ చరవాణిలోని హాట్‌స్పాట్ సహాయంతో కొన్నింటిని వినియోగించేవారు. ప్రస్తుతం రైతుసేవా కేంద్రాల్లో వీటి అవసరం లేని కారణంగా మూలకు చేరాయి.
● అయినవిల్లి ఆర్ఎస్‌కే-1లో 2020లో కియోస్క్‌ను తొలుత అద్దె భవనంలో ఏర్పాటు చేశారు. కొద్దిమంది మాత్రమే ఎరువులు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకున్నారు. ఆ తరువాత ఫోన్ యాప్ అందుబాటులోకి రావడంతో దీన్ని పట్టించుకోలేదు. ● రాజోలు మండలం కడలి, చింతలపల్లి గ్రామాల్లో యూపీఎస్‌లు పనిచేయకపోవడం, టచ్‌ప్యాడ్ తెరవకపోవడం వంటి సమస్యలతో సిబ్బంది వినియోగించడం లేదు.

ఫోన్ ద్వారానే సేవలు..

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఎరువులు, పురుగు మందులను సొసైటీలు, ఆర్ఎస్‌కేల్లో అందుబాటులో ఉంచి రైతులకు విక్రయిస్తున్నారు. దీంతో కియోస్క్‌లకు పనిలేకుండా పోయిందని సిబ్బంది చెబుతున్నారు. యూరియా, ఇతర నమోదులు వ్యవసాయ, ఉద్యాన సహాయకులు ఫోన్ యాప్‌ల ద్వారా నిర్వహిస్తున్నారు.

శస్త్రచికిత్స అనంతరం వ్యక్తి మృతి
వైద్యుల నిర్లక్ష్యమే కారణమని కుటుంబ సభ్యుల ఆరోపణ

అమలాపురం పట్టణం, న్యూస్‌టుడే: అమలాపురంలోని శ్రీనిధి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం ఓ వ్యక్తి మృతి చెందారు. అతని కుటుంబ సభ్యులు, బంధువులు నిరసన తెలిపారు. పోలీసులు ఆసుపత్రికి వెళ్లి వారికి సర్ది చెప్పారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. రాజోలు మండలం పొన్నమండకు చెందిన మొగలతుర్తి సాయికృష్ణ(32) తాపీ పనిచేసేవారు. ఏడాది క్రితం రోడ్డు ప్రమాదంలో గాయపడటంతో కాలికి రాడ్డు వేశారు. ఆ ప్రాంతంలో నొప్పి రావడంతో సోమవారం సాయంత్రం ఆసుపత్రిలో చేరారు. మంగళవారం ఉదయం ఆసుపత్రిలో శస్త్రచికిత్స చేసి రాడ్ తీసేశారు. కొద్ది సేపటి తర్వాత ఒక్కసారిగా ఆరోగ్యం విషమించి మృతి చెందారు. వైద్యుల నిర్లక్ష్యం కారణంగానే మరణించాడని బంధువులు ఆరోపించారు. శస్త్రచికిత్స అనంతరం గుండెపోటుతో మృతి చెందినట్లు ఆసుపత్రి వైద్యులు తెలిపారు.

(c) eenadu

రాజోలు

• రాజోలు • కొత్తపేట • పి.గన్నవరం

మాత్రలు వేస్తున్న జిల్లా కలెక్టర్ మహేష్‌కుమార్

ఆరోగ్యంగా ఉంటేనే రాణింపు

అమలాపురం గ్రామీణం: పిల్లలు ఆరోగ్యంగా ఉంటేనే విద్య, క్రీడల్లో మెరుగైన ప్రగతిని సాధించగలరని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ అన్నారు. ఈదరపల్లి బొంతువారిపేటలోని అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలకు ఆయన నులిపురుగుల నివారణ మాత్రలు వేశారు. జిల్లాలోని 51,543 మందికి అల్బెండోజోలు మాత్రలు వేసినట్లు ఐసీడీఎస్ పీడీ నాగమణి తెలిపారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి దుర్గారావు దొర, సీడీపీవోలు యర్రా రమాదేవి, విజయశ్రీ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి మీసాల వెంకన్న కల్యాణోత్సవాలు

యానాం, న్యూస్‌టుడే: మీసాల వెంకన్నగా ప్రఖ్యాతి పొందిన శ్రీభూ సమేత వేంకటేశ్వరుని కల్యాణోత్సవాలు యానాం బాలాలయంలో బుధవారం నుంచి ప్రారంభం కానున్నాయి. మార్చి 12 వరకు కల్యాణోత్సవంలో వివిధ క్రతువులు నిర్వహించనున్న నేపథ్యంలో ఆలయ కార్యనిర్వహణాధికారి ఆర్.జ్యోతి వెంకటేశ్వరరావు, ఉత్సవదారుల సమన్వయంతో ఏర్పాట్లు జరుగుతున్నాయి.

మీసాల వెంకన్న దివ్యమంగళ స్వరూపం

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

మామిడికుదురు, న్యూస్‌టుడే: ఆరోగ్యాన్ని దెబ్బతీసే మాదక ద్రవ్యాలకు ప్రతి ఒక్కరూ దూరంగా ఉండాలని నినదిస్తూ నగరం పోలీసుల ఆధ్వర్యంలో మామిడికుదురులో మంగళవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. అంతకు ముందు ఇదే అంశంపై పాఠశాలలో జరిగిన సమావేశంలో ఎస్సై చైతన్యకుమార్, హెచ్ఎం బి.చిరంజీవిరావు మాట్లాడుతూ మాదక ద్రవ్యాలతో కలిగే నష్టాల గురించి వివరించారు.

మామిడికుదురులో జరిగిన అవగాహన ర్యాలీలో విద్యార్థులు, పోలీసులు

గ్రామస్థాయిలో పార్టీని బలోపేతం చేయాలి

రాజోలు, న్యూస్‌టుడే: నియోజకవర్గంలో నూతనంగా ఎన్నికైన తెదేపా మండల అధ్యక్షులు ఇన్‌ఛార్జి గొల్లపల్లి అమూల్యతో కలిసి మంగళవారం జిల్లా అధ్యక్షుడు గుత్తుల సాయి, ప్రధాన కార్యదర్శి గంధం పల్లంరాజును మర్యాదపూర్వకంగా కలిశారు. మురమళ్లలోని పార్టీ కార్యాలయంలో గుత్తుల సాయిని, అమలాపురంలో గంధం పల్లంరాజు కలిసి సత్కరించారు. గ్రామస్థాయిలో పార్టీని బలోపేతం చేయాలని సూచించారన్నారు. రాష్ట్ర రోడ్లు అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ ముదునూరి చినబాబు, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు మొల్లేటి శ్రీనివాస్, రాజోలు, మలికిపురం, సఖినేటిపల్లి, మామిడికుదురు మండలాల అధ్యక్షులు పాల్గొన్నారు.

జిల్లా తెదేపా అధ్యక్షుడు గుత్తుల సాయిని కలిసిన ఇన్‌ఛార్జి అమూల్య, మండల పార్టీ అధ్యక్షులు

అందిపుచ్చుకుంటే.. మోత తప్పినట్లే

• పి.ఎం.సూర్యఘర్‌తో విద్యుత్తు బిల్లుల సొమ్ము ఆదా

రావులపాలెం గ్రామీణం, న్యూస్‌టుడే: విద్యుత్తు ఛార్జీల భారం నుంచి పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఆర్థిక ఉపశమనం కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. పీఎం సూర్యఘర్ పథకం ద్వారా రాయితీపై సోలార్ యూనిట్ల మంజూరుకు చర్యలు తీసుకుంది. పట్టణాలతోపాటు గ్రామీణ ప్రాంతాల్లోనూ ఇళ్లపై సౌర పలకలు ఏర్పాటు చేసుకునేలా అధికారులు అవగాహన కల్పిస్తున్నారు. నెలకు రూ.3వేలు విద్యుత్తు బిల్లు వచ్చే వినియోగదారులు 3కేవీ సామర్థ్యంగల యూనిట్‌ను అమర్చుకుంటే బిల్లు కట్టనవసరం లేదని చెబుతున్నారు.

కొత్తపేట నియోజకవర్గంలో ఇదీ పరిస్థితి

మండలం	అమర్చినవి
రావులపాలెం	165
కొత్తపేట	170
ఆత్రేయపురం	165
ఆలమూరు	200

ఎస్సీ, ఎస్టీలకు పూర్తిరాయితీ..

ఎస్సీ, ఎస్టీలవారికి సొంత ఇళ్లు ఉన్నవారికి పూర్తిరాయితీపై సోలార్ యూనిట్లను అమర్చుతున్నారు. గృహ అవసరాలకు సరిపడినంత కేవీ సామర్థ్యంగల యూనిట్‌లను ఏర్పాటుచేయడం ద్వారా వారు ప్రతీ నెలా చెల్లించాల్సిన విద్యుత్తు బిల్లులు సొమ్ము ఏమాత్రం చెల్లించనవసరం ఉండదని పలువురు చెబుతున్నారు. ఇంటి అవసరానికి నెలకు 100 యూనిట్లు వినియోగిస్తే.. సోలార్ ద్వారా 120 యూనిట్లు విద్యుత్తు ఖర్చు అయితే మిగిలిన 20 యూనిట్లకు ప్రభుత్వమే యూనిట్‌కు రూ.2.09 పైసలు చొప్పున చెల్లిస్తుంది.

యూనిట్ వివరాలు ఇలా

కేవీ యూనిట్	మొత్తం ఖర్చు	ప్రభుత్వ రాయితీ
1	70,000	30000
2	1,40,000	60,000
3	2,10,000	78,000

అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి

సోలార్ యూనిట్లు ఏర్పాటుచేసుకుంటే ప్రతీనెలా వచ్చే విద్యుత్తు బిల్లులనుంచి బయటపడవచ్చు. వీటి ఏర్పాటుకు ప్రభుత్వం రాయితీతోపాటు బ్యాంకులు సైతం రుణాలను అందిస్తున్నాయి. తమ అవసరాలకు అనుగుణంగా ఉన్న యూనిట్లను ఏర్పాటుకు దరఖాస్తులను అందిస్తే సకాలంలో అమర్చేలా చర్యలు తీసుకుంటాం. –డి.చిట్టిరాజు, ఏడీఈ, కొత్తపేట

విద్యార్థి వైద్యఖర్చులకు యూటీఎఫ్ సాయం

అంబాజీపేట, న్యూస్‌టుడే: ఎముకల సమస్యతో బాధపడుతున్న పుల్లేటికుర్రు గ్రామానికి చెందిన విద్యార్థి యర్రా అఖిలేష్‌కు యూటీఎఫ్ సభ్యులు రూ.43,100 ఆర్థిక సాయాన్ని మంగళవారం అందజేశారు. విరాళాలుగా సమకూరిన రూ.25 వేలు, కడలివారిపాలెం పాఠశాల ఉపాధ్యాయుడు పి.నారాయణమూర్తి, కుటుంబ సభ్యులు అందించిన రూ.18,100 కలిపి అందించారు. ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు జి.వి.రమణ, ఉమ్మడి జిల్లా పూర్వ ప్రధాన కార్యదర్శి టి.కామేశ్వరరావు, ఎఫ్‌డబ్ల్యూఎస్ డైరెక్టర్ పి.నారాయణమూర్తి, మండల శాఖ అధ్యక్ష, కార్యదర్శులు ఎం.సూర్యనారాయణ, పి.విశ్వప్రసాద్, నక్కా సుధాకర్‌బాబు, పి.శ్రీనివాస్, బి.సత్యనారాయణ, పి.ఏడుకొండలు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో త్రిశూలస్నానం

ఆలమూరులో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

ఆలమూరు, న్యూస్‌టుడే: ఆలమూరు శ్రీపార్వతీసమేత భట్టీవిక్రమార్కేశ్వరస్వామి వారి కల్యాణ మహోత్సవాల్లో భాగంగా పెద్దకాలువ వద్ద బ్రహ్మశ్రీ వెలవలపల్లి కృష్ణచైతన్యశర్మ, సీతారామశాస్త్రి, తిరిదే వార్షిక సత్కార పండితులు బ్రహ్మశ్రీ కాళ్లకూరి సూరి పండుల సారథ్యంలో శాస్త్రోక్తంగా త్రిశూలస్నానం నిర్వహించారు. భక్తులు ఆలయం నుంచి పెద్దకాలువ వరకూ పాదయాత్రలో తరలివెళ్లారు. ఈవో నరేంద్రకుమార్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

త్రిశూలస్నానం..

వైభవంగా చండీహోమం

ఆలమూరు: మాఘ బహుళ అమావాస్య మంగళవారం సందర్భంగా చింతలూరు శ్రీనూకాంబికా అమ్మవారి ఆలయప్రాంగణంలో చండీహోమాన్ని వైభవంగా నిర్వహించారు. భక్తులు విచ్చేసి హోమంలో పాల్గొన్నారు. దేవస్థానం పాలకమండలి ఛైర్మన్ వీరి అప్పారావు, ఈవో ఉండవల్లి వీర్రాజు చౌదరి పూర్ణాహుతి సమర్పించారు.

వాడపల్లి ఆలయ సన్నిధిలో అన్నవరం దేవస్థానం ఛైర్మన్

ఆత్రేయపురం: వాడపల్లిలోని వెంకటేశ్వరస్వామివారిని అన్నవరం దేవస్థానం ఛైర్మన్ ఐ.వి.రోహిత్ కుటుంబ సభ్యులు మంగళవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి స్వామి వారి తీర్థప్రసాదాలను అందించారు. వారికి స్వామివారి చిత్రపటాన్ని ఆలయ ఉపకమిషనర్ చక్రధరరావు అందించారు.

ఐ.వి.రోహిత్ కుటుంబ సభ్యులకు స్వామి వారి చిత్రపటం అందిస్తున్న ఉపకమీషనర్

లొల్లలాకులను పరిశీలించిన కేంద్ర జలశక్తి సంఘ సభ్యులు

ఆత్రేయపురం, న్యూస్‌టుడే: ఆత్రేయపురం మండలం లొల్ల లాకులను కేంద్ర జలశక్తి సంఘ సభ్యులు మంగళవారం పరిశీలించారు. ఈసందర్భంగా గోదావరి నది మేనేజ్‌మెంట్ బోర్డు ఛైర్మన్ బి.పి.పాండే, సభ్యులు సాగునీటి ప్రవాహం, నిర్మాణం జరిగిన తీరు పరిశీలించి వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఎస్ఈబీ గోపీనాథ్, ఈఈ కె.వెంకటేశ్వరరావు, డీఈబీ రవిప్రసాద్‌రాజు, ఏఈ సాయిమాధవ ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసరాలు అందజేత

బాధితులకు సామగ్రి అందజేస్తున్న యోగా శిక్షణ కేంద్రం నిర్వాహకులు

మామిడికుదురు, న్యూస్‌టుడే: ఇళ్లు దగ్ధం కావడంతో నిరాశ్రయులై జడ్పీ ఉన్నత పాఠశాల భవనంలో ఆశ్రయం పొందుతున్న 14 కుటుంబాలకు స్థానిక హేమానంద్ యోగా శిక్షణ కేంద్రం ఆధ్వర్యంలో వంట సామగ్రి, దుస్తులు, నీళ్ల వేసే కుండ డబ్బాలు సమకూర్చారు. తహసీల్దారు పి.సునీల్‌కుమార్ చేతుల మీదుగా మంగళవారం వీటిని అందజేశారు. *బాధిత కుటుంబాలకు భాజపా మండల శాఖ ఆధ్వర్యంలో అల్పాహారం, భోజన సదుపాయాలను సమకూర్చారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు అడబాల సత్యనారాయణ, మాజీ ఎమ్మెల్యే ఎం.ఎ.కృష్ణ, మండల అధ్యక్షుడు ధైరిశెట్టి దుర్గారావు, మెండా ఆదినారాయణ పాల్గొన్నారు.

ఉద్యోగాల క్రమబద్ధీకరణతో న్యాయం చేయాలి

డీసీసీబీ అధికారులకు వినతి అందిస్తున్న సొసైటీల సీఈవోలు

మామిడికుదురు, న్యూస్‌టుడే: సహకార సంఘాల్లో 2019 తర్వాత చేరిన ఉద్యోగులను వెంటనే క్రమబద్ధీకరించాలని, ఉద్యోగ విరమణ వయసును 62 ఏళ్లకు పెంచాలంటూ సమ్మెలో భాగంగా సంఘ నాయకులు స్థానిక డీసీసీబీ కార్యాలయం వద్ద మంగళవారం నిరసన వ్యక్తం చేశారు. అనంతరం డీసీసీబీ అధికారులకు వినతిపత్రాన్ని అందజేశారు. వివిధ సహకార సంఘాల సీఈవోలు అడబాల పెద్దిరాజు, చుట్టుగుల్ల రమేష్, యర్రంశెట్టి ఏసు, జి.శ్రీరాములు, వై.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నులిపురుగుల నివారణ మాత్రల పంపిణీ

రాజోలు, ఆలమూరు, మామిడికుదురు, సఖినేటిపల్లి, న్యూస్‌టుడే: జాతీయ నులి పురుగుల నివారణ కార్యక్రమంలో భాగంగా రాజోలు, కొత్తపేట, పి.గన్నవరం నియోజకవర్గాల్లో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లోని పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు వేశారు. ✦ రాజోలులో పీహెచ్‌సీ వైద్యాధికారి టి.మణికుమార్ ఆధ్వర్యంలో వివిధ పాఠశాలల్లోని విద్యార్థులకు నులిపురుగుల మందును వేశారు. ✦ పెదపళ్ల, చొప్పెల్ల వైద్యాధికారులు డి.సాయికిశోర్, ఎస్.లక్ష్మీస్నేహల ఆధ్వర్యంలో ప్రభుత్వ ఉన్నతపాఠశాలలో మాత్రలు పంపిణీ చేశారు. ✦ మామిడికుదురు మండలంలోని నగరం, మామిడికుదురు పీహెచ్‌సీ పరిధిలో 11,198 మంది పిల్లలకు మాత్రలు పంపిణీ చేశారు. వైద్యాధికారులు జాన్ లెవీ, సత్యవతి, పావని, వైద్య సిబ్బంది పాల్గొన్నారు. ✦ సఖినేటిపల్లి, రామేశ్వరం, మోరి పీహెచ్‌సీల పరిధిలోని విద్యార్థులకు అల్బెండజోల్ మాత్రలను మింగించారు. మండలంలో 6140 మందికి పంపిణీ చేసినట్లు డా.దుర్గాకావ్య, జయగాయిత్రి తెలిపారు.

మామిడికుదురులో విద్యార్థులకు మాత్రలు వేస్తున్న వైద్యాధికారి జాన్ లెవీ

ఆలమూరులో మాత్రలు వేస్తున్న పెదపళ్ల పీహెచ్‌సీ వైద్యాధికారి సాయికిశోర్

సఖినేటిపల్లిలో పిల్లలకు మాత్ర వేస్తున్న డా.దుర్గాకావ్య

కల్వర్టుపై కొరవడిన రక్షణ

మామిడికుదురు మండలం నగరంలోని బీఎస్ మూర్తి రోడ్డులో మీడియం డ్రెయిన్‌పై ఉన్న కల్వర్టు ప్రమాదకరంగా ఉంది. ఇరువైపులా రక్షణ గోడలు దెబ్బతినడంతో రాకపోకలు సాగించే ప్రయాణికులు భయాందోళన చెందుతున్నారు. మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలకు సమీపంలో, 216 బైపాస్‌కు చేరువలో ఉన్న ఈ కల్వర్టు రక్షణపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. గ్రామ కార్యదర్శి కూనపరెడ్డి సురేష్ దృష్టికి తీసుకువెళ్లగా సంబంధిత అధికారులతో పరిశీలన చేయిస్తామన్నారు.

–న్యూస్‌టుడే, మామిడికుదురు

మంచు దుప్పట్లోనే..

అంబాజీపేటలో మంగళవారం విపరీతమైన మంచు కురిసింది. ఉదయం 8.30 గంటలకు కూడా వాహనచోదకులు లైట్లు వేసుకుని వెళ్లాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. అంబాజీపేట-అమలాపురం ప్రధాన రహదారిలో నెమ్మదిగా రాకపోకలు సాగించాల్సి వచ్చింది. – న్యూస్‌టుడే, అంబాజీపేట

నిరుపయోగంగా వాటర్‌ప్లాంటు

కొత్తపేట రైతు బజార్లో ఏర్పాటు చేసిన తాగునీటి వాటరు ప్లాంటు మరమ్మతులకు గురయ్యింది. దీంతో బయట నుంచి వాటరు క్యాన్లతో నీటిని కొనాల్సి వస్తోందని స్థానికులు చెబుతున్నారు. వేసవి కాలం వస్తుండడంతో ఇబ్బందులు పడే అవకాశముందని అసహనం చెందుతున్నారు. అధికారులు స్పందించి ప్లాంటుకు మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. ఎస్టేట్ అధికారి ఎం.స్వర్ణలతను వివరణ కోరగా రెండు రోజుల్లో వినియోగానికి తీసుకొస్తామని తెలిపారు.

– న్యూస్‌టుడే, కొత్తపేట

చెరువుగట్టు కుంగిపోతోంది

పెదపళ్ల మల్లిడి చెరువు గుట్టు కుంగి పోవడంతో కొబ్బరి చెట్లు ప్రమాదకరంగా కిందకి వాలి ఉన్నాయి. చెరువు గట్టుని కొంతమంది ఆక్రమించుకుని పశువుల పాకలు వేసుకున్నారని.. నిత్యం పశువులు ఉండడంతో గట్లు కుంగి పోతున్నాయని స్థానికులు చెబుతున్నారు. పంచాయతీ కార్యదర్శి వేణిని వివరణ కోరగా త్వరలో సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు. – న్యూస్‌టుడే, ఆలమూరు

కాలువలో తుప్పలు.. ప్రవాహానికి అడ్డంకులు

అంబాజీపేట మండలంలోని అవిడి-మాచవరం పంట కాలువ అధ్వానంగా మారింది. ఈ కాలువలో తుప్పలు, డొంకలు, వ్యర్థాలు బాగా పేరుకుపోయాయి. వీటిని తొలగించకపోవటంతో సాగునీటి ప్రవాహానికి అడ్డంకిగా మారింది. అవిడి డ్యాం కూడలి నుంచి చిరుతపూడి,

ఇసుకపూడి, మాచవరం మీదుగా ఈ పంట కాలువ ప్రవహిస్తోంది. ప్రారంభం నుంచి చివరి వరకు ఈ కాలువ అలాగే ఉంది. దీనిపై దృష్టి సారించాలని కర్షకులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, అంబాజీపేట

అగ్నిమాపక కేంద్రం ఏర్పాటుకు వినతి

పి.గన్నవరం, న్యూస్‌టుడే: పోతవరం వద్ద మంజూరైన అగ్నిమాపక కేంద్రం ఏర్పాటుకు నిధులు కేటాయించాలని ఆ శాఖ డీజీ పి.వెంకటరమణను ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ కోరారు. ఇప్పటికే మంజూరైన ఈ కేంద్రం ఏర్పాటులో జాప్యం జరుగుతుందని మంగళవారం ఆయన విజయవాడలో కలిసి వివరించారు. త్వరలోనే దీనికి బడ్జెట్‌లో నిధులు కేటాయించేందుకు డీజీ భరోసా ఇచ్చారని ఎమ్మెల్యే తెలిపారు.

సహకార సంఘ ఉద్యోగుల ధర్నా

అంబాజీపేట, న్యూస్‌టుడే: ప్రభుత్వం తమ డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ అంబాజీపేట డీసీసీ బ్యాంకు వద్ద సహకార సంఘాల ఉద్యోగులు మంగళవారం ధర్నా చేపట్టారు. తమకు ఇచ్చిన హామీలను తక్షణం అమలు చేయాలని డిమాండ్ చేశారు. సీఈవోలు కుంపట్ల అయ్యప్పనాయుడు, పెచ్చెట్టి నారాయణమూర్తి, మద్దింశెట్టి నాగభూషణం, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఆంబోతుల వీరంగం.. వృద్ధుడికి గాయాలు

మామిడికుదురు, న్యూస్‌టుడే: మండలంలోని పాశర్లపూడి 216 జాతీయ రహదారిపై మంగళవారం రెండు ఆంబోతులు వీరంగం చేయడంతో స్థానికులు హడలెత్తిపోయారు. అదే సమయంలో అమలాపురం నుంచి తాటిపాక వైపు ద్విచక్ర వాహనంపై వెళ్తున్న 50 ఏళ్ల వ్యక్తిపైకి అవి అమాంతంగా రావడంతో ఆయనకు గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే వాటిని చెదరగొట్టి బాధితుడ్ని చికిత్స కోసం 108 వాహనంలో అమలాపురం ఆసుపత్రికి పంపించారు.

'పట్టణ తపాలా కార్యాలయంగా స్థాయి పెంచాలి'

మామిడికుదురు, న్యూస్‌టుడే: మండల కేంద్రంగా ఉన్న మామిడికుదురులోని గ్రామీణ తపాలా కార్యాలయాన్ని పట్టణ స్థాయికి పెంచాలని కోరుతూ అమలాపురం ఎంపీ హరీశ్‌మాథుర్‌కు మంగళవారం వినతిపత్రాన్ని అందజేశారు. ఈ మేరకు నగరం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘ ఛైర్మన్ ఈలి శ్రీనివాస్, తెదేపా స్థానిక నాయకులు పలువురు తెలిపారు.

పని భారాన్ని తగ్గించాలంటూ నిరసన

మామిడికుదురులో నినదిస్తున్న వీఆర్వోలు

రాజోలులో తహసీల్దార్ భాస్కర్‌కు వినతిపత్రం అందజేస్తున్న వీఆర్వోలు

మామిడికుదురు, రాజోలు, రావులపాలెం పట్టణం, సఖినేటిపల్లి, మలికిపురం, అంబాజీపేట, న్యూస్‌టుడే: తమపై పనిభారాన్ని తగ్గించాలని కోరుతూ వీఆర్వోలు, వీఆర్ఏలు మండల తహసీల్దార్ కార్యాలయం ఎదుట మంగళవారం నిరసన వ్యక్తం చేశారు. గ్రామ సచివాలయ, వార్డు సచివాలయాల్లోని పనులు తమకు అప్పగించవద్దంటూ నినాదాలు పలికారు. ఈ మేరకు ఆయా తహసీల్దార్లకు వినతిపత్రాన్ని అందజేశారు. ● రాజోలు మండల వీఆర్వోలు పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ భాస్కర్‌కు అందజేశారు. ● రావులపాలెంలోని వీఆర్వోలు తహసీల్దార్ కార్యాలయం వద్ద నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన ప్రదర్శన నిర్వహించారు. ● సఖినేటిపల్లి తహసీల్దార్ కార్యాలయం వద్ద వీఆర్వో, వీఆర్ఏ, సర్వేయర్లు నల్ల బ్యాడ్జీలను ధరించి నిరసన తెలిపారు. ● మలికిపురం మండలంలోని వీఆర్వోల సంఘం ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దారు కార్యాలయం వద్ద వీఆర్వోలు ధర్నా నిర్వహించారు.

రావులపాలెంలో నిరసన తెలుపుతున్న వీఆర్వోలు

మలికిపురం తహసీల్దారుకు వినతిపత్రం ఇస్తున్న వీఆర్వోలు

అంబాజీపేట తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న వీఆర్వోలు

వాలీబాల్ పోటీలు

ఉప్పలగుప్తం: గొల్లవిల్లి జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో అరిగెల రంగయ్య జాతీయస్థాయి వాలీబాల్ పోటీలు మూడోరోజు ప్రేక్షకులను ఊర్రుతలూగించాయి. క్రీడాభిమానులు అధికసంఖ్యలో వచ్చి మ్యాచ్‌లను వీక్షించి. చప్పట్లు, కేరింతలతో క్రీడాకారులను ఉత్సహపరిచారు. టోర్నీ అధ్యక్షుడు దేశంశెట్టి లక్ష్మీనారాయణ, గోపీరాజు, గునిశెట్టి చినబాబు, అరిగెల నానాజీ, నరేష్, మద్దింశెట్టి సురేష్ తదితరులు క్రీడాకారులను పరిచయం చేసుకుని శుభాకాంక్షలు తెలిపి పోటీలను ప్రారంభించారు.

● పురుషుల విభాగంలో ఎస్ఏఐ(కేరళ) జట్టుపై 3-1 స్కోరుతో ఐవోబీ (చెన్నై) జట్టు విజయం సాధించింది. అనంతరం ఆంధ్రప్రదేశ్, కర్ణాటక జట్లు, మహిళ విభాగంలో అల్ఫాన్సా(కేరళ), ఎస్ఆర్ఎం మధ్య అర్ధరాత్రి వరకు పోటీలు జరిగాయి.

క్రికెట్ ఛాంపియన్‌షిప్ పండా లెవన్ జట్టు కైవసం

మలికిపురం, న్యూస్‌టుడే: లక్కవరంలో ఎల్‌పీఎల్(లక్కవరం ప్రీమియర్ లీగ్) సీజన్2 గా గత వారం రోజులుగా నిర్వహించిన చిన్ని మెమోరియల్ క్రికెట్ టోర్నమెంటు ముగిసింది. పండా లెవన్(లక్కవరం) జట్టు ఈ టోర్నమెంట్ ఛాంపియన్‌షిప్‌ను గెలుచుకోగా రూ.20 వేల నగదు బహుమతిని సైతం కైవసం చేసుకుంది. రన్నర్ అప్‌గా నిలిచిన అంతర్వేది ఏఆర్ జట్టు ద్వితీయ బహుమతిగా రూ.15 వేలు నగదు బహుమతిని గెల్చుకుంది. ఇలపకుర్తి మణికంత, బోణం నాని, పిల్లా సాయి స్థానిక యువజన సంఘం సభ్యుల సహకారంతో టోర్నమెంట్‌ను నిర్వహించారు.

క్రికెట్టు టోర్నమెంట్ విజేత జట్టు

చెముడులంక నర్సరీ రైతుపై కలెక్టర్, ఎస్పీలకు ఫిర్యాదు

ఆలమూరు: తీసుకున్న అప్పులు తిరిగి చెల్లించడం లేదంటూ బాధితులు పదిరోజులుగా చెముడులంకలో నిరసన తెలుపుతున్నారు. వివరాల్లోకి వెళితే చెముడులంకకు చెందిన ఓ రైతు లంకగ్రామాల్లో పలువురి వద్ద నుంచి సుమారు రూ.10కోట్ల వరకూ అప్పు చేశారు. తిరిగి ఇవ్వకపోవడంతో బాధితులంతా అతని నర్సరీ వద్దనే పదిరోజులుగా నిరసన తెలుపుతున్నారు. ఈ అంశంపై వారంతా కలెక్టర్ ఆర్ మహేష్‌కుమార్, ఎస్పీ రాహుల్‌మీనాలకు ఫిర్యాదు చేశారు. వారి ఆదేశాల మేరకు కొత్తపేట ఇన్‌ఛార్జి డీఎస్పీగా ఉన్న రామచంద్రపురం డీఎస్పీ రఘువీర్‌కి సమస్యను పరిష్కరించాలని సూచించారు. దీంతో డీఎస్పీ స్థానిక ఎస్సై నరేష్‌తో కలిసి మంగళవారం ఆందోళన చేస్తున్న బాధితులతో చర్చించారు. ప్రస్తుతం అతను పరారీలో ఉన్నాడని పట్టుకుని చర్యలు తీసుకుంటామని డీఎస్పీ హామీ ఇచ్చారు.

సాగు నీటి కోసం రైతుల గగ్గోలు

మలికిపురం, రాజోలు, న్యూస్‌టుడే: నియోజకవర్గంలో దాళ్వా సీజను ప్రారంభమైంది. రాజోలు, మలికిపురం, సఖినేటిపల్లి, మామిడికుదురు మండలాల్లో దాళ్వా చేలల్లో నాట్లు దాదాపు పూర్తయ్యాయి. రాజోలు వ్యవసాయ సబ్ డివిజను పరిధిలో 7320 ఎకరాల్లో వరి నాట్లు వేశారు. అయితే దాళ్వా సాగుకు నీటి కొరత వచ్చే అవకాశాలు ఉండడంతో రైతులు గగ్గోలు పెడుతున్నారు. ఇప్పటికే రాజోలు మండలం శివకోటి పాలెం, పొన్నమండ, చెన్నడం, కడలిలోని తూర్పుపాలెం, అరవపాలెం శివారు ప్రాంతాలకు సాగు నీరందడం లేదని రైతులు చెబుతున్నారు. మలికిపురం మండలంలో రామరాజులంక, శంకరగుప్తం, గుడిమెళ్లంక తదితర గ్రామాల్లోనూ, సఖినేటిపల్లి మండలంలో సఖినేటిపల్లి, అప్పనరామునిలంక, అంతర్వేది తదితర గ్రామాల్లో ఇదే పరిస్థితి ఉండడంతో దిక్కుతోచని స్థితిలో రైతులు ఉన్నారు.

ఉప్పు నీటి సమస్య

ముంగండ... మలికిపల్లి డ్రెయిను పొంగడం వల్ల కాట్రేనిపాడులంక, కాట్రేనిపాడు కొడప గ్రామాల్లో వరి చేలల్లోకి ఉప్పు నీరు చేరి పంట చేలకు నష్టం కలుగుతోంది. మరో పక్క ఏళ్ల తరబడి పంట, మురుగు కాలువాల్లో పూడికతీత చేపట్టకపోవడంతో వరి చేలకు మురుగు నీటి సమస్య వెంటాడుతోంది. ఇది ఇలా ఉండగా మలికిపురం మండలం లక్కవరం, మట్టపర్రు, విశ్వేశ్వరాయపురం గ్రామాల పరిధిలో రొయ్యల చెరువుల్లోని వ్యర్థాలతో కూడిన ఉప్పు నీటిని ఇంజిన్లతో పంట కాలువల్లోకి తోడేస్తున్నారని రైతులు చెబుతున్నారు. దీని వల్ల పంట దిగుబడి తగ్గుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

శివకోటిలో చేలో నీరు లేని దుస్థితి

వంతుల వారీ విధానంలో..

రాజోలు వ్యవసాయ సబ్ డివిజనులో ఈనెల 10 నుంచి వంతుల వారీ విధానంలో సాగు నీరు విడుదల చేస్తున్నాం. నీటిని పొదుపుగా వినియోగించుకోవడమే కాకుండా నీటి వృథా లేకుండా రైతులు స్వచ్ఛందంగా చర్యలు చేపట్టాలి. ఏప్రిల్ నెలాఖరున కాలువలు మూసేసే వరకు వంతుల వారీ విధానం అమలవుతుంది. – రమేశ్‌బాబు, జలవనరుల శాఖ ఏఈ

CHANGE OF NAME

I, MUDUNURI VENKATA RAMA KRISHNAM RAJU (Old Name), S/o MUDUNURI MALLAPARAJU, D.No.3-142, Atreyapuram, Atreyapuram Mandal.

I have changed my name as **MUDUNURI VENKATA RAMA KRISHNA RAJU** (New Name).Hereafter my name is known as **MUDUNURI VENKATA RAMA KRISHNA RAJU** (NEW NAME) .

PUBLIC NOTICE

On Instructions by my Client M/s Shriram Finance Ltd., **Aryapuram Branch,** Rajamahendravaram-1, issue this Notice to General Public. My Client Intends to Sanction loan to **Sri Saladi Venkatapathi Raju** its property holder **Sri Saladi Sita Ramarao, S/o Sri Saladi Rama swamy,** 3-88/1, Turpupalem, Sivakodu, E.G.Dt., on the Security of the below mentioned property belongs to them by way of registered equitable mortgage.

SCHEDULE OF THE PROPERTY/TIES

An area of **Ac. 0.50** cts covered by in RS No. 496/1, situated in total Ac.2.22 cts in between Ac. 0.172 cts., Ac.0.50 cts or H.0.202 including Coconut Garden at Kesarapalli gramam Taluk, K.Gollapalli Grama Panchayat Area, Razole Sub-Registrar, Malikipuram Mandal, East Godavari District., within the following boundaries:
EAST: Bandela Deenaratnam Kumari and Others land, **SOUTH:** Saladi Anjaneyulu land as per this veelunama, **WEST:** Sarkaru Punta, **NORTH:** Saladi Papanna gari land as per this Veelunama. Together with all easement rights of Ac. 0.50 cts site etc.

PURAMSETTI SATYA RAMESH
K.VENKATA LAKSHMI, ADVOCATES, 79-21-08-6, Sri Lakshmi Apt.,-1, Law College Road, Rajahmundry, 99666 18571
Dt.17-02-2026, RAJAMAHENDRAVARAM.

(c) eenadu

అమలాపురం

● అమలాపురం ● ముమ్మిడివరం ● రామచంద్రపురం

రేపు పట్టణంలో విద్యుత్తు సరఫరాకు అంతరాయం

రామచంద్రపురం, న్యూస్‌టుడే: పట్టణంలోని 33/11 కేవీ సబ్‌స్టేషన్ పెయింటింగ్, మరమ్మతుల నిమిత్తం బుధవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు టౌన్-1, 2, 3 ఫీడర్లు, చెల్లూరు ఓదూరు ఫీడర్ల పరిధిలో సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఈఈ కె.రత్నాలరావు తెలిపారు. ఏరియా ఆసుపత్రి, రామకృష్ణ సెంటర్, ప్రధానరోడ్డు, మార్కెట్ సెంటర్, టౌన్‌బ్యాంక్ సెంటర్, వి.ఎస్.ఎం.కళాశాల, పసలపూడి రోడ్డు, చైతన్య రైస్‌మిల్ వరకు, హౌసింగ్‌బోర్డు, ముచ్చుమిల్లి, రత్నంపేట, లలితానగర్, కాకినాడ రోడ్డు, కొత్తూరు రోడ్డు, మణికంఠ రైసుమిల్లు వరకు, చోడవరం నూకలమిల్లు, అరికరేవుల రోడ్డు, నరసాపురపుపేట రొయ్యల చెరువుల ప్రాంతాల్లోని సర్వీసులకు సరఫరా నిలిపివేస్తామని పేర్కొన్నారు.

ఇతర రాష్ట్రాల బాధితులకూ కేసీఎం సేవలు

అమలాపురం కలెక్టరేట్, న్యూస్‌టుడే: కోనసీమ సెంటర్ ఫర్ మైగ్రేషన్(కేసీఎం) సేవలను ఇతర రాష్ట్రాల వాసులు సైతం వినియోగించుకుంటున్నట్లు కేసీఎం నోడల్ అధికారి కె.మాధవి తెలిపారు. ఆమె తెలిపిన వివరాల ప్రకారం.. తెలంగాణ రాష్ట్రం కరీంనగర్ జిల్లా లక్ష్మీదేవిపల్లికి చెందిన తాండ్ర అంజయ్య ఉపాధి నిమిత్తం కొంత కాలం క్రితం గల్ఫ్ వెళ్లాడు. అక్కడ పని చేస్తున్న సమయంలో ప్రమాదవశాత్తూ మృతి చెందాడు. మృతుడి కుటుంబ సభ్యులు ఫోన్‌లో కేసీఎం కేంద్రాన్ని సంప్రదించి మృత దేహాన్ని స్వగ్రామానికి తీసుకు వచ్చేందుకు సహాయం అందించాలని కోరారు. దీనిపై స్పందించిన అధికారులు గల్ఫ్‌లోని తెలుగు సంఘం నాయకులు, ఎంబైసీ అధికారుల సహకారంతో మంగళవారం మృతదేహాన్ని స్వగ్రామానికి తరలించి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

ఆక్వా రైతులను ఆదుకోవాలి

ఎమ్మెల్యే బుచ్చిబాబు

ముమ్మిడివరం, న్యూస్‌టుడే: ఆక్వా రైతులను ఆదుకోవడానికి రిజిస్ట్రేషన్ ప్రక్రియను వేగంగా పూర్తి చేయాలని ప్రభుత్వ విప్, ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు కోరారు. మంగళవారం శాసనసభ ప్రశ్నోత్తరాల సమయంలో ఆక్వా రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను ఎమ్మెల్యే సభ దృష్టికి తీసుకెళ్లారు. వైకాపా ప్రభుత్వ హయాంలో విద్యుత్తు సబ్సిడీకి ఆక్వా జోన్, నాన్ ఆక్వాజోన్ పరిధి పెట్టి రైతులను తీవ్రంగా మోసం చేశారన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడి ఆదేశంతో మత్స్యశాఖ ఆధ్వర్యంలో ఆక్వా రైతుల రిజిస్ట్రేషన్ ప్రక్రియను ప్రారంభించారని.. రెండు నెలలు గడుస్తున్నా.. ఇంకా పూర్తి కాలేదని అన్నారు. రైతులకు రూ.1.50కు యూనిట్ విద్యుత్తు అందించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఆక్వా చెరువులు ప్రభుత్వ భూములుగా నమోదు కావడం వల్ల ధ్రువీకరణకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయని.. వీటిని పరిష్కరించాలని కోరారు.

ఉత్సాహంగా వాలీబాల్ పోటీలు

ఎస్ఏఐ(కేరళ)-ఐఓబీ(చైన్నై) జట్ల మధ్య వాలీబాల్ పోరు

ఉప్పలగుప్తం, న్యూస్‌టుడే: గొల్లవిల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో అరిగెల రంగయ్య జాతీయస్థాయి వాలీబాల్ పోటీలు మూడోరోజు ప్రేక్షకులను ఉర్రూతలూగించాయి. క్రీడాభిమానులు అధికసంఖ్యలో వచ్చి మ్యాచ్‌లను వీక్షించారు. ఈలలు, కేరింతలతో క్రీడాకారులను ఉత్సాహపరిచారు. టోర్నీ ఛైర్మన్ దేశంశెట్టి లక్ష్మీనారాయణ, గోపీరాజు, గునిశెట్టి చినబాబు, అరిగెల నానాజీ, నరేష్, మద్దింశెట్టి సురేష్ తదితరులు క్రీడాకారులను పరిచయం చేసుకుని శుభాకాంక్షలు తెలిపి పోటీలను ప్రారంభించారు. ●పురుషుల విభాగంలో ఎస్ఏఐ(కేరళ) జట్టుపై 3-1 స్కోరుతో ఐవోబీ (చైన్నై) జట్టు విజయం సాధించింది. అనంతరం ఆంధ్రప్రదేశ్, కర్ణాటక జట్లు, మహిళ విభాగంలో అల్ఫాన్సా(కేరళ), ఎస్ఆర్ఎం మధ్య అర్ధరాత్రి వరకు పోటీలు జరిగాయి.

ఆత్మవిశ్వాసంతో పరీక్షలకు సిద్ధం కావాలి

అవగాహన కల్పిస్తున్న ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డా.ఎస్.ప్రభాకర్

ముమ్మిడివరం, న్యూస్‌టుడే: ఇంటర్మీడియట్ విద్యార్థులు ఒత్తిడికి గురికాకుండా ఆత్మవిశ్వాసంతో పరీక్షలకు సన్నద్ధం కావాలని ముమ్మిడివరంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డా. ఎస్. ప్రభాకర్ సూచించారు. స్థానిక డా.ఎంజీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ లక్ష్మీప్రశాంతి అధ్యక్షతన ఇంటర్మీడియట్ విద్యార్థులకు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రభాకర్ మాట్లాడారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపల్ డా. కె. చిట్టిబాబు, ఐక్యూ ఏసీ కోఆర్డినేటర్ డా. ఎన్. తులసిలక్ష్మి, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

స్వచ్ఛంద సంస్థల సేవలు అవసరం

కాట్రేనికోన : ప్రభుత్వశాఖల సమన్వయం, స్వచ్ఛంద సంస్థల కృషితో లబ్ధిదారులకు సంక్షేమ పథకాలు చేరుతాయని తహసీల్దారు రవికిరణ్ పేర్కొన్నారు. సర్పంచి సుధాకర్ అధ్యక్షతన సంక్షేమ పథకాల అమలు-సాధికారత అనే అంశంపై కాట్రేనికోనలో అవగాహన సమావేశం ఏర్పాటుచేశారు.

ఆర్థిక సాయం అందిస్తున్న మంత్రి సుభాష్

బాధితురాలికి ఆర్థిక సాయం

ద్రాక్షారామ, న్యూస్‌టుడే: రామచంద్రపురం మండలం కాపవరం గ్రామానికి చెందిన కాద సత్యనారాయణ భార్య ప్రసన్నలక్ష్మి కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతుండగా ఆమె వైద్యం కోసం గ్రామానికి చెందిన ఎన్ఆర్ఐ నల్లం చంద్రశేఖర్ రూ. 25 వేల ఆర్థికసాయాన్ని మంగళవారం మంత్రి సుభాష్ ద్వారా బాధితురాలికి అందించారు. కార్యక్రమంలో నల్ల శ్రీహరి, మణికంఠ, ఇళ్ల మురళి, నరహరిశెట్టి సునీల్ పాల్గొన్నారు.

రణభేరికి ఉపాధ్యాయులు

పామర్రు, న్యూస్‌టుడే: ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న దీర్ఘకాలిక సమస్యలకు పరిష్కారం కోరుతూ యూటీఎఫ్ ఆధ్వర్యంలో విజయవాడలో మంగళవారం నిర్వహించిన రణభేరి 2.0 కార్యక్రమానికి మండలం నుంచి ఉపాధ్యాయులు తరలివెళ్లారు. ప్రత్యేకంగా బస్సు ఏర్పాటుచేసుకుని నినాదాలు చేస్తూ సభాస్థలికి చేరుకున్నట్లు నాయకులు మాగాపు ప్రదీప్ కుమార్, దాసరి శ్రీనివాస్, చింతపల్లి శ్రీనివాస్, ఎస్. రవి తదితరులు తెలిపారు. సభ నిర్వహించడం ద్వారా కొన్ని సమస్యలకైనా పరిష్కారం లభిస్తుందని వారు ఆశాభావం వ్యక్తం చేశారు.

నేడు సామాజిక తనిఖీ ప్రజావేదిక

ద్రాక్షారామ : మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం 2024-25 ఆర్థిక సంవత్సరంలో రామచంద్రపురం గ్రామీణ మండలంలో చేపట్టిన పనుల సామాజిక తనిఖీపై నివేదికను బుధవారం ప్రజావేదికలో వెల్లడిస్తామని ఎంపీడీవో శివప్రసాద్ తెలిపారు. ఉదయం 10 గంటలకు సభ ప్రారంభమవుతుందని పేర్కొన్నారు.

సహకార ఉద్యోగుల సమ్మె

ముమ్మిడివరం: ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల్లో పనిచేస్తున్న ఉద్యోగులు చేపట్టిన సమ్మె మంగళవారం రెండో రోజూ కొనసాగింది. కొమానపల్లి పీఏసీఎస్ అధ్యక్షుడు పొద్దోకు నారాయణరావుకు ఉద్యోగులు వినతిపత్రం అందజేశారు. సీఈవో నంద్యాల మణికంఠ, పెసంగి నూకరాజు, పొత్తూరి ఈశ్వరరాజు, అన్నంనీడి వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

తెప్పోత్సవ ఏర్పాట్ల పరిశీలన

ఐ.పోలవరం, న్యూస్‌టుడే: మురమళ్లలోని భద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి ఆలయం వద్ద ఈనెల 15న ప్రారంభమైన మహాశివరాత్రి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఈ నెల 19న నిర్వహించే తెప్పోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించడానికి ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయి. స్థానిక రాఘవేంద్ర వారధి పుష్కర ఘాట వద్ద తెప్పోత్సవం నిర్వహించే ప్రాంతాన్ని దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ సత్యనారాయణ మంగళవారం పరిశీలించారు.

రహదారులపైనే పడేస్తున్నారు..!

● చెత్తతో అపరిశుభ్రంగా మారుతున్న పరిసరాలు

న్యూస్‌టుడే, అమలాపురం పట్టణం

జిల్లా ప్రధాన కేంద్రం అమలాపురం పట్టణంలో ప్రధాన, అంతర్గత రహదారులు, మురుగుకాలువలు చెత్తతో నిండిపోతున్నాయి. ఇళ్లు, దుకాణాల నుంచి వచ్చే చెత్తను, ప్లాస్టిక్ వ్యర్థాలను కొందరు రహదారులు, ఖాళీ స్థలాల్లో పడేస్తున్నారు. పశువులు చిందరవందరగా చేయడం, గాలికి ఎగరడంతో పరిసర ప్రాంతాలు అస్తవ్యస్తంగా మారుతున్నాయి. ఈ చెత్త కుళ్లి దుర్వాసన ఉత్పత్తి కేంద్రంగా మారుతోంది. వాహనచోదకుల తోపాటు చుట్టుపక్కల వారు ఇబ్బందులు పడుతున్నారు. పురపాలక సంఘంలో చెత్త సేకరణ వాహనాలు ఉన్నా లక్ష్యం నెరవేరడం లేదు. దోమల బెడద, దుర్వాసనతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

ప్రధానంగా ఈ ప్రాంతాల్లో..

కార్మికనగర్, ఈడబ్ల్యూఎస్ కాలనీ, కె. అగ్రహారం, వడ్డెగూడెం, విద్యుత్తునగర్, కుంకాల కొట్టు వీధి, గొల్లగూడెం, రావులచెరువు, విత్తనాల వారి కాలువ గట్టు, చిన్నవంతెన కుమ్మరికాలువ, నల్లవంతెన బైపాస్‌రోడ్డు, కాలేజీరోడ్డు ప్రాంతాల్లో చెత్త ఆరుబయట పడేస్తున్నారు.

కె.అగ్రహారంలో రోడ్డుపై చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలు

పురపాలక ముఖ చిత్రం

విస్తీర్ణం :	7.02 చ.కి.మీ.
వార్డులు :	30
జనాభా :	70వేలు
గృహాలు :	17,000
క్లాప్ వాహనాలు :	12
రోజు సేకరించే చెత్త :	38 టన్నులు

వాహనాలకు అందజేయాలి..

పట్టణంలో ఇంటింటికి చెత్త సేకరిస్తున్నారు. దీని కోసం ఇంటింటికి మూడేసి ప్లాస్టిక్ డబ్బాలు అందజేశారు. వాటిలో తడి, పొడి, ప్రమాదకర చెత్తగా వేరుచేసి వాటిని సంబంధిత డబ్బాల్లో వేసి ఉంచితే ఉదయం వాహనాల్లో తీసుకువెళ్తారు. కొందరు ఈ వాహనాలకు అందజేయకుండా సమీపంలోని రహదారులు, ఖాళీ స్థలాల్లో పడేస్తున్నారు.

కార్యదర్శులు గుర్తిస్తున్నారు..

కలెక్టర్ ఆదేశాల మేరకు రహదారులపై చెత్త వేయకుండా చర్యలు తీసుకుంటున్నారు. అలాంటి ప్రాంతాలను వార్డు సచివాలయ కార్యదర్శులు గుర్తిస్తునామన్నారు. తొలుత సంబంధిత వ్యక్తులకు చెబుతారు. అక్కడ సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తారు. చెత్త ఎవరు వేస్తున్నారో గుర్తించి జరిమానా విధిస్తారు.

జరిమానా విధిస్తాం..

పట్టణంలో పరిసరాల పరిశుభ్రతకు పెద్దపీట వేస్తున్నాం. క్షేత్రస్థాయిలో అపరిశుభ్ర వాతావరణంపై ఫిర్యాదులు అందుతున్నాయి. పారిశుద్ధ్య- ప్రజారోగ్యం కోసం ప్రజలు తమకిచ్చిన చెత్త డబ్బాల్లో చెత్తను నింపి వాహనాలకు అందజేయాలి. చెత్తను ఎక్కడ పడితే అక్కడ వేస్తే రూ.500 నుంచి 2,000 వేలు జరిమానాలు విధిస్తాం. సచివాలయ సిబ్బందిని అప్రమత్తం చేశాం. చెప్పినా వినకుంటే కేసులు పెడతాం. – వి.నిర్మల్‌కుమార్, అమలాపురం మున్సిపల్ కమిషనర్

పని ఒత్తిడిపై నిరసన

పామర్రు : వైకాపా ప్రభుత్వంలో సరైన సమయం ఇవ్వకుండా భూముల రీసర్వే తప్పులతడకగా తమతో చేయించారని, ఒత్తిడి తట్టుకోలేక పులువురు వీఆర్వోలు, సర్వేయర్లు అకాల మృత్యువాత పడ్డారని, తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్‌చేస్తూ మండల వీఆర్వో, సర్వేయర్లు, గ్రామ సేవకులు మంగళవారం కె. గంగవరం తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా చేశారు. అనంతరం తహసీల్దార్ శ్రీరామప్రసాద్‌కు వినతిపత్రం సమర్పించారు.

కార్యవర్గం ఎన్నిక

ముమ్మిడివరం, న్యూస్‌టుడే: ముమ్మిడివరం ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక మంగళవారం జరిగింది. సంఘ అధ్యక్షుడిగా కముజు శ్రీనివాస్, ఉపాధ్యక్షుడిగా దిల్బర్ హుస్సేన్, కార్యదర్శిగా వడ్డి వీరేంద్రకుమార్, సహాయ కార్యదర్శిగా పంతగడ వంశీ, కోశాధికారిగా కాండ్రేగుల త్రిమూర్తులు, సలహాదారుడిగా గాలిదేవర సత్యనారాయణను ఎన్నుకున్నారు.

దస్తావేజు పడిపోయినది

డా॥ B.R.అంబేద్కర్ కోనసీమ జిల్లా, రామచంద్రపురం పట్టణమునకు చెందిన దొమ్మేటి వీర్రాజు, S/o సూర్యనారాయణ (లేటు) గారికి సంబంధించిన ఒరిజినల్ దస్తావేజు నెంబర్:546/1999, సర్వే నెంబర్ 448/2రు ఖాళీ స్థలము గలది రామచంద్రపురం పట్టణములో జిరాక్స్ కాపీలను తీసుకోవడానికి వెళ్ళుచుండగా మార్గమధ్యలో పడిపోయినది. దొరికినవారు ఈ క్రింది అడ్రసుకు తెలియజేయగలరు.

దొమ్మేటి వీర్రాజు, S/o సూర్యనారాయణ (లేటు)
గుబ్బలవారిపేట, రామచంద్రపురం
సెల్: 80965 06979

PUBLIC NOTICE

On Instructions by my Client M/s Shriram Finance Ltd., Aryapuram Branch, Rajamahendravaram-1, E.G.Dt., issue this Notice to General Public. My Client Intends to Sanction loan to Sri INUMARTHI GANESH RAJA its property holder Sri Inumarthi Raja Rao, S/o Sri Inumarthi Veeranna, 12-50, MainRoad, Bandarulanka, Amalapuram Mandal. on the Security of the below mentioned property belongs to them by way of registered equitable mortgage.

SCHEDULE OF THE PROPERTY/TIES

An area of 122 sq.yds or 102.48 sq. mts. covered by in RS No. 124/6, situated in total Ac.0.2 1/2 cts in between D.No.12-38 Thatched House at Bandarulanka Panchayati, Bandarulanka Grama Taluk, Grama Kantham, Ambajipeta Sub-Registrar, Amalapuram Mandal, East Godavari District., within the following boundaries:
EAST: Part of your House and site 16.2 yards, SOUTH: Joint way 7.5 yards, WEST : House of Billa Garayya 16.2 yards, NORTH: Inumarthi Subbaraju gari House site 7.1 yards.
Together with all easement rights of 122 sq. yds site etc.

PURAMSETTI SATYA RAMESH
K.VENKATA LAKSHMI, ADVOCATES, 79-21-08-6, Sri Lakshmi Apt.-1, Law College Road, Rajahmundry, 99666 18871
Dt.17-02-2026, RAJAMAHENDRAVARAM.

ఇరుకు వంతెన.. యాతన

అమలాపురం మండలం చిందాడగరువు నుంచి రోళ్లపాలెం వెళ్లేందుకు మురుగుకాలువపై వంతెన అధ్వానంగా మారింది. ఇరువైపులా రెయిలింగ్ విరిగిపోయి ప్రమాదకరంగా దర్శనమిస్తోంది. శిథిలావస్థకు చేరడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని వాహనచోదకులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ తీసుకుని కొత్త వంతెన నిర్మించాలని రెండు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.
– న్యూస్‌టుడే, అమలాపురం గ్రామీణం

తారుతేలి.. రాళ్లు లేచి..

ముమ్మిడివరం మండలంలో 216 జాతీయ రహదారి నుంచి కొమానపల్లి వెళ్లే తారు రోడ్డు పాడైంది. తారు పెచ్చులూడిపోయి నల్లకంకర, రాళ్లు లేచిపోయి రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారు. రహదారిలో కొమానపల్లి, చింతపల్లిలంక, గేదెల్లంక గ్రామాల ప్రజలు నిత్యం ప్రయాణిస్తూ ఉంటారు. నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.
–న్యూస్‌టుడే, ముమ్మిడివరం

మురుగుతో వెతలు

అమలాపురంలోని మద్దెలవారిపేట శివారు సుమలత ఐటీఐ పక్కన్న మురుగుకాలువలో చెత్తవ్యర్థాలు పేరుకుపోయి అధ్వానంగా మారింది. మున్సిపల్ పారిశుద్ధ్య సిబ్బంది శుభ్రం చేయడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇక్కడ సరైన కాలువ లేక మురుగు ముందుకు కదలక స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. మున్సిపల్ అధికారులు ఈ కాలువను శుభ్రం చేయాలని కోరుతున్నారు. – న్యూస్‌టుడే, అమలాపురం పట్టణం

నులిపురుగుల నివారణతో ఆరోగ్యం

మాత్రలు వేస్తున్న జిల్లా కలెక్టర్ మహేష్‌కుమార్

అమలాపురం గ్రామీణం: పిల్లలు ఆరోగ్యంగా ఉంటేనే విద్య, క్రీడల్లో మెరుగైన ప్రగతిని సాధించగలరని కలెక్టర్ ఆర్. మహేష్‌కుమార్ అన్నారు. ఈదరపల్లి బొంతువారిపేటలోని అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలకు ఆయన నులిపురుగుల నివారణ మాత్రలు వేశారు. జిల్లాలోని 51,543 మందికి అల్బెండోజోలు మాత్రలు వేసినట్లు ఐసీడీసీఎస్ పీడీ నాగమణి తెలిపారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి దుర్గారావు దొర, సీడీపీవోలు యర్రా రమాదేవి, విజయశ్రీ తదితరులు పాల్గొన్నారు.

ద్రాక్షారామ: ద్రాక్షారామ పీహెచ్‌సీ పరిధిలోని 8,157 మంది పిల్లలకు నులిపురుగు నివారణ మాత్రలు పంపిణీ చేసినట్లు వైద్యాధికారి రత్నసుధ తెలిపారు. జిల్లా మలేరియా అధికారి నక్కా వెంకటేశ్వరరావు హసనబాద గ్రామంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో పిల్లలతో మాత్రలు మింగించారు.

రామచంద్రపురం: స్థానిక జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి బి.వి.వి. సత్యనారాయణ విద్యార్థులతో అల్బెండజోల్ మాత్రలు మింగించారు. ద్రాక్షారామ పీహెచ్‌సీ పరిధిలో 94 శాతం, రామచంద్రపురం పట్టణంలో 95 శాతం విద్యార్థులకు మాత్రలు వేసినట్లు తెలిపారు.

అమలాపురం పట్టణం: అమలాపురం మహాత్మాగాంధీ మున్సిపల్ హైస్కూల్‌లో ప్రధానోపాధ్యాయుడు గణ సత్యనారాయణ ఆధ్వర్యంలో జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమం నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ నిర్మల్‌కుమార్ విద్యార్థులకు నులిపురుగుల నివారణ మాత్రలు వేశారు.

ప్రశాంతంగా పది పరీక్షలు ప్రారంభం

యానాం, న్యూస్‌టుడే: సీబీఎస్ఈ విద్యావిధానం అమలులో ఉన్న యానాం విద్యాశాఖ పర్యవేక్షణలో పది పరీక్షలు స్థానిక పీఎంశ్రీ రాజీవ్‌గాంధీ ప్రభుత్వ ఆంగ్ల మాధ్యమ హైస్కూల్, శ్రీటంగుటూరి ప్రకాశం పంతులు ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మంగళవారం ప్రారంభమయ్యాయి. కేంద్రాల వద్ద పోలీసు భద్రత ఏర్పాటు చేశారు.

నేటి నుంచి మీసాల వెంకన్న కల్యాణోత్సవాలు

యానాం, న్యూస్‌టుడే: మీసాల వెంకన్నగా ప్రఖ్యాతి పొందిన శ్రీభూ సమేత వేంకటేశ్వరుని కల్యాణోత్సవాలు బాలాలయంలో బుధవారం నుంచి ప్రారంభం కానున్నాయి. మార్చి 12 వరకు కల్యాణోత్సవంలో వివిధ క్రతువులు నిర్వహించనున్నారు.

పవర్ లిఫ్టింగ్ పోటీల విజేతలకు అభినందన

క్రీడాకారులతో సంఘ నాయకులు

అమలాపురం పట్టణం, న్యూస్‌టుడే: రాజమహేంద్రవరంలో ఇటీవల జరిగిన రాష్ట్రస్థాయి పవర్ లిఫ్టింగ్‌పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులు ఎం. వీరేంద్ర, వై. ఇందిరాను మంగళవారం అభినందించారు. స్థానిక మున్సిపల్ సర్క్యులర్ బజార్ జిమ్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో శిక్షకుడు కంకిపాటి వెంకటేశ్వరరావు, జిల్లా బాడీబిల్డింగ్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు గారపాటి చంద్రశేఖర్ మాట్లాడారు. ఇటీవల జాతీయ స్థాయి పోటీల్లో రన్నర్ అప్ ట్రోఫి గెలిచిన బి. అప్పన్న, క్రీడాకారులకు బహుమతులు అందజేశారు.

మాదిగల సభ విజయవంతానికి పిలుపు

ఐ.పోలవరం : ఈ నెల 25న నిర్వహించనున్న మాదిగల విజయోత్సవ సభను విజయవంతం చేయాలని ఎంఆర్‌పీఎస్ ఆటో కార్మికుల సమావేశంలో పిలుపునిచ్చారు. ఐ.పోలవరం మండలం మురమళ్లలో నిర్వహించిన ఈ సమావేశానికి జిల్లా ఎంఆర్‌పీఎస్, ఎంఎస్పీ ఉపాధ్యక్షులు వీధి చిరంజీవి మాదిగ, వైకాపా నాయకుడు వీధి శేఖర్‌బాబు, తెదేపా నాయకుడు వేపాటి సత్తిబాబు మాట్లాడారు. పార్టీలతో సంబంధం లేకుండా ఐక్యతను చాటాలని పిలుపునిచ్చారు.

'మంద కృష్ణ మాదిగ క్షమాపణ చెప్పాలి'

అమలాపురం పట్టణం, న్యూస్‌టుడే: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌పై మంద కృష్ణ మాదిగ అనుచిత వ్యాఖ్యలు చేశారని, వెంటనే ఆయన క్షమాపణలు చెప్పాలని దళిత ఐక్యవేదిక నాయకులు డిమాండ్ చేశారు. అమలాపురం త్రిరత్న బుద్ధ విహార్‌లో దళిత ఐక్యవేదిక నాయకుల సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ నెల 25న అమలాపురంలో ఆయన పర్యటనను అడ్డుకుంటామన్నారు. ఇసుకపట్ల రఘుబాబు, తిరపతిరావు, చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

రైతులంతా వివరాలు నమోదు చేసుకోవాలి

పామర్రు, న్యూస్‌టుడే: మండలంలోని రైతులందరూ ఫార్మర్ రిజిస్ట్రీ పోర్టల్‌లో గుర్తింపు కార్డుల కోసం ఈనెల 28లోగా వివరాలు నమోదు చేసుకోవాలని, ఫిబ్రవరి 20లోగా ఈపంట నమోదు పూర్తయ్యేలా కృషిచేయాలని రామచంద్రపురం ఏడీ బి. నాగకుమార్ అన్నారు. మండలంలోని భట్లపాలిక, శివల గ్రామాల్లో మంగళవారం పొలంబడి నిర్వహించారు. రైతులకు ఆయన పలు సూచనలు చేశారు. సందేహాలకు సమాధానాలిచ్చారు. ప్రస్తుతం వరిపంటను ఆశించే తెగుళ్ల నివారణ మార్గాలు తెలిపారు. కార్యక్రమంలో బ్రహ్మపురి ఛైర్మన్ గెడ్డం పల్లపురావు, తెలుగు రైతు అధ్యక్షుడు బలుసు శివప్రసాద్, ఎర్రపోతవరం నీటి పంపిణీ సంఘం అధ్యక్షుడు నిడదవోలు సుబ్రహ్మణ్యేశ్వరరావు, వ్యవసాయ, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

తెదేపా జిల్లా అధ్యక్షుడిని కలిసిన నాయకులు

గుత్తుల సాయితో పార్టీ నాయకులు

ఐ.పోలవరం, న్యూస్‌టుడే: రాజోలు నియోజకవర్గ తెదేపా బాధ్యులు గొల్లపల్లి అమూల్య ఆధ్వర్యంలో ఆ పార్టీ మండలాధ్యక్షులు జిల్లా తెదేపా అధ్యక్షుడు గుత్తుల సాయిని మంగళవారం కలిసారు. ఐ.పోలవరం మండలం మురమళ్లలోని ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు క్యాంపు కార్యాలయం వద్ద వారు సాయిని మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. కార్యక్రమంలో రాష్ట్ర రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ ముదునూరి చినబాబురాజు, మామిడికుదురు, రాజోలు, సఖినేటిపల్లి, మలికిపురం మండల తెదేపా అధ్యక్షుడు బోణం సత్యనాగేశ్వరరావు, అంచూరి సునీత పురుషోత్తం, తాడి సత్యనారాయణ, అడబాల సాయిబాబా, మొల్లేటి శ్రీను, చుట్టుగుళ్ల కిశోర్, విత్తనాల జానకిరామ్ తదితరులు పాల్గొన్నారు.

రామచంద్రపురం పట్టణంలో IIT/JEE& NEET Programmeలో తిరుగులేని అగ్రగామి విద్యాసంస్థ

మోడరన్

48 YEARS EDUCATIONAL EMINENCE

GRC జూనియర్ కాలేజి

సూర్యనగర్, రామచంద్రపురం-533255, డా॥బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా.

Ph: 08857-242489, 98487 83737

బడ్జెట్ కాలేజీల చరిత్రలో సంచలన విజయం

We Never Corporate - We Always Co-Operate అనే నినాదంతో JEE 2026 సెషన్-1 ఫలితాల్లో జాతీయ స్థాయి అత్యుత్తమ పర్సంటైల్‌తో మరోసారి "మోడరన్" విజయభేరి

"లక్షల ఫీజుతో కాదు – లక్ష్యంతో సాధించిన మెగా విజయాలు"

కార్పొరేట్ కళాశాలలకు ధీటుగా 2026 JEE MAINS ఫలితాలు

97.5 Percentile
P.V.V.S.S.S. Sanjana
Hasanbada



93.71 Percentile
B.Sai Sreekar
Ramachandrapuram

89.77 Percentile	84.26 Percentile	83.13 Percentile	82.85 Percentile	82.67 Percentile	81.84 Percentile	81.69 Percentile	81.61 Percentile	81.06 Percentile
G.POOJITHA	A.MANOJ	P.ABHISHEK RAJ	P.A.JASHUVA	K.JISHNU	G.H.MANIKANTA	T.RAMYA SRI	N.KOUSHIK	M.MOUNIKA
Annaipeta	Thotapeta	Ramachandrapuram	Veeravallipalem	Ramachandrapuram	Ramachandrapuram	Muchimilli	K.Gangavaram	Velampalem



80.03 Percentile	79.95 Percentile	77.58 Percentile	77.12 Percentile	77.08 Percentile	76.35 Percentile	76.00 Percentile	74.89 Percentile	71.00 Percentile
A.V.LAKSHMI	A.V.SAI SUJI	K.S.SRIPRIYA	P.MEGHANA	CH.BHAGYA SRI	K.SATYA SAI	B.KEERTHANA	B.SANDYA	M.GEETHIKA
Pathakota	Pathakota	Ramachandrapuram	Hasanabada	Machavaram	Sundarapalli	Yeleswaram	Draksharama	Venturu

ముఖ్య గమనిక:
భారీ ప్రకటనలతో హోరెత్తించే కార్పొరేట్ విద్యాసంస్థలలో లక్షలకు లక్షలు ఫీజు హెచ్చించిన వారు సైతం అభినందించేలా మా మోడరన్ జూనియర్ కాలేజ JEE లో సత్తా చాటిందని పలువురు తల్లిదండ్రులు ఈ సందర్భంగా పేర్కొనటం మాకు గొప్ప స్ఫూర్తి

"లక్షల ఫీజు కన్నా లక్షణమైన ఫలితాలే మా లక్ష్యం" అనే నినాదానికి నిదర్శనంగా అకడమిక్ ఫలితాలతో పాటు ఆబ్జెక్టివ్ పరీక్షలలో కూడా సత్తా చాటుతున్న ఏకైక విద్యా సంస్థ "మోడరన్"

ఈ సందర్భంగా JEE Advance కి సెలక్టయిన మా విద్యార్థులకు, అత్యుత్తమ స్థాయిలో బోధన చేసిన మా JEE ఫ్యాకల్టీ కి మా అభినందనలు

♦ 72 పరిసర గ్రామాలకు బస్ సౌకర్యం కలదు

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో 48 సం॥ల నుండి హాస్టల్ వసతి గల ఏకైక విద్యా సంస్థ

విద్యారత్న Ln.Dr.G.V.Rao
President & Correspondent

(c) eenadu

ఈనాడు తూర్పుగోదావరి

భక్తుల వద్దకే సేవా టికెట్లు

అన్నవరం ఆలయంలో పీవోఎస్ యంత్రాలతో జారీ

అన్నవరం : భక్తుడి వద్దకే నేరుగా సిబ్బంది వెళ్లి టికెట్లు జారీ చేసేలా అన్నవరం దేవస్థానంలో 30 పీవోఎస్ యంత్రాలను అందుబాటులోకి తీసుకొచ్చారు. డిజిటల్ టెంపుల్స్ స్మార్ట్ ఎండోమెంట్స్‌కు అనుగుణంగా నగదు రహిత లావాదేవీలు మెరుగుపర్చడం, ఆన్‌లైన్ సేవలను విస్తృతం చేయడం, డిజిటల్ మౌలిక సదుపాయాలు బలోపేతం చేయడానికి చర్యలు చేపడుతున్నారు. కౌంటర్లలో టికెట్లు జారీ చేస్తూనే రద్దీ సమయాల్లో ఆలయ ప్రాంగణాల్లో భక్తుల వద్దకే నేరుగా సిబ్బంది వెళ్లి టికెట్లు ఇచ్చేలా ఏర్పాట్లు చేస్తున్నారు. యంత్రంలో క్యూఆర్ కోడ్ ద్వారా డిజిటల్ చెల్లింపులు చేయవచ్చు.

పీవోఎస్ యంత్రం ద్వారా టికెట్ ఇస్తున్న సిబ్బంది

ప్రస్తుతం దర్శనం, సేవ, ప్రసాదం టికెట్లు పీవోఎస్ ద్వారా ఇస్తుండగా భవిష్యత్తులో ఈ హుండీ, అన్నదానం టికెట్లు జారీ, ఇతర సేవలను అందుబాటులోకి తీసుకురానున్నారు.

ఇక.. మరిన్ని సౌకర్యాలు

అన్నవరం వచ్చే భక్తులకు మెరుగైన సౌకర్యాల కల్పనకు సర్కారు ప్రత్యేక దృష్టి సారించింది. రెండో మెట్లమార్గం ప్రారంభం, వసతి సముదాయం నిర్మాణానికి శంకుస్థాపన ఈ నెల 22న దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి చేయనున్నారు.

● కొండ దిగువ నుంచి మరో మెట్ల మార్గం నిర్మాణం పూర్తైంది. ట్రాఫిక్, పార్కింగ్ సమస్యను నియంత్రించేందుకు సుమారు రూ.1.30 కోట్ల వ్యయంతో పనులు చేపట్టారు.

● రత్నగిరిపై 105 గదులతో వసతి సముదాయం నిర్మించనున్నారు. 210 గదులతో రెండు బ్లాక్‌లుగా నిర్మాణానికి ప్రణాళిక చేశారు.

ఆట మొదలైంది..!

శ్యామలాసెంటర్: శాప్ లీగ్ పోటీల్లో భాగంగా రాజమహేంద్రవరం ఎస్‌కేవీటీ డిగ్రీ కళాశాలలో చదరంగం పోటీలను సోమవారం శాప్ డైరెక్టర్ పేరం రవీంద్రనాథ్ ప్రారంభించి మాట్లాడారు. క్రీడాకారుల్లోని ప్రతిభ వెలికితీసేందుకు కూటమి పభుత్వం శాప్ లీగ్ పోటీలను నిర్వహించటం క్రీడాకారులకు వరమన్నారు. స్కూలు గేమ్స్ సెక్రటరీ ప్రసాద్ మాట్లాడుతూ ఈ నెల 24న సైక్లింగ్ పోటీలు ఉంటాయన్నారు.

రక్షణ కళ్లు.. విస్మరిస్తే సంకెళ్లు..!

హెచ్చరికలు బేఖాతరు చేస్తే తప్పదు మూల్యం

న్యూస్‌టుడే, కంబాలచెరువు (రాజమహేంద్రవరం) : నగరం రోజురోజుకు ట్రాఫిక్ పద్మవ్యూహం అవుతోంది. మరోవైపు నేరాలు సైతం పెరుగుతున్నాయి. వీటికి అడ్డుకట్ట వేయడానికి పోలీసు శాఖ సాంకేతికత సాయంతో వినూత్న అడుగులు వేస్తోంది. మరోవైపు సిబ్బంది కొరతను అధిగమిస్తూ..నగరంలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఉండేందుకు ప్రధాన కూడళ్లలో 'పబ్లిక్ అడ్రసింగ్ సిస్టం'ను తెరపైకి తెచ్చింది.

ఎలా పని చేస్తుందంటే..

● నిర్దేశిత ప్రాంతాల్లోని సీసీ కెమెరాలను సంబంధిత పోలీసుస్టేషన్‌కు అనుసంధానిస్తారు.

● స్థానిక పరిస్థితులను కెమెరాల్లో చూసి వాకీటాకీ ద్వారా పోలీసులు సూచనలు చేస్తారు.

● ఈ ఆదేశాలను స్థానిక ప్రజలకు 'పబ్లిక్ అడ్రసింగ్ సిస్టం'లో భాగంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక పరికరం ద్వారా ఆడియో వినిపించేలా చేస్తారు.

ఇదీ ఉపయోగం

✦ ఆయా ప్రాంతాల్లో ఘర్షణలు జరుగుతున్నా, ట్రాఫిక్ ఇబ్బందులున్నా స్టేషన్ నుంచి సీసీ కెమెరాల ద్వారా పర్యవేక్షించి అక్కడికి వెళ్లకుండానే ప్రజలకు సమాచారం మైక్ ద్వారా ఇవ్వవచ్చు.

✦ ట్రాఫిక్ కూడలిలో అడ్డదిడ్డంగా వాహనాలు ఎవరైనా నిలిపితే వెంటనే పోలీసుల నుంచి హెచ్చరికలు జారీ అవుతాయి. ✦ కళాశాల విద్యార్థినులు, మహిళలు ఈవ్‌టీజింగ్‌కు గురైతే వారికి వెంటనే భద్రత కల్పించేలా ఏర్పాట్లు చేస్తారు. ✦ చోరీలకు సైతం అడ్డుకట్ట పడే అవకాశం ఉంది.

పోలీసుస్టేషన్‌లో పబ్లిక్ అడ్రసింగ్ సిస్టం పరికరం పనితీరు పరిశీలిస్తున్న సీఐ అప్పారావు

ప్రయోగాత్మకంగా ..

ప్రస్తుతం ప్రయోగాత్మకంగా నగరంలోని మూడోపట్టణ, బొమ్మూరు పోలీసుస్టేషన్ల పరిధిలో వీటిని ఏర్పాటు చేశారు. జైలు రోడ్డు, క్వారీ కూడలిలో అందుబాటులోకి తెచ్చారు. దేవీచౌక్, పుష్కరఘాట్, దేవీచౌక్, లాలాచెరువు వంటి ప్రధాన ప్రాంతాల్లో ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నారు. బొమ్మూరు పోలీసుస్టేషన్ పరిధిలోని దివాన్‌చెరువు పండ్ల మార్కెట్, కొత్త హైవేకు వెళ్లే జీరో పాయింట్, మోరంపూడి, హుకుంపేట, బొమ్మూరు కూడళ్లు, నామవరంలోనూ ఏర్పాటు చేశారు.

స్త్రీ శక్తి.. అనుబంధాల మజిలీ..!

బంధుమిత్రుల మధ్య పెరిగిన రాకపోకలు

న్యూస్‌టుడే, వి.ఎల్.పురం

పండగకు తప్ప మిగతా రోజుల్లో పుట్టింటికి వెళ్లాలన్నా.. బంధువుల ఇళ్లలో జరిగే శుభకార్యాలకు హాజరు కావాలన్నా గతంలో సామాన్య, మధ్యతరగతి కుటుంబాల్లోని మహిళలు కాస్తా ఆలోచించే పరిస్థితి ఉండేది. ప్రయాణ ఛార్జీల భారంతో ఆయా కార్యక్రమాలకు వెళ్లలేకపోయేవారు. కొన్ని సందర్భాల్లో పిల్లలను ఇంటి వద్దే వదిలేసి ద్విచక్రవాహనంపై వెళ్లి వచ్చేవారు. తప్పనిసరి అయితేనే మహిళలు బస్సు ప్రయాణాలు చేసేవారు కాదు. ఇప్పుడు గృహప్రవేశమైనా, వివాహ వేడుకైనా, బంధువుల ఇళ్లలో జరిగే ఏ కార్యక్రమానికైనా హాజరవుతున్నారు. కూటమి ప్రభుత్వం స్త్రీశక్తి పథకం అమలుతో ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణాలు సాగించే మహిళల సంఖ్య పెరిగింది. ఉచిత ప్రయాణం బంధువుల మధ్య అనుబంధాన్ని పెంచింది. తరచూ ఆత్మీయులను కలుసుకుని ఆప్యాయంగా పలకరించుకునే అవకాశాన్ని కల్పించింది.

ఆధ్యాత్మికతకు ఊతం

ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం వల్ల ఇటు దేవాలయాల్లోనూ గతంలో కంటే భక్తుల రద్దీ పెరిగింది. ఎక్కువ మంది మహిళలు ఆర్టీసీ బస్సుల్లో దైవదర్శనాలకు వెళ్తున్నారు. నాలుగు డిపోల్లో మొత్తం 275 ఆర్టీసీ బస్సులు ఉండగా పల్లెవెలుగు, అల్ట్రా పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్‌లు కలిపి 194 బస్సుల్లో స్త్రీశక్తి పథకం అమలవుతోంది. గతేడాది ఆగస్టు 15 నుంచి ఈ పథకాన్ని అమలు చేస్తున్నారు. రాజమహేంద్రవరం గోకవరం, కొవ్వూరు, నిడదవోలు డిపోల పరిధిలోని ఆర్టీసీ బస్సుల్లో మొత్తం 1.57 కోట్ల మంది మహిళలు ఉచిత ప్రయాణాలు చేశారు. ఉచిత బస్సుల్లో 68 శాతం మందికిపైగా మహిళలే ప్రయాణాలు సాగిస్తున్నారని ఆర్టీసీ జిల్లాప్రజారవాణా అధికారి(డీపీటీవో) వై.ఎస్.ఎన్. మూర్తి తెలిపారు.

ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని వినియోగించుకుంటున్న మహిళలు

జిల్లాలో ఆర్టీసీ బస్సులు	275
పథకం వర్తించేవి	194
వినియోగించుకుంది	1.57 కోట్ల మంది
సర్కారు రాయితీ	రూ.50.48 కోట్లు

మధ్యాహ్న భోజనం.. సంతృప్తిగా లేం!

నాణ్యతపై కాకినాడ, తూర్పులో కొంత ప్రతికూల స్పందన

ఈనాడు, రాజమహేంద్రవరం: విద్యార్థులకు మెరుగైన విద్య, నాణ్యమైన ఆహారం పాఠశాల స్థాయిలో అందించి వారి సర్వతోముఖాభివృద్ధికి బాటలు వేయాలన్న ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం 'డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం' నిర్వహిస్తోంది. మెనూ పక్కాగా అమలుచేయాలని ఆదేశించింది. అయితే క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ లోపంతో ఇబ్బంది ఏర్పడుతోంది. ప్రజల సంతృప్తి స్థాయి తెలుసుకునేందుకు ప్రభుత్వం 5 ప్రశ్నలతో రాష్ట్ర వ్యాప్తంగా ఇటీవల 2.27 లక్షల మందిని సంప్రదించగా 24.4 శాతం మంది వ్యతిరేకంగా స్పందించారు.

జిల్లాలవారీగా 5 ప్రశ్నలకు విద్యార్థుల తల్లిదండ్రులు ఎలా స్పందించారంటే(శాతాల్లో)

✔ బాగు ✘ లేదు	మెనూ అమలు ✔	మెనూ అమలు ✘	రుచి ✔	రుచి ✘	నాణ్యత ✔	నాణ్యత ✘	చిక్కీ నాణ్యత ✔	చిక్కీ నాణ్యత ✘	అన్నం ✔	అన్నం ✘	రాష్ట్రంలో ర్యాంకు
తూర్పు	84.6	15.4	73.5	26.5	67.7	32.3	75.7	24.3	67.5	32.5	22
కాకినాడ	83.4	16.6	75.0	25	65.6	34.4	77.8	22.2	68.3	31.7	26
కోనసీమ	85.8	14.2	70.3	29.7	70.6	29.4	75.8	24.2	69.2	30.8	16
పోలవరం	85.6	14.4	81.1	18.9	76.0	24.0	78.5	21.5	76.3	23.7	4

వెనుకబడిన మన జిల్లాలు..

కాకినాడ, తూర్పు గోదావరి జిల్లాల్లో ఆహార పదార్థాల రుచి, నాణ్యతపై ఎక్కువమంది అసంతృప్తి వ్యక్తంచేశారు. అన్ని విభాగాల్లో కాకినాడ వెనుకబడి రాష్ట్రంలో 26వ స్థానంలో ఉంది. తూర్పు 22, కోనసీమ 16, పోలవరం 4వ స్థానంలో ఉన్నాయి.

కొన్నిచోట్ల ఇలా..

● తుని పరిధిలోని కొండవరపుపేట పాఠశాలలో చదువుతున్న 11 మంది విద్యార్థుల తల్లిదండ్రుల అభిప్రాయాలు సేకరించారు. చిక్కీలు బాగునాయని 25 శాతం మంది చెప్పగా.. మిగిలిన అన్ని ప్రశ్నలకూ వ్యతిరేకంగానే సమాధానమిచ్చారు.

● కాకినాడ జిల్లా గజ్జనపూడి పాఠశాలలో 11 మందిని సంప్రదించగా మెనూ అమలు సరిగా లేదని అందరూ చెప్పారు. 33 శాతం మంది పదార్థాలు రుచిగా ఉంటున్నాయని, 25 శాతం మంది అన్నం బాగుందని మాత్రమే తెలిపారు.

పదో తరగతి పరీక్షలకు 138 కేంద్రాలు: డీఆర్వో

కలెక్టరేట్ (రాజమహేంద్రవరం), న్యూస్‌టుడే: జిల్లాలో 138 కేంద్రాల్లో పదో తరగతి పబ్లిక్ పరీక్షల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నట్లు జిల్లా రెవెన్యూ అధికారి(డీఆర్వో) టి.సీతారామమూర్తి తెలిపారు. మంగళవారం కలెక్టరేట్‌లో సమన్వయ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. వచ్చేనెల 16 నుంచి జరిగే పదో తరగతి(ఎస్ఎస్‌సీ) పబ్లిక్ పరీక్షలకు జిల్లాలో మొత్తం 24,538 మంది విద్యార్థులు హాజరుకానున్నట్లు తెలిపారు. పరీక్షల నిర్వహణలో ఎటువంటి లోపాలు లేకుండా అన్నిశాఖలు పరస్పర సమన్వయంతో పనిచేయాలని, పరీక్ష కేంద్రాల వద్ద విద్యార్థులకు మౌలిక సదుపాయాలు కల్పించడం తోపాటు, భద్రతా చర్యలు తీసుకోవాలని సూచించారు. పాఠశాల విద్యాశాఖాధికారి కె.వాసుదేవరరావు మాట్లాడుతూ పరీక్ష కేంద్రాల వద్ద అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని, ప్రశాంత వాతావరణంలో పారదర్శకంగా పరీక్షల నిర్వహణకు చర్యలు తీసుకుంటున్నామన్నారు.

కొబ్బరి మార్కెట్‌కు తమిళనాడు దెబ్బ

న్యూస్‌టుడే, అంబాజీపేట

కోనసీమలో కొబ్బరి ధరలు ఒక్కసారిగా పతనమయ్యాయి. మహాశివరాత్రి, హోలీ పండగల నేపథ్యంలో ధరలు ఆశాజనకంగా ఉంటాయని భావించిన రైతులు, వర్తకులకు నిరాశే మిగిలింది. మహాశివరాత్రికి అనుకున్నంత లావాదేవీలు జరగకపోవడంతో పాటు పొరుగున ఉన్న తమిళనాడు రాష్ట్రంలో ఏర్పడిన పరిస్థితులే దీనికి కారణమని మార్కెట్ విశ్లేషకులు భావిస్తున్నారు.

ప్రధాన కారణాలు ఇవే..

కొబ్బరి కాయల ఉత్పత్తిలో కోనసీమకు పోటీగా ఉన్న తమిళనాడు ప్రభావం ఇక్కడి మార్కెట్‌పై పడింది. ఆ రాష్ట్రంలో ఉత్పత్తి బాగా పెరగడంతో పాటు పరిమాణం, నాణ్యత మేలు రకంగా ఉండటంతో ఇతర రాష్ట్రాల వ్యాపారులు వాటినే కొనుగోలు చేసేందుకు మక్కువ చూపుతున్నారు. దీంతో కోనసీమ కాయలకు డిమాండ్ తగ్గిపోయింది. పొరుగు రాష్ట్రాల నుంచి వ్యాపారులకు ఆర్డర్లు రావడం లేదు. గత నెలలో వెయ్యి పచ్చికాయలు రూ.18 వేల నుంచి రూ.20 వేల వరకు పలికింది. బిహార్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాలకు రోజుకు 50 నుంచి 60 లారీల ఎగుమతులు జరిగేవి. ప్రస్తుతం తమిళనాడు కాయలపై మక్కువ చూపుతున్నారు. వెయ్యి పచ్చికాయలు రూ.15 వేల నుంచి రూ.17 వేల మధ్య ఉంది. కురిడీలు, కొత్తకొబ్బరి ధరలు కూడా తగ్గినట్లు వ్యాపారులు చెబుతున్నారు. ఎగుమతులు సైతం సన్నగిల్లాయంటున్నారు.

11 రోజులు రూ.19 కోట్లు..

ఖర్చు చేయకుంటే మురిగిపోనున్న 'ఉపాధి' నిధులు

న్యూస్‌టుడే, వి.ఎల్.పురం

జాతీయ ఉపాధి హామీ పథకంలో మెటీరియల్ కాంపోనెంట్ నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులు పూర్తి చేయడానికి ఇంకా 11 రోజులే గడువుంది. ఈ నెలాఖరులోగా పనులు పూర్తి చేసి మార్చి 15లోగా బిల్లులు అప్‌లోడ్ చేయాల్సి ఉంది. వీటిని ఖర్చు చేయకుంటే మురిగిపోయే పరిస్థితి ఉంది. గడువు సమీపిస్తున్న సమయంలో హడావుడిగా పనులు చేస్తున్నప్పటికీ ఎంత నాణ్యతగా పూర్తి చేయగలుగుతారనేది ప్రశ్నార్థకంగా మారింది.

సమన్వయ లోపంతో..

శాఖల మధ్య సమన్వయ లోపం వల్లే పనులు వేగవంతంకాలేదన్న విమర్శలు ఉన్నాయి. గతంలో ఒక ఆర్థిక సంవత్సరంలో పనులు పూర్తి చేయకపోతే తర్వాత ఏడాది చేపట్టే అవకాశం ఉండేది. కొత్త విధానంలో ఆ అవకాశం లేదు.

ఇదీ పరిస్థితి: ● పల్లెపండగ 2.0 కింద రూ.40.29 కోట్లతో 290 రోడ్లు మంజూరు కాగా 180 పనులు పూర్తి చేశారు. రూ.35 కోట్ల బిల్లులు అప్‌లోడ్ చేశారు. ● రూ.15 కోట్లతో 900 గోకులం షెడ్లు మంజూరయ్యాయి. 461 నిర్మాణాలు పూర్తి చేశారు. ● పశువుల నీటితొట్టెలు 242కుగాను 222 పనులు పూర్తి చేశారు. ఇంకా రూ.16 లక్షలతో 20 పనులు పూర్తి చేయాల్సి ఉంది. ● 1,350 ఎకరాల్లో పండ్ల తోట పెంపకానికి సంబంధించి ప్లాంటేషన్ పనులకు రూ.7.15 కోట్లు మంజూరయ్యాయి. 1,217 ఎకరాల్లో మొక్కలు నాటే పనులు పూర్తి చేశారు.

గోకవరం మండలం అచ్చుతాపురంలో సీసీ రోడ్డు పనులు

మెటీరియల్ కాంపోనెంట్ నిధులతో చేపట్టినవి

మంజూరైన పనులు	2,782
కేటాయించిన నిధులు	రూ.63.36 కోట్లు
పూర్తి చేసిన పనులు	2,080
పురోగతిలో ఉన్నవి	702

గట్లు గుల్ల.. పర్యవేక్షణ డొల్ల

దేవరపల్లి, న్యూస్‌టుడే: ప్రకృతి వనరులు అక్రమార్కులకు కాసులు కురిపిస్తున్నాయి. 30 అడుగుల కాలువ గట్లను సైతం మాయం చేస్తున్నారు. గుట్టలను గుల్ల చేస్తున్నా అధికారులు పట్టించుకోవట్లేదనే విమర్శలు ఉన్నాయి. గోపాలపురం, దేవరపల్లి, నల్లజర్ల మండలాల్లో రోజుల తరబడి మట్టి దందా సాగుతున్నా యంత్రాంగం అటు వైపు కన్నెత్తి చూడకపోవడం గమనార్హం. ఇటీవల దేవరపల్లి మండలం కృష్ణంపాలెం, యర్నగూడెం మధ్య గట్టుపై అక్రమార్కుల కన్ను పడింది.

30 కి.మీ. మేర తవ్వకాలు..

ఈ మూడు మండలాల్లో సుమారు 30 కిలోమీటర్ల మేర పోలవరం కుడి కాలువ విస్తరించి ఉంది. గోపాలపురం మండలం రాజంపాలెం నుంచి నల్లజర్ల మండలం ఘంటావారిగూడెం వరకు తవ్వకాలు జరుగుతున్నాయి. ప్రధానంగా పెద్దాపురం, వేళ్లచింతలగూడెం, చెరుకుమిల్లి, గుడ్డిగూడెం, బంధపురం, దేవరపల్లి, కృష్ణంపాలెం, యర్నగూడెం, నల్లజర్ల, అనంతపల్లి, గ్రామాల్లో పెద్దఎత్తున తవ్వి, తరలించేస్తున్నారు.

కృష్ణంపాలెం సమీపంలో తవ్వేసిన పోలవరం కుడి కాలువ గట్టు

దూరాన్ని బట్టి ధర..

కాలువ గట్టును తవ్వేందుకు జేసీబీకి ట్రిప్‌నకు రూ.100 ఇస్తున్నారు. దానిని రాత్రి పూట, రద్దీ తక్కువగా ఉండే సమయాల్లో ట్రాక్టర్లలో తరలిస్తున్నారు. దూరాన్ని బట్టి రూ.600 నుంచి రూ.800 వరకు వసూలు చేస్తున్నట్లు సమాచారం. దానిని ఇంటి పునాదులు, ఇటుకల బట్టీలకు, లేఔట్లకు తరలిస్తున్నారు. స్థానిక నాయకుల అండదండలతోనే తవ్వకాలు జరుగుతున్నాయనే విమర్శలు ఉన్నాయి.

నిఘా

ఖాళీ అయితే విక్రయాలు..

గత వైకాపా ప్రభుత్వ హయాంలో మట్టి తవ్వకాలు అధికంగా జరిగాయి. ఆ తర్వాత ఖాళీ అయిన స్థలాలను విక్రయించడం లేదా కౌలుకు ఇస్తున్నారని సమీప ప్రాంతాల రైతులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి దీనిపై చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

చర్యలు తీసుకుంటాం..

మట్టిని తరలిస్తున్న వారిపై సిబ్బందిని నియమించి నిఘా ఏర్పాటు చేశారు. గట్లను ఆక్రమించిన ప్రాంతాల్లో రెవెన్యూ, మైనింగ్ అధికారులతో పరిశీలిస్తాం. అనంతపల్లిలో అక్రమించినట్లు క్షేత్రస్థాయిలో ప్రాథమికంగా గుర్తించాం. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం. మట్టి మాఫియాపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. - కె.శ్రీనివాసరావు, డీఈ, పోలవరం కుడి కాలువ

కండల వీరులు.

నన్నయ విశ్వవిద్యాలయంలో అంతర్ కళాశాలల దేహదారుఢ్య పోటీలు ఉత్సాహంగా సాగాయి. ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల పరిధిలోని అనుబంధ కళాశాలల విద్యార్థులు హాజరయ్యారు. ప్రతిభ చాటిన వారిని వర్సిటీ జట్టుకు ఎంపిక చేశారు. బెస్ట్‌ఫిజిక్ మెన్ టీమ్ ఛాంపియన్ షిప్‌ను కాకినాడ పి.ఆర్.ప్రభుత్వ కళాశాల కైవసం చేసుకుంది. – న్యూస్‌టుడే, రాజానగరం

'రత్నం' పెన్ గొప్పతనాన్ని చూసి దేశం గర్విస్తోంది : లోకేశ్

రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ: వందేళ్ల చరిత్రకు దగ్గరగా వెళ్తున్న రత్నం పెన్ గొప్పతనాన్ని చూసి, దేశం గర్విస్తోందని మంత్రి నారా లోకేశ్ మంగళవారం ఎక్స్‌లో పోస్టు చేశారు. దేశంలో కళాకారుల పనితనానికి రాజమహేంద్రవరంలో తయారవుతున్న రత్నం పెన్ నిదర్శనమన్నారు. స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్న ఎందరో మహనీయుల చేతి రాతలతో కీర్తి గడించిందన్నారు. ఆత్మనిర్భర భారత్‌లో ఇటువంటి స్వదేశీ సంస్థలను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు.

గురుకులం పిలుస్తోంది..

కడియం, న్యూస్‌టుడే: మహాత్మా జ్యోతిబాపులే బీసీ గురుకులాల్లో 2026-27 విద్యా సంవత్సరానికి సంబంధించి ప్రవేశాల ప్రక్రియ మొదలైంది. 5వ తరగతిలో ప్రవేశాలు, 6, 7, 8వ తరగతుల్లోని బ్యాక్‌లాగ్ అడ్మిషన్లకు దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. గతంలో లాటరీ ద్వారా తీసుకోగా ఈసారి ప్రతిభ పరీక్ష ఆధారంగా తీసుకోనున్నట్లు అధికారులు తెలిపారు. జిల్లాలో 4 గురుకులాల్లో 160 సీట్లు ఉన్నాయన్నారు.

అర్హత: ☛ 9 నుంచి 11 ఏళ్ల మధ్య వయసున్న బీసీ, ఈబీసీ విద్యార్థులు.

☛ తల్లిదండ్రులు లేదా సంరక్షకుల వార్షికాదాయం రూ.లక్షకు మించకూడదు.

పరీక్ష: తెలుగు, ఆంగ్లం 10 మార్కులు చొప్పున, గణితం 15 మార్కులు, సైన్స్, సోషల్ కలిపి 15 మార్కులు కలిపి 50 మార్కులకు పరీక్ష ఉంటుంది. 4వ తరగతి స్థాయిలో ప్రశ్నలు ఉంటాయి. రెండు గంటల సమయం ఉంటుంది.

దరఖాస్తు: మార్చి 4లోగా http:///mjpapbcwreis.apcfss.in వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.

జిల్లాలో ఇలా..

బొమ్మూరు	బాలికలు	40
గోపాలపురం	బాలికలు	40
కొవ్వూరు	బాలురు	40
గోపాలపురం	బాలురు	40

గస్తీ ముమ్మరం

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): ప్రజల భద్రతకు ప్రాధాన్యమిస్తూ నేరాలు జరగకుండా రాత్రి గస్తీ మరింత ముమ్మరం చేసినట్లు ఎస్పీ డి.నరసింహకిషోర్ తెలిపారు. ప్రత్యేక పోలీసు బృందాలను రంగంలోకి దింపామన్నారు. వాహనాల తనిఖీ, రోడ్డు ప్రమాదాల నివారణ, డ్రంక్ అండ్ డ్రైవ్, జాతీయ రహదారిపై ప్రయాణించే వాహనదారులకు ఫేస్‌వాష్ అండ్ గో కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు.

జాతీయ రహదారిపై డ్రైవర్‌తో ముఖం కడిగిస్తున్న పోలీసులు

44 సెకన్లు.. 7 శ్లోకాలు

అమలాపురం గ్రామీణం, న్యూస్‌టుడే: పాఠశాలలో నేర్పించే శ్లోకాలను ఈ చిన్నారి అలవోగా చెప్పేస్తోంది. కామనగరువుకు చెందిన ముమ్మిడివరపు ఆరాశ్రీదత్త నాలుగున్నరేళ్ల వయసులోనే ఇండియా బుక్ ఆఫ్ రికార్డును సొంతం చేసుకుంది. 44 సెకన్లలో ఏడు సంప్రదాయ హిందూ శ్లోకాలను చెప్పి ఈ ఘనత సాధించింది. ప్రస్తుతం నిమిషంలో 12 హిందూ శ్లోకాలను చెబుతున్నట్లు చిన్నారి తల్లిదండ్రులు ప్రదీప్ కుమార్, ఫణిశ్రీ చెప్పారు. వీరిద్దరూ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లుగా ఉద్యోగం చేస్తూనే చిన్నారితో శ్లోకాలను సాధన చేయిస్తున్నారు. ప్రస్తుతం దిల్లీ పబ్లిక్ స్కూల్‌లో చదువుతోంది. రికార్డు కైవసం చేసుకున్న చిన్నారిని కలెక్టర్ మహేష్‌కుమార్, జేసీ నిశాంతి, ఆర్డీవో మాధవి మంగళవారం అభినందించారు

రికార్డుతో ఆరాశ్రీదత్త

విలస @ 1200

ఈ ఏడాది పులసల లభ్యత గణనీయంగా తగ్గిపోయింది. గోదావరి వరదల సమయంలో మత్స్యకారులు ఎంత వేటాడినా వలలకు చిక్కలేదు. ఎక్కడైనా అరకొరగా లభ్యమైనా ఒక్కోటి పరిమాణం బట్టి రూ.15 వేల నుంచి రూ.30 వేల వరకు పలికింది. దీంతో పులసప్రియులు, మత్స్యకారులు తీవ్ర నిరాశ చెందారు. ప్రస్తుతం తేటనీటిలో వలలకు చిక్కుతున్నాయి. వీటిని విలసలుగా పిలుస్తుంటారు. మంగళవారం పి.గన్నవరం మార్కెట్‌కి రెండు విలసలు తీసుకొచ్చి విక్రయించారు. పరిమాణం బట్టి రూ.600 నుంచి రూ.1200 ధరకు విక్రయించారు. - న్యూస్‌టుడే, పి.గన్నవరం

ఈనాడు

దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించండి

Cell: 80085 97607

ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి

Cell: 80082 34669

చుట్టుముట్టిన గోదావరి

గండిపోశమ్మ ఆలయం, పంటల మునక

దేవీపట్నం, న్యూస్‌టుడే: పోలవరం ప్రాజెక్టు బ్యాక్ వాటర్ (వెనుక జలాలు) కారణంగా వారం రోజులుగా గోదావరి పెరుగుతూనే ఉంది. మంగళవారం సాయంత్రానికి అడుగు మేర నీటి మట్టం పెరగడంతో గండిపోశమ్మ ఆలయాన్ని వరద చుట్టుముట్టింది. భక్తుల క్యాలెన్లు, సమీపంలోని దుకాణాలు ముంపునకు గురయ్యాయి. పోశమ్మగండి నుంచి పి.గొందురు వైపు పలుచోట్ల ఆర్‌అండ్‌బీ రహదారిని ఆనుకుని గోదావరి ప్రవహిస్తోంది. పి.గొందూరు వద్ద వరిచేలు, దండంగి, చినరమణయ్యపేట, కె.వీరవరం పరిసర ప్రాంతాల్లో మొక్కజొన్న చేలు ముంపునకు గురయ్యాయి. దండంగి ఆర్‌అండ్‌బీ రహదారిపై నీరు చేరడంతో వాహనాల రాకపోకలు స్తంభించాయి. పోలవరం ముంపు గ్రామాల్లో తక్కువ పన్నులకు పొలాలు రావడంతో రైతులు మొక్కజొన్న సాగు చేపట్టారు. ఒక్కసారిగా గోదావరి పెరగడంతో నష్టాలు తప్పవని కర్షకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఆలయాన్ని ముంచెత్తిన ప్రవాహం

గండిపోశమ్మ వారి ఆలయం వద్ద గోదావరి పెరుగుతున్నా భక్తుల రాక మాత్రం తగ్గలేదు. మంగళవారం మైదాన ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు కొండపై నుంచే అమ్మవారికి పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. కొండ ప్రాంతంలో వంటావార్పు కార్యక్రమాలు నిర్వహించుకున్నారు. గోదావరి వరదల కారణంగా ఏడు నెలలుగా అమ్మవారి దర్శనాలు నిలిచిపోయిన సంగతి తెలిసిందే. దేవస్థానం అధికారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయకపోవడంతో భక్తులకు ఇబ్బందులు తప్పడం లేదు. ఆలయానికి ఆదాయం కూడా తగ్గిపోతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కొండపై నుంచే పూజలు..

1,556 అంగన్‌వాడీ కేంద్రాలకు.. రూ.70 లక్షల జమ

బొమ్మూరు: జిల్లాలోని 1,556 అంగన్‌వాడీ కేంద్రాలకు నెలకు రూ.500 చొప్పున అయిదు నెలలకు సంబంధించి రూ.46.68 లక్షలు జమ చేసినట్లు మహిళా శిశు సంక్షేమ శాఖ పీడీ శ్రీదేవి మంగళవారం తెలిపారు. సామాజిక వేడుకల కోసం నెలకు రూ.500 చొప్పున 3 నెలలకు రూ.23.34లక్షలు ఇచ్చారన్నారు. ఈ సొమ్మును సీమంతాలు, అక్షరాభ్యాసాలు వంటి కార్యక్రమాలకు వినియోగించాలని సూచించారు.

(c) eenadu

'వికసిత్ భారత్' లక్ష్యాల సాధనతో సమగ్ర ప్రగతి : ఎంపీ

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ పురందేశ్వరి

టి.నగర్, న్యూస్‌టుడే: వికసిత్ భారత్ లక్ష్యాలను సాధించడం ద్వారా సమగ్ర ప్రగతి సాధ్యమని ఎంపీ పురందేశ్వరి అన్నారు. నగరంలో మంగళవారం సామాజిక మాధ్యమాల ప్రతినిధులతో జరిగిన సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. దేశ ఆర్థిక వ్యవస్థను బలపర్చే దిశగా బడ్జెట్ 2026 ప్రకటించామన్నారు. దీర్ఘకాలిక అభివృద్ధికి పునాది వేసే దిశగా కేంద్రం ఆలోచన చేస్తోందన్నారు. పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లక్ష్మీప్రసన్న మాట్లాడుతూ దేశ అభివృద్ధి దిశగా ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలు, బడ్జెట్ లక్ష్యాలను ప్రజల్లోకి చేర్చేందుకు సోషల్ మీడియా కీలక వేదికగా నిలుస్తుందన్నారు. సానుకూల సమాచారాన్ని సమాజానికి చేరవేయడంలో బాధ్యతగా వ్యవహరించాలన్నారు. సోషల్ మీడియా కన్వీనర్ కేశవకాంత్, జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

వేద పరిపుష్టితో ధర్మ రక్షణ

పురుషోత్తమ రామ మందిరంలో చతుర్వేద పారాయణం చేస్తున్న పండితులు

కొవ్వూరు పట్టణం, న్యూస్‌టుడే: పవిత్ర గౌతమి నదీ తీరం వేద మంత్రోచ్చారణలతో పులకించింది. శ్రీశంకరాచార్య మేడూరి సుబ్బన్న వేదశాస్త్ర పరిషత్తు ఆధ్వర్యంలో గౌతమి ఘాట్ పురుషోత్తమ రామమందిరంలో మంగళవారం వేదశాస్త్ర సభ నిర్వహించారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వేద పండితులు రుగ్వేదం, శుక్ల కృష్ణ యజుర్వేదం, సామవేదం, అధర్వణ వేద పారాయణం అనంతరం వేదాశీర్వచనం చేశారు. సుమారు 80 మంది ఘనాపాఠీలు, క్రమపాఠీలు, స్మార్తులు, పండితులు హాజరవ్వగా సభానంతరం వారిని సత్కరించారు. పండితులు శ్రీపాద మాణిక్యావధానులు, నోరి భోగేశ్వరశర్మ, దోర్బల ప్రభాకర శర్మ, ఆరాధ్యుల అప్పన్న సోమయాజి మాట్లాడుతూ 27 సంవత్సరాలుగా వేద శాస్త్ర పరిషత్తు చేస్తున్న సేవలు ఆదర్శంగా నిలుస్తున్నాయన్నారు. వేద విస్తృతితో ధార్మిక జీవనం, ధర్మ పరిరక్షణ సాధ్యమన్నది పరిషత్తు సంకల్పమన్నారు. పరిషత్తు అధ్యక్షుడు మేడూరి సూర్యనారాయణ, కార్యదర్శి మేడూరి శ్రీనివాస్ పర్యవేక్షించగా స్థానిక పండితులు అనుపిండి చక్రధరరావు, కోటేశ్వరరావు తదితరులు హాజరయ్యారు.

దుమ్ము.. దుమారం

ఉండ్రాజవరం మండలంలోని వడ్లూరు, పెరవలి రహదారిలో కాకరపర్రు కాలువ ప్రాంతంలో వాహనాల రాకపోకల సమయంలో రోడ్డుపై నిలువెత్తున దుమ్ము రేగుతోంది. దీంతో వెనుక నుంచి వెళ్లే వారికి కళ్లలో పడుతుండడంతో ఇబ్బందులు తప్పడం లేదు. దుమ్ము తెర కారణంగా ముందు ఏముందో తెలిక అవస్థలు ఎదుర్కొంటున్నారు. కొన్ని సందర్భాల్లో అదుపు తప్పి వాహనాలు బోల్తాపడి ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఆ ప్రాంతంలో రోడ్డు అభివృద్ధి చేయాలని పరిసర గ్రామాల ప్రజలు కోరుతున్నారు. పరిశీలించి చర్యలు తీసుకుంటామని ర.భ.శాఖ ఏఈ శ్రీనివాస్ తెలిపారు.

– న్యూస్‌టుడే, ఉండ్రాజవరం

పుష్కరాల ప్రణాళికపై ముఖ్యమంత్రితో భేటీ

సీఎంతో ఎమ్మెల్యేలు వెంకటరాజు, బుచ్చయ్యచౌదరి

గోపాలపురం, న్యూస్‌టుడే: రానున్న గోదావరి పుష్కరాల ఏర్పాట్లపై ముఖ్యమంత్రి చంద్రబాబుతో రాజమహేంద్రవరం గ్రామీణం, గోపాలపురం ఎమ్మెల్యేలు గోరంట్ల బుచ్చయ్య చౌదరి, మద్దిపాటి వెంకటరాజు చర్చించారు. అమరావతిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో మంగళవారం కలిసినట్లు మద్దిపాటి తెలిపారు. పుష్కరాలకు వచ్చే యాత్రికుల సురక్షితంగా వెళ్లే వరకు శుభ్రత, ఆరోగ్య, విశ్రాంతి మండపాలు, సాంకేతిక వినియోగం సీసీ కెమెరాలు, డ్రోన్ పర్యవేక్షణ తదితర అంశాలపై తీసుకుంటున్న చర్యలు, లక్షల మంది హాజరయ్యే పుష్కరాల నిర్వహణలో ఏఐ వినియోగంపై రూపొందించిన ప్రత్యేక ప్రణాళికను ముఖ్యమంత్రికి వివరించినట్లు ఆయన తెలిపారు.

మట్టి అక్రమ తవ్వకాల పరిశీలన

అంగర: కేదార్లంకలో రాత్రి సమయాల్లో అక్రమంగా మట్టి తవ్వకాలు చేస్తున్న ప్రాంతాలను తహసీల్దార్ శ్రీనివాస్ మంగళవారం పరిశీలించారు. ఏటిగట్టు వెంబడి తవ్వకాలు జరిగిన ప్రాంతాలను అధికారులతో కలిసి సందర్శించారు. 'లంకమట్టి...కొల్లగొట్టి' శీర్షికతో ప్రచురించిన కథనానికి అధికారులు స్పందించారు. తహసీల్దార్ మాట్లాడుతూ కొందరు రైతులకు చెందిన జిరాయితీ భూముల్లో తవ్వకాలు చేస్తున్నట్లు గుర్తించామన్నారు. ఆయా రైతులతో మాట్లాడి ఉన్నతాధికారులకు నివేదిస్తామని తెలిపారు. అక్రమ తవ్వకాలతో పాటు మట్టి తరలింపును అడ్డుకోవడానికి రెవెన్యూ, పోలీసు, పంచాయతీ అధికారుల సమన్వయంతో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు.

గంగపుత్రులకు తాగునీటి బెంగ
హార్బర్‌లో తప్పని ఇక్కట్లు

న్యూస్‌టుడే, సఖినేటిపల్లి

అంతర్వేది పల్లిపాలెంలో ఉన్న మినీ ఫిషింగ్ హార్బర్‌కు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి చేపలవేట కోసం వచ్చే గంగపుత్రులకు తాగునీటి కష్టాలు తప్పడం లేదు. ఇందుకోసం రూ.వేలు వ్యయం చేయాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల 60 వేల లీటర్ల తాగునీటి ఓవర్‌హెడ్ ట్యాంకు మంజూరు చేసినా పనుల ప్రారంభంలో జాప్యంతో అవస్థలు తప్పడం లేదు. ప్రస్తుతం వేసవి కాలం వచ్చేసింది. దీంతో మరిన్ని అవస్థలు తప్పవని వాపోతున్నారు.

ట్యాంకుల ద్వారా తాగునీటిని తీసుకొచ్చిన వాహనం

కమిటీని నియమించినా..

మత్స్యకారుల సంక్షేమమే లక్ష్యంగా 2016-19లో అప్పటి తెదేపా ప్రభుత్వం రూ.32 కోట్లు మంజూరు చేసి అంతర్వేదిలో మినీ ఫిషింగ్ హార్బర్‌ను నిర్మించింది. కొన్ని మౌలిక సదుపాయాలు కల్పించింది. మరికొన్ని మిగిలి ఉండగా వైకాపా ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. ఏవిధమైన అభివృద్ధి కార్యక్రమాలపై శ్రద్ధపెట్టలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆరు నెలల కిందట కలెక్టర్ ఛైర్మన్‌గా 14 మంది సభ్యులతో కమిటీని ఏర్పాటు చేసింది. పీపీపీ విధానంలో అభివృద్ధి చేయడానికి టెండర్ ద్వారా ఆర్‌ఆర్ ఏజెన్సీకి బాధ్యతలు అప్పగించింది. అభివృద్ధిలో భాగంగా 60 వేల లీటర్ల తాగునీటి ఓవర్‌హెడ్ ట్యాంకు మంజూరు చేశారు. దీని నిర్మాణానికి ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు మెగా ఇంజినీరింగ్ సంస్థకు అప్పగించారు. రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ భూమిపూజ చేశారు. కేవలం మట్టి పరీక్షలు తప్ప ఇప్పటివరకు పనులు ప్రారంభించలేదు.

ప్రైవేట్‌గా కొనుగోలు చేయలేక..

తాగునీటి సౌకర్యం లేకపోవడంతో ప్రైవేట్ వ్యక్తుల నుంచి లీటరు రూ.1 చొపున తెప్పకు రూ.50, ఫైబర్ బోటుకు రూ.600, సోనా బోటుకు రూ.1500 అదనపు ఖర్చు అవుతుందని చెబుతున్నారు. కొందరైతే నగదు ఇవ్వలేక చేపలిస్తుంటారు (వస్తు మార్పిడి పద్ధతి). అదనపు ఖర్చుతో ఇక్కడికి రావడానికి ఆసక్తి చూపక కాకినాడ, మచిలీపట్నం హార్బర్లకు వెళ్లిపోతున్నారు. తాగునీటి సౌకర్యం కల్పిస్తే రోజుకు 200 బోట్ల వరకు వస్తాయని జాలర్లు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

రోజువారీ వచ్చే బోట్ల సంఖ్య: 50–100

ఒక్కో బోటుపై ఉండేవారు: ఆరుగురు

నీటి అవసరం ఇలా.. (లీటర్లు)
- తెప్పబోటుకు (రోజుకు): 50
- ఫైబర్ బోటుకు (4 రోజులకు): 600
- సోనా బోటుకు (వారానికి): 1500

త్వరలో ప్రారంభిస్తాం..

హార్బర్‌లో ఓవర్‌హెడ్ ట్యాంకు నిర్మాణం మెగా ఇంజినీరింగ్ సంస్థ చేపడుతుంది. నిర్మాణ ప్రదేశంలో మట్టి పరీక్షలు జరిగాయి. మత్స్య, పంచాయతీరాజ్ నుంచి ఎన్‌వోసీ ఇవ్వాల్సి ఉంది. ఇచ్చిన వెంటనే పనులు ప్రారంభిస్తాం. మూడు నెలల్లో పూర్తి చేస్తాం.

- మారుతీరావు, డీఈ, ఆర్‌డబ్ల్యూఎస్, రాజోలు

కాటన్ బ్యారేజీ గేట్లకు మరమ్మతులు చేపట్టండి: ఎమ్మెల్యే నల్లమిల్లి

మాట్లాడుతున్న రామకృష్ణారెడ్డి

అనపర్తి గ్రామీణం: కాటన్ బ్యారేజీ గేట్లకు తక్షణమే మరమ్మతులు చేయించాలని అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి కోరారు. మంగళవారం అసెంబ్లీలో ఆయన మాట్లాడుతూ పలు సమస్యలు లేవనెత్తారు. కాటన్ బ్యారేజీని వైకాపా ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని, 2022లో 117 గేట్లు మార్చాలని సీడబ్ల్యూసీ నిపుణులు హెచ్చరించినా, ప్రపంచ బ్యాంకు ప్రతినిధులు రూ.200 కోట్ల నిధులు ఇస్తామన్నా పట్టించుకోలేదన్నారు. 2014లో ముఖ్యమంత్రిగా చంద్రబాబు రూ.31.77 కోట్లతో 64 గేట్లకు మరమ్మతులు చేయించారని గుర్తుచేశారు. తాజాగా మరమ్మతుల కోసం నిధులు మంజూరు చేశారన్నారు. ఇపుడున్న క్లోజర్ పీరియడ్‌లో మరమ్మతులు చేపట్టాలని కోరారు. అలాగే గోదావరి డెల్టాలోని లాకులు, షట్టర్ల మరమ్మతులకు నిధులు మంజూరుచేసి లీకులను అరికట్టాలన్నారు. గోదావరిలో నీరు తక్కువగా ఉందనే నెపంతో వెంకటనగరం ఎత్తిపోతల పథకాన్ని నిలిపివేయడం సరికాదని, వారం రోజుల పాటు నడపాలని కోరారు.

జేఈఈ మెయిన్ ఫలితాల్లో
తిరుమల ప్రతిభ

విద్యార్థులను అభినందిస్తున్న తిరుమల విద్యాసంస్థల అధినేత తిరుమలరావు, తదితరులు

కంబాలచెరువు (రాజమహేంద్రవరం), న్యూస్‌టుడే: జేఈఈ మెయిన్ ఫలితాల్లో రాజమహేంద్రవరంలోని తిరుమల ఐఐటీ అండ్ మెడికల్ అకాడమీ విద్యార్థులు ప్రతిభ చాటారని తిరుమల విద్యాసంస్థల ఛైర్మన్ నున్న తిరుమలరావు తెలిపారు. తమ అకాడమీ విద్యార్థి డి.శ్రీవేద్ 99.999 పర్సంటైల్ సాధించి ఎస్సీ కేటగిరీలో ఆలిండియా టాపర్‌గా నిలిచాడన్నారు. ఎం.కృష్ణ శరవణ సాకేత్ 99.99, గన్నమనీడి వాత్సల్య 99.98, జి.ప్రభవ్ తేజ 99.97, ఎం.సోనీష్ శివసాయి శ్రీవాత్స, పి.వెంకట నాగ సూర్య ధావన్, ఎం.వెంకట సత్యవివేక్ 99.95 పర్సంటైల్ చొప్పున సాధించారని వివరించారు. 99.50 పర్సంటైల్‌కు పైగా 57, 99 పర్సంటైల్‌కు పైగా 121, 98 పర్సంటైల్‌కు పైగా 226, 97 పర్సంటైల్‌కు పైగా 323, 96 పర్సంటైల్‌కు పైగా 410, 95 పర్సంటైల్‌కు పై 492, 90 పర్సంటైల్‌కు పైగా 829 మంది చొప్పున సాధించారన్నారు. సుమారు 800 మంది వివిధ ఎన్‌ఐటీ, ఐఐటీల్లో సీట్లు సాధించగలరన్నారు. అత్యుత్తమ ప్రతిభ చూపిన విద్యార్థులను అకడమిక్ డైరెక్టర్ జి.సతీష్‌బాబు, ప్రిన్సిపల్ వి.శ్రీహరితో కలిసి మంగళవారం అభినందించారు.

శ్రీషిర్డీసాయి జయకేతనం

శ్రీషిర్డీసాయి విద్యార్థులను అభినందిస్తున్న యాజమాన్యం

కంబాలచెరువు(రాజమహేంద్రవరం): జేఈఈ మెయిన్-2026 ఫలితాల్లో రాజమహేంద్రవరంలోని శ్రీషిర్డీసాయి జూనియర్ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చి వివిధ కేటగిరీల్లో అత్యుత్తమ పర్సంటైల్ సాధించారని విద్యాసంస్థల డైరెక్టర్ టి.శ్రీవిద్య మంగళవారం తెలిపారు. తమ లక్ష్య ఐఐటీ అకాడమీలో శిక్షణ పొందుతున్న ఎం.కృష్ణ శ్రీకృతి 99.91, కె.రామకార్తిక్ 99.71, ఎం.శ్రీనివాస్ 99.68, బి.శ్రీనిశాంత్ 99.63, కేవీఎంకే ప్రణీత్ 99.48, కె.సాత్విక్ 99.28, ఎ.లోహిత్‌కుమార్ 99.23, బి.శ్రీనిహాంత్ 99.11 పర్సంటైల్ చొప్పున సాధించారన్నారు. మొత్తం ఎనిమిది మంది 99కి పైగా పర్సంటైల్, 16 మంది 98కి పైగా, 28 మంది 97కిపైగా 52 మంది 95కి పైగా పర్సంటైల్ సాధించారన్నారు. శ్రీషిర్డీసాయి విద్యాసంస్థల ఛైర్మన్ తంబాబత్తుల శ్రీధర్ మాట్లాడుతూ జేఈఈ మెయిన్‌కు హాజరైన 284 మంది విద్యార్థుల్లో 184 మంది అడ్వాన్స్‌డ్‌కు అర్హత సాధించారన్నారు. ప్రతిభ చాటిన విద్యార్థులను, కృషి చేసిన అధ్యాపక బృందాన్ని ఛైర్మన్ శ్రీధర్, లక్ష్య డీన్ చంద్రశేఖర్ ప్రత్యేకంగా అభినందించారు.

మెరిసిన ఆదిత్య

శ్రీసాయి వైభవ్ రాఘవరావు
శ్రీజన్ శ్రీరామ్

గాంధీనగర్: జేఈఈ మెయిన్-2026 ఫలితాల్లో ఆదిత్య విద్యార్థులు జాతీయస్థాయిలో అత్యుత్తమ పర్సంటైల్స్‌తో సత్తా చాటారని ఛైర్మన్ ఎన్.శేషారెడ్డి మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను అభినందించారు. ఆదిత్య విద్యా సంస్థల కార్యదర్శి ఎన్.కృష్ణ దీపక్ రెడ్డి మాట్లాడుతూ ఎన్.శ్రీసాయివైభవ్ 99.99, వివిఎస్ఎస్ రాఘవరావు, గంజి శ్రీజన్ 99.98, బుడి శ్రీరామ్ 99.97, సత్యం భువనచంద్ర 99.96 పర్సంటైల్‌ను సాధించారన్నారు. మొత్తం 41 మంది విద్యార్థులు 99, ఆపైన పర్సంటైల్‌తో అత్యుత్తమ ప్రతిభ కనబర్చారన్నారు. డైరెక్టర్లు ఎన్.లక్ష్మీరాజ్యం, ఎన్.శృతి, ఎన్.సుగుణ, కోఆర్డినేటర్ కె.లక్ష్మీకుమార్, అకడమిక్ డైరెక్టర్ రాఘవరెడ్డి, గంగిరెడ్డి, ప్రిన్సిపల్స్ జె.మెయిన, పి.సత్యనారాయణరెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ ఫణీంద్ర తదితరులు విద్యార్థులు, అధ్యాపకులను అభినందించారు.

దేహదారుఢ్య పోటీల్లో అదరగొట్టిన కుర్రాళ్లు

విజేతలతో వీసీ ప్రసన్నశ్రీ, అధ్యాపకులు

రాజానగరం, న్యూస్‌టుడే: యువత చదువుతో పాటు అన్నిరంగాల్లో రాణించాలని నన్నయ విశ్వవిద్యాలయం వీసీ ప్రసన్నశ్రీ పేర్కొన్నారు. నన్నయలో మంగళవారం అంతర్ కళాశాలల దేహదారుఢ్య పోటీలు, వర్సిటీ జట్టు ఎంపికలు నిర్వహించారు. వివిధ విభాగాల్లో జరిగిన పోటీలో యూనివర్సిటీ అనుబంధ కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విజేతలకు వీసీ ఎస్.ప్రసన్నశ్రీ చేతుల మీదుగా పతకాలు అందించారు. ఆర్గనైజింగ్ ఛైర్మన్ కె.సుబ్బారావు, కార్యదర్శి వి.సాల్మన్ దేవానంద్, పరిశీలకులు ఆర్.వి.ఎల్.ఎస్.రత్నాకర్, సెలక్షన్ కమిటీ సభ్యులు వై.భాస్కరరావు, వి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

విజేతల వివరాలు: ● 60 కిలోల విభాగం: ఎన్.పూర్ణ సతీష్, కె.జగదీష్‌కుమార్ (డీఎన్ఆర్ కళాశాల, భీమవరం), ఆర్.కాశీవిశ్వనాథ్ (ఐడియల్ కళాశాల, కాకినాడ) మొదటి మూడు స్థానాల్లో నిలిచారు. ● 65 కిలోలు: వై.భరత్(ఆదిత్య కళాశాల, ఏలూరు), పి.సూరిబాబు(గోపన్నపాలెం), ఎ.జగదీష్(పాలకొల్లు). ● 70 కిలోలు: ఎల్.వి.సూర్యప్రకాష్, బి.సాయిప్రశాంత్, బి.దుర్గాప్రసాద్(పీఆర్ కళాశాల, కాకినాడ). ● 75 కిలోలు: ఎం.సాయిలోకేష్(సీ.ఆర్.రెడ్డి కళాశాల, ఏలూరు), బి.మహేష్, డి.అరుణ్‌కుమార్ (పీఆర్ కళాశాల, కాకినాడ) తొలి మూడు స్థానాల్లో నిలిచారు. ● 80 కిలోలు: పి.విజయ చాముండేశ్వర్ (పీఆర్ కళాశాల, కాకినాడ) ● 85 కిలోలు: షేక్‌మన్సూర్ (బీవీ రాజు కళాశాల, భీమవరం), 90 కిలోలు: కె.పవన్‌సాయి (పీఆర్ కళాశాల, కాకినాడ), 95 కిలోలు: కె.పాండురంగ వరప్రసాద్ (డా.సీ.ఎస్.కళాశాల, భీమవరం) పతకాలు సొంతం చేసుకున్నారు. ● మిస్టర్ నన్నయ విశ్వవిద్యాలయం 2025-26 ట్రోఫీని కె.పాండురంగ వరప్రసాద్ (డా.సీ.ఎస్.ఎన్.డిగ్రీ అండ్ పీజీ కళాశాల, భీమవరం), ●బెస్ట్‌ఫిజిక్ మెన్ టీమ్ ఛాంపియన్ షిప్ (పి.ఆర్.ప్రభుత్వ కళాశాల, కాకినాడ) కైవసం చేసుకున్నారు.

EENADU e Classifieds

AUTO
VEHICLES FOR SALE

శ్రీలలిత రైస్‌మిల్, పెద్దాపురం వారి ఇన్నోవా కార్లు అమ్మకమునకు కలవు. Contact Cell: 94941 54551.

BUSINESS SERVICES

బంగారం బ్యాంకులలో/ ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈరోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్). Ph: 81422 92071.

శ్రీ సాయి గోల్డ్ తాకట్టులో ఉన్న బంగారం ఏ బ్యాంక్/ ప్రైవేట్ సంస్థల నుండి అయినా విడిపించి, ఆ రోజు మార్కెట్ రేట్‌కి కొనబడును. స్పాట్ క్యాష్, ✆ 9493338823.

FINANCIAL SERVICES

స్థిరాస్తులపై ఆంధ్రప్రదేశ్ అంతటా మార్టిగేజ్ లోన్స్ మరియు స్థిరాస్తి ఎక్కడ ఉన్నా ఏ సంస్థలో ఉన్నా Xerox పేపర్స్‌పై 2nd మార్టిగేజ్ లోన్ ఇవ్వబడును. 50 లక్షలులోపు, అయోధ్య కోఆపరేటివ్ బ్యాంక్. ✆ 93969 99669.

REAL ESTATE
LAND FOR SALE
RAJAMAHENDRAVARAM RURAL

కడియం మండలం, మాధవరాయుడుపాలెం పరిధిలో పేపరుమిల్లు వెనుక 3 1/2 ఎకరముల భూమి వ్యవసాయం మరియు పరిశ్రమలకు అనువైనది అమ్మకం. ✆ 7702691117.

PLOT FOR SALE
KAKINADA CITY

Properties Bazar's @ Kakinada Touch Your Luck, Buy Plot & Win Plot, Free Lucky Draw with Guaranteed Prizes. Cell: 9154184236

RAJAMAHENDRAVARAM RURAL

రాజమండ్రి, పిడింగొయ్యి పంచాయతీలో DTCP అప్రూవ్డ్ కలిగిన N/E 272 చ||గ||లు, N/F 272 చ||గ||ల స్థలములు అమ్మకు. Contact: 7382 19 4444.

JOBS

Wanted DRA Tele Callers, Field Executives & Team Leaders Banking Sector Attractive Salaries and Incentives, ✆ 9849394835, 7075345527.

Wanted Teachers for Reputed Schools in A.P & Telangana, Contact: Sneha Placements Service. Ph: 94402 46409.

WANTED: Telecallers for Reputed Overseas Edu Consultancy in Rajahmundry. Experence Preferred. Contact Cell: 98521 59999.

WANTED
we are Hiring
Front Office Staff (Female) - 02 no's
Salary - 12 k
08 Hours Duty
SprintOn, JN Road Rajamahendravaram
✆ 99663 57897

త్రినేత్ర హోంకేర్‌లో వృద్ధులను/ పేషెంట్స్‌ను/పిల్లలను చూసుకొనుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఫ్రీ వసతి, భోజనం. జీ: 18K. ✆ 8520980099, 8520874499

కాకినాడలోని భానుగుడి జంక్షన్ నందు బట్టల షాపులో పనిచేయుటకు సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. శాలరీ - 15,000/- 4 W/O. + ESI + EPFO. సెల్: 9885295999.

హరేకృష్ణ హోంకేర్‌లో వృద్ధులను/ పేషంట్స్‌ని/ పిల్లలను చూసుకొనుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఫ్రీవసతి, భోజనం జీ:18-20K ✆ 96404 68899, 96402 58899

WANTED STAFF
★ Pre-Primary Teachers
★ Primary Teachers All Subjects
★ High School Teachers All Subjects
★ Office Assistant -cum-Telecaller
★ Computer Operator
Good Communication skills in English preferred.
Walk-in for Interview
Resume to: 70951 52111
INTERNATIONAL DELHI PUBLIC SCHOOL
Rajanagaram & Rajahmundry

SECURITY GUARDS

Wanted Security Guard: Night Duty 8 pm to 6 am, Salary: Rs.12,000/- Per Month, Work is at Kakinada. Contact: 95020 97778.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర
★ For the Information of Trade & Industry
★ తూర్పుగోదావరి జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు ధర రూ. 5-15 పైII
అనపర్తి ఆఫీసు: 08857-226908

EENADU for Advertisement Contact: 8008597607

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న ...

రైల్వే ప్లాట్‌ఫామ్‌పై ప్రసవం
ఆడబిడ్డకు జన్మనిచ్చిన ప్రయాణికురాలు

వి.ఎల్.పురం: రాజమహేంద్రవరం ప్రధాన రైల్వేస్టేషన్‌లో నిండు గర్భిణి అయిన ఒక ప్రయాణికురాలు ఆడబిడ్డను ప్రసవించిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. రైల్వే వైద్యసిబ్బంది ఆమెకు ప్లాట్‌ఫామ్‌పైనే వైద్యసేవలు అందించి తల్లీబిడ్డ క్షేమంగా ఉండేలా చూశారు. ఆర్పీఎఫ్ సిబ్బంది మంగళవారం తెలిపిన వివరాలు... చర్లపల్లి నుంచి షాలిమార్ వెళ్లే ఈస్ట్ కోస్ట్ ఎక్స్‌ప్రెస్ రైలులోని ఎస్-3 కోచ్‌లో కోల్‌కతా అహిర్తోలా ఘాట్ ప్రాంతానికి సంగీతకుమారి అనే గర్భిణి తన భర్త సాగర్‌తో కలిసి ప్రయాణం చేస్తున్నారు. సోమవారం సాయంత్రం రైలు నిడదవోలు రైల్వేస్టేషన్‌కు వచ్చే సరికి ఆమెకు ప్రసవ నొప్పులు మొదలయ్యాయి. దీంతో ఆమె భర్త వెంటనే విధుల్లో ఉన్న టీటీఈకు సమాచారం అందించారు. టీటీఈ ఇచ్చిన సమాచారంతో రైలు సాయంత్రం 5.35 గంటలకు రాజమహేంద్రవరం ప్రధాన రైల్వేస్టేషన్‌కు రాగానే రైల్వే వైద్యసిబ్బంది, ఆర్పీఎఫ్ సిబ్బంది సహకారంతో గర్భిణిని రైలు బోగీ నుంచి మూడో ప్లాట్‌ఫామ్ పైకి దించారు. ఆసుపత్రికి తరలించే సమయం కూడా లేకపోవడం, ప్లాట్‌ఫామ్‌పైనే ప్రసవించారు. ఆమెకు అక్కడే రైల్వే వైద్యుడు సునీల్‌కుమార్, వైద్యసిబ్బంది సత్యవతి, సుబ్బలక్ష్మి, త్రినాథ్‌లు వైద్యసేవలందించారు. తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నారని రైల్వే వైద్యులు నిర్ధారించిన తర్వాత ఆమెను ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు ఆర్పీఎస్ అధికారులు తెలిపారు.

శిశువును పరీక్షిస్తున్న రైల్వే వైద్య సిబ్బంది

ధరవరలు

అంబాజీపేట కొబ్బరి మార్కెట్

కొబ్బరి (క్వింటాళ్లలో)	ధర (రూ.ల్లో)
కొత్తకొబ్బరి	18,500
కురిడీ (వెయ్యింటికి): పాతకాయ: గండేరా	30,500
గటగట	29,000
కొత్తకాయ: గండేరా	30,000
గటగట	29,000
నీటి కాయ (వెయ్యింటికి): పాత (ముక్కుడు) కాయ	20,000-21,000
కొత్త (పచ్చి) కాయ	16,000-17,000
కొబ్బరినూనె మార్కెట్: 15 కిలోలు	5,000
కిలో	350

గమనిక: అంబాజీపేట కొబ్బరి మార్కెట్ ధరలు ప్రతి బుధ, శనివారాల్లో మాత్రమే మారుతాయి.

వెన్‌కాబ్ చికెన్ ధర కిలోకు రూ.ల్లో

ఫారంరేటు	115-00
రిటైల్ లైవ్	142-00
డ్రెస్డ్	206-00
స్కిన్‌లెస్	234-00

వేతన ఒప్పందంపై చర్చలు సఫలం

ఒప్పంద పత్రాన్ని తీసుకుంటున్న కార్మిక నాయకులు

దేవరపల్లి: గౌరీపట్నంలో క్రషర్ కార్మికుల నూతన వేతన ఒప్పందంపై యజమానుల సంఘంతో పీకేఎస్, ఏఐసీటీయూ ఆధ్వర్యంలో జరిగిన చర్చలు సఫలమయ్యాయి. గతంలో మూడుసార్లు చర్చలు విఫలమైన విషయం తెలిసిందే. తాజాగా క్రషర్ ఆడే కార్మికులకు 24 గంటలకు రూ.1300 వేతనం ఇస్తున్నారని, అదనంగా రోజుకి రూ.200, నెల జీతానికి పని చేసే వారికి రూ.2000 పెంచారని, సంక్రాంతి సమయంలో గతంలో రూ.3200 ఇచ్చేవారని, ఆ మొత్తానికి అదనంగా రూ.1800 పెంచి రూ.5000 బోనస్, జత దుస్తులు ఇచ్చేందుకు, రెగ్యులర్ కార్మికులకు నెలజీతం బోనస్, జతదుస్తులు ఇచ్చేవిధంగా ఒప్పందం కుదిరినట్లు నాయకులు తెలిపారు. మాస్కు, 150 గ్రాముల బెల్లం, రెండు అరటి పండ్లు, రూ.5 లక్షలు ప్రమాద బీమా చేయించే విధంగా అంగీకారం కుదిరిందన్నారు. ఈ ఒప్పందం మూడేళ్ల పాటు ఉంటుందన్నారు. యజమానుల సంఘం అధ్యక్షులు ఆండ్రు అనిల్, దోనెల్లి మధుబాబు, మదునూరి సూర్యనారాయణరాజు, సత్తి అనంతరెడ్డి, కార్మిక సంఘం నాయకులు కస్సే సత్యనారాయణ, ఎస్‌కే.మస్తాన్, గంటా కృష్ణ, సత్యనారాయణ, నరసింహరావు, తదితరులు పాల్గొన్నారు.

92.7 FM Rajamahendravaram
ఈ FM 92.7 Mee FM
ఈఎఫ్ఎమ్ కార్యక్రమాలు
సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉII 5 - ఉII 7
ఈ-మార్నింగ్స్	ఉII 7 - ఉII 11
నువ్వా నేనా	ఉII 11 - మII 2
సత్యభామ	మII 2 - సాII 5
లైట్ తీస్కో	సాII 5 - రాII 9
సరదాగా కాసేపు	రాII 9 - రాII 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రాII 12 - తెII 5

/Eenadufm
For Advertising on Eenadu FM Contact
9000180626, 9989993175

జంట హత్యల కేసులో.. నిందితుడికి జీవిత ఖైదు

కొత్తగూడెం న్యాయవిభాగం, న్యూస్‌టుడే: జంట హత్యల కేసులో వ్యక్తికి జీవితఖైదు, రూ.1000 జరిమానా విధిస్తూ జిల్లా ప్రధాన న్యాయమూర్తి పాటిల్ వసంత్ మంగళవారం తీర్పునిచ్చారు. దమ్మపేట మండలం మల్కారానికి నాగేంద్రబాబు 2022 జులై 7న భార్య, పిల్లలతో కలిసి అన్నపురెడ్డిపల్లికి వెళ్లారు. ఆ ఇల్లు ఖాళీగా ఉండటంతో నాగేంద్రబాబు తల్లి సుబ్బలక్ష్మి, మరదలి కొడుకు ఆకాశ్(7) అక్కడికి వెళ్లి నిద్రపోయారు. ఆ మరుసటి రోజు ఉదయం నాగేంద్రబాబు తల్లికి ఫోన్ చేయగా స్పందించకపోవడంతో అదే గ్రామంలో ఉంటున్న మరదలు పోచమ్మకి సమాచారం తెలిపి ఇంటికి వెళ్లి విచారించమని చెప్పారు. అక్కడికి వెళ్లి చూసే సరికి సుబ్బలక్ష్మి, ఆకాశ్ రక్త గాయాలతో నిర్జీవంగా పడి ఉన్నారు. ఈ విషయం ఆమె బావకు చెప్పడంతో పోలీసులకు ఫిర్యాదు చేయమని సూచించారు. ఆమె అదే రోజు దమ్మపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తులో భాగంగా తూర్పుగోదావరి జిల్లా ఉండ్రాజవరం మండలానికి చెందిన సుబ్బలక్ష్మి అల్లుడు మల్లవరపు శ్రీనివాసరావును విచారించారు. కుటుంబ తగాదాల విషయంలో అత్తపై కక్ష పెంచుకుని హత్యకు పాల్పడినట్లు నిర్ధారణకు వచ్చిన పోలీసులు కోర్టులో ఛార్జిషీట్ దాఖలు చేశారు. విచారణ సందర్భంగా న్యాయమూర్తి ప్రాసిక్యూషన్ తరపున 14 మంది సాక్షులను విచారించి నిందితుడిపై నేరం రుజువైనందున పై విధంగా తీర్పునిచ్చారు.

ఇక.. అంతరాయం లేకుండా టికెట్లు..!

మహిళా కండక్టరుకు పవర్ బ్యాంకు అందజేస్తున్న డీపీటీవో మూర్తి

వి.ఎల్.పురం, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న స్త్రీశక్తి పథకంతో ఆర్టీసీలో మహిళా ప్రయాణికుల రద్దీ బాగా పెరిగింది. గతంలో 50-60 శాతం ఉండే ఆక్యుపెన్సీరేషియో(ఓఆర్) 100 శాతానికి చేరడంతో టిక్కెట్లు జారీ చేసే ఈ-పోస్ యంత్రాల ఛార్జింగ్ త్వరగా అయిపోయి ఉచిత ప్రయాణ టికెట్ల జారీకి కండక్టర్లు ఇబ్బందులు పడాల్సి వస్తుంది. ఈ సమస్య పరిష్కారానికి ఏపీఎస్‌ఆర్టీసీ చర్యలు చేపట్టింది. జిల్లాలోని నాలుగు ఆర్టీసీ డిపోలకు 439 పవర్ బ్యాంకులను సరఫరా చేసింది. వీటిని మంగళవారం సాయంత్రం రాజమహేంద్రవరం ప్రధాన బస్టాండ్‌లో కండక్టర్లకు ఆర్టీసీ జిల్లా ప్రజా రవాణా అధికారి(డీపీటీవో) వై.ఎస్.ఎన్.మూర్తి చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా డీపీటీవో మాట్లాడుతూ ఆర్టీసీ ప్రధాన కార్యాలయం నుంచి వచ్చిన పవర్‌బ్యాంకుల వల్ల ఈపోస్ యంత్రాల ద్వారా టిక్కెట్ల జారీలో సమస్యలు తొలగుతాయన్నారు.

డిపో	పవర్ బ్యాంకులు
రాజమహేంద్రవరం	189
గోకవరం	112
కొవ్వూరు	84
నిడదవోలు	54

2015 పుష్కరాల పనుల్లో.. అవకతవకలపై విచారణకు ఆదేశం

అమలాపురం కలెక్టరేట్, న్యూస్‌టుడే: గత(2015) పుష్కరాల సమయంలో అప్పటి తూర్పు గోదావరి జిల్లాలో నిర్వహించిన పుష్కరాల పనుల్లో అవకతవకలపై రాష్ట్ర ప్రభుత్వం విచారణకు ఆదేశించింది. దీనికి సంబంధించి మంగళవారం జీవో-69 విడుదలైంది. ధవళేశ్వరం సబ్ డివిజన్ పరిధిలోని పనుల్లో అక్రమాలకు పాల్పడ్డారనే ఆరోపణల నేపథ్యంలో అప్పటి డీఈఈ టి.శ్రీనివాస్, ఏఈఈ కె.రాజమౌళి నుంచి వివరణ కోరారు. వారు తమపై తదుపరి చర్యలను నిలుపుదల చేయాలని, అప్పటి పనుల్లో అక్రమాలు చోటు చేసుకోలేదని లిఖిత పూర్వకంగా ఇచ్చిన సమాధానం నమ్మశక్యంగా లేదని ఉన్నతాధికారులు పేర్కొన్నారు. దీనిపై సమగ్రంగా విచారణ పూర్తి చేసి నివేదిక అందించేందుకు జలవనరుల శాఖకు చెందిన ఈఈ స్థాయి అధికారి.. గంగుమళ్ల శ్రీనివాస్‌ను ప్రత్యేక అధికారిగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

శ్రీరాంపురంలో 70 గ్రాముల ఆభరణాలు అపహరణ

రాజానగరం, న్యూస్‌టుడే: రాజానగరం పోలీసుస్టేషన్ పరిధి శ్రీరాంపురంలోని ఓ ఇంట్లో 70 గ్రాముల బంగారు ఆభరణాల చోరీ జరిగింది. ఎస్సై జి.వి.వి.సత్యనారాయణ మంగళవారం తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన యర్రంశెట్టి పట్టాభి నిమ్మకాయల వ్యాపారం చేస్తుంటారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. అదే గ్రామంలో ఉంటున్న తన అత్తయ్య అనారోగ్యంతో బాధపడుతున్నారని సోమవారం రాత్రి కుటుంబంతో కలిసి పరామర్శకు వెళ్లారు. పని నిమిత్తం మంగళవారం తెల్లవారుజామున 3 గంటలకు ఇంటికి తిరిగొచ్చారు. తలుపులు తీసి, బీరువాలోని బంగారు ఆభరణాలు, వివిధ సామగ్రి, రూ.10వేల నగదు చోరీ జరిగినట్లు గుర్తించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

(c) eenadu

రాజమహేంద్రవరం

సకాలంలో గుర్తించు.. కుష్ఠు నివారించు..

కడియం: సకాలంలో గుర్తిస్తే సర్వ కుష్ఠు నివారణ సాధ్యమేనని ఆ శాఖ జిల్లా నిర్వాహణాధికారి వసుధర సూచించారు. చైతన్యనగర్ లెప్రసీకాలనీలో మంగళవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. మైక్రోసెల్యులార్ అనే సూక్ష్మక్రిమి సోకడంతో ఈ వ్యాధి సంక్రమిస్తుందన్నారు. ఎండీటీ చికిత్సతో నూరుశాతం అంగవైకల్యం దూరమవుతుందన్నారు. ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాల్లో ఈ చికిత్స అందుబాటులో ఉందన్నారు. దాతలు సమకూర్చిన వాకర్స్, నడక కర్రలు, కళ్లద్దాలు, దుప్పట్లు, తదితర వస్తువులను రోగులకు పంపిణీ చేశారు.

నేడు విద్యుత్తు సరఫరాకు అంతరాయం

టి.నగర్, న్యూస్‌టుడే: 11కేవీ ఫీడర్ లైన్ మరమ్మతుల కారణంగా ఈ నెల 18న ఆయా ప్రాంతాల్లో సరఫరా నిలిపివేయనున్నట్లు ఏపీఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ నక్కపల్లి శామ్యూల్ మంగళవారం ప్రకటనలో తెలిపారు. కొత్తపేట, సోమలమ్మ గుడి ప్రాంతం, పల్లపువీధి తదితర ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు సరఫరా నిలిపివేయడం జరుగుతుందన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా

ఉ॥ 10 - మ॥ 1 — మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు: 83282 39927, 80089 02897

సమస్య: స్థానిక టి.నగర్‌లో వీధి కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. - నీలిమ

సమాధానం: వీధి కుక్కల నియంత్రణకు తగిన చర్యలు తీసుకోవడం జరుగుతుంది. ఆ ప్రాంతంలో సిబ్బంది పరిశీలిస్తారు. - ఎంహెచ్‌వో, వినూత్న

సమస్య: స్థానిక ఆర్యాపురం కాలువల్లో పూడిక పేరుకుపోవడంతో దుర్గంధం వెదజల్లుతోంది. - సూర్యారావు

సమస్య: స్థానిక కంబాలపేట వెనుక వీధుల్లో పూడిక సక్రమంగా తొలగించడం లేదు. - లక్ష్మి

సమాధానం: సిబ్బంది పరిశీలించి పూడిక తొలగించడం జరుగుతుంది. - ఎంహెచ్‌వో, వినూత్న

- న్యూస్‌టుడే, టి.నగర్

పెద్దలు.. భావితరానికి వారధులు..!

అవిశ్రాంత సేవలతో స్ఫూర్తిదాయకంగా జీవనం

రాజమహేంద్రవరం సాంస్కృతికం, న్యూస్‌టుడే: బాల్యం.. విద్యాభ్యాసం.. ఉద్యోగ జీవితం.. పదవీ విరమణ.. అందులో నేర్చుకున్న సారాంశం.. వెరసి వ్యక్తి సంపూర్ణ జీవితం. జీవన సారాన్ని అనుభవించిన పెద్దలు భావితరాలకు మార్గదర్శకులు. పిల్లలు ఏదైనా తప్పు చేస్తుంటే మందలించే హక్కు పెద్దలకే ఉంటుంది. పెద్దలు చూపిన బాటలో నడవాలని పూర్వీకుల కాలం నుంచి చెబుతున్న సత్యం ఇదే. రాజమహేంద్రవరం నగరానికి చెందిన కొందరు విశ్రాంత ఉద్యోగులు వారికి నచ్చిన అంశంలో కొనసాగుతూ బృందాలుగా కొందరు, సొంతంగా మరికొందరు భావితరాలకు మార్గదర్శనం చేస్తున్నారు.

యోగా నేర్పుతూ.. ఆదర్శం

దేశవ్యాప్తంగా పలు ప్రాంతాల్లో జలవనరుల శాఖలో ఉద్యోగిగా పనిచేస్తూ 2016లో ధవళేశ్వరం పదవీ విరమణ పొందా. విశ్రాంత జీవనం సమాజ సేవకు అంకితం చేయాలని భావించా. యోగాభ్యాసంలో 1998లో సిద్ధ సమాధి యోగా సంస్థలో రాజమహేంద్రవరంలో నేర్చుకున్నా. వ్యక్తిగత ఆరోగ్యం కోసం నేర్చుకున్న యోగా ఇతరులకు నేర్పిస్తున్నా. పదేళ్లుగా దానవాయిపేట గాంధీ పార్కులో ఆసక్తి కలిగిన వారికి తర్ఫీదు ఇస్తున్నా. 30మంది వరకు సాధకులు హాజరై శిక్షణ సద్వినియోగం చేసుకుంటున్నారు.

- సూరపురెడ్డి తాతారావు, విశ్రాంత ఉద్యోగి, రాజమహేంద్రవరం

సంప్రదాయాలను అందించాలని..

భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించాలనే తపనతో మిత్రుడు దేవత సుధాకర్‌తో కలిసి 'పీస్ ఫర్ పీపుల్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్' పేరుతో 2016లో స్వచ్ఛంద సంస్థను టీనగర్‌లో స్థాపించాం. సంస్థ ఆశయాలను అందిపుచ్చుకుని సేవలు చేయడం మరికొందరు మిత్రులు సభ్యులుగా చేరారు. సంస్థ ఆశయాల్లో భాగంగా ప్లాస్టిక్ నిషేధం, భారత స్వాతంత్య్ర ఉద్యమంలో పాల్గొన్న నిస్వార్థ నాయకుల కృషిని గౌరవిస్తూ వారి జయంతి, వర్ధంతి కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. ప్రత్యేక సందర్భాల్లో భావి తరానికి వారధులను నిలుస్తున్న ఉపాధ్యాయులను సన్మానిస్తున్నాం.

- డాక్టర్ లంక సత్యనారాయణ, అధ్యక్షుడు, పీస్ ఫర్ పీపుల్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్

కళలపై మమకారంతో

ధవళేశ్వరం జలవనరుల శాఖలో అధికారిగా పనిచేసి 2017లో పదవీ విరమణ చేశా. ఉద్యోగం చేస్తూనే కళలపై అభిమానంతో లలిత సంగీతం, జానపద సంగీతంపై అభిమానంతో గాయకుడిగా, రంగస్థల నటుడిగా 35ఏళ్లు కొనసాగా. దివంగత గాయకుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యంతో కలిసి అనేక కచేరీల్లో పాల్గొన్నాను. గాయని వాణీ జయరాంతో కలిసి 'జయహో మాతృభూమి' పేరుతో సొంతంగా ఆడియో చేశా. గాయని సుశీలతో కలిసి అప్పట్లో జిక్కి గీతాలు రూపొందించా. అన్నమయ్య రచించిన కీర్తనల్లో నస్థ సంకీర్తనలు రికార్డు చేసి కె.వి.రమణ వారి ఎమ్మెస్ కామెంట్రీతో విడుదల చేశా. డ్వార్ కంటే వీణల్లో ఆన్‌లైన్ ద్వారా రాగా కల్చరల్ అసోసియేషన్ ప్రారంభించి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నా. సమాజానికి సేవలందించిన ప్రముఖుల సంబంధించిన పుస్తకాలు రాసి విద్యార్థులకు పంపిణీ చేస్తున్నా.

- జి.వి.రమణ, గాయకుడు, రచయిత

దెబ్బతిన్న మంచినీటి పైపులైన్

ఇళ్లలోకి చొచ్చుకొచ్చిన నీరు

టి.నగర్, న్యూస్‌టుడే: రాజమహేంద్రవరం గ్రామీణం, వెంకటనగరం పంపింగ్ స్కీమ్ పైపులైన్ లీకైంది. కోలమూరు వద్ద పైపులకు పగుళ్లు రావడంతో నీరు వృథా అవుతుంది. జంగాలకాలనీలో ఇళ్లలోకి నీరు చేరిపోయింది. దీంతో స్థానికులు ఆందోళనకు గురయ్యారు. పంచాయతీ, రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు అక్కడకు చేరుకుని, మోటార్లు నిలిపివేయడంతో ఊపిరిపీల్చుకొన్నారు. రాజమహేంద్రవరం ఆర్డీవో కృష్ణ నాయక్ సంఘటనా స్థలానికి చేరుకొని పరిస్థితి పరిశీలించారు. పైపులైన్‌కు తక్షణం మరమ్మతులు చేపట్టాలని ఆదేశించారు.

కాలనీలో ప్రవహిస్తున్న నీరు

ప్రాధాన్యం ప్రకారం పనులు: ఎమ్మెల్యే ఆదిరెడ్డి

టి.నగర్, న్యూస్‌టుడే: నగరంలో ప్రాధాన్యం ప్రకారం పనులు చేపడుతున్నట్లు అర్బన్ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ తెలిపారు. మంగళవారం 34వ డివిజన్‌లో రూ. 2.80 కోట్లతో తలపెట్టిన అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. పుష్కరాల నేపథ్యంలో నగరాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. రోడ్లు, కాలువల విస్తరణ, పార్కులో గ్రీనరీ ఏర్పాటు వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుంటున్నామన్నారు. గత ప్రభుత్వ పాలనలో నగర అభివృద్ధిని పక్కన పెట్టారన్నారు. ప్రజల అభిరుచుల మేరకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు తెలిపారు. పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

శంకుస్థాపన కార్యక్రమంలో ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్

రాష్ట్ర పురోగతికి పునాది వేసిన బడ్జెట్

వికసిత్ ఆంధ్రప్రదేశ్ 2047 లక్ష్య సాధన దిశగా రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్ ప్రవేశపెట్టిందని అర్బన్ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ తెలిపారు. మంగళవారం అసెంబ్లీలో ఈ అంశాన్ని ప్రస్తావించారు. రాష్ట్ర పురోగతికి బడ్జెటు పునాది లాంటిదన్నారు. అప్పులను తగ్గించి ఆస్తులను పెంచే దిశగా కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తోందన్నారు.

శ్రీవారి బ్రహ్మోత్సవాలు

రాజమహేంద్రవరం సాంస్కృతికం, న్యూస్‌టుడే: రాజమహేంద్రవరం గౌతమఘాట్‌లోని శ్రీరంగధామంలో శ్రీభూనీళా సమేత కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు మంగళవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉదయం స్వామివారి తిరుమంజనం (ఉత్సవారంభ స్నపనం) నిర్వహించారు. సాయంత్రం ఆస్థాన మండపం వేదికపై దేవేరీ సమేత శ్రీవారి ఉత్సవమూర్తులకు విశేష పూజలు జరిగాయి. విష్ణు సహస్రనామ పారాయణం, సేవాకాలం, విష్వక్సేన ఆరాధన, పుణ్యాహవచనం, అంకురారోహణ, వైనతేయ ప్రతిష్ఠ, బ్రహ్మోత్సవ ఆరంభం కార్యక్రమాలు జరిగాయి.

క్రీడా పోటీల్లో నిర్కా శాస్త్రవేత్తల ప్రతిభ

వి.ఎల్.పురం, న్యూస్‌టుడే: భారత వ్యవసాయ పరిశోధన మండలి(ఐసీఏఆర్) ఆధ్వర్యంలో సికింద్రాబాద్‌లోని ఆర్ఆర్‌సీ మైదానంలో ఇటీవల జరిగిన దక్షిణ జోనల్ క్రీడాపోటీల్లో రాజమహేంద్రవరం వాణిజ్య వ్యవసాయ పరిశోధన సంస్థ(నిర్కా) శాస్త్రవేత్తలు ప్రతిభ చూపారు. శాస్త్రవేత్తలు కె. సుమన్‌కల్యాణి, బి. హేమ, దేవానంద్ రజత పతకాలు సాధించారు. ఈ సందర్భంగా మంగళవారం స్థానిక నిర్కా కార్యాలయంలో వీరిని ఆ సంస్థ డైరెక్టర్ ఎం. శేషుమాధవ్ అభినందించారు. భవిష్యత్తులో మరిన్ని క్రీడాపోటీల్లో పాల్గొని విజయం సాధించాలని ఆకాంక్షించారు.



విజేతలను అభినందిస్తున్న నిర్కా డైరెక్టర్ శేషుమాధవ్

నులిపురుగుల నివారణతో ఆరోగ్యం

రాజమహేంద్రవరం సాంస్కృతికం, ఏవీఏ రోడ్డు, న్యూస్‌టుడే: నులి పురుగుల కారణంగా అనేక అనారోగ్య సమస్యలు వస్తాయని, నివారణకు ప్రతి ఒక్కరూ మాత్రలు వేసుకోవాలని కందుకూరి రాజ్యలక్ష్మి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎఫ్ఏసీ ప్రిన్సిపల్ ప్రభల శ్రీవల్లి సూచించారు. మంగళవారం జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా రాజ్యలక్ష్మి కళాశాల విద్యార్థినులకు ప్రిన్సిపల్ నిర్వహణలో మాత్రలు పంపిణీ చేశారు. నులిపురుగుల కారణంగా రక్తహీనత, బలహీనత, పొట్టనొప్పి తదితర సమస్యలు వస్తాయన్నారు. చదువులో ఏకాగ్రత లోపిస్తుందన్నారు. వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. ఎన్ఎస్ఎస్ అధికారులు కాస్మా, వీరలక్ష్మి, విజయలక్ష్మి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు. ● రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో విద్యార్థులకు నులిపురుగుల నిర్మూలనపై ప్రిన్సిపల్ రామచంద్ర ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు.

ఆర్ట్స్ కళాశాలలో విద్యార్థినికి మాత్ర వేస్తున్న అధ్యాపకుడు

ఇళ్ల పట్టాల మాయాజాలంపై విచారణకు డిమాండ్

వి.ఎల్.పురం, న్యూస్‌టుడే: గత వైకాపా ప్రభుత్వ హయాంలో జరిగిన ఇళ్ల పట్టాల మాయాజాలంపై సమగ్ర విచారణ చేయించాలని భాజపా నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం కలెక్టరేట్‌లో జేసీ మేఘాస్వరూప్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. భాజపా సీనియర్ నాయకుడు ఏపీఆర్ చౌదరి, జనతా వారధి కన్వీనర్ సత్యప్రసాద్, పార్టీ జిల్లా ఎగ్జిక్యూటివ్ సభ్యులు బి.వి. రామారావు, యానాపు ఏసు తదితరులు మాట్లాడారు. గత వైకాపా ప్రభుత్వం ఇళ్లస్థలాల మంజూరు పేరుతో పేదలను మోసగించిందన్నారు. ఎన్నికల ముందు ప్రజలకు ఇళ్లస్థలాల మంజూరు చేసినట్లు పట్టాలు ఇచ్చి స్థలాలు మాత్రం చూపించలేదని విమర్శించారు. ఇచ్చిన ఇళ్ల పట్టాలకు సంబంధించి అసలు స్థలాలు ఎక్కడున్నాయో కూడా ఎవరికీ తెలియడంలేదన్నారు.



జేసీ మేఘాస్వరూప్‌కు వినతిపత్రం అందిస్తున్న భాజపా నాయకులు

ప్రమాదకరంగా విద్యుత్తు స్తంభాలు

నగర శివారులో చాలా ప్రాంతాల్లో విద్యుత్తు స్తంభాలకు సరైన నిర్వహణ, రక్షణ చర్యలు లేకుండా ప్రమాదకరంగా దర్శనమిస్తున్నాయి. కొన్ని చోట్ల ఒరిగిపోయాయి. పాత ఇనుప స్తంభాలకు అడుగు భాగంలో చాలా వరకు తుప్పుపట్టి పూర్తిగా ప్రమాదకరంగా ఉన్నాయి. రూరల్ ప్రాంతాలైన కాతేరు, కొంతమూరులో స్తంభాల కింద గుల్లగా మారిపోయాయి. ఎటువంటి ప్రమాదం జరగకముందే సంబంధిత అధికారులు స్పందించి పరిస్థితిని చక్కదిద్దాలని స్థానికులు కోరుతున్నారు. -న్యూస్‌టుడే, ఏవీఏ రోడ్డు

గొయ్యి..ఆదమరిస్తే అంతేనోయి

కొంతమూరు రోడ్డులో శానిటోరియం వద్ద రహదారి ఆనుకుని మూత లేకుండా అండర్ గ్రౌండ్ వాటర్ లైన్ గొయ్యి ప్రమాదకరంగా మారింది. మన్యం జిల్లా నుంచి నగరానికి వచ్చే ప్రధాన రహదారి ఇదే. పాఠశాల ప్రాంతంలో ఈ సమస్య ఉండటంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు. -న్యూస్‌టుడే, ఏవీఏ రోడ్డు

కొంతమూరు రోడ్డుపై అంధకారం

నగరంలో ప్రధాన జనసంచార ప్రాంతాల్లో ఒకటైన కొంతమూరు రోడ్డులో రాత్రిపూట ప్రయాణించాలంటే ద్విచక్ర వాహనదారులు భయాందోళనకు గురవుతున్నారు. కొంతమూరు గామన్ వంతెన సమీపంలో వీధి దీపాలు సరిగా వెలగడం లేదు. గతంలో శివారు ప్రాంతాల్లో ఎదుర్కొన్న సమస్యల దృష్ట్యా స్థానికులు ఒంటరిగా ప్రయాణించలేని పరిస్థితి. కోరుకొండ, గోకవరం లాంటి ప్రాంతాలకు ఇదే ప్రధాన మార్గం. -న్యూస్‌టుడే, ఏవీఏ రోడ్డు

రక్షణ తలుపులు ఏవీ?

ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల వెనుక ప్రహరీ సమీపంలోని పరిస్థితి ఇది. నగరంలోని చాలా ప్రాంతాల్లో విద్యుత్తు స్తంభాలకు అమర్చిన ఫ్యూజు పెట్టెలకు రక్షణ తలుపులు లేకుండా ప్రమాదకరంగా దర్శనమిస్తున్నాయి. ఇవి చేతికందేంత ఎత్తులో తెరిచి ఉన్నాయి. ఎటువంటి ప్రమాదం జరగకముందే సంబంధిత అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు. -న్యూస్‌టుడే, ఏవీఏ రోడ్డు

'భారత్ విస్తార్'తో మెరుగైన సేవలు

రాజానగరం: భారత్ విస్తార్ ఏఐ ప్లాట్‌ఫామ్‌తో మరింత మేలైన సేవలు అందుతాయని కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే) అధికారులు తెలిపారు. కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్‌సింగ్‌చౌహాన్ జైపూర్ నుంచి మంగళవారం ఈ ప్లాట్‌ఫామ్‌ను ప్రారంభించారు. దీనిని వెబ్‌కాస్ట్‌లో తిలకించేందుకు కలవచర్లలోని కేవీకేలో ఏర్పాటు చేయగా వివిధ మండలాలకు చెందిన 100 మంది రైతులు హాజరయ్యారు. ఈ సందర్భంగా కేవీకే అధికారి వి.ఎస్.జి.ఆర్.నాయుడు మాట్లాడుతూ రైతులకు సరైన సమయంలో పక్కా సమాచారాన్ని ఇచ్చేందుకు, వారి ఆదాయం పెంచేందుకు, వ్యవసాయాన్ని మరింత లాభదాయకంగా మార్చేందుకు ఇది ఉపయోగపడుతుందన్నారు. ఈ సమాచారం 22 భారతీయ భాషలలో అందుబాటులో ఉంటుందన్నారు. వాతావరణ సమాచారం, కేంద్ర ప్రభుత్వ పథకాల సమాచారాన్ని అందిస్తుందన్నారు. అధికారులు బి.నాగేశ్వరరెడ్డి, సంజయ్ వినాయక్ హెగ్డే, రఘునందన్, అజ్మల్ పాల్గొన్నారు.

ఒరిజినల్ డాక్యుమెంట్స్ పోయినవి

తటవర్తి సుభాషిణి, W/o రత్నకుమార్, D.No: 35-5-17, మంగళవారపుపేట, రాజమండ్రినందు నివసిస్తున్నాను. మాకు సంబంధించి కోరుకొండ మండలం, మధురపూడి గ్రామం, సర్వే నెం.373/1, 373/2లో గల ప్లాట్ నెం.69లో గల 220 చ॥గ॥ల స్థలమునకు సంబంధించిన ఒరిజినల్ డాక్యుమెంట్ నెం.709/2006 గల ఒరిజినల్ డాక్యుమెంట్‌ను Xerox నిమిత్తం రాజమండ్రి మంగళవారపుపేటలో గల మా ఇంటి వద్ద నుండి దేవీచౌక్ సెంటర్‌కు వెళ్తుండగా మార్గమధ్యలో పడిపోయినది. దొరికినవారు తెచ్చి ఇచ్చిన వారికి తగిన పారితోషికం ఇవ్వబడును.

88979 55845

నగరంలోని ఆర్ట్స్ కళాశాల వద్ద డ్రోన్ చిత్రం

డ్రోన్ కెమెరాతో నిఘా కట్టుదిట్టం

కంబాలచెరువు(రాజమహేంద్రవరం), న్యూస్‌టుడే: జిల్లా వ్యాప్తంగా వివిధ పోలీసుస్టేషన్ల పరిధిలో ఉన్న కళాశాలలు, పాఠశాలల వద్ద ఈవ్‌టీజింగ్, ఇతర చట్టవ్యతిరేక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేసేందుకు పోలీసులు చర్యలు చేపడుతున్నారు. అన్ని పాఠశాలలు, కళాశాలల వద్ద డ్రోన్లతో పర్యవేక్షణ చేస్తున్నారు.

'మట్టి మాఫియాను అడ్డుకొన్నందుకు దాడి'

టి.నగర్, న్యూస్‌టుడే: కోరుకొండలో మట్టిమాఫియాను అడ్డుకొన్నందుకు ఎస్సీ యువకులపై దాడి చేయడమే కాకుండా హత్యాయత్నం కేసు నమోదు చేశారని స్వతంత్ర జనతా పార్టీ (రిపబ్లిక్) రాష్ట్ర అధ్యక్షుడు బర్రే ఆనంద్‌కుమార్ ఆరోపించారు. కు మంగళవారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాజానగరం నియోజకవర్గంలో మట్టి మాఫియాకు పోలీసులు సహకరిస్తున్నారన్నారు. పోలీస్ స్టేషన్‌లో బాధిత కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేసినా ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు.

వృద్ధులకు మరిన్ని సౌకర్యాలు కల్పించాలి

రాజమహేంద్రవరం సాంస్కృతికం: సీనియర్ సిటిజన్స్ కోసం కేంద్ర ప్రభుత్వం జాతీయ కార్యాచరణ ప్రణాళిక కార్యక్రమం వారికి మరిన్ని సౌకర్యాలు కల్పించడానికి ఉపయోగపడుతుందని స్వర్ణాంధ్రా వృద్ధుల కేంద్రం నిర్వాహకుడు గుబ్బల రాంబాబు అన్నారు. మంగళవారం లాలాచెరువులోని స్వర్ణాంధ్రా కేంద్రంలో జరిగిన సీనియర్ సిటిజన్స్ జాతీయ కార్యాచరణ ప్రణాళిక అధ్యయన కార్యక్రమంలో మాట్లాడారు. ప్రతి మండల కేంద్రంలో ఒక్కో వృద్ధాశ్రమం నిర్మించాలని కోరారు. వివేకానంద ఐటీఐ ఇన్‌స్ట్రక్టర్ సాయి, పుష్కరమాత వృద్ధాశ్రమం సిబ్బంది వెంకటకృష్ణ, సోంబాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రారంభమైన ఎకోటూరిజం పనులు

ఆ స్థలంలో వద్దంటున్న యువకులు

కడియం, న్యూస్‌టుడే: కడియపులంకలో ప్రారంభమైన ఎకోటూరిజం పనులు కొంత ఉద్రిక్తతకు దారితీశాయి. దాదాపు 50 మంది పోలీసులు రంగప్రవేశం చేయడంతో టెన్షన్ వాతావరణం నెలకొంది. వివరాల్లోకి వెళ్తే.. కడియపులంకలో ఎకోటూరిజం పార్కు అభివృద్ధికి 2015లో 2.60 ఎకరాలను అప్పటి పంచాయతీ అధికారులు రాష్ట్ర పర్యాటకశాఖకు అప్పగించారు. ఆ తర్వాత పనులేవీ జరగలేదు. తాజాగా కూటమి సర్కారు దీనిపై దృష్టి పెట్టింది. ఇటీవల రూ. 5కోట్లు మంజూరు చేయగా పనులు ప్రారంభించారు. ఇలా ఉండగా స్థానికంగా కొంతమంది యువకులు వ్యతిరేకిస్తున్నారు. ఆ ప్రదేశం క్రీడాకారులు అవసరమని, సమీప ఆలయంలోని కార్యక్రమాలన్నీ అక్కడే జరుగుతున్నాయనేది వారి వాదన. మంగళవారం పనుల ప్రారంభానికి సిబ్బంది రావడంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. డీఎస్పీ భవ్యకిశోర్ గ్రామపెద్దలు, యువకులతో మాట్లాడారు. సిబ్బందికి ఎలాంటి ఆటంకం కలిగించొద్దని సూచించారు. కడియపులంక పంచాయతీ కార్యాలయంలో ఇన్‌ఛార్జి తహసీల్దార్ సునీల్‌కుమార్ ఆధ్వర్యంలో పలువురు కూటమి నాయకులు, ప్రజాప్రతినిధుల సమక్షంలో యువకులతో చర్చించారు. దాదాపు 70సెంట్లు విడిచిపెట్టి మిగిలిన ప్రాంతంలో నిర్మాణం చేసుకోవాలన్న యువత డిమాండ్‌పై సందిగ్ధం నెలకొంది. ఒకసారి పర్యాటకశాఖకు అప్పగించిన భూమిని తిరిగిచ్చే అధికారం రెవెన్యూ యంత్రాంగానికి లేదని అధికారులు వివరించారు. ఎటువంటి నిర్ణయం తీసుకోకుండానే అర్ధాంతరంగా చర్చలు ముగిశాయి.

యువకులు, నాయకులతో చర్చిస్తున్న ఇన్‌ఛార్జి తహసీల్దారు సునీల్‌కుమార్

వార్షిక బడ్జెట్‌కు ప్రతిపాదనలు సిద్ధం చేయండి

శ్యామలాసెంటర్, న్యూస్‌టుడే: వచ్చే విద్యా సంవత్సరానికి పాఠశాలలో సౌకర్యాల నిమిత్తం వార్షిక బడ్జెట్ ప్రతిపాదనలు సిద్ధం చేయాలని డీఎస్ఈవో వాసుదేవరావు ఎంఈవోలను ఆదేశించారు. లాలాచెరువు ఉన్నత పాఠశాలలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ బడ్జెట్ రూపకల్పనలో మౌలిక వసతులకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. టీచర్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్‌లో ఉపాధ్యాయులు నమోదు చేసిన సమాచారమంతా సరైనదేనని ధ్రువపత్రాలను ప్రధానోపాధ్యాయుల నుంచి స్వీకరించి ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. జిల్లా సమగ్ర శిక్ష ఏపీసీఎస్ సుభాషిణి మాట్లాడుతూ ప్రతి ప్రాథమిక పాఠశాలలో అయిదు తరగతి గదులు కచ్చితంగా ఉండాలన్నారు. కొవ్వూరు డివిజన్ డీవైఈవో దిలీప్‌కుమార్, రూరల్ ఎంఈవో దుర్గాతులసీదాస్, సిబ్బంది, ఎంఈవోలు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న డీఎస్ఈవో వాసుదేవరావు

హెచ్చరిక ప్రకటన

నా క్లయింట్ రాజమండ్రి, మెరకవీధి, D.No.32-8-23/1 కాపురస్తులు డా. మంగిన శ్రీనివాసరావు గారు నాకిచ్చిన సంజాయిషీ ప్రకారం తెలియచేయునది ఏమనగా, నా క్లయింట్ భార్య అయిన వెంకట సుబ్బలక్ష్మి గార్కి ఆమె పూర్వీకుల ద్వారా సంక్రమించిన భూములలో ప్రస్తుతం రాజమండ్రిలో వున్న Sy.Nos. 416/2B2A & 416/2B2B లో గల Ac.15.53 సెంట్స్ భాగమై ఉన్నది. సదరు భూమిలో ఆమెకు గల 2/3 వంతు వాటా ఆమె తండ్రి గారు కంచుమర్తి వెంకట సుబ్బారావు గారి అనంతరం, తల్లి గారి అనంతరం మరియు ఆమె పెదతండ్రి కంచుమర్తి పార్థసారధి గారు వ్రాయించి ఇచ్చిన ది. 13-1-1985 గల ఏకైక రిజిస్టర్డ్ వీలునామా ద్వారాను సంక్రమించియున్నది. వెంకట సుబ్బలక్ష్మి గారి మరియొక పెదతండ్రి కంచుమర్తి వెంకట సీతారామారావు గారు, ఆయనకు ఆయన సోదరులకు గల ఉమ్మడి కుటుంబ ఆస్తుల పంపకం నిమిత్తం రాజమండ్రి సబ్ కోర్టులో OS No. 185/83 & O.S.No.189/87 న దావాలు దాఖలు చేసియున్నారు. O.S.No.189/87 దావా ఆస్తులలో ఉండివున్న Ac.15.71 cts లో పై Ac.15.53 cts భాగము అయివుంది. సదరు దావాలలో కోర్టువారు ది. 31-12-1992 న ఇచ్చిన తీర్పులో పార్థసారధి గారు వ్రాయించి ఇచ్చిన పై వీలునామా నిజమైనదని నిర్ధారించి తీర్పు ఇచ్చియున్నారు.

వెంకట సుబ్బలక్ష్మి గారి తండ్రి గారు, ఆయన సోదరులు వారికి గల భూములకు సంబంధించి దాఖలు చేసిన ల్యాండ్ సీలింగ్ డిక్లరేషన్స్ బాపతు ప్రొసీడింగ్స్ LCC Nos. 919, 168, 917 of RJY / 75 ట్రిబ్యునల్ మరియు ఆంధ్రప్రదేశ్ హైకోర్టులలో ఇంకా పెండింగ్‌గా వున్నాయి కావున పై షెడ్యూల్ ఆస్తిపై 01-01-1975 నుండి ఎవరు ఎటువంటి లావాదేవీలు చేసినా ల్యాండ్ సీలింగ్ చట్టరీత్యా కూడా చెల్లనేరవు. అలాంటివి చేసినవారు కఠిన శిక్షార్హులు.

వెంకట సుబ్బలక్ష్మి గారి అనంతరం ఆమె యావదాస్తులు నా క్లయింటకు, వారి సంతానమునకు పూర్తి హక్కులతో సంక్రమించియున్నవి.

పై యదార్థ విషయాలను కప్పిపుచ్చి విజయవాడ వాస్తవ్యులు పెలుగుబంటి హరిబాబు & అతని అనుచరులు పై భూమికి సంబంధించి నకిలీ పత్రాలతో లేని తప్పుడు హక్కులను సృష్టించి భూకుంభకోణంకు పాల్పడి పై భూమి యందు అక్రమంగా చెల్లుబాటు కాని అన్యాక్రాంతములు జరిపియున్నారు. వారిపై చాలా FIRలు మరియు CID కేసులు నమోదు అయ్యి విచారణలు కొనసాగుతున్నాయి. నా క్లయింట్ కుటుంబమునకు తప్ప పై భూమియందు ఇతరులు ఎవరికీ ఏవిధమైన హక్కులు లేవు. ఇతరులు ఎవరైనా పై భూమికి సంబంధించి ఎటువంటి అన్యాక్రాంతాలు చేసినా అవి మోసపూరితమైనవని మరియు నా క్లయింట్ కుటుంబముపై చెల్లవనియు ఇందుమూలముగా తెలియజేయడం అయినది. పై విషయాల దృష్ట్యా ఎవరైనా సదరు భూమిపై ఎటువంటి క్రయ విక్రయాలు చేయుటకు ప్రయత్నించినా వాళ్లను భూకబ్జా చేసిన వ్యక్తులుగా గుర్తించి వారిపై తగిన సివిల్ మరియు క్రిమినల్ చర్యలు తీసుకొనబడునని నా క్లయింట్ హెచ్చరించమన్నారు. ది. 12-02-2026 న ఈనాడు దినపత్రికలో వచ్చిన ప్రకటనకు దీనిని ఖండన ప్రకటనగా భావించవలెను.

Palepu Apparao, Advocte

17-02-2026 — D.No: 23-11-8/2, LB Sastri Road,

రాజమహేంద్రవరం — Rajamahendravaram, Cell: 98661 28918

ప్రకటన బోర్డులు.. నిబంధనలకు తూట్లు

రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: పట్టణ ప్రాంతాల్లో ప్రమాదకర ప్రకటనల బోర్డులపై చర్యలు తీసుకోవాలని గతంలోనే న్యాయస్థానం ఆదేశించింది. ఇష్టానుసారం బోర్డులు ఏర్పాటు చేయడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని నిబంధనల మేరకు మాత్రమే అనుమతులు ఇవ్వాలని సూచనలు చేసింది. చారిత్రక రాజమహేంద్రవరంలో ప్రకటనల బోర్డులు ప్రమాదకరంగా ఏర్పాటు చేస్తున్నారు. ప్రధాన రహదారులు, కూడళ్లను ఆనుకొని గృహాలను లక్ష్యంగా చేసుకొని సంబంధిత యజమానులను ఒప్పించి, వాటికి అద్దెలు చెల్లిస్తున్నారు. తుపానుల సమయంలో అవి ఒరిగి కింద పడుతున్నాయి.

ట్రాఫిక్ ఇబ్బందులు

నగరంలో చాలా వరకూ నిబంధనలు పాటించకుండానే ప్రకటనల బోర్డులు ఏర్పాటు చేస్తున్నారు. వాస్తవానికి ప్రధాన రోడ్లు, జంక్షన్ల వద్ద కంటి దృష్టికి అనుకూలంగా మాత్రమే బోర్డులు ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. దృష్టిని మళ్లించే బోర్డులు వల్ల ట్రాఫిక్‌లో ఇబ్బందులు తప్పవు. అర్బన్‌లో కంబాలచెరువు, దేవీచౌక్, మెయిన్ రోడ్డు, కోటిపల్లి బస్టాండ్, తాడితోట తదితర ప్రాంతాల్లో గృహాలపై ఇష్టానుసారంగా బోర్డులు ఏర్పాటు చేశారు. అవి కంటి దృష్టికి ప్రమాదకరంగా మారాయి. రెండేళ్ల కిందట దానవాయిపేట, ప్రకాశంనగర్ , టి.నగర్, కంబాలచెరువు ప్రాంతాల్లో భారీ వర్షాలకు నేలపై కూలిపోవడంతో పలువురికి గాయాలయ్యాయి.

గత ఏడాది ఈదురు గాలులకు ఒరిగిన బోర్డులు

శివారు ప్రాంతాల్లోనే అధికం

నగరంలో అధికారిక లెక్కల ప్రకారం 1200 వరకూ ప్రకటనల బోర్డులు ఉన్నాయి. లెక్కల్లో లేనివి అదనంగా మరో 200 వరకూ ఉంటాయి. నగర శివారు ప్రాంతాల్లో ఎక్కువగా వీటిని ఏర్పాటు చేస్తున్నారు. వీటిలో చాలా వాటికి లీజు చెల్లించకపోవడంతో ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతోంది.

(c) eenadu

రాజమహేంద్రవరం గ్రామీణం

• రాజమహేంద్రవరం గ్రామీణం • రాజానగరం

వేతనాల పెంపుపై ఉద్యోగుల హర్షం

రాజానగరం, న్యూస్‌టుడే: రాష్ట్రవ్యాప్తంగా 108 సర్వీసులో ఉద్యోగులకు జీతాలు పెంచడం, ఆటోమేటిక్ స్లాబ్ అప్‌గ్రేడేషన్ విధానం వర్తింపజేయడంపై టీఎన్‌టీయూసీ, తెలుగునాడు 108 వర్కర్స్ యూనియన్ నేతలు హర్షం వ్యక్తం చేశారు. సంఘ అధ్యక్షుడు పి.నాగరాజు, ప్రధాన కార్యదర్శి యుగంధర్, సలహాదారు సుంకర శ్రీనివాసరావు మంగళవారం స్థానిక విలేకర్లతో మాట్లాడారు. సీఎం చంద్రబాబు, ఐటీ శాఖామంత్రి నారా లోకేశ్, వైద్యారోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ నేతృత్వంలో వైద్యరంగానికి ప్రాధాన్యం ఇస్తున్నారన్నారు. పైలెట్, ఈఎంటీ ఉద్యోగుల వేతనాలు పెంచడంతో మరింత బాధ్యతాయుగంగా విధులు నిర్వహిస్తామన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా

ఉ॥ 10 - మ॥ 1 మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు		
	ధవళేశ్వరం: 91212 29057	కడియం: 91212 29062
	బొమ్మూరు: 91549 78039	మోరంపూడి: 94935 92696
	రాజానగరం: 98492 36167	కోరుకొండ: 80085 74213

రహదారి బాగు చేయించరూ..

సమస్య: బొమ్మూరు జీపీఆర్ మార్గంలో రోడ్డు గుంతలుగా ఉంది. వీధి దీపాలు లేకపోవడంతో రోడ్డు సరిగా కనిపించట్లేదు. - కిరణ్, స్థానికుడు

సమాధానం: నిధులు మంజూరు కాగానే మరమ్మతులు చేయిస్తాం. - కాశీ, కార్యదర్శి, బొమ్మూరు

- న్యూస్‌టుడే, బొమ్మూరు

వెలుగులు

ఈనాడు కథనానికి స్పందన

బొమ్మూరు: బొమ్మూరు కాశీ కృష్ణనగర్‌లో వీధి దీపాలు లేక చీకటిగా ఉంది. రాకపోకలకు స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. ఈ సమస్యపై 'ఈనాడు'లో మంగళవారం 'దారంతా చీకటి' శీర్షికతో చిత్రకథనం ప్రచురితమైంది. కార్యదర్శి కాశీ స్పందించి కొత్తవి ఏర్పాటు చేయించారు.

జంబూపట్నంలో చాగంటి ప్రవచనం నేడు

కోరుకొండ, న్యూస్‌టుడే: ప్రముఖ ప్రవచనకర్త, రాష్ట్ర ప్రభుత్వ నైతిక విలువల సలహాదారు చాగంటి కోటేశ్వరరావు బుధవారం మండలంలోని జంబూపట్నం గ్రామానికి రానున్నారు. శివాలయం ప్రాంగణంలో సాయంత్రం 6 గంటలకు ప్రవచనం చేయనున్నారు. అన్ని గ్రామాల ప్రజలు ఆహ్వానితులే అని నిర్వాహకులు తెలిపారు.

ఇంతులు.. ఉపాధి కాంతులు

బొమ్మూరు, హుకుంపేట, న్యూస్‌టుడే: యువతులు, మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పించడానికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తోంది. అందులో భాగంగా బొమ్మూరులోని జిల్లా మహిళా ప్రాంగణంలో ఏపీఎస్ఎస్‌డీసీ ఆధ్వర్యంలో ఎంబ్రాయిడరింగ్, ఆధునిక కుట్టు కోర్సులతో పాటు అదనంగా బ్యూటీషియన్ కోర్సుపై కూడా శిక్షణ ఇస్తున్నారు. ఉదయం 9.30 నుంచి సాయంత్రం 4.30 వరకు తరగతులు నిర్వహిస్తున్నారు. మహిళలు ఇంటి దగ్గరే ఉండి ఉపాధి అవకాశాలు పొందడానికి ఇది చక్కని అవకాశమని ప్రాంగణం జిల్లా మేనేజర్ విమల చెబుతున్నారు. సుమారు 50 మంది నేర్చుకుంటుండగా, పలువురు తమ అభిప్రాయాలు పంచుకున్నారిలా..

ప్రాంగణంలో శిక్షణ ఇస్తున్న శిక్షకురాలు అమరావతి

నేను, మా చెల్లి కూడా..

టైలరింగ్ శిక్షణ కోసం రోజూ అనపర్తి నుంచి వస్తున్నా. గతంలో కొంత అనుభవం ఉన్నా పూర్తిస్థాయిలో నైపుణ్యం కోసం ఇక్కడ చేరాను. అంబరిల్లా, లాంగ్ ఫ్రాక్స్ వంటి వివిధ రకాల గౌన్లు కుడుతున్నా. సరికొత్త మోడల్స్ కుట్టేలా ఇక్కడ నేర్పిస్తున్నారు. మా చెల్లి ఇక్కడే బ్యూటీషియన్ కోర్సు నేర్చుకుంటోంది. శిక్షణ తర్వాత మేమిద్దరం మా ఇంటి దగ్గర వ్యాపారాలు పెట్టుకుంటాం.

- పి.సమత, అనపర్తి

వాటికి మంచి డిమాండ్..

సొంత కాళ్లపై నిలబడాలనే ఉద్దేశంతో ఇక్కడ చేరాను. ఇంట్లో ఏడాదిన్నర పాపను వదిలి రోజూ కేశవరం నుంచి ఇక్కడకు వస్తున్నా. ప్రస్తుతం ఫ్యాషన్ దుస్తులకు మంచి డిమాండ్ ఉంది. వివిధ రకాల శుభకార్యాలకు వేర్వేరు మోడల్స్ దుస్తులు వేసుకోవడం ఇప్పుడు ఫ్యాషన్. అందుకనుగుణంగా కుట్టగలిగితే మనకు మంచి డిమాండ్ ఉంటుంది.

- వి.సురేఖ, కేశవరం

ఉచితంగా నేర్పిస్తున్నారు..

ఇదే కోర్సు బయట నేర్చుకోవాలంటే రూ.6 వేలు ఖర్చు చేయాలి. ఆర్థిక పరిస్థితుల కారణంగా చాలామంది వెనుకడుగు వేస్తారు. ఇక్కడ ఉచితంగా నేర్పడం ద్వారా చాలామందికి మేలు జరుగుతుంది. సొంతంగా ఉపాధి పొందే అవకాశం లభిస్తుంది. అన్నిరకాల మోడల్స్ కుట్టడంపై దృష్టి పెట్టాను. చదువుతో సంబంధం లేకుండా అందరూ నేర్చుకోవచ్చు.

- కె.లిష్మాలయ, బొమ్మూరు

నైపుణ్యం ఉంటే ఆదాయం..

సాధారణ జాకెట్‌కు రూ.150, మోడల్ బట్టి రూ.300 నుంచి రూ.800 వరకు తీసుకుంటున్నారు. చీరలకు ఎంబ్రాయిడరీ, అమ్మాయిల గౌన్లు తదితరాలకు మంచి డిమాండ్ ఉంది. నైపుణ్యం ఉంటే ఆదాయం బాగుంటుంది. బాగా నేర్చుకున్న తర్వాత సొంతంగా వ్యాపారం పెట్టాలని నిర్ణయించుకున్నా. అర్థమయ్యేలా చెప్తున్నారు.

- పి.నవ్యత, ధవళేశ్వరం

'భారత్ విస్తార్'తో మెరుగైన సేవలు

రాజానగరం: భారత్ విస్తార్ ఏఐ ప్లాట్‌ఫామ్‌తో మరింత మెరైన సేవలు అందుతాయని కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే) అధికారులు తెలిపారు. కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్‌సింగ్‌చౌహాన్ జైపూర్ నుంచి మంగళవారం ఈ ప్లాట్‌ఫామ్‌ను ప్రారంభించారు. దీనిని వెబ్‌కాస్ట్‌లో తిలకించేందుకు కలవచర్లలోని కేవీకేలో ఏర్పాటు చేయగా వివిధ మండలాలకు చెందిన 100 మంది రైతులు హాజరయ్యారు. ఈ సందర్భంగా కేవీకే అధికారి వి.ఎస్.జి.ఆర్.నాయుడు మాట్లాడుతూ రైతులకు సరైన సమయంలో పక్కా సమాచారాన్ని ఇచ్చేందుకు, వారి ఆదాయం పెంచేందుకు, వ్యవసాయాన్ని మరింత లాభదాయకంగా మార్చేందుకు ఇది ఉపయోగపడుతుందన్నారు. ఈ సమాచారం 22 భారతీయ భాషలలో అందుబాటులో ఉంటుందన్నారు. వాతావరణ సమాచారం, కేంద్ర ప్రభుత్వ పథకాల సమాచారాన్ని అందిస్తుందన్నారు. అధికారులు బి.నాగేశ్వర రెడ్డి, సంజయ్ వినాయక్ హెగ్డే, రఘునందన్, అజ్మల్ తదితరులు పాల్గొన్నారు.

CHANGE OF NAME

I JP SHARAN S/o. Kalingi Lazar, D.No. 3-921, 12th Street, Ramakrishna, Nagar, Rajamahendravaram, E.G.Dt., A.P.-533107. I have changed my Name from JOHN PAL KALINGI (Old Name) to JP SHARAN (New Name). Henceforth I am being called as JP SHARAN S/o. Kalingi Lazar for all purpose.

పాస్‌పోర్టు పోయినది

Nalam Phani Kumar, S/o Kameswara Rao, D.No: 2-40-46/7, Datta Apartments, Alcot Gardens, Rajamahendravaram (U), E.G. District, A.P. అను నాకు విశాఖపట్నం పాస్‌పోర్ట్ ఆఫీస్‌వారు జారీచేసిన పాస్‌పోర్ట్ నెం. R7201352ను తీసుకుని ది.05-01-2026న ఇంటినుండి కోటిపల్లి బస్టాండ్ వద్ద జిరాక్స్ షాప్‌కు వెళ్తుండగా దారిలో పడిపోయినది. ఎంత వెతికినను దొరకలేదు. ఎవరికైనా దొరికిన యడల ఈ క్రింది ఫోన్ నెంబర్‌కు తెలియజేయవలసినదిగా కోరుతున్నాను.

Cont: 90520 35490

విద్యార్థుల భవిష్యత్తుకు భరోసా: బీవీఆర్

కోరుకొండ, రాజానగరం, న్యూస్‌టుడే: ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేసి విద్యార్థుల భవిష్యత్తుకు భరోసా కల్పించారని జిల్లా తెదేపా అధ్యక్షుడు, రుడా ఛైర్మన్ బీవీఆర్ చౌదరి హర్షం వెలిబుచ్చారు. ఇందులో విద్యాశాఖమంత్రి నారా లోకేశ్ చొరవ అభినందనీయమన్నారు. బూరుగుపూడి గేటు సమీపంలోని తెదేపా కార్యాలయంలో మంగళవారం ఆయన మాట్లాడారు. విద్యావ్యవస్థలో సమస్యల పరిష్కారానికి లోకేశ్ కృషి చేస్తున్నారన్నారు. బకాయిల చెల్లింపు విషయంలో రూ.1,200 కోట్లు విడుదల చేయడంతో బీసీ, ఈడబ్ల్యూఎస్, మైనార్టీ వర్గాలకు మేలు జరిగిందన్నారు.

'అసత్య ఆరోపణలు చేస్తే ఉపేక్షించం'

గోకవరం, న్యూస్‌టుడే: ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూపై అసత్య ఆరోపణలు చేస్తే ఉపేక్షించేది లేదని జగ్గంపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ ఆదాల భరత్‌బాబు హెచ్చరించారు. బూరుగుపూడి మాజీ సర్పంచ్ పాటంశెట్టి సూర్యచంద్ర చేసిన వ్యాఖ్యలపై గోకవరం తెదేపా కార్యాలయం వద్ద మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. భరత్‌బాబుతో పాటు సూరంపాలెం ప్రాజెక్టు ఛైర్మన్ ఉంగరాల రాములు, తెదేపా మండల పార్టీ అధ్యక్షుడు చంటిబాబు, గునిపే భరత్, బద్దిరెడ్డి బాబిలు మాట్లాడుతూ.. అభివృద్ధి ప్రదాత జ్యోతుల నెహ్రూను విమర్శించే స్థాయి పాటంశెట్టికి లేదన్నారు. అధికారంలోకి వచ్చిన 18 నెలల్లోనే రూ.కోట్లతో జగ్గంపేట, తంటికొండ, రంపయర్రంపాలెం రోడ్లను నిర్మించారన్నారు. ఆయనపై ఆరోపణలు చేస్తే తాము చూస్తూ ఊరుకోమన్నారు. సొసైటీ మాజీ అధ్యక్షుడు దాసరి తమ్మన్నదొర, తంటికొండ దేవస్థానం ఛైర్మన్ బద్దిరెడ్డి అచ్చన్నదొర, దాసరి సీతారామయ్య, పైలా శ్రీనివాసరావు, పురంశెట్టి శివాజీ, గళ్లా రాము తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధికి సంబంధించిన పత్రాలను చూపుతున్న తెదేపా నాయకులు

ప్రారంభమైన ఎకోటూరిజం పనులు

ఆ స్థలంలో పార్కు వద్దంటున్న యువకులు

కడియం, న్యూస్‌టుడే: కడియపులంకలో ప్రారంభమైన ఎకోటూరిజం పనులు కొంత ఉద్రిక్తతకు దారితీశాయి. దాదాపు 50 మంది పోలీసులు రంగప్రవేశం చేయడంతో ఆందోళన వాతావరణం నెలకొంది. వివరాల్లోకి వెళ్తే.. కడియపులంకలో ఎకోటూరిజం పార్కు అభివృద్ధికి 2015లో 2.60 ఎకరాలను అప్పటి పంచాయతీ అధికారులు రాష్ట్ర పర్యాటకశాఖకు అప్పగించారు. తర్వాత పనులేవీ జరగలేదు. తాజాగా కూటమి సర్కారు దీనిపై దృష్టి పెట్టింది. ఇటీవల రూ.5 కోట్లు మంజూరు చేయగా పనులు ప్రారంభించారు. ఇలా ఉండగా స్థానికంగా కొంతమంది యువకులు వ్యతిరేకిస్తున్నారు. ఆ ప్రదేశం క్రీడాకారులకు అవసరమని, సమీప ఆలయంలోని కార్యక్రమాలన్నీ అక్కడే జరుగుతున్నాయనేది వారి వాదన. మంగళవారం పనుల ప్రారంభానికి సిబ్బంది రావడంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. డీఎస్పీ భవ్యకిశోర్ గ్రామపెద్దలు, యువకులతో మాట్లాడారు. సిబ్బందికి ఎలాంటి ఆటంకం కలిగించొద్దని సూచించారు. కడియపులంక పంచాయతీ కార్యాలయంలో ఇన్‌ఛార్జి తహసీల్దార్ సునీల్ కుమార్ ఆధ్వర్యంలో పలువురు కూటమి నాయకులు, ప్రజాప్రతినిధుల సమక్షంలో యువకులతో చర్చించారు. దాదాపు 70సెంట్లు విడిచిపెట్టి మిగిలిన ప్రాంతంలో నిర్మాణం చేపట్టాలన్న యువత డిమాండ్‌పై సందిగ్ధం నెలకొంది. ఒకసారి పర్యాటకశాఖకు అప్పగించిన భూమిని తిరిగిచ్చే అధికారం రెవెన్యూ యంత్రాంగానికి లేదని అధికారులు వివరించారు. ఎటువంటి నిర్ణయం తీసుకోకుండానే అర్ధాంతరంగా చర్చలు ముగిశాయి.

యువకులు, నాయకులతో చర్చిస్తున్న ఇన్‌ఛార్జి తహసీల్దార్ సునీల్‌కుమార్

నులిపురుగుల నివారణపై శ్రద్ధ అవసరం

కడియం, న్యూస్‌టుడే: కడియం జడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం ఉదయం విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ వెలుగుబంటి సత్యప్రసాద్ మాట్లాడుతూ నులిపురుగులతో చిన్నారులకు రక్తహీనత, నీరసం, ఏకాగ్రత లోపించడం వంటివి కలుగుతాయన్నారు. వాటి నివారణకు వైద్యారోగ్య శాఖ అధికారుల పర్యవేక్షణలో మాత్రలు వేసుకోవాలని సూచించారు. ప్రధానోపాధ్యాయుడు టి.సత్యనారాయణ, సొసైటీ అధ్యక్షుడు వెలుగుబంటి నాని, చిలుకూరి ప్రభాకర్, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

● రాజానగరం: జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా రాజానగరం పీహెచ్‌సీ వైద్యులు, ఆరోగ్య సిబ్బంది ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. పీహెచ్‌సీ పరిధిలోని గ్రామాల్లో ఒక నుంచి 19 ఏళ్ల వారికి ఇచ్చినట్లు వైద్యాధికారి జి.బాస్కర్‌రామ్ తెలిపారు. 17,510 మందికి ఇవ్వడం లక్ష్యం కాగా మంగళవారం 16,979 మందికి ఇచ్చామని, మిగిలిన వారికి ఈనెల 24న అందిస్తామన్నారు.

● కోరుకొండ: కోరుకొండ పీహెచ్‌సీ పరిధిలోని ఆయా గ్రామాల్లో 99.14 శాతం మంది పిల్లలకు మాత్రలు వేసినట్లు వైద్యాధికారి జ్ఞానచంద్ర తెలిపారు. కోరుకొండ, కాపవరం, పశ్చిమగోనగూడెం, మునగాల, జంబూపట్నం, నరసాపురం, కణుపూరు, గాదరాడ గ్రామాల్లో 7,824 మంది పిల్లలకు 7,757 మందికి మాత్రలు ఇచ్చామన్నారు.

PUBLIC NOTICE

On Instructions by my Client M/s Shriram Finance Ltd., Innispeta Branch, E.G.Dt. issue this Notice to General Public. My Client Intends to Sanction loan to Sri Satti Mula Reddy, S/o Sri Satti Sura Reddy, Rajahmundry on the Security of the below mentioned property belongs to them by way of registered equitable mortgage.

SCHEDULE OF THE PROPERTY/TIES

A vacant site of 302.5 Sq. yards covered by in R.S. No. 34/1 & 34/3. Plot No. 21, towards South side sq. 101.83 yds out of sq. 201.66 yds and in Plot No. 22, sq. 201.66 yds total sq. 302.5 yds. situated at Hukumpeta Village, Hukumpeta Gram Panchayat, Rajahmundry Rural Mandal, Kadiyam Sub-Registrar, Rajahmundry District Registrar, East Godavari District, within the following boundaries: EAST: Vacant Area of Plot No. 9 & 10 of this plan 49'.6"; WEST: 30' Main Road as per plan 49'.6"; NORTH: Plot No. 21 Sold to Kovvuri Venkata Surya Sundar Reddy 55'.0"; SOUTH: Vacant area of Plot No. 23 55'.0".

Together with all easement rights in the vacant site of sq. 302.5 Yds 252.89 sq. mts.

PURAMSETTI SATYA RAMESH

K.VENKATA LAKSHMI, ADVOCATES, 79-21-08-6, Sri Lakshmi APt.,-1 Law College Road, Rajahmundry. 99666 18871

Dt.16-02-2026, RAJAMAHENDRAVARAM.

PUBLIC NOTICE

On Instructions by my Client M/s Shriram Finance Ltd., Aryapuram Branch, Rajamahendravaram-1, E.G.Dt., issue this Notice to General Public. My Client Intends to Sanction loan to SRI NIDADAVOLU RAMBABU, S/o Sri Nidadavolu Peda Sathi Raju @ Sathi Raju, 1-80/3, Fanjallipeta, Rajanagaram, E.G.Dt., on the Security of the below mentioned property belongs to them by way of registered equitable mortgage.

SCHEDULE OF THE PROPERTY/TIES

An area of 460.83 Sq. yards = 385.29 sq. mts covered by in RS No. 83/1B, situated in Ac.3.47 cts centre 0.87 cts West side way and in the sense site of D. No. 1-42 Bangala Penku House at Rajanagaram sivaru, Fanjallipeta Panchayat, Rajanagaram (Fanjallipeta gramam Taluk) Rajanagaram Sub-Registrar, Rajanagaram Mandal, East Godavari District, within the following boundaries: EAST: Battula Deenamma gari site 59'3" SOUTH: Nidadavolu Veerabhadra Rao daanapatta property written today among us. 70'0", WEST: Common joint Road left by us 59'.3", NORTH: Nidadavolu Sattibabu daanapatta property written today among us. 70'.0"

Together with all easement rights of 460.83 sq. yds site along with D. No.1-42, Bangala Penku House with windows, doors, ceiling and door frames etc.

PURAMSETTI SATYA RAMESH

K.VENKATA LAKSHMI, ADVOCATES, 79-21-08-6, Sri Lakshmi APt.,-1 Law College Road Rajahmundry, 99666 18871

Dt.17-02-2026, RAJAMAHENDRAVARAM.

రహదారి పక్కనే వ్యర్థాలు

బొమ్మూరు ఏపీ ట్రాన్స్‌కో ప్రహరీకి ఆనుకుని చెత్త పేరుకుపోయింది. కొన్ని రోజులుగా రోడ్డు పొడవునా వ్యర్థాలు వేస్తున్నారు. దగ్గరలోని దుకాణాల్లో టీ కప్పులు, ఆహార ప్యాకెట్లు ఇష్టానుసారంగా పడేస్తున్నారు. సమీప కార్యాలయల సముదాయల వద్ద అపరిశుభ్రంగా ఉండటంపై స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. సమస్యపై కార్యదర్శి కాశీని సంప్రదించగా చెత్త తొలగిస్తామన్నారు. – న్యూస్‌టుడే, బొమ్మూరు

కమ్మేసిన పొగమంచు

ఇటీవల వాతావరణం వైవిధ్యంగా ఉంటోంది. కొన్నిరోజులు పగలంతా ఉక్కబోతగా ఉండగా, రాత్రిపూట విపరీతమైన మంచు పడుతోంది. మంగళవారం ఉదయం రాజానగరం, దివాన్‌చెరువు, జాతీయ రహదారి వెంబడి పలు గ్రామాలను పొగమంచు కమ్మేసింది. ఉదయం 8 గంటలు దాటిన తర్వాత కూడా మంచు పడటంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. – న్యూస్‌టుడే, రాజానగరం

నన్నయ ప్రవేశం ద్వారంలో మంచుతో కనిపించని రహదారి

ప్రకృతి ఒడిలో ఆటలు

నిత్యం పుస్తకాలతో కుస్తీ పట్టే విద్యార్థులు మంగళవారం దివాన్‌చెరువులోని గోదావరి మహాపుష్కరవనంలో సందడి చేశారు. అభయారణ్యం పక్కనే ఉన్న వనంలో కొన్ని వేల వృక్షాలు, వందల రకాల మొక్కలు ఉన్నాయి. వీటిపై పిల్లలకు అవగాహన కల్పించేందుకు విద్యాసంస్థలు తమ విద్యార్థులను తీసుకొస్తాయి. వారంతా ఆటపాటలతో ఉల్లాసంగా గడిపారు. ఓపెన్ జిమ్‌లో సందడి చేశారు. - న్యూస్‌టుడే, రాజానగరం

'బాధ్యతా' సేవాసంస్థ చేయూత

కడియం, న్యూస్‌టుడే: జేగురుపాడు బీసీకాలనీలో ర్యాలీ సత్యవతి ఇల్లు ఇటీవల పూర్తిగా కాలిపోయింది. బాధితురాలని సర్పంచి యాదల సతీశ్‌చంద్రస్టాలిన్ నేతృత్వంలో బాధ్యతా సేవాసంస్థ అధ్యక్షుడు గిరజాల బాబు మంగళవారం పరామర్శించారు. సంస్థ కార్యవర్గ సభ్యులతో కలిసి నిత్యావసరాలు అందించారు. ఎంపీటీసీ సభ్యుడు ఆకుల సుధాకర్, పున్నమిరాజు వీర్రాజు, బళ్ల అన్నవరం, మునియ్య, శాకా కిరణ్, బత్తిన శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

సకాలంలో గుర్తించు.. కుష్ఠు నివారించు..

కడియం, న్యూస్‌టుడే: సకాలంలో గుర్తిస్తే స్పర్శ కుష్ఠు నివారణ సాధ్యమేనని ఆ శాఖ జిల్లా నివారణాధికారి డాక్టర్.వసుంధర సూచించారు. కడియం మండలం చైతన్యనగర్ లెప్రసీకాలనీలో మంగళవారం ఉదయం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మైకోబాక్టీరియమ్ అనే సూక్ష్మ క్రిమి సోకడంతో ఈ చర్మవ్యాధి కలుగుతుందన్నారు. ముందస్తు అవగాహనతో అరికట్టవచ్చాన్నారు. ఎండీటీ చికిత్సతో నూరు శాతం అంగవైకల్యం దూరమవుతుందన్నారు. ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాల్లో ఈ చికిత్స అందుబాటులో ఉందన్నారు. దాతలు సమకూర్చిన వాకర్లు, నడక కర్రలు, కళ్లద్దాలు, దుప్పట్లు, తదితర వస్తువులను రోగులకు పంపిణీ చేశారు. డాక్టర్ హారిక, పీఎంవో వీరలక్ష్మి, డీపీఎంవోలు నాగమలేశ్వరరావు, వెంకటరావు, మోషే, ఏఎన్ఎం లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

లెప్రసీ కాలనీలో మాట్లాడుతున్న జిల్లా అధికారిణి వసుంధర

వార్షిక బడ్జెట్‌కు ప్రతిపాదనలు సిద్ధం చేయండి

శ్యామలాసెంటర్: వచ్చే విద్యా సంవత్సరానికి పాఠశాలలో సౌకర్యాల నిమిత్తం వార్షిక బడ్జెట్ ప్రతిపాదనలు సిద్ధం చేయాలని డీఎస్ఈవో వాసుదేవరావు ఎంఈవోలను ఆదేశించారు. లాలాచెరువు ఉన్నత పాఠశాలలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ బడ్జెట్ రూపకల్పనలో మౌలిక వసతులకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. టీచర్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్‌లో ఉపాధ్యాయులు నమోదు చేసిన సమాచారమంతా సరైనదేనని ధ్రువపత్రాలను ప్రధానోపాధ్యాయుల నుంచి స్వీకరించి ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. జిల్లా సమగ్ర శిక్ష ఏపీసీఎస్ సుభాషిణి మాట్లాడుతూ ప్రతి ప్రాథమిక పాఠశాలలో అయిదు తరగతి గదులు కచ్చితంగా ఉండాలన్నారు. కొవ్వూరు డివిజన్ డీవైఈవో దిలీప్‌కుమార్, రూరల్ ఎంఈవో దుర్గాతులసీదాస్, సిబ్బంది, ఎంఈవోలు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న డీఎస్ఈవో వాసుదేవరావు

దెబ్బతిన్న మంచినీటి పైపులైన్

ఇళ్లలోకి చొచ్చుకొచ్చిన నీరు

టి.నగర్, న్యూస్‌టుడే: రాజమహేంద్రవరం గ్రామీణం, వెంకటనగరం పంపింగ్ స్కీమ్ పైపులైన్ లీకైంది. కోలమూరు వద్ద పైపులకు పగుళ్లు రావడంతో నీరు వృథా అయ్యింది. జంగాలకాలనీలో ఇళ్లలోకి నీరు చేరిపోయింది. దీంతో స్థానికులు ఆందోళనకు గురయ్యారు. పంచాయతీ, రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు అక్కడకు చేరుకుని, మోటార్లు నిలిపివేయడంతో ఊపిరిపీల్చుకొన్నారు. రాజమహేంద్రవరం ఆర్డీవో కృష్ణ నాయక్ సంఘటనా స్థలానికి చేరుకొని పరిస్థితి పరిశీలించారు. పైపులైన్‌కు తక్షణం మరమ్మతులు చేపట్టాలని ఆదేశించారు.

కాతేరులో అగ్ని ప్రమాదం

బొమ్మూరు: కాతేరు పరిధి సుబ్బారావుపేటలో మంగళవారం రాత్రి ఓ పూరిల్లు పూర్తిగా కాలిపోయింది. రాజమహేంద్రవరం జిల్లా సహాయ అగ్నిమాపక అధికారి పి.శ్రీనివాస్, రెవెన్యూ అధికారులు, స్థానికుల వివరాల ప్రకారం.. మద్దా నూతియ్య, వనులమ్మ దంపతులు తమ ఇద్దరు కుమారులతో పూరింటిలో నివసిస్తున్నారు. చిన్న కుమారుడుకి ఆరోగ్యం బాగోలేకపోవడంతో నలుగురూ ఆసుపత్రికి వెళ్లారు. రాత్రి 7 గంటలకు షార్ట్‌సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగి, ఇల్లు పూర్తిగా కాలిపోయింది. అగ్నిమాపక సిబ్బంది మంటలు అదుపు చేశారు. నిలువ నీడ లేకుండా పోయిందని వారు కన్నీరుపెట్టుకున్నారు. ఆదుకుంటామని వీఆర్వో వెంకన్న తెలిపారు.

మహారాజశ్రీ జిల్లా కన్స్యూమర్ ఫోరమ్ -II తూ.గో.జిల్లా, రాజమహేంద్రవరం వారి కోర్టులో

C.C.No. 121/2025

Between :

1) కాశి పద్మావతి

2) ఎం.డి.వల్లి- పిటిషనర్లు/వాదులు

మరియు

1) మండపల్లి వెంకట కృష్ణ (బిల్డర్ హుకుంపేట)

2) ఎం. శ్రీనివాస్, షాపు ఓనర్, ధవళేశ్వరం

3) మేనేజర్ ఎం.ఎం. సూపర్‌మార్కెట్, మండపల్లి మెన్షన్, ధవళేశ్వరం,తూ.గో.జిల్లా -రెస్పాండెంట్లు/ప్రతివాదులు

ప్రకటన

పై నెంబర్ దావా గ్రంథములో రెస్పాండెంట్లపై 1, 2వ పిటీషనర్లకు సంబంధించిన జిల్లా కన్స్యూమర్ ఫోరమ్-II రాజమహేంద్రవరం పిటీషను C.C. 121/2025 గారికి శ్రీ కోర్టువారు ఎన్నిసార్లు నోటీసులు పంపినను అమలు జరగనందున పై పిటీషనులో 1, 2వ రెస్పాండెంటు హాజరు నిమిత్తం శ్రీ కోర్టు వారు ది.2-3-2026 తేదీకు వాయిదా వేసినారు. కావున పై పిటీషనులో 1,2వ వ రెస్పాండెంట్లకు ఏమైనా ఆక్షేపణలున్న యెడల పై కోర్టులో ది.2-3-2026 తేదీ ఉ.10.30 ని॥ లగాయితూ స్వయంగా గాని, ప్లీడరు ద్వారా గాని హాజరై తెలియజేసుకోవలెను. లేనియెడల 1,2వ రెస్పాండెంటు పరోక్ష మందు పిటీషన్ను శ్రీ కోర్టువారు తీర్మానించుదురని యీ ప్రకటన ద్వారా తెలియజేయడమైనది.

శ్రీ కోర్టువారి అనుమతితో

గుమ్మడి దేవిభవాని

రాజమండ్రి పిటీషనర్ తరుపు అడ్వకేట్

17-2-2026 రాజమండ్రి

ఇళ్ల పట్టాలపై విచారణకు డిమాండ్

మోరంపూడి: వైకాపా హయాంలో ఇళ్ల పట్టాల పంపిణీలో జరిగిన మాయాజాలంపై సమగ్ర విచారణ చేపట్టాలని భాజపా సీనియర్ నాయకుడు ఏపీఆర్ చౌదరి, జనతా వారధి కోకన్వీనర్ బండి సత్యప్రసాద్ డిమాండ్ చేశారు. మంగళవారం కలెక్టరేట్ కార్యాలయంలో జేసీ మేఘాస్వరూప్‌కు వినతిపత్రం ఇచ్చామన్నారు. ఈ సందర్భంగా ఏపీఆర్ మాట్లాడుతూ నకిలీ పట్టాలతో భూమి చూపించకుండా కొందర్ని మోసం చేశారన్నారు. వాళ్ల పేర్లు ఆన్‌లైన్‌లో చూపిస్తుండటంతో కొత్తగా నమోదు చేసుకునే అవకాశం కోల్పోయారన్నారు. పాతవి లేక, కొత్తగా రాక వారి పరిస్థితి అగమ్యగోచరంగా మారిందన్నారు.

జేసీకి వినతిపత్రం ఇస్తున్న భాజపా నాయకులు

కాలనీ కష్టాలు

ఖాళీస్థలాలు.. మురుగుకూపాలు

కొంతమూరు, న్యూస్‌టుడే: రాజమహేంద్రవరం గ్రామీణంలోని పలు ప్రాంతాల్లో ఖాళీస్థలాలు మురుగు చెరువులను తలపిస్తున్నాయి. కాతేరు, కొంతమూరు అఫిషియల్ కాలనీ, భవానీనగర్, సంతోష్‌నగర్, బ్రాహ్మణ అగ్రహారం తదితర ప్రాంతాల్లో సమస్య తీవ్రంగా ఉంది. నెలల తరబడి వ్యర్థాలు నిలిచిపోతున్నాయి. ఎప్పటికప్పుడు చెత్త తొలగించట్లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. కాతేరు గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారి పొడవునా మురుగు నిలిచి దుర్వాసన వెదజల్లుతుంది. దానికి తోడు కుక్కలు, పందుల సంచారం విపరీతంగా ఉండటంతో అటుగా వెళ్లే వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కాలువలు లేకపోవడంతో గృహ వినియోగ నీరు ఖాళీస్థలాల్లో చేరి చెరువుల్లా నిలిచిపోతోంది. దోమలు విపరీతంగా పెరిగాయని, చిన్నారులు, వృద్ధులు తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సంబంధిత అధికారులు స్పందించి తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతున్నారు.

కొంతమూరులో రహదారి పక్కన ఖాళీ స్థలంలో పేరుకుపోయిన మురుగు

చీకటిపడితే దోమలు..

కాలానుగుణ మార్పులతో దోమల సమస్య విపరీతంగా ఉంది. రాత్రయితే నిద్ర పట్టట్లేదు. పరిసరాల అపరిశుభ్రత కారణంగా సమస్య తీవ్రంగా ఉంది. శివారు ప్రాంతం కావడంతో అధికారులు పట్టించుకోవట్లేదు. – ఎన్.శ్రీదేవి, స్థానికురాలు

ప్రతిపాదనలు పంపాం..

పుష్కర గ్రాంట్లలో నిధులను విడుదల చేశారు. ఈ మేరకు ప్రతిపాదనలు పంపాం. త్వరలో అవసరం ఉన్న చోట మురుగు కాలువలు నిర్మిస్తాం. శుక్రవారం నుంచి కాలువల శుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాం. సమస్యలను తొలగించే విధంగా చర్యలు తీసుకుంటాం. – డి.శ్రీనివాసరావు, కోలమూరు, పంచాయతీ కార్యదర్శి

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

గోకవరం బ్రాంచ్, గోకవరం, తూర్పుగోదావరి జిల్లా

స్వాధీనతా ప్రకటన

(చర మరియు స్థిరాస్తుల కోసం)

(రూల్ నెం.8(1) చట్ట క్రింద)

సెక్యూరిటైజేషన్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 క్రింద మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని రూల్ 3తో చదువబడే సెక్షన్ 13 (2) క్రింద సంక్రమించిన అధికారములను వినియోగించుకుంటూ **స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, గోకవరం బ్రాంచ్, గోకవరం తూర్పుగోదావరి జిల్లా** యొక్క అధీకృత అధికారియగు దిగువ సంతకందారు **18-12-2025** తేదీ గల సంక్షిప్త డిమాండ్ నోటీసు జారీ చేసిన **ఋణగ్రహీతలు: (1) మెసర్స్ లక్ష్మీప్రణతి కన్‌స్ట్రక్షన్స్, (ప్రొప్రయిటర్ : బోలగొండ ఉదయ నాగబాబు,** తండ్రి : సూకరాజు, డోర్‌నెం. 3-232, క్రీస్తునిపాలెం, గోకవరం, తూర్పుగోదావరి జిల్లా **(2) శ్రీమతి సుంకర భాగ్యజ్యోతి,** భర్త సోమన్నదొర, డోర్‌నెం. 3-232, క్రీస్తునిపాలెం, గోకవరం, తూర్పుగోదావరి జిల్లా **హామీదారులు : 1) శ్రీ బోలగొండ ఉదయ నాగబాబు,** తండ్రి : సూకరాజు, డోర్‌నెం. 3-232, ముత్యాలమ్మ గుడి వద్ద, క్రీస్తునిపాలెం, గోకవరం, తూర్పుగోదావరి జిల్లా **(2) శ్రీమతి సుంకర భాగ్యజ్యోతి,** భర్త సోమన్నదొర, డోర్‌నెం. 3-232, ముత్యాలమ్మ గుడి వద్ద, క్రీస్తునిపాలెం, గోకవరం, తూర్పుగోదావరి జిల్లా **(OD ABL Account No. 36363561762)** వారిని సదరు నోటీసులో తెలిపిన విధంగా **17-12-2025 తేది నాటికి మొత్తం రూ.11,35,184/- (అక్షరాల పదకొండు లక్షల ముప్పైఅయిదు వేల నూటఎనభైనాలుగు రూపాయలు మాత్రమే)** + వడ్డీ, వ్యయాలు, చార్జీలు మొ. వాటిని తనుగుణంగా చెల్లించిన మొత్తం తగ్గించి, సదరు నోటీసు స్వీకరణ తేది నుండి 60 రోజుల్లోగా తిరిగి చెల్లించాలని కోరారు.

ఋణగ్రహీత / హామీదారులు సదరు మొత్తాన్ని తిరిగి చెల్లించడంలో విఫలమైనందున, సదరు రూల్స్‌లోని రూల్ 8 మరియు 9తో చదువబడే సదరు చట్టంలోని సెక్షన్ 13(4) క్రింద తనకు సంక్రమించిన అధికారములను వినియోగించుకుంటూ దిగువ వివరించిన ఆస్తిని దిగువ సంతకందారు **16 ఫిబ్రవరి 2026**న నిర్మాణాత్మక స్వాధీనం చేసుకున్నారని ముఖ్యంగా ఋణగ్రహీతకు / హామీదారులు మరియు సాధారణ ప్రజలకు ఇందుమూలముగా నోటీసు ఇవ్వడమైనది.

సదరు ఆస్తితో ఎలాంటి వ్యవహారం జరపరాదని మరియు సదరు ఆస్తితో జరిపే ఏ వ్యవహారములైనా **17-12-2025 తేది నాటికి మొత్తం రూ.11,35,184/- (అక్షరాల పదకొండు లక్షల ముప్పైఅయిదు వేల నూటఎనభైనాలుగు రూపాయలు మాత్రమే)** + వడ్డీ, వ్యయాలు మరియు **అనుషంగిక చార్జీలు** మొ॥నవి తదుపరిగా మీరు ఏమైనా చెల్లింపులు చేస్తే అవి తగ్గించి స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా చార్జీలకు లోబడి ఉంటాయని ముఖ్యంగా ఋణగ్రహీతను / హామీదారులు మరియు సాధారణ ప్రజలను ఇందుమూలంగా హెచ్చరించడమైనది.

చర మరియు స్థిరాస్తుల వివరణ

శ్రీ బోలగొండ ఉదయ నాగబాబు, తండ్రి : సూకరాజు

తూర్పుగోదావరి జిల్లా, గోకవరం మండలం, గోకవరం గ్రామం, టి.నగర్ (పాలెపువారి తోట ఏరియా) కోరుకొండ ఎస్ఆర్.వో 1916 చ॥గ॥ల మొత్తం విస్తీర్ణంలో తూర్పువైపున వున్న 560 చ॥గ॥ల (ఖాళీ స్థలం) ఆర్.ఎస్. నెం. 259/2, జిరాయితీ డ్రైలో ఎ.1.06 సెంట్ల పూర్తి విస్తీర్ణంలో ఎ.0.91 సెంట్ల స్థలమునకు **సరిహద్దులు : తూర్పు** : చర్చి ప్రహరీ గోడ మరియు బోడంగి భాను. **దక్షిణం** : రోడ్డు మరియు ఇతరుల ఇల్లు, **పడమర** : రాజమార్గం, **ఉత్తరం** : నల్లమిల్లి శ్రీనివాసరెడ్డి గారి స్థలం.

తేది : 16-02-2026

ప్రదేశం : గోకవరం

అధికృత అధికారి

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

(c) eenadu

కొవ్వూరు

• కొవ్వూరు • నిడదవోలు • గోపాలపురం

అభివృద్ధి పనులు వేగవంతం

నిడదవోలు : అభివృద్ధి పనులు నాణ్యతతో వేగంగా పూర్తి చేయడమే లక్ష్యమని పురపాలక సంఘ ఛైర్మన్ భూపతి ఆదినారాయణ అన్నారు. అన్నపూర్ణనగర్ నుంచి చిన్నకాశీరేవు వరకు ప్రతిపాదిత అప్రోచ్ రోడ్డు, రుడా, 15వ ఆర్థిక సంఘ నిధులతో నిడదవోలు బస్టాండ్ కూడలి నుంచి సంతమార్కెట్ అంబేడ్కర్ విగ్రహం వరకు నిర్మిస్తున్న డ్రెయిన్, సీసీ రహదారి, డ్రైనేజీ లైన్ రహదారి నిర్మాణ పనులను ఆయన మంగళవారం పరిశీలించారు. కార్యక్రమంలో రైల్వే సీనియర్ సెక్షన్ ఇంజినీర్ డి.రవికిషోర్, ఆర్టీసీ ఎస్ఈ డిప్యూటీ ఇంజినీర్ శేషగిరిరావు, పట్టణ ప్రణాళికాధికారి ఎస్.సుబ్రియ, ఏఈ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వంద రోజుల ప్రణాళిక అమలుపై ఆరా

గోపాలపురం: స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాల, రేగులకుంటలోని డా.బి.ఆర్.అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలను డీఈవో కె.వాసుదేవరావు మంగళవారం తనిఖీ చేశారు. రేగులకుంటలోని బాలుర వసతి గృహంలో భోజనం, అల్పాహారాన్ని పరిశీలించారు. పాఠశాలలో పదో తరగతి విద్యార్థుల ప్రీ ఫైనల్, ఎఫ్ఏ-4 పరీక్షల నిర్వహణను పరిశీలించి ఉపాధ్యాయులకు సూచనలు ఇచ్చారు. పదో తరగతి, ఇంటర్ విద్యార్థులతో మాట్లాడి 100 రోజుల కార్యాచరణ ప్రణాళిక అమలు, పరీక్షల సంసిద్ధతపై ఆరా తీశారు.

స్వామివార్లకు త్రిశూల స్నానం

పెరవలి : తీపర్రు, కాకరపర్రు, ఖండవల్లి, మల్లేశ్వరంలోని శైవ క్షేత్రాల్లో స్వామివార్లకు మంగళవారం వేకువజామునే గోదావరి వద్ద త్రిశూల స్నానం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా

శుభ్రం చేశారు..

దేవరపల్లి : మండలంలోని యాదవోలు పంచాయతీ పరిధిలోని గోపాలపురం వెళ్లే రహదారిలో ఉన్న ఎస్సీ ఏరియా మంచినీటి ట్యాంకు సమీపంలో చెత్తచెదారం, వ్యర్థాలు పేరుకుపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని స్థానికులు వాపోతున్నారు. ఈ సమస్యను పంచాయతీ కార్యదర్శి ప్రసాద్ దృష్టికి తీసుకెళ్లగా స్పందించి శుభ్రం చేయించారు.

స్పందనకు వందనం

దుర్వాసనతో అవస్థలు..

సమస్య: దూబచర్ల ప్రధాన రహదారి పక్కన ఉన్న డ్రెయిన్ పూడిపోవడంతో మురుగు పారుదలకు ఆటంకాలు ఎదురవుతున్నాయి. పొంగి బయటకు వస్తుండటంతో ఆ ప్రాంతమంతా దుర్వాసన వెల్లువెత్తుతోంది. - స్థానికులు

సమాధానం: కాలువను శుభ్రం చేయిస్తాం. - ఆశాఅలేఖ్య, పంచాయతీ కార్యదర్శి

– న్యూస్‌టుడే, నల్లజర్ల

సమస్య : కుక్కునూరులోని బీసీ కాలనీ నుంచి మంచిపెంట పాఠశాలకు వెళ్లే మార్గంలో గడ్డి, తుప్పలు పెరిగి, వ్యర్థాలు చేరడంతో డ్రెయిన్ మూసుకుపోయింది. మురుగు పారడం లేదు. దుర్వాసనతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. - బి.రామారావు, కుక్కునూరు

సమాధానం : మురుగు కాలువను శుభ్రం చేయించి సమస్య పరిష్కరిస్తాం. - సుభద్ర, పంచాయతీ కార్యదర్శి

– న్యూస్‌టుడే, తాళ్లపూడి

మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు: కొవ్వూరు: 80085 74497 నిడదవోలు: 80085 74501, గోపాలపురం: 91212 29084

వ్యయమే.. వ్యాయామానికేదీ అవకాశం

• నిర్వహణ లోపంతో చిట్టడవిలా గట్టు, నిరుపయోగంగా పరికరాలు

న్యూస్‌టుడే, కొవ్వూరు పట్టణం

కొలెస్ట్రాల్‌కి కాస్త దూరంగా.. ఆరోగ్య సౌకర్యానికి చేరువగా ఉండాల్సిన రోజులివి. శీతాకాలం చలిని చీల్చుకుంటూ.. వేసవిలో తెల్లారే వచ్చే ఎండను దాటుకుని నడవటం, చిన్నపాటి వ్యాయామాలు, యోగాసనాలతో ఆ రోజంతా ఉల్లాసంగా ఉండాలని అందరూ భావిస్తున్నారు. నిత్యం ఒత్తిడికి లోనయ్యే వారికి ఇది ఎంతో మేలు చేస్తోంది. ప్రధాని మోదీ ఫిట్ ఇండియా కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆంధ్రప్రదేశ్ అర్బన్ గ్రీనరీ బ్యూటిఫికేషన్ ఆధ్వర్యంలో పట్టణాల్లోని ఉద్యానాలు, ఖాళీ ప్రదేశాలు, రిజర్వు స్థలాల్లో వ్యాయామ పరికరాలను ఏర్పాటు చేశారు. నిర్వహణ కరవై అవి వినియోగానికి దూరమయ్యాయి.



రాజీవ్‌కాలనీలోని వ్యాయామ పరికరాల దుస్థితి

• కొవ్వూరు పట్టణంలో 23 వార్డులున్నాయి. సుమారు 42 వేల మంది జనాభా నివసిస్తున్నారు. టోల్‌గేట్ నుంచి ఆరికిరేవుల రోడ్డులో వాటర్ వర్క్స్ వరకు ఉన్న గోదావరి గట్టు పొడవునా గత పుష్కరాల సమయంలో సుందరీకరణ పనులు చేపట్టారు. గట్టును నాలుగు భాగాలుగా విభజించి వివేకానంద, అంబేడ్కర్, ఎన్టీఆర్, గౌతమ మహర్షి, అల్లూరి సీతారామరాజు వంటి మహనీయుల పేర్లు పెట్టారు. శివ నంద పురపాలక ఉద్యానం, శ్రీరామా కాలనీ, రాజీవ్‌కాలనీ, క్రిస్టియన్‌పేట రిజర్వు ఖాళీ స్థలాలు, ఎన్టీఆర్ క్రీడా ప్రాంగణంలో తదితర ప్రాంతాల్లో వ్యాయామ పరికరాలు ఏర్పాటు చేశారు. పిల్లలు ఆడుకునే సామగ్రి, ఆట వస్తువులు ఏర్పాటు చేశారు. సుమారు రూ.2.20 కోట్లతో అమర్చారు.

మూణ్నాళ్ల ముచ్చటే..

సుందరీకరణ చేసిన గట్టుపై ఇలా..

కొన్నాళ్లు బాగానే ఉన్నా ఒక్కొక్కటిగా వ్యాయామ పరికరాలు, ఆట సామగ్రి ఏర్పాటు చేసిన ప్రాంతం, గట్టు చిట్టడవిలా మారి లోపలికి అడుగు పెట్టలేని స్థితి నెలకొంది. వినియోగం లేక పట్టి ఒక్కొక్కటిగా విరిగిపోతున్నాయి. ఉదాహరణకు రాజీవ్‌కాలనీ రిజర్వు స్థలంలో ఉన్న వ్యాయామ పరికరాలు ఉన్న ప్రాంతం చిట్టడవిని తలపిస్తోంది. పురపాలక ఉద్యానం, ఎన్టీఆర్ క్రీడా ప్రాంగణంలో పరికరాలు క్రమంగా శిథిలమై మూలకు చేరుతున్నాయి. పలుచోట్ల ఉయ్యాలలు, జారే బల్లలు పాడవగా వ్యాయామ సామగ్రి పనికి రాని స్థితికి చేరింది. ఈ దుస్థితిని పురపాలక కమిషనర్ సీహెచ్ వెంకటేశ్వర్లు దృష్టికి తీసుకెళ్లగా వ్యాయామ పరికరాలు, ఆట వస్తువుల వినియోగంలోకి తీసుకొచ్చేందుకు దృష్టి పెడతామన్నారు. క్షేత్రస్థాయిలో పరిశీలించడంతోపాటు రిజర్వు స్థలాల శుభ్రతకు చర్యలు తీసుకుంటామన్నారు.

పాస్‌పోర్ట్ పోయినది

S/o ... పాస్‌పోర్ట్ నెం. L6948876 ... 06-02-2026 ... Cell: 96181 46418

IN THE COURT OF HON'BLE SENIOR CIVIL JUDGE AND JMFC AT MANVI

M.C.No. 21/2025

Smt.Ramatulasi
V/s
Tumalapalli Kalibabu

To,
Respondent Sri. Tummalapalli Kalibabu, S/o T.Krishnamurthi R/o : Bassapur Hanchinal camp, Tq : Sindhanur Dt : Raichur, State : Karnataka Now residing at Musalgunta Tq : Nallajalla Mandalam Dt : East Godavari, Andhra Pradesh.

In the above case the petitioner filed petition for Dissolution of Marriage under section 13(1-A) (1-B) of the Hindu Marriage Act 1955. so also the petitioner has further averred that the Respondent is avoiding the summons, notice etc.,

All the concerned interested in the above matter are hereby warned to appear on or before the 2nd day of April 2026 at 11.00 A.M before the Hon'ble Court.

Take notice that in default of your appearance on the day mentioned above the case will heard and determined in your absence.

Give under my hand and seal of the Court this 17-2-2026 At Manvi.

By Order of the Court
Chief Ministerial office Senior Civil Judge and JMFC Court, Manvi
Through
B.K.AMARESHAPPA, Advocate, Manvi, Karnataka State.

వైభవంగా శ్రీపుష్పయాగం

ఉండ్రాజవరం : మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని మండలంలోని మోర్త, పాలంగి, ఉండ్రాజవరం, తాడిపర్రు తదితర గ్రామాల్లోని శివాలయాల్లో శివపార్వతుల కల్యాణోత్సవాల్లో భాగంగా స్వామి వార్లకు మంగళవారం శ్రీపుష్పయాగం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఇకపై సాయంత్రం తాగునీటి సరఫరా

నిడదవోలు : ఈస్టర్, రంజాన్ పండగల సందర్భంగా నిడదవోలు పట్టణంలో ఈనెల 19 నుంచి ఏప్రిల్ 6 వరకు తాగునీటి సరఫరాలో మార్పులు చేసినట్లు కమిషనర్ టి.కృష్ణవేణి తెలిపారు. ఉదయం 5 నుంచి 6 గంటలకు బదులు సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు అందిస్తామన్నారు. పట్టణ ప్రజలు గమనించాలని కోరారు.

రైతులు వడ్డీ రాయితీని పొందాలి

కొవ్వూరు పట్టణం : ఆరికిరేవుల ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘంలో పంట రుణాలు తీసుకుని సకాలంలో చెల్లించిన సభ్యులు వడ్డీ రాయితీ పొందాలని ఛైర్మన్ చావా రామకృష్ణ శ్రీనివాసరావు తెలిపారు. 2024-25 ఏడాదికి సంబంధించి రైతులకు వడ్డీ రాయితీగా రూ. 20,98,726 సంఘం ఖాతాకు జమైనట్లు చెప్పారు.

పీడీవో, బిల్లు కలెక్టర్‌కు సత్కారం

చాగల్లు : మండలంలోని నెలటూరు పంచాయతీలో నూరు శాతం పన్ను వసూలు చేసిన సందర్భంగా స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో పీడీవో వి.కరుణ, బిల్ కలెక్టర్ కుమారిని అధికారులు, సిబ్బంది సన్మానించి, అభినందనలు తెలిపారు.

'ఓటుహక్కుకు ముప్పుగా ఎన్ఐఆర్ ప్రక్రియ'

నిడదవోలు : ఓటు హక్కుకు ముప్పుగా మారిన ఎన్ఆర్ఐ ప్రక్రియను సీపీఎం వ్యతిరేకిస్తుందని జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు జువ్వల రాంబాబు అన్నారు. వివిధ రాజకీయ పక్షాలతో తహసీల్దారు బి.నాగరాజు నాయక్ మంగళవారం సమావేశం నిర్వహించారు. రాంబాబు మాట్లాడుతూ ఓటర్ల జాబితా క్రమం తప్పకుండా సవరించడమనేది సర్వసాధారణమన్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి నిధులివ్వాలని వినతి

ముఖ్యమంత్రికి ప్రతిపాదన అందించి వివరిస్తున్న ఎమ్మెల్యే ముప్పిడి

కొవ్వూరు పట్టణం : కొవ్వూరు నియోజకవర్గ అభివృద్ధికి నిధులు మంజూరు చేయించాలని కోరగా ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించినట్లు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబును సచివాలయంలో మంగళవారం సాయంత్రం కలిసి కొవ్వాడ కాలువ పూడికతీత, గుర్రపుడెక్క తొలగింపు పనులకు రూ.2.69 కోట్లు, సాంఘిక సంక్షేమ బాలుర, బాలికల వసతి గృహ భవనాల నిర్మాణానికి రూ.6 కోట్లతో చేసిన ప్రతిపాదనలను అందించినట్లు తెలిపారు. ఆ పనుల ఆవశ్యకతను వివరించి త్వరితగతిన నిధులివ్వాలని కోరానన్నారు.

అన్నదేవరపేటలో ఉచిత వైద్యశిబిరం

తాళ్లపూడి : మానవత సంస్థ ఆధ్వర్యంలో అన్నదేవరపేటలో మంగళవారం ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని జడ్పీటీసీ మాజీ సభ్యుడు అల్లూరి విక్రమాదిత్య, రైసు మిల్లర్ల సంఘం అధ్యక్షుడు జనార్ధనరావు, ఎత్తిపోతల పథకం అధ్యక్షుడు రామచంద్ర ప్రారంభించారు. శిబిరంలో వైద్యులు 200 మందికి స్కానింగ్, 98 మందికి ఈసీజీ, 200 మందికి దంత పరీక్షలు, 54 మందికి ఎక్సరే తీసినట్లు సంస్థ అధ్యక్షుడు శ్రీనివాస్ తెలిపారు. ఈ కార్యక్రమంలో పోసిన నాగార్జున, సనపల రాజశేఖర్, హనుమంతురావు, సాయిబాబా తదితరులు పాల్గొన్నారు.

పురస్కార గ్రహీతలకు సత్కారం

నిడదవోలు, న్యూసటుడే : ఏపీ ఎలక్ట్రికల్ ఎంప్లాయిస్ యూనియన్(1104) 76వ వార్షికోత్సవాన్ని నిడదవోలు విద్యుత్తు కార్మిక భవనంలో పీవీ సత్యనారాయణ అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. వివిధ సందర్భాల్లో పురస్కారాలు అందుకున్న పలువురిని సత్కరించారు. వృద్ధులు, పేదలకు చీరలు, దుప్పట్లు, పంపిణీ చేశారు. కార్యక్రమంలో డివిజన్ కార్యదర్శి గంటా సత్యనారాయణ, ఏడీఈ పీయూబీ శ్రీధర్, ఏఈ సీహెచ్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

భాజపా సంస్థాగత నిర్మాణానికి శ్రమిద్దాం

కొవ్వూరు పట్టణం, న్యూస్‌టుడే : భాజపా సంస్థాగత నిర్మాణానికి శ్రమించాలని.. కార్యకర్తల క్రమశిక్షణే పార్టీ అభివృద్ధిలో కీలకమని ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి అన్నారు. కొవ్వూరు పట్టణ ముఖ్యకార్యకర్తలతో ఇష్టాగోష్ఠి కార్యక్రమాన్ని స్థానిక నూలు వారి సత్రంలో మంగళవారం సాయంత్రం నిర్వహించారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర అధ్యక్షత వహించగా ముఖ్యఅతిథిగా ఎంపీ హాజరయ్యారు. పార్టీ పురోభివృద్ధికి చేపట్టాల్సిన కార్యాచరణ, సభ్యత్వాల ప్రగతి, కేంద్ర ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి ప్రణాళికపై క్షేత్రస్థాయిలో ప్రచారం, సమన్వయ ప్రక్రియపై చర్చించారు. ఒక్కొక్క కార్యకర్తతో ఆయా అంశాలపై చర్చించి అభిప్రాయాలను సేకరించారు. పలువురి సందేహాలను నివృత్తి చేసి పార్టీ నిర్మాణంపై పలు సూచనలు చేశారు. రాష్ట్ర నాయకుడు కోడూరి లక్ష్మీనారాయణ, జిల్లా ప్రధాన కార్యదర్శి శెట్టిపల్లి శివనాగరాజు, పట్టణ ఇన్‌ఛార్జి తురగా భాస్కరరావు, కౌన్సిలర్ పిల్లలమర్రి మురళీకృష్ణ, జిల్లా ఉపాధ్యక్షుడు బీవీ ముత్యాలరావు, మహిళా మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు తాడిమళ్ల విజయవాణి, శక్తి, బూత్ అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.



భాజపా ముఖ్యకార్యకర్తలతో ఎంపీ పురందేశ్వరి

'చలో విజయవాడ'కు యూటీఎఫ్ నాయకులు

కొవ్వూరు పట్టణం : పీఆర్సీ ఛైర్మన్‌ను నియమించి, పెండింగులో ఉన్న డీఏ బకాయిలను చెల్లించాలని కొవ్వూరు మండల యూటీఎఫ్ నాయకులు కోరారు. సమస్యల పరిష్కారాల కోసం చలో విజయవాడ రణభేరి 2.0 కార్యక్రమానికి మంగళవారం ఉదయం తరలివెళ్లారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాసన్, ప్రధాన కార్యదర్శి ఎండీ ఇమ్రాన్‌బాషా మాట్లాడుతూ సీపీఎస్‌ను రద్దు చేసి 2004కు ముందు నియామక ప్రక్రియ పూర్తయిన వారికి పాత పెన్షన్ విధానం అమలు చేయాలన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయుల, పెన్షనర్లపట్ల సానుకూల నిర్ణయాలు తీసుకోవాలన్నారు. నాయకులు డి.మహేష్, కె.ఏడుకొండలు పాల్గొన్నారు.

విద్యుత్తు సరఫరాకు అంతరాయం నేడు

గోపాలపురం : గోపాలపురం విద్యుత్తు ఉపకేంద్ర పరిధిలోని టౌన్ ఫీడర్‌లో బుధవారం సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఈఈ నారాయణ అప్పారావు తెలిపారు. గోపాలపురం, పెద్దగూడెం, ఉప్పరగూడెంలో సాయంత్రం 3 నుంచి 5 గంటల వరకు సరఫరా ఉండదన్నారు.

నిడదవోలు : నిడదవోలు పట్టణ-2 ఫీడర్‌లో కొత్త డీటీఆర్ పనుల నిమిత్తం కాపు కల్యాణ మండపం ప్రాంతంలో బుధవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్తు సరఫరా ఉండదన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం

నల్లజర్ల : క్రీడలు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయని ఎస్సై ఆంజనేయబాబు అన్నారు. స్థానిక సెయింట్ జోషఫ్ పాఠశాల్లో యాన్యువల్ స్పోర్ట్స్ వీక్‌ను పూర్వపు విద్యార్థి హేమంత్ చౌదరి కలసి ఆయన జెండా ఎగురవేసి ప్రారంభించారు. విద్యార్థులు పేరేడ్ నిర్వహించి గౌరవ వందనం సమర్పించారు. విద్యార్థులు చరవాణులకు దూరంగా ఉండాలని, చెడు వ్యసనాలకు బానిసలు కాకూడదని ఎస్సై సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఛైర్మన్ ఎం.జానకీదేవి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆరోగ్యం బాగుంటే చదువులో రాణింపు

విద్యార్థినితో మాత్ర మింగిస్తున్న ఆర్డీవో రాణి సుస్మిత

న్యూస్‌టుడే బృందం : శారీరకంగా ఆరోగ్యంగా ఉన్నప్పుడే విద్యార్థులు చదువులో రాణిస్తారని ఆర్డీవో రాణి సుస్మిత అన్నారు. జాతీయ నులి పురుగుల నివారణ కార్యక్రమంలో భాగంగా పట్టణం, గ్రామీణంలోని ప్రభుత్వ పాఠశాలలను పరిశీలించారు. విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు వేయించే ప్రక్రియలో పాల్గొన్నారు. డివిజన్ పరిధిలోని పీహెచ్‌సీల ఆధ్వర్యంలో వైద్య ఆరోగ్య, విద్యాశాఖలు చేపడుతున్న కార్యాచరణను డిప్యూటీ డీఎంహెచ్‌వో సంధ్యను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ విద్యార్థుల్లో రోగనిరోధక శక్తిని పెంపొందించేందుకు ఈ కార్యక్రమం తోడ్పడుతుందన్నారు.

నిడదవోలులో జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ శ్రీదేవి, మున్సిపల్ ఛైర్మన్ భూపతి ఆదినారాయణ..

సమగ్ర ఆరోగ్యంపై సానుకూల ప్రభావం..

నిడదవోలు : నులి పురుగుల నిర్మూలన ద్వారా పిల్లల్లో పోషకాహార లోపాలు, శరీరధార్మిక సమస్యలు తగ్గి సమగ్ర ఆరోగ్యంపై సానుకూల ప్రభావం ఉంటుందని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ శ్రీదేవి అన్నారు. పట్టణంలోని నెహ్రూనగర్, ఎన్టీఆర్‌కాలనీల్లో చిన్నారులకు నులి పురుగుల నివారణ మాత్రలు వేశారు. కార్యక్రమంలో పురపాలక సంఘ ఛైర్మన్ భూపతి ఆదినారాయణ, డాక్టర్ మంగరాజు తదితరులు పాల్గొన్నారు. ● నల్లజర్ల, ఉండ్రాజవరం ఇతర మండలాల్లోనూ కార్యక్రమం నిర్వహించారు.

పని భారం తగ్గించాలి

తహసీల్దార్ కృష్ణారావుకు వినతిపత్రం అందిస్తున్న మండల వీఆర్వోలు, వీఆర్ఏలు

నల్లజర్ల : పని భారం తగ్గించాలని కోరుతూ మండల రెవెన్యూ ఉద్యోగుల జేఏసీ ఆధ్వర్యంలో వీఆర్వోలు, వీఆర్ఏలు, సర్వేయర్లు మంగళవారం మండల రెవెన్యూ కార్యాలయం వద్ద భోజన విరామ సమయంలో నిరసన తెలిపి, తహసీల్దార్ కృష్ణారావుకు వినతి పత్రం అందించారు. తమ విధులతోపాటు వేరే పనులు అప్పగిస్తుండడంతో మానసిక ఒత్తిడికి గురవుతున్నామని మండల వీఆర్వోల సంఘం అధ్యక్షుడు శామ్యూల్ తెలిపారు.

శిరస్త్రాణ ధారణపై అవగాహన

నిడదవోలు: ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించి కుటుంబాలకు రక్షణగా నిలవాలని సీఐ పీవీజీ తిలక్ సూచించారు. మంగళవారం సాయంత్రం పట్టణంలోని గణపతికూడలిలో విజిబుల్ పోలీసింగ్‌లో భాగంగా వాహనాలను తనిఖీ చేసి చోదకులకు శిరస్త్రాణ ధారణపై అవగాహన కల్పించారు.

నిత్యం ఇదే తంతు

● గడ్డర్లపై అడ్డుకట్టలు వేసినా ప్రయోజనం శూన్యం

సమిశ్రగూడెం వంతెనపై ఇరుక్కున భారీ వాహనం, ఆర్టీసీ బస్సు

నిడదవోలు : సమిశ్రగూడెం వద్ద పశ్చిమ డెల్టా కాలువపై ఉన్న పురాతన వంతెన వద్ద నిత్యం ట్రాఫిక్ నిలిచి వాహనచోదకులు, ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఈ వంతెన శిథిలావస్థకు చేరడంతో అధికారులు భారీ వాహనాల రాకపోకలను నిలువరించేందుకు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా వంతెనకు ఇరువైపులా గడ్డర్లపై అడ్డుకట్టలు ఏర్పాటు చేశారు. తర్వాత పర్యవేక్షణ లేకపోవడంతో వాటిని భారీ వాహనాలు ఢీకొట్టి వెళ్లిపోతున్నాయి. ఈనెల 9న 'ఈనాడు'లో 'ప్రమాదం అంచున.. ఏళ్లనాటి వంతెన' శీర్షికన ప్రచురితమైన కథనంపై స్పందించి మళ్లీ గడర్లపై అడ్డుకట్టలు ఏర్పాటు చేశారు. అవి ఎత్తులో ఉండడంతో భారీ వాహనాలు యథేచ్ఛగా రాకపోకలు సాగిస్తున్నాయి. మంగళవారం మధ్యాహ్న సమయంలో వంతెనపై నుంచి భారీ వాహనం రావడంతో ఇరువైపులా భారీగా ట్రాఫిక్ నిలిచి పోయింది. రాజమహేంద్రవరం రోడ్డులోని సిలువ సెంటర్ వరకు, నరసాపురం రహదారిలో పాత పంచాయతీ కార్యాలయం వరకు, నిడదవోలు వైపు ఆర్వోబీ మధ్య వరకు ట్రాఫిక్ నిలిచి పోవడంతో సుమారు అరగంటకు పైగా ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.





(c) eenadu

మండపేట

• మండపేట • అనపర్తి

సంగమేశ్వరస్వామికి త్రిశూలస్నానం

మండపేట గ్రామీణం, న్యూస్‌టుడే: మండపేట మండలం ఏడిద గ్రామంలోని ప్రసిద్ధ శైవ క్షేత్రం శ్రీపార్వతి సమేత సంగమేశ్వరస్వామి మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా స్వామివారికి మంగళవారం త్రిశూలస్నానం వైభవంగా నిర్వహించారు. తుల్యభాగ, భరద్వాజ నదుల సంగమ క్షేత్రంలో రామపాదాల రేవు వద్ద ఆలయ అర్చకుడు ఆయనవిల్లి నాగభూషణశర్మ ఆధ్వర్యంలో స్వామివారికి త్రిశూలస్నాన కార్యక్రమాన్ని పూర్తి చేయించారు. భక్తుల శిరస్సుపై త్రిశూలం ఉంచి నదీజలాలను శిరస్సుపై పోయడం ద్వారా క్రతువును ముగించారు.

భక్తాంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవం

కపిలేశ్వరపురం, న్యూస్‌టుడే: కపిలేశ్వరపురం మండలం నల్లూరులో శ్రీసీతారామ, భక్తాంజనేయస్వామి ఆలయ ప్రథమ వార్షికోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. వేద పండితులు పెదపూడి సీతారామాచార్యులు ఆధ్వర్యంలో స్వామివారికి నాగవల్లీ దళాలు, గంగ సింధూరంతో ప్రత్యేకపూజలు, పంచామృతాభిషేకాలు జరిపించారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు విచ్చేసి స్వామివారిని దర్శించుకున్నారు. వారికి అన్నప్రసాదాలు అందించారు.

నల్లూరులో స్వామివారికి తమలపాకులతో అలంకరణ

మేమున్నాం.. మీకు తోడుగా

ఉ. 10 - మ. 1 మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు
మండపేట: 80085 74183 ద్వారపూడి: 98490 93850
అనపర్తి: 95333 66637 అంగర: 97044 16418
రాయవరం: 80085 74185

ముక్కు మూసుకోవాల్సిందే..

సమస్య: మండపేట మండలం మారేడుబాక గ్రామం ఆదర్శనగర్ ఒకటో వీధి రహదారి పక్కన వ్యర్థాలు పేరుకుపోయాయి. వాటి నుంచి దుర్వాసన వ్యాపిస్తోంది. - పి.కిషోర్‌కుమార్, మారేడుబాక

పరిష్కారం: సమస్యను పంచాయతీ కార్యదర్శి ఎం.శ్రీనివాస్ తెలియజేయగా వెంటనే స్పందించారు. సిబ్బందిని పంపించి వ్యర్థాలను తొలగించే పనులు చేయించారు. - న్యూస్‌టుడే, ద్వారపూడి

వ్యర్థాలు తొలగించారు..

మండపేట మండలం ద్వారపూడి కచేరిచావిడి వీధిలో రహదారి పక్కన వ్యర్థాలు పోస్తున్నారు. దుర్వాసన వ్యాపిస్తోందని 'మేమున్నాం.. మీకు తోడు'గా ద్వారా స్థానికులు సమస్యను పంచాయతీ కార్యదర్శి దృష్టికి తెలియజేయగా ఆయన స్పందించారు. వెంటనే సిబ్బందిని పంపించి వ్యర్థాలను తొలగించే పనులు చేయించారు. - న్యూస్‌టుడే, మండపేట గ్రామీణం

లక్ష్యానికి దూరంగా పీఎం స్వనిధి

కుట్టు శిక్షణ ఇస్తున్న ఉషాదేవి

మండపేట, న్యూస్‌టుడే: చిన్న వ్యాపారులు, వీధి వర్తకులను ఆదుకునేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పీఎం స్వనిధి పథకం లక్ష్యాన్ని చేరలేదు. కరోనా విపత్తు సమయంలో ఉపాధి కోల్పోయి తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న వీరిని ఆదుకోవాలని 2020 జూన్ ఒకటో తేదీన ఈ పథకాన్ని ప్రవేశపెట్టారు. లబ్ధిదారులను గుర్తించి రుణాలు అందించాలనే ఉద్దేశంతో పీఎం వీధి వ్యాపారుల ఆత్మనిర్భర్ నిధి ఏర్పాటుచేశారు. దీనిలో భాగంగా తొలి విడతలో గుర్తించిన వ్యాపారులకు రూ.15 వేలు, ఆ రుణం పూర్తిగా చెల్లించిన తరవాత రెండో విడతలో రూ.25 వేలు, మూడో విడతలో రూ.50 వేల వరకు ప్రయోజనం కల్పించారు. రుణం తీసుకుని వ్యాపారాలు చేసుకునేవారికి ఆసరాగా నిలిచేలా రూపొందించిన పథకంపై సరైన అవగాహన కల్పించకపోవడంతో అనుకున్న లక్ష్యాన్ని చేరలేదు.

ఇవీ ఉపయోగాలు..

రుణాలు తీసుకుని సకాలంలో బ్యాంకుకు తిరిగి చెల్లించేవారు యూపీఐ లింక్‌తో క్రెడిట్‌కార్డుకు అర్హత పొందుతారు. దీని ద్వారా ఎప్పుడైనా రూ.30 వేల రుణం పొందే అవకాశం ఉంది. డిజిటల్ పేమెంట్లు ఎక్కువ చేసేవారికి క్యాష్‌బ్యాక్ సౌకర్యం కల్పిస్తున్నారు.

ఇప్పటివరకు ఇచ్చిన రుణాలు..

మండపేట పట్టణంలో మొదటి మూడు విడతల్లో మొత్తం 3,287 మంది లబ్ధిదారులకు రుణాలివ్వాలనేది లక్ష్యంకాగా 80 మంది మాత్రమే దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో 65 మందికి మొత్తంగా రూ.93 లక్షల రుణం మంజూరుచేశారు.

అవగాహన కల్పిస్తున్నాం..

తొలి విడతలో రుణం తీసుకున్నవారు కొంతమంది ఇంకా పూర్తిగా చెల్లించలేదు. వారికి సిబిల్ స్కోర్ లేకపోతే బ్యాంకులు రుణాలు ఇవ్వడం లేదు. రుణాలు వెంటనే చెల్లించేలా అవగాహన కల్పించి లక్ష్యం మేరకు రుణాలు అందించేలా చర్యలు తీసుకుంటున్నాం. - టి.వి.రంగారావు, మున్సిపల్ కమిషనర్

10 మందికి కుట్టుశిక్షణ ఇస్తూ..

నాకు ఇద్దరు పిల్లలు. వారిని పోషించలేక భర్త ఇల్లు విడిచిపెట్టిపోవడంతో బాధ్యత నాపై పడింది. ఫ్యాషన్ డిజైనింగ్‌లో మెళకువలు నేర్చుకుని దుస్తులు కుడుతూ పిల్లల్ని చదివిస్తున్నా. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు 10 మంది మహిళలకు ఉచితంగా శిక్షణ ఇస్తున్నా. నేను మూడు విడతల్లో పీఎం స్వనిధి రుణం తీసుకున్నా. - తీగల ఉషాదేవి, మండపేట

కుటుంబానికి ఆసరాగా..

ఇద్దరు కుమారులకు వివాహాలు చేశా. వారు పనులు చేసుకుంటున్నారు. భర్త కూలి పనికి వెళతారు. కుటుంబ ఆసరా కోసం నేను కుట్టు శిక్షణ నేర్చుకుని దుస్తులు కుడుతున్నాను. పీఎం స్వనిధి 2.0 పథకంలో రూ.15 వేల రుణం పొందాను. - ఊడి వెంకటరమణ, మండపేట

పని ఒత్తిడి తగ్గించాలంటూ వీఆర్వోల నిరసన

మండపేట, న్యూస్‌టుడే: సచివాలయ విధుల, రెవెన్యూ శాఖ పనులతో ఒత్తిడి పెరిగి సరిగ్గా నిర్వర్తించలేకపోతున్నామని పేర్కొంటూ మంగళవారం తహసీల్దారు కార్యాలయం వద్ద వీఆర్వోలు నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. రాష్ట్ర నాయకత్వం పిలుపుమేరకు ఈనెల 19 వరకు నిర్వహించే నిరసన కార్యక్రమాల్లో భాగంగా ఆందోళనకు దిగారు. రెవెన్యూ ఉద్యోగుల రాష్ట్ర ప్రెసిడెంట్ మద్దతు వీఆర్వోలను బయోమెట్రిక్ హాజరు, సచివాలయ క్లస్టర్ సర్వే నుంచి మినహాయించాలని డిమాండ్ చేశారు. గతంలో చర్చలకు ఆహ్వానించి ఇచ్చిన హామీలు నెరవేర్చాలని కోరారు. కార్యక్రమంలో మండపేట వీఆర్వోల సంఘం అధ్యక్షుడు మేకా రామకృష్ణ, మండల కార్యదర్శి గంటి రవి, దేవి, సరిత, దుర్గా నాగలక్ష్మి, బి.దుర్గారావు, బి.వెంకటరామారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రెండో రోజూ కొనసాగిన నిరసన

కపిలేశ్వరపురం, బిక్కవోలు, అనపర్తి గ్రామీణం: కపిలేశ్వరపురం, బిక్కవోలు, అనపర్తి రెవెన్యూ కార్యాలయాల వద్ద మంగళవారం వీఆర్వోలు నిరసన కొనసాగించారు. రాష్ట్ర సంఘం పిలుపుమేరకు మధ్యాహ్న భోజన విరామ సమయంలో ఆందోళనల్లో పాల్గొన్నారు. సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ నినాదాలు చేశారు. పని వేళలు ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఉండేలా చర్యలు చేపట్టాలని ప్రభుత్వాన్ని కోరారు. మండల వీఆర్వోల సంఘం అధ్యక్షుడు రాముడు, కార్యదర్శి రాజారత్నం, ఉపాధ్యక్షుడు వెంకటేశ్వరరావు, కోశాధికారి నాగమణి పాల్గొన్నారు.

మండపేటలో నిరసన తెలుపుతున్న వీఆర్వోలు

మాదకద్రవ్యాలపై అవగాహన ర్యాలీ

రాయవరం, న్యూస్‌టుడే: తాత్కాలిక ఆనందాల కోసం మాదకద్రవ్యాల ఊబిలో దిగితే అనర్థాలే ఎదురవుతాయని రాయవరం ఎస్సై డి.సురేష్‌బాబు చెప్పారు. శ్రీరామయ్య జడ్పీ ఉన్నత పాఠశాలలో మాదకద్రవ్యాల నిరోధం, ఈవ్‌టీజింగ్ అంశాలు, చట్టాలపై విద్యార్థులకు మంగళవారం ఆయన అవగాహన కల్పించారు. రాయవరం పీహెచ్‌సీ వైద్యులు వర్షిణి, అనిరుధ్ మాట్లాడుతూ వ్యసనాలకు ఆకర్షితులైతే అనారోగ్యానికి గురవడమే కాకుండా ఉన్నతోద్యోగాల్లో స్థిరపడే అవకాశాలు మృగ్యమవుతాయని పేర్కొన్నారు. ఎంఈవో-2 యరమాటి సూర్యనారాయణ మాట్లాడుతూ తల్లిదండ్రుల ఆశయ సాధనలో నిమగ్నమవ్వాల్సిన విద్యార్థులు చెడుతోవ పట్టకుండా మాదకద్రవ్యాల బారిన పడకుండా ఉండాలన్నారు. అనంతరం హెచ్‌ఎం వి.శాంతిసునీల పర్యవేక్షణలో డ్రగ్స్ వద్దు బ్రో.. అంటూ విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్‌ఎంసీ ఛైర్మన్ దేవిరెడ్డి చిన్ని, మహిళా పోలీసు యు.సురేఖ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులతో ర్యాలీ నిర్వహిస్తున్న ఎస్సై సురేష్‌బాబు

వార్షిక బడ్జెట్‌కు ప్రతిపాదనలు సిద్ధం చేయండి

శ్యామలా సెంటర్, న్యూస్‌టుడే: వచ్చే విద్యా సంవత్సరానికి పాఠశాలల్లో సౌకర్యాల నిమిత్తం వార్షిక బడ్జెట్ ప్రతిపాదనలు సిద్ధం చేయాలని డీఈవో వాసుదేవరావు ఎంఈవోలను ఆదేశించారు. లాలాచెరువు ఉన్నత పాఠశాలలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ బడ్జెట్ రూపకల్పనలో మౌలిక వసతులకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. టీచర్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్‌లో ఉపాధ్యాయులు నమోదు చేసిన సమాచారాన్ని సక్రమంగా పరిశీలించి ప్రధానోపాధ్యాయుల నుంచి స్వీకరించి ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. జిల్లా సమగ్ర శిక్ష ఏపీసీ సుభాషిణి మాట్లాడుతూ ప్రతి ప్రాథమిక పాఠశాలలో ఆయా తరగతి గదులు కచ్చితంగా ఉండాలన్నారు. కో-ఆర్డినేటర్ దీపక్‌కుమార్, రూరల్ ఎంఈవో దుర్గాభవానీదేవి, సిబ్బంది, ఎంఈవోలు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న డీఈవో వాసుదేవరావు

ఇంతులు.. ఉపాధి కాంతులు

బొమ్మూరు, అనపర్తి గ్రామీణం, న్యూస్‌టుడే: యువతులు, మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పించడానికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తోంది. అందులో భాగంగా బొమ్మూరులోని జిల్లా మహిళా ప్రాంగణంలో ఏపీఎస్ఎస్‌డీసీ ఆధ్వర్యంలో ఎంబ్రాయిడరింగ్, ఆధునిక కుట్టు కోర్సులతో పాటు అదనంగా బ్యూటీషియన్ కోర్సుపై కూడా శిక్షణ ఇస్తున్నారు. ఉదయం 9.30 నుంచి సాయంత్రం 4.30 వరకు తరగతులు నిర్వహిస్తున్నారు. మహిళలు ఇంటి దగ్గరే ఉండి ఉపాధి అవకాశాలు పొందడానికి ఇది చక్కని అవకాశమని ప్రాంగణం జిల్లా మేనేజర్ విమల చెబుతున్నారు. సుమారు 50 మంది నేర్చుకుంటుండగా, పలువురు తమ అభిప్రాయాలు పంచుకున్నారిలా..

ప్రాంగణంలో శిక్షణ ఇస్తున్న శిక్షకురాలు అమరావతి

నేను, మా చెల్లి కూడా..

టైలరింగ్ శిక్షణ కోసం రోజూ అనపర్తి నుంచి వస్తున్నా. గతంలో కొంత అనుభవం ఉన్నా పూర్తిస్థాయిలో వైవిధ్యం కోసం ఇక్కడ చేరాను. అంబరిల్లా, లాంగ్ ఫ్రాక్ వంటి వివిధ రకాల గౌన్లు కుడుతున్నా. సరికొత్త మోడల్స్ కుట్టేలా ఇక్కడ నేర్పిస్తున్నారు. మా చెల్లి ఇక్కడే బ్యూటీషియన్ కోర్సు నేర్చుకుంటోంది. శిక్షణ తర్వాత మేమిద్దరం మా ఇంటి దగ్గర వ్యాపారం పెట్టుకుంటాం. - వి.సమత, అనపర్తి

వాటికి మంచి డిమాండ్

సొంత కాళ్లపై నిలబడాలనే ఉద్దేశంతో ఇక్కడ చేరాను. ఇంట్లో ఏడాదిన్నర పాపను వదిలి రోజూ కేశవరం నుంచి ఇక్కడకు వస్తున్నా. ప్రస్తుతం ఫ్యాషన్ దుస్తులకు మంచి డిమాండ్ ఉంది. వివిధ రకాల శుభకార్యాలకు వేర్వేరు మోడల్స్ దుస్తులు వేసుకోవడం ఇప్పుడు ఫ్యాషన్. అందుకనుగుణంగా కుట్టగలిగితే మనకు మంచి డిమాండ్ ఉంటుంది. - వి.సురేఖ, కేశవరం

అడబాలకు సత్కారం

రంగంపేట, న్యూస్‌టుడే: తెదేపా జిల్లా ఉపాధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన అడబాల వెంకట్రావును మంగళవారం ఘనంగా సత్కరించారు. రంగంపేట మండలం ఎస్.టి.రాజాపురంలో తెదేపా జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి ఆళ్ల గోవిందు, ఆత్మ కమిటీ ఛైర్మన్ ఎలుబండి సత్తిబాబు, మండల తెదేపా అధ్యక్షుడు ఉద్దండ్రావు శ్రీనివాసరావు తదితరులు ఆయనను సన్మానించారు. జిల్లా తెదేపా కమిటీలో స్థానం దక్కించుకున్న దూళ్ల ధర్మరాజుని కూడా నాయకులు సత్కరించారు.

వెంకట్రావుని సత్కరిస్తున్న తెదేపా నాయకులు

అలరించిన చిన్నారుల నృత్య ప్రదర్శన

బిక్కవోలు, న్యూస్‌టుడే: ఆంధ్రా శిర్డీ సాయి మందిరం కళా భవనంలో మంగళవారం చిన్నారుల కూచిపూడి నృత్యం ఆకట్టుకుంది. బాబా మందిర వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఏర్పాటుచేసిన నృత్య ప్రదర్శనలో పది మంది చిన్నారులు తమ నృత్యాభినయంతో అలరించారు. అనపర్తికి చెందిన శ్రీమంజునాథ కూడిపూడి నృత్య బృందం చిన్నారులు 90 నిమిషాల పాటు నృత్యంతో ప్రేక్షకుల్ని మైమరపించారు. శ్రీరామ కల్యాణ నృత్యరూపకం ఆకట్టుకుంది. కళింగ నాట్యం, భరతనాట్యం, రామాయణం, శివస్తోత్రం తదితర నృత్య రూపకాలు ప్రదర్శించారు. కమిటీ సభ్యులు నల్లమిల్లి వెంకటరెడ్డి, కల్యాణి దంపతులు వారిని సన్మానించారు.

శ్రీరామ కల్యాణ నృత్య రూపకంలో..

కోలాటం, మేళతాళాలతో బాబావారి రథోత్సవం

సాయి మందిరం వార్షికోత్సవ పూజలు

బిక్కవోలు, న్యూస్‌టుడే: బలభద్రపురంలోని ఆంధ్రా శిర్డీ సాయి మందిర వార్షికోత్సవాన్ని మంగళవారం వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచి భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి బాబాను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం కాగడా హారతి అనంతరం వివిధ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. బాబా విగ్రహానికి 1008 లీటర్ల ఆవుపాలతో అభిషేకం జరిపించారు. ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి సతీమణి మహాలక్ష్మి, తెదేపా నేత మనోజ్‌రెడ్డి దంపతులు, మాజీ ఎమ్మెల్యే డా.సత్తి సూర్యనారాయణ రెడ్డి, ఆదిలక్ష్మి దంపతులు ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. మహంకాళి వెంకట రామశాస్త్రి ఆధ్వర్యంలో 15 మంది వేద పండితులు బాబావారికి లక్ష పత్రిపూజ, గోపూజ, హోమపూజ, సూర్య నమస్కారాలు చేయించారు. భక్తులకు ఇబ్బందులు ఎదురవకుండా కమిటీ సభ్యులు సత్తి సుబ్బారెడ్డి, నల్లమిల్లి గంగారెడ్డి తదితరులు ఏర్పాట్లు చేశారు. సాయంత్రం నుంచి రాత్రి వరకు రథోత్సవం వైభవంగా సాగింది. సాయి మాలధారులు, భక్తులు రథం లాగగా మహిళలు కోలాటం ఆడుతూ ఆకట్టుకున్నారు.

వృక్షాల నరికివేత..

మండపేట గ్రామీణం, న్యూస్‌టుడే: పచ్చని చెట్లను పరిరక్షించాల్సిన అధికారులే వృక్ష సంపదను నాశనం చేసిన ఘటన మండపేట మండల పరిషత్ కార్యాలయం, పట్టణ ఆరోగ్య కేంద్రాల ప్రాంగణంలో మంగళవారం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం.. పట్టణంలోని 8వ వార్డు పరిధి దళితపేటలో మండల ప్రజా పరిషత్ కార్యాలయం, పట్టణ ఆరోగ్య కేంద్రం ఉన్నాయి. ఈ రెండు ప్రభుత్వ కార్యాలయాల పరిసరాల్లో టేకు, వేప తదితర రకాల 10 వృక్షాలు ఉన్నాయి. ఎంపీపీ కార్యాలయం, ఆసుపత్రికి వచ్చేవారికి నీడనిస్తున్నాయి. వీటిని ఎలాంటి అనుమతులు లేకుండా నరికివేశారని 8వ వార్డు కౌన్సిలర్ మందపల్లి రవికుమార్ ఆరోపించారు. దీనిపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తానని ఆయన చెప్పారు. ఆసుపత్రి వైద్యురాలు రమ్యలక్ష్మిని వివరణ కోరగా కొన్ని వృక్షాలు కార్బన్‌డైయాక్సైడ్‌ని ఎక్కువ విడుదల చేస్తున్నాయని, దీనివల్ల ఆరోగ్య కేంద్రానికి వచ్చే రోగులకు ఆస్థమా వచ్చే ప్రమాదం ఉందని గుర్తించి చెట్లను తొలగించామని వివరించారు. మరికొన్ని చెట్లు ఎంపీపీ కార్యాలయంపై సౌరశక్తి పరికరాల ఏర్పాటుకు అడ్డుగా ఉన్నాయని, తొలగించడానికి అనుమతులు ఉన్నాయని సిబ్బంది చెప్పడంతో అంగీకరించామన్నారు. ఎంపీడీవో కె.సత్యనారాయణమూర్తిని వివరణ కోరగా కార్యాలయంపై సోలార్ ప్యానళ్లు ఏర్పాటు చేస్తున్నామని, పనులకు అడ్డుగా ఉన్న కొమ్మలు నరికివేయించామన్నారు. ఈ పనులకు అటవీ శాఖ అధికారుల నుంచి అనుమతులు తీసుకోలేదన్నారు.

ఆసుపత్రి ప్రాంగణంలో చెట్లు నరికివేసిన ప్రాంతం

పవర్ లిఫ్టింగ్ విజేతకు అభినందన

కపిలేశ్వరపురం, న్యూస్‌టుడే: రాజమహేంద్రవరంలో ఇటీవల నిర్వహించిన 13వ సీనియర్ పవర్ లిఫ్టింగ్ పోటీల్లో రాయవరం మండలం చెల్లూరుకు చెందిన ఎస్.సాయికృష్ణ వీర్ 120 కిలోల విభాగంలో ద్వితీయస్థానంతో జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించారు. ఈ సందర్భంగా రాష్ట్ర నీటిపారుదల అభివృద్ధి సంస్థ ఛైర్మన్ వేగుళ్ల లీలాకృష్ణ మంగళవారం వల్లూరులో సాయికృష్ణను సత్కరించి అభినందించారు.

వల్లూరులో సాయికృష్ణను అభినందిస్తున్న లీలాకృష్ణ

మాత్రలతో నులిపురుగులు దూరం

అంగర, న్యూస్‌టుడే: జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా కపిలేశ్వరపురం మండలంలోని అంగర, వాకతిప్ప, అచ్యుతాపురం పీహెచ్‌సీల పరిధిలో మంగళవారం అల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. వైద్యాధికారులు డా.కరుణేంద్రకుమారి, డా.విజయదీపిక, డా.రత్నకుమారి, డా.రాకేష్ చౌదరి కార్యక్రమాల్ని పర్యవేక్షించారు.

రాయవరం, న్యూస్‌టుడే: జాతీయ నులిపురుగుల నివారణ దినం సందర్భంగా విద్యార్థులు, చిన్నారులకు మంగళవారం అల్బెండజోల్ మాత్రలను 97 శాతం పంపిణీ చేసినట్లు రాయవరం, మాచవరం పీహెచ్‌సీ వైద్యాధికారులు అనిరుధ్, మణికంఠ చెప్పారు. మొత్తం 12 గ్రామాల్లో 8,734 మందికి మాత్రలు వేయాన్నది లక్ష్యం కాగా మధ్యాహ్న భోజనానంతరం 8,468 మందికి వేశామని తెలిపారు. మిగిలిన వారికి వైద్య, ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు ఇంటింటా వెళ్లి మాత్రలు అందించి నూరు శాతం లక్ష్యాన్ని పూర్తి చేస్తారని వివరించారు.

అంగర: వాకతిప్పలో చిన్నారులకు మాత్రలు వేస్తున్న ఆరోగ్య సిబ్బంది

బిక్కవోలు: చిన్నపిల్లల్లో నులిపురుగులు వారి ఎదుగుదలను నిరోధిస్తాయని, రక్తహీనత కలిగిస్తాయని ఎంపీపీ తేతలి సుమ అన్నారు. తొస్సిపూడి ప్రాథమిక పాఠశాలలో ఆమె చిన్నారులకు మాత్రలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కూటమి నేతలు కర్రి శ్రీనివాసరావు, గోవింద రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పథకాల అమలుపై ఆరా

అనపర్తి గ్రామీణం, న్యూస్‌టుడే: నియోజకవర్గంలోని ప్రతి ఇంటికి వెళ్లి సూపర్ సిక్స్ పథకాలు అందుతున్నాయా లేదా అని మాజీ ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి తెలుసుకోవాలని అనపర్తి ఏఎంసీ ఛైర్‌పర్సన్ సూర్యకుమారి అన్నారు. అనపర్తి కూటమి కార్యాలయంలో మీడియా సమావేశంలో ఆమె మంగళవారం మాట్లాడారు. మహిళా శక్తి సభ్యులు ఎన్నికల ముందు ఇంటింటికి తిరిగి సూపర్ సిక్స్ పథకాల గురించి వివరించారని, క్షేత్రస్థాయిలో అమలుకావడం లేదని మాజీ ఎమ్మెల్యే అవాస్తవాలు మాట్లాడడడం సరికాదన్నారు. కార్యక్రమంలో కర్రి శేషారత్నం, సుభాషిని తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనుల పరిశీలన

రంగంపేట, న్యూస్‌టుడే: రంగంపేట మండలం ఎస్.టి.రాజాపురం, చంద్రేడులలో ఉపాధి పథకంలో జరుగుతున్న పనులను మంగళవారం పీడీ ఎ.నాగమహేశ్వరరావు పరిశీలించారు. పశువుల కోసం నిర్మిస్తున్న షెడ్లను పరిశీలించి ఏపీవో శేషవాణికి సూచనలు చేశారు. పనుల తీరుపై స్థానిక రైతులతో పీడీ చర్చించారు.

రామవరంలో రక్తదాన శిబిరం

అనపర్తి గ్రామీణం, న్యూస్‌టుడే: అనపర్తి మండలం రామవరంలో ధాత్రి ట్రస్ట్, జక్కంపూడి రామ్మోహనరావు ఫౌండేషన్ బ్లడ్ బ్యాంక్ ఆధ్వర్యంలో మంగళవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. వైకాపా నాయకుడు సబ్బెళ్ల కృష్ణారెడ్డి తన కుమారుడు సురేష్‌రెడ్డి 26వ జయంతి సందర్భంగా శిబిరం ఏర్పాటుచేశారు. కార్యక్రమంలో పలువురు యువకులు, వైకాపా నాయకులు పాల్గొన్నారు.

కక్ష సాధింపునకు పాల్పడితే సహించేది లేదు: ఎమ్మెల్సీ తోట

రాయవరం, న్యూస్‌టుడే: పంటచేలో మెరక పల్లాలు సరిచేసుకునే క్రమంలో మట్టిని తరలించిన రైతులపై రాజకీయ కక్ష సాధింపులకు పాల్పడితే సహించేదిలేదని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అన్నారు. రాయవరం మండలం చెల్లూరు-వెంటూరు గ్రామాల మధ్య పాలిక శ్రీనుకు చెందిన పొలంలోని మట్టిని తొలగిస్తుండగా అనుమతులు లేవని రెవెన్యూ అధికారులు టిప్పర్లు, లారీలను సోమవారం సీజ్ చేశారు. ఈ నేపథ్యంలో మంగళవారం ఆ స్థలాన్ని ఎమ్మెల్సీ తోట పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ రైతు మట్టి తొలగిస్తుంటే ఫిర్యాదు వచ్చిందని రెవెన్యూ అధికారులు అత్యుత్సాహం ప్రదర్శించారని విమర్శించారు. ఊడ్పు చేసేనుగా రైతు తన భూమిని మార్చుకుంటుంటే అభ్యంతరమేంటని ప్రశ్నించారు. ఎమ్మెల్సీ వెంట ఎంపీపీ నౌడు వెంకటరమణ, మాజీ ఎంపీపీ సిరిపురపు, స్థానిక వైకాపా నాయకులు ఉన్నారు.

మట్టి తొలగించిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ తోట

సీజ్‌చేసిన వాహనాల విడుదల..

చెల్లూరులో అక్రమంగా మట్టి తవ్వకాలు చేస్తున్నట్లు అందిన సమాచారంతో సీజ్‌చేసిన వాహనాలను విడుదల చేసినట్లు రాయవరం తహసీల్దారు బీవీ భాస్కర్ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ భూ యజమాని పాలిక శ్రీను మైనింగ్ శాఖకు అపరాధ రుసుం చెల్లించడంతో వాహనాలను ఆయనకు అప్పగించామన్నారు.

ఒకేసారి వచ్చాయి.. ఇరుక్కుపోయాయి

రద్దీ సమయంలో బైపాస్ రోడ్డులో వెళ్లాల్సిన భారీ రవాణా వాహనాలు మండపేట పట్టణంలోకి ప్రవేశించడంతో తరచుగా ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతోంది. చిన్నరోడ్డులో భారీ వాహనాలు, బస్సులు ఒకేసారి రావడంతో తప్పించడం కష్టసాధ్యంగా మారుతోంది. అదే సమయంలో డివైడర్ వద్ద ఇరుక్కుపోయి ఏ వాహనం కదలడానికి అవకాశం లేకుండా పోతోంది. ఇలా రెండు వాహనాలు ఇరుక్కుపోవడంతో వెనుక నుంచి వచ్చే వాహనాలు బారులు తీరుతున్నాయి. గతంలో బైపాస్ రోడ్డులో టోల్‌గేట్ ఉన్నపుడు భారీ వాహనాలు పట్టణంలోకి ప్రవేశించకుండా ఓ వ్యక్తి కాపలా ఉంచేవారు. ప్రస్తుతం టోల్‌గేట్ తొలగించడంతో బైపాస్‌లో వెళ్లాల్సిన వాహనాలు యథేచ్ఛగా ప్రవేశిస్తున్నాయి. ఈ విషయమై సీఐ సురేష్‌ని వివరణ కోరగా మెయిన్‌రోడ్డులో ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు చేపట్టినట్లు వివరించారు.
- న్యూస్‌టుడే, మండపేట

తొస్సిపూడి రోడ్డు.. ట్రాఫిక్ చిక్కులు

తొస్సిపూడి రోడ్డులో తరచుగా ట్రాఫిక్ సమస్యలు ఏర్పడుతున్నాయి. బలభద్రపురం నుంచి తొస్సిపూడి వరకు ఈ మార్గంలో ఒకేచోట మూడు రైస్ మిల్లులు ఉన్నాయి. వివిధ ప్రాంతాల నుంచి లారీలు, ట్రాక్టర్లు, ఇతరత్రా రవాణా వాహనాలు అధిక సంఖ్యలో ధాన్యం లోడుతో వస్తాయి. మిల్లు నుంచి పిలుపు వచ్చే వరకు వాటిని రోడ్డుపైనే నిలిపి ఉంచుతున్నారు. ఆయా మిల్లుల నుంచి రెండు వైపులా బారులుదీరే వాహనాలతో రోడ్డుపై ఇతర వాహనాల రాకపోకలకు తీవ్ర ఆటంకాలు ఎదురవుతున్నాయి. ఎదురెదురుగా వచ్చే రెండు వాహనాలు తప్పుకోవడానికి కష్టంగా మారుతోంది. ఫలితంగా ట్రాఫిక్ నిలిచిపోతోంది. రాత్రివేళల్లో పరిస్థితి ప్రమాదకరంగా మారుతోందని వాహనదారులు చెబుతున్నారు. వీటిని రోడ్డుపై నిలపకుండా ఎప్పటికప్పుడు మిల్లుల ఆవరణలోకి అనుమతించాలని కోరుతున్నారు. - న్యూస్‌టుడే, బిక్కవోలు

దుకాణాల ఆక్రమణపై సర్వే..

మండపేట గ్రామీణం, న్యూస్‌టుడే: మండపేట మండలం జడ్.మేడపాడు వంతెన దగ్గర జల వనరుల శాఖకు సంబంధించిన కాలువ గట్టుపై ఆక్రమణలను గుర్తించేందుకు మంగళవారం రెవెన్యూ, జలవనరుల శాఖ అధికారులు సర్వే చేపట్టారు. జడ్.మేడపాడు కూడలి నుంచి వేమగిరి, సామర్లకోటతో పాటు ఇటు మండపేట రహదారి కావడంతో అధిక సంఖ్యలో వాహనాల రాకపోకలు సాగుతుంటాయి. కాలువగట్టుకు ఇరువైపులా ఆక్రమణదారులు దుకాణాలు నిర్మించుకున్నారు. దీంతో నిత్యం ట్రాఫిక్ చిక్కులు తప్పడంలేదు. ఈ విషయంపై 'ఖాళీ స్థలమా.. కొట్టేద్దాం.. కట్టేద్దాం..' శీర్షికన ఇటీవల కథనం ప్రచురించడంతో జిల్లా కలెక్టర్ స్పందించారు. జల వనరుల శాఖ అధికారులను పరిస్థితిని సమీక్షించాలని ఆదేశించడంతో ఏఈ కె.వరప్రసాద్, మండపేట తహసీల్దార్ పి.తేజేశ్వరరావు, అధికారులు సర్వే చేపట్టారు. నివేదికను కలెక్టర్‌కు సమర్పిస్తామని తెలిపారు.

సర్వేచేస్తున్న రెవెన్యూ, జలవనరుల శాఖ అధికారులు

(c) eenadu

ఈనాడు
ఏలూరు
బుధవారం ఫిబ్రవరి 18, 2026 5

రేషన్ సరకులు అందడం లేదా? డయల్ యువర్ డీఎస్వో నేడు

ఏలూరు అర్బన్, న్యూస్‌టుడే: రేషన్ సరకులు సక్రమంగా అందడం లేదా? నిత్యావసరాల్లో నాణ్యత లోపిస్తోందా? తూకంలో తేడాలున్నాయా? చౌక దుకాణాలు నిర్ణీత వేళకు తెరవడం లేదా? వంట గ్యాస్ సిలిండర్లకు నగదు బదిలీ సొమ్ము బ్యాంకు ఖాతాల్లో జమవడం లేదా? గ్యాస్ బండలు ఇంటికి తెచ్చేందుకు సొమ్ము వసూలు చేస్తున్నారా? స్మార్ట్ కార్డుల్లో తప్పిదాలున్నాయా? పెట్రోలు బంకుల్లో కనీస సదుపాయాల్లేవా? నాసిరకం పెట్రోలు, డీజిల్ విక్రయిస్తున్నారా? తదితర సమస్యలను జిల్లా పౌర సరఫరాల అధికారి దృష్టికి తీసుకెళ్ళేందుకు అవకాశం కల్పిస్తోంది 'ఈనాడు'. ఇందుకు మీరు చేయాల్సింది ఒక్క ఫోన్ చేయడమే. మీ సమస్యలను డీఎస్వో విలియమ్స్ విని.. వాటికి పరిష్కార మార్గం చూపుతారు.

తేదీ: 18.02.2026 (బుధవారం)	సమయం: ఉదయం 11.00 నుంచి 12.00 గంటల మధ్యలో	ఫోన్ నంబరు 80083 01552

నరసింహుడిగా.. సూర్యనారాయణుడు

అమావాస్య సందర్భంగా ఏలూరు పవరపేటలోని సూర్య దేవాలయంలో మంగళవారం సూర్యభగవానుడికి ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం పంచామృతాభిషేకాలు, అర్చనలు చేసి.. లక్ష్మీనరసింహ స్వామిగా అలంకరించారు. భక్తులు స్వామి వారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. - న్యూస్‌టుడే, పవరపేట (ఏలూరు ఆధ్యాత్మికం)

20న ఉద్యోగుల గ్రీవెన్స్

ఏలూరు కలెక్టరేట్, న్యూస్‌టుడే: కలెక్టరేట్‌లోని గోదావరి సమావేశ మందిరంలో జిల్లాలోని ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి 20న ప్రత్యేక గ్రీవెన్స్ నిర్వహించనున్నారు. ఈ మేరకు కలెక్టర్ వెట్రిసెల్వి ఉత్తర్వులు జారీ చేసినట్లు ఏపీఎన్జీవోల సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ తెలిపారు. దీన్ని సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.

అక్కడ వదల్లేదు.. ఇక్కడ కదల్లేదు

● పశ్చిమలో గుర్తించగా.. ఏలూరులో ఏమైంది?
● మట్టి అక్రమ తవ్వకాలపై ఉదాసీనత

ఈనాడు-ఏలూరు: జిల్లాలో అటవీ శాఖకు చెందిన కొండగుట్టలు, భూములు, జల వనరుల శాఖ కాలువలు, చెరువుల్లోని మట్టిని అనుమతులు లేకుండా కొల్లగొట్టి సొమ్ము చేసుకుంటుంటే ప్రభుత్వానికి సీనరేజీ, రాయల్టీ ఫీజుల ఆదాయం రావడం లేదు. అయినా జిల్లా గనుల శాఖ స్పందించడం లేదు. ఈ విషయంలో కాస్త ఆలస్యంగా అయినా పశ్చిమ గోదావరి జిల్లా గనుల శాఖ స్పందించి కొరడా ఝుళిపిస్తోంది. తాడేపల్లిగూడెం మండలం ఆరుగొలనులో పట్టాభూముల్లో మట్టి తవ్వగా దానికి అనుమతి లేదని, సీనరేజీ, రాయల్టీ ఫీజుల రూపేణా సుమారు రూ.4 కోట్లు ప్రభుత్వానికి చెల్లించాలని నోటీసులు ఇచ్చింది. ఇందులో భాగస్వాములైన 15 మందిపై క్రిమినల్ కేసులు నమోదు చేయించింది. ఈ విధంగా జిల్లాలో గనుల శాఖ ఎందుకు వ్యవహరించలేకపోతోంది? ఒకవైపు లక్ష్యం మేర ఆదాయం రావడం లేదని కలెక్టర్ మొత్తుకుంటున్నారు. మట్టి అక్రమ తవ్వకాలతో గండిపడుతున్న ఆదాయాన్ని గుర్తించి వసూలు చేసేలా కలెక్టర్ జోక్యం చేసుకుంటే తప్ప యంత్రాంగం కదిలే పరిస్థితి కనిపించటం లేదు.

● ఆగిరిపల్లి మండలం తోటపల్లిలో వైకాపా హయాంలో అటవీ శాఖ భూముల్లో అనధికారికంగా మట్టి తవ్వారని, బాధ్యుల నుంచి సీనరేజీ, రాయల్టీ కట్టించాలని మంత్రి పార్థసారథి డీఎఫ్‌వోను ఆదేశించారు. ఆ మేరకు రూ.3 కోట్ల వరకు రావాలని లెక్క తేల్చినా పైసా వసూలు చేయలేదు.

● జీలుగుమిల్లి మండలం దర్భగూడెం వద్ద జల వనరుల శాఖ నిల్వ చేసుకున్న మట్టిని ఓ ప్రజాప్రతినిధి అనుచరులు తరలించి సొమ్ము చేసుకున్నారు. గుర్తు తెలియని వ్యక్తులు దీనికి పాల్పడ్డారని మొక్కుబడిగా ఫిర్యాదు ఇవ్వటంతో పోలీసులు దాన్ని పక్కన పడేశారు.

వీటిపై ఏమంటారు?

ఏలూరుకు సమీపంలో తమ్మిలేరులో అనధికార మట్టి తవ్వకాలకు అంతే లేదు. ఇక్కడ జరిగిన తవ్వకాలకు అపరాధ రుసుం విధిస్తే కోట్ల రూపాయల ఆదాయం వస్తుంది. అసలు అటు కన్నెత్తి చూడటం లేదు.

● కొయ్యలగూడెం, బుట్టాయగూడెం మండలాల్లో కొండ గుట్టలు, అటవీ శాఖ భూముల్లో మట్టి తవ్వకాలు భారీగా జరిగినట్లు ఫిర్యాదులు అందినా ఏ ఒక్కరిపై చర్యలు తీసుకోలేదు.

● ద్వారకా తిరుమల మండలంలో పోలవరం కాలువ గట్టు, చెరువుల్లో మట్టి బాగా తరలిపోయింది. బాధ్యులను గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేస్తే కొంత ఆదాయం వస్తుంది.

● దీనిపై గనుల శాఖ అధికారులను వివరణ కోరగా ఆరుగొలనులోని పట్టా భూమిలో తవ్వకాల బాధ్యులను గుర్తించారు. ఏలూరు జిల్లాలో ప్రభుత్వ, కొండగుట్టలు, చెరువులు కావడంతో కారకులను గుర్తించడం అంత సులభం కాదన్నారు.

కొల్లేటి కొంగు బంగారం.. పెద్దింట్లమ్మ

నేటి నుంచి అమ్మవారి జాతర

కైకలూరు, న్యూస్‌టుడే: కొల్లేటి కాంచే కొంగు బంగారం పెద్దింట్లమ్మ. నూటొక్క దేవతలకి పెద్దమ్మగా.. పార్వతీదేవి ప్రతిరూపంగా అమ్మవారి శోభ దశదిశలా విరాజిల్లుతోంది. విశాల నేత్రాలతో తొమ్మిది అడుగుల ఎత్తు పద్మాసన భంగిమలో దర్శనమిచ్చే అమ్మవారిని చూస్తే మనసు ఉప్పొంగుతుంది. 11వ శతాబ్దానికి ముందే కొల్లేరు సంస్కృతికి ఉండేవారు. వేంగి-చాళుక్య రాజులు కొలిచారని చరిత్ర చెబుతోంది. మత్స్యకారుల ఇంటి దేవతగా పూజలందుకుంటున్న పెద్దింట్లమ్మ జాతర మహోత్సవాలు బుధవారం నుంచి మార్చి 3 వరకు జరగనున్నాయి.

అపురూపం.. కళ్యాణ ఘట్టం

జాతరలో అపురూపమైన ఘట్టం జల దుర్గా సమేత గోకర్ణేశ్వరస్వామి దివ్య కల్యాణం. అమ్మవారి విగ్రహం చెంతనే జలదుర్గామాత కొలువై ఉండగా.. దేవస్థానానికి మూడు మైళ్ల దూరంలో ఉన్న గోకర్ణపురంలో గోకర్ణేశ్వరస్వామి కొలువుదీరారు. ఈ నెల 28న ఫాల్గుణ శుద్ధ ద్వాదశి రోజు అర్ధరాత్రి నుంచి తెల్లవారుజాము వరకు కల్యాణ మహోత్సవం నిర్వహిస్తారు.

అలంకరణలో అమ్మవారు

భక్తి పారవశ్యంలో తీసుకువెళ్లే అమ్మవారి ప్రభల జాతరను కళ్లారా వీక్షించే అనుభూతి వర్ణనాతీతం. గ్రామస్థులు ప్రభలతో కలిసి ఆడిపాడుతూ వందలాది గూడెం నుంచి పుట్టిలో సారెను సాయంత్రానికి అమ్మవారి సన్నిధికి చేరుస్తారు. ఆకట్టుకునే దేవతామూర్తుల వేషధారణలో పల్లకిలో ఊరేగుతూ గోకర్ణేశ్వరుడు ఇక్కడికి చేరుకుంటారు. జాతరకు లంక గ్రామాల బంధు గణం రెండురోజుల ముందే చేరుకోవడంతో మరో సంక్రాంతిని తలపిస్తోంది.



ముస్తాబైన ఆలయం

లోటుపాట్లు లేకుండా చర్యలు

జాతరలో లోటుపాట్లు లేకుండా అన్ని వసతులు కల్పించాం. గతేడాది కంటే వైభవంగా జాతర నిర్వహించేలా ఏర్పాట్లు చేశాం. 13 రోజుల్లో 15 లక్షల మంది భక్తులు వస్తారని అంచనా. - కూచిపూడి శ్రీనివాస్, ఈవో

● మధ్యలో సెలవు.. సాధనకు అనువు!
● రైతన్నా.. ఇదిగో నీకో యాప్!
6లో

నులిపురుగుల నివారణతో ఆరోగ్యం: కలెక్టర్

ఏలూరు అర్బన్, న్యూస్‌టుడే: జిల్లాలో 1 నుంచి 19 ఏళ్లలోపు బాలలందరికీ నులి పురుగుల నివారణ మాత్రలు తప్పనిసరిగా వేయించాలని కలెక్టర్ వెట్రిసెల్వి అన్నారు. స్థానిక సుబ్బమ్మదేవి, వెంకటరావుపేట నగర పాలక పాఠశాలల విద్యార్థులకు మంగళవారం నులిపురుగుల నివారణ మాత్రలు పంపిణీ వేసి ఆమె మాట్లాడారు. నులి పురుగులు పెరిగితే పిల్లలు అనారోగ్యం బారిన పడే అవకాశముందన్నారు. రక్తహీనత, పోషకాల లోపం, ఆకలి మందగించడం, బరువు తగ్గడం తదితర లక్షణాలు కనిపిస్తాయన్నారు. పిల్లలతో ఆల్బెండజోల్ మాత్రలు మింగించడం ద్వారా వీటిని నివారించవచ్చన్నారు. జిల్లావ్యాప్తంగా 3,73,873 మందికి ఈ నెల 24 వరకు మాత్రలు పంపిణీ చేయనున్నట్లు ఆమె పేర్కొన్నారు. డీఈవో వెంకట లక్ష్మమ్మ, ఆర్‌బీఎస్‌కే ప్రోగ్రాం అధికారి నరేంద్ర, తహసీల్దారు గాయత్రి తదితరులున్నారు.

బాలుడికి మాత్ర వేస్తున్న వెట్రిసెల్వి

ఆదివారమండి.. ఆనందించండి!

22 నుంచి హ్యాపీ సండే అమలుకు శ్రీకారం

ఏలూరు వన్‌టౌన్, న్యూస్‌టుడే: గత తెదేపా ప్రభుత్వ హయాంలో నగర, పట్టణ ప్రాంతాల ప్రజలకు ఆరోగ్యం, ఆహ్లాదం పంచడానికి 'ఆనంద లహరి' అమలు చేశారు. అప్పట్లో కార్యక్రమానికి ఏలూరు నగరవాసుల నుంచి ఆదరణ లభించింది. వైకాపా ప్రభుత్వం దీన్ని నిలిపేసింది. తాజాగా కూటమి సర్కారు కార్యక్రమాన్ని పునరుద్ధరించేందుకు ముహూర్తం ఖరారు చేసింది. ఈ నెల 22 నుంచి నగరపాలక, పురపాలక సంఘాల్లో ప్రారంభించాలని ఆదేశాలిచ్చింది. ప్రతి నెలా రెండు, నాలుగో ఆదివారాల్లో ఉదయం 6 నుంచి 10 గంటల మధ్య నిర్వహించనుంది.

వివిధ రకాల పోటీలు..

ఆనంద ఆదివారంలో సంగీతం, నృత్యం, కళా ప్రదర్శనలు, తేలికపాటి వ్యాయామాలు చేసేలా ప్రోత్సహించనున్నారు. యోగా, ధ్యానం, నడక, సైక్లింగ్‌పై ప్రజలకు అవగాహన కల్పించనున్నారు. విద్యార్థులకు ఆటలు, చిత్రలేఖనం, కథలు, వివిధ రకాల పోటీలు నిర్వహించనున్నారు. రోడ్ల పక్కన, కాలనీల్లోని రిజర్వు స్థలాల్లో మొక్కలు నాటడం, పరిసరాల శుభ్రత, పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాలు చేపట్టనున్నారు. 'ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా జిల్లా యంత్రాంగం సహకారంతో నగరంలో హ్యాపీ సండేను విజయవంతం చేస్తాం. కార్యక్రమాన్ని చక్కగా అమలు చేసేందుకు ప్రత్యేక అధికారులను నియమించాం' అని ఏలూరు నగర కమిషనర్ కె.భానుప్రతాప్ తెలిపారు.

ఒత్తిడి లేని జీవన శైలి

హ్యాపీ సండేలో అన్ని వర్గాల ప్రజలు భాగస్వామ్యమయ్యేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. తదనుగుణంగా అనువైన ప్రాంతాలు ఎంపిక చేస్తోంది. నగర, పుర ప్రజల ఆనందం, జీవన ప్రమాణాలు, ఒత్తిడి లేని జీవనశైలి పెంపొందించేందుకు కార్యక్రమం దోహదపడనుంది. ఎక్కువ మంది పిల్లలు, యువత, మహిళలు, వృద్ధులు పాలుపంచుకునేలా రూపొందిస్తున్నారు.

బియ్యంలో మోసం.. అమ్మకాల్లో కొత్త వేషం

ఏలూరులో విజిలెన్స్ తనిఖీల్లో బహిర్గతం

ఈనాడు-ఏలూరు

తూకంలో మోసం.. ధరలో దోపిడీ.. నాసిరకం. ఏలూరు నగరంలోని కొందరు బియ్యం వ్యాపారుల (రైస్ ట్రేడర్స్) అక్రమాలు ఇవి. బ్రాండెడ్ కంపెనీల సంచుల్లో నాణ్యత లేని బియ్యం నింపి వినియోగదారులకు అంటగట్టి జేబులు నింపుకొంటున్నారు. వీరి మోసాలను విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం మంగళవారం గుట్టురట్టు చేసింది.

బియ్యం బస్తాను కాటా వేసిన అధికారులు

ఎస్పీ నాగేశ్వరరావు ఆదేశాల మేరకు.. వన్‌టౌన్‌లో బియ్యం దుకాణాలపై విజిలెన్స్ యంత్రాంగం తనిఖీలకు వెళ్లగా అనేక మోసాలు బయటపడ్డాయి. ఒకరిద్దరు వ్యాపారులు గతంలో ఎప్పుడూ తమ దుకాణాల్లో తనిఖీలు చేయలేదని అభ్యంతరం చెప్పారు. మొత్తం 15 రైస్ ట్రేడర్స్‌లో తనిఖీలు జరపగా 11 దుకాణాల్లో అక్రమాలు గుర్తించారు. కొన్ని దుకాణాల్లో పీడీఎస్ బియ్యం పాలిష్ చేయించి పేరున్న కంపెనీల సంచుల్లో పోసి అమ్ముతున్నారు. మరికొన్నింటిలో బీపీటీ తదితర తక్కువ రకాల ధాన్యం ఆడించి క్వాలిటీ బియ్యం అని నమ్మించి విక్రయిస్తున్నారు. బ్రాండెడ్ కంపెనీల బియ్యం సంచులపై ఎమ్మార్పీ ధర, వినియోగం గడువు, విడిగా కిలో ధర ఎంతో పొందుపరుస్తాయి. వినియోగదారులకు ఏమైనా తేడాలు ఉంటే కస్టమర్ కేర్ నంబరుకు ఫోన్ చేయాలంటాయి. కానీ విజిలెన్స్ బృందాలు తనిఖీలకు వెళ్లిన 15 షాపుల్లో 11 చోట్ల అవేమీ లేవని గుర్తించారు.

కేసుల నమోదు

విజిలెన్స్ ఎస్పీ నాగేశ్వరరావు 'ఈనాడు'తో మాట్లాడుతూ 'బియ్యం సంచులపై ఆ బియ్యం ఎప్పుడు తయారు చేశారు? ఎప్పటిలోగా వినియోగించాలి అనే వివరాలు లేవు. ఏదైనా తేడా వస్తే ఎవరికి ఫోన్ చేయాలో కస్టమర్ కేర్ నంబరు లేదు. తూకం వేయగా 20 కిలోలకు 18-19 కిలోలే ఉన్నాయి. 25 కిలోల బస్తా అయితే 22 కిలోలే ఉంది. తూకంలో వ్యత్యాసాలు, కంపెనీ బ్రాండ్ల పేరుతో వినియోగదారులను ధరల రూపేణా దోచుకుంటున్నారని గుర్తించి 11 వ్యాపార సంస్థలపై కేసుల నమోదుకు ఆదేశించామని' ఆయన చెప్పారు.

మనోహరం.. జలవిహారం

భీమవరం ఆధ్యాత్మికం, న్యూస్‌టుడే : శివరాత్రి కల్యాణ మహోత్సవాల ముగింపులో భాగంగా పంచారామక్షేత్రం గునుపూడి సోమేశ్వర జనార్దనస్వామి ఆలయంలో పార్వతీ పరమేశ్వరులు చంద్రపుష్కరిణిలో హంసవాహనంపై విహరించారు. బాణసంచా కాల్పులు భక్తులకు కనువిందు చేశాయి. అనంతరం స్వామివార్ల గ్రామోత్సవం జరిగింది. అర్ధరాత్రి పుష్పోత్సవం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి వేడుకలను తిలకించారు.

చంద్రపుష్కరిణిలో విహరిస్తున్న సోమేశ్వరజనార్దనస్వామి, అమ్మవార్లు

గర్భస్రావాలపై నివేదికలు లోపాలతో ఎలా ఇచ్చారు

రాష్ట్ర మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ ఆగ్రహం



నందాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో దస్త్రాలు పరిశీలిస్తున్న శైలజ

బుట్టాయగూడెం, న్యూస్‌టుడే: మన్యం గ్రామాల్లో గర్భస్రావాలకు సంబంధించి లోపాలతో కూడిన నివేదికలు ఎలా ఇచ్చారని.. రాష్ట్ర మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ రాయపాటి శైలజ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కేఆర్‌పురం ఐటీడీఏలో వైద్య, స్త్రీ, శిశు సంక్షేమ శాఖల అధికారులు, సిబ్బందితో మంగళవారం ఆమె సమీక్షా సమావేశం నిర్వహించారు. గర్భస్రావాలు ఎక్కువ సంఖ్యలో నమోదు కావడంలో ఏలూరు జిల్లా రాష్ట్రంలో మూడో స్థానంలో ఉందని, అందుకు కారణాలపై ప్రశ్నించారు. మన్యం గ్రామాల్లో తొమ్మిది నెలల్లో 281 గర్భస్రావాలు నమోదు కావడానికి కారణాలపై సమీక్షించారు. ఎక్కువ సంఖ్యలో నమోదైన సంబంధిత పీహెచ్‌సీల సిబ్బందిని నిలదీశారు. తప్పుడు నివేదికలు అందజేయడంపై అసహనం వెలిబుచ్చారు. సరిచూసుకోకుండా ఇలా ఎలా ఇచ్చారంటూ ప్రశ్నించారు. ఇది వాస్తవమా కాదా, నిజమైతే కారణాలు ఏమిటి అనే దానిపై క్షేత్రస్థాయి పరిశీలన చేసి రెండు రోజుల్లో నివేదిక అందజేయాలని అధికారులను ఆదేశించారు. ఐటీడీఏ పీవో రాములు నాయక్, డీఎంహెచ్‌వో అమృతం, ఐసీడీఎస్ పీడీ శారద, శాప్ డైరెక్టర్ కొవ్వాసి జగదీశ్వరి, ట్రైకార్ ఛైర్మన్ బొరగం శ్రీనివాసులు, రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యురాలు కాకి లక్ష్మి, ఇన్‌ఛార్జి డిప్యూటీ డీఎంహెచ్‌వో సురేశ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మహిళల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి

మన్యం గ్రామాల్లోని మహిళల ఆరోగ్యంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టి మరిన్ని నిధులను వెచ్చిస్తోందని ఛైర్‌పర్సన్ శైలజ తెలిపారు. బుట్టాయగూడెం మండలం నందాపురం పీహెచ్‌సీని ఆమె సందర్శించి, దస్త్రాలు పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం గర్భిణులకు పోషకాహారాన్ని అందిస్తుందన్నారు. పీహెచ్‌సీల ద్వారా క్షేత్రస్థాయిలో గర్భిణుల ఆరోగ్య పరిరక్షణకు ఎప్పటికప్పుడు అవసరమైన చర్యలు తీసుకుంటుందన్నారు. బాల్య వివాహాలను అరికట్టేందుకు కృషి చేస్తున్నా గర్భస్రావాలు అధిక సంఖ్యలో నమోదయ్యాయని చెప్పారు.

ఎన్నాళ్లు చూస్తారు ఇంకెన్నాళ్లు చేస్తారు

16లో ఒక్కటీ పూర్తవ్వని పంచాయతీ భవనాలు

పరిశీలన

కొయ్యలగూడెం మండలం కుంతలగూడెంలో పంచాయతీ భవన నిర్మాణానికి రూ.32 లక్షలు కేటాయించారు. పునాది వేసేందుకు పాత మట్టి తవ్వి వదిలేశారు. గుత్తేదారు నిర్లక్ష్యంతో పనుల్లో ముందడుగు పడటం లేదు.

ఏలూరు వన్‌టౌన్, ఉంగుటూరు, కొయ్యలగూడెం గ్రామీణ- న్యూస్‌టుడే: జిల్లాలో జనాభా ప్రాతిపదికన ప్రభుత్వం కొత్త గ్రామ పంచాయతీలు ఏర్పాటు చేసింది. సకల సదుపాయాలతో సొంత భవనాలు నిర్మించాలని ఉత్తర్వులు జారీ చేసింది. రెండు దశల్లో 16 పంచాయతీ భవనాల ఏర్పాటుకు రూ.5.12 కోట్లు కేటాయించింది. ఇందుకు రాష్ట్రీయ గ్రామ స్వరాజ్ అభియాన్ (ఆర్‌జీఎస్‌ఏ) కింద రూ.20 లక్షలు, ఉపాధి హామీ (ఎన్‌ఆర్‌ఈజీఎస్)లో మరో రూ.12 లక్షలు చొప్పున రూ.32 లక్షలు కేటాయించింది. ఈ నిర్మాణాలు నత్తతో పోటీ పడుతున్నాయి. ఒక్క చోట భవనం పూర్తవలేదు.

ఉంగుటూరు మండలం నల్లమాడులో పంచాయతీ భవన నిర్మాణ పనులు శ్లాబు దశలో నిలిచిపోయాయి. మార్చి 15లోపు నిర్మాణం పూర్తి చేయకుంటే నిధులు నిలిచి పోయే ప్రమాదముంది.

అధికారుల నిర్లక్ష్యంతో..

గ్రామీణ ప్రాంతాల్లో మెరుగైన పాలన అందించాలని.. పంచాయతీలకు సొంత గూడు కల్పించాలన్న ఉద్దేశంతో.. పెద్ద మొత్తంలోనే నిధులు కేటాయించింది. క్షేత్రస్థాయిలో పంచాయతీరాజ్ ఉన్నతాధికారుల నిర్లక్ష్యం.. గుత్తేదారులు అలసత్వంతో పనుల్లో ముందడుగు పడటం లేదు. వీటిని పూర్తి చేయించడంపై పాలకులు సైతం శ్రద్ధ వహించడం లేదు. మండల, జిల్లా సమావేశాల్లో సమీక్షించడం లేదు. 16 భవనాలను మార్చి 15 లోపు నిర్మించకుంటే నిధులు వెనక్కి వెళ్లిపోయే ప్రమాదముంది. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి భవనాలను త్వరగా పూర్తి చేయాలని గ్రామీణులు కోరుతున్నారు.

దీనిపై వివరణ కోరేందుకు పీఆర్ అధికారులను ప్రయత్నించగా.. వారు స్పందించలేదు.

లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే కఠిన చర్యలు: డీఎంహెచ్‌వో

ఈనాడు-ఏలూరు: జిల్లాలోని స్కానింగ్ కేంద్రాల్లో ఎవరైనా లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే వారిపై, దీనికి బాధ్యులైన వైద్యులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని డీఎంహెచ్‌వో అమృతం హెచ్చరించారు. మంగళవారం 'ఈనాడు'లో 'అమ్మా.. లోలోపల ఎంత ఏడుస్తున్నానో' శీర్షికన ప్రచురితమైన కథనానికి ఆమె స్పందించారు.

వైద్య ఆరోగ్య, స్త్రీ-శిశు సంక్షేమం, పోలీసు శాఖల సంయుక్త ఆధ్వర్యంలో స్కానింగ్ కేంద్రాల్లో డెకాయ్ ఆపరేషన్లు కొనసాగిస్తామన్నారు. ప్రజలు కూడా ఎక్కడైనా నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తుంటే టోల్‌ఫ్రీ నంబరు: 1800 425 6131కు సమాచారం ఇవ్వాలని కోరారు. జిల్లాలో గతేడాది నమోదైన 1499 గర్భస్రావాల్లో 1190 సహజంగా జరిగినవి అని పేర్కొన్నారు. గర్భిణుల ఆరోగ్య సమస్యలు, పోషకాహార లోపం, రక్తహీనత, హార్మోనల్ కారణాలతో జరిగాయని వివరించారు.

ఆ సంకల్పమే బతికించెట్టు

కొయ్యలగూడెం గ్రామీణ, న్యూస్‌టుడే: కనకాద్రిపురం (ఆరిపాటిదిబ్బలు) వద్ద పొంగుటూరు రహదారిపై ఇటీవల వందల ఏళ్ల నాటి పెద్దపెద్ద రావిచెట్లు వరుసగా నిలబడి కనిపిస్తూ.. బాటసారులకు ఆశ్చర్యం కలిగిస్తున్నాయి. ఆ ప్రాంతంతో పరిచయం ఉన్నవారికి ఇంతకు ముందు అవి అక్కడ ఉన్నట్టు గుర్తులేక విస్మయం చెందుతున్నారు. ఆ చెట్లన్నీ కొమ్మలు నరికేసి మొండి మొదళ్లు మాత్రమే ఉన్నాయి. ఇంతకూ అవేమిటంటే.. రాజమహేంద్రవరం ప్రాంతానికి చెందిన వ్యక్తులు వీటిని అక్కడ నాటారు. అందుకోసం కొయ్యలగూడెం, బుట్టాయగూడెం, పోలవరం పరిసర ప్రాంతాల్లో అక్కడక్కడా తొలగించిన భారీ వృక్షాలను సేకరించి, శాస్త్రీయ విధానంలో తవ్విన గుంతల్లో నాటుతున్నారు. అవన్నీ తిరిగి చిగురించేలా సుమారు ఆరు నెలల పాటు సంరక్షించనున్నారు. ఆ తర్వాత బోన్సాయ్ చెట్ల తరహాలో వాటిని తీర్చిదిద్దుతామని వారు చెబుతున్నారు.

రొయ్య రాసిన మరణ శాసనం

మేత వేయడానికి వెళ్లి ఉసురు కోల్పోతున్న రైతులు, కార్మికులు

కుటుంబ సభ్యులకు గుండెకోత

కలిదిండి, కైకలూరు, మండవల్లి, న్యూస్‌టుడే : రొయ్య రాసిన మరణ శాసనానికి ఆనవాళ్లు ఇవి. లాభాల బాట పట్టించే ఆక్వా చెరువులు ఏమాత్రం ఏమరుపాటుగా ఉన్నా.. మృత్యుబాట పట్టించేస్తున్న వైనం ఇది. ప్రవహించే విద్యుత్తు.. వేగంగా తిరుగుతున్న ఏరియేటర్లు.. నిశ్శబ్దంగా నడిచే పడవ.. ఇవే మృత్యువుకు వాహకాలుగా మారుతున్నాయి. కుటుంబాల్లో తీరని శోకాన్ని నింపుతున్నాయి.

● మహా శివరాత్రికి భోగేశ్వరుడిని దర్శించుకుందామని దొడ్డిపట్ల నుంచి తన ఇద్దరు కుమార్తెలను తీసుకుని కలిదిండిలోని తన పుట్టింటికి వచ్చారు గంగుల వీర నాగజ్యోతి. తండ్రి సాగు చేస్తున్న రొయ్యలకు మేత వేద్దామని చిన్న కుమార్తె హేమను వెంట పెట్టుకుని ఆదివారం చెరువు వద్దకు వెళ్లారు. గట్టు మీద ఏర్పాటు చేసిన ఇంజిన్‌కు ఉన్న ఫ్యాన్ సెట్ రాడ్డుకు ఆమె వస్త్రం తగలడంతో ఆమె చెయ్యి పట్టుకుని నడుస్తున్న ఆరేళ్ల హేమ కూడా అందులో ఇరుక్కుపోయింది. భార్య, బిడ్డను కోల్పోయిన ఆ కుటుంబ పెద్ద గుండె అవిసిపోయింది. అమ్మా, చెల్లెలు ఇక లేరన్న నిజం మరో కుమార్తె మనసును దహించి వేసింది. పండగ నాడు ఇంటికొచ్చిన కూతురు, మనవరాలు నిర్జీవంగా పడి ఉండటం చూసి ఆ మలి వయసు తల్లిదండ్రుల హృదయాలు వేదనతో రోదించాయి.

● మూడేళ్ల కిందట భైరవపట్నానికి చెందిన ఓ వ్యక్తి రొయ్యల చెరువులో మందు కొట్టడానికి వెళ్లాడు. ఆ రోజు క్షేమంగా ఇంటికి వెళ్తే రూ.500 వచ్చేవి. కానీ.. మృత్యువు ఆ కార్మికుడి శవాన్ని ఇంటికి పంపించింది. చెరువులో మందు పిచికారీ చేస్తూ ఆ ఘటుకు ఆకస్మికంగా స్పృహ తప్పి పడవలో పడిపోయాడు. పడవ అదుపు తప్పడంతో చెరువులో మునిగిపోయాడు. తనపై ఆధారపడిన తల్లి, భార్య, ఇద్దరు కుమారులు రోడ్డున పడ్డారు.

● అమలాపురంలోని ఏటిగట్టు నుంచి మిత్రులతో కలిసి చెరువులో చేపలు పట్టుబడికి మండవల్లి వచ్చాడో కార్మికుడు. చెరువులో ఉండి వల లాగుతుండగా.. ప్రమాదవశాత్తు చెరువులో మునిగిపోయాడు. రోజూ సురక్షితంగా ఇంటికి వచ్చే నాన్న.. ఆ రోజు నిర్జీవంగా రావడంతో ఆ ఇద్దరు ఆడ బిడ్డలు దిక్కులేని వాళ్లయ్యారు. ఆ ఇల్లాలి వేదన నేటికీ తీరలేదు.

● కైకలూరు మండలం దొడ్డిపట్ల గ్రామానికి చెందిన ఓ యువకుడు ఏడాది కిందట ఓ రొయ్యల చెరువుపై ఏరియేటర్లు బిగించేందుకు పనికి వెళ్లాడు. పని మధ్యలో ఆకస్మికంగా తీగల్లో విద్యుత్తు ప్రవహించింది. ఏరియేటర్లు తిరగడంతో ఆ యువకుడు వాటిలో ఇరుక్కుపోయాడు. క్షణాల్లో నుజ్జునుజ్జు అయిపోయాడు. బిడ్డను కోల్పోయిన కన్నవాళ్లు ఇంకా ఆ ఘటన నుంచి బయట పడలేదు.

(c) eenadu

ఈ-ఆఫీసు అమలుతో పారదర్శక పాలన

సమీక్షిస్తున్న ఆర్‌డీఎంఏ నాగేశ్వరరావు

ఏలూరు (గ్రామీణ), న్యూస్‌టుడే: జిల్లాలోని అన్ని పురపాలక సంఘాల్లో ఈ-ఆఫీసు అమలు చేసి.. పారదర్శక పాలనకు పెద్ద పీట వేయాలని ఆర్‌డీఎంఏ సీహెచ్ నాగేశ్వరరావు అన్నారు. నగరపాలక సంస్థ కార్యాలయం సమావేశ మందిరంలో మంగళవారం సమీక్ష నిర్వహించి మాట్లాడారు. వంద శాతం పన్నుల వసూలుకు చర్యలు తీసుకోవాలన్నారు. అనధికార లేఅవుట్లు, నిర్మాణాలపై కఠినంగా వ్యవహరించాలన్నారు. పట్టణ ప్రణాళిక విభాగం పరిధిలో ఎల్‌ఆర్‌ఎస్, బీపీఎస్ అమలు, అనధికార నిర్మాణాల నియంత్రణ, ఖాళీ స్థలాల వివరాలు, కౌన్సిల్ సమావేశాలు, సీ, డీ వ్యర్థాల నిర్వహణ, వార్షిక ఖాతాలు, బడ్జెట్, ఈ-ఆఫీస్, జాతీయ హరిత ట్రిబ్యునల్ మార్గదర్శకాలు అమలు తదితరాలపై సమీక్షించారు. నగరపాలక సంస్థ కమిషనర్ ఎ.భానుప్రతాప్, అదనపు కమిషనర్ డి.శ్రీనివాసరావు, పురపాలక సంఘ కమిషనర్లు కె.వీరయ్య, కె.వెంకటరమణ, ఎ.రాంబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

22న రజక ఆత్మీయ సభ

ఏలూరు అర్బన్, న్యూస్‌టుడే: నూజివీడులో ఈ నెల 22న రజక ఆత్మీయ సభ నిర్వహిస్తున్నట్లు మాజీ ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు తెలిపారు. స్థానిక తెదేపా జిల్లా కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. సభకు మంత్రి కొలుసు పార్థసారథి ముఖ్య అతిథిగా హాజరవుతున్నట్లు చెప్పారు. సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు సీహెచ్ కట్టయ్య, తెదేపా నాయకుడు జగదీష్‌బాబు పాల్గొన్నారు.

అడిగితేనే.. అడుగు ముందుకు..

సుందరగిరికి చేరాలంటే తప్పని కష్టాలు

ఐఎస్ జగన్నాథపురం శ్రీలక్ష్మీనరసింహస్వామిని దర్శించుకునేందుకు ఇటీవల నలుగురు భక్తులు ఏలూరు నుంచి కారులో బయలుదేరి దూబచర్ల, జి.కొత్తపల్లి మీదుగా వచ్చి తూర్పు లక్ష్మీపురం అడ్డ రోడ్డు వద్ద దారి తప్పి టెక్కీవెనవారిగూడెం మార్గంలో వెళ్లిపోయారు. తీరా అక్కడకు వెళ్లాక అనుమానం వచ్చి ఎవరినో అడిగితే వెనక్కి వెళ్లమని చెప్పడంతో వారు తిరిగి వెనక్కి వచ్చి అసలు మార్గం వైపు వెళ్లారు. దేవాలయానికి వెళ్లే మార్గమని ఒక సూచిక బోర్డు కూడలిలో ఏర్పాటు చేసి ఉంటే ఇబ్బంది ఉండేది కాదు.

ప్రసాదం నుంచి కొంత మంది ఆటోల్లో ఐఎస్ జగన్నాథపురం శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయానికి బయలుదేరి జి.కొత్తపల్లి వరకు వచ్చి ఎడమ చేతి వైపు తిరగకుండా నేరుగా రామసింగవరం రోడ్డుపై వెళ్లి కొంత దూరం వెళ్లి మళ్లీ వెనక్కి వచ్చారు. స్థానికులను ఆలయం ఎక్కడ అని అడుగుతూ వివరాలు గమనిస్తూ చేరుకున్నారు.

ద్వారకాతిరుమల, జంగారెడ్డిగూడెం (గ్రామీణ), న్యూస్‌టుడే: ద్వారకాతిరుమల మండలం ఐఎస్ జగన్నాథపురం శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయానికి చేరుకునే క్రమంలో భక్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మార్గంలో పలు గ్రామాలకు వెళ్లే ప్రధాన కూడళ్లలో ఎక్కడా సూచిక బోర్డులు లేకపోవడంతో దారితప్పుతున్నారు. దారిపొడవునా ఎవరో ఒకరిని అడిగితేనే తప్ప గమ్యం చేరుకోలేని పరిస్థితి నెలకొంది.

ఐఎస్ జగన్నాథపురంలో ఆలయానికి వెళ్లే రోడ్డు ప్రారంభంలో తుప్పు పట్టి ఉన్న బోర్డు

ఎక్కడ ఏర్పాటు చేయాలంటే.. జి.కొత్తపల్లిలో రామసింగవరం వెళ్లే రోడ్డు, దూబచర్ల వెళ్లే రోడ్డు, తూర్పు లక్ష్మీపురం వెళ్లే రోడ్డు కలిసిన ప్రధాన కూడలి వద్ద దేవాలయానికి వెళ్లే మార్గం అని బోర్డులు ఏర్పాటు చేయాలి. తూర్పు లక్ష్మీపురం అడ్డ రోడ్డు వద్ద జంగారెడ్డిగూడెం వెళ్లే రోడ్డు, ఐఎస్ జగన్నాథపురం వెళ్లే రోడ్డు, జి.కొత్తపల్లి వెళ్లే రోడ్డు కలిసిన ప్రధాన కూడలిలో సూచికబోర్డు ఏర్పాటు చేయాల్సి ఉంది. ఐఎస్ జగన్నాథపురంలో ఆర్‌అండ్‌బీ రోడ్డు నుంచి సుందర గిరిపైకి వెళ్లే మార్గం ప్రారంభంలో గతంలో ఏర్పాటు చేసిన చిన్న ఇనుప బోర్డు తుప్పు పట్టిపోయి నిరుపయోగంగా మారింది.

పెరుగుతున్న భక్తులు: శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయం దినదినాభివృద్ధి చెందుతోంది. ఇక్కడకు వచ్చే భక్తులకు స్వామివారు కొలువైన సుందరగిరి అందాలు స్వాగతం పలుకుతాయి. ఆధ్యాత్మిక వాతావరణంలో పచ్చని చెట్లు చల్లని గాలులతో పలకరిస్తాయి. ఇక్కడి స్వామివారికి పాల పొంగళ్లు వండి నైవేద్యంగా సమర్పించడంతోపాటు ఆలయం వెనుక నిద్ర చేస్తే సంతాన ప్రాప్తి కలుగుతుందని భక్తుల విశ్వాసం. పలువురు ప్రముఖులు కూడా స్వామివారిని ఇష్టదైవంగా మారాయి.

బోర్డులు ఏర్పాటు చేస్తాం.. భక్తులు ఆలయానికి వెళ్లే మార్గం తెలుసుకునేలా ప్రధాన కూడళ్ల వద్ద తప్పకుండా బోర్డులు ఏర్పాటు చేస్తాం. ఇది భక్తులకు చాలా ఉపయోగకరంగా ఉంటుంది. - వై.భద్రాజీ, ఈవో, ద్వారకాతిరుమల దేవస్థానం.

దేహదారుఢ్య పోటీల్లో అదరగొట్టిన కుర్రాళ్లు

రాజానగరం, న్యూస్‌టుడే: యువత చదువుతో పాటు అన్నిరంగాల్లో రాణించాలని వీసీ ప్రసన్నశ్రీ పేర్కొన్నారు. నన్నయ యూనివర్సిటీలో మంగళవారం ఇంటర్ కాలేజీయేట్ బెస్ట్‌ఫిజిక్ మెన్ విశ్వవిద్యాలయం ఎంపికలు నిర్వహించారు. వివిధ విభాగాల్లో జరిగిన పోటీలో యూనివర్సిటీ అనుబంధ కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విజేతలకు వీసీ ఎస్.ప్రసన్నశ్రీ చేతుల మీదుగా పతకాలు అందించారు.

విజేతలతో వీసీ ప్రసన్నశ్రీ, అధ్యాపకులు

విజేతల వివరాలు: ✦ 60 కిలోల విభాగం: ఎన్.పూర్ణ సతీష్, కె.జగదీష్‌కుమార్ (డీఎన్‌ఆర్ కళాశాల, భీమవరం), ఆర్.కాశీవిశ్వనాథ్ (ఐడియల్ కళాశాల, కాకినాడ) మొదటి మూడు స్థానాల్లో నిలిచారు. ✦ 65 కిలోలు: వై.భరత్(ఆదిత్య కళాశాల, ఏలూరు), పి.సూరిబాబు(గోవర్ధనప్రియ), ఎ.జగదీష్(పాలకొల్లు). ✦ 70 కిలోలు: ఎల్.వి.ఎ.సూర్యప్రకాశ్, బి.సాయిప్రశాంత్, బి.దుర్గాప్రసాద్(పీఆర్ కళాశాల, కాకినాడ). ✦ 75 కిలోలు: ఎం.సాయిలోకేష్(సీ.ఆర్.రెడ్డి కళాశాల, ఏలూరు), బి.మహేష్, డి.అరుణ్‌కుమార్ (పీఆర్ కళాశాల, కాకినాడ) తొలి మూడు స్థానాల్లో నిలిచారు. ✦ 80 కిలోలు: పి.విజయ చాముండేశ్వర్ (పీఆర్ కళాశాల, కాకినాడ) ✦ 85 కిలోలు: షేక్‌మస్తాన్ (డీవీ రాజు కళాశాల, భీమవరం), 90 కిలోలు: కె.పవన్‌సాయి (పీఆర్ కళాశాల, కాకినాడ), 95 కిలోలు: కె.పాండురంగ వరప్రసాద్ (డా.సీ.ఎస్.ఎన్.కళాశాల, భీమవరం) పతకాలు సొంతం చేసుకున్నారు. ✦ మిస్టర్ నన్నయ విశ్వవిద్యాలయం 2025-26 ట్రోఫీని కె.పాండురంగ వరప్రసాద్ (డా.సీ.ఎస్.ఎన్.డిగ్రీ అండ్ పీజీ కళాశాల, భీమవరం), ✦ బెస్ట్‌ఫిజిక్ మెన్ ఛాంపియన్ షిప్ (పి.ఆర్.ప్రభుత్వ కళాశాల, కాకినాడ) కైవసం చేసుకున్నారు.

రైతుల అభ్యున్నతికి ప్రభుత్వం తోడ్పాటు: డీఏవో

పెదవేగి(పెదపాడు), న్యూస్‌టుడే: రైతుల అభ్యున్నతికి రాష్ట్ర ప్రభుత్వం తోడ్పాటునందిస్తోందని జిల్లా వ్యవసాయాధికారి షేక్ హబీబ్‌బాషా అన్నారు. పెదవేగి మండలం నడిపల్లిలో రైతు గుర్తింపు నమోదు ప్రక్రియను మంగళవారం ఆయన పరిశీలించి మాట్లాడారు. రైతు గుర్తింపు నమోదు ప్రక్రియ చేయించుకోవడం ద్వారా పంటల బీమా, పెట్టుబడి రాయితీ, విత్తనాలు, ఎరువులు, ఇతరత్రా సేవలన్నీ పొందవచ్చన్నారు. ఆధార్, భూ పత్రాలు, ఫోన్ నంబరుతో ఆర్‌ఎస్‌కేల్లో సంప్రదిస్తే సిబ్బంది ప్రక్రియ పూర్తి చేస్తారని ఆయన పేర్కొన్నారు. ఏడీఏ అనిల్‌కుమారి, మండల వ్యవసాయాధికారి సీహెచ్ శ్రీనివాసరావు, ఆర్‌ఎస్‌కే సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

మధ్యలో సెలవు.. సాధనకు అనువు!

పది పరీక్షలు రాసే విద్యార్థులకు అవకాశం

జిల్లాలో పది పరీక్షలు రాయనున్న వారి వివరాలు

విద్యార్థులు	24,314
పరీక్ష కేంద్రాలు	130

వేలేరుపాడు (గ్రామీణ), న్యూస్‌టుడే: పదో తరగతి వార్షిక పరీక్షలు మార్చి 16 నుంచి ఏప్రిల్ 1వ తేదీ వరకు నిర్వహించనున్నారు. ఈ ఏడాది ప్రతి పరీక్షకు మధ్య ఒక రోజు విరామం రావడంతో విద్యార్థులకు మేలు కలగనుంది. తెలుగు, హిందీ, ఆంగ్లం, గణితం, భౌతికశాస్త్రం, జీవశాస్త్రం, సాంఘికశాస్త్రం సబ్జెక్టులన్నింటికీ మధ్యలో తగిన విరామం ఉండేలా షెడ్యూల్ రూపొందించారు. దీనివల్ల విద్యార్థులు ప్రతి సబ్జెక్టు పూర్తి స్థాయి తయారీపై దృష్టి సారించేందుకు సమయం లభిస్తుందని ఉపాధ్యాయులు చెబుతున్నారు. ముఖ్యంగా గణితం, సైన్స్ సబ్జెక్టుల పునశ్చరణకు ఈ విరామం ఉపయుక్తమని, వార్షిక పరీక్షల సమయంలో మధ్యలో సెలవులు రావడం వల్ల పిల్లలపై ఒత్తిడి కొంత తగ్గుతుందని వైద్యులు అంటున్నారు. పూర్తిగా పుస్తకాలకే పరిమితం కాకుండా తగిన విశ్రాంతి తీసుకోవడం అవసరమని, సరిపడా నిద్ర, భోజనం, కొద్దిపాటి వ్యాయామం మానసిక ప్రశాంతతను అందించడంతోపాటు ఏకాగ్రతను పెంపొందిస్తాయని చెబుతున్నారు.

ప్రణాళిక ముఖ్యం: పరీక్షల మధ్య సెలవులు కేవలం విరామం మాత్రమే కాకుండా విద్యార్థులు బాగా సన్నద్ధమవడానికి మంచి మార్కులు సాధించడానికి ఉపకరిస్తాయి. చదువు, విశ్రాంతి మధ్య సమతుల్యత పాటిస్తూ సెలవు రోజుల్లో సరైన ప్రణాళికతో ముఖ్యమైన పాఠ్యాంశాల పునశ్చరణ, నమూనా ప్రశ్నపత్రాల సాధన, బలహీన అంశాలపై దృష్టి సారించడం ద్వారా ఆత్మవిశ్వాసం మరింత పెరిగి ఫలితాలు మెరుగ్గా వస్తాయని ఉపాధ్యాయులు సూచిస్తున్నారు. పిల్లలపై తల్లిదండ్రులు అతిగా ఒత్తిడి పెట్టకుండా వారి చదువు ప్రణాళికకు అనుగుణంగా సహకరించాలని విద్యాశాఖాధికారులు చెబుతున్నారు.

ఉత్తమ ఫలితాలు సాధించాలి.. విద్యార్థులందరూ పరీక్షల మధ్య సెలవులను సద్వినియోగం చేసుకుని ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆశిస్తున్నాం. పాఠశాలల్లో 100 రోజుల శిక్షణ ప్రణాళికను పక్కాగా అమలు చేసేలా చర్యలు చేపట్టాం. -కె.రవి ప్రసన్నకుమార్, డిప్యూటీ ఈవో, ఐటీడీఏ కేఆర్‌పురం.

ఆడిట్ జిల్లా రిజిస్ట్రార్‌గా రమాపతిరావు

ఏలూరు వన్‌టౌన్, న్యూస్‌టుడే: స్టాంప్స్ రిజిస్ట్రేషన్ శాఖలో గ్రేడ్-1 కేడర్ విధులు నిర్వర్తిస్తున్న సబ్ రిజిస్ట్రార్లకు జిల్లా రిజిస్ట్రార్లుగా ఉద్యోగోన్నతి కల్పిస్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. మెంటపాడు సబ్ రిజిస్ట్రార్‌గా పని చేస్తున్న జి.శివయ్యను భీమవరం జిల్లా రిజిస్ట్రార్‌గా, ఆడిట్ ఏలూరు జిల్లా రిజిస్ట్రార్ ఎం.పార్వతిని మన్యం జిల్లాకు బదిలీ చేసింది. ఆమె స్థానంలో కృష్ణా జిల్లా సబ్ రిజిస్ట్రార్ టీవీ రమాపతిరావును నియమిస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొంది.

ఈ పంతులమ్మ.. కలెక్టరమ్మే!

ఏలూరు నగరం వెంకటరావుపేట ప్రత్యేక నగరపాలక ప్రాథమిక పాఠశాలను కలెక్టర్ వెట్రిసెల్వి మంగళవారం సందర్శించారు. అయిదో తరగతి విద్యార్థులకు ఉపాధ్యాయిని పాఠాలు బోధిస్తుండగా.. కాసేపు పరిశీలించారు. అనంతరం కాసేపు పంతులమ్మ అవతారమెత్తారు. పిల్లలకు గణిత పాఠాలు చెప్పారు. ఆమె వెంట డీఈవో వెంకట లక్ష్మమ్మ, ఉపాధ్యాయులున్నారు. **- న్యూస్‌టుడే, ఏలూరు విద్యా విభాగం**

శివోహం

ముగిసిన మహాశివరాత్రి ఉత్సవాలు

ముసునూరు, న్యూస్‌టుడే: బలివే రామలింగేశ్వరస్వామి కల్యాణ మహోత్సవాలు మంగళవారంతో ముగిశాయి. చివరి రోజు అమావాస్య కావడంతో భక్తులు పోటెత్తారు. తమ్మిలేరులో పుణ్య స్నానాలు ఆచరించి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. బాహ్యలింగం, నాగేంద్ర స్వామి పుట్ట వద్ద భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. రామలింగేశ్వర స్వామితో పాటు రాజరాజేశ్వరి దేవి అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. స్వామివారికి ఉదయం బిందె తీర్థం, పవళింపు సేవ, అభిషేకాలు, ప్రత్యేక పూజలు, గ్రామోత్సవం నిర్వహించారు. హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ టి.మల్లికార్జునరావు కుటుంబ సమేతంగా వచ్చి దర్శించుకున్నారు.

రామలింగేశ్వరుడు

బాహ్య లింగాన్ని దర్శించుకుంటున్న హైకోర్టు విశ్రాంత జడ్జి జస్టిస్ మల్లికార్జునరావు

వచ్చే ఏడాదికి భక్తులకు అసౌకర్యాల్లేకుండా ఏర్పాట్లు: మంత్రి.. వచ్చే ఏడాదికి భక్తులకు అసౌకర్యాలు లేకుండా ఏర్పాట్లు చేస్తామని మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. మహాశివరాత్రి పురస్కరించుకుని మంగళవారం ముసునూరు మండలం బలివే రామలింగేశ్వర స్వామి దేవస్థానం వద్ద తమ్మిలేరులో పుణ్యస్నానాలు ఆచరించి ఆయన తండ్రి, మాజీ పార్లమెంటు సభ్యుడు పెద రెడ్డయ్యకు పిండ ప్రదానం చేశారు. అనంతరం స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయానికి వచ్చిన మంత్రికి ఈవో పామర్తి సీతారామయ్య, ఛైర్‌పర్సన్ బొమ్మకంటి శ్యామలరావు, అర్చకులు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. వచ్చే శివరాత్రికి ఆలయంలో సువిశాల ప్రాంగణం, రహదారులు, పార్కింగ్ స్థలం, భోజనశాల తదితర ఏర్పాట్లు పూర్తి చేస్తామన్నారు. ఏమైనా ఆర్థిక ఇబ్బందులుంటే తన సొంత ఖర్చులతోనైనా ఆలయాన్ని అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు.

ఉపాధ్యాయుడికి శిక్షా రత్న పురస్కారం

నాగేంద్రసింగ్‌ను అభినందిస్తున్న డీఈవో వెంకట లక్ష్మమ్మ

ఏలూరు విద్యా విభాగం, న్యూస్‌టుడే: స్థానిక శ్రీరామ్‌నగర్ మండల పరిషత్ పాఠశాల ఉపాధ్యాయుడు నాగేంద్రసింగ్‌కు శిక్షా రత్న పురస్కారం లభించింది. 2025-26 ఆర్థిక సంవత్సరానికి జాతీయ ఇన్నోవేటివ్ శిక్షా రత్న పురస్కారాలు ప్రకటించారు. ఆంధ్రప్రదేశ్ నుంచి మొత్తం 8 మంది ఉపాధ్యాయులను ఎంపిక చేయగా.. అందులో నాగేంద్రసింగ్ ఒకరు. ప్రాథమిక స్థాయిలో విద్యార్థులకు బోధన, దస్తూరి, మౌలిక సదుపాయాల కల్పన, ఆరోగ్యం, తల్లిదండ్రులతో సమన్వయం తదితరాలను ప్రాతిపదికన తీసుకొని పురస్కారాలు ప్రకటించారు. జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో నాగేంద్రసింగ్‌ను డీఈవో వెంకట లక్ష్మమ్మ మంగళవారం అభినందించి ప్రశంసాపత్రం, జ్ఞాపిక అందజేశారు.

ఉద్యోగాలకు 88 మంది ఎంపిక

ఏలూరు విద్యా విభాగం, న్యూస్‌టుడే: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జవహర్ నాలెడ్జ్ కేంద్రం ఆధ్వర్యంలో మంగళవారం ఉద్యోగ మేళా నిర్వహించారు. పలు ప్రైవేటు సంస్థల ప్రతినిధులు హాజరయ్యారు. మొత్తం 254 మంది విద్యార్థులు పాల్గొనగా.. 88 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఇందులో ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు 22 మంది ఉన్నట్లు ప్రధానాచార్యుడు గిరిబాబు తెలిపారు. ఉప ప్రధానాచార్యుడు అజయ్ కుమార్, సమన్వయకర్త వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

పైఎత్తు వేసి.. విజయం సాధించి

రాష్ట్ర స్థాయి చదరంగం పోటీలకు ఎంపిక

విజేతలతో అతిథులు

ఏలూరు నగరం, న్యూస్‌టుడే: స్థానిక ఇండోర్ స్టేడియంలో మంగళవారం జిల్లా స్థాయి చదరంగం పోటీలు నిర్వహించారు. అండర్- 13, 15, 17, 19 విభాగాల్లో పోటీలు జరగ్గా.. జిల్లా నలుమూలల నుంచి సుమారు 150 మందికి పైగా విద్యార్థులు హాజరయ్యారు. తొలుత రాష్ట్ర ఒలంపిక్స్ సంఘ కార్యదర్శి బడేటి వెంకటరామయ్య, సెట్‌వెల్ సీఈవో కె.ప్రభాకర్, డీఎస్‌డీవో ఎస్.ఎ.అజీజ్ పోటీలను ప్రారంభించారు. ఎసీజీఎఫ్ కార్యదర్శి అలివేలు మంగతాయారు, చదరంగం సంఘ సభ్యులు కృష్ణకుమారి, లక్ష్మణరావు పాల్గొని మాట్లాడారు. క్రీడాకారులు ఎత్తుకు పైఎత్తులు వేస్తూ ఉత్సాహంగా పాల్గొన్నారు. అనంతరం విజేతలను ప్రకటించారు. త్వరలో తిరుపతి వేదికగా జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని అజీజ్ తెలిపారు.

గెలుపొందింది వీరే.. ● బాలికల విభాగంలో(అండర్-13).. యడ్ల ప్రేమ రక్షిత (ప్రథమ), కొల్లా చవిశ్రీ(ద్వితీయ) **అండర్-15:** యర్రా ముకుంద ప్రియ(ప్రథమ), డి.జ్యోతిక శ్రీదేవి(ద్వితీయ) ● **అండర్-19:** అల్లూరు తేజశ్వని(ప్రథమ), డి.హవినీ కృతి(ద్వితీయ)● **బాలుర విభాగంలో(అండర్-17):** కొరారి తేజశ్ సాయి(ప్రథమ) ● **అండర్-19:** రేవులగడ్డ చింటు(ప్రథమ).

రైతన్నా.. ఇదిగో నీకో యాప్!

ఏపీఏఎంఐఎస్ 2.0తో సమస్త సమాచారం

కొయ్యలగూడెం గ్రామీణ, జంగారెడ్డిగూడెం గ్రామీణ, కాళ్ల, న్యూస్‌టుడే: రైతులకు తక్షణ సేవలు సమర్థంగా అందించడానికి వ్యవసాయ శాఖ ఆంధ్రప్రదేశ్ అగ్రికల్చర్ ఇన్‌ఫర్మేషన్ అండ్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ (ఏపీఏఐఎంఎస్ 2.0 APAMIS 2.0) పేరుతో చరవాణి యాప్‌ను అందుబాటులోకి తెచ్చింది. ఈ యాప్‌లో రైతులు తమ పొలాల వివరాలు, సర్వే నంబర్లు, మ్యాప్‌లు, మొదలైన అన్ని వివరాలను ఎప్పుడు కావాలంటే అప్పుడు చూసుకోవచ్చు. ఆ పొలాల్లో సాగు చేసే పంటల వివరాలు, ఈ-పంట తదితర ప్రభుత్వ కార్యక్రమాల నమోదు పరిశీలించుకోవచ్చు. గూగుల్ ప్లేస్టోర్ నుంచి యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి. ఆధార్ నంబర్‌తో రిజిస్టర్ చేసుకుని ఎం.పిన్ నంబరును ఏర్పాటు చేసుకోవాలి. ఆధార్ నంబర్(యూజర్ ఐడీ)తో లాగిన్ అయితే మనం పొలం సమాచారం కోసం ఎక్కడికో వెళ్లక్కర్లేకుండా మన అరచేతిలోని ఫోన్‌లోనే తెలుసుకోవచ్చు.

ఏమేం ఉంటాయంటే.. ముందుగా 'నా పొలాలు' అనే ఆప్షన్‌ను ఎంచుకుంటే అందులో పొలం సమాచారం, వాతావరణం, సలహాలు అని మూడు విభాగాలు ఉంటాయి. పొలం సమాచారంలో వ్యవసాయ సూచనలు, ముందస్తు చీడపీడల సమాచారం, పంటనష్టం, మార్కెట్ ధరలు, వార్తలు, ముఖ్య అధికారుల వివరాలు తదితర సమాచారం ఉంటుంది. వాతావరణం ఆప్షన్‌లో పొలం ఉన్న ప్రాంతంలో అయిదు రోజులకు సంబంధించిన వాతావరణం, ఉష్ణోగ్రతల వివరాలను తెలుసుకోవచ్చు. సలహాలు ఆప్షన్‌లో నేలల ఆరోగ్యం, చీడపీడల సమాచారం అందుబాటులో ఉంటుంది.

మార్కెట్ ధరల సమాచారం.. ➠ నా పొలాలు ఐచ్ఛికంలో మార్కెట్ ధరలు ట్యాబ్‌ను క్లిక్ చేస్తే పంటలకు సంబంధించి రానున్న అయిదు రోజుల మార్కెట్ ధరల అంచనాలను చూడొచ్చు. తమ పంటలకు సంబంధించి రాష్ట్రంలో ఉన్న ఇతర మార్కెట్ల సమాచారాన్ని కూడా రైతులు తెలుసుకోవచ్చు.

➠ ముఖ్య అధికారుల వివరాలు ట్యాబ్‌ను క్లిక్ చేస్తే తమ పరిధిలోని రైతు సేవా కేంద్రం, మండల, జిల్లా వ్యవసాయాధికారులు, రీజినల్ కోడింగ్ సెంటర్లు, జిల్లా ప్రయోగశాలలు, కృషి విజ్ఞాన కేంద్రాలు, ప్రయోగశాలలు తదితర కార్యాలయాల అధికారుల వివరాలు అందుబాటులో ఉంటాయి.

➠ పంట నష్టం ట్యాబ్‌ను క్లిక్ చేస్తే రైతులు తమ దరఖాస్తు ఏ స్థితి(స్టేటస్)లో ఉందన్న వివరాలు తెలుస్తాయి. పంట నష్టపోయిన రైతుల జాబితా కూడా చూడొచ్చు. కర్షకుల సందేహాలు, అభిప్రాయాలను తెలియజేయవచ్చు. ఇంకా పలు రకాల పంటల వీడియోలను కూడా యాప్‌లో అందుబాటులో ఉంటాయి.

చరవాణులకు నోటిఫికేషన్లు.. తమ పంటలకు సంబంధించి అవసరమైన సూచనలు, సలహాలు, ఏవైనా తెగుళ్లు, కీటకాలు ఆశించే ప్రమాదం ఉన్నప్పుడు, తుపాను రాక తదితర సందర్భాలను నోటిఫికేషన్ల రూపంలో రైతుల చరవాణులకు అందుతుంటాయి.

ఉద్యాన సాగు విస్తీర్ణ లక్ష్యాలు సాధిద్దాం: కలెక్టర్

ఏలూరు కలెక్టరేట్, న్యూస్‌టుడే: జిల్లాలో ఉద్యాన సాగు విస్తీర్ణ లక్ష్యాలు సాధించాలని కలెక్టర్ వెట్రిసెల్వి ఆదేశించారు. కలెక్టరేట్ నుంచి వ్యవసాయ, అనుబంధ రంగాల లక్ష్యాల ప్రగతిపై మంగళవారం అధికారులు, క్షేత్రస్థాయి సిబ్బందితో మంగళవారం దూర దృశ్య సమావేశం నిర్వహించి మాట్లాడారు. జిల్లాలో ఉద్యాన పంటల సాగు విస్తీర్ణానికి అదనంగా 15,847 హెక్టార్లలో ఆయిల్‌పామ్, 12,322 హెక్టార్లలో కొబ్బరి, కోకో తదితర ఉద్యాన పంటల సాగు విస్తరణకు నిర్దేశించినట్లు చెప్పారు. తుంపర్లు, బిందు సేద్యాన్ని 8,500 హెక్టార్లలో విస్తరించాలని నిర్ణయించగా.. ఇప్పటి వరకు 6,268 హెక్టార్లలో ప్రక్రియ పూర్తయిందన్నారు. ఏపీ ఫార్మర్స్ రిజిస్ట్రీ, ఈ-పంట నమోదును 20లోపు పూర్తి చేయాలని ఆదేశించారు. జిల్లా వ్యవసాయాధికారి హబీబ్ బాషా, జిల్లా ఉద్యానాధికారి షాజా నాయక్ తదితరులు పాల్గొన్నారు.

SBI స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

స్ట్రెస్సడ్ అస్సెట్స్ రికవరీ బ్రాంచి, పరిపాలన కార్యాలయ ప్రాంగణం, బాలాజీ నగర్, సిరిపురం జంక్షన్, విశాఖపట్నం

ధీకృత అధికారి వివరములు : పేరు : శ్రీ వై. శ్రీకాంత్ (చీఫ్ మేనేజర్) మొబైల్ నెం. 80994 44378, ఇ-మెయిల్ ఐడి: sbi.10077@sbi.co.in, ఆస్తి తనిఖీ కొరకు : 89858 67892

ఇ-వేలం అమ్మకం ప్రకటన

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 లోని రూల్ 6(2), 8(6) నిబంధనలతో చదువబడు (సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ & ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 క్రింద బ్యాంకునకు తనఖా చేసిన స్థిరాస్తుల అమ్మకము) SARFAESI చట్టం 2002 ప్రకారం సెక్షన్ 13(4) క్రింద దిగువ తెలిపిన ఆస్తి స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అధీకృత అధికారిగా దిగువ సంతకందారు **భౌతికంగా స్వాధీనం** చేసుకున్నారు. బ్యాంకు బకాయిలు రాబట్టుకొనుటకు దిగువ తెలిపిన తనఖాపెట్టిన ఆస్తి/ఆస్తుల ఈ-వేలం (SARFAESI చట్టం 2002 క్రింద) "ఎక్కడ ఎలా వున్నది అక్కడ అలానే" మరియు "అక్కడ ఏమున్నదో అదే" పద్ధతి పై నిర్వహించబడుతుందని సాధారణ ప్రజలకు ఇందుమూలముగా తెలియజేయడమైనది మరియు నియమ నిబంధనలు దిగువ తెలుపబడినవి.

ఋణగ్రహీత: మెస్సర్స్ శ్రీ వెంకట సాయి ఈశ్వర పౌల్ట్రీస్, ప్రొప్రయిటర్ : **శ్రీమతి మారెడ్డి దివ్య**, భర్త : ఎమ్. అనిల్ కుమార్, డోర్ నెం. 1-5ఎ, భీమోలు గ్రామం, గోపాలపురం మండలం, తూర్పు గోదావరి జిల్లా. **శ్రీ మారెడ్డి అనిల్ కుమార్,** తండ్రి : ఎమ్. జగ్గారావు, డోర్ నెం. 1-5ఎ, భీమోలు గ్రామం, గోపాలపురం మండలం, తూర్పు గోదావరి జిల్లా. **శ్రీ తోట రామ చంద్రుడు,** తండ్రి : టి. సీతారామయ్య, డోర్ నెం. 12-21, అశోక్ నగర్, పరింపూడి గ్రామం, కొయ్యలగూడెం మండలం, ఏలూరు జిల్లా. **శ్రీమతి ఎమ్. దివ్య,** భర్త : ఎమ్. అనిల్ కుమార్, డోర్ నెం. 1-5ఎ, భీమోలు గ్రామం, గోపాలపురం మండలం, తూర్పు గోదావరి జిల్లా. **శ్రీమతి తోట శైలజ,** భర్త : టి.రామచంద్రుడు, డోర్ నెం. 12-21, అశోక్ నగర్, పరింపూడి గ్రామం, కొయ్యలగూడెం మండలం, ఏలూరు జిల్లా. **డిమాండ్ నోటీసు తేది: 01-03-2023**

డిమాండ్ నోటీసు ప్రకారం బకాయి మొత్తం : తేది.01.03.2023 నాటికి **రూ.3,27,44,479/- + తేది.02.03.2023** నుండి వడ్డీ మరియు ఇతర ఖర్చులు మొదలగునవి. **ప్రస్తుత బకాయి మొత్తం : తేది.12-02-2026** నాటికి **రూ.2,64,79,817.13 పై + తేది.13.02.2026** నుండి వడ్డీ మరియు ఇతర ఖర్చులు మొదలగునవి. (మునుపటి జమలు మినహాయించిన తరువాత).

షెడ్యూలు ఆస్తి వివరములు:

ఆస్తి-1: పశ్చిమ గోదావరి జిల్లా, పరింపూడి రెవెన్యూ గ్రామం, పోలవరం ఆర్ & బి రోడ్డు దగ్గర, ఆర్.ఎస్.నెం.541/1 లోని ఎ.2.72 సెంట్లు, ఆర్.ఎస్.నెం.88/1 లోని ఎ.0.24 సెంట్లు, ఆర్.ఎస్.నెం.87 లోని ఎ.4.67 సెంట్లు లేదా 22602.79 చ॥గ॥లు, ఆర్.ఎస్.నెం.92 లోని ఎ.1.86 సెంట్లు లేదా 9002.39 చ॥గ॥లు, మొత్తం ఎ.9.49 సెంట్లు లేదా 45931.60 చ॥గ॥లు విస్తీర్ణం గల ఖాళీ నివాస స్థలం యావత్తు ఆస్తి రిజిష్టర్డు డాక్యుమెంట్ నెం.3822/2015, తేది.23.03.2015 ప్రకారం శ్రీ తోట రామచంద్రుడు, తండ్రి : టి. సీతారామయ్య గారికి చెందినది. **హద్దులు: తూర్పు** : పాలి వీర రాఘవులు గారి భూమి, **దక్షిణం** : కడగట్ల మహాలక్ష్మి గారి భూమి, **పడమర** : కాలువ, **ఉత్తరం** : రోడ్డు.

రిజర్వు ధర : రూ.6,07,00,000/- ధరావత్తు : రూ.60,70,000/- బిడ్ పెంపుదల : రూ.1,00,000/-

గమనిక: ఎస్ఎ నెం.493/2024ను ఋణగ్రహీత/హామీదారు డిఆర్‌టి, విశాఖపట్నంలో దాఖలు చేశారు, కానీ స్టే మంజూరు కాలేదు.

ఇ-వేలం తేదీ : 06-03-2026 సమయం : ఉ॥ 11.00 గం॥ల నుండి సా॥ 04.00 గం॥ల వరకు

ఆస్తి తనిఖీ తేది మరియు సమయం: తేది:18-02-2026 నుండి 05-03-2026 వరకు ఉ॥10.00 గం॥ల నుండి సా॥ 04.00 గం॥ల వరకు

ఇ-వేలం యొక్క నియమ నిబంధనలు

1) అమ్మకం యొక్క సవివరమైన నియమ నిబంధనల కొరకు, సెక్యూర్డ్ క్రెడిటార్స్ అయిన **స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా** యొక్క వెబ్ సైట్ : www.sbi.co.in/web/sbi-in-the-news/auction-noticesలో ఏర్పాటుచేసిన లింకును రిఫర్ చేయండి. రిజిస్ట్రేషన్, ఇయండి, వేలం యొక్క వివరములు మొదలగు వాటి గురించి సర్వీసు ప్రొవైడర్ **M/s. PSB Alliance & M/s. Baanknet** యొక్క ఇ-వేలం పోర్టల్ : https://baanknet.com/eauction-psb/x-login & https://baanknet.com & టోల్ ఫ్రీ ఫోన్ నెం.: 91 - 8291220220, Mail ID : support.baanknet@psballiance.comను సంప్రదించండి.
2) **ఆస్తిని రిజిస్ట్రేషన్ చేసుకొనుటకు వర్తించే స్టాంపు డ్యూటీలు బదిలీ ఛార్జీలు, ఫీజు వగైరా మరియు చట్టపరమైన/నాన్ స్టేటటరీ బకాయిలు, పన్నులు, రేట్లు, ఎస్సెస్‌మెంట్ ఛార్జీలు, ఫీజులు వగైరా కొనుగోలు దారే భరించవలెను.**

గమనిక : ఆసక్తి గల బిడ్డర్లు ఇ-వేలం ముగిసేలోపు PSB Alliance నందు ప్రీ-బిడ్ ఇ.ఎమ్.డి (Pre-Bid EMD) జమ చేయవలెను. ప్రీ-బిడ్ ఇ.ఎమ్.డి మొత్తం PSB Alliance బ్యాంక్ అకౌంట్‌లో జమ అయిన సమాచారం వెబ్‌సైట్‌లో పొందుపరిచిన తరువాత మాత్రమే బిడ్డరు యొక్క "వాలెట్"లో చూపించబడుతుంది. బ్యాంకింగ్ ప్రక్రియలో ఇది జరుగుటకు సమయం పట్టవచ్చు, కావున బిడ్డర్లు చివరి నిముషంలో ఇబ్బందులు ఎదుర్కొనకుండా తమ ప్రీ-బిడ్ ఇ.ఎమ్.డిను సాధ్యమైనంత త్వరగా జమ చేసుకోవాలనీ సూచించటమైనది.

గమనిక -2 : ఆదాయపు పన్ను చట్టం 1961లోని సెక్షన్ 194-1A ప్రకారం అమ్మకంలో భాగంగా అమ్మకం విలువ **రూ.50,00,000/-** (యాభై లక్షల రూపాయలు) మరియు అంతకంటే ఎక్కువ ఉన్నచో సదరు మొత్తముపై **TDS @ 1%** వర్తిస్తుంది. కావున సఫలీకృత బిడ్డరు/కొనుగోలుదారు గవర్నమెంట్ గైడ్‌లైన్స్ ధర లేదా అమ్మకం ధరలో ఏది ఎక్కువైతే దానిలో **1% TDS** ను తగ్గించుకొని సదరు మొత్తమును ఆదాయపు పన్ను డిపార్ట్‌మెంట్ యొక్క ఫారం నెం.16-బి నందు జమచేయవలెను మరియు సదరు ఒరిజినల్ **TDS** సర్టిఫికెట్‌ను బ్యాంకు వారికి సమర్పించవలెను.(వ్యవసాయ భూమి కాకుండా కేవలం స్థిరాస్తికి మాత్రమే వర్తించును).

తేది: 12-02-2026, ప్రదేశం: విశాఖపట్నం సం/- అధీకృత అధికారి, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

ప్రేమికుడి ఇంటి ఎదుట నిరసన

- నిశ్చితార్థమైనా..పెళ్లికి నిరాకరించిన యువకుడు
- న్యాయం చేయాలని యువతి ఆందోళన

కైకలూరు, న్యూస్‌టుడే: ఫేస్‌బుక్‌తో పరిచయమైన ఓ జంట ప్రేమ నిశ్చితార్థం వరకు చేరుకుంది. కట్నకానుకలను జేబులో వేసుకొని.. తీరా పెళ్లికి నిరాకరించాడు ఆ ప్రేమికుడు. బాధితురాలు తెలిపిన వివరాల ప్రకారం.. కైకలూరుకు చెందిన తస్లీమ్‌కు తల్లిదండ్రులు చనిపోయారు. ముగ్గురు సంతానాన్ని మేనత్త పెంచి పెద్ద చేయగా ఇటీవల ఆమె మృతి చెందింది. డిగ్రీ పూర్తి చేసిన యువతి అయిదేళ్ల కిందట హైదరాబాద్‌లో ఉద్యోగం చేస్తున్న సమయంలో ఫేస్‌బుక్‌లో కైకలూరుకే చెందిన అల్ఫార్ హుస్సేన్ పరిచయమయ్యాడు. అది కాస్తా ప్రేమగా మారి.. శారీరక సంబంధానికి దారి తీసింది. పెళ్లి చేసుకోవాలని ఎన్నిసార్లు కోరినా దాటవేస్తూ వచ్చాడు. ఎప్పటికైనా ఆమెనే చేసుకుంటానని రూ.100 బాండ్ పేపరుపై రాసిచ్చాడు.

అల్ఫార్ గృహం ఎదుట తస్లీమ్, బంధువుల నిరసన

తమకు సంబంధం లేదన్న కుటుంబ సభ్యులు.. యువతి ప్రేమ వ్యవహారాన్ని బంధువులకు తెలపగా 2023లో ఇరు కుటుంబాలు పెళ్లికి ఒప్పుకొని బంధువుల సమక్షంలో నిశ్చితార్థం చేసుకున్నారు. ఈ ఏడాది జనవరి 4న పెళ్లి నిర్ణయించి కట్న కానుకలుగా రూ.5 లక్షలు, 12 కాసుల బంగారు ఆభరణాలు, 125 గ్రాముల వెండి వస్తువులు, సెంటున్నర స్థలం ముందే ముట్టజెప్పారు. అదే సమయంలో యువకుడు రోడ్డు ప్రమాదంలో గాయపడగా పెళ్లి వాయిదా వేశారు. ఇటీవల పూర్తిగా పెళ్లికి నిరాకరించడంతో అతని కుటుంబ సభ్యులను ప్రశ్నించగా తమకు సంబంధం లేదన్నారు. దీంతో యువతి మంగళవారం ఆమె బంధువులు, ముస్లిం పెద్దలతో కలిసి తనకు న్యాయం చేయాలని నిరసనకు దిగింది. అంతకు ముందు కైకలూరు పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బంధువులు తెలిపారు.

బ్రాయిలర్ ధరలు (కృష్ణాజిల్లా) (కిలో 1 కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -115 రిటైల్ ధర 142 చికెన్ విత్ స్కిన్ - 206 చికెన్ స్కిన్‌లెస్ - 234. అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 128, 137, 148 చికెన్ విత్ స్కిన్ - 240 చికెన్ స్కిన్‌లెస్ - 250.

తేనెటీగల పెంపకంతో పంటల్లో అధికోత్పత్తి

ఉండి, న్యూస్‌టుడే: తేనెటీగల పెంపకంతో పంటల్లో మరింత అధికోత్పత్తి సాధించొచ్చని మార్టేరు వరి పరిశోధనా స్థానం ఏడీఆర్ టి.శ్రీనివాస్ తెలిపారు. ఉండి కృషి విజ్ఞాన కేంద్రంలో శాస్త్రీయ పద్ధతిలో తేనెటీగల పెంపకంపై రాష్ట్ర స్థాయిలో మూడో విడత శిక్షణ తరగతులు మంగళవారం ప్రారంభమయ్యాయి. శ్రీనివాస్ మాట్లాడుతూ నాణ్యమైన ఉత్పత్తుల సాధనకు యువత ముందుకురావాలని సూచించారు. కేవీకే ప్రధాన శాస్త్రవేత్త ఎన్.మల్లికార్జునరావు మాట్లాడుతూ తేనెతో పాటు ఉప ఉత్పత్తుల తయారీతో మహిళలు, యువత అదనపు ఆదాయాన్ని ఆర్జించొచ్చని వివరించారు. పంట దిగుబడులు 20-30 శాతం వరకూ పెరుగుతాయనే విషయాన్ని గుర్తించాలన్నారు. జిల్లా ఉద్యానాధికారి హరిప్రసాద్ మాట్లాడుతూ యూనిట్ల స్థాపనకు ముందుకొచ్చే శిక్షకులకిచ్చే రాయితీలు, ఇతర వివరాలను తెలియజేశారు. ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం విశ్రాంత రిజిస్ట్రార్ దండు జగన్నాథరాజు మాట్లాడుతూ తేనెను బ్రాండింగ్ పేరుతో విక్రయిస్తే అధిక ఆదాయం వస్తోందని చెప్పారు. శాస్త్రవేత్తలు ఎన్. డెబోరా మెస్సియానా, బిందు ప్రవీణ, శ్రీనివాసరావు, వినయలక్ష్మి తదితరులు మాట్లాడారు. శిక్షకుల నుంచి అభిప్రాయాలు సేకరించారు.

92.7 FM Rajamahendravaram 92.7 Mee FM

ఈఎఫ్ఎమ్ కార్యక్రమాలు

సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ॥ 5 - ఉ॥ 7
ఈ-మార్నింగ్స్	ఉ॥ 7 - ఉ॥ 11
నువ్వా నేనా	ఉ॥ 11 - మ॥ 2
సత్యభామ	మ॥ 2 - సా॥ 5
లైట్ తీస్కో	సా॥ 5 - రా॥ 9
సరదాగా కాసేపు	రా॥ 9 - రా॥ 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా॥ 12 - తె॥ 5

/Eenadufm

For Advertising on Eenadu FM Contact 9000180626, 9989993175

EENADU Classifieds

BUSINESS SERVICES

బంగారం బ్యాంకులలో/ ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈరోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్). Ph: 81422 92071.

TO LET

COMMERCIAL

ఏలూరు శనివారపుపేట సొసైటీ బ్యాంక్ ప్రక్కన మెయిన్‌రోడ్‌కు ఆనుకుని G+1 కమర్షియల్ బిల్డింగ్ వ్యాపార సంస్థలకు అద్దెకు. ✆ 99700 00901.

JOBS

Wanted DRA Tele Callers, Field Executives & Team Leaders Banking Sector Attractive Salaries and Incentives, ✆ 98493 94835, 70753 45527.

Wanted Teachers for Reputed Schools in A.P & Telangana, Contact: Sneha Placements Service. Ph: 94402 46409.

ఏలూరు జ్ఞాపికా TVS షోరూమ్ పాతబస్టాండ్, సత్రంపాడులో వర్క్‌చేయుటకు కావలెను. సేల్స్ ఎగ్జిక్యూటివ్స్ 10-14 వేలు, టెలీకాలర్స్ 14-18 వేలు, డేటా ఆపరేటర్స్ 9-14 వేలు, సేల్స్ ఆపరేటర్స్ 9-14 వేలు వర్క్‌షాపు మేనేజర్స్ 14-25 వేలు ట్రైనీ టెక్నీషియన్స్ 12-25 వేలు, హెల్పర్స్ 9-12 వేలు సంప్రదించండి. ✆ 70957 09292, 94922 25959.

త్రినేత్ర హోంకేర్‌లో వృద్ధులను/పేషెంట్స్‌ను/పిల్లలను చూసుకొనుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఫ్రీ వసతి, భోజనం. జీ: 18K. ✆ 8520980099, 8520874499

ఏలూరులోని ఫైర్ స్టేషన్ దగ్గరలోని క్లినిక్‌లో పనిచేయుటకు సెక్యూరిటీగార్డ్సు కావలెను. శాలరీ 14,000+esi+epfo. సెల్: 98852 95999, 9581251999.

బిజినెస్ ఎగ్జిక్యూటివ్స్/ బిజినెస్ మేనేజర్స్ కావలెను. డిగ్రీ, 5 సం॥ల మార్కెటింగ్ రంగంలో అనుభవం, 30 సం॥ల లోపు వారు రెజ్యూములను kamathamjob@gmail.com కు పంపగలరు.

హరేకృష్ణ హోంకేర్‌లో వృద్ధులను/ పేషంట్స్‌ను/ పిల్లలను చూసుకొనుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఫ్రీవసతి, భోజనం జీ: 18-20K ✆ 96404 68899, 96402 58899

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతి స్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తా పత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనలద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలు చేసే ప్రకటన కర్తను బ్లాక్-లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

నెక్ సూచించిన కోడిగ్రుడ్ల ధర

★ For the Information of Trade & Industry
★ గోదావరి జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గ్రుడ్డు ధర రూ. 5.15 పైII

తణుకు ఆఫీసు: 08819-224254

ఏలూరు

•ఏలూరు •దెందులూరు •ఉంగుటూరు

పోలీసు కానిస్టేబుల్ శిక్షణార్థుల ప్రతిభ

(గ్రూప్-2 విజేతలను అభినందిస్తున్న సూర్యచంద్రరావు తదితరులు)

పెదపాడు, ఏలూరు అర్బన్- న్యూస్‌టుడే: పెదవేగి పోలీసు శిక్షణ కళాశాలలో చిత్తూరు జిల్లాకు చెందిన కానిస్టేబుళ్లు శిక్షణ పొందుతున్నారు. వారిలో ఇద్దరు ఇటీవల విడుదలైన గ్రూప్-2 ఫలితాల్లో ప్రతిభ కనబరిచారు. కె. మదన్‌మోహన్‌రెడ్డి ఉప తహసీల్దారు, ఎన్. శ్రీనాథ్ ఎక్సైజ్ ఎస్సై ఉద్యోగాలు సాధించారు. వారిని ఏఎస్పీ సూర్యచంద్రరావు, పీటీసీ డీఎస్పీ ప్రసాద్, ఇన్‌స్పెక్టర్ రామారావు మంగళవారం అభినందించి సత్కరించారు.

ముగిసిన రామకోటి ఉత్సవాలు

ఏలూరు ఆధ్యాత్మికం, న్యూస్‌టుడే: స్థానిక అగ్రహారంలో 13 రోజులపాటు కొనసాగిన రామకోటి ఉత్సవాలు మంగళవారంతో ముగిశాయి. చివరి రోజు సీతారాములకు ప్రత్యేక పూజలు, అలంకరణలు చేశారు. హనుమన్నారాయణ భజన మండలి సుందరకాండ పారాయణం చేసింది. కళా వేదికపై కుమారి శిష్య బృందం ప్రదర్శించిన కూచిపూడి విశేషంగా అలరించింది. వారికి నిర్వాహకులు ప్రశంసాపత్రాలు అందజేశారు.

ఉద్యానం.. అధ్వానం



భీమడోలు మండల పరిషత్తు కార్యాలయ పాత భవన ప్రాంగణంలో ఉద్యానం ఏర్పాటు చేశారు. అప్పట్లో వివిధ పనుల నిమిత్తం కార్యాలయానికొచ్చే వారు అక్కడ కాసేపు సేదదీరేవారు. ప్రస్తుతం భవనం శిథిలావస్థకు చేరడంతో.. మరో భవనంలోకి మార్చారు. ఉద్యానం నిర్వహణను గాలికి వదిలేయడంతో.. పిచ్చిమొక్కలు పెరిగి అధ్వానంగా మారాయి. **- న్యూస్‌టుడే, భీమడోలు**

నిఘా లేక.. చోరీలు ఆగక

గణపవరం బస్టాండు నుంచి వివిధ ప్రాంతాలకు నిత్యం 90కి పైగా బస్సు సర్వీసులు నడుస్తున్నాయి. ఇక్కడి నుంచి రోజూ వందల మంది గమ్యస్థానాలకు చేరుకుంటున్నారు. బస్టాండులో సీసీ కెమెరాలు లేకపోవడంతో.. ఇటీవల చోరీలు అధికమయ్యాయి. నిత్యం ఏదొక దొంగతనం వెలుగు చూస్తున్నా.. అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు. **- న్యూస్‌టుడే, గణపవరం**

నిప్పు రాజేసి.. పొగ నింపేసి

ఏలూరు నగరంలో ఇంటింటా సేకరించిన చెత్తాచెదారాన్ని పోణంగి రోడ్డులోని డంపింగ్ యార్డుకు తరలించాల్సి ఉంది. ఇందుకు భిన్నంగా పారిశుద్ధ్య సిబ్బంది కృష్ణా కాలువ గట్టున పడేస్తున్నారు. వ్యర్థాలకు నిప్పుపెట్టడంతో.. ఆ ప్రాంతాన్ని పొగ కమ్మేస్తోంది. ఈ మార్గంలో రాకపోకలు సాగించే వాహనదారులు, ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. **- న్యూస్‌టుడే, ఏలూరు గ్రామీణ**

నియంత్రిక.. రక్షణ కల్పించక

దెందులూరు నుంచి కొవ్వలి వెళ్లే మార్గంలో.. రహదారి పక్కన విద్యుత్తు నియంత్రిక ప్రమాదకరంగా దర్శనమిస్తోంది. దాని చుట్టూ పిచ్చిమొక్కలు, ముళ్లచెట్లు పెరిగిపోయి కనిపిస్తున్నాయి. పిల్లలు, పశువులు అటువైపు వెళితే ప్రమాదం పొంచి ఉండే అవకాశముంది. అధికారులు స్పందించి రక్షణ గోడలు నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, దెందులూరు**

ఇరుకు రోడ్డు.. ఇక్కట్లు చూడు

గణపవరం- కలపర్రు మార్గంలోని క్రొవ్విడి, బావాయిపాలెం వద్ద రోడ్డు అంచులు ఆక్రమణకు గురయ్యాయి. దాంతో ఆయా గ్రామాల వద్ద తరచూ ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. క్రొవ్విడి మలుపు వద్ద రెండు భారీ వాహనాలు ఎదురుపడితే పక్కకు వెళ్లలేని పరిస్థితి. ఆక్రమణలు తొలగించి రోడ్డు విస్తరించాలని వాహనదారులు విజ్ఞప్తి చేస్తున్నారు. **- న్యూస్‌టుడే, నిడమర్రు గ్రామీణం**

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

ఏలూరు అర్బన్:	80085 74486	ఏలూరు టూటౌన్:	80085 74487
దెందులూరు:	80085 74535	పెదపాడు, పెదవేగి:	80085 74483
భీమడోలు:	80085 74527	నిడమర్రు గ్రామీణం:	97040 21765
ఉంగుటూరు:	94939 90333	గణపవరం:	99480 66777

ఏలూరు అర్బన్, న్యూస్‌టుడే: ? అమీనాపేట ఏటి గట్టు రోడ్డు ఆంజనేయస్వామి గుడి వీధిలో కొన్నాళ్లుగా కుళాయిల నుంచి మంచినీరు రావడం లేదు. **- దుర్గాప్రసాద్, స్థానికుడు**

✔ సమస్య నా దృష్టికి రాలేదు. ఒకట్రెండు రోజుల్లో కుళాయిల్లో నీరొచ్చేలా చర్యలు తీసుకుంటాం. **- భానుప్రతాప్, కమిషనర్**

ఏలూరు గ్రామీణ, న్యూస్‌టుడే: ? బూరాయిగూడెంలో ఇంటింటా చెత్త సేకరణ చేపట్టడం లేదు. స్థానికులు గ్రామ శివారున చెత్తాచెదారం పడేస్తున్నారు. **- ఏసుపాదం, స్థానికుడు**

✔ రోజూ చెత్త సేకరించేలా చూస్తాం. నిల్వల తొలగింపునకు చర్యలు తీసుకుంటాం. **- శ్రీనివాసరావు, అదనపు కమిషనర్**

దెందులూరు, న్యూస్‌టుడే: ? సంత మార్కెట్ పక్కనున్న మేకలమ్మ చెరువులోకి మురుగు చేరుతోంది. ఇటీవల ఆక్వా రైతు చెరువులోని చేపలు బయటికి వెళ్లి పోతున్నాయంటూ వల కట్టారు. దాంతో వ్యర్థాలు, చెత్త పేరుకుపోతోంది. **- శ్రీనివాసరావు**

✔ సమస్య పరిష్కరిస్తాం. **- గాయత్రీ, పంచాయతీ కార్యదర్శి**

ఆడాలనున్నా.. ఆడలేకున్నా!

మానసిక వికాసానికి దూరంగా విద్యార్థులు

పెదపాడు మండలం అప్పనవీడు ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో గడ్డి మొలిచి ఎండిపోయిన దృశ్యమిది. ఇక్కడ తగినన్ని సదుపాయాల్లేకపోవడంతో.. పిల్లలు ఆటలకు దూరమవుతున్నారు. మండల వ్యాప్తంగా 11 ఉన్నత పాఠశాలలుండగా.. అన్నిచోట్లా ఇదే పరిస్థితి.

పెదపాడు, గణపవరం, నిడమర్రు- న్యూస్‌టుడే: ప్రభుత్వ జడ్పీ ఉన్నత పాఠశాలల విద్యార్థులు ఆటలకు దూరమవుతున్నారు. సరైన క్రీడా మైదానాలు, వసతులు, పరికరాలు లేకపోవడంతో.. తరగతి గదులకే పరిమితమవుతున్నారు. మానసికోల్లాసం లేక.. ఒత్తిడికి గురవుతున్నారు. కొందరు తరచూ అనారోగ్యం బారిన పడుతున్నారు. మరికొందరు ప్రతిభ ఉన్నా.. క్రీడల్లో రాణించలేక పోతున్నారు.

పరిశీలన

నాలుగెకరాల్లో ఉండాలి..

జిల్లా వ్యాప్తంగా 248 ఉన్నత పాఠశాలలుండగా.. 56,678 మంది చదువుతున్నారు. విద్యా హక్కు చట్టం ప్రకారం నాలుగు ఎకరాల విస్తీర్ణంలో క్రీడా మైదానాలుండాలి. కానీ, సగానికి పైగా బడుల్లో అసలు మైదానాలే లేవు. కొన్నిచోట్ల ఆటలాడేందుకు వీల్లేకుండా ఉన్నాయి. ఇంకొన్ని చోట్ల రహదారుల పక్కన ఉండటంతో.. ఎప్పుడు ఏం జరుగుతుందోనని ఉపాధ్యాయులు వారిని బయటకు పంపడం లేదు. ఫలితంగా ఔత్సాహిక, ప్రతిభావంతులైన కొందరు విద్యార్థులు క్రీడలకు దూరమవుతున్నారు. మరికొందరు రూ.వేలు రుసుం చెల్లించి ప్రైవేట్‌గా శిక్షణ పొందుతున్నారు. అధికారులు, పాలకులు స్పందించి మైదానాలు అభివృద్ధి చేయాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

విషయం వాస్తవమే

'జిల్లాలోని పలు ఉన్నత పాఠశాలల్లో పూర్తిగా క్రీడా మైదానాల్లేని విషయం వాస్తవమే. ఉన్నచోట సాధ్యమైన మేర విద్యార్థులను ఆటలాడిస్తున్నారు. అన్ని చోట్ల మైదానాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటాం' అని జిల్లా విద్యా శాఖాధికారి వెంకట లక్ష్మమ్మ తెలిపారు.

గణపవరం జడ్పీ బాలురోన్నత పాఠశాల క్రీడా మైదానం పచ్చిక బయళ్లు పెరిగిపోయిన చిత్రమిది. ఇక్కడ సౌకర్యాల్లేకపోవడంతో.. వివిధ క్రీడాంశాల్లో రాణించే విద్యార్థులు ఏలూరుకెళ్లి శిక్షణ పొందాల్సి వస్తోంది.

పెరటి తోటలతో ఆరోగ్యం

ఏలూరు అర్బన్, న్యూస్‌టుడే: ఇంటి పెరట్లో పెంచిన కూరగాయలు, ఆకుకూరలు తినడం ద్వారా ఆరోగ్యంగా జీవించవచ్చని డీపీఎం బి. వెంకటేశ్ అన్నారు. స్థానిక టీటీడీసీలో ప్రకృతి వ్యవసాయంపై జిల్లా ప్రాజెక్టు ఆధ్వర్యాన మంగళవారం పెరటి తోటల పెంపకంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. పంట సాగులో రసాయన ఎరువులు ఎక్కువ వాడుతుండటంతో భూసారం దెబ్బతింటోందన్నారు. ఫలితంగా ఆహారమూ కలుషితమవుతోందని పేర్కొన్నారు. ప్రకృతి వ్యవసాయ ప్రాముఖ్యాన్ని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలని ఆయన కోరారు. సెర్ప్ పీడీ విజయకుమార్, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

గడువులోపు యూఎస్ఎఫ్ పూర్తి

దెందులూరు, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న ఏకీకృత కుటుంబ సర్వే(యూఎస్ఎఫ్)ను నిర్ణీత గడువులోపు పూర్తి చేయాలని జడ్పీ సీఈవో ఎం.శ్రీహరి ఆదేశించారు. స్థానిక గ్రామ సచివాలయం-1ను మంగళవారం ఆయన తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ.. విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే ఉపేక్షించేది లేదన్నారు. వంద శాతం పన్నులు వసూలు చేయాల్సిన బాధ్యత సచివాలయ సిబ్బందిదేనని స్పష్టం చేశారు. ఆయన వెంట ఎంపీడీవో కె.వీరప్రతాప్, సిబ్బంది ఉన్నారు.

సౌకర్యాల కల్పనకు వినతి

ఏలూరు అర్బన్, న్యూస్‌టుడే: ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాల్లో నెలకొన్న సమస్యలు పరిష్కరించి, మెరుగైన సౌకర్యాలు కల్పించాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు కె.నాని కోరారు. ఈ మేరకు జిల్లా బీసీ సంక్షేమాధికారిణి నాగమణికి మంగళవారం వినతి పత్రం అందజేశారు. విద్యార్థులకు మెస్ ఛార్జీలు పెంచాలని, సొంత భవనాలు నిర్మించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

ప్రజా సంక్షేమానికి పెద్దపీట: చింతమనేని

అర్జీ పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ప్రభాకర్

పెదవేగి, న్యూస్‌టుడే: ప్రజా సంక్షేమానికి కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. దుగ్గిరాల విడిది కార్యాలయంలో మంగళవారం ఆయన్ను పలువురు మర్యాదపూర్వకంగా కలిశారు. తమ సమస్యలు పరిష్కరించాలంటూ అర్జీలు అందజేశారు.

● ముసునూరు మండలం వేల్పుచర్లకు చెందిన తెదేపా సీనియర్ నాయకుడు, ఎమ్మెల్యే ప్రభాకర్ మామ పద్మనాభం(85) మంగళవారం మృతి చెందారు. ఆయన భౌతికకాయానికి చింతమనేని పూలమాల వేసి నివాళులర్పించారు.

సాంకేతిక విద్యకు ప్రాధాన్యం: పత్సమట్ల

డ్రోన్ నడుపుతున్న ఎమ్మెల్యే ధర్మరాజు

నారాయణపురం (ఉంగుటూరు), న్యూస్‌టుడే: విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని.. కూటమి ప్రభుత్వం సాంకేతిక విద్యకు ప్రాధాన్యమిస్తోందని ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు అన్నారు. నారాయణపురం శ్రీఅరవింద శత జయంతి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పీఎం-ఉషా నిధులతో ఇన్నోవేషన్ ఇంక్యుబేషన్ కేంద్రం ఏర్పాటు చేయనున్నారు. ఇందులో భాగంగా రూ.5 లక్షలతో కొనుగోలు చేసిన డ్రోన్‌ను ధర్మరాజు మంగళవారం ప్రారంభించి మాట్లాడారు. అనంతరం కళాశాలలో నిర్వహించనున్న జాతీయ సదస్సు కరపత్రాలను ఆవిష్కరించారు. స్థానికంగా నెలకొన్న సమస్యలను ప్రధానాచార్యురాలు కె.వసుధ ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా, వాటిని పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. సర్పంచి అలకనంద, సీపీడీసీ సభ్యులు సత్యనారాయణ, రంగరాజు, జానకి రామరాజు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

శిరస్త్రాణంతో ప్రాణాలకు రక్ష

కలపర్రు(పెదపాడు), న్యూస్‌టుడే: ద్విచక్ర వాహనదారులు శిరస్త్రాణం ధరించడం ద్వారా ప్రమాద సమయాల్లో ప్రాణాలు కాపాడుకోవచ్చని పెదవేగి సీఐ సీహెచ్ రాజశేఖర్ అన్నారు. కలపర్రు టోల్‌ప్లాజా వద్ద శిరస్త్రాణం ధరించకుండా వాహనాలు నడుపుతున్న చోదకులకు మంగళవారం కౌన్సెలింగ్ ఇచ్చారు. వారితో శిరస్త్రాణాలు కొనుగోలు చేయించి ధరింపజేశారు. ఎస్సై ఆర్.శ్రీను, సిబ్బంది పాల్గొన్నారు.

భీమడోలు: సూరప్పగూడెం కూడలిలో సీఐ యు.జె.విల్సన్, ఎస్సై మదీనాబాషా ఆధ్వర్యాన మంగళవారం పోలీసులు వాహన తనిఖీలు చేపట్టారు. శిరస్త్రాణం ధరించని వారితో.. అప్పటికప్పుడు కొనుగోలు చేయించారు. ఏఎస్సై వెంకటేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

భీమడోలు: చోదకులకు సూచనలిస్తున్న సీఐ విల్సన్

ఏలూరు గ్రామీణ: నగరంలో రెండో పట్టణ సీఐ సత్యనారాయణ నేతృత్వంలో గ్రామీణ ఎస్సై నాగబాబు, సిబ్బందితో వాహన తనిఖీలు చేపట్టారు. శిరస్త్రాణం ధరించని ద్విచక్ర వాహనదారులకు కౌన్సెలింగ్ ఇచ్చారు.

జలాశయంలో కేవలం వారానికి సరిపడా నిల్వలు

ఏలూరు గ్రామీణ, న్యూస్‌టుడే: ఆశ్రం సమీప వేసవి జలాశయంలో కేవలం వారానికి సరిపడా నిల్వలున్నాయని.. ప్రజలు తాగునీటిని జాగ్రత్తగా వాడుకోవాలని కో-ఆప్షన్ సభ్యుడు ఎస్ఎంఆర్ పెదబాబు, కమిషనర్ భానుప్రతాప్ సూచించారు. వేసవి జలాశయాన్ని మంగళవారం వారు పరిశీలించి మాట్లాడారు. మార్చి 10లోపు జలాశయం ఆధునికీకరణ పనులు పూర్తి చేయాలన్నారు. గోదావరి కాలువలో నీరు అడుగండటంతో.. మోటార్లతోనూ తోడే అవకాశం లేకుండా పోయిందని వారు పేర్కొన్నారు. వారి వెంట ఎంఈ సురేంద్రబాబు, డీఈ నారాయణరావు, ఏఈ సాయి, కార్పొరేటర్లు ఉన్నారు.

దస్తావేజులు పోయినవి

నా క్లయింట్ గొట్టాపు చంద్రశేఖర మురళీ వరప్రసాద్, తండ్రి : దుర్గారావు (ఫోన్ : నెం. 8523079029)వారి తాలూకా క్రయ దస్తావేజు నెం.6579/2014 ను పరియు దాని లింక్ దస్తావేజు నెం.10337/2012 ను నా క్లయింటు ఏలూరు జిల్లా కోర్టు సమీపంలో గల జిరాక్స్ షాపు నందు తేదీ:07-12-2025న సదరు దస్తావేజులు జిరాక్స్ తీయించు సందర్భంలో సదరు ఒరిజినల్ దస్తావేజులు పోయినవి. కావున ఎవ్వరికైనననూ దొరికినయెడల మాకు తెలియజేయవలసిందిగా కోరుచున్నాము.

ఏలూరు
తేది :17-2-2026

M.G.B. మురళి
న్యాయవాది, ఏలూరు
సెల్ :6281943636

మహారాజశ్రీ ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) ఏలూరు

E.P.No.35/2024
O.S.No.433/2021

Between:
మేకా సత్యనారాయణ ...డి.హెచ్.ఆర్/ప్లయింటిఫ్
మరియు
పిల్ల మరి విజయకుమారి ...జె.డి.ఆర్ / డిఫెండెంట్

పైనెంబరు EP గ్రంథలో జె.డి.ఆర్ కి సంబంధించి ఈ దిగువ షెడ్యులు ఆస్తిని పై కోర్టువారు ది.05.03.2026 తేదిన ఉదయం 10.30 ని॥లకు వేలం వేయుదురు కావలసినవారు. వేలంపాటలో పాల్గొనవచ్చును.

షెడ్యూలు : ప॥గో॥జిల్లా ఏలూరు సబ్‌రిజిష్టర్ ఏలూరు మండలం, శనివారపుపేట గ్రామ పంచాయితీ, గవరవరం గ్రామం. రి.స.నెం. 73/3 చ॥గ॥268.లు స్థలమునకు హద్దులు : **తూర్పు** : రోడ్డు 33.0 చ॥గ॥, **దక్షిణం** : జంగం జోసెఫ్ విజయసనత్ సాగర్ స్థలం. 74.6 చ॥గ॥, **పడమర** : సి.హెచ్. హరిబాబు ఇతరులు స్థలం 30.6 చ॥గ॥, **ఉత్తరం** : ఆచంట వెంకటరత్నం & కాటి రాధాకృష్ణ మూర్తి స్థలం 77.6 చ॥గ॥.

(శ్రీకోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)
డి.హెచ్.ఆర్.విలువ రూ. 17,50,000/-
అమీన విలువ రూ. 60,00,000/-
శ్రీ ఎల్.డి.ఎల్ ఆచారి, అడ్వకేట్
ఏలూరు

రక్తదాన శిబిరానికి స్పందన

ఏలూరు విద్యా విభాగం, న్యూస్‌టుడే: స్థానిక సీఆర్ఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో మంగళవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. హేలాపురి లయన్స్ క్లబ్, జిల్లా రెడ్‌క్రాస్ సంస్థ, కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ సంయుక్త ఆధ్వర్యంలో శిబిరం జరగ్గా.. 70 మంది విద్యార్థులు స్వచ్ఛందంగా పాల్గొని రక్తదానం చేశారు. రెడ్‌క్రాస్ సంస్థ జిల్లా ఛైర్మన్ డాక్టర్ ఎంబీఎస్‌వీ ప్రసాద్, సీఆర్ఆర్ విద్యాసంస్థల యాజమాన్య కమిటీ సభ్యుడు కె.హరిరామకృష్ణరాజు, ప్రధానాచార్యుడు కె.వెంకటేశ్వరరావు, ఎన్ఎస్ఎస్ ఇన్‌ఛార్జి వి.ప్రణవ్, హేలాపురి లయన్స్ క్లబ్ అధ్యక్షురాలు కె.అంజలి దేవి, కార్యదర్శి వి.విష్ణు కుమార్, కోశాధికారి కె.కృష్ణ కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

పుడతాయి.. కుడతాయి!

నగరంలో దోమల మోత

తంగెళ్లమూడి(ఏలూరు గ్రామీణ), న్యూస్‌టుడే: ఏలూరు నగర వాసులపై దోమలు దండయాత్ర చేస్తున్నాయి. కాలాలతో సంబంధం లేకుండా.. రాత్రింబవళ్లు తేడా లేకుండా.. ప్రజలపై దాడి చేస్తున్నాయి. నగరంలో మురుగునీటి వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉండటం.. కొన్ని ప్రాంతాల్లో డ్రెయిన్లు నిర్మించకపోవడం.. నివాసాల మధ్య ఖాళీ స్థలాలుండటం.. అందులో వాడుక నీరు నిలిచిపోతుండటం సమస్యకు మూలమవుతోంది.

ఏయే ప్రాంతాలంటే.. నగరంలోని తంగెళ్లమూడి, కండ్రికగూడెం, శనివారపుపేట, పుష్పలీలానగర్, కబాడీగూడెం, లునాని నగర్, లక్ష్మీనగర్, చాటపర్రు రోడ్డు, మస్తాన్‌మన్యం కాలనీ, నాగేంద్ర కాలనీ, ఆళ్ల నాని కాలనీ, బాలాజీ నగర్, వినాయక నగర్ తదితర ప్రాంతాల్లో సమస్య జటిలంగా ఉంటోంది. ఆయా ప్రాంతాల్లో డ్రెయిన్లు నిర్మించకపోవడం.. కచ్చా కాలువల్లో పూడిక పేరుకుపోవడంతో.. దోమల ఉత్పత్తి కేంద్రాలుగా మారుతున్నాయి.

నిర్మూలన ఉత్తి మాటే.. నగరంలో దోమల నిర్మూలన ఉత్తి మాటే. నగరపాలక సంస్థ అధికారులు తూతూ మంత్రంగా చర్యలు చేపడుతున్నారు. షెడ్యూల్ ప్రకారం వారానికో ప్రాంతంలో ఫాగింగ్ చేయాల్సి ఉండగా.. ఏడాదికోసారే చేస్తున్నారన్న విమర్శలున్నాయి. మలాథియాన్ పిచికారీ, ఆయిల్ బాల్స్ వేయడం తదితర దాఖలాల్లేవు. నగరంలో దోమల నిర్మూలనకు ఏటా రూ.లక్షల్లో ఖర్చు చేస్తున్నా.. ఫలితం మాత్రం శూన్యం. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని నగర వాసులు విజ్ఞప్తి చేస్తున్నారు. 'నగరంలో దోమల నిర్మూలనకు చర్యలు తీసుకుంటాం. తరచూ ఫాగింగ్ చేపడతాం' అని కమిషనర్ భానుప్రతాప్ తెలిపారు.

తహసీల్దారు కార్యాలయం ఎదుట నినాదాలు చేస్తున్న వీఆర్వోలు

'ఒత్తిడి భరించలేక ఆత్మహత్యలు'

పెదపాడు, న్యూస్‌టుడే: స్థానిక తహసీల్దారు కార్యాలయం ఎదుట వీఆర్వోలు నల్లబ్యాడ్జీలు ధరించి మంగళవారం నిరసన చేపట్టారు. సంఘం జిల్లా అధ్యక్షుడు సాయల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. వీఆర్వోలపై రోజురోజుకూ పని భారం పెరిగిపోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఒత్తిడి భరించలేక కొందరు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని, మరికొందరు హఠా న్మరణం చెందుతున్నారని వాపోయారు. రైతులకు పట్టాదారు పాస్‌పుస్తకాలిచ్చే సమయంలో సర్వర్లు మొరాయిస్తున్నారని, ఫలితంగా త్వరితగతిన ఈకేవైసీ చేయించలేక పోతున్నామని ఆయన తెలిపారు.

వైవీ రావు ఆశయాలు సాధిద్దాం

ఏలూరు అర్బన్, న్యూస్‌టుడే: స్థానిక ఎంప్లాయీస్ యూనియన్ కార్యాలయంలో సంఘ రాష్ట్ర పూర్వ అధ్యక్షుడు, ఏపీ ఐకాస అమరావతి పూర్వ ప్రధాన కార్యదర్శి వైవీ రావు మూడో వర్ధంతి కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు వెంకటేశ్వరరావు, ఈయూ నాయకులు రాంబాబు, వీర రాఘవులు, భాస్కరరావు, బాబూరావు తదితరులు పుష్పాంజలి ఘటించారు. వైవీ రావు ఆశయ సాధనకు సంఘ నాయకులంతా కృషి చేయాలని వారు పిలుపునిచ్చారు.

మాదకద్రవ్యాలతో జీవితం అంధకారం

మాట్లాడుతున్న వైద్యాధికారి నారాయణరాజు

నిడమర్రు, న్యూస్‌టుడే: విద్యార్థులు మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని.. వాటి జోలికెళ్లితే జీవితం అంధకారమవుతుందని వైద్యాధికారి నారాయణరాజు అన్నారు. పెదనిండ్రకొలను జడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రధానోపాధ్యాయుడు సత్యేంద్రకుమార్ రెడ్డి అధ్యక్షత వహించారు. నారాయణరాజు మాట్లాడుతూ.. విద్యార్థులు జంక్ ఫుడ్‌కు బానిస కావొద్దని సూచించారు. బాల్యం నుంచే లక్ష్యాన్ని నిర్దేశించుకొని.. దాన్ని సాధించేందుకు శ్రమించాలని కోరారు. అనంతరం పిల్లలకు నులి పురుగుల నివారణ మాత్రలు పంపిణీ చేశారు. ఉపాధ్యాయులు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

వెట్టిచాకిరీ నిర్మూలనకు తోడ్పాటు

ఏలూరు వన్‌టౌన్, న్యూస్‌టుడే: జిల్లాలో వెట్టిచాకిరీ నిర్మూలనకు ప్రతి ఒక్కరూ తోడ్పాటునందించాలని న్యాయవాది చిక్కా భీమేశ్వరరావు సూచించారు. స్థానిక కొత్త రోడ్డులోని నవ సమాజ సొసైటీ కార్యాలయంలో వెట్టిచాకిరి విమోచన జిల్లా కమిటీని మంగళవారం ఎన్నుకున్నారు. ఆయన మాట్లాడుతూ.. వెట్టిచాకిరి నిర్మూలనకు ప్రభుత్వ అధికారులు, స్వచ్ఛంద సేవా సంస్థలు, ప్రజా సంఘాల నాయకులు సమష్టిగా కృషి చేయాలన్నారు. పి.ఫ్రాన్సిస్ తంబి, రమేశ్‌బాబు, హెరాల్డ్ బాబు, శివకృష్ణ, వేణుగోపాలరావు, శ్రీనివాస్, అజయ్‌బాబు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాల అభివృద్ధికి చర్యలు

ఏలూరు విద్యా విభాగం, న్యూస్‌టుడే: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల అభివృద్ధికి చర్యలు చేపడుతున్నట్లు ప్రధానాచార్యుడు గిరిబాబు తెలిపారు. కళాశాలలో కాలేజ్ ప్లానింగ్, డెవలప్‌మెంట్ కౌన్సిల్(సీపీడీసీ) సమావేశం మంగళవారం నిర్వహించారు. కళాశాలలోని 3.35 ఎకరాల స్థలంలో శాశ్వత భవన నిర్మాణానికి రూ.12.6 కోట్ల అంచనాతో ప్రతిపాదనలు రూపొందించాలని తీర్మానించారు. సీపీడీసీ కార్యదర్శిగా ఎల్.వెంకటేశ్వరరావు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కళాశాల అభివృద్ధికి ఆయన రూ.20 వేలు విరాళం ప్రకటించారు. గిరిబాబు మాట్లాడుతూ.. కళాశాలలో ఏఐ ఆధారిత కంప్యూటర్ ప్రయోగశాలకు అవసరమైన ఏసీల వితరణకు పారిశ్రామికవేత్త గుప్తా హామీ ఇచ్చారని పేర్కొన్నారు.

విద్యుత్తు మోటార్ల దొంగలు అరెస్టు

పెదపాడు, న్యూస్‌టుడే: వ్యవసాయ విద్యుత్తు మోటార్లను కొన్నాళ్లుగా దొంగలిస్తున్న ముగ్గురిని పోలీసులు అరెస్టు చేశారు. స్థానిక పోలీసుస్టేషన్‌లో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో పెదవేగి సీఐ రాజశేఖర్, ఎస్సై శ్రీను వివరాలు వెల్లడించారు. పలు గ్రామాల్లోని ఆక్వా చెరువుల వద్దనున్న మోటార్లు తరచూ చోరీలకు గురవుతున్నాయి. బాధితుల ఫిర్యాదులతో గట్టి నిఘా పెట్టాం. గుడిపాడు ఎస్సీ కాలనీకి చెందిన చొక్కా నాగదుర్గారావు, చింతపల్లి నాగరాజు, సత్యవోలుకు చెందిన ఆటో డ్రైవర్ బొచ్చ వినోద్ కిరణ్ దొంగతనాలకు పాల్పడుతున్నట్లు తేలింది. వారిని అదుపులోకి తీసుకొని.. రూ.1.26 లక్షల విలువైన ఏడు విద్యుత్తు మోటార్లు, ఆటో స్వాధీనం చేసుకున్నాం. నిందితులను న్యాయస్థానంలో హాజరచగా.. న్యాయమూర్తి రిమాండ్‌కు ఆదేశించినట్లు సీఐ, ఎస్సై పేర్కొన్నారు.

వివరాలు వెల్లడిస్తున్న సీఐ రాజశేఖర్

వరకట్నం వేధింపులపై ఫిర్యాదు

ఏలూరు గ్రామీణ: స్థానిక 12 పంపుల కూడలికి చెందిన కొల్లి జ్యోతి భవానికి, అదే ప్రాంతంలో నివాసముంటున్న రూప్ సాయి వినయ్‌తో 2021లో పెళ్లయింది. వీరికి కుమారుడు ఉన్నాడు. కొన్నాళ్లుగా అదనపు కట్నం తేవాలని భర్త, అతడి తల్లి, చెల్లి, బావమరిది వేధిస్తున్నారు. ఈ నెల 11న భార్యతో సాయి వినయ్ గొడవపడి.. ఇంట్లో నుంచే బయటకు గెంటేశాడు. దాంతో బాధితురాలు మంగళవారం రెండో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

యువతి అదృశ్యంపై కేసు

పెదపాడు: మండలంలోని ఓ గ్రామానికి చెందిన యువతి ఈ నెల 16 ఉదయం ఇంట్లో నుంచి బయటకెళ్లారు. తిరిగి ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు చుట్టుపక్కల గాలించారు. ఫలితం లేకపోవడంతో మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఆర్.శ్రీను తెలిపారు.

బంగారు గొలుసు అపహరణ

ఉంగుటూరు: కైకరానికి చెందిన కొయ్యాని పాప, ఆమె భర్త పైడితల్లి మంగళవారం ప్రకాశం జిల్లా చీమకుర్తిలోని కుమార్తె ఇంటికి వెళ్లేందుకు బయల్దేరారు. ఇంటి నుంచి జాతీయ రహదారి వద్దకు నడిచి వస్తుండగా.. మార్గం మధ్యలోని పెద్దింట్లమ్మ ఆలయం వద్దకొచ్చే సరికి ఇద్దరు యువకులు ద్విచక్ర వాహనంపై వచ్చి వివాహిత మెడలోని 3 కాసుల బంగారు గొలుసు లాక్కొని పారిపోయారు. బాధితురాలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు చేబ్రోలు పోలీసులు తెలిపారు.

PUBLIC NOTICE

Under the instructions of **M/S Siddhartha Tiles and Sanitary LLP represented by its Managing Partner Lankipalli Poorna Pradeep,** Bengaluru, I issue the following Notice

On, 10-02-2026, My Client entered into an agreement of sale with **Chekuri Varalakshmi W/o Chekuri Srinivasaraju,** Narayanapuram to purchase the below mentioned A - Schedule land

Also on, 10-02-2026, My Client entered into an agreement of sale with Chekuri Srinivasaraju, S/O Chekuri Ramabadraraju, Gopinathapatnam to purchase the below mentioned B- Schedule land

A-Schedule: An extent of Ac1-18 cents of land in R.S No.222-1 (New R.S No:222-1F1)situated in Gopinathapatnam, Ungutur Mandal, Eluru District. **Bounded by: East-**Land of S. Krisnamraju and others, **South-**Land of Karthik Ice Industries **West-**Land of Ganta Venkatalakshmi, **North-**Kundeti Suresh land some extent & Matta Murali land some extent.

B-Schedule: An extent of Ac1-19 cents of land in R.S No. 222-1 (New R.S No:222-1F) situated in Gopinathapatnam, Ungutur Mandal, Eluru District. **Bounded by: East-** Land of S. Krisnamraju and others, **South-** 40 ft width road to tiles factory, **West-**Land of Ganta Venkatalakshmi, **North-** Above A- Schedule land

Please take notice anybody got any objection, right title or any kind of claim over the A, B-Schedule land, inform to below mentioned advocate within 15 days from the date of its publication else, my client will proceed further and purchase the above said lands.

K. SUBRAHMANYESWARA SWAMY
Advocate, Near Geethabhavan, Eluru. **Cell: 9440181117**

(c) eenadu

చింతలపూడి
• చింతలపూడి • పోలవరం

పోలవరం నుంచి హైదరాబాద్‌కు రెండో బస్సు

పోలవరం, న్యూస్‌టుడే: పోలవరం నుంచి హైదరాబాద్‌కు రెండో బస్సు నడిపేందుకు అనుమతి వచ్చిందని ఈ నెల 27 లేదా, వచ్చేనెల 1వ తేదీ నుంచి నడుపుతామని కొవ్వూరు ఆర్టీసీ డిపో మేనేజర్ అభిరామ్‌నాయిక్ తెలిపారు. ఈ మేరకు పోలవరంలో మాట్లాడుతూ బస్సు సాయంత్రం 5.45 గంటలకు కొవ్వూరు నుంచి బయలుదేరి 6.45కు పోలవరం వస్తుందన్నారు. కొయ్యలగూడెం, జంగారెడ్డిగూడెం మీదుగా హైదరాబాద్ వెళ్తుందని వెల్లడించారు.

రెవెన్యూ సిబ్బంది నిరసన

కొయ్యలగూడెం, న్యూస్‌టుడే: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ రెవెన్యూ సిబ్బంది కొయ్యలగూడెం తహసీల్దార్ కార్యాలయం వద్ద మంగళవారం నిరసన ప్రదర్శన చేశారు.

విద్యుత్తు సరఫరా వేళలు మార్పు

జంగారెడ్డిగూడెం పట్టణం, న్యూస్‌టుడే: కామవరపుకోట నుంచి జంగారెడ్డిగూడెం సబ్‌స్టేషన్‌కు వచ్చే టవర్‌లైన్ మరమ్మతుల నిమిత్తం ఈ నెల 19న జంగారెడ్డిగూడెం విద్యుత్తు డివిజన్ పరిధిలోని జంగారెడ్డిగూడెం, కొయ్యలగూడెం, బుట్టాయగూడెం, జీలుగుమిల్లి, కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లో సరఫరా వేళలు మార్చడం జరిగిందని ఈఈ పీర్ అహ్మద్‌ఖాన్ తెలిపారు. ఈ క్రమంలో గురువారం తెల్లవారుజామున ఒంటి గంట నుంచి ఉదయం 8 గంటల వరకు, అదేరోజు రాత్రి 10 గంటల నుంచి 12 గంటల వరకు సరఫరా ఇవ్వడం జరుగుతుందని చెప్పారు.

10 AM to 1 PM మేమున్నాం.. మీకు తోడుగా..
జంగారెడ్డిగూడెం: 80085 74478
కొయ్యలగూడెం: 80085 74947
చింతలపూడి: 76759 19086

జంగారెడ్డిగూడెం పట్టణం, న్యూస్‌టుడే: ? జంగారెడ్డిగూడెం గరుడ పక్షినగర్‌లో వీధిదీపాలు సక్రమంగా వెలగడం లేదు. రాకపోకలకు చాలా ఇబ్బందులు పడుతున్నాం. - సురేశ్, జంగారెడ్డిగూడెం

✔ చర్యలు తీసుకుంటాం. - కేవీ రమణ, కమిషనర్

జంగారెడ్డిగూడెం గ్రామీణ, న్యూస్‌టుడే: ? జంగారెడ్డిగూడెం మండలం వేగవరం గ్రామంలోని టీపీ కాలనీలో మురుగు కాలువల్లో వ్యర్థాలు పడేస్తున్నారు. మురుగు సరిగా పారడం లేదు. - రాజు

✔ శుభ్రం చేయిస్తాం. - రాంబాబు, కార్యదర్శి

కామవరపుకోట, న్యూస్‌టుడే: ? వీరిశెట్టిగూడెం పొలాలకు వెళ్లే మట్టి రోడ్డు గుంతలు పడటం వల్ల ప్రజలు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. - సత్యనారాయణ, వీరిశెట్టిగూడెం.

✔ చింతలపూడి వ్యవసాయ మార్కెట్ కమిటీ పరిధిలో పంట దారుల అభివృద్ధికి అనుమతులు కోరుతూ ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం. - ఏఎంసీ ఛైర్మన్ జిల్లాల దుర్గాప్రసాద్

చింతలపూడి, న్యూస్‌టుడే: ? చింతంపల్లి పంచాయతీలో డ్రెయిన్లు అస్తవ్యస్తంగా ఉన్నాయి. రెండు, మూడు నెలలకు కూడా ఒకసారి శుభ్రం చేయడం లేదు. - రాఘవ, చింతంపల్లి.

✔ డ్రెయిన్లు శుభ్రం చేసేలా ఆదేశాలిస్తాం. - కామేశ్వరి, ఎంపీడీవో.

? చింతలపూడి నుంచి రేచర్ల వెళ్లే ప్రధాన రహదారి అంచుల్లో ప్లాస్టిక్ వ్యర్థాలు పడేస్తున్నారు. - సుందరం, చింతలపూడి.

✔ వ్యర్థాలు రహదారి పక్కన పడేయకుండా చర్యలు చేపడతాం. - అంబటి రాంబాబు, నగర పంచాయతీ కమిషనర్.

అన్నీ చూశాం.. పరిష్కరిస్తాం..

'ఈనాడు- ఈటీవీ' వాక్‌విత్‌లో కమిషనర్‌లో రాంబాబు

చింతలపూడి పట్టణం, న్యూస్‌టుడే: చింతలపూడి మెరకవీధి, బోసుబొమ్మ కూడలిలో 'ఈనాడు - ఈటీవీ' ఆధ్వర్యంలో మంగళవారం 'వాక్‌విత్ కమిషనర్' జరిగింది. ఈ సందర్భంగా నగర పంచాయతీ కమిషనర్ రాంబాబు స్థానికులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. స్థానికులు చెప్పిన ప్రతి సమస్యను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. వీలైనంత త్వరలోనే అన్ని పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

☛ మెరకవీధిలో రహదారి అధ్వానంగా మారింది. గుంతల వల్ల ద్విచక్ర వాహనాలపై రాకపోకలకు ఇబ్బందులు కలుగుతుంది. - నారాయణరావు, స్థానికుడు.

☛ మెరకవీధి నుంచి బాలికల ఉన్నత పాఠశాలకు వెళ్లే రహదారికి ఇరువైపులా డ్రెయిన్లపై మూతలు లేవు. దీనివల్ల ఎదురుగా వాహనాలు వస్తే తప్పించడానికి అవస్థలు పడుతున్నాం. తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. - కృష్ణారావు, స్థానికుడు.

☛ మెరకవీధిలో పందుల సమస్య తీవ్రంగా ఉంది. పగలు, రాత్రి నివాసాల మధ్య సంచరిస్తూ పరిసరాలు అపరిశుభ్రంగా మారుస్తున్నాయి. డ్రెయిన్లపై మూతలు లేకపోవడంతో మురుగునీటిలోనే సంచరిస్తున్నాయి. - రాజేశ్, స్థానిక యువకుడు, సుశీలకుమారి, గృహిణి

☛ పట్టణంలోని ప్రధాన రహదారులపై సంచరించే పశువుల వల్ల స్థానికులతో పాటు వాహనదారులు అవస్థలు పడుతున్నారు. - ఆదిత్య, వాహన చోదకుడు

స్థానికులతో మాట్లాడుతున్న కమిషనర్

☛ పోస్టాఫీసు, ఉన్నత పాఠశాలకు మార్గంలోని ఖాళీ స్థలాల్లో వ్యర్థాలు పడేస్తున్నారు. పిచ్చి మొక్కలు పెరిగి చిట్టడివిని తలపిస్తున్నాయి. రాత్రి వేళల్లో విషసర్పాలు సంచరిస్తుండటంతో బయటకు రావాలంటే భయపడుతున్నాం. - సుబ్బారావు, విశ్రాంత ఉద్యోగి, రాజారావు, వ్యాపారి.

☛ పట్టణంలో తాగునీటి సరఫరా అస్తవ్యస్తంగా మారింది. మెరక ప్రాంతాల్లో తాగునీరు సరఫరా కావడం లేదు. కొన్ని ప్రాంతాల్లో రెండు, మూడు రోజులకు ఒకసారి నీటిని సరఫరా చేస్తున్నారు. - బాబురావు, సామాజిక కార్యకర్త, విజయకుమారి, గృహిణి.

పనులు చేయిస్తాం..

మెరకవీధిలో రహదారుల మరమ్మతులకు కృషి చేస్తాం. మూతలు లేని డ్రెయిన్లపై మూతలు వేస్తాం. పట్టణంలోని ఖాళీ స్థలాల్లో పిచ్చి మొక్కలు తొలగిస్తాం. ఇబ్బంది లేకుండా తాగునీటి సరఫరా చేస్తాం. పందులు, పశువుల యజమానులను గుర్తించి పట్టణానికి దూరంగా తరలించే విధంగా చర్యలు తీసుకుంటాం. - రాంబాబు, నగర పంచాయతీ కమిషనర్.

సాగు లాభసాటిగా మార్చుకోండి

చింతలపూడి పట్టణం, న్యూస్‌టుడే: వ్యవసాయం చేసే ప్రతి రైతుకు విశిష్ట నమోదు సంఖ్య అవసరమని జిల్లా వ్యవసాయాధికారి హబీబ్ బాషా తెలిపారు. పోతునూరులో పొలం పిలుస్తుంది కార్యక్రమంలో మంగళవారం ఆయన పాల్గొని మాట్లాడారు. ఏడీఏ సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగోన్నతులకు ఉత్తర్వులు

బుట్టాయగూడెం, న్యూస్‌టుడే: కేఆర్‌పురం ఐటీడీఏ పరిధిలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో పనిచేస్తున్న తెలుగు, హిందీ భాషా పండితులు, వ్యాయామోపాధ్యాయులకు ఉద్యోగోన్నతులు కల్పించేందుకు గిరిజన సంక్షేమ శాఖ సంచాలకుని నుంచి ఉత్తర్వులు వచ్చినట్లు కేఆర్‌పురం ఉప సంచాలకుడు జగన్నాథరావు తెలిపారు.

'పంట భూముల్లో ఆయుధ డిపో వద్దు'

కొయ్యలగూడెం గ్రామీణ, న్యూస్‌టుడే: పంటలు పండుతున్న భూముల్లో నౌకాదళ ఆయుధ డిపో ఏర్పాటుకు ప్రతిపాదించడం ప్రభుత్వాలకు తగదని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ అన్నారు. ఆయుధ డిపో ఏర్పాటు ప్రతిపాదిత భూములను సంఘం సభ్యుల బృందం మంగళవారం పరిశీలించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.

సీఎం సహాయనిధి అందజేత

వేలేరుపాడు గ్రామీణ, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి సహాయ నిధి పేదలకు అండగా నిలుస్తోందని వేలేరుపాడు తెదేపా మండలాధ్యక్షుడు అమరవరపు అశోక్ అన్నారు. రేపాకగొమ్ముకు చెందిన గుండారపు సంతోశ్‌కు రూ.69 వేలు చెక్కును ఆయన అందించారు.

WANTED
మా WHEELS ZONE కంపెనీ కొయ్యలగూడెం బ్రాంచిలో
సేల్స్ ఎగ్జిక్యూటివ్స్ -03 (MALE)
పని చేయుటకు కావలెను
జీతం: Rs: 15k ,విద్యార్హత: ఇంటర్
ONLINE ఇంటర్వ్యూ
Opp:SBI, నల్లజర్ల రోడ్డు.
77990 28444

లబ్ధిదారుకు పత్రాలు అందజేస్తున్న రోషన్ కుమార్

పేదవాడికి అండగా..

చింతలపూడి, న్యూస్‌టుడే: ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న పేదవారికి ముఖ్యమంత్రి సహాయనిధి ఆసరాగా నిలుస్తుందని ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ అన్నారు. స్థానిక క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే రోషన్‌కుమార్ ఏడుగురు లబ్ధిదారులకు రూ.2.15 లక్షలు విలువ కలిగిన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు మంగళవారం అందజేశారు.

అభివృద్ధి కమిటీ సభ్యుడిగా.. చింతలపూడి, న్యూస్‌టుడే: చింతలపూడి ఏరియా ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యునిగా పట్టణానికి చెందిన కంభం రమేష్‌ను ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ మంగళవారం నియమించారు. ఈ మేరకు నియామక ఉత్తర్వులను స్థానిక క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే అందజేశారు.

పుష్కరాల నిర్వహణకు సమగ్ర ప్రణాళిక

ద్వారకాతిరుమల, న్యూస్‌టుడే: గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు గోదావరి పుష్కరాలకు సంబంధించిన సమగ్ర ప్రణాళికను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడికి వివరించారు. ఈ మేరకు ఆయన మంగళవారం అమరావతి సచివాలయంలో ముఖ్యమంత్రిని కలిశారు. ముందస్తు ప్రణాళిక- అన్ని శాఖల సమన్వయం, ఘాట్ల వద్ద సురక్షిత స్నాన ఏర్పాట్లు, పరిశుభ్రత, తాగునీటి సదుపాయం, ట్రాఫిక్ నియంత్రణ- ప్రత్యేక రవాణా ఏర్పాట్లు, వైద్య శిబిరాలు, అంబులెన్స్ సేవలు, సీసీటివి, డ్రోన్లు, ఏఐ ఆధారిత పర్యవేక్షణ వంటి అంశాలపై వివరించినట్లు ఒక ప్రకటనలో తెలిపారు.

గ్రామాల అభివృద్ధికి రూ.2.02కోట్లు.. ద్వారకాతిరుమల, న్యూస్‌టుడే: ద్వారకాతిరుమల మండలంలోని గ్రామాల అభివృద్ధికి రూ.2.02కోట్లు మంజూరైనట్లు గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు తెలిపారు. ఉపాధి హామీ పథకం ద్వారా వివిధ అభివృద్ధి పనుల నిమిత్తం నిధులు మంజూరయ్యాయని పేర్కొన్నారు.

ప్రభుత్వాసుపత్రిలో ఆకస్మిక తనిఖీ

చింతలపూడి పట్టణం, న్యూస్‌టుడే: చింతలపూడి ప్రభుత్వాసుపత్రిని వైద్య ఆరోగ్యశాఖ జిల్లా సమన్వయకర్త పాల్ సతీశ్‌కుమార్ మంగళవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన అన్ని వార్డులను పరిశీలించారు. అక్కడి పరిస్థితులపై రోగులను అడిగి తెలుసుకున్నారు. రక్తపరీక్షా గది, ఎక్స్‌రే, స్త్రీ ప్రసూతి వార్డులను ఆయన తనిఖీ చేశారు. ప్రజలకు మెరుగైన సేవలందించాలని ఆయన సిబ్బందికి సూచించారు.

రహదారి భద్రతపై అవగాహన అవసరం

జంగారెడ్డిగూడెం పట్టణం, చింతలపూడి పట్టణం, న్యూస్‌టుడే: రహదారి భద్రతపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని ప్రిన్సిపల్ ఎన్.ప్రసాద్‌బాబు అన్నారు. జంగారెడ్డిగూడెంలోని సీఎస్‌టీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 'జాతీయ రహదారి భద్రత' పై మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ● చింతలపూడి డిగ్రీ కళాశాలలో రహదారి భద్రతా వారోత్సవాల కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ శ్రీనివాసరావు మాట్లాడారు.

పట్టిసం ఆదాయం రూ.47.62 లక్షలు

పోలవరం, న్యూస్‌టుడే: పట్టిసీమ వద్ద అఖండ గోదావరి మధ్యలోని భద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి ఆలయంలో మూడు రోజులపాటు జరిగిన మహాశివరాత్రి ఉత్సవాల నేపథ్యంలో టిక్కెట్లు, హుండీలు, లడ్డూ ప్రసాదం అమ్మకం, కొబ్బరి చెక్కల వేలం, కేశఖండన ద్వారా రూ.47,62,624 ఆదాయం వచ్చినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి సీహెచ్.వెంకటలక్ష్మి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ ఏడాది లడ్డూ ప్రసాదం అమ్మకాలు రూ.1.36 లక్షలు వచ్చింది. గత సంవత్సరం కంటే తగ్గింది. అన్నదానానికి విరాళాలు గత ఏడాది కంటే సగానికి సగం తగ్గి రూ.2,01,307 మాత్రమే సమకూరింది. ఆలయ ధర్మకర్త కొచ్చర్లకోట వీరభద్రరావు, చీఫ్‌ఫెస్టివల్ అధికారి పల్లంరాజు సమక్షంలో లెక్కింపు జరిగింది.

స్కౌట్స్, గైడ్స్ శిక్షణ

బుట్టాయగూడెం, న్యూస్‌టుడే: మండలంలోని పాఠశాలల్లో విద్యార్థులను స్కౌట్స్, గైడ్స్‌గా తయారు చేయడంపై ఉపాధ్యాయులకు బుట్టాయగూడెం జడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. ఎంఈవో-1, 2లు బాబూరావు, నరేంద్రరాయ్ పర్యవేక్షించారు.

జన్మదిన శుభాకాంక్షలు
మాకు అత్యంత ఆప్తులు, జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ శ్రీ ముళ్ళపూడి బాపిరాజు గార్కి మా హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు.
శ్రీ ముళ్ళపూడి బాపిరాజు గారు జిల్లా పరిషత్ మాజీ చైర్మన్, ఏలూరు
మాకిరెడ్డి దొరారెడ్డి- Ex. సొసైటీ అధ్యక్షులు గుణ్ణంపల్లి
ముల్లంలేటి రాజు గుణ్ణంపల్లి
వవలాపరపు వెంకటేష్- గుణ్ణంపల్లి
M.గాంధి మహదేవపురం

కనుల పండువగా వీరేశ్వరుని కల్యాణం

జంగారెడ్డిగూడెం గ్రామీణ, న్యూస్‌టుడే: తాడువాయి భద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి ఆలయంలో మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆలయ కళావేదిక వద్ద భద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి దివ్య కల్యాణం మంగళవారం కనుల పండువగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కల్యాణాన్ని వీక్షించారు. అనంతరం ఆలయ ఆవరణలో అన్నసమారాధనను ఉత్సవ కమిటీ ఛైర్మన్ ఉప్పునూతల పుల్లారావు, గ్రామ పెద్దలు ప్రారంభించారు. జంగారెడ్డిగూడెం సీఐ సుభాశ్, ఎస్సై వీర ప్రసాద్‌లు బందోబస్తు నిర్వహించారు.

హనుమకు విశేష పూజలు

జంగారెడ్డిగూడెం గ్రామీణ, న్యూస్‌టుడే: గురవాయిగూడెం మద్ది ఆంజనేయస్వామి ఆలయంలో మంగళవారం భక్తులు పోటెత్తారు. స్వామికి ప్రీతికరమైన తమలపాకులతో అర్చనలు చేశారు. ఆలయం చుట్టూ భక్తులు 108 ప్రదక్షిణలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. మంగళవారం ఒక్కరోజే వివిధ సేవల రూపేణా రూ.1,25,289 ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో ఆర్వీ చందన తెలిపారు.

గాంగేశ్వరుడి రథోత్సవం

కామవరపుకోట, న్యూస్‌టుడే: పురాతన తడికలపూడి శ్రీగాంగేశ్వర స్వామి రథోత్సవం సోమవారం రాత్రి అశేష భక్తజనం మధ్య ఘనంగా నిర్వహించారు. పూలమాలలు, తోరణాలతో సుందరంగా అలంకరించిన రథంపై పార్వతీ సమేతుడైన గాంగేశ్వరుడు కొలువుదీరి తెల్లవార్లు వీధుల్లో విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు.

నేత్రపర్వంగా వసంతోత్సవం

ద్వారకాతిరుమల, న్యూస్‌టుడే: ద్వారకాతిరుమల క్షేత్రపాలకుడైన శ్రీభ్రమరాంబమల్లేశ్వర స్వామి ఆలయంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు నేత్రపర్వంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా మంగళవారం ఉదయం త్రిశూలవారి, వసంతోత్సవం ఘనంగా నిర్వహించారు. స్వామి, అమ్మవార్లను పల్లికిపై ఊరేగిస్తూ వసంతోత్సవం జరిపించారు. ఈ సందర్భంగా స్వామి, అమ్మవార్లను స్థానిక శివ మండపంలో ఉంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. పూర్ణాహుతి, ధ్వజావరోహణ, ద్వాదశ కోవెల ప్రదక్షిణలు శాస్త్రోక్తంగా జరిపించారు.

పల్లకీలో కొలువైన స్వామి, అమ్మవార్లు

జన్మదిన శుభాకాంక్షలు
ఏలూరు జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ శ్రీ ముళ్ళపూడి బాపిరాజు గార్కి జన్మదిన శుభాకాంక్షలు.
శ్రీ ముళ్ళపూడి బాపిరాజు గారు జిల్లా పరిషత్ మాజీ చైర్మన్, ఏలూరు
నార్ల కాశీనాధం
నార్ల రాజేంద్రనాధ్
ద్వారకాతిరుమల

చిన వేంకన్న సేవలో కొరియోగ్రాఫర్ శేఖర్

ద్వారకాతిరుమల, న్యూస్‌టుడే: ద్వారకాతిరుమల శ్రీవారి ఆలయాన్ని సినిమా కొరియోగ్రాఫర్ శేఖర్ మంగళవారం దర్శించారు. ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం ఏర్పాటు చేశారు. అనంతరం ఆయనకు ఆలయ పండితులు వేద ఆశీర్వచనం అందజేశారు.

శ్రీవారి నిత్యాన్నదాన పథకానికి విరాళం

ద్వారకాతిరుమల, న్యూస్‌టుడే: ప్రముఖ పుణ్యక్షేత్రం ద్వారకాతిరుమల శ్రీవారి నిత్యాన్నదాన పథకానికి విజయవాడకు చెందిన పాలడుగు కృష్ణ మోహన్ రూ. లక్ష విరాళం అందించారు. ఆలయ కార్యాలయంలో మంగళవారం జమ చేశారు.

వారు దోచేస్తారు.. వీరు చూస్తుంటారు..

జంగారెడ్డిగూడెంలో పేట్రేగిపోతున్న దొంగలు

జంగారెడ్డిగూడెం పట్టణం, న్యూస్‌టుడే: జంగారెడ్డిగూడెం పట్టణంలో దొంగలు పేట్రేగిపోతున్నారు. తాళం వేసిన ఇళ్లనే లక్ష్యంగా చేసుకుని దోచేస్తున్నారు. ఇల్లు గుల్లయిన విషయం తెలుసుకున్న యజమానులు లబోదిబోమంటూ పోలీసుల వద్దకు పరుగులు తీస్తున్నారు. అయితే కొన్ని సందర్భాల్లో పోలీస్‌స్టేషన్లకు వెళ్లి ఫిర్యాదు చేసినా కేసులు నమోదు చేయడం లేదని బాధితులు వాపోతున్నారు. ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటి వరకూ సుమారు పది ఇళ్లలో దొంగతనాలు జరిగినట్లు సమాచారం. వీటిలో కొన్ని మాత్రమే కేసులు నమోదు చేయటం గమనార్హం.

● స్థానిక సాయిసూర్య నగర్‌కు చెందిన ఓ వ్యక్తి ఓ బహుళ అంతస్తుల భవనంలో అద్దెకు ఉంటున్నాడు. ఇంట్లో వారు ఊరికెళ్లడంతో ఈ నెల 12న పడకగదిలో ఒంటరిగా పడుకున్నాడు. అర్ధరాత్రి దాటిన తర్వాత ఇంటి ప్రధాన ద్వారం పగలగొట్టి ఇద్దరు ముసుగు దొంగలు లోపలికి ప్రవేశించారు. అలికిడి కావడంతో ఇంట్లో ఉన్న వ్యక్తికి మెలకువ వచ్చి చూసేసరికి ఇద్దరు ముసుగు దొంగలు కనిపించారు. దీంతో అతడు కేకలు వేసి తన పడకగది తలుపులు వేసేసుకుని బంధువులకు చరవాణిలో సమాచారం ఇచ్చారు. వారు పోలీసులను వెంటతీసుకొచ్చి చూసేసరికి దొంగలు అక్కడి నుంచి పరారయ్యారు. అదే సమయంలో బాధితుడి వద్ద నుంచి కానిస్టేబుళ్లు వివరాలు తీసుకున్నారు. అప్పటి నుంచి కేసులో పురోగతి లేదు. అదే రోజు మరో రెండిళ్లలో దొంగలు పడినట్లు స్థానికులు చెబుతున్నారు.

సాయిసూర్య నగర్‌లో బాధితుడి వద్ద వివరాలు సేకరిస్తున్న పోలీసులు

● సుబ్బంపేట బాబా గుడి సమీపంలోని ఓ ఇంట్లోని వారు జనవరి నెలలో ఊరెళ్లారు. అదే అదనుగా ఆ ఇంట్లోకి దొంగలు చొరబడి సుమారు రూ. లక్ష నగదు ఎత్తుకెళ్లారు. దీనిపై బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు వెళ్తే దొంగ దొరికితే కబురు పెడతామంటూ పోలీసులు నచ్చజెప్పి పంపించేశారు.

● అశ్వారావుపేట రోడ్డులోని ఓ దుకాణం తాళం కప్పలను ఈ నెల 15 రాత్రి పగుల గొట్టి దుకాణంలోని రూ.8 వేలు, రూ.20 వేలు విలువైన సిగరెట్లను దొంగలు ఎత్తుకెళ్లారు.

చర్యలు తీసుకుంటాం.. 'దొంగతనాల నియంత్రణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. పోలీస్‌స్టేషన్లలో కేసులు నమోదు చేయకుంటే నాకు సమాచారం ఇవ్వండి. కేసులు కట్టకుండా కాలయాపన చేసేవారిపై కఠిన చర్యలు తీసుకుంటాం.' ఏఎస్పీ సుస్మిత తెలిపారు.

జన్మదిన శుభాకాంక్షలు
మీ ఎదుగుదల మాకు స్ఫూర్తిదాయకం
శ్రీ ముళ్ళపూడి బాపిరాజు గారు జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ ఉమ్మడి ప.గో.జిల్లా
ఉప్పలూరి శేషగిరిరావు (గిరి), నల్లజర్ల
నాదెళ్ళ సురేంద్రనాధ్ చౌదరి, మారంపల్లి
ముళ్ళపూడి కృష్ణరాయ చౌదరి, చాగల్లు
అప్పసాని జగన్మోహనరావు, నల్లజర్ల
పాకలపాటి సోమశేఖర వరప్రసాద్ (సోమరాజు), పంగిడిగూడెం

పొగాకు బ్యారన్ దగ్ధం

కొయ్యలగూడెం గ్రామీణ, న్యూస్‌టుడే: సీతంపేటలో మంగళవారం జరిగిన అగ్నిప్రమాదంలో మహిళా రైతు మధ్యాహ్నపు ప్రభకు చెందిన పొగాకు బ్యారన్ దగ్ధమైంది. ప్రమాదంలో సుమారు రూ.3.50లక్షల మేర ఆస్తినష్టం వాటిల్లిందని భావిస్తున్నారు. జంగారెడ్డిగూడెం అగ్నిమాపక కేంద్రం సిబ్బంది ఘటన స్థలికి చేరుకుని మంటలను అదుపు చేశారు. భాజపా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు బొల్లిన నిర్మలకిశోర్ బాధిత రైతులను పరామర్శించారు.

పొగాకు తోట నరికేశారని ఫిర్యాదు

కొయ్యలగూడెం, న్యూస్‌టుడే: తమ పొగాకు తోటలో పక్వానికి వచ్చిన మొక్కలను నరికేసి నష్టపరిచారని మండలంలోని మంగపతిదేవిపేటకు చెందిన గంగుల నాగు పోలీసులకు మంగళవారం ఫిర్యాదు చేశారు. సుమారు ఎకరం తోటలో చాలా వరకు మొక్కలను ముక్కలుగా నరికేయడం వల్ల సుమారు రూ.5 లక్షల వరకు నష్టం జరిగిందని పేర్కొన్నారు.

గేదె దూడలకు పరిహారం

పోలవరం, న్యూస్‌టుడే: ఇటుకలకోట గ్రామంలో పులి దాడిలో చనిపోయిన రెండు గేదె దూడలకు అటవీశాఖ అధికారులు మొదటి విడతగా రూ.16,500 నష్టపరిహారం చెక్కు దూడల యజమానికి మంగళవారం అందజేశారు.

కర్మాగారం కాలుష్యంపై విచారణ

జంగారెడ్డిగూడెం పట్టణం, న్యూస్‌టుడే: జంగారెడ్డిగూడెం పట్టణంలోని నవభారత్ ఆయిల్ పామ్ కర్మాగారం వల్ల పంటలు, పర్యావరణానికి కలుగుతున్న నష్టంపై కాలుష్య నియంత్రణ మండలికి అందిన ఫిర్యాదు మేరకు ఏలూరు పర్యావరణ విభాగం సహాయ ఇంజినీర్ సంధ్య మంగళవారం విచారణ చేపట్టారు. ఈ మేరకు జంగారెడ్డిగూడెం పట్టణంలోని కర్మాగారం వెనుక ప్రాంతంలోని బొప్పన మోహన్‌మురళీ, పరిసర ప్రాంతాల్లోని రైతులతో ఆమె మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం పొగాకు, మొక్కజొన్న, పుచ్చపాదులపై కర్మాగారం నుంచి వెలువడుతున్న నల్ల రంగు బూడిదను ఆమె స్వయంగా పరిశీలించారు. బూడిద దాటికి పడుతున్న ఇబ్బందులను పలువురు కూలీలు సంధ్య దృష్టికి తీసుకొచ్చారు. కాలుష్యం కారణంగా పంటలు సక్రమంగా పండటం లేదంటూ రైతులు వాపోయారు. కాలుష్య నియంత్రణ మండలికి రైతు బొప్పన మోహన్‌మురళీ ఫిర్యాదు చేయడంతో విచారణకు వచ్చామని.. సేకరించిన సమాచారాన్ని ఉన్నతాధికారులకు నివేదిస్తామని సంధ్య తెలిపారు.

పొగాకు తోటను పరిశీలిస్తున్న సంధ్య

యువకుడి అదృశ్యం

జంగారెడ్డిగూడెం పట్టణం, న్యూస్‌టుడే: యువకుడు అదృశ్యంపై జంగారెడ్డిగూడెం పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. ఎస్సై వీరప్రసాద్ కథనం ప్రకారం.. జంగారెడ్డిగూడెం పట్టణం రామచంద్రపురానికి చెందిన బోగీల సత్యనారాయణ (19) సర్వీసింగ్ చేస్తూ జీవనం సాగిస్తుంటాడు. ఈ నెల 16న ద్విచక్రవాహనంపై బయటకు వెళ్లిన యువకుడు తిరిగి రాలేదు. దీంతో అతడి తల్లి అంజలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై చెప్పారు.

మద్యం తాగి బండి నడిపినందుకు జరిమానా

జంగారెడ్డిగూడెం పట్టణం, న్యూస్‌టుడే: జంగారెడ్డిగూడెం పోలీస్‌స్టేషన్ పరిధిలో మద్యం తాగి వాహనాలు నడిపి పట్టుబడ్డ ఇద్దరిని న్యాయస్థానంలో హాజరుపర్చగా జంగారెడ్డిగూడెం ప్రత్యేక కోర్టు ద్వితీయ శ్రేణి న్యాయమూర్తి నక్కా వెంకటేశ్వర్లు ఒక్కొక్కరికీ రూ.10వేలు చొప్పున మంగళవారం జరిమానా విధించారు.

జూద స్థావరంపై దాడి

జంగారెడ్డిగూడెం పట్టణం, న్యూస్‌టుడే: జంగారెడ్డిగూడెం మండలం శ్రీనివాసపురం గ్రామ శివారులో నిర్వహిస్తున్న జూద స్థావరంపై పోలీసులు మంగళవారం దాడిచేసి ఆరుగురిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై వీరప్రసాద్ తెలిపారు.

ఆదివాసీ పోరాటానికి అండ

పోలవరం, న్యూస్‌టుడే: అడవుల నుంచి ఆదివాసీలను గెంటేసి కార్పొరేట్ సంస్థలకు సామ్రాజ్య వాదులకు అప్పజెప్పడానికి పూనుకున్న పాలకుల విధానాలపై ఐక్యంగా పోరాడాలని మన్యం గిరిజన సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా మహాసభలో పలువురు వక్తలు పిలుపు ఇచ్చారు. పోలవరం మండలం మనుగోపుల గ్రామంలో రెండు రోజుల పాటు జరిగే జిల్లా మహాసభలకు మంగళవారం మన్యం గిరిజన సంఘ నాయకులు సవలం రాంబాబు అధ్యక్షత వహించారు. తొలుత కారం పార్వతి స్తూపం వరకు గ్రామంలో భారీ ప్రదర్శన నిర్వహించారు. రైతు కూలీ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎస్.ఝాన్సీ పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన సభలో వ్యవసాయశాఖ మాజీ మంత్రి, సంయుక్త కిసాన్‌మోర్చ కన్వీనర్ వడ్డే శోభనాద్రీశ్వరరావు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి ఇప్పటి వరకు ఆరు కోట్ల ఎకరాల అడవిని కార్పొరేట్లకు అప్పగించారన్నారు. ఆదివాసీ హక్కుల రక్షణ పోరాటానికి అండగా ఉంటానని వడ్డే ప్రకటించారు. ఈ కార్యక్రమంలో రైతుకూలీ సంఘం రాష్ట్ర కార్యదర్శి డి.వర్మ, మన్యం గిరిజన సంఘం గౌరవ అధ్యక్షుడు ఇల్లా రామిరెడ్డి, కార్యదర్శి కుంజరం రామారావు తదితరులు పాల్గొన్నారు. కళాకారుల నృత్యాలు, ఎర్రజెండాలతో గ్రామం ఎరుపు సంతరించుకుంది.

ప్రదర్శనలో నాయకులు

జన్మదిన శుభాకాంక్షలు
మాకు అత్యంత ఆప్తులు, ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ శ్రీ ముళ్ళపూడి బాపిరాజు గార్కి జన్మదిన శుభాకాంక్షలు.
శ్రీ ముళ్ళపూడి బాపిరాజు గారు జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ ఉమ్మడి ప.గో.జిల్లా, ఏలూరు
కప్పలగుంట గ్రామ టీడీపీ నాయకులు
చాట్రాది శ్రీనివాసరావు గ్రామ టీడీపీ అధ్యక్షులు
సంకురాత్రి శ్రీనివాసరావు Ex. గ్రామ టీడీపీ అధ్యక్షులు
గంజి కాశీవిశ్వనాథం
వేగి తుకారామచంద్రమూర్తి
జంగా ప్రసాద్‌రెడ్డి Ex. వైస్ MPP
తుంపాటి నాగప్రసాద్
తుంపాటి సాయికొండల వరప్రసాద్
సంకురాత్రి నాగసతీష్‌బాబు
వెల్లి వెంకటేశ్వరరావు
Y.G.V.V. సత్యనారాయణ (గంగాధర్)
యాదర రమేష్
తుంపాటి జస్వంత్‌చౌదరి

(c) eenadu

నూజివీడు

• నూజివీడు • కైకలూరు

కొల్లేరుపై అవగాహన అవసరం

పక్షుల సంరక్షణ కేంద్రంలో డిగ్రీ కళాశాల విద్యార్థులు

ఆటపాక(కైకలూరు), న్యూస్‌టుడే: మానవాళి మనుగడకు అవసరమైన అరుదైన చిత్తడి నేలల ప్రాంతం కొల్లేరు సరస్సుపై విద్యార్థులకు అవగాహన అవసరమని వైల్డ్‌లైఫ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపల్ ఎ.కేదారి, చరిత్ర విభాగాధిపతి ఎం.హరిప్రసాద్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు బోధన ప్రణాళికలో భాగంగా మంగళవారం విద్యార్థులతో కలిసి ఆటపాక పక్షుల సంరక్షణ కేంద్రాన్ని సందర్శించారు. కొల్లేరు ప్రాముఖ్యం, ప్రతియేటా ఇక్కడకు వచ్చే వలస పక్షుల జీవన విధానం, కొల్లేరు ప్రస్తుత తదితరాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అధ్యాపకులు వేదాంతం, వీర్రాజు, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆదిలోనే గుర్తించు.. ఆరోగ్యంగా జీవించు..

వివరిస్తున్న జగన్మోహనరావు, ఆనంద్ కుమార్

ఆగిరిపల్లి, న్యూస్‌టుడే: అనారోగ్యానికి క్యాన్సర్ ప్రమాదాన్ని నివారించవచ్చని, ఆదిలోనే గుర్తించడం ద్వారా ఆరోగ్యంగా జీవించవచ్చని ప్రభుత్వ వైద్యాధికారి జె.జగన్మోహనరావు, ఎంఈవో కె.ఆనంద్ కుమార్‌లు తెలిపారు. ఏపీ వాలంటరీ హెల్త్ ఆర్గనైజేషన్ సహకారంతో శారద స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఆగిరిపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మంగళవారం క్యాన్సర్ నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఒక్కరు ఆరోగ్యకర జీవనశైలిని పాటించడం ద్వారా క్యాన్సర్‌కు దూరంగా ఉండవచ్చని సూచించారు. కార్యక్రమంలో సంస్థ నిర్వాహకురాలు పి.శారద, ఆనంద మహిమ మండలి డైరెక్టర్ జి.సంధ్య, వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

సబ్ జూనియర్ పోటీల్లో ప్రతిభ

సత్తా చాటిన విద్యార్థినులతో ఉపాధ్యాయులు

మండవల్లి, న్యూస్‌టుడే: ముదినేపల్లి మండలం గురజలో నిర్వహించిన 85వ బాలికల సబ్‌జూనియర్ పోటీల్లో మండవల్లి మండలం లింగాల జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు సత్తా చాటినట్లు హెచ్‌ఎం రవికుమార్ తెలిపారు. షటిల్ పోటీల్లో నియోజకవర్గ స్థాయిలో ప్రథమ స్థానం, కబడ్డీలో ద్వితీయ స్థానం సాధించారని వివరించారు. సత్తాచాటిన విద్యార్థులను, పీడీ సుబ్బారావును, సర్పంచి బోయిడి ధనలక్ష్మి సురేష్, వెంకట శాస్త్రులు, ఉపాధ్యాయులు అభినందించారు. క్రీడల్లో మరింతగా పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

నూరు శాతం ఈ-పంట నమోదు పూర్తి చేయాలి: డీఏవో

పరిశీలిస్తున్న హబీబ్ బాషా

నూజివీడు, చాట్రాయి, న్యూస్‌టుడే: జిల్లాలో ఈ నెల 20లోగా నూరు శాతం ఈ-పంట నమోదు పూర్తి చేయాలని జిల్లా వ్యవసాయాధికారి హబీబ్ బాషా స్పష్టం చేశారు. చాట్రాయి మండలం చిన్నంపేటలో ఈ-పంట నమోదును మంగళవారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఇక్కడ 80 శాతం పంట నమోదైనట్లు గుర్తించారు. ప్రతి రైతు విశిష్ట సంఖ్య నమోదు చేసుకోవాలని, కిసాన్ డ్రోన్ యాప్‌లో నమోదుతో ఉబరైజేషన్ ద్వారా డ్రోన్ సేవలు రైతులు వినియోగించుకోవాలని సూచించారు. మొక్కజొన్న, వరి రైతులకు యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏవో బి.శివశంకర్, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ఉగాది నాటికి టిడ్కో ఇళ్ల పంపిణీ!

వేగం అందుకున్న పనులు

నూజివీడు రూరల్, న్యూస్‌టుడే

నూజివీడులో రూ.కోట్లు వెచ్చించి ప్రారంభించిన టిడ్కో గృహ నిర్మాణాలు గత ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా నిలిచిపోయాయి. వేలాది మంది లబ్ధిదారులు ఇళ్ల కోసం ఎదురు చూస్తూ ఇబ్బందులు పడ్డారు. ఎట్టకేలకు కూటమి ప్రభుత్వం తమ కలల ప్రాజెక్టు అయిన టిడ్కో గృహాలను పేద, మధ్యతరగతి వారికి అందించాలని కంకణం కట్టుకుంది. అనేక సమీక్షల అనంతరం ప్రాజెక్టు పనులను గుత్తేదారులతో పునఃప్రారంభం చేయించి పనులను వేగవంతం చేసింది. ఉగాది నాటికి టిడ్కో ఇళ్లను అందించాలని అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. నూజివీడులోని టిడ్కో గృహ సముదాయంలో వారం పది రోజులుగా పనులు వేగవంతమయ్యాయి. భవనాలకు రంగులు వేయడం, లోపల వివిధ రకాల మెటీరియల్ ఫిట్టింగ్‌లు తదితర పనులు చురుకుగా సాగుతున్నారు. 300 ఎస్‌ఎఫ్‌టీ గృహాలు 864, 365ఎస్‌ఎఫ్‌టీ గృహాలు 864, 430 ఎస్‌ఎఫ్‌టీ గృహాలు 912 మందికి కేటాయించారు. ప్రస్తుతం పలువురు దరఖాస్తుదారులు మృతి చెందగా, మరి కొందరు తమకు ఈ గృహాలు వద్దని తాము కట్టిన నగదును తిరిగి తమ ఆకౌంట్లకు జమ చేయాలని విజ్ఞప్తులు చేశారు. వీరి విజ్ఞప్తులు ఏ విధంగా పరిష్కరిస్తారో వేచి చూడాల్సిందే.

నూజివీడులో సిద్ధమవుతున్న గృహాలు

గతంలో నిధుల కొరత..

గతంలో నిధుల కొరత పరిపాలన లోపాలు, సమస్యలు లేకపోవడం వంటి కారణాలతో టిడ్కో గృహాల నిర్మాణం నిలిచిపోయింది. దీంతో వందల కుటుంబాలు ఆశలు వదులుకున్నాయి. కూటమి ప్రభుత్వం, మంత్రి కొలుసు పార్థసారథి ఈ విషయంపై అనేక సమావేశాల అనంతరం ఓ దారికి తీసుకువచ్చారు. విద్యుత్తు, తాగు నీరు, రహదార్ల వంటి మౌలిక వసతుల పనులు కూడా చేపట్టారు. అధికారులు ప్రాజెక్టు పర్యవేక్షణతో పనుల పురోగతిని పరిశీలిస్తున్నారు. టిడ్కో ఇళ్ల నిర్మాణం, రంగులు తదితర పనులు పునః ప్రారంభమయ్యాయని తెలుసుకున్న లబ్ధిదారులు తమ ఇళ్లను చూసుకుని త్వరలోనే గృహ ప్రవేశం అంటూ మురిసిపోతున్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

10 AM to 1 PM

నూజివీడు: 80085 74698	ఆగిరిపల్లి: 9121229090
ముసునూరు: 93983 81268	చాట్రాయి: 8008574700
కైకలూరు: 73060 88555	మండవల్లి: 8106099008
కలిదిండి: 90594 84862	ముదినేపల్లి: 8008574693

కైకలూరు, న్యూస్‌టుడే: మండలంలోని పందిరిపల్లిగూడెం రామాలయం వీధిలో సిమెంటు రోడ్డుపై మురుగునీరు నిలిచి రాకపోకలకు ఇబ్బందిగా మారింది. దీనిపై స్థానికుడు సహదేవుడు 'ఈనాడు' 'మేమున్నాం.. మీకు తోడుగా' ద్వారా సమస్యను పంచాయతీ కార్యదర్శి ప్రసాద్ దృష్టికి తీసుకువెళ్లారు. స్పందించిన ఆయన డ్రెయినేజీకి పక్క బోదెలు ఏర్పాటు చేయించి సమస్య పరిష్కరించారు.

చదవడం, రాయడం తప్పనిసరిగా రావాలి

చిన్నారి సామర్థ్యాన్ని పరీక్షిస్తున్న ఎంపీడీఓ, ఎంఈవో

కలిదిండి, న్యూస్‌టుడే: చదవడం, రాయడం ప్రతి విద్యార్థికి తప్పనిసరిగా నేర్పించాలని ఎంపీడీఓ పందని ఉమామహేశ్వరరావు ఉపాధ్యాయులకు సూచించారు. ఎంఈవో అనిశెట్టి శ్రీనివాసుతో కలిసి కలిదిండి, పోతుమర్రు పంచాయతీ పరిధిలోని ప్రాథమిక బడులను మంగళవారం పరిశీలించారు. విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించి ఆ వివరాలు నమోదు చేసుకున్నారు. చదువులో వెనుకబడి ఉన్న చిన్నారులపై ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని సూచించారు.

డంపింగ్ యార్డ్ పరిశీలన

సూచనలు ఇస్తున్న ఆర్డీ నాగ నరసింహారావు

నూజివీడు రూరల్, న్యూస్‌టుడే: డంపింగ్ యార్డును మున్సిపల్ అర్బన్ ఆర్డీ సీహెచ్ నాగ నరసింహారావు మంగళవారం పరిశీలించారు. డంపింగ్ యార్డుకు వస్తున్న చెత్త, ఎంత, మొత్తాన్ని ఏ విధంగా ఎక్కడి తరలిస్తున్నారు. తడి, పొడి చెత్తను వేర్వేరు చేస్తున్నారా అంటూ ఆరా తీశారు. మెటీరియల్ రికవరీ ఫెసిలిటీ యూనిట్ ఏర్పాటు తదితరాలపై పలు సూచనలు ఇచ్చారు. అనంతరం పురపాలక సంఘ కార్యాలయంలో సిబ్బందితో కొద్ది సేపు సమావేశమయ్యారు. వివిధ అంశాల పైన ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కొర్రపాటి పీరయ్య, ఆర్వో అప్పినేని నరసింహారావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సంతోష్, టీపీవో వెంకటేశ్వరరావు, ఏఈ వంశీ అభిషేక్ తదితరులు పాల్గొన్నారు.

భోగేశ్వరుడికి చక్రస్నానం

పల్లకీ మోస్తున్న ఆలయాధికారులు, భక్తులు

కలిదిండి, న్యూస్‌టుడే: మహా శివరాత్రి ఉత్సవాల్లో భాగంగా కలిదిండిలోని పార్వతీ సమేత పాతాళ భోగేశ్వరస్వామికి మంగళవారం చక్ర స్నానమాచరించారు. అనంతరం పూర్ణాహుతి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ ఈవో శింగనపల్లి శ్రీనివాసరావు, పాలక మండలి సభ్యులు పాల్గొన్నారు.

పరీక్ష కిట్ల అందజేత

ఆగిరిపల్లి, న్యూస్‌టుడే: విద్యార్థి జీవితంలో పదో తరగతి కీలకమని, ప్రతి ఒక్కరు కష్టపడి చదివి ఉన్నత స్థానంలో నిలవాలని పాస్టర్ కాటూరి జాన్ సునీల్ తెలిపారు. ఆగిరిపల్లి మండలం తోటపల్లి మెట్రో పాలిటన్ మిషన్ చర్చిలో మంగళవారం పదో తరగతి విద్యార్థులకు పరీక్ష కిట్లు అందజేశారు. మంచి మార్కులు సాధించేందుకు పలు సూచనలు చేశారు. పరీక్షల సమయంలో మంచి ఆహారం తీసుకోవాలని, చరవాణి, టీవీలకు దూరంగా ఉండాలని, ఒత్తిడి లేకుండా చూడాలని, పరీక్షలు బాగా రాసి మంచి మార్కులతో ఉత్తీర్ణులు కావాలని సూచించారు.

శిథిలావస్థలో.. చిన్నారుల బడి

ముసునూరు, న్యూస్‌టుడే: చిన్నారులకు విద్యా బుద్ధులు నేర్పి.. గర్భిణులు, బాలింతలకు పోషకాహారం అందించాలనే లక్ష్యంతో ఏర్పాటు చేసిన అంగన్‌వాడీ కేంద్రాలు ప్రమాదకరంగా మారాయి. ముసునూరు మండలంలో పలు చోట్ల అంగన్‌వాడీ కేంద్రాలు అరకొర వసతుల మధ్య కొనసాగుతున్నాయి. ఉన్న భవనాలు కొన్ని శిథిలం కాగా మరికొన్ని అద్దె భవనాలు, ఇరుకు గదుల్లో సాగుతున్నాయి. దీంతో చిన్నారులు, గర్భిణులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముసునూరు మండలం లోపూడిలో ఏళ్ల కిందట నిర్మించిన అంగన్‌వాడీ కేంద్రం శిథిలావస్థకు చేరింది. ఇక్కడ పదిమంది చిన్నారులు ఉన్నారు. భవనం శ్లాబు పెచ్చులూడి ఇనుప చువ్వలు బయటకు కనిపిస్తున్నాయి. ఇలా శిథిలావస్థకు చేరిన భవనంలో చిన్నారులను కూర్చోబెట్టి కేంద్రాలను నడుపుతుంటే ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని చిన్నారుల తల్లిదండ్రులు భయాందోళన చెందుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి భవనానికి మరమ్మతులు చేపట్టాలని చిన్నారుల తల్లిదండ్రులు కోరుతున్నారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాజ్యలక్ష్మి వద్ద ప్రస్తావించగా నూతన భవన నిర్మాణానికి ప్రతిపాదనలు పంపామన్నారు.

మురుగు చింత తీరేదెన్నడో..

కైకలూరు, న్యూస్‌టుడే: కైకలూరు వైఎస్సార్ కరకట్ట కాలనీలో నివాసాల చెంత మురుగు నీరు తిష్ఠ వేసింది. కొన్నేళ్లుగా డ్రెయినేజీ పూడిక తీయక పోవడం.. కొన్నిచోట్ల అసంపూర్తి డ్రెయినేజీ నిర్మాణాలతో కాలనీల వాసులు నిత్యం కష్టాలు ఎదుర్కొంటున్నారు. మురుగు నీరు ముందుకు కదిలే మార్గం లేక భరించలేని దుర్గంధం వెదజల్లుతోందని ప్రజలు గగ్గోలు పెడుతున్నారు. పంచాయతీ అధికారులకు విన్నవిస్తే నామమాత్రపు చర్యలతో సరిపెడుతున్నారు తప్ప శాశ్వత పరిష్కారం చూపలేక పోతున్నారని స్థానికుల వాదన. వర్షం వస్తే మురుగు నివాసాల్లోకి చేరి రోజుల తరబడి ఉండటంతో అందులోనే రాకపోకలు చేస్తున్నామని వాపోతున్నారు. దీనిపై పంచాయతీ ఈవో ఫణి రాజ కుమారిని సంప్రదించగా సమస్యను పరిశీలించి పరిష్కరించేలా చూస్తామన్నారు.

ట్రాఫిక్ చక్రబంధం

ముదినేపల్లి, న్యూస్‌టుడే: సింగరాయపాలెం సెంటరులో నిరంతరం ట్రాఫిక్ అంతరాయం ఏర్పడుతుంది. నిత్యం రద్దీగా ఉండే ఈ సెంటరులో భారీ వాహనాలు వచ్చినా, ఎదురెదురుగా వాహనాలు ఒకేసారివచ్చినా పావు గంట నుంచి అర గంటపైనే వాహనాలు నిలిచిపోవాల్సి వస్తుంది. ప్రధానంగా బంటుమిల్లి, కలిదిండి, చెన్నూరు, ముదినేపల్లి నుంచి వచ్చే నాలుగు రోడ్ల కూడలి సింగరాయపాలెం సెంటరు. నాలుగు రోడ్లలో ఆక్రమణలు పెరిగిపోవడంతో దుకాణాల్లో కొనడానికి వచ్చిన రహదారిపైనే పార్కింగ్ చేయాల్సి వస్తోంది. ఆక్రమణలు తొలగిస్తామని పలుమార్లు అధికారులు ప్రకటించినా, రాజకీయనాయకుల ఒత్తిడితో వెనుకడుగు వేస్తున్నారు. అలాగే మలుపు వద్దే భీమవరం, బంటుమిల్లి వెళ్లే బస్సులు ఆగడంతో తరచూ ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతోంది. దీనిపై ఎస్సై వీరభద్రరావును సంప్రదించగా సింగరాయపాలెంలో ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా సిబ్బందిని ఏర్పాటు చేశామన్నారు. ఆక్రమణలపై దృష్టి సారించి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని వివరించారు.

పూర్వ విద్యార్థుల చేయూత

హెచ్‌ఎంకు చెక్కు అందిస్తున్న సర్పంచి ఏసుబాబు

చినతాడినాడ (కలిదిండి), న్యూస్‌టుడే: చినతాడినాడ జడ్పీ ఉన్నత పాఠశాలలో రాత్రి 9.30 గంటల వరకు బడిలో చదువుకుంటున్న పదో తరగతి విద్యార్థులకు అల్పాహారం అందించడానికి పూర్వ విద్యార్థులు ముందుకు రావడం సంతోషంగా ఉందని హెచ్‌ఎం దామోదర రావు తెలిపారు. కలిదిండి జడ్పీ ఉన్నత పాఠశాలలో 1997-98 విద్యాసంవత్సరంలో పదో తరగతి చదువుకున్న విద్యార్థులు రూ.10 వేల చెక్కును సర్పంచి గండికోట ఏసుబాబు చేతుల మీదుగా హెచ్‌ఎంకు మంగళవారం అందించారు. తనతో పాటు చదువుకున్న మిత్రులు.. తాను హెచ్.ఎం.గా పని చేస్తున్న బడిలోని చిన్నారులకు ఈ సాయం చేయడం సంతోషంగా ఉందని దామోదర రావు తెలిపారు. విద్యార్థులు ఇష్టపడి చదువుకుని మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలని దాతలు ఆకాంక్షించారు.

నువ్వుల సాగుతో మంచి లాభాలు

రైతులతో శాస్త్రవేత్తలు ఫణికుమార్, నాగేంద్రబాబు

నూజివీడు రూరల్, న్యూస్‌టుడే: రైతులు సార్వా వరి పంట తరువాత నువ్వులు సాగు చేస్తే ప్రయోజనం ఉంటుందని ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు కె.ఫణికుమార్, ఎస్.నాగేంద్రబాబు తెలిపారు. మంగళవారం నూజివీడు మండలంలోని తూర్పు దిగవల్లిలో షెడ్యూల్డ్ కులాల ఉప ప్రణాళిక కింద నువ్వుల పంట సాగుపై రైతు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్తలు మాట్లాడుతూ విలువ ఆధారిత ఉత్పత్తులను మార్కెటింగ్ చేసుకుని ఆర్థికంగా పరిపుష్టి సాధించవచ్చని, లాభదాయకంగా ఉంటుందని రైతులకు సూచించారు. ఎకరా వరి పంటకు కావాల్సిన నీటితో ఐదు ఎకరాల నువ్వు పంటను సాగు చేయవచ్చన్నారు. ఈ విధానంలో ఒక రూపాయి ఖర్చుతో రూ.3 లాభం సాధించవచ్చన్నారు. నూజివీడు మండల వ్యవసాయాధికారి పి.చెన్నారావు, డీఆర్సీ ఏవో ఉష, తదితరులు పాల్గొన్నారు.

మొక్కజొన్నలో సస్యరక్షణ చర్యలతో మేలు.. చాట్రాయి, న్యూస్‌టుడే: మొక్కజొన్నలో సస్యరక్షణ చర్యలతో మంచి దిగుబడులు సాధించవచ్చని మండల ఏవో శివశంకర్ తెలిపారు. చాట్రాయి మండలం తుమ్మగూడెం, జయపురం గ్రామాల్లో మంగళవారం 'పొలం పిలుస్తోంది' నిర్వహించారు. ఎరువుల యాజమాన్య పద్ధతులు, ఈ-పంట నమోదుపై వివరించారు.

మలుపులు.. ప్రమాదాలకు నెలవులు

★ నిత్యం ప్రయాణికులకు అవస్థలు
★ ఏళ్లుగా తప్పని ఇబ్బందులు

మండవల్లి, న్యూస్‌టుడే

ప్రధాన రహదారుల్లోని మలుపులు ప్రమాదాలకు నిలయాలుగా మారుతున్నాయి. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా మలుపుల వద్ద రహదారులు విస్తరించకపోవడం, జంగిల్ క్లియరెన్స్ లేకపోవడంతో ప్రమాదాలు నిత్యకృత్యంగా మారుతున్నాయి. ఆ ప్రాంతాల్లో ఎదురెదురుగా వచ్చే వాహనాలు కనిపించకపోవడం వేగాన్ని నియంత్రించలేకపోవడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి.

ఇదీ పరిస్థితి.. భీమవరం, పాలకొల్లు, నర్సపురం ప్రాంతాల నుంచి విజయవాడ వెళ్లేందుకు అనువుగా జాతీయ రహదారి 165ను అభివృద్ధి చేశారు. మండవల్లి మండలంలోని గన్నవరం తరుగుమూల, లోకుమూడి ఏలూరు రోడ్డు ప్రమాదకరమైన మలుపులు నిత్యం ప్రమాదాలకు నెలవుగా ఉంటున్నాయి. ఏలూరు వైపునకు వెళ్లేటప్పుడు కొవ్వాడలంక మలుపు కాచుకుని కూర్చుంటుంది. కొత్త వాహనాలు ఈ ప్రాంతానికి వస్తే ఇబ్బందులు తప్పడం లేదు. వాహనాలు ఏమాత్రం వేగంతో వచ్చినా మలుపుల్లో వేగాన్ని నియంత్రించలేక పక్కకు పల్టీ కొడుతున్నాయి.

కొవ్వాడలంకలో..

సంఘటనలు ఇవీ..

- కొర్లపాడు వద్ద సున్నం లారీ బోదెలోకి పల్టీ కొట్టింది.
- కొర్లపాడు మలుపు వద్ద ఎదురెదురుగా వస్తున్న లారీ చేపల వ్యాన్ ఢీకొనడంతో డ్రైవర్లకు స్వల్ప గాయాలయ్యాయి.
- తరుగుమూల వేగాన్ని నియంత్రించలేక టాటా ఏస్ వాహనం ముళ్ల పొదల్లోకి దూసుకుపోయింది.
- కొవ్వాడలంక మలుపు వద్ద వ్యాను, లారీ ఢీకొన్నాయి. త్రుటిలో ప్రాణాపాయం తప్పింది.
- ద్విచక్రవాహనాలు ఢీ కొనడంతో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి.

ఇటీవల దెబ్బతిన్న కారు

నివారణకు ప్రత్యేక చర్యలు.. ప్రమాదాలు జరిగే ప్రాంతాలలో ప్రత్యేక సూచిక బోర్డులు, వేగ నియంత్రికలను ఏర్పాటు చేశాం. మలుపుల వద్ద ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించే వీలుగా జంగిల్ క్లియర్ చేస్తున్నాం. జాతీయరహదారి 165 విస్తరణ పూర్తయితే మండవల్లి, తరగుమూల మలుపులు ఉండవు.
- రామచంద్రరావు, ఎస్ఐ, మండవల్లి

తెదేపా సీనియర్ నాయకుడి మృతికి సంతాపం

పద్మనాభం(పాత చిత్రం)

ముసునూరు, న్యూస్‌టుడే: ముసునూరు మండలం వేల్పుచర్లకు చెందిన తెదేపా సీనియర్ నాయకుడు మానం పద్మనాభం(85) మంగళవారం మృతిచెందారు. ఆయన తెదేపా వ్యవస్థాపకుడు ఎన్టీఆర్ పార్టీ స్థాపించిన నాటి నుంచి పార్టీలో ఉంటూ గ్రామానికి అనేక సేవలందించారు. ఈయన దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్‌కు పెద్ద మామ. పద్మనాభం భౌతికకాయాన్ని చింతమనేని, పలువురు నాయకులు సందర్శించి నివాళులర్పించారు.

సిలువ గట్టు పుణ్య క్షేత్ర పతాకావిష్కరణ

నూజివీడు రూరల్, న్యూస్‌టుడే: సిలువ గట్టు పుణ్య క్షేత్ర జాతర ఈ నెల 17 నుంచి 25వ తేదీ వరకు జరగనున్న నేపథ్యంలో మంగళవారం సాయంత్రం పతాక ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఫా.డి.సతీశ్, ఎల్.జయరాజు పర్యవేక్షణలో ఈ కార్యక్రమం జరిగింది. రెవ.ఫా. రాజప్ప, రె.ఫా.బి.కిరణ్, రెవ.ఫా.కె.విజయరాజు పాల్గొని పతాకాన్ని ఆవిష్కరించారు. నేటి నుంచి సిలువ గట్టు జాతరలో భాగంగా నవ దిన జపమాల, ఆధ్యాత్మిక కార్యక్రమాలను ప్రారంభించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో పుణ్య క్షేత్ర కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

జూద శిబిరంపై పోలీసుల దాడి

మండవల్లి, న్యూస్‌టుడే: మండలంలోని చావలిపాడు గ్రామ శివారులో జూద శిబిరం నిర్వహిస్తున్నట్లు వచ్చిన సమాచారంతో మండవల్లి ఎస్సై రామచంద్రరావు పోలీసు సిబ్బందితో కలిసి మంగళవారం దాడి చేశారు. ఇందులో జూదం ఆడుతున్న అయిదుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.3,440 స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

సినిమాలు

నూజివీడు పట్టణం

సత్యనారాయణ	ఫంకీ
సత్యనారాయణ మినీ	....
ద్వారక సినిమాస్ స్క్రీన్ 1	కపుల్ ఫ్రెండ్లీ
ద్వారక సినిమాస్ స్క్రీన్ 2	మన శివశంకరవరప్రసాద్ గారు
ద్వారక సినిమాస్ స్క్రీన్ 3	మనసంతా నువ్వే
ఆగిరిపల్లి: శ్రీఅను డీలక్స్	మన శివశంకరవరప్రసాద్ గారు
కైకలూరు: శ్రీవిజయలక్ష్మి జీ	కపుల్ ఫ్రెండ్లీ
మాగంటి సినిమాస్	సీతా పయనం
శ్రీవెంకటరమణ సినిమాస్	ఫంకీ
ముదినేపల్లి: పూర్ణిమ	ఫంకీ

పన్నుల వసూలు వేగవంతం చేయాలి

నూజివీడు రూరల్, న్యూస్‌టుడే: మండలంలోని అన్ని గ్రామాల్లో ఇంటి పన్నుల వసూళ్లను వేగవంతం చేయాలని నూజివీడు ఎంపీడీవో చెన్నా రాఘవేంద్రనాథ్ సచివాలయ సిబ్బంది, కార్యదర్శులను ఆదేశించారు. కలెక్టరు, సబ్ కలెక్టరు నిత్యం పన్నుల వసూళ్లపై సమీక్షిస్తున్న నేపథ్యంలో కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. మంగళవారం ఆయన ఫోన్ కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతూ నూజివీడు మండలంలో రూ.3.46 కోట్ల డిమాండ్ ఉండగా కేవలం రూ.1.46 కోట్లు మాత్రమే వసూలైందన్నారు. ముఖ్యంగా గొల్లపల్లిలో రూ.42.76 లక్షలకు రూ. 39.97లక్షలు, మీర్జాపురంలో రూ.37.95లక్షలకు రూ.18.29లక్షలు వసూలు చేయాల్సి ఉందన్నారు. ఇదే విధంగా మిగిలిన గ్రామాల పరిస్థితి ఉందని తెలిపారు. పన్ను వసూలైతే గ్రామాల్లో వీధి దీపాలు, రక్షిత మంచినీటి పథకాల నిర్వహణ, సిబ్బంది జీతాలు తదితరాలకు వినియోగించాల్సి ఉందన్నారు.

కైకలూరు, న్యూస్‌టుడే: ఇంటి పన్ను వసూళ్లు వేగవంతం చేయాలని కైకలూరు పంచాయతీ ఈవో ఫణి రాజకుమారి గ్రామ సచివాలయాల సిబ్బందికి సూచించారు. మంగళవారం స్థానిక పంచాయతీ కార్యాలయంలో 5 గ్రామ సచివాలయాల కార్యదర్శులు, వీఆర్వోలు,సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఇంటి, నీటి పన్నుల రూపంలో పంచాయతీ పరిధిలో సుమారు రూ.కోటి వసూలు కావాల్సి ఉందన్నారు. ప్రభుత్వ సూచనలతో ప్రతి పైసా ఆన్‌లైన్‌లోనే చెల్లింపులు చేసేలా చూడాలన్నారు. గ్రామాల్లో అభివృద్ధి పనులు పంచాయతీలే స్వతహాగా నిర్వహించేందుకు సకాలంలో పన్నులు చెల్లించి ప్రజలు తమవంతు సహకారం అందించాలని సూచించారు.

పాఠశాలల్లో స్కౌట్స్, గైడ్స్ గ్రూపుల ఏర్పాటు

మాట్లాడుతున్న ఎంఈవో జమలయ్య

నూజివీడు రూరల్, న్యూస్‌టుడే: నూజివీడు పట్టణ మండల పరిధిలోని అన్ని ప్రభుత్వ ప్రయివేటు పాఠశాల్లో స్కౌట్స్ అండ్ గైడ్స్ గ్రూపులను ఏర్పాటు చేయాలని నూజివీడు ఎంఈవో-2 ఎస్. జమలయ్య ఆదేశించారు. మంగళవారం నూజివీడులోని ఎస్ఆర్ఆర్ పాఠశాలలో పట్టణ, మండల పరిధిలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో దేశభక్తి, నాయకత్వ లక్షణాలు పెంపొందించేందుకు ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల్లో 32 మంది విద్యార్థులు చొప్పున తప్పనిసరిగా గ్రూప్ ఏర్పాటు చేయాలన్నారు. ఎంఈవో1 దేవ వర ప్రసాదరావు, ఎస్ఆర్ఆర్ పాఠశాల ప్రధానోపాధ్యాయిని డీవీఎల్ పుష్పలత, రిసోర్స్ పర్సన్లు, స్కౌట్స్ మాస్టర్లు గైడ్ లీడర్లు పాల్గొన్నారు.

కోరుకొల్లు (కలిదిండి), న్యూస్‌టుడే : విద్యార్థుల్లో క్రమశిక్షణ, సేవా భావం పెంపొందించే దిశగా ప్రభుత్వ, ప్రైవేటు బడుల్లో స్కౌట్ అండ్ గైడ్స్‌ను ప్రవేశ పెట్టనున్నట్లు ఎంఈవో -1 టేకు రామలక్ష్మి తెలిపారు. కోరుకొల్లు జడ్పీ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులకు స్కౌట్ అండ్ గైడ్స్‌పై ఒక్కరోజు శిక్షణ, అవగాహన కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. మండలంలోని అన్ని యాజమాన్య బడుల నుంచి ఇద్దరు ఉపాధ్యాయులు దీనికి హాజరయ్యారు. ప్రతి బడిలోనూ 6-9 తరగతులకు చెందిన 32 విద్యార్థులను గ్రూప్‌గా ఎంపిక చేయాలన్నారు. వీళ్లలో బాలురు 16, బాలికలు 16 మంది ఉండాలని సూచించారు. వీరికి ప్రత్యేక శిక్షణ ఇస్తారని తెలిపారు. వీలైనంత త్వరగా ప్రతి పాఠశాల నుంచి విద్యార్థుల వివరాలు అందించాలన్నారు. హెచ్‌ఎం ఎన్ రాము, సీఆర్పీ నాగరాజు పాల్గొన్నారు.

ఆల్బెండజోల్ మాత్రలతో రక్తహీనత దూరం

మాత్రలు వేస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో

నూజివీడు రూరల్, న్యూస్‌టుడే: తల్లిదండ్రులు విధిగా తమ పిల్లలకు నులిపురుగుల నివారణ మాత్రలను విధిగ వేయించాలని నూజివీడు డిప్యూటీ డీఎంఅండ్ హెచ్‌వో ఎస్.పద్మావతి తెలిపారు. మంగళవారం నూజివీడులోని ఎస్ఆర్ఆర్ పాఠశాల, బాలికోన్నత పాఠశాలల్లో విద్యార్థులకు నులి పురుగులు మాత్రలను వేయించారు. ఒక సంవత్సరం నుంచి 19 సంవత్సరాలలోపు వారికి ఈ మాత్రలు వేయవచ్చని వివరించారు. ఈ కార్యక్రమాన్ని వైద్యులు వెంకటేశ్, కె.గంగాధరకుమార్, కె.సాయి సుధ పర్యవేక్షించారు.

ఆగిరిపల్లి, న్యూస్‌టుడే: నులి పురుగులను నిర్లక్ష్యం చేస్తే చిన్నారుల ఆరోగ్యానికి హాని చేకూరుతుందని ప్రభుత్వ వైద్యాధికారులు డా.జాస్తి జగన్మోహనరావు, డా.మంజుల, డా.సునంద కుమారి తెలిపారు. మంగళవారం మండలంలోని అన్ని పాఠశాలల్లోని చిన్నారులకు ఆల్బెండజోల్ మాత్రలు వేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారులు మాట్లాడుతూ.. భోజనానికి ముందు, ఆటలు ఆడిన అనంతరం, మలవిసర్జన తర్వాత చేతులను సబ్బుతో శుభ్రపరచుకోవాలని విద్యార్థులకు సూచించారు.

మండవల్లి, న్యూస్‌టుడే: ఆల్బెండజోల్ మాత్రలను వేసి విద్యార్థుల్లో వచ్చే రక్తహీనతను తరిమి కొట్టవచ్చని వైద్యాధికారులు పవిత్ర, స్తుతి తెలిపారు. జాతీయ నులి పురుగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని అన్ని పాఠశాలలు, అంగన్‌వాడీలలో చిన్నారులకు ఆరోగ్యశాఖ సిబ్బంది మాత్రలు వేశారు.

కోరుకొల్లు (కలిదిండి), న్యూస్‌టుడే : చిన్నారుల ఆరోగ్యానికి తొలి ప్రాధాన్యం ఇవ్వాలని కోరుకొల్లు పీహెచ్‌సీ వైద్యాధికారులు ధీరజ్‌కుమార్, ఉస్మాన్ తల్లిదండ్రులకు సూచించారు. నులి పురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని కోరుకొల్లు, కలిదిండి, మూలలంక పీహెచ్‌సీల పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేటు బడుల చిన్నారులకు ఆల్బెండజోల్ మాత్రలు వేశారు.

సాయిబాబా ఆలయ వార్షికోత్సవం

ముదినేపల్లి, న్యూస్‌టుడే: శ్రీహరిపురంలోని శిర్డీ సాయిబాబా మందిరం 17వ వార్షికోత్సవం మంగళవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారికి అభిషేకాలు, పలు రకాల హారతులు ఇచ్చారు. భక్తులు పెద్దఎత్తున పాల్గొని స్వామివారికి విశేష పూజలు చేసి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆలయ ఛైర్మన్ పరసా ఏడుకొండలు, నీలం నరసింహారావు, గొల్లపల్లి శ్రీనివాస్, నీలం సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

(c) eenadu

అక్కడ తగ్గిస్తున్నారు.. ఇక్కడ లాగేస్తున్నారు

ఎంఎల్ఎస్ పాయింట్లలో తరుగుతో కార్డుదారులకు వాత

న్యూస్‌టుడే, కాకినాడ కలెక్టరేట్

జిల్లాలోని మండలస్థాయి సరకు నిల్వ కేంద్రాలు(ఎంఎల్ఎస్ పాయింట్లు) వద్ద వేబ్రిడ్జిలు లేక రేషన్ సరకుల్లో తూకం తప్పుతోంది. చౌక దుకాణాలకు తరుగుతో ఇవ్వడంతో ఆ నష్టాన్ని పూరించే పేరుతో డీలర్లు పంపిణీలో ఇంకా ఎక్కువ కోత పెడుతున్నారు. ఏళ్ల తరబడి ఇదే తంతు నడుస్తున్నా.. చక్కదిద్దే పరిస్థితులు పౌరసరఫరాల సంస్థ వద్ద కనిపించడంలేదు.

మరమ్మతులకు గురైన కాకినాడ పాయింట్‌లోని వేబ్రిడ్జి

రెండు చోట్లే ఉన్నా.. ఒకటి పనిచేయదు..

జిల్లాలో కాకినాడ అర్బన్, పిఠాపురం, గొల్లప్రోలు, వేళంగి, దివిలి, జగ్గంపేట, తునిలో ఎంఎల్ఎస్ పాయింట్లు ఉన్నాయి. వీటిలో కాకినాడ అర్బన్, పిఠాపురంలో మాత్రమే వేబ్రిడ్జిలు ఏర్పాటుచేశారు. అందులోనూ కాకినాడ పాయింట్ వద్ద కొన్నేళ్లుగా పనిచేయడం లేదు. మిగతా చోట్ల వీటి ఏర్పాటు అంశం ప్రతిపాదనలతో సరిపెట్టారు. జిల్లాలోని 1,060 చౌక దుకాణాలకు ప్రతి నెలా 9,800 టన్నుల బియ్యాన్ని సరఫరా చేస్తున్నారు. ఒక్కో దుకాణానికి రెండు, మూడు క్వింటాళ్లు తక్కువగా సరఫరా డీలర్లు ఆరోపిస్తున్నారు. ఈ లోటు భర్తీకి కొందరు వివిధ వక్రమార్గాలు ద్వారా కార్డుదారులకు ఇచ్చే సరుకు నుంచి టన్నుల్లో కోతపెడుతున్నారు.

● ప్రతి ఎంఎల్ఎస్ పాయింట్ వద్ద ఎలక్ట్రానిక్ కాటాతో సరకులు తూకం వేసి వాహనాల్లో లోడింగ్ చేస్తున్నారు. ఇవి సక్రమంగా పనిచేయక పోవడం, వీటిలో పనిచేసే కాంట్రాక్టు సిబ్బంది చేతివాటం, బస్తాల నుంచి బియ్యాన్ని లాగేయడం వంటి కారణాలతో కచ్చితమైన తూకంతో సరకులు రావడం లేదు.

● జిల్లాలో నడకుదురు, సామర్లకోట, పిఠాపురం, గొల్లప్రోలు, కిర్లంపూడిలో పౌరసరఫరాల సంస్థకు బఫర్ గోదాములు ఉన్నాయి. వీటి నుంచి బియ్యాన్ని ఎంఎల్ఎస్ పాయింట్లకు తరలిస్తున్నారు. ఇక్కడ సరకును దిగుమతి చేసుకుని, ఆ తర్వాత చౌక దుకాణాలకు పంపించాలి. దీనికి తిలోదకాలిచ్చి కొన్నిచోట్ల గోదాము నుంచి వచ్చిన సరకును. మరో వాహనంలోకి వేసేసి దుకాణాలకు పంపిస్తున్నారు. లోడింగ్, అన్‌లోడింగ్ ఛార్జీలు పౌరసరఫరాల సంస్థ నుంచి లాగేస్తున్నారు.

● కొందరు డీలర్లు ఖాళీ వాహనాన్ని సమీపంలోని ప్రైవేటు వేబ్రిడ్జి వద్ద తూకం వేయిస్తున్నారు. అక్కడి నుంచి ఎంఎల్ఎస్ పాయింట్‌కు వచ్చి సరకును లోడు చేసుకుని, మళ్లీ వేబ్రిడ్జికి వెళ్లి తూకం వేసి రూ.200 ఫీజు చెల్లించుకుంటున్నారు. ఈ భారాన్ని కార్డుదారులకు తక్కువ సరకులిచ్చి సర్దుబాటు చేస్తున్నారు.

ప్రతిపాదనలు పంపించాం

ఎంఎల్ఎస్ పాయింట్ల వద్ద వేబ్రిడ్జిలకు ప్రతిపాదనలు పంపించాం. కాకినాడ అర్బన్‌లో మరమ్మతులకు నివేదిక ఇచ్చాం. కచ్చితమైన తూకంతో దుకాణాలకు సరకులు వెళ్లేలా చర్యలు తీసుకుంటాం. **- ఎం.దేవుల నాయక్, జిల్లా మేనేజర్, పౌరసరఫరాల సంస్థ**

ఈ-పంట నమోదులో జిల్లా ప్రథమస్థానం

20 వరకు గడువు

కాకినాడ కలెక్టరేట్, న్యూస్‌టుడే: జిల్లాలో రబీ సాగు చేసిన రైతులు ఈ నెల 20లోపు ఈ-క్రాప్‌లో నమోదు చేసుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి ఎన్.విజయ్‌కుమార్ సూచించారు. ఈ-పంట నమోదులో జిల్లా రాష్ట్రంలో మొదటి స్థానంలో ఉందన్నారు. జిల్లాలో 3,78,322 ల్యాండ్ పార్సిల్‌కు మంగళవారం సాయంత్రానికి 3,17,754 ల్యాండ్ పార్సిల్‌ను నమోదు చేసి, 84 శాతం పూర్తి చేశామని తెలిపారు. మిగితావి నమోదు చేసి త్వరగా ఈ ప్రక్రియ పూర్తయ్యేలా కృషి చేయాలని రైతు సేవా కేంద్రాల సిబ్బందిని ఆదేశించినట్లు చెప్పారు. రైతులకు అవగాహన కల్పించి, ఆన్‌లైన్‌లో సొంతంగా వారే నమోదు చేసుకునేలా చైతన్యం తీసుకువస్తున్నట్లు పేర్కొన్నారు.

విమానాశ్రయం.. అడుగులెటు!

తుని-అన్నవరం మధ్య పరిశీలనలో ఉన్నట్లు ప్రకటన

ఈనాడు, కాకినాడ: జిల్లాలో అన్నవరం-తుని మధ్య గ్రీన్ ఫీల్డ్ విమానాశ్రయ నిర్మాణంపై ఊగిసలాట కొనసాగుతోంది. గతంలో ఇక్కడ ప్రతిపాదనకు స్థానికుల నుంచి వ్యతిరేకత వ్యక్తమైంది. భూములు ఇవ్వలేమని ఆందోళనలు చేపట్టారు. అదే సమయంలో అక్కడ భూములు విమానాశ్రయానికి అనుకూలంగా లేవని గుర్తించి ప్రతిపాదనను ఉపసంహరించుకున్నట్లు అధికారులు తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఇటీవల ప్రభుత్వశాఖల ముఖ్యకార్యదర్శులతో నిర్వహించిన సమావేశంలో ఈ ఎయిర్‌పోర్టు పరిశీలనలో ఉన్నట్లే చూపించడంతో మరోసారి చర్చల్లోకి వచ్చింది.

రాష్ట్రంలో 9 విమానాశ్రయాలను కొత్తగా నిర్మించేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. అందులో తుని, అన్నవరం మధ్య నిర్మాణానికి సవివర నివేదిక (డీపీఆర్) తయారీ దశలో ఉన్నట్లు రాష్ట్ర విమానాశ్రయాల అభివృద్ధి సంస్థ (ఏపీఏడీసీఎల్) పేర్కొంది. రాజమహేంద్రవరం నుంచి గంట ప్రయాణ దూరంలో ఉన్న ఇక్కడ నిర్మిస్తే ఇటు కాకినాడ, అనకాపల్లి, విశాఖ జిల్లాలకు ఉపయుక్తంగా ఉంటుందన్నది ఆలోచన. ఈ విషయంపై తమకు ఎలాంటి సమాచారం లేదని కలెక్టరేట్ వర్గాలు చెబుతున్నాయి.

ఇక్కడే ఎందుకంటే..

● కాకినాడ సెజ్‌కు సమీపంలో విమానాశ్రయం నిర్మిస్తే పారిశ్రామికంగా అభివృద్ధితో పాటు కార్గోకు అనుకూలం. పైగా వాకలపూడి-అన్నవరం వరకు తీరం వెంబడి రూ.1440 కోట్లతో కొత్త జాతీయ రహదారి నిర్మాణం జరగబోతుంది. రోడ్డు, పోర్టులతో అనుసంధానానికి వీలుంటుంది.

● కాకినాడలో ఇటీవల రూ.13 వేల కోట్లతో ఏఎం గ్రీన్ అమ్మోనియా ప్లాంట్‌కు సీఎం శంకుస్థాపన చేశారు. ఉప్పాడ సమీపంలోని నేమాం పరిసరాల్లో ఏఎంజీ మెటల్స్ గ్రీన్ అల్యూమినా కంపెనీ రూ.44 వేల కోట్లతో ఏర్పాటు కాబోతుంది. సెజ్, పోర్టు పరిసరాల్లో భారీ పరిశ్రమలు పెట్టుబడులు పెట్టేందుకు వస్తుండడంతో తుని-అన్నవరం మధ్యలో విమానాశ్రయం ఏర్పాటు అనుకూలమని భావిస్తున్నారు.

● అనకాపల్లిలో ఆర్సెలార్ మిట్టల్ స్టీల్ ప్లాంట్, నక్కపల్లి బల్క్‌డ్రగ్ పార్క్‌తో భారీ పరిశ్రమలు ఏర్పాటవుతున్న నేపథ్యంలో వాటికీ ఈ విమానాశ్రయం అందుబాటులో ఉంటుందని ప్రభుత్వ ఆలోచన. ఒకవేళ ఈ ప్రాంతంలో స్థానికులు ఒప్పుకోకపోతే పాయకరావుపేట సమీపంలోనైనా నిర్మించి తీరే అవకాశం ఉంది.

భీమేశ్వరుడికి త్రిశూల స్నానం

మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం సామర్లకోట ఆలయ కోనేరులో భీమేశ్వరస్వామి, బాలాత్రిపుర సుందరి విగ్రహమూర్తులకు త్రిశూల స్నానం చేయించారు. ఈవో నీలకంఠం, ఛైర్మన్ జగదీష్‌మోహన్ ఆధ్వర్యంలో అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. - న్యూస్‌టుడే, సామర్లకోట

గండిపోశమ్మ ఆలయం మునక

దేవీపట్నం: పోలవరం ప్రాజెక్టు బ్యాక్ వాటర్ (వెనుక జలాలు) కారణంగా వారం రోజులుగా గోదావరి పెరుగుతూనే ఉంది. మంగళవారం సాయంత్రానికి గండిపోశమ్మ ఆలయాన్ని వరద చుట్టుముట్టింది. పోశమ్మగండి నుంచి పి.గొందురు వైపు పలుచోట్ల రహదారిని ఆనుకుని గోదావరి ప్రవహిస్తోంది. పి.గొందూరు వద్ద వరి చేలు, దండంగి, చినరమణయ్యపేట, కె.వీరవరం పరిసర ప్రాంతాల్లో మొక్కజొన్న చేలు ముంపునకు గురయ్యాయి. ముంపు గ్రామాల్లో తక్కువ పన్నులకు పొలాలు రావడంతో రైతులు మొక్కజొన్న సాగు చేపట్టారు. ఒక్కసారిగా గోదావరి పెరగడంతో నష్టాలు తప్పవని కర్షకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

కండల వీరులు..

నన్నయ విశ్వవిద్యాలయంలో అంతర్ కళాశాలల దేహదారుఢ్య పోటీలు ఉత్సాహంగా సాగాయి. ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల పరిధిలోని అనుబంధ కళాశాలల విద్యార్థులు హాజరయ్యారు. ప్రతిభ చాటిన వారిని వర్సిటీ జట్టుకు ఎంపిక చేశారు. బెస్ట్‌ఫిజిక్ మెన్ టీమ్ ఛాంపియన్‌షిప్‌ను కాకినాడ పి.ఆర్.ప్రభుత్వ కళాశాల కైవసం చేసుకుంది. **- న్యూస్‌టుడే, రాజానగరం**

గడువులోగా అక్విడక్టుకు మరమ్మతులు

పి.గన్నవరం: పి.గన్నవరం వద్ద వైనతేయ గోదావరి నదిపై డొక్కా సీతమ్మ అక్విడక్టు రోడ్డు వంతెన మరమ్మతు పనులు నిర్ణీత గడువులోగా పూర్తి చేస్తామని జలవనరులశాఖ ధవళేశ్వరం సర్కిల్ ఎస్.ఇ. కె.గోపీనాథ్ వెల్లడించారు. మంగళవారం సాయంత్రం ఆయన ఈ పనులను పరిశీలించి సిబ్బందికి తగు సూచనలు చేశారు. 31 నుంచి 34 ఎక్స్‌పేన్షన్ జాయింట్ల వద్ద అమర్చిన ఇనుప కడ్డీలను, వేరింగ్‌కోట్ వేసే ప్రదేశాలను పరిశీలించి పలు సూచనలు చేశారు.

పాఠశాలా.. పాట్లు చాలా..!

పరిశీలన

– న్యూస్‌టుడే, కొత్తపల్లి, పిఠాపురం, సర్పవరం, తాళ్లరేవు

జిల్లాలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాబోధన చేయడానికి ఉపాధ్యాయులు, చదువుకునేందుకు విద్యార్థులు భయాందోళన చెందాల్సిన పరిస్థితి నెలకొంది. శిథిల భవనాలు, ప్రమాదకర ప్రాంతాల్లో పాఠశాలలు ఉండడంతో తమ పిల్లలకు ప్రాణాపాయం పొంచి ఉందని తల్లిదండ్రులూ హడలిపోతున్నారు. చాలాచోట్ల భవనాలు చుట్టూ తుప్పలు పెరిగిపోవడంతో పాములు తదితర విష పురుగులు అప్పుడప్పుడూ తరగతి గదుల్లోకి వస్తున్నాయని చెబుతున్నారు. రహదారులను ఆనుకుని ఉన్న పాఠశాలల్లో విద్యార్థులు ఆడుకునే సమయంలో బయటికి వచ్చినప్పుడు వాహనాలు తగిలి గాయాలపాలవుతున్న ఘటనలూ ఉన్నాయి. పాలకులు, అధికారులు ప్రభుత్వ పాఠశాలల్లో సమస్యలను తక్షణం పరిష్కరించాలని పలువురు కోరుతున్నారు.

హెచ్చరిక.. అక్కడే గత్యంతరం లేక..!

ప్రమాదకర భవనం.. ఎవరూ అందులోకి వెళ్లకూడదు. అంటూ ఆ భవనం బయట నోటీసు బోర్డులో అతికించి ఉంటుంది. అలాంటి శిథిల భవనంలోనే తరగతులు నిర్వహిస్తుండడం గగుర్పాటుకు గురిచేస్తోంది. యు.కొత్తపల్లి మండలంలోని వాకతిప్ప జడ్పీ ఉన్నత పాఠశాల తరగతులను శిథిలావస్థకు చేరిన తుపాను రక్షణ భవనంలో నిర్వహిస్తున్నారు. వైకాపా హయాంలో ప్రారంభించిన అదనపు గదుల నిర్మాణం మధ్యలోనే ఆగింది. కొత్తమూలపేట, రమణక్కపేట జడ్పీ పాఠశాలల్లో ప్రహరీలు లేక ప్రమాదకర వాతావరణం నెలకొంది.

శిథిల స్థితికి చేరుకున్న వాకతిప్ప జడ్పీ పాఠశాల భవనం

● కరప మండలంలోని వేములవాడ శివారు పోలినాటివారిపేటలో ప్రాథమిక పాఠశాల భవనం శిథిల దశకు చేరుకొంది. స్లాబు భాగం పెచ్చులూడి పడుతోంది. సిరిపురం ప్రాథమిక పాఠశాలకు ప్రహరీ లేక పక్కనే ఉన్న పంట పొలాల నుంచి విషకీటకాలు విద్యార్థులను వణికిస్తున్నాయి.

● కాకినాడ గ్రామీణం తూరంగి జయప్రకాష్‌నగర్‌లోని మండల పరిషత్తు పాఠశాల భవనం పాడైపోయింది. పై అంతస్తుకు మరమ్మతులు చేయించినప్పటికీ స్లాబు పెచ్చులు ఊడిపడుతూనే ఉన్నాయి. దీంతో జూన్ నుంచి పైఅంతస్తులో తరగతులు ఆపేశారు. కింది అంతస్తులోని ఒక గది, వరండాలో నిర్వహిస్తున్నారు. ఇటు విద్యార్థులు, అటు ఉపాధ్యాయులు కూడా ఇబ్బందులు పడుతున్నారు. మరికొన్ని భవనాలదీ ఇదే తీరు.

మరికొన్ని ప్రమాదకర పరిస్థితులు..

● పిఠాపురం మండలంలోని బి.కొత్తూరులో ప్రభుత్వ పాఠశాల భవనం, ప్రహరీ ఛిద్రంగా మారాయి. పిఠాపరరం ఓబీఎస్, విరవ జడ్పీ పాఠశాలల్లో గత ప్రభుత్వ నాడు-నేడు పనులు అసంపూర్తిగా నిలిచిపోయాయి. జములపల్లి పాఠశాలలో గోడ లేక రక్షణ కరవవుతోంది.

● గొల్లప్రోలు మండలం కొత్తపేటలోని ప్రాథమిక పాఠశాలను ఆనుకుని తుప్పలు పెరిగిపోవడంతో విష పురుగులు సంచరిస్తున్నాయి. చేబ్రోలు జడ్పీ పాఠశాల వద్ద రహదారి దాటే సమయంలో విద్యార్థులు ప్రమాదాలకు గురవుతున్నారు.

● తాళ్లరేవు మండలంలోని పి.మల్లవరం, తాళ్లరేవు ప్రాథమిక పాఠశాలల ఆవరణలో, చొల్లంగి జడ్పీ ఉన్నత పాఠశాలను చేర్చి శిథిల స్థితిలో తుపాను భవనాలు ప్రమాదకరంగా ఉన్నాయి. వాటి చెంతనే విద్యార్థులు ఆటలాడుకుంటున్నారు. ఎప్పుడేం జరుగుతుందోనని తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు.

92 శాతం మందికి నులిపురుగుల నివారణ మాత్రలు

మసీదు సెంటర్, న్యూస్‌టుడే: జిల్లా వ్యాప్తంగా నులిపురుగుల నివారణా కార్యక్రమంలో భాగంగా అన్ని అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల్లో 1 నుంచి 19 ఏళ్ల లోపు వారికి ఆల్బెండజోల్ మాత్రలను వేశామని డీఎంహెచ్‌వో డా.నరసింహనాయక్ తెలిపారు. మంగళవారం స్థానిక సాలిపేట బాలికోన్నత పాఠశాలలో డీఎంహెచ్‌వో, డీఈవో పి.రమేష్, ఇతర వైద్యాధికారులు హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. వారు మాట్లాడుతూ మొత్తం 92.56 శాతం మందికి పంపిణీ చేశామని, ఈ నెల 24న మిగిలిన వారికి వేసి, 100 శాతం పూర్తి చేస్తామన్నారు. పర్యవేక్షణాధికారి వెంకటేశ్వర్లు, డా.అరుణ, డా.లక్ష్మి, డా.ప్రశాంతి, డా.పృథ్వీచరణ్, ప్రోగ్రాం ఆఫీసర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినికి మాత్ర వేస్తున్న డీఎంహెచ్‌వో నరసింహనాయక్

మధ్యాహ్న భోజనం.. సంతృప్తిగా లేం!

నాణ్యతపై కాకినాడ, తూర్పులో కొంత ప్రతికూల స్పందన

జిల్లాలవారీగా 5 ప్రశ్నలకు విద్యార్థుల తల్లిదండ్రులు ఎలా స్పందించారంటే(శాతాల్లో)

✔ బాగు / ✘ లేదు	మెనూ అమలు ✔	మెనూ అమలు ✘	రుచి ✔	రుచి ✘	నాణ్యత ✔	నాణ్యత ✘	చిక్కీ నాణ్యత ✔	చిక్కీ నాణ్యత ✘	అన్నం ✔	అన్నం ✘	రాష్ట్రంలో ర్యాంకు
తూర్పు	84.6	15.4	73.5	26.5	67.7	32.3	75.7	24.3	67.5	32.5	22
కాకినాడ	83.4	16.6	75.0	25	65.6	34.4	77.8	22.2	68.3	31.7	26
కోనసీమ	85.8	14.2	70.3	29.7	70.6	29.4	75.8	24.2	69.2	30.8	16
పోలవరం	85.6	14.4	81.1	18.9	76.0	24.0	78.5	21.5	76.3	23.7	4

ఈనాడు, రాజమహేంద్రవరం: విద్యార్థులకు మెరుగైన విద్య, నాణ్యమైన ఆహారం పాఠశాల స్థాయిలో అందించి వారి సర్వతోముఖాభివృద్ధికి బాటలు వేయాలన్న ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం 'డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం' నిర్వహిస్తోంది. మెనూ పక్కాగా అమలుచేయాలని ఆదేశించింది. అయితే క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ లోపంతో ఇబ్బంది ఏర్పడుతోంది. ప్రజల సంతృప్తి స్థాయి తెలుసుకునేందుకు ప్రభుత్వం 5 ప్రశ్నలతో రాష్ట్ర వ్యాప్తంగా ఇటీవల 2.27 లక్షల మందిని సంప్రదించగా 24.4 శాతం మంది వ్యతిరేకంగా స్పందించారు.

వెనుకబడిన మన జిల్లాలు..

కాకినాడ, తూర్పు గోదావరి జిల్లాల్లో ఆహార పదార్థాల రుచి, నాణ్యతపై ఎక్కువమంది అసంతృప్తి వ్యక్తంచేశారు. అన్ని విభాగాల్లో కాకినాడ వెనుకబడి రాష్ట్రంలో 26వ స్థానంలో ఉంది. తూర్పు 22, కోనసీమ 16, పోలవరం 4వ స్థానంలో ఉన్నాయి.

కొన్నిచోట్ల ఇలా..

● తుని పరిధిలోని కొండవరపుపేట పాఠశాలలో చదువుతున్న 11 మంది విద్యార్థుల తల్లిదండ్రుల అభిప్రాయాలు సేకరించారు. చిక్కీలు బాగునాయని 25 శాతం మంది చెప్పగా.. మిగిలిన అన్ని ప్రశ్నలకూ వ్యతిరేకంగానే సమాధానమిచ్చారు.

● కాకినాడ జిల్లా గజ్జనపూడి పాఠశాలలో 11 మందిని సంప్రదించగా మెనూ అమలు సరిగా లేదని అందరూ చెప్పారు. 33 శాతం మంది పదార్థాలు రుచిగా ఉంటున్నాయని, 25 శాతం మంది అన్నం బాగుందని మాత్రమే తెలిపారు.

అన్నవరం భక్తులకు మరిన్ని సౌకర్యాలు

22న శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు

అన్నవరం, న్యూస్‌టుడే: అన్నవరం వచ్చే భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వం పలు అభివృద్ధి పనులు చేపట్టనుంది. రత్నగిరిపై సీతారామసత్రం నిర్మాణం చేపట్టనుంది. మరోవైపు రెండో మెట్లమార్గం పూర్తైంది. మెట్ల మార్గం ప్రారంభం, వసతి సముదాయం నిర్మాణానికి ఈ నెల 22న శంకుస్థాపన చేయనున్నారు. ఈ మేరకు దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డికి మంగళవారం ఈవో ఆహ్వాన పత్రికను అందజేశారు.

రత్నగిరిపై నిర్మించనున్న సీతారామసత్రం నమూనా

రెండో మెట్లమార్గ నిర్మాణం పూర్తి..

కొండ దిగువ నుంచి మరో మెట్ల మార్గం నిర్మాణం పూర్తైంది. ట్రాఫిక్, పార్కింగ్ సమస్యను నియంత్రించేందుకు సుమారు రూ.1.30 కోట్ల వ్యయంతో పనులు చేపట్టారు. ఎగువ ఘాట్ రోడ్డుకు ఆనుకుని (టోల్‌గేటు వద్ద నుంచి) కొండపైన సెంటినరీ కాటేజీ వరకు 250 మీటర్లు పొడవున సుమారు 350 మెట్లు నిర్మించారు. ఒక్కో మెట్టు 14 అడుగుల పొడవు, 1.3 అడుగుల వెడల్పు, 6 అంగుళాల ఎత్తు, 28 ల్యాండింగ్‌లతో నిర్మాణం చేపట్టారు. ఆర్చి నిర్మాణం జరుగుతుంది.

రెండు బ్లాకులుగా సీతారామసత్రం

రత్నగిరిపై 105 గదులతో వసతి సముదాయం నిర్మించనున్నారు. 210 గదులతో రెండు బ్లాకులుగా నిర్మాణానికి ప్రణాళిక చేశారు. ముందుగా ఒక బ్లాక్ సుమారు రూ.11.40 కోట్లతో నిర్మాణం చేపట్టనున్నారు. జీప్లస్ 3 భవనంలో ఒక్కో ఫ్లోర్‌లో 35 గదులు, కింద సెల్లారు పార్కింగ్‌కు కేటాయించారు. 1995లో నిర్మించిన సీతారామసత్రం శిథిలావస్థకు చేరడంతో దీన్ని తొలగించి నిర్మాణం చేపట్టనున్నారు.

భక్తుల వద్దకే సేవా టికెట్లు

పీవోఎస్‌తో టికెట్ ఇస్తున్న సిబ్బంది

అన్నవరం, న్యూస్‌టుడే: భక్తుడి వద్దకే నేరుగా సిబ్బంది వెళ్లి టికెట్లు జారీ చేసేలా అన్నవరం దేవస్థానంలో 30 పీవోఎస్ యంత్రాలను అందుబాటులోకి తీసుకొచ్చారు. డిజిటల్ టెంపుల్స్ స్మార్ట్ ఎండోమెంట్స్‌కు అనుగుణంగా నగదు రహిత లావాదేవీలు మెరుగుపర్చడం, ఆన్‌లైన్ సేవలను విస్తృతం చేయడం, డిజిటల్ మౌలిక సదుపాయాలు బలోపేతం చేయడం, యాత్రికుల సౌలభ్యం, సేవా భావాన్ని మెరుగుపర్చడానికి చర్యలు చేపడుతున్నారు. కౌంటర్లలో టికెట్లు జారీ చేస్తూనే రద్దీ సమయాల్లో ఆలయ ప్రాంగణాల్లో భక్తుల వద్దకే నేరుగా సిబ్బంది వెళ్లి టికెట్లు ఇచ్చేలా ఏర్పాట్లు చేస్తున్నారు. యంత్రంలో క్యూఆర్ కోడ్ ద్వారా డిజిటల్ చెల్లింపులు చేయవచ్చు. ప్రస్తుతం దర్శనం, సేవ, ప్రసాదం టికెట్లు పీవోఎస్ ద్వారా ఇస్తుండగా భవిష్యత్తులో ఈ హుండీ, అన్నదానం టికెట్లు జారీ, ఇతర సేవలను అందుబాటులోకి తీసుకురానున్నారు. వివిధ ఆలయాల్లో కియోస్క్‌లు ఏర్పాటు చేయడానికి చర్యలు చేపడుతున్నారు. ఇందులో అన్నవరం ఆలయానికి ఎనిమిది కేటాయించారు.

ఈనాడు

దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించండి

Cell: 80085 97607

ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి

Cell: 80082 34669

కాలువ తీరిది.. నీరెలా పొలం చేరేది..!

పిఠాపురం మండలం మాధవపురం వెళ్లే మార్గంలో పిఠాపురం బ్రాంచి కెనాల్(పీబీసీ) కాలువ నిండా గుర్రపు డెక్క ఇలా ఆవరించి ఉంది. దాంతో సాగునీటి ప్రవాహానికి ఇబ్బందులు తలెత్తుతున్నాయని రైతులు ఆవేదనతో చెబుతున్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే శివారు ఆయకట్టుకు నీరు అందదని ఆందోళన చెందుతున్నారు. ఈ సమస్యపై పీబీసీ డీఈ సంతోష్‌కుమార్‌ను అడగ్గా వెంటనే కార్మికులను కేటాయించి శుభ్రం చేయిస్తామన్నారు. – న్యూస్‌టుడే, పిఠాపురం

(c) eenadu

SBI స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

స్ట్రెస్డ్ అస్సెట్స్ రికవరీ బ్రాంచి, పరిపాలన కార్యాలయ ప్రాంగణం, బాలాజీ నగర్, సిరిపురం, విశాఖపట్నం

అధీకృత అధికారి వివరములు : పేరు : శ్రీ వై. శ్రీకాంత్ (చీఫ్ మేనేజర్) మొబైల్ నెం. 80994 44378, ఇ-మెయిల్ ఐడి: sbi.10077@sbi.co.in, ఆస్తి తనిఖీ కొరకు : 89858 67892

ఇ-వేలం అమ్మకం ప్రకటన

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 లోని రూల్ 8(6)కు 9(1) నిబంధనలతో చదువబడు (సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ & ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 క్రింద బ్యాంకునకు తనఖా చేసిన స్థిరాస్తుల అమ్మకము)

SARFAESI చట్టం 2002 ప్రకారం సెక్షన్ 13(4) క్రింద దిగువ తెలిపిన ఆస్తి స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అధీకృత అధికారిగా దిగువ సంతకందారు లాంఛనంగా స్వాధీనం చేసుకున్నారు. బ్యాంకు బకాయిలు రాబట్టుకొనుటకు దిగువ తెలిపిన తనఖాపెట్టిన ఆస్తి/ఆస్తుల ఈ-వేలం (SARFAESI చట్టం 2002 క్రింద) "ఎక్కడ ఎలా వున్నది అక్కడ అలానే" మరియు "అక్కడ ఏమున్నదో అదే" పద్ధతి పై నిర్వహించబడుతుందని సాధారణ ప్రజలకు ఇందుమూలముగా తెలియజేయడమైనది మరియు నియమ నిబంధనలు దిగువ తెలుపబడినవి.

ఋణగ్రహీత(లు) : శ్రీ బోరా శ్రీనివాసరెడ్డి, తండ్రి : లేటు బి. అప్పల రెడ్డి, #53-17-9/1, ఎన్‌హెచ్-5 రోడ్డు, దయారామ్ స్వీట్స్ ప్రక్కన, మద్దిలపాలెం, విశాఖపట్నం, ఆంధ్రప్రదేశ్ - 530013. శ్రీమతి నిమ్మకాయల శ్రీదేవి, తండ్రి : శ్రీ ఎన్. వెంకట రమణ, అలియాస్ శ్రీమతి బోరా శ్రీదేవి, భర్త : బోరా శ్రీనివాసరెడ్డి, ఇ.నెం.53-17-9/1, ఎన్‌హెచ్-5 రోడ్డు, దయారామ్ స్వీట్స్ ప్రక్కన, మద్దిలపాలెం, విశాఖపట్నం, ఆంధ్రప్రదేశ్ - 530013. డిమాండ్ నోటీసు తేది: 17-09-2020

డిమాండ్ నోటీసు ప్రకారం బకాయి మొత్తం: తేది.15-09-2020 నాటికి రూ.1,29,30,445.45/- + భవిష్య వడ్డీ మరియు ఇతర ఖర్చులు మొదలగునవి. ప్రస్తుత బకాయి మొత్తం: తేది.13-02-2026 నాటికి రూ.1,95,83,232.55 పై + తేది.14.02.2026 నుండి భవిష్య వడ్డీ మరియు ఇతర ఖర్చులు మొదలగునవి (మునుపటి జమలు మినహాయించిన తరువాత).

షెడ్యూల్ ఆస్తి వివరములు:

సేల్ డీడ్ నెం.5904/2006, తేది.16.10.2006 ప్రకారం శ్రీమతి నిమ్మకాయల శ్రీదేవి అలియాస్ శ్రీమతి బోరా శ్రీదేవి, తండ్రి : శ్రీ ఎన్. వెంకట రమణ గారిచే తనఖా పెట్టబడిన స్థిరాస్తి : తూర్పు గోదావరి జిల్లా, తుని సబ్ రిజిస్ట్రీ, తుని మున్సిపల్ ఏరియా, వీరవరం, పట్టా నెం.79, సర్వే నెం.181/2ఎ లోని 4186.6 చ॥గ॥ల విస్తీర్ణం గల ఖాళీ స్థలం యావత్తు ఆస్తి రిజిష్టర్డు సేల్ డాక్యుమెంట్ నెం.5904/2006, తేది.16.10.2006 ప్రకారం శ్రీమతి నిమ్మకాయల శ్రీదేవి, తండ్రి : శ్రీ ఎన్. వెంకట రమణ గారికి చెందినది. హద్దులు : తూర్పు : చక్కా వరహాలమ్మ గారి భూమి, దక్షిణం : బైపాస్ రోడ్డు, పడమర : ఎమ్. గురుమూర్తి & ఎ. సోమన్న గార్ల భూమి, ఉత్తరం : పుంత మరియు ఆ తర్వాత కొండ.

రిజర్వు ధర : రూ.2,64,00,000/- ధరావత్తు : రూ.26,40,000/- బిడ్ పెంపుదల : రూ.1,00,000/-

ఇ-వేలం తేదీ : 06-03-2026 సమయం : ఉ॥ 11.00 గం॥ల నుండి సా॥ 04.00 గం॥ల వరకు

ఆస్తి తనిఖీ తేది మరియు సమయం: తేది: 18-02-2026 నుండి 05-03-2026 వరకు ఉ॥10.00 గం॥ల నుండి సా॥ 04.00 గం॥ల వరకు

గమనిక : ఋణగ్రహీత/హామీదారు డి.ఆర్.టి, విశాఖపట్నం నందు ఎస్.ఎ.నెం.522/2023 దాఖలు చేసినారు. కానీ, స్టే లేదు.

ఇ-వేలం యొక్క నియమ నిబంధనలు

1) అమ్మకం యొక్క సవివరమైన నియమ నిబంధనల కొరకు, సెక్యూర్డ్ క్రెడిటార్స్ అయిన స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా యొక్క వెబ్ సైట్ : www.sbi.co.in/web/sbi-in-the-news/auction-noticesలో ఏర్పాటుచేసిన లింకును రిఫర్ చేయండి. రిజిస్ట్రేషన్, ఐయండి, వేలం యొక్క వివరములు మొదలగు వాటి గురించి సర్వీసు ప్రొవైడర్ M/s. PSB Alliance & M/s. Baanknet యొక్క ఇ-వేలం పోర్టల్ : https://baanknet.com/eauction-psb/x-login & https://baanknet.com & టోల్ ఫ్రీ ఫోన్ నెం.: 91 - 8291220220, Mail ID : support.baanknet@psballiance.comను సంప్రదించండి.
2) ఆస్తిని రిజిస్ట్రేషన్ చేసుకొనుటకు వర్తించే స్టాంపు డ్యూటీలు బదిలీ ఛార్జీలు, ఫీజు వగైరా మరియు చట్టపరమైన/నాన్ స్టేటటరీ బకాయిలు, పన్నులు, రేట్లు, ఎస్సెస్‌మెంట్ ఛార్జీలు, ఫీజులు వగైరా కొనుగోలు దారే భరించవలెను.
గమనిక : ఆసక్తి గల బిడ్డర్లు ఇ-వేలం ముగిసేలోపు PSB Alliance నందు ప్రీ-బిడ్ ఇ.ఎమ్.డి (Pre-Bid EMD) జమ చేయవలెను. ప్రీ-బిడ్ ఇ.ఎమ్.డి మొత్తం PSB Alliance బ్యాంక్ అకౌంట్‌లో జమ అయిన సమాచారం వెబ్‌సైట్‌లో పొందుపరిచిన తరువాత మాత్రమే బిడ్డరు యొక్క "వాలెట్"లో చూపించబడుతుంది. బ్యాంకింగ్ ప్రక్రియలో ఇది జరుగుటకు సమయం పట్టవచ్చు, కావున బిడ్డర్లు చివరి నిముషంలో ఇబ్బందులు ఎదుర్కొనకుండా తమ ప్రీ-బిడ్ ఇ.ఎమ్.డిను సాధ్యమైనంత త్వరగా జమ చేసుకోవాలనీ సూచించటమైనది.
గమనిక -2 : ఆదాయపు పన్ను చట్టం 1961లోని సెక్షన్ 194-1A ప్రకారం అమ్మకంలో భాగంగా అమ్మకం విలువ రూ.50,00,000/- (యాభై లక్షల రూపాయలు) మరియు అంతకంటే ఎక్కువ ఉన్నచో సదరు మొత్తముపై TDS @ 1% వర్తిస్తుంది. కావున సఫలీకృత బిడ్డరు/కొనుగోలుదారు గవర్నమెంట్ గైడ్‌లైన్స్ ధర లేదా అమ్మకం ధరలో ఏది ఎక్కువైతే దానిలో 1% TDS ను తగ్గించుకొని సదరు మొత్తమును ఆదాయపు పన్ను డిపార్ట్‌మెంట్ యొక్క ఫారం నెం.16-బి నందు జమచేయవలెను మరియు సదరు ఒరిజినల్ TDS సర్టిఫికెట్‌ను బ్యాంకు వారికి సమర్పించవలెను. (వ్యవసాయ భూమి కాకుండా కేవలం స్థిరాస్తికి మాత్రమే వర్తించును).

తేది:13-02-2026, ప్రదేశం: విశాఖపట్నం సం/- అధీకృత అధికారి, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

సముద్రుడు.. వెనక్కి మళ్లాడు..!

యు.కొత్తపల్లి మండల పరిధిలోని ఉప్పాడ తీరంలో సముద్రం ఒక్కసారిగా వెనక్కి వెళ్లి ఆశ్చర్యానికి గురిచేసింది. మంగళవారం ఉదయం 9 గంటలప్పుడు కెరటాలు దూసుకొచ్చి రహదారిని తాకాయి. అంతలోనే ప్రశాంత వాతావరణం నెలకొని 50 మీటర్ల దూరం సముద్రం వెనక్కి వెళ్లింది. దీంతో ఆ ప్రాంతంలో జియోట్యూబ్ ఆనవాళ్లు బయటపడ్డాయి. సముద్రంలో ఏర్పడే ఆటుపోటు సమయంలో ఇలా ముందుకు, వెనక్కు మళ్లుతుందని మత్స్యకారులు పేర్కొన్నారు.

- న్యూస్‌టుడే, కొత్తపల్లి

ఇంటిల్లిపాదీ.. ఇలానా వెళ్లేది..!

ఇది చూడండి. ఇంటిలోని అంతా కలిసి ఒకే వాహనంపై ప్రమాదకరంగా ఎలా వెళ్తున్నారో. జరగరాని ప్రమాదం జరిగితే.. ఇంకేమైనా ఉందా. కనీస ఆలోచన మరిచారని చూసినవారంతా చర్చించుకున్నారు. సామర్లకోట-కాకినాడ రోడ్డులో మంగళవారం కనిపించిందీ చిత్రం. దీనిపై సామర్లకోట సీఐ కృష్ణభగవాన్‌ను అడగ్గా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నిబంధనలు పాటించని వాహన చోదకులు, డ్రైవర్లకు కౌన్సెలింగ్ చేస్తున్నామని.. చాలామందిలో మార్పు రావడం లేదని అన్నారు. తనిఖీలు పెంచుతామని తెలిపారు.

- న్యూస్‌టుడే, సామర్లకోట

లడ్డూ కల్తీ దోషులపై చర్యలేవి?

సీపీఐ జాతీయ కార్యదర్శి కె.రామకృష్ణ

మాట్లాడుతున్న రామకృష్ణ, పక్కన ఈశ్వరయ్య తదితరులు

గాంధీనగర్: తిరుమల లడ్డూ తయారీలో నెయ్యి కల్తీ జరిగిందని, కోట్ల రూపాయలు చేతులు మారడం నిజమని.. అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం తాత్సారం చేయకుండా బాధ్యులపై చర్యలు తీసుకోవాలని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.రామకృష్ణ కోరారు. మంగళవారం ఆయన కాకినాడ సూర్యకళామందిరంలో పార్టీ రాష్ట్ర సమితి సమావేశాల సందర్భంగా నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ఈ వ్యవహారం ఎవరి హయాంలో జరిగినా కల్తీకి పాల్పడిన వారిని, అందుకు అనుమతించిన వారిని, కోట్ల రూపాయలు లంచాలు మేసిన వారిపై పార్టీలకు అతీతంగా చర్యలు తీసుకోవాల్సిందేనన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడి ఉద్దేశంలో జగన్‌మోహన్‌రెడ్డిపై హిందువు కాదని ముద్రవేసి.. రాజకీయంగా లబ్ధి పొందాలని చూస్తున్నారని ఆరోపించారు. మరోవైపు జగన్‌మోహన్‌రెడ్డి నిందితులను వెనకేసుకొస్తున్నారని, కల్తీ నెయ్యి విషయంలో చర్యలు తీసుకోవాలని ఒక్కసారీ అనలేదన్నారు. నిందితులను శిక్షించాలని సూచించారు. వైకాపా ప్రతిపక్షంలో ఉన్నందున వారు అసెంబ్లీ సమావేశాలకు హాజరై ప్రజా సమస్యలు లేవనెత్తి వాటిపై పోరాడాలన్నారు. ప్రధాని మోదీ దేశ ప్రయోజనాలు దెబ్బతీసేలా ఇతర దేశాలతో ఒప్పందాలు చేసుకుంటున్నారని విమర్శించారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి జి.ఈశ్వరయ్య మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజల సమస్యలు, అభివృద్ధిపై దృష్టి చూపకుండా తిరుమల లడ్డూ నెయ్యి కల్తీ జరిగిందని.. దాని చుట్టూ రాజకీయాలు చేస్తున్నారన్నారు. ఇప్పటికైనా బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వెలిగోడు ప్రాజెక్టుకు నిధులు కేటాయించి పూర్తిచేయడంలోనూ ప్రభుత్వ నిర్లక్ష్యం కనిపిస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ ప్రజలపై భారాలు మోపే విధంగా ఉందని, ఇది బడాయి బడ్జెట్ అని పేర్కొన్నారు. సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు రావుల వెంకయ్య, అక్కినేని వనజ, ముప్పాళ్ల నాగేశ్వరరావు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు తాటిపాక మధు, కాకినాడ జిల్లా కార్యదర్శి బోడకొండ తదితరులు పాల్గొన్నారు.

జగనన్న లేఅవుట్లలో విజిలెన్స్ తనిఖీలు

చొల్లంగిలో విచారణ చేస్తున్న విజిలెన్స్ డీఎస్పీ తాతారావు, బృందం

తాళ్లరేవు: చొల్లంగి, జి.వేమవరం గ్రామాల్లో 2019-24 వరకు పేదలందరికీ జగనన్న ఇళ్ల స్థలాల భూసేకరణపై విజిలెన్స్ డీఎస్పీ ఎస్.తాతారావు, వివిధ శాఖల అధికారుల బృందం మంగళవారం విచారణ చేపట్టింది. చొల్లంగిలో సర్వే నంబరు 16/23బిలో 3.67 ఎకరాల్లో 126 మంది లబ్ధిదారులను ఎంపిక చేశారు. 101 మందికి స్థలాలు మంజూరు చేశారు. వారిలో 44 మంది ఇళ్లు నిర్మించుకున్నారు. అధికారుల బృందం కాలనీలో రహదారుల ఏర్పాటు, స్థలం మెరక పనులను పరిశీలించింది. ఇళ్ల స్థలాలకు సేకరించిన భూమికి సంబంధించి తమకు పూర్తిగా డబ్బులు అందలేదని చొల్లంగికి చెందిన రైతులు దిమ్మల మరిడయ్య, గుమ్మళ్ల నూకరాజు విజిలెన్స్ డీఎస్పీకి ఫిర్యాదు చేశారు. ప్రభుత్వం ఎకరానికి రూ.55 లక్షలకు కొనుగోలు చేసిందని, పూర్తిస్థాయిలో డబ్బులు ఇవ్వలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. * జి.వేమవరం సర్వే నంబరు 306/6, 307, 309/2లో 14.15 ఎకరాల్లో 574 మంది లబ్ధిదారులకు ఇళ్ల స్థలాలను కేటాయించారు. ఆ స్థలాలను విజిలెన్స్ బృందం పరిశీలించింది. గృహనిర్మాణ సంస్థ, రెవెన్యూ, ఉపాధి హామీ పథకం, మైన్స్ అధికారులు పాల్గొన్నారు.

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

తుని బ్రాంచ్ (00942), బెల్లపు వీధి, తుని, కాకినాడ జిల్లా

అధీకృత అధికారి/చీఫ్ మేనేజర్ వివరములు: పేరు: శ్రీమతి జి.సౌజన్య కుమారి, మొబైల్ నెం: 95735 55033
ఇ-మెయిల్ ఐడి: sbi.00942@sbi.co.in ఆస్థి తనిఖీ కొరకు: టి.రామచంద్రబాబు మొబైల్ నెం.: 89788 22777

ఇ-వేలం అమ్మకం ప్రకటన

(సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 క్రింద బ్యాంకునకు తనఖా చేసిన స్థిరాస్తుల ఇ-వేలం అమ్మకము)

SARFAESI చట్టం 2002 ప్రకారం సెక్షన్ 13 (4) క్రింద దిగువ తెలిపిన ఆస్థిని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, తుని బ్రాంచ్, కాకినాడ జిల్లా అధీకృత అధికారిగా దిగువ సంతకందారు భౌతిక స్వాధీనం చేసుకున్నారు. బ్యాంకు బకాయిలు రాబట్టుకొనుటకు దిగువ తెలిపిన తనఖా పెట్టిన ఆస్థి/ఆస్తుల ఈ -వేలం (SARFAESI) చట్టం 2002 క్రింద "ఎక్కడ ఎలా ఉన్నది అక్కడ అలానే" మరియు "అక్కడ ఏమున్నదో అదే" పద్ధతి పై నిర్వహించబడుతుందని సాధారణ ప్రజలకు ఇందుమూలముగా తెలియజేయడమైనది మరియు నియమ నిబంధనలు దిగువ తెలుపబడినవి.

1. శ్రీ పొడకట్ల సర్వేశ్వరరావు, తండ్రి: వీరబ్బాయి, డోర్ నెం.1-238, వంగలపూడి వారి వీధి, యస్.అన్నవరం గ్రామం, తుని మండలం, కాకినాడ జిల్లా-533 401, 2. మెస్సర్స్. శ్రీ షణ్ముఖ గన్నీస్ ట్రేడర్స్, ప్రొ.: శ్రీ పొడకట్ల సర్వేశ్వరరావు శ్రీ పొడకట్ల సర్వేశ్వరరావు, డోర్ నెం.4-5-2, గరువు వీధి, తుని, కాకినాడ జిల్లా-533 401.

బకాయి మొత్తం: ది.18-03-2025 నాటికి హౌసింగ్ లోన్ అకౌంట్ నెం.40680511171 చెల్లించవలసిన బకాయి రూ.19,36,362/- (అక్షరాల పందొమ్మిది లక్షల ముప్పై ఆరు వేల మూడు వందల అరవై రెండు రూపాయలు మాత్రమే) మరియు సురక్ష లోన్ అకౌంట్ నెం.40691883783 చెల్లించవలసిన బకాయి రూ.1,64,092/- (అక్షరాల ఒక లక్ష అరవై నాలుగు వేల తొంభై రెండు రూపాయలు మాత్రమే) మరియు క్యాష్ క్రెడిట్ లోన్ అకౌంట్ నెం.33129423109 (మెస్సర్స్. శ్రీ షణ్ముఖ గన్నీస్ ట్రేడర్స్) చెల్లించవలసిన బకాయి రూ.30,88,726/- (అక్షరాల ముప్పై లక్షల ఎనభై ఎనిమిది వేల ఏడు వందల ఇరవై ఆరు రూపాయలు మాత్రమే)

డిమాండ్ నోటీసు తేది: ది.18-03-2025 బకాయి మొత్తం: తేది. 18-03-2025 నాటికి రూ.51,89,180/- + తేది.19-03-2025 నుండి వడ్డీ మరియు ఇతర ఖర్చులు మొదలగునవి

స్థిరాస్థి వివరములు

తూర్పు గోదావరి జిల్లా, తుని యస్.ఆర్.ఓ.లో చేరిన రిజిష్టర్డ్ సేల్ డీడ్ డాక్యుమెంట్ నెం.474/2004, తేదీ: 25-02-2004 శ్రీ పొడకట్ల సర్వేశ్వరరావు, తండ్రి: వీరబ్బాయి గారి ఆస్థి.

తూర్పు గోదావరి జిల్లా, తుని సబ్ రిజిస్ట్రీ, తుని మండలం,యస్.అన్నవరం గ్రామం, సర్వే నెం.306/2, పాత డోర్ నెం.1-125/4, కొత్త డోర్ నెం.1-238లో 208 చదరపు గజములు = 173.97 చదరపు మీటర్లు గ్రౌండ్‌తో కూడిన స్థలం, ఫస్ట్ మరియు సెకండ్ ఫ్లోర్స్‌తో గల ఆర్‌సిసి బిల్డింగ్‌కు హద్దులు మరియు కొలతలు: తూర్పు: 36'00"=10.97 మీటర్లు - వంగలపూడి రత్నం గారి స్థలం అవతల 2 అడుగులు వెడల్పు గల దారి దక్షిణం: 52'-00"=15.84 మీటర్లు-వంగలపూడి ఆదినారాయణ గారి ఇల్లు పడమర: 36'00'=10.97 మీటర్లు రోడ్ ఉత్తరం: 52'00"=15.84 మీటర్లు - రోడ్ (పొడగట్ల సర్వేశ్వర రావు గారికి చెందిన స్థలం.) అన్ని సులభతరమైన హక్కులతో సహా

రిజర్వు ధర: రూ. 68,00,000/- ధరావత్తు: రూ.6,80,000/- బిడ్ పెంపుదల రూ.10,000/-

ఇ-వేలం తేదీ: 06-03-2026 సమయం: ఉ॥ 11.00 గం॥ల నుండి సా॥ 4.00 వరకు

ఆస్తి తనిఖీ తేది: ది. 18-02-2026 నుండి ది. 05-03-2026 వరకు ఉ: 11.00 గం.లనుండి సా. 4.00 గం.ల వరకు

EMDతో ఆన్‌లైన్ బిడ్ సమర్పించుటకు తేది.18-02-2026 ఉదయం గం.11.00ల నుండి తేది.06-03-2026 ఉదయం గం.11.00ల లోపు

ఇ-వేలం యొక్క నియమ నిబంధనలు

1) అమ్మకం యొక్క సవివరమైన నియమ నిబంధనల కొరకు సెక్యూర్ క్రెడిటర్లు అయిన స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా యొక్క వెబ్ సైట్ www.sbi.co.in/ www.sbi.co.in/web/sbi-in-the-news/auction-notices లో ఏర్పాటు చేసిన లింకును రిఫర్ చేయండి. రిజిస్ట్రేషన్, EMD, వేలం యొక్క వివరములు మొదలగు వాటి గురించి సర్వీసు ప్రొవైడర్ PSB Alliance ఇ-వేలం పోర్టల్: https://baanknet.com/eauction-psb/x.Login టోల్ ఫ్రీ ఫోన్ నెం.: 91-82912 20220, Mail ID: support.baanknet@psballiance.com ను సంప్రదించండి.
2) ఆస్తిని రిజిస్ట్రేషన్ చేసుకొనుటకు వర్తించే స్టాంపు డ్యూటీలు, బదిలీ ఛార్జీలు, ఫీజు వగైరా మరియు చట్టపరమైన/నాన్ స్టేట్యూటరీ బకాయిలు, ఎలక్ట్రికల్ బిల్లులు, పన్నులు, రేట్లు, ఎసెస్‌మెంట్ చార్జీలు, ఫీజులు వగైరా కొనుగోలు దారే భరించవలెను.
3) ఆసక్తి గల బిడ్డర్లు ఇ-వేలం ముగిసేలోపు PSB Alliance నందు ప్రీ-బిడ్ ఇ.యమ్.డి. (Pre-Bid EMD) జమ చేయవలెను. ప్రీ-బిడ్ ఇ.యమ్.డి. మొత్తం PSB Alliance బ్యాంక్ అకౌంట్‌లో జమ అయిన సమాచారం వెబ్‌సైట్‌లో పొందుపరిచిన తరువాత మాత్రమే బిడ్డర్లు యొక్క "వాలెట్"లో చూపించబడుతుంది. బ్యాంకింగ్ ప్రక్రియలో ఇది జరుగుటకు సమయం పట్టవచ్చు, కావున బిడ్డర్లు చివరి నిమిషంలో ఇబ్బందులు ఎదుర్కొనకుండా తమ ప్రీ-బిడ్ ఇ.యమ్.డి.ను సాధ్యమైనంత త్వరగా జమ చేసుకోవాలని సూచించటమైనది.
4) ఆదాయపు పన్ను చట్టం 1961 లోని సెక్షన్ 194-1ఎ ప్రకారం అమ్మకంలో భాగంగా అమ్మకం విలువ రూ.50,00,000/- (యాభై లక్షల రూపాయలు) మరియు అంతకంటే ఎక్కువ ఉన్నచో సదరు మొత్తంపై టి.డి.ఎస్. 1% వర్తిస్తుంది. కావున సఫలీకృత బిడ్డరు /కొనుగోలుదారు అమ్మకం ధరలో 1% టి.డి.యస్.ను తగ్గించుకుని సదరు మొత్తమును అమ్మకం దారైన బ్యాంకు పేరు మరియు పాన్ నెంబరు విధిగా నమోదు చేసి ఆదాయపు పన్ను డిపార్ట్‌మెంట్ యొక్క ఫారం నెం.16-బి నందు జమచేయవలెను మరియు సదరు ఒరిజినల్ టి.డి.ఎస్. సర్టిఫికెట్‌ను బ్యాంకు వారికి సమర్పించవలెను. (వ్యవసాయ భూమి కాకుండా కేవలం స్థిరాస్థికి మాత్రమే వర్తించును).

తేది: 17-02-2026 ప్రదేశం: తుని సం/-అధీకృత అధికారి, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

జేఈఈ మెయిన్‌లో

ఆదిత్య విద్యార్థుల ప్రతిభ

గాంధీనగర్, న్యూస్‌టుడే: జేఈఈ మెయిన్-2026 ఫలితాల్లో ఆదిత్య విద్యార్థులు జాతీయస్థాయిలో అత్యుత్తమ పర్సంటైల్స్‌తో సత్తా చాటారని ఛైర్మన్ ఎన్.శేషారెడ్డి మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను అభినందించారు. ఆదిత్య విద్యా సంస్థల కార్యదర్శి ఎన్.కృష్ణ దీప్‌రెడ్డి మాట్లాడుతూ ఎస్.శ్రీసాయివైభవ్ 99.99, వివిఎస్ఎస్ రాఘవరావు, గంజి శ్రీజన్ 99.98, బుడి శ్రీరామ్ 99.97, సత్యం భువనచంద్ర 99.96 పర్సంటైల్‌ను సాధించారన్నారు. మొత్తం 41 మంది విద్యార్థులు 99, ఆ పైన పర్సంటైల్‌తో అత్యుత్తమ ప్రతిభ కనబర్చారన్నారు. డైరెక్టర్ ఎన్.లక్ష్మీరాజు, ఎన్.సుష్మ, ఎన్.సుగుణ, కోఆర్డినేటర్ కె.లక్ష్మీకుమార్, అకడమిక్ డైరెక్టర్ రామచంద్రరెడ్డి, గంగిరెడ్డి, ప్రిన్సిపల్స్ జె.మెయిన, పి.సత్యనారాయణరెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ ఫణీంద్ర తదితరులు విద్యార్థులు, అధ్యాపకులను అభినందించారు.

శ్రీసాయి వైభవ్

శ్రీజన్

రాఘవరావు

శ్రీరామ్

శ్రీషిర్డీసాయి విద్యార్థుల సత్తా

కంబాలచెరువు(రాజమహేంద్రవరం), న్యూస్‌టుడే: జేఈఈ మెయిన్-2026 ఫలితాల్లో రాజమహేంద్రవరంలోని శ్రీషిర్డీసాయి జూనియర్ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చి వివిధ కేటగిరీల్లో అత్యుత్తమ పర్సంటైల్ సాధించారని విద్యాసంస్థల డైరెక్టర్ టి.శ్రీవిద్య మంగళవారం తెలిపారు. తమ లక్ష్య ఐఐటీ అకాడమీలో శిక్షణ పొందుతున్న ఎం.కృష్ణశ్రీకర్ 99.91, కె.రామకృష్ణ 99.71, ఎం.శ్రీవాస్ 99.68, బి.శ్రీనాథ్ 99.63, కేవీఎంకే ప్రణీత్ 99.48, కె.సాత్విక్ 99.28, ఎ.లోహిత్‌కుమార్ 99.23, బి.శ్రీహర్షిత్ 99.11 పర్సంటైల్ చొప్పున సాధించారన్నారు. మొత్తం ఎనిమిది మంది 99 పైగా పర్సంటైల్, 16 మంది 98 పైగా, 28 మంది 97కి పైగా 52 మంది 95కి పైగా పర్సంటైల్ సాధించారన్నారు. శ్రీషిర్డీసాయి విద్యాసంస్థల ఛైర్మన్ తంబాబత్తుల శ్రీధర్ మాట్లాడుతూ జేఈఈ మెయిన్స్ పేపర్ 1లో 284 మంది విద్యార్థుల్లో 184 మంది అర్హత సాధించారన్నారు. ప్రతిభ చాటిన విద్యార్థులను, కృషి చేసిన అధ్యాపకులను ఛైర్మన్ శ్రీధర్, లక్ష్య టీమ్ చంద్రశేఖర్ ప్రత్యేకంగా అభినందించారు.

శ్రీషిర్డీసాయి విద్యార్థులను అభినందిస్తున్న యాజమాన్యం

ఉపాధి పనులు వేగవంతం చేయాలి

సర్పవరం(కాకినాడ గ్రామీణం): కాకినాడ జిల్లాలో చేపడుతున్న ఉపాధిహామీ పనులు నాణ్యత లోపాలు లేకుండా త్వరితగతిన పూర్తిచేయాలని, నిర్లక్ష్యం చేస్తే ఉపేక్షించవద్దని అధికారులను ఎంపీ ఉదయ్‌శ్రీనివాస్ కోరారు. కాకినాడలోని కార్యాలయంలో ఆయన మంగళవారం డ్వామా పీడీ వెంకటలక్ష్మి, పంచాయతీరాజ్, ఇతర శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. డీసీసీబీ ఛైర్మన్ రామస్వామి, మాజీ ఎమ్మెల్యే వర్మ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

కాపు కల్యాణ మండపం నిర్మాణానికి రూ.75 లక్షలు

పెద్దాపురం పట్టణంలో అసంపూర్తిగా నిలిచిన కాపు కల్యాణ మండపం నిర్మాణం పూర్తికి ఎంపీ లాడ్స్ నిధుల రూ.75 లక్షల మంజూరు చేస్తున్నామని ఎంపీ తెలిపారు. కాకినాడ కార్యాలయంలో మంగళవారం డీసీసీబీ ఛైర్మన్ తుమ్మల రామస్వామి ఆధ్వర్యంలో పెద్దాపురానికి చెందిన తెలగా, కాపు సంఘం నాయకులు ఎంపీని కలిశారు. 15 ఏళ్లుగా పెద్దాపురంలో కాపు కల్యాణ మండప నిర్మాణం అసంపూర్తిగా ఉందని, నిధులు కోరారు. దాంతో ఆయన రూ.75 లక్షలు ఇస్తానన్నారు. కాపు సంఘం నాయకులు పసుపులేటి సాయిబాబు, పెద్దిరెడ్డి రాజేష్, కాటూరి శ్రీను పాల్గొన్నారు.

అనుమానంతో భార్యపై కత్తితో దాడి

కాకినాడ జీజీహెచ్‌కు తరలింపు.. పరిస్థితి విషమం

ఏలేశ్వరం: వివాహమై 20 ఏళ్లు దాటింది. నలుగురు సంతానం.. భార్యపై అనుమానం పెంచుకున్న ఆ భర్త మంగళవారం మధ్యాహ్నం కత్తితో దాడి చేయడంతో తల, చేతిపై తీవ్రగాయాలయ్యాయి. ఈ ఘటన ఏలేశ్వరం మండలం లింగంపర్తిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలివీ.. గిరిపాకకు చెందిన బొడ్డపాటి లక్ష్మీపతికి (44) లింగంపర్తి గ్రామానికి చెందిన కుమారి (40)తో ఇరవై ఏళ్ల కిందట వివాహమైంది. పెళ్లి అనంతరం అత్తగారింటికి వచ్చి నివాసం ఉంటున్నారు. ప్రస్తుతం వీరికి ముగ్గురు కుమారులు, ఒక కుమార్తె. కొన్ని రోజులుగా భార్యపై అనుమానం పెంచుకున్న భర్త మంగళవారం మధ్యాహ్నం భార్య ఇంట్లో ఒంటరిగా ఉన్న సమయంలో కత్తితో తల, చేతిపై దాడి చేశాడు. దీంతో ఆమెకు తీవ్ర గాయాలయ్యాయి. పెద్దగా కేకలు వేయడంతో చుట్టుపక్కలవారు ఘటనా స్థలానికి చేరుకుని ఏలేశ్వరం ఆసుపత్రికి తీసుకెళ్లారు. ప్రథమ చికిత్స అనంతరం కాకినాడ జీజీహెచ్‌కు తరలించారు. ప్రస్తుతం ఆమె పరిస్థితి విషమంగా ఉన్నట్లు చెబుతున్నారు. సీఐ సూర్యఅప్పారావు ఆదేశాల మేరకు ఎస్సై రామలింగేశ్వరరావు కేసు నమోదు చేసి నిందితుడిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు.

రాత్రి ఘర్షణ.. ఉదయం కొట్లాట

పిఠాపురంలో ఘటన.. అయిదుగురికి గాయాలు

పిఠాపురం: పిఠాపురంలోని కుక్కుటేశ్వరస్వామి రథోత్సవంలో సోమవారం రాత్రి రెండు ప్రాంతాలకు చెందిన ఒకే సామాజికవర్గ యువకుల మధ్య ఘర్షణ జరిగింది. మంగళవారం ఉదయం కక్షతో ఒక వర్గంపై మరోవర్గం దాడి చేసింది. ప్రమాదంలో ఇద్దరికి గాయాలు కాగా జీజీహెచ్‌కు తరలించారు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. స్థానిక జీవన్‌నగర్‌కు చెందిన యువకులు మంగళవారం మధ్యాహ్నం అయితేనగర్ ప్రాంతానికి వెళ్లి గొడవకు దిగి, కర్రలతో దాడి చేశారు. అదే సమయంలో చెప్పులు కుట్టే పరికరంతో ఆకాశ్ అనే యువకుడి పక్కటెముక భాగంలో పొడిచారు. ఇదే ఘటనలో మరో వ్యక్తి నాగ సురేష్‌తోపాటు మరో ముగ్గురు స్వల్పంగా గాయపడ్డారు. వీరిని పిఠాపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్సకు ఆకాశ్‌ను కాకినాడ జీజీహెచ్‌కు తరలించారు. పట్టణ పోలీసులు ఆసుపత్రికి వెళ్లి వివరాలు సేకరించారు. ఘర్షణ జరిగిన ప్రాంతంలో విచారణ చేస్తున్నట్లు సీఐ శ్రీనివాస్ తెలిపారు.

పట్టు పరిశ్రమల శాఖ అధికారిగా పరమేశ్వరి

గొల్లప్రోలు: కాకినాడ జిల్లా పట్టు పరిశ్రమశాఖ అధికారిణిగా జి.పరమేశ్వరి జిల్లా కార్యాలయంలో మంగళవారం సాయంత్రం బాధ్యతలు స్వీకరించారు. అనకాపల్లి జిల్లా పట్టు పరిశ్రమ శాఖ అధికారిగా బాధ్యతలు నిర్వహిస్తున్న పరమేశ్వరికి కాకినాడ జిల్లా అధికారిగా అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ఆ శాఖ డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాసులు ఉత్తర్వులు జారీ చేశారు. ఇంతకాలం కాకినాడ జిల్లా అధికారిగా బాధ్యతలు నిర్వహించిన బి.గీతారాణిని ఏలూరు జిల్లా అధికారిగా బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం సోమవారం రాత్రి జీవో జారీ చేసింది.

జిల్లా రిజిస్ట్రార్‌గా ప్రసాదరావు

గాంధీనగర్, న్యూస్‌టుడే: స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖ జిల్లా రిజిస్ట్రార్‌గా కె.ప్రసాదరావు నియమితులయ్యారు. ఈ మేరకు ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. కృష్ణాజిల్లా చల్లపల్లి సబ్ రిజిస్ట్రార్‌గా పనిచేస్తున్న ప్రసాదరావు పదోన్నతిపై కాకినాడకు వస్తున్నారు. ప్రస్తుతం ఇక్కడ మార్కెట్ వాల్యూ, ఆడిట్ రిజిస్ట్రార్‌గా ఉన్న జయలక్ష్మి ఇన్‌ఛార్జిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు.

20 నుంచి ఖడ్గమాల పూజ

అన్నవరం: అన్నవరం సత్యదేవుని క్షేత్ర రక్షకులుగా కొలిచే, ఉపాలయం వనదుర్గ అమ్మవారి ఆలయంలో ఈనెల 20 నుంచి ఖడ్గమాల పూజ (నూతన ఆర్జిత సేవ) ప్రారంభించనున్నారు. ఆలయంలో ప్రతి శుక్రవారం ఉదయం 7.30 నుంచి 8.30 గంటల వరకు పూజ జరుగుతుంది. ఇందులో పాల్గొనే దంపతులకు రూ.1,116 రుసుముగా నిర్ణయించారు. భక్తులకు అమ్మవారి రూపు, కండువ, రవిక, ప్రసాదం ఇస్తారు. వేదాశీస్సులు అందిస్తారు. పూజాసామగ్రిని దేవస్థానం సమకూరుస్తుంది. కొబ్బరికాయ, అరటిపండ్లు భక్తులు తెచ్చుకోవాలి.

ధరవరలు

అంబాజీపేట కొబ్బరి మార్కెట్

కొబ్బరి (క్వింటాళ్లలో)	ధర (రూ॥లలో)
కొత్తకొబ్బరి	18,500
కురిడీ (వెయ్యింటికి):	
పాతకాయ: గండేరా	30,500
గటగట	29,000
కొత్తకాయ: గండేరా	30,000
గటగట	29,000
నీటి కాయ (వెయ్యింటికి):	
పాత (ముక్కుడు) కాయ	20,000-21,000
కొత్త (పచ్చి) కాయ	16,000-17,000
కొబ్బరినూనె మార్కెట్:	
15 కిలోలు	5,000
కిలో	350

గమనిక: అంబాజీపేట కొబ్బరి మార్కెట్ ధరలు ప్రతి బుధ, శనివారాల్లో మాత్రమే మారుతాయి.

వెన్‌కాబ్ చికెన్ ధర కిలోకు రూ॥లో

ఫారంరేటు	115-00
రిటైల్ లైవ్	142-00
డ్రెస్డ్	206-00
స్కిన్‌లెస్	234-00

EENADU e Classifieds

AUTO
VEHICLES FOR SALE
శ్రీలలిత రైస్‌మిల్, పెద్దాపురం వారి ఇన్నోవా కార్లు అమ్మకమునకు కలవు. Contact Cell: 94941 54551.

BUSINESS SERVICES
బంగారం బ్యాంకులలో/ ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈరోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్). Ph: 81422 92071.
శ్రీ సాయి గోల్డ్ తాకట్టులో ఉన్న బంగారం ఏ బ్యాంక్/ ప్రైవేట్ సంస్థల నుండి అయినా విడిపించి, ఆ రోజు మార్కెట్ రేట్‌కి కొనబడును. స్పాట్ క్యాష్. ✆ 9493338823.

FINANCIAL SERVICES
స్థిరాస్తులపై ఆంధ్రప్రదేశ్ అంతటా మార్టిగేజ్ లోన్స్ మరియు స్థిరాస్తి ఎక్కడ ఉన్నా ఏ సంస్థలో ఉన్నా Xerox పేపర్స్‌పై 2nd మార్టిగేజ్ లోన్ ఇవ్వబడును. 50 లక్షలలోపు, అయోధ్య కోఆపరేటివ్ బ్యాంక్. ✆ 93969 99669.

REAL ESTATE
LAND FOR SALE
RAJAMAHENDRAVARAM RURAL
కడియం మండలం, మాధవరాయుడు పాలెం పరిధిలో పేపరుమిల్లు వెనుక 3 1/2 ఎకరముల భూమి వ్యవసాయం మరియు పరిశ్రమలకు అనువైనది అమ్మకం. ✆ 7702691117.

PLOT FOR SALE
KAKINADA CITY
Properties Bazar's @ Kakinada Touch Your Luck, Buy Plot & Win Plot, Free Lucky Draw with Guaranteed Prizes. Cell: 9154184236

RAJAMAHENDRAVARAM RURAL
రాజమండ్రి, పిడింగొయ్యి పంచాయతీలో DTCP అప్రూవ్ కలిగిన N/E 272 చ॥గ॥లు, N/F 272 చ॥గ॥ల స్థలములు అమ్మకం. Contact: 7382 19 4444.

JOBS
Wanted DRA Tele Callers, Field Executives & Team Leaders Banking Sector Attractive Salaries and Incentives. ✆ 9849394835, 7075345527.
Wanted Teachers for Reputed Schools in A.P & Telangana, Contact: Sneha Placements Service. Ph: 94402 46409.
WANTED: Telecallers for Reputed Overseas Edu Consultancy in Rajahmundry. Experience Preferred. Contact Cell: 98521 59999.

WANTED
we are Hiring
Front Office Staff (Female) - 02 no's
Salary - 12 k
08 Hours Duty
SprintOn, JN Road Rajamahendravaram
✆ 99663 57897

త్రినేత్ర హోంకేర్‌లో వృద్ధులను/ పేషెంట్స్‌ను/పిల్లలను చూసుకొనుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఫ్రీ వసతి, భోజనం. జీ: 18K. ✆ 8520980099, 8520874499

కాకినాడలోని భానుగుడి జంక్షన్ నందు బట్టల షాపులో పనిచేయుటకు సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. శాలరీ - 15,000/-/ 4 W/O. + ESI + EPFO. సెల్: 9885295999.

బిజినెస్ ఎగ్జిక్యూటివ్స్/ బిజినెస్ మేనేజర్స్ కావలెను. డిగ్రీ, 5 సం॥ల మార్కెటింగ్ రంగంలో అనుభవం, 30 సం॥ల లోపు వారు రెజ్యూములను kamatham-job@gmail.comకు పంపగలరు.

హరేకృష్ణ హోంకేర్‌లో వృద్ధులను/ పేషెంట్స్/ పిల్లలను చూసుకొనుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఫ్రీవసతి, భోజనం జీ:18-20K ✆ 96404 68899, 96402 58899

WANTED STAFF
★ Pre-Primary Teachers
★ Primary Teachers All Subjects
★ High School Teachers All Subjects
★ Office Assistant -cum-Telecaller
★ Computer Operator
Good Communication skills in English preferred.
Walk-in for Interview
Resume to: 70951 52111
INTERNATIONAL DELHI PUBLIC SCHOOL Rajanagaram & Rajahmundry

SECURITY GUARDS
Wanted Security Guard: Night Duty 8 pm to 6 am, Salary: Rs.12,000/- Per Month, Work is at Kakinada. Contact: 95020 97778.

నెక్ సూచించిన కోడిగుడ్డ ధర
★ For the Information of Trade & Industry
★ తూర్పుగోదావరి జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు ధర రూ. 5-15 పై॥
అనపర్తి ఆఫీసు: 08857-226908

EENADU for Advertisement Contact: 8008597607

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్-లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

కెనరా బ్యాంక్ Canara Bank

భారత ప్రభుత్వ రంగ సంస్థ A Government of India Undertaking

ఎ ఆర్ ఎమ్ బ్రాంచ్ (13591), విశాఖపట్నం
మెలోడీ సినిమా థియేటర్ ఎదురుగా, సూర్యాభాగ్, విశాఖపట్నం-530020, ఫోన్: 8332956773, 7095199455, ఇ-మెయిల్: cb13591@canarabank.com

స్థిరాస్తుల అమ్మకానికి వేలం అమ్మకం ప్రకటన

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 లోని 8(6) & 9(1) నిబంధనలతో చదవబడు సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్టు, 2002 క్రింద స్థిరాస్తుల అమ్మకానికి ఇ-వేలం అమ్మకం ప్రకటన. కెనరా బ్యాంక్ ఎ.ఆర్.ఎం బ్రాంచ్ విశాఖపట్నం వారికి దిగువ తెలిపిన ఋణగ్రహీత(లు)/హామీదారు(లు) చెల్లించవలసిన బకాయి మొత్తంను రాబట్టుకొనుటకు కెనరా బ్యాంక్ అధీకృత అధికారిచే భౌతికంగా స్వాధీనం చేసుకున్న, సెక్యూర్ క్రెడిటర్‌కు తనఖాపెట్టిన/ఛార్జి చేసిన దిగువ [illegible]

ఇ-వేలం తేది & సమయం: 06.03.2026, మ॥ 01.00 గం.ల నుండి మ॥ 02.00 గం.ల వరకు (ఒకవేళ అవసరమైతే ప్రతి 5 నిమిషముల వ్యవధిలో అపరిమిత పొడిగింపుతో)

ధరావత్తు సమర్పించుటకు ఆఖరి తేది: 05.03.2026, సాయంత్రం 6.00 గం.ల లోపు

వ. సం	ఋణగ్రహీత / హామీదారులు (అన్ని ఖాతాలు ఎ.ఆర్.ఎం బ్రాంచ్ విశాఖపట్నంకు బదిలీ చేయబడినవి)	తనఖాలో ఉన్న ఆస్తి వివరములు	రిజర్వు ధర	ఇ.ఎం.డి (రిజర్వు ధరలో 10%)
1	1. M/s. ఐలిఫ్టెక్ మెడికల్ అండ్ ఆఫీస్ ఇక్విప్మెంట్స్ ప్రైవేట్ లిమిటెడ్ [illegible]	ఆస్తి నెం.1: [illegible] సర్వే నెం. 129/6, 129/4, 129/5 [illegible]	రూ. 63.25 లక్షలు	రూ. 6.33 లక్షలు
		ఆస్తి నెం.2: [illegible] సర్వే నెం. 129/6, 129/4, 129/5 [illegible]	రూ. 63.05 లక్షలు	రూ. 6.31 లక్షలు
		ఆస్తి నెం.3: [illegible] సర్వే నెం. 129/6, 129/4, 129/5 [illegible]	రూ. 62.70 లక్షలు	రూ. 6.27 లక్షలు
		ఆస్తి నెం.4: [illegible] సర్వే నెం. 129/6, 129/4, 129/5 [illegible]	రూ. 62.63 లక్షలు	రూ. 6.27 లక్షలు

[illegible] www.canarabank.com [illegible] https://baanknet.com [illegible]

తేది: 13.02.2026, ప్రదేశం: విశాఖపట్నం సం/- అధీకృత అధికారి, కెనరా బ్యాంక్

కాకినాడ

రైతుబజార్‌లో కూరగాయల ధరలు(కిలోకు)

గాంధీనగర్, న్యూస్‌టుడే: టమాట- 10, 12, వంకాయలు- 26, 32, 40, బెండకాయలు- 36, పచ్చిమిర్చి- 58, 64, కాకరకాయ- 50, బీర- 34, 38, క్యాలీఫ్లవర్- 15, 20, క్యాబేజీ- 18, క్యారెట్- 26, 30, దొండకాయలు- 46, 50, బంగాళాదుంపలు- 16, 20, ఉల్లి- 20, 26, దోసకాయలు- 30, చిక్కుళ్లు- 26, చేమదుంపలు- 30, బీట్‌రూట్- 26, కీరదోస- 36, బీన్స్‌కాయలు- 70, అల్లం- 70, క్యాప్సికం- 60, బొబ్బర్లు- 28, చిలకడదుంపలు- 36, ఒకటి చొప్పున ఆనపకాయ- 15, 20, పొట్లకాయ- 25, 28, అరటికాయ- 6, 8, మునగకాడ- 12, 15, మామిడికాయ- 15, 20, నిమ్మకాయలు(డజన్) - 30, 36.

నగరంలో సినిమాలు

గాంధీనగర్, న్యూస్‌టుడే: ఆనంద్ సినిమాస్ 4స్క్రీన్- లవ్‌స్టోరీ, కపుల్ ఫ్రెండ్లీ, విత్‌లవ్, మన శంకరవరప్రసాద్ గారు, దేవీ మల్టీప్లెక్స్ 4స్క్రీన్- కపుల్ ఫ్రెండ్లీ, ఛాథాపచ్చ, విత్ లవ్, లక్ష్మి- ఫంకీ, సత్యగౌరి - కపుల్ ఫ్రెండ్లీ, తిరుమల- మన శంకరవరప్రసాద్ గారు, సీఅండ్‌సీ 1- ఫంకీ, సీఅండ్‌సీ 2- నారీనారీ నడుమ మురారి, శ్రీప్రియ - అరెంజ్(ఉ,మ), అనగనగా ఒకరాజు, పద్మప్రియ- ఫంకీ, సూర్య1(వాకలపూడి) - ఫంకీ, సూర్య 2.- సీతాపయనం.

మేమున్నాం.. మీకు తోడుగా

ఉ॥ 10 - మ॥ 1

మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు:
కాకినాడ నగరం: 80085 74157
సాంబమూర్తినగర్: 91548 46719, మసీదుసెంటర్: 91541 18210
గాంధీనగర్: 80085 74159, బాలాజీచెరువు: 80085 74154

స్పందనకు వందనం

వెలిగిన వీధిదీపం..

మసీదుసెంటర్: కాకినాడ, వెంకటేశ్వనగర్ ప్రధాన రహదారిపై వీధిదీపం వెలగకపోవడంతో చీకట్లు అలముకున్నాయి. దీనిపై ఇటీవల 'ఈనాడు'లో ప్రచురితమైన కథనానికి సంబంధిత అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించారు.

పూడిక తొలగించరూ..

మసీదుసెంటర్: కాకినాడ, శ్రీనగర్ ప్రధాన రహదారి పక్కన కాలవలో పూడిక తీయకపోవడంతో అధ్వానంగా దర్శనమిస్తోంది. మురుగు పారే వీలులేకపోవడంతో అవస్థలు తప్పడం లేదు. దాంతో దుర్వాసన వెదజల్లుతోందని, దోమలవ్యాప్తి చెందుతున్నాయని స్థానికులు వాపోతున్నారు. పక్కనే పాఠశాల ఉండటంతో విద్యార్థులకు సైతం అవస్థలు తప్పడం లేదు. సంబంధిత అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని వారు విన్నవిస్తున్నారు.

సొంత గూడు ఉన్నా.. తప్పని తిప్పలు

సాంబమూర్తినగర్(కాకినాడ), న్యూస్‌టుడే: మహిళాభివృద్ధి, శిశు సంక్షేమశాఖ(ఐసీడీఎస్) ఆధ్వర్యంలో నడిచే అంగన్‌వాడీ కేంద్రాలు చాలా వరకు అద్దె భవనాల్లోనే నడుస్తున్నాయి. అంతంత మాత్రంగానే అరకొర వసతులతో సిబ్బంది కేంద్రాలను నెట్టుకొస్తున్నారు. మరోవైపు కొన్నిచోట్ల సొంత గూడు ఉన్నా ఇబ్బందులు తప్పడం లేదు. కాకినాడ నడిబొడ్డున ఉన్న కొత్తకాకినాడలో మూడేళ్ల కిందట భాగ్యనగర్ గ్యాస్ కంపెనీ వారు కొత్త అంగన్‌వాడీ కేంద్రాన్ని నిర్మించి ఇచ్చారు. అయితే అక్కడే ఉన్న పాఠశాల భవనం తొలగించి కొత్త భవన నిర్మాణానికి శ్రీకారం చుట్టిన నేపథ్యంలో ప్రాథమిక పాఠశాలను తాత్కాలికంగా అంగన్‌వాడీ భవనంలోకి మార్చారు.

ఒకే గదిలో మూడు కేంద్రాల చిన్నారులు, అక్కడే సరకులు

మూడూ ఒకేచోట..

మూడు గదులతో ఉన్న అంగన్‌వాడీ కేంద్ర భవనంలో రెండు గదుల్లో ప్రాథమిక పాఠశాల నడస్తుండగా.. కేవలం ఒక్క గదిలోనే మూడు అంగన్‌వాడీ కేంద్రాలను నడపాల్సిన దుస్థితి నెలకొంది. ఒక్కో కేంద్రంలో 15 నుంచి 20 పిల్లలు చొప్పున మొత్తం 40 నుంచి 50 పిల్లలు వరకు ఒకే గదిలో ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. దీంతో సరకు నిల్వతోపాటు చిన్నారులు అక్కడే చదువు సాగించడం, భోజనం చేయడంతో సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు. దీనికితోడు గర్భిణి, బాలింతలకు పోషకాహారం పంపిణీ వంటి సమయాల్లోనూ ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. ఏళ్లు గడుస్తున్నా సమస్యను పరిష్కరించడం లేదని, ఇప్పటికైనా అధికారులు స్పందించి మూడు గదులను అంగన్‌వాడీ కేంద్రాలకే కేటాయించేలా చర్యలు తీసుకోవాలని కార్యకర్తలు, ప్రజలు కోరుతున్నారు.

కమ్యూనిజానిదే భవిష్యత్తు

సీపీఐ జాతీయ కార్యదర్శి రామకృష్ణ

గాంధీనగర్, న్యూస్‌టుడే: భవిష్యత్తు అంతా కమ్యూనిజానిదేనని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.రామకృష్ణ పేర్కొన్నారు. కాకినాడ సూర్యకళామందిరంలో సీపీఐ రాష్ట్ర సమితి సమావేశాల్లో మంగళవారం ఆయన మాట్లాడుతూ శత జయంతి ఉత్సవాల ముగింపు సభ ఖమ్మంలో లక్షలాది మందితో విజయవంతమైందని, తర్వాత కొత్తగూడెం కార్పొరేషన్‌లో ఎర్రజెండా ఎగిరిందని చెప్పారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి ఈశ్వరయ్య మాట్లాడుతూ పార్టీని మరింత బలోపేతం చేయడానికి ప్రతి సభ్యుడు అంకితభావంతో పనిచేయాలన్నారు. పార్టీ జాతీయ కంట్రోల్ కమిషన్ ఛైర్మన్ కె.నారాయణ, రావుల వెంకయ్య, అక్కినేని వనజ, ముప్పాళ్ల నాగేశ్వరరావు, తాటిపాక మధు, సత్యనారాయణమూర్తి, పి.హరినాథ్‌రెడ్డి, అజయ్‌కుమార్, జగదీష్, ప్రభాకర్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న రాష్ట్ర కార్యదర్శి జి.ఈశ్వరయ్య, వేదికపై రామకృష్ణ, నారాయణ తదితరులు

ఎట్టకేలకు గేటు తెరిచారు..!

కాకినాడ కలెక్టరేట్, న్యూస్‌టుడే: గత 13 రోజుల నిరీక్షణకు తెరపడింది. ఎట్టకేలకు మంగళవారం సాయంత్రం 6.30 గంటల ప్రాంతంలో ఎస్.అచ్యుతాపురం రైల్వేగేటు తెరిచి రాకపోకలకు అనుమతించారు. ఇక్కడ మరమ్మతుల నిమిత్తం ఈ నెల 4 నుంచి గేటును మూసివేశారు. పనుల్లో జాప్యంతో ప్రజలు ఇబ్బంది పడ్డారు. దీంతో ట్రాఫిక్ కొండయ్యపాలెం పైవంతెనకు మళ్లించడంతో రద్దీ ఏర్పడింది. పనులు పూర్తవడంతో ఎట్టకేలకు రాకపోకలకు అనుమతించారు.

పోలియో మహమ్మారిని తరిమికొడదాం

గాంధీనగర్, న్యూస్‌టుడే: ప్రపంచం నుంచి పోలియో మహమ్మారిని తరిమికొట్టేందుకు రోటరీ ఇంటర్నేషనల్ చేపట్టిన పల్స్ పోలియో కార్యక్రమాన్ని ముందుకు తీసుకెళ్లడంతో పాటు, విరాళాలు సేకరించేందుకు రోటరీ గవర్నర్ డాక్టర్ కల్యాణ చక్రవర్తి సైకిల్ యాత్ర చేపట్టడం అభినందనీయమని రోటరీ పాస్ట్ గవర్నర్ టిక్కు పేర్కొన్నారు. మంగళవారం రామారావుపేటలో సైకిల్ యాత్రను జెండా ఊపి ప్రారంభించారు. కల్యాణ చక్రవర్తి మాట్లాడుతూ ఇచ్ఛాపురం నుంచి విజయవాడ వరకూ ఉన్న 80 క్లబ్‌ల ప్రతినిధులు పర్యటించి ఈనెల 22వతేదీన విజయవాడలో జరిగే సదస్సుకు హాజరుకానున్నట్లు తెలియజేశారు. తడాల బుజ్జి, ఈశ్వరరావు, వరప్రసాద్, బాబి, సత్యనారాయణ, కల్యాణి రమేష్, సురానా, డాక్టర్ వినయ్, కాశీవిశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.

యాత్రను ప్రారంభిస్తున్న టిక్కు, కల్యాణ చక్రవర్తి

అదనపు పనుల నుంచి మినహాయించండి

కాకినాడ కలెక్టరేట్, న్యూస్‌టుడే: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న క్షేత్ర సహాయకులను ఇతర పనులు అప్పగించవద్దని, వాటి నుంచి మినహాయింపు ఇవ్వాలని క్షేత్ర సహాయకుల సంక్షేమ సంఘం జిల్లా కమిటి కోరింది. ఈ మేరకు మంగళవారం కలెక్టరేట్‌లో డ్వామా పీడీ అడపా వెంకటలక్ష్మికి వినతి పత్రం అందజేశారు. ఉపాధి పనుల్లో రోజూ ఉదయం 6 గంటలకు మొబైల్ యాప్‌లో కూలీల మస్టర్లు అప్‌లోడ్ చేయాలని, ప్రతి శుక్రవారం సమావేశాలు నిర్వహించి, ఏడు రకాల రిజిస్టర్లు నిర్వహించి, వివరాలు ఆన్‌లైన్‌లో పొందుపర్చాలని తెలిపారు. ఇవి కాకుండా అనధికారికంగా పింఛన్ల పంపిణీ, అక్షర ఆంధ్ర, గ్రామ పంచాయతీల్లో పనులు, వాటర్ ట్యాంకు క్లీనింగ్ వంటివి చేయిస్తున్నారని, వీటి నుంచి మినహాయింపు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం కలెక్టరేట్ జేసీ అపూర్వభరత్‌కు వినతి పత్రం అందజేశారు.

పీడీ వెంకటలక్ష్మికి వినతి అందజేస్తున్న క్షేత్రసహాయకులు

ఆర్డీవో కార్యాలయంలో అసిస్టెంట్ కలెక్టర్ విధులు

కాకినాడ కలెక్టరేట్, న్యూస్‌టుడే: జిల్లా అసిస్టెంట్ కలెక్టర్ మనీషా శిక్షణలో భాగంగా మంగళవారం కాకినాడ ఆర్డీవో కార్యాలయంలో విధులు నిర్వహించారు. భూములు, రీసర్వేకు సంబంధించిన అంశాలను ఆర్డీవో మల్లిబాబును అడిగి తెలుసుకున్నారు. వారం రోజులపాటు ఆమె ఇక్కడ శిక్షణ పొందనున్నారు.

ఒరిగిన స్తంభం.. పొంచి ఉన్న ప్రమాదం

నగరంలోని 41వ డివిజన్, ఒంటిమామిడి కూడలిలో విద్యుత్తు స్తంభం ఒరిగిపోయింది. ఇది ఎప్పుడు కూలుతుందోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఇక్కడ గతంలో ఇనుప విద్యుత్తు స్తంభాలను తొలగించి, కొత్తవి వేశారు. దీనిని మాత్రం మార్చలేదు. వ్యాపార కూడలి కావడం, నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగించే ప్రధాన రహదారిలో ప్రమాదం వాటిల్లక ముందే చర్యలు తీసుకోవాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు. – న్యూస్‌టుడే, కాకినాడ కలెక్టరేట్

నెలల తరబడి ఇంతే.. పట్టించుకోరంతే!

కాకినాడ 45వ డివిజన్ శ్రీరామ్‌నగర్ సచివాలయం సమీపంలో కొందరు రోడ్లను, కాలువలను ఆక్రమించి ఇటుకలు, కంకర, కర్రలు వంటివి నెలల తరబడి నిల్వ చేస్తున్నారు. దీంతో స్థానికులు రాకపోకలకు ఇబ్బందులకు గురవుతున్నారు. సమీపంలోనే సచివాలయం ఉన్నా అక్కడి సిబ్బంది చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని వాపోతున్నారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు. –న్యూస్‌టుడే, భానుగుడి సెంటర్

ఎత్తుకు పైఎత్తు

కాకినాడ డీఎస్‌ఏలో శాప్ లీగ్ క్రీడా పోటీల్లో భాగంగా జిల్లాస్థాయి చదరంగం పోటీలను మంగళవారం నిర్వహించారు. అండర్-13, 15, 17, 19 విభాగాల్లో బాలబాలికలకు నిర్వహించిన ఈ పోటీలకు జిల్లా వ్యాప్తంగా సుమారు 77 మంది క్రీడాకారులు హాజరయ్యారు. ఎత్తుకు పై ఎత్తు వేస్తూ సత్తా చాటారు. ప్రతిభ కనబరిచిన వారిని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు డీఎస్‌డీవో వి.సతీష్‌కుమార్ తెలిపారు. రాష్ట్ర ట్రైబల్ స్పోర్ట్స్ అధికారి ఎస్.వి.రమణ తదితరులు పాల్గొన్నారు. – న్యూస్‌టుడే, మసీదుసెంటర్

గుంత.. రాకపోకలకు చింత

కాకినాడలో అత్యంత కీలకమైన వార్ఫ్‌రోడ్డులో ప్రయాణం ప్రమాదకరంగా మారింది. అమలాపురం, మండపేట ప్రాంతాలకు భారీ వాహనాల రాకపోకలు ఇటువైపే సాగుతున్నాయి. ఈ రహదారిలో జీజీహెచ్‌కు వెనక భాగంలో సెంట్రల్‌డ్రగ్ స్టోర్స్‌కు ఎదురుగా ఏర్పడిన గుంతను ఆర్‌అండ్‌బీ, నగరపాలక అధికారులు పూడ్చలేదు. మలుపు సమీపంలో ఉండడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. వెంటనే మరమ్మతులు చేపట్టాలని స్థానికులు పాలెపు ధర్మారావు తదితరులు వేడుకుంటున్నారు. – న్యూస్‌టుడే, కాకినాడ కలెక్టరేట్

ఇళ్ల పట్టాల పంపిణీపై విచారణ చేపట్టాలి

కాకినాడ కలెక్టరేట్, న్యూస్‌టుడే: జగన్ ప్రభుత్వంలో 2019-24 మధ్య ఇళ్ల పట్టాల పంపిణీలో పెద్ద ఎత్తున అక్రమాలు జరిగాయని, దీనిపై సమగ్ర విచారణ చేయాలని భాజపా నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం కలెక్టరేట్‌లో సంయుక్త కలెక్టర్ అపూర్వభరత్‌కు భాజపా జిల్లా ప్రధాన కార్యదర్శి, జనతా వారధి కన్వీనర్ దాట్ల కృష్ణవర్మ ఆధ్వర్యంలో ఆపార్టీ నేతలు వినతి పత్రం అందజేశారు. గత ప్రభుత్వంలో ఇళ్ల స్థలాలు పేరిట భారీ దోపిడీకి పాల్పడ్డారని, స్థలాలు చూపకుండా పట్టాలు ఇచ్చారని, ఇవి నకిలీవని ఆరోపించారు. బాలాజీ శంకర్‌సింగ్, ఎం.సురేశ్, చోడిశెట్టి రమేశ్, కుండల సాయికుమార్, తదితరులు పాల్గొన్నారు.

జేసీ అపూర్వభరత్‌కు వినతి అందిస్తున్న భాజపా నాయకులు

విద్యార్థులకు క్రీడా పరికరాల అందజేత

మసీదుసెంటర్, న్యూస్‌టుడే: కాకినాడ ఏఎంజీ పాఠశాల విద్యార్థులకు సానా సతీష్‌బాబు ఫౌండేషన్ తరపున క్రికెట్, వాలీబాల్, త్రోబాల్, హ్యాండ్ బాల్, టెన్నికాయిట్ రింగ్స్ తదితర వాటిని మంగళవారం అందజేశారు. ఛైర్మన్ తలాటం హరీష్ విద్యార్థులతో ఆడి ప్రోత్సహించారు. పాఠశాల హెచ్‌ఎం చందన, ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ సీఎఫ్‌వో డి.విజయభాస్కర్, ఏసీఏ ఫైనాన్స్ మేనేజర్ జి.ఆంజనేయులు, నాగ గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు క్రీడా పరికరాలను అందజేసిన తలాటం హరీష్ తదితరులు

క్రీడాకారులకు మధ్యాహ్న భోజనం ఏర్పాటు

మసీదుసెంటర్, న్యూస్‌టుడే: కాకినాడ డీఎస్‌ఏలో జరుగుతున్న లాంచ్ ఆఫ్ లీగ్-2026 చెస్ టోర్నమెంట్‌లో క్రీడాకారులకు సానా సతీష్ బాబు ఫౌండేషన్ ఛైర్మన్ తలాటం హరీష్ ఆధ్వర్యంలో మధ్యాహ్న భోజనాన్ని మంగళవారం ఏర్పాటు చేశారు. డీఎస్‌డీవో సతీష్‌కుమార్, రాము, సునీల్, సాయి తదితరులు పాల్గొన్నారు.

కాకినాడను సుందరనగరంగా తీర్చిదిద్దుదాం

కాకినాడ నగరం, న్యూస్‌టుడే: కాకినాడను సుందర నగరంగా తీర్చిదిద్దేందుకు ప్రజలు, వ్యాపార సంస్థలు సహకరించాలని నగరపాలక సంస్థ ఇన్‌ఛార్జి కమిషనర్ ఎన్‌వీవీ సత్యనారాయణ కోరారు. మంగళవారం ఆయన ఘాటీ సెంటర్, కొవ్వూరు రోడ్డు ప్రాంతాల్లో పర్యటించి పారిశుద్ధ్య పరిస్థితులను పరిశీలించారు. కొన్నిచోట్ల కాలువల్లో ప్లాస్టిక్ వ్యర్థాలను గుర్తించి స్థానికులకు సూచనలు చేశారు. చెత్తను కాలువల్లో వేయవద్దని సూచించారు. మరికొన్ని చోట్ల ఆరుబయట రోడ్లపై కట్టెల పొయ్యిలతో వంటలు చేయడాన్ని గుర్తించి వారిని మందలించారు. ఘాటీ సెంటర్‌లో అన్న క్యాంటీన్‌ను సందర్శించారు. రుచి, శుభ్రతపై ఆరా తీశారు. ఎంహెచ్‌వో పృథ్వీచరణ్ తదితరులున్నారు.

సచివాలయ ఉద్యోగులకు సూచనలిస్తున్న కమిషనర్ సత్యనారాయణ

గురిపెట్టారు.. సత్తా చాటారు

జేఈఈ మెయిన్‌లో కాకినాడ విద్యార్థుల ప్రతిభ

గాంధీనగర్, న్యూస్‌టుడే: చిన్ననాటి నుంచి ఉన్నత లక్ష్యాలు ఏర్పరచుకుని వాటి కోసం వారంతా కృషి చేశారు. ఇంజినీరింగ్‌లో దేశంలోనే అత్యున్నత ఐఐటీల్లో చదవాలన్న లక్ష్యంతో ప్రత్యేకంగా, ప్రణాళికాబద్ధంగా చదివారు. తమ కలను నిజం చేసుకునే క్రమంలో జాతీయ స్థాయిలో నిర్వహించిన జేఈఈ మెయిన్‌లో సత్తా చాటారు. అత్యున్నత పర్సంటైల్ సాధించారు. తమ లక్ష్యసాధనలో ముందడుగు వేశారు.

ఐఏఎస్ సాధిస్తా..

✦ విద్యార్థి పేరు: ఎన్.శ్రీసాయి వైభవ్
▲ ఊరు : కాకినాడ
◗ పర్సంటైల్ : 99.99
◆ తల్లిదండ్రులు : ఉదయ్ భాస్కర్(విద్యుత్ శాఖ ఈఈ), శ్రీరాజ(గృహిణి)

■ సాధన ఇలా..: తల్లిదండ్రుల ప్రోత్సాహం, అధ్యాపకుల ప్రోత్సాహంతో రోజూ 15గంటలు చదివేవాడిని. సబ్జెక్టుల వారీగా సందేహాలు నివృత్తి చేసుకుంటూ, సాధన చేసేవాడిని. అడ్వాన్స్‌లో మంచి ర్యాంకు తెచ్చుకుని ఐఐటీ బాంబేలో చేరాలనేది కల. సమాజానికి నా వంతు సేవ చేయాలనేది నా సంకల్పం. అందుకే ఐఏఎస్ సాధించాలనే లక్ష్యంతో ఉన్నా.

స్టార్టప్ ప్రారంభిస్తా

✦ వి.వి.ఎస్.రాఘవరావు
▲ కాకినాడ ◗ 99.98
◆ సూర్యప్రకాశరావు (ఐటీ కన్సల్టెంట్), లక్ష్మీ జ్యోత్స్న (గృహిణి)

■ నా చిన్నప్పటి నుంచి నాన్న ఐఐటీ వంటి సంస్థల్లో చదివితే కలిగే ప్రయోజనాలు చెప్పడంతో ఎలాగైనా అక్కడే చేరాలనుకున్నాను. రెండేళ్లుగా పాఠ్యాంశాలు చదువుతూ, ఇంటి వద్ద సాధన చేసేవాడిని. అలా మంచి పర్సంటైల్ సాధించాను. ఐఐటీ మద్రాస్‌లో చేరాలనుకుంటున్నాను. భవిష్యత్తులో స్టార్టప్ ప్రారంభించాలనేది నా లక్ష్యం.

ఐఐటీ లక్ష్యంగా..

✦ బుడి శ్రీరామ్
▲ కాకినాడ
◗ 99.97
◆ రాజశేఖరరావు (సీఐ), ప్రసన్న (గృహిణి)

■ అమ్మానాన్న చిన్నప్పటి నుంచి ఐఐటీలో చేరితే కలిగే ప్రయోజనాలు చెప్పారు. దానినే లక్ష్యంగా చేసుకుని రోజూ 15 గంటల పాటు చదివేవాడిని. ఐఐటీ బాంబేలో చేరి, ఐఏఎస్ కావాలనేది నా ఆశయం.

సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ అవుతా

✦ గంజి శ్రీజన్ ▲ కాకినాడ ◗ 99.98
◆ రవివర్మ, నిర్మలా కుమారి (వెటర్నరీ అసిస్టెంట్ డైరెక్టర్లు) ■ రోజూ కళాశాలలో పాఠ్యాంశాలను, తిరిగి ఇంటికొచ్చాక పునశ్చరణ చేయడంతోపాటు ఐఐటీకి సంబంధించిన పుస్తకాలు చదివేవాడిని. అన్నయ్య ఐఐటీ బాంబేలో చేరి ప్రస్తుతం మైక్రోసాఫ్ట్‌లో ఇంజినీర్‌గా పనిచేస్తున్నారు. అతని స్ఫూర్తిగా తీసుకుని ఐఐటీ బాంబేలో చేరి సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ కావాలనేది నాలక్ష్యం.

దోష రహిత ఓటర్ల జాబితాలను తయారు చేద్దాం

కాకినాడ నగరం, న్యూస్‌టుడే: నగర నియోజకవర్గ పరిధిలో దోష రహిత ఓటర్ల జాబితాలను రూపొందిద్దామని నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, అదనపు కమిషనర్ కేటీ సుధాకర్ పేర్కొన్నారు. స్థానిక నగరపాలక సంస్థ కార్యాలయంలో మంగళవారం బూత్ లెవల్ అధికారులు, సచివాలయ సిబ్బందితో ఆయన సమావేశాన్ని నిర్వహించారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు స్పెషల్ ఇన్సెంటివ్ రివిజన్ (సర్)ను ప్రత్యేక శ్రద్ధతో నిర్వహించాలన్నారు. పాత ఓటర్ల జాబితాతో ప్రస్తుత ఓటర్ల జాబితాను సరిపోల్చి తప్పులను సరిదిద్దాలని సూచించారు. మృతులు, వలస ఓటర్లను జాబితాల నుంచి తొలగించాలని చెప్పారు. ఉప తహసీల్దారు గోవిందు తదితరులు పాల్గొన్నారు.

ఖైదీల సంక్షేమం, జీవన పరిస్థితులపై పరిశీలన

మసీదుసెంటర్, న్యూస్‌టుడే: కాకినాడ సబ్‌జైలులో ఖైదీల సంక్షేమం భద్రత, జీవన పరిస్థితులు తదితర అంశాలపై మండల్ లీగల్ సర్వీసెస్ కమిటీ ఛైర్‌పర్సన్, మూడో అదనపు జిల్లా న్యాయమూర్తి జి.ఆనంది మంగళవారం రెవెన్యూ, పోలీసు, విద్య, వైద్య ఆరోగ్యం తదితర శాఖల అధికారులతో పరిశీలించారు. ఖైదీలతో మాట్లాడి సౌకర్యాలు ఇతర అంశాలపై వివరాలు ఆరా తీశారు. వంటశాలను తనిఖీ చేసి మెనూ వివరాలు అడిగి తెలుసుకున్నారు. అసిస్టెంట్ కలెక్టర్ మనీషా, ఆర్డీవో మల్లిబాబు, డీఎంహెచ్‌వో నరసింహనాయక్, సబ్‌జైలు సూపరింటెండెంట్ వీరబాబు, డిప్యూటీ జైలర్ జోసెఫ్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మూడో అదనపు జిల్లా న్యాయమూర్తి జి.ఆనంది

పరీక్షలంటే భయం వీడాలి

పిఠాపురం, సామర్లకోట: పదో తరగతి వార్షిక పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులు భయం వీడాలని ఆర్‌జేడీ నాగమణి సూచించారు. మంగళవారం మల్లాం జడ్పీ పాఠశాలను తనిఖీ చేశారు. అక్కడి 117 మంది విద్యార్థులతో గంటపాటు రెండు విడతలుగా మాట్లాడారు. మంచి ఉత్తీర్ణత సాధించి భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలన్నారు. ప్రధానోపాధ్యాయుడు గాజుల మురళీభాస్కర్ తదితరులు పాల్గొన్నారు. ● విద్యార్థులు సమయం సద్వినియోగంతో సత్ఫలితాలు సాధించవచ్చని విద్యాశాఖ ఏడీ మహ్మద్‌షరీఫ్ సూచించారు. సామర్లకోట పీఎంశ్రీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థుల సన్నద్ధతను పరిశీలించారు. ప్రధానోపాధ్యాయుడు సాయి రామకృష్ణ ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటు చేశారు.

విద్యార్థినులతో మాట్లాడుతున్న ఆర్జేడీ నాగమణి

సహకార చట్టాలపై అవగాహన అవసరం

కాకినాడ నగరం, న్యూస్‌టుడే: సహకార చట్టాలపై అవగాహన అవసరమని విశ్రాంత జిల్లా సహకార అధికారి వై.ఉమామహేశ్వరరావు సూచించారు. జగన్నాథపురంలోని రాష్ట్ర మత్స్య సాంకేతిక శిక్షణా సంస్థ (ఎస్ఐఎఫ్‌టీ) కార్యాలయంలో మత్స్యకార సహకార సంఘాల కార్యవర్గ సభ్యులకు మంగళవారం శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ సంఘాల సభ్యులు బైలా, వారి విధులు, హక్కులు, కార్యకలాపాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. ప్రభుత్వం నుంచి వచ్చే పథకాలు, వాటిని సద్వినియోగం చేసుకోవడం వంటి అంశాలను తెలుసుకోవడం అవసరమని పేర్కొన్నారు. సహకార సంఘాలకు సంబంధించి 1964, 1995 చట్టాలను తెలుసుకోవాలని చెప్పారు. రామదాసు సహకార శిక్షణ కేంద్రం విద్యా బోధకులు ఆదిమూల వెంకటేశ్వరరావు పలు విషయాలను వివరించారు. సంఘాల తరపున తుమ్మల కొండలరావు, తదితరులు సమస్యలు వివరించారు. ఎస్ఐఎఫ్‌టీ ప్రిన్సిపల్ అంజలి, ఏడీ జాస్మిని, తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న విశ్రాంత జిల్లా సహకార అధికారి ఉమామహేశ్వరరావు

ఇళ్ల లక్ష్యం 13,588 పూర్తి 350

కాకినాడ కలెక్టరేట్, న్యూస్‌టుడే: జిల్లాలో పీఎంఏవై-1.0 కింద ఇళ్లు మంజూరై పనులు చేపట్టిన పేదలకు దశల వారీగా బిల్లులు చెల్లించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని హౌసింగ్ పీడీ ఎన్‌వీవీ సత్యనారాయణ తెలిపారు. మంగళవారం స్థానిక గృహ నిర్మాణ సంస్థ కార్యాలయంలో ఆయన ఇంజినీర్లు, అధికారులతో ఉగాది నాటికి పూర్తి చేయాల్సిన గృహ నిర్మాణాలపై సమీక్షించారు. ఉగాదికి జిల్లాలో 13,588 గృహ ప్రవేశాలు చేయాలన్నది లక్ష్యం కాగా, ఇప్పటికి 350 ఇళ్లను పూర్తి చేశామన్నారు. రూఫ్ లెవల్, లింటల్ లెవల్‌లో ఉన్న ఇళ్లకు త్వరగా స్లాబులు వేసేలా ఇంజినీర్లు లబ్ధిదారులను ప్రోత్సహించాలని సూచించారు. ప్రతి దశ పూర్తయిన వెంటనే బిల్లు విడుదలకు చర్యలు చేపట్టామని చెప్పారు. కార్యనిర్వాహక ఇంజినీర్లు కేవీఎస్ రెడ్డి, ఎల్.శ్రీనివాస్, మేనేజరు కె.సురేశ్‌బాబు, డీఈఈ నాగభూషణం, ఏఈలు సురేశ్‌కుమార్, బాషా తదితరులు పాల్గొన్నారు.

పెరిగిన భావనారాయణస్వామి ఆలయ ఆదాయం

సర్పవరం: కాకినాడ జిల్లా కేంద్రం శివారు సర్పవరంలోని స్వయంభూ రాజ్యలక్ష్మి సమేత భావనారాయణ స్వామి ఆలయ ఆదాయం పెరిగింది. మాఘమాస ఉత్సవాల కారణంగా నాలుగు ఆదివారాలు పెద్ద సంఖ్యలో తెలుగు రాష్ట్రాల నుంచి భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. గత సంవత్సరం రూ.22 లక్షలు రాగా ఈ ఏడాది రూ.25,04,931 వచ్చిందని ఈవో రాపాక శ్రీనివాసరావు తెలిపారు.

కర్పూరి ఠాకూర్‌కు నివాళి

సర్పవరం: కాకినాడ గ్రామీణం రమణయ్యపేటలోని నాయీబ్రాహ్మణ సేవాసంఘ సామాజిక భవనంలో మంగళవారం భారతరత్న, జన్‌నాయక్, బిహార్ మాజీ ముఖ్యమంత్రి కర్పూరి ఠాకూర్ వర్ధంతిని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. నాయీ బ్రాహ్మణ సంఘ అధ్యక్షుడు కోట ఉమాఅచ్యుతరమణ అధ్యక్షతన రాష్ట్ర ధన్వంతరి నాయీబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు గోపాలకృష్ణ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో బీసీ సంఘం నాయకుడు చొల్లంగి వేణుగోపాల్, ఇతర ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రకటన

మా క్లైంటు కాకినాడ జిల్లా, కాకినాడ కాపురస్తులు లేటు.నక్కా అప్పలస్వామి గారి కుమారుడు నక్కా రాజు మరియు లేటు పొట్లా చంద్రరావు గారి భార్య సీతారత్నం తరపున మాకు ఇచ్చిన సంజాయిషీ ప్రకారం తెలియజేయునది ఏమనగా ఈ దిగువ షెడ్యూలు దాఖలా ఆస్తి లేటు.నక్కా అప్పలస్వామి గారిది అయివుంది. వారి తదనంతరం వారి ముఖ్య వారసులైన మా క్లైంట్‌కు దాఖలు పడిన ఆస్తి అయియున్నది.

అయితే కాకినాడ కాపురస్తులు జాడా అప్పలస్వామి గారి కుమారుడు జాడా పాపారావు పత్రము సృష్టించి సదరు షెడ్యూల్ ఆస్తిని అన్యాక్రాంతము చేయుటకు ప్రయత్నించుచున్నారని సదరు విషయమై జాడా పాపారావు వగైరాల పై కాకినాడ కోర్టు లో వ్యాజ్యము జరుగుతున్నది. కావున షెడ్యూల్ దాఖలా ఆస్తిపై ఎవరు ఎటువంటి లావాదేవీలు జరిపినను చెల్లనేరవని, ఎటువంటి అమ్మకములు, కొనుగోళ్లు తో మా క్లైంటుకు సంబంధము లేదని ఇందు మూలముగా తెలియచేయుడమైనది.

Notice Schedule

Item No.1: Previously East Godavari District, Now Kakinada District, Kakinada Urban Mandal, Kakinada Corporation Area SRO, Kakinada, Gandhinagar, Mohammad Ali Street, Ward No.9, Block No.2, T.S. No.1320, Bearing Door No.9-11-3/2, Total Extent of 229 in item No.1: 120.62 sq.yards with consist of RCC ground First floor with all easementary rights.
East: 22.6 Road West: 23.6 Road North: 46.0 Yelamanchili Satyasree South: 46.0 Kommu Pothuraju gari Shed

Item No.2: Previously East Godavari District, Now Kakinada District, Kakinada Urban Mandal, Kakinada Corporation Area SRO, Kakinada, Gandhinagar, Mohammad Ali Street, Ward No.9, Block No.2, T.S. No.1320, Bearing Door No.9-11-3/2, Total Extent of 229 in item No.2: 107.71 sq.yards with consist of old thatched house with all easementary rights.
East: 22.6 Road, West: 23.6 Road, North: 46.0 Yelamanchili Satyasree, South: 46.0 Kommu Pothuraju gari Shed
With all kinds of easement rights etc.,

A. Naga Raju,
Venkat R.N. Advocates
Kakinada, 9912841155
Kakinada
16-02-2026

కాకినాడ గ్రామీణం

• కాకినాడ గ్రామీణం • పెద్దాపురం • పిఠాపురం

పీఏసీఎస్ కార్యాలయానికి తాళం

తాళ్లరేవు : డిమాండ్ల సాధన కోసం కోరంగి, తాళ్లరేవు, లచ్చిపాలెం గ్రామాల్లో సహకార సంఘాల ఉద్యోగులు నిరవధిక సమ్మెకు దిగారు. మంగళవారం సొసైటీ కార్యాలయాలకు తాళం వేశారు. డిమాండ్ నోటీసులను గేట్లుకు అతికించారు. బోనం గౌరీ శంకర్, కూర్మదాసు సంపత్‌కుమార్, విజయభాస్కర్ రెడ్డి, రామన్న, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో త్రిశూల స్నానం

పిఠాపురంలో శ్రీరాజరాజేశ్వరీసమేత ఉమా కుక్కుటేశ్వర స్వామి వార్ల కల్యాణోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. మంగళవారం స్వామివారికి అభిషేకం, అమ్మవారికి కుంకుమార్చనలు జరిగాయి. అనంతరం ఉత్సవ విగ్రహాలకు అర్చకుడు కైతేపల్లి కుటుంబసభ్యుల ఆధ్వర్యంలో త్రిశూల స్నానం చేయించారు. భక్తులతో ఆలయం కిటకిటలాడింది. ఈవో జగన్మోహన్ శ్రీనివాస్ ఏర్పాట్లు పర్యవేక్షించారు. – న్యూస్‌టుడే, పిఠాపురం

ఉత్తమ ఫలితాలకు కృషి

కరప: విద్యార్థులు శ్రద్ధగా చదివి ఉత్తమ ఫలితాల సాధించేందుకు కృషి చేయాలని హెచ్ఎం రాజరాజేశ్వరి సూచించారు. కరప జడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం 1997-98 బ్యాచ్ విద్యార్థులు సమకూర్చిన అల్పాహారాన్ని పదో తరగతి విద్యార్థులకు అందజేశారు. పోలిశెట్టి నారయ్య, వెంకటబాపనయ్య, శ్రీనివాస్, శివకుమార్ పాల్గొన్నారు.

సంకీర్తన పరిసమాప్తం

గొల్లప్రోలు: గొల్లప్రోలు కరణంగారితోట రామాలయ భజన సమాజం ఆధ్వర్యంలో నెల రోజులపాటు నిర్వహించిన మాఘ మాస నగర సంకీర్తన మంగళవారంతో ముగిసింది. ప్రతిరోజూ వేకువజామున భక్తిగీతాలు ఆలాపిస్తూ గొల్లప్రోలులో సభ్యులు పర్యటించారు.

ఆ బియ్యమే ఇస్తాం

పెద్దాపురం: రాష్ట్రంలో పోర్టిఫైడ్ బియ్యం కొరత ఉందని, ప్రజలకు దీనిని అందజేయడానికి కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని రాష్ట్ర పౌర సరఫరాల కార్పొరేషన్ డైరెక్టర్ తుమ్మల పద్మజ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక రాజుగారివీధిలోని మట్టే ఆదినారాయణ, నాగమణి ఆర్యవైశ్య సేవాసంఘ భవనంలో మాట్లాడుతూ లక్ష్యాన్ని అధిగమించి 50 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించామన్నారు.

సీఎంతో వర్మ భేటీ

పిఠాపురం: ముఖ్యమంత్రి చంద్రబాబును మంగళవారం అసెంబ్లీ ప్రాంగణంలో పిఠాపురం మాజీ ఎమ్మెల్యే వర్మ మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లా పార్టీ విషయాలతో పాటు మరికొన్ని అంశాలపై చర్చించారు. అనంతరం కాకినాడలోని ఓ కార్పొరేట్ ఆసుపత్రిలో ఎన్టీఆర్ వైద్యసేవలో జరుగుతున్న అవకతవకల గురించి వివరించారు.

రైతులకు రాయితీలు

పిఠాపురం: రైతులకు ప్రభుత్వం అందించే రాయితీలు, ఇతర పథకాలు పొందాలంటే విశిష్ట సంఖ్య నంబరు తప్పనిసరిగా ఉండాలని ఏడీఏ స్వాతి తెలిపారు. మంగళవారం పిఠాపురం మండలంలోని పలు గ్రామాల్లో రైతులకు వివిధ అంశాలపై అవగాహన కల్పించారు.

పతకమే లక్ష్యం.. ప్రతినతో కదనం

తైక్వాండోలో పిఠాపురానికి చెందిన పలువురు క్రీడాకారులు రాణిస్తున్నారు. రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో తలపడుతూ పతకాలు కైవసం చేసుకుంటున్నారు. ఆర్థిక పరిస్థితులను అధిగమిస్తూ ఆటపై ఆసక్తితో గుర్తింపు తెచ్చుకుంటున్నారు. సరైన క్రీడా మైదానం లేకపోయినా.. క్రీడా కోటాలో ప్రభుత్వ కొలువు సాధించవచ్చని, ఆటల్లో రాణించాలని కోచ్ లక్ష్మణరావు వీరిని తీర్చిదిద్దుతున్నారు. దాంతో అవకాశాలు సద్వినియోగం చేసుకుంటూ గుర్తింపు తెచ్చుకుంటున్నారు. ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తే మరిన్ని పతకాలు సాధిస్తామని చెబుతున్నారు. – న్యూస్‌టుడే, పిఠాపురం

పిఠాపురంలో సాధన చేస్తున్న క్రీడాకారులు

ఒలింపిక్ పోటీలకు వెళ్లాలని ఉంది..

లోహిత్ ప్రస్తుతం ఏడో తరగతి చదువుతున్నాడు. నాలుగో తరగతి నుంచే తైక్వాండో శిక్షణ తీసుకుంటున్నాడు. పిఠాపురం, కాకినాడ, రాజమహేంద్రవరంలలో జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో బంగారు పతకాలు సాధించాడు. గత ఏడాది విజయవాడ, విశాఖపట్నంలో రాష్ట్ర స్థాయిలోనూ రెండు బంగారు పతకాలు గెలుచుకున్నాడు. 2025 డిసెంబర్‌లో జాతీయ స్థాయి ఓపెన్ తైక్వాండో ఛాంపియన్‌షిప్ పోటీల్లోనూ బంగారు పతకం దక్కించుకున్నాడు. జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చుకుని ఒలింపిక్ పోటీలకు వెళ్లాలని ఉందని చెబుతున్నాడు.

క్రీడా కోటాలో కొలువుపై గురి..

బోను జయదీప్ ప్రస్తుతం 8వ తరగతి చదువుతున్నాడు. అయిదేళ్లుగా స్థానికంగా శిక్షణ తీసుకుంటున్నాడు. తుని, రాజమహేంద్రవరం, కాకినాడలలో జరిగిన జిల్లా స్థాయి తైక్వాండో పోటీల్లో బంగారు పతకం గెలుచుకున్నాడు. విజయవాడలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో రజత పతకం అందుకున్నాడు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలోనూ గుర్తింపు తెచ్చుకుని, క్రీడా కోటాలో ఉద్యోగం సాధించాలని కోరికతో దీనిని ఎంచుకున్నట్లు పేర్కొన్నాడు.

మరిన్ని పతకాలు తెచ్చుకోవాలని..

జె. రాఘవేంద్ర ఆదిత్య పదో తరగతి చదువుతున్నాడు. అయిదో తరగతి నుంచే సాధన మొదలు పెట్టాడు. ఇప్పటి వరకు జిల్లా స్థాయిలో రజత, బంగారు పతకాలు అందుకున్నాడు. విశాఖపట్నంలో గతేడాది జరిగిన రాష్ట్ర స్థాయి కాంపిటేషన్‌లో బంగారు పతకం సాధించాడు. విజయవాడలో జరిగిన ఓపెన్ నేషనల్ తైక్వాండో ఛాంపియన్‌షిప్‌లో రజత పతకం దక్కించుకున్నాడు. మరిన్ని పతకాలు సాధించేలా సాధన చేయడమే లక్ష్యమని చెబుతున్నాడు.

నులిపురుగులు నివారిద్దాం

గొల్లప్రోలు: నులిపురుగులతో చిన్నారులు రక్తహీనతకు గురై అనారోగ్యం పాలవుతారని వైద్యారోగ్య శాఖ అధికారులు, సిబ్బంది అవగాహన కల్పించారు. జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా మంగళవారం గొల్లప్రోలులోని ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలలు, పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో విద్యార్థులతో మధ్యాహ్న భోజనం అనంతరం ఆల్బెండజోల్ మాత్రలు మింగించారు. వైద్యులు అమృతరావు, సుబ్బారావు, సునీత మెర్సీ, పర్యవేక్షకులు అహ్మద్‌బాషా, రజనీబీ, లక్ష్మీరమణ పాల్గొన్నారు. * తాళ్లరేవు: ఆర్‌బీఎస్‌కే పీవో డాక్టర్ అరుణ పటవల జడ్పీ ఉన్నత పాఠశాలలో పిల్లలకు మంగళవారం నులిపురుగుల నివారణ మందులు వేశారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

CHANGE OF NAME

I, SINGIREDDY LAKSHMI DURGA DEVI, W/o AKULA AYYAPPA, Residing of Flat No.78, Akshayanandana Layout, Mehar Complex, Samalkot, Samalkot Mandal, Kakinada District, Andhra Pradesh-533440. Do, hereby declare that my surname mentioned as AKULA in my Husband's passport in incorrect. My correct surname is SINGIREDDY LAKSHMI DURGA DEVI. Hence forth I shall be known as LAKSHMI DURGA DEVI SINGIREDDY for all purposes.

సర్వే వేగవంతం

గొల్లప్రోలు, న్యూస్‌టుడే: ఓటర్ల మ్యాపింగ్ సర్వే వేగవంతం చేయాలని నియోజకవర్గ అధికారి భారతి ఆదేశించారు. గొల్లప్రోలులో ఓటర్ల సర్వే తీరుపై మంగళవారం పరిశీలించి అధికారులు, సిబ్బందితో సమీక్షించారు. బీఎల్‌వోలతో త్వరలో సమావేశం ఏర్పాటు చేస్తామన్నారు. గొల్లప్రోలు మండలంలో 77.9 శాతం, పట్టణంలో 74 శాతం, పిఠాపురం పట్టణంలో 78 శాతం, యు.కొత్తపల్లి మండలంలో 74శాతం సర్వే పూర్తయినట్లు తెలిపారు.

19న నేత్ర వైద్య శిబిరం

పెదపూడి: పెదపూడి శ్రీసత్యసాయి సేవాకేంద్రం ఆధ్వర్యంలో గురువారం కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేశామని సత్యసాయి సేవాకేంద్రం జిల్లా అధ్యక్షుడు గోవిందరాజులు మంగళవారం తెలిపారు. వేమగిరికి చెందిన పరమహంస యోగానంద నేత్రాలయ వైద్యులతో కంప్యూటర్ ఆధారిత చత్వారం, తలపోటు పరీక్షలు నిర్వహిస్తారన్నారు.

వేడుకలు.. ఆకట్టుకున్న ప్రదర్శనలు

పిఠాపురం, కొత్తపల్లి, గొల్లప్రోలు: పిఠాపురంలోని పాదగయ క్షేత్రంలో రాజరాజేశ్వరి సమేత ఉమాకుక్కుటేశ్వరస్వామి కల్యాణోత్సవాలు అయిదు రోజులుగా వైభవంగా నిర్వహిస్తున్నారు. మంగళవారం సాయంత్రం స్థానిక నటరాజ నృత్యనికేతన్ వారి సంప్రదాయ నృత్య ప్రదర్శన కార్యక్రమం జరిగింది. పిల్లా సత్యనారాయణ ఆధ్వర్యంలో చిన్నారులు అలరించారు. ఈవో జగన్మోహన్ శ్రీనివాస్ వారిని సత్కరించారు. బుధవారంతో ఉత్సవాలు ముగియనున్నాయి. ఈ నేపథ్యంలో రాత్రి 7 గంటలకు తెప్పోత్సవం, 8 గంటలకు శ్రీపుష్పోత్సవం నిర్వహించేందుకు భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. ● కొత్తపల్లిలోని శ్రీబాలాత్రిపుర సుందరి సమేత రాజశేఖరుడి ఆలయంలో రథోత్సవ వేడుకలు జరిగాయి. ఆలయ ఆవరణలో కోలాటం ఆకట్టుకుంది. ● దుర్గాడ శివాలయంలో ఉమారామలింగేశ్వరుడికి ప్రత్యేక అలంకరణ చేశారు. చేబ్రోలు నృత్యాంజలి అకాడమీకి చెందిన హరిప్రియవేణి శిష్యబృందం కొల్లూరు సీతారామమూర్తి ఆధ్వర్యంలో 40 మంది ప్రదర్శనలో పాల్గొన్నారు.



దుర్గాడలో ఆకట్టుకున్న ప్రదర్శన

పిఠాపురం: నృత్యం చేస్తున్న బాలికలు

కొత్తపల్లి: ఉత్సవంలో కోలాటం

లాకుల మరమ్మతులతో సాగుకు నీరు: ఎమ్మెల్యే నల్లమిల్లి

పెదపూడి: శిథిలమైన లాకులకు వెంటనే మరమ్మతులు చేపడితే రైతులకు సాగునీటి ఇబ్బందులు ఉండవని అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి మంగళవారం అసెంబ్లీ సమావేశంలో ప్రస్తావించారు. పెదపూడి మండలంలోని రైతులు ఈ సమస్య ఎదుర్కొంటున్నారన్నారు. తొస్సిపూడి, చింతపల్లి లాకుల మరమ్మతులు పూర్తిగా చేపట్టాలన్నారు. పంట కాలువల్లో పూడిక తీత చేపట్టడానికి ఈస్టర్న్ ప్రాజెక్టు కమిటీ ఛైర్మన్ సునీల్‌కుమార్‌తో సోమవారం చింతపల్లి లాకుల వద్ద పరిశీలించామన్నారు. ప్రభుత్వం పరిశీలించి లాకుల అభివృద్ధికి సహకరించాలని కోరారు.

మాట్లాడుతున్న రామకృష్ణారెడ్డి

మహారాజశ్రీ 1వ ఎడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి కాకినాడ వారి కోర్టులో

I.P.32/2025

Between:
Indukuri Parvathi Devi ... Petitioner
And:
Nadimpalli Raghu Rama Chandra Rao
Mohammad Ghouse Fadani ... Respondants

[illegible] ... Insolvent ... తేది.24-02-2026 ... [illegible]

ఆస్తి వివరం
కాకినాడ, రమణయ్య పేట, Sampath's Chaitanya Grand అను అపార్టుమెంటులో డో.నెం.68-10A-9/C/515 రు గల ఫోర్త్ ఫ్లోర్ లో గల 515 నెంబరు గల ఫ్లాటు దానికి సంబంధించిన అవిభక్తం 41.768 చ॥గ స్థలంతో సహా.

మల్లంపల్లి సర్వేశ్వరరావు, B.Com,B.L.
మెర్ల సూర్యనారాయణ, అడ్వకేట్,
డో.నెం. 8-15-3, ఒలేటి వారి వీధి,
గాంధీనగర్, కాకినాడ. సెల్:9848265645

ఈ దశ దాటదు.. సేవల దరి చేరదు..

వేళంగిలోని డ్వాక్రా భవన నిర్మాణం అసంపూర్తిగా నిలిచిపోవడంతో కార్యకలాపాలు నిర్వహించేందుకు ఇబ్బందులు పడుతున్నామని సంఘాల మహిళలు వాపోతున్నారు. స్థానిక వేంకటేశ్వరస్వామి ఆలయ సమీపంలో ఎనిమిదేళ్ల క్రితం చేపట్టిన నిర్మాణం స్లాబ్ దశలోనే నిలిచిపోయింది. ఎంపీడీవో శ్రీనివాస్‌ను అడగ్గా చర్యలు తీసుకుంటామన్నారు. – న్యూస్‌టుడే, కరప

పట్టు రైతుకు.. రాయితీ సామగ్రి

పట్టు రైతులకు ఉపకరించే బ్లీచింగ్, ముగ్గు, పోషణ వంటివి రాయితీపై అందిస్తున్నట్లు ఆ శాఖ అధికారులు తెలిపారు. రూ. 1,250 చొప్పున రైతులు చెల్లిస్తే రూ.5 వేల విలువైన సామగ్రిని తొలి విడతగా 100 మందికి అందిస్తున్నామన్నారు. చేబ్రోలు రైతులతోపాటు పోలవరం, దొండవాక ప్రాంతాల రైతులకు పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. – న్యూస్‌టుడే, గొల్లప్రోలు

ఆరోగ్య కేంద్రమా.. అధ్వానమా..!

తాళ్లరేవు మండలం పటవల-1 ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రం పరిధిలో 3,800 మంది జనాభా ఉన్నారు. వీరందరికీ సేవలందించే ఆరోగ్య ఉపకేంద్ర భవనం మూడేళ్ల కిందటే శిథిలమైంది. దాంతో అద్దె భవనంలోనే సేవలందిస్తున్నారు. వెంటే చర్యలు తీసుకోవాలని సిబ్బంది వాపోతున్నారు. అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. – న్యూస్‌టుడే, తాళ్లరేవు

మురుగు కదలదు.. సమస్య తీరదు

దర్గాసెంటర్ నుంచి పాతపెద్దాపురం వెళ్లే ప్రధాన రహదారి పక్కనున్న మురుగు కాలువలో చెత్త పేరుకుపోయింది. దోమలు వృద్ధిచెంది రాత్రుళ్లు నిద్రపోలేకపోతున్నామని ఆ ప్రాంతవాసులు వాపోతున్నారు. అధికారులు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. కమిషనర్ శ్రీకాంత్‌రెడ్డిని అడగ్గా కార్మికులను పంపి శుభ్రం చేయిస్తామని తెలిపారు. – న్యూస్‌టుడే, పెద్దాపురం

మహారాజశ్రీ పిఠాపురం సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో,

OS. No: 244/2017

Between:
దేవవరపు మంగ అండ్ అదర్స్ ...పిటీషనర్స్
And:
పడాల నూకరాజు అండ్ అదర్స్ ...రెస్పాండెంట్స్
To:
8వ ప్రతివాది: పడాల పార్వతి, భర్త (లేట్) లోవ కుమార్, వయస్సు: 62 సం॥లు, డో.నెం.: 6-2-137, గృహిణి, H/o- లింగం సుబ్బారావు, ఇంద్రపాలెం, కాకినాడ-6, కాకినాడ జిల్లా.

పై నెంబరు గల దావాలో శ్రీ కోర్టు వారు మీకు ఎన్ని పర్యాయములు నోటీసులు పంపించి నప్పటికీ మీరు ఉద్దేశ్యపూర్వకముగా తీసుకోకుండా తప్పించుకొనుచున్నందున పై కోర్టు వారి ఆదేశం ప్రకారం మీకు తెలియ చేయునది ఏమనగా పై నెంబరు గల పిటీషన్ ది-27-02-2026 వ తేదీన వాయిదా వేయబడినది. కావున ఆ రోజు ఉ.10గం॥30ని॥లకు పై కోర్టు వారి ఎదుట మీరు స్వయంగా గాని వకీలు ద్వారా గాని హాజరు అయి పై దావాలో మీకు ఏమయినా అక్షేపణలు ఉంటే తెలియ జేయవలెను లేనిచో పై దావా మీకు పరోక్షమున తీర్మానించబడును.

(By Court Order)
పిఠాపురం: పి.వి.ఎస్.ఆర్.మూర్తి అడ్వకేట్,
Date: 11.02.2026 పిఠాపురం, సెల్:9848006149

కర్పూరి ఠాకూర్‌కు నివాళి

సర్పవరం: కాకినాడ గ్రామీణం రమణయ్యపేటలోని నాయీబ్రాహ్మణ సేవా సంఘ సామాజిక భవనంలో మంగళవారం భారతరత్న, జన్‌నాయక్, బిహార్ మాజీ ముఖ్యమంత్రి కర్పూరి ఠాకూర్ వర్ధంతిని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. నాయీ బ్రాహ్మణ సంఘ అధ్యక్షుడు కోట ఉమాఅచ్యుతరమణ అధ్యక్షతన రాష్ట్ర ధన్వంతరి నాయీబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు గోపాలకృష్ణ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో బీసీ సంఘం నాయకుడు చొల్లంగి వేణుగోపాల్, ఇతర ప్రతినిధులు పాల్గొన్నారు.

పెరిగిన భావనారాయణస్వామి ఆలయ ఆదాయం

సర్పవరం: కాకినాడ జిల్లా కేంద్రం శివారు సర్పవరంలోని స్వయంభూ రాజ్యలక్ష్మి సమేత భావనారాయణస్వామి ఆలయ ఆదాయం పెరిగింది. మాఘమాస ఉత్సవాల కారణంగా నాలుగు ఆదివారాలు పెద్ద సంఖ్యలో తెలుగు రాష్ట్రాల నుంచి భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. గత సంవత్సరం రూ.22 లక్షలు రాగా ఈ ఏడాది రూ. 25,04,931 వచ్చిందని ఈవో రాపాక శ్రీనివాసరావు తెలిపారు.

మొర ఆలకించండి.. పని ఒత్తిడి తగ్గించండి

గొల్లప్రోలు: పని ఒత్తిడితో వీఆర్వోలు రోడ్డు ప్రమాదాలకు గురవుతున్నారని, కొందరు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని, తక్షణం పని భారం తగ్గించాలని కోరుతూ వీఆర్వోలు, గ్రామసర్వేయర్లు రెండోరోజు మంగళవారం ఆందోళన కొనసాగించారు. గొల్లప్రోలు తహసీల్దార్ కార్యాలయం ఎదుట నల్ల రిబ్బన్లు ధరించి నిరసన తెలిపారు. ● **తాళ్లరేవు:** మండల వీఆర్వోల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు రాజు, శ్రీనివాసరావు ఆధ్వర్యంలో రెవెన్యూ కార్యాలయం ఎదుట వీఆర్వోలు నిరసన తెలిపారు. ● **కాజులూరు:** జాబ్ ఛార్టులో స్పష్టతలేకుండా ఒకేసారి అన్ని పనులు చేయడం వల్ల పనిభారం పెరిగి తీవ్ర ఒత్తిడికి గురవుతున్నామని వీఆర్వోలు నిరసన తెలిపారు. మంగళవారం తహసీల్దారు కార్యాలయం వద్ద మధ్యాహ్న భోజన విరామ సమయంలో నల్ల బ్యాడ్జీలు ధరించి నినాదాలు చేశారు. పని ఒత్తిడి తగ్గించాలని కోరుతూ తహసీల్దారు రవీంద్రనాథ్ ఠాగూర్‌కు వినతిపత్రం అందించారు.

గొల్లప్రోలులో నల్లరిబ్బన్లు ధరించి నినదిస్తున్న వీఆర్వోలు

బాల్య వివాహాలు ఆపుదాం

తాళ్లరేవు: ఇంజరంలో బాల్య వివాహముక్త్ భారత్ కార్యక్రమాన్ని ఐసీడీఎస్, జిల్లా బాలల పరిరక్షణ విభాగం ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ఇంజరం జడ్పీ ఉన్నత పాఠశాలలో బాల్య వివాహాల వల్ల కలిగే నష్టాలపై సీడీపీవో సీహెచ్ లక్ష్మి, బాలల పరిరక్షణ విభాగం సోషల్ వర్కర్ చినబాబు విద్యార్థులకు వివరించారు.

ఉపాధి గ్రామసభ

గొల్లప్రోలు: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో ఏపీ మల్లవరంలో నిర్వహించిన పనులపై సామాజిక తనిఖీ గ్రామసభ మంగళవారం నిర్వహించారు. ఏడాది కాలంలో జరిగిన పనులను తనిఖీ చేసి కూలీలకు నగదు చెల్లింపులను పరిశీలించారు. నివేదికను గ్రామసభలో చదివి వినిపించారు. పర్యవేక్షకులుగా యు.కొత్తపల్లి ఎంఈవో వేణుగోపాల్ హాజరయ్యారు. ఎస్ఆర్‌పీ రాజు, డీఆర్పీ పాము రాజు పాల్గొన్నారు. దుర్గాడలో బుధవారం నిర్వహిస్తామని ఏపీవో గంగాభవానీ తెలిపారు.

పరీక్షలంటే భయం వీడాలి

మాట్లాడుతున్న ఆర్జేడీ నాగమణి

పిఠాపురం, సామర్లకోట: పదో తరగతి వార్షిక పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులు భయం వీడాలని ఆర్జేడీ నాగమణి సూచించారు. మంగళవారం మల్లాం జడ్పీ పాఠశాలను తనిఖీ చేశారు. అక్కడి 117 మంది విద్యార్థులతో గంటపాటు రెండు విడతలుగా మాట్లాడారు. మంచి ఉత్తీర్ణత సాధించి భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలన్నారు. ప్రధానోపాధ్యాయుడు గాజుల మురళీభాస్కర్ తదితరులు పాల్గొన్నారు. ● విద్యార్థులు సమయం సద్వినియోగంతో సత్ఫలితాలు సాధించవచ్చని విద్యాశాఖ ఏడీ మహ్మద్‌షరీఫ్ సూచించారు. సామర్లకోట పీఎంశ్రీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థుల సన్నద్ధతను పరిశీలించారు. ప్రధానోపాధ్యాయుడు సాయిరామకృష్ణ ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటు చేశారు.

రూ.4 లక్షల బంగారం, కిలో వెండి అపహరణ

పెద్దాపురం: పెద్దాపురం పట్టణ పరిధిలోని విశాలాక్షినగర్‌లో సోమవారం రాత్రి ఉమ్మెళ్ల ప్రసాద్ ఇంట్లో దొంగలు చొరబడి బీరువాలోని రూ.4 లక్షలు విలువైన బంగారం, కేజీ వెండి వస్తువులు చోరీ చేశారు. ఇంటి యజమాని కుటుంబ సభ్యులతో సామర్లకోటలోని భీమేశ్వరస్వామి ఆలయానికి వెళ్లి తిరిగొచ్చి చూడగా ఇంటి తాళాలు బద్దలుకొట్టి ఉన్నాయి. బీరువాలోని ఆభరణాలు కనిపించకపోవడంతో మంగళవారం పెద్దాపురం పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ విజయ్‌శంకర్ వెళ్లి బీరువాను పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మౌనిక తెలిపారు.

వేలం ప్రకటన

In the Court of the Honourable Principal Senior Civil Judge: Kakinada
E.P.NO.73 of 2024 in O.S.No.38 OF 2024
Between:
Koppisetti Ratnam ....D.Hr./Plaintiff
And:
Koppisetti Ratnam ....J.Dr./Defendant

పై నెంబరు అమలు గ్రంథములో D.Hr కు రావలసిన డిక్రీ బాకీకు గాను J.Dr తాలూకు దిగువ షెడ్యూలు దాఖలా ఆస్తిని వేలము యిస్టికోర్టు షరతులకు లోబడి శ్రీకోర్టువారు ది.12-03-2026 వ తేదీన ఉదయం గం॥10.30ని॥ లకు వేలం వేయుదురు. కావున పాడదలచినవారు వచ్చి సదరు వేలంలో పాల్గొనవచ్చును. వివరములు కొరకు పై శ్రీ కోర్టు నజారత్ ఆఫీసు నందు గాని, ఈ క్రింది తెలిపిన D.Hr అడ్వకేట్ గారిని గాని అడిగిన తెలుసుకొనవచ్చును.

SCHEDULE: Presently Kakinada District, previously E.G.Dt. Kakinada Rural, Kakinada District. Sarpavaram Sub-Registry, Vakalapudi(V). S.No.40/2 extent of Ac.1-50 cents divided into house sites. L.P.No.34/84 Dated 8-4-1985 Layout PR.No.45, Plot No.17 with an extent of 325 sq yards but in Measurements is 276 sq yards of the Northern side extent of 226.67 sq yards or 189.52 sq yards is situated within the following Boundaries.
East : 60.00 Feet or 18.28 mts, House of U. Thirupathi Rao bearing D.No.4-108 in Plot No.18. West : 60.00 feet or 18.28 mts. Land belongs to plot no.15 & 16, North : 34.00 feet or 10.36 mts. 40 feet road. South : 34.00 feet or 10.36 mts. Remaining land of Plot No.17 with all Easementary rights etc.,
D.Hr Value : Rs. 30,00,000/-
Ameena Value: Rs.32,00,000/-
J.Dr Value: – Nill –

యనమల రాముం
దేవులపల్లి వి.ఎస్. శ్రీలక్ష్మి, అడ్వకేట్స్,
డో.నెం.4-35, సుందర నగర్, సర్పవరం జంక్షన్, కాకినాడ-5, సెల్.9848442583, 6281841178

మేమున్నాం.. మీకు తోడుగా

ఉ॥ 10 - మ॥ 1 మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు: కాకినాడ గ్రామీణం: 80085 74325 పెద్దాపురం: 80085 74198, పిఠాపురం: 80085 65544

సమస్య: నడకుదురు బంటాల తూము వద్ద డ్రెయినేజీలో వ్యర్థాలు పేరుకుపోయి మురుగునీరు వెళ్లడం లేదు. **- రాజు**

పరిష్కారం: పంచాయతీ కార్యదర్శి వారిజకు చెప్పగా సిబ్బందిని పంపి శుభ్రం చేయించారు.
– న్యూస్‌టుడే, కరప

సమస్య: పిఠాపురంలోని నూకాలమ్మ గుడి సమీపంలోని వీధుల్లో డ్రెయిన్లు అధ్వానంగా ఉన్నాయి. **- గణేష్**

పరిష్కారం: పారిశుద్ధ్య అధికారి ప్రభాకర్‌కు చెప్పగా ఆయా వీధుల్లో కార్మికులతో శుభ్రం చేయించారు.
– న్యూస్‌టుడే, పిఠాపురం

సమస్య: గొల్లప్రోలు ఈబీసీకాలనీలో వ్యర్థాలతో కాలువ మూసుకుపోయి మురుగు రోడ్డుపై ప్రవహిస్తోంది. **- స్థానికులు**

పరిష్కారం: పారిశుద్ధ్య పర్యవేక్షణాధికారి రఘుప్రసాద్ సిబ్బందితో వ్యర్థాలు తొలగింపజేశారు.
– న్యూస్‌టుడే, గొల్లప్రోలు

సమస్య: స్థానిక శివాలయం ప్రాంతంలో రహదారి చెత్తగా ఉంది. తొలగించడానికి చర్యలు తీసుకోవాలి. **- ప్రసాద్**

పరిష్కారం: పారిశుద్ధ్య అధికారి ఆదినారాయణకు తెలుపగా కార్మికులతో శుభ్రం చేయించారు.
– న్యూస్‌టుడే, పెద్దాపురం

సమస్య: కొత్తపల్లి నుంచి ఉప్పాడ రహదారి వెంట చెత్త పేరుకుపోయి రాకపోకలకు ఇబ్బందిగా ఉంటోంది. **- ప్రయాణికులు**

పరిష్కారం: పంచాయతీ కార్యదర్శి సత్యనారాయణ వెంటనే సిబ్బందితో చెత్తను తొలగింపజేశారు. – న్యూస్‌టుడే, కొత్తపల్లి

సమస్య: సర్పవరం గ్రామంలోని గాంధీనగర్‌లో ఉన్న మురుగు కాలువల్లో పూడిక సరిగా తీయడం లేదు. **- రాజశేఖర్**

పరిష్కారం: పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్‌కు చెప్పగా కార్మికులను కేటాయించి శుభ్రం చేయించారు. – న్యూస్‌టుడే, సర్పవరం

దొంగల బారి నుంచి కాపాడండి

పోలీసులకు గ్రామస్థుల వినతి

కరప, న్యూస్‌టుడే: మండల కేంద్రంలో రెండు నెలలుగా చోరీలు విపరీతంగా పెరిగిపోవడంతో బయటకు రావాలంటేనే హడలిపోవాల్సివస్తోందని, దొంగల బారి నుంచి కాపాడాలని కరప గ్రామస్థులు కోరారు. ఈ సందర్భంగా మంగళవారం సాయంత్రం వారు కరప పోలీసు స్టేషన్ వద్ద నిరసన వ్యక్తం చేసి వినతిపత్రం ఇచ్చారు. కొద్దిరోజుల నుంచి ఆగంతుకులు పట్టపగలే ఇళ్లలోకి చొరబడి ఇద్దరు మహిళల నుంచి బంగారం అపహరించుకునిపోయారని వాపోయారు. అర్ధరాత్రి సమయంలో ఇళ్లల్లోంచి మోటారుసైకిళ్లు దొంగిలించుకుపోయారని, గ్రామంలో వరుస దొంగతనాలపై గ్రామస్థులమంతా తీవ్ర భయాందోళన చెందుతున్నామన్నారు. రెడ్డి వెంకటరమణ, కశిలంక రాజు, మాధవరపు ప్రసాద్, కశిలంక కృష్ణ, యాళ్ల పండు, పేకేటి దుర్గాప్రసాద్, పేపకాయల అంజి, నున్న చంటి తదితరులు పాల్గొన్నారు.

పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న గ్రామస్థులు

దేవదాయ ధర్మదాయ శాఖ

శ్రీ నూకాలమ్మ అమ్మవారి దేవస్థానం

కాండ్రేగుల గ్రామం, పెదపూడి మండలం, కాకినాడ జిల్లా.

టెండర్ కమ్ బహిరంగ వేలం ప్రకటన

కాకినాడ జిల్లా, పెదపూడి మండలం, కాండ్రేగుల గ్రామంలో వేంచేసియున్న శ్రీ నూకాలమ్మ అమ్మవారి దేవస్థానం వద్ద భక్తులచే సమర్పించబడిన కొబ్బరికాయ మింజవలే సగం చెక్క ప్రోగుచేసుకొని తీసుకొనే హక్కు, కోళ్ళు అమ్ముకొనే హక్కు మరియు కోళ్ళు, చీరలు, జాకెట్ ముక్కలు వసూలు చేసుకొని తీసుకొనే హక్కునకు గాను ఈ క్రింది పట్టికలో తెలియజేసిన విధంగా బహిరంగ వేలం నిమిత్తం ది.28-02-2026 శనివారం ఉదయం గం 10.00లకు అమ్మవారి ఆలయ ఆవరణలో శ్రీ తనిఖీదారు, దేవదాయ ధర్మదాయ శాఖ, కాకినాడ వారి సమక్షంలో కార్యనిర్వహణాధికారి వారిచే బహిరంగ వేలం నిర్వహించబడును.

వ.నెం.	వేలం పాట వివరం	కాలపరిమితి	పాట ధరావతు
1.	భక్తులచే సమర్పించబడిన కొబ్బరికాయ మింజవలే సగం చెక్క ప్రోగుచేసుకొని తీసుకొనే హక్కు, కోళ్ళు అమ్ముకొనే హక్కు మరియు కోళ్ళు, చీరలు, జాకెట్ ముక్కలు వసూలు చేసుకొని తీసుకొనే హక్కునకు గాను	ది.17-03-2026వ మంగళవారం రాత్రి 8 గం.ల నుండి ది.18-03-2026 బుధవారం రాత్రి 8 గం.ల వరకు	30,000/-

ముఖ్య షరతులు: 1) హెచ్చు పాటదారు పేరున పాట కొట్టి వేసిన వెంటనే ధరావతుతో కలుపుకొని పాట సొమ్ము పూర్తిగా చెల్లించవలెను. అట్లు చెల్లించని యెడల సదరు పాటను (ఫర్ఫిట్) చేసి తిరిగి పాట నిర్వహించబడును. 2) మిగిలిన పాట షరతులు దేవస్థానం వారి కార్యాలయంలో తెలుసుకొనవలెను.

కాండ్రేగుల. కార్యనిర్వహణాధికారి
17-02-2026. 86396 13148

తుని

• తుని • ప్రత్తిపాడు • జగ్గంపేట

కనీస జాగ్రత్తలతో విపత్తులు దూరం

సదస్సులో మాట్లాడుతున్న తహసీల్దార్ సూర్యప్రభ

ప్రత్తిపాడు, న్యూస్‌టుడే: కనీస జాగ్రత్తలు పాటించడంతో ఎన్నో విపత్తులు దూరంగా ఉండవచ్చని తహసీల్దార్ ఎం.సూర్యప్రభ అన్నారు. ప్రత్తిపాడులో ఎన్డీఆర్ఎఫ్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు మంగళవారం జరిగింది. ఎన్డీఆర్ఎఫ్ పదో బెటాలియన్ కమాండెంట్ వీవీఎస్ ప్రసన్నకుమార్, ఇన్‌స్పెక్టర్ సుశాంత్ కుమార్ బెహరాతో కలిసి తహసీల్దార్ పలు సూచనలు చేశారు. ప్రాథమిక చికిత్స, సీపీఆర్ తదితర అంశాలపై ఎన్డీఆర్ఎఫ్ అవగాహన కలిగించారు. ఎంఈవో రాజబాబు, ఉపతహసీల్దారు పుణ్యవతి, ఎంఆర్ఐ గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కోర్టు ఆవరణలో ఆధార్ అవగాహన సదస్సు

ప్రత్తిపాడు, న్యూస్‌టుడే: ప్రత్తిపాడు జేఎఫ్‌సీఎం కోర్టులో ఆధార్ శిబిరాన్ని మంగళవారం ఏర్పాటు చేశారు. ఆధార్ వివరాలు నవీకరణ కోసం చేసిన ఈ ఏర్పాటును కక్షిదారులు, సిబ్బంది, న్యాయవాదులు సద్వినియోగం చేసుకున్నారు. ఈ కేంద్రాన్ని జూనియర్ సివిల్ జడ్జి గోపీనాథ్ పరిశీలించారు. ఈ సందర్భంలో ఆధార్ వివరాలు ఇచ్చేటప్పుడు, వేలిముద్రలు నమోదుచేసేటప్పుడు పూర్తి అవగాహనతో ఉండాలని ప్రజలకు సూచించారు. ఆధార్ పేరిట జరుగుతున్న మోసాల పైనా అప్రమత్తం చేశారు.

కేంద్రంలో జడ్జి గోపీనాథ్

వంతెనల నిర్మాణం.. తీరనున్న కష్టాలు

• రైల్వే గేట్ల వద్ద నిరీక్షణ నుంచి ఉపశమనం

తుని పట్టణం, తొండంగి, న్యూస్‌టుడే

తుని నియోజకవర్గ పరిధిలో రావికంపాడు రైల్వే యార్డు వద్ద రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి ప్రభుత్వం చురుగ్గా చర్యలు చేపడుతోంది. అన్నవరం వద్ద కూడా ఆర్వోబీ, తుని పట్టణంలోని కొండవారిపేట వద్ద అండర్ పాస్ వంతెన నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధమయ్యాయి.

రావికంపాడు రైల్వే గేటు

రావికంపాడు వద్ద..

తొండంగి మండలం రావికంపాడు వద్ద రూ.83.20 కోట్లతో ఆర్వోబీ నిర్మాణానికి ప్రణాళిక వేగంగా జరుగుతుంది. కత్తిపూడి నుంచి పెరుమళ్లాపురం మార్గంలో రావికంపాడు వద్ద రైల్వే యార్డు నుంచి క్వారీ సామగ్రి ఎక్కువగా రవాణా జరుగుతుండటంతో తరచూ గేటు మూసివేస్తున్నారు. రైళ్ల రాకపోకల సమయంలో ఇదే పరిస్థితి. తీర ప్రాంతంలో పోర్టు, పలు పరిశ్రమలు అందుబాటులోకి వస్తున్నాయి. ఈ ప్రాంతంలో సుమారు 200 హెచరీలు ఉన్నాయి. పలు గ్రామాల నుంచి రోజూ వందలాది మంది రాకపోకలు సాగిస్తుంటారు. వంతెన నిర్మాణం జరిగితే సమస్య తీర నుంది. ఇక్కడ రైల్వే భాగం 135 మీటర్లు ఉండగా భవిష్యత్తులో ట్రాక్ విస్తరణకు అనుగుణంగా వంతెన నిర్మించనున్నారు.

అన్నవరం వద్ద..

అన్నవరం రైల్వే స్టేషన్ వద్ద ఆర్వోబీ నిర్మాణం ఎన్నో ఏళ్లుగా దస్త్రాలకే పరిమితమైంది. అన్నవరం నుంచి తొండంగి మండలంలో పలు గ్రామాలకు రాకపోకలకు రైల్వేగేటు వల్ల ఇబ్బందులు ఎదురవుతున్నాయి. గేటు మూసివేస్తే కనీసం 15 నిమిషాలు వేచి ఉండాలి. సత్యదేవుని దర్శనానికి వచ్చే భక్తులు, సముద్ర తీర ప్రాంతానికి వెళ్లే పర్యాటకులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. తుని పట్టణంలోని కొండవారిపేట వద్ద అండర్‌పాస్ అధ్వానంగా ఉండటంతో 10 వార్డుల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అన్నవరం వద్ద వంతెన, కొండవారిపేట వద్ద అండర్ పాస్ నిర్మాణంపై కూడా ప్రభుత్వం దృష్టిసారించింది.

దూరం కానున్న అవస్థలు

వంతెనల నిర్మాణంతో నియోజకవర్గంలోని పలు గ్రామాల ప్రజలు కష్టాలు తీరతాయని ఎమ్మెల్యే యనమల దివ్య అన్నారు. తమ విజ్ఞప్తిపై తక్షణం స్పందించి రావికంపాడు వద్ద ఆర్వోబీ మంజూరు చేయించిన ప్రధాని నరేంద్రమోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.

మేమున్నాం.. మీకు తోడుగా

మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు: తుని: 9100020946, ప్రత్తిపాడు: 98669 62946 జగ్గంపేట: 80086 22066

ఉ॥ 10 - మ॥ 1

పగలు కూడా విద్యుత్తు వెలుగులు

సమస్య: రావికంపాడులో పగలే వీధి దీపాలు వెలుగుతున్నాయి. దీంతో విద్యుత్తు వృథా అవుతోంది.
- నాగు, గ్రామస్థుడు

సమాధానం: వీధి దీపాలకు సంబంధించి మూడో వైరు వేయాల్సి ఉంది. త్వరలో సమస్య పరిష్కరిస్తాం.
- రామారావు, పంచాయతీ కార్యదర్శి

న్యూస్‌టుడే, తొండంగి

ఏరియా ఆసుపత్రిలో సమస్యల తిష్ట

రోగులకు పూర్తిస్థాయిలో అందని సేవలు

ప్రభుత్వ ప్రాంతీయ ఆసుపత్రిలో అనేక సమస్యలు తిష్టవేసి ఉన్నాయి. దీంతో నిత్యం రోగులకు ఇబ్బందే. మూడు నియోజకవర్గాల పరిధిలోని 12 మండలాల నుంచి సుమారు 500 మంది ఈ ఆసుపత్రికి రోజూ వైద్యం కోసం వస్తున్నారు. క్షతగాత్రులు, గర్భిణుల అత్యవసర వైద్యం విషయంలో పలు విభాగాల డాక్టర్లు, ఆధునిక పరికరాలు లేకపోవడంతో జీజీహెచ్‌కు రిఫర్ చేస్తున్నారు. - న్యూస్‌టుడే, తుని, తుని పట్టణం

ఆసుపత్రిలోని ఓపీ విభాగంలో రద్దీ

పరిశీలన

నత్తనడకన అభివృద్ధి పనులు

ఆసుపత్రి పాతభవనం పైకప్పు శిథిలావస్థకు చేరి స్లాబు నుంచి నీరు కారుతుండటంతో దాన్ని తొలగించి కొత్తగా నిర్మించే భవనాల పనులు నత్తనడకన సాగుతున్నాయి. నాబార్డు నిధులు రూ.10.20 కోట్లతో చేపట్టిన ఈ పనులు 2022 డిసెంబరుకు పూర్తికావాలి. ఏళ్ల గడుస్తున్నా ఆగుతూ...సాగుతూ ఉన్నాయి. దీంతో పడకలు అందుబాటులో లేక రోజూ సుమారు 100 మంది ఇన్‌పేషంట్లను ఉంచేందుకు అవస్థలు తప్పడం లేదు. గదులు లేక సామగ్రి, మంచాలు వరండాల్లో ఉంచారు. ఆసుపత్రి ప్రాంగణంలో కుక్కలు, దోమలు, పాముల సంచారం ఎక్కువగా ఉంది. సీసీ కెమెరాల నిఘా ఉన్నా బైకులు, ఫోన్లు ఇతర సామగ్రి చోరీకి గురవుతూనే ఉన్నాయి.

వరండాలో మంచాలు ఇలా..

సిబ్బంది కొరత ప్రధాన కారణం

పేరుకు వంద పడకల ఏరియా ఆసుపత్రి అయినా, ప్రస్తుతం అన్ని విభాగాలు కలిపి సుమారు 188 పడకలకు చేరింది. అయితే వైద్యులు, సిబ్బంది మాత్రం వంద పడకల ఆసుపత్రికి కేటాయించిన వారే ఉన్నారు. దీంతో కొన్నేళ్లుగా వైద్య సేవలు ఇబ్బందిగా ఉంది. అత్యవసర సేవల కోసం 2012లో ట్రామాకేర్ సెంటరును ఏర్పాటు చేశారు. అయితే మంజూరైన 40 పోస్టుల్లో ప్రస్తుతం 8 మంది మాత్రమే ఉన్నారు. ల్యాబ్, రక్తనిధి కేంద్రం మరికొన్ని విభాగాల్లో వైద్యులు, సిబ్బంది 24 పోస్టులు ఖాళీ ఉన్నాయి. మాతాశిశు విభాగానికి (ఎంసీహెచ్) సంబంధించి కూడా ఆయా పోస్టులు భర్తీ చేయాలి. దీనికి తోడు పారిశుద్ధ్య, సెక్యూరిటీ విభాగంలో అవుట్ సోర్సింగ్ ద్వారా పనిచేస్తున్న కార్మికుల సంఖ్యను కూడా పెంచాల్సి ఉంది. 200 పడకల జిల్లా ఆసుపత్రి హోదాతో వైద్య సిబ్బందిని నియమించే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

పూర్తి స్థాయి వైద్యసేవలకు కృషిచేస్తున్నాం

ఆసుపత్రిలోని అన్ని విభాగాల్లో పూర్తిస్థాయిలో వైద్య సేవలు అందించేందుకు కృషిచేస్తున్నాం. కొరత ఉన్న వైద్యులు, సిబ్బందిని మంజూరు చేయాలని ఉన్నతాధికారులను కోరాం. అభివృద్ధి పనుల్లోనూ వేగం పెంచేలా చూస్తాం. - డా.ఎస్.అన్నపూర్ణ, సూపరింటెండెంట్, తుని

వనదుర్గ ఆలయంలో ప్రత్యంగిర హోమం

అన్నవరం, న్యూస్‌టుడే : అన్నవరం సత్యదేవుని క్షేత్ర రక్షకులుగా కొలిచే వనదుర్గ అమ్మవారి ఆలయంలో మంగళవారం ప్రత్యంగిర హోమం శాస్త్రోక్తంగా నిర్వహించారు. అమావాస్య సందర్భంగా వైదిక బృందం ఆధ్వర్యంలో ప్రత్యంగిర హోమం నిర్వహించి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.

నిత్యాన్నదానానికి రూ. లక్ష విరాళం

అన్నవరం, న్యూస్‌టుడే : అన్నవరం దేవస్థానంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి హైదరాబాద్‌కు చెందిన ఎన్.చక్రవర్తి, సరోజ దంపతులు రూ.లక్ష విరాళాన్ని మంగళవారం అందజేశారు. దాతకు ఆలయ సూపరింటెండెంట్ యనమల అప్పారావు నిత్యాన్నదాన పత్రాన్ని అందజేశారు.

తీరంలో పుణ్యస్నానాలు

తొండంగి, న్యూస్‌టుడే: మహాశివరాత్రి అమావాస్య సందర్భంగా పెరుమాళ్లపురం పూరీ జగన్నాథ స్వామి వారి ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు జరిగాయి. వేకువ జాము నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయం వద్దకు చేరుకుని స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం సముద్ర తీరంలో పుణ్యస్నానాలు ఆచరించారు.

హోమం నిర్వహిస్తున్న వైదిక బృందం

గ్రామస్థాయి నుంచి పార్టీ పటిష్ఠం: ఎంపీ

జగ్గంపేట గ్రామీణం, న్యూస్‌టుడే: జనసేన పార్టీని గ్రామస్థాయి నుంచి పటిష్ఠం చేయాలని ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ అన్నారు. కాట్రావులపల్లి కూడలిలో జనసేన జెండాను ఆవిష్కరించారు. ఉదయ్‌శ్రీనివాస్ మాట్లాడుతూ.. అధినేత పవన్‌కల్యాణ్ ఆదేశాల మేరకు గ్రామాల్లో జెండా ఎగరవేస్తున్నామన్నారు. రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందన్నారు. నియోజకవర్గంలో రూ.45 కోట్ల 'ఉపాధి' నిధులను గ్రామాభివృద్ధికి కేటాయించామన్నారు. ఎమ్మెల్యే నెహ్రూ సహకారంతో పరిశ్రమల స్థాపన, ట్రామాకేర్ సెంటర్ ఏర్పాటుకు కృషిచేస్తున్నట్లు తెలిపారు. డీసీసీబీ ఛైర్మన్ తుమ్మల రామస్వామి, తుమ్మలపల్లి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

జెండా ఆవిష్కరిస్తున్న ఎంపీ ఉదయ్‌శ్రీనివాస్

'అవినీతి ఆరోపణలపై ఆధారాలతో ముందుకు రావాలి'

జగ్గంపేట గ్రామీణం, కిర్లంపూడి, న్యూస్‌టుడే: నియోజకవర్గ అభివృద్ధి కోసం అహర్నిశలు శ్రమిస్తున్న ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూను విమర్శిస్తే సహించేది లేదని తెదేపా రాష్ట్ర కార్యదర్శి ఎస్‌వీఎస్ అప్పలరాజు అన్నారు. మార్కెట్ కమిటీ కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పాటంశెట్టి సూర్యచంద్ర స్థాయికి మించి నిరాధార ఆరోపణలు చేస్తున్నారన్నారు. నాయకులు జీను మణిబాబు, బుర్రి సత్తిబాబు, పైడిపాల సూరిబాబు తదితరులు పాల్గొన్నారు. ● కిర్లంపూడిలో ఎంపీపీ తోట రవి, నాయకులు వీరంరెడ్డి కాశిబాబు, బస్వా వీరబాబు,చదరం చంటిబాబు, బొదిరెడ్ల సుబ్బారావు తదితరులు విలేకరులతో మాట్లాడుతూ.. ఎమ్మెల్యే నెహ్రూ కుటుంబంపై చేసిన అవినీతి ఆరోపణలకు సంబంధించిన ఆధారాలు ఉంటే వాటితో ముందుకు రావాలని వారు సవాల్‌చేశారు.

శుభ్రతతో రోగాలు దూరం

ప్రత్తిపాడు, గండేపల్లి, తొండంగి, ఏలేశ్వరం, కిర్లంపూడి,న్యూస్‌టుడే: మండలంలోని పాఠశాలల్లో నులిపురుగుల నివారణకు మాత్రల పంపిణీ మంగళవారం జరిగింది. ప్రత్తిపాడు హైస్కూలులో రాష్ట్ర ఖాదీ, గ్రామీణ పరిశ్రమలబోర్డు వైస్ ఛైర్మన్ కొమ్ముల కన్నబాబు విద్యార్థులకు మాత్రలు వేశారు. డాక్టర్ ఉషశ్రీ విద్యార్థులకు ఆరోగ్య పరిరక్షణపై సూచనలిచ్చారు. చినశంకర్లపూడిలో జరిగిన కార్యక్రమంలో సీనియర్ తెదేపా నాయకుడు మిరియాల శ్రీను తదితరులు పాల్గొన్నారు. ●గండేపల్లి మండలంలోని 3,847 మంది చిన్నారులకు గానూ 3,736 మంది చిన్నారులకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేసినట్లు ఎంపీడీవో హరికృష్ణ సత్యరెడ్డి తెలిపారు. మంగళవారం జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా మండలంలోని అన్ని అంగన్‌వాడీ, పాఠశాలల్లోని చిన్నారులకు మాత్రలు పంపిణీచేశారు. ఈ కార్యక్రమంలో వైద్యఅధికారి సురేంద్ర, ఎంఈవో వెంకటరెడ్డి తదితర సిబ్బంది పాల్గొన్నారు. ● తొండంగి మండలంలోని 19 ఏళ్లలోపున్న వారిలో నులిపురుగులను నివారించేందుకు ఆలెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. ఆత్మ కమిటీ ఛైర్మన్ నరహరశెట్టి సూర్యప్రకాష్, యనమల రాజేష్, వైద్యులు శిరీష, కిషోర్, అర్చన, భారతి విద్యార్థులకు మంగళవారం ఈమాత్రలు వేశారు. ● ఏలేశ్వరం మండలం పెద్ద నాపల్లిలో ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి , సుంకర సత్తిబాబు ఆల్‌బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు.ఎంపీడీవో, ఎంఈవో, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు. ● కడుపులో నులిపురుగుల వల్ల చిన్నారుల్లో ఎదుగుదల లోపిస్తుందని దీనిపై అవగాహనతో వ్యవహరించాలని కిర్లంపూడి మండల వైద్యాధికారి రాంబాబు నాయక్ తెలియజేశారు. జాతీయ నులిపురుగుల నివారణా దినోత్సవాన్ని కిర్లంపూడి ప్రభుత్వ ఉన్నతపాఠశాల ఆవరణలో మంగళవారం ప్రారంభించారు. నులిపురుగువల జరిగే అనర్థాలను విద్యార్థులకు ఎంపీపీ తోట రవి, సర్పంచి మహేంద్రాడ శ్రీలత తదితరులు అవగాహన కల్పించారు. ఎంపీడీవో బి.హరికృష్ణ, హెచ్ఎమ్ రమణీకుమారి, హెల్త్ సూపర్‌వైజర్ అన్నపూర్ణ, ఇతర నాయకులు, వైద్యఆరోగ్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రత్తిపాడులో మాత్రలు వేస్తున్న ఖాదీ బోర్డు వైస్ ఛైర్మన్ కన్నబాబు

నీటి వృథాను అరికట్టరూ..!

కోటనందూరు మండలం అల్లిపూడిలో కొళాయి దగ్గర నీరు వృథాగా పోతోంది. కాలువలు లేకపోవడంతో ఆ ప్రాంతమంతా చిత్తడిగా మారుతోంది. కొళాయి చుట్టూ గట్టు నిర్మాణం పూర్తయ్యే వరకు తాత్కాలిక మరమ్మతులు చేసి సమస్యను పరిష్కరిస్తామని పంచాయతీ కార్యదర్శి జి.పద్మ తెలిపారు.
- న్యూస్‌టుడే, కోటనందూరు

శుద్ధజల యంత్రం.. అలంకారప్రాయం

తుని గ్రామీణ మండలం పరిధిలోని ఉన్న 27 సచివాలయాల్లో గత ప్రభుత్వం అందించిన శుద్ధజల యంత్రాలు రెండు మినహా మిగిలినవన్నీ మరమ్మతులకు నోచుకోలేదు. దీంతో సిబ్బందికి, అక్కడకు వచ్చేవారికి తాగునీరు అందని పరిస్థితి. వీటిని వినియోగంలోకి తీసుకొని వచ్చేందుకు అధికారులు దృష్టిసారించాలని ప్రజలు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, తుని గ్రామీణం

పక్కా కాలువ నిర్మించరూ...

రౌతులపూడి సత్యదేవాకాలనీలో పక్కా కాలువ నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు. తేటగుంట - తుని ప్రధాన రహదారిని కలుపుతూ కాలనీలో ఉండే సీసీ రహదారి వెంబడి కాలువ నిర్మించకపోవడంతో పారిశుద్ధ్య సమస్యలు తలెత్తుతున్నాయని కాలనీవాసులు వాపోతున్నారు. అధికారులకు పలుసార్లు విన్నవించినా ప్రయోజనం లేదన్నారు. సమస్యను పంచాయతీ కార్యదర్శి రామచంద్రమూర్తి ప్రస్తావించగా ఉన్నతాధికారుల దృష్టిలో విషయాన్ని ఉంచి సమస్యకు పరిష్కారం చూపుతామన్నారు. - న్యూస్‌టుడే, రౌతులపూడి

హెచ్చరిక బోర్డులు అవసరం

ఏలేశ్వరం నుంచి ప్రత్తిపాడు వెళ్లే ప్రధాన రహదారిలో మలుపులు ప్రమాదాలకు కారణమవుతున్నాయి. లింగంపర్తి, భద్రవరం, పేరవరం గ్రామాల వద్ద ఉన్న మలుపుల వద్ద ఎలాంటి రక్షణ చర్యలు లేవు. మలుపులతో పాటు రోడ్డుకు ఇరువైపులా ముళ్లతుప్పలు పెరిగాయి. సంబంధిత అధికారులు స్పందించి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, ఏలేశ్వరం

సభాపతిని కలిసిన నాయకులు

తుని, న్యూస్‌టుడే: శాసనసభాపతి అయ్యన్నపాత్రుడిని స్థానిక నాయకులు మంగళవారం రాత్రి తుని రైల్వేస్టేషన్‌లో కలిశారు. విజయవాడ వెళ్లేందుకు నర్సీపట్నం నుంచి తుని రైల్వేస్టేషన్ వరకు రోడ్డుమార్గంలో వచ్చారు. స్టేషన్‌లో పలువురు నాయకులు స్పీకర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. గోదావరి ఎక్స్‌ప్రెస్‌లో విజయవాడ వెళ్లారు. స్పీకర్‌ను కలిసిన వారిలో సుర్ల లోవరాజు, అంకంరెడ్డి నానబ్బాయి, పెద్దిరెడ్డి శ్రీను, పండు తదితరులు ఉన్నారు.

తుని రైల్వేస్టేషన్‌లో...

సన్నకారు రైతు గుర్తింపు ఉంటేనే భూమిపై హక్కు

గండేపల్లి,న్యూస్‌టుడే: ఆరేళ్ల (1987కి ముందు) భూమిని సాగుచేసి ఉంటేనే సన్నకారు రైతుగా గుర్తిస్తామని దేవాదాయశాఖ జిల్లా అధికారి నాగేశ్వరరావు అన్నారు. తాళ్లూరు మఠం, వెంకటేశ్వరస్వామి ఆలయం వద్ద మంగళవారం దేవాదాయశాఖ అధికారులు సన్నకారు రైతుహక్కుపై విచారణ చేపట్టారు. దేవాదాయశాఖ అధికారి మాట్లాడుతూ. . మర్రిపాక, బురుగుపూడి గ్రామాల్లో తాళ్లూరు మఠానికి చెందిన సుమారు 77 ఎకరాల భూమిపై విచారణ చేపట్టినట్లు తెలిపారు. 80 ఏళ్లుగా భూమిని సాగుచేస్తున్న వారికే భూమిపై హక్కు కల్పించాలని రైతుకూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు అన్నారు. అధికారులకు వినతిపత్రం అందజేశారు. దేవాదాయశాఖ ఇన్‌స్పెక్టర్ ఫణీంద్రకుమార్, రైతులు పాల్గొన్నారు.

అధికారులకు వినతిపత్రం అందజేస్తున్న రైతులు

ఆహార పండుగ

రౌతులపూడి: శ్రీహర్ష ఆంగ్ల మాధ్యమ పాఠశాలలో మంగళవారం ఆహార పండుగ సందడిగా జరిగింది. చెఫ్‌ల వేషధారణలో చిన్నారులు అలరించారు. ఆహారం ప్రాముఖ్యం, వివరించారు

భోజనం చేస్తున్న చిన్నారులు

'ప్రభుత్వం కక్షపూరితంగా వ్యవహరిస్తోంది..'

కిర్లంపూడి: కూటమి ప్రభుత్వం ప్రతిపక్ష పార్టీపై కక్షపూరితంగా వ్యవహరిస్తోందని మాజీమంత్రి గుడివాడ అమర్‌నాథ్ ఆరోపించారు. కిర్లంపూడిలో మాజీమంత్రి ముద్రగడ పద్మనాభరెడ్డిని అమర్‌నాథ్, మాజీ ఎమ్మెల్యే కర్ణం ధర్మశ్రీ, విజయగనగరం జడ్పీ మాజీ ఛైర్మన్ మజ్జి శ్రీనివాస్ మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం విలేకరులతో అమర్‌నాథ్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం నడుస్తోందని ఆరోపించారు.

వీఆర్వోల బాధ్యతలపై స్పష్టత ఇవ్వాలని వినతి

తుని గ్రామీణం, జగ్గంపేట గ్రామీణం, న్యూస్‌టుడే: వీఆర్వోల విధులపై స్పష్టత ఇవ్వాలని కోరుతూ తుని నియోజకవర్గానికి చెందిన తుని, తొండంగి, కోటనందూరు మండల వీఆర్వోల సంఘాల ప్రతినిధులు నియోజకవర్గ ప్రత్యేక అధికారి శ్రీధర్‌కు వినతిపత్రం అందజేశారు. మండల పరిషత్తు కార్యాలయంలో మంగళవారం ఆయన్ని కలిశారు. ● సమస్యల పరిష్కారం కోరుతూ వీఆర్వోలు, వీఆర్ఎలు, సర్వేయర్లు జగ్గంపేట తహసీల్దార్ కార్యాలయం వద్ద మంగళవారం నిరసన చేపట్టారు. వీఆర్వోల సంఘ అధ్యక్షులు చినవీర్రాజు మాట్లాడారు.

ఆసుపత్రి అభివృద్ధి కమిటీలో మార్పులు

తుని, న్యూస్‌టుడే: ప్రభుత్వ ప్రాంతీయ ఆసుపత్రి అభివృద్ధి కమిటీలో కొన్ని మార్పులు చేస్తూ కలెక్టర్ ఇటీవల ఉత్తర్వులు జారీ చేశారు. వివిధ కారణాలతో సభ్యులుగా ఉన్న గంట్ల చిన్నారావు, విజయ్‌లను తొలగించారు. చోడిశెట్టి త్రిమూర్తులు స్వామి (ఎస్.అన్నవరం), రాజాల నిర్మల (హంసవరం) ప్రత్యేక ఆహ్వానితులుగా కాదంబరి రామకృష్ణను కలెక్టర్ నియమించారు. మిగిలిన సభ్యులు యథావిధిగా కొనసాగనున్నారు.

ఏరియా ఆసుపత్రిలో అరుదైన శస్త్రచికిత్స

తుని: ప్రభుత్వ ప్రాంతీయ ఆసుపత్రిలో ఓ మహిళకు వైద్యులు అరుదైన శస్త్రచికిత్స చేశారు. ఎస్.అన్నవరానికి చెందిన రామకుమారి (35) ని పరీక్షించిన వైద్యులు శస్త్రచికిత్స చేసి గర్భసంచిలో ఉన్న 500 గ్రాముల అండాశయ తిత్తిని తొలగించారు,సూపరింటెండెంట్ అన్నపూర్ణ, వైద్యులు తేజస్విని, సునీత బృందం శస్త్రచికిత్సను విజయవంతంగా చేశారు.

వీధి వ్యాపారులకు ఉపాధి

కిర్లంపూడి: వీధి వ్యాపారులకు ప్రోత్సాహం అందించేందుకు ప్రభుత్వం రూ.50 వేలు విలువచేసే బడ్డీలను ఉచితంగా అందజేస్తుందని ఎంపీపీ తోట రవి పేర్కొన్నారు. రెండు బడ్డీలను లబ్ధిదారులకు మంగళవారం ప్రజాప్రతినిధులు, అధికారులు అందజేశారు.

తిరుమల విద్యార్థుల సత్తా

కోలా అంకిత్

దుగ్గాడ అభినవ్

ఎల్లపు అఖిల

గనిరెడ్డి వెంకట సూర్యకిరణ్

పాయకరావుపేట, న్యూస్‌టుడే: జేఈఈ మెయిన్ ఫలితాల్లో పాయకరావుపేట తిరుమల విద్యాసంస్థ విద్యార్థులు సత్తా చాటారు. సంస్థకు చెందిన కోలా అంకిత్ 99.53, దుగ్గాడ అభినవ్ 99.31, ఎల్లపు అఖిల 98.91, గనిరెడ్డి వెంకట సూర్యకిరణ్ 98.13 పర్సంటైల్ సాధించారని ఛైర్మన్ నున్న తిరుమలరావు తెలిపారు. 98 పర్సంటైల్ పైన నలుగురు, 95 పైన 10 మంది, 90 పర్సంటైల్ పైన 28 మందికి వచ్చాయని వివరించారు. పాయకరావుపేటలో స్థాపించిన మొదటి బ్యాచ్ కొద్దిమంది విద్యార్థులతోనే అత్యుత్తమ ఫలితాలు సాధించామని తిరుమలరావు అన్నారు. ప్రతిభ చూపిన విద్యార్థులు, అధ్యాపకులను ఆయన అభినందించారు.

గూడేల్లోనే నయం.. మైదానంలో అధ్వానం

• స్వచ్ఛతలో ఇదీ తీరు

న్యూస్‌టుడే-ప్రత్తిపాడు

ఉప ప్రణాళిక మన్యంలో వీధులు, మంచినీటి వనరుల నిర్వహణ తీరు మైదాన ప్రాంతాలతో పోలిస్తే మెరుగ్గా ఉంటోంది. కొండలపైనా, మారుమూల ప్రాంతాల్లో ఉన్న పల్లెల్లో పారిశుద్ధ్య కార్యక్రమాలకు ప్రత్యేక నిధులు కేటాయించకపోయినా, కనీసం పారిశుద్ధ్య సిబ్బంది లేకపోయినా శుచిగా తండాలు ఉంటున్నాయి. మైదాన ప్రాంత గ్రామాల్లో చెత్త సేకరణ, నిర్వహణకు రూ.లక్షలు వెచ్చిస్తున్నా గ్రామ శివారున, చెరువు గట్లపైనా వ్యర్థాలను గుట్టల కింద పోస్తున్నారు. పోలవరం, పుష్కర గట్లనే కాదు హైవేను వదలిపెట్టడం లేదు. ప్రత్తిపాడు, ధర్మవరం కత్తిపూడి ప్రతిచోట ఇదే తీరు.. ఖాళీ జాగాలు ఉంటే తుప్పలు పెరిగిపోవడం, నీరు నిలిచిపోవడం ప్రజారోగ్యానికి సవాలు విసిరే తీరే ప్రతి గ్రామంలో దర్శనమిస్తోంది. గ్రామాన్ని కనీసం 3 టన్నుల చెత్త రోజూ ఉక్కిరిబిక్కిరి చేస్తుంది. నియోజకవర్గంలోని 36 గిరిజన గ్రామాలు ఉండగా ఇక్కడ జనాభాకు తగ్గట్టుగా సంచారం, వ్యర్థాలు ఉత్పత్తి ఉన్నా.. వీధుల నిర్వహణ మాత్రం బాగుంటుంది. ఈ తండాలన్నింటికీ పారిశుద్ధ్య కార్యక్రమాల రూపేణా ఖర్చు చేసే మొత్తం ఏడాదికి రూ.20 లక్షలు దాటదు. గతేడాది ఉపప్రణాళిక పంచాయతీలను మినహా నియోజకవర్గంలో 50 పంచాయతీల్లోనూ ప్రతి గ్రామానికి రూ.5 లక్షలు నుంచి రూ.10లక్షలు శుభ్రతకే వెచ్చిస్తారు.

ఇదీ పరిస్థితి.

పూరిళ్లు పక్కపక్కనే ఉన్నా ఎవరికి వారు హద్దులుగా దడులు కట్టుకుని ఇల్లూ వాకిలి శుచిగా ఉంచుతారు. వాడకం నీరు వీధిలోకి వదిలేయరు. సిమెంటు రోడ్లు ఉన్నా తివాచీల్లా ముచ్చటగా ఉండేలా నిర్వహించుకుంటున్నారు. ప్రత్తిపాడు మండలంలోని కొండపై ఉన్న ఉలిగోగుల, మెట్టుచింత బాపన్నధార, కె.మిర్తివాడ, కొండపల్లి, బురదకోట వంతాడ..తదితర గిరిజన పల్లెలు ఏ కాలంలో వెళ్లినా స్వచ్ఛత గాడి తప్పదు. పాఠశాలలు, ఇతర కార్యాలయ భవనాలు ప్రహరీలు లేకుండా ఖాళీ జాగాలు ఉన్నా వాటిని శుభ్రంగానే ఉంచుతున్నారు. ఏలేశ్వరం పట్టణం, మేజరు పంచాయతీలకు మురుగు పారుదల, చెత్త నిర్వహణ ఇప్పటికీ సాధ్యంకాని వ్యవహారంగానే ఉంటోంది.

ఉలిగోగుల గిరిజన గ్రామం

అనుమానాస్పద స్థితిలో యువకుడి ఆత్మహత్య

తణుకు, న్యూస్‌టుడే: పట్టణ పోలీస్ ఠాణా పరిధిలో అనుమానాస్పదస్థితిలో యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన మంగళవారం వెలుగు చూసింది. ఎస్సై కె.శ్రీనివాస్ తెలిపిన వివరాలివీ.. గండేపల్లికి చెందిన కొమ్ముకూరి సూరిబాబు (27) తణుకు రైల్వేస్టేషన్ రోడ్డులోని ఒక ఇంట్లో పది రోజుల కిందట అద్దెకు దిగాడు. అయిదేళ్ల కిందట తణుకు పట్టణంలోని ఇరగవరం కాలనీకి చెందిన తిరుమల అనే యువతిని ప్రేమ వివాహం చేసుకున్న సూరిబాబు స్థానికంగా ఓ వస్త్ర దుకాణంలో సేల్స్‌మేన్‌గా పనిచేస్తున్నాడు. వారికి సోఫియా(4) అనే కుమార్తె ఉంది. ఇక్కడ అద్దెకు వచ్చిన నుంచి భార్య తిరుమల అప్పుడప్పుడు వచ్చి వెళ్తోంది. సోమవారం మధ్యాహ్నం ఇంట్లో గడియ పెట్టుకున్న సూరిబాబు తలుపులు తీయకపోవడంతో ఇంటి యజమాని అనుమానంతో సూరిబాబు భార్యతోపాటు పోలీసులకు సమాచారం అందించారు. సోమవారం అర్ధరాత్రి ఎస్సై శ్రీనివాస్ ఆధ్వర్యంలో సిబ్బంది ఇంటి తలుపులు పగులగొట్టి చూడగా ఉరేసుకొని ఉన్నాడు. మంగళవారం మృతదేహాన్ని తణుకు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై శ్రీనివాస్ తెలిపారు.

ద్విచక్రవాహనం అదుపు తప్పి దంపతులకు గాయాలు

తొండంగి, న్యూస్‌టుడే: ద్విచక్ర వాహనం అదుపుతప్పి అన్నవరం గ్రామానికి చెందిన సుబ్రహ్మణ్యం, నాగమణి దంపతులు ద్విచక్ర వాహనంపై పిఠాపురం వెళుతు కింద పడి గాయపడ్డారు.

ధర్మవరంలో 15 మందికి కుక్కకాట్లు

ప్రత్తిపాడు: శునకాల బెడద గ్రామాల్లో ఎక్కువైంది. ధర్మవరంలో ఓ కుక్క కనిపించిన వారిని కరుచుకుంటూ పోయింది. శివాలయం వీధిలో 15 మంది వరకూ గాయపడ్డారు.ప్రత్తిపాడు సీహెచ్‌సీలో వీరు చికిత్స చేయించుకున్నారు.

ముగ్గురికి జైలు శిక్ష, జరిమానా

రౌతులపూడి: ధారజగన్నాథపురం గ్రామంలో సరిహద్దు వివాదంలో తనపై దాడి జరిగిందని 2015లో అల్లు సింహాద్రి అన్నవరం పోలీసులకు ఫిర్యాదు చేశారు. అప్పటి అన్నవరం ఎస్సై జగన్‌మోహన్‌రావు ఘటనపై కేసు నమోదు చేశారు. వాదనల అనంతరం తుని కోర్టు న్యాయమూర్తి వి.గోపాలకృష్ణ ముగ్గురు నిందితులకు రెండేళ్ల జైలు, ఒక్కొక్కరికి రూ.2వేలు చొప్పున జరిమానా విధించారని మంగళవారం ఎస్సై వెంకటేశ్వరరావు తెలిపారు.

తాగి వాహనం నడిపిన యువకుడిపై కేసు

రౌతులపూడి, న్యూస్‌టుడే: మద్యం మత్తులో వాహనం నడిపి, ప్రమాదానికి గురైన యువకుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని రౌతులపూడి ఎస్సై వెంకటేశ్వరరావు తెలిపారు. ద్విచక్రవాహనంపై వెళుతున్న ఓ యువకుడు ములగపూడి గ్రామంలో బండిపై నుంచి జారిపడ్డాడని, కౌన్సెలింగ్ ఇచ్చి కేసు నమోదు చేశామన్నారు.

(c) eenadu

మత్తు ముఠాలపై ఉక్కుపాదం

రూ.21.5 కోట్ల సరకు సీజ్

స్వాధీనం చేసుకున్న సరకు వివరాలను కొత్వాలుకు వివరిస్తున్న నార్కోటిక్ విభాగం అధికారి

బెంగళూరు (శివాజీనగర), న్యూస్‌టుడే : నగరంలోని వివిధ ప్రాంతాల్లో దాడులు నిర్వహించిన నార్కోటిక్ విభాగం పోలీసులు రూ.21.5 కోట్ల విలువైన మాదక ద్రవ్యాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ దాడుల్లో అరెస్టైన వారిలో ముగ్గురు నైజీరియన్లు, 12 మంది స్థానికులు, ఇతర రాష్ట్రాలకు చెందిన వారు ఉన్నారు. వీరి నుంచి 9.450 కిలోల హైడ్రో గంజాయి, 5.677 కిలోల ఎండీఎంఏ, 34 కిలోల గంజాయి, 131 గ్రాముల కొకైన్, 462 మి.లీ. హషీష్ తైలం, 29 ఎల్ఎస్‌డీ మాత్రలు, 27 గ్రాముల ఎల్ఎస్‌డీ చీటీలు, ఒక కారు, ఒక బైకు, నాలుగు చరవాణులు జప్తు చేసుకున్నామని నగర పోలీసు కమిషనర్ సీమంత్ కుమార్ సింగ్ వెల్లడించారు. అమృతహళ్లి, హెబ్బగోడి, జీవనబీమానగర, మహాలక్ష్మి లేఅవుట్, గోవిందపురల్లో కార్యాచరణ నిర్వహించి మాదక ద్రవ్యాలను జప్తు చేసుకున్నామని వివరించారు. నిందితుల్లో వర్తూరులో ఉంటున్న నైజీరియన్ ఒకాయిల్ (30), హెబ్బాళ సమీపంలోని మనోరాయనపాళ్య నివాసులు అజ్మల్ (29), మజీద్ (5)ల నుంచి పెద్ద మొత్తంలో మాదక ద్రవ్యాలను జప్తు చేసుకున్నామని చెప్పారు. నిందితులను అరెస్టు చేసిన పోలీసు సిబ్బందిని డీసీపీలు బీఎస్ నేమగౌడ, అక్షయ్ హాకే, విక్రమ్ అమటె, జీకే మిథున్ కుమార్, ఎం నారాయణ్ ప్రశంసించారు.

సేతువు సిద్ధం

రాజధాని నగరంలో క్రాంతి వీర సంగొళ్లి రాయణ్ణ రైల్వేస్టేషన్ (మెజెస్టిక్)-నాయండనహళ్లి మధ్య రైల్వే ఉపరితల వంతెన సిద్ధమైంది. కేంద్ర రైల్వే శాఖ సహాయ మంత్రి సోమణ్ణ ఈ వంతెనను మంగళవారం ప్రారంభించారు.
- **న్యూస్‌టుడే, బెంగళూరు**

మా ఒప్పందం బహిరంగమే!

- త్వరలో ముఖ్యమంత్రే ప్రకటిస్తారు
- నాయకత్వ మార్పుపై డీకే స్పందన

డీకే

ఈనాడు, బెంగళూరు : కుర్చీ కోసం ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి మధ్య కొనసాగుతున్న పోరుకు ఇప్పట్లో తెరపడేలా లేదు. ఒక్కొక్కరుగా బహిరంగ వ్యాఖ్యలు చేస్తూ పార్టీలో అలజడి సృష్టిస్తున్నా అధిష్ఠానం చోద్యం చూస్తున్నట్లుగా ఉంటోంది. ఈ మధ్యలో డీకే శివకుమార్ దిల్లీ పర్యటన, ముఖ్యమంత్రి మద్దతుదారుల విదేశీ పర్యటనలతో ఈ పోరు క్లైమాక్స్‌కు చేరినట్లే కనిపిస్తోంది. మరో రెండు వారాల్లో ముఖ్యమంత్రి సిద్ధరామయ్య 2026-27 బడ్జెట్ ప్రకటించేందుకు సిద్ధమవుతుండగా డీకే శివకుమార్ శిబిరం పట్టు బిగించే ప్రయత్నం చేస్తోంది.

త్వరలోనే చెబుతారు..

నాకు, ముఖ్యమంత్రి మధ్య రహస్య ఒప్పందాలేమీ జరగలేదు. ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే, సీనియర్ ఏఐసీసీ నేతల సమక్షంలోనే ఆ ఒప్పందం కుదిరింది. సమయం వచ్చినప్పుడే ముఖ్యమంత్రి ఆ విషయాన్ని బయటపెడతారు. ఆలోగా నాతో ఏదేదో చెప్పించే ప్రయత్నం చేయకండి.. ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్ మంగళవారం చేసిన ఈ వ్యాఖ్యలు మరింత ప్రాధాన్యం సంతరించుకున్నాయి. ఓ వైపు ముఖ్యమంత్రి సిద్ధరామయ్య అధిష్ఠానం చెప్పినట్లే నేను, డీకే నడుచుకోవాలని పదేపదే ప్రకటించటం, ఓసారి మా మధ్య ఎలాంటి ఒప్పందం లేదని చెప్పటం, ఇంకోసారి ఇచ్చిన మాట నెరవేరుస్తున్నట్లు గ్యారంటీలను అడ్డుపెట్టుకుని ఎద్దేవా చేస్తున్నారు. ఆయన కుమారులు యతీంద్ర కాస్త దూకుడు ప్రదర్శించి ఐదేళ్లు మా తండ్రే ముఖ్యమంత్రి అన్న రీతిలో చేసిన వ్యాఖ్యలు డీకే శిబిరాన్ని ఉడికించేలా చేస్తోంది. ఈ పరిణామాలతో మంగళవారం డీకే శివకుమార్ చేసిన వ్యాఖ్యలు ఇద్దరి మధ్య పోరు గాలిపోకు చందం కాదని మరోసారి స్పష్టం చేసింది.



దుమారం రేపిన మహదేవప్ప మటలు

చిచ్చు రేపిన మహదేవప్ప

డీకేకు ముఖ్యమంత్రి పీఠం అంతకంతకూ దూరమవుతోందని రగులుతున్న ఆయన మద్దతుదారులు, మరీ ముఖ్యంగా మాజీ ఎంపీ డీకే సురేశ్‌కు మంత్రి మహదేవప్ప వ్యాఖ్యలు పుండు మీద కారం చల్లినట్లుగా మారాయి. ఎమ్మెల్యేలను ఏ రకంగా శునకాలతో పోల్చిన మహదేవప్ప వ్యాఖ్యలు సహజంగానే పార్టీలో కలకలం రేపాయి. ఆయన చేసిన వ్యాఖ్యలపై డీకే శివకుమార్ స్పందిస్తూ ఆయన వ్యాఖ్యలకు నేను బదులివ్వనని తెగేసి చెప్పారు. ఆయన కూడా మా అధిష్ఠానంలో ఒకరిగా మారారని ఎద్దేవా చేశారు. నేను ఎవరికి పడితే వారికి బదులివ్వాల్సిన అవసరం లేదన్నారు. ఆయన సోదరుడు డీకే సురేశ్ మరో అడుగు వేసి శునకాలకు విశ్వాసం ఉంటుంది. పార్టీ విధేయులకు ఆ విశ్వాసం మరింత ఎక్కువ. యజమానికి విశ్వాసాన్ని చూపే సమయం వచ్చిందని ఇతర పార్టీల నుంచి వచ్చిన వారిని ఉద్దేశించి మాట్లాడారు. ఆయన చేసిన వ్యాఖ్యలు పరోక్షంగా ముఖ్యమంత్రిని కూడా తాకినట్లు తెలుస్తోంది. ఇటీవల సర్కారు ప్రకటించిన కార్పొరేషన్ నియామకాల్లోనూ ఇతర పార్టీల వారికి అవకాశం ఇవ్వటంపై సురేశ్ ఆరోపించిన విషయం తెలిసిందే.

'విదేశీ' దుమారం..

మంగళవారం 20 మందికి పైగా ఎమ్మెల్యేలు ఆస్ట్రేలియాకు బయలుదేరారు. రాఘవేంద్ర హిట్నాళ్, హెచ్.డి.తమ్మయ్య, హంపనగౌడ బాదర్లి, బీఎం నాగరాజ, దేవేంద్రప్ప, యశ్వంతరాయగౌడ పాటిల్, పుట్టరంగశెట్టి తదితరులతో కూడిన 20మంది ఎమ్మెల్యేల బృందం విదేశాలకు బయలుదేరటంపై తనకేమి సమాచారం లేదని డీకే అన్నారు. వారెందుకు వెళ్లారో? వారిని ఎవరు పంపారో కూడా తనకు తెలియదన్నారు. అందరూ అంచనా వేసినట్లు పశు సంవర్ధక శాఖ మంత్రి వెంకటేశ్ ఈ పర్యటనకు వెళ్లకపోవటం చర్చనీయాంశం. ఓ వైపు పార్టీ రాష్ట్ర బాధ్యులు రణదీప్ సింగ్ సుర్జేవాలా వారిస్తున్నా వీరంతా విదేశాలకు బయలుదేరటం పార్టీలో దుమారం రేపటం ఖాయమని తెలుస్తోంది. వీరంతా మార్చి 3న తిరిగి బెంగళూరుకు రానున్నారు. వీరు త్వరలో నిర్వహించే సీఎల్‌పీ సమావేశాన్ని బహిష్కరించేందుకే వెళ్లారన్న వాదన పార్టీ వర్గాల నుంచి వినిపించటం కొసమెరుపు.

బాల రక్షకభట దర్పం!

పండ్ల బుట్టను అందుకుంటున్న బాల ఎస్పీ

దావణగెరె, న్యూస్‌టుడే : ఒకటిన్నర ఏడాది వయసున్నప్పుడే హితార్థ్ క్యాన్సర్ బారిన పడ్డాడు. తాను పెద్దయ్యాక పోలీసు అధికారిని అవుతానని మాటలు వచ్చినప్పటి నుంచి చెబుతూ వచ్చాడు. అతని మాటల్ని నిజం చేసేందుకు అతని తల్లిదండ్రులు ప్రభు, అనుషా చేసిన ప్రయత్నం ఎట్టకేలకు సఫలమైంది. హొన్నాళి తాలూకా హోసళ్లి తాలూకాకు చెందిన హితార్థ్‌కు పోలీసు సమవస్త్రాలను కుట్టించారు. ఎస్పీ హెచ్‌టీ శేఖర్ కార్యాలయానికి తీసుకువచ్చారు. శేఖర్ ఆ బాల ఎస్పీకి పండ్ల బుట్టను అందించారు. తన కుర్చీలో కొంత సమయం కూర్చుని, వాకీ టాకీలో మాట్లాడేందుకు అవకాశం కల్పించారు. బాలుని ముఖంలో ఆనందాన్ని చూసి ఎస్పీ, కార్యాలయం సిబ్బంది, అతని తల్లిదండ్రులు ఆనందించారు. తమ కుమారుని ఆశ నెరవేరిందని ప్రభు, అనూష దంపతుల కళ్ల నుంచి ఆనందబాష్పాలు రాలాయి.

విధానసౌధలో రైతు సంఘాల నేతలతో సమావేశమైన సీఎం సిద్ధరామయ్య, మంత్రి చెలువరాయస్వామి తదితరులు

అన్నదాతలకే సర్కారు వెన్నుదన్ను

బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే : రైతు కుటుంబాలకు చెందిన యువతులను ప్రభుత్వోద్యోగాల నియామకాల్లో 20 శాతం రిజర్వేషన్ కల్పించాలని, యువతులకు పెళ్లయ్యే వరకు రూ.10 లక్షలు డిపాజిట్ చేయాలని కర్ణాటక రాజ్య రైతు సంఘాల ప్రతినిధులు రాష్ట్ర ప్రభుత్వానికి విన్నవించారు. బడ్జెట్ ముందస్తు చర్చల్లో భాగంగా మంగళవారం ఇక్కడి విధానసౌధ సమావేశ మందిరంలో ముఖ్యమంత్రి సిద్ధరామయ్య రైతు సంఘాల ప్రతినిధులతో సమావేశమయ్యారు. వ్యవసాయ ఆధారిత పరిశ్రమల ఏర్పాటుకు తక్కువ వడ్డీతో కూడిన రుణాలు అందించాలని రైతు నేతలు కోరారు. యువ రైతుల పెళ్లి కష్టంగా మారిందని, ఇదొక సామాజిక సమస్యగా మారుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. యువ రైతులను పెళ్లి చేసుకునే యువతులకు కనీసం రూ. 10 లక్షలు డిపాజిట్ చేయాలని కోరారు. వ్యవసాయ రంగం సమస్యలను పరిష్కరించాలని కోరారు. పంట ఉత్పత్తుల గిట్టుబాటు కమిషన్‌కు చట్టబద్ధత కల్పించాలన్నారు. రైతు నేత ఆచార్య ఎం.డి. నంజుండస్వామి పుట్టిన గ్రామం మైసూరు జిల్లా టి.నరసీపుర తాలూకా మాద్రహళ్లిని అభివృద్ధి చేయాలని విజ్ఞప్తి చేశారు. కేంద్ర ప్రభుత్వ రైతు వ్యతిరేక చట్టాలను తిరస్కరించాలని పలువురు ప్రతిపాదించారు. ఉత్పత్తులకు మద్దతుధర కల్పించేందుకు వీలుగా రూ. 20 వేల కోట్లతో ప్రత్యేక నిధి ఏర్పాటు చేయాలని విన్నవించారు. వారి సూచనలకు సీఎం సానుకూలంగా స్పందించారు. రైతు సంఘాల నేతలు కురుబూరు శాంతకుమార్, బడగలపుర నాగేంద్ర, సునంద, మక్కి, నంజుండస్వామి, డీఎస్ పూజారి, వ్యవసాయ శాఖ మంత్రి చెలువరాయస్వామి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ శాలిని రజనీశ్ తదితరులు హాజరయ్యారు.

విధానసౌధ సమావేశ మందిరంలో పాల్గొన్న రైతు సంఘాల నేతలు

రెక్కలు తొడిగిన గులాబీలు!

బెంగళూరు (గ్రామీణం), న్యూస్‌టుడే : ప్రేమికుల దినోత్సవం రోజున కెంపేగౌడ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి ఆరు కోట్ల గులాబీలు వివిధ ప్రాంతాలకు తరలి వెళ్లాయి. బెంగళూరు నుంచి 26 దేశాలకు, 47 దేశీయ నగరాలకు 2700 మెట్రిక్ టన్నులకు పైగా ఎర్ర గులాబీలు వెళ్లాయి. గత ఏడాదితో పోల్చితే పూల సంఖ్యలో 38 శాతం, తూకంతో పోల్చితే 64 శాతం వృద్ధి కనిపించింది. అంతర్జాతీయ గమ్యస్థానాల్లో సింగపూర్, తదుపరి స్థానాల్లో కౌలాలంపూర్, అబుదాబి, న్యూయార్క్, కువైట్ ఉన్నాయి. ఈ ఏడాది గులాబీలు దిగుమతి చేసుకున్న నగరాల్లో లాస్‌ఏంజిల్స్, లండన్, డల్లాస్, టొరంటో, ఒర్లాండో చేరాయి. అంతర్జాతీయ ఎగుమతులు సగటున 305 మెట్రిక్ టన్నులు ఉండగా, దేశీయ మార్కెట్‌కు 2402 మెట్రిక్ టన్నులుగా నమోదైంది. దిల్లీ, కోల్‌కతా, గువాహటి, ముంబయి, జైపూర్ నగరాలకు ఎక్కువ సంఖ్యలో గులాబీలు ఇక్కడి నుంచి ఎగుమతి చేశారు.

అయ్యో పాపం.. బిడ్డ క్యాబ్‌లోనే మరిచిపోయారు

బెంగళూరు (హలసూరు), న్యూస్‌టుడే : క్యాబ్‌లో ఇంటికి తిరిగి వచ్చిన అనంతరం నాలుగేళ్ల బిడ్డను కారులోనే వదిలి కిందకు దిగారు. ఇంట్లోకి వెళ్లిన అనంతరం బిడ్డను కారులోనే వదిలి వెళ్లామని గుర్తించారు. తక్షణమే పోలీసులకు ఫోన్ చేశారు. క్యాబ్ బుక్ చేసుకున్న వివరాల ఆధారంగా డ్రైవరుకు ఫోన్ చేశారు. కారు వెనుక సీట్లో బిడ్డ నిద్రపోతున్నట్లు డ్రైవరు గుర్తించి అప్రమత్తమయ్యాడు. వెనక్కు వచ్చి బిడ్డను అప్పగించి వెళ్లాడు. ఇంతటి నిర్లక్ష్యంగా వ్యవహరించిన తల్లిదండ్రుల తీరును నెటిజన్లు తప్పు పట్టారు.

బావిలో విద్యార్థి మృతదేహం

కలబురగి, న్యూస్‌టుడే : జిల్లా కేంద్రానికి చేరువలోని బబలాద గ్రామ పొలాల ఆవరణలోని బావిలో గురు (15) అనే విద్యార్థి మృతదేహాన్ని మంగళవారం గుర్తించారు. వసతిగృహంలో ఉంటున్న గురు గత శనివారం సాయంత్రం నుంచి కనిపించకుండా పోయాడు. చించోళికి చెందిన అతను హాస్టల్‌లో ఉంటూ, ఓ ఉపాధ్యాయుని బైక తీసుకువెళ్లి గోడను ఢీకొట్టాడు. జరిగిన నష్టాన్ని అతని కుటుంబ సభ్యుల నుంచి వసూలు చేయాలని ప్రిన్సిపల్ ఆదేశించారు. అదే బాధతో అతను ఆత్మహత్యకు పాల్పడి ఉంటాడని అనుమానిస్తున్నారు.

ఆటోలో అమెరికా రాయబారి!

సెర్జియో గోర్‌తో ఆటోలో ప్రయాణిస్తున్న తేజస్వి సూర్య

జయనగర, యశ్వంతపుర, న్యూస్‌టుడే : భారత్‌లో అమెరికా రాయబారి సెర్జియో గోర్‌తో కలిసి బెంగళూరు దక్షిణ లోక్‌సభ సభ్యుడు తేజస్వి సూర్య నగర వీధుల్లో ఆటోలో ప్రయాణించారు. ఇందిరానగరలోని ఫిల్టర్ కాఫీ రెస్టారెంటుకు వెళ్లి, ఇడ్లీ, దోసె, కాఫీ రుచి చేశారు. భారత్- అమెరికా మధ్య వ్యాపారం, సాంకేతికత, ఆవిష్కరణలకు సంబంధించి తాము చర్చించుకున్నామని సూర్య తెలిపారు. ఆటో ప్రయాణాన్ని గోర్ ఆస్వాదించారని చెప్పారు. బెంగళూరులో 700కు పైగా అమెరికన్ కంపెనీలు ఉన్నాయని గుర్తుచేశారు.

సిద్ధుతో మంతనాలు..

ముఖ్యమంత్రి సిద్ధరామయ్యను మంగళవారం అమెరికా రాయబారి సెర్జియో గోర్ కలిశారు. మైసూరు పేటా, గంధం మాలతో ఆయనను సిద్ధు సత్కరించారు. రాష్ట్రంలో పారిశ్రామికాభివృద్ధి, పరిశ్రమల ఏర్పాటు తదితర అంశాలపై ఇద్దరి మధ్య చర్చలు జరిగినట్లు ముఖ్యమంత్రి సచివాలయ వర్గాలు తెలిపాయి. అభివృద్ధి పథకాలపైనా వారు చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి డాక్టర్ సుధాకర్ తదితరులు చర్చల్లో పాల్గొన్నారు.

అమెరికా రాయబారిని సత్కరిస్తున్న ముఖ్యమంత్రి సిద్ధరామయ్య

హోటల్‌లో అల్పాహారం ఆరగిస్తూ మాట్లాడుకుంటున్న తేజస్వి సూర్య, సెర్జియో గోర్

ప్రేమించి.. పెళ్లాడి.. చివరికి ప్రాణం తీశాడు

చిక్కమగళూరు, న్యూస్‌టుడే : ప్రేమించి వివాహం చేసుకున్న మమత (32)ను ఆమె భర్త రంగనాథ్ (34) దారుణంగా హత్య చేసిన ఘటన బీరూరు పట్టణం చౌడేశ్వరి నగర్ ప్రాంతంలో దిగ్భ్రాంతి కలిగించింది. రంగనాథ్ భవన నిర్మాణ కార్మికుడు. భర్త ఆదాయానికి తోడుగా వక్క వలిచే పనులు, కల్యాణ మండపంలో ఆమె పనులు చేసేది. తాను పొరుగూరికి పనులకు వెళ్లినప్పుడు భార్య ఇతరులతో సన్నిహితంగా ఉంటోందని ఆయన అనుమానించేవాడు. ఎప్పుడూ ఆమె చరవాణిలో మాట్లాడుతూ ఉండటాన్ని గమనించి గొడవ పడేవాడు. ఇదే అనుమానంతో ఆమెపై సోమవారం రాత్రి దాడి చేసి గొంతు నులిమి హత్య చేశాడని బీరూరు ఠాణా పోలీసులు మంగళవారం వెల్లడించారు. నిందితుడ్ని అరెస్టు చేసి విచారణ చేపట్టారు.

సీజే రాయ్ కేసు.. తుది దశలో దర్యాప్తు

బెంగళూరు (సదాశివనగర), న్యూస్‌టుడే : గత జనవరి 30న తుపాకీతో కాల్చుకుని ఆత్మహత్యకు పాల్పడిన పారిశ్రామికవేత్త సీజే రాయ్ కేసు విచారణను ప్రత్యేక దర్యాప్తు దళం (సిట్) అధికారులు కొనసాగిస్తున్నారు. త్వరలో దర్యాప్తు వివరాల నివేదికను కొత్వాలుకు అందిస్తామని అధికారులు తెలిపారు. ఐటీ దాడులు, వ్యాపార లావాదేవీలు, పెట్టుబడులు, వ్యక్తిగత వివరాలు, కుటుంబ విషయాలపై సిట్ వేర్వేరుగా దర్యాప్తు చేస్తోంది. ఆత్మహత్యకు ముందస్తుగా ఆయన లేఖలోని వివరాలను క్షుణ్ణంగా పరిశీలించింది.

హైకోర్టులో రాహుల్‌కు ఊరట

బెంగళూరు (సదాశివనగర), న్యూస్‌టుడే : లోక్‌సభలో విపక్ష నాయకుడు రాహుల్‌గాంధీపై కర్ణాటక భాజపా శాఖ నమోదు చేసిన పరువు నష్టం కేసును జస్టిస్ సునీల్ దత్ యాదవ్ తోసిపుచ్చారు. గత అసెంబ్లీ ఎన్నికలకు ముందస్తుగా వివిధ దినపత్రికల్లో కర్ణాటక కాంగ్రెస్ ప్రకటనలు ఇచ్చింది. అప్పటి భాజపా ప్రభుత్వం గుత్తేదార్ల నుంచి 40 శాతం కమీషన్లు తీసుకుందని, కొవిడ్ సమయంలో అవినీతికి పాల్పడిందని ఆరోపిస్తూ ప్రకటనల్లో పేర్కొంది. ఆ ప్రకటనలను రాహుల్ తన సామాజిక మాధ్యమాల్లో పంచుకున్నారు. అలా చేయడం తప్పు కాదని అభిప్రాయపడిన ధర్మాసనం ఆయనపై నమోదైన కేసును రద్దు చేస్తూ ఆదేశాలు జారీ చేసింది.

వాహనాలకు జెండా ఊపి సాగనంపుతున్న మంత్రి, అధికారులు

నారీ జగతికి రక్షరేఖ

తాలూకా స్థాయిలోనూ 'అక్కపడె'

బెళగావి, న్యూస్‌టుడే : బాలికలు, యువతులు, మహిళలకు రక్షణగా అక్కపడె (అక్క దళం) నిలుస్తుందని మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి లక్ష్మీ హెబ్బాళ్కర్ ప్రకటించారు. బెళగావి కిత్తూరు చెన్నమ్మ కూడలి వద్ద అక్కపడె వాహనాలకు ఆమె మంగళవారం పచ్చజెండా ఊపారు. దళం సభ్యులు, అధికారులతో కలిసి నినాదాలు రాసిన అట్టముక్కలు ప్రదర్శించారు. వారితో స్వీయచిత్రాలు తీసుకుని మాట్లాడారు. బాల్య వివాహాలను పూర్తిగా అడ్డుకోవడం, బాలికలను గర్భిణులుగా చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవడం, లైంగిక దౌర్జన్యాలు, వేధింపులను అడ్డుకోవడం, ఈవ్ టీజింగ్‌లకు అడ్డుకట్ట వేసేందుకే అక్క పడెను అన్ని జిల్లా కేంద్రాల్లో దశలవారీగా అందుబాటులోకి తీసుకువస్తున్నామని వివరించారు. బాలల సహాయవాణి (1098), మహిళా సహాయవాణి (181), పోలీసు సహాయవాణి (112) సంఖ్యలకు ఫోన్ చేసినా, అక్క పడె అక్కడకు చేరుకుంటుందని చెప్పారు. ఫిర్యాదులు ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని భరోసా ఇచ్చారు. బీదర్ నుంచి వచ్చిన అక్కపడె సభ్యులు ఆత్మరక్షణ విధానాలను స్థానిక యువతులకు బోధించారు. అక్క పడె రాష్ట్ర సంయోజకురాలు సైని, కమిషనర్ భూషణ్ గులాబ్ రావు బోర్సే, ఎస్పీ కె.రామరాజన్, అధికారులు చేతన్ కుమార్ సుమిత్ర, అనిల్ కుమార్ హెగ్డే, ఎంకే హెగ్డే తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఓటర్ల జాబితాలో దిద్దుబాట్లే కీలకం

ఎన్నికల అధికారికి డీకే విన్నపం

రాష్ట్ర ఎన్నికల కమిషనర్ జి.ఎస్.సంగ్రేశికి వినతిపత్రం అందిస్తున్న ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్, మంత్రులు రామలింగారెడ్డి, దినేశ్ గుండూరావు తదితరులు

బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే : గ్రేటర్ బెంగళూరు ప్రాధికార (జీబీఏ) పరిధిలోని ఐదు నగర పాలికెలకు ఎన్నికలు నిర్వహించే అవకాశాలున్న క్రమంలో ఓటర్ల జాబితా సవరణ విధానంలో లోపాలను సవరించాలని ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్ ప్రతిపాదించారు. ఈమేరకు ఆయన మంగళవారం రాష్ట్ర ఎన్నికల కమిషనర్ జి.ఎస్.సంగ్రేశిని కలిసి ఓ వినతిపత్రం సమర్పించారు. కేంద్ర ఎన్నికల కమిషన్ రాష్ట్రంలో ఓటర్ల జాబితా ప్రత్యేక దిద్దుబాటు చర్యలు (ఎస్ఐఆర్) చేపట్టే ప్రయత్నాలు ప్రారంభించడంతో ఉపముఖ్యమంత్రి ఆ అధికారిని కలిసి అభ్యంతరాలు తెలిపారు. ఇప్పటికే రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో ఎస్ఐఆర్‌పై చర్చించామని, మంత్రులంతా ఆ విధానంపై ఆందోళన వ్యక్తం చేశారని వివరించారు. గతంలో కేంద్ర ఎన్నికల కమిషన్ సిద్ధం చేసిన ఓటరు జాబితాలో లోపాలు ఉన్నాయని, వాటిని మాత్రమే సవరించాలని విన్నవించారు. ఒకింట్లో ఉన్న ఓటర్లను వేర్వేరు పోలింగు కేంద్రాల్లో చేర్పించారని, సక్రమంగా మ్యాపింగ్ చేయలేదని, ఆ లోపాలే సవరించాలని కోరినట్లు డీకే గుర్తుచేశారు. ఫారం:7 ఇచ్చి ఓటరు జాబితా నుంచి పేర్లు తొలగించారని, ఇది మంచిది కాదన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ఓటరు జాబితా నవీకరించాలన్నారు. అందులోని లోపాలను ఎన్నికల కమిషన్ దృష్టికి తేవడంతో పాటు కొందరు బీఎల్ఓలు ఒకింట్లో ఉండే ఓటర్లను రెండు భాగాలు చేసి వేర్వేరు పోలింగు కేంద్రాల్లో చేర్పిస్తున్నారని అభ్యంతరం తెలిపారు. కొన్ని ప్రాంతాల్లో అల్పసంఖ్యాకులు, వెనుకబడిన వర్గాల ఓటర్ల పేర్లను తొలగించారని ఆందోళన వ్యక్తం చేశారు. డబుల్ ఓటింగ్, మూడు ప్రాంతాల్లో ఓటు తదితర తప్పులు ఉన్నాయన్నారు. ఈ తప్పులకు బాధ్యులను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. కమిషనర్‌ను కలిసిన వారిలో మంత్రులు రామలింగారెడ్డి, దినేశ్ గుండూరావు, బమూల్ అధ్యక్షుడు డీకే సురేశ్, శాసనసభ్యులు రిజ్వాన్ హర్షద్, ఏసీ శ్రీనివాస్, పుట్టణ్ణ, శ్రీనివాస్ తదితరులున్నారు.

మాధ్యమిక విద్య పరీక్షలకు సన్నాహాలు

రాష్ట్రవ్యాప్తంగా 28 నుంచి షురూ

బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే : రాష్ట్రంలో ఈనెల 28 నుంచి మార్చి 17 వరకు ద్వితీయ మాధ్యమిక విద్య (పీయూ) పరీక్షలు, మార్చి 18 నుంచి ఏప్రిల్ 2 వరకు పదో తరగతి పరీక్షలు నిర్వహిస్తామని ప్రాథమిక విద్యా శాఖ మంత్రి మధు బంగారప్ప ప్రకటించారు. ఆయన మంగళవారం ఇక్కడ విద్యా శాఖ ఉన్నతాధికారులతో సమావేశమయ్యాక విలేకర్లతో మాట్లాడారు. పరీక్ష కేంద్రాలను గుర్తించామని, అన్నింటా మౌలిక సౌకర్యాలు కల్పిస్తామన్నారు. దూర ప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థులు ఇబ్బందులు పడకుండా సహకరిస్తామని చెప్పారు. పరీక్ష కేంద్రాల్లో పారదర్శకత సాధనకు వెబ్‌కాస్టింగ్ విధానాన్ని ఈసారీ ఎంచుకుంటామన్నారు. సామాజిక మాధ్యమాల్లో పరీక్షలకు సంబంధించిన తప్పుడు సమాచారాన్ని ప్రచారాన్ని నమ్మవద్దని తల్లిదండ్రులను కోరారు.



ఈ దిశగా అధికారులు చైతన్య కార్యక్రమాలు చేపట్టాలన్నారు. పరీక్షలు శాంతియుతంగా నిర్వహించడానికి ప్రజలూ సహకరించాలని కోరారు. విద్యార్థులకు నమూనా పరీక్ష పత్రాలను అందించినట్లు తెలిపారు. గ్రామాల నుంచి పరీక్ష కేంద్రానికి చేరుకునే వారికి ఉచిత ప్రయాణ వసతి కల్పిస్తామని, హాల్‌టికెట్లను ఆర్టీసీ కండక్టర్లకు చూపించి బీఎంటీసీ, కె.ఎస్.ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించవచ్చన్నారు. వచ్చే ఏడాది నుంచి ముఖ ఆధారిత హాజరు (ఫేషియల్ అటెండెన్స్) విధానాన్ని ఎంచుకుంటామని ఓ ప్రశ్నకు బదులిచ్చారు.

కాలిపోయిన వాహనాలు

చెళ్లకెర (చిత్రదుర్గ), న్యూస్‌టుడే : గ్యారేజీలో మంటలు వ్యాపించి రూ.30 లక్షల విలువ చేసే నాలుగు కార్లు బుగ్గిగా మారిన సంఘటన మంగళవారం దావణగెరెలో చోటుచేసుకుంది. గాంధీనగర్ పోలీసు ఠాణా పరిధిలో అరుణ్ అనే వ్యక్తికి చెందిన గ్యారేజ్‌లో వ్యర్థాలకు మంటలు సోకి, క్రమంగా కార్లకు వ్యాపించడంతో కాలిపోయాయి.

ఆస్తి కోసం తండ్రిని కొట్టిచంపిన తనయుడు



మునికృష్ణప్ప

బెంగళూరు (హలసూరు), న్యూస్‌టుడే : ఆస్తి కోసం మోహన్ కుమార్ అనే వ్యక్తి తన తండ్రి మునికృష్ణప్ప (66)ను హత్య చేశాడు. ఇందిరానగర ఠాణా పోలీసుల కథనం ప్రకారం.. బీఎంటీసీ నుంచి పదవీ విరమణ అనంతరం మునికృష్ణప్ప ముత్యాలమ్మ దేవాలయం సమీపంలో ఉండేవారు. తన ఆస్తికి వీలునామా రాసి, అందులో ఎక్కువ మొత్తాన్ని మనవళ్ల పేరిటే మార్చారు. తన పేరిట ఆస్తి రాయాలని కొద్ది రోజులుగా మోహన్‌కుమార్ తండ్రితో గొడవ పడుతూ వస్తున్నాడు. ఇదే విషయమై గత శనివారం రాత్రి తండ్రితో గొడవ పడి, ఇనుప రాడ్‌తో తలపై కొట్టడంతో ఆయన గాయపడి, కోలుకోలేక మంగళవారం వేకువజామున కన్నుమూశారు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 9121167525
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 9945050116

(c) eenadu

పాటలతో ఉత్తేజం పరుస్తున్న గాయకురాలు

జానపద పాటలతో ఉత్సాహం

ముగిసిన కురుగోడు ఉత్సవం

కురుగోడు(బళ్లారి), న్యూస్‌టుడే: కురుగోడు ఉత్సవం ముగింపు సందర్భంగా సోమవారం రాత్రి దొడ్డ బసవేశ్వర ప్రధాన వేదికపై నిర్వహించిన రసమంజరిలో ఉత్తర కర్ణాటకకు చెందిన ప్రసిద్ధ జానపద గాయకులు మాలు నిప్పనాళ్, బాలు బెలగుండి పాడిన పాటలకు స్థానికులు తన్మయత్వం చెందారు. రసమంజరి సంగీత కచేరీతో పట్టణానికి కొత్త శోభ వచ్చింది. మొదట మాలు నిప్పనాళ్ 'నా డ్రైవర్ నన్ను లవ్వర' అనే పాటకు యువత ఒక్కసారి కేకలు, కేరింతలతో హోరెత్తించారు. వేదిక ముందు యువతీ, యువకులు నృత్యం చేస్తూ కళాకారులను ప్రోత్సహించారు. అనంతరం బాలు బెలగుండి కుణితలో కుణితలో పాటకు ప్రేక్షకులను మంత్ర ముగ్ధులను చేసింది. ఎమ్మెల్యే జె.ఎన్.గణేశ్‌తో పాటు, అధికారులు, ప్రజాప్రతినిధులు రసమంజరి కార్యక్రమం ముగిసే వరకు ఉండిపోయారు.

ఆకట్టుకున్న చిన్నారుల నృత్య ప్రదర్శన

సాంస్కృతిక సంబరాల్లో సందడి చేస్తున్న కురుగోడు యువకులు

రాయల కీర్తి కిరీటం.. ధ్వని, వెలుగు

19 వరకూ ప్రదర్శనలు

విజయనగర సామ్రాజ్యాన్ని స్థాపించిన బుక్కరాయను ఆశీర్వదిస్తున్న విద్యారణ్య స్వామీజీ

హొసపేటె, న్యూస్‌టుడే: విజయనగర సామ్రాజ్యం, రాయల కీర్తిని వర్ణించే, హంపీ ఉత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన ధ్వని, వెలుగు కార్యక్రమం విజయవంతంగా సాగుతోంది. ఈ నెల 13న ధ్వని,వెలుగు కార్యక్రమం ప్రారంభమైంది. 19 వరకూ సాగుతుంది. ఈ కార్యక్రమం కోసం గజశాల వద్ద ప్రత్యేక వేదికలను ఏర్పాటు చేశారు. సుమారు 150 మంది కళాకారులు ఈ ప్రదర్శనలో పాల్గొంటున్నారు. సాయంత్రం 7 నుంచి 9 వరకూ కార్యక్రమం జరుగుతోంది. 1986లో హంపీ ఉత్సవాల ప్రారంభం సమయం లోనే ధ్వని, వెలుగు కార్యక్రమం కూడా ప్రారంభమైంది. క్రీ.శ.13వ శతాబ్దంలో హిందూ ధర్మం ఆపదలో ఉన్న సమయంలో విజయనగర సామ్రాజ్యం ఆవిర్భవిస్తుంది. దానికి దారితీసిన కారణాలను విశ్లేషిస్తూ సామ్రాజ్యం పతనం వరకూ సాగిన ప్రముఖ ఘట్టాలను ఈ ధ్వని,వెలుగు కార్యక్రమంలో ప్రదర్శిస్తారు. దీని కోసం ప్రత్యేకంగా ఐదు వేదికలు ఏర్పాటు చేశారు. ఇందులో కళాకారుల సంభాషణలు ఉండవు. నేపథ్య గొంతు మాత్రమే ఉంటుంది. సన్నివేశాలకు తగ్గట్టు ఆ వేదికపైన వెలుగు పడుతుంది. మిగిలిన వేదికలపై చీకటి ఉంటుంది. ఈ నేపథ్యంలో ఈ కార్యక్రమానికి ఎనలేని ఆదరణ దక్కుతోంది. ఏటా హంపీ ఉత్సవాల్లో ధ్వని,వెలుగు కార్యక్రమం కోసం కళాకారులు, కళాభిమానులు వేయికళ్లతో ఎదురు చూస్తుంటారు. విజయనగర సామ్రాజ్యం ఆవిర్భావం, ప్రౌఢదేవరాయ పాలన, తరువాత శ్రీకృష్ణదేవరాయ పాలన, బహమని సుల్తానుల దాడులు ఇలా ప్రతీ ఘటాన్ని కళాకారులు అద్భుతంగా అభినయిస్తున్నారు.

విజయనగర రాజుల కాలంలో మహిళలూ కుస్తీ పోటీల్లో బలంగా ఉండేవారని తెలిపే సన్నివేశం

కుటుంబ సమేతంగా ఏడుకొండలవాడిని దర్శించుకుంటున్న శ్రీకృష్ణదేవరాయలు

విజయనగర కాలంలో పురందర దాసు వైభవం

అజిత్ చిచ్చుతోనే శివ హత్య

దర్యాప్తులో గుర్తించిన పోలీసులు

బెంగళూరు (కృష్ణరాజపురం), న్యూస్‌టుడే : రాజధాని నగరంలో రౌడీషీటర్ శివకుమార్ అలియాస్ బిక్లు శివ హత్య కేసు కీలక మలుపులు తిరుగుతోంది. ఈ కేసులో ఇప్పటికే భాజపా సీనియర్ నాయకుడు, శాసనసభ్యుడు భైరతి బసవరాజ్ అరెస్టైన నేపథ్యంలో దర్యాప్తు వేగం పుంజుకుంది. ఈ హత్యకు మలయాళీ అజిత్ అనే వ్యక్తి కారణమని ప్రాథమిక దర్యాప్తులో భారతీనగర ఠాణా పోలీసులు గురించారు. శివ హత్య కేసులో ఏ1 జగ్గ అలియాస్ జగదీశ్. మొదట వీరిద్దరూ ప్రాణస్నేహితులు. కిత్తనూరు ప్రాంతంలో ఒక భూవివాదాన్ని సెటిల్ చేసేందుకు జగదీశ్, శివ ఇద్దరూ వెళ్లారు. ఆ సమయంలో జగదీశ్‌ను స్థానిక యువకులకు 'డాన్' అని శివపరిచయం చేశాడు. ఇదే విషయాన్ని జగదీశ్ స్నేహితులకు అజిత్ ఫోన్ చేసి 'జగదీశ్‌ను బిక్లు శివ రౌడీ అని చెప్పుకొంటున్నాడు' అని చెప్పాడు. అప్పటి నుంచి జగ్గ- శివ ఇద్దరి మధ్య పొరపొచ్చాలు వచ్చాయని పోలీసులు గుర్తించారు. ఆ క్రమంలోనే వివాదాలు పతాక స్థాయికి చేరి హత్య వరకు వెళ్లినట్లు ప్రాథమిక నిర్ధారణకు వచ్చారు.

గేటును అమర్చుతున్న యంత్రం



అమరిక పూర్తయిన మరో గేటు

చురుగ్గా క్రస్ట్‌గేట్ల బిగింపు పనులు

హొసపేటె, న్యూస్‌టుడే: తుంగభద్ర క్రస్ట్ గేట్ల బిగింపు పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఇప్పటివరకూ మొత్తం 25 గేట్ల తయారీ పూర్తయింది. అందులో ఐదు గేట్ల బిగింపు పూర్తికాగా, మరో 8 గేట్ల పనులు తుది దశకు చేరుకున్నాయి. మిగిలిన వాటి పనులు మరో మూడు రోజుల్లో చేపడుతున్నారు. డిసెంబరు 24 నుంచి గేట్ల అమరిక పనులు ప్రారంభమయ్యాయి. నిపుణ కార్మికుల మూడు బృందాలు రేయింబవళ్లు పనిచేస్తున్నారని డ్యాం బాధ్య ఇంజినీరు కిరణ్‌కుమార్ తెలిపారు. మే నెలాఖరులోగా అన్ని గేట్ల బిగింపు పనులు పూర్తి చేస్తామని ఆయన స్పష్టం చేశారు. గదగ, స్థానికంగా గేట్ల తయారీ పనులు వేగంగా జరుగుతున్నాయి. తుంగభద్ర మండలి కార్యదర్శి రామకృష్ణారెడ్డి, పర్యవేక్షక ఇంజినీరు నారాయణ్ నాయక్ ఎప్పటికప్పుడు పనుల ప్రగతి పరిశీలన చేసి తగిన సూచనలు చేస్తున్నారు.

జె.తనుష్ | శగున్ వి.జంబుర | బి.ఆర్.శోభిత్ | హెచ్.జయంత్ | బి.ఆర్.సుదర్శన్ | ఎస్.అమూల్య | పి.కె.కిశన్ | ఎస్.చిరంతన్ | జె.కార్తీక్ | ఎం.ఎస్.ప్రతీక్

జేఈఈలో మెరిసిన ఎం.వి. కళాశాల విద్యార్థులు

దావణగెరె(బళ్లారి), న్యూస్‌టుడే: జేఈఈ మెయిన్స్ పరీక్షల్లో దావణగెరె సర్ ఎం.వి కళాశాల విద్యార్థులు మంచి పర్సంటైల్ సాధించి సత్తాచాటారు. అత్యధికంగా 99.83 పర్సంటైల్ సాధించిన దావణగెరెకు చెందిన విద్యార్థిని ప్రథమ స్థానంలో నిలిచారు. జె.తనుష్ 99.83 పర్సంటైల్ సాధించి టాపర్‌గా నిలిచింది. శగున్ వి.జంబుర 99.56, బి.ఆర్.శోభిత్ 99.42,హెచ్.జయంత్ 99.37, బి.ఆర్.సుదర్శన్ 99.37, ఎస్.అమూల్య 99.35, పి.కె.కిశన్ 99.27, ఎస్.చిరంతన్ 99.08, జె.కార్తీక్ 99.08, ఎం.ఎస్.ప్రతీక్ 99.03 పర్సంటైల్ సాధించారు. అత్యధిక పర్సంటైల్ సాధించిన వారిని కళాశాల కార్యదర్శి శ్రీధర్, కళాశాల డైరెక్టర్, ప్రధాన ఆచార్యులు, అధ్యాపకులు, సిబ్బంది అభినందించారు.

డి.రోహిత్‌కుమార్ | ఇషాంత్ రాజ్ | హెచ్.లిఖిత్ | ఎస్.వివేక్ | ఎస్.జి.అరుణ్ | త్రిషా | కె.ప్రజ్వల్ | విజయకుమార్ మైనల్లి | కె.ఎస్.సాయి హర్షిక | బి.మధుసాయి చరణ్

బళ్లారి న్యూ శ్రీ చైతన్య విద్యార్థుల ప్రతిభ

శరణబసవ అమరప్ప ధర్మంతి

బళ్లారి, న్యూస్‌టుడే: వృత్తి శిక్షణ కోర్సుల ప్రవేశాలకు నిర్వహించిన జేఈఈలో మెయిన్ పరీక్షల్లో బళ్లారి న్యూ శ్రీ చైతన్య పదవీ పూర్వ కళాశాల విద్యార్థులు సత్తా చాటారు. డి.రోహిత్‌కుమార్ 99.71 పర్సంటైల్ సోర్స్ సాధించి సత్తాచాటారు. ఇషాంత్ రాజ్ 98.04, హెచ్.లిఖిత్ 96.92, ఎస్.వివేక్ 95.14, ఎస్.జి.అరుణ్ 92.86 త్రిషా 92.75, కె.ప్రజ్వల్ 92.46, విజయకుమార్ మైనల్లి 92.00, కె.ఎస్.సాయి హర్షిక 91.90, బి.మధుసాయి చరణ్ 91.27, శరణబసవ అమరప్ప ధర్మంతి 90.37, శ్రీహిత 90.06 పర్సంటైల్ సాధించినట్లు కళాశాల ప్రధాన ఆచార్యులు రఘు సింధిల్ తెలిపారు. అత్యధిక పర్సంటైల్ సాధించిన విద్యార్థులను కళాశాల ఛైర్మన్ పయ్యావుల విష్ణు, డీన్ ప్రసన్న అంజినేయులు తదితరులు అభినందించారు.

శ్రీహిత



శివప్రసాద్ | ధీరజ్ | రామలోహిత
దినేశ్‌రెడ్డి | పి.వెంకటసాయి | హెచ్.నందసాయి

జేఈఈలో సత్తా చాటిన బెస్ట్ విద్యార్థులు

బళ్లారి : జేఈఈ మెయిన్-2026 తొలి విడత ఫలితాల్లో బెస్ట్ పదవీ పూర్వ కళాశాల విద్యార్థులు సత్తాచాటారు. వారిలో కె.ఎం.శివప్రసాద్ 96.13 పర్సంటైల్ సాధించి కళాశాల టాపర్‌గా నిలిచాడు. ధీరజ్ 96. రామ లోహిత 93.21, ఎం.దినేశ్‌రెడ్డి 85.95, పి.వెంకటసాయి 84.18, హెచ్.నందసాయి 81.03 పర్సంటైల్ సాధించినట్లు కళాశాల ప్రధాన ఆచార్యులు వెంకటేశ్వరరావు తెలిపారు. మంచి పర్సంటైల్ సాధించిన విద్యార్థులను కళాశాల అధ్యక్షుడు కోనంకి రామప్ప, ఉపాధ్యక్షుడు తిలకకుమార్, కార్యదర్శి మన్నెం శ్రీనివాసులు, ఉప ఆచార్యులు శ్రీనివాసరెడ్డి తదితరులు అభినందించారు.

స్నేహితుల గొడవ.. పదో తరగతి విద్యార్థి ఆత్మహత్య

ఆత్మహత్య చేసుకొన్న విద్యార్థి కొట్రేశ్

చెళ్లకెర (చిత్రదుర్గ), న్యూస్‌టుడే: భరమసాగర ప్రైవేటు ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న కొట్రేశ్ (16) అనే విద్యార్థి పాఠశాల భవనం 3వ అంతస్తు నుంచి దూకి ఆత్మహత్య చేసుకొన్న సంఘటన సోమవారం జరిగిందని పోలీసులు తెలిపారు. మంగళవారం వారు తెలిపిన వివరాల మేరకు.. కరియణ్ణనహళ్లి గ్రామానికి చెందిన గురులింగయ్య తన కొడుకు కొట్రేశ్‌ను భరమసాగరలోని ఒక ప్రైవేటు గురుకుల ఉన్నత పాఠశాలలో చేర్పించారు. ఆదివారం శివరాత్రి సందర్భంగా గురులింగయ్య పాఠశాల విద్యార్థుల వసతి గృహానికి వెళ్లి కొట్రేశ్‌ను కలిసి పలకరించి పండ్లు, తినుబండారాలను ఇచ్చి వచ్చారు. ఆరోజు రాత్రి పండ్లను స్నేహితులతో తినే సమయంలో వారి మధ్య ఘర్షణ జరిగింది. హాస్టల్ వార్డెన్ వచ్చి వారికి సర్దిచెప్పి వెళ్లారు. ఆవేదనకు గురైన కొట్రేశ్ సోమవారం పాఠశాల భవనంపై నుంచి దూకి ఆత్మహత్య చేసుకొన్నాడని గురులింగయ్య భరమసాగర పోలీసు ఠాణాలో ఫిర్యాదు చేశారు. కొట్రేశ్ పాఠశాల భవనంపై నుంచి దూకే దృశ్యం సీసీ కెమెరాల్లో రికార్డు అయింది. తీవ్రంగా గాయపడిన కొట్రేశ్‌ను స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అక్కడ మృతి చెందాడని పోలీసులు తెలిపారు. భరమసాగర పోలీసు ఠాణాలో కేసును నమోదు చేసుకొన్నారు. కుమారుడి మృతదేహాన్ని చూసి ఆసుపత్రి వద్ద కుటుంబ సభ్యులు గుండెలవిసేలా రోదించారు.

రోడ్డుప్రమాదంలో ఇద్దరి దుర్మరణం

హాసన, న్యూస్‌టుడే : చెన్నరాయపట్టణ తాలూకా దొడ్డేరి కావలు గేట్ వద్ద సోమవారం రాత్రి సంభవించిన రోడ్డు ప్రమాదంలో మత్తిఘట్ట నివాసి రమేశ్ (23), ఎం.హొన్నేనహళ్లి నివాసి పురుషోత్తమ్ (26) మరణించారు. కిరణ్ అనే యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. కిరణ్, రమేశ్ ఇద్దరూ వస్తున్న బైకును ఎదురుగా మరో బైకులో వచ్చిన పురుషోత్తమ్ ఢీకొట్టడంతో ప్రమాదం సంభవించింది. హిరిసావె ఠాణా పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

ఆమె ప్రేమ.. బూటకం

ధార్వాడ, న్యూస్‌టుడే : శ్రీమంతులైన యువకులను లక్ష్యంగా చేసుకుని సామాజిక మాధ్యమాల్లో పరిచయం చేసుకోవడం, వివాహం చేసుకుంటానని నమ్మించి, నగదు తీసుకుని వంచనకు పాల్పడుతున్న యువతికి స్థానికులు దేహశుద్ధి చేసిన ఘటన ధార్వాడలో చోటు చేసుకుంది. మాళమడ్డి లేఅవుట్‌లోని ఒక పెట్రోలు బంకులో పని చేస్తున్న యువతి తన పేరు ఐశ్వర్య, రేణుక, ఆరోహిగా పేర్కొంటూ యువకులను పరిచయం చేసుకునేది. సంజు దొడ్డమని, గురు వక్కుంద తదితర యువకులను వివాహం చేసుకుంటానని నమ్మించింది. గురు వద్ద రూ.7 లక్షల నగదు తీసుకుంది. అతనితో ప్రేమ అంటూ తిరుగుతూనే సంజు దొడ్డమనితో పరిచయం పెట్టుకుంది. ఈ విషయం తెలుసుకున్న గురు ఆవేదనతో విషం తాగి బలవన్మరణానికి ప్రయత్నించాడు. బాధితుడిని చికిత్స కోసం ఆసుపత్రిలో చేర్పించారు. బాధిత యువకుల తరపు కుటుంబ సభ్యులు ఆ యువతిపై దాడి చేసి గాయపరిచారు. ఆమెను కూడా చికిత్స కోసం ఒక ఆసుపత్రిలో చేర్పించారు. ధార్వాడ నగర ఠాణా పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

సదృఢ జాతి నిర్మాణం సమష్టి బాధ్యత

హొసపేటె, న్యూస్‌టుడే: సదృఢ జాతి నిర్మాణం సమష్టి బాధ్యత అని నాడోజ, ప్రముఖ విద్వాంసుడు బరగూరు రామచంద్రప్ప పేర్కొన్నారు. హంపీ కన్నడ విశ్వ విద్యాలయంలో 24న జరిగే స్నాతకోత్సవం సందర్భంగా మంగళవారం వర్సిటీలో ఏర్పాటు చేసిన పుస్తక విడుదల కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఆరోగ్యవంతమైన జాతి నిర్మాణం కావాలంటే అక్కడ కుల,మత భేదాలు ఉండకూడదని నొక్కిపలికారు. మన జాతి, సంస్కృతి, సంప్రదాయాలకు ప్రపంచ వ్యాప్తంగా మంచి గుర్తింపు ఉంది, దానిని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపైన ఉందని గుర్తుచేశారు. కన్నడ సాహిత్యక్షేత్రం నిర్మాణానికి చాలా మంది తమదైన కానుక సమర్పించారు. వారిలో భానుముష్తాక్, నిసార్ అహ్మద్, సారా అబూబక్కర్, డాక్టర్ రాజ్‌కుమార్ ప్రముఖులని తెలిపారు. కేవలం నవంబరు నెలలో మాత్రమే కన్నడ భాష గురించి మాట్లాడి.. పెద్దగా ప్రసంగాలు చేస్తే సరిపోదు, భాషాభివృద్ధికి ప్రజలు, ప్రభుత్వాలు కృషి చేయాలని సూచించారు. మాతృభాషపై అధ్యయనం చేసే విద్యార్థుల సంఖ్య నానాటికీ తగ్గుతోందని విచారం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వర్సిటీ సంస్థాపక ఉపకులపతి డాక్టర్ చంద్రశేఖర కంబారను సన్మానించారు. ఉపకులపతి డాక్టర్ డి.వి.పరమశివమూర్తి, కులసచివుడు డాక్టర్ విరూపాక్షి పూజారహళ్లి, అధ్యయన విభాగం ముఖ్యుడు డాక్టర్ మహదేవయ్య పాల్గొన్నారు.

పుస్తకాలను విడుదల చేస్తున్న విద్వాంసులు డాక్టర్ చంద్రశేఖర కంబార, నాడోజ బరగూరు రామచంద్రప్ప

EENADU Classifieds

JOBS

Wanted DRA Tele Callers, Field Executives & Team Leaders Banking Sector Attractive Salaries and Incentives, ✆ 9849394835, 7075345527.

Wanted Teachers for Reputed Schools in A.P & Telangana, Contact: Sneha Placements Service. Ph: 94402 46409.

త్రినేత్ర హోంకేర్‌లో వృద్ధులను/ పేషెంట్స్‌ను/ పిల్లలను చూసుకొనుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఫ్రీ వసతి, భోజనం. జీ: 18K. ✆ 8520980099, 8520874499

హరేకృష్ణ హోంకేర్‌లో వృద్ధులను/ పేషంట్స్‌ను/ పిల్లలను చూసుకొనుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఫ్రీవసతి, భోజనం జీ: 18-20K ✆ 96404 68899, 96402 58899

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలను ఇచ్చుటకు ఈ క్రింది నెంబర్లను సంప్రదించగలరు.

బళ్లారి : 9121167525

బెంగుళూరు : 9121167527

ప్రకటనలపై జి.ఎస్.టి. 5% వర్తించబడును

కొప్పళ గ్యారంటీ పథకాల ఉత్సవంలో మాట్లాడుతున్న మంత్రి శివరాజ్ తంగడిగి

మహిళల ఆత్మగౌరవ ప్రతీకలు.. పంచ గ్యారంటీలు

గంగావతి,న్యూస్‌టుడే: పంచ గ్యారంటీ పథకాలతో రాష్ట్రంలో మహిళలు ఆత్మాభిమానంతో జీవిస్తున్నారని రాష్ట్ర బీసీ సంక్షేమ, కన్నడ, సాంస్కృతిక శాఖ మంత్రి శివరాజ తంగడిగి పేర్కొన్నారు. కొప్పళలో మంగళవారం జరిగిన గ్యారంటీ పథకాల ఉత్సవాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఈ పథకాల నుంచి వచ్చే డబ్బులను మహిళలు పొదుపు చేసి చిరు వ్యాపారాలు, పాడిపరిశ్రమలతో స్వయం ఉపాధి పొందుతున్నారన్నారు. తమ పిల్లల కళాశాలల ఫీజులను సైతం కడుతున్నారన్నారు. రాష్ట్రంలో తప్ప దేశంలో ఎక్కడా ఇలాంటి సంక్షేమ పథకాలు లేవన్నారు. రహదారులు, చెరువులు నిర్మించడం మాత్రమే అభివృద్ధి కాదన్నారు. అందరూ వ్యక్తిగతంగా అభివృద్ధి చెందాలన్నదే గ్యారంటీ పథకాల ధ్యేయం అన్నారు. అవి ప్రజలకు అందుతున్నాయా లేదా అన్నది సమీక్షించేందుకే ఈ కార్యక్రమాలు చేస్తున్నట్లు చెప్పారు. ఈపథకాల సమితి రాష్ట్ర అధ్యక్షుడు హెచ్ఎం రేవణ్ణ మాట్లాడుతూ గ్యారంటీ పథకాల కింద ఇప్పటి దాకా రూ.1.12 లక్షల కోట్లు లబ్ధిదారుల ఖాతాలకు నగదు బదిలీ చేసినట్లు చెప్పారు. సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్ఆర్ మెహరూజ్‌ఖాన్, లోక్‌సభ సభ్యుడు రాజశేఖర్ హిట్నాళ, గ్యారంటీ పథకాల జిల్లాధ్యక్షుడు రెడ్డి శ్రీనివాస్ పాల్గొన్నారు.

బాధితుల వివరాల గోప్యతకు రక్ష

బెంగళూరు (రాజాజీనగర) : అత్యాచారం, లైంగిక దౌర్జన్యానికి గురైన యువతులు, బాలికలు, మహిళల వివరాలు ఎవరూ గుర్తించకుండా గోప్యతను కాపాడాలని పోలీసు డైరెక్టర్ జనరల్ డాక్టర్ ఎంఏ సలీం పాత్రికేయులకు విన్నవించారు. ఫిర్యాదులు వచ్చిన అనంతరం బాధితుల వివరాలు, ఫొటోలు బయటకు రాకుండా ఠాణా అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. దర్యాప్తు పూర్తయ్యేంత వరకు అన్ని చోట్లా గోప్యతను కాపాడాలని సర్వోన్నత న్యాయస్థానం ఇటీవల ఆదేశించిన విషయాన్ని గుర్తు చేశారు. దర్యాప్తు పూర్తయిన అనంతరం సీల్డ్ కవర్‌లోనే న్యాయస్థానానికి ఆ వివరాలు అందించాలని సర్క్యులర్లు జారీ చేశామని సలీం తెలిపారు.

ఉత్సాహంగా ఉద్యోగుల క్రీడా పోటీలు

క్యారమ్స్ ఆడుతున్న మహిళా ఉద్యోగులు

బళ్లారి, న్యూస్‌టుడే: ప్రభుత్వ పథకాలను అర్హులైన ప్రజలకు చేర్చడానికి శ్రమిస్తున్న ప్రభుత్వ ఉద్యోగులు ఒత్తిడితో విధులు నిర్వహిస్తున్నారు. మీ సమస్యలను పరిష్కరించడానికి నాతోపాటు ఇతర ఎమ్మెల్యేలు సిద్ధంగా ఉన్నారని ఎమ్మెల్యే నారా భరత్‌రెడ్డి భరోసా ఇచ్చారు. జిల్లా యంత్రాంగం, పంచాయతీ, యువ సబలీకరణ క్రీడాశాఖ, కర్ణాటక ప్రభుత్వ ఉద్యోగుల సంఘం సంయుక్తంగా స్థానిక జిల్లా క్రీడామైదానంలో మంగళవారం ప్రారంభమైన జిల్లాస్థాయి ఉద్యోగుల క్రీడాపోటీలను ఎమ్మెల్యే ప్రారంభించారు. ప్రభుత్వ ఉద్యోగుల భవనం నిర్మాణానికి స్థలం కేటాయించి, భవనం నిర్మించాలని కోరారు. ప్రభుత్వ స్థలం గుర్తించి నా దృష్టికి తీసుకొస్తే ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రితో చర్చించి స్థలం కేటాయిస్తామన్నారు. ఎన్జీవో సంఘం జిల్లా బాధ్య అధ్యక్షుడు డా.సదానంద నెల్కుద్రి మాట్లాడుతూ 2006 తర్వాత ఎన్.పి.ఎస్. పింఛను పథకం తెచ్చారు. ఈ పథకంలో 2.93లక్షల మంది ప్రభుత్వ ఉద్యోగులు ఉన్నారు. విశ్రాంతి తర్వాత తమ జీవనం సాగించడం కష్టమవుతోంది. ఎల్.పి.ఎస్. ప్రవేశపెట్టాలని గత కొన్నేళ్లుగా డిమాండ్ చేస్తున్నాం. ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ప్రత్యేక శ్రద్ధ తీసుకుని కమిటీని ఏర్పాటు చేసి వేర్వేరు రాష్ట్రాల్లో అమలు చేసిన ఎల్.పి.ఎస్.ను పరిశీలించి నివేదిక తెప్పించారు. ప్రభుత్వం నివేదికను పరిశీలించి ఎల్.పి.ఎస్.ను ప్రవేశపెట్టాలని కోరారు. ఎన్జీవో మాజీ అధ్యక్షుడు డా.మల్లేశప్ప మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో ఎన్జీవోలకు ప్రభుత్వ కేటాయించిన స్థలంలో భవనం కూడా నిర్మించారు. బళ్లారిలో భవనం ఉన్న నేటికీ పాత డీసీ కార్యాలయం ప్రభుత్వ ఆధీనంలో ఉంది. తమ సంఘానికి ఎలాంటి హక్కు లేదు. ఉన్న స్థలాన్ని ఎన్జీవోకు కేటాయించడం, లేకుంటే నగరంలో ఎకరా స్థలం కేటాయించి భవనం నిర్మించాలని ఎమ్మెల్యేను కోరారు. క్రీడాశాఖాధికారి కె.గ్రేసి, అదనపు జిల్లా పోలీస్ అధికారి రవికుమార్, రాష్ట్ర పరిషత్ సభ్యుడు సురేశ్‌కుమార్ జిల్లా కార్యదర్శి తిప్పారెడ్డి, గౌరవ అధ్యక్షుడు డా.రాజశేఖర్ ఎన్.గాణిగేర, కోశాధికారి హనుమంతరాయ. సభ్యులు రామకృష్ణ, శరణబసవ, రాజశేఖర్, జె.ఎస్.ఆంజనేయులు, భాస్కర్‌రెడ్డి, హరికృష్ణ, అనిల్, కార్పొరేటర్లు మించి శ్రీనివాస్, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

చదరంగంలో పోటీ పడుతూ..

మూడు గంటల ఆలస్యంగా ప్రారంభం

ఉదయం 10 గంటలకు జిల్లా క్రీడామైదానంలో క్రీడాపోటీలు ప్రారంభం కావాల్సి ఉండగా, మూడు గంటల ఆలస్యంగా ప్రారంభమయ్యాయి. జిల్లాలో కురుగోడు, సిరుగుప్ప, కంప్లి, సండూరు, బళ్లారి తాలూకాల నుంచి ఉద్యోగులు ఉదయం 10గంటలకు మైదానానికి చేరుకున్నారు. సమవస్త్రాలు తీసుకుని పేర్లు నమోదు చేసుకున్నారు. ఎమ్మెల్యే రాక కోసం మూడు గంటలు పాటు వేచి చూశారు. చివరికి మధ్యాహ్నం 1.01 నిమిషాలకు ఆయన చేరుకున్నారు. అప్పటికే భానుడు ప్రతాపం చూపడంతో ఉద్యోగులు ఇబ్బందులు పడ్డారు.

కబడ్డీ జట్ల మధ్య పోటీ

క్రీడాకారుల గౌరవ వందనాన్ని స్వీకరిస్తున్న ఎమ్మెల్యే నారా భరత్‌రెడ్డి, ఎన్జీవో సంఘం అధ్యక్షుడు తదితరులు

లాంగ్ జంప్ చేస్తున్న క్రీడాకారుడు

(c) eenadu

పైపులైన్ సరిచేస్తున్న పంచాయతీ సిబ్బంది

ఎట్టకేలకు పైపులైన్ పనులు షురూ!

మాన్వి,న్యూస్‌టుడే: తాలూకాలోని చిక్కకొట్నేకల్ పంచాయతీ గ్రామానికి సరిగ్గా తాగునీరు సరఫరా చేయటంలేదని ఆరోపిస్తూ స్థానికులు పంచాయతీకి తాళాలు బిగించి ముట్టడించిన విషయం విదితమే. 'ఈనాడు'లో ఈ వార్త ప్రచురితం కాగా తాలూకా పంచాయతీ కార్యనిర్వహణాధికారి మంగళవారం చిక్కకొట్నేకల్ గ్రామానికి వచ్చి నీటి సమస్యపై ఆరా తీశారు. స్థానిక గ్రామ పంచాయతీ అధికారుల పర్యవేక్షణలో సిబ్బంది పైపులైన్ సరిచేసి మోటారు మరమ్మతులను ప్రారంభించారు. దీంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

బళ్ళారి

● బళ్ళారి ● రాయచూరు ● కొప్పళ ● విజయనగర ● చిత్రదుర్గ

కంప్లిలో ఇంజినీరింగ్ కళాశాల ఏర్పాటు చేయరూ..

రాఘవేంద్ర తళవార్

కంప్లి, న్యూస్‌టుడే: కంప్లిలో ఇంజినీరింగ్ కళాశాల ఏర్పాటు చేయడంతో పాటు వివిధ సదుపాయాల కల్పనకు 2026 బడ్జెట్‌లో నిధులు కేటాయించాలని ముఖ్యమంత్రి సిద్ధరామయ్యకు వినతిపత్రం సమర్పించినట్లు భాజపా మత్స్యకారుల విభాగ రాష్ట్ర సమితి సభ్యుడు రాఘవేంద్ర తళవార్ తెలిపారు. కంప్లిలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఆర్థికంగా వెనుకబడిన వర్గాల జనాభాకు అనుగుణంగా వారి అభ్యున్నతికి నిధులు కేటాయించాలి. దళిత, గిరిజన, వెనుకబడిన వర్గాల సంక్షేమానికి బడ్జెట్‌లో రూ. 50 వేల కోట్లు కేటాయించాలి. వెనుకబడిన వర్గాల ప్రజలు అధికంగా ఉన్న వంద విధానసభ క్షేత్రాల్లో విద్య, పరిశ్రమల అభివృద్ధికి ప్రాధాన్యమివ్వాలని వినతిపత్రంలో కోరినట్లు తెలిపారు.

రైతులకు సాగుపట్టాలు ఇవ్వాలని డిమాండ్

హాళేకోటలో సాగు భూములను పరిశీలిస్తున్న రైతు సంఘం నేతలు

సిరుగుప్ప, న్యూస్‌టుడే: హాళేకోట గ్రామ పరిధిలో రైతులు సాగు చేస్తున్న భూమికి ప్రభుత్వం పట్టాలు పంపిణీ చేయాలని కర్ణాటక ప్రాంత రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు శివశంకర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైతు సంఘం ప్రతినిధులు, రైతులతో కలిసి ఆయన మంగళవారం రైతులు సాగు చేస్తున్న భూములను పరిశీలించారు. చాలా ఏళ్లుగా ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందిన రైతులు భూములు సాగు చేసుకుని జీవనం సాగిస్తున్నారు. సబ్‌రిజిస్ట్రార్ యల్లాలింగారెడ్డి, రెవెన్యూ శాఖ అధికారుల సహకారంతో దొడ్డిదారిన ఈ భూములను ఇతరుల పేర్ల మీద రిజిస్టర్డ్ చేస్తున్నట్లు ఆరోపించారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ఇక్కడ పరిశీలన జరిపి, అక్రమాలకు పాల్పడుతున్న రెవెన్యూ, సంబంధిత శాఖల అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సాగు చేసుకుంటున్న పేద రైతులకు న్యాయం చేయాలని కోరారు. రైతులు గంగప్ప, బసప్ప, గాళెప్ప, విరేశ్ పాల్గొన్నారు.

పనులు సగం .. అలసత్వం సంపూర్ణం

● పూర్తికాని 400 మీటర్ల రహదారి నిర్మాణం

రహదారి కంటే ఎత్తుగా భూగర్భ మురుగుకాలువ ఛాంబర్

బళ్లారి, న్యూస్‌టుడే: బళ్లారి నగర నడిబొడ్డున గడిగి చెన్నప్ప కూడలి, నగర పాలికె కార్యాలయానికి కూతవేటు దూరంలో ఉన్న కోలాచలం కాంపౌండ్‌లో 400 మీటర్ల రహదారి ఏర్పాటు చేయడానికి ఐదు నెలలు గడిచాయి. అయినా పనులు పూర్తి కాక పోవడంతో స్థానికులు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రజాపనుల శాఖ రూ. 85.79 లక్షలతో ఆగస్టులో పనులకు ఎమ్మెల్యే నారా భరత్‌రెడ్డి భూమిపూజ చేశారు. మొత్తం 400 మీటర్ల పొడవు రహదారి, 15 అడుగుల వెడల్పు ఉంటుంది. రహదారి ఇరువైపులా మురుగు కాలువ, దానిపై పాదచారులు వెళ్లడానికి ఫుట్‌పాత్, తాగునీటి పైపులు, 631 మీటర్ల భూగర్భ మురుగు కాలువ పనులు జరగాల్సి ఉంది.

హడావుడిగా మొదలెట్టి..

రహదారి పనులను హడావిడిగా ప్రారంభించారు. గుత్తేదారులు రహదారి తవ్వి..భూగర్భ మురుగుకాలువ గొట్టాలు వేశారు. రహదారికి ఇరువైపులా మురుగు కాలువను నిర్మించి దానిపై సిమెంట్ బల్లలు కూడా వేశారు. మధ్యలో తారును వదిలి ఇరువైపులా తవ్వి కంకర తోలి ఆపేశారు. రహదారికి అడుగు ఎత్తులో భూగర్భ మురుగు కాలువ ఛాంబర్లు ఉండటం, ఇరువైపులా కంకర వేయడంతో వాహనదారులు కిందపడి గాయాలపాలవుతున్నారు. ఈ మార్గంలో నర్సింగ్ హోమ్‌లు, క్లినిక్‌లు, ల్యాబ్, మెడికల్ స్టోర్లు, హోటళ్లు, తదితర వాణిజ్య దుకాణాలు ఉన్నాయి. నిత్యం వాహనాల రద్దీ, పాదచారులు వెళ్తుంటారు. రహదారి సరిగ్గా లేకపోవడంతో వాహనదారులు రాత్రిపూట కింద పడి గాయాలపాలయ్యారు. సగంలో నిలిచి పోయిన రహదారిని యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

కంకర వేసి వదిలేశారిలా

దుస్థితికి చేరిన రహదారిపై వాహనదారుల ఇబ్బందులు

పాత రోడ్డును తవ్వాల్సి ఉంది

రహదారిని పూర్తిగా తవ్వి..కింద నుంచి మట్టి కంకర వేసి పైభాగంలో తారు వేయాల్సి ఉంది. గుత్తేదారులు రహదారి ఇరువైపులా మురుగు కాలువల కోసం తవ్విన ప్రదేశంలో మాత్రమే కంకర మట్టి వేసి పూడ్చివేశారు. మధ్యలో తారు రోడ్డు అదే విధంగా ఉంది. దానిపైనే తారు రోడ్డు చేసి చేతులు దులుపుకోవాలని ప్రయత్నాలు చేస్తున్నారు. దీనిపై జేఈ విజయకుమార్‌ను వివరణ కోరగా గతంలో గడిగి చెన్నప్ప కూడలిలో రహదారి పనులు జరుగుతుండటం, ఈ రహదారి పగటిపూట తీరికలేకుండా ఉండటంతో పనులు చేయడం కష్టంగా మారింది. త్వరలో పనులు పూర్తి చేయిస్తాన్నారు.

వంతెన నిర్మాణ పనులు ఆపాలని వినతి

అధికారికి వినతిపత్రం సమర్పిస్తున్న రైతు సంఘం, నాయకులు, ఆలయ సమితి సభ్యులు

కంప్లి, న్యూస్‌టుడే: కంప్లి కోటె మార్గంలోని వరసిద్ధి వినాయక ఆలయం ఎదురుగా విజయనగర కాలువపై నూతన వంతెన నిర్మాణ పనులను నిలిపివేయాలని ఆలయ సమితి సభ్యులు, సాగు నీటి వినియోగదారుల సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ విషయమై ప్రజా పనుల శాఖ అధికారి ఆనంద్‌కు మంగళవారం ఆలయం వద్ద వినతిపత్రం సమర్పించారు. ఆలయ సమితి సభ్యుడు హెచ్.గవిసిద్ధప్ప మాట్లాడుతూ ఉత్తరం వైపు ఆలయ వరుసలో వంతెన నిర్మిస్తున్నారు. ఇది అవైజ్ఞానికం. వెంటనే వంతెన నిర్మాణ పనులను నిలిపివేయాలన్నారు. రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు బి.వి.గౌడ మాట్లాడుతూ ఆలయ ఆవరణలో వంతెన నిర్మాణం వల్ల మాగాణి మార్గంలో అటు వైపు రైతులు వెళ్లేందుకు ఇబ్బంది ఎదురవుతుంది. అందువల్ల దక్షిణం వైపు వంతెన నిర్మాణం చేపట్టాలన్నారు. నాయకులు తిమ్మప్ప నాయక్, కొట్టూరు రమేశ్, డాక్టర్ రాము, పుట్టి సచిన్, ఎం.శ్రీనివాస్, సత్యప్ప స్వామి, వీరాంజనేయులు, గొర్రె శ్రీనివాస్ పాల్గొన్నారు.

నేతాజీ మార్గం .. యువతకు ఆదర్శం

నేతాజీ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న విశ్రాంత ముఖ్య ఉపాధ్యాయుడు వేణుగోపాల్, చిత్రంలో విశ్రాంత అధ్యాపకులు బసవరాజు, మల్లికార్జునగౌడ, దిలీప్‌కుమార్, జగదీశ్

బళ్లారి, న్యూస్‌టుడే: అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక డా.రాజ్‌కుమార్ రహదారిలో ఉన్న పాంచజన్య సభాభవనంలో నేతాజీ సుభాష్ చంద్రబోస్ 129వ జయంతిని నిర్వహించారు. కార్యక్రమంలో విశ్రాంత అధ్యాపకులు ఎన్. బసవరాజ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. స్వాతంత్ర్య పోరాటం నేతాజీ పాత్రను విలువ కట్టలేమన్నారు. నేడు యువతీ, యువకులు ఆయన మార్గదర్శనంలో ముందుకు వెళ్లాలన్నారు. బ్రిటిష వారికి వ్యతిరేకంగా పోరాటం చేసిన నేతాజీ గురించి ప్రతి భారతీయుడు స్మరించుకోవాలన్నారు. విశ్రాంత ముఖ్య ఉపాధ్యాయుడు ఎం.వేణుగోపాల్ విద్యార్థులు ప్రాథమిక దశ నుంచే దేశ భక్తి, ప్రేమ పెంచుకోవాలి. నాయకత్వ లక్షణాలతో ముందుకు వెళ్లాన్నారు. ఏబీవీపీ నగర అధ్యక్షుడు జగదీశ్ కనుగోలు నేజాతీ సుభాష్ చంద్రబోస్ జీవిత చరిత్ర, పోరాటం గురించి వివరించారు. కార్యక్రమంలో నాగరాజు, దిలీప్‌కుమార్, మల్లికార్జునగౌడ పాల్గొన్నారు.

'వేసవిలో నీటి సమస్య రానివ్వం'

ఏళుమక్కళ తాయి అమ్మవారికి పూజలు చేస్తున్న మంత్రి బోసురాజు

సిరివార,(మాన్వి): స్థానిక నాగడదిన్ని రోడ్డు వద్ద ఉన్న ఏళుమక్కళ తాయి అమ్మవారి ఆలయాన్ని రాష్ట్ర చిన్ననీటి పారుదల, శాస్త్ర సాంకేతిక శాఖల మంత్రి ఎన్.ఎస్. బోసురాజు సందర్శించారు. ఈ సందర్భంగా భక్తుల కోరిక మేరకు ఈ ప్రాంతంలో సముదాయ భవనం నిర్మించేందుకు ఇప్పటికే నిధులు విడుదల చేసినట్లు తెలిపారు. ఆలయం ఇతర అభివృద్ధి పనులకు కూడా సహకరిస్తామన్నారు.

నేడు తాలూకా అధికారులతో సమావేశం

మాన్వి, సిరివార తాలూకాల్లో వేసవిలో నీటి సమస్య తలెత్తకుండా చూసేందుకు శాయశక్తులా ప్రయత్నిస్తున్నట్లు మంత్రి ఈ సందర్భంగా వెల్లడించారు. నీటి సమస్య నివారణ కోసమే బుధవారం మాన్వి తాలూకా పంచాయతీ సభాంగణంలో ఉభయ తాలూకాల అధికారుల ప్రత్యేక సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు మంత్రి తెలిపారు. వేసవిలో పశువులకు మేత, నీరు సరఫరా విషయమై సభలో చర్చిస్తామని, సాధ్యమైనంత వరకు సమస్యలేర్పడకుండా చూస్తామన్నారు. ఈ సందర్భంగా పట్టణ పంచాయతీ అధ్యక్షుడు హాజీచౌదరి, ప్రముఖులు శరణయ్య నాయక్ గుడదిన్ని, చుక్కి సూగప్ప సాహుకార్, పట్టణ పంచాయతీ ముఖ్యాధికారి సురేశ్ శెట్టి, టీపీఈఓ శశిధర్‌స్వామి తదితరులు పాల్గొన్నారు.

సమ్మేళనాలతో సాహితీ వేత్తలకు ప్రేరణ

సమ్మేళనాన్ని ప్రారంభిస్తున్న జిల్లా బాధ్య మంత్రి సుధాకర్. వేదికపై ఎమ్మెల్యే రఘుమూర్తి, సంధ్యారెడ్డి, సిద్ధరామయ్య

చెళ్లకెర(చిత్రదుర్గ),న్యూస్‌టుడే: కన్నడ సాహిత్య సమ్మేళనాలు రచయితలు, సాహితీ వేత్తలకు ఉత్సాహాన్ని నింపి ఉత్తమ రచనలు వచ్చేందుకు దోహదం చేస్తున్నాయని జిల్లా బాధ్యమంత్రి డి.సుధాకర్ పేర్కొన్నారు. మంగళవారం ఇక్కడ జి.జి.సముదాయ భవనంలో నిర్వహించిన 18వ జిల్లా కన్నడ సాహిత్య సమ్మేళనాన్ని ప్రారంభించి మాట్లాడారు. కన్నడ భాష దేశ భాషల్లో తనదైన ప్రత్యేకతను చాటుకొంటోందన్నారు. కన్నడ రచయితలకు అత్యధికంగా జ్ఞానపీఠ్ అవార్డులు లభించడం అందరికీ గర్వకారణమన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే టి. రఘుమూర్తి, సమ్మేళనం అధ్యక్షురాలు డా. సంధ్యారెడ్డి, సాహితీవేత్త జి.ఎస్. సిద్ధరామయ్య, విధానపరిషత్ సభ్యుడు నవీన్, ఆధ్యాత్మిక గురువులు శివలింగానందస్వామి, రాష్ట్ర ద్రాక్షరస మండలి అధ్యక్షుడు డా యోగీశ్ బాబు, జిల్లా కన్నడ సాహిత్య పరిషత్ అధ్యక్షుడు శివస్వామి తదితరులు పాల్గొన్నారు.

తుంగభద్ర జలాశయం నీటిమట్టం

పూర్తిస్థాయి నీటిమట్టం 1633 అడుగులు

17-02-2026 (ఉ. 8 గంటలకు)	ప్రస్తుతం	గత సంవత్సరం
నీటిమట్టం (అడుగుల్లో)	1602.07	1611.84
ఇన్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	000	000
అవుట్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	428	9,821
నీటి నిల్వ (టి.ఎం.సి)	24.312	41.327

గరిష్ఠసామర్థ్యం (133 టీఎంసీలు) వాస్తవసామర్థ్యం 105.788 టీఎంసీలు

ఎమ్మెల్యే సూచనతో నిలిచిన పనులు

నిలిచిన రహదారి నిర్మాణ పనులు

సింధనూరు, న్యూస్‌టుడే: సింధనూరులో రైల్వే స్టేషను మార్గానికి సీసీ రోడ్డు నిర్మాణం పనులు ఎట్టకేలకు నిలిచాయి. ఎమ్మెల్యే బాదర్లి హంపనగౌడ తాత్కాలికంగా పనులు ఆపాలని నీటిపారుదల శాఖ ఈఈకి చరవాణిలో సూచనలు ఇవ్వడంతో పనులు ఆపుడికే నిలిచాయి. ఈ మార్గం 40వ కాలువ గట్టున ఉండి, నీటిపారుదల శాఖకు చెందినది. స్టేషను నుంచి కుష్టగి ప్రధాన రహదారిని కలుపుతూ దారి నిర్మాణం ప్రారంభించారు. ప్రస్తుతం రైల్వే స్టేషనుకు వెళ్లే ప్రయాణికులకు సౌకర్యంగా స్టేషను దగ్గర నుంచి పాత కాలువ గట్టు సమీపంలోని గంగావతి ప్రధాన రహదారి వరకు రహదారిని అభివృద్ధి చేస్తున్నారు. ఇందులో శ్రీసత్యాగార్డెన్స్ క్రాస్ వరకూ 1.5 కిలోమీటర్ల మేరకు సిమెంటు దారిని నిర్మిస్తున్నారు. మొత్తం కాలువ గట్టు 66 అడుగులు ఉండగా అధికారులు కేవలం 36 అడుగుల మేరకే రహదారి నిర్మిస్తూ..తమ పరిధిలో గల గట్టు చివరన మురుగు కాలువను నిర్మించకుండా దాదాపు 30 అడుగుల దారిని అన్యాక్రాంతానికి అవకాశం ఇవ్వు వదిలేశారు. దీనికి మాజీ ఎంపీ కె.విరుపాక్షప్ప మొదలుకొని అనేక మంది అభ్యంతరం తెలిపి ఎమ్మెల్యేకు విషయాన్ని గుర్తుచేశారు. విషయం ఎమ్మెల్యే వరకు వెళ్లడంతో ఆయన నీటి పారుదల ఈఈకి సూచనలు ఇచ్చి పనులు నిలిపివేయించారు. ఎమ్మెల్యే బాదర్లి మంగళవారం రాత్రి విదేశీ పర్యటనకు బయలుదేరుతున్నందున మార్చి ఒకటిన తిరిగి సింధనూరు వస్తారు. అంత వరకు స్టేషను దారి నిర్మాణం పనులు నిలిచి నట్లేనని స్థానికులు పేర్కొంటున్నారు.

అంతర్ వర్సిటీ చదరంగం పోటీలకు సింధనూరు విద్యార్థిని

డిగ్రీ విద్యార్థిని విజయలక్ష్మిని అభినందిస్తున్న అధ్యాపక బృందం

సింధనూరు, న్యూస్‌టుడే: ఈ నెల 19 నుంచి 24 వరకు ఆంధ్రప్రదేశ్ విశాఖపట్నం గీతం విశ్వవిద్యాలయంలో జరుగనున్న దక్షిణ భారత అంతర్ విశ్వవిద్యాలయాల మహిళల చదరంగ పోటీలకు రాయచూరు ఆదికవి శ్రీమహర్షి వాల్మీకి విశ్వవిద్యాలయం తరఫున ప్రాతినిధ్యం వహించేందుకు సింధనూరు ప్రభుత్వ ఫస్ట్ గ్రేడ్ కళాశాల విద్యార్థిని విజయలక్ష్మి ఎంపికైంది. ఎంపిక ప్రక్రియలో ఈ యువతి చక్కని ప్రతిభాపాటవాలు చూపడంతో విశ్వవిద్యాలయం క్రీడల విభాగం విజయలక్ష్మిని అంతిమంగా ఎంపిక చేసింది. విద్యార్థిని విజయలక్ష్మి ఈ కళాశాలలో బీఎస్సీ ద్వితీయ సెమిస్టర్ చదువుతోంది. ఈమె ఎంపిక మా కళాశాల కీర్తిని పెంచిందని ప్రాచార్యులు ప్రొఫెసర్ పాండు హర్షం వ్యక్తం చేశారు. మంగళవారం ఈమెను స్థానిక కళాశాల్లో అధ్యాపక బృందం అభినందించింది. అనంతరం పోటీలకు సాగనంపింది.

జాబితాపై అభ్యంతరాల ఆహ్వానం

బళ్లారి, న్యూస్‌టుడే: జిల్లాలో అంగన్‌వాడీ కేంద్రాల్లో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయక కార్యకర్తల ఎంపిక చేసిన తాత్కాలిక జాబితాను ప్రకటించాం. దీనిపై ఏలాంటి అభ్యంతరాలున్నా మార్చి 3వ తేదీ సాయంత్రం 5.30 గంటల లోపు సంబంధిత శిశు అభివృద్ధి శాఖ కార్యాలయానికి రాతపూర్వకంగా తెలియజేయాలని అధికారి ఒక ప్రకటనలో కోరారు.

రేపు 15 సూత్రాలపై ప్రగతి పరిశీలన సమావేశం

బళ్లారి, న్యూస్‌టుడే: జిల్లా అల్పసంఖ్యాక సంక్షేమ శాఖ ప్రధాన మంత్రి 15 సూత్రాల కార్యక్రమాల అమలుపై మూడో త్రైమాసిక ప్రగతి పరిశీలన సమావేశం నిర్వహిస్తున్నట్లు అధికారి రాజు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. డీసీ కె.నాగేంద్ర ప్రసాద్ అధ్యక్షతన ఈ నెల 19న ఉదయం 11 గంటలకు నూతన జిల్లా పాలనాధికారి కార్యాలయంలో జరుగుతుందని, అధికారులతో వివరాలతో రావాలన్నారు.

హేమారెడ్డి మల్లమ్మ విగ్రహావిష్కరణ

కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు, అభిమానులు

సిరివార,(మాన్వి): పట్టణంలోని 10వ వార్డు మల్లమ్మ లేవుట్‌లో శివ శరణె హేమారెడ్డి మల్లమ్మ విగ్రహాన్ని ఆవిష్కరించారు. నీలగల్ బృహన్మఠం డాక్టర్ పంచాక్షరి శివాచార్య మహా స్వామీజీ, నవలకల్ బృహన్మఠం అభినవ సోమనాథ్ శివాచార్య స్వామీజీ సాన్నిధ్యంలో మాజీ ఎమ్మెల్యే రాజా వెంకటప్ప నాయక్ ఇతర నాయకులు కలిసి ప్రారంభించారు. హేమారెడ్డి మల్లమ్మ మహిళలందరికీ ఆదర్శప్రాయమన్నారు. ఆమె పేరున విగ్రహం నెలకొల్పటం అన్ని విధాలా సముచితమన్నారు. ఈ సందర్భంగా బ్రిజేష్‌పాటిల్, జి.లోకరెడ్డి, చుక్కి సూగప్పసాహుకార్, శివశంకర్‌పాటిల్, విరూపాక్షిగౌడ, మల్లికార్జునగౌడ, శ్రీధర్‌స్వామి, శరణప్పగౌడ, ప్రకాష్‌పాటిల్, కాశీనాథ్, వీరేశ్, గురుగౌడ తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర బృందం ఉపాధి పనుల పరిశీలన

రాయచూరు, న్యూస్‌టుడే: కేంద్ర ఆడిట్ బృందం అధికారి కుముద్ దుబె రాయచూరు తాలూకాలో గ్రామీణ ఉపాధి పథకం కింద జరుగుతున్న పనులను పరిశీలించారు. తొలుత చంద్రబండ పంచాయతీ కార్యాలయానికి వెళ్లి వివిధ పనులకు సంబంధించిన దస్త్రాలు, కూలీల పేర్ల నమోదు, హాజరు పుస్తకాన్ని పరిశీలించారు. అనంతరం అరసిగేరా తాండాలో పశువుల దొడ్ల నిర్మాణం, నాగనదొడ్డి గ్రామంలో కందకం కట్టడం పనులను చూశారు. తర్వాత చింతలకుంట, చంద్రబండలో అమృత సరోవర పథకాన చేపట్టిన చెరువు పనులను తనిఖీ చేశారు. కడగందొడ్డిలో నిర్మిస్తున్న రహదారి, కురుబదొడ్డిలో చెరువు పూడికతీత, కట్లకటూరులో నిర్మిస్తున్న మురుగునీటి నిర్మాణ పనుల గురించి తెలుసుకున్నారు. అధికారి వెంట తాలూకా పంచాయతీ ఈవో చంద్రశేఖర్ పవార్, సహాయ నిర్దేశకుడు హనుమంతు ఉన్నారు.

ఏపీఎంసీ పేరుకు గొప్ప.. రహదారులు అధ్వానమప్పా

మార్కెట్ మొదటి క్రాస్ వద్ద అధ్వానంగా తయారైన మార్గం

రాయచూరు, న్యూస్‌టుడే: దక్షిణ భారత్‌లోనే అతి పెద్ద వ్యవసాయ ఉత్పత్తుల విక్రయ విపణుల్లో ఒకటని గొప్పగా చెప్పుకునే రాయచూరు ఏపీఎంసీ(గంజ్)లో రహదారులు అధ్వానంగా తయారయ్యాయి. పాడైన దారుల స్థానంలో కొత్తవి నిర్మించడం లేదు. కనీసం గుంతలనైనా పూడ్చడం లేదు. దీంతో పంటను తీసుకొచ్చే లారీల, ట్రాక్టర్లు, టెంపోలు చోదకులు ఈ మార్గంలో రావటానికి జడుసుకుంటున్నారు. ఏపీఎంసీని చూస్తే పేరు గొప్ప ఊరుదిబ్బ అన్న సామెత గుర్తొస్తోంది. తొమ్మిది దశకాల చరిత్ర కలిగిన ఈ మార్కెట్‌ను 1934లో స్థాపించారు.

పాలక మండలికి పట్టని రోడ్లు

ఆదాయం దండిగా సమకూరుతోంది. అయితే పాలక మండలి, అధికారులు రహదారుల మరమ్మతులు పట్టించుకోవడం లేదని రైతులు ఆవేదనతో వెలుబుచ్చుతున్నారు. పొరుగున ఉన్న యాదగిరి, తెలుగు రాష్ట్రాల సరిహద్దుల అన్నదాతలు వివిధ ఉత్పత్తులను తీసుకొస్తారు. దసరా నుంచి సంక్రాంతి వరకు లోడింగ్, అన్ లోడింగ్ చేసే వందలాది వాహనాలతో మార్కెట్ కిక్కిరిసిపోతోంది. వాహనాన్ని పార్కింగ్ చేసేందుకు ఖాళీ స్థలం కోసం వెదుక్కోవాలి. నిండు లోడ్‌లతో వస్తున్నందున సహజంగానే రహదారులు పాడవుతాయి కనుక ఏటా బాగు చేయించాలి. గత రెండేళ్ల వ్యవధిలో తాత్కాలిక పనులు చేయలేదు. వానాకాలంలో గుంతలు కన్పించక ముందుకు వెళ్లటానికి చోదకులు ముప్పు తిప్పలు పడాల్సిందే. ఏప్రిల్ నుంచి ఆగస్టు వరకు మార్కెట్ ఖాళీగా ఉంటుంది. ఈ వ్యవధిలో పనులు చేయాలన్న రైతు సంఘాలు విన్నపాలు బుట్ట దాఖలవుతున్నాయి. పన్నుల వసూళ్ల కోసం అధికారులు కనబరుస్తున్న శ్రద్ధ మౌలిక వసతుల కల్పనపై చూపడం లేదని రైతు నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఏపీఎంసీ అధ్యక్షుడు, ఉపాధ్యక్షుడు, సభ్యులు దెబ్బతిన్న రహదారుల దుస్థితిని చూడాలని కోరుతున్నారు.

అక్రమ కేసుల్ని ఖండిస్తూ దళ్ పాదయాత్ర

రాయచూరు, న్యూస్‌టుడే: దళ్ నాయకుడిపై తప్పుడు కేసులు పెట్టడాన్ని ఖండిస్తూ స్థానిక కనకదాసు కూడలి నుంచి ఎస్పీ కార్యాలయం వరకు పాద్రయాత్ర చేపడతామని పార్టీ ఎస్సీ విభాగం అధ్యక్షుడు నరసప్ప ఆశాపూరు తెలిపారు. జిల్లా అధ్యక్షుడు విరూపాక్షి నేతృత్వంలో బుధవారం ఉదయం 11 గంటలకు కనకదాసు విగ్రహానికి పూలమాల వేసిన అనంతరం పాదయాత్ర మొదలవుతుందని వెల్లడించారు. పార్టీ శ్రేణులు తరలిరావాలని కోరారు. కాంగ్రెస్ నాయకుడు జి.తిమ్మారెడ్డి ప్రోద్బలంతో కొందరు దళ్ నగరాధ్యక్షుడు బి.తిమ్మారెడ్డిపై పనిగట్టుకుని పోలీసుఠాణాకు వెళ్తున్నారని, కాంగ్రెస్ యువ నాయకుడి సూచనల మేరకు కేసులు నమోదు చేస్తున్నారని తెలిపారు. రాబోయే నగర పాలక సంస్థ ఎన్నికల్లో దళ్ తరపున పోటీ చేయకుండా భయపెట్టేందుకే ఇలా చేస్తున్నారని, ఇందుకోసం ఒక బృందాన్ని నియమించినట్లు ఎస్పీ దృష్టికి తీసుకువస్తామని వెల్లడించారు.

హెచ్‌ఐవీ బాధితులను ఆదుకుందాం

మాట్లాడుతున్న జిల్లా ఎయిడ్స్ నియంత్రణాధికారి గిరీష్ చిత్రంలో అధ్యాపకులు

బళ్లారి, న్యూస్‌టుడే: హెచ్‌ఐవీ బాధితులను మానవత్వంతో చూసుకోవాలి. వారిలో మనోధైర్యాన్ని నింపాలని హెచ్‌ఐవీ విభాగం అధికారి గిరీష్ కోరారు. బళ్లారి ప్రభుత్వ సరళాదేవి సతీశ్చంద్ర అగర్వాల్ డిగ్రీ కళాశాలలోని సభాభవనంలో మంగళవారం ఏర్పాటు చేసిన ఎయిడ్స్ నియంత్రణ, నిర్వహణపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఎయిడ్స్ వ్యాప్తికి ప్రధాన కారణాలు, వ్యాధి వ్యాప్తిని నివారించడానికి తీసుకోవాల్సిన చర్యలను నేటి విద్యార్థులు తెలుసుకోవాలన్నారు. ఇతరులకు ఎయిడ్స్ నివారణపై అవగాహన కల్పించాలని కోరారు. 18 ఏళ్లు పైబడిన యువతీ, యువకులు రక్తదానం చేయడం వల్ల వారి ఆరోగ్యం, ఆలోచన శక్తి, జ్ఞాపక శక్తి పెరుగుతుందన్నారు. అధ్యాపకులు ఇస్మాయిల్ మకందార్, డా.దస్తగిరిసాబ్, డా.బసప్ప, మారెప్ప, డా.మహంతేష్‌కుమార్ పాల్గొన్నారు.

నేటి నుంచి రాఘవేంద్ర సప్తాహ మహోత్సవాలు

సత్యనారాయణ పేట రాఘవేంద్రుడికి పుష్పాలంకరణ

ప్రసన్నాచార్

బళ్లారి గ్రామీణ, న్యూస్‌టుడే: మంత్రాలయం గురురాఘవేంద్రుడి పట్టాభిషేకం, జయంత్యుత్సవాలను పురస్కరించుకుని బుధవారం నుంచి ఈనెల 24 వరకు ఏడురోజుల పాటు రాఘవేంద్ర సప్తాహ మహోత్సవాలను సత్యనారాయణ పేట రాఘవేంద్ర మఠంలో నిర్వహిస్తున్నట్లు మఠం వ్యవస్థాపకుడు ప్రసన్నాచార్ తెలిపారు. విశేష పూజలు, అలంకార సేవ, ప్రవచనం, తదితర కార్యక్రమాలు చేపడుతామన్నారు. 19న పట్టాభిషేక ఉత్సవంలో హోమాలు, పాదపూజ, రథోత్సవం, ప్రవచన కార్యక్రమం ఉంటుందన్నారు. 24న రాఘవేంద్రస్వామి, జయంతిని పురస్కరించుకుని పల్లకీ ఉత్సవం, నగర ప్రదక్షిణ, రథోత్సవం, సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు, ఉపన్యాసాలు ఏర్పాటు చేశామని భక్తులు పాల్గొనాలని ఆయన కోరారు.

కన్నడ సాహిత్య సేవలో భాగస్వాములవుదాం

మాన్వి,న్యూస్‌టుడే: నీర్‌మాన్వి గ్రామంలోని సిద్ధారూఢమఠం ఆవరణలో ఈనెల 28న సమ్మేళనాన్ని నిర్వహించనున్నట్లు తాలూకా కన్నడ సాహిత్య పరిషత్ అధ్యక్షుడు శరణబసవ తెలిపారు. పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ 11వ సమ్మేళనం విజయవంతానికి అందరూ చేయూతనందించాలన్నారు. కన్నడమ్మ సాహిత్య సేవలో అందరూ భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. స్థానిక పత్రికా భవనంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో శరణబసవ మాట్లాడారు. సమ్మేళనం స్వాగతి సమితి గౌరవాధ్యక్షుడిగా మంత్రి ఎన్.ఎస్.బోసురాజు, అధ్యక్షుడిగా ఎమ్మెల్యే హంపయ్యనాయక్ వ్యవహరిస్తారన్నారు. సాహిత్యాభిమానుల ఏకాభిప్రాయం మేరకు సాహితీవేత్త డాక్టర్ బసవ ప్రభుపాటిల్ బెట్టదూర్‌ను సమ్మేళనాధ్యక్షుడిగా ఎంపిక చేసినట్లు చెప్పారు.

ఆలయాల్లో మారుమోగిన ఆధ్యాత్మిక ఘోష

పూల మధ్య మహదేశ్వరుడు

కారటగి, న్యూస్‌టుడే: కారటగిలో మహదేశ్వర స్వామికి అమావాస్య సందర్భంగా మంగళవారం విశేష పూజలు జరిగాయి. రుద్రాభిషేకం, పంచామృత అభిషేకం, వినాయక, నవగ్రహ పూజలు నిర్వహించారు. చారిత్రక నేపథ్యం గల ఈ ఆలయంలో మూడు రోజులుగా పూజలు జరుగుతున్నాయి.

సిరుగుప్ప, న్యూస్‌టుడే: పట్టణంలోని 3వ వార్డులో దొడ్డ బసవేశ్వర ఆలయంలో పూజలు నిర్వహించారు. అమావాస్య పురస్కరించుకుని మంగళవారం ఉదయం ఆలయంలో పూజలు, అభిషేకాలు చేశారు. కాలనీ వాసులతో పాటు ఇతర కాలనీల నుంచి భక్తులు తరలివచ్చి పూజల్లో పాల్గొన్నారు.

దొడ్డబసవేశ్వర ఆలయంలో పూజల్లో పాల్గొన్న భక్తులు

సిరుగుప్ప, న్యూస్‌టుడే: పట్టణంలోని 16వ వార్డు సదాశివనగర్‌లో ఉరుకుంద ఈరణ్ణ ఆలయంలో పూజలు నిర్వహించారు. అమావాస్యను పురస్కరించుకుని మంగళవారం ఉదయం స్వామి వారికి పూజలు, అభిషేకాలు నిర్వహించి, అన్నదానం చేశారు.

ఉరుకుంద ఈరణ్ణ ఆలయంలో పూజల్లో పాల్గొన్న భక్తులు

బళ్లారి గ్రామీణ, న్యూస్‌టుడే: చెళ్లగుర్కిలో వెలసిన భక్తుల ఆరాధ్యదైవం ఎర్రితాత మఠంలో అమావాస్యను పురస్కరించుకుని ఎర్రిస్వామికి పంచామృతాలతో అభిషేకించారు. పుష్పాలు, రజతకవచంతో అలంకరించారు. ఉత్సవ విగ్రహాన్ని పల్లకీలో ఉంచి మఠం చుట్టూ ప్రదక్షిణ చేశారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని స్వామిని దర్శించుకున్నారు. భక్తులకు మఠం ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. అల్లీపురం మఠంలో మహదేవతాతకు, ఎత్తినబూదిహాళ్ బసవణ్ణకు ప్రత్యేక పూజలు చేసి అలంకరించారు. కార్యక్రమంలో మఠం అధ్యక్షుడు బాలనగౌడ, కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

చెళ్లగుర్కి ఎర్రితాతకు పుష్పాలంకరణ

(c) eenadu

యక్షగానం.. దివ్యానందం!

- వరాహావతారం.. అద్భుత ప్రదర్శన
- కళారూపానికి కొత్త సామాజిక అర్థం

యక్షగాన ప్రదర్శనలో దివ్యాంగ బాల కళాకారులు

మంగళూరు, న్యూస్‌టుడే : ఆంధ్రప్రదేశ్‌లో కూచిపూడి.. తెలంగాణలో చిందు భాగవతం తరహాలో కర్ణాటక తీరప్రాంత జిల్లాల్లో యక్షగానమంటే స్థానికులకు అమితాసక్తి. యక్షగానం ప్రదర్శనలో పురుషులే భాగమవుతారు. ఈ ప్రదర్శనల్లో రాణించేందుకు కళాకారులు ఏళ్ల తరబడి శ్రమిస్తుంటారు. రేవునగరి మంగళూరు శక్తినగర్‌లో సానిధ్య స్పెషల్ చిల్డ్రన్స్ స్కూల్ అండ్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్‌లోని దివ్యాంగ బాలలు కేవలం ఆరు నెలల శిక్షణతో స్టేజీపై దుమ్మురేపారు. నటన, భావోద్వేగం, పాత్రలకు తగిన ముఖ కవళికలు, ఆకట్టుకునే ఆహార్యంతో భళా అనిపించారు. శిక్షణ, అవకాశం లభిస్తే ఏ కళారూపంలోనైనా తాము రాణించగలరని చాటి చెప్పారు. రికార్డెడ్ డైలాగ్‌లకు అనుగుణంగా స్టేజీపై ప్రదర్శన ఆద్యంతం అందరినీ అలరించింది. విద్యాసంస్థలో పలువురు దివ్యాంగులు విద్యాభ్యాసం చేస్తున్నారు. ఇక్కడ చదువుతో పాటు నృత్యం, గానం, చిత్రలేఖనం వంటి కళలు, స్వయం ఉపాధి పనులనూ నేర్పిస్తుంటారు. సానిధ్య ఇన్‌స్టిట్యూట్ వార్షికోత్సవం సందర్భంగా ఏటా మంగళూరు నగరంలోని అతిపెద్ద 'కద్రి ఉద్యానవనం'లో సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తారు. ఈసారి వార్షికోత్సవానికి కొన్ని నెలలు ముందు నుంచే పిల్లలకు వివిధ కళారూపాల్లో శిక్షణ ఇచ్చారు. పిల్లలు యక్షగానం నేర్చుకోవడం చాలా కష్టం. అందుకే ఆరు నెలల ముందు నుంచే ఈవిభాగంలో 15 మంది బాలురకు శిక్షణ మొదలుపెట్టారు.

దుమ్మురేపిన దివ్యాంగులు..

ఈసారి ప్రదర్శనలో శిక్షణ పొందిన దివ్యాంగ బాలురు ప్రదర్శించిన యక్షగానం అందరినీ ఆకట్టుకుంది. 'వరాహ అవతారం' అనే పురాణ గాథను వీరు ఇతివృత్తంగా ఎంచుకున్నారు. శ్రీమహావిష్ణువు ధరించిన పది ప్రధాన అవతారాల్లో వరాహ అవతారం మూడోది. దీనిపై యక్షగానం ప్రదర్శన కోసం ముందుగానే సంస్థ ప్రతినిధులు 'ప్రసంగాన్ని' (సంభాషణలను) కళాకారులతో చెప్పించి, ప్రత్యేక స్టూడియోలో వాటిని రికార్డు చేయించారు. ఆ సంభాషణలకు అనుగుణంగా దివ్యాంగ కళాకారులు, అద్భుతంగా జీవకళ ఉట్టిపడేలా భావ వ్యక్తీకరణ చేశారు. వారి ముఖ కవళికలు, కాళ్ల కదలికలు, ఆహార్యం, భావోద్వేగాలను వ్యక్తం చేసిన తీరు వీక్షకుల మనసులను హత్తుకుంది. తమకు కేటాయించిన పాత్రల్లో ఆ బాలలు జీవించారు. రికార్డు చేసిన సంభాషణలకు వారు పెదవులు కదుపుతూ నటించారంటే వీక్షకులు ఎవరూ నమ్మలేకపోయారు. అంతగా ఆ పాత్రల్లో దివ్యాంగ బాలలు ఇమిడిపోయారు. ఈ యక్షగాన కళారూపం ప్రదర్శనకు కద్రి ఏరియాకు చెందిన కళాకారుడు శరత్ కుమార్ కద్రి దర్శకత్వం వహించగా, సహాయ దర్శకుడిగా సుజీత్ కుమార్ వ్యవహరించారు. కేవలం మూడు నుంచి ఆరు నెలల్లోనే ఏ అంశంపై అయినా యక్షగానాన్ని ప్రదర్శించేలా సిద్ధం కావడం ఈ దివ్యాంగ బాలల ప్రతిభ, అంకితభావాలకు నిదర్శనం అని సంస్థ పాలనాధికారి డాక్టర్ వసంత్‌కుమార్ శెట్టి తెలిపారు.

చెట్టుకింద నుజ్జయిన ఆటో

వాహనాలు ధ్వంసం

బెంగళూరు (రాజాజీనగర), న్యూస్‌టుడే : రాజాజీనగర శ్రీరామమందిర ఆటల మైదానంలో నిలిపి ఉంచిన వాహనాలపై చెట్టు విరిగిపడింది. ఆటో డ్రైవరు వేణుగోపాల్ ఒక ప్రయాణికురాలితో వెళుతున్న సమయంలో మంగళవారం ఒక కొమ్మ ఆ ఆటోపై పడింది. వాహనం మధ్య భాగంలో కొమ్మ పడడంతో డ్రైవరు, ప్రయాణికురాలు గాయపడకుండా, ఎలాగోలా ప్రమాదం నుంచి తప్పించుకున్నారు. ప్రమాదంలో మూడు ద్విచక్రవాహనాలూ ధ్వంసమయ్యాయి. రాజాజీనగర ఠాణా పోలీసులు దర్యాప్తు చేపట్టారు. విరిగిన చెట్టు కొమ్మలు, స్థానికంగా ఉన్న చెట్లకు ఉన్న ఎండు కొమ్మలను తొలగించేందుకు పాలికె సిబ్బంది చర్యలు చేపట్టారు.

తీరంలో ప్రతిధ్వనించిన 'వందేమాతరం'

బెంగళూరు (క్రీడలు), న్యూస్‌టుడే : 'వందేమాతరం' గీతం 150 సంవత్సరాల సంబరాల నేపథ్యంలో కేంద్ర పారిశ్రామిక భద్రత దళం (సీఐఎస్ఎఫ్) నేతృత్వంలో ఏర్పాటు చేసిన తీరప్రాంత సైకిల్ యాత్ర (కోస్టల్ సైక్లోథాన్-2026) మంగళవారం కారవార చేరుకుంది. పట్టణంలోని మాజాళి చెక్‌పోస్ట్ వద్ద ఈ సైకిల్ యాత్రికులకు ఘన స్వాగతం లభించింది. దళం సీనియర్ కమాండెంట్ అజయ్‌కుమార్ ఝా, బెంగళూరు ఉప కేంద్రం సీనియర్ కమాండెంట్ ఆర్.సి.సింగ్, ఉప కమాండెంట్ బీరేంద్రకుమార్, యువ సబలీకరణ క్రీడాశాఖ సంచాలకుడు రవినాయక్, డీఎస్పీ గిరీష్ తదితరులు పాల్గొన్నారు. వివిధ శాఖలకు చెందిన స్థానిక అధికారులు, ఎన్‌సీసీ విద్యార్థులు, జానపద కళాకారులు స్వాగతం పలికారు. గోట్నీబాగ్ క్రాస్‌లో మహిళా మత్స్యకారుల స్వాగత ఘట్టం ఆకట్టుకుంది. సుమారు 50 మంది సైక్లిస్టులకు తిలకం దిద్ది, పూలు జల్లి ఆహ్వానం పలికారు. జనవరి 28న గుజరాత్‌లో ప్రారంభించిన ర్యాలీ.. తీర ప్రాంతంలో సాగుతూ కార్వార చేరుకుంది. స్థానిక ప్రభుత్వ ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాల్లో బృంద సభ్యులు పాల్గొన్నారు. ఉదయం ధ్వజారోహణ అనంతరం మురుడేశ్వరకు బయలుదేరారు. బృంద సభ్యుడు, రక్షకభటుడు రాహుల్ మాట్లాడుతూ కొచ్చి వరకు యాత్ర సాగుతుందన్నారు. కరావళి ప్రాంత భద్రత, సురక్షిత, సమాచార సేకరణకు ప్రాధాన్యమిస్తున్నట్లు వివరించారు.

సైక్లోథాన్‌లో పాల్గొన్న సీఐఎస్ఎఫ్ జట్టు సభ్యులు

బెంగళూరు విపణిలో కూరగాయల ధరలు

(హాప్‌కామ్స్‌-కిలో..రూ.లలో)

బీన్స్‌-	40
క్యారెట్‌-	55
బీరకాయలు-	55
క్యాబేజీ-	35
క్యాలీఫ్లవర్‌(ఒక్కటి)-	30
సొరకాయ-	55
దొండకాయలు-	45
పొట్లకాయ-	45
పచ్చి మిరపకాయలు-	85
కాకర కాయలు-	55
టమాటా(నాటు)-	35
టమాటా-	25
గుమ్మడి-	30
ఆలుగడ్డ-	35
ఉల్లి(మేలురకం)-	35
ఉల్లి(సాధారణ)-	25
వెల్లుల్లి-	160
సాంబారు ఉల్లి-	165
బీట్‌రూట్‌-	55
వంకాయలు-	55
బెండకాయలు-	55
ముల్లంగి-	55
నిమ్మకాయ-	120
పండ్లు, ఫలాల ధరలు	
వాషింగ్టన్‌ ఆపిల్‌-	395
సిమ్లా ఆపిల్‌-	285
గ్రీన్‌ ఆపిల్‌-	345
అరటి కాయలు-	35
సపోటా-	65
పైనాపిల్‌-	65
బొప్పాయి-	35
ఆరంజి-	95
బత్తాయి-	55

(న్యూస్‌టుడే, యశ్వంతపుర)

ఆమె ప్రేమ.. నాటకం

ధార్వాడ, న్యూస్‌టుడే : శ్రీమంతులైన యువకులను లక్ష్యంగా చేసుకుని సామాజిక మాధ్యమాల్లో పరిచయం చేసుకోవడం, వివాహం చేసుకుంటానని నమ్మించి, నగదు తీసుకుని వంచనకు పాల్పడుతున్న యువతిని స్థానికులు దేహశుద్ధి చేసిన ఘటన ధార్వాడలో చోటు చేసుకుంది. మాళమడ్డి లేఅవుట్‌లోని ఒక పెట్రోలు బంకులో పని చేస్తున్న యువతి తన పేరు ఐశ్వర్య, రేణుక, ఆరోహిగా పేర్కొంటూ యువకులను పరిచయం చేసుకునేది. సంజు దొడ్డమని, గురు వక్కుంద తదితర యువకులను వివాహం చేసుకుంటానని నమ్మించింది. గురు వద్ద రూ.7 లక్షల నగదు తీసుకుంది. అతనితో ప్రేమ అంటూ తిరుగుతూనే సంజు దొడ్డమనితో వివాహం తాళి బలవంతంగా ప్రయత్నించింది. బాధితుడి చికిత్స కోసం ఆసుపత్రిలో చేర్పించారు. బాధిత యువకుల తరపు కుటుంబ సభ్యులు ఆ యువతిపై దాడి చేసి గాయపరిచారు. ఆమెను కూడా చికిత్స కోసం ఒక ఆసుపత్రిలో చేర్పించారు. ధార్వాడ నగర ఠాణా పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

బాధితుల వివరాలపై గోప్యతకు అప్రమత్తం

బెంగళూరు (రాజాజీనగర) : అత్యాచారం, లైంగిక దౌర్జన్యానికి గురైన యువతులు, బాలికలు, మహిళల వివరాలు ఎవరూ గుర్తించకుండా గోప్యతను కాపాడాలని పోలీసు డైరెక్టర్ జనరల్ డాక్టర్ ఎంఏ సలీం ప్రాంతీయులకు విన్నవించారు. ఫిర్యాదులు వచ్చిన అనంతరం బాధితుల వివరాలు, ఫొటోలు బయటకు రాకుండా ఠాణా అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. దర్యాప్తు పూర్తయ్యేంత వరకు అన్ని చోట్ల గోప్యతను కాపాడాలని సర్వోన్నత న్యాయస్థానం జారీ చేసిన ఆదేశాలను విధిగా అమలు చేయాలని గుర్తు చేశారు. దర్యాప్తు పూర్తయిన అనంతరం సీల్డ్ కవర్‌లోనే న్యాయస్థానానికి ఆ వివరాలు అందించాలని సర్క్యులర్ జారీ చేశామని సలీం తెలిపారు.

అజిత్ చిచ్చుతోనే శివ హత్య

- దర్యాప్తులో గుర్తించిన పోలీసులు

బెంగళూరు (కృష్ణరాజపురం), న్యూస్‌టుడే : రాజధాని నగరంలో రౌడీషీటర్ శివకుమార్ అలియాస్ బిక్లు శివ హత్య కేసు కీలక మలుపు తిరుగుతోంది. ఈ కేసులో ఇప్పటికే భాజపా సీనియర్ నాయకుడు, శాసనసభ్యుడు బైరతి బసవరాజ్ అరెస్టైన నేపథ్యంలో దర్యాప్తు వేగం పుంజుకుంది. ఈ హత్యకు మలయాళీ అజిత్ అనే వ్యక్తి కారణమని ప్రాథమిక దర్యాప్తులో భారతీనగర ఠాణా పోలీసులు గుర్తించారు. శివ హత్య కేసులో ఏ1 జగ్గ అలియాస్ జగదీష్. మొదట వీరిద్దరూ ప్రాణస్నేహితులు. కిత్తనూరు ప్రాంతంలో ఒక భూవివాదాన్ని సెటిల్ చేసేందుకు జగదీష్, శివ ఇద్దరూ వెళ్లారు. ఆ సమయంలో జగదీష్‌ను స్థానిక యువకులకు 'డాన్' అని శివపరిచయం చేశాడు. ఇదే విషయాన్ని జగదీష్ స్నేహితులకు అజిత్ ఫోన్ చేసి 'జగదీష్‌ను బిక్లు శివ రౌడీ అని చెప్పుకొంటున్నాడు' అని చెప్పాడు. అప్పటి నుంచి జగ్గ- శివ ఇద్దరి మధ్య పొరపొచ్చాలు వచ్చాయని పోలీసులు గుర్తించారు. ఆ క్రమంలోనే వివాదాలు పతాక స్థాయికి చేరి హత్య వరకు వెళ్లినట్లు ప్రాథమిక నిర్ధారణకు వచ్చారు.

ఉత్తరాది మహిళపై కన్నడిగుల ఆగ్రహం

బెంగళూరు (మారతహళ్లి) : కన్నడ భాష, కన్నడిగులను దూషిస్తూ వ్యాఖ్యలు చేసిన ఓ ఉత్తరాది మహిళపై చర్యలు తీసుకోవాలని కన్నడ సంఘాలు డిమాండ్ చేశాయి. ఒక హెయిర్ కటింగ్ సెలూన్‌కు వెళ్లిన ఆమె అక్కడి సిబ్బందితో హిందీలో మాట్లాడాలని దబాయించింది. తమకు హిందీ రాదని చెబితే.. బెంగళూరులో ఉంటూ హిందీ రాదని ఎలా అంటారంటూ దూషణలకు పాల్పడింది. ఇప్పుడు ఈ వీడియో వైరల్‌గా మారడంతో ఆమెపై చర్యలు తీసుకోవాలని కన్నడ సంఘాల ప్రతినిధులు డిమాండ్ చేశారు.

నటునిపై కేసు నమోదు

బెంగళూరు (గాంధీనగర), న్యూస్‌టుడే : థియేటర్‌లో 'జేసీ' సినిమాను అభిమానులతో చూస్తూ మధ్యలో తల్వార్ పట్టుకుని ఫోజిచ్చిన యువ నటుడు సూర్య ప్రఖ్యాత్‌పై గోవిందరాజనగర ఠాణా పోలీసులు మంగళవారం కేసు నమోదు చేసుకున్నారు. ఈ నెల 6న సినిమా చూస్తూ తల్వార్‌ను ప్రదర్శిస్తూ అభిమానులతో కలిసి తీసుకున్న ఫొటోలు, వీడియోలు వైరల్‌గా మారాయి. వీడియో ఆధారంగా పోలీసులు స్వయం ప్రేరితంగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

రోడ్డుప్రమాదంలో ఇద్దరి దుర్మరణం

హాసన, న్యూస్‌టుడే : చెన్నరాయపట్టణ తాలూకా దొడ్డేరి కావలు గేట్ వద్ద సోమవారం రాత్రి సంభవించిన రోడ్డు ప్రమాదంలో మత్తిఘట్ట నివాసి రమేశ్ (23), ఎం.హొన్నేనహళ్లి నివాసి పురుషోత్తమ్ (26) మరణించారు. కిరణ్ అనే యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. కిరణ్, రమేశ్ ఇద్దరూ వస్తున్న బైకును ఎదురుగా మరో బైకుపై వచ్చిన పురుషోత్తమ్ ఢీకొట్టడంతో ప్రమాదం సంభవించింది. హిరిసావె ఠాణా పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

అడ్డగోలుగా భూస్వాధీనం

కాంగ్రెస్‌పై చలువాది నిప్పులు

పార్టీ నేతలతో కలసి పత్రాలు ప్రదర్శిస్తున్న చలువాది నారాయణస్వామి

బెంగళూరు (మల్లేశ్వరం), న్యూస్‌టుడే : భూములకు రక్షణ కల్పించవలసిన ప్రభుత్వం 31 ఇంటి పట్టాలను కాంగ్రెస్ పార్టీ నేతలకు అక్రమంగా కేటాయించిందని విధానపరిషత్తులో విపక్ష నాయకుడు చలువాది నారాయణస్వామి ఆరోపించారు. చిక్కబళ్లాపురలో ఒక వ్యక్తి పార్టీ కార్యాలయాన్ని నిర్మించేందుకు భూమి స్వాధీనపరుచుకున్నట్లు చెప్పారు. స్వాధీనపరచుకున్న 3,404 చదరపు అడుగుల భూమి విలువ రూ.4.08 కోట్లు ఉండగా, రూ.20.42 లక్షలకు పొందారని చెప్పారు. తుమకూరు, బెంగళూరు గ్రామీణ జిల్లా, చామరాజనగర, దక్షిణ కన్నడ, ఉడుపి, తదితర ప్రాంతాల్లో భూమి విలువకు 5 శాతం మాత్రమే చెల్లించి, స్వాధీనపరుచుకున్నారని ఆరోపించారు. భాజపా ప్రధాన కార్యాలయం జగన్నాథ భవన్‌లో పార్టీ నేతలతో కలిసి విలేకరులతో నారాయణస్వామి మంగళవారం మాట్లాడారు. కాంగ్రెస్ భవన్ నిర్మాణానికి సీఏ స్థలాన్ని బలవంతంగా కేటాయించుకున్న ప్రభుత్వ తీరును ప్రశ్నిస్తూ న్యాయపోరాటం చేస్తామని హెచ్చరించారు. ఇలా భూములు కేటాయించడం సరికాదని అధికారులు చేసిన సూచనలను ముఖ్యమంత్రి, ఇతర మంత్రులు పెడచెవిన పెట్టారని ఆరోపించారు. భూములను వెనక్కు తిరిగి ప్రభుత్వానికి ఇచ్చేంత వరకు పోరాటం చేస్తామని హెచ్చరించారు. పార్టీ నాయకులు డాక్టర్ నరేంద్ర రంగప్ప, మోహన్ విశ్వ, వికాస్ పుత్తూరు తదితరులు సమావేశంలో పాల్గొన్నారు.

సూరజ్‌కు చుక్కెదురు

బెంగళూరు (మహాలక్ష్మి లేఅవుట్), న్యూస్‌టుడే : అసహజ లైంగిక దౌర్జన్యానికి పాల్పడిన ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎమ్మెల్సీ సూరజ్ రేవణ్ణ వేసుకున్న అర్జీని చట్టసభ ప్రతినిధుల న్యాయస్థానంలో న్యాయమూర్తి సంతోష్ గజానన భట్ తోసిపుచ్చారు. హాసన జిల్లా హొళెనరసీపుర ఠాణాలో నమోదైన కేసును రద్దు చేయాలని సూరజ్ రేవణ్ణ అర్జీ వేసుకున్నారు. సూరజ్ తనపై లైంగిక దౌర్జన్యానికి పాల్పడ్డాడని 2024 జూన్ 22న ఒక యువకుడు ఆరోపించాడు. ఆ కేసులో సూరజ్‌ను పోలీసులు అరెస్టు చేసి కారాగారానికి పంపించారు. కొద్ది రోజులకే ఆయన బెయిలుపై బయటకు వచ్చారు. తాజా అర్జీని న్యాయస్థానం తోసిపుచ్చడంతో క్రమం తప్పకుండా జరిగే విచారణకు ఆయన హాజరు కావలసి ఉంటుంది.

ఆ ఊరు.. రెండు ముక్కలు

బెళగావి : బెళగావి తాలూకా బెనకనహళ్లి గ్రామంలో భార్యాభర్తల గొడవను పరిష్కరించేందుకు గ్రామస్థులు రెండుగా విడిపోయి కొట్టుకున్నారు. పంచాయితీ నిర్వహించేందుకు ముత్యానట్టి నుంచి బెనకహళ్లికి భర్త తరపున వ్యక్తులు వచ్చారు. ఈ విషయంలో రెండు గ్రామాలకు చెందిన వారు గ్రూపులుగా విడిపోయి ఒకరిపై మరొకరు దాడి చేసుకున్నారు. ఈ ఘటనలో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. ఒకరిపై మరొకరు ఇచ్చిన ఫిర్యాదుతో బెళగావి గ్రామీణ ఠాణా పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

ఎస్సీ రిజర్వేషన్ ముసాయిదా ఆమోదానికి విన్నపం

బెంగళూరు (బాణసవాడి), న్యూస్‌టుడే : శాసనసభ ఆమోదించిన షెడ్యూల్డు కులాల రిజర్వేషన్ ముసాయిదాను ఆమోదించాలని పలువురు శాసన సభ్యులు గవర్నరు థావర్‌చంద గహ్లోత్‌కు విన్నవించారు. బెంగళూరులోని లోక్‌భవన్‌లో ఆహార పౌరసరఫరాల శాఖ మంత్రి కె.హెచ్.మునియప్ప నేతృత్వంలో వారంతా గవర్నరును కలిశారు. విధానసభలో ఆమోదం పొందిన ముసాయిదాను త్వరగా ఆమోదిస్తే మేలు చేకూరుతుందని తెలిపారు. ఉభయసభల్లో ఆ ముసాయిదాను పార్టీలకు అతీతంగా ఆమోదించారని గుర్తు చేశారు. మంత్రులు మునియప్ప, ఆర్.బి.తిమ్మాపుర, శాసన సభ్యులు రూపకళ శశిధర్, కె.ఎస్.బసవరాజు, ఎన్.శ్రీనివాస్, కటిక్ విఠల్ దొండగ, వసంతప్ప, మాజీ ఎంపీలు ఎల్.హనుమంతయ్య, బి.ఎన్.చంద్రప్ప తదితరులు గవర్నర్‌ను కలిశారు.

పట్టాలు తప్పిన గూడ్సు

రామనగర, న్యూస్‌టుడే : బెంగళూరు నుంచి మైసూరుకు వెళుతున్న గూడ్సు రైలు బోగీ ఒకటి బిడది వద్ద మంగళవారం పట్టాలు తప్పింది. స్టేషన్ దాటిన వెంటనే చివరి బోగీ పట్టాలు తప్పినట్లు గుర్తించారు. రైలును నిలిపే లోగా అది కొద్ది మీటర్లు ముందుకు వెళ్లింది. ఆ బోగీలో సరుకులు లేకపోవడంతో పట్టాలు దెబ్బతినలేదని అధికారులు తెలిపారు. బోగీని తిరిగి పట్టాలపై నిలిపేంత వరకు బెంగళూరు, మైసూరు మధ్యలో రైళ్ల రాకపోకలను తాత్కాలికంగా నిలపడంతో ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు.

విహంగ వేదిక.. విహార వాటిక!

'కెంపేగౌడ' విమానాశ్రయంలో కొత్తకొత్తగా..

బెంగళూరు (యలహంక), న్యూస్‌టుడే : బెంగళూరు కెంపేగౌడ అంతర్జాతీయ విమానాశ్రయానికి రాకపోకలు సాగించే ప్రయాణికులను ఆకట్టుకునేందుకు వివిధ కళాఖండాలను సిద్ధం చేశారు. ప్రత్యేక కళాకారుల సహకారంతో వివిధ నిర్మాణాలు ప్రాణం పోసుకుంటున్నాయి. రెండో టెర్మినల్ నిర్మాణమే ఓ అపురూపమనుకుంటే.. దాని పరిధిలో ప్రయాణికులకు సేవలందించడానికి ప్రత్యేకించిన ఆహారశాల, ఉద్యానవనం వేటికవే ప్రత్యేకం. ప్రపంచంలోనే ప్రఖ్యాతి పొందిన టెర్మినల్-2ను మరింత అందంగా మార్చుతున్నారు. కొత్తగా అద్భుతమైన 'రసా' విభాగం సిద్ధం చేశారు. కళాకారుడు టీఎన్ తెల్లూరు దీని రూపకర్త. దేవస్థానం గోపురంపై రాకెట్ తరహా నిర్మాణాన్ని టెర్మినల్ మధ్యభాగంలో ఇటీవలే ఆవిష్కరించారు. సుమారు 13.2 అడుగుల ఎత్తు, 5.5 అడుగుల వెడల్పు ఉన్న ఈ గోపురం చూపరులను ఇట్టే ఆకట్టుకుంటోంది. అక్కడికి చేరువలోనే గోపురం ఆహారశాల, విహారానికి ఉద్యానవనాన్ని సిద్ధం చేసి.. వాటికి ప్రత్యేక దారులు నిర్మించారు. ఈ దారులన్నీ వెదురు పలకలతోనే తీర్చిదిద్దారు. అటుగా నడక సాగించే వారు కొత్త అనుభూతికి లోనవుతున్నారు. ప్రయాణికులు వెదురు నడక దారిపై నడుస్తూ కొత్త అనుభూతి పొందుతున్నారు. దేశ, విదేశీ ప్రయాణికులను ఈ విభాగం ఇట్టే ఆకట్టుకుంటోంది.



ఉద్యానవనంలోకి వెదురు కర్రలతో నడక దారి

నూతనంగా వెదురుతో నిర్మించిన ఆహారశాల ఇదీ

గోపురంపై రాకెట్‌ను పోలిన అద్భుత కళాఖండం

రక్షకులకు అత్యాధునిక కెమెరా గన్

కెమెరా పనితీరు గమనిస్తున్న కొత్వాలు, రక్షకభటులు, నిపుణులు

బెంగళూరు (రామమూర్తినగర), న్యూస్‌టుడే : మోటారు వాహన చట్టాలను ఉల్లంఘించే వారిని గుర్తించేందుకు ట్రాఫిక్ పోలీసులకు అత్యాధునిక కెమెరా గన్‌లను అందుబాటులోకి తీసుకువస్తున్నామని నగర పోలీసు కమిషనర్ సీమంత్ కుమార్ సింగ్ తెలిపారు. 'స్పీడ్ రాడార్ గన్ కెమెరా'గా వ్యవహరించే ఈ కెమెరాలతో దూరం నుంచి వేగంగా వచ్చే వాహనాలను గుర్తించి, ఆ వేగాన్ని, వాహనం నంబరుతో సహా రికార్డు చేస్తుంది. పరిమితి మించిన వేగంతో వెళ్లే వారిని తక్కున గుర్తించేందుకు ఈ కెమెరా సహకరిస్తుంది. నగరంలో 2003లో 95 మంది, 2024లో 197 మంది, 2025లో 414 మంది బాలురు అతివేగం, వీలింగ్, డ్రాగ్ రేసులకు పాల్పడి దొరికిపోయారని కొత్వాలు తెలిపారు. అతివేగంతోనే ప్రమాదాలు జరుగుతున్నాయని గుర్తించి జాతీయ రహదారులు, వలయ వర్తుల రహదారుల్లో ఈ కెమెరాలతో దశల వారీగా నిఘా పెడతామని వివరించారు.

మురిపించిన డార్లింగ్ కృష్ణ

మాక్‌టెయిల్-2 చిత్రంలో 'డార్లింగ్ కృష్ణ'

బెంగళూరు (గాంధీనగర), న్యూస్‌టుడే : 'లవ్ మాక్‌టెయిల్-2' సినిమాలో తండ్రీకుమార్తెల అనుబంధాన్ని కళ్లముందు నిలిపేలా చిత్రీకరించిన 'ఒబ్బంటి యాదె నా' పాటను చిత్ర బృందం విడుదల చేసింది. సామాజిక మాధ్యమాల్లో ఈ వీడియో సాంగ్‌కు చక్కని స్పందన లభించిందని నట, దర్శకుడు 'డార్లింగ్ కృష్ణ' తెలిపారు. 'మాట మౌనమైంది. శోకం భావమైంది' అనే పదాలతో మొదలయ్యే ఈ పాటను రాఘవేంద్ర కామత్ రచించగా, నకుల్ అభయంకర్ సంగీత స్వరాలను సమకూర్చారు. 'లవ్ మాక్‌టెయిల్'లో పాటలకు ఇచ్చిన ప్రాధాన్యతనే రెండో భాగాన్ని కూడా చిత్రీకరిస్తున్నామని చెప్పారు. 'క్రిస్మి' బ్యానర్ తెరకెక్కిస్తున్న ఈ చిత్రాన్ని ఏప్రిల్ 10న విడుదల చేయనున్నారు. నటీనటుల్లో డార్లింగ్ కృష్ణ, మిలనా నాగరాజ్, సంవృత, అమృతా అయ్యంగార్, రాచెల్ డేవిడ్, అభిలాష్ దళపతి తదితరులు ఉన్నారు.

ఇల్లు కట్టుకోవాలని చోరీలు

నిందితురాలు (అంతర్ చిత్రం), జప్తు చేసుకున్న ఆభరణాలు

బెంగళూరు (జేపీనగర), న్యూస్‌టుడే : ఇళ్లలో దొంగతనాలకు పాల్పడిన సొత్తుతో తమిళనాడులో ఓ ఇల్లు కట్టుకోవడానికి వీలుగా కొంత భూమి కొనుగోలు చేసుకున్న దీప అనే పనిమనిషిని కోణనకుంటె ఠాణా పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. జగదీశ్ అనే వ్యక్తి నివాసంలో ఆభరణాలు దొంగతనం కావడంతో ఆయన ఫిర్యాదుతో దీపను అదుపులోనికి తీసుకుని విచారించారు. తానే నగలను దొంగిలించానని ఆమె అంగీకరించింది. జగదీశ్ నివాసంలో దొంగిలించిన 200 గ్రాముల ఆభరణాలను జప్తు చేసుకున్నారు. ఇదే తరహాలో ఇతరుల ఇళ్లలో దొంగిలించిన సొత్తుతో ఇంటి స్థలం కొనుగోలు చేసుకుందని తెలుసుకుని పోలీసులు కంగు తిన్నారు. ఆమె నుంచి మరిన్ని వివరాలు రాబట్టేందుకు విచారణను తీవ్రం చేశారు.

రశ్మి లీల.. కోలుకోలేక కన్నుమూత

నటి రశ్మి లీల

బెంగళూరు (జేపీనగర), న్యూస్‌టుడే : బుల్లి తెర నటి రశ్మి లీల ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సోమవారం సాయంత్రం కన్నుమూశారు. ఏడేళ్లుగా ఆమె పల్మనరీ ఫైబ్రోసిస్ అనే వ్యాధితో బాధపడ్డారు. ఊపిరితిత్తుల మార్పిడి కోసం ఆమె వేచి చూస్తున్నారు. నగదు సమకూర్చుకున్న అనంతరం ఊపిరితిత్తులు అందుబాటులో ఉన్నాయని నారాయణ హెల్త్ నుంచి వచ్చిన సమాచారంతో ఆమెను అక్కడ చేర్పించారు. సుమారు 12 గంటల పాటు శస్త్రచికిత్స అనంతరం ఆమె కోలుకున్నట్లే కనిపించినా.. కొంత సమయానికే కన్నుమూసిందని వైద్యులు విచారం వ్యక్తం చేశారు. ఆమె భౌతికకాయానికి భర్త సారక్కి మంజు మంగళవారం అంత్యక్రియలు నిర్వహించారు. 'పాప పాండు' ధారావాహికతో పాటు పలు కన్నడ చిత్రాల్లో సహాయక నటిగా రశ్మి నటించారు. బుల్లితెర నటులు, సాంకేతిక నిపుణులు ఆమెకు నివాళులు అర్పించారు.

ఆసుపత్రి పడకపై చివరి రోజుల్లో రశ్మి లీల

చక్కని ప్రశంస

గొలుసు తెంచుకుని పరారవుతున్న సయ్యద్ జాఫర్ అనే నిందితుడ్ని సినీ ఫక్కీలో వెంబడించి బంధించిన కానిస్టేబుల్ హణమంత పుటాణిని బెంగళూరు నగర కొత్వాలు సీమంత్‌కుమార్ సింగ్ మంగళవారం అభినందించారు. విజయనగర ఠాణా పరిధిలో వెళుతున్న దాక్షాయణి అనే గృహిణి గొలుసు తెంపుకొని నిందితుడు పరారవుతుండగా ఆమె కేకలు వేసింది. విధులు ముగించుకుని అటుగా వెళుతున్న సిటీ ఆర్మ్‌డ్ రిజర్వు పోలీసు హణమంత నిందితుడ్ని వెంబడించి పట్టుకుని విజయనగర ఠాణాలో అప్పగించారు. **(న్యూస్‌టుడే, శివాజీనగర)**

EENADU e Classifieds

JOBS

Wanted DRA Tele Callers, Field Executives & Team Leaders Banking Sector Attractive Salaries and Incentives, ✆ 9849394835, 7075345527.

Wanted Teachers for Reputed Schools in A.P & Telangana, Contact: Sneha Placements Service. Ph: 94402 46409.

త్రినేత్ర హోంకేర్‌లో వృద్ధులను/ పేషెంట్స్‌ను/ పిల్లలను చూసుకొనుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఫ్రీ వసతి, భోజనం. జీ: 18K. ✆ 8520980099, 8520874499

హరేకృష్ణ హోంకేర్‌లో వృద్ధులను/ పేషెంట్స్/ పిల్లలను చూసుకొనుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఫ్రీవసతి, భోజనం జీ: 18-20K ✆ 96404 68899, 96402 58899

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలను ఇచ్చుటకు ఈ క్రింది నెంబర్లను సంప్రదించగలరు.

బళ్ళారి : 9121167525

బెంగుళూరు : 9121167527

ప్రకటనలపై జి.ఎస్.టి. 5% వర్తించబడును

(c) eenadu

బెంగళూరు

● బెంగళూరు ● కోలారు ● మైసూరు ● హోసూరు ● చిక్కబళ్లాపుర ● తుమకూరు

20న మెగా ఉచిత వైద్య శిబిరం

డాక్టర్ సుందరరాజు

బెంగళూరు(జాలహళ్లి), న్యూస్‌టుడే: గోరిపాళ్యంలో ఇండియన్ ఇండిపెండెంట్ తెలుగు బాప్టిస్ట్ (ఐటీబీసీ మినిస్ట్రీస్) ఆధ్వర్యంలో ఈనెల 20న ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తారు. మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 6 వరకు శిబిరంలో తమ ఆరోగ్య సమస్యలకు ప్రజలు పరిష్కారం పొందొచ్చని అధ్యక్షుడు రెవరెండ్ ఎం.సుందరరాజు మంగళవారం ఇక్కడ విలేకర్ల సమావేశంలో తెలిపారు. అవసరమైన మందులు ఉచితంగా అందిస్తామని పాటు, శస్త్ర చికిత్సలు అవసరమైన వారికి ఉచితంగా కార్పొరేట్ ఆసుపత్రిలో చేయిస్తామన్నారు. అన్ని రోగాలకు సంబంధిత నిపుణులైన వైద్యులతో చికిత్సలు అందించనున్నట్లు చెప్పారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, పూర్తి వివరాలకు ఫోన్: 9945040503 నంబరులో సంప్రదించాలని కోరారు.

డీసీఎంను కలిసిన గుబ్బి ఎమ్మెల్యే కుటుంబసభ్యులు

బెంగళూరు(యలహంక),న్యూస్‌టుడే: ఉపముఖ్యమంత్రి డీకేశివకుమార్‌ను మంగళవారం ఇక్కడి సదాశివనగరలో గుబ్బి శాసనసభ్యుడు శ్రీనివాస్ కుటుంబసభ్యులు కలిశారు. ఇది మామూలు భేటీ మాత్రమేనని, తన కుమారుడ్ని డీకేకు పరిచయం చేసేందుకు కలిసినట్లు ఎమ్మెల్యే శ్రీనివాస్ తెలిపారు. తన కుమారుడితో డీకే మాట్లాడారని, చదువు ప్రాధాన్యం గురించి వివరించారన్నారు. ప్రస్తుతం తన కుమారుడు డీకేను కలిసిన సంతోషంలో ఉన్నారని చెప్పారు.

డీకే దంపతులను కలిసిన గుబ్బి ఎమ్మెల్యే శ్రీనివాస్ కుటుంబం

హోసూరు కబుర్లు

సామాజికవేత్తకు బిరుదు ప్రదానం

డెంకణీకోట న్యూస్‌టుడే: క్రిష్ణగిరికి చెందిన జలాలుద్దీన్ స్వార్డు అనే స్వచ్ఛంద సంస్థను స్థాపించి జిల్లాలోని అనేక ప్రాంతాల్లో సామాజిక చైతన్య కార్యక్రమాలు నిర్వహించి పేరు తెచ్చుకున్నారు. ఆయన వీధి నాటకాలు, పాటల రూపంలో మహిళా విద్య, హక్కులు, బాధ్యతలు, ఇతర అనేక సంక్షేమ, ప్రజాపయోగ సమాచారాలు, ప్రభుత్వ పథకాలపై అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ సేవల్ని గుర్తించిన చెన్నైలోని ఆరం శిఖరం ట్రస్టు జలాలుద్దీన్‌కు ఉత్తమ సమాజసేవకుడు బిరుదును ప్రకటించింది. ఆయనకు ఈ బిరుదును చలన చిత్ర నటుడు, దర్శకుడు భాగ్యరాజ్, నీడియిన్ కరక్ పత్రిక వ్యవస్థాపకుడు బాస్కరన్ ప్రదానం చేశారు. జలాలుద్దీన్‌ను ఎమ్మెల్యేలు మదియగనన్, అశోక్‌కుమార్, రామచంద్రన్, జిల్లా రెవెన్యూ అధికారి సాధనైకురో తదితరులు అభినందించారు.

నటుడు భాగ్యరాజ్ నుంచి బిరుదును స్వీకరిస్తున్న జలాలుద్దీన్

పారిశుద్ధ్య భవన నిర్మాణానికి భూమిపూజ

డెంకణీకోట న్యూస్‌టుడే: స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో ఆవరణలో రూ.21 లక్షల వ్యయంతో పారిశుద్ధ్య భవన నిర్మాణానికి పట్టణ పంచాయతీ అధ్యక్షుడు శ్రీనివాసన్ భూమిపూజ చేసి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలోని ప్రతి ఇంట్లో మరుగుదొడ్డు వాడాలని, పచ్చదనం, పరిశుభ్రతను అందరూ పాటించాలని కోరారు. కార్యక్రమంలో పట్టణ పంచాయతీ ఉపాధ్యక్షుడు అబ్దుల్‌కలాం, డాక్టర్ అళగు, ముజామిల్‌బాషా, కృష్ణప్పన్, కాంట్రాక్టర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర రాజకీయాల్లో మార్పు ఉండదు

బెంగళూరు(యశ్వంతపుర),న్యూస్‌టుడే: రాష్ట్రంలో రానున్న రోజుల్లో రాజకీయాల్లో ఎలాంటి మార్పు ఉండదని మాజీ మంత్రి కె.ఎన్.రాజణ్ణ తెలిపారు. మంగళవారం ఇక్కడ ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి సిద్ధరామయ్య బడ్జెట్ సమర్పిస్తారని దీన్ని బట్టి ఆయన యథాతథంగా కొనసాగుతారనే అర్థమన్నారు. సిద్దు పూర్తి విశ్వాసంతో ఉన్నారని తెలిపారు. కొందరు శాసనసభ్యులు తమ సొంత ఖర్చుతో విదేశీయాత్రలు చేపడితే తప్పు ఏమిటి? అని ప్రశ్నించారు. చట్టసభల్లో మహిళ రిజర్వేషన్ అమల్లోకి వస్తే తన కుమార్తె రశ్మిని ఎన్నికల పోటీలో దింపుతానని ప్రకటించారు.

ఘనంగా రామలింగేశ్వరుడి రథోత్సవం

ముళబాగిలు, న్యూస్‌టుడే: తాలూకాలోని ఆవణి గ్రామంలో రామలింగేశ్వరుడి జాతర అత్యంత ఘనంగా నిర్వహించారు. మంగళవారం రథోత్సవాన్ని తిలకించేందుకు లక్షకు పైగా భక్తాదులు తరలిరావడంతో ఆవణి జనసంద్రంగా మారింది. మంగళవాయిద్యాలు, కోలాటాలు, చెక్కభజనల మధ్య స్వామి వారి రథాన్ని పురవీధుల్లో ఊరేగించారు. భక్తులు అడుగడుగునా స్వామి వారికి కొబ్బరికాయలు కొట్టి కర్పూర హారతులిచ్చారు. స్థానికులు భక్తులకు అన్నదానంతో పాటు వడపప్పు, మజ్జిగ వితరణ చేశారు. కోలారు జిల్లా మేజిస్ట్రేట్ డాక్టర్ రవి రథోత్సవాన్ని జెండా ఊపి ప్రారంభించారు. మంత్రి భైరతి సురేశ్, ఎమ్మెల్యే కోత్తూరు మంజునాథ్, సమృద్ధి మంజునాథ్, తహసీల్దార్ గీతా తదితరులు పాల్గొన్నారు.

ఆవణి జాతరలో కిక్కిరిసిన జనసందోహం

అంగరంగ వైభవంగా ఆదిశక్తి జాతర

తుమకూరు, న్యూస్‌టుడే: ప్రసిద్ధ హెత్తేనహళ్లి గ్రామదేవత ఆదిశక్తి దేవి జాతరలో అపారమైన భక్తిశ్రద్ధలతో అశేష జనవాహిని పాల్గొని ఘనంగా నిర్వహించారు. మారమ్మతల్లి రథోత్సవం సోమవారం రాత్రి ప్రారంభమై మంగళవారం తెల్లవారే వరకు కొనసాగింది. ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈసారి సైతం రథోత్సవంలో రాష్ట్రం నలుమూలల నుంచి వచ్చిన భక్తులు పాల్గొన్నారు. తుమకూరు తాలూకాలోని వివిధ గ్రామాల్లో శక్తిదేవత జాతర మహోత్సవం అత్యంత వైభవంగా కొనసాగింది.

ఆదిశక్తిదేవి ఊరేగింపులో పాల్గొన్న భక్త సమూహం

ఫైనల్లో కిరణ్ బాయ్స్ జయకేతనం

పావగడ,న్యూస్‌టుడే: సూపర్ ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నీని కిరణ్ బాయ్స్ కైవసం చేసుకొంది. స్థానిక మహాత్మాగాంధీ స్టేడియంలో న్యూ అంజన్ క్రీడా యువకుల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్ ఫైనల్లో మధుగిరి కిరణ్ బాయ్స్, పావగడ కన్నా బాయ్స్ తలపడ్డాయి. మధుగిరి కిరణ్ బాయ్స్ 6 ఓవర్లలో 76 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించగా పావగడ కన్నా బాయ్స్ చివరి వరకు పోరాడి 6 ఓవర్లలో 72 పరుగులు చేసి కేవలం నాలుగు పరుగుల తేడాతో ఓటమి పొందారు.

జాతరలో మజ్జిగ వితరణ

పావగడ,న్యూస్‌టుడే: శ్రీ సత్యసాయి జిల్లా మడకశిర తాలూకా అమరాపురం మండలం హేమావతి శ్రీ సిద్ధేశ్వరస్వామి జాతర మహోత్సవంలో మంగళవారం తుమకూరు సహకార పాల ఉత్పత్తిదారుల సంఘం డైరెక్టర్ చంద్రశేఖరరెడ్డి ఆధ్వర్యంలో మజ్జిగ పాకెట్లను వితరణ చేశారు. కార్యక్రమంలో మడకశిర తహసీల్దారు నరసింహయ్య, పావగడ సౌహార్ద బ్యాంకు అధ్యక్షుడు కృష్ణారెడ్డి, సిద్ధేశ్వర అన్నదాసోహ సమితి అధ్యక్షుడు చంద్రశేఖరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

‘ఆర్‌ఎస్‌ఎస్‌కు రిజిస్ట్రేషన్ కావాలి’

బెంగళూరు(యలహంక),న్యూస్‌టుడే: రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్)కు చట్టప్రకారం రిజిస్ట్రేషన్ కావాలని అందుకు సంబంధించి చట్టం తేస్తామని, చట్టం వచ్చిన తర్వాత రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని గ్రామీణాభివృద్ధి పంచాయతీరాజ్ శాఖ మంత్రి ప్రియాంక్‌ఖర్గే సూచించారు. మంగళవారం ఇక్కడ ఆయన విలేకర్లతో మాట్లాడుతూ దేశంలో అందరికీ ఒక నిబంధన, మీకు ఒక నిబంధన ఉందా? అని ప్రశ్నించారు. ఆర్ఎస్ఎస్ ప్రజలు, వివిధ వర్గాల నుంచి విరాళాలు సేకరిస్తుందని, రిజిస్ట్రేషన్ కాలేదంటే చట్ట వ్యతిరేకమన్నారు.

కేఆర్‌మార్కెట్‌లో ఆధునిక పార్కింగ్ కేంద్రం

బెంగళూరు(యశ్వంతపుర),న్యూస్‌టుడే: నిత్యం వ్యాపారులు, వాహనాల రద్దీతో ఉండే కె.ఆర్.మార్కెట్ కింద అంతస్తులో నూతనంగా వాహనాల పార్కింగ్ కేంద్రాన్ని త్వరలో ప్రారంభించనున్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం ఇక్కడ గ్రేటర్ బెంగళూరు ప్రాధికార (జీబీఏ) చీఫ్ కమిషనర్ మహేశ్వరరావు అధికారులతో కలిసి నూతన పార్కింగ్ కేంద్రాన్ని పరిశీలించారు. మొన్నటి వరకు మురికి యార్డుగా ఉన్న కింద అంతస్తును ప్రాధికార సిబ్బంది శుభ్రం చేశారు. సిటీ మార్కెట్ పోలీసులు నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్న వాహనాలను కింద అంతస్తులో ఉంచారు. వాటిని కూడా తొలగించారు. కార్లు, ద్విచక్రవాహనాలు పార్కింగ్ చేసే విధంగా ఆ ప్రదేశాన్ని సిద్ధం చేస్తున్నారు. 500 వాహనాలు నిలిపే విధంగా మార్కెట్ భవనం కింద అంతస్తును సిద్ధం చేసినట్లు చీఫ్ కమిషనర్ మహేశ్వరరావు తెలిపారు. మార్కెట్ రహదారుల ఆక్రమణలను తొలగించాలని, వ్యాపారులకు ప్రత్యేక స్థలం కేటాయించాలని పార్కింగ్ కేంద్రంలోకి రాకపోకలు సాగించే విధంగా ఆక్రమణలను తొలగించాలని ఆయన అధికారులకు సూచించారు. నిత్యం శుభ్రంగా ఉంచుకోవాలని, ఎప్పటికప్పుడు చెత్త తొలగించాలని తెలిపారు. నిత్యం వేలాది మంది చిరువ్యాపారులు మార్కెట్‌కు వస్తున్నారని, వారి వాహనాలు పార్కింగ్ చేసేందుకు ఇప్పటి వరకు సరైన వ్యవస్థ లేదన్నారు. ఇప్పుడు కింద అంతస్తును వాహనాలు పార్కింగ్ చేసేందుకు సిద్ధం చేసినట్లు తెలిపారు. ఆయన వెంట బెంగళూరు దక్షిణ నగర పాలికె కమిషనర్ రాజేంద్ర చోళన్ తదితరులు ఉన్నారు.

మార్కెట్ భవనం కింద అంతస్తులో ఏర్పాటు చేసిన పార్కింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న చీఫ్ కమిషనర్ మహేశ్వరరావు తదితరులు

‘ప్రశస్తిని అందుకోవడం మహదానందం’

బెంగళూరు(సాంస్కృతికం), న్యూస్‌టుడే: ప్రముఖ రచయిత్రి పాత్రికేయురాలు గోరూరు పంకజకు సోమవారం అవ్వ ప్రశస్తి ప్రదానం చేశారు. ఆమె రాసిన బెరగురేఖెగళు అనే కావ్య కృతికి ఈ ప్రశస్తి లభించింది. ఇప్పటికే ఈ రచన వివిధ భాషల్లో అనువాదం కావటం విశేషం. మాతోశ్రీ వడ్డనకేరి ప్రతిష్ఠాన్‌కు చెందిన హారకొడద శ్రీచెన్న బసవేశ్వర సంస్థానపు హీరే మఠంలో జరిగిన సమారంభంలో డాక్టర్ చెన్నవీర శివాచార్య స్వామీజీ చేతుల మీదుగా ఈ ప్రతిష్ఠాత్మక ప్రశస్తిని పంకజ అందుకొన్నారు. కార్యక్రమంలో కలబుర్గి శరణ బసవ విశ్వవిద్యాలయ కులపతి డాక్టర్ ద్రాక్షాయని ఎస్.అప్పా, అమలాపుర మఠానికి చెందిన డాక్టర్ గురుపాద లింగ శివయోగి, బసవకల్యాణ శాసనసభ్యుడు శరణు సలగర, అఖిల భారత శరణ సాహిత్య పరిషత్ ఉపాధ్యక్షుడు అప్పారావ్, డాక్టర్ శరణ బసప్ప వడ్డెనకేరి తదితర ప్రముఖులు హాజరయ్యారు. ఈ ప్రశస్తిని అందుకోవడం తనకు అమితానందంగా ఉందని పంకజ తెలిపారు.

చెన్నవీర శివాచార్య స్వామీజీ చేతుల మీదుగా ప్రశస్తిని స్వీకరిస్తున్న గోరూరు పంకజ

20 నుంచి నగరంలో సంగీతోత్సవం

బెంగళూరు (సాంస్కృతికం), న్యూస్‌టుడే: ఈనెల 20,21,22 తేదీల్లో నగరవాసులకు సంగీతోత్సవం వీనుల విందు చేయనుంది. నగరంలోని ఉడుపి ప్రతిష్ఠాన తన 10వ వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించనున్న ఈ ఉత్సవంలో ఉత్తర దక్షిణ భారతదేశానికి చెందిన అంతర్జాతీయ స్థాయి సంగీత, వాద్య విద్వాంసులతో కచేరీలు ఏర్పాటు చేస్తోంది. స్థానిక వయ్యాలి కావల్‌లోని చౌడయ్య మెమోరియల్ హాలులో ప్రతిరోజు సాయంత్రం 7 గంటలకు కార్యక్రమాలు ప్రారంభమౌతాయి. మొదటిరోజు ప్రముఖ హిందుస్తానీ శాస్త్రీయ సంగీత విదుషి బేగం పర్వీన్ సుల్తాన్ కచేరీ రంజింప చేయనుంది. 21న తాళవాద్య కచేరీని పద్మశ్రీ విద్వాన్ తిరువాయూరు భక్తవత్సలం బృందం లయవిన్యాసం అలరించనుంది. 22న ప్రపంచ ప్రఖ్యాత మోహన వీణ వాద్య విద్వాంసుడు పండిత్ విశ్వమోహన్ భట్ కచేరీ ఉంటుంది.

ప్రముఖ హిందుస్తానీ సంగీత విదుషి

మారుమూల గ్రామాలకు సమగ్ర సంచార వైద్య సేవలు షురూ!

బెంగళూరు (కెంగేరి), న్యూస్‌టుడే: స్థానిక ఆనేకల్‌లో ఆస్టర్ డీఎం ఫౌండేషన్, సమగ్ర గ్రామీణ సంక్షేమ (సీఐఆర్‌డబ్ల్యూ) సంచార వైద్య సేవల యూనిట్-అత్యాధునిక సంచార వైద్య విభాగాన్ని మంగళవారం ప్రారంభించారు. గ్రామీణ ప్రాంతాల్లో సత్వర వైద్య సాయం అందించే లక్ష్యంతో కొత్త సంచార వైద్య విభాగం అందుబాటులోకి వచ్చింది. ప్రపంచవ్యాప్తంగా సంచార వైద్య సేవల విభాగాల్ని పరిగణనలోకి తీసుకొంటే భారత్‌లో ఇది 49వది. ఈ సందర్భంగా ఆస్టర్ డీఎం హెల్త్‌కేర్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ టి.జె.విల్సన్ మాట్లాడుతూ ప్రాథమిక చికిత్స, మారుమూల ప్రాంతాల్లోని ప్రజల ఆరోగ్య పర్యవేక్షణకు మద్దతుగా ఉంటుందన్నారు. సకాలంలో వైద్య సంరక్షణను కల్పించడం తమ సంస్థ లక్ష్యమన్నారు. ఈ సంచార విభాగాన్ని రెవరెండ్ ఫాదర్ డయోనిసియస్ వాజ్, రెవరెండ్ ఫాదర్ అర్విన్‌లూయిస్, రెవరెండ్ ఫాదర్ శాంతరాజ్ థామస్, ఆస్టర్ డీఎం ఫౌండేషన్ ఇండియా సంస్థ సామాజిక సేవల ముఖ్యుడు వినోద్‌చంద్రవాల్, హరిప్రసాద్, డిప్యూటీ జనరల్ మేనేజర్ కుల్దీప్ పాఠక్‌లతో కలిసి ప్రారంభించారు. జ్ఞానజ్యోతి సెంటర్ ఫర్ ఇంటిగ్రల్ రూరల్ వెల్‌ఫేర్ ఆరోగ్యం, విద్య, జీవనోపాధి, శిక్షణ, సామాజిక సంక్షేమ కార్యక్రమాలతో సమగ్ర గ్రామీణ అభ్యున్నతిపై దృష్టి సారించే స్థానిక సంక్షేమ అభివృద్ధి లక్ష్యంగా కార్యకలాపాలు నిర్వహిస్తోంది.

ప్రారంభ కార్యక్రమంలో పాల్గొన్న అర్విన్‌లూయిస్, వినోద్ చంద్రపాల్, యూనిట్ సిబ్బంది

పూడిక తొలగింపు పనులు ముమ్మరం

బెంగళూరు(బాణసవాడి),న్యూస్‌టుడే: చిన్నవానకు ముంపునకు గురవుతున్న నగరంలోని హెచ్‌ఎస్‌ఆర్‌లేఔట్ గుండా ప్రవహించే రాజకాలువలో పూడిక తొలగింపు పనులను గ్రేటర్ బెంగళూరు ప్రాధికార(జీబీఏ) చేపట్టింది. జేసీబీ యంత్రాల సహాయంతో మట్టి తొలగింపు పనులను నిర్వహిస్తున్నారు. ఏటా.. వర్షాలు కురిసిన ప్రతిసారి హెచ్‌ఎస్‌ఆర్ లేఔట్‌లో పలు ప్రదేశాలు ముంపునకు గురవుతున్నాయి. రోజులు తరబడి అక్కడ ప్రజలు వాననీటి మధ్య జీవించాల్సిన పరిస్థితులు నెలకొంటాయి. ప్రధానంగా అక్కడి రాజకాలువే ముంపునకు ప్రధానకారణం. శ్రీమంతులు ఎక్కువగా నివసించే ప్రాంతం కావడంతో ముంపు వార్త మొత్తం నగరాన్నే కాదు..దేశ రాజధాని దిల్లీ దృష్టిని ఆకర్షిస్తోంది. ఒకసారి ఏకంగా ప్రధానమంత్రి కార్యాలయం కూడా ముంపు విషయమై జోక్యం చేసుకొంది. మే నెల నుంచి వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయి. దాన్ని దృష్టిలో పెట్టుకుని ముంపు ప్రాంతాల్లో ఉన్న రాజకాలువల్లో పూడిక తీసే పనులు ముమ్మరంగా చేపట్టారు.

కొనసాగుతున్న రాజకాలువ పూడిక తొలగింపు పనులు

పాఠ్యేతర కార్యక్రమాలూ ముఖ్యం

బెంగళూరు (జేపీనగర), న్యూస్‌టుడే: విద్యార్థి జీవితంలో పాఠాలతో పాటు పాఠ్యేతర కార్యక్రమాలు కూడా ముఖ్యమని విశ్రాంత దైహిక శిక్షకుడు మేజర్ హెచ్.ఎన్.నాగరాజయ్య పేర్కొన్నారు. క్రీడలు కూడా విద్యాభ్యాసంలో భాగమని గుర్తించాలన్నారు. జయనగర జాతీయ కళాశాల్లో 61వ క్రీడోత్సవ జ్యోతిని అందుకుని క్రీడాకారుల్ని ఉత్సాహపరిచారు. వివిధ పోటీల్లో విజేతలకు పతకాలు, ట్రోఫీలు, ప్రమాణపత్రాలు వితరణ చేసి మాట్లాడారు. శారీరక ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు, స్ఫూర్తిని ప్రదర్శించేందుకు క్రీడలు ఉపయుక్తమని తెలిపారు. నేషనల్ ఎడ్యుకేషన్ సొసైటీ యాజమాన్య ప్రతినిధులు బి.ఎస్. అరుణ్‌కుమార్, వి.మంజునాథ్, వి.వెంకట శివారెడ్డి, డాక్టర్ వెంకటరామరెడ్డి, సుధాకర్ ఇస్తూరి, జీఎం రవీంద్ర తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

క్రీడాజ్యోతితో విద్యార్థులు, విశ్రాంత దైహిక శిక్షకుడు మేజర్ నాగరాజయ్య, కళాశాల ప్రతినిధులు

బాలుడి పాదయాత్ర

హావేరి, న్యూస్‌టుడే: కురవత్తి బసవేశ్వర జాతరలో పాల్గొనేందుకు సమర్థ శివయోగి కాగినల్లి (6) అనే బాలుడు పాదరక్షలు లేకుండా 13 కి.మీ. పాదయాత్ర చేశాడు. రెండున్నర గంటల్లో అతని పాదయాత్ర పూర్తయింది. పాదయాత్రలో అతనికి తోడుగా తండ్రి, గుత్తల గ్రామానికి చెందిన స్థానికులు కొందరు అడుగులు వేశారు. పాదయాత్ర అనంతరం రథోత్సవంలో పాల్గొన్న బాలుడ్ని స్థానికులు అభినందించి ప్రశంసల వర్షం కురిపించారు.

నడక కొనసాగిస్తున్న శివయోగి

బలవన్మరణానికి పాల్పడిన ఎలక్ట్రీషియన్

శివమొగ్గ, న్యూస్‌టుడే: తీర్థహళ్లి సమీపంలోని రామమండపం వద్ద తుంగా నదిలో దూకి ఇలియాస్ అనే ఎలక్ట్రీషియన్ బలవన్మరణానికి పాల్పడ్డాడు. నది ఒడ్డున దుస్తులు, చెప్పులను స్థానికులు గుర్తించారు. నీటిలో తేలుతున్న మృతదేహాన్ని చూసి పోలీసులకు సమాచారం అందించారు. అతను ఆత్మహత్య చేసుకున్నాడా లేదా ఈతకు దిగి మరణించాడా అనే విషయాన్ని దర్యాప్తు చేయాల్సి ఉందని తీర్థహళ్లి ఠాణా పోలీసులు తెలిపారు.

యువతను ఆకర్షిస్తున్న విద్యుత్తు వాహనాలు

బెంగళూరు (మల్లేశ్వరం), న్యూస్‌టుడే: విద్యుత్తు ద్విచక్ర వాహనాలపై యువత మక్కువ చూపుతోంది. తమ ఈ-బైక్ చేతక్-సి25 శ్రేణి వాహనాలకు యువత నుంచి చక్కని స్పందన లభిస్తోందని బజాజ్ సంస్థ ప్రకటించింది. నగర రద్దీలో ఈ వాహనాలతో ప్రయాణించడం సులువుగా ఉండటం, ఒకసారి ఛార్జింగ్ చేస్తే 113 కి.మీ. వరకు ప్రయాణించే అవకాశం వల్ల పలువురు ఆకర్షితులౌతున్నారు. పలు ప్రాంతాల్లో ఛార్జింగ్ పాయింట్లు అందుబాటులోకి తీసుకువచ్చామని సంస్థ ప్రతినిధులు ప్రకటించారు.

జేఈఈ సెషన్-I ఫలితాల్లో మెరిసిన శ్రీచైతన్య కర్ణాటక విద్యార్థులు

బెంగళూరు (క్రీడలు), న్యూస్‌టుడే: 2026 జేఈఈ ముఖ్య పరీక్షల సెషన్-1 ఫలితాల్లో శ్రీచైతన్య బెంగళూరు, కర్ణాటక విద్యార్థులు ఏడుగురు 99.95 పర్సంటైల్ కన్నా అధిక మార్కులను పొంది ఉత్తమ ప్రతిభ చాటారు. 115 మంది విద్యార్థులు 99 కన్నా అధిక మార్కులు సాధించారు. ఈ సాధనకు విద్యార్థులు, పోషకులు, సిబ్బంది వర్గాలు అందరూ ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా శ్రీచైతన్య విద్యా సంస్థల డైరెక్టర్ సుష్మాబోపణ్ణ, వి.సతీష్‌కుమార్ ఏజీఎం జేఈఈ ముఖ్య పరీక్షల్లో యశస్సు పొందిన ప్రతి విద్యార్థి వారి తల్లితండ్రులకు ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. రామ్‌నిఖిల్ పువ్వాడి-99.99 పర్సెంటైల్, ఆదిత్యసింగ్ 99.98, సుధన్వన్ పి.రావు 99.95 పర్సెంటైల్‌ను సాధించారు.

రామ్‌నిఖిల్ ఆదిత్యసింగ్ సుధన్వన్

నందినిపై దుష్ప్రచారం:కేసు నమోదు

బెంగళూరు (మారతహళ్లి), న్యూస్‌టుడే: నందిని బ్రాండ్ ఉత్పత్తులు నాసిరకం అంటూ సామాజిక మాధ్యమాల్లో ప్రచారం చేస్తున్న వారిపై చర్యలు తీసుకుంటున్నామని కర్ణాటక పాల సమాఖ్య డిమాండ్ చేసింది. తమ ఉత్పత్తులు వినియోగానికి యోగ్యం కాదని పోస్టులు పెట్టిన పేజీలు, ఖాతాలు, వ్యక్తులపై సైబర్ ఠాణ పోలీసులకు కేఎంఎఫ్ అధికారులు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు ఆయా ఖాతాల పరిశీలిన ప్రక్రియను ప్రారంభించారు.

రోడ్డు ప్రమాదంలో యువతి మృతి

బెంగళూరు (రాజాజీనగర), న్యూస్‌టుడే: రాజాజీనగరలోని రాజ్‌కుమార్ రోడ్డులోని హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు వద్ద రోడ్డు ప్రమాదంలో యోగేశ్వరి (27) అనే యువతి మరణించింది. లగ్గెరె సమీపంలోని కెంపేగౌడ లేఅవుట్‌కు చెందిన ఆమె ఒక ప్రైవేటు కంపెనీలో ఉద్యోగిని. భోజనానికి వెళ్తున్న సమయంలో వేగంగా వచ్చిన బైకు ఢీకొనడంతో తీవ్రంగా గాయపడింది. బాధితురాలిని చికిత్స కోసం ఆసుపత్రిలో చేర్పించినా ఫలితం లేకపోయింది.

ఫొటోగ్రాఫర్‌కు అరదండాలు

బెంగళూరు (మారతహళ్లి): నాగొండనహళ్లిలోని ఒక టెకీ నివాసంలో దొంగతనానికి పాల్పడిన కిరణ్ రాజ్ (40) అనే ఫొటోగ్రాఫర్‌ను వైట్‌ఫీల్డ్ ఠాణా పోలీసులు అరెస్టు చేశారు. అతని నుంచి రూ.55 లక్షల విలువైన ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. ఫొటో స్టూడియోలో నష్టాలు రావడంతో ఉపాధి కోసం దొంగతనాలు ప్రారంభించాడని ప్రాథమిక విచారణలో గుర్తించామని సీఐ గురుప్రసాద్ తెలిపారు. టెకీ నివాసం వెలుపల షూ ర్యాక్‌లో తాళం ఉంచి వెళ్తున్నట్లు గమనించి, ఆయన నివాసంలో 380 గ్రాములకు పైగా ఆభరణాలను దొంగిలించాడని విచారణలో గుర్తించారు.

చెత్త కుప్పలో నవజాత శివువు మృతదేహం

బెంగళూరు (జేపీనగర), న్యూస్‌టుడే: అప్పుడే పుట్టిన బిడ్డను దయలేని తల్లి చెత్తకుప్పలో విసిరి వెళ్లిపోయింది. పాలు లేక ఏడ్చి, గొంతు ఎండిపోయి ఆ నవజాత శిశువు మరణించింది. పూర్ణప్రజ్ఞ లేఅవుట్‌లోని ఒక అపార్ట్‌మెంట్ వెనుక చెత్త కుప్పలో పడి ఉన్న చిన్నారి మృతదేహాన్ని అక్కడ ఆడుకుంటున్న బాలురు చూసి ఈషా (22) అనే యువకునికి సమాచారం అందించారు. అతను ఇచ్చిన ఫిర్యాదుతో సుబ్రహ్మణ్యపుర ఠాణా పోలీసులు మృతదేహాన్ని తీసుకుని విక్టోరియా ఆసుపత్రికి తరలించారు. ఈ ప్రాంతానికి చుట్టుపక్కల ఉన్న సీసీ కెమెరాల ఫుటేజీను పరిశీలిస్తున్నామని పోలీసులు తెలిపారు.

విద్యుదాఘాతానికి ఉద్యోగి బలి

తుమకూరు, న్యూస్‌టుడే: విధి నిర్వహణలో ఉండగా అనుకోకుండా విద్యుత్తు సరఫరా జరగడంతో లైన్‌మ్యాన్ దుర్మరణం చెందిన ఘటన ఇది. జిల్లాలోని చిక్కనాయకనహళ్లి తాలూకు వడేరహళ్లి వద్ద మంగళవారం విద్యుత్తు మరమ్మతు పనులు చేస్తుండగా సంభవించిన ప్రమాదంలో బెళగావి జిల్లా గోకాక్ నివాసి హనుమంత జాలికట్టె(40) మృత్యువాత పడ్డారు. ఆకస్మిక దుర్ఘటనలో ప్రాణాలు కోల్పోయిన హనుమంతకు బెస్కాం సిబ్బంది స్థానికులు తీవ్ర సంతాపాన్ని వెలుబుచ్చారు అధికారులు ఘటనను పరిశీలిస్తున్నారు. మృతుని కుటుంబానికి తీవ్ర సంతాపాన్ని తెలిపారు.

హనుమంత జాలికట్టె (పాతచిత్రం)

టీవీ కొట్టేసి..28 ఏళ్ల తర్వాత దొరికాడు

దావణగెరె, న్యూస్‌టుడే: రూ.2 వేల విలువైన టీవీని దొంగిలించి పరారైన ఫకీర (50) 28 ఏళ్ల అనంతరం దొరికిపోయిన ఘటన ఇది. దేవరాజ అరసు లేఅవుట్‌కు చెందిన నిందితుడు, తన అనుచరులతో కలిసి రంగనాథ లేఅవుట్‌లో రుద్రయ్య అనే వ్యక్తి నివాసంలో టీవీని దొంగిలించాడు. ఈ కేసులో దావణగెరె గ్రామీణ ఠాణా పోలీసులు రవి, మునావర్ అనే నిందితులను అరెస్టు చేసి, టీవీ జప్తు చేసుకున్నారు. అప్పటి ఫకీర పోలీసులకు దొరక్కుండా తప్పించుకుని తిరుగుతున్నాడు. ఇటీవల అనుమానాస్పదంగా తిరుగుతున్న అతణ్ని పోలీసులు పట్టుకున్నారు. విచారణలో అతని పాత నేరం వెలుగులోకి వచ్చింది. ఫకీరను న్యాయనిర్ణయానికి తరలించినట్లు పోలీసులు తెలిపారు.

ఇళ్లపై రాళ్లు విసురుతున్న..ఇద్దరి అరెస్టు

క్రైం కార్నర్

చిక్కమగళూరు, న్యూస్‌టుడే: విజయనగర లేఅవుట్‌లోని ఇళ్లపై రాళ్లు విసిరి పరారవుతున్న అక్షద్, హుసేన్ అనే యువకులను స్థానిక పోలీసులు అరెస్టు చేశారు. గత వారం రోజులుగా ఓ వర్గం వారి ఇళ్లను లక్ష్యంగా చేసుకుని వీరు రాళ్లు రువ్వుతూ దాడులకు తెగబడ్డారు. సుధా అనే మహిళ ఫిర్యాదుతో, బజరంగదళ్ కార్యకర్తల సహకారంతో కార్యాచరణ నిర్వహించి, నిందితులను అరెస్టు చేశారు.

ఉద్యాననగరికి విచ్చేసిన సాకర్ దిగ్గజం

బెంగళూరు (క్రీడలు), న్యూస్‌టుడే: అంతర్జాతీయ ఫుట్‌బాల్ ఆటగాడు జెమీనైట్ మంగళవారం నగరానికి విచ్చేశారు. భారత్‌లో పర్యటించడం ఆయనకు ఇది ఏడోసారి. టాప్ ఫ్రీస్టైల్ ఫుట్‌బాల్ ఆటగాళ్ల జాబితాలో స్థానం పొందిన, జెమీ గిన్నిస్ ప్రపంచ రికార్డు నెలకొల్పారు. స్థానిక పోదార్ ఇంటర్నేషనల్ స్కూల్‌కు విచ్చేయడంతో పాఠశాల విద్యార్థులు ఆనందం వ్యక్తం చేశారు. పాఠశాలలో నిర్వహిస్తున్న ప్రత్యేక ఫుట్‌బాల్ సదస్సులో పాల్గొన్న జెమీ ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతిసారీ భారత్‌కు వచ్చినప్పుడు ఇక్కడి విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం, కౌశల్యం, సృజన ఏమేరకు పెరిగిందో చూడడం తనకు ఎంతో ఆనందమన్నాడు. విద్యార్థులు కనబరుస్తున్న ప్రతిభ, ఆసక్తి తనకు మరింత ఉత్సాహాన్ని కల్గిస్తున్నాయని తెలిపాడు. జెమీ 2017 నుంచి రెండేళ్ల పాటు యూఈఎఫ్ఏ ఛాంపియన్స్ లీగ్ ఫైనల్స్‌లో చక్కని ప్రదర్శననిచ్చాడు. ఈ సందర్భంగా విద్యా సంస్థ డైరెక్టర్ హర్షాపోదార్ మాట్లాడుతూ ఆయనను అనేకసార్లు ఆహ్వానించే అదృష్టం తమకు లభించిందన్నారు. జెమీ విద్యార్థులకు ఫుట్‌బాల్ ఆటలోని వివిధ విన్యాసాలను ప్రదర్శించి చూపి వారిలో మరింత ఉత్సాహాన్ని నింపాడు.

ఆటగాళ్ల మధ్య ఫుట్‌బాల్ విన్యాసాన్ని ప్రదర్శిస్తున్న జెమీనైట్

తొమ్మిది కోట్ల కిలోల పొగాకు ఉత్పత్తికి ఆమోదం

గుంటూరు, న్యూస్‌టుడే: రాష్ట్రంలో 2026-27 ఏడాదికి తొమ్మిది కోట్ల (90 మిలియన్) కిలోల పొగాకు ఉత్పత్తికి భారత పొగాకు బోర్డు పాలకమండలి ఆమోదించింది. బోర్డు ఛైర్మన్ చిడిపోతు యశ్వంత్‌కుమార్ అధ్యక్షతన ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరుప్రధాన కార్యాలయంలో 166వ పొగాకు బోర్డు సమావేశం మంగళవారం జరిగింది. అంతర్జాతీయ మార్కెట్ డిమాండ్, రైతుల వినతి మేరకు తొమ్మిది కోట్ల కిలోల సాగుకు తీర్మానం ఆమోదించినట్లు బోర్డు వర్గాలు తెలిపాయి. సమావేశంలో పొగాకు బోర్డు ఈడీ విశ్వశ్రీ, వేలం సంచాలకులు శ్రీనివాస్, వర్చువల్ విధానంలో లోక్‌సభ సభ్యుడు పి.మహేశ్‌కుమార్, రాజ్యసభ సభ్యుడు కె.లక్ష్మణ్, కేంద్ర వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వ శాఖ సంచాలకులు మౌనికా గౌర్ పాల్గొన్నారు.

మాల్యాద్రికి శ్రీకృష్ణదేవరాయ జాతీయ పురస్కారం

బెంగళూరు(యశ్వంతపుర),న్యూస్‌టుడే: కర్ణాటక తెలుగు రచయితల సమాఖ్య ఛైర్మన్ డాక్టర్ బొగ్గవరపు మాల్యాద్రి ప్రతిష్ఠాత్మక శ్రీకృష్ణదేవరాయ సేవారత్న జాతీయ పురస్కారాన్ని స్వీకరించారు. కడప జిల్లా బ్రహ్మంగారి మఠంలో రాయల భువనవిజయం సాహిత్యవేదిక, శ్రీకృష్ణదేవరాయ ఫౌండేషన్ సంయుక్తంగా నిర్వహించిన కార్యక్రమంలో మాజీ ఎంపీ డాక్టర్ ఎన్.తులసిరెడ్డి తదితరుల చేతుల మీదుగా పురస్కారాన్ని అందుకున్నారు. తెలుగు భాషా పరిరక్షణకు మాల్యాద్రి పాటుపడుతున్నారని ఆయన సేవలను గుర్తించి పురస్కారం అందించినట్లు రాయల భువన విజయం సాహిత్య వేదిక అధ్యక్షుడు బొల్లు రామ్మోహన్ తెలిపారు. కార్యక్రమంలో శ్రీకృష్ణదేవరాయ ఫౌండేషన్ అధ్యక్షుడు అల్లం రంగనాయకులు తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎంపీ తులసిరెడ్డి చేతులు మీదుగా ప్రశస్తిని స్వీకరించిన మాల్యాద్రి

(c) eenadu

బళ్ళారి

• బళ్ళారి • రాయచూరు • కొప్పళ • విజయనగర • చిత్రదుర్గ

23న బెంగళూరులో దివ్యాంగుల వినూత్న నిరసన

సమావేశంలో మాట్లాడుతున్న శివగేని

రాయచూరు, న్యూస్‌టుడే: దివ్యాంగుల సమస్యలపై ఈ నెల 23న బెంగళూరులో 'దివ్యాంగుల నరక- రాజకీయం వైపు' అనే వినూత్న కార్యక్రమాన్ని నిర్వహిస్తామని రాష్ట్ర దివ్యాంగుల ఒక్కూట అధ్యక్షుడు శివగేని వెల్లడించారు. ఆయన మంగళవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. దేశంలో దివ్యాంగులు 3.5 కోట్ల మంది ఉంటే కర్ణాటకలో 15 లక్షల మందికి పైగా ఉన్నారని వివరించారు. ఓట్ల కోసం తమ పట్ల సానుభూతి ప్రకటనలు చేసే నాయకులు సౌకర్యాలు అందించేందుకు మాత్రం చొరవ చూపడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పొరుగున ఉన్న తమిళనాడులో మాదిరి రాజకీయాల్లో సంబంధించి ఐదు శాతం రిజర్వేషన్లు కర్ణాటకలో కల్పించాలని, ప్రభుత్వ ఉద్యోగాల భర్తీలో ప్రాధాన్యం ఇవ్వాలని, రూ.6 వేల పింఛను జారీ చేయాలని, దివ్యాంగుల సంక్షేమానికి బడ్జెట్‌లో నిధులను రెట్టింపు చేసేలా ఒత్తిడి తెస్తామని వివరించారు.

విశాఖపట్నంలో చదరంగం పోటీలకు సింధనూరు విద్యార్థిని

డిగ్రీ విద్యార్థిని విజయలక్ష్మిని అభినందిస్తున్న అధ్యాపక బృందం

సింధనూరు, న్యూస్‌టుడే: ఈ నెల 19 నుంచి 24 వరకు ఆంధ్రప్రదేశ్ విశాఖపట్నం గీతం విశ్వవిద్యాలయంలో జరుగనున్న దక్షిణ భారత అంతర్ విశ్వవిద్యాలయాల మహిళల చదరంగం పోటీలకు రాయచూరు ఆదికవి శ్రీమహర్షి వాల్మీకి విశ్వవిద్యాలయం తరఫున ప్రాతినిధ్యం వహించేందుకు సింధనూరు ప్రభుత్వ ఫస్ట్‌గ్రేడ్ కళాశాల విద్యార్థిని విజయలక్ష్మి ఎంపికైంది. ఎంపిక ప్రక్రియలో ఈ యువతి చక్కని ప్రతిభాపాటవాలు చూపడంతో విశ్వవిద్యాలయం క్రీడల విభాగం విజయలక్ష్మిని అంతిమంగా ఎంపిక చేసింది. విద్యార్థిని విజయలక్ష్మి ఈ కళాశాలలో బీఎస్సీ ద్వితీయ సెమిస్టర్ చదువుతోంది. ఈమె ఎంపిక మా కళాశాల కీర్తిని పెంచిందని ప్రాచార్యులు ప్రొఫెసర్ పాండు హర్షం వ్యక్తం చేశారు. మంగళవారం ఈమెను కళాశాల అధ్యాపక బృందం అభినందించి పోటీలకు సాగనంపింది.

ఎట్టకేలకు పైపులైన్ పనులు షురూ!

మాన్వి, న్యూస్‌టుడే: తాలూకాలోని చిక్కకొట్నేకల్ పంచాయతీ గ్రామానికి సరిగ్గా తాగు నీరు సరఫరా చేయటంలేదని ఆరోపిస్తూ స్థానికులు పంచాయతీకి తాళాలు బిగించి ముట్టడించిన విషయం విదితమే. ఈనాడులో ఈ వార్త ప్రచురితం కాగా తాలూకా పంచాయతీ కార్యనిర్వహణాధికారి మంగళవారం చిక్కకొట్నేకల్ గ్రామానికి వచ్చి నీటి సమస్యపై ఆరా తీశారు. స్థానిక గ్రామ పంచాయతీ అధికారుల పర్యవేక్షణలో సిబ్బంది పైపులైన్ సరిచేసే మోటార్ మరమ్మతు పనులను ప్రారంభించారు. దీంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

పైపులైన్ సరిచేస్తున్న పంచాయతీ సిబ్బంది

ప్రజలు సహకరిస్తేనే అక్రమ రవాణా నివారణ

ప్రసంగిస్తున్న న్యాయమూర్తి సాత్విక్

రాయచూరు, న్యూస్‌టుడే: మహిళలు, బాలల అక్రమ రవాణాను అడ్డుకునేందుకు ప్రజల సహకారం అవసరమని సీనియర్ సివిల్ న్యాయమూర్తి, జిల్లా న్యాయసేవల ప్రాధికార సభ్య కార్యదర్శి హెచ్.ఎ.సాత్విక్ పేర్కొన్నారు. స్త్రీలు, చిన్నారుల రవాణాను నియంత్రించే చట్టాలపై అధికారులు, సిబ్బందికి అవగాహన కల్పించేందుకు మంగళవారం ఇక్కడి మహిళా శిశు సంక్షేమ శాఖ కార్యాలయ సభా భవనంలో సదస్సు నిర్వహించారు. సాత్విక్ కార్యక్రమాన్ని ప్రారంభించి ఉపన్యసించారు. తరలించడం అమానుషమని తెలిపారు. వారి హక్కులను కాలరాస్తూ, ఉల్లంఘిస్తున్నట్లు అనేక కేసులు నమోదవుతున్నాయని వివరించారు. మహిళా శిశు సంక్షేమ శాఖ ఉప నిర్దేశకుడు నవీన్‌కుమార్ ప్రసంగిస్తూ చట్ట వ్యతిరేక కార్యకలాపాల పట్ల మౌనం వహించవద్దని కోరారు. మహిళలు, పిల్లల్ని అక్రమంగా రవాణా చేస్తున్నట్లు తెలిస్తే సమాచారం ఇవ్వాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా అక్రమ రవాణాను అడ్డుకుంటామని, క్లిష్ట పరిస్థితుల్లో ఉన్న వారిని రక్షించేందుకు సహకరిస్తామని, బాధితులకు న్యాయం అందేందుకు తోడ్పాటు అందిస్తామని, రాజ్యాంగంలోని సమాన అవకాశాలను నెరవేర్చేందుకు తమ వంతు కృషి చేస్తామని ఎస్పీ కుమారస్వామి ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమానికి వివిధ శాఖల అధికారులు సింధు, ఆరతి, అమరేశ్, శివమానప్ప, శరణమ్మ, మహబూబ్‌సాబ్ హాజరయ్యారు.

ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, సిబ్బంది

వాహనాలు ధ్వంసం

చెట్టుకింద నుజ్జయిన ఆటో

బెంగళూరు (రాజాజీనగర), న్యూస్‌టుడే : రాజాజీనగర శ్రీరామమందిర ఆటల మైదానంలో నిలిపి ఉంచిన వాహనాలపై చెట్టు విరిగిపడింది. ఆటో డ్రైవర్ వేణుగోపాల్ ఒక ప్రయాణికురాలితో వెళుతున్న సమయంలో మంగళవారం ఒక కొమ్మ ఆ ఆటోపై పడింది. వాహనం ముందు భాగంలో కొమ్మ పడడంతో డ్రైవర్, ప్రయాణికురాలు గాయపడకుండా, ఎలాంటి ప్రమాదం నుంచి తప్పించుకున్నారు. ప్రమాదంలో మూడు ద్విచక్రవాహనాలు ధ్వంసమయ్యాయి. రాజాజీనగర ఠాణా పోలీసులు దర్యాప్తు చేపట్టారు. విరిగిన చెట్టు కొమ్మలు, స్థానికంగా ఉన్న చెట్లకు ఉన్న ఎండు కొమ్మలను తొలగించేందుకు పాలికె సిబ్బంది చర్యలు చేపట్టారు.

వేసవిలోనూ నీటి సమస్య రానివ్వం

ఏకుమక్కల తాయి అమ్మవారికి పూజలు చేస్తున్న మంత్రి బోసురాజు

సిరివార,(మాన్వి): స్థానిక నాగడదిన్ని రోడ్డు వద్ద ఉన్న ఏకుమక్కళ తాయి అమ్మవారి ఆలయాన్ని రాష్ట్ర చిన్ననీటి పారుదల, శాస్త్ర సాంకేతిక శాఖల మంత్రి ఎన్.ఎస్.బోసురాజు సందర్శించారు. ఈ సందర్భంగా భక్తుల కోరిక మేరకు ఈ ప్రాంతంలో సముదాయ భవనం నిర్మించేందుకు ఇప్పటికే నిధులు విడుదల చేసినట్లు తెలిపారు. ఆలయం ఇతర అభివృద్ధి పనులకు కూడా సహకరిస్తామన్నారు.

ప్రత్యామ్నాయాలపై చర్చ

మాన్వి: సిరివార తాలూకాల్లో వేసవిలో నీటి సమస్య తలెత్తకుండా చూసేందుకు శాయశక్తులా ప్రయత్నిస్తున్నట్లు మంత్రి ఈ సందర్భంగా వెల్లడించారు. నీటి సమస్య నివారణ కోసమే బుధవారం మాన్వి తాలూకా పంచాయతీ సభాంగణంలో ఉభయ తాలూకాల అధికారుల ప్రత్యేక సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు మంత్రి తెలిపారు. వేసవిలో పశువులకు మేత, నీరు సరఫరా పనుల్లో సమస్యలు, ప్రత్యామ్నాయంతో సాధ్యమైనంత సమస్యల్లేకుండా చూస్తామన్నారు. ఈ సందర్భంగా పట్టణ పంచాయతీ అధ్యక్షుడు హాజీవలి, ప్రముఖులు శరణయ్యనాయక్ గుడదిన్ని, చుక్కి సూగప్ప సాహుకార్, పట్టణ పంచాయతీ ముఖ్యాధికారి సురేశ్ శెట్టి, టీపీఈఓ శశిధర్‌స్వామి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే సూచనతో నిలిచిన పనులు

నిలిచిన రహదారి నిర్మాణం పనులు

సింధనూరు, న్యూస్‌టుడే: సింధనూరులో రైల్వే స్టేషను మార్గానికి సీసీ రోడ్డు నిర్మాణం పనులు ఎట్టకేలకు నిలిచాయి. ఎమ్మెల్యే బాదర్లి హంపనగౌడ తాత్కాలికంగా పనులు ఆపుదామని నీటిపారుదల శాఖ ఈఈకి చరవాణిలో సూచనలు ఇవ్వడంతో పనులు అక్కడికే నిలిచాయి. ఈ మార్గం 40వ కాలువ గట్టున ఉండి, నీటిపారుదల శాఖకు చెందినది. స్టేషను నుంచి కుష్టగి ప్రధాన రహదారికి కలుపుతూ దాదాపు ఒక కిలోమీటర్ పొడవు ఉంది. ప్రస్తుతం రైల్వే స్టేషను వెళ్లే ప్రయాణికులకు సౌకర్యంగా స్టేషను దగ్గర నుంచి పాత కమ్మవారి సంఘం సమీపంలోని గంగావతి ప్రధాన రహదారి వరకు రహదారిని అభివృద్ధి చేస్తున్నారు. ఇందులో శ్రీ త్యాగరాజ్ క్రాస్ వరకు 1.5 కిలోమీటర్ల మేరకు సిమెంటు దారిని నిర్మిస్తున్నారు. మొత్తం కాలువ గట్టు 66 అడుగులు ఉండగా అధికారులు కేవలం 36 అడుగుల మేరకే రహదారి నిర్మిస్తూ..తమ పరిధిలో గల గట్టు దిగువన మురుగు కాలువను నిర్మించకుండా దాదాపు 30 అడుగుల మేర దారిని అన్యాక్రాంతానికి అవకాశం ఇస్తూ వదిలేశారు. దీనికి మాజీ ఎంపీ కె.విరుపాక్షప్ప మొదలుకొని అనేక మంది అభ్యంతరం తెలిపి ఎమ్మెల్యేపై విమర్శలు గుప్పించారు. విషయం ఎమ్మెల్యే వరకు వెళ్లడంతో ఆయన నీటిపారుదల ఈఈకి సూచనలు ఇచ్చి పనులు నిలిపివేయించారు. ఎమ్మెల్యే బాదర్లి మంగళవారం రాత్రి విదేశీ పర్యటనకు బయలుదేరుతున్నందున మార్చి ఒకటిన తిరిగి సింధనూరు వస్తారు. అంతవరకు స్టేషను దారి నిర్మాణం పనులు నిలిచినట్లే.

బైపాస్ రహదారిని నిర్మించాలని వినతి

వినతిపత్రాన్ని పరిశీలిస్తున్న సీఎం

రాయచూరు, న్యూస్‌టుడే: జిల్లా కేంద్రం పరిధి లింగసూగూరు రహదారి రాష్ట్ర 20వ హైవేను మంత్రాలయం రహదారి జాతీయ హైవే 167తో అనుసంధానించేందుకు బైపాస్ రహదారిని నిర్మించాలని ఎమ్మెల్సీ వసంతకుమార్ సీఎంకు విజ్ఞప్తి చేశారు. రెండు లేక నాలుగు వరుసల బైపాస్‌కు ఆమోదం తెలిపి, బడ్జెట్‌లో రూ.250 కోట్లు కేటాయించాలని విన్నవించారు. ఎమ్మెల్సీ మంగళవారం బెంగళూరులో ముఖ్యమంత్రి సిద్ధరామయ్యను కలిసి ఈమేరకు వినతి పత్రాన్ని అందజేసి వివరించారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, మహారాష్ట్రకు రాకపోకలు సాగించే సరకు వాహనాలు నగరంలో ప్రవేశిస్తున్నందున రాయచూరులో నిత్యం రద్దీ సమస్య ఎదుర్కోవాల్సి వస్తోందని వివరించారు. బైపాస్ రహదారి నిర్మితమైతే ప్రజలకు సంచార కష్టాలు తప్పుతాయన్నారు.

కేంద్ర బృందం ఉపాధి పనుల పరిశీలన

పశువులదొడ్డి వద్ద సమీక్షిస్తున్న అధికారులు

రాయచూరు, న్యూస్‌టుడే: కేంద్ర ఆడిట్ బృందం అధికారి కుముద్ దుబె రాయచూరు తాలూకాలో గ్రామీణ ఉపాధి పథకం కింద జరుగుతున్న పనులను పరిశీలించారు. తొలుత చంద్రబండ పంచాయతీ కార్యాలయానికి వెళ్లి వివిధ పనులకు సంబంధించిన దస్త్రాలు, కూలీల పేర్ల నమోదు, హాజరు పుస్తకాన్ని పరిశీలించారు. అనంతరం అరసిగేరా తాండాలో పశువుల దొడ్ల నిర్మాణం, నాగనదొడ్డి గ్రామంలో కందకం కట్టడం పనులను చూశారు. తర్వాత చింతలకుంట, చంద్రబండలో అమృత సరోవర పథకాన చేపట్టిన చెరువు పనులను తనిఖీ చేశారు. కడగందొడ్డిలో నిర్మిస్తున్న రహదారి, కురుబదొడ్డిలో చెరువు పూడికతీత, కట్లకటూరులో నిర్మిస్తున్న మురుగునీటి నిర్మాణ పనుల గురించి తెలుసుకున్నారు. అధికారి వెంట తాలూకా పంచాయతీ ఈవో చంద్రశేఖర్ పవార్, సహాయ నిర్దేశకుడు హనుమంతు ఉన్నారు.

అక్రమ కేసుల్ని ఖండిస్తూ దళ్ పాదయాత్ర

రాయచూరు, న్యూస్‌టుడే: దళ్ నాయకుడిపై తప్పుడు కేసులు పెట్టడాన్ని ఖండిస్తూ స్థానిక కనకదాసు కూడలి నుంచి ఎస్పీ కార్యాలయం వరకు పాదయాత్ర చేపడతామని ఎస్సీ విభాగం అధ్యక్షుడు నరసప్ప ఆశాపూరు తెలిపారు. జిల్లా అధ్యక్షుడు విరూపాక్షి నేతృత్వంలో బుధవారం ఉదయం 11 గంటలకు కనకదాసు విగ్రహానికి పూలమాల వేసిన అనంతరం పాదయాత్ర మొదలవుతుందని వెల్లడించారు. పార్టీ శ్రేణులు తరలిరావాలని కోరారు. కాంగ్రెస్ నాయకుడు జి.తిమ్మారెడ్డి ప్రోద్బలంతో కొందరు దళ్ నగరాధ్యక్షుడు బి.తిమ్మారెడ్డిపై పనిగట్టుకుని పోలీసుఠాణాకు వెళ్తున్నారని, కాంగ్రెస్ యువ నాయకుడి సూచనల మేరకు కేసులు నమోదు చేస్తున్నారని తెలిపారు. రాబోయే నగర పాలక సంస్థ ఎన్నికల్లో దళ్ తరఫున పోటీ చేయకుండా భయపెట్టేందుకే ఇలా చేస్తున్నారని, ఇందుకోసం ఒక బృందాన్ని నియమించినట్లు ఎస్పీ దృష్టికి తీసుకువస్తామని వెల్లడించారు.

ప్రేమించి.. పెళ్లాడి.. చివరికి ప్రాణం తీశాడు

చిక్కమగళూరు, న్యూస్‌టుడే : ప్రేమించి వివాహం చేసుకున్న మమత (32)ను ఆమె భర్త రంగనాథ్ (34) దారుణంగా హత్య చేసిన ఘటన బీరూరు పట్టణం చౌడేశ్వరినగర్ ప్రాంతంలో కలకలం రేకెత్తించింది. రంగనాథ్ భవన నిర్మాణ కార్మికుడు. భర్త ఆదాయానికి తోడుగా వృత్తిపరమైన పనులు, కల్యాణ మండపంలో వంట పనులు చేసేది. తాను పొరుగూరికి పనులకు వెళ్లినప్పుడు భార్య ఇతరులతో సన్నిహితంగా ఉంటోందని ఆయన అనుమానించేవాడు. ఎప్పుడూ ఆమె చరవాణిలో మాట్లాడుతూ ఉండటాన్ని గమనించి గొడవ పడేవాడు. ఇదే అనుమానంతో ఆమెపై సోమవారం రాత్రి దాడి చేసి గొంతు నులిమి హత్య చేశాడని బీరూరు ఠాణా పోలీసులు మంగళవారం వెల్లడించారు. నిందితుడ్ని అరెస్టు చేసి విచారణ చేపట్టారు.

బ్రహ్మకుమారీల సేవలు అనన్యం

ప్రసంగిస్తున్న ఎస్.సజ్జన్

భరతనాట్యం ప్రదర్శన

రాయచూరు, న్యూస్‌టుడే: సమాజంలో శాంతి, సౌహార్దతలు నెలకొనేందుకు ప్రజాపిత బ్రహ్మకుమారీ విశ్వవిద్యాలయం చేస్తున్న కృషి అపారమని రాయచూరు విభాగం సహాయక కమిషనర్ డాక్టర్ పంపన్న సజ్జన్ ప్రశంసించారు. శివరాత్రి పురస్కరించుకుని స్థానిక వాల్మీకి మైదానంలో ద్వాదశ జ్యోతిర్లింగాల దర్శన కార్యక్రమం సోమవారం రాత్రి ముగిసింది. ముగింపులో పాల్గొన్న సజ్జన్ ప్రసంగిస్తూ ఏటా మాదిరిగానే ఈసారీ భక్తులు శివలింగాలను దర్శించుకుని తరించారని తెలిపారు. 12 లింగాలను ఒకేచోట తిలకించే అవకాశం కల్పించిన బ్రహ్మకుమారీలను అభినందించారు. ఏఎస్పీ కుమారస్వామి మాట్లాడుతూ భావ సమైక్యత కోసం ఇటువంటి కార్యక్రమాలు తరచూ నిర్వహించాలని కోరారు. రిమ్స్ డీన్ డాక్టర్ రమేశ్ ప్రసంగిస్తూ విద్యార్థుల్లో ఆధ్యాత్మిక భావాలు పెంపొందిస్తున్న ఈ సంస్థ కార్యకలాపాలకు అండగా నిలుద్దామన్నారు. ప్రజాపిత సంచాలకురాలు స్మితా, ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు కృష్ణ శావంతగేరా, జిల్లా క.సా.ప. సహ కార్యదర్శి దండప్ప బిరాదార్ పాల్గొన్నారు. గాయకుడు గురునాథ్ పంచాక్షరి మంత్రాన్ని పఠించారు. రాఘవ నాట్యమృత సంస్థ బృందం నాట్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

హేమారెడ్డి మల్లమ్మ విగ్రహావిష్కరణ

సిరివార,(మాన్వి): పట్టణంలోని 10వ వార్డు మల్లమ్మ లేవుట్‌లో శివ శరణె హేమారెడ్డి మల్లమ్మ విగ్రహాన్ని మంగళవారం ఆవిష్కరించారు. నీలగల్ బృహన్మఠం డాక్టర్ పంచాక్షరి శివాచార్య మహాస్వామీజీ, నవలకల్ బృహన్మఠం అభినవ సోమనాథ్ శివాచార్య స్వామీజీ సాన్నిధ్యంలో మాజీ ఎమ్మెల్యే రాజా వెంకటప్పనాయక్ ఇతర నాయకులు కలిసి ప్రారంభించారు. హేమారెడ్డి మల్లమ్మ మహిళలందరికీ ఆదర్శప్రాయమన్నారు. ఆమె పేరున విగ్రహం నెలకొల్పటం అన్ని విధాలా సముచితమన్నారు. ఈ సందర్భంగా బ్రిజేష్ పాటిల్, జి.లోకరెడ్డి, చుక్కి సూగప్పసాహుకార్, శివశంకర్‌పాటిల్, విరూపాక్షిగౌడ, మల్లికార్జునగౌడ, శ్రీధర్‌స్వామి, శరణప్పగౌడ, ప్రకాష్ పాటిల్, కాశీనాథ్, వీరేశ్, గురుగౌడ తదితరులు పాల్గొన్నారు.

కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు, అభిమానులు

ఓటర్ల జాబితాలో దిద్దుబాట్లే కీలకం

రాష్ట్ర ఎన్నికల కమిషనర్ జి.ఎస్.సంగ్రేశికి వినతిపత్రం అందిస్తున్న ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్, మంత్రులు రామలింగారెడ్డి, దినేశ్ గుండూరావు తదితరులు

ఎన్నికల అధికారికి డీకే విన్నపం

బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే : గ్రేటర్ బెంగళూరు ప్రాధికార (జీబీఏ) పరిధిలోని ఐదు నగర పాలికెలకు ఎన్నికలు నిర్వహించే అవకాశాలున్న క్రమంలో ఓటర్ల జాబితా సవరణ విధానంలో లోపాలను సవరించాలని ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్ ప్రతిపాదించారు. ఈమేరకు ఆయన మంగళవారం రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌కు జి.ఎస్.సంగ్రేశిని కలిసి ఓ వినతిపత్రం సమర్పించారు. కేంద్ర ఎన్నికల కమిషన్ రాష్ట్రంలో ఓటర్ల జాబితా ప్రత్యేక దిద్దుబాటు చర్యలు (ఎస్ఐఆర్) చేపట్టే ప్రయత్నాలు ప్రారంభించడంతో ఉపముఖ్యమంత్రి ఆ అధికారిని కలిసి అభ్యంతరాలు తెలిపారు. ఇప్పటికే రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో ఎస్ఐఆర్‌పై చర్చించామని, మంత్రులంతా ఆ విధానంపై ఆందోళన వ్యక్తం చేశారని వివరించారు. గతంలో కేంద్ర ఎన్నికల కమిషన్ సిద్ధం చేసిన ఓటరు జాబితాలో లోపాలు ఉన్నాయని, వాటిని మాత్రమే సవరించాలని విన్నవించారు. ఒకింట్లో ఉన్న ఓటర్లను వేర్వేరు పోలింగు కేంద్రాల్లో చేర్పించారని, సక్రమంగా మ్యాపింగ్ చేయలేదని, ఆ లోపాలే సవరించాలని కోరినట్లు డీకే గుర్తుచేశారు. ఫారం:7 ఇచ్చి ఓటరు జాబితా నుంచి పేర్లు తొలగించారని, ఇది మంచిది కాదన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ఓటరు జాబితా నవీకరించాలన్నారు. అందులోని లోపాలను ఎన్నికల సంఘం దృష్టికి తేవడంతో పాటు కొందరు బీఎల్‌ఓలు ఒకింట్లో ఉండే ఓటర్లను రెండు భాగాలు చేసి వేర్వేరు పోలింగు కేంద్రాల్లో చేర్పిస్తున్నారని అభ్యంతరం తెలిపారు. కొన్ని ప్రాంతాల్లో అల్పసంఖ్యాకులు, వెనుకబడిన వర్గాల ఓటర్ల పేర్లను తొలగించారని ఆందోళన వ్యక్తం చేశారు. డబుల్ ఓటింగ్, మూడు ప్రాంతాల్లో ఓటు తదితర తప్పులు ఉన్నాయన్నారు. ఈ తప్పులకు బాధ్యులను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. కమిషనర్‌ను కలిసిన వారిలో మంత్రులు రామలింగారెడ్డి, దినేశ్‌గుండూరావు, బమూల్ అధ్యక్షుడు డీకే సురేష్, శాసనసభ్యులు రిజ్వాన్ హర్షద్, ఏసీ శ్రీనివాస్, పుట్టణ్ణ, శ్రీనివాస్ తదితరులున్నారు.

ఆటోలో అమెరికా రాయబారి!

సెర్జియో గోర్‌తో ఆటోలో ప్రయాణిస్తున్న తేజస్వి సూర్య

అమెరికా రాయబారిని సత్కరిస్తున్న సిద్ధరామయ్య

జయనగర, యశ్వంతపుర : భారత్‌లో అమెరికా రాయబారి సెర్జియో గోర్‌తో కలిసి బెంగళూరు దక్షిణ లోక్‌సభ సభ్యుడు తేజస్వి సూర్య నగర వీధుల్లో ఆటోలో ప్రయాణించారు. ఇందిరానగరలోని ఫిల్టర్ కాఫీ రెస్టారెంటుకు వెళ్లి, ఇడ్లీ, దోసె, కాఫీ రుచి చేశారు. భారత్- అమెరికా మధ్య వ్యాపారం, సాంకేతికత, ఆవిష్కరణలకు సంబంధించి తాము చర్చించుకున్నామని సూర్య తెలిపారు. ఆటో ప్రయాణాన్ని గోర్ ఆస్వాదించారని చెప్పారు. బెంగళూరులో 700కు పైగా అమెరికన్ కంపెనీలు ఉన్నాయన్నారు.

సిద్ధుతో మంతనాలు..

ముఖ్యమంత్రి సిద్ధరామయ్యను మంగళవారం అమెరికా రాయబారి సెర్జియో గోర్ కలిశారు. మైసూరు పేటా, గంధం మాలతో ఆయనను సిద్ధు సత్కరించారు. రాష్ట్రంలో పారిశ్రామికాభివృద్ధి, పరిశ్రమల ఏర్పాటు తదితర అంశాలపై ఇద్దరి మధ్య చర్చలు జరిగినట్లు ముఖ్యమంత్రి సచివాలయ వర్గాలు తెలిపాయి. అభివృద్ధి పథకాలపైనా వారు చర్చించారు. ఈసందర్భంగా మంత్రి డాక్టర్ సుధాకర్ తదితరులు చర్చల్లో పాల్గొన్నారు.

సంగీత ఉపాధ్యాయినుల నియామకానికి దరఖాస్తులు

రాయచూరు, న్యూస్‌టుడే: కేంద్ర మిషన్ వాత్సల్య మార్గదర్శకాల మేరకు జిల్లా బాలల రక్షణ విభాగం పరిధిలోని బాలల పాలనా సంస్థల్లో సంగీత ఉపాధ్యాయినులను తాత్కాలికంగా నియమించుకునేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నారు. దరఖాస్తులో విద్యార్హత, అనుభవం వివరాల దాఖలాల్ని జత చేసి ఈ నెల 23 లోపు రాయచూరు అజాదనగర్‌లోని బాలల రక్షణ కార్యాలయంలో అందజేయాలని అధికారులు కోరారు.

తుంగభద్ర జలాశయం నీటిమట్టం		
పూర్తిస్థాయి నీటిమట్టం 1633 అడుగులు		
17-02-2026 (ఉ॥ 8 గంటలకు)	ప్రస్తుతం	గత సంవత్సరం
నీటిమట్టం (అడుగుల్లో)	1602.07	1611.84
ఇన్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	000	000
అవుట్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	428	9,821
నీటి నిల్వ (టి.ఎం.సి)	24.312	41.327
గరిష్ఠసామర్థ్యం (133 టీఎంసీలు)	వాస్తవసామర్థ్యం 105.788 టీఎంసీలు	

కన్నడ సాహిత్య సేవలో భాగస్వాములవుదాం

మాన్వి,న్యూస్‌టుడే: నీర్‌మాన్వి గ్రామంలోని సిద్ధారూఢమఠం ఆవరణలో ఈనెల 28న సమ్మేళనాన్ని నిర్వహించనున్నట్లు తాలూకా కన్నడ సాహిత్య పరిషత్ అధ్యక్షుడు శరణబసవ తెలిపారు. పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ 11వ సమ్మేళనం విజయవంతానికి అందరూ చేయూతనందించాలన్నారు. కన్నడమ్మ సాహిత్య సేవలో అందరూ భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. స్థానిక పత్రికా భవనంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో శరణబసవ మాట్లాడారు. సమ్మేళనం స్వాగత సమితి గౌరవాధ్యక్షుడిగా మంత్రి ఎన్.ఎస్.బోసురాజు, అధ్యక్షుడిగా ఎమ్మెల్యే హంపయ్యనాయక్ వ్యవహరిస్తారన్నారు. సాహిత్యాభిమానుల ఏకాభిప్రాయం మేరకు సాహితీవేత్త డాక్టర్ బసవ ప్రభుపాటిల్ బెట్టదూర్‌ను సమ్మేళనాధ్యక్షుడిగా ఎంపిక చేసినట్లు చెప్పారు.

ఆస్తి కోసం తండ్రిని కొట్టిచంపిన తనయుడు

బెంగళూరు (హలసూరు), న్యూస్‌టుడే : ఆస్తి కోసం మోహన్‌కుమార్ అనే వ్యక్తి తన తండ్రి మునికృష్ణప్ప (66)ను హత్య చేశాడు. ఇందిరానగర ఠాణా పోలీసుల కథనం ప్రకారం.. బీఎంటీసీ నుంచి పదవీ విరమణ అనంతరం మునికృష్ణప్ప ముత్యాలమ్మ దేవాలయం సమీపంలో ఉండేవారు. సంపాదనలో ఎక్కువ భాగాన్ని ఇళ్ల స్థలాలు కొనుగోలు చేసి, భవనాలు నిర్మించి బాడుగకు ఇచ్చారు. తన ఆస్తికి వీలునామా రాసి, అందులో ఎక్కువ మొత్తాన్ని మనవళ్ల పేరిటే మార్చారు. తన పేరిట ఆస్తి రాయాలని కొద్ది రోజులుగా మోహన్‌కుమార్ తండ్రితో గొడవ పడుతూ వస్తున్నాడు. ఇదే విషయమై గత శనివారం రాత్రి తండ్రితో గొడవ పడి, ఇనుప రాడ్‌తో తలపై కొట్టడంతో ఆయన తీవ్రంగా గాయపడ్డాడు. బాధితుడ్ని చికిత్స కోసం ఆసుపత్రిలో చేర్పించగా, చికిత్స పొందుతూ మంగళవారం వేకువజామున కన్నుమూశారు. హత్యాయత్నం కేసును హత్యకేసుగా మార్చుకుని పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

రోడ్డుప్రమాదంలో ఇద్దరి దుర్మరణం

హాసన, న్యూస్‌టుడే : చెన్నరాయపట్టణ తాలూకా దొడ్డేరి కావలు గేట్ వద్ద సోమవారం రాత్రి సంభవించిన రోడ్డు ప్రమాదంలో మత్తిఘట్ట నివాసి రమేశ్ (23), ఎం.హొన్నేనహళ్లి నివాసి పురుషోత్తమ్ (26) మరణించారు. కిరణ్ అనే యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. కిరణ్, రమేశ్ ఇద్దరూ వస్తున్న బైకును ఎదురుగా మరో బైకులో వచ్చిన పురుషోత్తమ్ ఢీకొట్టడంతో ప్రమాదం సంభవించింది. హిరిసావె ఠాణా పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

ఏపీఎంసీ పేరు గొప్ప.. రహదారులు దిబ్బ

రాయచూరు, న్యూస్‌టుడే: దక్షిణ భారత్‌లోనే అతి పెద్ద వ్యవసాయ ఉత్పత్తుల విక్రయ విపణుల్లో ఒకటని గొప్పగా చెప్పుకునే రాయచూరు ఏపీఎంసీ(గంజ్)లో రహదారులు అధ్వానంగా తయారయ్యాయి. పాడైన దారుల స్థానంలో కొత్తవి నిర్మించడం లేదు. కనీసం గుంతలనైనా పూడ్చడం లేదు. దీంతో పంటను తీసుకొచ్చే లారీల, ట్రాక్టర్లు, టెంపోలు చోదకులు ఈ మార్గంలో రావటానికి జడుసుకుంటున్నారు. ఏపీఎంసీని చూస్తే పేరు గొప్ప ఊరుదిబ్బ అన్న సామెత గుర్తుస్తోంది. తొమ్మిది దశకాల చరిత్ర కల్గిన ఈ మార్కెట్‌ను 1934లో స్థాపించారు.

పాలక మండలికి పట్టని రోడ్లు

ఆదాయం దండిగా సమకూరుతోంది. అయితే పాలక మండలి, అధికారులు రహదారుల మరమ్మతులు పట్టించుకోవడం లేదని రైతులు ఆవేదనతో వెలుబుచ్చుతున్నారు. పొరుగున ఉన్న యాదగిరి, తెలుగు రాష్ట్రాల సరిహద్దుల అన్నదాతలు వివిధ ఉత్పత్తులను తీసుకొస్తారు. దసరా నుంచి సంక్రాంతి వరకు లోడింగ్, అన్‌లోడింగ్ చేసే వందలాది వాహనాలతో మార్కెట్ కిక్కిరిసిపోతోంది. వాహనాన్ని పార్కింగ్ చేసేందుకు ఖాళీ స్థలం కోసం వెదుక్కోవాలి. నిండు లోడ్‌లతో వస్తున్నందున సహజంగానే రహదారులు పాడవుతాయి కనుక ఏటా బాగు చేయించాలి. గత రెండేళ్ల వ్యవధిలో తాత్కాలిక పనులు చేయలేదు. వానాకాలంలో గుంతలు కన్పించక ముందుకు వెళ్లటానికి చోదకులు ముప్పు తిప్పలు పడాల్సిందే. ఏప్రిల్ నుంచి ఆగస్టు వరకు మార్కెట్ ఖాళీగా ఉంటుంది. ఈ వ్యవధిలో పనులు చేయాలన్న రైతు సంఘాలు విన్నపాలు బుట్ట దాఖలవుతున్నాయి. పన్నుల వసూళ్ల కోసం అధికారులు కనబరుస్తున్న శ్రద్ధ మౌలిక వసతుల కల్పనపై చూపడం లేదని రైతు నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఏపీఎంసీ అధ్యక్షుడు, ఉపాధ్యక్షుడు, సభ్యులు దెబ్బతిన్న రహదారుల దుస్థితిని చూడాలని కోరుతున్నారు.

మార్కెట్ మొదటి క్రాస్ వద్ద అధ్వానంగా తయారైన మార్గం

(c) eenadu

నిమిషం ఆలస్యమైనా అనుమతి ఉండదు

● ఇంటర్ పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్

● 'న్యూస్‌టుడే' ముఖాముఖిలో ఆర్జేడీ సురేష్‌బాబు

ప్రతి విద్యార్థి జీవితంలో ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు ముఖ్యమైనవి. వారి భవిష్యత్తును నిర్ణయించే ఈ పరీక్షలు ఈనెల 23వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. మార్చి 24వ తేదీ వరకు కొనసాగుతాయి. ఈసందర్భంగా పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు, అధికారుల నియామకం, నిబంధనలు తదితర అంశాలను ఇన్‌ఛార్జి ఆర్జేడీ సురేష్‌బాబు వివరించారు.

– న్యూస్‌టుడే, కర్నూలు విద్య

78,831 మంది విద్యార్థులు

ఈ ఏడాది ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలకు కర్నూలు జిల్లాలో 48,964, నంద్యాల జిల్లాలో 29,867 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. నంద్యాల 55, కర్నూలు జిల్లాలో 75 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్ష ఉంటుంది. పరీక్ష సమయానికి గంట ముందే కేంద్రానికి విద్యార్థులు చేరుకోవాలి. నిమిషం ఆలస్యమైనా కేంద్రంలోకి అనుమతి ఉండదు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుంది.

హెల్ప్‌డెస్క్

● పరీక్ష కేంద్రాల వద్ద ఏవైనా సమస్యలు తలెత్తితే కర్నూలు జిల్లా విద్యార్థులు 08518- 222047, నంద్యాల జిల్లా వారు 6281134324 నంబరుకు ఫోన్‌చేసి సమాచారం ఇవ్వవచ్చు.

చరవాణులు నిషేధం

● కర్నూలు జిల్లాలో ఇద్దరు సభ్యులతో కూడిన ఆరు సిట్టింగ్ స్క్వాడ్ బృందాలు, ముగ్గురు సభ్యులతో కూడిన రెండు ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు, చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్టుమెంటల్ ఆఫీసర్లు, ఇన్విజిలేటర్ల నియామకం పూర్తయింది.

● నంద్యాల జిల్లాలో నాలుగు సిట్టింగ్ స్క్వాడ్, మూడు ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలను నియమించాం.

● పరీక్షల విధుల్లో ఉన్న అధికారులు సెల్‌ఫోన్లు వినియోగించడాన్ని నిషేధించామన్నారు. ఎవరైనా అధికారులు చరవాణితో కనిపిస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ప్రత్యేక బృందాలు

కేంద్రాల తనిఖీ కోసం ప్రత్యేక బృందాలను నియమించడం జరిగింది. ప్రతి కేంద్రంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశాం. జిల్లా, రాష్ట్ర స్థాయి అధికారులు వీటిని పర్యవేక్షిస్తుంటారు. ఎక్కడ ఏ చిన్న ఇబ్బంది కలిగినా వెంటనే చర్యలు తీసుకునే విధంగా రెండు జిల్లాల కలెక్టర్ల నుంచి అనుమతులు వచ్చాయి. పరీక్షా కేంద్రాల వద్ద శాంతిభద్రతల సమస్యలు తలెత్తకుండా పోలీసు శాఖ బందోబస్తు నిర్వహిస్తుంది.

ప్రమాదమని తెలుసు.. ప్రశ్నించరని అలుసు

కర్నూలు వెంకటరమణకాలనీ ప్రధాన రహదారిపై మంగళవారం ఓ విద్యుత్తు స్తంభాన్ని క్రేన్ ద్వారా ప్రమాదకరంగా తరలించారు. వాహనాల రద్దీ అధికంగా ఉన్న సమయంలో కనీస జాగ్రత్తలు పాటించకుండా... వాహనదారులను హెచ్చరించే చర్యలేవీ చేపట్టకుండా నిర్లక్ష్యంగా స్తంభాన్ని తీసుకెళ్లడం పట్ల పలువురు ఆగ్రహం వ్యక్తం చేశారు. అటూ ఇటూ ఊగుతున్న స్తంభం ఏమాత్రం తగిలినా ప్రాణాలు పోయే ప్రమాదం ఉంది.

– ఈనాడు, కర్నూలు

మిల్లర్ల కనుసన్నల్లో దందా

● క్వింటాపై రూ.600- 1,000 పెంపు

బియ్యంపై 5 శాతం జీఎస్టీని కేంద్రం అమలులో తెచ్చింది. 5, 10, 20, 25 కిలోల బియ్యం ప్యాకింగ్‌కు దీనిని వర్తింపజేస్తున్నారు. 2025 డిసెంబరులో కేంద్రం బియ్యం ఎగుమతులపై అవకాశం కల్పించింది. దీన్ని సాకుగా చూపి సోనా మసూరి బియ్యం కొరత ఉందని, పాత బియ్యం లేవని.. కొత్త రకాల మాత్రమే ఉన్నాయంటూ మిల్లర్లు కృత్రిమ కొరత సృష్టించి ధరలు పెంచేశారు. కిలోపై రూ. 7- 10 వరకు వడ్డించారు. ప్రస్తుతం సన్న రకాల నిల్వలు లేవు.. కొత్త పంట వచ్చే వరకు ధరల మోత తప్పదని మిల్లర్లు చెబుతున్నారని వ్యాపారులు అంటున్నారు.

– న్యూస్‌టుడే, కర్నూలు కలెక్టరేట్

తూకాల్లో దోకా

బెదరగొడుతున్నారు

● సోనా మసూరి 25 కిలోల బస్తా రూ. వెయ్యి నుంచి రూ. 1,250కు చేరింది. నంద్యాల సోనా రూ. 1,375 నుంచి రూ. 1,550కు పెరిగింది. చిల్లర వర్తకులు కిలో రూ. 55తో విక్రయిస్తున్నారు. సోనా మసూరి క్వింటా రూ. 3,800- రూ. 4,100, నంద్యాల సోనా మసూరి క్వింటా రూ. 4,200 నుంచి రూ. 4,100 ధర పలుకుతున్నాయి.

● రైతులు సోనా మసూరి క్వింటా రూ. 4,400- 4,500తో విక్రయిస్తుండగా.. మిల్లర్లు మాత్రం క్వింటాకు రూ. 5 వేలకు పైగా వసూలు చేస్తున్నారు.

బియ్యం రకాలు	జనవరి (క్వింటా రూ.వేల్లో)	ప్రస్తుతం
సోనా మసూరి	4,000	5,000
నంద్యాల సోన	5,500	6,100

● 25 కిలోల ప్యాకింగ్ వరకు బియ్యంపై జీఎస్టీ అమల్లోకి తేవడంతో.. పన్ను ఎగ్గొట్టేందుకు కొందరు మిల్లర్లు 26 కిలోల పరిమాణంలో ప్యాకింగ్ చేస్తున్నారు.

● ఉమ్మడి జిల్లాలో వందకు పైగా రైస్ మిల్లులు ఉండగా.. 5 శాతం మంది 26 కిలోల సంచులు విక్రయిస్తున్నారు. మిగతా వారంతా 24, 25 కిలోలను ప్యాకింగ్ చేసి మార్కెట్‌లోకి హోల్‌సేల్ వ్యాపారులకు సరఫరా చేస్తున్నారు.

● మరికొందరు మిల్లర్లు బియ్యం ప్యాకెట్‌పై 25 కిలోలని ముద్రిస్తున్నా.. 24 కిలోలే ఇస్తూ మోసం చేస్తున్నారు. కొందరు బ్రాండ్‌ల పేరుతో బాదేస్తున్నారు. బియ్యం ప్యాకింగ్‌కు తూనికలు, కొలతల శాఖ అనుమతి తీసుకోవాల్సి ఉండగా ఒక్కరూ పట్టించుకోరు.

కానులకు మరిగి.. తనిఖీలు మరిచి

● బియ్యం 26 కిలోల బస్తా విక్రయిస్తే జీఎస్టీ చెల్లించాల్సిన అవసరం లేదు. అదే 25 కిలోల ప్యాకెట్లు విక్రయిస్తే 5 శాతం జీఎస్టీ చెల్లించాల్సి ఉంటుంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 24, 25 కిలోల బియ్యం ప్యాకెట్ల విక్రయాలు జోరుగా సాగుతున్నా జీఎస్టీ అధికారులు తనిఖీలు చేయడం లేదు. మిల్లర్లతో నెలవారీ మామూళ్లు తీసుకుంటూ తనిఖీలు చేయడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. దీంతో ప్రభుత్వ ఖజానాకు రూ.కోట్లలో నష్టం వాటిల్లుతోంది.

● జిల్లాలో జాయింట్ కలెక్టర్ ఆధ్వర్యంలో వివిధ శాఖల అధికారులు, సభ్యులతో జిల్లాస్థాయి ధరల నియంత్రణ కమిటీ ఉంటుంది. ఉమ్మడి జిల్లాలో కన్వీనర్లుగా ఈ కమిటీ సమావేశాలు జరగలేదు.

● బియ్యం ధరలు అమాంతం పెరిగిన నేపథ్యంలో రైస్ మిల్లుల్లో నిల్వలపై సంబంధిత శాఖలు తనిఖీలు నిర్వహించాలి. హోల్‌సేల్, రిటైల్ వ్యాపార సంస్థల్లోనూ సోదాలు చేయాలి. తూనికలు కొలతలు, పౌర సరఫరాల శాఖల అధికారులు తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు.

● ఇప్పటికైనా కమిటీలను బలోపేతం చేసి ధరలకు కళ్లెం వేయడంతో పాటు రైతుబజార్లు, ప్రత్యేక కౌంటర్లలో తక్కువ ధరకు బియ్యాన్ని అందుబాటులోకి తేవాలని ప్రజలు కోరుతున్నారు.

గెలుపు ఎత్తులు

కర్నూలు నగరంలోని డీఎస్ఏ స్టేడియంలో మంగళవారం జిల్లాస్థాయి చెస్ లీగ్ చదరంగం అండర్-13, 15, 17, 19 పోటీలు మొదలయ్యాయి. నగరపాలక సంస్థ కమిషనర్ పి.విశ్వనాథ్, జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి భూపతిరావు, ఎస్జీఎఫ్ కార్యదర్శి టి.కృష్ణ, చదరంగం జిల్లాసంఘం అర్బిటర్ ఇమామ్‌హుస్సేన్ పోటీలను ప్రారంభించారు. – న్యూస్‌టుడే, కర్నూలు క్రీడలు

నిరుపయోగంగా పోతున్నా.. నిద్రమత్తేనా

కర్నూలు అశోక్ నగర్ పంపు హౌస్ వద్ద నిత్యం ట్యాంకర్లకు మంచి నీరు నింపుతున్నారు. ఈ క్రమంలో పెద్ద మొత్తంలో తాగు నీరు వృథాగా పోతోంది.

–ఈనాడు, కర్నూలు

నేడు కోర్టు ఉద్యోగాలకు రాత పరీక్ష

కర్నూలు గాయత్రీ ఎస్టేట్, న్యూస్‌టుడే : కర్నూలులోని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యాలయానికి సంబంధించి రికార్డు అసిస్టెంట్, ఫ్రంట్ ఆఫీస్ కోఆర్డినేటర్ ఉద్యోగాల భర్తీకి సంబంధించిన రాత పరీక్ష స్థానిక సంకల్‌బాగ్‌లోని ప్రసూన లా కళాశాలలో బుధవారం జరగనున్నట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి. కబర్ధి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి లీలా వెంకటశేషాద్రి తెలిపారు. రికార్డు అసిస్టెంట్ పోస్టుకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు ఉదయం 8.45 గంటల్లోపు కేంద్రానికి చేరుకోవాలన్నారు. ఫ్రంట్ ఆఫీస్ కోఆర్డినేటర్ ఉద్యోగానికి దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు ఉదయం 11.45లోగా రావాలన్నారు. ఒక్క నిమిషం ఆలస్యంగా వచ్చినా అనుమతి ఉండదన్నారు.

నేడు పారిశ్రామిక వినియోగదారుల పరిష్కార వేదిక

కర్నూలు వెంకటరమణ కాలనీ, న్యూస్‌టుడే: పారిశ్రామిక విద్యుత్తు వినియోగదారుల సమస్యల సత్వర పరిష్కారం కోసం బుధవారం పరిష్కార వేదిక నిర్వహిస్తున్నట్టు సంస్థ సీఎండీ శివశంకర్ లోతేటి తెలిపారు. ఎస్ఈల పరిధిలో పరిష్కారం కానీ సమస్యలను నేరుగా సీఎండీ దృష్టికి తీసుకెళ్లొచ్చు. బుధవారం ఉదయం 10:30 నుంచి 11:30 గంటల మధ్యలో టోల్‌ఫ్రీ నంబరు 18004251555333కి ఫోన్ చేయొచ్చు. . అదేవిధంగా 9133331912 వాట్సప్ నంబర్‌కు సమస్య వివరాలు పంపించి పరిష్కారం పొందొచ్చు.

నాడు ఆగి.. నేడు కదిలి

పాఠశాలల్లో అసంపూర్తి పనులపై దృష్టి ● నివేదికలు కోరిన ప్రభుత్వం

"నాడు- నేడు" కింద పాఠశాలల రూపురేఖలు మారుస్తామని గత వైకాపా ప్రభుత్వం గొప్పలు చెప్పింది. మొదటి విడత పనులు పూర్తి కాకుండానే హడావిడిగా రెండో విడత ఎంపిక చేశారు. కర్నూలు జిల్లాలో 974 బడులకు రూ. 425.94 కోట్లు, నంద్యాలలో 853 పాఠశాలలకు రూ. 363.10 కోట్లు కేటాయించారు. రెండో విడత కింద ఎంపికైన బడుల్లో గదులు పడగొట్టారు. కానీ సరిపడా నిధులు ఇవ్వలేదు. నిర్మాణం పేరుతో స్థానిక నేతలు ఇసుక, ఇనుము, సిమెంటు బేరం చేశారు. భావితరం చదువులు చెట్లకిందకు వదిలేశారు. విద్యార్థుల అవస్థలు గమనించిన 'కూటమి' ప్రభుత్వం నిర్మాణాలపై దృష్టి సారించింది.. మన బడి-మన భవిష్యత్తు కింద నిధులిఇచ్చేందుకు మండలాల వారీగా నివేదికలు కోరింది.

– న్యూస్‌టుడే, నంద్యాల పట్టణం, ఎమ్మిగనూరు



పరిశీలన

ఎమ్మిగనూరు పట్టణంలోని నీలకంఠేశ్వర జడ్పీ ఉన్నత పాఠశాలలో వెయ్యి మందికి పైగా విద్యార్థులున్నారు. ఇక్కడున్న పాత గదులను గత ప్రభుత్వ హయాంలో పడగొట్టారు. రూ. 2.40 కోట్లు వెచ్చించి కొత్తగా 20 గదులు నిర్మిస్తామని ఆర్భాటం చేశారు. కొత్తవి నిర్మించకుండా వదిలేశారు. అటు పాతవి లేక.. ఇటు కొత్తవి పూర్తికాక మొండి గోడల మధ్యనే విద్యార్థులు పాఠాలు వింటున్నారు.

మండలాల వారీగా..

● పాఠశాలకు కావాల్సిన గదులు, ప్రహరీలు, మరుగుదొడ్లు, ఆర్వో ప్లాంట్లు తదితర వివరాలను మండలాల వారీగా పంపించాలని పాఠశాల విద్యాశాఖ జిల్లా విద్యాశాఖాధికారులను ఆదేశించింది. ఆ మేరకు మండలాల వారీగా ప్రస్తుతం ఎంఈవోల ఆధ్వర్యంలో నివేదికలు రూపొందిస్తున్నారు.

● నెలాఖరులోగా నివేదికలను తీసుకున్న అనంతరం కూటమి ప్రభుత్వం మన బడి-మన భవిష్యత్తు కింద పాఠశాలలకు నిధులు మంజూరు చేయనుంది.

పూర్తి కావాల్సినవి	కర్నూలు	నంద్యాల
అదనపు గదులు	457	353
ప్రహరీలు	367	275
మరుగుదొడ్లు	250	225

● నంద్యాల జిల్లాలో 79 పాఠశాలల్లో 394 అదనపు గదుల నిర్మాణానికి రూ. 47.28 కోట్లు కేటాయించారు. ఇందులో ప్రహరీలకు రూ. 123.25 కోట్లు ఇస్తామన్నారు. కర్నూలు జిల్లాలో 457 పాఠశాలల్లో అదనపు గదుల నిర్మాణానికి రూ. 275.42 కోట్లు కేటాయించారు. ఇందులో 367 పాఠశాలల్లో ప్రహరీల నిర్మాణానికి రూ. 42.59 కోట్లు ఇస్తామన్నారు.

మూడేళ్లుగా విద్యార్థుల అవస్థ

● అదనపు గదుల నిర్మాణంతో పాటు ఆర్వో ప్లాంట్లు, మరుగుదొడ్ల నిర్మాణం, ర్యాంపులు, విద్యుత్తు సామగ్రి కోసం నిధులు కేటాయించినా అలంకారప్రాయంగానే ఉండిపోయాయి. చాలా పాఠశాలల్లో ఫ్లోరింగ్ పనులు పూర్తి కాలేదు.

● నిధులు పూర్తి స్థాయిలో విడుదల కాకపోవడంతో 2023 డిసెంబరులోనే జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో పనులు ఆగిపోయాయి. ఉన్న గదులు పగలగొట్టి కొత్తగా కట్టక పోవడంతో చాలా చోట్ల విద్యార్థులు చెట్ల కింద, ఆరు బయట కూర్చోవాల్సి వస్తోంది. మరికొన్ని చోట్ల చావిడిలు, సత్రాల్లో పాఠాలు చెబుతున్నారు.

పెన్షనర్లూ.. పత్రం సమర్పించండి

● 10 రోజులే గడువు

రాష్ట్ర ప్రభుత్వ సర్వీస్, ఫ్యామిలీ పెన్షన్‌దారులు తమ జీవన ప్రమాణ పత్రాలు (లైఫ్ సర్టిఫికెట్లు) సమర్పించేందుకు గడువు సమీపిస్తోంది. ఈ నెల 28వ తేదీ వరకు జీవన ప్రమాణ పోర్టల్‌లో లేదా ఖజానా శాఖ కార్యాలయాల్లో సమర్పించాల్సి ఉంటుంది. గతేడాది నవంబరు, డిసెంబరు నెలల్లో సమర్పించినవి చెల్లుబాటు కావు. తాజాగా ఇవ్వకుంటే ఏప్రిల్ 1న ఇచ్చే మార్చి పెన్షన్ నిలిపివేయనున్నారు. పెన్షన్‌దారులు తమ పత్రాలు సమర్పించేందుకు కర్నూలు, గూడూరు, ఎమ్మిగనూరు, ఆదోని, పత్తికొండ, ఆలూరు ఉప ఖజానా కార్యాలయాల్లో ప్రత్యేక కేంద్రాలు ఏర్పాటు చేశారు. "అనారోగ్యంతో నడవలేని పింఛనుదారులు తమ దృష్టికి తీసుకొస్తే.. ఖజానా శాఖ సిబ్బంది ఇంటి వద్దకు వస్తారని" జిల్లా అధికారి బి.రామచంద్రరావు తెలిపారు. – న్యూస్‌టుడే, కర్నూలు కలెక్టరేట్

సబ్ ట్రెజరీ	పత్రాలు సమర్పించిన వారు	ఇంకా ఇవ్వాల్సిన వారు
కర్నూలు	10,713	1,506
ఆదోని	1,893	369
ఆలూరు	586	109
గూడూరు	446	63
పత్తికొండ	666	45
ఎమ్మిగనూరు	950	152

ఆధార్ నవీకరణకు సంకటం

కర్నూలు కలెక్టరేట్, న్యూస్‌టుడే: ఆధార్ నవీకరణ ప్రక్రియను నత్తను తలపిస్తోంది. గతేడాది డిసెంబరు నాటికి కర్నూలు జిల్లాలో 94,495, నంద్యాల జిల్లాలో 63,031 మంది పిల్లల ఆధార్ అప్‌డేషన్ పెండింగ్ ఉండేది. గడిచిన రెండు నెలల్లో కర్నూలు జిల్లాలో 385, నంద్యాల జిల్లాలో 225 మంది పిల్లలకు మాత్రమే ఆధార్ అప్‌డేషన్ చేయించారంటే ఈ ప్రక్రియ ఎంత నత్తనడకన సాగుతుందో అర్థమవుతోంది. కర్నూలు జిల్లాలో 672 గ్రామ, వార్డు సచివాలయాలు ఉన్నాయి. వీటి పరిధిలో రోజుకు ఆరేడుగురికి కూడా ఆధార్ నవీకరణ చేయడం లేదు. నంద్యాలలోని 516 సచివాలయాల పరిధిలో రోజుకు ముగ్గురు.. నలుగురికి కూడా ఆధార్ అప్‌డేషన్ చేయడం లేదు. కొన్ని సచివాలయాల్లో వారంలో ఒక్కరికి కూడా మాండేటరీ బయోమెట్రిక్ అప్‌డేషన్ (ఎంబీయూ) చేయకపోవడం సేవా లోపానికి అద్దం పడుతోంది.

నగరంలోని విఠల్‌నగర్ సచివాలయంలో పిల్లలకు ఆధార్ నవీకరిస్తున్న డిజిటల్ అసిస్టెంట్

జిల్లా	సచివాలయాలు	మొత్తం చిన్నారులు	ఎంబీయూ అప్‌డేషన్	ఎంబీయూ పెండింగ్
కర్నూలు	672	94,110	9,614	84,496
నంద్యాల	516	62,806	18,138	44,668

● ఆధార్‌లో మార్పులు, చేర్పులు, అప్‌డేషన్ సేవలకు పిల్లల జనన ధ్రువీకరణ పత్రాలు అడుగుతున్నారు. 10- 20 శాతం మందికి ఇవి లేవు.

● తల్లిదండ్రులు తమ పిల్లలకు జనన ధ్రువీకరణ పత్రాల (లేట్ బర్త్ సర్టిఫికెట్) కోసం గ్రామ, వార్డు సచివాలయాలు, తహసీల్దారు, రెవెన్యూ డివిజనల్ కార్యాలయాలు, మున్సిపల్ ఆఫీసుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు.

● జనన ధ్రువీకరణ పత్రాలు మంజూరైనా కొన్ని సచివాలయాల్లో వాటిని డిజిటల్ సర్టిఫికెట్లపై ప్రింట్ ఇవ్వడం లేదు. తెల్ల కాగితంపైనే ఇస్తున్నారు.

● ఆధార్ అప్‌డేషన్ చేయించుకునే క్రమంలో ఇవి చెల్లుబాటవక తల్లిదండ్రులు, పిల్లలు ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు.

పశ్చిమ నేలలో.. కృష్ణమ్మ పరవళ్లు

● తొలిసారి వేల ఎకరాల్లో రెండో పంట

● హంద్రీ నీవా విస్తరణతో రైతులకు లబ్ధి

కరవు నేల.. ఇప్పటి వరకు రెండో పంట ఎరుగరు.. ప్రస్తుతం అక్కడ ఎటు చూసినా పచ్చదనమే కనిపిస్తోంది.. పొలాల్లో శ్రమజీవులు పని చేసుకొంటూ కనిపిస్తున్నారు. పశ్చిమ ప్రాంతమైన దేవనకొండ, పత్తికొండ, కృష్ణగిరి తదితర ప్రాంతాల్లో కనిపిస్తున్న దృశ్యాలివి. ఇందుకు కారణం 'కూటమి' ప్రభుత్వం వచ్చిన తర్వాత హంద్రీనీవా కాల్వను విస్తరించడమే.. ఫిబ్రవరిలోనూ వే'గంగా' కృష్ణమ్మ ప్రవహిస్తోంది.. ఆ నీటి ఆధారంగా రైతులు వివిధ రకాల పంటలు సాగు చేశారు.

– న్యూస్‌టుడే, పత్తికొండ



హంద్రీనీవా నీరు నిలిచే గుంత వద్ద మోటార్లు

కాల్వ సమీపంలో రైతులు ఏర్పాటు చేసుకున్న నియంత్రికలు

రూ.830 కోట్లు వెచ్చించి

● ఉమ్మడి కర్నూలు జిల్లాలో 134 కి.మీ. మేర హంద్రీనీవా కాల్వ విస్తరించి ఉంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఈ కాల్వ విస్తరణపై దృష్టి సారించింది. మల్యాల నుంచి 216 కి.మీ. వరకు మూడు ప్యాకేజీలుగా విభజించి రూ. 830 కోట్లు వెచ్చించారు. కాల్వలో 3,850 క్యూసెక్కులు వెళ్లేలా 'కట్ట'దిట్టం చేశారు. ఇప్పటి వరకు 40.109 టీఎంసీలు విడుదల చేశారు.

కాల్వ ఒడ్డున మోటార్లు

● రైతులు కాల్వ ఒడ్డున మోటార్లు పెట్టి 2 నుంచి 3 కి.మీ. మేర పైపు లైన్లు వేసుకొని నీటిని తీసుకెళ్తున్నారు. ప్రధాన కాల్వకు ఇరువైపులా రైతులు విద్యుత్తు మోటార్లు ఏర్పాటు చేసుకొని వేరుసెనగ, టమాటా, ఉల్లి, మిరప తదితర పంటలు సాగు చేస్తున్నారు. అవసరమైన విద్యుత్తు కోసం ఒకేచోట విద్యుత్తు నియంత్రికలు ఏర్పాటు చేసుకున్నారు.

● "కాల్వ నుంచి పైపులైన్ వేసుకొన్నా.. ప్రస్తుతం రెండెకరాల్లో వేరుసెనగ సాగు చేశా. మరో నెల రోజుల పాటు నీరొదిలితే పంట చేతికందుతుందని" మద్దికెరకు చెందిన రైతులు పేర్కొన్నారు.

మనోరథంపై మహానందీశుడు

'జ'న'జయ ధ్వనుల మధ్య మహానందీశుడు కదిలారు.. మహాశివ రాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా మంగళవారం సాయంత్రం రథోత్సవం కనులపండువగా నిర్వహించారు. శ్రీకామేశ్వరీదేవి సహిత మహానందీశ్వరస్వామి వార్లతో పాటు నంద్యాల బ్రహ్మనందీశ్వర దేవస్థానం నుంచి కల్యాణ పెద్దలుగా వచ్చిన శ్రీగంగా పార్వతీదేవి సమేత బ్రహ్మనందీశ్వరస్వామివార్లు రథంపై ఆసీనులయ్యారు. వేదపండితులు రవిశంకర అవధాని ఆధ్వర్యంలో విఘ్నేశ్వరపూజ, స్వస్తివాచనం, నవకలశ స్థాపన, రథాంగ హోమం, స్నపనం, రథాంగబలి, మహాపూర్ణాహుతి, రథాధిదేవతల పూజలు చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా నంద్యాల జిల్లా జడ్జి అమ్మన్నరాజు, ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి శ్రీనివాసులు, ఆర్డీవో చల్లా విశ్వనాథ్, తహసీల్దార్ పి.రమాదేవి దంపతులు, ఈవో నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి, ఏఈవో మధు పాల్గొని రథోత్సవ పూజ చేసి ఉత్సవాన్ని ప్రారంభించారు. రథోత్సవం ముందు కళాకారుల డప్పుల విన్యాసాలు ఎంతో ఆకట్టుకున్నాయి. – న్యూస్‌టుడే, మహానంది

అన్న క్యాంటీన్ ఛైర్మన్ల ఎంపిక వివాదం

ఆదోని నేరవార్తలు, న్యూస్‌టుడే: ఆదోని పట్టణంలోని మూడు అన్న క్యాంటీన్లకు ఛైర్మన్ల ఎంపిక వివాదానికి దారి తీసింది. కౌన్సిలర్లు లలితమ్మ, చిన్న, సురేష్‌లను ఛైర్మన్లుగా ఎంపిక చేస్తూ ఈ నెల 16న ఉత్తర్వులు జారీ అయ్యాయి.

● ఒకటో వార్డు కౌన్సిలర్‌గా తెదేపాకు చెందిన పార్వతి ఉన్నా.. ఆమెను ఎంపిక చేయకుండా వైకాపా నుంచి భాజపాలో చేరిన కౌన్సిలర్లను ఎంపిక చేయడం బాధాకరమని తెదేపా సీనియర్ నాయకులు భూపాల్ చౌదరి, తెదేపా పట్టణ అధ్యక్షుడు తిమ్మప్ప సామాజిక మాధ్యమంలో అసహనం వ్యక్తం చేశారు.

● కూటమి ప్రభుత్వంలో తెదేపా కౌన్సిలర్‌ను కాదని.. వైకాపా కౌన్సిలర్లకు ఛైర్మన్ల పదవి ఇవ్వడం బాధాకరమని, రాబోయే కౌన్సిల్ ఎన్నికల్లో 42 వార్డుల్లో భాజపా వారే పోటీ చేసి గెలిపించుకోవాలని తెదేపా నాయకులు ఎమ్మెల్యే డాక్టరు పార్థసారథికి మెసేజ్ పెట్టడం పట్టణంలో చర్చనీయాంశంగా మారింది.

● ఇదిలా ఉండగా.. కొత్తగా నియమించిన ఛైర్మన్లకు సంబంధించిన జీవోను తాత్కాలికంగా రద్దు చేస్తున్నట్లు మున్సిపల్ కమిషనరు పురపాలక సంఘం కమిషనర్ నయీమ్ అహ్మద్ ఉత్తర్వులు జారీ చేయడం గమనార్హం.

అనారోగ్యాన్ని నులిపేద్దాం

జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లాలో 1- 19 ఏళ్ల వయసున్న పిల్లలందరికీ ఆల్బెండజోల్ మాత్రలు ఉచితంగా పంపిణీ చేస్తున్నట్లు కలెక్టర్ డాక్టర్ ఎ.సిరి తెలిపారు. నగరంలోని ఇందిరా గాంధీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మాత్రలు వేశారు.

– న్యూస్‌టుడే, కర్నూలు వైద్యాలయం

సులభం.. సురక్షితం

● తక్కువ ధరకే పార్సిల్ సేవలు

● వ్యాపారులకు తపాలా శాఖ అండ

చేతివృత్తిదారులు, చిరు వ్యాపారులు తమ ఉత్పత్తులపై సామాజిక మాధ్యమాలు, అంతర్జాలంలో ప్రచారం చేసుకుంటున్నారు. వినియోగదారులు తమకు నచ్చినవి బుక్ చేసుకొని కొన్ని రోజుల్లోనే పొందుతున్నారు. ఇలాంటి పార్సిళ్లను ఇంటికి చేరవేయడానికి తపాలా శాఖ ముందుకొచ్చింది. దుస్తులు, నిత్యావసరాలు, గృహోపకరణాలు, ఆహార పదార్థాలు, వివిధ రకాల వస్తువులను చేరవేస్తుంది. తక్కువ ధరకు విదేశాలతో పాటు దేశంలోని చిన్న పల్లెలకు పంపవచ్చని తపాలా సూపరింటెండెంట్లు జనార్దన్‌రెడ్డి, అప్పలస్వామి తెలిపారు.

– న్యూస్‌టుడే, నంద్యాల రైతునగరం

● పార్సిళ్లు పంపాలనుకుంటే సమీపంలోని తపాలా కార్యాలయానికి వెళ్లాలి. వ్యక్తిగత, వినియోగదారుని చిరునామా ఇవ్వాలి. ఐడీ ప్రూఫ్ ఉండాలి.

● సరకు వివరాలు తప్పని సరిగా పొందుపర్చాలి. చరవాణి సంఖ్య రాయాలి. ట్రాకింగ్ సదుపాయం అందుబాటులో ఉంది. కస్టమ్స్ డిక్లరేషన్ చేయాలి.

నగరంలో తపాలా కార్యాలయంలో పార్సిల్‌ను ప్యాకింగ్ చేస్తున్న సిబ్బంది

● ఇంటి నుంచే పార్సిల్ సేవలు పొందాలనుకుంటే ఏపీపీ.ఇండియాపోస్ట్.జీవోవీ.ఇన్ అనే వెబ్‌సైట్‌లో బుక్ చేసుకోవచ్చు. తపాలా సిబ్బంది ఇంటి వద్దకు వచ్చి తీసుకెళ్తారు.

● సామాజిక మాధ్యమాల్లో వ్యాపారాలు చేసుకునే వారికి బిజినెస్ అకౌంట్ ద్వారా దేశంలో ఎక్కడికైనా రూ. 51కే పార్సిళ్లను పంపవచ్చు. క్యాష్ ఆన్ డెలివరీ సదుపాయం అందుబాటులో ఉంది.

● కిలోకు రూ. 60 తీసుకుంటున్నారు. బరువు, దూరాన్ని బట్టి పార్సిల్ ధర మారుతుంది.

● రిజిస్టర్ పోస్ట్ ద్వారా అయితే రూ. 250కే 2 కిలోల లోపు బరువు ఉన్న వాటిని విదేశాలకు పంపవచ్చు.

● బీఎంపీఎల్(బుక్ నౌ పే ల్యాటర్) అనే విధానం ద్వారా వినియోగదారులు డబ్బును నెలకు ఒకసారి చెల్లించొచ్చు.

● వ్యాపార సంబంధమైన వస్తువులను విదేశాలకు పార్సిల్ (డాక్ ఘర్ నిర్యాక్ కేంద్ర్) ద్వారా చిన్న వ్యాపారులు వస్తువులను ఎగుమతి చేసుకోవచ్చు. ఒక పార్సిల్‌కు 35 కిలోల చొప్పున ఎన్ని కిలోలైనా పంపించుకోవచ్చు.

● సంప్రదించాల్సి నంబర్లు.. కర్నూలు.. 8919286405, నంద్యాల 9642074950.

ఈనాడు

దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు

Cell: 99899 97628

ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి

Cell: 80085 13479

(c) eenadu

ఆహారశుద్ధి పరిశ్రమల ఏర్పాటు వేగవంతం చేయాలి

కర్నూలు కలెక్టరేట్, న్యూస్‌టుడే : జిల్లాలో పీఎం ఎఫ్ఎంఈ కింద ఆహార శుద్ధి పరిశ్రమల ఏర్పాటు ప్రక్రియను వేగవంతం చేయాలని కలెక్టర్ డా.ఎ.సిరి అధికారులను ఆదేశించారు. కర్నూలు కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో ఆహార శుద్ధి పరిశ్రమల ఏర్పాటుపై ఏపీఎంఐపీ, డీఆర్డీఏ, బ్యాంకుల అధికారులతో మంగళవారం ఆమె సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో పీఎంఎఫ్ఎంఈ కింద 2025- 26 ఆర్థిక సంవత్సరంలో 156 యూనిట్ల ఏర్పాటు లక్ష్యం కాగా ఇప్పటివరకు 77 మాత్రమే గ్రౌండింగ్ అయ్యాయన్నారు. ఇందుకు సంబంధించి బ్యాంకుల్లో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను త్వరగా పరిశీలించి అర్హులకు రుణాలు మంజూరు చేయించాలని ఎల్‌డీఎంను ఆదేశించారు. ఏపీఎంఐపీ, డీఆర్డీఏ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి యూనిట్ల ఏర్పాటులో సాంకేతిక సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని చెప్పారు. సమావేశంలో ఏపీఎంఐపీ పీడీ, ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ ఈడీ శ్రీనివాసులు, డీఆర్డీఏ పీడీ రమణారెడ్డి, ఎల్డీఎం రామచంద్రరావు, బ్యాంకు అధికారులు పాల్గొన్నారు.

తాడాట... గెలుపు బాట

☛ రాష్ట్ర, జాతీయ స్థాయిలో సత్తా చాటుతున్న చిచ్చరపిడుగు

నంద్యాల గాంధీచౌక్, న్యూస్‌టుడే: నంద్యాల పట్టణంలో కొందరు విద్యార్థులు తాడాటను సరదాగా నేర్చుకుని రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తున్నారు. ఆటలో మంచి నైపుణ్యాలు సాధించి వివిధ రాష్ట్రాల్లో, దేశాల్లో జరిగే పోటీల్లో పాల్గొంటున్నారు. వ్యక్తిగత విభాగంలో ప్రతిభ చూపి జాతీయ స్థాయిలో సత్తా చాటి ప్రశంసలు అందుకుంటున్నారు. ఈ క్రీడలో పట్టణానికి చెందిన రుషిక్ నాగేష్ దూసుకుపోతున్నాడు.

పతకాలతో రుషిక్

నంద్యాల పట్టణం రెవెన్యూ క్వార్టర్స్‌లో ఉంటున్న నాగరాజు, సువర్ణ దంపతుల కుమారుడు రుషిక్ నాగేష్ 10వ తరగతి చదువుతున్నాడు. కొన్నేళ్ల నుంచి క్రీడల పట్ల మక్కువతో జంప్‌రోప్ క్రీడను ఎంచుకున్నాడు. తల్లిదండ్రులు, పాఠశాల యజమాన్యం సహకారంతో అందులో ప్రతిభ చాటి అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తున్నాడు.

◆ 2022 మార్చిలో కర్నూలులో నిర్వహించిన జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొని ప్రథమ స్థానంలో నిలిచి బంగారు పతకం సాధించాడు.

◆ కడపలో నిర్వహించిన జిల్లా స్థాయి పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచాడు.

◆ జులైలో ప్రకాశం జిల్లా ఒంగోలులో నిర్వహించిన రాష్ట్ర స్థాయి పోటీల్లో గెలుపొంది జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు.

◆ హోసపేటలో జాతీయస్థాయి పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచి అంతర్జాతీయ స్థాయికి ఎంపికయ్యారు.

◆ నవంబర్‌లో థాయిలాండ్‌లో జరిగిన క్రీడల్లో పాల్గొని ప్రశంసా పత్రాన్ని అందుకున్నాడు.

◆ 2023 ఫిబ్రవరిలో షిర్డీలో జరిగిన జాతీయ స్థాయి క్రీడల్లో బృందంలో బంగారు పతకం సాధించాడు. అలాగే వ్యక్తిగత విభాగంలో వెండి పతకంతో రాణించాడు.

సాధించిన విజయాలు..

◆ మధ్యప్రదేశ్ ఉజ్జయినిలో సీనియర్ మీట్‌లో బంగారు పతకం సాధించాడు.

◆ నంద్యాలలో జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో బంగారు పతకాన్ని గెలుచుకున్నాడు.

◆ సెప్టెంబరులో తెనాలిలో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో బంగారు పతకాన్ని సాధించాడు.

◆ అక్టోబరులో తెనాలిలో జాతీయ స్థాయి పోటీల్లో బృందంలో వెండి పతకం సంపాదించాడు. వ్యక్తిగత విభాగంలో కాంస్య పతకాన్ని అందుకున్నాడు.

◆ 2024 జపాన్‌లో జరిగిన అంతర్జాతీయ పోటీల్లో 5వ స్థానంలో నిలిచాడు.

◆ 2025 నేపాల్‌లో జరిగిన సౌత్ ఏషియన్ పోటీల్లో పాల్గొని రెండు వెండి పతకాలు అందుకున్నాడు.

ఒలింపిక్స్‌లో ఆడటమే లక్ష్యం - రుషిక్‌నాగేష్

మాది సాధారణ కుటుంబం. నాకు చదువుతో పాటు క్రీడలంటే ఇష్టం. దీనికి మా తల్లిదండ్రులు ప్రోత్సహిస్తున్నారు. 10వ తరగతి చదువుతున్నాను. పోటీలకు వెళ్లడానికి డబ్బులు లేని సమయాలు కూడా ఉన్నాయి. ప్రస్తుతం అంతర్జాతీయ స్థాయికి ఎంపికైనందుకు ఆనందంగా ఉంది. దాతలు సహకరించి ప్రోత్సహిస్తే ఒలింపిక్స్‌లో రాణించి దేశానికి గుర్తింపు తీసుకొస్తాను.

జోడు రథోత్సవం.. ఆధ్యాత్మిక వైభవం

◆ 21 నుంచి గూళ్యంలో గాదిలింగేశ్వరస్వామి ఉత్సవాలు

హాలహర్వి, న్యూస్‌టుడే: ఆంధ్ర, కర్ణాటక రాష్ట్రాల భక్తుల ఇలవేల్పు గాదిలింగేశ్వరస్వామి జోడు రథోత్సవ వేడుకలు ఈ నెల 21 నుంచి ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. గురు శిష్యులైన సిద్ధేశ్వర, గాదిలింగేశ్వరస్వామి రథోత్సవం లక్షలాది భక్తజన సందోహం మధ్య నిర్వహించనున్నారు. వందల సంవత్సరాలుగా ఈ జోడు రథోత్సవాలు నిర్వహిస్తున్నారని గ్రామ పెద్దలు, ఆలయ నిర్వాహకులు తెలిపారు. గురువు సిద్ధేశ్వర స్వామికి పరమ

గాదిలింగేశ్వర స్వామి మూల విరాట్టు

ఉత్సవాలకు ముస్తాబైన జోడు రథాలు

భక్తుడైన గాదిలింగేశ్వరస్వామికి నిత్యం మూడు పూజలు జరుపడం ఆనవాయితీ. ఈ రథోత్సవం ఐదు రోజుల పాటు జరుగుతుంది. ఇందులో భాగంగా ఈ నెల 21న ప్రభోత్సవం, 22న జోడు రథోత్సవం, 23న వసంతోత్సవం, 24న ఎద్దుల పరుష, 25న చివరి రోజు బుధవారం స్వామికి ప్రత్యేక పూజలు చేసి జాతర మహోత్సవం ముగియనుంది. జాతర తిలకించేందుకు ఆంధ్ర, కర్ణాటక ప్రాంతాల నుంచే కాకుండా మహారాష్ట్ర, తమిళనాడు తదితర ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొంటారు.

ప్రత్యేక బస్సులు

ఈ నెల 22 నుంచి ఆదోని డిపో నుంచి పదుల సంఖ్యలో ప్రత్యేక బస్సులు నడిపేందుకు అధికారులు సిద్ధమయ్యారని దేవదాయ శాఖ ఈవో రామకృష్ణ, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసులు తెలిపారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఆర్టీసీ అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని కోరినట్లు వారు పేర్కొన్నారు. దీంతో పాటు కర్ణాటక రాష్ట్రం బళ్లారి, శిరుగుప్ప డిపో పరిధి నుంచి కర్ణాటక ఆర్టీసీ బస్సులు నడపనున్నారు. కేవలం జాతర రోజే కాకుండా ఐదు రోజుల పాటు భక్తులు వచ్చి వెళ్లడానికి బస్సులు తిరిగేలా చర్యలు చేపట్టాలని అధికారులను విన్నవించారు.

● ఆలయ కార్యనిర్వహణాధికారి రాధాకృష్ణ మాట్లాడుతూ.. 'ఈ నెల 21 నుంచి ప్రారంభం కానున్న జోడు రథోత్సవానికి ఆలయం వద్ద అన్ని ఏర్పాట్లు చేశాం. భక్తులకు ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక వసతులు, భక్తులు ప్రత్యేక పూజలు చేసేందుకు, మొక్కులు చెల్లించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాం. రథోత్సవం విజయవంతం అయ్యేలా ప్రతి ఒక్కరు సహకరించాలి' అని అన్నారు.

● ఎస్సై ఈశ్వరరావు మాట్లాడుతూ.. 'మూడు రోజుల పాటు జరిగే ఉత్సవాలకు పోలీసు సిబ్బందితో ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేస్తున్నాం. ఇప్పటికే అన్ని సిబ్బందికి పలు విషయాలు సూచించాం. గ్రామస్థులతో పాటు జాతర తిలకించేందుకు వచ్చిన భక్తులు పోలీసులకు సహకరించి విజయవంతం అయ్యేందుకు కృషి చేయాలి' అని పేర్కొన్నారు.

ఉపాధిహామీ పథకాన్ని నిర్వీర్యం చేసిన భాజపా

■ ప్రతిపక్ష హోదా కావాలనే జగన్ దీనిపై నోరు విప్పరు
■ పీసీసీ అధ్యక్షురాలు షర్మిల విమర్శ

ఈనాడు, కర్నూలు : కేంద్రంలోని భాజపా ప్రభుత్వం ఉపాధిహామీ పథకాన్ని నిర్వీర్యం చేసి, దాని స్థానంలో వీబీ జీ రామ్ జీ చట్టాన్ని తెచ్చి రాష్ట్రాలపై భారం మోపిందని పీసీసీ అధ్యక్షురాలు వై.ఎస్.షర్మిల విమర్శించారు. మహాత్మాగాంధీ ఉపాధిహామీ చట్టాన్ని యథాతథంగా అమలు చేయాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన 'ఉపాధిహామీ పరిరక్షణ యాత్ర'లో భాగంగా కర్నూలు శివారులోని గార్గేయపురంలో మంగళవారం నిర్వహించిన బహిరంగ సభలో ఆమె మాట్లాడారు. కొత్త చట్టం ప్రకారం 40 శాతం నిధులను రాష్ట్ర ప్రభుత్వమే భరించాల్సి ఉందన్నారు. అంత భారాన్ని భరించడం రాష్ట్రాలకు కష్టంగా మారుతుందన్నారు. దేశవ్యాప్తంగా కోట్ల మందికి ఉపాధి కల్పిస్తున్న కీలక పథకాన్ని పూర్తిగా ఎత్తేయాలని భాజపా కుట్రలు పన్నుతోందని ఆరోపించారు. జీ రామ్ జీ చట్టం గుత్తేదారులకు కార్మికులను సరఫరా చేసేలా ఉందని వివరించారు. ప్రతిపక్ష హోదా కావాలని అడిగే జగన్‌మోహన్‌రెడ్డి దీనిపై నోరు విప్పడం లేదని ధ్వజమెత్తారు. మోదీ అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై కాంగ్రెస్ పార్టీ మాత్రమే పోరాటం చేస్తోందని గుర్తుచేశారు. కాంగ్రెస్ చేస్తున్న ఉద్యమానికి ప్రజల నుంచి మద్దతు కావాలని విజ్ఞప్తి చేశారు. ట్రంప్‌తో మోదీ చీకటి ఒప్పందం చేసుకున్నారని పేర్కొన్నారు.

గార్గేయపురం సభలో మాట్లాడుతున్న పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల

అమెరికా వ్యవసాయ ఉత్పత్తులపై సున్నా పన్ను విధిస్తే మన దేశ రైతులు తమ పంట ఉత్పత్తులను ఎక్కడ విక్రయించాలని ప్రశ్నించారు. సీడబ్ల్యూసీ సభ్యుడు కొప్పుల రాజు మాట్లాడుతూ ఉపాధిహామీ పథకంతో గ్రామాల్లో వలసలు ఆగాయని గుర్తుచేశారు.

చర్చికి రాలేదని వాహనం అడ్డగింత

గార్గేయపురంలో నిర్మాణంలో ఉన్న చర్చికి రావాలని చందు అనే వ్యక్తి షర్మిల వాహనాన్ని అడ్డగించడంతో కాసేపు ఉద్రిక్తత తలెత్తింది. కార్యక్రమం షెడ్యూలులో చర్చికి వెళ్లే అంశం లేకపోవడంతో సభ అనంతరం ఆమె వాహనంపై కర్నూలు వైపు బయలుదేరారు. ఆమె ప్రయాణిస్తున్న వాహనం ముందుకు వెళ్లకుండా చందు అడ్డుగా నిల్చోవడంతో పాటు వాహనాన్ని చేతులతో గట్టిగా కొట్టడంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. ఆయన్ను అక్కడి నుంచి పక్కకు తీసుకెళ్లడంతో వివాదం సద్దుమణిగింది.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, వాణిజ్య పన్నుల శాఖ

బహిరంగ వేలము ప్రకటన

ఇందుమూలముగా యావన్మందికి తెలియజేయడం ఏమనగా M/s. పవన్ కాటన్ కంపెనీ S.No: 108/A, D.No:17-42-13A1, మాదవరం రోడ్డు, ఆదోని వారు వ్యాపారం నిర్వహించి పన్ను రూపంలో వాణిజ్య పన్నుల శాఖకు బకాయి పడ్డారు. బకాయి వసూలుకు గాను ప్రొప్రైటర్ శ్రీ సౌదరీ నీలకంఠప్ప పేరు మీద సర్వే నంబరు 181/19B, ఖాతా నంబర్ 819, నిత్రవట్టి గ్రామము, హాలహర్వి మండలంలో ఉన్న 3.776 ఎకరాల వ్యవసాయ భూమిని 28-02-2026వ తేదీన శనివారం నాడు ఉదయం 11 గంటలకు వేలం వేయుటకు నిశ్చయించడమైనది. భూమి విలువ సుమారు రూ. 10,53,504/- రూపాయలు. ఆసక్తి గలవారు 28-02-2026న పైన కనబరచిన సర్వే నంబరు గల వ్యవసాయ భూమి వద్ద జరిగే వేలం పాటలో పాల్గొని దక్కించుకోవచ్చు. మిగతా విషయాలకు **Dy. AC-III, ఆదోని సర్కిల్** వారిని సంప్రదించవచ్చు.

ఇట్లు: డిప్యూటీ అసిస్టెంట్ కమిషనర్-III
ఆదోని సర్కిల్ (రాష్ట్ర పన్నులు)
Mobile: 79895 72049.

బాధిత కుటుంబానికి మందకృష్ణ పరామర్శ

తుగ్గలి, న్యూస్‌టుడే: స్వగ్రామంలో హత్యకు గురైన ఎమ్మార్పీఎస్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బొందిమడుగుల రమేశ్ కుటుంబాన్ని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగ మంగళవారం వారి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. హత్యకు గల కారణాలను కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకొన్నారు. రమేశ్ హత్య కేసులో నిందితులకు కఠిన శిక్ష పడేలా పోలీసు అధికారులు కృషి చేయాలన్నారు. ఎస్సీలపై దాడులు చేస్తే చట్ట పరమైన చర్యలు తీసుకోవాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు, సీఐ పులిశేఖర్, ఎస్సై నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

బాధితులను పరామర్శిస్తున్న మందకృష్ణ మాదిగ

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, వాణిజ్య పన్నుల శాఖ

బహిరంగ వేలం ప్రకటన

DRC- 17 : రిఫరెన్స్ నం.ZD3702260051310 **తేదీ: 18.02.2026**

వాణిజ్య పన్నుల శాఖ వారికి చిన్న తుంబళం నిజాముద్దీన్, S/o C.ఇస్మాయిల్ సాబ్, M/s తుంబళం సానా ట్రేడర్స్ ప్రొప్రైటర్, SR.No. 178 సి/1, బసాపురం రోడ్, ఆదోని- 518301. వారు చెల్లించవలసిన బకాయిల మొత్తం Rs. 42,18,180/- వసూలు చేయుటకు సదరు వ్యక్తులు క్రింద ఆస్తి వేలం ద్వారా అమ్మకానికి ఉంచుతున్నాము.

ఆస్తి వివరాలు: సర్వే నెం. 306/ఎ2, విస్తీర్ణం 4.67 ఎకరాలు, FT సరిహద్దులు: (N): చిన్న తుంబళం షేక్షావలి భూమి (ఎస్) పూజారి లక్ష్మన్న భూమి (E): అలిమోహినుద్దీ భూమి (W): మంచాల మౌలా సాబు భూమి.

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ప్రకారం మార్కెట్ విలువ Rs. 20,00,000/- వేలం తేదీ: 28.02.2026 (శనివారం), సమయం: మధ్యాహ్నం 3.00 గంటలకు, వేదిక: M/s తుంబళం సానా ట్రేడర్స్ మరిన్ని వివరాల కోసం క్రింద అధికారిని సంప్రదించవచ్చు.

సం/- డిప్యూటీ అసిస్టెంట్ కమిషనర్(ST)-1, అసిస్టెంట్ కమిషనర్ కార్యాలయం, ఆదోని సర్కిల్. మొబైల్: 99494 81464

జేఈఈలో నవోదయం

● ప్రత్యేక శిక్షణతో 33 మంది ప్రతిభ
● సత్తా చాటిన బనవాసి జవహర్ విద్యార్థులు

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: జేఈఈ మెయిన్-2026 తొలి సెషన్ ఫలితాల్లో బనవాసి జవహర్ నవోదయ విద్యార్థులు మెరిశారు. ఈ ఏడాది కొత్తగా ఇక్కడ 39 మందికి శిక్షణ ఇచ్చారు. కర్నూలు నవోదయ-సీఈవో-అవంతి (సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ అవంతి) ప్రారంభించిన మొదట ఏడాదిలో ఉత్తమ ఫలితాలు సాధించడం విశేషం. రాష్ట్రంలోని 13 జిల్లాలకు చెందిన విద్యార్థులు ఇక్కడ శిక్షణ పొందుతున్నారు. ప్రభుత్వం వీరికి ప్రత్యేకంగా శిక్షణతోపాటు అన్ని వసతులు కల్పించింది. వీటిని విద్యార్థులు సద్వినియోగం చేసుకుని సత్తా చాటారు.

విద్యార్థి పేరు	★
పర్సంటైల్	%
ప్రాంతం	✤
లక్ష్యం	➾

ప్రత్యేక కేంద్రం ఏర్పాటు

ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా బనవాసి జవహర్ నవోదయలో ప్రత్యేక కేంద్రం ఏర్పాటు చేసి రాష్ట్రవ్యాప్తంగా ఉన్న విద్యార్థులకు శిక్షణ ఇస్తోంది. ఈ నేపథ్యంలో ఇటీవల జరిగిన జేఈఈ మొదటి సెషన్‌లో అజయకుమార్‌రెడ్డి (98.22), శ్రీకుమార్ (98.1), జితేంద్రరెడ్డి (97.74) ప్రతిభ చాటారు. మొత్తం 33 మంది మంచి పర్సంటైల్ తెచ్చుకున్నారని ప్రిన్సిపల్ పద్మావతి తెలిపారు. హైదరాబాద్ రీజినల్ స్థాయిలో ఎక్కువమంది ఎంపికవడం కళాశాలకు ఎంతో గర్వకారణమన్నారు.

★ అజయకుమార్‌రెడ్డి
% 98.22 ✤ మార్కాపురం
➾ బాంబే ఐఐటీలో సీటు సాధించి సాఫ్ట్‌వేర్ రంగంలో రాణించడం.

★ శ్రీకుమార్
% 98.1
✤ తూర్పు గోదావరి
➾ దిల్లీ ఐఐటీలో సీఎస్ఈ చేసి సాఫ్ట్‌వేర్ ఇంజినీరు అవడం..

★ ఆదిత్య
% 96.32
✤ విజయనగరం
➾ కేరళలోని ఎన్ఐటీలో చదువుకోవడమే ఆశయం.

★ జితేంద్రరెడ్డి
% 97.74
✤ కర్నూలు
➾ జేఈఈ అడ్వాన్స్‌లో ప్రతిభ చాటి బాంబే ఐఐటీలో సీటు సాధించడం..

★ పేరమ్మ
% 96.49
✤ ఒంగోలు
➾ జేఈఈ మెయిన్ రెండో విడతకు సిద్ధమవుతున్నా. మద్రాసు ఐఐటీలో చేరడమే లక్ష్యం.

★ హేమంత్ నాయక్
% 96.75
✤ కడప
➾ మద్రాసు ఐఐటీలో చదివి సాఫ్ట్‌వేర్ ఇంజినీరుగా రాణిస్తా.

డిగ్రీ పరీక్షల్లో 14 మంది డిబార్

కర్నూలు విద్య, న్యూస్‌టుడే : రాయలసీమ విశ్వవిద్యాలయం పరిధిలో జరుగుతున్న డిగ్రీ 1వ సెమిస్టర్ పరీక్షల్లో మాల్ ప్రాక్టీస్‌కు పాల్పడిన 14 మంది విద్యార్థులను డిబార్ చేసినట్లు కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినర్ వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం జరిగిన పరీక్షకు 12,212 మందికి గాను 11,306 మంది విద్యార్థులు హాజరైనట్లు వెల్లడించారు.

డీఎంహెచ్‌వోగా డాక్టర్ కామేశ్వరప్రసాద్

కర్నూలు వైద్యాలయం, న్యూస్‌టుడే : కర్నూలు జిల్లా డీఎంహెచ్‌వోగా డాక్టర్ కామేశ్వరప్రసాద్‌ను నియమిస్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం ఏపీ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్‌గా పనిచేస్తున్న ఈయన్ను ఫారిన్ సర్వీసు కింద ఏడాది కాలం పాటు డీఎంహెచ్‌వోగా నియమించారు. గతేడాది అక్టోబరు నుంచి డాక్టర్ భాస్కర్‌రాజు ఇన్‌ఛార్జి డీఎంహెచ్‌వోగా కొనసాగుతున్నారు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, వాణిజ్య పన్నుల శాఖ

బహిరంగ వేలం ప్రకటన

DRC- 17 : రిఫరెన్స్ నం. ZD370226004944E **తేదీ: 18.02.2026**

వాణిజ్య పన్నుల శాఖ వారికి బండికి సన్నప్ప, S/o బండికి ముద్దప్ప, M/s సంగీత కాటన్స్ ప్రొప్రైటర్, 16/68, బసాపురం రోడ్, గౌరమ్మ హోటల్ దగ్గర, ఆదోని, కర్నూలు- 518301. వారు చెల్లించవలసిన బకాయిల మొత్తం Rs. 87,23,670/- వసూలు చేయుటకు సదరు వ్యక్తులు క్రింద ఆస్తి వేలం ద్వారా అమ్మకానికి ఉంచుతున్నాము.

ఆస్తి వివరాలు: 1) 16/54/డి, రెవెన్యూ వార్డ్ నం. 16, పర్వతపురం రోడ్, ఆదోని - 518301.
2) MIG- 214, రెవెన్యూ వార్డ్ నం.1, హౌసింగ్ బోర్డ్ కాలనీ, ఆదోని- 518301.
3) 1/MIG/446/b, రెవెన్యూ వార్డ్ నం.1, హౌసింగ్ బోర్డ్ కాలనీ, ఆదోని- 518301.
4) 5/390/282/66/A, రెవెన్యూ వార్డ్ నం.5, రాజరాజేశ్వరి నగర్, ఆదోని- 518301.

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ప్రకారం మార్కెట్ విలువ Rs. 1,00,00,000 వేలం తేదీ: 28.02.2026 (శనివారం), సమయం: ఉదయం 11.00 గంటలకు, వేదిక: M/s సంగీత కాటన్స్ మరిన్ని వివరాల కోసం క్రింద అధికారిని సంప్రదించవచ్చు.

సం/- డిప్యూటీ అసిస్టెంట్ కమిషనర్(ST)-1, అసిస్టెంట్ కమిషనర్ కార్యాలయం, ఆదోని సర్కిల్. మొబైల్: 99494 81464

సౌత్‌జోన్ క్రికెట్ పోటీల్లో.. చిత్తూరు, కర్నూలు జట్ల విజయం

కడప క్రీడలు, న్యూస్‌టుడే: ఏసీఏ సౌత్‌జోన్ అండర్-12 అంతర్ జిల్లాల వన్డే క్రికెట్ పోటీల్లో చిత్తూరు, కర్నూలు జట్లు గెలిపొందాయి. కర్నూలు జట్టు సభ్యుడు గోవర్ధన్‌రెడ్డి సెంచరీ చేశాడు. అలాగే కడప, చిత్తూరు, కర్నూలు క్రీడాకారులు యోగాంజనేయులు, భానువర్షిత్‌రెడ్డి, గోకుల్‌సాయి, ధనుష్, నీలేష్ అర్ధ సెంచరీలు చేసి రాణించారు. వైఎస్ఆర్ఆర్-ఏసీఏ స్టేడియం, కేఎస్ఆర్ఎం క్రికెట్ మైదానంలో మంగళవారం క్రికెట్ పోటీలు జరిగాయి.

చిత్తూరుదే గెలుపు

వైఎస్ఆర్ఆర్-ఏసీఏ స్టేడియంలో జరిగిన మ్యాచ్‌లో చిత్తూరు జట్టు 16 పరుగుల తేడాతో గెలుపొందింది. టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ చేసిన ఆ జట్టు నిర్ణీత 35 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 220 పరుగులు చేసింది. జట్టులో గోకుల్ సాయి 95, ధనుష్ 65 పరుగులు చేశారు. 221 పరుగుల విజయ లక్ష్యంతో బ్యాటింగ్‌ను ఆరంభించిన కడప జట్టు 33.3 ఓవర్లలో 203 పరుగులు చేసి ఆలౌట్ అయ్యింది. జట్టులో యోగాంజనేయులు 86, భానువర్షిత్‌రెడ్డి 54 పరుగులు చేసినప్పటికీ జట్టును గెలిపించలేకపోయారు. చిత్తూరు బౌలర్లలో పునీత్‌సాయిరెడ్డి 4, భువన్‌సాయి 3 వికెట్లు తీసుకున్నారు.

కర్నూలు జట్టు ఆధిపత్యం


సెంచరీ చేసిన కర్నూలు బ్యాట్స్‌మెన్ గోవర్ధన్‌రెడ్డి

ఈ టోర్నమెంట్‌లో కర్నూలు జట్టు రెండో విజయాన్ని నమోదు చేసుకుంది. మొదటి మ్యాచ్‌లో చిత్తూరుపై గెలుపొందిన ఆ జట్టు కేఎస్ఆర్ఎం క్రికెట్ మైదానంలో మంగళవారం జరిగిన మ్యాచ్‌లోనూ అనంతపురం జట్టుపై 156 పరుగుల భారీ తేడాతో గెలుపొంది రెండో విజయాన్ని తన ఖాతాలో నమోదు చేసుకుంది. ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచిన కర్నూలు జట్టు తొలుత బ్యాటింగ్ చేసి నిర్ణీత 35 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 261 పరుగులు చేసింది. జట్టులో గోవర్ధన్‌రెడ్డి 131 పరుగులు, నిలేష్ 84 పరుగులు చేసి ఆ జట్టుకు భారీ స్కోరు అందించారు. ఆపై అనంతపురం జట్టు 35 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 125 పరుగులు మాత్రమే చేసింది. జట్టులో తౌఫిక్ 33, హన్షిక్‌రెడ్డి 24 పరుగులు చేశారు. కర్నూలు బౌలర్లలో సూర్య, ఖలీద్ మూడు వికెట్లు తీసుకోగా వరుణ్‌కుమార్‌కు 2 వికెట్లు దక్కాయి.

నేత్రపర్వం.. బుగ్గరామేశ్వరుడి రథోత్సవం

ఓర్వకల్లు, న్యూస్‌టుడే : మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా కాల్వబుగ్గలో బుగ్గ రామేశ్వరస్వామి రథోత్సవం మంగళవారం రాత్రి కనులపండువగా సాగింది. అర్చకులు ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించి రథంపై కొలువుదీర్చారు. ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి, తితిదే పాలకమండలి సభ్యుడు మల్లెల రాజశేఖర్ ముఖ్య అతిథులుగా హాజరై రథోత్సవాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో మండల తెదేపా అధ్యక్షుడు నాగిరెడ్డి, ఈవో మద్దిలేటి, ఆలయ కమిటీ ఛైర్మన్ నారాయణ, ఓర్వకల్లు, హుసేనాపురం, నన్నూరు సొసైటీ ఛైర్మన్లు సుధాకరరావు, సుధాకరరెడ్డి, నాగేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

అశేష భక్తజనం మధ్య సాగుతున్న రథోత్సవం

పులిగట్టు అంజన్నను దర్శించుకున్న కృష్ణమ్మ

మంత్రాలయం గ్రామీణం, న్యూస్‌టుడే: కౌతాళం మండలంలోని ఎరిగేరి గ్రామంలో వెలసిన పులిగట్టు ఆంజనేయస్వామి పల్లకోత్సవం మంగళవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారిని తెదేపా జిల్లా అధ్యక్షురాలు గుడిసె కృష్ణమ్మ దర్శించుకున్నారు. స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆమె వెంట నాయకులు రామకృష్ణారెడ్డి, సురేష్‌నాయుడు, టిప్పుసుల్తాన్ తదితరులు ఉన్నారు.

స్వామి దర్శనానికి వస్తున్న తెదేపా జిల్లా అధ్యక్షురాలు గుడిసె కృష్ణమ్మ, రామకృష్ణారెడ్డి తదితరులు

ఆటో బోల్తా.. ఎనిమిది మందికి గాయాలు

పత్తికొండ గ్రామీణం, న్యూస్‌టుడే: వ్యవసాయ కూలీలతో వెళ్తున్న ఆటో అదుపు తప్పి బోల్తాపడి కూలీలకు తీవ్ర గాయాలైన ఘటన మంగళవారం పత్తికొండ మండలం గుండుతండా సమీపంలో జరిగింది. క్షతగాత్రుల బంధువులు తెలిపిన వివరాల మేరకు.. గుండుతండా, బుగ్గతండా నుంచి పలువురు వ్యవసాయ కూలీలు మండల పరిధిలోని కొత్తపల్లికి వేరుసెనగ, ఇతర పంట కోత పనులకు ఉదయాన్నే ఆటోలో బయల్దేరారు. పత్తికొండ ప్రధాన రహదారికి చేరే సమయంలో ఆటో అదుపు తప్పి బోల్తా పడింది. అందులో ప్రయాణిస్తున్న కూలీలు కొందరు రోడ్డుపక్కన పడిపోగా మరికొందరు మహిళలు ఆటోలోనే ఇరుక్కుపోయారు. అటుగా వెళ్తున్న కొందరు గమనించి ఆటోను పైకి లేపి కూలీలను బయటకు తీసి, పత్తికొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. గాయపడిన వారిలో లలిత, లక్ష్మి, రాజమ్మ, రాజూనాయక్, భాస్కర్‌నాయక్, గోవిందమ్మ, గంగేనాయక్, లలితమ్మ ఉన్నారు. పరిస్థితి విషమంగా ఉన్న నలుగురిని వైద్యుల సూచన మేరకు కర్నూలుకు తరలించారు. సమాచారం అందుకున్న పత్తికొండ సీఐ జయన్న ఆసుపత్రి వద్దకు చేరుకొని ఘటన వివరాలు తెలుసుకొన్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ చెప్పారు. అధిక సామర్థ్యంతో ఆటోలు నడిపే వారిపై చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

యార్డులో పత్తి చోరీ

ఆదోని మార్కెట్, న్యూస్‌టుడే: ఆదోని వ్యవసాయ మార్కెట్ యార్డులో వ్యాపారి జిందే లక్ష్మణ్‌కు చెందిన మూడు క్వింటాళ్ల పత్తి దొంగలపాలైన ఘటన మంగళవారం వెలుగు చూసింది. యార్డులో 60 క్వింటాళ్ల పత్తి నిల్వ చేసి ఉంచినట్లు లక్ష్మణ్ తెలిపారు. వరుసగా సెలవులు రావడంతో.. 18న మార్కెట్ యార్డులో పత్తిని టెండర్ వేయాలని భావించారు. ఇదే అదునుగా నిల్వ చేసిన దాంట్లో మూడు క్వింటాళ్ల పత్తిని గుర్తుతెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లినట్లు బాధితులు తెలిపారు.

बैंक ऑफ़ बड़ौदा Bank of Baroda **బ్యాంక్ ఆఫ్ బరోడా**
బళ్ళారి రోడ్ కర్నూలు బ్రాంచ్,
జిల్లా పరిషత్ ఎదురుగా, అబ్దుల్లా ఖాన్ ఎస్టేట్ ప్రక్కన, కర్నూలు -518001

చర / స్థిరాస్తుల విక్రయము కొరకు అమ్మకం ప్రకటన

అనుబంధం- IV-A [నిబంధన 6 (2) & 8 (6)కి చూడండి]
సెక్యూరిటైజేషన్ మరియు రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ మరియు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రస్ట్ చట్టం, 2002 తో కలిపి చదవబడే సెక్యూరిటీ ఇంట్రస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 యొక్క రూల్ 6(2) & 8(6) నిబంధనలు క్రింద చర / స్థిరాస్తులు విక్రయం కొరకు అమ్మకం ప్రకటన.

ఇందుమూలముగా సాధారణ ప్రజానీకమునకు మరియు ముఖ్యంగా ఋణగ్రహీతలు/తనఖాదారులు/హామీదారులకు తెలియజేయునది ఏమనగా ఈ దిగువ వివరించబడిన చర / స్థిరాస్తులను సెక్యూర్డ్ క్రెడిటార్ గారికి తనఖా/ఛార్జ్‌డ్ చేయబడి బ్యాంక్ ఆఫ్ బరోడా అధీకృత అధికారి (సెక్యూర్డ్ క్రెడిటార్) వారిచే స్వాధీనము చేసుకొనబడిన దిగువ పేర్కొన్న ఖాతాల యొక్క బకాయి సొమ్ము రాబట్టుకొనే నిమిత్తం సదరు స్థిరాస్తులను **"అక్కడ ఏమి ఉన్నదో అదే"** మరియు **"ఏదైతే ఉన్నదో అదే"** ప్రాతిపదికన అమ్మకం జరుపబడును.

ఋణగ్రహీత: శ్రీమతి రాజ్‌పుత్ భవాని, హామీదారు : శ్రీ రాజ్‌పుత్ గోవర్ధన్ సింగ్, ఇరువురి నివాసం : 78/8-ఎ-12-2-116సి, మయూరి హోమ్స్, విటల్ నగర్, కొత్త కృష్ణా నగర్, కల్లూరు, కర్నూలు-518003

స్థిరాస్తి వివరములు:
కర్నూలు జిల్లా, కల్లూరు సబ్ రిజిస్ట్రేషన్, కర్నూలు మున్సిపల్ కార్పోరేషన్ పరిధిలో, వార్డు నెం.78, కొత్త కృష్ణా నగర్, విటల్ నగర్, సర్వే నెం.475, ఫ్లాటు నెం.6, (అసెస్‌మెంట్ నెం.1016002355)తో తనఖాపెట్టిన అవిభాజ్యపు నివాస ఇంటి డి.నెం.78/8-ఎ-12-2-59. **హద్దులు: తూర్పు** : ప్లాటు నెం.5లో భవనం, **పడమర** : ప్లాటు నెం.7 **ఉత్తరం** : 25 అ॥ల వెడల్పు రోడ్డు, **దక్షిణం** : ఇతర ప్లాట్లు. **కొలతలు** : **తూర్పు నుండి పడమర** : 34 అ.లు లేదా 10.3632 మీ.లు, **ఉత్తరం నుండి దక్షిణం** : 40 అ.లు లేదా 12.1920 మీ.లు.

మొత్తం బకాయి, ఇతర ఛార్జీలు కలపకుండా: తేది.20-07-2025 నాటికి రూ.34,94,321/-
ఈ-వేలం తేదీ మరియు సమయం: 21-03-2026 మ॥ గం.02-00 ల నుండి సా॥ గం.06-00 ల వరకు
రిజర్వు ధర: రూ.72,93,000/- ధరావతు: రూ.7,29,300/- బిడ్ ఇంక్రిమెంట్ ధర: రూ.25,000/-
స్వాధీనం యొక్క స్థితి : లాంఛనాత్మక స్వాధీనం
ఆస్తుల తనిఖీ తేదీ మరియు సమయం: ముందస్తు అనుమతితో 18-02-2026 నుండి 20-03-2026 వరకు

విక్రయానికి సంబంధించిన వివరణాత్మక నిబంధనలు & షరతుల కోసం వెబ్‌సైట్ https://www.bankofbaroda.in/e-auction.htm & ఆన్‌లైన్ వేలం పోర్టల్ https://baanknet.com ను సందర్శించగలరు. ఆసక్తిగల బిడ్డర్లు అధీకృత అధికారి వారిని మొబైల్ నెం.91542 85315 నందు సంప్రదించవచ్చును.

తేది: 17.02.2026, ప్రదేశం : కర్నూలు సం/- అధీకృత అధికారి, బ్యాంక్ ఆఫ్ బరోడా

EENADU Classifieds

BUSINESS SERVICES

BUSINESS OFFER

బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్, ఫైనాన్స్‌లో తాకట్టులో ఉన్నవి మా డబ్బుతో విడిపించి కొనబడును. (రిటైర్డ్ పోలీస్ డిపార్ట్మెంట్) గోల్డెన్ ట్రేడింగ్ కం. ✆73821 14647.

JOBS

Wanted Teachers for Reputed Schools in A.P & Telangana, Contact: Sneha Placements Service. Ph: 94402 46409.

Wanted PRO Qualification any Inter/ Degree. Vani Multi Speciality Hospitals, Dhone. ✆ 95155 59593.

కర్నూలు కొరియర్ లాజిస్టిక్ లో పనిచేయుటకు 1 సంవత్సరం అనుభవం ఉన్న కొరియర్ డెలివరీ బాయ్స్ కావలెను. సంప్ర: 85558 37909.

త్రినేత్ర హోంకేర్‌లో వృద్ధులను/ పేషెంట్స్‌ను/ పిల్లలను చూసుకొనుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఫ్రీ వసతి, భోజనం. జీ: 18K. ✆ 85209 80099, 85208 74499

ప్రముఖ రియల్ ఎస్టేట్ కంపెనీకి 10మంది మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్, టీమ్‌లీడర్స్, టెలికాలర్ కావలెను. తేజేశ్వర్‌రెడ్డి సెల్: 62811 96419, 94941 91951.

HKMCFAP కర్నూలు పుల్లూరు స్టేట్ (అన్నా క్యాంటీన్) ఆఫీసులో పనిచేయుటకు ఎగ్జిక్యూటివ్స్ (డిగ్రీ) & అనుభవం కల్గిన వంట మనిషి కావలెను. ✆ 81214 57873.

Team Leadersగా కర్నూలు, నంద్యాల ఏరియాలలో on role / off role లో M/F కావలెను. PF+ జీతం, Q: డిగ్రీ/ MBA, MCA ✆ 94403 51657.

సిమెంట్ కంపెనీల యందు సెక్యూరిటీ గార్డుగా పనిచేయుటకు వ్యక్తులు కావలెను జీతం 18వేలు, 22వేలు, 25వేలు, 28వేలు మాజీ సైనికులకు 30వేలు ✆ 90521 24024, 94943 64596.

హరేకృష్ణ హోంకేర్‌లో వృద్ధులను/ పేషంట్స్/ పిల్లలను చూసుకొనుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఫ్రీవసతి, భోజనం జీ: 18-20K ✆ 96404 68899, 96402 58899.

Rize Academy లో జాబ్ కర్నూలులో చేయుటకు టెలికాలర్స్ కావలెను. అర్హత, అనుభవానికి జీతం ఉండును. సంప్ర: 88864 44720, 79818 86828.

అన్నిరకాల బిజినెస్ వ్యవహారాలు
B/W 5 లైన్ల ప్రకటన రూ. 470/- మాత్రమే.
కలర్ 5 లైన్ల ప్రకటన రూ. 555/- మాత్రమే.
ప్రకటనలపై 5% GST వర్తించును.
వివరాలకు: 99899 97628

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్-లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

(c) eenadu

ఆదోని

• ఆదోని • ఆలూరు • పత్తికొండ

ఉద్యోగ మేళా సద్వినియోగం చేసుకోవాలి

ఆలూరు, న్యూస్‌టుడే: నిరుద్యోగులను దృష్టిలో పెట్టుకుని ప్రైవేటు ఉపాధి కల్పన సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 20న ఉదయం 10 గంటలకు ఆలూరులో నిర్వహించనున్న ఉద్యోగ మేళాను సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ రమాదేవి, స్కిల్‌హబ్ సమన్వయకర్త వీరేశ్ తెలిపారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం ఉద్యోగ మేళాకు సంబంధించిన కరపత్రాలు విడుదల చేశారు. 18 నుంచి 35 సంవత్సరాల లోపు వయసు నిరుద్యోగ యువతీ, యువకులు మేళాకు హాజరుకావాలని సూచించారు. ఇంటర్వ్యూలకు హాజరయ్యే వారు విద్యార్హత, ఆధార్ పత్రాలు, రెండు ఫొటోలు వెంట తీసుకురావాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు, స్కిల్‌హబ్ సిబ్బంది పాల్గొన్నారు.

ఓటర్ల జాబితా సిద్ధం చేయాలి

మద్దికెర, న్యూస్‌టుడే: రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎలాంటి తప్పులు లేకుండా ఓటర్ల జాబితా సరిచేసి, సిద్ధంగా ఉంచాలని తహసీల్దారు గుండాల నాయక్ పేర్కొన్నారు. మద్దికెరలో మంగళవారం ఆయన బీఎల్వోలు, రెవెన్యూ సిబ్బందితో సమావేశం నిర్వహించి అవగాహన కల్పించారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఓటర్ల నమోదుతో పాటు, తప్పొప్పులను సవరించాలని సూచించారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM) ఆదోని: 77996 66004 ఆలూరు: 80085 62277 పత్తికొండ: 80085 73822

చిప్పగిరి, న్యూస్‌టుడే: ?: నేమకల్లు ఉన్నత పాఠశాల వద్ద మురుగు నిలుస్తోంది. దుర్వాసనతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. **- గోపాల్, నేమకల్లు**

✔: గ్రామ పంచాయతీ సిబ్బందికి సూచించి, తొలగించేలా చర్యలు చేపడతాం. **- బాలన్న, పంచాయతీ కార్యదర్శి, నేమకల్లు**

మద్దికెర, న్యూస్‌టుడే: ?: సాయినగర్ కాలనీలో వారం రోజులుగా తాగునీరు అందడం లేదు. అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఎవరూ పట్టించుకోవడం లేదు. **- రఘు, మురళీ, రామాంజులు**

✔: పరిశీలించి, వెంటనే మరమ్మతు చేయించి నీరందేలా చూస్తాం. **- మయాంక్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ**

ఆస్పరి, న్యూస్‌టుడే: ?: గ్రామంలోని చెత్తంతా చెరువు కట్టపై వేస్తున్నారు. సమీపంలో పాఠశాల ఉంది. దుర్వాసనతో పాటు రోగాలు ప్రబలే ప్రమాదం ఉంది. **- మహేశ్, రాజు, ఆస్పరి** ✔: గ్రామంలోని చెత్తంతా సేకరించి స్వచ్ఛ సంపద కేంద్రంలో వేయిస్తున్నాం. చెరువు కట్టపై వేయకుండా చర్యలు తీసుకుంటాం. **- విజయరాజు, పంచాయతీ కార్యదర్శి, ఆస్పరి**

ఆదోని పట్టణం, న్యూస్‌టుడే: ?: పట్టణంలో రంజాన్ మాసం ప్రారంభమవుతున్న నేపథ్యంలో తాగునీటి ఇబ్బందులతో పాటు వీధి దీపాల సమస్యలు లేకుండా చూడాలి. టైలర్ వృత్తిదారులకు ఉపాధి కోసం రాత్రి సమయంలో వృత్తి చేసుకునేందుకు కొంత సడలింపు ఇవ్వాలి. **- నసీరుద్దీన్‌వలీ, ఆదోని**

✔: పట్టణంలో రంజాన్ మాసం సందర్భంగా ఇబ్బందులు లేకుండా చేస్తాం. **- నయీమ్ అహ్మద్, కమిషనర్, ఆదోని పురపాలక సంఘం**

విజేఈఈయులు

పేరు : ★ కుటుంబ నేపథ్యం : ✤ శాతం : % లక్ష్యం : ➜

ఆదోని విద్య, ఆదోని పాతపట్టణం, న్యూస్‌టుడే: ఐఐటీ, ట్రిపుల్ ఐటీ ఇంజినీరింగ్ కళాశాలల్లో ప్రవేశం కోసం నిర్వహించిన జేఈఈ మెయిన్ తొలి విడత ప్రవేశ పరీక్షల్లో ఆదోని విద్యార్థులు ప్రతిభ చాటి ర్యాంకుల పంట పండించారు.

★ కె.నాగప్రవీణ్ ✤ ప్రశాంతి, గోపీనాథ్. తండ్రి ఆదోని పురపాలక సంఘంలో ఉప ఇంజినీర్‌గా పనిచేస్తున్నారు. % 97.66 ➜ ఐఐటీలో స్థానం సాధించడం.

★ బి.చైతన్య రాఘవ ✤ తల్లిదండ్రులు సుకన్య, బి.సూర్యనారాయణ. తండ్రి బ్యాంకు ఉద్యోగి % 96.70 ➜ సాఫ్ట్‌వేర్ రంగంలో ఉన్నతంగా ఎదగాలని.

★ జి.చంద్రిక ✤ తల్లిదండ్రులు సురేశ్, రేణుక. చేనేత కార్మికులు % 95.94 ➜ బీటెక్‌లో ఉత్తమ ఫలితాలు సాధించాలి.

★ కె.అజిత్, ✤ తల్లిదండ్రులు బసవరాజు, మధుమతి. తండ్రి లోన్‌రికవరీ ఏజెంట్‌గా పని చేస్తున్నారు. % 93.08 ➜ ఏరోనాటికల్ ఇంజినీరింగ్ చేయాలని.

★ సోంపోతే విశాల్ సాయి ✤ తల్లిదండ్రులు ఎస్.లక్ష్మణ్‌రావు, కె.అరుణ. తండ్రి అకౌంటెంట్ % 91.63 శాతం ➜ ఇంజినీరింగ్‌లో ప్రత్యేక గుర్తింపు పొందాలని

ధ్రువపత్రాలు అందుకున్న ఎన్‌సీసీ క్యాడెట్లతో ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయుడు రాజాసతీశ్, ఎన్‌సీసీ అధికారిణి పరిమళ

ఎన్‌సీసీతో ఉన్నత విద్యకు అవకాశం

ఆదోని విద్య, న్యూస్‌టుడే: విద్యార్థులు ఎన్‌సీసీ కోర్సు చేయడం వల్ల భవిష్యత్తులో ఉన్నత విద్య, ఉద్యోగ అవకాశాలు మెరుగుపడుతాయని ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయుడు రాజాసతీశ్, ఎన్‌సీసీ అధికారిణి పరిమళ అన్నారు. ఆదోని పట్టణంలోని నెహ్రూ మెమోరియల్ పురపాలక ఉన్నత పాఠశాలలో 2023-25 సంవత్సరంలో ఎన్‌సీసీ కోర్సు పూర్తిచేసిన 50 మంది విద్యార్థినులకు ధ్రువపత్రాలు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

సర్వేంతరాయం.. సిబ్బంది సతమతం

- పల్లెల్లో తప్పని ఇబ్బందులు
- లక్ష్యం చేరాలని అధికారుల ఒత్తిళ్లు

ఆలూరు గ్రామీణం, హాలహర్వి, దేవనకొండ, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ప్రతి కుటుంబ వివరాలను సాంకేతికంగా పొందుపరిచి సంక్షేమ, అభివృద్ధి పథకాలు అందేలా చేయాలనే ఉద్దేశంతో యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వే చేపట్టేందుకు శ్రీకారం చుట్టింది. గ్రామాల్లో సచివాలయ సిబ్బంది ఇంటింటికి వెళ్లి సర్వే చేపట్టి ఆ కుటుంబ సభ్యుల వివరాలు పొందుపరిచి, బయోమెట్రిక్ లేదా ఓటీపీ ద్వారా ధ్రువీకరిస్తారు. క్షేత్రస్థాయిలో సచివాలయ సిబ్బంది కొరత వేధిస్తుండటం, మరో వైపు అధికారులు లక్ష్యాలు చేరుకోవాలని ఒత్తిడి చేస్తున్నారు. ఇటు సర్వే పూర్తికాక, అటు అధికారుల ఒత్తిడి భరించలేక సచివాలయ సిబ్బంది సతమతమవుతున్నారు.

నియోజకవర్గం : ఆలూరు
మండలాలు: 6 (ఆలూరు, ఆస్పరి, చిప్పగిరి, దేవనకొండ, హాలహర్వి, హొళగుంద)
జనాభా : 3.50లక్షలు
సర్వే చేయాల్సిన కుటుంబాలు: 1,03,087
పంచాయతీలు : 108
సచివాలయాలు : 98
సర్వే చేసే సిబ్బంది: 98

కొత్తపేట గ్రామంలో సర్వే చేస్తున్న సచివాలయ ఉద్యోగులు

ఇదీ పరిస్థితి..

ప్రతి సచివాలయ సిబ్బందికి క్లస్టర్ల చొప్పున కుటుంబాలను విభజించారు. ఆ కుటుంబానికి సంబంధించిన పూర్తి వివరాలు పొందుపరచడంతో పాటు భవిష్యత్తులో ప్రభుత్వం తరఫున అందించే సంక్షేమ పథకాలు నేరుగా వారికే లబ్ధిచేకూర్చేందుకే ఈ సర్వే ఉద్దేశం. ఇంత వరకు బాగానే ఉన్నా.. ఈ ప్రక్రియ కొనసాగించేందుకు తగిన సిబ్బంది లేకపోవడంతో సర్వే వేగంగా ముందుకుసాగడంలేదు. ఉన్నతాధికారులు మాత్రం లక్ష్యం చేరుకోవాలని ఒత్తిడి చేస్తున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు సర్వే చేయడంతో పాటు, ఆ వివరాలపై ఉన్నతాధికారులు రివ్యూ కార్యక్రమాలు చేపడుతుండటంతో సిబ్బంది మానసికంగా, శారీరకంగా సతమతమవుతున్నారు. నియోజకవర్గంలోని ఆలూరు, హాలహర్వి, దేవనకొండ, ఆస్పరి, చిప్పగిరి, హొళగుంద మండలాల్లో 1,03,087 కుటుంబాలను సర్వే చేయాల్సి ఉందని అధికారులు వెల్లడించారు.

- నియోజకవర్గంలోని ఓ మండలంలో ఉదయం నుంచి సాయంత్రం 6 గంటలకు వరకు సర్వే నిర్వహించుకుని మండల కేంద్రానికి రాత్రి ఏడు గంటలకు చేరుకుని ఎనిమిది గంటల వరకు నిర్వహించే రివ్యూ కార్యక్రమానికి పాల్గొనాలని చెప్పడంతో సచివాలయ సిబ్బంది వ్యయప్రయాసాలకోర్చి మండల కేంద్రానికి చేరుతున్నారు. అరగంటపాటు రివ్యూ ముగించుకుని తిరిగి వారి స్వగ్రామాలకు వెళ్లిపోవాలని సూచించడంతో ఈ సమయంలో ఎలా వెళ్లాలని ఉద్యోగులు సతమతమయ్యారు. దీనికి సిబ్బంది కొరత వల్ల ఉన్నవారిపైనే రెట్టింపు పనిభారంతో విధులు నిర్వహిస్తున్నా, ఉన్నతాధికారులతో చీవాట్లు తప్పడంలేదని ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఫిబ్రవరి 10వ తేదీ వరకు చేపట్టిన సర్వే వివరాలు

మండలం	సచివాలయాలు	సర్వే చేయాల్సిన కుటుంబాలు	పూర్తి చేసినవి
ఆలూరు	16	17,556	7,756
హాలహర్వి	15	14,006	8,108
ఆస్పరి	19	20,490	11,392
హొళగుంద	16	18,058	9,205
దేవనకొండ	22	22,838	10,632
చిప్పగిరి	09	10,131	6,263

బురద నీరే దిక్కు.. రోగాలతో చిక్కు

ఆస్పరి మండలంలోని జోహరాపురం గ్రామానికి బాపురం తాగునీటి పథకం నుంచి నీరు సరఫరా చేస్తున్నారు. 15- 20 రోజులకోసారి నీరు వస్తుండటంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. గ్రామంలో సుమారు 10వేల జనాభా ఉంటుంది. ఆ గ్రామానికి ప్రధానంగా వక్రేణి కుంట ఉంది. వర్షాకాలంలో ఈ కుంటలోకి వర్షం నీరొచ్చి చేరుతుంది. చాలా మంది ఈ నీటినే స్నానాలకు, పాత్రలు శుభ్రం చేసేందుకు వినియోగిస్తున్నారు. శుద్ధజలం కొనలేని నిరుపేదలు గత్యంతరం లేక వక్రేణి కుంటలోని బురద నీటినే తెచ్చుకొని వడపోసుకొని దాహార్తి తీర్చుకుంటున్నట్లు గ్రామస్థులు తెలిపారు. **- న్యూస్‌టుడే, ఆస్పరి**

రహదారిపై మురుగు ప్రవాహం

ఆలూరు పట్టణంలోని పలు కాలనీల్లో మురుగు కాల్వల్లో కాకుండా రహదారులపై పారుతోంది. ఆలూరు ఎంపీడీవో కార్యాలయం ఎదుట కోయనగర్ కాలనీకి వెళ్లే మార్గంలోని కాల్వల్లో చెత్త పేరుకుపోవడంతో మురుగు ముందుకు పారే వీల్లేకుండా పోయింది. దీంతో మురుగంతా రోడ్డుపై నిలిచిపోయింది. ఇటు వైపు రాకపోకలు కొనసాగించే వారు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి కాల్వలో చెత్త తొలగించి మురుగు ప్రవహించేలా చూడాలని స్థానికులు కోరుతున్నారు. **– న్యూస్‌టుడే, ఆలూరు**

రైతు సేవకు దూరం

చిప్పగిరి మండలంలోని నేమకల్లు గ్రామంలోని రైతు సేవా కేంద్రం భవనం ఇది. వైకాపా హయాంలో ఒక్కో భవనానికి రూ.40 లక్షలు వెచ్చించి నిర్మించారు. ప్రస్తుతం అవి నిరుపయోగంగా ఉన్నాయి. రామదుర్గం, నేమకల్లు, నగరడోణ, బెల్డోణ, డేగులపాడు గ్రామాల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది. కొన్ని పూర్తికాగా మరి కొన్ని వివిధ దశల్లో ఉన్నాయి. వాటిని పూర్తిచేస్తే రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయి. కూటమి ప్రభుత్వం నిరుపయోగంగా ఉన్న ప్రభుత్వ భవనాలను గుర్తించి వినియోగంలోకి తేవాలని అన్నదాతలు కోరుతున్నారు. **– న్యూస్‌టుడే, నేమకల్లు (చిప్పగిరి)**

శిథిల దారులు.. పురవాసులకు ఇబ్బందులు



పీసె వెంకోబరావు, ఆదోని పట్టణం

పౌర పాత్రికేయం

ఆదోని పట్టణంలోని గోకర్‌జెండా ప్రాంతం నుంచి దుబ్బగణపతి ఆలయం మీదుగా పెద్దపళ్లకు వెళ్లే ప్రధాన రహదారి శిథిలావస్థకు చేరింది. సుమారు 1.50 కి.మీ. ఉన్న ఈ రహదారి మొత్తం కంకర తేలి పెద్దపెద్ద గుంతలు పడ్డాయి. ఫలితంగా వాహన చోదకులు ఈ దారిలో రాకపోకలు సాగించాలంటే సాహసం చేయాల్సిందే. దొడ్డనగేరి, సుల్తానపురం, మాంత్రికి, పట్టణ శివారు కొండపై వెలసిన యల్లమ్మ దేవాలయం, రణమండల ఆంజనేయస్వామి ఆలయాలకు రోజూ వేలాది వాహనాల రాకపోకలు సాగిస్తుంటాయి. విద్యార్థులు, తల్లిదండ్రులు ఆటోలు, ద్విచక్రవాహనాలపై వెళ్తుంటారు. ప్రమాదాల బారిన పడిన ఘటనలూ లేకపోలేదు. పురపాలక అధికారులు స్పందించి ఈ రహదారిని మరమ్మతులు చేపట్టి గుంతలు మూయించి ప్రమాదాలు నివారించాలని పురవాసులు కోరుతున్నారు.

- పీసె వెంకోబరావు, ఆదోని పట్టణం

– న్యూస్‌టుడే, ఆదోని ఎస్కేడీ కాలనీ

పంటకోత ప్రయోగాలపై దృష్టి సారించాలి

ఆదోని గ్రామీణం, న్యూస్‌టుడే: పంటల దిగుబడులకు సంబంధించిన పంట కోత ప్రయోగాలు పక్కాగా చేయాలని కర్నూలు ఉప గణాంక అధికారి రమణ, ఆదోని డివిజన్ ఉప గణాంక అధికారి గోపాల్ అన్నారు. స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో మంగళవారం ఆదోని, పత్తికొండ డివిజన్ సహాయ గణాంక అధికారులతో సమావేశం నిర్వహించారు. ప్రధానమంత్రి ఫసల్ యోజన బీమా పథకం కింద ఖరీఫ్‌లో వరి పంటకు సంబంధించిన పంట కోత ప్రయోగాలపై సమీక్ష చేశారు. సమావేశంలో ఆదోని, పత్తికొండ డివిజన్ సహాయ గణాంక అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

గిరుల్లో భక్తఝరి

బిణిగేర(ఆస్పరి), న్యూస్‌టుడే: బిణిగేర శ్రీగిరిక్షేత్రంలో మహాశివరాత్రి సందర్భంగా ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం పంచలింగేశ్వర ఆలయ గిరిప్రదక్షిణ భక్తజన సందోహం నడుమ వైభవంగా జరిగింది. ఆశ్రమ గురువు శ్రీనివాసనాయన దంపతులు గంధోత్సవం చేసుకుంటు మేళతాళాలతో ఊరేగింపుగా గిరి ప్రదక్షిణ నిర్వహించారు. కార్యక్రమానికి భక్తులు పెద్దఎత్తున తరలివచ్చారు.

భక్తజన సందోహం నడుమ గిరి ప్రదక్షిణ

గురువులను సన్మానిస్తున్న పంచలింగేశ్వర ఆశ్రమ గురువు శ్రీనివాసనాయన

అధ్యాత్మిక చింతన కలిగివుండాలి

ఆస్పరి, న్యూస్‌టుడే : గ్రామీణ ప్రాంతాల్లో యువత చెడు అలవాట్లకు బానిస కాకుండా మంచి అలవాట్లతో పాటు దైవ చింతన అధ్యాత్మిక భావాలు కలిగి ఉండాలని కామవరం మఠం గురువు అవ్యక్తానందస్వామి అన్నారు. బిణిగేరి గ్రామ సమీపంలోని శ్రీగిరి క్షేత్రంలో మంగళవారం ఆధ్యాత్మిక సమ్మేళనాన్ని ఆశ్రమ గురువు శ్రీనివాసనాయన ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో గురువులు హనుమంతస్వామీజీ, జగదీశస్వామి, గంగాధర్‌రెడ్డి, కుమారస్వామీజీ, సోమప్పస్వామీజీ, ఈరన్న స్వామి, పులికొండస్వామి, తదితరులు పాల్గొన్నారు.

కమనీయం బ్రహ్మేశ్వరస్వామి రథోత్సవం

వెల్దుర్తి, న్యూస్‌టుడే: వెల్దుర్తి సమీపంలోని బ్రహ్మగుండం క్షేత్రంలో మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా కామేశ్వరి సహిత బ్రహ్మేశ్వరస్వామి రథోత్సవం ఆలయ కమిటీ నిర్వాహకులు బొమ్మన రాజశేఖర్‌రెడ్డి, ఈవో ఆంజనేయులు ఆధ్వర్యంలో కమనీయంగా సాగింది. బ్రహ్మగుండం క్షేత్రం భక్తులతో కిక్కిరిసింది. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సీఐ యుగంధర్, ఎస్సై నరేష్ పోలీసు బందోబస్తు చేపట్టారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీలు దశరథరామిరెడ్డి, జ్ఞానేశ్వర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్తు దీపాల వెలుగుల్లో బ్రహ్మేశ్వరస్వామి రథోత్సవం

నాయీబ్రాహ్మణ సేవా సంఘం నూతన కమిటీ ఎన్నిక

పత్తికొండ గ్రామీణం, న్యూస్‌టుడే: పత్తికొండ పట్టణంలో వెలసిన పెద్ద ఆంజనేయస్వామి ఆలయ నూతన కమిటీని సంఘం నాయకులు ఎన్నుకున్నారు. అధ్యక్షుడు మూలింటి చంద్రశేఖర్ అధ్యక్షతన ఆలయంలో మంగళవారం జరిగిన సమావేశంలో నూతన కమిటీ ఎన్నిక నిర్వహించారు. గౌరవాధ్యక్షుడిగా యం.కారన్న, గౌరవ సలహాదారులుగా గోవిందరాజులు, పోస్ట్ ఆంజనేయులు సంఘం కొత్త అధ్యక్ష, కార్యదర్శులుగా చిన్నమద్దిలేటి, శరవప్ప, ఉపాధ్యక్షుడిగా నవీన్, కోశాధికారిగా రంగస్వామి, పలువురుని కమిటీ సభ్యులుగా ఎనుకున్నారు. సమావేశంలో సభ్యులు వెంకటేశ్వర్లు, వేణు, రఘు, రామకృష్ణ, భగవంతు, ధనుంజయ, లింగన్న, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

నేత్రాలను సంరక్షించుకోవాలి

పత్తికొండ గ్రామీణం, న్యూస్‌టుడే: జ్ఞానేంద్రియాల్లో ప్రధానమైన నేత్రాల విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని ప్రముఖ నేత్ర వైద్యుడు హనుమంతరెడ్డి సూచించారు. పత్తికొండ ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పలువురు విద్యార్థినులకు కంటి అద్దాలు అందజేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయిని కాటం శ్రీదేవి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం భ్రమరాంబ, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పొలంలో నియంత్రిక ధ్వంసం

నేలతలమర్రి (దేవనకొండ) న్యూస్‌టుడే : గ్రామ సమీపంలో రైతు హంపిరెడ్డి పొలంలో గుర్తుతెలియని దుండగులు నియంత్రికను ధ్వంసం చేసి అందులోని సామగ్రిని ఎత్తుకెళ్లినట్లు స్థానికులు తెలిపారు. సుమారు రూ.1.35లక్షల నష్టం వాటిల్లిందని సంబంధిత రైతు పేర్కొన్నారు. పొలాల్లో విద్యుత్తు పరికరాలు, కరెంట్ తీగలు తదితర వరుస దొంగతనాలతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

జిల్లాగా ప్రకటించే వరకు ఉద్యమం ఆగదు

ఆదోనిలో రిలే నిరాహారదీక్షలు చేస్తున్న ఐకాస నాయకులు

ఆదోని ఎస్కేడీ కాలనీ, న్యూస్‌టుడే: ఆదోని జిల్లాగా ప్రకటించే వరకు ఉద్యమం కొనసాగిస్తామని ఆదోని జిల్లా సాధన సమితి ఐకాస నాయకులు రఘురామయ్య, కృష్ణమూర్తిగౌడు, దస్తగిరినాయుడు, కోదండ తదితరులు అన్నారు. ఆదోని జిల్లా కోసం ఐకాస ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు మంగళవారం 94వ రోజుకు చేరుకున్నాయి. దీక్షల్లో ఐకాస నాయకులు దండు అయ్యాళప్ప, నరేంద్రయాదవ్, పి.కుమార్, సుభాష్‌చంద్రబోస్, శ్రీధర్, రమేశ్, మల్లేశ్, బసవరాజు, పరమేశ్, హఫీజ్ కూర్చొని మద్దతు తెలిపారు.

ఎమ్మెల్యే సానుకూలంగా లేరు

ఆదోని పాతపట్టణం, న్యూస్‌టుడే: జిల్లా ఏర్పాటుకు ఆదోని ఎమ్మెల్యే అనుకూలంగా లేరని, కేవలం ప్రకటనలకే పరిమితమవుతున్నారని ఆదోని జిల్లా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు నూర్‌అహ్మద్ మంగళవారం అన్నారు. అసెంబ్లీలో ఆదోని జిల్లా ఏర్పాటుపై ఎమ్మెల్యే డిమాండ్ చేయలేదని, కేవలం ఇస్తే బాగుంటుందని సలహా ఇచ్చినట్లు మాట్లాడినట్లు ఉందన్నారు. జిల్లా సాధన కోసం తాము బంద్, ఉద్యమాలు చేస్తే స్పందించని రాష్ట్ర ప్రభుత్వం ఎమ్మెల్యే సలహాకు స్పందిస్తుందనుకోవడం అమాయకత్వమేనన్నారు.

పశ్చిమ ప్రాంతానికి న్యాయం చేయాలి

ఆదోని పురపాలకం, న్యూస్‌టుడే: డివిజన్‌లోని ఎమ్మిగనూరు, మంత్రాలయం, పత్తికొండ, ఆలూరు నియోజకవర్గాలను కలుపుకొని ఆదోనిని జిల్లా కేంద్రంగా చేస్తే వెనుకబడిన పశ్చిమ ప్రాంతానికి న్యాయం జరుగుతుందని ఎమ్మెల్యే పార్థసారథి అన్నారు. రాష్ట్రంలో అతి పెద్ద మండలంగా ఉన్న ఆదోనిని రెండుగా చేసినందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు ధన్యవాదాలు తెలిపారు. పెద్దతుంబళం, పెద్దహరివాణం కేంద్రంగా మరో రెండు మండలాలు ఏర్పాటు చేయాలన్నారు. ఇక్కడి ప్రాంతంలో వలసలు ఆగి, ఉపాధి అవకాశాలు పెరిగి, అభివృద్ధి జరగాలంటే జిల్లా ఏర్పాటే అత్యవసరమన్నారు.

జాతీయ లోక్‌అదాలత్‌ను జయప్రదం చేయండి

ఆదోని గ్రామీణం, న్యూస్‌టుడే: జాతీయ లోక్‌అదాలత్‌ను మార్చి 14న నిర్వహించనున్నట్లు ఆదోని జిల్లా రెండో అదనపు జడ్జి సుధ, ఏడో అదనపు జిల్లా జడ్జి లక్ష్మీరాజ్యం, ఆదోని సీనియర్ సివిల్ జడ్జి యజ్ఞ నారాయణ అన్నారు. ఆదోని జిల్లా కోర్టులో మంగళవారం సాయంత్రం జాతీయ లోక్‌అదాలత్‌పై న్యాయవాదులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. జాతీయ లోక్‌అదాత్‌లో ఎక్కువ కేసులు పరిష్కారం అయ్యేలా చూడాలన్నారు. సమావేశంలో మొదటి ఏడీఎం సుభాష్, పీడీఎం అర్చన, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీరాములు, న్యాయవాదులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జిల్లా రెండో అదనపు జడ్జి సుధ

గ్రూప్-2 అధికారికి సన్మానం

ఆదోని గ్రామీణం, న్యూస్‌టుడే: గ్రూప్-2 అధికారిగా ఎంపికైన హరిబాబును ఆదోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో మంగళవారం ఘనంగా సన్మానించారు. దేవనకొండ సహాయ గణాంక అధికారిగా పనిచేస్తూ గ్రూప్-2కు ఎంపికయ్యారు. వెలగపూడి సచివాలయం సహాయ సెక్షన్ అధికారిగా నియమితులయ్యారు. తోటి ఉద్యోగులు జ్ఞాపిక అందించి సత్కరించారు. కార్యక్రమంలో ఆదోని డివిజన్ ఉప గణాంక అధికారి గోపాల్, కర్నూలు ఉప, ఆదోని సహాయ గణాంక అధికారులు రమణ, వెంకటేశ్వర్లు ఆదోని, పత్తికొండ డివిజన్‌లోని సహాయ గణాంక అధికారులు పాల్గొన్నారు.

రహదారి లైనింగ్ పనులు ప్రారంభం

హొళగుంద, న్యూస్‌టుడే: హొళగుంద నుంచి ఢణాపురం రహదారి పనులకు మోక్షం లభించింది. 25 కి.మీ. మేర చేపట్టేందుకు ప్రభుత్వం రూ.13.74 కోట్లు మంజూరు చేసింది. ఢణాపురం నుంచి హెబ్బటం, హెబ్బటం నుంచి హొళగుంద వరకు రోడ్డు పనులకు టెండర్లు పూర్తయ్యాయి.

నులిపురుగుల నివారణకు కృషి చేద్దాం

మండిగిరి జడ్పీ పాఠశాలలో విద్యార్థులకు మాత్రలు వేస్తున్న డాక్టర్ సత్యవతి

ఆదోని గ్రామీణం, న్యూస్‌టుడే: ఆల్బెండజోల్ మాత్రలతో పిల్లల్లో నులిపురుగులను నివారించి, రక్తహీనత నుంచి బయట పడేలా అందరం కలిసికట్టుగా కృషిచేయాలని ఆదోని డివిజన్ డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ సత్యవతి అన్నారు. మండిగిరి పంచాయతీ పరిధిలోని జడ్పీ పాఠశాలలో మంగళవారం జాతీయ నులిపురుగుల దినోత్సవం పురస్కరించుకొని ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ సత్యవతి, వైద్య ఆరోగ్య శాఖ పరిశీలకులు రామచంద్రుడు, పెద్దహరివాణం పీహెచ్‌సీ డాక్టర్ వినోద్‌కుమార్, ఆదోని డివిజన్ డిప్యూటీ డీఈవో రాజేంద్రప్రసాద్, ఎంఈవో శ్రీనివాసులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పత్తికొండ గ్రామీణం, న్యూస్‌టుడే: పిల్లల ఎదుగుదలకు తీవ్ర ఆటకంగా మారిన నులిపురుగులను నివారించాలని ఆర్డీవో ఎస్.భరత్‌నాయక్, జిల్లా నోడల్ అధికారి మల్లికార్జునరెడ్డి అన్నారు. పత్తికొండ ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో వారు పాల్గొని విద్యార్థులకు నివారణ మందులు వేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచి కొమ్ముదీపిక, ఉప వైద్యాధికారి రఘురామిరెడ్డి, మండల వైద్యాధికారిణి సుజాత, ఐసీడీఎస్ అధికారిణి లలిత, వైద్య ఆరోగ్య సిబ్బంది సాయిబాబా, ప్రకాశ్, గంగరత్న, వరలక్ష్మి, పాఠశాల ఉపాధ్యాయ బృందం, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు. పుచ్చకాయలమడ గ్రామంలోనూ కార్యక్రమం నిర్వహించారు.

మద్దికెర, న్యూస్‌టుడే: మద్దికెరలోని ఆయా పాఠశాలల్లో ఆల్బెండజోల్ విద్యార్థులకు మందులను పంపిణీ చేశారు. వైద్యాధికారులు, శ్రీలక్ష్మి, రాగిణి, సిబ్బంది, ఎంఈవో రంగస్వామి తదితరులు పాల్గొన్నారు.

పత్తికొండ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులకు మందులు వేస్తున్న ఆర్డీవో భరత్‌నాయక్

పతకాలు వలలో పడాల్సిందే

వెల్దుర్తి, న్యూస్‌టుడే: గ్రామీణ ప్రాంతానికి చెందిన విద్యార్థి రాష్ట్రస్థాయి పోటీల్లో రాణించి, జాతీయ స్థాయి నెట్‌బాల్ పోటీలకు అర్హత సాధించాడు. వెల్దుర్తి మండలం గోవర్ధనగిరి జడ్పీ ఉన్నత పాఠశాల తొమ్మిదో తరగతి విద్యార్థి వంశీ నెట్‌బాల్ పోటీల్లో జిల్లా నుంచి జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని ప్రశంసలు అందుకుంటున్నాడు.

పతకాలతో వంశీ

గోవర్ధనగిరి గ్రామానికి చెందిన లక్ష్మీదేవి, గోవిందు దంపతుల కుమారుడు వంశీ. ఆటలో విద్యార్థుల ఆసక్తి, ఉత్సాహం గమనించిన కొత్తగా వచ్చిన పీఈటీ వంశీకృష్ణ నెట్‌బాల్‌లో శిక్షణ ఇచ్చారు. దీంతో విద్యార్థి వంశీ ఆసక్తిని గుర్తించి, ప్రత్యేక శ్రద్ధ చూపారు.

సాధించిన విజయాలు

- గత ఏడాది డిసెంబర్ 16న సిల్వర్ జూబ్లీ కళాశాల ఆవరణలో జిల్లాస్థాయి నెట్‌బాల్ పోటీల్లో పాల్గొనేందుకు ఉమ్మడి జిల్లాల నుంచి 350 మంది విద్యార్థులు పాల్గొన్నారు. వీటిలో గోవర్ధనగిరి పాఠశాల నుంచి వంశీ, గంభీర్ ఎంపికయ్యారు.
- వంశీ గత డిసెంబరు 27 నుంచి 29 వరకు తూర్పు గోదావరి జిల్లా రావులపాలెంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొన్నారు. వీటిలో ప్రతిభ చూపడంతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి జాతీయ స్థాయి నెట్‌బాల్ పోటీలకు ఎంపికయ్యారు.
- హైదరాబాద్‌లోని గచ్చిబౌలిలో జరిగిన 42వ సీనియర్ నెట్‌బాల్ ఛాంపియన్‌షిప్‌లో ఇతను రాష్ట్రం నుంచి పాల్గొన్నారు. గ్రామీణ ప్రాంతానికి చెందిన వంశీ ఆంధ్రప్రదేశ్ నుంచి ప్రాతినిధ్యం వహిస్తూ జాతీయ స్థాయి పోటీల్లో ఆడటంతో పాఠశాల సిబ్బంది, గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు.

ఎగరటంలో మెలకువలు - వంశీ, క్రీడాకారుడు

నెట్‌బాల్ ఆటలో పాయింట్ సాధించాలంటే.. ఎగరటం కీలకంగా ఉంటుంది. సరైన సమయంలో ఎలా జంప్ చేసి నెట్ చేయాలనే విషయాలను పీఈటీ వంశీకృష్ణ ప్రత్యక్షంగా వివరిస్తుంటారు. పాఠశాల తరగతుల అనంతరం రోజూ గంట పాటు శిక్షణ అందించారు. జాతీయ స్థాయికి ఎంపిక కావడం సంతోషంగా ఉంది.

(c) eenadu

ఎమ్మిగనూరు

• ఎమ్మిగనూరు • మంత్రాలయం • కోడుమూరు

సచివాలయం పూర్తి చేయించాలి

పెద్దకడబూరు, న్యూస్‌టుడే: మండల కేంద్రంలోని గ్రామ సచివాలయం-2 నూతన భవన నిర్మాణ పనులు పూర్తి చేయాలని మంగళవారం ఎంపీడీవో ప్రభావతిదేవికి కాలనీవాసులు వినతిపత్రం సమర్పించారు. సంబంధిత గుత్తేదారు పనులు పూర్తి చేయకుండా నిధులు డ్రా చేసినట్లు ఆరోపించారు. సదరు గుత్తేదారుపై సమగ్ర విచారణ చేపట్టి పనులు పూర్తి చేయాలని కోరారు.

ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కుల పంపిణీ

మంత్రాలయం గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలో అనారోగ్య సమస్యలతో చికిత్స పొందిన వారికి ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి నిధులు విడుదలయ్యాయి. ఆ చెక్కులను మంగళవారం కౌతాళంలో ఉరుకుంద ఆలయ ట్రస్టు బోర్డు మాజీ ఛైర్మన్ చెన్నబసప్ప, ఉరుకుంద కొట్రేష్‌గౌడ, రమేష్‌గౌడ చేతులమీదుగా బాధితులకు పంపిణీ చేశారు. మొత్తం అయిదుగురికి రూ.2,07,306 చెక్కులను వారికి అందజేసినట్లు వారు తెలిపారు.

ప్రాజెక్టులకు నిధులు కేటాయించడం శుభ పరిణామం

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: వైకాపా హయాంలో ప్రాజెక్టులను పూర్తిగా విస్మరించారని.. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత బడ్జెట్‌లో నిధులు కేటాయించడం రాయలసీమ ప్రాంతానికి శుభపరిణామమని ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి పేర్కొన్నారు. శాసనసభ సమావేశంలో మంగళవారం ఆయన మాట్లాడారు. వైకాపా హయాంలో సీమలోని ప్రాజెక్టులన్నింటిని రివర్స్ టెండర్ల పేరిట నిధులు కేటాయించకుండా వదిలేశారన్నారు. ఆర్డీఎస్, గుండ్రేవుల, హంద్రీనీవా, వేదవతి, గాలేరు నగరి ప్రాజెక్టులను సర్వనాశనం చేశారని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టుల పూర్తికి భారీగా నిధులు కేటాయించడం సంతోషకరమని చెప్పారు. అంతేకాక ఆర్డీఎస్ కుడి కాలువ పనులు పూర్తి చేస్తే పశ్చిమ ప్రాంతాలకు కరవు తొలగిపోతుందని పేర్కొన్నారు.

అసెంబ్లీ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బీవీ

పది పరీక్షల్లో శతశాతం ఉత్తీర్ణత సాధించాలి

సి.బెళగల్, న్యూస్‌టుడే: పదో తరగతి విద్యార్థులు పరీక్షల్లో శతశాతం ఉత్తీర్ణత సాధించాలని అసిస్టెంట్ బీసీ సంక్షేమాధికారి శ్రీనివాసులు సూచించారు. సి.బెళగల్‌లో బీసీ బాలుర వసతిగృహాన్ని మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. దస్త్రాలను పరిశీలించి సరకుల నిల్వలను పరిశీలించారు. అనంతరం వసతిగృహంలో పదో తరగతి విద్యార్థులకు కల్పిస్తున్న సదుపాయాలపై ఆరా తీశారు. కష్టపడి చదివి వసతిగృహానికి, పాఠశాలకు, తల్లిదండ్రులకు పేరు తీసురావాలని సూచించారు. ఐవీఆర్ సర్వే లో సంతృప్త శాతం 95 శాతానికి పెంచేందుకు కృషి చేయాలన్నారు.

విద్యార్థులతో మాట్లాడుతున్న అసిస్టెంట్ బీసీ సంక్షేమాధికారి శ్రీనివాసులు

విస్తరణ ఊసెత్తితే ఒట్టు

☛ ప్రధాన రహదారిలో ప్రయాణికుల ఇబ్బందులు

కోడుమూరు, న్యూస్‌టుడే: పట్టణంలో ట్రాఫిక్ సమస్యలు నిత్యకృత్యమయ్యాయి. పట్టణానికి అనుసంధానంగా ఉన్న దారి కర్నూలు నుంచి బళ్లారి, మంత్రాలయం వంటి ప్రధాన పట్టణాలను కలుపుతోంది. ఇప్పటికీ ఈ మార్గం రెండు వరసలకే పరిమితం కావడంతో వాహనాల రాకపోకలకు నిత్యం అంతరాయం ఏర్పడుతోంది. పెరిగిన వాహనాల రద్దీకి అనుగుణంగా కర్నూలు నుంచి బళ్లారి, కోడుమూరు మీదుగా ఎమ్మిగనూరు, ఆదోని రహదారులను నాలుగు వరుసలుగా విస్తరిస్తే సమస్యలు తొలగుతాయి.

ప్రమాదాలకు అడ్డాగా మారి..

గత కొన్నేళ్లుగా కోడుమూరు మండలం ప్రమాదాలకు అడ్డాగా మారింది. మూడేళ్ల కాలంలోనే పదుల సంఖ్యలో రోడ్డు ప్రమాదాలు జరిగి పలువురు మృత్యువాత పడ్డారు. ప్రధానంగా కోడుమూరు- ప్యాలకుర్తి గ్రామాల మధ్య రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇందుకు రోడ్డు విస్తరణ పనులు చేయకపోవడం, ఉన్న రహదారి సక్రమంగా లేకపోవడం, పరిమితికి మించి ప్రయాణాలు, అతివేగం వంటివి కారణాలు.

ప్రధాన రహదారిలో ఒక వైపునకే పరిమితమైన తారు రోడ్డు

నిత్యం ట్రా'ఫికర్'

పట్టణంలోని ప్రయాణికులకు ఇప్పటికీ పాత బస్టాండు కూడలే అడ్డాగా ఉంది. కొత్త బస్టాండు ప్రాంతం ఉన్నప్పటికీ అక్కడ బీటీ రహదారి 10 మీటర్లే ఉండటంతో ప్రయాణికులు వేచి ఉండేందుకు, వాహనాల రాకపోకలకు నిత్యం అంతరాయం కలుగుతోంది. దీంతో పాత బస్టాండులోనే బస్సుల కోసం వేచి ఉంటున్నారు.

● పట్టణంలో 2023 నవంబరులో అప్పటి ఎస్సై శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఆక్రమణలను తొలగించి రోడ్డును విస్తరించారు. కానీ నేడు ఆ రోడ్డు ఎర్రమట్టితో ఉంది. అధికారులు దృష్టి సారించాల్సిన అవసరముంది.

మట్టిరోడ్డు దుమ్మెత్తిపోస్తోంది

- షేక్ షేక్షా వలి, కోడుమూరు

పట్టణంలోని పాత బస్టాండు కూడలిలో మట్టిరోడ్డు కారణంగా వాహనాల రాకపోకల సమయంలో దుమ్మెత్తిపోస్తోంది. దీంతో ప్రజలకు శ్వాసకోశ సమస్యలు తలెత్తుతున్నాయి. సంబంధిత అధికారులు, నాయకులు సమస్య పరిష్కారంపై దృష్టి సారించాలి.

ఉన్నది 10 మీటర్ల బీటీ దారే

- రమణ, డీఈఈ ఆర్అండ్‌బీ

పట్టణానికి కర్నూలు నుంచి బళ్లారి, ఆదోని ప్రాంతాలకు వెళ్లడానికి అనుమతి ఉన్న రహదారి పది మీటర్లే. గతంలో అప్పటి ఎస్సై ట్రాఫిక్ సమస్యల దృష్ట్యా ఆక్రమణలు తొలగించి మట్టిదారిని ఏర్పాటు చేయించారు. ఆ రోడ్డులో బీటీ వేయడం మా పరిధిలోకి రాదు. ఉన్నతాధికారుల నుంచి నాలుగు వరుసల దారికి అనుమతి వస్తే రోడ్డు వేస్తాం.

గురుకుల ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసుకోండి

సి.బెళగల్, న్యూస్‌టుడే: సి.బెళగల్‌లో అండేడ్కర్ గురుకుల పాఠశాలలో 5వ తరగతి, ఇంటర్ ప్రథమ సంవత్సరం సీట్ల భర్తీకి ప్రవేశ పరీక్ష కోసం ఈ నెల 19 లోపు దరఖాస్తు చేసుకోవాలని గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ చింతలయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
ఎమ్మిగనూరు 8008573824
కోడుమూరు 9885988357
కౌతాళం 8008574913

పెద్దకడబూరు, న్యూస్‌టుడే: ?: మండల కేంద్రంలోని ట్రిపుల్ఆర్ కాలనీలో మురుగు కాల్వలు, సీసీ రహదారులు లేక ఇళ్ల నుంచి వచ్చే వ్యర్థ నీరు రహదారిపై నిలుస్తోంది. - మంగలి సూరి, పెద్దకడబూరు

✔:సమస్య గురించి గ్రామ సర్పంచి, పంచాయతీ అధికారితో చర్చించి పరిష్కారానికి కృషి చేస్తాం. - ప్రభావతిదేవి, ఎంపీడీవో, పెద్దకడబూరు

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: ?: లక్ష్మణ్‌టాకీస్ ఏరియాలో వీధి దీపాలు లేక చీకట్లో ఉంటున్నాం. - గోపాల్, కాలనీవాసి ✔: వీధి దీపాలు ఏర్పాటు చేస్తాం. - నీరజా, డీఈ ?: 33వ వార్డులో తాగునీటి సమస్య ఉంది. తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. - నాజీర్, కాలనీవాసి ✔: నీటి సమస్య పరిష్కారానికి చర్యలు చేపడతాం. - గంగిరెడ్డి, పురపాలక కమిషనర్

?: ఎన్టీఆర్ కాలనీలో విద్యుత్తు తీగలు కిందకు వాలాయి. వెంటనే మరమ్మతులు చేపట్టండి - లక్ష్మన్న, స్థానికుడు ✔: కిందకు వాలిన తీగలను సరిచేసి సమస్య పరిష్కరిస్తాం. - ప్రసన్నాంజనేయ, విద్యుత్తు ఏఈ

సి.బెళగల్, న్యూస్‌టుడే: ?: గొల్లలదొడ్డి ప్రాథమిక పాఠశాలలో అసంపూర్తిగా నిలిచిన అదనపు గదులు భవనాల నిర్మాణాలు పూర్తి చేయండి. - చంద్రన్న, గొల్లలదొడ్డి గ్రామం ✔: అసంపూర్తి గదుల నిర్మాణంపై సర్వశిక్షా అభియాన్ ఏఈ శివశంకర్ దృష్టికి తీసుకెళ్లి చర్యలు తీసుకుంటాం. - రాణెమ్మ, ఎంపీడీవో ?: మారందొడ్డి నుంచి పోలకల్‌కు వెళ్లే మట్టి రహదారిని బీటీ రహదారిగా మార్చండి. - సుందరం, మారందొడ్డి ✔: కోడుమూరు పంచాయతీరాజ్ డీఈఈ కర్రెన్న దృష్టికి తీసుకెళ్లి చర్యలు తీసుకుంటాం. - రాణెమ్మ, ఎంపీడీవో

నందవరం, న్యూస్‌టుడే: ?: మండల పరిధిలోని జగ్గాపురం గ్రామంలో రెండు రోజులకోసారి తాగునీరు సరఫరా చేస్తున్నారు. - గ్రామస్థులు

✔: తాగునీరు రోజువారీగా సరఫరా అయ్యేలా చర్యలు తీసుకుంటాం. - సుజాత, పంచాయతీ కార్యదర్శి

పెరిగిపోతున్న నిర్లక్ష్యం

మండలంలోని చిన్నకొత్తిలి ప్రజల దాహార్తి తీర్చే సమ్మర్ స్టోరేజి ట్యాంకు అధ్వానంగా తయారైంది. అడుగడుగునా నిర్వహణ లోపాలు కనిపిస్తున్నాయి. దీని ద్వారా 5 గ్రామాలకు చెందిన సుమారు 7 వేల మంది జనాభాకు తాగునీటిని అందించాల్సి ఉంది. సమ్మర్ స్టోరేజీ ట్యాంకు చుట్టూ కంపచెట్లు పెరిగిపోయాయి. వీటిని ఇలాగే వదిలేస్తే పైప్ లైన్లు దెబ్బతినే అవకాశముంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి కంపచెట్లను తొలగించేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, నందవరం

పీఎంశ్రీ.. నిర్వహణ మరిచిరి

రాష్ట్ర ప్రభుత్వం పీఎంశ్రీ పథకం కింద పాఠశాలల అభివృద్ధికి నిధులు విడుదల చేసింది. రూ.లక్షలు ఖర్చు చేసి కొన్నిచోట్ల అభివృద్ధి పనులు చేపట్టారు. కొన్నిచోట్ల గాలికి వదిలేశారు. అందుకు నిదర్శనమే మండలంలోని ఆదర్శ పాఠశాల. దీనికి రూ.1.35 లక్షల నిధులు విడుదల చేశారు. క్రీడా మైదానం కోసం నిధులు ఖర్చు చేసినా పిచ్చి మొక్కలు మొలిచి నిరుపయోగంగా మారింది. సంబంధిత అధికారులు దృష్టి సారిస్తే విద్యార్థులకు ఉపయోకరంగా మారుతుంది. - న్యూస్‌టుడే, గోనెగండ్ల

పూడిక తొలగదు.. మురుగు కదలదు

స్వచ్ఛాంధ్ర, స్వచ్ఛ ఎమ్మిగనూరు అంటూ ప్రతి వారం ప్రచారాలు నిర్వహిస్తున్నా కనీసం మురుగు కాల్వలను శుభ్రం చేయడం లేదు. పట్టణంలో మెయిన్ రోడ్డులో కాల్వ పూడికతో నిండిపోయింది. నిత్యం రహదారిలో వేలాది మంది రాకపోకలు సాగిస్తున్నారు. శుభ్రం చేయకపోవడంతో దుర్గంధంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి తక్షణమే పూడిక తొలగించాలని కోరుతున్నారు. - న్యూస్‌టుడే, ఎమ్మిగనూరు

ఫార్మర్ రిజిస్ట్రేషన్ తప్పనిసరి

గూడూరు గ్రామీణం, న్యూస్‌టుడే: రైతులంతా తప్పనిసరిగా ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఏవో దస్తగిరి రెడ్డి తెలిపారు. మంగళవారం మునుగాల, మల్లాపురం గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఏవో మాట్లాడుతూ.. ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేసుకున్న రైతులకు మాత్రమే పీఎం కిసాన్ సొమ్ము ఖాతాలలో జమవుతుందని తెలిపారు. ఈ నెల 28వ తేదీ లోపు రైతు సేవాకేంద్రాల్లో నమోదు చేయించుకోవాలన్నారు.

గోనెగండ్ల, న్యూస్‌టుడే: రైతులు తప్పకుండా ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఎమ్మిగనూరు సహాయ వ్యవసాయ సంచాలకుడు మహ్మద్‌ఖాద్రి తెలిపారు. మంగళవారం కైరవాడిలో వ్యవసాయ సిబ్బంది నమోదు చేసిన డేటాను ఆయన, ఏవో హేమలత పరిశీలించారు. మండలంలో 2450 మంది రైతులు రిజిస్ట్రేషన్ చేసుకోలేదన్నారు. వారంతా నెలాఖరులోపు నమోదు చేసుకోవాలని కోరారు.

ప్రతిభ చాటిన విద్యార్థులకు అభినందనలు

సి.బెళగల్: జేఈఈ మెయిన్-2026లో సి.బెళగల్ అంబేద్కర్ గురుకుల విద్యార్థులు ఎం.సంజీవరాజ్, బి.చార్లెస్‌లు ప్రతిభ కనబరిచినట్లు ప్రిన్సిపల్ చింతలయ్య తెలిపారు. ఈ సందర్భంగా ఆయన, వైస్ ప్రిన్సిపల్ రాజశేఖరరెడ్డి విద్యార్థులను అభినందించారు. మిగతా విద్యార్థులు వీరిని స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు.

సంజీవరాజ్

బి.చార్లెస్

నులిపురుగుల నివారణతోనే ఆరోగ్యం

సి.బెళగల్, న్యూస్‌టుడే: నులి పురుగుల నివారణకు పిల్లలతో ఆల్‌బెండజోల్ మాత్రలు మింగించాలని జిల్లా మలేరియా అధికారి నూకరాజు సూచించారు. సి.బెళగల్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు నులిపురుగులు నివారణ మాత్రల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం అంగన్‌వాడీ-6 కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆయా కార్యక్రమాల్లో సి.బెళగల్ వైద్యాధికారి మిధున్‌కుమార్ రెడ్డి, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు తదితరులు పాల్గొన్నారు.

కోడుమూరు పట్టణం: కోడుమూరు శివారులోని ఆదర్శ పాఠశాలలో ఎంపీడీవో రాముడు, పీహెచ్‌సీ వైద్యాధికారి శ్రీమంత్ మాదన్న నులిపురుగుల మాత్రల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు.

గూడూరు గ్రామీణం: ప్రతి ఒక్కరూ చేతులు శుభ్ర చేసుకుని ఆహార పదార్థాలను తీసుకోవాలని నులిపురుగుల నివారణ కార్యక్రమ రాష్ట్ర పరిశీలకుడు రామచంద్ర అన్నారు. మంగళవారం గూడూరులోని జడ్పీ బాలికల ఉన్నత పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాల్లో నులిపురుగుల మాత్రల పంపిణీ కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు.

గోనెగండ్ల: మండలంలో నిర్వహించిన నులిపురుగుల దినోత్సవం విజయవంతమైందని మండల వైద్యాధికారిణి రంగరవళి పేర్కొన్నారు. గోనెగండ్లలోని జడ్పీ ఉన్నత, చదువుల రామయ్య పాఠశాలల విద్యార్థులకు నులి నివారణ మాత్రలు పంపిణీ చేశారు.

కోసిగి: కోసిగి ఆదర్శ పాఠశాలలో వైద్యాధికారి ఇబ్రహీం విద్యార్థులకు నులిపురుగుల నివారణ మాత్రలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీహెచ్‌సీ వైద్యాధికారిణి ఈశ్వరమ్మ, ఆరోగ్య విస్తరణ అధికారులు ఎల్లప్ప, శ్రీనివాసులు పాల్గొన్నారు.

సి.బెళగల్: విద్యార్థికి మాత్ర వేస్తున్న జిల్లా మలేరియా నివారణ అధికారి నూకరాజు

సంక్షిప్త సమాచారం

ముడుమాల (సి.బెళగల్), న్యూస్‌టుడే: మండలంలోని ముడుమాల ప్రత్యేక ప్రాథమిక పాఠశాలను మంగళవారం ఎంఈవో-1 జ్యోతి పర్యటించి ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ తనిఖీలో పాఠశాలలో జీఎఫ్ఎల్ఎన్ ఎఫ్ఏ-4 పరీక్షల మార్కులను, విద్యార్థుల నైపుణ్యాలను పరిశీలించారు. అనంతరం కొత్తకోటలో ప్రత్యేక ప్రాథమిక పాఠశాలలో కొనసాగుతున్న నులిపురుగుల నివారణ మాత్రలు పంపిణీలో పాల్గొన్నారు.

కోడుమూరు గ్రామీణం: రబీలో సాగు చేసిన వాటికి పంట నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి రవిప్రకాశ్ సూచించారు. లద్దగిరిలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంఏవో మాట్లాడుతూ.. వేసవిలో పత్తి వేస్తే ఎండు తెగులు, గులాబి రంగు పురుగు ఉద్ధృతి పెరుగుతుందన్నారు. వేసవి పత్తులు ఇప్పుడే సాగు చేయకూడదన్నారు. ఉద్యానవన శాఖ అధికారి మదన్‌మోహన్ పలు సూచనలు చేశారు. రైతులు ఏ సందేహాలను ఉన్నా అధికారులను సంప్రదించవచ్చన్నారు.

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో భాగంగా అంగన్వాడీ వర్కర్స్ సమస్యలు పరిష్కరించే వరకు ఉద్యమాలు ఆపేది లేదని అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ కార్యదర్శి గోవర్ధనమ్మ ధ్వజమెత్తారు. అంగన్‌వాడీ అధికారులకు మంగళవారం వినతిపత్రం సమర్పించారు.

ఉరుసు ఏర్పాట్లపై సమీక్ష

గోనెగండ్ల, న్యూస్‌టుడే: మండలంలోని గంజహళ్లిలో ఈ నెల 23వ తేదీన జరిగే బడేసాహెబ్ స్వామి ఉరుసును ప్రశాంతంగా జరుపుకోవాలని ఎమ్మిగనూరు డీఎస్పీ భార్గవి సూచించారు. మంగళవారం గ్రామంలో ఉరుసు ఏర్పాట్లపై డీఎస్పీ దర్గాను సందర్శించారు. అనంతరం సీఐ చంద్రబాబుతో కలిసి గ్రామ పెద్దలతో దర్గాలో సమీక్షించారు. డీఎస్పీ మాట్లాడుతూ.. గ్రామంలో తలెత్తే సమస్యలపై సొంత నిర్ణయాలు తీసుకోకుండా పోలీసుల దృష్టికి తీసుకురావాలని కోరారు. మహిళల భద్రత, బాల్యవివాహాలు, సైబర్ నేరాలు, రోడ్డు ప్రమాదాలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు.

రాష్ట్రస్థాయిలో మెరిసిన మంత్రాలయం విద్యార్థులు

మంత్రాలయం గ్రామీణం, న్యూస్‌టుడే: రాష్ట్రస్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీల్లో మంత్రాలయం జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు విజేతలుగా నిలిచి స్వర్ణ పతకం సాధించారు. అమరావతి పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో ఈ నెల 13 నుంచి 16 వరకు కర్నూలులో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో మంత్రాలయం జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు వివిధ కేటగిరిల్లో ప్రతిభ కనబరిచారన్నారు. మొత్తం 4 స్వర్ణాలు, ఒక కాంస్య పతకం సాధించారు. ఈ సందర్భంగా విద్యార్థులను ప్రధానోపాధ్యాయుడు విఠోభరావు అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు చంద్రశేఖర్, వీరేష్ రావు, రామచంద్ర, సుల్తానా, ఉమామహేశ్వరి, రవీంద్ర, పీడీ నరసింహ రాజు తదితరులు పాల్గొన్నారు.

పతకాలు సాధించిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

మంత్రాలయం గ్రామీణం, న్యూస్‌టుడే: రాష్ట్రస్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీల్లో మండలంలోని దుద్ది జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు విజేతలుగా నిలిచి కాంస్య పతకం సాధించారు. అమరావతి పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో ఈ నెల 13, 14, 15, 16 తేదీల్లో కర్నూలులో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో కోసిగి మండలం దుద్ది జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు తాయన్న, శివాజీ, రాకేష్, వీరాంజి, రాజు పాల్గొని ప్రతిభ కనబరిచారు. ఇందులో తొమ్మిదో తరగతి విద్యార్థి రాజు 53 కిలోల కేటగిరిలో 170 కిలోల బరువు ఎత్తి కాంస్య పతకం సాధించినట్లు దుద్ది పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అయ్యస్వాములు తెలిపారు. విద్యార్థులను పాఠశాల ఉపాధ్యాయులు నారాయణ, లక్ష్మీకాంత్, నాగలక్ష్మి, సునీత, రమేష్, వెంకటేశ్వర నాయక్, ఫిజికల్ డైరెక్టర్ లక్ష్మి అభినందించారు.

విగ్రహాల తొలగింపుపై ధర్నా

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: కోతుల బావి (భక్తాంజనేయ స్వామి దేవాలయం) సమీపంలో ఏర్పాటు చేసిన విగ్రహాల తొలగింపు అన్యాయమని విశ్వహిందూ పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు విష్ణువర్ధన్ రెడ్డి ధ్వజమెత్తారు. పురపాలక సంఘం కార్యాలయం ఎదుట మంగళవారం ధర్నా నిర్వహించారు. అనంతరం పురపాలక కమిషనర్ గంగిరెడ్డికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కోతుల బావి స్థలం గ్రామ కంఠం భూమన్నారు. కొందరు నేతలు పబ్బం గడుపుకొనేందుకు కోతుల బావి వద్ద అక్రమంగా డబ్బాలు వేసేందుకు అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపించారు. చుట్టూ ఉన్న స్థలంలో డబ్బులు తీసుకొని దుకాణాలు నిర్మించేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు. ఇక్కడి ఖాళీ స్థలాన్ని అలాగే ఉంచాలని డిమాండు చేశారు. దీనిపై ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి జోక్యం చేసుకొని కోతుల బావి స్థలం దేవాలయానికి అప్పజెప్పే విధంగా చూడాలని కోరారు. కొందరు వ్యక్తులు ఇష్టారాజ్యంగా మాట్లాడడం సరికాదన్నారు. కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్, భాజపా నాయకులు దయాసాగర్, లలితజైన్, ఉరుకుంద తదితరులు పాల్గొన్నారు.

ధర్నాలో కూర్చున్న విశ్వహిందూ పరిషత్, భాజపా నాయకులు

30 ఏళ్ల తర్వాత కాలువ పనులకు మోక్షం

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: ఏళ్ల తరబడి నెలకొన్న సమస్యలపై కూటమి ప్రభుత్వం స్పందించింది. పట్టణంలో 9వ వార్డు ఎస్సీ కాలనీలో 30 ఏళ్లుగా ఇరువైపులా డ్రైనేజీ లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వైకాపా హయాంలో సమస్యలు విన్నవించినా స్పందన లేదు. కూటమి ప్రభుత్వం వచ్చాక కాలువ పనుల కోసం రూ.40 లక్షలు మంజూరు చేయడంతో పనులకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా తెదేపా 9వ వార్డు ఇన్‌ఛార్జి రాజేంద్ర మాట్లాడుతూ ఎమ్మెల్యే బీవీ హయాంలో అభివృద్ధి పనులు వేగవంతం చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ఇబ్రహీం, రఘు, ప్రవీణ్, కుమార్, ఫకీరయ్య తదితరులు పాల్గొన్నారు.

పనులు పరిశీలిస్తున్న తెదేపా నాయకులు

పులిగట్టు ఆంజనేయుడిని దర్శించుకున్న నేతలు

మంత్రాలయం గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని ఎరిగేరి గ్రామంలో వెలసిన పులిగట్టు ఆంజనేయస్వామిని తెదేపా జిల్లా మాజీ అధ్యక్షుడు తిక్కారెడ్డి, నాయకులు చెన్నబసప్ప, కొట్రేష్ గౌడు దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. మంగళవారం రాత్రి పల్లకోత్సవం వైభవంగా నిర్వహించారు. అలాగే వైకాపా నాయకుడు ప్రదీప్ రెడ్డి, తెదేపా జిల్లా ఉపాధ్యక్షుడు ఉలిగయ్య తదితరులు వేర్వేరుగా దర్శించుకున్నారు.

స్వామి వారిని దర్శించుకుంటున్న తిక్కారెడ్డి, చెన్నబసప్ప, కొట్రేష్‌గౌడు

గంజహళ్లిలో డెంగీ కేసు నమోదు

గోనెగండ్ల, న్యూస్‌టుడే: మండలంలోని గంజహళ్లిలో డెంగీ కేసు నమోదైనట్లు మలేరియా సబ్ యూనిట్ అధికారి కృష్ణుడు మంగళవారం తెలిపారు. ఈ నేపథ్యంలో గ్రామంలో పంచాయతీ సిబ్బందితో దోమల నివారణ మందు పిచికారీ చేయించారు. గ్రామంలో జ్వర లక్షణాలు ఉన్న రోగులకు రక్త పరీక్ష చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది హనుమంతు, పరమేశ్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామంలో దోమల మందు పిచికారీ చేయిస్తున్న వైద్య సిబ్బంది

చికిత్స పొందుతూ మహిళ మృతి

మంత్రాలయం గ్రామీణం, న్యూస్‌టుడే: మంత్రాలయంలో రామచంద్రానగర్‌కు చెందిన వివాహిత సంధ్య(28) ఈ నెల 15న అనుమానాస్పద స్థితిలో అస్వస్థతకు గురై ఆదోనిలో చికిత్స నిమిత్తం చేరింది. అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం బళ్లారి ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లగా అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందింది. మృతురాలి తల్లి ఫిర్యాదు మేరకు మంత్రాలయం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రామాంజులు తెలిపారు.

ప్రధానోపాధ్యాయుడి పై ఎంఈఓ విచారణ

మంత్రాలయం గ్రామీణం, న్యూస్‌టుడే: కౌతాళం జడ్పీ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు సుధాకర్ రెడ్డిపై వచ్చిన ఆరోపణలపై మంగళవారం తహసీల్దారు రజనీకాంత్ రెడ్డి, ఎంఈఓ-2 శోభారాణి విచారణ చేపట్టారు. జడ్పీ ఉన్నత పాఠశాలకు వెళ్లి బియ్యం నిల్వలపై వివరాలను సేకరించారు. ప్రధానోపాధ్యాయుడిపై వచ్చిన ఆరోపణలపై పూర్తి స్థాయిలో విచారణ చేసి ఉన్నతాధికారులకు నివేదిక పంపిస్తామన్నారు. కాగా అవినీతికి పాల్పడ్డ ప్రధానోపాధ్యాయుడిని వెంటనే సస్పెండ్ చేయాలని విద్యార్థి సంఘాలు డిమాండ్ చేశాయి.

కౌతాళం: జడ్పీ ఉన్నత పాఠశాలలో విచారణ చేస్తున్న ఎంఈఓ శోభారాణి

ఘనంగా రేవణ సిద్దేశ్వరుడి రథోత్సవం

హాల్వి: పూజలందుకుంటున్న రేవణ సిద్ధేశ్వరుడు

హాల్వి: స్వామివారి రథోత్సవం

మంత్రాలయం గ్రామీణం: మండలంలోని హాల్వి గ్రామంలో వెలసిన రేవణ సిద్దేశ్వర స్వామి రథోత్సవం మంగళవారం అంగరంగ వైభవంగా సాగింది. ఉదయం స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకం చేసి మధ్యాహ్నం భక్తులకు అన్నదానం నిర్వహించారు. సాయంత్రం ఉత్సవమూర్తులకు హాల్వి మఠం పీఠాధిపతులు అభినవ మహంత స్వాముల చేతులమీదుగా పూజలను నిర్వహించారు. అనంతరం రథోత్సవం నిర్వహించారు.

పెద్దకడబూరు, న్యూస్‌టుడే: మహా శివరాత్రి ఉత్సవాల్లో భాగంగా పెద్దకడబూరులో మంగళవారం శ్రీ సిద్ధారుఢ స్వామి రథోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. స్వామి వారికి వివిధ రకాల అభిషేకాలు, కుంకుమార్చన చేసి మహా మంగళ హారతి అర్పించారు. రథోత్సవం సందర్భంగా సాయంత్రం రెడ్డిగారి రామలింగారెడ్డి స్వగృహం నుంచి కుంభోత్సవాన్ని నిర్వహించారు. అనంతరం రథోత్సవం వైభవంగా సాగింది. తెదేపా నాయకులు రమాకాంత రెడ్డి, మాధవరం నాయకులు రాకేశ్‌రెడ్డి, రాజారెడ్డి, వైకాపా నాయకులు ప్రదీప్‌రెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, చంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సిద్ధారుఢ స్వామి రథోత్సవంలో భక్తులు

ఆటల్లో చిచ్చర పిడుగులు

☛ పతకాలు కొల్లకొడుతున్న సర్కారు బడి విద్యార్థులు

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: ఉన్న వనరులను సద్వినియోగం చేసుకుని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు క్రీడల్లో అదుర్స్ అనిపిస్తున్నారు. కృషి, పట్టుదలతో సాధన చేసి జిల్లా, రాష్ట్ర, స్థాయిలో పతకాలు పొంది అబ్బురపరుస్తున్నారు. జాతీయ స్థాయిలో సత్తా చాటేందుకు సాధన చేస్తున్నారు. ఎమ్మిగనూరు నీలకంఠేశ్వరస్వామి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులపై కథనం..

అవలీలగా బరువులెత్తి..

పట్టణానికి చెందిన మొహమ్మద్ వలి ఎస్ఎన్ఎస్ ఉన్నత పాఠశాలలో పదోతరగతి చదువుతున్నారు. తల్లిదండ్రులు మెహరూన్, ఇంతియాజ్ వ్యాపారం నిర్వహిస్తున్నారు. చిన్నపటి నుంచి వలికి క్రీడల్లో ఆసక్తి ఉంది. రెండేళ్లుగా వ్యాయామశాలకు వెళ్తూ పవర్ లిఫ్టింగ్ సాధన చేశారు. 72 కేజీల విభాగంలో మెలకువలు నేర్చుకున్నారు. గతేడాది ఆగస్టులో జరిగిన పోటీల్లో జిల్లా స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. జులై 26, 27 తేదీల్లో విజయవాడలో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో మూడు జిల్లాల క్రీడాకారులను ఓడించి ప్రథమ స్థానం కైవసం చేసుకుని జాతీయ స్థాయికి ఎంపికయ్యారు. ఆగస్టు 19, 20, 21 తేదీల్లో జార్ఖండ్ రాష్ట్రం జంషెడ్‌పూర్‌లో నిర్వహించిన జాతీయ స్థాయి పోటీల్లో ద్వితీయ స్థానం సాధించారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో కర్నూలులో జరిగిన పోటీల్లో అండర్-74 విభాగంలో ప్రథమ స్థానంలో నిలిచారు.

ఫరీదా.. ఫుట్‌బాల్‌లో దిట్ట

పట్టణానికి చెందిన ఫరీదా చిన్నపటి నుంచి ఫుట్‌బాల్‌పై మక్కువ పెంచుకున్నారు. మూడేళ్లగా మైదానంలో సాధన చేశారు. తల్లిదండ్రులు రఫిక్ ఉసేని, షాహీమ్ కూలీలు. ఆమెను క్రీడల్లో ప్రోత్సహించడంతో ఫుట్‌బాల్ నేర్చుకుని మెలకువలు నేర్చుకున్నారు. రైట్ ఫార్వర్డ్‌లో రాణిస్తూ బంతి దొరికితే చాలు గోల్ సాధనే లక్ష్యంగా సాగుతోంది. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో గతేడాది కర్నూలులో జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో అండర్-19 విభాగంలో ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. అనంతరం అండర్-19 విభాగంలో రాష్ట్రస్థాయి పోటీలు ఎమ్మిగనూరులో నిర్వహించగా ఇక్కడా ప్రతిభ కనబరిచారు. కృష్ణ, గుంటూరు జిల్లాలో జరిగిన పోటీల్లోనూ రాణించారు. భవిష్యత్తులో జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యేందుకు ముమ్మరంగా సాధన చేస్తున్నారు. జాతీయ స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచి పతకం అందుకోవడమే తన లక్ష్యమంటోంది ఫరీదా.

(c) eenadu

కర్నూలు

• కర్నూలు • పాణ్యం

ఓటర్ల జాబితా సిద్ధం చేసుకోండి

ఈవోపీఆర్డీలతో సమావేశమైన డీపీవో భాస్కర్

కర్నూలు జడ్పీ, న్యూస్‌టుడే : గ్రామ పంచాయతీ ఎన్నికలకు సంబంధించిన ఓటర్ల జాబితాను మార్చి 9వ తేదీలోగా సిద్ధం చేసుకోవాలని జిల్లా పంచాయతీ అధికారి జి.భాస్కర్ ఆదేశించారు. కలెక్టరేట్‌లోని డీపీవో కార్యాలయంలో మంగళవారం ఆయన జిల్లాలోని ఈవోపీఆర్డీలతో సమావేశం నిర్వహించారు. పంచాయతీ ఎన్నికల నిర్వహణపై ఈనెల 20న షెడ్యూల్ ఎంపీడీవోలకు అమరావతి నుంచి వర్చువల్ శిక్షణ ఉంటుందని తెలిపారు. కర్నూలు డీఎల్‌పీవో లక్ష్మి, ఏవో గీతా ప్రతిమ పాల్గొన్నారు.

నేడు టీజీవీ మైనారిటీ కళాక్షేత్రం ప్రారంభం

కర్నూలు నగరం, న్యూస్‌టుడే : స్థానిక పాత బస్తీలోని ఉస్మానియా కళాశాల సమీపంలో ఏర్పాటు చేసిన టీజీవీ మైనారిటీ కళాక్షేత్రాన్ని బుధవారం సాయంత్రం మాజీ ఎంపీ టీజీ వెంకటేష్ ప్రారంభించనున్నారు. కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య అధ్యక్షతన జరిగే కార్యక్రమంలో గజల్స్ ఖవ్వాలి, హిందీ గీతాల ఆలాపన ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
కర్నూలు : 80085 52632,
కర్నూలు గ్రామీణ : 85000 05408
ఓర్వకల్లు : 63004 66875

కర్నూలు నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే : ? : కల్లూరు చెన్నమ్మ కూడలి సమీపంలోని మైదానం వైపు కింద రహదారి అధ్వానంగా మారింది. - మనోహర్

? : నిర్మల్‌నగర్‌లో మురుగు కాలువలు వ్యర్థాలతో పూడిపోయాయి. శుభ్రం చేయాలి. - స్థానికులు

✔ : రహదారికి మరమ్మతులు చేపడతాం. కాలువలు శుభ్రం చేయిస్తాం. - నగరపాలక అధికారులు

మన విద్యార్థులు విజేఈఈలు

కర్నూలు విద్య, న్యూస్‌టుడే : దేశంలోని ఐఐటీలు, ట్రిపుల్‌ఐటీలో, ఉత్తమ ఇంజినీరింగ్ కళాశాలల్లో ప్రవేశాల కోసం నిర్వహించిన జేఈఈ మెయిన్ పరీక్షలో నగరానికి చెందిన విద్యార్థులు ప్రతిభ చూపారు. జనవరిలో నిర్వహించిన మెయిన్ మొదటి దశకు సంబంధించిన ఫలితాలు సోమవారం రాత్రి విడుదలయ్యాయి. ఇందులో పలువురు ఉత్తమ పర్సంటైల్ సాధించారు. మరింత మెరుగైన పర్సంటైల్ సాధించడమే లక్ష్యంగా జేఈఈ-మెయిన్2, అడ్వాన్స్‌డ్ పరీక్షలకు సిద్ధమవుతున్నారు. తమ కుటుంబ నేపథ్యం, భవిష్యత్తు లక్ష్యాల గురించి విజేతలు ఇలా వివరిస్తున్నారు.

● విద్యార్థి ✪ పర్సంటైల్ ❒ ప్రాంతం ✦ భవిష్యత్తు లక్ష్యం ★ తల్లిదండ్రులు

● హర్షిత్‌రెడ్డి
❒ గణేష్‌నగర్-2, కర్నూలు
✦ బాంబే ఐఐటీలో చదవాలని ఉంది. ఇందుకోసం జేఈఈ మెయిన్2, అడ్వాన్స్‌డ్‌లో రాణించేందుకు రోజుకు పది గంటలు చదువుతున్నా.
★ తులసేశ్వర్‌రెడ్డి, హరిత

✪ 98.69

● మహబూబ్‌బాషా
❒ వెంకటేష్‌నగర్, కల్లూరు
✦ దేశంలోని టాప్ టెన్ ఇంజినీరింగ్ కళాశాలలో సీఎస్‌సీ చదవాలన్న నా లక్ష్యం. ఇందుకోసం కష్టపడి చదువుతున్నా. జేఈఈ మెయిన్2, అడ్వాన్స్‌డ్‌లో ఉత్తమ ర్యాంకు తెచ్చుకునేందుకు సన్నద్ధమవుతున్నా.
★ అలీబాబు, షబాన

✪ 98.27

● సుగుణిరెడ్డి
❒ వెంకటరమణకాలనీ, కర్నూలు
✦ జేఈఈ మెయిన్2 పరీక్షకు సిద్ధమవుతున్నా. అందులో మరింత మెరుగైన పర్సంటైల్ సాధించి మంచి ఐఐటీలో ఇంజినీరింగ్ సీఎస్‌సీ పూర్తిచేసి సాఫ్ట్‌వేర్ ఇంజినీరుగా స్థిరపడాలన్నది నా లక్ష్యం. ★ శ్రీకాంత్‌రెడ్డి, ఉషారాణి

✪ 98.47

అభివృద్ధి జాడలేక.. సమస్యలు తొలగక

పరిశీలన

కర్నూలు కలెక్టరేట్, న్యూస్‌టుడే : కల్లూరు అర్బన్‌లోని 16 వార్డులు 2002లో నగరపాలక సంస్థలో విలీనమయ్యాయి. నగరంలో కలిసినా సౌకర్యాలు మెరుగుపడతాయని ఆశించిన ప్రజలకు నిరాశే మిగిలింది. 14 ఏళ్లుగా నగరపాలక సంస్థ పాలకవర్గం, అధికారులు ఈ కాలనీలపై దృష్టిపెట్టిన దాఖలాల్లేవు. శరవేగంగా విస్తరిస్తున్న కల్లూరు అర్బన్ ప్రాంతం నుంచి నగరపాలకకు ఏటా రూ.కోట్ల పన్ను సమకూరుతోంది. వేలాదిమంది నివసిస్తున్న కాలనీల్లో కనీసం రహదారులు, డ్రైనేజీ, వీధిదీపాలు, తాగునీటి సౌకర్యం కరవైంది. నెలల తరబడి పారిశుద్ధ్య సిబ్బంది జాడ రావడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. శివారు ప్రాంతాల్లో నేటికీ మట్టిరోడ్లే దర్శనమిస్తున్నాయి. వీధులు, ఖాళీ మురుగు నీరు పారుతోంది. స్థలాల్లో ఎటుచూసినా చెత్త పేరుకుపోయింది. దీంతో తమ జీవనం దుర్భరంగా మారిందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వీకర్‌సెక్షన్ కాలనీ నుంచి ఎల్.పేట వెళ్లే మార్గంలో చాలా ఏళ్ల కిందట ఏర్పాటైన రేణుకానగర్‌లో అంతర్గత రహదారులు అధ్వానంగా మారాయి. ఉల్చాల రోడ్డు నుంచి బళ్లారి రోడ్డును కలిపే ప్రధాన మార్గాల్లో కూడా మట్టిరోడ్లే ఉన్నాయి. సీసీ రోడ్లు ఏర్పాటు చేయాలని, మురుగు కాలువల నిర్మాణం చేపట్టాలని కాలనీ వాసులు పలుమార్లు నగరపాలక అధికారులను కోరుతున్నా స్పందన కరవైంది.

కల్లూరు అర్బన్ పరిధిలోని రేడియో స్టేషన్ సమీపంలో గురురాజనగర్ 15 ఏళ్ల కిందట ఏర్పడింది. ఈ కాలనీలో నేటికీ మట్టిరోడ్లే దర్శనమిస్తున్నాయి. అంతర్గత దారులు అధ్వానంగా మారాయి. మురుగు కాలువలు మాటే లేదు. కాలనీవాసులే సొంత ఖర్చులతో రహదారులు, కల్వర్టులు ఏర్పాటు చేసుకోవాల్సిన పరిస్థితి.

ఏళ్లుగా మట్టిరోడ్డే దిక్కు

బళ్లారి రోడ్డులోని వైటెక్స్ నుంచి కోడుమూరు వైపు వెళ్లే దారిలో వీకర్‌సెక్షన్ కాలనీ, ఉల్చాల వైపు వెళ్లే ప్రధాన రహదారికి ఇరువైపులా పలు కొత్త కాలనీలు ఏర్పాటయ్యాయి. రిచ్‌మండ్ విల్లాస్, హౌసింగ్ మందిరం, శ్రీనివాస నగర్, శాంతినగర్, రేణుకనగర్, గురురాజ నగర్, శ్రీసాయిలక్ష్మి నగర్, ఆదిత్యనగర్, భ్రమరాంబనగర్, రాధానగర్, తదితర కాలనీల పరిధిలో కొన్నేళ్లుగా వేలాదిమంది ప్రజలు నివసిన్నారు. ఈ ప్రాంతాల్లో ఎక్కడా సీసీరోడ్లు ఏర్పాటు చేయలేదు. మట్టిరోడ్లపైనే ప్రజలు రాకపోకలు సాగించాల్సి వస్తోంది.

● రేడియో స్టేషన్ సమీపంలోని శాంతినగర్ కాలనీలో మట్టిరోడ్లు దారుణంగా ఉన్నాయి. గుంతలు, బండరాళ్లతో కూడిన దారిలో వాహనాలపై వెళ్లలేని పరిస్థితి నెలకొంది. కొన్నిచోట్ల మురుగు కాలువలు నిర్మించారు. కల్వర్టుల నిర్మాణం చేపట్టి మధ్యలోనే వదిలేశారు. దీంతో రాకపోకలు సాగించేందుకు వీలుకావడం లేదని స్థానికులు వాపోతున్నారు.

● ఉల్చాల రోడ్డులోని ఆదిత్యనగర్ సమీపంలో ఉన్న భ్రమరాంబ నగర్‌లో దారులన్నీ రాళ్లు రప్పలతో నిండిపోయాయి. కనీసం రోడ్లపై ఎర్రమట్టి కూడా వేయడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మునగాలపాడు రోడ్డు

కర్నూలు మండలం మునగాలపాడులో గ్రామ సచివాలయానికి వెళ్లే రహదారి దారుణంగా దెబ్బతింది. దారి పొడవునా పెద్ద పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. వాటిలో నీరు నిలవడంతో రాకపోకలకు ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ దారిలోనే ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. తరచూ చిన్నపిల్లలు గుంతల్లో పడి గాయాలపాలవుతున్నారని గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.
– న్యూస్‌టుడే, కర్నూలు గ్రామీణ

కాలువ బాగుపడక.. పారిశుద్ధ్యం పడక

నగరం పరిధిలోని కృష్ణానగర్‌లో మురుగు కాలువలు అధ్వానంగా మారాయి. కొన్ని ప్రాంతాల్లో కాలువలు నిర్మించకపోవడంతో మురుగు నిల్వ ఉంటోంది. తరచూ రహదారులపై పారుతోంది. అపరిశుభ్రత, దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు వాపోతున్నారు. అధికారులు స్పందించి కాలువలు నిర్మించాలని కోరుతున్నారు.
– న్యూస్‌టుడే, కర్నూలు నగరపాలక సంస్థ

అడుగుపెట్టలేం.. నీరు పట్టుకోలేం

కర్నూలు మండలం నిడ్జూరులో నీటి ట్యాంకు పరిసరాలు పాచి పట్టి అపరిశుభ్రంగా మారాయి. కుళాయిల నుంచి వృథాగా పోయే నీరు నిల్వ చేరి ఆ ప్రాంతం బురదమయమైంది. దీంతో నీరు పట్టుకునేందుకు స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి నీటి వృథాను అరికట్టడంతో పాటు పరిసరాలు శుభ్రం చేయించాలని స్థానికులు కోరుతున్నారు.
– న్యూస్‌టుడే, కర్నూలు గ్రామీణ

నిఘా నేత్రానికి నిర్లక్ష్యపు మసక

కలెక్టరేట్‌లోని ఎస్‌బీఐ ఏటీఎం కేంద్రానికి ఎదురుగా ఉన్న స్తంభానికి సీసీ కెమెరా ఏర్పాటు చేశారు. ఆ స్తంభానికి అల్లుకున్న తీగజాతి మొక్కలు నిఘా కెమెరాను కూడా చుట్టేశాయి. ప్రస్తుతం తీగలు ఎండిపోయి కెమెరాకు అడ్డుగా ఉన్నాయి. ఈ స్తంభానికి ఏర్పాటు చేసిన విద్యుత్తు దీపం కూడా ప్రస్తుతం లేదు. సంబంధిత అధికారులు స్పందించి నిఘా కెమెరాకు అడ్డుగా ఉన్న తీగలను తొలగించాల్సిన అవసరం ఉంది. – న్యూస్‌టుడే, కర్నూలు బి.క్యాంపు

మురుగు కుంట.. ప్రజలకు తంటా

నగరంలోని వెంకటరమణ కాలనీ ప్రధాన రహదారిలో వెంట సాయిబాబా ఆలయం ఆర్చి పక్కన ఉన్న ఎస్బీఐ ఏటీఎం ఎదురుగా మురుగు కాలువ పూడిపోయింది. దానిని శుభ్రం చేయకపోవడంతో మురుగునీరు సమీపంలోని ఖాళీ స్థలాల్లో నిల్వచేరి మడుగును తలపిస్తోంది. దుర్వాసన, దోమల బెడద పెరిగి ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు వాపోతున్నారు.
– న్యూస్‌టుడే, కర్నూలు వెంకటరమణ కాలనీ

పన్ను వసూళ్లలో పురోగతి సాధించాలి

మాట్లాడుతున్న కలెక్టర్ డా.సిరి

కర్నూలు కలెక్టరేట్, న్యూస్‌టుడే : ఆస్తి, నీటి పన్నుల వసూళ్లలో మరింత పురోగతి సాధించాలని కలెక్టర్ డా.ఎ.సిరి మున్సిపల్ కమిషనర్లను ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లో మంగళవారం ఆమె కర్నూలు నగరం, ఆదోని, ఎమ్మిగనూరు, గూడూరు పురపాలక సంఘాల్లో పన్నుల వసూళ్లపై సమీక్షించారు. ట్రేడ్ లైసెన్స్ రుసుము వసూళ్లలో వేగం పెంచాలని చెప్పారు. భవన నిర్మాణాలు, లేఅవుట్ అనుమతుల కోసం వచ్చిన దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలన్నారు. సమావేశంలో కర్నూలు మున్సిపల్ కమిషనర్ విశ్వనాథ్, వీడియో కాన్ఫరెన్సు ద్వారా ఎమ్మిగనూరు, ఆదోని, గూడూరు మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.

సర్వేలు సకాలంలో పూర్తి చేయండి

కర్నూలు కలెక్టరేట్, న్యూస్‌టుడే : ఏకీకృత కుటుంబ సర్వే, హౌస్ హోల్డ్ ఈ-కేవైసీ ప్రక్రియను వేగంగా పూర్తి చేయాలని కలెక్టర్ డా.ఎ.సిరి ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లను ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్ నుంచి మంగళవారం ఆమె జిల్లాలోని ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లతో టెలీ కాన్ఫరెన్సు ద్వారా సమీక్షించారు. ఏకీకృత సర్వేలో వెనుకబడిన సిబ్బందికి తాఖీదులు జారీ చేయాలని ఆదేశించారు.

గుంతల పూడ్చివేత వేగవంతం

కర్నూలు కలెక్టరేట్, న్యూస్‌టుడే : రహదారులపై గుంతల పూడ్చివేతను వేగవంతం చేయాలని, పనుల నాణ్యతలో ఎట్టి పరిస్థితుల్లో రాజీ పడకూడదని కలెక్టర్ డా.సిరి అధికారులను ఆదేశించారు. కర్నూలు కలెక్టరేట్‌లో మంగళవారం ఆమె రహదారుల మరమ్మతుల్లో పురోగతిపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. జిల్లా వ్యాప్తంగా పంచాయతీరాజ్, ఆర్అండ్‌బీ, మున్సిపల్, జాతీయ రహదారులపై ఏర్పడిన గుంతలను గుర్తించి తనకు నివేదిక పంపాలని ఆదేశించారు. సమావేశంలో ఆర్అండ్‌బీ ఎస్ఈ మహేశ్వరరెడ్డి, కర్నూలు నగర కమిషనర్ విశ్వనాథ్, పంచాయతీరాజ్ ఇంజినీర్ శ్రీనివాసులు, వీడియో కాన్ఫరెన్సు ద్వారా ఎమ్మిగనూరు, ఆదోని, గూడూరు మున్సిపల్ కమిషనర్లు, నేషనల్ హైవే ప్రాజెక్టు డైరక్టర్లు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో అమావాస్య పూజలు

కర్నూలు ఆధ్యాత్మికం, న్యూస్‌టుడే : మాఘశుద్ధ అమావాస్యను పురస్కరించుకుని కర్నూలులోని ఆంజనేయస్వామి ఆలయాల్లో మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. బళ్లారి చౌరస్తాలోని వీరాంజనేయస్వామి, బంగారుపేట ఆంజనేయస్వామి, గణేశ్‌నగర్‌లోని సీతా రామాంజనేయస్వామి ఆలయం, పాతబస్తీలోని పేట ఆంజనేయస్వామి ఆలయాల్లో హనుమంతుడి మూలవిరాట్టుకు సింధూరం అలంకరణ చేసి ఆకు పూజలు జరిపించారు. లలితాపీఠం, సూర్యనారాయణస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు.

● నంద్యాల చెక్‌పోస్టు సమీపంలోని కృష్ణ ఆలయంలో మూడు రోజుల పాటు నిర్వహించే సుదర్శన హోమం మంగళవారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా డీసీఎంఎస్ ఛైర్మన్ ఆధ్వర్యంలో శ్రీకృష్ణుని విగ్రహానికి పూజలు చేశారు.



బళ్లారి చౌరస్తాలోని వీరాంజనేయస్వామి ఆలయంలో మూలవిరాట్టుకు అలంకరణ

సంక్షిప్త సమాచారం

నన్నూరు (ఓర్వకల్లు) : నన్నూరుకు చెందిన బోయ రామకృష్ణ ఇటీవల విద్యుదాఘాతానికి గురై మృతి చెందారు. ఆయన కుటుంబానికి ప్రభుత్వం మంజూరైన రూ.5 లక్షల పరిహారం మంజూరు చేసింది. ఇందుకు సంబంధించిన చెక్కును ఎమ్మెల్యే గౌరు చరితా రెడ్డి మంగళవారం బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. మండల తెదేపా అధ్యక్షుడు నాగిరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

కర్నూలు వెంకటరమణ కాలనీ, న్యూస్‌టుడే : భవన, ఇతర నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించి కార్మికులను ఆదుకోవాలని, పెండింగ్‌లో ఉన్న క్లెయిమ్‌లను వెంటనే విడుదల చేయాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి మునెప్ప, నగర కార్యదర్శి చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. స్థానిక సంఘం కార్యాలయంలో మంగళవారం నాయకుడు నల్లన్న అధ్యక్షతన నిర్వహించిన భవన నిర్మాణ కార్మికుల నగర కౌన్సిల్ సమావేశంలో వారు మాట్లాడారు.

కర్నూలు వెంకటరమణ కాలనీ : కోవాబన్ వలి కుటుంబానికి ప్రభుత్వం రూ.5 లక్షల పరిహారం అందించాలని ఆవాజ్ కమిటీ నాయకులు కోరారు. పాతనగరంలోని మౌలానా అబుల్ కలాం ఆజాద్ చౌక్ వద్ద మంగళవారం ధర్నా నిర్వహించారు. ఆవాజ్ నగర కమిటీ అధ్యక్షుడు ఇక్బాల్‌హుస్సేన్, కార్యదర్శి షరీఫ్, ఆప్ నాయకుడు షకీల్‌ఖాన్, చిన్న వ్యాపారుల సంఘం నాయకుడు మహమ్మద్ రఫీ, నిసార్ అహమ్మద్ పాల్గొన్నారు.

కర్నూలు వెంకటరమణ కాలనీ, న్యూస్‌టుడే : పేదలు, కార్మికుల పక్షపాతి రాజగోపాల్ ఆశయ సాధనకు కృషి చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి అంజిబాబు, నగర కార్యదర్శి విజయరామాంజనేయులు పిలుపునిచ్చారు. పాతనగరంలోని సుర్జిత్‌భవన్‌లో మంగళవారం రాజగోపాల్ వర్ధంతి సభ నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

అమర జవాన్ సర్కిల్‌గా నామకరణం చేయండి

మేయర్ రామయ్యకు వినతిపత్రం ఇస్తున్న మాజీ సైనికులు

కర్నూలు బి.క్యాంపు, న్యూస్‌టుడే : దేశం కోసం ప్రాణాలు అర్పించిన వీర జవాన్ల గౌరవార్థం స్థానిక సిల్వర్‌జూబ్లీ కూడలికి అమర జవాన్ సర్కిల్‌గా నామకరణం చేయాలని మాజీ సైనికుల సంఘం అధ్యక్షుడు బాబురాజ్, కార్యదర్శి మల్లికార్జున, కేడీ వీఎం రెడ్డి కోరారు. ఈమేరకు సంఘం నాయకులు నగర మేయర్ బీవై రామయ్యను మంగళవారం కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ అంశాన్ని కౌన్సిల్ ముందుకు తీసుకెళ్లి తగిన చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బీసీ సంఘం అధ్యక్షుడు ధర్మేంద్ర, సోషల్ మీడియా ప్రధాన కార్యదర్శి ఎస్.భరత్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సాంఘిక సంక్షేమాధికారిణిపై చర్యలకు డిమాండు

కర్నూలు బి.క్యాంపు, న్యూస్‌టుడే : సాంఘిక సంక్షేమాధికారిణిని సస్పెండ్ చేయాలని ఎస్సీ, ఎస్టీ జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు సురేందర్, మాలతి, రవికిరణ్, మద్దిలేటి, సురేష్, మధునాయక్ డిమాండ్ చేశారు. అధికారిణి వార్డెన్ల నుంచి లంచాలు తీసుకుంటున్నారని ఆరోపిస్తూ మంగళవారం కలెక్టరేట్ సమీపంలోని గాంధీ విగ్రహం వద్ద ధర్నా చేశారు. గాంధీ విగ్రహానికి వినతిపత్రం సమర్పించారు. ఎస్సీ సంక్షేమ వసతిగృహాలను ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు తనిఖీ చేయొద్దంటూ ఆదేశాలు ఇవ్వడం సిగ్గుచేటన్నారు.

రైల్వేస్టేషన్ అభివృద్ధి పనుల పరిశీలన

కర్నూలు బి.క్యాంపు, న్యూస్‌టుడే : కేంద్ర ప్రభుత్వం కర్నూలు రైల్వేస్టేషన్ అభివృద్ధికి రూ.46 కోట్లు కేటాయించిందని మాజీ ఎంపీ టీజీ వెంకటేష్ తెలిపారు. స్థానిక రైల్వేస్టేషన్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులను మంగళవారం ఆయన పరిశీలించారు. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా రైల్వే స్టేషన్‌లో ఏర్పాటు చేస్తున్న రెండో గేటు ప్రయాణికులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని వెల్లడించారు. కార్యక్రమంలో రైల్వే అధికారులు, సిబ్బంది, టీజీ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

డంపింగ్‌యార్డును తలపిస్తున్న కేసీ

వినాయకఘాట్ వద్ద కేసీ కాలువను పరిశీలిస్తున్న ఎస్ఈ బాలచంద్రారెడ్డి, కమిషనర్ విశ్వనాథ్

కర్నూలు జల మండలి, న్యూస్‌టుడే : నగరంలో ప్రవహించే కేసీ కాలువను డంపింగ్ యార్డుకంటే అధ్వానంగా మారిందని ఇరిగేషన్ కర్నూలు సర్కిల్ ఎస్ఈ బాలచంద్రారెడ్డి, నగరపాలక సంస్థ కమిషనర్ విశ్వనాథ్ అసహనం వ్యక్తం చేశారు. నగరంలోని కారల్‌మార్క్స్ కాలనీ, అశోక్‌నగర్, వినాయక్ ఘాట్ ప్రాంతాల్లో మంగళవారం వారు కేసీ కాలువను పరిశీలించారు. టన్నుల కొద్దీ చెత్తను వేయడంతో పాటు మురుగునీటిని కాలువలోకి వదలడంతో దుర్వాసన వెదజల్లుతోందన్నారు. ఈ అంశంపై నగరపాలక సంస్థకు గతంలో పలుసార్లు లేఖలు ఇచ్చినా స్పందించలేదని ఎస్ఈ పేర్కొన్నారు. కాలువలో చెత్త వేయకుండా కార్పొరేషన్ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. కాలువలో చెత్త వేయకుండా ప్రజలకు అవగాహన కల్పించాల్సి ఉందని, మురుగునీరు కలవకుండా జాగ్రత్తలు తీసుకుంటామని కమిషనర్ చెప్పారు. నగరపాలక సంస్థ ఎస్ఈ రమణమూర్తి, కేసీసీ డీఈఈ ప్రసాదరావు, ఏఈ భరత్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అలరించిన భజన పోటీలు

భజన బృందాలకు నగదు బహుమతులు అందజేస్తున్న దాతలు

ఓర్వకల్లు, న్యూస్‌టుడే : కాల్వబుగ్గలోని బుగ్గ రామేశ్వర స్వామి మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని మంగళవారం నిర్వహించిన జిల్లాస్థాయి భజన పోటీలు అలరించాయి. 20 భజన బృందాలు పోటీపడ్డాయి. మండ్లవానిపల్లె భజన బృందం రూ.25 వేల ప్రథమ, కర్నూలు బృందం రూ.20 వేల ద్వితీయ, కందికాయపల్లె బృందం రూ.15 వేల తృతీయ, శంకరాపురం బృందం రూ.12 వేల నాలుగో బహుమతి, పెట్నికోట భజన బృందం రూ.10 వేల ఐదో బహుమతి గెలుపొందాయి. ఉత్తమ హార్మోనిస్టుగా కందికాయపల్లెకు చెందిన తేజాచారి, ఉత్తమ తబలా కళాకారుడిగా మండ్లవానిపల్లెకు చెందిన భరత్, ఉత్తమ గాయకుడిగా కర్నూలుకు చెందిన చక్రపాణి నిలిచారు. విజేతలకు దాతలు నగదు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ఈవో మద్దిలేటి, నిర్వాహకులు ఆకుల మహేష్, కల్లే లక్ష్మీనారాయణశర్మ తదితరులు పాల్గొన్నారు.

శక్తియాప్ సేవలు ఉపయోగించుకోండి

కర్నూలు నేరవిభాగం, న్యూస్‌టుడే : మహిళలు ఆపద సమయాల్లో డయల్ 100, 112 నంబర్లు, శక్తియాప్ సేవలను ఉపయోగించుకోవాలని పోలీసు అధికారులు సూచించారు. ఎస్పీ విక్రాంత్‌పాటిల్ ఆదేశాల మేరకు మంగళవారం జిల్లాలోని పలు పోలీసు స్టేషన్ల పరిధిలో అవగాహన సదస్సులు నిర్వహించారు. రహదారి భద్రత, సైబర్‌నేరాలపై అవగాహన కల్పించారు. మహిళలతో సమావేశమై ఆత్మరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు.

కర్నూలు ప్రిన్సిపల్ జిల్లా జడ్జి వారి కోర్టు
ఓ.యస్. నంబరు: 71/2025

జి.యల్.ప్రదీప్ కుమార్ ...వాది

యెదిరె

1. ఏ.పి.పవర్ జనరేషన్ కంపెనీ లిమిటెడ్, విజయవాడ వారి తరుపున మేనేజింగ్ డైరెక్టరు.
2. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, వి.టి.పి.యస్., ఇబ్రహీంపట్నం, కృష్ణా జిల్లా పూర్వం (స్టేట్ బ్యాంక్ ఆఫ్ హైదరాబాద్) వారి తరుపున బ్రాంచి మేనేజరు.
3. ఆల్ కన్సర్న్డ్ ...ప్రతివాదులు

జనరల్ నోటీసు

ఇందుమూలముగా యావన్మందికి తెలియజేయడం ఏమనగా, పై దావాలో వాది తన మేనమామ కీ॥శే॥ శ్రీ గాజుల విజయభాస్కర్ గారు, తన పేరున తేది. 10-11-2023న వ్రాయించి ఇచ్చిన రిజిస్టర్డ్ వీలునామానుసరించి, పై 1వ మరియు 2వ ప్రతివాదుల నుండి రావలసిన ఫైకములు రాబట్టుకొనుటకు పై డిక్లరేషన్ దావా దాఖలు చేసి ఉంటున్నాడు. కనుక సదరు దావా గురించి ఎవరికైనా అభ్యంతరాలున్న యెడల, తేది: 27-02-2026న స్వయంగా గానీ, వకీలు ద్వారా గానీ పై కోర్టు వారి సమక్షంలో తెలుపుకొనగలరు.

వాయిదా తేదీ: 27-2-2026

(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)
జి.చలపతి రావు
యమ్.జాఫర్ హుస్సేన్ బేగ్
ఎ.అనిల్ కుమార్
వాది పరం అడ్వొకేట్స్, కర్నూలు
98666 27781, 94417 33438, 98492 02963.

కిక్ బాక్సింగ్‌లో కింగ్‌లు

★ జాతీయస్థాయిలో రాణిస్తున్న కర్నూలు క్రీడాకారులు

కర్నూలు క్రీడలు, న్యూస్‌టుడే : నగరానికి చెందిన హరికల్యాణ్, గణపతి దేవ్‌జీ కిక్ బాక్సింగ్‌లో సత్తా చాటుతున్నారు. ఆటపై ఇష్టంతో మూడేళ్లుగా శిక్షణ తీసుకుంటున్నారు. నిత్యం శిక్షకుల పర్యవేక్షణలో సాధన చేస్తూ మెలకువలు నేర్చుకున్నారు. పోటీల్లో ప్రత్యర్థులను చిత్తుచేసి విజేతలుగా నిలుస్తున్నారు. వివిధ ప్రాంతాల్లో జరిగిన జిల్లా, రాష్ట్ర, జాతీయస్థాయి కిక్ బాక్సింగ్ పోటీల్లో గెలుపొంది పతకాలు సాధించారు. దేశం తరపున పోటీపడి పతకాలు సాధించడమే లక్ష్యంగా సాధన చేస్తున్నట్లు వీరు చెబుతున్నారు.

హరికల్యాణ్.. పోటీల్లో ధనాధన్

స్థానిక బళ్లారి చౌరస్తా సమీపంలోని వాసవీనగర్‌కు చెందిన హరికల్యాణ్ డిగ్రీ పూర్తి చేశాడు. మూడేళ్లుగా కిక్ బాక్సింగ్‌లో శిక్షణ పొంది పోటీల్లో రాణిస్తున్నాడు. ● 2024 జనవరిలో నగరంలోని ఇండోర్ స్టేడియంలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో 68 కిలోల విభాగంలో రజత పతకం సాధించాడు. ● 2024 జులైలో పంజాబ్‌లోని లవ్‌లీ ప్రొఫెషనల్ విశ్వవిద్యాలయంలో జరిగిన జాతీయస్థాయి పోటీల్లో ఆంధ్రప్రదేశ్‌కు ప్రాతినిధ్యం వహించాడు. ● 2025 జనవరి 8న నగరంలోని మాంటీ పాఠశాల మైదానంలో జరిగిన జిల్లాస్థాయి పోటీల్లో 70 కిలోల విభాగంలో స్వర్ణం అందుకున్నాడు. ● 2025 ఏప్రిల్‌లో బి.క్యాంపులో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో రజతం గెలుపొందాడు. ● 2025 సెప్టెంబరులో ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం రాయ్‌పుర్‌లో జరిగిన జాతీయస్థాయి పోటీల్లో ఆంధ్రప్రదేశ్‌కు ప్రాతినిధ్యం వహించాడు. ● ఈనెల 4 నుంచి 8వ తేదీ వరకు దిల్లీలో జరిగిన ఓపెన్ అంతర్జాతీయ కిక్‌బాక్సింగ్ పోటీల్లో 75 కిలోల విభాగంలో కాంస్య పతకాన్ని సాధించాడు.

గణపతి.. క్రీడల్లో ఖ్యాతి

వెంకటరమణ కాలనీకి చెందిన గణపతి దేవ్‌జీ 8వ తరగతి చదువుతున్నాడు. తల్లిదండ్రుల ప్రోత్సాహంతో కిక్ బాక్సింగ్‌లో శిక్షణ పొందుతూ పోటీల్లో సత్తా చాటుతున్నాడు. ● 2024 జనవరిలో నగరంలోని ఇండోర్ స్టేడియంలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో 59 కిలోల విభాగంలో బంగారు పతకం గెలుపొందాడు. ● 2025 జనవరిలో నగరంలోని మాంటీ పాఠశాల మైదానంలో జరిగిన జిల్లాస్థాయి పోటీల్లో అండర్-14 విభాగం పాయింట్ ఫైట్‌లో స్వర్ణం, కిక్ లైట్‌లో రజత పతకాలు సాధించాడు. ● 2025 ఏప్రిల్‌లో బి.క్యాంపు కాలనీలో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో రజతం అందుకున్నాడు. ● 2025 ఆగస్టులో చెన్నైలో జరిగిన జాతీయస్థాయి పోటీల్లో ఆంధ్రప్రదేశ్‌కు ప్రాతినిధ్యం వహించాడు. ● ఈనెల 4 నుంచి 8వ తేదీ వరకు దిల్లీలో నిర్వహించిన అంతర్జాతీయ ఓపెన్ కిక్‌బాక్సింగ్ పోటీల్లో పాయింట్ ఫైట్‌లో కాంస్యం, కిక్ లైట్ విభాగంలో రజత పతకాలు గెలుపొందాడు.

న్యాయమైన డిమాండ్లు నెరవేర్చండి

కల్లూరు గ్రామీణ, న్యూస్‌టుడే : సహకార సంఘాల్లో పనిచేస్తున్న ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని ఉమ్మడి కర్నూలు జిల్లా సహకార సంఘాల అధ్యక్షుడు హనీఫ్ కోరారు. కృష్ణానగర్‌లోని సహకార బ్యాంక్ ఎదుట సహకార సంఘాల సీఈవో, సిబ్బంది మంగళవారం ధర్నా కార్యక్రమం చేపట్టారు. సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంజిబాబు, జిల్లా కోశాధికారి గోపాల్, మండల కార్యదర్శి హుస్సేనయ్య తదితరులు ధర్నాకు మద్దతు తెలిపారు.

వ్యక్తిగత శుభ్రతతోనే ఆరోగ్యం పదిలం

పెద్దటేకూరు (కల్లూరు గ్రామీణ), న్యూస్‌టుడే : వ్యక్తిగత శుభ్రతతోనే ఆరోగ్యం పదిలంగా ఉంటుందని ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ ప్రాంతీయ సంచాలకుడు డా.రామగిడ్డయ్య పేర్కొన్నారు. కల్లూరు మండలం పెద్దటేకూరు గ్రామంలో చేపట్టిన నులి పురుగుల నివారణ కార్యక్రమాన్ని మంగళవారం ఆయన తనిఖీ చేశారు. సబ్ యూనిట్ అధికారి నజీర్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

దోమల నివారణకు చర్యలు

కర్నూలు నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే : నగరంలో దోమల నివారణకు చర్యలు చేపట్టామని నగరపాలక సీనియర్ ఎటమాలజిస్ట్ వెంకటేశులు తెలిపారు. స్టాంటన్‌పురం, మాస మసీద్ ప్రాంతం, భగత్‌సింగ్‌నగర్, అశోక్‌నగర్, లేబర్‌కాలనీ, ధర్మపేట, నరసింహారెడ్డినగర్ తదితర ప్రాంతాల్లో నిల్వ ఉన్న నీటిలో మంగళవారం ఆయిల్ బాల్స్ వేసి, రసాయనాలు పిచికారీ చేయించారు.

వేర్వేరు ఘటనల్లో ముగ్గురికి గాయాలు

కర్నూలు నేరవిభాగం, న్యూస్‌టుడే : పాతబస్తీ జమ్మిచెట్టు కాలనీకి చెందిన మాబాషా సోమవారం అర్ధరాత్రి ద్విచక్ర వాహనంపై వెళ్తూ అదుపు తప్పి పడిపోవడంతో గాయాలయ్యాయి. స్థానికులు ఆస్పత్రిలో చేర్పించారు.

కర్నూలు నేరవిభాగం : పందిపాడులో పదేళ్ల బాలుడు శేఖర్‌పై వేడి టీ పడటంతో గాయపడ్డాడు. తల్లిదండ్రులు కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. ఎన్టీఆర్ బిల్డింగ్స్‌కాలనీకి చెందిన బాలుడు ఖాజాబాషా సోమవారం రాత్రి కాలనీలో నడుచుకుంటూ వెళ్తుండగా ఆటో ఢీకొట్టడంతో గాయపడ్డాడు. కుటుంబ సభ్యులు సర్వజన ఆసుపత్రిలో చేర్పించారు.

Karnataka Bank Your Family Bank Across India
Celebrating 100 Years of Trust
FEBRUARY 18, 2026
102వ వ్యవస్థాపక దినోత్సవ శుభాకాంక్షలు
Kurnool - Nandyal Road Branch, Devi Function Hall, Kurnool.
కర్ణాటక బ్యాంక్ 102వ వ్యవస్థాపక దినోత్సవ సందర్భంగా నంద్యాల రోడ్డు బ్రాంచ్ మేనేజర్ శ్రీ కె.రామ గోపాల్ గారికి మరియు బ్యాంక్ సిబ్బందికి మా శుభాకాంక్షలు...
శ్రీ కె.రామ గోపాల్ గారు
బ్రాంచ్ మేనేజర్
SHAIK VALI BASHA
Prop: VALI TOBACCO TRADERS
Sy No: 192/A1, Midturu (V), Nandyal Road, Nandikotkur (M), NDL Dist.

(c) eenadu

వైభవం.. త్రిపురాంతకేశ్వరస్వామి రథోత్సవం

త్రిపురాంబ సమేత త్రిపురాంతకేశ్వరుడు

మహాశివరాత్రి మహోత్సవాల్లో భాగంగా ప్రసిద్ధ పుణ్యక్షేత్రం త్రిపురాంతకంలో మంగళవారం త్రిపురాంబ సమేత త్రిపురాంతకేశ్వరస్వామి రథోత్సవం వైభవంగా జరిగింది. మంగళవాయిద్యాల నడుమ స్వామి, అమ్మవార్లు శ్రీగిరి నుంచి తరలివచ్చి రథాన్ని అధిష్ఠించారు. దేవదేవరుల రథాన్ని పుష్పాలతో అలంకరించారు. వేదపండితులు, అర్చకుల ఆధ్వర్యంలో తెదేపా వైపాలెం నియోజకవర్గ ఇన్‌ఛార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు, ఈవో డి.అనిల్ కుమార్, ఎంపీడీవో రాజ్‌కుమార్, ఉత్సవాల ఛైర్‌పర్సన్ సుజాత శ్రీనివాసరెడ్డి, సభ్యులు, నాయకులు పూజలు నిర్వహించారు. అనంతరం రథశాల నుంచి నాలుగు కాళ్ల మండపం వరకు భక్తజన నీరాజనాల నడుమ స్వామి, అమ్మవార్ల రథోత్సవం అత్యంత వైభవంగా సాగింది. దేవదేవరుల తేరును లాగి భక్తులు పులకించిపోయారు. మార్కాపురం డీఎస్పీ నాగరాజు పర్యవేక్షణలో బందోబస్తు నిర్వహించారు. **- న్యూస్‌టుడే, త్రిపురాంతకం గ్రామీణం**

రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

ఖనిజాన్వేషణ!

- లింగసముద్రం, వలేటివారిపాలెంలో ఇనుప ఖనిజం
- గని తవ్వకాలకు ముందుకొచ్చిన జిందాల్ సంస్థ

ఉమ్మడి ప్రకాశం జిల్లా లింగసముద్రం, వలేటివారిపాలెం ప్రాంతాల్లోని భూముల్లో ఇనుప ఖనిజం ఉండడంతో ఖనిజాన్వేషణ సాగిస్తున్నారు. ఖనిజం వెలికితీసేందుకు జిందాల్ సంస్థ ఆసక్తి చూపడంతో ప్రభుత్వం అనుమతుల విషయమై చురుగ్గా వ్యవహరిస్తోంది. తవ్వకాలు మొదలైతే ప్రత్యక్షంగా పరోక్షంగా వేలాది మందికి ఉపాధి లభించనుంది. **- ఈనాడు, ఒంగోలు**

ఇనుము తయారీకి ఉపయోగపడే ముడి ఖనిజం మాగ్నటైట్‌ను ఇక్కడ గుర్తించారు. కీలక మూలకం ఎఫ్ఈ (ఫెర్రమ్) 18 నుంచి 25 శాతం స్థాయిలో ఉంది. దీన్ని ఖనిజ శుద్ధి (బెనిఫిషియేషన్) చేసి వినియోగంలోకి తీసుకురానున్నారు. జిందాల్ సంస్థ ప్రతినిధులు ఇప్పటికే ఈ ప్రాంతాన్ని పరిశీలించారు. రెండు మండలాల పరిధిలో 3,920 హెక్టార్లలో ఖనిజం ఉన్నట్లు గుర్తించారు. దాదాపు అరవైకిపైగా ప్రాంతాల్లో డ్రిల్లింగ్ చేసి ఎక్కడెక్కడ ఖనిజ నిల్వలు ఏ స్థాయిలో ఉన్నాయనే దానిపై అన్వేషణ సాగుతోంది. ఇప్పటికే జిల్లా అధికార యంత్రాంగం ఖనిజాన్వేషణకు సహకారం అందిస్తోంది. ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా గుర్తించి చక్కదిద్దేందుకు రాష్ట్రస్థాయి అధికారులు ప్రయత్నం చేస్తున్నారు. మొత్తం భూమిలో 80 శాతం అటవీ శాఖ పరిధిలో ఉండడంతో ప్రత్యామ్నాయంగా భూములు ఆశాఖకు అప్పగించడంతోపాటు అనుమతులు తీసుకోవాల్సి ఉంది.

ఖనిజ శుద్ధి ఇక్కడే..

స్థానికంగా దొరికే లోగ్రేడ్ మాగ్నటైట్‌ను ఇక్కడే శుద్ధి చేసి దాని నుంచి నాణ్యమైన ఖనిజాన్ని (హైగ్రేడ్) వేరు చేయనున్నారు. ఇందులోని సిలికా(ఇసుక) వంటి వాటిని వేరుచేయడం, అయస్కాంతం ద్వారా నాణ్యమైన మాగ్నటైట్‌ను సేకరించనున్నారు. ఇక్కడ దాదాపు 800 మిలియన్ టన్నుల ఖనిజ నిల్వలు ఉండొచ్చని అంచనా వేస్తున్నారు. ఖనిజ శుద్ధి కేంద్రాన్ని లింగసముద్రం మండలం అద్దంకివారిపాలెం, లక్ష్మక్కపల్లి మధ్య ప్రాంతాల్లో ఏర్పాటుకు జిందాల్ సంస్థ ఆలోచన చేస్తోంది. కేంద్రం ఏర్పాటుకు 1,500 ఎకరాల వరకు భూములు అవసరం కానున్నాయి. భూసేకరణ విషయమై జిల్లా అధికార యంత్రాంగం ప్రత్యేక దృష్టిసారించింది. అవసరమైన భూములను వారికి అప్పగించేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ రాజాబాబు ఇటీవల అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

యువతకు ఉపాధి...

ఖనిజ తవ్వకాలు మొదలైతే ఇక్కడ యువతకు ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. ప్రత్యక్షంగా గనుల్లో తవ్వకాలు, శుద్ధి కేంద్రం, ఖనిజ తరలింపుతో రవాణా రంగం, దీనికి అనుబంధంగా సేవారంగం విస్తరించి జిల్లాలో యువత ఉపాధి పొందనున్నారు. లింగసముద్రం, వలేటివారిపాలెం మండలాల్లో ఇనుప ఖనిజం లభ్యత ఏ స్థాయిలో ఉందనే దానిపై అన్వేషణ జరుగుతోంది.. ఇది పూర్తయ్యాక ఎంత మేర భూములు అవసరమన్నది తేలిన తరువాత తవ్వకాలకు అనుమతులు ఇస్తామని భూగర్భ గనులశాఖ జిల్లా అధికారి రాజశేఖర్ పేర్కొన్నారు.

చూస్తే గుండె చెరువు!

చిత్రంలో కనిపిస్తోంది జిల్లా కేంద్రం మార్కాపురం పట్టణంలోని సుమారు 584 ఎకరాల్లో విస్తరించిన పెద్దచెరువుకు చెందిన దాదాపు 1,100 ఎకరాల ఆయకట్టు. గతంలో ఎటు చూసినా పచ్చటి పొలాలతో కనిపించిన ఈ ప్రాంతం ప్రస్తుతం పంటల సాగు లేక ఇలా చిల్ల చెట్లతో దర్శనమిస్తోంది. చెరువులో సమృద్ధిగా ఉన్నప్పుడు ఆయకట్టుతోపాటు మరో 2 వేల వరకు పంటలు సాగయ్యేవి. కాలక్రమేణా చెరువులో చేపల పెంపకంతో ఆయకట్టుకు సాగునీటిని నిలిపేయడంతోపాటు స్థిరాస్తి వ్యాపారుల వెంచర్లతో పంటల సాగు విస్తీర్ణం పూర్తిగా పడిపోయింది. ఒకప్పుడు పంటలతో కళకళలాడిన ఆయకట్టు బీడుగా మారిపోయింది. ఇప్పటికే చివరన ఉన్న ఆయకట్టు భూముల్లో వెంచర్లు వేయగా, రానున్న రోజుల్లో మిగిలిన పొలాలు సైతం స్థిరాస్తి వ్యాపారుల చేతుల్లోకి వెళ్లిపోనున్నాయి. **- న్యూస్‌టుడే, మార్కాపురం అర్బన్**

బత్తాయి రైతు బతికేదెట్టా?

- కలగా మారిన మార్కెట్ సౌకర్యం
- జ్యూస్ ఫ్యాక్టరీ ఏర్పాటుపై ఆశలు



జిల్లాలోని బత్తాయి రైతులు కష్టనష్టాలకు గురవుతున్నారు. పంట దిగుబడులను భద్రపరచుకునేందుకు మార్కెట్ సౌకర్యం కలగా మిగిలిపోవడంతో పెట్టుబడులు కూడా దక్కని పరిస్థితి నెలకొంది. సుమారు 15 ఏళ్ల కిందట సుమారు 20 వేల హెక్టార్లలో బత్తాయి తోటలు సాగయ్యేవి. రానురాను సాగునీరందక చెట్లు ఎండిపోవడం, తోటలు నరికేయడం, దిగుబడులొచ్చినా మార్కెట్ సౌకర్యం లేకపోవడం తదితర కారణాలతో సాగు విస్తీర్ణం 3 వేల హెక్టార్లకు పడిపోయింది. ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని కనిగిరి, యర్రగొండపాలెం, మార్కాపురం, గిద్దలూరు, దర్శి, కొండపి, కందుకూరు తదితర ప్రాంతాల్లో అధికంగా సాగు చేస్తున్నారు. వందలాది కుటుంబాలకు ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి పొందుతున్నాయి. వ్యయప్రయాసలకు ఓర్చి సాగు చేస్తున్నా అన్ని విధాలుగా రాయితీలు పరికరాలు అందిస్తున్నా స్థానికంగా నిల్వ చేసుకునేందుకు మార్కెట్ సౌకర్యం లేక నష్టపోతున్నారు. దీంతో దళారుల చేతికి చిక్కి వారు అడిగిన ధరకు విక్రయించుకోవాల్సి వస్తోంది. పాలకులు బత్తాయి మార్కెట్‌తో పాటు జ్యూస్ ఫ్యాక్టరీ నిర్మిస్తామని హామీలిచ్చినా ఆచరణకు నోచు కోలేదు. కనిగిరిలో మార్కెట్ ఏర్పాటు చేయాలని గత కొన్నేళ్లుగా రైతులు పోరాటాలు చేస్తున్నా ఫలితం లేకుండాపోయింది. మార్కెట్ సౌకర్యం లేక రవాణా ఛార్జీలు, కూలీల ఖర్చులు కలుపుకుని ఏటా రూ.50 కోట్లకుపైగానే నష్టపోవాల్సి వస్తుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి బత్తాయి మార్కెట్, జ్యూస్ ఫ్యాక్టరీని ఏర్పాటు చేసి ఆదుకోవాలని కోరుతున్నారు. ఈ విషయమై జిల్లా ఉద్యానవన శాఖాధికారి గోపీచంద్ మాట్లాడుతూ ఇక్కడ సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతామని తెలిపారు. **- న్యూస్‌టుడే, కనిగిరి**

పెళ్లి బాజాలు మోగనున్నాయ్!

ఈ నెల 19 నుంచి శుభ ముహూర్తాలు

ఈ నెల 19వ తేదీ నుంచి పెళ్లి బాజాలు మోగనున్నాయి. మొత్తం 53 శుభగడియలు ఉన్నాయని వేదపండితులు చెబుతున్నారు. ఫిబ్రవరి 19, 20, 21, 24, 25, 26, మార్చి 1, 3, 4, 7, 8, 9, 11, 12, ఏప్రిల్ 15, 20, 21, 25, 26, 27, 28, 29, మే 1, 3, 5, 6, 7, 8, 13, 14, జూన్ 21, 22, 23, 24, 25, 26, 27, 29, జులై 1, 6, 7, 11, నవంబరు: 21, 24, 25, 26, డిసెంబరు 2, 3, 4, 5, 6, 11, 12వ తేదీల్లో శుభ మహూర్తాలున్నాయి.

రెండు నెలల ముందే బుకింగ్: ఉమ్మడి ప్రకాశం జిల్లాలో 150కి పైగా కల్యాణ మండపాలున్నాయి. ఇవన్నీ రెండు నెలల ముందు నుంచే బుక్ అయిపోయాయి. ఎక్కువ మంది అడ్వాన్స్‌లు చెల్లించి ఆయా తేదీల్లో ఖరారు చేసుకున్నారు. ఇవి కాకుండా దేవాలయాలు, ప్రైవేటు ఖాళీ స్థలాల్లో సైతం పందిళ్లు ఏర్పాటు చేసుకుని వివాహాలు చేయడానికి ఏర్పాట్లు చేసుకుంటున్నారు. దూర ప్రాంతాల నుంచి వివాహాలకు వచ్చేవారి కోసం హోటళ్లతోపాటు బస్సులు, కార్లు సైతం ముందుగానే రిజర్వేషన్ చేయించుకున్నారు. మిట్టపాలెం నారాయణస్వామి దేవస్థానం వేదపండితులు శివప్రసాద్ శర్మ మాట్లాడుతూ వివాహాలతోపాటు గృహ ప్రవేశాలకు ఫిబ్రవరి, మార్చి, ఏప్రిల్‌లో మంచి ముహూర్తాలు ఉన్నాయన్నారు. ఇప్పటికే పలువురు జాతకాలు, తిథులను సరిచూసుకుని తేదీలు నిర్ణయించుకున్నట్లు తెలిపారు. చాలా మంది వివాహాలు చేసుకునేందుకు, గృహప్రవేశాలకు ముహూర్తాలు ఖరారు చేసుకున్నారని వివరించారు. **- న్యూస్‌టుడే, సీఎస్‌పురం**

పల్లె పోరుకు కసరత్తు!

- మార్చి 9లోపు ఓటర్ల జాబితా తయారీకి అధికారుల ప్రణాళిక
- నేడు కలెక్టరేట్‌లో డిప్యూటీ ఎంపీడీవో, కార్యదర్శులకు శిక్షణ

పల్లె పోరు నిర్వహణకు ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర ఎన్నికల సంఘం నుంచి ఆదేశాలు రావడంతో ఆ దిశగా జిల్లా పంచాయతీ అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. గ్రామ పంచాయతీ, వార్డుల వారీగా మార్చి 9వ తేదీలోగా ఓటర్ల జాబితా తయారు చేయాలని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ నీలంసాహ్ని ఇప్పటికే కలెక్టర్లతోపాటు డీపీవోలకు ఆదేశాలు జారీ చేశారు. పంచాయతీ సర్పంచుల పాలకవర్గాల గడువు ఏప్రిల్ 2తో పూర్తి కానుంది. దీంతో వెంటనే స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర ఎన్నికల సంఘం సిద్ధం చేస్తోంది. ఓటర్ల జాబితా తయారీ అనంతరం పంచాయతీ సర్పంచి, వార్డుల రిజర్వేషన్లు ఖరారు చేయనున్నారు. ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు ప్రారంభించడంతో గ్రామాల్లో ఎన్నికల వాతావరణం మొదలైంది. **-న్యూస్‌టుడే, కలెక్టరేట్**



జిల్లాల విభజన అనంతరం ప్రస్తుత ప్రకాశం జిల్లాలో 519, మార్కాపురం జిల్లాలో 406 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. 2021, ఫిబ్రవరిలో ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని 1,046 గ్రామ పంచాయతీలకు ఎన్నికల ప్రకటన విడుదల చేశారు. ఇందులో కోర్టు కేసుల కారణంగా 28 పంచాయతీలకు ఎన్నికలు నిలిపివేయగా, మిగతా 1,018 పంచాయతీలకు ఎన్నికలు జరిగాయి. ప్రస్తుతం ఆయా పాలకవర్గాల పదవీకాలం గడువు సమీపించడంతో దానికి ముందుగానే ఎన్నికల ప్రక్రియకు సంబంధించి అన్ని ఏర్పాట్లు చేసేందుకు జిల్లా పంచాయతీ అధికారులు కసరత్తు ప్రారంభించారు. ఇందులో భాగంగా 2026, జనవరి ఒకటో తేదీ నాటికి సిద్ధం చేసిన అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా ఓటర్ల జాబితాలను కలెక్టరేట్ నుంచి మంగళవారం సేకరించారు. వాటి ఆధారంగా పంచాయతీ, వార్డుల వారీ జాబితాలను విభజించనున్నారు. జనవరి 1వ తేదీ అనంతరం ఓటుహక్కు పొందినవారి పేర్లను చివరి వార్డులో కలుపుతారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు పంచాయతీ ఎన్నికల నిర్వహణ ప్రక్రియలో భాగంగా ఓటర్ల జాబితా తయారీపై దృష్టి సారించినట్లు డీపీవో ఎం.వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు స్థానిక ప్రకాశం భవన్‌లోని కలెక్టర్ కాన్ఫరెన్స్ హాలులో బుధవారం మధ్యాహ్నం 2.30 గంటలకు ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని డిప్యూటీ ఎంపీడీవోలతోపాటు మండలానికి ఒక పంచాయతీ కార్యదర్శి చొప్పున శిక్షణ ఇవ్వనున్నట్లు ఆయన తెలిపారు.

నియోజకవర్గం	ఓటర్లు
వైపాలెం	2,07,620
దర్శి	2,27,560
ఎస్ఎన్‌పాడు	2,14,309
ఒంగోలు	2,40,035
కొండపి	2,40,324
మార్కాపురం	2,15,160
గిద్దలూరు	2,41,738
కనిగిరి	2,42,031



ఒంగోలు రైలు నిలయంలో సమస్యల కూత!

- ప్రయాణికులకు తప్పని ఇబ్బందులు
- ఎంపీ మాగుంటకూ చేదు అనుభవం

ఒంగోలు రైల్వే స్టేషన్‌లోని అయిదో నంబరు ప్లాట్‌ఫాం

ఒంగోలు రైలునిలయంలో తిరుపతి, చెన్నై వైపు వెళ్లే రైలు ఎక్కాలంటే కష్టాలు తప్పడం లేదు. మూడో నంబరుకు రావాల్సిన రైలు అయిదో నంబరుకు వస్తుందని చివర్లో ప్రకటన చేస్తుండడంతో ప్రయాణికులు పరుగులు పెట్టాల్సి వస్తోంది. సాక్షాత్తు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డికి అనుభవం ఎదురుకావడంతో రైల్వే అధికారులు ఇకనైనా మేల్కొంటారని సామాన్య ప్రయాణికులు భావిస్తున్నారు. **-ఈనాడు, ఒంగోలు**

మహాశివరాత్రి రోజు ఒంగోలు నుంచి చెన్నై వెళ్లేందుకు ఎంపీ మాగుంటతో పెద్దసంఖ్యలో ప్రయాణికులు మూడో నంబరు ప్లాట్‌ఫాంపై వేచి ఉన్నారు. జీటీ ఎక్స్‌ప్రెస్ రైలు మరో పది నిమిషాల్లో వస్తుందనగా, అయిదో నంబరుకు వస్తుందని ప్రకటించారు. దీంతో పాదాచారుల వంతెన వద్దకు చేరుకుని అది ఎక్కి దిగి మరో కిలోమీటరు దూరం నడిచి జీటీ ఎక్స్‌ప్రెస్ ఏసీ బోగీల వద్దకు చేరుకోవాల్సి వచ్చింది. కనీస సౌకర్యాల్లేవని, రైలు అయిదో నంబరు ప్లాట్‌ఫాంలోకి వస్తుందని ముందుగా ప్రకటించకపోవడంపై ఎంపీ రైల్వే అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక రైల్వే అధికారులు ఎంపీ వద్దకు చేరుకుని సర్దిచెప్పి పంపించారు. పిల్లలు, లగేజీలను మోసుకుని ప్లాట్‌ఫాంలు మారేందుకు నరకయాతన అనుభవించామని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేశారు.

ఇకనైనా మోక్షం లభించేనా?

ఎంపీ మాగుంట ఫిర్యాదుతో విజయవాడ డివిజన్ రైల్వే అధికారులు విచారణ చేపట్టారు. అయిదో నంబరు ప్లాట్‌ఫాంపై సౌకర్యాల కల్పనపై ఆరా తీశారు. విద్యుద్దీపాలు అమర్చే పనిని మరో రెండు వారాల్లో, బోగీలు సూచించే ఎల్ఈడీ బోర్డులు వచ్చే నెలలో పూర్తి చేస్తామని ప్రకటించారు. పాదాచారుల వంతెన నిర్మాణం పూర్తిచేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. రైళ్ల సకాలంలో గమ్యం చేరేందుకు అయిదో నంబరు ప్లాట్‌ఫాంను వినియోగంలోకి తీసుకొచ్చామని, కొద్ది రోజుల్లో సమస్యలు పరిష్కరిస్తామని ఒంగోలు రైల్వేస్టేషన్ మేనేజర్ కృష్ణ తెలిపారు.

(c) eenadu

కోనేరులో త్రిశూల స్నానం కార్యక్రమంలో పాల్గొన్న ఉభయదాతలు, భక్తులు

వైభవంగా నిర్మమహేశ్వరుడి త్రిశూల స్నానం

పొదిలి, న్యూస్‌టుడే: పొదిలి నిర్మమహేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం స్వామివారి త్రిశూలానికి కోనేరులో స్నానం నిర్వహించారు. దేవస్థానం నుంచి కోనేరు వరకు త్రిశూలాన్ని తీసుకొచ్చారు. వేదపండితులు ప్రత్యేక పూజలు చేసి కోనేరులో స్నానం చేయించారు. స్వామివారికి పూర్ణాహుతి వసంతోత్సవం నిర్వహించారు. మోహిని అలంకారంలో స్వామివారు భక్తులకు దర్శనమిచ్చారు. ఉభయదాతలు కె.వెంకటగురు సత్యనారాయణ కుటుంబ సభ్యులు, దేవస్థానం ఛైర్మన్ ఒగ్గు వెంకట్రామయ్య, గునుపూడి భాస్కర్, మాధురి, భక్తులు పాల్గొన్నారు.

సార్వభౌమ అలంకరణలో మార్కండేయుడు

మార్కాపురం గ్రామీణం, న్యూస్‌టుడే: శివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా పట్టణంలోని శ్రీజగదాంబ సమేత మార్కండేశ్వర దేవస్థానంలో బ్రహ్మోత్సవాలు కనుల పండువగా జరుగుతున్నాయి. మంగళవారం రాత్రి గజ వాహనంపై సార్వభౌమ అలంకరణలో మార్కండేయస్వామివారు పురవీధుల్లో విరాజిల్లారు.

నట్టలనివారణ మందుల పంపిణీలో పాల్గొన్న ఉప సంచాలకులు బి.మురళీకృష్ణ, అధికారులు

మేలుజాతి లేగదూడల ప్రదర్శన

మార్కాపురం గ్రామీణం: మండలంలోని గజ్జలకొండ గ్రామంలో మంగళవారం పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో మేలు జాతి లేగదూడల ప్రదర్శన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పశుసంవర్ధక అభివృద్ధి సంస్థ ఉపసంచాలకులు బి.మురళీకృష్ణ పాల్గొని రైతులకు అవగాహన కల్పించారు. అనంతరం మొదటి మూడు స్థానాల్లో నిలిచిన దూడల యజమానులకు బహుమతులు అందించారు. నట్టల నివారణ మందులు, మల్టీవిటమిన్ సిరప్‌లు, లవణబాక్సులు అందించారు. ఈ కార్యక్రమంలో సహాయ సంచాలకులు రమేష్, వైద్యులు భాస్కర్‌రెడ్డి, రసజ్ఞ, సిబ్బంది పాల్గొన్నారు.

హోరాహోరీగా ఎడ్ల పందేలు

మేళ్లచెరువు, న్యూస్‌టుడే: మహా శివరాత్రి వేడుకల సందర్భంగా సూర్యాపేట జిల్లా మేళ్లచెరువులో ఎడ్ల పందేలు మంగళవారం హోరాహోరీగా సాగాయి. న్యూ కేటగిరీ విభాగంలో పోటీ పడేందుకు మొత్తం 10 జతలు వచ్చాయి. పుచ్చకాయల శేషాద్రి చౌదరి(ముప్పాళ్ల, ప్రకాశం జిల్లా) గిత్తలు 5,250 అడుగుల దూరం లాగి ద్వితీయ బహుమతిని గెలుచుకున్నాయి.

ప్రాణం తీసిన ఈత సరదా

❖ వైద్యవిద్యార్థి మృత్యువాత

గార్లదిన్నె గ్రామీణం, న్యూస్‌టుడే: అనంతపురం జిల్లా గార్లదిన్నె సమీపంలోని ఈతకొలనులో ప్రమాదవశాత్తు ఓ వైద్యవిద్యార్థి మృతి చెందిన ఘటన మంగళవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఉమ్మడి ప్రకాశం జిల్లా మార్కాపురానికి చెందిన **మోహన్** (19) అనంతపురంలోని ప్రభుత్వ వైద్యకళాశాలలో ఎంబీబీఎస్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. ఎనిమిది మంది సహచర విద్యార్థులతో కలిసి మంగళవారం మధ్యాహ్నం గార్లదిన్నెకు వచ్చారు. వారితో కలిసి మోహన్ ఈత కొడుతూ లోపలికి వెళ్లారు. ఎంత సేపటికీ రాకపోవడంతో తోటి విద్యార్థులు ఈతకొలనులో వెతకసాగారు. కొలను లోపల ఉండటాన్ని గుర్తించి..బయటికి తీసుకొచ్చారు. తలకు గాయం కావడంతో ఆటోలో సమీపంలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. అనంతరం మృతదేహాన్ని అనంతపురం సర్వజన వైద్యశాలకు తరలించారు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై గౌస్‌బాషా తెలిపారు.

రంజాన్ మాసం.. సద్గుణాల ధామం

❖ ఉపవాస దీక్షలకు ఏర్పాట్లు

న్యూస్‌టుడే, పొదిలి:

ముస్లిం సోదరులు అత్యంత పవిత్రంగా భావించే రంజాన్ నెల వచ్చేసింది. హృదయాలలో పవిత్రతను, ఆధ్యాత్మిక భావనను నింపే మాసంగా ఈ నెలను భావిస్తారు. శాంతి, సౌభ్రాతృత్వాన్ని లోకానికి చాటడం ఈ మాసం ప్రత్యేకత.

ప్రత్యేక ప్రార్థనల్లో ముస్లిం సోదరులు

కఠోర ఉపవాస వ్రతం

ఈ 30 రోజుల పాటు కఠోర ఉపవాస వ్రతం పాటిస్తారు. ఖురాన్ పారాయణానికి అధిక ప్రాధాన్యం ఇస్తారు. తెల్లవారుజామున సెహరి, సాయంత్రం ఇఫ్తార్ కార్యక్రమాలతో మసీదుల్లో సందడి వాతావరణం నెలకొంటుంది. రంజాన్ అనేది అరబిక్ పదం. అరబిక్‌లో రంజాన్ అంటే దహించి వేయడం అని అర్థం. ఏడాదిలోని 11 నెలల్లో తెలిసో తెలియక చేసే తప్పులను, పాపాలను రంజాన్ నెలలోని ఉపవాస దీక్షల పుణ్యంతో అల్లా దహించి వేస్తారని మత పెద్దలు చెబుతారు.

ముస్తాబైన మసీదులు

ఉమ్మడి ప్రకాశం జిల్లాలో సుమారు 200 మసీదులు ఉన్నాయి. నెలవంక కనిపించగానే ఉపవాస దీక్షలు పాటించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఒంగోలు, మార్కాపురం, పొదిలి, కనిగిరి, కందుకూరు, యర్రగొండపాలెం, గిద్దలూరు, పామూరు, కంభం, కురిచేడు ప్రాంతాల్లో ఉన్న మసీదులన్నీ ముస్తాబయ్యాయి.

షవ్వాల్ నెలవంకతో ప్రారంభం

ఇస్లామియా క్యాలెండర్ మాసాల్లో తొమ్మిదో నెల రంజాన్. నెలవంక చూసినప్పటి నుంచి తరువాతి నెలవంక దర్శనమిచ్చేంత వరకు నెలరోజుల పాటు ముస్లింలు కఠిన ఉపవాస దీక్షలు చేపడతారు. వేకువజామున సహరీతో ఉపవాసాలను ప్రారంభిస్తారు. ఉపవాసం పాటించే వారు ప్రాతఃకాలానికి ముందే లేచి భోజనం ఆరగిస్తారు. దీన్నే ఇస్లామియా పరిభాషలో సహరీ అంటారు. సూర్యాస్తమయం వరకు మంచినీళ్లు కూడా ముట్టరు. సూర్యాస్తమయం కాగానే మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలతో ఉపవాసం విరమిస్తారు. దీనే ఇఫ్తార్ అంటారు.

ఓర్పు, సహనం అలవడతాయి

రంజాన్ మాసంలో పాటించే ఉపవాస దీక్ష వల్ల జీవితంలో ఎదిగేందుకు అవసరమైన ఓర్పు, సహనం అలవడతాయి. ముస్లింలు తప్పనిసరిగా ఉపవాస దీక్షలతోపాటు ఐదు పూటల నమాజ్ చేస్తారు. అల్లా ధ్యానంలో గడుపుతారు. ఈ నెలలోనే పవిత్ర ఖురాన్ అవతరించింది.

– మౌలానా రబ్బాని, పొదిలి

జేఈఈ మెయిన్స్‌లో కొండెపి విద్యార్థి ప్రతిభ

కొండెపి (గ్రామీణం), న్యూస్‌టుడే: జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో కొండెపి గ్రామానికి చెందిన **రాజా యాగ్నిక్ నిఖిల్** 99.9191% సాధించి ప్రతిభ కనబరిచాడు. అతని తల్లిదండ్రులు రాజా గురవయ్య, సునంద ప్రభుత్వ ఉద్యోగులుగా పనిచేస్తున్నారు. ప్రస్తుతం విజయవాడలోని ఓ ప్రైవేట్ కళాశాలలో ఇంటర్ మీడియట్ చదువుతున్నాడు. ఐఐటీలో సీఎస్ఈ చదవడం లక్ష్యం అని విద్యార్థి చెప్పాడు.

డీఎంహెచ్‌వోగా మాధవీలత

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారిగా బి.మాధవీలత నియమితులయ్యారు. ఈమె ప్రస్తుతం ఒంగోలులోని ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో ఆర్ఎంవోగా కొనసాగుతున్నారు. ప్రస్తుత డీఎంహెచ్‌వో టి.వెంకటేశ్వర్లు గుంటూరు డీఎంహెచ్‌వోగా బదిలీ అయ్యారు. ఈ మేరకు రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ కార్యదర్శి సౌరభ్ గౌర్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.

మహా శివరాత్రికి ఆర్టీసీకి భారీ ఆదాయం

❖ నాలుగు రోజుల్లో రూ.58 లక్షల వసూలు

న్యూస్‌టుడే మార్కాపురం

మహా శివరాత్రికి ఈసారి మార్కాపురం ఆర్టీసీ డిపోకు రికార్డు స్థాయిలో ఆదాయం వచ్చింది. గతంలో ఎన్నడూ లేనంతగా అధిక సంఖ్యలో ప్రయాణికులు, భక్తులు జ్యోతిర్లింగాల్లో ఒకటైన ప్రముఖ పుణ్యక్షేత్రం శ్రీశైల క్షేత్రానికి బస్సుల్లో నిలబడటానికి కూడా స్థలం లేనంతగా ప్రయాణించి ఆర్టీసీకి ఆదాయం తెచ్చిపెట్టారు. గతంలో కంటే ఈ ఏడాది రూ.13.90 లక్షలు ఆదాయం అదనంగా వచ్చిందంటే భక్తులు శ్రీశైలానికి ఏవిధంగా వెళ్లారో గమనించవచ్చు.

మార్కాపురం ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రయాణికుల రద్దీ

24 గంటలూ నడిచిన 80 ప్రత్యేక బస్సులు

ఈ నెల 13వ తేదీ నుంచి 16వ తేదీ వరకు మార్కాపురం నుంచి దోర్నాల మీదుగా శ్రీశైలానికి 80 ప్రత్యేక బస్సులను 24 గంటల పాటు నడిపారు. ఈ ప్రయాణంలో ఆర్టీసీకి ఒక్క శ్రీశైలం ద్వారానే రూ.56 లక్షల ఆదాయం వచ్చింది. మార్కాపురం నుంచి శ్రీశైలంకు ఈ నాలుగు రోజుల్లో 29,000 మంది రాకపోకలు సాగించారు. దీంతో రికార్డు స్థాయిలో గతంలో వచ్చిన ఆదాయం కంటే ఈ ఏడాది రూ.13.90 లక్షలు అదనంగా వచ్చినట్లు మార్కాపురం ఆర్టీసీ డీఎం లావణ్య తెలిపారు.

త్రిపురాంతకానికి 1,100 మందికి పైగా రాకపోకలు

మార్కాపురం నుంచి మహా శివరాత్రి ఈ నెల 15, 16 తేదీల్లో ప్రత్యేక ఆర్టీసీ సర్వీసులను అధికారులు ఏర్పాటు చేశారు. ఈ రెండు రోజులు మార్కాపురం నుంచి త్రిపురాంతకానికి 1,100 మందికి పైగా ప్రయాణికులు రాకపోకలు సాగించారు. దీంతో ఈ రెండు రోజుల్లో త్రిపురాంతకం నుంచి ఆర్టీసీకి రూ.2.04 లక్షలు ఆదాయం వచ్చినట్లు అధికారులు తెలిపారు. ఆక్యుపెన్సీ వంద నుంచి 110 శాతం పెరిగిందని, గతంలో ఎన్నడూ ఈ విధంగా జరగలేదని చెప్పారు.

విద్యార్థి దశలో ఆరోగ్యంపై శ్రద్ధ అవసరం

మాట్లాడుతున్న జేసీ శ్రీనివాసులు, వేదికపై వైద్యాధికారులు

మార్కాపురం గ్రామీణం, న్యూస్‌టుడే: విద్యార్థులు చదువుతో పాటు వ్యక్తిగత శుభ్రత, శారీరక ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని సంయుక్త కలెక్టర్ పి.శ్రీనివాసులు అన్నారు. మంగళవారం జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు అధ్యక్షతన వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన స్పెషల్ డ్రైవ్‌లో పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు ప్రతిరోజూ శుభ్రతను పాటించి తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు. కార్యక్రమ రాష్ట్ర నోడల్ అధికారి ఆర్.నరేష్ మాట్లాడుతూ మార్కాపురం జిల్లాలోని ప్రతిఒక్క అంగన్వాడీ కేంద్రాలు, పాఠశాలలు, కాలేజీల్లో 2.93లక్షల మంది 1 నుంచి 19 సంవత్సరాలలోపు విద్యార్థులకు నులిపురుగుల నివారణ మాత్రలను అందిస్తున్నామన్నారు. అనంతరం వైద్య సిబ్బంది విద్యార్థులకు సరళంగా అర్థమయ్యే విధంగా స్కిట్‌రూపంలో శుభ్రతా చర్యలను వివరించారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్‌వో వాణిశ్రీ, జిల్లా క్షయ నివారణాధికారి రాహుల్, డిప్యూటీ డీఎంహెచ్‌వోలు మనషే, సుజన, తదితర వైద్యఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

సాగునీరు వృథా కాకుండా చూడాలి

సమావేశంలో పాల్గొన్న డీసీ ఛైర్మన్‌లు, ఎన్నెస్పీ ఎస్‌ఈ వరలక్ష్మి

సంతనూతలపాడు, న్యూస్‌టుడే: రైతులు సంతృప్తి చెందేలా చివరి ఎకరానికీ సాగర్ నీరు అందించాలని డీసీ ఛైర్మన్‌లు కోరారు. మంగళవారం ఒంగోలులోని ఎన్నెస్పీ కార్యాలయంలో ఒంగోలు, సంతనూతలపాడు, చీమకుర్తి నీటి సంఘాల అధ్యక్షులతో ఎస్‌ఈ వరలక్ష్మి సమీక్షించారు. ఈ సందర్భంగా పలు అంశాలపై చర్చించారు. నీటి కోసం రైతులు ఇబ్బందులు పడకుండా.. నిత్యం పర్యవేక్షణలో చూడాలని నిర్ణయించారు. బుధవారం నుంచి కారుమంచి మేజరుకు, ఒంగోలు సమ్మర్ స్టోరేజ్-2కు నీటిని సరఫరా చేస్తున్నారని, కారుమంచి మేజరుపై రైతులు నీటిని సద్వినియోగం చేసుకోవాలని ఎస్‌ఈ కోరారు. నీటి వృథా లేకుండా చూడాలన్నారు. అదే క్రమంలో రాష్ట్ర ప్రభుత్వం సాగునీటి ప్రాజెక్టులకు బడ్జెట్‌లో రూ.18,224 కోట్లు కేటాయించడంపై నీటి సంఘాల అధ్యక్షులు హర్షం వ్యక్తం చేశారు. సంతనూతలపాడు-చంద్రపాలెం మధ్య ఓబీసీపైనున్న చప్టాకు, మరో రెండు చప్టాలకు అంచనాలు వేసి నిధుల కేటాయింపునకు ప్రతిపాదనలు పంపారు. నీటి వినియోగం, రానున్న ఏడాదిలో చేయాల్సిన పనులు.. ఇలా పలు అంశాలపై చర్చించారు. ఈ సమావేశంలో డీసీ ఛైర్మన్‌లు నల్లూరి కృష్ణారావు, రామా శ్రీనివాసరావు, పాలడుగు వెంకటనారాయణ, దొడ్డా వెంకట్రావు, కంకణాల వేణు, ఎన్నెస్పీ ఈఈ దివాకర్, పలు నీటి సంఘాల అధ్యక్షులు, ఎన్నెస్పీ అధికారులు పాల్గొన్నారు.

సత్వర చికిత్సతో క్షయ నిర్మూలన

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: సత్వర చికిత్స ద్వారా క్షయ వ్యాధి నిర్మూలన సాధ్యమని జిల్లా క్షయ నిర్మూలన అధికారి జి.బాలాజీ సూచించారు. టీబీ అవగాహన వారోత్సవాల్లో భాగంగా స్థానిక జిల్లా జైలులో మంగళవారం ఖైదీలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. టీబీ లక్షణాలు, తక్షణ వ్యాధి నిర్ధారణ ప్రాముఖ్యత గురించి వివరించారు. క్షయ నిర్మూలనలో భాగంగా ఉచిత చికిత్స సదుపాయాలు, నివారణ చర్యలపై పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా జైలు సూపరింటెండెంట్ పి.వరుణ్‌రెడ్డి, జైలర్ ఎం.ఎ.నాయుడు, వైద్యాధికారి బ్రహ్మతేజ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జిల్లా క్షయ నిర్మూలన అధికారి బాలాజీ

అధికారులతో సమీక్షిస్తున్న మార్కెటింగ్‌శాఖ ఆర్జేడీ శ్రీనివాసరావు

నియోజకవర్గానికో రైతు బజారు

ఒంగోలు గ్రామీణం: ప్రభుత్వ ఆదేశాల మేరకు నియోజకవర్గానికో రైతు బజారు ఏర్పాటు లక్ష్యంగా నిర్ణయించినట్లు మార్కెటింగ్‌శాఖ విజయవాడ ఆర్జేడీ శ్రీనివాసరావు తెలిపారు. స్థానిక జిల్లా మార్కెటింగ్ కార్యాలయంలో మంగళవారం మార్కెట్ కమిటీ కార్యదర్శులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇప్పటికే ప్రకాశం జిల్లాలోని ఒంగోలు, కందుకూరులో రైతు బజార్లు ఉండగా.. దర్శిలో నిర్మాణం జరుగుతున్నట్లు వివరించారు. మిగిలిన మూడు చోట్ల నిర్మాణానికి అవసరమైన స్థల సేకరణ చేయాలని ఆదేశించారు. జిల్లాలోని చెక్‌పోస్టుల వద్ద మార్కెటింగ్ ఫీజులు 66 శాతం మేర మాత్రమే వసూలైనట్లు తెలిపారు. వంద శాతం వసూలుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లాలోని 7 కమిటీల పరిధిలో లైసెన్స్ తీసుకున్న వ్యాపారుల వద్ద సెస్ బకాయిలు వసూలు చేయాలని సూచించారు. ఈ సమావేశంలో మార్కెటింగ్ ఏడీ వరలక్ష్మి పాల్గొన్నారు.

ప్రకాశం జిల్లాలో బ్రాయిలర్ ధరలు (కిలో 1కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం ధర - 115, రిటైల్ లైవ్ - 142, చికెన్ విత్ స్కిన్ - 206, చికెన్ స్కిన్‌లెస్- 234

ఘర్షణకు దారితీసిన పొలం వివాదం

❖ ఒకరి మృతి, ఇద్దరికి గాయాలు

పెద్దదోర్నాల, న్యూస్‌టుడే: పొలం వివాదం దాయాదుల మధ్య ఘర్షణకు దారి తీసింది. ఒకరిపై ఒకరు దాడి చేసుకోవడంతో ఒకరు మృతి చెందగా... ఇద్దరు గాయపడిన సంఘటన దోర్నాల మండలం తిమ్మాపురంలో మంగళవారం చోటుచేసుకుంది. ఈ ఘర్షణలో పూర్ణకంటి నాగూలూరయ్య (62) మృతి చెందాడు. ఇతనికి భార్య దేవమ్మ, అయిదుగురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. పూర్ణకంటి నాగేంద్రరావు, పూర్ణకంటి రమేష్‌లకు గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం నాగూలూరయ్యకు పూర్ణకంటి నాగేంద్రరావు, రమేష్‌లు దాయాదులు. వీరు నెల్లూరులో ఉంటున్నారు. మూడు రోజుల క్రితం తల్లి సంవత్సరీకానికి వచ్చారు. అదే సమయంలో సాగులో ఉన్న కంది పంటను నాగూలూరయ్య కోశారని తెలియడంతో వారు అక్కడికి వెళ్లారు. నాగూలూరయ్యకు వారికి మధ్య వివాదం చోటుచేసుకుంది. అంబులతో దాడి చేసుకున్నారు. నాగేంద్రరావు చేతికి, ఛాతీలో గాయం కాగా, రమేష్ చేతికి గాయమైంది. గాయపడిన వారిని బంధువులు పెద్దదోర్నాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లి చూడగా నాగూలూరయ్య తీవ్రంగా గాయాలై మృతి చెంది కనిపించాడు. మృతుడి కడుపులో అంబుతో పొడిచిన పోట్లు ఉన్నాయి. సీఐ అజయ్‌కుమార్, యర్రగొండపాలెం ఎస్సై చౌడయ్య మృతదేహాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ట్రాక్టర్ బోల్తా పడి యువకుడి దుర్మరణం

త్రిపురాంతకం, న్యూస్‌టుడే: ప్రమాదవశాత్తు ట్రాక్టర్ బోల్తాపడిన ఘటనలో ఓ యువకుడు మృతిచెందిన సంఘటన త్రిపురాంతకం మండలంలోని పాత అన్నసముద్రంలో మంగళవారం చోటు చేసుకుంది. గ్రామస్థులు తెలిపిన వివరాల మేరకు గ్రామానికి చెందిన పసుపులేటి ఆంజనేయులు కుమారుడు **వెంకట చంద్రశేఖర్** (20) హైదరాబాద్‌లో ఉంటున్నాడు. శివరాత్రి ఉత్సవాలు ఉండడంతో ఇటీవల స్వగ్రామానికి వచ్చాడు. పొలం వద్ద ఉన్న ట్రాక్టర్‌ను ఇంటికి తీసుకెళ్లే క్రమంలో ప్రమాదవశాత్తు అదుపుతప్పి పక్కనే ఉన్న పంట కాలువలో బోల్తాపడింది. ఈ ఘటనలో చంద్రశేఖర్ ట్రాక్టర్ కిందే బురదలో ఇరుక్కుని ఉండిపోయాడు. ప్రమాద విషయాన్ని తెలుసుకున్న కుటుంబ సభ్యులు, గ్రామస్థులు సంఘటనా స్థలానికి చేరుకుని యువకుడిని బయటకు తీయగా అప్పటికే మృతి చెందాడు. చేతికి అంది వచ్చిన ఒక్కగానొక్క కుమారుడు ప్రమాదంలో మృతి చెందడంతో తల్లిదండ్రులు బోరున విలపించారు. దీంతో పండుగ పూట గ్రామంలో తీవ్ర విషాదఛాయలు అలుముకున్నాయి.

'బాలుడి మృతిపై దర్యాప్తు వేగవంతం'

సింగరాయకొండ పోలీసు స్టేషను ముందు బైఠాయించి నిరసన తెలియజేస్తున్న విద్యార్థి కుటుంబ సభ్యులు

సింగరాయకొండ గ్రామీణం, న్యూస్‌టుడే: విద్యార్థి అనుమానాస్పద మృతిపై దర్యాప్తు వేగవంతం చేసి కారకులపై చట్టపరమైన చర్యలు చేపడతామని కందుకూరు సీఐ అన్వర్‌బాషా తెలిపారు. సింగరాయకొండ మండలం మూలగుంటపాడు ఓ కోచింగ్ సెంటరులో గత శనివారం సాయంత్రం కనిగిరి పట్టణానికి చెందిన ఓ బాలుడు(11) అనుమానాస్పదంగా మృతి చెందాడు. బాలుడి తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు, బంధువులు మంగళవారం కోచింగ్ సెంటరు వద్ద ఆందోళన చేసేందుకు వెళ్లే క్రమంలో సీఐ హజరత్తయ్య సిబ్బందితో వారిని నిలువరించారు. ఈ సమయంలో పోలీసులు, వారి మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. అనంతరం వారు స్థానిక పోలీసు స్టేషను ముందు బైఠాయించి నిందితులను కఠినంగా శిక్షించి న్యాయం చేయాలంటూ డిమాండు చేశారు. ఈ కేసులో విచారణ అధికారిగా జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజు నియమించిన కందుకూరు సీఐ అన్వర్‌బాషా, సింగరాయకొండ సీఐ హజరత్తయ్య లు దర్యాప్తు వేగవంతం చేసి న్యాయం జరిగేలా చర్యలు చేపడతామని హామీ ఇవ్వడంతో వారు నిరసన విరమించారు. విచారణ పూర్తయ్యే వరకు శాంతి భద్రతలకు విఘాతం కల్గించరాదని, ఆగ్రహావేశాలకు పోరాదని వారికి సూచించారు. కార్యక్రమంలో టంగుటూరు ఎస్సై నాగమల్లేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

కడతేరిపోయావా కన్నా..!

❖ తల్లిదండ్రుల నిర్లక్ష్యానికి పసివాడు బలి ❖ మృతదేహాన్నీ తీసుకెళ్లని వైనం

అడవిపాలెం (సంతమాగులూరు), న్యూస్‌టుడే: తల్లిదండ్రుల నిర్లక్ష్యం ఆ పసివాడిని బలితీసుకుంది.. పొత్తిళ్లలో ఉండాల్సిన బిడ్డను పొలం గట్టుపై వదిలేయడంతో..అక్కడున్న విష ద్రావణం తాగిన అతను చికిత్స పొందుతూ కడతేరిపోయాడు. బిడ్డ మృతదేహాన్ని ఆసుపత్రిలోనే వదిలేసి వెళ్లిపోయాయి ఆ పాషాణ హృదయాలు ! గుండెల్ని పిండేసే ఈ విషాద సంఘటన మంగళవారం ఆలస్యంగా వెలుగు చూసింది. ఏఎస్సై శ్రీనివాసరావు తెలిపిన వివరాల ప్రకారం.. ఉలవపాడు మండలం, కృష్ణాపురానికి చెందిన సీహెచ్.శ్రీనివాసరావు, మస్తానమ్మ బాతులు పెంచుకుంటూ ఉపాధి పొందుతున్నారు. వారు ఇటీవల బాతులు మేపుకునేందుకు ఈ నెల 14న సంతమాగులూరు మండలం అడవిపాలేనికి వెళ్లారు. అదేరోజు తమ పదిహేను నెలల మగబిడ్డను అక్కడి పొలం గట్టుపై వదిలేసి బాతులు మేపుకునే పనిలో పడ్డారు. ఆ పసివాడు పొరపాటున అక్కడ పడివున్న పిచికారీ మందును తాగి అపస్మారక స్థితికి చేరాడు. కొద్ది సేపటికి గమనించిన తల్లి వెంటనే బిడ్డను తీసుకుని అద్దంకి ప్రభుత్వాసుపత్రికి వెళ్లింది. పరిస్థితి విషమంగా ఉండటంతో ఒంగోలు రిమ్స్‌లో చేర్పించింది. పరిస్థితి విషమించడంతో ఆ బాలుడు సోమవారం రాత్రి ప్రాణాలు కోల్పోయాడు. ఈ ఘటనపై మృతుడి తండ్రి మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై తెలిపారు. తల్లిదండ్రులు బిడ్డ మృతదేహాన్ని ఆసుపత్రిలోనే వదిలేసి వెళ్లడం అక్కడి వారిని కలచివేసింది.

పుడమికి నవశకం!

❖ ఉమ్మడి ప్రకాశం జిల్లాలో 86 వేల ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయం

న్యూస్‌టుడే, ఒంగోలు గ్రామీణం

మోతాదుకు మించి రసాయనాల వినియోగంతో నేల నిర్జీవంగా మారుతోంది. తద్వారా రైతులకు సాగు వ్యయం పెరిగిపోతుండగా, దిగుబడులు తగ్గిపోతున్నాయి. ప్రధానంగా తెల్ల రేగడి, చౌడు భూముల్లో సాగు గిట్టుబాటు కాక రైతులు అప్పులపాలవుతున్నారు. ఈ నేపథ్యంలో నేలకు పునరుజ్జీవం కల్పించి సహజ శక్తిని పెంపొందించేందుకు ప్రకృతి వ్యవసాయం అధికారులు ప్రణాళిక చేశారు. తక్కువ పెట్టుబడితో ప్రకృతి విధానంలో పంటల సాగు ప్రోత్సహిస్తున్నారు. ఇందులో భాగంగా నవ ధాన్యాలు అందజేసేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించారు. ఖరీఫ్‌కు ముందే వేసవిలో నవ ధాన్యాల సాగు లక్ష్యంగా నిర్దేశించుకున్నారు. రుతు పవనాలు రాకముందే పొడి నేలలో విత్తనం వేయనున్నారు. పొలం సారవంతం చేసేందుకు పచ్చి రొట్ట (జనుము, జీలుగ, పిల్లిపెసర) ఎరువులు ఎంతో ఉపయోగ పడనున్నాయి.

30 రకాల విత్తనాల కిట్ రూ.800

ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని రైతులకు సరఫరా చేసేందుకు 86 వేల నవధాన్యాల కిట్లు తయారీ చేయాలని లక్ష్యంగా నిర్ణయించారు. ఇందులో జొన్న, మొక్కజొన్న, కందులు, పెసలు, వేరుసెనగ, పొద్దు తిరుగుడు, ధనియాలు, మెంతులు, ఆవాలు, జీలుగ, జనుము, పిల్లిపెసర, ఆకు కూరలు, ఉలవలు, అలసంద, మినుములు, కొర్రలు, సామలు, రాగులు, సజ్జలు, నువ్వులు, వరి, తీగ, దుంపజాతికి చెందిన 30 రకాల విత్తనాలున్నాయి. ఒక్కోదానిలో 10 కిలోల చొప్పున అన్ని రకాల విత్తనాలుంటాయి. ఎకరానికి ఒక్కో కిట్ సాగు చేస్తే చాలు. విత్తన రకాల ఆధారంగా కిట్ రూ.800 నుంచి రూ.1,000 వరకు ధర నిర్ణయించారు. వీటిపై రైతులకు అవగాహన కల్పించి 86 వేల ఎకరాల్లో సాగు చేసేందుకు కార్యాచరణ రూపొందించారు.

కందులూరులో రైతులకు అవగాహన కల్పిస్తున్న జడ్‌బీఎన్‌ఎఫ్ డీపీఎం సుభాషిణి

సూక్ష్మ పోషకాల లోపాలు అధిగమిద్దాం

30 రకాల విత్తనాలను పచ్చిరొట్ట ఎరువులుగా సాగు చేయడంతో ఎన్నో లాభాలుంటాయి. నేలలో కర్బన శాతం పెరుగు తుంది. కలియ దున్నడంతో భూసారానికి లోపం ఉండదు. ప్రధాన పంటకు రసాయన ఎరువుల భారంతో పాటు కలుపు బెడద, చీడపీడల ఉద్ధృతి తగ్గుతుంది. నేలలో తేమ పెరిగి, వానపాముల సంఖ్య వృద్ధి చెందుతాయి. స్థూల, సూక్ష్మ పోషకాల లోపాలు అధిగమించొచ్చు.

–సుభాషిణి, డీపీఎం, జడ్‌బీఎన్‌ఎఫ్

EENADU Classifieds

BUSINESS SERVICES

బంగారం బ్యాంకులో! ఏ ఇతర ప్రైవేటు సంస్థలో తాకట్టులో ఉన్నా విడిపించి ఈరోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్). Ph: 81422 92071.

JOBS

Wanted DRA Tele Callers, Field Executives & Team Leaders Banking Sector Attractive Salaries and Incentives. Ph: 9843396935, 7075345527.

Wanted Teachers for Reputed Schools in A.P & Telangana, Contact: Sneha Placements Service. Ph: 94402 46409.

PROFESSIONAL SERVICES

ASTROLOGY

PEOPLE CARE

OLD AGE HOME

Cont: 7095870566, 9912147879

REAL ESTATE

WANTED

గమనిక

కనిగిరి

• కనిగిరి • గిద్దలూరు

కనులపండువగా పాతాళనాగేశ్వరుడి రథోత్సవం

గిద్దలూరు పట్టణం, న్యూస్‌టుడే: శివరాత్రి ఉత్సవాల్లో భాగంగా గిద్దలూరు పట్టణంలోని పాతాళనాగేశ్వరస్వామి దేవస్థానంలో మంగళవారం సాయంత్రం నిర్వహించిన స్వామివారి రథోత్సవం కనులపండువగా సాగింది. ముందుగా ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించి రథంపై కొలువుదీర్చారు. ప్రత్యేక పూజల అనంతరం గ్రామోత్సవం ప్రారంభించారు. మహిళల కోలాట ప్రదర్శన, కాంతార వేషధారణలు, కేరళ వాయిద్యాలు, సాంస్కృతిక ప్రదర్శనల మధ్య రథోత్సవం వైభవంగా చేపట్టారు. వేడుకలో ఎమ్మెల్యే సోదరుడు ముత్తుముల కృష్ణకిశోర్‌రెడ్డి, ఆలయ కమిటీ అధ్యక్షుడు ఆరవీటి సుబ్రహ్మణ్యం, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

గ్రామోత్సవాన్ని ప్రారంభిస్తున్న దేవస్థాన కమిటీ సభ్యులు

వేడుకగా పాచ్చాహుస్సేని గంధ మహోత్సవం

కనిగిరి, న్యూస్‌టుడే: కనిగిరి పట్టణంలోని శ్రీ హజరత్ బాదేషా పాచ్చాహుస్సేని చిష్టవుల్ ఖాదరి 128వ గంధ మహోత్సవాన్ని మంగళవారం రాత్రి వైభవంగా నిర్వహించారు. కనిగిరితో పాటు పొదిలి, కొనకనమిట్లతో పాటు పరిసర జిల్లాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై మొక్కులు చెల్లించారు. పాచ్చాహుస్సేని సమాధి వద్ద పలువురు ప్రజా ప్రతినిధులు చాదర్ కప్పారు. వేడుకల సందర్భంగా దర్గాను విద్యుద్దీపాలతో ప్రత్యేకంగా అలంకరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి.

విద్యుత్తు దీపాల కాంతుల్లో దర్గా... భక్తుల రద్దీ

రణభేరికి తరలిన ఉపాధ్యాయులు

సి.ఎస్.పురం, న్యూస్‌టుడే: పీఆర్సీ నియామకం, ఆర్థిక బకాయిల సాధన, సీపీఎస్ రద్దు ప్రధాన అజెండాగా విజయవాడలో తలపెట్టిన రణభేరి ధర్నాకు సి.ఎస్.పురం, పామూరు మండలాల నుంచి యూటీఎఫ్ నాయకులు తరలివెళ్లారు. ఇచ్చిన హామీ మేరకు వెంటనే వేతన కమిటీ వేయాలని, ఉద్యోగ, ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన బకాయిలు చెల్లించాలని కోరారు. సర్వీసులో ఉన్న ఉపాధ్యాయులకు టెట్ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా కార్యదర్శి పి.తిరుపతిరెడ్డి, కుటుంబ సంక్షేమ పథక డైరెక్టర్ జె.వెంకటరావు, నాయకులు హస్తి వీరాంజనేయులు, పి.దేవదాస్, ఉదయ్‌కుమార్, కె.నాగేశ్వరావు, జి.వెంకటేశ్వర్లు, జి.కొండలరావు, వి.శ్రీనివాసులు, మానం శ్రీనివాసులు నిరసనలో పాల్గొన్నారు.

ధర్నాలో ప్లకార్డులు ప్రదర్శిస్తున్న యూటీఎఫ్ నాయకులు

జేఈఈ మెయిన్స్‌లో మెరిశారు

లక్ష్మీ తేజ

రికిష్‌రెడ్డి

సి.ఎస్.పురం, న్యూస్‌టుడే: జేఈఈ మెయిన్స్ మొదటి విడత ఫలితాలలో సి.ఎస్.పురానికి చెందిన ఇద్దరు విద్యార్థులు ప్రతిభ చాటారు. విద్యార్థిని నాయుడు లక్ష్మీతేజ 99.93 పర్సంటైల్ సాధించింది. తండ్రి రవి ప్రధానోపాధ్యాయుడు కాగా తల్లి అంజనీకుమారి గృహిణి. కంప్యూటర్ సైన్స్ ఇంజినీరుగా స్థిరపడాలన్నది తన లక్ష్యమని పేర్కొంది. మరో విద్యార్థి కొంగలవీటి రికిష్‌రెడ్డి 99.77 పర్సంటైల్ తెచ్చుకున్నాడు. తండ్రి శేషారెడ్డి పంచర్ షాపు యజమాని కాగా, తల్లి లక్ష్మీకాంతమ్మ, గృహిణి. ఐఐటీలో సీఎస్ఈ పూర్తి చేయాలన్నది తన లక్ష్యమని వివరించాడు. వీరిని పలువురు అభినందించారు.

యూబీఐ ప్రాంతీయ కార్యదర్శిగా ఫారూఖ్

కొమరోలు గ్రామీణం, న్యూస్‌టుడే: యూనియన్ బ్యాంకు మార్కాపురం జిల్లా మైనారిటీ ఉద్యోగుల ప్రాంతీయ కార్యదర్శిగా కొమరోలు శాఖ మేనేజర్ మహ్మద్ ఫారూఖ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. హైదరాబాద్‌లో ఈ నెల 14న నిర్వహించిన సమావేశంలో ఈ ఎంపిక చేపట్టారు. ఈ సందర్భంగా బ్యాంకు సిబ్బంది, ఖాతాదారులు మంగళవారం ఆయనను సత్కరించారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)

కనిగిరి : 8008574114

గిద్దలూరు పట్టణం : 8008574135

మీ ప్రాంతంలో ఏ ప్రజా సమస్యనైనా పరిష్కరించే క్రమంలో 'ఈనాడు' మీకు తోడుగా ఉంటుంది. వివరాలను, చిత్రాలను వాట్సాప్ ద్వారా పంపవచ్చు. లేదా ఫోన్లో వివరించవచ్చు. వాటిని బాధ్యుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తాం.

?: అర్ధవీడు: బొల్లుపల్లి నాయిని చెరువు తూము మరమ్మతులకు గురై నీరంతా వృథాగా పోతోంది. – రాజు

✓: పరిశీలించి... మరమ్మతులు చేపడతాం. – శ్రీనునాయక్, నీటిపారుదల శాఖ జేఈ

?: అర్ధవీడు: రంగాపురం మసీదు వీధిలో కాలువలు లేక ఇళ్ల ముందరే మురుగు నిలిచి సమస్యగా మారింది. – ఖాజావలి

✓: కాలువల ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపాం. అనుమతులు రాగానే పనులు చేపడతాం. – కాసింపీరా, ఎంపీడీవో

?: కనిగిరి: పట్టణంలోని ఎమ్మెస్సార్ రోడ్డు, ఆర్టీసీ డిపో రోడ్డు, క్లబ్ రోడ్డు తదితర ప్రాంతాల్లో కుక్కల సమస్య తీవ్రంగా ఉండడంతో ఇబ్బంది పడుతున్నాం. – మురళి

✓: గతంలో కొన్ని కుక్కలు పట్టించి టీకాలు వేయించాం. మరోసారి ఈ ప్రక్రియ చేపడతాం. – పి.శ్రీధర్, కమిషనర్

?: కనిగిరి: వైఎస్సార్ రోడ్డు, తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో దీపాలు వెలగక రాత్రి వేళ అటుగా రాకపోకలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. – నారాయణమ్మ

✓: వెంటనే సిబ్బందిని పంపి దీపాలు బాగు చేయిస్తాం. –మాధవరావు, మున్సిపల్ ఏఈ

చిట్కా... పాటిస్తే మార్కులు పక్కా!

• కొద్దిపాటి జాగ్రత్తలతో ఉత్తమ ఫలితాలు • విద్యార్థులకు నిపుణుల సూచనలు

'మా అబ్బాయి బాగా చదివినా ఆ స్థాయిలో మార్కులు రావడం లేదు' కొందరు తల్లిదండ్రుల నుంచి తరచూ వినిపించే మాట ఇది. 'అన్ని ప్రశ్నలకు సరిగానే సమాధానాలు రాశాను. మార్కులు మాత్రం తగ్గాయ'ని ఆవేదన వ్యక్తం చేసే విద్యార్థులనూ చూస్తుంటాం. ఎంత బాగా చదివినా, అన్ని ప్రశ్నలకూ సమాధానాలిచ్చినా విద్యార్థులు చేసే చిన్న చిన్న పొరపాట్లే మార్కులు తగ్గేందుకు కారణమవుతున్నాయని నిపుణులు చెబుతున్నారు. చేతిరాతపై దృష్టి సారించడం, కొద్దిపాటి జాగ్రత్తలు పాటించడం ద్వారా ఈ సమస్యను అధిగమించి మంచి ఫలితాలు సాధించవచ్చని వివరిస్తున్నారు. మరి కొద్ది రోజుల్లో పది, ఇంటర్ పరీక్షలు మొదలు కానున్న నేపథ్యంలో వారు చేసిన సూచనలు మీకోసం...

–న్యూస్‌టుడే, సి.ఎస్.పురం, పామూరు

డీజీపేట జడ్పీ ఉన్నత పాఠశాలలో చేతిరాత సాధన చేస్తున్న పదో తరగతి విద్యార్థులు

ఇలా చేయండి...

❖ సమాధానాలు రాసేటప్పుడు ఆందోళన, తొందరపాటుకు తావివ్వరాదు. దీనివల్ల తప్పులు దొర్లే అవకాశం ఉంది. ❖ ఎన్ని మార్కుల ప్రశ్న అన్నదాన్ని బట్టి సమాధానం నిడివి ఉండాలి.

❖ అక్షరాలను ఓ క్రమపద్ధతిలో రాస్తూ వెళ్లాలి. కొట్టివేతలు, దిద్దుబాట్లు లేకుండా జాగ్రత్త వహించాలి. తప్పనిసరైతే సదరు పదాన్ని క్రాస్‌మార్క్ చేసి కొత్తగా రాయడం మేలు. ❖ పదాలు, వరుసల మధ్య తగినంత దూరం పాటించాలి. శీర్షికలు, ఉప శీర్షికలు స్పష్టంగా కనిపించేలా ఉండాలి.

❖ అనువైన పెన్ను ఎంపిక చేసుకోవాలి. గట్టిగా ఒత్తి రాయకూడదు. ❖ రంగులు వేయాల్సి వస్తే రంగు పెన్సిళ్లు వినియోగించాలి. స్కెచ్‌లు వాడితే పేజీ రెండో వైపు ఆ గుర్తులు పడిపోయే అవకాశం ఉంది. ❖ పేజీ పైన, ఎడమ వైపు అంగుళం చొప్పున మార్జిన్లు విడిచి పెట్టాలి. ❖ గణితంలో సూత్రాలు, సమీకరణాలు కనిపించేలా రాయాలి. రఫ్‌వర్క్ కోసం కుడివైపు మార్జిన్ ఉంచుకోవాలి.

అర్థవంతంగా రాయడమే ప్రధానం...

'సంగ్రహణ శక్తి ఎంత ఉన్నా అర్థవంతంగా రాయడమే ప్రధానం. ఎక్కువ రాయాలన్న తపనతో సమయం వృథా చేయరాదు. ఎంతమేరకు అవసరమో అంతే రాస్తే సులభంగా మంచి మార్కులు సాధించవచ్చు. ఈ విధానం భవిష్యత్తులో రాయబోయే పోటీపరీక్షలకూ ఉపయోగపడుతుంద'ని సి.నాగులవరం జడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బూదాల డేవిడ్ తెలిపారు. 'రాసే సమాధానాలు చక్కగా, మార్కులు వేసే వారిని ఆకట్టుకునేలా ఉండాలి. అక్షరాలు మరీ చిన్నవిగానూ, మరీ పెద్దవిగానూ ఉండకూడదు. పేజీకి 18 నుంచి 20 లైన్లు ఉంటే మేల'ని చెప్పారు సి.ఎస్.పురం ఎంఈవో రాజాల కొండారెడ్డి. ముఖ్యమైన పదాలను హైలెటర్స్ లేదా అండర్ లైన్ చేయడం, సమాధానాన్ని విభజించి సైడ్ హెడ్డింగ్స్ రూపంలో వివరిస్తే బాగుంటుందని సూచించారు. ఈ అంశాలపై విద్యార్థులకు ప్రత్యేకంగా అవగాహన కల్పిస్తున్నట్లు వెల్లడించారు.

రాచర్ల: చేతులు శుభ్రతపై అవగాహన కల్పిస్తున్న ఎంఈవో గిరిధరశర్మ, ఉపాధ్యాయులు

కనిగిరి: విద్యార్థులతో మాత్రలు మింగిస్తున్న మున్సిపల్ ఛైర్మన్ షేక్ అబ్దుల్ గఫార్

చేతుల శుభ్రతతో వ్యాధులు దూరం

జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవంలో భాగంగా మంగళవారం... కనిగిరి, గిద్దలూరు నియోజకవర్గాల్లోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులతో ఆల్బెండజోల్ మాత్రలు మింగించారు. చేతుల శుభ్రతపై ఉపాధ్యాయులు అవగాహన కల్పించారు. వ్యక్తిగత పరిశుభ్రతతో చాలావరకు వ్యాధులు దరిచేరవని వివరించారు. ఆయా కార్యక్రమాల్లో మండల విద్యాశాఖాధికారులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. – న్యూస్‌టుడే బృందం

పీఎంశ్రీ పాఠశాలలకు మరిన్ని వసతులు

సి.ఎస్.పురం, న్యూస్‌టుడే: పీఎంశ్రీ పాఠశాలలకు సమగ్ర శిక్షా అభియాన్ ద్వారా విద్యార్థులకు టీ షర్టులు సరఫరా చేస్తున్నట్లు ఎంఈవో రాజాల కొండారెడ్డి తెలిపారు. ఈ మేరకు సి.ఎస్.పురం జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు మంగళవారం పంపిణీ చేశారు. త్వరలోనే అటల్ టింకరింగ్ ల్యాబ్‌లు, స్కూలు బ్యాండ్ యూనిట్‌లు ఏర్పాటు కానున్నట్లు చెప్పారు. నేరుగా కేంద్రం నిధులు సమకూర్చి వసతులు కల్పిస్తున్నందున... కేంద్ర ప్రభుత్వ ఉన్నతాధికారులు ఈ వారంలో పీఎంశ్రీ పాఠశాలలను తనిఖీ చేయనున్నారని తెలిపారు. ప్రధానోపాధ్యాయిని షేక్ ఖాదరున్నీసా బేగం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

టీ షర్టులు అందజేస్తున్న ఎంఈవో కొండారెడ్డి

ఇరుకు దారులు... ఆపై ఆక్రమణలు

కంభం బస్టాండ్ నుంచి చౌక్ సెంటర్, మార్కెట్ ప్రాంతాలకు వెళ్లే దారులు ఇరుగ్గా ఉంటాయి. ఎదురెదురుగా రెండు ఆటోలు వచ్చినా తప్పుకోవడం కష్టమవుతుంది. దీనికితోడు కొందరు వ్యాపారులు రోడ్డుపైనే వ్యాపార కార్యకలాపాలు నిర్వహిస్తుండడంతో మరిన్ని చిక్కులు తలెత్తుతున్నాయి. వై.జంక్షన్, కందులాపురం కూడలి, బస్టాండ్ ప్రాంతాల్లో పాటు మార్కాపురం, గిద్దలూరు రహదారుల్లోనూ ఇదే దుస్థితి ఉండడంతో వాహనదారులు ఇక్కట్లు పడుతున్నారు. సమస్యపై సీఐ మల్లికార్జున స్పందిస్తూ ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. పంచాయతీ వారు ఆక్రమణలు గుర్తిస్తే తొలగింపునకు సహకరిస్తామన్నారు. – న్యూస్‌టుడే, కంభం

బడి పక్కనే బారు!

పందిళ్లపల్లి జడ్పీ ఉన్నత పాఠశాల ప్రహరీని ఆనుకుని నిర్వహిస్తున్న మద్యం గొలుసు దుకాణం ఇది. పక్కనే రేకుల షెడ్డు వేసి సిటింగ్ గదిని నిర్వహిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. మందుబాబులు మత్తులో తరచూ గొడవలు పడుతున్నారు. ఈ సమీపంలోనే బాలికల మూత్రశాలలు ఉండడంతో ఇటుగా వచ్చేందుకు విద్యార్థినులు భయపడుతున్నారు. తగిన చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు కోరుతున్నారు. సమస్యపై ఎక్సైజ్ అధికారులు స్పందిస్తూ... ఎక్సైజ్ అధికారులతో తనిఖీలు చేపట్టి తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. – న్యూస్‌టుడే, వేటపాలెం

కాశీపురం దారి... కష్టాలే మరి!

కనిగిరి పట్టణంలోని దేవాంగ్‌నగర్ నుంచి కాశీపురం వెళ్లే రహదారి తీరిది. గత వైకాపా ప్రభుత్వ హయాంలో 2.3 కిలోమీటర్ల రోడ్డు నిర్మాణానికి ఏఐఐబీ నిధులు రూ.2 కోట్లు మంజూరయ్యాయి. గుత్తేదారుకు బిల్లులు చెల్లించకపోవడంతో కంకర తోలి వదిలేశారు. అప్పటి నుంచి ఇటుగా రాకపోకలు సాగించేవారు నానా అవస్థలు పడుతున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి రోడ్డు పూర్తికి చర్యలు తీసుకోవాలని పట్టణవాసులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, కనిగిరి

ఆలయ భూమిలో ఆక్రమణ

పామూరులోని నెల్లూరు రోడ్డులో ఉన్న భుజంగేశ్వర స్వామి దేవస్థానం భూమిలో ప్రహరీ నిర్మాణానికి మంగళవారం కొందరు ప్రయత్నించగా... స్థానికుల సమాచారంతో ఆలయ అధికారులు అడ్డుకున్నారు. కొద్ది రోజుల క్రితం ఇరువురు రోడ్డులోనూ కొందరు వ్యక్తులు స్థలం ఆక్రమణకు యత్నించారు. అధికారుల అలసత్వంతోనే తరచూ ఇటువంటి ఘటనలు చోటుచేసుకుంటున్నాయన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఈవో నాగిరెడ్డిబాబు మాట్లాడుతూ ఆలయ భూములు ఆక్రమిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. – న్యూస్‌టుడే, పామూరు

కేబుల్ కట్టలు... తప్పని చిక్కులు

కనిగిరి కోదండరామ స్వామి ఆలయం వద్ద విద్యుత్తు స్తంభం పరిస్థితి ఇది. గుట్టలుగా కేబుల్ కట్టలు చుట్టేయడంతో ప్రమాదకరంగా మారింది. పట్టణంలో ఏ స్తంభం చూసినా దాదాపు ఇదే దుస్థితి. సర్వీసు వైర్లకు మరమ్మతులు చేయాలన్నా ఇబ్బందులు తప్పడం లేదు. బాపట్ల జిల్లాలో కేబుల్ వైరు మెడకు చుట్టుకుని ఓ వ్యక్తి మృతి చెందిన నేపథ్యంలో... వీటి నిర్మూలనపై దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. సమస్యపై మున్సిపల్ కమిషనర్ పి.శ్రీధర్ స్పందిస్తూ పరిమితికి మించి స్తంభాలపై ఉన్న కేబుల్ కట్టలను తొలగిస్తామన్నారు. – న్యూస్‌టుడే, కనిగిరి

కర్పూరీ ఠాకూర్ సేవలు ఎనలేనివి

కనిగిరి: భారతరత్న, బిహార్ మాజీ ముఖ్యమంత్రి జననాయక్ కర్పూరీ ఠాకూర్ వర్ధంతి సందర్భంగా కనిగిరిలోని బీసీ ఐక్యవేదిక కార్యాలయంలో ఆయన చిత్రపటం వద్ద నివాళులర్పించారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ సంఘాల ప్రతినిధులు మాట్లాడుతూ కర్పూరీ ఠాకూర్ ఇండియా ఉద్యమంలో పాల్గొన్నారని తెలిపారు... ముఖ్యమంత్రిగా సంపూర్ణ మద్యపాన నిషేధం అమలు చేశారని తెలిపారు. నాయకులు పల్లా మాలకొండయ్య, దేవరాజు గట్టు శివకోటయ్య, ఉండేటి రాజు, తిరుమల, కొండయ్య, బాలగురవయ్య, చంద్రశేఖర్, బాబూరావు, వెంకట్ సుబ్బయ్య, శంకర్, రామారావు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వీఆర్వోల నిరసన

హనుమంతునిపాడు, న్యూస్‌టుడే: సమస్యల పరిష్కారం కోరుతూ రాష్ట్రవ్యాప్తంగా తలపెట్టిన నిరసనలో భాగంగా హెచ్‌ఎంపాడు తహసీల్దారు కార్యాలయం వద్ద వీఆర్వోలు మంగళవారం ధర్నా చేపట్టారు. సంఘం నాయకుడు జి.బెంజిమెన్ మాట్లాడుతూ పనిభారం తగ్గించాలన్నారు. పాసుపుస్తకాల్లో తప్పులు వీఆర్వోలపై రుద్దడం సరికాదన్నారు. సర్వేలకు తగిన సమయం కేటాయించాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దారు నాగలక్ష్మికు వినతిపత్రం అందజేశారు. సంఘం ప్రతినిధులు శ్రీకాంత్, జేమ్స్ తదితరులు పాల్గొన్నారు.

సస్యరక్షణతో మేలైన దిగుబడులు

మిరపలో తెగుళ్ల నివారణకు సూచనలు చేస్తున్న జిల్లా ఉద్యానశాఖ అధికారి గోపీచంద్

వెలిగండ్ల, న్యూస్‌టుడే: పంట తోటల్లో యాజమాన్య పద్ధతులు పాటించాలని జిల్లా ఉద్యానశాఖాధికారి వై.గోపీచంద్ తెలిపారు. వెలిగండ్ల మండలం కొటాలపల్లి, నాగులవరం, మరపగుంట్లలోని నిమ్మ, దానిమ్మ, మిరప, కూరగాయల పంటలను మంగళవారం పరిశీలించారు. మిరపలో నల్ల తామర, రసం పీల్చే పురుగుల నివారణకు సూచనలు చేశారు. కూరగాయల తోటల్లో పసుపు, నీలం రంగు జిగురు అట్టలు వినియోగించాలన్నారు. ఉద్యాన శాఖ ద్వారా రాయితీపై మంజూరు చేసిన ప్యాక్‌హౌస్, శాశ్వత పందిరి, నీటికుంటను పరిశీలించారు. ఈ-పంట నమోదును తనిఖీ చేశారు. కనిగిరి ఉద్యాన శాఖ డివిజన్ విస్తరణాధికారి, సచివాలయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

సంపూర్ణ అక్షరాస్యతే లక్ష్యం

అక్షరాలు పాఠాలు అభ్యసిస్తున్న వయోజనులు

పామూరు, న్యూస్‌టుడే: జిల్లాలో ఏర్పాటు చేసిన అక్షరాంధ్ర కేంద్రాలను ఎంపీడీవో నారాయణగుప్తా, డిప్యూటీ ఎంపీడీవో హజరత్ అలీ మంగళవారం ప్రారంభించారు. సంపూర్ణ అక్షరాస్యతే లక్ష్యంగా చేపడుతున్న కార్యక్రమాన్ని వయోజనులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. సర్పంచ్ సిద్దమూర్తి లక్ష్మీనారాయణరెడ్డి, తెదేపా నాయకులు, స్థానికులు పాల్గొన్నారు. తరగతుల నిర్వహణ తీరును పరిశీలించారు.

పేదలకు చీరల పంపిణీ

కంభం: వైద్యుడు మల్లికార్జునరావు సేవల మరువలేనివని లయన్స్ క్లబ్ సభ్యులు సయ్యద్ జాకీర్ హుస్సేన్, మహబూబ్ బేగ్, గుండయ్య పేర్కొన్నారు. ఆయన వర్ధంతి సందర్భంగా స్థానిక ఆర్టీసీ బస్టాండ్ వద్ద మంగళవారం చీరలు పంపిణీ చేశారు. బలిచెడ్డల ప్రారంభించారు. క్లబ్ సభ్యులు వెంకట సుబ్బయ్య, రమణ, జలాలీ తదితరులు పాల్గొన్నారు.

పరీక్షల సామగ్రి అందజేత

హనుమంతునిపాడు: నందనవనం జడ్పీ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థులకు గ్రామానికి చెందిన దాత నాసర్ అహమ్మద్... అక్షర సామగ్రి, పరీక్ష అట్టలు, పెన్నులు తదితర సామగ్రి సమకూర్చారు. తెదేపా మండల అధ్యక్షుడు తిరుపతిరెడ్డి, నాయకులు చీకటి వెంకటసుబ్బయ్య, సుమిత్ర తిరుపతిరెడ్డి మంగళవారం వాటిని పంపిణీ చేశారు.

శకటం... చూస్తేనే నీరసం!

• కాలం చెల్లిన వాహనంతో ఇక్కట్లు
• కంభం అగ్నిమాపక కేంద్రంలో దుస్థితి

న్యూస్‌టుడే – కంభం

కంభం అగ్నిమాపక కేంద్రం కనీస వసతులకు నోచక కునారిల్లుతోంది. ప్రమాదాల తీవ్రత ఎక్కువగా ఉండే ఈ ప్రాంతంలో నేటికీ కాలం చెల్లిన శకటమే ఆధారంగా మారింది. ఈ కేంద్రం పరిధిలో కంభం, బేస్తవారపేట, అర్ధవీడు మండలాలున్నాయి. 24 ఏళ్ల క్రితం వాహనం కేటాయించారు. అది పాతది కావడంతో తరచూ మరమ్మతులకు గురవుతోంది.

24 ఏళ్ల క్రితం కేటాయించిన వాహనం

ఎక్కడ ఆగిపోతుందో..!

కంభం నుంచి అర్ధవీడు మండలంలోని వెలగలపాయ, బొమ్మిలింగం, బేస్తవారపేట మండలంలోని కోనపల్లి, సింగరపల్లి తదితర ప్రాంతాలు నలభై కిలోమీటర్లకు పైగా దూరంలో ఉన్నాయి. కొండలు, తిప్పలు దాటి వెళ్లాల్సి ఉంటుంది. దీంతో వాహనం ఎప్పుడు ఎక్కడ ఆగిపోతుందో తెలియని పరిస్థితి. శకటం సామర్థ్యం తగ్గడంతో కొండలు ఎక్కడం కష్టమవుతోంది. టైర్లు పూర్తిగా అరిగిపోవడంతో ముప్పై, నలభై కిలోమీటర్ల వేగానికి మించి వెళ్లలేని దుస్థితి నెలకొంది. దీంతో ప్రమాద స్థలానికి వెళ్లే సరికి జరగాల్సిన నష్టం జరిగిపోతోంది. యర్రగొండపాలెం, దోర్నాల, గిద్దలూరు కేంద్రాల్లోనూ పలు సమస్యలున్నాయి.

□ కంభం కేంద్రం పరిధిలో గత ఏడాది 61 అగ్ని ప్రమాదాలు సంభవించాయి. గత అయిదేళ్ల కాలాన్ని పరిశీలిస్తే సగటున ఏటా యాభై వరకు దుర్ఘటనలు చోటుచేసుకుంటున్నాయి. తీవ్రత ఇలా ఉన్నా వసతులు మాత్రం ఆ స్థాయిలో లేక సమస్య నెలకొంది.

ఇతర సమస్యలు సైతం...

కేంద్రానికి ప్రహరీ సైతం లేక రక్షణ కరవైంది. పందులు, పశువులు లోపలకు వస్తున్నాయి. కేంద్రం నుంచి వాహనం బయటకు వెళ్లే రహదారి సైతం ఆక్రమణలతో కుంచించుకుపోయింది. రోడ్డుపైనే కొందరు వాహనాలు నిలుపుతుండడంతో అత్యవసర సమయాల్లో శకటం వేగంగా వెళ్లలేని పరిస్థితి ఉంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి కొత్త వాహనం కేటాయించడంతో పాటు, వసతుల మెరుగుకు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. ఈ విషయమై కేంద్రం అధికారి మోషస్ మాట్లాడుతూ సమస్యలను ఇప్పటికే ఉన్నతాధికారులకు నివేదించినట్లు తెలిపారు.

అధిక ధరలకు వస్తువులు విక్రయిస్తే చర్యలు

కంభం, న్యూస్‌టుడే: ఎమ్మార్పీకి మించి వస్తువులు విక్రయిస్తే చర్యలు తప్పవని తూనికలు కొలతల అధికారి షేక్ మోహిసిన్ హెచ్చరించారు. అధిక ధరకు సిగరెట్లు అమ్ముతున్నట్లు ఆన్‌లైన్‌లో ఫిర్యాదులు రావడంతో... కంభంలోని పలు దుకాణాల్లో మంగళవారం తనిఖీలు చేపట్టారు. ఈ మేరకు అర్ధవీడు మండలంలో నాలుగు, కంభంలో మూడు కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థి మృతిపై విచారణ చేపట్టాలి

కనిగిరి, న్యూస్‌టుడే: సింగరాయకొండలోని కోచింగ్ సెంటర్‌లో ఆరో తరగతి చదువుతున్న కనిగిరి పట్టణానికి చెందిన సయ్యద్ అలీ కమరాన్ కౌషిక్ మృతిపై ప్రత్యేక విచారణ జరిపించాలని సీఐటీయూ జిల్లా నాయకుడు కేశవరావు డిమాండ్ చేశారు. సుందరయ్య భవన్‌లో మంగళవారం గ్రామ సమావేశంలో మాట్లాడారు. అనుమానాస్పద రీతిలో విద్యార్థి మృతి చెందడం బాధాకరమన్నారు. పోలీసులు పారదర్శకంగా విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలన్నారు. సీపీఎం, సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు.

పాఠశాలలో గ్యాస్ లీకై ప్రమాదం

హనుమంతునిపాడు, న్యూస్‌టుడే: వాలిచెర్ల జడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం వంట చేస్తుండగా గ్యాస్ లీకై ప్రమాదం చోటుచేసుకుంది. పది విద్యార్థుల కోసం అల్పాహారం సిద్ధం చేస్తుండగా ఈ ఘటన చోటుచేసుకుంది. నీటి డ్రమ్ముల, మిక్సీ వంటసామగ్రి దగ్ధమైనట్లు ప్రధానోపాధ్యాయుడు మాలకొండయ్య తెలిపారు. కనిగిరి అగ్నిమాపక సిబ్బంది మంటలు ఆర్పివేశారు. ప్రమాద సమయంలో విద్యార్థులు పాఠశాలలో లేకపోవడంతో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదన్నారు.

ఆటో అదుపు తప్పి ఒకరికి గాయాలు: రాచర్ల, న్యూస్‌టుడే: ఆటో అదుపు తప్పి చెట్టును ఢీకొన్న ఘటనలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. రాచర్ల మండలం సమీపంలో మంగళవారం ఈ ప్రమాదం చోటుచేసుకుంది. కంభం మండలం తురిమెళ్ల గ్రామానికి చెందిన వెన్నపూస పెంచలయ్య... గిద్దలూరు నుంచి సొంతూరుకు ఆటోలో వస్తుండగా అదుపుతప్పి చెట్టును ఢీకొన్నారు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన ఆయనను 108 వాహనంలో గిద్దలూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

జూద శిబిరంపై దాడి: గిద్దలూరు పట్టణం, న్యూస్‌టుడే: కృష్ణంశెట్టిపల్లె పంచాయతీ అక్కలరెడ్డిపల్లెలో నిర్వహిస్తున్న జూద శిబిరంపై పోలీసులు మంగళవారం దాడి చేశారు. ఆరుగురిని అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.13,200 నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

(c) eenadu

మార్కాపురం

•మార్కాపురం •యర్రగొండపాలెం

మార్కాపురం జిల్లా సమగ్రాభివృద్ధికి కృషి

మార్కాపురం, న్యూస్‌టుడే: మార్కాపురం జిల్లాను సమగ్రంగా అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని జేసీ శ్రీనివాసులును మార్కాపురం జిల్లా సాధన సమితి సభ్యులు కోరారు. మంగళవారం మార్కాపురంలో జిల్లా సాధన సమితి ఆధ్వర్యంలో జిల్లా సమగ్ర అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించాలని, వెలిగొండ ప్రాజెక్టు పనులు పూర్తి చేసి నీళ్లు వదలాలని డిమాండ్ చేస్తూ జేసీ శ్రీనివాసులుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మార్కాపురం జిల్లా సాధన సమితి నాయకులు చెన్ను శివ ప్రసాదరావు, అందె నాసరయ్యలు మాట్లాడుతూ జిల్లా పరిధిలోకి దొనకొండ, కురిచేడు మండలాలతో పాటు వెలిగొండ ప్రాజెక్టు ప్రారంభ ప్రాంతాన్ని కలపాలని కోరారు. వెలిగొండ ప్రాజెక్టు పనులు సత్వరమే పూర్తి చేసి నీటిని విడుదల చేయాలన్నారు. గిద్దలూరు కేంద్రంగా డివిజన్‌ను ప్రకటించాలని డిమాండ్ చేశారు. కంభం- బేస్తవారిపేట మండలాల మధ్య బస్సు డిపోతో పాటు వంద పడకల వైద్యశాలను ఏర్పాటు చేయాలన్నారు. ఈ వినతిపత్రాలను సీఎంతో పాటు డిప్యూటీ సీఎం, మంత్రులు, రాష్ట్ర ఉన్నతాధికారులకు అందజేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఖాశిం, వేణుగోపాల్, అంకన్న, గురువారెడ్డి, రమణరావు, రామకృష్ణ, మురళీ కృష్ణ, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

జేసీ శ్రీనివాసులుకు వినతిపత్రం అందజేస్తున్న జిల్లా సాధన సమితి నాయకులు

20న దివ్యాంగుల సమావేశం

యర్రగొండపాలెం పట్టణం: వై.పాలెం నియోజకవర్గ వికలాంగుల హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో ఈ నెల 20న వై.పాలెంలో దివ్యాంగుల సమావేశం నిర్వహిస్తున్నట్లు వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు గుమ్మా రాజయ్య మంగళవారం తెలిపారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో జరిగే సమావేశంలో పింఛన్లు, ట్రైసైకిళ్లు, బ్యాటరీ ట్రైసైకిళ్లకు అవసరమైన వారి నుంచి దరఖాస్తులు తీసుకుని అధికారులకు అందజేయడం జరుగుతుందన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. (10 AM TO 1 PM)

మార్కాపురం : 8008631313
యర్రగొండపాలెం : 8008552658

యర్రగొండపాలెం, న్యూస్‌టుడే:

?:యల్లారెడ్డిపల్లె గ్రామంలోని కొన్ని గ్రామాల్లో సాగర్ నీరు, పంచాయతీ బోరు నీళ్లు రావడం లేదు. ఇబ్బందులు పడుతున్నాం. వెంటనే నీటి సమస్య తీర్చాలి. కృష్ణ, స్థానికుడు

✓: క్షేత్రస్థాయికి వెళ్లి సమస్య పరిశీలించి పరిష్కరించేందుకు కృషి చేస్తాం. – జడ్సన్‌పాల్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ

పెద్దదోర్నాల, న్యూస్‌టుడే:

?: కడపరాజుపల్లెలో మురుగు కాలువలు లేకపోవడంతో నీరు రహదారిపై ప్రవహిస్తోంది. దోమలు వృద్ధి చెందుతుండటంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. – వెంకటేశ్వర్లు, కడపరాజుపల్లె

✓: మురుగు కాలువల నిర్మాణం కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. నిధులు మంజూరైన వెంటనే పనులు చేపట్టి సమస్య పరిష్కరిస్తాం. – భ్రమరాంబికా దేవి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ, దోర్నాల.

మార్కాపురం గ్రామీణం, న్యూస్‌టుడే:

?: మండలంలోని రాజుపాలెం గ్రామంలో సైడు కాలువలు లేక మురుగునీరు రోడ్లపై పారుతోంది. దీంతో దుర్వాసన వ్యాపిస్తోంది. దోమల బెడద ఎక్కువై రాత్రిపూట తీవ్ర ఇబ్బంది పడుతున్నాం. వెంటనే చర్యలు తీసుకోగలరు. – పి.వెంకటేశ్వర్లు(బాబు), గ్రామస్థుడు

✓: గ్రామంలోని పరిస్థితులు పరిశీలించి తగు పారిశుద్ధ్య చర్యలు చేపడతాం. వెంటనే మురుగు తొలగింపు పనులు నిర్వహిస్తాం. – బాలచెన్నయ్య, మార్కాపురం ఎంపీడీవో.

యర్రగొండపాలెం పట్టణం, న్యూస్‌టుడే:

?: ఇందిరానగర్ చివరి బజారులో చెత్త పేరుకుపోయింది. మురికి కాలువల్లో పూడిక పేరుకున్నా తీసే వారు లేకపోయారు. దీంతో అపరిశుభ్రత తోపాటు భరించలేని దుర్వాసనతో ఇబ్బంది పడుతున్నాం. వెంటనే పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలి. – ఎస్వీ పవీ, స్థానికుడు

✓: పంచాయతీ సిబ్బందిని పంపించి పారిశుద్ధ్య పనులు చేయిస్తాం. సమస్య లేకుండా చేస్తాం. – రామసుబ్బయ్య, పంచాయతీ కార్యదర్శి

ఘాట్ మలుపులు.. ప్రమాదానికి పిలుపులు

● సూచిక, హెచ్చరిక బోర్డుల ఏర్పాటు అవసరం

న్యూస్‌టుడే, పెద్దదోర్నాల:

మార్కాపురం జిల్లా అంటే ఎవరికైనా గుర్తొచ్చేది శ్రీశైలం. ఒంగోలు, ఇతర ప్రాంతాల నుంచి వచ్చే వాహనాలు మార్కాపురం మీదుగా పెద్దదోర్నాల దాటి ఘాట్ రోడ్లో శ్రీశైలం చేరుకుంటారు. వేలాది మంది భక్తులు, పర్యాటకులు దట్టమైన నల్లమల అభయారణ్యం మీదుగా శ్రీశైలానికి చేరుకుంటారు. ఎత్తైన కొండలు, లోతైన లోయలు, అడుగడుగునా మలుపులతో కూడిన రహదారుల్లో వాహనాలు ప్రయాణిస్తుంటాయి. చోదకులకు రహదారిపై అవగాహన లేకపోవడంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి.

● పెద్దదోర్నాల-శ్రీశైలం, పెద్దదోర్నాల-ఆత్మకూరు రహదారుల్లో చోదకులు మలుపులు గుర్తించలేక పోవడంతో ఇటీవలే మూడు ప్రమాదాలు జరిగాయి. ఒకరు మృతి చెందగా, ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు.

పెద్దదోర్నాల-ఆత్మకూరు రహదారిలో..

జిల్లా పరిధిలోని పెద్దదోర్నాల-ఆత్మకూరు ఘాట్ రహదారి 36 కి.మీలు ఉంది. దీనిలో 24 కి.మీలు సింగిల్ రహదారిలోని పెద్దమంతనాల, రోళ్లపెంట సమీప ప్రాంతాల్లో మలుపుల వద్ద తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఇక్కడ పరిమిత వేగంతో ప్రయాణించాలి. ఏ మాత్రం వేగం పెంచినా... ప్రమాదంలో పడ్డట్టే.

శ్రీశైలం మార్గంలో..

పెద్దదోర్నాల-శ్రీశైలం 46 కి.మీలు ఘాట్ రహదారి ఉంది. ఎత్తయిన కొండలు, లోయలతో కూడిన రహదారిలో అనేక మూలమలుపులు ఉన్నాయి. అజాగ్రత్తగా వాహనం నడిపితే ప్రమాదం తలుపు తడుతోంది.

● పెద్దదోర్నాల అటవీశాఖ చెక్‌పోస్టుకు పెద్ద మూలమలుపు, బోడేనాయక్ తండా, చింతల, తుమ్మలబైలు, జంగిల్ సఫారీ, పులిచెరువు రహదారి, ఆంజనేయస్వామి గుడి, దెయ్యాల మలుపు, చిన్నారుట్ల సమీపంలో, ఇష్టకామేశ్వరీదేవి ఆలయానికి వెళ్లే రహదారి సమీపాల్లో ప్రమాదకర మూలమలుపులు ఉన్నాయి.

శ్రీశైలం ఘాట్ రహదారిలో ప్రమాదకర మలుపులో వెళ్తున్న వాహనాలు

నివారణ చర్యలు తీసుకుంటున్నాం

శ్రీశైలం వెళ్లే వాహనాలు ఘాట్ రహదారుల్లో ప్రమాదాలు జరగకుండా పటిష్ఠమైన చర్యలు చేపడుతున్నాం. ప్రమాదాలు జరిగే ప్రదేశాల్లో పోలీసు సిబ్బందిని నియమించాం. వారు చోదకులు పరిమిత వేగంతో వెళ్లేలా సూచనలు ఇస్తున్నారు. నాలుగు మొబైల్ టీమ్‌లు నిరంతరం ఆ రహదారుల్లో తిరుగుతున్నాయి. – అజయ్‌కుమార్, సీఐ, యర్రగొండపాలెం

వై.పాలెం పట్టణం: విద్యార్థులకు డీ వార్మింగ్ మాత్రలు మింగిస్తున్న ఎంఈవో ఆంజనేయులు తదితరులు

ఎద్దొర్నాల: విద్యార్థులకు మాత్రలు వేస్తున్న ఎంఈవో మస్తాన్‌నాయక్

నులిపురుగుల నివారణకు మాత్రలు వేసుకోవాలి

పొదిలి, న్యూస్‌టుడే: విద్యార్థులు ఏడాదికి రెండుసార్లు నులిపురుగుల నివారణ మాత్రలు వేసుకోవడం వల్ల ఆరోగ్యంగా ఉండవచ్చని యూపీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ శరత్‌చంద్ర చెప్పారు. మంగళవారం ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో విద్యార్థుల చేత నులిపురుగుల నివారణ మాత్రలు మింగించారు. అనంతరం ఆరోగ్య విషయాలపై అవగాహన కల్పించారు. జడ్పీ ఉన్నత పాఠశాలలో ఏపీ మెడికల్ కమిషన్ సభ్యురాలు డాక్టర్ స్వర్ణ గీత విద్యార్థులచేత మాత్రలు మింగించారు. బాలికల ఉన్నత పాఠశాలలో తెదేపా రాష్ట్ర కార్యదర్శి జి.భాస్కర్, ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఎంపీపీ చైర్మన్ సయ్యద్ ఇమామ్‌సా హెచ్ మాత్రలు మింగించారు. ● పెద్దదోర్నాల: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఎంఈవో బి. మస్తాన్‌నాయక్, ప్రధానోపాధ్యాయురాలు పి.శ్యామ్ ప్రసన్నాంజలి, చింతల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి యోగ్యిలు విద్యార్థులతో మాత్రలు మింగించారు. ● యర్రగొండపాలెం పట్టణం: పట్టణంలోని వేమినేని కోటయ్యగారి ఎంపీపీ పాఠశాలలో ఎంఈవో ఆంజనేయులు, ఎంపీపీ పాఠశాల్లో ఎంఈవో 2 మల్లునాయక్ మాత్రలు మింగించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం సురేష్, ఏఎన్‌ఎం రెహమున్నీసా, ఆశావర్కర్ కరుణ తదితరులు పాల్గొన్నారు.

పొదిలి: విద్యార్థులతో మాత్రలు మింగిస్తున్న తెదేపా రాష్ట్ర కార్యదర్శి భాస్కర్

సందడిగా ఎడ్ల బండ లాగుడు పందేలు

త్రిపురాంతకం గ్రామీణం, న్యూస్‌టుడే: త్రిపురాంతకేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు పురస్కరించుకుని మంగళవారం ఎడ్ల బండ లాగుడు పందేలు నిర్వహించారు. నియోజకవర్గ తెదేపా ఇన్‌ఛార్జి గూడూరి ఎరిక్షన్ బాబు ఎడ్ల బల ప్రదర్శన పోటీలను ప్రారంభించారు. వాటిని తిలకించేందుకు సుదూర ప్రాంతాల నుంచి జనాలు తరలిరావడంతో ప్రాంగణం కిక్కిరిసింది. కార్యక్రమంలో మండల తెదేపా కన్వీనర్ ఎం.వలరాజు, ఎన్నెస్పీ డీసీ అధ్యక్షులు డి.చలమయ్య, త్రిపురాంతకం పీఏసీఎస్ అధ్యక్షులు జి.వెంకట నారాయణ, నిర్వాహకులు ఎం. రామిరెడ్డి , టి.చంద్రశేఖరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎడ్ల బల ప్రదర్శన పోటీలను ప్రారంభిస్తున్న ఎరిక్షన్ బాబు

సాగర్ నీటి వర్కర్ల సమ్మె విరమణ

యర్రగొండపాలెం పట్టణం, న్యూస్‌టుడే: వై. పాలెం నియోజకవర్గంలో నాలుగు మండలాలకు సంబంధించిన సాగర్ నీరు సరఫరా చేసే సిబ్బంది రెండ్రోజులపాటు సమ్మె చేశారు. వారికి రావాల్సిన వేతన బకాయిలు కోసం సోమ, మంగళవారాల్లో సమ్మె బాట పట్టగా ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ నాగేశ్వరరావు జోక్యంతో మంగళవారం సాయంత్రం విరమించారు. ఏడు నెలలుగా ఈ కార్మికులకు గుత్తేదారులు వేతనాలు ఇవ్వడం లేదు. వై.పాలెం, పుల్లలచెరువు, త్రిపురాంతకం, పెద్దారవీడు మండలాలలోని 30 మంది కార్మికులు పనిచేస్తున్నారు. పనిచేయించుకుని వేతనాలు ఇవ్వకపోవడంతో సమ్మె చేయడానికి ముందుకొచ్చినట్లు కార్మికులు తెలిపారు. ఈ నెల 25న వేతనాలు చెల్లిస్తామని అధికారులు తెలపడంతో సమ్మె విరమించారు. వీరు సమ్మె కారణంగా సోమ, మంగళవారాల్లో నీటి సరఫరాను నిలిపి వేశారు. అంతే కాక కొన్ని చోట్ల నాలుగు నుంచి ఐదు రోజులు నీరు సరఫరా జరగలేదు. ఈ విషయంపై వై. పాలెం ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ జెడ్సన్‌పాల్‌ను సంప్రదించగా వేతన బకాయిలు ఇవ్వాల్సిన మాట నిజమేనన్నారు. ఎస్‌ఈ నాగేశ్వరరావు జోక్యంతో కార్మికులు సమ్మె చేయడం లేదని తెలిపారు.

ఉద్యాన హబ్‌తో జిల్లా అభివృద్ధి: ఎమ్మెల్యే కందుల

మార్కాపురం, న్యూస్‌టుడే: మార్కాపురం జిల్లా ప్రజల ఆకాంక్షలను, మనోభావాలను పరిగణలోకి తీసుకుని సీఎం చంద్రబాబునాయుడు ఇచ్చిన మాట మేరకు మార్కాపురం జిల్లాను ప్రకటించినందుకు ఎమ్మెల్యే కందుల నారాయణ రెడ్డి ధన్యవాదాలు తెలిపారు. మంగళవారం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి అసెంబ్లీలో మాట్లాడారు. మార్కాపురం జిల్లాకు చంద్రన్న మార్కాపురం జిల్లాగా పెట్టాలని కోరారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఇప్పటికే నాలుగు సార్లు వెలిగొండ ప్రాజెక్టు సందర్శించి పనుల్లో పురోగతి సాధించారన్నారు. ప్రాజెక్టును పూర్తి చేయడానికి ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉందన్నారు. బడ్జెట్లో మార్కాపురం జిల్లాకు ఉద్యాన హబ్‌ను కల్పించడం సంతోషకరమన్నారు. ఈ ప్రాంతం నిత్యం కరవుతో ఉన్న నేపథ్యంలో ఉద్యాన హబ్‌తో కలపడంతో రైతులకు ఎంతో లాభం కలుగుతుందన్నారు.

అసెంబ్లీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నారాయణరెడ్డి

వేడుకగా పాచ్చాహుస్సేని గంధ మహోత్సవం

కనిగిరి, న్యూస్‌టుడే: కనిగిరి పట్టణంలోని శ్రీ హజరత్ బాదేషా పాచ్చాహుస్సేని చిష్టవుల్ ఖాదరి 128వ గంధ మహోత్సవాన్ని మంగళవారం రాత్రి వైభవంగా నిర్వహించారు. కనిగిరితో పాటు పొదిలి, కొనకనమిట్లతో పాటు పరిసర జిల్లాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై మొక్కులు చెల్లించారు. పాచ్చాహుస్సేని సమాధి వద్ద పలువురు ప్రజా ప్రతినిధులు చాదర్ కప్పారు. వేడుకల సందర్భంగా దర్గాను విద్యుద్దీపాలతో ప్రత్యేకంగా అలంకరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి.

విద్యుత్తు చౌర్యంపై అధికారుల దాడులు

పుల్లలచెరువు (యర్రగొండపాలెం), న్యూస్‌టుడే: మండలంలోని పలు గ్రామాల్లో జరుగుతున్న విద్యుత్తు చౌర్యం, అనధికార కనెక్షన్లపై విజిలెన్స్ అధికారులు దాడులు నిర్వహించారు. మార్కాపురం డీఈఈ పీవీ నాగేశ్వరరావు ఆధ్వర్యంలో మంగళవారం ఉదయం 45బృందాలుగా ఏర్పడ్డ అధికారులు విస్తృత తనిఖీలు చేశారు. 63కేసులు నమోదు చేసి రూ. 5.22లక్షల అపరాధ రుసుం విధించారు. దాడుల్లో డీపీఈ హైమావతి, ఏఈలు, సిబ్బంది పాల్గొన్నారు.

పక్కా గృహం.. పైకప్పు లేకపాయె

దోర్నాల మండలం యడవల్లి సమీపంలో జగనన్న కాలనీలో పక్కా గృహాల నిర్మాణాలు శ్లాబ్ స్థాయిలో నిలిచిపోయాయి. యడవల్లి, గంటవానిపల్లె గ్రామాల్లోని పక్కా గృహాలు లేని నిరుపేదలకు కర్నూలు-గుంటూరు రహదారిలోని తిరుమలనాథ దేవాలయం సమీపంలో వైకాపా పాలనలో జగనన్న కాలనీ పేరుతో పక్కా గృహాల నిర్మాణం చేపట్టారు. కాలనీలో విద్యుత్తు, తాగు నీటి సౌకర్యం కల్పించారు. కాలనీలో మూడొంతుల గృహాలు నిర్మాణం పూర్తి కాలేదు. గత ప్రభుత్వం బిల్లులు సకాలంలో ఇవ్వకపోవడంతో పూర్తి చేయలేకపోయామని లబ్ధిదారులు పేర్కొంటున్నారు. ప్రభుత్వం స్పందించి వాటి నిర్మాణాలు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, పెద్దదోర్నాల:

బొడ్రాయి గుంత.. రాకపోకలకు చింత

పొదిలి పాతూరులో మహాలక్ష్మమ్మ దేవాలయం ఎదురుగా ప్రధాన రహదారి మధ్యలో గ్రామ బొడ్రాయి ఉంది. దీని వల్ల రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. సోమవారం పొదిలిలో రథోత్సవం సందర్భంగా రథం చక్రాలు బొడ్డురాయిపై ఉన్న ఇనుపగ్రిల్ నుంచి వెళ్లడంతో గ్రిల్ దెబ్బతింది. దీంతో మంగళవారం ఆ మార్గంలో వాహనచోదకులు ఇబ్బంది పడకుండా గుంత చుట్టూ రాళ్లు ఏర్పాటు చేశారు. దూరప్రాంతాల వారు చూసేలా ఎర్రటి వస్త్రపు జెండాను ఉంచారు. పట్టణంలోని పెద్దలు జోక్యం చేసుకుని బొడ్డురాయిని ఇతర ప్రాంతాల్లో ప్రతిష్ఠించి రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, పొదిలి:

దళారులను నమ్మకండి.. మద్దతు ధర గమనించండి

రైతులు పండించిన కందులను ప్రభుత్వ మద్దతు ధరకే విక్రయించుకోవాలని, దళారులను నమ్మి మోసపోవద్దని వ్యవసాయ అధికారి లక్ష్మీనారాయణ తెలిపారు. మండల కేంద్రం పెద్దారవీడులో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ...ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో పెద్దారవీడులో కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు వివరించారు. కంది పంటకు ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర రూ.8,000 ఉందని, గ్రామాల్లో దళారులు రూ.6వేలు, రూ.6,500లకు కొనుగోలు చేస్తున్నారని, రైతులు మద్దతు ధరను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రైతు సేవా సిబ్బంది సౌజన్య, మల్లునాయక్ పాల్గొన్నారు. - న్యూస్‌టుడే, పెద్దారవీడు

పొగమంచు.. చూసి నడపండి

పొదిలి - ఒంగోలు, పొదిలి-నంద్యాల ప్రధాన రహదారులపై మంగళవారం పొగమంచు కమ్మేసింది. దీంతో ఎనిమిది గంటల వరకు రహదారి కనిపించకపోవడంతో వాహనచోదకులు ఇబ్బందులు పడ్డారు. దగ్గరకు వచ్చేంతవరకు ఎదురుగా వచ్చే వాహనాలు, పాదచారులు కనిపించకపోవడంతో లైట్లు వేసుకొని వాహనాలను నడపాల్సి వచ్చింది. పొదిలి పట్టణమంతా మంచు వ్యాపించడంతో వాహనచోదకులు వాహనాలను మెల్లగా నడిపారు. వాహనదారులు మంచులో ఎదురుగా వచ్చే వాహనాలను జాగ్రత్తగా గమనించి నడపాలని అధికారులు సూచిస్తున్నారు. - న్యూస్‌టుడే, పొదిలి

కనువిందుగా పాతాళనాగేశ్వరస్వామి గ్రామోత్సవం

గిద్దలూరు పట్టణం: శివరాత్రి ఉత్సవాల్లో భాగంగా గిద్దలూరు పట్టణంలోని పాతాళ నాగేశ్వర స్వామి దేవస్థానంలో మంగళవారం సాయంత్రం నిర్వహించిన స్వామివారి రథోత్సవం కనులపండువగా సాగింది. వేడుకలో ఎమ్మెల్యే సోదరుడు ముత్తుముల కృష్ణకిషోర్‌రెడ్డి, ఆలయ కమిటీ అధ్యక్షుడు ఆరవీటి సుబ్రహ్మణ్యం, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

గ్రామోత్సవాన్ని ప్రారంభిస్తున్న దేవస్థాన కమిటీ సభ్యులు

రణభేరి సభకు తరలివెళ్తున్న పొదిలి యూటీఎఫ్ నాయకులు

12వ పీఆర్సీ వెంటనే వేయండి

పొదిలి, న్యూస్‌టుడే: ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కారం దిశగా ప్రభుత్వం చర్చలు జరపాలని యూటీఎఫ్ జిల్లా సహాధ్యక్షులు పి.బాలవెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం పొదిలి యూటీఎఫ్ కార్యాలయంవద్ద ఆయన మాట్లాడారు. 12వ పీఆర్సీ కమిషన్ వేయాలని, ఐ.ఆర్.29 శాతం ప్రకటించాలన్నారు. అనంతరం విజయవాడలో జరుగుతున్న రణభేరి-2 సభకు యూటీఎఫ్ నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు పి.శ్రీనివాసులు, బుజ్జిబాబు, సత్యనారాయణరెడ్డి, వెంకటేశ్వర్లు, ఎస్కే ఖాశింసా, టి.శ్రీనివాస్, రామారావు, దిల్షాద్, షమీం, ఫాతిమా. శైలజ తదితరులు పాల్గొన్నారు.

20లోపు ఈ-పంట నమోదు చేసుకోండి

పెద్దదోర్నాల, న్యూస్‌టుడే: రబీలో సాగు చేసిన పంటలను ఈ నెల 20 లోపు ఈ-పంట నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి జవహర్‌లాల్‌నాయక్ రైతులకు సూచించారు. అయినముక్కులలో మంగళవారం జరిగిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో పాల్గొన్న ఆయన జొన్న పంటలను పరిశీలించారు. అనంతరం రైతు సేవా కేంద్రంలో రైతులకు పంటల సాగు, ప్రభుత్వ పథకాల సద్వినియోగం తదితర వివరాల గురించి ఆయన రైతులకు వివరించారు. కార్యక్రమంలో వీఏఏ ఎం.శివశైలజ తదితరులు పాల్గొన్నారు.

కంది పంట విక్రయానికి..

పొదిలి: కంది పంటను అమ్ముకునేందుకు తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని ఏవో డి.శ్రీనివాసులు చెప్పారు. మంగళవారం మల్లవరం, అక్కచెరువు గ్రామాల్లో పొలం పిలుస్తుంది కార్యక్రమంలో భాగంగా అవగాహన కల్పించారు. కంది కోతలను పరిశీలించారు. కందికి ప్రభుత్వ మద్దతు ధర క్వింటాకు రూ.8 వేలు ప్రకటించిందన్నారు. త్వరలో కొనుగోలు కేంద్రాలు ప్రారంభం కానున్నట్లు చెప్పారు. వ్యవసాయానికి సంబంధించి రాయితీలు, పథకాలు పొందాలంటే రైతులు తప్పనిసరిగా ఫార్మర్ రిజిస్ట్రీ పోర్టల్‌లో నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు.

సమాజ చైతన్యానికి జేవీవీ నిరంతర యత్నం

పొదిలి, న్యూస్‌టుడే: సమాజం చైతన్యం కావాల్సిన అవసరం ఉందని జేవీవీ జిల్లా గౌరవ అధ్యక్షులు డాక్టర్ జవహర్ అన్నారు. పొదిలి ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో మంగళవారం నిర్వహించిన జేవీవీ మండలస్థాయి వక్త-2026 పోటీల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. సమాజం శ్రేయస్సు కోసం, మూఢనమ్మకాలను పారదోలేందుకు జేవీవీ నిరంతరం కృషి చేస్తుందన్నారు. విద్యార్థులు శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకోవాలని సూచించారు. జేవీవీ రాష్ట్ర జాతీయ కమిటీ సభ్యులు షేక్ గయాజ్ మాట్లాడుతూ విద్యార్థుల్లో మాట్లాడేతత్వాన్ని, ప్రశ్నించేతత్వాన్ని అలవర్చేందుకు వక్త పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రారంభ కార్యక్రమంలో ఎంఈవో నాగలక్ష్మి, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రోజారాణి పాల్గొన్నారు. మండలస్థాయిలో ప్రథమ కె.ఇందు, గీతాంజలి పాఠశాల, ద్వితీయ షేక్ మిశ్బహీన, సంస్కృతి విద్యాలయం, మూడో బహుమతి జ్యోతిర్ బిందు ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల సాధించారు. ఈ కార్యక్రమంలో జేవీవీ ప్రతినిధులు సిహెచ్.రమేష్, వేణుగోపాల్, వీరారెడ్డి, కె.వెంకటేశ్వర్లు, జి.మధు, పాపారాయుడు, నరేంద్ర, ఎస్.పి.బాలయ్య నిరంజన్, కిరణ్మయి, బెనర్జి, నాగశ్రీ తదితరులు పాల్గొన్నారు.

జేవీవీ ప్రతినిధులతో మండల స్థాయి విజేతలు

పర్యావరణ రుసుం వసూలు చేసే అటవీశాఖ చెక్‌పోస్టు

అటవీశాఖకు పెరిగిన ఆదాయం

పెద్దదోర్నాల, న్యూస్‌టుడే: శ్రీశైలంలో జరిగిన మహా శివరాత్రి బ్రహ్మోత్సవాలు వీక్షించేందుకు ఈసారి గత ఏడాది కంటే ఎక్కువ వాహనాల్లో భక్తులు తరలి వెళ్లారు. దీంతో అటవీశాఖకు పర్యావరణ రుసుం ఎక్కువ వసూలైంది. గత ఏడాది ఫిబ్రవరి 19 నుంచి 27 వరకు శ్రీశైలంలో జరిగిన బ్రహ్మోత్సవాలకు 12,008 వాహనాలు తరలి వెళ్లగా..ఈ నెల 8 నుంచి 16 వరకు జరిగిన బ్రహ్మోత్సవాలకు 14,720 వాహనాలు వెళ్లాయి. పెద్దదోర్నాలలోని అటవీశాఖ చెక్‌పోస్టు వద్ద చిన్న వాహనాలకు రూ.70, పెద్ద వాహనాలకు రూ.130లు పర్యావరణ రుసుం పేరిట వసూలు చేస్తారు. ఆ లెక్కన గత ఏడాది రూ.10,36,910లు వసూలు కాగా..ఈ ఏడాది రూ.12,01,220లు వచ్చింది. పర్యావరణ రుసుం పేరిట వసూలు చేసే డబ్బును ఘాట్ రహదారిలో ప్లాస్టిక్ వ్యర్థాలను ఏరివేసేందుకు నియమించిన స్వచ్ఛ సేవకుల వేతనాలకు, అటవీ, వన్యప్రాణుల సంరక్షణ కోసం ఖర్చు చేస్తున్నట్లు అటవీ అధికారులు తెలిపారు.

చినారికట్లలో పొగాకు బ్యారన్ దగ్ధం

మార్కాపురం, కొనకనమిట్ల, న్యూస్‌టుడే: కొనకనమిట్ల మండలంలోని చినారికట్లలో పొగాకు బ్యారన్ దగ్ధం అయిన సంఘటన మంగళవారం చోటు చేసుకుంది. బాధిత రైతు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన రైతు ఐలా హనుమంతరావుకు చెందిన పొగాకు బ్యారన్‌లో ఉన్న కర్రలకు మంటలు అంటుకున్నట్లు చెప్పారు. మంటలు కాస్తా పొగాకుకు వ్యాపించినట్లు తెలిపారు. బ్యారన్‌లో మంటల్లో కాలిపోతున్న పొగాను గమనించి విషయాన్ని అగ్నిమాపక శాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. కనిగిరి అగ్నిమాపకశాఖ అధికారులు చేరుకుని మంటలను అదుపు చేశారు. అగ్నిమాపక శకటం ఘటన స్థలానికి చేరుకునే లోపే మంటల్లో పొగాకు అంతా కాలిపోయినట్లు రైతు వాపోయారు. రూ. 5 లక్షల మేర నష్టం వాటిల్లినట్లు ఆవేదన వ్యక్తం చేశారు. ఊహించని విధంగా జరిగిన ప్రమాదంలో తీవ్రంగా నష్టపోయానని ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత రైతు వాపోయాడు.

మంటలను అదుపు చేస్తున్న అగ్నిమాపక శాఖ అధికారులు

వేసవికి ముందే.. ఎద్దడి ప్రభావం

❑ పొదిలి నగర పంచాయతీలో మొదలైన ఇక్కట్లు

న్యూస్‌టుడే, పొదిలి:

మార్కాపురం, ప్రకాశం జిల్లాలకు ముఖ్య కూడలి పొదిలి అన్ని విధాలా అభివృద్ధి దిశగా పయనించాలి. ఎప్పటికప్పుడు ప్రజా సమస్యలను పరిష్కరించాలి. ముఖ్యంగా వేసవి వచ్చిందంటే ఈ నగర పంచాయతీలో ప్రజలు తాగునీటి సమస్యతో ఇబ్బంది పడతారు. ఈసారి వేసవి రాకముందే పొదిలిలో తాగునీటి కష్టాలు ప్రారంభమయ్యాయి.

నాలుగు దశాబ్దాల నాటి నీటి పథకం

పట్టణంలోని నాలుగు దశాబ్దాల క్రితం నిర్మించిన ఎన్‌ఏపీ నీటి పథకం ప్రజల దాహార్తి తీర్చలేకపోతోంది. నగర పంచాయతీలో 20 వార్డులు ఉండగా,36,000 మంది జనాభా ఉన్నారు. అన్ని ప్రాంతాల్లో పూర్తిస్థాయిలో తాగునీటి పైపులు విస్తరించలేదు. కొత్తూరులోని విశ్వనాథపురం, బాలాజీ నగర్, పిచ్చిరెడ్డికాలనీ, ఇస్లాంపేట, బీసీకాలనీ తదితర ప్రాంతాల ప్రజలు ప్రతిరోజు ఉదయం ఎన్‌ఏపీ సంపు వద్దకు వెళ్లి తాగునీటిని తెచ్చుకోవాల్సి వస్తుంది.

అనధికారిక కనెక్షన్లు అధికం

పట్టణంలో తాగునీటి కనెక్షన్లు ఎక్కువగా అనధికారికంగా ఉన్నాయి. అధికారికంగా 200 ఉంటే అనధికారికంగా 1,100పైనే ఉన్నాయి. కొన్ని ప్రాంతాల్లోని ప్రజలు వీధికుళాయిలకు నీళ్లు ఎక్కకపోవడంతో తాగునీటి పైపులైన్లను ఇళ్లలోకి కనెక్షన్లు తీసుకుని మోటార్లతో నీటిని పట్టుకుంటున్నారు. దీంతో దిగువ ప్రాంతాల ప్రజలకు నీరు సరఫరా కావడం లేదు. పలుమార్లు అనధికారిక కనెక్షన్లు తొలగించుకోవాలని, ఉన్నా క్రమబద్ధీకరించుకోవాలని అధికారులు ఆదేశించినా ప్రయోజనం లేకుండా పోతోంది. పాతూరులోని కొన్నివార్డుల్లో పూర్తిస్థాయిలో నీరు అందుతోంది. కొత్తూరులో మాత్రం ఓవర్‌హెడ్ ట్యాంకులకు నీరు ఎక్కించి అక్కడినుంచి సరఫరా చేయాల్సి ఉంటోంది. దీంతో ఆయా వార్డుల్లో తాగునీరు గంట కంటే ఎక్కువ సేపు సరఫరా చేయడం లేదు. దీంతో ఆర్థికంగా ఉన్న వారు డబ్బా నీటిని కొనుగోలు చేసి తాగుతున్నారు. మరి కొంతమంది ఎన్‌ఏపీ సంపు వద్దకు వెళ్లి తెచ్చుకోవాల్సి వస్తుంది.

పాతూరు ఎన్‌ఏపీ సంపు వద్దకు వచ్చి నీటిని పట్టుకుంటున్న ప్రజలు

ప్రభుత్వ ముందస్తు చర్యలు

వేసవి ఎద్దడిని దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం ఈసారి ముందుగానే స్పందించింది. పాడైపోయిన బోర్లు, చేతిపంపులు మరమ్మతులు చేపట్టి అందుబాటులోకి తేవాలని సూచించింది. పొదిలి పరిధిలో ఆ దిశగా చర్యలు వేగవంతం కావాల్సి ఉంది.

జీవితంలో ఉన్నతంగా రాణించాలి

మార్కాపురం గ్రామీణం, న్యూస్‌టుడే: సాయికిషోర్ మాదిరి ప్రతి ఒక్కరూ జీవితంలో ఉన్నతంగా రాణించాలని అధ్యాపకులు అన్నారు. ఇటీవల విడుదలైన గ్రూప్ 2 ఫలితాల్లో పట్టణానికి చెందిన శ్రీసాధన డిగ్రీ కళాశాల పూర్వ విద్యార్థి హెచ్.సాయికిషోర్ నాయక్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ విభాగంలో ఉద్యోగం సాధించారు. ఈ నేపథ్యంలో మంగళవారం ఆయనను కళాశాల ప్రిన్సిపల్ మధుసూదన్‌శాస్త్రి, సిబ్బంది అభినందించి సన్మానించారు. అనంతరం ప్రసంగించారు.

సాయికిషోర్‌నాయక్‌ను సన్మానిస్తున్న ప్రిన్సిపల్ మధుసూదన్ శాస్త్రి, కళాశాల సిబ్బంది

(c) eenadu

ఈనాడు నంద్యాల
బుధవారం ఫిబ్రవరి 18, 2026

భయపెడుతున్న బ్లాస్టింగ్

పైపాలెం గట్టుపై ఉన్న రాళ్లు
డ్రిల్లింగ్ చేసి అట్టపెట్టెతో కప్పి

మిడుతూరు మండలం పైపాలెంలో ప్రజలకు ముందస్తు సమాచారం ఇవ్వకుండా బ్లాస్టింగ్ చేపడుతుండటంతో గ్రామస్థులు భయాందోళన చెందుతున్నారు. పైపాలెం, మాసపేట, నాగలూటి గ్రామాల పరిధిలోని సుమారు 3 వేల ఎకరాల విస్తీర్ణంలో ఓ కంపెనీ సోలార్ పరిశ్రమ ఏర్పాటు చేస్తోంది. ఈ క్రమంలో గట్టు ప్రాంతాన్ని తవ్వేందుకు బ్లాస్టింగ్ చేపట్టారు. పనుల వద్ద సెక్యూరిటీ లేకుండా, ముందస్తుగా గ్రామంలో దండోరా వేయకుండా చేస్తుండటంతో గ్రామస్థులు భయాందోళనకు గురవుతున్నారు.
–న్యూస్‌టుడే, నందికొట్కూరు, మిడుతూరు

స్వచ్ఛ శ్రీగిరి

మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని లక్షలాది మంది భక్తులు శ్రీశైలం సందర్శించారు. గతంలో ఆలయం ముందు భాగం నుంచి నంది సర్కిల్ వరకు శుభ్రం చేసేవారు. ఈసారి ప్రధాన రహదారులన్నీ శుభ్రం చేశారు. గతంలో రహదారులు దుమ్మూధూళితో పాటు బ్లీచింగ్ పౌడర్ దుమ్ముతో శివరాత్రి తర్వాత

కొన్నిరోజుల పాటు భక్తులు ఇబ్బందులు పడేవారు. ఈసారి ఆ కష్టాలు తప్పినందుకు భక్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.
– న్యూస్‌టుడే, శ్రీశైలం, నందిసర్కిల్

సున్నిపెంట.. ఆక్రమణల పుట్ట

☛ 1,764 ప్రభుత్వ క్వార్టర్లు కబ్జా ☛ వెలుస్తున్న బహుళ అంతస్తులు

శ్రీశైల జలాశయం నిర్మితమైన సున్నిపెంటలో విలువైన ప్రభుత్వ గృహ సముదాయాలు ఆక్రమణలకు గురవుతున్నాయి. ప్రాజెక్టు నిర్మాణ సమయంలో ప్రభుత్వం వేలాది ఎకరాల భూమి సేకరించింది. పనులు చేపట్టడానికి వీలుగా సున్నిపెంటలో అధికారులు, ఉద్యోగులు, సిబ్బందికి గృహ సముదాయాలు నిర్మించారు. సేకరించిన భూమిలో 716 ఎకరాలు మిగిలింది. మరోవైపు ప్రాజెక్టు నిర్మాణ సమయంలో వచ్చిన ఇంజినీర్లు, ఉద్యోగులు చాలా మంది క్వార్టర్లను ఖాళీ చేసి ఇతర ప్రాంతాలకు వెళ్లిపోయారు. ఈ నేపథ్యంలో పలువురు అక్కడున్న ప్రభుత్వ స్థలాలు, క్వార్టర్లు ఆక్రమించి బహుళ అంతస్తుల భవనాలు, హోటళ్ల నిర్మాణాలు జరుగుతున్నా అధికారులు చోద్యం చూస్తున్నారు. – నంద్యాల, ఈనాడు

121.85 ఎకరాల భూమి పరులపాలు

■ శ్రీశైల మల్లన్న క్షేత్రానికి 8 కి.మీ. దూరంలో ప్రధాన రహదారి పక్కనే సున్నిపెంట ఉండటంతో అక్కడి స్థలాలకు విపరీతమైన డిమాండ్ పెరిగింది. ఖాళీ స్థలాలు, క్వార్టర్లపై జలవనరుల శాఖ అధికారుల పర్యవేక్షణ కొరవడింది. దీంతో కొందరు వ్యాపారులు, స్థానికులు యథేచ్ఛగా ఆక్రమించేశారు. 1,764 ప్రభుత్వ క్వార్టర్లు ఆక్రమణకు గురైనట్లు.. ఆ భూమి విలువ రూ.2 వేల కోట్లకుపైగా ఉంటుందని అంచనా. కొందరైతే వాటిని కూలగొట్టి కొత్తగా నిర్మాణాలు చేపట్టారు.

■ విజిలెన్స్ అధికారులు విచారణ చేయగా 121.85 ఎకరాల భూమి కబ్జా అయినట్లు 2014 లోనే తేల్చారు. దీంతోపాటు సున్నిపెంట పరిసరాల్లో ఉన్న క్వార్టర్లను ఆక్రమించారని నివేదికలో పేర్కొన్నారు. చర్యలు లేకపోవడంతో ఆక్రమణలు క్రమంగా పెరిగిపోతున్నాయి.

వెస్టన్ కాలనీలో ప్రభుత్వ స్థలంలో ప్రైవేటు వ్యక్తులు నిర్మిస్తున్న ప్రహరీ

సమగ్ర సర్వే లోపభూయిష్టం

వైకాపా హయాంలో పెద్దఎత్తున ఆక్రమణలు జరిగాయి.. 'కూటమి' ప్రభుత్వానికి ఫిర్యాదులు అందాయి. ఈ నేపథ్యంలో 27 పాయింట్లతో గతేడాది సమగ్ర సర్వే చేశారు. ఏఏ ప్రాంతాల్లో ? ఎంత విస్తీర్ణంలో భూమిని ? ఎవరు ఆక్రమించుకున్నారు ? అనే వివరాలతో సమగ్ర నివేదికను రూపొందించారు. దీని తయారీలో పెద్దఎత్తున అక్రమాలు జరిగాయన్న విమర్శలున్నాయి. కొన్ని ఆక్రమణలను నివేదికలో ప్రస్తావించలేదన్న ఆరోపణలు ఉన్నాయి. పకడ్బందీగా సర్వే చేస్తే తప్ప ఆక్రమణలు వెలుగులోకి రావు.

హైకోర్టు ఆదేశించినా

■ సున్నిపెంటలో ఆక్రమణలపై హైకోర్టు న్యాయవాది డి.కాశీరావు ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. ఓ అధికారిని నియమించి చర్యలు తీసుకోవాలని హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ చల్లా గుణరంజన్‌ల ధర్మాసనం కీలక ఉత్తర్వులిచ్చింది. ఆక్రమణల వివరాలు మార్చి 18వ తేదీకల్లా కోర్టు ముందుంచాలని హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ఆదేశించారు.

■ సాక్షాత్తూ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తే సున్నిపెంట ఆక్రమణలపై స్పందించి చర్యలకు ఆదేశించిన నేపథ్యంలో ఇప్పటికైనా ఆక్రమణలు, అక్రమ నిర్మాణాలు ఆగుతాయని అందరూ భావించారు. వారందరి అంచనాలకు భిన్నంగా సున్నిపెంట గ్రామంలో ఆక్రమణలు కొనసాగుతూనే ఉన్నాయి.

నిమిషం ఆలస్యమైనా అనుమతి ఉండదు

▸▸ ఇంటర్ పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్
▸▸ 'న్యూస్‌టుడే' ముఖాముఖిలో ఆర్జేడీ సురేష్‌బాబు

సురేష్‌బాబు

కర్నూలు విద్య, న్యూస్‌టుడే : ప్రతి విద్యార్థి జీవితంలో ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు ముఖ్యమైనవి. వారి భవిష్యత్తును నిర్ణయించే ఈ పరీక్షలు ఈనెల 23వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. మార్చి 24వ తేదీ వరకు కొనసాగుతాయి. ఈసందర్భంగా పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు, అధికారుల నియామకం, నిబంధనలు తదితర అంశాలను ఇన్‌ఛార్జి ఆర్జేడీ సురేష్‌బాబు వివరించారు.

78,831 మంది విద్యార్థులు

ఈ ఏడాది ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలకు కర్నూలు జిల్లాలో 48,964, నంద్యాలలో 29,867 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. నంద్యాల 55, కర్నూలు జిల్లాలో 75 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్ష ఉంటుంది. పరీక్ష సమయానికి గంట ముందే కేంద్రానికి విద్యార్థులు చేరుకోవాలి. నిమిషం ఆలస్యమైనా కేంద్రంలోకి అనుమతి ఉండదు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుంది.

హెల్ప్‌డెస్క్

● పరీక్ష కేంద్రాల వద్ద ఏవైనా సమస్యలు తలెత్తితే కర్నూలు జిల్లా విద్యార్థులు 08518-222047, నంద్యాల జిల్లా వారు 6281134324 నంబరుకు ఫోన్‌చేసి సమాచారం ఇవ్వవచ్చు.

చరవాణుల నిషేధం

● కర్నూలు జిల్లాలో ఇద్దరు సభ్యులతో కూడిన ఆరు సిట్టింగ్ స్క్వాడ్ బృందాలు, ముగ్గురు సభ్యులతో కూడిన రెండు ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు, చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్టుమెంటల్ ఆఫీసర్లు, ఇన్విజిలేటర్ల నియామకం పూర్తయింది.

● నంద్యాల జిల్లాలో నాలుగు సిట్టింగ్ స్క్వాడ్, మూడు ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలను నియమించాం.

● పరీక్షల విధుల్లో ఉన్న అధికారులు సెల్‌ఫోన్లు వినియోగించడాన్ని నిషేధించామన్నారు. ఎవరైనా అధికారులు చరవాణితో కనిపిస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

బృందాల నియామకం

కేంద్రాల తనిఖీ కోసం ప్రత్యేక బృందాలను నియమించడం జరిగింది. ప్రతి కేంద్రంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. జిల్లా, రాష్ట్రస్థాయి అధికారులు వీటిని పర్యవేక్షిస్తుంటారు. ఎక్కడ ఏ చిన్న ఇబ్బంది కలిగినా వెంటనే చర్యలు తీసుకునే విధంగా రెండు జిల్లాల కలెక్టర్ల నుంచి అనుమతులు వచ్చాయి. పరీక్ష కేంద్రాల వద్ద శాంతిభద్రతల సమస్యలు తలెత్తకుండా పోలీసు శాఖ బందోబస్తు నిర్వహిస్తుంది.

పెన్షనర్లు పత్రం సమర్పించండి

☛ 10 రోజులే గడువు

కర్నూలు కలెక్టరేట్, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వ సర్వీస్, ఫ్యామిలీ పెన్షన్‌దారులు తమ జీవన ప్రమాణ పత్రాలు (లైఫ్ సర్టిఫికెట్లు) సమర్పించేందుకు గడువు సమీపిస్తోంది. ఈ నెల 28వ తేదీ వరకు జీవన ప్రమాణ పోర్టల్‌లో లేదా ఖజానా శాఖ కార్యాలయాల్లో సమర్పించాల్సి ఉంటుంది. గతేడాది నవంబరు, డిసెంబరు నెలల్లో సమర్పించినవి చెల్లుబాటు కావు. తాజాగా ఇవ్వకుంటే ఏప్రిల్ 1న ఇచ్చే మార్చి పెన్షన్ నిలిపివేయనున్నారు. పెన్షన్‌దారులు తమ పత్రాలు సమర్పించేందుకు కర్నూలు, గూడూరు, ఎమ్మిగనూరు, ఆదోని, పత్తికొండ, ఆలూరు ఉప ఖజానా కార్యాలయాల్లో ప్రత్యేక కేంద్రాలు ఏర్పాటు చేశారు. "అనారోగ్యంతో నడవలేని పింఛనుదారులు తమ దృష్టికి తీసుకొస్తే ఖజానా శాఖ సిబ్బంది ఇంటి వద్దకు వస్తారని" జిల్లా అధికారి బి.రామచంద్రరావు తెలిపారు.

సబ్ ట్రెజరీ	పత్రాలు సమర్పించిన వారు	ఇంకా ఇవ్వాల్సిన వారు
కర్నూలు	10,713	1,506
ఆదోని	1,893	369
ఆలూరు	586	109
గూడూరు	446	63
పత్తికొండ	666	45
ఎమ్మిగనూరు	950	152

నేడు పారిశ్రామిక వినియోగదారుల పరిష్కార వేదిక

కర్నూలు వెంకటరమణ కాలనీ, న్యూస్‌టుడే: పారిశ్రామిక విద్యుత్తు వినియోగదారుల సమస్యల సత్వర పరిష్కారం కోసం బుధవారం పరిష్కార వేదిక నిర్వహిస్తున్నట్లు సంస్థ సీఎండీ శివశంకర్ లోతేటి తెలిపారు. ఎస్ఈల పరిధిలో పరిష్కారం కానీ సమస్యలను నేరుగా సీఎండీ దృష్టికి తీసుకెళ్లొచ్చు.

● బుధవారం ఉదయం 10:30 నుంచి 11:30 గంటల మధ్యలో టోల్‌ఫ్రీ నంబరు 18004251553333కి ఫోన్ చేయొచ్చు.. అదేవిధంగా 9133331912 వాట్సప్ నంబర్‌కు సమస్య వివరాలు పంపించి పరిష్కారం పొందొచ్చు.

మనోరథంపై మహానందీశుడు

'జన'జయ ధ్వనుల మధ్య మహానందీశుడు కదిలారు.. మహాశివ రాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా మంగళవారం సాయంత్రం రథోత్సవం కనులపండువగా నిర్వహించారు. శ్రీకామేశ్వరీదేవి సహిత మహానందీశ్వరస్వామి వార్లతోపాటు నంద్యాల బ్రహ్మనందీశ్వర దేవస్థానం నుంచి కల్యాణ పెద్దలుగా వచ్చిన శ్రీగంగా పార్వతీ దేవి సమేత బ్రహ్మనందీశ్వరస్వామివార్లు రథంపై ఆసీనులయ్యారు. ముఖ్య అతిథులుగా నంద్యాల జిల్లా జడ్జి అమ్మన్నరాజు, ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి శ్రీనివాసులు, ఆర్డీవో చల్లా విశ్వనాథ్, తహసీల్దార్ పి.రమాదేవి దంపతులు, ఈవో నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి, ఏఈవో మధు పాల్గొన్నారు. – న్యూస్‌టుడే, మహానంది

శ్రీగిరిలో పూర్ణాహుతి

- నేడు శ్రీశైల మల్లన్నకు అశ్వవాహనసేవ

శ్రీశైలం ఆలయం, న్యూస్‌టుడే: శ్రీశైల మహాక్షేత్రంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు చివరి దశకు చేరుకున్నాయి. ఇందులో భాగంగా ప్రధాన ధ్వజస్తంభంపై ఆవిష్కరించిన ధ్వజపటాన్ని అవరోహణం చేశారు. స్వామి, అమ్మవార్లకు బుధవారం అశ్వవాహన సేవ నిర్వహించనున్నారు.

ధ్వజస్తంభం పైనుంచి ధ్వజపటాన్ని అవరోహణం చేస్తున్న ఛైర్మన్,ఈవో, పండితులు

పశువుల తిండి.. భావితరానికి వండి

☛ చెత్తలో పడిన ఆకుకూరల సేకరణ ☛ విద్యార్థుల ఆరోగ్యంతో చెలగాటం

ఆళ్లగడ్డ, న్యూస్‌టుడే : వసతిగృహ విద్యార్థుల ఆరోగ్యంతో గుత్తేదారులు చెలగాటమాడుతున్నారు. నాసిరకం వస్తువులు సరఫరా చేసి జేబులు నింపుకొంటున్నారు. నాణ్యతను పరిశీలించాల్సిన అధికారులు అటువైపు చూడడం లేదు. ఇదే అవకాశంగా చేసుకుని కుళ్లిపోయిన.. కింద పడేసిన ఆకుకూరలు, కాయగూరలతో చేసిన వంటకాలను విద్యార్థులకు వడ్డిస్తున్నారు.

తక్కువ ధరకు దక్కించుకొని

● జిల్లాలో 75 వరకు బీసీ, కస్తూర్బా, ఆదర్శ, ఎస్సీ, ఎస్టీ వసతి గృహాలు ఉన్నాయి. సుమారు 15 వేల మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. వీరందరికీ వసతిగృహంలో భోజనం పెట్టేందుకు ఆహార పదార్థాలు సరఫరా చేసేందుకు టెండర్లు పిలుస్తుంటారు. గుత్తేదారులు పెద్దసంఖ్యలో టెండర్ల ప్రక్రియలో పాల్గొంటుంటారు.

● ఆకుకూరలు, కూరగాయలు, పప్పు దినుసులు, సుగంధ ద్రవ్యాలు తదితరాలు ఎవరైతే తక్కువకు కోట్ చేస్తారో వారికే హక్కులు లభిస్తాయి. గతేడాది జరిగిన టెండరు ప్రక్రియలో కూరగాయలు కిలో రూ.28, ఆలు, క్యారెట్, బీట్‌రూట్, ముల్లంగి తదితరాలు కిలో రూ.29, ఆకుకూరలు కిలో రూ.10 చొప్పున కోట్ చేసిన గుత్తేదారుడు హక్కులు దక్కించుకున్నారు.

కిలో రూ.10కే టెండర్

● టెండరు దక్కించుకున్న గుత్తేదారుడు ఉప గుత్తేదారుకు బాధ్యతలు అప్పగిస్తున్నారు. ఆకుకూరలు కిలో రూ.10కే సరఫరా చేయాల్సి రావడంతో ఉప గుత్తేదారు అక్రమాలకు పాల్పడుతున్నారు. కిలోకు మూడు నుంచి నాలుగు కొత్తిమీర కట్టలు తూగుతాయి. ఒక్కోటి రూ.15 నుంచి రూ.20 వరకు పలుకుతుంది. ఈ లెక్కన కిలో కొత్తిమీర రూ.60 నుంచి 80 అవుతుంది. అలాంటిది కేవలం రూ.10కే సరఫరా చేయాల్సి ఉండడంతో మార్కెట్లో కింద పడేసిన కట్టలను ఏరుకుని ఆశ్రమ వసతి గృహాలకు సరఫరా చేస్తున్నారన్న ఆరోపణలున్నాయి.

● వాస్తవానికి వసతిగృహాలను తరచూ తనిఖీ చేసి పర్యవేక్షించాల్సిన అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదు. సరకుల నాణ్యతను నిర్లక్ష్యం చేస్తున్నారు. ఇదే అవకాశంగా గుత్తేదారులు బరితెగిస్తున్నారు. నాసిరకమైన వస్తువులు సరఫరా చేసి బిల్లులు చేసుకుంటున్నారు.

కాసులకు కక్కుర్తిపడి..

ఆకుకూర కట్టను ఆవు తింటుండగా.. లాక్కుంటున్న వ్యక్తి

ఆళ్లగడ్డ పరిధిలోని నాలుగు వసతిగృహాలు, ఒక పాఠశాలలో మధ్యాహ్న భోజనానికి ఆకుకూరలు, కూరగాయలు సరఫరా చేసే బాధ్యతను ఓ ఉప గుత్తేదారు తీసుకున్నాడు. డబ్బులు మిగుల్చుకోవాలన్న కక్కుర్తితో నాణ్యత లేని కూరగాయలు, ఆకుకూరలను మార్కెట్‌లో సేకరించాడు. వాటిని రెండు పెద్ద సంచుల్లో వేసుకోవడాన్ని కొందరు గమనించి చరవాణిలో చిత్రీకరించారు. కొందరు వ్యాపారులు కింద వదిలేసిన గోంగూర, మెంతాకు, పుదీనా తదితర కట్టలను సంచుల్లో వేసుకున్నాడు. అసలే మార్కెట్‌లో పందులు, కుక్కలు, ఇతర జంతువులు నిత్యం సంచరిస్తూ ఉంటాయి. ఈ నేపథ్యంలో కింద పడేసిన ఆకుకూరలను సేకరించారు. కొన్నింటిని ఆవులు తింటుండగా బలవంతంగా వాటి నోటి నుంచి లాక్కోవడం గమనార్హం.

సులభం.. సురక్షితం

☛ తక్కువ ధరకే పార్సిల్ సేవలు
☛ వ్యాపారులకు తపాలా శాఖ అండ

తపాలా కార్యాలయంలో పార్సిల్‌ను ప్యాకింగ్ చేస్తున్న సిబ్బంది

నంద్యాల రైతునగరం, న్యూస్‌టుడే: చేతివృత్తిదారులు, చిరు వ్యాపారులు తమ ఉత్పత్తులపై సామాజిక మాధ్యమాలు, అంతర్జాలంలో ప్రచారం చేసుకుంటున్నారు. వినియోగదారులు తమకు నచ్చినవి బుక్ చేసుకొని కొన్ని రోజుల్లోనే పొందుతున్నారు. ఇలాంటి పార్సిళ్లను ఇంటికి చేరవేయడానికి తపాలా శాఖ ముందుకొచ్చింది. దుస్తులు, నిత్యావసరాలు, గృహోపకరణాలు, ఆహార పదార్థాలు, వివిధ రకాల వస్తువులను చేరవేస్తుంది. తక్కువ ధరకు విదేశాలతో పాటు దేశంలోని చిన్న పల్లెలకు పంపవచ్చని తపాలా సూపరింటెండెంట్లు జనార్దన్‌రెడ్డి, అప్పలస్వామి తెలిపారు.

● పార్సిళ్లు పంపాలనుకుంటే సమీపంలోని తపాలా కార్యాలయానికి వెళ్లాలి. వ్యక్తిగత, వినియోగదారుని చిరునామా ఇవ్వాలి. ఐడీ ప్రూఫ్ ఉండాలి.

● సరకు వివరాలు తప్పనిసరిగా పొందుపర్చాలి. చరవాణి సంఖ్య రాయాలి. ట్రాకింగ్ సదుపాయం అందుబాటులో ఉంది. కస్టమ్స్ డిక్లరేషన్ చేయాలి.

● ఇంటి నుంచే పార్సిల్ సేవలు పొందాలనుకుంటే ఏపీపీ. ఇండియాపోస్ట్.జీవోవీ.ఇన్ అనే వెబ్‌సైట్‌లో బుక్ చేసుకోవచ్చు. తపాలా సిబ్బంది ఇంటి వద్దకు వచ్చి తీసుకెళ్తారు.

● సామాజిక మాధ్యమాల్లో వ్యాపారాలు చేసుకునే వారికి బిజినెస్ అకౌంట్ ద్వారా దేశంలో ఎక్కడికైనా రూ.51కే పార్సిళ్లను పంపవచ్చు. క్యాష్ ఆన్ డెలివరీ సదుపాయం అందుబాటులో ఉంది.

● కిలోకు రూ.60 తీసుకుంటున్నారు. బరువు, దూరాన్ని బట్టి పార్సిల్ ధర మారుతుంది.

● రిజిస్టర్ పోస్ట్ ద్వారా అయితే రూ.250కే 2 కిలోల లోపు బరువు ఉన్న వాటిని విదేశాలకు పంపవచ్చు.

● బీఎంపీఎల్(బుక్ నౌ పే ల్యాటర్) అనే విధానం ద్వారా వినియోగదారులు డబ్బును నెలకు ఒకసారి చెల్లించొచ్చు.

● వ్యాపార సంబంధమైన వస్తువులను విదేశాలకు పార్సిల్ (డాక్ ఘర్ నిర్యాక్ కేంద్ర్) ద్వారా చిన్న వ్యాపారులు వస్తువులను ఎగుమతి చేసుకోవచ్చు. ఒక పార్సిల్‌కు 35 కిలోల చొప్పున ఎన్ని కిలోలైనా పంపించుకోవచ్చు.

● సంప్రదించాల్సి నంబర్లు
కర్నూలు: 8919286405
నంద్యాల: 9642074950

మిల్లర్ల కనుసన్నల్లో దందా

☛ క్వింటాపై రూ.600- 1,000 పెంపు

కర్నూలు కలెక్టరేట్, న్యూస్‌టుడే : బియ్యంపై 5 శాతం జీఎస్టీని కేంద్రం అమల్లోకి తెచ్చింది. 5, 10, 20, 25 కిలోల బియ్యం ప్యాకింగ్‌కు దీనిని వర్తింపజేస్తున్నారు. 2025 డిసెంబరులో కేంద్రం బియ్యం ఎగుమతులకు అవకాశం కల్పించింది. దీన్ని సాకుగా చూపి సోనా మసూరి బియ్యం కొరత ఉందని, పాత బియ్యం లేవని.. కొత్త రకాలు మాత్రమే ఉన్నాయంటూ మిల్లర్లు కృత్రిమ కొరత సృష్టించి ధరలు పెంచేశారు. కిలోపై రూ.7- 10 వరకు వడ్డించారు. ప్రస్తుతం సన్న రకాల నిల్వలు లేవు.. కొత్త పంట వచ్చే వరకు ధరల మోత తప్పదని మిల్లర్లు చెబుతున్నారని వ్యాపారులు అంటున్నారు.

తూకాల్లో ధోకా

● 25 కిలోల ప్యాకింగ్ వరకు బియ్యంపై జీఎస్టీ అమల్లోకి తేవడంతో.. పన్ను తప్పించుకునేందుకు కొందరు మిల్లర్లు 26 కిలోల పరిమాణంలో ప్యాకింగ్ చేస్తున్నారు.

● ఉమ్మడి జిల్లాలో వందకు పైగా రైస్ మిల్లులు ఉండగా.. 5 శాతం మంది 26 కిలోల సంచులు విక్రయిస్తున్నారు. మిగతా వారంతా 24, 25 కిలోలను ప్యాకింగ్ చేసి మార్కెట్‌లోకి హోల్‌సేల్ వ్యాపారులకు సరఫరా చేస్తున్నారు.

● మరికొందరు మిల్లర్లు బియ్యం ప్యాకెట్‌పై 25 కిలోలని ముద్రిస్తున్నా.. 24 కిలోలే ఇస్తూ మోసం చేస్తున్నారు. కొందరు బ్రాండ్‌ల పేరుతో బాదేస్తున్నారు. బియ్యం ప్యాకింగ్‌కు తూనికలు, కొలతల శాఖ అనుమతి తీసుకోవాల్సి ఉండగా ఒక్కరూ పట్టించుకోవడం లేదు.

మామూళ్లు మరిగి.. తనిఖీలు మరిచి

● బియ్యం 26 కిలోల బస్తా విక్రయిస్తే జీఎస్టీ చెల్లించాల్సిన అవసరం లేదు. అదే 25 కిలోల ప్యాకెట్లు విక్రయిస్తే 5 శాతం జీఎస్టీ చెల్లించాల్సి ఉంటుంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 24, 25 కిలోల బియ్యం ప్యాకెట్ల విక్రయాలు జోరుగా సాగుతున్నా జీఎస్టీ అధికారులు తనిఖీలు చేయడం లేదు. మిల్లర్లతో నెలవారీ మామూళ్లు తీసుకుంటూ తనిఖీలు చేయడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. దీంతో ప్రభుత్వ ఖజానాకు రూ.కోట్లలో నష్టం వాటిల్లుతోంది.

● బియ్యం ధరలు అమాంతం పెరిగిన నేపథ్యంలో రైస్ మిల్లుల్లో నిల్వలపై సంబంధిత శాఖలు తనిఖీలు నిర్వహించాలి. హోల్‌సేల్, రిటైల్ వ్యాపార సంస్థల్లోనూ సోదాలు చేయాలి. అధికారులు తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు.

నొస్సంలో సోలార్ పరిశ్రమ

నంద్యాల పట్టణం, సంజామల, న్యూస్‌టుడే: సంజామల మండలం నొస్సం గ్రామంలో సోలార్ పరిశ్రమ ఏర్పాటుకు 1500 ఎకరాలను కేటాయిస్తూ స్పెషల్ చీఫ్ సెక్రటరీ జి.సాయి ప్రసాద్ ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు మంగళవారం జీవో నంబరు 123 జారీ చేశారు. ప్రతిపాదిత సోలార్ ప్రాజెక్టు ద్వారా 250 మెగావాట్ల విద్యుదుత్పత్తి జరగనుంది. నొస్సం గ్రామంలోని సర్వే నంబరు 1409-5లోని ఈ భూమిని ఎన్ఆర్ఈడీసీఏపీకి 30 ఏళ్ల పాటు లీజుకు ఇచ్చారు. లీజులో భాగంగా ఏడాదికి ఎకరాకు సదరు సంస్థ రూ.31 వేలు చెల్లించనుంది. ఈ లీజు మొత్తం ప్రతి ఏడాది 5 శాతం పెరుగుతుంది. ఏపీ ఇంటిగ్రేటెడ్ క్లీన్ ఎనర్జీ పాలసీ-2024లో భాగంగా ఈ భూకేటాయింపులు జరిగాయి.

4.22 లక్షల మందికి ఆల్బెండజోల్ మాత్రల అందజేత

నంద్యాల పాతపట్టణం, న్యూస్‌టుడే: జిల్లా వ్యాప్తంగా ఏడాది నుంచి 19 ఏళ్ల వయసు లోపు 4,22,271 మందికి ఆల్బెండజోల్ మాత్రలు వేసినట్లు డీఎంహెచ్‌వో డా.వెంకటరమణ తెలిపారు. ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో మంగళవారం ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.

నాడు ఆగి.. నేడు కదిలి

☛ పాఠశాలల్లో ఆగిన నిర్మాణాలు ☛ నివేదిక కోరిన ప్రభుత్వం

నంద్యాల పట్టణ పరిధిలోని నూనెపల్లె మున్సిపల్ ఉన్నత పాఠశాలలో 250 మంది విద్యార్థులు చదువుకొంటున్నారు. ఇక్కడున్న గదులను మూడేళ్ల కిందట పడగొట్టారు. అదనపు, కొత్త గదుల పేరుతో నిర్మాణాలు ప్రారంభించారు. ఏ ఒక్కటీ పూర్తి కాలేదు. విద్యార్థులు చెట్ల కిందనే కూర్చొని పాఠాలు వింటున్నారు.

"నాడు- నేడు" కింద పాఠశాలల రూపురేఖలు మారుస్తామని గత వైకాపా ప్రభుత్వం గొప్పలు చెప్పింది. మొదటి విడత పనులు పూర్తి కాకుండానే హడావిడిగా రెండో విడత ఎంపిక చేశారు. కర్నూలు జిల్లాలో 974 బడులకు రూ.425.94 కోట్లు, నంద్యాలలో 853 పాఠశాలలకు రూ.363.10 కోట్లు కేటాయించారు. రెండో విడత కింద ఎంపికైన బడుల్లో గదులు పడగొట్టారు. కానీ సరిపడా నిధులు ఇవ్వలేదు. నిర్మాణం పేరుతో స్థానిక నేతలు ఇసుక, ఇనుము, సిమెంటు బేరం చేశారు. భావితరం చదువులు చెట్లకిందకు వదిలేశారు. విద్యార్థుల అవస్థలు గమనించిన 'కూటమి' ప్రభుత్వం నిర్మాణాలపై దృష్టి సారించింది.. మన బడి-మన భవిష్యత్తు కింద నిధులిచ్చేందుకు మండలాల వారీగా నివేదికలు కోరింది.
– న్యూస్‌టుడే, నంద్యాల పట్టణం, ఎమ్మిగనూరు

సమగ్ర వివరాల సేకరణ

■ పాఠశాలకు కావాల్సిన గదులు, ప్రహరీలు, మరుగుదొడ్లు, ఆర్వో ప్లాంట్లు తదితర వివరాలను మండలాల వారీగా పంపించాలని పాఠశాల విద్యాశాఖ జిల్లా విద్యాశాఖాధికారులను ఆదేశించింది. ఆ మేరకు మండలాల వారీగా ప్రస్తుతం ఎంఈవోల ఆధ్వర్యంలో నివేదికలు రూపొందిస్తున్నారు.

■ నెలాఖరులోగా నివేదికలను తీసుకున్న అనంతరం కూటమి ప్రభుత్వం మన బడి-మన భవిష్యత్తు కింద పాఠశాలలకు నిధులు మంజూరు చేయనుంది. ఆ మేరకు వేసవిలో పనులు ప్రారంభించి పాఠశాలలు తెరచుకునే నాటికి పనులు పూర్తి చేసేలా కార్యాచరణ తయారవుతోంది. రెండు జిల్లాల పరిధిలోని 53 మండలాల్లో ప్రస్తుతం పాఠశాలల వారీగా అధికారులు కొత్త అంచనాలు తయారు చేస్తున్నారు.

పూర్తి కావాల్సినవి	కర్నూలు	నంద్యాల
అదనపు గదులు	457	353
ప్రహరీలు	367	275
మరుగుదొడ్లు	250	225

మూడేళ్లుగా విద్యార్థుల అవస్థ

■ నంద్యాల జిల్లాలో 79 పాఠశాలల్లో 394 అదనపు గదుల నిర్మాణానికి రూ.47.28 కోట్లు కేటాయించారు. ఇందులో ప్రహరీలకు రూ.123.25 కోట్లు ఇస్తామన్నారు. కర్నూలు జిల్లాలో 457 పాఠశాలల్లో అదనపు గదుల నిర్మాణానికి రూ.275.42 కోట్లు కేటాయించారు. ఇందులో 367 పాఠశాలల్లో ప్రహరీల నిర్మాణానికి రూ.42.59 కోట్లు ఇస్తామన్నారు.

■ అదనపు గదుల నిర్మాణంతో పాటు ఆర్వో ప్లాంట్లు, మరుగుదొడ్ల నిర్మాణం, ర్యాంపులు, విద్యుత్తు సామగ్రి కోసం నిధులు కేటాయించినా అలంకారప్రాయంగానే ఉండిపోయాయి. చాలా పాఠశాలల్లో ఫ్లోరింగ్ పనులు పూర్తి కాలేదు.

■ నిధులు పూర్తి స్థాయిలో విడుదల కాకపోవడంతో 2023 డిసెంబరులోనే జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో పనులు ఆగిపోయాయి. ఉన్న గదులు పగలగొట్టి కొత్తగా కట్టకపోవడంతో చాలా చోట్ల విద్యార్థులు చెట్ల కింద, ఆరు బయట కూర్చోవాల్సి వస్తోంది. మరికొన్నిచోట్ల చావిడిలు, సత్రాల్లో పాఠాలు చెబుతున్నారు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 99899 97628
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 80085 13479

(c) eenadu

జిల్లాస్థాయి చదరంగం పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు

క్రీడలతో ఉజ్వల భవిష్యత్తు

నంద్యాల పాతపట్టణం, న్యూస్‌టుడే: చదువుతో పాటు క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని చెస్ సంఘం జిల్లా అధ్యక్షుడు డా. రవికృష్ణ అన్నారు. రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం డీఎస్‌ఏ ఇండోర్ స్టేడియంలో జిల్లాస్థాయి చదరంగం పోటీలను ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నంద్యాల జిల్లా క్రీడాకారులు శాప్ లీగ్‌లను సద్వినియోగం చేసుకుని ఉన్నత శిఖరాలను చేరుకోవాలన్నారు. గెలుపొందిన క్రీడాకారులు రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభను చాటుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి విశ్వనాథ్, చెస్ సంఘం కార్యదర్శి రామసుబ్బారెడ్డి, డీఎస్‌డీవో ఎంఎన్. వి.రాజు పాల్గొన్నారు.

తాడాట... గెలుపు బాట

☛ రాష్ట్ర, జాతీయ స్థాయిలో సత్తా చాటుతున్న చిచ్చరపిడుగు

నంద్యాల గాంధీచౌక్, న్యూస్‌టుడే: నంద్యాల పట్టణంలో కొందరు విద్యార్థులు తాడాటను సరదాగా నేర్చుకుని రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తున్నారు. ఆటలో మంచి నైపుణ్యాలు సాధించి వివిధ రాష్ట్రాల్లో, దేశాల్లో జరిగే పోటీల్లో పాల్గొంటున్నారు. వ్యక్తిగత విభాగంలో ప్రతిభ చూపి జాతీయ స్థాయిలో సత్తా చాటి ప్రశంసలు అందుకుంటున్నారు. ఈ క్రీడలో పట్టణానికి చెందిన రుషిక్ నాగేష్ దూసుకుపోతున్నాడు. నంద్యాల పట్టణం రెవెన్యూ క్వార్టర్స్‌లో ఉంటున్న నాగరాజు, సువర్ణ దంపతుల కుమారుడు రుషిక్ నాగేష్ 10వ తరగతి చదువుతున్నాడు. కొన్నేళ్ల నుంచి క్రీడల పట్ల మక్కువతో జంప్‌రోప్ క్రీడను ఎంచుకున్నాడు. తల్లిదండ్రులు, పాఠశాల యాజమాన్యం సహకారంతో అందులో ప్రతిభ చాటి అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తున్నాడు.

పతకాలతో రుషిక్

సాధించిన విజయాలు..

◆ 2022 మార్చిలో కర్నూలులో నిర్వహించిన జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొని ప్రథమ స్థానంలో నిలిచి బంగారు పథకం సాధించాడు.

◆ కడపలో నిర్వహించిన జిల్లా స్థాయి పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచాడు.

◆ జులైలో ప్రకాశం జిల్లా ఒంగోలులో నిర్వహించిన రాష్ట్ర స్థాయి పోటీల్లో గెలుపొంది జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు.

◆ హోసపేటలో జాతీయస్థాయి పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచి అంతర్జాతీయ స్థాయికి ఎంపికయ్యారు.

◆ నవంబర్‌లో థాయిలాండ్‌లో జరిగిన క్రీడల్లో పాల్గొని ప్రశంసా పత్రాన్ని అందుకున్నాడు.

◆ 2023 ఫిబ్రవరిలో షిర్డీలో జరిగిన జాతీయ స్థాయి క్రీడల్లో బృందంలో బంగారు పతకం సాధించాడు. అలాగే వ్యక్తిగత విభాగంలో వెండి పతకంతో రాణించాడు.

◆ మధ్యప్రదేశ్‌ని ఉజ్జయినిలో సీనియర్ మీట్‌లో బంగారు పతకం సాధించాడు.

◆ నంద్యాలలో జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో బంగారు పతకాన్ని గెలుచుకున్నాడు.

◆ సెప్టెంబరులో తెనాలిలో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో బంగారు పతకాన్ని సాధించాడు.

◆ అక్టోబరులో తెనాలిలో జాతీయ స్థాయి పోటీల్లో బృందంలో వెండి పతకం సంపాదించాడు. వ్యక్తిగత విభాగంలో కాంస్య పతకాన్ని అందుకున్నాడు.

◆ 2024 జపాన్‌లో జరిగిన అంతర్జాతీయ పోటీల్లో 5వ స్థానంలో నిలిచాడు.

◆ 2025 నేపాల్‌లో జరిగిన సౌత్ ఏషియన్ పోటీల్లో పాల్గొని రెండు వెండి పతకాలు అందుకున్నాడు.

ఒలింపిక్స్‌లో ఆడటమే లక్ష్యం - రుషిక్‌నాగేష్

మాది సాధారణ కుటుంబం. నాకు చదువుతో పాటు క్రీడలంటే ఇష్టం. దీనికి మా తల్లిదండ్రులు ప్రోత్సహిస్తున్నారు. 10వ తరగతి చదువుతున్నాను. పోటీలకు వెళ్లడానికి డబ్బులు లేని సమయాలు కూడా ఉన్నాయి. ప్రస్తుతం అంతర్జాతీయ స్థాయికి ఎంపికైనందుకు ఆనందంగా ఉంది. దాతలు సహకరించి ప్రోత్సహిస్తే ఒలింపిక్స్‌లో రాణించి దేశానికి గుర్తింపు తీసుకొస్తాను.

జోడు రథోత్సవం.. ఆధ్యాత్మిక వైభవం

◆ 21నుంచి గూళ్యంలో గాదిలింగేశ్వరస్వామి ఉత్సవాలు

హాలహర్వి, న్యూస్‌టుడే: ఆంధ్ర, కర్ణాటక రాష్ట్రాల భక్తుల ఇలవేల్పు గాదిలింగేశ్వరస్వామి జోడు రథోత్సవం నేపథ్యంలో ఈ నెల 21 నుంచి ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. గురు శిష్యులైన సిద్ధేశ్వర, గాదిలింగేశ్వరస్వామి రథోత్సవం లక్షలాది భక్తజన సందోహం మధ్య నిర్వహించనున్నారు. వందల సంవత్సరాలుగా ఈ జోడు రథోత్సవాలు నిర్వహిస్తున్నారని గ్రామ పెద్దలు, ఆలయ నిర్వాహకులు తెలిపారు. గురువు సిద్ధేశ్వర స్వామికి పరమ

గాదిలింగేశ్వర స్వామి మూల విరాట్టు

ఉత్సవాలకు ముస్తాబైన జోడు రథాలు

భక్తుడైన గాదిలింగేశ్వరస్వామికి నిత్యం మూడు పూజలు జరపడం ఆనవాయితీ. ఈ రథోత్సవం ఐదు రోజుల పాటు జరగనుంది. ఇందులో భాగంగా ఈ నెల 21న ప్రభోత్సవం, 22న జోడు రథోత్సవం, 23న వసంతోత్సవం, 24న ఎద్దుల పరుష, 25న చివరి రోజు బుధవారం స్వామికి ప్రత్యేక పూజలు చేసి జాతర మహోత్సవం ముగియనుంది. జాతర తిలకించేందుకు ఆంధ్ర, కర్ణాటక ప్రాంతాల నుంచే కాకుండా మహారాష్ట్ర, తమిళనాడు తదితర ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొంటారు.

ప్రత్యేక బస్సులు

ఈ నెల 22 నుంచి ఆదోని డిపో నుంచి పదుల సంఖ్యలో ప్రత్యేక బస్సులు నడిపేందుకు అధికారులు సిద్ధమయ్యారని దేవదాయ శాఖ ఈవో రాధకృష్ణ, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసులు తెలిపారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఆర్టీసీ అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని కోరినట్లు వారు పేర్కొన్నారు. దీంతో పాటు కర్ణాటక రాష్ట్రం బళ్లారి, శిరుగుప్ప డిపో పరిధి నుంచి కర్ణాటక ఆర్టీసీ బస్సులు నడపనున్నారు. కేవలం జాతర రోజే కాకుండా వారం రోజుల పాటు యథావిధిగా బస్సులు తిరిగేలా చర్యలు చేపట్టాలని అధికారులకు విన్నవించారు.

● ఆలయ కార్యనిర్వహణాధికారి రాధకృష్ణ మాట్లాడుతూ.. 'ఈ నెల 21 నుంచి ప్రారంభం కానున్న జోడు రథోత్సవం పురస్కరించుకొని ఆలయంలో అన్ని ఏర్పాట్లు చేశాం. భక్తులకు ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక వరసలు, భక్తులు ప్రత్యేక పూజలు చేసేందుకు, మొక్కులు చెల్లించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాం. రథోత్సవం విజయవంతం అయ్యేలా ప్రతి ఒక్కరు సహకరించాలి' అని అన్నారు.

● ఎస్సై ఈశ్వరరావు మాట్లాడుతూ.. 'మూడు రోజుల పాటు జరిగే ఉత్సవాలకు పోలీసు సిబ్బందితో ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేస్తున్నాం. ఇప్పటికే అన్ని సిబ్బందికి పలు విషయాలు సూచించాం. గ్రామస్థులతో పాటు జాతర తిలకించేందుకు వచ్చిన భక్తులు పోలీసులకు సహకరించి విజయంతం అయ్యేందుకు కృషి చేయాలి' అని పేర్కొన్నారు.

బాల బందీలకు విముక్తి

➤ పని చేస్తున్న చిన్నారులను గుర్తించేందుకు ప్రత్యేక డ్రైవ్

నంద్యాల రైతునగరం, న్యూస్‌టుడే: బాల కార్మిక వ్యవస్థ నిర్మూలించడానికి జిల్లా టాస్క్‌ఫోర్స్ కమిటీలు ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహిస్తున్నాయి. 14 ఏళ్ల లోపు పిల్లలతో పనులు చేయిస్తున్న యాజమాన్యాలను గుర్తించి, వారిపై కఠిన చర్యలు తీసుకుంటున్నారు. ఆర్థిక పరిస్థితులు, నిరక్షరాస్యత

దుకాణాల్లో బాల కార్మికుల కోసం డ్రైవ్ నిర్వహిస్తున్న టాస్క్‌ఫోర్స్ బృందం

కారణంగా తల్లిదండ్రులు వారి పిల్లలను పనులకు పంపుతున్నారు. బడుల్లో గడపాల్సిన బాల్యం బందీగా మారుతోంది. ఏటా అధికారులు దాడులు నిర్వహిస్తున్నా వారి సంఖ్య తగ్గడం లేదు. బాల కార్మికుల కోసం ప్రత్యేక డ్రైవ్‌ను నిర్వహిస్తున్నారు. జిల్లాలో బాలల పరిరక్షణ, ఛైల్డ్ లైన్, రెవెన్యూ, పోలీసు, కార్మిక, విద్య శాఖల అధికారులు బృందంగా ఏర్పడి టాస్క్‌ఫోర్స్ కమిటీని ఏర్పాటు చేస్తున్నారు. నంద్యాల జిల్లాలో పలు దుకాణాలు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు, టీకొట్లు, ఇటుకల బట్టీలు తదితర ప్రాంతాల్లో తనిఖీలు చేపడుతున్నారు.

ఏడాది	గుర్తించిన చిన్నారులు
2023	52
2024	13
2025	23

2 నెలల పాటు

నంద్యాల జిల్లాలో జనవరి 26 నుంచి మార్చి 31 వరకు అధికారులు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి బాల కార్మికులకు గుర్తించే పనిలో నిమగ్నమయ్యారు. ఈ కార్యక్రమంలో బాల కార్మికుల నిర్మూలన గురించి ప్రజలకు అవగాహన కల్పిస్తారు. ఎవరైనా బాల కార్మికులను పనిలో పెట్టుకుంటే వారు శిక్షార్హులవుతారని తెలియజేస్తున్నారు. గుర్తించిన బాల కార్మికులకు విముక్తి కల్పిస్తున్నారు. భిక్షాటన చేస్తున్న 14 ఏళ్లలోపు చిన్నారులను చేరదీసి పాఠశాలల్లో చేర్పిస్తున్నారు. 18 ఏళ్లలోపు వారిని ఓపెన్ ఇంటర్, ఒకేషన్ కోర్సులలో చేర్పిస్తున్నారు. బాల కార్మికులను పనిలో పెట్టుకున్న వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటున్నారు. గత 3 ఏళ్ల కాలంలో 88 మంది బాల కార్మికులను గుర్తించి రూ.2 లక్షల జరిమానాలు విధించినట్లు కార్మిక శాఖ సహాయ కమిషనర్ బషీరున్నిసా బేగం తెలిపారు. బాల కార్మికుల గురించిన సమాచారాన్ని 1098కు తెలియజేయాలన్నారు.

ప్రతిధ్వనించిన ఓంకారనాదం

బండిఆత్మకూరు, న్యూస్‌టుడే: మహాశివరాత్రిని పురస్కరించుకొని నల్లమల అభయారణ్యంలో వెలసిన ఓంకార పుణ్యక్షేత్రంలో మంగళవారం రథోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఛైర్మన్ చెన్నారెడ్డి, ఈవో నాగప్రసాద్ ఆధ్వర్యంలో ఆలయ పూజారులు రథానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆ తర్వాత రథోత్సవాన్ని ప్రారంభించారు. రథాన్ని లాగేందుకు ప్రజలు, భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి తరలివచ్చారు. కార్యక్రమంలో తెదేపా మండల అధ్యక్షుడు లాయర్ కృష్ణారెడ్డి, నందిపాటి నరసింహారెడ్డి, పెప్సీ నాగేశ్వరరెడ్డి, అల్లె ఈశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఓంకార క్షేత్రం

తిలకిస్తున్న భక్తజనం

హుండీ లెక్కించగా.. రూ. 2. 11 లక్షలు వచ్చినట్లు ఆలయ ఈవో నాగప్రసాద్, ఛైర్మన్ చెన్నారెడ్డి తెలిపారు. మహాశివరాత్రి సందర్భంగా ఆలయంలో ఏర్పాటు చేసిన హుండీలను లెక్కించారు.

కమనీయం.. ఉమామహేశ్వరుడి వైభవం

యాగంటి (బనగానపల్లి గ్రామీణం), న్యూస్‌టుడే: బనగానపల్లి మండల పరిధిలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన యాగంటి ఉమామహేశ్వరస్వామి రథోత్సవం మంగళవారం ఘనంగా జరిగింది. ఆలయ ఛైర్మన్ మౌళీశ్వరరెడ్డి, ఆలయాధికారి పాండురంగారెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన బీసీ ఇందిరమ్మ రథోత్సవాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కోలాటం, చెక్కభజన భక్తులను ఆకట్టుకుంది.

ఆలయాలకు కెనరా బ్యాంక్ రూ.21.26 లక్షల విరాళం

మహానందిలో ఏఈవోకు చెక్‌ను అందజేస్తున్న జీఎం మిథన్తయా తదితరులు

మహానంది, న్యూస్‌టుడే: ఉమ్మడి కర్నూలు జిల్లాలోని పలు ఆలయాల్లో అవసరాల నిమిత్తం రూ. 21. 26 లక్షలను విరాళంగా అందిస్తున్నట్లు కెనరా బ్యాంక్ తిరుపతి రీజియన్ జీఎం ఐపీ మిథన్తయా తెలిపారు. మంగళవారం ఆయన మహానందికి వచ్చిన ఆయన ఆలయ ఏఈవో ఎర్రమల మధుకు చెక్కును అందజేశారు. మహానంది క్షేత్రానికి రూ. 2. 26 లక్షలు, మంత్రాలయానికి రూ. 5 లక్షలు, రుద్రవరం మండలం ముత్తలూరు గ్రామంలో వాటర్ ఫిల్టర్ నిర్మాణానికి రూ. 10 లక్షలు, అహోబిళం క్షేత్రానికి రూ. 2 లక్షలు, యాగంటి క్షేత్రానికి రూ. 2 లక్షలు విరాళంగా అందజేశామని వివరించారు. కార్యక్రమంలో కర్నూలు ఆర్ఎం సుశాంత్‌కుమార్, నంద్యాల చీఫ్ మేనేజర్ అనంత్, రికవరీ సెక్షన్ ఇన్‌ఛార్జి రమణారెడ్డిలు పాల్గొన్నారు.

సౌత్‌జోన్ క్రికెట్ పోటీల్లో.. చిత్తూరు, కర్నూలు జట్ల విజయం

కడప క్రీడలు, న్యూస్‌టుడే: ఏసీఏ సౌత్‌జోన్ అండర్-12 అంతర్ జిల్లాల వన్డే క్రికెట్ పోటీల్లో చిత్తూరు, కర్నూలు జట్లు గెలిపొందాయి. కర్నూలు జట్టు సభ్యుడు గోవర్ధన్‌రెడ్డి సెంచరీ చేశాడు. అలాగే కడప, చిత్తూరు, కర్నూలు క్రీడాకారులు యోగాంజనేయులు, భానువర్షిత్‌రెడ్డి, గోకుల్‌సాయి, ధనుష్, నీలేష్ అర్ధ సెంచరీలు చేసి రాణించారు. వైఎస్‌ఆర్‌ఆర్-ఏసీఏ స్టేడియం, కేఎస్‌ఆర్ఎం క్రికెట్ మైదానంలో మంగళవారం క్రికెట్ పోటీలు జరిగాయి.

చిత్తూరుదే గెలుపు

వైఎస్‌ఆర్‌ఆర్-ఏసీఏ స్టేడియంలో జరిగిన మ్యాచ్‌లో చిత్తూరు జట్టు 16 పరుగుల తేడాతో గెలుపొందింది. టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ చేసిన ఆ జట్టు నిర్ణీత 35 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 220 పరుగులు చేసింది. జట్టులో గోకుల్ సాయి 95, ధనుష్ 65 పరుగులు చేశారు. 221 పరుగుల విజయ లక్ష్యంతో బ్యాటింగ్‌ను ఆరంభించిన కడప జట్టు 33.3 ఓవర్లలో 203 పరుగులు చేసి ఆలౌట్ అయ్యింది. జట్టులో యోగాంజనేయులు 86, భానువర్షిత్‌రెడ్డి 54 పరుగులు చేసినప్పటికీ జట్టును గెలిపించలేకపోయారు. చిత్తూరు బౌలర్లలో పునీత్‌సాయిరెడ్డి 4, భువన్‌సాయి 3 వికెట్లు తీసుకున్నారు.

కర్నూలు జట్టు ఆధిపత్యం

సెంచరీ చేసిన కర్నూలు బ్యాట్స్‌మెన్ గోవర్ధన్‌రెడ్డి

ఈ టోర్నమెంట్‌లో కర్నూలు జట్టు రెండో విజయాన్ని నమోదు చేసుకుంది. మొదటి మ్యాచ్‌లో చిత్తూరుపై గెలుపొందిన ఆ జట్టు కేఎస్‌ఆర్ఎం క్రికెట్ మైదానంలో మంగళవారం జరిగిన మ్యాచ్‌లోనూ అనంతపురం జట్టుపై 156 పరుగుల భారీ తేడాతో గెలుపొంది రెండో విజయాన్ని తన ఖాతాలో నమోదు చేసుకుంది. ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచిన కర్నూలు జట్టు తొలుత బ్యాటింగ్ చేసి నిర్ణీత 35 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 261 పరుగులు చేసింది. జట్టులో గోవర్ధన్ రెడ్డి 131 పరుగులు, నిలేష్ 84 పరుగులు చేసి ఆ జట్టుకు భారీ స్కోరు అందించారు. ఆపై అనంతపురం జట్టు 35 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 125 పరుగులు మాత్రమే చేసింది. జట్టులో తౌఫిక్ 33, హన్షిక్ రెడ్డి 24 పరుగులు చేశారు. కర్నూలు బౌలర్లలో సూర్య, ఖలీద్ మూడు వికెట్లు తీసుకోగా వరుణ్‌కుమార్‌కు 2 వికెట్లు దక్కాయి.

జేఈఈలో నవోదయం

● ప్రత్యేక శిక్షణతో 33 మంది ప్రతిభ
● సత్తా చాటిన బనవాసి జవహర్ విద్యార్థులు

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: జేఈఈ మెయిన్-2026 తొలి సెషన్ ఫలితాల్లో బనవాసి జవహర్ నవోదయ విద్యార్థులు మెరిశారు. ఈ ఏడాది కొత్తగా ఇక్కడ 39 మందికి శిక్షణ ఇచ్చారు. కర్నూలు నవోదయ-సీఈవో-అవంతి (సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ అవంతి) ప్రారంభించిన మొదట ఏడాదిలో ఉత్తమ ఫలితాలు సాధించడం విశేషం. రాష్ట్రంలోని 13 జిల్లాలకు చెందిన విద్యార్థులు ఇక్కడ శిక్షణ పొందుతున్నారు. ప్రభుత్వం వీరికి ప్రత్యేకంగా శిక్షణతోపాటు అన్ని వసతులు కల్పించింది. వీటిని విద్యార్థులు సద్వినియోగం చేసుకుని సత్తా చాటారు.

విద్యార్థి పేరు	★
పర్సంటైల్	%
ప్రాంతం	✤
లక్ష్యం	➾

ప్రత్యేక కేంద్రం ఏర్పాటు

ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా బనవాసి జవహర్ నవోదయలో ప్రత్యేక కేంద్రం ఏర్పాటు చేసి రాష్ట్రవ్యాప్తంగా ఉన్న విద్యార్థులకు శిక్షణ ఇస్తోంది. ఈ నేపథ్యంలో ఇటీవల జరిగిన జేఈఈ మొదటి సెషన్‌లో అజయకుమార్‌రెడ్డి (98.22), శ్రీకుమార్ (98.1), జితేంద్రరెడ్డి (97.74) ప్రతిభ చాటారు. మొత్తం 33 మంది మంచి పర్సంటైల్ తెచ్చుకున్నారని ప్రిన్సిపల్ పద్మావతి తెలిపారు. హైదరాబాద్ రీజినల్ స్థాయిలో ఎక్కువమంది ఎంపికవడం కళాశాలకు ఎంతో గర్వకారణమన్నారు.

★ అజయకుమార్‌రెడ్డి
% 98.22 ✤ మార్కాపురం
➾ బాంబే ఐఐటీలో సీటు సాధించి సాఫ్ట్‌వేర్ రంగంలో రాణించడం.

★ శ్రీకుమార్
% 98.1
✤ తూర్పు గోదావరి
➾ దిల్లీ ఐఐటీలో సీఎస్ఈ చేసి సాఫ్ట్‌వేర్ ఇంజినీరు అవడం..

★ ఆదిత్య
% 96.32
✤ విజయనగరం
➾ కేరళలోని ఎన్ఐటీలో చదువుకోవడమే ఆశయం.

★ జితేంద్రరెడ్డి
% 97.74
✤ కర్నూలు
➾ జేఈఈ అడ్వాన్స్‌లో ప్రతిభ చాటి బాంబే ఐఐటీలో సీటు సాధించడం..

★ పేరమ్మ
% 96.49
✤ ఒంగోలు
➾ జేఈఈ మెయిన్ రెండో విడతకు సిద్ధమవుతున్నా. మద్రాసు ఐఐటీలో చేరడమే లక్ష్యం.

★ హేమంత్ నాయక్
% 96.75
✤ కడప
➾ మద్రాసు ఐఐటీలో చదివి సాఫ్ట్‌వేర్ ఇంజినీరుగా రాణిస్తా.

సందడిగా గార్దభాల పోటీలు

కడమలకాల్వ(బండిఆత్మకూరు), న్యూస్‌టుడే: మహాశివరాత్రి పురస్కరించుకొని కడమలకాల్వ గ్రామంలో శివనందిలో ఏర్పాటు చేసిన గార్దభాల పోటీలు సందడిగా సాగాయి. పోటీల్లో కడప జిల్లా మిట్టపల్లె గ్రామానికి చెందిన నరసయ్య గార్దభం 28.105 రౌండ్లు తిరిగి ప్రథమ స్థానం కైవసం చేసుకున్నట్లు నిర్వాహకులు పాపయ్య, మదన భూపాల్ తెలిపారు. ఆలయ ఛైర్మన్ మద్దిగారి పుష్పరాజు చేతుల మీదుగా విజేతలకు నగదును అందజేశారు. ఎస్సై జగన్‌మోహన్ వలి, మల్లికార్జున, ఎల్లయ్య, శేఖర్, అక్బర్ పాల్గొన్నారు.

గడ్డిమందు తాగి వృద్ధుడి మృతి

గడివేముల, న్యూస్‌టుడే: మద్యం మత్తులో గడ్డిమందు తాగి వృద్ధుడు మరణించినట్లు ఎస్సై నాగార్జునరెడ్డి తెలిపారు. పెసరవాయి గ్రామానికి చెందిన వడ్డె చిన్నవెంకటేశ్వర్లు(73) ఈనెల 13న మద్యం మత్తులో గడ్డిమందు తాగాడు. చికిత్స కోసం నంద్యాల వైద్యశాలకు తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం కర్నూలు వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మరణించినట్లు చెప్పారు.

ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేసిన భాజపా

◆ ప్రతిపక్ష హోదా కావాలనే జగన్ దీనిపై నోరు విప్పరు ◆ పీసీసీ అధ్యక్షురాలు షర్మిల విమర్శ

ఈనాడు, కర్నూలు : కేంద్రంలోని భాజపా ప్రభుత్వం ఉపాధిహామీ పథకాన్ని నిర్వీర్యం చేసి, దాని స్థానంలో వీబీ జీ రామ్ జీ చట్టాన్ని తెచ్చి రాష్ట్రాలపై భారం మోపిందని పీసీసీ అధ్యక్షురాలు వై.ఎస్.షర్మిల విమర్శించారు. మహాత్మా గాంధీ ఉపాధిహామీ చట్టాన్ని యథాతథంగా అమలు చేయాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన 'ఉపాధిహామీ పరిరక్షణ యాత్ర'లో భాగంగా కర్నూలు శివారులోని గార్గేయపురంలో మంగళవారం నిర్వహించిన బహిరంగ సభలో ఆమె మాట్లాడారు. కొత్త చట్టం ప్రకారం 40 శాతం నిధులను రాష్ట్ర ప్రభుత్వమే భరించాల్సి ఉందన్నారు. అంత భారాన్ని భరించడం రాష్ట్రాలకు కష్టంగా మారుతుందన్నారు. దేశవ్యాప్తంగా కోట్ల మందికి ఉపాధి కల్పిస్తున్న కీలక పథకాన్ని పూర్తిగా ఎత్తేయాలని భాజపా కుట్రలు పన్నుతోందని ఆరోపించారు. జీ రామ్ జీ చట్టం గుత్తేదారులకు కార్మికులను సరఫరా చేసేలా ఉందని వివరించారు. ప్రతిపక్ష హోదా కావాలని అడిగే జగన్‌మోహన్‌రెడ్డి దీనిపై నోరు విప్పడం లేదని ధ్వజమెత్తారు. మోదీ అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై కాంగ్రెస్ పార్టీ మాత్రమే పోరాటం చేస్తోందని గుర్తుచేశారు. కాంగ్రెస్ చేస్తున్న ఉద్యమానికి ప్రజల నుంచి మద్దతు కావాలని విజ్ఞప్తి చేశారు. ట్రంప్‌తో మోదీ చీకటి ఒప్పందం చేసుకున్నారని పేర్కొన్నారు. అమెరికా వ్యవసాయ ఉత్పత్తులపై సున్నా పన్ను విధిస్తే మన దేశ రైతులు తమ పంట ఉత్పత్తులను ఎక్కడ విక్రయించాలని ప్రశ్నించారు. సీడబ్ల్యూసీ సభ్యుడు కొప్పుల రాజు మాట్లాడుతూ ఉపాధిహామీ పథకంతో గ్రామాల్లో వలసలు ఆగాయని గుర్తుచేశారు.

గార్గేయపురం సభలో మాట్లాడుతున్న పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల

చర్చికి రాలేదని వాహనం అడ్డగింత

గార్గేయపురంలో నిర్మాణంలో ఉన్న చర్చికి రావాలని చందు అనే వ్యక్తి షర్మిల వాహనాన్ని అడ్డగించడంతో కాసేపు ఉద్రిక్తత తలెత్తింది. కార్యక్రమం షెడ్యూలులో చర్చికి వెళ్లే అంశం లేకపోవడంతో సభ అనంతరం ఆమె వాహనంపై కర్నూలు వైపు బయలుదేరారు. ఆమె ప్రయాణిస్తున్న వాహనం ముందుకు వెళ్లకుండా చందు అడ్డుగా నిల్చోవడంతో పాటు వాహనాన్ని చేతులతో గట్టిగా కొట్టడంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. ఆయన్ను అక్కడి నుంచి పక్కకు తీసుకెళ్లడంతో వివాదం సద్దుమణిగింది.

మహిళ ఆత్మహత్య

నంద్యాల గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని భీమవరం గ్రామానికి చెందిన మహబూబ్‌బీ(40) పట్టణ శివారులోని చిన్న చెరువులో దూకి ఆత్మహత్యకు పాల్పడినట్లు గ్రామీణ సీఐ ఈశ్వరయ్య తెలిపారు. గ్రామానికి చెందిన మహిళ భర్త నూర్‌అహమ్మద్‌తో తరచూ గొడవపడేది. మంగళవారం భర్తతో గొడవపడి పుట్టిల్లు అయిన బండిఆత్మకూరు మండలం బీ కోడూరు గ్రామానికి వెళ్తున్నట్లు ఇరుగు పొరుగువారికి చెప్పింది. నంద్యాలకు వచ్చి చిన్నచెరువులో దూకి ఆత్మహత్యకు పాల్పడిందన్నారు. భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

అయినవారే అంతమొందించారు

◆ వీడిన వనికిందిన్నె హత్య కేసు మిస్టరీ

ఆళ్లగడ్డ, న్యూస్‌టుడే : శిరివెళ్ల మండలం వనికిందిన్నెలో ఈనెల 13వ తేదీన జరిగిన చిటికెల వెంకటేశ్వర్లు హత్య కేసు మిస్టరీ వీడింది. అయినవారే హత్య చేశారు. ఈ కేసు వివరాలను డీఎస్పీ కె.ప్రమోద్ కుమార్ తన కార్యాలయంలో మంగళవారం వెల్లడించారు. హత్యకు గురైన వెంకటేశ్వర్లుకు భార్య, పిల్లలు లేరు. అతను తన అన్న భార్య మరియమ్మతో సన్నిహితంగా ఉండేవాడు. వెంకటేశ్వర్లుకు ఎవరూ లేకపోవడంతో ఆస్తి మొత్తం తమకే దక్కుతుందని వెంకటేశ్వర్లుకు వరుసకు తమ్ముడయ్యే హుస్సేనికి చెందిన ముగ్గురు కుమారులు చిటికెల దస్తగిరి, చిటికెల పెద్ద పక్కీరయ్య, చిటికెల రాముడు ఆశపడ్డారు. ఈనెల 13న హతుడు, నిందితులు కలిసి మద్యం తాగారు. మద్యం మత్తులో వెంకటేశ్వర్లు దూషించడం.. ఆస్తి మొత్తం మరియమ్మకే రాసిస్తానని చెప్పడంతో హుస్సేని కుమారులు ఆగ్రహానికి గురయ్యారు. వెంకటేశ్వర్లును హత్య చేస్తే ఆస్తి మొత్తం తమకే దక్కుతుందన్న ఉద్దేశంతో అదే రోజు రాత్రి అతని ఇంటికెళ్లి రోకలిబండతో కొట్టి చంపారు. ఇంట్లో ఉన్న రూ. 50 వేలు తీసుకెళ్లారు.

వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ ప్రమోద్ కుమార్

రోకలిబండ పట్టించింది..

వెంకటేశ్వర్లును హత్య చేసిన తర్వాత కేసును పక్కదోవ పట్టించడమేకాక.. ఆ నేరం మరియమ్మకు సంబంధించిన వారిపైకి వెళ్లేలా నిందితులు ప్రయత్నించారు. హత్యకు ఉపయోగించిన రోకలిబండను ఊరి సమీపంలోని కాలువలో కాల్చేశారు. నిందితుల్లో ఒకరైన దస్తగిరి.. తన ఇంట్లోని రోకలి బండను హతుడి ఇంట్లో ఉంచాడు. ఈ రోకలి బండపై మరియమ్మ అనుమానం వ్యక్తం చేయగా పోలీసులు ఈ దిశగా విచారణ జరపగా.. అది దస్తగిరిదిగా తేలింది. వెంటనే అదుపులోకి తీసుకుని విచారించగా ముగ్గురు అన్నదమ్ముల పాత్ర బయట పడింది. ఆస్తి వేరొకరికి దక్కుతుందన్న స్వార్థంతోనే కుమారుల వరుసయ్యేవారే హత్య చేశారని డీఎస్పీ తెలిపారు. కేసు విచారణలో భాగంగా పోలీసు జాగిలం నిందితుల ఇళ్ల వద్దకు వెళ్లడమేకాక హత్య సమయంలో ఉపయోగించిన చొక్కాను సైతం గుర్తించిందని చెప్పారు. ఈ సమావేశంలో సీఐ రాము, పోలీసులు పాల్గొన్నారు.

రహదారి ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

ప్యాపిలి, న్యూస్‌టుడే : ప్యాపిలి పట్టణ సమీపంలో జాతీయ రహదారి వద్ద సోమవారం అర్ధరాత్రి ఆటోను లారీ ఢీకొన్న ఘటనలో ఆటో డ్రైవర్ మృతి చెందారు. ప్యాపిలి పట్టణానికి చెందిన మధుసూదన్ (34) తన ఆటోలో గుత్తి నుంచి ప్యాపిలికి వస్తున్నారు. జాతీయ రహదారి ప్రాంతంలో వైభవ్ దాబా వద్ద యూటర్న్ తీసుకుంటుండగా డోన్ నుంచి అనంతపురం వైపు వెళుతున్న లారీ ఆటోను బలంగా ఢీకొంది. ఆటో పల్టీలు కొట్టడంతో మధుసూదన్ తలకు తీవ్రగాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం డోన్ ప్రభుత్వాసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో చనిపోయారు. అతనికి భార్య లావణ్య, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి వార్ల దేవస్థానం
శ్రీశైలం-518 101, నంద్యాల జిల్లా.
ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన
ఆర్.సి.నెం.84/44814/2026 08-02-2026
శ్రీశైల దేవస్థానము సంబంధించి 2026-27 అనగా 01-05-2026 నుండి 30-04-2027 వరకు ఈ దేవస్థానమునకు అవసరమైన (1) ఎం.పి.ఫామ్స్, (2) స్టేషనరీ వస్తువులు మరియు బయోడిగ్రేడబుల్ కవర్లు సరఫరా చేయుటకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండర్లు కోరబడుచున్నవి. తేది: 20-02-2026 నుండి టెండరు షెడ్యూళ్లను డౌన్‌లోడ్ చేసుకొనవచ్చును.
టెండరు నిబంధనలు మరియు పూర్తి వివరములకు www.apeprocurement.gov.in ద్వారా తెలుసుకొనగలరు. అవసరమైన సమాచారము కొరకు 99634 40246, 94413 35756 కార్యాలయ వేళలలో సంప్రదించవచ్చును.
శ్రీ స్వామి అమ్మవార్ల సేవలో...
యం.శ్రీనివాస రావు, స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ మరియు కార్యనిర్వహణాధికారి

EENADU Classifieds
BUSINESS SERVICES
BUSINESS OFFER
బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్, ఫైనాన్స్‌లో తాకట్టులో ఉన్నవి మా డబ్బుతో విడిపించి కొనబడును. (రిటైర్డ్ పోలీస్ డిపార్ట్మెంట్) గోల్డెన్ ట్రేడింగ్ కం. ✆73821 14647.
JOBS
Wanted Teachers for Reputed Schools in A.P & Telangana, Contact: Sneha Placements Service. Ph: 94402 46409.
Wanted PRO Qualification any Inter/ Degree. Vani Multi Speciality Hospitals, Dhone. ✆ 95155 59593.
కర్నూలు కొరియర్ లాజిస్టిక్ లో పనిచేయుటకు 1 సంవత్సరం అనుభవం ఉన్న కొరియర్ డెలివరీ బాయ్స్ కావలెను. సంప్ర: 85558 37909.
త్రినేత్ర హోంకేర్‌లో వృద్ధులను/ పేషెంట్స్‌ను/ పిల్లలను చూసుకొనుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఫ్రీ వసతి, భోజనం. జీ: 18K. ✆ 85209 80099, 85208 74499
ప్రముఖ రియల్ ఎస్టేట్ కంపెనీకి 10మంది మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్, టీమ్‌లీడర్స్, టెలికాలర్ కావలెను. తేజేశ్వర్‌రెడ్డి సెల్: 62811 96419, 94941 91951.
HKMCFAP కర్నూలు పుల్లూరు స్టేజ్ (అన్నా క్యాంటీన్) ఆఫీసులో పనిచేయుటకు ఎగ్జిక్యూటివ్స్ (డిగ్రీ) & అనుభవం కల్గిన వంట మనిషి కావలెను. ✆ 81214 57873.
Team Leadersగా కర్నూలు, నంద్యాల ఏరియాలలో on role / off role లో M/F కావలెను. PF+ జీతం, Q: డిగ్రీ/ MBA, MCA ✆ 94403 51657.
సిమెంట్ కంపెనీల యందు సెక్యూరిటీ గార్డుగా పనిచేయుటకు వ్యక్తులు కావలెను జీతం 18వేలు, 22వేలు, 25వేలు, 28వేలు మాజీ సైనికులకు 30వేలు ✆ 90521 24024, 94943 64596.
హరేకృష్ణ హోంకేర్‌లో వృద్ధులను/ పేషంట్స్‌ని/ పిల్లలను చూసుకొనుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఫ్రీవసతి, భోజనం జీ: 18-20K ✆ 96404 68899, 96402 58899.
Rize Academy లో జాబ్ కర్నూలులో చేయుటకు టెలికాలర్స్ కావలెను. అర్హత, అనుభవానికి జీతం ఉండును. సంప్ర: 88864 44720, 79818 86828.
అన్నిరకాల బిజినెస్ వ్యవహారాలు
B/W 5 లైన్ల ప్రకటన రూ. 470/- మాత్రమే.
కలర్ 5 లైన్ల ప్రకటన రూ. 555/- మాత్రమే.
ప్రకటనలపై 5% GST వర్తించును.
వివరాలకు: 99899 97628
గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్‌లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

(c) eenadu

నంద్యాల

•నంద్యాల •నందికొట్కూరు •శ్రీశైలం •పాణ్యం

ఘనంగా శ్రీదుర్గాభోగేశ్వరుని రథోత్సవం

రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

గడివేముల, న్యూస్‌టుడే: శ్రీదుర్గాభోగేశ్వరుని రథోత్సవం ఘనంగా నిర్వహించారు. భక్తులు భారీగా పాల్గొని రథాన్ని లాగారు. స్వామి అమ్మవార్లకు అభిషేక అర్చనలు చేశారు. సాయంత్రం స్వామి అమ్మవార్లను రథంపై అధిరోహించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ శ్రీనివాసరెడ్డి, ఆలయ ఛైర్మన్ కంది శ్రీనివాసులు, కార్యనిర్వహణాధికారి చంద్రశేఖరరెడ్డి, తెదేపా నాయకులు వెంకటశివుడు, సీఐ కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎస్సై నాగార్జునరెడ్డి, అర్చకులు శ్యామసుందరశర్మ, గిరిధర్, తదితరులు పాల్గొన్నారు.

పట్టణంలో ఆక్రమణలు తొలగిస్తాం

నంద్యాల పురపాలకం, న్యూస్‌టుడే: నంద్యాల పట్టణంలోని అన్ని ప్రాంతాల్లో ఆక్రమణలు తొలగిస్తామని, మురుగు సమస్యలు లేకుండా చర్యలు చేపడుతున్నామని పురపాలక కమిషనర్ బండి శేషన్న స్పష్టం చేశారు. పట్టణంలోని ఆత్మకూరు బస్టాండ్ వద్ద మంగళవారం ఆయన పర్యటించారు. ఆక్రమణలు తొలగింపును దగ్గరుండి పరిశీలించారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
నందికొట్కూరు : 94403 61729
ఆత్మకూరు : 90149 09024
నంద్యాల : 98853 28120

పగిడ్యాల,న్యూస్‌టుడే: ?: పగిడ్యాలలోని అంబేడ్కర్ సర్కిల్ ఎదుట నిలిచిన మురుగునీరు, వ్యర్థాలను తొలగించండి. - **నాగన్న, స్థానికుడు** ✔: పారిశుద్ధ్య కార్మికులను పంపి మురుగు తొలగించేందుకు చర్యలు తీసుకుంటాం. - **పెరుమాళ్లు శేషన్న,సర్పంచి**

నంద్యాల పురపాలకం, న్యూస్‌టుడే: ?: పట్టణంలోని హౌసింగ్‌బోర్డ్ కాలనీ, నౌమన్‌నగర్‌లో కాల్వలు శుభ్రం చేయడం లేదు. దోమల బెడద అధికంగా ఉంది. **-నాగనందయ్య, సలాం, స్థానికులు** ?: పట్టణంలోని కురువపేటలో కుక్కల బెడద అధికమైంది. **- శివరాం స్థానికుడు.**
✔: కాల్వలు శుభ్రం చేయించి, స్ప్రేయింగ్, ఫాగింగ్ చేయిస్తాం. కుక్కలను పట్టించి సమస్యను పరిష్కరిస్తాం.
- లక్ష్మీనారాయణశర్మ, శానిటరీ ఇన్‌స్పెక్టర్

వీరబ్రహ్మేంద్ర స్వామికి ప్రత్యేక పూజలు

నందికొట్కూరు, న్యూస్‌టుడే: నందికొట్కూరు పట్టణంలో శ్రీపోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి రథోత్సవం కనులపండువగా సాగింది. మంగళవారం సాయంత్రం బ్రహ్మంగారి మఠం వద్ద ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం రథంపై కొలువుదీర్చి మంగళవాయిద్యాలతో భక్తులు రథాన్ని ముందుకు లాగారు.

పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి రథోత్సవం

ప్రజా సమస్యల పరిష్కారంపై దృష్టి

★ పురపాలక కమిషనరుతో 'ఈనాడు' ఫోన్ ఇన్

ఆత్మకూరు పట్టణం, న్యూస్‌టుడే: పురపాలక సంఘంలో నెలకొన్న ప్రజా సమస్యల పరిష్కారంపై దృష్టిసారిస్తామని కమిషనర్ అవుకు ఓబులేసు స్పష్టం చేశారు. మంగళవారం 'ఈనాడు' ఆధ్వర్యంలో పురపాలక కమిషనరుతో ఫోన్ ఇన్ కార్యక్రమం నిర్వహించారు. ప్రజలు తమ కాలనీల్లో నెలకొన్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ఈ సమస్యలను ఇంజినీరింగ్, పారిశుద్ధ్య విభాగం అధికారులకు సూచించి పరిష్కరించాలని కమిషనర్ సూచించారు. కార్యక్రమంలో కార్యాలయ మేనేజర్ నాయక్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ జీవన్ కుమార్, ఏఈ పాషా రేష్మా పాల్గొన్నారు.

సమస్యలు నమోదు చేసుకుంటున్న కమిషనరు అవుకు ఓబులేసు

?: ఇందిరానగర్‌లో దైవసన్నిధి ప్రార్థన మందిరం వద్ద పైపులైను లీకైంది. - **ఓబులేసు, ఇందిరానగర్.**
?: పెద్దపీర్లవీధిలో పైపులైనుకు వాల్వ్ లేకపోవటం వల్ల నీళ్లు వృథాగా పోతున్నాయి. - **చాంద్‌బాషా, ప్రధానోపాధ్యాయులు.**
✔: లీకేజీలకు మరమ్మతులు చేయిస్తాం.

?: కస్తూర్బా లేఅవుట్‌లో నీటి సమస్య ఉంది. గతంలో ఫిర్యాదు చేసినా పరిష్కరించలేదు. - **రమణమ్మ, ఆత్మకూరు.**
✔: మోటార్లకు మరమ్మతులు చేసి నీటి సమస్య పరిష్కరిస్తాం.

?: ఇందిరానగర్‌లో చర్చి పక్కగా ఉన్న మినీ ట్యాంకుకు నీళ్లు సరఫరా చేయాలి. వేసవిలో నీటి సమస్య తలెత్తుతుంది. - **రాజేష్, ఇందిరానగర్.**
✔: మినీ ట్యాంకుకు నీళ్లు సరఫరా చేస్తాం.

?: సంతమార్కెట్ ప్రాంతంలో, రహ్మత్‌నగర్‌లో మక్కా మసీదు ఎదురుగా ఉన్న మురుగు కాల్వలో పూడిక, వ్యర్థాలు పేరుకుపోయాయి. దుర్వాసన వస్తోంది. - **హుసేన్, ఖలీలివీధి. -ఖాదర్ బాషా, రహ్మత్‌నగర్.**
✔: కాల్వలో పూడిక తొలగిస్తాం.

?: పాత బస్టాండులో నూతన సిమెంటు రోడ్డు ఎత్తడం, దిగడం కష్టంగా ఉంది. - **రహిమాన్, నేతాజీనగర్.**
✔: తాత్కాలికంగా తరలిస్తాం.

?: రంగమహల్ థియేటరు మార్గంలో డస్ట్‌బిన్ లేకపోవటంతో వ్యర్థాలను బహిరంగ ప్రదేశంలో పడేస్తున్నారు. పందులు, ఆవులు సంచరిస్తూ ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. - **రణధీర్, ఆత్మకూరు.**
✔: డస్ట్‌బిన్ ఏర్పాటు పరిశీలిస్తాం.

?: శ్రీశైలం దారిలో ఉన్న మైనార్టీ కాలనీలో వీధి దీపాలు లేవు. రాత్రివేళల్లో పాములు సంచరిస్తున్నాయి. - **హబీబుల్లా, ఆత్మకూరు.**
✔: వీధి దీపాలు ఏర్పాటు చేస్తాం.

?:కప్పలకుంటలో స్పీడు బ్రేకరు శిథిలమవడంతో గుంత ఏర్పడింది. వాహనదారులు కిందపడుతున్నారు. - **సుమంత్, కప్పలకుంట.**
✔: గుంతను పూడ్చివేయిస్తాం.

?: పుల్లారెడ్డి పాఠశాల ప్రదేశంలో మురుగు నీళ్లు అధికంగా నిలుస్తున్నాయి. బురదలో నడవడం ఇబ్బందిగా ఉంది. - **రమణ, తోటగేరి.**
✔: మురుగు కాల్వ నిర్మాణం పరిశీలిస్తాం.

?: ద్వారకా సాయినగర్‌లో సిమెంటు రహదారులు లేవు. గుంతలమయమైన రహదారిలో ప్రయాణం కష్టంగా ఉంది. - **రవి, ద్వారకాసాయినగర్.**
✔: సిమెంటు రహదారి నిర్మాణం పరిశీలిస్తాం.

ప్రైవేట్ పాఠశాలల్లో ఉచిత ప్రవేశం

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే: ఆర్‌టీఈ చట్టం ప్రకారం ప్రైవేట్, అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో బలహీన వర్గాలు, ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులకు కేటాయించే సీట్లకు దరఖాస్తులు కోరుతున్నట్లు ఎంఈవో బ్రహ్మం తెలిపారు. 2026-27 విద్యా సంవత్సరానికి సంబంధించి ప్రవేశం కోసం ఈనెల 20 నుంచి మార్చి 10వ తేదీ వరకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు మంగళవారం పేర్కొన్నారు.

మహానంది, న్యూస్‌టుడే: మహానంది మండలంలోని ప్రైవేటు పాఠశాలల్లో ఉచిత ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంఈవో-1 రామసుబ్బయ్య తెలిపారు. మంగళవారం మహానందిలోని ప్రభుత్వ గిరిజన ఆశ్రమ పాఠశాలలో ఆయన మాట్లాడారు. వివరాలకు టోల్‌ఫ్రీ నంబర్ 18004258599కు సంప్రదించాలని చెప్పారు.

మెరుగైన వైద్యం అందించాలి

నంద్యాల రైతునగరం, న్యూస్‌టుడే: ప్రభుత్వం ప్రజలకు మెరుగైన వైద్యం అందించేలా చర్యలు తీసుకోవాలని పీపుల్స్ హెల్త్ సొసైటీ నాయకులు రమేష్‌బాబు, లక్ష్మణ్ అన్నారు. పట్టణంలోని మున్సిపల్ టౌన్ హాల్‌లో మంగళవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో మద్దులు, రామచంద్రుడు, నరసింహ, వెంకటలింగం, బాల వెంకట్, మౌలాలి తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

బండిఆత్మకూరు, న్యూస్‌టుడే: వరి పంటలు సాగు చేసిన రైతులకు సాగునీటి ఇబ్బందులు కలుగకుండా త్వరితగతిన పనులు పూర్తి చేయాలని తెదేపా మండల అధ్యక్షుడు లాయర్ కృష్ణారెడ్డి అన్నారు.

నందికొట్కూరు, న్యూస్‌టుడే: నందికొట్కూరులోని వినియోగదారుడు కొన్న ఓ కంపెనీ బలవర్ధక పౌడర్ డబ్బాలో నల్లటి పురుగులు వచ్చాయి. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

నంద్యాల గ్రామీణం, న్యూస్‌టుడే: భీమవరం గ్రామంలో శెనగ పంటలో సీనియర్ గణాంకాల అధికారి సతీశ్ బాబు ఆధ్వర్యంలో వ్యవసాయ అధికారులు మూడు చోట్ల పంటకోత ప్రయోగాలు నిర్వహించారు.

పాణ్యం గ్రామీణం, న్యూస్‌టుడే: పిన్నాపురం గ్రామంలో ప్రాథమిక పాఠశాలకు గ్రామానికి చెందిన వెంకటనారాయణ, నాగరత్నమ్మ, పుల్లారెడ్డి, వెంకటేష్‌లు 10 కుర్చీలను వితరణ చేసినట్లు ప్రధానోపాధ్యాయులు సాల్మన్ తెలిపారు.

పాణ్యం గ్రామీణం, న్యూస్‌టుడే: విద్యార్థుల సృజనాత్మకత, నిర్మాణాత్మక ఆలోచనలు వెలికి తీసేందుకు శాంతిరాం ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో కళాశాలలో ఇన్నోవేషన్ షోకేస్ కార్యక్రమాన్ని నిర్వహించారు.

నంద్యాల పాతపట్టణం, న్యూస్‌టుడే: నంద్యాలలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ప్రముఖ నేత్ర వైద్య నిపుణులు సుదర్శన రెడ్డి సతీమణి రుక్మిణమ్మ 20 మంది దివ్యాంగులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

నందికొట్కూరు గ్రామీణం, న్యూస్‌టుడే: సకాలంలో సర్వే పూర్తి చేయాలని పాములపాడు ఎంపీడీవో చంద్రశేఖర్ సచివాలయ సిబ్బందికి సూచించారు.

నందికొట్కూరు గ్రామీణం: మల్యాల గ్రామంలో శివరాత్రి సందర్భంగా నిర్వహించిన కబడ్డీ పోటీలను తెదేపా మండల మాజీ సురేంద్రనాథ్‌రెడ్డి ప్రారంభించారు.

పాణ్యం గ్రామీణం, న్యూస్‌టుడే: పాణ్యంలోని ఏపీ కాలనీలోని ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు ఉచితంగా జోలో మాత్రలను ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్ అందజేశారు.

నంద్యాల రైతునగరం: పంచాయతీల్లో పని చేస్తున్న కార్మికులకు పీఎఫ్ అమలు చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఏసురత్నం, గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి రామాంజనేయులు డిమాండు చేశారు.

పాణ్యం గ్రామీణం, న్యూస్‌టుడే: పాణ్యంలోని పురాతనమైన పాణికేశ్వరస్వామి తిరుణాళ్లలో చిన్నారుల కోలాటం అలరించింది.

అడ్డుపెట్టి.. అలాగే వదిలేసి..

నంద్యాల పట్టణంలో ఈనెల 5 నుంచి 9వ తేదీ వరకు తిక్కస్వామి ఉరుసు జరిగింది. దీంతో సాయిబాబానగర్ నుంచి దేవనగర్ వెళ్లే కూడలిలో ట్రాఫిక్ నియంత్రణ కోసం పోలీసులు రోడ్డుపై బ్యారికేడ్లు ఏర్పాటు చేశారు. ఉరుసు ముగిసినా వాటిని తొలగించకపోవడంతో వాహనదారులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. వీటిని తొలగించాలని కోరుతున్నారు.
– న్యూస్‌టుడే, నంద్యాల రైతునగరం

పడితే.. ప్రమాదమే..

పట్టణంలోని తహసీల్దారు కార్యాలయానికి వెళ్లే మార్గంలో వ్యవసాయశాఖ ప్రహరీని ఆనుకుని ఉన్న నియంత్రిక దిమ్మె ప్రమాదకరంగా ఉంది. దిమ్మెను మురుగు కాల్వపైనే నిర్మించారు. కాల్వ గోడ కూలిపోవడంతో నియంత్రిక అడుగు భాగంలో ఉన్న మట్టి, రాళ్లు కాల్వలో పడిపోతున్నాయి. దీంతో దిమ్మె ఒకవైపు ఒరిగిపోతోంది. దిమ్మె కూలిపోతే విద్యుత్తు ప్రమాదం జరిగే అవకాశం ఉంది. కొత్త దిమ్మె నిర్మించి నియంత్రికను మార్చటం లేదు. –న్యూస్‌టుడే, ఆత్మకూరు పట్టణం

రైతు సేవాకేంద్రం.. పునాదులకే పరిమితం

మండలంలోని భీమవరం గ్రామంలో ఉన్న రైతు సేవా కేంద్రం పునాదులకే పరిమితమైంది. గత వైకాపా ప్రభుత్వం రూ.21.8లక్షల నిధులు మంజూరు చేసింది. నిధులు సకాలంలో విడుదల చేయకపోవడంతో గుత్తేదారు పనులను పునాదుల్లోనే ఆపేశారు. కొత్త ప్రభుత్వం కూడా నిధులు మంజూరు చేయకపోవడంతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గ్రామానికి ఎరువుల లారీ వస్తే ప్రైవేటు గోదాములో ఉంచాల్సిన పరిస్థితి నెలకొంది.
–న్యూస్‌టుడే, నంద్యాల గ్రామీణం

మొక్కే కదాని.. వదిలేస్తే ముప్పే..

నంద్యాల పట్టణంలోని బైరమల్ వీధిలో ఉన్న పురపాలక దుకాణాల భవనాల గోడలకు మొక్కలు మొలకెత్తాయి. వాటిని ఎవరూ పట్టించుకోకపోవడంతో అలానే పెరుగుతున్నాయి. ఎక్కువగా పెరిగితే గోడలకు బీటలు వచ్చే అవకాశం ఉంది. భవనాలు కూడా శిథిలావస్థకు చేరుతాయి. దీంతో ప్రమాదం ఏర్పడుతుందని స్థానికులు భయపడుతున్నారు. – న్యూస్‌టుడే, నంద్యాల పురపాలకం

కష్టపడ్డారు.. సాధించారు..

నంద్యాల పాతపట్టణం, నంద్యాల గాంధీచౌక్, న్యూస్‌టుడే: నంద్యాల పట్టణానికి చెందిన విద్యార్థులు జేఈఈ పరీక్షలో ప్రతిభ చాటారు. జేఈఈ మెయిన్ మొదటి విడత పరీక్షలో మంచి పర్సంటైల్ సాధించారు. ఇంజినీరింగ్ విద్యలో రాణించడమే లక్ష్యంగా ముందుకెళ్తున్నారు. కష్టపడి చదివి భవిష్యత్తుకు బాటలు వేసుకున్నారు. తల్లిదండ్రుల ప్రోత్సాహం, గురువుల తోడ్పాటుతో అనుకున్న లక్ష్యాన్ని చేరుకున్నామని విద్యార్థులు తెలిపారు.

● విద్యార్థి
✪ పర్సంటైల్
❒ ప్రాంతం
✦ భవిష్యత్ లక్ష్యం
★ తల్లిదండ్రులు

● పి. శ్రీవర్ధన్‌రెడ్డి
❒ నంద్యాల ఎస్‌బీఐ కాలనీ
✦ కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ విభాగంలో పరిశోధనలు
★ పి. లక్ష్మీకాంత్‌రెడ్డి, రమాదేవి
✪ 99.965

● తన్వీర్
❒ నంద్యాల ఎన్జీవో కాలనీ
✦ కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ విభాగంలో పరిశోధనలు
★ మౌలాలీ, హసీనా
✪ 99.992

● మనిషా
❒ సోమయాజులపల్లె
✦ ఐఐటీ బాంబేలో ఇంజినీరింగ్
★ బాలనరసింహుడు, వసంత
✪ 99.23

● జయవర్ధన్‌రెడ్డి
❒ బాలకొండ హాల్, నంద్యాల
✦ సాఫ్ట్‌వేర్ ఇంజినీరు
★ వెంకటేశ్వరరెడ్డి, సౌదామిని
✪ 99.90

● అంజన్‌బాషా
❒ నంద్యాల పట్టణం, ఎస్బీఐ కాలనీ
✦ ఐఏఎస్ చదవాలని ఉంది.
✪ 99.416

● బాలిరెడ్డి
❒ టంగుటూరు
✦ సీఎస్ఈ ఇంజినీరింగ్
★ వెంకటరెడ్డి, స్వప్న
✪ 99.151

ఆత్మకూరు పురపాలక కమిషనరు సస్పెన్షన్

ఆత్మకూరు పట్టణం, న్యూస్‌టుడే: ఆత్మకూరు పురపాలక సంఘం కమిషనరుగా పని చేస్తూ ఏసీబీకి పట్టుబడిన రమేష్‌బాబును సస్పెండ్ చేస్తూ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. రమేష్‌బాబు ఈ నెల 5వ తేదీన రూ.20 లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు దాడి చేసి పట్టుకుని కోర్టులో ప్రవేశపెట్టడంతో రిమాండు విధించారు. ఈ నెల 6వ తేదీ నుంచే కమిషనరును సస్పెండ్ చేసినట్లుగా పరిగణిస్తామని ఉత్తర్వుల్లో పొందుపరిచారు.

పవర్ లిఫ్టింగ్ పోటీల్లో బాలికల సత్తా

మిడుతూరు, న్యూస్‌టుడే: కర్నూలులోని ఔట్‌డోర్ స్టేడియంలో ఈనెల 13-15 తేదీల్లో జరిగిన రాష్ట్రస్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీల్లో మిడుతూరు కేజీబీవీ బాలికలు సత్తా చాటారు. పాఠశాల నుంచి 12 మంది బాలికలు ఈ పోటీల్లో పాల్గొనగా ప్రథమ స్థానంలో ఒకరు, ద్వితీయ స్థానంలో నలుగురు, 3వ స్థానంలో ఏడుగురు నిలిచినట్లు పీడీ సుమలత తెలిపారు. ఈ సందర్భంగా కేజీబీవీలో మంగళవారం జరిగిన ఒక ప్రత్యేక కార్యక్రమంలో ప్రిన్సిపల్ విజయలక్ష్మి బాలికలను అభినందించారు.

పతకాలు సాధించిన బాలికలతో ప్రిన్సిపల్ విజయలక్ష్మి, పీడీ సుమలత

రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

మహానంది, న్యూస్‌టుడే: రైతు శ్రేయోభివృద్ధే కూటమి ప్రభుత్వ ధ్యేయమని నంద్యాల జిల్లా కేసీకెనాల్ ప్రాజెక్టు ఛైర్మన్ బన్నూరు రామలింగారెడ్డి పేర్కొన్నారు. మహానందిలో మంగళవారం రాష్ట్రస్థాయి ఎద్దుల బండలాగు పోటీలను నంద్యాల తెదేపా నాయకులు ఎన్.ఎం.డి.ఫయాజ్ ప్రారంభించారు. కార్యక్రమంలో నిర్వాహకులు మాలపాటి పుల్లయ్య చౌదరి, తెదేపా నాయకులు బుడ్డారెడ్డి శ్రీనివాసరెడ్డి, మండల తెదేపా అధ్యక్షులు కంచెర్ల శివశంకరచౌదరి తదితరులు పాల్గొన్నారు. బాపట్ల జిల్లా వేటపాళెం గ్రామానికి చెందిన శివక్రిష్ణ చౌదరి, ఆర్.కె.బుల్స్ శిరిషా చౌదరి వృషభాలు ప్రథమ స్థానాన్ని దక్కించుకున్నాయి.

మహానందిలో పోటీలు ప్రారంభిస్తున్న బన్నూరు రామలింగారెడ్డి

హోరాహోరీగా బండలాగుడు పోటీలు

బండిఆత్మకూరు, న్యూస్‌టుడే: మండల పరిధిలోని క్రిష్ణనంది ఆలయంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి బండలాగుడు పోటీలు మంగళవారం హోరాహోరీగా సాగాయి. ఈ పోటీలను ఎస్సై జగన్‌మోహన్ ప్రారంభించారు. మహానంది మండలం తిమ్మాపురం గ్రామానికి చెందిన మనోహర్‌రెడ్డి, సాయీశ్వర్ వృషభాలు ప్రథమ స్థానంలో నిలిచినట్లు నిర్వాహకులు శ్రీనివాసులు, చలమయ్య, టి.శ్రీనివాసులు తెలిపారు.

గడివేముల, న్యూస్‌టుడే: భోగేశ్వరంలో బండలాగుడు పోటీలను మాజీ ఎంపీపీ శ్రీనివాసరెడ్డి, మల్కిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి ప్రారంభించారు. పోటీల్లో జూలెపల్లె భాస్కరరెడ్డి వృషభాలు ప్రథమస్థానంలో నిలిచాయి. కార్యక్రమంలో నిర్వాహకులు గిరిబాబు, ఈశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహిళా సాధికారతపై అవగాహన అవసరం

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే: జిల్లా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో కరపత్రాలను ఆవిష్కరించారు. మార్చి 7 న విజయవాడలో నిర్వహించనున్న మహిళా దినోత్సవ మహాసభకు సంబంధించిన కరపత్రాలను స్థానిక సంఘం కార్యాలయంలో జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు ప్రభావతమ్మ ఆవిష్కరించారు. సంఘం జిల్లా కార్యవర్గ సభ్యులు నాగేంద్రప్ప, శ్రీనివాసులు, పాల్గొన్నారు.

కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ప్రభుత్వ ఉద్యోగుల సంఘం నాయకులు

ఆర్డీవో కార్యాలయ గదికి కన్నం

ఆత్మకూరు, న్యూస్‌టుడే: ఆత్మకూరు ఆర్డీవో కార్యాలయం ప్రాంగణంలోని ఓ గదికి గుర్తుతెలియని దుండగులు కన్నం వేశారని ఆర్డీవో నాగజ్యోతి తెలిపారు. కార్యాలయంలోని అన్ని గదులకు 8 సీసీ కెమెరాలు ఉన్నా సిగ్నల్స్ సమస్య వల్ల అవి పనిచేయలేదన్నారు.

భూ బదలాయింపు జరగని స్థలానికి వీఎల్టీ

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే: పట్టణంలోని నూనెపల్లె భూమి బదలాయింపు జరగని స్థలానికి మున్సిపల్ అధికారులు పన్ను వేశారు. ఈ విషయాన్ని గుర్తించిన మాజీ ఎమ్మెల్యే భూమా బ్రహ్మానందరెడ్డి మంగళవారం స్థలం వద్దకు చేరుకుని యజమానితో మాట్లాడారు. భూమి బదలాయింపునకు దరఖాస్తు చేసుకోలేదని సమాధానం ఇవ్వడంతో మున్సిపల్ కమిషనర్ శేషన్నతో భూమా మాట్లాడారు. ల్యాండ్ కన్వర్షన్ లేని స్థలానికి వీఎల్టీ ఎలా ఇచ్చారని ప్రశ్నించారు. కానీ సరైన సమాధానం మాత్రం రాలేదు.

స్వయం ఉపాధితో సుస్థిరాభివృద్ధి

ఆత్మకూరు, న్యూస్‌టుడే: మహిళా సాధికారతతో సుస్థిర ఉపాధి సాధ్యమౌతుందని డీఆర్‌డీఏ పీడీ శ్రీధర్‌రెడ్డి అన్నారు. డీఆర్‌డీఏ-వెలుగు ఆధ్వర్యంలో కరివేన, నల్లకాల్వ గ్రామంలో వెదురు ఆభరణాల తయారీపై స్వయం సహాయక సంఘాల మహిళలకు శిక్షణనిచ్చారు. తక్కువ పెట్టుబడితో ఇంటి వద్ద నుంచే ఆదాయం పొందే అవకాశం ఉందన్నారు. నల్లకాల్వ గ్రామంలో 15 ఎకరాల విస్తీర్ణంలో వెదురుతోట ఈ కార్యక్రమానికి ప్రేరణగా నిలిచిందన్నారు.

శిక్షణ పొందిన మహిళలతో డీఆర్‌డీఏ సిబ్బంది

నైపుణ్యాలను పెంపొందించుకోవాలి

నంద్యాల విద్య, న్యూస్‌టుడే: విద్యార్థులు నైపుణ్యాలను పెంచుకుని ఉన్నత స్థానాలకు చేరుకోవాలని డీఈవో జనార్దన్‌రెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలోని టౌన్‌హాల్‌లో నంది బాలోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డీఈవోతో పాటు వైద్యులు రాకేష్‌రెడ్డి, క్రాంతిచైతన్య, గురురాజా విద్యాసంస్థల కరస్పాండెంట్ మౌలాలిరెడ్డి, భాస్కర్‌లు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. వారు మాట్లాడుతూ..సృజనాత్మకతను వెలికితీయడానికి బాలోత్సవాలు దోహదపడుతాయన్నారు. కార్యక్రమంలో నంది బాలోత్సవాల రాష్ట్రనాయకులు రామరాజు, సమన్వయకర్త మౌలాలి, గురుస్వామి, న్యాయవాది శంకరయ్యప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న డీఈవో జనార్దన్‌రెడ్డి

సమన్వయంతో ముందుకు వెళ్లాం

నందికొట్కూరు, న్యూస్‌టుడే: ఇంటి నిర్మాణం విషయంలో హౌసింగ్, సచివాలయం సిబ్బంది సమన్వయంగా ముందుకు సాగాలని హౌసింగ్ డీఈ నాగరాజు సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం సొంతింటి కల నెరవేర్చేందుకు లబ్ధిదారులకు సలహాలు సూచనలు ఇవ్వడమే కాకుండా వారు ఇంటి నిర్మాణాలు పూర్తి చేయించాలన్నారు. అసంపూర్తి నిర్మాణాలకు, ఇంటి నిర్మాణం చేయకున్నా బిల్లులు చెల్లిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో పురపాలక కమిషనర్ వెంకటరామిరెడ్డి, సచివాలయం ఇంజినీరింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

మహారాజశ్రీ నందికొట్కూరు జూనియర్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టులో
O.S.No: 74/2025
కె.శ్రీనివాసులు S/o కురువ నారాయణ, హిందూ, వయస్సు 49 సంవత్సరాలు, రిటైర్డు ఆర్మీ, ఇంటి నెం: 1-532, అల్లూరు రోడ్, సూర్యనగరు, నందికొట్కూరు (టౌన్ మరియు మండలం), నంద్యాల జిల్లా. - వాది
V/s
ఎస్.అతవుర్ రహిమాన్ S/o S.Md. ఇస్మాయిలు, ముస్లిం, వయస్సు 45 సం॥లు, ప్లేవుడ్ బిజినెస్, R/o తుమ్మలూరు (గ్రామం), పాములపాడు (మండలం), నంద్యాల (జిల్లా). - ప్రతివాది
ప్రతివాదికి దావా సమను
పై దావా కేసులో వాది అయిన కె.శ్రీనివాసులు ప్రతివాది అయిన ఎస్.అతవుర్ రహిమాన్ గారి మీద ప్రామిసరి నోటు బాకీ నిమిత్తం పై కోర్టులో దావా వేసియున్నారు. ఎన్నిసార్లు ప్రతివాదికి దావా సమన్లు కోర్టు నుంచి పంపిననూ ముట్టడం లేదు. కావున కోర్టు వారు పేపరు ప్రకటన ద్వారా దావా సమన్లు పంపుటకు ఉత్తర్వులిచ్చి ఉన్నారు. పై దావా కేసులో తేది: 24-03-2026 తేదీన ఉదయం 10.30 గంటలకు మీరు గాని, మీ తరఫున వకీలు ద్వారా గాని హాజరు కావలెనని తెలుపడమైనది.
వాయిదా తేది: 24-03-2026
(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)
ఎ.రహమతులా బేగ్
వాది తరఫు న్యాయవాది
నందికొట్కూరు- 518401.
సెల్: 9441402133.

విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపల్ జయచంద్రప్రసాద్

సౌత్‌జోన్ రగ్బీ పోటీలకు ఎంపిక

పాణ్యం గ్రామీణం, న్యూస్‌టుడే: సౌత్‌జోన్ రగ్బీ టోర్నమెంట్‌కు ఆర్జీఎం ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థినిలు ఎంపికైనట్లు ప్రిన్సిపల్ జయచంద్రప్రసాద్ తెలిపారు. మంగళవారం కళాశాలలో పోటీలకు ఎంపికైన విద్యార్థినిలను అధ్యాపకులు, సిబ్బంది అభినందించారు. గుంటూరులో నిర్వహించిన ఏపీ రగ్బీ అసోసియేషన్ మహిళా జట్టు ఎంపిక పోటీల్లో ఆర్జీఎం కళాశాలకు చెందిన తన్మయి, నవ్యశ్రీ, జయశ్రీసాయి ప్రతిభ కనపరిచారన్నారు. కళాశాల గేమ్స్ ఆర్గనైజింగ్ సెక్రటరీ, పీడీ వెంకటేష్, రాంనాయక్, పాల్గొన్నారు.

ఆకలితో చదువులు సాగేదెలా..!

నంద్యాల విద్య, న్యూస్‌టుడే: నంద్యాల నియోజకవర్గంలో 100 రోజుల ప్రణాళికలో భాగంగా విద్యార్థులకు ప్రతి రోజు ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. పదో తరగతి పరీక్షలకు నెల రోజుల సమయం ఉంది. పరీక్షలకు సన్నద్ధమయ్యేందుకు రోజుకు దాదాపు 10 గంటలకు పైగా విద్యార్థులు తరగతి గదిలో ఉంటున్నారు. సరైన పోషకాహారం అందక చదువుపై ఏకాగ్రత ఉంచలేక అవస్థలు పడుతున్నారు.

సాయంత్రం తగ్గుతున్న హాజరు

చాలా పాఠశాలల్లో సాయంత్రం విద్యార్థుల హాజరు తగ్గుతోంది. పాఠశాల అయిపోయిన తర్వాత 10 శాతం మంది విద్యార్థులు ఇళ్లకు వెళ్తున్నారు. బాలికలు చీకటి పడ్డాక ఇబ్బందిపడే పరిస్థితులు, తదితర కారణాలతో కొందరు గైర్హాజరవుతున్నారు. మరోవైపు 100 రోజుల ప్రణాళికకు సంబంధించిన ప్రత్యేక పుస్తకాలు అందడం లేదు. సబ్జెక్టు బోధించే ఉపాధ్యాయులకు ఒకే పుస్తకం ఇవ్వడంతో సమస్యలు ఉత్పన్నం అవుతున్నాయి. మిగిలినవి ఆన్‌లైన్‌లో పొందుపరిచారు. వాటిని ఉపాధ్యాయులు డౌన్‌లోడ్ చేసుకుని విద్యార్థులకు అందిస్తున్నారు. ఇలా అనేక ఇబ్బందుల మధ్య ప్రత్యేక తరగతుల బోధన జరుగుతోంది. ఇలాంటి ఇబ్బందులు కలగకుండా గతంలో అల్పాహారం ప్రభుత్వం అందజేసింది. ఈ ఏడాది అవి అందకపోవడంతో ఉదయం, సాయంత్రం విద్యార్థులకు పోషకాహారం అందించలేక పోతున్నారు.

కేవీఎం పురపాలక పాఠశాలలో ప్రత్యేక తరగతులు

ఉపాధ్యాయులే దిక్కు

కొన్ని పాఠశాలల్లో ప్రతి రోజు సబ్జెక్టు బోధించే ఉపాధ్యాయులే అల్పాహారం అందించేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నారు. ఉద్యోగులు, విద్యా కమిటీ ఛైర్మన్లు, ఉపాధ్యాయులు సేకరించిన సొమ్ముతోనే బిస్కట్లు, ఇతర స్నాక్స్‌లను అందజేస్తున్నారు. అలసిపోతున్న విద్యార్థులకు ఇది కొంత ఊరటగా అందిస్తున్నారు. అయితే ప్రభుత్వం, విద్యాశాఖాధికారులు దీనిపై దృష్టి సారించడం లేదు.

నంద్యాల మండలంలో
పాఠశాలలు: 22
పదో తరగతి విద్యార్థులు: 1510

గోస్పాడు మండలంలో
పాఠశాలలు: 05
విద్యార్థులు: 383

ప్రభుత్వానికి నివేదించాం

- జనార్దన్‌రెడ్డి, జిల్లా విద్యాధికారి

100 రోజుల ప్రణాళికలో భాగంగా విద్యార్థులకు సజావుగా తరగతులు నిర్వహిస్తున్నాం. పది పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులకు అల్పాహారం అందించే విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాం. 100శాతం ఫలితాల కోసం విద్యాశాఖ కృషి చేస్తుంది.

24వ వర్ధంతి

మంచికి మారుపేరుగా నిలిచి అందరి మనస్సులను ఆకట్టుకొని మమతానురాగాలను అందరికీ పంచి ఇచ్చి దైవసాన్నిధ్యాన్ని చేరి 24 సంవత్సరాల కాలం అయినప్పటికీ మీ ప్రేమ, అనురాగాలను మేము మరచి పోలేకున్నాము. మీ పవిత్ర ఆత్మకు పరిపూర్ణమైన శాంతిని చేకూర్చాలని భగవంతుని ప్రార్థిస్తూ... బాధాతప్త హృదయాలతో...

కీ॥శే॥ సాకె కుళ్లాయప్ప
LIC of India, Nandyal
జననం: 1-5-1946,
మరణం: 18-2-2002
ఇ.నెం. 28/812-U,
N.G.O's Colony, నంద్యాల

భార్య: సాకె లక్ష్మీదేవి
కుమారుడు: సాకె శ్రీనివాసులు
కోడలు: సాకె చంద్రలత
తమ్ముడు: సాకె సూర్యనారాయణ
మరదలు: సాకె సుశీల
మనుమళ్లు: సాకె హితేష్ అనురాగ్, MBBS, MD
సాకె నూతన్ అనుదీప్ M.Sc.(Clinical Psychology)
కోడలు: సాకె శాంతిప్రియ

(c) eenadu

ఆళ్లగడ్డ

• ఆళ్లగడ్డ • బనగానపల్లి • డోన్

న్యాయమైన సమస్యలు పరిష్కరించండి

సొసైటీ ఛైర్మన్‌కు సమ్మె నోటీసు ఇస్తున్న ఉద్యోగులు

బనగానపల్లి, న్యూస్‌టుడే: సహకార సొసైటీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని ఆ సంఘం అధ్యక్షుడు అబ్దుల్ మునాఫ్ డిమాండు చేశారు. సహకార సంఘాల సిబ్బంది మంగళవారం బానుముక్కల సహకార సంఘం ఛైర్మన్ అత్తార్ అబ్దుల్ కలాంకు సమ్మె నోటీసు ఇచ్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈనెల 27న గుంటూరులో సంఘం కమిషనర్ కార్యాలయం వద్ద వంటావార్పు చేపట్టనున్నట్లు తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా బెనిఫిట్స్ ఇవ్వాలని అన్నారు. సీఈవోలు డి.దస్తగిరి, మునమద్దిలేటి, ఏకాంబరం, పామీర్, సురేంద్రనాథ్‌రెడ్డి, శివారెడ్డి, మహేంద్రరెడ్డి పాల్గొన్నారు.

పరిశుభ్రత తప్పనిసరి

కోవెలకుంట్ల, న్యూస్‌టుడే: విద్యార్థులు తప్పనిసరిగా వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని జిల్లా మలేరియా అధికారి చంద్రశేఖర్‌రావు అన్నారు. కోవెలకుంట్లలోని సెయింట్ జోసఫ్ పాఠశాలలో మంగళవారం జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు మాత్రలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
ఆళ్లగడ్డ: 8008 574916
డోన్ పట్టణం: 94408 57790
బనగానపల్లి: 80085 73763

?: స్థానికంగా ఉన్న శివాలయం సమీపంలోని కాలనీలో వీధి దీపాలు వెలగడం లేదు. రాత్రివేళలో బయటకు రాలేని పరిస్థితి. - కుల్లాయి, కాలనీవాసి

✔: పరిశీలించి వీధి దీపాలు వెలిగేలా చర్యలు తీసుకుంటాం. - చంద్రమౌళేశ్వరగౌడ్, డిప్యూటీ ఎంపీడీవో - న్యూస్‌టుడే, కోవెలకుంట్ల

?: గోపాలపురం ప్రధాన రహదారిపై మురుగు నీరు నిలుస్తోంది. ఇబ్బందులు పడుతున్నాం. - హుసేని

✔: పారిశుద్ధ్య పనులు చేపట్టేలా చర్యలు తీసుకుంటాం. - నూరుహాన్, ఎంపీడీవో - న్యూస్‌టుడే, ఆళ్లగడ్డ గ్రామీణం

?: మండలంలోని యర్రగుంట్ల సినిమాహాల్ కాలనీలో సీసీ రహదారులు నిర్మించాలి. - హనుమంతయ్య

✔: సీసీ రహదారుల నిర్మాణానికి ఇప్పటికే ప్రతిపాదనలు పంపాం. - శ్రీనివాసశర్మ, డిప్యూటీ ఎంపీడీవో - న్యూస్‌టుడే, శిరివెళ్ల

ముత్తలూరు గ్రామాభివృద్ధికి చర్యలు

శుద్ధజల కేంద్రం ప్రారంభంలో జీఎం మిత్రన్యా తదితరులు

ముత్తలూరు (ఉయ్యాలవాడ), న్యూస్‌టుడే: మండలంలోని ముత్తలూరు గ్రామంలో రూ.10 లక్షలతో శుద్ధ జల కేంద్రం, సౌర వీధి దీపాలు ఏర్పాటు చేసినట్లు కెనరా బ్యాంకు తిరుపతి సర్కిల్ కార్యాలయ జనరల్ మేనేజర్ పాండురంగ మిత్రన్యా తెలిపారు. ఆయన మంగళవారం శుద్ధజల కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామానికి చెందిన లింగమూర్తి ప్రస్తుతం కెనరా బ్యాంకులో కార్పొరేట్ రిజనల్ హెడ్‌-3గా పనిచేస్తున్నారని.. తమ గ్రామాన్ని అభివృద్ధి చేయాలని కోరడంతో కార్పొరేట్ సామాజిక బాధ్యత కింద ముత్తలూరు గ్రామాన్ని దత్తత తీసుకుని అభివృద్ధి చేస్తున్నట్లు పేర్కొన్నారు. కర్నూలు బ్యాంక్ ఏజీఎం సుశాంత్, ఆంధ్రా బ్యాంకు మేనేజర్ సందీప్, సర్పంచి మహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

యాగంటి (బనగానపల్లి గ్రామీణం), న్యూస్‌టుడే: బనగానపల్లి మండలం యాగంటి ఉమామహేశ్వరస్వామి ఆలయంలో సీసీ కెమెరాలు, పరికరాలకు సంబంధించిన రూ.1,99,000 విలువ చేసే చెక్కును కెనరా బ్యాంకు అధికారులు మంగళవారం ఆలయానికి అందజేశారు.

అహోబిలం (ఆళ్లగడ్డ గ్రామీణం), న్యూస్‌టుడే: అహోబిలం మఠం పీఠాధిపతి రంగనాథ యతీంద్ర మహాదేశికన్‌ను కెనరా బ్యాంక్ తిరుపతి సర్కిల్ జీఎం మిత్రన్యా కలిశారు. ఆయన మంగళవారం అహోబిలం చేరుకుని ఎగువ, దిగువ ఆలయాల్లో స్వామి, అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

చమురు నిక్షేపాలకు తవ్వకాలు

క్రిష్టిపాడు (దొర్నిపాడు), న్యూస్‌టుడే: దొర్నిపాడు మండలం క్రిష్టిపాడు గ్రామ పరిసరాల్లో గత కొన్ని రోజులుగా చమురు నిక్షేపాల కోసం బోరు బావులు తవ్వుతున్నారు. డీజిల్, పెట్రోలు కోసం తవ్వుతున్నట్లు అధికారులు చెబుతున్నారు. 60 మీటర్ల దూరం చొప్పున.. 100 అడుగుల లోతు మేర తవ్వకాలు చేపట్టారు. ఎలాంటి సమాచారం లేకుండా తవ్వకాలు చేస్తుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ విషయమై దొర్నిపాడు తహసీల్దారు సుభద్రను వివరణ కోరగా చమురు నిక్షేపాల పరిశీలన కోసం ఓఎన్‌జీసీ అధికారులు వచ్చారని.. రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు.

తాగునీటికి బోరుమనాల్సిందే

◆ కానరాని మరమ్మతులు ◆ ఆందోళనలో జనం

పరిశీలన

డోన్ పట్టణం, న్యూస్‌టుడే: డోన్ పట్టణంలోని పలు ప్రాంతాల్లో అక్కడక్కడా తాగునీటి సమస్యలు వేధిస్తున్నాయి. పలు కాలనీవాసులకు బోరు నీరే ఆసరా. కొన్ని ప్రాంతాల్లో అవి పనిచేయకపోవడంతో జనం ఇబ్బందులు పడుతున్నారు. పట్టణ పరిధిలో అధికారుల లెక్కల ప్రకారం 150 చేతి పంపులు ఉన్నట్లు అంచనా. ఇందులో 110 వరకు పనిచేస్తున్నాయి.. 40 వరకు పనిచేయడం లేదు.. అందుబాటులోని పంపుల వద్ద నీటి కోసం బారులు తీరుతున్నారు. క్షేత్రస్థాయిలో పరిశీలిస్తే చాలా ప్రాంతాల్లో పనిచేయడం లేదు. పట్టణంలోని కొత్తపేట, వైఎస్‌ఆర్ నగర్, పాతపేట, నెహ్రూ నగర్, టీచర్స్ కాలనీ, చిగురుమానుపేట, తారకరామనగర్, కేఈ కృష్ణమూర్తి నగర్, శ్రీనివాసనగర్ తదితర కాలనీల్లో చేతిపంపులు ఎక్కువగా ఉన్నాయి. ఆయా ప్రాంతాల్లో కొన్ని బోర్లు అందుబాటులో లేవు.

పట్టణంలో వార్డులు	32
జనాభా	75 వేలకుపైగా..
ఉన్న బోర్లు (అంచనా)	150

వేసవి సమీపిస్తున్నా..

☛ పట్టణంలోని కొండపేటలో రెండు, వైఎస్‌ఆర్ నగర్‌లో ఒక ప్రాంతంలో చేతి పంపులు పనిచేయడం లేదంటూ స్థానికులు అధికారులకు ఫిర్యాదు చేసినా మరమ్మతులు చేయలేదు. కేవీఎస్ కాలనీలో ప్రాథమిక పాఠశాల పక్కన బోరు ఉన్నప్పటికీ నిష్ప్రయోజనంగా మారింది.

కేవీఎస్ కాలనీలో మరమ్మతులకు నోచుకోని చేతి పంపు

☛ గతంలో వేసవికి ముందే సమ్మర్ యాక్షన్ ప్లాన్‌లో భాగంగా చేతి పంపులకు సంబంధించిన సామగ్రి కోసం ప్రతిపాదనలు పంపి తెప్పించుకునే వారు. ప్రస్తుతం ఆ పరిస్థితి కానరావడం లేదు.

☛ సామగ్రి గత కొంతకాలంగా తెప్పించడం లేదని.. ఎవరైనా ఫిర్యాదు చేస్తే పరిశీలించి ఏవి వస్తువులు అవసరమవుతాయో గుర్తించి అప్పటికప్పుడు తెప్పించి మరమ్మతులు చేయిస్తున్నట్లు మున్సిపల్ ఇంజినీరింగ్ అధికారులు పేర్కొంటున్నారు.

☛ చేతి పంపులు పనిచేయకుంటే మరమ్మతులు చేయించేందుకు ముగ్గురు సిబ్బందిని అధికారులు నియమించేవారు. ప్రస్తుతం పురపాలక పరిధిలో ఒక్కరే దిక్కయ్యారు. ఏడాది నుంచి ఒక్కరితోనే మరమ్మతులు చేయిస్తున్నారు.

☛ ఇందిరానగర్, పాతపేట, కేఈ కృష్ణమూర్తి నగర్, జంగాలకాలనీ తదితర ప్రాంతాల్లో మురుగు కాలువల పక్కనే చేతి పంపులున్నాయి. ఈ నేపథ్యంలో తాగునీరు కలుషితమవుతోందని స్థానికులు చెబుతున్నారు. పలు ప్రాంతాల్లో చివరికి ఈ నీటినే జనం తాగాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది.

సగానికిపైగా పనిచేయక..

బేతంచెర్ల నగర పంచాయతీ పరిధిలో 33 చేతి పంపులున్నాయి. అందులో 15 వరకు పనిచేస్తుండగా.. కొన్ని మరమ్మతులకు నోచుకోవడం లేదు. మరికొన్ని తుప్పు పట్టి పనికిరాకుండా ఉన్నాయి. [illegible] దృష్టి సారించాల్సి ఉంది. ఈ విషయమై మున్సిపల్ ఏఈ మధుతేజరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వానికి నివేదికలు పంపామని.. నిధులు మంజూరైన వెంటనే మరమ్మతులు చేపడుతామని పేర్కొన్నారు.
- న్యూస్‌టుడే, బేతంచెర్ల



బుగ్గానిపల్లెలో చేతి పంపు దుస్థితి

నాణ్యమైన విద్య అందించండి

బి.తండా (బేతంచెర్ల), న్యూస్‌టుడే: విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించి వారి అభివృద్ధికి కృషి చేయాలని ఎంఈవోలు సోమశేఖర్, అబ్రహం అన్నారు. బి.తండా గ్రామంలోని ప్రాథమిక పాఠశాలను మంగళవారం తనిఖీ చేశారు. ప్రభుత్వం అందిస్తున్న ఉచిత పాఠ్య పుస్తకాలు, యూనిఫామ్ తదితర వాటి వివరాలు అడిగి తెలుసుకున్నారు.

ముగిసిన గంగామాత ఉత్సవం

అవుకు, న్యూస్‌టుడే: అవుకులో వెలసిన గంగామాత ఆలయంలో మంగళవారం వార్షికోత్సవ వేడుకలు ముగిశాయి. ఆలయ నిర్మాణ దాత రమేష్ ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక అలంకరణ, పూజలు జరిపారు.

విద్యుత్తు విజిలెన్స్ అధికారుల దాడులు

చాగలమర్రి, న్యూస్‌టుడే: మండల వ్యాప్తంగా విద్యుత్తు విజిలెన్స్ అధికారులు మంగళవారం ఆకస్మిక దాడులు నిర్వహించారు. మండలంలోని గొట్లూరు, నేలంపాడు, చాగలమర్రి గ్రామాల్లో విద్యుత్ విజిలెన్స్ డీఈ గోపి, ఏడీ కృష్ణమూర్తి, సిబ్బంది తనిఖీలు జరిపారు. విద్యుత్తును అక్రమంగా వాడుతున్న 30 మందిపై కేసులు నమోదు చేసి రూ.2 లక్షలకుపైగా జరిమానా విధించారు.

ఒక వరుస.. రాకపోకలకు అవస్థ

ఆళ్లగడ్డ మండల పరిధిలోని పాతకందుకూరు గ్రామానికి ఒక వరుస రహదారి ఉండటంతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ మార్గంలో వైఎస్సార్ కడప జిల్లాలోని జమ్మలమడుగు, పులివెందుల ప్రాంతాలకు వాహనాలు అధిక సంఖ్యలో రాకపోకలు సాగిస్తుంటాయి. వాహనాలు ఎదురెదురుగా వచ్చినా.. వరి గడ్డి ట్రాక్టర్లు వెళ్లే సమయంలో రాకపోకలకు ఇబ్బందులు తప్పడం లేదు. రెండు వరుసల రహదారి కోసం గతంలోనే ప్రతిపాదనలు పంపామని.. మంజూరు కాలేదని ఆర్‌అండ్‌బీ ఏఈ వెంకటేశ్వర్‌రెడ్డి తెలిపారు. - న్యూస్‌టుడే, ఆళ్లగడ్డ గ్రామీణం

తవ్వేసి.. కష్టాల్లోకి నెట్టేసి

పురపాలక పరిధిలోని చిగురుమానుపేట కాలనీలోని వీధుల్లో సీసీ రహదారులు, మురుగు కాల్వలు అధ్వానంగా ఉన్నాయి. గతంలో పైపులైను పేరుతో యథేచ్ఛగా తవ్వేశారు. ఆ తర్వాత సిమెంటు పూత వేయాల్సి ఉండగా అలానే వదిలేశారు. ఫలితంగా జనం రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు పడుతున్నారు. వాహనాలు సైతం తిరగలేని పరిస్థితి ఏర్పడింది. వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని జనం విన్నవిస్తున్నారు. -న్యూస్‌టుడే, డోన్ పట్టణం

నిధులు అందక.. పనులు కదలక

మండల పరిధిలోని గొర్లగుట్ట ప్రాంతంలో గత ప్రభుత్వ హయాంలో చేపట్టిన విలేజ్ హెల్త్ క్లినిక్ పనులు మధ్యలో ఆగిపోయాయి. నిధులు రాకపోవడంతో పనులు ముందుకు సాగడం లేదు. దీంతో ఆరోగ్య సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు. వెంటనే ప్రభుత్వం స్పందించి నిధులు మంజూరు చేసి భవనాన్ని అందుబాటులోకి తీసుకురావాలని గ్రామస్థులు విన్నవిస్తున్నారు. - న్యూస్‌టుడే, బేతంచెర్ల

నియంత్రిక.. ప్రమాదకరంగా

కోవెలకుంట్లలోని గాంధీనగర్ కాలనీలో పాఠశాల విద్యార్థులకు ప్రమాదం పొంచి ఉంది. పాఠశాలలో 1 నుంచి 5 వరకు 67 మంది విద్యార్థులు చదువుతున్నారు. పాఠశాల ప్రవేశ మార్గం పక్కనే విద్యుత్తు నియంత్రిక ప్రమాదకరంగా ఉంది. కింది భాగంలోనే విద్యుత్తు తీగలు ఉండటంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. వెంటనే నియంత్రికను వేరే ప్రదేశానికి మార్చేలా చర్యలు తీసుకోవాలని పలువురు విన్నవిస్తున్నారు. - న్యూస్‌టుడే, కోవెలకుంట్ల

అహోబిలంలో పీఠాధిపతి ప్రత్యేక పూజలు



పూజలు నిర్వహిస్తున్న పీఠాధిపతి రంగనాథ యతీంద్ర మహాదేశికన్

అహోబిలం (ఆళ్లగడ్డ గ్రామీణం), న్యూస్‌టుడే: ప్రముఖ పుణ్యక్షేత్రం అహోబిలంలో పీఠాధిపతి రంగనాథ యతీంద్ర మహాదేశికన్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అహోబిలం మఠంలో స్వామిని సుప్రభాత సేవతో మేల్కొల్పి నిత్య ఆరాధనలు చేశారు. సకలదేవతామూర్తులను, స్వర్ణ మాలోల నృసింహస్వామిని పీఠాధిపతి పూజించి మహా మంగళహారతి అందించారు. భక్తులకు పీఠాధిపతి తీర్థప్రసాదాలు అందించారు. ఆలయ సీఏవో రామానుజన్, ప్రధానార్చకుడు కిడాంబి వేణుగోపాలన్, మనియార్ సౌమ్యనారాయణన్ పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

శిరివెళ్ల, న్యూస్‌టుడే: మండల పరిధిలోని యర్రగుంట్ల, శిరివెళ్ల, గోవిందపల్లె గ్రామాల్లోని ఉన్న ప్రైవేటు పాఠశాలల్లో 25 శాతం ఉచిత సీట్లకు సంబంధించి ప్రవేశాల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంఈవో నాగార్జునరెడ్డి మంగళవారం విద్యాహక్కు చట్టం ప్రకారం ఎస్సీ, ఎస్టీ, బీసీ, ముస్లిం మైనార్టీ పిల్లలకు 1వ తరగతిలో 25 శాతం ఉచిత ప్రవేశాలు కల్పించనున్నట్లు పేర్కొన్నారు. మార్చి 10వ తేదీ లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

చాగలమర్రి, న్యూస్‌టుడే: మండలంలోని ప్రైవేటు పాఠశాలల్లో 25 శాతం ఉచిత సీట్లకు సంబంధించి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు మండల విద్యాధికారులు శేషశయనారెడ్డి, నయామతుల్లా మంగళవారం తెలిపారు.

పిల్లల సంరక్షణ అందరి బాధ్యత

యనకండ్ల, ఎర్రగుడి (బనగానపల్లి గ్రామీణం), న్యూస్‌టుడే: బాలబాలికల సంరక్షణ అందరి బాధ్యత అని జిల్లా బాలల సంరక్షణ కార్యాలయాధికారి.. కౌన్సిలర్ సునీల్‌కుమార్ పేర్కొన్నారు. ఐసీడీఎస్ సూపర్‌వైజరు చిట్టెమ్మ ఆధ్వర్యంలో యనకండ్ల, ఎర్రగుడి గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో మంగళవారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. బాలల సంరక్షణ శాఖ సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య పనులు చేపట్టండి

కోవెలకుంట్ల, న్యూస్‌టుడే : కోవెలకుంట్లలో ప్రజలు వివిధ సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని.. వెంటనే పరిష్కరించాలని ప్రజాసంఘాల నాయకులు కోరారు. నంద్యాలలో డీఆర్‌వో రామునాయక్‌ను మంగళవారం కలిసి వినతిపత్రం అందించారు. పారిశుద్ధ్యం లోపించి దోమల బెడద ఎక్కువైందని చెప్పారు. సీపీఎం డివిజన్ కార్యదర్శి సుధాకర్, మానవహక్కుల సంఘం నాయకులు కరీంబాషా తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ఉరుసు

కోవెలకుంట్ల, న్యూస్‌టుడే: కోవెలకుంట్లలోని నూర్‌షావలి దర్గాలో ఉరుసును మంగళవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శివరాత్రి అనంతరం ఈ కార్యక్రమం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఉరుసు నేపథ్యంలో ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

పక్కాగా సర్వే వివరాల నమోదు

సమావేశంలో మాట్లాడుతున్న శివారెడ్డి

సంజామల, న్యూస్‌టుడే : గ్రామాల్లో జరిగే వివిధ సర్వేలను పక్కగా చేయాలని జిల్లా స్వర్ణగ్రామ, స్వర్ణ వార్డు జిల్లా ఇన్‌ఛార్జి అధికారి శివారెడ్డి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయాన్ని ఆయన మంగళవారం తనిఖీ చేశారు. అనంతరం పంచాయతీ కార్యదర్శులు, మహిళా పోలీసులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు తదితరులతో సమీక్షించారు. విధుల్లో అలసత్వం వహించకుండా జాగ్రత్త పడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సాల్మన్, ఏవో రామసుబ్బయ్య, జీఎస్‌డబ్ల్యూ మండల అధికారి సురేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

వాహనాల దారి మళ్లింపు

అవుకు, న్యూస్‌టుడే: అవుకులో మురుగు కాలువల నిర్మాణంలో భాగంగా అవుకు-కోవెలకుంట్ల రహదారిలో తిరిగే వాహనాలను దారి మళ్లించారు. కోవెలకుంట్ల వైపు నుంచి వచ్చే వాహనాలు ఓబులాపురం మీదుగా అవుకు చేరుకోవాలని, అవుకు నుంచి కోవెలకుంట్లకు వెళ్లే వాహనాలు సైతం అదే దారిలో వెళ్లాల్సి ఉంటుందని అధికారులు ప్రకటించారు. కాగా ఆర్టీసీ బస్సులను గ్రామం బయట ఆపుతుండటంతో జనం ఇబ్బందులు పడుతున్నారు. ప్రత్యేకించి వృద్ధుల పరిస్థితి దయనీయంగా మారింది.

నివాస సముదాయంలో మంటలు

డోన్ నేరవిభాగం, న్యూస్‌టుడే: పట్టణంలోని బీఎస్‌ఎన్‌ఎల్ క్వార్టర్స్‌లోని గదుల్లో మంగళవారం పొగలు వ్యాపించి మంటలు చెలరేగాయి. స్థానికులు గమనించి అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. వారు అక్కడికి చేరుకుని మంటలను ఆర్పేశారు. నివాస సముదాయంలోని ఓ గదిలో ఉన్న పాత ల్యాండ్ ఫోన్‌లు, వస్తువులు కాలిపోయాయి. వినియోగంలో లేని ఈ క్వార్టర్స్‌లోకి గుర్తుతెలియని వ్యక్తులు వెళ్లి నిప్పంటించినట్లు స్థానికులు తెలిపారు.

క్వార్టర్స్ నుంచి వస్తున్న పొగలు

విద్యుత్తు తీగల చోరీ

అవుకు, న్యూస్‌టుడే: వ్యవసాయ పంపుసెట్లకు అమర్చిన విద్యుత్తు తీగలు అపహరణకు గురైన ఘటన మంగళవారం అవుకులో జరిగింది. అవుకు సమీపంలోని పాలేరు వాగు తీరం వెంబడి పలువురు మోటార్లను అమర్చుకొని గొట్టపు మార్గం ద్వారా పొలాలకు సాగు నీరు అందిస్తున్నారు. వాగు తీరం వెంబడి దాదాపు 90 పంపుసెట్లు ఉన్నాయి. కాగా 60 పంపుసెట్లకు సంబంధించిన తీగలను దొంగలు కత్తిరించి తీసుకెళ్లినట్లు తెలిసింది. ఈ మేరకు బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

బీమాతో జీవితానికి ధీమా

ఆళ్లగడ్డ, న్యూస్‌టుడే: తపాలా బీమాతో జీవితాలకు ధీమా ఉంటుందని పోస్టల్ ఇన్‌స్పెక్టర్ రామనాథం అన్నారు. ఆయన మంగళవారం మాట్లాడుతూ ఆర్.కృష్ణాపురం గ్రామానికి చెందిన మనోహర్‌రెడ్డి మూడేళ్ల కిందట నెలకు రూ. 4,500 ప్రీమియం కట్టారని, ఆయన ఆకస్మాత్తుగా గుండెపోటుతో చనిపోయారని అన్నారు. నామినీగా ఉన్న ఆయన తల్లి శివపార్వతమ్మకు రూ. 6,26,475 విలువైన చెక్కు అందించామన్నారు. ప్రతి ఒక్కరూ తపాలా శాఖలో బీమా చేయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పోస్టుమాస్టర్ గురువయ్య, జనార్దన్, పెద్దరాజు తదితరులు పాల్గొన్నారు.

బీమా చెక్కు అందిస్తున్న పోస్టల్ ఇన్‌స్పెక్టర్ రామనాథం

సంక్షిప్త సమాచారం

మూడురాళ్లపల్లె (చాగలమర్రి), న్యూస్‌టుడే: మండలంలోని మూడురాళ్లపల్లె గ్రామంలో వెలసిన శ్రీదేవి, భూదేవి సమేత వెంకటేశ్వరస్వామి, సాయినాథ ఆలయాల వార్షిక మహోత్సవాలు, కల్యాణ మండపం ప్రారంభోత్సవ కార్యక్రమాలను బుధవారం నిర్వహిస్తున్నట్లు ఆలయ వ్యవస్థాపకులు పులిచిన్నఓబుల్‌రెడ్డి మంగళవారం తెలిపారు.

డి.వనిపెంట (చాగలమర్రి), న్యూస్‌టుడే: మండలంలోని డి.వనిపెంట గ్రామానికి చెందిన తెదేపా నేత, నీటి సంఘం మాజీ అధ్యక్షులు ఉండ్ర బాలనరసింహుడు (75) అనారోగ్యంతో చనిపోయారు. తెదేపా యువ నేత భూమా జగత్‌విఖ్యాత్‌రెడ్డి నివాళులర్పించారు.

ఉయ్యాలవాడ: మండలంలోని మూడు చెరువుల మరమ్మతులకు ఎఫ్‌డీఆర్ పథకం కింద రూ.13 లక్షలు విడుదలైనట్లు మైనర్ ఇరిగేషన్ ఏఈ రామ్‌ప్రసాదు మంగళవారం తెలిపారు.

శిరివెళ్ల, న్యూస్‌టుడే: పరిశుభ్రతతోనే రోగాలు దూరమవుతాయని పీహెచ్‌సీ వైద్యాధికారి ముఖేష్‌కుమార్, ఎంఈవో నాగార్జునరెడ్డి అన్నారు. నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని శిరివెళ్ల పీహెచ్‌పీ పరిధిలో 6,130 మంది విద్యార్థులకు మాత్రలు వేసినట్లు చెప్పారు.

వైభవంగా రథోత్సవం

డోన్, న్యూస్‌టుడే: మహాశివరాత్రి నేపథ్యంలో డోన్ పట్టణ సమీపంలోని కొత్తబుగ్గ, పాత బుగ్గరామలింగేశ్వరస్వామి ఆలయాల వద్ద మంగళవారం రథోత్సవం వైభవంగా నిర్వహించారు. మూడురోజుల పాటు ప్రత్యేక ఉత్సవాలు నిర్వహించిన అనంతరం శివపార్వతుల ఉత్సవ విగ్రహాలను రథంపై ఉంచి ఊరేగింపు నిర్వహించారు. అనంతరం ఉత్సవమూర్తులకు స్థానిక కోనేరులో తెప్పోత్సవం జరిపారు. ఎలాంటి ఘటనలు జరగకుండా డోన్ డీఎస్పీ శ్రీనివాసులు ఆధ్వర్యంలో ప్రత్యేక పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఆర్‌ఎస్ రంగాపురం (బేతంచెర్ల), న్యూస్‌టుడే: ఆర్‌ఎస్ రంగాపురం గ్రామ సమీపంలో వెలసిన ముచ్చట్ల మల్లికార్జున స్వామి ఆలయం వద్ద మంగళవారం సాయంత్రం రథోత్సవం నిర్వహించారు. ఈవో మద్దిలేటి, నిర్వాహకులు జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో స్వామి, అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. అనంతరం ఉత్సవమూర్తులను తేరుపై ఉంచి ఊరేగించారు. ఆర్యవైశ్య సంఘం, వాసవీ వనితాక్లబ్ ఆధ్వర్యంలో అన్నదానం ఏర్పాటు చేశారు.

రథోత్సవంలో పాల్గొన్న జనం

పనులు వేగంగా పూర్తి చేయండి

కోవెలకుంట్ల, న్యూస్‌టుడే : ఉపాధి హామీ పథకం మార్చితో పూర్తవుతుందని.. ఈలోపు పెండింగ్‌లో ఉన్న పనులు వేగంగా పూర్తి చేయాలని ఆ పథకం జిల్లా పీడీ సూర్యనారాయణ అన్నారు. స్థానిక వెలుగు కార్యాలయ ఆవరణలో బహిరంగ సామాజిక తనిఖీ సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. రూ. 23,400 దుర్వినియోగమైనట్లు తేల్చారు. దీనిని వెంటనే రికవరీ చేయాలని ఆదేశించారు.

దాతల చేయూత అభినందనీయం

సంజామల, న్యూస్‌టుడే : విద్యార్థుల విద్యాభివృద్ధికి సహకారం అందించడం అభినందనీయమని ప్రధానోపాధ్యాయులు మురళీకృష్ణ శాస్త్రి అన్నారు. మండలంలోని కానాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థుల విద్యాభివృద్ధికి ఉయ్యాలవాడ మండలం బోడెమ్మనూరుకు చెందిన ప్రవాస భారతీయుడు సగినేల రవీంద్రబాబు చేయూతనిస్తున్నారు. ఇందులో భాగంగా రూ. 5 వేల విలువ చేసే క్రికెట్ కిట్లను అందించారు. ఈ సందర్భంగా ఆయన్ను అభినందించారు.

పల్లకిపై నృసింహుడి విహారం

ఊరేగుతున్న ఉత్సవమూర్తులు

రుద్రవరం, న్యూస్‌టుడే: అహోబిలం లక్ష్మీనృసింహస్వామి పార్వేటోత్సవంలో భాగంగా మండల కేంద్రమైన రుద్రవరం గ్రామానికి మంగళవారం పల్లకి చేరుకుంది. గ్రామంలోని వివిధ తెలుపులపై కొలువుదీరిన ప్రహ్లాద వరదుడు, లక్ష్మీనృసింహస్వామికి ప్రజలు ప్రత్యేక పూజలు చేసి దర్శించుకున్నారు. స్వామిరాకతో గ్రామంలో పండగ వాతావరణం నెలకొంది.

ఆకట్టుకున్న బండలాగుడు పోటీలు

జ్ఞాపిక అందజేస్తున్న మౌళీశ్వరరెడ్డి, పాండురంగారెడ్డి తదితరులు

యాగంటి (బనగానపల్లి గ్రామీణం), న్యూస్‌టుడే: యాగంటి ఉమామహేశ్వరస్వామి శివరాత్రి ఉత్సవాల నేపథ్యంలో రైతు సంబరాల్లో భాగంగా బండలాగుడు పోటీలను మంగళవారం సైతం నిర్వహించారు. పోటీలకు ముఖ్య అతిథులుగా యాగంటి ఆలయ ఛైర్మన్ మౌళీశ్వరరెడ్డి, ఆలయాధికారి పాండురంగారెడ్డి హాజరై ప్రారంభించారు. విజేతలుగా నిలిచిన వృషభ యజమానులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు అమర్‌నాథ్‌రెడ్డి, మీరాపురం నారాయణరెడ్డి, పాతపాడు సర్పంచి మహేశ్వరరెడ్డి, శంకేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిత్య సాధన.. గెలుపు బాటన

■ వివిధ క్రీడల్లో విద్యార్థినుల ప్రతిభ

బేతంచెర్ల, న్యూస్‌టుడే : వారందరూ పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థినులు. పాఠశాల దశ నుంచే క్రీడలపై మక్కువ చూపారు. వారి ఆసక్తిని గమనించిన వ్యాయామ ఉపాధ్యాయులు శిక్షణ ఇవ్వడమేకాక నిరంతరం ప్రోత్సహించడం ప్రారంభించారు. ఈ నేపథ్యంలో వారు నిత్యం సాధన చేస్తూ క్రీడలపై పట్టు పెంచుకున్నారు. ఎక్కడ పోటీలు జరిగినా పాల్గొని పతకాలు గెలుచుకోవడం ప్రారంభించారు. జాతీయస్థాయి పోటీల్లో పాల్గొనడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నారు.

రూప.. పతకాలతో సత్తా

డోన్ పట్టణానికి చెందిన కె.రూప. బేతంచెర్ల ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో డీఏఐ విభాగంలో ద్వితీయ సంవత్సరం చదువుతోంది. ఆమె చదువుతోపాటు క్రీడల్లో రాణిస్తోంది. వ్యాయామ ఉపాధ్యాయుడి సహకారంతో పరుగు పందెం, షాట్‌పుట్, చదరంగం, లాంగ్‌జంప్‌లో శిక్షణ పొందింది. 2023, 2024, 2025 డిసెంబరులో నంద్యాల, విశాఖపట్నం, అనంతపురంలో జరిగిన రాష్ట్రస్థాయి చదరంగం, 200, 800 మీటర్ల పరుగు పందెం, షాట్‌పుట్, లాంగ్ జంప్ పోటీల్లో పాల్గొని బంగారు పతకాలు అందుకుంది. అంతర్జాతీయ స్థాయి పోటీల్లో తలపడి పతకాలు సాధించాలన్నదే తన ప్రధాన లక్ష్యమని రూప పేర్కొంది.

అఖిల.. పోటీల్లో మెరిసి..

బేతంచెర్ల ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో అఖిల ఏఐఎంఎల్ చదువుతోంది. ఆమె తల్లిదండ్రులు వ్యవసాయ కూలీలుగా పనిచేస్తూ అఖిలను చదివిస్తున్నారు. ఈ నేపథ్యంలో వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా అటు చదువులోనూ, ఇటు క్రీడల్లోనూ అఖిల రాణిస్తుండటం విశేషం. చిన్నప్పటి నుంచి పరుగు పందెం, షాట్‌పుట్‌పై దృష్టి పెట్టిన ఆమె పలు పతకాలు సొంతం చేసుకుంది. 2024 డిసెంబరులో రాష్ట్రస్థాయి పోటీల్లో బంగారు పతకం అందుకుంది. రాయలసీమ రీజియన్ స్థాయిలో విశాఖలో.. ఆ తర్వాత గతేడాది అనంతపురంలో జరిగిన 200, 400 మీటర్ల పరుగు పందెం పోటీల్లో ఆడి బంగారు పతకాలతోపాటు ప్రశంసా పత్రాలు అందుకుంది. రానున్న రోజుల్లో జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని సత్తా చాటేందుకు సిద్ధమవుతున్నట్లు అఖిల తెలిపింది.

మానసిక ఒత్తిడిని దూరం చేయాలి

సమావేశంలో మాట్లాడుతున్న ప్రిన్సిపల్ డా.లలిత

బనగానపల్లి, న్యూస్‌టుడే: విద్యార్థులు.. మానసిక ఒత్తిడికి గురికాకుండా చూడాలని ప్రిన్సిపల్ డాక్టర్ లలిత పేర్కొన్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అధ్యాపకులతో మంగళవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఆమె మట్లాడుతూ పరీక్షల ఒత్తిడి, భవిష్యత్తు ఆందోళన, ఆర్థిక సమస్యలు, కుటుంబ పరిస్థితుల నేపథ్యంలో విద్యార్థులు మానసిక ఒత్తిడికి గురయ్యే అవకాశముందని చెప్పారు. ఇలాంటి పరిస్థితికి విద్యార్థులను దూరంగా ఉంచే బాధ్యతను అధ్యాపకులు తీసుకోవాలని సూచించారు. త్వరలో పరీక్షలు జరగనున్నాయని.. విద్యార్థులు ప్రశాంతంగా రాసేలా వారిలో ధైర్యం నింపాలని పేర్కొన్నారు. నిత్యం వారి సమస్యలు తెలుసుకుంటూ అండగా నిలవాలని పేర్కొన్నారు. అనంతరం పలు అంశాలపై సమీక్షించారు.

గుర్తింపు సంఖ్యతో సేవలు సులభతరం

గుండంపాడు (శిరివెళ్ల), న్యూస్‌టుడే: పొలం ఉన్న ప్రతి రైతుకు ప్రత్యేక గుర్తింపు సంఖ్యను రాష్ట్ర ప్రభుత్వం అందిస్తోందని ఏవో సుధాకర్ తెలిపారు. గుండంపాడు గ్రామంలోని రైతు సేవా కేంద్రంలో రైతులకు ప్రత్యేక గుర్తింపు సంఖ్యపై మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే పథకాలు పొందాలంటే రైతులు తప్పనిసరిగా ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వీఏఏలు, ఎంపీఈవోలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

(c) eenadu

ఇద్దరు బాల నేరస్థుల పరారీ

రాయగడ పట్టణం, న్యూస్‌టుడే: అనుగుల్‌లోని ప్రత్యేక హోం నుంచి ఇద్దరు బాల నేరస్థులు పరారయ్యారు. తెరచి ఉంచిన డ్రైనేజీ కప్పు ద్వారా వీరు పరారైనట్లు నిర్వాహకులు గుర్తించారు. ఫిబ్రవరి 14న సాయంత్రం ఈ ఘటన జరిగినప్పటికీ రొటీన్ తనిఖీల సందర్భంగా మంగళవారం ఆలస్యంగా వెలుగు చూసింది. పరారైన వారిలో ఒకరు బాలేశ్వర్ జిల్లా జొపద పోలీసుస్టేషన్ పరిధికి చెందిన వారు కాగా, మరొకరు కటక్ జిల్లా టంగి స్టేషన్ పరిధికి చెందిన వాడిగా గుర్తించారు. ఎంత వెతికినా వీరి ఆచూకీ లభించకపోవడంతో హోం కౌన్సిలర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు వెల్లడించారు.

నిర్వాహకుల తప్పిదంతో విద్యార్థుల అవస్థలు

జిల్లా విద్యాధికారి మాయాధర్ సాహుకు సమస్య వివరిస్తున్న విద్యార్థి తల్లి

పర్లాఖెముండి, న్యూస్‌టుడే: పదో తరగతి సీబీఎస్‌ఈ విధానంలో మంగళవారం నుంచి పరీక్షలు ప్రారంభమయ్యాయి. నిర్వాహకుల తప్పిదంతో ఐదుగురు విద్యార్థుల భవిష్యత్తు అంధకారంలోకి వెళ్లింది. విద్యార్థి తల్లి జ్యోతి తెలిపిన వివరాల ప్రకారం.. కాశీనగర్ సమితిలోని 'స్మార్ట్ పబ్లిక్ స్కూల్‌'లో చదువుకుంటున్న తన కుమార్తె కె.జయ కుమారికు పరీక్ష ప్రవేశ పత్రం ఇవ్వకపోవడంతో పరీక్ష హాలుకు వెళ్లలేకపోయిందని వాపోయారు. ఈ విషయమై పాఠశాల యాజమాన్యాన్ని ప్రశ్నించగా ఆధార్ కార్డులో తప్పిదంతో ప్రవేశ పత్రం రాలేదని తెలిపినట్లు వివరించారు. ఈ విషయమై కలెక్టరుకు ఫిర్యాదు చేయడంతో జిల్లా విద్యాధికారి దీనిపై దర్యాప్తు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు.

మార్చి 7న రాష్ట్రానికి అమిత్‌షా



భువనేశ్వర్, న్యూస్‌టుడే: కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా మార్చి 7న కటక్ వస్తారని మంగళవారం అధికారవర్గాలు తెలిపాయి. అక్కడి సీఆర్పీఎఫ్ రైజింగ్ డే కార్యక్రమంలో పాల్గొంటారు. తర్వాత మావోయిస్టుల సమస్యపై ఉన్నతాధికారులతో సమీక్షిస్తారు.

విపక్షాల వాకౌట్

గవర్నరుతో అవాస్తవాలు చెప్పించారన్న నవీన్

భువనేశ్వర్, న్యూస్‌టుడే: శాసనసభలో మంగళవారం గవర్నరు కంభంపాటి హరిబాబు ప్రసంగిస్తున్న సమయంలో విపక్షాలు (బిజద, కాంగ్రెస్) సభ నుంచి వాకౌట్ చేశాయి. సభావరణలో విపక్షనేత నవీన్ పట్నాయక్ విలేకర్లతో మాట్లాడుతూ భాజపా పాలకులు గవర్నరుతో అవాస్తవాలు చెప్పించారని, వారు రాసిచ్చిన ప్రసంగాన్ని ఆయన చదివేశారని పేర్కొన్నారు. గవర్నరు ప్రసంగంలో వాస్తవాలు లేవని, రాష్ట్రంలో అభివృద్ధి శూన్యమని, ఎంతో పాలకులు చెప్పించింది అత్యంత దురదృష్టకరమని పేర్కొన్నారు. శాంతి భద్రతలు పూర్తిగా క్షీణించిపోయిన తరుణంలో అంతా బాగుందని చెప్పుకోవడం ఆశ్చర్యంగా ఉందన్నారు. ఇటీవల కాలంలో ఏ రాష్ట్రంలో జరగనన్ని ఘటనలు ఒడిశాలో జరిగాయన్నారు. గవర్నరు ప్రసంగంపై తాము తీవ్ర అసంతృప్తిగా ఉన్నట్లు నవీన్ చెప్పారు. కాంగ్రెస్ సభా పక్షం నేత రామచంద్ర కదం ఇలాగే స్పందించారు. గవర్నరు ప్రసంగం ఇంద్రజాలమైనట్లుగా కనిపిస్తోంది, వాస్తవ పరిస్థితి భిన్నంగా ఉందన్నారు.

వారిద్దరూ సభలోనే..

బిజద నుంచి సస్పెండైన అరవింద మహాపాత్ర్, సనాతన మహాకుడ్ స్థానాలు అసెంబ్లీలో మారాయి. వీరిద్దరికీ ఇండిపెండెంట్లుగా పరిగణించి వేరే సీట్లు కేటాయించారు. గవర్నరు ప్రసంగంపై విపక్షాలు అసంతృప్తి వ్యక్తం చేసి వెలుపలకు రాగా, అరవింద, సనాతన తమ స్థానాలు వీడలేదు. వాకౌట్ చేయలేదు.

ట్యాంకరును ఢీకొన్న బైక్

ముగ్గురి మృతి

ఘటనా స్థలంలో లారీ వెనక ద్విచక్రవాహనం

రాయగడ గ్రామీణం, న్యూస్‌టుడే: రోడ్డు పక్కన ఆగి ఉన్న ట్యాంకరును ఢీకొని ముగ్గురు మృతి చెందిన ఘటన టికిరి పోలీసుస్టేషన్ సమీపంలో సోమవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. ప్రమాదానికి సంబంధించి టికిరి ఐఐసీ దినకృష్ణ సాహు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మృతుల్లో కాశీపూర్ సమితి కురిగాం గ్రామానికి చెందిన గోవింద జోడియ తనయుడు నరేంద్ర జోడియ(25), మజాడియ కుమారుడు బిపిన్ జోడియ(14) జగజోడియ కుమారుడు జున జోడియ(15) ఉన్నారు. టికిరి సమీపంలో జరిగిన శివరాత్రి జాతరకు వెళ్లి, తిరిగి గోరఖ్‌పూర్ రోడ్డు వైపు వస్తుండగా పెట్రోలు బంకు కూడలిలో రోడ్డు పక్కన ఆగి ఉన్న ట్యాంకరును ద్విచక్ర వాహనంతో ఢీకొన్నారు. అక్కడికి చేరుకున్న పోలీసులు వారిని స్థానికంగా ఓ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అప్పటికే నరేంద్ర మృతి చెందారు. మిగిలిన ఇద్దరిని మెరుగైన వైద్యానికి రాయగడ జిల్లా ఆసుపత్రికి తరలిస్తుండగా మధ్యలో జున జోడియ మృతి చెందారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బిపిన్ మృతి చెందారు. టికిరి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఇదిలా ఉండగా ఈ ప్రమాదాన్ని నిరసిస్తూ బాధిత కుటుంబ సభ్యులు గ్రామస్థులతో సోమవారం రాస్తారోకో చేపట్టారు. మృతుల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. దీంతో వాహన రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.

వికసిత్ ఒడిశా... అదే ఆశ.. ధ్యాస

అన్నిరంగాల్లో రాష్ట్రం ముందంజ వేస్తోంది

బడ్జెట్ సమావేశాలు ప్రారంభించిన గవర్నరు హరిబాబు

భువనేశ్వర్, న్యూస్‌టుడే: 'వికసిత్ భారత్-2047' ధ్యేయం నెరవేర్చడంలో ఒడిశా గ్రోత్ ఇంజిన్ అవుతుందని, సమృద్ధ ఒడిశా అన్నిరంగాల్లో ముందంజలో ఉందని గవర్నరు కంభంపాటి హరిబాబు చెప్పారు. మంగళవారం శాసనసభ బడ్జెట్ (2026-27) ప్రారంభించిన ఆయన ప్రభుత్వ కార్యక్రమాలు, సాధించిన విజయాలు ప్రస్తావించారు. 'జై జగన్నాథ్' అంటూ ప్రారంభించిన ఒక గంట 40 నిమిషాలపాటు ప్రసంగించారు.

తలసరి ఆదాయం రూ.32 లక్షలకు

రాష్ట్ర ప్రభుత్వం 'వికసిత్ భారత్-2047, వికసిత్ ఒడిశా-2036' పేరిట రెండు విజన్ డాక్యుమెంట్లు రూపకల్పన చేసింది. 2025 జూన్‌లో ఇవి ప్రధాని నరేంద్రమోదీ భువనేశ్వర్‌లో ఆవిష్కరించిన తర్వాత కార్యక్రమాల అమలు ప్రారంభమైందన్నారు. వికసిత్ భారత్‌కు ఒడిశా గ్రోత్ ఇంజిన్ అని, ప్రజల తలసరి ఆదాయం రూ.1.8 లక్షల నుంచి రూ.32 లక్షలకు పెరుగుతుందని తెలిపారు. 2036 నాటికి స్వతంత్ర ఒడిశా శతాబ్ది వేడుకలు జరుపుకోనుండగా రాష్ట్ర ఆర్థిక రంగం 500 బిలియన్ అమెరికన్ డాలర్లకు చేరుకుంటుందన్నారు.

నిర్మాణ రంగం కీలకం

వికసిత్ ఒడిశాలో పరిశ్రమల నిర్మాణరంగం కీలకమని, ఇటీవల కాలంలో పెద్దఎత్తున పారిశ్రామిక ఒప్పందాలు (ఎంటయూలు) కుదుర్చుకున్నట్లు చెప్పారు. ఏకగవాక్ష సంఘం (సింగిల్ విండో) 238 ఎంటయూలు కుదుర్చుకోగా, రూ.7 లక్షల కోట్ల పెట్టుబడులొచ్చాయన్నారు. 2025లో 85 నిర్మాణాలు పట్టాలెక్కాయని, 1.66 లక్షల మందికి ఉపాధి కలుగుతుందన్నారు. రాష్ట్రంలో 55 ఉక్కు కర్మాగారాలు ఏర్పాటు కానుండగా, ఏడాదిలో 100 మిలియన్ టన్నుల ఉత్పత్తి సాధించనున్న ఒడిశా దేశంలో అగ్రగామిగా నిలుస్తుందన్నారు. కేంద్రం రాష్ట్రానికి రెండు సెమీకండక్టర్ కేంద్రాలు కేటాయించిన నేపథ్యంలో ఐటీ, సెమీకండక్టర్ రంగాల్లోనూ అభివృద్ధి సాధ్యమేనని గవర్నర్ వివరించారు. ఫార్మా, ఆటోమొబైల్, టూరిజం, టెక్స్‌టైల్, ఫుడ్ ప్రాసెసింగ్, ఎలక్ట్రానిక్స్ తదితర రంగాల్లోనూ ఒప్పందాలు కుదిరాయన్నారు. విద్యుతుత్పత్తిలో ఇప్పుడు ఒడిశా మిగులు రాష్ట్రమని, సమీప భవిష్యత్తులో ఎనర్జీ రంగంలో సామర్థ్యం రెట్టింపు అవుతుందన్నారు. ఎంఎస్ఎంఈ, స్టార్టప్‌ల ఏర్పాటు ఆశాజనకంగా ఉందని తెలిపారు.

శాసనసభలో ప్రసంగిస్తున్న హరిబాబు, పక్కన సభాపతి సురమాపాడి

మెగా ప్రాజెక్టులు, రహదారులు

రూ.8,308 కోట్ల వ్యయంతో భువనేశ్వర్, కటక్, పరదీప్ కోస్టల్ హైవే, కటక్ రివర్ క్రాసింగ్ ప్రాజెక్టు, భువనేశ్వర్, నందన్‌కానన్ 6 వరుసల రింగ్‌రోడ్, రాష్ట్రంలోని ఇతర ప్రధాన మార్గాలన్నీ నాలుగు వరుసలుగా చేయడానికి సన్నాహాలు ప్రారంభించినట్లు చెప్పారు. నదులపై వంతెన మార్గాలు, ఆలయాల విస్తరణ, పర్యాటక కేంద్రాలకు హంగులు కల్పిస్తున్నామన్నారు. స్వచ్ఛభారత్ మిషన్-2లో పట్టణ ప్రాంతాల్లో 1.66 లక్షల మరుగుదొడ్ల నిర్మాణం జరిగిందన్నారు.

విద్య, పరిశోధనలకు ప్రాధాన్యం

కేంద్ర విద్యా విధానం అమలుపరిచిన ప్రభుత్వం 45 వేల ప్రాథమిక పాఠశాలల్లో శిశువాటికా చదువులకు శ్రీకారం చుట్టిందని, రూ.1,200 కోట్ల వ్యయంతో 2,200 గోదావరీశ్ మిశ్ర ఆదర్శ విద్యాలయాల పనులు చేపట్టిందన్నారు. ఆదివాసీ ప్రాంతాల్లో డ్రాపౌట్లు తగ్గించడానికి విద్యార్థులకు ఉపకార వేతనాలు, ఇతర సౌకర్యాలు కల్పిస్తున్నామన్నారు. ప్రాథమిక, ఉన్నత విద్యా ప్రమాణాలు పెంచడానికి, పరిశోధనలు, నూతన ఆవిష్కరణలు, క్రీడలకు ప్రోత్సాహకాలు కల్పిస్తున్నామన్నారు.

అండగా హెల్త్ కార్డులు

'సర్వేజనా సుఖనో భవంతు' ధ్యేయంగా ప్రభుత్వం పాన్, గుట్కా, ఖైనీ, నస్యం తదితర పొగాకు ఉత్పత్తులు, విక్రయాలు పూర్తిగా నిషేధించిందన్నారు. ఆయుష్మాన్ భారత్, గోపబంధు, ఆరోగ్య కార్యక్రమాల ద్వారా 1.3 కోట్ల కుటుంబాలకు హెల్త్‌కార్డులు కేటాయించి ఉచిత చికిత్స సౌకర్యాలు కల్పిస్తున్నామన్నారు.

అన్ని జిల్లా కేంద్రాల్లో మెడికల్ కళాశాల ఆసుపత్రులు ఏర్పాటుకు శ్రీకారం చుట్టి ఎంబీబీఎస్ సీట్ల సంఖ్య పెంచుతున్నామన్నారు.

రైతులు, సుభద్రలు రాణించారు

తమ ప్రభుత్వం కోటి మందికిపైగా మహిళలకు సుభద్ర పథకం కింద సొమ్ము చెల్లింపులు, మహిళా సంఘాలకు వడ్డీలేని రుణాలు, ఇతర ప్రోత్సాహకాలు అందిస్తున్న నేపథ్యంలో వారంతా ముందంజ వేస్తున్నారన్నారు. అన్నదాతలకు క్వింటాలు ధాన్యానికి రూ.800లు ఇన్‌పుట్ సబ్సిడీ, ఇతర ప్రోత్సాహకాలు అందిస్తున్నందున వారంతా ఆర్థికంగా ముందంజ వేశారన్నారు.

దివంగతులకు శ్రద్ధాంజలి

ప్రసంగానికి ముందుగా ఇటీవల కాలంలో మృతిచెందిన మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు, పోలీసులకు గవర్నరు సంతాపం తెలిపారు. వారి ఆత్మలకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తున్నామని, దివంగతుల కుటుంబాలకు సంతాపం తెలియజేస్తున్నామన్నారు. ఉదయం 10.50 గంటలకు శాసనసభా ప్రాంగణానికి చేరుకున్న హరిబాబుకు సభాపతి సురమాపాడి, ఇతర అధికారులు స్వాగతించారు. తర్వాత పోలీసుల గౌరవ వందనం స్వీకరించిన గవర్నరు సభ లోపలికి వచ్చి ప్రసంగించారు.

తొలిరోజు సభ్యులతో సభ కళకళ

మావోయిస్టులు లేని రాష్ట్రంగా..

మావోయిస్టుల ఏరివేత ప్రక్రియ చివరి దశలో ఉందని, ఇటీవల కాలంలో 48 మంది ఎన్‌కౌంటర్ కాగా, 78 మంది అరెస్టయ్యారని, 82 మంది లొంగిపోయారని చెప్పారు. శాంతిభద్రతలకు ప్రభుత్వం తొలి ప్రాధాన్యమిస్తోందని, పోలీసుశాఖను ఆధునికీకరిస్తున్నామని, నేరాలపై ఉక్కుపాదం మోపుతున్నట్లు తెలిపారు.

కార్యాలయానికి తాళం వేసి నిరసన

బందీగా పీఈవో

కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న గ్రామస్థులు

నవరంగపూర్, న్యూస్‌టుడే: పంచాయతీలో అభివృద్ధి పనులు నత్తనడకన నడుస్తున్నాయని, లబ్ధిదారులకు పింఛన్లు, అభివృద్ధి పథకాలు అందటం లేదని ఆరోపిస్తూ మంగళవారం పంచాయతీ వాసులు పంచాయతీ కార్యాలయానికి తాళం వేసి పీఈవోను బంధించి ఆందోళన చేసిన ఘటన నవరంగపూర్ జిల్లా రాయ్‌ఘర్ సమితిలో జరిగింది. వివరాల్లోకి వెళితే కుందేయి పంచాయతీలో భూరకామాహలి, సెమారడిహి, సంబల్‌పూర్, ఖిలాలి గ్రామాల్లో తాగునీటి సరఫరా, రహదారుల నిర్మాణం, క్రీడా మైదానం, అంగన్‌వాడీ కేంద్రాలను నిర్మించాలని పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదన్నారు. అరకొర పనులు చేసి ఎటువంటి సమాచార బోర్డులు ఏర్పాటు చేయకుండా ప్రజలను మోసగిస్తున్నారని, పథకాలు కూడా సరిగా అమలు చేయటం లేదని ఆరోపిస్తూ పీఈవో భోల్‌నాథ్ బిసోయిని బంధించి ఆందోళన చేశారు. విషయం తెలుసుకున్న పంచాయతీ అభివృద్ధి అధికారి మంటు స్వాయిన్, ఇంజినీర్ కపిల్ కలో, బీఎస్ఎస్‌వో జ్ఞానచంద్ మాటియా ఆందోళనకారులను నచ్చజెప్పగా శాంతించారు.

ఆమె వద్దు... పాఠశాల తెరవొద్దు

పాఠశాల బయట కూర్చొన్న విద్యార్థులు

నవరంగపూర్, న్యూస్‌టుడే: శిశుసేవకురాలి నియామకాన్ని వ్యతిరేకిస్తూ మంగళవారం గ్రామస్థులు పాఠశాలకు తాళం వేసిన ఘటన నవరంగపూర్ జిల్లా జోరిగావ్ సమితి కానకోట పంచాయతీ పుర్లా గ్రామంలో చోటుచేసుకుంది. ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఇటీవల పాఠశాల అభివృద్ధి కమిటీ అనుమతి లేకుండా ప్రధానోపాధ్యాయుడు తులారామ్‌బొత్ర శిశుసేవకురాలిగా ఆరతి శాంటాను నియమించారు. ప్రభుత్వ నియామకాలను ఉల్లంఘించి ఆమెను నియమించారని గ్రామస్థులు, కమిటీ సభ్యులు వ్యతిరేకిస్తూ తాళం వేశారు. దాంతో విద్యార్థులు పాఠశాల బయట కూర్చొన్నారు. విద్యాశాఖాధికారులు రాకపోగా సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని ఆందోళనకారులకు నచ్చజెప్పడంతో వారు శాంతించి తాళం తీశారు.

జేఈఈలో మనోడి సత్తా

తల్లిదండ్రులతో భవేష్

రాయగడ పట్టణం, న్యూస్‌టుడే: జేఈఈ మెయిన్-2026 తొలి విడత ఫలితాల్లో రాష్ట్రానికి చెందిన విద్యార్థి సత్తా చాటాడు. దేశవ్యాప్తంగా 100 పర్సంటైల్ సాధించిన పన్నెండు మందిలో ఒకరిగా నిలిచాడు. మొత్తం 13,04,653 మంది రాసిన ఈ పరీక్షలో భవేష్ ఆరో స్థానాన్ని సొంతం చేసుకున్నాడు. ఎన్టీఏ సోమవారం ప్రకటించిన ఫలితాల్లో దిల్లీ, ఏపీ, బిహార్, రాజస్థాన్‌లకు చెందిన ఐదుగురి తర్వాత భవేష్ వారి సరసన నిలిచాడు. ఈ సందర్భంగా తన సంతోషాన్ని మీడియాతో పంచుకుంటూ దీని వెనుక తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సహకారం ఎంతో ఉందన్నారు. సరైన ప్రణాళికతో రోజుకి 5-6 గంటలు చదివితే చాలని భవేష్ తెలిపారు.

రూపాలు ఒకేలా.. మార్కులూ ఆశ్చర్యం కలిగేలా

మహోరూప్ అహ్మద్‌ఖాన్, మస్‌మార్ అహ్మద్‌ఖాన్

భువనేశ్వర్, న్యూస్‌టుడే: కవలలు... సాధారణంగా ఒకేలా కనిపిస్తారు. వారికి జేఈఈలో మార్కులు కూడా ఒకేలా వస్తే.. ఆశ్చర్యం అనిపిస్తుంది కదా.. ఇది నిజం. భువనేశ్వర్‌కి చెందిన కవలలు మహోరూప్ అహ్మద్‌ఖాన్, మస్‌మార్ అహ్మద్‌ఖాన్ 'జేఈఈ మెయిన్-2026'లో ఒకేలా 99.98 మార్కులు సాధించి సత్తా చాటుకున్నారు. పుట్టుకలోనే కాదు, పర్సంటైల్లోనూ ఇద్దరూ ఒకేలా ఫలితాలు దక్కించుకోవడం విశేషం. రాజస్థాన్‌లోని కోటాలో కవలలు ఒకేచోట కోచింగ్ తీసుకోగా, తల్లి జనితా బేగం సహకరించారు. వీరిద్దరూ మంగళవారం భువనేశ్వర్‌లో విలేకర్లతో మాట్లాడుతూ ముంబయి ఐఐటీలో చేరి కంప్యూటర్ సైన్స్ చదువుతామని, తర్వాత సివిల్స్‌కు సన్నద్ధమవుతామని చెప్పారు.

మిషన్‌శక్తి ఇక 'సుభద్రశక్తి'

భువనేశ్వర్, న్యూస్‌టుడే: క్యాబినెట్ ఆమోదం లేకుండా మోహన్‌చరణ్ మాఝి సర్కారు మిషన్‌శక్తి పేరును 'సుభద్రశక్తి'గా మార్చేశారు. రాష్ట్ర ప్రభుత్వం పత్రికా ప్రకటన ద్వారా పేరు మార్చారు. ఇటీవల భువనేశ్వర్‌లో 'శిశిర సరస' మేళా చేపట్టిన సంగతి తెలిసిందే. ఈ వేడుకల్లో ఆయాచోట్ల సుభద్రశక్తి బోర్డులు కనిపించాయి. ఇంతలో సోమవారం రాత్రి 'సుభద్రశక్తి' పేరు అధికారికంగా ప్రకటించారు. మహిళా స్వయం సహాయక సంఘాలు (ఎస్‌హెచ్‌జీ) దీని ఆధీనంలో ఉన్న సంగతి తెలిసిందే.

విశ్రాంత ఈఈ ఆస్తుల జప్తు

రాయగడ పట్టణం, న్యూస్‌టుడే: ఆదాయానికి మించి ఆస్తులు కలిగి ఉన్న కేసులో ఓ విశ్రాంత కార్యనిర్వాహక ఇంజినీరు(ఈఈ)కు సంబంధించి రూ.2.50 కోట్ల ఆస్తులను జప్తు చేయాలని న్యాయస్థానం ఆదేశించింది. ఈమేరకు భువనేశ్వర్ ప్రత్యేక విజిలెన్స్ న్యాయస్థానం మంగళవారం తీర్పును వెల్లడించింది. ఆ వివరాల ప్రకారం.. నవరంగపూర్ జిల్లా ఉమర్‌కోట్ ఆర్‌డబ్ల్యూ డివిజన్ ఈఈగా సింహాద్రి నాయక్ విధులు నిర్వహించేవారు. లెక్కకు మించి ఆస్తులు కలిగి ఉన్నారన్న ఆరోపణలపై 2023 డిసెంబరు 11న నాయక్, ఆయన భార్యపై విజిలెన్స్ కేసులు నమోదయ్యాయి. దీనిని పరిశీలించిన న్యాయస్థానం వీరిద్దరి పేరిట ఉన్న రూ.2,50,44,029 స్థిర, చరాస్తులను జప్తు చేయాలని ఆదేశించింది. రాయగడలో బహుళ అంతస్థు, నవరంగపూర్‌లో మరో రెండు భవనాలు, ఈ రెండుచోట్ల మరో మూడు ప్లాట్లు, బంగారు నగలు, బ్యాంకు డిపాజిట్లను విజిలెన్స్ అధికారులు గుర్తించారు.

కటక్‌లోని 10వ వార్డులో పచ్చకామెర్లు

భువనేశ్వర్, న్యూస్‌టుడే: కటక్‌లోని 10వ వార్డులో పచ్చకామెర్ల వ్యాధి వ్యాపించింది. 10 మంది బాధితులు ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు. 12వ వార్డులోనూ వ్యాధి పీడితులున్నారని, నీటి కలుషితం వల్లే ఈ పరిస్థితి తలెత్తిందని పలువురు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం నగర మేయరు సుభాష్‌సింగ్, ఇతర అధికారులు 10వ వార్డు పరిశీలించి పరిస్థితి అధ్యయనం చేశారు. తాగునీటి సరఫరా పైపులైన్లు అండర్ గ్రౌండ్‌లో పగులుతున్నాయి. అలాంటిచోట్ల మురుగు కాలువల్లోని నీరు తాగునీటితో కలిసి సరఫరా అవుతోంది. ఆ నీటిని తాగినవారు వ్యాధి బారిన పడుతున్నారు. మరోవైపు మేయరు మాట్లాడుతూ నీటి నమూనాలు పరీక్షలకు పంపించామని, అన్నికోణాల్లో సమీక్షించి అత్యవసర చర్యలు తీసుకుంటున్నామన్నారు.

శస్త్రచికిత్స చేయకుండానే కారాగారానికి బిక్రం

ఎమ్కేసీజీ నుంచి గట్టి భద్రత మధ్య బిక్రం పండాను చక్రాల కుర్చీలో కారాగారానికి తరలిస్తున్న పోలీసులు

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: బ్రహ్మపురలోని ఎమ్కేసీజీ వైద్య కళాశాల ఆసుపత్రిలోని సర్జరీ విభాగం లోపలి వార్డులో అయిదు రోజులపాటు చికిత్సలు పొందిన బ్రహ్మపుర మాజీ ఎమ్మెల్యే బిక్రం కుమార్ పండాకు శస్త్రచికిత్స చేయకుండానే సోమవారం తిరిగి కారాగారానికి తరలించారు. శస్త్రచికిత్సకు తాను సిద్ధమేనంటూ బిక్రం చెప్పిన వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతోంది. ఆయన అంగీకరించకపోవడంతో శస్త్రచికిత్స చేయలేదని ఎమ్కేసీజీ ఆసుపత్రి సూపరింటెండెంటు ఆచార్య దుర్గా మాధవ శత్పథి మంగళవారం విలేకరులకు చెప్పారు. ఈ ఉదంతం ఇప్పుడు చర్చనీయాంశమైంది. న్యాయవాది పితబాస పండా హత్య కేసులో అరెస్టయి బ్రహ్మపుర మండల కారాగారంలో ఉన్న బ్రహ్మపుర మాజీ ఎమ్మెల్యే బిక్రంకుమార్ పండా ఇటీవల అస్వస్థతకు గురయ్యారు. ఎమ్కేసీజీ ఆసుపత్రిలో ఆయనకు వివిధ రోగ నిర్ధారణ పరీక్షలు చేసిన వైద్యులు పండా గాల్ బ్లాడర్‌లో రాళ్లున్నట్లు గుర్తించారు. నొప్పితో మరింత బాధపడ్డ బిక్రం అయిదు రోజుల కిందట మళ్లీ ఎమ్కేసీజీ ఆసుపత్రిలోని సర్జరీ విభాగం లోపలి వార్డులో చికిత్సకు చేరారు. వివిధ విభాగాల వైద్య నిపుణుల బృందం ఆయన చికిత్సలను పర్యవేక్షించింది. సోమవారం హఠాత్తుగా పండాను వైద్యులు డిశ్చార్జ్ చేయడంతో కారాగారానికి తరలించేందుకు పోలీసు అధికారులు చేరుకోవడంతో అక్కడ హైడ్రామా నెలకొంది. శస్త్రచికిత్సలకు సిద్ధమంటున్న పండాను ఆ ప్రక్రియ చేయకుండా కారాగారానికి తరలించడమేంటని ఆయన కుటుంబ సభ్యులు పోలీసుల్ని నిలదీశారు. దీంతో అక్కడ కొంతసేపు గందరగోళ పరిస్థితి నెలకొంది. అధికారులు గట్టి భద్రత మధ్య మాజీ ఎమ్మెల్యేను కారాగారానికి తరలించడంపై పండా, ఆయన కుటుంబ సభ్యులు, న్యాయవాది దీపక్ పట్నాయక్ అభ్యంతరం తెలిపారు. ఆయన ఇంకా పూర్తిగా కోలుకోలేదని పేర్కొన్నారు. దీనిపై ఆసుపత్రి సూపరింటెండెంటు ఆచార్య శత్పథి విలేకరులతో మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే బిక్రం ఆరోగ్యం బాగుందని చెప్పారు. ఆయన శస్త్ర చికిత్సలకు అంగీకరించలేదని వైద్యమందించిన వైద్య బృందం పేర్కొనడంతో పండాను డిశ్చార్జ్ చేశామని ఆయన తెలిపారు.

మూణాళ్ల ముచ్చట... నిధులు రాక కటకట

కోచింగ్ సెంటర్

జయపురం, న్యూస్‌టుడే: జయపురం ప్రాంతంలో ఏర్పాటు చేసిన ఐఐటీ, నీట్ కోచింగ్ సెంటర్ మూతపడింది. సంవత్సరంపాటు ఈ కేంద్రంలో గిరిజన విద్యార్థులకు ఇంజినీరింగ్, డాక్టర్ ప్రవేశ పరీక్షకు కోచింగ్ ఇచ్చారు. నిధులు రాకపోవడంతో ఈ పరిస్థితి తలెత్తిందని అధికారులు పేర్కొన్నారు. సెంటర్‌లో ఉన్న టేబుళ్లు, కుర్చీలు, కంప్యూటర్లను కేంద్రీయ విద్యాలయానికి అప్పగించారు. ప్రస్తుతం సెంటర్‌లో బామునిపుట్ ఉన్నత పాఠశాల విద్యార్థుల కోసం ఓ గ్రంథాలయం ఏర్పాటు చేశారు. గిరిజన విద్యార్థుల కోసం ఐటీడీఏ తరఫున ఈ కేంద్రం ఏర్పాటు చేశారు. నలుగురు శిక్షకులను నియమించి 2024 నవంబరులో ప్రారంభించారు. బామునిపుట్, కొట్పాడ్ ఎస్ఎస్‌డీ ఉన్నత పాఠశాలల్లో చదివిన 50 మంది విద్యార్థులు కోచింగ్ తీసుకోగా, 19 మంది ఓజేఈఈలో ఉత్తీర్ణత సాధించారు. నిధులు అందకపోవడంతో మూసేసినట్లు నిర్వాహకులు తెలిపారు.

మావోయిస్టుల లొంగుబాటుకు విస్తృత ప్రయత్నాలు

ఆలిండియా రేడియో ద్వారా ప్రచారం కల్పిస్తున్న ఒడిశా పోలీసులు

రాయగడలో ఇటీవల లొంగిపోయిన నిఖిల్, అంకిత, ఇతర మావోయిస్టులు

రాయగడ పట్టణం, న్యూస్‌టుడే: రాష్ట్రంలో మార్చి 31 లోగా నక్సలిజాన్ని పూర్తిగా రూపుమాపాలని డెడ్‌లైన్ విధించిన నేపథ్యంలో మావోయిస్టుల లొంగుబాటుకు పోలీసు యంత్రాంగం విస్తృత ప్రయత్నాలు చేస్తోంది. సమాచారం వారికి చేరువయ్యేలా ఆలిండియా రేడియో ద్వారా ఒడిశా పోలీసులు ప్రచారం కల్పిస్తున్నారు. ఇందులో భాగంగా ఇటీవల లొంగిపోయిన మావోయిస్టు నాయకుల సందేశాత్మక సంభాషణలను రోజుకు మూడుసార్లు రేడియోలో ప్రసరిస్తున్నారు. ఇందుకోసం రాయగడలో ఫిబ్రవరి 13న లొంగిపోయిన సీపీఐ(మావోయిస్టు) రాష్ట్ర కమిటీ మాజీ సభ్యుడు నిఖిల్ అలియాస్ నిరంజన్‌రౌత్, జగదల్‌పూర్‌లో జనవరి నెలలో లొంగిపోయిన ప్రత్యేక జోనల్ కమిటీ మహిళా మావోయిస్టు నాయకురాలు నీతూ పిలుపునిచ్చిన సందేశాలను వినిపిస్తున్నారు. ఈ విషయమై అదనపు డీజీ(మావోయిస్టు నియంత్రణ ఆపరేషన్) సంజీవ్‌పండా మీడియాతో మాట్లాడుతూ ప్రచార పోస్టర్లలో లొంగిపోయిన మావోయిస్టుల ఫోన్ నెంబర్లను ఏర్పాటు చేస్తున్నామన్నారు. మావోయిస్టులు ఎలాంటి అయోమయానికి గురికాకుండా ఉండేలా లొంగిపోయిన వారిని సంప్రదించే వెసులుబాటు కోసం ఇలా చేశామన్నారు.

మూడు భాషల్లో

మావోయిస్టులు లొంగిపోవాలంటూ ఒడియా, హిందీ, కోయ భాషల్లో రేడియో ద్వారా ప్రచారం కల్పిస్తున్నట్లు పోలీసు వర్గాలు తెలిపాయి. ఇందుకోసం ఆకాశవాణిలో రోజూ ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం మూడుసార్లు ప్రసరిస్తున్నట్లు పేర్కొన్నాయి. రాష్ట్రంలో ప్రస్తుతం 40 మంది వరకు మావోయిస్టులు ఉన్నట్లు పోలీసు యంత్రాంగం ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో డెడ్‌లైన్(మార్చి 31) లోగా వారు లొంగిపోయేందుకు అవకాశం కల్పిస్తున్నట్లు వెల్లడించాయి. రాయగడ, కొంధమాల్, కలహండి, బొలంగీర్‌లోని గాంధామర్దన్ పర్వత ప్రాంతంలో పోలీసులు, భద్రతా బలగాలు ముమ్మర గాలింపు చర్యలు చేపడుతున్నారని పోలీసువర్గాలు స్పష్టం చేశాయి.

బడ్జెట్ జనరంజకంగా ఉంటుంది: మోహన్

భువనేశ్వర్, న్యూస్‌టుడే: రానున్న ఆర్థిక సంవత్సరం(2026-27) బడ్జెట్ జనరంజకంగా ఉంటుందని, వికసిత్ ఒడిశా సంస్కరణలకు అద్దం పడుతుందని ముఖ్యమంత్రి మోహన్‌చరణ్‌మాఝి పేర్కొన్నట్లు తెలిసింది. సోమవారం రాత్రి భువనేశ్వర్ అసెంబ్లీలోని 54వ నెంబరు గదిలో సీఎం అధ్యక్షతన భాజపా సభాపక్షం సమావేశం జరిగింది. బడ్జెట్ సమావేశాల్లో విపక్షాల దూకుడుకు అడ్డుకట్ట వేయడానికి వ్యూహరచన చేశారు. ఈ సందర్భంగా సీఎం బడ్జెట్ గురించి పార్టీ సభ్యులతో మాట్లాడారని, ఈ నెల 20న సమర్పించనున్న పద్దులపై స్వల్పంగా వివరించినట్లు తెలిసింది.

భాజపా సభాపక్షం సమావేశంలో మాట్లాడుతున్న సీఎం మోహన్

(c) eenadu

బ్రహ్మపుర రైల్వే స్టేషన్‌కు అదనపు హంగులు

ఆవరణలో నిర్మాణమైన వాహనాల పార్కింగ్ స్థలం

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: తూర్పు కోస్తా రైల్వే పరిధిలో రాష్ట్రంలోని ప్రధాన స్టేషన్లలో ఒకటైన పురాతన బ్రహ్మపుర రైల్వే స్టేషన్‌కు ఎట్టకేలకు అదనపు హంగులు సమకూరాయి. స్టేషన్ ప్రధాన ప్రవేశ మార్గంలో కొత్తగా నిర్మాణమైన భవనం ప్రారంభోత్సవానికి సిద్ధమైంది. రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ త్వరలో వర్చువల్‌గా కార్యక్రమంపై బ్రహ్మపుర రానున్నట్లు అనధికారికంగా తెలిసింది. దీంతో ఆయన రాక సందర్భంగా స్టేషన్లో చేపట్టిన నిర్మాణాలు పూర్తి చేసే పనుల్లో అధికారులు తలమునకలయ్యారు. మంగళవారం స్టేషన్ ఆవరణలో నూతన భవనానికి రంగులు, పలకలు అద్దే పనులు చకచకా సాగుతున్నాయి. భవనం లోపల సాధారణ టికెట్ కౌంటర్లు తదితరాలున్న ప్రాంతంలో ఎల్‌ఈడీ టీవీలు, కంప్యూటర్ల అమరిక పనులు చేపట్టారు. రూ.11.20 కోట్ల వ్యయంతో స్టేషన్ ప్రధాన ప్రవేశ మార్గంలో నూతన భవనం, సర్క్యులేటింగ్ ప్రాంతం, ఆవరణలో ద్విచక్ర వాహనాలు, ఆటోలు, నాలుగు చక్రాల వాహనాలు నిలిపేందుకు పార్కింగ్ స్థలాల నిర్మాణాలు జరిపారు. నూతన భవనంలో మూడు సాధారణ టికెట్ కౌంటర్లు, నాలుగు ఆటోమేటిక్ టికెట్ వెండింగ్ యంత్రాలు (ఏటీవీఎం), దివ్యాంగుల కోసం కౌంటరు, ప్రయాణికులు కూర్చొనేందుకు ఏర్పాట్లు తదితరాలు ఏర్పాటు చేసినట్లు స్టేషన్ అధికారులు 'న్యూస్‌టుడే'కు చెప్పారు.

ప్రఫుల్లకోరా విగ్రహావిష్కరణ

భువనేశ్వర్, న్యూస్‌టుడే: ప్రముఖ సంగీత దర్శకుడు ప్రఫుల్ల కోరా విగ్రహావిష్కరణ కార్యక్రమం సోమవారం రాత్రి భువనేశ్వర్‌లోని రవీంద్ర మండపంలో ఘనంగా జరిగింది. సాంస్కృతిక, ఉన్నత విద్యాశాఖ మంత్రి సూర్యవంశీ సూరజ్ ముఖ్యఅతిథిగా పాల్గొని విగ్రహావిష్కరణ చేసి మాట్లాడారు. గాయకుడిగా, సంగీత దర్శకునిగా జగన్నాథ కీర్తనలు ఆలపించి అందరి మన్ననలు పొందారని, ప్రఫుల్ల జయంతి నాడు ఆయన విగ్రహాన్ని ప్రతిష్ఠించడం రాష్ట్రానికి గర్వకారణంగా అభివర్ణించారు. కార్యక్రమంలో సాంస్కృతిక శాఖ కార్యదర్శి బిజయ్‌కేతన్ ఉపాధ్యాయ, కార్యదర్శి దేవీప్రసాద్ దాస్, సంచాలకురాలు దేవయాని భుయ్యా, అధికారులు, అభిమానులు పాల్గొన్నారు.

కార్యక్రమంలో మంత్రి సూర్యవంశీ, ఇతర అధికారులు, అతిథులు

సంప్రదాయబద్ధంగానే దొండొనాచొ దీక్షలు చేపట్టాలి

- కమిటీల ప్రతినిధులతో బీఈఎంసీ సమావేశం

కార్యక్రమంలో ఉప కమిషనర్ ఆశీర్వాద్ పరిదా, ఇతర అధికారులు

బ్రహ్మపుర బజారు, న్యూస్‌టుడే: బ్రహ్మపుర పురపాలక సంఘం (బీఈఎంసీ) పరిధిలోని మార్చిలో వివిధ చోట్ల జరగనున్న దొండొనాచొ దీక్షలు ఆద్యంతం సంప్రదాయాలతోనే చేపట్టాలని అధికారులు చెప్పారు. ఈ మేరకు గంజాం జిల్లా పాలనాధికారి దీక్షల నిర్వహణపై కొత్తగా ఆంక్షలు విధించారు. ఈ సందర్భంగా మంగళవారం బీఈఎంసీ కాన్ఫరెన్స్ హాల్లో దొండొనాచొ నిర్వాహక కమిటీ ప్రతినిధులతో అధికారులు ప్రత్యేక సమావేశమయ్యారు. ఇందులో ఉపకమిషనర్ ఆశీర్వాద్ పరిదా మాట్లాడుతూ వచ్చే నెలలో వివిధ చోట్ల జరగనున్న దొండొనాచొ దీక్షల్లో మద్యపానం జరిపే ఘటి దొండ్, రాత్రి వేళల్లో పూజల్లో ఒపేరాలు, అశ్లీల నృత్యాలు ఉండకూడదని, వస్త్రధారణలు ఆయా ప్రదర్శనల్లో ఉండకూడదని ఆయన చెప్పారు. దీక్షలు జరిగే సమయంలో ముందుగా సంబంధిత ఠాణాల పోలీసు స్టేషన్లలో అనుమతి తీసుకోవాలని చెప్పారు. రాత్రి వేళల్లో పౌరాణిక నాటకాలు, సంగీత ప్రదర్శనలు ఉండాలని సూచించారు. సమావేశంలో ఉపకమిషనర్ వికాస్ కుమార్ నాయక్, సహాయ కమిషనర్ రోనిత్ కుమార్, పోలీసు అధికారులు మానస్ రంజన్ సాహు, అశోక్ శుక్లా, బీఈఎంసీ పరిధిలోని పదిహేడు దొండొనాచొ నిర్వహణ కమిటీల ప్రతినిధులు పాల్గొన్నారు.

రాజధానిని కమ్మేసిన పొగమంచు

భువనేశ్వర్ స్మార్ట్ సిటీ ఆవరణలో కురుస్తున్న మంచు

గోపాల్‌పూర్, న్యూస్‌టుడే: రాజధాని భువనేశ్వర్‌ను మంగళవారం ఉదయం పొగమంచు కమ్మేసింది. 8.30 గంటల వరకు ఈ తీవ్రత కొనసాగింది. వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బంది కలిగింది. గోపాల్‌పూర్ వాతావరణ అధ్యయన కేంద్రం(ఐఎండీ) సంచాలకుడు ఉమాశంకర్‌దాస్ 'న్యూస్‌టుడే'తో మాట్లాడుతూ కేంద్రపడ, జగత్సింగ్‌పూర్, ఖుర్దా, పూరీ, గంజాం, కటక్ తీర జిల్లాల్లో మంచు కురిసినట్లు తెలిపారు. ఈ పరిస్థితి గురువారం (19వ తేదీ) వరకు కొనసాగుతుందన్నారు. బంగాళాఖాతం మీదుగా వీస్తున్న గాలుల్లో తేమ అధికంగా ఉంటున్నందున పొగమంచు కురుస్తున్నట్లు చెప్పారు.

పంచాయతీ కార్యాలయానికి గేటు ఏర్పాటు చేయాలి

విరిగిన గేటు వద్ద ఆందోళనకారులు

సిమిలిగుడ, న్యూస్‌టుడే: నందపూర్ సమితి హాటిబరి పంచాయతీ కార్యాలయం ప్రవేశ గేటును నిర్మించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. ఇక్కడ పంచాయతీ కార్యాలయానికి ఉండే ఇనుప గేటుతో పాటు గోడ కొంతభాగం కిందట విరిగిపోయింది. దీంతో కార్యాలయం ఆవరణలోకి పశువులు ప్రవేశిస్తున్నాయని, రక్షణ కరవైందని గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారు. పంచాయతీ అధికారులు పట్టించుకోకపోవడంతో గ్రామస్థులు పంచాయతీ కేంద్రం ముందు మంగళవారం ధర్నా చేశారు. దీనిపై సమితి అధికారులను వివరణ కోరగా అందజేస్తామని పేర్కొన్నారు. సమితి అభివృద్ధి అధికారి దుర్గాప్రసాద్ దొరను ప్రశ్నించగా గేటు నిర్మిస్తామని హామీ ఇచ్చారు.

గంజాం జిల్లాలో 88 శాతం ధాన్యం సేకరణ

- 1.21 లక్షల మంది రైతుల ఖాతాలకు రూ.1,055 కోట్లు బదిలీ

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: వ్యవసాయాధారిత గంజాం జిల్లాలో రైతుల సమస్యల పరిష్కారానికి యంత్రాంగం ప్రాధాన్యమిస్తోందని, ఇంతవరకూ జిల్లాలో రైతుల నుంచి 88 శాతం ధాన్యం సేకరణ పూర్తయిందని గంజాం పాలనాధికారి వి.కీర్తివాసన్ సోమవారం రాత్రి ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో 54,46,201 క్వింటాళ్ల ధాన్యం సేకరణ లక్ష్యం కాగా, ఇంతవరకూ 47,98,588 క్వింటాళ్ల ధాన్యం సేకరించామని తెలిపారు. 1,21,816 మంది రైతుల బ్యాంకు ఖాతాలకు నేరుగా డీబీటీ ద్వారా రూ.1,055 కోట్లకుపైగా చెల్లింపులు జరిగాయని ఆయన పేర్కొన్నారు. జిల్లాలోని దిగపహండి సమితిలో అత్యధికంగా 95.06 శాతం ధాన్యం సేకరణ జరగ్గా, పాత్రపురం సమితిలో 94.93 శాతం సేకరణ జరిగిందని కీర్తివాసన్ పేర్కొన్నారు.

ఓ మండీలో సజావుగా ధాన్యం సేకరణ

అంతర్రాష్ట్ర క్రికెట్ పోటీల విజేత మకరాంపురం

ఇచ్ఛాపురం, న్యూస్‌టుడే: మకరాంపురం జట్టు అంతర్రాష్ట్ర టీ20 క్రికెట్ టోర్నమెంట్ విజేతగా నిలిచింది. ఇచ్ఛాపురం రాజావారి మైదానంలో వెల్లా జయంతి స్మారకార్థం వెల్లా కేశవరావు నిర్వహించిన పోటీల్లో ఆంధ్ర, ఒడిశా రాష్ట్రాల నుంచి 20 జట్లు పాల్గొన్నాయి. మంగళవారం తుది పోరు జరిగింది. ఇందులో మకరాంపురం జట్టు టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ చేసి 20 ఓవర్లలో ఆరు వికెట్ల నష్టానికి 179 పరుగులు చేసింది. అనంతరం బ్రహ్మపురం జట్టు ఏడు వికెట్ల నష్టానికి 134 పరుగులకే పరిమితమైంది. విజేత జట్టుకు ట్రోఫీతోపాటు రూ.50వేల నగదు, రన్నరప్‌కు ట్రోఫీతోపాటు రూ.35వేల నగదును పురస్కారంగా అందజేశారు. మకరాంపురం జట్టుకు ప్రాతినిధ్యం వహించిన సాత్విక్ మ్యాన్ ఆఫ్ ద సిరీస్‌కు ఎంపికయ్యారు. ఉత్తమ బౌలర్‌గా విస్సాల, ఉత్తమ బ్యాట్స్‌మన్‌గా అప్పన్న నిలిచారు. ఘనతతోపాటు శ్రీహరిబాబు, నిర్వాహక బృందం కృష్ణయ్య, దిలీప్‌యాదవ్, ప్రేమ్ పాల్గొన్నారు.

విజేత మకరాంపురం జట్టుకు ట్రోఫీ అందిస్తున్న పురప్రముఖులు రాజలక్ష్మి

రాసేశ్వరి నేత్రాలు దానం

భువనేశ్వర్, న్యూస్‌టుడే: డాక్టర్ రాసేశ్వరి పాణిగ్రాహి మంగళవారం కన్నుమూశారు. ఆమె ఈ లోకం వీడినా నేత్రదానంతో మరో ఇద్దరికి చూపు ప్రసాదించారు. సోమవారం రాత్రి మృతిచెందిన రాసేశ్వరి అంత్యక్రియలు సంబల్‌పూర్‌లో జరిగాయి. వైద్యులు, అభిమానులు, సేవాసంస్థల కార్యకర్తలు అంతిమయాత్రలో పాల్గొన్నారు. కన్నీటి వీడ్కోలు పలికారు.

ప్రముఖుల సంతాపం

రాసేశ్వరి మృతిపట్ల గవర్నరు కంభంపాటి హరిబాబు సంతాపం తెలిపారు. వైద్య వృత్తిలో నిష్ణాతురాలైన ఆమె ఎమ్మెల్యేగా, సామాజిక కార్యకర్తగా ఎంతో మంది ప్రజలకు సేవలందించారని, ఆమె ఆత్మకు శాంతి కలగాలని ప్రార్థిస్తున్నట్లు పేర్కొన్నారు. ముఖ్యమంత్రి మోహన్‌చరణ్ మాఝి, విపక్షనేత నవీన్‌పట్నాయక్ తదితర ప్రముఖులంతా సంతాపం తెలిపారు.

జగన్నాథుని 'సాగరబిజె' సేవలు

గోపాల్‌పూర్, న్యూస్‌టుడే: పాల్గుణ అమావాస్య పర్వదినాన్ని పురస్కరించుకుని మంగళవారం పూరీ శ్రీక్షేత్రంలో జగన్నాథుని సాగరబిజె సేవలు జరిగాయి. ఉదయం 4 గంటలకు ఆలయ తలుపులు తెరిచిన సేవాయత్‌లు పురుషోత్తమ, బలభద్ర, సుభద్రల సన్నిధిలో మంగళహారతి, మైలం, అబకాశ, తిలకధారణ తదితర సేవలు చేపట్టారు. అనంతరం నల్లసమ్మ గోపాల వల్లభ అర్చన, నైవేద్యం అర్పణ చేసి స్వామి ఉత్సవ విగ్రహం గోవిందునికి అలంకరించి పల్లకిలో ఆనవాయితీ ప్రకారం మహోదధి సాగర తీరానికి తిరువీధిగా తీసుకెళ్లి పూజలు చేయించి తర్వాత శ్రీక్షేత్రానికి తెచ్చారు.

పుష్పాలంకరణలో గోవిందుడు

యువతను ఆకర్షిస్తున్న బంగ్లార్ యువసాథీ పథకం

ఖరగ్‌పూర్, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి మమతా బెనర్జీ యువతను ఆకర్షించడానికి బంగ్లార్ యువసాథీ పథకం(నిరుద్యోగ భృతి) ప్రవేశపెట్టారు. ఈ పథకం కింద లబ్ధిదారు యువత దరఖాస్తులు నింపి పట్టణ జకాటపూర్ వద్ద పాలక సంఘ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన కౌంటర్లలో జమ చేస్తున్నారు. ఈ కౌంటర్లలో పనితీరు ఏవిధంగా కొనసాగుతున్నది పురపాలక ఛైర్మన్ కల్యాణి ఘోష్ పరిశీలించారు. ఈ నెల 25తో దరఖాస్తు గడువు ముగియనుంది.

నేటి నుంచి బ్రహ్మోత్సవాలు

ఖరగ్‌పూర్, న్యూస్‌టుడే: ఖరగ్‌పూర్ పట్టణ పత్రిస్కాడ, బాపునగర్ శ్రీ ప్రసన్న కల్యాణ వేంకటేశ్వర స్వామి దేవస్థానం 39వ వార్షిక బ్రహ్మోత్సవాలు నేటి నుంచి ప్రారంభమై 23తో ముగుస్తాయి. 18న నగర సంకీర్తన, ఉత్సవ విగ్రహాల పల్లకిలో ఊరేగింపు, 19న శ్రీ భవాని చంద్రమౌళీశ్వర స్వామి కల్యాణోత్సవం, 20న శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి కల్యాణోత్సవం. 21న చక్రస్నానం, రాత్రి పూలంగి సేవ, 22న నారాయణ హోమం, 23న అన్నప్రసాద వితరణ, రాత్రి దీపారాధనతో ఈ వేడుకలు ముగుస్తాయి.

మజ్జిగౌరి ఆలయంలో పూజల వివరాలు

రాయగడ, న్యూస్‌టుడే: ఉదయం 5.00 గంటలకు తొలిపూజ, ధూప దీప నివేదన, హారతి. 6.00 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు అమ్మవారి సర్వ దర్శనం. 12.30 నుంచి 2.00 గంటల వరకు మహా నైవేద్యం, ఆలయం మూత. 2 గంటల నుంచి రాత్రి 8.30 గంటల వరకు సర్వ దర్శనం. సాయంత్రం 6.00 గంటలకు ప్రత్యేక హారతి.

ప్రత్యేక అలంకరణలో మజ్జిగౌరి అమ్మవారు

కృత్రిమ అవయవాల అమరిక శిబిరం

కృత్రిమ అవయవాలు అందజేస్తున్న అశ్విని షడంగి

బరగఢ్, న్యూస్‌టుడే: బరగఢ్ మార్వాడి యువ మంచ్ (స్మృతి శాఖ) ఆధ్వర్యంలో ఫిబ్రవరి 17న అగ్రగామి సంఘ్ పరిసరాల్లో ఉచితంగా కృత్రిమ అవయవాల అమరిక, పంపిణీ శిబిరం నిర్వహించారు. ఇందులో సుమారు 120 మంది దివ్యాంగులకు కృత్రిమ అవయవాలు అందజేశారు. బరగఢ్ ఎమ్మెల్యే అశ్విని షడంగి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వందనా అగర్వాల్, రేఖ అగర్వాల్, ఆశాశర్మ, సునీతాశర్మ పాల్గొన్నారు.

ఇండో-రష్యాల మధ్య విద్యా సహకారం

ఖరగ్‌పూర్, న్యూస్‌టుడే: ఐఐటీ ఖరగ్‌పూర్-ఎంప్రెస్ కేథరిన్-2 సెయింట్ పీటర్స్‌బర్గ్ మైనింగ్ విశ్వవిద్యాలయం(రష్యా)ల మధ్య విద్యా సహకారాలపై ఒప్పందం జరిగింది. రెండు సంస్థల ప్రతినిధులు సోమవారం ఈ ఒప్పందంపై సంతకాలు పెట్టినట్లు ఐఐటీ ఖరగ్‌పూర్ ఓ ప్రకటనలో తెలిపింది.

ఒప్పందంలో ఇరు సంస్థల ప్రతినిధులు

ఉత్సాహంగా క్విజ్ పోటీలు

విద్యార్థులకు ట్రోఫీలు, ప్రశంసాపత్రాలు అందజేస్తున్న అతిథులు

జయపురం, న్యూస్‌టుడే: జయపురం పట్టణం చందన్‌బాడ్ ఉన్నత పాఠశాలలో మంగళవారం క్విజ్ పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో 22 పాఠశాలలకు చెందిన 51 మంది విద్యార్థులు పాల్గొన్నారు. బీఈవో చందన్‌కుమార్ నాయక్ ఆధ్వర్యంలో పోటీలు జరిగాయి. ముఖ్యఅతిథిగా ప్రధానోపాధ్యాయుడు ఓం ప్రకాష్‌మిశ్ర, ఏబీఈఓ కె. గోపాల్, ప్రధానోపాధ్యాయురాలు నిపికాపాత్ర్ హాజరై విజేతలకు ట్రోఫీలు, ప్రశంసాపత్రాలు అందజేశారు.

విద్యార్థులకు చేయూత

సిమిలిగుడ, న్యూస్‌టుడే: లక్ష్మీపూర్ సమితికి చెందిన కుడిపొద్ర ఆదర్శ విద్యాలయంలో మంగళవారం ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఇందులో సిమిలిగుడకు చెందిన సంఘ సేవకులు ఆనంద్ పట్నానియా, స్నిగ్ధరాణి మిశ్రలు పాల్గొని 170 మంది విద్యార్థులకు రగ్గులు, విద్యా సామగ్రి అందజేశారు. కార్యక్రమంలో ఆనంద్ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థులకు విద్యా సామగ్రి అందజేస్తున్న అతిథులు

దొరికాయి.. తిరిగి ఇచ్చేశారు

నగదుతో గౌరీశంకర్

జయపురం, న్యూస్‌టుడే: పట్టణంలో ఎస్బీఐ బజార్ బ్యాంకులో పాస్‌బుక్ అప్‌డేట్ చేయించుకోవడానికి మంగళవారం టి.గౌరీశంకర్ వెళ్లారు. బ్యాంకులో ప్లాస్టిక్ సంచిలో రూ. 20 వేలు నగదు పడి ఉండటం గుర్తించి, బ్యాంకు మేనేజర్‌కు అప్పగించారు. సామాజిక మాధ్యమంలో పోస్టును చూసి కొరాపుట్ సమితి పొడగూడ గ్రామానికి చెందిన రబినారాయణ దాదాపు 4 గంటల తరువాత బ్యాంకుకు చేరుకొని డబ్బును తీసుకున్నారు. గౌరీశంకర్‌ను పలువురు అభినందించారు.

అధ్వానంగా గ్రామీణ రహదారులు

సిమిలిగుడ, న్యూస్‌టుడే: నందపూర్ సమితిలో గ్రామీణ అభివృద్ధి శాఖ అధీనంలో ఉన్న గ్రామీణ రహదారులు అధ్వానంగా మారాయి. ఏళ్ల తరబడి మరమ్మతులు చేయకపోవడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ముఖ్యంగా తుబా-రాయ్‌సింగ్, బిలాపుట్, కుర్డీ ప్రాంతాల గ్రామీణ రహదారులు గోతులతో నిండాయి. ఇదే మార్గంలో ఉన్నతాధికారులు తరచూ పర్యటిస్తున్నా రహదారి మరమ్మతుల విషయంలో చీమకుట్టినట్లయినా లేకపోవడం శోచనీయం. ఆ ప్రాంతీయులు సంబంధిత విభాగాధికారులకు రహదారి మరమ్మతుల గురించి విన్నవించినా పట్టించుకోవడం లేదని సర్వత్రా నిరసన వ్యక్తమవుతోంది. రహదారులు ఈ దుస్థితిలో ఉండటంతో తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. రాకపోకలకు వీలుగా మెరుగుపరచాలని రాయ్‌సింగ్ సర్పంచి జగబంధు సెతి, బిల్లాపుట్ సర్పంచి రాజేష్, కుర్డీ సర్పంచి పదలామ్ హంటాల్ డిమాండ్ చేస్తున్నారు. లేకుంటే భారీ ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు. రహదారుల దుస్థితిపై గ్రామీణ అభివృద్ధి శాఖ జూనియర్ ఇంజినీర్ జయంత్‌కుమార్ సాహు వద్ద ప్రస్తావించగా మరమ్మతుల కోసం ప్రతిపాదనలు పంపించామని, ఆమోదం వచ్చిన వెంటనే పనులు ప్రారంభిస్తామని చెప్పారు.

అధ్వానంగా తుబా-రాయ్‌సింగ్ రహదారి

పార్టీ బలాన్ని పెంచడమే లక్ష్యం

సిమిలిగుడ, న్యూస్‌టుడే: కొరాపుట్‌లో పార్టీ బలాన్ని పెంచడమే లక్ష్యమని బిజూ మహిళా జిల్లా వర్కింగ్ అధ్యక్షురాలు ఊర్మిళ ముదిలి అన్నారు. తాజాగా పార్టీ అధిష్ఠానం ఆమెకు వర్కింగ్ అధ్యక్షురాలుగా అవకాశం ఇవ్వడంతో మంగళవారం నందపూర్‌లో విలేకరులతో మాట్లాడారు. పార్టీ అధినేత నవీన్ పట్నాయక్ తనపై నమ్మకంతో ఈ అవకాశం ఇచ్చారని, మహిళా కార్యకర్తలకు అండగా ఉండి పార్టీ ప్రతిష్ఠ నిలిపేలా పనిచేస్తామన్నారు. బ్లాక్ బిజద అధ్యక్షుడు కాశీనాథ్ గొల్లూరి, సీనియర్ నేతలు జగన్నాథ్ పంగి, గోపాలకృష్ణ అభినందించారు.

ఊర్మిళ ముదిలి

సంతోష్ ప్రధాన్‌కు స్వర్ణ పతకాలు

బరగఢ్, న్యూస్‌టుడే: మధ్యప్రదేశ్‌లోని జబల్‌పూర్‌లో ఇంజినీరింగ్ కళాశాలలో ఇటీవల జరిగిన 45వ జాతీయ మాస్టర్స్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌లో ఒడిశాకు చెందిన క్రీడాకారుడు డాక్టర్ సంతోష్ ప్రధాన్ అత్యుత్తమ ప్రదర్శన చేశారు. బరగఢ్ జిల్లా సర్లా గ్రామానికి చెందిన ఆయన, ఈ పోటీల్లో ఏకంగా మూడు స్వర్ణ పతకాలు సాధించి హ్యాట్రిక్ నమోదు చేశారు. లాంగ్‌జంప్, ట్రిపుల్‌జంప్, 100 మీటర్ల హార్డిల్స్‌లో గత నెల జనవరిలో హైదరాబాద్‌లోని గచ్చిబౌలి స్టేడియంలో జరిగిన అథ్లెటిక్ మీట్‌లో కూడా ఆయన మూడు బంగారు పతకాలు సాధించడం విశేషం. ప్రస్తుతం ఆయన బరగఢ్ జిల్లా పోలీస్ శాఖలో విధులు నిర్వహిస్తున్నారు.

బాలుడి మృత్యువాత

రాయగడ పట్టణం, న్యూస్‌టుడే: రోడ్డు ప్రమాదంలో 15 ఏళ్ల బాలుడు దుర్మరణం చెందిన ఘటన రాయగడలో మంగళవారం సాయంత్రం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. స్థానిక రిలయన్స్ పెట్రోలు బంకు సమీపంలో రెండు బైకులు ఢీకొనడంతో ఓ ద్విచక్ర వాహనం వెనక కూర్చొన్న బాలుడు కిందపడి మృతిచెందాడు. మృతుడు కాశీపూర్ సమితి మందిబిసి గ్రామానికి చెందిన రాజేష్‌బాగ్‌గా గుర్తించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు.

జలపాతంలో మునిగి ఏఎస్సై దుర్మరణం

జయపురం, న్యూస్‌టుడే: కొరాపుట్ జిల్లా కొట్పాడ్ పోలీసుస్టేషన్ పరిధిలో ఉన్న గులుమి జలపాతంలో మునిగి ఓ ఏఎస్సై గల్లంతైన విషయం తెలిసిందే. అగ్నిమాపక శాఖ సిబ్బంది దాదాపు 40 గంటలు శ్రమించగా మంగళవారం ఆయన మృతదేహాన్ని బయటకు తీశారు. శవపరీక్షలు నిర్వహించి, విమానంలో మృతదేహాన్ని స్వస్థలమైన రాజస్థాన్‌కు పంపించనున్నట్లు ఐఐసీ ఫకీర్‌మోహన్ తెలిపారు.


ఆకాష్ చౌదరి (పాతచిత్రం)

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

జయపురం, న్యూస్‌టుడే: రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందిన ఘటన కొరాపుట్ జిల్లా దశమంత్‌పూర్ సమితిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలో తునపారసాహికి చెందిన చంద్రశేఖర్ ముదులి(29), సహదేవ్ దంగడామాఝి కలిసి ద్విచక్ర వాహనంపై వెళుతుండగా, సోమవారం మాలిగావ్ ప్రాంతం వద్ద అతివేగంగా వచ్చి మరో వాహనం వీరిని ఢీకొని వెళ్లిపోయింది. తీవ్రంగా గాయపడిన ఇద్దరిని స్థానికులు లక్ష్మీపూర్ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ చంద్రశేఖర్ మంగళవారం మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు.

కారు బైకు ఢీకొని మరొకరు..

ప్రమాదానికి గురైన కారు

జయపురం, న్యూస్‌టుడే: కారు-బైకు ఢీకొని ఒకరు మృతిచెందిన ఘటన కొరాపుట్ జిల్లా బొయిపరిగుడ సహీద్ లక్ష్మణ్ నాయక్ పాఠశాల వద్ద జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పూజారిగూడ పంచాయతీ నువాగుడ గ్రామానికి చెందిన నరహరి పూజారి(35), ఆయన బావ బందన్‌కండకి కలిసి ద్విచక్ర వాహనంపై మంగళవారం మాతాపడ పంచాయతీ మసియాగూడ గ్రామానికి వెళుతుండగా పాఠశాల వద్ద కారు వీరిని ఢీకొట్టింది. ఇద్దరు తీవ్రంగా గాయపడటంతో వారిని స్థానికులు ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ నరహరి మృతిచెందినట్లు వైద్యులు ప్రకటించారు.

ఆయుధాల రవాణా.. ఇద్దరి అరెస్టు

బరగఢ్, న్యూస్‌టుడే: ఆయుధాలు అక్రమంగా రవాణా చేస్తున్న వారిపై దాడి చేసి ఇద్దరు నిందితులను బరగఢ్ టౌన్ పోలీసులు అరెస్టు చేశారు. ఈ దాడిలో దేశీయ పిస్టల్ తదితరాలను స్వాధీనం చేసుకున్నారు. ఒక కారుతో పాటు రెండు ద్విచక్ర వాహనాలు జప్తు చేశారు. నిందితులను కోర్టుకు తరలించారు.

ద్విచక్ర వాహనం చోరీ

పర్లాఖెముండి, న్యూస్‌టుడే: పర్లాఖెముండి పట్టణ ఆదర్శ ఠాణా పరిధిలో ఎన్‌ఫీల్డ్ వాహనం చోరీ జరిగింది. ఠాణా అధికారి ప్రశాంత్ భూపతి తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని బోక్షిసాహికి చెందిన ఖిరోద్‌చంద్ర మహాపాత్ర్ తన ఇంటి ముందు ఉంచిన వాహనం ఆదివారం రాత్రి చోరీకి గురైందని ఠాణాలో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రాయగడలో అగ్నిప్రమాదం

మంటలార్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

రాయగడ పట్టణం, న్యూస్‌టుడే: జిల్లా కేంద్రంలో నిర్మాణ దశలో ఉన్న రైల్వే డీఆర్‌ఎం కార్యాలయం సమీపంలో మంగళవారం అగ్నిప్రమాదం సంభవించింది. అగ్నిమాపకశాఖ వర్గాల సమాచారం మేరకు.. స్థానిక సాయి ఇంటర్నేషనల్ కూడలి ఎదురుగా ఉన్న రైల్వే ప్రాంతంలో పోగుచేసి ఉన్న కలపకు నిప్పంటుకుంది. సమాచారం అందుకున్న వెంటనే సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని మంటలను అదుపు చేయడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.

EENADU Classifieds
JOBS
Wanted Teachers for Reputed Schools in A.P & Telangana, Contact: Sneha Placements Service. Ph: 94402 46409.
త్రినేత్ర హోంకేర్‌లో వృద్ధులను / పేషెంట్స్‌ను / పిల్లలను చూసుకొనుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఫ్రీ వసతి, భోజనం. జీ: 18K. ✆ 8520980099, 8520874499
హరేకృష్ణ హోంకేర్‌లో వృద్ధులను / పేషంట్స్ / పిల్లలను చూసుకొనుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఫ్రీవసతి, భోజనం జీ:18-20K ✆ 96404 68899, 96402 58899.
ప్రకటన చిన్నదైనా స్పందన అతివేగం
ఈనాడు క్లాసిఫైడ్స్
5 లైన్ల ప్రకటన కేవలం 315 /- (GST 5% అదనం) మాత్రమే
సంప్రదించండి: 8008597609

నిర్మించి ఏడాది.. మరమ్మతులకు గురైన వారధి

నవరంగపూర్, న్యూస్‌టుడే: ఏడాది కిందట ఉమర్‌కోట్ నుంచి నవరంగపూర్‌కు రహదారి నిర్మించారు. అందులో భాగంగా నిర్మించిన బడబరండి వంతెన మరమ్మతులకు గురై ఊచలు బయటకు రావడంతో పలు ప్రమాదాలు జరుగుతున్నాయని వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. ప్రతిరోజు ఈ మార్గంలో వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయని, అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం లేకపోయిందని స్థానికులు వాపోతున్నారు. ఈ విషయమై శాఖ ఇంజినీర్ బిశ్వరంజన్ బెహరాను అడగ్గా త్వరలోనే మరమ్మతులు పూర్తి చేస్తామని తెలిపారు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించండి
Cell: 80085 97609
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 80081 11237

ఉరేసుకుని యువకుడి ఆత్మహత్య

నవరంగపూర్, న్యూస్‌టుడే: ఉరేసుకుని యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన నవరంగపూర్ జిల్లా ఉమర్‌కోట్‌లో సోమవారం రాత్రి జరిగింది. ఏఎస్సై మలాయికుమార్ మిశ్ర తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణానికి చెందిన లింగరాజ్ జెనా(28) సోమవారం రాత్రి భోజనం చేసి గదిలో నిద్రపోవటానికి వెళ్లాడు. మంగళవారం ఉదయం ఎంతసేపటికీ తిరిగి రాకపోవడంతో తలుపులు పగలుగొట్టి చూడగా, ఫ్యాన్‌కు ఉరేసుకుని ఉన్నాడు. వెంటనే ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు.

అస్వస్థతకు గురైన ఎలుగుబంటి

నవరంగపూర్, న్యూస్‌టుడే: నవరంగపూర్ జిల్లా ఉమర్‌కోట్ సమితి తొహర అటవీ ప్రాంతంలో అస్వస్థతకు గురైన ఎలుగుబంటిని మంగళవారం స్థానికులు గుర్తించారు. దీన్ని చూడటానికి స్థానికులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. అటవీశాఖ అధికారులకు సమాచారం అందించగా వారు ఎలుగును ఆసుపత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం పపదహండి మృగవిహార్ కేంద్రానికి తరలించారు.

సంపద సృష్టిపై దృష్టి సారించాలి

సాలూరు, న్యూస్‌టుడే: చెత్త నుంచి సంపద సృష్టించడంపై అధికారులు దృష్టి సారించాలని పుర ప్రాంతీయ సంచాలకుడు రవీంద్ర అన్నారు. సోమవారం పట్టణంలోని డంపింగ్‌యార్డును సందర్శించారు. అనంతరం పన్నుల వసూళ్లపై అధికారులతో కమిషనర్ ఛాంబర్‌లో సమీక్షించారు. బకాయిలు వసూలుచేసి, శతశాతం లక్ష్యాలు సాధించాలన్నారు. కమిషనర్ రత్నకుమార్, ఆర్‌వో ఆశిస్ కుమార్, ఆర్ఐ నారాయణ రావు, పారిశుద్ధ్య అధికారి బాలకృష్ణ, డీఈ ప్రసాద్ ఉన్నారు.

మొక్కలు కావు.. తీర ప్రాంత కవచాలు!

ఇక్కడ విస్తారంగా కనిపిస్తున్నవి తీరప్రాంత కవచాలు. కనుచూపు మేర వంద ఎకరాల్లో దట్టంగా పెరిగిన ఈ మడ అడవులు వజ్రపుకొత్తూరు మండలం నువ్వలరేవు సముద్ర తీరంలో ఉప్పుటేరు ప్రవహించే పల్లివూరు రహదారి కూడలి పరిసర ప్రాంతంలో ఉన్నాయి. మంచినీళ్లపేట, హుకుంపేట, పూడిలంక, పల్లివూరు గ్రామాలను ఆనుకొని మడ అడవి జాతి (అవిసెన్నియా జెర్మినన్స్) మొక్కలు ఏపుగా విస్తరించి ఉన్నాయి. ఇవి ఎక్కువగా మంచి, ఉప్పు నీరు కలిసే బురద తీరాల్లో వ్యాప్తి చెందుతాయి. వీటి దృఢమైన వేర్లు సముద్రంలో సంభవించే ఆటుపోట్లతో ఉప్పుటేరులో నీటి ఉధృతిని తగ్గిస్తూ ఆయా ప్రాంతాలు, పంట పొలాలు, రహదారులు కోతకు గురి కాకుండా రక్షణ కవచంగా నిలుస్తాయి. సముద్ర జాతులు, పక్షులు, ఇతర వన్యప్రాణులకు నర్సరీలు, ఆవాసాలుగా ఏర్పడి జీవ వైవిధ్యాన్ని కాపాడుతుండటం విశేషం.

– న్యూస్‌టుడే, వజ్రపుకొత్తూరు

కూత పెడితే పతకమే..!

– న్యూస్‌టుడే, కోటబొమ్మాళి

వారంతా పేద కుటుంబాల నుంచి వచ్చారు. సౌకర్యాలు అంతంత మాత్రంగానే ఉన్నా నిత్య సాధనతో పతకాల పంట పండిస్తున్నారు. కోటబొమ్మాళి ఉన్నత పాఠశాల బాలికలు కబడ్డీలో సత్తా చాటుతున్నారు. ఈ ఏడాది జరిగిన రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో 11 మంది పదో తరగతి బాలికలు పాల్గొన్నారు. తొమ్మిది స్వర్ణాలు, రెండు రజతాలు సొంతం చేసుకోవడం గమనార్హం. వీరంతా జాతీయస్థాయి కబడ్డీ పోటీల్లో పలు విభాగాల్లో రాష్ట్ర జట్టుకు ప్రాతినిధ్యం వహించారు. హెచ్ఎం డబీరు గోవిందరావు, వ్యాయామోపాధ్యాయులు వాసుదేవరావు, వెంకటరావు, గణేష్ ప్రోత్సాహంతో ముందడుగు వేస్తున్నారు.

ఉపాధ్యాయులతో ప్రతిభ చూపిన విద్యార్థినులు

కబడ్డీలో రాష్ట్రస్థాయిలో రాణిస్తున్న బాలికలు

బెస్ట్ డిఫెండర్‌గా గుర్తింపు

కోటబొమ్మాళికి చెందిన డ్రైవర్ సింహాచలం, సుజాత కుమార్తె **నివగాన గీతిక.** అయిదుసార్లు రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొని రెండు స్వర్ణాలు, మూడు రజత పతకాలను సాధించింది. కర్నూలులో జరిగిన పోటీల్లో అండర్- 17 విభాగంలో జిల్లా జట్టుకు నాయకత్వం వహించి, రాష్ట్ర స్థాయిలో ద్వితీయ స్థానంలో నిలిచింది. బెస్ట్ డిఫెండర్‌గా నగదు పురస్కారం అందుకుంది. ఈ ఏడాది మహారాష్ట్రలో జరిగిన జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంది.

సైన్యంలో చేరడమే ధ్యేయం

కొత్తపేటకు చెందిన లారీ డ్రైవర్ అసిరినాయుడు, లక్ష్మి కుమార్తె **జీరు చంద్రలేఖ.** రాష్ట్ర స్థాయిలో పలుమార్లు స్వర్ణ పతకాలు సాధించింది. ఈ ఏడాది హరియాణాలో జరిగిన జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంది. దేశం తరఫున ప్రాతినిధ్యం వహించి క్రీడా కోటాలో సైన్యంలో చేరడమే తన ధ్యేయమని చెబుతోంది.

దేశానికి పేరు తీసుకొస్తా

కోటబొమ్మాళికి చెందిన తాపీ మేస్త్రీ జీరు రమేష్, దేవి కుమార్తె **కవిత.** అయిదుసార్లు రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొని స్వర్ణాలు, రజతాలు సాధించింది. బిహార్‌లో జరిగిన జాతీయస్థాయి సబ్ జూనియర్ పోటీల్లో సత్తా చాటింది. కబడ్డీలో మరిన్ని మెలకువలు నేర్చుకుని దేశానికి పేరు తీసుకొస్తానని చెబుతోంది.

పోలీసు కొలువే లక్ష్యం

కోటబొమ్మాళికి చెందిన ఆర్ఎంపీ వైద్యుడు పాత్రుని గోపి, కౌసల్య కుమార్తె **గీతిక.** అయిదుసార్లు రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొని రెండు స్వర్ణాలు, రెండు రజతాలు సాధించింది. ఈ ఏడాది హరియాణాలో జరిగిన జాతీయస్థాయి సబ్ జూనియర్ కబడ్డీ పోటీల్లో ప్రతిభ చూపింది. క్రీడా కోటాలో పోలీసు కొలువే లక్ష్యమని పేర్కొంది.

12 గంటల పాటు ప్రజాదర్బారు

● ఓపిగ్గా సమస్యలు విన్న కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు



ప్రజా సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు తెలిపారు. శ్రీకాకుళం నగర పరిధి 80 అడుగుల రహదారిలోని ఆయన క్యాంపు కార్యాలయంలో సోమవారం ప్రజాదర్బార్ నిర్వహించారు. ఉదయం 10 నుంచి రాత్రి 10 గంటల వరకు వినతులు స్వీకరించారు. అర్జీదారుల సమస్యలు తెలుసుకున్నారు. సంబంధిత శాఖల అధికారులకు ఫోన్ చేసి పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు. సుమారు 1,500 మంది నుంచి అర్జీలు అందాయని కేంద్ర మంత్రి కార్యాలయ ప్రతినిధులు తెలిపారు. వృద్ధురాలి యోగక్షేమాలు అడిగి తెలుసుకుంటున్న కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడిని చిత్రంలో చూడొచ్చు. – న్యూస్‌టుడే, కలెక్టరేట్(శ్రీకాకుళం)

11 మంది అరెస్టు: కొమరాడ, న్యూస్‌టుడే: కొమరాడ మండలంలోని కోదుల గుంప సమీపంలో సోమవారం జూదం ఆడుతున్న 11 మందిని అరెస్టు చేసినట్లు ఎస్సై జగదీష్‌నాయుడు తెలిపారు. రూ. 21 వేల నగదు, 10 చరవాణులు స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు.

2 కి.మీ. రోడ్డు 20 ఏళ్లుగా నిరీక్షణ...!

– న్యూస్‌టుడే, సోంపేట

ఉద్దానంలో ఏడు మండలాలను కలిపే రహదారి అది.. దీని నిర్మాణానికి అటవీ శాఖ అనుమతులకు రెండు దశాబ్దాలుగా నిరీక్షణ తప్పడం లేదు. తీర ప్రాంత గ్రామాల ప్రజలు రాకపోకలకు అవస్థలు పడుతున్నారని తెలిసినా ఉన్నతాధికారులు మౌనం పాటిస్తున్నారు. రామయ్యపట్నం-గొల్లగండి గ్రామాల మధ్య రెండు కి.మీ. మేర రోడ్డు నిర్మిస్తే 150 గ్రామాలకు మెరుగైన రవాణా సదుపాయం అందుబాటులోకి వస్తుంది. 20 ఏళ్ల కిందట పనులు ప్రారంభించగా సామాజిక అటవీ ప్రాంతమని అభ్యంతరం తెలపడంతో నిలిపివేశారు.

22 కి.మీ. దూరం తగ్గుతుంది

★ రామయ్యపట్నం-గొల్లగండి రహదారి నిర్మిస్తే ఇచ్ఛాపురం, కవిటి, కంచిలి, సోంపేట మండలాల ప్రజలు నేరుగా వజ్రపుకొత్తూరు వరకు వెళ్లడానికి ఉపయోగపడుతుంది.

★మహేంద్రతనయ నదిపై బారువ వద్ద వంతెన నిర్మాణం మరో ఆరేడు నెలల్లో పూర్తవుతుంది. ఈ మార్గంలో ఇచ్ఛాపురం నుంచి వజ్రపుకొత్తూరు వెళ్లేందుకు 22 కి.మీ. మేర దూరం తగ్గుతుంది.

ప్రత్యామ్నాయ స్థలం ఇస్తామన్నా..

★ తీర ప్రాంతానికి చెందిన ఈ భూమి అటవీశాఖకు సంబంధించింది కావడంతో ఉన్నత స్థాయి అనుమతులొస్తే తప్ప పనులు చేయడానికి వీలు లేదని అటవీ శాఖ అధికారులు స్పష్టం చేస్తున్నారు.

★ సమస్య పరిష్కారానికి రెవెన్యూ, అటవీ శాఖల అధికారులు పలుమార్లు సర్వేలు నిర్వహించారు. అటవీ శాఖకు ప్రత్యామ్నాయంగా 1.67 ఎకరాలు మరో చోట కేటాయించడానికి ప్రయత్నించినా పనులకు సహకరించకపోవడం సరికాదని తీర ప్రాంత గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అభివృద్ధికి నోచుకోని రామయ్యపట్నం రోడ్డు

150 గ్రామాలకు ఉపయోగపడే రహదారి నిర్మాణానికి అటవీశాఖ మోకాలడ్డు

పలుమార్లు నిధుల మంజూరు

★ 2006లో పనికి ఆహార పథకం కింద రామయ్యపట్నం-గొల్లగండి రహదారి నిర్మించాలని నిర్ణయించారు. కంకర రోడ్డు నిర్మించగానే అటవీ శాఖ అభ్యంతరాలతో పనులు నిలిచిపోయాయి.

★ 2011లో బీటీ రోడ్డు నిర్మాణానికి రూ.60 లక్షల మేర మంజూరు చేశారు. సమాయత్తం కాగా అటవీ సిబ్బంది అడ్డుకున్నారు.

★ 2017లో రూర్బన్ కింద రూ. కోటి మంజూరైనా అదే సమస్య పునరావృతమైంది. అటవీ శాఖతో సంప్రదింపుల అనంతరం 2022లో మళ్లీ అంతే మొత్తం సమకూరింది. ఉన్నతాధికారుల నుంచి అనుమతులు తెచ్చుకుని పనులు చేయాలని సూచించడంతో ముందుకు సాగలేదు.

★ ఇటీవల రూ. 1.20 కోట్లు మంజూరయ్యాయి. గుత్తేదారు ఇందుకు సన్నద్ధంగా అనుమతులు లేవంటూ అడ్డుకున్నారు.

త్వరలో అనుమతులొచ్చే అవకాశం..

అటవీ శాఖ అభ్యంతరాలతో తీర ప్రాంతంలో రహదారుల నిర్మాణం, ఇతర అభివృద్ధి పనులకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. రామయ్యపట్నం రోడ్డు విషయమై ఉన్నతాధికారులను సంప్రదిస్తున్నాం. త్వరలో అనుమతులొచ్చే అవకాశముంది. – బెందాళం అశోక్, ప్రభుత్వ విప్

రైతేరాజు

ఏపుగా పెరిగిన మొక్కజొన్న పంట

వర్షాకాలంలో మొక్కజొన్న.. వేసవిలో కూరగాయలు

న్యూస్‌టుడే, సారవకోట

పంటల మార్పిడి విధానం అనుసరించి అధిక దిగుబడులు, ఆదాయం సాధిస్తున్నారు సారవకోట మండలం బొంతు గ్రామానికి చెందిన రైతు సువరపు భాస్కరరావు. 90 సెంట్ల మెట్ట భూమిలో వర్షాకాలంలో మొక్కజొన్న, రబీ సీజన్‌లో టమాటా, బంతి, కాకర, వంగ, బీన్స్, గోరుచిక్కుడు, ముల్లంగి, క్యాబేజీ, దుంపలు వంటి కూరగాయలు, కొత్తిమీర, తోటకూర వంటి ఆకుకూరలు వేస్తున్నారు.

● పొలం మధ్యలో ఉన్న వ్యవసాయ బావి నీరే వేసవి పంటకు ఆధారం. పొలానికి ఇరువైపులా రంగసాగరం కాలువలు ఉండటంతో బావిలో మార్చి నెలాఖరు వరకు నీరు సమృద్ధిగా ఉంటుంది. పొలాలను మెత్తగా దుక్కి చేసి అనంతరం 5 నుంచి 10 సెంట్ల విస్తీర్ణం మేరకు మళ్లుగా విభజించి ఎత్తుపేన పంటలు సాగు చేస్తారు. ఒక పంట వల్ల నష్టం జరిగినా మరో పంట వల్ల ఆదాయం వస్తుందన్న ఆలోచనతో పంట మార్పిడి విధానం పాటిస్తున్నారు.

'బావి వద్ద ఆయిల్ ఇంజిన్ ఏర్పాటు చేశాను. స్ప్రింక్లర్ గొట్టాలు వినియోగించి తడి అందిస్తున్నా. విత్తనాలు నరసన్నపేట, శ్రీకాకుళం, పాతపట్నంలో కొనుగోలు చేస్తాను. 90 సెంట్ల విస్తీర్ణంలో పంటల సాగు కోసం కొంత పెట్టుబడి, ఎరువులు, పురుగు మందు, కర్రలు ఏర్పాటుకు రూ.70 వేల వరకు ఖర్చవుతుంది. కుటుంబసభ్యుల సహకారంతో పంటలు పండిస్తున్నాను. ఖర్చులు మినహా ఏడాదికి రూ.1.25లక్షల నుంచి రూ.1.50లక్షల వరకు ఆదాయం వస్తుంది.' అని రైతు సువరపు భాస్కరరావు తెలిపారు.

● పొలాన్ని మెత్తగా దుక్కిచేసి, భూసారం పెంచి సాగు చేస్తే మంచి దిగుబడులు వస్తాయని పాతపట్నం ఉద్యాన శాఖాధికారిణి మంగమ్మ తెలిపారు. పంట మార్పిడి విధానం తప్పనిసరిగా అనుసరించాలన్నారు. లేదంటే తెగుళ్లు, పురుగు ఉధృతి అధికంగా ఉంటుందన్నారు. కూరగాయలు సాగు చేసే రైతులకు ప్రభుత్వ రాయితీ అందిస్తోందని, సూచనల కోసం 8106416360ను సంప్రదించాలన్నారు.

రబీ పంటగా బీన్స్, కొత్తిమీర సాగు

కర్బూజ పంటలో సస్యరక్షణ చర్యలు ఇలా..

మాకివలసలో పండిసున్న కర్బూజా

జలుమూరు, న్యూస్‌టుడే: కర్బూజ సాగుకు మధుబాల, సుగర్‌బేబీ వంటి విత్తనాలు ఎంచుకోవాలి. పొలం మెత్తగా దుక్కిచేసి 15 సెంటీమీటర్ల ఎత్తుగా గట్లు వేయాలి. వాటికి ఆనుకునేలా నీరు వెళ్లేలా పిల్లకాలువలు తీయాలి. మొక్కకు మొక్కకు 60 సెంటీమీటర్లు దూరం ఉండాలి. మొక్క నాటే ప్రాంతంలో 10 సెంటీమీటర్ల లోతు గొయ్యితీసి ఎకరాకు 2 టన్నుల పశువుల ఎరువు, 100 కిలోల యూరియా, 100 కిలోల సూపర్ ఫాస్పేట్, 80 కిలోల పొటాష్, ఫిప్రోనిల్ గులికలు మిశ్రమం చేసి వేయాలి. మొక్క నాటిన తరువాత తగు మోతాదులో నీటి తడులు అందించాలి. కాయ నాణ్యత పెరిగేందుకు బోరాన్ ఒక లీటరు నీటికి 4 గ్రాముల చొప్పున నీటిలో కలిపి పిచికారీ చేయాలి. ఆకులు రసం పీల్చే పురుగు నివారణకు ఎసిఫేట్ పౌడర్ ఒక గ్రాము, కార్బండిజమ్ పౌడర్ ఒక గ్రాము లీటరు నీటికి చొప్పున కలిపి పిచికారీ చేయాలి. కాయ పాడవకుండా ప్లాస్టిక్ సీటు వేసే పద్ధతి చాలా మంచిదని ఉద్యాన శాఖ అధికారిణి కత్తిరి సునీత తెలిపారు.

పక్షులకు నాణ్యమైన తిండి గింజలు వేయాలి

న్యూస్‌టుడే, జలుమూరు: రానున్నది వేసవి కాలం ఎండలు మండుతున్న వేళ పశు పక్ష్యాదులు వడదెబ్బ బారి నుంచి రక్షించుకోవాలని అమ్మవారిపేట పశువైద్యాధికారి ముద్దాడ దీప్తి తెలిపారు. పక్షులను సంరక్షిస్తున్న యజమానులు ఇంటి పరిసరాల్లో నీడనిచ్చే చెట్లు పెంచాలన్నారు. చెట్లు కొమ్మలకు, పక్షుల నివాసయోగ్యమైన ప్రదేశాల్లో తాగునీరు అందుబాటులో ఉండేలా చూడాలి. నాణ్యమైన తిండి గింజలు వేయాలి. పాడైపోయిన గింజలు వేస్తే ఎస్పెర్జిల్లోసిస్ వ్యాధి వచ్చి పక్షులు మరణించే ప్రమాదం ఉంది. ట్రోటాన్, లివోటిస్, లివ్- 52 వంటి లివర్‌కు సంబంధించిన మందులు 100 పక్షులకు 10 మి.లీ మందు ఒక లీటరు నీటిలో కలిపి తాగిస్తే ఆరోగ్యంగా ఉంటాయని దీప్తి తెలిపారు.

జలుమూరులో చెట్టు నీడన సేదతీరుతున్న పావురాలు

పెసర సాగుకు అనుకూలమైన విత్తనాలు ఇవే

సరుబుజ్జిలి, న్యూస్‌టుడే

యాజమాన్య పద్ధతులు, సస్యరక్షణ చర్యలు, విత్తనాల ఎంపిక, కలుపు, తెగుళ్ల నివారణ వంటి చర్యలు తీసుకుంటే అధిక దిగుబడులు సాధించొచ్చని కేవీకే సస్యపోషణ శాస్త్రవేత్త **ఎస్.కిరణ్‌కుమార్** అన్నారు. రైతులు చరవాణిలో అడిగిన ప్రశ్నలకు సమాధానం ఇచ్చారు.

ప్రశ్న: వేసవిలో పెసర సాగు చేయాలని అనుకుంటున్నాం. అనుకూలమైన విత్తన రకాలను తెలపండి.

-జి.రామరాజు, అక్కురాడ

☛: ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ కళాశాల విశ్వవిద్యాలయం నుంచి విడుదలైన నూతన రకాలైన ఎల్‌జీజీ 630, 607, ఐపీఎం 2-14 అనుకూలంగా ఉంటాయి.

ప్రశ్న: నువ్వు విత్తనాలు చల్లి 25 రోజులు అవుతోంది. ఆకులకు రంధ్రాలు పడుతున్నాయి నివారణ చర్యలు చెప్పండి

- పి.చంద్రశేఖర్, చల్లబంద

☛: ఎసిఫేట్ అనే మందును ఎకరాకు 200 గ్రాములు చొప్పున 200 లీటర్ల నీటిలో కలిపి మొక్కలపై పిచికారీ చేసుకుంటే ఆకులపై రంధ్రాలు పడకుండా నివారించొచ్చు.

ప్రశ్న: చెరకు ముచ్చెలు నాటి 30 రోజులు అవుతోంది. పొలంలో తుంగ ఎక్కువగా ఉంది నివారణ ఎలా

– కె.వెంకటరమణ, మబగాం

☛: చెరకు ముచ్చెలు నాటిన 30 రోజుల తరువాత తుంగ వంటి మొండి జాతి కలుపు నివారణకు హాలో సల్ఫ్యూరాన్ మిథైల్ అనే కలుపు మందును 40 గ్రాములు 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేసుకుంటే తుంగ నివారించొచ్చు.

ఏళ్ల కష్టాలకు చెల్లు బీటీ

– న్యూస్‌టుడే, వజ్రపుకొత్తూరు గ్రామీణం, పలాస

వైకాపా ప్రభుత్వ హయాంలో గ్రామీణ రహదారులు కనీస అభివృద్ధికి నోచుకోలేదు. కంకర తేలి, గుంతలు పడిన రోడ్లను పట్టించుకున్న వారే కరవయ్యారు. గోతుల్లో తట్టెడు మట్టి పోసిన దాఖలాలు లేవు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వాటి గతి మారుతోంది. పలాస నియోజకవర్గంలో ఎమ్మెల్యే గౌతు శిరీష చొరవతో గ్రామీణ రోడ్లు గాడిన పడుతున్నాయి. దశాబ్దాలుగా కనీస అభివృద్ధికి నోచుకోని దారులు ఇప్పుడు ఎన్ఆర్ఈజీఎస్‌లో పక్కా బీటీ రోడ్లుగా మారుతున్నాయి. దీంతో ఇన్నాళ్లు పడుతూ లేస్తూ రాకపోకలు సాగించిన వాహనదారులు, ప్రయాణికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కేఆర్‌పేట రోడ్డు-రెయ్యిపాడు మధ్య పూర్తయిన బీటీ రోడ్డు నిర్మాణం

వేగంగా రహదారుల నిర్మాణం

ఇదీ పరిస్థితి

★ వజ్రపుకొత్తూరు మండలం కేఆర్‌పేట బీటీ రోడ్డు నుంచి రెయ్యిపాడు మధ్య ఉన్న మట్టి రోడ్డు అధ్వానంగా తయారైంది. ప్రస్తుతం ఎన్ఆర్ఈజీఎస్ కింద రూ. 50 లక్షలు మంజూరు కావడంతో ఇటీవలే బీటీ నిర్మాణం పూర్తయింది. ★ యూఆర్‌కేపురం రోడ్డు నుంచి సైనూరు మధ్య రూ. 25 లక్షలతో బీటీ రోడ్డు నిర్మించారు. ★ ఎన్‌పీ రోడ్డు నుంచి ఉ.రాయపాడు వరకు రూ. కోటితో బీటీ రోడ్డు నిర్మాణం ఇటీవలే పూర్తయింది. ★ పలాస మండలం కొబ్బరి చెట్లూరు రైల్వేగేటు నుంచి సున్నాదేవి వరకు రూ. 75 లక్షలతో బీటీ రోడ్డును అభివృద్ధి చేశారు. ★ మందస మండలం ఉమాగిరి నుంచి భైరిసారంగిపురం వరకు రూ. 90 లక్షలతో బీటీ రోడ్డు నిర్మాణం పూర్తవడంతో నియోజకవర్గ ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

అభివృద్ధి బాట పయనం

పలాస నియోజకవర్గంలోని గ్రామీణ ప్రాంత రహదారులు కూటమి ప్రభుత్వంలో వృద్ధి చెందుతున్నాయి. ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా అత్యంత ఇబ్బందికరంగా ఉన్న రహదారులను గుర్తించి యుద్ధప్రాతిపదికన పూర్తి చేసి మెరుగుపరుస్తున్నాం. రానున్న రోజుల్లో మిగిలి ఉన్న దారులను అభివృద్ధి పరిచి రాకపోకలకు అంతరాయం తలెత్తకుండా అన్ని చర్యలు తీసుకుంటాం.

– రవిబాబు, డీఈఈ, పంచాయతీరాజ్ శాఖ ప్రాజెక్టు, పలాస

మంజూరైన రహదారుల వివరాలు

మండలం	మంజూరు	నిధులు (రూ.కోట్లలో)	పనులు పూర్తయినవి	జరుగుతున్నవి
పలాస	10	60.589	3	7
వజ్రపుకొత్తూరు	8	56.6145	4	2

'గుంప' ఆదాయం రూ.3.13 లక్షలు

నగదు లెక్కింపు గది వద్ద ఈవో, పోలీసులు

కొమరాడ: మహాశివరాత్రి సందర్భంగా కొమరాడ మండలంలోని గుంప సోమేశ్వరస్వామి ఆలయం ఆది, సోమవారాల్లో భక్తజన సందోహంతో నిండిపోయింది. కాగా ఈ రెండు రోజుల్లో హుండీ కానుకలు, టికెట్ల రూపంలో వచ్చిన ఆదాయాన్ని దేవాదాయ శాఖ అధికారి శ్రీనివాసరావు, ఎస్సై జగదీష్‌నాయుడు సమక్షంలో లెక్కించారు. మొత్తం రూ. 3,13,141 వచ్చినట్లు వెల్లడించారు. సిబ్బంది ఉన్నారు.

సిబ్బంది లేరు.. తలుపులు తీయరు

మెళియాపుట్టిలో ర.భ.శాఖ సెక్షన్ కార్యాలయాన్ని రూ.లక్షల వ్యయంతో నిర్మించారు. ఇక్కడ పనిచేసిన ఏఈ బదిలీ కావడంతో ఏడాదిగా వినియోగానికి దూరంగానే ఉంది. శాశ్వత ప్రాతిపదికన మండలానికి ర.భ.శాఖ అధికారులు, సిబ్బంది లేక భవనం అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా తయారైందని పలువురు వాపోతున్నారు. ఈ సమస్యపై ఏఈ హరనాథరావు మాట్లాడుతూ.. మెళియాపుట్టిలో అదనపు బాధ్యతలు చేపడుతున్నానని, అటెండర్ లేకపోవడంతో ఇబ్బంది ఉందని తెలిపారు. – న్యూస్‌టుడే, మెళియాపుట్టి

19న అమెరికా భక్తుల ప్రవచనం

హిరమండలం, న్యూస్‌టుడే: ఈనెల 19న నరసన్నపేటలో అమెరికాకు చెందిన భక్తులు హరినామ సంకీర్తన ప్రవచనం, భగవద్గీత ప్రసంగం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆధ్యాత్మిక కూర్మ గ్రామం నిర్వాహకులు పేర్కొన్నారు.

స్వశక్తితో ఎదిగి.. ఆదర్శంగా నిలిచి

మహిళా సంఘాల రుణాలతో ఆర్థికంగా నిలదొక్కుకుంటున్న నారీమణులు

– న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం గ్రామీణం

ఇంటికే పరిమితం కాకుండా కొందరు మహిళలు స్వశక్తితో ముందుకు సాగుతూ, కుటుంబానికి తమ వంతు భరోసా కల్పించి ఆర్థికంగా నిలదొక్కుకుంటున్నారు. గ్రామ మహిళా సమాఖ్య నుంచి రుణాలు తీసుకొని చిన్న చిన్న వ్యాపారాలు చేస్తూ తద్వారా ఉపాధి పొంది ఎందరికో ఆదర్శంగా నిలుస్తున్నారు.

✤ ఇచ్ఛాపురం మండలంలో ఈదుపురం, అరకభద్ర, లొద్దపుట్టి, మండపల్లి, బూర్జపాడు, బిర్లంగి తదితర ప్రాంతాలకు చెందిన మహిళా సంఘ సభ్యులు గ్రూపులుగా ఏర్పడి వ్యాపార కార్యకలాపాలు సాగిస్తూ కుటుంబ సభ్యుల అవసరాలు తీర్చుతూ, వారికి చేదోడు వాదోడుగా ఉంటున్నారు.

తోడుగా నిలుస్తూ..

అల్లిక పని చేస్తున్న తేజ

లొద్దపుట్టికి చెందిన పైల తేజ భూమాత స్వయం సహాయక సంఘంలో సభ్యురాలు. రూ. 50వేలు రుణం తీసుకుని ఇంటి వద్దనే మగ్గంతోపాటు బ్యూటీపార్లర్ నడుపుతున్నారు. కమలాయిపుట్టుగ, గుడ్డిభద్ర, బెలగాం, ఇచ్ఛాపురం తదితర ప్రాంతాల నుంచి మగ్గం పనులు చేయించుకునేందుకు ఇక్కడ వస్తారు. నెలకు సుమారు రూ. 20వేలు పైనే ఆదాయం వస్తోంది. దీంతో బ్యాంకుకు వాయిదాలు చెల్లిస్తూ, కుటుంబానికి తోడుగా నిలుస్తున్నారు.

కుటుంబానికి ఆసరా

అగరబత్తీలు తయారీ చేస్తున్న ఊర్వశి

అరకభద్ర గ్రామానికి చెందిన తెలగ ఊర్వశి శ్రీ వినాయక సహాయక సంఘంలో సభ్యురాలు. ఇంటి వద్దనే చిన్న వ్యాపారం చేసేవారు. ఆ సంపాదన సరిపోకపోవడంతో సంఘంలో పొదుపు రుణం రూ. లక్ష తీసుకొని చిరు వ్యాపారాలు నిర్వహిస్తున్నారు. ఒక పక్క అగరబత్తీలు తయారీ చేస్తూ మరో పక్క పాన్‌షాపు నడుపుతున్నారు. అగరబత్తీలు గ్రామంలోనే కాకుండా కవిటి, సోంపేట, పలాస, శ్రీకాకుళం మండలాలతోపాటు ఒడిశాలోని జయంత్‌పూర్, పాత్రపూర్, సమాంతపల్లి తదితర ప్రాంతాలకు విక్రయిస్తూ నెలకు రూ. 20 వేలు వరకు సంపాదిస్తున్నారు. కుటుంబ అవసరాలు తీర్చుతూ.. బ్యాంకు రుణం, వాయిదాలు చెల్లిస్తున్నామని ఆమె తెలిపారు.

ఆర్థికంగా స్థిరపడుతూ

చిప్స్ తయారు చేస్తున్న రహిణి

ఈదుపురానికి చెందిన దుక్క రహిణి మహిళా గ్రూపులో సభ్యురాలు. వ్యవసాయ కూలీగా ఉంటూ కుటుంబాన్ని పోషించేవారు. కూలీ గిట్టుబాటు కాకపోవడంతో రూ. లక్ష రుణం తీసుకుని ఇంటి వద్దనే చిప్స్ తయారీ ప్రారంభించారు. దీనిపై నెలకు రూ. 15 వేలు ఆర్జిస్తున్నారు. సంఘాలు అందిస్తున్న రుణాలు సద్వినియోగం చేసుకుంటే ఆర్థికంగా స్థిరపడొచ్చని ఆమె అంటున్నారు.

అందరినీ ప్రోత్సహిస్తున్నాం

గ్రామాల్లో ఆర్థికంగా ఎదగాలనుకుంటున్న మహిళలకు సంఘాలు, బ్యాంకుల ద్వారా రుణాలు అందించి వారిని ప్రోత్సహిస్తున్నాం. ఇచ్ఛాపురం మండలంలో సుమారు 2 వేల మందికి వ్యక్తిగత రుణాలు అందించి ఆర్థికంగా ఎదిగేందుకు సహకరిస్తున్నాం.

– ఎస్.ప్రసాదరావు, ఏపీఎం, ఇచ్ఛాపురం

విశాఖ రైల్వే జోన్‌లో కలపండి

సోంపేట, కంచిలి, కవిటి గ్రామీణం, ఇచ్ఛాపురం, న్యూస్‌టుడే: ఇచ్ఛాపురం నుంచి పలాస వరకు ఉన్న రైల్వే స్టేషన్లను విశాఖ రైల్వే జోన్‌లో కలిపి ప్రయాణికులకు ఇబ్బంది లేకుండా చూడాలని జెడ్ఆర్‌యూసీసీ సభ్యుడు శ్రీనివాసరావు కోరారు. ఆయన సోమవారం కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడుకు వినతిపత్రం పంపిస్తూ ఖుర్దా డివిజన్‌లోని ఇచ్ఛాపురం, జాడుపూడి, సోంపేట, బారువ, మందస, సుమ్మాదేవి, పలాస స్టేషన్ల అభివృద్ధితోపాటు ఇతర సమస్యల పరిష్కారానికి విశాఖ కేంద్రంగా ఏర్పాటవుతున్న సౌత్ కోస్ట్ రైల్వేజోన్‌లో కలిపేలా చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. ఖుర్దా రోడ్ డివిజన్‌లో ఈ స్టేషన్లు ఉండటంతో భాషాపరమైన ఇబ్బందులతోపాటు ఈ ప్రాంత ప్రజలకు ఇతర సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని రామ్మోహన్‌నాయుడితోపాటు రైల్వేశాఖా మంత్రికి మెయిల్ ద్వారా వినతిపత్రం పంపించామన్నారు.

కరపత్రాలు ఆవిష్కరిస్తున్న జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి రాజు

జ్ఞాపకాల మదిలో...
జాతస్య హిధ్రువో మృత్యుః ధ్రువం జన్మ మృతస్యచ
తస్మాద పరిహార్యేర్థే నత్వం శోచితు మర్హసి
మీరు చూపిన ఆత్మీయత..
అనురాగం మా అభివృద్ధికి వేసిన పూబాట..
మీరు భౌతికంగా దూరమైనా మా చెంత ఉన్నట్లే ఉంది..
ఏమిచ్చి రుణం తీర్చుకోము మా యదలోతుల్లోని భావాలను అక్షరరూపంలో నివేదించడం తప్ప..
నిర్యాణం, వర్ధంతి, జయంతి
ఈనాడు
యాడ్స్ ద్వారా తెలియజేయండి
ప్రకటనలపై జీఎస్టీ 5% అదనం
ఈనాడు ప్రకటనల విభాగం
80085 97609

(c) eenadu

రథోత్సవానికి హాజరైన జనం

తేరుపై తేజోమూర్తి

వైభవంగా అమరేశ్వరుని దివ్య రథోత్సవం

అమరావతి, న్యూస్‌టుడే: హరహర మహాదేవ.. శంభోశంకర నామ స్మరణతో అమరావతి మార్మోగింది. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా కీలక ఘట్టమైన బాలచాముండికా అమరేశ్వరస్వామి దివ్య రథోత్సవం మంగళవారం వైభవంగా నిర్వహించారు. రథాన్ని పుష్పాలతో శోభాయమానంగా తీర్చిదిద్ది ఉత్సవమూర్తులను కొలువుదీర్చారు. శాసనసభ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు, ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ హాజరై ప్రత్యేక పూజల అనంతరం సాయంత్రం 4.25 గంటలకు రథోత్సవం ప్రారంభించారు. భక్తులు శివ నామస్మరణ చేస్తూ రథం లాగేందుకు పోటీపడ్డారు. వేలాది మంది తరలివచ్చి వేడుకను కనులారా వీక్షించారు. కళాకారులు రథం ముందు నృత్యాలు, కోలాటాలు, డప్పు వాయిద్యాలతో అలరించారు. అమరావతి ప్రధాన వీధిలో క్రోసూరు రహదారి వరకు రథం వెళ్లి తిరిగి 5.30 గంటలకు రథశాలకు చేరుకుంది. ఆలయ కార్యనిర్వహణాధికారి రేఖ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

రథం లాగుతున్న డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణరాజు, ఎమ్మెల్యేలు భాష్యం ప్రవీణ్, భాను ప్రకాష్, బ్రహ్మారెడ్డి, పులివర్తి నాని తదితరులు

ఉక్కు.. తుక్కు

గోదాముల్లో నిరుపయోగంగా..

ఈనాడు, నరసరావుపేట, న్యూస్‌టుడే, వినుకొండ రూరల్

వైకాపా ప్రభుత్వంలో గృహ నిర్మాణ సంస్థపరంగా భారీ అవినీతి జరిగింది. జగనన్న కాలనీల పేరిట ఎన్నో అక్రమాలు చోటుచేసుకున్నాయి. గృహ నిర్మాణ సంస్థలో అవసరానికి మించి కొనుగోలు చేసిన ఉక్కును నాడు వినియోగించకపోవడంతో గోదాముల్లో తుక్కుగా మూలుగుతోంది. ఆ ఇనుమునే ఇప్పుడు ఇళ్ల నిర్మాణానికి వాడాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలు రావడంతో 'తుక్కుగా మారిన ఉక్కు' బాగోతం బయటపడింది. ఏయే జిల్లాల్లో ఎంత మేరకు నాటి ఇనుము నిల్వలు ఉన్నాయనే విషయమై ప్రభుత్వం లెక్కలు తీసింది. జిల్లాలో 1,343 టన్నుల నిల్వలు ఉన్నట్లు తేలింది.

❖ అప్పట్లో బహిరంగ మార్కెట్లో టన్ను ఇనుము ధర రూ.54 వేలు ఉంటే వైకాపా నాయకులు టెండర్లు దక్కించుకుని టన్ను రూ.60 వేలకు కొనుగోలు చేయించారు. అలా జిల్లాలో రూ.8 కోట్ల విలువైన 1,343 టన్నుల నిల్వ ఉంది.

❖ జగనన్న కాలనీల పేరిట ఊళ్లే నిర్మిస్తున్నామని గొప్పలు చెప్పారే కానీ.. ఇళ్లు మాత్రం నిర్మించలేకపోయారు. టన్ను రూ.60 వేలకు పైగా వెచ్చించి ఇనుము కొనుగోలు చేసి వినియోగించలేదు. ఇళ్ల నిర్మాణం జరగకపోవడంతో జిల్లాలోని వివిధ ప్రాంతాల గోదాముల్లో నిల్వలు ఉండిపోయాయి. ఆ ఉక్కును ఐచ్ఛికం-3 కింద నిర్మించే ఇళ్లకు వినియోగించాలని రాష్ట్రస్థాయి ఉన్నతాధికారులు ప్రస్తుతం ఆదేశించారు. పీఎంఏవై-1.0 పథకం ఈ ఏడాది సెప్టెంబరుతో ముగియనుంది. ఈ నేపథ్యంలో నిల్వ ఉక్కును పథకం కింద వినియోగించాలని సూచించారు. అవసరమైతే పీఎంఏవై అర్బన్, గ్రామీణ పథకాల ఇళ్లకూ వినియోగించడానికి అనుమతించారు. మార్చిలోపు వినియోగించకుంటే సంబంధిత అధికారులు బాధ్యత వహించాల్సి ఉంటుందని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

వినుకొండ గోదాములో నిల్వ చేసిన ఇనుము

ముందుకు రాని లబ్ధిదారులు

మూడేళ్లకు పైగా నిల్వ ఉండటంతో తుప్పు పట్టిన ఉక్కును తీసుకునేందుకు లబ్ధిదారులు ముందుకు రావడం లేదు. నిల్వ ఉన్న ఉక్కు ఇళ్ల నిర్మాణానికి పనికిరాదని జిల్లా గృహ నిర్మాణ సంస్థ ఇంజినీరింగ్ అధికారులు చెబుతున్నారు. మరోపక్క ఉన్నతస్థాయి నుంచి ఉత్తర్వులు వెలువడటంతో ఏం చేయాలో అర్థం కాని పరిస్థితి నెలకొంది. అమరావతి, పెదకూరపాడు మినహా మిగతా అన్నిచోట్లా గోదాముల్లో నిల్వ ఉండటంతో ఇనుము బాగానే ఉందని, గ్రామీణ ప్రాంతాల్లో నిర్మించే ఆప్షన్-3 ఇళ్లకు ఆ ఇనుము వాడతామని గృహ నిర్మాణ సంస్థ పీడీ ప్రసాద్ తెలిపారు.

వైద్య ఆరోగ్యశాఖ డిజిటల్ బాట

జిల్లాలో 132 మందికి ఐడీల కేటాయింపు

నరసరావుపేట, న్యూస్‌టుడే: పారదర్శకత.. జవాబుదారీతనం.. వేగంగా దస్త్రాల పరిష్కారం లక్ష్యంగా వైద్య ఆరోగ్యశాఖ డిజిటల్ బాట పట్టింది. పాలనా వ్యవహారాలన్నింటిని ఇక నుంచి కాగితాల రూపంలో కాకుండా ఆన్‌లైన్‌లోనే నిర్వహించనుంది. ఈ-ఆఫీస్ విధానంతో ఉద్యోగులు, అధికారుల పనితీరు రాష్ట్రస్థాయి నుంచి సులువుగా పర్యవేక్షించే వెసులుబాటు కలుగనుంది. విధుల్లో అలసత్వం.. నిర్లక్ష్యంగా వ్యవహరించే వారిని గుర్తించి వారి పనితీరు మెరుగుపర్చే చర్యలకు అవకాశం ఏర్పడనుంది. జిల్లాలో 132 మంది ఉద్యోగులకు ఐడీలు ఇచ్చారు. వీరందరి ఐడీలు ఎన్ఐసీ బృందం లాగిన్ చేయనుంది. త్వరలోనే పూర్తిస్థాయిలో ఆన్‌లైన్ సేవలు అందుబాటులోకి రానున్నాయి.

❖ డీఎంహెచ్‌వో కార్యాలయంలోని అన్ని విభాగాల బాధ్యులు, పీహెచ్‌సీలు, యూపీహెచ్‌సీల వైద్యాధికారులు, పర్యవేక్షకులు, కార్యాలయ సిబ్బందికి ఈ-ఆఫీస్ ఐడీలు కేటాయించారు. పీహెచ్‌సీ, యూపీహెచ్‌సీ స్థాయిలో వైద్యాధికారి ఒకరు, సీనియర్ అసిస్టెంట్(యూడీసీ)కి ఐడీలు ఇచ్చారు. జూనియర్ సహాయకుడి నుంచి సీనియర్ సహాయకుడికి.. అక్కడి నుంచి వైద్యాధికారికి దస్త్రాలు ఆన్‌లైన్‌లో వెళ్తాయి. వైద్యాధికారి నుంచి నేరుగా డీఎంహెచ్‌వోకు ఆన్‌లైన్‌లో రిపోర్టులు, దస్త్రాలు పంపిస్తారు. డీఎంహెచ్‌వో కలెక్టర్‌తో పాటు రాష్ట్ర కమిషనర్ కార్యాలయానికి దస్త్రాలు ఆన్‌లైన్‌లో పంపించనున్నారు.

❖ డీఎంహెచ్‌వో కార్యాలయంలో వివిధ విభాగాలు నడుస్తున్నాయి. ఏవో కార్యాలయంలో వివిధ సెక్షన్లలో సూపరింటెండెంట్లతోపాటు ఇతర ఉద్యోగులు 50 మంది, పీహెచ్‌సీల్లో 14 మంది చొప్పున వైద్యులు, సిబ్బంది విధులు నిర్వర్తిస్తున్నారు. జిల్లాలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు (పీహెచ్‌సీలు) 39, పట్టణ ఆరోగ్య కేంద్రాలు(యూపీహెచ్‌సీలు) 26 ఉన్నాయి. వీటిలోని వైద్యాధికారులు, సీనియర్ సహాయకులకు ఈ-ఆఫీస్ ఐడీలు కేటాయించారు. వారు తప్పనిసరిగా ఆ ఐడీతో లాగిన్ అయి దస్త్రాలను తెరవడం విధిగా జాగ్రత్తలు తీసుకున్నారు.

❖ ఈ-ఆఫీస్ కార్యకలాపాల నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని డీఎంహెచ్‌వో డాక్టర్ రవి చెప్పారు. ఐడీల లాగిన్ ప్రక్రియ వేగవంతంగా జరుగుతోంది. ఉద్యోగులందరికీ ఐడీ లాగిన్లు ఇస్తే ఇక కార్యకలాపాలన్నీ డిజిటల్ రూపంలో జరుగుతాయని వివరించారు.

రాజధానిలో భూసేకరణకు సిద్ధం

భూసమీకరణలో ఇవ్వని 2,459.88 ఎకరాలకు ప్రణాళిక

ఈనాడు – అమరావతి

నవ్యాంధ్ర రాజధాని అమరావతి నిర్మాణానికి భూసమీకరణలో భూమివ్వని రైతుల నుంచి భూసేకరణ ద్వారా తీసుకునేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. కొంతమంది రైతులు వివిధ కారణాలతో ఇప్పటికీ భూములివ్వలేదు. వీరిలో నెలకొన్న సందేహాలను సీఆర్‌డీఏ అధికారులు పలుమార్లు నివృత్తి చేశారు. భూసమీకరణ కింద ఇస్తే ఎక్కువ ప్రయోజనం ఉంటుందని అవగాహన కల్పించారు.

తప్పనిసరి పరిస్థితుల్లో..

రాజధానిలో వివిధ ప్రాజెక్టుల పనులు వేగంగా జరుగుతుండటం, వివిధ సంస్థలు పనులు చేపడుతుండటం, రైతులకిచ్చిన రిటర్నబుల్ ప్లాట్లలో మౌలిక వసతుల కల్పన వీలైనంత తొందరగా పూర్తి చేయాలన్న లక్ష్యంతో చేస్తున్న పనులకు కొన్నిచోట్ల అడ్డంకులు ఎదురవుతున్నాయి. వీటిని అధిగమించడానికి భూసేకరణకు వెళ్లక తప్పని పరిస్థితి. ఇందుకోసం ప్రత్యేక ప్రణాళికను అధికారులు సిద్ధం చేస్తున్నారు. ప్రాధాన్యక్రమంలో ఆయా అవసరాలకు తగ్గట్టుగా సేకరణ చేపట్టనున్నారు.

❖ తొలి ప్రాధాన్యతగా.. రాజధానికి జాతీయ రహదారి నుంచి అనుసంధానం చేసే సీడ్ యాక్సెస్ రోడ్డు నిర్మాణానికి అవసరమైన 12.5757 ఎకరాలను సేకరించనున్నారు.

❖ మరోవైపు ట్రంక్‌రోడ్ల నిర్మాణానికి అవసరమైన 216 ఎకరాలకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నారు.

❖ ప్రకటన జారీకి ముందే రైతులు భూసమీకరణలో ఇవ్వడానికి ముందుకొస్తే వారి నుంచి వెంటనే తీసుకుంటారు.

❖ భూసేకరణ అధికారి నియామకం తర్వాత తదుపరి ప్రక్రియను చేపట్టే దిశగా కార్యాచరణ ప్రణాళికతో ముందుకెళ్తున్నారు. ఇదంతా పూర్తయితే రాజధాని ప్రాంతంలో పనులకు అడ్డంకులు తొలగడంతోపాటు అభివృద్ధి వేగవంతమవుతుందని సీఆర్‌డీఏ భావిస్తోంది.

" భూయజమానుల్లో కొందరు స్థానికంగా లేకపోవడం, కుటుంబ సభ్యుల మధ్య తగాదాలు, మరికొందరు భూసమీకరణకు ఆసక్తి చూపకపోవడంతో 2,459 ఎకరాల సమీకరణ సాధ్యం కాలేదు. ఇవి ఎక్కడికక్కడ ఎల్‌పీఎస్ లేఅవుట్లు, రైతులకు కేటాయించిన రిటర్నబుల్ ప్లాట్ల పరిధిలో ఉన్నాయి. "

సేకరించాల్సిన భూమి వివరాలు...

విభాగం	ఎకరాల్లో
సీడ్‌యాక్సెస్ రోడ్డు	12.58
ట్రంక్ రోడ్లు	216.33
ఎల్‌పీఎస్ లేఔట్లు, మౌలికవసతుల కల్పన	396.31
రైతులకు ఇచ్చిన రిటర్నబుల్ ప్లాట్లు	174.35
భూసమీకరణలో ఇవ్వని భూమి	1660.31
మొత్తం భూమి	2459.88

ఎయిమ్స్ ప్రస్థానం అద్వితీయం : లోకేశ్

ఈనాడు, అమరావతి – న్యూస్‌టుడే, మంగళగిరి, తాడేపల్లి: మంగళగిరి ఎయిమ్స్ ప్రస్థానం అద్వితీయం. బోధన, పరిశోధన, రోగి సంరక్షణ అనే మూడు స్తంభాలపై నిలిచి ఉంది. నమ్మకం అనే నాలుగో స్తంభంపై ఎదగాలని రాష్ట్ర ఐటీ, విద్య శాఖల మంత్రి నారా లోకేశ్ ఆకాంక్షించారు. మంగళగిరి ఎయిమ్స్‌లో మంగళవారం నిర్వహించిన రెండో స్నాతకోత్సవంలో ఆయనతోపాటు కేంద్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి అనుప్రియ పటేల్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. తొలుత ఎయిమ్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అహంతెమ్ శాంతాసింగ్ ప్రగతి నివేదిక వివరించారు.

ఘనంగా స్నాతకోత్సవం

రాష్ట్ర మంత్రి లోకేశ్‌ను సన్మానిస్తున్న అహంతెమ్ శాంతాసింగ్, వేదికపై కేంద్ర సహాయ మంత్రి అనుప్రియ పటేల్, ఎయిమ్స్ అధ్యక్షుడు తపన్‌కుమార్ సాహూ, డీన్ రామ్మోహన్ తదితరులు

❖ వైద్య పట్టాలందుకున్నవారు: 58 మంది

❖ బంగారు పతకాలందుకున్నవారు: ముగ్గురు

" మంగళగిరి ఎయిమ్స్ 2015లో అతి సామాన్యంగా ప్రారంభమైంది. నేడు అండర్ గ్రాడ్యుయేట్, పోస్ట్ గ్రాడ్యుయేట్, సూపర్ స్పెషాలిటీ, నర్సింగ్, అనుబంధ ఆరోగ్య రంగాల్లో 1,300 మందికిపైగా విద్యార్థులతో సమగ్ర సంస్థగా ఎదిగింది. ప్రస్తుతం 650 పడకలున్నాయి. – మంత్రి నారా లోకేశ్

" వైద్య విద్య కోసం విదేశాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా దేశంలో వివిధ వైద్య కళాశాలలు ఏర్పాటు చేస్తున్నాం. మంగళగిరి ఎయిమ్స్‌లోనూ ఆయుష్ సేవలను మరింత విస్తృతం చేస్తాం. – అనుప్రియ పటేల్, కేంద్ర సహాయ మంత్రి

ఆకట్టుకున్న వస్త్రాలంకరణ.. ఎయిమ్స్ విభాగాధిపతుల నుంచి వైద్యులు, వైద్య విద్యార్థులు మంగళగిరి చేనేత వస్త్రాలంకరణతో ఆకట్టుకున్నారు. పురుషులు అచ్చమైన పంచెకట్టు, పైజామా ధరించగా.. మహిళలు చేనేత చీరలు ధరించారు. యువ వైద్యులు సైతం సంప్రదాయ వస్త్రధారణతో కనువిందు చేశారు.

శ్రద్ధాంజలి

ప్రేమతో ఆప్యాయతతో అందరి మన్ననలు ఆకట్టుకున్న మీరు ఇక లేరన్న నిజాన్ని నమ్మలేకున్నాము. మీ పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ఆ భగవంతుని ప్రార్థిస్తూ... - కుటుంబ సభ్యులు

కీ॥శే॥ తోట శివమల్లిఖార్జునరావు గారు
లాలుపురం (గ్రా.), గుంటూరు రూరల్ (మం.)
జననం : 1/11/1958 మరణం : 17/2/2026

: అంతిమయాత్ర : ది. 18-2-2026 బుధవారం ఉ॥ 10 గం.లకు గుంటూరు రూరల్ (మం.), లాలుపురం (గ్రా.) లోని మా స్వగృహమునుండి బయలుదేరును.

మళ్లీ ఆనంద ఆదివారం!

రఘురామనగర్ (సత్తెనపల్లి), న్యూస్‌టుడే

ఉరుకులుపరుగుల జీవితంతో ఒత్తిడి, అనారోగ్య సమస్యల బారినపడుతున్న పట్టణ ప్రజల్లో సంతోషం నింపడమే ధ్యేయంగా ఆనంద ఆదివారం కార్యక్రమాన్ని కూటమి ప్రభుత్వం పునరుద్ధరించింది. గత తెదేపా ప్రభుత్వ హయాంలో పట్టణాల్లో ఉల్లాసం.. ఉత్సాహభరిత వాతావరణంలో హ్యాపీ సండే వేడుకలు నిర్వహించారు. పిల్లలు, పెద్దలు అందరూ ఒకచోట చేరి సందడి చేశారు. వైకాపా అధికారంలోకి రాగానే ప్రజలకు ఆనందాన్ని దూరం చేసింది. ఆరోగ్యం.. ఆహ్లాదానికితోడు పర్యావరణ పరిరక్షణలో అందరినీ భాగస్వాముల్ని చేసేలా ఇక నుంచి వేడుకలు నిర్వహించనున్నారు.

పట్టణ ప్రజల సంతోషమే ధ్యేయం

నెలలో రెండు వారాలు

ఈ నెల 22 నుంచి హ్యాపీ సండే కార్యక్రమం మొదలవుతుంది. నెలలో 2, 4వ ఆదివారాలు వేడుకలు నిర్వహిస్తారు. అందరికీ అనువుగా ఉండేలా ఉదయం 6 నుంచి 10 గంటల వరకు కార్యక్రమాలు ఏర్పాటు చేస్తారు. స్థానిక పరిస్థితుల్ని బట్టి రెండునుంచి మూడు గంటలు వివిధ వేడుకలు నిర్వహిస్తారు. కూడళ్లు, పార్కులు, కళాశాలలు, జనం ఎక్కువమంది గుమిగూడేచోట వీటిని ఏర్పాటు చేస్తారు.

❖ ఈ నెల 22వ తేదీన ఆనంద ఆదివారాన్ని నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్లు న్యూస్‌టుడే బృందంతో చెప్పారు.

ఆరోగ్యం.. ఆహ్లాదం.. పర్యావరణ హితం

ఆరోగ్యం కోసం సైక్లింగ్, నడక, జాగింగ్, యోగా, క్రీడలు, తేలికపాటి వ్యాయామాలు, పిల్లల కోసం ఆటలు, కథల పోటీలు, ఆటవిడుపుగా సాంస్కృతిక కళా ప్రదర్శనలు, నృత్యం, సంగీతం వంటి కార్యక్రమాలుంటాయి. చిన్నారులు, యువత, మహిళలు, వయోవృద్ధుల్ని వేడుకల్లో భాగస్వాముల్ని చేస్తారు. పర్యావరణ పరిరక్షణపై విస్తృత స్థాయిలో అవగాహన కల్పించడంతో పాటు వీధుల్ని శుభ్రం చేయడం, మొక్కలు నాటే కార్యక్రమాలు చేపడతారు. ప్రజల్లో పర్యావరణ స్పృహను పెంపొందిస్తారు.

ముఖ్యమంత్రి పర్యటనకు చురుగ్గా ఏర్పాట్లు

వినుకొండ రూరల్, వినుకొండ, న్యూస్‌టుడే: అన్ని శాఖల అధికారులు సమన్వయంతో ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేయాలని కలెక్టర్ కృతికా శుక్లా సూచించారు. వినుకొండలో ఈ నెల 21న నిర్వహించే స్వచ్ఛాంధ్ర - స్వర్ణాంధ్ర కార్యక్రమంలో సీఎం చంద్రబాబు పాల్గొననున్న నేపథ్యంలో ఏర్పాట్ల పరిశీలనకు ఆమె మంగళవారం ఇక్కడికి వచ్చారు. తొలుత జూనియర్ కళాశాల మైదానంలో హెలిప్యాడ్ స్థలాన్ని పరిశీలించారు. కార్యక్రమం జరిగే వైద్యశాల, ఎన్నెస్పీ కాలనీలో ప్రజావేదిక నిర్వహణకు నిర్ణయించిన స్థలాన్ని చూసి సమీప జడ్పీ పాఠశాల మైదానాన్ని పరిశీలించారు. అక్కడి నుంచి వైద్యశాలకు చేరుకుని ఆయా శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. పల్నాడు జిల్లా ఏర్పడిన తరువాత తొలిసారి ముఖ్యమంత్రి చంద్రబాబు వినుకొండ వస్తున్నారని, అన్ని శాఖల అధికారులు సమన్వయంతో కార్యక్రమం విజయవంతం చేయాలని ఆదేశించారు. వైద్యశాలలో సీఎం పరిశీలన సమయంలో ఎలాంటి అవాంతరాలు లేకుండా చూడాలన్నారు. వైద్యశాలలో ఇప్పటికే జరుగుతున్న మరమ్మతులు, పనుల పురోగతిపై డీసీహెచ్‌ఎస్ ప్రసూన, సూపరింటెండెంట్ దయానిధిని అడిగి తెలుసుకున్నారు. భద్రత విషయంలో జాగ్రత్తలు పాటించాలని డీఎస్పీ హనుమంతరావుకు సూచించారు. సీఎం వినుకొండలో ఉన్నంతవరకు విద్యుత్తు సరఫరాకు అంతరాయం కలగకుండా చూడాలని ఆ శాఖాధికారులకు తెలిపారు. హెలిప్యాడ్ పనులు వేగంగా పూర్తి చేయాలని ఆర్‌అండ్‌బీ ఈఈ గీతారాణి, డీఈ వెంకటేశ్వరరావు, ఏఈ నవ్యకు కలెక్టర్ సూచించారు. రెవెన్యూ, పురపాలక, ఆర్‌అండ్‌బీ అధికారులు చేపట్టాల్సిన పనులను వివరించారు. పొల్యూషన్ కంట్రోల్ బోర్డు (ఏపీపీసీబీ) రీజినల్ అధికారి నజీరాబేగం, ఆర్డీవో మధులత, డీఎంహెచ్‌వో రవి, తహసీల్దార్ సురేష్, సీఐలు ప్రభాకర్, బ్రహ్మయ్య, అధికారులు పాల్గొన్నారు.

హెలిప్యాడ్ పరిశీలించి అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ కృతికా శుక్లా

చదరంగం ఆడుతున్న బాలురు

ఎత్తుకు పైఎత్తు

నరసరావుపేట క్రీడలు, న్యూస్‌టుడే: పట్టణంలోని కోడెల శివప్రసాదరావు క్రీడా మైదానంలో శాప్ ఆధ్వర్యంలో మంగళవారం జిల్లాస్థాయి చదరంగం పోటీలు నిర్వహించారు. అండర్-13, 15, 17, 19 కేటగిరీల్లో నిర్వహించిన పోటీలకు వివిధ ప్రాంతాల నుంచి సుమారు 100 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఎత్తుకు పైఎత్తులు వేస్తూ ప్రతిభ చాటారు. పోటీల్లో సత్తాచాటి జిల్లాస్థాయి జట్టుకు ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 21, 22 తేదీల్లో తిరుపతిలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని జిల్లా క్రీడాభివృద్ధి అధికారి పి.నరసింహారెడ్డి తెలిపారు.

ఏపీపీఎస్సీ ఫలితాల్లో మెరిశారు

డీవైఈవోలుగా ఇద్దరి ఎంపిక

ఈనాడు, నరసరావుపేట, ఈపూరు, న్యూస్‌టుడే: ఉప విద్యాశాఖాధికారి (డీవైఈవో) పోస్టులకు ఏపీపీఎస్సీ నిర్వహించిన పరీక్ష ఫలితాల్లో జిల్లా అభ్యర్థులు మెరిశారు. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 38 డివిజనల్ ఉప విద్యాశాఖాధికారి పోస్టులుండగా 2024 మేలో ప్రిలిమ్స్, 2025 మార్చిలో మెయిన్స్ పరీక్షలు నిర్వహించారు. నరసరావుపేట ప్రకాశ్‌నగర్‌కు చెందిన గర్నెపూడి తిమోతి సుధీర్‌కుమార్ ప్రతిభ చాటి పోస్టుకు ఎంపికయ్యారు. ఇతను గుంటూరు ఇజ్రాయేల్‌పేటలోని శ్రీబొర్రా నాగేశ్వర రావు మున్సిపల్ హైస్కూలులో బయాలజీ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. ఈపూరు మండలం ఇనుమెళ్లకు చెందిన తాటిపర్తి ఉదయ కిరణ్ డీవైఈవోగా ఎంపికయ్యారు. ఇతను నకరికల్లు మండలం కండ్లకుంట జడ్పీ ఉన్నత పాఠశాలలో గణిత ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు.

సుధీర్‌కుమార్, ఉదయ కిరణ్

ఎడ్ల పందేల్లో పల్నాడుకు ప్రథమ స్థానం

మేళ్లచెరువు, న్యూస్‌టుడే: మహాశివరాత్రి వేడుకల సందర్భంగా సూర్యాపేట జిల్లా మేళ్లచెరువులో ఎడ్ల పందేలు మంగళవారం హోరాహోరీగా సాగాయి. న్యూ కేటగిరీ విభాగంలో మంగు రమాదేవి (నాదెండ్ల మండలం ఇర్లపాడు, పల్నాడు జిల్లా) గిత్తలు.. ఆరు పళ్ల విభాగంలో నెల్లూరి రామకోటయ్య (కేసానుపల్లి, పల్నాడు జిల్లా) గిత్తలు ప్రథమ స్థానాల్లో నిలిచాయి. విజేతలకు నిర్వాహకులు బహుమతులు అందజేశారు.

SHRIRAM Finance

శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్

నమోదిత కార్యాలయం: శ్రీ టవర్స్, ప్లాట్ నెం.14ఎ, సౌత్ ఫేజ్, ఇండస్ట్రియల్ ఎస్టేట్, గిండి, చెన్నై-600032.

జోనల్ ఆఫీస్ : శ్రీరామ్ ఎన్‌క్లేవ్, అన్నపూర్ణ నగర్, 5వ లేన్, ఇన్నర్ రింగ్ రోడ్డు, గోరంట్ల, గుంటూరు-522034.

డిమాండ్ నోటీసు

సెక్యూరిటైజేషన్ అండ్ రీకనస్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం 2002, సెక్షన్ 13(2) అనుసరించి డిమాండ్ నోటీసును జారీచేయడమైనది.

మెసర్స్ శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ (గతంలో "శ్రీరామ్ సిటీ యూనియన్ ఫైనాన్స్ లిమిటెడ్" గా పిలువబడేది, ఎన్‌సిఎల్‌టి బ్రాంచ్-II చెన్నై, తేది 9-11-2022 యొక్క ఉత్తర్వుల ప్రకారం శ్రీరామ్ ట్రాన్స్‌పోర్ట్ ఫైనాన్స్ లిమిటెడ్‌లో విలీనమైనది మరియు శ్రీరామ్ ట్రాన్స్‌పోర్ట్ ఫైనాన్స్ లిమిటెడ్‌గా మార్చబడినది) మరియు ఆ తర్వాత (30-11-2022 తేదీనాటి కార్పొరేట్ ఫైనాన్స్ మంత్రిత్వశాఖ లేఖ) ద్వారా శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ గా తిరిగి పేరు పెట్టుటకు ఆమోదం పొందిన మేము కంపెనీల చట్టం, 2013 క్రింద రిజిస్టర్డు కంపెనీ అయి ఉన్నాము మరియు నాన్-బ్యాంకింగ్ ఫైనాన్స్ బిజినెస్‌ను నడుపుటకు ఆర్‌బిఐ వద్ద కూడా రిజిస్టరై ఉన్నాము. శ్రీ టవర్స్, ప్లాట్ నెం.14ఎ, సౌత్ ఫేజ్, ఇండస్ట్రియల్ ఎస్టేట్, గిండి, చెన్నై-600032 వద్ద మరియు మా జోనల్ కార్యాలయం చిరునామా, శ్రీరామ్ ఎన్‌క్లేవ్, అన్నపూర్ణ నగర్, 5వ లేన్, ఇన్నర్ రింగ్ రోడ్డు, గోరంట్ల, గుంటూరు-522034 మరియు బ్రాంచ్ ఆఫీస్ : నరసరావుపేట వద్ద కలిగి ఉన్న మేము ఈ దిగువ నోటీసును జారీచేయడమైనది. (ఇక పై కంపెనీ/ఋణదాతగా పిలువబడుతుంది).

దిగువ తెలిపిన రుణగ్రహీతలు/సహ రుణగ్రహీతలు/గ్యారంటార్లు/శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ నుండి ఆర్థిక సహాయాన్ని వినియోగించుకొన్నారు. ఆర్థిక సహాయాన్ని వినియోగించుకున్న సదరు రుణగ్రహీతలు/గ్యారంటర్లు గడువు తేదీల ప్రకారం వడ్డీ మరియు అసలు మొత్తాలను తిరిగి చెల్లించుటలో అనేక సార్లు విఫలమైనారని మేము తెలియజేస్తున్నాము. సెక్యూరిటైజేషన్ అండ్ రీకనస్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్ 2002 క్రింద & సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 లోని రూలు 3తో చదువకోవల్సిన సెక్షన్ 13(2) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగించుకుంటూ శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ యొక్క అధీకృత అధికారి సదరు ఖాతాను నిరర్థక ఆస్తిగా వర్గీకరించారు. నోటీసుల స్వీకరణ తేదీ నుండి 60 రోజులలోగా చెల్లింపు తేదీ వరకు నోటీసులలో తెలిపిన మొత్తంపై కాంట్రాక్చువల్ రేటు పంతున తదుపరి వడ్డీతోపాటు నోటీసులలో తెలిపిన మొత్తం మరియు అనుషంగిక ఖర్చులు, వ్యయాలు, చార్జీలు వగైరాను చెల్లించవల్సిందిగా దిగువ తెలిపిన రుణగ్రహీతలు/గ్యారంటర్లు తనఖారుణగ్రస్తులను కోరుతూ SARFAESI చట్టం, 2002 లోని సెక్షన్ 13(2) క్రింద ఇందులో తెలిపిన సంబంధిత తేదీలలో డిమాండ్ నోటీసులు జారీ చేశారు.

వారి చివరిగా తెలిసిన చిరునామాలోని వారికి జారీ చేయబడిన నోటీసులు అందచేయబడక తిరిగి వచ్చినందున సదరు విషయం గురించి బహిరంగ ప్రకటన ద్వారా వారికి సమాచారం ఇవ్వడమైనది. సెక్యూర్డ్ ఆస్తులను విడిపించుకొనుటకు లభించు సమయానికి సంబంధించి చట్టంలోని సెక్షన్ 13 యొక్క సబ్- సెక్షన్ (8) లోని నిబంధనలను చూడవల్సిందిగా ఋణగ్రహీతలకు విజ్ఞప్తి.

ఋణగ్రహీత(లు)/సహ-ఋణగ్రహీత(లు)/హామీదారు(ల) పేరు	ఎన్‌పిఏ తేది 31-07-2012	డిమాండ్ నోటీసు తేది 28-01-2026
ఎంటర్‌ప్రైజ్ ఫైనాన్స్ ఋణ ఖాతా నెం. NARP1TF12290007, తేది. 27-12-2011 1) బత్తుల శ్రీనివాసరావు, తండ్రి : నరసింహారావు, R/o డి నెం.176A, సంతమాగులూరు (పోస్ట్ & మం), ప్రకాశం జిల్లా-523302. 2) షేక్ జాన్, తండ్రి : మహబూబ్ బాషా, R/o డి నెం. 29-1958, శ్రీనివాస నగర్, వినుకొండ (పోస్ట్ & మం), గుంటూరు జిల్లా-522647.	రుణం మొత్తం రూ. 15,00,000/- (పదిహేను లక్షల రూపాయలు మాత్రమే)	మొత్తం బకాయి: రూ. 74,85,819/- (డెబ్బై నాలుగు లక్షల ఎనభై ఐదు వేల ఎనిమిది వందల పంతొమ్మిది రూపాయలు మాత్రమే) తేది 28-01-2026 నాటికి

బత్తుల శ్రీనివాస రావు గారికి చెందిన షెడ్యూల్ స్థిరాస్తి వివరములు:

ఐటెమ్ నెం.1: ప్రకాశం జిల్లా, నరసరావుపేట రిజిస్ట్రేషన్ జిల్లా, నరసరావుపేట సబ్ జిల్లా, సంతమాగులూరు గ్రామ పంచాయతీ ఏరియా, సంతమాగులూరు గ్రామం, డి నెం.840 నందు ఎ. 3.00 సెంట్లలోని విస్తీర్ణం 629.2 చ॥గ॥లు లేదా 526.13 చ॥మీ॥ల ఖాళీ స్థలం. **హద్దులు: తూర్పు:** బత్తుల శ్రీనివాసరావు గారి స్థలం, **దక్షిణం:** బొల్లా రామి రెడ్డి గారి స్థలం, **పడమర:** డొంక రోడ్డు, **ఉత్తరం:** రాంపల్లి కోటి రెడ్డి గారి స్థలం.

ఈ హద్దుల యందు విస్తీర్ణం 629.2 చ॥గ॥లు లేదా 526.13 చ॥మీ॥ల ఖాళీ స్థలం మాత్రమే కలదు. (ఈ ఆస్తి S.R.O. నరసరావుపేట యొక్క డాక్యుమెంట్ నెం.12589/2008 కి సంబంధించినది).

ఐటెమ్ నెం.2: ప్రకాశం జిల్లా, నరసరావుపేట రిజిస్ట్రేషన్ జిల్లా, నరసరావుపేట సబ్ జిల్లా, సంతమాగులూరు గ్రామ పంచాయతీ ఏరియా, సంతమాగులూరు గ్రామం, డి నెం.840 నందు ఎ. 3.00 సెంట్లలోని విస్తీర్ణం 195 చ॥గ॥లు లేదా 163.05 చ॥మీ॥ల ఖాళీ స్థలం. **హద్దులు: తూర్పు:** వల్లెపు వెంకటేశ్వర్లు గారి స్థలం, **దక్షిణం:** బొల్లా రామి రెడ్డి గారి స్థలం, **పడమర:** బత్తుల శ్రీనివాసరావు గారి స్థలం, **ఉత్తరం:** రాంపల్లి కోటి రెడ్డి గారి స్థలం.

ఈ హద్దుల యందు విస్తీర్ణం 195 చదరపు గజాలు లేదా 163.05 చదరపు మీటర్ల ఖాళీ స్థలం మాత్రమే కలదు. (ఈ ఆస్తి S.R.O. నరసరావుపేట యొక్క డాక్యుమెంట్ నెం.12591/2008 కి సంబంధించినది).

పైన తెలిపిన పరిస్థితుల దృష్ట్యా, ఈ నోటీసు ప్రచురణ తేదీ నుండి 60 రోజులలోగా భవిష్యత్ వడ్డీ మరియు వర్తించు ఛార్జీలతోపాటు పైన తెలిపిన బకాయి మొత్తాలను చెల్లించవల్సిందిగా పైన తెలిపిన ఋణగ్రహీతలు, సహ-ఋణగ్రహీతలు మరియు/లేదా వారి హామీదారులకు (వర్తింపును బట్టి) ఇందుమూలముగా నోటీసు ఇవ్వడమైనది. లేనిచో, సెక్యూరిటైజేషన్ అండ్ రీకనస్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్ 2002 లోని సెక్షన్ 13(4) క్రింద మరియు ఇందులో వర్తించు నిబంధనల క్రింద రుణగ్రహీతలు మరియు తనఖా రుణగ్రస్తుల యొక్క సెక్యూర్డ్ ఆస్తులు స్వాధీనత చేపట్టడంతో సహా సెక్యూర్డ్ అసెట్స్ మీద ఈ నోటీసు తేదీ నుండి 60 రోజుల అనంతరం తదుపరి చర్యలు చేపట్టబడును. సదరు చట్టంలోని సెక్షన్ 13(13) క్రింద, సెక్యూర్డ్ క్రెడిటార్ యొక్క ముందస్తు వ్రాత పూర్వక సమ్మతి లేకుండా నోటీసులో తెలిపిన తమ సెక్యూర్డ్ అసెట్స్‌ను అమ్మకం, లీజు లేదా మరేదేని ఇతర విధంగా ఏ ఋణగ్రహీతా బదిలీ చేయరాదని గమనించగలరు.

ప్రదేశం : గుంటూరు — సం/- అధీకృత అధికారి, శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్

వారు దారిచూపారు.. వీరు దోచుకుంటున్నారు!

ఆన్‌లైన్ చేయకుండానే మెప్మాలో రుణాలు

ఈనాడు, నరసరావుపేట: అర్హత లుండి.. అన్ని పత్రాలు సరిగా ఉన్నా రుణాలు మంజూరు చేయని బ్యాంకర్లు.. అడ్డదారిలో నకిలీ పత్రాలు సమర్పించే వారికి మాత్రం దగ్గరుండి మరీ మంజూరు చేస్తున్నారు. మెప్మా రుణాలు పక్కదారి పట్టడంలో బ్యాంకర్ల పాత్రే కీలకమని దర్యాప్తు బృందం గుర్తించింది. ప్రభుత్వం మహిళలకు అందించే మెప్మా రాయితీ రుణాల్ని ఎలా నకిలీ గ్రూపులు సృష్టించి స్వాహా చేయవచ్చో వైకాపా నాయకులు దారి చూపించారు. ఇప్పుడు కూటమి నాయకులు కొందరు అందిపుచ్చుకుని అదే దారిలో నడుస్తున్నారు. ఓ శాసన సభ్యుడి అనుచరులమని చెలామణి అవుతున్నవారు మెప్మా అధికారులతో కలిసి రుణాల పేరిట ప్రభుత్వ సొమ్మును స్వాహా చేసినట్లు దర్యాప్తు బృందం ఆధారాలను సేకరించింది.

నకిలీ గ్రూపులు సృష్టించి..

ఆధార్ సీడింగ్ చేయని వారు గ్రూపుల్లో ఎంతమంది ఉన్నారో విచారించి వారి పేర్లు.. మరణించిన, పట్టణం వదిలివెళ్లిన వారి పేర్లు, ఆధార్ నంబర్లు మొదట సేకరించారు. పట్టణంలో నివాసముండే ఇద్దరితో నకిలీ గ్రూపులు సృష్టించారు. మిగతా వారంతా నకిలీలే. వారి సంతకాలూ వీరే చేశారు. మెప్మా అధికారి, బ్యాంకు సిబ్బంది ముందస్తుగానే ఒక ఒప్పందం చేసుకోవడంతో ఈ గ్రూపులు ఆన్‌లైన్ కాకున్నా రుణాలు మంజూరు చేశారు. నరసరావుపేట పట్టణంలో 1 నుంచి 9వ వార్డు.. 26 నుంచి 30వ వార్డుల వరకు నకిలీ గ్రూపులు అధికంగా ఏర్పాటు చేసినట్లు విచారణ అధికారులు చెబుతున్నారు. ఇదిలా ఉంటే 25 గ్రూపులతో ఒక ఎస్ఎల్ఎఫ్ (స్లమ్ లెవల్ ఫెడరేషన్) ఏర్పాటు చేశారు. అందులోని కొన్ని గ్రూపులను మరో ఎస్ఎల్ఎఫ్‌లో యాడ్ చేసి అక్కడా రుణాల మంజూరులో గోల్‌మాల్ చేసినట్లు తెలిసింది.

❖ వైకాపా హయాంలో మెప్మాలో ఇక్కడ పనిచేసి అక్రమాలకు పాల్పడి వేరే ప్రాంతానికి బదిలీ అయిన వారికి తిరిగి ఇక్కడ పోస్టింగ్ ఇప్పించారు. అలాగే కొందరిని ఆర్పీలుగా నియమించారు. వారిద్వారా ప్రస్తుత కూటమి నాయకులు అక్రమాలకు పాల్పడ్డారు. తామే ఇక్కడ పోస్టింగ్ ఇప్పించామని.. ఆర్పీలుగా నియమించామని.. చెప్పినట్లు చేయాల్సిందేనని బెదిరించి నకిలీ బాగోతానికి తెరతీశారు. ఎమ్మెల్యే పేరు చెప్పి సుమారు రూ.2 కోట్ల మేర స్వాహా చేసినట్లు తెలుస్తోంది. ఈ నకిలీ గ్రూపులకు సెంట్రల్ బ్యాంకు సిబ్బంది, మెప్మాలో కీలక అధికారులు సహకరించినట్లు అధికారులు నిర్ధారణకు వచ్చారు.

జేఎన్‌టీయూ ప్రిన్సిపల్‌గా రవీంద్ర

నరసరావుపేట అర్బన్, న్యూస్‌టుడే: జేఎన్‌టీయూ కళాశాల ప్రిన్సిపల్‌గా సీనియర్ ప్రొఫెసర్ వి.రవీంద్రను నియమిస్తూ విశ్వవిద్యాలయ ఉపకులపతి ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటి వరకు ఈ స్థానంలో విధులు నిర్వహించిన ప్రొఫెసరు సీహెచ్ శ్రీనివాసరావును జేఎన్‌టీయూ కాకినాడకు బదిలీ చేశారు. అక్కడ ఈఈఈ విభాగానికి ప్రొఫెసరుగా నియమించారు. ఇదే సమయంలో 10 మంది ప్రొఫెసర్లు విశ్వవిద్యాలయం నుంచి బదిలీ అయ్యారు.

మద్యం అమ్మిన హోంగార్డు సస్పెన్షన్

నరసరావుపేట సెంట్రల్, న్యూస్‌టుడే: కోటప్పకొండ తిరునాళ్లలో మద్యం అమ్మిన హోంగార్డు ఎన్.కోటేశ్వరరావును సస్పెండ్ చేస్తూ ఎస్పీ బి.కృష్ణారావు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. కోటేశ్వరరావు నరసరావుపేట గ్రామీణ పోలీస్‌స్టేషన్‌లో హోంగార్డుగా విధులు నిర్వహిస్తున్నారు. శివరాత్రి రోజు ట్రాఫిక్ మళ్లించే బోర్డులు పెట్టే విధులను అతనికి ఉన్నతాధికారులు అప్పగించారు. అయితే విధులు నిర్వహించకుండా మద్యం అమ్ముతున్న విషయం సామాజిక మాధ్యమాలతో పాటు పత్రికల ద్వారా వెలుగులోకి వచ్చిన సంగతి తెలిసిందే.

SHRIRAM Finance

శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్

నమోదిత కార్యాలయం: శ్రీ టవర్స్, ప్లాట్ నెం.14ఎ, సౌత్ ఫేజ్, ఇండస్ట్రియల్ ఎస్టేట్, గిండి, చెన్నై-600032.

జోనల్ ఆఫీస్ : శ్రీరామ్ ఎన్‌క్లేవ్, అన్నపూర్ణ నగర్, 5వ లేన్, ఇన్నర్ రింగ్ రోడ్డు, గోరంట్ల, గుంటూరు-522034.

డిమాండ్ నోటీసు

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం 2002, సెక్షన్ 13(2) [illegible]

[illegible]

ఋణగ్రహీత(లు)/సహ-ఋణగ్రహీత(లు)/హామీదారు(ల) పేరు	ఎన్‌పిఏ తేది	డిమాండ్ నోటీసు తేది
30.09.2021	18-11-2025	
ఎంటర్‌ప్రైజ్ ఫైనాన్స్ ఋణ ఖాతా నెం. STNLITF2101200004, తేది. 20.01.2021 [illegible]	రుణం మొత్తం రూ. 17,00,000/-	మొత్తం బకాయి: రూ. 33,60,349/- తేది 18-11-2025 నాటికి

ఋణ ఖాతా నెం.STNLITF2101200004 - [illegible] నెం.1209/2016 మరియు 985/2017 [illegible]

[illegible]

ప్రదేశం : గుంటూరు సం/- అధీకృత అధికారి, శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్

SHRIRAM Finance

శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్

నమోదిత కార్యాలయం: శ్రీ టవర్స్, ప్లాట్ నెం.14ఎ, సౌత్ ఫేజ్, ఇండస్ట్రియల్ ఎస్టేట్, గిండి, చెన్నై-600032.

జోనల్ ఆఫీస్ : శ్రీరామ్ ఎన్‌క్లేవ్, అన్నపూర్ణ నగర్, 5వ లేన్, ఇన్నర్ రింగ్ రోడ్డు, గోరంట్ల, గుంటూరు-522034.

డిమాండ్ నోటీసు

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం 2002, సెక్షన్ 13(2) [illegible]

[illegible]

ఋణగ్రహీత(లు)/సహ-ఋణగ్రహీత(లు)/హామీదారు(ల) పేరు	ఎన్‌పిఏ తేది	డిమాండ్ నోటీసు తేది
	29-02-2020	13-01-2026
ఎంటర్‌ప్రైజ్ ఫైనాన్స్ ఋణ ఖాతా నెం. STNLITF1903300014, తేది. 31-03-2019 [illegible]	రుణం మొత్తం రూ. 7,00,000/-	మొత్తం బకాయి: రూ. 23,47,224/- తేది 13-01-2026 నాటికి

[illegible]

ప్రదేశం : గుంటూరు సం/- అధీకృత అధికారి, శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్

ప్రతిభావంతులు

జేఈఈ మెయిన్స్‌లో సత్తాచాటిన విద్యార్థులు

ఎస్కే సుహాన్

యశోధర్

జి.యశ్విత

ఎన్.ప్రదీప్‌చౌదరి


డి.బాలాజి

వినుకొండ, న్యూస్‌టుడే: ఐఐటీలో చదవాలన్నది యువతరం కల. దానిని సాకారం చేసుకునేందుకు పట్టుదలతో ప్రయత్నిస్తున్నారు. ఇందులో మొదటి దశ అయిన జేఈఈ మెయిన్స్ పరీక్షలలో వినుకొండ విద్యార్థులు సత్తాచాటారు. వినుకొండకు చెందిన ఎస్కే ఎం.ఎం.సుహాన్ జేఈఈ మెయిన్స్‌లో 99.86 పర్సంటైల్ సాధించాడు. సుహాన్ తల్లిదండ్రులు సర్ఫరాజ్ సుల్తానా, సైదావలి.. నూజండ్ల మండలం ఐనవోలు, వినుకొండ మండలం తిమ్మాయి పాలెం ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులుగా పని చేస్తున్నారు. ఎం.ఎం.సుహాన్ విజయవాడలోని ఓ ప్రైవేటు కళాశాలలో ఇంటర్ చదువుతున్నాడని తల్లిదండ్రులు తెలిపారు. జేఈఈ అడ్వాన్స్‌డ్ లోనూ సత్తాచాటి ఐఐటీ బాంబేలో సీటు సాధించడమే తమ కుమారుడి లక్ష్యమన్నారు. అంతిమంగా సివిల్ సర్వీస్ సాధించాలని ధ్యేయంగా పెట్టుకున్నాడని వివరించారు. పట్టణానికి చెందిన గుడ్లూరి యశ్విత 99.77 పర్సంటైల్ సాధించి అడ్వాన్స్‌డ్ పరీక్షలకు సిద్ధం అవుతోంది. తండ్రి సాంబశివరావు త్రిపురాంతకం పశువైద్యాధికారి కాగా తల్లి శ్రీలక్ష్మి అక్కడే ప్రభుత్వ యాజమాన్య పాఠశాల ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్నారు. హనుమాన్‌నగర్‌కు చెందిన నర్రా ప్రదీప్ చౌదరి 99.1 పర్సంటైల్ రావడంతో అడ్వాన్స్‌డ్‌లో మరింత పట్టుసాధించాలన్న ప్రయత్నంలో ఉన్నాడు. తండ్రి శ్రీనివాసరావు బొల్లాపల్లి మోడల్ స్కూలు ఉపాధ్యాయుడిగా తల్లి అరుణ పట్టణంలో ఓ ప్రైవేటు పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్నారు. మరో విద్యార్థి దేశబోయిన బాలాజీ 98.17 సాధించాడు. తండ్రి శ్రీనివాసరావు యడ్లపాడు మండలం సొలస ఉన్నత పాఠశాలలో, తల్లి సునీత అదే మండలంలోని వంకాయలపాడు ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నారు.

వేల్పూరు(శావల్యాపురం), న్యూస్‌టుడే : జేఈఈ మెయిన్స్ పరీక్ష ఫలితాల్లో మండలంలో వేల్పూరు గ్రామానికి చెందిన విద్యార్థి అత్యుత్తమ ప్రతిభ కనబరిచాడు. గ్రామానికి చెందిన మర్రి నాగేశ్వరరావు, పద్మావతి కుమారుడు మర్రి యశోధర్ జేఈఈ పరీక్ష ఫలితాల్లో 98.04 పర్సంటైల్ సాధించాడు. ఇతను ప్రాథమిక, ఉన్నత విద్య అంతా గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో పూర్తిచేశాడు. ప్రస్తుతం విజయవాడలోని ప్రైవేటు కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. ఫలితాల్లో మంచి మార్కులు సాధించడంపై గ్రామస్థులు అభినందనలు తెలిపారు.

విద్యార్థులను ఆటలాడించాల్సిందే: కలెక్టర్

నులిపురుగుల నివారణ మందు వేస్తున్న కలెక్టర్ కృతికాశుక్లా

వినుకొండ, న్యూస్‌టుడే: నులి పురుగుల సమస్య ఉన్నవారికి ఆహారం తీసుకున్నప్పటికీ అందులోని పోషకాలు ఒంటికి పట్టవని తద్వారా రక్తహీనతతో ఇబ్బంది పడతారని [illegible] ఎస్సీ కాలనీలోని అంబేడ్కర్ ఎస్సీ గురుకుల బాలికల పాఠశాలలో వైద్యశాఖ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మందుల పంపిణీని ఆమె మంగళవారం ప్రారంభించారు. తొలుత కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి రోజు పిల్లలకు ఆహారంలో ఏదో ఒక రూపంలో మునగ పొడి అందేలా చూడాలని పాఠశాల యాజమాన్యానికి సూచించారు. రోజువారీ కాలమాన పట్టికలో 45 నిమిషాల పాటు విద్యార్థులకు ఆటలు తప్పనిసరిగా చేర్చా[illegible] గురించి అవగాహన కల్పించాలన్నారు. పాఠశాలలో సమస్యలున్నాయా అని ప్రశ్నించగా వైఎస్ ప్రిన్సిపల్ నిర్మలాదేవి మాట్లాడుతూ డ్రెయినేజీ లేక నీరు బయటకు వెళ్లడం లేదని చెప్పారు. దీనిపై స్పందించిన కలెక్టర్ తగిన చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా వైద్య శాఖాధికారి రవి, ఆర్డీవో మధులత, ఆర్‌బీఎస్‌కే ప్రోగ్రాం అధికారి రాజేశ్వరి, మలేరియా విభాగం డీడీ రామనాథం, వైద్యులు పర్వీన్, తహసీల్దారు సురేష్, ప్రిన్సిపల్ వెంకటమ్మ పాల్గొన్నారు.

అత్తపై పెట్రోల్ పోసి నిప్పంటించిన అల్లుడు

నిందితుడిని అరెస్టు చేయాలని బాధితుల ఆందోళన

బాధితురాలితో మాట్లాడుతున్న పోలీసులు

దాచేపల్లి: దాచేపల్లి నగర పంచాయతీ పరిధిలో దారుణ ఘటన చోటుచేసుకుంది. కుటుంబ కలహాల నేపథ్యంలో అల్లుడు జక్కా రవికుమార్ తన అత్త వాసం లక్ష్మీపై పెట్రోల్ పోసి నిప్పంటించాడు. శ్రీనివాసపురానికి చెందిన రవికుమార్ మంగళవారం దాచేపల్లిలో అత్త ఇంటికి ద్విచక్ర వాహనంపై వచ్చాడు. ఆ సమయంలో అరుగుపై కూర్చుని ఉన్న అత్తపై పెట్రోల్ పోసి నిప్పంటించి పరారయ్యాడు. వెంటనే అప్రమత్తమైన ఆమెతో పాటు చుట్టుపక్కల వారు మంటలను ఆర్పడంతో పెను ప్రమాదం తప్పింది. ఈ ఘటనతో గాయపడిన బాధితురాలు బంధువులతో కలిసి అద్దంకి- నార్కెట్‌పల్లి హైవేపై రాత్రి 9.30 గంటల సమయంలో బైఠాయించి ఆందోళనకు దిగారు. నిందితుడిని వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలగడంతో సమాచారం అందుకున్న సీఐ భాస్కర్ అక్కడికి చేరుకున్నారు. బాధితులతో మాట్లాడి న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

బ్రాయిలర్ ధరలు

(కిలో 1కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 115, రిటైల్ ధర - 142, చికెన్ విత్‌స్కిన్ - 206, చికెన్ స్కిన్‌లెస్ - 234.

కృష్ణా జిల్లాలో: వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -115 రిటైల్ ధర 142 చికెన్ విత్ స్కిన్ - 206 చికెన్ స్కిన్‌లెస్ - 234.

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 116, 123, 135 చికెన్ విత్ స్కిన్ - 220 చికెన్ స్కిన్‌లెస్ - 230.

ఆర్టీసీకి రూ.1.50 కోట్ల ఆదాయం

మల్లమ్మ సెంటర్ (నరసరావుపేట), న్యూస్‌టుడే: మహాశివరాత్రి పురస్కరించుకుని పల్నాడు జిల్లా రీజియన్ పరిధిలో నడిపిన 460 బస్సుల్లో రాకపోకలు సాగించిన ప్రయాణికుల నుంచి ఆర్టీసీకి రూ.1.50 కోట్ల ఆదాయం వచ్చినట్లు ప్రజా రవాణా అధికారిణి అజితకుమారి తెలిపారు. గతేడాది నాలుగు లక్షల మంది భక్తులు ఆర్టీసీ బస్సుల్లో రాకపోకలు సాగించగా రూ.1.22 కోట్ల ఆదాయం వచ్చిందని.. ఈ ఏడాది అదనంగా 47,000 మంది ప్రయాణించారని వివరించారు.

సీఆర్‌పీఎఫ్ కానిస్టేబుల్ మృతి

అధికారిక లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహిస్తున్న ఎన్డీఆర్ఎఫ్ సభ్యులు

నకరికల్లు, న్యూస్‌టుడే: విధి నిర్వహణకు వెళ్తూ రోడ్డు ప్రమాదానికి గురై సీఆర్‌పీఎఫ్ కానిస్టేబుల్ వజ్రగిరి రవీంద్ర (33) మృతి చెందారు. రవీంద్ర సీఆర్‌పీఎఫ్ కానిస్టేబుల్‌గా దిల్లీలో విధులు నిర్వహిస్తున్నారు. సెలవు నిమిత్తం స్వగ్రామం నకరికల్లుకు వచ్చారు. సెలవులు ముగియడంతో తిరిగి విధుల్లో చేరేందుకు ఈ నెల 16న విజయవాడలో రైలు ఎక్కేందుకు బయలుదేరారు. మార్గమధ్యలో ఫిరంగిపురం వద్ద ఆయన వెళుతున్న ద్విచక్ర వాహనాన్ని కారు బలంగా ఢీకొట్టింది. దీంతో తీవ్రంగా గాయపడిన ఆయనను చికిత్స నిమిత్తం గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందారు. మంగళవారం రవీంద్ర భౌతికకాయానికి అధికారిక లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. ఎన్డీఆర్ఎఫ్ బృందాలు హాజరై గౌరవ వందనం సమర్పించారు. రవీంద్రకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

పండగకు వచ్చి.. పరలోకాలకు..

నాగరాజు (పాత చిత్రం)

నరసరావుపేట సెంట్రల్, న్యూస్‌టుడే: శివరాత్రి పండగకు చెల్లెలి ఇంటికి వచ్చిన అన్న రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందిన ఘటన మండలంలోని గోనెపూడిలో సోమవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. గ్రామీణ పోలీసుల కథనం మేరకు ప్రకాశం జిల్లా అద్దంకి మండలం ధేనువకొండ గ్రామానికి చెందిన పిట్టల నాగరాజు (30) అతని స్నేహితులు రామకృష్ణ, వెంకటేశ్వర్లు మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా గోనెపూడిలోని తన సోదరి కొండా వెంకటలక్ష్మి ఇంటికి వచ్చారు. స్వామి దర్శనానికి కొండకు వెళ్లి వచ్చారు. రాత్రి 10 గంటల సమయంలో మళ్లీ కొండకు వెళ్లి వస్తామని ముగ్గురూ ద్విచక్రవాహనంపై వెళ్లారు. తిరిగి వస్తుండగా ఎదురుగా వచ్చిన మరో ద్విచక్రవాహనాన్ని తప్పించే క్రమంలో వాహనం అదుపు తప్పి పల్టీ కొట్టింది. ఈ ప్రమాదంలో నాగరాజు తలకు తీవ్ర గాయమై అక్కడికక్కడే మృతి చెందగా మిగిలిన ఇద్దరికి గాయాలయ్యాయి. గ్రామీణ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ద్విచక్ర వాహనం అదుపు తప్పి యువకుడి దుర్మరణం

గణపవరం(చిలకలూరిపేట గ్రామీణ): ద్విచక్ర వాహనం అదుపుతప్పి రెయిలింగ్‌ను ఢీకొని యువకుడు దుర్మరణం చెందిన సంఘటన నాదెండ్ల మండలం గణపవరం పరిధిలో కొత్త బైపాస్ రహదారిపై మంగళవారం చోటుచేసుకుంది. బాపట్ల జిల్లా మార్టూరు మండలం వలపర్లకు చెందిన షేక్ ఖాజావలి (31) కూరగాయల వ్యాపారం చేస్తుంటాడు. అందులో భాగంగా మార్టూరు నుంచి ద్విచక్రవాహనంపై గుంటూరు వెళ్తుండగా అదుపుతప్పి గణపవరం బైపాస్ పరిధిలో రెయిలింగ్‌ను ఢీకొన్నాడు. దీంతో కిందపడిన ఖాజావలి తలకు తీవ్ర గాయాలై మృతి చెందాడు. అదే సమయంలో ఖాజావలి జేబులోని సెల్‌ఫోన్ రోడ్డుపై పడిపోవడంతో వాహనాల కింద పడి నుజ్జయింది. పోలీసులు అందులోని సిమ్ తీసి దాని ద్వారా మృతుడి వివరాలు తెలుసుకుని కుటుంబ సభ్యులకు సమాచారమిచ్చారు. మృతుడి సోదరుడు బాషిద్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెంకటేశ్వరరావు తెలిపారు.

91.9 FM Vijayawada

ఈఎఫ్ఎమ్ కార్యక్రమాలు

సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ. 5 - ఉ. 7
ఈ-మార్నింగ్స్	ఉ. 7 - ఉ. 11
నువ్వా నేనా	ఉ. 11 - మ. 2
సత్యభామ	మ. 2 - సా. 5
లైట్ తీస్కో	సా. 5 - రా. 9
సరదాగా కాసేపు	రా. 9 - రా. 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా. 12 - తె. 5

/Eenadufm

For Advertising on Eenadu FM Contact 80080 03297

ప్రవాసాంధ్రుడి ఆధ్యాత్మిక సేవ

★ రూ. 2.50 కోట్లతో ఆలయ నిర్మాణం ★ నేటి నుంచి ప్రతిష్ఠ పూజలు

వినుకొండ, న్యూస్‌టుడే: పట్టణానికి చెందిన ప్రవాసాంధ్రుడు పట్టణంలోని దక్షిణం బజారులో సుమారు రూ.2.50 కోట్లతో శ్రీరమా సమేత సత్యనారాయణస్వామి ఆలయం నిర్మించారు. నేటి నుంచి ప్రతిష్ఠ పూజలు ప్రారంభం కానున్నాయి. పట్టణానికి చెందిన జొన్నలగడ్డ పాండురంగారావు, వెంకటచంద్ర రమాదేవి దంపతులు 1977లో అమెరికా వెళ్లి అక్కడే ఔషధ వ్యాపారంలో స్థిరపడ్డారు. జన్మభూమికి తన వంతు సేవగా స్థానికంగా తన ఇంటి స్థలంతో పాటు పక్కన మరికొంత భూమి కొనుగోలు చేసి సొంతంగా ఆలయం కట్టించారు. ఈనెల 21న శనివారం ఉదయం 10.35 గంటలకు ప్రతిష్ఠ మహోత్సవం నిర్వహిస్తున్నట్లు ఈయన అన్న కుమారుడు పట్టణ ఆర్యవైశ్య సదావర్తి సంఘం అధ్యక్షుడు జొన్నలగడ్డ బాబ్జి తెలిపారు. శనివారం మధ్యాహ్నం భక్తులకు అన్నసంతర్పణ చేయనున్నట్లు చెప్పారు.

ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్

ప్రభుత్వ రంగ షెడ్యూల్డ్ బ్యాంక్

కృష్ణనగర్, గుంటూరు (7031) బ్రాంచి, ఫోన్: 0863-2233554, మొబైల్: 9390478331, email: bm0031@apgb.bank.in

సర్ఫేసి చట్టం లోని నియమం 4(2ఎ) క్రింద నోటీసు (చరాస్తుల పై)

To,

ఆస్తి యజమానులు: 1) శ్రీమతి పిన్నింటి పద్మావతి, భర్త: శ్రీనివాసరావు, నివాసము: 4-4-173/2, 7/2 చంద్రమౌళినగర్, గుంటూరు. 2) ది డైరెక్టర్: మెస్సర్స్ నంది వర్ధన టెక్స్‌టైల్ మిల్స్ లిమిటెడ్, ఎన్‌హెచ్-16 సర్వీస్ రోడ్డు, తిమ్మాపురం గ్రామం, ఎడ్లపాడు మండలం, పల్నాడు జిల్లా.

ఇతర సంబంధిత పార్టీలు: 3) మెస్సర్స్ నంది వర్ధన టెక్స్‌టైల్ మిల్స్ లిమిటెడ్, ఎన్‌హెచ్-16 సర్వీస్ రోడ్డు, తిమ్మాపురం గ్రామం, ఎడ్లపాడు మండలం, పల్నాడు జిల్లా. తరుపున మేనేజింగ్ డైరెక్టర్ శ్రీ పిన్నింటి శ్రీనివాసరావు, తండ్రి: సుబ్బారావు, నివాసము: 4-4-173/2, 7/2, చంద్రమౌళినగర్, గుంటూరు. 4) మెస్సర్స్ ఓటిస్ టెక్స్‌టైల్స్ ప్రైవేట్ లిమిటెడ్, రిజిస్టర్డ్ ఆఫీస్: 2వ అంతస్తు, 4-4-173/2, వెంకట సాంబశివ రెసిడెన్సీ ప్రక్కన, 7/2, చంద్రమౌళినగర్, గుంటూరు, తరుపున మేనేజింగ్ డైరెక్టర్ శ్రీ పిన్నింటి మహేష్, తండ్రి: శ్రీనివాసరావు, నివాసము: 4-4-173/2, 7/2, చంద్రమౌళినగర్, గుంటూరు, 5) శ్రీ పిన్నింటి శ్రీనివాసరావు, తండ్రి: సుబ్బారావు, నివాసము: 4-4-173/2, 7/2, చంద్రమౌళినగర్, గుంటూరు. 6) శ్రీ పిన్నింటి మహేష్, తండ్రి: శ్రీనివాసరావు, నివాసము: 4-4-173/2, 7/2, చంద్రమౌళినగర్, గుంటూరు. 7) శ్రీ పిన్నింటి ఉదయ్ కుమార్, తండ్రి: శ్రీనివాసరావు, నివాసము: 3-53, అన్నవరం, పెదనందిపాడు, గుంటూరు జిల్లా.

డియర్ సర్/మేడమ్,

వెంకట సాంబశివ రెసిడెన్సీ ప్రక్కన, గుంటూరు-522007, డోర్ నెం.4-4-173/2, 7/2వ లైను, చంద్రమౌళీనగర్ నందు గల ఇంటి నుండి గృహోపకరణాలను 7 రోజుల్లోపు తీసుకువెళ్ళమని అభ్యర్థిస్తూ Speed Post ద్వారా 10-02-2026వ తేదీన సర్ఫేసీ రూల్ 4(2ఎ) నోటీసును మీకు పంపియున్నాము. సదరు లేఖ గల ఎన్వలప్ కవర్ డెలివరీ కాకుండా/తెలియకుండా తిరిగి వచ్చినది. అందువలన ఈ రోజు నుండి 7 రోజుల్లోపు గృహోపకరణాలను తీసివేయమని మేము ఈ పేపరు ప్రకటన ద్వారా మీకు తెలియజేయచున్నాము. ఈ రోజు నుండి 7 రోజుల్లోపు మీరు గృహోపకరణాలను తీసివేయకపోతే ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్ వారు నాటిని అత్యధిక టెండరు ఇచ్చిన వ్యక్తికి విక్రయించి, మీ ఖాతాకు సదరు ఆదాయాన్ని జమచేయునని దయచేసి గమనించగలరు.

తేది : 10-02-2026, ప్రదేశం: గుంటూరు అధీకృత అధికారి, ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్,

SBI **స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా**

స్ట్రెస్డ్ అసెట్స్ రికవరి బ్రాంచి (కోడ్- 05172)

2వ అంతస్తు, టిఎస్ఆర్‌టిసి కమ్యూటర్ అమెనిటి సెంటర్, బస్ టెర్మినల్ కాంప్లెక్స్, కోఠి, హైదరాబాద్-500095. టి.ఎస్. ఇ-మెయిల్: sbi.05172@sbi.co.in

స్థిరాస్తుల అమ్మకానికి విక్రయ ప్రకటన

(సెక్యూరిటి ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 యొక్క రూల్ 8(6)కింద)

సెక్యూరిటి ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 రూల్ 8(6) ప్రొవిజనులతో కలిపి చదువుకోవలసిన సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్ 2002 కింద స్థిరాస్తుల విక్రయానికి ఇ-వేలం ప్రకటన. సాధారణ ప్రజలకు మరియు ప్రత్యేకించి రుణగ్రహీతలు/గ్యారంటర్‌లకు నోటీసు ఇచ్చేదేమంటే, దిగువ వివరించబడిన స్థిరాస్తి సెక్యూర్డ్ క్రెడిటార్‌కు తాకట్టుపెట్టబడినది/ఛార్జి వేయబడినది మరియు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అధీకృత అధికారి, సెక్యూర్డ్ క్రెడిటార్ చేత లాంఛనప్రాయంగా స్వాధీనం చేసుకోబడినది మరియు 17.02.2026 నాటికి గల రూ. 1,23,19,608/- (రూపాయలు ఒకకోటి ఇరవై మూడు లక్షల పందొమ్మిది వేల ఆరు వందల ఎనిమిది మాత్రమే)ల స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా, సెక్యూర్డ్ క్రెడిటార్‌కు గల బకాయి సొమ్మును, కాంట్రాక్టు రేటు ప్రకారం అదనపు వడ్డీ, అపరాధవడ్డీ, మరియు వ్యయాలు సహా సెక్యూర్డ్ క్రెడిటార్ **గ్యారంటార్‌లకు అందచేసిన రుణాన్ని (1) శ్రీ బాల ఆనంద్ జెల్డి, తండ్రి పేరు జేసుదాస్ జెల్డి,** ప్లాటు నం.46, 1వ లేన్, మాధవపురి కాలని, సైనిక్‌పురి, హైదరాబాద్-500 094 **(2) శ్రీమతి ఖల్లూరతోప సోఫియ, భర్త పేరు బాల ఆనంద్ జెల్డి,** ప్లాటు నం.46, 1వ లేన్ , మాధవపురి కాలని, సైనిక్‌పురి, హైదరాబాద్-500 094 **(3) శ్రీ నూకతోటి శుభ చరణ్, తండ్రి పేరు ఎస్.రామారావు** ప్లాట్ నం.1008, "సాకేత్ ప్రియం" అపార్ట్‌మెంట్, కాప్రా, హైదరాబాద్-500 062 **(4) శ్రీ కట్టా రాజ్ వినయ కుమార్, తండ్రి పేరు కె.ఆశీర్వాదం,** ఇ.నెం. 11-60, సిపాయ్‌పేట్, మెయిన్‌రోడ్, చీరాల, ప్రకాశం జిల్లా-523155 నుంచి రాబట్టుకొనేందుకుగాను **"ఎక్కడ ఏది ఎలా ఉన్నదో అక్కడ అది అలాగే"** ప్రాతిపదికన **09.03.2026**న విక్రయించబడును.

ఏవైనా తెలిసిన ఎంకంబరెన్సులతో స్థిరాస్తి సంక్షిప్త వివరణ

వాణిజ్య ఆస్తి డి.నం.27-81, బ్లాకు నం.27, విజయ్ హాస్పిటల్ దగ్గర, సిపాయ్‌పేట, జంద్రపేట గ్రామం మరియు పంచాయతి, ప్రకాశం జిల్లా. చీరాల గ్రామంలో సర్వే నం.354/4 మరియు 347/6లో ఎ. 1.75సెంట్ల భూమిలో ఎ. 0.60 సెంట్లు లేదా 2904 చ.గజాల భూమి మరియు ఏసిసి షీట్ పై కప్పు గల ఇల్లు మరియు రేకుకొటం. ఎస్ఆర్ఓ చీరాల వద్ద నమోదైన రిజిస్టర్డ్ డాక్యుమెంట్ నం.575/1995 తేది 24.02.1995 ద్వారా శ్రీ కట్టా రాజ్ వినయ కుమార్‌కు చెందినది. హద్దులు: తూర్పు: ఈ వైపు 99 అడుగుల ముప్పాల ఆంజనేయులు [illegible]

రిజర్వు ధర: రూ.3,13,70,000/- ధరావతు: రూ.31,37,000/- బిడ్ హెచ్చింపు: రూ.50,000/- వేలం తేది 09.03.2026 [illegible] SBIN0007905361.

[illegible] https://baanknet.com [illegible] డాటా అప్‌లోడింగ్, బిడ్ డాక్యుమెంట్ల దాఖలు, ట్రైనింగ్/ డిమాన్‌స్ట్రేషన్, ఆన్‌లైన్ ఇంటర్‌సె బిడ్డింగ్ నియమ నిబంధనల మొదలగువానిలో సహాయం కావలసిన ఔత్సాహిక బిడ్డర్లు https://baanknet.comను చూడవచ్చును. 3) విక్రయం విపరమైన నియమ నిబంధనలకు website URL: https://baanknet.comలో ఇవ్వబడిన లింకును దయచేసి చూడండి.

క్యూఆర్ కోడ్..

అదనపు వివరాలకు దయచేసి దిగువ అధికారులను ఏ పనిదినంలో అయినా ముందస్తు అనుమతితో 07.03.2026 సా. 5.00 గం. లోగా సంప్రదించండి. 1) సందీప్ పరిడాల, మేనేజర్, మొబైల్ నం. 89859 03747 2) శ్రీ గంజి ప్రసాద్, చీఫ్ మేనేజర్, మొబైల్ నం. 98669 86725.

తేది 17.02.2026 స్థలం: హైదరాబాద్. సం/- అధీకృత అధికారి, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా.SARB-1, హైదరాబాద్.

EENADU Classifieds

BUSINESS SERVICES

బంగారం బ్యాంకులలో/ ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈరోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్). Ph: 81422 92071.

బంగారం కొనబడును. బ్యాంకులలో ఇతర ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీబంగారం విడిపించి అధిక దరకు కొనబడును (స్పాట్ క్యాష్). ✆ 87907 41166

PROFESSIONAL SERVICES

ASTROLOGY

తమిళనాడు వైదీశ్వరన్ కోయిల్ శ్రీ అగస్త్యే నాడి జ్యోతిష్యాలయం మీ చేతి బొటనవేలు ముద్రతో మీ భవిష్యత్తు పూర్తిగా చెప్పబడును. అన్ని సమస్యలకు పరిష్కారం చెప్పబడును. 89782 15913.

REAL ESTATE

PLOT FOR SALE

GENERAL

Commercial plot 1373 sq.yds Inner Ring road, Guntur, with 1.25 lakhs Rent and bank loan for immediate sale. Call: 9573454266.

గుంటూరులో వెంచర్, RTO ఆఫీస్ నుండి 6 కి.మీ., 40 అ||రోడ్ ఆనుకొని దామరపల్లిలో థారు రోడ్లు, డ్రైనేజ్, ప్రహరీ. చ||గ|| రూ. 11000/-. స్పా.ర. 8317528192.

TO LET

Office Premises is available in Sailok Complex 1st Floor at 6/1 Arundelpet, Guntur with fecilities of Ac, Lift & Both Room, Contact, Cell: 92484 94407.

JOBS

Wanted DRA Tele Callers, Field Executives & Team Leaders Banking Sector Attractive Salaries and Incentives, ✆ 9849394835, 7075345527.

Wanted Teachers for Reputed Schools in A.P & Telangana, Contact: Sneha Placements Service. Ph: 94402 46409.

PROs, Marketing Managers Required. Salary: 27,500/-., NTR Circle, Vijayawada. ✆ 63043 28479.

ప్రముఖ మ్యాన్ పవర్ సెక్యూరిటీ ఏజెన్సీకి డెవలప్‌మెంట్ ఆఫీసర్ కావలెను. ✆ 95029 49415.

గుంటూరు, ఆటోనగర్‌లో H.P. పెట్రోల్ బంక్‌లో పనిచేయుటకు మేనేజర్, పంపు బాయ్స్/ గర్ల్స్ కావలెను. పార్ట్ టైమ్/ ఫుల్ టైమ్. 7799689889, 8074546302.

త్రినేత్ర హోంకేర్‌లో వృద్ధులను/ పేషెంట్స్‌ను /పిల్లలను చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఫ్రీ వసతి, భోజనం. జీ: 18K. ✆ 85209 80099, 85208 74499.

గుంటూరు మాస్టర్‌మైండ్స్ కాలేజ నందు క్లాసు ఇన్‌ఛార్జిస్ మరియు క్యాంపస్ ఇన్‌ఛార్జ్‌గా పని చేయుటకు పురుషులు కావలెను. జీతము: 14,000/- నుండి 21,000/- వరకు ఇవ్వబడును. అర్హతలు: ఇంటర్ నుండి పి.జి. వరకు. వయస్సు: 22 సంవత్సరాలు నుండి 45 సంవత్సరాలు వరకు ఉండవలెను. గుంటూరు లోకల్ వ్యక్తి అయ్యి ఉండాలి. సంప్ర: ఫోన్ నెం. 8978480435.

గుంటూరు సిటీలోని ప్రముఖ బ్యాంక్ అనుబంధ సంస్థతో కలిసి పని చేయుటకు విశ్రాంత ఉద్యోగులు, హౌస్‌వైఫ్ 10th పాస్, 50సం||పై వయస్సు వారు కావలెను. 7036761665.

అకౌంట్స్ మేనేజర్ కావలెను. బి.కాం., 5 సం||లు అకౌంట్స్‌పై అనుభవం, ఇన్‌కంటాక్స్, GST రిటన్స్ వేయగలిగిన వారు kamathamjob@gmail.com కు పంపగలరు.

ఆఫీస్ స్టాఫ్, నర్సెస్ (MPHW) కావలెను. కొత్తవారికి కూడా ప్రాధాన్యత. అహల్యా నర్సింగ్ హోమ్, శివాలయం వెనుక, కొత్తపేట, గుంటూరు. ✆ 92464 27459.

హరేకృష్ణ హోంకేర్‌లో వృద్ధులను/ పేషంట్స్ను / పిల్లలను చూసుకొనుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఫ్రీ వసతి, భోజనం జీ: 18-20K ✆ 96404 68899, 96402 58899

గుంటూరు ఓల్డ్ క్లబ్ రోడ్, ఆపిల్ డెంటల్ కేర్‌లో పని చేయుటకు Male/Female అసిస్టెంట్స్ కావలెను. గుంటూరు లోకల్‌వారు మాత్రమే. ✆ 63022 43437.

గుంటూరు సిటి RTC బస్టాండ్ దగ్గరలో ప్రముఖ బిర్యాని హోటల్ నందు పని చేయుటకు సప్లయిర్ కావలెను. లోకల్ వారికి ప్రాధాన్యత. ✆ 96668 41537.

ప్రముఖ దంత వైద్యశాల నందు పని చేయుటకు అసిస్టెంట్ మరియు రిసెప్షనిస్ట్ స్టాఫ్ కావలెను. సంప్ర|| 78420 31133.

ప్రముఖ విద్యాసంస్థలో పని చేయుటకు రిసెప్షనిస్ట్, టీచర్స్, టీమ్‌లీడర్స్ మరియు మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. ఆకర్షణీయమైన జీతం ఇవ్వబడును. సంప్రదించండి: 87126 18882. గుంటూరు.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

Book your 5 lines Classified Colour Rs.770/- 3Ads Package Rs.1945/-

5 lines Classified B/W Rs.650/- 3Ads Package Rs.1625/-

ప్రకటనపై 5% జి.ఎస్.టి. అదనం

తక్కువ బడ్జెట్‌లో మీ అవసరాలు తీర్చే ఏకైక మార్గం.. ఈనాడులో ప్రకటన ఇవ్వటం పూర్తి వివరాలకు సంప్రదించండి: 8008510541

నరసరావుపేట

•నరసరావుపేట • వినుకొండ • చిలకలూరిపేట

కోటప్పకొండ వైపు రహదారులను విస్తరించరూ!

చిలకలూరిపేట (గ్రామీణ, న్యూస్‌టుడే: కోటప్పకొండ తిరునాళ్లలో పోలీసులు ట్రాఫిక్ నియంత్రణకు ఎన్ని చర్యలు తీసుకుంటున్నా రహదారులు చిన్నవి కావడంతో భక్తులకు ఏటా ట్రాఫిక్ కష్టాలు తప్పడం లేదని నవతరం పార్టీ జాతీయ అధ్యక్షుడు రావు సుబ్రహ్మణ్యం అభిప్రాయపడ్డారు. ఇలాంటి పరిస్థితుల్లో కొండ వైపు రహదారులను ఆరు వరుసలుగా విస్తరించాలని కోరుతూ సీఎం చంద్రబాబుకు మంగళవారం ఈ-మెయిల్, రిజిస్టర్ పోస్టు ద్వారా లేఖ పంపినట్లు తెలిపారు. చిలకలూరిపేట నుంచి కోటప్పకొండ వరకు, నరసరావుపేట నుంచి యలమంద, గురవాయపాలెం మీదుగా కోటప్పకొండ వరకు, పెట్లూరివారిపాలెం నుంచి కోటప్పకొండ వరకు మూడు వైపులా రహదారులను ఆరు వరుసలుగా విస్తరించి నిర్మాణం చేపట్టాలని తద్వారా లక్షలాది మంది భక్తులకు కష్టాలు తప్పుతాయన్నారు.

గురుకుల పాఠశాలలో సమస్యల పరిష్కారానికి నిధులు

వినుకొండ, న్యూస్‌టుడే: అంబేడ్కర్ ఎస్సీ గురుకుల బాలికల పాఠశాలలో డ్రైనేజీ నిర్మాణం, తాగునీటి సరఫరా పనులకు రూ.30లక్షలు మంజూరయ్యాయి. చాలా కాలంగా వసతి గృహంలో వాడిన నీరు బయటకు వెళ్లేందుకు సరైన కాలువ లేదు. నిరంతరం ప్రహరీ పక్కనే నిలిచి ఆ ప్రాంతం అపరిశుభ్రంగా మారి దుర్వాసన వెదజల్లుతోంది. పాఠశాల విద్యార్థినులతో పాటు చుట్టుపక్కల నివాసం ఉంటున్న వారు ఇబ్బంది పడుతున్నారు. దీంతో పాటు పాఠశాలలో తాగు నీటి సమస్య నెలకొంది. కొత్తగా వసతి గృహం కోసం సుమారు రూ.20కోట్లతో నిర్మించిన భవనంలో నీరు చాలక విద్యార్థులు కాలకృత్యాలకు పాఠశాల వద్దకు రావాల్సిన పరిస్థితి. మురుగు కాలువ, నీటి సరఫరాకు టెండర్లు పూర్తయ్యాయని త్వరలో పనులు చేపడతామని ఏఈ జాన్‌సైదా తెలిపారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

నరసరావుపేట అర్బన్ : 80085 73156

యడ్లపాడు : 8008145652 వినుకొండ గ్రామీణ : 9440009293

? జిల్లా కేంద్రం నరసరావుపేటలో సత్తెనపల్లి రోడ్డులోని వినాయకుని గుడి పక్క వీధిలో డ్రైనేజీ పూడిక తీయడం లేదు. దుర్వాసన వెదజల్లుతోంది. - **వెంకటేశ్వర్లు, స్థానికుడు**
✔ వెంటనే సిబ్బందిని పంపి డ్రైనేజీ పూడిక తీయిస్తాం. - **రామకోటయ్య, పారిశుద్ధ్య అధికారి** - న్యూస్‌టుడే, మల్లమ్మ సెంటర్ (నరసరావుపేట)

? మండలంలో పెట్లూరివారిపాలెంలోని వినాయకుని ఆలయ బజారు, ఆ పక్క వీధుల్లో పగటిపూట కూడా వీధి దీపాలు వెలుగుతున్నాయి. దీంతో విద్యుత్తు వృథా అవుతోంది. - **శ్రీనివాసరావు**
✔ గ్రామంలో పర్యటించి పగటిపూట ఎక్కడెక్కడ వీధి దీపాలు వెలుగుతున్నాయో గుర్తిస్తాం. రాత్రి మాత్రమే వెలిగేలా చర్యలు తీసుకుంటాం. - **రాంబాబు, ఏఈ, విద్యుత్తు శాఖ** - న్యూస్‌టుడే, నరసరావుపేట సెంట్రల్

? చిలకలూరిపేట పట్టణంలో రహ్మత్‌నగర్-2 నుంచి వడ్డెర కాలనీకి వెళ్లే దారిలో కాలువలో పూడికతో మురుగునీరు ఇళ్ల ముందుకు చేరుతోంది. దోమలు వృద్ధి చెందుతున్నాయి. దుర్వాసనతో ఇబ్బంది పడుతున్నాం. - **భాస్కరరావు**
✔ కాలువల్లో అడ్డంకులు తొలగించి మురుగు నీరు సక్రమంగా పారేలా చర్యలు తీసుకుంటాం. - **సునీత, పారిశుద్ధ్య అధికారిణి** - న్యూస్‌టుడే, చిలకలూరిపేట పట్టణం

? యడ్లపాడులో జాతీయ రహదారి సర్వీసు రోడ్డు అంచుల్లో గుర్తు తెలియని వ్యక్తులు వ్యర్థాలు పారబోస్తున్నారు. దీంతో ఆ ప్రాంతం దుర్గంధం వెదజల్లుతోంది. - **స్థానికులు**
✔ సర్వీసు రోడ్డులో చెత్త కుప్పలు వేయకుండా చర్యలు తీసుకుంటాం. - **బాపిరాజు, పంచాయతీ కార్యదర్శి, యడ్లపాడు** - న్యూస్‌టుడే, యడ్లపాడు

? కమ్మవారిపాలెం ఎస్సీ కాలనీలో విద్యుత్తు నియంత్రిక చేతికందే ఎత్తులో ఉంది. తీగలు వేలాడుతున్నాయి. సమీపంలో పిల్లలు ఆటలాడుతున్న సమయంలో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని భయంగా ఉంది. - **శ్రీనివాసరావు, ఎస్సీ కాలనీ**
✔ పరిశీలించి నియంత్రికను తగినంత ఎత్తులో అమర్చుతాం. ప్రమాదాలకు అవకాశం లేకుండా చూస్తాం. - **సుధాకర్, ఏఈ, విద్యుత్తు శాఖ** - న్యూస్‌టుడే, నూజండ్ల

? పట్టణంలో లాయర్ స్ట్రీట్‌లోని ఓ దుకాణం సమీపంలో కాలువలో మురుగు ముందుకు కదలడం లేదు. - **సత్య, వినుకొండ**
✔ వెంటనే పూడిక తొలగించి మురుగునీరు వెళ్లేలా చూస్తాం. - **ఇస్మాయిల్, శానిటరీ ఇన్‌స్పెక్టర్, పురపాలక సంఘం, వినుకొండ** - న్యూస్‌టుడే, వినుకొండ రూరల్

? మండలంలో ఇనిమెళ్ల మేజర్ కాలువకు సిమెంట్ పైపులైన్ వద్ద నీరు లీకవుతోంది. దీంతో దిగువ ప్రాంతాలకు నీరు సక్రమంగా చేరడం లేదు. - **సుబ్బయ్య**
✔ ఓఅండ్ఎం మరమ్మతు పనుల్లో ప్రతిపాదన పెట్టాం. - **శ్రీనివాసులు, షిఫ్ట్ ఈఈ, ఎన్నెస్పీ, వినుకొండ** - న్యూస్‌టుడే, వినుకొండ

పనులు పూర్తికాక ముందే పగుళ్లు

న్యూస్‌టుడే, అరండల్‌పేట (నరసరావుపేట సెంట్రల్) ఇంజినీరింగ్ అధికారుల పర్యవేక్షణ లోపం, గుత్తేదారు ఇష్టారాజ్యం. వెరసి మురుగు కాలువ నిర్మాణంలో నాణ్యత లోపం కనిపిస్తోంది. పట్టణంలోని అరండల్‌పేట నుంచి ఆర్‌అండ్‌బీ కార్యాలయం వరకు, ఎక్సైజ్ కార్యాలయం నుంచి ఎస్పీవో వరకు 175 మీటర్ల పొడవున రూ.17 లక్షలతో డ్రైనేజీ నిర్మాణ పనులు ప్రారంభించారు. పనులు పూర్తికాక ముందే కాలువ గోడ ఒక వైపు పగుళ్లిచ్చింది. అలాగే పట్టణంలోని శివుని మందిరం తదితర ప్రాంతాల్లో కాలువల నిర్మాణం చేపట్టారు. ఆయా ప్రాంతాల్లో పనులు ఇష్టానుసారంగా చేస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ విషయాన్ని మున్సిపల్ డీఈ రవీ దృష్టికి తీసుకెళ్లగా ఆ ప్రాంతాన్ని పరిశీలించి పగుళ్లు వచ్చిన చోట తిరిగి నిర్మాణం చేసేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. పట్టణంలో చేపట్టిన పనులన్నింటిని పరిశీలించి నాణ్యత లోపం ఉంటే తిరిగి సక్రమంగా నిర్మించేలా చూస్తామన్నారు.

ఇరవై రోజులకే విరిగి పడింది

అడ్డంకి బ్రాంచి కెనాల్‌పై కారుమంచి వద్ద వంతెనపై ఆర్‌అండ్‌బీ అధికారులు నిర్మించిన రెయిలింగ్ 20 రోజులకే విరిగి కాలువలో పడిపోయింది. గతంలో గ్రామంలో అధికారిక కార్యక్రమంలో పాల్గొనడానికి వచ్చిన చీఫ్ విప్ వంతెనను పరిశీలించారు. ఆ సమయంలో గ్రామస్థులు రెయిలింగ్ లేకపోవడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని ఆయన దృష్టికి తెచ్చారు. వెంటనే ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలని ఆర్‌అండ్‌బీ అధికారులను ఆయన ఆదేశించారు. దీంతో అధికారులు వంతెన వద్ద ఇరువైపులా రక్షణ గోడ నిర్మించారు. కొన్ని రోజులకే అది నెర్రెలు ఇచ్చింది. సోమవారం రాత్రి పది అడుగుల మేర విరిగి కాలువలో పడిపోయింది. నాసిరకం పనుల వల్లే ఇలా జరిగిందని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. ఈ విషయమై ఏఈ కంటేటి నవ్యను వివరణ అడగ్గా ప్రస్తుతం కాలువలో నీరు ఎక్కువగా ఉన్నందున పనులు చేయడానికి వీలుగా లేదని, త్వరలో సమస్య పరిష్కారానికి చర్యలు చేపడతామన్నారు. వంతెనకు పూర్తి స్థాయిలో రెయిలింగ్ నిర్మించడానికి, మరమ్మతులకు ప్రతిపాదనలు పంపామని తెలిపారు. - **న్యూస్‌టుడే, కారుమంచి (శావల్యాపురం)**

వైద్యశాల పరిశీలించిన కలెక్టర్

ల్యాబ్ పరిశీలిస్తున్న కలెక్టర్ కృతికాశుక్లా, ఆర్డీవో మధులత

వినుకొండ రూరల్, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో కలెక్టర్ కృతికాశుక్లా వినుకొండ ప్రభుత్వ వైద్యశాలలో అడుగడుగునా పరిశీలించారు. ప్రతి వార్డును క్షుణ్నంగా తనిఖీ చేశారు. అవసరమైన ఉన్న వస్తువుల తొలగించాలన్నారు. రోగులతో మాట్లాడి అందుతున్న సేవలపై ఆరా తీశారు. పాత భవనం వినియోగంపై వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం వైద్యశాలకు ఎంత విద్యుత్తు బిల్లు వస్తుంది. సోలార్ యూనిట్ ఏర్పాటు చేసి విద్యుదుత్పత్తి చేసేలా ప్రతిపాదనలు తయారు చేయాలని ఆదేశించారు. బయో మెడికల్ వేస్ట్ స్టోరేజ్ గది ఎక్కడుందని ఆరా తీసి పరిశీలించారు. వ్యర్థాలను ఎలా నిర్మూలిస్తున్నారో సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ముఖ్యమంత్రి ఆసుపత్రిలో వార్డులు, బయో మెడికల్ వేస్ట్ స్టోరేజ్, ల్యాబ్ పరిశీలిస్తారని తగిన విధంగా సన్నద్ధంగా ఉండాలని సూచించారు. వైద్యశాల మొత్తం శుభ్రంగా ఉంచాలన్నారు. కొత్త భవనంలో అన్ని గదులు పరిశీలించి అక్కడే అధికారులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్‌ను సీపీఐ పట్టణ కార్యదర్శి ఉలవలపూడి రాము ఆధ్వర్యంలో నేతలు కలిసి వినుకొండలో 100 పడకల వైద్యశాల, శాశ్వత వైద్యులను నియమించాలని కోరుతూ వినతి పత్రం అందజేశారు. ఆమె వెంట ఆర్డీవో మధులత, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు (ఏపీపీసీబీ) రీజినల్ అధికారిణి నజీరాబేగం, డీసీహెచ్ఎస్ ప్రసూన, సూపరింటెండెంట్ దయానిధి, వైద్యులు ఉన్నారు.

సస్యరక్షణతో శనగలో నాణ్యమైన దిగుబడులు

యడ్లపాడు, న్యూస్‌టుడే: సమగ్ర సస్యరక్షణ చర్యలతో శనగ పంటలో అధిక దిగుబడులు సాధించవచ్చని నరసరావుపేట సహాయ వ్యవసాయ సంచాలకుడు టి.వి.శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని కారుచోలలో మంగళవారం నిర్వహించిన 'పొలం పిలుస్తోంది' కార్యక్రమంలో ఆయన రైతులకు పలు సూచనలు, సలహాలు అందించారు. పూత, పిందె దశలో శనగ పంటలో నాణ్యమైన దిగుబడి కోసం పది రోజుల వ్యవధిలో రెండు సార్లు చొప్పున పొటాషియం నైట్రేట్(మల్టీకే) లేదా (13. 0.45)ను లీటరు నీటికి 5 గ్రాముల చొప్పున పిచికారీ చేయాలన్నారు. తుప్పు తెగులు నివారణకు ప్రొపికొనాజోల్(టిల్ట్) ఎకరాకు 200 మి.లీ. చొప్పున పిచికారీ చేసుకోవాలన్నారు. ముఖ్యమైన, మిరప పంట చేలలో మందుల పిచికారీకి డ్రోన్ వినియోగించుకోవాలని సూచించారు. ఏవో హరిప్రసాద్ మాట్లాడుతూ రైతులంతా తప్పనిసరిగా 11 అంకెల విశిష్ట రైతు సంఖ్యను కలిగి ఉండాలని, ఇలా ఉన్నవారికే ప్రభుత్వ సంక్షేమ, రాయితీ పథకాలు వర్తిస్తాయన్నారు. రైతులు సమీప రైతు సేవా కేంద్రాల ద్వారా విశిష్ట సంఖ్య పొందవచ్చన్నారు. కార్యక్రమంలో వీఏఏ సుప్రియ పాల్గొన్నారు.

క్రికెట్ ఆడి పోటీలు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అరవిందబాబు

క్రీడల్లో రాణించి దేశ ప్రగతి చాటాలి

సాతులూరు (చిలకలూరిపేట (గ్రామీణ): చదువుతో పాటు ప్రతి విద్యార్థి క్రీడల్లో రాణించి దేశ ప్రగతి చాటాలని నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు సూచించారు. నాదెండ్ల మండలం సాతులూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో క్రికెట్ పోటీలను మంగళవారం ఆయన ప్రారంభించారు. కొద్దిసేపు బ్యాటింగ్ చేసి విద్యార్థులను ఉత్సాహపరిచారు. క్రీడాకారులను చిలకలూరిపేట గ్రామీణ సీఐ సుబ్బానాయుడు పరిచయం చేసుకున్నారు. అన్ని రంగాల్లో రాణించినప్పుడే విద్యార్థులు ఉన్నత శిఖరాలు చేరుతారన్నారు. 30 సంవత్సరాల క్రితం గ్రామంలో ఉన్నత పాఠశాలను ఏర్పాటు చేసి నాణ్యమైన విద్యతో పాటు అన్ని రంగాల్లో విద్యార్థులను తీర్చిదిద్దుతున్న ఈతరం యాజమాన్యం బండారుపల్లి సత్యనారాయణ, పాటిబండ్ల శివరామకృష్ణ ప్రసాద్, ఉపాధ్యాయులు, సిబ్బందిని ఎమ్మెల్యే, సీఐ అభినందించారు.

చదరంగంతో ఆలోచన శక్తి మెరుగు

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులతో డీఎస్‌వో తదితరులు

నరసరావుపేట క్రీడలు, న్యూస్‌టుడే: చదరంగం ఓ మేధో క్రీడ. దీన్ని తరచూ ఆడటంతో ఆలోచన శక్తి మెరుగుపడుతుందని ఎమ్మెల్యే చదలవాడ అరవిందబాబు అన్నారు. స్థానిక కోడెల శివప్రసాదరావు స్టేడియంలో శాప్ ఆధ్వర్యంలో చెస్ జిల్లా స్థాయి పోటీలను జిల్లా క్రీడాభివృద్ధి అధికారి పి.నరసింహారెడ్డితో కలిసి ఆయన ప్రారంభించారు. క్రీడాకారులతో కలిసి కొద్ది సేపు చెస్ ఆడారు. జిల్లాస్థాయిలో బాగా ఆడి గెలుపొందిన వారు రాష్ట్ర స్థాయిలో కూడా విజేతలుగా నిలవాలని ఆకాంక్షించారు. జిల్లా చెస్ అసోసియేషన్ కార్యదర్శి చక్రవర్తి, జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శి సురేష్, జిల్లా మహిళా విభాగం స్కూల్ గేమ్స్ కార్యదర్శి పద్మావతి, క్రీడా శిక్షకులు, జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

విజేతల వివరాలు ఇలా.. జిల్లా స్థాయిలో విజేతలుగా నిలిచిన వారు ఈ నెల 21, 22 తేదీల్లో తిరుపతిలో నిర్వహించే రాష్ట్ర స్థాయి చెస్ పోటీల్లో పాల్గొంటారని జిల్లా క్రీడాభివృద్ధి అధికారి తెలిపారు. అండర్-13 బాల, బాలికల విభాగంలో జి.నీలప్రజ్ఞ, బి.అమర్‌నాథ్, బి.మేఘశ్రీ కోమలి యాదవ్, నాగశ్రీ దీక్షితరెడ్డి, అండర్-15 బాలబాలికల విభాగంలో స్వాతిక్ ఏశాన్, ఎ.ఈశ్వర్ రేవంత్, సీహెచ్.దివ్య, టి.దివ్య, అండర్-17 విభాగంలో కౌశిక్, నరేంద్ర, యశ్వంతి, అంజన సౌమ్య, అండర్-19 బాలికల విభాగంలో షేక్ చాందిని విజేతలుగా నిలిచారు.

నగదు అందిస్తున్న దాతలు

ఆలయ పునర్నిర్మాణానికి విరాళం

నరసరావుపేట సెంట్రల్, న్యూస్‌టుడే: మండలంలో ఇస్సపాలెంలోని శ్రీ మహంకాళి అమ్మవారి ఆలయ పునర్నిర్మాణానికి గ్రామానికి చెందిన కంచరగుంట నారాయణ, సామ్రాజ్యం జ్ఞాపకార్థం వారి కుమారులు భూలక్ష్మీ కోటేశ్వరరావు, పార్వతి శివ నాగేశ్వరరావు రూ.1,01,116 నగదును విరాళంగా ఆలయ ఛైర్మన్ బండ్లమూరి చంద్రశేఖర్‌కు మంగళవారం అందజేశారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు, దాతల కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న డీటీవో శ్రీనివాసరావు

పింఛనుదారులకు ఇంటి వద్దే బ్యాంకింగ్ సేవలు

నరసరావుపేట అర్బన్, న్యూస్‌టుడే: పింఛనుదారులకు ఇంటి వద్దే బ్యాంకింగ్ సేవలు అందుబాటులో ఉన్నాయని సద్వినియోగం చేసుకోవాలని ఎస్‌బీఐ చీఫ్ మేనేజరు అమరేంద్ర అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ పింఛనుదారుల కార్యాలయంలో మంగళవారం దీనిపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డీటీవో శ్రీనివాసరావు పింఛనుదారుల సందేహాలను నివృత్తి చేశారు. జనన తేదీ కచ్చితంగా నమోదు చేయాలని సూచించారు. యూనో యాప్ వినియోగం గురించి వివరించారు. సంఘం జిల్లా అధ్యక్షుడు మానం సుబ్బరావు, కార్యనిర్వాహక కార్యదర్శి ఈశ్వర్‌రెడ్డి, కోశాధికారి ఎమ్మెస్ ఆర్కే ప్రసాద్ పాల్గొన్నారు.

అవాస్తవాలు ప్రచారం చేస్తే చట్టపరమైన చర్యలు

మల్లమ్మ సెంటర్ (నరసరావుపేట), న్యూస్‌టుడే: సొంత ఎజెండాతో ఎవరైనా సామాజిక మాధ్యమాల్లో అవాస్తవాలు ప్రచారం చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని రెండో పట్టణ సీఐ ప్రభాకర్ హెచ్చరించారు. నరసరావుపేట పట్టణం కాకుమాను బజార్‌లో సోమవారం రాత్రి ప్రభ తగిలి స్తంభం నేలవాలగా ప్రభ కూలిందని వక్రీకరిస్తూ కొందరు సామాజిక మాధ్యమాల్లో ప్రచారం చేశారు. గతేడాది కృష్ణా జిల్లా యనమలకుదురులో జరిగిన ఘటనను ఇలా వక్రీకరించారంటూ సీఐ మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సమాజాన్ని దృష్టి మళ్లించేలా ఉద్దేశపూర్వకంగా వీడియోలు పెడితే జైలుకు పంపుతామన్నారు. ఇలాంటి ఘటనలో ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.

తిరుమల విద్యార్థులకు ఉద్యోగాలు

నరసరావుపేట అర్బన్, న్యూస్‌టుడే: తిరుమల ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు సుమీ మదర్సన్ ప్రైవేటు లిమిటెడ్ సంస్థలో ఉద్యోగాలు సాధించారని ప్రిన్సిపల్ డాక్టర్ వైవీ నారాయణ తెలిపారు. సంస్థ మంగళవారం ప్రాంగణ ఎంపికలు నిర్వహించింది. విద్యార్థులకు మౌఖిక పరీక్షలు, బృంద చర్చ నిర్వహించి ఎంపికలు చేశారు. మొత్తం 21 మంది ఉద్యోగాలకు ఎంపికైనట్లు తెలిపారు. విద్యార్థులను కళాశాల ఛైర్మన్ బొల్లా బ్రహ్మనాయుడు, కార్యదర్శి రావెల సత్యనారాయణ, టీపీవో సాంబశివరావు అభినందించారు.

విద్యుత్తు సరఫరా పునరుద్ధరణ

మల్లమ్మ సెంటర్(నరసరావుపేట), న్యూస్‌టుడే: నరసరావుపేట పట్టణం కాకుమాను బజార్‌లో సోమవారం రాత్రి ప్రభ తగిలి స్తంభం విరిగిన సంగతి తెలిసిందే. దాని స్థానంలో కొత్త విద్యుత్తు స్తంభం ఏర్పాటు చేసినట్లు డీ-2 సెక్షన్ ఏఈ సురేంద్ర తెలిపారు. ఆ ప్రాంత ప్రజలకు ఎలాంటి అసౌకర్యం లేకుండా ఉదయాన్నే ఆ ప్రాంతంలో విద్యుత్తు పునరుద్ధరణ చేసినట్లు తెలిపారు.

వంద పడకల వైద్యశాల ఏర్పాటుకు వినతి

వినుకొండ, న్యూస్‌టుడే: వినుకొండలో వంద పడకల వైద్యశాలను ఏర్పాటు చేయాలని సీపీఐ నాయకులు కలెక్టర్ కృతికాశుక్లాను కలిసి వినతిపత్రం అందజేశారు. ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్ల పరిశీలనకు వినుకొండ వచ్చిన ఆమెను ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద మంగళవారం కలిశారు. ఇప్పుడున్న కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో ఎముకల వైద్య నిపుణులను నియమించాలని కోరారు. ప్రమాదాల్లో గాయాలైన వారికి సత్వర వైద్యం అందక ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. సీపీఐ పట్టణ కార్యదర్శి యు.రాము, కిషోర్, మస్తాన్, అంజయ్య తదితరులు వినతిపత్రం అందజేసిన వారిలో ఉన్నారు.

అంచులు కుంగుతున్నాయ్.. ఓ కన్నేయరూ!

యడ్లపాడు నుంచి లింగారావుపాలెం వరకు 5 కి.మీ. దూరం సీఆర్‌డీపీ మంజూరు చేసిన నిధులతో నిర్మించిన బీటీ రోడ్డు దెబ్బతింటోంది. కొత్తగా రోడ్డు నిర్మించినా ఇరువైపులా అంచుల్లో మట్టి పోయలేదు. దీంతో భారీ వాహనాలు అంచుల్లో దిగినప్పుడు రోడ్డు ధ్వంసమవుతోంది. అంచులు దెబ్బతింటున్నాయి. ఈ విషయాన్ని సీఆర్‌డీపీ ఏఈ నవీన్ దృష్టికి తీసుకెళ్లగా ఈ రోడ్డులో నాలుగు రోజుల క్రితమే రెండో లేయర్ బీటీ వేసినట్లు తెలిపారు. అంచుల్లో మట్టి పోసి పటిష్ఠం చేసే పనులు వెంటనే ప్రారంభిస్తామని రోడ్డు నాణ్యత దెబ్బతినకుండా చర్యలు తీసుకుంటామన్నారు. - **న్యూస్‌టుడే, యడ్లపాడు**

పంచాయతీ నిధుల దుర్వినియోగంపై ఫిర్యాదు

బొల్లాపల్లి, న్యూస్‌టుడే: మండలంలో మర్రిపాలెం పంచాయతీలో పెద్ద ఎత్తున నిధుల దుర్వినియోగం జరిగిందని వెంటనే విచారణ చేసి బాధ్యులపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని బొల్లాపల్లి ప్రాథమిక సహకార సంఘం అధ్యక్షుడు పెసల వెంకట నారాయణ జిల్లా పంచాయతీ అధికారికి ఫిర్యాదు చేశారు. ఈనెల 4న రూ.6.99 లక్షలు, 13వ తేదీన రూ.86 వేలు నిధులు పంచాయతీ ఖాతా నుండి అక్రమంగా డ్రా చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. పంచాయతీలో ఎలాంటి అభివృద్ధి పనులు చేయకుండానే వీధి దీపాలు, కొత్త తాగునీటి మోటార్ల ఏర్పాటు, మరమ్మతు, పంచాయతీ పారిశుద్ధ్య సిబ్బంది వేతనాల పేరుతో నిధుల దుర్వినియోగానికి పాల్పడ్డారని వివరించారు. ఆయన వెంట గ్రామస్థులు పి.సాయి విష్ణుమూర్తి, గాదె గోపాలరెడ్డి తదితరులు ఉన్నారు.

ప్రజల కలలకు ప్రతిరూపం.. బడ్జెట్ : ప్రత్తిపాటి

చిలకలూరిపేట గ్రామీణ, న్యూస్‌టుడే : రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల శాసనసభలో ప్రవేశపెట్టిన వార్షిక బడ్జెట్ రాష్ట్రాభివృద్ధికి దిక్సూచిగా నిలుస్తుందని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. బడ్జెట్‌పై చర్చ సందర్భంగా శాసనసభలో మంగళవారం ఆయన మాట్లాడారు. రాష్ట్ర ముఖ చిత్రాన్ని మార్చే కీలక ఘట్టం తాజా బడ్జెట్‌తో ఆవిష్కృతం కానుందన్నారు. స్వర్ణాంధ్ర విజన్ 2047 లక్ష్య సాధనకు ఇది ప్రతీక అన్నారు. ఆర్థిక సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్న రాష్ట్రానికి నమ్మకాన్ని అందించేలా ప్రభుత్వం బడ్జెట్‌ను తీర్చిదిద్దిందన్నారు. రాష్ట్ర చరిత్రలో ఎన్నడూలేని విధంగా ప్రకటించిన రూ.3,32,205 కోట్ల బడ్జెట్ కేవలం సంఖ్య మాత్రమే కాదని రాష్ట్ర పునః నిర్మాణానికి సిద్ధం చేసిన ఆర్థిక శిలాఫలకమన్నారు. వ్యవసాయ అనుబంధ రంగాలకు రూ.53,752 కోట్ల కేటాయింపుతో కూటమి ప్రభుత్వం రైతు పక్షపాత ప్రభుత్వంగా నిలిచిందన్నారు. తల్లికి వందనం అమలు, ఆచరణలో మంత్రి నారా లోకేశ్ రికార్డు సృష్టించారన్నారు. ఈ పథకం అమలుకు బడ్జెట్‌లో రూ.9407 కోట్లు కేటాయింపుతో రాష్ట్రం దేశంలోనే ఒక రికార్డు సృష్టించిందన్నారు. బడ్జెట్ కేటాయింపుల్లో సామాజిక న్యాయం స్పష్టంగా కనిపిస్తోందన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, మహిళల సంక్షేమానికి బడ్జెట్‌లో రూ.91,527 కోట్లు కేటాయించడమే అందుకు నిదర్శనమన్నారు. అందులో బీసీ సంక్షేమానికి 51వేల కోట్లు కేటాయించడం నిజంగా ఒక చరిత్ర అన్నారు. 2019- 24 మధ్య వైకాపా ప్రభుత్వంపై పొరుగు రాష్ట్రాల్లో ఎలాంటి చర్చ జరిగింది.. ఇప్పుడు సీఎం చంద్రబాబు సుపరిపాలనపై ఎలాంటి చర్చ నడుస్తుందో ప్రతి ఒక్కరూ నిశితంగా గమనిస్తున్నారన్నారు. చంద్రబాబు ఆలోచనలు, దూరదృష్టితో అన్ని వర్గాలకు సామాజిక, ఆర్థిక వృద్ధికి బడ్జెట్ దోహదం చేయనుందన్నారు.

బోర్ల తవ్వకాలకు భూమిపూజ

కనమర్లపూడి(శావల్యాపురం), న్యూస్‌టుడే : కనమర్లపూడి గ్రామంలో తాగునీటి ఎద్దడి నివారణకు తెదేపా ఆధ్వర్యంలో కాలనీల్లో చేతి పంపులు ఏర్పాటు చేస్తామని పార్టీ జిల్లా రైతు ఉపాధ్యక్షుడు గోరంట్ల హనుమంతరావు తెలిపారు మంగళవారం గ్రామంలోని ఎస్సీ, బీసీ కాలనీలో చేతి పంపు బోర్ల తవ్వకాలకు ప్రత్యేక భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో మంచినీటి పథకం ఏర్పాటుకు కూడా చీఫ్ విప్ జి.వి.ఆంజనేయులు సహకారంతో ప్రతిపాదనలు పంపామన్నారు. కార్యక్రమంలో తెదేపా మండల మాజీ అధ్యక్షుడు బోడెపూడి ప్రసాద్, సీనియర్ నేత బోడెపూడి వెంకటేశ్వర్లు, నీటి సంఘం అధ్యక్షుడు బోడెపూడి శంకర్, ముక్కపాటి నాగేశ్వరరావు, కాసరగడ్డ వెంకటరత్నం, తెదేపా గ్రామ కమిటీ అధ్యక్షుడు మర్రి నరేంద్ర, యలవర్తి వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

పిల్లల ఆరోగ్య భవిష్యత్తుకు ఒక్క మాత్ర

రొంపిచర్ల, గణపవరం(చిలకలూరిపేట (గ్రామీణ), యడ్లపాడు, వినుకొండ రూరల్, నూజండ్ల, శావల్యాపురం, న్యూస్‌టుడే: చిన్నారుల ఆరోగ్య భవిష్యత్తుకు ఒక్కమాత్ర శ్రీరామరక్ష అని వైద్యులు అన్నారు. జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవం పురస్కరించుకుని నరసరావుపేట, చిలకలూరిపేట, వినుకొండ నియోజకవర్గాల్లోని మండలాల్లో 1-19 ఏళ్లలోపు పాఠశాలలు, కళాశాలల విద్యార్థులకు నులి పురుగుల నివారణ మాత్రలు పంపిణీ చేశారు. నులిపురుగుల వల్ల రక్తహీనత వస్తుందని గుర్తించాలన్నారు. నులిపురుగులు సోకిన చిన్నారుల్లో పోషకాల లోపం, ఆకలి మందగించడం, నీరసం, కడుపునొప్పి, వికారం, వాంతులు, బరువు తగ్గడం తదితర లక్షణాలు ఉంటాయన్నారు. సకాలంలో ఆల్బెండజోల్ మాత్రలు వేసుకుంటే ఆరోగ్యంగా జీవించవచ్చన్నారు. మిగిలిన వారికి ఈనెల 24న అందజేస్తామని తెలిపారు.

శివాలయంలో కూలిన ధ్వజస్తంభం

చిలకలూరిపేట పట్టణం: చిలకలూరిపేట - పురుషోత్తమపట్నం ప్రధాన రహదారిలోని అన్నపూర్ణ సమేత విశ్వేశ్వరస్వామి దేవాలయం(శివాలయం)లో ధ్వజస్తంభం సోమవారం అర్ధరాత్రి దాటిన తర్వాత అకస్మాత్తుగా విరిగి నేల కొరిగింది. ఈ ధ్వజస్తంభాన్ని 40 ఏళ్ల క్రితం ప్రజల సహకారంతో ప్రతిష్ఠించారు. ధ్వజస్తంభం అడుగుభాగాన బాగా పాడై విరిగి ప్రహరీపై పడిపోయింది. త్వరలో నూతన ధ్వజస్తంభం ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

19న వేల్పూరుకు షర్మిల

వినుకొండ, న్యూస్‌టుడే: ఉపాధి హామీ పథకాన్ని రక్షించుకునేందుకు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యాప్తంగా రచ్చబండ కార్యక్రమం నిర్వహిస్తోందని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు జి.అలెగ్జాండర్ సుధాకర్ తెలిపారు. స్థానికంగా ఆ పార్టీ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇందులో భాగంగా ఈనెల 19న ఉదయం 10 గంటలకు శావల్యాపురం మండలం వేల్పూరులో నిర్వహించే రచ్చబండ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు వైఎస్. షర్మిలరెడ్డి పాల్గొంటారని తెలిపారు. కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం ఉపాధి హామీ పథకం పేరు మార్చడంతో పాటు రాష్ట్రాలపై అధిక భారం మోపుతోందని తద్వారా పథకం నిర్వీర్యం చేసేందుకు ప్రయత్నిస్తోందని ఆరోపించారు. దీన్ని తిప్పికొట్టి ప్రజల్లో చైతన్యం నింపేందుకు కాంగ్రెస్ కృషి చేస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో నియోజకవర్గ ఇన్‌ఛార్జి బోయపాటి రామాంజనేయులు, జిల్లా అధికార ప్రతినిధి ప్రసన్నకుమార్, కార్మిక నాయకులు విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

కారును ఢీకొన్న మినీ లారీ

ఒకే కుటుంబానికి చెందిన అయిదుగురికి గాయాలు

ప్రమాద స్థలంలో వాహనాలు

చిలకలూరిపేట గ్రామీణ, న్యూస్‌టుడే: గుంటూరు - కర్నూలు జాతీయ రహదారిపై నాదెండ్ల మండలం గొరిజవోలు రెవెన్యూ పరిధిలో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన అయిదుగురు గాయపడ్డారు. నాదెండ్ల ఎస్సై వెంకటేశ్వరరావు తెలిపిన వివరాల మేరకు.. నంద్యాల జిల్లా గాజులపల్లి నుంచి తూర్పుగోదావరి జిల్లా పిఠాపురానికి అరటికాయల లోడుతో మినీ లారీ వెళ్తోంది. గొరిజవోలు రెవెన్యూ పరిధిలోకి వచ్చేసరికి ముందున్న ద్విచక్రవాహనాన్ని తప్పించే క్రమంలో ఎదురుగా వస్తున్న కారుని మినీ లారీ ఢీకొంది. దీంతో కారు ముందు భాగం పూర్తిగా దెబ్బతింది. కారులో ప్రయాణిస్తున్న ఒకే కుటుంబానికి చెందిన అనుమోలు వెంకట అరుణ్‌కుమార్, అతని భార్య రజిని, పిల్లలు జయసూర్య, శరణ్య, విశ్వతేజకు గాయాలయ్యాయి. హైదరాబాద్‌లో నివాసం ఉంటున్న వీరు గుంటూరుకు వచ్చి తిరిగి వెళ్లే క్రమంలో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. క్షతగాత్రులకు 108 సిబ్బంది ప్రాథమిక చికిత్స అందించి నరసరావుపేట ప్రభుత్వాసుపత్రిలో చేర్పించారు. బాధితుడి బావమరిది జవ్వాజి వెంకటకృష్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని యువకుడికి.. చిలకలూరిపేట గ్రామీణ: చిలకలూరిపేట - నరసరావుపేట మార్గంలో లింగంగుంట్ల పరిధిలో కుప్పగంజివాగు వంతెన వద్ద రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. ప్రకాశం జిల్లా జె.పంగులూరు మండలం రాంకూర్ గ్రామానికి చెందిన కమ్మ వెంకట్‌అనిల్ ద్విచక్రవాహనంపై కోటప్పకొండకు వెళ్లి తిరిగి వస్తున్నాడు. అతను నడుపుతున్న ద్విచక్రవాహనాన్ని లింగంగుంట్ల వంతెన వద్ద గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. తీవ్ర గాయాలైన అతన్ని తాడేపల్లిలోని మణిపాల్ ఆసుపత్రిలో చేర్పించారు. క్షతగాత్రుడి భార్య అనూష ఫిర్యాదు మేరకు మంగళవారం కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అనిల్‌కుమార్ తెలిపారు.

వృద్ధుడి బలవన్మరణం

చిలకలూరిపేట పట్టణం, న్యూస్‌టుడే: అనారోగ్య కారణంతో మనస్తాపం చెంది వృద్ధుడు బలవన్మరణం చెందిన ఘటన చిలకలూరిపేట పట్టణ పరిధిలోని టిడ్కో సముదాయంలోని ఓ ఇంట్లో మంగళవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. చింతలపూడి శ్రీనివాసరావు (62) అనే వృద్ధుడు టిడ్కో గృహాల్లో నివాసం ఉంటున్నాడు. భార్య ఆరేళ్ల క్రితం మృతి చెందింది. ఇద్దరు పిల్లలు హైదరాబాద్‌లో ఉంటారు. ఇంట్లో ఒంటరిగా ఉండటం, అనారోగ్య కారణంతో తీవ్ర మనోవేదనకు గురై ఫ్యాన్‌కు ఉరేసుకున్నాడు. కుమారుడు సురేష్‌బాబు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

సత్తెనపల్లి

• సత్తెనపల్లి • పెదకూరపాడు • మాచర్ల • గురజాల

అమరలింగేశ్వరుని ఆలయ ఆదాయం రూ.3,55,408

గురజాల (గ్రామీణ), న్యూస్‌టుడే: దైద అమరలింగేశ్వరస్వామి ఆలయ హుండీ ఆదాయాన్ని మంగళవారం లెక్కించారు. మహాశివరాత్రి సందర్భంగా దర్శన టికెట్లు, అభిషేకాలు, హుండీ, తాళల ద్వారా రూ.3,55,408 వచ్చినట్లు ఆలయ ఈవో పూర్ణచంద్రరావు తెలిపారు. ప్రత్యేక అధికారి నెమలి ఆదిశ్వర రెడ్డి, ఆలయ ఛైర్మన్ సాంబశివ రావు పాల్గొన్నారు.

నగదు లెక్కిస్తున్న సిబ్బంది

వంతెనపై ఇసుక మేటల తొలగింపు

పెదకూరపాడు, న్యూస్‌టుడే: 'ఇసుక మేట.. ప్రమాదాల బాట' శీర్షికన ప్రచురించిన కథనానికి శారతీయ జూనియర్, డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు స్పందించారు. మంగళవారం విద్యార్థులు పెదకూరపాడు - గుంటూరు మార్గంలోని పొదపాడు, లింగగుంట్ల వంతెనపై పేరుకుపోయిన ఇసుక మేట, పిచ్చి మొక్కలను తొలగించారు. కళాశాల ప్రిన్సిపల్ అశోక్ మాట్లాడుతూ విద్యార్థులతోపాటు ప్రజలు సేవా దృక్పథం కలిగి ఉండాలన్నారు.

ఇసుక తొలగిస్తున్న ఎన్ఎస్ఎస్ విద్యార్థులు

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

సత్తెనపల్లి: 80085 73171 పెదకూరపాడు: 80088 31888
కారంపూడి: 80085 73185 గురజాల: 80085 7 3176

? పట్టణంలోని నరసరావుపేట రోడ్డులో పెద్ద మసీదు, ముస్లిం పేట, నిర్మలానగర్, వడ్డవల్లి జెండాచెట్టు సమీపంలోని మసీదుల వద్ద పారిశుద్ధ్యం అధ్వానంగా ఉంది. మురుగు కాలువలు శుభ్రంగా లేవు. **- స్థానికులు, ముస్లిం ఏరియా**

✓ రంజాన్ ఉపవాసాల నేపథ్యంలో పట్టణంలోని అన్ని మసీదుల వద్ద పారిశుద్ధ్యం మెరుగుకు ప్రత్యేక డ్రైవ్ చేపడతాం. **- విజయసారథి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ - న్యూస్‌టుడే, సత్తెనపల్లి**

పర్యావరణ హితం.. బడికి పచ్చదనం

ఉగాది నుంచి దేశీయ మొక్కల పెంపకం

సత్తెనపల్లి, మాచర్ల, కారంపూడి, న్యూస్‌టుడే: పచ్చని చెట్లు, పచ్చిక బయళ్ల మధ్య చదువుకుంటే పిల్లల్లో ఆసక్తి పెంపొందడంతోపాటు ఆహ్లాదకర సామర్థ్యాన్ని గణనీయంగా మెరుగుపరుస్తాయని స్వీడన్‌కు చెందిన శాస్త్రవేత్తల పరిశోధనలో వెల్లడైంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బడుల్లో పచ్చదనం పెంచి పర్యావరణహిత వాతావరణంలో బోధన జరిగేలా చర్యలు తీసుకుంటున్నాయి. ఉపాధి హామీ నిధులతో కొన్ని పాఠశాలల్లో మొక్కలు నాటి సంరక్షించారు. దీంతో పచ్చదనం వెల్లివిరిసి, ఆహ్లాదం నెలకొంది. పర్యావరణ మిత్ర జాతీయ పురస్కారాన్ని నార్నెపాడు ప్రాథమిక పాఠశాల అందుకుంది. అన్ని బడుల చుట్టూ పచ్చని కుడుం ఏర్పాటు చేసేలా కూటమి ప్రభుత్వం ప్రణాళికలు రూపొందిస్తోంది.

గ్రీన్ టెక్నాలజీ పార్కులు

ఉగాది నుంచి రాష్ట్రంలోని అన్ని పాఠశాలల్లో దేశీయ మొక్కలు పెంపకాన్ని చేపట్టనున్నారు. అటవీశాఖతో కలిసి గ్రీన్ టెక్నాలజీ పార్కులను ప్రారంభించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించడంతో విద్య, అటవీ శాఖలు కసరత్తు చేస్తున్నాయి. సింహభాగం ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో గ్రీన్ టెక్నాలజీ పేరుతో పార్కులు ఏర్పాటుకు పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయి. ముప్పాళ్ల మండలం నార్నెపాడు జడ్పీ ఉన్నత పాఠశాలకు 20 సూత్రాల కమిటీ గతంలో పచ్చదనపు బడిగా గుర్తించింది. ఇదే మండలంలోని ముప్పాళ్ల, మాదల, దమ్మాలపాడు, బొల్లవరం పాఠశాలల్లోనూ పచ్చదనం పెంచేందుకు అవకాశం ఉంది. నందిగామలో పచ్చదనం కాస్తంత మెరుగ్గా ఉంది. గ్రీన్ పార్కుల్లో వివిధ రకాల నీడనిచ్చే మొక్కలతోపాటు పండ్లు, కూరగాయల తోటలు పెంచుతారు. పట్టణ, మండల కేంద్రాల్లో తగ్గుతున్న పచ్చని సంపద గ్రీన్ పార్కులతో పెంచేందుకు అవకాశం ఏర్పడుతుంది.

నియోజకవర్గం	ఉన్నత పాఠశాలలు
సత్తెనపల్లి	71
పెదకూరపాడు	59
గురజాల	79
మాచర్ల	88

❖ సత్తెనపల్లి, పెదకూరపాడు, గురజాల, మాచర్ల నియోజకవర్గాల్లోని పాఠశాలల్ని ప్రాథమికంగా గుర్తించారు. గ్రీన్ పార్కుల ఏర్పాటుకు విశాల మైదానాలున్న బడులను ఎంపిక చేయనున్నారు. గ్రీన్ టెక్నాలజీతో పార్కుల ఏర్పాటు మంచి ఆలోచన అని పర్యావరణ ప్రేమికులు చెబుతున్నారు.

కారంపూడి కేజీబీవీలో పచ్చదనం మధ్య చదువుతున్న విద్యార్థినులు

తహసీల్దారు చెంతకు 'అండర్ పాస్' పంచాయితీ

కంకణాలపల్లి (సత్తెనపల్లి గ్రామీణ), న్యూస్‌టుడే: 'అండర్ పాస్ నిర్మాణంపై అభ్యంతరాలు' శీర్షికన 'ఈనాడు'లో మంగళవారం వెలువడిన కథనానికి అధికారులు స్పందించారు. సత్తెనపల్లి మండలం వావిలాలనగర్ రైల్వే లెవెల్ క్రాసింగ్ గేటు వద్ద నిర్మించతలపెట్టిన అండర్ పాస్ రైల్వే వంతెన పంచాయితీ తహసీల్దారు చెంతకు చేరింది. రైల్వే శాఖ నిర్దేశించిన మేరకు 'యూ' ఆకారంలో అండర్ పాస్ నిర్మాణం వద్దని, నేరుగా మార్గం ఏర్పాటు చేయాలని కంకణాలపల్లి వాసులు చెబుతున్నారు. నేరుగా అండర్ పాస్ నిర్మించడంవల్ల, రైల్వే స్థలం తీసి 'యూ' ఆకారంలో నిర్మాణం చేపట్టాలని వావిలాలనగర్ వాసులు వాదిస్తున్నారు. నేరుగా నిర్మిస్తే అనేక గృహాలను దారి మూసుకుపోతుందన్నారు. దీంతో రెండు గ్రామాలకు చెందిన పెద్దలతో తహసీల్దారు కె.ఎస్.చక్రవర్తి సమావేశమయ్యారు. ఇరుపక్షాల అభ్యంతరాలను ఆలకించారు. వారి వాంగ్మూలాలను నమోదు చేశారు. నివేదికను కలెక్టర్కు, ఆర్డీవోకు పంపనున్నట్లు తెలిపారు.

బీసీ రిజర్వేషన్ల పితామహుడు ఠాగూర్

సత్తెనపల్లి, న్యూస్‌టుడే: బీసీ రిజర్వేషన్ల పితామహుడు కర్పూరి ఠాగూర్ అని బీసీ సంఘాల నాయకులు అన్నారు. పట్టణంలోని ఎన్జీవోస్ హోమ్ సెంటర్లో మంగళవారం బీసీ సంఘ నాయకుడు దుగ్గి భద్రయ్య ఆధ్వర్యంలో ఠాగూర్ వర్ధంతి నిర్వహించారు. బీసీలకు ఠాగూర్ అందించిన సేవల్ని వక్తలు కొనియాడారు. నాయకులు బాబోజ్, అంకమ్మరావు, దస్తగిరి, చిన్న షరీఫ్, సైదారావు, గోవింద, ధర్మారావు, నాగేశ్వరరావు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనులపై క్షేత్ర పరిశీలన చేయండి

సత్తెనపల్లి (గ్రామీణ): మండలంలోని 25 గ్రామ పంచాయతీల్లో 2024 ఏప్రిల్ నుంచి 2025 మార్చి వరకు జరిగిన ఉపాధి హామీ పథకం పనులపై సామాజిక తనిఖీ మొదలైంది. ఏపీడీ వెంకట నారాయణ తెలిపారు. రూ.16.70 కోట్లు వెచ్చించి చేపట్టిన పంట కాలువలు, గ్రావెల్, సీసీ రోడ్లు, పంట కుంటలు, పశువుల షెడ్ల నిర్మాణంపై క్షేత్రస్థాయిలో పరిశీలించాలని సూచించారు. ఈ మేరకు మంగళవారం సత్తెనపల్లి మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన సమన్వయ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎంపీడీఓ శ్రీనివాస రెడ్డి, పీజర్ ఏజు సింగ్, ఈసీ హరిత పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఏపీడీ నారాయణ

ఎరువుల అక్రమ నిల్వలపై చర్యలు

బెల్లంకొండ: బెల్లంకొండలోని సాంబశివ ట్రేడర్స్, ఎస్వీఎస్ ఫెర్టిలైజర్స్, ఎస్ఆర్కే కెమికల్స్ దుకాణాలను మంగళవారం ఏవో అరుణకుమారి తనిఖీ చేశారు. ఇందులో భాగంగా అక్రమంగా నిల్వ ఉంచిన 39.78 మెట్రిక్ టన్నుల ఎరువులతోపాటు 4.35 లీటర్ల పురుగు మందు అమ్మకాలను నిలుపుదల చేసినట్లు ఆమె తెలిపారు. వాటి విలువ సుమారు 11.26 లక్షలు ఉంటుందన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అమ్మకాల రికార్డులు సరిగా లేనందున ఎరువులు, పురుగు మందు సీజ్ చేశామన్నారు. రైతులకు యూరియా అందుబాటులో ఉందన్నారు. డీలర్లు అధిక ధరలకు అమ్మినా, అక్రమంగా నిల్వ ఉంచినా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

రికార్డులు పరిశీలిస్తున్న ఏవో అరుణకుమారి

19 నుంచి వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు

గురజాల (గ్రామీణ), న్యూస్‌టుడే: పులిపాడులోని అలివేలు మంగ, పద్మావతి సమేత వెంకటేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు ఈనెల 19 నుంచి 21 వరకు నిర్వహించనున్నట్లు అర్చకులు వెంకటసూర్యబ్రహ్మణ్యశర్మ, బాలశర్మ, ప్రధా శర్మ తెలిపారు. 19వ తేదీ 365 కలశాలతో మహాకుంభాభిషేకం, మహాన్యాస పూర్వక ఏకాదశరుద్రాభిషేకం, గణపతి పూజ, 20న బలిహరణ, స్వామి కల్యాణం, సాయంత్రం గ్రామోత్సవం, 21న పూర్ణాహుతి హోమం నిర్వహిస్తామన్నారు.

అలంకరణలో స్వామి

కనకదుర్గమ్మా.. కరుణించవమ్మా

పిడుగురాళ్ల, న్యూస్‌టుడే: పట్టణంలోని కనకదుర్గ అమ్మవారి ఆలయం త్రయోదశ వార్షికోత్సవం సందర్భంగా మంగళవారం మహాచండి హోమం, మహాపూర్ణాహుతి నిర్వహించారు. ప్రధాన అర్చకులు పూర్ణానందశాస్త్రి, వెంకటేశ్వరశర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై వేడుక తిలకించారు. అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు.

పూర్ణాహుతి హోమం నిర్వహిస్తున్న అర్చకులు

మానవత్వం చాటి.. అండగా నిలిచి

విద్యార్థి వైద్యానికి ఆర్థిక చేయూత

రెంటచింతల, న్యూస్‌టుడే: మాచర్ల మండలం కొప్పునూరుకు చెందిన విద్యార్థి సంతోష్‌నాయక్ వైద్యానికి ఉపాధ్యాయులు ఆర్థిక చేయూత అందించారు. విద్యార్థిది నిరుపేద కుటుంబం. సొంతిల్లు కూడా లేదు. పదేళ్ల కిందట తండ్రి దేవనాయక్ కాళ్ల చచ్చుబడ్డాయి. మంచానికే పరిమితమయ్యారు. తల్లి మంగమ్మపై కుటుంబ భారం పడింది. ఆమె కూలీ పనులు చేస్తూ కుటుంబాన్ని నెట్టుకొస్తోంది. కుమారుడిపైనే ఆశలు పెట్టుకుని జీవిస్తోంది. బిడ్డకు ఉన్నత చదువులు చెప్పించాలని తపన పడుతోంది. ఈ క్రమంలో సంతోష్‌నాయక్‌ను రెంచింతలలోని రామకృష్ణ గురుకుల పాఠశాలలో చేర్పించింది. ప్రస్తుతం ఏడో తరగతి చదువుతున్నాడు. ఇటీవల విద్యార్థి అనారోగ్యం బారిన పడ్డాడు. నిత్యం రెక్కాడితేనే డొక్కాడే కుటుంబంలో భర్త, కుమారుడు అనారోగ్యం బారిన పడటం ఆమెను మరింత కుంగదీసింది. ఆ కుటుంబ పరిస్థితిని తెలుసుకున్న ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్ పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులకు, మిత్రులకు చెప్పడంతో మానవత్వంతో స్పందించి రూ.లక్ష సమకూర్చారు. మంగళవారం కొప్పునూరు వెళ్లి బాలుడి తండ్రి దేవనాయక్‌కు నగదు అందజేశారు. కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

ఆర్థిక సాయం అందజేస్తున్న హెచ్‌ఎం శ్రీనివాస్

చదువుతో ఉన్నత స్థానం

కొండమోడు, రాజుపాలెం, న్యూస్‌టుడే: చదువుతో జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగవచ్చని, విద్యార్థి దశలో క్రమశిక్షణతో విద్యనభ్యసించాలని జనసేన పార్టీ మండల అధ్యక్షుడు తోట నర్సయ్య అన్నారు. రాజుపాలెం కస్తూర్బా బాలికల పాఠశాలలో మంగళవారం పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పబ్లిక్ పరీక్షల్లో ఉత్తమ మార్కులు సాధించాలన్నారు. పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలని కోరారు. గతేడాది పదో తరగతిలో ప్రథమస్థానంలో నిలిచిన జ్యోత్స్న హారికకు రూ.5116, ద్వితీయ స్థానంలో నిలిచిన బండి లక్ష్మీప్రసన్నకు రూ.3116 ప్రోత్సాహక నగదు అందజేశారు. మూడోస్థానంలో నిలిచిన కటారి శ్రావణికి పగడాల నరసింహారావు రూ.2116 అందించారు. అలాగే కొండమోడు కేఎన్ఆర్ విద్యా సంస్థలో జరిగిన పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు కార్యక్రమంలో బాల, బాలికల సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి.

నేత్ర వైద్య శిబిరానికి స్పందన

తాళ్లచెరువు (అచ్చంపేట), న్యూస్‌టుడే: మండలంలోని తాళ్లచెరువులో పెదకాకాని శంకర్ కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన ఉచిత నేత్ర వైద్య శిబిరానికి స్పందన లభించింది. తెదేపా నాయకులు శౌర్రెడ్డి, కిషోర్‌రెడ్డి శిబిరాన్ని ప్రారంభించారు. వైద్యులు 36 మందిని పరీక్షించారు. 22మందికి కంటి శుక్లాల ఆపరేషన్లకు ఆసుపత్రికి తరలిస్తున్నట్లు ఆప్తాల్మిక్ అసిస్టెంట్లు ప్రసన్నకుమార్, కరుణ తెలిపారు. స్థానిక ఎస్సీకాలనీ , ఎస్టీబీసి కాలనీలలోని పాఠశాల విద్యార్థులకు కంటిపరీక్షలునిర్వహించారు. అసరమైన వారికి ఉచితంగా కళ్ల జోళ్లు అందిస్తామని, క్రోసూరు లోని విజన్ సెంటర్‌కు రిఫర్ చేశామన్నారు. స్థానిక తెదేపా నేతలు విజయారెడ్డి, నల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులతో శంకర్ కంటి ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది, ఉపాధ్యాయులు

సమస్యల పరిష్కారానికి పోరాడతాం

మాచర్ల పట్టణం: తమ సమస్యలు పరిష్కరించే వరకూ పోరాడతామని ఏపీ వ్యవసాయ సహకార సంఘాల ఐక్య వేదిక నాయకుడు జింకల చెన్నయ్య తెలిపారు. రాష్ట్ర వ్యాప్త సమ్మెలో భాగంగా మంగళవారం ఉద్యోగులు విధులను బహిష్కరించారు. తమ డిమాండ్ల నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవో నంబరు 36ను అమలు చేసి, 2019 నుంచి 2024 వరకు పెండింగ్‌లో ఉన్న వేతనాలతోపాటు, మధ్యంతర భృతి ఇవ్వాలని, ఉద్యోగులకు గ్రాట్యుటీ చట్టప్రకారం చెల్లించాలన్నారు. 2019 తర్వాత సహకార సంఘాల్లో చేరిన ఉద్యోగులను వెంటనే రెగ్యులర్ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పి.రాజసాగర్‌రెడ్డి, ఎస్.బ్రహ్మేశ్వరరావు, బి.రామకృష్ణ, ఇ.వెంకటేశ్వర్లు, బి.కొండలరావు పాల్గొన్నారు.

నిరసన తెలుపుతున్న జేఏసీ నాయకులు

వెంకటాద్రినాయుడి పాలనలో అమరావతికి ప్రత్యేక గుర్తింపు

అమరావతి, న్యూస్‌టుడే: అమరావతిని పరిపాలించిన రాజా వాసిరెడ్డి వెంకటాద్రి నాయుడితో అమరావతికి ప్రత్యేక గుర్తింపు వచ్చిందని డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు అన్నారు. అమరేశ్వరుని రథోత్సవానికి వచ్చిన ఆయన ఎమ్మెల్యేలతో కలిసి వెంకటాద్రి నాయుడు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబుకు అమరావతి రాజధానిని అంతర్జాతీయ నగరంగా తీర్చిదిద్దే ఆశీస్సులు ఇవ్వాలని అమరేశ్వరున్ని కోరుకున్నట్లు తెలిపారు. సంక్షేమం, అభివృద్ధి లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పాలన సాగిస్తోందన్నారు. బడ్జెట్‌లో అన్ని వర్గాలకు ప్రాధాన్యం ఇచ్చారన్నారు. ఆయన వెంట ఎమ్మెల్యేలు భాష్యం ప్రవీణ్, పులివర్తి నాని, తెదేపా జిల్లా అధ్యక్షుడు జానీసైదా తదితరులు ఉన్నారు.

వెంకటాద్రినాయుడి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న రఘురామకృష్ణరాజు, ఎమ్మెల్యేలు భాష్యం ప్రవీణ్, పులివర్తి నాని

దస్తావేజులు పోయినవి

గుంటూరు జిల్లా, తాడికొండ మండలం మోతడక గ్రామ డోర్ నెం.7-115 నివాసి **గుమ్మడిదల మునేశ్వరరావు** గారి కుమారులు **గుమ్మడిదల రోశయ్య, గుమ్మడిదల శ్రీనివాసరావు** (సెల్ నెం.9912036174) మా పేరిట పల్నాడు జిల్లా, అమరావతి మం, కర్లపూడి గ్రామ సర్వే నెం.168ఎ లోని 1 ఎకరం భూమికి సంబంధించిన డాక్యుమెంట్ నెంబరు 3296/2022 మరియు ఎ 1.50 సెంట్లు సంబంధించిన డాక్యుమెంట్ నెం.3295/2022రు గా రిజిస్టర్ కాబడినవి. సదరు ఆ దస్తావేజులు తీసుకొని మా ఇంటి వద్ద నుండి 21-01-2026వ తేదీన అమరావతి ఎమ్మార్వో ఆఫీసుకు బైకుపై వెళ్తుండగా దారి మధ్యలో పోయినవి. ఎవరికైనా దొరికినచో పైన తెలిపిన అడ్రస్‌కు తెలియజేయగలరు.

అమరేశ్వరుని వైభవం

అలంకరణలో స్వామి

అమరావతి, న్యూస్‌టుడే: చూసిన కనులదే భాగ్యం అన్నట్లుగా అమరేశ్వరుని రథోత్సవం వైభవంగా సాగింది. మంగళవారం సాయంత్రం ప్రత్యేక పూజల అనంతరం రథోత్సవాన్ని ప్రారంభించారు. ఓ వైపు భక్తుల శివ నామస్మరణ.. మరోవైపు డప్పులు, మంగళ వాయిద్యాల నడుమ ఆదిదేవుడు పురవీధుల్లో ఊరేగారు. పెద్దసంఖ్యలో తరలివచ్చిన జనం బాలచాముండికా అమరేశ్వరున్ని దర్శించుకుని భక్తిపారవశ్యం పొందారు. భాష్యం ప్రవీణ్ ఆహ్వానం మేరకు వేడుక చూసేందుకు పలువురు ఎమ్మెల్యేలు తరలివచ్చారు. డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు, ఎమ్మెల్యేలు పులివర్తి నాని (చంద్రగిరి), జూలకంటి బ్రహ్మారెడ్డి (మాచర్ల), గాలి భానుప్రకాష్ (నగరి), గురజాల జగన్మోహనరావు (చిత్తూరు), భాష్యం విద్యాసంస్థల ఛైర్మన్ భాష్యం రామకృష్ణ, తెదేపా జిల్లా అధ్యక్షుడు షేక్ జానీసైదా హాజరయ్యారు.

రథోత్సవంలో కళాకారుల ప్రదర్శన

భక్తులకు మజ్జిగ, తాగునీరు పంపిణీ

అమరావతి, న్యూస్‌టుడే: అమరేశ్వరుని రథోత్సవానికి వచ్చిన భక్తులకు తాగునీటి సమస్య లేకుండా ఉప్పుటూరు చినరాములు ట్రస్ట్ ఆధ్వర్యంలో తాగునీరు, మజ్జిగ పంపిణీ చేశారు. 20 వేల తాగునీటి సీసాలు, 8 వేల మజ్జిగ ప్యాకెట్లు, 600 లీటర్ల పాలు పంపిణీ చేసినట్లు ట్రస్టు సభ్యులు తెలిపారు. ఈవో రేఖ పంపిణీని ప్రారంభించారు. ట్రస్ట్ తరపున ఎన్ఆర్ఐ రామ్‌చౌదరి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టారు.

కార్యాలయాల నిర్మాణానికి అడుగులు

దాచేపల్లి, న్యూస్‌టుడే: పట్టణంలోని ఐదోవార్డులో ఉన్న నాలుగెకరాల్లో వివిధ ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణానికి భూమి చదును పనులు మంగళవారం ప్రారంభించారు. ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు చొరవతో ప్రభుత్వ కార్యాలయాలన్నీ ఒకచోట ఏర్పాటుకు చర్యలు చేపట్టారు. ప్రభుత్వ స్థలాన్ని బాగు చేయించాలని మున్సిపల్, రెవెన్యూ అధికారులకు సూచించారు. ఆ మేరకు నగర పంచాయతీ కమిషనర్ వెంకటేశ్వర్లు, సీఐ భాస్కర్, తహసీల్దారు శ్రీనివాస్ యాదవ్ పనులు ప్రారంభించారు. తెదేపా మండల కన్వీనర్ నారాయణ, షరీఫ్, తంగెళ్ల శ్రీనివాసరావు, నర్రా పుల్లయ్య, తోట వెంకటేశ్వర్లు, అక్కినపల్లి బాలయ్య, పి.భాస్కరరావు, తిరుమలకుమార్, మల్లి తదితరులు పాల్గొన్నారు.

సబ్ రిజిస్ట్రార్‌కు ఉద్యోగోన్నతి

సత్తెనపల్లి, న్యూస్‌టుడే: స్థానిక సబ్ రిజిస్ట్రార్ బి.అశోక్‌కు ఉద్యోగోన్నతి లభించింది. గ్రేడ్-1 రిజిస్ట్రార్‌గా ఉన్న ఆయనను నంద్యాల జిల్లా రిజిస్ట్రార్‌గా నియమిస్తూ మంగళవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. గతేడాది బదిలీల్లో ఆయన ఇక్కడికి వచ్చారు. జిల్లా రిజిస్ట్రార్‌గా నియమితులైన ఆయనను ఉద్యోగులు, దస్తావేజు లేఖరులు అభినందించారు.

పది మంది బైండోవర్

ముప్పాళ్ల, న్యూస్‌టుడే: మురుగు కాలువల విషయంలో తరచూ గొడవపడుతున్న ఇరువర్గాలను తహసీల్దార్ వద్ద బైండోవర్ చేయించినట్లు ఎస్సై అనిల్‌కుమార్ తెలిపారు. మండలంలోని మాదల ఎస్సీ కాలనీకి చెందిన సమీప బంధువులు రెండు వర్గాలుగా గొడవ పడుతున్నారు. రెండ్రోజుల కిందట కూడా గొడవ పడటంతో 10 మందిని తహసీల్దార్ నగేష్ వద్ద బైండోవర్ చేశారు. మరోసారి గొడవపడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

పరీక్షల సామగ్రి అందజేత

రెంటచింతల, న్యూస్‌టుడే: విద్యార్థుల భవిష్యత్తును మార్చేది విద్యేనని తహసీల్దార్ మేరి కనకం అన్నారు. మంగళవారం స్థానిక సెయింట్ జోసఫ్స్ ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. మదర్‌థెరిసా ఫౌండేషన్ ఆధ్వర్యంలో పది విద్యార్థులకు పరీక్షల సామగ్రి పంపిణీ చేశారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ ఫాదర్ గోవింద బాలస్వామి, హెచ్ఎం దుర్గాప్రసాద్, ఫౌండేషన్ అధ్యక్షుడు బాబురావు, కిషోర్, వెంకటేష్ పాల్గొన్నారు.

సామాజిక తనిఖీపై ప్రజావేదిక

మాచర్ల పట్టణం, న్యూస్‌టుడే: సామాజిక తనిఖీలపై స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ప్రజావేదిక మంగళవారం నిర్వహించారు. డ్వామా పీడీ సిద్ధ లింగమూర్తి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ 2024-25 సంవత్సరానికి సంబంధించిన ఉపాధి పనులపై సామాజిక తనిఖీలు నిర్వహించారన్నారు. ఇప్పటికే 16 గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించామన్నారు. మొత్తం 713 పనులకు రూ.11.70 కోట్లు వెచ్చించినట్లు చెప్పారు. పలుచోట్ల లోపాలు గుర్తించామని, సొమ్ము రికవరీకి ఆదేశించినట్లు చెప్పారు. రూ.14 వేలు రికవరీకి ఆదేశించగా, రూ.72 వేలు రికవరీకి ప్రతిపాదించామని, రూ.1.29 లక్షలకు సంబంధించి రెక్టిఫికేషన్‌కు పంపామని తెలిపారు. ఈ కార్యక్రమంలో విజిలెన్స్ అధికారులు హీరాలాల్ నాయక్, విజయలక్ష్మి, ఏపీడీ సత్యనారాయణ, క్వాలిటీ కంట్రోల్ అధికారి ప్రభాకర్, ఎంపీడీవో ఫణికుమార్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

సిబ్బందితో మాట్లాడుతున్న పీడీ సిద్ధలింగమూర్తి

నులి పురుగుల నివారణ మాత్రల పంపిణీ

న్యూస్‌టుడే, బృందం: నులి పురుగుల నివారణ దినోత్సవం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా అన్ని పాఠశాలల్లో విద్యార్థులకు నులి పురుగుల నివారణ మాత్రలు పంపిణీ చేశారు. క్రోసూరులో జిల్లా మలేరియా అధికారి నజీర్ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. వైద్యులు పరిసరాలు, వ్యక్తిగత శుభ్రత పాటించాలని విద్యార్థులకు సూచించారు. చేతుల శుభ్రతపై అవగాహన కల్పించారు.

కారంపూడిలో విద్యార్థికి మాత్ర అందిస్తున్న తహసీల్దారు వెంకటేశ్వరనాయక్

వీఆర్వోల సమస్యలు పరిష్కరించాలి

కారంపూడి, న్యూస్‌టుడే: వీఆర్వోలపై పని భారం తగ్గించాలని రాష్ట్ర సంఘం పిలుపు మేరకు మంగళవారం వెల్దుర్తి తహసీల్దార్ కార్యాలయం వద్ద నల్లబ్యాడ్జీలు ధరించిన నిరసన తెలిపారు. వీఆర్వోలు మాట్లాడుతూ జిల్లా రెవెన్యూ, జీఎస్‌డబ్ల్యూఎస్ అధికారుల మధ్య సమన్వయం లేకపోవడంతో క్షేత్రస్థాయిలో ఒత్తిడి పెరుగుతోందని, ప్రభుత్వం వర్క్ టు రూల్ అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు.

వెల్దుర్తి తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన

108లో గర్భిణి ప్రసవం

అమరావతి, న్యూస్‌టుడే: అత్తలూరు పీహెచ్‌సీ నుంచి 108లో తరలిస్తున్న గర్భిణి మార్గమధ్యలో ప్రసవించిన ఘటన మంగళవారం చోటు చేసుకుంది. మునగోడుకు చెందిన సాగరిక రాణికి పురిటి నొప్పులు రావడంతో అత్తలూరు పీహెచ్‌సీకి బంధువులు తీసుకొచ్చారు. నెలలు నిండకుండానే నొప్పులు రావడంతో పరీక్షలు చేసిన వైద్యులు సత్తెనపల్లి ఏరియా ఆసుపత్రికి రిఫర్ చేసి 108లో పంపించారు. మార్గమధ్యలో నొప్పులు ఎక్కువ కావడంతో 108 జిల్లా మేనేజర్ నాగదీప్, ఈఎంటీ సురేష్, పైలట్ మనోజ్ వాహనంలోనే ప్రసవం చేశారు. తల్లి బిడ్డ క్షేమంగా ఉన్నట్లు తెలిపారు.

పారిశుద్ధ్య కార్మికులకు అండ

పెదకూరపాడు, న్యూస్‌టుడే: పారిశుద్ధ్య కార్మికులు నిజమైన సేవకులని తెదేపా జిలా కార్యదర్శి అర్తిమళ్ల రమేష్ అన్నారు. కూటమి ప్రభుత్వం గ్రీన్ అంబాసిడర్ల వేతనం రూ.6 వేలు నుంచి రూ.10 వేలకు పెంచి వారి కుటుంబాల్లో వెలుగులు నింపిందన్నారు. వేతన పెంపును హర్షిస్తూ పెదకూరపాడు పంచాయతీ పరిధిలో పనిచేస్తున్న గ్రీన్ అంబాసిడర్లు మంగళవారం ఆయనను సత్కరించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు మక్కెన సాగర్, రమేష్ పాల్గొన్నారు.

ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్

చంద్రమౌళి నగర్ బ్రాంచ్, బిషప్ వారి యొక్క ఇంటి కాంపౌండ్, రింగ్ రోడ్డు, చంద్రమౌళి నగర్, గుంటూరు - 522007. ఫోన్: 08632 350085/255024, E-Mail : iob1178@iob.in.

స్థిరాస్తుల అమ్మకం కొరకు ఇ - వేలం బహిరంగ ప్రకటన

(సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 యొక్క రూల్ 8(6)లోని నిబంధనలతో చదువుకోవలసిన సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ & ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 క్రింద స్థిరాస్తుల అమ్మకము కొరకు ఇ-వేలం అమ్మకం ప్రకటన)

సెక్యూర్డ్ క్రెడిటార్ ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్ వారికి దిగువ తెలిపిన ఋణగ్రహీతలు/తనఖాదారులు వారు తేది:31-01-2026 నాటికి చెల్లించవలసిన బకాయి మొత్తము రూ.7,74,003.85 పై (అక్షరాల ఏడు లక్షల డెబ్బై నాలుగు వేల మూడు రూపాయల ఎనభై ఐదు పైసలు మాత్రమే) + తదుపరి వడ్డీ, కాస్ట్స్ వసూలు కొరకు సెక్యూర్డ్ క్రెడిటార్ అయిన ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్, చంద్రమౌళి నగర్ బ్రాంచి యొక్క అధీకృత అధికారి వారిచే లాంఛనాత్మక స్వాధీనత పరుచుకోబడిన బ్యాంక్ తనఖా/అధీనంలో నున్న దిగువ వివరించిన స్థిరాస్తి "ఎక్కడ ఎలా వున్నది అలానే" "ఏది ఎలా వుంటే అలానే" మరియు "అక్కడ ఏది ఉన్నదో అది" పద్ధతి పై తేది.23-03-2026న విక్రయించబడునని యావన్మంది ప్రజానీకమునకు మరియు ప్రత్యేకంగా ఋణగ్రహీత(లు) మరియు హామీదారు(లు)కు ఇందుమూలముగా సూచించటమైనది.

సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ & ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 (2002 యొక్క నెం.54) క్రింద బ్యాంకుకు తనఖా పెట్టిన స్థిరాస్తుల అమ్మకము. ఇందుమూలంగా యావన్మందికి తెలియజేయునది ఏమనగా ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్ అధీకృత అధికారి గారు దిగువ ఋణం సొమ్ము వసూలు కొరకు, బ్యాంకుకు రావలసిన బకాయిలు మరియు దిగువ తెలిపిన వడ్డీతో సహా రాబట్టుకొనుటకు దిగువ ఆస్తులను "ఎక్కడ ఉన్నది అక్కడ అలాగే" & "ఏది ఉంటే అది" అను పద్ధతిలో అమ్మకం చేసే హక్కుతో సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 లోని సెక్షన్ 13(2) ప్రకారం జారీచేసిన నోటీసును అనుసరించి స్వాధీనం చేసుకున్నారు. సదరు బకాయిలు మరియు రావలసిన సొమ్మును చెల్లించనందున, దిగువ సంతకందారు సదరు చట్టంలోని సెక్షన్ 13(4) ప్రకారం సంక్రమించిన అధికారములతో బ్యాంకుకు రావలసిన బకాయి సొమ్ములు మొత్తం రాబట్టుకొనుటకు సదరు ఆస్తి అమ్మకం చేయుటకు నిర్ణయించినారు. దిగువ సంతకందారు వెబ్‌పోర్టల్ https://baanknet.com నందు గల ఇ-వేలం ప్లాట్‌ఫారంపై సదరు అమ్మకంను నిర్వహించెదరు.

ఋణగ్రహీత/తనఖాదారు పేరు & చిరునామా : మెస్సర్స్ హోటల్ సాయి సూర్య (ఋణగ్రహీత), డోర్ నెం.5-94-32, 6/13 క్రాస్ రోడ్డు, వార్డు 37, బ్రాడీపేట, గుంటూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం - 522002. ప్రాతినిధ్యం వహిస్తున్న ప్రొప్రయిటర్ : శ్రీ మాలంపాటి శ్రీనివాసరావు (ప్రొప్రయిటర్), తండ్రి : మాలంపాటి హనుమంతరావు, శాశ్వత చిరునామా: ఇంటి నెం.2-35, లింగంగుంట్ల, పెదకూరపాడు, గుంటూరు, ఆంధ్రప్రదేశ్ - 522402. శ్రీ మాలంపాటి హనుమంతరావు (తనఖాదారు & హామీదారు) శాశ్వత చిరునామా: ఇంటి నెం.2-35, లింగంగుంట్ల, పెదకూరపాడు, గుంటూరు, ఆంధ్రప్రదేశ్ - 522402.

NPA తేది. 30.09.2022 — డిమాండ్ నోటీసు తేది : 31.08.2024

డిమాండ్ నోటీసు నందు పేర్కొన్న బకాయి : రూ.6,36,112/- + తదుపరి వడ్డీ, కాస్ట్స్, ఇతర ఖర్చులు.

స్వాధీనత నోటీసు తేది: 28.07.2025, — స్వాధీనత నోటీసు పేపరు ప్రచురణ తేది: 31.07.2025

స్వాధీనత నోటీసు నందు పేర్కొన్న బకాయి: రూ.7,03,177/- + తదుపరి వడ్డీ, కాస్ట్స్, ఇతర ఖర్చులు.

స్థిరాస్తి వివరములు: గుంటూరు జిల్లా (ప్రస్తుతం పల్నాడు జిల్లా), నరసరావుపేట డిస్ట్రిక్ట్ రిజిస్ట్రార్, పెదకూరపాడు మండల పరిషద్, లింగంగుంట్ల గ్రామ పంచాయితీ, డోర్ నెం.2-35, లింగంగుంట్ల, సర్వే నెం.122-2 లోని 451 చ॥గ॥లు లేదా 378.84 చ॥మీ॥ల విస్తీర్ణం గల స్థలం అందు గల నివాస భవనం మాలెంపాటి హనుమంతరావు, తండ్రి : శ్రీ మాలెంపాటి సింగారయ్య గారి పేరున కలదు. హద్దులు: తూర్పు: బోడపాటి శివయ్య & ఇతరుల గోడ - 107.6 అ॥లు, దక్షిణం : వేమా సీతారావమ్మ & ఇతరుల స్థలం, అమ్మకందారుకి చెందిన ఈవ్స్ స్పేస్ - 39.6 అ॥లు, పడమర : నూతక్కి శ్రీనివాసరావు మరియు ఇతరుల గోడ - 109 అ॥లు, ఉత్తరం : బజారు - 35.6 అ॥లు., మోర్టగేజ్ డీడ్ నెం.2984/2017, తేది.27.11.2017 ప్రకారం.

రిజర్వుధర: రూ.22,61,000/- ధరావత్తు ధర : రూ.2,26,100/- బిడ్ పెంపుదల మొత్తం: రూ.25,000/-

* రూ.50.00 లక్షలు మరియు అంతకంటే ఎక్కువ బిడ్‌తో విజయవంతమైనచో టిడిఎస్ @ 1% వసూలు చేయబడును.

వేలం తేది మరియు సమయం: తేది.23-03-2026, ఉ॥ 11.00 గం॥ల నుండి మ॥ 01.00 గం॥ వరకు మరియు https://baanknet.com ప్లాట్‌ఫాం నందు వేలం పూర్తి అయ్యే వరకు ప్రతి 5 ని॥లకు ఒక సారి ఆటోటైమ్ ఎక్స్‌టెన్షన్ ఉందును.

ధరావత్తు చెల్లించువిధానం : ఆసక్తి గల బిడ్డర్లు / కొనుగోలుదారులు వారి మొబైల్ నెంబర్ మరియు ఇ-మెయిల్ ఐడి ఉపయోగించి https://baanknet.com పోర్టల్ నందు నమోదు చేసుకొనవలెను. తదుపరి అవసరమైన కెవైసి పత్రాలను అప్‌లోడ్ చేయవలసిందిగా కోరడమైనది. కెవైసి పత్రాలను ఇ-వేలం సర్వీస్ ప్రొవైడర్ ధృవీకరించిన తర్వాత (2 పని రోజులు పట్టవచ్చు), ఆసక్తి గల బిడ్డర్లు/కొనుగోలుదారులు సదరు గ్లోబల్ ధరావత్తు వాలెట్ ఖాతా నందు ఆన్‌లైన్ విధానం ద్వారా ధరావత్తు మొత్తాన్ని 23-03-2026, మధ్యాహ్నం 01.00 గంట లోపు బదిలీ చేయవలెను. ఆసక్తి గల బిడ్డర్లు చెల్లుబాటు అయ్యే ఇ-మెయిల్ చిరునామాను కలిగి ఉండవలెను మరియు పైన పేర్కొన్న సర్వీస్ ప్రొవైడర్ యొక్క వెబ్‌సైట్ నందు లాగిన్ అవ్వడం ద్వారా వారి పేరు / ఖాతాను నమోదు చేసుకొనవలెను.

బిడ్ పెంపుదల : పైన తెలుపబడినది — బ్యాంకుకు తెలిసినంత వరకు ఎలాంటి జంఝాటములు (ఎన్‌కంబరెన్స్) : లేదు

ఆస్తుల తనిఖీ తేది మరియు సమయం : ముందుగా బ్యాంకు వారి అనుమతి తీసుకొని బ్యాంకు పనివేళలలో తేది.18-02-2026 నుండి

ఆన్‌లైన్ ద్వారా ధరావత్తుతో కలిపి బిడ్స్ సమర్పించుట: తేది:18-02-2026 నుండి

ఆన్‌లైన్ ద్వారా ధరావత్తుతో కలిపి బిడ్స్ దాఖలు చేయు చివరి తేది.23-03-2026, మ॥ 01.00 గం॥ వరకు

* ప్రభుత్వ స్థానిక పన్నులు (ఆస్తులకు సంబంధించిన స్థానిక పన్నులు, ప్రోపర్టీ టాక్స్, వాటర్, డ్రైనేజ్ నిర్వహణ ఛార్జీలు, ఎలక్ట్రికల్ బిల్స్ మొదలగునవి) పాల్గొనదలిచిన బిడ్డర్ల ద్వారా నిర్ధారించబడాలి. సఫలీకృతులైన బిడ్డరుదారులే భరించాలి.

* చట్టబద్ధ బకాయిలు కన్నా బ్యాంక్ బకాయిలకు ప్రాధాన్యత ఉంటుంది.

అమ్మకం యొక్క సవివరమైన నియమ నిబంధనల కోసం, సర్వీస్ ప్రొవైడర్ యొక్క వెబ్‌సైట్ : https://baanknet.com/eauction-psb/bidder-registration లేదా బ్యాంక్ వెబ్‌సైట్ : www.iob.in/e-Auctions.aspx మరిన్ని వివరముల కొరకు : బ్రాంచి మేనేజర్, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్, చంద్రమౌళి నగర్ బ్రాంచ్, బిషప్ వారి యొక్క ఇంటి కాంపౌండ్, రింగ్ రోడ్డు, చంద్రమౌళి నగర్, గుంటూరు - 522007. ఫోన్: 08632 350085/255024, మొబైల్ నెం.: 8925951178 & E-Mail : iob1178@iob.in లేదా సర్వీస్ ప్రొవైడర్: M/s. Bank Asset Auction Network (BAANKNET), రిజిష్టర్డు ఆఫీస్ : యూనిట్ -1, 3వ ఫ్లోర్, VIOS కమర్షియల్ టవర్, వడాలా ట్రక్ టెర్మినల్ దగ్గర, వడాలా ఈస్ట్, ముంబయి - 400037, email: support.baanknet @psballiance.com (సంప్రదించవలసిన నెం.: 8291220220, హెల్ప్ డెస్క్ పనిచేయు సమయం : ఉ॥ 8.00 గం॥ల నుండి రా॥ 8.00 గం॥ల వరకు) వారిని సంప్రదించగలరు.

తేది : 17-02-2026, ప్రదేశం : గుంటూరు — సం/- అధీకృత అధికారి, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్

(c) eenadu

నిర్లక్ష్యం ఖరీదు.. రూ.80 లక్షలు

సాలూరు పట్టణ ప్రధాన రహదారి పక్కన మున్సిపల్ దుకాణ సముదాయమిది. రూపాయి ఆదాయం లేదు. మొదటి అంతస్తు ప్రారంభించి పదేళ్లైనా నేటికీ దుకాణాలు తెరుచుకోలేదు. షట్టర్లు విరిగి, గోడలు, గచ్చులు బీటలు వారాయి. అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది. నెలకు ఒక్కో దుకాణానికి అయిదారు వేల రూపాయలు అద్దె వచ్చే అవకాశం ఉంది. ఈ లెక్కన గత పదేళ్లలో రూ.80 లక్షల ఆదాయం కోల్పోయింది. మరమ్మతులకు ప్రతిపాదనలు చేసి పాలకవర్గం దృష్టికి తీసుకెళతామని డీఈ ప్రసాద్ తెలిపారు. – న్యూస్‌టుడే, సాలూరు

అక్రమాల లెక్క రూ. 1.31 కోట్లు

గరుగుబిల్లి పీఏసీఎస్‌లో చేతివాటం

న్యూస్‌టుడే, పార్వతీపురం, గరుగుబిల్లి గ్రామీణం

గరుగుబిల్లి సొసైటీ భవనం

గరుగుబిల్లి ప్రాథమిక వ్యవసాయ సంఘం(పీఏసీఎస్)లో ఆర్థిక పరమైన అక్రమాలు జరిగాయి. గతేడాది ఆగస్టు నుంచి ఈ సొసైటీలో జరిగిన అక్రమాలపై సహకార శాఖ అధికారులు విచారణ చేస్తున్నారు. 'ఈనాడు'లో ఈ విషయంపై సెప్టెంబరు 9 నుంచి వరుసగా కథనాలు ప్రచురితమయ్యాయి. రూ.కోటికి పైగా నిధులు దుర్వినియోగం జరిగినట్లు తొలుత 'ఈనాడు' వెలుగులోకి తీసుకువచ్చింది. ఇప్పుడు అదే నిజమైంది. సహకారశాఖ అధికారులు నిర్వహించిన దర్యాప్తులోనూ ఇదే విషయం తేలినట్లు సమాచారం.

తప్పు జరిగిందిలా

సొసైటీ నుంచి అప్పులు తీసుకున్న రైతులు తిరిగి రుణాన్ని చెల్లిస్తారు. ఈ ప్రక్రియలో చెల్లింపు రసీదులు ఇస్తారు. ఈ క్రమంలో కట్టిన మొత్తానికి ఒక రసీదు రైతుకు ఇచ్చి.. మరో రసీదులో విలువ మార్చి.. బ్యాంకుకు ఇచ్చినట్లు ప్రాథమికంగా గుర్తించారు. ఇప్పటికి 100 రసీదులకు సంబంధించి లెక్కలు తేలనట్లు గుర్తించారు

రుణ విముక్తి అయినా రెన్యువల్!

కొందరు సభ్యులు భూ పత్రాలను సొసైటీలో కుదవపెట్టి వ్యవసాయ రుణాలు తీసుకున్నారు. ఇటువంటివారు తిరిగి రుణాన్ని చెల్లించి రుణ విముక్తులయ్యారు. వారు కుదవపెట్టిన ఆస్తి పత్రాలు, రుణం చెల్లించినట్లు ధ్రువపత్రాలు కూడా జారీ చేశారు.

● తర్వాత అదే రైతు పేరిట రుణాన్ని రెన్యువల్ చేసినట్లు అధికారులు గుర్తించారు. ఇలా రూ.లక్షల్లో అక్రమాలు చోటు చేసుకున్నట్లు తెలుస్తోంది.

● ఈ రుణాలతో తమకు సంబంధం లేదని సభ్యులు స్పష్టం చేశారు.

కార్యకలాపాలపై అనుమానం ఎప్పుడంటే..

గరుగుబిల్లి సొసైటీలో కొన్నేళ్లు చోటుచేసుకున్న ఆర్థిక అవకతవకలు రూ.1.31 కోట్ల వరకు ఉన్నట్లు దర్యాప్తులో అధికారులు ఒక అంచనాకు వచ్చారు. ఈ సొసైటీలో సీఈవోగా పనిచేసిన ఉద్యోగి గత ఏడాది ఏప్రిల్‌లో మరణించారు. దీంతో ఆయన స్థానంలో పర్సన్ ఇన్‌ఛార్జిని నియమించారు. ఆయన బాధ్యతలు స్వీకరించిన తర్వాత పీఏసీఎస్ కార్యకలాపాలపై అనుమానం రావడంతో డీసీసీబీకి తెలియజేశారు. జిల్లా కేంద్ర సహకార బ్యాంకు ప్రాథమికంగా దర్యాప్తు నిర్వహించింది. దీనిపై సమగ్ర విచారణ చేయాల్సిందిగా సహకార శాఖ అధికారులను కోరారు. జిల్లా సహకారశాఖలో పనిచేస్తున్న అధికారిని విచారణ అధికారిగా నియమించారు. రైతుల ఖాతాలు, రుణాలు, రెన్యువల్ వంటి అంశాలను ఆసరాగా చేసుకుని రూ.1.28 కోట్లు వరకు సొసైటీ నిధులు దుర్వినియోగం చేసినట్లు విచారణలో గుర్తించారు. మరో రూ.5 లక్షల మేరకు వేతనాలు చెల్లింపుల విషయంలో నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించినట్లు గుర్తించారు. నివేదికను జిల్లా సహకారశాఖ అధికారులకు సమర్పించారు.

చర్యలు తీసుకుంటున్నాం.. దర్యాప్తు అధికారి నివేదికను సమర్పించారు. దీన్ని రిజిస్ట్రారుకు అందించాలి. బాధ్యులపై ఏం చర్యలు తీసుకోవాలి? తదుపరి ఏం చేయాలి? వంటి అంశాలపై సూచనలు తీసుకొని ముందుకు వెళ్లాల్సి ఉంది. ఆ దిశగా చర్యలు తీసుకుంటున్నాం.
– వాణీశైలజ, జిల్లా సహకార అధికారిణి

అపురూపం.. అమ్మరూపం

శంబర(మక్కువ), న్యూస్‌టుడే: గిరిజనుల ఆరాధ్య దైవం పోలమాంబ అమ్మవారి నాలుగో వారం జాతర మంగళవారం కనుల పండువగా జరిగింది. భక్తులు అధిక సంఖ్యలో వచ్చి గోముఖి నదీతీరాన మొక్కులు చెల్లించుకున్నారు. ట్రస్టు బోర్డ్ ఛైర్మన్ నైదాన చినతిరుపతిరావు, ఈవో బి.శ్రీనివాసుల పర్యవేక్షణలో ఏర్పాట్లు జరిగాయి. తెదేపా అరకు పార్లమెంట్ అధ్యక్షురాలు తేజోవతి, మాజీ ఎమ్మెల్యే ఆర్‌పీ బంజ్‌దేవ్ అమ్మవారిని దర్శించుకున్నారు.

దివ్యమైన సాయం

పార్వతీపురం, కలెక్టరేట్ ప్రాంగణం, న్యూస్‌టుడే: అలెంకో సంస్థ సహకారంతో దివ్యాంగులకు పంపిణీ చేసేందుకు ట్రై సైకిళ్లు జిల్లాకు చేరుకున్నాయి. మంగళవారం 20 ట్రై సైకిళ్లు ప్రాథమికంగా అందాయని దివ్యాంగుల సంక్షేమశాఖ ఉద్యోగి ఎస్‌వీ రమణ చెప్పారు. రెండు రోజుల్లో మరిన్ని రానున్నాయని, అధికారుల ఆదేశాల మేరకు అర్హులైన వారికి అందజేసేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

రెండు పూటలా వెయ్.. వారం రోజులు వాడేయ్..!

వైద్యుల్లా చెప్పేస్తున్న కొందరు ఔషధ దుకాణదారులు

అక్రమాలు బయటపడుతున్నా చర్యలు శూన్యం

'విజయనగరం అంబటిసత్రం సమీపంలోని ఓ మందుల దుకాణం యజమాని మత్తెక్కించే దగ్గు మందు, కాలం చెల్లిన ఔషధాలు విక్రయించాడు. డేహ్రాడూన్ నుంచి ప్రతి నెలా దిగుమతి చేసుకునేవాడు. 100 మి.లీ. సీసాను రూ.46కు కొనుగోలు చేసి రూ.150కు విక్రయించేవాడు. ఇలా వేల సీసాలు అమ్మేశాడు. విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులకు పట్టుబడినా అప్పటికే చాలా సరకు బయటకు వెళ్లిపోయింది. 2019 నుంచి కొనుగోలు, అమ్మకాలకు సంబంధించి రికార్డులే లేనట్లు గుర్తించారు'
– ఈనాడు, విజయనగరం

చీటీ లేకుండానే..

వైద్యుల సిఫార్సులు లేకుండా మందుల అమ్మకం నేరం. అయితే దాదాపు 90 శాతం దుకాణాల్లో ప్రిస్క్రిప్షన్ లేకుండానే అంటగడుతున్నారు. జ్వరం, ఒళ్లు నొప్పులు, తలనొప్పి, దగ్గు.. ఇలా ఏదున్నా రెండు, మూడు వారాలకు ఇచ్చేస్తున్నారు. రూపాయి ఉంటే రూ.30 తీసుకుంటున్నారు. ఎప్పుడు వేయాలి.. ఏం తినాలో వారే చెప్పేస్తున్నారు.

ఇలాంటి కేసులు ఉమ్మడి జిల్లాలో అయిదారు బయటపడ్డాయి. వినియోగదారులను మోసం చేస్తూ కొందరు విచ్చలవిడిగా మందులు విక్రయించేస్తున్నారు. తనిఖీలు మొక్కుబడిగా సాగుతుండడం, పలువురు ఔషధ నియంత్రణ శాఖ అధికారులు వసూళ్లలో నిమగ్నం కావడంతో ఈ దుస్థితి నెలకొంది. దీంతో పెద్దఎత్తున నకిలీ మందులు రోగులకు చేరుతున్నాయి.

తనిఖీలు తూతూమంత్రం: రెండు జిల్లాల్లో 2,176 మందుల దుకాణాలకు లైసెన్సులు జారీ చేశారు. ఇందులో కొందరు హోల్‌సేల్ వ్యాపారులున్నారు. ప్రస్తుతం 1,822 దుకాణాలు పని చేస్తున్నాయి. ఉన్నవాటిలో అత్యధిక శాతం నిబంధనలు పాటించడం లేదు. తనిఖీలు చేయాల్సిన అధికారులూ లేరు.

సిబ్బంది కొరత

విజయనగరం, బొబ్బిలి, పార్వతీపురంలో ఒక్కో డ్రగ్ ఇన్‌స్పెక్టర్ పని చేస్తున్నారు. నెలకు 40 దుకాణాలను పరిశీలించాలి. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వార్షిక ప్రణాళిక అమలు చేయాలి. రెండు నెలల క్రితం పార్వతీపురం ఇన్‌స్పెక్టర్‌గా టెక్కలి ఇన్‌స్పెక్టర్‌కు అదనపు బాధ్యతలు అప్పగించారు. విజయనగరం ఏడీ రజితకు గత అక్టోబరులో డీడీగా పదోన్నతి లభించింది. నాటినుంచి ఇక్కడ అదనపు బాధ్యతల్లోనే ఉన్నారు. కింది స్థాయి సిబ్బంది కొరత సైతం వేధిస్తోంది.

చర్యలు తప్పవు..

ఎప్పటికప్పుడు దాడులు చేస్తున్నామని, గుర్తించిన అక్రమాలపై కేసులు నమోదు చేస్తున్నామని ఔషధ నియంత్రణ విభాగం ఉప సంచాలకురాలు రజిత తెలిపారు. కాలం చెల్లిన మాత్రలు అమ్మినా, అమ్మకాలు, మందుల నిల్వలకు సంబంధించి లెక్కల్లో తేడా కనిపించినా చర్యలు తప్పవని హెచ్చరించారు.

మంచంపై తండ్రి.. ఆసుపత్రిలో కుమారుడు

ఆర్థికంగా చితికిపోతున్న కుటుంబం

న్యూస్‌టుడే– చీపురుపల్లి, చీపురుపల్లి గ్రామీణం

ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ధనుంజయదొర

కిరాణా దుకాణం నడిపి కుటుంబాన్ని నెట్టుకొస్తున్న తండ్రి తీవ్ర అనారోగ్యం పాలై మంచానికి పరిమితమయ్యాడు. నేనున్నా నాన్న.. మీకేం కాదు.. కుటుంబానికి అండగా ఉంటా అని ధైర్యం చెప్పే కుమారుడు రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఆసుపత్రిలో ఉన్నాడు. అటు తండ్రి.. ఇటు కుమారుడి పరిస్థితితో కుటుంబం విలవిల్లాడిపోతోంది.

చీపురుపల్లి పట్టణంలోని కొత్తగవిడివీధికి చెందిన ఉంగరాల బాలాజీ, సుప్రియ దంపతులకు కిరాణా దుకాణమే ఆధారం. వీరికి ఇద్దరు సంతానం. కుమారుడు ధనుంజయదొర విజయనగరంలో డీఎల్ఎంటీ కోర్సు, కుమార్తె స్థానికంగా తొమ్మిదో తరగతి చదువుతున్నారు. 2021లో బాలాజీ క్యాన్సర్ బారినపడ్డారు. హైదరాబాద్‌లోని బసవతారకం ఆసుపత్రిలో చికిత్స పొందారు. కొంతవరకు కోలుకున్నా.. మంచానికే పరిమితమయ్యారు. మల, మూత్ర విసర్జన వ్యవస్థ పాడవడంతో బ్యాగులను అమర్చారు. వాటిని ఎప్పటికప్పుడు మార్చుతుండాలి. ఈ క్రమంలో 2023లో హెర్నియా బారినపడ్డారు. విజయనగరంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో శస్త్రచికిత్స చేయించగా.. కోలుకున్నారు. 2025 అక్టోబర్‌లో మరోసారి హెర్నియా బయటపడింది. మళ్లీ శస్త్రచికిత్స చేయించారు. ఈసారి విఫలమై శరీరమంతా ఇన్ఫెక్షన్ అయ్యి తీవ్ర అనారోగ్యానికి గురయ్యారు. విశాఖపట్నంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించారు. అప్పటి నుంచి అక్కడే వైద్యం పొందుతున్నారు. రెండు రోజులకోసారి ఇంటి నుంచి తీసుకెళ్లి తీసుకొస్తున్నారు. ఈ వైద్యానికి రూ.20 లక్షల వరకు ఖర్చయిందని భార్య సుప్రియ తెలిపారు. బాలాజీ తండ్రి నారాయణ ఆర్మీ విశ్రాంత ఉద్యోగి. కుటుంబ సంపాదనంతా వైద్యానికే ఖర్చుచేసి పూర్తిగా చితికిపోయారు.

ఇంతలోనే విషాదం

ఇంతటి బాధలో ఉన్న కుటుంబాన్ని కుమారుడి రోడ్డు ప్రమాదం ఘటన తీవ్ర విషాదంలో నింపేసింది. ఈనెల 9న ధనుంజయదొర తండ్రిని విశాఖపట్నం ఆసుపత్రి నుంచి ఇంటికి తీసుకొచ్చారు. మరుసటి రోజు కళాశాలకు ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా గుర్ల మండలం గుజ్జింగివలస వద్ద ఎదురుగా వచ్చిన మరో ద్విచక్ర వాహనం ఢీకొంది. చేయి, భుజం, కాళ్లు, పాదాల వద్ద తీవ్ర గాయాలయ్యాయి. కాలు భాగంలో రెండుచోట్ల ఎముకలు విరిగిపోయాయి. విజయనగరంలోని ఓ ఆసుపత్రిలో రెండు శస్త్రచికిత్సలు జరిగాయి. ప్రస్తుతం చికిత్స పొందుతున్నాడు.

ఇల్లాలి బాధ వర్ణనాతీతం

సుప్రియ రోజూ భర్తకు సపర్యలు చేసి, కుమారుడి వద్దకు పరుగులు తీస్తోంది. ఆర్థికంగా చితికిపోవడం.. భర్త మంచానపడి.. కుమారుడు ఐసీయూలో.. ఏం చేయాలో పాలుపోని దుస్థితిలో తీవ్ర మనోవేదనకు గురవుతున్నారు. ధనుంజయదొర స్నేహితులు విషయాన్ని సామాజిక మాధ్యమాల్లో పెడితే కొంత ఆర్థిక తోడ్పాటు అందింది. దాతలు స్పందించి ఆదుకోవాలని కుటుంబీకులు కోరుతున్నారు.

ఇంటి వద్ద మంచానికి పరిమితమైన తండ్రి బాలాజీకి సపర్యలు చేస్తున్న కుమార్తె

నులిపురుగుల నిర్మూలన మాత్రలు

1.92 లక్షల మందికి..

పార్వతీపురం పట్టణం, న్యూస్‌టుడే: జిల్లాలో 1,92,816 మందికి నులిపురుగుల నిర్మూలన మాత్రలు పంపిణీ చేసినట్లు డీఎంహెచ్‌వో భాస్కరరావు ఒక ప్రకటనలో తెలిపారు. జాతీయ నులి పురుగుల నిర్మూలన కార్యక్రమంలో భాగంగా సోమవారం 1-19 ఏళ్ల వయసు వారితో మాత్రలు మింగించామన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లోని 38,167 మంది పిల్లలకు, ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో 1,35,235 మంది, కళాశాలల విద్యార్థులు 19,414 మందికి అందించామని చెప్పారు.

మార్చి 9న ఓటరు జాబితా ప్రదర్శన

పార్వతీపురం, న్యూస్‌టుడే: స్థానిక సంస్థల పదవీకాలం ముగుస్తుండడంతో ఆయా సంస్థలకు ఎన్నికలు నిర్వహించే క్రతువుకు అవసరమైన ప్రణాళికను సిద్ధం చేసే దిశగా రాష్ట్ర ఎన్నికల సంఘం సమాయత్తం అవుతోంది. ఇందులో భాగంగా పంచాయతీలకు ఎన్నికలు నిర్వహించే విషయంలో కసరత్తును అధికారులు ప్రారంభించారు. రెవెన్యూ అధికారులు శాసనసభ నియోజకవర్గాల వారీగా ఓటరు జాబితాలను సిద్ధం చేశారు. వీటిని గ్రామ పంచాయతీ పాలన యంత్రాంగానికి అప్పగించారు. ఈ జాబితాను పరిశీలించి, పంచాయతీల వారీగా ఓటరు జాబితాలను విడదీసి పంచాయతీ ఎన్నికలకు ఉపయోగించాల్సిన జాబితాను తయారుచేసే పనిలో పడ్డారు. జిల్లాలో 451 పంచాయతీలకు సంబంధించిన ఓటరు జాబితాలను తయారుచేసే దిశగా చేపట్టాల్సిన చర్యలను మండల ఉప ఎంపీడీవోలకు తెలియజేశారు. మంగళవారం జిల్లా పంచాయతీ అధికారి కార్యాలయం దగ్గర డిప్యూటీ ఎంపీడీవోలు, వారికి సహాయకులుగా ఇద్దరు పంచాయతీ కార్యదర్శులు ఓటరు జాబితాలను విడదీశారు.

ఓటరు జాబితాలను పరిశీలిస్తున్న డిప్యూటీ ఎంపీడీవోలు, సచివాలయ కార్యదర్శులు

చేరికలు ఎక్కడ పెట్టాలో?

శాసనసభ ఎన్నికల తర్వాత ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పులు జరిగాయి. అసెంబ్లీ వరకు ఏ పోలింగు బూతులో ఓటరు పేరు ఉందనే విషయమే పరిగణనలోకి తీసుకుంటారు. పంచాయతీ ఎన్నికల విషయానికి వస్తే ఇంటివరుసల క్రమంలో, వార్డుల వారీగా ఓటర్లను పొందుపరచాలి. కొత్తగా చేరిన వారి పేర్లు ఎక్కడ ఉంచాలో గుర్తించి జాబితాను తయారుచేసే బాధ్యత పంచాయతీల్లో నిర్వహిస్తారు. ఈ ప్రక్రియను పూర్తిచేసి.. మార్చి 9న పంచాయతీల్లో ఓటరు జాబితాను ప్రకటించాలని ఎన్నికల అధికారులు ఆదేశించారు. ఈ దిశగా చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా పంచాయతీ అధికారి టి.కొండలరావు 'న్యూస్‌టుడే'తో చెప్పారు.

రయ్‌మంటూ రహదారుల నిర్మాణం

'న్యూస్‌టుడే'తో ఈఈ రాధాకృష్ణ

ముఖాముఖి

పార్వతీపురం, న్యూస్‌టుడే: జిల్లాలో ర.భ.శాఖ పరిధిలో రహదారుల పనులు ఈ ఆర్థిక సంవత్సరం పూర్తయ్యేలోగా చేయడానికి వీలుగా చర్యలు తీసుకుంటున్నట్లు ఆ శాఖ కార్యనిర్వాహక ఇంజినీరు రాధాకృష్ణ చెప్పారు. మంగళవారం ఈఈ కార్యాలయంలో 'న్యూస్‌టుడే'తో మాట్లాడారు. ఇటీవల ప్రభుత్వం ప్రాధాన్య క్రమంలో చెల్లింపులకు శ్రీకారం చుట్టడంతో నిలిచిన పనులు ప్రారంభించేందుకు గుత్తేదారులు ముందుకు వచ్చారని చెప్పారు. వివరాలు ఆయన మాటల్లోనే..

14 చోట్ల పూర్తి

జిల్లాలో 27 రహదారులకు సంబంధించిన పనులకు రూ.78.37 కోట్లు మంజూరయ్యాయి. ఇందులో రూ.34.69 కోట్లతో 14 పూర్తి చేశాం. 8 పనులు ప్రగతిలో ఉన్నాయి. ఈ నెలలో పూర్తి చేసేందుకు వీలుగా యంత్రాంగం పనిచేస్తోంది. మరో అయిదు పనులకు సంబంధించి గుత్తేదారులు ఒప్పందాలు రావాల్సి ఉంది. వీటి పూర్తికి చర్యలు చేపడతాం.

రూ.19.22 కోట్లతో భవన నిర్మాణాలు

పార్వతీపురంలో న్యాయమూర్తుల నివాసాల నిర్మాణంతోపాటు నాలుగు పనులను చేస్తున్నాం. వీటికి రూ.5.7 కోట్లు వ్యయం అవుతోంది. కురుపాం న్యాయస్థానం చుట్టూ ప్రహరీ నిర్మాణానికి రూ.1.20 కోట్లు మంజూరయ్యాయి. ప్రారంభించాల్సి ఉంది. జిల్లాలో రూ.11.37 కోట్లతో ఆరుచోట్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల భవన నిర్మాణాలు చేపడుతున్నాం. వీటిలో శంబర, మక్కువ పనులు పూర్తయ్యాయి.

★ సీతానగరం పీహెచ్‌సీకి సంబంధించి కొత్త గుత్తేదారును ఆహ్వానిస్తున్నాం. మామిడిపల్లి, తోణాంలో పనులు జరుగుతున్నాయి. వాటిని త్వరలోనే అప్పగించనున్నాం.

★ ఈ ఏడాది వివిధ పథకాల కింద భవనాల నిర్మాణాలకు రూ.19.22 కోట్లు మంజూరయ్యాయి. ఇప్పటికే రూ.10.93 కోట్లతో 11 పనులు పూర్తి చేశాం.

ఆ మార్గాన్నీ ప్రతిపాదించాం..

జిల్లాలోని ప్రధాన రహదారి కళింగపట్నం-పార్వతీపురానికి రూ.5 కోట్ల పైచిలుకు నిధులతో ప్రతిపాదించాం. త్వరలో నిధులు మంజూరు కానున్నాయి. చిలకపాలెం-రాయగడ రోడ్డు పీపీపీ విధానంలో చేపట్టేందుకు డీపీఆర్‌లు తయారు చేశాం. అవి ప్రభుత్వ పరిశీలనలో ఉన్నాయి. జిల్లాలో అయిదు రైలు వంతెనల నిర్మాణం రైల్వే అధికారులు చేపడతారు.

నీళ్లన్నారు.. నిధులు దోచేశారు..!

దిష్టి బొమ్మల్లా ట్యాంకులు

వీటి నిర్మాణానికి రూ.కోటి ఖర్చు

న్యూస్‌టుడే, సాలూరు

సుద్దులు చెప్తాం.. మేం పాటించం.. అనడానికి గత ప్రభుత్వ పాలనలో నేతలు చేపట్టిన పనులే నిదర్శనం. జగనన్న కాలనీలో పేదల ఇళ్ల నిర్మాణానికి నీళ్లిచ్చేందుకు తాత్కాలిక ట్యాంకులు నిర్మించారు. వీటి కోసం రూ.లక్షలు ఖర్చు చేశారు. కానీ చుక్కనీరు చేరలేదు.

సాలూరు పట్టణంలో ఎనిమిది లేఅవుట్లు వేశారు. 2,680 మంది పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించారు. గుమడాం-4, 5 లేఅవుట్లలో 1,508 ఇళ్లకు 188 తాత్కాలిక ట్యాంకుల నిర్మాణానికి రూ.90 లక్షలు, నెలిపర్తి-2 లేఅవుట్‌లో 419 ఇళ్లు నిర్మించేందుకు 42 ట్యాంకులకు రూ.30 లక్షలు కేటాయించారు. ప్రజారోగ్య శాఖ ఆధ్వర్యంలో పనులు చేశారు. బోర్లు, మోటార్లు వేశారు. సిమెంట్ ట్యాంకులు నిర్మించారు. పైపులైన్ వేయక ట్యాంకులకు నీరు రాలేదు. దీంతో దిష్టిబొమ్మల్లా మారాయి. వీటికి కేటాయించిన నిధులతో సీసీ రోడ్లు, కాలువ, తాగునీటి పనులు చేస్తే బాగుండేది. కానీ, వైకాపా నేతలు నిధులు దోచేందుకు అవసరం లేని పనులు చేశారని లబ్ధిదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

పైపులతోనే నీటితడి..

గృహ లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణ సమయంలో మోటార్ల నుంచి డ్రమ్ములకు పైపులతో నీరు పట్టి పనులు చేపట్టారు. ఇప్పటికీ అదే పరిస్థితి. కొంతమంది అప్పులు చేసి మరీ బోర్లు వేసుకున్నారు. కానీ, చేసిన పనులకు నిధులు మంజూరుకాక చాలా వరకు పునాదుల్లో పనులు నిలిచాయి. గుమడాం-5 లేఅవుట్‌లో 1,337 ఇళ్లకు కేవలం ఏడు ఇళ్లు మాత్రమే పూర్తయ్యాయి. సౌకర్యాలు లేక ప్రస్తుతం ఒక్క కుటుంబం కూడా నివాసం లేదు. నెలిపర్తి కాలనీలో వందల అడుగుల పైపులు, డ్రమ్ములు కొనుగోలు చేసి మోటార్ నుంచి నీటిని తోడుకుని.. తడిపి 250 ఇళ్లు నిర్మించారు. సదుపాయాలు లేక ప్రస్తుతం 20 కుటుంబాలే ఉంటున్నాయి.

గుమడాం లేఅవుట్‌లో నిర్మించిన ట్యాంకులు

నిధుల్లేక వేయలేదు..

'గత ప్రభుత్వ ఆదేశాల మేరకు లేఅవుట్లలో వాటర్ ట్యాంకులు నిర్మించాం. పైపులైన్ నిర్మాణానికి అప్పట్లో నిధులు మంజూరు కాలేదు. దీంతో, ఆ పనులు జరగలేదు. జిల్లాలో సాలూరు, పాలకొండ, పార్వతీపురం పట్టణాల్లో ఇదే పరిస్థితి ఉంది' అని జిల్లా ప్రజారోగ్య శాఖ అధికారి వంశీకృష్ణ తెలిపారు.

వనితలూ.. అందిపుచ్చుకోండి అవకాశాలు

పార్వతీపురం, న్యూస్‌టుడే: మహిళలు పరిశ్రమలను ఏర్పాటు చేసుకుని వ్యాపారవేత్తలుగా ఎదగాలని, ఆ దిశగా ప్రభుత్వం వివిధ అవకాశాలను కల్పిస్తోందని పరిశ్రమలశాఖ అధికారి సీతారాం అన్నారు. మంగళవారం డీఆర్‌డీఏ కార్యాలయంలో సీఆర్పీలతో జరిగిన సమావేశంలో పీఎంఈజీపీ కార్యక్రమంపై అవగాహన కల్పించారు. ఏయే పరిశ్రమలు ఏర్పాటు చేయడానికి వీలుంది, వనరులు ఏమిటి? వాటిని ఎలా వినియోగించుకోవాలి అనే వివరాలను పరిశ్రమల శాఖ అందిస్తుందన్నారు. ఏవైనా ఆలోచనలు ఉంటే తమను సంప్రదించాలని కోరారు.

కొత్త పంటల వైపు వెళ్దాం: మహిళా సంఘాల సభ్యులకు ఉన్న వ్యవసాయ క్షేత్రాల్లో కొత్త పంటలు పండించేందుకు సమాయత్తం చేయాలని డీఆర్‌డీఏ పీడీ సుధారాణి అన్నారు. కొమరాడ మండలంలో డిమాండు ఉన్న కొత్త పంటలు పండించేందుకు చర్యలు చేపడుతున్నామని వెల్లడించారు. వీరఘట్టంలోనూ అమలుకు యోచన చేస్తున్నామన్నారు. 'గ్రామ అంగళ్లు' ఏర్పాటు చేసి మహిళా రైతులు పండించే కూరగాయలు విక్రయించేందుకు చర్యలు చేపడుతున్నామని చెప్పారు. గరుగుబిల్లిలోని మహిళలు గుర్రపుడెక్కతో ఆదాయం పొందేందుకు ముందుకు రావాలని, దీంతో నెల్లూరు, పశ్చిమ గోదావరి జిల్లాల్లో ఎరువులు తయారు చేస్తున్నారని చెప్పారు.

మాట్లాడుతున్న పరిశ్రమల శాఖ అధికారి సీతారాం, వేదికపై డీఆర్డీఏ పీడీ సుధారాణి

ఎత్తుకు పైఎత్తు... ప్రత్యర్థి చిత్తు

పార్వతీపురం పట్టణం, న్యూస్‌టుడే: చదరంగం పోటీల్లో విద్యార్థులు ఎత్తుకు పై ఎత్తు వేసి ప్రత్యర్థులను చిత్తు చేశారు. మంగళవారం ఎన్జీజీవో హోమ్‌లో శాప్ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి చదరంగం పోటీలు జరిగాయి. జిల్లా నలుమూలల నుంచి 100 మంది విద్యార్థులు హాజరయ్యారు. అండర్-13, 15, 17, 19 విభాగాల్లో బాలురు, బాలికలకు విడిగా పోటీలు నిర్వహించారు. జిల్లాస్థాయిలో ప్రతిభ చూపిన విద్యార్థులను రాష్ట్రస్థాయికి ఎంపిక చేసినట్లు డీఎస్‌డీవో శ్రీధర్‌రావు తెలిపారు. స్కూల్ గేమ్స్ జిల్లా కార్యదర్శులు ఎస్.మురళీ, కె.నాగమణి, పరిశీలకులు ప్రసాద్, వెంకటేష్, భార్గవి, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయికి ఎంపికైన వారు

బాలుర విభాగం: బి.సంకీర్త్, ఎం.కుమార్, ఎం.నరేష్, జి.భరద్వాజ్, టి.గిరిప్రకాష్, జి.చైతన్య, ఎస్.ఠాగూర్ నాయుడు, ఎస్.మదన్

బాలికల విభాగం: ఎస్.తమన్నా, జి.సంజన, కె.తేజశ్విని, ఎస్.వెన్నెల, పి.లహరి, బి.లావణ్య

చదరంగంలో పోటీ పడుతున్న విద్యార్థినులు

ఉత్సాహంగా ఫుట్‌బాల్ పోటీలు

విజయనగరంలోని రాజీవ్ క్రీడా మైదానంలో మంగళవారం ఫుట్‌బాల్ పోటీలు ఉత్సాహంగా సాగాయి. ఉత్తరాంధ్ర చిట్టి వైష్ణవి స్మారక సెవెనర్స్ పేరిట నిర్వహించగా.. ఎనిమిది జట్లు పాల్గొన్నాయి. తొలి సెమీ ఫైనల్‌లో కొమ్మాది(విశాఖ)పై నెల్లిమర్ల బృందం విజయం సాధించింది. రెండో సెమీస్‌లో స్టార్‌ఫ్లెక్సీ(విశాఖ), టౌన్‌స్పోర్ట్స్ క్లబ్(విజయనగరం) హోరాహోరీగా తలపడ్డాయి. 1- 1 గోల్స్ రావడంతో మ్యాచ్ డ్రా అయ్యింది. పెనాల్టీ షూట్అవుట్‌లోనూ 3- 3 గోల్స్ రావడంతో ఫలితం తేల్చడానికి టాస్ వేశారు. ఇందులో ఆతిథ్య జట్టుకు అనుకూలంగా ఫలితం రావడంతో ఫైనల్‌కు చేరింది. నెల్లిమర్లపై 2-0తో జయకేతనం ఎగరవేసింది.
– న్యూస్‌టుడే, విజయనగరం బాబామెట్ట

జ్ఞాపకాల మదిలో...
జాతస్య హిధ్రువో మృత్యుః ధ్రువం జన్మ మృతస్యచ
తస్మాద పరిహార్యేర్థే నత్వం శోచితు మర్హసి
మీరు చూపిన ఆత్మీయత.. అనురాగం మా అభివృద్ధికి వేసిన పూబాట.. మీరు భౌతికంగా దూరమైనా మా చెంత ఉన్నట్లే ఉంది.. ఏమిచ్చి రుణం తీర్చుకోము మా యదలోతుల్లోని భావాలను అక్షరరూపంలో నివేదించడం తప్ప..
ప్రకటనలపై ఇంకోటి 5% అదనం
నిర్యాణం, వర్ధంతి, జయంతి
ఈనాడు యాడ్స్ ద్వారా తెలియజేయండి
ఈనాడు ప్రకటనల విభాగం
9000866020, 8008597609

(c) eenadu

ఈ- నారీతో జీవనోపాధులు మెరుగు

మయూరి కూడలి: స్వయం సహాయక సంఘాలకు ప్రభుత్వాలు ఇస్తున్న రూ.కోట్ల నిధులు దుర్వినియోగం కాకుండా ఈ-నారీ వ్యవస్థ దోహదపడుతుందని, జీవనోపాధులు మెరుగవుతాయని వెలుగు ఏపీడీ సావిత్రి అన్నారు. మంగళవారం విజయనగరంలోని టీటీడీసీ ప్రాంగణంలో జరిగిన శిక్షణ కార్యక్రమంలో మాట్లాడారు. డీపీఎంలు రాజ్‌కుమార్, చిరంజీవి, లక్ష్మునాయుడు, రవికుమార్ పాల్గొన్నారు.

మెరిశారు.. మురిశారు

జేఈఈ అడ్వాన్స్డ్ పరీక్ష ఫలితాల్లో ఉమ్మడి జిల్లా విద్యార్థులు సత్తా చాటారు. మంచి పర్సంటైల్‌తో ప్రతిభ చూపారు.
– న్యూస్‌టుడే, వంగర, పాలకొండ, పార్వతీపురం, గరుగుబిల్లి, గజపతినగరం

ఐఐటీ సీటు సాధిస్తా

విజయనగరం విద్యావిభాగం, న్యూస్‌టుడే: జేఈఈ అడ్వాన్స్డ్ ద్వారా ఐఐటీ సీటు సాధించాలన్నదే తన లక్ష్యమని విజయనగరంలోని ప్రదీప్‌నగర్‌కు చెందిన **వల్లంటి దీవక్‌చంద్ర** పేర్కొన్నాడు. జేఈఈ మెయిన్‌లో 99.90 పర్సంటైల్ సాధించాడు. ముంబయి లేదా చెన్నై ఐఐటీలో కంప్యూటర్‌సైన్స్ చదువుతానని తెలిపాడు. ఏడోతరగతి వరకు విజయనగరంలో చదివిన దీపక్ విశాఖపట్నంలో ఎనిమిదో తరగతి పూర్తి చేసి, తొమ్మిది నుంచి విజయవాడలో చదువుతున్నాడు. తల్లిదండ్రులు జ్యోతి, సత్యనారాయణ ఉపాధ్యాయ వృత్తిలో ఉన్నారు.

పాలవలస భార్గవనాయుడు

◆ కొట్టిశ గ్రామం, వంగర మండలం
● 99.99
■ అప్పలరాము (ఉపాధ్యాయుడు), లలిత కుమారి (గృహిణి)

ఉత్తరావెల్లి సాయి అభిజిత్ నాయుడు

◆ మద్దివలస, వంగర మండలం
● 98.997
■ గణేష్‌బెనర్జీ, పార్వతి (సర్పంచి)

పాలవలస హరిరామ్ ప్రసాద్

◆ కొట్టిశ వంగర, మండలం
● 98.91
■ పాలవలస రాంబాబు, పద్మ (రియల్ఎస్టేట్)

బి.పూర్ణచంద్ర

◆ బురదవెంకటాపురం, గరుగుబిల్లి
● 99.112
■ నారాయణ స్వామి (ఉపాధ్యాయుడు), తల్లి గృహిణి

గొర్లె నిహారిక

◆ పురిటిపెంట, గజపతినగరం మండలం
● 99.78
■ శ్రీనివాసనాయుడు, లక్ష్మి

సారిక కృష్ణమనోజ్ నాయుడు

◆ తూర్పువీధి (పార్వతీపురం)
● 99.65
■ సులోచన నాయుడు(గృహిణి), కృష్ణం నాయుడు(వ్యాపారి)

పెంట శ్రీశాంత్

◆ గరుగుబిల్లి, హిక్కింవలస గ్రామం ● 99.98
■ తండ్రి శ్రీనివాసరావు, తల్లి వసంతలక్ష్మి

సూచిక: ◆ గ్రామం ● పర్సంటైల్ ■ తల్లి దండ్రులు

స్టోర్ రూములో సరకులు పరిశీలిస్తున్న సీనియర్ సివిల్ జడ్జి కృష్ణప్రసాద్

ఖైదీలపై వివక్ష తగదు

శృంగవరపుకోట, న్యూస్‌టుడే: ఖైదీలపై వివక్ష చూపించరాదని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఎ.కృష్ణప్రసాద్ అన్నారు. జాతీయ న్యాయ సేవాధికార సంస్థ, జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆదేశాల మేరకు మంగళవారం ఎస్.కోటలోని సబ్ జైలును మంగళవారం సందర్శించారు. ఖైదీలకు న్యాయ విజ్ఞాన సదస్సుపై అవగాహన కల్పించారు. వారిపట్ల వివక్ష చూపిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. జైలులో లీగల్ ఎయిడ్ క్లినిక్‌ను తనిఖీ చేశారు. న్యాయవాదులు, పారా లీగల్ వాలంటీర్లు నిర్వహిస్తున్న విధుల గురించి ఆరా తీశారు. ఖైదీలతో మాట్లాడుతూ.. నేర ప్రవృత్తిని విడిచిపెట్టి మంచి పౌరులుగా మెలగాలని హితవు పలికారు. సబ్ జైలులో బాధితులకు న్యాయ సహాయం అందించడానికి ఏర్పాటు చేసిన జైల్ లీగల్ ఎయిడ్ క్లినిక్‌ను సక్రమంగా కొనసాగించాలన్నారు. కారాగారంలో అందుతున్న సౌకర్యాలపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. స్టోర్ రూమ్‌ను పరిశీలించారు.

అమెరికా అమ్మ ఇక లేరు

చార్లెస్ డి లార్(పాతచిత్రం)

కొత్తవలస, న్యూస్‌టుడే: దత్తిలో హోమ్స్ ఆఫ్ ది ఇండియన్ నేషన్(హోయినా) అనాథ ఆశ్రమ వ్యవస్థాపకురాలు, అమెరికాకు చెందిన చార్లెస్ డి లార్(91) ఇకలేరు. అమెరికాలోని తన నివాసంలో సోమవారం మృతిచెందారని క్యాంపస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డా.గ్లోరీ జెన్స్, మేనేజర్ శ్రీనివాసకుమార్ మంగళవారం తెలిపారు.

అమెరికాలో పుట్టి.. చార్లెస్ డి లార్ 1935లో జన్మించారు. అప్పట్లో మదర్ థెరెస్సాతో కలిసి చెన్నైలో సేవలు అందించారు. ఈ క్రమంలో 1978లో మద్రాసులో బాలికల హోమ్‌ను ప్రారంభించారు. తర్వాత బాపట్లలో బాలుర హోమ్‌ను నెలకొల్పారు. సేవలకు గాను అప్పట్లో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నుంచి ప్రశంసలు అందుకున్నారు. కొత్తవలస మండలం దత్తి రెవెన్యూలో 25 ఎకరాల భూమిని కొనుగోలు చేసి 2001లో బాల, బాలికల కోసం ప్రత్యేక వసతి గృహాలు నిర్మించి ఇక్కడ కూడా ఒక హోమ్‌ను ప్రారంభించారు. చెన్నై, బాపట్లలో ఉన్న బాలికలు, బాలురను ఇక్కడకు తీసుకొచ్చి.. భర్త బ్రూస్ లార్‌తో కలిసి నిర్వహించారు.

ఉచిత విద్య, వసతి.. కులమతాలకు అతీతంగా నిరుపేదలు, అనాథలు, దివ్యాంగ పిల్లలకు ప్రవేశాలు కల్పించి ఉచిత విద్య, భోజన, వసతి సదుపాయాలు అందించారు. కళలు, సంప్రదాయ నృత్యాలు, ఆత్మరక్షణ నైపుణ్యాలలో శిక్షణ ఇప్పిస్తున్నారు. వ్యక్తిగత విరాళాలు, చర్చిలు, సేవా సంస్థల ద్వారా నిధులు సమకూర్చుకుని పిల్లల భవిష్యత్తును తీర్చిదిద్దుతున్నారు. ఏడాదికి రెండు, మూడు సార్లు అమెరికా నుంచి ఇక్కడకు వచ్చి పిల్లల బాగోగులు చూస్తుండేవారు. ఆశ్రయం పొందుతున్నవారితో పాటు నిర్వాహకులు, ఉద్యోగులు, స్థానికులు 'మామ్' అని పిలుస్తుంటారు. పెద్దలంతా అమెరికా అమ్మ అని అంటారు. స్థానికంగా ఉన్న హోమ్‌లో ప్రస్తుతం 125 మంది ఉన్నారు. చార్లెస్ మృతితో విషాదఛాయలు అలుముకున్నాయి.

కొత్తవలస మండలం దత్తిలోని హోయినా ఆశ్రమంలో నివాళులర్పిస్తున్న చిన్నారులు

మధుర ఫలం.. కవర్లతో భద్రం

న్యూస్‌టుడే– రాజాం: జిల్లాలో మామిడి తోటలు విస్తారంగా సాగవుతున్నాయి. దిగుబడి సమయంలో నాణ్యతను బట్టే కాయల రేటు ఉంటుంది. పిందె దశలో తగిన జాగ్రత్తలు తీసుకోకపోతే రైతుకు తీవ్ర నష్టం జరుగుతుంది. దీన్ని గుర్తించిన ప్రభుత్వం ఉద్యానశాఖ ద్వారా పిందె దశ నుంచే వాటికి కవర్లు తొడిగి సంరక్షించేలా చర్యలు చేపట్టింది. కవర, కూలీల ఖర్చులో 50 శాతం రాయితీ ఇస్తూ రైతులను ఆదుకుంటోంది. అవగాహన లేకపోవడంతో రైతులు సద్వినియోగం చేసుకోలేకపోతున్నారు. జిల్లాలో 82,500 ఎకరాల్లో మామిడి తోటలు ఉన్నాయి.

సంతకవిటి మండలం తాళ్లలో మామిడి పిందెలకు కవర్లు (పాతచిత్రం)

గరిష్ఠంగా అయిదెకరాలు.. రెండు నుంచి అయిదెకరాల లోపు ఉన్న రైతులకు ఉద్యానశాఖ 50 శాతం రాయితీ సమకూర్చుతోంది. కాయలను ఆశించే పురుగులు, తెగుళ్ల నుంచి బయట పడేందుకు ఇది రక్షణ కవచంలా నిలుస్తుంది. కాయ నాణ్యత పెరిగితే మార్కెట్లో సాధారణ కాయలకంటే అధిక ధర పలుకుతుంది. ఒక్కో రైతు గరిష్ఠంగా రెండు హెక్టార్లు(అయిదు ఎకరాలు) వరకు రాయితీ పొందొచ్చు. రెండు హెక్టార్లకు రూ.50 వేల వరకు ఉద్యానశాఖ రాయితీ అందిస్తోందని రాజాం ఉద్యానశాఖ అధికారిణి ఉమామహేశ్వరి తెలిపారు.

ఒక హెక్టారుకు రాయితీ ఇలా..

★ ఒక హెక్టారుకు 15 వేల కవర్లు అవసరం ★ ఒక్కో కవరు ధర రూ.2.50 ★ మొత్తం విలువ: రూ.37,500 ★ ఇందులో 50శాతం రాయితీ: 18,750 ★ కవర్లు తొడిగేందుకు కూలీల ఖర్చులు: రూ.12,500 ★ ఇందులో 50 శాతం రాయితీ: రూ.6,250 ★ ఒక హెక్టారుకు అందించే మొత్తం రాయితీ: రూ.25 వేలు

ఉద్యానశాఖ అధికారులను సంప్రదించాలి..

★ ఫ్రూట్ కవర్లు ఏర్పాటు చేస్తే వాతావరణ పరిస్థితులు, తెగుళ్లను తట్టుకుని ఆకర్షణీయ రంగుతో దిగుబడి వస్తుంది. ★ నిమ్మకాయ పరిమాణంలో ఉన్నప్పుడు తొడిగితే నాణ్యమైన దిగుబడి సాధించొచ్చు. ★ రైతు సేవా కేంద్రాల్లోని ఉద్యానశాఖ అధికారులను సంప్రదించాలి. వారికి అర్జీ ఇస్తే అర్హతను బట్టి కవర్లు ఏర్పాటు చేస్తారు. ★ రైతులు కూడా మార్కెట్లో కొనుగోలు చేసుకోవచ్చు. ★ దరఖాస్తు 1బీ, ఆధార్, బ్యాంకు ఖాతా సమర్పించాలి.

ఒక్కో రైతుకు రూ.50వేలు రాయితీ

పరిమితికి మించితే చర్యలు

అయ్యన్నపేట, న్యూస్‌టుడే: పరిమితికి మించి అధిక లోడుతో ప్రయాణిస్తున్న వాహనదారులపై కఠిన చర్యలు తప్పవని ఎస్పీ దామోదర్ మంగళవారం ఓ ప్రకటనలో హెచ్చరించారు. ఎండుగడ్డి, కలప, ఇసుక, గ్రావెల్, మట్టి, సిమెంట్.. తదితర లోడులతో వెళ్లేవారు తప్పనిసరిగా నిబంధనలు పాటించాలన్నారు. ఒకవేళ యజమాని ఒత్తిడి చేస్తే సమీప పోలీసు స్టేషన్ లేదా ట్రాఫిక్ అధికారులకు సమాచారం అందించాలని, లేని పక్షంలో లైసెన్సు రద్దు చేస్తామన్నారు. ఓవర్ లోడింగ్‌ను నియంత్రించేందుకు ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహిస్తామన్నారు. ఈ విషయంలో పోలీసులకు సహకరించాలని కోరారు.

'సాగర సంగ్రామం' విజయవంతానికి పిలుపు

గోడప్రతులను ఆవిష్కరిస్తున్న ఏపీఎన్‌జీజీవో నాయకులు

విజయనగరం విద్యావిభాగం, న్యూస్‌టుడే: ఏపీసీపీఎస్‌ఈఏ(ఆంధ్రప్రదేశ్ కాంట్రిబ్యూటరీ పింఛను పథకం ఉద్యోగుల సంఘం) ఆధ్వర్యంలో ఈనెల 22న విశాఖపట్నంలో జరిగే 'సాగర సంగ్రామం' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఏపీఎన్‌జీజీవో అధ్యక్ష, కార్యదర్శులు సురేష్, శ్రీధర్ పిలుపునిచ్చారు. విజయనగరంలోని ఎన్‌జీవో భవనంలో మంగళవారం సంబంధిత గోడప్రతులను ఆవిష్కరించారు. పెండింగ్‌లో ఉన్న డీఏ బకాయిలు విడుదల చేయాలని, అందరికీ ఆమోదయోగ్యమైన పింఛను విధానాన్ని అమలు చేయాలని డిమాండు చేశారు. జిల్లా అధ్యక్షుడు వి. రమణ, రాష్ట్ర కార్యదర్శి కె.ధనుంజయ్ తదితరులు పాల్గొన్నారు.

లింగసమానత్వం పాటించాలి

మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో జీవనరాణి

విజయనగరం అయ్యన్నపేట, న్యూస్‌టుడే: లింగవివక్ష చూపకుండా సమానత్వం పాటిస్తూ, మహిళలపై జరుగుతున్న హింసను అరికట్టాలని డీఎంహెచ్‌వో జీవనరాణి పిలుపునిచ్చారు. మంగళవారం తన కార్యాలయంలో జరిగిన సమావేశంలో మాట్లాడారు. అల్ట్రాసౌండ్ స్కానింగ్ సెంటర్లు, ఎంఆర్‌ఐ, ఇతర స్కాన్ సెంటర్లు తప్పనిసరిగా నిబంధనలు పాటించాలని ఆదేశించారు. పనిచేసే వైద్యులు అర్హత పత్రాలను అందించాలని, లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. పీసీపీఎన్‌డీటీ నోడల్ అధికారి అచ్యుతకుమారి, డిప్యూటీ డీఎంహెచ్‌వో సూర్యనారాయణ, ఎన్జీవో కోశాధికారి తదితరులు పాల్గొన్నారు.

'రెవెన్యూ అధికారి వైఖరిపై ధర్నా చేపడతాం'

జామి, న్యూస్‌టుడే: జామి తహసీల్దారు వి. కృష్ణంరాజు వైఖరిపై విజయనగరంలోని కలెక్టరు కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తామని ఆంధ్రప్రదేశ్ గోసంరక్షణ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు రామకృష్ణ తెలిపారు. ఈ మేరకు మంగళవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ప్రతి మూడు నెలలకోసారి జంతు సంక్షేమ కమిటీ సమావేశాలు నిర్వహించాల్సి ఉండగా సంవత్సరం నుంచి జరగడం లేదన్నారు. పశువులు అక్రమంగా తరలిస్తున్నా చర్యలు తీసుకోవడం లేదని, వీటన్నింటికీ నిరసనగా ఆందోళన చేపడతామన్నారు. సత్యనారాయణ, బి.సంధ్యారాణి, పైడితల్లి తదితరులు పాల్గొన్నారు.

పూర్వపు డీఎంపై చర్యలకు విజిలెన్స్ సిఫార్సు

ఈనాడు, విజయనగరం

పౌర సరఫరాల సంస్థ పూర్వపు జిల్లా మేనేజరు మీనాకుమారి హయాంలో జరిగిన అవినీతి ఆరోపణలపై విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు విచారణ పూర్తి చేశారు. వైకాపా ప్రభుత్వ హయాంలో అసిస్టెంటు మేనేజరు (సాంకేతిక)గా పని చేస్తూ అప్పటి ప్రభుత్వ పెద్దల ఆశీస్సులతో మేనేజరుగా మూడేళ్ల పాటు కొనసాగిన ఆమెపై వెల్లువెత్తిన ఆరోపణలపై జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి, రాష్ట్ర హోం మంత్రి అనిత గత జూన్‌లో జరిగిన డీఆర్సీలో విచారణకు ఆదేశించారు. ఈక్రమంలో మూడు, నాలుగు అంశాల్లో అక్రమాలు వెలుగుచూసినట్లు తెలిసింది.

★ ధాన్యం సేకరణకు రైతులు వినియోగించిన గోనె సంచులకు సంబంధించి నగదు వారి పేరిట కాకుండా తమకు అనుకూలమైన మిల్లర్లకు చెల్లించారు. ఆన్‌లైన్‌లో రైతుల ఖాతాల్లో నగదు జమ చేయకుండా నిబంధనల గీత దాటారు. ఈ సంస్థకు సేవలందించే సాఫ్ట్‌వేర్ సంస్థ మేనేజరుతో కుమ్మక్కై సుమారు రూ.కోటికి పైగా ఖాతాలకు మళ్లించారని, వారి నుంచి తమ సంబంధీకుల ఖాతాలకు జమ చేయించినట్లు ఆరోపణలు ఎదుర్కొన్నారు. ఈ చెల్లింపులపై బ్యాంకు లావాదేవీలు పరిశీలించగా సుమారు రూ. 50 లక్షలకు పైగా గోల్‌మాల్ జరిగిందని తేల్చినట్లు తెలిసింది. ★ సంస్థలో డేటా ఎంట్రీ ఆపరేటర్ల పోస్టులకు పొరుగు సేవల ప్రాతిపదికన నియామకానికి ఎంపిక చేసిన తీరులోనూ నిబంధనలు పాటించలేదు. నియామకాల్లో ప్రతిభ జాబితాలో ముందున్న వారికి అన్యాయం జరిగిందని ఆరోపణలు ఎదుర్కొన్నారు. వీటిపై దస్త్రాలను పరిశీలించిన విజిలెన్స్ అధికారులు వాటి నిగ్గు తేల్చారు.

పప్పు.. తప్పు: రేషన్ కందిపప్పు నాశిరకంగా ఉన్నా సరఫరాదారు పంపిన లారీ నుంచి అన్‌లోడ్ చేయించారు. శ్రీకాకుళం జిల్లాలో తిరస్కరించిన 25 మెట్రిక్ టన్నుల పప్పు సరఫరాదారుతో కుమ్మక్కై తీసుకున్నారని ఆరోపణలు ఎదుర్కొన్నారు. ఆరేడు నెలల విచారణ అనంతరం పూర్వపు డీఎం సహా ఆమెకు సహకరించిన అధికారులపై శాఖాపరమైన చర్యలతో పాటు క్రిమినల్ చర్యలు తీసుకోవాలని విజిలెన్స్ అధికారులు తమ నివేదికలో ప్రభుత్వానికి సిఫార్సు చేసినట్లు సమాచారం.

పంటకాలువలో పడి వలస కూలీ మృతి

ఆదినారాయణ (పాత చిత్రం)

చీపురుపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: రెక్కాడితే గానీ డొక్కాడని కుటుంబం.. పొట్ట చేత పట్టుకుని పని కోసం జిల్లాలు దాటాడు. కుమార్తె భవిష్యత్తు బాగుండాలని కలలు కన్నాడు. పని అంతా సక్రమంగా ఉందని, బెంగ పెట్టుకోకుండా జాగ్రత్తగా ఉండండని భార్యతో ఫోన్‌లో మాట్లాడిన మాటలే ఆఖరివి అవుతాయని వారు అనుకోలేదు. ప్రమాదవశాత్తు పంట కాలువలో పడి వ్యక్తి మృతిచెందిన ఘటన పల్నాడు జిల్లా నర్సారావుపేట మండలంలో చోటుచేసుకుంది. బాధిత కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం. . చీపురుపల్లి మండలం జి.ములగాం గ్రామానికి చెందిన కక్కి ఆదినారాయణ(40) తాపీ పని చేస్తుంటారు. 20 రోజుల క్రితం గ్రామానికి చెందిన మరో నలుగురితో కలిసి పల్నాడు జిల్లా నర్సారావుపేట మండలం వెళ్లారు. అక్కడ ఒక వెంచర్‌లో పనికి కుదిరారు. సమీపంలోని హనుమాన్ నగరంలో నివాసం ఉంటున్నారు. శివరాత్రి మరుసటిరోజు సోమవారం పనికి సెలవు ఇచ్చారు. మధ్యాహ్నం సమయంలో తన సహచరుడు శనపతి భోగితో కలిసి రావిపాడు-లింగంగుంట్ల వెళ్లే దారిలో బహిర్భూమికి వెళ్లారు. ఆ సమయంలో ఆదినారాయణ ప్రమాదవశాత్తు కాలువలో పడిపోయాడు. అందులోని బండరాయి తలకు గట్టిగా తగలడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న కుటుంబసభ్యులు, గ్రామ నాయకులు అక్కడికి వెళ్లారు. మంగళవారం మృతదేహంతో బయల్దేరారు. ఈయనకు కుమార్తె అమూల్య, భార్య భాగ్యలక్ష్మి ఉన్నారు. భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు నర్సారావుపేట రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారన్నారు.

ఆర్టీసీ బస్సును ఢీకొన్న వ్యాన్

● అయిదుగురికి గాయాలు

ప్రమాదంలో దెబ్బతిన్న వ్యాన్

బొండపల్లి, న్యూస్‌టుడే: ట్రాక్టర్‌ను ఓవర్‌టేక్ చేసే క్రమంలో ఆర్టీసీ బస్సును వ్యాన్ ఢీకొని అయిదుగురు గాయపడిన ఘటన మండలంలో చోటుచేసుకుంది. ఎస్సై మహేష్ తెలిపిన వివరాల ప్రకారం. . మంగళవారం గొట్లాం జాతీయ రహదారి సమీపంలో ట్రాక్టర్‌ను అధిగమించే క్రమంలో పార్వతీపురం నుంచి విజయనగరం వెళ్తున్న ఆర్టీసీ బస్సును విజయనగరం నుంచి గజపతినగరం వస్తున్న వ్యాన్ ఢీకొంది. ఈ ప్రమాదంలో వ్యాన్ డ్రైవర్‌తో పాటు అందులోని నలుగురు ప్రయాణికులు గాయపడ్డారు. వారిలో పురంనేని రమేష్(30) తల, కాళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను విజయనగరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఘటనపై కేసు నమోదు చేశామని, గాయపడిన మిగతావారి వివరాలు తెలియాల్సి ఉందని ఎస్సై చెప్పారు.

చరవాణుల దొంగ అరెస్టు

విజయనగరం అయ్యన్నపేట, న్యూస్‌టుడే: విజయనగరం రైల్వేస్టేషన్‌లో చరవాణుల దొంగను జీఆర్‌పీ పోలీసులు అరెస్టు చేశారు. ఎస్సై బాలాజీరావు వివరాల ప్రకారం.. బొబ్బిలి మండలం పారాది గ్రామానికి చెందిన పి.శ్రీను కొన్ని రోజులుగా రైలు ప్రయాణికుల నుంచి చరవాణులు ఎత్తుకెళ్తున్నాడు. బాధితుల ఫిర్యాదు మేరకు జీఆర్‌పీ, ఆర్పీఎఫ్ సిబ్బంది నిఘా పెట్టి మంగళవారం అదుపులోకి తీసుకున్నారు. అతడి నుంచి రూ.30 వేలు విలువైన మొబైల్‌ను స్వాధీనం చేసుకున్నారు. రిమాండుకు తరలించామని ఎస్సై వెల్లడించారు.

EENADU Classifieds

REAL ESTATE

PLOT FOR SALE

విజయనగరం సిటీ లిమిట్స్ భోగాపురం రోడ్ ఆనుకొని లోన్ సదుపాయంతో ఉడా ప్లాట్స్ కలవు. సంప్రదించండి: 7799334841

REPAIRS

TV REPAIR

భాస్కర్ ఎలక్ట్రానిక్ 32" LEDTV రూ.8,999/- 2సం||లు వారంటీతో S.కోట నుండి 30కి||మీ||లోపు LEDTV ఇంటికి వచ్చి బాగు చేయబడును. C:8500188608.

ప్రకటన చిన్నదైనా స్పందన అతివేగం ఈనాడు క్లాసిఫైడ్స్ 5 లైన్ల ప్రకటన కేవలం 315 /- (GST 5% అదనం) మాత్రమే సంప్రదించండి: 8008597609

TO LET

COMMERCIAL

VZM Town Siddarthanagar GST Office Opposite, Ground floor 2100 Sft suitable Banks, Office near RTC Complex road ✆ 9701129889, 9100994599.

JOBS

Wanted Teachers for Reputed Schools in A.P & Telangana, Contact: Sneha Placements Service. Ph: 94402 46409.

విజయవాడ ప్లాస్టిక్ పరిశ్రమ నందు పనిచేయుటకు హెల్పర్స్ కావలెను. అర్హత: 10th, ఇంటర్, ITI, డిప్లొమా. Email: infoampp2016@gmail.com ✆ 62810 45178. అడ్రస్: అమరావతి పాలీప్యాక్, D.No: 25-38, 4వ క్రాస్ రోడ్, కబేలా, VJA-12

త్రినేత్ర హోంకేర్‌లో వృద్ధులను/ పేషెంట్స్‌ను /పిల్లలను చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఫ్రీ వసతి, భోజనం. జీ: 18K. ✆ 8520980099, 8520874499

హరేకృష్ణ హోంకేర్‌లో వృద్ధులను/ పేషంట్స్‌ని / పిల్లలను చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఫ్రీవసతి, భోజనం జీ:18-20K ✆ 96404 68899, 96402 58899

Tea Shop లో పనిచేయుటకు Boy కావలెను. వసతి భోజనం మంచి జీతం కలదు. ద్వారకానగర్ విశాఖపట్నం Ct: 8500711637.

FACULTY/ TEACHERS

గాజువాక విశాఖడిఫెన్స్ అకాడమీలో హాస్టల్లో ఉండి పనిచేయుటకు Physical Education Teacher కావలెను. జీ:10K+ ఫుడ్& అకామిడేషన్. 9848577745, 9666694545.

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

నాలుగు ఎకరాల్లో ఆక్రమణ గుర్తింపు

జలాశయ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఎస్ఈ అప్పలనాయుడు, ఇతర అధికారులు, రైతు సంఘు నాయకులు

మెంటాడ, న్యూస్‌టుడే: గుర్లగెడ్డ మినీ జలాశయం ఎడమ ప్రధాన కాలువ పరిధిలో సర్వే నంబరు 11లో నాలుగు ఎకరాలు ఆక్రమణకు గురైనట్లు ప్రాథమికంగా గుర్తించామని నీటి పారుదల శాఖ అధికారులు తెలిపారు. మంగళవారం జలాశయ ప్రాంతాన్ని ఆ శాఖ ఎస్ఈ పి.అప్పలనాయుడు, ఈఈ ఎం.వి.రమణలతోపాటు పలువురు ఇంజినీరింగ్ అధికారుల బృందం పరిశీలించింది. ఈ సందర్భంగా గతంలో ఎడమ, కుడి ప్రధాన కాలువలో చేపట్టిన పనులు, వాటి ప్రస్తుత స్థితిగతులు, మట్టికట్టలను చూశారు. అనంతరం విలేకర్లతో ఎస్ఈ మాట్లాడుతూ.. గతేడాది సెప్టెంబరులో రూ. 17 కోట్ల అంచనా వ్యయంతో అసంపూర్తి పనులకు, డిజైన్ల మార్పు ఎక్కడ చేయాల్సి ఉందోనన్న వివరాలతో ప్రభుత్వానికి నివేదికలు పంపనున్నట్లు తెలిపారు. ఆరోపణలపై ఆ శాఖ అధికారులు మాట్లాడుతూ.. ఎడమ ప్రధాన కాలువ మొత్తం 25 ఎకరాలు కాగా.. అందులో 4 ఎకరాలు ఆక్రమణకు గురైనట్లు సర్వేలో తేలిందన్నారు. సర్వే పూర్తయిన తర్వాత ఆక్రమణలు ఉన్నాయని నిర్ధారణ అయితే చట్టరీత్యా తగిన చర్యలు తీసుకుంటామన్నారు. ఇరిగేషన్ డీఈఈలు నవీన్, రామునాయుడు, ఏఈ రాకేష్‌కుమార్, రైతు సంఘాల నాయకులు ఆర్.అప్పలనాయుడు, పి.అప్పలనాయుడు, వ్య.కా.సంఘ నాయకులు ఆర్.రాములు తదితరులున్నారు.

అంగన్‌వాడీలకు బడ్జెట్‌లో కేటాయింపులు పెంచాలి

ఇన్‌ఛార్జి పీడీ సుజాతకు వినతిపత్రం ఇస్తున్న కార్యకర్తలు

విజయనగరం అయ్యన్నపేట, న్యూస్‌టుడే: అంగన్‌వాడీ కార్యకర్తలను ఆదుకునేందుకు బడ్జెట్‌లో కేటాయింపులు పెంచాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి టీవీ.రమణ డిమాండు చేశారు. మంగళవారం ఐసీడీఎస్ ఇన్‌ఛార్జి పీడీ ఎల్.సుజాత, ఇన్‌ఛార్జి సీడీపీవో ఎం.సత్యవతికి వినతి పత్రాలు అందజేశారు. 2019 నుంచి వేతనాలు పెరగలేదని, గతంలో జరిగిన ఒప్పందాలను అమలు చేయాలని కోరారు. అర్హతగల మినీ వర్కర్లకు ఉద్యోగోన్నతులు కల్పించాలన్నారు. అన్నిరకాల ప్రభుత్వ పథకాలు అందేలా చూడాలన్నారు. ఈనెల 23 నుంచి 27 వరకు రిలే నిరాహార దీక్షలు చేపడుతున్నట్లు ప్రకటించారు. నాయకులు జగన్‌మోహన్‌రావు, సునీత, వి.లలితకుమారి, డి.ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.

రామతీర్థం హుండీ ఆదాయం రూ.47.62 లక్షలు

కానుకలు లెక్కిస్తున్న ఆలయ అధికారులు, సిబ్బంది

నెల్లిమర్ల, న్యూస్‌టుడే: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థం దేవస్థానంలో మహా శివరాత్రి జాతరతో పాటు గడిచిన 27 రోజులకు సంబంధించిన హుండీ ఆదాయాన్ని మంగళవారం ఆలయ పర్యవేక్షణాధికారులు డి.శ్రీనివాసరావు, జి.శ్యామ్‌ప్రసాద్ సమక్షంలో లెక్కించారు. రూ.47,62,196 వచ్చిందని ఈవో వై.శ్రీనివాసరావు తెలిపారు. బంగారం 30.55 గ్రాములు, వెండి 5.300 కిలోలు వచ్చినట్లు వెల్లడించారు. భక్తుల దర్శనం టికెట్లు, స్వామివారి ప్రసాదాల ద్వారా రూ.21,53,480 సమకూరిందన్నారు. బొబ్బిలి వేణుగోపాలస్వామి దేవస్థానం ఈవో సీహెచ్‌టీవీఆర్.లక్ష్మణరావు, అర్చకస్వాములు, పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించండి
Cell: 80085 97609
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 80081 11237

డీమ్డ్ టు బి వర్సిటీగా జీఎంఆర్ కళాశాల

రాజాం, న్యూస్‌టుడే: రాజాంలోని జీఎంఆర్ ఇంజినీరింగ్ కళాశాల డీమ్డ్ టు బీ విశ్వవిద్యాలయంగా గుర్తింపు పొందిందని జీఎంఆర్ వరలక్ష్మి ఫౌండేషన్ సీఈవో అశ్వినీసక్సేనా తెలిపారు. కేంద్ర విద్యాశాఖ యూజీసీ చట్టం కింద నోటిఫై చేసినట్లు వెల్లడించారు. ఇది మరిన్ని విభిన్న కోర్సులు, పరిశోధనలకు దోహదపడుతుందని సంతోషం వ్యక్తం చేశారు.

చికెన్ ధరలు

రకం	(బ్యాగ్)లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
బ్రాయిలర్	130	230	240

పశువైద్య విద్యార్థుల ప్రతిభ

గరివిడి, న్యూస్‌టుడే: గరివిడి పశువైద్య కళాశాల విద్యార్థులు వెటర్నరీ అసోసియేషన్ ఆఫ్ ఇండియా(న్యూదిల్లీ) నిర్వహించిన జాతీయ స్థాయి లఘుచిత్రాల నిర్మాణంలో సత్తా చాటారు. వన్ హెల్త్ ప్రోగ్రాంలో భాగంగా పోటీలు అంతర్జాలంలో జరిగాయి. విద్యార్థులు వి.చరిత్రశ్రీ, బి.సన్ను, ఎన్ని అనన్య, జ్యోత్స్న, ప్రవల్లికల బృందం జంతువుల నుంచి మనుషులకు సంక్రమించే వ్యాధులు, నియంత్రణలో పశువైద్యుల పాత్రను వివరిస్తూ లఘు చిత్రం తీశారు. దీని ఫలితాలు మంగళవారం విడుదల చేశారు. దీనికి జాతీయస్థాయిలో ద్వితీయ బహుమతి లభించింది. విద్యార్థులను కళాశాల అసోసియేట్ డీన్ మక్కెన శ్రీను, విద్యార్థి విభాగం అధికారి బీఆర్ అంబేడ్కర్ తదితరులు మంగళవారం అభినందించారు.

విద్యార్థులను అభినందిస్తున్న కళాశాల అసోసియేట్ డీన్ శ్రీను, అధ్యాపకులు

షెడ్డుంది కానీ.. ఉపయోగం లేదు

పాచిపెంట మండలంలోని గిరిజనుల అటవీ ఉత్పత్తులను నిల్వ ఉంచుకునేందుకు, అమ్ముకొనేందుకు వీలుగా నిర్మించిన షెడ్డు శిథిలావస్థకు చేరుకుంది. దీంతో వినియోగానికి దూరమైంది. చుట్టూ పనికిరాని మొక్కలు పెరిగి అధ్వానంగా తయారైంది. దీంతో సంతను పక్కన ఉన్న స్థలంలో నిర్వహిస్తున్నారు. అక్కడికి వచ్చే గిరిజనులు నీడ లేక ఇబ్బంది పడుతున్నారు. సమస్యను ఏఎంసీ ఛైర్మన్ సూర్యనారాయణ వద్ద ప్రస్తావించగా.. రూ.60 లక్షలతో ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపామన్నారు.
– న్యూస్‌టుడే, పాచిపెంట

సార్.. ఇంత ఘోరమా..?

పాలకొండ పట్టణంలోని నగరి విశ్వేశ్వరస్వామి ఆలయం ఎదురుగా మూడు రోడ్ల కూడలి వద్ద వ్యర్థాలను పారబోస్తుండటంతో అపరిశుభ్రత నెలకొంది. కోమటిపేట, బుడ్డకొండవారి వీధుల మధ్య వ్యర్థాలు గత మూడు రోజులుగా ఇలా.. రోడ్డుపైనే చెల్లాచెదురుగా పడి ఉన్నాయి. ఆ మార్గంలో రాకపోకలు సాగించడానికి ప్రజలు అవస్థలు పడుతున్నారు. నగర పంచాయతీ కమిషనర్ రత్నరాజ్ వద్ద సమస్యను ప్రస్తావించగా.. తక్షణం పారిశుద్ధ్య సిబ్బందితో చెత్తను శుభ్రం చేయిస్తామన్నారు.
– న్యూస్‌టుడే, పాలకొండ గ్రామీణం

వాహనాలన్నీ రోడ్డుపైనే..

పాలకొండ ఆర్టీసీ కాంప్లెక్సు వద్ద నిత్యం వందలాది ద్విచక్ర వాహనాలను నిలిపివేస్తుండటంతో రాకపోకలకు ఇబ్బందిగా మారింది. ఇక్కడ ప్రత్యేక పార్కింగ్ స్థలం కేటాయించకపోవడంతో వాహనదారులు రోడ్డుపైనే వాహనాలను నిలిపివేస్తున్నారు. దీంతో రోడ్డు ఇరుకుగా మారుతోంది. మరోవైపు ఇదే అదనుగా కొందరు దుండగులు వాహనాలు, పెట్రోలును చోరీ చేస్తున్నారు. ఇటీవల ఇటువంటి ఘటనలు ఎక్కువయ్యాయి. వాహనాలు నిలిపేందుకు ప్రత్యేక స్థలం కేటాయించాలని, ఉన్నతాధికారులకు నివేదించామని ఆర్టీసీ డిపో మేనేజర్ మూర్తి అన్నారు. – న్యూస్‌టుడే, పాలకొండ

బాగు చేస్తేనే.. సాగునీరు

రావుపల్లి గ్రామ శివారు చెరువు నుంచి కొత్తపల్లి పంట పొలాలకు సాగునీరు అందాల్సి ఉంది. ఇక్కడ ఏర్పాటు చేసిన మదుము శిథిలమైంది. దీంతో 200 ఎకరాలకు సాగునీరు సక్రమంగా అందడం లేదని రైతులు చెబుతున్నారు. ఇరిగేషన్ అధికారులు పట్టించుకోవాలని కోరుతున్నారు. ఏఈ రమణ వద్ద సమస్యను ప్రస్తావించగా.. నిర్వహణ పనుల నిధులు వస్తే మదుము బాగు చేస్తామన్నారు.
– న్యూస్‌టుడే, గరుగుబిల్లి

అసంపూర్తిగానే సచివాలయ భవనం

గుచ్చిమి గ్రామ పంచాయతీ కార్యాలయ భవనంపైన అదనపు గదుల నిర్మాణానికి మూడేళ్ల కిందట పనులు ప్రారంభించారు. రెండేళ్లు గడుస్తున్నా పనుల్లో ప్రగతి లేకుండా పోయింది. ప్రస్తుతం కింద భవనంలోనే సచివాలయ సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. పక్కన ఉన్న ఖాళీ స్థలంలో ప్రత్యేక సమావేశాలు, కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నారు. దీంతో నిర్వహణ భారం సిబ్బందిపైనే పడుతోంది. భవనం పూర్తికి చర్యలు తీసుకుంటామని ఏఈ చంద్రమౌళి తెలిపారు. – న్యూస్‌టుడే, సీతానగరం

మీ సమస్యా.. మీకు తోడుగా (10 AM TO 1 PM)

పార్వతీపురం	8008566244
పాలకొండ	8008574299
సాలూరు	8008786820
కురుపాం	9849044696

?: పాలకొండ గారమ్మకాలనీ వంతెన వద్ద అపరిశుభ్రత వల్ల రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నాం. - **స్థానికుడు**
● ఆక్రమణలు తొలగించేలా చర్యలు తీసుకుంటాం. – **రత్నరాజ్, నగర పంచాయతీ కమిషనర్** – న్యూస్‌టుడే, పాలకొండ గ్రామీణం

?: మొండెంఖల్లు గ్రామంలో ప్రధాన రక్షిత తాగునీటి పథకం చుట్టూ పనికి రాని మొక్కలు పెరిగాయి. అలాగే ట్యాంకులో క్లోరినేషన్ చేయకపోవడంతో తాగునీరు కలుషితం అవుతోంది. - **రామకృష్ణ, స్థానికుడు**
● పనికి రాని మొక్కలు తొలగిస్తాం. క్లోరినేషన్ చేయిస్తాం. - **వేణుగోపాల్, జేఈ** – న్యూస్‌టుడే, కురుపాం గ్రామీణం

?: ఉద్దవోలు ఆరోగ్య ఉపకేంద్రం వద్ద ఉన్న కుళాయి విరిగిపోయింది. - **స్థానికులు**
● సర్పంచి దృష్టికి తీసుకెళ్లి, సమస్యను పరిష్కరిస్తాం. - **మహాలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి** – న్యూస్‌టుడే, గరుగుబిల్లి గ్రామీణం

?: సంగంవలస నుంచి అడ్డూరివలసకు వెళ్లే మార్గంలో ఖానా మలుపు వద్ద రోడ్డు పాడైంది. ప్రమాదాలు జరుగుతున్నాయి. - **రామయ్య**
● చర్యలు తీసుకుంటాం. - **సాయికుమార్, ఏఈ, పీఆర్ ప్రాజెక్టు** – న్యూస్‌టుడే, పార్వతీపురం గ్రామీణం

?: సీతానగరం ప్రధాన వీధి నుంచి సాయిరాం కాలనీకి రహదారి లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నాం. - **యోగేశ్వరరావు**
● నిధులు మంజూరయ్యాయి. పనులు చేపడతాం. - **సురేష్, ఈవో** – న్యూస్‌టుడే, సీతానగరం

పూడిక తొలగింపు

స్పందనకు వందనం

పాలకొండ గ్రామీణం, న్యూస్‌టుడే: పాలకొండ నీలమాంబ దేవాలయం వద్ద రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగు సమస్య ఎట్టకేలకు తీరింది. ఇటీవల దీనిపై 'ఈనాడు'లో వార్త ప్రచురితమవడంతో నగర పంచాయతీ సిబ్బంది కాలువలోని పూడిక తొలగించారు.

అక్రమాలకు రోడ్డేశారు!

సాలూరు, న్యూస్‌టుడే: నిబంధనలకు విరుద్ధంగా చెరువులు, నదీ తీర ప్రాంతాలను ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకోవాలి. జలవనరులను రక్షించి భూగర్భ జలాలను పెంచి, భావితరాలకు నీటి కష్టాలు లేకుండా చేయాలి. ఇవేవీ తమకు సంబంధం లేదన్నట్లు వ్యవహరిస్తున్నారు సంబంధిత అధికారులు. పట్టణంలోని చెరువుల ఆక్రమణలే వీటికి నిదర్శనం.

ఇదీ పరిస్థితి..

పట్టణంలోని పేరసాగరం చెరువు 40 ఎకరాల విస్తీర్ణంలో ఉండేది. దీనిలో ఇప్పటివరకు సుమారు పది ఎకరాల వరకు ఆక్రమణకు గురైంది. డబ్బివీధి, దండిగాం రోడ్డు తదితర ప్రాంతాల్లో చెరువు గట్లను ఆక్రమించి అక్రమ నిర్మాణాలు చేపట్టారు. వీటికి పురపాలిక నిధులతో సీసీ రోడ్డువేసి అధికారులే దారి చూపారు. ఎరుకలి వీధిలో రాజావారి చెరువు ఆక్రమణలతో పూర్తిగా ఆనవాళ్లు కోల్పోయింది. అక్కడ చెత్త వేసి డంపింగ్‌యార్డుగా మార్చేశారు. మురుగునీరు తప్ప వర్షపునీరు దానిలోకి వెళ్లే దారిలేకుండా చేశారు.

అక్రమ నిర్మాణాలకు పుర నిధులతో వేసిన సీసీ రోడ్డు

కోట వీధి రాణి చెరువులో రెవెన్యూ అధికారులు పలుమార్లు 'ఇది ప్రభుత్వ స్థలం' అని బోర్డులు పెట్టినా ఆక్రమణదారులు వాటిని తొలగించి మరీ నిర్మాణాలు చేపట్టారు. 26వ జాతీయ రహదారి పక్కన శ్రీనివాస కాలనీ సమీపంలో రెండు మూడు చెరువులున్నాయి. వాటిలో ఒకటి పూర్తిగా ఆక్రమణకు గురైంది. మిగిలిన రెండు కూడా ప్రస్తుతం ఆక్రమణలకు గురవుతున్నాయి. వర్షపునీరు చెరువులకు మళ్లించేందుకు నిర్మించిన కల్వర్టులను పూర్తిగా కప్పేశారు.

ఏకంగా అమ్మకానికి..

ఆక్రమణదారులను ఖాళీ చేయించడానికి తెదేపా ప్రభుత్వం 2018లో వారికి టిడ్కో గృహాలు మంజూరు చేసింది. అవి ఇప్పటికీ అప్పగించకపోవడంతో వారంతా ఆక్రమిత స్థలాల్లోనే ఉన్నారు. అంతేకాకుండా కొత్తగా స్థలాలు ఆక్రమించి వాటికి రక్షణ కంచెలు వేసి విక్రయానికి సిద్ధం చేస్తున్నారు. వీటికి స్థానిక నేతలు కూడా వత్తాసు పలుకుతుండడం మరో విశేషం.

వారికి నోటీసులిచ్చాం

పెద్ద కొండల చెరువు స్థలాలను ఆక్రమించి ఇళ్లు నిర్మించుకున్న 30 మందికి నోటీసులిచ్చాం. టిడ్కో గృహాలు మంజూరైనవారికి ఇళ్లు అప్పగిస్తే ఆక్రమిత స్థలాలను ఖాళీ చేయిస్తాం.
– రత్నకుమార్, పుర కమిషనర్

గంజాయి రవాణాకు అడ్డుకట్ట వేయాలి

భామిని, న్యూస్‌టుడే: ఒడిశా సరిహద్దులోని భామిని మండలం మీదుగా గంజాయి అక్రమ రవాణా జోరుగా సాగుతోందని, దీన్ని అరికట్టేలా చర్యలు తీసుకోవాలని పాలకొండ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ అసెంబ్లీ సమావేశంలో మంగళవారం కోరారు. ఒడిశా నుంచి పెద్ద ఎత్తున అక్రమంగా గంజాయి వస్తోందన్నారు. దీనిపై హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత స్పందిస్తూ.. ఒడిశా నుంచి ఉత్తరాంధ్రలోని 5 జిల్లాల మీదుగా గంజాయి అక్రమ రవాణా సాగిస్తున్నారని తెలిసిందన్నారు. దానికి అడ్డుకట్ట వేసేందుకు అంతర్రాష్ట్ర సరిహద్దులోని చెక్‌పోస్టులు, హైవేల సమీపంలో నూతన సాంకేతికత కలిగిన సీసీ కెమెరాలు, డ్రోన్ల వినియోగం పెంచామని చెప్పారు. ఈ అయిదు జిల్లాల్లో ఇప్పటి వరకు 1,423 కేసులు నమోదైనట్లు తెలిపారు. 762 వాహనాలు సీజ్ చేసి, 3,515 మందిని అరెస్టు చేశామని వివరించారు. మన్యం జిల్లాలో 493 ఈగల్ క్లబ్‌లు ఏర్పాటు చేశామన్నారు. అందులో పాలకొండ నియోజకవర్గంలో 131 ఈగల్ క్లబ్‌లను ప్రతి పాఠశాలలో ఏర్పాటు చేసి అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వివరించారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ

ప్రత్యేక మండలం ఏర్పాటుకు వినతి

జియ్యమ్మవలస, న్యూస్‌టుడే: నీలకంఠాపురం గ్రామాన్ని ప్రత్యేక గిరిజన మండలం చేయాలని కోరుతూ మంత్రి జి.సంధ్యారాణికి నాయకులు విన్నవించారు. ఈమేరకు మాజీ ఎమ్మెల్యే నిమ్మక జయరాజు, గిరిజన జేఏసీ నాయకుడు బి.రామారావు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఎల్.తాతబాబు నాయుడు అమరావతి సచివాలయంలో ఆమెను కలిసి మాట్లాడారు.

ఆరోగ్యవంతమైన సమాజమే లక్ష్యం

పార్వతీపురం గ్రామీణం, న్యూస్‌టుడే: ఆరోగ్యవంతమైన సమాజం కోసం అన్నివర్గాలు కృషి చేయాలని జేసీ సి.యశ్వంత్‌కుమార్ రెడ్డి సూచించారు. మంగళవారం పెదబొండపల్లి ఉన్నత పాఠశాలలో నులిపురుగుల నిర్మూలన మాత్రలు వేసే కార్యక్రమాన్ని ప్రారంభించారు. పిల్లల శారీరక, మానసిక ఎదుగుదలకు నులిపురుగులు ప్రధాన అడ్డంకి అని వివరించారు. అనంతరం పీహెచ్‌సీని పరిశీలించి వైద్యులతో సమీక్షించారు. డీఎంహెచ్‌వో భాస్కరరావు, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి విజయమోహన్, జిల్లా పథక అధికారి జగన్మోహనరావు, ఎంపీడీవో సత్యం, ఎంఈవో విమల కుమారి తదితరులు పాల్గొన్నారు. డోకిశీలలో గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాల, పీహెచ్‌సీలను జేసీ తనిఖీ చేశారు. ✦ **జియ్యమ్మవలస:** ఆర్‌ఆర్‌బీపురం పీహెచ్‌సీ పరిధి టీకే జమ్ము, పీటీ మండ పాఠశాలల్లోని విద్యార్థులకు డిప్యూటీ డీఎంహెచ్‌వో కె.పద్మావతి నులిపురుగుల నివారణ మాత్రలు అందించారు. ✦ **పాలకొండ:** పాలకొండ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో డిప్యూటీ డీఎంహెచ్‌వో కె.విజయపార్వతి విద్యార్థులకు మాత్రలు వేయించారు.

విద్యార్థినికి మాత్ర వేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న జేసీ

శిరస్త్రాణం తప్పనిసరి

పార్వతీపురం గ్రామీణం, న్యూస్‌టుడే: ప్రమాదాల నివారణలో భాగంగా శిరస్త్రాణం విధిగా ధరించాలని వ్యవసాయ కార్మిక సంఘ జిల్లా ఉపాధ్యక్షుడు పి.రాము అన్నారు. మంగళవారం గంగాపురం పంచాయతీ తాన్నవలస యువతతో కలిసి గిరిజన గ్రామాల్లో ద్విచక్ర వాహనాలపై ర్యాలీ నిర్వహించారు.

ద్విచక్ర వాహనాలతో ర్యాలీ

మొక్కజొన్న పంట ధ్వంసం

కొమరాడ, న్యూస్‌టుడే: అడవి ఏనుగులు గంగరేగువలసకు చెందిన రైతులు కోడి కామినాయుడు, సాంబయ్య, రమేష్ సాగు చేస్తున్న మొక్కజొన్న పంటను ధ్వంసం చేశాయి. చేతికి అందొచ్చిన జొన్నను నష్టపోవడంతో వాపోతున్నారు.

బాలుడికి రూ.లక్ష వితరణ

సీతంపేట, న్యూస్‌టుడే: పులిపుట్టి భారతి ఇంటర్నేషనల్ పాఠశాలలో 5వ తరగతి చదువుతున్న భామిని మండలం సింగిడికి చెందిన రోహిత్ కుమార్ మహాపాత్రో ఇటీవల ప్రమాదానికి గురయ్యాడు. కాలికి శస్త్ర చికిత్స చేయాల్సి ఉంది. పాఠశాల యాజమాన్యం, సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రుల సహకారంతో రూ.లక్ష విరాళాన్ని సేకరించారు. శ్రీకాకుళంలోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాలుడి కన్నవారికి విరాళాన్ని అందజేశారు. ప్రిన్సిపల్ నవీన్, ఎస్.పి.పెంటయ్య తదితరులు ఉన్నారు.

అధ్యాపకుల వితరణ

కొమరాడ: సివిని గ్రామానికి చెందిన బి.అక్షిత కొమరాడ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ పూర్తి చేసింది. తండ్రి చనిపోవడం, పై చదువులకు ఆర్థిక ఇబ్బందులను గుర్తించిన అధ్యాపకులు, విద్యార్థులు రూ.16,500 పోగు చేసి.. అందించారు.

10 బస్సులు.. రూ.2 లక్షల ఆదాయం

కొమరాడ, న్యూస్‌టుడే: మహాశివరాత్రి సందర్భంగా పార్వతీపురం నుంచి గుంప సోమేశ్వరాలయానికి ఆర్టీసీ సర్వీసులు నడిచాయి. పది బస్సులు రెండు రోజులపాటు నడిపామని, 10 వేల మంది ప్రయాణికులు రాకపోకలు సాగించారని డీఎం లక్ష్మణరావు చెప్పారు. రూ.2 లక్షల ఆదాయం వచ్చిందని తెలిపారు.

సీబీఎస్‌ఈ పరీక్షలు ప్రారంభం

గుమ్మలక్ష్మీపురం, న్యూస్‌టుడే: గుమ్మలక్ష్మీపురం ఏకలవ్య పాఠశాలలో సీబీఎస్‌ఈ బోర్డు పరీక్షలు మంగళవారం ప్రారంభమయ్యాయి. ప్రిన్సిపల్ వీరసింగ్ విద్యార్థులకు హాల్ టికెట్లు అందించి.. ఒత్తిడికి గురికాకుండా ప్రశాంతంగా రాయాలని ధైర్యం చెప్పారు. పదో తరగతి-56 మంది, 12వ తరగతి-71 మంది విద్యార్థులు హాజరైనట్లు చెప్పారు. వైస్ ప్రిన్సిపల్ రాజశేఖర్, ఉపాధ్యాయులు ఉన్నారు.

నేడు విద్యుత్తుకు అంతరాయం

సీతానగరం: సీతానగరం విద్యుత్తు ఉప కేంద్రం నిర్వహణ పనుల్లో భాగంగా బుధవారం ఉదయం 7 గంటల నుంచి 2 వరకు సరఫరా నిలిపివేస్తున్నట్లు ఈఈ కె.గోపాలరావు నాయుడు తెలిపారు. అవకాశం ఉన్నంత వరకు ఇతర ప్రాంతాల నుంచి సరఫరా అందించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు.

పని భారం తగ్గించండి

సాలూరు, న్యూస్‌టుడే: 'అదనపు విధులు అప్పగించడంతో ఒత్తిడికి గురై, ఆందోళన చెందుతున్నాం.. ఇప్పటికే పలువురు వీర్వోలు ప్రాణాలు కోల్పోయారు. ఇతర శాఖల పనుల నుంచి ఉపశమనం కల్పించండి' అని డిమాండ్ చేస్తూ మంగళవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట రెవెన్యూ అధికారులు నిరసన చేపట్టారు. జిల్లా వీఆర్వోల సంఘ సహాయ కార్యదర్శి బలరాం, మండలాధ్యక్షుడు రాము, వీఆర్వోలు పాల్గొన్నారు.

కాంట్రాక్టు సర్వీస్ నుంచి తొలగింపు

సీతంపేట, న్యూస్‌టుడే: సీతంపేట ఐటీడీఏ పరిధిలోని కారిగూడ మినీ గురుకులం(బాలికలు)లో సీఆర్టీలుగా పనిచేస్తున్న ఎన్.దులేంత్రిని(హిందీ), ఎన్.శ్రీలక్ష్మి(తెలుగు)లను కాంట్రాక్టు సర్వీస్ నుంచి తొలగించినట్లు జిల్లా గిరిజన సంక్షేమ, సాధికారత అధికారి ఎం.అన్నాదొర తెలిపారు. వీరిద్దరు ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని ఝాన్సీలో ఉన్న బుందేల్‌ఖండ్ విశ్వవిద్యాలయం నుంచి నకిలీ బీఈడీ ధ్రువపత్రాలతో ప్రస్తుతం పని చేస్తున్నట్లు వచ్చిన ఆరోపణలపై ఐటీడీఏ పీవో విచారణ జరిపారన్నారు. ఈ విచారణలో సంబంధిత బీఈడీ ధ్రువపత్రాలు నకిలీవని తేలడంతో నిబంధనల మేరకు చర్యలు తీసుకున్నారని తెలిపారు.

నిబంధనలు పాటిద్దాం.. సురక్షితంగా ప్రయాణిద్దాం

పాలకొండ గ్రామీణం, న్యూస్‌టుడే: ప్రతి ఒక్కరూ నిబంధనలు పాటిస్తూ.. సురక్షితమైన ప్రయాణాలు చేయాలని పాలకొండ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రధానాచార్యుడు శ్యాంబాబ్ అన్నారు. కళాశాలలో మంగళవారం రహదారి భద్రతా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై డి.వెంకన్న మాట్లాడుతూ.. శిరస్త్రాణం ధరించాలని, అతివేగం ప్రమాదకరమని విద్యార్థులకు సూచించారు. వైస్ ప్రిన్సిపల్ బి.జయమణి, కో-ఆర్డినేటర్ బి.రాజు తదితరులు పాల్గొన్నారు.

అన్నదాతపై ఎరువుల భారం

– న్యూస్‌టుడే, వీరఘట్టం

రసాయన ఎరువుల కంపెనీలు ధరలు పెంచాయి. వీటిని విక్రయించడం రైతులకు భారంగా మారింది. తోటపల్లి ఎడమ కాలువ వద్ద షట్టర్లు దెబ్బతినడంతో లీకైన నీరు కాలువల్లో ప్రవహిస్తోంది. దీంతో ఎక్కువ మంది రైతులు వరి పంటను వేశారు. కొంతమంది మొక్కజొన్న, నువ్వులు, అపరాలు వేశారు. అక్కడక్కడ చెరకు, అరటి పంటలు ఉన్నాయి. యూరియా, డీఏపీ మినహా మిశ్రమ ఎరువుల తయారీకి ముడి సరకు అవసరం. ఇది విదేశాల నుంచి దిగుమతి చేసుకోవాల్సి ఉంటుంది. అంతర్జాతీయ మార్కెట్‌లో వీటి ధరలు అధికంగా ఉండటంతో ధరలు పెరిగాయని వ్యాపారులు చెబుతున్నారు.

పెరిగిన ధరల వివరాలు ఇలా..

50 కిలోల 15.15.15 మిశ్రమ ఎరువు రబీ ప్రారంభంలో రూ.1,550 ఉండగా ప్రస్తుతం రూ.1,650కి చేరింది. 20.20.13 కాంప్లెక్సు ఎరువు (50 కిలోల బస్తా) రూ.1,400 ఉండగా ఇప్పుడు రూ.1,500కు పెరిగింది. 10.26.26 కాంప్లెక్స్ ఎరువు ధర రూ.1,900 ఉండగా.. రూ.2,100కు చేరింది. 14.35.14 ఎరువు బస్తా రూ.1,950 ఉండగా.. ప్రస్తుతం రూ.2,150కు అమ్ముతున్నారు. రూ.1,600 ఉన్న 16.16.16 ఎరువు రూ.1,675కు చేరింది.

ఎరువుల నిల్వలు

రసాయనాల వాడకం తగ్గించాలి

రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించి తగిన మోతాదులో క్రిమిసంహారక మందులు వాడాలి. డీలర్లు ఎంఆర్‌పీ ధరలకే ఎరువులను విక్రయించాలి. సేంద్రియ వ్యవసాయ విధానం అవలంబించడం ద్వారా రైతులకు ఎరువుల భారం తగ్గుతుంది. ఆ దిశగా ఆలోచించాలి.
– కె. రత్నకుమారి, వ్యవసాయ సహాయ సంచాలకురాలు

జిల్లాలో.. సాగు విస్తీర్ణం: 98,920 హెక్టార్లు, రైతులు: 2,13,000

మద్యం మత్తులో రసాయనం తాగి..

పార్వతీపురం పట్టణం, బలిజిపేట, న్యూస్‌టుడే: మద్యం మత్తులో అరటి పండ్లు మగ్గపెట్టే మందు తాగి వ్యక్తి అస్వస్థతకు గురైన ఘటన మంగళవారం బలిజిపేట మండలంలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. బలిజిపేట హరిజన వీధికి చెందిన బి.పైడిరాజు సైకిల్ మెకానిక్‌గా పనిచేస్తూ జీవిస్తున్నాడు. మద్యం మత్తులో రసాయనం తాగడంతో తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. బాధితుడికి స్థానిక ఆసుపత్రిలో ప్రాథమిక చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం జిల్లా ఆసుపత్రికి తరలించారు. పోలీసులు వివరాలు సేకరిస్తున్నారు.

ముగ్గురిపై కేసు నమోదు

పార్వతీపురం గ్రామీణం, న్యూస్‌టుడే: చినబొండపల్లిలో జరిగిన గొడవలో ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు హెచ్‌సీ గౌరీశంకరరావు తెలిపారు. గ్రామానికి చెందిన అప్పలనాయుడు ఇంటి విషయంలో జరిగిన తగాదాలో తన కుమార్తె తవిటమ్మ, ఆమె భర్త రామకృష్ణను కొట్టాడు. ఘటనలో అప్పలనాయుడికి కూడా గాయాలయ్యాయి. ముగ్గురూ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. పరస్పర ఫిర్యాదుల మేరకు వీరిపై మంగళవారం కేసులు నమోదు చేసినట్లు హెచ్‌సీ చెప్పారు.

దుకాణంలో చోరీ

పార్వతీపురం గ్రామీణం, న్యూస్‌టుడే: నర్సిపురంలోని మద్యం దుకాణంలో దొంగతనం జరిగింది. స్థానికుల వివరాల మేరకు.. సోమవారం రాత్రి దొంగలు దుకాణం తాళాలు విరగ్గొట్టి సుమారు రూ.15 వేలు, సీసీ కెమెరా డిస్కులు తీసుకుపోయారు. మంగళవారం ఉదయం షాపుకి వెళ్లిన సిబ్బంది చూసి విషయాన్ని గుర్తించారు. తమకు దీనిపై ఇంతవరకు ఫిర్యాదు అందలేదని గ్రామీణ పోలీసులు చెప్పారు.

అంపావల్లి బాధితులకు పరామర్శ

బలిజిపేట, న్యూస్‌టుడే: బలిజిపేట మండలం అంపావల్లిలో క్లోరినేషన్ సిలిండర్ లీకైన ఘటనలో అస్వస్థతకు గురై పార్వతీపురం జిల్లా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను మాజీ ఎమ్మెల్యే బొబ్బిలి చిరంజీవులు మంగళవారం పరామర్శించారు.

ఆటోలు ఢీ.. ఇద్దరికి తీవ్ర గాయాలు

పార్వతీపురం పట్టణం, కొమరాడ, న్యూస్‌టుడే: రెండు ఆటోలు ఢీకొన్న ఘటనలో ఇద్దరు తీవ్రంగా గాయపడిన ఘటన కొమరాడ మండలంలో మంగళవారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు... వన్నాం గ్రామానికి చెందిన హేమసుందర్ కుటుంబం విజయవాడలో ఉంటున్నారు. మహాశివరాత్రికి స్వగ్రామం వచ్చారు. తిరుగు ప్రయాణంలో రైలు ఎక్కేందుకు ఆటోలో పార్వతీపురం బయలు దేరారు. గ్రామ సమీపంలో ఎదురుగా వచ్చిన ఆటో ఢీకొనడంతో తొమ్మిదో తరగతి విద్యార్థి విష్ణువర్ధన్, ఆటో చోదకుడు సుధీర్ తీవ్రంగా గాయపడ్డారు. బాధితులను జిల్లా ఆసుపత్రికి తరలించారు. పోలీసులు వివరాలు సేకరిస్తున్నారు.

రెండు కాళ్లకు కట్టుతో విష్ణువర్ధన్

విద్యుత్తు లేక రిజిస్ట్రేషన్లకి ఇక్కట్లు

పార్వతీపురం గ్రామీణం, న్యూస్‌టుడే: పార్వతీపురం సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో మంగళవారం విద్యుత్తు లేక కక్షిదారులు ఇబ్బందిపడ్డారు. బ్యాటరీలు ఎక్కువ సమయం పనిచేయక పోవడంతో ప్రక్రియ నిలిచిపోయింది.

గంగమ్మ జాతరకు ఏర్పాట్లు

పార్వతీపురం గ్రామీణం: పార్వతీపురం ప్రజల ఇలవేల్పు నీలావడి అగ్నిగంగమ్మ జాతరకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు తహసీల్దారు సోనాలి పాత్రో మంగళవారం తెలిపారు. ఈ మేరకు ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఈనెల 23న మొదలయ్యే జాతర మార్చి 11 వరకు ఉంటుందని చెప్పారు. జాతర కోసం పార్వతీపురం నుంచి నీలావడి వరకు బస్సులు వేసేందుకు అధికారులు అంగీకరించారని కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు సత్యంనాయుడు, రవికుమార్ తెలిపారు.

పరికరం ఉన్నా.. పని చేయదంతే!

పంచాయతీల్లో ఫైబర్ నెట్ పరిస్థితి

మరమ్మతులకు గురైన ఫైబర్‌నెట్ పరికరం

కురుపాం గ్రామీణం, న్యూస్‌టుడే: గత వైకాపా హయాంలో పంచాయతీలకు అందజేసిన ఫైబర్ నెట్ పరికరాలు నేడు నిరుపయోగంగా మారాయి. గిరిజన, గ్రామీణ ప్రాంతాలకు అంతర్జాల సేవలు అందించి సాంకేతికతను చేరువ చేసేందుకు మూడేళ్ల కిందట ఏపీ ఫైబర్ సామగ్రిని అన్ని పంచాయతీలకు అందించింది. దీంతో ప్రభుత్వ పథకాలు, ఆన్‌లైన్ ప్రక్రియ పనులు వేగవంతమవుతాయని అంతా భావించారు. కానీ అలా జరగక పోగ మూలకు చేరాయి.

రూ.లక్షలు వృథా...

అంతర్జాలం కనెక్షన్ ఇచ్చేందుకు ఏపీ ఫైబర్ డెల్టా పేరుతో ఆప్టికల్ లైన్ టెర్మినల్(ఓఎల్‌టీ) పరికరాన్ని పంచాయతీలకు అందజేశారు. కురుపాం మండలంలో మొత్తం 23 పంచాయతీలకు సుమారు రూ.30 లక్షలకు పైగా వెచ్చించారు. ఇవేవీ పనిచేయడం లేదు.

అందుబాటులోకి వస్తే మేలు..

సచివాలయాల ద్వారా ప్రజలకు పలు సేవలు అందించాల్సి ఉంది కానీ అంతర్జాల సదుపాయం అరకొరగా ఉండటంతో ఇబ్బందులు తప్పడం లేదు. దీంతో సిబ్బంది హాట్‌స్పాట్ ద్వారా తమ చరవాణుల్లో అంతర్జాల సౌకర్యాన్ని వినియోగించాల్సి వస్తోంది. పంచాయతీల్లో నిధుల కొరత వల్ల అంతర్జాలానికి అదనపు ఖర్చు భారంగా మారుతోందని సిబ్బంది వాపోతున్నారు. ఫైబర్ నెట్ సేవలు అందుబాటులోకి వస్తే మేలు చేకూరుతుందని అధికారులు చెబుతున్నారు.

పరిశీలించి, బాగు చేయిస్తాం

కురుపాం మండలంలో ఎక్కడెక్కడ ఫైబర్ నెట్ పరికరాలు పనిచేయడం లేదో క్షేత్రస్థాయిలో పరిశీలించి, బాగు చేయిస్తాం. త్వరలో అన్నిచోట్ల పూర్తిస్థాయిలో అంతర్జాల సదుపాయం కల్పిస్తాం. – జె.ఉమామహేశ్వరి, ఎంపీడీవో, కురుపాం

బాల్య వివాహాల నిర్మూలనకు కృషి

కురుపాం గ్రామీణం, కొమరాడ, బలిజిపేట, న్యూస్‌టుడే: బాల్య వివాహాల నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా బాలల సంరక్షణ విభాగం లీగల్ అధికారి పి.శ్రీధర్ అన్నారు. మంగళవారం కురుపాం ఏకలవ్య పాఠశాలలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. మహిళా సంరక్షణ కార్యదర్శి స్వప్న తదితరులు ఉన్నారు. కొమరాడ మండలం తులసివలస, కెమిశిలలో బాలల సంరక్షణ అధికారి ఎ.సత్యనారాయణ అవగాహన కల్పించారు. బలిజిపేట ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని వెంగాపురం శ్రీ భారతి ఉన్నత పాఠశాలలో బాల్య వివాహాలను వ్యతిరేకిస్తామంటూ విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు.

బలిజిపేటలో విద్యార్థుల ప్రతిజ్ఞ

సమష్టిగా పనిచేస్తే ఉత్తమ ర్యాంకు

పాలకొండ, న్యూస్‌టుడే: స్వచ్ఛ సర్వేక్షణ్‌లో ఉత్తమ ర్యాంకులు సాధించేందుకు ఉద్యోగులంతా సమష్టిగా పని చేయాలని స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఏఐఎల్‌ఎస్‌జీ శిక్షకులు వెంకటేశ్వరరావు, తిరుపతిరావులు అన్నారు. పాలకొండ నగర పంచాయతీ కార్యాలయంలో మంగళవారం సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. ప్రతి ఉద్యోగి తమ సామర్థ్యాలను మెరుగుపరచుకుని, విధుల్లో బాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించారు. అప్పుడే స్థానిక సమస్యలు పరిష్కారం అవుతాయని పేర్కొన్నారు. కమిషనర్ రత్నరాజ్, జిల్లా కో-ఆర్డినేటర్ తిరుపతమ్మ, పర్యావరణ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

సూచనలిస్తున్న శిక్షకుడు

ప్రాథమిక విద్య సక్రమంగా ఉండాలి

సీతంపేట, న్యూస్‌టుడే: ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులు మెరుగ్గా రాణించాలంటే.. ప్రాథమిక విద్య సక్రమంగా ఉండాలని డిప్యూటీ డీఈవో పి.నారాయుడు అన్నారు. అందుకు అనుగుణంగా బోధన అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. దిగువ కారిమానుగూడ ప్రాథమిక పాఠశాలను మంగళవారం సందర్శించారు. తరగతి గదులు, మరుగుదొడ్లను పరిశీలించారు. విద్యార్థులను పలు ప్రశ్నలు అడిగి.. సమాధానాలు రాబట్టారు. ఉపాధ్యాయులు, సిబ్బంది ఉన్నారు.

పిల్లల సామర్థ్యాన్ని పరీక్షిస్తున్న నారాయుడు

ఆన్‌లైన్ తరగతులు ప్రారంభం

సీతానగరం: జోగింపేట కేజీబీవీలో ఏర్పాటు చేసిన అటల్ టింకరింగ్ ల్యాబ్‌లో ఆన్‌లైన్ తరగతులను డీఈవో బ్రహ్మాజీరావు ప్రారంభించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఈనెలలో ప్రారంభించగా, మొదటి విడతలో జిల్లాను ఎంపిక చేసినట్లు తెలిపారు. డిప్యూటీ డీఈవో రాజ్‌కుమార్, జిల్లా సైన్సు అధికారి లక్ష్మణరావు, డీఆర్‌పీ శైలజ పాల్గొన్నారు.

రైల్వే గేటు కొనసాగించాలి

సీతానగరం: చినభోగిల కూడలిలోని రైల్వే గేటును కొనసాగించాలని విశాఖలోని ప్రాంతీయ ప్రబంధకుడు బి.లలిత్‌కు పలువురు సర్పంచులు వినతిపత్రం అందించారు. ఆర్‌ఎం సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు.

వీఆర్యేల ఆందోళన: బలిజిపేట గ్రామీణం, పార్వతీపురం గ్రామీణం: వీఆర్యేల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సిటు ఆధ్వర్యంలో బలిజిపేట, పార్వతీపురం తహసీల్దార్లకు వినతి పత్రాలు అందజేశారు. 18న కలెక్టరేట్ వద్ద నిరసన చేపట్టనున్నట్లు తెలిపారు.

(c) eenadu

చుట్టేసిన గోదావరి

గండిపోశమ్మ ఆలయం, పంటల మునక

ఆలయాన్ని ముంచెత్తిన ప్రవాహం

దేవీపట్నం, న్యూస్‌టుడే: పోలవరం ప్రాజెక్టు బ్యాక్ వాటర్ (వెనుక జలాలు) కారణంగా వారం రోజులుగా గోదావరి పెరుగుతూనే ఉంది. మంగళవారం సాయంత్రానికి అడుగు మేర నీటి మట్టం పెరగడంతో గండిపోశమ్మ ఆలయాన్ని వరద చుట్టుముట్టింది. జిల్లా కూలైన్స్, సమీపంలోని దుకాణాలు ముంపునకు గురయ్యాయి. పోశమ్మగండి నుంచి పి.గొందూరు వైపు వెళ్లే ఆర్‌అండ్‌బీ రహదారిని ఆనుకుని గోదావరి ప్రవహిస్తోంది. పి. గొందూరు వద్ద వరి చేలు, దండంగి, చినరమణయ్యపేట, కె.వీరవరం పరిసర ప్రాంతాల్లో మొక్కజొన్న చేలు ముంపునకు గురయ్యాయి. దండంగి ఆర్‌అండ్‌బీ రహదారిపై నీరు చేరడంతో వాహనాల రాకపోకలకు ఇబ్బంది వాయి. పోలవరం ముంపు గ్రామాల్లో తప్పిన పనులకు పొలాలు రావడంతో రైతులు మొక్కజొన్న సాగు చేపట్టారు. ఒక్కసారిగా గోదావరి పెరగడంతో నష్టాలు తప్పవని కర్షకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

కొండపై నుంచే పూజలు..

గండిపోశమ్మ తల్లి ఆలయం వద్ద గోదావరి పెరుగుతున్నా భక్తుల రాక మాత్రం తగ్గలేదు. మంగళవారం మైదాన ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు కొండపై నుంచే అమ్మవారికి పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. కొండ ప్రాంతంలో వంటావార్పు కార్యక్రమాలు నిర్వహించుకున్నారు. గోదావరి వరదల కారణంగా ఏడు నెలలుగా అమ్మవారి దర్శనాలు నిలిచిపోయిన సంగతి తెలిసిందే. దేవస్థానం అధికారులు ప్రత్యామ్నాయ ఏర్పాటు చేయకపోవడంతో భక్తులు ఇబ్బందులు తప్పడం లేదు. ఆలయానికి ఆదాయం కూడా గణనీయంగా తగ్గిపోయిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి గండిపోశమ్మ నూతన ఆలయ నిర్మాణాన్ని ప్రారంభించాలని భక్తులు కోరుతున్నారు.

ఆశ్రమ పాఠశాల పిల్లలకు మాత్రలను మింగిస్తున్న పీవో స్మరణ్‌రాజ్

విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణకు చర్యలు

రంపచోడవరం, న్యూస్‌టుడే: జిల్లాలో పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో బాలబాలికలకు రక్తహీనత బారిన పడకుండా వారి ఆరోగ్య పరిరక్షణకు చర్యలు చేపట్టినట్లు ఐటీడీఏ పీవో స్మరణ్‌రాజ్ అన్నారు. నులిపురుగుల నివారణ దినం సందర్భంగా మంగళవారం స్థానిక ఐటీడీఏ వద్ద ఆశ్రమ పాఠశాల విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను మింగించారు. వివిధ పాఠశాలల్లో విద్యార్థులకు డీఎంహెచ్‌వో డాక్టరు సరిత ఆధ్వర్యంతో నులిపురుగుల నివారణ మాత్రలను మింగించారు. ఇంకా మిగిలిన పిల్లలకు ఈ నెల 24న మాత్రలు మింగిస్తామని తెలిపారు. డాక్టరు ఇక్షిత్, సిబ్బంది మార్గదర్శి, ఎంపీహెచ్‌వోలు జ్యోతిరాజు, సతీష్, ప్రసాద్, నీరజ, వైవీ సత్యనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

సీబీఎస్ఈ 'పది' పరీక్షలు ప్రారంభం

రాజవొమ్మంగి, మారేడుమిల్లి, న్యూస్‌టుడే: జిల్లాలోని ఏకలవ్య మోడల్ గురుకుల విద్యాలయాల్లో మంగళవారం సీబీఎస్ఈ విభాగంలో పదో తరగతి పరీక్షలు ప్రారంభమయ్యాయి. మొదటి రోజు మ్యాథ్స్ స్టాండర్డ్, బేసిక్ పరీక్ష జరిగింది. జిల్లాలో రాజవొమ్మంగి, వై. రామవరం, మారేడుమిల్లి, చింతూరులో పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. 353 మంది విద్యార్థులకుగాను అంతా హాజరయ్యారని ఏకలవ్య విద్యాలయాల కన్వీనర్ ప్రిన్సిపల్ శంకర్‌ప్రసాద్ తెలిపారు. రాజవొమ్మంగి పరీక్ష కేంద్రం వద్ద ఎస్సై శివకుమార్ ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు. మారేడుమిల్లిలోని ఏకలవ్య గురుకుల పాఠశాలలో ఏర్పాటు చేసిన కేంద్రంలో మారేడుమిల్లి, రంపచోడవరం పాఠశాలల విద్యార్థులు పరీక్షలు రాశారు. సీసీ కెమెరాల పర్యవేక్షణలో జరుగుతున్న ఈ పరీక్షలకు ఐదు గదులను కేటాయించారు. తొలిరోజు పరీక్షకు మారేడుమిల్లి నుంచి 57, రంపచోడవరం పాఠశాల నుంచి 60 మంది విద్యార్థులు హాజరయ్యారని పరీక్షల నిర్వహణాధికారి తోట వినోద్ తెలిపారు. విద్యార్థులకు అవసరమైన అన్ని సదుపాయాలను కల్పించామని ఆయన చెప్పారు.

రాజవొమ్మంగి పరీక్ష కేంద్రం వద్ద ఎస్సై శివకుమార్ తదితరులు

జలం.. పుష్కలం

సాగు, విద్యుదుత్పత్తికి వినియోగం

న్యూస్‌టుడే – మోతుగూడెం

సీలేరు, అనుబంధ జలాశయాల్లో నీరు పుష్కలంగా ఉంది. ఆంధ్రలోని కొండల్లో పుట్టిన మాచ్‌ఖండ్ (సీలేరు) నది ఆంధ్రా-ఒడిశా రాష్ట్రాల్లోని సరిహద్దులను తాకుతూ 320 కిలోమీటర్ల మేర ప్రవహిస్తుంది. సీలేరు నదికి సహజసిద్ధమైన ప్రవాహం వాలు ఎక్కువగా ఉన్నందువల్ల విద్యుదుత్పత్తి కేంద్రాలు నిర్మాణానికి వీలు కలిగింది. మాచ్‌ఖండ్ వద్ద జలాశయం ఎత్తు 2,750 అడుగులు ఉండగా, పొల్లూరు వద్ద 267 అడుగులు ఉంటుంది. ఈ నది 200 మైళ్ల దూరం వరకు 2,500 అడుగుల ఎత్తు నుంచి వాలుగా ప్రవహిస్తుంది.

ఐదు జలాశయాలు..

ఈ నదిపై నిర్మించిన ఐదు జలవిద్యుత్కేంద్రాల్లో విద్యుదుత్పత్తి కోసం నీరు సరఫరా చేయడానికి జోలాపుట్, మాచ్‌ఖండ్, సీలేరు, డొంకరాయి, పోర్‌బే వద్ద ఐదు జలాశయాలను నిర్మించారు. జోలాపుట్‌లో 31 టీఎంసీలు, బలిమెలలో 110, సీలేరులో 3, డొంకరాయిలో 13 టీఎంసీల నీటిని నిల్వ చేయవచ్చు. జోలాపుట్ జలాశయం నుంచి వచ్చే నీటి ద్వారా మాచ్‌ఖండ్‌లో విద్యుదుత్పత్తి, అనంతరం విడుదలయ్యే నీరు బలిమెల జలాశయం చేరుతుంది. మన రాష్ట్ర వాటా నీటిని సీలేరు, డొంకరాయి, పొల్లూరు జలవిద్యుత్కేంద్రాల్లో విద్యుదుత్పత్తికి వినియోగిస్తారు. అక్కడి నుంచి వచ్చే నీటిలో మూడు టీఎంసీలు నిల్వ చేయడానికి గుంటవాడలో జలాశయం నిర్మించారు. దీనినుంచి నీటిలో విద్యుదుత్పత్తి అనంతరం విడుదలయ్యే నీటిని నిల్వ చేయడానికి డొంకరాయిలో 12 గేట్లతో ఒక డ్యాం ఉంది. ఇక్కడ 16 శతకోటి ఘనపుటడుగుల నీటిని నిల్వ చేయవచ్చు. ఇక్కడి మినీ జలవిద్యుత్కేంద్రంలో ఉత్పత్తి తర్వాత పోర్‌బే జలాశయంలో 29.65 లక్షల క్యూబిక్ మీటర్ల నీటిని నిల్వ చేస్తారు. ఇక్కడి నుంచి 8 కి.మీ సొరంగ మార్గం ద్వారా పొల్లూరు పెన్‌స్టాక్ పైపులకు పంపిస్తారు. అక్కడ విద్యుదుత్పత్తి అనంతరం విడుదలయ్యే నీటిని శబరి నదిలో నిల్వ చేస్తారు. ఉభయ గోదావరి జిల్లాల్లో రబీ పంటలకు సాగునీరు అవసరమైనప్పుడు విడుదల చేస్తారు.

డొంకరాయి ప్రధాన ఆనకట్ట

అవసరాలకు సరిపడా నిల్వలు..

విద్యుదుత్పత్తికి, సాగు అవసరాలకు సరిపడా నీరుంది. మొత్తం సీలేరు బేసిన్‌లో 70 టీఎంసీల వరకు నీటి నిల్వలున్నాయి. డెల్టాలో రబీ పంటలకు అదనంగా సీలేరు నీటిని విడుదల చేసినా విద్యుదుత్పత్తికి కొరత ఉండదు. పొల్లూరు నుంచి 4 వేలు, డొంకరాయి ప్రధాన ఆనకట్ట ద్వారా 3,500 క్యూసెక్కుల నీటిని నిత్యం విడుదల చేస్తున్నాం. డొంకరాయి ప్రధాన ఆనకట్ట గేట్ల ద్వారా ఇప్పటివరకు 3.8 టీఎంసీలు అదనంగా విడుదల చేశాం. ఈ నెలాఖరు వరకు నీటి విడుదల కొనసాగుతుంది.

– కేవీ రాజారావు, సీఈ, సీలేరు విద్యుత్తు కాంప్లెక్స్

మాచ్‌ఖండ్‌లో విద్యుదుత్పత్తి నిలిపివేత

ముంచంగిపుట్టు గ్రామీణం, న్యూస్‌టుడే: ఆంధ్ర, ఒడిశా ఉమ్మడి నిర్వహణలో ఉన్న మాచ్‌ఖండ్ జలవిద్యుత్కేంద్రంలో విద్యుదుత్పత్తిని అధికారులు నిలిపివేశారు. ప్రాజెక్టులో విద్యుత్తు ఉత్పత్తికి అవసరమైన నీటిని చేరవేసే జోలాపుట్ డ్యాం నుంచి విద్యుత్తు కేంద్రానికి అనువైన స్థాయిలో నీరు చేరకపోవడంతో మంగళవారం ఈ నిర్ణయం తీసుకున్నారు. ఉదయం 8 గంటల సమయంలో విద్యుదుత్పత్తిని నిలిపివేసి డీపీ డ్యాంలో నీటి నిల్వలను ఖాళీ చేశారు. నీటి మట్టం తగ్గిన తర్వాత సొరంగ మార్గం వద్ద ఉన్న ట్రష్ ర్యాక్ (జాలీలు)కు అడ్డుగా తుప్పలు ఉన్నట్లు గుర్తించారు. ప్రాజెక్టు ఈఈ (జనరేషన్) బి.గోవిందరాజులు ఆధ్వర్యంలో సిబ్బంది జాలీలకు అడ్డుగా ఉన్న తుప్పలను తొలగించారు. పూర్తి కెనాల్ మార్గంలోనూ చెట్ల కొమ్మలను గమనించి వాటి తొలగింపు చేపట్టారు. ట్రష్ ర్యాక్‌కి తుప్పలు అడ్డుపడటం వల్ల విద్యుదుత్పత్తిని నిలిపివేయాల్సి వచ్చిందని ఈఈ చెప్పారు. బుధవారం విద్యుదుత్పత్తిని పునరుద్ధరిస్తామని పేర్కొన్నారు.

ఐటీడీఏలో పీజీఆర్ఎస్ రద్దు

చింతూరు, న్యూస్‌టుడే: ప్రతి బుధవారం ఐటీడీఏలో నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదికను రద్దు చేసినట్లు ప్రాజెక్టు అధికారి శుభం నొక్వాల్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అత్యవసర పరిపాలన కార్యకలాపాలు నిర్వహించాల్సి ఉన్నందున రద్దు చేశామన్నారు.

రీసర్వేలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు

వీసీలో మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్, ఇన్‌ఛార్జి జేసీ శ్రీపూజ, ఇన్‌ఛార్జి ఆర్డీవో లోకేశ్వరరావు

పాడేరు, న్యూస్‌టుడే: ఉమ్మడి అల్లూరి జిల్లాలో తహసీల్దార్ల లాగిన్‌లో రీసర్వేకు సంబంధించి పెండింగ్ ఉన్న సమస్యలను గడువులోగా పూర్తి చేయాలని కలెక్టర్ దినేష్‌కుమార్ స్పష్టం చేశారు. కలెక్టరేట్ నుంచి అల్లూరి, పోలవరం జిల్లాల అధికారులతో మంగళవారం దృశ్య మాధ్యమంలో మాట్లాడారు. మండలాల వారీ ప్రగతిపై ఆరా తీశారు. పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను పరిశీలించి ఆర్డీఓ, జాయింట్ కలెక్టర్ లాగిన్‌కు పంపాలని సూచించారు. నిర్లక్ష్యం వహించే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు (పీజీఆర్ఎస్) వచ్చే వినతులను సకాలంలో పరిష్కరించాలన్నారు. వారంలో ఒకరోజు వీఆర్వోలు, సర్వేయర్లతో సమావేశం నిర్వహించాలని సూచించారు.

పాడేరు పట్టణం, న్యూస్‌టుడే: పింఛన్ల పంపిణీలో అవకతవకలకు పాల్పడితే సహించేది లేదని, బాధ్యులపై కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ దినేష్‌కుమార్ స్పష్టం చేశారు. అభివృద్ధి పనులపై కలెక్టరేట్ నుంచి మంగళవారం వీసీలో అధికారులతో సమీక్ష నిర్వహించారు. స్వర్ణ గ్రామ, స్వర్ణ వార్డు విభాగాల ద్వారా అందించే సేవలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు గ్రామ సభలు ఏర్పాటు చేయాలన్నారు. ఐవీఆర్ఎస్ కాల్స్‌కు సంబంధించి ప్రభుత్వ పథకాల అమలుపై సంతృప్తి చెందితే ఏ బటన్ నొక్కాలో అర్థమయ్యేలా వివరించాలని సూచించారు. పింఛన్ల పంపిణీ అనంతరం మిగిలిన సొమ్మును ప్రభుత్వానికి జమ చేయాలని, లేకుంటే క్రిమినల్ చర్యలు తప్పవని హెచ్చరించారు. వేసవిలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా జల్ జీవన్ మిషన్ పనులను వేగవంతం చేయాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో తాగునీటి సదుపాయం కల్పించడంతోపాటు మరుగుదొడ్లను వినియోగంలోకి తీసుకురావాలన్నారు. ఇన్‌ఛార్జి జేసీ శ్రీపూజ, రంపచోడరం, చింతూరు ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారులు స్మరణ్‌రాజ్, శుభంనొఖ్వాల్, పాడేరు ఇన్‌ఛార్జి డీఆర్ఓ అంబేడ్కర్, ఇన్‌ఛార్జి ఆర్డీవో లోకేశ్వరరావు పాల్గొన్నారు.

భక్తుల చెంతకే సేవా టికెట్లు

పీవోఎస్ యంత్రం ద్వారా టికెట్ ఇస్తున్న సిబ్బంది

అన్నవరం, న్యూస్‌టుడే: భక్తుడి వద్దకే నేరుగా సిబ్బంది వెళ్లి టికెట్లు జారీ చేసేలా కాకినాడ జిల్లా అన్నవరం దేవస్థానంలో 30 పీవోఎస్ యంత్రాలను అందుబాటులోకి తీసుకొచ్చారు. డిజిటల్ టెంపుల్స్ స్మార్ట్ ఎండోమెంట్స్‌కు అనుగుణంగా నగదు రహిత లావాదేవీలు మెరుగుపర్చడం, ఆన్‌లైన్ సేవలను విస్తృతం చేయడం, డిజిటల్ మౌలిక సదుపాయాలు బలోపేతం చేయడం, యాత్రికుల సౌలభ్యం, సేవా భావాన్ని మెరుగుపర్చడానికి చర్యలు చేపడుతున్నారు. కౌంటర్లలో టికెట్లు జారీ చేస్తూనే రద్దీ సమయాల్లో ఆలయ ప్రాంగణాల్లో భక్తుల వద్దకే నేరుగా సిబ్బంది వెళ్లి టికెట్లు ఇచ్చేలా ఏర్పాట్లు చేస్తున్నారు. యంత్రంలో క్యూఆర్ కోడ్ ద్వారా డిజిటల్ చెల్లింపులు చేయవచ్చు. ప్రస్తుతం దర్శనం, సేవ, ప్రసాదం టికెట్లు పీవోఎస్ ద్వారా ఇస్తుండగా భవిష్యత్తులో ఈ హుండీ, అన్నదానం టికెట్లు జారీ, ఇతర సేవలను అందుబాటులోకి తీసుకురానున్నారు. వివిధ ప్రధానాలయాల్లో కియోస్క్‌లు ఏర్పాటు చేయడానికి చర్యలు చేపడుతున్నారు. ఇందులో అన్నవరం ఆలయానికి 8 కేటాయించారు.

సామాన్యులకూ ఆదరువు

అటల్ పెన్షన్ యోజనతో పింఛను

న్యూస్‌టుడే – చింతూరు

ఉద్యోగులే కాదు సామాన్యులూ 60 ఏళ్ల తరువాత పింఛను పొందే అవకాశాన్ని కల్పిస్తూ కేంద్ర ప్రభుత్వం అటల్ పెన్షన్ యోజన అమలు చేస్తోంది. 2015 జనవరి 9న ప్రారంభమైన ఈ పథకం కాలపరిమితి ముగింపు దశకు చేరుకోవడంతో 2031 వరకు పొడిగిస్తూ నిర్ణయం తీసుకుంది. దీన్ని పెన్షన్ రెగ్యులేటరీ అండ్ డెవలప్‌మెంట్ అథారిటీ నిర్వహిస్తోంది.

అర్హులెవరంటే...

ఈ పథకంలో చేరేందుకు 18 నుంచి 40 ఏళ్ల వయసున్న వారు అర్హులు. తపాలా శాఖ లేదా ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో ఖాతా ఉండాలి. నెలకు రూ. 1,000, రూ. 2,000, రూ. 3,000, రూ. 4,000, రూ. 5,000 వరకు పెన్షన్ పొందొచ్చు. వయసునుబట్టి నెల, మూడు, ఆరు నెలలకోసారి చెల్లించాల్సి ఉంటుంది.

కుటుంబం మొత్తానికీ వర్తింపు..

ఈ పథకంలో పింఛను తీసుకునేవారికి బీమా సదుపాయం ఉంది. పథకంలో చేరిన వ్యక్తి మృతి చెందితే నెలకు తీసుకునే పెన్షన్ ఆధారంగా కుటుంబానికి బీమా చెల్లిస్తారు.

- భర్త మరణిస్తే భార్య బతికి ఉన్నంత కాలం పింఛను చెల్లిస్తుంది. ఆమె కూడా మృతిచెందితే పిల్లలకు బీమా వస్తుంది.

బీమా వివరాలు

పింఛను (రూ)	బీమా (రూ.లక్షలు)
1,000	1.7
2,000	3.4
3,000	5.1
4,000	6.8
5,000	8.5

వ్యవసాయంలో సడలిన కృషి

ఖాళీగా శాస్త్రవేత్తల పోస్టులు

న్యూస్‌టుడే – రంపచోడవరం

పోలవరం జిల్లాలో గిరిజన రైతులు అధికంగా జీడిమామిడి, మామిడి తోటలను సాగుచేస్తూ జీవనం సాగిస్తుంటారు. కొన్ని ప్రాంతాల్లో వర్షాధారంగా ఖరీఫ్ పంటలు సాగు చేస్తుంటారు. జిల్లాలోని 11 మండలాల్లో రైతులకు వివిధ పంటల్లో సస్యరక్షణ, యాజమాన్య పద్ధతులపై వ్యవసాయ శాఖ అధికారులు సూచనలు చేస్తున్నారు. వీరితోపాటు పందిరిమామిడి కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే) శాస్త్రవేత్తలు కూడా క్షేత్రస్థాయిలో పర్యటించి కర్షకులకు సలహాలు, సూచనలు చేయాల్సి ఉండగా కేవలం ఇద్దరే ఉండటంతో కష్టసాధ్యమవుతోంది. కేవీకే అధిపతి డాక్టర్ రాజేంద్రప్రసాద్ తోపాటు ఉద్యాన వ్యవసాయ విస్తరణ శాస్త్రవేత్త మాత్రమే ఉన్నారు. మిగిలిన సాయిల్ సైన్స్, తెగుళ్లు, కీటక విభాగాలకు సంబంధించి శాస్త్రవేత్తల పోస్టులు ఏడాది కాలంగా ఖాళీగా ఉన్నాయి. మత్స్య శాఖ శాస్త్రవేత్త పోస్టు కూడా నాలుగు నెలలుగా భర్తీ చేయలేదు.

పందిరిమామిడి కృషి విజ్ఞాన కేంద్రం

కేవీకే ఉన్న ప్రాంతం: పందిరిమామిడి
విభాగాలు: సాయిల్ సైన్స్, తెగుళ్లు, కీటక, మత్స్య
మొత్తం శాస్త్రవేత్తల పోస్టులు: ఆరు
ఖాళీగా ఉన్నవి: నాలుగు

క్షేత్రస్థాయి పరిశీలన ఏదీ..?

ఏజెన్సీ ప్రాంతంలో గిరిజన రైతులకు వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో 90 శాతం రాయితీపై విత్తనాలు, ఎరువులను ప్రభుత్వం పంపిణీ చేస్తోంది. యంత్ర పరికరాలను సైతం అందజేసి సాంకేతికతను వినియోగించుకునేలా అవగాహన కల్పిస్తోంది. మన్యంలో కృషి విజ్ఞాన కేంద్రం అందుబాటులో ఉన్నా శాస్త్రవేత్తల కొరత వెంటాడుతోంది. రంపచోడవరం ఏజెన్సీ ప్రాంతంలో వివిధ పంటల సాగుతోపాటు ప్రత్యామ్నాయంగా చేపల పెంపకాన్ని చేపడతారు. చేపల రైతులను ప్రోత్సహించేందుకు, సూచనలు చేసేందుకు మత్స్య శాస్త్రవేత్త అందుబాటులో లేరు. భూమి సారవంతంగా ఉన్నదీ లేనిదీ గుర్తించడం, ఏయే పంటలు వేస్తే అధికంగా దిగుబడి వస్తుంది, రసాయనాలు లేకుండా ఎంత మోతాదులో ఎటువంటి ఎరువులు వేయాలనే అంశాలపై వివరించేందుకు సాయిల్ సైన్స్ విభాగం శాస్త్రవేత్త పోస్టు ఖాళీగా ఉంది. తెగుళ్ల విభాగానికి చెందిన శాస్త్రవేత్త లేకపోవడంతో పంటలపై ఆశించే చీడపీడలపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు పాటించడంతో రైతులు వెనుకబడుతున్నారు.

రూ.2 కోట్ల బీమా చేయించి హత్యాయత్నం

నిందితులను అదుపులోకి తీసుకున్న పోలీసులు

బూర్గంపాడు, ఎటపాక, న్యూస్‌టుడే: తల్లిదండ్రులు లేని యువకుడి పేరిట బీమా చేయించి సొమ్ముల కోసం అతణ్ని అంతమొందించాలని పథకం పన్నారు. తీవ్రంగా కొట్టి రహదారి ప్రమాదంగా చిత్రీకరించాలనుకొన్నారు. విచారణలో ఇది ప్రమాదం కాదని ప్రణాళిక ప్రకారం చేసిన ఘాతుకమని పోలీసులు నిర్ధారించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడు ఎస్సై మేడా ప్రసాద్ స్థానిక ఠాణాలో మంగళవారం వివరాలు వెల్లడించారు. ఏపీలోని పోలవరం జిల్లా ఎటపాక మండలం గన్నవరానికి చెందిన కట్టా యశ్వంత్ చిన్నతనంలోనే తల్లిదండ్రులు చనిపోవడంతో అదే గ్రామంలో మేనమామ సంరక్షణలో ఉంటున్నాడు. ఆరు నెలలుగా భద్రాచలానికి చెందిన కట్టా సాయిదీపక్‌తో స్నేహం చేస్తూ సహాయకారిగా ఉంటున్నాడు. సాయిదీపక్‌కు.. ఓ ప్రైవేటు బ్యాంకులో సేల్స్ ఆఫీసర్‌గా పని చేస్తున్న భానుప్రకాష్ జత కలిశాడు. ఇద్దరు కలిసి పథకం ప్రకారం యశ్వంత్ పేరిట గత ఏడాది నవంబరులో ఓ సంస్థలో రూ.2 కోట్లకు బీమా పాలసీ తీసుకున్నారు. యశ్వంత్, సాయిదీపక్‌ల సామాజికవర్గాలు వేరైనా ఇంటి పేరు ఒకటే కావడంతో సాయిదీపక్‌ను నామినీగా ఉంచారు. యశ్వంత్‌ను అంతమొందించి ప్రమాదంగా చిత్రీకరించి బీమా సొమ్ము దక్కించుకోవాలని పథకం వేశారు.

నిందితులను చూపిస్తున్న ఎస్సై మేడా ప్రసాద్

ప్రయాణికుల రాకతో బెడిసికొట్టి..

ఈ నెల 14న మోతె పట్టినగర్ వద్ద మద్యం తాగించి తిరిగి వెళ్లేటప్పుడు యశ్వంత్ తలమీద రాడ్డుతో కొట్టి హతమార్చేందుకు ప్రయత్నించారు. రక్తమోడుతున్న యశ్వంత్‌ను రోడ్డు మీద, స్కూటీని పక్కన ఉంచారు. ఆ సమయంలో అదే మార్గంలో వస్తున్న ప్రయాణికులు రక్తం మడుగులో ఉన్న యశ్వంత్‌ను గమనించి అంబులెన్స్‌కు, పోలీసులకు సమాచారం అందించారు. అక్కడే ఉన్న నిందితులు సాయిదీపక్, భానుప్రకాష్ ప్రయాణికుల్లా నటించి యశ్వంత్‌ను భద్రాచలం ఆసుపత్రికి తరలించారు. బాధితుడి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు సాయిదీపక్, భానుప్రకాష్‌లను మంగళవారం సారపాకలో అదుపులోకి తీసుకున్నారు. నిందితులను రిమాండ్‌కు తరలించారు.

మధ్యాహ్న భోజనం.. అంత సంతృప్తిగా లేం!

- నాణ్యతపై కాకినాడ, తూర్పులో ప్రతికూల స్పందన
- విద్యార్థుల తల్లిదండ్రుల అభిప్రాయ సేకరణ

ఈనాడు, పోలవరం: విద్యార్థులకు మెరుగైన విద్య, నాణ్యమైన ఆహారం పాఠశాల స్థాయిలో అందించి వారి సర్వతోముఖాభివృద్ధికి బాటలు వేయాలన్న ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం 'డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం' నిర్వహిస్తోంది. మెనూ పక్కాగా అమలుచేయాలని ఆదేశించింది. అయితే క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ లోపంతో ఇబ్బంది ఏర్పడుతోంది. ప్రజల సంతృప్తి స్థాయి తెలుసుకునేందుకు ప్రభుత్వం 5 ప్రశ్నలతో రాష్ట్ర వ్యాప్తంగా ఇటీవల 2.27 లక్షల మందిని సంప్రదించగా 24.4 శాతం మంది వ్యతిరేకంగా స్పందించారు.

వెనుకబడిన మన జిల్లాలు..

కాకినాడ, తూర్పు గోదావరి జిల్లాల్లో ఆహార పదార్థాల రుచి, నాణ్యతపై ఎక్కువమంది అసంతృప్తి వ్యక్తంచేశారు. అన్ని విభాగాల్లో కాకినాడ వెనుకబడి రాష్ట్రంలో 26వ స్థానంలో ఉంది. తూర్పు 22, కోనసీమ 16, పోలవరం 4వ స్థానంలో ఉన్నాయి.

కొన్నిచోట్ల ఇలా..

- తుని పరిధిలోని కొండవరపుపేట పాఠశాలలో చదువుతున్న 11 మంది విద్యార్థుల తల్లిదండ్రుల అభిప్రాయాలు సేకరించారు. చిక్కీలు బాగున్నాయని 25 శాతం మంది చెప్పగా.. మిగిలిన అన్ని ప్రశ్నలకూ వ్యతిరేకంగానే సమాధానమిచ్చారు.
- కాకినాడ జిల్లా గజ్జనపూడి పాఠశాలలో 11 మందిని సంప్రదించగా మెనూ అమలు సరిగా లేదని అందరూ చెప్పారు. 33 శాతం మంది పదార్థాలు రుచిగా ఉంటున్నాయని, 25 శాతం మంది అన్నం బాగుందని మాత్రమే తెలిపారు.

జిల్లాలవారీగా 5 ప్రశ్నలకు విద్యార్థుల తల్లిదండ్రులు ఎలా స్పందించారంటే(శాతాల్లో)

✔ బాగు / ✘ లేదు	మెనూ అమలు ✔ – ✘	రుచి ✔ – ✘	నాణ్యత ✔ – ✘	చిక్కీ నాణ్యత ✔ – ✘	అన్నం ✔ – ✘	రాష్ట్రంలో ర్యాంకు
తూర్పు	84.6 – 15.4	73.5 – 26.5	67.7 – 32.3	75.7 – 24.3	67.5 – 32.5	2
కాకినాడ	83.4 – 16.6	75.0 – 25	65.6 – 34.4	77.8 – 22.2	68.3 – 31.7	26
కోనసీమ	85.8 – 14.2	70.3 – 29.7	70.6 –29.4	75.8 – 24.2	69.2 – 30.8	16
పోలవరం	85.6 – 14.4	81.1 – 18.9	76.0 – 24.0	78.5 – 21.5	76.3 – 23.7	4

పునరావాస పనులపై సమీక్ష నేడు

చింతూరు: పోలవరం ప్రాజెక్టు అడ్మినిస్ట్రేటర్ అభిషేక బుధవారం పోలవరం నిర్వాసిత గ్రామాల్లో పర్యటించి చేపట్టాల్సిన చర్యలపై సమావేశం నిర్వహిస్తారని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి శుభం నొక్వాల్ మంగళవారం చెప్పారు. ఫేజ్ ఎల్‌లో నిర్వాసితులకు చేపట్టిన పునరావాసం, పునర్వ్యవస్థీకరణ పురోగతి, చేపట్టాల్సిన పనులపై అధికారులతో సమీక్షిస్తారన్నారు. భూసేకరణ, పెండింగ్ కేసులు, పరిహారం చెల్లింపుల వివరాలను తెలుసుకుని, నిర్వాసిత కాలనీల్లో వసతులు, రహదారులు, ఇతర అభివృద్ధి కార్యక్రమాలను పరిశీలించనున్నారని వివరించారు.

ఉపాధిలో అద్వితీయం!

వందరోజుల పని దినాల కల్పనలో జిల్లా ప్రథమం

పాడేరు పట్టణం, న్యూస్‌టుడే

రాష్ట్రంలో ఉపాధి కూలీలకు వంద రోజులు పని దినాలు కల్పించడంలో జిల్లా అగ్రస్థానంలో నిలిచింది. ముఖ్యంగా పనులు, అంచనాలను గుర్తించి లక్ష్యాలను చక్కగా నిర్దేశించుకోవడంతోనే ఈ ఘనత సాధించినట్లు అధికారులు చెబుతున్నారు. కలెక్టర్ దినేష్‌కుమార్ సైతం ఉపాధి కూలీలకు వంద రోజుల పని కల్పించడంలో గుర్తింపు లభించినందుకు రాష్ట్ర గణతంత్ర దినవేడుకల్లో ఉపాధిహామీ అధికారులు, క్షేత్రస్థాయి సిబ్బందిని మెచ్చుకున్నారు. ఇదే ఉత్సాహంతో భవిష్యత్తులో మరిన్ని పనులు చేపట్టాలని ఆకాంక్షించారు

ఉపాధి పనులు పరిశీలిస్తున్న అధికారులు

ఉమ్మడి అల్లూరి జిల్లాలో ఉపాధి హామీ అమలు తీరిలా...

వేతన లక్ష్యం	: రూ. 327 కోట్లు
మెటీరియల్ లక్ష్యం	: రూ.287 కోట్లు
కూలీలు	: 3.27 లక్షలమంది
ఆధారపడిన కుటుంబాలు	: 1.63 లక్షలు
ప్రధాన పనులు : పంట, ఊట కుంటలు, అమృత్ సరోవర్, రాతి కట్టడాలు	

సహజ వనరులు సంరక్షించేలా..

ఉపాధి హామీలో స్థానికంగా ఉన్న సహజ వనరులను సంరక్షించే పనులకు ప్రాధాన్యమివ్వాలి. జిల్లా జల యాజమాన్య సంస్థ (డ్వామా) అధికారులు క్షేత్రస్థాయిలో సర్వే చేపట్టి ఏ పనులు అవసరమో సరిగ్గా అంచనా వేస్తున్నారు. సాగునీటి వనరుల వృద్ధి, సంరక్షణ పనులు ఎక్కువగా చేపట్టడంతో భూసారం పెరిగి వ్యవసాయ, ఉద్యాన పంటలు సమృద్ధిగా పండుతున్నాయి. కూలీలకు ఆటంకం లేకుండా పని లభ్యమవుతోంది. కొన్ని జిల్లాల్లో పనులు గుర్తించడంలో అధికారులు విఫలం చెందడం కారణంగా కూలీలకు పూర్తిస్థాయిలో ఉపాధి దక్కడం లేదు. జిల్లాలో ఈ సమస్య రాకుండా అడిగిన వెంటనే పని కల్పించడంతో కూలీలు సంతృప్తి వ్యక్తపరుస్తున్నారని డ్వామా ప్రాజెక్ట్ డైరెక్టర్ విద్యాసాగరరావు పేర్కొంటున్నారు.

100 రోజులు పని లభించిన కుటుంబాల వివరాలివీ..

సంవత్సరం	కుటుంబాలు
2022-23	15,172
2023-24	43,314
2024-25	48,639
2025-26 (జనవరి నాటికి)	26,097

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించండి
Cell: 80085 97607
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 80082 34669

కండల వీరులు.. యువ కిశోరాలు

నన్నయవర్సిటీలో అంతర్ కళాశాలల దేహదారుఢ్య పోటీలు ఉత్సాహంగా సాగాయి. ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల పరిధిలోని అనుబంధ కళాశాలల విద్యార్థులు హాజరయ్యారు. ప్రతిభ చాటిన వారిని వర్సిటీ జట్టుకు ఎంపిక చేశారు. బెస్ట్‌ఫిజిక్ మెన్ టీమ్ ఛాంపియన్ షిప్‌ను కాకినాడ పి.ఆర్. ప్రభుత్వ కళాశాల కైవసం చేసుకుంది. – న్యూస్‌టుడే, రాజానగరం

(c) eenadu

నాడు నైనై.. నేడు రయ్ రయ్

గత ప్రభుత్వ అయిదేళ్ల పాలనలో రహదారులు పాడై వర్షాకాలంలో తటాకాలను తలపించినా పట్టించుకోలేదు. దీంతో ప్రజలు, వాహనదారులు రాకపోకలకు తీవ్ర అవస్థలు పడ్డారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తరువాత వీరి కష్టాలు ఒక్కొక్కటిగా దూరమవుతున్నాయి. రెండు నియోజకవర్గాలకు అనుసంధానంగా ఉన్న ముక్తేశ్వరం-ముమ్మిడివరం ప్రధాన రహదారిని ముక్తేశ్వరం నుంచి కె.జగన్నాథపురం వరకు రూ.3.20 కోట్లతో తాజాగా ఆధునికీకరించారు. గత నెలలో చేపట్టిన పనులు ప్రస్తుతం పూర్తయ్యాయి. దీంతో హాయిగా ప్రయాణం సాగించేందుకు అవకాశం ఏర్పడిందని అంతా సంతోషిస్తున్నారు.

– న్యూస్‌టుడే, అయినవిల్లి

సముద్రుడు.. వెనక్కి మళ్లాడు..!

యు.కొత్తపల్లి మండల పరిధిలోని ఉప్పాడ తీరంలో సముద్రం ఒక్కసారిగా వెనక్కి వెళ్లి ఆశ్చర్యానికి గురిచేసింది. మంగళవారం ఉదయం 9 గంటలప్పుడు కెరటాలు దూసుకొచ్చి రహదారిని తాకాయి. అంతలోనే ప్రశాంత వాతావరణం నెలకొని 50 మీటర్ల దూరం సముద్రం వెనక్కి వెళ్లింది. దీంతో ఆ ప్రాంతంలో జియోట్యూబ్ ఆనవాళ్లు బయటపడ్డాయి. సముద్రంలో ఏర్పడే ఆటుపోటు సమయంలో ఇలా ముందుకు, వెనక్కు మళ్లుతుందని మత్స్యకారులు పేర్కొన్నారు.

– న్యూస్‌టుడే, కొత్తపల్లి

దుమ్ము.. దుమారం

ఉండ్రాజవరం మండలంలోని వడ్లూరు, పెరవలి రహదారిలో కాకరపర్రు కాలువ ప్రాంతంలో వాహనాల రాకపోకల సమయంలో రోడ్డుపై నిలువెత్తున దుమ్ము రేగుతోంది. దీంతో వెనుక నుంచి వెళ్లే వారికి కళ్లలో పడుతుండడంతో ఇబ్బందులు తప్పడం లేదు. దుమ్ము తెర కారణంగా ముందు ఏముందో తెలిక అవస్థలు ఎదుర్కొంటున్నారు. కొన్ని సందర్భాల్లో అదుపు తప్పి వాహనాలు బోల్తాపడి ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఆ ప్రాంతంలో రోడ్డు అభివృద్ధి చేయాలని పరిసర గ్రామాల ప్రజలు కోరుతున్నారు. పరిశీలించి చర్యలు తీసుకుంటామని ర.భ.శాఖ ఏఈ శ్రీనివాస్ తెలిపారు.

– న్యూస్‌టుడే, ఉండ్రాజవరం

క్రీడా పోటీల్లో ప్రతిభ చాటండి: కలెక్టర్

అమలాపురం గ్రామీణం, న్యూస్‌టుడే: శాప్ లీగ్-2026 పేరుతో ఏడాది పొడవునా నిర్వహించే మల్టీ స్పోర్ట్స్ లీగ్ పోటీల్లో పాల్గొని ప్రతిభను చాటాలని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ పిలుపునిచ్చారు. స్థానిక జి.ఎం.సి.బాలయోగి స్టేడియంలో శాప్ లీగ్ చదరంగం పోటీలను కలెక్టర్ దంపతులు మంగళవారం ప్రారంభించారు. 12 నుంచి 20 ఏళ్ల మధ్య క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ఈ పోటీలను నిర్వహిస్తున్నారని కలెక్టర్ తెలిపారు. ఇందులో 31 క్రీడాంశాలు ఉన్నాయన్నారు. విజేతలకు ఆకర్షణీయమైన ప్రోత్సాహక బహుమతులు అందించడంతోపాటు రాష్ట్రస్థాయికి ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. ఈ నెల 24న సైక్లింగ్ పోటీలను జి.ఎం.సి.బాలయోగి క్రీడా మైదానంలో నిర్వహిస్తున్నామన్నారు. చదరంగంలో ప్రతిభ కనబరిచిన వారికి ఈ నెల 28, మార్చి 1న విజయవాడలో జరిగే పోటీల్లో పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో డీఎస్‌డీఓ వి.ఆర్.రుద్ర, కార్యదర్శి కె.ఈశ్వరరావు, రమాదేవి, పీఈటీలు బి.ఎస్.ఎన్.మూర్తి, జి.వి.సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి రూ.5 లక్షల విరాళం

ఆత్రేయపురం, న్యూస్‌టుడే: ఆత్రేయపురంలోని శ్రీ రాజరాజేశ్వరి, వేణుగోపాలస్వామి ఆలయ పునర్ నిర్మాణ పనులకు పలువురు దాతలు తమ వంతు చేయూతనందించారు. గ్రామానికి చెందిన సాగిరాజు రామకృష్ణ రాజు(నల్లి) దంపతుల కుమారుడు తేజ్‌వర్మ రూ.5లక్షల విరాళాన్ని అందించారు. చిలువూరి వెంకట్రాజు, నాగమణి దంపతులు కుమార్తె ప్రవాసాంధ్రురాలు దేవీ సునీత భారతి రూ.1,11,116లు విరాళం అందించారు. ఆలయ కమిటీ ఛైర్మన్‌లు వేగేశ్న ప్రసాద్‌రాజు, పులవర్తి కాశీవిశ్వనాథం, వాడపల్లి దేవస్థానం ఛైర్మన్ ముదునూరి వెంకట్రాజు తదితరులు పాల్గొన్నారు.

గంగపుత్రులకు తాగునీటి బెంగ
హార్బర్‌లో తప్పని ఇక్కట్లు

న్యూస్‌టుడే, సఖినేటిపల్లి

అంతర్వేది పల్లిపాలెంలో ఉన్న మినీ ఫిషింగ్ హార్బర్‌కు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి చేపలవేట కోసం వచ్చే గంగపుత్రులకు తాగునీటి కష్టాలు తప్పడం లేదు. ఇందుకోసం రూ.వేలు వ్యయం చేయాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల 60 వేల లీటర్ల తాగునీటి ఓవర్‌హెడ్ ట్యాంకు మంజూరు చేసినా పనుల ప్రారంభంలో జాప్యంతో అవస్థలు తప్పడం లేదు. ప్రస్తుతం వేసవి కాలం వచ్చేసింది. దీంతో మరిన్ని అవస్థలు తప్పవని వాపోతున్నారు.

ట్యాంకుల ద్వారా తాగునీటిని తీసుకొచ్చిన వాహనం

బోటుకు రూ.600, సోనా బోటుకు రూ.1500 అదనపు ఖర్చు అవుతుందని చెబుతున్నారు. కొందరైతే నగదు ఇవ్వలేక చేపలిస్తుంటారు (వస్తు మార్పిడి పద్ధతి). అదనపు ఖర్చుతో ఇక్కడికి రావడానికి ఆసక్తి చూపక కాకినాడ, మచిలీపట్నం హార్బర్లకు వెళ్లిపోతున్నారు. తాగునీటి సౌకర్యం కల్పిస్తే రోజుకు 200 బోట్ల వరకు వస్తాయని జాలర్లు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

రోజువారీ వచ్చే బోట్ల సంఖ్య: 50–100

ఒక్కో బోటుపై ఉండేవారు: ఆరుగురు

నీటి అవసరం ఇలా.. (లీటర్లు)
- తెప్పబోటుకు (రోజుకు): 50
- ఫైబర్ బోటుకు (4 రోజులకు): 600
- సోనా బోటుకు (వారానికి): 1500

కమిటీని నియమించినా..

మత్స్యకారుల సంక్షేమమే లక్ష్యంగా 2016-19లో అప్పటి తెదేపా ప్రభుత్వం రూ.32 కోట్లు మంజూరు చేసి అంతర్వేదిలో మినీ ఫిషింగ్ హార్బర్‌ను నిర్మించింది. కొన్ని మౌలిక సదుపాయాలు కల్పించింది. మరికొన్ని మిగిలి ఉండగా వైకాపా ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. ఏవిధమైన అభివృద్ధి కార్యక్రమాలపై శ్రద్ధపెట్టలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆరు నెలల కిందట కలెక్టర్ ఛైర్మన్‌గా 14 మంది సభ్యులతో కమిటీని ఏర్పాటు చేసింది. పీపీపీ విధానంలో అభివృద్ధి చేయడానికి టెండర్ ద్వారా ఆర్ఆర్ ఏజెన్సీకి బాధ్యతలు అప్పగించింది. అభివృద్ధిలో భాగంగా 60 వేల లీటర్ల తాగునీటి ఓవర్‌హెడ్ ట్యాంకు మంజూరు చేశారు. దీని నిర్మాణానికి ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు మెగా ఇంజినీరింగ్ సంస్థకు అప్పగించారు. రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ భూమిపూజ చేశారు. కేవలం మట్టి పరీక్షలు తప్ప ఇప్పటివరకు పనులు ప్రారంభించలేదు.

ప్రైవేట్‌గా కొనుగోలు చేయలేక..

తాగునీటి సౌకర్యం లేకపోవడంతో ప్రైవేట్ వ్యక్తుల నుంచి లీటరు రూ.1 చొప్పున తెప్పకు రూ.50, ఫైబర్

త్వరలో ప్రారంభిస్తాం..

హార్బర్‌లో ఓవర్‌హెడ్ ట్యాంకు నిర్మాణం మెగా ఇంజినీరింగ్ సంస్థ చేపడుతుంది. నిర్మాణ ప్రదేశంలో మట్టి పరీక్షలు జరిగాయి. మత్స్య, పంచాయతీరాజ్ నుంచి ఎన్‌వోసీ ఇవ్వాల్సి ఉంది. ఇచ్చిన వెంటనే పనులు ప్రారంభిస్తాం. మూడు నెలల్లో పూర్తి చేస్తాం.

- మారుతీరావు, డీఈ, ఆర్‌డబ్ల్యూఎస్, రాజోలు

నేటి నుంచి పెద్దింట్లమ్మ జాతర

సఖినేటిపల్లి, న్యూస్‌టుడే: చిన్న కొల్లేరు పెద్దింట్లమ్మ అమ్మవారిగా పిలిచే మెండుపాలెం(కేశవదాసుపాలెం) అమ్మవారి జాతర మహోత్సవాలు నేటి నుంచి ప్రారంభం కానున్నాయి. ఉత్సవాలకు సంబంధించిన ఏర్పాట్లు కమిటీ ఇప్పటికే పూర్తిచేశారు.

ఉదయం అమ్మవారికి దూపదీప నైవేద్యాలు సమర్పించి, పూజలు చేసి ప్రారంభిస్తారు. మార్చి 18వరకు ఈ ఉత్సవాలు నిర్వహించనున్నారు. సుమారు 5లక్షల వరకు భక్తులు వస్తారని అంచనా వేస్తున్నారు.

జేఈఈ మెయిన్ ఫలితాల్లో
తిరుమల ప్రతిభ

విద్యార్థులను అభినందిస్తున్న తిరుమల విద్యాసంస్థల అధినేత తిరుమలరావు, తదితరులు

కంబాలచెరువు (రాజమహేంద్రవరం), న్యూస్‌టుడే: జేఈఈ మెయిన్ ఫలితాల్లో రాజమహేంద్రవరంలోని తిరుమల ఐఐటీ అండ్ మెడికల్ అకాడమీ విద్యార్థులు ప్రతిభ చాటారని తిరుమల విద్యాసంస్థల ఛైర్మన్ నున్న తిరుమలరావు తెలిపారు. తమ అకాడమీ విద్యార్థి డి.శ్రీవేద్ 99.999 పర్సంటైల్ సాధించి ఎస్సీ కేటగిరీలో ఆలిండియా టాపర్‌గా నిలిచాడన్నారు. ఎం.కృష్ణ శరవణ సాకేత్ 99.99, గన్నమనీడి వాత్సల్య 99.98, జి.ప్రభవ్ తేజ 99.97, ఎం.సోనీష్ శివసాయి శ్రీవాత్స, పి.వెంకట నాగ సూర్య ధావన్, ఎం.వెంకట సత్యవివేక్ 99.95 పర్సంటైల్ చొప్పున సాధించారని వివరించారు. 99.50 పర్సంటైల్‌కు పైగా 57, 99 పర్సంటైల్‌కు పైగా 121, 98 పర్సంటైల్‌కు పైగా 226, 97 పర్సంటైల్‌కు పైగా 323, 96 పర్సంటైల్‌కు పైగా 410, 95 పర్సంటైల్‌కు పై 492, 90 పర్సంటైల్‌కు పైగా 829 మంది చొప్పున సాధించారన్నారు. సుమారు 800 మంది వివిధ ఎన్ఐటీ, ఐఐటీల్లో సీట్లు సాధించగలరన్నారు. అత్యుత్తమ ప్రతిభ చూపిన విద్యార్థులను అకడమిక్ డైరెక్టర్ జి.సతీష్‌బాబు, ప్రిన్సిపల్ వి.శ్రీహరితో కలిసి మంగళవారం అభినందించారు.

శ్రీషిర్డీసాయి జయకేతనం

శ్రీషిర్డీసాయి విద్యార్థులను అభినందిస్తున్న యాజమాన్యం

కంబాలచెరువు(రాజమహేంద్రవరం): జేఈఈ మెయిన్-2026 ఫలితాల్లో రాజమహేంద్రవరంలోని శ్రీషిర్డీసాయి జూనియర్ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చి వివిధ కేటగిరీల్లో అత్యుత్తమ పర్సంటైల్ సాధించారని విద్యాసంస్థల డైరెక్టర్ టి.శ్రీవిద్య మంగళవారం తెలిపారు. తమ లక్ష్య ఐఐటీ అకాడమీలో శిక్షణ పొందుతున్న ఎం.కృష్ణ శ్రీకృతి 99.91, కె.రామకార్తిక్ 99.71, ఎం.శ్రీనివాస్ 99.68, బి.శ్రీనిశాంత్ 99.63, కేవీఎంకే ప్రణీత్ 99.48, కె.సాత్విక్ 99.28, ఎ.లోహిత్‌కుమార్ 99.23, బి.శ్రీనిహాంత్ 99.11 పర్సంటైల్ చొప్పున సాధించారన్నారు. మొత్తం ఎనిమిది మంది 99కి పైగా పర్సంటైల్, 16 మంది 98కి పైగా, 28 మంది 97కిపైగా 52 మంది 95కి పైగా పర్సంటైల్ సాధించారన్నారు. శ్రీషిర్డీసాయి విద్యాసంస్థల ఛైర్మన్ తంబాబత్తుల శ్రీధర్ మాట్లాడుతూ జేఈఈ మెయిన్‌కు హాజరైన 284 మంది విద్యార్థుల్లో 184 మంది అడ్వాన్స్‌డ్‌కు అర్హత సాధించారన్నారు. ప్రతిభ చాటిన విద్యార్థులను, కృషి చేసిన అధ్యాపక బృందాన్ని ఛైర్మన్ శ్రీధర్, లక్ష్య డీన్ చంద్రశేఖర్ ప్రత్యేకంగా అభినందించారు.

మెరిసిన ఆదిత్య

శ్రీసాయి వైభవ్

రాఘవరావు

శ్రీజన్

శ్రీరామ్

గాంధీనగర్: జేఈఈ మెయిన్-2026 ఫలితాల్లో ఆదిత్య విద్యార్థులు జాతీయస్థాయిలో అత్యుత్తమ పర్సంటైల్స్‌తో సత్తా చాటారని ఛైర్మన్ ఎన్.శేషారెడ్డి మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను అభినందించారు. ఆదిత్య విద్యా సంస్థల కార్యదర్శి ఎన్.కృష్ణ దీపక్ రెడ్డి మాట్లాడుతూ ఎన్.శ్రీసాయివైభవ్ 99.99, వివిఎస్ఎస్ రాఘవరావు, గంజి శ్రీజన్ 99.98, బుడి శ్రీరామ్ 99.97, సత్యం భువనచంద్ర 99.96 పర్సంటైల్‌ను సాధించారన్నారు. మొత్తం 41 మంది విద్యార్థులు 99, ఆపైన పర్సంటైల్‌తో అత్యుత్తమ ప్రతిభ కనబర్చారన్నారు. డైరెక్టర్లు ఎన్.లక్ష్మీరాజ్యం, ఎన్.శృతి, ఎన్.సుగుణ, కోఆర్డినేటర్ కె.లక్ష్మీకుమార్, అకడమిక్ డైరెక్టర్ రాఘవరెడ్డి, గంగిరెడ్డి, ప్రిన్సిపల్స్ జె.మెయిన, పి.సత్యనారాయణరెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ ఫణీంద్ర తదితరులు విద్యార్థులు, అధ్యాపకులను అభినందించారు.

దేహదారుఢ్య పోటీల్లో అదరగొట్టిన కుర్రాళ్లు

విజేతలతో వీసీ ప్రసన్నశ్రీ, అధ్యాపకులు

రాజానగరం, న్యూస్‌టుడే: యువత చదువుతో పాటు అన్నిరంగాల్లో రాణించాలని నన్నయ విశ్వవిద్యాలయం వీసీ ప్రసన్నశ్రీ పేర్కొన్నారు. నన్నయలో మంగళవారం ఇంటర్ కాలేజీమేట్ బెస్ట్‌ఫిజిక్ మెన్ విశ్వవిద్యాలయం ఎంపికలు నిర్వహించారు. వివిధ విభాగాల్లో జరిగిన పోటీలో యూనివర్సిటీ అనుబంధ కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విజేతలకు వీసీ ఎస్.ప్రసన్నశ్రీ చేతుల మీదుగా పతకాలు అందించారు. ఆర్గనైజింగ్ ఛైర్మన్ కె.సుబ్బారావు, కార్యదర్శి వి.సాల్మన్ దేవానంద్, పరిశీలకులు ఆర్.వి.ఎల్.ఎస్.రత్నాకర్, సెలక్షన్ కమిటీ సభ్యులు వై.భాస్కరరావు, వి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

విజేతల వివరాలు: ● 60 కిలోల విభాగం: ఎన్.పూర్ణ సతీష్, కె.జగదీష్‌కుమార్ (డీఎన్ఆర్ కళాశాల, భీమవరం), ఆర్.కాశీవిశ్వనాథ్ (ఐడియల్ కళాశాల, కాకినాడ) మొదటి మూడు స్థానాల్లో నిలిచారు. ● 65 కిలోలు: వై.భరత్(ఆదిత్య కళాశాల, ఏలూరు), పి.సూరిబాబు(గోపన్నపాలెం), ఎ.జగదీష్(పాలకొల్లు). ● 70 కిలోలు: ఎల్.వి.సూర్యప్రకాష్, బి.సాయిప్రశాంత్, బి.దుర్గాప్రసాద్(పీఆర్ కళాశాల, కాకినాడ). ● 75 కిలోలు: ఎం.సాయిలోకేష్(సీ.ఆర్.రెడ్డి కళాశాల, ఏలూరు), బి.మహేష్, డి.అరుణ్‌కుమార్ (పీఆర్ కళాశాల, కాకినాడ) తొలి మూడు స్థానాల్లో నిలిచారు. ● 80 కిలోలు: పి.విజయ చాముండేశ్వర్ (పీఆర్ కళాశాల, కాకినాడ) ● 85 కిలోలు: షేక్‌మన్సూర్ (బీవీ రాజు కళాశాల, భీమవరం), 90 కిలోలు: కె.పవన్‌సాయి (పీఆర్ కళాశాల, కాకినాడ), 95 కిలోలు: కె.పాండురంగ వరప్రసాద్ (డా.సీ.ఎస్.కళాశాల, భీమవరం) పతకాలు సొంతం చేసుకున్నారు. ● మిస్టర్ నన్నయ విశ్వవిద్యాలయం 2025-26 ట్రోఫీని కె.పాండురంగ వరప్రసాద్ (డా.సీ.ఎస్.ఎన్.డిగ్రీ అండ్ పీజీ కళాశాల, భీమవరం), ●బెస్ట్‌ఫిజిక్ మెన్ టీమ్ ఛాంపియన్ షిప్ (పి.ఆర్.ప్రభుత్వ కళాశాల, కాకినాడ) కైవసం చేసుకున్నారు.

EENADU Classifieds

AUTO

VEHICLES FOR SALE

శ్రీలలిత రైస్‌మిల్, పెద్దాపురం వారి ఇన్నోవా కార్లు అమ్మకమునకు కలవు. Contact Cell: 94941 54551.

BUSINESS SERVICES

బంగారం బ్యాంకులలో/ ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈరోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్). Ph: 81422 92071.

శ్రీ సాయి గోల్డ్ తాకట్టులో ఉన్న బంగారం ఏ బ్యాంక్/ ప్రైవేట్ సంస్థల నుండి అయినా విడిపించి, ఆ రోజు మార్కెట్ రేట్‌కి కొనబడును. స్పాట్ క్యాష్, ✆ 9493338823.

FINANCIAL SERVICES

స్థిరాస్తులపై ఆంధ్రప్రదేశ్ అంతటా మార్ట్‌గేజ్ లోన్స్ మరియు స్థిరాస్తి ఎక్కడ ఉన్నా ఏ సంస్థలో ఉన్నా Xerox పేపర్స్‌పై 2nd మార్ట్‌గేజ్ లోన్ ఇవ్వబడును. 50 లక్షలులోపు, అయోధ్య కోఆపరేటివ్ బ్యాంక్. ✆ 93969 99669.

REAL ESTATE

LAND FOR SALE

RAJAMAHENDRAVARAM RURAL

కడియం మండలం, మాధవరాయుడుపాలెం పరిధిలో పేపరుమిల్లు వెనుక 3 1/2 ఎకరముల భూమి వ్యవసాయం మరియు పరిశ్రమలకు అనువైనది అమ్మకం. ✆ 7702691117.

PLOT FOR SALE

KAKINADA CITY

Properties Bazar's @ Kakinada Touch Your Luck, Buy Plot & Win Plot, Free Lucky Draw with Guaranteed Prizes. Cell: 9154184236

RAJAMAHENDRAVARAM RURAL

రాజమండ్రి, పిడింగొయ్యి పంచాయతీలో DTCP అప్రూవ్ కలిగిన N/E 272 చ|గ|లు, N/F 272 చ|గ|ల స్థలములు అమ్మకం. Contact: 7382 19 4444.

JOBS

Wanted DRA Tele Callers, Field Executives & Team Leaders Banking Sector Attractive Salaries and Incentives, ✆ 9849394835, 7075345527.

Wanted Teachers for Reputed Schools in A.P & Telangana, Contact: Sneha Placements Service. Ph: 94402 46409.

WANTED: Telecallers for Reputed Overseas Edu Consultancy in Rajahmundry. Experence Preferred. Contact Cell: 98521 59999.

WANTED we are Hiring Front Office Staff (Female) - 02 no's Salary - 12 k 08 Hours Duty SprintOn, JN Road Rajamahendravaram ✆ 99663 57897

త్రినేత్ర హోంకేర్‌లో వృద్ధులను/ పేషెంట్స్‌ను/పిల్లలను చూసుకొనుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఫ్రీ వసతి, భోజనం. జీ: 18K. ✆ 8520980099, 8520874499

కాకినాడలోని భానుగుడి జంక్షన్ నందు బట్టల షాపులో పనిచేయుటకు సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. శాలరీ - 15,000/-/ 4 W/O. + ESI + EPFO. సెల్: 9885295999.

బిజినెస్ ఎగ్జిక్యూటివ్స్/ బిజినెస్ మేనేజర్స్ కావలెను. డిగ్రీ, 5 సం||ల మార్కెటింగ్ రంగంలో అనుభవం, 30 సం||ల లోపు వారు రెజ్యూములను kamatham-job@gmail.comకు పంపగలరు.

హరేకృష్ణ హోంకేర్‌లో వృద్ధులను/ పేషంట్స్/ పిల్లలను చూసుకొనుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఫ్రీవసతి, భోజనం జీ:18-20K ✆ 96404 68899, 96402 58899

WANTED STAFF
★ Pre-Primary Teachers
★ Primary Teachers All Subjects
★ High School Teachers All Subjects
★ Office Assistant -cum-Telecaller
★ Computer Operator
Good Communication skills in English preferred. Walk-in for Interview
Resume to: 70951 52111
INTERNATIONAL DELHI PUBLIC SCHOOL Rajanagaram & Rajahmundry

SECURITY GUARDS

Wanted Security Guard: Night Duty 8 pm to 6 am, Salary: Rs.12,000/- Per Month, Work is at Kakinada. Contact: 95020 97778.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర
★ For the Information of Trade & Industry
★ తూర్పుగోదావరి జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారంగేటు ధర రూ. 5-15 పై॥
అనపర్తి ఆఫీసు: 08857-226908

EENADU for Advertisement Contact: 8008597607

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్-లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

జగనన్న లేఅవుట్లలో విజిలెన్స్ తనిఖీలు

చొల్లంగి జగనన్న లేఅవుట్‌లో విచారణ చేస్తున్న విజిలెన్స్ డీఎస్పీ ఎస్.తాతారావు, అధికారుల బృందం

తాళ్లరేవు, న్యూస్‌టుడే: చొల్లంగి, జి.వేమవరం గ్రామాల్లో 2019-24 వరకు పేదలందరికీ జగనన్న ఇళ్ల స్థలాల భూసేకరణపై విజిలెన్స్ డీఎస్పీ ఎస్.తాతారావు, వివిధ శాఖల అధికారుల బృందం మంగళవారం విచారణ చేపట్టింది. చొల్లంగిలో సర్వే నంబరు 16/23 బి1లో 3.67 ఎకరాల్లో 126 మంది లబ్ధిదారులను ఎంపిక చేశారు. 101 మందికి స్థలాలు మంజూరు చేశారు. వారిలో 44 మంది ఇళ్లు నిర్మించుకున్నారు. అధికారుల బృందం కాలనీలో రహదారుల ఏర్పాటు, స్థలం మెరక పనులను పరిశీలించింది. ఇళ్ల స్థలాలకు సేకరించిన భూమికి సంబంధించి తమకు పూర్తిగా డబ్బులు అందలేదని చొల్లంగికి చెందిన రైతులు దిమ్మల మరిడయ్య, గుమ్మళ్ల నూకరాజు విజిలెన్స్ డీఎస్పీకి ఫిర్యాదు చేశారు. ప్రభుత్వం ఎకరానికి రూ.55 లక్షలకు కొనుగోలు చేసిందని, పూర్తి స్థాయిలో డబ్బులు ఇవ్వలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు.
● జి.వేమవరం సర్వేనంబరు 306/6, 307, 309/2లో 14.15 ఎకరాల్లో 574 మంది లబ్ధిదారులకు ఇళ్ల స్థలాలను కేటాయించారు. ఆ స్థలాలను విజిలెన్స్ బృందం పరిశీలించింది. గృహనిర్మాణ సంస్థ, రెవెన్యూ, ఉపాధి హామీ పథకం, మైన్స్ అధికారులు పాల్గొన్నారు.

ధరవరలు

అంబాజీపేట కొబ్బరి మార్కెట్

కొబ్బరి (క్వింటాళ్లలో)	ధర (రూ॥లలో)
కొత్తకొబ్బరి	18,500
కురిడీ (వెయ్యింటికి):	
పాతకాయ: గండేరా	30,500
గటగట	29,000
కొత్తకాయ: గండేరా	30,000
గటగట	29,000
నీటి కాయ (వెయ్యింటికి):	
పాత (ముక్కుడు) కాయ	20,000-21,000
కొత్త (పచ్చి) కాయ	16,000-17,000
కొబ్బరినూనె మార్కెట్:	
15 కిలోలు	5,000
కిలో	350

గమనిక: అంబాజీపేట కొబ్బరి మార్కెట్ ధరలు ప్రతి బుధ, శనివారాల్లో మాత్రమే మారుతాయి.

వెన్‌కాబ్ చికెన్ ధర కిలోకు రూ॥లో

ఫారంరేటు	115-00
రిటైల్ లైవ్	142-00
డ్రెస్డ్	206-00
స్కిన్‌లెస్	234-00

గోదావరి డెల్టా వ్యవస్థపై క్షేత్రస్థాయి పరిశీలన

కాటన్ అక్విడక్టును పరిశీలిస్తున్న గోదావరి రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు ఛైర్మన్ బి.పి.పాండ్య బృందం

పి.గన్నవరం, న్యూస్‌టుడే: గోదావరి డెల్టా వ్యవస్థ ఏవిధంగా పనిచేస్తుందనే దానిపై గోదావరి రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు(జీఆర్ఎంబీ) ఛైర్మన్ బి.పి.పాండ్య బృందం మంగళవారం పరిశీలన చేసింది. ధవళేశ్వరం బ్యారేజీ మొదలుకుని లొల్ల హెడ్‌లాకులు, పి.గన్నవరం వద్ద కాటన్, డొక్కా సీతమ్మ అక్విడక్టులు, అంతర్వేది సాగర సంగమం ప్రదేశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించింది. కాటన్ బ్యారేజీ ద్వారా ఉభయ గోదావరి జిల్లాలకు ఖరీఫ్, రబీ సీజన్లలో అందుతున్న సాగునీరు, ప్రజలకు తాగునీటి సరఫరా, కాలువల వ్యవస్థ తదితర విషయాలను జలవనరులశాఖ ఎస్.ఇ. కె.గోపీనాథ్ వివరించారు. ఈ సందర్భంగా పి.గన్నవరంలో పాండ్య కొద్దిసేపు విలేకరులతో మాట్లాడారు. డెల్టా వ్యవస్థ బాగానే పనిచేస్తోందన్నారు. జీఆర్ఎంబీ మెంబర్ సెక్రటరీ కాంబోజ్, ఈఈలు వేణుగోపాలరావు, కె.వెంకటేశ్వరరావు, డీఈఈ భూపతిరాజు రవి ప్రసాద్‌రాజు, ఏఈఈ బెహరా రమేష్‌బాబు, సాగునీటి సంఘాల అధ్యక్షులు చొల్లంగి సత్యనారాయణమూర్తి, కొల్నాడ సత్యనారాయణరాజు పాల్గొన్నారు.

92.7 FM Rajamahendravaram
ఈఎఫ్ఎమ్ కార్యక్రమాలు
సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ॥ 5 - ఉ॥ 7
ఈ-మార్నింగ్స్	ఉ॥ 7 - ఉ॥ 11
నువ్వా నేనా	ఉ॥ 11 - మ॥ 2
సత్యభామ	మ॥ 2 - సా॥ 5
లైట్ తీస్కో	సా॥ 5 - రా॥ 9
సరదాగా కాసేపు	రా॥ 9 - రా॥ 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా॥ 12 - తె॥ 5

/Eenadufm
For Advertising on Eenadu FM Contact
9000180626, 9989993175

నులిపురుగులను నివారిద్దాం

అంబాజీపేట హడ్కోకాలనీలో చిన్నారులకు మాత్రలు వేసిన ఎంహెచ్ఎన్ జాయింట్ డైరెక్టర్ సతీష్‌కుమార్‌తో స్థానిక వైద్యాధికారులు

అంబాజీపేట, న్యూస్‌టుడే: నులిపురుగులను నివారించేందుకు చిన్నారులకు మాత్రలు వేయడం ఓ ఉద్యమంలా సాగాలని రాష్ట్ర మాతృమరణాల నివారణ సంస్థ(ఎంహెచ్ఎన్) జాయింట్ డైరెక్టర్ సతీష్‌కుమార్ అన్నారు. అంబాజీపేట మండలంలోని వివిధ అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలల్లో చిన్నారులకు వేసిన నులిపురుగుల నివారణ మాత్రల కార్యక్రమాన్ని ఆయన మంగళవారం పరిశీలించారు. అంబాజీపేట పీహెచ్‌సీ పరిధిలో 5,124 మందికి గాను 5,076 మందికి 81 కేంద్రాల ద్వారా మాత్రలను పంపిణీ చేశారు. తొలుత అంబాజీపేట ఉన్నత పాఠశాలలో ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, అంబాజీపేట పీహెచ్‌సీ వైద్యాధికారులు వి.గౌతమి, కె.ఎన్.శ్రీనివాస్, ముక్కామల పీహెచ్‌సీ వైద్యాధికారి టి.దివ్య విద్యార్థులకు వీటిని అందజేశారు. ఆశా, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

రూ.కోట్లు వెచ్చించారు.. మూలకు చేర్చారు

విలసలో పనిచేయని యంత్రం

న్యూస్‌టుడే, అయినవిల్లి

గత ప్రభుత్వ పాలనలో రూ.కోట్లు వెచ్చించి రైతుభరోసా కేంద్రాల్లో ఏర్పాటు చేసిన కియోస్క్‌లు నిరుపయోగంగా మారాయి. రైతులకు మెరుగైన సేవలు అందించేందుకు అప్పట్లో ఆర్భాటంగా వీటిని ప్రారంభించారు. అనేక సమస్యలతో వినియోగానికి దూరమై తుప్పుపట్టి మూలకు చేరాయి. జిల్లాలో సుమారు 450 కియోస్క్‌లు వినియోగంలోకి తీసుకొస్తామని జిల్లా వ్యవసాయాధికారి ఎం.వెంకటరామారావు తెలిపారు.

అంతర్జాలం లేకపోవడంతో..

విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు, బ్యాంకింగ్.. తదితర సేవలకు గత ప్రభుత్వం కియోస్క్‌లను ఆర్బీకేల వారీగా సరఫరా చేసింది. అంతర్జాల సౌకర్యం కల్పించకపోవడం, గ్రామీణ ప్రాంతాల్లో నెట్‌వర్క్ సమస్యలతో వీటి వినియోగంలో అనేక ఇబ్బందులు ఎదురయ్యాయి. అప్పట్లో సిబ్బంది తమ చరవాణిలోని హాట్‌స్పాట్ సహాయంతో కొన్నింటిని వినియోగించేవారు. ప్రస్తుతం రైతుసేవా కేంద్రాల్లో వీటి అవసరం లేని కారణంగా మూలకు చేరాయి.

● అయినవిల్లి ఆర్ఎస్‌కే-1లో 2020లో కియోస్క్‌ను తొలుత అద్దె భవనంలో ఏర్పాటు చేశారు. కొద్దిమంది మాత్రమే ఎరువులు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకున్నారు. ఆ తరువాత ఫోన్ యాప్ అందుబాటులోకి రావడంతో దీన్ని పట్టించుకోలేదు. ● రాజోలు మండలం కడలి, చింతలపల్లి గ్రామాల్లో యూపీఎస్‌లు పనిచేయకపోవడం, టచ్‌ప్యాడ్ తెరవకపోవడం వంటి సమస్యలతో సిబ్బంది వినియోగించడం లేదు.

ఫోన్ ద్వారానే సేవలు..

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఎరువులు, పురుగు మందులను సొసైటీలు, ఆర్ఎస్‌కేల్లో అందుబాటులో ఉంచి రైతులకు విక్రయిస్తున్నారు. దీంతో కియోస్క్‌లకు పనిలేకుండా పోయిందని సిబ్బంది చెబుతున్నారు. యూరియా, ఇతర నమోదులు వ్యవసాయ, ఉద్యాన సహాయకులు ఫోన్ యాప్‌ల ద్వారా నిర్వహిస్తున్నారు.

శస్త్రచికిత్స అనంతరం వ్యక్తి మృతి
వైద్యుల నిర్లక్ష్యమే కారణమని కుటుంబ సభ్యుల ఆరోపణ

అమలాపురం పట్టణం, న్యూస్‌టుడే: అమలాపురంలోని శ్రీనిధి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం ఓ వ్యక్తి మృతి చెందారు. అతని కుటుంబ సభ్యులు, బంధువులు నిరసన తెలిపారు. పోలీసులు ఆసుపత్రికి వెళ్లి వారికి సర్ది చెప్పారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. రాజోలు మండలం పొన్నమండకు చెందిన మొగలతుర్తి సాయికృష్ణ(32) తాపీ పనిచేసేవారు. ఏడాది క్రితం రోడ్డు ప్రమాదంలో గాయపడటంతో కాలికి రాడ్డు వేశారు. ఆ ప్రాంతంలో నొప్పి రావడంతో సోమవారం సాయంత్రం ఆసుపత్రిలో చేరారు. మంగళవారం ఉదయం ఆసుపత్రిలో శస్త్రచికిత్స చేసి రాడ్ తీసేశారు. కొద్ది సేపటి తర్వాత ఒక్కసారిగా ఆరోగ్యం విషమించి మృతి చెందారు. వైద్యుల నిర్లక్ష్యం కారణంగానే మరణించాడని బంధువులు ఆరోపించారు. శస్త్రచికిత్స అనంతరం గుండె పోటుతో మృతి చెందినట్లు ఆసుపత్రి వైద్యులు తెలిపారు.

(c) eenadu

రహదారి అధ్వానం.. రాకపోకలకు నరకం

దేవీపట్నం, న్యూస్‌టుడే: మండలంలోని పోతవరం నుంచి చిన్నారి గండి వరకు దాదాపు 3కి.మీ రహదారి పొడవునా రాళ్లు తేలి భారీ గుంతలు ఏర్పడటంతో రాకపోకలకు అవస్థలు పడుతున్నామని గిరిజనులు వాపోతున్నారు. చిన్నారి గండి, పెనికలపాడు పునరావాస కాలనీ నిర్వాసితులు మండల కేంద్రమైన ఇందుకూరుపేటకు వెళ్లాలంటే ఈ మార్గంలోనే ప్రయాణించాలి. పోలవరం ముంపు గ్రామాలైన డి.రావిలంక, పరగసానిపాడు, బోడిగూడెం, నాగులపల్లి, పి.గొందూరు గిరిజనులు పాత గ్రామాలకు వెళ్లాలంటే చిన్నారిగండి నుంచి కొండమార్గాన వెళ్లి మామిడి, జీడిమామిడి పంటలను సాగుచేసుకుని ఈ రహదారి గుండానే రాకపోకలు సాగిస్తున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పదిహేళ్ల క్రితం వేసిన ఈ రహదారికి కనీసం మరమ్మతులు కూడా చేయలేదని, ఇప్పటికైనా అధికారులు స్పందించి రహదారి సౌకర్యం కల్పించాలని వేడుకుంటున్నారు.

పోతవరం నుంచి చిన్నారిగండికి అధ్వానంగా రహదారి

ప్రహరీ నిర్మించండి.. రక్షణ కల్పించండి

మారేడుమిల్లి : అసలే గిరిజన విద్యార్థులు.. పైగా చిన్నపిల్లలు.. వారికి అవసరమైన రక్షణ కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. ఆయా పాఠశాలలకు మౌలిక సదుపాయాలు అందుబాటులో లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. మారేడుమిల్లి పంచాయతీ పరిధిలోని పూజారిపాకలు గ్రామంలో ఉన్న పాఠశాలలో ఒకటి నుంచి ఐదో తరగతి వరకు విద్యార్థులు చదువుతున్నారు. పాఠశాల భవనం పాతబడిపోవడం, చుట్టూ కనీసం ప్రహరీ లేకపోవడంతో ఇబ్బందికరంగా మారింది. పైగా పాఠశాల పక్కనే పూర్తిగా శిథిలస్థితి చేరుకున్న మరో భవనం ఉండడంతో ప్రమాదాలు పొంచి ఉంటున్నాయి. సంబంధిత అధికారులు స్పందించి తగు చర్యలు చేపట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు. దీనిపై మారేడుమిల్లి ఎంఈవో-2 వి.ముత్యాలరావును 'న్యూస్‌టుడే' వివరణ కోరగా, పాఠశాల ప్రహరీ కోసం ప్రభుత్వానికి నివేదించామని, మంజూరైన వెంటనే నిర్మిస్తామని తెలిపారు.

ప్రహరీ లేని పూజారిపాకలు పాఠశాల

సౌకర్యాల కల్పనలో జాప్యం

మారేడుమిల్లి న్యూస్‌టుడే: మారేడుమిల్లిలో పారిశుద్ధ్య పనుల్లో భాగంగా గ్రామంలోని వీధులను శుభ్రం చేసి, వచ్చిన చెత్తను సైకిలు బళ్లపై వేసుకుని ఊరికి దూరంగా పారేస్తున్నారు. పారిశుద్ధ్య పనులను మరింత మెరుగ్గా చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం గ్రామ పంచాయతీకి సుమారు రూ.6 లక్షల వ్యయంతో ట్రాక్టరును కేటాయించింది. కాని ప్రభుత్వం అవగాహన లోపం, అధికారుల నిర్లక్ష్యం కారణంగా తొట్టెను మంజూరు చేయలేదు. తొట్టె ఉంటేనే పనులను సమర్థవంతంగా చేసేందుకు ఆస్కారం ఉంటుంది. గత్యంతరం లేని పరిస్థితుల్లో అది పంచాయతీ భవనంలోని గదికే పరిమితం అయింది. పైగా ట్రాక్టరు ఎవరికి కనిపించకూడదనే ఉద్దేశంతో గదికి తాళం వేసి రహస్యంగా ఉంచడం గమనార్హం. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి, చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

మారేడుమిల్లి సచివాలయంలో నిరుపయోగంగా ట్రాక్టరు

ప్రథమ వార్షికోత్సవంలో ఆలయ వ్యవస్థాపకులు, గ్రామస్థులు

వైభవంగా మల్లికార్జున వార్షికోత్సవం

మోతుగూడెం: చింతూరు మండలం మోతుగూడెం పంచాయతీ పొల్లూరు జలపాతం సమీపంలోని మల్లికార్జున స్వామి ఆలయ ప్రథమ వార్షికోత్సవాన్ని మంగళవారం వైభవంగా నిర్వహించారు. 65 ఏళ్ల క్రితం జలపాతం సమీపంలోని హిందుస్థాన్ కంపెనీ రహదారిలో కోర్టీ దొండప్ప నిర్మించిన ఈ ఆలయం గత నేపథ్యంలో కార్మికులు వెళ్ల శిథిలావస్థకు చేరింది. దీంతో ఆదిని మనవడు కోర్టీ మల్లికార్జున్, దేవి దంపతులు పురాతన దేవాలయాన్ని పునః ప్రతిష్ఠించి, మళ్లీ ప్రారంభించారు. ఆలయ వార్షికోత్సవాన్ని అర్చకస్వామి నవిల్లి కుమారస్వామి శర్మ ఆధ్వర్యంలో వేదమంత్రాల నడుమ ఘనంగా జరిపించారు. గణపతి పూజ, హోమం, పాలు, పంచామృత పుష్పాభిషేకం నిర్వహించారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారికి అభిషేకాలు నిర్వహించి, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

మేమున్నాం.. మీకు తోడుగా

ఉ. 10 - మ. 1

రంపచోడవరం 9490877172	అడ్డతీగల 9491575045
దేవీపట్నం 7673936638	గంగవరం 9493541083

గోతులమయంగా మార్గం

సమస్య: చింతకర్రపాలెం నుంచి మడగుకోట వెళ్లే రోడ్డు నిర్మించిన అనతి కాలంలోనే ఎక్కడ పడితే అక్కడ గోతులమయంగా మారింది. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలి.

-రామారావు, చింతకర్రపాలెం

పరిష్కారం: రోడ్డుకు పాడైన చోట్ల మరమ్మతులు చేసే విధంగా చర్యలు తీసుకుంటాం.

-సత్యన్నారాయణ, ఏఈ, వై.రామవరం మండలం.

– న్యూస్‌టుడే, వై.రామవరం

మురుగు కాలువలు అస్తవ్యస్తం

సమస్య: మారేడుమిల్లిలోని సీసీ రోడ్డు వీధిలో డ్రైనేజీలు అస్తవ్యస్తంగా తయారయ్యాయి. గతంలో నిర్మించినవి శిథిల స్థితికి చేరడంతో కనీసం మురుగు నీరు పారే ఆస్కారం లేకుండా పోయింది. ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు.

- కత్తుల లక్ష్మణ్‌రెడ్డి, మారేడుమిల్లి

పరిష్కారం: డ్రైనేజీల నిర్మాణానికి అవసరమైన చర్యలు చేపడతాం.

- వెంకటరమణ, డీఈఈ, పంచాయతీరాజ్‌శాఖ

– న్యూస్‌టుడే, మారేడుమిల్లి

సమస్యల పరిష్కారానికి ఐటీడీఏ ముట్టడి నేడు

చింతూరు, న్యూస్‌టుడే: మండలంలోని పేగ పంచాయతీలో సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ గ్రామస్థులు బుధవారం చింతూరు ఐటీడీఏ ముట్టడి కార్యక్రమం నిర్వహించనున్నట్లు యూత్ సభ్యులు మంగళవారం తెలిపారు. ఏడుగురాళ్లపల్లి నుంచి అల్లిగూడెం వరకు ఉన్న రహదారిని అభివృద్ధి చేసేందుకు నిధులు మంజూరైనా అటవీ అనుమతులు లేక అభివృద్ధి చేయడం లేదని, రాకపోకలకు ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. అత్యవసర వైద్యం కోసం ఏడుగురాళ్లపల్లి వెళ్లాలంటే అధిక సమయం పడుతోందన్నారు. పంచాయతీలో సమస్యలపై అనేకసార్లు అధికారులకు విన్నవించినా ఫలితం లేకపోయిందని, తప్పనిసరి పరిస్థితుల్లో ఆందోళన చేపట్టనున్నట్లు తెలిపారు.

ఎడుగురాళ్లపల్లి నుంచి పేగ వెళ్లే రోడ్డు దుస్థితి

పడవ చూస్తే చిల్లు.. ప్రయాణమంటే గుబులు

ముంచంగిపుట్టు, న్యూస్‌టుడే

మత్స్యగెడ్డపై రాకపోకలకు గిరిజనులు నడుపుతున్న పడవ శిథిలం కావడంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు. సుజనకోట పంచాయతీ పరిధిలోని 14 గ్రామాల గిరిజనులు మత్స్యగెడ్డ దాటేందుకు నాటు పడవలు ఆశ్రయించేవారు. ఎనిమిదేళ్ల క్రితం అప్పటి తెదేపా ప్రభుత్వం వీటిని సుడిపటం ప్రమాదమని గుర్తించి రెండు పడవలు ఉచితంగా మంజూరు చేసింది. తాడు సాయంతో వీటిని నడుపుతూ గిరిజనులు గెడ్డ దాటేవారు. పడవ నడిపేవారు నామమాత్రపు రుసుము తీసుకుంటూ వీటిని నిర్వహించేవారు. కాగా ఈ పడవల్లో గతంలోనే ఒకటి శిథిలమై ప్రవాహంలో కొట్టుకుపోయింది. ప్రస్తుతం వినియోగిస్తున్నది కూడా మరమ్మతుకు గురైంది. రంధ్రాలు ఏర్పడి గెడ్డనీరు పడవలోకి చేరుతుండటంతో ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు. ఒకవ్యక్తి నీటిని తోడి పారబోస్తున్నారు. తాడు ఆధారం చేసుకుని పడవ ప్రయాణంపై ఆధారపడి రాకపోకలు సాగిస్తున్నారు. వారపుసంతకు జరిగే రోజుల్లో శిథిలమైన పడవలో 20 నుంచి 30 మందిని ఒడ్డుకు చేరవేస్తుంటామని స్థానికులు తెలిపారు. కనీసం 500 మంది రోజూ తాడు ఆధారంగా ప్రయాణం చేస్తున్నారన్నారు. కుమ్మరిపుట్టు వద్ద రాకపోకలు సాగించేందుకు ప్రభుత్వం కొత్త పడవలు మంజూరు చేయాలని గిరిజనులు కోరుతున్నారు.

శిథిలమైన పడవలో చేరిన నీటిని తొలగిస్తున్న గిరిజనుడు

జంబూపట్నంలో చాగంటి ప్రవచనం నేడు

కోరుకొండ, న్యూస్‌టుడే: ప్రముఖ ప్రవచనకర్త, రాష్ట్ర ప్రభుత్వ నైతిక విలువల సలహాదారు చాగంటి కోటేశ్వరరావు బుధవారం మండలంలోని జంబూపట్నం గ్రామానికి రానున్నారు. శివాలయం ప్రాంగణంలో సాయంత్రం 6 గంటలకు ప్రవచనం చేయనున్నారు. అన్ని గ్రామాల ప్రజలు ఆహ్వానితులే అని నిర్వాహకులు తెలిపారు.

గస్తీ ముమ్మరం

కంబాలచెరువు(రాజమహేంద్రవరం), న్యూస్‌టుడే: ప్రజల భద్రతకు ప్రాధాన్యమిస్తూ నేరాలు జరగకుండా రాత్రి గస్తీ మరింత ముమ్మరం చేసినట్లు ఎస్పీ డి.నరసింహకిషోర్ తెలిపారు. ప్రత్యేక పోలీసు బృందాలను రంగంలోకి దింపామన్నారు. వాహనాల తనిఖీ, రోడ్డు ప్రమాదాల నివారణ, డ్రంక్ అండ్ డ్రైవ్, జాతీయ రహదారిపై ప్రయాణించే వాహనదారులకు ఫేస్‌వాష్ అండ్ గో కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు.

చెల్లింపుల్లో జాప్యం.. నిర్మాణాలు అసంపూర్ణం

అందుబాటులోకి రాని సచివాలయ భవనాలు

న్యూస్‌టుడే – చింతూరు

గత వైకాపా ప్రభుత్వం ఏర్పాటు చేసిన సచివాలయాలకు భవనాలు నిర్మించాలని తలపెట్టినప్పటికీ అవసరమైన నిధులు విడుదల చేయకపోవడంతో వివిధ దశల్లో నిలిచిపోయాయి. ఉపాధి హామీ పథకంలో నిర్మాణానికి 2019లో అనుమతులు వచ్చినా 2021లో నెమ్మదిగా పనులు మొదలయ్యాయి. అప్పటి వైకాపా నాయకులు నామినేషన్ పద్ధతిలో వారికి అనుకూలమైన వారికి పనులు అప్పగించారు. ఉపాధి పథకం నిధుల చెల్లింపులో జాప్యం జరగడంలో నిర్మాణాలు పూర్తిచేయకుండా ముఖం చాటేశారు.

ముకునూరులో నిర్మాణం నిలిచిన భవనం

ఒకే ప్రాంగణంలో..

సచివాలయ వ్యవస్థలో ఒకే ప్రాంగణంలో పంచాయతీ కార్యాలయం, రైతు భరోసా, ఆరోగ్య కేంద్రాలు ఏర్పాటు చేయాలనే ఉద్దేశంతో భవనాలు నిర్మించేందుకు నిర్ణయించారు. చింతూరు మండలంలో రూ. 81 లక్షల అంచనా వ్యయంతో 13 సచివాలయ భవనాల నిర్మాణలను పంచాయతీరాజ్, గిరిజన సంక్షేమ శాఖ ఇంజినీరింగ్ విభాగానికి ప్రభుత్వం అప్పగించింది. ముకునూరు, చట్టి, చిడుమూరు, మొతుగూడెం, పేగ పంచాయతీల్లో భవనాల నిర్మాణం పూర్తి కాలేదు. ఇంకా రూ. 30 లక్షల నిధులు మంజూరు కావాల్సి ఉంది. ప్రస్తుతం పంచాయతీ కార్యాలయాల్లోనే సచివాలయ కార్యకలాపాలు కొనసాగుతున్నాయి.

మొత్తం భవనాలు	13
అంచనా వ్యయం	రూ.85 లక్షలు
మంజూరు	రూ.55 లక్షలు
నిలిచిపోయినవి	9

పూర్తి చేసేలా చర్యలు

నిర్మాణాలు పూర్తిచేసేందుకు చర్యలు చేపడతాం. గతంలో నిధులు మంజూరు కాక కొంత జాప్యం జరిగింది. దాదాపు 70 శాతం పనులు పూర్తయ్యాయి. మిగిలినవి త్వరలో చేపడతాం.

- తరుణ్, ఏఈ, గిరిజన సంక్షేమ శాఖ

సకాలంలో గుర్తించు.. కుష్ఠు నివారించు..

కడియం, న్యూస్‌టుడే: సకాలంలో గుర్తిస్తే స్పర్శ కుష్ఠు నివారణ సాధ్యమేనని ఆ శాఖ జిల్లా నివారణాధికారి డాక్టర్.వసుంధర సూచించారు. కడియం మండలం చైతన్యనగర్ లెప్రసీకాలనీలో మంగళవారం ఉదయం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మైకోబాక్టీరియమ్ అనే సూక్ష్మక్రిమి సోకడంతో ఈ చర్మవ్యాధి కలుగుతుందన్నారు. ముందస్తు అవగాహనతో అరికట్టవచ్చాన్నారు. ఎండీటీ చికిత్సతో నూరుశాతం అంగవైకల్యం దూరమవుతుందన్నారు. ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాల్లో ఈ చికిత్స అందుబాటులో ఉందన్నారు. దాతలు సమకూర్చిన వాకర్లు, నడక కర్రలు, కళ్లద్దాలు, దుప్పట్లు, తదితర వస్తువులను రోగులకు పంపిణీ చేశారు. డాక్టర్ హారిక, పీఎంవో వీరలక్ష్మి, డీపీఎంవోలు నాగమలేశ్వరరావు, వెంకటరావు, మోషే, ఏఎన్ఎం లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

లెప్రసీ కాలనీలో మాట్లాడుతున్న జిల్లా అధికారిణి వసుంధర

అల్లూరి విగ్రహంపై నిర్లక్ష్యం తగదు

రాజవొమ్మంగి, న్యూస్‌టుడే: కొండపల్లిలో మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు విగ్రహాన్ని అధికారులు నిర్లక్ష్యంగా తుప్పల్లో వదిలేశారని గ్రామస్థులు మంగళవారం నిరసన చేపట్టారు. పెసా కమిటీ ఉపాధ్యక్షుడు కోటం వెంకటేశ్వరరావు మాట్లాడుతూ 516-ఈ జాతీయ రహదారి విస్తరణలో భాగంగా గ్రామంలో రోడ్డు పక్కనే ఉన్న అల్లూరి విగ్రహాన్ని దిమ్మతోసహా తొలగించి తుప్పలు, చెట్ల మధ్య వదిలేశారని ఆవేదన వ్యక్తం చేశారు. నెలలు గడుస్తున్నా హైవే అధికారులు స్పందించకపోవడం, నేటికీ సరైన స్థలంలో ఏర్పాటు చేయకపోవడం బాధాకరమన్నారు. స్వాతంత్ర్య సమరయోధుల విగ్రహాల పట్ల నిర్లక్ష్యం సరికాదని, తక్షణమే గౌరవప్రథమైన స్థలంలో ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. వార్డు సభ్యుడు సత్యనారాయణ, జనసేన నాయకుడు సుమంత్, గ్రామస్థులు పాల్గొన్నారు.

కొండపల్లిలో అల్లూరి విగ్రహం వద్ద గ్రామస్థుల నిరసన

దొరమామిడిలో ఎన్టీఆర్ ట్రస్టు ఉచిత వైద్య శిబిరం

గంగవరం, న్యూస్‌టుడే: మండలంలోని దొరమామిడిలో ఎన్టీఆర్ ట్రస్టు ఉచిత వైద్య శిబిరాన్ని మంగళవారం నిర్వహించారు. ట్రస్టు ఛైర్‌పర్సన్ నారా భువనేశ్వరి ఆదేశాల మేరకు ఎన్టీఆర్ ట్రస్టు ఆధ్వర్యంలో మండలంలోని 8 గ్రామాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నట్లు మాజీ ఎంపీపీ డా.తీగల ప్రభ తెలిపారు. ఈనెల 18,19,20,21,23,26,28 తేదీల్లో ఎండపల్లి, సూరంపాలెం, జగ్గంపాలెం, రాజవరం, మర్రిపాలెం, ఓజుబంధన, కుసుమరాయి గ్రామాల్లో నిర్వహించనున్నట్లు తెలిపారు. దొరమామిడిలో నిర్వహించిన వైద్య శిబిరంలో రోగులకు వైద్య సేవలందించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచి చంద్రకళ, ఎంపీటీసీ పండా ఆదినారాయణ, పెసా ఉపాధ్యక్షుడు మడకం రామారావు వైద్యాధికారి ప్రసాద్, ఎన్టీఆర్ ట్రస్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



గ్రామస్థులకు వైద్య సేవలందిస్తున్న వైద్యాధికారి

వేతనాల పెంపుపై ఉద్యోగుల హర్షం

రాజానగరం : రాష్ట్రవ్యాప్తంగా 108 సర్వీసులో ఉద్యోగులకు జీతాలు పెంచడం, ఆటోమేటిక్ స్లాబ్ అప్‌గ్రేడేషన్ విధానం వర్తింపజేయడంపై టీఎన్‌టీయూసీ, తెలుగునాడు 108 వర్కర్స్ యూనియన్ నేతలు హర్షం వ్యక్తం చేశారు. సంఘ అధ్యక్షుడు పి.నాగరాజు, ప్రధాన కార్యదర్శి యుగంధర్, సలహాదారు సుంకర శ్రీనివాసరావు మంగళవారం స్థానిక విలేకర్లతో మాట్లాడారు. సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్, వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ నేతృత్వంలో వైద్యరంగానికి ప్రాధాన్యం ఇస్తున్నారన్నారు. పైలెట్, ఈఎంటీ ఉద్యోగుల వేతనాలు పెంచడంతో మరింత బాధ్యతాయుగంగా విధులు నిర్వహిస్తామన్నారు.

బాలుడి అదృశ్యంపై ఫిర్యాదు

మోతుగూడెం, న్యూస్‌టుడే: చింతూరు మండలం చదలవాడ గ్రామానికి చెందిన ఎనిమిదేళ్ల సోడె కార్తీక్ ప్రాథమిక పాఠశాలలో ఒకటో తరగతి చదువుతున్నాడు. ఈ నెల 14న పాఠశాలకు బయలుదేరిన అతడు అక్కడికి చేరలేదు. సాయంత్రం కుమారుడు ఇంటికి రాకపోవడంతో బంధువుల ఇళ్లు, చుట్టుపక్కల గ్రామాల్లో తల్లిదండ్రులు వెదికినా ఆచూకీ లభించలేదు. వారిచ్చిన ఫిర్యాదు మేరకు మోతుగూడెం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. బాలుడి ఆచూకీ తెలిసినవారు ఎస్సైకు 94409 00757, ఏఎస్సైకు 90322 82323 ఫోన్ నంబర్ల ద్వారా తెలియజేయాలని కోరారు.



కార్తీక్ (పాత చిత్రం)

నులి పురుగులను నివారిద్దాం..

మారేడుమిల్లి, రాజవొమ్మంగి, అడ్డతీగల, చింతూరు, ఎటపాక, మోతుగూడెం, రంపచోడవరం, గంగవరం, న్యూస్‌టుడే: జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవం కార్యక్రమంలో భాగంగా జిల్లా వ్యాప్తంగా మంగళవారం అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలు, కళాశాలల్లో మాత్రల పంపిణీ, అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ● జిల్లాలో కొత్తగా ఏర్పడిన గుర్తేడు మండలంతో పాటు 12మండలాల్లో 87,217 మందికి నులిపురుగుల మాత్రలు వేయాల్సి ఉండగా 84,253 మంది పిల్లలకు వేసినట్లు పోలవరం జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారిణి డా.సరిత మీడియాకు తెలిపారు. ● మారేడుమిల్లిలోని స్థానిక పాఠశాలలు, కళాశాలల విద్యార్థులకు ఆల్బెండజోల్-400 ఎంజీ మాత్రలు వేయించే కార్యక్రమంలో వైద్య, ఆరోగ్యశాఖ రీజనల్ డైరెక్టర్ పద్మా శశిధర్, జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి పి.సరితతో కలిసి పాల్గొన్నారు.● రంపచోడవరంలోని కన్నారం గ్రామంలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల చిన్నారులకు డా.కృష్ణపవన్, ఎంపీటీసీ సభ్యులు కుంజం వంశీ మాత్రలు వేయించారు.● అడ్డతీగల మండలంలోని పలు పాఠశాలల్లో ఎంపీడీవో ఏవీవీ కుమార్, వైద్యాధికారి దేవీ ప్రియాంక మాత్రలు పంపిణీ చేసి అవగాహన కల్పించారు. ● చింతూరు మండలంలోని జిల్లా ఉప వైద్యాధికారి పుల్లయ్య కస్తూర్బా విద్యాలయం విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. తులసిపాక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 6,500 మందికి 95 శాతం, మోతుగూడెం పీహెచ్‌సీలో 1,902 మందికి 96 శాతం మాత్రలు పంపిణీ చేసినట్లు వైద్యాధికారులు ఉదయ్ కుమార్ రెడ్డి, అభిజ్ఞచంద్రిక, నీల్‌వాస్ తెలిపారు ● ఎటపాక వైస్ ఎంపీపీ మంగేశ్వరరావు పీహెచ్‌సీ డాక్టర్ శ్రీదేవితో కలిసి పురుషోత్తపట్నం పంచాయతీ శ్రీరామ్‌నగర్‌కాలనీలోని అంగన్వాడీ సెంటర్‌లో నులి పురుగుల మాత్రలు వేశారు.● రాజవొమ్మంగి మండలంలోని 40 అంగన్‌వాడీ కేంద్రాలు, 36 పాఠశాలలు, మూడు కళాశాలలకు చెందిన 4128 మంది చిన్నారులకు మాత్రలు వేసినట్లు వైద్యాధికారిణి సుష్మ తెలిపారు.

రాజవొమ్మంగి గురుకుల పాఠశాలలో విద్యార్థినులకు మాత్రలు వేస్తున్న వైద్యాధికారిణి సుష్మ, ప్రిన్సిపల్ సత్యవేణి

అంగన్‌వాడీ విద్యార్థులతో మాత్రలు మింగిస్తున్న ఆర్డీ, డీఎంహెచ్‌వో

అడ్డతీగలలో విద్యార్థులకు మాత్రలు వేస్తున్న వైద్యాధికారి దేవీప్రియాంక, ఎంపీడీవో కుమార్

వార్షిక బడ్జెట్‌కు ప్రతిపాదనలు సిద్ధం చేయండి

శ్యామలాసెంటర్: వచ్చే విద్యా సంవత్సరానికి పాఠశాలలో సౌకర్యాల నిమిత్తం వార్షిక బడ్జెట్ ప్రతిపాదనలు సిద్ధం చేయాలని డీఎస్ఈవో వాసుదేవరావు ఎంఈవోలను ఆదేశించారు. లాలాచెరువు ఉన్నత పాఠశాలలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ బడ్జెట్ రూపకల్పనలో మౌలిక వసతులకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. టీచర్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్‌లో ఉపాధ్యాయులు నమోదు చేసిన సమాచారమంతా సరైనదేనని ధ్రువపత్రాలను ప్రధానోపాధ్యాయుల నుంచి స్వీకరించి ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. జిల్లా సమగ్ర శిక్ష ఏపీసీఎస్ సుభాషిణి మాట్లాడుతూ ప్రతి ప్రాథమిక పాఠశాలలో అయిదు తరగతి గదులు కచ్చితంగా ఉండాలన్నారు. కొవ్వూరు డివిజన్ డీవైఈవో దిలీప్‌కుమార్, రూరల్ ఎంఈవో దుర్గాతులసీదాస్, సిబ్బంది, ఎంఈవోలు పాల్గొన్నారు.

వృద్ధులకు మరిన్ని సౌకర్యాలు కల్పించాలి

రాజమహేంద్రవరం సాంస్కృతికం, న్యూస్‌టుడే : సీనియర్ సిటిజన్స్ కోసం కేంద్ర ప్రభుత్వం జాతీయ కార్యాచరణ ప్రణాళిక కార్యక్రమం వారికి మరిన్ని సౌకర్యాలు కల్పించడానికి ఉపయోగపడుతుందని స్వర్ణాంధ్రా వృద్ధుల కేంద్రం నిర్వాహకుడు గుబ్బల రాంబాబు అన్నారు. మంగళవారం లాలాచెరువులోని స్వర్ణాంధ్రా కేంద్రంలో జరిగిన సీనియర్ సిటిజన్స్ జాతీయ కార్యాచరణ ప్రణాళిక అధ్యయన కార్యక్రమంలో మాట్లాడారు. ప్రతి మండల కేంద్రంలో ఒక్కో వృద్ధాశ్రమం నిర్మించాలని కోరారు. వివేకానంద ఐటీఐ ఇన్‌స్ట్రక్టర్ సాయి, పుష్కరమాత వృద్ధాశ్రమం సిబ్బంది వెంకటకృష్ణ, సోంబాబు తదితరులు పాల్గొన్నారు.

ఆధార్ సేవలను సద్వినియోగం చేసుకోండి

మోతుగూడెం, న్యూస్‌టుడే: చింతూరు మండలం మోతుగూడెం పంచాయతీ కార్యాలయంలో మంగళవారం ఆధార్ సేవా శిబిరాన్ని ఏర్పాటు చేశారు. పంచాయతీ అభివృద్ధి అధికారి గుంపెనపల్లి మోహన్‌రావు మాట్లాడుతూ.. 17 నుంచి 20వ తేది వరకు శిబిరాన్ని నిర్వహిస్తామని, పరిసర గ్రామాలవారు సేవలను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఆధార్ నమోదు, బయోమెట్రిక్ నవీకరణ, చిరునామా, పేరు, మొబైల్ నంబర్ తదితర మార్పులు, చేర్పులు చేస్తారని తెలిపారు. కార్యక్రమంలో డిజిటల్ అసిస్టెంట్ తుర్రం రామకృష్ణ, పంచాయతీ సిబ్బంది తోకల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల భవిష్యత్తుకు భరోసా: బీవీఆర్

కోరుకొండ, రాజానగరం, న్యూస్‌టుడే: ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేసి విద్యార్థుల భవిష్యత్తుకు భరోసా కల్పించారని జిల్లా తెదేపా అధ్యక్షుడు, రుడా ఛైర్మన్ బీవీఆర్ చౌదరి హర్షం వెలిబుచ్చారు. ఇందులో విద్యాశాఖామంత్రి నారా లోకేశ్ చొరవ అభినందనీయమన్నారు. బూరుగుపూడి గేటు సమీపంలోని తెదేపా కార్యాలయంలో మంగళవారం ఆయన మాట్లాడారు. విద్యావ్యవస్థలో సమస్యల పరిష్కారానికి లోకేశ్ కృషి చేస్తున్నారన్నారు. బకాయిల చెల్లింపుల విషయంలో రూ. 1,200 కోట్లు విడుదల చేయడంతో బీసీ, ఈడబ్ల్యూఎస్, మైనార్టీ వర్గాలకు మేలు జరిగిందన్నారు.

ప్రతిపాదనలకే పరిమితం.. అభ్యంతరాలతో ఆలస్యం

వై.రామవరం,. న్యూస్‌టుడే ; వై.రామవరం నుంచి గుర్తేడు రోడ్డు నిర్మించేందుకు దశాబ్దాల కాలం నుంచి ప్రతిపాదనలు చేయడం, అటవీ శాఖ అభ్యంతరాలతో నిలిచిపోవడం పరిపాటిగా మారింది. దశాబ్దాల కాలం నుంచి రోడ్డు నిర్మాణం కోసం 100 గ్రామాల గిరిజనులు ఉన్నతాధికారులకు మొర పెట్టుకుంటున్నారు. రూ. 2కోట్లతో రోడ్డు నిర్మాణానికి చేసిన ప్రతిపాదనలు కాస్త సంవత్సరాల ఆలస్యం వల్ల ఇప్పుడు సుమారు రూ. 14 కోట్లకు చేరుకుంది. అయినా రోడ్డు నిర్మాణానికి మాత్రం అనుమతులు వచ్చిన పరిస్థితి లేదు. దీంతో గుర్తేడు-వై. రామవరం రాకపోకలు సాగించాలంటే సుమారు 140-150 కి.మీ గిరిజనులు ప్రయాణించాల్సి వస్తోంది.

వై.రామవరం నుంచి గుర్తేడు వెళ్లే రోడ్డు మార్గం

గుర్తేడు రోడ్డు నిర్మాణానికి

వై.రామవరం నుంచి గుర్తేడుకు 14 కి.మీ మేర యార్లగడ్డ, గొరబంద, చీడిపాకలు గ్రామాల సరిహద్దు వరకు రోడ్డు నిర్మించాల్సి ఉంటుంది. మిగిలిన పిల్లల పుట్ట, మఠం భీమవరం మీదుగా గుర్తేడు వరకు రోడ్డు నిర్మాణం ఉంది. ఈ నిర్మాణం చేపడితే పోలవరం, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లో నివశిస్తున్న 100 గ్రామాల ప్రజలకు రవాణా ఇబ్బందులు తొలగుతాయి.

నిర్మాణంతో ప్రయోజనాలు:

ఈ రోడ్డు నిర్మిస్తే గుర్తేడు నుంచి వై.రామవరంకు 30 కి.మీ ప్రయాణిస్తే సరిపోతుంది. అనారోగ్యానికి గురయితే వై.రామవరంలో ఉన్న సామాజిక ఆరోగ్య కేంద్రానికి, ఉన్నతాధికారుల కార్యాలయాలకు వెళ్లాలన్నా రవాణా సౌకర్యం అందుబాటులో ఉంటుంది. గృహ నిర్మాణాలకు అవసరమయ్యే ఇసుక, మెటల్ వంటి ఉపకరణాలు తీసుకెళ్లడానికి, రైతులు పండించిన పంటలు అమ్ముకోవడానికి సులభతరం అవుతుంది. తక్కువ రవాణా ఖర్చులతో మిగుల ఆదాయాన్ని పొందవచ్చు. ఇన్ని సౌకర్యాలకు అనువైన రోడ్డు నిర్మాణం అటవీ అభ్యంతరాలతో నిలిచిపోవడంతో ఆయా గ్రామాల గిరిజనం ఇబ్బందులకు గురవుతున్నారు.

గుర్తేడు రోడ్డు నిర్మాణానికి అటవీ అనుమతులు కొరకు నివేదించాం. స్టేజ్-1 అనుమతులు వచ్చాయి. స్టేజ్-2 అనుమతులు రావలసి ఉంది. రోడ్డుకి సంబంధించిన ఫైలు ఉన్నతాధికారులకు నివేదించాం.

- సుబ్బారెడ్డి, సబ్ డీఎఫ్‌వో, రంపచోడవరం

నిర్మాణానికి అవసరమైన అన్ని చర్యలు చేపడుతున్నాం. అటవీ శాఖ కోరిన మేరకు 29 ఎకరాల భూమిని రెవెన్యూ శాఖ ఇవ్వడం జరిగింది. దానికి సంబంధించిన వివరాలను అటవీ శాఖకు అందజేశాం. వారు అనుమతులు ఇచ్చిన వెంటనే నిర్మాణం చేపడతాం.

- భవానీ, డీఈ,రోడ్డు , భవనాల శాఖ,రంపచోడవరం

అటవీ ఉత్పత్తులకు గిట్టుబాటు ధర కల్పించండి

రంపచోడవరం, న్యూస్‌టుడే: ఏజెన్సీ ప్రాంతంలో గిరిజనులు సేకరిస్తున్న అటవీ ఉత్పత్తులతోపాటు వారు పండిస్తున్న వివిధ పంటలకు మార్కెట్‌కు అనుగుణంగా గిట్టుబాటు ధరలు కల్పించి ఆదుకోవాలని అఖిలభారత రైతుకూలీ సంఘం (ఏఐకేఎంఎస్) రాష్ట్ర నాయకులు పల్లాల లచ్చిరెడ్డి, కుంజా దూలయ్య డిమాండ్ చేశారు. సంఘం ఆధ్వర్యంలో స్థానిక మార్క్స్ ఏంగిల్స్ భవనం నుంచి ర్యాలీ చేశారు. అనంతరం స్థానిక ఐటీడీఏలో పీవో స్మరణ్‌రాజ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ప్రతి ఏడాది డిసెంబరు నుంచి కరక్కాయలు, కోవెల జిగురు, తేనె, కొండ చీపుర్లు, ఉసిరి, ఇండుగ, ముషిని పిక్కలు, అడ్డాకులు, రెల్లచెక్క, నరమామిడి చెక్క తదితరాలను గిరిజనులు ఎంతో కష్టపడి అడవుల నుంచి సేకరించి, విక్రయించడం ద్వారా వచ్చిన ఆదాయంతో జీవనం సాగిస్తున్నారన్నారు. ఆయా అటవీ ఉత్పత్తులకు ధరలు పెంచి జీసీసీ ద్వారా కొనుగోలు చేసి ఆదుకోవాలన్నారు. సంఘం నాయకులు ఐ. రమణ, వి. చిట్టిబాబు, అనసూయ, బాలురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పీవో స్మరణ్‌రాజ్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఏఐకేఎంఎస్ నాయకులు

(c) eenadu

ఈనాడు ప్రకాశం

బుధవారం 18 ఫిబ్రవరి 2026

వైభవం.. త్రిపురాంతకేశ్వరస్వామి రథోత్సవం

త్రిపురాంబ సమేత త్రిపురాంతకేశ్వరుడు

మహాశివరాత్రి మహోత్సవాల్లో భాగంగా ప్రసిద్ధ పుణ్యక్షేత్రం త్రిపురాంతకంలో మంగళవారం త్రిపురాంబ సమేత త్రిపురాంతకేశ్వరస్వామి రథోత్సవం వైభవంగా జరిగింది. మంగళవాయిద్యాల నడుమ స్వామి, అమ్మవార్లు శ్రీగిరి నుంచి తరలివచ్చి రథాన్ని అధిష్ఠించారు. దేవదేవరుల రథాన్ని పుష్పాలతో అలంకరించారు. వేదపండితులు, అర్చకుల ఆధ్వర్యంలో తెదేపా వైపాలెం నియోజకవర్గ ఇన్‌ఛార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు, ఈవో డి.అనిల్ కుమార్, ఎంపీడీవో రాజ్‌కుమార్, ఉత్సవాల ఛైర్పర్సన్ సుజాత శ్రీనివాసరెడ్డి, సభ్యులు, నాయకులు పూజలు నిర్వహించారు. అనంతరం రథశాల నుంచి నాలుగు కాళ్ల మండపం వరకు భక్తజన నీరాజనాల నడుమ స్వామి, అమ్మవార్ల రథోత్సవం అత్యంత వైభవంగా సాగింది. దేవదేవరుల తేరును లాగి భక్తులు పులకించిపోయారు. మార్కాపురం డీఎస్పీ నాగరాజు పర్యవేక్షణలో బందోబస్తు నిర్వహించారు. - న్యూస్‌టుడే, త్రిపురాంతకం గ్రామీణం

రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

ఖనిజాన్వేషణ!

- లింగసముద్రం, వలేటివారిపాలెంలో ఇనుప ఖనిజం
- గని తవ్వకాలకు ముందుకొచ్చిన జిందాల్ సంస్థ

ఉమ్మడి ప్రకాశం జిల్లా లింగసముద్రం, వలేటివారిపాలెం ప్రాంతాల్లోని భూముల్లో ఇనుప ఖనిజం ఉండడంతో ఖనిజాన్వేషణ సాగిస్తున్నారు. ఖనిజం వెలికితీసేందుకు జిందాల్ సంస్థ ఆసక్తి చూపడంతో ప్రభుత్వం అనుమతుల విషయమై చురుగ్గా వ్యవహరిస్తోంది. తవ్వకాలు మొదలైతే ప్రత్యక్షంగా పరోక్షంగా వేలాది మందికి ఉపాధి లభించనుంది. - ఈనాడు, ఒంగోలు

ఇనుము తయారీకి ఉపయోగపడే ముడి ఖనిజం మాగ్నటైట్‌ను ఇక్కడ గుర్తించారు. కీలక మూలకం ఎఫ్ఈ (ఫెర్రమ్) 18 నుంచి 25 శాతం స్థాయిలో ఉంది. దీన్ని ఖనిజ శుద్ధి (బెనిఫిషియేషన్) చేసి వినియోగంలోకి తీసుకురానున్నారు. జిందాల్ సంస్థ ప్రతినిధులు ఇప్పటికే ఈ ప్రాంతాన్ని పరిశీలించారు. రెండు మండలాల పరిధిలో 3,920 హెక్టార్లలో ఖనిజం ఉన్నట్లు గుర్తించారు. దాదాపు అరవైకిపైగా ప్రాంతాల్లో డ్రిల్లింగ్ చేసి ఎక్కడెక్కడ ఖనిజ నిల్వలు ఏ స్థాయిలో ఉన్నాయనే దానిపై అన్వేషణ సాగుతోంది. ఇప్పటికే జిల్లా అధికార యంత్రాంగం ఖనిజాన్వేషణకు సహకారం అందిస్తోంది. ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా గుర్తించి చక్కదిద్దేందుకు రాష్ట్రస్థాయి అధికారులు ప్రయత్నం చేస్తున్నారు. మొత్తం భూమిలో 80 శాతం అటవీ శాఖ పరిధిలో ఉండడంతో ప్రత్యామ్నాయంగా భూములు ఆశాఖకు అప్పగించడంతోపాటు అనుమతులు తీసుకోవాల్సి ఉంది.

శుద్ధి ప్రక్రియ ఇక్కడే..

స్థానికంగా దొరికే లోగ్రేడ్ మాగ్నటైట్‌ను ఇక్కడే శుద్ధి చేసి దాని నుంచి నాణ్యమైన ఖనిజాన్ని (హైగ్రేడ్) వేరు చేయనున్నారు. ఇందులోని సిలికా(ఇసుక) వంటి వాటిని వేరుచేయడం, అయస్కాంతం ద్వారా నాణ్యమైన మాగ్నటైట్‌ను సేకరించనున్నారు. ఇక్కడ దాదాపు 800 మిలియన్ టన్నుల ఖనిజ నిల్వలు ఉండొచ్చని అంచనా వేస్తున్నారు. ఖనిజ శుద్ధి కేంద్రాన్ని లింగసముద్రం మండలం అద్దంకివారిపాలెం, లక్ష్మక్కపల్లి మధ్య ప్రాంతాల్లో ఏర్పాటుకు జిందాల్ సంస్థ ఆలోచన చేస్తోంది. కేంద్రం ఏర్పాటుకు 1,500 ఎకరాల వరకు భూములు అవసరం కానున్నాయి. భూసేకరణ విషయమై జిల్లా అధికార యంత్రాంగం ప్రత్యేక దృష్టిసారించింది. అవసరమైన భూములను వారికి అప్పగించేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ రాజాబాబు ఇటీవల అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

యువతకు ఉపాధి...

ఖనిజ తవ్వకాలు మొదలైతే ఇక్కడ యువతకు ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. ప్రత్యక్షంగా గనుల్లో తవ్వకాలు, శుద్ధి కేంద్రం, ఖనిజ తరలింపుతో రవాణా రంగం, దీనికి అనుబంధంగా సేవారంగం విస్తరించి జిల్లాలో యువత ఉపాధి పొందనున్నారు. లింగసముద్రం, వలేటివారిపాలెం మండలాల్లో ఇనుప ఖనిజం లభ్యత ఏ స్థాయిలో ఉందనే దానిపై అన్వేషణ జరుగుతోంది.. ఇది పూర్తయ్యాక ఎంత మేర భూములు అవసరమన్నది తేలిన తరువాత తవ్వకాలకు అనుమతులు ఇస్తామని భూగర్భ గనులశాఖ జిల్లా అధికారి రాజశేఖర్ పేర్కొన్నారు.

మొత్తం తవ్వేశారు.. స్తంభాలు వదిలేశారు

జిల్లాలో మట్టి మాఫియా ఆగడాలకు ఈ చిత్రమే నిదర్శనం. ముండ్లమూరు మండలం మారెళ్ల గ్రామంలో చెరువు వద్ద విద్యుత్తు స్తంభాల చుట్టూ మట్టిని కొందరు అక్రమార్కులు తవ్వేయడంతో ప్రమాదకరంగా తయారయ్యాయి. విద్యుత్తు సరఫరా అందించే స్తంభాల చుట్టూ మట్టి తవ్వకాలతో ఇలా నీరు చేరింది.

-ఈనాడు, ఒంగోలు

ఉగాది నాటికి ఇళ్లు పూర్తి కావాలి

ఒంగోలు కలెక్టరేట్, న్యూస్‌టుడే: ఉగాది నాటికి నిర్దేశించిన లక్ష్యం మేరకు గృహనిర్మాణాలు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ పి.రాజాబాబు ఆదేశించారు. జిల్లాలోని మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు, ఇతర మండల అధికారులతో మంగళవారం వీక్షణ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇంటి పన్ను వసూళ్ల లక్ష్యాన్ని తక్షణమే చేరుకోవాలని ఆదేశించారు. 10వ తరగతి విద్యార్థులకు ఆరోగ్య పరీక్షల నిర్వహణతోపాటు, వారిని పబ్లిక్ పరీక్షలకు పూర్తి స్థాయిలో సన్నద్ధం చేయాలని ఎంఈవోలకు సూచించారు. అక్షర ఆంధ్రా కార్యక్రమం నిర్వహణపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కేటాయించిన నిధులను సమర్థంగా వినియోగించుకునేలా పెండింగ్ పనులను పూర్తి చేయలని పీఆర్, డ్వామా అధికారులను ఆదేశించారు. సమావేశంలో జిల్లా గృహనిర్మాణ శాఖ అధికారి శ్రీనివాస్ ప్రసాద్, జడ్పీ సీఈవో చిరంజీవి, డీపీవో ఎం. వెంకటేశ్వరరావు, డీఈవో రేణుక, డ్వామా పీడీ జోసెఫ్‌కుమార్, డీఆర్డీఏ పీడీ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

స్టార్ హాస్పిటల్స్ వైద్యనిపుణులను
ఇప్పుడు స్టార్ ఇన్ఫర్మేషన్ సెంటర్ & సూపర్ స్పెషాలిటీ క్లినిక్స్,
ఒంగోలులో సంప్రదించగలరు

STAR HOSPITALS Expertise • Excellence • Empathy Hyderabad

డా. విశ్వక్‌సేన రెడ్డి పి
MBBS, MS, MCh (Neurosurgery), Fellow in Neuroendoscopy, Trained in Minimally Invasive Brain & Spine Surgery
సీనియర్ కన్సల్టెంట్ - న్యూరో & స్పైన్ సర్జన్

మీరు ఈ క్రింది సమస్యలతో బాధపడుతున్నారా?
- వెన్నెముక సమస్యలు
- డిజెనరేటివ్ డిస్క్ సమస్యలు
- హెర్నియేటెడ్ డిస్క్
- లంబార్ స్పైనల్ స్టెనోసిస్
- పార్శ్వగూని వంటి వెన్నెముక వైకల్యాలు
- వెన్నెముక ఇన్ఫెక్షన్లు
- స్పాండిలోలిస్థెసిస్‌తో సహ వెన్నెముక అస్థిరత
- వెన్నుపూస కుదింపు పగుళ్లు
- వెన్నెముక కణితులు

డా. శ్రీనివాస రెడ్డి జి
MBBS, MD (Internal Med - Manipal), DM (Hepatology - ILBS, New Delhi), Fellow in Liver ICU & Transplant - King's Hospital, UK
కన్సల్టెంట్ - హెపటాలజీ & లివర్ ట్రాన్స్‌ప్లాంట్ ఫిజిషియన్

మీరు ఈ క్రింది సమస్యలతో బాధపడుతున్నారా?
- దీర్ఘకాలిక కాలేయ వ్యాధులు
- కాలేయ క్యాన్సర్
- ఫ్యాటీ లివర్ డిసీజ్
- హెపటైటిస్ A,B,C,E
- ఆల్కహాల్ సంబంధిత కాలేయ వ్యాధి
- ఆటో ఇమ్యూన్ కాలేయ వ్యాధులు
- గాల్ బ్లాడర్ సంబంధిత వ్యాధులు
- లివర్ ట్రాన్స్ ప్లాంటేషన్

19 ఫిబ్రవరి, 2026
(ప్రతి నెల 3వ గురువారం అందుబాటులో కలరు)
ఉ॥ 10:00 - సా॥ 04:00
స్టార్ ఇన్ఫర్మేషన్ సెంటర్ & సూపర్ స్పెషాలిటీ క్లినిక్స్, వేమూరి మెడికల్స్ వెనుక, సుందరయ్య భవన్ రోడ్, ఒంగోలు
అపాయింట్‌మెంట్స్ కొరకు, కాల్ చేయండి:
9063 443 707 | 9849 133 956
స్టార్ హాస్పిటల్స్: నానక్‌రామ్‌గూడ । బంజారాహిల్స్

భక్తజనం.. పరవశం!

మహా శివరాత్రి సందర్భంగా కొత్తపట్నం మండలం మడనూరులో శ్రీరామలింగేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. రామలింగేశ్వరస్వామి, కన్నేశ్వరస్వామి, అనంత కోదండ స్వామి, జ్వాలాముఖి అమ్మవార్లను మంగళవారం ట్రాక్టర్లపై ఈతముక్కల గ్రామం వరకు ఘనంగా ఊరేగించారు. ఈ సందర్భంగా ఉత్సవమూర్తులను పెద్దసంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు.

- న్యూస్‌టుడే, కొత్తపట్నం

డీఎంహెచ్‌వోగా మాధవీలత

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారిణిగా బి.మాధవీలత నియమితులయ్యారు. ఆమె ప్రస్తుతం ఒంగోలులోని ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో ఆర్ఎంవోగా కొనసాగుతున్నారు. ప్రస్తుత డీఎంహెచ్‌వో టి.వెంకటేశ్వర్లు గుంటూరు డీఎంహెచ్‌వోగా బదిలీ అయ్యారు. ఈ మేరకు రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ కార్యదర్శి సౌరభ్ గౌర్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.

పెళ్లి బాజాలు మోగనున్నాయ్!

ఈ నెల 19 నుంచి శుభ ముహూర్తాలు

ఈ నెల 19వ తేదీ నుంచి పెళ్లి బాజాలు మోగనున్నాయి. మొత్తం 53 శుభగడియలు ఉన్నాయని వేదపండితులు చెబుతున్నారు. ఫిబ్రవరి 19, 20, 21, 24, 25, 26, మార్చి 1, 3, 4, 7, 8, 9, 11, 12, ఏప్రిల్ 15, 20, 21, 25, 26, 27, 28, 29, మే 1, 3, 5, 6, 7, 8, 13, 14, జూన్ 21, 22, 23, 24, 25, 26, 27, 29, జులై 1, 6, 7, 11, నవంబరు: 21, 24, 25, 26, డిసెంబరు 2, 3, 4, 5, 6, 11, 12వ తేదీల్లో శుభ ముహూర్తాలున్నాయి.

రెండు నెలల ముందే బుకింగ్: ఉమ్మడి ప్రకాశం జిల్లాలో 150కి పైగా కల్యాణ మండపాలున్నాయి. ఇవన్నీ రెండు నెలల ముందు నుంచే బుక్ అయిపోయాయి. ఎక్కువ మంది అడ్వాన్స్‌లు చెల్లించి ఆయా తేదీల్లో ఖరారు చేసుకున్నారు. ఇవి కాకుండా దేవాలయాలు, ప్రైవేటు ఖాళీ స్థలాల్లో సైతం పందిళ్లు ఏర్పాటు చేసుకుని వివాహాలు చేయడానికి ఏర్పాట్లు చేసుకుంటున్నారు. దూర ప్రాంతాల నుంచి వివాహాలకు వచ్చేవారి కోసం హోటళ్లతోపాటు బస్సులు, కార్లు సైతం ముందుగానే రిజర్వేషన్ చేయించుకున్నారు. మిట్టపాలెం నారాయణస్వామి దేవస్థానం వేదపండితులు శివప్రసాద్ శర్మ మాట్లాడుతూ వివాహాలతోపాటు గృహ ప్రవేశాలకు ఫిబ్రవరి, మార్చి, ఏప్రిల్‌లో మంచి ముహూర్తాలు ఉన్నాయన్నారు. ఇప్పటికే పలువురు జాతకాలు, తిథులను సరిచూసుకుని తేదీలు నిర్ణయించుకున్నట్లు తెలిపారు. చాలా మంది వివాహాలు చేసుకునేందుకు, గృహప్రవేశాలకు ముహూర్తాలు ఖరారు చేసుకున్నారని వివరించారు. - న్యూస్‌టుడే, సీఎస్‌పురం

పల్లె పోరుకు కసరత్తు!

- మార్చి 9లోపు ఓటర్ల జాబితా తయారీకి అధికారుల ప్రణాళిక
- నేడు కలెక్టరేట్‌లో డిప్యూటీ ఎంపీడీవో, కార్యదర్శులకు శిక్షణ

పల్లె పోరు నిర్వహణకు ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర ఎన్నికల సంఘం నుంచి ఆదేశాలు రావడంతో ఆ దిశగా జిల్లా పంచాయతీ అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. గ్రామ పంచాయతీ, వార్డుల వారీగా మార్చి 9వ తేదీలోగా ఓటర్ల జాబితా తయారు చేయాలని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ నీలంసాహ్ని ఇప్పటికే కలెక్టర్లతోపాటు డీపీవోలకు ఆదేశాలు జారీ చేశారు. పంచాయతీ సర్పంచుల పాలకవర్గాల గడువు ఏప్రిల్ 2తో పూర్తి కానుంది. దీంతో వెంటనే స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర ఎన్నికల సంఘం సిద్ధం చేస్తోంది. ఓటర్ల జాబితా తయారీ అనంతరం పంచాయతీ సర్పంచి, వార్డుల రిజర్వేషన్లు ఖరారు చేయనున్నారు. ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు ప్రారంభించడంతో గ్రామాల్లో ఎన్నికల వాతావరణం మొదలైంది. -న్యూస్‌టుడే, కలెక్టరేట్



జిల్లాల విభజన అనంతరం ప్రస్తుత ప్రకాశం జిల్లాలో 519, మార్కాపురం జిల్లాలో 406 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. 2021, ఫిబ్రవరిలో ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని 1,046 గ్రామ పంచాయతీలకు ఎన్నికల ప్రకటన విడుదల చేశారు. ఇందులో కోర్టు కేసుల కారణంగా 28 పంచాయతీలకు ఎన్నికలు నిలిపివేయగా, మిగతా 1,018 పంచాయతీలకు ఎన్నికలు జరిగాయి. ప్రస్తుతం ఆయా పాలకవర్గాల పదవీకాలం గడువు సమీపించడంతో దానికి ముందుగానే ఎన్నికల ప్రక్రియకు సంబంధించి అన్ని ఏర్పాట్లు చేసేందుకు జిల్లా పంచాయతీ అధికారులు కసరత్తు ప్రారంభించారు. ఇందులో భాగంగా 2026, జనవరి ఒకటో తేదీ నాటికి సిద్ధం చేసిన అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా ఓటర్ల జాబితాలను కలెక్టరేట్ నుంచి మంగళవారం సేకరించారు. వాటి ఆధారంగా పంచాయతీ, వార్డుల వారీ జాబితాలను విభజించనున్నారు. జనవరి 1వ తేదీ అనంతరం ఓటుహక్కు పొందినవారి పేర్లను చివరి వార్డులో కలుపుతారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు పంచాయతీ ఎన్నికల నిర్వహణ ప్రక్రియలో భాగంగా ఓటర్ల జాబితా తయారీపై దృష్టి సారించినట్లు డీపీవో ఎం.వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు స్థానిక ప్రకాశం భవన్‌లోని కలెక్టర్ కాన్ఫరెన్స్ హాలులో బుధవారం మధ్యాహ్నం 2.30 గంటలకు ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని డిప్యూటీ ఎంపీడీవోలతోపాటు మండలానికి ఒక పంచాయతీ కార్యదర్శి చొప్పున శిక్షణ ఇవ్వనున్నట్లు ఆయన తెలిపారు.

నియోజకవర్గం	ఓటర్లు
వైపాలెం	2,07,620
దర్శి	2,27,560
ఎస్ఎన్‌పాడు	2,14,309
ఒంగోలు	2,40,035
కొండపి	2,40,324
మార్కాపురం	2,15,160
గిద్దలూరు	2,41,738
కనిగిరి	2,42,031

ఒంగోలు రైలు నిలయంలో సమస్యల కూత!

- ప్రయాణికులకు తప్పని ఇబ్బందులు
- ఎంపీ మాగుంటకూ చేదు అనుభవం

ఒంగోలు రైల్వే స్టేషన్‌లోని అయిదో నంబరు ప్లాట్‌ఫాం

ఒంగోలు రైలునిలయంలో తిరుపతి, చెన్నై వైపు వెళ్లే రైలు ఎక్కాలంటే కష్టాలు తప్పడం లేదు. మూడో నంబరుకు రావాల్సిన రైలు అయిదో నంబరుకు వస్తుందని చివర్లో ప్రకటన చేస్తుండడంతో ప్రయాణికులు పరుగులు పెట్టాల్సి వస్తోంది. సాక్షాత్తు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డికి అనుభవం ఎదురుకావడంతో రైల్వే అధికారులు ఇకనైనా మేల్కొంటారని సామాన్య ప్రయాణికులు భావిస్తున్నారు.

-ఈనాడు, ఒంగోలు

మహాశివ రాత్రి రోజు ఒంగోలు నుంచి చెన్నై వెళ్లేందుకు ఎంపీ మాగుంటతో పెద్దసంఖ్యలో ప్రయాణికులు మూడో నంబరు ప్లాట్‌ఫాంపై వేచి ఉన్నారు. జీటీ ఎక్స్‌ప్రెస్ రైలు మరో పది నిమిషాల్లో వస్తుందనగా, అయిదో నంబరుకు వస్తుందని ప్రకటించారు. దీంతో పాదాచారుల వంతెన వద్దకు చేరుకుని అది ఎక్కి దిగి మరో కిలోమీటరు దూరం నడిచి జీటీ ఎక్స్‌ప్రెస్ ఏసీ బోగీల వద్దకు చేరుకోవాల్సి వచ్చింది. కనీస సౌకర్యాల్లేవని, రైలు అయిదో నంబరు ప్లాట్‌ఫాంలోకి వస్తుందని ముందుగా ప్రకటించకపోవడంపై ఎంపీ రైల్వే అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక రైల్వే అధికారులు ఎంపీ వద్దకు చేరుకుని సర్ది చెప్పి పంపించారు. పిల్లలు, లగేజీలను మోసుకుని ప్లాట్‌ఫాంలు మారేందుకు నరకయాతన అనుభవించామని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేశారు.

ఇకనైనా మోక్షం లభించేనా?

ఎంపీ మాగుంట ఫిర్యాదుతో విజయవాడ డివిజన్ రైల్వే అధికారులు విచారణ చేపట్టారు. అయిదో నంబరు ప్లాట్‌ఫాంపై సౌకర్యాల కల్పనపై ఆరా తీశారు. విద్యుద్దీపాలు అమర్చే పనిని మరో రెండు వారాల్లో, బోగీలు సూచించే ఎల్ఈడీ బోర్డులు వచ్చే నెలలో పూర్తి చేస్తామని ప్రకటించారు. పాదాచారుల వంతెన నిర్మాణం పూర్తిచేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. రైళ్లు సకాలంలో గమ్యం చేరేందుకు అయిదో నంబరు ప్లాట్‌ఫాంను వినియోగంలోకి తీసుకొచ్చామని, కొద్ది రోజుల్లో సమస్యలు పరిష్కరిస్తామని ఒంగోలు రైల్వేస్టేషన్ మేనేజర్ కృష్ణ తెలిపారు.

జిల్లాలో పోటి మరియు పోలిక లేని TOP పర్సంటైల్స్
Students favourite college
శ్రీ సరస్వతి ఒంగోలు, ప్రకాశం జిల్లా.
IIT & NEET ACADEMY | JUNIOR COLLEGE
JEE (Main) 2026 - Session 1 RESULTS
District 1st

99.56 YEGGONU RISHITH KUMAR REDDY, App. No. 260310429462

98.28 MANDLA VENKATA VISHNU, App. No. 260310657055

97.82 L.VENKATESWARA REDDY, App. No. 260310666532
97.37 K. AVINASH REDDY, App. No. 260310515829
94.00 M AKHIL VENKATA SAI DURGA PRASAD, App. No. 260311002247
93.65 P. VENKATA ASEESH, App. No. 260310396694
93.60 N. GANESH MAHARAJU, App. No. 260310822848
93.38 N. MAHITHA, App. No. 260311050471
93.26 T ASHOK REDDY, App. No. 260310603489
92.76 K. RANGA YASASWINI, App. No. 260310685487
92.56 SK. AKRAM, App. No. 260310714059
92.19 K. SRINIVASA REDDY, App. No. 260311027180
91.99 G. KARTHIK, App. No. 260311062821
91.70 S. AKHIRANAND, App. No. 260310525448
91.48 K. SRINADH GUPTA, App. No. 260310513441
91.29 C. VENKATA KALYANI, App. No. 260310896341
90.73 K. ASISH NIHAL, App. No. 260310717036
90.72 SK. NABHI BASHA, App. No. 260310859321
90.67 G. POORNA SIVA NAGARAJU, App. No. 260310719882
90.32 S. SAHASRA SHANKAR, App. No. 260310792773
90.00 C. SAHITHYA, App. No. 260310551260
90 ABOVE PERCENTILE : 21
85 ABOVE PERCENTILE : 47
80 ABOVE PERCENTILE : 77

SUBJECT WISE TOP PERCENTILE
MATHEMATICS 99.59 | PHYSICS 99.69 | CHEMISTRY 99.73

JEE Main లో ప్రకాశం జిల్లాలో ఇప్పటివరకు ఏ విద్యాసంస్థ సాధించలేని ఫలితాలను సాధించిన శ్రీ సరస్వతి కి సహకరించిన వారందరికి మా హృదయపూర్వక అభినందనలు తెలియజేస్తూ

M.P.C. IIT - JEE Advance / JEE Mains / EAPCET
Bi.P.C. NEET / EAPCET
C.E.C & M.E.C With CA foundation
ADMISSIONS ARE IN PROGRESS
Sri. A. GANESH REDDY M.Tech., Director of Sri Saraswathi Groups - Prakasam Dist.
Sri. A.G. SANKAR REDDY MBA., Director of Sri Saraswathi Groups - Prakasam Dist.
Seperate Hostel facility available for Boys & Girls
Bus facility available
Contact for more details
84070 78888, 91761 62696, 81436 68888

Sri. A.V. RAMANA REDDY FOUNDER & CHAIRMAN - SRI SARASWATHI GROUPS Cell : 98488 79655

(c) eenadu

క్షణికావేశంలో తప్పులు చేయొద్దు

ఆహార పదార్థాలను పరిశీలిస్తున్న న్యాయమూర్తి ఇబ్రహీం షరీఫ్

ఒంగోలు న్యాయవిభాగం, న్యూస్‌టుడే: విచారణ ఖైదీలతో పాటు జైలు శిక్ష అనుభవిస్తున్న నిందితులు జిల్లా న్యాయసేవాధికార సంస్థ, మండల న్యాయసేవాధికార కమిటీల ఉచిత న్యాయ సహాయం ద్వారా న్యాయవాదిని నియమిస్తారని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఎస్కే ఇబ్రహీం షరీఫ్ తెలిపారు. జాతీయ న్యాయసేవాధికార సంస్థ నిర్దేశం మేరకు నెలవారీ తనిఖీలో భాగంగా మంగళవారం జిల్లా జైలును పరిశీలించారు. ఖైదీలకు అందిస్తున్న ఆహార పదార్థాల నాణ్యత, వసతి సదుపాయాలను గమనించారు. న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. క్షణికావేశంలో తప్పులు చేసి విలువైన జీవితాలను నాశనం చేసుకోవద్దని హితవు పలికారు. రాజీపడదగిన క్రిమినల్ కేసులను మార్చి 14న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌లో పరిష్కరించుకోవచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా జైలర్ ఎం.ఎ.నాయుడు, లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ జి.రవికిరణ్, పి.వి.రాముడు, జైలు విజిటింగ్ న్యాయవాది మోబీనా, సిబ్బంది పాల్గొన్నారు.

చిన్నారుల ఆరోగ్యమే దేశానికి సౌభాగ్యం

విద్యార్థినికి మాత్ర అందిస్తున్న డీఎంహెచ్‌వో వెంకటేశ్వర్లు

ఒంగోలు గ్రామీణం: బాల, బాలికల ఆరోగ్యం దేశానికి సౌభాగ్యమని డీఎంహెచ్‌వో టి.వెంకటేశ్వర్లు తెలిపారు. జాతీయ నులి పురుగుల నిర్మూలన దినోత్సవాన్ని పురస్కరించుకుని ఒంగోలు రామనగర్‌లోని నగరపాలక సంస్థ ఉన్నత పాఠశాలలో మంగళవారం విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు మింగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 6 నుంచి 19 సంవత్సరాల వయసు కలిగిన పిల్లలకు మాత్రలు ఇస్తున్నట్లు తెలిపారు. నులి పురుగులు ఉన్న పిల్లలు రక్తహీనత, పోషకాహార లోపం, ఆకలి లేకపోవడం, బలహీనత తదితర అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నట్లు వివరించారు. డీఈవో సీవీ.రేణుక మాట్లాడుతూ.. ప్రతి విద్యార్థి అన్నం తినే ముందు చేతులు శుభ్రం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు భగీరథ, రవీంద్రకుమార్, నాగార్జున, సంతోష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రకాశం.. సినిమా చిత్రీకరణకు అనుకూలం

మాట్లాడుతున్న సినీ దర్శకుడు దిలీప్ రాజా

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: సినిమా షూటింగ్‌లకు ప్రకాశం జిల్లా వరప్రదాయిని మూవీ ఆర్టిస్ట్ అసోసియేషన్ ఏపీ 24 విభాగాల యూనియన్ వ్యవస్థాపకుడు (మా-ఏపీ) సినీ దర్శకుడు దిలీప్ రాజా పేర్కొన్నారు. ఒంగోలులోని ఓ హోటల్‌లో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 8వ శతాబ్దంలో పల్లవ నిర్మిత రాతి దేవాలయం ఉన్న భైరవకోనలో తన సినిమా చిత్రీకరణ చేయనున్నట్లు ప్రకటించారు. అక్కడ 200 మీటర్ల ఎత్తు నుంచి ప్రవహిస్తున్న జలపాతాల వద్ద హీరో, హీరోయిన్ల సన్నివేశం చిత్రీకరిస్తున్నట్లు వివరించారు. ఇప్పటికే తమ యూనిట్ గుండ్లకమ్మ నది ఒడ్డున చందవరంలో నిర్మించిన బౌద్ధ క్షేత్రం, కాకతీయుల కాలంలో నెలకొల్పిన త్రిపురాంతకం ఆలయాలను సందర్శించి, అక్కడి విశేషాలను ఎంపిక చేసుకున్నట్లు తెలిపారు. పాకల, కొత్తపట్నం, రామాపురం బీచ్‌ల్లో పాట చిత్రీకరణ చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ సమావేశంలో దర్శకుడు ఎ.శ్రీనివాస యాదవ్, నిర్మాత రాయని సురేష్‌బాబు పాల్గొన్నారు. అనంతరం కలెక్టర్ పి.రాజాబాబును మర్యాదపూర్వకంగా కలిశారు.

బాలల సమగ్ర ఎదుగుదలే లక్ష్యం

ఒంగోలు కలెక్టరేట్, న్యూస్‌టుడే: అంగన్‌వాడీ కేంద్రాల్లోని బాలల సమగ్ర ఎదుగుదలే లక్ష్యంగా సిబ్బంది పనిచేయాలని కలెక్టర్ పి.రాజాబాబు ఆదేశించారు. స్థానిక ప్రకాశం భవన్‌లో మంగళవారం జిల్లాలోని ఐసీడీఎస్ సీడీపీవోలతో సమీక్షించారు. వయసుకు తగినట్టుగా పిల్లల బరువు, ఎదుగుదల ఉండాలన్నారు. పోషకాహార లోపం, ఎత్తు, బరువు తక్కువ ఉన్న పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని ఆదేశించారు. ఇలాంటి పిల్లలు ఉన్న అంగన్‌వాడీ కేంద్రాలతో పాటు, పర్యవేక్షకులు లేని ప్రాంతాల్లోని కేంద్రాలపై సీడీపీవోలు మరింత దృష్టిసారించాలన్నారు. నెల రోజుల్లో స్పష్టమైన మార్పు కనిపించాలని ఆదేశించారు. విధుల నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించే అంగన్‌వాడీ సిబ్బందిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఐసీడీఎస్ ఉద్యోగులు, జిల్లా ఇన్‌ఛార్జి మహిళా, శిశు సంక్షేమశాఖ అధికారిణి మాధురి పాల్గొన్నారు.

సెలవుపై వెళ్లిన మహిళా, శిశు సంక్షేమశాఖ అధికారిణి

ఒంగోలు గ్రామీణం: జిల్లా మహిళా, శిశు సంక్షేమశాఖ అధికారిణి సువర్ణ దీర్ఘకాలిక సెలవుపై వెళ్లారు. బాలసదన్‌కు చెందిన ఓ బాలిక అనారోగ్య కారణాల రీత్యా మృతి చెందింది. సదరు విషయంలో విధుల పట్ల నిర్లక్ష్యం వహించిన అధికారిణి సువర్ణను కలెక్టర్ పి.రాజాబాబు జీవీఎం ప్రభుత్వానికి సరెండర్ చేశారు. తిరిగి మళ్లీ విధుల్లో కూడా చేరారు. తాజాగా ఆమె దీర్ఘకాలిక సెలవుపై వెళ్లడం ఉద్యోగ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ఈ మేరకు ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ మాధురికి జిల్లా మహిళా, శిశు సంక్షేమశాఖ అధికారిణిగా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ కలెక్టరేట్ నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి.

పుడమికి నవశకం!

❖ జిల్లాలో 86 వేల ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయం

న్యూస్‌టుడే, ఒంగోలు గ్రామీణం

కందుకూరులో రైతులకు అవగాహన కల్పిస్తున్న జడ్‌బీఎన్‌ఎఫ్ డీపీఎం సుభాషిణి

మోతాదుకు మించి రసాయనాల వినియోగంతో నేల నిర్జీవంగా మారుతోంది. తద్వారా రైతులకు సాగు వ్యయం పెరిగిపోతుండగా, దిగుబడులు తగ్గిపోతున్నాయి. ప్రధానంగా తెల్ల రేగడి, చౌడు భూముల్లో సాగు గిట్టుబాటు కాక రైతులు అప్పులపాలవుతున్నారు. ఈ నేపథ్యంలో నేలకు పూర్వవైభవం కల్పించి సహజ శక్తిని పెంపొందించేందుకు ప్రకృతి వ్యవసాయం అధికారులు ప్రణాళిక చేశారు. తక్కువ పెట్టుబడితో ప్రకృతి విధానంలో పంటల సాగు ప్రోత్సహిస్తున్నారు. ఇందులో భాగంగా నవ ధాన్యాలు అందజేసేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించారు. ఖరీఫ్ ముందే వేసవిలో నవ ధాన్యాల సాగు లక్ష్యంగా నిర్దేశించుకున్నారు. రుతు పవనాల రాకముందే పొడి నేలలో విత్తనం వేయనున్నారు. పచ్చి రొట్ట (జనుము, జీలుగ, పిల్లిపెసర) ఎరువులు ఎంతో ఉపయోగ పడనున్నాయి.

800 నుంచి రూ.1,000 వరకు ధర నిర్ణయించారు. వీటిపై రైతులకు అవగాహన కల్పించి 86 వేల ఎకరాల్లో సాగు చేసేందుకు కార్యాచరణ రూపొందించారు.

30 రకాల విత్తనాల కిట్ రూ.800

ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని రైతులకు సరఫరా చేసేందుకు 86 వేల నవధాన్యాల కిట్లు తయారీ చేయాలని లక్ష్యంగా నిర్ణయించారు. ఇందులో జొన్న, మొక్కజొన్న, కందులు, పెసలు, వేరుసెనగ, పొద్దు తిరుగుడు, ధనియాలు, మెంతులు, ఆవాలు, జీలుగ, జనుము, పిల్లిపెసర, ఉలవలు, అలసంద, మినుములు, కొర్రలు, సామలు, రాగులు, సజ్జలు, నువ్వులు, వరి, తీగ, దుంపజాతికి చెందిన 30 రకాల విత్తనాలున్నాయి. ఒక్కోదానిలో 10 కిలోల చొప్పున అన్ని రకాల విత్తనాలుంటాయి. ఎకరానికి ఒక్క కిట్ సాగు చేస్తే చాలు. విత్తన రకాల ఆధారంగా కిట్ రూ.

సూక్ష్మ పోషకాల లోపాలు అధిగమిద్దాం

30 రకాల విత్తనాలను పచ్చిరొట్ట ఎరువులుగా సాగు చేయడంతో ఎన్నో లాభాలుంటాయి. నేలలో కర్బన శాతం పెరుగుతుంది. కలుపు ఉన్నందుడంతో భూసారానికి లోపం ఉండదు. ప్రధాన పంటకు రసాయన ఎరువుల భారంతో పాటు కలుపు బెడద, చీడపీడల ఉధృతి తగ్గుతుంది. నేలలో తేమ పెరిగి, వానపాముల సంఖ్య వృద్ధి చెందుతాయి. స్థూల, సూక్ష్మ పోషకాల లోపాలు అధిగమించొచ్చు.
—సుభాషిణి, డీపీఎం, జడ్‌బీఎన్‌ఎఫ్

విద్యార్థి వైష్ణవ్ కుమార్‌రెడ్డిని అభినందిస్తున్న సరస్వతి విద్యా సంస్థల చైర్మన్ రమణారెడ్డి

విద్యార్థులను అభినందిస్తున్న శ్రీచైతన్య కళాశాల డీన్ రామకృష్ణ, అధ్యాపకులు

జేఈఈ మెయిన్స్‌లో విద్యార్థుల ప్రతిభ

విద్యార్థులను అభినందిస్తున్న ఎస్ఎస్ఎన్ కళాశాల ప్రిన్సిపల్ శివానందరెడ్డి

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: జేఈఈ మెయిన్స్-2026 పరీక్ష ఫలితాల్లో ఒంగోలులోని శ్రీసరస్వతి జూనియర్ కళాశాలకు చెందిన పలువురు విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. పర్సంటైల్ వారీగా వి.రిషిత్ కుమార్‌రెడ్డి (99.56), ఎం.వెంకట విష్ణు (98.28), ఎల్.వెంకటేశ్వర రెడ్డి (97.82), కె.అవినాష్‌రెడ్డి (97.37) సాధించినట్లు విద్యా సంస్థల చైర్మన్ ఏవీ.రమణారెడ్డి తెలిపారు. 90 పర్సంటైల్ పైన 21 మంది, 85 పర్సంటైల్ పైన 47 మంది, 80 పర్సంటైల్ పైన 77 మంది సాధించినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా సదరు విద్యార్థులను స్థానిక కళాశాలలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో అభినందించారు. కళాశాల డైరెక్టర్లు ఏ.గణేష్‌రెడ్డి, ఏ.గంగా శంకర రెడ్డి, అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.

❖ జేఈఈ మెయిన్స్ పరీక్షా ఫలితాల్లో ఒంగోలులోని శ్రీ చైతన్య జూనియర్ కళాశాలకు చెందిన విద్యార్థులు కె.తేజ నరసింహ చౌదరి (98.60), షేక్ ఆర్మాన్ సయ్యద్ (98.40), షేక్ మహమ్మద్ ఇమాన్ (96.09) సాధించారు. ఈ సందర్భంగా సదరు విద్యార్థులను కళాశాల డీన్ ఎం.రామకృష్ణ, అధ్యాపక సిబ్బంది అభినందించారు.

❖ ఒంగోలు అంజయ్యరోడ్డు: జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో ఒంగోలులోని ఎస్ఎస్ఎన్ జూనియర్ కళాశాల విద్యార్థులు బి.ప్రవంత్ అశోక్ ఓపెన్ కేటగిరిలో 97.28 పర్సంటైల్‌తో పాటు మరో అయిదుగురు విద్యార్థులు 90 పర్సంటైల్ సాధించినట్లు విద్యాసంస్థల చైర్మన్ ఎల్లటూరి రామకృష్ణారెడ్డి పేర్కొన్నారు. విద్యార్థులను కళాశాల ప్రిన్సిపల్ శివానందరెడ్డి, డీన్ జనార్దన్ రెడ్డి తదితరులు అభినందించారు.

సాగునీరు వృథా కాకుండా చూడాలి

సమావేశంలో పాల్గొన్న డీసీ చైర్మన్లు, ఎన్నెస్పీ ఎస్ఈ వరలక్ష్మి

సంతనూతలపాడు, న్యూస్‌టుడే: రైతులు సంతృప్తి చెందేలా చివరి ఎకరానికీ సాగర్ నీరు అందించాలని డీసీ చైర్మన్లు కోరారు. మంగళవారం ఒంగోలులోని ఎన్నెస్పీ కార్యాలయంలో ఒంగోలు, సంతనూతలపాడు, మీనుకుర్తి నీటి సంఘాల అధ్యక్షులతో ఎస్ఈ వరలక్ష్మి సమీక్షించారు. ఈ సందర్భంగా పలు అంశాలపై చర్చించారు. నీటి కోసం రైతులు ఇబ్బందులు పడకుండా.. నిత్యం పర్యవేక్షించాలని నిర్ణయించారు. బుధవారం నుంచి కారుమంచి మేజరుకు, ఒంగోలు సమ్మర్ స్టోరేజ్-2కు నీటిని సరఫరా చేస్తున్నారని, కారుమంచి మేజరుపై రైతులు నీటిని సద్వినియోగం చేసుకోవాలని ఎస్ఈ కోరారు. నీటి వృథా లేకుండా చూడాలన్నారు. అదే క్రమంలో రాష్ట్ర ప్రభుత్వం సాగునీటి ప్రాజెక్టులకు బడ్జెట్‌లో రూ.18,224 కోట్లు కేటాయించడంపై నీటి సంఘాల అధ్యక్షులు హర్షం వ్యక్తం చేశారు. సంతనూతలపాడు-చంద్రపాలెం మధ్య ఓబీసీపైనున్న చప్టాకు, మరో రెండు చప్టాలకు అంచనాలు వేసి నిధుల కేటాయింపునకు ప్రతిపాదనలు పంపారు. నీటి వినియోగం, రానున్న ఏడాదిలో చేయాల్సిన పనులు.. ఇలా పలు అంశాలపై చర్చించారు. ఈ సమావేశంలో డీసీ చైర్మన్లు నల్లూరి కృష్ణారావు, రామా శ్రీనివాసరావు, పాలడుగు వెంకటనారాయణ, దొడ్డా వెంకట్రావు, కంకణాల వేణు, ఎన్నెస్పీ ఈఈ దివాకర్, పలు నీటి సంఘాల అధ్యక్షులు, ఎన్నెస్పీ అధికారులు పాల్గొన్నారు.

సత్వర చికిత్సతో క్షయ నిర్మూలన

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: సత్వర చికిత్స ద్వారా క్షయ వ్యాధి నిర్మూలన సాధ్యమని జిల్లా క్షయ నిర్మూలన అధికారి జి.బాలాజీ సూచించారు. టీబీ అవగాహన వారోత్సవాల్లో భాగంగా స్థానిక జిల్లా జైలులో మంగళవారం ఖైదీలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. టీబీ లక్షణాలు, తక్షణ వ్యాధి నిర్ధారణ ప్రాముఖ్యత గురించి వివరించారు. క్షయ నిర్మూలనలో భాగంగా ఉచిత చికిత్స సదుపాయాలు, నివారణ చర్యలపై పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా జైలు సూపరింటెండెంట్ పి.వరుణ్‌రెడ్డి, జైలర్ ఎంఏ.నాయుడు, వైద్యాధికారి బ్రహ్మతేజ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జిల్లా క్షయ నిర్మూలన అధికారి బాలాజీ

కనుల పండువగా దర్శి రథోత్సవం

దర్శి (తాళ్లూరు): దర్శి పట్టణంలో మంగళవారం రథోత్సవం కనుల పండువగా జరిగింది. దర్శి, పరిసర మండలాల్లోని పెద్దఎత్తున భక్తులు తరలిరావడంతో పట్టణంలోని వీధులన్నీ కిక్కిరిశాయి. అంతకుముందు కాశీ అన్నపూర్ణా సమేత కాశీ విశ్వేశ్వర స్వామి ఆలయంలో శివ, పార్వతులకు విశేష పూజలు నిర్వహించారు. తెదేపా దర్శి నియోజకవర్గం ఇన్‌ఛార్జి గొట్టిపాటి లక్ష్మి, ఆమె భర్త కడియాల లలిత్‌సాగర్ ఆలయంలో పూజలు చేశారు. అనంతరం శివ, పార్వతుల విగ్రహాలను ఏర్పాటు చేసి రథోత్సవానికి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా లక్ష్మి, లలిత్‌సాగర్ దంపతులు, మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు, దర్శి ఛైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య, తహసీల్దారు శ్రావణ్‌కుమార్, సంఘ సంస్కర్త జీవీ.రత్నం తదితరులు రథాన్ని లాగి భక్తిని చాటుకున్నారు. కళాకారుల ప్రదర్శనలు, మహిళల కోలాట ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. నగర పంచాయతీ ఇన్‌ఛార్జి కమిషనర్ శ్రీరామమూర్తి, ఆలయ ఈవో సుబ్బారావు, పలువురు ప్రముఖులు, తెదేపా, భాజపా, జనసేన పార్టీల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

నియోజకవర్గానికో రైతు బజారు

ఒంగోలు గ్రామీణం: నియోజకవర్గానికో రైతు బజారు ఏర్పాటు లక్ష్యంగా నిర్ణయించినట్లు మార్కెటింగ్‌శాఖ విజయవాడ ఆర్జేడీ శ్రీనివాసరావు తెలిపారు. స్థానిక జిల్లా మార్కెటింగ్ కార్యాలయంలో మంగళవారం మార్కెట్ కమిటీ కార్యదర్శులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. . జిల్లాలోని ఒంగోలు, కందుకూరులో రైతు బజార్లు ఉండగా.. దర్శిలో నిర్మాణం జరుగుతున్నట్లు వివరించారు. మిగిలిన మూడు చోట్ల నిర్మాణానికి అవసరమైన స్థల సేకరణ చేయాలని ఆదేశించారు. చెక్‌పోస్టుల వద్ద మార్కెటింగ్ ఫీజులు 66 శాతం మేర మాత్రమే వసూలైనట్లు తెలిపారు. వంద శాతం వసూలుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లాలోని 7 కమిటీల పరిధిలో లైసెన్స్ తీసుకున్న వ్యాపారుల వద్ద సెస్ బకాయిలు వసూలు చేయాలని సూచించారు. సమావేశంలో మార్కెటింగ్ ఏడీ వరలక్ష్మి పాల్గొన్నారు.

ఎన్నికల హామీలు అమలు చేయాలి

సమావేశంలో మాట్లాడుతున్న ఐద్వా జిల్లా కార్యదర్శి రమాదేవి

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: సార్వత్రిక ఎన్నికల సమయంలో కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు సూపర్ సిక్స్ పథకాలను అమల్లోకి తీసుకురావాలని ఐద్వా జిల్లా కార్యదర్శి కె.రమాదేవి డిమాండ్ చేశారు. స్థానిక ఎల్‌బీజీ భవన్‌లో మంగళవారం ఐద్వా జిల్లా కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. స్త్రీలకు ఉచిత బస్సు పథకం అమల్లోకి వచ్చినా తగినన్నీ బస్సులు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నట్లు ఆవేదన వ్యక్తం చేశారు. నిరుద్యోగులకు నెలకు రూ.3 వేలు భృతితోపాటు, 18 సంవత్సరాలు నిండిన మహిళలకు ఆడబిడ్డ పథకం కింద రూ.1500 చొప్పున ఇచ్చే పథకాన్ని తక్షణమే అమల్లోకి తీసుకురావాలని కోరారు. పథకాలు అమలు పక్కన పెట్టి మద్యం వ్యాపారం విచ్చల విడిగా పెంచుకుంటూ పోతున్నారని విమర్శించారు. ఈ సమావేశంలో ఐద్వా నాయకురాలు సయ్యద్ షర్మిల, మాలతి, ఆదిలక్ష్మి, గోవిందమ్మ తదితరులు పాల్గొన్నారు.

‘బాలుడి మృతిపై దర్యాప్తు వేగవంతం’

సింగరాయకొండ పోలీసు స్టేషను ముందు బైఠాయించి నిరసన తెలియజేస్తున్న విద్యార్థి కుటుంబ సభ్యులు

సింగరాయకొండ గ్రామీణం, న్యూస్‌టుడే: విద్యార్థి అనుమానాస్పద మృతిపై దర్యాప్తు వేగవంతం చేసి కారకులపై చట్టపరమైన చర్యలు చేపడతామని కందుకూరు సీఐ అన్వర్‌బాషా తెలిపారు. సింగరాయకొండ మండలం మూలగుంటపాడు ఓ కోచింగ్ సెంటరులో గత శనివారం సాయంత్రం కనిగిరి పట్టణానికి చెందిన ఓ బాలుడు(11) అనుమానాస్పదంగా మృతి చెందాడు. బాలుడి తల్లి దండ్రులు, కుటుంబ సభ్యులు, బంధువులు మంగళవారం కోచింగ్ సెంటరు వద్ద ఆందోళన చేసేందుకు వెళ్లే క్రమంలో సీఐ హజరత్తయ్య సిబ్బందితో వారిని నిలువరించారు. ఈ సమయంలో పోలీసులు, వారి మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. అనంతరం వారు స్థానిక పోలీసు స్టేషను ముందు బైఠాయించి నిందితులను కఠినంగా శిక్షించి న్యాయం చేయాలంటూ డిమాండు చేశారు. ఈ కేసులో విచారణ అధికారిగా జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజు నియమించిన కందుకూరు సీఐ అన్వర్‌బాషా, సింగరాయకొండ సీఐ హజరత్తయ్య లు దర్యాప్తు వేగవంతం చేసి న్యాయం జరిగేలా చర్యలు చేపడతామని హామీ ఇవ్వడంతో వారు నిరసన విరమించారు. విచారణ పూర్తయ్యే వరకు శాంతి భద్రతలకు విఘాతం కల్గించరాదని, ఆగ్రహావేశాలకు పోరాదని వారికి సూచించారు. కార్యక్రమంలో టంగుటూరు ఎస్సై నాగమల్లేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

పండగకు వచ్చి..పరలోకాలకు..

నరసరావుపేట సెంట్రల్, న్యూస్‌టుడే: శివరాత్రి పండగకు చెల్లెలి ఇంటికి వచ్చిన అన్న రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందిన ఘటన పల్నాడు జిల్లా నరసరావుపేట మండలం గోనెపూడిలో సోమవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. గ్రామీణ పోలీసుల కథనం మేరకు అద్దంకి మండలం ధేనువకొండ గ్రామానికి చెందిన పిట్టల నాగరాజు (30) అతని స్నేహితులు రామకృష్ణ, వెంకటేశ్వర్లు మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా నరసరావుపేట మండలం గోనెపూడిలోని తన సోదరి కొండా వెంకటలక్ష్మి ఇంటికి వచ్చారు. స్వామి దర్శనానికి కొండకు వెళ్లి వచ్చారు. ఈ క్రమంలో సోమవారం రాత్రి 10 గంటల సమయంలో మళ్లీ కొండకు వెళ్లి వస్తామని ముగ్గురూ ద్విచక్రవాహనంపై వెళ్లారు. తిరిగి వస్తుండగా ఎదురుగా వచ్చిన మరో ద్విచక్రవాహనాన్ని తప్పించే క్రమంలో అదుపు తప్పి పడిపోయారు. ఈ ప్రమాదంలో నాగరాజు తలకు తీవ్ర గాయమై అక్కడికక్కడే మృతి చెందగా మిగిలిన ఇద్దరికి గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న గ్రామీణ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. నాగరాజు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా వైద్యశాలకు తరలించారు. మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ప్రకాశం జిల్లాలో బ్రాయిలర్ ధరలు (కిలో 1కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం ధర - 115, రిటైల్ లైవ్ - 142, చికెన్ విత్ స్కిన్ - 206, చికెన్ స్కిన్‌లెస్- 234

కడతేరిపోయావా కన్నా..!

❖ తల్లిదండ్రుల నిర్లక్ష్యానికి పసివాడు బలి ❖ మృతదేహాన్నీ తీసుకెళ్లని వైనం

అడవిపాలెం (సంతమాగులూరు), న్యూస్‌టుడే: తల్లిదండ్రుల నిర్లక్ష్యం ఆ పసివాడిని బలితీసుకుంది.. పొత్తిళ్లలో ఉండాల్సిన బిడ్డను పొలం గట్టుపై వదిలేయడంతో.. అక్కడున్న విష ద్రావణం తాగిన అతను చికిత్స పొందుతూ కడతేరిపోయాడు. బిడ్డ మృతదేహాన్ని ఆసుపత్రిలోనే వదిలేసి వెళ్లిపోయాయి ఆ పాషాణ హృదయాలు ! గుండెల్ని పిండేసే ఈ విషాద సంఘటన మంగళవారం ఆలస్యంగా వెలుగు చూసింది. ఏఎస్సై శ్రీనివాసరావు తెలిపిన వివరాల ప్రకారం.. ఉలవపాడు మండలం, కృష్ణాపురానికి చెందిన సీహెచ్.శ్రీనివాసరావు, మస్తానమ్మ బాతులు పెంచుకుంటూ ఉపాధి పొందుతున్నారు. వారు ఇటీవల బాతులు మేపుకునేందుకు ఈ నెల 14న సంతమాగులూరు మండలం అడవిపాలేనికి వెళ్లారు. అదేరోజు తమ పదిహేను నెలల మగబిడ్డను అక్కడి పొలం గట్టుపై వదిలేసి బాతులు మేపుకునే పనిలో పడ్డారు. ఆ పసివాడు పొరపాటున అక్కడ పడివున్న పిచికారీ మందును తాగి అపస్మారక స్థితికి చేరాడు. కొద్దిసేపటికి గమనించిన తల్లి వెంటనే బిడ్డను తీసుకుని అద్దంకి ప్రభుత్వాసుపత్రికి వెళ్లింది. పరిస్థితి విషమంగా ఉండటంతో ఒంగోలు రిమ్స్‌లో చేర్పించింది. పరిస్థితి విషమించడంతో ఆ బాలుడు సోమవారం రాత్రి ప్రాణాలు కోల్పోయాడు. ఈ ఘటనపై మృతుడి తండ్రి మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై తెలిపారు. తల్లిదండ్రులు బిడ్డ మృతదేహాన్ని ఆసుపత్రిలోనే వదిలేసి వెళ్లడం అక్కడి వారిని కలచివేసింది.

పచ్చాకు ట్రాక్టర్ బోల్తా.. కూలీ మృతి

❖ మరో ముగ్గురికి తీవ్ర గాయాలు

ఒంగోలు నేరవిభాగం, న్యూస్‌టుడే: ఒంగోలు-చీరాల రహదారిలో త్రోవగుంట సమీపంలోని భారత్ పెట్రోలియం బంకు సమీపంలో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక మహిళా కూలీ దుర్మరణం పాలయ్యారు. మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. నాగులుప్పలపాడు మండలం మద్దిరాలపాడుకు చెందిన కూలీలు చేకూరపాడుకు చెందిన రైతు వడ్లెళ్ల ప్రభాకరరావుకు చెందిన పొలం నుంచి పొగాకు కొట్టుకుని తిరిగి అదే గ్రామానికి వెళ్లే క్రమంలో ప్రమాదం జరిగింది. ట్రాక్టర్‌లో పొగాకు నింపుకొని వెళ్తుండగా దానికి రెండువైపులా నలుగురేసి చొప్పున కూలీలు కూర్చుని ప్రయాణిస్తున్నారు. ఈ క్రమంలో పొలం నుంచి ప్రధాన రహదారిలోకి వచ్చేందుకు డొంకదారిలో ప్రయాణిస్తున్న ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తాపడింది. ట్రాక్టర్ ఒకవైపునకు బోల్తాపడగా అటువైపు కూర్చున్న కూలీలు కిందపడిపోయారు. వారిపై ట్రాక్టర్‌లో ఉన్న పొగాకు పడిపోయింది. మరోవైపు కూర్చున్న కూలీలు ట్రాక్టర్ పైనుంచి దూకేశారు. వారు కేకలు వేయడంతో ఆ మార్గంలో ప్రయాణిస్తున్నవారు హుటాహుటిన అక్కడకు చేరుకుని పొగాకును తొలగించి దానికింద చిక్కుకున్న కూలీలను కాపాడేందుకు యత్నించారు. స్థానికుల ద్వారా అందిన సమాచారంతో ఒంగోలు తాలూకా పోలీసులు హుటాహుటిన సంఘటనాస్థలానికి చేరుకుని సహాయక చర్యల్లో పాల్గొన్నారు. ఈ ప్రమాదంలో ముగ్గురు కూలీలు గాయాలతో బయటపడగా, చాట్లగడ్డ **ఎమేలియా**(40) అనే మహిళ అపస్మారక స్థితిలోకి వెళ్లి మృతి చెందారు. ఉసురుపాటి ఆరోగ్యమ్మ, దీప్తి, జ్యోతి అనే మహిళలు తీవ్రంగా గాయపడ్డారు. వారిని ఒంగోలు జీజీహెచ్‌కు తరలించి అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం ప్రైవేటు వైద్యశాలకు తీసుకెళ్లారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు తాలూకా ఎస్సై హరిబాబు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎల్ఐసి హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్

నెల్లూరు ఏరియా ఆఫీస్:
డి.నెం.15-284, MSR ఎన్‌క్లేవ్, ఫస్ట్ ఫ్లోర్, బృందావనం, నెల్లూరు-524001.

ఇ-వేలం అమ్మకం ప్రకటన

ఎల్.ఐ.సి. హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ (LIC HFL) వారి యొక్క అధీకృత అధికారిగా ఉన్న ఈ దిగువ సంతకందారుడు సెక్యూరిటైజేషన్ మరియు రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ మరియు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 నందు చెప్పబడిన నిబంధనలు మరియు అందలి సెక్షన్ 13(12)తో కలిపి చదవబడే విధంగా సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) నిబంధనలు, 2002 యొక్క నిబంధన 3 క్రింద తమకు లభించిన అధికారములను వినియోగించుకొంటూ ఈ దిగువ చెప్పబడిన ఋణగ్రహీత(లు) / తనఖాదారు(లు) చెల్లించవలసిన బకాయి మొత్తములను తిరిగి చెల్లించవలసినదిగా కోరుతూ డిమాండ్ నోటీసు జారీచేసియున్నారని ఇందుమూలముగా తెలియజేయడమైనది. అయినప్పటికీ మా నోటీసులు నందు చెప్పబడిన బకాయి మొత్తములను ఈ ఋణగ్రహీత(లు) / తనఖాదారు(లు) చెల్లింపులో విఫలమైనందున, ఈ దిగువ చెప్పబడిన సంతకందారుడు, ఈ దిగువ చెప్పిన ఆస్తులను సదరు పై చట్టం యొక్క సెక్షన్ 13(4) మరియు సెక్షన్ 14తో కలిపి చదవబడే నిబంధన 8 క్రింద **భౌతికంగా స్వాధీనము** చేసికొనియున్నారు.

లోన్ నెం. / ఋణగ్రహీత / సహ-ఋణగ్రహీత పేరు	స్థిరాస్తి వివరములు	రిజర్వు ధర (రూ.)	ధరావత్తు (రిజర్వు ధరలో 10%)	బ్యాంక్ వివరములు (ధరావత్తు బదిలీ చేయవలసిన)
లోన్ నెం. 711100007511, 711100007532, 711100007543 శ్రీ భాస్కరరావు గణపతిరాజు & శ్రీమతి సునీత గణపతిరాజు నెల్లూరు ఏరియా ఆఫీస్ సంప్రదించవలసిన నెం: 9441272136, 9704020357	20-06-2005 తేదీగల విక్రయ దస్తావేజు నెం. 1937/2005 లోని స్థిరాస్తి. ప్రకాశం జిల్లా, కందుకూరు సబ్ జిల్లా, కందుకూరు మండలం, కందుకూరు మునిసిపాలిటీ, కందుకూరు గ్రామము, యస్.నెం.894/2ఎ, కందుకూరు టౌన్, వార్డు నెం.17, బ్లాక్ నెం.2, సమీప డోర్ నెం.17-2-10 నందు 197.4/9 చ॥గ॥ లేదా సమానమైన 165.088 చ॥మీ॥ విస్తీర్ణముగల స్థలము ప్లాట్ నెం.2 స్థిరాస్తికి సంబంధించిన యావదాస్తి. **దీనికి హద్దులు: తూర్పు:** 18 అ॥ వెడల్పుగల మార్గము; **దక్షిణం:** యమ్.వెంకటరావుకు చెందిన ప్లాట్ నెం.3; **పడమర:** ఉప్పుటూరి వెంకట సుబ్బయ్య మరియు ఇతరుల యొక్క స్థలము; **ఉత్తరం:** ప్లాట్ నెం.1 లోని స్థలము.	రూ. 49,00,000/-	రూ. 4,90,000/-	Beneficiary Name: LIC HOUSING FINANCE LIMITED COLLECTION A/C VIJAYAWADA. Branch Name: HDFC Bank Account No: LHFLVW711100007543 IFSC CODE: HDFC0000109
		బిడ్ పెంపుదల మొత్తం రూ.10,000/-		

ఇ-వేలం యొక్క వెబ్‌సైట్	https://bankauctions.in
ఆస్తి తనిఖీ కొరకు తేది & సమయం	18.03.2026 ఉ॥ 10.30 గం॥ల నుండి సా॥ 04.00 గం॥ల వరకు
ఆస్తి డాక్యుమెంట్స్ యొక్క ఫోటోకాపీల తనిఖీ కొరకు తేది & సమయం	16.03.2026 ఉ॥ 10.30 గం॥ల నుండి సా॥ 04.00 గం॥ల వరకు
టెండరు / సీల్డ్ బిడ్ సమర్పించుటకు చివరి తేది	23.03.2026 సా॥ 05.00 గం॥ల లోపు
ఇ-వేలం తేది మరియు సమయం	24.03.2026 ఉ॥ 11.00 గం॥ల నుండి మ॥ 01.00 గం॥ వరకు

ఇ-వేలం ద్వారా విక్రయం చేయు పైన చెప్పబడిన అసెట్స్ / ఆస్తులు (SARFAESI, చట్టం 2002 నందు నియమములు మరియు నిబంధనలకు లోబడి మరియు తదుపరి చెప్పిన నిబంధనలు) కొరకు జారీ చేసిన ఈ బహిరంగ ప్రకటనతో పాటుగా, **ఎల్.ఐ.సి. హెచ్.ఎఫ్.ఎల్** వారు ఆన్‌లైన్ విధానం ద్వారా పైన చెప్పబడిన ఆస్తులను "ఎక్కడ ఏమి ఉన్నదో అలాగే" మరియు "అక్కడ ఏమి ఉన్నదో అదే" ప్రాతిపదిక పై కొనుగోలు చేయుటకు ఆసక్తి గల బిడ్డర్ల నుండి ఆఫర్లను ఆహ్వానించుచున్నాము.

వేలం ద్వారా విక్రయం యొక్క నియమములు & నిబంధనలు ఈ దిగువ చెప్పబడినవి

1) "ఎక్కడ ఏమి ఉన్నదో అలాగే", "అక్కడ ఏమి ఉన్నదో అదే", "ఏదైతే ఉన్నదో అదే" మరియు "ప్రశ్నించే వీలులేని" ప్రాతిపదిక పై మాత్రమే ఇ-వేలం నిర్వహించబడును మరియు "ఆన్‌లైన్" విధానము ద్వారా ఇ-వేలం **ఎల్.ఐ.సి. హౌసింగ్ ఫైనాన్స్** వారిచే ఆమోదిత ఇ-వేలం సర్వీస్ ప్రొవైడర్ **M/s.4 Closure** వారిచే నిర్వహించబడును. **2)** ఆసక్తి గల బిడ్డర్లు తమ పేర్లను దయచేసి మా పోర్టల్ **https://bankauctions.in** నందు నమోదు చేసుకొనవలెను మరియు వారి యొక్క యూజర్ ఐడి మరియు పాస్‌వర్డ్‌లను ఉచితంగా పొందవచ్చును. ఇ-వేలం విధానం ద్వారా పాల్గొనుటకు ఆన్‌లైన్ శిక్షణ కొరకు ఆసక్తిగల అర్హత కలిగిన బిడ్డర్లు మా సర్వీసు ప్రొవైడరు **M/s.4Closure, సంప్రదించవలసిన వ్యక్తి: శ్రీ టి.జయప్రకాష్‌రెడ్డి, ఫోన్: 8142000064**, ఇ-మెయిల్ ఐడి: **prakash@Bankauctions.in & info@bankauctions.in** నందు సంప్రదించగలరు. **3)** ఆమోదిత ఇ-వేలం సర్వీస్ ప్రొవైడర్ **M/s.4Closure** వారి **https://bankauctions.in** వెబ్‌సైట్ దర్శించి వేలం ద్వారా విక్రయం చేయు ఆస్తి యొక్క పూర్తి వివరములు మరియు అందలి పూర్తి నియమములు మరియు నిబంధనలు తెలుసుకొనవచ్చును. **4)** మరిన్ని వివరముల కోసం దయచేసి సంప్రదించండి: **9441272136, 9704020357.**
*వేలం యొక్క ఇతర అన్ని నియమ నిబంధనలు అధికారిక వెబ్‌సైట్: **https://online.lichousing.com/eauction/** లో అనుబంధం 2 గా పేర్కొనబడ్డాయి.

తేది: 17-02-2026, ప్రదేశము: నెల్లూరు — సం/- అధీకృత అధికారి, ఎల్.ఐ.సి. హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్

BUSINESS SERVICES

బంగారం బ్యాంకులలో/ ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈరోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్). Ph: 81422 92071.

PROFESSIONAL SERVICES

ASTROLOGY

తమిళనాడు వైదీశ్వరన్‌కోయిల్ శ్రీ అగస్త్య నాడి జ్యోతిష్యాలయం మీచేతి బొటన వేలు ముద్రతో మీ భవిష్యత్తు పూర్తిగా చెప్పబడును. అన్ని సమస్యలకు పరిష్కారం చెప్పబడును. 89782 15913.

PEOPLE CARE

OLD AGE HOME

డా॥లక్ష్మీప్రియాంక వానప్రస్థ వృద్ధాశ్రమం, సూరారెడ్డిపాళెం, టంగుటూరు (మం), ఒంగోలు. ఆహ్లాదకరమైన, ఆరోగ్యకరమైన మంచి వాతావరణంలో అందరికి అందుబాటులో నిర్మించబడిన వృద్ధాశ్రమం. బెడ్ పేషెంట్స్‌కు ప్రత్యేక వసతులు కలవు. Cont: 7095870566, 9912147879.

REAL ESTATE

WANTED

ప్రకాశం జిల్లాలో బీడు లేదా వ్యవసాయ భూమి, క్లియర్ టైటిల్ మరియు రోడ్డు సౌకర్యం కలిగినటువంటి 100ఎకరాలు కావలెను. ✆ 93922 16369.

JOBS

Wanted DRA Tele Callers, Field Executives & Team Leaders Banking Sector Attractive Salaries and Incentives, ✆ 9849394835, 7075345527.

Wanted Teachers for Reputed Schools in A.P & Telangana, Contact: Sneha Placements Service. Ph: 94402 46409.

ఒంగోలు LUCKY షాపింగ్ మాల్ ఎదురు గల JOCKEY షోరూమ్ నందు పనిచేయుటకు అనుభవం గల సేల్స్ బాయ్స్ కావలెను. సంప్ర: 99898 48485.

త్రినేత్ర హోంకేర్‌లో వృద్ధులను/ పేషెంట్స్‌ను /పిల్లలను చూసు కొనుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఫ్రీ వసతి, భోజనం. జీ: 18K. ✆ 8520980099, 8520874499

డా॥లక్ష్మీప్రియాంక వానప్రస్థ వృద్ధాశ్రమం, సూరారెడ్డిపాళెం, టంగుటూరు (మం), ఒంగోలు. కంప్యూటర్ ఆపరేటర్స్ మరియు భార్యాభర్త కేర్‌టేకర్స్ కావలెను. Cont: 7095870566, 9912147879

హరేకృష్ణ హోంకేర్‌లో వృద్ధులను/ పేషెంట్స్‌ను/ పిల్లలను చూసు కొనుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఫ్రీవసతి, భోజనం జీ:18-20K ✆ 96404 68899, 96402 58899

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తా పత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటన దారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయం లో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బు ను వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

కందుకూరు

•కందుకూరు • కొండపి

రాళ్లపాడు పనులకు పునఃప్రతిపాదనలు

అసెంబ్లీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాగేశ్వరరావు

ఈనాడు, అమరావతి: రాళ్లపాడు జలాశయం ఎడమ ప్రధాన కాలువ పనులను రీ ఎస్టిమేట్ చేయించి పునఃప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటామని జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. 2018లో పనులు చేపట్టేందుకు అప్పటి తెదేపా ప్రభుత్వం రూ.36.50 కోట్లు మంజూరు చేస్తే అనంతరం అధికారంలోకి వచ్చిన వైకాపా ప్రభుత్వం వాటిని చేపట్టకుండా రద్దు చేసిందన్నారు. శాసనసభ ప్రశ్నోత్తరాల సందర్భంగా కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానమిచ్చారు. 'రాళ్లపాడు జలాశయం 16 వేల ఎకరాలకు సాగునీరు, 116 గ్రామాలకు తాగునీరందిస్తుంది. 1.10 టీఎంసీల సామర్థ్యంతో నిర్మించిన ఈ జలాశయం మరమ్మతుల లక్ష్యం. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత రూ.2.54 కోట్లు మంజూరు చేశాం. కందుకూరు నియోజకవర్గంలోని ఇతర నీటిపారుదల వనరుల మరమ్మతులకు మరో .8.34 కోట్లు ఇచ్చాం. నీరు వృథా కాకుండా జలాశయానికి సంబంధించిన స్పాట్‌లాక్ గేట్లు, హెడ్ రెగ్యులేటర్‌లకు సంబంధించిన మరమ్మతుల పనులు చేయించడం గానీ అవసరమైతే కొత్తవి ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటాం' అని మంత్రి పేర్కొన్నారు.

నిలిచిన తాగునీటి సరఫరా

గుడ్లూరు, న్యూస్‌టుడే: మండలంలోని పూరేటిపల్లిలో రెండు రోజుల నుంచి తాగునీటి సరఫరా నిలిచిపోయిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాళ్లపాడు జలాశయం నుంచి వచ్చే నీరుకూడా నిలవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని తెలిపారు. ఈ విషయంపై ఎంపీడీవో వెంకటేశ్వరరావు వివరణ కోరగా బుధవారం నుంచి నీటిసరఫరా అయ్యేవిధంగా చర్యలు తీసుకుంటామన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
కందుకూరు: 70939 81624
కొండపి: 96424 56296

మీ ప్రాంతంలో ఏ ప్రజా సమస్యనైనా పరిష్కరించే క్రమంలో 'ఈనాడు' మీకు తోడుగా ఉంటుంది. వివరాలను, చిత్రాలను వాట్సాప్ ద్వారా పంపవచ్చు. లేదా ఫోన్లో వివరించవచ్చు. వాటిని బాధ్యుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తాం.

వలేటివారిపాలెం, న్యూస్‌టుడే:
?: అయ్యవారిపల్లె ఎస్సీకాలనీలోని ప్రాథమిక పాఠశాల వద్ద వీధి దీపం వెలగడం లేదు. సమస్యను పరిష్కరించగలరు. - కోటయ్య, స్థానికుడు
✓: మరమ్మతులు చేయాలని పంచాయతీ కార్యదర్శికి చెప్పాను. - వెంకటనారాయణ, ఈవోపీఆర్డీ

మర్రిపూడి, న్యూస్‌టుడే:
?: చిమట పంచాయతీలోని ఎస్సీ కాలనీలో కాలువల్లో మురుగునీరు నిలిచి దోమలు వ్యాప్తి చెందుతున్నాయి. సమస్యను పరిష్కరించగలరు.
✓: పంచాయతీ కార్యదర్శితో మాట్లాడి పరిశుభ్రత పనులు చేయిస్తాం. - నాగూర్‌వలి, ఎంపీడీవో

గుడ్లూరు, న్యూస్‌టుడే:
?: గుడ్లూరు మామిడి చెట్ల కాలనీ నుంచి ఎస్సీ కాలనీకి పోయే మార్గంలో వీధి దీపాలు వెలగడం లేదు. సమస్యను పరిష్కరించగలరు. - పరిణిత్‌కుమార్, స్థానికుడు
✓: పరిశీలించి మరమ్మతులు చేయిస్తాం. - నరేష్, పంచాయతీ కార్యదర్శి

జరుగుమల్లి, న్యూస్‌టుడే:
?: బిట్రగుంట గ్రామంలో కాలువలో చాలా కాలంగా పూడిక తీయకపోవడంతో మురుగు నీరు నిలిచి దోమలు అధికంగా వ్యాప్తి చెందుతున్నాయి. - నారాయణ, స్థానికుడు
✓: త్వరలో కాలువల్లో పూడిక తీయించి దోమల నివారణకు చర్యలు చేపడతాం. - షఫీ, పంచాయతీ కార్యదర్శి

ఉలవపాడు, న్యూస్‌టుడే:
?: ఉలవపాడులోని ఎస్‌బీఐ బ్యాంకు, దర్గా సెంటరులోనూ వీధిదీపాలు తరచూ వెలగకుండా పోతున్నాయి. - నాగేశ్వరరావు, ఉలవపాడు.
✓: పరిశీలించి రెండు రోజుల్లో మరమ్మతులు చేయిస్తాం. - వీరయ్య, పంచాయతీ కార్యదర్శి.
?: కరేడు ఇందిరానగర్ కాలనీలో వీధిదీపాలు వెలగడంలేదు. - శ్రీను, ఇందిరానగర్ కాలనీ.
✓: రెండు రోజుల్లో వెలిగించే ఏర్పాటు చేయిస్తాం. - భాస్కరరావు, పంచాయతీ కార్యదర్శి.

ఉత్తమ ఫలితాల సాధనకు కృషి చేయాలి

వలేటివారిపాలెం: ప్రత్యేక తరగతులను నిర్వహించి విద్యార్థులతో ఉత్తమ ఫలితాలను సాధించాలని ఉపాధ్యాయులకు సమగ్ర శిక్షా సీఎంవో రమణయ్య సూచించారు. జమీన్ ఓగూరుపాడులో కేజీబీవీ పాఠశాలను జిల్లా కమిటీ మంగళవారం సందర్శించారు. పదో తరగతి విద్యార్థులకు 100 రోజుల ప్రణాళిక అమలుతీరుపై సిబ్బంది, విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. దస్త్రాలను పరిశీలించారు. ఒత్తిడికి గురికాకుండా పరీక్షలకు సన్నద్ధం కావాలని విద్యార్థులకు చెప్పారు. ఉపాధ్యాయుల సూచనలను తప్పని సరిగా పాటిస్తే మంచి ఫలితాలు వస్తాయన్నారు. రసూల్, షమీర్ పాల్గొన్నారు.

ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

జరుగుమల్లి: ఉచిత నిర్బంధ విద్యాహక్కు చట్టం ప్రకారం 2026- 27 విద్యాసంవత్సరానికి ప్రైవేట్ పాఠశాల్లో ఒకటో తరగతి ప్రవేశాలకు ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసింది. మండలంలోని సహాయ, ఎన్ ఆర్డ యూడెడ్ స్కూళ్లలో పేదలు, అనాథలు, దివ్యాంగులు, ఆర్థికంగా, సామాజికంగా వెనుకబడిన బలహీన వర్గాల వారికి కేటాయించిన 25 శాతం సీట్ల కోసం ఈ నెల 20 నుంచి ఆన్‌లైన్లో దరఖాస్తు చేసుకోవాలని మండల విద్యాశాఖాధికారులు బి. నాగేంద్రవదన్, డి. శ్రీనివాసరావు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తి గలవారు మండల విద్యాశాఖ కార్యాలయంలో, గ్రామ వార్డు సచివాలయాలు, లేదా మీ సేవ కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

పారిశుద్ధ్య లోపం... వ్యాధులకు ఊతం

సింగరాయకొండ గ్రామీణం, న్యూస్‌టుడే: సింగరాయకొండ మండలంలో అపరిశుభ్రం కారణంగా విష జ్వరాలు విజృంభిస్తున్నాయి. రోజురోజుకు డెంగీ, మలేరియా, టైఫాయిడ్ కేసులు అధికమవుతున్నాయి. మేజరు పంచాయతీలైన సింగరాయకొండ, మూలగుంటపాడు గ్రామాల్లో ప్రజలు అనారోగ్య సమస్యలతో ఆసుపత్రుల చుట్టూ తిరుగుతున్నారు.

ప్రైవేటు పాఠశాలల వద్ద పేరుకుపోయిన వ్యర్థాలు

మురుగు నిలయాలుగా

మూలగుంటపాడు పంచాయతీ పరిధిలోని విద్యానగర్, ఐటీఐ కళాశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంతాల్లో కాలువలు మురుగు నిలయాలుగా మారాయి. పంచాయతీ కార్యాలయ పరిసరాల్లోని ఖాళీ ప్రాంతాల్లో మరింత అధ్వానంగా మారాయి. కాలువల్లో వ్యర్థాలు, మురుగు, నిలిచి దుర్వాసన వస్తోంది. దీంతో ఆయా ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

క్షేత్రస్థాయిలో పరిస్థితులు భిన్నం

మండలంలోని మూలగుంటపాడు గ్రామంలో ప్రైవేటు పాఠశాలలు, విద్యానగర్, పంచాయతీ కార్యాలయం తదితర ప్రాంతాల్లో రహదారులు, నివాసాల వెంబడి వ్యర్థాలు, కాలువల్లో పూడిక తొలగించక దుర్వాసన వెదజల్లుతోంది. ప్లాస్టిక్ సంచులను ఆవులు, పశువులు తింటూ వ్యాధుల బారిన పడుతున్నాయి. ఇలాంటి ప్రాంతాల్లో బ్లీచింగ్ చల్లిన దాఖలాలు లేవు. ఏటా బ్లీచింగ్ రూ.5 లక్షల వరకు పంచాయతీ ఖర్చు చేస్తుంది. కానీ క్షేత్రస్థాయిలో మాత్రం పరిస్థితులు భిన్నంగా ఉన్నాయి. దీంతో లక్ష్యం నీరుగారుతోంది.

మెరుగుకు చర్యలు

ఈ విషయంపై పంచాయతీ కార్యదర్శి హనుమంతరావును వివరణ కోరగా.. పారిశుద్ధ్యం మెరుగుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఖాళీ స్థలాల్లో మురుగు లేకుండా స్థలాల యజమానులకు నోటీసులు జారీ చేస్తామన్నారు. గత పది రోజులుగా పారిశుద్ధ్య కార్మికులు పాకల బీచ్ ఫెస్టివల్ కార్యక్రమంలో పాల్గొనడంతో గ్రామంలో వ్యర్థాలు పేరుకు పోయాయన్నారు.

కనులపండువగా నీలకంఠేశ్వరస్వామి కల్యాణం

ఉలవపాడు, న్యూస్‌టుడే: మహాశివరాత్రిని పురస్కరించుకుని ఉలవపాడులోని నీలకంఠేశ్వరస్వామి కల్యాణం మంగళవారం అంగరంగ వైభవంగా జరిగింది. కల్యాణాన్ని తిలకించేందుకు మహిళా భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం తీర్థప్రసాదాలు అందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది పాల్గొన్నారు. ● టంగుటూరు: రావూరి సోమయ్య నగర్‌లోని శ్రీలింగాల పరమేశ్వర అమ్మవారి ఆలయంలో మహా శివరాత్రిని పురస్కరించుకుని ఉత్సవాలను నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా మంగళవారం కాళీ మాత అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారికి లలిత సహస్రనామ పారాయణం చేశారు. అనంతరం ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం అమ్మవారికి మహాకుంభ కార్యక్రమాన్ని నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు.

నిధుల కేటాయింపునకు అనుతివ్వాలి

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: అభివృద్ధి పనుల నిమిత్తం నియోజకవర్గానికి రూ.కోటి చొప్పున ఒడా నిధులు కేటాయింపునకు అనుమతి ఇవ్వాలని కోరుతూ రాష్ట్ర పురపాలకశాఖ మంత్రి పి.నారాయణకు మంగళవారం వినతి పత్రం అందజేశారు. గతంలో బీవీఎసీస్ సంబంధించిన రూ.10 కోట్ల నిధులను విడుదల చేయాలని కోరారు. ఐడీఎస్ఎంటీ ప్లాట్ల వేలానికి అనుమతి ఇవ్వాలని విన్నవించారు. ఈ మేరకు జేసీ కల్పనాకుమారి, ఒడా ఛైర్మన్ షేక్ రియాజ్, నగర మేయర్ గంగాడ సుజాత, కమిషనర్ కె.వెంకటేశ్వరరావు తదితరులు రాష్ట్ర మంత్రి నారాయణను కలిశారు.

మద్యం గొలుసు దుకాణాలకు వ్యతిరేకంగా గ్రామస్థుల ర్యాలీ

టంగుటూరు, న్యూస్‌టుడే: మండలంలోని పొందూరు గ్రామంలో బెల్టుషాపుల ద్వారా మద్యం విక్రయించడాన్ని వ్యతిరేకిస్తూ గ్రామానికి బొద్దున మంగళవారం రాత్రి గ్రామస్థులు నిరసన ర్యాలీ చేపట్టారు. ఈ కార్యక్రమంలో మద్యపాన వ్యతిరేక సంఘం, వామపక్ష పార్టీ నాయకులు, గ్రామ సర్పంచి పిల్లి కోటిలింగం, ఎంపీటీసీ సభ్యుడు పమిడి నాగేశ్వరరావులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామంలో విచ్చలవిడిగా మద్యం ఏరులై పారుతుండడంతో, పేద కుటుంబాలు, మహిళలు అల్లాడిపోతున్నారన్నారు. మహిళలు బహిరంగంగా తిరగాలంటే భయపడుతున్నారని తెలిపారు. పోలీసులు పొందూరు గ్రామంలో మద్యం అమ్మకాలను అడ్డుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వామపక్ష నాయకులు వి.మోజెస్, కోటేశ్వరరావు, సుదాకర్, ఏసుదాసు, కోటేశ్వరరావు, కొండయ్య పాల్గొన్నారు.

మాట్లాడుతున్న వామపక్ష, ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు

వ్యక్తిగత పరిశుభ్రత అవసరం

కందుకూరు గ్రామీణం, న్యూస్‌టుడే: నులి పురుగులు శరీరంలో ఉంటే పోషకాహార లోపం, రక్తహీనత, శారీరక మానసిక సమస్యలు ఎదురవుతాయని ఉప జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి పి.రమేష్ సూచించారు. మంగళవారం కొండముడుసుపాలెం ప్రాథమిక పాఠశాల్లో జాతీయ నులి పురుగుల దినోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఏడాది 19సంవత్సరాల లోపు పిల్లలు ఆల్బెండజోల్ 400ఎంజీ మాత్రలు తప్పనిసరిగా వేసుకోవాలని సూచించారు. ఆహారం తినక ముందు తర్వాత చేతులు సబ్బుతో శుభ్రం చేసుకోవాలని, పరిశుభ్రమైన తాగునీటిని తాగాలని, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో మాచవరం పీహెచ్‌సీ వైద్యుడు రాకేష్, సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. ● పొన్నలూరు: మండలంలోని అన్ని పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, జూనియర్ కళాశాల్లో జాతీయ నులి పురుగుల దినోత్సవం సందర్భంగా మంగళవారం విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్యాధికారులు శ్రీకాంత్, కృష్ణచైతన్య, రవికిరణ్, మల్లికార్జునరావు, భాస్కరరావు, హెచ్ఈవో సురేష్, గిరిజ, ఏఎన్ఎమ్‌లు, ఎంఎల్‌హెచ్‌పీలు పాల్గొన్నారు. ● ఉలవపాడు: జాతీయ నులిపురుగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఉలవపాడులోని ప్రభుత్వ జీటీఎస్ఎమ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల్లో విద్యార్థినీ విద్యార్థులకు మాత్రలను మింగించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు హెల్త్‌కేర్ కోఆర్డినేటర్ కాంతి, సిబ్బంది పాల్గొన్నారు. ● గుడ్లూరు: విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని మండల విద్యాశాఖాధికారి సాయి ప్రియాంక సూచించారు. నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా మంగళవారం స్థానిక ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులకు మాత్రలు అందించారు. చేతులు శుభ్రంగా లేకపోతే వందరకాల వ్యాధులు నివారించవచ్చని వైద్యాధికారులు సూచించారు. మండలంలోని అన్ని పాఠశాలల్లో వైద్య సిబ్బంది ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రామ్మోహన్, సీహెచ్‌వో సుబ్బారావు, మల్లికార్జున, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ●సింగరాయకొండ గ్రామీణం: నులి పురుగుల విద్యార్థుల రక్తహీనత, శరీర పెరుగుదలను నిరోధిస్తాయని ప్రభుత్వ వైద్యాధికారి డా.ఆయేషా అన్నారు. నులి పురుగులను నివారించేందుకు విద్యార్థులు తగు జాగ్రత్తలు పాటించాలని, చేతులు శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ప్రభుత్వ వైద్యులు రవి, వంశీధర్, ధీరేంద్ర, సిబ్బంది పాల్గొన్నారు. ● కందుకూరు పట్టణం: యుక్త వయస్సులో నులి పురుగుల వలన అనేక అనారోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని టీబీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ నాగేశ్వరరావు అన్నారు. కార్యక్రమంలో ఎన్ ఎస్ఎస్ బాధ్యులు, విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

కొండముడుసుపాలెం ప్రాథమిక పాఠశాల్లో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఆరోగ్యశాఖాధికారులు

తాగునీరు నేలపాలు

జంపాలవారిపాలెం సమీపంలో పంచాయతీ అంతర్గత తాగునీటి పైపులు లీకై నిరంతరం వృథాగా నేల పాలవుతోంది. నాలుగు రోజుల క్రితం విద్యుత్తు స్తంభాలు ఏర్పాటు చేసే సమయంలో పైపులు మరమ్మతులకు గురయ్యాయి. అప్పటి నుంచి నీరు వృథాగానే పోతోంది. దీంతో కొన్ని ప్రాంతాలకు నీటి సరఫరా నిలిచి పోవటంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ విషయంపై పంచాయతీ కార్యదర్శి మాధవరావును వివరణ కొరగా మరమ్మతులు చేయిస్తానని తెలిపారు. - న్యూస్‌టుడే, లింగసముద్రం

కదలని మురుగు

మండలంలోని నెన్నూరుపాడు గ్రామంలో మురుగు సమస్యతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గ్రామంలోని ఏ వీధిలో చూసినా కాలువల్లో పూడిక తీయకపోవడంతో ఎక్కడ మురుగు అక్కడే నిలిచిపోయి దుర్వాసన వెదజల్లుతోంది. పంచాయతీ సిబ్బంది మురుగు సమస్యను తొలగించకపోవటంతో స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వరరావుని వివరణ కోరగా వారం రోజుల్లో సమస్యను పరిష్కరిస్తామన్నారు. - న్యూస్‌టుడే, కొండపి గ్రామీణం

రెవెన్యూ విధులకే పరిమితం చేయాలి

కందుకూరు గ్రామీణం, న్యూస్‌టుడే: ఇతర శాఖలు నిర్వహించాల్సిన సర్వేలకు వీఆర్వోలను వినియోగించడం వలన రెవెన్యూ పరంగా చేపట్టే కార్యక్రమాలలో వెనుకబడుతున్నామని షోకాజ్‌లు ఇస్తున్నారని శాఖాపరమైన పనులకు మాత్రమే వినియోగించుకోవాలని వీఆర్వోలు డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ముందు భోజన విరామసమయంలో రాష్ట్ర వీఆర్వోల సంఘం పిలుపు మేరకు నిరసన చేపట్టారు. ఈ కార్యక్రమంలో మండలంలోని వీఆర్వోలు పాల్గొన్నారు. ● కందుకూరు పట్టణం: ప్రతి సచివాలయానికి లేదా ఒక రెవెన్యూ గ్రామానికి ఒక వీఆర్వో చొప్పున నియమించాలని ఏపీ వీఆర్వోల సంఘం నాయకులు కోరారు. తహసీల్దారు కార్యాలయం ఎదుట వీఆర్వోల సంఘం పిలుపు మేరకు మంగళవారం మండలంలోని వీఆర్వోలు నిరసన కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వం వీఆర్వోలకు కార్యాలయాల్లో కనీస మౌలిక వసతులు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు రామకృష్ణ, వెంకటేశ్వర్లు, రవి, ఉదయ్‌భాస్కర్ పాల్గొన్నారు.

తహసీల్దారు కార్యాలయం ముందు నిరసన తెలుపుతున్న వీఆర్వోలు

యాజమానికి బహుమతి అందజేస్తున్న మహేశ్వరరావు

మేలు జాతి లేగదూడల ప్రదర్శన

వలేటివారిపాలెం, న్యూస్‌టుడే: రాష్ట్రీయ గోకుల్ మిషన్ ఆర్థిక సహకారంతో పశుసంవర్ధక శాఖ పశువైద్యుడు సుధాకర్ ఆధ్వర్యంలో వలేటివారిపాలెంలోని చిన్న అమ్మపాలెంలో మేలుజాతి లేగదూడల ప్రదర్శన కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఛైర్‌పర్సన్ గుత్తా మహేశ్వరరావు ప్రారంభించారు. అనంతరం శాఖ డివిజన్ ఉపసంచాలకుడు శ్రీధరరావు మాట్లాడుతూ.. కృత్రిమ గర్భధారలణతో అధిక శాతం ఆడ దూడలు జన్మిస్తాయని దీని వల్ల పశుపోషకులకి లాభదాయకమన్నారు. దూడలకు ముర్రు పాలు పట్టించడంతో పాటు 60రోజుల పాటు పాలను తాగించి, వాటి సంరక్షణకు తగు చర్యలు తీసుకోవాలని పశుపోషకులకు సూచించారు. అనంతరం లేగ దూడల ప్రదర్శనలో ఉత్తమ లక్షణాలు, ఆరోగ్యమంతంగా ఉన్న వాటిని గుర్తించి బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో కందుకూరు, వలేటివారిపాలెం సహాయ సంచాలకులు చంద్రమోహన్, చెన్నకేశవులు, చినపవని, కోవూరు పశువైద్యశాలల వైద్యులు సుబ్రహ్మణ్యం, శ్రీకాంత్, నాయకులు నరసింహం, మధు, తదితరులు పాల్గొన్నారు.

రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి

గుడ్లూరు, న్యూస్‌టుడే: మండలంలోని తెట్టు-కావలి రైల్వే లైన్ మధ్య గుర్తు తెలియని ఓ వృద్ధుడిని(65) రైలు ఢీకొనడంతో మృతి చెందినట్లు కావలి జీఆర్పీ పోలీసు ఎస్సై వెంకటరావు మంగళవారం తెలిపారు. మృతుడు నల్లని నిండుచేతుల చొక్కా, లాల్చీ, జర్కిన్ ధరించి ఉన్నాడన్నారు. చూచేందుకు యాచకుడిలా ఉన్నారని ఆచూకీ తెలిసిన వారు కావలి జీఆర్పీ పోలీసులను సంప్రదించాలని ఎస్సై తెలిపారు.

యువకుడు అదృశ్యంపై కేసు నమోదు

ఉలవపాడు, న్యూస్‌టుడే: కరేడు పంచాయతీలోని కొత్తపల్లిపాలెంకు చెందిన యువకుడు కనిపించకుండా వెళ్లాడని తల్లి భారతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై సుబ్బారావు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు పిన్ని రాజేంద్రప్రసాద్(25) అనే యువకుడు ఈనెల 14న సాయంత్రం ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. అప్పటి నుంచి ఇంటికి తిరిగిరాలేదు. మరుసటిరోజు స్నేహితులు, బంధువుల వద్ద విచారించినా ఆచూకీ తెలియకపోవడంతో తల్లి పోలీస్‌స్టేషన్‌కు వచ్చి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కారు టైరు పేలి బోల్తా

జరుగుమల్లి: తిరుమల శ్రీవారిని దర్శించుకుని తిరిగి వస్తుండగా ఓ కుటుంబం కారు ప్రమాదానికి గురైన ఘటన మంగళవారం మధ్యాహ్నం బిట్రగుంట వద్ద ఉన్న పాలేరు నదీ సమీపంలో చోటుచేసుకుంది. హైవే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్న నరేంద్ర కుటుంబం సభ్యులతో కలిసి కారులో తిరుమలకు వెళ్లారు. మంగళవారం మధ్యాహ్నం తిరుగు ప్రయాణంలో వస్తుండగా బిట్రగుంట వద్ద పాలేరు వంతెన సమీపానికి చేరుకోగానే కారు ముందు టైరు పగిలిపోయింది. దీంతో కారు డివైడర్‌ని ఢీ కొట్టి బోల్తా పడింది. ప్రమాద ఘటనలో కారులో నరేంద్ర, భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కారు తీవ్రంగా దెబ్బతింది, అదృష్టవశాత్తు ఎవరికీ ఎటువంటి గాయాలు కాకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. సమాచారం అందుకున్న హైవే పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. క్రేన్ సహాయంతో కారును రోడ్డు పక్కకు తొలగించి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

యువతిపై అసభ్యపదజాలం: డ్రైవర్‌పై కేసు

కొండపి గ్రామీణం, న్యూస్‌టుడే: కొండపి పోలీస్ స్టేషన్‌లో మంగళవారం ఓ బాలికను అసభ్యంగా దూషించడని డ్రైవర్‌పై యువతి తల్లిదండ్రుల ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై ప్రేమ్‌కుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు ప్రకారం మండలంలోని పెరిదేపి గ్రామానికి చెందిన ఓ యువతి కందుకూరు మండలంలో ఉన్న ఓ ప్రైవేట్ కళాశాల్లో నర్సింగ్ చదువుతుంది. కాసేపు బస్సు ఆపమని చెప్పమని తన స్నేహితురాలికి చెప్పింది. ఈ విషయాన్ని కళాశాల బస్సు డ్రైవర్‌కు తెలపడంతో అసభ్య పదజాలాలు దూషించి బస్సు అపకుండా వెళ్లిపోయాడు. అసభ్య పదజాలంతో ఎందుకు తిట్టావని డ్రైవర్‌ను ఆ యువతి అడగడంతో చిన్నపాటి వాగ్వాదం చోటు చేసుకుంది. యువతి ఈ సంభాషణ మొత్తాన్ని కొండపిలో ఉన్న తన బంధువులకు తెలిపింది. దీంతో సాయంత్రం కళాశాల బస్సు కొండపి చేరుకునే సమయానికి బంధువులు గొడవకుదిగారు. దీంతో డ్రైవర్ వెంటనే భయంతో బస్సును కదిలించి పెద్దకండ్లగుంట గ్రామానికి తీసుకువెళ్లాడు. అమ్మాయి బంధువులు బస్సు వెనకాలే వెంబడించి డ్రైవర్‌పై, బస్సుపై దాడి చేశారు. ఈ సంఘటనలో డ్రైవర్‌కు చిన్నపాటి గాయాలయ్యాయి. బస్సు అద్దాలను రాళ్లతో పగలకొట్టారు. అమ్మాయిని అసభ్య పదజాలం వాడినందుకు తల్లిదండ్రుల ఇచ్చిన ఫిర్యాదు మేరకు డ్రైవర్‌పై, కళాశాల బస్సును ధ్వంసం చేసినందుకు యాజమాన్యం ఇచ్చిన ఫిర్యాదులపై సుమారు 10 మంది యువకులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

క్రీడా సామగ్రి అందజేత

లింగసముద్రం, న్యూస్‌టుడే: లింగసముద్రం ఉన్నత పాఠశాలకు పూర్వ విద్యార్థి కె.వెంకటనారాయణ రూ.40వేల విలువైన క్రీడా సామగ్రిని మంగళవారం అందజేసినట్లు ప్రధానోపాధ్యాయుడు మాధవరావు తెలిపారు. ఈ సందర్భంగా దాతను హెచ్‌ఎం, ఉపాధ్యాయులు అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కొండయ్య, వెంకటేశ్వర్లు, కె.ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రధానోపాధ్యాయులకు అందజేస్తున్న పూర్వ విద్యార్థి వెంకట నారాయణ

19న విద్యుత్తు వినియోగదారుల అదాలత్

కందుకూరు పట్టణం, న్యూస్‌టుడే: ఏపీ సీజీఆర్ఎఫ్ ఆధ్వర్యంలో 19వ తేదీ ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ వినియోగదారుల అదాలత్ అవగాహన సదస్సు గుడ్లూరులోని తెట్టు రోడ్డులో ఉన్న కల్యాణమండపంలో జరుగుతుందని ఈఈ అత్తంటి వీరయ్య ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కందుకూరు డివిజన్‌లోని అయిదు మండలాలు, పొన్నలూరు, జరుగుమల్లి, సింగరాయకొండ, కొండపి మండలాల వినియోగదారులు సమస్యలను ఛైర్మన్ ఎన్.విక్టర్ ఇమ్మానుయేలు దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించుకోవచ్చని తెలిపారు. ● గుడ్లూరు: మండలంలోని విద్యుత్తు వినియోగదారుల అదాలత్ అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు కందుకూరు విద్యుత్తు ఈఈ వీరయ్య, గుడ్లూరు ఏఈ మధుబాబు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ● కందుకూరు పట్టణం: ఏపీ సీజీఆర్ ఎఫ్ ఆధ్వర్యంలో ఈనెల 19వ తేదీ ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ వినియోగదారుల అదాలత్, అవగాహన సదస్సు గుడ్లూరులోని తెట్టు రోడ్డులో ఉన్న కల్యాణమండపంలో జరుగుతుందని ఆ శాఖ ఈఈ అత్తంటి వీరయ్య తెలిపారు. కందుకూరు డివిజన్ లోని అయిదు మండలాలు, పొన్నలూరు, జరుగుమల్లి, సింగరాయకొండ, కొండపి మండలాల వినియోగదారులు శాఖకు సంబంధించిన సమస్యలను ఛైర్మన్ ఎన్. విక్టర్ ఇమ్మానుయేలు దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించుకోవచ్చని తెలిపారు.

జేఈఈ మెయిన్స్‌లో విద్యార్థుల ప్రతిభ

కొండపి గ్రామీణం: జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో కొండపి గ్రామానికి చెందిన **రాజా యాగ్నిక్ నిఖిల్** 99.9191% సాధించి ప్రతిభ కనపరిచాడు. అతడి తల్లిదండ్రులు రాజా గురవయ్య, సునంద ప్రభుత్వ ఉద్యోగులుగా పనిచేస్తున్నారు. ప్రస్తుతం విజయవాడలోని ఓ ప్రైవేట్ కళాశాల్లో ఇంటర్ మీడియట్ చదువుతున్నాడు. ఇంజినీరింగ్‌లో సీఎస్ఈ చదవడం లక్ష్యం అని విద్యార్థి చెప్తున్నాడు.

● కందుకూరు పట్టణం: జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో పట్టణంలోని బీఆర్.ఆక్స్‌ఫర్డ్ ఐఐటీ, మెడికల్ అకాడమి విద్యార్థులు అత్యుత్తమ పర్సంటైల్ సాధించారని కళాశాల డైరెక్టర్ బి.నరేంద్ర తెలిపారు. బొల్లినేని కార్తీక్‌నాయుడు 99.76 పర్సంటైల్, మానికొండ హర్షిత్‌చౌదరి 98.96, ఆర్.యశస్వీకుమార్ 96.54, పి.లోకేష్ 94.52, ఎన్.వి.ఆర్యేంద్ర 93.38, కె.శశికళ 92.88, ఆర్.నాగసాయి 92.22 పర్సంటైల్ సాధించారని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను మంగళవారం కళాశాలలో జరిగిన కార్యక్రమంలో విద్యాసంస్థల ఛైర్మన్ ఉన్నంభాస్కర్, కరస్పాండెంట్ బి.వెంకటేశ్వర్లు, డైరెక్టర్ బాలభాస్కర్, ప్రిన్సిపల్ అబ్బూరివెంకటేశ్వర్లు, షాహుల్ అభినందించారు.

విద్యార్థులను అభినందిస్తున్న కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు

రైతులకు విశిష్ట గుర్తింపు సంఖ్య నమోదు తప్పనిసరి

కందుకూరు గ్రామీణం, న్యూస్‌టుడే: రైతులకు విశిష్ట గుర్తింపు సంఖ్య ఆధారంగానే ప్రభుత్వ పథకాల లబ్ధి చేకూరుతుందని ఏవో అబ్దుల్‌రహీం పేర్కొన్నారు. మండలంలోని పలుకూరు రైతు సేవాకేంద్రంలో నమోదు ప్రక్రియను ఆయన స్వయంగా పరిశీలించి రైతులకు సూచనలు చేశారు. రైతులు స్వయంగా వచ్చి నమోదు చేసుకుంటేనే అన్నదాత సుఖీభవ, పీఎంకిసాన్ నిధులు వారి ఖాతాల్లోకి చేరతాయి ఆయన తెలిపారు. గుర్తింపు సంఖ్య అధారంగా రైతులకు రాయితీ పథకాలు అందించగలమని, నమోదు కాని వారికి ఇబ్బందులు వస్తాయన్నారు. గ్రామస్థాయిలోని రైతు సేవా కేంద్రాల్లో సిబ్బందిని సంప్రదించి త్వరితగతిన నమోదు చేసుకోవాలని రైతులకు సూచించారు. ● మర్రిపూడి: రైతులందరూ తప్పనిసరిగా రైతు నమోదు పోర్టల్‌లో తమ పేర్లు నమోదు చేయించుకోవాలని వ్యవసాయాధికారి వెంకటేష్ సూచించారు. మంగళవారం మండలంలోని కూచిపూడిలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. పీఎం కిసాన్ నిధులు రైతుల ఖాతాల్లో జమ కావాలంటే విశిష్ట సంఖ్య కలిగి ఉండాలన్నారు. మండలంలో 1638 మంది రైతులు నమోదు చేయించుకోలేదని, ఆయా గ్రామాల్లో గ్రామ వ్యవసాయ సహాయకులను కలిసి నమోదు చేయించుకోవాలన్నారు. శనగ కోతలను పరిశీలించారు. ● జరుగుమల్లి: మండలంలోని వర్ధినేనివారిపాలెం, పీరాపురం గ్రామాల్లో మండల వ్యవసాయ అధికారి కాశీవిశ్వనాథ్ మంగళవారం పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. శనగ పంట కోత సమయంలో మట్టి, రాళ్ళు లేకుండా చూసుకోవాలని, తేమ శాతం గమనించి పురుగుమందు పిచికారీ చేసిన గోనె సంచుల్లో నిల్వ చేసుకోవాలని రైతులకు సూచించారు. అనంతరం బిట్రగుంట రైతు సేవా కేంద్రాన్ని జిల్లా సహాయ వ్యవసాయ సంచాలకులు ఉషారాణి సందర్శించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది నవ్య, వినోద్, స్థానిక రైతులు పాల్గొన్నారు.

పలుకూరు ఆర్ఎస్‌కేలో నమోదు ప్రక్రియను పరిశీలిస్తున్న ఏవో అబ్దుల్‌రహీం

● వలేటివారిపాలెం: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తోన్న పథకాలను రైతులు పొందాలంటే ప్రతి రైతు రైతు విశిష్ట గుర్తింపు కార్డును తప్పనిసరిగా కలిగి ఉండాలని మండల ఏవో శేషారెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని శాఖవరం రైతు సేవా కేంద్రంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంటల సాగులో ఆధునిక యాజమాన్య పద్ధతులతో పాటు శాస్త్రవేత్తల సూచనలను, సలహాలను పాటిస్తే వ్యవసాయం లాభసాటి కాగలదని అన్నారు. కార్యక్రమంలో సిబ్బంది సాయిచరణ్, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

(c) eenadu

అద్దంకి

• అద్దంకి • దర్శి

ప్రసన్నాంజనేయునికి ప్రత్యేక పూజలు

శింగరకొండ (అద్దంకి) : శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామికి దశసహస్ర కదళీ ఫలార్చన జరిగింది. స్వామి వారికి ప్రీతిపాత్రమైన మంగళవారం కావడంతో భక్తులు పెద్దసంఖ్యలో దర్శించుకున్నారు. ఒంగోలుకు చెందిన బంధకవి ప్రవీణ్-మాలతి దంపతులు ఉభయదాతలుగా వ్యవహరించారు. ప్రాతఃకాలంలో సుప్రభాతం, గోపూజ, బిందెతీర్థంతో స్వామి వారికి అభిషేకం నిర్వహించారు. వేద పండితులు వంగల హరిశంకరావధాని, ప్రధానార్చకులు కోట లక్ష్మీనారాయణ నేతృత్వంలో గణపతి పూజ నిర్వహించారు. కార్యక్రమంలో పాలకమండలి ఛైర్మన్ చుండూరి మురళీసుధాకరరావు, ట్రస్టీలు సునీత, వెంకట నారాయణమ్మ తదితరులు పాల్గొన్నారు. సాయంత్రం పల్లకీసేవ నిర్వహించారు.

భీమలింగేశ్వరునికి అభిషేకాలు

జె.పంగులూరు, న్యూస్‌టుడే: పంగులూరులోని పార్వతి సమేత భీమలింగేశ్వరాలయంలో సోమవారం రాత్రి కాలభైరవునికి విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఆలయంలో దీపాలు వెలిగించారు. అనంతరం ప్రత్యేకాలంకరణలో స్వామివారు, పార్వతీ అమ్మవారి దర్శనానికి ఏర్పాట్లు చేసినట్లు ఆలయ అర్చక స్వామి చందలూరి సునీల్ శర్మ తెలిపారు. ఈ పూజాది కార్యక్రమాలలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

భీమలింగేశ్వరాలయంలో దీపాలు వెలిగిస్తున్న భక్తులు

సినీనటుడు రఘుబాబుకు ప్రసాదం అందిస్తున్న చుండూరి

శింగరకొండలో రఘుబాబు

అద్దంకి: శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి ఆలయంలో సినీనటులు రఘుబాబు మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. కొరిశపాడు మండలం రావినూతల గ్రామానికి చెందిన రఘుబాబు ఆలయానికి వచ్చిన సమయంలో పాలకమండలి ఛైర్మన్ చుండూరి మురళీసుధాకరరావు, అర్చకులు స్వాగతం పలికారు. గర్భాలయంలో పూజల అనంతరం అర్చకులు శేషవస్త్రం సమర్పించి, ఆశీర్వచనం అందించారు. కార్యక్రమంలో పాలకమండలి సభ్యులు, స్థానికులు పాల్గొన్నారు.

నేడు శింగరకొండ తిరునాళ్ల సమన్వయ భేటీ

శింగరకొండ (అద్దంకి), న్యూస్‌టుడే : శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి, లక్ష్మీనరసింహస్వామి 71వ వార్షిక తిరునాళ్లకు సంబంధించి సమన్వయ భేటీ బుధవారం తితిదే కల్యాణ మండపం వద్ద జరుగుతుందని సహాయ కమిషనర్ తిమ్మానాయుడు, పాలకమండలి ఛైర్మన్ చుండూరి మురళీసుధాకరరావు సంయుక్త ప్రకటనలో తెలిపారు. అద్దంకి ఆర్డీవో లక్ష్మీప్రసన్న అధ్యక్షత వహిస్తారని చెప్పారు. అన్ని ప్రభుత్వశాఖల అధికారులు హాజరు కావాలని ఇప్పటికే సమాచారం ఇచ్చినట్లు వెల్లడించారు. ప్రసన్నాంజనేయస్వామి రాతి ముఖ మండపం నిర్మాణం పూర్తయి, గత ఏడాది మే నెల 19న కుంభాభిషేకం జరిగింది. అనంతరం జరుగుతున్న తొలి వార్షిక తిరునాళ్ల కావటంతో ఈ అంశానికి ప్రాధాన్యం పెరిగింది. ఈ నెల 28, మార్చి 1, 2 తేదీల్లో వేడుకలు నిర్వహించనున్నారు. మార్చి రెండో తేదీన జరిగే తిరునాళ్ల మహోత్సవానికి సుమారు మూడు లక్షల మంది భక్తులు హాజరయ్యే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. తిరునాళ్ల విజయవంతానికి చేపట్టవలసిన చర్యల గురించి ఆయా శాఖల అధికారులతో ఆర్డీవో చర్చించనున్నారు.

నిర్వాసితులకు సమకూరుతున్న నీడ

శింగరకొండపాలెం(అద్దంకి), న్యూస్‌టుడే : అద్దంకి పట్టణంలో మిని బైపాస్ నిర్మాణంతో నిర్వాసితులైన కుటుంబాల వారికి నీడ సమకూరుతోంది. 65 మంది పేదలు స్వచ్ఛందంగా ఖాళీ చేసి శింగరకొండపాలెం సమీపంలోని నివేశన స్థలాల వద్దకు చేరారు. వీరందరికీ పునరావాస అధికారులు అన్నిరకాల వసతులు సమకూర్చారు. విద్యుత్తుదీపాలు, రహదారులు, బహిరంగ మరుగుదొడ్లు, మంచినీరు వంటి మౌలిక వసతులు కల్పించారు. కొంతమంది సొంత భవనాల నిర్మాణం చేపట్టేందుకు సిమెంటు కాంక్రీటు పనులు చేపట్టారు. భవిష్యత్తులో ఈ ఇళ్లన్నీ శింగరకొండపాలెం గ్రామపంచాయతీ పరిధిలోకి చేరనున్నాయి.

శింగరకొండపాలెం సమీపంలో కాలనీలో ఇళ్ల నిర్మాణం

సమ్మెతో సొసైటీల మూసివేత

తాళ్లూరు, న్యూస్‌టుడే : దీర్ఘకాలిక సమస్యల పరిష్కారం కోరుతూ సహకార సంఘాల్లోని సిబ్బంది సమ్మెలో పాల్గొనడంతో సొసైటీలు మూత పడ్డాయి. పలువురు కార్యదర్శులు, ఇతర సిబ్బంది సమ్మెకు దిగడంతో తూర్పుగంగవరంలోని నాగంబొట్లపాలెం సొసైటీ కార్యాలయం, మన్నేపల్లిలోని సొసైటీ కార్యాలయాలు తెరిచేందుకు వీల్లేక మూతపడ్డాయి.

కుటుంబానికి అండగా అతివలు

జె.పంగులూరు, తాళ్లూరు, న్యూస్‌టుడే:

కూటమి ప్రభుత్వం మహిళల ఉపాధి కల్పనకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోంది. స్వయం సహాయక సంఘాల సభ్యులకు సెర్ప్, వివిధ పథకాల ద్వారా రుణాలు మంజూరు చేయిస్తోంది. వాటిని సద్వినియోగం చేసుకుని వారు ఆర్థికంగా స్థిరపడుతున్నారు.

కూలి పనులు వీడి..

నా పేరు యనవరపు ఆదిలక్ష్మి. మాది పంగులూరు గ్రామం. గతంలో వ్యవసాయ కూలి పనులకు వెళితేనే గానీ పూట గడిచేది కాదు. తదనంతరం స్వయం సహాయక సంఘంలో సభ్యురాలిగా చేరా. తీసుకున్న నగదు సత్వరం చెల్లించడంతో ఇప్పటికే నాలుగు పర్యాయాలు రుణం మంజూరు చేశారు. వాటితో అల్పాహార, శీతల పానీయాల దుకాణం నడుపుతున్నా. అన్ని ఖర్చులు పోనూ నెలకు రూ. 20 వేల ఆదాయం వస్తోంది. అమ్మాయిని ఉన్నత చదువులు చదివించడమే కాక, ఆమెకు పెళ్లి కోసం రూ. లక్షలు ఖర్చు చేసినా ఆర్థిక ఇబ్బందులు రాలేదు.

ఉన్నత చదువులు చదివిస్తూ..

నా పేరు పి.నాసర్‌బీ. పంగులూరులో స్వయం సహాయక సంఘంలో సభ్యురాలిగా చేరా. బ్యాంకు లింకేజీ రుణం పొందా. రూ.2 లక్షలతో పిండి రుబ్బు మిషన్, కారం, పసుపు ఆడించే యంత్రాలు కొనుగోలు చేసి ఇంటి వద్దే షాపు పెట్టుకున్నా. కరెంటు బిల్లు, ఇతర ఖర్చులు పోనూ నెలకు రూ.20 వేల ఆదాయం వస్తోంది. అమ్మాయిని బీటెక్, అబ్బాయిని పదో తరగతి చదివిస్తున్నా. బ్యాంకుల ద్వారా అందించే రుణాలు సద్వినియోగం చేసుకోవాలని ఏపీఎం సీహెచ్. కోటేశ్వరరావు కోరారు. స్త్రీనిధి, ఇతర రుణాల ద్వారా మంచి ఉపాధి పొందొచ్చన్నారు.

స్త్రీ నిధి రుణం ఆదుకుంది

నా పేరు గాదంశెట్టి స్వాతి. తాళ్లూరులో స్త్రీనిధి నుంచి రూ.లక్ష రుణం తీసుకోవడం ఎంతో ఉపకరించింది. బ్యాంకు నుంచి మరో రూ.లక్ష తీసుకున్నా. వాటిని సద్వినియోగం చేసుకొని భర్త పవన్ సహకారంతో కిరాణా దుకాణాన్ని అభివృద్ధి చేశా. నెలకు కనీసం రూ.15 వేలకు పైగా ఆదాయం వస్తోంది. కుమార్తె, కుమారుడిని కార్పొరేట్ చదువులు చదివిస్తున్నా. జీవితంలో స్థిరపడేందుకు ఈ రుణాలు ఎంతో ఉపకరించాయి.

నులి పురుగులతో విద్యార్థులకు ఆరోగ్య సమస్యలు

అద్దంకి, న్యూస్‌టుడే : నులి పురుగులతో విద్యార్థులకు ఆరోగ్య సమస్యలు ఎదురవుతాయని గాజులపాలెం పట్టణ ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి డాక్టర్ గొట్టిపాటి జయసింహ అన్నారు. మంగళవారం ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు నులి పురుగుల మాత్రలు వేశారు. శింగరకొండ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయం వద్ద కాకానిపాలెం పట్టణ ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ ప్రణయ్‌కుమార్ విద్యార్థులకు నులిపురుగుల మందులు వేశారు. ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసులు, చాముండేశ్వరి తదితరులు పాల్గొన్నారు

దర్శి(తాళ్లూరు), న్యూస్‌టుడే : దర్శి, చందలూరులోని పీహెచ్‌సీ, ఇతర వైద్యశాలల ఆధ్వర్యాన పిల్లలకు ఉపాధ్యాయులు, వైద్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు మాత్రలు మింగించారు. ఎర్రఓబనపల్లి ప్రాథమిక పాఠశాలలోని చిన్నారులకు మాత్రలందించారు.

మేదరమెట్ల: 1-19 ఏళ్లలోపు ఉన్న వారికి మాత్రలను అందించినట్లు మేదరమెట్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి చిట్టిబాబు తెలిపారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

బాలికల ఉన్నత పాఠశాలలో మాత్రలు వేస్తున్న డాక్టర్ జయసింహ

ఎర్రఓబనపల్లి పాఠశాలలో..

పాఠశాలల్లో తనిఖీలు

తాళ్లూరు, న్యూస్‌టుడే: మండలంలోని దారంవారి పాలెం ప్రాథమిక పాఠశాలలో మంగళవారం ఎంఈవోలు సుబ్బయ్య, ఎల్.సుధాకర రావు తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ రకాల దస్త్రాలను, మధ్యాహ్న భోజన పథకం నిర్వహణ తీరు గురించి వివరాలను నమోదు చేసుకున్నారు. 75 రోజుల జీఎఫ్ఎల్ఎన్ కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేయాలన్నారు. పాఠశాలల్లో రోల్ పెంచాలని కోరారు. పాఠశాలల సముదాయాల కమిటీ ఛైర్మన్ వైఎస్సార్కే ప్రసాద్, హెచ్‌ఎం వరలక్ష్మీ దేవి, సీఆర్పీ శ్రీనివాసరావు, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)

అద్దంకి: 94409 15704,
దర్శి: 9848 671678
మేదరమెట్ల: 79933 00506

దొనకొండ, న్యూస్‌టుడే:

? దొనకొండలోని ఒబ్బాపురం వీధిలో ఎన్‌ఏపీ ట్యాంక్ నుంచి రైల్వే గోడ వరకు మట్టిరోడ్డు ఉంది. స్థానికుల ఇళ్ల నుంచి వచ్చే వ్యర్థ జలాలు రోడ్డుపైనే నిలిచిపోతున్నాయి. దీంతో దోమల బెడద ఎక్కువవుతోంది.
– డి.చిరంజీవి, ఒబ్బాపురం

✓: వెంటనే ఆ పరిసరాలు శుభ్రంచేయించి బ్లీచింగ్ చల్లిస్తాం. నిధులొచ్చిన వెంటనే సిమెంటు రోడ్డు వేయించి సమస్య పరిష్కారానికి కృషిచేస్తాం.
– కృష్ణమూర్తి, పంచాయతీ కార్యదర్శి

అద్దంకి, మేదరమెట్ల, న్యూస్‌టుడే:

? పమిడిపాడు గ్రామంలో కనగాలవారిపాలెం వెళ్లే దారిలోని కాలువలో చెత్త పేరుకుపోయింది. తొలగించగలరు. – స్థానికులు, పమిడిపాడు

✓: వెంటనే కాలువలో చెత్తను తొలగించేందుకు చర్యలు చేపడతాం.
– నరేంద్ర, పంచాయతీ కార్యదర్శి, పమిడిపాడు

? అనమనమూరు ఎస్సీ కాలనీలో వీధి దీపాలు వెలగడం లేదు. సమస్యను పరిష్కరించగలరు.
– స్థానికులు, అనమనమూరు

✓: నూతన విద్యుత్తు స్తంభాలు ఏర్పాటు చేశాం. త్వరలో వీధి దీపాలు అమరుస్తాం.
– జంపు హరిబాబు, సర్పంచి, అనమనమూరు

పుట్టావారిపాలెం (సంతమాగులూరు):

? పుట్టావారిపాలెం కూడలికి నాలుగు వైపులా ఉన్న రహదారి అంచుల్లో స్థానిక దుకాణదారులు, అల్పాహార, భోజనశాల, పండ్ల దుకాణదారులు వ్యర్థాలు పోస్తున్నారు. పంచాయతీ అధికారులు స్పందించి చెత్త సంపద కేంద్రానికి తరలించాలి. – స్థానికులు, పుట్టావారిపాలెం.

✓: పుట్టావారిపాలెం కూడలిలోని దుకాణదారులు ఇంటి పన్ను కట్టని కారణంగా వ్యర్థాలు సేకరించే డీజిల్ వాహనం పెట్టే అవకాశం లేదు. వారు పన్ను కడితే వాహనం ద్వారా తరలించేందుకు అవకాశముంది.
–శివరామప్రసాద్, ఈవోఆర్డీ, సంతమాగులూరు

అద్దంకి, న్యూస్‌టుడే :

? భవానీకూడలి నుంచి దర్శి రహదారిలోని మూడం తస్తుల భవనం వద్ద ఏర్పాటు చేసిన హైమాస్ట్ వీధిదీపాలు అయిదింటికి గానూ ఒక్కటే వెలుగుతోంది. దీంతో చీకట్లు అలముకుని ప్రమాదాలు జరుగుతున్నాయి. – నాగేశ్వరరావు, అద్దంకి

✓: తక్షణం మరమ్మతులు జరిపిస్తాం, అన్ని దీపాలు వెలిగేలా చర్యలు తీసుకుంటాం.
– జి. లోకేశ్, ఏఈ, అద్దంకి పట్టణం

ముప్పు పొంచివున్నా పట్టదా !

జె.పంగులూరు మండలంలోని రామకూరులో విద్యుత్తు పరివర్తకం ప్రమాదకరంగా ఉంది. అక్కడి మక్కెనవారి కుంట కూడలిలో తక్కువ ఎత్తులో అమర్చారు. దీంతో చిన్నారులు, వృద్ధులు ప్రమాదాల బారిన పడే ప్రమాదముందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ఆర్డీఎస్ఎస్ పనుల్లో భాగంగా పరివర్తకాలను మార్పు చేస్తామని ఏఈ ఆంజనేయులు చెప్పారు. –న్యూస్‌టుడే, జె.పంగులూరు

నీటి కష్టాలిక దూరం

స్పందనకు పందనం

తాళ్లూరులోని కొత్తపాలెం బీసీ కాలనీకి నీటి కష్టాలు దూరం కానున్నాయి. అక్కడి ట్యాంకుకు పగుళ్లు ఏర్పడి నీళ్లన్నీ నేల పాలవుతున్న వైనంపై ఈ నెల 8న 'ఈనాడు'లో చిత్రవార్త ప్రచురితమైంది. దీనిపై స్పందించిన ఎంపీడీవో అజిత, సమస్య పరిష్కరించాల్సిందిగా కార్యదర్శి షహనాజ్ బేగాన్ని ఆదేశించారు. ఈ మేరకు మంగళవారం పాత ట్యాంకును కూల్చి వేసి, ఆప్రాంతాన్ని శుభ్రం చేయించారు. త్వరలో కొత్త ట్యాంకు నిర్మాణ పనులు చేపట్టనున్నారు.
–న్యూస్‌టుడే, తాళ్లూరు

ఏడాదిగా అంధకారంలోనే కూడలి

కొరిశపాడు మండలం మేదరమెట్లలోని బస్టాండ్ సమీపంలో సెంటర్ లైటింగ్ వ్యవస్థ గత ఏడాదిగా పనిచేయడం లేదు. డివైడర్‌పై ఉన్న కొన్ని దీపాలు వెలుగుతున్నా.. ప్రధాన కూడలి అంధకారమయమైంది. మలుపు వద్ద వాహనాలు సరిగా కనిపించడం లేదు. దీనిపై స్థానిక పంచాయతీ కార్యదర్శి లక్ష్మీకాంత్‌ను వివరణ కోరగా, త్వరలోనే దీపాలకు మరమ్మతులు చేపడతామన్నారు.
–న్యూస్‌టుడే, మేదరమెట్ల

ముంచెత్తుతున్న మురుగు

కురిచేడు మండలంలోని పడమర వీరాయపాలెం ఎస్సీ కాలనీలో నివాసాల నుంచి వచ్చే వ్యర్థ జలాలు రోడ్డుపైకి చేరుతున్నాయి. అక్కడ డ్రైనేజీలను కొంతదూరం మాత్రమే నిర్మించి వదిలేశారు. దీంతో మురుగంతా స్థానిక హెచ్‌పీ పెట్రోల్ బంకు సమీపంలో కురిచేడు - వినుకొండ ప్రధాన రహదారిపై నిలిచిపోతోంది. దీంతో వాహనచోదకులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మురుగునీరు వెళ్లేందుకు రహదారికి ఇరువైపులా పక్క కాలువలు నిర్మించి సమస్య పరిష్కరించాలని వాహనచోదకులు కోరుతున్నారు. –న్యూస్‌టుడే, కురిచేడు

వ్యవసాయరంగంలో వినూత్న మార్పులు

దర్శి (తాళ్లూరు): వ్యవసాయ రంగంలో వినూత్న మార్పులు రాబోతున్నాయని దర్శి కృషి విజ్ఞాన కేంద్రం సమన్వయకర్త డాక్టరు రమేష్ అన్నారు. దర్శి కేవీకేలో మంగళవారం భారత్ ప్రభుత్వం వర్చువల్‌గా ప్రారంభించిన భారత్ విస్తార్ కార్యక్రమాన్ని ప్రత్యక్ష ప్రసారం చేసి రైతులకు అవగాహన కల్పించారు. రైతులు సాంకేతిక పద్ధతులపై పూర్తిస్థాయిలో అవగాహన పొంది వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చుకోవాలన్నారు. కేవీకే శాస్త్రవేత్తలు డాక్టరు టి.మానస, డాక్టరు టి.వెంకటేశ్వర్‌రెడ్డి, తదితర సిబ్బంది పాల్గొన్నారు.

యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా

అద్దంకి, న్యూస్‌టుడే : అద్దంకి గుండ్లకమ్మ నది వంతెన సమీపంలో ఇసుక తవ్వకాలు యథేచ్ఛగా జరుగుతున్నాయి. పక్షం రోజుల క్రితం గుండ్లకమ్మ నదిలో ఇసుక తవ్వకాలను ఆర్డీవో లక్ష్మీప్రసన్న ఆధ్వర్యంలో తహసీల్దార్ జీ శ్రీచరణ్ తదితరులు అడ్డుకున్నారు. ఓ పొక్లెయిన్, మూడు ఇసుక ట్రాక్టర్‌లను స్వాధీనంలోకి తీసుకున్నారు. అయినా అక్రమార్కుల్లో ఎలాంటి మార్పు రాలేదు. రాత్రి సమయాల్లో యంత్రాలతో ఇసుక తవ్వకం, పగటి వేళల్లో కూలీలతో తరలించి కాసులు వెనుకేసుకుంటున్నారు.

ఇసుక తవ్వకాలు జరుగుతున్న ప్రాంతమిదే

విశిష్ట గుర్తింపుతో బహుళ ప్రయోజనాలు

జె.పంగులూరు, న్యూస్‌టుడే: విశిష్ట గుర్తింపు సంఖ్యను నమోదు చేసుకోవడం ద్వారా బహుళ ప్రయోజనాలు పొందొచ్చని మండల వ్యవసాయాధికారి సుబ్బారెడ్డి రైతులకు సూచించారు. చిన మల్లవరంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు వినయ్ కుమార్, రైతులు పాల్గొన్నారు.

చిన మల్లవరంలో రైతులతో మాట్లాడుతున్న ఏవో సుబ్బారెడ్డి

ఒకేషనల్ విద్యతో మెరుగైన ఉపాధి

తాళ్లూరు : ఒకేషనల్ విద్యతో విద్యార్థులకు మెరుగైన ఉపాధి లభిస్తుందని జీసీడీవో హేమలత అన్నారు. తూర్పుగంగవరంలోని జడ్పీ ఉన్నత పాఠశాల్లో నూతనంగా ఏర్పాటు చేసిన ఒకేషనల్ ల్యాబ్‌ను మంగళవారం ఆమె ప్రారంభించారు. అనంతరం వసతులను పరిశీలించిన తదుపరి మాట్లాడారు. ప్రతి విద్యార్థికి ఒకేషనల్ విద్యపై అవగాహన కల్పించాలన్నారు. పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన కిచెన్ గార్డెన్‌ను పరిశీలించారు. ప్రధానోపాధ్యాయులు వైఎస్సార్కే ప్రసాద్, పీఎంసీ ఛైర్మన్ షంషాద్‌బేగం, ఒకేషనల్ ట్రైనర్లు వై. అంజిబాబు, సీహెచ్. దావీదు, కోఆర్డినేటర్లు కిషోర్, మురళి, పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

ఒకేషనల్ ల్యాబ్‌ను పరిశీలిస్తున్న జీసీడీవో హేమలత

మరింత మెరుగ్గా విద్యుత్తు సరఫరా

తాళ్లూరు, న్యూస్‌టుడే : జిల్లావ్యాప్తంగా మెరుగైన, నాణ్యమైన విద్యుత్తు సరఫరా చేస్తున్నట్లు ఏపీసీపీడీసీఎల్ ఎస్ఈ కట్టా వెంకటేశ్వర్లు స్పష్టంచేశారు. తాళ్లూరులోని విద్యుత్తు ఉపకేంద్రాన్ని మంగళవారం ఆయన ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా వివిధ రకాల దస్త్రాలను, బిల్లుల వసూళ్ల పత్రాలను పరిశీలించారు. తదుపరి పలు రకాల యంత్ర పరికరాల పని తీరును స్వయంగా గమనించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బకాయిలకు త్వరితగతిన వసూలు చేయాలని సిబ్బందికి సూచించారు. రైతులకు వ్యవసాయావసరాల కోసం నిత్యం తొమ్మిది గంటలు విద్యుత్తు సరఫరా చేస్తున్నామన్నారు. ఎక్కడన్నా పరివర్తకాలు కాలిపోతే రైతులకు ఇబ్బందులు రాకుండా ఉండేందుకు వెంటనే మరో పరివర్తకాన్ని ఏర్పాటు చేయిస్తున్నామన్నారు. దర్శి ఈఈ శ్రీనివాసులు, ఏడీఈ రవికుమార్, ఏఈ రామకృష్ణారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

తాళ్లూరులోని విద్యుత్తు ఉపకేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎస్ఈ వెంకటేశ్వర్లు

నిధులు కేటాయించాలి

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: అభివృద్ధి పనుల నిమిత్తం నియోజవర్గానికి రూ. కోటి చొప్పున ఒడా నిధులు కేటాయింపునకు అనుమతి ఇవ్వాలని కోరుతూ రాష్ట్ర పురపాలకశాఖ మంత్రి పి.నారాయణకు మంగళవారం వినతిపత్రం అందజేశారు. గతంలో బీపీఎస్‌కు సంబంధించిన రూ.10 కోట్ల నిధులను విడుదల చేయాలని కోరారు. ఐడీఎస్ఎంటీ ప్లాట్ల వేలానికి అనుమతి ఇవ్వాలని విన్నవించారు. ఈ మేరకు జేసీ కల్పనాకుమారి, ఒడా ఛైర్మన్ షేక్ రియాజ్, నగర మేయర్ గంగాడ సుజాత, కమిషనర్ కె. వెంకటేశ్వరరావు తదితరులు రాష్ట్ర మంత్రి నారాయణను కలిశారు.

నిత్యం భయం.. భయం

❒ బెంబేలెత్తిస్తున్న శునకాలు, వానరాలు

న్యూస్‌టుడే, మేదరమెట్ల:

❖ మేదరమెట్ల పతుల కాలనీలో ద్విచక్ర వాహనంపై వెళుతున్న ఓ యువకుడిపై ఇటీవల కుక్కలు దాడి చేయడంతో గాయాలయ్యాయి.

❖ మేదరమెట్ల సాయిబాబా గుడి బజారులో ట్యూషన్‌కు వెళుతున్న విద్యార్థిపై కుక్కలు దాడి చేయడంతో గాయపడ్డాడు.

❖ మేదరమెట్ల, అద్దంకి పట్టణవాసులను వానరాలు బెంబేలెత్తిస్తున్నాయి. ఇళ్లల్లోకి చొరబడి చేతికందిన తినుబండారాలు, వస్తువులు ఎత్తుకెళుతున్నాయి.

అద్దంకి పట్టణం, మేదరమెట్ల ప్రాంతాల్లో శునకాలు..వానరాలతో జనం బెంబేలెత్తుతున్నారు. వీటి సంఖ్య రోజురోజుకీ పెరిగిపోతోంది. గుంపులు గుంపులుగా తిరుగుతూ కనపడిన వారిపై దాడులకు దిగుతున్నాయి. మేదరమెట్ల పట్టణంతో పాటు స్థానిక గ్రామాల్లో రద్దీగా ఉండే కూడళ్లు, సంతలు, దుకాణ సముదాయాలు, హోటళ్ల వద్ద కుక్కలు తిష్ఠవేసి చిన్నారులు, వృద్ధులపై దాడులు చేస్తున్నాయి. సైకిళ్లు, ద్విచక్ర వాహనాలపై వెళ్లే వారిని వెంబడిస్తుండటంతో కొందరు అదుపుతప్పి గాయాల పాలవుతున్నారు. చిన్నపిల్లలు, మహిళలు బయటకు రావాలంటే భయపడే పరిస్థితులు నెలకొన్నాయి. వీధి కుక్కలు మనుషులతో పాటు మేకలు, గేదెలపై దాడిచేసి గాయపరుస్తున్నాయి. వాటి నియంత్రణ తలనొప్పిగా మారిందని, జీవకారుణ్య చట్టాల కారణంగా తాము ఏమీ చేయలేకపోతున్నామని పంచాయతీ అధికారులు నిస్సహాయత వ్యక్తం చేస్తున్నారు. సంతాన నిరోధక శస్త్రచికిత్సలు చేయాలని ఉన్నతాధికారులు సూచిస్తున్నారు.

మేదరమెట్ల వీధిలో తిష్ఠవేసిన కుక్కల గుంపు

ఇంటి ఆవరణలో కోతులు

ఆగడాలకు లెక్కేలేదు..

అద్దంకి పట్టణం, మేదరమెట్ల గ్రామాల్లో వానరమూకలు ప్రజలకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. అటవీ ప్రాంతాల్లో ఆహారం లభించకపోవడంతో ఇవి వనం వీడి జనం చెంతకు చేరుతున్నాయి. తాటాకు ఇళ్లు, పూరిపాకలను ధ్వంసం చేస్తున్నాయి. ఇళ్లలోకి దూరి వండిన ఆహార పదార్థాలు, పండ్లు, నిత్యావసరాలు ఎత్తుకుపోతున్నాయి. ఇంటి పైన నీటి ట్యాంకుల్లో దిగి ఈత కొడుతూ నీటిని కలుషితం చేస్తున్నాయి. అధికారులు స్పందించి వాటి నుంచి రక్షించాలని కోరుతున్నారు.

చర్యలు తీసుకుంటాం

సమస్య మా దృష్టికి వచ్చింది. శునకాలకు వ్యాక్సిన్ వేయిస్తాం. కోతులను పట్టించి అటవీ ప్రాంతంలో విడిచిపెట్టేలా చర్యలు తీసుకుంటాం. –రాజ్యలక్ష్మి, ఎంపీడీవో, కొరిశపాడు మండలం

గోడపత్రాలను ఆవిష్కరిస్తున్న గొట్టిపాటి లక్ష్మి, ఇతరులు

వయోజనుల అక్షరాస్యతకు కృషి

తాళ్లూరు, న్యూస్‌టుడే : వయోజనులను అక్షరాస్యులుగా చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని దర్శి నియోజకవర్గ తెదేపా ఇన్‌ఛార్జి గొట్టిపాటి లక్ష్మి అన్నారు. అక్షర- ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా మంగళవారం దర్శి మండల పరిషత్ కార్యాలయం వద్ద గోడ పత్రాలను ఆమె పలువురు నాయకులు, ప్రముఖులతో కలసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కార్యక్రమం ప్రాధాన్యం గురించి నియోజకవర్గ పర్యవేక్షకులు వై. చౌడిరెడ్డి వివరించారు.

చెక్కుల అందజేత: దర్శిలోని నియోజకవర్గ తెదేపా ఇన్‌ఛార్జి గొట్టిపాటి లక్ష్మి స్వగృహంలో మంగళవారం సీఎం సహాయనిధి చెక్కులు, మంజూరు పత్రాలను పంపిణీ చేశారు. వేములకు చెందిన బేతే పద్మకు, దర్శి పట్టణంలోని మామిడికాయల వెంకటేశ్వర్లు, తాళ్లూరు మండలం మాధవరానికి చెందిన పాలెపోగు మార్కు, పారెళ్ల రాఘవులుకు చెక్కులను అందజేశారు. అనంతరం దర్శి పట్టణంలో ప్లాస్టిక్ బుట్టలను గొట్టిపాటి లక్ష్మి స్థానికులకు అందజేశారు. ఏఎంసీ ఛైర్మన్ దారం నాగవేణి సుబ్బారావు, నగర పంచాయతీ ఛైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య, ఎంపీపీ సుధారాణి, డిప్యూటీ ఎంపీడీవో సుధాకర్, ఎంఈవోలు మాలకొండయ్య, రమాదేవి, పలువురు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

మోటారు తీగల చోరీ

విద్యుత్తు తీగలను కోసుకెళ్లిన దృశ్యం

కురిచేడు: కల్లూరు రైతులకు చోరులు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నారు. ఈ నెల 15న మహాశివరాత్రి రోజున గ్రామ ప్రజలందరూ పండగ ఉత్సవాల్లో ఉండగా, గ్రామంలోని 30 మంది రైతులకు చెందిన విద్యుత్తు తీగలను చోరీ చేశారు. వాటి విలువ సుమారు రూ.50 వేలు ఉంటుందని రైతులు తెలిపారు. దీంతో బాధితులు మంగళవారం రాత్రి కురిచేడులోని పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశారు.

ఒరిజినల్ పాస్‌పోర్టు పోయినది

GADDAM MANIKANTA
S/o Siva Prasada Rao,
Addanki Town, Addanki
Mandal, Prakasam Dt. AP.
నా యొక్క ఒరిజినల్ పాస్‌పోర్ట్ నెం. N8124966గా గల నేను ఇంటి నుండి బస్టాండ్‌కు వెలుచుండగా దారిలో పోయినది. దొరికినవారు సంప్రదించగలరు.
సెల్: 73865 05506

ఒంగోలు

•ఒంగోలు • సంతనూతలపాడు

భవనాలు, స్థలాలు క్రమబద్ధీకరించుకోవాలి

చీమకుర్తి, న్యూస్‌టుడే: భవన యజమానులు బీపీఎస్, ప్లాట్ల యజమానులు ఎల్‌ఆర్‌ఎస్ కోసం దరఖాస్తు చేసుకోవాలని గుంటూరు ఆర్డీడీటీపీ మధుకుమార్ సూచించారు. ఆయన ఆధ్వర్యంలో వచ్చిన బృందం మంగళవారం చీమకుర్తిలోని పలు భవనాలను, లేఅవుట్లను పరిశీలించారు. అనంతరం మున్సిపల్ కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. పురపాలక సంఘం పరిధిలో 56 లేఅవుట్లను గుర్తించగా.. వాటిలో 50కి ఐపీఎల్‌పీ ప్లాట్లను తయారు చేసినట్లు కమిషనర్ వై.రామకృష్ణయ్య, టీపీవో శారదలు తెలియజేశారు. ఇప్పటి వరకు 35 దరఖాస్తులను క్రమబద్ధీకరించినట్లు చెప్పారు. బీపీఎస్‌లో భాగంగా 111 దరఖాస్తులు రాగా అందులో 35 భవనాలను క్రమబద్ధీకరించినట్లు వివరించారు.

ఉపాధిహామీ పనులు వేగవంతం చేయాలి

మద్దిపాడు: ఉపాధిహామీ పనుల వేగవంతంపై డ్వామా పీడీ జోసెఫ్‌కుమార్ సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఈ పథకం వీబీ జీ రామ్‌జీ పేరుతో కొత్తగా ప్రారంభం కానున్న నేపథ్యంలో మంగళవారం ఎంపీడీవో కార్యాలయంలో ఏపీవో దనుంజయరెడ్డి, ఈసీ కిషోర్, సాంకేతిక సహాయకులతో సమావేశమయ్యారు. పంచాయతీల వారీగా వివరాలు తెలుసుకున్నారు. ఒక గ్రామ పంచాయతీకి 20 పనులను మాత్రమే కేటాయించాలని తెలిపారు. పనితీరు మెరుగుపరుచుకోకపోతే చర్యలు తప్పవని సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

నేడు విద్యుత్తు సరఫరాకు అంతరాయం

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: మరమ్మతుల దృష్ట్యా ఒంగోలు నగర పరిధిలోని వంటకాలని, సాయిబాబా గుడి, గాంధీ పార్కు, మంగమూరురోడ్డు, చిన్నకోట వారి వీధి తదితర ప్రాంతాల్లో బుధవారం ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్తు సరఫరా నిలిపివేయనున్నట్లు డీఈ పాండురంగారావు తెలిపారు.

అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని వినతి

ముఖ్యమంత్రి చంద్రబాబుకు వివిధ పనుల గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే విజయకుమార్

సంతనూతలపాడు, న్యూస్‌టుడే: సంతనూతలపాడు నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులకు సంబంధించి ఎమ్మెల్యే బీఎన్ విజయకుమార్ అమరావతిలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును కలిశారు. నాగులుప్పలపాడు మండలం అమ్మనబ్రోలులో ఏపీ గురుకుల బాలికల పాఠశాల భవనం దెబ్బతినడంతో కొత్త భవన నిర్మాణానికి రూ.10 కోట్లు నిధులు మంజూరు చేయాలని కోరారు. గుండ్లకమ్మ జలాశయంపై కీర్తిపాడు, బీర్నపుప్పలపాడుల వద్ద చెక్‌డ్యామ్‌ల నిర్మాణాలకు నిధులు కేటాయించాలని విన్నవించారు. చీటితో పాటు చీమకుర్తి నుంచి ఎర్రగుడిపాడు, సంతనూతలపాడు మండలం ఒబ్బీపురం, రుద్రవరం, గురవారెడ్డిపాలెం మీదుగా మద్దిపాడు మండలం కొష్టాల వరకున్న చిన్నరహ్నా రోడ్డు నిర్మాణానికి నిధులు కేటాయించాలని కోరినట్లు ఎమ్మెల్యే తెలిపారు. ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులకు సంబంధించిన వాటిపైనా చర్చించారు. వీటిపై ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించినట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు.

విద్యార్థులకు ప్లేట్లు, గ్లాసుల పంపిణీ

చిలకపాడు(సంతనూతలపాడు): మండలంలోని చిలకపాడు జడ్పీహెచ్ ఎస్‌లో విద్యార్థులకు ప్లేట్లు, గ్లాసులు పంపిణీ చేశారు. వాసవీక్లబ్, మహిళాక్లబ్‌ల ఆధ్వర్యంలో గ్రామానికి చెందిన క్లబ్ సభ్యులు పోకూరి రామారావు, వనజకుమారి దంపతులు 150 మంది విద్యార్థులకు రూ.20 వేల విలువ చేసే వస్తువులు అందజేశారు. ప్రధానోపాధ్యాయుడు పి.స్వప్నరాజు, వాసవీక్లబ్ జిల్లా కో ఆర్డినేటర్ వేమూరి నాగేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

బిల్లులివ్వక.. భవనాలు పూర్తికాక!

❖ వైకాపా ప్రభుత్వ తీరుతో అసంపూర్తిగా గ్రామ సచివాలయాలు

న్యూస్‌టుడే, మద్దిపాడు, నాగులుప్పలపాడు

సంతనూతలపాడు నియోజకవర్గంలో సచివాలయ భవనాలు అసంపూర్తిగా నిలిచిపోయాయి. వైకాపా ప్రభుత్వంలో సరిగా నిధుల కేటాయింపు లేకపోవడంతో ఇవి పూర్తికాలేదు. మరి కొన్ని గ్రామాల్లో వైకాపా నేతల మధ్య ఆధిపత్య పోరుతో నిర్మాణాలు ముందుకు సాగలేదు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం కొంతమేర పాత బిల్లులు చెల్లించినప్పటికీ ఇంకా పూర్తిస్థాయిలో దృష్టి సారించలేదు. దీంతో పాత, అద్దె భవనాల్లోనే సచివాలయాలు కొనసాగుతున్నాయి. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి అసంపూర్తి భవనాలన్నింటినీ పూర్తిచేయాలని ప్రజలు కోరుతున్నారు.

గుండ్లాపల్లిలో సచివాలయ భవనం ఇలా..

ప్రారంభోత్సవాలు చేసినా అందుబాటులోకి రాలేదు...

మద్దిపాడు మండలంలో 18 గ్రామ సచివాలయాలకు గాను గుండ్లాపల్లిలో రెండు అంతస్తులు స్లాబ్‌వేసి నాయకుల మధ్య ఆధిపత్యంతో నిర్మాణం నిలిచిపోయింది. సాంకేతిక కారణాలతో నిలిచిపోయిన దొడ్డవరం సచివాలయ భవనం ప్రస్తుతం పనులు సాగుతున్నాయి. లింగంగుంటలో అసలుకే ప్రారంభమే కాలేదు. వెల్లంపల్లి, నేలటూరు, సీతారామపురం, దొడ్డవరప్పాడు, కీర్తిపాడు గ్రామాల్లో నిర్మాణాలు పూర్తి కాకుండానే అప్పటి వైకాపా నేతలు ఎన్నికల్లో లబ్ధి పొందడానికి ప్రారంభోత్సవాలు సైతం చేశారు. అయినా వాటిని ఇప్పటికీ గుత్తేదారులు ప్రభుత్వానికి అప్పగించలేదు.

❖ సంతనూతలపాడు మండలంలోని 15 సచివాలయాల్లో ఇప్పటి వరకు 9 పూర్తయ్యాయి. మండల కేంద్రంలో అసంపూర్తి భవనాన్ని ప్రైవేటు వ్యక్తులు వినియోగించుకుంటున్నా అధికారులు చూసీచూడనట్టే వ్యవహరిస్తున్నారు. మైనంపాడులో అసలు నిర్మాణమే ప్రారంభం కాలేదు. పి.తక్కెళ్లపాడులో సగం వరకు సచివాలయ భవనం పూర్తయింది.

❖ నాగులుప్పలపాడులో 20 గ్రామ సచివాలయాలకు గాను 9 మాత్రమే పూర్తి చేశారు. మద్దిరాలపాడు, నిడమానూరు, తిమ్మసముద్రం1, 2, నిర్మాణాలు పలు దశల్లో నిలిచిపోయాయి. రాపర్లలో స్లాబు లెవల్, కనపర్తి-2, సీహెచ్.ఉప్పలపాడు, పునాది మట్టంలో నిర్మాణాలు నిలిచిపోయాయి. ఉప్పుగుండూరు-2, కండ్లగుంట, కనపర్తి-1లలో భవన నిర్మాణాలు ప్రారంభమే కాలేదు.

❖ చీమకుర్తి మండలంలోని 17 సచివాలయాల్లో నిప్పట్లపాడులో స్లాబు స్థాయి, మంచికలపాడులో పునాదిమట్టంలోనే పనులు నిలిచిపోయాయి. పులికొండ, గాడిపర్తివారి పాలెంలో చివరి దశలో పనులు సాగుతున్నాయి.

సంతనూతలపాడులో నిరసన తెలుపుతున్న వీఆర్వోలు

పని ఒత్తిడి తగ్గించాలని ఆందోళన

సంతనూతలపాడు, న్యూస్‌టుడే: తమపై పనిభారం, ఒత్తిడులను తగ్గించాలని మండల వీఆర్వోలు తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన చేపట్టారు. రాష్ట్ర వీఆర్వోల సంఘం పిలుపు మేరకు మధ్యాహ్నం 1 గంట నుంచి 2 గంటల వరకు నల్ల రిబ్బన్లు ధరించి ఆందోళన చేశారు. ఈ సందర్భంగా జిల్లా వీఆర్వోల సంఘం ప్రధాన కార్యదర్శి ఆదిరెడ్డి మాట్లాడుతూ.. పంచాయతీ, రెవెన్యూ శాఖల మధ్య వీఆర్వోలు నలిగి పోతున్నారన్నారు. తమకు డీడీవోలుగా తహసీల్దార్‌లను నియమించాలని, ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు వర్క్ రూల్‌ను అమలు చేయాలని కోరారు. సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె.రవికుమార్, జిల్లా ఉపాధ్యక్షుడు పి.వెంకటస్వామి, జిల్లా మహిళా కార్యదర్శి జి.వినీల, మండల అధ్యక్షుడు ఎం.శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

మద్దిపాడు, న్యూస్‌టుడే: పని ఒత్తిడి తగ్గించాలంటూ మండలంలోని వీఆర్వోలు, సర్వేయర్లు నల్లబ్యాడ్జీలు ధరించి తహసీల్దార్ కార్యాలయం వద్ద మంగళవారం నిరసన వ్యక్తం చేశారు. వీఆర్వోల సంఘం అధ్యక్షురాలు ఆరిఫా మాట్లాడుతూ.. తమకు రీ సర్వేతో పాటు, పట్టాదారు పాసు పుస్తకాల్లో దోషాలను సరిదిద్దాలని చెప్పారన్నారు. దీంతో పాటు సర్వేలు నిర్వహించడం వల్ల తీవ్ర ఒత్తిడికి గురవుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం తహసీల్దార్ ఆదిలక్ష్మికి వినతిపత్రం అందజేశారు.

మురుగు.. పడేదెలా అడుగు

ఒంగోలు నగరంలోని రిమ్స్ వైద్యశాల ఎదరు రోడ్డులో మంగళవారం కనిపించిన చిత్రమిది. ఇక్కడ ఉన్న ప్రధాన కాలువ మురుగునీరు ముందుకు సాగేందుకు వీలులేక ఇలా రోడ్డుపై పారింది. దీంతో ఆ మార్గంలో ప్రయాణించే ద్విచక్ర వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. రిమ్స్ వైద్యశాలకు వెళ్లేవారు మురుగు నీటిలోనే నడక సాగించాల్సి పరిస్థితి. దీనిపై మున్సిపల్ శానిటీరీ ఇన్‌స్పెక్టర్ పిచ్చయ్యను వివరణ కోరగా.. సమీపంలో కాలువ నిర్మాణం జరుగుతుందని, మురుగు నీరు పారేలా మలుపు తిప్పామని.. అయినా నీరు వెనక్కి తన్నడంతో రోడ్డుపై చేరిందని తెలిపారు. సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. –న్యూస్‌టుడే, ఒంగోలు అంజయ్యరోడ్డు

కబడ్డీ క్రీడాకారులతో కరచాలనం చేస్తున్న ఎమ్మెల్యే దామచర్ల

చీమకుర్తిలో నగరేశ్వరుని రథోత్సవంలో భక్తులు

మడనూరు ఉత్సవాలకు ఎంతో ప్రత్యేకత

కొత్తపట్నం, న్యూస్‌టుడే: మండలంలోని మడనూరులో మహా శివరాత్రి సందర్భంగా నిర్వహిస్తున్న రామలింగేశ్వర స్వామి వారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మూడో రోజు మంగళవారం రథోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇక్కడి వేడుకకు ఎంతో ప్రత్యేకత ఉందన్నారు. ఆలయ ప్రాంగణంలో గ్రామస్థుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రకాశం, నెల్లూరు, గుంటూరు, బాపట్ల, తిరుపతి జిల్లా స్థాయి మత్స్యకారుల కబడ్డీ పోటీలను సందర్శించి క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో తెదేపా నాయకులు దేవప్రసాద్, రామచంద్రగౌడ్, తిరుపతి, జక్కరయ్యా, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

❖ **నగరేశ్వర స్వామి వైభవం..**

చీమకుర్తి: స్థానిక శిద్దా వారి వీధిలో గల నగరేశ్వర స్వామి రథోత్సవం వైభవంగా జరిగింది. ప్రత్యేకంగా అలంకరించిన రథంపై స్వామివార్ల ఉత్సవమూర్తులను ఊరేగించారు. ఈ కార్యక్రమంలో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

విద్యార్థులకు పూర్తిస్థాయిలో వసతులు కల్పించాల్సిందే

చదలవాడలో అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఆర్వో చిన ఓబులేసు

నాగులుప్పలపాడు, న్యూస్‌టుడే: ప్రభుత్వ వసతి గృహాల్లో విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలు పూర్తి స్థాయిలో అందాలని డీఆర్వో చిన ఓబులేసు సూచించారు. మండలంలోని పోతవరం బీసీ బాలుర వసతి గృహాన్ని మంగళవారం ఆయన తనిఖీ చేశారు. వన్ ఇన్‌స్టిట్యూషన్-వన్ ఆఫీసర్ కార్యక్రమంలో భాగంగా వసతి గృహాన్ని పరిశీలించినట్లు ఆయన తెలిపారు. స్నానపు గదులు, వంట గది, విద్యార్థులు నిద్రించే గదులను పరిశీలించారు. వసతులపై విద్యార్థులను అడిగి తెలుసుకొన్నారు. అనంతరం చదలవాడలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఆయన వెంట తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్, సిబ్బంది ఉన్నారు.

రామతీర్థం ఆదాయం రూ.5.78 లక్షలు

చీమకుర్తి, న్యూస్‌టుడే: మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా మండలంలోని రామతీర్థంలో వెలసిన మోక్ష రామలింగేశ్వర స్వామి దేవస్థానం ఆదాయం గత సంవత్సరంతో పోల్చితే రూ.లక్ష అదనంగా వచ్చినట్లు ఈవో రజనీకుమారి తెలిపారు. ఈ సంవత్సరం రూ.5.78 లక్షల ఆదాయం లభించిందన్నారు. హుండీ ద్వారా రూ.2.79 లక్షలు, కొబ్బరికాయల పాటల రూ.1.21 లక్షలు, కొబ్బరి చిప్పల ద్వారా రూ.16 వేలు, అభిషేకాల ద్వారా రూ.85 వేలు, ప్రత్యేక దర్శనం టిక్కెట్ల రూపంలో రూ.71 వేలు ఆదాయం సమకూరినట్లు వివరించారు.

21లోపు సర్వే పూర్తి చేయండి

నాగులుప్పలపాడు: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వేను ఈ నెల 21 లోపు పూర్తి చేయాలని ఎంపీడీవో రవికుమార్ సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం చదలవాడ ఎస్సీ కాలనీలో సర్వేను ఆయన పరిశీలించారు. స్వర్ణ గ్రామంలో పనిచేస్తున్న సిబ్బంది అందరూ తప్పనిసరిగా వారికి కేటాయించిన క్లస్టర్‌లోని కుటుంబాలను వంద శాతం పూర్తి చేయాలన్నారు. ఆలస్యం చేసిన వారిపై క్రమ శిక్షణ చర్యలు తీసుకుంటామని సిబ్బందిని హెచ్చరించారు.

మంత్రి నారాయణకు వినతిపత్రం అందజేస్తున్న ఒడా ఛైర్మన్ షేక్ రియాజ్, నగర మేయర్ సుజాత

నిధుల కేటాయింపునకు అనుమతివ్వాలి

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: అభివృద్ధి పనుల నిమిత్తం నియోజవర్గానికి రూ.కోటి చొప్పున ఒడా నిధులు కేటాయింపునకు అనుమతి ఇవ్వాలని కోరుతూ రాష్ట్ర పురపాలకశాఖ మంత్రి పి.నారాయణకు మంగళవారం వినతిపత్రం అందజేశారు. గతంలో బీపీఎస్‌కు సంబంధించిన రూ.10 కోట్ల నిధులను విడుదల చేయాలని కోరారు. ఐడీఎస్ఎంటీ ప్లాట్ల వేలానికి అనుమతి ఇవ్వాలని విన్నవించారు. ఈ మేరకు జేసీ కల్పనాకుమారి, ఒడా ఛైర్మన్ షేక్ రియాజ్, నగర మేయర్ గంగాడ సుజాత, కమిషనర్ కె.వెంకటేశ్వరరావు తదితరులు రాష్ట్ర మంత్రి నారాయణను కలిశారు.

పదిలో నూరు శాతం ఉత్తీర్ణతే లక్ష్యం

చీమకుర్తి: ప్రభుత్వం అమలు చేస్తున్న వంద రోజుల కార్యాచరణ ప్రణాళిక ప్రకారం పదో తరగతి విద్యార్థులు చదివితే శత శాతం ఉత్తీర్ణత సాధ్యమేనని మండల విద్యాశాఖాధికారులు డి.వి.నరసింహారావు, కె.శివాజీలు సూచించారు. బండ్లమూడి, నాయుడుపాలెం జడ్పీ ఉన్నత పాఠశాలలను మంగళవారం వారు సందర్శించారు. పదో తరగతి విద్యార్థులతో సమావేశమయ్యారు.

ఎవరూ చూడరని.. చూసినా అడగరని!

న్యూస్‌టుడే, చీమకుర్తి

కొస్తంత జాగా కనిపిస్తే చాలు, గ్రానైట్ పరిశ్రమల వ్యర్థాలు తెచ్చి పోసేస్తున్నారు. ఫ్యాక్టరీలు విస్తరించిన ప్రాంతంలో కాకుండా సుమారు పది, పదిహేను కిలోమీటర్ల దూరంలో ఉన్న రోడ్ల పక్కన వాహనాలతో తరలించి కుప్పలుగా వేస్తున్నారు. దీంతో ద్విచక్ర, ఇతర వాహన చోదకులు ఇబ్బంది పడుతున్నారు.

యర్రగుడిపాడు రహదారి పక్కన వేసిన గ్రానైట్ వ్యర్థాలు

ఆదమరిస్తే ప్రమాదం తప్పదు..

గ్రానైట్, అనుబంధ పరిశ్రమలు విస్తరించి ఉన్న చీమకుర్తి మండలంలోని ఆర్ఎల్‌పురం, బూదవాడ, యల్లయ్యనగర్, మర్రిచెట్లపాలెం తదితర ప్రాంతాల్లో ఇప్పటికే రహదారుల అంచులు, కాలువ కట్టలు, వాగులు, వంకలు పరిశ్రమల వ్యర్థాలతో నిండిపోయాయి. ఈ రహదారుల్లో రాకపోకలు సాగించాలంటే స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పరిశ్రమల వ్యర్థాలు వేసేందుకు బూదవాడ పంచాయతీ పరిధిలోని యర్రకొండలో గతంలో క్వారీ నిర్వహించిన ప్రాంతాన్ని కేటాయిస్తామని అధికారులు చెబుతున్న మాటలు ఆచరణకు నోచుకోవడం లేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కొద్ది నెలల కిందట కాలుష్య నియంత్రణ మండలి, భూగర్భ గనుల శాఖ అధికారులు బూదవాడ, మర్రిచెట్లపాలెం గ్రానైట్ పరిశ్రమల యజమానులతో సమావేశం నిర్వహించారు. పరిశ్రమల వ్యర్థాలు పోసేందుకు అవసరమైన డంపింగ్ యార్డు కోసం స్థలం కేటాయింపు చేస్తామని సంబంధిత, భూమికి ప్రభుత్వం నిర్ణయించిన ధర చెల్లించాలని ఫ్యాక్టరీ యజమానులను కోరారు. అందుకు వారు అంగీకరించారు. ఆ తర్వాత ఆ ఊసే మరిచారు. ఒంగోలు-కర్నూలు రహదారి నుంచి యర్రగుడిపాడు మార్గంలో పోసిన వ్యర్థాలతో వాహనదారులు అవస్థలు పడుతున్నారు. రాత్రి వేళల్లో ఏమాత్రం ఏమరపాటుగా ఉన్నా ప్రమాదాలు తప్పవు. రోడ్ల పక్కన గ్రానైట్ వ్యర్థాలను తొలగింప చేసే దిశగా చర్యలు చేపట్టాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

గంజాయి మాఫియాను అరికట్టాలి

మాట్లాడుతున్న డైఫీ రాష్ట్ర కార్యదర్శి రామన్న

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: మత్తు పదార్థాలు, మాదక ద్రవ్యాలను అరికట్టాలని డైఫీ రాష్ట్ర కార్యదర్శి జి.రామన్న డిమాండ్ చేశారు. డైఫీ ఆధ్వర్యంలో ఒంగోలులోని ఆదిత్య డిగ్రీ కళాశాలలో మంగళవారం మాదక ద్రవ్యాల నియంత్రణపై అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా మత్తు, గంజాయి మాఫియా ఆగడాలు పెరిగిపోతున్నాయని ఆరోపించారు. గంజాయి మాఫీయాపై ప్రభుత్వం పీడీ యాక్ట్ పెట్టాలని కోరారు. 'డ్రగ్స్ అంతం-డైఫీ పంతం' నినాదంతో రాష్ట్ర వ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో డైఫీ జిల్లా అధ్యక్షుడు కేవీ.పిచ్చయ్య, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరాస్వామి తదితరులు పాల్గొన్నారు.

జూదరుల అరెస్టు

ఒంగోలు నేరవిభాగం, మద్దిపాడు, న్యూస్‌టుడే: మద్దిపాడు మండలంలో ఓ జూద శిబిరంపై దాడి చేసిన టాస్క్‌ఫోర్సు పోలీసులు ఆరుగురు జూదగాళ్లను మంగళవారం రాత్రి అరెస్ట్ చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని దొడ్డవరం, చీమకుర్తి మండలం నేకునంబాదు గ్రామాల శివారులో పొలాల్లో జూద శిబిరం నిర్వహిస్తుండగా.. టాస్క్‌ఫోర్సు ఇన్‌ఛార్జి సీఐ సుధాకర్ ఆధ్వర్యంలో పోలీసులు దాడి చేశారు. కోతముక్క ఆడుతున్న వారిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ. 65 వేల నగదు, ఆరు చరవాణులు, అయిదు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకుని మద్దిపాడు పోలీస్ స్టేషన్‌లో అప్పగించారు. ఈ దాడుల్లో ఎస్సైలు సుదర్శన్, చెంచయ్యలు ఏఎస్సై మహబూబ్‌బాషా సిబ్బంది పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)

ఒంగోలు నగరం: 8008574067
ఒంగోలు గ్రామీణం : 8008564455
ఒంగోలు అంజయ్య రోడ్డు : 8247324766
కొత్తపట్నం : 8464085451
ఎస్.ఎన్.పాడు: 8008552692

న్యూస్‌టుడే, మద్దిపాడు, కొత్తపట్నం, ఒంగోలు అంజయ్యరోడ్డు

?: మద్దిపాడు మండలం ఇందిరమ్మ కాలనీకి వెళ్లే మార్గంలో మంచినీటి పైపులైన్ దెబ్బతింది. దీనివల్ల నీరు లీకై సీసీ రోడ్ల పనులకు ఆటంకం కలుగుతోంది.

–గడ్డం సత్యనారాయణ, గ్రామస్థుడు

✓: పైపులైన్‌కు మరమ్మతులు చేయించి నీటి వృథాను అరికడతాం.

–నూరుల్లా, పంచాయతీ కార్యదర్శి

?: మద్దిపాడు మండలం దొడ్డవరం పంచాయతీ ఎస్సీ కాలనీలో మురుగు కాలువలు అధ్వానంగా మారాయి. వాటి ద్వారా దుర్వాసన వస్తుంది. దోమలు పెరిగిపోయి ఇబ్బందులకు గురవుతున్నాం.

–కావూరి రవీంద్ర, స్థానికుడు

✓: పంచాయతీ పారిశుద్ధ్య సిబ్బందిని పంపించి కాలువలు శుభ్రం చేయించి, దోమల నివారణకు ఫాగింగ్ చేయిస్తాం.

– రాజా రమేష్, పంచాయతీ కార్యదర్శి

?: కొత్తపట్నం మండలం కె.పల్లెపాలెం బీచ్‌లో వ్యర్థాలు పేరుకుపోయాయి. తీరానికి వచ్చిన పర్యాటకులకు దుర్వాసనతో ఇబ్బందులు తప్పడం లేదు. –వెంకట్రావు, పర్యాటకుడు

✓: ఎక్కడైతే వ్యర్థాలున్నాయో సేకరించి వెంటనే తరలిస్తాం. –వేణుగోపాల కృష్ణమూర్తి, డిప్యూటీ ఎంపీడీవో

?: ఒంగోలు నగరం పాండరీపురంలోని స్వాతి కల్యాణమండపం రోడ్డులో కొత్తగా కాలువ నిర్మించారు. అప్పటి నుంచి మున్సిపాలిటీ నీరు కలుషితమై వస్తుంది.

–లక్ష్మి, స్థానికురాలు.

✓: వెంటనే పరిశీలించి రెండు రోజుల్లో శుభ్రమైన నీరు వచ్చేలా చూస్తాం.

–ఏసయ్య, మున్సిపల్ ఇంజినీర్

ఈ-పంట నమోదు.. అన్నదాతకు తోడు

న్యూస్‌టుడే, ఒంగోలు గ్రామీణం

• ఈ నెల 20 తుది గడువు

వ్యవసాయాన్ని ప్రోత్సహించడంతోపాటు.. అన్నదాతలకు అండగా ఉండేందుకు ప్రభుత్వం అనేక పథకాలు అందిస్తోంది. ఆయా సేవలు పారదర్శకంగా రైతులకు చేరేందుకు ఈ-పంట నమోదు విధానాన్ని ప్రవేశ పెట్టింది. ప్రస్తుతం రబీలో సాగైన పంటల వివరాల నమోదు ప్రక్రియ వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో సాగుతుంది. పంట సాగు హక్కు పత్రాలు పొందిన కౌలు రైతులు కూడా వారు సాగు చేసే పంటల నమోదు చేయించుకునే అవకాశం కల్పించారు. వ్యవసాయశాఖ ఆదేశాల మేరకు ఈ-పంట నమోదుకు ఈ నెల 20 తుది గడువు కావడంతో మరో మూడు రోజులే మిగిలి ఉంది. ఇప్పటివరకు 70 శాతం నమోదుకాక, మిగిలిన వారంతా వినియోగించుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

నాగులుప్పలపాడు మండలంలో అత్యధికంగా పంటల సాగు

ఒంగోలు, సంతనూతలపాడు నియోజకవర్గాల పరిధిలో నాగులుప్పలపాడు మండలంలో అత్యధిక విస్తీర్ణంలో పంటలు సాగు చేశారు. గ్రామ వ్యవసాయ సహాయకులు, వీఆర్వోల సమన్వయంతో గ్రామాల వారీగా బృందాలు ఏర్పాటు చేసి నమోదు ప్రక్రియ నిర్వహించేలా కార్యాచరణ చేపట్టారు. గ్రామంలో ఏ రైతుకు ఎంత భూమి ఉంది, అందులో ఏయే పంటలు సాగు చేస్తున్నారు.. తదితర వివరాలు సేకరిస్తున్నారు. సాగుదారులు తమ ఆధార్, చరవాణి నంబరు, సర్వే నంబరు చెప్పడంతోపాటు, పొలం వద్దకు వెళ్లి ఫొటో నమోదు చేస్తున్నారు. రబీ సీజన్‌లో వరి, శనగ, మిరప, మినుము, జొన్న, మొక్కజొన్న పంటలకు మాత్రమే బీమా వర్తించనున్న నేపథ్యంలో వాటిని నోటిఫైడ్ పంటలుగా గుర్తించారు. విపత్తుల సమయంలో జరిగే పంట నష్టానికి ఈ-పంటలో వివరాలే కీలకం. దాని ఆధారంగానే నష్టపరిహారం అందించనున్నారు. అందులో నమోదు చేయకుంటే పరిహారంతో పాటు, ప్రభుత్వం అందించే ఫలాలకు దూరం కావాల్సిందే. ఈ-పంట నమోదుతోనే రైతు సేవా కేంద్రాల్లో శనగ, కంది, వరి తదితర పంటలను కొనుగోలు చేయనున్నారు.

మద్దిపాడు మండలం వెల్లంపల్లిలో ఈ-పంట నమోదును పరిశీలిస్తున్న ఏడీఏ రమేష్‌బాబు

రబీలో మండలాల వారీగా సాగు విస్తీర్ణం (ఎకరాల్లో), ఈ-క్రాప్ వివరాలు..

మండలం	సాగు విస్తీర్ణం	ఈ–పంట నమోదు
ఒంగోలు	23,474	20,152
కొత్తపట్నం	16,016	10,957
చీమకుర్తి	20,616	13,972
నాగులుప్పలపాడు	45,279	34,181
సంతనూతలపాడు	21,408	17,147
మద్దిపాడు	24,031	19,192

అమరావతి వెళ్లాం.. అసెంబ్లీ చూశాం!

న్యూస్‌టుడే, పేర్నమిట్ట(సంతనూతలపాడు)

సచివాలయం వద్ద పేర్నమిట్ట పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు

సంతనూతలపాడు మండలంలోని పేర్నమిట్ట జడ్పీహెచ్ఎస్ విద్యార్థులు మంగళవారం అమరావతిలోని రాష్ట్ర సచివాలయంతో పాటు, శాసనసభను సందర్శించారు. అసెంబ్లీ సమావేశాలను ప్రత్యక్షంగా వీక్షించారు. పాఠశాలకు చెందిన 35 మంది విద్యార్థులు, ఉపాధ్యాయులతో కలిసి తరలివెళ్లారు. ప్రధానోపాధ్యాయురాలు పార్వతిశాంతి మాట్లాడుతూ.. విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు, క్రమశిక్షణ, దేశభక్తి, సమాజ సేవ, పట్టుదల, అంకితభావంతో నడుచుకోవడం తదితర లక్షణాలు ఇలాంటి పర్యటనల వల్ల కలుగుతాయని వివరించారు. శాసనసభ సమావేశాలు చూసేందుకు విద్యార్థులకు అనుమతి ఇవ్వడంపై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, స్పీకర్ అయ్యన్నపాత్రుడులకు ధన్యవాదాలు తెలియజేశారు. ఉపాధ్యాయులు బి.శ్రీనివాసరావు, ముంతాజ్‌బేగం, విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు తమ అభిప్రాయాలను పంచుకున్నారిలా.

కొత్త ఆలోచనలు రేకెత్తించాయి

పాఠశాల తరఫున శాసనసభను చూసేందుకు వెళ్లాం. అక్కడ సభ జరుగుతున్న తీరును చూశాం. రాష్ట్ర ప్రజల అభ్యున్నతి కోసం ఎటువంటి చర్యలు, శ్రద్ధ తీసుకుంటున్నారో తెలుసుకున్నాం. మేము వెళ్లినప్పుడు జనాభాపై చర్చ జరుగుతుంది. సమావేశం జరిగే తీరును స్వయంగా చూడటంతో కొత్త ఆలోచనలు రేకెత్తాయి. రాష్ట్రాభివృద్ధి ఇలాంటి సమావేశాలతోనే జరుగుతుందని తెలుసుకున్నాం.

–యు.యెహేమియా అఖిల్, 8వ తరగతి

ఎన్నో అంశాలపై అవగాహన కలిగింది

అసెంబ్లీ సమావేశాలను తిలకించి ఎన్నో అంశాలను ఆసక్తిగా తెలుసుకున్నాం. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, మంత్రి నారా లోకేశ్‌తో పాటు, ఇతర మంత్రులు, ఎమ్మెల్యేలను చూశాం. వారు సభలో ఎలా మాట్లాడుతున్నారో గమనించాం. ప్రజలకు సేవ చేయాలనే విషయాలు తెలుసుకున్నాం. నాయకత్వం, బాధ్యత ఇలా అంశాలపై అవగాహన కలిగింది. నేరుగా సమావేశాలను చూడటం ఎంతో సంతోషం కలిగింది. –జి.వి.జ్ఞాన కారుణ్య, 9వ తరగతి

(c) eenadu

జనసందోహం మధ్య మూలస్థానేశ్వరుని రథోత్సవం
అంతరిక్షంలో స్వామివారు

గండవరంలో ఉదయకోళేశ్వరస్వామి తెప్పోత్సవం

పరమశివుడి వైభవం..
పరవశించిన భక్తజనం

శివరాత్రి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం నెల్లూరు మూలాపేటలోని భువనేశ్వరి సమేత మూలస్థానేశ్వరస్వామి, కొడవలూరు మండలం గండవరంలో వెలసిన గంగా పార్వతీ సమేత ఉదయ కోళేశ్వరస్వామి రథోత్సవాలు కనుల పండువగా జరిగాయి. భక్తులు స్వామి వారి రథాలను లాగేందుకు పోటీపడ్డారు. ఎక్కడికక్కడ మొక్కులు చెల్లించుకున్నారు. రాత్రి గండవరంలో జరిగిన స్వామివారి తెప్పోత్సవం ఆద్యంతం ఆధ్యాత్మికతను ఇనుమడింపజేసింది. – న్యూస్‌టుడే, నెల్లూరు(సాంస్కృతికం), కొడవలూరు

జిల్లా రిజిస్ట్రార్‌గా రవి జోసఫ్

నెల్లూరు(మార్కెట్ సెంటర్), న్యూస్‌టుడే: జిల్లా రిజిస్ట్రార్‌గా రవి జోసఫ్ నియమితులయ్యారు. అల్లూరు సబ్ రిజిస్ట్రార్‌గా విధులు నిర్వహిస్తున్న ఆయనకు ప్రభుత్వం ఉద్యోగోన్నతి కల్పించింది. ప్రస్తుతం జిల్లా రిజిస్ట్రార్‌గా విధులు నిర్వహిస్తున్న బాలాంజనేయులు ప్రస్తుతం జిల్లా ఇన్‌ఛార్జి రిజిస్ట్రార్‌గా ఉన్నారు.

భళా.. చదరంగమిలా

క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం జిల్లాస్థాయి శాప్ లీగ్ చదరంగం పోటీలు ఉత్సాహంగా జరగ్గా- 191 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. అండర్- 13, 15, 17, 19 విభాగాల్లో బాల బాలికలకు వేర్వేరుగా స్విస్ పద్ధతిలో హోరాహోరీగా తలపడ్డారు. 31 అంశాల్లో జిల్లా స్థాయి పోటీలు నిర్వహించి.. ప్రతిభ కనబరిచిన వారిని రాష్ట్ర స్థాయి పోటీలకు పంపుతామని క్రీడాభివృద్ధి అధికారి ఎం.పాండురంగారావు తెలిపారు. – న్యూస్‌టుడే, నెల్లూరు(క్రీడా విభాగం)

జలవనరుల శాఖలో..
అక్రమాలపై విచారణ

నెల్లూరు(పద్మావతిసెంటర్), న్యూస్‌టుడే: జలవనరులశాఖ పనుల్లో జరిగిన అవకతవకలపై ఆరోపణలు ఎదుర్కొంటున్న ముగ్గురు ఇంజినీర్లపై ప్రభుత్వం విచారణకు ఆదేశించింది. ఆ మేరకు ఉత్తర్వులు జారీ చేయడంతో పాటు విచారణాధికారిని సైతం నియమించింది. వైకాపా ప్రభుత్వ హయాంలో జిల్లాలోని నీటిపారుదలశాఖ సెంట్రల్ డివిజన్‌లో పనిచేసిన మాజీ ఈఈ పి.కృష్ణమోహన్, డీఈఈ వై. వెంకయ్య, మాజీ ఏఈ కేవీఆర్ ప్రసాద్ పేర్లు ఈ జాబితాలో ఉన్నాయి.

ఆరోపణలు ఇలా..

- సంగం ఆన కట్ట వద్ద ఇసుక సంచులు వేయకుండానే వేసినట్లు బినామీ కాంట్రాక్టర్ల పేరుతో రూ. లక్షల లావాదేవీలు నిర్వహించడం..
- సంగం మండలం సహా డివిజన్ పరిధిలో పనులు చేయకుండానే.. బిల్లులు చేసుకోవడం..
- నీరు-చెట్టు పనుల్లో నాణ్యతను విస్మరించడం, గ్రావెల్ అనుమతుల మంజూరులో డబ్బు వసూలు చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇవి రుజువైతే.. శాఖాపరమైన చర్యలు తీసుకోనున్నారు.

కోతలెంచి.. వాత!
వేసవి సన్నాహకాల్లో విద్యుత్తు శాఖ

నెల్లూరు(విద్యుత్తు), న్యూస్‌టుడే: వేసవి ముంచుకొస్తున్న నేపథ్యంలో విద్యుత్తుశాఖ అప్రమత్తమైంది. ఎదురయ్యే సవాళ్లను అధిగమించేందుకు సమగ్ర ప్రణాళికను సిద్ధం చేయడంతో పాటు ఇప్పటికే కార్యాచరణకు శ్రీకారం చుట్టింది. మొత్తంగా వేసవి డిమాండ్‌ను అధిగమించి.. నిరంతర విద్యుత్తు అందించేందుకు చర్యలు తీసుకుంటోంది. చేపట్టనున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో నిరంతర విద్యుత్తును అందించేందుకు ఉద్దేశించిన ఆర్‌డీఎస్ఎస్ పథకం కింద రూ. 505 కోట్లతో స్తంభాలు, తీగలు, ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేస్తున్నారు. దీనికి ఇప్పటికే రూ. 242 కోట్లు ఖర్చు చేయగా.. మార్చి నాటికి పూర్తవుతాయని అధికారులు చెబుతున్నారు. రూ. 50 కోట్లతో నగరంలోని పాత పెద్దాసుపత్రి ఆవరణలో రెండు ఎకరాల్లో చేపట్టిన 132 కేవీ సబ్ స్టేషన్, రూ. 5 కోట్లతో గాంధీ బొమ్మ సమీపంలోని స్వతంత్ర పార్కును ఆనుకుని ఉన్న స్థలంలో కంటెయినర్ సబ్ స్టేషన్ పనులను వేగవంతం చేశారు.

నెల్లూరు: ట్రాన్స్‌ఫార్మర్ సామర్థ్యం పెంపు పనుల్లో సిబ్బంది

కేటగిరీల వారీగా వినియోగదారులు

గృహ	8,99,151
వాణిజ్య	97,411
పరిశ్రమలు	4,240
ఆలయాలు, పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాలు	25,353
వ్యవసాయం	1,85,080
ఆక్వా	25,380
హెచ్‌టీ	814
రోజు అవసరం	14 మిలియన్ యూనిట్లు

12 సబ్‌స్టేషన్లకు ప్రతిపాదనలు

జిల్లాలో 12 సబ్‌స్టేషన్ల నిర్మాణానికి అధికారులు ప్రతిపాదనలు పంపారు. ఒక్కొక్కటి రూ. 3 కోట్లతో.. నెల్లూరు నగరంలో 3, గ్రామీణంలో 3, కావలి, ఆత్మకూరు, కోవూరు నియోజకవర్గాల్లో 2 చొప్పున 33/11 కేవీ ఉపకేంద్రాల నిర్మాణం

120 అదనపు ట్రాన్స్‌ఫార్మర్లు

సాధారణ రోజుల్లో 13 నుంచి 14 మిలియన్ యూనిట్ల విద్యుత్తు వినియోగం ఉండగా- వేసవిలో ఇది 18 మిలియన్ యూనిట్లకు చేరుతుందని అంచనా. ఈ క్రమంలో నిరంతర విద్యుత్తు కోసం జిల్లా వ్యాప్తంగా 120 ట్రాన్స్‌ఫార్మర్లు అదనంగా ఏర్పాటు చేస్తున్నారు. ఆయా ప్రాంతాల్లో విద్యుత్తు వినియోగాన్ని అంచనా వేసి.. ఉన్నవాటి సామర్థ్యాన్ని పెంచుతున్నారు.

- విద్యుత్తుశాఖ ఎస్ఈ కె.రాఘవేంద్రం మాట్లాడుతూ.. 'వేసవిలో వినియోగదారులకు ఇబ్బంది కలగకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నాం. వినియోగం అంచనా ఆధారంగా అవసరమైన ప్రాంతాల్లో అదనపు చర్యలు తీసుకుంటున్నాం' అన్నారు.

ధాన్యం కొనుగోళ్లకు
169 కేంద్రాలు
'ఈనాడు-ఈటీవీ'తో జేసీ మొగిలి వెంకటేశ్వర్లు

నెల్లూరు(కలెక్టరేట్), న్యూస్‌టుడే: జిల్లాలో ఈ నెలాఖరు నుంచి వరికోతలు ప్రారంభం కానున్నాయి. రబీలో అత్యధిక దిగుబడులు వచ్చే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో ఈనాడు-ఈటీవీకి ఇచ్చిన ముఖాముఖిలో జేసీ మొగిలి వెంకటేశ్వర్లు కొనుగోలు కేంద్రాలు, బ్యాంకు గ్యారెంటీలతో పాటు ఇతర ముఖ్య అంశాలపై స్పందించారు. స్థానికులతో పాటు ఇతర జిల్లాల మిల్లర్ల ద్వారా ధాన్యం కొనుగోలు చేస్తామని.. దళారులను నమ్మి మోసపోవద్దని రైతులకు సూచించారు. ఆయన ఇంకా ఏమన్నారంటే...

దళారులను నమ్మొద్దు..

జిల్లాలో 5 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వచ్చే అవకాశం ఉంది. అందుకు అనుగుణంగా 169 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నాం. కోవూరు, కోట, గూడూరు ప్రాంతాల్లో ముందుగా.. విడవలూరు, కొడవలూరు, రేబాల, దామరమడుగు, బుచ్చిరెడ్డిపాళెం ప్రాంతాల్లో పది రోజుల్లో వరి కోతలు ప్రారంభమయ్యే అవకాశం ఉంది. అందుకు అనుగుణంగా చర్యలు చేపడుతున్నాం.

తక్కువ ధరకు కొంటే చర్యలు

మొదటి రకం ధాన్యం క్వింటా మద్దతు ధర రూ. 2,369. ఇంతకంటే తక్కువ ధరకు కొన్నట్లు తెలిస్తే.. కఠిన చర్యలు తీసుకుంటాం. రైతు సేవా కేంద్రాల్లో తేమశాతం తెలిపే యంత్రాలు అందుబాటులో ఉంచాం. తహసీల్దారు, వ్యవసాయ శాఖ కార్యాలయాల్లో అదనంగా ఉన్న కంప్యూటర్లు తీసుకువెళ్లి.. రైతు సేవా కేంద్రాల్లో ఉంచే ఏర్పాట్లు చేశాం.

జీబీలు.. రూ. 100 కోట్ల వరకు

మిల్లర్లు మోసం చేస్తున్నారని, తూకంలోనూ ఇబ్బందులు పెడుతున్నారనే ఫిర్యాదులు ఉన్నాయి. ఇలాంటి వాటిని ఉపేక్షించబోం. మిల్లర్లకు రూ.3 కోట్ల బకాయిలు చెల్లించేలా ఉన్నతాధికారులకు నివేదించాం. డీసీవో కూడా రూ. 3కోట్లు ఇచ్చారు. బ్యాంకు గ్యారంటీలు రూ.9 కోట్లు తీసుకున్నాం. ఇప్పటికే రూ. 15 కోట్ల వరకు బ్యాంకు బ్యాలెన్స్ ఉంది. జీబీలు రూ. వంద కోట్ల వరకు తీసుకుంటాం.

900 టార్పాలిన్ పట్టలు

గోదాములు, రైతులు ధాన్యం తీసుకొచ్చేందుకు వాహనాలు అందుబాటులో ఉంచాం. ఆరబెట్టుకునేందుకు 900 టార్పాలిన్ పట్టలు కొనుగోలు చేశాం. వర్షం వచ్చినప్పుడు ఇబ్బందులు లేకుండా.. రైతు సేవా కేంద్రాలకు పంపించాం. మద్దతు ధర కంటే తక్కువకు అమ్ముకోవద్దని రైతులకు సూచిస్తున్నాం.

25 లక్షల గన్నీ బ్యాగులు

రైతు సేవా కేంద్రాల్లో 25 లక్షల వరకు గన్నీ బ్యాగులు అందుబాటులో ఉంచాం. వ్యవసాయశాఖ అధికారులు 6 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తుందని చెబుతున్నారు. గతంలో 1.40 లక్షల మెట్రిక్ టన్నులు సేకరించాం. ఇప్పుడు 2.50 లక్షల సేకరణకు ప్రతిపాదనలు పంపించాం. మొత్తంగా నాలుగు లక్షల వరకు సేకరణకు చర్యలు తీసుకుంటున్నాం.

పేదల గూడు.. ఆర్థిక తోడు

న్యూస్‌టుడే, నెల్లూరు(టౌన్): ప్రధానమంత్రి ఆవాస్ యోజన(పీఎంఏవై-2.0) ద్వారా పట్టణ ప్రాంతాల్లో ఇళ్ల నిర్మాణం చేపట్టే లబ్ధిదారులకు కూటమి ప్రభుత్వం మరింత ఆర్థిక ప్రయోజనం చేకూర్చనుంది. సాయాన్ని రూ. 1.80 లక్షల నుంచి రూ. 2.50 లక్షలకు పెంచింది. ఈ నిర్ణయంతో జిల్లాలోని 2,684 మందికి లబ్ధి చేకూరనుంది. పట్టణ ప్రాంతాల్లో సొంత స్థలం ఉండి.. ఇల్లు నిర్మించుకోలేని పేదలకు శాశ్వత వసతి కల్పించేందుకు పీఎంఏవై 2.0 కింద ప్రభుత్వం చర్యలు చేపట్టిన విషయం తెలిసిందే.

వివరాలు ఇలా...

పట్టణం/నగరం	లక్ష్యం	మంజూరు
అల్లూరు	131	130
ఆత్మకూరు	242	239
బుచ్చిరెడ్డిపాలెం	285	285
కందుకూరు	417	410
కావలి	330	328
నెల్లూరునగరం	430	422
నెల్లూరురూరల్ (అర్బన్)	849	842

గతంలో ఇలా...

ఒక్కొక్క గృహ నిర్మాణానికి యూనిట్ విలువ రూ. 1.80 లక్షలు ఉండేది. కేంద్రం నుంచి రూ. 1.50 లక్షలు, రాష్ట్రం నుంచి రూ. 30వేల చొప్పున సాయం అందేది. గత వైకాపా ప్రభుత్వం ఈ పథకాన్ని నీరుగార్చింది. జగనన్న కాలనీల్లో గృహాలకే తప్ప.. పీఎంఏవైలో మంజూరు చేయకపోవడంతో.. పట్టణ ప్రాంతాల్లో చాలా మంది దరఖాస్తుదారులు నిరాశ చెందారు.

- దీనిపై గృహ నిర్మాణశాఖ ఇన్‌ఛార్జి పీడీ మోహన్‌రావు మాట్లాడుతూ.. పథకాన్ని అర్హులు సద్వినియోగం చేసుకోవాలి. పట్టణాల్లో అర్హులైన పేదల వివరాలు సేకరిస్తున్నాం అన్నారు.

డబ్బుంటే చేదా..
మీకా ఉద్దేశం లేదా!

ఇప్పటి వరకు తీసుకుంది 10 శాతమే..

ఈనాడు, నెల్లూరు: న్యూస్‌టుడే, నెల్లూరు(పద్మావతినగర్): మనుగడలో లేని వాటితో పాటు కొన్ని వ్యక్తిగత బ్యాంకు ఖాతాల్లో భారీగా నగదు నిల్వలు ఉన్నా.. తీసుకునేందుకు ఆసక్తి చూపడం లేదు. కేంద్రం వెసులుబాటు కల్పించినా.. సద్వినియోగం చేసుకోవడం లేదు. అవగాహన లేమి, బ్యాంకుల చుట్టూ తిరగాల్సి వస్తుందేమోనన్న అపోహతో చాలా మంది అటువైపు కూడా వెళ్లడం లేదు. జిల్లాలో పది శాతం మంది కూడా వారి ఖాతాల్లోని డబ్బు తీసుకోకపోవడం దీనికి నిదర్శనం.

6,11,981 ఖాతాలు.. రూ. 125 కోట్లు

జిల్లాలో 6,11,981 బ్యాంకు ఖాతాలు ఉండగా.. వీటిలో సుమారు రూ. 125 కోట్లు ఉన్నాయి. కొన్నాళ్ల పాటు లావాదేవీలు నిర్వహించి.. గత పదేళ్లుగా స్తబ్దుగా ఉన్న ఖాతాలను అన్‌క్లెయిమ్డ్‌గా గుర్తించారు. ఇటీవల సమీక్షించిన సీఎం చంద్రబాబునాయుడు.. ఈ అంశంపై ప్రత్యేక దృష్టిపెట్టాలని సూచించారు. దాంతో ప్రభుత్వ ఖాతాల్లోని సొమ్మును తిరిగి తెచ్చుకునే ప్రయత్నాలు మొదలయ్యాయి. వ్యక్తిగత ఖాతాల్లోని సొమ్మును తీసుకునే అవకాశం ఉంది. వీటిలో 2015-16 తెరిచిన జన్‌ధన్ ఖాతాలు ఉన్నాయి. కలెక్టర్ హిమాన్షుశుక్లా సైతం.. మనుగడలో లేని ఖాతాలను వెంటనే పునరుద్ధరించాలని, అవసరం లేదనుకున్నవి మూసివేయాలని సూచించారు. ఆ మేరకు ప్రజలకు అవగాహన కల్పించాలని ఆదేశించారు.

తిరిగి తీసుకోవాలంటే...

- అన్ క్లెయిమ్డ్ ఖాతాల వివరాలు తెలుసుకోవడానికి యూడీజీఏఎం (ఉద్గమ్) వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలి.
- అనంతరం ఆధార్, పాన్ కార్డు ద్వారా తెలుసుకోవచ్చు.
- సంబంధిత పత్రాలు అప్‌లోడ్ చేసి.. బ్యాంకులో కొత్తగా కేవైసీ చేసుకుని సొమ్మును పొందొచ్చు.
- అప్పట్లో ఇచ్చిన ఆధార్ కార్డులోని పేరు, చరవాణి నంబరు, చిరునామా మార్చుకుని ఉంటే.. బ్యాంకులో రీకేవైసీ చేయాలి.
- ఆ తర్వాతే ఆర్‌బీఐ నుంచి సొమ్ము తిరిగి తీసుకునే అవకాశం లభిస్తుంది.

బ్యాంకులో సంప్రదించండి

అన్ క్లెయిమ్డ్ ఖాతాల్లోని డబ్బు తీసుకోవాలంటే.. ఖాతా ఉన్న బ్యాంకులో సంప్రదించాలి. వారే అన్ని వివరాలు చెబుతారు. సందేహాలు నివృత్తి చేస్తారు. ఇంకా ఏమైనా ఇబ్బందులు ఎదురైతే.. నెల్లూరులోని లీడ్ బ్యాంకు కార్యాలయాన్ని సంప్రదించవచ్చు.
– మణిశేఖర్, ఎల్‌డీఎం

ఇదీ సంగతి | ప్రభుత్వ ఖాతాలు: 4,828 | నగదు నిల్వ: రూ.10.04 కోట్లు | కేవైసీ పూర్తయినవి: 169

మేయర్ ఎన్నిక..
రాజకీయ వేదిక

పార్టీల అప్రమత్తత

నెల్లూరు(టౌన్), న్యూస్‌టుడే: నెల్లూరు నగర రాజకీయం హాట్ టాపిక్‌గా మారింది. మేయర్ పదవిని భర్తీ చేసేందుకు రాష్ట్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల చేయడంతో స్థానికంగా రాజకీయ వేడి మొదలైంది. ఎన్నిక కోసం ఈ నెల 26వ తేదీ ఉదయం 11 గంటలకు ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నారు. దాంతో తెదేపా, వైకాపా నాయకులు అప్రమత్తమయ్యారు. అధికార పార్టీకి దాదాపు 42 మంది కార్పొరేటర్లు మద్దతు తెలుపుతుండగా.. వైకాపా పక్షంలో పది మంది ఉన్నారు. మాజీ మేయర్ స్రవంతి తటస్థంగా ఉన్నట్లు చెబుతున్నా.. ఈమెకు వైకాపా లోపాయకారీ మద్దతు తెలుపుతుండటం గమనార్హం. కూటమి నాయకులు ఇప్పటికే మేయర్ అభ్యర్థిగా 53వ డివిజన్ కార్పొరేటర్ దేవరకొండ సుజాతను ప్రకటించారు.

ప్రలోభాలకు ప్రయత్నం...

తెదేపాకు మద్దతుగా ఉన్న కార్పొరేటర్లను ప్రలోభపెట్టేందుకు వైకాపా ప్రయత్నాలు చేస్తోంది. కొందరికి నగదు ఆశ చూపుతుండటంతో పాటు వచ్చే ఎన్నికల్లో కార్పొరేటర్ సీటు ఇస్తామని హామీ ఇస్తున్నట్లు తెలిసింది. అదే సమయంలో తమ కార్పొరేటర్లు జారిపోకుండా తెదేపా నాయకులు వ్యూహ రచన చేస్తున్నారు. ఈ నెల 26న మేయర్ ఎన్నిక జరగనుండగా.. అదే రోజు నెల్లూరులో జరిగే ఓ వివాహానికి మాజీ ముఖ్యమంత్రి, వైకాపా అధ్యక్షుడు జగన్ మోహన్‌రెడ్డి రానున్నట్లు సమాచారం. దీంతో సింహపురి రాజకీయాల్లో ఎలాంటి పరిణామాలు చోటు చేసుకుంటాయోనన్న ఉత్కంఠ నెలకొంది.

యువత.. సమాజ సేవలో భాగమవుదామా

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), న్యూస్‌టుడే: సమాజ సేవా కార్యక్రమాల్లో పాల్గొనే యువతను ప్రోత్సహించేలా జిల్లాలో మేరా యువ భారత్(ఎన్‌వైకే) ఆధ్వర్యంలో యువ వాలంటీర్ల నోటిఫికేషన్ విడుదలైంది. ఈ నెల 20వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలి. ఆన్‌లైన్ దరఖాస్తుల కోసం http:///nyks.nic.in/nycapp/main.asp వెబ్‌సైట్‌ను, మరిన్ని వివరాలకు 9963533440 నంబరును సంప్రదించాలని అధికారి సూచించారు.

పరిష్కారం.. ఓ మాయ
కలెక్టరేట్ పోర్టల్‌లో పాత ఫొటో అప్‌లోడ్

నెల్లూరు(కలెక్టరేట్), న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యం ఇస్తుంటే.. క్షేత్రస్థాయిలో కొందరు అధికారులు ఆ ఆశయానికి తూట్లు పొడుస్తున్నారు. అర్జీలను పరిష్కరించకుండానే.. పరిష్కారమైనట్లు చూపుతున్నారు. ఇలాంటి సంఘటనే తాజాగా నెల్లూరు రూరల్‌లో వెలుగు చూసింది.

2024లో ఎండార్స్‌మెంట్ తీసుకుంటున్న చిన్న వెంకటసుబ్బయ్య.. ప్రస్తుతం ఇదే చిత్రాన్ని అప్‌లోడ్ చేశారు

నెల్లూరు రూరల్ మండలం కొమ్మరపూడికి చెందిన రైతుల నుంచి గత ప్రభుత్వం నెల్లూరు బిట్-1 కొత్తూరు పరిధిలో నవరత్నాలు పేదలందరికీ ఇళ్లు పథకం కింద భూమి సేకరించింది. 122 మంది రైతుల నుంచి 61.56 ఎకరాలు తీసుకుంది. ఒక్కో రైతు నుంచి 50 సెంట్లు తీసుకుని.. రూ. 12.50 లక్షల చొప్పున చెల్లించింది. కాగా.. 122 మందిలో 118 మందికే పరిహారం అందించారు. మిగిలిన నలుగురు మూడేళ్లుగా అధికారుల చుట్టూ తిరుగుతున్నారు.

ఈ క్రమంలో పెట్లూరు చిన వెంకటసుబ్బయ్య అనే రైతు నెల రోజుల కిందట నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి తన కార్యాలయంలో నిర్వహించే ప్రజా దర్బార్ కార్యక్రమంలో వినతిపత్రం సమర్పించారు. తనకు పరిహారం మంజూరు చేయించాలని కోరారు. ఆ అర్జీని నెల్లూరు రూరల్ మండల అధికారులకు పంపించగా.. వారు పరిష్కరించకుండానే చిన వెంకటసుబ్బయ్యకు ఎండార్స్‌మెంట్ ఇచ్చినట్లు 2024లో తీసుకున్న ఎండార్స్‌మెంట్ ఫొటోనే మళ్లీ కలెక్టరేట్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేశారు.

అధికారులు న్యాయం చేయాలి..

నెల్లూరు రూరల్ తహసీల్దారు కార్యాలయం నుంచి ఎండార్స్‌మెంట్ ఇస్తామని నాకు ఫోన్ చేశారు. పరిహారం అందలేదు కదా? ఎందుకని ప్రశ్నించా. ఎండార్స్‌మెంట్ ఇవ్వాలని చెప్పారు. పరిష్కరించినట్లు చూపుతారని వెళ్లలేదు. కానీ, 2024లో ఇచ్చిన ఎండార్స్‌మెంట్ ఫొటోను ఇప్పుడు అప్‌లోడ్ చేశారు. అధికారులు స్పందించి పరిహారం అందించి ఆదుకోవాలి. – పెట్లూరు చినవెంకటసుబ్బయ్య

క్రిస్‌సిటీ.. పరిశ్రమలకు రెడీ!
ఏపీఐఐసీ నుంచి ఏపీఐసీడీసీకి భూమి బదలాయింపు

ఈనాడు, నెల్లూరు: పరిశ్రమల ఏర్పాటుపై కూటమి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ పెడుతోంది. చెన్నై- బెంగళూరు పారిశ్రామిక నడవా(సీబీఐసీ)లో భాగమైన కృష్ణపట్నం ఇండస్ట్రియల్ సిటీ(క్రిస్ సిటీ)ని పారిశ్రామిక నగరంగా తీర్చిదిద్దేందుకు మరో కీలక నిర్ణయం తీసుకుంది. ఏపీఐఐసీ అధీనంలోని సుమారు 2500.40 ఎకరాలను ఏపీ ఇండస్ట్రియల్ కారిడార్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్(ఏపీఐసీడీసీ)కు పూర్తి అమ్మకపు విధానంలో బదిలీ చేయడానికి ఆమోదం తెలిపింది. ఇందుకు సంబంధించిన స్టాంప్ డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఫీజులను పూర్తిగా మాఫీ చేస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో పరిశ్రమల ఏర్పాటు ప్రక్రియ వేగవంతం కానుంది.

క్రిస్‌సిటీలో పనులు

రూ. 17.47 కోట్ల రాయితీ

భూముల బదలాయింపునకు సంబంధించి ప్రభుత్వం స్టాంప్ డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఫీజులకు రాయితీ కల్పిస్తోంది. ఇందులో స్టాంపు డ్యూటీ రూ. 15.17 కోట్లు, రిజిస్ట్రేషన్ ఫీజు రూ. 2.30 కోట్లను మాఫీ చేసింది. దీంతో జిల్లాకు భారీ ప్రయోజనం చేకూరనుంది. భారీ పరిశ్రమల స్థాపనకు మార్గం సుగమం కానుంది. జిల్లా తీర ప్రాంతం భవిష్యత్తులో ప్రధాన పారిశ్రామిక హబ్‌గా మారే అవకాశాలు పెరిగాయి.

లీజు పద్ధతి రద్దు

చెన్నై- బెంగళూరు ఇండస్ట్రియల్ కారిడార్(సీబీఐసీ)లో భాగంగా కృష్ణపట్నం నోడ్ అభివృద్ధి జరుగుతోంది. దీనికోసం ఏపీఐఐసీ. కేంద్ర సంస్థ ఎన్ఐసీడీఐటీతో కలిసి ప్రత్యేక సంస్థ(ఎస్‌పీవీ)ను ఏర్పాటు చేసింది. మొత్తం 12వేల ఎకరాల్లో పరిశ్రమల నగరం ఏర్పాటు చేయాలని నిర్ణయించగా... ఇందులో జిల్లా తీర ప్రాంతంలోని కొత్తపట్నం, సిద్ధవరం, తూర్పు కనుపూరు, తమ్మినపట్నంలో 2,500 ఎకరాలు సేకరించారు. మొదటి దశలో ఈ ప్రాంతంలో అభివృద్ధి చేయనుండగా.. తొలుత ఈ భూమిని 99 ఏళ్ల లీజు పద్ధతిలో ఇవ్వాలనుకున్నారు. తాజాగా రాష్ట్ర ప్రభుత్వం ఆ పద్ధతిని రద్దు చేసి.. పూర్తిస్థాయి అమ్మకపు విధానం(అవుట్‌రైట్ సేల్)కు మార్చింది. తద్వారా పెట్టుబడిదారులకు భూమిపై స్పష్టమైన హక్కులు లభిస్తాయి.

ఉత్తరక్రియలు

మంచికి మారుపేరుగా నిలిచి, నలుగురికి ఆదర్శప్రాయమై, అందరి హృదయాలలో చెరగని ముద్రవేసిన మా ఇంటి దైవం శ్రీమతి కొండిశెట్టి వెంకట భారతి గారు స్వర్గస్తులైనారు. వారి పవిత్రాత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తూ...
శ్రీమతి కొండిశెట్టి వెంకట భారతి గారు
జననం : 01-06-1966 ● మరణం : 06-02-2026
భర్త : కొండిశెట్టి వెంకట శేషయ్య
కుమారులు - కోడళ్లు
కొండిశెట్టి యతీష్ కుమార్ - హరిత
కొండిశెట్టి కమలాకర్ - దీప్తి
మనుమడు : మితిన్, మనుమరాళ్లు : ధృతి, విస్మిత
ఉత్తరక్రియలు : తేది : 18-02-2026 బుధవారం నెల్లూరు కరెంట్ ఆఫీస్ సెంటర్, రుత్విక్ ఎన్‌క్లేవ్, మల్లి టవర్స్ నందు జరుగును. కావున తెలియజేయడమైనది.

ఉత్తరక్రియలు

మా తండ్రి గారైన శ్రీ మేడేపల్లె వెంకటస్వామి గారు (Rtd. Head Master) తేది 05-02-2026 గురువారం స్వర్గస్తులైనారు. వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తూ...
కీ॥శే॥ శ్రీ మేడేపల్లె వెంకటస్వామి గారు (Rtd. Head Master)
జననం : 01-07-1940 మరణం : 05-02-2026
పెద్దకర్మ : తేది 19-02-2026 గురువారం నెల్లూరు జిల్లా, ఉదయగిరి మండలం, నేలటూరు గ్రామములోని మా స్వగృహము నందు జరుగును. కావున తెలియజేయడమైనది.
ఇట్లు : కుమారులు : మేడేపల్లె వెంకటేశ్వరరావు, మేడేపల్లె రాజేంద్రప్రసాద్ / మరియు కుటుంబ సభ్యులు

ఉత్తరక్రియలు

జననం 10-10-1951 మరణం 4-2-2026
శ్రీ ఇందుపూరు శ్రీనివాసులురెడ్డి గారు
(శ్రీ వేదగిరి లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానం మాజీ చైర్మన్ - నరసింహకొండ, మాజీ సర్పంచ్, టిడిపి సీనియర్ నాయకులు మరియు సాగునీటి వినియోగదారుల సంఘం అధ్యక్షులు - పొట్టేపాళెం)
మంచి మనస్సు, ఉన్నతమైన వ్యక్తిత్వంతో జీవించి, అందరిపట్ల ప్రేమానురాగాలను పంచి, మా అందరి హృదయాలలో చెరగని ముద్రవేసి, మా కుటుంబ ఉన్నతికి అహర్నిశలు శ్రమించిన మా ఇంటి దైవం శ్రీ ఇందుపూరు శ్రీనివాసులురెడ్డి గారు తేది : 4-2-2026 బుధవారం నాడు స్వర్గస్తులైనారు. వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ఆ భగవంతుని ప్రార్థిస్తూ...
కుమారులు : ఇందుపూరు అచ్యుత శంకర్‌రెడ్డి - సుమతి, ఇందుపూరు ఉదయ్ శంకర్‌రెడ్డి - మౌనిక / మనుమడు, మనుమరాళ్లు సాయిదియారెడ్డి, శ్రీమంత్‌రెడ్డి, గాన్విక‌రెడ్డి
ఉత్తరక్రియలు : వారి పెద్దకర్మ తేది 19-02-2026 గురువారం ఉదయం 10.00 గంటలకి నెల్లూరు రూరల్, పొట్టేపాళెం గ్రామంలో పంచాయితీ ఆఫీసు దగ్గర మా స్వగృహం నందు జరుగును. కావున తెలియజేయడమైనది.

సందర్భమేదైనా ఈనాడు ను చేసుకోండి వేదిక
మీ బంధుమిత్రులు, కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషులకు ఈనాడులో ప్రకటనల ద్వారా తెలియజేయండి
లీగల్ ప్రకటనలు
ఈనాడు క్లాసిఫైడ్స్
వేడుక ఏదైనా.. ఈనాడు ను చేసుకోండి వేదిక
జన్మదిన శుభాకాంక్షలు
పదవీ విరమణ శుభాకాంక్షలు
అంత్యక్రియలు, వర్ధంతి, జయంతి
ఈనాడు యాడ్స్ ద్వారా తెలియజేయండి
జి.ఎస్.టి. 5% అదనం
ప్రకటనల కొరకు సంప్రదించండి: 800 800 1790

(c) eenadu

చివరి మజిలీ.. కన్నీటి కడలి

చావులోనూ కష్టాలు తప్పడం లేదు. మండలంలోని కృష్ణారెడ్డిపాలెం పంచాయతీ నడిమిమాదిగపాలెంలో మృతదేహాన్ని శ్మశానవాటికకు తీసుకెళ్లేందుకు నానా ఇబ్బందులు పడ్డారు. గ్రామానికి చెందిన గంగపట్ల కొండమ్మ (45) మృతి చెందగా.. మంగళవారం అంత్యక్రియలకు తీసుకెళ్లడం సాహసంగా మారింది. శ్మశానవాటికకు గ్రామానికి మధ్యలో వాగు అడ్డుగా ఉంది. ఇందులో నీరు ఉండడంతో దాటేందుకు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. - న్యూస్‌టుడే, కలిగిరి

ట్యాంకుకు పగుళ్లు.. తప్పని ఇక్కట్లు

బుచ్చిరెడ్డిపాలెం మండలం దామరమడుగులోని జడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో గత వైకాపా ప్రభుత్వంలో మంచినీటి సరఫరా ట్యాంకును నిర్మించారు. పనుల్లో నాణ్యత లోపించి నీరు లీకవుతూ. ఆవరణం అంతా బురదమయమవుతోంది. ప్రమాదకర స్థితిలో ఉన్న ట్యాంకు వద్దే విద్యార్థులకు మధ్యాహ్న భోజనం వండి వడ్డిస్తున్నారు. ప్రమాదం జరగక ముందే అధికారులు చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. - ఈనాడు, నెల్లూరు

హెచ్చరిక.. ఆచరించక

నెల్లూరు నగరం నుంచి దూర ప్రాంతాలకు వెళ్లే ప్రైవేట్ వాహనాలు ఆర్టీసీ బస్టాండు వద్ద రోడ్డుకు ఇరువైపులా బారులుదీరుతున్నాయి. చెన్నై, బెంగళూరు వెళ్లడానికి ఆర్టీసీ బస్సుల కోసం వేచి చూసే ప్రయాణికులను ప్రైవేటు బస్సుల సిబ్బంది పిలిచి తీసుకెళ్తున్నారు. బస్టాండ్ ఎదుట దూర ప్రాంత ప్రైవేట్ బస్సులు నిలపొద్దని అధికారులు హెచ్చరికలు జారీచేసినా పట్టించుకోవడం లేదు. - ఈనాడు, నెల్లూరు

నిర్వీర్యం చేయక.. నిర్లక్ష్యానికి ప్రతీక

ఈ చిత్రం.. బుచ్చిరెడ్డిపాలెం మండలం దామరమడుగు పంచాయతీ పరిధిలోని రామచంద్రారెడ్డి నగర్ శివారు ప్రాంతంలోనిది. వ్యాధిగ్రస్థులకు వాడిన సిరంజీలు రోడ్డు పక్కనే కుప్పలుగా పారబోశారు. ప్రత్యేక పద్ధతిలో నిర్వీర్యం చేయాల్సి ఉన్నా.. మండలంలోని ప్రైవేటు డాక్టర్లు, ఆర్ఎంపీలు చికిత్స కోసం ఉపయోగించిన సూదులను రోడ్డు పక్కనే ఇలా పారబోశారు. అధికారులు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. -ఈనాడు, నెల్లూరు

లక్ష్యం.. సత్ఫలితం

మెయిన్స్‌లో సింహపురి విద్యార్థుల ప్రతిభ

పట్టుదల, లక్ష్యంతో సాగితే కల తీరం చేరుకుంటారు. అదే నిజం చేశారు సింహపురి విద్యార్థులు. జాతీయ స్థాయిలో నిర్వహించిన జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో విద్యార్థులు ఉత్తమ పర్సంటైల్ సాధించి భళా అనిపించుకున్నారు. - న్యూస్‌టుడే, నెల్లూరు (విద్య), ఇందుకూరుపేట

విద్యార్థి పేరు · పర్సంటైల్ · ఊరు · తల్లిదండ్రులు · కుటుంబ నేపథ్యం · లక్ష్యం

మద్రాసు ఐఐటీలో సీటు

సీహెచ్ అనిరుధ్ వర్ధన్‌రెడ్డి · 99.58 · నెల్లూరు · చిన్నారెడ్డి - కవిత · తండ్రి వ్యాపారవేత్త · మద్రాసు ఐఐటీలో సీటు సాధించడం

పేరున్న ఐఐటీలో చేరుతా

కె.జోయల్ సుభాష్ · 99.23 · నెల్లూరు కావలిగనగర్ · సుబ్బు - సుజన · తండ్రి రైల్వే ఉద్యోగి · మంచి ఐఐటీలో సీటు సాధించడం

అడ్వాన్స్‌డ్‌లో ఉత్తమ ర్యాంకు సాధన

కె.వెంకట జితేష్ · 99.055 · నెల్లూరు హరనాథపురం · రమేష్ - లత · తండ్రి వ్యాపారం · అడ్వాన్స్‌డ్‌లో మంచి ర్యాంకు సాధించడం

తండ్రి స్ఫూర్తి

చిరిగి యశ్వంత్ · 99.64 · ముదివర్తిపాలెం, ఇందుకూరుపేట · రాజారావు - గీతారాణి · తండ్రి సాఫ్ట్‌వేర్ ఉద్యోగం · ముంబయి ఐఐటీలో సీటు

కెరటాలతో ఆట.. మృత్యుబాట

న్యూస్‌టుడే, నెల్లూరు (వేదాయపాలెం), చిత్రగుంట

- గతేడాది నవంబరు 2న నగరానికి చెందిన ముగ్గురు స్నేహితులు మైపాడు బీచ్‌కు వెళ్లి సరదాగా గడుపుతూ ప్రమాదవశాత్తు మునిగి మృతి చెందారు. మూడు కుటుంబాల్లో విషాదం నింపింది.
- జనవరి నెల 16న సముద్ర స్నానానికి వెళ్లిన నలుగురు మృత్యువాత పడ్డారు. ఈ ఘటన అల్లూరు ఇస్కపల్లిపాలెం సముద్రతీరంలో జరిగింది. ఆరోజే సముద్ర స్నానం కోసం బోగోలు మండలం తాటిచెట్లపాలెం వద్ద సముద్ర స్నానం కోసం వెళ్లిన యోగా గురువు అలల్లో చిక్కుకుపోయి మృతి చెందారు.
- తాజాగా బోగోలు మండలం తాటిచెట్లపాలెం వద్ద సరదాగా సముద్రంలో ఈతకు వెళ్లిన ఇద్దరు మృత్యువాత పడగా.. మరొకరు గల్లంతయ్యారు.

సువిశాల సముద్ర తీరం.. జిల్లా సొంతం. కొందరు అత్యుత్సాహంతో సముద్రంలో ఈత కొడుతుంటారు. మరికొందరు సముద్ర స్నానాలు ఆచరిస్తుంటారు. ముఖ్యంగా యువత సెలవు దినాల్లో బీచ్‌ల్లో ప్రాధాన్యం ఇస్తుంటారు. వారాంతం రోజుల్లో జిల్లాలోని తీర ప్రాంతాలు రద్దీగా ఉంటాయి. రాకాసి అలలు పొంచి ఉంటాయని గ్రహించరు. ఊపిరాడక విగత జీవుల్లా మారుతున్నారు. జిల్లాలోని తీర ప్రాంతాల్లో తరచూ ఇలాంటి ఘటనలు చోటు చేసుకుంటున్నాయి.

సం||	మృతులు
2021	12
2022	19
2023	16
2024	21
2025	23

107 కి.మీ. పరిధి.. జిల్లాను ఆనుకొని 107 కి.మీ. సముద్ర తీర ప్రాంతం ఉంది. దీని వెంబడి 31 ప్రాంతాల్లో పర్యాటకులు వెళ్తుంటారు. ముఖ్యంగా మైపాడు, ఎర్రన్నదిబ్బ, ఊటుకూరు, రామచంద్రాపురం, కొత్తూరు, పాతపాలెం, లక్ష్మీపురం, ఒట్టూరు, కర్లపాలెం, టెంకాయచెట్లపాలెం, ఇస్కపల్లి, కొత్త కోడూరు ప్రాంతాల్లో పర్యాటకుల తాకిడి ఎక్కువగా ఉంటుంది. కొన్ని ప్రదేశాల్లో అలలు తీరానికి వేగంగా దూసుకొచ్చి అంతే వేగంగా వెనక్కి వెళ్తుంటాయి. ఇలాంటి రెండు అలల మధ్య ఉండే నీటినే 'రిప్ కరెంట్' అంటారు. ఈ జలాలు చూడటానికి నిశ్చలంగా అనిపిస్తాయి. అందుకే వీటి బారిన పడి ఏటా పదుల సంఖ్యలో ప్రాణాలు విడుస్తున్నారు.

జాగ్రత్తలు పాటిస్తే.. తీర ప్రాంతాల్లో క్షేమం

మెరైన్ పోలీసుల సూచనలు..

ఎక్కువ దూరం సముద్రంలోకి పోకుండా, అలలకు ఎదురు వెళ్లకుండా జాగ్రత్త వహించాలి. నీరు బలంగా లాగుతున్న (రిప్ కరెంట్) ప్రదేశం నుంచి బయటకు వచ్చాక, తిరిగి అలల సాయంతో ఒడ్డువైపు ఈదాలి. రిప్ కరెంట్ ఉన్న చోట అలలు పెద్దగా కనిపించవు. సముద్రం నుంచి నేరుగా బయటకు పోవడానికి నష్టపడి నీటి గీతలా కనిపిస్తుంది. ఎవరైనా రిప్ కరెంట్‌లో చిక్కుకుంటే అది 30-100 మీటర్ల మేర సముద్రంలోకి బలంగా లాక్కెళ్తుంది. ఆ సమయంలో భయాందోళనకు గురికావద్దు. నేరుగా తీరానికి ఈత కొట్టకూడదు. అలా చేస్తే బలహీనమవుతారు. అలలకు సమాంతరంగా కుడి, ఎడమ, ఏదో ఒక వైపునకు ఈదడం ద్వారా బయట పడొచ్చు.

మాట్లాడుతున్న కలెక్టర్ హిమాన్షు శుక్లా

ఉద్యానవన నర్సరీల ఏర్పాటుకు ప్రతిపాదనలు

నెల్లూరు(టౌన్): జిల్లాలో ఉద్యానవన నర్సరీలు ఏర్పాటు చేసేందుకు పెన్నా, సంగం బ్యారేజీల పరిసర ప్రాంతాల్లో గానీ, అవకాశం ఉన్న ప్రదేశాల్లోగానీ ఆయిల్ పామ్ తో పాటు బీజు ప్రాతిపదికన అవకాశం ప్రతిపాదనలు సిద్ధం చేయాలని కలెక్టర్ హిమాన్షు శుక్లా అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో ఉద్యాన శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండల ఉద్యానశాఖ అధికారులు ఆయా మండలాల్లో ప్రత్యేక లక్ష్యంతో పని చేయాలన్నారు. కలువాయి, సైదాపురం, దుత్తలూరు మండలాల్లో ఉన్న కోల్డ్ స్టోరేజీలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఉద్యానశాఖ అధికారులు శాస్త్రీయ దృక్పథం నుంచి బయటకు వచ్చి వినూత్నంగా ఆలోచించి మెరుగైన ఫలితాలు సాధించాలని తెలిపారు. తొలుత ఉద్యానశాఖ అధికారి రమణారెడ్డి ఆ శాఖ అమలు చేస్తున్న పనుల పురోగతిపై పవర్ పాయింట్ ప్రజంటేషన్ చేశారు. సమావేశంలో డీఆర్‌డీఏ పీడీ నాగరాజకుమారి పాల్గొన్నారు.

ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి 24 నుంచి పరీక్షలు

నెల్లూరు(విద్య): నగరంలోని కస్తూర్బాదేవి బాలికల ఉన్నత పాఠశాలలో ఎయిడెడ్ ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి ఈ నెల 24, 25, 26 తేదీల్లో పరీక్షలు జరుగుతాయని డీఈవో ఆర్.బాలాజీరావు ప్రకటనలో పేర్కొన్నారు. 24న ఎస్‌ఏ ఫిజికల్ సైన్స్ అభ్యర్థులకు ఉదయం 9 నుంచి 10.30 వరకు పాలిటెక్నిక్ ఐటీ సొల్యూషన్స్‌లో, ఎస్‌ఏ బీఎస్ అభ్యర్థులకు 25న తేదీ ఉదయం 9 నుంచి 10.30 గంటలకు, మధ్యాహ్నం 12 నుంచి 1.30 వరకు అదే కేంద్రంలో జరుగుతాయని, 26న తేదీ ఎస్‌ఏ మ్యాథ్స్ అభ్యర్థులకు మధ్యాహ్నం 3 నుంచి 4.30 వరకు ఐటీ సొల్యూషన్స్ అక్కడే ఉన్న ఐయాన్ డిజిటల్ కేంద్రంలో, ఎస్జీటీ అభ్యర్థులకు మధ్యాహ్నం 12 నుంచి 1.30 వరకు ఐయాన్ డిజిటల్ కేంద్రంలో జరుగుతాయని తెలిపారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు వారికి కేటాయించిన తేదీల్లో, ఆయా కేంద్రాలకు ముందుగానే చేరుకోవాలన్నారు. హాల్‌టికెట్లు ఆన్‌లైన్‌లో డౌన్‌లోడ్ చేసుకోవాలని, వివరాలకు డీఈవో కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

అభివృద్ధి పనులు వేగవంతం చేయండి

విడవలూరు కొడవలూరు, న్యూస్‌టుడే: కోవూరు నియోజకవర్గ పరిధిలోని అభివృద్ధి పనులతో పాటు అపరిష్కృతంగా ఉన్న సమస్యలను సత్వరం పరిష్కరించాలని సీఎం చంద్రబాబును ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి దంపతులు విన్నవించారు. మంగళవారం అమరావతిలోని సీఎం కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. కనిగిరి రిజర్వాయర్ ఆధునికీకరణ పనులు చేపట్టాలని, ముదివర్తి-ముదివర్తిపాలెం మధ్య పెన్నానదిపై కాజ్‌వే నిర్మాణ పనులు వేగవంతం చేయాలని కోరారు. గంగపట్నం, పల్లిపాలెం ఉప్పుటేరు వంతెన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని విన్నవించారు. బుచ్చిలో అగ్ని మాపక కేంద్రానికి అదనపు సిబ్బందిని నియమించాలని, సీఎం సహాయ నిధికి సంబంధించి పేదల వైద్య సదుపాయాలకు సంబంధించిన పెండింగ్ ఫైళ్లను త్వరగా పరిష్కరించేలా అధికారులకు ఆదేశాలివ్వాలని కోరారు. సానుకూలంగా స్పందించిన సీఎం చంద్రబాబు సంబంధిత అధికారులతో చర్చించి సమస్యలు పరిష్కరిస్తామని తెలిపారు. వారివెంట ఇన్‌ఛార్జి మేయర్ రూప్ కుమార్ యాదవ్ తదితరులు ఉన్నారు.



సీఎం చంద్రబాబు నాయుడుతో వేమిరెడ్డి దంపతులు

నులిపురుగులతో ఆరోగ్య సమస్యలు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), న్యూస్‌టుడే: నులిపురుగుల వల్ల రక్తహీనత, పోషకాల లోపం, ఆకలి మందగించడం ఇలా ఎన్నో ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయని కలెక్టర్ హిమాన్షు శుక్లా పేర్కొన్నారు. జాతీయ నులిపురుగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని నగరంలోని ఈఎస్ఆర్ఎం హైస్కూల్లో విద్యార్థులకు అల్బెండజోల్ మాత్రలను అందించే కార్యక్రమం మంగళవారం ప్రారంభించగా కలెక్టర్ పాల్గొన్నారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో సుజాత, ప్రోగ్రాం కోఆర్డినేటర్ యశంత్, డెమో కనకరత్నం తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ ఎంపికలు 21నుంచి

నెల్లూరు(వేదాయపాలెం): నెల్లూరు ఏసీ స్టేడియంలో ఈనెల 21న ఉదయం 8 గంటలకు అండర్-19, 22న అండర్- 23 ఎంపికలు నిర్వహిస్తున్నట్లు జిల్లా క్రికెట్ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు రాజశేఖర్ రెడ్డి, శ్రీనివాసులు ప్రకటనలో తెలిపారు.

SBI స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
ఎమ్ఎస్ఎమ్ఇ బ్రాంచ్, నెల్లూరు, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా

ఇ-వేలం ద్వారా వాహనము అమ్మకం (హైపోథికేషన్)

ఋణగ్రహీత పేరు : శ్రీ దువ్వూరు కృష్ణ తేజ రెడ్డి, తండ్రి : డి. రనిల్ కుమార్ రెడ్డి, ఏపూరు, మిట్టపాలెం, ముతుకూరు, నెల్లూరు - 524323.

రిజిస్ట్రేషన్ నెం.	కంపెనీ / ఫ్యూయల్	మోడల్ / కి.మీ.	కనీసపు ధర	ధరావత్తు
AP 39 VD 1155	MAHINDRA & MAHINDRA LTD BLAZO48 HL BS6 P 67 CB ER/ DIESEL	2023 / 84240 km	రూ. 24,60,000/-	రూ. 2,46,000/-
AP 39 VC 4656	MAHINDRA & MAHINDRA LTD BLAZO48 HL BS6 P 67 CB ER/ DIESEL	2023 / 77841 km	రూ. 24,60,000/-	రూ. 2,46,000/-
AP 39 VD 6888	MAHINDRA & MAHINDRA LTD BLAZO48 HL BS6 P 67 CB ER/ DIESEL	2023 / 73061 km	రూ. 24,60,000/-	రూ. 2,46,000/-
AP 39 VC 4647	MAHINDRA & MAHINDRA LTD BLAZO48 HL BS6 P 67 CB ER/ DIESEL	2023 / 90634 km	రూ. 24,60,000/-	రూ. 2,46,000/-

ఇ-వేలం తేది మరియు సమయం : 27-02-2026 ఉ|| 11.00 గం||ల నుండి సా|| 4.00 గం||ల వరకు
బిడ్స్ సమర్పించుటకు ఆఖరు తేది మరియు సమయం : 27-02-2026, మ|| 12.00 గం||ల లోపు
బిడ్ పెంపుదల : బిడ్డర్స్ వారి ఆఫర్ ధరలను రూ.5,000/-లతో గుణింపులో హెచ్చించవలెను.

నియమ నిబంధనలు : 1) వాహనమును "ఎక్కడ ఎలా వున్నది అక్కడ " మరియు " అక్కడ ఏమున్నదో అదే " అను పద్ధతిలో వేలం వేయబడును మరియు రిజర్వు ధరకన్నా తక్కువ ధరకు వాహనములు అమ్మబడదు. 2) విజయవంతమైన పాటదారుడు అంగీకరించిన అమ్మకపు ధరలో కనీసం (10+15) 25% తక్షణమే చెల్లించవలెను. మిగిలిన సొమ్మును 15 రోజులలోపు చెల్లించని పక్షంలో ఎటువంటి నోటీసు లేకుండా అప్పటి వరకు చెల్లించిన మొత్తమును కోల్పోవుదురు. 3) ఎటువంటి కారణం చూపకుండానే వేలం వాయిదా వేయుటకు, రద్దు చేయుటకు బ్యాంకు వారికి అధికారం కలదు. 4) వాహనమును సోమవారం నుండి శనివారం వరకు బ్యాంక్ పనివేళలలో తనిఖీ చేసుకోగలరు. 5) అమ్మకం యొక్క సవివరమైన నియమ నిబంధనల కొరకు, వెబ్ పోర్టల్ https://baanknet.com/eauction-psb/bidder-registration మరియు టోల్ ఫ్రీ నెం: + 91- 8291220220, మెయిల్ ఐడి : support.Baanknet@psballiance.com మరియు ఏదేని వాహనముల విచారణకు చీఫ్ మేనేజర్ : ఫోన్ నెం. 9949865463 (లేదా) మా యొక్క రికవరీ ఏజెన్సీ, మొబైల్ నెం : 93978 67899 వారిని సంప్రదించవచ్చును.

తేది : 17-02-2026, ప్రదేశం : నెల్లూరు సం/- అధీకృత అధికారి, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

విచారించి పరిహారం చెల్లిస్తాం

మనుబోలు: పొలం కోల్పోయి నష్టపోయిన రైతుకు పరిహారం ఇప్పించేలా చూస్తామని జేసీ మొగిలి వెంకటేశ్వర్లు అన్నారు. కాగితాలపూరులోని చెరువును మంగళవారం అధికారులతో కలిసి పరిశీలించారు. గ్రామానికి చెందిన అడపాల గోపాల్‌రెడ్డి అనే రైతుకు చెందిన 1.87 ఎకరాల పొలంలో 1996లో పంట కాలువ తవ్వించారు. అప్పటి నుంచి నష్ట పరిహారం చెల్లించలేదు. ఇటీవల జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో జేసీ క్షేత్రస్థాయిలో పరిశీలించారు.

సమాచార స్రవంతి

బంగారం ధరలు

గ్రాముధర:	రూ. 14,542
(3 శాతం జీఎస్టీ కలిసిన ధర)	
సవర ధర:	రూ. 1,16,336
వెండి గ్రాము :	రూ. 252.60

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్	122
లేయర్	90
బ్రాయిలర్స్	220
బ్రాయిలర్ స్కిన్‌లెస్	246
లేయర్ మాంసం	153

పుల్లలే హద్దులు.. అక్రమార్కుల ఎత్తులు

న్యూస్‌టుడే, కావలి

ప్లాట్లకు నాటిన పుల్లలు

- ఇది కావలి పట్టణ శివారులో జాతీయ రహదారికి ఆనుకొని ఉన్న ఆముదాలదిన్నెలోని ఓ స్థిరాస్థి క్షేత్రం. దీనికి నుడా అనుమతులు లేవు. భూ వినియోగ మార్పిడీ చేయలేదు. అయినా ప్లాట్లు విక్రయిస్తున్నారు.
- నియోజకవర్గంలో అనుమతులు లేకుండా ఎక్కడ లేఅవుట్ వేసినా హద్దు రాళ్లు తొలగిస్తానని ఎమ్మెల్యే కృష్ణారెడ్డి హెచ్చరించారు. అయినా అక్రమ స్థిరాస్తి క్షేత్రాలు వెలుస్తున్నాయి.

స్థిరాస్తి వ్యాపారుల అక్రమాలు ఎత్తుకు పైఎత్తుగా సాగుతున్నాయి. రెండు రోజులుగా ఎక్కడా హద్దు రాళ్లు లేకుండా పుల్లల్ని పాతి కొనుగోలుదారులను ఆకర్షిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం అయిదునెలలుగా కన్వర్షన్ (భూ వినియోగ మార్పిడి)ని నిలిపివేయడం తెలిసిందే. అయినా, కావలి పరిసరాల్లో యథేచ్ఛగా పంట పొలాలు ప్లాట్లుగా మారిపోతున్నాయి. పొలాలు కనీసం అయిదారుఅడుగుల వరకు చదును చేస్తేగాని ప్లాట్లుగా కనిపించవు. ఇందుకు గ్రావెల్‌ను కూడా అక్రమంగా తీసుకొచ్చి నింపుతున్నారు. ఆముదాలదిన్నె గ్రామ రెవెన్యూలోని 1582 సర్వేనంబరులో జలవనరుల శాఖ భూమి, 1888 తదితర సర్వే నంబర్లలో పంటకాలువల భూముల్ని ఈ స్థిరాస్తి వ్యాపారులు ఆక్రమించారు. ఇప్పటికే ఈ గ్రామ సమీపంలోని కొండేపి వాగు వద్ద జరిగిన ఆక్రమణలతో ఇరువైపులా పంట పొలాలు ఏటా మునకకు గురవుతున్నాయి. ప్రస్తుతం కన్వర్షన్ చేయడం లేదని తహసీల్దార్ శ్రావణ్‌కుమార్ స్పష్టంచేశారు. ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురికాకుండా చర్యలు తీసుకుంటామని వివరించారు.

వెట్టి చాకిరి నిర్మూలనకు చర్యలు

నెల్లూరు(టౌన్), న్యూస్‌టుడే: జిల్లాలో వెట్టి చాకిరి నిర్మూలనకు జిల్లా స్థాయి విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ ఏర్పాటు చేసి ప్రతి మూడు నెలలకు ఒకసారి సమావేశాలు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ హిమాన్షు శుక్లా తెలిపారు. మంగళవారం కలెక్టరేట్‌లో వెట్టి చాకిరి నిర్మూలనకు సంబంధించిన గోడప్రతులను ఆవిష్కరించారు. ఎవరైనా బాల, ఇతర కార్మికులను వెట్టి చాకిరికి గురిచేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఆర్డీ సంస్థ డైరెక్టర్ షేక్ బషీర్, కార్మికశాఖ ఉప కమిషనర్ విజయకుమార్‌రెడ్డి, డీవీఎంసీ సభ్యులు పోలయ్య, సత్యవతమ్మ, శ్వేత, సుదర్శన్ పాల్గొన్నారు.

పంట పొలాల్లో ఓఎన్జీసీ తవ్వకాలు

దెబ్బతిన్న వరి.. నష్టపోయిన రైతులు

దగదర్తి, న్యూస్‌టుడే: మండలంలోని దుండిగంలో ఓఎన్జీసీ చేపట్టిన తవ్వకాలతో రైతులు నష్టపోయారు. కోత దశలో ఉన్న వరి దెబ్బతింది. సమాచారం ఇవ్వకుండా తవ్వకాలు చేపట్టారని కర్షకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. భూమి లోపల ఉండే సహజ వాయువు, ఖనిజాలను కనుగొనేందుకు ఓఎన్జీసీ సిబ్బంది వివిధ ప్రాంతాల్లో సర్వే చేస్తున్నారు. అందుకు పొలాలు, అడవులు, ఎడారుల్లో కూడా శోధన చేస్తున్నారు. ముందుగా భూమిలోకి సిగ్నల్ పంపి నిక్షేపాలున్నాయో లేవో చూసి అవసరమైతే లోతుగా బోరు వేసి పరిశీలిస్తున్నారు. ఇందుకు భూముల రైతులకు ముందుగా లిఖితపూర్వకంగా నోటీసులు ఇవ్వాలి. ఉపయోగానికి ఒప్పందం చేసుకోవాలి. పంట నష్టం జరిగితే పరిహారం చెల్లించాలి. ఇవేమీ చేయకుండా తవ్వకాలు చేయడంతో రైతులు పంట కోల్పోయారు. ఈ విషయమై తహసీల్దార్ లాజరస్‌ను వివరణ కోరగా వరి పొలాల్లో తవ్వకాలకు అనుమతి ఇవ్వలేదని స్పష్టంచేశారు.

తవ్వకాలతో ధ్వంసమైన వరి పంట

అధికారిపై రహస్య విచారణ

అనంతసాగరం : తహసీల్దార్ కార్యాలయంలోని ఓ అధికారిని మంగళవారం ఇద్దరు ఉన్నతాధికారులు ఎంపీడీవో కార్యాలయంలో రహస్యంగా విచారించారు. విశ్వసనీయ సమాచారం మేరకు తహసీల్దార్ కార్యాలయానికి చెందిన అధికారి అసభ్యంగా ప్రవర్తించారని ఓ మహిళా ఉద్యోగి ఆత్మకూరు ఆర్డీవో కార్యాలయంలో ఫిర్యాదు చేయగా.. కలెక్టర్‌కు తెలియజేయడంతో విచారణకు అధికారులను పంపించారు. ఈ మేరకు ఎంపీడీవో కార్యాలయంలో తహసీల్దార్ కార్యాలయం సిబ్బందిని విచారించారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న అధికారి తీరును తెలుసుకున్నారు. అనంతరం లిఖిత పూర్వకంగా వివరాలు సేకరించారు.

ఆగ్రహం వ్యక్తం చేస్తున్న రైతులు

భూసేకరణ గ్రామసభలో ఉద్రిక్తత

దగదర్తి: మండలంలోని దామవరంలో జరిగిన భూసేకరణ గ్రామసభలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. విమానాశ్రయం కోసం భూసేకరణపై మంగళవారం కావలి ఆర్డీవో వంశీకృష్ణ ఆధ్వర్యంలో గ్రామసభ జరిగింది. అధికారులు రూపొందించిన జాబితా తప్పుల తడకగా ఉందని గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేశారు. శాశ్వత లీజుదారుల పేర్లు చాలా వరకూ లేవని మండిపడ్డారు. భూముల విస్తీర్ణంలోనూ తేడాలున్నాయని ఆరోపించారు. దీంతో ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. పోలీసులు నచ్చజెప్పినా వినలేదు. ఆర్డీవో జోక్యం చేసుకుని భూసేకరణలో నిజమైన లబ్ధిదారులను గుర్తించి పరిహారం అందజేస్తామని హామీ ఇచ్చారు. సమగ్రంగా విచారించి అర్హులకు న్యాయం చేస్తానని హామీ ఇవ్వడంతో వారు శాంతించారు. 104 ఎకరాల లబ్ధిదారులపై విచారణ చేపట్టారు. తహసీల్దార్ లాజరస్, డిప్యూటీ తహసీల్దార్ భాగ్యలక్ష్మి, ఆర్ఐ ప్రియాంక, సీనియర్ అసిస్టెంట్ శివ, వీఆర్వో వేణుగోపాల్, రైతులు పాల్గొన్నారు.

SHRIRAM Finance శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్
రిజిస్టర్డ్ ఆఫీస్: శ్రీ టవర్స్, ప్లాట్ నెం.14ఎ, సౌత్ ఫేజ్, ఇండస్ట్రియల్ ఎస్టేట్, గిండి, చెన్నై- 600032.వెబ్‌సైట్: www.shriramfinance.in/auction
జోనల్ కార్యాలయం : డి.నెం.9/113, మిద్దెపైన, పార్కు వీధి, సూళ్లూరుపేట మండలం, నెల్లూరు జిల్లా మరియు శాఖ కార్యాలయం, సూళ్లూరుపేట

కటకం శ్రీనివాసులు గారికి చెందిన స్థిరాస్తులు అమ్మకము కొరకు ఈ-వేలం ప్రకటన

సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్)రూల్స్, 2002, 9(1) & 8(6)తో చదువబడే క్రింద స్థిరాస్తుల ఈ-వేలం అమ్మకం ప్రకటన

సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్‌అసెట్స్ మరియు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్ 2002 యొక్క రూల్ 9(1)తో చదువబడే సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2022 ప్రకారం తేది: 09.05.2025 న జారీ చేసిన ఉద్దేశిత అమ్మకం ప్రకటన జారీ చేసిన గడువు ముగిసిన అనంతరం జారీ చేస్తున్న స్థిరాస్తుల అమ్మకం ఈవేలం నోటీసు. దిగువ తెలిపిన వారందరూ సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 - చట్టంలోని 54/2002 క్రింద 8(6)తో చదువబడే సెక్షన్ 13(8) క్రింద ఉద్దేశించిన మీ యొక్క విమోచన హక్కును వినియోగించుకోవడంలో విఫలమైనందున ఈ ఈ-వేలం అమ్మకం నోటీసు జారీ చేయబడినది. ఈ నోటీసు రుణగ్రహీతలకు/ గ్యారంటార్లకు / తనఖాదారులకు / సహ-రుణగ్రహీతలకు/ కో-అప్లికెంట్లకు తెలియజేయడమైనది.

ఇందుమూలముగా యావన్మంది ప్రజానీకానికి మరియు ముఖ్యంగా రుణగ్రహీత(లు) మరియు గ్యారంటారు (లు)లకు తెలియజేయడమేమనగా దిగువ తెలిపిన రుణగ్రహీతలు / గ్యారంటార్లకు చెందిన ఆస్తులను సెక్యూర్డ్ క్రెడిటార్‌కు తనఖా / ఛార్జిలో వుంచి పొందిన బకాయి మొత్తము తేది: 03.09.2022 నాటికి రూ.29,39,815/- లను + తేది:03.09.2022నాటి నుండి వడ్డీ మరియు ఇతర ఖర్చులను రాబట్టుకునేందుకు సర్ఫేసి చట్టంలోని సెక్షన్ 13(2) క్రింద డిమాండ్ నోటీసు తేది: 03.09.2022 న జారీ చేసి శ్రీరామ్‌ఫైనాన్స్ లిమిటెడ్ యొక్క సెక్యూర్డ్ క్రెడిటార్ వారిచే స్వాధీనం చేసుకున్న ఆస్తులను "ఎక్కడ ఎలా వున్నదో అక్కడ" "అక్కడ ఎలా ఉన్నదో" అలానే మరియు "అక్కడ ఏమి ఉన్నదో" అనే పద్ధతిపై తేది: 24.03.2026 ఉదయం 11.గం||లకు నుండి మ.1.00 గం||ల మధ్య విక్రయించుటకు నిర్ణయించినారు.

అగ్రిమెంటు నెం.:SLRPTTF1904270005, రుణగ్రహీతలు/గ్యారంటార్ల యొక్క పేర్లు,చిరునామా:- 1)కటకం శ్రీనివాసులు, తండ్రి లేట్ రామయ్యశెట్టి, దర్గా వీధి, కసుమూరు గ్రామం, వెంకటాచలం మండలం, నెల్లూరు జిల్లా - 524320 (రుణగ్రహీత) 2) కటకం ప్రసన్నలక్ష్మి, భర్త కె.శ్రీనివాసులు దర్గా వీధి, కసుమూరు గ్రామం, వెంకటాచలం మండలం, నెల్లూరు జిల్లా - 524320 (గ్యారంటారు) 3)అల్లూరు రమణయ్య, తండ్రి ఎ.వెంకటసుబ్బయ్య, డి.నెం.16-12-218, హరనాథపురం, నాగసాయి మందిరం దగ్గర, దర్గామిట్ట, నెల్లూరు జిల్లా - 524003 (గ్యారంటారు)

స్థిరాస్తుల యొక్క వివరణ: (కటకం శ్రీనివాసులు పేరున వున్న ఆస్తి వివరములు):- ఐటంనెం.1:- నెల్లూరు రిజిస్ట్రేషన్ జిల్లా, బుజబుజ నెల్లూరు సబ్ జిల్లా, వెంకటాచలం మండలం, కసుమూరు మైనర్ పంచాయతీ, కసుమూరు గ్రామం, పట్టానెం.863, సర్వేనెం.156/2లో ఎ.0.35 సెంట్లు పట్టానెం.845 సర్వేనెం.156/3లో ఎ.0.30 1/2 సెంట్లు, పట్టానెం.863- సర్వేనెం.156/6లో ఎ.0.12 సెంట్లు, పట్టానెం. 845- సర్వేనెం.156/7 లో ఎ.0.29 సెంట్లు మొత్తం ఎ.1.60 1/2 సెంట్లు మరియు ఇందున ఎ.0.05 1/2 సెంట్లు లేదా 33 1/3 అంకణముల స్థలం మరియు ఇందున పడమర వైపు 16 అంకణముల 48 చ.అ. లేదా 111.483 చ.మీల స్థలం. హద్దులు: తూర్పు: పఠాన్ దిలావర్ వద్ద విక్రయదారులు కొనుగోలు చేసిన స్థలం, పడమర: సయ్యద్ బక్షు సాహెబ్ వద్ద విక్రయదారులు కొనుగోలు చేసిన స్థలం, ఉత్తరం: 12అ. వెడల్పు గల రోడ్డు, దక్షిణం: పంట కాలువ. ఈ హద్దుల మధ్య స్థలం యొక్క విస్తీర్ణం 16 అంకణముల 48 చ.అ.లు లేదా 111.483 చ.మీ. మాత్రమే రిజర్వు ధర: రూ.43,73,000/- ధరావత్తు-4,37,000/-

ఐటంనెం.2:- నెల్లూరు రిజిస్ట్రేషన్ జిల్లా, బుజబుజ నెల్లూరు సబ్ జిల్లా, వెంకటాచలం మండలం, కసుమూరు మైనర్ పంచాయతీ, కసుమూరు గ్రామం, పట్టానెం.863, సర్వేనెం.156/2లో ఎ.0.35 సెంట్లు పట్టానెం.845 సర్వేనెం.156/3లో ఎ.0.30 1/2 సెంట్లు, పట్టానెం.863- సర్వేనెం.156/6లో ఎ.0.12 సెంట్లు, పట్టానెం.845-సర్వేనెం.156/7 లో ఎ.0.29 సెంట్లు మొత్తం ఎ.1.60 1/2 సెంట్లు మరియు ఇందున ఎ.0.05 1/2 సెంట్లు లేదా 33 1/3 అంకణముల స్థలం మరియు ఇందున పడమర వైపు 16 అంకణముల 36 చ.అ. లేదా 110.368 చ.మీల స్థలం. హద్దులు: తూర్పు: మగ్బుం స్థలం,పడమర: భక్షు స్థలం, ఉత్తరం: 12.అ. వెడల్పు గల రోడ్డున దక్షిణం: పంట కాలువ. ఈ హద్దుల మధ్య స్థలం యొక్క విస్తీర్ణం 16 అంకణముల 36 చ.అ.లు లేదా 110.368 చ.మీ. మాత్రమే రిజర్వు ధర: రూ.43,75,000/- ధరావత్తు-4,37,500/- తాకట్టు రుణభారాలు: లేవు.

అగ్రిమెంటు నెంబరు	ఆస్తి యొక్క రిజర్వు ధర	ధరావత్తు	ధరావత్తు సమర్పణ విధానం	బిడ్ ఇంక్రిమెంటు మొత్తము	వేలం తేది	ధరావత్తు సమర్పణ తేది	ఆస్తుల తనిఖీ తేది
SLRPTTF 2102270002	ఐటం1: రూ.43,73,000/- ఐటం2: రూ.43,75,000/- మొత్తం షెడ్యూలు(1నుండి2) రిజర్వుధర రూ.87,48,000/- (ఎనభై ఏడు లక్షల నలభై ఎనిమిది వేల రూపాయలు మాత్రమే)	ఐటం1: రూ.4,37,300/- ఐటం2: రూ.4,37,500/- మొత్తం ధరావత్తు :రూ.8,74,800(ఎనిమిది లక్షల డెబ్బైనాలుగు వేల ఎనిమిది వందల రూపాయలు మాత్రమే)	శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ వారి పేరున డిమాండ్ డ్రాఫ్ట్ ద్వారా	ఒక్కొక్క ఐటం రూ.25,000/-	26.03.2026	25.03.2026	24.03.2026

ఆసక్తి గల బిడ్డర్లు లాగిన్ ఐడి & పాస్‌వర్డ్ ఏర్పాటు చేయడంలో, బిడ్ సమర్పణలో, ఈ బిడ్డింగ్ ప్రక్రియలో సహాయం కొరకు మెస్సర్స్ శ్రీరామ్ ఆటోమాల్ ఇండియా లిమిటెడ్, శ్రీ గౌరవ్ నంబూద్రి సెల్: 9833922941, ఈమెయిల్ <gaurav.n@samil.in> మరియు ఆస్తి సంబంధిత వివరాలకై అధీకృత అధికారి, శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, బి.శ్రీనివాసులుసెల్: +91 7013073475 సంప్రదించగలరు. అధీకృత అధికారి ఏ బిడ్డు అయినా లేక అన్ని బిడ్లను ఏ కారణము తెలుపకనే తిరస్కరించుటకు అధికారము కలిగి వున్నారు. ఆన్‌లైన్ వేలము టెండరు సమర్పణ/ బిడ్ ఫారం కొరకు/ టెండరు ఓపెన్ రియు వేలము కొరకు వెబ్‌సైట్ https://eauctions.Samil.in/home ను చూడగలరు.పూర్తి నియమ నిబంధనల కొరకు శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ వెబ్‌సైట్‌లో తెలుపబడిన లింకు https://www.shriramfinance.in/auction ను చూడగలరు. గమనిక : ఇందుమూలముగా తెలియజేయడమేమనగా "శ్రీరామ్ సిటీ యూనియన్ ఫైనాన్స్ లిమిటెడ్ " ఎన్‌సిఎల్‌టి చెన్నై వారి ఉత్తర్వు ప్రకారం "శ్రీరామ్ ట్రాన్స్‌పోర్ట్ ఫైనాన్స్ లిమిటెడ్"తో విలీనం కాబడింది. ఇటీవల "శ్రీరామ్ ఫైనాన్స్ ట్రాన్స్‌పోర్ట్ లిమిటెడ్" గా మార్పు చెందింది. ఇది తేది: 30.11.2022 నుంచి పేరు మార్పుకు సంబంధించిన సర్టిఫికెట్ ఇన్ కార్పొరేషన్ తేది: 30.11.2022 ద్వారా మార్పు చెందింది.

ప్రదేశము:సూళ్లూరుపేట తేది:14.02.2026 సం// అధీకృత అధికారి, శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్

EENADU Classifieds

REAL ESTATE

PLOT FOR SALE

కావలి టౌన్ రామమూర్తిపేట ట్రెండ్స్ షోరూం ప్రక్క వీధిలో MRO ఆఫీస్‌కి ఎదురుగా 220 అంకణముల స్థలం అమ్మకంనకు కలదు. ✆ 92987 52705.

JOBS

Wanted DRA Tele Callers, Field Executives & Team Leaders Banking Sector Attractive Salaries and Incentives, ✆ 9849394835, 7075345527.

Wanted Teachers for Reputed Schools in A.P & Telangana, Contact: Sneha Placements Service. Ph: 94402 46409.

త్రినేత్ర హోంకేర్‌లో వృద్ధులను / పేషెంట్స్‌ను /పిల్లలను చూసుకొనుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఫ్రీ వసతి, భోజనం. జీ: 18K. ✆ 85209 80099, 85208 74499

ప్రముఖ విద్యాసంస్థకు లేడీ కంప్యూటర్ ఆపరేటర్, టెలీకాలర్స్, కౌన్సిలర్స్ & ఫీల్డ్ అనుభవం కల్గిన PROలు కావలెను. ఆకర్షణీయమైన జీతం. ✆ 73827 44791

ప్రముఖ కంపెనీలో ప్యాకింగ్ మిషన్ వద్ద ప్యాకింగ్ చేయుటకు మహిళలు కావలెను. నారాయణరెడ్డిపేట (డేవిస్ పేట) నెల్లూరు. ✆ 91005 74129, 76759 74297

హరేకృష్ణ హోంకేర్‌లో వృద్ధులను/ పేషంట్స్/ పిల్లలను చూసుకొనుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఫ్రీవసతి, భోజనం జీ:18-20K ✆ 96404 68899, 96402 58899

రియల్ ఎస్టేట్ ఆఫీస్‌లో పనిచేయుటకు కొంత కంప్యూటర్ తెలిసిన స్త్రీలు పార్ట్‌టైమ్ ఒకరు, ఫుల్‌టైమ్ ఒకరు ఇద్దరు కావలెను. సంప్ర: 99665 05777

FACULTY/ TEACHERS

Ratnam High School, Lakshmipuram, Nellore. Wanted Teachers in all subjects for 6th, 7th, 8th, 9th Classes. for Details Plesae Contact: 77020 00050, 91825 81092

DRIVERS

హెవీ లైసెన్స్ కల్గిన డ్రైవర్లు కావలెను. నెల్లూరు టౌన్‌లో కంపెనీ నందు పని చేయుటకు సంప్రదించండి. 98488 85034

గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తా పత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

అధిక స్పందనలు పొందండి. వాహనాలు అమ్మకం, ఉద్యోగాల భర్తీ, ఇళ్లు, ప్లాట్లు, స్థలాలు అమ్మకాలు, కొనుగోళ్లు, ఇళ్లు, షాపులు, ప్లాట్లు అద్దెకు మరియు అన్ని రకాల బిజినెస్ వ్యవహారాలు... B/w 5 లైన్ల ప్రకటన రూ. 470/- మాత్రమే. వివరాలకు.. నెల్లూరు 80080 01790

మీ చిన్నారులకు పుట్టినరోజు శుభాకాంక్షలు ఈనాడు ద్వారా తెలపండి. B&W : రూ. 600 Colour : రూ. 800

ప్రకటనలపై 5% GST వర్తించును

(c) eenadu

కావలి

•కావలి •ఉదయగిరి •ఆత్మకూరు

మండలపల్లిలో చిన్నారులతో మాట్లాడుతున్న పీడీ హేమ సుజన

అంగన్‌వాడీ కేంద్రాల్లో తనిఖీ

అనంతసాగరం, న్యూస్‌టుడే: అంగన్‌వాడీ కేంద్రాలను మరింత మెరుగ్గా పర్యాలని, చిన్నారులు లేని కేంద్రాల్లో వారిని చేర్పించేందుకు చర్యలు తీసుకోవాలని ఐసీడీఎస్ పీడీ హేమసుజన అధికారులను ఆదేశించారు. మంగళవారం మండలంపల్లి, మినగల్లు గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు అందిస్తున్న పోషకాహారాన్ని తనిఖీ చేశారు. అనంతరం కేంద్రాల్లోని రికార్డులను పరిశీలించారు.

గురుకులంలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఉదయగిరి, న్యూస్‌టుడే : మండలంలోని గండిపాలెంలోని బాలుర గురుకుల పాఠశాలలో 5,6,7,8 తరగతుల్లో మిగిలిన ఖాళీల భర్తీకి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని పాఠశాల ప్రిన్సిపల్ అబ్దుల్ గఫూర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 18 నుంచి మార్చి 31వ తేదీ వరకు దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు. వివరాలకు 87126 25047, 89191 18986 నంబర్లలో సంప్రదించాలన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా!

(10 AM to 1 PM)

కావలి : 80080 51666, 91548 46698
ఉదయగిరి : 80085 73944 ఆత్మకూరు: 8008573949

? **సమస్య:** మా ప్రాంతంలో పైపులైన్ లీకుతో నీరు వృథా అవుతోంది. రోడ్డుపై ప్రవహిస్తుండటం ఇబ్బందిగా ఉంది. **- కమలేశ్‌బాబు, పాతూరు**

✓ **సమాధానం:** ఇప్పటికే ఒక లీకును పరిష్కరించాం. మరో దాన్ని కూడా బాగు చేస్తాం. **- సాయిరాం, డీఈఈ - కావలి, న్యూస్‌టుడే**

? కలిగిరి నుంచి సంగం మార్గంలో శ్రీకొలను బ్రాంచి కాలువ నుంచి వాగు వరకు రోడ్డుకు ఇరువైపులా స్థానికులు వ్యర్థాలు పారేస్తున్నారు. **- మాల్యాద్రి, స్థానికుడు**

✓ పరిశీలించి చర్యలు తీసుకుంటాం. **-రవిచంద్ర, డిప్యూటీ ఎంపీడీవో - న్యూస్‌టుడే, కలిగిరి**

? మా గ్రామంలో కాలువలు లేవు. దీంతో ఇళ్లలోని మురుగునీరు రోడ్లపైకి చేరుతోంది. దుర్గంధం వెదజల్లుతోంది. **-రమేష్, పెద్దిక్కేస్వరం**

✓ కాలువల నిర్మాణానికి ప్రతిపాదనలు పంపిస్తాం. నిధులొస్తే నిర్మిస్తాం. **-ప్రసన్నకుమారి, ఎంపీడీవో -న్యూస్‌టుడే, ఏఎస్‌పేట**

? కొత్త గిరిజన కాలనీలో తాగునీటి సరఫరా సరిగా లేదు. **- పిడు కొండలు, చెర్లోవంగల్లు**

✓ సరఫరాకు చర్యలు తీసుకుంటాం. **- షాలెట్, ఎంపీడీవో - సంగం, న్యూస్‌టుడే**

? అనంతసాగరం మండలం మినగల్లు గ్రామంలోని ఎస్సీ కాలనీలో మురుగు కాలువలను సకాలంలో శుభ్రం చేయడం లేదు. దీంతో దోమలు స్వైరవిహారం చేస్తుండటంతో కాలనీ వాసులు అనారోగ్యం పాలవుతున్నారు. **-సుధాకర్, గ్రామస్థుడు**

✓ సిబ్బందిని పంపి మురుగు కాలువలను శుభ్రం చేయిస్తాం. దోమల నియంత్రణ కోసం కాలనీలో ఫాగింగ్ తప్పకుండా చేయిస్తాం. **-రమణరావు, పంచాయతీ కార్యదర్శి**

వ్యక్తిత్వ వికాసంపై విద్యార్థులకు అవగాహన

ఉదయగిరి, న్యూస్‌టుడే : విద్యార్థి స్థాయి నుంచే మంచి వ్యక్తిత్వాన్ని అలవరచుకోవాలని డాక్టర్ కె.వేణుగోపాల్ సూచించారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంగళవారం దుద్యమ్ సీడ్స్ సంస్థ ఆధ్వర్యంలో వ్యక్తిత్వ వికాసంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసులు, జేవీవీ నాయకులు దస్తగిరి అహ్మద్, రామిరెడ్డి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

నీటి సమస్య తీర్చండి

కావలి, న్యూస్‌టుడే: నీటి కొరతతో ఇబ్బందులకు గురవుతున్నామని కస్తూర్బా గాంధీ విద్యాలయ బాలికలు వాపోయారు. సోమవారం డిప్యూటీ డీఈవో నరసింహారావు, డైట్ అధ్యాపకులు పద్మజ, మాధవీలత విద్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా బాలికలు మాట్లాడుతూ తమకు నీటి సమస్య తీవ్రంగా ఉందని తెలిపారు. బోరు వేయిస్తామన్న హామీ నెరవేరలేదన్నారు. సాంవత్సరిక పరీక్షలు సమీపిస్తున్న దృష్ట్యా ప్రతి విద్యార్థి ప్రణాళికాబద్ధంగా చదవాలని సూచించారు.

ఉచిత 2డి ఎకో పరీక్షలు

కావలి, న్యూస్‌టుడే: పట్టణంలోని రెడ్‌క్రాస్ కేంద్రంలో తలసేమియా బాధిత చిన్నారులకు 2డి ఎకో పరీక్షలు మంగళవారం ఉచితంగా నిర్వహించారు. గుంటూరుకు చెందిన గుండె వ్యాధుల నిపుణులు జ్యోతిప్రకాశ్‌రెడ్డి ఆధ్వర్యంలో ఈ సేవలందించారు. రెడ్‌క్రాస్ ప్రతినిధులు జిల్లా వాడ రవికుమార్, కలికి శ్రీహరిరెడ్డి, గొట్టిపాటి మనోహర్, శ్రీధర్, దాకారపు రవిప్రకాష్, హరినారపరెడ్డి, మార్కండేయులు, సీతారామయ్య, శ్రీనివాసకుమార్, పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే ప్రజారోగ్యం

కావలి, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి చంద్రబాబు పాలనలో ప్రజల ఆరోగ్య ప్రమాణాలు మెరుగవుతున్నాయని దళిత నాయకులు, తెదేపా పట్టణ ప్రధాన కార్యదర్శి జ్యోతి బాబూరావు అన్నారు. రూ.1.2 లక్షల సీఎం సహాయ నిధి చెక్కు, శెట్టిపల్లి కృష్ణ తేజకు అందజేశారు. ఎమ్మెల్యే డీవీ కృష్ణారెడ్డి చొరవతో సీఎం సహాయ నిధి మంజూరవుతుందన్నారు.

స్వర్ణ కార్యాలయం.. సిబ్బంది కనం

గ్రామస్థాయిలోనే ప్రభుత్వ సేవలు అందించేందుకు ఏర్పాటుచేసిన స్వర్ణ వార్డు, గ్రామ కార్యాలయాల్లో ప్రజలకు సేవలు అందడం లేదు. వీటిలో పనిచేసే వారు అందుబాటులో లేకపోవడంతో పనులపై వచ్చేవారు ఇబ్బందులు పడుతున్నారు. కొన్నిచోట్ల ఒకరిద్దరు మాత్రమే ఉంటున్నారు. మరికొన్నిచోట్ల ఖాళీగా కనిపిస్తున్నాయి. కావలి, ఉదయగిరి నియోజకవర్గాల్లో మంగళవారం 'న్యూస్‌టుడే' ప్రతినిధులు గ్రామాల్లో పరిశీలించగా ఈ విషయాలు తెలిశాయి. **-న్యూస్‌టుడే, వింజమూరు, దుత్తలూరు, కావలి, వరికుంటపాడు**

ఒకే ఒక్కరు

వింజమూరు రెండో వార్డు కార్యాలయంలో పది మందికి ఇంజినీరింగ్ అసిస్టెంట్ ముజీబ్ గౌడ్ ఒక్కరే ఉన్నారు. డిజిటల్ అసిస్టెంట్ రవీంద్ర డిప్యుటేషన్‌పై నెల్లూరు వెళ్లారు. పశుసంవర్ధక సహాయకుడు రాజశేఖర్ జబీవల మృతి చెందగా ఒకటో వార్డు వంశీ ఇన్‌ఛార్జిగా వ్యవహరిస్తున్నారు. కొందరు సర్వే పనుల కోసం వెళ్లినట్లు చెబుతున్నారు. డిజిటల్ సహాయకుడు డిప్యుటేషన్‌పై నెల్లూరు వెళ్లగా సంక్షేమ సహాయకుడు ఈ బాధ్యతలు చూస్తున్నారు. ఆయన కూడా లేకపోవడంతో ధ్రువపత్రాల కోసం వచ్చిన వారు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

విధులకు దూరం

వరికుంటపాడులో సర్వేయర్, వీఆర్వో కార్యాలయంలో లేరు. వారు రీసర్వే సభలకు వెళ్లారని కార్యాలయ సిబ్బంది తెలిపారు. ఇలా సర్వే పేరుతో సిబ్బంది లేకపోవడంతో ప్రజలు సేవలు పొందలేకపోతున్నారు. **అల్లూరు:** నగర పంచాయతీలోని రెండో స్వర్ణ వార్డులో 12 మంది ఉండాల్సి ఉండగా, ముగ్గురు మాత్రమే ఉన్నారు. వీరు సర్వేలు ఇతర పనుల కోసం బయటకు వెళ్లారు. దీంతో సచివాలయంలో సేవలు ప్రజలకు అందటం లేదు. మిగిలిన చోట్ల ఇదే పరిస్థితి ఉంది.

సర్వేలో ఉన్నారంట

దుత్తలూరు మండలంలోని వెంకంపేటలో 11 మందికి ఏడుగురు ఉన్నారు. వీరంతా ఏకీకృత కుటుంబ సర్వే కోసం గ్రామాలకు వెళ్లారు. దీంతో కార్యాలయం ఖాళీగా మారింది. వివిధ సమస్యలపై వచ్చిన వారు నిరాశగా వెనుదిరిగారు. ధ్రువీకరణ పత్రాలు తీసుకోవడానికి రైతులు, విద్యార్థులు రోజూ వచ్చి వెళుతున్నారు. రేషన్, ఆధార్ కార్డుల్లో మార్పులు కూడా కావడం లేదని గ్రామీణులు వాపోతున్నారు.

అందరూ బయట పనుల్లోనే..

పట్టణంలోని స్వర్ణ వార్డులు ఖాళీగా దర్శనమిస్తున్నాయి. వైకుంఠపురం, రైల్వే రోడ్డు, రాజా వీధిలో ఉన్న వాటిలో ఇద్దరు, ముగ్గురు మాత్రమే సిబ్బంది కనిపించారు. మహిళా పోలీసులు ఉన్నా పన్ను వసూళ్లు, ఎస్ఎంఎఫ్ ఏయు పాఠశాలల్లో విద్యార్థులకు నులిపురుగుల మాత్రలు అందించేందుకు వెళ్లినట్లు చెబుతున్నారు. మరికొందరు పురపాలకం తరఫున తడి, పొడి చెత్తబుట్టలను ఇంటింటా అందించేందుకు, కుటుంబ సర్వేలో ఉన్నట్లు అక్కడ ఉన్న సిబ్బంది తెలిపారు.

పగటి వెలుగులు పట్టవా..?

గ్రామంలోని పలు వీధుల్లో వీధిదీపాలు రాత్రింబవళ్లు తేడాలేకుండా వెలుగుతున్నాయి. ప్రధానంగా ఆసక్తల వీధి, షేపాబాద్, తిప్ప ప్రాంతాల్లోని లైట్లకు స్విచ్‌లు లేకపోవడంతో నిరంతరాయంగా వెలుగుతున్నాయి. అధికారులు స్పందించి స్విచ్‌లు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు. ఈ విషయమై పంచాయతీ కార్యదర్శి షరీఫ్‌ను సంప్రదించగా పరిశీలించి అవసరమైన చోట్ల స్విచ్‌లు ఏర్పాటు చేస్తామన్నారు. **- అనుమసముద్రంపేట, న్యూస్‌టుడే**

ప్రమాదం అంచున ప్రయాణం

కలిగిరి మండలంలోని పెరికేట ఎస్సీ కాలనీలోకి వెళ్లేందుకు తొమ్మిది అడుగుల వెడల్పుతో వైకాపా ప్రభుత్వంలో సిమెంటు రోడ్డు నిర్మించగా.. అంచులకు గ్రావెల్ తోలలేదు. ఎదురెదురుగా వాహనాలు వస్తే పక్కకు దిగే అవకాశం లేదు. రెండు వైపులా రోడ్డు అంచులకు గ్రావెల్ తోలాలని స్థానికులు కోరుతున్నారు. **-న్యూస్‌టుడే, కలిగిరి**

మురుగు గుంత.. దుర్గంధం చింత

గ్రామంలోని చెర్లో తోట సాయిబాబా ఆలయం వద్ద సచివాలయం-2వ వెళ్లే దారిలో మురుగునీరు మడుగు ఏర్పడి దుర్వాసన వెదజల్లుతోంది. చుట్టుపక్కల ఇళ్ల నుంచి వచ్చే మురుగునీరు ఇక్కడికి చేరుతోంది. దోమలు వృద్ధి చెంది అంటు వ్యాధులు ప్రబలుతున్నాయని సమీప గృహాల వారు ఆందోళన చెందుతున్నారు. ఈ విషయమై పంచాయతీ కార్యదర్శి కె. రామారావు స్పందిస్తూ పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. **- వింజమూరు, న్యూస్‌టుడే**

కాలువ కట్ట.. ఆక్రమణలతో తంటా!

గ్రామంలోని నీటి ట్యాంక్ కూడలిలో కాలువపై ఆక్రమణలతో వాహనాల రాకపోకలకు అంతరాయం కలుగుతోంది. భారీ వాహనాలు మలుపు తిరిగేందుకు వీలు కావడం లేదు. ఈ విషయమై జల వనరుల శాఖ ఏఈ సుధీర్‌ను అడగ్గా.. పరిశీలించి చర్యలు తీసుకుంటామని తెలిపారు. **- అల్లూరు, న్యూస్‌టుడే**

అక్రమాలకు సాక్ష్యాలు

ఈ స్తంభాలు పట్టణ శివారు బుడమగుంట చెరువులో మట్టి అక్రమ తవ్వకాలకు సాక్ష్యాలు. వీటి చుట్టూ కొద్ది పాటి మట్టి మాత్రమే మిగిల్చారు. దాంతో ప్రమాదకర పరిస్థితులు పొంచి ఉన్నాయి. చెరువులో నీరు తగ్గి మట్టి కనిపిస్తున్న చోట్ల నిత్యం తవ్వకాలు యథేచ్ఛగానే సాగుతున్నాయి. **- కావలి, న్యూస్‌టుడే**

తెరుచుకున్న మరుగుదొడ్లు

ఉదయగిరి, న్యూస్‌టుడే : పట్టణంలోని పంచాయతీ బస్టాండ్‌లో మరుగుదొడ్ల తలుపులు తెరుచుకున్నాయి. వారం రోజులుగా వీటికి తాళాలు వేయడంతో ప్రయాణికులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై 'ఈనాడు'లో మంగళవారం 'అత్యవసరానికి తాళం... ఎంతో కష్టం' శీర్షికన కథనం ప్రచురితమైంది. స్పందించిన ఎంపీడీవో శ్రీనివాసులు తలుపులు తీయించారు.

పారిశుద్ధ్యం బాగైంది

కావలి, న్యూస్‌టుడే: పట్టణంలోని వెంగళరావునగర్‌లో ఉన్న బీసీ సంక్షేమ వసతిగృహాల ప్రాంగణంలో పారిశుద్ధ్యం మెరుగుపరిచారు. మంగళవారం 'ఈనాడు'లో 'అత్తెసరు కూరలు.. నీళ్ల మజ్జిగ' శీర్షికన ప్రచురితమైన కథనానికి సంక్షేమాధికారి బండికోట చలపతిరావు స్పందించారు. హాస్టల్ ప్రాంగణం అంతా శుభ్రం చేయించారు.

లీకులు.. ఇక్కట్లు

పట్టణంలో అస్తవ్యస్తంగా తాగునీటి సరఫరా

వీరు పట్టణంలోని వడ్డిపాలెం ప్రాథమిక పాఠశాల సమీపంలో నాలుగు రోడ్ల కూడలిలో పైపులైను మరమ్మతులకు గుంత తవ్వుతున్న శ్రామికులు. రెండు రోజుల క్రితం సమస్య తలెత్తడంతో పరిష్కరించారు. మళ్లీ నాలుగడుగుల దూరంలో పడడంతో రోజుల తరబడి నీటిసరఫరా నిలిచిపోతోంది.

పట్టణంలో లీకులతో ప్రజలకు తాగునీరు అందడం లేదు. దశాబ్దాల క్రితం వేసిన పైపులైన్లకు లీకుల బెడద నిత్యం వెంటాడుతోంది. వీటిని బాగుచేయడంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. క్లాంపులు వంటి వాటితో అనుసంధానం చేయాలి. హీటింగ్ మిషన్ ద్వారా అతికించడం వంటివి చేసినా ప్రయోజనమే. అలాకాకుండా రబ్బర్ ట్యూబులతో సరిపెడుతున్నందున సమస్యలు పునరావృతమవుతున్నాయి. రెండు రోజుల క్రితం పాతూరు వివేకానంద పార్కు వద్ద లీకేజీని అరికట్టారు. అంతలోనే ఆ వార్డులో మరో చోట సమస్య నెలకొంది. పదే పదే తవ్వకాలతో రోడ్లన్నీ పాడైపోతున్నాయి. వాటిని సరిదిద్దే కార్యాచరణ కూడా కరవే. రోజుల తరబడి ఆయా ప్రాంతాల్లో నీటి సరఫరా నిలిచిపోతోంది. సమస్యలన్నీ పరిష్కరించేందుకు కృషి చేస్తున్నట్లు పురపాలక డీఈ సాయిరాం తెలిపారు. ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూస్తున్నామన్నారు. **- న్యూస్‌టుడే, కావలి**

12 రోజులుగా నీరు రావడం లేదు

మా ప్రాంతంలో 12 రోజులుగా నీటి సరఫరా నిలిపివేశారు. లీకులు, ఇతర కారణాలతో ఆపేశామంటున్నారు. ప్రత్యామ్నాయంగా వాటర్ ట్యాంకర్లను పంపిస్తామంటున్నారు. వాటి నుంచి నీరు మోసుకెళ్లాలంటే ఇబ్బందిగా ఉంది. అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలి.
– షేక్ జైబూన్, తుఫాన్‌నగర్, కావలి

మూఢనమ్మకాలతో అనర్థాలు

బహుమతులు పొందిన విద్యార్థులతో జేవీవీ నాయకులు, ఎంఈవో తదితరులు

సీతారామపురం, న్యూస్‌టుడే : ప్రజల్లో మూఢనమ్మకాలను తొలగించేలా జనవిజ్ఞాన వేదిక చైతన్యం కల్పిస్తుందని ఎంఈవో మస్తాన్‌వలి తెలిపారు. మండల స్థాయిలో వక్త 2026 పోటీలను సీతారామపురంలోని గౌతమి హైస్కూల్‌లో విద్యార్థులకు మంగళవారం నిర్వహించారు. షేక్ సాఖీభా ఆజం, డి. వెంకటచైత్ర, వై.తేజశ్రీ మొదటి మూడుస్థానాల్లో నిలిచినట్లు జేవీవీ ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు తెలిపారు. కార్యక్రమంలో జేవీవీ నాయకులు రామిరెడ్డి, దస్తగిరి అహ్మద్, శ్రీనివాసులురెడ్డి పాల్గొన్నారు.

రక్తహీనతే ప్రధాన సమస్య : జేడీ

సంగం : బాలల్లో రక్తహీనత ప్రధాన సమస్యగా ఉందని దాన్ని అధిగమించేందుకు జాతీయ స్థాయిలో నులిపురుగుల నివారణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వైద్య ఆరోగ్య శాఖ రాష్ట్ర జాయింట్ డైరెక్టరు కామేశ్వరప్రసాద్ సంగంలో మంగళవారం తెలిపారు. బాలికల గురుకుల పాఠశాలలో ఆన్‌లైన్ వీడియో ప్రదర్శన ద్వారా నులిపురుగుల కారణంగా రక్తహీనత తోపాటు, ఉదర సంబంధిత వ్యాధులపై అవగాహన కల్పించారు. మండల వైద్యాధికారి అశోక్, ఇన్‌ఛార్జ్ ప్రధానాచార్యులు సునీత హాజరయ్యారు.

వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి

సీతారామపురం, న్యూస్‌టుడే : వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని సమగ్ర శిక్షా ఏఎమ్‌వో జి.సుధీర్‌బాబు సూచించారు. సీతారామపురంలోని కేజీబీవీని పల్లెపాడులోని డైట్ కళాశాల లెక్చరర్ షేక్ షఫీవుల్లా, పి. రజని, సైట్ ఇంజినీర్ షేక్ అహ్మద్‌బాషాతో కలసి మంగళవారం తనిఖీ చేశారు. వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించి సామర్థ్యాలు మెరుగయ్యేలా చూడాలన్నారు. కార్యక్రమంలో సీతారామపురం ఎంఈవో మస్తాన్‌వలి, కేజీబీవీ ప్రిన్సిపల్ షాహిదా తదితరులు పాల్గొన్నారు. **అనుమసముద్రంపేట:** గ్రామంలోని కేజీబీవీని జీసీడీవో శాంతకుమారి, డైట్ లెక్చరర్లు నటరాజమూర్తి, హైమావతి మంగళవారం తనిఖీ చేశారు. విద్యార్థుల సామర్థ్యాలు, కేంద్రంలోని వసతులను పరిశీలించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ శ్రీలక్ష్మమ్మ, ఉపాధ్యాయినులు పాల్గొన్నారు.

చిరుధాన్యాలతో లాభాలు

నెర్నూరులో జొన్న ప్రదర్శనా క్షేత్రాన్ని పరిశీలిస్తున్న శాస్త్రవేత్త సురేఖాదేవి, వ్యవసాయాధికారులు

చేజర్ల, న్యూస్‌టుడే: ఆరోగ్యం, ఆదాయం కోసం రైతులు చిరుధాన్యాలు సాగు చేసుకోవాలని పొదలకూరు వ్యవసాయ పరిశోధనా స్థానం శాస్త్రవేత్త వి.సురేఖాదేవి సూచించారు. నెర్నూరులో ఏర్పాటు చేసిన జొన్న, శనగ ప్రదర్శనాస ముదాయాలను మంగళవారం ఆమె సందర్శించి రైతులకు సూచనలు చేశారు. సేంద్రీయ ఎరువులు, జీవ నియంత్రణ పద్ధతులు పాటించి రైతులు సాగు ఖర్చులు తగ్గించుకోవాలని కోరారు.

భూముల కబ్జాపై లబ్ధిదారుల కన్నెర్ర

నిరసన తెలుపుతున్న దళితులు

జలదంకి, న్యూస్‌టుడే : ప్రభుత్వం ఇచ్చిన భూములను ఆక్రమణదారుల నుంచి విడిపించి తమకు స్వాధీనం చేయాలని మంగళవారం లబ్ధిదారులు తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేశారు. అధికారులు, నాయకుల తీరుకు నిరసనగా వంటా వార్పు కార్యక్రమానికి సిద్ధమయ్యారు. తహసీల్దార్ సీతామహాలక్ష్మి సమాచారంతో ఎస్సై లతీపున్నీసా సిబ్బందితో వచ్చి అడ్డుకోవడంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. దీంతో డీఎస్పీ పి.శ్రీధర్, కావలి రెండో పట్టణ సీఐ వి.గిరిబాబు చేరుకొని తహసీల్దార్ సీతామహాలక్ష్మితో పాటు ఆందోళనకారులతో చర్చించారు. లబ్ధిదారులు ముసలి వెంకటరమణయ్య, కె.జనార్దన్ మాట్లాడుతూ 2009లోఒక్కొకరికి 1.50 ఎకరం వంతున 145 మందికి భూములు పంపిణీ చేశారన్నారు. వీటిని సాగు చేసుకొనివ్వకుండా కొందరు అధికారులు, నాయకుల అండతో గ్రామపెద్దలు అడ్డుకుంటున్నారని ఆరోపించారు. న్యాయం చేసే వరకు వెళ్లమని స్పష్టంచేశారు. పది రోజుల్లో సమస్య పరిష్కరిస్తామని తహసీల్దార్ సీతామహాలక్ష్మి, ఉపతహసీల్దార్ వెంకట్రామిరెడ్డి డీఎస్పీ, సీఐ సమక్షంలో హామీఇవ్వడంతో ఆందోళన విరమించారు.

సముద్రంలో కోస్టు గార్డు దళాల గాలింపు

సముద్రంలో బోటులో వెళుతున్న మెరైన్ సీఐ శేషయ్య, సిబ్బంది

బిట్రగుంట : బోగోలు మండలం తాటిచెట్లపాలెం వద్ద సముద్రంలో సోమవారం గల్లంతైన లోకేష్ కోసం మంగళవారం గాలింపు చర్యలు ముమ్మరంగా జరుగుతున్నాయి. కలెక్టర్, ఎస్పీ ఆదేశాలతో కోస్టుగార్డు సిబ్బంది రంగంలోకి దిగారు. అల్లూరు, బోగోలు, కావలి రూరల్ గ్రామీణ ప్రాంతాల్లోని మత్స్యకారులను ఇస్కపల్లి మెరైన్ సీఐ శేషయ్య, బోగోలు తహసీల్దారు శ్రీనివాసులురెడ్డి, బిట్రగుంట ఎస్సై నక్కా ప్రభాకర్ అప్రమత్తం చేశారు. మంగళవారం రాత్రి వరకు ఆచూకీ లభ్యం కాలేదు.

సింగారెడ్డిపల్లిలో 11 అర్జీలు

సీతారామపురం, న్యూస్‌టుడే : వన్‌మంత్ వన్ విలేజ్ ఫోర్ విజిట్స్ కార్యక్రమాన్ని తహసీల్దారు ఫాజిహా మంగళవారం మండలంలోని సింగారెడ్డిపల్లిలో నిర్వహించారు. కార్యక్రమంలో 11 అర్జీలు అందినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో వీఆర్వో మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

త్వరితగతిన భూసమస్యల పరిష్కారం

దుత్తలూరు : త్వరితగతిన భూసమస్యలను పరిష్కరించేందుకే రాష్ట్ర ప్రభుత్వం ఒన్ మంత్ ఒన్ విలేజ్ ఫోర్ విజిట్ కార్యక్రమాన్ని అమలు చేస్తోందని తహసీల్దారు నాగరాజు పేర్కొన్నారు. మండలంలోని ఏరుకొల్లులో కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

దగదర్తి, న్యూస్‌టుడే: సముద్ర స్నానానికి వెళ్లి ప్రమాదవశాత్తు సముద్రంలో గల్లంతైన యువకుల కుటుంబీకులను మండలంలోని ఉలవపాళ్లలో రాష్ట్ర తెదేపా కార్యదర్శి రవికుమార్‌చౌదరి మంగళవారం పరామర్శించారు. ఆయన వెంట తెదేపా నాయకుడు శ్రీనివాసులు ఉన్నారు.

బాలలు వ్యసనాలకు దూరంగా ఉండాలి

సంగం : బాలలు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని నెల్లూరులోని ఏసీ. సుబ్బారెడ్డి వైద్య కళాశాల ఆచార్యులు డాక్టరు కాలేషా సాహెబ్ అన్నారు. సంగంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గంజాయి వంటి మత్తు పదార్థాలకు కొందరు బాలలు అలవాటు పడుతున్నారని, అటువంటి వారిని గుర్తించి చికిత్స అందిస్తున్నామన్నారు. తల్లిదండ్రులు కూడా తమ సంతానం తీరుతెన్నుల గురించి దృష్టి సారించాలన్నారు.

సంక్షిప్త సమాచారం

లక్ష్యాల మేరకు మట్టి నమూనాల సేకరణ

ఆత్మకూరు : డివిజన్ స్థాయిలో లక్ష్యాల మేరకు మట్టి నమూనాలు సేకరించాలని ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ కన్నయ్య అన్నారు. ఆత్మకూరులో ప్రకృతి వ్యవసాయంపై డివిజన్ స్థాయి సమీక్ష నిర్వహించారు. ఎన్ఎఫ్ఏ చంద్ర, రవిచంద్రప్రసాద్ పాల్గొన్నారు.

19న జాబ్‌మేళా

ఆత్మకూరు : పట్టణంలో ఈనెల 19వ తేదీ నిర్వహించే మెగా జాబ్‌మేళాను విజయవంతం చేయాలని ఆత్మకూరు ఆర్డీవో పావని కోరారు. మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ ఆంధ్ర ఇంజినీరింగ్ కళాశాలలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఈ కార్యక్రమం ఉంటుందన్నారు. నిరుద్యోగులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని సూచించారు.

పాఠశాల విద్యార్థుల ర్యాలీ..

అనుమసముద్రంపేట : ఏఎస్‌పేట జడ్పీ పాఠశాల విద్యార్థులకు మాదకద్రవ్య నిరోధక చట్టం, ఆత్మరక్షణపై మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు, పోలీసులతో కలిసి గ్రామంలో ప్రదర్శన చేశారు.

పొలం విషయమై ఇరు వర్గాల ఘర్షణ

జలదంకి : పొలం విషయమై రెండు కుటుంబాలు ఘర్షణ పడిన వైనమిది. ఈఘటన తిమ్మసముద్రంలో మంగళవారం చోటు చేసుకొంది. గ్రామంలో ప్రభుత్వ భూమి 2.39 ఎకరాల్లో కాసు మహేశ్వరరావు 30 ఏళ్లుగా సాగు చేసుకొని జీవిస్తున్నారు, రెండేళ్ల నుంచి దివ్యాంగుడైన నాగి వెంకటేశ్వర్లు ఈ భూమి తనదంటూ మహేశ్వరరావుతో వివాదానికి దిగారు. మంగళవారం పొలంలోని జామాయిల్ చెట్లను మహేశ్వరరావు కుటుంబ సభ్యులతో కలిసి నరికిస్తుండగా, నాగి వెంకటేశ్వర్లు తన కుటుంబ సభ్యులతో వెళ్లి అడ్డుకున్నారు. ఈ విషయమై రెండు వర్గాల మధ్య ఘర్షణ జరిగింది. దీనిపై కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై లతీపున్నీసా తెలిపారు.

వైభవంగా హనుమంత వాహన సేవ

హనుమంత వాహనంపై ఊరేగుతున్న శ్రీస్వామి అమ్మవార్లు

వరికుంటపాడు, న్యూస్‌టుడే: మండలంలోని వైకుంఠపురంలో పద్మావతి గోదాదేవి సమేత వేంకటేశ్వరస్వామి వార్షికోత్సవాల్లో మంగళవారం అభిషేకాలు, హోమాలు, కలశ ఆరాధన, మూలమంత్ర హోమం, కుంకుమార్చన తదితర పూజలు నిర్వహించారు. రాత్రి హనుమంత వాహనంపై స్వామి, అమ్మవార్ల గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త పెండ్యాల సూర్యనారాయణ అమ్మాజీ, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

అంబారీ వాహనంపై గ్రామోత్సవం

అంబారీపై ఊరేగింపు

చెర్లోవంగల్లు (సంగం) : మండలంలోని చెర్లోవంగల్లు కామాక్షిదేవి సమేత భీమేశ్వరస్వామి ఆలయంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం అర్ధరాత్రి నుంచి మంగళవారం వేకువజాము వరకు అంబారీ వాహనంపై స్వామి గ్రామోత్సవం వైభవంగా జరిగింది. గ్రామస్థులు నైవేద్యాలు సమర్పించి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

నీడ లేని కీలక శాఖలు

అధికారులు, ప్రజలకు కష్టాలు

అద్దె భవనంలో సోమశిల సబ్‌డివిజన్ కార్యాలయం

బిట్రగుంట, న్యూస్‌టుడే

కీలక ప్రభుత్వ శాఖలకు సొంత గూడు లేక అద్దె భవనాల్లో సిబ్బంది నానాఇబ్బందులు పడుతున్నారు. మరి కొందరు అధికారులు కావలిలోని ఆయా శాఖల కార్యాలయాల్లోనే పనులు చేస్తున్నారు. మరోవైపు వీటికి వచ్చే ప్రజలకు కష్టాలు తప్పడం లేదు. ఇదీ బోగోలు మండలంలోని పరిస్థితి. పాపిరెడ్డి కాలువ పరిధిలోని శ్రీవెంకటేశ్వరపాలెం మేజరు కాలువకు చెందిన సబ్‌డివిజన్ కార్యాలయం 30 ఏళ్లుగా విశ్వనాథరావుపేటలో ప్రైవేటు భవనంలో నడుస్తోంది. దీని పరిధిలో మూడు ఉపకాలువల కింద 20 వేల ఎకరాల ఆయకట్టు ఉంది. సాగునీటి సంఘాల సమావేశాలు నిర్వహించాలన్నా వీలు కావడం లేదు. చిన్నతరహా సాగునీటి పారుదల శాఖ, డీఎం కాలువ ఏఈలకు కార్యాలయాలే లేవు. గతంలో సొంత డబ్బులు చెల్లించి అద్దె భవనంలో ఉండి విధులు నిర్వహించే వారు. ఆరేళ్లుగా కావలిలోని వారి డీఈఈ కార్యాలయాల నుంచే రాకపోకలు సాగిస్తున్నారు. రైతులు సమస్యలు చెప్పుకోవాలన్నా వీలు కావడం లేదు. అల్లూరు డెల్టా పరిధిలోని జువ్వలదిన్నె, ఉలవపాళ్ల మేజరు కాలువల ఏఈలు అల్లూరులో ఉంటూ పరిపాలన సాగిస్తున్నారు.

బహుళ శాఖల కార్యాలయంతో

చిన్నతరహా నీటి పారుదల శాఖ ఆర్‌డబ్ల్యూఎస్ డెల్టా ఏఈలు, డీఈఈలకు వేదికగా.. బహుళ శాఖల కార్యాలయం బోగోలులో ఏర్పాటుచేస్తే రైతులకు మేలు జరుగుతుంది. బోగోలులో ప్రభుత్వ స్థలాలు ఉన్నాయి. పాలకులు ఈదిశగా చొరవ చూపాల్సిన అవసరం ఉంది. ఈ విషయమై ఎమ్మెల్యే డీవీ కృష్ణారెడ్డితో 'న్యూస్‌టుడే' మాట్లాడగా.. పరిశీలనలో ఉందని పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు.

రోడ్డుపైనే వృద్ధుడి మృతి

పంచాయతీ సిబ్బంది అంత్యక్రియలు

వింజమూరు, న్యూస్‌టుడే : మండలంలోని చంద్రపడియకు చెందిన కర్నాటి వెంకటరత్నం (71) వింజమూరు-ఆత్మకూరు రోడ్డులో బస్సు స్టేజీ వద్ద మృతి చెందారు. కుష్ఠు వ్యాధితో బాధపడుతూ పాఠశాల ఆవరణలో ఉంటున్నారు. తలదాచుకుంటున్నారు. భార్య, కుమారుడు గతంలో మృతి చెందారు. కుమార్తె జనార్దనపురంలో ఉండగా, మనవడు నెల్లూరు నారాయణ ఆసుపత్రిలో పని చేస్తున్నారు. ఆత్మకూరు ఆసుపత్రికి వెళ్లి వైద్యం చేయించుకొని బస్సులో వచ్చి చంద్రపడియలో దిగిన చోటే మృతి చెందారు. గ్రామస్థులు పట్టించుకోలేదు. సమాచారం తెలుసుకున్న పంచాయతీ కార్యదర్శి విజయమ్మ వింజమూరు పంచాయతీ ట్రాక్టరు పారిశుద్ధ్య కార్మికులు తీసుకొచ్చి అంత్యక్రియలు చేశారు.

పిల్లలు పుట్టడం లేదని ఆత్మహత్య

కావలి, న్యూస్‌టుడే: వివాహమై 11 సంవత్సరాలైనా పిల్లలు పుట్టడం లేదని చేవూరు శరణ్య (31) ఆత్మహత్య చేసుకుంది. పట్టణంలోని పదో వార్డుకు చెందిన ఈమె నాలుగు రోజుల క్రితం ఎలుకల మందు తినగా.. కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తరలించారు. తొలుత కావలిలో ప్రాథమిక చికిత్స చేయించి చెన్నైకు తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం ప్రాణాలు కోల్పోయింది. ఒకటో పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు.

డాక్యుమెంటు పోయినది

పేటేటి సుధాకర రావు S/o. Late **పేటేటి వెంకట సుబ్బయ్య శెట్టి**, 11-32-105, No. 81, బృందావనం హౌసింగ్ కాలని, కావలి టౌన్ & మండలం, ఎస్‌పిఎస్ఆర్ నెల్లూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్ కాపురస్తుడు అను నేను మా తల్లిగారైన **శ్రీమతి పేటేటి పారిజాతమ్మ** W/o. Late పేటేటి వెంకటసుబ్బయ్య శెట్టి, (Died తేది: 27.03.1986) (చేవెళ్ళ సబ్‌రిజిస్ట్రారు, రంగారెడ్డి జిల్లా)కు సంబంధించిన సేల్‌డీడ్ ఒరిజినల్ రిజిష్టర్డ్ డాక్యుమెంట్ నెం. 1516/1986 పోయినది. నేను కావలి నమస్కార్ హోటల్ దగ్గర తేది: 06.02.2026న జెరాక్స్ తీసుకొని వస్తుండగా పోయినది. ఎవరికైనా దొరికినయెడల తెలుపగలరు.

Cell: 98482 79906

(c) eenadu

వసతిగృహాల సమీపంలో అంధకారం.. వందలాది మంది విద్యార్థినుల ఇక్కట్లు

కోవూరు, న్యూస్‌టుడే: కోవూరు పట్టణ పరిధిలోని జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల సమీపంలో మూడు వసతి గృహాల్లో సుమారు 300 మంది విద్యార్థినులు ఉంటున్నారు. వసతి గృహాలకు వెళ్లే ప్రధాన మార్గంలో వీధి దీపాలు లేక అంధకారం నెలకొంది. అత్యవసర పరిస్థితుల్లో ఆరోగ్య సమస్యలు తలెత్తినపుడు ఆసుపత్రికి వెళ్లాల్సి వచ్చినా చీకట్లో వెళ్లాల్సి వస్తోందని స్థానికులు వాపోతున్నారు. ప్రధాన సిమెంట్ రోడ్డు మార్గంలో పక్కనే ఉన్న పాత పోలీస్ క్వార్టర్స్ శిథిలావస్థకు చేరుకోవడంతో పరిసరాల్లో విష పురుగులు, సర్పాలు సంచరిస్తున్నాయని విద్యార్థినుల తల్లిదండ్రులు చెబుతున్నారు. విద్యార్థినుల భద్రత దృష్టిలో ఉంచుకొని వీధి దీపాలు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

గూడూరు

•గూడూరు •కోవూరు •సర్వేపల్లి

సచివాలయ సిబ్బందికి షోకాజ్ నోటీసులు

బుచ్చిరెడ్డిపాళెం, న్యూస్‌టుడే: బుచ్చిరెడ్డిపాళెం పురపాలక పరిధిలో యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వేలో నిర్లక్ష్యం వహిస్తున్న వార్డు అడ్మినిస్ట్రేటివ్ సెక్రటరీ, ముగ్గురు ఏఎన్‌ఎంలకు షోకాజ్ నోటీసులిచ్చినట్లు పురపాలక కమిషనర్ బాలకృష్ణ తెలిపారు. పురపాలక కార్యాలయంలో మంగళవారం ఆయన మాట్లాడుతూ ఎవరైనా విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని పేర్కొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా!

(10 AM to 1 PM) గూడూరు: 85002 02046
కోవూరు :79950 67034, సర్వేపల్లి : 80085 73980

సమస్య: కోట మండలం గమళ్లవీధిలోని మురుగు కాలువలు దెబ్బతిని మురుగు కదలడం లేదు. స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. – పోలమ్మ, స్థానికురాలు

సమాధానం : కాలువలు బాగు చేసేందుకు ప్రతిపాదనలు పంపుతాం. –రాజశేఖర్, ఈవో

? పొదలకూరు నుంచి మనుబోలు వెళ్లే మార్గంలో ఉన్న నిమ్మమార్కెట్ ఎదుట వేగనియంత్రికలు ఏర్పాటు చేయాలి. మార్కెట్లో నుంచి వాహనాలు రోడ్డుపైకి వచ్చే సమయంలో ప్రమాదాలు జరుగుతున్నాయి. – వెంకటేశ్వర్లు, స్థానికుడు

✓ పరిశీలించి వేగాన్ని నియంత్రించేలా సూచిక బోర్డులు రోడ్డుపైన గీతలు ఏర్పాటు చేస్తాం. –శ్రీనివాసులు, రభ ఏఈ

? తోటపల్లిగూడూరు మండలం ముంగలదొరువు సమీపంలో కోడూరు రోడ్డు పక్కనే వ్యర్థాలు పడేస్తున్నారు. –శ్రీనివాసులు, స్థానికుడు

✓ సిబ్బందికి చెప్పి పారిశుద్ధ్య పనులు చేపడతాం. – నరసయ్య, డిప్యూటీ ఎంపీడీవో

? తోటపల్లిగూడూరు మండలం మండపం పంచాయతీ చంద్రశేఖర్‌పురం రోడ్డు గతుకుల మయంగా మారింది. రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. – మస్తానయ్య, స్థానికుడు

✓ పరిశీలించి రోడ్డు మరమ్మతులకు చర్యలు తీసుకుంటాం. –రమేశ్, పీఆర్ ఏఈ

? తోటపల్లిగూడూరు మండలం చింతోపు సమీపంలో కోడూరు రోడ్డు పక్కనే వ్యర్థాలు పడేస్తున్నారు. దుర్వాసనతో సమస్యలు తలెత్తుతున్నాయి. – రామకృష్ణ, స్థానికుడు

✓వ్యర్థాలు తొలగించి, ప్రజలకు ఇబ్బంది లేకుండా చేస్తాం.–నరసయ్య, డిప్యూటీ ఎంపీడీవో

? తోటపల్లిగూడూరు మండలం మల్లికార్జునపురం వద్ద పారుదల కాలువలో పిచ్చి మొక్కలు పెరిగిపోయాయి. నీటి పారుదలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. – పరమేశ్, స్థానికుడు

✓ కాలువల్లో పిచ్చిమొక్కలు తొలగించి సాగు నీరు సజావుగా వెళ్లేలా చర్యలు తీసుకుంటాం. –అలీ, ఇరిగేషన్ ఏఈ

? పొదలకూరులోని లింగంపల్లి తోపు ప్రమాదకరమైన పెద్ద చెట్లు నరికి గుట్టలు వేశారు. రెండేళ్లుగా వాటిని అలాగే వదిలేయడంతో వాటిలో విషసర్పాలు చేరడతో స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు. – రత్నయ్య, స్థానికుడు

✓ పరిశీలించి వేలం నిర్వహిస్తాం.
– యశ్వంత్ సింగ్, పంచాయతీ కార్యదర్శి

? పొదలకూరు రూరల్ పరిధిలోని వినాయక మాన్యం కాలనీలో విద్యుత్తు స్తంభాలు వాలిపోయి ప్రమాదకరంగా ఉన్నాయి. – మస్తాన్

✓సరిచేయిస్తాం.–శ్రీనివాసులు, డిస్కం ఏఈ

? రాపూరు మండల పరిధిలోని బొజ్జనపల్లి ఎస్సీ కాలనీలో విద్యుత్తు తీగలు ఇళ్లపై వేలాడుతున్నాయి. అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలి. – స్థానికులు

✓ డిస్కం అధికారులకు చెప్పి సమస్య పరిష్కరిస్తాం – భవాని, ఎంపీడీవో

అధ్వానంగా భవనాలు.. రోగులకు అవస్థలు

కొన్ని చోట్ల నిర్మిస్తున్నా ఇక్కడ జాప్యమెందుకో..

న్యూస్‌టుడే, కోట

గ్రామీణ ప్రాంతాల్లో ఆయుష్ పరిధిలోని వైద్య భవనాలు అధ్వానంగా ఉన్నాయి. రోగులు, వైద్య సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు ప్రతిపాదనలు పంపామని చెబుతున్నా కార్యరూపం దాల్చడం లేదు. సర్వేపల్లి, కోవూరు నియోజకవర్గాల పరిధిలో జిల్లా ప్రభుత్వం నిధులు మంజూరు చేయడంతో నూతన భవన నిర్మాణాలు చేపట్టారు. గూడూరు నియోజకవర్గ పరిధిలో కొన్ని చోట్ల పనులు ప్రారంభం కాలేదు.

● చిల్లకూరులోని భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరింది. స్లాబ్ పైనుంచి పెచ్చులూడి పడుతున్నాయి. గోడలు బీటలు వారాయి. వర్షమొస్తే పూర్తిగా నీరు కారుతోంది. దస్త్రాలు తడుస్తున్నాయి. దీనికితోడు పెచ్చులూడుతుండడంతో సిబ్బంది బిక్కుబిక్కుమంటూ విధులు నిర్వహిస్తున్నారు. వైద్యశాల చుట్టూ ఉన్న ప్రహరీ కూలింది. మూగ జీవాలు లోపలికి వస్తున్నాయి. రాత్రి సమయాల్లో మందు బాబులకు అడ్డాగా మారింది. ఉదయం వైద్యులు, రోగులు వచ్చేసరికి ఖాళీ మద్యం సీసాలు, ప్లాస్టిక్ వ్యర్థాలు ఉంటున్నాయి.

శిథిలావస్థలో ఉన్న చిల్లకూరు హోమియో వైద్యశాల భవనం

● గూడూరు నియోజకవర్గంలోని కోట మండల పరిధిలో నాలుగు దశాబ్దాల క్రితం విద్యానగర్, చిట్టేడులో ప్రభుత్వ హోమియో వైద్యశాలలు ఏర్పాటు చేశారు. చిట్టేడులోని వైద్యశాలకు సొంత భవనం నిర్మించగా విద్యానగర్‌లో మాత్రం వేరే భవనంలో కొనసాగుతోంది. రోజుకు వంద మంది వరకు రోగులు వచ్చి వైద్యసేవలు పొందుతున్నారు. పదేళ్లుగా రెండు భవనాలు దెబ్బతిన్నాయి.

● విద్యానగర్‌లో భవనం అధ్వానంగా ఉంది. ఇటీవల తాత్కాలికంగా మరమ్మతులు చేపట్టారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నూతన భవనాలు నిర్మించి మెరుగైన వైద్యసేవలందించాలని రోగులు కోరుతున్నారు.

● చిట్టేడు హోమియో వైద్యాధికారి సురేష్ మాట్లాడుతూ... నూతన భవన నిర్మాణానికి ప్రతిపాదనలు పంపామని, త్వరలోనే నిధులు మంజూరవుతాయని తెలిపారు. రోగులకు ఇబ్బందులు లేకుండా కనీస వసతులు కల్పించేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

విచారణతో సరి.. చర్యలెప్పుడో మరి..!

న్యూస్‌టుడే, చిల్లకూరు

చిల్లకూరు మండలంలోని మోచ యతిల్లో ఆఫ్‌లైన్‌లో ఇంటి పన్నుల వసూళ్ల వ్యవహారంపై పంచాయతీ కార్యదర్శి కొలిక్కి రాలేదు. ముత్యాలపాడులోని పంచాయతీ సంబంధిత కార్యదర్శి నెల రోజుల క్రితం స్థానిక ఐదు చేతితో రాసిన రసీదులు ఇచ్చి పన్నుల రూపేణా రూ.లక్షలు వసూలు చేశారు. దీనిపై గ్రామస్థులు గగ్గోలు పెట్టడంతో గూడూరు డీఎల్‌డీవో వాణిరెడ్డి విచారణ చేపట్టారు. ● క్షేత్రస్థాయిలో పరిశీలించి 120 మంది నుంచి ఇదే తరహాలో నిబంధనలకు విరుద్ధంగా ఆఫ్‌లైన్‌లో గూడా అధిక మొత్తంలో పన్నులు వసూలు చేసి, ఆన్‌లైన్‌లో నమోదు చేయపోవడాన్ని గుర్తించారు. ఆ మొత్తాన్ని పంచాయతీ ఖాతాలో జమ చేయలేదని నిర్ధారించారు. అక్రమంగా వసూలు చేసిన కొంత నగదును తిరిగి ఇంటి యజమానులకు చెల్లించారు. నిబంధనలను అతిక్రమించినట్లు గుర్తించి అప్పట్లో ద్వారా స్పష్టం చేశారు. విచారణ నివేదికను వెంటనే తిరుపతి జిల్లా డీపీవోకు సమర్పించారు.

అధికారుల అండదండలతో ఉద్యోగోన్నతి..

చిల్లకూరు మండలాన్ని నెల్లూరు జిల్లాలో కలపడంతో విచారణ నివేదికను ఉన్నతాధికారులు పట్టించుకోలేదన్నది విశ్వసనీయ సమాచారం. అక్రమాలకు పాల్పడిన పంచాయతీ కార్యదర్శి పైస్థాయిలో ప్రస్తుతం చేసుకున్నట్లు తెలిసింది. గతంలో మోమిడిలో పనిచేసిన సమయంలోనూ అక్రమాలు జరిగినట్లు ఆరోపణలు వెల్లువెత్తాయి. తమకేం కాదన్న ధీమా కొందరు పంచాయతీ కార్యదర్శుల్లో వ్యక్తమవుతోంది. పలు పంచాయతీల్లో ఆఫ్‌లైన్ రసీదులతో పన్నులు వసూలు చేసినట్లు అధికారులు గుర్తించినా చర్యలు లేకపోవడమే నిదర్శనం. అక్రమ వసూళ్లతో సంబంధం ఉన్న ఇద్దరు కార్యదర్శులు పదోన్నతిపై వెళ్లగా, మరి కొందరు దీర్ఘకాలిక సెలవులో ఉన్నారని అధికారులు స్పష్టం చేస్తుండడం కొసమెరుపు.

కమనీయం.. ఆది దంపతుల కల్యాణం

పొదలకూరు, బుచ్చి, న్యూస్‌టుడే: మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం నాలుగో రోజు పొదలకూరు వినాయకుడి కామాక్షమ్మ సమేత రామలింగేశ్వర స్వామి ఆలయంలో పార్వతీ, పరమేశ్వరుల కల్యాణం కనుల పండుగగా నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు. కల్యాణం అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉభయకర్తలుగా హరీష్ చందన దంపతులు, ఆలయ ఛైర్మన్ ప్రసాద్‌రెడ్డి, ప్రధాన అర్చకులు ప్రసాద్ స్వామి, అర్చకులు పాల్గొన్నారు. ● బుచ్చిలోని రామకృష్ణాపురంలోని కల్యాణ వెంకటేశ్వరస్వామి దశమ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామివారు హనుమంతవాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు.



పార్వతీ, పరమేశ్వరుల కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

భారీగా హాజరైన మహిళా భక్తులు

ఇవేం పనులు సారూ!

గూడూరు పట్టణం, న్యూస్‌టుడే: ఆ చేతులతో అక్షరాలు రాసేందుకు బడికి వస్తే.. వారితో పనులు చేయించడం చర్చనీయాంశమైంది. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలని ప్రభుత్వం కృషి చేస్తుంటే, క్షేత్ర స్థాయిలో విద్యాబుద్ధులు నేర్పించాల్సిన గురువులే వారికి పనులు చెప్పడం పలు విమర్శలకు తావిస్తోంది. పాఠశాలల్లో శుభ్రం చేయడానికి ఆయాలను నియమించి ప్రభుత్వం వేతనాలిస్తోంది. కానీ కొన్ని చోట్ల విద్యార్థులతో పనులు చేయిస్తున్నారు. గూడూరు మండలం మిట్టాత్మకూరులోని మండల ప్రజా పరిషత్తు ప్రాథమిక పాఠశాలలో ఒకటో తరగతి చదువుతున్న విద్యార్థి చేత మరుగుదొడ్ల వద్ద డబ్బాలకు నీరు పట్టించే పనులు చేయిస్తున్నారు. దీనిపై ఎంఈవో-1 రవీంద్రబాబు 'న్యూస్‌టుడే'తో మాట్లాడుతూ.. అన్ని పాఠశాలలకు ఆయాలు ఉన్నారని, విద్యార్థులతో పనులు చేయించడంపై పరిశీలించి చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

పాఠశాల మరుగుదొడ్లో డబ్బాకు నీరు పడుతున్న విద్యార్థి

ఉపాధి పనుల పురోగతిపై సమీక్ష

సైదాపురం, న్యూస్‌టుడే: ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టిన పనులను ఫిబ్రవరి మాసాంతంలోగా పూర్తయ్యేలా చూడాల్సిన బాధ్యత క్షేత్ర, సాంకేతిక సహాయకులపై ఉందని ఏపీడీ గాయత్రీదేవి అన్నారు. సైదాపురం మండలంలో 2025-26లో చేపట్టిన పనుల్లో పురోగతిపై మండలంలోని ఆ పథకం సిబ్బందితో సమీక్షించారు. ఆమె మాట్లాడుతూ.. వచ్చే ఆర్థిక సంవత్సరం నుంచి ఉపాధి హామీ పథకంలో మార్పులు చేస్తున్నందున ఇప్పటికే చేపట్టిన పనులు పూర్తి చేయాలని కోరారు. ఏపీవో మురళి, ఏపీవోలు, సాంకేతిక, క్షేత్ర సహాయకులు పాల్గొన్నారు.

సర్వే సకాలంలో పూర్తిచేయండి

కోట, న్యూస్‌టుడే: ఏకీకృత కుటుంబ సమగ్ర సర్వే సకాలంలో పూర్తి చేయాలని డీడీవో వాణి రెడ్డి అన్నారు. మండలంలోని గూడలి-2, కోట-2, ఊనుగుంటపాళెం సచివాలయాల్లో ఆమె మంగళవారం ఏకీకృత కుటుంబ సమగ్ర సర్వేపై సచివాలయ సిబ్బందితో సమీక్షించారు. ఆమె మాట్లాడుతూ డిమాండ్ మేరకు పన్నులు వసూలు చేయాలని సూచించారు. అనంతరం ఊనుగుంటపాళెంలోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని ఆమె పరిశీలించారు. ఆమె వెంట డిప్యూటీ ఎంపీడీవో వేణు, సచివాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

ఊనుగుంటపాళెంలో పరిశీలిస్తున్న డీడీవో వాణిరెడ్డి

చెస్‌లో చెన్నూరు విద్యార్థి ప్రతిభ

గూడూరు పట్టణం, న్యూస్‌టుడే: నెల్లూరులో నిర్వహించిన జిల్లా స్థాయి చెస్ పోటీల్లో గూడూరు పురపాలక పరిధిలోని చెన్నూరు జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల 10వ తరగతి విద్యార్థి యుగంధర్‌సాయి ద్వితీయ బహుమతి సాధించినట్లు పీడీ జమీలా మంగళవారం తెలిపారు. అండర్-17 విభాగంలో జరిగిన పోటీల్లో విద్యార్థి గెలుపొంది రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థిని పలువురు అభినందిచారు.

భూసార పరీక్షల ఆధారంగా ఎరువులు వినియోగిద్దాం

తోటపల్లిగూడూరు, న్యూస్‌టుడే: భూసార పరీక్షల ఆధారంగా ఎరువులు వినియోగించాలని వ్యవసాయశాఖ సహాయ సంచాలకులు మారుతీదేవి సూచించారు. మండలంలోని పాపిరెడ్డిపాళెం, చిన్నచెరుకూరు గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. రైతులతో కలిసి క్షేత్ర పరిశీలన చేశారు.

ఆరేళ్లుగా పట్టించుకోరా

సర్వేపల్లి ప్రాథమిక పాఠశాల ప్రాంగణంలో చేపట్టిన తరగతి గదుల నిర్మాణాలు అసంపూర్తిగా ఉన్నాయి. ఆరేళ్ల క్రితం పనులు ప్రారంభించగా... స్లాబ్ లెవల్‌కు నిర్మించి నిధులు మంజూరు కాలేదని నిలిపివేశారు. ఉన్న రెండు గదుల్లోనే తరగతులు నిర్వహిస్తున్నారు. పూర్తి స్థాయి గదుల్లేక ఇబ్బందులు పడుతున్నారు. త్వరగా పూర్తి చేయాలని స్థానికులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, వెంకటాచలం

ఈ మార్గంలో వెళ్లేదెలా..!

వెంకటాచలం మండలం తిక్కవరప్పాడు పంచాయతీ జోసెఫ్‌పేటలో ఇళ్ల మధ్యలో ప్రధాన రహదారులపై పేడ దిబ్బలు వేశారు. ఒకరిని చూసి ఒకరన్నట్లు వరుసగా వేయడంతో రహదారిపై ఆటోలు, కార్లు వెళ్లే మార్గం కూడా లేకుండాపోయింది. దిబ్బల కారణంగా దుర్వాసన వస్తుండడంతో పాటు దోమల బెడద తీవ్రంగా ఉందని, అధికారులు తొలగించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.
–న్యూస్‌టుడే, వెంకటాచలం

అలంకారప్రాయం

పొదలకూరు నాలుగో సచివాలయం ఎదుట చేతి పంపు అలంకారప్రాయంగా మారింది. లింగంపల్లి తోపులో చాలా మంది పేదలు నివసిస్తున్నారు. పైపులైను ద్వారా నీటి సరఫరాలో ఇబ్బందులు ఎదురైతే చేతిపంపును వినియోగిస్తుంటారు. కొన్నినెలలుగా మూలనపడింది. మరమ్మతులు చేసి బోరు చుట్టూ సిమెంట్ ప్లాట్‌ఫాం నిర్మించాలని పలువురు వేడుకుంటున్నారు. – న్యూస్‌టుడే, పొదలకూరు

తాగునీరు కలుషితం

చిల్లకూరులోని గొల్లపాలెంలో తాగునీటి పైపులైనుకు ఏర్పాటు చేసిన వాల్వు ఇటీవల మరమ్మతులకు గురైంది. దానిని బాగు చేసే నిమిత్తం సిబ్బంది గుంత తవ్వారు. సక్రమంగా మూత వేయకపోవడంతో మురుగునీరు పేరుకుపోయింది. పైపుల్లోకి వెళ్లి కలుషితమయ్యే అవకాశముంది. సచివాలయానికి కూతవేటు దూరంలో ఉన్నా, ఎవరూ పట్టించుకున్న దాఖలాలు లేవని స్థానికులు వాపోతున్నారు.
– న్యూస్‌టుడే, చిల్లకూరు

అసంపూర్తి భవనం.. ప్రారంభిస్తే ఉపయోగం

పొదలకూరు మండలం ఇనుకుర్తి జడ్పీ ఉన్నత పాఠశాలకు నిర్మించిన అదనపు గదులు మూడేళ్లుగా అసంపూర్తిగా ఉన్నాయి. గత వైకాపా పాలనలో ప్రారంభమవగా.. బిల్లులు చెల్లించకపోవడంతో పనులు నిలిచిపోయాయి. సుమారు 150 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. కూటమి ప్రభుత్వం స్పందించి భవనాన్ని పూర్తిచేస్తే ఉపయోగంగా ఉంటుందని ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు సూచిస్తున్నారు. – న్యూస్‌టుడే, పొదలకూరు రూరల్

మహిళల ఆర్థికాభివృద్ధికి కృషి

గూడూరు పట్టణం, న్యూస్‌టుడే: మహిళల ఆర్థికాభివృద్ధికి కృషి చేస్తున్నట్లు సునీతా సేవాసంస్థ ప్రధాన కార్యదర్శి సారంగం సులక్ష్మీ తెలిపారు. గూడూరులోని ఆ సంస్థ కార్యాలయంలో మహిళలకు ఉచితంగా కుట్టు, శారీ ఫోల్డింగ్‌పై మంగళవారం శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రతినిధులు గిరిజ తదితరులు పాల్గొన్నారు.

భాజపా నాయకుల అభినందన

కోట, న్యూస్‌టుడే: కోటకు చెందిన సారంగం రమేశ్‌బాబును భాజపా ఓబీసీ తిరుపతి జిల్లా ఉపాధ్యక్షుడిగా నియమిస్తున్నట్లు జిల్లా ఓబీసీ జిల్లా అధ్యక్షుడు గోపి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రమేశ్‌బాబును భాజపా నాయకులు, కార్యకర్తలు అభినందించారు.

రక్తహీనతే అనారోగ్యానికి మూలం

గూడూరు, కోవూరు, సర్వేపల్లి, వెంకటగిరి బృందం, న్యూస్‌టుడే : రక్తహీనత వల్ల పలు అనారోగ్య సమస్యలు తలెత్తుతాయని జిల్లా అదనపు వైద్యాధికారి డాక్టర్ ఖాదర్‌వలి పేర్కొన్నారు. తోటపల్లిగూడూరు మండలం కోడూరు బాలికల గురుకుల పాఠశాలలో మంగళవారం నులిపురుగుల నివారణ దినం సందర్భంగా విద్యార్థినులకు మాత్రలు అందజేశారు. ● వరిగొండ పీహెచ్‌సీ పరిధిలోని నరుకూరు అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు వైద్యసిబ్బంది మాత్రలు వేశారు. ● ముత్తుకూరుతో పాటు పలు గ్రామాల్లో అధికారులు పరిశీలించారు. వ్యక్తిగత శుభ్రత పాటించాలని సూచించారు. ● మనుబోలు మండలంలో 5,452 మంది పిల్లలను గుర్తించి, అందులో 5,251 మందికి మాత్రలు వేశామని వైద్యురాలు తెలిపారు. ● కలువాయిలో ప్రత్యేక పరిశీలకులు రామ్మోహన్ రావు తదితరులు పరిశీలించారు. పీహెచ్‌సీ పరిధిలో 4379 మంది విద్యార్థులకు మాత్రలు అందజేశామని వైద్యులు తెలిపారు. సైదాపురంలో 3990 మందికి అందజేశామని సిబ్బంది పేర్కొన్నారు. ● ఇందుకూరుపేట మండలం ఆదెమ్మసత్రం జడ్పీ ఉన్నత పాఠశాలలో వైద్యాధికారి ఖాదర్ వలి పరిశీలించారు. ● విడవలూరులోని పీఆర్ ఆర్ అండ్ వీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పీహెచ్‌సీ వైద్యులు హరికృష్ణ సిబ్బందితో కలిసి పంపిణీ చేశారు. ● రాపూరు మండల పరిధిలో 10,098 మంది పిల్లలకు గాను 9903 మందికి మాత్రలు వేశామని వేపినాపి వైద్యాధికారి పేర్కొన్నారు. మిగిలిన వారికి 24న రెండో విడత నిర్వహిస్తామని ప్రత్యేక పరిశీలకులు రామ్మోహన్ పేర్కొన్నారు.

కోడూరు గురుకుల పాఠశాలలో విద్యార్థినికి మాత్ర వేస్తున్న వైద్యురాలు, పక్కన వైద్యాధికారి ఖాదర్‌వలి

నల్లబ్యాడ్జీలతో వీఆర్వోల నిరసన

గూడూరు పట్టణం, బుచ్చి, న్యూస్‌టుడే: వీఆర్వోలు పని ఒత్తిడి తగ్గించాలని పట్టణంలోని తహసీల్దారు కార్యాలయం వద్ద వీఆర్వో అసోసియేషన్ నాయకులు ఆధ్వర్యంలో నల్లబ్యాడ్జీలతో మంగళవారం నిరసన వ్యక్తం చేసి, తహసీల్దారు ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ సర్వేలు, రెవెన్యూ పనులు రెండు చేయాలంటే ఇబ్బందులున్నాయని చెప్పారు. ఆ సంఘం నాయకులు రాధాకృష్ణయ్య, శివకుమార్, హనుమంతయ్య తదితరులు పాల్గొన్నారు. ● కొన్నేళ్లుగా గ్రామాల్లో పనిచేస్తున్న గ్రామ రెవెన్యూ సహాయకులకు పదోన్నతులివ్వాలని బుచ్చి తహసీల్దారుకు ఆ సంఘం నాయకులు వినతిపత్రం ఇచ్చారు.

గూడూరు తహసీల్దారుకు వినతిపత్రం అందిస్తున్న వీఆర్వోలు

వ్యసనాలకు బానిసై.. వృద్ధుడిని హతమార్చి

నాలుగు గ్రాముల బంగారం కోసమే దారుణానికి పాల్పడిన నిందితుడి అరెస్టు

చిల్లకూరు, న్యూస్‌టుడే: మద్యం, జూదం, క్రికెట్ బెట్టింగ్, ఇతర వ్యసనాలకు ఆటోడ్రైవర్ అప్పుల పాలయ్యాడు.. కొన్ని రోజులుగా వృద్ధుడు పొలాలను పశువులను తీసుకెళుతుండగా గమనించాడు.. అతని వద్ద నాలుగు గ్రాముల బంగారం కోసం వృద్ధుడిని హతమార్చి చేతిలో ఉన్న ఉంగరం తీసుకొని పరారయ్యాడు. చిల్లకూరు మండలం నెలబల్లిరెట్టపల్లిలో నాలుగు రోజుల క్రితం జరిగిన హత్యకేసును పోలీసులు ఛేదించారు. స్థానిక పోలీసు స్టేషన్‌లో సీఐ శేఖర్‌బాబు, ఎస్సై సురేష్‌బాబుతో మంగళవారం వివరాలు వెల్లడించారు.. . గ్రామానికి చెందిన ఏడెం రమణారెడ్డి (84) పశువులను మేపేందుకు వెళ్లి ఈనెల 13న హత్యకు గురైన విషయం తెలిసిందే. మృతుడి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు. అదే గ్రామానికి చెందిన పసుపులేటి శ్రీనివాసులుపై అనుమానంతో అదుపులోకి తీసుకున్నారు. నిందితుడు ఆటో నడుపుతూ, పందులను పెంచుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. వృద్ధుడి చేతిలో ఉన్న బంగారు ఉంగరంపై కన్నేశాడు. పథకం ప్రకారం కర్రతో వృద్ధుడి తలపై బలంగా కొట్టాడు. చనిపోయాడని నిర్ధారించుకొని చేతి వేలికి ఉన్న నాలుగు గ్రాముల ఉంగరాన్ని తీసుకెళ్లాడు. గూడూరులోని ఓ నగల దుకాణంలో కుదువపెట్టి రూ.30 వేలు తీసుకున్నారు. అదే సొమ్ముతో తనఖాలో ఉన్న తన బైకును విడిపించుకున్నాడు. క్లూస్‌టీం సిబ్బంది సహకారంతో పోలీసులు తమదైన శైలిలో విచారించగా నిందితుడు నేరాన్ని అంగీకరించాడు. చోరీ చేసిన ఉంగరాన్ని రికవరీ చేశారు. నిందితుడిని అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచినట్లు సీఐ తెలిపారు.

చిల్లకూరులో వివరాలు వెల్లడిస్తున్న సీఐ శేఖర్‌బాబు

అక్షరమే ఆయుధం

మోసాలకు కళ్లెం!

న్యూస్‌టుడే, పొదలకూరు రూరల్, ముత్తుకూరు

ప్రస్తుత సమాజంలో గౌరవింపబడాలన్నా.. పేరు ప్రఖ్యాతులు పొందాలన్నా అది విద్యతోనే సాధ్యం.. ఒక్క మాటలో చెప్పాలంటే పేదరికాన్ని సులువుగా జయించి ఉన్నత స్థానాలకు చేరడానికి ఏకైక అర్హత ప్రామాణికం విద్య. కానీ సుమారు యాభై ఏళ్ల కిత్రం నాటి పరిస్థితులతో చాలా మంది నిరక్షరాస్యులుగా మిగిలారు. ఫలితంగా చిన్నపాటి అవసరాల కోసం ఇతరులపై ఆధారపడడం మనం చూస్తున్నాం. వీరందరి కోసం ప్రభుత్వం 'అక్షర ఆంధ్ర' పేరిట అక్షరాలు దిద్దిస్తూ, వారిలో చైతన్యాన్ని నింపుతోంది.

తోటపల్లిగూడూరులో సాధన చేస్తున్న వయోజనులు

● రాష్ట్రంలో వంద శాతం అక్షరాస్యతే లక్ష్యంగా ప్రతి ఒక్కరిని విద్యావంతులుగా తీర్చిదిద్దేందు ప్రభుత్వం 'ఉల్లాస్ అక్షర ఆంధ్ర' కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. గ్రామాల్లో వయోజన విద్యను ప్రోత్సహిస్తూ మహిళా సమాఖ్య, ఉపాధిహామీ పథకాల్లో ఉన్న నిరక్షరాస్యులను గుర్తించి పది మంది వయోజనులకు ఒక వాలంటీర్ ద్వారా శిక్షణ ఇచ్చే ఏర్పాట్లు చేస్తున్నారు. అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవాన్ని పురస్కరించుకుని సెప్టెంబరు 8న ఈ కార్యక్రమాన్ని రాష్ట్ర వ్యాప్తంగా ప్రారంభించారు. చదువురాని వయోజనులకు వంద గంటల పాటు నిర్దేశించిన అంశాలపై శిక్షణ ఇస్తారు.

● నోడల్ అధికారి మస్తాన్‌రెడ్డి మాట్లాడుతూ. .జిల్లాలో ఈ ఏడాది లక్ష మంది వయోజనులను అక్షరాస్యులుగా మార్చేందుకు ప్రభుత్వం లక్ష్యం నిర్దేశించిందన్నారు. ఆయా గ్రామాల్లో వాలంటీర్లు క్షేత్ర స్థాయిలో శిక్షణ ఇస్తున్నారు. వారు నేర్చుకున్న అంశాలపై మార్చి 29న పరీక్ష నిర్వహించి ధ్రువపత్రాలు అందజేస్తామన్నారు. సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.

ఉపయోగాలివి..

మహిళా సమాఖ్య, యానిమేటర్లు సాయంత్రం వేళ గ్రూపు సభ్యుల్లో గుర్తించిన వయోజనులకు పాఠాలు చెబుతారు. ప్రాథమిక అక్షరాస్యత, డిజిటల్ విద్య, ఆర్థిక విద్య, జీవన నైపుణ్యాలపై తరగతులు నిర్వహిస్తారు. పెద్దలకు అక్షరాలను సులభంగా గుర్తించడం, రాయడం, చదవడం, నేర్పిస్తారు. బయటకు వెళ్లినపుడు ఒకరిపై ఆధారపడకుండా గ్రామాల పేర్లు, బోర్డులపై ఉన్న అక్షరాలు, దినపత్రికలు చదవగలుగుతారు. సంతకాలు చేయగలిగే సామర్థ్యంతో పాటు మోసగాళ్ల నుంచి కాపాడుకోవచ్చు. రాష్ట్రాన్ని అక్షరాస్యతలో అగ్రగామిగా లేదా ఒకటి నుంచి మూడు స్థానాల్లో నిలబెట్టే దిశగా అడుగులు వేస్తున్నారు. మండల స్థాయిలో ఎంపీడీవో, ఎంఈవో, ఏపీఎం, ఏపీవోల ద్వారా పర్యవేక్షిస్తున్నారు.

నియోజకవర్గాల వారీగా వయోజనుల వివరాలు

గూడూరు	6650
సర్వేపల్లి	12405
కోవూరు	16701
వెంకటగిరి	6280

ఆర్టీసీ బస్సు ఢీకొని ఇద్దరికి గాయాలు

కోవూరు, న్యూస్‌టుడే: ఆర్టీసీ బస్సు స్కూటీని వెనుక నుంచి ఢీకొట్టడంతో ఇద్దరికి తీవ్రగాయాలైన ఘటన కోవూరులో మంగళవారం జరిగింది. స్థానికుల సమాచారం మేరకు.. కోవూరులోని జాతీయ రహదారి ఆకాశ వంతెన సమీపంలో లారీ యార్డు వద్ద సర్వీసు రోడ్డుపై నెల్లూరు నుంచి కావలికి వెళుతున్న ఆర్టీసీ అద్దె బస్సు నెల్లూరు నుంచి రేగడి చెలిక వైపు వెళుతున్న స్కూటీని వెనుక వైపు నుంచి ఢీకొట్టడంతో స్కూటీపై ఉన్న ఇద్దరు వ్యక్తులకు గాయాలయ్యాయి. స్థానికులు గమనించి 108కు సమాచారమివ్వడంతో గాయపడిన వారిని నెల్లూరుకు తరలించారు.

ఇంటి ఎదుట నిలిపిన బైకు దహనం

పొదలకూరు, న్యూస్‌టుడే : మొన్న విద్యుదాఘాతానికి గురి చేయగా.. సోమవారం రాత్రి ఇంటి ఎదుట నిలిపిన వాహనాన్ని పెట్రోలుపోసి దహనం చేసిన సంఘటన తాటిపర్తి గ్రామంలో జరిగింది. గ్రామంలో సెలూన్ దుకాణం నిర్వహిస్తూ రమణయ్య జీవిస్తున్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ.. తనపై ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు కక్ష కట్టి ఇబ్బందులు పెడుతున్నారని వాపోయారు. రెండు రోజుల క్రితం తాను రాత్రి ఇంట్లో నిద్రిస్తుంగా గడియకు విద్యుత్తు ప్రవహించేలా తీగలు ఏర్పాటు చేశారని, తెలియక తన భార్య ప్రభావతి తాకడంతో అస్వస్థతకు గురైనట్లు తెలిపారు. రాత్రి ఇంటి ముందు నిలిపిన ద్విచక్ర వాహనాన్ని పెట్రోలు పోసి నిప్పంటించారని వాపోయారు. ఎస్సై హనీఫ్ సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

వ్యర్థాలు... ప్రయాణికుల అవస్థలు

వెంకటాచలం- ముత్తుకూరు ప్రధాన రహదారి పక్కన భారీ ఎత్తున వ్యర్థాలు వేస్తున్నారు. బయట ప్రాంతాల నుంచి వెంకటాచలం, సర్వేపల్లి గ్రామాల మధ్యన కోళ్లు, మెడికల్ వ్యర్థాలతో పాటు ప్లాస్టిక్ కవర్లు, ఇతర వస్తువులు వాహనాల్లో తెచ్చి పడేస్తున్నారు. అధికారులు స్పందించి వ్యర్థాలు తొలగించడంతో పాటు, మళ్లీ వేయకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, వెంకటాచలం

మహిళ అదృశ్యంపై ఫిర్యాదు

రాపూరు, న్యూస్‌టుడే: మండల పరిధిలోని ఆకిలివలసకు చెందిన మహిళ అదృశ్యమైనట్లు కుటుంబ సభ్యులు మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు పేర్కొన్నారు.

ప్రకటన

ఇందుమూలముగా యావన్మందికి తెలియజేయడమేమనగా నా క్లయింటు అయిన **మాలపాటి పద్మ భర్త మాలపాటి ఓబులురెడ్డి,** రాపూరు రోడ్డు, పొదలకూరు గ్రామం మరియు మండలము, నెల్లూరు జిల్లా. నా క్లయింటు ఒరిజినల్ రిజిష్టరు డాక్యుమెంటు నెం. 3484/2025 సంబంధించిన ఒరిజినల్ రిజిష్టరు లింకు డాక్యుమెంటు నెం. 415/1992 తేది: 6-2-2026న నా క్లయింటు పొదలకూరు గ్రామం దగ్గర జెరాక్స్ తీసుకొని మోటర్‌బైకులో నా క్లయింటు ఇంటికి పోవుచుండగా మార్గమధ్యలో పోయినది. ఈ ఒరిజినల్ రిజిష్టరు లింక్ డాక్యుమెంటు ఎవ్వరికైనా దొరికిన యెడల ఈ క్రింది అడ్రసుకు తెలిపి తగిన పారితోషికం పొందగలరు.

Sk. Fuhaid Ahmad, B.Com., L.L.B., Advocate, Meclines Road, Kotamitta, Nellore. Cell: 99080 54415.

నెల్లూరు

•నెల్లూరు •నెల్లూరు గ్రామీణం

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి

కిరణ్‌కుమార్‌ను సత్కరిస్తున్న ఎన్జీవోస్ నాయకులు

నెల్లూరు(కలెక్టరేట్), న్యూస్‌టుడే: ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం చేయడంలో కృషి చేస్తానని నూతనంగా ఎన్నికైన ఏపీ ఎన్జీవోస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కిరణ్‌కుమార్ తెలిపారు. మంగళవారం నెల్లూరులోని ఎన్జీవో భవనంలో జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బందరు పల్లి వెంకటేశ్వర్లు, గాదిరాజు రామకృష్ణ ఆధ్వర్యంలో శాలువాలు కప్పి పూలమాలలు, బొకేలు అందించి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు రమణారెడ్డి, ఆంజనేయవర్మ, ఆక్కులు పెంచలయ్య, రాజేంద్ర తదితరులు పాల్గొన్నారు.

400 కేజీల నిషేధిత ప్లాస్టిక్ స్వాధీనం

రూ.1.40 లక్షల జరిమానా

ప్లాస్టిక్‌ను స్వాధీనం చేసుకుంటున్న అధికారులు

నెల్లూరు(టౌన్), న్యూస్‌టుడే: నెల్లూరు నగరపాలక సంస్థ కమిషనర్ వైఓ నందన్ ఆదేశాల మేరకు ప్రజారోగ్య విభాగం అధికారులు నగరంలోని పలు హోల్‌సేల్ దుకాణాల్లో మంగళవారం ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. చిన్నబజారు, పెద్దబజారు, కూరగాయల మార్కెట్ తదితర ప్రాంతాల్లోని తనిఖీలు చేసి దాదాపు 400 కేజీల నిషేధిత ప్లాస్టిక్ ఉత్పత్తులను స్వాధీనం చేసుకున్నారు. దుకాణాల యజమానులకు రూ.1.40 లక్షలు జరిమానా విధించారు. ఈ సందర్భంగా ఆరోగ్యాధికారి డాక్టర్ దినేష్ మాట్లాడుతూ పర్యావరణం, ప్రజారోగ్యానికి హాని కలిగించే 125 మైక్రాన్ల కన్నా తక్కువ మందం కలిగిన ప్లాస్టిక్ విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. శానిటరీ సూపర్‌వైజర్ షరీఫ్, సిబ్బంది పాల్గొన్నారు.

స్వచ్ఛ సర్వేక్షణ్‌పై ప్రజలకు అవగాహన

నెల్లూరు(నగరపాలకసంస్థ), న్యూస్‌టుడే: నగరంలోని 54 డివిజన్లలో విధులు నిర్వహిస్తున్న పబ్లిక్‌హెల్త్ కార్మికులు నగరపాలకసంస్థ అందించిన రక్షణ ఉపకరణాలను తప్పనిసరిగా వినియోగించాలని కమిషనర్ వైఓ నందన్ సూచించారు. మంగళవారం కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ నియమించిన నాలెడ్జ్ పార్ట్‌నర్ అయిన ఆలిండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ లోకల్ సెల్ఫ్ గవర్నమెంటు వారు పబ్లిక్ హెల్త్ వర్కర్లు, మేస్త్రీలకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఆరోగ్యాధికారి డాక్టర్ దినేష్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వహిస్తున్న స్వచ్ఛ సర్వేక్షణ్ కార్యక్రమంపై ప్రజలందరికీ అవగాహన కల్పించాలన్నారు. స్వచ్ఛ సర్వేక్షణ్‌లో నగరపాలకసంస్థకు ఉత్తమ ర్యాంకు వచ్చేలా ప్రతి ఒక్క సిబ్బంది కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్లు దొరసాని, రేవతి తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సరఫరాకు నేడు, రేపు అంతరాయం

నెల్లూరు(టౌన్), న్యూస్‌టుడే: నగరంలోని తోటపల్లి పంప్‌హౌస్‌లో ట్రాన్స్‌ఫార్మర్లను మారుస్తున్న కారణంగా మంచి నీటి సరఫరాలో అంతరాయం ఉంటుందని నగరపాలకసంస్థ ఎస్ఈ రహంతు జాని ప్రకటనలో తెలిపారు. బుధవారం సాయంత్రం నుంచి గురువారం ఉదయం వరకు 4, 5, 6, 7, 8, 9, 10 డివిజన్ల పరిధిలో నీటి సరఫరా ఉండదన్నారు. గురువారం సాయంత్రం నుంచి సరఫరా యథావిధిగా జరుగుతుందని ప్రజలు సహకరించాలని కోరారు.

మార్పు.. నిబంధనల కూర్పు

పది పరీక్షల్లో డిజిటల్ విధానంలో సీఎస్, డీవోల నియామకం

పదో తరగతి పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులు

గుర్తించిన పరీక్ష కేంద్రాలు : 174

పరీక్షల నిర్వహణ మార్చి 16 నుంచి ఏప్రిల్ 1 వరకు

హాజరవుతున్న విద్యార్థులు : 27,931

ఇన్విజిలేటర్లు : 1860

న్యూస్‌టుడే, నెల్లూరు (విద్య)

పదో తరగతి పరీక్షలను పక్కాగా, పారదర్శకంగా నిర్వహించేందుకు కూటమి ప్రభుత్వం మార్పులకు శ్రీకారం చుట్టింది. ఇన్విజిలేటర్లు, చీఫ్ సూపరింటెండెంట్లు (సీఎస్), డిపార్ట్‌మెంటల్ అధికారులు (డీఓ)లను డిజిటల్ విధానంలో నియమించనున్నారు. గతేడాది వరకు జిల్లా స్థాయిలోనే డీఈవోలు, డిప్యూటీఈవోలు ఈ ప్రక్రియ చేపట్టేవారు. ఈ ఏడాది రాష్ట్ర విద్యాశాఖ అధికారులు ఇన్విజిలేటర్లను నియమిస్తారు. టీచర్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్ (టిస్)లో నమోదు చేసిన ఉపాధ్యాయుల వివరాల ప్రకారం ఇన్విజిలేషన్ విధులు కేటాయించనున్నారు.

వీరికే మినహాయింపు

గతంలో ఇన్విజిలేటర్లుగా నియమితులైన ఉపాధ్యాయుల్లో కొందరు సాకులు చెబుతూ విధుల నుంచి తప్పించుకునేవారు. కొత్త విధానంలో అలా చేయడానికి వీలు కాదు. 60 ఏళ్లు నిండిన ఉపాధ్యాయులు, గర్భిణులు, బాలింతలు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి మాత్రమే పదో తరగతి పరీక్షల విధుల నుంచి మినహాయింపు ఇచ్చారు. గతంలో మాదిరిగా క్లోజ్ బాధ్యులు, సస్పెన్షన్‌లో ఉన్నవారిని విధుల్లోకి తీసుకోరు. పరీక్ష సక్రమంగా జరిగేందుకు జంబ్లింగ్ విధానంలో విధులు కేటాయిస్తారు.

ప్రైవేటు ఉపాధ్యాయులకు..

కొన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులు పదో తరగతి పరీక్షల విధులకు వెళ్లడంతో నిర్వహణ కష్టంగా ఉండేది. దాంతో ఎస్జీటీలకు పూర్తిగా మినహాయింపు ఇచ్చారు. పాఠశాల సహాయకులు, వ్యాయామ ఉపాధ్యాయులను మాత్రమే ఇన్విజిలేటర్లుగా నియమించనున్నారు. తొలిసారిగా ప్రైవేటు పాఠశాలల ఉపాధ్యాయులకూ అవకాశం కల్పిస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

రూ.1.29 కోట్లతో 13 ట్రాన్స్‌ఫార్మర్లు

విద్యుత్తు అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి

నెల్లూరు(టౌన్), న్యూస్‌టుడే: ప్రజా బాటలో భాగంగా బుజబుజనెల్లూరుకు వచ్చినప్పుడు ప్రజలు లోవోల్టేజీ సమస్యను నెల్లూరురూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి దృష్టికి తీసుకురాగా.. వెంటనే అధికారులతో మాట్లాడి రూ.1.29 కోట్లతో 13 నూతన ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు చేశారని తెదేపా నాయకులు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం 25వ డివిజన్ బుజబుజనెల్లూరులో రూ.1.29 కోట్ల వ్యయంతో విద్యుత్తు అభివృద్ధి పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ నరసింహారి, రూరల్ ఎమ్మెల్యే కార్యాలయ ఇన్‌ఛార్జి చక్రవర్తిరెడ్డి, నాయకులు రమణయ్య, మాతంగి కృష్ణ, సాయిబాబా తదితరులు పాల్గొన్నారు.

ప్రజా దర్బార్‌లో 164 వినతులు

వినతులు స్వీకరిస్తున్న అధికారులు

నెల్లూరు(టౌన్), న్యూస్‌టుడే: మంత్రి నారాయణ ఆదేశాల మేరకు నగరపాలకసంస్థ ఆధ్వర్యంలో మంగళవారం నగరంలోని పప్పులవీధి, బాలాజీనగర్, దాకిలివీధి, ఇసుకడొంక ప్రాంతాల్లో ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రత్యేకాధికారులు హిమబిందు, వాసుబాబు, శ్రీనివాసరెడ్డి, భానుప్రతాప్ పాల్గొని ప్రజల నుంచి 164 వినతులు స్వీకరించారు. పౌరసేవలు, పన్నులు, రోడ్లు, విద్యుద్దీపాలు, కాలువల నిర్మాణం తదితర అంశాలతో పాటు నగర పింఛన్లు, ఇంటి స్థలాలకు పెద్దఎత్తున వినతులు వస్తున్నాయని తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్ కిన్నెర మాల్యాద్రి, నాయకులు సుజాత, హుస్సేన్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఆస్తి పన్ను వసూలుకు స్పెషల్ డ్రైవ్

మాట్లాడుతున్న కమిషనర్ నందన్

నెల్లూరు(నగరపాలకసంస్థ), న్యూస్‌టుడే: ఈ ఆర్థిక సంవత్సరానికి కేవలం 42 రోజులే మిగిలి ఉండటంతో, రెవెన్యూ సిబ్బంది అంతా ఆస్తి పన్నుల వసూలు చేసేలా దృష్టి పెట్టాలని కమిషనర్ వైఓ నందన్ ఆదేశించారు. మంగళవారం కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్‌ సెంటర్‌లో రెవెన్యూ విభాగంతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మొండి బకాయిదారుల జాబితాలోని వారిని నేరుగా కలిసి పన్నులు వసూలయ్యేలా చూడాలన్నారు. తద్వారా రూ.20కోట్ల ఆస్తి పన్ను వసూలవుతుందని పేర్కొన్నారు. ఉద్యోగులు, సిబ్బంది స్పెషల్ డ్రైవ్ చేపట్టాలని ఆదేశించారు. ఈ సమావేశంలో డిప్యూటీ కమిషనర్ చెన్నుడు, రెవెన్యూ అధికారుల సమద్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రవ్యాప్తంగా దర్గాల్లో నిత్యాన్నదానం

కమిటీలకు నియామక పత్రాలు అందిస్తున్న ఛైర్మన్ అబ్దుల్ అజీజ్

నెల్లూరు(టౌన్), న్యూస్‌టుడే: వక్ఫ్ స్థలాలు పేదవారికి ఉపయోగపడేలా ప్రణాళికలు రూపొందించి ముందుకెళుతున్నట్లు వక్ఫ్‌బోర్డు రాష్ట్ర ఛైర్మన్ అబ్దుల్ అజీజ్ తెలిపారు. మంగళవారం నెల్లూరులోని నివాసంలో కోటమిట్ట షాదీమంజిల్ కమిటీతో పాటు ప్రసిద్ధ మసీదులైన అక్సాస్ అలీ ఖాన్, జామియా, నూరే మదీనా నూతన కమిటీలను నియమించి సభ్యులతో సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ దర్గాలు, మసీదుల నుంచి వచ్చే ఆదాయ వనరులు ముస్లిం పేద బిడ్డల చదువులకు, ఆడ బిడ్డల వివాహాలకు ఉపయోగించాలని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న పెద్ద దర్గాల్లో నిత్యాన్నదానం ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. బారా షహీద్ దర్గా, కోటమిట్ట షాదీమంజిల్‌లో మరో రెండు స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. కార్పొరేటర్ కరిముల్లా, నాయకులు ఇంతియాజ్, మొయినుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగి తాత్కాలికంగా సస్పెన్షన్

నెల్లూరు(టౌన్), న్యూస్‌టుడే: నగరంలోని కోదండనగర్ వార్డు సచివాలయ అడ్మిన్ కార్యదర్శి దీపుల రాజశేఖర్‌ను తాత్కాలికంగా సస్పెండ్ చేస్తూ నగర పాలకసంస్థ కమిషనర్ వైఓ నందన్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. మెడికల్ లీవ్‌లో ఉన్న రాజశేఖర్ విధులకు తిరిగి హాజరుకావాలని నోటీసులు జారీ చేసినా.. ఇప్పటి వరకు రాకపోవడంతో సస్పెన్షన్ విధించినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ఇక్కడ జర భద్రం!

నగరంలోని మినీ బైపాస్ రోడ్డు బీవీ నగర్ కూడలి నుంచి కేబీఆర్ వీధికి వెళ్లే చోట తాగునీటి పథకం సంప్ ప్రమాదకరంగా ఉంది. దీనిపై సిమెంట్ అచ్చులు పడిపోయి పెద్ద గుంతగా ఉంది. సంప్ రోడ్డు పక్కనే ఉండడంతో వాహనదారులు ఏమాత్రం ఆదమరిచినా గుంతలో పడిపోవాల్సిందే. అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. -న్యూస్‌టుడే, నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట)

రోడ్డు తవ్వారు.. పూడ్చడం మరిచారు

నగరంలోని పొదలకూరు రోడ్డు నిప్పో సెంటర్ వద్ద తాగు నీటి పైపులైను లీకవుతున్న నేపథ్యంలో మరమ్మతులు చేసేందుకు రహదారిని పగులగొట్టారు. నెల రోజులు గడిచినా గుంతలను సక్రమంగా పూడ్చకపోవడంతో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. -న్యూస్‌టుడే, నెల్లూరు(పద్మావతి సెంటర్)

టైల్స్‌ఊడి.. కుంగిపోయి

నెల్లూరు సౌత్ రైల్వేస్టేషన్‌లో ప్లాట్‌ఫారం అధ్వానంగా ఉంది. మూడో రైల్వేట్రాక్ నిర్మించినపుడు ఇక్కడ ప్లాట్‌ఫారం ఏర్పాటు చేశారు. ప్రస్తుతం కొన్నిచోట్ల కుంగి టైల్స్ ఊడిపోయాయి. పెద్దగా రైళ్లు ఆగకపోయినా ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుంటారు. అధికారులు పరిశీలించి మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు. - న్యూస్‌టుడే, నెల్లూరు(మార్కెట్ సెంటర్)

ప్రయాణం.. ప్రమాదకరం

భవన నిర్మాణ కార్మికులు కూలీ పనులకెళితేనే.. జీవన నావ సాగుతుంది. వీరు పనుల కోసం వెళ్లే సమయంలో వాహనాలపై ప్రమాదకరంగా ప్రయాణిస్తున్నారు. మంగళవారం ట్రాక్టరులో భవన నిర్మాణ సామగ్రితో పాటు దానిపై కూర్చొని జొన్నవాడ మార్గంలో పనులకు వెళుతున్నారు. ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా ప్రమాదం జరిగే అవకాశం ఉంది. - ఈనాడు, నెల్లూరు

పేరుకుపోయిన పూడిక.. మురుగు కదలక

నెల్లూరు నగరంలోని ఫత్తేఖాన్ పేట రైతు బజార్ వద్ద కాలువలో పూడిక పేరుకుపోయింది. మురుగు ముందుకు కదలక భరించలేని దుర్వాసనతో అల్లాడుతున్నామని అక్కడి ప్రజలు వాపోయారు. నగరపాలక అధికారులు స్పందించి పూడిక తీయించాలని స్థానికులు కోరుతున్నారు. -న్యూస్‌టుడే, నెల్లూరు(పద్మావతిసెంటర్)

నేడు పరిష్కార వేదిక ప్రత్యేక కార్యక్రమం

నెల్లూరు(విద్యుత్తు): ఏపీఎస్‌పీడీసీఎల్ ఆధ్వర్యంలో పారిశ్రామిక విద్యుత్తు వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక ప్రత్యేక కార్యక్రమం బుధవారం ఉదయం 10.30 నుంచి 11.30 గంటల వరకు నెల్లూరు ఎస్ఈ కార్యాలయంలో జరగనుంది. పారిశ్రామిక వినియోగదారులు పాల్గొని సమస్యలను పరిష్కరించుకోవచ్చు. 1912 లేదా 9133331912 వాట్సప్ ద్వారా విద్యుత్తు సమస్యలను తెలపాలని అధికారులు వివరించారు.

ఇంటర్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

నెల్లూరు(విద్య), న్యూస్‌టుడే : జిల్లాలో త్వరలో జరగనున్న ఇంటర్ పబ్లిక్ పరీక్షలను విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా పకడ్బందీగా నిర్వహించాలని ది పేరెంట్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నాయకులు నరహరి పేర్కొన్నారు. మంగళవారం ఆర్ఐవోకు వినతి పత్రం ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ పరీక్ష కేంద్రాల వద్ద గట్టి బందోబస్తు ఏర్పాటు చేయాలని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులరెడ్డి, రాజశేఖర్, మున్నా పాల్గొన్నారు.

త్యాగరాజ మందిరంలో ఏకాంత సేవ

మందిరంలో పూజలు

నెల్లూరు (సాంస్కృతికం), న్యూస్‌టుడే: వేదాయపాలెంలోని త్యాగరాజ మందిరంలో శివరాత్రి మహోత్సవాలు వేడుకగా జరుగుతున్నాయి. మంగళవారం స్వామివారికి విశేష అలంకరణ చేసి ఏకాంత సేవ నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు చేపట్టారు. అన్న ప్రసాద వితరణ చేశారు.

రథంపై నీలకంఠేశ్వరస్వామి అభయం

రథోత్సవంలో భక్తులు

నెల్లూరు(సాంస్కృతికం), న్యూస్‌టుడే: అన్నపూర్ణ సమేత నీలకంఠేశ్వరస్వామి మంగళవారం రథంపై ఊరేగారు. నగరంలోని మూలాపేట దేవస్థానం నుంచి స్వామి వారి రథోత్సవం ప్రారంభమైంది. ముందుగా ఆలయ ప్రధాన అర్చకులు సాయిస్వామి పూజలు నిర్వహించారు. ఆలయ ఛైర్మన్ వెంకటేశ్వర్లు ఉత్సవాన్ని ప్రారంభించారు. స్వామి వారి మాడవీధుల్లో రథంపై ఆదిదంపతులు భక్తులకు దర్శనమిస్తూ ముందుకు సాగారు.

జేఈఈ మెయిన్స్‌లో విద్యార్థుల విజయకేతనం

నెల్లూరు(విద్య): జిల్లాలోని పలు ప్రైవేట్ జూనియర్ కళాశాలల్లో చదివిన విద్యార్థులు జేఈఈ మెయిన్స్‌లో ఉత్తమ పర్సంటైల్ సాధించారు. వారిని ఆయా విద్యాసంస్థల ప్రతినిధులు, ప్రిన్సిపళ్లు అభినందించారు.

నారాయణ విజయ ప్రస్థానం: పోటీ పరీక్షలు ఏవైనా నారాయణ విద్యార్థులే అగ్రస్థానం అని ఆ విద్యాసంస్థల జీఎం విజయభాస్కర్‌రెడ్డి పేర్కొన్నారు. ఆయన మాట్లాడుతూ 27 మంది 99 పర్సంటైల్, 49 మంది 98, 64 మంది 97, 110 మంది 95 పర్సంటైల్ సాధించారని తెలిపారు.

డాక్టర్ కిషోర్స్ రత్నం జూనియర్ కళాశాల: విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారని ఆ విద్యాసంస్థల జీఎం రామ్మూర్తినాయుడు పేర్కొన్నారు. ఆయన మాట్లాడుతూ కె.వెంకట జీవితేష్ 99.055, వి.గౌతమ్‌రెడ్డి 98.68, డి.భానుప్రకాష్ 97.58 పర్సంటైల్.. ఇలా 20 మంది విద్యార్థులు సాధించారని తెలిపారు.

ఓవెల్ జూనియర్ కళాశాల: నగరంలోని కళాశాల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారని ఆ విద్యాసంస్థల ఛైర్మన్ వేణు పేర్కొన్నారు. ఆయన మాట్లాడుతూ అనిర్విన్య వర్ధన్‌రెడ్డి 99.58, కె.జోయల్ సుభాష్ 99.23, ఎన్.ధనుంజయ్‌రెడ్డి 99.10, వై.సాయిసాత్విక్ 99.09 పర్సంటైల్.. ఇలా 27 మంది సాధించారని తెలిపారు.

విశ్వసాయి జూనియర్ కళాశాల: విద్యార్థులు జాతీయ స్థాయిలో ఉత్తమ పర్సంటైల్ సాధించారని ఆ విద్యాసంస్థల ఛైర్మన్ సత్యనారాయణ పేర్కొన్నారు. శరణ్య 97.42 పర్సంటైల్, జి.మహీంద్రారెడ్డి 95.58, పి.గుణసాయి 94.98, బి.శ్రీనివాసులు 94.54, కె.లాస్యలహరి 94.5 పర్సంటైల్ సాధించారని తెలిపారు. 36 మంది 90 పర్సంటైల్‌కు పైగా సాధిచారని తెలిపారు.

శ్రీచైతన్య విద్యార్థులు: శ్రీచైతన్య విద్యార్థులు ఉత్తమ పర్సంటైల్ సాధించారని ఆ విద్యాసంస్థల ఏజీఎం శ్రీరామ్ పేర్కొన్నారు. 12 మంది 95 పర్సంటైల్‌కు పైగా, 18 మంది 90కి పైగా, 102 మంది 85 పర్సంటైల్‌కు పైగా సాధించారని తెలిపారు.

అవగాహన సదస్సు

నెల్లూరు(విద్య), న్యూస్‌టుడే : నగరంలోని డీకే ప్రభుత్వ మహిళా కళాశాలలో మంగళవారం పీఎం విశ్వకర్మ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఎస్ఎంఈ డైరెక్టర్ వీరయ్య మాట్లాడుతూ నిరుద్యోగ యువతకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పలు పథకాల ద్వారా ఉపాధి అవకాశాలు చూపుతున్నాయని వీటిని వినియోగించుకోవాలని తెలిపారు. అభ్యర్థులకు పలు వృత్తుల పనిముట్లు అందజేశారు. కార్యక్రమంలో ఏపీఎస్ఎస్‌డీసీ జిల్లా మేనేజర్ అబ్దుల్ ఖయ్యూం, ఐపీపీఎస్ మేనేజర్ సుధాకర్, డీపీఎం మధుసూదన్, విశ్వబ్రాహ్మణ సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకటశేషయ్య, శ్రీనివాసులు, రవిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఆదిశంకరుడి మార్గం అనుసరణీయం

ఉపన్యాసకులు శ్రీనివాసరావును సత్కరిస్తున్న నిర్వాహకులు

నెల్లూరు(మార్కెట్ సెంటర్), న్యూస్‌టుడే: ఆదిశంకరాచార్యులు చూపించిన ఆధ్యాత్మిక మార్గం అనుసరణీయమని గుంటూరు హిందూ కళాశాల ఆంగ్ల ఉపన్యాసకులు బ్రహ్మశ్రీ శ్రీనివాసరావు అన్నారు. నెల్లూరు పొగతోటలోని ఆదిశంకర ధ్యాన మందిరంలో మంగళవారం శంకరాద్వైత మత సిద్ధాంత ప్రకటన పర్వదినాన్ని ఘనంగా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఉత్తరాఖాండ్‌లో ఉన్న త్రివేణి సంగమ తీరంలో ఆదిశంకరాచార్యులు అద్వైత మత సిద్ధాంతాన్ని ప్రకటించారని చెప్పారు. కార్యక్రమంలో ఆదిశంకర ధ్యాన మందిర మేనేజింగ్ ట్రస్టీ ఆనందకుమార్ గిరిజాల లక్ష్మి, వరప్రసాదరావు, ఉదయరాణి, సుజాత, వెంకటప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా!

(10 AM to 1 PM)
నెల్లూరు, గ్రామీణం
80085 50332
80085 74001

సమస్య: నగరంలోని రంగనాయకులపేట మెయిన్ రోడ్డులో కుక్కలు ఎక్కువగా ఉన్నాయి. రాత్రి పూట గుంపులుగా తిరుగుతున్నాయి. రద్దీగా ఉండే ప్రాంతం కావడంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. – సుధీర్‌బాబు

సమాధానం: సిబ్బందిని పంపి కుక్కలను పట్టించేందుకు వెంటనే చర్యలు చేపడతాం.

– డాక్టర్ మదన్‌మోహన్, వెటర్నరీ అధికారి

? మనుమసిద్ధినగర్‌లో కాలవలు శుభ్రం చేయడం లేదు. మురుగునీరు నిలిచి దుర్వాసన వస్తోంది. దోమలు వ్యాప్తి చెందుతున్నాయి. – నళిని

✓ కాలువలను శుభ్రం చేయిస్తాం.

– డాక్టర్ దినేష్, ఆరోగ్యాధికారి

– న్యూస్‌టుడే, నెల్లూరు(నగరపాలకసంస్థ)

ప్రణాళిక లేని పని.. వృథాగా నిధి

ముందస్తు చర్యలు తీసుకుంటే..

‘ నగరంలోని గోమతినగర్‌కు వెళ్లే మార్గంలో కొద్ది నెలలు కిందట రూ.35 లక్షలతో సీసీ రోడ్డును నిర్మించారు. మొక్కలు నాటేందుకు ముందస్తుగా గుంతలు ఏర్పాటు చేయలేదు. ప్రస్తుతం సిమెంట్ రోడ్డును పగులగొట్టి మొక్కలు నాటేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ఫలితంగా ప్రభుత్వ నిధులు వృథా అవుతున్నాయి. నగరంలోని పలు డివిజన్లలో ఇదే జరుగుతోంది. - న్యూస్‌టుడే, నెల్లూరు(నవాబుపేట) ’

బాలాజీనగర్‌లో సిమెంట్ రోడ్డు తవ్వి ఏర్పాటు చేసిన గుంత

నగర, గ్రామీణ నియోజకవర్గ పరిధిలోని డివిజన్లలో అవసరమైన చోట్ల సీసీ రోడ్ల నిర్మాణాలు విస్తారంగా జరుగుతున్నాయి. ఇదే సమయంలో పచ్చదనం పర్యావరణ పరిరక్షణలో భాగంగా నగర నియోజకవర్గ పరిధిలో గ్రీన్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నగరపాలక సంస్థ సహకారంతో డివిజన్‌కు సగటున రెండువేల మొక్కలు ప్రతి ఐదు మీటర్లకు ఒకటి నాటేలా పనులు జరుగుతున్నాయి. మొత్తంగా ఒక్క నెల్లూరు నగర నియోజకవర్గంలోనే 50వేల మొక్కలు నాటాలన్నదే లక్ష్యంగా పనులు జరుగుతున్నాయి.

మొక్కలు నాటేందుకు జేసీబీలతో కనీసం ఒకటిన్నర అడుగుల నుంచి రెండు అడుగుల పొడవు, వెడల్పుతో గుంతలు తీస్తున్నారు. కొన్ని చోట్ల గుంతలు తీసే సమయంలో పగుళ్లిచ్చి ఎక్కువభాగం రోడ్లు దెబ్బతింటున్నాయి. గుంతలు తీసిన తరువాత మళ్లీ సిమెంట్‌తో పూత పనులు చేస్తున్నారు. ఇలా గుంతలు తీయడం.. పూత పనుల కోసం రూ. లక్షలు ఖర్చవుతోంది. ముందస్తుగా కొద్దిపాటి జాగ్రత్త చర్యలు తీసుకుంటే నష్టం జరగకుండా చేయవచ్చని పర్యావరణ ప్రేమికులు చెబుతున్నారు. సీసీ రోడ్ల నిర్మాణం జరిగే సమయంలో పాత టైర్లను మొక్కలు నాటాలని గుర్తించిన చోట ఏర్పాటు చేస్తే సరిపోతుందని వారు పేర్కొంటున్నారు. ఇలా చేయడం వల్ల నేరుగా మొక్కలను నాటొచ్చని తెలిపారు. అధికారులు మొక్కలు నాటేందుకు ముందస్తు చర్యలు తీసుకుంటే మంచిదని నగర వాసులు కోరుతున్నారు.

బెల్టు దుకాణాలు అరికట్టాలి

నెల్లూరు(విద్య), న్యూస్‌టుడే : మద్యం ఏరులై పారుతున్నా, మహిళలు, బాలికలపై అత్యాచారాలు, హత్యలు జరుగుతున్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోక పోవడం దారుణమని ఐద్వా జిల్లా అధ్యక్షురాలు శివకుమారి అన్నారు. మంగళవారం నగరంలోని రామచంద్రరెడ్డి భవన్‌లో అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం జిల్లా కమిటీ విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత సూపర్ సిక్స్ అమలులో పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. మద్యం అమ్మకాల్లో ప్రభుత్వం ముందుందని తెలిపారు. కార్యక్రమంలో కార్యదర్శి మస్తాన్‌బీ, పద్మ, సుబ్బమ్మ, శంషాద్, ఎం.ప్రమీల, కాకు విజయమ్మ, సిహెచ్. సుజనా తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఐద్వా నాయకురాలు శివకుమారి

తెరపై ఈనాడు

పార్వీ సినిమాస్ (ఎం.1) షెడ్యూల్ : స్క్రీన్..1. మనసంతా నువ్వే (తెలుగు), ఆరంజ్ (తెలుగు) స్క్రీన్ 2.. ఫంకీ (తెలుగు) స్క్రీన్.3..కపుల్ ఫ్రెండ్లీ (తెలుగు) **పార్వీ సినిమాస్ (స్పైస్) :** స్క్రీన్.1..కపుల్ ఫ్రెండ్లీ (తెలుగు) స్క్రీన్ 2. సీతా పయనం (తెలుగు), క్రైమ్ 101 (ఇంగ్లిష్) స్క్రీన్ 3. ఓ రోమియో (హిందీ) స్క్రీన్ 4. 3 తెలుగు, లవ్ స్టోరీ (తెలుగు), విత్‌లవ్ (తెలుగు) స్క్రీన్.5.. ఫంకీ (తెలుగు) **రైన్ సినిమా షెడ్యూల్ :** స్క్రీన్..1. ఫంకీ (తెలుగు) స్క్రీన్ 2. కపుల్ ఫ్రెండ్లీ (తెలుగు) స్క్రీన్ 3. సీతా పయనం (తెలుగు), ఎర్రచీర (తెలుగు) నిలవే (తెలుగు)

ఓం

సంవత్సరీకము

స్వస్తిశ్రీ చాంద్రమానేన విశ్వావసు నామ సం॥ ఫాల్గుణ శుద్ధ పాఢ్యమి మా తల్లిగారైన కావలి సురేఖ గారి ఏడూడి

తేది: 18-02-2026 బుధవారము

పంక్తి : మధ్యాహ్నం 1 గం॥కు

నెల్లూరు, ముకుందాపురంలోని మా స్వగృహము నందు జరుగును. కావున తెలియజేయడమైనది.

కావలి సురేఖ గారు

భర్త : కావలి ఆనంద్ మోహన్‌రావు

ఇట్లు : కుమారులు : కావలి సత్యనారాయణ గుప్త, కావలి సందీప్‌కుమార్

(c) eenadu

విద్యార్థులతో ముచ్చటిస్తున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

విద్య, ఆరోగ్యం విద్యార్థులకు భాగ్యం

పుట్టపర్తి: విద్య, ఆరోగ్యం విద్యార్థులకు రెండు కళ్లు అని కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ పేర్కొన్నారు. మంగళవారం జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా మండల పరిధిలోని జగరాజుపల్లి ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అల్బెండజోల్ మాత్రలు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన కలెక్టర్ మాట్లాడుతూ 19 ఏళ్లలోపు పిల్లలంతా ఈ మాత్రలు తప్పనిసరిగా వేసుకోవాలన్నారు. జిల్లావ్యాప్తంగా అన్ని శాఖల సమన్వయంలో 1 నుంచి 19 సంవత్సరాలలోపు 3,66,225 మంది పిల్లలకు మాత్రలు 98.96 శాతం పంపిణీ చేసినట్లు వెల్లడించారు. 24న డీవార్మింగ్ మాత్రలు ఉచితంగా పంపిణీ చేయనున్నట్లు కలెక్టర్ చెప్పారు. అన్ని శాఖల సిబ్బంది సమన్వయంతో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో ఫైరోజాబేగం, డాక్టర్ సునీల్‌కుమార్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

'జిల్లేడుబండ' పనులు పూర్తి చేయండి: మంత్రి

ఈనాడు, అమరావతి : జిల్లేడుబండ రిజర్వాయర్ పనుల పురోగతిపై జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడుతో వైద్యారోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్ చర్చించారు. ఇప్పటికే ఆ ప్రాజెక్టు నిర్మాణానికి రూ.200 కోట్ల విడుదలకు పరిపాలన అనుమతులు వచ్చాయి. మిగిలిన నిధులు కూడా విడుదల చేసి త్వరితగతిన ప్రాజెక్టు పూర్తి చేయాల్సిందిగా సత్యకుమార్ యాదవ్ కోరారు.

ఆలోచన వెలిగింది..

బత్తలపల్లి నుంచి ధర్మవరం వెళ్లే మార్గంలో వేల్పుమడుగు వద్ద పెద్ద ఇటుక బట్టీ ఉంది. ఇక్కడ రాత్రి పగలు పనులు చేస్తూనే ఉంటారు. రాత్రి వేళ పనులు చేయడానికి విద్యుత్తు దీపాలను అమర్చాలి.. అన్ని విద్యుత్తు స్తంభాలు మంజూరు కష్టం. కానీ ఎలా? అతడికో ఉపాయం తట్టింది. తన స్థలంలో పెరుగుతున్న తాటిచెట్లను కోయించి ఇటుక బట్టీ చుట్టూ పాతించాడు. ఒక్కో చెట్టు పైన విద్యుత్తు దీపాల్ని అమర్చాడు. అక్కడక్కడ కొన్ని చెట్లుకు సీసీ కెమెరాలను అమర్చాడు. దీంతో పని నిరంతరం

కొనసాగుతోంది. ఎవరు ఏమేం పనులు చేస్తున్నారన్నది ఎప్పటికప్పుడు సీసీ కెమెరాల ద్వారా తెలుసుకుంటూ పర్యవేక్షిస్తున్నారు. **- ఈనాడు, అనంతపురం**

పవన విద్యుదుత్పత్తిలో మేటి.. సౌరశక్తిలో లేదు సాటి!

ఈనాడు, పుట్టపర్తి: పునరుత్పాదక ఇంధన వనరుల ఉత్పత్తిలో ఉమ్మడి జిల్లా దూసుకుపోతోంది. రాష్ట్రంలో సుమారు 70 వేల మెగావాట్ల సౌర, పవన, పంప్డ్ స్టోరేజ్ విద్యుత్తు ప్రాజెక్టుల నిర్మాణ పనులు వివిధ దశల్లో ఉండగా.. వాటిలో అత్యధికంగా రాయలసీమలోనే ఉన్నాయి. అందులోనూ ఉమ్మడి అనంత జిల్లాలో ఎక్కువగా ఉండటం విశేషం. శ్రీసత్యసాయి జిల్లాలో సౌర విద్యుత్తు ఉత్పత్తి కోసం రాష్ట్ర ప్రభుత్వం వివిధ కంపెనీలకు అనుమతులు మంజూరు చేసింది.

✤ మడకశిరలో చింతా పవర్ కంపెనీకి 4,000 మెగావాట్లు, పెనుకొండలో బండాడ గ్రూపునకు 1,000 మెగావాట్లకు ప్రభుత్వం అనుమతులు ఇచ్చింది. రిలయన్స్ గూగుల్ డాటా సెంటర్‌కు అమడగూరు ప్రాంతంలో లీజు ప్రాతిపదికన 30 వేల ఎకరాలు సేకరించడానికి సన్నాహాలు చేస్తోంది. ఇక్కడ 6,000 మెగావాట్ల సోలార్ విద్యుత్తు ఉత్పత్తి చేయాలని లక్ష్యంగా నిర్ణయించింది.

✤ ఓడీచెరువు, నల్లమాడ మండలాల్లో దాదాపు మరో 25,000 ఎకరాల్లో సోలార్ పార్కులు ఏర్పాటు కానున్నాయి. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం నంబులపూలకుంటలో 1,000 మెగావాట్ల సౌర విద్యుదుత్పత్తి చేస్తోంది. అదే మండలంలో మరో 700, రామగిరి, కనగానపల్లి మండలాల్లో 1,000 మెగావాట్ల ఉత్పత్తికి అనుమతులు మంజూరు చేసింది. దేశంలో ఎక్కడా లేనివిధంగా శ్రీసత్యసాయి జిల్లాలో దాదాపు 15 వేల మెగావాట్ల సౌరవిద్యుత్తు ఉత్పత్తి చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.

దేశంలోనే ప్రప్రథమంగా..

తాడిమర్రి మండలం పెద్దకోట్ల, దాడితోట గ్రామాల పరిధిలో రూ.5 కోట్లతో అదాని పవర్ 800 మెగావాట్ల పంప్డ్ స్టోరేజీ ప్రాజెక్టు నిర్మిస్తోంది. ఇది దేశంలోనే మొదటగా పనులు ప్రారంభమైన పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టుగా నిలిచింది.

వైకాపా హయాంలో ఒక్క మెగావాట్ లేదు..

2019-2024 సంవత్సరాల్లో ఒక్క మెగావాట్ యూనిట్ విద్యుత్తు ఉత్పత్తి జరగకపోవడం గమనార్హం. ఈ రంగాన్ని వైకాపా ప్రభుత్వం పూర్తిగా విస్మరించింది.

ఇక్కడే ఎందుకంటే..

పునరుత్పాదక ఇంధన వనరుల ఉత్పత్తికి అవసరమైన భూములు, మానవ వనరుల లభ్యతతోపాటు బెంగళూరు విమానాశ్రయం సమీపంలో ఉండటం, జాతీయ రహదారులు అందుబాటులో ఉండటం కలిసొస్తోంది. ప్రాజెక్టులు పూర్తయితే వేలాదిమందికి ఉపాధి లభిస్తుంది. శరవేగంగా ప్రగతి జరుగుతుంది.

పనులు చురుగ్గా సాగుతున్నాయి

పవన, సౌర విద్యుత్తు ప్రాజెక్టుల సంబంధించి అనుమతుల మంజూరు, భూసేకరణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. ప్రభుత్వం నిర్దేశించిన గడువులోపు లక్ష్యాలు సాధించేందుకు కృషి చేస్తున్నాం.

- శివశంకర్‌నాయుడు, పీడీ, నెడ్‌క్యాప్

అన్నీతానై.. అన్నదానం

హిందూపురంలో వైద్యుడి ఉదారత

పాత్రలు కడుగుతున్న రవిశంకర్

హిందూపురం సాంస్కృతికం, గ్రామీణం, న్యూస్‌టుడే: ఆయన వృత్తిరీత్యా డాక్టరేట్ అందుకున్న వైద్యుడు.. నిత్యం అన్నదానం చేయాలన్న తపన ఆయనను ఆధ్యాత్మిక మార్గం వైపు నడిపింది. కర్ణాటక శ్రీక్షేత్రం కైవారం తాత గురుసేవకుడిగా హిందూపురం పట్టణానికి చెందిన డాక్టర్ రవిశంకర్ పలు సేవా కార్యక్రమాలను చేపడుతూ పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారు. కైవారం సేవా ట్రస్టు నిర్వాహకులు ఎం.ఆర్.జయరాం, బాలకృష్ణ బాగోతర గురువుల ఆశీస్సులతో హిందూపురం శ్రీయోగినారాయణ సేవా సమితి అధ్యక్షుడిగా 2013లో చేరారు. 2019-20లో కరోనా ప్రభావం నేపథ్యంలో సమితి ద్వారా రోగులకు సేవలందించడంతో తమిళనాడుకు చెందిన ఓ సంస్థ ఇతడికి డాక్టరేటు పురస్కారం అందజేసింది. 2024లో ప్రజలకు అన్నసంతర్పణ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ప్రారంభంలో వంద మందికి ఉచిత భోజనం అందించారు. ప్రస్తుతం రోజుకు 500 మందికి భోజనం చేస్తున్నారు. ప్రతివారం పక్క ఆకలితో ఉండకుండా తానే స్వయంగా నిత్యం సరుకులను తెచ్చుకుని వంట చేసి ప్రజలకు వడ్డించిన తర్వాత ఆ పాత్రలను తానే స్వయంగా శుభ్రం చేయడం మరో విశేషం. భవిష్యత్తులో అన్నసత్రం కట్టాలన్నది లక్ష్యమని రవిశంకర్ చెబుతున్నారు.

ఉచిత కంప్యూటర్ శిక్షణకు ఆహ్వానం

బుక్కపట్నం, న్యూస్‌టుడే: నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఉచిత కంప్యూటర్ శిక్షణను ఏర్పాటు చేస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి హరికృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ, సీడ్‌యాప్‌ల సంయుక్తంగా కస్టమర్ కేర్, ఎగ్జిక్యూటివ్ వాయిస్, నాన్‌వాయిస్ కోర్సులను అందిస్తున్నామన్నారు. బుక్కపట్నం సత్యసాయి డిగ్రీ కళాశాలలో శిక్షణలు ఏర్పాటు చేసినట్లు వివరించారు. ఆసక్తి ఉన్న యువత ఆధార్ లింక్ కలిగిన మొబైల్‌ను తీసుకుని రావాలని సూచించారు. మూడు నెలల పాటు శిక్షణ ఉంటుందని చెప్పారు.

డిప్యూటీ డీఎంహెచ్‌వోగా బాధ్యతల స్వీకరణ

ధర్మవరం న్యూస్‌టుడే: ధర్మవరం డివిజన్ డిప్యూటీ డీఎంహెచ్‌వోగా డా.భాగ్యలక్ష్మి మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఈమెను డా. చెన్నారెడ్డి, వైద్య సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందే విధంగా కృషి చేస్తానని ఆమె వెల్లడించారు.

21 నుంచి పలు రైళ్ల రద్దు

అనంతపురం (రైల్వే), న్యూస్‌టుడే: ధర్మవరం పెనుకొండ మధ్య రైల్వే పనుల నేపథ్యంలో పలు రైళ్లను రద్దు చేశారు. గుంతకల్లు హిందూపురం మధ్య నడిచే 77213/14 ఈరైలు ఈనెల 22 వరకు రద్దు చేసినట్లు తెలిపారు. బెంగళూరు-అనంతపురం మధ్య నడిచే ప్యాసింజర్ రైలు 66559/66560 కూడా ఈనెల 22 వరకు రద్దు చేశారు. మచిలీపట్నం-ధర్మవరం మధ్య నడిచే రైళ్లు ఈనెల 21, 22 తేదీల్లో అనంతపురం దాకా నడుస్తుంది. అనంతపురం నుంచి ధర్మవరం మధ్య రద్దు చేశారు. మచిలీపట్నం నుంచి అనంతపురానికి వచ్చి తిరిగి వెనక్కి వెళుతుంది.

త్రినేత్ర స్వామికి.. బ్రహ్మ రథోత్సవ సేవ

గాంధీకట్ట వద్ద ఊరేగింపు, అంతర్‌చిత్రంలో స్వామివారి కల్యాణం

తాడిపత్రి బుగ్గరామలింగేశ్వరస్వామి కల్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. ఉదయం బుగ్గరామలింగేశ్వరుడు, రాజరాజేశ్వరి అమ్మవార్లను అలంకరించి కల్యాణ క్రతువు చేపట్టారు. మున్సిపల్ ఛైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి కుటుంబ సమేతంగా పాల్గొని వీక్షించారు. సాయంత్రం బుగ్గరామలింగేశ్వరుడు, రాజరాజేశ్వరి అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను పట్టువస్త్రాలతో అలంకరించి రథంలో కొలువుతీర్చారు. అనంతరం గాంధీకట్ట వద్ద నుంచి ఆంజనేయస్వామి విగ్రహం వరకు అక్కడి నుంచి తిరిగి గాంధీకట్ట వద్దకు రథోత్సవం కన్నుల పండువగా సాగింది. **- న్యూస్‌టుడే, తాడిపత్రి**

అభివృద్ధికి సహకరించాలని వినతి

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో ఎమ్మెల్యే ఎం.ఎస్.రాజు

మడకశిర, న్యూస్‌టుడే : మడకశిర నియోజకవర్గ అభివృద్ధికి సహకరించాలని తెదేపా జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే ఎం.ఎస్.రాజు ముఖ్యమంత్రి చంద్రబాబును కోరారు. మంగళవారం ఉదయం ఉండవల్లిలోని సీఎం నివాసంలో నియోజకవర్గం సమస్యలు, పరిశ్రమల స్థాపనపై చర్చించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. ప్రధానంగా మడకశిర బైపాస్ కెనాల్, రింగురోడ్డు, రాళ్లపల్లి, రత్నగిరి రిజర్వాయర్, 20 విద్యుత్తు ఉపకేంద్రాలను ఏర్పాటు చేయాలని వినతి పత్రం అందజేసినట్లు వివరించారు. నూతనంగా గ్రామీణ రహదారులు నిర్మించడానికి నిధులు మంజూరు చేయాలని, పుట్టపర్తి, హిరియూరు జాతీయ రహదారి నిర్మాణం త్వరితగతిన చేపట్టాలని కోరినట్లు పేర్కొన్నారు.

రామం.. ధ్యానం

ధ్యానముద్రలో శ్రీరాముడు.. ఇలాంటి దృశ్యం చాలా అరుదు. కళ్యాణదుర్గం పట్టణం కోటవీధిలో పట్టాభిరామ దేవాలయంలో కనిపిస్తుంది. ఈ విషయం చాలా మందికి తెలియదు. శ్రీకృష్ణ దేవరాయల సామంత రాజు 14వ శతాబ్దంలో దీన్ని నిర్మించారు. దక్షిణానికి అభిముఖంగా ఉండటం, గర్భగుడి పొడవు, వెడల్పు 14×14 మేరకు ఉంటుంది. స్వామివారు, సీతమ్మవారు, ఆంజనేయస్వామి పద్మాసనంలో కూర్చొని వేదపఠనం చేస్తున్నట్లుగా దర్శనమిస్తారు. ఇలాంటి విగ్రహాలు ఎక్కడాలేవని చరిత్రకారులు చెబుతున్నారు. ఇటీవల కళ్యాణదుర్గం వచ్చిన ప్రముఖ ప్రవచనకర్త గరికపాటి నరసింహారావు ఆలయం సందర్శించి రాముల వారి ధ్యానముద్ర అరుదని కితాబివ్వడం విశేషం.

- న్యూస్‌టుడే, కళ్యాణదుర్గం

పట్నానికి వస్తే ఉగ్గపట్టుకోవాల్సిందే!

✧ అందుబాటులో లేని శౌచాలయాలు

ధర్మవరం పట్టణ మార్కెట్‌లో తలుపులేని శౌచాలయం

ధర్మవరం పట్టణం, కదిరి, పుట్టపర్తి: ధర్మవరం.. నిత్యం తెలుగు రాష్ట్రాలతోపాటు ఇతర ప్రాంతాల నుంచి పట్టుచీరల కొనుగోలుకు ప్రజలు, వ్యాపారులు పెద్దసంఖ్య వస్తుంటారు. కదిరి.. ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి దర్శనానికి భక్తులు వేలాదిగా వస్తారు. పుట్టపర్తి.. ఆధ్యాత్మిక పట్టణానికి దేశవిదేశాలకు చెందిన భక్తులు, పర్యాటకులతోపాటు వివిధ పనుల నిమిత్తం జిల్లావాసులు తరలివస్తుంటారు. అత్యంత ప్రాధాన్యం ఉన్న పట్టణాల్లో స్థానికులు వేలాది మంది ఉన్నారు.

✦ అత్యవసరాలను తీర్చుకోవాలంటే వారు పడుతున్న ఇబ్బందులు అన్నీ ఇన్నీకావు. జనంతో నిత్యం రద్దీగా ఉంటున్న పట్టణాల్లో తగినన్ని శౌచాలయాలు లేకపోవడంతో ప్రజలు నరకం అనుభవిస్తున్నారు. ముఖ్యంగా మహిళల బాధలు వర్ణనాతీతం.

ఒకే ఒక్కటి..: కదిరిలో నృసింహుడి దర్శనానికి ప్రతి రోజూ వేలాది మంది భక్తులు వస్తూపోతుంటారు. మరోవైపు వివిధ పనుల కోసం పది మండలాలకు చెందినవారు రాకపోకలు సాగిస్తుంటారు. వారికి ఒక్కటి తప్ప.. సామూహిక శౌచాలయాలు ఎక్కడా లేవు.

ఉన్నా మూతపడి..: పుట్టపర్తిలో జిల్లా కార్యాలయాలు ఉన్నాయి. ప్రజలు ఎన్నో సమస్యలపై కార్యాలయాలకు వస్తుంటారు. చాలా చోట్ల శౌచాలయాలు అందుబాటులో లేవు. భక్తులు, పర్యాటలకు తిప్పలు తప్పడం లేదు. 2015లో నాలుగు మరుగుదొడ్లు నిర్మించిన నిర్వహణ లేక మూతబడటం గమనార్హం.

మరమ్మతులు చేయిస్తాం..

మూతబడిన శౌచాలయాలకు చిన్నపాటి మరమ్మతులు చేయాల్సి ఉంది. సిబ్బందితో చెప్పి సరి చేయించి... వినియోగంలోకి తీసుకొస్తాం. **- క్రాంతికుమార్, మున్సిపల్ కమిషనర్, పుట్టపర్తి**

మహిళల నరకయాతన

ధర్మవరం పట్టణానికి ప్రతి రోజూ సుమారు 10 వేల మంది రాకపోకలు సాగిస్తుంటారు. వారిలో అత్యధిక శాతం మహిళలే. చీరలు కొనేందుకు అధికంగా వస్తుంటారు. ఆర్టీసీ బస్టాండ్‌లో ఉన్న శౌచాలయాలే మహిళలకు దిక్కు. మార్కెట్‌లో అధ్వానంగా ఉన్న శౌచాలయాలనే పురుషులు వినియోగించుకోవాల్సి వస్తోంది. బాలుర ఉన్నత పాఠశాల మైదానంలోకి వెళ్లే చోట మూత్రవిసర్జన చేస్తుండటంతో ఆ ప్రాంతం దుర్గంధం వెదజల్లుతోందని విద్యార్థులు వాపోతున్నారు.

పట్టణాల్లో ఇలా..

పట్టణం	జనాభా	శౌచాలయాలు
ధర్మవరం	1,65,000	8
పుట్టపర్తి	36,610	4
కదిరి	1,27,400	1

కదిరిలో ఇదొక్కటే దిక్కు..

గ్రామీణదారులకు నిధుల యోగం

● మారనున్న రోడ్ల రూపురేఖలు

పుట్టపర్తి, న్యూస్‌టుడే: శ్రీసత్యసాయి జిల్లాలోని గ్రామీణ రహదారుల రూపురేఖలు మారనున్నాయి. ఏపీఆర్ఆర్ఎస్‌పీ ప్రాజెక్టు కింద 230.98 కి.మీ పరిధిలోని 57 చోట్ల రహదారులకు మోక్షం లభించింది. ఈ మేరకు పాలనాపరంగా రూ.100.66 కోట్లు నిధుల మంజూరుకు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కేంద్ర ప్రాయోజిత పథకాల్లోని నాబార్డ్, సాస్కీ, పూర్వోదయ పథకం, రాయలసీమ ప్యాకేజీ నిధుల లభ్యత ఆధారంగా ప్యాకేజీ కింద పనులు పూర్తి చేయనున్నారు. అత్యధికంగా పుట్టపర్తి నియోజకవర్గంలో 18 రహదారుల పనులకు రూ.33.83 కోట్లు కేటాయించగా, అత్యల్పంగా హిందూపురంలో 9 రహదారుల పనులకు రూ.9.26 కోట్లు కేటాయించారు.

నియోజకవర్గాల వారీగా విడుదలైన నిధులు

నియోజకవర్గం	పనులు	నిధులు రూ.కోట్లలో
పుట్టపర్తి	18	33.83
ధర్మవరం	08	19.08
హిందూపురం	09	9.26
కదిరి	02	11.28
పెనుకొండ	11	20.94
మడకశిర	06	10.96
రాప్తాడు	03	5.31

ప్రతిపాదనలు సిద్ధం చేశాం

అవసరమైన పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేసి, పంపుతున్నాం. మార్చిలో టెండర్ ప్రక్రియ పూర్తి చేసి పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకుంటామని ప్రాజెక్టు ఈఈ శంకరయ్య తెలిపారు. **- శంకరయ్య, ఈఈ**

సోనాక్షి సత్తా

✦ జాతీయ స్థాయి జిమ్నాస్టిక్స్‌లో రాణిస్తున్న బాలిక

హిందూపురం, న్యూస్‌టుడే: హిందూపురం పట్టణానికి చెందిన **సోనాక్షి** చిన్న వయసులోనే అందనంత ఎత్తుకు ఎదిగింది. రెండో తరగతిలోనే జిమ్నాస్టిక్స్‌పై మక్కువ చూపింది. క్రమంగా అదే పట్టుదలతో రాష్ట్ర, జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరిచి పతకాలు సొంతం చేసుకుంది. ఇటీవల తమిళనాడులోని సేలంలో జరిగిన అండర్-14 బాలికల విభాగంలో జాతీయస్థాయి పురస్కారాన్ని దక్కించుకుంది. ప్రస్తుతం ఓ ప్రైవేటు పాఠశాలలో 8వ తరగతి చదువుతోంది. బాలిక తండ్రి చంద్రమోహన్.. కొవిడ్ వ్యాప్తి సమయంలో మృతి చెందాడు. విద్యుత్తుశాఖలో జేఈఈవోగా పనిచేసి పదవీ విరమణ పొందిన చిన్నారి తాత నారాయణ చేరదీసి విద్యాభ్యాసం చేయిస్తూ ఆటలో శిక్షణ ఇప్పిస్తున్నారు.

యోగాలోనూ ప్రావీణ్యం..

యోగాతో చురుకైన మేధస్సు లభిస్తుందనే ఆకాంక్షతో ప్రావీణ్యం సాధించింది. పలు ఆసనాలను సులభంగా వేస్తూ అందరినీ ఆకట్టుకుంటోంది. అంతర్జాతీయ స్థాయిలో రాణించి ఉత్తమ క్రీడాకారిణిగా గుర్తింపు పొంది.. పది మందికి శిక్షణ ఇచ్చే విధంగా కేంద్రాన్ని ఏర్పాటు చేయాలనేది తన ఆశయమని విద్యార్థిని పేర్కొంది.

సాధించిన పతకాలతో సోనాక్షి

నిషేధమున్నా.. రైట్‌రైట్

పట్టణంలో భారీ వాహనాల ప్రవేశంతో జనం బెంబేలెత్తుతున్నారు. తాడిపత్రి వైపు నుంచి బెంగళూరుకు ధర్మవరం మీదుగానే భారీ వాహనాల రాకపోకలు సాగుతున్నాయి. రద్దీ వేళల్లో పొట్టిశ్రీరాములు కూడలి, కళాజ్యోతి కూడలి, పీఆర్టీ కూడలి వద్ద ద్విచక్ర వాహనదారులు, పాదచారులు ఇబ్బందులు పడుతున్నారు. పట్టణంలో పగటివేళ భారీ వాహనాల ప్రవేశంపై నిషేధం ఉన్నా రాకపోకలు జరుగుతున్నాయి.

– న్యూస్‌టుడే, ధర్మవరం

కాలుష్యం తగ్గించే.. డీఈఎఫ్ ఆయిల్

పెట్రోలు పంపుల వద్ద ఇప్పుడు కొత్త కంటెయినర్లు కనిపిస్తున్నాయి.. ఏంటా అని ఆరా తీస్తే కొత్త విషయం వెలుగులోకి వచ్చింది. లారీలు, ఇతర వాహనాలు ఎక్కువ దూరం ప్రయాణం చేయాల్సి ఉంటుంది. డీజిల్‌తో నడిచే వాహనాల నుంచి కాలుష్యం మోతాదు ఎక్కువ. దీన్ని తగ్గించేందుకు ప్రవేశపెట్టిందే ఈ డీఈఎఫ్ ఆయిల్. పొగ గొట్టం నుంచి వచ్చే హానికర వాయువుల మోతాదు తగ్గించేందుకు దీన్ని వాడతారు. ప్రస్తుతం ప్రతి బండికి తప్పనిసరిగా పోయించుకోవాలని చెబుతున్నారు. బెంగళూరు-హైదరాబాద్ జాతీయ రహదారిపై వడియంపేట వద్ద ఏర్పాటు చేయడంతో స్థానికుల్లో చర్చ నడుస్తోంది.

- ఈనాడు, అనంతపురం

ఎండు తెగులు.. తడి ఆరని కళ్లు

✦ ఉమ్మడి జిల్లాలో చీనీ సాగు : 1,21,105 ఎకరాలు	✦ రైతుల సంఖ్య : 34,598 మంది	✦ ఉమ్మడి జిల్లాలో చీనీ సాగు : 1,21,105 ఎకరాలు	✦ తెగుళ్ల సమస్య : వేరుకుళ్లు, మంగు తెగులు	✦ నష్టం ఇలా : ఎకరాకు ఏడాదికి 5వేల ఎకరాల్లో ఎండిపోతున్నాయి	✦ దిగబడి నష్టం : 1,21,105 టన్నులు

గార్లదిన్నెలో ఎండిపోతున్న చీనీ చెట్లు చూపుతున్న రైతులు

అనంతపురం (వ్యవసాయం), న్యూస్‌టుడే: కరవెంత ఇబ్బంది పెట్టినా చీనీ తోటలు ఆదుకుంటాయన్న అనంత రైతుల్లో ధీమా ఉండేది. ఇప్పుడు పరిస్థితి మారింది. ఏ రైతు చరిత్ర తడిమినా భయం కొట్టుకొచ్చినంత పనవుతోంది. కన్నబిడ్డల్లా పెంచుకున్న చెట్లు, ఏడో సంవత్సరమే.. నిలువునా ఎండిపోతుంటే ఏమీ చేయలేని నిస్సహాయస్థితి. ఒకే ఒక్క తెగులు చీనీ మనుగడను శాసిస్తోంది. చలి వాతావరణం తొలగి, వేసవి రానున్న క్రమంలో ఈ తెగులు స్వైరవిహారం చేస్తోంది.

కొన్నేళ్లుగా చీనీ తోటలకు రూట్‌రాట్ అనే వేరుకుళ్లు తెగులు ఆశిస్తోంది. ఎక్కువగా ఫిబ్రవరి నుంచి మార్చి వరకు అత్యధికంగా చెట్లు నిలువునా ఎండిపోతున్నాయి.

పీచు వేరుకు సోకి..

పీచువేర్లకు ఆశించి క్రమేణా పెద్ద వేర్లకు పాకడంతో అవి కుళ్లి తొందరగా ఎండిపోతాయి. తెగుళ్ల ఆశించిన చెట్లకు విపరీతంగా పూతపూసి కాయలు ముందిరేలోపే చెట్లు ఎండిపోతున్నాయని ఉద్యాన శాస్త్రవేత్తల సైతం ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నేలలో తేమ శాతం తక్కువ ఉండడం, వేర్లకు గాయాలు కావడం, నీటి తడులలో ఎక్కువ వ్యత్యాసాలుండడంతో ఈ తెగులు సోకే అవకాశం ఎక్కువ. ఫలితంగా కాయ నాణ్యత తగ్గి టన్ను ధర రూ.10 వేల దిగువకు చేరుతోంది.

యాజమాన్య పద్ధతులే శరణ్యం



- డాక్టర్ శారద (ప్రధాన శాస్త్రవేత్త), ఉద్యాన పరిశోధన కేంద్రం(రేకులకుంట)

వేరుకుళ్లు తెగులుతో వేగంగా ఎండిపోతాయి. ఆకులు పసుపు రంగులోకి మారి, రాలిపోతాయి. కొమ్మలు పెలుసుగా మారిపోతాయి. నివారణకు తెగులు రాక ముందే పశువుల ఎరువుతో కలిపిన ట్రైకోడెర్మా విరిడి వేసుకోవాలి. చెట్లు మొదళ్లను శుభ్రం చేసి కార్బండిజం 2 గ్రాములు లీటరు నీటితో తడిసేలా పిచికారీ చేయాలి.

ఆర్థిక అక్షరాస్యతతోనే భవిష్యత్తుకు భరోసా

గాండ్లపెంట,న్యూస్‌టుడే : సమాజంలో ఆర్థిక అక్షరాస్యతతోనే భవిష్యత్తుకు భరోసా అని ఏపీజీబీ లీడ్ బ్యాంకు మేనేజర్ రమణకుమార్, రెక్కమానులోని బ్యాంకు మేనేజర్ వెంకటరెడ్డి, ఆర్థిక అక్షరాస్యత జిల్లా సమన్వయకర్త శివశంకర్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం చామాలగొంది గ్రామంలో మహిళా సమైఖ్య సభ్యులతో ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కుటుంబాలు అన్నివిధాలా వృద్ధి చెందాలంటే ఆర్థిక అక్షరాస్యత కీలకమన్నారు. కార్యక్రమంలో సర్పంచి శివప్పనాయుడు, సీసీ నిర్మలమ్మ, ఆర్థిక అక్షరాస్యత కౌన్సిలర్ వీరమారుతి, యానిమేటర్ హరి తదితరులు పాల్గొన్నారు.

నలుగురికి ఏఓలుగా పదోన్నతి

తపోవనం (అనంత గ్రామీణం), న్యూస్‌టుడే: జడ్పీ యాజమాన్యం కింద పనిచేస్తున్న నలుగురు సీనియర్ సహాయకులకు ఏఓలుగా పదోన్నతి కల్పించారు. ఈమేరకు ఉత్తర్వులను జడ్పీ డిప్యూటీ సీఈఓ బి.గిరిజమ్మ, సీఈఓ జి.శివశంకర్, ఉప సీఈఓ జి.వెంకటసుబ్బయ్య చేతుల మీదుగా వారికి అందజేశారు. తనకల్లులోని మండల ప్రజా పరిషత్‌లో సీనియర్ సహాయకులుగా పనిచేస్తున్న ఆర్.రాజశేఖరుడు ఉరవకొండ ఏఓగా బదిలీ చేశారు. పీఆర్ సబ్‌డివిజన్ కార్యాలయంలో పనిచేస్తున్న బి.మహేష్‌ను గోరంట్ల, పుట్టపర్తిలో వైసే నరేంద్రరెడ్డిని గాండ్లపెంట, కళ్యాణదుర్గం పీఆర్ సబ్-డివిజన్‌లో పనిచేస్తున్న సి.పద్మావతిని రొద్దం మండల ఏఓగా వేశారు. కార్యక్రమంలో జడ్పీ ఏఓలు విజయభాస్కర్‌రెడ్డి, నియాజ్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

రేపు మత్స్య సంపదకు వేలం

అనంతపురం (వ్యవసాయం): కలెక్టర్ ఆదేశాలతో జీడిపల్లి జలాశయంలోని మత్స్య సంపద 19న బహిరంగ వేలం నిర్వహిస్తామని పీఏబీఆర్ మత్స్యక్షేత్రం, మత్స్య అభివృద్ధి అధికారి పెద్దబాలనాయక్ తెలిపారు. జీడిపల్లి జలాశయ పరిధిలో జీడిపల్లి, రామసాగరం, అంకంపల్లి, హనుమిరెడ్డిపల్లి, దుద్దేకుంట గ్రామాలున్నాయి. ఆరోజు ఉదయం 11.30 గంటలకు జీడిపల్లి ప్రభుత్వ పాఠశాల ఆవరణలో వేలం ఉంటుంది. దరఖాస్తుదారులు రూ.5 వేలు రుసుం చెల్లించాల్సి ఉంటుందన్నారు.

అంతుచిక్కని నీటి లెక్కలు

● పీఏబీఆర్ కుడి కాలువ ప్రవాహం అస్తవ్యస్తం ● ఒకచోట 630, మరోచోట 65 క్యూసెక్కులు

2 కి.మీ వద్ద నీటి ప్రవాహం

అనంతపురం (శ్రీనివాస్‌నగర్), న్యూస్‌టుడే: పీఏబీఆర్ కుడి కాలువ నిర్వహణ అస్తవ్యస్తంగా మారడంతో చివరి ఆయకట్టుకు నీరందడం లేదు. ఈ కాలువ మొదట్లో 2 కి.మీ వద్ద 630 క్యూసెక్కుల ప్రవాహం కొనసాగుతుండగా, బత్తలపల్లి మండలం మల్లేపల్లి సమీపంలోని 80 కి.మీ వద్ద కేవలం 65 క్యూసెక్కులే ఉంది. 94 కి.మీ వద్ద చుక్కనీరు కనిపించలేదు. ఈ దయనీయ స్థితి ఎందుకు నెలకొంది? ఆ నీళ్లు ఎక్కడికి వెళుతున్నాయి, ఏమవుతున్నాయో హెచ్చెల్సీ అధికారులే చెప్పాలి. వారి పర్యవేక్షణ పూర్తిగా పడకేసిందని, క్షేత్రస్థాయి ఇంజినీర్లు పట్టించుకోవడం లేదని ప్రవాహం లెక్కలే చెబుతున్నాయి. ఈ తతంగాన్ని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ జలవనరుల మంత్రి నిమ్మల రామానాయుడు దృష్టికి తెచ్చారు. ఇదే సందర్భంలోనే అనంత, శ్రీసత్యసాయి జిల్లాల కలెక్టర్లు ఆ కాలువ నీటి ప్రవాహంలో ఏం జరుగుతోందని సూటిగా ప్రశ్నించారు. ఈక్రమంలో మంగళవారం సాయంత్రం ఆగమేఘాలపై ఇద్దరు కలెక్టర్లు కలిసి హెచ్చెల్సీ అధికారులతో వీక్షణ సమీక్ష నిర్వహించి వాస్తవ పరిస్థితిపై ఆరా తీశారు.

50 రోజులైనా గందరగోళమేనా..

గతేడాది డిసెంబరు 1 నుంచి పీఏబీఆర్ కుడి కాలువకు నీటి విడుదల చేశారు. కాలువ మొదట్లో గండి పడటంతో ఓ పది రోజులు ప్రవాహం బాగా తగ్గింది. ఇప్పటికి 50 రోజులపైనే గడిచినా నీటి ప్రవాహం అస్తవ్యస్తంగా, గందరగోళంగా సాగుతోంది. ద్వారం వద్ద చూస్తే 640 నుంచి 700 క్యూసెక్కుల మధ్యలో ప్రవాహం ఉండగా, ఓ 50 కి.మీ దాటగానే గణనీయంగా తగ్గుతోంది. ఆఖరుకు చుక్క నీరు వెళ్లడం లేదు. నార్పల మండలం బి.పప్పూరు చెరువుకు కొద్ది నీరు మాత్రమే దక్కుతోంది. అటు ధర్మవరం, ఇటు తాడిమర్రి వైపు నీరే వెళ్లలేదు. నీటి ప్రవాహం ఇంత దయనీయంగా ఉన్నా అధికార యంత్రాంగం పట్టించుకోవడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

రంధ్రాలు.. గేట్లు ఎత్తేశారా?

నీటి ప్రవాహంపై అనేక అనుమానాలు నెలకొన్నాయి. చాలా ప్రాంతాల్లో పంట కాలువలకు గేట్లు ఎత్తేస్తున్నారు. కొన్నిచోట్ల కాలువకు గండ్లు, రంధ్రాలు పెట్టి నీటి చౌర్యానికి పాల్పడుతున్నారు. దీని వెనుక కొందరు ఇంజినీర్ల పాత్ర ఉందని, రైతుల నుంచి ముడుపులు తీసుకుని చేతులెత్తేస్తున్నారన్న ఆరోపణలు లేకపోలేదు. రాత్రివేళల్లో గేట్లు ఎత్తడం, పగలు కిందికి దించడం జరుగుతోంది. ఫలితంగా నీటి ప్రవాహం ఇబ్బందికరంగా సాగుతోంది. మరోవైపు కాలువలపై నిఘా, పోలీసు, రెవెన్యూ, జల వనరుల బృందాలను నియమిస్తామన్న నిర్ణయం ఊసే లేకపోవడం గమనార్హం.

నీటి ప్రవాహంపై మరింత శ్రద్ధ

కుడి కాలువ నీటి ప్రవాహంలో కొన్ని ఇబ్బందులు తలెత్తిన మాట వాస్తవం. దీన్ని గాడిలో పెడతాం. క్షేత్రస్థాయిలో ముమ్మర తనిఖీలు చేపడతాం. ఆఖరి ఆయకట్టుకు నీళ్లు ఇవ్వడమే కాదు, దిగువ నుంచి చెరువులకూ నీరు కేటాయిస్తూ వస్తాం. రెండు మూడు రోజుల్లో అన్నీ చక్కబడతాయి.

- సుధాకర్‌రావు, ఎస్‌ఈ, హెచ్చెల్సీ

వదాన్య అండతో జేఈఈ శిఖరాగ్రాన..

చక్కటి పర్సంటైల్‌తో మెరిసిన విద్యార్థులు

తులసికార్తిక్, వదాన్య వ్యవస్థాపకుడు అశోక్, జుగేష్‌కుమార్, యశ్వంత్‌కుమార్

జేఎన్‌టీయూ, న్యూస్‌టుడే: వదాన్య జనసొసైటీ సహకారంతో ముగ్గురు పేదింటి విద్యార్థులు జుగేష్‌కుమార్, తులసికార్తిక్, యశ్వంత్‌కుమార్ జేఈఈ మెయిన్స్‌లో 99పైన పర్సంటైల్‌తో సత్తాచాటి అడ్వాన్స్‌డ్‌కు అర్హత సాధించారు. గ్రామీణ ప్రాంతాలు, ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పేద విద్యార్థులకు 'వదాన్య జనసొసైటీ' అండగా నిలుస్తోంది. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ఆ సంస్థ నిరుపేద విద్యార్థుల విద్య కోసం విస్తృత సేవలందిస్తోంది. పిల్లలను హైదరాబాదులోని ప్రైవేటు జూనియర్ కళాశాలల్లో ఇంటర్ చేర్పించి అన్ని వసతులు కల్పిస్తోంది. జాతీయస్థాయి పరీక్షకు శిక్షణతో పాటు ఉపకార వేతనాలు ఇస్తోంది. ఈ సందర్భంగా వదాన్య వ్యవస్థాపకుడు పడిపాటి అశోక్ మాట్లాడుతూ 15 ఏళ్లు రెండు తెలుగు రాష్ట్రాల్లో తమ జనసొసైటీ ప్రతిభావంత పేదింటి విద్యార్థుల విద్యకు తోడ్పడుతోందన్నారు. 2021 నుంచి టాలెంట్ టెస్టులు నిర్వహించి ఎంపికైన వారి ఉజ్వల భవిష్యత్తుకు కృషి చేస్తున్నామన్నారు.

పేదింటి విద్యాకుసుమాలు

● జుగేష్‌కుమార్ జేఈఈ మెయిన్స్‌లో 99.98 పర్సంటైల్ సాధించాడు. తండ్రి పేరు గోపాల్. ధర్మవరం పట్టణానికి చెందిన ఆయన నేత కార్మికుడు. జుగేష్ పది, ఇంటర్‌లో ఉత్తమ మార్కులు సాధించాడు.

● తులసికార్తిక్ ధర్మవరానికి చెందిన నేత కార్మికుడు నారాయణస్వామి కుమారుడు. జేఈఈ మెయిన్స్‌లో 99.84 పర్సంటైల్ సాధించాడు.

● యశ్వంత్‌కుమార్ 99.78 పర్సంటైల్ తెచ్చుకున్నాడు. కొత్తచెరువుకు చెందిన సదాశివ ఆయన తండ్రి. ప్రైవేటు కళాశాలలో పని చేస్తారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివి ఉత్తమ ప్రతిభచాటి వదాన్య జనసొసైటీ ఇస్తున్న ఉపకార వేతనంతో విద్యనభ్యసిస్తున్నాడు.

వైభవం.. అగ్నిగుండ మహోత్సవం

పూజలందుకుంటున్న సిద్ధేశ్వరస్వామి

అమరాపురం, న్యూస్‌టుడే: అమరాపురం మండలం హేమావతిలోని సిద్ధేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం అగ్నిగుండం మహోత్సవం వైభవంగా జరిగింది. ఉదయం 5 గంటలకే ఈవో నరసింహరాజు, ఉత్సవ కమిటీ ఛైర్మన్ కరేగౌడ్, గ్రామ పెద్దలు అగ్నిగుండానికి పూజలు చేసి వెలిగించారు. జిల్లా నలుమూలలతో పాటు సమీప కర్ణాటక, తమిళనాడు, తెలంగాణ ప్రాంతాల నుంచి దాదాపు 35 వేలకుపైగా భక్తులు హాజరై స్వామివారి దర్శనంతో పాటు అగ్నిగుండంలో ధూపం, రైతులు పండించిన వేరుసెనగ, ఆముదం, కొబ్బరి తదితరాలు వేసి మొక్కు తీర్చుకున్నారు. రాత్రి 10 వరకు రద్దీ కొనసాగింది.

భారీ బందోబస్తు

ఉత్సవానికి వచ్చిన భక్తులు ఇబ్బందులు కలగకుండా సీఐలు రాజకుమార్, రాఘవన్‌లు దాదాపు వందమంది సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేశారు. సిద్ధేశ్వరస్వామి అన్నదాసోహ సమితి అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు అశ్వర్థనారాయణ హాజరైన భక్తులకు అన్నదానం నిర్వహించారు.

అగ్నిగుండంలో ధూపం వేసి మొక్కులు తీర్చుకుంటున్న భక్తులు

తిమ్మమాంబ హుండీ ఆదాయం లెక్కింపు

కానుకలు లెక్కిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

నంబులపూలకుంట, న్యూస్‌టుడే: మహా శివరాత్రి ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన తిమ్మమాంబ హుండీ ఆదాయాన్ని ఆలయ కమిటీ సభ్యులు మంగళవారం లెక్కించారు. హుండీ ఆదాయం రూ.3.62 లక్షలు వచ్చినట్లు వారు తెలిపారు. ఉత్సవాలకు గతంలో కంటే ఎక్కువ సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నట్లు కమిటీ సభ్యులు వివరించారు. ఉత్సవాలను విజయవంతం చేయడానికి కృషి చేసిన ఎమ్మెల్యే కందికుంటకు వారు కృతజ్ఞతలు తెలియజేశారు. వెంకటనారాయణ, శ్రీనివాసులు, నారాయణస్వామి, సర్పంచు విష్ణుమూర్తి, గ్రామస్థులు చౌదరి, యోగీశ్వర పాల్గొన్నారు.

బాగా చదివారు.. సత్తా చాటారు

దేవాంగం భరత్ | లిఖిత్ నందన్‌రెడ్డి | రాజ్‌దీప్ | వెంకట పునీత్ | పాటిల్ ప్రహాస్‌రెడ్డి

గోరంట్ల, న్యూస్‌టుడే: జేఈఈ మెయిన్స్‌లో విద్యార్థులు సత్తాచాటారు. గోరంట్ల మండలంలోని మలసముద్రం గ్రామానికి చెందిన దేవాంగం భరత్ 99.84 పర్సంటైల్ సాధించాడు. తండ్రి శ్రీనివాసులు మేడాపురంలో, తల్లి నాగమణి ధర్మవరంలో ప్రభుత్వ ఉపాధ్యాయులుగా పని చేస్తున్నారు.

తలుపుల : బత్తలపల్లి మండలం నల్లబోయనపల్లికి చెందిన బి.లిఖిత్ నందన్‌రెడ్డి 99.91 పర్సంటైల్ సాధించి సత్తా చాటినట్లు తల్లిదండ్రులు బి.శంకరనారాయణరెడ్డి, దీపారాణి తెలిపారు. విద్యార్థి తండ్రి తలుపుల మండలం లక్కసముద్రం ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నాడు.

రామగిరి : కొండాపురం గ్రామానికి చెందిన రాజ్‌దీప్ 99.71 పర్సంటైల్ సాధించాడు. చిన్నరాజన్న, సుజాత దంపతుల కుమారుడు హైదరాబాద్‌లోని నారాయణ కళాశాలలో ఇంటర్ చదువుతున్నాడు. తండ్రి వృత్తిరీత్యా ఉపాధ్యాయుడు.

కొత్తచెరువు: మండల పరిధిలోని మామిళ్లకుంట క్రాస్‌కు చెందిన ఉపాధ్యాయుడు హరిప్రసాద్ కుమారుడు వెంకట పునీత్ 99.77 పర్సంటైల్ సాధించాడు. అలాగే లింగారెడ్డిపల్లి గ్రామానికి చెందిన ఉపాధ్యాయుడు పాటిల్ రవీంద్రారెడ్డి కుమారుడు ప్రహాస్ కుమార్ రెడ్డి 99.68 పర్సంటైల్ సాధించాడు.

పప్పుసెనగ పంటకు మద్దతు ధర

క్వింటాలుకు రూ.5,875

అనంతపురం (వ్యవసాయం), న్యూస్‌టుడే: పప్పుసెనగ పంటకు ప్రభుత్వం మద్దతు ధర కల్పించింది. క్వింటా రూ.5,875 చొప్పున కొనుగోలు చేయాలని నిర్ణయించింది. ఏపీ మార్క్‌ఫెడ్‌కు కొనుగోలు బాధ్యతలు అప్పగించారు. ఈమేరకు ప్రభుత్వం అనుమతి ఇచ్చిందని ఏపీ మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్ పిన్నేశ్వరి తెలిపారు. ఈ-పంట నమోదు చేసుకున్న రైతుల నుంచే పప్పుసెనగ కొంటామని, గింజల్లో తేమ 14 శాతం ఉండాలన్నారు. పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్, బ్యాంకు ఖాతా పుస్తకం నకళ్లు తప్పనిసరిగా తేవాలన్నారు. పప్పుసెనగ పంట సాగైన మండలాల్లోని రైతు సేవా కేంద్రాల్లో కర్షకులు పేర్లు నమోదు చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

విశ్రాంత సీఈపై ఏసీబీ విచారణ

అనంతపురం(శ్రీనివాస్‌నగర్), న్యూస్‌టుడే: ఆదాయానికి మించి ఆస్తులున్నాయన్న అభియోగంపై జిల్లా జలవనరుల శాఖ రిటైర్డు చీఫ్ ఇంజినీరు(సీఈ) వీవీ నాగేశ్వరరావుపై సమగ్ర విచారణకు అనంత రేంజ్ ఏసీబీ సీఐ హమీద్‌ఖాన్‌ను నియమించారు. మంగళవారం ఆ శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి జి.సాయిప్రసాద్ ఈమేరకు జీఓ 66 జారీ చేశారు. 2012 డిసెంబరులో సీఈపై అవినీతి అభియోగాలు నమోదైన విషయం తెలిసిందే. శాఖాపరమైన విచారణ ఒకవైపు కొనసాగుతుండగా, మరోవైపు ఏసీబీ విచారణ చేస్తోంది. గత నెలలో అప్పటి ఏసీబీ సీఐ ఖాదర్‌బాషాను నియమించగా, ఆయన మాతృశాఖకు బదిలీ కావడంతో హమీద్‌ఖాన్‌ను వేశారు.

సబ్‌రిజిస్ట్రార్‌కు పదోన్నతి

సి.కుమారస్వామిరెడ్డి

తపోవనం (అనంత గ్రామీణం), న్యూస్‌టుడే: అనంతపురం ప్రాంతీయ కార్యాలయంలో చిట్‌ఫండ్స్ సబ్-రిజిస్ట్రార్‌గా పనిచేస్తున్న సి.కుమారస్వామిరెడ్డికి జిల్లా రిజిస్ట్రార్‌గా పదోన్నతి లభించింది. ఆయనను శ్రీకాకుళం జిల్లా రిజిస్ట్రార్‌గా బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. రాయలసీమ జిల్లాల్లో సబ్-రిజిస్ట్రార్‌గా అనేక కార్యాలయాల్లో పని చేసిన ఆయన చిట్స్‌ఫండ్స్ సబ్-రిజిస్ట్రార్‌గా రెండేళ్లుగా అనంతపురంలోనే విధులు నిర్వహించారు. రాష్ట్రవ్యాప్తంగా 18 మంది జిల్లా రిజిస్ట్రార్లుగా పదోన్నతి పొందగా, అందులో అనంతపురం ఉమ్మడి జిల్లా నుంచి కుమారస్వామి రెడ్డి మాత్రమే ఉన్నారు.

బైండోవర్ నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

పుట్టపర్తి పట్టణం, న్యూస్‌టుడే: బైండోవర్ నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ సతీష్‌కుమార్ మంగళవారం ఒక పత్రికా ప్రకటన ద్వారా హెచ్చరించారు. బైండోవర్ కాలంలో నేరాలకు పాల్పడితే రిమాండ్‌కు తరలించనున్నట్లు ఆయన చెప్పారు. లేపాక్షి మండలంలో ఇలాంటి కేసులో నిబంధనలు ఉల్లంఘించిన వ్యక్తిని 15 రోజులు రిమాండ్‌కు తరలించినట్లు వివరించారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

లాడ్జీలో వృద్ధుడి బలవన్మరణం

అనంత నేరవార్తలు, న్యూస్‌టుడే: నగరంలోని ఆర్టీసీ బస్టాండు సమీపంలోని ఓ లాడ్జీలో వృద్ధుడు ఆత్మహత్యకు పాల్పడ్డారు. వివరాలు..శ్రీసత్యసాయి జిల్లా కొత్తచెరువు మండలం మీర్జాపురానికి చెందిన సంజీవరెడ్డి (72) సోమవారం మధ్యాహ్నం బస్టాండు వద్దనున్న లాడ్జీలో గది అద్దెకు తీసుకున్నారు. మంగళవారం లాడ్జి సిబ్బంది గది తలుపులు కొట్టినా లోపలి నుంచి స్పందన రాలేదు. అనుమానంతో కిటికీ రెక్కలు బద్దలు గొట్టి చూడగా, లోపల ఫ్యాన్‌కు సంజీవరెడ్డి ఉరేసుకొని వేలాడుతూ కనిపించారు. సిబ్బంది అతడిని కిందికి దించి చూడగా అప్పటికే ప్రాణాలు పోయినట్లు గుర్తించారు. లాడ్జి నిర్వాహకులు మూడో పట్టణ పోలీసులకు సమాచారం ఇవ్వగా, వారు ఘటనాస్థలికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ సర్వజనాసుపత్రికి తరలించారు. వృద్ధుడి ఆత్మహత్యకు కారణాలు తెలియాల్సి ఉంది.

O/o Executive Engineer, APMSIDC MC Division, Penukonda In Sri Sathyasai Dist.
'e' Procurement Short Tender Notice No. 12/EE/APMSIDC/MC Divn./Pkd/2025-26/Dt. 17-02-2026

Tender is invited through 'e' Procurement platform for the work "Providing patient waiting shed at OP block and minor Repairs to area Hospital at Dharmavaram in Sri Sathyasai District (Rs. 8.70 lakhs)". The other details can be seen at website www.apeprocurement.gov.in Contact No. 8297467436.

Sd/- Executive Engineer, APMSIDC, Ananthapuramu

EENADU Classifieds

BUSINESS SERVICES

BUSINESS OFFER

బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్, ఫైనాన్స్‌లో తాకట్టులో ఉన్నవి మా డబ్బుతో విడిపించి కొనబడును. (రిటైర్డ్ పోలీస్ డిపార్ట్మెంట్) గోల్డెన్‌ట్రేడింగ్ కం. ✆ 7382114647.

JOBS

Wanted DRA Tele Callers, Field Executives & Team Leaders Banking Sector Attractive Salaries and Incentives, ✆ 9849394835, 7075345527.

Wanted Teachers for Reputed Schools in A.P & Telangana, Contact: Sneha Placements Service. Ph: 94402 46409.

Job Vacancy: We Hiring Open Positions Himayat Grand Luxury Hotel in Anantapur Contact: 6300123535. Requirements: 1-2 Years Experience in Hotel Industry Good Communication Skills Excellent Computer Skill

త్రినేత్ర హోంకేర్‌లో వృద్ధులను/ పేషెంట్స్‌ను/ పిల్లలను చూసుకొనుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఫ్రీ వసతి, భోజనం. జీ: 18K. ✆ 8520980099, 8520874499

ఎలక్ట్రికల్స్ & ఎలక్ట్రానిక్స్‌లో మార్కెటింగ్ చేయుటకు అనుభవం గల వ్యక్తులు & Office Boys కావలెను. సం॥ప్ర: 9440294666.

హరేకృష్ణ హోంకేర్‌లో వృద్ధులను/ పేషంట్స్/ పిల్లలను చూసుకొనుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఫ్రీవసతి, భోజనం జీ: 18-20K ✆ 96404 68899, 96402 58899

ప్రముఖ మా సంస్థ యందు వర్క్ చేయుటకు రిసెప్షన్, టెలీకాలర్, ఆఫీస్ అసిస్టెంట్ అర్జెంట్‌గా కావలెను. Q: 10 to డిగ్రీ, జీతం 9K to 25K ✆ 9491555724

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

EENADU Classifieds 5 లైన్ల ప్రకటన రూ. 395/- మాత్రమే

తక్కువ ఖర్చుతో... ప్రతిరోజు క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వండి.... అధిక స్పందనలు పొందండి. వాహనాల అమ్మకం... ఉద్యోగాల భర్తీ... ఇళ్లు, ఫ్లాట్లు, స్థలాల అమ్మకాలు, కొనుగోళ్లు... ఇళ్లు, షాపులు, ఫ్లాట్లు అద్దెకు మరియు అన్నిరకాల బిజినెస్ వ్యవహారాలు...

వివరాలకు : 8008709784

ప్రకటనలపై జి.ఎస్.టి. 5% వర్తించబడును

ఎప్పుడు వస్తారో.. ఎక్కడికి వెళ్తారో!

ప్రభుత్వ వైద్యకళాశాలలో విద్యార్థులపై కొరవడిన పర్యవేక్షణ

అనంతపురం (వైద్యం), న్యూస్‌టుడే: అనంతపురం ప్రభుత్వ వైద్యకళాశాలలో ఎంబీబీఎస్ చదువుతున్న విద్యార్థులపై పర్యవేక్షణను అధికారులు గాలికొదిలేశారన్న విమర్శలు వస్తున్నాయి. రోజువారీగా కళాశాలకు వస్తున్నారా.. లేదా... తరగతులకు హాజరకాకుండా ఎక్కడికి వెళ్తున్నారారన్న సమాచారం తెలుసుకోవడం లేదు. దీంతో కొందరు వైద్యవిద్యార్థులు ఎవరికీ చెప్పకుండా బయటకు వెళ్లడం.. వారి పనులు ముగించుకుని తిరిగి నేరుగా వసతిగృహాలకు వెళ్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. మంగళవారం తొమ్మిది మంది ఎంబీబీఎస్ విద్యార్థులు ఈత కొట్టడానికి గార్లదిన్నెకు వెళ్లడం... అక్కడ ఓ విద్యార్థి మృతి చెందటంతో భద్రతపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి. సదరు విద్యార్థులు ఎవరి అనుమతితో వెళ్లారు. అంతమంది తరగతికి హాజరుకాకపోతే బోధకులు ఎందుకు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురాలేదన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఎవరు వచ్చినా రాకపోయినా.. తమ పని తాము చేసుకుని వెళ్లిపోతున్నట్లు వ్యవహరిస్తుండటంతో ఇలాంటి పరిస్థితులు వస్తున్నాయని సర్వత్రా వ్యక్తమవుతోంది.

● ఎంబీబీఎస్ చదువుతున్న మొత్తం విద్యార్థులు 850 మంది కాగా వారిలో 90 శాతం మంది ప్రభుత్వ వైద్యకళాశాల వసతిగృహాల్లోనే ఉంటున్నారు. మొదటి సంవత్సరం వారికి ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు.. రెండు నుంచి ఆపై సంవత్సరాల విద్యార్థులకు ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు తరగతులు నిర్వహిస్తారు.

● వీరు బయటకు వెళ్లేందుకు అనుమతిచ్చే సమయం: సాయంత్రం 5గంటల పైన, వసతిగృహాల్లోకి రాత్రి తొమ్మిది గంటలలోపు రావాల్సి ఉంటుంది.

విచారణ చేపట్టి.. చర్యలు తీసుకుంటాం

విద్యార్థులు ఎవరి అనుమతితో బయటికి వెళ్లారో సమాచారం లేదు. తొమ్మిది మంది మొదటి సంవత్సరం విద్యార్థులు కళాశాలకు వచ్చారా.. లేదా అనేదానిపై విచారణ చేపడతాం. బాధ్యులు నిర్లక్ష్యంగా వ్యవహరించినట్లు తేలితే తగిన చర్యలు తీసుకుంటాం. పర్యవేక్షణ వ్యవస్థను మరింత పటిష్ఠం చేస్తాం. ప్రస్తుతం విద్యార్థి మృతదేహాన్ని మార్చురీకి తరలించాం. మృతుడి తల్లితండ్రులకు సమాచారం ఇచ్చాం.

- డాక్టర్ విజయశ్రీ, ప్రిన్సిపల్, ప్రభుత్వ వైద్యకళాశాల

ప్రాణం తీసిన ఈత సరదా!

వైద్యవిద్యార్థి మృత్యువాత

మోహన్

గార్లదిన్నె గ్రామీణం, న్యూస్‌టుడే: గార్లదిన్నె సమీపంలోని ఈతకొలనులో ప్రమాదవశాత్తు ఓ వైద్యవిద్యార్థి మృతి చెందిన ఘటన మంగళవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఉమ్మడి ప్రకాశం జిల్లా మార్కాపురంకు చెందిన మోహన్ (19) అనంతపురంలోని ప్రభుత్వ వైద్యకళాశాలలో ఎంబీబీఎస్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. ఎనిమిది మంది సహచర విద్యార్థులతో కలసి మంగళవారం మధ్యాహ్నం గార్లదిన్నెకు వచ్చారు. వారితో కలిసి మోహన్ ఈత కొడుతూ లోపలికి వెళ్లారు. ఎంత సేపటికి రాకపోవడంతో తోటి విద్యార్థులు ఈతకొలనులో వెతకసాగారు. కొలను లోపల ఉండటాన్ని గుర్తించి... బయటికి తీసుకొచ్చారు. తలకు గాయం కావడంతో ఆటోలో సమీపంలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. అనంతరం మృతదేహాన్ని అనంతపురం సర్వజన వైద్యశాలకు తరలించారు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై గౌస్‌బాషా తెలిపారు.

చదువుతోపాటు క్రీడలు తప్పనిసరి

ఎత్తులు వేస్తున్న ఎంపీ అంబికా, కలెక్టర్ ఆనంద్

అనంతపురం క్రీడలు, న్యూస్‌టుడే: చదువుతో పాటు ఆటల్లో రాణించే విద్యార్థులు జీవితంలో ఉన్నతస్థాయి అందుకుంటారని అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ తెలిపారు. మంగళవారం డీఎస్ఏ ఇండోర్ స్టేడియంలో శాప్ లీగ్ జిల్లాస్థాయి చెస్ పోటీల ప్రారంభోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. క్రీడలను అభివృద్ధి చేయాలనే సంకల్పంతో శాప్ లీగ్ పోటీలకు శ్రీకారం చుట్టామన్నారు. జిల్లాస్థాయిలో విజేతలుగా నిలిచిన వారు రాష్ట్ర స్థాయి పోటీల్లో సత్తాచాటి జిల్లా కీర్తిని ఇనుమడింపజేయాలని పిలుపునిచ్చారు. కలెక్టర్ ఆనంద్ మాట్లాడుతూ జిల్లాస్థాయి పోటీల్లో ఎక్కువమంది పాల్గొనేలా ప్రచారం చేయాలని ఆదేశించారు. ప్రతి పాఠశాల, జూనియర్ కళాశాలకు లీగ్ పోటీలపై అవగాహన కల్పించాలన్నారు. శాప్ డైరెక్టర్ బి.శివ, డీఎస్‌డీఓ ఎస్ఎం మంజుల, పాఠశాల క్రీడా సమాఖ్య జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు, ఎస్ఎస్‌బీఎన్ పీడీ శ్రీవాస్‌రెడ్డి, డీఎస్ఏ శిక్షకులు పాల్గొన్నారు. అనంతరం కలెక్టర్, ఎంపీ చదరంగం బోర్డుపై ఎత్తులు వేసి పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఇండోర్ స్టేడియం మరమ్మతులకు నిధులివ్వాలని డీఎస్‌డీఓ మంజుల ఎంపీ అంబికాను అభ్యర్థించగా ఆయన సానుకూలంగా స్పందించారు.

గొర్రెల పెంపక క్షేత్రం తీరుపై ఆరా

పెనుకొండ శివారులోని గొర్రెలపెంపక క్షేత్రాన్ని సందర్శించిన కలెక్టర్

పెనుకొండ, న్యూస్‌టుడే: పట్టణ శివారులోని ప్రభుత్వ గొర్రెల పెంపక క్షేత్రాన్ని మంగళవారం జిల్లా కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన క్షేత్ర విస్తీర్ణం, గొర్రెల సంఖ్య పెంచడానికి వాడుతున్న సాంకేతిక పద్ధతులపై ఆరా తీశారు. క్షేత్రం లక్ష్యాలను, క్షేత్రానికి సంబంధించిన భూమి నుంచి వైద్యకళాశాల, ఎంఐజీ లేఅవుట్‌కు ఎంత భూమి కేటాయించారన్న అంశాలను అడిగి తెలుసున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ క్షేత్రం భూమి అన్యాక్రాంతం కాకుండా రక్షించడానికి పలు సూచనలిచ్చారు. సెమీ కల్చర్ మొక్కల సంఖ్యను పెంచాలని, ఉపాధి హామీ పథకం ద్వారా చెక్‌డ్యామ్‌లు నిర్మాణానికి అవకాశాలు పరిశీలించాలని, క్షేత్రం చుట్టూ కంచె ఏర్పాటు చేయాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా పశువైద్యాధికారి శుభదాస్, డీడీ కాంతమ్మ, పశువైద్యుడు నాగేంద్ర, తహసీల్దార్ స్వాతి పాల్గొన్నారు.

కారు ఢీకొని ఉపాధ్యాయుడి దుర్మరణం

ద్విచక్రవాహనంపై విధులకు వెళ్తుండగా ప్రమాదం

ఆదినారాయణ

ధనాపురం (పరిగి), న్యూస్‌టుడే: మండలపరిధిలోని ధనాపురం క్రాస్ వద్ద కొడికొండ నుంచి శిర వెళ్లే జాతీయ రహదారిలో మంగళవారం ఉదయం ద్విచక్రవాహనాన్ని కారు ఢీకొన్న ప్రమాదంలో ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుడు ఆదినారాయణ(56) అక్కడికక్కడే మృత్యువాత పడగా, మరో ఉపాధ్యాయుడు తీవ్రంగా గాయపడ్డాడు. వివరాలిలా.. బుక్కపట్నం మండలం బుచ్చయ్యగారిపల్లికి చెందిన ఆదినారాయణ (47), మరో ఉపాధ్యాయుడు తుమ్మలప్పతో కలిసి ద్విచక్రవాహంలో గుడిబండ మండలం మోపురుగుండు పాఠశాలకు వెళుతున్నారు. మార్గంమధ్యలో ధనాపురం క్రాస్ వద్ద వీరు ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనాన్ని ఎదురుగా వస్తున్న కారు వేగంగా ఢీకొట్టడంతో ఆదినారాయణ మృతి చెందాడు. గుడిబండ మండలం దిన్నేహట్టి ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న తుమ్మలప్ప తీవ్రంగా గాయపడ్డారు. విషయం తెలుసుకున్న పరిగి 108 వాహన సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని గాయపడ్డ ఉపాధ్యాయుడ్ని చికిత్స కోసం హిందూపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఆదిమూర్తి భార్య లలిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఏఎస్సై వెంకటేశ్వర్లు తెలిపారు. మృతుడికి భార్యతో పాటు ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. ప్రభుత్వ ఉపాధ్యాయుడు ఆదినారాయణ మృతిపై గుడిబండ ఎంఈవో 2 రవిచంద్రకుమార్ తీవ్ర విచారం వ్యక్తం చేశారు.

రోడ్డు దాటుతూ మరొకరు..

హిందూపురం, న్యూస్‌టుడే: హిందూపురం పురపాలక సంఘం పరిధిలోని మోతుకపల్లి వద్ద మంగళవారం రాత్రి రహదారి దాటుతున్న ఆదిరెడ్డి(65)ని ద్విచక్ర వాహనం ఢీకొనడంతో దుర్మరణం చెందారు. పరిగి మండలం శ్రీరంగరాజుపల్లికి చెందిన ద్విచక్ర వాహనదారుడు హిందూపురం నుంచి స్వగ్రామానికి వెళ్తుండగా మార్గం మధ్యలో ఈ ఘటన చోటు చేసుకుంది. ఒకటో పట్టణ పోలీస్‌స్టేషన్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

భార్య కాపురానికి రాలేదని... పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నం

చౌడప్ప

రాయదుర్గం గ్రామీణం, న్యూస్‌టుడే: రాయదుర్గం పోలీస్ సర్కిల్ కార్యాలయం ఎదుట వడ్రవన్నూరు గ్రామానికి చెందిన దివ్యాంగుడు చౌడప్ప మంగళవారం ఒంటిపై పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. అప్రమత్తమైన పోలీసులు ఆయన ప్రయత్నాన్ని అడ్డుకుని నీళ్లుచల్లి దుస్తులు మార్పించారు. చౌడప్పకు డి.హీరేహాళ్ మండలం కళ్యం గ్రామానికి చెందిన ఓ మహిళతో కొన్నేళ్ల కిందట వివాహమైంది. ఏడు నెలలుగా వీరు కళ్యంలోని అద్దె ఇంట్లో ఉంటున్నారు. కొన్నాళ్లుగా చౌడప్ప తన స్వగ్రామం వడ్రవన్నూరు వెళ్దామని భార్యకు చెప్పగా ఆమె నిరాకరించడంతో మనస్తాపానికి గురై పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. తన భార్య తరపున పెద్ద మనుషులు జోక్యం చేసుకుని తనకు అన్యాయం చేస్తున్నారని, తనతోపాటు భార్యను స్వగ్రామానికి పంపించాలని ఆయన పోలీసులను వేడుకున్నాడు. రాయదుర్గం అర్బన్ సీఐ జయనాయక్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కుమారుడిపై దాడి.. అడ్డుకోబోయి తల్లి మృతి

గౌసియా

అనంత నేరవార్తలు: కొడుకుపై జరుగుతున్న దాడిని అడ్డుకోబోయిన తల్లి తీవ్రంగా గాయపడి మృతి చెందిన ఘటన నగరంలో చోటుచేసుకుంది. నాలుగో పట్టణ పోలీసులు తెలిపిన మేరకు.. గౌసియా (56) కుమారుడు ఇమ్రాన్, కోడలు జ్యోతితో కలిసి కోవూరునగర్‌లోని కేకే పార్క్ వ్యూ అపార్టుమెంటులో ఉంటోంది. అదే ప్రాంతంలో నిఖత్ జరీన్, మల్కి జాఫర్ అనే దంపతులు నివసిస్తున్నారు. ప్రస్తుతం జాఫర్ దుబాయ్ వెళ్లారు. ఇటీవల జరీన్ భర్త వద్దకు వెళ్లింది. ఇమ్రాన్ కొన్నిరోజులుగా జరీన్‌కు ఫోన్ సందేశాలు పంపుతూ తరచు మాట్లాడేవాడు. గుర్తించిన ఆమె భర్త ఇమ్రాన్‌తో రెండు రోజుల క్రితం ఫోన్‌లో గొడవపడి హెచ్చరించాడు. ఈ విషయాన్ని తన కుటుంబ సభ్యులు, బంధువులకు తెలిపారు. ఈక్రమంలో సోమవారం రాత్రి జాఫర్ కుటుంబ సభ్యులు, బంధువులు ఇమ్రాన్ ఇంటికి వెళ్లి అతడిపై దాడి చేశారు. దాన్ని ఇమ్రాన్ తల్లి గౌసియా అడ్డుకునేందుకు ప్రయత్నించగా, ఆగ్రహంతో ఆమెను కిందకు తోసి తీవ్రంగా కొట్టడంతో అపస్మారక స్థితికి చేరుకుంది. గొడవను గమనించిన చుట్టుపక్కల వారు అక్కడికి చేరుకొని దాడికి దిగిన వారిని తరిమేశారు. అనంతరం గౌసియాను ప్రభుత్వ సర్వజన ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. మంగళవారం ఉదయం ఆమె చనిపోయింది. మృతురాలి కుమారుడి ఫిర్యాదుతో పోలీసులు మల్కి జాఫర్, ఫక్రున్నీసా బేగం, రఫీ, ఇంతియాజ్, గౌస్, మరికొందరిపై కేసు నమోదు చేశారు.

హిందూపురం

• హిందూపురం • పెనుకొండ • మడకశిర

సేంద్రియ సాగుతో అధిక లాభాలు

రొద్దం(పెనుకొండ), న్యూస్‌టుడే: సేంద్రియ పద్ధతిలో పంటలు సాగుచేయడం ద్వారా రైతులు అధిక లాభాలు పొందవచ్చని టింబక్టు కలెక్టివ్ రాయలసీమ వాటర్ ప్రాజెక్టు మేనేజర్ పేదూరి శ్రీకాంత్ పేర్కొన్నారు. మంగళవారం చెలిమి కార్యక్రమంలో భాగంగా రొద్దం మండలంలోని కోగిర, రాచూరు, పెద్దకోడిపల్లి, శ్యాపురం గ్రామాలకు చెందిన 21మంది రైతులకు టింబక్టు కలెక్టివ్ ఆధ్వర్యంలో 75శాతం రాయితీపై స్ప్రింక్లర్లను పంపిణీ చేశారు. అనంతశక్తి సీఈవో లావణ్య, రాయలసీమ వాటర్ ప్రాజెక్టు సమన్వయకర్త రవి, వాటర్ ఎక్స్‌పర్ట్ ప్రవీణ్, కార్యకర్తలు పాల్గొన్నారు.

స్ప్రింక్లర్లు పంపిణీ చేస్తున్న టింబక్టు సిబ్బంది

దూమాణప్పస్వామి ఆశ్రమంలో పూజలు

అగ్నిగుండంలోకి ధూపం వేస్తున్న భక్తులు

గుడిబండ: మండలంలోని మందలపల్లిలోని శ్రీదూమాణప్పస్వామి ఆశ్రమంలో మహాశివరాత్రి పురస్కరించుకుని మంగళవారం సాయంత్రం అగ్నిగుండం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ధూపం వేసి దూమాణప్పస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. సింగిల్ విండో అధ్యక్షుడు మద్దనకుంటప్ప, మండల తెదేపా కన్వీనర్ లక్ష్మీనరసప్ప, న్యాయవాది శివకుమార్, నన్నమారప్ప, రంగప్ప, తిప్పన్న తదితరులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా

హిందూపురం: 91548 46650
పెనుకొండ: 91000 20922
మడకశిర: 76759 19016

సమస్య: బూదిపల్లి ఇందిరమ్మ కాలనీలో వీధి దీపాలు వెలుగడం లేదు. **-రాజగోపాల్**

సమాధానం: రెండు రోజుల్లో ఏర్పాటు చేస్తాం. **- నరసప్ప, సర్పంచి, జమ్ములబండ**

సమస్య: మైనగానిపల్లిలో తవ్విన బోరుకు మోటారు, స్టార్టర్లు అమర్చాలి. **-వరప్రసాద్**

సమాధానం: పరికరాలు వచ్చాయి. త్వరలో అమర్చుతాం. **-లక్ష్మీనరసప్ప, మండల కన్వీనర్, గుడిబండ**

సమస్య: పట్టణంలోని దశరథరామయ్య కాలనీలోని అభయాంజనేయస్వామి ఆలయం పక్క వీధిలో కాలువలు శుభ్రం చేయడం లేదు. **- సూర్యనారాయణ**

సమాధానం: పారిశుద్ధ్య కార్మికులను పంపి శుభ్రం చేయిస్తా. **-శంకర్, మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్, హిందూపురం. -న్యూస్‌టుడే, గుడిబండ, హిందూపురం సాంస్కృతికం**

సమస్య: పరిగిలోని సీతారామపురం కాలనీ చంద్రారెడ్డి ఇంటి సమీపంలో వీధి దీపం వెలగడం లేదు. **-నాగమణి**

సమాధానం: వెంటనే ఏర్పాటు చేయిస్తాను **-అరుణ, ఇన్‌ఛార్జి కార్యదర్శి, పరిగి.**

సమస్య: పరిగి బోయపేటలో ఉపరితల నీటి తొట్టి నిర్మాణానికి భూమి పూజ చేసి వదిలేశారు. పనులు ఎప్పుడు ప్రారంభిస్తారు. **-టి.నరసింహమూర్తి**

సమాధానం: గుత్తేదారుతో మాట్లాడి పనులు చేపడతాం. **-ప్రత్యూష, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ పరిగి. -న్యూస్‌టుడే, పరిగి(కొడిగెనహళ్లి)**

స్పందించారు.. పరిష్కరించారు

హిందూపురం సాంస్కృతికం : పట్టణంలోని వివిధ కాలనీల్లో నెలకొన్న సమస్యలను 'ఈనాడు'లో ప్రచురితం కావడంతో సంబంధిత అధికారి స్పందించారు. హీరోహోండా షోరూం నుంచి ఆర్టీసీ కాలనీకి వెళ్లే రహదారిలోని చెత్తను మంగళవారం పారిశుద్ధ్య కార్మికులతో శుభ్రం చేయించారు.

వేసవి రాకముందే తాగునీటి ఎద్దడి

వ్యవసాయ బోర్లను ఆశ్రయిస్తున్న గ్రామస్థులు

మడకశిర గ్రామీణం, లేపాక్షి, న్యూస్‌టుడే: వేసవి రాకముందే కొన్ని గ్రామాల్లో తాగునీటి ఎద్దడి మొదలైంది. రక్షిత నీటి పథకం బోర్లలో నీరు అడుగంటిపోయి బోర్లలో అరకొరగా నీరొస్తున్నాయి. దీంతో ప్రజలకు తాగునీరు చాలక సమీప వ్యవసాయ బోర్ల వద్దకు, నీరు లభ్యం ఉండే ప్రాంతాలకు వెళ్లి తెచ్చుకోవాల్సిన పరిస్థితి నెలకొంది.

వ్యవసాయ బోరు వద్ద నీటిని పట్టుకుంటున్న టీడీపల్లి తండా మహిళలు

సమస్య ఉన్న గ్రామాల్లో కొన్ని

మడకశిర మండలం టీడీపల్లి తండాలో తీవ్ర తాగునీటి సమస్యను ఎదుర్కొంటున్నారు. గ్రామానికి తాగునీటి కోసం గతంలో తవ్వించినా బోరులో నీటిమట్టం తగ్గింది. ఎగువ ప్రాంతంలో కుళాయిలకు నీరు సరఫరా కావడం లేదు. ఇక్కడ 150 కుటుంబాలు. 300కు పైగా జనాభా ఉంది. గ్రామానికి తాగునీటి సమస్య పరిష్కరించేందుకు ఆరు నెలల క్రితం కొత్త బోరు తవ్వించారు. నీరు సమృద్ధిగా లభ్యమయ్యాయి. మోటారు, పంప్‌సెట్ బిగిస్తే సమస్య నివారించవచ్చు.

● పత్తికుంట గ్రామంలో రెండు బోర్లు ఉన్నాయి. ఇందులో ఒకటి ఎండిపోయింది. మరొకటి ఊరికి దూరంగా చెరువులో తవ్వించారు. తరచూ పైపులైన్ దెబ్బతిని సమస్య నెలకొంటోంది. 200 కుటుంబాలు 700కు పైగా జనాభా ఉంది. కొత్త బోరు తవ్వించి నీటి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

● అమరాపురం మండలం వి.అగ్రహారం, హెచ్‌బీఎన్ కాలనీ, బసవనపల్లి ఎస్సీకాలనీలో ఎమ్మెల్యే నిధులతో బోర్లు తవ్వించారు. పంప్‌సెట్ అమర్చాల్సి ఉంది.

● రొళ్ల మండలంలో వెంకటంపల్లి బోరుకు మోటారు సమస్య ఉంది. మల్లినమడుగులో బోరులో నీటిమట్టం తగ్గి తాగునీటి సమస్య నెలకొంది.

హిందూపురం నియోజకవర్గంలో..

హిందూపురం నియోజకవర్గ వ్యాప్తంగా 35 పంచాయతీలున్నాయి. 172 గ్రామాలున్నాయి. ఇప్పటికే 34 గ్రామాల్లో నీటి సమస్య నెలకొంది. వేసవి ఎండలు ఎక్కువవుతుండడంతో బోర్లలో నీటిమట్టం తగ్గుతుండడంతో తాగునీటి సమస్య నెలకొంటోంది.

పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటాం

వేసవిలో బోర్లలో నీటిమట్టం తగ్గుతోంది. అదనపు పైపులు బిగించి నీటి సమస్యను పరిష్కరిస్తాం. కొత్తగా 200 బోర్లు తవ్వించాం. వాటిలో ఇంకా కొన్నింటికి మోటారు, స్టార్టర్లు అమర్చాల్సి ఉంది. వెంటనే బిగించి సమస్యను పరిష్కరిస్తాం.
-విజయ్‌కుమార్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ, మడకశిర

ఖాళీ బిందెలతో నిరసన తెలుపుతున్న గ్రామస్థులు

హంద్రీనీవా నీటితో చెరువు నింపాలి

లేపాక్షి, న్యూస్‌టుడే: ఉప్పరపల్లి చెరువుకు హంద్రీనీవా కాలువ ద్వారా నీటిని మళ్లించి నింపాలని గ్రామస్థులు కోరారు. తాగునీటికి ఇబ్బందులు పడుతున్నామని మంగళవారం స్థానికులు ఖాళీ బిందెలతో ట్యాంకు వద్ద నిరసన వ్యక్తం చేశారు. చెరువు నిండి ఆరేళ్లు కావస్తోందని వాపోయారు. సోమిరెడ్డిపల్లి, కుర్లపల్లి చెరువులు నిండిన తర్వాత తమ చెరువుకు నీటిని సరఫరా చేస్తారనే ఉద్దేశంతో అందరూ ఐక్యంగా డబ్బులు పోగుచేసి కాలువలు శుభ్రం చేయించినట్లు తెలిపారు. వెంటనే చెరువుకు నీటిని వదలాలని కోరారు.

డి.అచ్చంపల్లిలో ఖాళీ బిందెలతో నిరసన

మడకశిర గ్రామీణం: మండలంలోని డి.అచ్చంపల్లి గ్రామంలో తాగునీటి సమస్య నెలకొంది. గ్రామంలో ఉన్న రెండు తాగునీటి బోర్లలో ఒకటి ఎండిపోయింది. మరో దానిలోనూ నీటిమట్టం అడుగంటింది. మంగళవారం సాయంత్రం గ్రామంలో ప్రజలు ఖాళీ బిందెలతో నిరసన తెలిపారు.

విద్యార్థులకు గణిత నైపుణ్యం, భాషలపై పట్టు పెంచాలి

విద్యార్థులతో ముచ్చటిస్తున్న జిల్లా కలెక్టర్ శ్యాంప్రసాద్

గోరంట్ల, న్యూస్‌టుడే: కేంద్రీయ విద్యాలయంలో చదువుతున్న విద్యార్థుల్లో గణిత నైపుణ్యాలు, ఆంగ్లం, హిందీ భాషలపై పట్టు పెంచేదిశగా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ శ్యాంప్రసాద్ అభిప్రాయం వ్యక్తం చేశారు. గోరంట్ల మండలం పాలసముద్రం సమీపంలోని నాసిన్ ఆవరణలో ఉన్న కేంద్రీయ విద్యాలయంలో మంగళవారం జరిగిన సంస్థ నిర్వహణ సంఘం సమావేశంలో ఛైర్మన్ హోదాలో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యాప్రమాణాలు మెరుగు, పరిపాలన వ్యవస్థ బలోపేతం, ఆర్థిక నిర్వహణ, నిధులు సేకరణ తదితర అంశాలపై సంఘం సభ్యులతో కలెక్టర్ చర్చించారు. అనంతరం తరగతి గదులకు వెళ్లి విద్యార్థులతో ముచ్చటించారు. వారి సామర్థ్యాలను పరిశీలించారు. ఇందులో భాగంగా ఏర్పాటుచేసిన సాంస్కృతిక కార్యక్రమాలను కలెక్టర్ తిలకించారు. విద్యాలయ అభివృద్ధికి ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు కృషి చేయాలని సూచించారు. కలెక్టర్ ఉన్న సమయంలోనే పిల్లలకు నులిపురుగుల నివారణ మాత్రలు వేశారు. నామిని ఛైర్మన్ శేషు ఐఆర్ఎస్, ప్రిన్సిపల్ కృష్ణారావు పాల్గొన్నారు.

ఎండు గడ్డికి అంటుకున్న మంటలు

ఆకతాయిల చేష్టలు.. విద్యుత్తు కష్టాలు

చిలమత్తూరు: చిలమత్తూరు మండలం కొడికొండ చెక్‌పోస్టు సమీపంలోని హరిత రెస్టారెంట్ ముందు భాగంలోని ఎండుగడ్డికి ఆకతాయిలు మంగళవారం సాయంత్రం నిప్పు పెట్టారు. మంటలు వ్యాపించి విద్యుత్తు తీగలు పూర్తిగా కాలిపోయాయి. దీంతో ప్రజలు విద్యుత్తు సరఫరా లేక మూడు గంటల పాటు చీకట్లో ఉండాల్సి వచ్చింది. విషయాన్ని లైన్‌మెన్‌కు, అధికారులకు గ్రామస్థులు చెప్పడంతో వారు వచ్చి మరమ్మతు చేసి సరఫరాను పునరుద్ధరించారు.

క్షయ రోగులకు పౌష్టికాహార కిట్ల పంపిణీ

మడకశిర, న్యూస్‌టుడే : జాతీయ క్షయ నివారణ పథకంలో భాగంగా మంగళవారం స్థానిక ప్రభుత్వాసుపత్రిలో క్షయ వ్యాధిగ్రస్థులకు మున్సిపల్ ఛైర్మన్ నరసింహరాజా చేతుల మీదుగా పౌష్టికాహార కిట్లు పంపిణీ చేశారు. క్షయ రోగులకు సంగు హైటెక్ ఏపీ ప్రైవేట్ లిమిటెడ్ సీఎస్ఆర్ ఫౌండేషన్ సహకారంతో వారి ఆరోగ్యానికి మద్దతుగా కందిబేడలు, బెల్లం, పెసర, వేరుసెనగ, సెనగలు పంపిణీ చేసినట్లు వైద్యులు అనుమ జేమ్స్, శ్రుతిలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ఎస్ రాము, డీపీసీ మల్లికార్జున, సీపీఎం కోఆర్డినేటర్ నాగేంద్ర సాయికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

గోరంట్ల: క్షయ వ్యాధిగ్రస్థులు వైద్యుల సలహా మేరకు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని సీహెచ్‌సీ వైద్యాధికారి వినోద్‌కుమార్ పేర్కొన్నారు. స్థానిక ఆసుపత్రిలో మంగళవారం నిత్యావసరాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. సూపర్‌వైజర్ పవన్‌కుమార్, పీపీఎస్‌ఏ శంకర్ పాల్గొన్నారు.

కిట్లు పంపిణీ చేస్తున్న మున్సిపల్ ఛైర్మన్ నరసింహరాజా

ఉపాధ్యాయుడి మృతికి సంతాపం

గుడిబండ, న్యూస్‌టుడే: గుడిబండ మండలంలోని మోపురుగుండు ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న 2008 ఎంటీఎస్ ఉపాధ్యాయుడు ఆదినారాయణ మంగళవారం రోడ్డు ప్రమాదంలో దుర్మరణం పాలయ్యాడు. యూనియన్ నాయకులు గోవిందనాయక్, మంజునాథ్, వెంకటనారాయణ, రమేశ్ తదితరులు సంతాపం వ్యక్తం చేశారు.

27 నుంచి యూటీయూసీ మహాసభలు

హిందూపురం గ్రామీణం, న్యూస్‌టుడే : యూటీయూసీ ప్రథమ రాష్ట్ర మహాసభలను ఈనెల 27, 28వ తేదీల్లో హిందూపురం పట్టణంలో నిర్వహించనున్నట్లు శ్రీసత్యసాయి జిల్లా కన్వీనర్ ఎ.శ్రీనివాసులు ఓ ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి జిల్లాల్లోని 14 నియోజకవర్గాలు, పట్టణ, గ్రామీణ మండలాల అధ్యక్ష, కార్యదర్శులు, ప్రతినిధులు, సభ్యులు హాజరై రాష్ట్ర నేతలు సూచించిన మేరకు ప్రజాసమస్యల పరిష్కారం కోసం పోరాడాలని ఆయన కోరారు.

బైండోవర్‌ను అతిక్రమించిన వ్యక్తికి జైలు

లేపాక్షి, న్యూస్‌టుడే: మండలంలోని కంచిసముద్రానికి చెందిన నారాయణస్వామిని మంగళవారం అరెస్టు చేసి తహసీల్దార్ ముందు హాజరు పరచగా 15 రోజుల పాటు జుడీషియల్ రిమాండ్‌కు ఆదేశిస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు డీఎస్పీ మహేష్ తెలిపారు. మంగళవారం సీఐలు జనార్దన్, రాజగోపాల్‌నాయుడు, ఆంజినేయులు, ఎస్సై నరేంద్రతో కలిసి డీఎస్పీ కేసుకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. నారాయణస్వామిపై గతంలో లేపాక్షి పోలీస్‌స్టేషన్‌లో పలు కేసులు నమోదయ్యాయి. దీంతో అతన్ని భవిష్యత్తులో ఎలాంటి చట్టవ్యతిరేక చర్యల్లో పాల్గొనకుండా ముందు జాగ్రత్తగా తహసీల్దార్ ముందు బైండోవర్ చేసినట్లు తెలిపారు. అయితే అతని ప్రవర్తనలో ఏమాత్రం మార్పు రాకపోగా పోలీసులు తనను ఏమీ చేయలేరనే భ్రమలో తరచూ నేరాలకు పాల్పడేవాడు. దీనిపై సమగ్ర నివేదికను తహసీల్దార్ సౌజన్యలక్ష్మి ముందు ఉంచగా ఆమె విచారించి నారాయణస్వామికి నోటీసులు జారీ చేసింది. నోటీసులకు అతను స్పందించక పోవడంతో మంగళవారం రిమాండ్‌కు ఆదేశించినట్లు ఆయన వివరించారు.

సీఐలతో కలిసి కేసు వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ మహేష్

డిగ్రీ కళాశాలలో విద్యార్థినికి మాత్రలు వేస్తున్న ప్రిన్సిపల్ జయప్ప, తదితరులు

నులిపురుగుల నివారణ మాత్రల పంపిణీ

మడకశిర గ్రామీణం, పెనుకొండ, న్యూస్‌టుడే: నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా మంగళవారం అన్ని మండలాల్లో 1 నుంచి 19 ఏళ్ల లోపు వయసున్న వారికి ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. చిన్నారులకు ఈ మాత్రలు వేయిస్తే పిల్లల్లో రక్తహీనతను నివారించి పోషక శక్తి పెరుగుతుందన్నారు. శరీరంలో నులిపురుగులు అపరిశుభ్రత, కలుషితమైన ఆహారం తీసుకోవడం ద్వారా ప్రవేశిస్తాయని పరిటాల శ్రీరాములు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ జయప్ప అన్నారు. అనంతరం విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు.

పని భారంపై సచివాలయ ఉద్యోగుల నిరసన

సోమందేపల్లి, న్యూస్‌టుడే: స్వర్ణ గ్రామ సచివాలయాల్లో పనిభారం అధికం కావడంతో తీవ్ర మానసిక ఒత్తిడికి గురవుతున్నామని సిబ్బంది మంగళవారం ఆందోళన వ్యక్తం చేశారు. మండలంలోని అన్ని సచివాలయాల సిబ్బంది సోమందేపల్లికి చేరుకొని ప్రధాన వీధుల గుండా ఎంపీడీవో కార్యాలయం వరకు ప్రదర్శన నిర్వహించారు. మృతిచెందిన సిబ్బందికి ఎన్టీఆర్ కూడలిలో మానవహారంగా ఏర్పడి అశ్రునివాళి అర్పించారు. ప్రభుత్వం ఆదేశించిన ప్రకారం పలురకాల సర్వేలు చేపడుతుండటంతో పని భారం పెరిగిపోయి మానసికంగా, శారీరకంగా సతమత మవుతూ సక్రమంగా విధులు చేపట్టలేక పోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. మరికొందరు అనారోగ్యాలకు గురై మృత్యువాత పడుతున్నారని, ప్రభుత్వం స్పందించి పనిభారం తగ్గించి, తమ ఆరోగ్యాలను కాపాడాలని నినాదాలు చేశారు.

ప్రదర్శనలో స్వర్ణ గ్రామ సచివాలయాల సిబ్బంది

రోడ్డుపై మురుగు.. ఎలా వేయాలి అడుగు

కదిరేపల్లి గ్రామంలోని వీధులు అపరిశుభ్రంగా మారాయి. మధూడికి వెళ్లే మట్టి రోడ్డులో, ఆర్డీటీ కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రానికి వెళ్లే సీసీ రోడ్డుపై మురుగు నీరు ప్రవహిస్తోంది. రోడ్డుకు ఇరువైపులా కాలువలు లేకపోవడంతో కుళాయి నీరు, ఇళ్లలోని మురుగు రోడుపైకి చేరుతోంది. ఈ విషయమై పంచాయతీ కార్యదర్శి మహేశ్‌ను వివరణ కోరగా వెంటనే మురుగును తొలగించి సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు. **-న్యూస్‌టుడే, అగళి**

కంపలో నియంత్రిక.. ఫ్యూజు వేసేదెలా?

మండలంలోని పిల్లిగుండ్ల దళిత కాలనీ ప్రాంతంలో నియంత్రిక వద్ద కంపచెట్లు పెరిగి ఫ్యూజులు వేయడానికి ఇబ్బందిగా మారింది. సంబంధిత అధికారులకు తెలిపినా పట్టించుకోవడం లేదని కాలనీవాసులు వాపోతున్నారు. ఈ విషయంపై ఏఈ నిజాముద్దీన్‌ను వివరణ కోరగా వెంటనే పరిశీలించి కంపచెట్లను తొలగిస్తామని తెలిపారు. **-న్యూస్‌టుడే, రొళ్ల**

అడుగుకోగుంత.. ప్రయాణానికి చింత

తడకలపల్లి నుంచి ఎల్లోటి గ్రామానికి వెళ్లే 4 కిలోమీటర్ల రహదారిలో వెయ్యికి పైగా గుంతలున్నాయి. అడుగడుగునా గుంతలు పడి కంకర తేలి ప్రయాణం నరక యాతనగా మారింది. ఈ విషయమై పీఆర్ డీఈ వెంకటేశ్వర్లును వివరణ కోరగా రోడ్డు నిర్మాణానికి రూ.1.77 కోట్లు మంజూరయ్యాయని, త్వరలో టెండర్లు పిలిచి పనులు చేపడతామన్నారు. **-న్యూస్‌టుడే, మడకశిర గ్రామీణం**

ఎట్టకేలకు పైపుల ఏర్పాటు

చిలమత్తూరు: చిలమత్తూరు మండలం ఎంజేపీ గురుకుల పాఠశాల పక్కన ఉన్న హౌసింగ్‌బోర్డు కాలనీలో ఐదేళ్ల నుంచి వ్యర్థపదార్థాలు, చెత్తాచెదారం, మురుగునీటితో ఇబ్బందులు పడుతున్న కాలనీప్రజలకు ఎట్టకేలకు సమస్య తీరింది. పలుమార్లు ఈ సమస్యలపై 'ఈనాడు'లో చిత్రవార్తలు ప్రచురితం అయ్యాయి. కాలనీ ప్రజలు సమస్యను ఎమ్మెల్యే వ్యక్తిగత కార్యదర్శులు సురేంద్ర, శ్రీనివాసరావు, వీరయ్య, బాలాజీల దృష్టికి తీసుకువెళ్లారు. వారు వెంటనే స్పందించి చిలమత్తూరు తెదేపా సీనియర్ నాయకుడు లక్ష్మీనారాయణయాదవ్‌కు సిమెంటు పైపులు వేయమని ఆదేశించడంతో మంగళవారం కర్నూలు నుంచి పైపులు తీసుకువచ్చి కాలనీలో మురుగు నీరు రాకుండా అమర్చారు. దీంతో కాలనీ ప్రజలు కృతజ్ఞతలు తెలియజేశారు.

లేపాక్షిలో ఘనంగా చండీహోమం

లేపాక్షి, న్యూస్‌టుడే: మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా నాలుగో రోజైన మంగళవారం లేపాక్షి దుర్గా, పాపనాశేశ్వర, వీరభద్రస్వామి ఆలయంలో చండీహోమాన్ని పండితులు సునీల్‌శర్మ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ప్రత్యేకంగా అలంకరించిన శివ, పార్వతి, దుర్గాదేవి ఉత్సవ మూర్తులను సింహ వాహనంపై కొలువుదీర్చి గ్రామంలో ఊరేగించారు. అనంతరం భక్తజన సందోహం నడుమ మంగళ వాయిద్యాలతో చండీహోమం నిర్వహించారు. యజ్ఞానికి ముందు వేద పండితులు ఆలయం చుట్టూ ప్రదక్షిణ చేసి వీరభద్రస్వామి, దుర్గాదేవి అమ్మవారికి మహా మంగళహారతి నిర్వహించి బలిహారణం చేశారు. అనంతరం పూర్ణాహుతి ఇచ్చారు. వీరభద్రస్వామి, దుర్గాదేవికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ఛైర్మన్ రమానందన్, కార్యనిర్వహణాధికారి నరసింహమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

లేపాక్షిలో చండీహోమంలో పూర్ణాహుతి నిర్వహిస్తున్న పండితులు

అయిదు రోజులుగా ఆగిన తపాలా సేవలు

గోరంట్ల, న్యూస్‌టుడే: గోరంట్ల ఉపతపాలా కార్యాలయంలో సాంకేతిక సమస్యతో శుక్రవారం నుంచి సేవలు అందక ఖాతాదారులు, సాధారణ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సమస్య పరిష్కారం కావడానికి ఇంకా ఒకట్రెండు రోజులు పట్టే అవకాశం ఉన్నట్లు చెబుతున్నారు. తపాలాశాఖాధికారులు స్పందించి సమస్య పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

విద్యాభివృద్ధికి క్రీడలు దోహదం

హిందూపురం, న్యూస్‌టుడే: క్రీడలు విద్యాభివృద్ధికి తోడ్పడతాయని ఎంఈవో గంగప్ప అన్నారు. మంగళవారం ముద్దిరెడ్డిపల్లిలోని జడ్పీ ఉన్నత పాఠశాలకు ప్రధానమంత్రి స్కూల్ రైజింగ్ ఇండియా కింద రూ.1.50లక్షలు విలువచేసే క్రీడా సామగ్రిని అందించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సుధామణి, పీడీ నాగమణి తదితరులు పాల్గొన్నారు.

చోరీ చిన్నది.. నష్టం లెక్కలేనిది

బోరుబావుల వద్ద కేబుల్ అపహరణతో రైతుల ఆందోళన

సోమందేపల్లి, న్యూస్‌టుడే: మండలంలోని గుడిపల్లిలో రైతుల వ్యవసాయ బోరుబావులకు అమర్చిన విద్యుత్తు కేబుల్‌ను దుండగులు అపహరిస్తున్నారు. సాయంత్రం వరకు పంటలకు నీటితడులు అందించిన రైతులు ఇళ్లకు చేరుకున్నాక రాత్రి దొంగలు కేబుల్ వైర్‌ను కత్తిరించుకొని వెళ్తున్నారు. దాని కరిగిస్తే దొంగకు వచ్చేది రూ.వెయ్యి వరకే ఉంటున్నా.. రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. కొన్నిచోట్ల మిగిలిన తీగ బోరులోకి జారిపోతోంది. దాన్ని బయటకు తీయడానికి మరింత ఖర్చుచేయాల్సి వస్తోందని, అంత వరకు పంటలకు తడులు అందక నష్టపోతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

గుడిపల్లిలో 15 చోట్ల ఒకేరోజు..

సోమందేపల్లిలోని గుడిపల్లిలో మూడు రోజుల క్రితం 15 మంది అన్నదాతల వ్యవసాయ విద్యుత్తు మోటార్ల వద్ద కేబుల్‌ను తొలగించి ఎత్తుకెళ్లారు.

బోరుబావికి తొలగించిన విద్యుత్తు కేబుల్

● వ్యవసాయ మోటార్ల కేబుల్ చోరీ కారణంగా ఒక్కో రైతుకు రూ.3 వేలు వరకు నష్టం వాటిల్లింది. ఇక కేబుల్ వైరు బోరుబావిలోకి జారిపోయిన రైతులకు మరో రూ.2 వేలకు పైగా ఖర్చులు మీద పడుతోంది. చోరీకి పాల్పడిన దొంగలకు 12 మీటర్ల వైరును మంటల్లో కాల్చితే ఐదు కిలోల రాగి వైరు లభిస్తే కేవలం రూ.1500 వస్తుంది. కాని రైతు నష్టం అధికంగా ఉంటోంది. దొంగతనాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని ఎస్సై రమేశ్‌బాబుకు బాధితులు ఫిర్యాదు చేశారు.

రూ.1800 చెల్లించి కొనుగోలు చేశాం

బోరుబావికున్న 12 మీటర్ల కేబుల్ వైరును దొంగలు చోరీ చేశారు. మూడు రోజులుగా మామిడి తోట, మొక్కజొన్న పంటకు ఇబ్బందిగా మారడంతో సోమవారం రూ.1800 పెట్టి కొనుగోలు చేశా. మరో రూ.500 మెకానిక్ ఇచ్చి కనెక్షన్ ఇప్పించాం. తమ ముగ్గురు సోదరులకు సంబంధించి రూ.7,800 నష్టపోయాం. మళ్లీ కొత్తది కొనేందుకు రూ.9 వేలు ఖర్చు చేయాల్సి వచ్చింది. **-రంగప్ప, రైతు, గుడిపల్లి**

8th ANNIVERSARY
వైష్ణవి ENT హాస్పిటల్ & అలర్జీ సెంటర్

RPGT రోడ్, హిందూపురం
9346234090

వైష్ణవి ENT హాస్పిటల్ & అలర్జీ సెంటర్ ఎనిమిది సంవత్సరాలు పూర్తి చేసుకుని దిగ్విజయంగా తొమ్మిదవ సంవత్సరంలోకి అడుగిడుతున్న శుభ సందర్భంగా మమ్ము ఆదరిస్తున్న హిందూపురం పట్టణం మరియు పరిసరప్రాంత ప్రజలకు మా హృదయపూర్వక ధన్యవాదములు.

డా॥ వి.అనిల్
MBBS, MS; ENT and Head & Neck Surgery
చెవి, ముక్కు & గొంతు శస్త్ర చికిత్స నిపుణులు
Advanced Endoscopic Surgeon
Kurnool Medical College, Reg No.47710

వైకుంఠ సమారాధన

జననం 31-03-1975
మరణం 08-02-2026

కీ॥శే॥ డా॥ పెయ్యల లక్ష్మీపతిరెడ్డి గారు MDS
డా॥ APJ అబ్దుల్‌కలాం నేషనల్ స్టార్ అవార్డు గ్రహీత
నారశింహపల్లి గ్రామం, గోరంట్ల మండలం

భార్య: పి.అనురాధ
నాన్న: పి.రామలింగారెడ్డి, అన్న: పి.వి.శివారెడ్డి
తమ్ముడు: పి.రాఘవేంద్రరెడ్డి మరియు పెయ్యల కుటుంబ సభ్యులు

పెద్దకర్మ మరియు వైకుంఠ సమారాధన 18-02-2026న తేది బుధవారం ఉదయం 10.00 గంటల నుండి గోరంట్ల మండలం నారశింహపల్లి గ్రామంలోని మా స్వగృహము నందు జరుగును.

(c) eenadu

పుట్టపర్తి
•పుట్టపర్తి •ధర్మవరం •కదిరి •రాప్తాడు

సమస్య పరిష్కరించాలని నోటీసు

ఓబులదేవరచెరువు, న్యూస్‌టుడే: సమస్యను పరిష్కరించాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రైమరీ అగ్రికల్చర్ కో-ఆపరేటివ్ సొసైటీ ఎంప్లాయిస్ యూనియన్ (జేఏసీ) మేరకు సహకార సంఘం ఉద్యోగులు నిరవధిక సమ్మెలో ఉన్నారు. మంగళవారం స్థానిక కో-ఆపరేటివ్ బ్యాంక్ మేనేజర్ లక్ష్మిరెడ్డికి ఉద్యోగులు సమ్మె నోటీస్ అందించారు. సీఈఓలు రామ్మోహన్, రామాంజినేయులు, కేశవులు, నాగవేణి, పణికుంటారెడ్డి, రమేష్ పాల్గొన్నారు. అంతకుముందు యూనియన్ డైరీలు, క్యాలెండర్ ఆవిష్కరించారు.

ఆర్థిక సాయం అందజేత

కదిరి పట్టణం: రోడ్డు ప్రమాదంలో చనిపోయిన నాగరాజు కుటుంబానికి హరీశ్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎం.ఎస్.కిరణ్ మంగళవారం రూ.50 వేల ఆర్థిక సాయం అందజేశారు. కాళసముద్రం నివాసి నాగరాజు గత డాది డిసెంబరు 25న జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు.

రాష్ట్రస్థాయి షూటింగ్‌బాల్‌లో కేజీబీవీ విద్యార్థినుల ప్రతిభ

బుక్కపట్నం, న్యూస్‌టుడే: 44వ రాష్ట్రస్థాయి షూటింగ్ బాల్ సబ్ జూనియర్ పోటీల్లో బుక్కపట్నం కేజీబీవీ విద్యార్థినులు ప్రతిభ చాటినట్లు ప్రిన్సిపల్ సౌజన్య, పీఈటీ స్వర్ణకుమారి తెలిపారు. ఈనెల 13 నుంచి 15 వరకు ధర్మవరంలో రాష్ట్రస్థాయి పోటీలు జరగ్గా ఉమ్మడి అనంత జిల్లాలో మూడవ స్థానాన్ని కైవసం చేసుకున్నట్లు పేర్కొన్నారు. క్రీడాకారులు వాసంతి, సాయిశ్రీ, మమత, భవ్యశ్రీ, గీతిక, కావ్యశ్రీ, షర్మిలాబాయి, సురేఖలకు ప్రశంసా పత్రాలు, పతకాలు జ్ఞాపిక పొందినట్లు చెప్పారు.

విజేతలతో ప్రిన్సిపల్ సౌజన్య, పీఈటీ స్వర్ణకుమారి

మేమున్నాం.. మీకు తోడుగా

పుట్టపర్తి: 80085 73039
కదిరి : 80085 73033
ధర్మవరం: 99596 98222

సమస్య: తాడిమర్రి నుంచి దాడితోట (గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారికి ఇరువైపులా కంపచెట్లు పెరిగిపోయి వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వాటిని తొలగించాలని కోరుతున్నాం. - మండల ప్రజలు

సమాధానం: పంచాయతీ కార్యదర్శులతో మాట్లాడి వాటిని తొలగించాలని ఆదేశిస్తాం.

సమస్య: గ్రామంలో పలు కాలనీల్లో ఏర్పాటు చేసిన తాగునీటి ట్యాంకులకు పైపులైన్ కనెక్షన్లు ఇవ్వలేదు. వేసవి వస్తోంది అధికారులు స్పందించి వాటిని వినియోగంలోకి తేవాలని కోరుతున్నాం. - సాంబ, నారాయణ

సమాధానం: ఆ శాఖాధికారులతో మాట్లాడి వాటిపై చర్చిస్తాం.

(పై ప్రశ్నలకు ఎంపీడీవో వెంకటరంగారావు సమాధానాలిచ్చారు.)
-న్యూస్‌టుడే, తాడిమర్రి

టమాటరాక.. గిట్టుబాటు కాక

అప్పుల ఊబిలో చిక్కుకుంటున్న అన్నదాతలు

తనకల్లు, న్యూస్‌టుడే: టమాటా ధరలు పడిపోవడంతో అన్నదాతలు బిక్కుబిక్కుమంటున్నారు. కనీసం పెట్టుబడి దక్కక కర్షకులు అప్పుల ఊబిలోకి జారుకుంటున్నారు. రూ. లక్షలు ఖర్చుచేసి ఆరుగాలం శ్రమించిన హలికుడికి తుదకు అప్పులే మిగులుతున్నాయి. కనీసం గిట్టుబాటు ధర కూడా దక్కక శ్రామికులు ఆందోళన చెందుతున్నారు.

ఊపిరి సలపనివ్వని చీడపీడలు

కదిరి డివిజన్ పరిధిలో ఎక్కువశాతం మంది రైతులు టమాటా సాగుచేస్తుంటారు. అన్నమయ్య జిల్లా మదనపల్లె, ములకలచెరువు, కర్ణాటక రాష్ట్రం చింతామణి, కోలార్, వడ్డిపల్లి ప్రాంతాల్లో మార్కెట్ సౌకర్యం ఉండటంతో ఎక్కువ మంది టమాటా సాగు చేయడానికి మొగ్గు చూపుతున్నారు. ప్రస్తుతం 30 కిలోల ధర రూ.70 నుంచి రూ. 280 పలుకుతోంది. దీంతో కూలీలు, రవాణా ఖర్చులు, కమీషన్‌కే చాలక కర్షకులు ఆందోళన చెందుతున్నారు. దీనికి తోడు చీడపీడలు వారిని ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి.

అదనపు ఖర్చులతో ఉక్కిరిబిక్కిరి

టమాటా సాగుకు దుక్కి నుంచి రైతులు అధిక ఖర్చులు వెచ్చించాల్సి వస్తోంది. దీనికి తోడు కట్టెలు, పురి, వైరు ధరలు పెరగడం అన్నదాతలను ఇబ్బందులకు గురిచేస్తోంది. పుర్తి 50 కిలోల మూట ధర గత సంవత్సరం జూన్‌లో రూ. 8200 ఉండగా ప్రస్తుతం రూ. 10,200కు చేరింది. కట్టెలు డిమాండ్‌ను బట్టి ధరలు పెరుగుతున్నాయి. ఎరువుల ధరలు రైతులకు ఊపిరి ఆడకుండా చేస్తున్నాయి. కూలీల ఖర్చు డిమాండ్‌ను బట్టి మారుతోంది. దూర ప్రాంతాల నుంచి వచ్చే మహిళా కూలీలకు మధ్యాహ్నం వరకు రూ.400 ఇస్తుండగా అదనంగా ఆటో ఛార్జీ రూ.100 వరకు భరించాల్సి వస్తోందని వాపోతున్నారు. ఎకరం విస్తీర్ణంలో టమాటా సాగు చేయాలంటే రూ.2 లక్షలకు పైగా ఖర్చు అవుతోంది.

కదిరి నియోజకవర్గంలో వివరాలిలా..

మండలం	సాగువిస్తీర్ణం (ఎకరాల్లో)
కదిరి	150
ఎన్పీకుంట	100
తలుపుల	180
గాండ్లపెంట	100
నల్లచెరువు	350
తనకల్లు	800

తోటలోనే వదిలేసిన టమాటాలు

నులిపురుగుల నివారణ మాత్రల పంపిణీ

నంబులపూలకుంట: మండలంలోని అన్ని పాఠశాలల్లోని విద్యార్థులకు నులిపురుగు నివారణ మాత్రలు అందించినట్లు వైద్యాధికారి బాలాజీ నాయక్ తెలిపారు. మంగళవారం మండలంలోని కస్తూర్బా గాంధీ గురుకుల పాఠశాలలో విద్యార్థినులకు నులిపురుగు మాత్ర పంపిణీ కార్యక్రమాన్ని ఎంపీపీ పాల్గొని ప్రారంభించారు, డిప్యూటీ ఎంపీడీవో మాధవరెడ్డి ప్రారంభించారు.

విద్యార్థినికి మాత్ర వేస్తున్న డిప్యూటీ ఎంపీడీవో మాధవరెడ్డి

గాండ్లపెంట, న్యూస్‌టుడే : మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలలో జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని ప్రత్యేకాధికారి రాజేంద్రనాథ్ రెడ్డి, వైద్యాధికారులు మహేశ్వరనాయక్, బాబాఫక్రుద్దీన్, తహసీల్దార్ బాబురావు, ఎంపీడీవో రామకృష్ణ, ఎంఈఓ సోమశేఖర్‌రెడ్డి, సర్పంచి భరత్, తెదేపా మండల కన్వీనర్ వెంకటప్రసాద్, ఉపాధ్యాయులు, వైద్య సిబ్బంది నిర్వహించారు.

నల్లచెరువు, న్యూస్‌టుడే : మండలంలోని ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలల విద్యార్థులకు జాతీయ నులిపురుగుల దినోత్సవం సందర్భంగా అల్బెండజోల్ మాత్రలు సిబ్బందితో కలిసి వైద్యాధికారిణి ఆలేఖ్య పంపిణీ చేశారు. కార్యక్రమాన్ని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ నాగేంద్ర కుమార్ పర్యవేక్షించి కస్తూర్బా గాంధీ పాఠశాల బాలికలకు ఆ మాత్రలు వేశారు.

ధర్మవరం పట్టణం, న్యూస్‌టుడే : ధర్మవరం డివిజన్‌లోని ప్రభుత్వ, ప్రైవేట్ విద్యా సంస్థల్లోని విద్యార్థులకు అల్బెండజోల్ మాత్రలు వేసినట్లు డిప్యూటీ డీఎంహెచ్‌ఓ చెన్నారెడ్డి మంగళవారం తెలిపారు.

సీతారామాలయ నిర్మాణానికి రూ.లక్ష విరాళం

గ్రామస్థులకు విరాళం అందజేస్తున్న బత్తల హరిప్రసాద్

కదిరి పట్టణం, న్యూస్‌టుడే : నల్లచెరువు మండలంలోని బసవన్నకోట వద్ద నిర్మాణంలో ఉన్న రామాలయానికి కదిరి మండలం కుమ్మరవాండ్లపల్లికి చెందిన డాక్టర్ బత్తల హరిప్రసాద్ మంగళవారం రూ.లక్ష విరాళం అందజేశారు. మండలానికి చెందిన దశరథనాయుడు, నరసింహారెడ్డి, నగేష్, వెంకటనారాయణ, వేమయ్య, ఓబులప్ప, శ్రీరాములు, మురళి పాల్గొన్నారు.

విద్యార్థులకు కంటి అద్దాల పంపిణీ

బత్తలపల్లి న్యూస్‌టుడే: దృష్టిలోపం ఉన్న విద్యార్థులకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు అరుణ్‌కుమార్ ఆధ్వర్యంలో కంటి అద్దాలు ఉచితంగా పంపిణీ చేశారు. మండలంలోని ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు గత నెలలో కంటి పరీక్షలు నిర్వహించారు. వారిలో 98 మంది విద్యార్థులకు దృష్టిలోపం ఉన్నట్లు గుర్తించారు. మంగళవారం వారికి ఉచితంగా కంటి అద్దాలు పంపిణీ చేశారు. ఎంపీడీఓ నరసింహనాయుడు, ఈఓఆర్డీ క్రిష్టప్ప, ప్రధానోపాధ్యాయులు నాగరత్న, జయంతి ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

కళ్లజోడు అందుకున్న విద్యార్థులతో వైద్యుడు అరుణ్‌కుమార్

సైన్స్‌తోనే సమాజాభివృద్ధి

ధర్మవరం పట్టణం: సైన్స్ పరిజ్ఞానం లేనిదే ఏ శక్తి ముందుకు సాగదని, దాంతోనే ప్రపంచం మనుగడ సాధిస్తోందని జేవీవీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ ఆదిశేషు తెలిపారు. ఇటలీ సిద్ధాంతకర్త, ఖగోళవేత్త గెలీలియో బ్రూనో సత్యాన్వేషణ రోజును జేవీవీ నాయకులు ఘనంగా నిర్వహించారు. మంగళవారం పట్టణంలోని గణేష్ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో కార్యక్రమం జరిపారు. జేవీవీ జిల్లా కార్యదర్శి లోకేశ్, ఉపాధ్యాయులు రామకృష్ణ, హరికృష్ణ పాల్గొన్నారు.

రీసర్వే ప్రక్రియపై అవగాహన

నంబులపూలకుంట, న్యూస్‌టుడే: రీ సర్వే ప్రక్రియలో భాగంగా మంగళవారం పెద్దపల్లిలో రైతులకు గ్రౌండ్ ట్రూతింగ్ పై తహసీల్దార్ దేవేంద్రనాయక్ అవగాహన కల్పించారు. రైతుల సమక్షంలోనే వారి భూ సరిహద్దులను గుర్తించడన్నే గ్రౌండ్ ట్రూతింగ్ అంటారని తహసీల్దార్ తెలిపారు. భూ విస్తీర్ణం, సరిహద్దులు, రికార్డులకు సంబంధించిన సమస్యలు ఉంటే సరైన ధ్రువీకరణ పత్రాలను తీసుకొని రీ సర్వే అధికారులకు చూపిస్తే పరిష్కరిస్తారని తెలిపారు. మండల సర్వేయర్ ప్రభుజన్‌రెడ్డి, వీఆర్‌ఓ అనూష, సర్వేయర్లు యశ్వర్ధరెడ్డి, నాగేంద్ర పాల్గొన్నారు.

కాలభైరవుడికి ప్రత్యేక పూజలు

ధర్మవరం న్యూస్‌టుడే: పట్టణంలోని కాలభైరవ స్వామి ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమావాస్యను పురస్కరించుకుని భక్తులు మూకుడు దీపం వెలిగించారు. పట్టణంలోని ప్రజలతోపాటు, గ్రామీణ ప్రాంతాల నుంచి భక్తులు తరలి వచ్చి స్వామి వారికి పూజలు చేశారు.

ప్రత్యేక అలంకరణలో కాలభైరవుడు

ముగిసిన పెద్దమ్మతల్లి జాతర

ముదిగుబ్బ, న్యూస్‌టుడే: మండలంలోని పెద్దమ్మతల్లి జాతర మంగళవారం ఘనంగా జరిగింది. మూడు రోజులుపాటు జరిగిన జాతరలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉరేగింపు చేశారు. పెద్దమ్మతల్లిని నల్లలమ్మ గద్దెమీద నుంచి ఆలయానికి తీసుకొచ్చి వెండి కిరీటాలు, పుష్పాలతో ప్రత్యేక అలంకరణ చేసి పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. పరుస రోజు కావడంతో గాజులు, ఆటబొమ్మల అంగళ్లతో పాటు ఆలయ ప్రాంగణం భక్తులతో కిక్కిరిసిపోయింది.

విశేష అలంకరణలో పెద్దమ్మతల్లి

నిబద్ధతతో విధులు నిర్వర్తించాలి

కొత్తచెరువు, న్యూస్‌టుడే: కొత్తచెరువు సర్కిల్ పరిధిలో అధికారులు, పోలీసులు నిబద్ధతతో విధులు నిర్వర్తించి నేరాలను నియంత్రించాలని పుట్టపర్తి డీఎస్పీ విజయకుమార్ పేర్కొన్నారు. మంగళవారం ఆయన యూపీఎస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. నమోదైన కేసులు, పెండింగ్ కేసులు, వాటి స్థితిగతులు, నిందితుల అరెస్టు, కేసుల దర్యాప్తులు వాటి పురోగతులపై సీఐ మారుతి శంకర్‌ను అడిగి తెలుసుకున్నారు.

'బూత్ స్థాయి నుంచి పార్టీని బలోపేతం చేద్దాం'

నల్లమాడ, న్యూస్‌టుడే: స్థానిక సంస్థల ఎన్నికల లక్ష్యంగా తెదేపాను క్షేత్రస్థాయిలో బూత్‌స్థాయిలో మరింత బలోపేతం చేయడానికి ప్రతి ఒక్క కార్యకర్త క్రియాశీలకంగా పని చేయాలని ఆ పార్టీ మండల స్థానిక సంస్థల ఎన్నికల పరిశీలకుడు సోమనాయక్ పిలుపునిచ్చారు. ఎర్రమాండ్లపల్లి, చారుపల్లి, సి.బడవాండ్లపల్లి గ్రామాల్లో 139, 141 బూత్‌లలో మండల కన్వీనర్ మైలే శంకర్, పుట్టపర్తి నియోజకవర్గ సోషల్ మీడియా కోఆర్డినేటర్ కె.మంజునాథ్‌రెడ్డితో కలసి మంగళవారం పర్యటించారు.

19న ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి వేడుకలు

ధర్మవరం న్యూస్‌టుడే: పట్టణంలో ఈనెల 19న ఛత్రపతి శివాజీ మహారాజ్ 399వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నట్లు మంత్రి సత్యకుమార్ కార్యాలయ ఇన్‌ఛార్జి హరీశ్‌బాబు ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం సాయంత్రం గాంధీనగర్ చౌరస్తా నుంచి ఆలయ కూడలి నుంచి శోభాయాత్ర ఉంటుందని ఆయన చెప్పారు. నియోజకవర్గ ప్రజలు పాల్గొనాలని ఆయన కోరారు.

వేధింపులకు పాల్పడితే చర్యలు

ధర్మవరం న్యూస్‌టుడే: మహిళలు, బాలికలను వేధించే వారిపై కఠినంగా వ్యవహరిస్తామని డీఎస్పీ హేమంత్‌కుమార్ అన్నారు. మంగళవారం పట్టణంలోని కేతిరెడ్డి కాలనీలో పోలీసుశాఖ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రెండో పట్టణ సీఐ రెడ్డప్ప, పోలీసులు పాల్గొన్నారు.

పూత దశలోనే సస్యరక్షణ చర్యలు తీసుకోవాలి

నల్లమాడ: మామిడి తోట రైతులు పూత దశలోనే ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని మండల ఉద్యానవన అధికారి నవీన్‌కుమార్ సూచించారు. మంగళవారం మెట్టునవాండ్లపల్లిలో మామిడి తోట రైతులకు అవగాహన కల్పించారు, తోటలను పరిశీలించారు. ఈ సందర్భంగా మామిడి తోట పూతదశలో ఉన్నందున రైతులు పూత రాలకుండా ప్రత్యేక చర్యలు పాటించాలని సూచించారు. మండల రైతు సేవాకేంద్రం అధికారులు రాధ, నారాయణ పాల్గొన్నారు.

ఎస్సైలు శ్రీనివాసులు, నారాయణరెడ్డి, ఏఎస్సై ప్రసాద్, మునేనాయక్, అశోక్ పాల్గొన్నారు.

బాల్యవివాహాల నిర్మూలనపై ..

నల్లమాడ, న్యూస్‌టుడే: వంకరకుంట గ్రామంలో మండల ఎస్సై సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది బాల్యవివాహాల నిర్మూలనపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ 21 శతాబ్దంలో కూడా బాల్యవివాహాలు జరుగడం దురదృష్టకరమని వాటిని నిర్మూలించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. బాల్య వివాహం చట్టవిరుద్ధమని, వివాహంలో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ శిక్షపడే అవకాశం ఉందని పేర్కొన్నారు. బాలల భవితకు బాల్య వివాహాలు అడ్డంకులుగా మారుతున్నాయన్నారు.

ట్యాంకు నిరుపయోగం

మేజరు పంచాయతీ కొత్తచెరువులోని పెద్ద మసీదు దగ్గరున్న ట్యాంకుకు నీటి సరఫరాలేక నిరుపయోగంగా మారింది. ధర్మవరం రోడ్డు నుంచి విజయనగర కాలనీ మీదుగా బసవన్నకట్ట, పెద్ద మసీదు వరకూ వివిధ ప్రాంతాల్లో చిన్న ట్యాంకులు ఏర్పాటుచేసి సత్యసాయి నీటిని సరఫరా చేస్తున్నారు. అయితే పెద్ద మసీదు దగ్గరున్న ట్యాంకుకు రోజుల తరబడి నీటి సరఫరా జరగడం లేదు. దీంతో విష్ణుప్రియ సత్రం, లేదంటే బసవన్న కట్ట ప్రాంతాల నీటిని తెచ్చుకోవాల్సిన పరిస్థితి. ఎంపీడీవో సాదిక్‌వలి దృష్టికి తీసుకెళ్లగా పైపులైను మరమ్మతులు చేసి ట్యాంకుకు నీటి సరఫరా చేస్తామని తెలిపారు.

- న్యూస్‌టుడే, కొత్తచెరువు

తారు లేచి.. గుంతలు పడి

నూతనకాలువ పంచాయతీ నుంచి పొలతలవాండ్లపల్లి పంచాయతీ మీదుగా కదిరికి ఉన్న తారు రోడ్డు అధ్వానంగా మారింది. పలుచోట్ల కంకర లేచిపోయి గుంతలు పడి వాహనదారుల ప్రయాణానికి ఇబ్బందికరంగా మారిందని స్థానికులు చెబుతున్నారు. ఈ మార్గంలో ఆటోలు, ద్విచక్ర వాహనాలు, ట్రాక్టర్లు నిత్యం తిరుగుతుంటాయి. కదిరికి దగ్గర రోడ్డు కావడంతో ఎక్కువ మంది ఈ మార్గాన్నే ఆశ్రయిస్తారు. సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి దెబ్బతిన్న రహదారిని బాగుచేయాలని స్థానికులు కోరుతున్నారు. ఈ విషయంపై సంబంధిత పీఆర్ జేఈ తాను కలసి అంచనాలు వివరణ కోసం ఇప్పటికే ప్రతిపాదనలకు నివేదిస్తామన్నారు. - న్యూస్‌టుడే, తలుపుల

అరటి తోట దగ్ధం

కనగానపల్లి, న్యూస్‌టుడే: అరటి తోట అగ్నికి ఆహుతైన ఘటన కనగానపల్లి మండల కేంద్రంలో సోమవారం రాత్రి జరిగింది. కనగానపల్లికి చెందిన రైతు శివయ్య ఏడాది కిందట ఐదు ఎకరాల పొలాన్ని కౌలుకు తీసుకొని అరటి పంట సాగు చేశాడు. గుర్తు తెలియని వ్యక్తులు ఎండు గడ్డికి నిప్పు పెట్టడంతో మంటలు మంటలు వ్యాపించాయి. రైతు అప్రమత్తమై అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇచ్చారు. అగ్నిమాపక సిబ్బంది అక్కడకు చేరుకొని మంటలను అదుపు చేసేసరికి రెండు ఎకరాల్లో ఉన్న పంట పూర్తిగా కాలిపోయింది. అరటి పంట పూర్తిగా కాలిపోవడంతో రూ.6 లక్షల వరకు పంట నష్టం వాటిల్లినట్లు బాధిత రైతు వాపోయారు.


కాలిపోయిన అరటి తోట

విషద్రావణం తాగి పది గొర్రెలు మృతి

ధర్మవరం న్యూస్‌టుడే: బుడ్డారెడ్డిపల్లిలో మంగళవారం రసాయన మందులు కలిపిన నీటిని తాగి పది గొర్రెలు మృత్యువాత పడ్డాయి. గ్రామానికి చెందిన దాసరి ఆదెప్ప గొర్రెల మందను శివశంకర్‌రెడ్డి వ్యవసాయతోటకు సోమవారం రాత్రి తీసుకెళ్లారు. మంగళవారం ఉదయం రసాయన మందులను నీటి తొట్టిలో కలిపి డ్రిప్ ద్వారా పంటకు అందించడానికి సిద్ధం చేసుకున్నారు. ఈ క్రమంలోనే ఆ నీటిని పది గొర్రెలు తాగి మృతి చెందాయి. రూ.లక్షకుపైగా నష్టం వాటిల్లిందని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశారు.

ఆకస్మిక తనిఖీ

ఓబులదేవరచెరువు, న్యూస్‌టుడే: జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమాన్ని రాష్ట్ర అధికారి డాక్టర్ విజయ్‌కుమార్ ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. స్థానిక కస్తూర్బా పాఠశాలలో నులిపురుగు నివారణ కోసం విద్యార్థులకు అల్బెండజోల్ మాత్రలను వేశారు. రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. మండల వైద్యాధికారి భానుప్రకాష్, సీహెచ్‌ఓ ప్రమీలమ్మ, సూపర్‌వైజర్ రామకృష్ణమ్మ, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరం

కదిరి, న్యూస్‌టుడే: పట్టణ పరిధి నిజాంవలి కాలనీలో పీపుల్స్ హెల్త్ సొసైటీ ఆధ్వర్యంలో వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఇక్రా పాఠశాల విద్యార్థులు, బీడీ కార్మికులకు వైద్యపరీక్షలు చేసి, మందులు అందజేశారు. ఇస్మాయిల్, అజాద్, ముబారక్, తస్లీరా లీఖాన్, నిశ్శల, నారాయణస్వామి నాయక్ వైద్యసేవలు అందించారు. నిర్వాహకులు రామకృష్ణ, జీవీ నరసింహులు, జగన్మోహన్, సాంబశివ, ముస్తాక్, బాబ్జాన్, ఉదయ్‌లు పాల్గొన్నారు.

వేతనాలు పెంచాలని వినతి

పుట్టపర్తి పట్టణం, న్యూస్‌టుడే: పట్టణంలో ఐసీడీఎస్ సమావేశంలో అంగన్‌వాడీలకు వేతనాలు పెంచాలని రేల్ నిరాహార దీక్ష చేపడతామని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆంజనేయులు తెలిపారు. మంగళవారం ఐసీడీఎస్ కార్యాలయంలో పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని పీడీ ప్రమీలకు వినతిపత్రం అందజేశారు. అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్ల అసోసియేషన్ కోశాధికారి దేవి, ఉపాధ్యక్షురాలు శకుంతల, రాజేశ్వరి, కమలమ్మ పాల్గొన్నారు.

పీడీ ప్రమీలకు వినతిపత్రం అందజేస్తున్న ఏఐటీయూసీ సభ్యులు

క్రైం కార్నర్

చికిత్స పొందుతూ వివాహిత మృతి

తనకల్లు, న్యూస్‌టుడే: ద్రావకం తాగి ఆత్మహత్యాయత్నం చేసిన వివాహిత సుశీలమ్మ (30) అనంతపురంలో ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందింది. మండలంలోని నారెవాండ్లపల్లికి చెందిన ఆమె ఈ నెల 12న ఇంట్లో ద్రావకం తాగి పడిఉండడాన్ని గుర్తించిన కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం అనంతపురానికి తరలించి చికిత్స అందిస్తుండగా మృతి చెందింది. ఆమెకు భర్త, కుమారుడు, కుమార్తె ఉన్నారు. కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ..

నల్లచెరువు, న్యూస్‌టుడే: రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి చెందిన ఘటన మండల పరిధిలో మంగళవారం చోటుచేసుకుంది. వివరాల మేరకు జిల్లాలోని చెన్నేకొత్తపల్లి మండలంలోని నల్లసానివారిపల్లి గ్రామానికి చెందిన పోట్ల చిన్నప్ప భార్య రామలక్ష్మమ్మ వీరనారాయణస్వామి పరసకు వెళ్లి తిరిగి ద్విచక్ర వాహనంలో వస్తుండగా మండలంలోని పెద్దేక్కోటపల్లి గ్రామం వద్ద ఆమె బైక్‌పై నుంచి కిందపడ్డారు. ప్రమాదంలో ఆమె తీవ్రంగా గాయపడ్డారు. వెంటనే ఆమెను 108 వాహనంలో కదిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం బత్తలపల్లి ఆర్డీటీ ఆసుపత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆమె మంగళవారం మృతి చెందారు.

వేధింపులపై ఫిర్యాదు.. కేసు నమోదు

ధర్మవరం న్యూస్‌టుడే: పట్టణంలోని ఓ కాలనీకి చెందిన యువతి, ఆమె కుటుంబ సభ్యులను పోక్సో కేసు పెడతానని బెదిరింపులకు గురిచేస్తున్న చియ్యేటి సాయికుమార్‌రెడ్డిపై రెండో పట్టణ పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. రాప్తాడు మండలం గొందిరెడ్డిపల్లికి చెందిన చియ్యేటి సాయికుమార్ రెడ్డిపై బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ రెడ్డప్ప తెలిపారు.

పోక్సో కేసులో యువకుడికి రిమాండ్

ముదిగుబ్బ, న్యూస్‌టుడే: పోక్సో కేసులో ఓ యువకుడికి 15 రోజులు కోర్టు రిమాండ్ విధించినట్లు ముదిగుబ్బ సీఐ శివరాముడు తెలిపారు. మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలికను అదే గ్రామానికి చెందిన మల్లికార్జున(28) అనే యువకుడు ప్రేమించి పెళ్లిచేసుకోవాలని వేధించగా బాలిక తండ్రి స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. యువకుడిపై పోక్సో కేసు నమోదుచేసి మంగళవారం కదిరి కోర్టుకు తరలించగా రిమాండ్ విధించినట్లు చెప్పారు.

ఆటో బోల్తా.. ఐదుగురికి గాయాలు

తనకల్లు, న్యూస్‌టుడే: అదుపుతప్పి ఆటో బోల్తాపడింది. ప్రమాదంలో ఐదుగురు గాయపడ్డారు. ఈ ఘటన తనకల్లులో చోటుచేసుకుంది. అలయం వద్ద 42 జాతీయరహదారిపై మంగళవారం చోటుచేసుకుంది. గాయపడిన వారిలో ముగ్గురు తిమ్మమ్మమర్రిమాను సందర్శించి కొక్కంటి క్రాస్‌లో ఆటో ఎక్కారు. అక్కడి నుంచి నల్లచెరువుకు వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. క్షతగాత్రుల్ని తనకల్లు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

బొలెరో బోల్తా.. 8 మందికి..

ముదిగుబ్బ, న్యూస్‌టుడే: అతివేగం, డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగా బొలెరో బోల్తాపడి ఎనిమిది మందికి గాయాలయ్యాయి. ఈ ఘటన మంగళవారం రాత్రి మండలంలోని చిన్నకొట్ల - యర్రగుంటపల్లి మధ్య జరిగింది. పోలీసుల వివరాల మేరకు బూదనంపల్లి గ్రామానికి చెందిన వెంగళరెడ్డి, బయప్ప తోటలో చీనీకాయలు కోసేందుకు తాడిమర్రి మండలంలోని పిన్నదరి, నార్పల మండలంలోని సంజీవపురం నుంచి రెండు బొలెరో వాహనాల్లో కూలీలు వచ్చారు. తిరుగు ప్రయాణంలో చిన్నకొట్ల దాటిన తర్వాత మలుపులో డ్రైవర్ వేగాన్ని నియంత్రించలేక అదుపుతప్పి బోల్తాపడింది. అందులో ప్రయాణిస్తున్న ఎనిమిది మందికి రక్తగాయాలయ్యాయి. క్షతగాత్రులను స్థానికులు 108 వాహనంలో బత్తలపల్లి ఆర్డీటీ ఆసుపత్రికి తరలించారు.

గడ్డివాముకు నిప్పంటించిన దుండగులు

నల్లచెరువు, న్యూస్‌టుడే : చెవిటివారిపల్లి గ్రామంలో దళితవాడలో ఉంటున్న రైతుకు చెందిన గడ్డివామును గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో పూర్తిగా కాలిపోయింది. రూ.లక్ష వరకు నష్టం వాటిల్లిందని బాధితుడు వాపోయారు. తెలిపిన వివరాల మేరకు రోజులాగే పశువులను మేపడానికి ఇటు వెళ్లగా.. ఆటు ఇంట్లో వాళ్లు కూలి పనులకు వెళ్లడంతో గుర్తుతెలియని వ్యక్తులు నిప్పంటించారని గ్రామస్థులు సమాచారం అందించారు. వేసవిలో పశువుల మేతకు పెట్టుకున్న గడ్డి సరికి పూడిదైపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు.

కాలువ ఇలా.. సాగునీరు వెళ్లేదెలా?

కొత్తచెరువు, న్యూస్‌టుడే: కొత్తచెరువు మండల పరిధిలోని ఆయకట్టుకు నీరందించే సాగునీటి కాలువల్లో గుర్రపుడెక్క ఏపుగా పెరిగిపోయింది. దీంతో సాగునీరు ముందుకెళ్లలేని పరిస్థితి ఏర్పడింది. రానున్న వేసవికి పంటకు నీరు అధికంగా నీరు అవసరం అవుతుంది. ఈ నేపథ్యంలో అన్నదాతలు పంటకు నీరందుతుందా అని ఆందోళన చెందుతున్నారు.

నీరు కనిపించనంతగా కమ్మేసి

బుక్కపట్నం చెరువు ఆయకట్టులో అత్యధిక సాగు కలిగిన తిమ్మరుసుకుంట కాలువ మండల కేంద్రం పడమటి వైపు మాగాణి భూములకు సాగునీరు అందిస్తోంది. రబీ ప్రారంభంలోనే కాలువల్లో పూడిక తొలగించడానికి సాగునీటి సంఘం ఆధ్వర్యంలో రూ. లక్షల నిధులు వెచ్చించారు. అయితే వరినాట్లు ప్రారంభ దశలోనే కాలువలో గుర్రపుడెక్క పెరిగింది. దీంతో మరొకసారి రైతులే గుర్రపుడెక్కను తొలగించారు. అయినా కొద్ది రోజుల్లోనే కాలువలో నీరు కనిపించకుండా గుర్రపుడెక్క కలుపు విస్తరించి ఆయకట్టు రైతుల్లో గుబులు పుట్టిస్తోంది.

ఆందోళనలో అన్నదాతలు

వరిసాగులో కూలీల కొరత, పెట్టుబడులు భారీగా పెరిగిన నేపథ్యంలో సాగునీటి కాలువల్లో పలుమార్లు కలుపు తొలగించడం భారమని అన్నదాతలు వాపోతున్నారు. కాలువలో సాగునీరు ముందుకు సాగకపోతే పంట చేతికందుతుందా అన్న అనుమానాలు హాలికుల్లో వ్యక్తమవుతోంది. హంద్రీనీవా కాలువ ద్వారా కృష్ణాజలాలు చెరువుకు చేరుతుండటంతో కలుపు మొక్క నీటిలో విస్తరిస్తోందని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

తిమ్మరుసు కుంట కాలువలో ఏపుగా పెరిగిన గుర్రపుడెక్క

ప్లాస్టిక్ వినియోగంపై మహిళలకు అవగాహన

కొత్తచెరువు, న్యూస్‌టుడే: ప్లాస్టిక్ వ్యర్థాలతో పర్యావరణం కలుషితమై మానవ మనుగడకు అవరోధంగా మారిందని జిల్లా పంచాయతీ అధికారి సమత, డీఆర్‌డీఏ పీడీ నరసయ్యలు పేర్కొన్నారు. కొత్తచెరువు మండలం మైలసముద్రం గ్రామంలో మంగళవారం ప్లాస్టిక్ వ్యర్థాల నిర్మూలనపై డ్వాక్రా మహిళలకు అవగాహన కల్పించారు. అధికారులు మాట్లాడుతూ ప్రతి మహిళ తమ ఇంటి నుంచే బాధ్యతగా ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించుకోవాలని సూచించారు. ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయంగా వస్త్ర సంచులు, జూటు బ్యాగులు, కాగిత సంచులను వినియోగించాలని కోరారు. డిప్యూటీ ఎంపీడీవో సాదిక్‌వలి, ఏపీఎం నారాయణస్వామి, కార్యదర్శి గంగాధర్ రెడ్డి, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

ఉచితంగా తుంపర పరికరాల పంపిణీ

రామగిరి, న్యూస్‌టుడే: టింబక్టు కలెక్టివ్ సంస్థ చెలిమి కార్యక్రమంలో భాగంగా మండలంలోని పలువురు రైతులకు ఉచితంగా తుంపర పరికరాలు అందజేశారు. మంగళవారం రామగిరిలోని మహిళాశక్తి సొసైటీ కార్యాలయ ఆవరణలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో టింబక్టు సంస్థ సహకారంతో సేంద్రియ వ్యవసాయ సాగు చేపట్టిన మండలంలోని రైతులకు ఉచితంగా తుంపర పరికరాలను అందజేశారు. పోలేపల్లి, దుబ్బార్లపల్లి గ్రామాలకు చెందిన 16 మంది రైతులకు ఒక్కో సెట్ తుంపర పరికరాలు అందజేశారు. టింబక్టు సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సుబ్బన్న పాల్గొన్నారు.

రైతులకు తుంపర పరికరాలు అందజేస్తున్న టింబక్టు కలెక్టివ్ సంస్థ ప్రతినిధులు

ఆర్‌సీపీ నాయకుడి మృతికి సంతాపం

ఓబులదేవరచెరువు, న్యూస్‌టుడే: రాయలసీమ రైతు సంఘం నాయకుడు రామచంద్ర తిరుపతిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందారు. ఆయన మృతదేహానికి ఆర్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి రవిశంకర్‌రెడ్డి నివాళులు అర్పించారు.

CHANGE OF SURNAME
I, Narayanaswamy Peddaneni S/o. Peddineni Pullappa, D.No : 1-116, Nallacherlo Palli Village, Mudigubba mandal, Sri Satya Sai District. I have changed My Surname from PEDDANENI (Old Surname) to PEDDINENI (New Surname). Henceforth I am being called as PEDDINENI NARAYANA SWAMY for all future purposely

(c) eenadu

ఈనాడు డిజిటల్, శ్రీకాకుళం

అదిగో అక్రమం.. కనిపించినదే సాక్ష్యం..!

- ఇసుక తవ్వకాల్లో నిబంధనలకు తూట్లు
- అనుమతుల పేరుతో రేవుల్లో ఇష్టారాజ్యం

ఇసుక రేవుల్లో అక్రమాలు జరుగుతున్నాయి. అనుమతుల పేరుతో నిబంధనలకు తూట్లు పొడుస్తూ వంశధార, నాగావళి నదుల్లో ఇష్టారాజ్యంగా తవ్వేస్తున్నారు. డీసిల్టేషన్ రేవుల్లో ప్రకృతి విధ్వంసానికి పాల్పడుతున్నారు. ఇసుక దిబ్బలు తొలగించకపోగా.. నదీ గర్భాల్లో అగాధాలు సృష్టిస్తున్నారు. కరకట్టలు సైతం ధ్వంసం చేసి రేవుల్లోకి దర్జాగా రహదారులు నిర్మించుకుని చెలరేగుతున్నారు. ఇంత జరుగుతున్నా అధికారులు నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తుండటం గమనార్హం.

హిరమండలంలో గొట్టా బ్యారేజీకి దిగువన భగీరథపురం డీసిల్టేషన్ రేవు ఇది. ఇక్కడ నిబంధనలకు విరుద్ధంగా నదీ గర్భంలో పొక్లెయిన్‌తో ఇలా తవ్వకాలు చేపడుతున్నారు

● జిల్లాలో డీసిల్టేషన్‌కు మొత్తం 18 ఇసుక రేవులకు అనుమతులు ఇచ్చారు. నిబంధనల ప్రకారం ఆయా చోట్ల ఇసుక దిబ్బలు మేట వేస్తే కేవలం వాటిని మాత్రమే తొలగించాలి. అలా జరగట్లేదు. జలవనరుల శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో నదీ ప్రాంతాన్ని పరిశీలించి.. ఆయా దిబ్బలు తొలగించేందుకు గుత్తేదారుల కోసం టెండర్లు పిలుస్తారు. అనంతరం కాలుష్య నియంత్రణ మండలి అధికారులు ధ్రువీకరించాక గనులశాఖ అధికారులు పనులు చేసేందుకు అనుమతులు మంజూరు చేస్తారు. అదీ సవ్యంగా సాగట్లేదు.

రూ.5 లక్షలిస్తే చాలు..

డీసిల్టేషన్ అవసరం లేకపోయినా నదీ తీర ప్రాంతాల్లో నచ్చిన ప్రదేశంలో రేవు కావాలంటే మొత్తం రూ.5 లక్షలు ఇస్తే పని అయిపోతుంది. ఇసుక రేవులకు సంబంధించిన అనుమతుల నుంచి దశలవారీగా ఆయా శాఖల్లోని కొందరికి ముడుపులు ముడుతుండటంతో వీటిపై ఎవరూ కన్నెత్తి చూడట్లేదని విమర్శలు వినిపిస్తున్నాయి.

అంతా మాయే..

గుత్తేదారు టన్ను ఇసుకకు నిర్వహణ ఛార్జీల కింద ప్రభుత్వానికి రూ.30 చెల్లించాలి. 30 టన్నుల లారీ ఇసుకకు రూ.900 చెల్లించాలి. కానీ 40 టన్నుల వరకు లోడ్ చేస్తున్నారు. సగటున రేవు నుంచి రాత్రీపగలూ తేడా లేకుండా 50 నుంచి 100కుపైగా లారీలు వెళ్తున్నాయి. దస్త్రాల్లో మాత్రం కేవలం ఐదు, పది లారీలు మాత్రమే వెళ్తున్నాయని తప్పుడు లెక్కలు చూపిస్తున్నారు.

పరిశీలన లేదు.. తనిఖీలుండవు..

అధికారులు రేవుల పరిశీలనను పూర్తిగా గాలికొదిలేశారు. తనిఖీ కేంద్రాలను ఎత్తేశారు. అనుమతులకు మించి తవ్వకాలు, పరిమితికి మించి లోడింగ్, ఇసుక రవాణా నమోదులో తప్పుడు లెక్కలు, నిర్వహణ ఛార్జీల పక్కదారి, నకిలీ బిల్లులతో రవాణా, నదీ గర్భాల్లో అగాధాలు సృష్టించడం ఇలా ఎన్ని జరుగుతున్నా చర్యలు తీసుకోకపోవడం ఆరోపణలకు మరింత బలం చేకూరుస్తోంది.

రీసర్వే వేగవంతం చేయండి: కలెక్టర్

కలెక్టరేట్(శ్రీకాకుళం), న్యూస్‌టుడే: రీసర్వే ప్రక్రియ వేగవంతం చేయాలని, వెబ్‌ల్యాండ్ రికార్డుల్లో వ్యత్యాసాలను సరిదిద్దాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశించారు. కలెక్టరేట్ నుంచి మంగళవారం తహసీల్దార్లు, ఎంపీడీవోలతో దూరదృశ్య సమీక్ష నిర్వహించి మాట్లాడారు. నాలుగో దశ రీసర్వే 167 గ్రామాల్లో జరుగుతోందని, 24 గ్రామాల్లో పూర్తయిందన్నారు. వెబ్‌ల్యాండ్‌లో ఇతరుల పేరిట ఉన్న భూముల వివరాలు పరిశీలిస్తే 29,953 సర్వే నంబర్లలో తప్పులున్నాయని, వీటిపై దృష్టి సారించాలని పేర్కొన్నారు. జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

తీరం.. సేద తీరలేం..

నిత్యం సందర్శకులతో కళకళలాడే ప్రధాన బీచ్‌లు పారిశుద్ధ్య లోపంతో దర్శన మిస్తున్నాయి. జిల్లాలో పదుల సంఖ్యలో ఆహ్లాదం పంచే తీరాలున్నా అభివృద్ధికి నోచుకోవట్లేదు. వ్యర్థాలు పేరుకుపోయి దుర్వాసన వ్యాపిస్తోంది. ఇచ్ఛాపురం, సోంపేట, వజ్రపుకొత్తూరు, శ్రీకాకుళం, ఎచ్చెర్ల, రణస్థలం మండలంలోని బీచ్‌లకు పర్యాటకులు నిత్యం వస్తుంటారు. సదుపాయాల్లేక ఇబ్బందులు పడుతున్నారు. ఇచ్ఛాపురం మండలం డొంకూరు తీరంలో పేరుకుపోయిన వ్యర్థాలను చిత్రంలో చూడొచ్చు. - న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం గ్రామీణం

రక్షిత భవనం.. భయం..భయం..!



తుపాను వేళ ఆపదొస్తే ఈ భవనాలు రక్షణ కల్పిస్తాయో లేదో చెప్పలేం కాని.. ఏ క్షణాన కూలుతాయోనని బిక్కుబిక్కుమంటూ గడపాల్సిన దుస్థితి మత్స్యకార గ్రామాల్లో నెలకొంది. దశాబ్దాల కిందట ఇచ్ఛాపురం నుంచి రణస్థలం వరకు తుపాను రక్షిత భవనాలు నిర్మించారు. వీటిలో ఎక్కువ శాతం శిథిలస్థితికి చేరుకున్నాయి. వీటిని కూల్చాలని అధికారులకు ఫిర్యాదులిస్తున్నా స్పందన లేదు. కవిటి మండలం ఇద్దివానిపాలెంలో భవనాన్ని చిత్రంలో చూడొచ్చు. - న్యూస్‌టుడే, కవిటి గ్రామీణం

కాశీబుగ్గలో మహాత్మాగాంధీ విగ్రహం వద్ద తెదేపా నాయకుల సంబరాలు

జంట పట్టణాలకు జలసత్వాలు..!

- యూఐడీఎఫ్ కింద పలాసకు రూ.121.99 కోట్లు
- ఫలించనున్న ఎమ్మెల్యే శిరీష కృషి

న్యూస్‌టుడే, పలాస

పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష కృషి ఫలించనుంది.. జంట పట్టణాలను పట్టిపీడిస్తున్న తాగునీటి సమస్యకు త్వరలో ముగింపు కార్డు పడనుంది. పలాస-కాశీబుగ్గ పురపాలికలో నీటిఎద్దడి అధికంగా ఉండటం, సింధూర జలసిరి పథకం శతశాతం పూర్తి చేసేందుకు నిధుల కొరత ఏర్పడింది. ఈ విషయాన్ని రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి శిరీష తీసుకెళ్లడంతో నిధుల మంజూరుకు చర్యలు తీసుకుంటున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో నీటి సమస్యల పరిష్కారానికి అర్బన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ ఫండ్(యూఐడీఎఫ్) కింద పలాసకు రూ.121.99 కోట్లు మంజూరుకు ప్రభుత్వం సిద్ధమవుతోంది.

● రాష్ట్రంలో అనంతపురం, నెల్లూరు, గుంటూరు, విశాఖపట్నం ప్యాకేజీల కింద పురపాలక, నగరపాలక సంస్థల్లో తాగునీటి సరఫరా, పారిశుద్ధ్య ప్రాజెక్టుల నిర్వహణకు ప్రణాళిక సిద్ధం చేసింది. ఇందులో భాగంగా విశాఖపట్నం ప్యాకేజీలో పలాస, బొబ్బిలి, పార్వతీపురంలో 8 ప్రాజెక్టుల నిర్వహణకు చర్యలు చేపట్టింది. పలాసకు మూడు విడతలుగా రూ.37.89 కోట్లు, రూ.37.94 కోట్లు, రూ.46.16 కోట్ల చొప్పున విడుదలకు డీపీఆర్ సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపించారు. ఆఫ్‌షోర్ రిజర్వాయరు నుంచి తాగునీరు అందించేందుకు చర్యలు తీసుకుంటారు.

తెదేపా నేతల హర్షం

తాగునీటి సరఫరాకు నిధుల మంజూరు ప్రకటనతో పలాసలో తెదేపా నాయకులు హర్షం వ్యక్తం చేశారు. కాశీబుగ్గ మహాత్మాగాంధీ విగ్రహం వద్ద మంగళవారం రాత్రి మిఠాయిలు పంచుతూ, బాణసంచా కాల్చారు. టీపీసీ ఛైర్మన్ వజ్జ బాబూరావు, తెదేపా బీసీ విభాగ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎల్.కామేశ్వరరావు, జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ పి.విఠల్, వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ ఎం.శ్రీనివాసరావు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

వ్యాపారులకు పైకం.. నగరానికి మైకం..!

● శ్రీకాకుళం నగరంలోని డచ్ భవనం వద్ద ఆరు నెలల కిందట గంజాయి విక్రయిస్తున్న ఇద్దరు ఒడిశా వాసులను పోలీసులు పట్టుకున్నారు. వారితో పాటు వినియోగిస్తున్న మరో ఆరుగురిని కూడా అరెస్టు చేశారు.

● గంజాయి తాగుతున్న యువకులను మందలించారనే కోపంతో మొండేటి వీధి వద్ద ద్విచక్ర వాహనంపై వెళ్తున్న హెడ్ కానిస్టేబుల్‌పై దాడి చేశారు. ఘటనలో ఆయన తీవ్ర గాయాలపాలయ్యారు.

కిళ్లీ బడ్డీల్లో యథేచ్ఛగా గంజాయి విక్రయాలు

ఎక్కువగా విక్రయాలు జరుగుతున్న ప్రాంతాలు.. పొట్టిశ్రీరాములు మార్కెట్, కృష్ణా పార్కు, న్యూకాలనీ, పాతశ్రీకాకుళం, బలగ హడ్కోకాలనీ, వాంబేకాలనీ, మహాలక్ష్మీ నగర్, దమ్మల వీధి.

న్యూస్‌టుడే, శ్రీకాకుళం నేరవార్తావిభాగం

కూటమి ప్రభుత్వం గంజాయిపై ఉక్కుపాదం మోపుతోంది. అధికారంలోకి వచ్చినప్పటి నుంచి వినియోగం, అక్రమ రవాణా కట్టడికి కృషి చేస్తోంది. అభ్యుదయం పేరిట సైకిల్ యాత్ర చేపట్టి ఊరూరా అవగాహన కల్పించారు. కొందరిని అరెస్టు చేసి జైలుకు పంపారు. అయినప్పటికీ చాలా మందిలో మార్పు రావట్లేదు. విక్రేతలు, వినియోగించేవారు కొత్త మార్గాలను ఎంచుకుంటున్నారు. జిల్లా కేంద్రంలో పరిస్థితి మరింత దారుణంగా ఉంది.

● నగరంలో గంజాయి వినియోగం విచ్చలవిడిగా సాగుతోంది. యువకులు గుంపులుగా చేరి మత్తులో జోగుతున్నారు. కొన్ని కిళ్లీ బడ్డీల్లో చిన్న పొట్లాలుగా చేసి విక్రయిస్తున్నారు. ఒక్కో పొట్లాం రూ.10కే దొరుకుతోంది. సిగరెట్‌లో పొగాకు తీసేసి.. రెండు పొట్లాల గంజాయి దట్టించి నిర్భయంగా పీల్చేస్తున్నారు. మత్తెక్కగానే ద్విచక్ర వాహనాలపై చక్కర్లు కొడుతూ గొడవలకు దిగుతున్నారు. కొన్ని బ్యాచ్‌లు మత్తులోనే దాడులకు పాల్పడుతున్నాయి.

కఠిన చర్యలు తప్పవు..

గంజాయి కట్టడికి శత విధాలా ప్రయత్నిస్తున్నాం. అక్రమ రవాణా, విక్రయాలు జరుగుతున్నట్లు సమాచారం తెలిస్తే వెంటనే పోలీసులకు తెలియజేయండి. ప్రజల సహకారం ఉంటే పూర్తి స్థాయిలో అడ్డుకోగలం. పాత నేరస్థులపై నిఘా ఉంది. కళ్లు గప్పి గంజాయి విక్రయిస్తున్నా.. కొంటున్నా కఠిన చర్యలు తప్పవు. - సీహెచ్ వివేకానంద, డీఎస్పీ, శ్రీకాకుళం

ఇదీ పరిస్థితి...

- నగరంలోని ఒకటో పట్టణ పోలీసు స్టేషన్ పరిధిలో సాయంత్రం వేళ గంజాయి బ్యాచ్‌లు చేస్తున్న ఫీట్లు జనాలను భయపెడుతున్నాయి.
- హౌసింగ్ బోర్డు కాలనీ, పాత శ్రీకాకుళం, పొన్నాడ వంతెన, 80 అడుగుల రోడ్డు, కొత్తపేట ప్రాంతాల్లో చీకటి పడగానే గుంపులుగా చేరిపోతున్నారు.
- ఒడిశా నుంచి రోజూ నగరానికి వచ్చే ప్రైవేటు బస్సులు, కూరగాయలు, ఇతర రవాణా వాహనాలు, ద్విచక్ర వాహనాలపై సరకు ఇక్కడికి తీసుకొస్తున్నారు.
- పాత నేరస్థులు, గతంలో నగరానికి గంజాయి తీసుకొచ్చినవారే ఇప్పటికీ రవాణా చేస్తున్నట్లు తెలుస్తోంది.

జిల్లాలో వివరాలిలా..

ఏడాది	కేసులు	పట్టుబడిన గంజాయి (కిలోల్లో..)
2023-24	19	338.82
2024-25	52	1,333.91
2025-26	142	1,824.20

ఏర్పాట్లపై పోలీసులకు సూచనలిస్తున్న ఎస్పీ మహేశ్వరరెడ్డి

నేడే చక్రతీర్థ స్నాన ఘట్టం

జలుమూరు, ఎల్ఎన్‌పేట, నేరవార్తావిభాగం, న్యూస్‌టుడే: జలుమూరు మండలంలోని ప్రముఖ శైవ క్షేత్రం శ్రీముఖలింగంలో బుధవారం జరగనున్న చక్రతీర్థస్నాన ఘట్టానికి అధికారులు సర్వం సిద్ధం చేశారు. మంగళవారం క్షేత్రస్థాయిలో ఏర్పాట్లను ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డి పరిశీలించారు. వంశధార నదికి స్వామి నంది వాహనంపై వెళ్లే మార్గం, స్నానమాచరించే ప్రాంతంలో ఏర్పాటు చేసిన బారికేడ్లు, పార్కింగ్ స్థలాలు, కంట్రోల్‌రూమ్‌ను సందర్శించి పోలీసులకు పలు సూచనలు అందించారు. రోప్ పార్టీలు ఏర్పాటు చేసి భక్తుల రాకపోకలు క్రమబద్ధీకరించాలన్నారు. పటిష్ఠ బందోబస్తుతో పాటు నది వరకు డ్రోన్, సీసీ కెమెరాలతో నిఘా ఉంటుందని చెప్పారు. ఆయన వెంట శిక్షణ కలెక్టర్ పృథ్వీరాజ్ కుమార్, ఆర్డీవో కె.సాయి ప్రత్యూష, అదనపు ఎస్పీలు కె.వి.రమణ, పి.శ్రీనివాసరావు ఉన్నారు.

ప్రైవేటు డ్రోన్లు నిషేధం.. చక్రతీర్థ స్నాన ఘట్టంలో ప్రైవేటు డ్రోన్ల వినియోగాన్ని నిషేధం విధించినట్లు ఎస్పీ తెలిపారు. భక్తుల రక్షణ దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు. అనుమతి లేకుండా డ్రోన్లు ఎగరవేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

పలాస కల సాకారం దిశగా అడుగులు

ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం పలాస కల సాకారం చేసే దిశగా అడుగులు వేస్తున్నామని కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు అన్నారు. కాశీబుగ్గ మైదానంలో నిర్మాణ పనులు, కేంద్రీయ విద్యాలయం స్థలం, తాత్కాలిక తరగతుల నిర్వహణ తదితర అంశాలను మంగళవారం పరిశీలించారు. చిన్నబడాం నుంచి జరుగుతున్న పైవంతెన పనులు వేగవంతం చేయాలని కోరారు. కేంద్రీయ విద్యాలయం నిర్మిత ప్రాంతాన్ని సందర్శించారు. 15 ఎకరాల వరకు ప్రభుత్వ భూమి ఉండేలా చూస్తే భవిష్యత్తులో ఇబ్బంది తలెత్తకుండా ఉంటుందని సూచించారు. పలాస రైల్వే ఆర్‌పీఎఫ్ బ్యారక్‌లో తాత్కాలికంగా తరగతులు ఏప్రిల్ నుంచి నిర్వహించేలా చూడాలని ఆదేశించారు. - న్యూస్‌టుడే, పలాస

జిల్లా రిజిస్ట్రార్‌గా కుమారస్వామిరెడ్డి

అనంత గ్రామీణం, న్యూస్‌టుడే: జిల్లా రిజిస్ట్రార్‌గా అనంతపురం ప్రాంతీయ కార్యాలయంలో చిట్‌ఫండ్స్ సబ్-రిజిస్ట్రార్‌గా పని చేస్తున్న సి.కుమారస్వామిరెడ్డి నియమితులయ్యారు. ఆయనకు ఉద్యోగోన్నతి కల్పించి.. బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. రాయలసీమ జిల్లాల్లో సబ్-రిజిస్ట్రార్‌గా అనేక కార్యాలయాల్లో పని చేసిన ఆయన చిట్స్ ఫండ్స్ సబ్-రిజిస్ట్రార్‌గా రెండేళ్లుగా అనంతపురం జిల్లాలో విధులు నిర్వర్తించారు.

మార్చి నుంచి ఈడీపీ శిక్షణ

ఎచ్చెర్ల, న్యూస్‌టుడే: ఎచ్చెర్ల మండల కేంద్రంలోని యూనియన్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థలో మార్చి మొదటి వారం నుంచి పీఎంఈజీపీ(ప్రధానమంత్రి ఎంప్లాయ్‌మెంట్ జనరేషన్ ప్రోగ్రాం)లో భాగంగా ఈడీపీ(ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం) శిక్షణ ప్రారంభించనున్నట్లు సంస్థ డైరెక్టర్ రామ్‌జీ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. పీఎంఈజీపీలో రుణం మంజూరైన లబ్ధిదారులు మాత్రమే అర్హులని తెలిపారు. అభ్యర్థులు ఈ నెల 28లోగా పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. అదనపు సమాచారానికి 95534 10809, 79933 40407 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

నకిలీ పేర్లు.. తప్పుడు చిరునామాలు..!

- పలాస పీఏసీఎస్‌లో భారీ కుంభకోణం
- రైతులే లేకుండా వారి పేరిట రుణాల మంజూరు

ఈనాడు డిజిటల్ శ్రీకాకుళం

ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల్లో(పీఏసీఎస్) అక్రమార్కుల ఆగడాలు పెచ్చుమీరుతున్నాయి. పలాస పీఏసీఎస్‌లో భారీ కుంభకోణం జరిగింది. రుణాల మంజూరు ప్రక్రియలో అవకతవకలకు పాల్పడ్డారు. రైతులే లేకుండా నకిలీ పేర్లు.. తప్పుడు చిరునామాలు సృష్టించి.. ఏకంగా రూ.కోట్లు పక్కదారి పట్టించారు. అధికారులు, సిబ్బంది, కొందరు రాజకీయ నాయకులు దీని వెనక ఉన్నట్లు తెలుస్తోంది. ఈ అక్రమాలపై ఇప్పటికే అందిన ఫిర్యాదుల మేరకు కూటమి సర్కారు విచారణకు ఆదేశించింది. దర్యాప్తులో విస్తుపోయే అంశాలు వెలుగు చూసినట్లు సమాచారం.

● పలాస పీఏసీఎస్‌లో 800 మందికి పైగా నకిలీ పేర్లతో రుణాలు ఇచ్చినట్లుగా చూపించి సొమ్ము స్వాహా చేశారు. ఇలా ఏకంగా రూ.4.50 కోట్లు దోచుకున్నారు. సగటున ఒక్కో పేరు కింద రూ.20 వేల నుంచి రూ.లక్షల వరకు రుణాలు ఇచ్చినట్లుగా దస్త్రాల్లో చూపించారు. 2005 నుంచి దశలవారీగా అవకతవకలకు పాల్పడినట్లు ప్రాథమికంగా గుర్తించారు.

వారిదే కీలక పాత్ర..

● 2019-24 మధ్య కాలంలో వైకాపాకు చెందిన ఓ వ్యక్తి అధికారాన్ని అడ్డం పెట్టుకుని అక్రమాల్లో కీలక పాత్ర పోషించారని విమర్శలున్నాయి. ఓ గోదాం మరమ్మతుల పేరుతో ఏకంగా రూ.13 లక్షలు బిల్లులు పెట్టి దోచుకున్నారు.

● మరొకరు సుమారు రూ.10 లక్షలకుపైగా తీసుకున్న ముందస్తు సొమ్ము చెల్లించలేదు. రుణాల జారీ విషయంలోనే కాకుండా, పీఏసీఎస్ కార్యాలయ నిర్వహణ కింద పెద్ద మొత్తంలో ఖర్చు చేసినట్లు చూపించడంతో పాటు అందులోనూ వాటాలు వేసుకొని రూ.లక్షల్లో పక్కదారి పట్టించారని సమాచారం.

● రుణాల మంజూరులో నిబంధనలు తుంగలో తొక్కారు. పూర్తి వివరాలు రాస్తే అనుమానాలు వస్తాయని కేవలం దస్త్రాల్లో వ్యక్తి పేరు, గ్రామాన్ని మాత్రమే నమోదు చేశారు. స్థాయికి మించి నిర్వహణ ఖర్చులకు బిల్లులు పెట్టారు.

న్యూస్‌టుడే, కవిటి గ్రామీణం

రైతన్నా.. మిగిలింది 3 రోజులే..!

కవిటిలో ఈ-పంట నమోదు చేస్తున్న వీఏఏలు

రైతులకు భూహక్కు పత్రాలు ఎంత ముఖ్యమో.. సాగు చేసిన పంటలను ప్రభుత్వం గుర్తించేందుకు ఈ-పంట నమోదు కూడా అంతే కీలకం. బీమా వర్తించాలన్నా.. సంక్షేమ పథకాలు, రాయితీలు పొందాలన్నా.. ఎరువులు కావాలన్నా.. పంట విక్రయించాలన్నా వివరాల నమోదు తప్పనిసరి. ప్రస్తుతం సాగవుతున్న రబీ పంటల వివరాల నమోదు గడువు ఈ నెల 20తో ముగియనుంది. జిల్లాలో వరితో పాటు మొక్కజొన్న, వేరుశనగ, చెరకు ఎక్కువగా సాగు చేస్తున్నారు.

ఈ-పంట నమోదుకు 20 వరకు అవకాశం

● రైతు సేవా కేంద్రాల ద్వారా గ్రామ వ్యవసాయ సహాయకులు రెండు నెలల నుంచి వివరాలు నమోదు చేస్తున్నారు. ఇప్పటి వరకు 70,552 హెక్టార్లకు సంబంధించి ప్రక్రియ పూర్తయ్యింది. రైతులు కూడా మొబైల్ యాప్ ద్వారా నేరుగా ఆన్‌లైన్‌లో నమోదు చేసుకునే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించింది.

అవగాహన కల్పించాం.. రైతులు తప్పనిసరిగా ఈ-పంటలో వివరాలు నమోదు చేసుకోవాలి. ఇప్పటికే రైతు సేవా కేంద్రాల ద్వారా వీఏఏలు ప్రక్రియ పూర్తి చేస్తున్నారు. మొబైల్ యాప్ ద్వారా రైతులు సొంతంగా కూడా చేసుకోవచ్చు. ఎలా చేయాలో ఇప్పటికే అవగాహన కల్పించాం. - కె.త్రినాథస్వామి, జిల్లా వ్యవసాయాధికారి

జిల్లాలో ఈ-పంట వివరాలు

రకం	నమోదు (హెక్టార్లలో)
వరి	10,678
రాగులు	2,987
మొక్కజొన్న	24,628
పెసర	9,414
మినుము	18,244
ఉలవలు	334
వేరుశనగ	3,869
నువ్వులు	373
పొద్దుతిరుగుడు	25

మీరే చేసుకోవచ్చు..

- అన్నదాతలు స్మార్ట్ ఫోన్‌లో ఏపీఏఐఎంఎస్ 2.0 యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి.
- ఆధార్ నంబరు ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకుని ఎం పిన్ సెట్ చేసుకోవాలి.
- అనంతరం వెబ్‌ల్యాండ్‌లో అనుసంధానమైన రైతుకు చెందిన భూములు యాప్‌లో కనిపిస్తాయి.
- దాని ద్వారా ఇప్పటి వరకు వీఏఏలు నమోదు చేయని పంటల వివరాలను సకాలంలో నమోదు చేసుకోవచ్చు.
- ప్రక్రియ పూర్తి చేసేందుకు రైతులు తప్పనిసరిగా పొలంలో ఉండాలి.
- 20 మీటర్ల జియో రిఫరెన్సు హద్దులతో పొలంలో పంటతో సహా చిత్రం తీయాలి.

న్యూస్‌టుడే, శ్రీకాకుళం నగరం

చెప్పినా ఇంతే.. చెల్లించరంతే..!

● నగరంలో పేరుకుపోతున్న ఆస్తి పన్ను బకాయిలు

నగరాలు, పట్టణాల్లో స్థానిక సంస్థలకు ఎక్కువ ఆదాయం ఆస్తి, ఖాళీ స్థలాలు, నీటి పన్నుల ద్వారానే వస్తుంది. ఏటా రూ.కోట్లలో వచ్చే ఆ మొత్తంతోనే రహదారులు, కాలువల నిర్మాణంతో పాటు ఇతర మౌలిక వసతులు కల్పిస్తారు. శ్రీకాకుళం నగరంలో ఏటేటా బకాయిలు పేరుకుపోతుండటంతో ప్రగతి కుంటుపడుతోంది. ప్రధానంగా వాణిజ్య భవనాల యజమానులు, ప్రభుత్వ సంస్థల నుంచి ఏళ్ల తరబడి పన్నులు వసూలు కావట్లేదు. ఖజానా ఖాళీ అయిపోతుండటంతో జిల్లా కేంద్రంలో కొత్త పనులు చేపట్టేందుకు గుత్తేదారులు సైతం ముందుకు రాని పరిస్థితి నెలకొంది.

● నగరంలో పెద్ద ఎత్తున బకాయిలు వసూలు కావాల్సి ఉంది. ఈ ఆర్థిక సంవత్సరం ముగిసేందుకు మరికొద్ది రోజులే ఉంది. ఇంకా ప్రైవేటు వ్యక్తుల నుంచి రూ.21.57 కోట్లు, రాష్ట్ర ప్రభుత్వం రూ.8.59 కోట్లు, కేంద్ర ప్రభుత్వం రూ.2.29 కోట్లు, ఖాళీ స్థలాల పన్నులు రూ.3.27 కోట్ల మేర రావాలి. వీటిపై అధికార యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారించింది. నగరపాలక సంస్థ రంగం సిద్ధం చేసింది. లక్ష్యాల మేరకు పన్నులు వసూలు చేయాలనే ధ్యేయంతో సచివాలయాల వారీగా ప్రత్యేక బృందాలను నియమించింది.

కార్యాచరణ ఇదీ..

● పన్నులు చెల్లించనివారికి మొదటి విడతగా సాధారణ నోటీసులు జారీ చేస్తున్నారు. పెద్ద మొత్తంలో బకాయిలు ఉన్న వారి వద్దకు సిబ్బంది స్వయంగా వెళ్లి చెల్లించాలని కోరుతున్నారు.

● అప్పటికీ స్పందించని వారికి రెడ్, ఆక్యుపెన్సీ నోటీసులు జారీ చేస్తారు. అయినా లాభం లేకుంటే వారెంట్ నోటీసులు ఇవ్వడంతో పాటు వారి వాణిజ్య భవనాల్లో కార్యకలాపాలు నిలిపివేసి షట్టర్లకు తాళాల వేసేలా కార్యాచరణ సిద్ధం చేశారు. ఇళ్లకు కుళాయి కనెక్షన్లు సైతం తొలగించి.. నీటి సరఫరా నిలిపివేయనున్నారు.

అందరూ సహకరించాలి.. ప్రజలు సకాలంలో ఆస్తి, కుళాయి, ఖాళీ స్థలాల పన్నులు చెల్లించి నగరాభివృద్ధికి సహకరించాలి. చెల్లించకుంటే చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. ఆస్తులు జప్తు చేసేందుకు సైతం వెనకాడేది లేదు. - హెచ్.కూర్మారావు, కమిషనర్, శ్రీకాకుళం నగరపాలక సంస్థ

నగరంలో ఆస్తి పన్ను వివరాలిలా..	చెల్లింపుదారులు:	ప్రభుత్వ భవనాలు:	ప్రైవేటు:	వసూళ్ల లక్ష్యం:	బకాయిలు:
	46,700	247	44,413	రూ.55.14 కోట్లు	రూ.35.72 కోట్లు

పీజీ, బీపీఈడీ మొదటి సెమిస్టర్ పరీక్షలు ప్రారంభం

ఎచ్చెర్ల, న్యూస్‌టుడే: బి.ఆర్.అంబేడ్కర్ విశ్వవిద్యాలయం దాని అనుబంధ కళాశాలల పీజీ, బి.పి.ఈడీ సెమిస్టర్ పరీక్షలు వర్సిటీ కేంద్రంగా మంగళవారం ప్రారంభమయ్యాయి. ఉదయం 10 గంటల నుంచి 1 గంట వరకు పరీక్షలు జరిగాయి. పీజీ మొదటి సెమిస్టర్‌లో సైన్స్ కోర్సులకు సంబంధించి 406కు 402 మంది, ఆర్ట్స్ కోర్సులకు సంబంధించి 294 మందికి 271 మంది పరీక్షలకు హాజరయ్యారు. బీపీఈడీ పరీక్షలు మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల నిర్వహించగా మొత్తం 389 మందికి 373 మంది హాజరయ్యారు. ఈ పరీక్షలకు చీఫ్ సూపరింటెండెంట్లుగా కె.స్వప్నవాహిని, జి.అప్పలనాయుడు, ఎన్.గోవిందరాజు వ్యవహరించారు. పరీక్షలు ఈ నెల 25 వరకు కొనసాగనున్నాయి.

నులిపురుగుల నివారణ మాత్రల పంపిణీ

శ్రీకాకుళం గ్రామీణం, న్యూస్‌టుడే: జిల్లాలోని పాఠశాలలు, కళాశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో 19 ఏళ్ల లోపు పిల్లలకు నులిపురుగుల నివారణ మాత్రలు ఉచితంగా పంపిణీ చేస్తున్నట్లు ఎన్‌డీడీ రాష్ట్ర పర్యవేక్షణాధికారి డాక్టర్ బొడ్డేపల్లి మీనాక్షి తెలిపారు. శ్రీకాకుళం గ్రామీణ మండలం వప్పంగిలోని జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో ఇన్‌ఛార్జి డీఎంహెచ్‌వో డాక్టర్ మేరీ క్యాథరిన్ అధ్యక్షతన పీవో ఆర్‌బీఎస్‌కే శివరంజని ఆధ్వర్యంలో జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. డాక్టర్ నమ్రతాప్రియ, డీఈవో రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినికి ఆల్బెండజోల్ మాత్ర వేస్తున్న ఎన్‌డీడీ రాష్ట్ర పర్యవేక్షణాధికారి బొడ్డేపల్లి మీనాక్షి



(c) eenadu

ప్రయాణం.. ప్రహసనం!

బూర్జ మండల పరిధి శ్రీకాకుళం-పాలకొండ ప్రధాన రహదారిపై మర్రిపాడు, లక్కుపురం, పాలవలస, కొండపేట, మదనాపురం, అప్పలపేట, కేకే రాజపురం, నీలాదేవిపురం తదితర కూడళ్ల వద్ద గుంతలు ఏర్పడ్డాయి. ఈ మార్గంలో తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై ఆర్‌అండ్‌బీ శాఖ జేఈ ఆంజనేయ నాయక్‌ను 'న్యూస్‌టుడే' సంప్రదించగా సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. **- న్యూస్‌టుడే, బూర్జ**

విశ్రాంత ఏబీసీడబ్ల్యూవో పింఛనులో కోత

పాతశ్రీకాకుళం: జిల్లాకు చెందిన విశ్రాంత ఏబీసీడబ్ల్యూవో పింఛనులో కోత విధిస్తూ బీసీ సంక్షేమ శాఖ ఎక్స్ అఫీషియో కార్యదర్శి ఎస్.సత్యనారాయణ ఉత్తర్వులు జారీ చేశారు. కోటబొమ్మాళిలోని వసతిగృహ సంక్షేమాధికారిగా ఎం.రాఘవేంద్రరావు విధులు నిర్వహిస్తున్న సమయంలో ఏబీసీడబ్ల్యూవో కార్యాలయంలో నిధులు దుర్వినియోగమయ్యాయనే ఆరోపణలు వచ్చాయి. అప్పటి జిల్లా అధికారి కె.శ్రీదేవితో కలిసి పక్కదారి పట్టించారని అనిశా ప్రాథమిక నివేదికలో స్పష్టం చేసింది. ఆ శాఖ అదనపు డైరెక్టర్ ఎం.మహేశ్వరరెడ్డి విచారణ చేయగా సమాధానాలు సంతృప్తికరంగా రాలేదు. విశ్రాంత ఏబీసీడబ్ల్యూవో పింఛనులో కోత విధించాలని ప్రభుత్వం నిర్ణయించింది. వచ్చే నెల నుంచి మూడేళ్ల పాటు 3 శాతం కోత విధించనుంది.

భగీరథ యత్నం..!

న్యూస్‌టుడే, లావేరు

రబీ పంటలు కాపాడుకోవడానికి అదనపు ఖర్చు

రబీలో ఎక్కువ మంది రైతులు మొక్కజొన్న సాగుకు మొగ్గు చూపారు. గతం కన్నా విస్తీర్ణం రెట్టింపైంది. అవసరం మేరకు నీరు అందుబాటులో లేక గెడ్డలు, వాగులు, నదులు, నేల బావుల నుంచి ఇంజిన్లతో తోడి తడులిస్తున్నారు. అదనపు ఖర్చు అవుతుండటంతో లబోదిబోమంటున్నారు. నీటి వనరుల నుంచి 200 నుంచి 600 మీటర్ల పొడవునా గొట్టాలు ఏర్పాటు చేసి తడులు పెట్టాల్సిన పరిస్థితి నెలకొందని రైతులు వాపోతున్నారు. ఎకరా పొలంలో మొక్కజొన్నకు ఒకసారి నీరు అందించడానికి రూ.1,200 నుంచి రూ.1,800 వరకు పెట్టుబడి అవుతోంది. ఇలా సుమారు 10 తడులు పెట్టాల్సి వస్తోంది.

లావేరు మండలం తాళ్లవలస వద్ద చిట్టగెడ్డ నుంచి నీరు తోడుతున్న ఇంజిన్

120 టీఎంసీల నీరు వృథా

రబీలో 80 వేల హెక్టార్లలో వివిధ పంటలు సాగు చేస్తున్నారు. నదులు, ప్రాజెక్టుల ద్వారా ఏటా 120 టీఎంసీల నీరు అందుబాటులో ఉన్నప్పటికీ నిల్వ చేసే సామర్థ్యం లేక సముద్రంలో వృథాగా కలిసిపోతోంది. నాగావళి, వంశధార, బాహుదా నదుల్ని అనుసంధానం చేస్తే ఈ పరిస్థితి తప్పేదని.. జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు అన్నదాతల సమస్యలు పట్టించుకోవడం లేదని జిల్లా రైతు సంఘం కార్యదర్శి కె.మోహనరావు ఆవేదన వ్యక్తం చేశారు.

కానరాని ప్రయోజనం

తోటపల్లి, మడ్డువలస ప్రాజెక్టులు, నారాయణపురం కుడి కాలువ, వంశధార, నాగావళి, బాహుదా నదులు ఉన్నప్పటికీ పూర్తిస్థాయిలో ఆనకట్టలు లేకపోవడంతో సాగునీరు అందని పరిస్థితి నెలకొంది. లక్ష ఎకరాలు సాగుకు దూరంగా ఉన్నాయి. రబీకి సంబంధించి మెట్ట ప్రాంతాల్లో మోటార్లు, నేల బావులు, చెరువులు, నదులు ఇతర నీటి వనరుల ఆధారంగా పంటలు సాగు చేస్తున్నారు.

ఇదీ పరిస్థితి

లావేరు, రణస్థలం, జి.సిగడాం, ఎచ్చెర్ల మండలాల పరిధిలో వర్షాలపై ఆధారపడి పంటలు సాగు చేయాల్సిన దుస్థితి నెలకొంది. రబీలో ఎక్కువగా మొక్కజొన్న సాగు చేస్తున్నారు. టమాటా, మిరప, పుచ్చ, గుమ్మడి, అరటి, చెరకు, బొప్పాయి ఇతర పంటలు, కూరగాయలు కలిపి 60 వేల ఎకరాల్లో సాగు చేస్తున్నారు. సాగునీటికి కొన్నిచోట్ల బోర్లు, మరికొన్నిచోట్ల చెరువులు, గెడ్డ వాగులు, నేలబావులపై ఆధారపడుతున్నారు. ఇంజిన్లు ఏర్పాటు చేసుకుని పగలు, రాత్రి కాపలా ఉంటూ తడులు అందిస్తున్నామని వాపోతున్నారు.

రైతులకు తెలియజేశాం..

రబీ ప్రారంభంలో వరికి కొంతమేర సాగునీరు అందించాం. పూర్తిస్థాయిలో పంటలకు సాగునీరు అందించే పరిస్థితి లేదు. ఈ విషయాన్ని రైతులకు ముందే తెలియజేశాం. ప్రస్తుతం నదుల్లో అనుకున్న స్థాయిలో నీరు నిల్వ లేదు.
- పి.సుధాకర్, ఎస్ఈ, జలవనరుల శాఖ

దేశ నిర్మాణంలో యువత భాగస్వాములవ్వాలి

వివేకానంద చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న జిల్లా ఉపాధి కల్పనాధికారి సుధ తదితరులు

ఎచ్చెర్ల, న్యూస్‌టుడే: యువత దేశ నిర్మాణంలో భాగస్వాములు కావాలని జిల్లా ఉపాధికల్పనాధికారి కె.సుధ కోరారు. మండలం చిలకపాలెం సమీపంలోని శ్రీ శివాని ఇంజినీరింగ్ కళాశాలలో కేంద్ర యువజన వ్యవహారాల, క్రీడల మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో మంగళవారం అంతర్ జిల్లా యువజన మార్పిడి కార్యక్రమం ప్రారంభమైంది. ఈ సందర్భంగా స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మేరా యువ భారత్ డిప్యూటీ డైరక్టర్ కె.వెంకట్ ఉజ్వల్ మాట్లాడుతూ ఐదు రోజులు జరిగే ఈ శిక్షణ కార్యక్రమానికి నెల్లూరు నుంచి యువత హాజరయ్యారని వీరికి జిల్లాలోని చారిత్రక, సాంస్కృతిక ప్రదేశాలను చూపిస్తామన్నారు. సెట్‌శ్రీ సీఈవో వి.వి.అప్పలనాయుడు, జిల్లా పర్యాటకశాఖాధికారి నారాయణరావు, పీడీ టి.బాలాజీరావు పాల్గొన్నారు.

ఆదిత్య బిర్లా ట్రస్ట్‌తో బీఆర్ఏయూ ఒప్పందం

ఎచ్చెర్ల, న్యూస్‌టుడే: యువత మానసిక ఆరోగ్యాన్ని మెరుగుపరచి ఆత్మహత్యలకు పాల్పడుతున్న ఘటనలను నివారించడానికి డా.బి.ఆర్.అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలోని సోషల్‌వర్క్ విభాగం, ముంబయికి చెందిన ఆదిత్య బిర్లా ట్రస్టుతో ఒప్పందం కుదుర్చుకుంది. ఈ సందర్భంగా వర్సిటీలో మంగళవారం ఆ సంస్థ ప్రతినిధులు వీసీ ఆచార్య కె.ఆర్.రజనితో చర్చలు జరిపారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ పీఎం ఉషా పథకంలో భాగంగా వర్సిటీలో పలు అకడమిక్, సర్టిఫికెట్ కోర్సులు, హ్యాకథాన్‌లు, వినూత్న వైజ్ఞానిక ప్రదర్శనలు నిర్వహిస్తామన్నారు. పీఎం ఉష కార్యక్రమం వర్సిటీ నోడల్ అధికారి యు.కావ్యజోత్స్న, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఏప్రిల్ లోగా ఆర్వోబీ నిర్మాణం పూర్తి

పలాస, న్యూస్‌టుడే: పలాసలో సుదీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్న ఆర్వోబీ నిర్మాణం ఏప్రిల్ లోగా పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నామని కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు అన్నారు. మంగళవారం కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, పలువురు అధికారులు, నాయకులతో కలిసి వంతెన నిర్మాణ పనులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఏర్పడగానే రైల్వే శాఖ నిధులు రూ.46 కోట్లతో పనులు ప్రారంభమయ్యేలా చూశామని గుర్తు చేశారు. తాళభద్ర వద్ద పైవంతెన నిర్మాణానికి రూ.76 కోట్లు మంజూరయ్యాయని.. స్థానికులతో చర్చించి పూర్తి చేస్తామన్నారు. అభివృద్ధి పనులకు సంబంధించి ఎమ్మెల్యే గౌతు శిరీష పట్టుదలతో చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. ఉద్దానానికి ఉపయోగపడేలా జీడి, కొబ్బరి పంటలను ప్రోత్సహిస్తూ బడ్జెట్‌లో కేటాయింపులు చేయడం హర్షణీయమన్నారు. అందరి ఆమోదంతో కార్గో విమానాశ్రయాన్ని ఏర్పాటు చేయాలని కృషి చేస్తున్నట్లు తెలిపారు. అమృత్‌భారత్‌లో భాగంగా ఇచ్ఛాపురం, పలాస, నౌపడ, శ్రీకాకుళం రోడ్‌ రైలు నిలయాలను ప్రపంచ స్థాయి ప్రమాణాలతో తీర్చిదిద్దుతున్నట్లు చెప్పారు. పలాసను అందంగా తయారు చేయాలనే సంకల్పంతో ఎమ్మెల్యే శిరీషతో కలిసి పని చేస్తామన్నారు. ఆర్డీవో జి.వెంకటేశ్, తహసీల్దారు టి.కల్యాణచక్రవర్తి, పుర కమిషనర్ ఇ.శ్రీనివాసులు, తెదేపా నియోజకవర్గ సమన్వయకర్త వై.వెంకన్నచౌదరి, తెదేపా నాయకులు పాల్గొన్నారు.

చిన్నబడాం వద్ద పై వంతెన పనులు పరిశీలిస్తున్న కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు, అధికారులు, నాయకులు

నాణ్యత లోపం.. గిరాకీ తగ్గుముఖం!

న్యూస్‌టుడే, కంచిలి గ్రామీణం, కంచిలి

మందగించిన కొబ్బరి పుల్లల ఎగుమతులు

ఉద్దానం కొబ్బరి పుల్లలకు ఉత్తరాదిలో గిరాకీ ఉన్నప్పటికీ నాణ్యత లోపం, దిగుబడి తగ్గుతుండటంతో ఎగుమతులు మందగించాయి. ఇచ్ఛాపురం, పలాస నియోజకవర్గాలు, గార, రణస్థలం, ఎచ్చెర్ల, జి.సిగడాం మండలాల్లో కొబ్బరి సాగు చేస్తున్నారు. వాతావరణ మార్పు, తుపాన్ల కారణంగా ఆకులకు తెల్లదోమ ఆశించడం, తెగుళ్ల కారణంగా దిగుబడి తగ్గింది. పదేళ్ల కిందట పుల్లల నాణ్యత బాగుండేది. ఇక్కడి నుంచి ఎగుమతి అయ్యే పుల్లలకు ఇతర ప్రాంతాల నుంచి పెద్ద పోటీ ఉండేది కాదు. ప్రస్తుతం గోదావరి జిల్లాలు, తమిళనాడు నుంచి పోటీ ఉండటంతో ఈ ప్రాంత రైతులు నష్టపోతున్నారు.

తగ్గిన ఆదాయం

గతంలో ఎకరా తోటలో 70 వరకు కొబ్బరి చెట్లుండేవి. రైతుకు పుల్లల ద్వారా నెలకు రూ.2500 వరకు ఆదాయం వచ్చేది. వరుస తుపాన్ల కారణంగా ప్రస్తుతం ఎకరాకు 40 చెట్లే ఉన్నాయి. తెల్లదోమ, నల్లముట్టె పురుగు, గ్యానోడెర్మా వంటి చీడపీడల కారణంగా నెలకు రూ.వెయ్యి రావడం కష్టంగా మారింది. ప్రత్యామ్నాయంగా పామాయిల్ పుల్లలు లభ్యమవుతుండటంతో గిరాకీ తగ్గుతోందని వ్యాపారులు తెలిపారు.

కంచిలి వద్ద ఓ దుకాణంలో కొబ్బరి పుల్లల్ని కట్టలు కడుతున్న శ్రామికులు

ఉత్తరాది రాష్ట్రాల్లో అధిక వినియోగం

బిహార్, ఉత్తర్‌ప్రదేశ్, దిల్లీ, హరియాణా, పంజాబ్, మహారాష్ట్ర, రాజస్థాన్‌కు ఎగుమతి చేస్తారు. ఆయా రాష్ట్రాల్లో చీపురు కట్టల వినియోగం అధికంగా ఉంటుంది. మార్కెట్లో కిలో పుల్లల ధర రూ.35 నుంచి రూ.60 వరకు ఉండగా.. వ్యాపారులు స్థానిక రైతుల నుంచి నాణ్యత మేరకు రూ.25 నుంచి రూ.45 వరకు చెల్లించి కొనుగోలు చేస్తున్నారు.

తెగుళ్ల నివారణకు చర్యలు తీసుకోవాలి

కొబ్బరి కొమ్మలకు తెగుళ్లు ఆశించడంతో పుల్లలు నలుపు రంగులోకి మారుతున్నాయి. వ్యాపారులు తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారు. తెగుళ్ల నివారణకు అధికారులు చర్యలు తీసుకోవాలి. **- అన్నపూర్ణ, శ్రీరాంపురం, కంచిలి మండలం**

అవగాహన కల్పిస్తున్నాం..

కొబ్బరి చెట్లను ఆశిస్తున్న తెగుళ్లు, చీడపీడల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. సామూహికంగా నివారణ చర్యలు తీసుకుంటే సత్ఫలితాలు వస్తాయి. సాగు విస్తరణపై ప్రత్యేక దృష్టి సారిస్తాం. **- మాధవీలత, ఉద్యాన అధికారిణి, సోంపేట**

★ జిల్లాలో కొబ్బరి తోటల సాగు విస్తీర్ణం: 36,920 ఎకరాలు ★ ఆధారపడిన కుటుంబాలు: 70 వేలు ★ కొబ్బరి పుల్లల దుకాణాలు: 25

Government of Andhra Pradesh
Endowments Department
E-PROCUREMENT TENDER NOTICE

Improvements to Temple to **Sri Uma Neelakanteswara Swamy Temple, Nimmada (V),** Kotabommali (M), Srikakulam District. NIT No.P/COE/1446/2025, Dt: 12.11.2025. For further details log onto website **https://tender.apeprocurement.gov.in** For further details contact Ph. 9440196444.

Sd/- XXX
EXECUTIVE AUTHORITY
Sri Uma Neelakanteswara Swamy Temple,
Nimmada (V), Kotabommali (M), Srikakulam Dist.

Government of Andhra Pradesh
Endowments Department
E-PROCUREMENT TENDER NOTICE

Reconstruction of Temple (Balance Works) to Sri Kodanda Rama Swamy Temple, Besi Ramachandrapuram (V), Sompeta (M), Srikakulam District. NIT No.P/COE/1524/2025-224, Dt: 22.11.2025. For further details log onto website **https://tender.apeprocurement.gov.in** For further details contact Ph. 8985870109.

EXECUTIVE AUTHORITY
Sri Kodanda Rama Swamy Temple,
Besi Ramachandrapuram (V), Sompeta (M), Srikakulam Dist.

చికిత్స పొందుతూ బాలుడి మృతి

ఆసుపత్రి వద్ద బంధువుల ఆందోళన

నరసన్నపేట, న్యూస్‌టుడే: నరసన్నపేట జయలక్ష్మీనగర్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రి వద్ద మంగళవారం ఉద్రిక్తత నెలకొంది. జలుమూరు మండలం కృష్ణాపురం గ్రామానికి చెందిన గద్దెబోయిన మణికంఠ (15) ఈనెల 16న నిమ్మాడ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. క్షతగాత్రుడిని సదరు ఆసుపత్రిలో చేర్పించారు. ఉదయం పరీక్షల అనంతరం శస్త్రచికిత్స చేయాలని వైద్యులు ఆపరేషన్ థియేటర్‌కు తీసుకెళ్లారని బంధువులు తెలిపారు. సాయంత్రం వరకు మణికంఠ ఆరోగ్య విషయంలో ఆసుపత్రి వర్గాలు వివరాలు వెల్లడించలేదని పేర్కొన్నారు. ఒక్కసారిగా చనిపోయినట్లు చెప్పారని, వైద్యుల నిర్లక్ష్యం వల్లే మణికంఠ మృతి చెందాడని ఆరోపించారు. మంగళవారం రాత్రి వరకు బంధువుల రోదనలు, ఆందోళనలతో ఆసుపత్రి ఆవరణ ఉద్రిక్తంగా మారింది. పోలీసులు నచ్చజెప్పినా బంధువుల్లో ఆవేశం కట్టలు తెంచుకుని తోపులాటకు దారితీసింది. ఒక దశలో వైద్యులపై దాడికి యత్నించారు. మృతదేహాన్ని ప్రధాన రహదారిపైకి తరలించి ఆందోళన చేసే ప్రయత్నాన్ని పోలీసులు అడ్డుకున్నారు. డీఎస్పీ లక్ష్మణరావుతో పాటు సీఐలు శ్రీనివాసరావు, అవతారం, ఎస్సైలు అక్కడికి చేరుకుని పరిస్థితిని అదుపు చేశారు. మణికంఠ 10వ తరగతి చదువుతూ నిమ్మాడలోని వసతి గృహంలో ఉంటున్నాడు. స్వగ్రామానికి ద్విచక్రవాహనంపై వెళ్తూ రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు.

నిరసన తెలుపుతున్న బంధువులు

మణికంఠ (పాత చిత్రం)

ఉత్సాహంగా చదరంగం పోటీలు

శాప్ లీగ్స్ క్రీడల నిర్వహణలో భాగంగా మంగళవారం జిల్లా స్థాయి చదరంగం పోటీలు నిర్వహించారు. శ్రీకాకుళం నగర పరిధి శాంతినగర్ ఇండోర్ మైదానంలో నిర్వహించిన పోటీల్లో 99 మంది పాల్గొన్నారు. అండర్-13, 15, 17, 19 విభాగాల్లో ఉత్సాహంగా తలపడ్డారు. జిల్లా స్థాయిలో ప్రతిభ చూపిన వారు తిరుపతిలో ఈ నెల 21, 22 తేదీల్లో జరిగే పోటీల్లో పాల్గొననున్నారు. అండర్-13 విభాగంలో బలివాడ జయంత్, బస్వా భానుతేజ్, బొల్లా శ్రుతి, వి.రోషిణి, అండర్-15లో బొల్లా యశ్వంత్, బగాది కార్తికేయ, మెట్ట ప్రణీత, వి.లోచన ఎంపికయ్యారు. అండర్-19లో రూప మహాలక్ష్మి, కూన ప్రమీల ఎంపికయ్యారు. పోటీలకు ఆల్ ఇన్ చెస్ ఫెడరేషన్, చెస్ ఇన్ స్కూల్, ఫిడే ఆర్బిటర్ సనపల భీమారావు న్యాయనిర్ణేతగా వ్యవహరించారు. జిల్లా క్రీడాప్రాధికార సంస్థ అధికారి ఎ.మహేశ్‌బాబు, డీఎస్‌ఏ శిక్షకులు పాల్గొన్నారు.
- న్యూస్‌టుడే, పాతబస్టాండ్

23న రాష్ట్ర స్థాయి పారాబ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికలు

పాతబస్టాండ్, న్యూస్‌టుడే: రాష్ట్ర స్థాయి పారా బ్యాడ్మింటన్ పోటీల్లో పాల్గొనే క్రీడాకారుల ఎంపికలు ఈ నెల 23న నిర్వహించనున్నట్లు జిల్లా స్టీఫెన్ హాకింగ్ పారా స్పోర్ట్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు ఎన్.గిరిధర్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని ఇండోర్ స్టేడియంలో ఉదయం 7 గంటలకు పోటీలు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. ఆసక్తి గల క్రీడాకారులు 80081 62432, 91776 93836కు ఫోన్ చేసి వివరాలు నమోదు చేసుకోవాలని సూచించారు.

చికెన్ ధరలు

రకం	(బ్యాగ్)లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
బ్రాయిలర్	150	255	275

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించండి
Cell: 80085 97609
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 80081 11237

మన ఊరు-మన బాధ్యత ఆలోచన భేష్.. కలెక్టరేట్(శ్రీకాకుళం): 'మన ఊరు-మన బాధ్యత ఆలోచన బాగుందని.. పర్యావరణ పరిరక్షణపై అందరూ దృష్టి సారించాలని కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు అన్నారు. శ్రీకాకుళం నగరంలోని క్యాంపు కార్యాలయంలో మంగళవారం ఆయన్ను జిల్లా పర్యావరణ ఛైర్మన్ లయన్ పొన్నాడ రవికుమార్ మర్యాదపూర్వకంగా కలిశారు. 'మన ఊరు-మన బాధ్యత' పేరిట చేపట్టిన కార్యక్రమాలను వివరించారు. ఈ సందర్భంగా రవికుమార్‌ను కేంద్ర మంత్రి అభినందించారు.

జాతీయ ఎస్టీ కమిషన్‌కు నివేదిక

సారవకోట, న్యూస్‌టుడే: జిల్లాలో వైద్య ఆరోగ్యశాఖలో ఏఎన్ఎం గ్రేడ్-3 ఉద్యోగోన్నతుల్లో చోటుచేసుకున్న అక్రమాలపై దిల్లీలో జాతీయ ఎస్టీ కమిషన్‌కు మంగళవారం నివేదిక సమర్పించినట్లు ఆదివాసీ సంక్షేమ పరిషత్తు రాష్ట్ర ఉపాధ్యక్షుడు వాబ యోగి తెలిపారు. 2019లో భర్తీ చేసిన పోస్టుల్లో రూల్ ఆఫ్ రిజర్వేషన్ పాటించలేదని, తప్పుడు కుల ధ్రువీకరణ పత్రాలు సమర్పించిన అభ్యర్థుల పేర్లు చేర్చారని తెలియజేస్తూ వివరాలు అందజేసినట్లు పేర్కొన్నారు. స్పందించిన కమిషన్ 15 రోజుల్లో సమగ్ర నివేదిక సమర్పించాలని డీఎంహెచ్‌వో అనిత, వైద్య ఆరోగ్యశాఖ డీడీ ప్రసాద్‌ను ఆదేశించినట్లు యోగి చెప్పారు.

వివరాలు వెల్లడిస్తున్న వాబ యోగి

గంజాయితో ఒకరి అరెస్టు

పాతపట్నం, న్యూస్‌టుడే: ఒడిశా నుంచి రాష్ట్రం మీదుగా తమిళనాడుకు గంజాయి తరలిస్తున్న వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. ఒడిశాలోని పర్లాఖెముండి నుంచి పాతపట్నం ప్రైవేటు ట్రావెల్స్ బస్సు వద్దకు ఇద్దరు వ్యక్తులు వచ్చారు. విజయవాడకు టికెట్ తీశారు. ట్రావెల్స్ సిబ్బంది బ్యాగులు తనిఖీ చేస్తుండగా.. ఒక్కసారిగా నిందితులు పరారయ్యేందుకు ప్రయత్నించారు. వీరిలో ఒకరు పట్టుబడగా.. పాతపట్నం పోలీసులకు అప్పగించారు. అతని వద్ద సుమారు 5 కిలోల గంజాయి ఉన్నట్లు సమాచారం. పరారైన వ్యక్తి ఆచూకీ తెలియలేదు.

SHRIRAM Finance

శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్

రిజిస్టర్డ్ ఆఫీస్: శ్రీ టవర్స్, ప్లాట్ నెం.14ఎ, సౌత్ ఫేజ్, ఇండస్ట్రియల్ ఎస్టేట్, గిండి, చెన్నై - 600032. Website: http://www.shriramfinance.in./auction
జోనల్ కార్యాలయం : సరస్వతీ కాంప్లెక్స్ 1వ అంతస్తు, ఎస్.వి.సి.థియేటర్ ప్రక్కన, రామలక్ష్మణ జంక్షన్, శ్రీకాకుళం బ్రాంచ్ మరియు శ్రీకాకుళం-II బ్రాంచ్

లేటు ఎండ కర్రెన్న గారికి చెందిన స్థిరాస్తులకు సంబంధించి ఇ-వేలం అమ్మకం ప్రకటన

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని రూల్ 9(1) & 8(6)కి సంబంధించిన నిబంధనతో పాటు ఫైనాన్షియల్ అసెట్స్ మరియు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 యొక్క సెక్యూరిటైజేషన్ మరియు రీకన్‌స్ట్రక్షన్స్ కింద స్థిరాస్తుల విక్రయం కోసం ఈ-వేలం అమ్మకం ప్రకటన.

రుణదాత సెక్యూరిటీగా ఉంచిన దిగువ వివరించిన స్థిరాస్తి తనఖాగా/ ఛార్జ్ చేయబడిందని, 20.03.2026 తేదీన ఉ॥ 11.00 నుండి మ॥ 1.00 వరకు "ఉన్నది" "ఉన్నట్లే" మరియు "ఏమున్నదో అదే" ప్రాతిపదికన విక్రయించబడుతుందని సాధారణ ప్రజలకు మరియు ప్రత్యేకించి హామీదారు మరియు తనఖాదారుకు రికవరీ కోసం నోటీసు ఇవ్వబడింది. 24.06.2023 నుండి శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్‌కు ఉన్న బకాయి రూ.**97,72,431/-** (రూపాయలు తొంభై ఏడు లక్షల డెబ్బై రెండు వేల నాలుగు వందల ముప్పై ఒకటి మాత్రమే) రుణఖాతా నెం: **SRKLMTF1705060002** మరియు 07.02.2026 నాటికి వడ్డీ కలుపుకొని, శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, సెక్యూర్డ్ క్రెడిటార్ ప్రకారం తేదీ 24.06.2023 నుండి ఇతర ఛార్జీలు మరియు ఖర్చులు. క్రింద పేర్కొన్న రుణగ్రహీత/గ్యారంటర్(లు)కి **SARFAESI** చట్టం యొక్క **U/S** 13(2) నోటీసు జారీ చేయబడింది.

1. కాంతమ్మ ఎండ, W/o కర్రెన్న ఎండ, హిందూ, వయస్సు 47 సంవత్సరాలు, డో.నెం.6-3-135, కొత్తకోట వారి వీధి, ఆమదాలవలస మండలం శ్రీకాకుళం జిల్లా, 532185. (రుణ గ్రహీత).
2. శ్రీరంగస్వామి బాణాల, S/o బాణాల రామమూర్తి, హిందూ, వయస్సు 47 సంవత్సరాలు, డో.నెం. 1-58/A,1-58, నీలంపేట గ్రామం, పట్టుపురం పోస్ట్, కోటబొమ్మాళి మండలం శ్రీకాకుళం జిల్లా. (హామీదారు)
3. వెంకటస్వామి ఎండ S/o లేట్ కర్రెన్న ఎండ, హిందూ వయస్సు 29 సంవత్సరాలు, డో.నెం.6-3-135, కొత్తకోట వారి వీధి, ఆమదాలవలస మండలం శ్రీకాకుళం లేటు కర్రెన్న ఎండ యొక్క చట్టపరమైన వారసుడు(హామీదారు).
4. భానుచందర్ ఎండ S/o లేట్ కర్రెన్న ఎండ, హిందూ, వయస్సు 26 సంవత్సరాలు, డో.నెం.6-3-135, కొత్తకోట వారి వీధి, ఆమదాలవలస మండలం, శ్రీకాకుళం జిల్లా. లేటు కర్రెన్న ఎండ యొక్క చట్టపరమైన వారసుడు (గ్యారంటర్) (హామీదారు).

డాక్యుమెంట్ నెంబర్:214/2004 ప్రకారం లేటు ఎండ కర్రెన్న గారికి చెందిన ఆస్థి వివరాలు

శ్రీకాకుళం జిల్లా కోటబొమ్మాళి ఉప జిల్లా, కోటబొమ్మాళి గ్రామపంచాయతీ మరియు గ్రామ లెక్క దాఖలాలో గల జిరాయితి మెట్టు భూమి కి గల సర్వే నెంబరు 267/8 లో విస్తీర్ణము ఎ.0.45 సెంట్లు ఉత్తర శ్రేణి వైపు కలదు, దక్షిణ శ్రేణి వైపు డోర్ నెంబర్ 5-5-260లోగల స్థలముకు కొలతలు తూర్పు పడమరలకు 30 అడుగులు లేదా 9.10 మీటర్లు మరియు ఉత్తర దక్షిణలకు 60 అడుగులు లేదా 18.20 మీటర్లు, మొత్తము 200 చదరపు గజాలు లేదా 168 చదరపు మీటర్లు గల ఖాళీ స్థలముకు సరిహద్దులు **తూర్పు:** ఎండ లక్ష్మీ గారికి చెందిన ఖాళీ స్థలం, **దక్షిణం:** విక్రయత వదలి పెట్టిన పాసేజ్ (రహదారి), **పడమర:** విక్రయతులకు చెందిన మిగిలిన భూమి **ఉత్తరం:** సుంకర ఆరుద్ర గారికి చెందిన RCC భవనం.

ఎటువంటి వివాదాలు లేవు

అగ్రిమెంట్ నెం.	స్థిరాస్తి కోసం రిజర్వ్ ధర	EMD ధరావత్తు	EMD సమర్పించు మార్గం	BID అమౌంట్ రెట్టింపు	వేలం తేది	EMD సమర్పించు తేది	స్థిరాస్తి పరిశీలనా తేది
SRKLMTF1705060002	ఐటమ్-1: రూ. 21,60,000/- (ఇరవై ఒక లక్ష అరవైవేలు మాత్రమే) అత్యధిక వాల్యుయేషన్ నివేదిక మొత్తం	ఐటమ్-1: రూ. 2,16,000/- (రెండు లక్షల పదహారువేలు మాత్రమే)	శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ పేరున డిమాండ్ డ్రాఫ్ట్ సమర్పించవలెను	Rs.25000/-	20-03-2026	19-03-2026	18-03-2026

ఆసక్తి గల బిడ్డర్లు లాగిన్ ఐడి & పాస్వర్డ్ క్రియేట్ చేసుకోవడానికి, డేటాను అప్లోడ్ చేయడం, బిడ్డు సమర్పించడం, ఇ-బిడ్డింగ్ ప్రక్రియపై శిక్షణ, మొదలైనవాటిలో సహాయం కొరకు మెస్సర్స్ శ్రీరామ్ ఆటోమాల్ ఇండియా లిమిటెడ్ వారిని సంప్రదించవచ్చును. పేరు: **శ్రీ గౌరవ్ నంబూదిరి,** ఫోన్ నెం. **9833922941,** Email id: gaurav.n@samil.in మరియు ఆస్తికి సంబంధించిన వివరాలు కోసం శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ అధీకృత అధికారి **జి. సురేష్ గారిని ఫోన్: 9849824246, జి. నారాయణమూర్తి గారిని ఫోన్: 9866509590** నందు ఆఫీసు పనిదినములలో పనివేళల నందు సంప్రదించవచ్చును. ఎట్టి కారణములు చూపకుండానే ఏదేని లేదా అన్ని బిడ్లను తిరస్కరించు హక్కు అధీకృత అధికారికి ఉంది. ఆన్లైన్ వేలం మా వేలం ఏజన్సీ శ్రీరామ్ ఆటోమాల్ ఇండియా లిమిటెడ్ యొక్క వెబ్ సైట్ (https://eauctions Samil.in/home) పై నిర్వహించబడును, టెండరు దాఖలు/ బిడ్ ఫారం పొందుటకు / టెండరు తెరచు మరియు వేలం జరుగు ప్రదేశం కొరకు వెబ్‌సైట్ (https://eauctions Samil.in/home)ను చూడగలరు. అమ్మకం యొక్క పూర్తి నియమనిబంధనల వివరాలకై శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ వెబ్‌సైట్ ఇవ్వబడిన లింకు https://www.shriramfinance.in/ఆక్షన్ ను చూడగలరు

గమనిక : ఇందుమూలంగా తెలియజేయునది. "తేది 30.11.2022 నాటి NCLT చెన్నై యొక్క ఉత్తర్వు ప్రకారం "శ్రీరామ్ సిటీ యూనియన్ ఫైనాన్స్ లిమిటెడ్" "శ్రీరామ్ ట్రాన్స్‌పోర్ట్ ఫైనాన్స్ లిమిటెడ్" తో విలీనం చేయబడింది. తదనంతరం "శ్రీరామ్ ట్రాన్స్‌పోర్ట్ ఫైనాన్స్ లిమిటెడ్" పేరు "శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్" గా మార్చబడింది. తెలియజేయడమైనది. పేరు మార్పుకు అనుగుణంగా ఇన్కార్పొరేషన్ సర్టిఫికేట్ 30.11.2022 ప్రకారం.

స్థలం: శ్రీకాకుళం. తేది: **17-02-2026** సం/- **అధీకృత అధికారి, శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్**

EENADU e Classifieds

TO LET

COMMERCIAL

శ్రీకాకుళం టౌన్ RTC కాంప్లెక్స్ SSR డిగ్రీకాలేజ్ దగ్గర 15,500 & 5500 SFTతో 2G+3 బిల్డింగ్స్ విద్యాసంస్థలు హాస్పిటల్స్ బ్యాంక్స్ అద్దెకు ✆ 9703779230, 9398873241.

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు. ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

JOBS

ఉద్యోగావకాశాలు. అందరు రిటైర్డ్ ఉద్యోగులకు, గృహిణులకు, నిరుద్యోగులకు, ఉద్యోగావకాశాలు కల్పించబడును. గృహిణులకు ఇంటి వద్ద ఉండి పనిచేయు సౌకర్యము కలదు. ఆదాయము నెలకు లక్ష నుండి 2 లక్షల వరకు. ఇంటర్వ్యూ: 16, 17, 18 తేదీలలో- ఫిబ్రవరి. Con:9959083267

ప్రకటన చిన్నదైనా స్పందన అతివేగం
ఈనాడు క్లాసిఫైడ్స్
5 లైన్ల ప్రకటన
కేవలం 315 /-
(GST 5% అదనం)
మాత్రమే
సంప్రదించండి:
8008597609

Wanted Teachers for Reputed Schools in A.P & Telangana, Contact: Sneha Placements Service. Ph: 94402 46409.

విజయవాడ ప్లాస్టిక్ పరిశ్రమ నందు పనిచేయుటకు హెల్పర్స్ కావలెను. అర్హత: 10th, ఇంటర్, ITI, డిప్లొమా. Email: infoampp2016@gmail.com ✆ 62810 45178. అడ్రస్: అమరావతి పాలీప్యాక్, D.No: 25-38, 4వ క్రాస్ రోడ్, కబేళా, VJA-12.

త్రినేత్ర హోంకేర్‌లో వృద్ధులను/ పేషెంట్స్‌ను /పిల్లలను చూసుకొనుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఫ్రీ వసతి, భోజనం. జీ: 18K. ✆ 8520980099, 8520874499

హరేకృష్ణ హోంకేర్‌లో వృద్ధులను/ పేషంట్స్‌/ పిల్లలను చూసుకొనుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఫ్రీవసతి, భోజనం జీ: 18-20K ✆ 96404 68899, 96402 58899

FACULTY/ TEACHERS

గాజువాక విశాఖడిఫెన్స్ అకాడమీలో హాస్టల్లో ఉండి పనిచేయుటకు Physical Education Teacher కావలెను. జీ:10K+ ఫుడ్& అకామిడేషన్. 9848577745, 9666694545.

పలాస

• పలాస • ఇచ్ఛాపురం

జేఈఈ మెయిన్‌లో సత్తా

బి.సుమీత్

ఇప్పిలి రాహుల్

పలాస-కాశీబుగ్గ పురపాలక సంఘం చిన్నబడాంకు చెందిన బొడ్డ రమేష్‌బాబు, ధనలక్ష్మి దంపతుల కుమారుడు బొడ్డ సుమీత్ జేఈఈ మెయిన్‌లో మెరిశాడు. సోమవారం విడుదలైన ఫలితాల్లో 99.94 పర్సంటైల్‌తో సత్తా చాటాడు. విద్యార్థి తండ్రి ఆర్మీలో ఉద్యోగ విరమణ చేయగా, తల్లి గృహిణి. ఐఏఎస్ అధికారి కావడమే తన లక్ష్యమని సుమీత్ అన్నారు. ✦ కంచిలికి చెందిన ఇప్పిలి ప్రవీణ్, శ్రీలక్ష్మి దంపతుల కుమారుడు రాహుల్ 98.5123 పర్సంటైల్ సాధించారు. విద్యార్థి తండ్రి వ్యాపారి కాగా, తల్లి గృహిణి. – న్యూస్‌టుడే, పలాస, కంచిలి

తెరపై ఈనాడు

పలాసలో.. ఎస్వీ మ్యాక్స్: మన శంకర వరప్రసాద్‌గారు హరిశంకర్: పంకీ
ఇచ్ఛాపురంలో.. మణికంఠ ఎల్ మ్యాక్స్: పంకీ, పూర్ణ: మన శంకర వరప్రసాద్‌గారు సోంపేటలో.. ఎస్ఎస్‌మ్యాక్స్: మన శంకర వరప్రసాద్‌గారు, శివ: పంకీ
మందసలో.. మహేంద్ర: పాంచాలి – న్యూస్‌టుడే, పలాస, ఇచ్ఛాపురం, సోంపేట, మందస

మేమున్నాం.. మీకు తోడుగా
(10 AM TO 1 PM) 8008574279 9063144707

? బాబ్జాపెస్ వీధి ముఖద్వారంలో కల్వర్టు ప్రమాదకరంగా మారింది. - వంశీమోహన్, ఇచ్ఛాపురం ★ పరిశీలించి, సమస్యను పరిష్కరిస్తాం. - నల్లి రమేష్, పుర కమిషనర్, ఇచ్ఛాపురం – న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం

? పలాస మండలం సున్నాడలోని పెరడ వీధిలో కాలువలు లేక ఇబ్బంది పడుతున్నాం. - స్థానికులు ★ కాలువల నిర్మాణానికి కృషి చేస్తాం. - పద్మనాభం, పంచాయతీ అభివృద్ధి అధికారి, లొద్దభద్ర – న్యూస్‌టుడే, పలాస గ్రామీణం

నేటి నుంచి చక్రధరుడి డోలోత్సవాలు
15 రోజులపాటు నిర్వహణ

– న్యూస్‌టుడే, కవిటి గ్రామీణం

కవిటి మండలం బెజ్జిపుట్టుగలో వెలసిన చక్రధర పెరుమాళ్ స్వామి డోలోత్సవాలు, చతుర్థ బ్రహ్మోత్సవాలు బుధవారం నుంచి మార్చి 2 వరకు 15 రోజులపాటు నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్తలు, గ్రామస్థులు తెలిపారు. ఈ ఉత్సవాల్లో స్వామివారికి సుప్రభాత సేవతోపాటు పల్లకీసేవ, గరుడోత్సవాలు నిర్వహించనున్నారు. వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

స్వామివారి లీల: పాకలో ప్రతిష్ఠించిన స్వామిని గ్రామానికి చెందిన ఇనామీదారులైన ఇచ్ఛాపురం వాసి గాదె పంతులు తన స్వగృహానికి తీసుకెళ్లి వైష్ణవ సంప్రదాయ ప్రకారం పూజలు చేస్తుండగా ఇల్లు, వారు తినే ఆహార పదార్థాలు రక్తవర్ణంగా మారిపోయాయి. దీంతో భయభ్రాంతులకు గురైన పంతులు స్వామివారిని బెజ్జిపుట్టుగలో విడిచివెళ్లారు. అప్పుడు గ్రామానికి చెందిన పొందల వంశీయులు శిల్పాలు చెక్కే రాతితో ఆలయం నిర్మించి అందులో విగ్రహాలను ప్రతిష్ఠించారు. అప్పటి నుంచి పుణ్యక్షేత్రంగా వెలసింది. ఏటా 15 రోజులపాటు డోలోత్సవాలు నిర్వహిస్తూ వస్తున్నారు.

చరిత్ర: మూడు శతాబ్దాల కిందట బ్రిటిష్ పాలనలో బంగాళాఖాతంలో డచ్‌వారి నౌక బెజ్జిపుట్టుగ సమీపంలో హఠాత్తుగా నిలిచిపోయింది. నౌక యంత్రమంతా సవ్యంగా ఉన్నప్పటికీ ముందుకు కదలలేదు. అందులో శ్రీదేవి, భూదేవి సమేత చక్రధర స్వామి వారి పంచలోహ విగ్రహాలు ఉన్నాయి. ఆ గ్రామానికి చెందిన కళింగ వైష్ణవులు నౌకలో నుంచి వాటిని బయటకు తీసి బెజ్జిపుట్టుగలోని ఓ పాకలో ప్రతిష్ఠించారు. వెంటనే నౌక ముందుకు కదిలిందని స్థానికులు చెబుతున్నారు.

ఆయిల్ పామ్‌కు ఆసరా

– న్యూస్‌టుడే, పలాస గ్రామీణం

ఉద్యాన పంటల సాగుకు ప్రభుత్వం ప్రోత్సాహకాలు అందిస్తోంది. అందులోనూ ఆయిల్ పామ్ పంటకు ప్రత్యేక రాయితీలు ఇస్తోంది. కొన్ని కంపెనీలను ప్రభుత్వమే ఎంపిక చేసి వాటి ద్వారా మొక్కలు ఇప్పిస్తూ, కొనుగోలు కూడా చేయిస్తోంది. ఇప్పటికే కొంతమంది రైతులు ఆ దిశగా ప్రయత్నాలు చేస్తున్నారు. రైతులందరూ పూర్తిస్థాయిలో ఆయిల్ పామ్ పంటపై అవగాహన పెంచుకుని, ఆ పంట వేసే దిశగా ఆలోచించాలని ఉద్యాన అధికారులు కోరుతున్నారు.

తెగుళ్లు తక్కువ

❖ ఆయిల్ పామ్ పంట వేసిన మూడేళ్లు దాటిన తర్వాత పంట చేతికొస్తుంది. నాలుగో ఏడాది నుంచి అమ్ముకోవచ్చు. పంటను సాగు చేయడం వల్ల ఏడాది పొడవునా నెలవారీ ఆదాయం వస్తుంది.

❖ ఈ పంటకు తెగుళ్లు, వ్యాధులు చాలా తక్కువగా సోకుతుంటాయి. మొదటి మూడు సంవత్సరాల్లో అంతర పంటలూ వేసుకోవచ్చు.

❖ 4 నుంచి 8 సంవత్సరాల వయసున్న ఆయిల్ పామ్ తోట నుంచి ఎకరానికి 6 నుంచి 7 టన్నులు, 8 ఏళ్ల పైబడిన తోట నుంచి ఎకరానికి 8 నుంచి 12 టన్నుల దిగుబడి వస్తుంది.

రాయితీలు ఇలా..

❖ ఆయిల్ పామ్ సాగులో ఎకరానికి సుమారు 52 మొక్కలు నాటుతారు. మొక్కకు మొక్కకు మధ్య 9 మీటర్ల దూరం ఉండాలి. సాధారణంగా స్వదేశీ, దిగుమతి అనే రెండు రకాల మొక్కలు సాగు చేయడానికి ఉపయోగిస్తున్నారు.

సాగు వివరాలు (ఎకరాల్లో..)

మండలం	2024-25 లక్ష్యం	సాగు	2025-26 లక్ష్యం	సాగు
పలాస	25	5.50	25	11
వజ్రపుకొత్తూరు	5	15	37.5	3
మందస	30	13.75	70	10
సోంపేట	7.5	0	37.5	12.575

పలాస మండలం రంగోయిలో వేసిన మొక్కలు

❖ సాగు ఖర్చుల నిమిత్తం హెక్టారుకు ఏడాదికి రూ.5,250 చొప్పున నాలుగేళ్లకు రూ.21 వేలు, అంతర పంటలు పండించేందుకూ అంతే రాయితీ ఇస్తోంది.

❖ ఆయిల్‌పామ్ సాగును ప్రోత్సహిస్తూ బిందు సేద్యం పరికరాలకు చిన్న, సన్నకారు రైతులకు 90 శాతం, ఇతర రైతులకు 50 శాతం రాయితీ అందిస్తోంది.

❖ స్వదేశీ రకం మొక్క రూ.133, దిగుమతి రకం మొక్క రూ.193గా ఉంది. ప్రభుత్వం స్వదేశీ మొక్కల కొనుగోలుకు హెక్టారుకు రూ.20 వేలు, దిగుమతి మొక్క కొనుగోలుకు హెక్టారుకు రూ.28 వేల రాయితీని ఇస్తోంది.

లాభదాయకం : నీటి సదుపాయం ఉండి వరి పండిస్తున్న రైతులు కాస్త ఆలోచించి ఆయిల్ పామ్ పంటపై దృష్టి పెడితే ఎకరాకు ఏడాదికి రూ.1.5 లక్షల నుంచి రూ.2 లక్షలు ఆదాయం పొందొచ్చు. అంతర పంటల నుంచి అదనంగా ఆదాయం వస్తుంది. కంపెనీలే మొక్కలు ఇచ్చి, కొనుగోలు చేస్తారు. ధరను ప్రభుత్వం నిర్ణయిస్తుంది. – శంకరదాస్, ఉద్యాన శాఖ అధికారి, పలాస

కొమ్మల తొలగింపు

స్పందనకు వందనం

ఇచ్ఛాపురం ఏఎస్‌పేట నుంచి పురుషోత్తపురం మధ్య విద్యుత్తు తీగలకు సమీపంగా చెట్టుకొమ్మలు చేరాయి. స్థానికులు సమస్యను 'ఈనాడు' 'మేమున్నాం...మీకు తోడుగా..' ద్వారా అధికారులకు నివేదించారు. దీనిపై స్పందించిన ఏఈ కేవీ గోవిందరావు కొమ్మలు కత్తిరించి సమస్యను పరిష్కరించారు. – న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం

ఆర్థిక చేయూత

ఈదుపురానికి చెందిన శివ బెహరా అనారోగ్యంతో బాధపడుతున్నారు. విషయం తెలుసుకున్న అదే గ్రామానికి చెందిన కార్మిక సంఘ సభ్యులు సమావేశమై బాధిత కుటుంబానికి రూ.33 వేలు ఆర్థిక సాయం అందించారు. – న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం గ్రామీణం

సరఫరా ఎప్పుడో మరి..

మందస మండలం మారుమూల సరిహద్దు గిరిజన గ్రామం గోపాలసాయి వద్ద సుజల స్రవంతి పథకం నీటి ట్యాంకు ఇది. ఏడాది కిందట గోపాలసాయితోపాటు దబార్సింగి, కుదుమసింగి, కొంకాసాయి, కుమ్మరుకట్ట గ్రామాల గిరిజనుల దాహార్తి కోసం దీన్ని నిర్మించారు. నీటి సరఫరా మాత్రం నేటికీ లేదు. పైపులైను పనులు పూర్తవ్వగానే గ్రామాలకు తాగునీరు సరఫరా చేస్తామని సర్పంచి జయలక్ష్మి తెలిపారు. – న్యూస్‌టుడే, మందస

వారి నిర్లక్ష్యం.. అందరికీ అపాయం

ఇచ్ఛాపురం పట్టణ ప్రధాన రహదారి మార్గంతోపాటు రద్దీ రోడ్లలో ఆక్రమణలు, నిర్లక్ష్య పనులతో ఇబ్బందులు తప్పడం లేదు. మరమ్మతులు చేపట్టేటప్పుడు రోడ్డుపైనే పనులు చేపడుతున్నారు. దుకాణదారులు రోడ్డును ఆక్రమించడంతో రాకపోకలకు అవస్థలు పడుతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పుర కమిషనర్ రమేష్ వద్ద ప్రస్తావించగా పోలీసులు, సచివాలయ సిబ్బంది సహకారంతో చర్యలు తీసుకుంటామన్నారు. – న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం

అడ్డదిడ్డంగా చూపుతోంది..

కొళిగాం నుంచి అరకభద్ర వెళ్లేందుకు మధ్యలో ప్రమాదకర మలుపులున్నాయని తెలిపేందుకు ఏర్పాటు చేసిన సూచిక బోర్డు ఇది. చాలా నెలల కిందట నుంచి పక్కకు వాలి ఉంది. సమీపంలోనే మరో రహదారి ఉండటంతో కొత్తగా ఇటు వైపు ప్రయాణం చేసే వాళ్లు ఎలా వెళ్లాలో తెలియక తికమక పడుతున్నారు. ఈ విషయమై పంచాయతీ రాజ్ శాఖ ఏఈ ధనంజయను వివరణ కోరగా బోర్డును సరిచేస్తామని తెలిపారు. – న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం గ్రామీణం

ఇబ్బందులు పట్టవా..?

కేసరిపడ సచివాలయ భవన నిర్మాణం సగంలోనే నిలిచిపోయింది. దీంతో తమకు ఇబ్బందులు తప్పడం లేదని సిబ్బంది, ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం రైతు సేవా కేంద్రంలోనే విధులు నిర్వహిస్తున్నారు. అధికారులు స్పందించి భవన నిర్మాణం పూర్తిచేయాలని కోరుతున్నారు. ఈ విషయాన్ని పీఆర్ ఏఈ ప్రవీణ్ వద్ద ప్రస్తావించగా ప్రభుత్వం నుంచి అనుమతులు రాగానే నిర్మాణ పనులు చేపడతామన్నారు. – న్యూస్‌టుడే, కంచిలి గ్రామీణం

వృథాగా నీరు.. ఇదేం తీరు

అక్కుపల్లి శివసాగర పర్యాటక తీరంలో ఏర్పాటు చేసిన మోటారు ట్యాంకు నుంచి తాగునీరు వృధాగా పోతోంది. ట్యాంకు చుట్టూ వేసిన కుళాయిలు పాడవ్వడంతో మోటారు వేయగానే నీరంతా బయటకు పోతోంది. విరిగిన కుళాయి పైపుల్లో కర్రలు అమర్చి నీటిని వాడుకునే ప్రయత్నం చేస్తున్నారు. నీటి వృధాను అరికట్టేలా చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో రమేష్‌నాయుడు తెలిపారు. – న్యూస్‌టుడే, వజ్రపుకొత్తూరు

ఉన్నత స్థాయికి చేరుకోవాలి

విద్యార్థులు భవిష్యత్తులో ఉన్నత స్థాయికి చేరుకుని చదువుకున్న విద్యాలయాలకు మంచి పేరు తీసుకురావాలని వక్తలు ఆకాంక్షించారు. సోంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో రెండో సంవత్సరం విద్యార్థులకు మంగళవారం వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థుల నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కళాశాల ప్రిన్సిపల్ మోహనరావు, అధ్యాపకులు వెంకటరావు, రజనీకుమారి, రామినాయుడు, యుగంధర్, సుందరరాణి, కల్పన తదితరులు పాల్గొన్నారు. – న్యూస్‌టుడే, సోంపేట

విద్యార్థి దశ నుంచే సామాజిక బాధ్యత కలిగి ఉండాలి

సోంపేట: విద్యార్థి దశ నుంచే సామాజిక బాధ్యత కలిగి ఉండాలని రీజినల్ జాయింట్ డైరెక్టర్ బి.పావని సూచించారు. బారువ డిగ్రీ కళాశాలను మంగళవారం సందర్శించి ఉన్నత్ భారత్ అభియాన్ ఆధ్వర్యంలో చేపడుతున్న కార్యక్రమాలను పరిశీలించారు. వాటి ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు. ప్రిన్సిపల్ రామారావు, వైస్ ప్రిన్సిపల్ రామకృష్ణ, పాల్గొన్నారు.

కేంద్రమంత్రిని కలిసిన రైల్వే శ్రామిక్ యూనియన్ సభ్యులు

పలాస, న్యూస్‌టుడే: కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు మంగళవారం పలాసలో పర్యటించారు. ఈ మేరకు రైల్వేశ్రామిక్ యూనియన్ ఉద్యోగులంతా రైల్వే ఆర్‌పీఎఫ్ బ్యారెక్ వద్ద ఆయనను కలిసి వారి సమస్యలు విన్నవించారు. అనంతరం ఆయనకు తన చిత్రపటాన్ని అందజేశారు. శ్రామిక్ యూనియన్ నాయకులు రామకృష్ణ, కార్యదర్శి ఉమామహేశ్వర రావు, అయ్యప్ప, ఎ.రామకృష్ణ, ఆర్.నారాయణ పాల్గొన్నారు.

పలాసలో కేంద్రమంత్రికి చిత్రపటాన్ని అందిస్తున్న రైల్వే శ్రామిక్ యూనియన్ నాయకులు

ఖుర్దా డివిజన్ నుంచి మార్చండి

కవిటి గ్రామీణం, ఇచ్ఛాపురం, న్యూస్‌టుడే: ఒడిశాలోని ఖుర్దా డివిజన్‌లో ఉన్న ఇచ్ఛాపురం, జాడుపూడి, సోంపేట, బారువ, మందస, సుమాదేవి, పలాస రైలు నిలయాలను కొత్తగా ఏర్పాటు అవుతున్న విశాఖ రైల్వే జోన్‌లో కలపాలని జెడ్ఆర్ యూసీసీ సభ్యుడు శ్రీనివాస్ రౌళో కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడికి వినతిపత్రం అందించారు. మణిచంద్ర ప్రకాష్, పి.సంతోష్ పట్నాయక్, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

అంతర్రాష్ట్ర క్రికెట్ టోర్నమెంట్ విజేత మకరాంపురం

విజేత జట్టుకు ట్రోఫీని అందిస్తున్న పురాధ్యక్షురాలు రాజలక్ష్మి

ఇచ్ఛాపురం, న్యూస్‌టుడే: మకరాంపురం జట్టు అంతర్రాష్ట్ర టీ20 క్రికెట్ టోర్నమెంట్ విజేతగా నిలిచింది. ఇచ్ఛాపురం రాజావారి మైదానంలో వెచ్చా జయంతి స్మారకార్థం వెచ్చా కేశవరావు నిర్వహించిన పోటీల్లో ఆంధ్ర, ఒడిశా రాష్ట్రాల నుంచి 20 జట్లు పాల్గొనగా మంగళవారం తుది పోరు జరిగింది. ఇందులో మకరాంపురం జట్టు టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ చేసి 20 ఓవర్లలో ఆరు వికెట్ల నష్టానికి 179 పరుగులు చేసింది. అనంతరం బ్రహ్మపుర జట్టు ఏడు వికెట్ల నష్టానికి 134 పరుగులకే కుప్పకూలింది. విజేత జట్టుకు ట్రోఫీతోపాటు రూ.50వేల నగదు, రన్నరప్‌కు రూ.35వేల నగదును పురాధ్యక్షురాలు పిలక రాజలక్ష్మి, వెచ్చా కేశవరావు అందించారు. మకరాంపురం జట్టుకు ప్రాతినిధ్యం వహించిన సాత్విక్ మ్యాన్ ఆఫ్ ద సిరీస్‌కు ఎంపికవ్వగా.. ఉత్తమ బౌలర్‌గా చిన్నరాజు, ఉత్తమ బ్యాటర్‌గా అన్నుమన్ నిలిచారు. ఉప తహసీల్దారు శ్రీహరిబాబు, నిర్వాహక బృందం కృష్ణయ్య, దిలీప్‌యాదవ్, షేక్‌మున్నా తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా పోటీలు

కవిటి, న్యూస్‌టుడే: పాత కొజ్జిరియాలో స్థానిక యువత ఆధ్వర్యంలో ఎల్‌వీఎస్ మెమోరియల్ మెగా క్రికెట్ పోటీలు ఉత్సాహంగా సాగుతున్నాయి. మంగళవారం కమళాయిపుట్టుగ, కపాసుకుద్ది తలపడగా కపాసుకుద్ది విజయం సాధించింది. అనంతరం బలరాంపురం, బసవకొత్తూరు జట్ల మధ్య సాగిన పోటీలో బసవకొత్తూరు గెలిచింది. సాయంత్రం ఆర్.కరాపాడు, సోంపేట-బి జట్లు మధ్య జరిగిన పోటీలో సోంపేట-బి జట్టు విజయం సాధించింది.

కాశీ అన్నపూర్ణేశ్వరి విగ్రహ ప్రతిష్ఠ

కంచమ్మతల్లి దేవస్థానం ఆలయ ఆవరణలో కాశీ అన్నపూర్ణేశ్వరిదేవి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం ఈ నెల 22న నిర్వహించనున్నట్లు కమిటీ ప్రతినిధులు తెలిపారు. పూజల్లో పాల్గొనేవారు పిడికెడు బియ్యం, బెల్లం శనివారం సాయంత్రం 6 గంటలకు తీసుకురావాలని పేర్కొన్నారు. – న్యూస్‌టుడే, కంచిలి

బీసీలకు ప్రాధాన్యమిచ్చిన ప్రభుత్వం

ఇచ్ఛాపురం, న్యూస్‌టుడే: రాష్ట్రంలో బీసీ వర్గాల అభ్యున్నతిని కాంక్షించే కూటమి ప్రభుత్వం బడ్జెట్‌లో కేటాయింపులు చేసిందని రాష్ట్ర బీసీ రెడ్డిక కార్పొరేషన్ అధ్యక్షుడు కొండ శంకర్‌రెడ్డి అన్నారు. ఇచ్ఛాపురంలోని పార్టీ కార్యాలయంలో మంగళవారం ఆయన మాట్లాడారు. గతేడాది బడ్జెట్‌లో బీసీల కోసం రూ.47,456 కోట్లు కేటాయించగా, తాజాగా రూ.51,021 కోట్లు నమోదు చేశారన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, బీసీ సంక్షేమశాఖామంత్రి సవిత, ప్రభుత్వ విప్ బెందాళం అశోక్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.

చిన్నారుల చిరుసాయం

కొండపూరుకు చెందిన మూడేళ్ల బాలుడు భువన్ విద్యుత్తు ప్రమాదంలో తీవ్రంగా గాయపడటంతో దాతలు స్పందిస్తున్నారు. అమలపాడు ప్రాథమిక పాఠశాలకు చెందిన చిన్నారులు చందాలు వేసుకుని రూ.6,947 ఉద్దానం హెల్పింగ్ సొసైటీ ద్వారా మంగళవారం బాధిత కుటుంబానికి అందించారు. చిన్నారులను ఉపాధ్యాయులు అభినందించారు. ప్రధానోపాధ్యాయుడు వాసుదేవ్ పాల్గొన్నారు. – న్యూస్‌టుడే, వజ్రపుకొత్తూరు గ్రామీణం

అందుబాటులోకి సుజలధార

కంచిలి, న్యూస్‌టుడే: తలతంపర గ్రామస్థుల అవసరాల మేరకు ఆర్వో (సుజలధార) సౌకర్యాన్ని కూటమి ప్రభుత్వ నాయకులు తీసుకొచ్చారు. మంగళవారం సర్పంచి జగబంధు దొళాయి, తెదేపా మండలాధ్యక్షుడు మాదిన రామారావు, ఏపీ లైవ్ స్టాక్ డైరెక్టర్ ఎం.పూర్ణచంద్ర, ఏఎంసీ డైరెక్టర్ అభిమన్యు బిసాయి సమక్షంలో తాగు నీటి ట్యాంకర్ ద్వారా శుద్ధజలం అందజేశారు.

అవగాహనతోనే ఆరోగ్యం

పలాస గ్రామీణం: శిక్షణలో పాల్గొన్న మహిళా సంఘాల సభ్యులు

మందస, పలాస గ్రామీణం, వజ్రపుకొత్తూరు: ఆహార వ్యవహారాలే ఆరోగ్యానికి ముఖ్యమని, ఈ విషయంలో కనీస అవగాహన కలిగి ఉండాలని ఏపీఎంలు పి.కూర్మారావు, జాంబవతి, ప్రసాదరావు అన్నారు. ఆహారం, పోషణ, ఆరోగ్యం, పారిశుద్ధ్యంపై మందస, వజ్రపుకొత్తూరు వెలుగు కార్యాలయంలో మంగళవారం శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ✦ పలాస స్త్రీ శక్తి భవనంలో ఈ-నారీ, వీవోఏ, సీఆర్‌పీలకు జీవనోపాధుల సర్వే యాప్‌పై శిక్షణ ఇచ్చారు. లీగల్ సమన్వయకర్త తారకమోహన్, ఎంఎంఎస్ అధ్యక్షులు రమణమ్మ, సరస్వతి, కోశాధికారులు చంద్రకళ, త్రివేణి సీసీలు తదితరులు పాల్గొన్నారు.

యోగి వేమన విగ్రహావిష్కరణకు విరాళం

ఇచ్ఛాపురం: పూరీ, గంజాం, శ్రీకాకుళం రెడ్డిక మహాజన సంఘ వందేళ్ల ఉత్సవాల్లో భాగంగా రెడ్డికలకు ప్రతీక అయిన యోగివేమన విగ్రహాన్ని నెలకొల్పుతున్నారు. కొజ్జిరియా రెడ్డిక సంఘ భవనం వద్ద ఈ విగ్రహాన్ని 22న ఆవిష్కరించేందుకు ఇచ్ఛాపురం జోన్ రెడ్డిక సంఘం ఏర్పాట్లు చేసింది. ఈ మేరకు గొల్లవీధిలోని సామాజికవర్గ పెద్దలను ఆహ్వాన కమిటీ ప్రతినిధులు ఆశి చిరంజీవులురెడ్డి, దుర్గాశి పాపారావు, తిప్పన దుర్యోధనరెడ్డి, దక్కత నూకయ్యరెడ్డి మంగళవారం ఆహ్వానించారు. దక్కత లోకనాథరెడ్డి, భాస్కర్‌రెడ్డి, విశ్వనాథరెడ్డి తదితరులు విరాళమందించారు.

దారులు చూడండి.. దయ చూపండి..

– న్యూస్‌టుడే, మందస

ఏ ప్రాంతమైనా వాటి అభివృద్ధి రహదారులపైనే ఆధారపడి ఉంటుంది. రోడ్లు బాగుంటేనే అన్ని సౌకర్యాలు సాకారమవుతాయి. పలాస నియోజకవర్గంలోని ఏజెన్సీ ప్రాంతాల్లో కొన్ని దారులు దారుణంగా మారాయి. వైకాపా హయాంలో అభివృద్ధి పనులు లేక రాళ్లు తేలి, గోతులు ఏర్పడి కాలినడకకూ కష్టంగా మారాయి.

ఇదీ పరిస్థితి

★ మందస మండలంలో జాతీయ రహదారి నుంచి కొండలోగాం, టంగరపుట్టి, కుసుమాల మీదుగా ఎంఎం రోడ్డు వరకు 9 కిలోమీటర్లు రాళ్లు తేలి, గోతులు ఏర్పడి పాడైంది. ★ బెల్లుపద్ర కూడలి నుంచి బొందుకారి మీదుగా బుడంబొ 5 కిలోమీటర్ల రహదారి నరకదారిని తలపిస్తోంది.

★ ఎంఎం రోడ్డు నుంచి బొగాబంద మీదుగా బసవసాయి రహదారిలో భారీ వాహనాలు తిరుగుతుండటంతో చాలా చోట్ల మరమ్మతులకు గురైంది.

★ ఎంఎం రోడ్డు నుంచి కిల్లోయి, బంజరుయువరాజపురం మీదుగా కొంటాసాయి రహదారిలో బూరుసాయి సమీపంలో కల్వర్టు కుంగింది. రెండు నెలల నుంచి ఆ దారిలో వాహనాలు తిరగని పరిస్థితి నెలకొంది.

★ ఎంఎం రోడ్డు నుంచి సాబకోట మీదుగా సింగుపురం రహదారి చాలా చోట్ల పెద్ద పెద్ద గోతులు ఏర్పడ్డాయి. కొన్ని చోట్ల కోతకు గురై మట్టి రోడ్డును తలపిస్తోంది.

★ చీపి నుంచి పద్మాపురం, మహల్పడ మీదుగా బుడార్సింగి కూడలి, చొంపాపురం కూడలి నుంచి కొరడాబడి, ముర్ధమేక రహదారులు గోతులతో దర్శనమిస్తున్నాయి.

★ పలాస మండలంలో సవర గోవిందపురం కూడలి నుంచి మహాదేవిపురం పొత్రియా, బాలాజీఊరు, గట్టూరు మీదుగా కొటారితాళపద్ర వరకు 5 కిలోమీటర్ల రహదారి గోతులు, రాళ్లతో దారుణంగా మారింది.

ప్రతిపాదనలు పంపించాం

నియోజకవర్గంలోని ఏజెన్సీ ప్రాంతాల్లో పాడైన రహదారుల అభివృద్ధి కోసం ఏడాది కిందట ప్రతిపాదనలు పంపించాం. బాగా పాడైన కొన్నింటిని రూ.3 కోట్లతో అభివృద్ధి చేశాం. మిగతా వాటిని నిధులు వచ్చాక నిర్మిస్తాం. – కృష్ణకుమార్, ఐటీడీఏ డీఈఈ, మందస

సాగుతున్న పనులు.. అక్కడే సమావేశాలు?

ప్రణాళికేతర నిధులు రూ.13 లక్షలతో చేపడుతున్న పుర కార్యాలయ భవన సుందరీకరణ పనులు కొనసాగుతున్నాయి. గత నెల కౌన్సిల్ సమావేశానికి ముందు ఈ పనులు ప్రారంభించడంతో, అప్పుడు పుర సమావేశం పై అంతస్తులో నిర్వహించారు. బుధవారం పుర బడ్జెట్ సమావేశం నిర్వహించనున్నారు. ఇంకా పనులు కొనసాగడంతో వాటి నడుమే కౌన్సిల్ సమావేశం నిర్వహించనున్నట్లు సమాచారం. పనులు వేగంగా, సవ్యంగా జరిగేలా చర్యలు తీసుకుంటున్నామని కార్యాలయ ఏఈ కిశోర్ తెలిపారు. – న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం

వ్యక్తిగత శుభ్రతతో నులిపురుగుల నివారణ

మాణిక్యపురం పాఠశాల వద్ద విద్యార్థులకు మాత్రలు వేస్తున్న వైద్యురాలు

వ్యక్తిగత శుభ్రత పాటించడం ద్వారా నులిపురుగుల బారి నుంచి బయటపడొచ్చని వైద్యులు పేర్కొన్నారు. ఇచ్ఛాపురం, పలాస నియోజకవర్గాల్లోని విద్యాలయాల్లో నులిపురుగుల నివారణ దినం సందర్భంగా మంగళవారం విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు అందజేశారు. పీహెచ్‌సీ వైద్యులు, ఎంఈవోలు ప్రధానోపాధ్యాయులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు. – న్యూస్‌టుడే పలాస, ఇచ్ఛాపురం బృందం

సకాలంలో వైద్యసేవలు అందించండి

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు వచ్చే రోగులకు సకాలంలో వైద్య సేవలందించాలని అభివృద్ధి కమిటీ ఛైర్మన్ కడియాల పద్మ అన్నారు. మంగళవారం బొరివంక, మాణిక్యపురం పీహెచ్‌సీల అభివృద్ధి కమిటీల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆసుపత్రులకు అవసరమైన వివిధ అభివృద్ధి పనులను తీర్మానించారు. ఎంపీడీవో ఎల్.త్రినాథ్, డిప్యూటీ ఎంపీడీవో వరప్రసాద్, సర్పంచి శ్రీరామ్‌ప్రసాద్, సావిత్రి ప్రియ, ఎంపీటీసీ సభ్యుడు డి.సతీష్, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు. – న్యూస్‌టుడే, కవిటి గ్రామీణం

పని ఒత్తిడి తగ్గించాలి

కంచిలి: నిరసన తెలుపుతున్న వీఆర్వోలు, సర్వేయర్లు

కంచిలి, కాశీబుగ్గ, న్యూస్‌టుడే: రెవెన్యూ కార్యాలయాల్లో విధులు నిర్వహిస్తున్న వీఆర్వోలు, గ్రామ సర్వేయర్లు తమకు పని ఒత్తిడి తగ్గించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర రెవెన్యూ సంఘాల పిలుపు మేరకు కంచిలి, పలాస తహసీల్దార్ కార్యాలయాల ఎదుట మంగళవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. జాబ్ చాట్ ప్రకారం పనులు అప్పగించాలని కోరారు. శ్రావణ్ కుమార్, సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

(c) eenadu

టెక్కలి

•టెక్కలి •నరసన్నపేట •పాతపట్నం

వైద్యులతో మాట్లాడుతున్న డీసీహెచ్ఎస్ విజయలక్ష్మి

సాధారణ ప్రసవాలకే ప్రాధాన్యం

నరసన్నపేట, న్యూస్‌టుడే: ప్రభుత్వ ఆసుపత్రుల్లో సాధారణ ప్రసవాలకే ప్రాధాన్యమివ్వాలని జిల్లా ఆసుపత్రుల సమన్వయాధికారి కె.ఎన్.విజయలక్ష్మి సూచించారు. మంగళవారం స్థానిక ప్రాంతీయ ఆసుపత్రిని ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రసూతి విభాగం వైద్యులతో మాట్లాడారు. రోగులకు ఉత్తమ సేవలందించాలని సూచించారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ శ్రీనుబాబు, నిర్వహణాధికారి కాళీచరణ్ ఉన్నారు.

నులి పురుగుల నివారణతో ఆరోగ్యం

నులి పురుగుల నివారణతో ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మిద్దామని వైద్య సిబ్బంది కూటమి నాయకులు, ప్రజాప్రతినిధులు పేర్కొన్నారు. టెక్కలి, నరసన్నపేట, పాతపట్నం నియోజక వర్గాల వ్యాప్తంగా మంగళవారం ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. నులి పురుగుల వల్ల వచ్చే అనర్థాలపై అవగాహన కల్పించారు. – న్యూస్‌టుడే బృందం

నందిగాం: చిన్నారికి ఆల్బెండజోల్ మాత్ర వేస్తున్న వైద్య సిబ్బంది

మల్లన్నకు ప్రత్యేక పూజలు

టెక్కలి పట్టణం, న్యూస్‌టుడే: రావివలసలోని ఎండల మల్లికార్జున స్వామి శైవక్షేత్రంలో మహాశివరాత్రి వేడుకల్లో భాగంగా మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అష్టమూలికా జలాభిషేకాన్ని నిర్వహించారు. బుధవారం తిరువీధి, చక్రతీర్థస్నానానికి ఏర్పాట్లు చేశారు. దేవాదాయశాఖ ఈవో జి.గురునాథరావు, ఎల్.ఎల్.నాయుడు, అర్చకులు పాల్గొన్నారు.

అష్టమూలికా జలాభిషేకం నిర్వహిస్తున్న ఈవో, అర్చకులు

సంకల్పంతో మంచి ఫలితాలు

నరసన్నపేట: మాట్లాడుతున్న ప్రిన్సిపల్ ప్రవీణ

నరసన్నపేట, సారవకోట, న్యూస్‌టుడే: విద్యార్థులు సంకల్పంతో మంచి ఫలితాలు సాధించగలుగుతారని ఈదులవలస ఆదర్శ పాఠశాల ప్రిన్సిపల్ పి.ప్రవీణ అన్నారు. స్థానిక పద్మావతి జూనియర్ కళాశాలలో మంగళవారం నిర్వహించిన విద్యార్థుల వీడ్కోలు సమావేశంలో ఆమె మాట్లాడారు. కళాశాల డైరెక్టర్ దుర్గాప్రసాద్, ప్రిన్సిపల్ శ్రీనివాసరావు పాల్గొన్నారు. ★ సారవకోట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో వీడ్కోలు కార్యక్రమాన్ని సందడిగా జరిపారు. ప్రధాన అధ్యాపకుడు సునీల్‌కుమార్ ఉన్నారు.

చుక్క లేదు.. దప్పిక తీరదు..!

– న్యూస్‌టుడే, జలుమూరు, నరసన్నపేట, సారవకోట, నరసన్నపేట గ్రామీణం, పోలాకి

వేసవి వచ్చిందంటే చాలు తాగునీటి కోసం మూగజీవాలు అల్లాడి పోతుంటాయి. చాలా చోట్ల దప్పికతో పదుల సంఖ్యలో మృతి చెందుతుంటాయి. సమస్యను పరిష్కరించేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ప్రతి గ్రామంలో నీటి వసతి ఉన్న సమీపంలో తొట్టెలు నిర్మించి తాగునీరు అందించేందుకు అడుగులు వేసింది. ఆశయం బాగున్నా.. ఆచరణలో మాత్రం అధికారులు అలసత్వం వహించడంతో లక్ష్యం నీరుగారి పోయింది. పనులు పూర్తయ్యాక అంతా చేతులు దులుపుకొన్నారు. ఎక్కడా నీరు నింపిన దాఖలాలు లేవు. నరసన్నపేట నియోజకవర్గంలో పరిస్థితిపై కథనం.

చల్లవానిపేట వద్ద నిరుపయోగంగా నీటి తొట్టె

ఇదీ పరిస్థితి..

★ సారవకోట మండలం గొర్రిబంద, కొత్తూరు, వాబ, వండానవలస, జమచక్రం, కొత్తూరు, బుడితి తదితర ప్రాంతాల్లో నిర్మాణాలు అలంకారప్రాయంగా మారాయి. గొర్రిబందలో రెండు నిర్మించగా.. ఒకటి వినియోగిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

★ పోలాకి మండలం గొల్లలవలస, దీర్ఘాసి, పోలాకి, పిండ్రువాడ తదితర పంచాయతీల్లో తొట్టెలు నిర్మించినా, నీరు నింపలేదు. దీంతో నిధులు బూడిదలో పోసిన పన్నీరులా మారాయి.

★ నరసన్నపేట మండలం నడగాం, సుందరాపురం, మడపాం, కోమర్తి తదితర గ్రామాల్లో పనులు చేపట్టినా ప్రయోజనం లేకుండా పోయింది.

★ జలుమూరు మండలం రామయ్యవలస, చల్లవానిపేట, సురవరం, లింగాలవలస, పెద్దదూగాం తదితర గ్రామాల్లో తొట్టెలు నిర్మించినప్పటికీ లింగాలవలస మినహా ఎక్కడా నీరు నింపలేదు.

చర్యలు చేపడతాం

తొట్టెల పనులు పూర్తయ్యాక పంచాయతీలకు అప్పగించాం. వారు నీటిని నింపేలా చూడాలి. అవసరమైన నిధులు పంచాయతీ నుంచే ఉపయోగించుకోవాలని సూచించాం. క్షేత్రస్థాయిలో పరిశీలించి, వినియోగంలోకి తీసుకొచ్చేలా చర్యలు చేపడతాం.
– శేఖర్, యుగంధర్, రమణ, నారాయణరావు, ఏపీవోలు

వివరాలు ఇలా..

మండలం	పంచాయతీలు	నిర్మించిన తొట్టెలు	ఖర్చు చేసిన నిధులు (రూ.లక్షల్లో)
జలుమూరు	40	18	6.12
నరసన్నపేట	34	31	10.54
సారవకోట	35	24	6.59
పోలాకి	31	27	9.18

మేమున్నాం.. మీకు తోడుగా (10 AM TO 1 PM) 9441426248 8374620852

? కొత్తూరు మండలం మాతల గ్రామంలోని సాగునీటి కాలువను కొందరు ఆక్రమించి, ఇళ్ల స్థలాలుగా మారుస్తున్నారు. – గొర్లె ఫాల్గుణరావు, స్థానికుడు

★ రెవెన్యూ అధికారులను కలిసి సర్వే చేయిస్తాం. ఆక్రమణలుంటే తొలగిస్తాం. – శివరాంప్రసాద్, ఏఈ, నీటిపారుదల శాఖ, కొత్తూరు - న్యూస్‌టుడే, కొత్తూరు

? హిరమండలం మేజరు పంచాయతీలో తరచూ తాగునీటి సమస్యలు తలెత్తుతున్నాయి. రెండు రోజులుగా కుళాయిల ద్వారా నీరు సరఫరా కావడం లేదు. – నారాయణరావు, సుభలయ

★ విద్యుత్తు సరఫరాలో అంతరాయం వల్ల ఇబ్బందులు ఎదురవుతున్నాయి. చర్యలు తీసుకుంటున్నాం. – సాయిప్రసాద్, ఇన్‌ఛార్జి పంచాయతీ కార్యదర్శి, హిరమండలం - న్యూస్‌టుడే, హిరమండలం

★ నందిగాం మండలం కాపుతెంబూరు పంచాయతీ లట్టిగాం గ్రామంలో సీసీ రోడ్లు, కాలువలు లేక అవస్థలు ఎదుర్కొంటున్నాం. – దుంపల వాలి, గ్రామస్థుడు

★ సమస్యను సర్పంచి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తాం – వర్ధన్, పంచాయతీ కార్యదర్శి, కాపుతెంబూరు - న్యూస్‌టుడే, నందిగాం

రేపు అవగాహన సమావేశం

కోటబొమ్మాళి, న్యూస్‌టుడే: స్థానిక మండల పరిషత్తు సమావేశ మందిరంలో గురువారం పీఎం సూర్యఘర్ యోజనపై అవగాహన సమావేశం నిర్వహిస్తున్నట్లు టెక్కలి డివిజన్ ఏపీఈపీడీసీఎల్ ఈఈ నరసింహకుమార్ తెలిపారు. బ్యాంకర్లు, విద్యుత్తు అధికారులు, సోలార్ వెండర్లు హాజరవుతారని ఆయన పేర్కొన్నారు.

ప్రయాణం.. ఆటో.. ఇటో

తరచూ ప్రమాదాలు జరుగుతున్నా.. వాహనదారుల్లో మార్పు రావడం లేదు. లగేజీ వాహనాలు, ఆటోలపై పరిమితికి మించి సరకులు తరలిస్తున్నారు. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో యథేచ్ఛగా రాకపోకలు సాగిస్తున్నారు. కొత్తూరు నుంచి నివగాం మీదుగా ఒడిశాకు పరిమితి మించిన బరువుతో వెళ్తున్న ఆటోను చిత్రంలో చూడొచ్చు. చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. నిబంధనలు అతిక్రమిస్తే కేసులు నమోదు చేస్తామని ఎస్ఐ కె.వెంకటేశ్ చెప్పారు. – న్యూస్‌టుడే, కొత్తూరు

నాణ్యత తారుమారు..!

సారవకోట మండలం భద్రాచలం కూడలి నుంచి కిడిమి గ్రామం వరకు ఉన్న కిలోమీటరు బీటీ రోడ్డు దయనీయంగా మారడంతో రెండు నెలల కిందట మరమ్మతులు చేపట్టారు. ఇంతలోనే రహదారి నామరూపాలు కోల్పోవడంతో ప్రయాణికులు పెదవి విరుస్తున్నారు. నిర్మాణ సమయంలో పర్యవేక్షణ లోపమే కారణమని ఆరోపిస్తున్నారు. ఈ విషయమై పీఆర్ విభాగం ఏఈ లావణ్యను వివరణ కోరగా.. గుత్తేదారుతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తామన్నారు. – న్యూస్‌టుడే, సారవకోట

వాలింది.. వణికిస్తోంది

నరసన్నపేట మండలం బాలసీమలో బసివలస కూడలి వద్ద రహదారి పక్కనే విద్యుత్తు స్తంభం పక్కకు ఒరిగిపోయింది. కొన్ని నెలలుగా పరిస్థితి ఇలాగే ఉన్నా పట్టించుకునే వారే లేకుండా పోయారని ఆ మార్గంలో రాకపోకలు చేసే వారు వాపోతున్నారు. ప్రమాదం జరగక ముందే స్పందించాలని కోరుతున్నారు. ఈ విషయాన్ని ఉద్దాం విద్యుత్తు ఉపకేంద్రం ఏఈ బాలకృష్ణ వద్ద ప్రస్తావించగా.. పరిశీలించి స్తంభాన్ని సరి చేయిస్తామని తెలిపారు.
– న్యూస్‌టుడే, నరసన్నపేట గ్రామీణం

అదే పేరు.. మారని తీరు

కూటమి అధికారంలోకి వచ్చి సుమారు రెండేళ్లు పూర్తయినా పలుచోట్ల ప్రభుత్వ భవనాలపై గత ప్రభుత్వం నాటి చిత్రాలు, లోగోలు కనిపిస్తున్నాయి. హిరమండలం పరిధి రుగడ గ్రామ సచివాలయం, రైతుసేవా కేంద్రం వద్ద పాత పేర్లు, లోగోలు దర్శనమిస్తున్నాయి. ప్రభుత్వం నుంచి ఆదేశాలున్నప్పటికీ అధికారులు ఈ విషయంపై అంతగా దృష్టి సారించడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో ఆర్.కాళీప్రసాదరావు స్పష్టం చేశారు.
– న్యూస్‌టుడే, హిరమండలం

దుర్వాసన, దోమల బెడద

సారవకోట మార్కెట్ కూడలిలోని వీధి కాలువలపై పలకలు లేకపోవడంతో వ్యర్థాలు పేరుకుపోయి మురుగు దిగువకు ప్రవహించడం లేదు. దీంతో దుర్గంధం, దోమల బెడద తప్పడం లేదని స్థానికులు చెబుతున్నారు. రోగాలు ప్రబలక ముందే, కాలువలు పటిష్ఠం చేసి, సిమెంట్ పలకలు వేయాలని కోరుతున్నారు. ఈ విషయాన్ని పంచాయతీ కార్యదర్శి లక్ష్మి దృష్టికి తీసుకెళ్లగా.. సర్పంచి శంకర్‌బాబుతో మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని పేర్కొన్నారు. – న్యూస్‌టుడే, సారవకోట

జేఈఈ మెయిన్‌లో సత్తా

తల్లిదండ్రులతో అల్లు లక్ష్మీప్రసన్న

కోట్ని రుత్విక్

లాడె ఆదర్శ్

జలుమూరు, హిరమండలం, న్యూస్‌టుడే: తిమడాం గ్రామానికి చెందిన అల్లు లక్ష్మీప్రసన్న ఇటీవల విడుదలైన జేఈఈ మెయిన్ ఫలితాల్లో 99.37 పర్సంటైల్ సాధించారు. తండ్రి నర్సింహమూర్తి ప్రైవేటు ఉద్యోగి, తల్లి పార్వతి ప్రైవేటు పాఠశాలలో ఉపాధ్యాయినిగా పనిచేస్తున్నారు. ★ హిరమండలం గ్రామానికి చెందిన కోట్ని రుత్విక్ 99.55 పర్సంటైల్ సాధించారు. తండ్రి రమేష్‌కుమార్ చిరు వ్యాపారి, తల్లి సుమలత గృహిణి. ★ హిరమండలం వాసి లాడె ఆదర్శ్ 98.38 పర్సంటైల్ సాధించారు. తండ్రి కామేశ్వరరావు చిరు వ్యాపారి, తల్లి భవానీ గృహిణి. అడ్వాన్స్‌లో మంచి ర్యాంకు సాధించడమే తమ లక్ష్యమని వీరంతా పేర్కొన్నారు.

సమస్యల పరిష్కారానికి సమ్మె బాట

అల్లాడ పీఏసీఎస్ అధ్యక్షుడికి నోటీసు అందజేస్తున్న ఉద్యోగులు

జలుమూరు, న్యూస్‌టుడే: సమస్యలు పరిష్కరించాలని అల్లాడ పీఏసీఎస్ అధ్యక్షుడు వెలమల చంద్రభూషణరావుకు వ్యవసాయ పరపతి సంఘం ఉద్యోగులు మంగళవారం సమ్మె నోటీసు అందించారు. జీవో నంబరు 36 వెంటనే అమలు పరచాలని, ఉద్యోగులకు చెల్లించే గ్రాట్యుటీ నిబంధనల ప్రకారం పెంచాలని, 2019 తరువాత సహకార సంఘాల్లో చేరిన వారిని రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఈవో గిరిధర్ పాల్గొన్నారు.

ఆస్తులు ఘనం.. ఆదరణ శూన్యం

– న్యూస్‌టుడే, టెక్కలి పట్టణం

అభివృద్ధికి నోచుకోని టెక్కలిలోని లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం

టెక్కలి పట్టణ నడిబొడ్డున ఒకప్పుడు దేదీప్యమానంగా వెలిగిన లక్ష్మీనరసింహస్వామి దేవస్థానానికి నేడు కనీస ఆదరణ కరవవుతోంది. 150 ఏళ్లకు పైగా చరిత్ర, రూ.వందల కోట్ల విలువైన ఆస్తులున్నాయి. అయినప్పటికీ నిర్వహణకు నోచుకోక పూర్తిగా శిథిలావస్థకు చేరింది. దేవాదాయశాఖ, ప్రజాప్రతినిధులు చొరవ చూపి పూర్వవైభవం తీసుకురావాలని భక్తులు కోరుతున్నారు.

224.22 ఎకరాల భూములు

స్థానిక ప్రధాన రహదారిని ఆనుకుని కొండ్రవీధి, సర్వమంగళవీధి మధ్యలో ఉన్న ఈ దేవస్థానానికి టెక్కలి, నందిగాం, మెళియాపుట్టి మండలాల పరిధిలో 224.22 ఎకరాల భూములున్నాయి. టెక్కలిలో 9.85 ఎకరాల భూమి ఆర్టీసీ డిపోకు కేటాయించగా, సరిగా చెల్లింపులు జరగక మూడు దశాబ్దాలుగా కోర్టు వివాదం నడుస్తోంది. మిగిలిన చోట్ల నామమాత్రపు కౌలు మాత్రమే వసూలు చేస్తున్నారు. ఆలయానికి సంబంధించి ఆరు దుకాణాలు ఉన్నా వాటి నుంచి నెలకు రూ.11 వేలు మాత్రమే అద్దె రూపంలో సమకూరుతోంది. మరోవైపు ఫిక్స్‌డ్ డిపాజిట్లు రూ.24 లక్షలు, బ్యాంకు లాకరులో 812.980 గ్రాముల బంగారు, 7.88 కిలోల వెండి ఆభరణాలున్నాయి.

ఉన్నతాధికారులకు తెలియజేస్తాం

దేవస్థానానికి టెక్కలి పట్టణ పరిధిలోనే విలువైన ఆస్తులున్నప్పటికీ అనుకున్న స్థాయిలో ఆదాయం సమకూరడం లేదు. దీంతో మరమ్మతులు చేపట్టలేకపోతున్నాం. కొన్ని చోట్ల కోర్టు వివాదాలు నడుస్తున్నాయి. సమస్యలను ఉన్నతాధికారులకు తెలియజేస్తాం. – వి.రాధాకృష్ణ, దేవస్థాన ఈవో

అమలుకు నోచుకోని హామీలు

దేవస్థానం అభివృద్ధికి పాలకులు కొన్నేళ్లుగా హామీలివ్వడమే తప్ప అమలుకు నోచుకోవడం లేదు. ఆలయానికి మరమ్మతులు జరిపి చుట్టూ ఉన్న ప్రాంతాన్ని మాడవీధులుగా అభివృద్ధి చేస్తామని వైకాపా హయాంలో నాటి పాలకులు పేర్కొన్నారు. అడుగులు ముందుకు పడలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి దాదాపు రెండేళ్లవుతున్నా పరిస్థితి షరా మామూలే. దేవస్థానం పేరున ఉన్న ఫిక్స్‌డ్ డిపాజిట్‌ను వినియోగించుకుని సర్వశ్రేయోనిధి సమకూర్చుకుంటే అభివృద్ధికి అవకాశముంటుందని భక్తులు ఆశిస్తున్నారు. ఈ దిశగా పాలకులు చొరవ చూపాలని అంతా కోరుతున్నారు.

పెచ్చులు పడుతున్నాయి

గర్భగుడి మినహాయిస్తే మిగిలిన అన్ని చోట్లా పెచ్చులు పడుతున్నాయి. ప్రాకార మండపం గజాలు కనిపిస్తున్నాయి. వర్షం కురిస్తే పరిస్థితి మరింత అధ్వానంగా మారుతోందని భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ధ్వజస్తంభం ఎప్పుడు కూలుతుందో తెలియని పరిస్థితి. చుట్టూ ఉన్న పురాతన కట్టడాలకు కాలం చెల్లింది. అర్చకుని కుటుంబం సైతం బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లదీస్తోంది.

శిథిలావస్థలో ప్రాకార మండపం

మద్యం తాగి.. కుప్పకూలి

సూరిబాబు

హైదరాబాద్, న్యూస్‌టుడే: దుకాణంలో మద్యం కొనుగోలు చేసి తాగిన వ్యక్తి కొద్దిసేపటికే అక్కడే కుప్పకూలి మరణించిన ఘటన హైదరాబాద్‌లోని కూకట్‌పల్లి ఠాణా పరిధిలో జరిగింది. పోలీసులు, మృతుడి బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. నరసన్నపేట మండలం జగన్నాథపురం గ్రామానికి చెందిన డోలా సూరిబాబు(47) కుటుంబం కొన్నాళ్ల కిందట నగరానికి వలసొచ్చింది. మూసాపేట పరిధి జనతానగర్‌లో ఉంటున్న సూరిబాబు పెయింటింగ్ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఈయనకు మద్యం తాగే అలవాటుంది. భార్య పద్మావతి, కుమార్తెలు ఉమ, వాణి వారం క్రితం స్వగ్రామానికి వెళ్లారు. సూరిబాబు ప్రస్తుతం ఇంట్లో ఒంటరిగా ఉన్నారు. మంగళవారం ఉదయం జనతానగర్ మద్యం దుకాణానికి వెళ్లారు. తాగిన కొద్ది సేపటికే కుప్పకూలి మృతి చెందారు. పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అభివృద్ధికి నిదర్శనం బిల్‌గేట్స్ ప్రశంసలే

మాట్లాడుతున్న రాష్ట్ర కళింగ కార్పొరేషన్ ఛైర్మన్ గోవిందరాజులు, చిత్రంలో కూటమి నాయకులు

కోటబొమ్మాళి, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలో రాష్ట్ర అభివృద్ధికి గేట్స్ ఫౌండేషన్ ఛైర్మన్ బిల్‌గేట్స్ ప్రశంసలే నిదర్శనమనే విషయాన్ని వైకాపా శ్రేణులు గుర్తించాలని రాష్ట్ర కళింగ కార్పొరేషన్ ఛైర్మన్ బోయిన గోవిందరాజులు అన్నారు. స్థానిక తెదేపా కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సహకార సంఘ అధ్యక్షురాలు విజయలక్ష్మి, కొత్తమ్మతల్లి ఆలయ కమిటీ అధ్యక్షుడు చిన్నగోవిందరావు, పట్టణ తెదేపా అధ్యక్షుడు కోరాడ గోవింద పాల్గొన్నారు.

ఘనంగా ఉమాకామేశ్వరుని చక్రతీర్థ స్నానం

నరసన్నపేట గ్రామీణం, సారవకోట, న్యూస్‌టుడే: లుకులాం వంశధార నదీతీరంలో ఉమాకామేశ్వరస్వామి చక్రతీర్థస్నానోత్సవాలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కామేశ్వరపేట నుంచి స్వామివారిని ఊరేగింపుగా తీసుకొచ్చారు. రుత్వికులు నగరంపల్లి సత్యనారాయణ, సుబ్రహ్మణ్యం, సతీష్‌శర్మ ఆధ్వర్యంలో కార్యక్రమం చేపట్టారు. ఈవో పి.మాధవి, లుకులాం, కామేశ్వరపేట, ముసిడిగట్టు సర్పంచులు తవిటినాయుడు, చక్రధర్, సూరన్నాయుడు పాల్గొన్నారు. ★ సారవకోట గ్రామానికి ఆనుకొని ఉన్న కొండపై కొలువైన మండలాధీశ్వర స్వామి ఆలయ వార్షికోత్సవ ఉత్సవాలు ముగిశాయి. బుధవారం స్వామివారిని ఊరేగించి, స్థానిక శివరామపాత్రుని కోనేరులో చక్రతీర్థ స్నాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

లుకులాం వంశధార నదీతీరంలో ఉత్సవమూర్తులకు జలాభిషేకం

పక్కా భవనం నిర్మించండి

కొత్తూరు, న్యూస్‌టుడే: అబలాసింగి పాఠశాలకు పక్కా భవనం నిర్మించాలని ఎస్ఎఫ్ఐ నాయకుడు ఎస్.చిన్నారావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు సిర్ల ప్రసాదరావు కోరారు. ఈమేరకు స్థానిక తహసీల్దార్ జోగారావుకు మంగళవారం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆరు గిరిజన గ్రామాలకు ఈ ఒక్క పాఠశాలే ఉందని తెలిపారు. సమస్యను ఉన్నతాధికారులకు నివేదిస్తామని తహసీల్దార్ చెప్పారు.

తహసీల్దార్ జోగారావుకు వినతిపత్రం అందిస్తున్న ఎస్ఎఫ్ఐ, ప్రజాసంఘాల నాయకులు

రేపటి నుంచి ఆలయ ప్రారంభోత్సవాలు

సారవకోట, న్యూస్‌టుడే: తొగిరి పంచాయతీ తర్లి గ్రామంలో నిర్మించిన అభయాంజనేయ స్వామి ఆలయ ప్రారంభోత్సవాలు గురువారం నుంచి 20వ తేదీ వరకు నిర్వహించనున్నారు. మూడు రోజుల పాటు వివిధ పూజ కార్యక్రమాలు చేపడతామని నిర్వాహకులు తెలిపారు.

నకిలీ ధ్రువపత్రాలపై చర్యలు తీసుకోవాలి

సారవకోట, న్యూస్‌టుడే: కొత్తూరు మండలం లబ్బ పంచాయతీ కారిగూడ బాలికల ఆశ్రమ పాఠశాలలో నకిలీ ధ్రువపత్రాలతో ఇద్దరు మహిళలు సీఆర్టీలుగా పనిచేశారని, వీరిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని గిరిజన ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు చౌదరి లక్ష్మీనారాయణ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ప్రకటన విడుదల చేశారు. దీనిపై 10 నెలల కిందట ఐక్యవేదిక తరఫున కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. అధికారులు విచారణ జరిపి, వారిని తొలగించారని పేర్కొన్నారు. సదరు వ్యక్తులపై చీటింగ్ కేసు నమోదు చేసి, జీతాన్ని రికవరీ చేయాలన్నారు.

కేంద్రమంత్రి దృష్టికి సమస్యలు

రామ్మోహన్‌నాయుడితో మాట్లాడుతున్న జడ్పీటీసీ సభ్యుడు బుచ్చిబాబు, తెదేపా నాయకులు

హిరమండలం, న్యూస్‌టుడే: హిరమండలం అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని జడ్పీటీసీ సభ్యుడు పి.బుచ్చిబాబు కోరారు. మంగళవారం ఆయన తెదేపా నాయకులతో కలిసి కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడిని కలిసి మండల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు వివరించారు. మండల కేంద్రంతో అనుసంధానంగా ఉన్న రహదారులు విస్తరణ, పర్యాటక పార్కు, గొట్టాబ్యారేజీకి కొత్త వంతెన నిర్మాణానికి కృషి చేయాలన్నారు. పీఏసీఎస్ అధ్యక్షుడు గోళ్ల సింహాచలం, తెదేపా నాయకులు ఎస్.గోవిందరావు, సీహెచ్.రామారావు, బి.సురేష్, డి.వెంకటరావు, బి.అప్పన్న పాల్గొన్నారు.

కళ్లద్దాల పంపిణీ

హిరమండలం, న్యూస్‌టుడే: మండలంలోని పలు ప్రభుత్వ ఉన్నత పాఠశాలల విద్యార్థులకు మంగళవారం నేత్ర వైద్యాధికారి ఐ.జానకిరామయ్య కళ్లద్దాలు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ గతంలో జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో పిల్లలకు కంటి పరీక్షలు చేశామన్నారు. అవసరమైన వారికి ప్రభుత్వం కళ్లద్దాలు మంజూరు చేయగా.. హిరమండలంలో 21 మందికి, అవలంగిలో 9, తంప గ్రామంలో ఆరుగురికి అందజేశామన్నారు.

హెచ్చరిక బోర్డు ఏర్పాటు

పాతపట్నం, న్యూస్‌టుడే: పాతపట్నం మేజర్ పంచాయతీ పరిధిలోని ప్రభుత్వ స్థలం ఆక్రమణకు గురైంది. పిల్లివీధి దిగువున ఉన్న 1.20 ఎకరాల్లో అక్రమార్కులు లేఅవుట్లు వేసి విక్రయించేందుకు చర్యలు చేపట్టారు. దీనిపై ఆర్డీవోకు ఫిర్యాదులు అందడంతో పంచాయతీ కార్యదర్శి రామచంద్రరావు మంగళవారం క్షేత్ర స్థాయిలో పరిశీలించి గ్రామకంఠంగా నిర్ధారించి ప్రభుత్వ భూమి అని బోర్డును ఏర్పాటు చేశారు. నిర్మాణాలు చేపడితే చర్యలు తీసుకుంటామన్నారు.

పని ఒత్తిడితో ఇబ్బందులు

కోటబొమ్మాళిలో నిరసన తెలుపుతున్న రెవెన్యూ ఉద్యోగులు

కోటబొమ్మాళి, నరసన్నపేట, పాతపట్నం, న్యూస్‌టుడే: పని ఒత్తిడి తగ్గించాలని కోరుతూ గ్రామ రెవెన్యూ అధికారులు, సిబ్బంది మంగళవారం నల్ల బ్యాడ్జీలు ధరించి కోటబొమ్మాళి తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. సెలవు రోజుల్లో విధులకు రావాలని ఒత్తిడి చేయడం తగదని నినాదాలు చేశారు. ఏఎస్‌వో రవిబాబు, సీనియర్ సహాయకుడు ఆదిబాబు పాల్గొన్నారు. ★ నరసన్నపేటలో వీఆర్వోల సంఘ ప్రతినిధి జె.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నిరసన జరిగింది. ★ పాతపట్నం తహసీల్దార్ కార్యాలయం వద్ద రెవెన్యూ సిబ్బంది ఆందోళన చేపట్టారు. మండలాధ్యక్షుడు మురళీకృష్ణనాయుడు ఉన్నారు.

అందుబాటులోకి డిగ్రీ కోర్సులు

కోటబొమ్మాళి, న్యూస్‌టుడే: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో రానున్న విద్యా సంవత్సరం నుంచి డిగ్రీ తరగతులు నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో బీఎస్సీ కంప్యూటర్ సైన్సు, బీఎస్సీ (జంతుశాస్త్రం), బీఏ (ఎకనామిక్స్), బీకాం (కంప్యూటర్ అప్లికేషన్) కోర్సులు అందుబాటులోకి రానున్నట్లు ఇన్‌ఛార్జి (టెక్కలి) ప్రిన్సిపల్ టి.గోవిందమ్మ తెలిపారు. ప్రతి సబ్జెక్టుకు 40 వరకు సీట్లు ఉన్నాయని చెప్పారు.

స్వచ్ఛ రథం సేవలు వినియోగించుకోండి

పోలాకి, ఎల్ఎన్‌పేట, న్యూస్‌టుడే: పల్లెలు శుభ్రంగా ఉండాలనే సంకల్పంతో ప్రభుత్వం కేటాయించిన స్వచ్ఛ రథాన్ని వినియోగించుకోవాలని తెదేపా నియోజకవర్గ కన్వీనర్ బగ్గు అర్చన కోరారు. మంగళవారం మబగాంలో వాహనాన్ని ఆమె ప్రారంభించారు. పంచాయతీ కార్యదర్శి శోభారాణి పాల్గొన్నారు. ★ ఎల్ఎన్‌పేట మండలంలో అన్ని పంచాయతీల్లో స్వచ్ఛ రథం నిర్వహణ నిమిత్తం ఈనెల 19న మండల పరిషత్తు కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో పైడి శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఈ మేరకు ప్రకటన విడుదల చేశారు.

కర్లెమ్మలో యాదవుల సంబరం

కొత్తూరు, న్యూస్‌టుడే: కర్లెమ్మలో యాదవుల సంబరాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. కులదైవానికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం తప్పెటగుళ్లు, నృత్యాలతో దేవతామూర్తిని ఊరేగింపుగా చెరువు వద్దకు తీసుకెళ్లి మొక్కులు చెల్లించుకున్నారు.

కొమ్మలగూడలో అవగాహన కార్యక్రమం

పాతపట్నం, న్యూస్‌టుడే: ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని బ్రెడ్స్ స్వచ్ఛంద సంస్థ సమన్వయకర్త జి.వి.రమణ అన్నారు. కొమ్మలగూడ రిసోర్స్ భవనంలో సమీప గ్రామాల గిరిజన ప్రజలకు మంగళవారం అవగాహన కల్పించారు.

పౌష్టికాహారంతో ఆరోగ్యం

నందిగాం, న్యూస్‌టుడే: పౌష్టికాహారం తీసుకొని ఆరోగ్యంగా ఉండాలని ఏపీఎం మనోరత్నం అన్నారు. స్థానిక వెలుగు కార్యాలయంలో మంగళవారం మహిళా సంఘ సభ్యులకు, సీఏలకు ఆహారం పోషణ, ఆరోగ్యంపై ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం జరిగింది.

పారిశుద్ధ్యానికి తొలి ప్రాధాన్యం

ఎల్ఎన్‌పేట, న్యూస్‌టుడే: గ్రామాల్లో పారిశుద్ధ్యానికి తొలి ప్రాధాన్యమివ్వాలని అధికారులు, ప్రజాప్రతినిధులు పేర్కొన్నారు. మండల పరిషత్తు ఆవరణలో 22 పంచాయతీలకు సంబంధించిన చెత్త సేకరణ రిక్షాలను మంగళవారం పంపిణీ చేశారు. ఎంపీడీవో శ్రీనివాసరావు పాల్గొన్నారు.

(c) eenadu

డెక్క.. అందని నీటి చుక్క

సరుబుజ్జిలి మండలంలోని పురుషోత్తపురం గ్రామానికి సమీపంలో ఉన్న అవధాన్ల చెరువులో గుర్రపుడెక్క పేరుకుపోయింది. వంశధార వరదలు, వర్షాలు సమయాల్లో చెరువులోని డెక్క పొలాల్లోకి చేరి పంటలు దెబ్బతింటున్నాయని కర్షకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయాన్ని నీటి పారుదల ఏఈ దాలయ్య వద్ద ప్రస్తావించగా డెక్క తొలగిస్తామని తెలిపారు. –న్యూస్‌టుడే, సరుబుజ్జిలి

శ్రీకాకుళం
•శ్రీకాకుళం •ఆమదాలవలస •ఎచ్చెర్ల

★ సరస్వతి: ఫంకీ ★ ఎస్వీసీ(రామలక్ష్మణ): మన శంకర వరప్రసాద్ గారు ★ సమ్మక్క సీతా పయనం ★ మారుతి : నారీ నారీ నడుమ మురారి ★ కిన్నెర: విత్ లవ్ ★ కీర్తన: భర్త మహాశయులకు విజ్ఞప్తి ★ సూర్యమహల్: కపుల్ ఫ్రెండ్లీ – న్యూస్‌టుడే, పాతబస్టాండ్

మేమున్నాం.. మీకు తోడుగా

(10 AM TO 1 PM) 9502198883 8008552704

మీ ప్రాంతంలో ఏ ప్రజాసమస్యనైనా పరిష్కరించే క్రమంలో 'ఈనాడు' మీకు తోడుగా ఉంటుంది. వివరాలు, చిత్రాలను వాట్సప్ ద్వారా పంపొచ్చు. లేదా ఫోన్ చేసి వివరించొచ్చు. వాటిని బాధ్యుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తాం.

?: బూర్జ దేవర వీధిలో మురుగునీటి కాలువలు గట్టుతో నిండిపోయాయి. -స్థానికుడు, బూర్జ ✦ సమస్య పరిష్కరిస్తాం. బి.కిరణ్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి, బూర్జ

?: మామిడి వలసలో కాలువలు లేక మురుగు రహదారిపై ప్రవహిస్తోంది. -స్థానికుడు, మామిడివలస ✦ నిర్మాణానికి చర్యలు తీసుకుంటాం. -ఆర్.తిరుపతిరావు, ఎంపీడీవో, బూర్జ

?: ఆమదాలవలస పట్టణంలోని ప్రధాన రహదారిలో ఇష్టానుసారంగా ఆటోలు నిలపడంతో ట్రాఫిక్‌తో ఇబ్బందులు పడుతున్నారు. శ్రీను, స్థానికుడు.. ✦ చర్యలు తీసుకుంటాం. బాలరాజు, ఎస్సై, ఆమదాలవలస

?: నాదనపుగనిలో రోజూ తాగునీరు ట్యాంకర్ రావడం లేదు. రమణ, స్థానికుడు ✦ రోజూ వచ్చేలా ఏర్పాట్లు చేస్తాం. జాన్సన్, మున్సిపల్ ఏఈ, ఆమదాలవలస

న్యూస్‌టుడే, ఆమదాలవలస పట్టణం

మిస్టర్ ఆంధ్ర పోటీలకు ఎంపిక

రాష్ట్ర స్థాయి శారీరక దారుఢ్య పోటీల్లో పాల్గొనే బాడీ బిల్డర్ల ఎంపిక మంగళవారం శ్రీకాకుళం నగరంలోని కోడిరామ్మూర్తి మైదానంలో నిర్వహించారు. వివిధ కేటగిరీల్లో ఎస్.వంశీరెడ్డి, వి.ఉదయ్‌కిరణ్, పి.ధనరాజ్, ఇబ్రహీం, కె.విష్ణువర్ధన్, ఆర్.ఢిల్లీశ్వరరావు, మాస్టర్స్ విభాగంలో కె.గౌరీశంకర్ ఎంపికయ్యారు. ఆంధ్ర బాడీ బిల్డర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 23 నుంచి విశాఖపట్నంలో మిస్టర్ ఆంధ్ర పోటీలు నిర్వహించనున్నారు. స్టార్ బాడీ బిల్డర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వి.విజయ్‌కుమార్, ఆంధ్ర బాడీ బిల్లర్స్ అసోసియేషన్ సభ్యులు టి.జీవన్, బి.ప్రసాద్ వారిని అభినందించారు.

– న్యూస్‌టుడే, పాతబస్టాండ్

నగరపాలక సంస్థ ఇన్‌ఛార్జి ఈఈగా కమలాకర్

శ్రీకాకుళం నగరం, న్యూస్‌టుడే: శ్రీకాకుళం నగరపాలక సంస్థ డీఈ పి.కమలాకర్‌కు ఈఈగా ప్రభుత్వం అదనపు బాధ్యతలు అప్పగించింది. ఇక్కడ ఈఈగా విధులు నిర్వహిస్తున్న బి.శ్రీనివాసరావు దీర్ఘకాలిక సెలవులో ఉండటంతో ఆయన స్థానంలో కమలాకర్‌ను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

ఇది తోటపల్లి కాలువే..!

రణస్థలం మండలంలోని బావరాజుపాలెం వద్ద తోటపల్లి కాలువల్లో పనికిరాని మొక్కలు, పొదలు ఏపుగా పెరిగాయి. కొన్నేళ్లుగా మరమ్మతులకు నోచుకోక కాలువలు పూడికపోయి నీరు నిలిచిపోతోందని రైతులు వాపోతున్నారు. ఈ ఏడాదైనా వాటిని తొలగించి సాగునీరందించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఈ విషయాన్ని తోటపల్లి డీఈ లావణ్య దృష్టికి తీసుకెళ్లగా కేడ్‌వామ్ ప్రాజెక్టు కింద ప్రతిపాదనలు పంపాం నిధులు మంజూరైన వెంటనే చర్యలు చేపడతామన్నారు. – న్యూస్‌టుడే, రణస్థలం

అభివృద్ధి పనులు.. పల్లెల్లో మార్పులు..!

–న్యూస్‌టుడే, ఆమదాలవలస పట్టణం

★ దశాబ్దాల నుంచి సరైన రహదారులు, కాలువలు లేకపోవడంతో పట్టణ, పల్లె ప్రాంతాల ప్రజలు అవస్థలు పడుతూ ఇంటికి చేరుకునే పరిస్థితులు ఉండేవి. కూటమి అధికారం చేపట్టిన తరువాత రెండేళ్లలో పెనుమార్పులు చోటు చేసుకున్నాయి. ఎక్కడికక్కడ సీసీ, బీటీ రహదారుల నిర్మాణం చేపట్టడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

★ ఆమదాలవలస నియోజకవర్గంలోని సుమారు 406.95 కోట్లతో పనులు జరుగుతున్నాయి. ఇప్పటికే కొన్ని పూర్తయ్యాయి. ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులతో ఆర్‌డబ్ల్యూఎస్ కాలువలు, ఆర్ అండ్ బీ రహదారులు, ఇరిగేషన్ పనులు, ఆమదాలవలస పట్టణంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల అదనపు భవన నిర్మాణం, పుర పరిధిలోని 23 వార్డులకు తాగునీటి సరఫరా, గిరిజన సంక్షేమ బాలికల ఉన్నత పాఠశాల ఏర్పాటు, అటవీ గ్రామాలకు రహదారులు,

కనుగులవలస గ్రామంలో నూతనంగా నిర్మించిన సీసీ రహదారి

వంశధార ఆధునికీకరణ, అక్విడక్టు-కొత్తూరు రోడ్డులో అండర్‌డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు, పొందూరు-శ్రీకాకుళం రోడ్డులో ప్రహరీ నిర్మాణం ఇలా పలు అభివృద్ధి పనులు జరుగుతున్నాయి.

★ ఆమదాలవలస నియోజకవర్గంలో ఆమదాలవలస, పొందూరు, సరుబుజ్జిలి, బూర్జ మండలాల్లో 110 గ్రామాలతో పాటు పుర పరిధిలో 23 వార్డుల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. ఆమదాలవలస పట్టణంలో సుమారు 90 ఎకరాల విస్తీర్ణంలో పెద్ద చెరువును పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దనున్నట్లు చెప్పారు.

భవనానికి గ్రహణం..!

పొందూరు మండలం నందివాడ గ్రామ పంచాయతీ పరిధిలోని ప్రభుత్వ హయాంలో నిర్మించిన ఆరోగ్య కేంద్రం పనులు పునాదుల దశలోనే నిలిచిపోయాయి. దీంతో ఆ ప్రాంత ప్రజలకు వైద్యం దూరమైంది. అనారోగ్యం చెందితే మండల కేంద్రాలకు వెళ్లాల్సి వస్తోందని, ప్రభుత్వం భవనం పూర్తిచేయాలని గ్రామస్థులు కోరుతున్నారు. ఎంపీడీవో వాసుదేవరావు వద్ద ప్రస్తావించగా పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు.

–న్యూస్‌టుడే, పొందూరు గ్రామీణం

పనికిరాని మొక్కలు.. ప్రజలకు పాట్లు

సరుబుజ్జిలి మండలంలోని సుబ్బపేట-ఇస్కలపాలెం గ్రామాల మధ్య రహదారిలో ఇరువైపులా పనికిరాని మొక్కలు పెరిగాయి. విషసర్పాలు, అడవి పందుల భయం వెంటాడుతోందని ఆయా ప్రాంతాల ప్రజలు వాపోతున్నారు. జంగిల్ క్లియరెన్స్ చేపట్టాలని కోరుతున్నారు. ఆర్‌అండ్‌బీ జేఈ అంజనేయనాయక్ వద్ద ప్రస్తావించగా తొలగిస్తామన్నారు.

–న్యూస్‌టుడే, సరుబుజ్జిలి

మురుగు తిష్ఠ.. దోమల బెడద

పొందూరు మండలం కేశవదాసుపురం గ్రామంలో మురుగు కాలువలు అధ్వానంగా తయారయ్యాయి. మురుగు నిలిచిపోయి దుర్వాసన వెదజల్లుతోంది. రాత్రివేళ దోమల బెడద అధికంగా ఉంటోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎంపీడీవో వాసుదేవరావు వద్ద ప్రస్తావించగా సమస్య పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

- న్యూస్‌టుడే, పొందూరు గ్రామీణం

అమ్మో.. ఎప్పుడు కూలుతుందో..!

శ్రీకాకుళం గ్రామీణ మండలం కనుగులవానిపేటలో తుపాను రక్షిత భవనం ప్రమాదకరంగా మారింది. ఎప్పుడు కూలుతుందోనని స్థానికులు భయాందోళనలకు గురవుతున్నారు. భారీ వర్షాల సమయంలో అవస్థలు తప్పడం లేదు. ఈ విషయమై తహసీల్దారు శిర్ల గణపతిని 'న్యూస్‌టుడే' సంప్రదించగా పరిశీలించి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

– న్యూస్‌టుడే, శ్రీకాకుళం గ్రామీణం

విద్యార్థుల్లో నైపుణ్యాన్ని గుర్తించండి

విద్యార్థి తయారు చేస్తున్న మట్టికుండను పరిశీలిస్తున్న యశోధ లక్ష్మి

బూర్జ, న్యూస్‌టుడే: ప్రతి విద్యార్థిలో నైపుణ్యాన్ని గుర్తించి ఉత్తమంగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని గురుకులాల జిల్లా సమన్వయకర్త వై.యశోధ లక్ష్మీ పేర్కొన్నారు. కొల్లివలస గురుకుల ప్రధానాచార్యుడు ఎన్.రామకృష్ణ ఆధ్వర్యంలో మంగళవారం ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా ఆమె పాల్గొని, ప్రారంభించారు. విద్యార్థులు ఆర్ట్ అండ్ పెయింటింగ్, కలంకారీ ప్రదర్శనలు చూసి మెచ్చుకున్నారు.

బాలుడిని గుర్తిస్తే వివరాలు తెలపండి

సోయల్ (అధికారులు తెలిపిన పేరు)

పాతబస్టాండ్, న్యూస్‌టుడే: శ్రీకాకుళం నగరంలోని శాంతా కల్యాణ్ అనురాగ నిలయంలో ఆశ్రయం పొందుతున్న బాలుడిని గుర్తించిన వారు వివరాలు తెలియజేయాలని జిల్లా బాలల రక్షణ అధికారి కేవీ రమణ మంగళవారం తెలిపారు. తన పేరు సోయల్, సెంతిఎరాసియాగా చెబుతున్న ఈ బాలుడు 2023 సెప్టెంబరు 25న చెన్నై రైల్వే స్టేషన్‌లో పోలీసులకు దొరికాడు. అక్కడి రైల్వే పోలీసులు నార్త్ జోన్ బాలల సంక్షేమ సమితికి అప్పగించగా విచారించిన అధికారులు శ్రీకాకుళం అని భావించి విశాఖపట్నం కార్యాలయానికి చేర్చారు. అక్కడి నుంచి 2024 ఫిబ్రవరి 27న శ్రీకాకుళం బాలల సంక్షేమ సమితికి పంపారు. అప్పటి నుంచి గుర్తించడానికి కౌన్సెలింగ్ చేసినా వివరాలు చెప్పలేకపోతున్నాడు. ప్రస్తుతం విశాఖలోని ప్రభుత్వ బాలల సంక్షేమ సమితి కార్యాలయంలోని బాలుర రక్షిత గృహంలో ఉన్నాడు. వివరాలు తెలిసిన బంధువులు, తల్లిదండ్రులు తగిన ఆధారాలతో సహా కార్యాలయానికి వస్తే అప్పగించనున్నట్లు పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 94400 30230, 99896 34481కు ఫోన్ చేయాలని సూచించారు.

చేనేత సంఘాల బకాయిలు చెల్లించండి

శ్రీకాకుళం అర్బన్, న్యూస్‌టుడే: రాష్ట్రవ్యాప్తంగా చేనేత సంఘాలకు ప్రభుత్వం చెల్లించాల్సిన రూ.203 కోట్ల బకాయిలు వెంటనే విడుదల చేసి కార్మికులను ఆదుకోవాలని చేనేత సలహా మండలి మాజీ సభ్యుడు మంచు కృష్ణారావు కోరారు. అమరావతిలో మంగళవారం మంత్రులు అచ్చెన్నాయుడు, లోకేశ్, సవితను కలిసి వినతిపత్రాలు అందజేశారు. జీఎస్టీ 5 శాతం అమలు, ఏడాదికి రూ.25 వేలు ఆర్థిక సాయం, 50 ఏళ్లు దాటిన చేనేత కార్మికులకు పింఛను వంటి సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఈ నెల 22న నిర్వహించనున్న చేనేత గర్జనకు ముందే ఆయా అంశాలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లాలని విజ్ఞప్తి చేశారు.

జేఈఈ మెయిన్‌లో సత్తా

టి.ప్రియూష సుకృత వర్షిణి | పి.దినేష్ | ఎన్.రోషన్ రామ్ | బరాటం హాసిని | మజ్జి జ్యోతిష్‌కుమార్ | మజ్జి యామిని

కలెక్టరేట్(శ్రీకాకుళం), గార (శ్రీకూర్మం), ఎచ్చెర్ల, న్యూస్‌టుడే: జేఈఈ మెయిన్‌లో పలువురు విద్యార్థులు సత్తా చాటారు. ఉత్తమ పర్సంటైల్ సాధించి అడ్వాన్స్ పరీక్షకు అర్హత సాధించారు.

★ జి.సిగడాం మండలం టంకాల దిగ్గువలస గ్రామానికి చెందిన టంకాల విజయ్‌కుమార్, భారతి దంపతుల కుమార్తె ప్రియూష సుకృత వర్షిణి 99.82, టెక్కలి మండలం ధర్మనీలాపురం గ్రామానికి చెందిన లక్ష్మీపతి, నిర్మల దంపతుల కుమారుడు పి.దినేష్ 99.90, శ్రీకాకుళం నగరానికి చెందిన మహేశ్వరరావు, అరుణకుమారి దంపతుల కుమారుడు రోషణ్ రామ్ 99.63 పర్సంటైల్ సాధించారు.

★ గార మండలం శ్రీకూర్మం మాజీ సర్పంచి బరాటం రామశేషు కుమార్తె హాసిని 99.51 పర్సంటైల్ సాధించింది.

★ ఎచ్చెర్ల మండలం కొయ్యాం గ్రామానికి చెందిన మజ్జి జ్యోతిష్‌కుమార్ 99.56, మజ్జి యామిని 99.15 పర్సంటైల్ సాధించారు. శ్రీచైతన్య విద్యార్థులు ఉత్తమ పర్సంటైల్‌ను సాధించారని డీన్ కె.మురళీధర్, ఏజీఎం పి.నర్సునాయుడు తెలిపారు. ఎన్.రోషన్‌రామ్ 99.63, రాజేష్ 99.03 పర్సంటైల్ సాధించారని తెలిపారు.

★ పి.సాయికృష్ణ 96.17, కె.నవనీత 95.43, వి.గాయత్రీలక్ష్మి 92.38 సాధించారని శ్రీ ఆదిత్య జూనియర్ కళాశాల డైరెక్టర్ బీఎస్ చక్రవర్తి, ప్రిన్సిపల్ ఢిల్లీశ్వరరావు తెలిపారు.

కనకదుర్గమ్మ సేవలో ఎమ్మెల్యే శంకర్

విజయవాడలో కొలువైన కనకదుర్గ అమ్మవారిని మంగళవారం శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ దంపతులు దర్శించుకున్నారు. ప్రత్యేక పూజల అనంతరం అర్చకులు వేదాశీర్వచనం పలికి ప్రసాదాలు అందజేశారు.

– న్యూస్‌టుడే, కలెక్టరేట్(శ్రీకాకుళం)

కూరగాయల ధరలు

★ టమాటాలు 12 ★ వంకాయలు 20/36 ★ బెండ 44★ పచ్చిమిర్చి 68 ★ కాకర 40 ★ బీర 46 ★ కాలీఫ్లవర్ 15/20 ★ క్యాబేజీ బుట్ట 20 ★ క్యారెట్ 30 ★ దొండ 36 ★ బంగాళదుంపలు 18 ★ ఉల్లిపాయలు 20/24 ★ గోరుచిక్కుడు 40 ★ ఆనప 16

–న్యూస్‌టుడే, కలెక్టరేట్(శ్రీకాకుళం)

ఉమాజఠలేశ్వరస్వామికి త్రిశూల స్నానం

మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా పాతశ్రీకాకుళం పరిధి నక్క వీధిలో కొలువైన ఉమాజఠలేశ్వర స్వామి ఉత్సవ మూర్తులను మంగళవారం మేళతాళాలతో ఊరేగించారు. నాగావళి నదిలో త్రిశూల స్నానం అనంతరం ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు భారీగా పాల్గొన్నారు.– న్యూస్‌టుడే, శ్రీకాకుళం సాంస్కృతికం

తీరిన సమస్య..!

స్పందనకు వందనం

జి.సిగడాం, న్యూస్‌టుడే: జి.సిగడాం మండలం పెంట గ్రామం దిగువ వీధిలోని తాగునీటి బోరు వారం రోజులు కిందట మరమ్మతులకు గురైంది. ఈ నెల 17వ తేదీన 'బోరు..మారని తీరు..!' శీర్షికతో 'ఈనాడు'లో వచ్చిన కథనానికి అధికారులు స్పందించి, బాగు చేశారు.

ఆదిత్యాలయంలో నిత్యాన్నదానానికి విరాళం

శ్రీకాకుళం నగరం: అరసవల్లిలో కొలువైన సూర్యనారాయణస్వామి ఆలయంలో నిత్యాన్నదాన పథకానికి విశాఖపట్నానికి చెందిన మణికేశ్వరి రూ.1,11,116 విరాళంగా అందజేశారు. ఆదిత్యాలయంలో మంగళవారం పూజల అనంతరం ఈవో కేఎన్‌వీడీ ప్రసాద్‌ను ఆయన కార్యాలయంలో కలిసి చెక్కు ఇచ్చారు. అర్చకులు వేదాశీర్వచనం పలికి ప్రసాదాలు అందజేశారు. ఈవో ఆదిత్యుని చిత్రపటాన్ని బహూకరించారు.

మంచు కురుస్తోంది.. జాగ్రత్తగా నడపండి

సరుబుజ్జిలి, న్యూస్‌టుడే: సరుబుజ్జిలి మండలంలోని తెల్లవారు జామున దట్టంగా కురుస్తున్న మంచు వల్ల ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయని, వాహనాలు జాగ్రత్తగా నడపాలని సరుబుజ్జిలి ఎస్సై బి.హైమావతి అన్నారు. వాహనాలు నడిపేటప్పుడు లైట్లు వేసుకోవాలన్నారు.

అవయవదానంపై అవగాహన

శిక్షణలో పాల్గొన్న విద్యార్థులు, గ్రామస్థులు

పొందూరు గ్రామీణం, న్యూస్‌టుడే: పొందూరు మండలం పుల్లాజీపేట గ్రామంలో గత ఆరు రోజులుగా పొందూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక శిబిరం మంగళవారం ముగిసింది. జనవిజ్ఞాన వేదిక అవయవదానం సంఘం సభ్యులు శివాజీ, దప్పు శీను తదితరులు పాల్గొని అవయవ దానంపై ఆవశ్యకత, మూఢ నమ్మకాలపై అవగాహన కలిగించారు. అనంతరం మొక్కలు నాటారు. కార్యక్రమంలో శ్రీకాకుళం జిల్లా ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త వనజ తదితరులు పాల్గొన్నారు.

సాంకేతిక సమస్యలు.. భారంగా వసూళ్లు..!

– న్యూస్‌టుడే, గార

గ్రామ పంచాయతీలకు ప్రధాన ఆదాయ వనరు ఇంటిపన్ను.. ప్రభుత్వం నుంచి వచ్చే నిధులు కోసం ఎదురు చూడకుండా పనులు ఈ నిధులతో చేపడతారు. గతంలో పన్ను వసూలు చేసి పంచాయతీ కార్యదర్శులు నగదు తీసుకొని రసీదు అందజేసేవారు. ఆ సమయంలో కొంత అవకతవకలు జరిగేవి. కూటమి ప్రభుత్వం స్వర్ణ పంచాయతీలు పేరిట ఆన్‌లైన్ చెల్లింపు విధానాన్ని ప్రవేశపెట్టింది. క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి ఆన్‌లైన్‌లో నేరుగా పన్ను కట్టేయొచ్చు.

★ ప్రభుత్వం స్వర్ణ పంచాయతీ యాప్ ప్రారంభించినా.. పన్ను చెల్లించే క్రమంలో సాంకేతిక సమస్యలు వెంటాడుతున్నాయి. గృహాల వారీగా వివరాలు నమోదు అనంతరం క్యూఆర్ కోడ్ స్కాన్ చేసిన సమయంలో లావాదేవీలు విఫలమవుతున్నాయి. దీంతో 24 గంటల ఆగి.. మళ్లీ స్కాన్ చేయాల్సి వస్తోంది. యాప్‌లో కడితే పన్ను మొత్తానికి తక్షణమే చరవాణికి రసీదు సంక్షిప్త సమాచార రూపంలో వస్తుంది. కానీ చెల్లింపుదారు స్పష్టత కోసం ఉన్నతాధికారులు వద్దంటున్నా కార్యదర్శులు రసీదు రూపంలో అందజేస్తున్నారు. దీనికి తోడు గత ప్రభుత్వ పాలనలో పన్ను వసూలుపై దృష్టి సారించకపోవడంతో బకాయిలు పేరుకుపోయాయని, వాటి వసూలు భారంగా మారిందని సిబ్బంది వాపోతున్నారు.



తంగుళ్లపేటలో ఇంటి పన్ను వసూలు చేస్తున్న సిబ్బంది

'సాంకేతిక సమస్యలను పరిష్కరిస్తాం. బకాయిల వసూలుకు చర్యలు తీసుకుంటున్నాం. ఇప్పటికే లక్ష్యంలో 50 శాతం పూర్తయింది. మార్చి చివరి నాటికి అనుకున్నది సాధిస్తాం. త్వరలో గ్రామాల్లో అవగాహన కల్పిస్తాం' అని శ్రీకాకుళం డీఎల్పీవో గోపీ బాల తెలిపారు.

★ శ్రీకాకుళం డివిజన్ పరిధి గార, శ్రీకాకుళం, ఎచ్చెర్ల, రణస్థలం, లావేరు, నరసన్నపేట, పోలాకి, ఆమదాలవలస, జలుమూరు, సరుబుజ్జిలి, పొందూరు, జి.సిగడాం, బూర్జ పంచాయతీల్లో బకాయిల వివరాలు ఇలా..

చెల్లించాల్సిన పన్ను	వసూలైన మొత్తం
రూ. 13,48,54,000	రూ. 7,62,23,000



అమృతమూర్తికి అశ్రునివాళి

మంచికి మారుపేరు, ఆదర్శప్రాయులు, కుటుంబ శ్రేయస్సుకు శ్రమించి మా హృదయాలలో సుస్థిర స్థానం పొందిన మీ మరణం మాకు తీరని లోటు. మీ పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తూ..

కీ॥శే॥ దుర్గమహంతి శ్రీనివాసరావు గారు
రిటైర్డ్ గ్రేడ్-I, ఛార్జిమెన్, Rly.
బలిజేపల్లివారి వీధి, శ్రీకాకుళం
జననం : 1933 మరణం : 08-02-2026

కుమారులు - కోడళ్లు
దుర్గమహంతి వెంకటరమణ - లక్ష్మి
దుర్గమహంతి రామారావు (జర్నలిస్ట్) - చిన్నారి
మనుమరాండ్రు - వారి భర్తలు
డి.పద్మలత - మెహెర్‌హరీష్
కె.శేతుమాధవి - అభిషేక్‌పట్నాయక్
డి.దివ్యజ్యోతి - జగదీష్
ఆర్.సాయిలక్ష్మి - రామ్మోహన్‌పట్నాయక్
మునిమనుమరాలు : రాజ్వీమెహెర్
కుమార్తె - అల్లుడు: వి.నాగమణి - (లేటు) వి.ఎ.వి.సింహగిరి
మనుమలు: వి.బాలాజీ, వి.నాగరాజు
కుటుంబ సభ్యులు మరియు బంధుమిత్రులు

పెద్దకర్మ : తేది: 18-02-2026ది బుధవారం శ్రీకూర్మంలో జరుపబడును సెల్ : 7032198574

అమృతమూర్తికి అశ్రుతాంజలి

మంచికి మారుపేరు, ఆదర్శప్రాయులు, కుటుంబ ఉన్నతికి శ్రమించి మా అందరి హృదయాలలో సుస్థిర స్థానం పొందిన మీ మరణం మాకు తీరని లోటు, మీ పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని భగవంతుని ప్రార్థిస్తూ...

కీ॥శే॥ తమ్మినేని నీలయ్య గారు
తోలాపి గ్రామం, పొందూరు (మం)
జననం: 1949 మరణం: 06-02-2026

భార్య: శ్రీమతి కళావతి
మామయ్య - అత్తయ్య
కీ॥శే॥ పొన్నాడ అప్పారావు మాస్టారు - సూరమ్మ

కుమారుడు - కోడలు
పాండురంగారావు - పుష్పలత
మనమళ్లు: శరత్‌చంద్ర, సాత్విక్
కుమార్తెలు - అల్లుళ్లు
గురుగుబెల్లి రాధ - పాపారావు
దుంపల లలిత - ప్రభాకరరావు
బావమరుదులు - వారి భార్యలు
పొన్నాడ రంగారావు - అనసూయ
పొన్నాడ చిట్టిబాబు - జయలక్ష్మి
పొన్నాడ రామినాయుడు - భారతి
తోటల్లుళ్లు - వారి భార్యలు
కీ॥శే॥ డా॥ సనపల విజయ భాస్కరరావు - అరుణ
తమ్మినేని వేణుగోపాలరావు - వెంకటలక్ష్మి

పెద్దకర్మ: తేది:18-02-2026 బుధవారం నాడు, తోలాపి గ్రామంలో మా స్వగృహమునందు జరుపబడును.

అమృతమూర్తికి అశ్రునివాళి

మంచికి మారుపేరుగా నిలిచి, కుటుంబ ఉన్నతికి అహర్నిశలు శ్రమించి, అందరి మన్ననలు పొందిన మీరు మా నుండి దూరమైనందుకు మిక్కిలి చింతిస్తూ.. దైవ సన్నిధికి చేరిన మీ పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తూ..

కీ॥శే॥ సింగుపురపు లక్ష్మి గారు
ఒపివాడ గ్రామం, బూర్జ (మం)
జననం : 01-01-1955 మరణం : 08-02-2026

భర్త : సింగుపురపు రామారావు

కుమారులు - కోడళ్లు - మనుమలు, మనుమరాండ్రు
అమ్మినాయుడు - వరలక్ష్మి - రాఘవేంద్ర, లావణ్య
కోటేశ్వరరావు - రేవతి - రిత్వికాశాన్వి
(మాజీ పీఏసీఎస్ ఛైర్మన్, బూర్జ)
అల్లుడు - కుమార్తె - మనుమలు, మనుమరాండ్రు
చిగురుపల్లి సూరప్పనాయుడు - వరలక్ష్మి - అజయ్‌కుమార్, రవికుమార్, కమల - అనిల్

కుటుంబ సభ్యులు మరియు బంధుమిత్రులు

పెద్దకర్మ: తే 18-02-2026ది బుధవారం ఒపివాడ గ్రామంలో మా స్వగృహంనందు జరుగును. సెల్: 8500200611

SBI స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
హోమ్ లోన్ సెంటర్ (64217), డోర్ నంబర్ 14-3-15, గ్రౌండ్ ఫ్లోర్, సంపత్ విహార్ అపార్ట్‌మెంట్, శ్రీకాకుళం, శ్రీకాకుళం(జిల్లా)- 532 001, ఇమెయిల్: sbi.64217@sbi.co.in
అధీకృత అధికారి పేరు : శ్రీ ఎం.రవి శంకర్ ప్రసాద్, మొబైల్ నెం. : 74165 40025
ఆస్తి తనిఖీ కొరకు : కె.అశోక్, మొబైల్ నెం. : 80990 41788

ఇ-వేలం అమ్మకం ప్రకటన

సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎసెట్స్ & ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 (నెం.54) కింద స్థిరాస్తుల అమ్మకం కొరకు ఇ-వేలం అమ్మకపు ప్రకటన [illegible]

ఎ) రిజర్వు ధర : రూ.42,50,000/- బి) ధరావత్తు: రూ.4,25,000/- సి) బిడ్ పెంపుదల మొత్తం: రూ.10,000/-
ఇ-వేలం తేది: 25.03.2026 [illegible]
[illegible]
తేది : 16.02.2026, ప్రదేశం : శ్రీకాకుళం సం/- అధీకృత అధికారి, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

(c) eenadu

సీబీఎస్ఈ 10వ తరగతి పబ్లిక్ పరీక్షలు మంగళవారం నుంచి ప్రారంభమయ్యాయి. చెన్నై కొట్టూర్‌లోని భక్తవత్సలం విద్యాశ్రమం పాఠశాలలో పరీక్ష రాయడానికి ముందు విద్యార్థినులు స్థానిక ఆలయంలో స్వామి దర్శనం చేసుకున్నారు. ఉపాధ్యాయుల వద్ద ఆశీర్వాదం పొందారు. **- ఆర్కేనగర్, న్యూస్‌టుడే**

21 నుంచి రాష్ట్రంలో వర్షాలకు అవకాశం

ప్యారిస్, న్యూస్‌టుడే: రాష్ట్రంలో 21వ తేదీ నుంచి తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణ పరిశోధన కేంద్రం ఓ ప్రకటనలో తెలిపింది. నైరుతి బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడిందని, ఇది ఉత్తర వాయువ్య దిశలో పయనించి బుధవారం మరింత బలపడే అవకాశం ఉందని పేర్కొంది. అదేవిధంగా తమిళనాడు, పుదుచ్చేరిలో 19వ తేదీ వరకు పొడి వాతావరణం ఉంటుందని, 21న రాష్ట్రంలో కొన్నిచోట్ల, 22న దక్షిణ తమిళనాడులో కొన్ని చోట్ల, ఉత్తర తమిళనాడులో ఒకటి రెండు చోట్ల, 23వ తేదీ రాష్ట్రంలో ఒకటి రెండు చోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉందని వివరించింది. ఉత్తర తమిళనాడులో బుధ, గురువారాల్లో తేలికపాటి పొగమంచు పడే అవకాశం ఉందని చెప్పింది. చెన్నై, శివారు ప్రాంతాల్లో బుధవారం ఆకాశం మేఘావృతమై ఉంటుందని వెల్లడించింది.

విద్యకు పెద్దపీట

బడ్జెట్ ప్రసంగం చేస్తున్న తంగం తెన్నరసు

- రూ.57,039 కోట్ల కేటాయింపు
- రూ. 4,67,264 కోట్లతో ఓటాన్ అకౌంట్ బడ్జెట్
- శాసనసభలో సమర్పించిన ఆర్థిక మంత్రి
- వివిధ రంగాల్లో కీలక ప్రకటనలు

అసెంబ్లీలో మంగళవారం రాష్ట్ర ఓటాన్ అకౌంట్ బడ్జెట్ (2026–27)ను ఆర్థిక మంత్రి తంగం తెన్నరసు ప్రవేశపెట్టారు. గత బడ్జెట్ కన్నా 7.30శాతం ఎక్కువ నిధులతో రూ.4,67,264 కోట్లతో కేటాయింపులు ప్రకటించారు. **- ఈనాడు-చెన్నై**

తమిళభాష అమరవీరుల దినం..

ఏటా జనవరి 25వ తేదీని 'తమిళభాష అమరవీరుల దినం'గా ప్రకటించారు. అంబేడ్కర్ రచనల్ని సరళమైన తమిళంలో అనువదించి 27 సంపుటాలుగా ప్రజలకు అందించనున్నట్లు వెల్లడించారు.

చరిత్రకు గౌరవం

తంజావూర్‌లో గ్రాండ్ చోళా మ్యూజియం, గంగైకొండ చోళపురంలో మరో మ్యూజియంతో పాటు ఈరోడ్‌లో నొయ్యల్ మ్యూజియం, సింధూ నాగరికతకు సంబంధించి తమిళనాడులో బయల్పడిన ఆనవాళ్లను చెన్నై ఎగ్మోర్ ప్రభుత్వ మ్యూజియంలో ఏర్పాటు చేయనున్నారు. తిరువణ్ణామలైలో తమిళ సాంస్కృతిక మ్యూజియం తెస్తున్నారు. వాటికోసం రూ.285 కోట్లు కేటాయించారు.

శరణార్థులకు నిధులు

శ్రీలంక తమిళుల సంక్షేమం కోసం రూ.456 కోట్లు ఖర్చు చేయనున్నట్లు ప్రకటించారు. వారికోసం 3 విడతల్లో 10,469 ఇళ్ల నిర్మాణానికి రూ.630 కోట్లు కేటాయిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే వారికోసం 6,010 గృహాలు నిర్మించినట్లు వెల్లడించారు.

అన్నా వర్సిటీకి రూ.1,380 కోట్లు..

చెన్నైలోని అన్నా యూనివర్సిటీని ఆసియాలోనే అత్యంత ప్రధాన వర్సిటీగా మార్చేందుకు ముందుకొచ్చారు. ఇందుకు రూ.1,380 కోట్లు కేటాయించారు. సేలం, కోయంబత్తూరు, తిరునెల్వేలిలోని ప్రభుత్వ ఇంజినీరింగ్ కళాశాలల్లో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లను ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. రాష్ట్రంలోని 71 ఐటీఐలను ఇండస్ట్రీ 4.0 సాంకేతికత కేంద్రాలుగా వృద్ధి చేసేందుకు రూ.2,877 కోట్లు కేటాయిస్తున్నట్లు వెల్లడించారు. మదురైలో కలైజ్ఞర్ సెంటినరీ లైబ్రరీ తరహాలో కోయంబత్తూర్, తిరుచ్చి, కడలూర్, సేలం, తిరునెల్వేలిలో లైబ్రరీల నిర్మాణానికి రూ.902 కోట్లు ప్రకటించారు.

చికిత్సలో మేటిగా..

కాంచీపురంలోని అరిజ్ఞర్ అన్నా స్మారక క్యాన్సర్ ఆసుపత్రిని సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్‌గా మార్చేందుకు ఏకంగా రూ.398 కోట్లను ప్రకటించారు.

చెన్నై మహా నగరానికి..

చెన్నై మహానగర పాలక సంస్థ(జీసీసీ) తాగునీటి పైప్‌లైన్లను 'రింగ్ మెయిన్ పైప్‌లైన్ ప్రాజెక్టు' కింద వృద్ధి చేయడానికి రూ.3,109కోట్లు కేటాయించారు. ఉత్తర చెన్నైలో వివిధరకాల అభివృద్ధికి రూ.6,045 కోట్లు ప్రకటించారు. ఇందులో బస్ టెర్మినల్‌లు, గృహ నిర్మాణాలు, తాగునీటి వసతులు, ఆసుపత్రులు, చెరువులు, బీచ్‌ల వృద్ధి, ఫిష్‌మార్కెట్లు, జిమ్‌లు, పార్కులు, క్రీడావసతులు, విద్యుత్తు ఆధారిత దహనవాటికలు, పాలిటెక్నిక్ కాలేజీలు, నైపుణ్య శిక్షణ కేంద్రాల్ని తీసుకురానున్నారు. సింగార చెన్నై 2.0 ప్రాజెక్టుకు రూ.500కోట్లు, నగరానికి సమీపంలో నిర్మించనున్న మామల్లన్ రిజర్వాయర్‌కు రూ.100కోట్లు, శివారులో పెరిపెరల్ రింగ్‌రోడ్డు ప్రాజెక్టుకు రూ.3,540కోట్లు ఇస్తున్నట్లు తెలిపారు.

వాతావరణ మార్పులకు పరిష్కారం

వడదెబ్బ, ప్రత్యేక విపత్తులపరంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రాంతాల్లో తొలివిడతగా 11 కార్పొరేషన్లను ఎంపికచేసి పరిష్కారమార్గాలు చూపుతామని బడ్జెట్‌లో తెలిపారు. తూర్పు, పశ్చిమ కనుమల్లోని ప్రాంతాల్లో ముప్పును అంచనా వేయనున్నారు. కొండచరియలు విరిగిపడే ప్రమాదాలున్న విరుదునగర్, రామనాథపురం, శివగంగై జిల్లాల్లో పరిష్కార చర్యలకోసం రూ.110కోట్లు కేటాయించారు.

దుస్తుల తనిఖీకి ఆధునిక ల్యాబ్

క్రీడా దుస్తుల్లో నాణ్యత పెంచేందుకు, నిర్ధరణ కోసం పరీక్షలు నిర్వహించేందుకు 'అడ్వాన్స్‌డ్ క్వాలిటీ టెస్టింగ్ ల్యాబొరేటరీ'ని ప్రకటించారు. ఇందుకు రూ.6 కోట్లు కేటాయించారు. దీన్ని కోయంబత్తూరులోని దక్షిణ భారత వస్త్ర పరిశోధన సంఘం(సిట్రా)లో తీసుకురానున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో 10 కొత్త హ్యాండ్లూమ్ పార్కులు ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. అరణిలో కలైజ్ఞర్ కరుణానిధి సెంటినరీ మెమోరియల్ హ్యాండ్లూమ్ సిల్క్ పార్క్ తేనున్నారు.

కీలక రంగాలకు కేటాయింపులు (రూ.కోట్లలో)..	
విద్య	57,039
పట్టణాభివృద్ధి	35,773
గ్రామీణాభివృద్ధి	28,687
ఆరోగ్యం	22,090
జాతీయ రహదారులు	21,132
విద్యుత్తు	18,091
ఆహార, సహకారం	17,068
పోలీస్	13,583
రవాణా	13,061
జలవనరులు	10,076
సాంఘిక సంక్షేమం	8,633
పరిశ్రమలు, ఎంఎస్ఎంఈ	6,224
ఆదిద్రావిడ, గిరిజన సంక్షేమం	3,934

వ్యవసాయ బడ్జెట్ సమర్పిస్తున్న ఎం.ఆర్.కె.పన్నీర్ సెల్వం, ప్రసంగం వింటున్న స్పీకర్ అప్పావు, సీఎం స్టాలిన్ తదితరులు

వ్యవసాయరంగానికి ప్రాధాన్యం..

చెన్నై: శాసనసభలో 2026-27వ ఏడాది ఓటాన్ అకౌంట్ వ్యవసాయ బడ్జెట్‌ను ఆ శాఖ మంత్రి ఎం.ఆర్.కె.పన్నీర్‌సెల్వం సమర్పించారు. ఆయన మాట్లాడుతూ... 2021-22వ ఏడాది వ్యవసాయ బడ్జెట్‌లో రూ.34,220 కోట్లుగా ఉన్న కేటాయింపులు 2025-26వ సంవత్సరానికి రూ.45,661 కోట్లుగా పెరిగాయన్నారు. తద్వారా వ్యవసాయరంగానికి ఈ ప్రభుత్వం అందిస్తున్న ప్రాధాన్యతను గుర్తించవచ్చని తెలిపారు. ఈ ఏడాదికి ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌లో వ్యవసాయ రంగానికి రూ.47,248.24 కోట్లు కేటాయించినట్లు పేర్కొన్నారు. ముఖ్యమంత్రి నేతృత్వంలో ప్రస్తుతం అమలులో ఉన్న వ్యవసాయ, అనుబంధ పథకాలు కొనసాగించనున్నట్లు తెలిపారు. శాసనసభలో ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌ను ప్రవేశపెట్టే సందర్భంగా ఆర్థిక మంత్రి తంగం తెన్నరసు, వ్యవసాయ శాఖ మంత్రి ఎం.ఆర్.కె.పన్నీర్ సెల్వం మెరీనా తీరంలోని దివంగత ముఖ్యమంత్రి అన్నాదురై, మాజీ ముఖ్యమంత్రి కరుణానిధి సమాధులను సందర్శించుకుని నివాళులర్పించారు.

రెవెన్యూ లోటు..	
ఆర్థిక సంవత్సరం	రూ.కోట్లలో..
2021-22	46,538
2022-23	36,215
2023-24	45,121
2024-25	45,840
2025-26	69,219
2026-27	48,696

త్వరలో కొత్త టెర్మినస్

చెన్నై మెట్రో ఫేజ్-2 ప్రాజెక్టుకు రూ.5,467 కోట్లను కేటాయించారు. చెన్నై నుంచి పశ్చిమ దిశగా వెళ్లే బస్సుల కోసం కుతంబాక్కం బస్ టెర్మినస్ సేవలు త్వరలో అందుబాటులోకి వస్తాయని ప్రకటించారు.

కొత్త టైడల్ పార్కులు

తమిళనాడు సెమీ కండక్టర్స్ మిషన్‌కు రూ.100 కోట్లు ప్రకటించారు. తిరుచ్చి, మదురై, హోసూరులో కొత్తగా టైడల్‌పార్కులను ఏర్పాటుచేసేందుకు రూ.1,070కోట్లు కేటాయించారు. రూ.388 కోట్లతో మరో 9 నగరాల్లో మినీ ఐటీ పార్కుల్ని తెస్తామన్నారు.

దేశానికే నమూనా - తంగం తెన్నరసు

16వ ఆర్థిక సంఘం నివేదికలోని అంశాలు తమిళనాడును తీవ్ర నిరాశకు గురిచేశాయని బడ్జెట్ ప్రసంగంలో ఆర్థికశాఖ మంత్రి తంగం తెన్నరసు అన్నారు. రాష్ట్రానికి న్యాయబద్ధంగా ఇవ్వాల్సిన వాటాపై అన్యాయంగా వ్యవహరించారని ఆరోపించారు. 9వ ప్రణాళిక సంఘం నివేదికలో తమిళనాడు వాటా 7.9శాతముండగా, దాన్నిప్పుడు 4.079కి తగ్గించారన్నారు. 16వ ఆర్థిక సంఘం నివేదికలో కేరళకు 23.74శాతం, కర్ణాటకకు 13.27శాతం నిధులు పెంచి.. తమిళనాడుకు మాత్రం కేవలం 0.44శాతం పెరుగుదల చూపించారని, ఇతర అన్ని రాష్ట్రాలతో పోల్చితే ఇదే అత్యల్పమని తెలిపారు. 50ఏళ్ల క్రితం మాజీ మంత్రి కరుణానిధి చెప్పిన పరిస్థితి ఇప్పటికీ కొనసాగుతోందని అప్పటి మాటల్ని గుర్తుచేశారు. 'పన్నులు విధించే అధికారం కేంద్రం తీసుకుని, ప్రజా సంక్షేమాన్ని కాపాడే అధికారం మాత్రం రాష్ట్రప్రభుత్వానికి ఇస్తుండటం విడ్డూరంగా ఉంది. అనేక సమస్యలకు ప్రాథమికంగా కారణమిదే. ప్రస్తుత ఆదాయ పంపిణీ వ్యవస్థలో మార్పు రావాలి' అని అప్పట్లో కరుణానిధి అన్నట్లు బడ్జెట్ ప్రసంగంలో తెలిపారు. చెన్నై మెట్రో రైల్ ఫేజ్-2 ప్రాజెక్టు కేంద్ర ప్రభుత్వ పరిధిలోనిదని, వారు ఇవ్వాల్సిన రూ.9,523 కోట్ల నిధుల్ని అధికారిక పుస్తకంలో చూపకపోవడంతో తమిళనాడు అప్పుల తీవ్రత పెరిగినట్లు చూపించారని ఆరోపించారు. ఇది పోను రాష్ట్రానికి రూ.9,42,851 కోట్ల అప్పు ఉందన్నారు. ఇవన్నీ ఎదుర్కొని ప్రజా కేంద్రీకృత ప్రభుత్వానికి తమిళనాడును ఓ నమూనాగా దేశానికి చూపుతున్నామని చెప్పారు. తమ ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి 1,179 సంస్థలతో ఒప్పందాలు కుదుర్చుకున్నామని, వాటి విలువ రూ.12.37లక్షల కోట్లని తెలిపారు. వాటిద్వారా 36 లక్షల మందికి ఉపాధి లభించనుందన్నారు.

20 వరకు సమావేశాలు

చెన్నై, న్యూస్‌టుడే: శాసనసభ ఓటాన్ అకౌంట్ బడ్జెట్ సమావేశాలు 20 వరకు జరగనున్నాయి. మంగళవారం శాసనసభ కార్యక్రమాలు ముగిసిన తర్వాత సభను ఎన్నిరోజులు పాటు నిర్వహించాలనే విషయమై బిజినెస్ అడ్వయిజరీ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. సభాపతి అప్పావు విలేకర్లతో మాట్లాడుతూ... ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌పై బుధవారం, గురువారం చర్చ జరగనుందని, 20న ఆర్థికశాఖ మంత్రి తంగం తెన్నరసు సమాధానం ఇస్తారని పేర్కొన్నారు.

ఇదో చెవులు కుట్టే వేడుక..

చెన్నై, న్యూస్‌టుడే: శాసనసభకు అన్నాడీఎంకే సభ్యులు కర్ణభూషణ మహోత్సవ ఆహ్వానపత్రికలతో హాజరయ్యారు. సమావేశం తర్వాత శాసనసభ ప్రాంగణంలో మీడియా ప్రతినిధులతో ప్రతిపక్షనేత ఎడప్పాడి పళనిసామి మాట్లాడారు. ఈ ప్రభుత్వం ఏ స్థాయిలో ప్రజలకు చెవులు కుట్టిందనే విషయాన్ని చెప్పడానికే కర్ణభూషణ మహోత్సవం ఆహ్వానపత్రికలతో వచ్చామన్నారు. ఓటాన్ అకౌంట్ బడ్జెట్ అతి పెద్ద చెవులు కుట్టే వేడుకని ఎద్దేవా చేశారు. 2021వ ఏడాది శాసనసభ ఎన్నికలప్పుడు ఇచ్చిన 525 హామీల్లో నాలుగో వంతు కూడా నెరవేర్చలేదని ఆరోపించారు. పలు శాఖలవారికి హామీలను నెరవేర్చలేదని, అందరూ పోరాడుతున్నారని, రాష్ట్రమే కదనరంగంగా మారిందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వంపై నిందలు వేసే ఆర్థికమంత్రి రాష్ట్ర సొంత ఆదాయం తగ్గడంపై వివరణ ఇవ్వలేదన్నారు. 2026-27వ ఏడాది ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌లో ఆర్థికలోటు వెల్లడించిన దానికన్నా మరింత పెరగనుందని తెలిపారు.

ఆహ్వానపత్రిక చూపుతున్న అన్నాడీఎంకే సభ్యులు

భారీ విజయాలకు నాంది పలికే బడ్జెట్: స్టాలిన్

చెన్నై, న్యూస్‌టుడే: జులైలో భారీ విజయాలకు నాంది పలికే బడ్జెట్‌ను ద్రావిడ మోడల్ 2.0 ప్రభుత్వం సమర్పించనుందని ముఖ్యమంత్రి స్టాలిన్ తెలిపారు. ఆయన తన 'ఎక్స్' పేజీలో... 'ఇదే అభివృద్ధి, తమిళనాడే ఇండియాకు మోడల్' అంటూ అందరూ ప్రశంసించేలా ఐదేళ్ల పాలనను చేపట్టి అదే క్రమంలో ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌ను సమర్పించినట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వ వంచనలను సమర్థవంతంగా అధిగమించి అభివృద్ధి సాధించి ఐదేళ్లు పూర్తి చేసుకున్నామని పేర్కొన్నారు. జులైలో ద్రావిడ మోడల్ 2.0 కొత్త ప్రకటనలతో మరింత భారీ విజయాలకు నాంది పలికే బడ్జెట్‌ను సమర్పించనుందని పేర్కొన్నారు.

టీవీకే మేనిఫెస్టో 27న విడుదల?

చెన్నై, న్యూస్‌టుడే: టీవీకే మేనిఫెస్టోను ఈ నెల 27న విడుదల చేయనున్నట్లు సమాచారం. మేనిఫెస్టో రూపకల్పనకు రాష్ట్ర నిర్వాహకులతో కూడిన కమిటీని ఏర్పాటు చేయడంతో పాటు ప్రజల నుంచి అభిప్రాయాలు, సూచనలు, ప్రతిపాదనలు పొందడానికి అనువుగా వెబ్‌సైట్‌నూ ప్రారంభించింది. వాటికి అందే ప్రతిపాదనలు, అభిప్రాయాలను డ్రాఫ్టు మేనిఫెస్టోలో పొందుపరిచే పనుల్లో కమిటీ నిమగ్నమైంది. ఈ నేపథ్యంలో మేనిఫెస్టోను ఈ నెల 27న విడుదల చేయనున్నట్లు ప్రచారం జరుగుతోంది. దీనిని ప్రజల సమక్షంలో విడుదల చేయాలా? లేక పార్టీ నిర్వాహకుల సమక్షంలో విడుదల చేయాలా? అనే అంశాలపై చర్చిస్తున్నట్లు సమాచారం.

పార్టీలో చేరిన అన్నాడీఎంకే మాజీ మంత్రి

సుబ్రమణియన్‌ను సత్కరిస్తున్న విజయ్

చెన్నై: అన్నాడీఎంకే మాజీ మంత్రి సుబ్రమణియన్ టీవీకేలో చేరారు. తెన్‌కాశి జిల్లా వాసుదేవనల్లూర్ మాజీ ఎమ్మెల్యే మనోహరన్ టీవీకే అధ్యక్షుడు విజయ్ సమక్షంలో సోమవారం ఆ పార్టీలో చేరిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో మాజీ మంత్రి సుబ్రమణియన్ కూడా విజయ్ సమక్షంలో టీవీకేలో చేరారు. పుదుకోట్టై జిల్లాకు చెందిన ఆయన 2006-11 వరకు గంధర్వకోట్టై ఎమ్మెల్యేగా, 2011-16 వరకు ఆదిద్రావిడ సంక్షేమశాఖ మంత్రిగానూ వ్యవహరించారు.

ఉన్నతాధికారి ఉత్తర్వులు ఇస్తే కొట్టి చంపుతారా?: మదురై ధర్మాసనం

ప్యారిస్, న్యూస్‌టుడే: ఉన్నతాధికారి ఉత్తర్వులు ఇస్తే కొట్టి హత్య చేస్తారా అని మద్రాసు హైకోర్టు మదురై ధర్మాసనం ప్రశ్నించింది. శివగంగై జిల్లా తిరుప్పువనం మడప్పురం భద్రకాళియమ్మన్ ఆలయంలో కాపలాదారుడిగా పని చేస్తున్న అజిత్‌కుమార్‌ను చోరీ కేసు దర్యాప్తులో పోలీసులు కొట్టడంతో గతేడాది జూన్ 27న మృతి చెందాడు. ఈ కేసులో అరెస్టైన ఐదుగురు పోలీసులు బెయిల్ కోసం మదురై ధర్మాసనంలో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్ న్యాయమూర్తి జస్టిస్ శ్రీమది ఎదుట సోమవారం విచారణకు వచ్చింది. రెండు అభియోగపత్రాలు దాఖలు చేసినట్లు, అజిత్‌కుమార్‌ను పోలీసులు కొట్టి చంపారు అనేందుకు ఆధారాలు ఉన్నాయని, వారికి బెయిల్ ఇవ్వకూడదని సీబీఐ తరఫున వాదనలు వినిపించారు. పోలీసులు మనస్సాక్షితో వ్యవహరించాలని, కొట్టడం కుదరదని ఒక్కరు కూడా ఎందుకు నిరాకరించలేదని న్యాయమూర్తి ప్రశ్నించారు. చట్ట విరుద్ధంగా వ్యవహరించడం కుదరదని ఉన్నతాధికారికి చెప్పాలని, ఒకవేళ ఆయన చర్యలు చేపడితే న్యాయస్థానానికి రావాలని, కోర్టు రక్షిస్తుందని అభిప్రాయపడ్డారు. ఈ కేసులో పోలీసులు చేసింది క్షమించరాని నేరమన్నారు. మిగిలిన నిందితులను త్వరలో అరెస్టు చేయాలని, దర్యాప్తు పూర్తయ్యే వరకు బెయిల్ ఇవ్వడం కుదరదని స్పష్టం చేశారు. అజిత్‌కుమార్ మృతి కేసు విచారణ ఆరు నెలల్లో పూర్తి చేయాలని ఉత్తర్వులు ఇచ్చారు.

చెన్నైలో రూఫ్ టాప్ ఓపెన్ బస్సులు: ఎంటీసీ

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: చెన్నైలో ప్రయాణికులను ఆకట్టుకునేలా 'రూఫ్ టాప్ ఓపెన్' బస్సులు నడపనున్నారు. ఈ విషయమై ఎంటీసీ అధికారి మాట్లాడుతూ.. ..చెన్నైలో 20 డబుల్‌డెక్కర్ బస్సులు నడిపేందుకు ఒప్పందం కుదిరిందని, ఆ పనులు జరుగుతున్నాయని చెప్పారు. ఆ బస్సులన్నింట్లో ఏసీ సౌకర్యం ఉంటుందన్నారు. ఇందులో నాలుగింటిని 'రూఫ్ టాప్ ఓపెన్'గా మార్చేసి ఉపయోగించాలని నిర్ణయించినట్లు పేర్కొన్నారు. ఇందుకోసం ఒప్పందంలో సవరణ చేసి వ్యవధిని 12ఏళ్లుగా నిర్ణయించామని తెలిపారు. త్వరలో ఆ బస్సులు చెన్నైలో తిరగనున్నాయని పేర్కొన్నారు.

నూతన విద్యుత్తు కనెక్షన్ల కోసం టీఎన్‌పీడీసీఎల్ యాప్

వడపళని, న్యూస్‌టుడే: నూతన విద్యుత్తు కనెక్షన్ల దరఖాస్తులు, వినియోగదారుల ఫిర్యాదులు పరిష్కారానికి తమిళనాడు పవర్ డిస్ట్రిబ్యూషన్ కార్పొరేషన్ లిమిటెడ్ (టీఎన్‌పీడీసీఎల్) సరికొత్త యాప్ అందుబాటులోకి తెచ్చింది. కొత్త కనెక్షన్లకు సంబంధించిన వివరాలు యాప్‌లో నమోదు చేయగానే ఆ ప్రాంత అసిస్టెంట్ ఇంజినీర్ మొబైల్‌కు వివరాలు వెళతాయి. వాటిని కమర్షియల్ అసిస్టెంట్, లైన్ ఇన్‌స్పెక్టర్‌కు పంపుతారు. తద్వారా దరఖాస్తుల ప్రాసెస్‌కు పట్టే సమయం కూడా తగ్గుతుందని అధికారులు పేర్కొన్నారు. ఇప్పటివరకు మాన్యువల్‌గా చేస్తున్నారని, ఇకపై అలా జరగదన్నారు. మీటర్లు కూడా త్వరగా అందుతాయని తెలిపారు. అనంతరం సర్వీస్ నెంబరు కేటాయిస్తారని టీఎన్‌పీడీసీఎల్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ విభాగ చీఫ్ ఇంజినీర్ నిరైమతి అన్నారు. ప్రస్తుతం ప్రయోగాత్మకంగా మదురై, తిరునెల్వేలో అమల్లోకి తీసుకొచ్చారు. మార్చి నుంచి రాష్ట్రంలోని ఇతర ప్రాంతాలకు విస్తరించనున్నారు. తొలుత లోటెన్షన్, ఆ తర్వాత హై టెన్షన్ వినియోగదారులకు విస్తరిస్తామని సంస్థ డైరెక్టర్ ఎ.సెల్వకుమార్ తెలిపారు. ఫిర్యాదులకు కూడా త్వరగా పరిష్కారం లభిస్తుందన్నారు.

అన్నాడీఎంకే రెండాకుల గుర్తు వ్యవహారం

ఎన్నికల కమిషన్‌ను ప్రశ్నించిన దిల్లీ హైకోర్టు

ప్యారిస్, న్యూస్‌టుడే: అన్నాడీఎంకే రెండాకుల గుర్తు కేటాయింపు, పార్టీ జెండా, పేరు ఉపయోగించడంపై ఇచ్చిన ఫిర్యాదుపై చర్యలు ఎందుకు ఆలస్యమయ్యాయని ఎన్నికల కమిషన్‌ను దిల్లీ హైకోర్టు ప్రశ్నించింది. గుర్తు కేటాయింపు, పేరుకు సంబంధించి పుగళేంది ఇచ్చిన ఫిర్యాదులపై త్వరగా చర్యలు చేపట్టాలని దిల్లీ హైకోర్టు 2024లో ఉత్తర్వులు ఇచ్చింది. ఎలాంటి చర్యలు చేపట్టలేదని ఎన్నికల కమిషన్‌కు వ్యతిరేకంగా పుగళేంది దాఖలు చేసిన కోర్టు ధిక్కరణ కేసు సోమవారం విచారణకు వచ్చింది. ఎప్పుడు విచారించి పరిష్కరిస్తారని, న్యాయస్థానం ఆదేశాలిచ్చిన తర్వాత కూడా ఎందుకు ఆలస్యమైందని ఎన్నికల కమిషన్‌ను న్యాయమూర్తి ప్రశ్నించారు. వివరణ ఇవ్వాలంటూ తదుపరి విచారణ వాయిదా వేశారు.

టీఎన్‌పీఎస్సీ పరీక్షల కంట్రోలర్ బదిలీ

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: టీఎన్‌పీఎస్సీ పరీక్షల కంట్రోలర్‌గా శ్రీవెంకట ప్రియ సోమవారం సాయంత్రం బాధ్యతలు స్వీకరించారు. గ్రూప్-2 మెయిన్ పరీక్షకు సరిగా కేంద్రాలను కేటాయించకపోవడంతో అభ్యర్థులు గందరగోళానికి గురయ్యారు. ఆ పరీక్షను రద్దు చేస్తున్నట్లు టీఎన్‌పీఎస్సీ ప్రకటించింది. విచారణ జరిపి ఐదుగురిని సస్పెండ్ చేశారు. పరీక్షల కంట్రోలర్ షణ్ముగసుందరాన్ని బదిలీ చేశారు.

రూ.16వేలు పలికిన పూజలో ఉంచిన నిమ్మకాయ

విల్లివాక్కం, న్యూస్‌టుడే: తమిళనాడులోని ఓ ఆలయంలో పూజలో ఉంచిన నిమ్మకాయను వేలం వేయగా రూ.16వేలు పలికింది. ఈరోడ్ జిల్లా శివగిరి సమీపం విళక్కేత్తిపుదు అన్నామలైపాలయంలోని కరుప్పణ్ణ ఈశ్వరర్ ఆలయంలో మహాశివరాత్రిని పురస్కరించుకుని అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. వేలాది మంది భక్తులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయంలో పూజలో ఉంచిన నిమ్మకాయ, వెండి నాణెం, వెండి ఉంగరం వేలం వేశారు. నిమ్మకాయ రూ.16 వేలకు, వెండి నాణెం రూ.21వేలకు, వెండి ఉంగరం రూ.52 వేలకు భక్తులు దక్కించుకున్నట్లు ఆలయ నిర్వాహకులు మంగళవారం తెలిపారు.

కూటమి పాలనకు చోటులేదు: వైగో

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: కూటమి పాలనకు రాష్ట్రంలో చోటులేదని ఎండీఎంకే ప్రధానకార్యదర్శి వైగో తెలిపారు. ఆయన మంగళవారం తిరుచ్చి విమానాశ్రయంలో విలేకరులతో మాట్లాడారు. అందరినీ ఆశ్చర్యపరిచే విధంగా ఆర్థికమంత్రి తంగం తెన్నరసు ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌లో 36లక్షల మందికి ఉపాధి కల్పిస్తామని ప్రకటించారని గుర్తు చేశారు. ఈ బడ్జెట్‌లో అన్ని పక్షాలను ఆకర్షించేలా, తమిళనాడును ఆర్థిక వ్యవస్థలో అగ్రస్థానానికి తీసుకెళ్లేలా ఉందన్నారు. మూసివేసిన స్టెరిలైట్ పరిశ్రమలో యంత్రాలను ఇంకా తొలగించలేదన్నారు. ఇండియా కూటమిలో కాంగ్రెస్ కొనసాగుతుందని నమ్ముతున్నానని చెప్పారు.

మరిగే నెయ్యిలో చేతులతో అప్పం కాల్చిన వృద్ధురాలు

ప్యారిస్, న్యూస్‌టుడే: మరిగే నెయ్యిలో చేతులతో ఓ వృద్ధురాలు అప్పం కాల్చి ప్రసాదంగా అందించారు. విరుదునగర్ జిల్లా శ్రీవిల్లిపుత్తూర్ ముదలియార్‌పట్టి వీధి భద్రకాళియమ్మన్ ఆలయంలో శివరాత్రి వేడుకల్లో భాగంగా అప్పం కాల్చి ప్రసాదంగా పంచే ప్రత్యేక కార్యక్రమం వందేళ్లుగా జరుగుతోంది. ముత్తమ్మాళ్(93) అనే వృద్ధురాలు 63 ఏళ్లుగా శివరాత్రి రోజున అప్పం చేస్తున్నారు. ఈ ఏడాది మహా శివరాత్రిని పురస్కరించుకుని 48 రోజులు వ్రతం ఉన్న ముత్తమ్మాళ్ ఆదివారం అర్ధరాత్రి వేడి నెయ్యిలో చేతులతో అప్పం కాల్చి భక్తులకు ప్రసాదంగా పంపిణీ చేశారు.

అప్పం కాల్చుతున్న ముత్తమ్మాళ్

ఈపీఎస్‌తో నయినార్ భేటీ

సైదాపేట, న్యూస్‌టుడే: అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిసామితో భాజపా రాష్ట్ర అధ్యక్షుడు నయినార్ నాగేంద్రన్, కేంద్ర సహాయ మంత్రి ఎల్.మురుగన్ మంగళవారం భేటీ అయ్యారు. చెన్నై గ్రీన్‌వేస్ రోడ్డులోని ఈపీఎస్ నివాసంలో జరిగిన భేటీ సుమారు గంటపాటు కొనసాగింది. ఈ సందర్భంగా ప్రధాని మోదీ మార్చి 1న మదురైకి రానున్నారు. దానికి ముందు డీఎండీకేను ఎన్డీయేలోకి తీసుకురావడం గురించి చర్చించినట్లు సమాచారం. అదే సమయంలో ఈశా యోగా కేంద్రంలో జరిగిన శివరాత్రి వేడుకల్లో ఎల్.మురుగన్, అన్నాడీఎంకే మాజీ మంత్రి ఎస్పీ వేలుమణి, డీఎండీకే ప్రధాన కార్యదర్శి ప్రేమలత పాల్గొనడం గమనార్హం. అక్కడే కూటమి తదితర పలు విషయాలు మాట్లాడినట్లు తెలుస్తోంది.

పళనిసామితో మాట్లాడుతున్న నయినార్ నాగేంద్రన్, ఎల్.మురుగన్

(c) eenadu

పాడుబడిన ఇంట్లో దెయ్యముందని పుకార్లు
నివాసం ఎదుట పోలీసు భద్రత

హత్యకు గురైన విశ్రాంత అధికారి ఇల్లు

ప్యారిస్, న్యూస్‌టుడే: హత్యకు గురైన విశ్రాంత అధికారి ఇంట్లో దెయ్యం ఉందంటూ సామాజిక మాధ్యమాల్లో పుకార్లు వ్యాపిస్తున్న తరుణంలో ఆ ఇంటి ముందు పోలీసులు భద్రతా విధులు చేపట్టారు. చెన్నై అశోక్‌నగర్‌లో నివాసం ఉంటున్న శవరణన్ రాష్ట్ర ఖనిజ వనరులశాఖలో అధికారిగా పనిచేసి పదవీ విరమణ పొందారు. 2008లో శవరణన్, భార్య కస్తూరి, పనిమనిషి అన్నపూరణి హత్యకు గురయ్యారు. ఈ కేసుని సీబీసీఐడీ పోలీసులు దర్యాప్తు చేసి శవరణన్ కారు డ్రైవరు సహా నలుగురిని అరెస్టు చేశారు. హత్య జరిగి 18 ఏళ్లయిన నేపథ్యంలో శవరణన్.. దివంగత మాజీ ముఖ్యమంత్రి ఎంజీఆర్‌తో తీసుకున్న ఫొటో, ఇంట్లోని వస్తువులు చెల్లాచెదురుగా పడి ఉన్నాయని, కారు, ఇల్లు శిథిలావస్థలో ఉన్నాయని, ఆ ఇంట్లో దెయ్యం ఉందని కొందరు ఇంట్లో వెళ్లి రీల్స్ తీసి సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేశారు. ఆ వీడియోలు వైరల్‌గా మారాయి. ఈ క్రమంలో ఆ ఇంటి ముందు పోలీసులు భద్రతా విధులు చేపట్టారు. ఇంట్లోకి ఎవరైనా ప్రవేశిస్తే కఠిన చర్యలు చేపడతామని పోలీసు అధికారులు హెచ్చరించారు.

ఇన్‌సోలేరియన్ సంస్థతో 'సీఎస్ఐఆర్-ఎస్ఈఆర్సీ' ఒప్పందం

ఒప్పందాలతో ఇరు సంస్థల ఉన్నత ప్రతినిధులు

వడపళని, న్యూస్‌టుడే: పునరుత్పాదక ఇంధన సాంకేతికతలు, వ్యవస్థలు, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ పరీక్ష, సాంకేతిక మూల్యాంకనం అభివృద్ధి కోసం 'ఇన్‌సోలేరియన్' సంస్థతో 'కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రిసెర్చ్ - స్ట్రక్చరల్ ఇంజినీరింగ్ రిసెర్చ్ సెంటర్(సీఎస్ఐఆర్-ఎస్ఈఆర్సీ)' ఒప్పందాన్ని కుదుర్చుకుంది. సీఎస్ఐఆర్-ఎస్ఈఆర్సీ డైరెక్టర్, డాక్టర్ ఆనందవల్లి, ఇన్‌సోలేరియన్ సంస్థ పరిశోధన, అభివృద్ధి (ఆర్ అండ్ డీ) కల్చరల్ పంకజ్ సోమవారం ఒప్పందాలు మార్చుకున్నారు. పీపీవీ ఓ ప్రకటన విడుదల చేసింది. ఇన్‌సోలేరియన్ సంస్థ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ డాక్టర్ అతుల్ ఆనంద్, బరువా, బీకేఎండీ చీఫ్ సైంటిస్ట్, హెడ్, డాక్టర్ కె.సతీష్‌కుమార్‌తో పాటు పలువురు శాస్త్రవేత్తలు, సాంకేతిక అధికారులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

అధ్యాపకుల నిరసన దీక్ష

టీనగర్, న్యూస్‌టుడే: తిరునెల్వేలి జిల్లా శేరన్‌మహాదేవి సమీపంలో మనోన్మణీయం సుందరనార్ విశ్వవిద్యాలయ అనుబంధ సంస్థ అయిన మనో కళాశాల ఉద్యోగులను తక్షణమే ప్రభుత్వ కళాశాలగా మార్చాలని డిమాండ్ చేస్తూ అధ్యాపకులు పెద్ద ఎత్తున్న ఆందోళన చేపట్టారు. సోమవారం సాయంత్రం ప్రారంభమైన ఈ నిరసన రాత్రంతా కొనసాగింది. చలిని కూడా లెక్క చేయకుండా వారు కళాశాల ఆవరణలోనే బస చేసి తమ నిరసన వ్యక్తం చేశారు. మంగళవారం కూడా నిరసన కొనసాగింది. ప్రభుత్వం నుంచి స్పష్టమైన హామీ వచ్చే వరకు పోరాటాన్ని విరమించే ప్రసక్తే లేదని అధ్యాపకులు స్పష్టం చేశారు.

తేయాకు రైతులకు ప్రోత్సాహక నిధి

ప్రోత్సాహక నిధి అందుకున్న రైతులతో మంత్రి అన్బరసన్

సైదాపేట, న్యూస్‌టుడే: ఇండ్కోసర్వ్ కింద పని చేసే 16 సహకార తేయాకు కర్మాగారాలకు ... 16 మంది రైతులకు ఎంఎస్ఎంఈ శాఖ మంత్రి అన్బరసన్ ప్రోత్సాహక నిధి అందజేశారు. తలా రూ.25వేల చొప్పున రూ.4 లక్షలు అందింది. అలాగే తేయాకు కర్మాగారాలకు రూ.3.25 కోట్ల విలువైన ఉపకరణాలు అందజేశారు. కార్యక్రమంలో ఎంఎస్ఎంఈ శాఖ అదనపు ప్రధాన కార్యదర్శి అతుల్ ఆనంద్, కార్మిక సంక్షేమ విభాగ కమిషనర్ నిర్మల్‌రాజ్, ఇండ్కోసర్వ్ ప్రధాన కార్యనిర్వాహక అధికారి రాజగోపాల్ సుంకర తదితరులు పాల్గొన్నారు.

పోలీసు ఇన్‌స్పెక్టర్ విధుల నుంచి తొలగింపు
ఓ కేసులో దర్యాప్తు సరిగా జరగలేదని చర్యలు

జయశంకర్

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: యువకుడి ఆత్మహత్య కేసులో దర్యాప్తు సరిగా జరపలేదని పోలీసు ఇన్‌స్పెక్టర్‌ను విధుల నుంచి తొలగించారు. కడలూర్ జిల్లా సెత్తియాతోప్పు పోలీసు స్టేషన్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న జయశంకర్ 2022లో విళ్లుపురం జిల్లా కంజనూర్ పోలీస్‌స్టేషన్‌లో ఇన్‌స్పెక్టర్‌గా పనిచేశారు. అప్పుడు సూరపట్టు ప్రాంతానికి చెందిన రాజా అనే యువకుడు వర్గానికి, మరో వర్గానికి గొడవలు జరిగాయి. ఇరు వర్గాలపై పోలీసులు కేసునమోదు చేశారు. రెండ్రోజుల తర్వాత రాజా ఆత్మహత్య చేసుకున్నాడు. ఆత్మహత్యకు కారణమైనవారిని అరెస్ట్ చేయాలని బంధువులు రాస్తారోకో చేశారు. అనంతరం ఇన్‌స్పెక్టర్ జయశంకర్ నేతృత్వంలో పోలీసులు ఆత్మహత్యకు ప్రేరేపించినందుకు ఇద్దరిని అరెస్ట్ చేశారు. అనంతరం ఆత్మహత్య కేసుని జయశంకర్ సరిగా దర్యాప్తు జరపలేదని ఉన్నతాధికారులు సస్పెండ్ చేశారు. కొన్నినెలల క్రితం జయశంకర్ మళ్లీ విధుల్లో చేరారు. ఇది లా ఉండ గా యువకుడి ఆత్మహత్య కేసులో దర్యాప్తు సక్రమం గా జరగలేదని విళ్లుపురం డీఐజీ కార్యాలయం నుంచి డీజీపీకి నివేదిక అందింది. దాని ఆధారంగా డీజీపీ వెంకట్రామన్ సూచనల మేరకు డీఐజీ అరుళరసు సోమవారం ఇన్‌స్పెక్టర్ జయశంకర్‌ను విధుల నుంచి తొలగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

EENADU Classifieds
JOBS

Wanted Teachers for Reputed Schools in A.P & Telangana, Contact: Sneha Placements Service. Ph: 94402 46409.

త్రినేత్ర హోంకేర్‌లో వృద్ధులను/ పేషెంట్స్‌ను/ పిల్లలను చూసుకొనుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఫ్రీ వసతి, భోజనం. జీ: 18K. ✆ 8520980099, 8520874499

హరేకృష్ణ హోంకేర్‌లో వృద్ధులను/ పేషెంట్స్‌ని/ పిల్లలను చూసుకొనుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఫ్రీ వసతి, భోజనం జీ: 18-20K ✆ 96404 68899, 96402 58899

భాగస్వామ్యం ఇవ్వాలి..

ప్లకార్డులు ప్రదర్శిస్తున్న పార్టీ నిర్వాహకులు

చెన్నై, న్యూస్‌టుడే: నగరానికి విచ్చేసిన కాంగ్రెస్ జాతీయ ప్రధాన కార్యదర్శి కె.సి.వేణుగోపాల్‌కు ఆ పార్టీ నిర్వాహకులు కొందరు అధికారంలో భాగస్వామ్యం నినాదాన్ని ప్లకార్డుల రూపంలో ప్రదర్శించారు. కూటమిలో కాంగ్రెస్‌కు తగిన గౌరవం లభించాలని, బోర్డుల నుంచి సహకార సంఘాల వరకు భాగస్వామ్యం కావాలని, పురపాలక ఎన్నికల్లో 30శాతం భాగస్వామ్యం కావాలంటూ ప్లకార్డులు ప్రదర్శించారు. అధికారంలో భాగస్వామ్యంపై కాంగ్రెస్‌లో రెండు వర్గాలు కొనసాగుతున్న విషయం తెలిసిందే.

ఎడారిగా మారిన పక్షుల స్వర్గధామం

ఎండిపోయిన కూంతన్‌కుళం సరస్సు

చుక్క నీరు లేకుండా పోయిన దృశ్యం

- న్యూస్‌టుడే, టీనగర్

తిరునెల్వేలి జిల్లా కూంతన్‌కుళం పక్షుల అభయారణ్యం ప్రస్తుతం పక్షులు లేక బోసిగా కనిపిస్తోంది. ఏటా లక్షలాది విదేశీ పక్షులతో కళకళలాడే ఈ ప్రాంతం గత కొన్ని రోజులుగా ఎడారిని తలపిస్తోంది. దాహంతో అలమటించి పక్షులు ప్రాణాలు విడుస్తున్నాయని పక్షుల ప్రేమికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నాంగునేరి తాలూకాలో 1.29 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో ఉన్న ఈ సరస్సుకు ఏటా దేశాల నుంచి వచ్చే సుమారు 100 రకాల పక్షులు అవాసంగా ఉంది. సైబీరియా నుంచి ఏటా డిసెంబర్ నుంచి జూన్ వరకు ఇక్కడ పక్షులు సందడి ఉంటుంది. అయితే ఈ ఏడాది కూంతన్‌కుళంలోని ప్రధాన చెరువు పూర్తిగా ఎండిపోయింది. సంతానోత్పత్తి కోసం వచ్చిన పక్షులు తమ పిల్లలను పోషించలేక నీటి కోసం వచ్చిన ఉన్న ఉన్న చిన్న కాడుకాళం వంటి ప్రాంతాలకు వలస వెళ్తున్నాయి. కూంతన్‌కుళం సరస్సు ప్రధానంగా మణిముత్తారు ఆనకట్ట పై ఆధారపడి ఉంటుంది. ఈ ఏడాది నీటి కొరత ఏర్పడటానికి కారణాలపై ఆరా తీయగా జలాశయంలో నీటిమట్టం 100 అడుగుల కంటే తక్కువగా ఉంటే విడతల వారీగా నీటిని విడుదల చేస్తారని అధికారులు తెలిపారు.

జలాశయ నీరందక..

ప్రస్తుతం జలాశయంలో 98 అడుగుల మేర నీరుంది. నిబంధనల ప్రకారం ఈ ఏడాది మొదటి రెండు రీచ్‌లకు మాత్రమే నీరు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. కూంతన్‌కుళం నాలుగో రీచ్‌లో ఉండటంతో దీనికి నీటి కేటాయింపులు జరగలేదు. పక్షుల మరణాలపై జిల్లా అటవీ అధికారి ఇళంగో మాట్లాడుతూ.. నీటి ఎద్దడి ఉన్న మాట వాస్తవమేనని, ప్రస్తుతం నీటిని విడుదల చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అయితే పక్షులు కేవలం దాహంతోనే చనిపోయాయని చెప్పలేమన్నారు. విద్యుత్ తీగలు తగలడం వల్ల లేదా అనారోగ్యంతో చనిపోయి ఉండవచ్చన్నారు. కాగా, దీనిపై కూంతన్‌కుళం గ్రామస్థులు మాట్లాడుతూ.. అక్కడికి వచ్చే పక్షులను తాము సొంత బిడ్డల్లా చూసుకుంటామని, వాటికి ఇబ్బంది కలగకూడదని దశాబ్దాలుగా తమ ప్రాంతంలో దీపావళికి బాణసంచా కూడా కాల్చడం లేదని తెలిపారు.

తక్షణ చర్యలకు కలెక్టరు ఆదేశం

కూంతన్‌కుళంలో నీటి ఎద్దడిపై వరుసగా వార్తలు వెలువడటంతో వెంటనే స్పందించిన అధికారులు తిరునెల్వేలి జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు గత రెండు రోజులుగా నీటిని విడుదల చేస్తున్నారు. దీంతో మళ్లీ అక్కడ పూర్వ వైభవం సంతరించుకుంటుందని స్థానికులు ఆశిస్తున్నారు.

అన్నాడీఎంకేలో చేరిన ఆదవ్ అర్జున అత్త

ఈపీఎస్, ఎస్పీ వేలుమణితో లీమా రోస్

సైదాపేట, న్యూస్‌టుడే: టీవీకే ఎన్నికల ప్రచార నిర్వహణ విభాగ ప్రధాన కార్యదర్శి ఆదవ్ అర్జున అత్త అన్నాడీఎంకేలో చేరారు. ఇండియా జననాయగ కట్చి (ఐజేకే) రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శిగా పనిచేసిన లాటరీ టికెట్ల విక్రయ సంస్థ అధిపతి మార్టిన్ సతీమణి, టీవీకే ముఖ్య నిర్వాహకుడైన ఆదవ్ అర్జున అత్త లీమా రోస్ ఆ పార్టీ నుంచి వైదొలుగుతున్నట్లు ఇటీవల ప్రకటించారు. ఈ నేపథ్యంలో మంగళవారం ఎడప్పాడి పళనిసామి సమక్షంలో అన్నాడీఎంకేలో చేరారు. రానున్న ఎన్నికల్లో అన్నాడీఎంకే తరఫున తిరుచ్చి, కోయంబత్తూర్ నియోజకవర్గాల్లో ఏదో ఒకదాని నుంచి పోటీ చేసే అవకాశం ఉందని సమాచారం.

● **సైదాపేట :** డీఎంకేకు చెందిన పలువురు మంగళవారం అన్నాడీఎంకేలో చేరారు. డీఎంకే మాజీ కార్య నిర్వహక కమిటీ సభ్యుడు, మదురై కార్పొరేషన్ మాజీ ఉప మేయర్ పీఎం మన్నన్ నేతృత్వంలో మదురై నాల్గవ ప్రాంత మాజీ ఉప కార్యదర్శి రాజశేఖర్, జిల్లా కళలు, సాహిత్య పేరవై ఉప ఆర్గనైజర్ అన్బరసు ఇళంగో, మదురై 26వ వార్డు మాజీ ఉప కార్యదర్శి ప్రకాష్ జయరామన్, 58వ వార్డు రవిశంకర్ తదితర 100 మందికి పైగా పార్టీ ప్రధాన కార్యదర్శి పళనిసామి సమక్షంలో అన్నాడీఎంకేలో చేరారు. చెన్నై గ్రీన్‌వేస్ రోడ్డులోని ఎడప్పాడి నివాసంలో జరిగిన కార్యక్రమంలో మాజీ మంత్రులు కేపీ మునుసామి, సెల్లూరు రాజు తదితరులు పాల్గొన్నారు.

మదురై తముక్కం వంతెనకు నేతాజీ పేరు
ముఖ్యమంత్రి ప్రకటన

చెన్నై, న్యూస్‌టుడే: మదురైలోని తముక్కం మైదానం నుంచి నెల్‌పేట్టైలోని అన్నా విగ్రహం వరకు నిర్మించిన పైవంతెనకు 'నేతాజీ సుభాష్ చంద్రబోస్' వంతెన అని ముఖ్యమంత్రి నామకరణం చేశారు. ఆయన తన 'ఎక్స్'లో.. మదురైలోని తముక్కం మైదానం నుంచి నెల్‌పేట్టైలోని అన్నా విగ్రహం వరకు 1.9 కి.మీ దూరానికి నిర్మించిన పైవంతెనకు భారతీయ స్వాతంత్ర్యం కోసం తనకంటూ మార్గాన్ని రూపొందించి దక్షిణాది జిల్లాల ప్రజలను పాల్గొనేలా చేసిన ధీరత్వానికి ప్రతీకగా ఉన్న నేతాజీ సుభాష్ చంద్రబోస్ పేరును పెట్టి గర్విస్తున్నట్లు తెలిపారు. రూ.213 కోట్ల వ్యయంతో నిర్మించిన ఈ వంతెనను 21న తన మదురై పర్యటనలో భాగంగా ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు.

హాకీ టోర్నమెంట్ విజేత కెనరా బ్యాంకు జట్టు

వడపళని, న్యూస్‌టుడే: చెన్నై ఎగ్మోర్‌లోని మేయర్ రాధాకృష్ణన్ స్టేడియంలో ఈనెల 11 నుంచి 15వ తేదీ వరకు ఐదు రోజులపాటు 'ఆలిండియా పబ్లిక్ సెక్టార్ హాకీ టోర్నమెంట్-2026' జరిగింది. జాతీయ స్థాయి పోటీలను 'స్పోర్ట్స్ అండ్ కల్చరల్ ప్రమోషన్ బోర్డ్(ఎస్సీపీబీ)', ఆలిండియా పబ్లిక్ సెక్టార్ స్పోర్ట్స్ కంట్రోల్ బోర్డ్ (ఏఐపీఎస్సీబీ) ఆధ్వర్యంలో భారత ఆహార సంస్థ(ఎఫ్‌సీఐ), జోనల్ స్పోర్ట్స్ ప్రమోషన్ అండ్ కల్చరల్ కమిటీ(జడ్ఎస్‌పీసీసీ) నిర్వహించాయి. పోటీల్లో దేశ వ్యాప్తంగా ఉన్న ఏడు ప్రభుత్వ రంగ సంస్థల ఉద్యోగులు పాల్గొన్నారు. పోటీల ముగింపు రోజున చెన్నైలోని మద్రాస్ ఎక్స్‌పోర్ట్ ప్రాసెసింగ్ జోన్(ఎంఈపీజెడ్) జాయింట్ డెవలప్‌మెంట్ కమిషనర్ సి.ఆర్థర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. హాకీ భారత జట్టు మాజీ కెప్టెన్, ఒలింపిక్ బంగారు విజేత వాసుదేవన్ భాస్కరన్, దక్షిణాది కల్చరల్ కమిటీ అధ్యక్షురాలు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (సౌత్) జసింత లాజరస్ గౌరవ అతిథులుగా హాజరయ్యారు. తుది పోరులో ఎఫ్‌సీఐ జట్టుపై కెనరా బ్యాంక్ జట్టు విజయం సాధించింది.

లైకా కేసులో నటుడు విశాల్ పిటిషన్ కొట్టివేత

ప్యారిస్, న్యూస్‌టుడే: లైకా సంస్థకు సంబంధించిన కేసులో నటుడు విశాల్ దాఖలు చేసిన పిటిషన్‌ను మద్రాసు హైకోర్టు కొట్టివేసింది. లైకా సంస్థలకు చెల్లించాల్సిన రూ.21.29 కోట్లను 30 శాతం వడ్డీతో కలిపి తిరిగి చెల్లించాలని విశాల్‌కు మద్రాసు హైకోర్టు సింగిల్ జడ్జి ఉత్తర్వులు ఇచ్చారు. ఈ ఉత్తర్వులను సవాలు చేస్తూ విశాల్ తరఫున దాఖలైన అప్పీల్‌పై విచారణ జరిపిన ద్విసభ్య ధర్మాసనం సింగిల్ జడ్జి ఉత్తర్వులకు మధ్యంతర స్టే విధించి, రూ.10 కోట్లను డిపాజిట్ చేయాలని ఉత్తర్వులు ఇచ్చింది. ఈ నేపథ్యంలో రూ.10 కోట్లను డిపాజిట్ చేసేందుకు ఆరు వారాల గడువు కోరుతూ విశాల్ తరఫున పిటిషన్ దాఖలైంది. ఈ పిటిషన్ న్యాయమూర్తులు జస్టిస్ కార్తికేయన్, జస్టిస్ కుమరేశ్ బాబు ధర్మాసనంలో విచారణకు వచ్చింది. అప్పుడు విశాల్ తరఫున.. బ్యాంకు ఖాతాలను స్తంభింపజేయడంతో నగదు సేకరించేందుకు గడువు అవసరమైందని, రూ.10 కోట్లను డిపాజిట్ చేసేందుకు ఆరు వారాల గడువు కావాలని వాదనలు వినిపించారు. ఇది ఆమోదించడానికి నిరాకరించిన న్యాయమూర్తులు.. గడువు ఇవ్వడం కుదరదని తెలిపి విశాల్ పిటిషన్‌ను కొట్టివేస్తూ మంగళవారం ఉత్తర్వులు ఇచ్చారు.

ఆరోగ్యశాఖ భవనాలు ప్రారంభం

భవనాలు ప్రారంభిస్తున్న ముఖ్యమంత్రి స్టాలిన్

చెన్నై, న్యూస్‌టుడే: ఆరోగ్యశాఖ తరఫున చేపట్టిన పలు నిర్మాణాలను ముఖ్యమంత్రి స్టాలిన్ ప్రారంభించారు. చెన్నై రాజీవ్‌గాంధీ ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి ప్రాంగణంలో రూ.65 కోట్లతో న్యూరాలజీ విభాగం భవనం, తమిళనాడు ప్రభుత్వ దంత వైద్యకళాశాల ఆస్పత్రిలో రూ.64.09 కోట్లతో అదనపు భవనాలు, చెన్నై కీళ్‌పాక్కం ప్రభుత్వ మానసిక చికిత్సాలయంలో రూ.40 కోట్లతో భవనాలు, రాయపురం ప్రభుత్వ ఆర్ఎస్ఆర్ఎం ప్రసూతి ఆస్పత్రిలో రూ.31.74 కోట్లతో సమీకృత ఎమర్జెన్సీ, నవజాత శిశువు సంరక్షణ కేంద్రం అదనపు భవనం, రక్తనిధి తదితర భవనాలను నిర్మించారు. మరికొన్ని జిల్లాల్లో నిర్మించిన ఆరోగ్యశాఖ భవనాలను సచివాలయం నుంచి మంగళవారం ముఖ్యమంత్రి వర్చువల్‌గా ప్రారంభించారు.

గిండి పారిశ్రామికవాడలో..

చెన్నై: సిడ్కో తరఫున గిండి పారిశ్రామికవాడలో రూ.175 కోట్లతో నిర్మించిన బహుళంతస్తుల ప్రాంగణాన్ని, రూ.32.33 కోట్లతో పట్టు నూలు, నేత, కృత్రిమ పట్టు, బంగారు ఆభరణాల తయారీ పరిశ్రమలను ముఖ్యమంత్రి స్టాలిన్ సచివాలయం నుంచి వర్చువల్‌గా ప్రారంభించారు.

4 'తోళి' వసతి గృహాలు

సాంఘిక సంక్షేమం, మహిళా సాధికారతశాఖ తరఫున మదురై, ధర్మపురి, కడలూర్, రాణిపేట్టలలో రూ.21.02 కోట్ల వ్యయంతో 4 'తోళి' వర్కింగ్ ఉమెన్స్ వసతి గృహాలను కూడా ముఖ్యమంత్రి ప్రారంభించారు.

'విళుదుగళ్' సేవా కేంద్రాలు..

దివ్యాంగులకు సమీకృత సేవలను అందించేలా రూ.14.57 కోట్లతో చెన్నై తదితర 20 జిల్లాల్లో నిర్మించిన 105 విళుదుగళ్ సమీకృత సేవా కేంద్రాలను ముఖ్యమంత్రి ప్రారంభించారు.

శ్రీలంక తమిళుల పునరావాస కేంద్రాలు

పునరావాసశాఖ తరఫున తిరువళ్లూర్, రాణిపేట్టై, తిరుపత్తూర్, శివగంగై, చెన్నై, తెన్‌కాశి జిల్లాల్లోని శ్రీలంక తమిళులు పునరావాస శిబిరాల్లో రూ.29.17 కోట్లతో నిర్మించిన, రూ.4.59 కోట్ల వ్యయంతో అభివృద్ధి చేసిన వసతులు కలిగిన 506 ఇళ్లను ముఖ్యమంత్రి ప్రారంభించారు. కోయంబత్తూర్, తిరువళ్లూర్, నామక్కల్, రామనాథపురం, తిరుపత్తూర్, తిరుచ్చిరాపల్లి, తిరువణ్ణామలై జిల్లాల్లోని శ్రీలంక తమిళుల పునరావాస కేంద్రాల్లో రూ.1.47 కోట్ల వ్యయంతో నిర్మించిన 7 వర్క్‌షాపులను ప్రారంభించారు.

హోలీ ప్రత్యేక రైళ్లు

వడపళని, న్యూస్‌టుడే: హోలీ పర్వదినాన్ని పురస్కరించుకుని ప్రయాణికుల సౌకర్యార్థం పలు మార్గాల్లో వీక్లీ ప్రత్యేక రైళ్లను నడుపుతున్నట్టు దక్షిణ రైల్వే ఓ ప్రకటన విడుదల చేసింది. ● **06077** చెన్నై ఎగ్మోర్‌లో 28, మార్చి 7, 14 తేదీలు (శని) 22.45కు బయలుదేరి మూడో రోజు 07.05కి సంత్రాగచ్చి చేరుకుంటుంది. ● **06078** సంత్రాగచ్చిలో మార్చి 2, 9, 16 తేదీలు (సోమ) 09.00కు బయలుదేరి మరుసటి రోజు 16.45కి చెన్నై సెంట్రల్‌కు వస్తుంది. ● **06019** చెన్నై సెంట్రల్‌లో 23, మార్చి 2, 9 తేదీలు (సోమ) 23.50కి బయలుదేరి మూడో రోజు 16.00కు హజరత్ నిజాముద్దీన్ వెళ్తుంది. ● **06020** హజరత్ నిజాముద్దీన్‌లో 26, మార్చి 5, 12 తేదీలు (గురు) 06.25కు బయలుదేరి మరుసటి రోజు 23.45కు చెన్నై సెంట్రల్‌కు చేరుతుంది.

● **సేవలు పొడిగింపు... 06039** చెన్నై సెంట్రల్‌లో 22, మార్చి 1, 8 తేదీలు (ఆది) 23.50కు బయలుదేరి మూడో రోజు 20.00కు బరౌని చేరుకుంటుంది. ● **06040** బరౌనిలో 25, మార్చి 4, 11 తేదీలు (బుధ) 21.00కు బయలుదేరి మూడో రోజు 18.00 గంటలకు చెన్నై సెంట్రల్‌కు వస్తుంది. ఈ రైళ్లకు బుధవారం నుంచి రిజర్వేషన్లు ప్రారంభమవుతాయి.

విదేశీ ఉద్యోగావకాశాలపై చాట్‌బాట్ ప్రారంభం

చాట్‌బాట్ ప్రారంభిస్తున్న దృశ్యం

చెన్నై, న్యూస్‌టుడే: విదేశీ ఉద్యోగావకాశాలపై వివరాలను తెలుసుకునేందుకు అనువుగా చాట్‌బాట్‌ను ప్రభుత్వం ప్రారంభించింది. చెన్నైలోని కలైవాణర్ అరంగంలో 'తమిళనాడు ఓవర్‌సీస్ మొబిలిటీ అండ్ ఎంప్లాయర్ పార్ట్నర్ సమ్మిట్' సోమవారం సాయంత్రం జరిగింది. ఇందులో కేంద్ర విదేశీ వ్యవహారాలశాఖ ఉప కార్యదర్శి సురేందర్ భగత్, ఓవర్‌సీస్ ఎంప్లాయిమెంట్ బ్యూరో ఛైర్మన్, ఎండీ బాలసుబ్రమణియన్, తమిళనాడు నైపుణ్యాభివృద్ధి సంస్థ ఎండీ క్రాంతికుమార్, సైబర్ క్రైమ్ విభాగం ఎస్పీ షాహనజ్ ఇలియాజ్, ప్రవాసీయుల భద్రతా అధికారి (తమిళనాడు) రాజ్‌కుమార్ తదితరులు పాల్గొని విదేశీ ఉద్యోగావకాశాల విధానాలు, లైసెన్సు పొందిన ఏజెంట్లు, విదేశాలకు వెళ్లేందుకు అవసరమైన అనుమతులు వంటి సమాచారాన్ని తెలుసుకునేలా 'పార్తు పోంగ 2.0' అవగాహన ఉద్యమం, సామాజిక మాధ్య చాట్‌బాట్‌ను ప్రారంభించారు. విదేశాల్లోని ఉద్యోగాలకు అక్రమంగా వెళ్లడం ద్వారా ఎదురయ్యే ఇబ్బందులు, మోసపోతున్న ఉదంతాలను అధికారులు వివరించారు.

ప్రజలకు ఎలాంటి ప్రయోజనం లేదు: అన్నామలై

ఓటాన్ అకౌంట్ బడ్జెట్ ప్రసంగం సందర్భంగా శాసనసభ ప్రవేశద్వారం వద్ద అరటిచెట్లతో అలంకరణ ▶ విలేకరులతో మాట్లాడుతున్న అన్నామలై

కోయంబత్తూరు, సైదాపేట, న్యూస్‌టుడే: ఓటాన్ అకౌంట్ బడ్జెట్ ప్రజలకు ఎలాంటి ప్రయోజనం చేకూర్చేదిలా లేదని భాజపా రాష్ట్ర మాజీ అధ్యక్షుడు అన్నామలై విమర్శించారు. కోయంబత్తూరు విమానాశ్రయంలో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. రుణభారం తగ్గించుకోవాల్సి ఉండా ఏటా అది పెరుగుతోందన్నారు. వ్యవసాయరంగ వృద్ధి కేవలం 3 శాతం మాత్రమే ఉందని, అది కూడా కేంద్ర ప్రభుత్వ పథకాలతోనే సాధ్యమైందని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం రైతుల కోసం కొత్త పథకాలను స్వయంగా తీసుకురావడంలేదని విమర్శించారు. డీఎంకే ప్రభుత్వం తన చివరి బడ్జెట్‌లోనూ ప్రజలను మోసం చేయటం ఆపలేదని తెలిపారు.

ఇదయక్కని సినిమా తిలకించిన ఈపీఎస్



థియేటర్ వద్ద ఎంజీఆర్ కటౌట్ ▶ ఈపీఎస్‌కు గజమాల వేస్తున్న నిర్వాహకులు

సైదాపేట, న్యూస్‌టుడే: అన్నాడీఎంకే వ్యవస్థాపకుడు ఎంజీఆర్ నటించిన ఇదయక్కని సినిమాను చెన్నై ఆల్బర్ట్ థియేటర్‌లో అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిసామి మంగళవారం వీక్షించారు. ఈ సినిమా 225వ రోజు విజయోత్సవంలో పాల్గొని జ్ఞాపికలు అందజేశారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లను ఎంజీఆర్ అభిమానుల సమన్వయ బృందం, తమిళనాడు, కర్ణాటక సినిమా పంపిణీదారుడు రాజు చేశారు. అన్నాడీఎంకే మాజీ మంత్రులు, మాజీ ఎంపీలు, ఎమ్మెల్యేలు కూడా సినిమా తిలకించారు.

తాంబరం రైల్వే స్టేషన్‌లో ఏసీ వెయిటింగ్ హాలు

విల్లివాక్కం, న్యూస్‌టుడే: తాంబరం రైల్వే స్టేషన్‌లో ప్రయాణికుల సౌకర్యార్థం 'పే అండ్ యూజ్' ఏసీ వెయిటింగ్ హాలు అందుబాటులోకి వచ్చింది. ఈ హాలులో లగ్జరీ సోఫా సెట్లు, ఏటీఎం కౌంటర్లు, మహిళలు, పురుషులకు ప్రత్యేక మరుగుదొడ్లు, ఫోన్ ఛార్జింగ్ సౌకర్యాలు, ఉచిత వైఫై సౌకర్యం, తాగునీరు, పిల్లలకు పాలివ్వడానికి ప్రత్యేక గదులతో పాటు పలు ఆధునాతన వసతులు కల్పించారు. 24 గంటలు అందుబాటులో ఉండే హాలుకి గంటకు రూ.35 వసూలు చేస్తారు. రిజర్వేషన్, అన్‌రిజర్వ్‌డ్ టికెట్లున్నవారు రుసుము చెల్లించి వెయిటింగ్ హాలు ఉపయోగించుకోవచ్చని అధికారులు తెలిపారు.

2,119.65 కిలోల గంజాయి ధ్వంసం

ప్యారిస్, న్యూస్‌టుడే: చెన్నై పోలీసు కమిషనరు అరుణ్ ఉత్తర్వుల మేరకు ఏర్పాటైన డ్రగ్ డిస్పోజల్ కమిటీ(డీడీసీ) ద్వారా చెంగల్పట్టు జిల్లా తెన్‌మేల్పాక్కంలో ఉన్న జీజే మల్టీక్లేవ్ ఇండియా ప్రైవేటు లిమిటెడ్ సంస్థ ఆమోదించిన ప్రాంతంలో అన్ని పర్యావరణ, చట్ట నిబంధనలు పాటించి గ్రేటర్ చెన్నై పోలీసులు వివిధ కేసుల్లో స్వాధీనం చేసుకున్న మత్తుపదార్థాలను సోమవారం మంటల్లో వేసి ధ్వంసం చేశారు. డీడీసీ ఛైర్మన్, అదనపు పోలీసు కమిషనరు జోషి నిర్మల్‌కుమార్ నేతృత్వంలో 448 కేసుల్లో స్వాధీనం చేసుకున్న మొత్తం 2,119.65 కిలోల గంజాయిని పోలీసులు కాల్చేశారు.

ఆలయ వేడుకలో వెల్లివిరిసిన మతసామరస్యం

టీనగర్, న్యూస్‌టుడే: తిరునెల్వేలి పట్టణంలోని సెంగుందర్ వేలంది వీధిలో ఉన్న అరుళ్మిగు శ్రీ స్వామి సంధి భూతత్తార్ ఆలయంలో ఏటా మాసి అమావాస్యను పురస్కరించుకుని 'కొడై విళా' వేడుక వైభవంగా జరుగుతుంది. ఈ ఏడాది వేడుక సోమవారం ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా ప్రతి సంవత్సరం వందలాది మంది భక్తులు పాల బిందెలతో ఊరేగింపుగా ఆలయానికి వెళ్లడం ఆనవాయితీ. ఆ మేరకు భక్తులు వీధుల్లో ఊరేగింపుగా వెళ్తుండగా జామియా మసీదు వీధిలో ముస్లింలు వారికి ఎదురెళ్లి ఘనంగా స్వాగతం పలికి మతసామరస్యాన్ని చాటారు.

పొన్నమరావతిలో కోలాహలంగా జల్లికట్టు

ఎద్దులను లొంగదీసే యత్నంలో క్రీడాకారులు

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: పుదుక్కోట్టై జిల్లా పొన్నమరావతి సమీపంలోని ఆలవయల్ పొన్ మసిలింగ అయ్యనార్ ఆలయంలో శివరాత్రి వేడుకల్లో భాగంగా మంగళవారం జల్లికట్టు పోటీ జరిగింది. పోటీని ఇలుప్పూర్ ఆర్డీవో గోకుల్‌సింగ్ ప్రారంభించారు. 800 ఎద్దులు, 300మందిపైగా క్రీడాకారులు పాల్గొన్నారు. గెలుపొందిన ఎద్దుల యజమానులు, క్రీడాకారులకు నిర్వాహకులు బహుమతులు అందజేశారు.

విద్యార్థులకు సైకిళ్ల పంపిణీ

టీనగర్, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం తరఫున ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్లోని విద్యార్థులకు ఉచితంగా సైకిళ్లు అందజేస్తున్నారు. ఈ క్రమంలో ఓమలూరులోని ఎయిడెడ్ ఉన్నత పాఠశాలల విద్యార్థులకు సైకిళ్ల పంపిణీ కార్యక్రమం మంగళవారం జరిగింది. ఓమలూరు పట్టణ పంచాయతీ అధ్యక్షురాలు సెల్వరాణి ముఖ్య అతిథిగా హాజరై వేలాస్వామి పాఠశాల విద్యార్థులు 143 మందికి, ఫాతిమా బాలికల పాఠశాలకు చెందిన 371 మందికి సైకిళ్లను అందజేశారు.

తిరునెల్వేలి కోర్టుకు బాంబు బెదిరింపు

టీనగర్, న్యూస్‌టుడే: తిరునెల్వేలి జిల్లా కోర్టు ప్రాంగణంలో బాంబు పెట్టినట్లు అగంతకులు కోర్టు కార్యాలయానికి ఈ-మెయిల్ పంపారు. వెంటనే అప్రమత్తమైన అధికారులు పోలీసులకు సమాచారం అందించారు. వారు బాంబ్ స్క్వాడ్‌తో వెంటనే అక్కడకు చేరుకుని క్షుణ్ణంగా తనిఖీలు చేపట్టారు. ఎలాంటి పేలుడు పదార్థాలు లభించలేదు. బెదిరింపులకు పాల్పడిన వారిని గుర్తించేందుకు సైబర్ క్రైమ్ పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. అదేవిధంగా తిరుచ్చెందూర్ కోర్టుకు కూడా బాంబు బెదిరింపు వచ్చినట్లు పోలీసులు తెలిపారు.

రూ.140 కోట్ల పెట్టుబడులకు యూఏసీ ఆమోదం

అలెక్స్ పాల్ మేనన్ నుంచి నియామకపత్రం అందుకుంటున్న హిజ్రా

వడపళని, న్యూస్‌టుడే: తమిళనాడు, అండమాన్, పుదుచ్చేరి ప్రాంతాల్లో రూ.140 కోట్లకు పైగా పెట్టుబడులతో రానున్న కొత్త యూనిట్లు, విస్తరణ ప్రాజెక్టులకు 'ఎంఈపీజెడ్ స్పెషల్ ఎకనమిక్ జోన్' అనుబంధ సంస్థ యూనిట్ అప్రూవల్ కమిటీ డెవలప్‌మెంట్ కమిషనర్ అలెక్స్ పాల్ మేనన్ ఆమోదం తెలిపారు. కొత్త యూనిట్ల ఆమోదంతో 950 మందికిపైగా ఉపాధి అవకాశాలు లభించడంతో పాటు పారిశ్రామిక పర్యావరణ వ్యవస్థ బలోపేతమవుతుందని అధికారులు భావిస్తున్నారు. ఇద్దరు హిజ్రాలకు సోమవారం కమిషనర్ అలెక్స్ పాల్ మేనన్ నియామకపత్రాలు అందించారు.

విజయ్ సమావేశానికి అనుమతి కోరుతూ వినతి

వేలూర్: టీవీకే అధ్యక్షుడు విజయ్ 23వ తేదీ వేలూర్‌లో జరిగే సమావేశంలో పాల్గొననున్నారు. సమావేశానికి అనుమతి, భద్రత కోరుతూ ఎస్పీ కార్యాలయంలో టీవీకే వేలూర్ పశ్చిమ జిల్లా కార్యదర్శి వేల్‌మురుగన్, నిర్వాహకులు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వేల్‌మురుగన్ మాట్లాడుతూ... సమావేశానికి అనుమతి వస్తే పోలీసు నిబంధనలు 100శాతం పాటిస్తామని పేర్కొన్నారు. పాల్గొనేవారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. 50 మంది వైద్యులు, 100 మంది నర్సులు, ఓ మినీ ఆస్పత్రి తాత్కాలికంగా ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు.

డీఎంకే కూటమిలో కాంగ్రెస్‌కు సమస్య లేదు

చెన్నై: డీఎంకే కూటమిలో తమ పార్టీకి ఎలాంటి సమస్య లేదని కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల బాధ్యుడు గిరీశ్ చోడంకర్ తెలిపారు. చెన్నై విమానాశ్రయంలో విలేకరులతో మాట్లాడుతూ.. డీఎంకేతో 22న కూటమి చర్చలు కోసం నిరీక్షిస్తున్నామని చెప్పారు. కూటమికి సంబంధించి కాంగ్రెస్ తరఫున ఐదుగురు సభ్యుల కమిటీని ఇప్పటికే నియమించినట్లు, ఆ నివేదిక ఆధారంగా అధిష్ఠానం నిర్ణయం తీసుకుంటుందని పేర్కొన్నారు. అప్పటి వరకు కూటమిపై ఎవరూ బహిరంగంగా మాట్లాడరన్నారు. అధికారంలో భాగస్వామ్యంపై తమతో డీఎంకే ఇప్పటివరకు ఎలాంటి చర్చలు జరపలేదన్నారు.

దుకాణాల బంద్ నిర్వహిస్తాం

సేలం, న్యూస్‌టుడే: ఆస్తి పన్ను భారీగా పెంచడాన్ని నిరసిస్తూ దుకాణాల బంద్ నిర్వహించనున్నట్లు సేలం జిల్లాలోని లీబజార్ వర్తక సంఘం హెచ్చరించింది. సంఘ నిర్వాహకులు పెరియస్వామి, తిరుమురుగన్ తదితరులు మంగళవారం విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ.. లీ బజార్‌లో 1,518 మంది వ్యాపారులపై ఆస్తి పన్ను ఊహించని రీతిలో పెంచినట్లు తెలిపారు. రానున్న అసెంబ్లీ ఎన్నికలలోపు పెంచిన పన్నులను తగ్గించకపోతే అన్ని వర్గాల వ్యాపారులను ఏకం చేసి దుకాణాల బంద్ నిర్వహించనున్నట్లు స్పష్టం చేశారు.

(c) eenadu

ముఖ్యమంత్రితో విత్ లవ్ నిర్మాతల భేటీ

చెన్నై: వర్ధమాన దర్శకుడు మదన్ దర్శకత్వంలో అబిషన్ జీవింత్, అనస్వర రాజన్ జంటగా నటించిన 'విత్ లవ్' చిత్రం ఈ నెల 6న విడుదలై విజయవంతంగా ప్రదర్శితమవుతున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో చిత్ర నిర్మాతలు జసిలియాన్ నజరేత్, మహేశ్ రాజ్ జసిలియాన్ మంగళవారం ముఖ్యమంత్రి స్టాలిన్‌ను మర్యాదపూర్వకంగా కలిసి కాసేపు ముచ్చటించారు. సినిమా విజయానికి ముఖ్యమంత్రి శుభాకాంక్షలు తెలిపి చిత్రబృందం కృషిని అభినందించారు. తొలి మూడు రోజుల్లో రూ.11 కోట్ల వసూళ్లను రాబట్టిన ఈ చిత్రం పది రోజుల్లో రూ.25 కోట్ల వసూళ్లను దాటినట్లు చిత్ర బృందం అధికారికంగా ప్రకటించింది.

స్టాలిన్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న నిర్మాతలు

మరకద నాణయం-2కి పూజ

చెన్నై: ఎ.ఆర్.కె.శరవణన్ కథ రాసి దర్శకత్వం వహించి 2017లో విడుదలైన చిత్రం 'మరకద నాణయం'. ఆది పినిశెట్టి, నిక్కీ గల్రాని జంటగా నటించిన ఈ చిత్రం అప్పట్లో ప్రేక్షకులను మెప్పించింది. ఈ నేపథ్యంలో శివరాత్రిని పురస్కరించుకుని చిత్రం రెండో భాగానికి సోమవారం పూజా కార్యక్రమంతో చిత్రీకరణ ప్రారంభించారు. నటుడు కార్తి క్లాప్ కొట్టగా నటుడు ఆర్య కెమెరా స్విచ్చాన్ చేశారు. దర్శకుడు వెంకట్‌ప్రభు 'కెమెరా రోలింగ్, యాక్షన్' చెప్పి చిత్రీకరణను ప్రారంభించారు. షేషన్ స్టూడియోస్, దంగల్ టీవీ, ఆర్టీసీ మీడియా, యాక్సెస్ ఫిల్మ్ ఫ్యాక్టరీ, గుడ్‌షో వంటి పతాకాలపై సుధన్ సుందరం, మహేశ్ సింఘాల్, దుర్గారామ్ చౌదరి, దేవ్, జేబీ దుర్గ తదితరులు సంయుక్తంగా చిత్రాన్ని నిర్మిస్తున్నారు. రెండో భాగానికీ ఎ.ఆర్.కె.శరవణన్ దర్శకత్వం వహిస్తున్నారు. చిత్రంలో ఆది, సత్యరాజ్, ప్రియాభవాని శంకర్, నిక్కీ గల్రాని, మునీష్‌కాంత్, ఆనందరాజ్ తదితరులు ముఖ్యమైన పాత్రల్లో నటిస్తున్నారు. దిబు నినన్ థామస్ సంగీతం అందిస్తున్నారు. సంభాషణలు రమేశ్ కన్నా రాస్తున్నారు.

క్లాప్ కొడుతున్న కార్తి

చోరీకి గురైన విగ్రహాలు తీసుకొచ్చేందుకు చర్యలు

ప్యారిస్, న్యూస్‌టుడే: తమిళనాడులో చోరీ చేసి విదేశాలకు తరలించిన పురాతన విగ్రహాలను తిరిగి తీసుకొచ్చేందుకు విగ్రహాల అక్రమ రవాణా నిరోధక విభాగం పోలీసులు చర్యలు చేపట్టారు. తిరువారూరు జిల్లా కరువనక్కుడి గ్రామం కైలాసనాథర్ ఆలయంలోని త్రిపుర మంగళ కాళీ విగ్రహం, నంది రాతి విగ్రహం, తంజావూరు జిల్లా మానంపట్టి గ్రామం నాగనాథస్వామి ఆలయానికి చెందిన ఆరు తలల స్కంద కార్తికేయ విగ్రహాలు ఆస్ట్రేలియా కాన్‌బెర్రాలోని నేషనల్ గ్యాలరీలో ఉన్నట్లు గుర్తించారు. కళ్లకురిచ్చి జిల్లా వీరసోళపురం గ్రామంలో సుమారు 900 ఏళ్ల ముందు నిర్మించిన నారీశ్వరర్ ఆలయానికి చెందిన నాయనార్, సుందరర్-పరవై నాచ్చియార్ విగ్రహం కనిపించకుండా పోయింది. తంజావూరు జిల్లా మన్నార్‌కుడి తాలూకా ఆలత్తూరులోని విశ్వనాథస్వామి ఆలయానికి చెందిన సోమస్కందర్ విగ్రహం కనిపించలేదు. ఈ రెండు విగ్రహాలు అమెరికాలోని వాషింగ్టన్ మ్యూజియంలో ఉన్నట్లు గుర్తించారు. ఆ విగ్రహాలను అప్పగించేందుకు ఆస్ట్రేలియా, అమెరికాలోని మ్యూజియం, వేలం సంస్థలు అంగీకరించినట్లు, త్వరలో రాష్ట్రానికి తీసుకొస్తారని పోలీసులు పేర్కొన్నారు.

సోమస్కందర్ విగ్రహం

వడం ఫస్ట్ సింగిల్ విడుదల

చెన్నై: కేంద్రన్ దర్శకత్వంలో విమల్, సంగీత జంటగా నటించిన చిత్రం 'వడం'. జల్లికట్టు నేపథ్యంతో రూపొందిన ఈ చిత్రంలో నటురాజన్, నరేన్ తదితరులు ముఖ్యమైన పాత్రల్లో నటించారు. చిత్రీకరణ పనులను మదురై, కోయంబత్తూర్ పరిసరాల్లో చేపట్టారు. ప్రస్తుతం నిర్మాణానంతర పనులు జరుగుతున్నాయి. చిత్రానికి డి.ఇమాన్ సంగీతం అందించారు. చిత్రం తొలి సింగిల్ 'పాండి ముని'ని చిత్రబృందం విడుదల చేసింది.

దాషమక్కాన్ ఫస్ట్ సింగిల్...

చెన్నై: వినీత్ వరప్రసాద్ దర్శకత్వంలో హరీశ్ కల్యాణ్, ప్రీతి ముకుందన్ జంటగా నటిస్తున్న చిత్రం 'దాషమక్కాన్'. థింక్ స్టూడియోస్, ప్రొడక్షన్ అండ్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రానికి బ్రిట్టో మైఖేల్ సంగీతం అందిస్తున్నారు. ఈ నేపథ్యంలో తొలి సింగిల్ 'రాప్ బాటల్'ను చిత్ర బృందం విడుదల చేసింది. ఈ చిత్రంలో వైవిధ్యమైన కథాపాత్రలో హరీశ్ కల్యాణ్ నటిస్తున్నారు.

సేయోన్‌గా వస్తున్న శివకార్తికేయన్

చెన్నై: కమల్‌హాసన్‌కు చెందిన రాజ్‌కమల్ ఫిల్మ్స్ ఇంటర్నేషనల్ పతాకంపై 'అమరన్' చిత్రంలో శివకార్తికేయన్ నటించిన విషయం తెలిసిందే. ఇదే కాంబినేషన్‌లో మరో చిత్రం తెరకెక్కనుందని ఇటీవల ప్రకటించిన నేపథ్యంలో ప్రస్తుతం చిత్రం టైటిల్‌ను 'సేయోన్'గా వెల్లడించారు. శివకుమార్ మురుగేశన్ దర్శకత్వంలో రూపొందుతున్న ఈ చిత్రం ఫస్ట్‌లుక్ పోస్టరును చిత్రబృందం విడుదల చేసింది. పోస్టరులో శివకార్తికేయన్ బనియన్, పంచె ధరించి విప్పుకున్న నెమలి పురి ఎదుట కత్తి పట్టుకుని కూర్చున్నారు. ఇది చిత్రంపై అభిమానుల్లో ఆసక్తిని రేకెత్తించేలా మారింది. చిత్రానికి సంతోశ్ నారాయణన్ సంగీతం అందించనున్నారు. చిత్రం ప్రోమో వీడియోను చిత్రబృందం విడుదల చేసింది. దీని ద్వారా చిత్రం అక్టోబరులో విడుదల కానున్నట్లు వెల్లడించింది.

వైభవంగా అంకాళ పరమేశ్వరి శ్మశానకొల్ల

పళ్లిపట్టు: అలంకరణలో అంకాళ పరమేశ్వరి ● ఆర్కేనగర్: మహిషాసురమర్దినిగా అమ్మవారు

పళ్లిపట్టు, న్యూస్‌టుడే: తిరువళ్లూర్ జిల్లా పళ్లిపట్టు సమీపం కీల్‌కాల్‌పట్టెడ గ్రామంలోని శ్రీ అంకాళ పరమేశ్వరి అమ్మవారి ఆలయ 123వ వార్షికోత్సవం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి సోమవారం రాత్రి గ్రామ వీధుల్లో ఊరేగించారు. మంగళవారం అమ్మవారిని ఊరేగింపుగా కుశస్థలి నది ఒడ్డుకు తీసుకెళ్లారు. అక్కడ ఇసుకలో రూపొందించిన రాక్షస రూపంపై అమ్మవారికి భోజనం, కుడుములు, నిమ్మకాయలు, పండ్లు, కోడిగుడ్లు తదితర వాటిని పెట్టి భక్తులు కొల్లగొట్టారు. కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

● **ఆర్కేనగర్:** కాంచీపురం పొన్నేరిక్కరై వద్ద ఉన్న అంకాళపరమేశ్వరి ఆలయంలో జరుగుతున్న ఉత్సవాల్లో భాగంగా మంగళవారం శ్మశానకొల్ల వేడుక ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా అమ్మవారు మహిషాసురమర్దినిగా భక్తులకు దర్శనమిచ్చారు. 18న ఊయల ఉత్సవం, 19న కుప్పాళ్యం ఉత్సవం జరగనున్నాయి.

చెన్నై డీజీపీ కార్యాలయ ప్రాంతంలోని శ్మశానంలో మంగళవారం శ్మశానకొల్ల జరిపారు. ఈ సందర్భంగా కొందరు భక్తులు దేవతామూర్తుల వేషధారణలో ఊరేగింపు నిర్వహించారు. పలువురు శ్మశానంలోని తమవారి సమాధుల వద్ద పూజలు చేశారు.

సముద్ర జలాల్లోకి ప్రవేశించనున్న శిక్షణ నౌక కృష్ణ

నౌక 'కృష్ణ' ప్రారంభ కార్యక్రమంలో అనుపమ, అనిల్ చౌహాన్ తదితరులు

వడపళని, న్యూస్‌టుడే: భారత నావికాదళం కోసం కాట్టుపల్లిలోని ఎల్ అండ్ టీ షిప్‌యార్డులో మూడు శిక్షణ నౌకలు నిర్మాణంలో ఉన్నాయి. అధునాతన సాంకేతికతతో తయారైన మొదటి నౌక 'కృష్ణ' సముద్ర జలాల్లోకి పంపడానికి ముందస్తు కార్యక్రమాలు మంగళవారం జరిగాయి. సముద్ర సంప్రదాయాలకు తగిన విధంగా 'డిఫెన్స్ వైవ్స్ వెల్ఫేర్ అసోసియేషన్(డీడబ్ల్యూడబ్ల్యూఏ)' అధ్యక్షురాలు అనుపమ ప్రారంభించారు. చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ అనిల్ చౌహాన్, వార్‌షిప్ ప్రొడక్షన్ అండ్ అక్విజిషన్ కంట్రోలర్ సంజయ్ సాధు, రియర్ అడ్మిరల్ ఉపల్ కుండు, తమిళనాడు, పుదుచ్చేరి నావికా విభాగ ఫ్లాగ్ ఆఫీసర్ కమాండింగ్ అరుణ్ రామచందని తదితరులు పాల్గొన్నారు. ఈ నౌకలో 20 మంది అధికారులు, 150 మంది నావికులు, 200 మంది కేడెట్లు పయనించే వీలుందని రక్షణ శాఖ మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొంది.

పర్యాటక కళ తప్పిన వాల్‌పారై

ట్రిప్లికేన్, న్యూస్‌టుడే: ఎండలతో వాల్‌పారై పర్యాటక కళను కోల్పోతోంది. కోయంబత్తూర్ జిల్లాలోని ముఖ్యమైన పర్యాటక ప్రదేశాలలో వాల్‌పారై ఒకటి. గత కొన్ని నెలలుగా ఇక్కడ ఆహ్లాదకరమైన వాతావరణం ఉండటంతో పర్యాటకుల రాక పెరిగింది. ఈ నేపథ్యంలో నెల రోజులుగా వాల్‌పారై, పరిసర ప్రాంతాల్లో ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటోంది. దీంతో కూళంగల్ నది, వెళ్లమలై నది, చిన్నకల్లార్, ఇరైచ్చిపారై జలపాతం, ఆనకట్టలలో నీరు కూడా ఇంకిపోయింది. ఈ కారణంగా వాల్‌పారైకు పర్యాటకుల సంఖ్య తగ్గుతోంది. సెలవు రోజుల్లోనూ అంతంతమాత్రంగానే వస్తున్నారు.

కూళంగల్ నది వద్ద అక్కడక్కడా కనిపిస్తున్న పర్యాటకులు

పద్మశ్రీ పురస్కారానికి ఎంపికైన దివంగత కృష్ణన్ సతీమణికి ప్రభుత్వ ఉద్యోగం

విల్లివాక్కం, న్యూస్‌టుడే: నీలగిరి జిల్లా ఆలుకురుంబర్ గిరిజన సామాజికవర్గానికి చెందిన దివంగత చిత్రకారుడు ఆర్.కృష్ణన్‌కు పద్మశ్రీ పురస్కారం ప్రకటించిన విషయం తెలిసిందే. ఆయన కుటుంబం పేదరికంలో ఉందని ప్రచార మాధ్యమాల్లో వార్తలు రావడంతో అవసరమైన సాయం అందించాలని ముఖ్యమంత్రి స్టాలిన్ ఆదేశించారు. ఆ మేరకు కృష్ణన్ సతీమణి సుశీలకు ఊటీ సమీపంలోని ముత్తొరైపాలాడ ఏకలవ్య రెసిడెన్షియల్ గిరిజన మోడల్ పాఠశాలలో తోటమాలి ఉద్యోగం ఇచ్చారు. నియామక ఉత్తర్వును సోమవారం నీలగిరి జిల్లా కలెక్టర్ లక్ష్మీభవ్య తన్నీరు అందజేశారు.



సుశీలకు నియామక ఉత్తర్వు అందిస్తున్న కలెక్టర్ లక్ష్మీభవ్య

అధికారంలో భాగస్వామ్యానికి ఒత్తిడి చేయలేదు

సైదాపేట, న్యూస్‌టుడే: అధికారంలో భాగస్వామ్యానికి ఒత్తిడి చేయలేదని వీసీకే అధ్యక్షుడు తిరుమావళవన్ తెలిపారు. చెన్నై విమానాశ్రయంలో ఆయన మంగళవారం విలేకర్లతో మాట్లాడారు. ఒక్కో పార్టీకి ఒక్కో విధానం ఉంటుందని, ఆ ప్రకారం డిమాండ్ అనేది సహజమని చెప్పారు. వీసీకే ప్రారంభించినప్పటి నుంచే అధికారంలో భాగస్వామ్యం తమ డిమాండ్లలో ఒకటని తెలిపారు. ఇది తమిళనాడులో సాధ్యమా అంటే ఇప్పట్లో లేదనే చెప్పాలన్నారు. అధికారంలో భాగస్వామ్యం కోరటం కాంగ్రెస్ హక్కు అని పేర్కొన్నారు. కూటమిలో చీలికలు వస్తాయని ప్రత్యర్థులు భావిస్తున్నారని, వారి కలలు ఫలించవని చెప్పారు.

విలేకర్లతో మాట్లాడుతున్న తిరుమావళవన్

దంపతుల దారుణహత్య

కుమారుడితో సుశీల్, గిరిజ (పాతచిత్రాలు) ● అరెస్టయిన పార్థసారథి

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: చెన్నై ఈసీఆర్ ప్రాంతంలో పట్టపగలే దంపతులను దారుణంగా హత్య చేసిన ఘటన కలకలం సృష్టించింది. పోలీసుల కథనం మేరకు.. . చెన్నై ఈస్ట్ కోస్ట్ రోడ్డులోని కానత్తూర్‌రెడ్డి కుప్పం భారతిదాసన్ వీధికి చెందిన పార్థసారథి(42), జమున దంపతులు. వీరి మధ్య అభిప్రాయభేదాలు తలెత్తడంతో రెండేళ్ల క్రితం జమున పిల్లలను తీసుకుని సైదాపేటలోని సోదరి ఇంటికి వెళ్లింది. దీంతో పార్థసారథి ఒంటరిగా ఉంటున్నాడు. అతని ఎదురింట్లో ఉంటున్న సుశీల్‌కి పార్థసారథి భార్య జమునకు వివాహేతర సంబంధం ఉన్నట్లు తెలుస్తోంది. సుశీల్ కారణంగానే తన భార్య వదిలి వెళ్లిపోయిందని పార్థసారథి అతనిపై పగ పెంచుకున్నాడు. ఈ నేపథ్యంలో సోమవారం సాయంత్రం సుశీల్ భార్య గిరిజతో వాహనం పార్కింగ్ విషయంలో పార్థసారథి గొడవపడ్డాడు. ఆక్రోశంతో ఇంట్లోకి వెళ్లి కత్తి తీసుకొచ్చి సుశీల్(35), గిరిజ(29)పై విచక్షణ రహితంగా దాడి చేశాడు. దీంతో వారు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. వీరికి ఏడు, నాలుగేళ్ల వయసున్న కుమారులున్నారు. నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆస్తి కోసం అమ్మానాన్నలపై కత్తితో కుమారుడి దాడి
తండ్రి మృతి, తల్లి పరిస్థితి విషమం

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: ఆస్తి కోసం తల్లిదండ్రులపై కుమారుడు కత్తితో కిరాతకంగా దాడి చేసిన ఘటన దిండుగల్ జిల్లాలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు... దిండుగల్ జిల్లా సంగైనాయక్కనూర్‌కు చెందిన పాండి(70), మీనాక్షి(69) దంపతులు. వీరికి కుమారుడు సురుళి(45) ఉన్నాడు. ఇదిలా ఉండగా కొన్నిరోజులుగా తన పేరిట ఆస్తులను రాయాలని సురుళి తరచూ తల్లిదండ్రులతో గొడవపడుతున్నాడు. ఈ నేపథ్యంలో సోమవారం రాత్రి ఆస్తికి సంబంధించి మళ్లీ తల్లిదండ్రులతో గొడవపడ్డాడు. ఈ క్రమంలో ఆక్రోశంతో కత్తితో వారిపై దాడి చేశాడు. తీవ్రంగా గాయపడిన వృద్ధులను స్థానికులు ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పాండి మృతి చెందారు. మీనాక్షి పరిస్థితి విషమంగా ఉంది. పోలీసులు కేసు నమోదు చేసి సురుళిని అరెస్ట్ చేశారు.

బస్సు ఢీకొని ప్రైవేటు ఉద్యోగి మృతి

పొన్నేరి: తిరువళ్లూర్ జిల్లా పొన్నేరి సమీపం ఆంగాడు ముత్తుమారి అమ్మవారి ఆలయానికి చెందిన బాలాజీ(37) ప్రైవేటు సంస్థలో ఉద్యోగి. ఈయన సోమవారం సాయంత్రం విధులు ముగించుకుని ద్విచక్ర వాహనంపై ఇంటికి బయలుదేరాడు. చోళిపాళ్యంలో ప్రైవేటు బస్సు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. రెడ్‌హిల్స్ పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించి బస్సు డ్రైవర్ ప్రభును అరెస్టు చేశారు.

తరగతి గదిలో స్పృహకోల్పోయి విద్యార్థి...

ఆర్కేనగర్: తిరుప్పూర్ జిల్లా కనకంపాళ్యం ప్రాంతంలోని ప్రభుత్వ మహోన్నత పాఠశాలలో పుదూర్ ప్రాంతానికి చెందిన మురళి, మణిమేఘలై దంపతుల కుమారుడు దీపక్ ఏడో తరగతి చదువుతున్నాడు. ఇదిలా ఉండగా మంగళవారం పాఠశాలకు వెళ్లిన దీపక్ మధ్యాహ్నం భోజనం తిన్న తర్వాత తరగతి గదికి వెళ్లాడు. ఉన్నట్టుండి నోట్లో నురగలు వచ్చి స్పృహకోల్పోయాడు. ఉపాధ్యాయులు ఆస్పత్రికి తీసుకెళ్తుండగా మార్గమధ్యంలోనే బాలుడు మృతి చెందాడు. మృతిలో అనుమానం ఉందని, ఉపాధ్యాయులు కొట్టడంతోనే చనిపోయాడని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పోక్సో కేసులో యువకుడి అరెస్టు

వేలూర్, న్యూస్‌టుడే: తిరువణ్ణామలై జిల్లా తిరువణ్ణామలై ప్రాంతానికి చెందిన దంపతులకు ఆడ పిల్లలు లేకపోవడంతో బెంగళూరుకు చెందిన ఓ బాలికను దత్తత తీసుకున్నారు. ప్రస్తుతం 14ఏళ్ల వయసున్న బాలిక గుడియాత్తం సమీపంలోని బంధువుల ఇంట్లో ఉంటూ అక్కడి పాఠశాలలో 9వ తరగతి చదువుతోంది. ఈ క్రమంలో తల్లిదండ్రులను చూసేందుకు తిరువణ్ణామలై వెళ్లగా ఆమెకు తీవ్ర కడుపునొప్పి వచ్చింది. తల్లిదండ్రులు ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన డాక్టర్లు బాలిక గర్భంతో ఉన్నట్లు నిర్ధారించి గుడియాత్తం ఆల్ ఉమెన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు దర్యాప్తు చేపట్టి అత్యాచారానికి పాల్పడిన గుడియాత్తం ప్రాంతానికి చెందిన కమలేష్(24)ను పోక్సో చట్టం కింద అరెస్టు చేశారు. పోలీసు స్టేషన్‌కు తీసుకెళ్లి విచారిస్తుండగా పోలీసుల కళ్లుగప్పి తప్పించుకున్నాడు. బెంగళూరులో ఉన్నట్లు గుర్తించిన పోలీసులు అక్కడకు వెళ్లి కమలేష్‌ను అరెస్టు చేసి మంగళవారం గుడియాత్తం తీసుకొచ్చారు.

హత్య కేసులో పరారీ నిందితుడు...


నిందితుడు తిల్లైఆనందన్

గిండి: పెండింగ్ కేసుల్లో నిందితులను అరెస్టు చేయాలని కోర్టు, చెన్నై పోలీసు కమిషనర్ ఆదేశాలు జారీ చేశారు. ఆ మేరకు 2010లో దురైపాక్కం పోలీసు క్వార్టర్స్ పరిధిలోని విల్సన్(45) అనే వ్యక్తి హత్యకు గురయ్యాడు. ఈ కేసులో నిందితుడు కారైపాక్కంకు చెందిన తిల్లై ఆనందన్‌ను అరెస్టు చేశారు. ఇతను బెయిలుపై బయటికొచ్చి కోర్టులో హాజరుకాకుండా తప్పించుకు తిరుగుతున్నాడు. దీంతో కోర్టు గతేడాది జులైలో అరెస్టు వారెంటు జారీ చేసింది. దురైపాక్కం పోలీసులు గాలించి ఆనందన్‌ను సోమవారం అరెస్టుచేసి కోర్టులో హాజరుపరచి రిమాండుకు తరలించారు.

భూ కబ్జా కేసులో మరొకరు...

ప్యారిస్: చెన్నై అయ్యప్పన్‌తాంగల్‌కి చెందిన పర్మిళ నాయకి అనే మహిళ 2021లో చెన్నై పోలీసు కమిషనరు కార్యాలయంలో ఓ ఫిర్యాదు చేశారు. అందులో.. షోళింగనల్లూర్‌లో తనకు చెందిన సుమారు 6,400 చదరపు అడుగుల ఖాళీ స్థలాన్ని రమేష్, లక్ష్మీనారాయణన్ అనే వ్యక్తులు నకిలీ పత్రాలతో ఆక్రమించుకుని, వారి పేరిట రిజిస్టర్ చేయించుకున్నారని, అదేవిధంగా పత్రాలను ఫైనాన్స్ సంస్థలో తాకట్టు పెట్టి రూ.3 కోట్లు రుణం తీసుకున్నారని చెప్పారు. ఇందుకు సంబంధించి సెంట్రల్ క్రైం బ్రాంచ్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టి రమేష్, ప్రేమ్‌కుమార్, కుషాల్ చంద్ అనే నిందితులను 2021లో అరెస్టు చేశారు. ఆ తర్వాత గతేడాది లక్ష్మీనారాయణన్ భార్య సుమతిని అరెస్టు చేశారు. ఈ నేపథ్యంలో ఈ కేసులో ఐదేళ్లుగా పరారీలో ఉన్న లక్ష్మీనారాయణన్‌ను సోమవారం అరెస్టు చేశారు. కోర్టులో హాజరుపరచి రిమాండ్‌కి తరలించారు.

రైల్లో మత్తుమాత్రలు తరలిస్తున్న విదేశీయులు సహా నలుగురు..

అరెస్టయిన నిందితులు

గుమ్మిడి పూండి: ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రం నెల్లూరు, సూళ్లూరుపేట తదితర ప్రాంతాల నుంచి రైళ్లలో కొందరు తిరువళ్లూర్ జిల్లా గుమ్మిడిపూండి మీదుగా చెన్నైకి మత్తుమాత్రలు తరలిస్తున్నారని జిల్లా ఎస్పీ వివేకానంద శుక్లాకు సమాచారం అందింది. ఆయన ఆదేశాల మేరకు ఎస్సై రవి నేతృత్వంలో పోలీసులు గుమ్మిడిపూండి రైల్వేస్టేషన్‌లో మంగళవారం తనిఖీలు చేపట్టారు. నెల్లూరు నుంచి చెన్నై వైపు వెళ్తున్న రైలు నుంచి దిగిన మహిళ సహా నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని సోదా చేశారు. వారి నుంచి 120 మత్తుమాత్రలు, 55 గ్రాముల కొకైన్, 10 గ్రాముల మెథాంఫెటమైన్ అనే మత్తుపదార్థం స్వాధీనం చేసుకున్నారు. నిందితులు ఉత్తరప్రదేశ్‌కు చెందిన అర్పితదాస్, నైజీరియాకు చెందిన సిబుసోర్ సెట్రాక్, నోన్‌సోజో ఆక్సిన్, కోయంబత్తూర్‌కు చెందిన విష్ణుగా తేలింది. నిందితులను అరెస్టు చేసి కోర్టులో హాజరుపరచి రిమాండుకు తరలించారు.

చోరీ కేసులో నిందితుడు...

గుమ్మిడిపూండి: తిరువళ్లూర్ జిల్లా మాదర్‌పాక్కం సమీపం మా.నెల్లూరుకు చెందిన రాము రైతు. ఈయన కుమారుడికి ఈనెల 20న వివాహం జరగనుంది. ఇందుకోసం ఆయన తన భార్య రాజేశ్వరితో కలిసి బంధువులకు ఆహ్వానపత్రికలు అందజేసేందుకు ఈనెల 13న చెన్నై వెళ్లారు. ఆ సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు ఇంటి తాళం పగులగొట్టి 5 సవర్ల నగలు, రూ.50 వేల నగదు ఎత్తుకెళ్లారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పాదిరివేడు పోలీసులు దర్యాప్తు చేపట్టి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తిరుపతి జిల్లా సత్యవేడుకు చెందిన గోవిందన్ అనే వ్యక్తిని మంగళవారం అరెస్టు చేసి నగలు, నగదు స్వాధీనం చేసుకున్నారు.

ప్లాట్ల విక్రయం పేరిట రూ.15 లక్షలు మోసం చేసిన వ్యక్తి...

గిండి, న్యూస్‌టుడే: చెన్నై సాలిగ్రామానికి చెందిన బాలచందర్‌కు 2024లో స్నేహితుడి ద్వారా భాస్కరన్ అనే వ్యక్తితో పరిచయం ఏర్పడింది. భాస్కరన్ తనకు కాంచీపురంలో స్థలం ఉందని, ప్లాట్లుగా మార్చి అమ్ముతున్నట్టు చెప్పాడు. రెండు ప్లాట్లు అమ్ముతానని బాలచందర్‌కు చెప్పి రూ.15 లక్షలు తీసుకున్నాడు. రిజిస్ట్రేషన్ చేయమని బాలచందర్ అడుగుతున్నా భాస్కరన్ పట్టించుకోకపోవడంతో సందేహించిన బాలచందర్ స్థలం గురించి పలువురిని విచారించారు. అది వేరొకరి స్థలమని తెలియడంతో విరుగంబాక్కం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు దర్యాప్తు చేసి భాస్కరన్‌ను అరెస్టు చేశారు. సోమవారం కోర్టులో హాజరుపరచి రిమాండుకు తరలించారు.

క్రైం కార్నర్

ఆలయ ప్రాంగణంలో వ్యక్తి మృతదేహం లభ్యం

పొన్నేరి, న్యూస్‌టుడే: తిరువళ్లూర్ జిల్లా రెడ్‌హిల్స్ సమీపం పెరుంగావూరులో పెరుమాళ్ ఆలయ నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఆలయం ప్రాంగణంలో సుమారు 50ఏళ్ల వయసున్న వ్యక్తి మృతదేహం పడి ఉండటాన్ని స్థానికులు గమనించి చోళవరం పోలీసులకు సమాచారం అందించారు. వారు అక్కడకు చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టానికి తరలించారు. మృతుడు సిరుక్కావూరుకు చెందిన రైతు కూలీ నాగప్పన్‌గా తేలింది. మృతికి కారణాలపై దర్యాప్తు చేస్తున్నారు.

హత్య కేసులో ఇద్దరు మహిళలు సహా 9 మందికి జీవిత ఖైదు

గిండి, న్యూస్‌టుడే: చెన్నై తిరువాన్మియూరుకు చెందిన చిన్నయ్య అలియాస్ ఏళుమలై(40), అదే ప్రాంతానికి చెందిన పుష్పరాజ్ మధ్య పాతకక్షలున్నాయి. 2010 జులై 14వ తేదీ రాత్రి చిన్నయ్య ఇంట్లోకి చొరబడిన పుష్పరాజ్, అతని కుమారులు తదితర 10మందికి పైగా.. చిన్నయ్య, అతని కుటుంబీకులపై కత్తులతో దాడి చేశారు. తీవ్రంగా గాయపడి చిన్నయ్య మృతిచెందాడు. తిరువాన్మియూర్ పోలీసులు ఇద్దరు మహిళలు సహా 16 మందిని అరెస్టు చేశారు. కేసు విచారణ చెన్నై 7వ అదనపు కోర్టులో జరుగుతోంది. 2017 మార్చిలో ఇద్దరు నిందితులు చనిపోయారు. అనంతరం నిందితులను విడుదల చేస్తూ కోర్టు తీర్పు నివ్వడంతో పోలీసులు మద్రాసు హైకోర్టులో పిటిషన్ వేశారు. ఈ క్రమంలో మరో ఐదుగురు నిందితులు మరణించారు. ఈ నేపథ్యంలో ఈనెల 11, 16 తేదీలలో జరిగిన విచారణలో నేరం రుజువు కావడంతో ఇద్దరు మహిళలు సహా 9 మందికి జీవిత ఖైదు, తలా రూ.వెయ్యి జరిమానా విధిస్తూ న్యాయస్థానం ఉత్తర్వులు జారీ చేసింది.

దాడి కేసులో దోషికి రెండేళ్లు...

గిండి: చెన్నై అగరం సింగారనాయకర్ వీధికి చెందిన జానకిరామ్ సోదరుడు జంబులింగం వద్ద సచ్చిదానందం అనే వ్యక్తి పనిచేశాడు. అతను పని సరిగా చేయట్లేదని అన్నదమ్ములు మందలించారు. దీంతో ఇద్దరిపై సచ్చిదానందం దాడి చేశాడు. బాధితులు చెన్నై మధురవోయల్ పోలీసు స్టేషన్‌లో 2012 మార్చి 16న ఫిర్యాదు చేశారు. పోలీసులు నిందితుడిని అరెస్టు చేశారు. ఈ కేసు విచారణ పూందమల్లి జ్యుడిషియల్ కోర్టులో సోమవారం ముగిసింది. నేరం రుజువు కావడంతో సచ్చిదానందం(42)కు రెండేళ్ల జైలు శిక్ష, రూ.10వేలు జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు. జరిమానా చెల్లించకుంటే మరో నెల రోజులు జైలు శిక్ష అనుభవించాలని ఆదేశించారు.

వివాహిత ఆత్మహత్య

వేలూర్, న్యూస్‌టుడే: తిరుపత్తూరు జిల్లా జోలార్‌పేట సమీపం చిన్న కమ్మియంపట్టు ప్రాంతానికి చెందిన కూలీ శరవణన్, గీత(35) దంపతులు. భార్యాభర్తల మధ్య ప్రతిరోజూ గొడవలు జరుగుతున్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో మంగళవారం ఉదయం మళ్లీ గొడవ జరిగింది. మనస్తాపానికి గురైన గీత సమీపంలోని వ్యవసాయ బావిలో దూకింది. ఆమెను కాపాడే ప్రయత్నంలో శరవణన్ కూడా నీటిలో మునిగిపోయాడు. స్థానికులు ఇద్దరిని బయటకు తీసి జోలార్‌పేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ పరీక్షించిన వైద్యులు గీత మృతి చెందినట్లు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రథం బోల్తాపడి 10 మందికి గాయాలు

ప్రమాదానికి గురైన రథం

వేలూర్, న్యూస్‌టుడే: వేలూర్ జిల్లాలో ఏటా ఏటా మహాశివరాత్రి తర్వాత రోజు శ్మశానకొల్ల ఉత్సవం కోలాహలంగా జరుగుతుంది. ఆ ప్రకారం సోమవారం వేలూర్‌లోని పలు ప్రాంతాల్లో అలంకరించిన రథాలను పాలారు నది ఒడ్డుకు తీసుకొచ్చారు. ఈ నేపథ్యంలో కళింజూరు ప్రాంత రథం ట్రాక్టర్‌తో పాటు బోల్తాపడింది. ప్రమాదంలో 10 మంది గాయపడ్డారు.

దొంగకు దేహశుద్ధి

వేలూర్, న్యూస్‌టుడే: వేలూర్ జిల్లా ఆనైకట్టు సమీపం వెలంగడు మునియంపట్టు ప్రాంతానికి చెందిన దినేష్‌బాబు చెన్నైలోని ఓ ప్రైవేటు కంపెనీలో పనిచేస్తున్నారు. ఈయనకు భార్య మంజుల, ఇద్దరు పిల్లలున్నారు. ఇదిలా ఉండగా మంగళవారం ఉదయం మంజుల ఇంటికి తాళం వేసి గుడియాత్తంలోని ఆస్పత్రికి వెళ్లింది. తిరిగి వచ్చి చూడగా తలుపులు తెరచి ఉన్నాయి. లోపల ఓ గుర్తు తెలియని వ్యక్తి కనిపించాడు. నగలు, నగదు, వెండి వస్తువులతో పారిపోయేందుకు సిద్ధంగా ఉన్నాడు. అప్రమత్తమైన మంజుల బయటకు పరుగెత్తి తలుపులు మూసి ఇరుగుపొరుగువారిని పిలిచింది. వారు అక్కడకు వచ్చి దొంగను పట్టుకుని దేహశుద్ధి చేశారు. తరువాత ఆనైకట్టు పోలీసులకు అప్పగించారు. నిందితుడు తిరుపత్తూరు సమీపం మాదనూరు ప్రాంతానికి చెందిన అన్బరసు(35)గా తెలిసింది.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Ph: 044-28232390
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 97910 83205, 97910 74993

(c) eenadu

వైభవంగా త్రిశూలస్నానం

త్రిశూల స్నానం నిర్వహిస్తున్న అర్చక స్వాములు

తిరుపతి (తితిదే), న్యూస్‌టుడే: తిరుపతి శ్రీ కపిలేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో చివరి రోజు మంగళవారం ఉదయం త్రిశూలస్నానం వైభవంగా నిర్వహించారు. కపిల తీర్థం పుష్కరిణిలో అర్చక స్వాములు శైవాగమ శాస్త్రానుసారం ఈ ఘట్టాన్ని ముగించారు. ఉదయం శ్రీ నటరాజ స్వామివారు సూర్యప్రభ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం అర్చకులు శాస్త్రోక్తంగా త్రిశూలస్నానం నిర్వహించారు. సాయంత్రం ధ్వజారోహణంతో శ్రీకపిలేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ముగిశాయి. రాత్రి రావణాసుర వాహనసేవ జరిగింది. ఆలయ సూపరింటెండెంట్ చంద్రశేఖర్, ఏవీఎస్వో రమేష్ కృష్ణ పాల్గొన్నారు.

నులిపురుగులను నలిపేద్దాం..

తిరుపతి (కలెక్టరేట్) న్యూస్‌టుడే: జాతీయ నులిపురుగుల దినం సందర్భంగా మంగళవారం కలెక్టరేట్‌లో విద్యార్థులకు కలెక్టర్ వెంకటేశ్వర్ అల్బెండజోల్ మాత్రలు వేశారు. ఆయన మాట్లాడుతూ నులిపురుగులతో రక్తహీనత, పోషకాహార లోపం, ఎదుగుదల మందగింపు వంటి సమస్యలు తలెత్తుతాయని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా మొదటి విడతలో 4,97,311 మంది పిల్లలకు అల్బెండజోల్ మాత్రలను వేయనున్నట్లు తెలిపారు. మంగళవారం గైర్హాజరైన, అనారోగ్యంతో ఉన్న పిల్లలకు ఈ నెల 24న మాప్-అప్ దినంగా మాత్రలు పంపిణీ చేస్తామని తెలిపారు.

విద్యార్థినికి అల్బెండజోల్ మాత్ర వేస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

కళ్లెదుటే మృగాడు!

■ చిన్నారిని కబళించిన కీచకుడు ■ మదనపల్లె పట్టణంలో దుర్ఘటన

ఈ ప్రశ్నకు బదులేది?

ఆడ పిల్లగా పుట్టడం నేను చేసిన తప్పా అమ్మా!

పట్టపగలు బయట తిరగడం నేరమా నాన్నా!

ఆప్యాయంగా మాట్లాడితే నమ్మడం పాపమా అంకుల్!

పసి మొగ్గలనూ చిదిమేసే రాక్షస లోకమని తెలియలేదు అన్నా!

ఎదురింట్లోని ఓ మృగాడు కన్నేశాడని.. కాటేయడానికి చూస్తున్నాడని ఊహించలేదు బాబాయ్

● ఇలాగైతే నాలాంటి బాలికలు బయట తిరిగేదెలా? మమ్మల్ని కాపాడటానికి అమ్మా, నాన్న నిత్యం వెంట ఉండాలంటే సాధ్యమా? కులవర్ధన్ లాంటి దుర్మార్గుల నుంచి మాకు రక్షణ కల్పించేదెవరు? స్వేచ్ఛగా తిరిగేలా భద్రత కల్పించేదెవరు?

● విగతజీవిగా పడి ఉన్న ఏడేళ్ల చిన్నారి వేస్తున్న ప్రశ్నలివి.. వీటికి సమాధానం చెప్పేదెవరు? ఆడపిల్లకు అండగా నిలిచేదెవరు? మదనపల్లె పట్టణంలోని నీరుగుట్టువారిపల్లెకు చెందిన చిన్నారి సోమవారం అదృశ్యమై మంగళవారం ఉదయం ఎదురింట్లోని యువకుడి గదిలో నీటి డ్రమ్ములో శవంగా తేలింది.

మానవీయ విలువలకే సమాధి కట్టే.. మనుషులమన్న విషయానికే అనుమానమొచ్చే దుర్ఘటన మంగళవారం మదనపల్లె జిల్లా కేంద్రంలో చోటు చేసుకుంది. మృగాడి వాంఛాగ్నిలో ఓ లేత కలువ కాలిపోయింది. నీరుగట్టువారిపల్లెకు చెందిన కులవర్ధన్ ఏడేళ్ల చిన్నారిపై హత్యాచారానికి పాల్పడిన ఉదంతం ఇది..

- న్యూస్‌టుడే, మదనపల్లె నేరవార్తలు, పట్టణం, గ్రామీణ

అభం శుభం తెలియని ఏడేళ్ల చిన్నారిని గంజాయి, మద్యానికి బానిసైన ఓ దుర్మార్గుడు లైంగికంగా దాడి చేయడంతో పాటు నీటి డ్రమ్ములో ముంచేసి చంపేశాడు.. మృతదేహాన్ని ఎవరికీ కన్పించకుండా నీటి డ్రమ్ములో ఉంచి మూతపెట్టి నిద్రపోయాడు. బాలిక కోసం గాలింపు చేపట్టిన పోలీసులు అనుమానంతో అతని ఇంటిని పరిశీలించగా మృతదేహం బయటపడింది. నిందితుడు పరారీలో ఉండగా చిన్నారి మృతదేహాన్ని మార్చురీకి తరలించేందుకు యత్నించిన పోలీసులు ఆమె కుటుంబ సభ్యులతో పాటు పెద్ద సంఖ్యలో ప్రజలు అడ్డుకున్నారు. నిందితుడిని ప్రజా కోర్టులో ఉరి తీయాలని, లేదంటే తమకు అప్పగించాలని డిమాండ్ చేస్తూ సాయంత్రం వరకు ఆందోళన చేపట్టారు. ఈ ఆందోళన తీవ్ర ఉద్రిక్తతకు దారి తీసింది.

వీరబల్లి మండలంలోని ఓ గ్రామానికి చెందిన కుటుంబం 15 సంవత్సరాల క్రితం మదనపల్లె పట్టణంలోని ఓ వీధిలో అద్దె ఇంటిలో చేరారు. భార్యాభర్తలు వేర్వేరు పనులు చేసుకుంటూ పిల్లలిద్దరినీ స్థానికంగా ఉన్న ఓ ప్రైవేటు పాఠశాలలో చదివిస్తున్నారు. సోమవారం పాఠశాలకు సెలవు కావడంతో బాలిక ఇంటి వద్దనే ఉంది. తల్లి తనతో పాటు రావాలని కోరినా చిన్నారి అవ్వా తాతతో కలిసి ఇంట్లోనే ఉంటానని చెప్పడంతో ఆమె విధులకు వెళ్లి పోయింది.

జాతీయ రహదారిపై స్థానికుల ఆందోళన

నిందితుడికి ఉరిశిక్ష విధించాలని వాహనాలపైకెక్కిన నిరసనకారులు

కామం కళ్లనే కాదు మెదడును మూసేస్తుంది
వావి వరసలు కన్పించకుండా చేస్తుంది
కోరిక మనిషినే కాదు.. మానవత్వాన్ని చంపేస్తుంది
చిన్నా.. పెద్దా గౌరవాలను తుంచేస్తుంది.
దుర్మార్గపు ఆలోచన మృగాడిగా మారుస్తుంది.
స్త్రీ అయితే చాలు.. పసిపిల్లలు, ముసలోళ్లు అన్న తేడా లేకుండా చేస్తుంది... ఈ దుర్మార్గుడికి మృగాలోచన వచ్చింది..
మెదడును గంజాయి మత్తు కమ్మేసింది..
మానవత్వాన్ని చంపేసింది.. ఏడేళ్ల చిన్నారిపై హత్యాచారానికి పురిగొల్పింది.

కులవర్ధన్

సోమవారం 4:30 చిన్నారి కన్పించకపోవడంతో అవ్వా, తాత వెతికారు. ఆచూకీ దొరక్కపోవడంతో పనికి వెళ్లిన కోడలికి ఫోన్ చేసి చెప్పారు. తల్లి వెంటనే ఇంటికి వచ్చింది. ఇదే విషయాన్ని భర్తకు తెలియజేసింది. స్థానికుల సాయంతో కుటుంబ సభ్యులంతా కలిసి చుట్టుపక్కల గాలించారు.

6:00 చిన్నారి ఆచూకీ దొరక్కపోవడంతో ఒకటో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. 6.15 గంటలకు ఎఫ్ఐఆర్ నమోదు చేసిన పోలీసులు హెడ్‌కానిస్టేబుల్‌తో పాటు మరో ఇద్దరు సిబ్బంది విచారణ ప్రారంభించారు. సీఐ మహమ్మద్ రఫీ సాంకేతిక బృందంతో చుట్టుపక్కల గాలించారు.

అర్ధరాత్రి 1:30 చిన్నారి ఇంటి ముందున్న కులవర్ధన్ (30)పై అనుమానం రావడంతో అతని ఇంటి తలుపు తట్టారు. తీయకపోవడంతో తలుపుపై భాగంలో ఉన్న కిటికీలో నుంచి చరవాణిలో వీడియో తీశారు. కులవర్ధన్ మంచంపై నిద్రిస్తున్నట్లు గుర్తించారు. మద్యం మత్తులో నిద్రపోయి ఉంటాడన్న అనుమానంతో పోలీసులు వెళ్లిపోయారు.

ఉదయం 7:00 మంగళవారం ఉదయం కులవర్ధన్ ఇంటి వద్దకు చేరుకుని అతన్ని నిద్రలేపే యత్నం చేశారు. నిద్రలేచిన కులవర్ధన్ తలుపు తీసి పోలీసులను బయటకు నెట్టి.. వారిపై దాడికి యత్నించాడు. పారిపోయేందుకు చూశాడు.

7:15 కులవర్ధన్ నిద్రిస్తున్న గదిలోనే ఉన్న ప్లాస్టిక్ డ్రమ్ములో శరీరంపై ఎలాంటి దుస్తులు లేని స్థితిలో చిన్నారి మృతదేహాన్ని గుర్తించారు.

7:40 అప్పటికే విషయం పాకిపోవడంతో పెద్ద సంఖ్యలో జనం అక్కడికి చేరుకుని నిందితుడిని తమకు అప్పగించాలని పోలీసులను అడ్డుకున్నారు. చిన్నారి మృతదేహం ఉన్న ఇంట్లోకి వెళ్లకుండా అడ్డుకున్నారు. బాలిక బంధువులు, స్థానికులు నీరుగట్టువారిపల్లెలోని రహదారిపై బైఠాయించి ఆందోళన చేశారు. ముంబయి- చెన్నై జాతీయ రహదారిపై సాయంత్రం 5 గంటల వరకు ఆందోళన చేశారు. అన్నమయ్య జిల్లా ఇన్‌ఛార్జిగా ఉన్న కడప ఎస్పీ నచికేత్ విశ్వనాథ్ మధ్యాహ్నం 2 గంటలకు అక్కడికి చేరుకున్నారు.

సాయంత్రం 6:35 పోలీసులు చిన్నారి మృతదేహం ఉన్న ఇంట్లోకి వెళ్లి అన్ని పరిశీలించిన అనంతరం 6.42కు పోలీసు బందోబస్తు మధ్య శవాన్ని మదనపల్లె ఆసుపత్రికి తరలించారు.

రాత్రి 8:40 డీఐజీ కోయ ప్రవీణ్ మదనపల్లె చేరుకుని రాత్రి 8 గంటలకు చిన్నారి మృతదేహానికి శవపరీక్ష చేయించి రాత్రి 8.40 గంటలకు కుటుంబ సభ్యులకు అప్పగించారు.

పూత బాగుంది.. పిందే అనుమానం

పెరుగుతున్న ఉష్ణోగ్రతలతో మామిడి రైతుల్లో ఆందోళన

పుత్తూరు, న్యూస్‌టుడే: ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ఈసారి మామిడి పూత ఆరంభంలో ఆశించిన విధంగా ఉన్నా రాబోయే మూడు నెలలు ప్రకృతి పైనే భారం వేయాలి. వాస్తవానికి డిసెంబర్ 15 నుంచి జనవరి ఆఖరు వరకు పూత కాలం. అయితే ఈ ఏడాది డిసెంబర్, జనవరిలో వాతావరణం అనుకూలించకపోవడంతో పూత ఆశించిన మేర రాలేదు. ఫిబ్రవరి మొదలు కొంచెం వాతావరణంలో మార్పులు చోటు చేసుకోవడంతో విస్తారంగా పూత పూస్తోంది. అదే సమయంలో శివరాత్రి వరకే మంచు పడుతుంది. ఈ సమయంలోనే పిందెలు నిలబడే అవకాశం ఉంటుందని రైతులు పేర్కొంటున్నారు.

- ● ఉమ్మడి జిల్లాలో మామిడి సాగు: **1.05** లక్షల హెక్టార్లు
- ● సాగు రకాలు: బేనీషా, తోతాపురి, రుమాని, కాలేపాడు, చందూర, ఇతరత్రా
- ● ఎగుమతి: నాగ్‌పూర్, నాందేడ్, హైదరాబాద్, ముంబయి, చెన్నై, పుణె
- ● పల్ప్ ఫ్యాక్టరీలు: **48** (దేశంలోనే అత్యధికం)

వాతావరణంలో మార్పులతో..

శివరాత్రి తర్వాత ఎండలు ప్రతాపాన్ని చూపనున్నాయి. ప్రస్తుతం రాత్రుల్లో మంచుతో కూడిన చలి ఉంది. పగలు మాత్రం సూర్యుడు సుర్రుమంటున్నాడు. ఈ వాతావరణం పంట దిగుబడిపై ప్రభావం చూపుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే వేలాది రూపాయలు వ్యయం చేసి సస్య రక్షణ చర్యలు చేపడుతున్నారు. ఈసారి పూత ఆశాజనకంగా ఉండడంతో కౌలు యజమానులు తోటల కొనుగోలుకు మక్కువ చూపుతున్నారు. రైతులు మాత్రం మామిడి తోట కాపును విక్రయించేందుకు సుముఖత చూపడం లేదు.

సర్వదర్శనానికి 8 గంటలు

తిరుమల, తిరుపతి (తితిదే), న్యూస్‌టుడే: శ్రీవారి సర్వదర్శనానికి 8 గంటల్లో, రూ.300 ఎస్ఈడీ టికెట్లు కలిగిన భక్తులకు 3 గంటల్లో దర్శనం లభించనుంది. సోమవారం శ్రీవారిని 73,776 మంది దర్శించుకున్నారు. రూ.4.42 కోట్లు హుండీ కానుకలు లభించాయి. శ్రీనివాసం, విష్ణు నివాసం, భూదేవి కాంప్లెక్స్ వద్ద మంగళవారం భక్తులకు 15 వేల సర్వ దర్శన టోకెన్లు జారీ చేశారు. వీరికి బుధవారం వేకువ జామున 3 నుంచి రాత్రి 10వరకు దర్శనం కానుంది. శ్రీవారి మెట్టు నడకదారి భక్తులకు 2 వేల టోకెన్లు జారీ చేశారు.

నేడు 'పారిశ్రామిక వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక'

తిరుపతి (జీవకోన), న్యూస్‌టుడే: ఏపీఎస్పీడీసీఎల్ సర్కిల్ పరిధిలోని తిరుపతి, చిత్తూరు, నెల్లూరు, కడప, కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీసత్యసాయి, అన్నమయ్య జిల్లాల్లోని పారిశ్రామిక విద్యుత్తు వినియోగదారుల సమస్యల సత్వర పరిష్కారానికి బుధవారం పరిష్కార వేదిక నిర్వహిస్తున్నట్లు సంస్థ సీఎండీ శివశంకర్ లోతేటి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎస్ఈల పరిధిలో పరిష్కారం కానీ సమస్యలను నేరుగా తమ దృష్టికి తీసుకురావచ్చన్నారు.

స్థలం: తిరుపతిలోని సంస్థ కార్పొరేట్ కార్యాలయం.
సమయం: ఉదయం 10.30 నుంచి 11.30 వరకు.
సంప్రదించాల్సిన నంబర్లు:
టోల్‌ఫ్రీ: 1912, 1800425155333

హాయిగా.. క్షేమంగా

తిరుపతి నుంచి మదనపల్లెకి వెళ్లే మార్గంలో గతంలో నిత్యం ఏదో ఒక చోట ప్రమాదాలు జరిగేవి. ఇటువైపు ప్రయాణమంటేనే హడలెత్తిపోయేవారు. ప్రస్తుతం ఆరు వరుసల జాతీయ రహదారి నిర్మాణం జరగడంతో వాహనదారుల కష్టాలు, భయాలు తీరాయి. అడుగడుగునా ప్రమాద సూచికలు ఏర్పాటు చేశారు. మలుపుల్లోనూ వాహనదారులు అప్రమత్తమయ్యేలా చర్యలు తీసుకున్నారు. రాతి గుట్టలను తొలిచినచోట రాళ్లు జారిపడకుండా.. సిమెంటుతో ప్లాస్టరింగ్ చేశారు. భాకరాపేట వంకర్లు తిరిగిన రహదారి ఆకట్టుకుంటోంది.

– ఈనాడు, తిరుపతి

భక్తులకు అమావాస్య కష్టాలు

ప్రత్యామ్నాయం లేక.. పాట్లు

రూ.1500 రాహు, కేతు మండపం వద్ద పూజల నిర్వహణకు నిరీక్షిస్తున్న జనం

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: రాహు, కేతు సర్పదోష నివారణ పూజల కోసం ముక్కంటి ఆలయానికి వచ్చే భక్తులు అవస్థలు పడాల్సి వచ్చింది. అమావాస్య, మంగళవారం కలసి రావడంతో భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. శివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆలయంలో మహద్వారం లోపల నిర్వహించే రూ.2500, రూ.5 వేల టికెట్ల ద్వారా నిర్వహించే రాహు, కేతు పూజలు రద్దు చేశారు. దీంతో మహద్వారం బయట నిర్వహించే రూ.1500ల రాహు, కేతు పూజలు చేయించుకోవడానికి భక్తులు పోటెత్తారు. ఇక్కడి మండపం చిన్నది కావడం, ప్రత్యామ్నాయ సదుపాయాలు కల్పించని కారణంగా భక్తులకు అవస్థలు తప్పలేదు.

104FM Tirupati
ఈఎఫ్ఎమ్ కార్యక్రమాలు
సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ॥ 5 - ఉ॥ 7
ఈ-మార్నింగ్స్	ఉ॥ 7 - ఉ॥ 11
నువ్వానేనా	ఉ॥ 11 - మ॥ 2
సత్యభామ	మ॥ 2 - సా॥ 5
లైట్ తీస్కో	సా॥ 5 - రా॥ 9
సరదాగా కాసేపు	రా॥ 9 - రా॥ 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా॥ 12 - తె॥ 5

/Eenadufm
For Advertising on Eenadu FM Contact
8008555167, 9154991499

భూతల కైలాసంలో.. భవుని కల్యాణం

కమనీయ వేడుకకు.. ఏర్పాట్లు సిద్ధం

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: బ్రహ్మోత్సవాల్లో ప్రధాన ఘట్టం భక్తపరాధీనుడి కల్యాణమే. అన్నీ ఆలయాల్లో ఈ వేడుకలను ఆలయ ఆవరణలో నిర్వహిస్తారు. భక్తుల పాలిట భూతల కైలాసంగా ప్రసిద్ధి చెందిన శ్రీకాళహస్తిలో మాత్రం అందుకు భిన్నంగా అమావాస్య.. అర్ధరాత్రి.. నడివీధిలో భక్తుందరి మధ్యలో ఆయన వివాహం చేసుకోవడం ఇక్కడి ప్రత్యేకత.

ముస్తాబైన పెళ్లిమండపం

వరునిగా కైలాసవాసి, వధువుగా జ్ఞానాంబికల వివాహ మహోత్సవానికి పట్టణంలోని పెళ్లిమండపం వేదికగా ఏర్పాట్లు సిద్ధమయ్యాయి. వివాహ వేదిక వద్దకు సోమస్కందమూర్తి గజవాహనంపై, జ్ఞానాంబిక సింహవాహనంపై శివపరివారంతో కలసి చేరుకున్నారు.

స్కందరాత్రి వైభవం

తారకాసుర సంహారం.. స్కంద జననం ప్రాధాన్యంగా ఈ వివాహ మహోత్సవం నిర్వహించడం సంప్రదాయంగా వస్తోంది. అందుకే బ్రహ్మోత్సవాల్లో ఈ రాత్రిని స్కందరాత్రిగా పిలుస్తారు. పెళ్లికుమారుడైన శివయ్య వెంట సమస్త దేవతాగణాలన్నీ జయహో శంకరా.. జయజయహో శంకరా అంటూ కీర్తిస్తూ వివాహ వేదిక వద్దకు కదిలారు. ఇనాళ్లు సోమస్కందమూర్తితో భక్తులకు దర్శన భాగ్యం కల్పించిన గంగాదేవిని ఈ వివాహ మహోత్సవం సందర్భంగా కన్పించకుండా అలంకారం చేపట్టడం విశేషం. సర్వేశ్వరి అయిన జ్ఞానాంబికను భుజకీర్తులతో హిమవంతుని కుమార్తెగా వివాహ వేదిక వద్దకు తీసుకువచ్చారు.

గజ వాహనంపై పెళ్లి కుమారుడిగా సోమస్కందమూర్తి

సింహ వాహనంపై పెళ్లి కుమార్తెగా జ్ఞాన ప్రసూనాంబిక అమ్మవారు

స్త్రీశక్తి పథకానికి.. బడ్జెట్ బాసట

తిరుపతి(ఆర్టీసీ), న్యూస్‌టుడే: జిల్లాలో స్త్రీశక్తి పథకానికి విశేష స్పందన లభిస్తోంది. ఇదివరకు ఉన్న ఆక్యుపెన్సీ రేషియో (ఓఆర్), ఎర్నింగ్ పర్ కిలో మీటర్ (ఈపీకే) శాతం రెండింతలు పెరిగింది. గతేడాది 2025 ఆగస్టు 16 నుంచి పథకం అమలులోకి రాగా ఈ ఏడాది ఫిబ్రవరి 15వ తేదీ వరకు 18,636,805 మంది మహిళలు ప్రయాణించారు. సగటున ఒక్కో మహిళకు రోజుకు రూ.1152 చొప్పున మొత్తం రూ.70.52 కోట్ల లబ్ధి చేకూరింది. మహిళల నుంచి వస్తున్న ఆదరణను గుర్తించిన కూటమి ప్రభుత్వం వారి ప్రయాణానికి ఎలాంటి లోటులేకుండా ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ప్రత్యేకంగా స్త్రీశక్తి పథకానికి రూ.1450 కోట్లు కేటాయించింది.

జిల్లాలో రూ.70.52 కోట్లు లబ్ధి పొందిన మహిళలు

జిల్లాలో గత ఆగస్టు నుంచి ప్రయాణ వివరాలు

నెల	కి.మీ (లక్షల్లో)	ప్రయాణించిన మహిళలు	పొందిన లబ్ధి (కోట్లలో)
--			
ఆగస్టు	54.81	1342185	5.34
సెప్టెంబరు	87.84	3133495	12.43
అక్టోబరు	89.76	3073618	12.09
నవంబరు	89.45	3411638	12.89
డిసెంబరు	91.89	3299738	12.36
జనవరి	92.17	2890749	10.72
ఫిబ్రవరి	43.6	1485382	4.69

ఆదుకొనే నేస్తమా.. బడి పిలుస్తోంది

ఈనాడు డిజిటల్, తిరుపతి: ప్రభుత్వ పాఠశాలలకు ఎన్ని నిధులు ఇస్తున్నా క్షేత్రస్థాయిలో సమస్యలు మాత్రం తీరడం లేదు. బడి బాగు కోసం.. పిల్లల భవిష్యత్తు కోసం కేంద్ర ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిన 'విద్యాంజలి' పోర్టల్‌లో ఉపాధ్యాయులు పెడుతున్న అభ్యర్థనలు చూస్తే గుండె బరువెక్కుతోంది. తిరుపతి జిల్లా నుంచి నమోదైన కొన్ని అభ్యర్థనలే ఇందుకు నిదర్శనం.

ఏమిటీ కార్యక్రమం?

కేంద్ర విద్యాశాఖ ప్రారంభించిన అద్భుతమైన వేదిక 'విద్యాంజలి'. 'విద్య', 'అంజలి' (రెండు చేతులు జోడించి సమర్పించడం) అనే రెండు పదాల కలయికే ఈ కార్యక్రమం. ప్రభుత్వ పాఠశాలలను కమ్యూనిటీతో అనుసంధానించి అభివృద్ధి చేయడమే దీని ముఖ్య ఉద్దేశం.

ఎవరు సాయం చేయొచ్చు?

పూర్వ విద్యార్థులు, విశ్రాంత ఉపాధ్యాయులు, సైంటిస్టులు, ప్రభుత్వ ఉద్యోగులు, గృహిణులు, యువత, లేదా కార్పొరేట్ కంపెనీలు (సీఎస్ఆర్ కింద).. ఎవరైనా సరే తమకు నచ్చిన ప్రభుత్వ పాఠశాలను దత్తత తీసుకోవచ్చు లేదా సాయం చేయొచ్చు.

వచ్చిన అభ్యర్థనలు
- సేవలు: 110
- సామగ్రి: 1,037
- మొత్తం విన్నపాలు: 1,147

సహకారం ఇలా అందించండి

సాయం రెండు రకాలుగా అందించొచ్చు:
- **సేవలు / యాక్టివిటీస్ :** సబ్జెక్టులు బోధించడం, యోగా నేర్పించడం, ఆర్ట్, క్రాఫ్ట్, కెరీర్ కౌన్సెలింగ్ ఇవ్వడం, వైద్య శిబిరాల నిర్వహణ, సెల్ఫ్ డిఫెన్స్ నేర్పించడం వంటివి.
- **వస్తువులు /సామగ్రి:** ఫ్యాన్లు, కుర్చీలు, కంప్యూటర్లు, ప్రింటర్లు, క్రీడా సామగ్రి, వాటర్ ప్యూరిఫైయర్లు, ట్యూబ్ లైట్లు, ఇతర అవసరాలను విరాళాలు అందించి తీర్చవచ్చు.

ఆసక్తి ఉన్నవారు vidyanjali.education.gov.in వెబ్‌సైట్‌లో 'వాలంటీర్'గా రిజిస్టర్ చేసుకుని, మీకు దగ్గర్లో ఉన్న పాఠశాల అవసరాలను తీర్చవచ్చు.

'విద్యాంజలి' సాక్షిగా సర్కారు బడుల ఆర్తనాదాలు

పలుచోట్ల ఇలా..

- ఒక్క తిరుపతి జిల్లా నుంచే 'విద్యాంజలి' పోర్టల్‌లో వందలాది అభ్యర్థనలు పెండింగ్‌లో ఉన్నాయి.
- మామండూరు జడ్పీ పాఠశాల అదనపు తరగతి గదులు, క్రికెట్/వాలీబాల్ కిట్లు, వాటర్ ప్యూరిఫైయర్ల కోసం ఎదురుచూస్తోంది.
- తడ జడ్పీపీ బాలికల పాఠశాల విద్యార్థినులు 'ఆత్మరక్షణ' విద్యను నేర్పించమని కోరుతున్నారు.
- గ్రామీణ పాఠశాలల్లో చాలా చోట్ల కంప్యూటర్లు, ప్రింటర్లు లేక డిజిటల్ విద్య అందడం లేదు.
- యోగా నేర్పేవారు లేక, డ్రాయింగ్ టీచర్లు లేక, కనీసం కూర్చోవడానికి బెంచీలు లేక ఎన్నో పాఠశాలలు దాతల కోసం ఎదురుచూస్తున్నాయి.

హనుమాన్ ప్రాజెక్టుతో వన్యప్రాణుల సంరక్షణ

లైవ్ క్యాప్చర్ నెట్ గన్ వినియోగాన్ని చూపుతున్న సీఎఫ్ సెల్వం

తిరుపతి (జీవకోన),న్యూస్‌టుడే: శేషాచలంలో వన్యప్రాణుల సంరక్షణ, మానవులు, వన్యప్రాణులకు మధ్య జరుగుతున్న ఘర్షణ వాతావరణాన్ని తగ్గించేందుకు ప్రభుత్వం హనుమాన్ ప్రాజెక్టు ప్రారంభించిందని తిరుపతి సర్కిల్ అటవీ సంరక్షణాధికారి (సీఎఫ్) సి.సెల్వం తెలిపారు. తిరుపతి బయోట్రిమ్‌లో మంగళవారం వన్యప్రాణుల రెస్క్యూపై ర్యాపిడ్ రెస్పాన్స్ టీమ్ సభ్యులకు కార్యశాల నిర్వహించారు. చిరుతలు, ఎలుగుబంట్లు, పాములు, ఏనుగులు వంటి వన్యప్రాణుల అదుపు, వాటిపై దాడుల నిర్మూలనే ఈ ప్రాజెక్టు ప్రధాన లక్ష్యమన్నారు. మార్చి 3న ఈ ప్రాజెక్టు ప్రారంభం కానుందని.. అందులో భాగంగా ప్రతి జిల్లాలో ర్యాపిడ్ రెస్పాన్స్ టీమ్‌లు, ప్రత్యేకంగా వన్యప్రాణి అంబులెన్స్‌లు, ప్రత్యేక వాహనాల కేటాయింపు ప్రారంభమైందన్నారు. జిల్లా అటవీ అధికారి వి.సాయిబాబ మాట్లాడుతూ తిరుపతి సర్కిల్ పరిధిలో తిరుపతి, అన్నమయ్య జిల్లాల్లోని రెండు డివిజన్లలో బృందాలు ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన వివరించారు.

'కైలాస' ప్రాశస్త్యం.. నవసంధి బలం

నవసంధి వినాయకుల్లో ఒక్కరైన నైరుతి గణపతి

కుంభాభిషేక మహోత్సవం జరిగిన అగ్నిగణపతి

చతుర్మాడ వీధుల్లో గణనాథులు

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: సమస్త దేవతలకు, ఎందరో భక్తులకు, చివరకు మూగజీవులకు సైతం ముక్తినిచ్చిన భూతల కైలాసంగా శ్రీకాళహస్తి దినదిన ప్రవర్ధమానం చెందుతోంది. ఏ క్షేత్రంలో లేని విధంగా ఇక్కడి చతుర్మాడ వీధుల్లో నవసంధి గణనాథులు కొలువుదీరడం, క్షేత్ర ప్రాభవానికి ఇదో ప్రత్యేక నిదర్శనంగా చెప్తుంటారు. శ్రీకాళహస్తీశ్వరాలయంలో నిర్వహించే మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల ప్రారంభం సందర్భంగా ధ్వజారోహణం రోజున ఇక్కడి గణనాథులను కార్యక్రమాలకు ఆహ్వానించడం, ధ్వజావరోహణం సందర్భంగా మళ్లీ వీడ్కోలు పలకడం ఆనవాయితీ. అలాగే వినాయకచవితి సందర్భంగా ఇక్కడి ఆలయాలకు ముక్కంటీశుని ఆలయం తరఫున పట్టువస్త్రాలు సమర్పణ జరుపుతారు.

ఒక్కో వీధిలో.. ఒక్కో గణపతి..: శ్రీకాళహస్తి క్షేత్ర సందర్శనకు వచ్చే భక్తుల సంకటాలను తొలగిస్తూ ఇక్కడి క్షేత్ర వైభవం దినదిన ప్రవర్ధమానం కావడానికి ప్రధాన కారణం నవసంధి వినాయకులే. ముక్కంటీశునితో పాటు దేవతా పరివారం చతుర్మాడ వీధుల గుండా ఊరేగుతూ భక్తులకు దర్శనమిస్తుంటారు. ఇక్కడి చతుర్మాడ వీధుల్లో ఒక్కో దిక్కు.. మూలల్లో ఆయా అధిదేవతల అంశతో వినాయకులు పూజలందుకోవడం ఇక్కడి క్షేత్ర ప్రత్యేకం. బ్రహ్మోత్సవాల్లో ప్రతి రోజున పురవీధుల్లో ఊరేగే దేవతామూర్తులకు ఆయా ఆలయాల వద్దకు రాగానే సర్కారు హారతి పేరుతో ప్రత్యేక హారతులు ఇస్తుండటం సంప్రదాయం.

తేరువీధి : వీధి ప్రారంభంలో అన్నీ సంకటాలు తొలగించే సంకటహర గణపతి, వరుణుడి అంశతో ఉన్న వరుణగణపతి కొలువుదీరారు.

నెహ్రూవీధి : వాయువ్య మూలలో వాయుగణపతి, ఒకే ఆలయంలో ఇద్దరు గణపతులుగా కొలువుదీరిన కుబేరగణపతులు ఉండటం విశేషం.

నగరివీధి: ఇక్కడి ఈశాన్య మూలలో ఈశానుడి అంశలో ఉన్న ఈశాన్య గణపతి, ఇంద్ర గణపతులు కొలువుదీరి ఉన్నారు.

బజారువీధి: ఇక్కడి ఆగ్నేయంలో అగ్నిగణపతి, యమగణపతి, నైరుతిమూలన నైరుతి గణపతి (ఈయన అమ్మవారి తేరు వెనుక ఉన్న మండపంలో ఉంటారు) ఉంటారు.

విజయసిద్ధి.. చండీహోమ ప్రసిద్ధి



చండీహోమాన్ని నిర్వహిస్తున్న వేదపండితులు

శక్తి ఆలయాల్లో చండీ హోమాలు నిర్వహించడం ఆగమ సంప్రదాయంగా వస్తోంది. దేవాదాయ శాఖ తరఫున ప్రసిద్ధి చెందిన పలు అమ్మవారి ఆలయాల్లో ఈ విశేష సేవ ఆర్జిత సేవగా నిర్వహిస్తున్నారు. శ్రీకాళహస్తీశ్వరాలయంలో భక్తుల సౌకర్యార్థం ఈ సేవను ఏళ్ల క్రితమే అందుబాటులోకి తీసుకువచ్చారు.

టికెట్‌ధర: రూ.1,116
ప్రవేశం: ఇద్దరికి
నిర్వహణ: దక్షిణకాళీ ఆలయంలో
ఫలం: అభీష్టసిద్ధి, శత్రుజయం, సంకటహర పరిస్థితుల నుంచి అధిగమించడం, ఆరోగ్యఫలం

సేవలు ఫలాలు

ప్రాభవం.. దక్షిణకాళీ ఆలయం..: శ్రీకాళహస్తీశ్వరాలయంలో కొలువుదీరిన దక్షిణకాళీ ఎంతో శక్తికల్గిన అమ్మవారు. బ్రహ్మోత్సవాల్లో అత్యంత కీలకం, ప్రధాన భూమిక కల్గిన మహాశివరాత్రి, రథోత్సవం, కైలాసగిరి ప్రదక్షిణోత్సవం తదితర ఉత్సవాల సందర్భంగా ఉత్సవమూర్తులను ఇక్కడి ఆలయం వద్దకు తీసుకువచ్చి ప్రత్యేకంగా హారతులు సమర్పించడం ఉత్సవాలకు బయలుదేరడం సంప్రదాయంగా వస్తోంది. మహిమాన్వితమైన అమ్మవారి ఆలయంలో చండీహోమాన్ని ఆర్జితసేవగా వేదపండితులు నిత్యం జరిపిస్తుంటారు. పూజలు అయ్యాక ఆలయం తరఫున తీర్థప్రసాదాలు అందజేస్తారు. - న్యూస్‌టుడే, శ్రీకాళహస్తి

శ్రీకాళహస్తీశ్వరుడికి పట్టువస్త్రాల సమర్పణ



పట్టువస్త్రాలు తీసుకెళ్తున్న కాణిపాకం ఆలయ ప్రతినిధులు

కాణిపాకం, న్యూస్‌టుడే: శివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా కాణిపాకం స్వయంభు శ్రీవరసిద్ధి వినాయక స్వామి ఆలయం తరఫున తిరుపతి జిల్లా శ్రీకాళహస్తీశ్వరుడికి పట్టువస్త్రాలను ఆలయ ఛైర్మన్ మణినాయుడు, ఈవో పెంచల కిశోర్ అక్కడి ఆలయ ఛైర్మన్ కొట్టె సాయిప్రసాద్, ఈవో బాపిరెడ్డికి మంగళవారం అందజేశారు. నూతన వస్త్రాలను స్వామి, అమ్మవార్ల అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. పాలకమండలి సభ్యులు నాగరాజాచారియులు, శివప్రసాద్, నరేశ్, సతీష్, వసంతమ్మ, కృష్ణవేణి, చంద్రకళ, అనసూయ, శ్రీవాణి, అధికారులు, అర్చక, వేదపండితులు పాల్గొన్నారు.

మహాసంప్రోక్షణకు అంకురార్పణ

పూజలు చేస్తున్న అర్చకులు

నాగలాపురం: స్థానిక వేదనారాయణస్వామి ఆలయ మహాకుంభాభిషేక ఉత్సవాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. అర్చకులు మూలవర్లకు పూజలు చేసి యాగశాలలో వైదిక కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం పుట్టమట్టితో చిత్రించిన మేదిని ప్రతిమ ఎదుట వేదమంత్రాలతో ఉత్సవాలకు సకల దేవతలను, అష్టదిక్పాలకులను సందేశాన్ని అందిస్తూ మహాసంప్రోక్షణ అంకురార్పణ చేశారు. ఏర్పాట్లను తితిదే ఆగమ సలహాదారు వరదన్, సూపరింటెండెంట్ దర్శయ్య, ఆలయాధికారులు చెంగల్రాయులు, శ్రీనివాసులు, ప్రధానార్చకులు నాగరాజభట్టాచార్యులు పర్యవేక్షించారు.

తితిదే సీఈగా సత్యనారాయణ ఉద్యోగోన్నతి

తిరుపతి (తితిదే): తితిదే ఉద్యోగి టీవీ సత్యనారాయణను సూపరింటెండింగ్ నుంచి చీఫ్ ఇంజినీర్‌గా పదోన్నతి కల్పిస్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఉత్తర్వులు 2022 నుంచి వర్తిస్తాయని అందులో పేర్కొన్నారు. డీపీసీ సిఫార్సుల మేరకు రెవెన్యూ శాఖ ఎక్స్ అఫీషియో కార్యదర్శి ఎం.హరి జవహర్‌లాల్ జీవో విడుదల చేశారు.

జేఈఈ మెయిన్స్‌లో శ్రీచైతన్య ప్రభంజనం

ఉత్తమ పర్సంటైల్ పొందిన విద్యార్థులతో శ్రీ చైతన్య ఏజీఎం బి.వి.ప్రసాద్ తదితరులు

తిరుపతి (విద్య), న్యూస్‌టుడే: ఎన్‌టీఏ విడుదల చేసిన జేఈఈ మెయిన్స్-2026 ఫలితాల్లో శ్రీ చైతన్య విద్యాసంస్థల విద్యార్థులు జాతీయస్థాయిలో ఉత్తమ పర్సంటైల్ సాధించినట్లు ఆ కళాశాల యాజమాన్యం మంగళవారం ఓ ప్రకటనలో తెలిపింది. తిరుపతి జోన్‌కు చెందిన టీవీఎస్ శర్వ- 99.984, కె.హరికుమార్- 99.9505, ఆర్.రఘు- 99.5578, వై.రాజేశ్వర్- 99.4687, వి.మనస్ కృష్ణ- 99.4276, ఎస్.హరి- 99.1456, వై.సాయిమోహిత్‌రెడ్డి- 99.1214, జి.మోహిత్- 99.1112 పర్సంటైల్ సాధించారని పేర్కొన్నారు. మరో 46 మంది 98 పైన, 81 మంది విద్యార్థులు 97 పర్సంటైల్ పైగా సాధించినట్లు అందులో వివరించారు. దీనికి ప్రత్యేకంగా రూపొందించిన ఆబ్జెక్టివ్ మెటీరియల్స్, విద్యార్థుల కృషి కారణమని డైరెక్టర్ సుష్మశ్రీ, నాగేంద్రకుమార్ తెలియజేశారు. విద్యార్థులను, అధ్యాపకులను అభినందించారు. తిరుపతి జోన్ ఏజీఎం బి.వి.ప్రసాద్ పాల్గొన్నారు.

ఫలితాల్లో నారాయణ సత్తా

ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులతో డీజీఎం కొండలరావు

తిరుపతి (విద్య), న్యూస్‌టుడే: జేఈఈ మెయిన్ ఫలితాల్లో తమ విద్యార్థులు జాతీయస్థాయిలో 100 పర్సంటైల్ సహా, అత్యుత్తమ ఫలితాలు సాధించారని నారాయణ విద్యాసంస్థల డీజీఎం కొండలరావు తెలిపారు. ఎస్.హర్షిత్ 100 పర్సంటైల్, వి.హర్షిత్ 99.98, వి.అన్వ్ 99.96, జి.ప్రదీప్ 99.92, ఎం.చక్రి శ్రీకర్ 99.90, కె.జీవన్ సాయిరాం 99.80, ధనుష్ శెట్టి 99.80, ఎం.ఇషాన్ 99.71, కె.సూర్యచరణ్ 99.58, సి.మంజిత్ రెడ్డి 99.46, వి.వేణు ప్రత్యూష్ 99.46, ఎం.శ్రీరామ్ రెడ్డి 99.46, జె.జతిన్ భరద్వాజ్ 99.45, వి.దేవ్ కాశ్ 99.42, జి.ప్రణవ్ 99.39, సి.సాయిశ్రీ 99.35, టి.సాయివర్ధన్‌రెడ్డి 99.24, ఆర్.సంయుక్త కృష్ణ 99.15, కె.కుషల్ 99.10, జి.సంజుశ్రీ 99.03, ఎస్.తోశాంక్ 99.15, పి.కీర్తన 99.00 పర్సంటైల్ సాధించారు. 99 పర్సంటైల్ పైన 22 మంది, 98 పర్సంటైల్ పైన 39 మంది, 95 పర్సంటైల్ పైన 87 మంది, 90 పర్సంటైల్ పైన 150 మంది పైగా సాధించారని తెలిపారు. విద్యార్థులను కోర్ డీన్ శ్రీనివాసరావు, డీన్‌లు వేణుగోపాల్, సురేష్, ఏజీఎం గోపీచంద్ సిబ్బంది అభినందించారు.

ANDHRA PRADESH INDUSTRIAL INFRASTRUCTURE CORPORATION LTD.
(A Govt. of Andhra Pradesh Undertaking) O/o Zonal Office, APIIC Ltd., Padmavathi Nilayam, 7th floor, Room No.701 to 710, Tiruchanur- 517 503 email : zm.tir.apiic@nic.in. Cell : 9848933879

'e' PROCUREMENT TENDER NOTICE
Tender Notice No.17&18/ZM-TPT/APIIC/2025-26, Dt:-17.02.2026
Zonal Manager, APIIC Limited, Tirupati invites bids for the following works:

17.Name of the work: Providing intensive patch work to internal roads at industrial park Srikalahasti, Srikalahasti Mandal, Tirupati District Under IALA for the year 2025-26, **ECV:-31,52,121.00. Bid download starts date: 18.02.2026 at 11.00 AM, Last date for submission of bids : 23.02.2026 up to 11.30 AM**

18. Name of the work : Special Repairs to Internal Road, near vijaya Tractors at IP Tirupati, Renigunta Mandal, Tirupati District, under IALA for the year 2025-26. **ECV:-17,64,991. Bid download starts date: 18.02.2026 at 11.00 AM, Last date for submission of bids : 23.02.2026 up to 11.30 AM**

The details of tender notice and bid documents can be downloaded from website www.apeprocurement.gov.in

Sd/- ZONAL MANAGER, APIIC LTD., TIRUPATI

శ్రీకాళహస్తీశ్వర స్వామి వారి దేవస్థానము,
శ్రీకాళహస్తి - తిరుపతి జిల్లా - 517 644

సీల్డు టెండరు ప్రకటన
RC.No.A2/1265/2026, Dated: 17-02-2026

శ్రీకాళహస్తీశ్వర స్వామి వారి దేవస్థానము ప్రధాన ఆలయము మరియు అనుబంధ ఆలయము నందు నిర్వహింపబడు నిత్యోత్సవములకు తేది: 01.04.2026 నుండి తేది: 31.03.2027 వరకు అనగా ఒక సంవత్సర కాలమునకు శ్రీపాద కూలీలను మరియు ఎద్దులు సరఫరా చేయుటకు సీల్డ్ టెండర్లు నిర్వహించబడును.
ఆసక్తిగల వారు ఇతర వివరములకు కార్యాలయ పనివేళలయందు సెల్ నెం.9618515658 / 9866456141 / 9989414040 లను సంప్రదించవచ్చును.

THIPPAREDDY BAPI REDDY, కార్యనిర్వహణాధికారి

రియల్.. అడ్డదారులు తొక్కెన్..!

చెరువు కట్టను తొలచి ఏర్పాటు చేసిన రోడ్డు

తొట్టంబేడు, న్యూస్‌టుడే: స్థిరాస్తి వ్యాపారుల ఆగడాలు రోజురోజుకు మితిమీరుతున్నాయి. వైకాపా పాలనలో చెరువు, పుట్ట, కాల్వలు, భూములు అనే తేడా లేకుండా విచ్చలవిడిగా ఆక్రమించుకొని.. ప్రస్తుత కూటమి పాలనలోనూ ఆక్రమణల దందా యథేచ్ఛగా సాగిస్తున్నారు. తొట్టంబేడు మండలం రామచంద్రాపురం చెరువుకట్టను స్థిరాస్తి వ్యాపారులు జేసీబీతో తొలిచి రోడ్డు ఏర్పాటు చేశారు. ఈ తంతు రెండు రోజులుగా రాత్రివేళల్లో సాగించారు. ఈ విషయమై జలవనరులశాఖ ఏఈ నాగరాజు వద్ద ప్రస్తావించగా పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు.

రుయా న్యూబ్లాక్ ఆధునికీకరణ

బర్న్ వార్డు అదనపు గదిలో పడకల ఏర్పాటు

తిరుపతి (వైద్యవిభాగం), న్యూస్‌టుడే: రుయా ప్రభుత్వ ఆస్పత్రి న్యూ బ్లాక్‌లోని వార్డును ఆధునికీకరిస్తున్నారు. ప్లాస్టిక్ సర్జరీ విభాగంలోని బర్న్ వార్డులో అదనపు గదిలో పడకలు అందుబాటులోకి తెచ్చారు. తీవ్రమైన కాలిన గాయాలకు చికిత్స అందించేందుకు వీలుగా హై డిపెండెన్సీ యూనిట్ (హెచ్‌డీయూ)ను అప్‌గ్రేడ్ చేసి మెరుగుపరిచారు. రోగులకు అవసరమైన మౌలిక సదుపాయాలు సమకూర్చారు. బర్న్ వార్డుకు వచ్చే రోగులకు నాణ్యమైన వైద్యం, సదుపాయాల కల్పన కోసం వైద్యులు, దాతల సహకారంతో యూనిట్ వైద్యాధికారులు చర్యలు చేపట్టారు. అలాగే దాతల సహకారంతో రోగుల సహాయకుల సౌకర్యార్థం సిమెంట్ గార్డెన్ కుర్చీలు, షెడ్లు, పరికరాలు అందుబాటులో ఉంచారు. సీఎస్ఆర్ నిధులతో అవసరమైన పరికరాలు సమకూర్చనున్నట్లు సూపరింటెండెంట్ డాక్టర్ రాధ తెలిపారు. అలాగే న్యూబ్లాక్‌లోని ఈఎన్‌టీ, డెర్మటాలజీ, ఫిమేల్ ఎముకల వార్డులు ఆధునికీకరిస్తున్నట్లు చెప్పారు. రుయా ప్రధాన భవనం, వార్డులో లీక్ అవుతున్న ట్యాంకర్లను మార్చుతున్నట్లు తెలిపారు. స్లాబ్‌కు మరమ్మత్తులు చేస్తున్నట్లు చెప్పారు.

క్రీడాస్ఫూర్తి పెంపొందించుకోవాలి: శాప్ డైరెక్టర్

క్రీడాకారుడితో కరచాలనం చేస్తున్న శాప్ డైరెక్టర్ రజనీ, శశిధర్

తిరుపతి (క్రీడలు), న్యూస్‌టుడే: విద్యార్థులు చదువుతో పాటు క్రీడాస్ఫూర్తిని పెంపొందించుకోవాలని భారత హాకీ క్రీడాకారిణి, శాప్ డైరెక్టర్ రజనీ పేర్కొన్నారు. తిరుపతి శ్రీశ్రీనివాస క్రీడా సముదాయంలో మంగళవారం చదరంగం జిల్లాస్థాయి ఎంపిక పోటీలను ఆమె ప్రారంభించి మాట్లాడారు. పోటీలకు జిల్లా నలుమూలల నుంచి అండర్-13, 15, 17, 19 విభాగాలకు చెందిన బాలబాలికలు 120 మంది తరలి వచ్చారు. విజేతలు ఈ నెల 21, 22వ తేదీల్లో తిరుపతి వేదికగా జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని వివరించారు. బిందు, నరేంద్ర రెడ్డి, బాలాజీ, శ్రీనివాస సూరి పాల్గొన్నారు.

పారిశ్రామికాభివృద్ధి సాధించాలి

ప్రసంగిస్తున్న సెంథిల్‌కుమార్

తిరుపతి (మహిళా వర్సిటీ), న్యూస్‌టుడే: సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని, మార్కెటింగ్ పథకాల ప్రయోజనాలు సద్వినియోగం చేసుకుంటూ.. పారిశ్రామికాభివృద్ధి సాధించాలని విశాఖపట్నం సూక్ష్మ, చిన్న పరిశ్రమల అభివృద్ధి అధికారి సెంథిల్‌కుమార్ పేర్కొన్నారు. శ్రీ పద్మావతి మహిళా వర్సిటీ, మదనపల్లె మిట్స్- ఐపీఎఫ్‌సీ కళాశాల సంయుక్తంగా మంగళవారం వర్సిటీలో సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల ఆవిష్కరణ పథకం కింద 'ఇంటెలెక్చువల్ ప్రాపర్టీ రైట్స్' అనే అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. చెన్నైకు చెందిన జీఐ, కాపీరైట్ విభాగం అసిస్టెంట్ రిజిస్ట్రార్ శహవ కుమార్ జీఐ ట్యాగ్ దరఖాస్తులపై అవగాహన కల్పించారు. మహిళా వర్సిటీ రిజిస్ట్రార్ ఉష, ఆచార్య ఉమా మహేశ్వరిదేవి, ఎస్వీయూ ఆచార్యులు వంశీకృష్ణ తదితరులు ప్రసంగించారు.

ఇంజినీరింగ్ సప్లిమెంటరీ పరీక్షలకు నోటిఫికేషన్

తిరుపతి (ఎస్వీయూ), న్యూస్‌టుడే: ఎస్వీయూ బీటెక్, ఎంటెక్‌కు ప్రత్యేక సప్లిమెంటరీ పరీక్షల నిర్వహణకు మంగళవారం నోటిఫికేషన్ విడుదల చేసింది. వర్సిటీ పరిధిలోని విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ రాజమాణిక్యం సూచించారు. 2007, 2010, 2016 బీటెక్ విద్యార్థులతో పాటు 2018 నిబంధనలు వర్తించే విద్యార్థులు, అలాగే 2009, 2016 ఎంటెక్ బ్యాక్‌లాగ్ విద్యార్థులకు ఒకేసారి (వన్ టైమ్ ఛాన్స్) అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు. దరఖాస్తుల సమర్పణ కోసం ఆయా కళాశాలల్లో సంప్రదించాలని కోరారు.

స్మార్ట్ మీటర్లపై అపోహలొద్దు: సీఎండీ

గ్రామస్థులతో మాట్లాడుతున్న సీఎండీ శివశంకర్

తిరుపతి(జీవకోన), బీఎన్ కండ్రిగ: స్మార్ట్ మీటర్లపై వినియోగదారులు అపోహలు పెట్టుకోవద్దని, పారదర్శకంగా, ఉపయోగకరంగా పనిచేస్తాయని ఏపీఎస్పీడీసీఎల్ సీఎండీ శివశంకర్ లోతేటి గ్రామస్థులకు వివరించారు. బుచ్చినాయుడుకండ్రిగ మండలం కొత్తపాలెంలో మంగళవారం నిర్వహించిన 'కరెంట్‌తో జనంలోకి' కార్యక్రమంలో తిరుపతి సర్కిల్ ఈఈ సుధాకర్, సహాయ ఈఈ చలపతితో కలిసి ఆయన పాల్గొని మాట్లాడారు.

శ్రీవారి సేవలో యూఎస్ఏ క్రికెటర్లు

శ్రీవారి ఆలయం ఎదుట యూఎస్ఏ క్రికెట్ జట్టు సభ్యులు మోనాంక్ పటేల్, మిలింద్ కుమార్, సౌరభ్ నేత్రవాల్కర్

తిరుమల: శ్రీవారిని యూఎస్ఏ క్రికెట్ జట్టు సభ్యులు మంగళవారం దర్శించుకున్నారు. ఉదయం వీఐపీ బ్రేక్ దర్శన సమయంలో జట్టులోని భారత సంతతి క్రీడాకారులు మోనాంక్ పటేల్, మిలింద్ కుమార్, సౌరభ్ నేత్రవాల్కర్ శ్రీవారి మూలమూర్తిని దర్శించుకున్నారు. ఆలయం వెలుపల జట్టు కెప్టెన్ మోనాంక్ పటేల్ మాట్లాడుతూ.. 'శ్రీవారిని దర్శించుకుని ఆశీస్సులు అందుకోవడం సంతోషంగా ఉంది. దర్శన ఏర్పాట్లు చేసిన తితిదే అదనపు ఈవో వెంకయ్యచౌదరికి ధన్యవాదాలు. తమకు అవకాశం కల్పించిన ఐసీసీ, బీసీసీఐ, ఆంధ్రప్రదేశ్ క్రికెట్ అసోషియేషన్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుకొంటున్నాం. ఆలయ ప్రాంగణం, పరిసరాలు ఎంతో పరిశుభ్రంగా ఉన్నాయి' అని పేర్కొన్నారు.

ఆన్‌లైన్ బెట్టింగ్ ముఠా గుట్టు రట్టు

రూ.7.48 లక్షల నగదు, పరికరాల స్వాధీనం

నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్న నగదు, పరికరాలు

తిరుపతి (నేరవిభాగం), న్యూస్‌టుడే: ఆన్‌లైన్ క్యాసినో, క్రికెట్ బెట్టింగ్‌లకు పాల్పడుతున్న ముఠా గుట్టు రట్టైంది. బాధితుల సమాచారం మేరకు పోలీసులు ముగ్గురిని అరెస్టు చేసి రూ.7.48 లక్షల నగదు, ల్యాప్‌టాప్, నాలుగు చరవాణులు, నాలుగు పేటీఎం క్యూఆర్ కోడ్ బాక్సులు స్వాధీనం చేసుకున్నారు. తిరుపతి తూర్పు సీఐ శ్రీనివాసులు కథనం మేరకు.. 'తిరుపతి గాంధీపురం పంచాయతీ శ్రీనగర్ కాలనీకి చెందిన వేముల మునికృష్ణ (39), బైరాగిపట్టెడకు చెందిన శివశంకర్‌రెడ్డి (54), కడప జిల్లా మైదుకూరుకు చెందిన రాధాకృష్ణ (31) మరో ఇద్దరు రాజేష్, రాధాకృష్ణలతో కలిసి అమాయకులే లక్ష్యంగా ఆన్‌లైన్‌లో 'ఎక్స్ విన్ ఎక్స్ఛేంజ్, కింగ్ ఎక్స్ఛేంజ్' యాప్స్ ద్వారా క్యాసినో, క్రికెట్ బెట్టింగ్‌లు ఆడించారు. ఏడాదిగా తిరుపతి కేంద్రంగా ఈ దందా నడుస్తోంది. అనేక మంది రూ.లక్షల్లో నగదు పోగొట్టుకున్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు నిఘా పెట్టారు. మంగళవారం స్థానిక బైరాగిపట్టెడ వద్ద ఉన్న మునికృష్ణ, శివశంకర్‌రెడ్డి, రాధాకృష్ణలను అరెస్టు చేశారు. పరారీలో ఉన్న ఇద్దరి కోసం గాలిస్తున్నారు. కేసు ఛేదనలో ప్రతిభ కనబరిచిన సీఐ శ్రీనివాసులు, ఎస్ఐలు రామస్వామి, ప్రసాద్‌లను డీఎస్పీ భక్తవత్సలం అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో లైన్‌మెన్ దుర్మరణం

పుల్లంపేట, న్యూస్‌టుడే: విధులకు హాజరై ఇంటికి తిరుగు వస్తున్న తరుణంలో రోడ్డు ప్రమాదంలో లైన్‌మెన్ మృతిచెందాడు. ఈ ఘటన పుల్లంపేట మండలం సీతారాంపేటలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సీతారాంపేట గ్రామానికి చెందిన చిన్నయానాదయ్య (42) విద్యుత్‌శాఖలో ఓబులవారిపల్లె టౌన్ లైన్‌మెన్‌గా విధులు ముగించుకొని ఇంటికి వస్తుండగా పుల్లంపేట మండలం రెడ్డిపల్లె చెరువు కట్ట సమీపంలో రాజంపేట నుంచి తిరుపతి వైపు వెలుతున్న లారీ ఢీకొంది. దీంతో అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు.

ఇద్దరు గంధపు చెట్ల స్మగ్లర్ల అరెస్ట్

తిరుమల, న్యూస్‌టుడే: తిరుమల శేషాచలం అటవీ ప్రాంతంలో గంధపు చెట్లు కొడుతున్న ఇద్దరు స్మగ్లర్లను తిరుమల రేంజ్ అటవీ అధికారులు అరెస్ట్ చేశారు. డీఎఫ్‌వో స్వప్నకుమారి కథనం మేరకు.. సోమవారం డీఎఫ్‌వోకు అందిన సమాచారంతో తిరుమల బీటు అధికారి, బేస్ క్యాంప్ సిబ్బంది తనిఖీలు చేపట్టగా సాయంత్రం 5.30 గంటల ప్రాంతంలో పాత పాపవినాశనం వద్ద గంధపు చెట్టు కోస్తున్న ఇద్దరిని గుర్తించారు. వారు ఎర్రావారిపాళెం మండలం చింతగుంటకు చెందిన జి.జయరామయ్య, బంగారుపాళెం మండలం మిట్టపల్లి గ్రామానికి చెందిన వై.ధనంజయగా గుర్తించారు. వారి నుంచి 31.90 కిలోల దుంగలు స్వాధీనం చేసుకున్నారు. ఎఫ్‌బీవో జె.అఖిల్ పాల్గొన్నారు.

పీజీఆర్ఎస్ అర్జీలను గడువులోగా పరిష్కరించాలి

తిరుపతి (కలెక్టరేట్): ప్రజా సమస్యల పరిష్కార వేదిక అర్జీలు, యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వే తదితర కార్యక్రమాలపై మంగళవారం కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్ సమీక్షించారు. గడువులోగా అర్జీలు పరిష్కరించాలని ఆదేశించారు. అక్షరాంధ్ర కార్యక్రమాన్ని సామూహిక బాధ్యతగా భావించి విజయవంతం చేయాలన్నారు. పీ4లో బంగారు కుటుంబాల గుర్తింపు త్వరగా జరగాలని కోరారు.

SHRIRAM Finance
శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్
నమోదిత కార్యాలయం : శ్రీ టవర్స్, ప్లాట్ నెం.14ఎ, సౌత్ ఫేజ్, ఇండస్ట్రియల్ ఎస్టేట్, గిండి, చెన్నై-600032.
ప్రాంతీయ కార్యాలయం: డి.నెం.8-115/1, 4వ అంతస్తు, కెనరా బ్యాంక్ పైన, ఎంఎం కాంప్లెక్స్, రాయల్ నగర్, ఆర్‌సి రోడ్డు, తిరుపతి, తిరుపతి జిల్లా -517501
బ్రాంచ్ కార్యాలయం : డి.నెం.8-119, 2వ అంతస్తు, ఆర్‌సి రోడ్డు, తిరుపతి, తిరుపతి జిల్లా-517501 వెబ్‌సైట్ : http://www.shriramfinance.in./auction

శ్రీమతి ఎస్ అన్నపూర్ణ గారికి చెందిన స్థిరాస్తుల విక్రయానికి ఇ-వేలం అమ్మకం ప్రకటన

రూల్ 9(1) క్రింద సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్‌తోచదపబడే సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ & ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 క్రింద స్థిరాస్తుల అమ్మకం కోసం ఇ-వేలం అమ్మకం ప్రకటన **30-12-2024 తేదీ గల ఉద్దేశపూర్వక అమ్మకం నోటీసు 30 రోజుల గడువు** తీరిన తర్వాత ఇప్పుడు జారీచేయబడినది. సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని రూల్ 8(6)లో చదువబడు చట్టం 54/2002లోని సెక్షన్13(8) క్రింద పేర్కొన్న విడిపించుకునే హక్కును మీరు వినియోగించుకోవడంలో విఫలమైనందున ఇ-వేలం అమ్మకం కోసం ప్రకటన జారీ చేయబడింది. ఋణగ్రహీతలు/హామీదారులు/తనఖాదారులు/సహ-దరఖాస్తుదారులు/సహ-ఋణగ్రహీతలకు ఇందుమూలముగా తెలియజేయడమైనది.
ఇందుమూలముగా సాధారణ ప్రజానీకానికి ముఖ్యంగా ఋణగ్రహీతలు/హామీదారులు/తనఖాదారులు/సహ-దరఖాస్తుదారులు/సహ-ఋణగ్రహీతలకు నోటీసు ద్వారా తెలియజేయునది ఏమనగా, సర్ఫేసి యాక్ట్ సెక్షన్ 13(2) ప్రకారం, శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, అధీకృత అధికారి జారీచేసిన **డిమాండ్ నోటీసు తేది.30.01.2023** ప్రకారం, **తేది.30.01.2023** నాటికి **రూ.79,42,976/-** మరియు **31.01.2023** నుండి వర్తించు వడ్డీ మరియు కాస్ట్స్ మరియు చార్జీలు మరియు ఖర్చులు రాబట్టుకొనుటకు సెక్యూర్డు క్రెడిటార్‌కు తనఖా పెట్టిన / ఛార్జీ చేసిన దిగువ తెలిపిన స్థిరాస్తులను **"ఎక్కడ ఎలా ఉన్నది" "అక్కడ అలా"** మరియు **"అక్కడ ఏమున్నదో అది"** ప్రాతిపదికన ఇ-వేలం ద్వారా **తేది.25-03-2026** న **ఉదయం 11.00** గంటల నుండి **మధ్యాహ్నం 01.00** గంటల వరకు ఆస్తులను విక్రయించేందుకు నిర్ణయించటమైనది.

అగ్రిమెంట్ నెం : TRPTITF1502270010

ఋణగ్రహీత/హామీదారు(లు): **1)** సి.రాము మూర్తి, తండ్రి: నరసింహులు చెట్టి (లేటు), డి.నెం.100, మౌర్య అపార్ట్‌మెంట్స్, రాయల్ నగర్, పోస్టల్ కాలనీ,తిరుపతి, చిత్తూరు జిల్లా -517501.
2) వై.కేశవులు, తండ్రి : వై.సంజీవి, డి.నెం.11-19ఎ, ఎస్.వి.నగర్, పోస్టల్ కాలనీ, తిరుపతి, చిత్తూరు జిల్లా -517501.
3) మూర్తి స్టోర్స్, ప్రాతినిధ్యం వహిస్తున్న ప్రొప్రయిటర్ సి.రాము మూర్తి, తండ్రి: నరసింహులు చెట్టి (లేటు), చిరునామా.డి.నెం.100, మౌర్య అపార్ట్‌మెంట్స్, రాయల్ నగర్, పోస్టల్ కాలనీ,తిరుపతి, చిత్తూరు జిల్లా -517501.
4) ఎస్ అన్నపూర్ణ, భర్త : ఎస్.ఆర్ ప్రకాష్, డి.నెం.3-8-299, కుమ్మరమిట్ట వీధి, తిరుపతి, చిత్తూరు జిల్లా -517501.

స్థిరాస్తి వివరములు: (డాక్యుమెంట్ నెం.518/2015 ప్రకారం శ్రీమతి ఎస్ అన్నపూర్ణ గారికి చెందిన ఆస్తి)
చిత్తూరు జిల్లా, శ్రీ బాలాజీ రిజిస్ట్రేషన్ జిల్లా, చంద్రగిరి సబ్ జిల్లా, తిరుపతి రూరల్ మండలం, సి-మల్లవరం గ్రామ పంచాయితీ, నెం.22, గొల్లపల్లి గ్రూపు నెం.56, కాలూరు గ్రామ ఖాతాలో, సర్వే నెం.48-7ఎ, 7బి మరియు 7సి, హరిజనవాడ దగ్గర ఖాళీ ఇంటి స్థలం. హద్దులు : తూర్పు : చిన్నక్క మరియు ఇతరుల భూమి, పడమర: కందస్వామి ధరణి గారి స్థలం, ఉత్తరం : యర్రగురవాగారి చెంగారెడ్డి మరియు ఇతరుల భూమి, దక్షిణం: శ్రీనివాస మంగాపురం వెళ్ళు రోడ్డు. వీటి మధ్యలో స్థలం విస్తీర్ణం తూర్పు నుండి పడమర ఉత్తరం వైపు 23 అడుగులు లేదా 7.015 మీటర్లు మరియు తూర్పు నుండి పడమర దక్షిణం వైపు 27.7 అడుగులు లేదా 8.448 మీటర్లు, ఉత్తరం నుండి దక్షిణం తూర్పు వైపు 179.7 అడుగులు లేదా 54.808 మీటర్లు మరియు ఉత్తరం నుండి దక్షిణం పడమం వైపు 170-5 అడుగులు లేదా 52.002 మీటర్లు. మొత్తం విస్తీర్ణం 4439 చ॥అ॥లు లేదా 493 1/4 చ॥గ॥ల ఖాళీ స్థలం.

ఎన్‌కంబరెన్సులు ఏమైనా : లేవు

ఆస్తి రిజర్వు ధర	ధరావత్తు మొత్తం	ధరావత్తు సమర్పించు విధానం	బిడ్ పెంపుదల మొత్తం	వేలం తేది	ధరావత్తు సమర్పించుటకు చివరి తేది	ఆస్తి తనిఖీ తేది
రూ.63,92,000/-	రూ.6,39,200/-	శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ పేరున డి.డి సమర్పించాలి	రూ.25,000/-	25.03.2026	24.03.2026	23.03.2026

ఆసక్తిగల బిడ్డర్లు లాగిన్ ఐడి & పాస్‌వర్డ్ సృష్టించడంలో, డేటాను అప్‌లోడ్ చేయడంలో, బిడ్ సమర్పించడంలో, ఇ-బిడ్డింగ్ ప్రక్రియపై శిక్షణలో మొదలగున వాటి సహాయం కొరకు మెస్సర్స్ శ్రీరామ్ ఆటోమాల్ ఇండియా లిమిటెడ్, సంప్రదించవలసిన వ్యక్తి : గౌరవ్ నంబూదిరి, మొబైల్ నెం. 9833922941, గౌరవ్ నంబూదిరి <gaurav.n@samil.in> నందు సంప్రదించగలరు.
ఆసక్తి సంబంధించిన ఏదైనా సందేహాల కోసం శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, అధీకృత అధికారి, వి.గోపి గారిని కార్యాలయ పని దినాలలో 83091 24131 నందు సంప్రదించవచ్చు.
అధీకృత అధికారికి ఏవైనా లేదా అన్ని బిడ్లను తిరస్కరించే హక్కు కలదు. ఆన్‌లైన్ వేలం మా వేలం ఏజెన్సీ శ్రీరామ్ ఆటో మాల్ ఇండియా లిమిటెడ్ వెబ్‌సైట్‌లో (https://eauctions.Samil.in/home) నిర్వహించబడుతుంది. టెండర్ సమర్పణ స్థలం/ బిడ్ ఫారమ్ / టెండర్ ఓపెన్ & వేలం పొందటానికి, దయచేసి https://eauctions.Samil.in/home వెబ్‌సైట్‌ను సందర్శించండి మరియు అమ్మకం యొక్క విపరణాత్మక నిబంధనలు మరియు షరతుల కోసం దయచేసి శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ వెబ్‌సైట్‌లో అందించిన https://www.shriramfinance.in/auction లింక్‌ను చూడండి.
గమనిక: 'చెన్నైలోని NCLT ఆదేశం ప్రకారం "శ్రీరామ్ సిటీ యూనియన్ ఫైనాన్స్ లిమిటెడ్" ను "శ్రీరామ్ ట్రాన్స్‌పోర్ట్ ఫైనాన్స్ లిమిటెడ్"లో విలీనం చేసినట్లు తెలియజేయడమైనది. తదనంతరం 30-11-2022 నాటి పేరు మార్పుకు సంబంధించిన విలీన ధృవీకరణ పత్రం ప్రకారం, 30.11.2022 నుండి "శ్రీరామ్ ట్రాన్స్‌పోర్ట్ ఫైనాన్స్ లిమిటెడ్" పేరును "శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్"గా మార్చడు జరిగింది.

తేది.16.02.2026, ప్రదేశం : తిరుపతి — సం/- అధీకృత అధికారి, శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్

EENADU Classifieds

FINANCIAL SERVICES

స్థిరాస్తులపై ఆంధ్రప్రదేశ్ అంతటా మార్టిగేజ్ లోన్స్ మరియు స్థిరాస్తి ఎక్కడ ఉన్నా ఏ సంస్థలో ఉన్నా Xerox పేపర్స్‌పై 2nd మార్టిగేజ్ లోన్ ఇవ్వబడును. 50 లక్షలులోపు, అయోధ్య కోఆపరేటివ్ బ్యాంక్. ✆ 93969 99669.

REAL ESTATE

FLAT FOR SALE

GENERAL

తిరుపతి, గెస్ట్‌లైన్ హోటల్‌కి ఆనుకొని మాస్టర్ ప్లాన్ 80 feet రోడ్డు ప్రక్కన AB AAVAS Phoenix Tower Smart Homesలో 2, 3 BHK Flats సేల్స్‌కు కలవు. RERA Project. 9505502346

PLOT FOR SALE

GENERAL

నేషనల్ హైవేలకు ఆనుకొని తిరుపతిలో ఫైనల్ అప్రూవ్డ్ ప్లాట్స్ అన్ని సదుపాయాలతో తక్కువ ధరకే, డైరెక్ట్ ఓనర్, స్పాట్ రిజిస్ట్రేషన్ ఫోన్ : 99662 62221/ 95027 74175

JOBS

WANTED MALE Process Associates Qual: Degree/ Diploma with Typing Skills of 25 NWPM, Sal: 14K to 18K. Mob: 80967 30137.

Wanted DRA Tele Callers, Field Executives & Team Leaders Banking Sector Attractive Salaries and Incentives, ✆ 98493 94835, 70753 45527.

Wanted Supervisors for Civil and Electrical Works. Contact: 90005 55035.

Wanted Teachers for Reputed Schools in A.P & Telangana, Contact: Sneha Placements Service. Ph: 94402 46409.

Wanted Marketing Executives. Exp: 2 Years, : Degree & MBA, Office Boy : Inter, Tirupathi ✆ 77992 16807.

G Digital షోరూం మదనపల్లి, వాయల్పాడు నందు పనిచేయుటకు Manager/ Sales Staff కావలెను. M/F, A: 19-35, Q: Inter/Degree ✆91821 25692, 97058 26033.

తిరుపతిలోని ప్రముఖ కంపెనీకి బిజినెస్ పర్సన్స్, రిటైర్డ్ పర్సన్స్, వివాహితులు కావలెను. Age: 30 to 65, Qua: Inter- PG పాన్‌కార్డు తప్పనిసరి ✆ 76750 95860.

EENADU THE Ec WAY CLASSIFIEDS
B/W 5 లైన్ల ప్రకటన రూ. 500/-
Colour 5 లైన్ల ప్రకటన రూ. 600/- మాత్రమే
తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య జిల్లాల్లో అన్ని రకాల బిజినెస్ వ్యవహారాలు
వివరాలకు...
80085 13290

మీ చిన్నారులకు పుట్టిన రోజు శుభాకాంక్షలు ఈనాడు ద్వారా తెలపండి
B/W: రూ. 600
Colour: రూ. 800
ప్రకటనలపై 5% GST వర్తించును

త్రినేత్ర హోంకేర్‌లో వృద్ధులను/ పేషెంట్స్‌ను/ పిల్లలను చూసుకొనుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఫ్రీ వసతి, భోజనం. జీ: 18K. ✆ 85209 80099, 85208 74499

ప్రముఖ విద్యాసంస్థకు లేడీ టెలికాలర్స్, కౌన్సిలర్స్ & ఫీల్డ్ అనుభవం కల్గిన PROలు కావలెను. ఆకర్షణీయమైన జీతం కల్పించబడును. ✆ 90320 30124

మార్కెటింగ్ Reps/Officers (తిరుపతి టౌన్‌లో పనిచేయుటకు) కావలెను. Qly: MBA/B.Com/ B.Sc, గూడ్స్ ఆటో డ్రైవర్-1 అనుభవం, లైసెన్స్, బ్యాడ్జి కలిగి ఉండవలెను.✆9703402722

తిరుపతి, NGO's కాలనీ, D.No: 6-8-1113లోని కల్పవృక్ష లగ్జరీ హోమ్‌స్టే నందు పనిచేయుటకు రిసెప్షన్ కమ్ సూపర్‌వైజర్, స్వీపర్లు కావలెను. Cont: గాయత్రి హాస్పిటల్స్, వి.వి.మహల్ రోడ్డు, లలిత జ్యూవెలరీ ప్రక్కన, తిరుపతి. ✆ 98497 55595.

హరేకృష్ణ హోంకేర్‌లో వృద్ధులను/ పేషెంట్స్‌/ పిల్లలను చూసుకొనుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఫ్రీ వసతి, భోజనం జీ: 18-20K ✆ 96404 68899, 96402 58899

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్-లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

తిరుపతి

తిరుచానూరు సీఐ చొరవతో సమస్య పరిష్కారం

తిరుచానూరు, న్యూస్‌టుడే: నగరంలోని ఓ ప్రైవేటు నర్సింగ్ కళాశాల విద్యార్థుల నుంచి ఫీజు వసూలు చేసి ధ్రువీకరణ పత్రాలు ఇవ్వకుండా ఇబ్బందులు పెడుతున్న విషయాన్ని మంగళవారం ఎన్ఎస్‌యూఐ నాయకులు తిరుచానూరు సీఐ సునీల్‌కుమార్ దృష్టికి తీసుకుని రావడంతో ఆయన చొరవ తీసుకుని సమస్యను పరిష్కరించారు. ఓ ప్రైవేటు నర్సింగ్ కళాశాలలో మొదటి సంవత్సరం చదువుతున్న చిత్తూరుకు చెందిన నేహా తనకు ఇక్కడ చదవడం ఇష్టంలేదని... టీసీ ఇస్తే మరో కళాశాలలో చేరుతానంటూ యాజమాన్యాన్ని విజ్ఞప్తి చేశారు. ఇబ్బంది పెడుతుండటంతో విద్యార్థి సంఘం నాయకులు తిరుచానూరు సీఐ దృష్టికి తీసుకొచ్చారు. ఆయన స్పందించి వెంటనే యాజమాన్యంతో మాట్లాడి విద్యార్థిని నేహాకు ధ్రువీకరణ పత్రాలను అందజేశారు.

రేపు ప్రత్యేక విద్యుత్ అదాలత్

తిరుపతి(జీవకోన), న్యూస్‌టుడే: ఏపీఎస్పీడీసీఎల్ విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక, ఆపరేషన్ తిరుపతి డివిజన్ ఆధ్వర్యంలో గురువారం ప్రత్యేక విద్యుత్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు ఆపరేషన్ తిరుపతి టౌన్ ఈఈ గంగాధర్‌రెడ్డి మంగళవారం తెలిపారు. నగరంలోని 33 //11 కేవీ ఆర్‌డీవో సబ్‌స్టేషన్‌లో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1.00 గంట వరకు కార్యక్రమం జరుగుతుందని తెలిపారు.

శ్రీవారి సేవలో ప్రముఖులు

శ్రీవారి ఆలయం ఎదుట ప్రభుత్వ సలహాదారు శ్రీనివాసరాజు

తిరుమల: శ్రీవారిని పలువురు ప్రముఖులు మంగళవారం దర్శించుకున్నారు. ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో శ్రీవారి మూలమూర్తిని తెలంగాణ ప్రభుత్వ సలహాదారు శ్రీనివాసరాజు, హీరోయిన్ ఇషారెబ్బా, సినీ దర్శకుడు శైలేష్ కొలను, సంగీత దర్శకుడు కోటి, శ్రీకాళహస్తి మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి, వైకాపా నాయకుడు జోగి రమేష్ దర్శించుకున్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. (10 AM TO 1 PM)

నగరపాలిక: 80080 20003, తిరుపతి (విద్య, తితిదే): 93936 28003
తిరుచానూరు: 80082 30008, మంగళం-జీవకోన: 80080 40005
తిరుపతి గ్రామీణ: 80085 74564, చంద్రగిరి: 80085 74561

తిరుపతి(నగరపాలిక), న్యూస్‌టుడే: సమస్య: ఎల్.ఎస్.నగర్‌లో ఇళ్ల మధ్య హోం స్టేలు నిర్వహిస్తున్నారు. అక్కడ బస చేసేందుకు వచ్చిన కార్లు రోడ్లపైన ఆపుతున్నారు. నగరపాలిక కార్మికులు వీధులు శుభ్రం చేసేందుకు వచ్చే సమయంలో కార్లు అడ్డుగా ఉండి శుభ్రం చేయలేని పరిస్థితి. ఆ ప్రాంతమంతా చెత్తచెదారంతో నిండిపోతుంది. **- స్థానికులు**

సమాధానం: హోంస్టేల నిర్వాహకులతో చర్చించి సమస్య పరిష్కరించేందుకు చర్యలు చేపడతాం.

సమస్య: వేశాలమ్మ గుడి వీధిలో పలు ప్రాంతాల్లో వీధిదీపాలు సక్రమంగా వెలగడం లేదు. గంగమ్మ ఆలయం వీధిలో చాలా చీకటిగా ఉంటోంది. **- ప్రమీల, స్థానికురాలు**

సమాధానం: వీధిదీపం ఏర్పాటుచేసి సమస్యను పరిష్కరిస్తాం.
- శ్యాంసుందర్, ఎస్ఈ, నగరపాలిక

చంద్రగిరి: సమస్య: చంద్రగిరి ఆర్టీసీ బస్టాండు పక్కన బందలమాను నార్వ ముళ్లపొదలు, చెత్తాచెదారంతో నిండి ఉంది. నార్వకాల్వను శుభ్రం చేయాల్సిన అవసరం ఉంది. **- నాగరాజనాయుడు, స్థానికులు**

సమాధానం: ఈ సమస్య మాదృష్టికి వచ్చింది. ఉపాధిహామీ పథకం కింద పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకుని కాలువను శుభ్రం చేయిస్తాం. **- చంద్రశేఖర్‌రెడ్డి, పంచాయతీ ఈవో**

నడకదారి ఆక్రమించి.. అడ్డగోలుగా విక్రయించి

☛ నాణ్యతలేని పూజాద్రవ్యాలతో మోసం ☛ అలిపిరి మెట్ల దగ్గర వసూల్ రాజాలు

తిరుపతి (తితిదే), న్యూస్‌టుడే: కాలినడకన ఏడుకొండలెక్కి మొక్కులు చెల్లించుకుందామని సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులను అలిపిరి నడకదారి దుకాణదారులు నిలువునా దోచేస్తున్నారు. మొక్కులు తీరాయని.. తాము అనుకున్న పనులు త్వరగా నెరవేరాలని కోరుతూ చాలా మంది భక్తులు మెట్టు పూజ చేస్తున్నారు. వీరిని లక్ష్యంగా చేసుకుని నాణ్యత లేని పసుపు, కుంకుమ, కర్పూరం విక్రయిస్తూ.. సొమ్ము చేసుకుంటున్నారు. భక్తుల విశ్వాసాలు వీరికి సంపాదన మార్గాలుగా మారాయి. వీటిని అరికట్టాల్సిన అధికారులు చోద్యం చూస్తున్నారనే ఆరోపణలున్నాయి.

మైదాతో కుంకుమ.. రసాయనాలతో పసుపు

అలిపిరి మార్గంలో నిత్యం వేలాది మంది తిరుమల చేరుకుంటారు. ఇందులో వందల మంది మెట్టుపూజ చేస్తుంటారు. వీరంతా వివిధ ప్రాంతాల వస్తుండటంతో కుంకుమ, పసుపు తదితర పూజాద్రవ్యాలు ఇక్కడే కొనుగోలు చేస్తుంటారు. అలాంటి వారే లక్ష్యంగా ఇక్కడి వ్యాపారులు దందా చేస్తున్నారు. నాణ్యమైన పసుపు బదులు రసాయనాలతో తయారైనవి విక్రయిస్తున్నారు. మైదాపిండికి రంగు కలిపి కుంకుమలాగా విక్రయిస్తున్నారనే విమర్శలున్నాయి.

తూతూ మంత్రంగా తనిఖీలు

గతంలో నకిలీ సరకులు అమ్ముతున్నారని తెలిసి అధికారులు దాడులు నిర్వహించారు. వ్యాపారుల నుంచి సామగ్రి స్వాధీనం చేసుకుని వెళ్లిపోయేవారు. తర్వాత రాజీ చేసుకుని మామూళ్లకు అలవాటు పడటంతో వ్యాపారులు యథేచ్ఛగా నాణ్యత లేకుండా విక్రయిస్తున్నారు. తనిఖీలు నామమాత్రంగా చేస్తున్నారు.

భక్తుల వెంట పడుతూ రోడ్డుపైనే విక్రయాలు

వ్యాపారులు రోడ్లు ఆక్రమించారు. నడకదారి ప్రారంభం, రుయా దారిలో ఓ వైపు దుకాణాలు ఏర్పాటు చేసుకున్నారు. లగేజీ కేంద్రం వద్ద తాళాల పేరుతో దందా సాగిస్తున్నారు. బ్యాగులు, సూట్ కేసులకు తాళాలు లేకుంటే లగేజీ కేంద్రాల్లో తీసుకోరంటూ చెబుతూ చిన్న తాళాలను అధిక ధరలకు అంటకడుతున్నారు.

● దుకాణాలకు ఎటువంటి అనుమతులు ఉండవు. దీంతో పోలీసు, విజిలెన్స్, కార్పొరేషన్ సిబ్బందికి ఈ దుకాణాలు ఆదాయ మార్గాలుగా మారాయి. రోజుకు దుకాణానికి కొంత చొప్పున వసూలు చేసుకుంటూ చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. వ్యాపారుల నుంచి ఆ అక్రమ సొమ్ము వసూలు చేసుకునేందుకు ప్రత్యేకంగా ఓ మనిషిని నియమించుకున్నారని అక్కడి వారే చెబుతున్నారు.

నడకదారిలో ఏర్పాటు చేసిన దుకాణాలు

మౌనమే అధికారుల మంత్రం

ఈ అంశంపై వివరణ కోరేందుకు పోలీసు, విజిలెన్స్ నగరపాలక అధికారులను సంప్రదించగా వారు స్పందించలేదు. తమ పరిధిలోకి రాదంటూ దాటవేత ధోరణిలో సమాధానం చెప్పారు. ఉన్నతాధికారులు స్పందించి అనధికార దుకాణాలు తొలగించాలని భక్తులు కోరుతున్నారు.

అమ్మవారిని దర్శించుకున్న సంగీత దర్శకుడు కోటి

తిరుచానూరు, న్యూస్‌టుడే: తిరుచానూరు శ్రీపద్మావతీ అమ్మవారిని మంగళవారం సినీ సంగీత దర్శకుడు కోటి కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. ఆయనకు ఆలయం వద్ద సూపరింటెండెంట్ సురేష్‌బాబు స్వాగతం పలికి ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు.

స్మార్ట్‌సిటీ ఈఈగా రవి కొనసాగింపు

తిరుపతి(నగరపాలిక): తిరుపతి స్మార్ట్‌సిటీ కార్పొరేషన్ ఈఈగా ఆర్.రవిని కొనసాగిస్తూ మంగళవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. పంచాయతీరాజ్ ఈఈగా పనిచేస్తూ ఆయన డెప్యూటేషన్‌పై స్మార్ట్‌సిటీ పథకంలో పనిచేస్తున్నారు. ఆయన పదవీకాలం ముగియడంతో ఈ ఏడాది జులై 31 వరకు డెప్యూటేషన్‌ను కొనసాగించారు.

హోలీ పండుగకు ప్రత్యేక రైళ్లు

తిరుపతి(రైల్వే), న్యూస్‌టుడే: హోలీ పండగ సందర్భంగా ప్రత్యేక రైళ్లు నడపనున్నట్లు ద.మ. రైల్వే అధికారులు తెలిపారు. నంబరు 07051 రైలు తిరుపతి- రక్సాల్ జంక్షన్ మధ్య ఈ నెల 21, 28, మార్చి 7వ తేదీల్లో నడుస్తుందన్నారు. తిరుపతి నుంచి ఉదయం 8:15 గంటలకు బయలుదేరి రేణిగుంట, కడప, తాడిపత్రి, వికారాబాద్, చర్లపల్లి మీదుగా మూడో రోజు మధ్యాహ్నం 13:30 గంటలకు రక్సాల్ జంక్షన్‌కు చేరుకోనుంది. అలాగే 07052 రక్సాల్ జంక్షన్- తిరుపతి రైలు ఈ నెల 24, మార్చి 3వ, 10వ తేదీల్లో నడుస్తుందన్నారు. ● 07519 తిరుపతి- మదార్ జంక్షన్ రైలు మార్చి 3వ తేదీన, 07520 మదార్ జంక్షన్- తిరుపతి రైలు 5వ తేదీన నడుస్తుందన్నారు.

స్విమ్స్ పరిశోధక విద్యార్థికి డాక్టరేట్

డాక్టర్ శ్రీకాంత్

తిరుపతి(వైద్యవిభాగం), న్యూస్‌టుడే: స్విమ్స్ ఫిజియోథెరపీ పరిశోధక విద్యార్థి డాక్టర్ శ్రీకాంత్ అరుగ డాక్టరేట్ పట్టా అందుకున్నారు. 'ఎఫెక్టివ్‌నెస్ ఆఫ్ ప్లైయోమెట్రిక్స్ వర్సెస్ రెసిస్టెన్స్ ట్రైనింగ్ యుజింగ్ మల్టీజిమ్ ఆన్‌ది స్ట్రెంత్ ఆఫ్ లోయర్ లింబ్ మస్క్యులేచర్, జంప్ పెర్ఫార్మెన్స్, అజిలిటీ అండ్ బ్యాలన్స్ అమాంగ్ రిక్రియేషనల్ వాలీబాల్ ప్లేయర్స్' అనే అంశంపై పరిశోధన నిర్వహించారు. అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ విశ్వనాథ్‌రెడ్డి పర్యవేక్షణలో పరిశోధన గ్రంథాన్ని సమర్పించారు. కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ శిల్పా కడియాల పరిశీలించి పీహెచ్‌డీ ప్రదానం చేశారు.

రామానుజ కూడలి శుభ్రం

ఈనాడు కథనానికి స్పందన

తిరుపతి పూర్ణకుంభం కూడలి నుంచి రేణిగుంట మార్గంలోని రామానుజ కూడలిని మంగళవారం అధికారులు శుభ్రం చేయించారు. అక్కడి సమస్యలపై మంగళవారం 'రామానుజా.. కనుమా' శీర్షికన చిత్ర కథనం ప్రచురితమైంది. స్పందించిన నగరపాలక అధికారులు పిచ్చిమొక్కలు, పాకుడుపట్టిన నీళ్లు తొలగించారు. పరిసరాలు శుభ్రం చేయించారు. టైల్స్ ఏర్పాటు పనులు చేయాల్సి ఉంది. **-ఈనాడు, తిరుపతి**

సచివాలయ ఉద్యోగులపై సర్వేలతో మానసిక ఒత్తిడి

కొవ్వొత్తులతో సచివాలయ ఉద్యోగుల నిరసన

తిరుపతి(నగరపాలిక), న్యూస్‌టుడే: ప్రభుత్వం సర్వేల పేరుతో స్వర్ణ గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులను మానసిక ఒత్తిడికి గురిచేస్తున్నదని, గత రెండు నెలల కాలంలో గుండెపోటు, రోడ్డు ప్రమాదాలు, ఆత్మహత్యలు చేసుకున్న వారి సంఖ్య ఆందోళన కలిగిస్తోందని సచివాలయ ఉద్యోగులు మంగళవారం తిరుపతిలో నిరసన కార్యక్రమాలు చేపట్టారు. తిరుపతి సచివాలయ ఉద్యోగుల ఐకాస ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి మహతి కళాక్షేత్రం నుంచి నగరపాలిక కార్యాలయం వరకు కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కోటేశ్వరరావు మాట్లాడారు. నాగమోహన్, విద్యాసాగర్, మోహన్‌కుమార్, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

'మంగళం డిపోను ప్రైవేట్ సంస్థకు అమ్మేస్తున్నారు'

మంగళం డిపో కార్మికులతో మాట్లాడుతున్న సీఐటీయూ నాయకుడు కందారపు మురళి

తిరుపతి(మంగళం),న్యూస్‌టుడే: మంగళం ఆర్టీసీ డిపోను ఓ ప్రైవేట్ సంస్థకు అమ్మేస్తున్నారని, రూ.100 కోట్ల స్థలాన్ని విక్రయించే హక్కు ప్రభుత్వానికి ఎవరిచ్చారని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కందారపు మురళి ప్రశ్నించారు. తిరుపతి అర్బన్ మండలం మంగళంలోని ఆర్టీసీ డిపోను సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు జయచంద్ర, కోశాధికారి కుమార్‌తో కలిసి ఆయన సందర్శించి మాట్లాడారు. రాష్ట్రంలో రూ.20 వేల కోట్ల విలువైన ఆర్టీసీ స్థలాలు విక్రయించేందుకు ప్రభుత్వం యత్నిస్తోందని ఆరోపించారు. దీన్ని వెంటనే విరమించుకోవాలని డిమాండ్ చేశారు. పర్యావరణ హితం పేరుతో డిపోలను ప్రయివేటు వ్యక్తులకు అప్పజెప్పి ఈ-బస్సులను నడుపుతామంటే కార్మికలోకం చూస్తూ ఊరుకోదన్నారు. మంగళం డిపోపై ప్రభుత్వం ఇప్పటికే ఉత్తర్వులు ఇచ్చిందని ఆరోపించారు.

ఎలాంటి ఉత్తర్వులు రాలేదు: డీఎం

ప్రభుత్వం నుంచి తమకు సీఐటీయూ చెబుతున్నట్లు ఎలాంటి ఉత్తర్వులు రాలేదని డిపో మేనేజర్ సుధాకరయ్య 'న్యూస్‌టుడే'కు తెలిపారు. 50 ఈ-బస్సులను డిపోకు కేటాయిస్తున్న మాట వాస్తవమేనని, కానీ డిపోను ఖాళీ చేయాలని, ఇక్కడున్న బస్సులను తరలించాలని ఉత్తర్వులు లేవన్నారు.

కళాశాల, పాఠశాలకు డెస్కులు పంపిణీ

చిన్నగొట్టిగల్లు: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలకు -50, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు- 50 చొప్పున మొత్తం 100 డెస్కులను పారిశ్రామిక వేత్త వలసారెడ్డి శివ ప్రసాద్ రెడ్డి మంగళవారం అందజేశారు. తన చిన్నాన్న వలసారెడ్డి వెంకట రెడ్డి జ్ఞాపకార్థంగా ఈ డెస్కులను పాఠశాలకు విరాళంగా అందించినట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులు సౌకర్యవంతమైన వాతావరణంలో చదువుకోవాలని, తమ వంతు సహాయం అందించడం ఆనందంగా ఉందన్నారు. డెస్కుల కొరతతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న విద్యార్థులకు ఈ విరాళం ఎంతో ఉపయోగపడుతుందని ఉపాధ్యాయులు పేర్కొన్నారు.

బీసీ 'సింహగర్జన'ను విజయవంతం చేయాలి

తిరుపతి(గాంధీరోడ్డు), న్యూస్‌టుడే: బీసీల ఐక్యత, ఆత్మగౌరవం, రాజకీయ అధికారం సాధనే లక్ష్యంగా బీసీవై పార్టీ జాతీయ అధ్యక్షుడు బోడె రామచంద్ర యాదవ్ తలపెట్టిన బీసీ 'సింహగర్జన' కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని బీసీ సంఘర్షణ సమితి పిలుపునిచ్చారు. స్థానిక యాదవ్ భవనంలో మంగళవారం సింహగర్జన పోస్టర్లను ఆవిష్కరించారు.

యూఎస్ఏ క్రికెటర్లను కలిసిన టీపీఎల్ విజేత

తిరుమల: తిరుమల ప్రీమియర్ లీగ్ విజేత నీలాద్రి టీమ్ సభ్యులు.. యూఎస్ఏ క్రికెటర్లు మోనాంక్ పటేల్, మిలింద్ కుమార్, సౌరబ్ నేత్రవాల్కర్‌లను మంగళవారం కలిశారు. ఈసందర్భంగా వారు నీలాద్రి టీమ్‌కు అభినందనలు తెలియజేశారు. స్థానిక వకుళమాత అతిథిగృహంలో ఈ కార్యక్రమం జరిగింది.

WANTED
మా Wheels Zone కంపెనీ పాకల బ్రాంచ్ లో
సేల్స్ మేనేజర్ (Male)
పనిచేయుటకు కావలెను
జీతం: 20k ,విద్యార్హత: డిగ్రీ
ONLINE ఇంటర్వ్యూ
Near HDFC Bank, Mainroad
✆77990 28444

ప్రవేశ మార్గం.. వాహనాలకు నిలయం

తిరుపతి కేంద్రీయ బస్టాండ్‌లో వింత పరిస్థితి ఉంది. ప్రయాణికుల రాకపోకలు ఏర్పాటు చేసిన ప్రవేశ మార్గం.. వాహనాల పార్కింగ్ కేంద్రంగా మారిపోయింది. ద్విచక్రవాహనాలను పార్కింగ్ స్థలాల్లో కాకుండా.. ప్రవేశమార్గం, ప్లాట్‌ఫాంల వద్ద నిలిపేస్తున్నారు. ఈ చిత్రం అలాంటిదే. శ్రీకాళహస్తి ప్లాట్‌ఫాంకు ఎదురుగా ఉన్న ప్రవేశ మార్గంలో వాహనాలను ఇలా పార్కింగ్ చేశారు. **- న్యూస్‌టుడే, తిరుపతి(ఆర్టీసీ)**

సేతుపై.. రావిచెట్టు

తిరుపతి - చంద్రగిరి మార్గం తుమ్మలగుంట ఎస్వీ గోశాల వద్ద ఉన్న రామసేతు రైల్వేఓవర్‌బ్రిడ్జిపై రావిచెట్టు మొలిచి పెరిగి పెద్దదై వేళ్లునుకుని ప్రమాదకరంగా కన్పిస్తుంది. పగుళ్లు రాకముందే సంబంధిత అధికారులు పర్యవేక్షించి తాత్కాలికంగా కాకుండా.. శాశ్వతంగా తొలగించే ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.
-ఈనాడు, తిరుపతి

పార్కింగ్ ప్రాంతం కాదు.. బస్టాండే

ఇదేదో ద్విచక్రవాహనాల పార్కింగ్ ప్రదేశం అనుకుంటున్నారా.. కాదండీ.. ఇది భాకరాపేట వద్ద ఉన్న బస్టాప్.. గ్రామాల నుంచి వివిధ పనులపై వచ్చిన జనాలు..స్థానికులు ఇలా ద్విచక్రవాహనాలను ఇష్టానుసారం పార్కింగ్ చేసి.. పనులు పూర్తి చేసుకుని వచ్చి తీసుకువెళ్తుంటారు. ఇక్కడ స్కూటర్లు, కార్లు, పార్కింగ్ చేయవద్దని.. చేస్తే గాలి తీసివేసి.. జరిమానా ఉంటుందని హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేసినా.. బేఖాతరు చేస్తూ పార్కింగ్ చేస్తున్నారు. **-ఈనాడు, తిరుపతి**

శ్రీపరాశరేశ్వరస్వామి ఆలయానికి పట్టువస్త్రాల సమర్పణ

పట్టువస్త్రాలతో ఆలయంలోకి వెళ్తున్న సీఆర్ రాజన్ దంపతులు

తిరుచానూరు, న్యూస్‌టుడే: తిరుచానూరు యోగిమల్లవరం శ్రీపరాశరేశ్వర స్వామి మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం వన్నెకుల క్షత్రియ కార్పొరేషన్ ఛైర్మన్ సీఆర్ రాజన్ దంపతులు పట్టువస్త్రాలను సమర్పించారు. ఆలయం వద్ద ఆయనకు ఛైర్మన్ నీలకంఠం, సభ్యులు ఘన స్వాగతం పలికారు. . అనంతరం ఆలయ ప్రాంగణంలో జరిగిన కల్యాణోత్సవంలో ఆయన పాల్గొన్నారు.

శేషాచలంలో అగ్నిప్రమాదాల నివారణకు చర్యలు

తిరుపతి (మంగళం): శేషాచలం అడవుల్లో అగ్ని ప్రమాదాల నివారణకు ముందస్తు చర్యలు చేపడుతున్నామని జిల్లా అటవీ అధికారి వి.సాయిబాబా మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. వేసవిలో అగ్ని ప్రమాదాలు నివారించేందుకు ఇప్పటికే ఫైర్‌లైన్లు ఏర్పాటు చేశామన్నారు. ఫైర్ ఫైటింగ్ టీమ్‌లు అందుబాటులోకి తెస్తామన్నారు. అగ్నిప్రమాదాలను జాతీయ విపత్తుగా గుర్తించిన కేంద్రం ప్రత్యేకంగా ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృందాలను పంపుతోందని, వీరికి బుధవారం నుంచి ఐదు రోజులపాటు శేషాచలం అడవులపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. వాతావరణం, నీటి వనరులు, అటవీ మార్గాల గురించి వివరిస్తామన్నారు.

IN THE COURT OF THE PRINCIPAL CIVIL JUDGE (JUNIOR DIVISION) AT TIRUPATI
O.S.No. 181/2022
State Bank of India, RASMECCC & SARC Rep. by its Asst. General Mariager, Office at Upstairs Of Hero Showroom, Renigunta Road, Tirupati. ...Plaintiff
Vs
Malarapu Sankaraiah ...Defendant
SUIT SUMMONS TO DEFENDANT
Malarapu Sankaraiah, S/o M. Rama krishnaiah, Door NO.20-3-124/13 Sanjay Gandhi colony, Tirupati.
Please take suit summons that in the above suit filed by the plaintiff against you is posted to 24.02.2026 for your appearance before the above Court. If you got any objections attend the above date 10.30 am and file the same falling which the matter will be decided exparte.
Hearing Date: 24.02.2026
MAVILLA HARISH
Advocate, Tirupati. Cell: 9949992779

విద్యార్థులను అభినందిస్తున్న డైరెక్టర్లు అబ్దుల్ ఇగ్రత్, గోవర్దన్

అశ్వమేధ అకాడమీ విద్యార్థుల ప్రతిభ

తిరుపతి (విద్య): స్థానిక అశ్వమేధ జూనియర్ కళాశాల నీట్, ఐఐటీ అకాడమీ విద్యార్థులు జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో ఉత్తమ పర్సంటైల్ సాధించినట్లు అకాడమీ డైరెక్టర్లు అబ్దుల్ ఇగ్రత్, టి.ఎం. గోవర్దన్ మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు ఇందులో కె.సంధ్య -99.2, డి.అఖిల్- 98.18, ఎ.ఉష్మశ్రీ- 97.13 పర్సంటైల్‌తో పాటు 20 మందికి పైగా అర్హత పొందినట్లు తెలిపారు. అధ్యాపకుల ఉత్తమ బోధనలతో ఈ విజయాలు సాధ్యమైనట్లు ప్రిన్సిపల్ సుమతి పేర్కొన్నారు.

విద్యార్థిని అభినందిస్తున్న కళాశాల అధ్యాపకులు

ఎన్నారై విజయకేతనం

తిరుపతి (విద్య), న్యూస్‌టుడే: ఎన్నారై జూనియర్ కళాశాలకు చెందిన విద్యార్థులు జేఈఈ మెయిన్స్‌లో సత్తా చాటారని ఆ కళాశాల యాజమాన్యం మంగళవారం ఓ ప్రకటనలో తెలిపింది. రాయపూడి నందిత సరోజ- 99.41, పి.వికాస్- 99.32 పర్సంటైల్ సాధించారు. వారికి విద్యాసంస్థల ఛైర్మన్ ఆలపాటి రవీంద్ర, కరస్పాండెంట్ ఆలపాటి రాజేంద్రప్రసాద్ అభినందనలు తెలిపారు.

మాతృశ్రీ విద్యార్థి సత్తా

తిరుపతి (విద్య): స్థానిక రైల్వే కాలనీలోని మాతృశ్రీ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ పూర్వ విద్యార్థి పి.మహేంద్ర జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో 98.268 పర్సంటైల్ సాధించారని ఆ పాఠశాల కరస్పాండెంట్ డాక్టర్ సుధాకర్ నాయుడు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు.

రాష్ట్రస్థాయిలో సత్తా

పాకాల, న్యూస్‌టుడే: విజయవాడలో ఓ ప్రైవేటు సంస్థ నిర్వహించిన రాష్ట్రస్థాయి వేదిక్ మ్యాథమేటిక్స్‌లో స్థానిక ఇన్‌ఫాంట్ జీసస్ పాఠశాలకు చెందిన తొమ్మిదో తరగతి విద్యార్థిని జయశ్రీ, శబరీషన్ సత్తా చాటారు. మంగళవారం పాఠశాలలో కరస్పాండెంట్ ఫాదర్ ఆంథోనిరాజ్, ఉపాధ్యాయులు వారిని అభినందించారు.

అమరావతిపై విష ప్రచారం తగదు

తిరుపతి (నగరం), న్యూస్‌టుడే: రాజధాని అమరావతిపై వైకాపా నాయకులు విష ప్రచారం చేస్తున్నారని నగర ఉప మేయర్ ఆర్సీ మునికృష్ణ విమర్శించారు. మంగళవారం నగరంలోని తన కార్యాలయంలో జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. అమరావతికి మైక్రోసాఫ్ట్ అధినేత బిల్‌గేట్స్ వస్తే ఆయన పర్యటనపై రాజకీయ విమర్శలు చేయడం సిగ్గు చేటు అన్నారు. బిల్‌గేట్స్ పర్యటనకు అయిన ఖర్చుపై అనవసరంగా రాద్ధాంతం చేయడం దారుణమన్నారు.

తెలుగు గంగ లీకేజీపై జనాగ్రహం

తిరుపతి(మంగళం): శెట్టిపల్లె గ్రామంలోని తెలుగు గంగ పైపు లీకేజీకి గురై, నీరు వృథాగా పోతున్నా నగరపాలక సంస్థ సిబ్బంది పట్టించుకోని వైనంపై మహిళలు, గ్రామపెద్దలు ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం గ్రామానికి వచ్చిన నగరపాలక సంస్థ సిబ్బందిని స్థానికులు నిలదీశారు. ప్రధాన పైపులైను నుంచి జిల్లా కలెక్టరేట్‌లో పనిచేస్తున్న ఓ అధికారి డైరెక్టుగా కనెక్షన్ తీసుకున్న కారణంగా ఈ సమస్య వచ్చిందని, ఎందుకు స్పందించలేదని ప్రశ్నించారు.

డిమాండ్‌లను తక్షణమే నెరవేర్చాలి

తిరుపతి(గాంధీరోడ్డు), న్యూస్‌టుడే: స్విమ్స్ కార్మికుల సమ్మెలో అధికారులు అంగీకరించిన అన్ని డిమాండ్‌లను తక్షణమే అమలు చేయాలని స్విమ్స్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి జి.రవి డిమాండ్ చేశారు. మంగళవారం విలేకరులతో మాట్లాడారు. స్విమ్స్ ఆసుపత్రిలో పనిచేస్తున్న కార్మికులకు ప్రస్తుతం ఉన్న శానిటేషన్ హోదాను తొలగించి, వార్డు బాయిలుగా పరిగణించాలని విజ్ఞప్తి చేశారు.

భారత్ విస్తార్ యాప్ ఆవిష్కరణ సమావేశం

సమావేశంలో ప్రసంగిస్తున్న వీసీ డా.జె.వి.రమణ

తిరుపతి (పశువైద్య విశ్వవిద్యాలయం), న్యూస్‌టుడే: తిరుపతిలోని శ్రీ వేంకటేశ్వర పశువైద్య వర్సిటీ పరిధిలోని డెయిరీ టెక్నాలజీ కళాశాల ఆడిటోరియంలో మంగళవారం భారత్ విస్తార్ యాప్ ఆవిష్కరణ సమావేశం ప్రత్యక్ష ప్రసారం కార్యక్రమంలో వర్సిటీ వీసీ డా.జె.వి.రమణ, అధికారులు పాల్గొన్నారు. కేంద్ర ప్రభుత్వం రైతుల కోసం ఏ.ఐ. ఆధారిత బహు భాషా మొబైల్ యాప్ భారత్ విస్తార్‌ను మంగళవారం కేంద్ర వ్యవసాయ శాఖ మాత్యులు శివరాజ్‌సింగ్ చౌహాన్ చేతుల మీదుగా జైపూర్ నుంచి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమాన్ని తిరుపతిలోని పశువైద్య వర్సిటీలో ప్రత్యక్ష ప్రసారం ద్వారా తిలకించేలా వర్సిటీ అధికారులు ఏర్పాట్లు చేశారు.

నగదు కాజేసిన వ్యక్తులపై కేసు నమోదు

తిరుపతి (నేరవిభాగం) న్యూస్‌టుడే: వడ్డీ ఆశ చూపి నగదు కాజేసిన వారిపై కేసు నమోదైంది. తిరుపతి కొరమీనుగుంటలో నరేంద్ర, భారతి నివాసముంటున్నారు. వారి పిల్లలను పాఠశాలకు తీసుకెళ్లి తీసుకొచ్చేందుకు తిరుపతికి చెందిన గోపిని డ్రైవర్‌గా నియమించుకున్నారు. కొన్ని రోజులకు అత్యవసరమని యజమానుల దగ్గర గోపి రూ.రెండున్నర లక్షల నగదు తీసుకున్నారు. ఆ తర్వాత వడ్డీ ఆశ చూపి రూ. 50 లక్షలను స్నేహితుల బ్యాంక్ ఖాతాలకు జమ చేయించుకున్నారు. తిరిగి ఇమ్మని అడిగితే బెదిరింపులకు పాల్పడ్డారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ శ్రీనివాసులు తెలిపారు.

రోడ్డుప్రమాదంలో తెదేపా నాయకుడికి తీవ్రగాయాలు

చంద్రగిరి: పూతలపట్టు-నాయుడుపేట జాతీయ రహదారి తొండవాడ సర్వీసు రోడ్డులో మంగళవారం రాత్రి జరిగిన రోడ్డుప్రమాదంలో తెదేపా దివ్యాంగ నాయకుడు కోనేటి జీవన్‌కుమార్‌రెడ్డి గాయపడ్డారు. తొండవాడ నుంచి సి.మల్లవరానికి వెళ్తున్న క్రమంలో ఆయన ప్రయాణిస్తున్న మూడు చక్రాల వాహనం బండరాయిపైకి ఎక్కి బోల్తా పడింది. ప్రమాదంలో జీవన్‌కుమార్‌రెడ్డి తలకు తీవ్ర గాయమైంది. పరిస్థితి విషమంగా ఉండటంతో ఓ ప్రైవేట్ వైద్యశాలకు తీసుకెళ్లారు.

వైకాపా విమర్శలు మానుకోవాలి

తిరుపతి(గాంధీరోడ్డు): కూటమి ప్రభుత్వంపై వైకాపా నేతలు విమర్శలు చేయడం మానుకోవాలని తెదేపా బీసీ సంఘాల నాయకులు హితవు పలికారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం మాట్లాడారు. బీసీ సంక్షేమానికి పెద్దపీట వేస్తున్న కూటమి ప్రభుత్వానికి అండగా ఉంటామని స్పష్టం చేశారు. రామారావు, తులసీ తదితరులు పాల్గొన్నారు.

ఆటోలపై రవాణా శాఖ కేసులు

తిరుపతి(నేరవిభాగం): ఆటోలపై రవాణా శాఖ కొరడా ఝుళిపించింది. ఎంవీఐలు శ్రీనివాసరావు, అతికానాజ్, స్వర్ణలత, మోహన్‌కుమార్, ఆంజనేయ ప్రసాద్, రమణనాయక్ మంగళం కూడలి, చెర్లోపల్లి సర్కిల్‌లో ఆటో రిక్షాలను తనిఖీ చేశారు. అధికంగా ప్రయాణికులను తరలిస్తున్న 15 ఆటో రిక్షాలపై కేసులు నమోదు చేశారు. వాహన సామర్థ్య ధ్రువీకరణ, బీమా లేని 20 ఆటో రిక్షాలపై కేసులు నమోదు చేశారు. 12 మంది ద్విచక్ర వాహనదారులపై కేసులు పెట్టారు.

(c) eenadu

శ్రీకాళహస్తి
• శ్రీకాళహస్తి • సత్యవేడు • రైల్వేకోడూరు

కలెక్టర్ వెంకటేశ్వర్‌ను సన్మానిస్తున్న రమేష్‌బాబు

రహదారి సమస్యపై కలెక్టర్‌కు విన్నపం

రైల్వేకోడూరు, న్యూస్‌టుడే: తిరుపతి-రైల్వేకోడూరు మధ్య జాతీయ రహదారి అధ్వానంగా ఉందని, మరమ్మతులు చేయించాలని కలెక్టర్ వెంకటేశ్వర్‌కు విన్నవించినట్లు రాష్ట్ర గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ డైరెక్టర్ రమేష్‌బాబు మంగళవారం పేర్కొన్నారు. పట్టణంలోని జాతీయ రహదారి డివైడర్లపై పచ్చదనం పెంపొందించడానికి సహకరించాలన్నారు. ఆయనతో పాటు తెదేపా నాయకులు చంద్రమౌళి, ఉమేష్ ఉన్నారు.

పాఠశాల విద్య మెరుగుపడాలి

రైల్వేకోడూరు, న్యూస్‌టుడే: పాఠశాల విద్య మెరుగుపడాలని, విద్యార్థుల నైపుణ్యాలను ఉపాధ్యాయులు గమనిస్తూ ఉండాలని జిల్లా విద్యాశాఖాధికారి కేవీఎన్ కుమార్ పేర్కొన్నారు. మంగళవారం ఆయన మైసూరువారిపల్లె, మంగంపేట ఏపీఎండీసీ, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను పరిశీలించారు. అనంతరం రైల్వేకోడూరు ఎమ్మార్సీ కార్యాలయంలో ఉపాధ్యాయులతో సమావేశం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఎంఈవో- 2 సుందర్‌బాబు సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థుల పఠనాశక్తిని పరిశీలిస్తున్న డీఈవో కేవీఎన్ కుమార్, పక్కన ఉపాధ్యాయులు

ద్రవిడ సంప్రదాయం.. పరవశించిన భక్తగణం

'బాల్య వివాహం'పై వ్యూహం

10 ప్రవేశ మార్గాల్లో తనిఖీ కేంద్రాలు

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: బాల్య వివాహాల ఊబిలో చిక్కుకుంటున్న బాలికల సంరక్షణకు ప్రభుత్వ ఆదేశాల మేరకు అధికారులు పకడ్బందీగా వ్యూహరచన చేశారు. పట్టణంలోకి ప్రవేశించే పలు ప్రాంతాల్లో మంగళవారం తనిఖీ కేంద్రాలు ఏర్పాటు చేశారు. వివిధ శాఖల అధికారులు బృందాలుగా ఏర్పడి నిశితంగా పరిశీలించి నూతన వధూవరులకు అనుమతులు ఇచ్చి పంపుతున్నారు. ఇందు కోసం పది మార్గాల్లో తనిఖీ కేంద్రాలు ఏర్పాటు చేశారు. స్వామి, అమ్మవార్ల కల్యాణోత్సవం సందర్భంగా కల్యాణం చేసుకునే వధూవరులను తనిఖీ చేసి ధ్రువీకరణ పత్రాలు అందజేసి కల్యాణ వేదిక వద్దకు పంపే విధంగా చర్యలు చేపట్టారు.

తనిఖీ కేంద్రాన్ని సందర్శిస్తున్న ఐసీడీఎస్ అధికారులు

సోమస్కందమూర్తికి ప్రత్యేక అలంకరణలు

జ్ఞానాంబికకు

గంగాదేవికి విశేష అలంకరణలు

కళాకారుల నృత్య రూపకం

నాయుడుపేటకు చెందిన నటరాజ నాట్యాలయ కళాకారుల నృత్య ప్రదర్శన

నేడు తాండవేశ్వరుని కల్యాణోత్సవం

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: తారకాసురుని సంహారం కోసం జనించే స్కందుని కోసం సమస్త దేవతాగణం నిరీక్షిస్తున్న సమయంలో శివపార్వతుల కల్యాణంతో సురగణాలు, యక్ష, కిన్నెర, కింపురుషులు, ఋష్యప్రముఖులు అందరూ ఆనందడోలికల్లో తలమునకలవుతారు. వీరందరి ఆనందాన్ని చూసిన సర్వేశ్వరుడు సర్వానంద భరితుడై సతీదేవితో కలిసి ఆనందతాండవం చేస్తాడని పురాణాలు విశదపరుస్తున్నాయి. బ్రహ్మోత్సవాల్లో స్కందరాత్రి అయ్యాక ఆనందరాత్రిని పురస్కరించుకుని ముక్కంటి ఆలయంలో సభాపతి కల్యాణం నిర్వహించడం సంప్రదాయం. ఆలయంలోని ఆస్థాన మండపంలో నాట్యశాస్త్రానికి ఆదిగురువైన నటరాజస్వామి, శివకామసుందరికి ఆగమోక్తంగా వివాహం నిర్వహించనున్నారు. ఊరేగింపులో ఉత్సవమూర్తులు తమిళ సంప్రదాయంలో అలంకరించారు. అనంతరం దేవేరి సమేతుడైన సభాపతిని అంగరంగ వైభవంగా పురవీధుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శన భాగ్యం కల్పించనున్నారు.

● కల్యాణోత్సవ వైభవ సందర్భంగా నూతన వధూవరులకు తిరుపతి ఎంపీ మద్దిల గురుమూర్తి, మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి బంగారు తాళి బొట్లు వితరణగా ఇచ్చారు.

గిరిప్రదక్షిణ మార్గంలో వాహనాలు నిషేధం

మహాశివరాత్రి వార్షిక బ్రహ్మోత్సవాల్లో కైలాసగిరి ప్రదక్షిణోత్సవం సందర్భంగా మార్గంలో వాహనాల రాకపోకలు రద్దు చేసినట్లు ఆలయ ఈవో బాపిరెడ్డి తెలిపారు. ముక్కంటి ఆలయం నుంచి సోమస్కందమూర్తి, జ్ఞానప్రసూనాంబ అమ్మవార్లు ఈనెల 19న కైలాసగిరి ప్రదక్షిణోత్సవానికి బయలుదేరి వెళ్లనున్నట్లు వివరించారు.

నృత్యం.. రసరమ్య భరితం

మహాశివరాత్రి వార్షిక బ్రహ్మోత్సవాల్లో నృత్య ప్రదర్శనలు రసరమ్యభరితంగా సాగుతున్నాయి. ధూర్జటి కళా ప్రాంగణంలో మంగళవారం పలువురు కళాకారులు తమదైన నృత్య ప్రదర్శనతో ఆహూతులను రంజింపచేశారు. అలాగే పురాణ ప్రవచనాలు, ఆధ్యాత్మిక సంగీత విభావరి, పౌరాణిక నాటకాలు మరింతగా ఆకట్టుకున్నాయి.

చరిత్రాత్మకం.. ఆస్థాన మండపం

శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఉన్న పలు చరిత్రాత్మక కట్టడాల్లో ఆస్థాన మండపం ఒకటి. బ్రహ్మోత్సవాల్లో భాగంగా సభాపతి కల్యాణోత్సవం నిర్వహించేది ఇక్కడే.

రాయలు వంశీయుల నిర్మాణం

మీకు తెలుసా..?

విజయనగర సామ్రాజ్యాన్ని పాలించిన అచ్యుతరాయల కాలంలో ఇక్కడి ఆస్థాన మండపాన్ని నిర్మించినట్లు స్థలపురాణం ద్వారా తెలుస్తోంది. 1529 అక్టోబరు 20న 16 కాళ్లతో నిర్మించిన ఈ మండపంలో ఆయన పట్టాభిషేకం చేసుకున్నట్లు తెలుస్తోంది. పట్టాభిషేకం కోసం ఈ మండపాన్ని నిర్మించినట్లు తెలుస్తోంది. ఆ మండపమే ప్రస్తుతం ఆస్థాన మండపంగా ఖ్యాతి గడించింది. బుధవారం జరిగే సభాపతి కల్యాణానికి ఇక్కడ ఏర్పాట్లు సిద్ధం అవుతున్నాయి. - న్యూస్‌టుడే, శ్రీకాళహస్తి

ఆస్థాన మండపంలో నటరాజస్వామికి అభిషేకాలు నిర్వహిస్తున్న అర్చకులు

గుడిమల్లంలో గిరిప్రదక్షిణ

గిరిప్రదక్షిణలో ఆనందవల్లీదేవి సమేత పరశురామేశ్వరస్వామి

ఏర్పేడు, న్యూస్‌టుడే: మండలంలోని గుడిమల్లం శ్రీ పరశురామేశ్వరస్వామి ఆలయంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం గిరిప్రదక్షిణ చేపట్టారు. శ్రీ ఆనందవల్లీదేవి సమేత పరశురామేశ్వరస్వామితో పాటు వినాయకుడు, సుబ్రహ్మణ్యస్వామి శివపరివారంతో కలిసి మూషిక, నెమలి, సింహ, వృషభవాహనాలను అధిరోహించి విహరించారు. ఆలయ ఈవో రామచంద్రారెడ్డి, ఛైర్మన్ గిరినాయుడు పాల్గొన్నారు.

నటరాజస్వామి ప్రాకారోత్సవం

వేడుకగా త్రిశూలస్నానం

నాగలాపురం, న్యూస్‌టుడే: సురుటుపల్లి పల్లికొండేశ్వరాలయంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు మంగళవారం ముగిశాయి. తొలుత త్రిశూల స్నానం చేశారు. అనంతరం రావణాసుర వాహనంపై వాల్మీకేశ్వరుడిని గ్రామ వీధులలో ఊరేగించారు. ఆలయ ఛైర్మన్ పద్మనాభరాజు, ఈవో లత, ప్రధానార్చకులు కార్తికేయన్ పాల్గొన్నారు. వరదయ్యపాళెం: సంతవేలూరులోని వాలీశ్వరాలయం, పాందూరులోని జ్యోతీశ్వరాలయంలో శివపార్వతుల కల్యాణోత్సవం వైభవోపేతంగా జరిగింది. ఆదిదంపతులు గ్రామవీధుల్లో ఊరేగుతూ ప్రజలకు దర్శనం కల్పించారు.

ఆది దేవుడికి హంస వాహన సేవ

శ్రీకాళహస్తి గ్రామీణం (ఏర్పేడు), న్యూస్‌టుడే: తొండమానుపురంలో వెలసిన శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ వెంకటేశ్వరస్వామి మంగళవారం స్వామి, అమ్మవార్లకు శాస్త్రోక్తంగా అభిషేకాలు నిర్వహించి చందనాలంకరణ చేశారు. రాత్రి హంసవాహనంపై కొలువుదీరి గ్రామవీధుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు.

హంసవాహనంపై శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి

తొట్టంబేడు: ఉత్సవమూర్తులకు కల్యాణం జరిపిస్తున్న పండితులు

వైభవంగా శ్రీఅగస్తీశ్వరుని కల్యాణం

తొట్టంబేడు, న్యూస్‌టుడే: పెద్దకన్నలిలో వెలసిన శ్రీదుర్గాంబికా సమేత శ్రీఅగస్తీశ్వరాలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహించారు. మంగళవారం శ్రీదుర్గాంబికా సమేత శ్రీఅగస్తీశ్వరుని కల్యాణ వేడుకను వేదపండితులు శాస్త్రోక్తంగా జరిపారు.

ప్రభుత్వ భూములు కాపాడాలి

ఏర్పేడు, న్యూస్‌టుడే: మండలంలోని వికృతమాల రెవెన్యూలో పెద్దఎత్తున ప్రభుత్వ భూములు ఆక్రమణలకు గురవుతున్నాయని సీపీఐ నేతలు ఆరోపించారు. సీపీఐ నేత గురవయ్య ఆధ్వర్యంలో మంగళవారం డీకేటీ భూముల ఆక్రమణపై నిరసన తెలిపారు. కార్యక్రమంలో మణి, శివకుమార్ జనార్దన్, వినోద్, కార్తిక్, గోపి పాల్గొన్నారు.

మామిడి రైతులకు రాయితీపై కవర్లు

రైల్వేకోడూరు, న్యూస్‌టుడే: మామిడి రైతులకు రాయితీ ధరలతో కాయలకు కట్టే కవర్లు(సంచులు) పంపిణీ చేస్తున్నట్లు ఉద్యాన శాఖ అధికారి ఎం. వెంకటభాస్కర్ తెలిపారు. స్థానిక కార్యాలయంలో మంగళవారం ఆయన మాట్లాడుతూ రాయితీతో కవర్లను రూ.1కే ఇస్తున్నట్లు చెప్పారు. ఒక్కో రైతుకు కనిష్ఠంగా 2,500 నుంచి గరిష్ఠంగా 30వేల కవర్లు మంజూరు చేస్తామని చెప్పారు. అవసరమైన రైతులు తమను సంప్రదించాలన్నారు.

చిన్న ప్రాణితో పెద్ద ముప్పు

సత్యవేడు, న్యూస్‌టుడే: పిల్లల సంపూర్ణ ఆరోగ్యం కొరకు అల్బెండజోల్ మాత్రలు విద్యార్థులు వేసుకోవాలని ఏఎన్ఎం మేరి అన్నారు. మంగళవారం మండలంలోని పెద్దఈటిపాకం, రాచపాళెం, పాలగుంట పాఠశాలలో విద్యార్థులకు మాత్రలు వేశారు. పిచ్చాటూరు: నులిపురుగుల నివారణతో ఆరోగ్యం పదిలంగా ఉంటుందని వైద్యాధికారి ధనుష్ పేర్కొన్నారు. మండలంలోని పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాల్లోని విద్యార్థులకు సిబ్బందితో కలిసి ఆల్బెండజోల్ మందులను అందించారు. పెనగలూరు, పుల్లంపేట, న్యూస్‌టుడే: చిన్న ప్రాణితో పెద్ద ప్రాణానికే ముప్పు అని ఎనగలూరు, పుల్లంపేట, వైద్యాధికారులు మహమ్మద్ తౌనిఖ్, మనోజ్‌చంద్ర అన్నారు.

ప్రకృతి సంపదను భవిష్యత్తుకు అందించాలి

శ్రీకాళహస్తి: ప్రకృతి సంపదను భవిష్యత్తుకు అందించడమే సుస్థిర అభివృద్ధి అని ఏపీఎస్పీడీసీఎల్ ఛైర్మన్, ఎండీ శివశంకర్ అన్నారు. శ్రీకాళహస్తిలోని చిలకమహాలక్ష్మీ ఆలయానికి సమీపంలోని సమావేశపు హాలులో మంగళవారం నిర్వహించిన భూఅమృత్ కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్ర అటవీశాఖ సలహాదారులు అంకారావు, మాజీ ఎమ్మెల్యే ఎస్సీవీనాయుడు పాల్గొన్నారు.

ఎంపీ లక్ష్మణ్‌కు స్వాగతం పలుకుతున్న దృశ్యం

ఎంపీ లక్ష్మణ్‌కు ఘనస్వాగతం

రేణిగుంట, న్యూస్‌టుడే: భాజపా ఎంపీ, ఆ పార్టీ ఓబీసీ జాతీయ అధ్యక్షుడు కె.లక్ష్మణ్‌కు రేణిగుంట విమానాశ్రయంలో ఘనస్వాగతం లభించింది. తిరుమల శ్రీవారి దర్శనార్థం కుటుంబసమేతంగా మంగళవారం ఆయన ఇక్కడికి చేరుకున్నారు. విమానాశ్రయంలో ఆయనకు భాజపా రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోలా ఆనంద్, జిల్లా అధ్యక్షుడు సామాంచి శ్రీనివాస్ నాయకులు తేజోవతి, బీడీ బాలాజీ, వరప్రసాద్ రాజారాయల్, పురుషోత్తం, తదితరులు స్వాగతం పలికారు. ఓబీసీ జిల్లా ఉపాధ్యక్షుడిగా ఎన్నికైన వేణును ఆయన అభినందించారు.

భారత్ విస్తార్‌పై అవగాహన

రేణిగుంట, న్యూస్‌టుడే: భారత్ విస్తార్‌పై రైతులు అవగాహన కలిగి ఉండాలని రాస్ కేవీకే ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ శ్రీనివాసులు తెలిపారు. మంగళవారం స్థానిక రాస్ కేవీకేలో భారత్ విస్తార్ ప్రారంభ కార్యక్రమం నిర్వహించారు. డ్రమ్ సీడర్, వ్యవసాయ యంత్రాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రాస్ కేవీకే శాస్త్రవేత్తలు దివ్య, దివ్య సుధ, అనూష, రైతులు పాల్గొన్నారు.

వివరాలు తెలుసుకుంటున్న జీవీ నారాయణరెడ్డి

స్వర్ణ పంచాయతీలుగా తీర్చిదిద్దుదాం

ఏర్పేడు, న్యూస్‌టుడే: కలిసికట్టుగా పనిచేస్తూ గ్రామాలను స్వర్ణ పంచాయతీలుగా తీర్చిదిద్దుదామని స్వర్ణగ్రామ, వార్డు జిల్లా అధికారి జీవీ నారాయణరెడ్డి తెలిపారు. ఏర్పేడు మండలంలోని గుడిమల్లం పంచాయతీలో జరుగుతున్న యూనిఫైడ్ కుటుంబ సర్వే, అక్షరాంధ్ర, ఈకేవైసీ అంశాలను ఆయన పరిశీలించారు. ఈ నెల 20లోపు సర్వే పూర్తిచేయాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో సౌభాగ్యమ్మ, డిప్యూటీ ఎంపీడీవో రమణకుమార్ అధికారులు పాల్గొన్నారు.

'విద్యార్థుల అదృశ్యం అవాస్తవం'

రేణిగుంట, న్యూస్‌టుడే: రేణిగుంటలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో సోమవారం మధ్యాహ్న భోజనం తరువాత పాఠశాల ప్రహరీ దాటి వెళ్లిన 6వ తరగతి విద్యార్థులను ఆటో డ్రైవర్ సహాయంతో ప్రిన్సిపల్ రాధాకృష్ణ గుర్తించారు. పిల్లలను వారి తల్లిదండ్రులకు అప్పగించారు. ఇక్కడ ముగ్గురు విద్యార్థులు అదృశ్యమయ్యారనే వార్త వైరల్ కావడంతో మంగళవారం రేణిగుంట గ్రామీణ సీఐ మంజునాథరెడ్డి అటెండన్స్ రిజిస్టర్‌ను తనిఖీ చేశారు.

అనుమతి ఉన్న సమయంలోనే వాహనాలు వెళ్లాలి

సత్యవేడు, న్యూస్‌టుడే: దాసుకుప్పం, సత్యవేడు ప్రాంతాల్లో ఉదయం 7.30 నుంచి 9.30 గంటల వరకు, సాయంత్రం 4 నుంచి 7.30వరకు ఎలాంటి భారీ వాహనాలకు, టిప్పర్లకు అనుమతి లేదని ఎస్సై సాయినాథ్ చౌదరి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

మొక్కల పెంపకంతోనే పర్యావరణ పరిరక్షణ

బీఎన్‌కండ్రిగ, న్యూస్‌టుడే: మొక్కల పెంపకంతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమవుతుందని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు కె.అంకారావు తెలిపారు. మంగళవారం ఆయన స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాల, ఎస్వీఆర్ ప్రైవేటు పాఠశాల విద్యార్థులతో సమావేశమై మొక్కల పెంపకం ఆవశ్యకతను వివరించారు. ఎంఈవో మునిసుబ్రహ్మణ్యం, ప్రధానోపాధ్యాయుడు రమణయ్య, తెదేపా నేత కన్నయ్యనాయుడు తదితరులు పాల్గొన్నారు.

బీఎన్‌కండ్రిగ ఉన్నత పాఠశాలలో మాట్లాడుతున్న ప్రభుత్వ సలహాదారు అంకారావు

నేడు ప్రత్యేక విద్యుత్తు అదాలత్

నారాయణవనం, న్యూస్‌టుడే: విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారానికి స్థానిక సౌరకాయలస్వామి కల్యాణ మండపంలో బుధవారం ప్రత్యేక అదాలత్‌ను నిర్వహిస్తున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ జయప్రకాష్ తెలిపారు. అదాలత్ ఛైర్మన్ శ్రీనివాస ఆంజనేయమూర్తి నేతృత్వంలో బుధవారం మధ్యాహ్నం 3.00 గంటల నుంచి 5.00 వరకు జరిగే అదాలత్‌ను వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

సీఎం సహాయనిధి చెక్కు పంపిణీ

పుల్లంపేట, న్యూస్‌టుడే: పుత్తనవారిపల్లెకు చెందిన జింకా లీలావతికి సీఎం సహాయనిధి రూ.3,03,082ల చెక్కును తెదేపా నాయకుడు ముక్కా విశాల్‌రెడ్డి మంగళవారం అందించారు. నాయకులు చంద్రశేఖర్ నాయుడు, నారాయణ, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

పని ఒత్తిడి తగ్గించాలి

రేణిగుంట, న్యూస్‌టుడే: పని ఒత్తిడి తగ్గించాలని వీఆర్వోలు డిమాండ్ చేశారు. మంగళవారం నల్లబ్యాడ్జీలు ధరించి తహసీల్దారు కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. యూఎఫ్ఎస్ సర్వేలు, సచివాలయ సర్వేల నుంచి తమను మినహాయించాలని డిమాండ్ చేశారు. ఓబులవారిపల్లె: తమపై పని భారం తగ్గించాలని మంగళవారం నల్ల బ్యాడ్జీలు ధరించి వీఆర్వోలు తహసీల్దారు తహసీల్దారు యామినికి వినతి పత్రం అందించారు. శ్రీకాళహస్తి: మంగళవారం తహసీల్దారు కార్యాలయం వద్ద వీఆర్‌వోలు నిరసన చేపట్టారు. ఏర్పేడు: పనిఒత్తిడి తగ్గించాలని ఏర్పేడు మండలంలోని వీఆర్‌వోలు నల్లబ్యాడ్జీలతో తహసీల్దారు కార్యాలయం ఎదుట మంగళవారం నిరసన తెలియజేశారు. సమస్యలను ఉన్నతాధికారులకు విన్నవించుకున్నప్పటికీ న్యాయం జరగలేదని వాపోయారు. కార్యక్రమంలో భాస్కర్, మణి, వీఆర్‌వోలు పాల్గొన్నారు.

నిరసన వ్యక్తం చేస్తున్న వీఆర్వోలు

స్థల ఆక్రమణలపై చర్యలు తీసుకోండి

పిచ్చాటూరు: స్థానిక ఉన్నత పాఠశాల స్థల ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలని ప్రధానోపాధ్యాయుడు గిరిప్రకాష్ ఎంపీడీవో మహమ్మద్‌రఫీ, తహసీల్దారు సుబ్రహ్మణ్యంలకు మంగళవారం వినతిపత్రాలు అందించారు.

ఇంటర్ విద్యే భవిష్యత్తుకు పునాది

పుల్లంపేట: ఇంటర్ విద్య విద్యార్థులకు భవిష్యత్తులో మార్గం చూపుతుందని ఎస్‌బీవీడీ సభా సంస్థల కరస్పాండెంట్ శ్రీరాములు అన్నారు. మంగళవారం కళాశాలలో ఫేర్‌వెల్ దినోత్సవాన్ని నిర్వహించారు.

జేఈఈ మెయిన్స్‌లో విద్యార్థి సత్తా

శ్రీకాళహస్తి గ్రామీణం: శ్రీకాళహస్తికి చెందిన విద్యార్థి నాగోలు మోహిత్‌నందన్ రెడ్డి సోమవారం విడుదలైన జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో 98శాతం మార్కులు సాధించాడు. తల్లి ప్రవీణ, తండ్రి సురేంద్ర రెడ్డి వ్యవసాయశాఖ అధికారులు.

ఎలుగుబంటి సంచారంతో ఆందోళన

ఓబులవారిపల్లె: మండలంలో పంట పొలాలు, మంగంపేట, గోవిందపల్లె ముగ్గురాయి మిలుల్లో ఎలుగుబంటి సంచారం చేస్తుంది. మంగళవారం గోవిందపల్లె పంచాయతీ కురుగుంట్లవారిపల్లె వద్ద ఉన్న పంట పొలాల్లోకి ఎలుగుబంటి వచ్చింది. ఇటీవల బాలిరెడ్డిపల్లె, వైకోట పంట పొలాల్లో రైతులపై దాడి చేసిన విషయం తెలిసిందే. దీంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

స్పీకర్లు వితరణ.. పుల్లంపేట: మండల కేంద్రమైన పుల్లంపేట భద్రావతి సమేత భావనారుషి ఆలయానికి మంగళవారం విశ్రాంత ఉద్యోగి నూకల వెంకటరమణ రూ.15ల విలువ చేసే ఎలక్ట్రానిక్ స్పీకరన్లు ఆలయ కార్యదర్శి శ్రీనివాసులుకు అందించారు.

గ్రంథాలయాల్లో పోటీ పరీక్షల పుస్తకాలు.. తొట్టంబేడు: గ్రంథాలయాల్లో పోటీ పరీక్షలకు అవసరమయ్యే పుస్తకాలను అందుబాటులోకి తెస్తామని ఉమ్మడి చిత్తూరు జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ రెడ్డివారి గురవారెడ్డి అన్నారు.

శాస్త్రవేత్తలుగా ఎదగాలి.. రేణిగుంట: విద్యార్థులు భావి భారత శాస్త్రవేత్తలుగా ఎదగాలని జన విజ్ఞన వేదిక జిల్లా ఉపాధ్యక్షుడు వెంకటరమణ తెలిపారు. మంగళవారం ప్రముఖ ఖగోళ, గణిత శాస్త్రవేత్త బ్రూనో బలిదానం పురస్కరించుకుని పలు పాఠశాలల్లో సత్యాన్వేషణ రోజు నిర్వహించారు.

చైన్ స్నాచింగ్‌పై జాగ్రత్త

కేవీబీపురం, న్యూస్‌టుడే: మహిళలు చైన్ స్నాచింగ్‌పై అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ ఓబయ్య కోరారు. మంగళవారం సంత వద్ద స్థానిక మహిళలతో మాట్లాడారు. అనుమానాస్పద వ్యక్తులు తిరుగుతుంటే 9491074520 నెంబరుకు ఫోన్ చేయాలన్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి

పిచ్చాటూరు, న్యూస్‌టుడే: మండలంలోని వెంగళత్తూరు వద్ద మతిస్థిమితం లేకుండా తిరిగే వ్యక్తి శనివారం అపస్మారక స్థితికి వెళ్లడంతో నగరి వైద్యశాలకు తరలించారు. చికిత్స పొందుతూ ఆయన సోమవారం మరణించినట్లు ఎస్సై రాఘవేంద్ర మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి..

రేణిగుంట, న్యూస్‌టుడే: మండలంలోని కరకంబాడి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా మరొకరు గాయపడ్డారు. స్థానికుల కథనం మేరకు.. వెదురుకుప్పం గ్రామానికి చెందిన బుజ్జమ్మ (58), సుబ్రహ్మణ్యం మంగళవారం దొడ్లమిట్ట గ్రామానికి వచ్చారు. తిరుగు ప్రయాణంలో ఆటోలో వెళుతుండగా కరకంబాడి కూడలి వద్ద కారు వీరిని ఢీకొంది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన బుజ్జమ్మను స్థానిక ప్రైవేటు ఆసుపత్రికి, సుబ్రహ్మణ్యాన్ని రేణిగుంట తిరుపతి మార్గంలో ఉన్న మరో ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. బుజ్జమ్మ చికిత్స పొందుతూ మృతి చెందారు.

CHANGE OF NAME
I, JEBBIREDDY SUBRAMANYAM (OLD NAME), S/o JEBBIREDDY SUBBARAMI REDDY, R/o 4/32, THALLAMVARIPALLI (Vi), GADELA (Po), OBULAVARIPALLI (Ml), ANNAMAYYA DIST., A.P.-516108. I CHANGED MY NAME TO JEBBIREDDY SUBRAMANYAM REDDY. HENCE FORTH, I WILL BE KNOWN AS JEBBIREDDY SUBRAMANYAM REDDY (NEW NAME).

CHANGE OF SURNAME
I, POLI SUGUNA (OLD NAME), W/o JEBBIREDDY SUBRAMANYAM REDDY, R/o 4/32, THALLAMVARIPALLI (Vi), GADELA (Po), OBULAVARIPALLI (Ml), ANNAMAYYA DIST., A.P.-516108. I CHANGED MY SURNAME TO JEBBIREDDY SUGUNA. HENCE FORTH, I WILL BE KNOWN AS JEBBIREDDY SUGUNA (NEW NAME).

CHANGE OF NAME
I, JEBBIREDDI SUMANTH (OLD NAME), S/o JEBBIREDDY SUBRAMANYAM REDDY, R/o 4/32, THALLAMVARIPALLI (Vi), GADELA (Po), OBULAVARIPALLI (Ml), ANNAMAYYA DIST., A.P.-516108. I CHANGED MY NAME TO JEBBIREDDY SUMANTH REDDY. HENCEFORTH, I WILL BE KNOWN AS JEBBIREDDY SUMANTH REDDY (NEW NAME).

పన్ను బకాయిలు.. కార్యదర్శులపై ఒత్తిళ్లు

• స్వర్ణ పంచాయతీలతో పక్కాగా లెక్కలు..

నారాయణవనం, బీఎన్‌కండ్రిగ, న్యూస్‌టుడే: గ్రామ పంచాయతీల్లో ఇంటి పన్నుల వసూళ్ల వ్యవహారం కార్యదర్శులకు సంకటంగా మారింది. కూటమి ప్రభుత్వం స్వర్ణ పంచాయతీ వ్యవస్థను అమల్లోకి తీసుకొచ్చింది. పంచాయతీ లావాదేవీలన్నీ పూర్తిగా ఆన్‌లైన్ కావడంతో బకాయిలకు సంబంధించిన పురోగతిని కమిషనర్ స్థాయిలో ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారు. వంద శాతం వసూళ్లు జరగాలనే లక్ష్యంతో ముందుకు వెళ్తున్నారు. తంలోనే అధికం.. పన్నులు అధికంగా వసూలు కావల్సింది ఇండస్ట్రియల్ ప్రాంతంలోనే. సెజ్, ఇతర మండలాల్లోని కర్మాగారాల యజమానులు గతంలో పన్ను కట్టలేదు. అధికారులను చేతిలో ఉంచుకుని పబ్బం గడిపారు. పన్ను వసూలు చేయడంలో జిల్లాలో కేవీబీపురం 52 శాతంతో చివరి స్థానంలో ఉంది. సత్యవేడు నియోజకవర్గంలో బీఎన్‌కండ్రిగ మండలం మొదటి స్థానంలో నిలవగా జిల్లాలో టాప్ పదిలో నిలిచింది. ఈ మండలంలో 20 పంచాయతీల్లో 100 శాతం పన్ను వసూలు చేశారు.

మండలాల వారీగా గణాంకాలు (రూ.లో)

మండలం	పంచాయతీలు	అసెస్మెంట్లు	చెల్లించింది	బకాయిలు
కేవీబీపురం	39	9,880	28,00,000	26,88,000
నారాయణవనం	19	8,442	46,98,000	34,18,000
బీఎన్‌కండ్రిగ	28	8,774	50,41,000	6,97,000
పిచ్చాటూరు	21	7,814	23,14,000	8,46,000
సత్యవేడు	28	12,394	76,45,000	61,80,000
నాగలాపురం	19	7,117	24,81,000	15,57,000
వరదయ్యపాళెం	29	11,178	1.77కోట్లు	82,23,000

లక్ష్యానికి సుదూరం..

మార్చి మొదటి పక్షంలో 75శాతం, నెలాఖరుకు 100శాతం పన్ను వసూలు చేయాలని నిబంధనలున్నా దాదాపు 90 శాతం పంచాయతీలు మార్చి సమీపిస్తున్నా లక్ష్యం చేరుకోలేదు. గత ప్రభుత్వ హయాంలో కొన్నిచోట్ల పన్నులు అసాధారణంగా పెంచడంతో బకాయిలు భారీగా పెరిగిపోయాయి. వాటిని రాబట్టడం ప్రస్తుత కార్యదర్శులకు తలనొప్పిగా మారింది.

లీగల్ నోటీసులే తరువాయి..

ఫిబ్రవరిలోపు చెల్లించకపోతే లీగల్ నోటీసులు జారీ చేస్తాం. మార్చిలో వచ్చే ఏడాది బడ్జెట్‌కు సంబంధించి ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలి. కాబట్టి ఫిబ్రవరిలోనే పన్నులు వసూలు చేయాలని ఇది వరకే సిబ్బందికి సూచించాం.
- సుస్మిత, డీఎల్‌డీవో, శ్రీకాళహస్తి

(c) eenadu

సూళ్లూరుపేట

• సూళ్లూరుపేట • వెంకటగిరి

విద్యార్థులు శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించుకోవాలి

మాట్లాడుతున్న షార్ విశ్రాంత గ్రూపు డైరెక్టర్ జగదీష్ చంద్రారెడ్డి

తడ, న్యూస్‌టుడే: విద్యార్థులు శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించుకోవాలని షార్ విశ్రాంత గ్రూపు డైరెక్టర్ జగదీష్ చంద్రారెడ్డి అన్నారు. మండలంలోని అక్కంపేట ప్రభుత్వ ఆదర్శ పాఠశాలలో జన విజ్ఞాన వేదిక సూళ్లూరుపేట శాఖ ఆధ్వర్యంలో మంగళవారం బ్రూనో వర్ధంతి సందర్భంగా సత్యాన్వేషణ దినోత్సవాన్ని నిర్వహించారు. విద్యార్థులు మూఢ నమ్మకాలను విడనాడాలని సూచించారు. జిల్లా అధ్యక్షులు వెంకటరమణయ్య తదితరులు పాల్గొన్నారు.

20న నూతన నవగ్రహ ప్రతిష్ఠ

వెంకటగిరి, న్యూస్‌టుడే: కుమ్మరిగుంటలోని అయ్యప్పస్వామి ఆలయంలో ఈ నెల 20వ తేదీన నూతన నవగ్రహ విగ్రహాలను ప్రతిష్ఠించనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. శుక్ర, శని, ఆది వారం కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

వ్యవసాయ శాస్త్రవేత్తల పరిశీలన

వాకాడు, న్యూస్‌టుడే: మండలంలోని కొండాపురంలో అగ్గిపెట్టె లకు తట్టుకోగలిగిన సన్న బియ్యం వరి వంగడాన్ని నెల్లూరు వ్యవసాయ శాస్త్రవేత్తలు మంగళవారం పరిశీలించారు. ప్రధాన శాస్త్రవేత్తలు వెంకటేశ్వర్లు, వినీత, శ్రీలక్ష్మి హాజరై వరి దిగుబడి గురించి రైతులకు వివరించారు. రైతు విజయభాస్కర్‌రెడ్డి వేసిన ఎన్ఎల్ఆర్ 3648 వరి రకాన్ని పరిశీలించారు. వ్యవసాయాధికారిణి దీప, పెళ్లూరు కోటేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కనులవిందుగా శివపార్వతుల కల్యాణం

స్వామివారికి కల్యాణం నిర్వహిస్తున్న వేద పండితులు

నాయుడుపేట, న్యూస్‌టుడే: పట్టణంలో స్వర్ణముఖి తీరంలోని శ్రీప్రసూనాంబ, నీలకంఠేశ్వరస్వామి మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం శివ పార్వతుల కల్యాణోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. వేద పండితులు ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించి శాస్త్రోక్తంగా కల్యాణం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని శివపార్వతులకు తలంబ్రాలు సమర్పించారు. భక్తులకు అన్నదానం చేశారు. ఉభయకర్తలుగా ఆలయ కమిటీ ఛైర్మన్ గూడూరు సుధీర్‌రెడ్డి దంపతులు పాల్గొన్నారు. తెల్లచెరుజుమున తుమ్మూరు గంగా సమేత నీలకంఠేశ్వరస్వామి ఆలయంలో తితిదే ఆధ్వర్యంలో శివపార్వతుల కల్యాణం నిర్వహించారు.

నీలకంఠేశ్వరుడికి వసంతోత్సవం

నాయుడుపేట, న్యూస్‌టుడే: తుమ్మూరు శ్రీగంగాకామాక్షి సమేత నీలకంఠేశ్వరస్వామి ఆలయంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల ముగింపు సందర్భంగా తితిదే ఆధ్వర్యంలో మంగళవారం వసంతోత్సవాన్ని నిర్వహించారు. అర్ధరాత్రి శివపార్వతుల కల్యాణోత్సవం అనంతరం వసంతోత్సవం, నిత్యబలిహరణ, చప్పర ఉత్సవం నిర్వహించి ధ్వజావరోహణం చేశారు. పల్లికి సేవలో గంగాభవానీ నీలకంఠేశ్వరుడికి గ్రామోత్సవం నిర్వహించారు.

పల్లకీ సేవలో గంగాభవానీ నీలకంఠేశ్వరస్వామి

కేంద్రాలు అసంపూర్తి.. సేవలకు ఇబ్బంది

ఆభాకలోని అసంపూర్తి రైతు సేవా కేంద్రం

సూళ్లూరుపేట గ్రామీణం, న్యూస్‌టుడే: గ్రామ స్థాయిలో రైతులకు సేవలందించేందుకు ఏర్పాటైన రైతు సేవా కేంద్రాలకు పూర్తి స్థాయిలో భవనాలు లేక రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రైతుల వద్దకే సేవలు అందించాలనే ఉద్దేశంతో ఏర్పాటైన ఈ వ్యవస్థకు నిధులున్నా సమస్యలు పరిష్కారం కావడం లేదు. గత వైకాపా ప్రభుత్వం సకాలంలో పూర్తి చేయక పోవడంతో ఈ పరిస్థితి నెలకొంది. సిబ్బంది నియామకం, కేటాయింపు, నిర్మాణాలకు నిధులు వెచ్చించినా పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురాక పోవడంతో రైతులకు ఇబ్బందులు తప్పడం లేదు.

అందుబాటులోకి రావాలి

సూళ్లూరుపేట మండలంలోని కోటపోలూరు 1, కోటపోలూరు 2, కేసీయన్‌గుంట, ఆభాక, కడపత్ర, మంగళంపాడు, మంగానెల్లూరు, దామానెల్లూరుల్లో నిర్మాణాలు అసంపూర్తిగా ఉన్నాయి. ఈ మండలంలో ఒక్క నిర్మాణాన్ని పూర్తి చేయలేదు.

● తడ మండలంలోని రామాపురం, పెరివమట్, బీవీపాళెం, ఇరకం, పూడి, టొన్‌తడ, తడకండ్రిగ 2, అండగుండ్ల, కొండూరు, మాంబట్టు, వేనాడు, కారిజాతలోనూ భవనాలను పూర్తి చేయాల్సి ఉంది.

● దొరవారిసత్రం మండలంలోని తల్లంపాడు, తనియాలి, కల్లూరు, మీజూరు, వేణుంబాకం, ఉచ్చూరు, కొత్తపల్లి, పూలతోట, ఏకొల్లు భవనాలు అసంపూర్తిగా దర్శనమిస్తున్నాయి.

ప్రస్తుత ఆర్ఎస్‌కేల స్థితి

మండలం	మంజూరు	అసంపూర్తి
సూళ్లూరుపేట	10	10
తడ	16	13
దొరవారిసత్రం	8	6

పూర్తయిన భవనాలు

తడ మండలంలో కాదలూరు, గద్దగుంట, తడ కండ్రిగ 1, దొరవారిసత్రం మండలంలో పోలిరెడ్డిపాళెం, నెలబల్లి గ్రామాల్లో నిర్మాణాలు పూర్తయ్యాయి. మొత్తం మూడు మండలాల్లో 34 ఆర్ఎస్‌కే భవనాలకు గాను ఐదు మాత్రమే అందుబాటులో ఉన్నాయి.

ఇబ్బందులు తప్పడంలేదు

రైతులకు సలహాలు, సూచనలు అందించడం, సమావేశాల్లో నిర్వహణ, పథకాల అమలు, పూర్తిస్థాయి భవనాలు లేని చోట ఎరువుల అమ్మకం, పంటల కొనుగోళ్లకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. సామాజిక, ఇతర ప్రభుత్వ భవనాల్లోనే సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. **- కాంచన, ఇన్‌ఛార్జి ఏడీ**

మేమున్నాం.. మీకు తోడుగా..

నాయుడుపేట: 80085 73970
సూళ్లూరుపేట: 88979 08890
వెంకటగిరి: 80085 73966
సమయం 10 AM TO 1 PM

వాకాడు, న్యూస్‌టుడే: సమస్య: వాకాడు బ్యారేజీకి అవతల వైపున రోడ్డు పక్కనే ముళ్ల కంప పెరగడంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. ముళ్లచెట్లు తొలగించి సమస్యను పరిష్కరించాలి. **- సుబ్బయ్య, వాకాడు**

సమాధానం: ముళ్ల కంపను తొలగించేలా చర్యలు తీసుకుంటాం. **- శ్రీనివాసరావు, ఏఈ**

వెంకటగిరి, న్యూస్‌టుడే: సమస్య: పట్టణంలోని 17వ వార్డులో మున్సిపాలిటీ ద్వారా వచ్చే తాగునీరు కలుషితమౌతుంది. ఈ నీటిలో పురుగులు, చెత్తా చెదారం వస్తోంది. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలి.
- మల్లికార్జున్, వెంకటగిరి

సమాధానం: పరిశీలించి తగు చర్యలు తీసుకుంటాం.
- సాంబశివయ్య, పుర కమిషనర్

వెంకటగిరి, న్యూస్‌టుడే: సమస్య: పట్టణంలోని కర్ణకమ్మ వీధిలో ఆర్వీఎం ఉన్నత పాఠశాల వెనుక భాగంలో సైడు కాలువ దెబ్బతింది. మురుగు సాఫీగా సాగడం లేదు. చర్యలు తీసుకోవాలి. **- వెంకటసత్య**

సమాధానం: కాలువలో వ్యర్థాలు తొలగిస్తాం.
- రామారావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్

నాయుడుపేట, న్యూస్‌టుడే: సమస్య: నాయుడుపేట బజారువీధుల్లో దుకాణాల ఎదుట ద్విచక్ర వాహనాలు నిలిపి ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తున్నారు. **- స్థానికులు**

సమాధానం: మా సిబ్బందితో రహదారులపై ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు తీసుకుంటాం.
- చెంచుబాబు, డీఎస్పీ, నాయుడుపేట

సమస్య: పట్టణంలోని కళాశాల వదిలే సమయాల్లో ఆకతాయిలు ద్విచక్ర వాహనాలపై అమ్మాయిల వెంట పడుతున్నారు. **- తల్లిదండ్రులు**

సమాధానం: విద్యా సంస్థల వద్ద ఉండే ఆకతాయిలపై నిఘా ఉంచి కఠిన చర్యలు తీసుకుంటాం.
- చెంచుబాబు, డీఎస్పీ, నాయుడుపేట

చెత్త తొలగింపు

ఈనాడు కథనానికి స్పందన

నాయుడుపేట పట్టణం, న్యూస్‌టుడే: నాయుడుపేట ఆర్టీసీ బస్టాండు సమీప రాఘవేంద్ర కాంప్లెక్సు ఎదురుగా డ్రైనేజీకాల్వ ఆనుకుని రోడ్డుపై ఉన్న చెత్తచెదారాన్ని మంగళవారం పారిశుధ్య సిబ్బంది తొలగించారు. ఈనాడులో కథనం ప్రచురితం కావడంతో అధికారులు స్పందించారు.

కాలువ పనుల ప్రారంభం

నాయుడుపేట పట్టణం, న్యూస్‌టుడే: నాయుడుపేట లోతువానిగుంటలో రూ.20లక్షల తుడా నిధులతో ప్రధాన డ్రైనేజీ కాల్వల పనులు ప్రారంభించారు. ఇక్కడి బీఎంఆర్‌నగర్‌లోని ఖాళీ స్థలాల్లోకి మురుగు చేరడంపై ఈనాడులో కథనం ప్రచురితం కావడంతో అధికారులు స్పందించారు. తుడా నిధులతో డ్రైనేజీ కాల్వల పనులు చేస్తున్నారు. మురుగు విన్నమాల కాల్వలోకి కలపనున్నారు.

నియంత్రికలకు మరమ్మతులు

ఓజిలి, న్యూస్‌టుడే: మండలంలోని కారూరు గ్రామంలో మంగళవారం విద్యుత్తుశాఖ అధికారులు మరమ్మతులు చేపట్టారు. కారూరు గ్రామంలో వేలాడుతున్న విద్యుత్తు తీగలు, వీధి దీపాలు, నియంత్రికలకు మరమ్మతులు చేపట్టారు. గ్రామాల్లో అంతరాయం లేకుండా విద్యుత్తు సరఫరాకు చర్యలు చేపట్టారు.

రేపోమాపో కూలేందుకు సిద్ధం

సూళ్లూరుపేట మండలంలోని కోటపోలూరు గ్రామం చెరువు వద్ద పొలంలోని విద్యుత్తు స్తంభం వాలింది. తీగల మీద ఆధారపడింది. చుట్టు పక్కల వ్యవసాయం చేసుకునే రైతులు దీని వల్ల ప్రమాదం జరిగే అవకాశాలున్నట్లు తెలిపారు. అటుగా వెళ్లాలంటేనే భయపడుతున్నారు. విద్యుత్తు శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.
- న్యూస్‌టుడే, సూళ్లూరుపేట గ్రామీణం

అధ్వానంగా తహసీల్దారు కార్యాలయం

పెళ్లకూరు తహసీల్దారు భవనం శిథిలావస్థకు చేరి ప్రమాదకరంగా మారింది. గోడలు, స్లాబు పగుళ్లుచ్చి కూలే స్థితికి చేరింది. అధికారులు, సిబ్బంది బిక్కు బిక్కు మంటూ విధులు నిర్వహిస్తున్నారు. తహసీల్దారు పక్కనే వ్యవసాయాధికారి కార్యాలయ గదిలో విధులు నిర్వహిస్తున్నారు. జిల్లా అధికారులు, నాయకులు ప్రత్యక్షంగా చూసినా స్పందించిన దాఖలాలు లేవు.
- న్యూస్‌టుడే, పెళ్లకూరు

శిథిలావస్థలో బస్టాండ్

సూళ్లూరుపేట మండలం కొరిడి గ్రామంలోని బస్టాండు గోడలు శిథిలావస్థకు చేరుకున్నాయి. బస్సు సౌకర్యం తక్కువగా ఉన్నందున స్కూలుకు వెళ్లే విద్యార్థులు, ఉపాధ్యాయులు, నిత్యం కూలి పనులకు వెళ్లే కార్మికులు బస్సు కోసం వేచి ఉండాల్సిన పరిస్థితి. బస్టాండు సరిగ్గా లేక ఎండైనా, వానైనా రోడ్డు మీదే ఉండాల్సిన పరిస్థితి ఏర్పడిందని ప్రజలు వాపోతున్నారు.
- న్యూస్‌టుడే, సూళ్లూరుపేట గ్రామీణం

ప్రమాదకరంగా రహదారి కూడలి

పట్టణంలో పుదూరు జాతీయ రహదారి కూడలిలో ఏవాహనం ఏటు వస్తుందో తెలియని పరిస్థితి నెలకొంది. నాయుడుపేట పట్టణం నుంచి మల్లాం, దుగరాజపట్నం వైపుగా వెళ్లే వాహనాలు కోల్‌కత్తా-చెన్నై రహదారిని దాటి వెళ్లాల్సి ఉంది. ఎన్‌హెచ్‌పై వాహనాలు అతివేగంగా ప్రయాణించడంతోపాటు నిత్యం రద్దీగా ఉంటుంది. ప్రాధాన్యత కలిగిన ఈ ప్రాంతంలో అండర్‌పాస్ లేక పోవడంతో ప్రమాదకరంగా మారింది. అండర్ పాస్ ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, నాయుడుపేట**

భాజపా జిల్లా కమిటీలో చోటు

చిట్టమూరు, న్యూస్‌టుడే: స్థానిక మండల స్థాయి నేతలకు జిల్లా కమిటీలో చోటు కల్పించడం హర్షణీయమని భాజపా మండల మాజీ అధ్యక్షుడు దువ్వూరు శరశ్చంద్రారెడ్డి పేర్కొన్నారు. సుంకర రమణయ్య, యల్లసిరి వెంకటేశ్వర్లు గౌడ్, లాలాపేట మునిప్రతాప్‌లకు జిల్లా కమిటీలో చోటు దక్కిందన్నారు.

పూర్వ విద్యార్థుల వితరణ

చిట్టమూరు, న్యూస్‌టుడే: మండలంలోని ఆరూరు ఉన్నత పాఠశాలలో 2014-15 పూర్వ విద్యార్థులు ప్రస్తుతం పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు పరీక్షా సామగ్రి, పౌష్టికాహారాన్ని మంగళవారం అందజేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జీవీఎస్ లక్ష్మి, ఉపాధ్యాయులు చలపతి, అశోక్, పెంచలయ్య, మీరయ్య, అన్నపూర్ణ, మైథిలి, రాజ్యలక్ష్మి, అనురాధ తదితరులు పాల్గొన్నారు.

అర్బన్ సీఐగా వెంకటేశ్వర్లు

నాయుడుపేట పట్టణం, న్యూస్‌టుడే: నాయుడుపేట అర్బన్ సీఐగా వెంకటేశ్వర్లు మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఈయన ప్రకాశం జిల్లా పొదిలి సీఐగా పని చేస్తూ వీఆర్‌కు వెళ్లారు. తాజా బదిలీల్లో ఇక్కడ విధులు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో శాంతి భద్రతల పరిరక్షణకు పని చేస్తానని, చట్ట వ్యతిరేఖ కార్యకలాపాలపై కఠినంగా వ్యవహరిస్తామన్నారు. సీఐని పలువురు కలిసి అభినందించారు.

శ్రీబాలసుబ్రహ్మణ్యంస్వామికి అభిషేకం

నాయుడుపేట పట్టణం, న్యూస్‌టుడే: నాయుడుపేట లోతువానిగుంటలోని శ్రీబాలసుబ్రహ్మణ్యం స్వామికి మంగళవారం అభిషేకాల అనంతరం గంధంతో అలంకరణ చేశారు. పూజల్లో నెల్లూరు జిల్లా భాజపా మాజీ అధ్యక్షుడు రంగినేని కృష్ణయ్య, భాజ పా నాయకులు పాల్గొన్నారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు. మండలంలోని మేనకూరు పంచాయ తీ చలివేంద్రం వద్దనున్న శ్రీదేవి, భూదేవి సమేత వైద్యవీరరాఘవస్వామి ఆలయంలో అమావాస్యతో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ నిర్వాహకులు, భక్తులు పాల్గొన్నారు.

సౌకర్యాల్లేక సిబ్బంది ఇబ్బందులు

గ్రద్దగుంటలో ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీలు

ఓజిలి, న్యూస్‌టుడే: మండలంలోని గ్రద్దగుంట, అత్తివరం, మానవాలి, కారూరు, కుందాం, హర్మేనిపాడు, భువనగిరిపాళెం, భట్లకనుపూరు, ఇనుగుంట, చిలమానుచేను, కురుగొండ, గుర్రంకొండ తదితర గ్రామాల్లో అధికారులు ఉపాధిహామీ పనులు చేపడుతున్నారు. ఈపనులకు గ్రామాల్లో కూలీలు రోజుకు సుమారు 1200మంది హాజరౌతున్నట్లు అధికారులు తెలిపారు. ఉపాధిహామీ పనులు చేపట్టే ప్రదేశంలో కూలీలకు అందుబాటులో తాగునీరు, మజ్జిగ, ప్లాస్టిక్ పట్టలు, ప్రథమ చికిత్స సామగ్రి అందుబాటులో లేక పోవడంతో ఇబ్బంది పడుతున్నామని ఉపాధి కూలీలు వాపోతున్నారు. ఉపాధిహామీ సిబ్బంది కూలీలకు సరైన కొలతలు ఇవ్వక పోవడంతో దిన సరి కూలీ గిట్టుబాటు కావడం లేదన్నారు. అధికారులు స్పందించి ఉపాధి హామీ పనులు జరిగే ప్రదేశంలో కనీస సౌకర్యాలు కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు.

విద్యుత్తుతో ఈ ప్రాంతం అభివృద్ధి

కార్యక్రమంలో మాట్లాడుతున్న ఈఈ శ్రీనివాసులు

సూళ్లూరుపేట పట్టణం, న్యూస్‌టుడే: సూళ్లూరుపేటకు విద్యుత్తు వెలుగులు వచ్చిన 70 సంవత్సరాల కాలంలో ఎంతో అభివృద్ధి చెందినట్లు ఈఈ శ్రీనివాసులు తెలిపారు. మంగళవారం పట్టణంలోని జీఎన్‌టీ రోడ్డులో జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. 1956 ఫిబ్రవరి 17న పట్టణానికి విద్యుత్తు సౌకర్యాన్ని ఏర్పాటు చేశారన్నారు. విద్యుత్తు సౌకర్యంతో పట్టణ పరిసరాల్లో ఎన్నో పరిశ్రమలు వచ్చినట్లు గుర్తు చేశారు. ఏఎంసీ ఛైర్మన్ రమేష్, సీనియర్ నాయకుడు సుధాకర్‌రెడ్డి, డీఈఈ శేఖర్‌బాబు, తెదేపా నాయకులు, విద్యుత్తుశాఖ, సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

ఘనంగా కళాశాల వార్షికోత్సవం

మాట్లాడుతున్న ప్రిన్సిపల్ శ్యామ్‌కుమార్

సూళ్లూరుపేట గ్రామీణం, న్యూస్‌టుడే: విద్యార్థులు ఇష్టపడి చదివితే అన్ని పాఠ్యాంశాలు సులభంగా అర్థమవుతాయని ప్రిన్సిపల్ శ్యామ్‌కుమార్ అన్నారు. మంగళవారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల 56వ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థి దశలో భౌతికంగా, మానసికంగా పరిపక్వత సాధిస్తే విజయ శిఖరాలను అందుకోవచ్చన్నారు. ఇంటర్ సంవత్సరంలో ప్రథమ స్థానం సాధించిన విద్యార్థులకు నగదు బహుమతులను అందజేసి అభినందించారు. కళాశాల అభివృద్ధికి అధ్యాపకురాలైన శ్రీమతి ఉమామహేశ్వరి, కృష్ణారెడ్డి రూ.50,000లు అందజేశారు. ఎంఈవోలు శ్రీమతి సునీల, శ్రీనివాసులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

పాండురంగడికి వెండి ఆభరణాలు

స్వామివారికి వెండి ఆభరణాలు తెస్తున్న సుబ్బారెడ్డి దంపతులు

వాకాడు, న్యూస్‌టుడే: పంట్రంగంలోని పురాతన పుణ్యక్షేత్రమైన శ్రీకామాక్షిదేవి సమేత పాండురంగేశ్వరస్వామి వారికి రూ.6.50లక్షల విలువైన 3.100 కిలోల వెండి కిరీటాన్ని బహూకరించారు. మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం మండలంలోని నిడిగుర్తి పంచాయతీ మాజీ సర్పంచి మానస భర్త సుబ్బారెడ్డి దంపతులు వెండి ఆభరణాన్ని సమర్పించారు. ఆలయ కమిటీ ఛైర్మన్ మధురెడ్డి, ఈవో పెంచల వరప్రసాద్ వాటిని అందుకుని స్వామి వారికి అలంకరింపజేశారు.

ఈఎస్ఎస్‌లో ఉద్యోగమేళా నేడు

వెంకటగిరి, న్యూస్‌టుడే: పట్టణంలోని ఈఎస్ఎస్ డిగ్రీ కళాశాల ప్రాంగణంలో బుధవారం ఉద్యోగమేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ హరికృష్ణ తెలిపారు. విజన్ ఇండియా ఆధ్వర్యంలో పలు జాతీయ కంపెనీల్లో ఉద్యోగావకాశాలు కల్పించేందుకు ముఖాముఖీ నిర్వహిస్తారన్నారు. ఆసక్తి కలిగిన యువత తమ ధ్రువీకరణ పత్రాలతో హాజరు కావాలని కోరారు.

వైద్యుడు జిలానీపై విచారణ

రికార్డులు పరిశీలిస్తున్న బాపట్ల ఇన్‌ఛార్జి డీసీహెచ్ఎస్ పద్మావతి

వెంకటగిరి, న్యూస్‌టుడే: పట్టణంలోని సామాజిక ఆరోగ్య కేంద్రం వైద్యుడు జిలానీపై వచ్చిన ఆరోపణలపై మంగళవారం బాపట్ల ఇన్‌ఛార్జి డీసీహెచ్ఎస్ పద్మావతి విచారణ చేపట్టారు. సిబ్బందిని విచారించి రాతపూర్వకంగా ఫిర్యాదులు స్వీకరించారు. ఆసుపత్రిలో రికార్డులను, సీసీ ఫుటేజీలను పరిశీలించారు. వైద్యులు జిలానీ విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించడమే కాకుండా, సిబ్బందితో దురుసుగా ప్రవర్తిస్తున్నారని, ఆసుపత్రిలో రికార్డులు మాయం చేయడమే కాకుండా సీసీ ఫుటేజీని నిలిపి రికార్డులు తరలించారనే ఆరోపణలపై విచారించామన్నారు. ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ ఫిర్యాదు మేరకు గతంలోనూ విచారించారు. తాజాగా మరోసారి విచారణ చేపట్టారు.

వ్యవసాయానికి నిరంతర విద్యుత్తు

పెళ్లకూరు, న్యూస్‌టుడే: వ్యవసాయ పంపుసెట్లకు నిరంతరం తొమ్మిది గంటలు విద్యుత్తు సరఫరా చేస్తామని డిస్కం సూపరింటెండెంట్ ఇంజినీరు చంద్రశేఖర్ తెలిపారు. మంగళవారం పెళ్లకూరు మండలం లక్ష్మినాయుడుకండ్రిగ గ్రామంలో జరిగిన కరెంటోళ్ల జాన బాట కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

వీఆర్వోల నిరసన.. తడ: పని ఒత్తిడి తగ్గించాలని వీఆర్వోలు స్థానిక తహసీల్దారు కార్యాలయం వద్ద మంగళవారం నల్లబ్యాడ్జిలతో నిరసన తెలిపారు. వీఆర్వోల సంఘం నాయకులు, సర్వేయర్లు, గ్రామ రెవెన్యూ సహాయకులు పాల్గొన్నారు.

రిజర్వాయర్ పనులు ప్రారంభించాలని వినతి

మంత్రి రామానాయుడుతో ఎమ్మెల్యేలు రామకృష్ణ, సునీల్‌కుమార్

వెంకటగిరి, న్యూస్‌టుడే: ఆల్తూరుపాడు రిజర్వాయర్ పనుల టెండర్ల ప్రక్రియ పూర్తి చేసి త్వరలో పనులు ప్రారంభించాలని జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడుకు ఎమ్మెల్యే రామకృష్ణ వివరించారు. మంగళవారం అమరావతిలోని మంత్రి కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని కొండ కిందగ్రామాలకు సాగునీరు అందించే సోమశిల-స్వర్ణముఖి లింక్ కాలువ పనులు పూర్తి చేయాలని, రిజర్వాయర్ పనులు పూర్తి చేస్తే ఈ ప్రాంతమంతా సస్యశ్యామలంగా ఉంటుందన్నారు. తెలుగు గంగ కాలువ వెంబడి స్లూయిస్లు నిర్మించిన చెరువులకు సాగునీరు అందించాలన్నారు. అలపలేరు ట్యాంక్ మరమ్మతులు చేయాలని, నియోజకవర్గంలోని పలు చెరువులకు మరమ్మతులు చేసేందుకు నిధులు మంజూరు చేయాల్సిందిగా కోరారు. గూడూరు ఎమ్మెల్యే సునీల్‌కుమార్ ఉన్నారు.

సమస్యల పరిష్కారానికి జనబాట

దొరవారిసత్రం: క్షేత్ర స్థాయిలో సమస్యలను గుర్తించి వాటిని త్వరిత గతిన పరిష్కరించేందుకు కరంటోళ్ల జనబాట కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆ శాఖ ఎస్ఈ చంద్రశేఖర్ పేర్కొన్నారు. మంగళవారం దొరవారిసత్రం మండలంలోని కట్టువాపల్లిలో జరిగిన గుర్తించిన సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలన్నారు. ఈఈ శ్రీనివాసులు, డీఈ శేఖర్ పాల్గొన్నారు.

కబడ్డీలో తడ జట్టు విజేత

తడ, న్యూస్‌టుడే: తడ జడ్పీ ఉన్నత పాఠశాలలో మ్యాజిక్ బస్ ఇండియా ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన మినీ కబడ్డీ టోర్నమెంట్‌లో మంగళవారం తడ జట్టు విజేతగా నిలిచింది. ఈపోటీల్లో 26 పాఠశాలల నుంచి బాలురు, బాలికలు పాల్గొన్నారు. బాలుర విభాగం నుంచి తడ జట్టు, బాలికల విభాగం నుంచి గూడూరు మండలం దిగుపాళెం పాఠశాల జట్టు విజేతలుగా నిలిచారు. ఎంఈవో వేములు బహుమతులు అందజేశారు.

జిల్లా ఓబీసీ మోర్చా ఉపాధ్యక్షుడిగా వరప్రసాద్

ఓజిలి, న్యూస్‌టుడే: తిరుపతి జిల్లా ఓబీసీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడిగా మండలంలోని పెద్ద పరియ గ్రామానికి చెందిన ఆరుముళ్ల వరప్రసాద్ నియమితులయ్యారు. గతంలో ఓజిలి మండల భాజపా అధ్యక్షుడిగా పని చేసిన వరప్రసాద్ అప్పట్లో పార్టీ అభివృద్ధికి చేసిన సేవలను గుర్తించి ఎంపిక చేశారు.

నేరాలకు పాల్పడితే చర్యలు.. వాకాడు: యువత నేరాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఎస్సై నిఖిల్‌బాబు హెచ్చరించారు. గొల్లపాలెంలో మంగళవారం రాత్రి సిబ్బందితో కలిసి ప్రజలకు అవగాహన కల్పించారు.

ఆధునికీకరణ దిశగా పేట రైల్వేస్టేషన్

• మెరుగు పడిన సౌకర్యాలు
• సూపర్ ఫాస్ట్ రైళ్లు నిలుపుదల

నాయుడుపేట, న్యూస్‌టుడే: పలు ప్రాంతాల కూడలిగా ఉన్న నాయుడుపేట రైల్వే స్టేషన్‌లో ఆధునికీకరణ పనులతో ప్రయాణికుల సౌకర్యాలు మెరుగు పడ్డాయి. దీంతో కొత్తగా పలు ఎక్స్‌ప్రెస్ రైళ్లు నిలుస్తున్నాయి. త్వరలో ఇక్కడ నుంచి సరకు రవాణా చేసుకునే అవకాశాన్ని కల్పించనున్నారు.

ప్రాధాన్యతతో అభివృద్ధి

నాయుడుపేట పారిశ్రామిక క్లస్టర్ కావడంతో ఇక్కడ నుంచి పొరుగు రాష్ట్రాలకు పారిశ్రామిక, వాణిజ్య పరమైన సరకులు రవాణా చేస్తున్నారు. నాయుడుపేట, పెళ్లకూరు, ఓజిలి, చిట్టమూరు, కోట, వాకాడు, బాలాయపల్లి మండలాలకు చెందిన ప్రయాణికులు ప్రధాన నగరాలు, పట్టణాలకు వెళ్లాలంటే నాయుడుపేట స్టేషన్ నుంచే అధికంగా ప్రయాణం సాగిస్తుంటారు. పారిశ్రామిక అవసరాలు, పెరిగిన ప్రయాణికులను దృష్టిలో ఉంచుకొని రైల్వేశాఖ అమృత్‌భారత్ ప్రాజెక్టులో భాగంగా ఈస్టేషన్‌లో మౌలిక వసతులు అభివృద్ధి చేశారు.

మెరుగు పడిన సౌకర్యాలు

నాయుడుపేట రైల్వేస్టేషన్‌లో ఏర్పాటు చేసిన లిఫ్టు

ప్రయాణికుల సౌకర్యార్థం కొత్తగా లిఫ్టు ఏర్పాటు చేయడంతో ప్లాట్ ఫాంలు దాటడానికి అనుకూలంగా ఉంది. ప్రయాణికుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ప్లాటు ఫామ్‌లపై ఎలక్ట్రానిక్ డిస్‌ప్లే బోర్డులు ఏర్పాటు చేశారు. వీటిద్వారా ఏకోచ్ ఎక్కడ ఆగుతుందో తెలుస్తోంది. రైళ్ల రాకపోకల వివరాలు, ఎలక్ట్రానిక్ సిస్టమ్ ద్వారా ప్రకటిస్తున్నారు. ప్రయాణికులు కూర్చోడానికి నాపరాళ్ల బల్లలు, పంకాలు, తాగునీరు, మరుగుదొడ్ల వంటి వసతులు కొంత మేరకు మెరుగు పడ్డాయి. రైల్వేస్టేషన్ ప్రాంగణం ఆహ్లాదకరంగా మారింది. అమృత్‌భారత్ వంటి మరికొన్ని సూపర్ ఫాస్ట్ రైళ్లను నిలుపుతున్నారు.

సరకు రవాణాకు అనుకూలం

సరకు రవాణాకు గూడ్స్ రైళ్లు నిలవడానికి, ప్యాసింజర్ రైళ్లు ఉంచడానికి అనుకూలంగా తాజాగా అదనపు ట్రాక్, షెడ్డు నిర్మించారు. దీని పక్కనే సరకులను స్టేషన్‌కు తీసుకొచ్చే వాహనాల రాకపోకలకు అనువుగా సీసీ రోడ్డు నిర్మించారు. పరిశ్రమలు, వాణిజ్య, వ్యవసాయ ఉత్పత్తులు వ్యాగిన్ల ద్వారా ఇతర ప్రాంతాలకు సరఫరా చేసేందుకు వెసులుబాటు కలగనున్నది.

పోలీసులపై దౌర్జన్యం చేసిన వ్యక్తి అరెస్టు

ఓజిలి, న్యూస్‌టుడే: మండలంలోని భట్లకనుపూరు గ్రామంలో శివరాత్రి వేడుకల్లో విధులు నిర్వహిస్తున్న పోలీసులపై దౌర్జన్యం చేసిన వ్యక్తిని ఎస్సై శ్రీకాంత్ మంగళవారం అరెస్టు చేసి నాయుడుపేట కోర్టులో హాజరుపరిచారు. నాయుడుపేట జూనియర్ సివిల్ జడ్జి మీనాక్షి సుందరి నిందితుడికి 14రోజులు రిమాండ్ విధించినట్లు ఎస్సై తెలిపారు.

ముగ్గురిపై కేసులు

క్రైం కార్నర్

డక్కిలి: మోపూరు రోడ్డు పాయింట్‌లో నివాసం ఉంటున్న శ్రీరాం సునీతను ఆమె భర్త చిరంజీవి అత్తమామలు వేధిస్తున్నట్లు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ముగ్గురిపై మంగళవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై శివ శంకరరావు తెలిపారు.

ఆరుగురిపై..

వాకాడు: మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా వాకాడులో బీసీ కాలనీ, గొల్లపాలెం యువకుల మధ్య సోమవారం తెల్లవారు జామున ఘర్షణ చోటు చేసుకుంది. ఈ ఘర్షణలో మంగళవారం ఆరుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై నిఖిల్‌బాబు తెలిపారు. తహసీల్దార్ ఇక్బాల్ వద్ద హాజరు పరిచినట్లు ఎస్సై తెలిపారు.

(c) eenadu

ఆలోచనలు విరియాలి.. ఆవిష్కరణలు మెరవాలి..!

ఈనాడు

ప్రతి విద్యార్థిలో ఏదో ఒక ప్రతిభ దాగి ఉంటుంది. పాఠశాల స్థాయిలోనే సృజనాత్మకత వెలికితీసేందుకు 'ఈనాడు వైజ్ఞానిక ప్రదర్శన' నిర్వహిస్తోంది. వినూత్న ఆలోచనలతో ప్రయోగాలు చేసేలా ప్రోత్సహిస్తోంది. **ఇందులో భాగంగా 'డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ మెమోరియల్ సొసైటీ హాల్, బుల్లయ్య కాలేజ్ పక్కన, రామా టాకీస్ దరి, విశాఖపట్నం'లో ఫిబ్రవరి 24వ తేదీన మెగా సైన్స్ ఫెయిర్ నిర్వహిస్తోంది.**

GGU GODAVARI GLOBAL UNIVERSITY RAJAMAHENDRAVARAM, A.P.
Call: 994 999 3483 | www.ggu.edu.in

నిబంధనలు.. ● 6 నుంచి 10 తరగతుల విద్యార్థులకు మాత్రమే. ● ప్రాజెక్టును ముందుగా నమోదు చేసుకోవాలి. ● ఒక ప్రాజెక్టుకి ఇద్దరు విద్యార్థులకు అనుమతి. ● పాఠశాల/ బ్రాంచ్‌కి ఒక ప్రాజెక్టుకు మాత్రమే అనుమతి. ● మొదటి ముగ్గురు విజేతలకు బహుమతులు ఉంటాయి. ● పాల్గొన్న విద్యార్థులకు సర్టిఫికెట్స్ ప్రదానం. **రిజిస్ట్రేషన్ చివరి తేదీ : ఫిబ్రవరి 20**

నమోదు కొరకు: 8639814432
సమయం: ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గం॥ల వరకు..

తీరంలో డ్రోన్ కెమెరాలు నిషేధం

జగదాంబకూడలి, న్యూస్‌టుడే: విశాఖ తీరంలో మిలన్, ఐఎఫ్ఆర్ విన్యాసాల నేపథ్యంలో డ్రోన్ కెమెరాల వినియోగాన్ని నిషేధిస్తున్నట్లు సీపీ శంఖబ్రతబాగ్చీ తెలిపారు. 20వ తేదీ సాయంత్రం 6 గంటల వరకు ఐఎన్ఎస్ డేగా, బీచ్‌రోడ్డు, పార్క్‌హోటల్, కైలాసగిరి తదితర ప్రాంతాల్లో దాదాపు 5 కిలో మీటర్ల పరిధిలో నిషేధం అమల్లో ఉంటుందని పేర్కొన్నారు.

ఈనాడు విశాఖపట్నం

బుధవారం 18 ఫిబ్రవరి 2026

విన్యాసాలను తిలకించడానికి వచ్చిన నగరవాసులు

'నౌకా' సంరంభం.. సాగర సంభ్రమం..!

వన్‌టౌన్, న్యూస్‌టుడే : అంతర్జాతీయ ఫ్లీట్ రివ్యూ(ఐఎఫ్ఆర్)లో భాగంగా ఆర్కేబీచ్ కేంద్రంగా నిర్వహించే సిటీ పరేడ్, నౌకాదళం విన్యాసాలు, ఫైర్, డ్రోన్ షోల నిర్వహణకు రంగం సిద్ధమైంది. బుధవారం నమూనా విన్యాసాలు నిర్వహించి, గురువారం పూర్తిస్థాయి ప్రదర్శనకు ఏర్పాట్లు పూర్తి చేశారు.

★ సాగరతీరంలో ఇసుక తిన్నెల పైనుంచి చూసేందుకు సాధారణ ప్రజలకు ఉచితంగానే అనుమతి ఉంటుంది. ఎక్కడా తొక్కిసలాటలు లేకుండా ఇనుపగ్రిల్స్‌తో ఎన్‌క్లోజర్లు సిద్ధం చేశారు.

పార్కింగ్.. ఎల్ఈడీ తెరలు

★ నగరం నుంచి బీచ్‌రోడ్డుకు వచ్చే వారు కేజీహెచ్ డౌన్, పందిమెట్ట డౌన్, పాండురంగాపురం డౌన్‌తో పాటు వుడా పార్కు వైపు నుంచి విన్యాసాలు జరిగే ప్రాంగణానికి చేరుకోవచ్చు. ★ ఏపీఐఐసీ స్థలం, కోస్టల్ బ్యాటరీ, ఏయూ మైదానాల్లో వాహనాల పార్కింగ్‌కు అవకాశం కల్పించారు.

★ బీచ్ వరకు రాలేక పోయిన వారికి సిటీ సెంట్రల్‌పార్క్, వుడా పార్క్, సిరిపురం కూడలి గురజాడ ప్రాంగణంలో భారీ ఎల్ఈడీ తెరలు ఏర్పాటు చేశారు.

రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ముకు స్వాగతం పలుకుతున్న మేయర్ పీలా శ్రీనివాసరావు, మంత్రి డీఎస్‌బీవీ స్వామి, ఎంపీ శ్రీభరత్, సీపీ శంఖబ్రత బాగ్చీ, కలెక్టర్ హరేంధిరప్రసాద్

సీఎం చంద్రబాబుకు స్వాగతం పలుకుతున్న జేసీ విద్యాధరి

పాసులు తప్పనిసరి..

★ ఈనెల 19న నిర్వహించే అంతర్జాతీయ సిటీ పరేడ్‌లోని అన్ని కార్యక్రమాలను 18న పూర్తిస్థాయిలో ప్రదర్శిస్తారు. బీచ్‌రోడ్డులోని పార్క్‌హోటల్ కూడలి నుంచి కోస్టల్ బ్యాటరీ వరకు సాగే ఈ పరేడ్‌ను రెండు వైపుల నుంచి ప్రజలు, అతిథులు తిలకించేందుకు వీలుగా ఏర్పాట్లు చేశారు.

★ ఐఎఫ్ఆర్ నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు
★ పార్క్ హోటల్ నుంచి కోస్టల్‌బ్యాటరీ వరకు సిటీ పరేడ్
★ నేడు నమూనా విన్యాసాలు, రేపు పూర్తి స్థాయి ప్రదర్శన

లేజర్ వెలుగులు.. కట్టిపడేసిన విన్యాసాలు

ఈనాడు–విశాఖపట్నం

అంతర్జాతీయ యుద్ధనౌకల సమీక్ష (ఐఎఫ్ఆర్-2026), మిలన్ వేడుకల్లో భాగంగా తూర్పు నావికా దళం ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన రిహార్సల్స్ అంబరాన్నంటాయి. యుద్ధ విమానాల నుంచి వదిలిన బాంబుల మోతతో తీరం దద్దరిల్లింది. చేతక్, ధ్రువ్, సీకింగ్ హెలికాప్టర్ల రెస్క్యూ, ఆపరేషన్ విన్యాసాలు ఆకట్టుకున్నాయి. శత్రువులపై విరుచుకుపడే యుద్ధ ట్యాంకర్లతో పాటు, శత్రువుల నౌకలను కూల్చే ఆయిల్ రిగ్ పేలుడు విన్యాసాలు ఒళ్లు గగుర్పొడిచాయి. గగనతలంలో మిగ్-29, హాక్ ఫైటర్ జెట్లు, పి-81 బోయింగ్ విమానాల గర్జనలు ఆకర్షణగా నిలిచాయి. సముద్రంలో ఉంచిన 71 యుద్ధ నౌకలు విద్యుత్తు దీపాల వెలుగుల్లో నగరవాసులను కట్టిపడేస్తున్నాయి. కొన్ని నౌకల లేజర్ షో ఆకట్టుకుంది. సిటీ పరేడ్ రిహార్సల్స్‌లో భాగంగా ఆర్కే బీచ్ ప్రధాన వేదిక వద్ద రైఫిల్స్‌తో కంటిన్యూటీ డ్రిల్ చేపట్టారు. సీ క్యాడెట్ కోర్ (ఎస్‌సీసీ) క్యాడెట్ల నృత్య ప్రదర్శన, ఎన్‌సీసీ, ఎస్‌సీసీ, పోలీసు, కోరుకొండ, వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు, మాజీ సైనికులు, ఎయిర్‌ఫోర్స్ సిబ్బంది బ్యాండ్స్‌తో కవాతు నిర్వహించారు. అనంతరం బాణసంచా కాల్పులతో తీరాకాశం వర్ణరంజితమైంది.

భద్రత పటిష్ఠం

తూర్పు నౌకాదళం ఆధ్వర్యంలో జరిగే కార్యక్రమాలకు సంబంధించి మూడు వారాల నుంచి జిల్లా అధికార యంత్రాంగం చేపట్టిన ఏర్పాట్లు కొలిక్కి వచ్చాయి. వివిధ దేశాలకు చెందిన యుద్ధనౌకలు, దేశ, విదేశీ ప్రముఖులు, త్రివిధ దళాలకు చెందిన ఉన్నతాధికారులు, విశ్రాంత ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు హాజరవుతున్న నేపథ్యంలో పోలీసు యంత్రాంగం పటిష్ఠ భద్రతా ఏర్పాట్లు చేసింది.

బ్యాండుతో కవాతు నిర్వహిస్తున్న విద్యార్థినులు

గ్రేహౌండ్స్ స్పెషల్ ఫోర్సు కవాతు

★ ఆర్కేబీచ్ నుంచి సబ్‌మెరైన్ మ్యూజియం వరకు 15 బ్లాకులు ఏర్పాటు చేశారు. ఆయా బ్లాకులకు అతిథులు, నౌకాదళం ఉద్యోగులు, ఇతర ముఖ్యులకు కేటాయించారు. బ్లాకుల్లోకి వెళ్లాలంటే ప్రతి ఒక్కరికీ పాస్ తప్పనిసరి.



ఫ్లీట్ రివ్యూ కోసం ఆర్కే బీచ్‌రోడ్డులో ఏర్పాటు చేసిన గ్యాలరీలు

నౌకను ఆయిల్ రిగ్‌తో పేల్చే నమూనా విన్యాసం

సంద్రంలో 'బలగం'... శత్రు దుర్భేద్యం...!

మిలన్‌లో ప్రత్యేక ఆకర్షణగా ఐఎన్ఎస్ అరిధమన్, ఐఎన్ఎస్ ఆర్నాలా

ఈనాడు–విశాఖపట్నం, సింధియా–న్యూస్‌టుడే: గాలిలో.. నీటిపైన.. సముద్రం అడుగున రక్షణ కవచంలా పనిచేసే ఆయుధ సంపత్తి తూర్పు నౌకాదళం ప్రత్యేకం. అందులో యుద్ధనౌకలతోపాటు జలాంతర్గాములు, ఫ్రిగేట్లు, డిస్ట్రాయర్లు కీలక పాత్ర పోషిస్తున్నాయి. వాటిల్లో అరిధమన్ అణు జలాంతర్గామి, ఐఎన్ఎస్ ఆర్నాలా యుద్ధనౌక మిలన్ విన్యాసాల్లో ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయి.

ఐఎన్ఎస్ అరిధమన్

అణుశక్తితో నడిచే అణుజలాంతర్గామి అరిఘాత్‌ను 2024లో కమిషనింగ్ చేశారు. ఈ జలాంతర్గామిపై కే-4 బాలిస్టిక్ క్షిపణి పరీక్ష సైతం విజయవంతమైంది. ఐఎన్ఎస్ అరిధమన్ మూడో అణు జలాంతర్గామి తుదిదశలో ఉంది. ఇప్పటికే పలు దఫాలు సీ్ట్రయల్స్ పూర్తి చేసుకుంది. ఈ ఏడాదిలోనే కమిషనింగ్ జరిపేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

ప్రత్యేకతలు..

బరువు: 7000 టన్నులు
పనిచేసే విధానం: 83మెగా వాట్స్. దేశీయ లైట్‌వాటర్ రియాక్టర్.
క్షిపణుల సామర్థ్యం: అరిహంత్ కంటే రెట్టింపుతో కే4 క్షిపణులను, 8 సబ్‌మెరైన్ లాంచ్ బాలిస్టిక్ క్షిపణులను తీసుకెళ్లగలదు. కే15 తరహాలో 25 వరకు మోయగలదు
నిర్మాణం: విశాఖపట్నం షిప్‌బిల్డింగ్ సెంటర్
వేగం: సముద్ర జలాల అడుగున 24 నాటికల్ మైళ్లు

'ఐఎన్ఎస్ ఆర్నాలా'..

యాంటీ సబ్‌మెరైన్ వార్‌ఫేర్-షాలో వాటర్ క్రాఫ్ట్ (ఏఎస్‌డబ్ల్యూ-ఎస్‌డబ్ల్యూసీ)గా భారత నౌకాదళంలో 'ఐఎన్ఎస్ ఆర్నాలా' పేరుగాంచింది. ఈ యుద్ధనౌకను గత ఏడాది జూన్ 18న కమిషనింగ్ చేశారు. 80శాతం దేశీయ పరిజ్ఞానంతో తయారు చేశారు. లోతు తక్కువగా ఉన్న జలాల్లో సైతం శత్రువుల జలాంతర్గాముల జాడను కనిపెట్టగలదు.

ప్రత్యేకతలు..

కమిషనింగ్: విశాఖపట్నం నేవల్ బేస్
నిర్మాణం: కోల్‌కత్తాలోని గార్డెన్‌రీచ్ షిప్ బిల్డింగ్ అండ్ ఇంజినీర్స్.
సాంకేతిక ఆయుధ సంపత్తి: ఆధునిక అభయ్ కాంపాక్ట్ హల్ మౌంటెడ్ సోనార్ వ్యవస్థ, లోఫ్రీక్వెన్సీ వేరియబుల్ డెప్త్ సోనార్ వ్యవస్థ. ఆధునిక స్టెల్త్ పరిజ్ఞానం. **ఉపయోగాలు:** అన్వేషణ, రక్షణ, ఇంటెన్సిటీ మారిటైం ఆపరేషన్స్.

ఉన్నత చదువులకు అండగా.. 'విద్యా లక్ష్మి'!

★ ఎలాంటి పూచీకత్తు లేకుండా రుణాలు
★ పేద, మధ్యతరగతి విద్యార్థులకు వరం

ఈనాడు, విశాఖపట్నం: ఉన్నత చదువులకు వెళ్లాలని ఉన్నా.. ఆర్థిక సమస్యల కారణంగా పేద, మధ్య తరగతి వర్గాల విద్యార్థులు వెనకడుగు వేయాల్సిన పరిస్థితి. అలాంటి వారికి 'ప్రధాన మంత్రి విద్యాలక్ష్మి' పథకం ఆసరాగా నిలుస్తోంది. గతేడాది ఫిబ్రవరి 25 నుంచి ఈ ఏడాది జనవరి వరకు ఈ పథకం కింద జిల్లాకు రూ.82.53 కోట్ల రుణం మంజూరు చేయగా.. రూ.14.16 కోట్లు విడుదల చేశారు. ఆయా వివరాలను ఇటీవల పార్లమెంటులో ప్రస్తావించారు.

గతేడాది ఫిబ్రవరి 25 నుంచి ఈ ఏడాది జనవరి వరకు ఇలా..

వచ్చిన దరఖాస్తులు: 602	ఆమోదించిన దరఖాస్తులు: 541
కేటాయించిన నిధులు: రూ. 82.53 కోట్లు	విడుదలైన నిధులు: రూ. 14.16 కోట్లు

దేశంలోని 902 విద్యా సంస్థల్లో..: ఈ పథకం ద్వారా ప్రతిభావంతులైన విద్యార్థులు దేశంలో ప్రతిష్ఠాత్మక ఉన్నత విద్యా సంస్థల్లో ప్రవేశాలు పొందేందుకు అవసరమైన ఆర్థిక సాయం అందుతుంది. దేశంలోని 902 అగ్రశ్రేణి విద్యాసంస్థల్లో చదువుకోవచ్చు. ఎన్ఐఆర్ఎఫ్‌లో తొలి 100 స్థానాల్లో ఉన్న ప్రభుత్వ, ప్రైవేటు విద్యా సంస్థల్లో ప్రవేశాలకూ ఈ పథకం వర్తిస్తుంది. ఆయా కేటగిరీలకు, కొన్ని రంగాలకు ఇచ్చే ర్యాంకింగ్‌లను, రాష్ట్ర ప్రభుత్వాలకు చెందిన ఉన్నత విద్యా సంస్థలను (101-200 ర్యాంకుల మధ్య ఉన్నవి), కేంద్ర ప్రభుత్వ విద్యా సంస్థలను పరిగణనలోకి తీసుకుంటారు. ఎలాంటి పూచీకత్తు, హామీ లేకుండా బ్యాంకులు విద్యా రుణం అందిస్తున్నాయి. ఆయా కోర్సులకు సంబంధించిన పూర్తి ట్యూషన్ ఫీజులు, ఇతర ఖర్చులను దీని ద్వారా చెల్లించవచ్చు.

15 రోజులలోపే రుణం..: రుణం అవసరమైన విద్యార్థులు https://pmvidyalaxmi.co.in వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలి. అవసరానికి అనుగుణంగా రుణం కోసం దరఖాస్తు చేసుకోవాలి. అర్హులకు 15 రోజులలోపే రుణం మంజూరు చేస్తారు. దరఖాస్తు తిరస్కరిస్తే, కారణాలను ఈ-మెయిల్ ద్వారా తెలియజేస్తారు. రూ.7.5 లక్షల లోపు రుణాలకైతే 75 శాతం వరకు క్రెడిట్ గ్యారంటీ పొందేందుకు వీలుంటుంది. కుటుంబ వార్షికాదాయం రూ.8 లక్షల లోపు ఉండాలి. ఇతరత్రా ప్రభుత్వ ఉపకారవేతన పథకాలు, వడ్డీ రాయితీ పథకాలు తీసుకుని ఉండకూడదు. అలాంటి వీరికి 2 శాతం వడ్డీ రాయితీ లభిస్తుంది.

శ్రమించారు.. సాధించారు!

జేఈఈ విజేతలకు అభినందన

గాజువాక, పెదగంట్యాడ, కార్పొరేషన్, న్యూస్‌టుడే : జేఈఈ మెయిన్ ఫలితాల్లో పలువురు విద్యార్థులు ప్రతిభ చాటారు. మంచి ప్రణాళిక.. ఉపాధ్యాయుల మార్గదర్శనం.. తల్లిదండ్రుల ప్రోత్సాహంతో ఈ విజయం సాధించామని విద్యార్థులు తెలిపారు. ఐఐటీ లక్ష్యంగా చదువుతున్నామని చెప్తున్నారు.

★ **పేరు : ఎన్ఎంఎల్ మూర్తి**
■ **స్వస్థలం:** చినముషిడివాడ
● **పర్సంటైల్ :** 99.82
▼ **కుటుంబ నేపథ్యం:** తండ్రి సాయి కుమార్ ఉపాధ్యాయుడు, తల్లి పార్వతి గృహిణి
✔ **ఏమన్నారంటే:** పట్టుదలతో 10 గంటలపాటు చదివి పరీక్షలకు సిద్ధమయ్యా. అధ్యాపకులు ఇచ్చిన సూచనలను పాటించి అనుకున్న లక్ష్యాన్ని సాధించా. ఐఐటీ చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నా..!

★ **ఎస్. కార్తికేయ**
■ శనివాడ ● 99.77
▼ తండ్రి రవిబాబు, స్థిరాస్తి వ్యాపారి. తల్లి శ్యామ గృహిణి.
✔ తల్లిదండ్రుల ప్రోత్సాహం, అధ్యాపకుల సహకారం నన్ను ముందుకు నడిపించింది. ఐఐటీ చేయడమే నా ముందున్న లక్ష్యం.



★ **గౌతమ్ ఆదిత్య**
■ గాజువాక ● 99.71
▼ తండ్రి సోమశేఖర్ వ్యాపారి, తల్లి దేవి గృహిణి.
✔ రోజూ 11 గంటల వరకూ చదివేవాడిని. అధ్యాపకులతో సందేహాలను నివృత్తి చేసుకుని ప్రతి రోజు నోట్స్ రాసుకున్నాను. ఐఐటీలో రాణించాలన్నదే నా ముందున్న లక్ష్యం.

★ **ఎస్.హిమాని హన్సిత**
■ గురుద్వారా
● 99.91
▼ తండ్రి ఉమామహేశ్వరరావు లెక్చరర్. తల్లి వెంకటలక్ష్మి గృహిణి.
✔ రోజూ కళాశాలకు వెళ్లొచ్చిన తర్వాత, ఇంటి వద్ద అదనంగా మూడు గంటల పాటు అన్ని సబ్జెక్టులు చదివా. కళాశాలలో ఇచ్చిన మెటీరియల్ బాగా ఉపయోగపడింది. దీంతో మంచి పర్సంటైల్ వచ్చింది.

★ **ఎస్ఎస్.అభిరామ్ సాత్విక్**
■ పీఎంపాలెం
● 99.82
▼ తండ్రి ఆదినారాయణ కళాశాలలో హెచ్ఓడీగా పని చేస్తున్నారు. తల్లి సుహాసిని గృహిణి.
✔ మెయిన్‌కు సన్నద్ధమయ్యే సందర్భంలో ప్రతి అంశంపై అవగాహన పెంచుకున్నా. ఏ సందేహం వచ్చినా, వెంటనే నివృత్తి చేసుకుంటూ పట్టుదలతో చదివా.

పోర్టు గెస్ట్‌హౌస్‌లో..

విద్యుత్తు సరఫరాకు అంతరాయం

ఈనాడు, విశాఖపట్నం: అంతర్జాతీయ యుద్ధనౌకల సమీక్ష (ఫ్లీట్ రివ్యూ)లో పాల్గొనేందుకు మంగళవారం సాయంత్రం విశాఖ చేరుకున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విమానాశ్రయం నుంచి నేరుగా పోర్టు గెస్ట్‌హౌస్‌కు వెళ్లారు. గెస్ట్‌హౌస్ ప్రాంగణంలోని ప్రత్యేక బస్సులో సీఎం ఉండగా కొద్ది సేపు విద్యుత్తు నిలిచిపోయింది. దీంతో ఆ ప్రాంతం అంతా ఒక్కసారిగా చీకట్లు అలముకున్నాయి. అప్పటికే స్టాండ్‌బైగా జనరేటర్లు ఉండటంతో వెంటనే విద్యుత్తును పునరుద్ధరించారు. రాత్రి సీఎంను కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయ స్వామి, విశాఖ ఎంపీ శ్రీభరత్ కలిసి మాట్లాడారు.

WALK - IN - INTERVIEW
A Multi Crore Org. ISO (Certified)
Open New Branches Wanted the below Positions in Vizag Branches
BRANCHES: Seethammadhara, MVP Colony, Madhurawada
★ CHIEF ADMINISTRATIVE OFFICER : M/F
Qlf: Retired Head of the Department in any Sector
YEARLY PACKAGE: 15 LAKHS
★ OFFICE INCHARGE : M/F
Qlf: Age 30 Years & above
Any Degree Minimum 1 Year Experience
YEARLY PACKAGE: 10 LAKHS
INTERVIEWS ON: 18-02-2026
Con: M.B.N.SATYANARAYANA
DOCTORS COLONY, VSP.
9848197936

'మలుపు'ల్లో.. అడుగడుగునా అక్రమాలు!

దురుద్దేశంతోనే 'రోడ్డు' అలైన్‌మెంట్ మార్పు

ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుల వినతి

ఈనాడు, విశాఖపట్నం, న్యూస్‌టుడే, పీఎం పాలెం, సాగర్‌నగర్ : రుషికొండ వద్ద నేరుగా వెళ్లాల్సిన రోడ్డు ఓ రిసార్టు, కన్వెన్షన్ సెంటర్ వద్దకు వెళ్లేసరికి మెలికలు తెరిగింది. వైకాపా నేతల ఒత్తిళ్లకు తలొగ్గి సామాన్యుల ఆస్తుల మీదుగా అలైన్‌మెంట్ వెళ్లేలా చేశారు. ఇదంతా గత ప్రభుత్వంలో తయారు చేసిన వీఎంఆర్‌డీఏ మాస్టర్‌ప్లాన్‌లో చోటు చేసుకుంది. ఆ తర్వాత దానిపై అభ్యంతరాలు తెలియజేసినా పట్టించుకోలేదు. ఇటీవల కూటమి ప్రభుత్వం మాస్టర్‌ప్లాన్ పునఃపరిశీలన చేసింది. ఇక్కడ మార్పులు చేయాలన్న వినతిని పరిగణనలోకి తీసుకోవడం లేదని, ఫలితంగా తమ స్థలాలు పోతున్నాయని బాధితులు వాపోతున్నారు.

అందుకోసమేనా?: గత ప్రభుత్వంలో మాస్టర్‌ప్లాన్ తయారీ సమయంలో వైకాపా నేతలు కొందరు ఇక్కడ స్థలాలు కొనుగోలు చేయాలని ప్రయత్నించినా స్థానికులు కొందరు అంగీకరించలేదు. దీంతో వారి ఆస్తులకు పూర్తిగా నష్టం కలిగించేలా అప్పటి నేతలు వ్యవహరించారనే చర్చ సాగుతోంది. ఇదే సమయంలో కొందరు కీలక వ్యక్తులకు లబ్ధి కలిగేలా చేశారంటున్నారు. 'గత ప్రభుత్వంలో అన్యాయంగా వ్యవహరించి ప్రజలకు నష్టం కలిగిన చాలా అంశాల్లో మార్పులు చేశాం. ఇంకా ఉంటే పరిశీలిస్తాం. మార్చి పదో తేదీ వరకు దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం ఉంది' అని వీఎంఆర్‌డీఏ ఛైర్మన్ ప్రణవ్‌గోపాల్ పేర్కొన్నారు.

అంతా తారుమారు: కైలాసగిరి నుంచి భోగాపురానికి రుషికొండ మీదుగా ఆరు వరుసల రహదారిని గత ప్రభుత్వంలో ప్రతిపాదించారు. వీఎంఆర్‌డీఏ తయారు చేసిన 2041 ముసాయిదా ప్రణాళికలో రెండు వైపులా సమాంతరంగా భూములు తీసుకునేలా అలైన్‌మెంట్ చేశారు. తరువాత ఏమైందో గాని తుది ప్లాన్‌లో అంతా తారుమారైపోయింది.

★ రుషికొండ వద్ద రిసార్టు, కన్వెన్షన్ సెంటరు వైపునకు ప్రతిపాదనే లేదు. ఏకంగా నాలుగు సర్వే నంబర్లలోని స్థలాల మీదుగా ఎడమ వైపునకు పూర్తిగా తిప్పేశారు. అక్కడి నుంచి మళ్లీ కుడివైపునకు మలుపు తిప్పి బీచ్‌కు సమీపం నుంచి వెళ్లేలా ప్రతిపాదించారు. ఇన్ని మలుపులు తిప్పకుండా ప్రతిపాదించే అవకాశం ఉన్నా,

మలుపులు తిప్పిన రహదారి ఇదే..

కొందరి మేలు కోసం 300 మీటర్లు ఇష్టానుసారంగా ప్రతిపాదించారు. వాస్తవానికి రెండు వైపులా సగం సేకరించేలా ప్రతిపాదిస్తే కుడి వైపున్న ఆస్తులకు ఎటువంటి నష్టం జరగదు. ఎడమ వైపున్న ఆస్తుల్లో కొంత పోయినా కొంత మిగులుతుంది. ఇటీవల సీఎం సాధ్యమైనంత వరకు మలుపులు లేకుండా నిర్మించాలని ఆదేశించినా అధికారులు పట్టించుకోకపోవడం గమనార్హం.

ఐఎన్ఎస్ సర్కార్స్‌లో విందు

సింధియా, న్యూస్‌టుడే : తూర్పు నావికాదళ ముఖ్య కార్యాలయం 'ఐఎన్ఎస్ సర్కార్స్'లో మంగళవారం రాత్రి 'ప్రెసిడెన్షియల్ బాంక్వెట్' నిర్వహించారు. భారత రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము అంతర్జాతీయ ఫ్లీట్ రివ్యూ నిమిత్తం మంగళవారం సాయంత్రం ఈస్ట్రన్ నేవల్ కమాండ్ ముఖ్య కార్యాలయానికి చేరుకున్నారు. సంప్రదాయంలో భాగంగా రాష్ట్రపతి ప్రముఖులకు విందు ఇచ్చారు. ఇందులో రాష్ట్ర గవర్నర్ జస్టిస్ ఎస్.అబ్దుల్ నజీర్, రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ధీరజ్‌సింగ్ ఠాకుర్, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ దంపతులు, రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డీబీవీ స్వామి, నేవీ చీఫ్ దినేష్ కుమార్ త్రిపాఠి, ఈఎన్‌సీ చీఫ్ వైస్ అడ్మిరల్ సంజయ్‌భల్లా తదితరులు పాల్గొన్నారు.

పవన్ కల్యాణ్ దంపతులతో భారత నేవీ చీఫ్ అడ్మిరల్ దినేష్ కుమార్ త్రిపాఠి, ఈఎన్‌సీ చీఫ్ వైస్ అడ్మిరల్ సంజయ్‌భల్లా దంపతులు

ఇక తరగతులకు డుమ్మా కొట్టలేరు..!

★ ఏయూ అనుబంధ కళాశాలల్లో ముఖ గుర్తింపు హాజరు
★ తొలిదశలో 70 విద్యాలయాల్లో అమలుకు సన్నాహాలు

ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే: అనుబంధ కళాశాలల్లో విద్యార్థులు, అధ్యాపకులు సక్రమంగా తరగతులు, విధులకు హాజరయ్యేలా ఆంధ్రవిశ్వవిద్యాలయం చర్యలకు ఉపక్రమించింది. ఈ మేరకు వర్సిటీ పరిధిలోని 303 కళాశాలల్లో ముఖ గుర్తింపు హాజరు(ఫేస్ రికగ్నైజేషన్ అటెండెన్స్) పరికరాలు ఏర్పాటు చేయనున్నారు. ఏయూ పరిధిలోని పలు కళాశాలలు సక్రమంగా నడవడం లేదని ఇటీవల అధికారుల ఆకస్మిక తనిఖీల్లో తేలింది. దీంతో ప్రతి రోజూ విద్యార్థులు, అధ్యాపకులు హాజరును నేరుగా వర్సిటీ నుంచే పర్యవేక్షించాలని నిర్ణయించారు.

సక్రమంగా నడవని కళాశాలలు...: ఏయూ అధికారుల ఆకస్మిక తనిఖీలలో ఒక న్యాయ కళాశాల, ఒక బీఎడ్ కళాశాల విద్యార్థులు లేకుండా నడుస్తున్నట్లు గుర్తించారు. ఫలితంగా విద్యా ప్రమాణాలు దిగజారడంతోపాటు ఫీజు రీయింబర్స్‌మెంట్ రూపంలో ప్రభుత్వానికి నష్టం వాటిల్లుతోందని చెబుతున్నారు. దీనికి అడ్డుకట్ట వేయడానికే ముఖ గుర్తింపు హాజరును అమలు చేయాలని నిర్ణయించారు.

మొదట ఆ కళాశాలల్లోనే...: ముఖ గుర్తింపు హాజరును తొలి దశలో 70 కళాశాలల్లో అమలు చేయనున్నారు. ఈ విడతలో న్యాయ, బీఎడ్ కళాశాలలు ఎక్కువగా ఉండేలా ప్రణాళిక రూపొందించారు. ముఖ గుర్తింపు హాజరు పరికరాల కోసం ఈ నెలాఖరుకు టెండర్ పిలిచే అవకాశం ఉందని ఏయూ కంప్యూటర్ కేంద్రం సంచాలకులు ఆచార్య భాస్కరరెడ్డి తెలిపారు.

పనిచేసే విధానం ఇది..

కళాశాలలో ఏర్పాటు చేసిన పరికరంలో ముఖ గుర్తింపు వేయగానే నేరుగా ఏయూ కంప్యూటర్ కేంద్రంలో నమోదవుతుంది. విద్యార్థి లేదా అధ్యాపకుడు కళాశాల నుంచి బయటకు వెళ్లేటప్పుడు కూడా అందులో నమోదు చేయాల్సి ఉంటుంది. తద్వారా వారు కళాశాలకు ఎప్పుడు వస్తున్నారు. ఎప్పుడు వెళుతున్నారో తెలుస్తుంది. ఒక వేళ మారుమూల ప్రాంతాల్లో వైఫై/అంతర్జాలం సిగ్నల్ సరిగా లేక సమాచారం తక్షణం పంపించలేకపోయినా సిగ్నల్ వచ్చే వరకు ఆయా వివరాలు పరికరంలోనే స్టోర్ అవుతాయి. సిగ్నల్ వచ్చాక నేరుగా ఏయూ కంప్యూటర్ కేంద్రానికి సమాచారం పంపిస్తుంది. తొలిదశలో ఏర్పాటు చేసే ముఖ గుర్తింపు పరికరాల్లో లోటుపాట్లను గుర్తించి రెండో దశలో అన్ని కళాశాలల్లోనూ అమలు చేస్తామని ఆచార్య భాస్కరరెడ్డి తెలిపారు.

కేర్ టేకర్ కావలెను
విశాఖ నగరంలో ప్రముఖ ప్రభుత్వరంగ బీమా కంపెనీకి (The New India Assurance Company Ltd.) సంబంధిత ఉద్యోగుల గెస్ట్‌హౌస్ / ట్రాన్సిట్ క్యాంప్ నందు వంటపనులు, లాండ్రీ మరియు ఇతర నిర్వహణ పనులు చేయుటకు అనుభవం కలిగిన పురుష / స్త్రీ అభ్యర్థుల నుండి దరఖాస్తులు కోరడమైనది.
వయస్సు: 40 సంవత్సరములు. ప్రాంతీయ మరియు హిందీ బాష, దక్షిణ / ఉత్తర భారత వంటకాలపై అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత.
Sd/- CHIEF REGIONAL MANAGER
THE NEW INDIA ASSURANCE COMPANY LTD.
D.No. 47-15-5, Near Diamond Park, Dwarakanagar, Vizag-16.
Whatsapp: 9989591215 Cell:9849011389

సందర్భమేదైనా ఈనాడును చేసుకోండి వేదిక
మీ బంధుమిత్రులు, కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషులకు ఈనాడు లో ప్రకటనల ద్వారా తెలియజేయండి

ఈనాడు యాడ్స్ ద్వారా తెలియజేయండి
ప్రకటనల కొరకు సంప్రదించండి
80087 09638

ఉక్కు సీవీవోగా నీలకంఠరెడ్డి

కూర్మన్నపాలెం, న్యూస్‌టుడే : ఉక్కు కర్మాగారం చీఫ్ విజిలెన్స్ అధికారిగా సి. నీలకంఠరెడ్డి నియమితులయ్యారు. ఎన్ఎండీసీ పరిశ్రమలో సీవీవోగా పనిచేస్తున్న ఆయనకు ఉక్కు అదనపు బాధ్యతలు అప్పగించారు. 1997వ ఐఆర్ఎస్ బ్యాచ్‌కు చెందిన నీలకంఠరెడ్డి తదుపరి ఉత్తర్వులు వెలువడేవరకు అదనపు బాధ్యతలు నిర్వహించనున్నారు.

ప్రయాణికుల రద్దీకి ప్రత్యేక రైళ్లు

రైల్వేస్టేషన్, న్యూస్‌టుడే : ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని వారాంతపు ప్రత్యేక రైళ్లు అందుబాటులోకి తీసుకురానున్నట్టు వాల్తేర్ సీనియర్ డీసీఎం కె.పవన్‌కుమార్ తెలిపారు. ★ మార్చి 1 నుంచి 8 వరకు ప్రతి ఆదివారం ఎస్ఎంవీ బెంగళూర్- మాల్దాటౌన్(06565), మార్చి 4 నుంచి 11 వరకు ప్రతి బుధవారం మాల్దాటౌన్-బెంగళూరు(06566) రైళ్లు, ఈనెల 26, మార్చి 1, 5 తేదీల్లో చర్లపల్లి-షాలిమార్(07512), ఈనెల 27, మార్చి 2, 6 తేదీల్లో షాలిమార్-చర్లపల్లి(07513) రైళ్లు అందుబాటులో ఉంటాయన్నారు.

కనుమరుగైపోతున్నా.. కన్ను తెరవరా..?

- కబ్జా కోరల్లో సుజాతనగర్ రాజుచెరువు
- పరిరక్షించాలని ఉప ముఖ్యమంత్రికి లేఖ

సుజాతనగర్ (పెందుర్తి), న్యూస్‌టుడే: పెందుర్తి మండలంలోనే అత్యధికంగా ధర పలుకుతున్న భూములున్న సుజాతనగర్ కాలనీ సమీప రాజుచెరువు కనుమరుగైపోయే దుస్థితి నెలకొంది. దళారులు రాబందులై జలవనరులను మింగేస్తున్నా యంత్రాంగం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోంది. రోజులు గడుస్తున్న కొద్దీ చెరువులో జలాలు మాయమై కాంక్రీటు భవనాలు వెలుస్తున్నాయి. కళ్ల ముందే అంతా జరుగుతున్నా తమకేమీ పట్టదన్నట్టుగా వ్యవహరిస్తున్న అధికార యంత్రాంగం తీరు అనుమానాలకు తావిస్తోంది.

★ ఇక్కడ ఆక్రమణలను అడ్డుకోవాల్సిన కొందరు అధికారులు, నాయకులు, దళారులు కుమ్మక్కై చెరువు కబ్జాను ప్రణాళికాబద్ధంగా అమలు చేస్తున్నారని పరిసర కాలనీల ప్రజలు ఆరోపిస్తున్నారు. 2017 నుంచి ప్రభుత్వాలు, అధికారులు, ప్రజా ప్రతినిధులు మారుతున్నా రాజు చెరువు తలరాత మాత్రం మారలేదని వాపోతున్నారు. ఈ నేపథ్యంలో చెరువును రక్షించాలని కోరుతూ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, మంత్రి నారా లోకేశ్‌లకు పలువురు లేఖ ద్వారా ఫిర్యాదు చేశారు.



గతంలో మూడొంతులు ఆక్రమణ జరగ్గా.. మిగిలిన చెరువు ప్రదేశం ఇలా..

మిగిలింది అయిదెకరాలే..

చినముషిడివాడ రెవెన్యూ సర్వే సంఖ్య 163లో 24 ఎకరాల్లో రాజుచెరువు విస్తరించి ఉండేది. కొన్నేళ్ల కిందట 11ఎకరాలు మిగలగా ప్రస్తుతం అయిదెకరాలకు పరిమితం అయిందని అంచనా. చెరువు కబ్జాపై గతంలో ఫిర్యాదులు వచ్చిన నేపథ్యంలో అప్పటి జిల్లా సంయుక్త కలెక్టర్, ఇతర అధికారులు ఎలాంటి చర్యలు చేపట్టలేదు. ప్రస్తుతం ఈ చెరువులో పాకల స్థానంలో పక్కా భవనాలు వెలిశాయి. కొంతమంది కబ్జాదారులు వెనుక ఉండి ఈ ఆక్రమణల తంతు నడిపిస్తున్నారని అంటున్నారు. తొలుత పేదలతో ఇక్కడ పాకలు వేయిస్తారు. తర్వాత వాటిని అమ్మకానికి పెట్టి రూ.లక్షల్లో లాభాలు గడిస్తున్నారు.

ఆ నిధులు ఏమయ్యాయో..?

అమృత్ పథకంలో భాగంగా 2023లో రాజుచెరువు అభివృద్ధికి రూ.3.30 కోట్లు మంజూరు చేసింది. ఆ మేరకు ఆక్రమణల తొలగింపు, చెరువు గట్టు పటిష్ఠం చేసే పనులు కొంతమేర చేపట్టారు. తర్వాత నిధులు ఏమయ్యాయో..? పనులు ఎందుకు నిలిచిపోయాయో..? తెలియని పరిస్థితి.

★ ఇక్కడ కబ్జాల కారణంగా శాంతిభద్రతల సమస్య కూడా తలెత్తుతోంది. ఇటీవల దళారులు దౌర్జన్యాలకు దిగి ప్రశ్నించిన వారిపై దాడులు చేయిస్తున్నారు. కొత్తగా పాకలు వెలిసేటప్పుడు రాత్రి వేళ ఘర్షణలు జరుగుతున్నాయి. ఈ సమస్య కలెక్టర్ దృష్టికి వెళ్లినా చర్యలకు ఎందుకు తాత్సారం చేస్తున్నారోనని స్థానికులు అంటున్నారు. ప్రస్తుతం యంత్రాంగమంతా ఇంటర్నేషనల్ ఫ్లీట్ రివ్యూలో నిమగ్నమై ఉన్నందున మిగిలిన చెరువు గర్భాన్ని రాత్రి వేళ మట్టితో కప్పేసి ఆక్రమించాలని ప్రణాళిక వేసినట్లు తెలుస్తోంది. ఇప్పటికైనా అధికారులు కళ్లు తెరవకుంటే సుజాతనగర్, చినముషిడివాడ పరిసర ప్రాంతాల్లో భవిష్యత్తులో భూగర్భ జలాల కొరత ఎదుర్కోనాల్సి వస్తుందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

సచివాలయాల్లో సంస్కరణలతో మెరుగైన పాలన

మంత్రి డీఎస్‌బీవీ.స్వామి వెల్లడి

మంత్రి డీఎస్‌బీవీ.స్వామికి పుష్పగుచ్ఛం అందిస్తున్న పీజీటీలు

వన్‌టౌన్, న్యూస్‌టుడే : గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా ప్రజలకు మెరుగైన పాలన, పారదర్శకమైన సేవలు అందించేందుకు వీలుగా పలు సంస్కరణలు తీసుకొస్తున్నామని మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి అన్నారు. మంగళవారం ఆయన విశాఖపట్నంలోని ఓ హోటల్లో విలేకరులతో మాట్లాడారు. "రికార్డ్ అసిస్టెంట్ హోదాలో నియమితులైన సచివాయల ఉద్యోగులకు పదోన్నతులు కల్పించేలా చర్యలు తీసుకుంటున్నాం. ఇప్పటికే డిజిటల్ సహాయకులకు గ్రేడ్-5, గ్రేడ్-4 పంచాయతీ కార్యదర్శులుగా పదోన్నతులు కల్పించాం. సచివాలయ ఉద్యోగుల హాజరుకు బయోమెట్రిక్ విధానం తీసుకొచ్చాం. క్షేత్రస్థాయిలో ఉండే వారు ఎక్కడికక్కడే హాజరు నమోదు చేసుకునే వీలుంటుంది. మహిళా పోలీసుల ఆసక్తి మేరకు ఐసీడీఎస్‌లో సేవలు అందించేందుకు నియమిస్తాం. ఒకే ప్రాంగణంలో ఉన్న సచివాలయాలను ఇతర ప్రభుత్వ భవనాల్లోకి తరలిస్తాం. రాష్ట్రంలో మూడు చోట్ల వసతి గృహ విద్యార్థులకు నీట్, ఐఐటీ శిక్షణ ఇస్తున్నాం. గ్రూపు-1 సర్వీసులతో పాటు బ్యాంకింగ్ ఉద్యోగాలకు అవసరమైన శిక్షణ ఇస్తున్నాం..." అని మంత్రి పేర్కొన్నారు.

వన్‌టౌన్, న్యూస్‌టుడే : అంబేడ్కర్ గురుకులాల్లోని విద్యార్థుల చదువు, ఆరోగ్య తదితర అంశాలపై పీజీటీలు ప్రత్యేకంగా దృష్టి సారించాలని మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి సూచించారు. అంబేడ్కర్ గురుకుల విద్యాలయాల్లో పని చేస్తున్న 250 టీజీటీలకు ఇటీవల కూటమి ప్రభుత్వం పీజీటీలుగా పదోన్నతి కల్పించింది. ఈ నేపథ్యంలో పలువురు పీజీటీలు మంగళవారం మంత్రిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

తిరుమల నెయ్యి కల్తీపై ప్రాయశ్చిత్తం చేయాలి

సీతంపేట, న్యూస్‌టుడే: తిరుమల లడ్డూ తయారీలో వినియోగించే నెయ్యి కల్తీ జరిగిందని తేలినందున భక్తులు శ్రీవారి శరణు కోరుతూ అపచార ప్రాయశ్చిత్తం చేయాలని రాష్ట్ర సాధు పరిషత్ అధ్యక్షులు శ్రీనివాసానంద సరస్వతి పేర్కొన్నారు. నగరంలోని ఒక హోటల్లో మంగళవారం నెయ్యి కల్తీపై ఉత్తరాంధ్ర సాధు పరిషత్ సభ్యులు రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. అనంతరం శ్రీనివాసానంద సరస్వతి విలేకరులతో మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలో లడ్డూ ప్రసాదం తయారీలో రసాయనాలు కలిపిన నెయ్యి వినియోగించి శ్రీవారికి నైవేద్యం పెట్టడంతో పాటు భక్తులకు అందించారన్నారు. శ్రీనివాసుడి కృప వల్ల రసాయనాలు కలిసిన లడ్డూలు తిన్నా భక్తులకు ఏమీ కాలేదన్నారు. దీనికి ప్రాయశ్చిత్తంగా ప్రతి హిందువు తమ ఇళ్లలో దీపం వెలిగించి వేంకటేశ్వరుడి ఆలయాల్లో ముడుపులు చెల్లించాలన్నారు. ఈ విధంగా ప్రాయశ్చిత్తం కోరమని ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, మాజీ ముఖ్యమంత్రి జగన్ దంపతులను కోరతామన్నారు. ప్రాయశ్చిత్తం సమయంలో గోవింద నామస్మరణ చేయాలని కోరారు. ఒకే సమయంలో ఈ ప్రక్రియ జరగాలని ఎప్పుడు చేయాలనేది త్వరలో విజయవాడలో రాష్ట్ర సాధు పరిషత్తు సమావేశం నిర్వహించి ప్రకటిస్తామన్నారు.

విలేకరులతో మాట్లాడుతున్న రాష్ట్ర సాధు పరిషత్ అధ్యక్షులు శ్రీనివాసానంద సరస్వతి

36.8 కి.మీ దూరం.. 25 నిమిషాలు

ఊపిరితిత్తులను తరలించిన వైద్య బృందం

శంషాబాద్, న్యూస్‌టుడే: హైదరాబాద్ కిమ్స్ ఆసుపత్రిలో ప్రాణాపాయ స్థితిలో ఉన్న రోగికి ఊపిరితిత్తుల మార్పిడి కోసం మంగళవారం శంషాబాద్ విమానాశ్రయం నుంచి బేగంపేట వరకు మంగళవారం సాయంత్రం ఆర్జీఐఏ ట్రాఫిక్ పోలీసులు గ్రీన్ ఛానల్ ఏర్పాటు చేశారు. విశాఖపట్నం నుంచి వైద్య బృందం ఇండిగో ఎయిర్‌లైన్స్ 6ఇ-783 విమాన సర్వీస్‌లో లైవ్ ఆర్గాన్స్‌ను శంషాబాద్ విమానాశ్రయానికి తీసుకొచ్చారు. అక్కడ నుంచి ఎయిర్‌పోర్ట్ భద్రతాధికారులు నిమిషాల వ్యవధిలో బ్యాటరీ వాహనంలో బయట అంబులెన్స్ వద్దకు తరలించారు. అక్కడి నుంచి 36.8 కి.మీ దూరంలో ఉన్న కిమ్స్ ఆసుపత్రికి గ్రీన్‌ఛానల్ ద్వారా 25 నిమిషాల్లోనే తీసుకెళ్లినట్టు పోలీసులు పేర్కొన్నారు.

రూ.32 లక్షల ఆర్థికసాయం అందజేత

సీఎం సహాయనిధి నుంచి రూ.28 లక్షలు మంజూరు

వన్‌టౌన్, న్యూస్‌టుడే : జీవీఎంసీ 35వ వార్డు వెలంపేట సమీప లక్ష్మీనగర్ ప్రాంతానికి చెందిన ఇమంది హరినాథ్ తీవ్రమైన అనారోగ్య సమస్యలతో బాధపడుతుండడంతో, ఆయన వైద్య ఖర్చులకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి రూ.28 లక్షలు మంజూరైంది. ఆ నిధులు సరిపోకపోవడంతో విశాఖ దక్షిణం తెదేపా ఇన్‌ఛార్జి, ఎన్టీఆర్ వైద్యసేవా ట్రస్టు ఎగ్జిక్యూటివ్ వైస్‌ఛైర్మన్ సీతంరాజు సుధాకర్ మరో రూ.4 లక్షలు సొంత నిధులు కలిపి... మంగళవారం బాధిత కుటుంబానికి రూ.32 లక్షలు అందించారు. ప్రస్తుతం బాధితుడు హైదరాబాద్‌లో చికిత్స పొందుతున్నాడని సీతంరాజు సుధాకర్ తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావు, పార్టీ నాయకులు బి.రాముడెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబ సభ్యులకు నగదు మంజూరు పత్రం అందజేస్తున్న సీతంరాజు సుధాకర్

జేఈఈ మెయిన్ ఫలితాల్లో 'శ్రీవిశ్వ' విజయభేరి

సీతంపేట, న్యూస్‌టుడే: జేఈఈ మెయిన్-2026(సెషన్-1) ఫలితాల్లో శ్రీవిశ్వ జూనియర్ కళాశాల విద్యార్థులు ఉత్తరాంధ్రలోనే అత్యధిక పర్సంటైల్ సాధించి విజయభేరి మోగించారు. వివిధ కేటగిరీల్లో వి.మధుసూర్యసాయి శషాంక్ 99.67, పి.భవదీష్ 99.65, ఎం.త్రినయణి 99.51, డి.దేవ మణికంఠ 99.49, కె.హరిశరణ్ 99.12, వి.యశ్వంత్ 99 పర్సంటైల్ సాధించారు. 99 పర్సంటైల్ ఆరుగురు, 98 పర్సంటైల్ 28 మంది, 97 పర్సంటైల్ 43 మంది, మొత్తం 210 మందికి పైగా విద్యార్థులు అత్యుత్తమ పర్సంటైల్ సాధించినట్లు యాజమాన్యం ఓ ప్రకటనలో తెలిపింది. ఈ సందర్భంగా విద్యార్థులను యాజమాన్య ప్రతినిధులు, అధ్యాపకులు అభినందించారు.

ప్రతిభ చూపిన విద్యార్థులతో శ్రీవిశ్వ కళాశాల యాజమాన్య ప్రతినిధులు

ఎసెంట్ జయకేతనం

కార్పొరేషన్, న్యూస్‌టుడే : నగరంలోని ఆశీలుమెట్ట ఎసెంట్ కళాశాల విద్యార్థులు జేఈఈ మెయిన్ తొలి విడత పరీక్ష ఫలితాల్లో ప్రతిభ చూపినట్లు సంస్థ డైరెక్టర్ జి.నాగేశ్వరరావు మంగళవారం తెలిపారు. ఎస్.హిమాని హన్విత 99.91 పర్సంటైల్, ఎస్ఎస్.అభిరామ్ సాత్విక్ 99.82 పర్సంటైల్ సాధించినట్లు ఆయన పేర్కొన్నారు. 99 పర్సంటైల్ 13 మంది, 98 పర్సంటైల్ 29, 95 పర్సంటైల్ 68, 90 పర్సంటైల్ 152 మంది సాధించారని ఆయన తెలిపారు.

'ఆకాశ్' విద్యార్థుల ప్రతిభ

విద్యార్థులను అభినందిస్తున్న ఆకాశ్ విద్యా సంస్థల యాజమాన్యం, అధ్యాపకులు

అక్కయ్యపాలెం, న్యూస్‌టుడే: ఆకాశ్ విద్యా సంస్థల విద్యార్థులు జేఈఈ మెయిన్ సెషన్-1 ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ చూపినట్లు సంస్థ రాష్ట్ర అకడమిక్ హెడ్ ఆర్.వి.ఎస్.ఎన్.మూర్తి, సీనియర్ అసిస్టెంట్ డైరెక్టర్లు లక్ష్మీనారాయణ, ఈశ్వరీప్రసాద్ తెలిపారు. ఈ మేరకు ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను డైమండ్ పార్కు సమీపంలోని సంస్థ కార్యాలయంలో మంగళవారం సత్కరించి అభినందించారు. బేత సాయిఆషిక్(99.97), వేమూరి సాయిసందీప్(99.91), బేరా ప్రవమ్‌కుమార్(99.69), సేనీత్ సేన్(99.68), ప్రగడ ఫాల్గునీమాన్య(99.65), తిరుమరెడ్డి రోషిణి(99.18), మల్లిపూడి ప్రవీణసాయి(99.10) పర్సంటైల్ సాధించారు. సంస్థ జాతీయ అకాడమీ బిజినెస్ హెడ్ ధీరజ్ మిశ్రా, బ్రాంచ్ హెడ్ రాజేశ్, అకాడమీ హెడ్ బి.వి.ఎ.ఎన్.మూర్తి తదితరులు పాల్గొన్నారు.

పక్కా ప్రణాళికతోనే ఉజ్వల భవిష్యత్తు

భీమునిపట్నం, న్యూస్‌టుడే: జీవితంలో ఉన్నత లక్ష్యాలను సాధించేందుకు విద్యార్థినులు నిర్దేశించిన ప్రణాళికతో ముందుకు సాగాలని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. జాతీయ నులి పురుగుల దినోత్సవం పురస్కరించుకుని మంగళవారం భీమిలిలో ప్రభుత్వ బాలికల గురుకుల పాఠశాలను సందర్శించి బాలికలకు ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం విద్య, వైద్య రంగాలకు ఎనలేని ప్రాధాన్యత ఇస్తోందన్నారు. డి.ఎం.హెచ్.ఓ డా.పి.జగదీశ్వరరావు, ప్రధానాచార్యులు పద్మలత, కార్పొరేటర్లు గంటా అప్పలకొండ, గాడు చిన్నికుమారి లక్ష్మి, పి.వి.నరసింహం, నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థినులతో ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

కోర్టు హాల్లో కుప్పకూలిన మహిళ

సపర్యలు చేయించిన న్యాయమూర్తి

బాధితురాలికి చికిత్స అందిస్తున్న సిబ్బంది

విశాఖలీగల్, న్యూస్‌టుడే : కుటుంబ గొడవల నేపథ్యంలో మంగళవారం వాయిదాకు హాజరైన మహిళా కక్షిదారు కోర్టు హాల్లోనే కుప్పకూలి పోవడంతో ప్రధాన కుటుంబ న్యాయస్థానం న్యాయమూర్తి కె.రాధారత్నం స్పందించారు. వైద్యురాలితో ప్రాథమిక వైద్యం చేయించి, అనంతరం కోర్టు ప్రాంగణంలోని న్యాయవాదుల డిస్పెన్సరీలో వైద్యసేవలు అందించాలని ఆదేశించారు. ఆ వివరాలు.. మల్కాపురం ప్రాంతానికి చెందిన ఎస్.జగదీశ్వరి కోర్టు వాయిదాకు హాజరై, ఒక్కసారిగా రక్తపోటు పెరగడంతో తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. మూడు గంటల తర్వాత బాధితురాలు కోలుకోవడంతో కేసు తదుపరి విచారణను వాయిదా వేశారు. సకాలంలో న్యాయమూర్తి స్పందించిన తీరును పలువురు న్యాయవాదులు ప్రశంసించారు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము-పశు సంవర్ధక శాఖ
అద్దె రవాణా వాహనము కొరకు ప్రకటన
...8008204158, 7013949375...

మహారాష్ట్ర ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి కోర్టు, విశాఖపట్నం.
E.P. 21/2020 in O.S. 1127/2016
...డిక్రీ హోల్డర్ మరియు ...జె.డి.ఆర్
వేలం ప్రకటన
...
డిక్రీ హోల్డర్ ధర : Rs. 25,00,000/-
కోర్టు అమీన్ ధర : Rs. 30,00,000/-
...
(By order of the Honourable Court)
KANDREGULA JAGADHESWARA RAO
Advocate, Visakhapatnam.
తేది.18-02-2026. Ph: 9848062634, 8886329999

EENADU Classifieds

AUTO
VEHICLES FOR SALE
2025 model Bharat Benz 3532c Tipper, Regn No:AP39WC3439. Contact Sundaram Finance Limited, Gajuwaka. Ph: 9440909746.
Mahindra Alfa-2022 Model-AP39-UE-3003 is for Sale in as is Where is Condition. ★Sundaram Finance Ltd. ✆ 94409 09731

BUSINESS SERVICES
FINANCIAL SERVICES
HEALTH & CARE
PILES

REAL ESTATE
FLAT FOR SALE
NAD
3Bhk 1800 sft flat E/f, 2Bhk 865sft S/f 2Bhk 820sft N/f 5th floor for sale @ 4500 per sft at Vimanagar. ✆ 9446139989
GENERAL
3BHK, North facing 1300 sft with car parking(USD-33.89)2nd floor, 9h sector, Opp.Samata College, MVP Colony. Cont: 9494576200.
LAND FOR SALE
GENERAL
PLOT FOR SALE
NAD
160 sq.yrd (35x41) N/F 30ft Rd. 2nd plot Laneno: 10, Vimanagar for sale. Direct parties only. ✆ 9446139989
PENDURTHI

GENERAL
Plot for Sale – VUDA Approved Open Plots with Residential building Size: 286 Sq.yards, North facing 30 feet Road at Marripalem VUDA Layout, Visakhapatnam for more information: 9959336633
LEASE/ RENT
GENERAL
NAD Kotha Road Rent/Lease 3&4th Floor for Corporate Offices/ Clinics Above SBI 1750Sft Each ✆ 9985374007, 7999856046.
WANTED
GENERAL
WANTED One Independent Building for School purpose or old School setup for Long Lease in front of big road within main city of Vizag or 800 to 1500 Sq.yds. Land for Purchase in Yendada or Rushikonda. Contact Ph: 94408 78272
SECOND SALE
JOBS
Wanted A/C Tech Supervisor / Helpers Project Engineer Diploma Holders for VRV ✆ 9912756400, 9848196400.

Urgent Requirement following Senior Positions * Chief Administration Managers: 5 No's, M/F, Experienced / Retd. in any field. Interviews on: 11th & 12th Feb.26. ✆ 9553021026, 7702999763.
Wanted Teachers for Reputed Schools in A.P & Telangana, Contact: Sneha Placements Service. Ph: 94402 46409.
Office Assistant Qlf: Inter, Basic Computer knowledge Teja Drilling, Nr. Dolphin Hotel. 7675989983, 7675989986.
WANTED ... 10th, 12th, Degree ... Freshers / Experienced Male Executives ... Srinivasa Rao Madhurawada, Vizag 9666838334, 8712644055
Gujarat ... 9505701977.

ప్రముఖ సంస్థలో ప్రాజెక్ట్‌వర్క్‌లో పనిచేయుటకు లేడీ మేనేజర్ కావలెను గమనిక:చదువుతూ జాబ్ చేస్తూ ఉమెన్స్ హాస్టల్‌లో ఉండిన మహిళలకు ప్రాధాన్యత 7416304118
FACULTY/ TEACHERS
గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలను ప్రచురించేందుకు ముందు తగిన రీతిలో క్షుణ్నంగా విచారించుకోవలసిందిగా పాఠకులను సూచించడమైనది. ప్రకటనలను చూసుకుని లేదా చేసుకుంటున్న క్రయవిక్రయాలకు ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ...

చదరంగం పోటీలు ప్రారంభం

విశాఖక్రీడలు, న్యూస్‌టుడే : శాప్ లీగ్స్ చదరంగం పోటీలు మంగళవారం గోపాలపట్నం ఇండోర్ స్టేడియంలో ప్రారంభమయ్యాయి. ముఖ్యఅతిథిగా హాజరైన జిల్లా క్రీడాభివృద్ధి అధికారిణి జూన్ గాల్లోయట్ మాట్లాడుతూ... ప్రతిభ చూపిన క్రీడాకారులు 21, 22 తేదీల్లో తిరుపతిలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. అండర్-13, -15, -17, -19 విభాగాల్లో మొత్తం 131 మంది బాల, బాలికలు పాల్గొని.. ఎత్తులకు పైఎత్తులు వేశారన్నారు. జిల్లా చెస్ సంఘం కార్యదర్శి మణికంఠ, ఎస్‌జీఎఫ్ అడ్మినిస్ట్రేటివ్ కార్యదర్శి యామిని తదితరులు పాల్గొన్నారు.

★ అండర్-13 బాలుర విభాగంలో కె.వినాయక్, నందనదత్తు, బాలికల విభాగంలో పి.కృష్ణవరుణ్య, ఎం.దివ్యదర్శిని, అండర్ -15 బాలుర విభాగంలో కె.హర్షవర్ధన్ యాదవ్, కె.ధీరజ్, బాలికల విభాగంలో ఎ.చైత్ర, కె.ఈషా ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచారు.

తలపడుతున్న క్రీడాకారులు

★ అండర్-17 బాలుర విభాగంలో కె.రితీష్, కె.యతేంద్ర తొలి రెండు స్థానాల్లో నిలవగా, బాలికల విభాగంలో జాగృతి కుమారి ప్రసాద్ ప్రథమ స్థానంలో నిలిచింది. ద్వితీయ స్థానంలో ఎవరూ అర్హత సాధించలేదు.

★ అండర్- 19 బాలుర విభాగంలో కె.శాంతినాథ్ ప్రథమ, కె.ఎ.కిరణ్ ద్వితీయ స్థానాలు సొంతం చేసుకున్నారు. బాలికల విభాగంలో ఎం.జె.జగదాంబ చంద్రహాసిని ప్రథమస్థానం సాధించింది. ద్వితీయ స్థానంలో ఎవరూ అర్హత సాధించలేదు.

విద్యుత్తు వినియోగం, వ్యయాల తగ్గింపే లక్ష్యం

సీతంపేట, న్యూస్‌టుడే: విద్యుత్తు వినియోగం, వ్యయాల తగ్గింపే లక్ష్యంగా కృషి చేస్తున్నామని ఏపీఈపీడీసీఎల్ సీఎండీ ఇమ్మడి పృథ్వీతేజ్ తెలిపారు. విద్యుత్తు సరఫరాలో వ్యయాలను తగ్గించడంతో పాటు స్థిరమైన గ్రిడ్ నిర్వహణ లక్ష్యంగా 'ఎనర్జీ కాస్ట్ సేవింగ్స్ - డిమాండ్ రెస్పాన్స్'పై ఐఐటీ మద్రాస్‌లోని అంకుర సంస్థ ఎలిమెంట్స్ ఎనర్జీ ఆధ్వర్యంలో ఈపీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయంలో సోమవారం కార్యశాల నిర్వహించారు. ఈ సందర్భంగా ఈపీడీసీఎల్ డైరెక్టర్(ఆపరేషన్స్) టి.వి.సూర్యప్రకాశ్, ఎలిమెంట్స్ ఎనర్జీ ఫౌండర్ ఆన్సన్ సాండోతో కలిసి సీఎండీ పృథ్వీతేజ్ మాట్లాడారు. విద్యుత్తు వినియోగంపై అవగాహన కల్పించేందుకు ఎలిమెంట్స్ ఎనర్జీ సహకారంతో ప్రజలకు అవగాహన కల్పించనున్నామన్నారు. స్మార్ట్‌మీటర్ల ఏర్పాటు, పీక్ టారిఫ్ సమయాల్లో విద్యుత్తు వినియోగాన్ని తగ్గించి, ఆఫ్ పీక్ లేదా సాధారణ టారిఫ్ సమయాలకు మార్చడం ద్వారా వినియోగదారులు తమ విద్యుత్తు బిల్లులను గణనీయంగా తగ్గించుకోవచ్చునన్నారు. వినియోగదారుల కోసం ప్రత్యేకంగా రూపొందించిన ఈ వినూత్న కార్యక్రమం ద్వారా విద్యుత్తు వినియోగాన్ని మరింత సమర్థంగా నిర్వహించుకునే అవకాశం ఉంటుందన్నారు.

మాట్లాడుతున్న ఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్, చిత్రంలో ఆన్సన్ సాండో, టి.వి.సూర్యప్రకాశ్

వన్యప్రాణుల సంరక్షణ అందరి బాధ్యత

ఎండాడ, న్యూస్‌టుడే: వన్య ప్రాణులను రక్షించే బాధ్యత అందరిపై ఉందని సీసీఎఫ్ మహ్మద్ దివాన్ మైథీన్ తెలిపారు. 'హనుమాన్' కార్యక్రమంలో భాగంగా కంబాలకొండ ఎకో టూరిజం పార్కులో ఉన్న యోగా సెంటర్‌లో మంగళవారం విశాఖ అటవీ రేంజ్ అధికారులు, సిబ్బంది, వైల్డ్‌లైఫ్ వాలంటీర్లకు కార్యశాల నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అటవీ ప్రాంతం నుంచి జనారణ్యంలోకి చేరిన వన్యప్రాణులను సంరక్షించడంతో పాటు వాటి నుంచి ప్రజలకు ఎలాంటి హాని కలగకుండా చర్యలు చేపట్టాలన్నారు. పుణెకు చెందిన రెస్క్యూ ఛారిటబుల్ ట్రస్టు ప్రతినిధి కిరణ్ తదితరులు మాట్లాడారు. కార్యక్రమంలో జూ క్యూరేటర్ జి.మంగమ్మ, వివిధ జిల్లాలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సీసీఎఫ్ మహ్మద్ దివాన్ మైథీన్, కార్యక్రమంలో పాల్గొన్న రేంజ్ అధికారులు, తదితరులు

'కనీస వేతనాలు చెల్లించాలి'

కార్పొరేషన్, న్యూస్‌టుడే : మున్సిపల్ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని గ్రేటర్ విశాఖ మున్సిపల్ ఎంప్లాయీస్ యూనియన్(సీఐటీయూ) గౌరవ అధ్యక్షుడు పి.వెంకటరెడ్డి కోరారు. మంగళవారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద కార్మికులు, సీఐటీయూ నాయకులు ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కార్మికులకు కనీస వేతనాలు చెల్లించాలని, బడ్జెట్‌లో ప్రత్యేకంగా నిధులు కేటాయించాలని కోరారు. కౌన్సిల్ తీర్మానం ప్రకారం నీటి సరఫరా కార్మికులకు పీఎఫ్, ఈఎస్ఐ, ఇతర ప్రయోజనాలు కల్పించాలని డిమాండ్ చేశారు.

ఆందోళనలో పాల్గొన్న సీఐటీయూ నాయకులు

పాల ధరలు తగ్గించాలని డిమాండ్

కార్పొరేషన్, న్యూస్‌టుడే : విశాఖ డెయిరీ యాజమాన్యం ఇటీవల పెంచిన పాల ధరలను వెంటనే తగ్గించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి జగ్గునాయుడు డిమాండ్ చేశారు. మంగళవారం పార్టీ ఆధ్వర్యంలో ఆర్టీసీ కాంప్లెక్స్ సమీప పైవంతెన వద్ద ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... డెయిరీ లాభాల్లో ఉన్నప్పటికీ, లీటర్ పాల ధరపై రూ.2 పెంచి వినియోగదారులపై భారం మోపడం తగదన్నారు. పాల ధర పెంపుతో ఇతర ఉత్పత్తుల ధరలు అమాంతం పెరుగుతాయన్నారు. ఆందోళనలో రైతు సంఘం నాయకులు నాయిని బాబు, పార్టీ నాయకులు ఆర్‌కేఎస్‌వీ.కుమార్, వి.కృష్ణారావు, బి.జగన్, పద్మ, మణి తదితరులు పాల్గొన్నారు.

నినాదాలు చేస్తున్న సీపీఎం నాయకులు

చికెన్ ధరలు

(కిలోకి - రూ.లలో)

	వెన్‌కాబ్	బ్యాగ్
ఫారం గేటు	115	110
లైవ్	142	130
డ్రెస్డ్	206	230
స్కిన్‌లెస్	234	240

పెందుర్తి

తెరపై ఈనాడు
లక్ష్మీకాంత్ స్క్రీన్-1: ఫంకీ
స్క్రీన్-2: మన శంకర వరప్రసాద్ గారు

అడివివరం పైడితల్లమ్మ పరస రేపు

అడివివరం (సింహాచలం), న్యూస్‌టుడే: సింహాద్రి అప్పన్న స్వామి సోదరీమణి, అడివివరం గ్రామ దేవత శ్రీపైడితల్లి అమ్మవారి పరస మహోత్సవం గురువారం ఘనంగా నిర్వహించనున్నట్లు ఈవో జె.వెంకటరావు తెలిపారు. ఆ రోజు ఉదయం నుంచి అమ్మవారికి విశేష పూజలు జరుగుతాయని వివరించారు. భక్తులకు ఇబ్బంది లేకుండా దర్శనాలు కల్పించేందుకు క్యూలైన్లు, తాగునీరు, ప్రసాద వితరణ, ఇతర సదుపాయాలు కల్పించనున్నట్లు పేర్కొన్నారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

వైభవంగా అమావాస్య తిరువీధి

సింహాచలం, న్యూస్‌టుడే: అమావాస్య తిథిని పురస్కరించుకుని మంగళవారం సాయంత్రం సింహగిరిపై అప్పన్న స్వామి తిరువీధి వేడుకగా జరిగింది. అర్చకులు దేవేరుల సమేతుడైన గోవిందరాజ స్వామిని పట్టు పీతాంబరాలు, ఆభరణాలతో అలంకరించి పల్లకిలో కొలువుదీర్చారు. పండితుల వేద పారాయణలు, నాదస్వర మంగళవాయిద్యాల నడుమ సింహగిరి మాడవీధుల్లో దేవతామూర్తుల తిరువీధి శోభాయమానంగా జరిగింది. భక్తజనం స్వామిని దర్శించుకుని గోవింద నామస్మరణ చేశారు.

మేమున్నాం.. మీకు తోడుగా

80085 74978 సమయం: ఉ॥ 10 నుంచి మ॥ ఒంటి గంట మధ్య

సబ్బవరం, న్యూస్‌టుడే: ?: సాయినగర్ ఎస్సీ కాలనీలో వ్యర్థాలు పేరుకుపోయి దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నాం. –ఎం.శంకరరావు ✓: వెంటనే పరిశీలించి చర్యలు తీసుకుంటాం. –పి.ఆనందరావు, గ్రామ కార్యదర్శి, సబ్బవరం

?: సబ్బవరం బాలికల వసతి గృహం సమీపంలో వ్యర్థాలు పేరుకుపోయి దోమల బెడద వెంటాడుతోంది. –పి.నారాయణరావు ✓: క్షేత్ర స్థాయిలో పరిశీలించి సమస్య పరిష్కరిస్తాం. –డి.ప్రసాదరావు, సర్పంచి, సబ్బవరం

వేపగుంట, న్యూస్‌టుడే : ?: సాయిదుర్గానగర్ కాలువల్లో చెత్త పేరుకుపోయింది. –రామారావు, వెంకటరావు, స్థానికులు ✓: వెంటనే సిబ్బందితో వ్యర్థాలు తీయించి సమస్య పరిష్కరిస్తాం. –వెంకటస్వామి, శానిటరీ ఇన్‌స్పెక్టర్

పరవాడ, న్యూస్‌టుడే: ?: పరవాడ మండల పరిషత్తు కార్యాలయ కూడలి సమీప రహదారి అంచులు ప్రమాదకరంగా మారాయి. –అప్పారావు, పరవాడ. ✓: మీప్రాంత సమస్యను పరిష్కరించడానికి చర్యలు చేపడతాం. –లలిత, ఏఈ, ఆర్‌అండ్‌బి, పరవాడ.

గ్రామాల్లో సౌర వెలుగులు

ఎన్టీపీసీ నిధులతో 71 సోలార్ దీపాల ఏర్పాటు

వాడచీపురుపల్లిలో ఏర్పాటు చేసిన సౌర దీపం

పరవాడ, న్యూస్‌టుడే: పరవాడ సింహాద్రి ఎన్టీపీసీ యాజమాన్యం నిర్వాసిత గ్రామాల్లో సౌర విద్యుత్తు స్తంభాలు ఏర్పాటు చేస్తోంది. గ్రామాల్లోని ముఖ్యమైన ప్రదేశాల్లో ప్రజలకు, వాహనదారులకు రాత్రి వేళ రాకపోకలకు ఇబ్బంది లేకుండా వీటిని సిద్ధం చేస్తున్నారు. సంస్థ సామాజిక బాధ్యత(సీఎస్ఆర్) కార్యక్రమంలో భాగంగా నిర్వాసిత గ్రామాల్లో దశలవారీగా వీటిని ఏర్పాటు చేస్తున్నారు. ప్రస్తుతం సంస్థ సీఎస్ఆర్ నిధులు రూ.40లక్షలు వెచ్చించి కలపాక పంచాయతీలో 35, ముత్యాలమ్మపాలెంలో 10, వెన్నెలపాలెంలో 11, వాడచీపురుపల్లిలో 15 చొప్పున మొత్తం 71 దీపాలు అందుబాటులోకి తెచ్చారు. నెడ్‌క్యాప్ ద్వారా 20వాట్స్ సామర్థ్యం గల సౌర దీపాల పనులు దాదాపు పూర్తి కావడంతో గ్రామాల్లో రాత్రి వేళ వెలుగులు విరబూస్తున్నాయి. గతంలో వాడచీపురుపల్లి, ముత్యాలమ్మపాలెం, వెన్నెలపాలెం, నాయుడుపాలెం, పరవాడ, రావాడ, తిక్కవానిపాలెంలలో 350 సోలార్ దీపాలు ఏర్పాటు చేశారు.

మరోచోట పరికరాలు అమర్చుతున్న సిబ్బంది

చీకటిగా ఉండే ప్రాంతాల్లో..

ముఖ్యంగా వీధిదీపాలు లేకుండా చీకటిగా ఉన్న ప్రాంతాల్లో వీటిని ఏర్పాటు చేశారు. ముఖ్యంగా శ్మశానవాటికలు, రోడ్డు మలుపులు, రైతులు పొలాలకు వెళ్లే మార్గం, ఆలయాల వద్ద విద్యుత్తుదీపాలు లేని చోట్ల, శివారు గ్రామాల్లో వీటిని ఏర్పాటు చేశారు. తొలుత గొయ్యి తవ్వి అందులో స్తంభం నిలబెట్టి సిమెంట్ కాంక్రీటు వేస్తున్నారు. తర్వాత దానిపై సోలార్‌ప్యానల్, ఎల్ఈడీ దీపం బిగించారు. సాయంత్రం చీకటి పడే సమయంలో సోలార్ లైటు వెలిగి, ఉదయం ఆటోమేటిక్‌గా ఆరిపోతుంది. ఈ దీపాలు ఏర్పాటు చేయడంతో ఇప్పటివరకు చీకటిగా ఉన్న ప్రాంతాల్లో వెలుగులు రావడంతో స్థానికులు రాత్రి వేళ సులువుగా రాకపోకలు చేసేందుకు మార్గం సుగమం అయింది.

ప్రయోజనాలేమిటంటే..

సాధారణ దీపాలతో పోల్చుకుంటే సోలార్ దీపాల మన్నిక ఎక్కువగా ఉండి నిర్వహణ భారం తక్కువగా ఉంటుంది. పంచాయతీలకు ముఖ్యంగా విద్యుత్తు బిల్లుల భారం నుంచి ఉపశమనం పొందవచ్చు * వీటిని ఎక్కడైనా ఏర్పాటు చేసుకోవచ్చు. విద్యుత్తు తీగల అవసరం ఉండదు. సాయంత్రం నుంచి ఉదయం వరకు నిరంతరం వెలుగుతాయి. కాలుష్యం సమస్య ఉండదు. గ్రామాల్లో సౌర వెలుగులకు ప్రాధాన్యమిస్తూ దశల వారీగా వీటిని ఏర్పాటు చేస్తున్నామని మున్ముందు గ్రామాల్లో మరిన్ని సోలార్ ఎల్ఈడీ దీపాలు ఏర్పాటు చేస్తామని ఎన్టీపీసీ సీఎస్ఆర్ విభాగ ప్రతినిధి ప్రకాశరావు పేర్కొన్నారు.

ఏయూలో విద్యార్థులు, వాలంటీర్ల ఘర్షణ

ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే: ఆంధ్ర విశ్వవిద్యాలయంలో మంగళవారం సాయంత్రం విద్యార్థులు, వాలంటీర్ల మధ్య వివాదం చోటుచేసుకుంది. ఆ వివరాలిలా..సాయంత్రం ఆరున్నర గంటల సమయంలో బాస్కెట్ బాల్ మైదానంలో ఆర్.ఎస్.ఎస్. వాలంటీర్లు 12 మంది కవాతు చేస్తుండగా ఎస్.ఎఫ్.ఐ విద్యార్థులు వచ్చి అడ్డుకున్నారు. దాంతో ఇరు వర్గాల మధ్య వివాదం చోటు చేసుకుంది. విషయం తెలుసుకున్న ఏయూ సెక్యూరిటీ డీన్ ఇమ్మానియేల్ రాజు సిబ్బందితో వెళ్లి వారిని చెదరగొట్టి పంపించేశారు. తర్వాత రాత్రి 7.30 గంటల సమయంలో ఇరువర్గాలు మళ్లీ వాగ్వాదానికి దిగాయి. ఆ సమయంలో సుమారు 2 వందల మంది విద్యార్థులు అక్కడకు చేరుకోగా.. ఇరువర్గాల మధ్య తోపులాట జరిగి కొందరు స్వల్పంగా గాయపడినట్లు తెలిసింది. వీసీ సూచన మేరకు మూడో పట్టణ పోలీసుల జోక్యంతో గొడవ సద్దుమణిగిందని ఏయూ వర్గాలు తెలిపాయి. ★ ఈ ఘటనపై రాష్ట్ర భాజపా అధ్యక్షుడు పి.వి.ఎన్. మాధవ్ ఓ ప్రకటనలో తీవ్రంగా స్పందించారు. ఆర్.ఎస్.ఎస్. ఒక జాతీయ వాద సంస్థ అని, ఆ సంస్థకు చెందిన సేవక్‌లపై దాడిని ఖండిస్తూ బాధ్యులను అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.

జాతీయ వీల్‌ఛైర్ క్రికెట్ టోర్నీ గోడపత్రిక ఆవిష్కరణ

గోడ పత్రిక ఆవిష్కరిస్తున్న ఏసీఏ అధ్యక్షుడు, ఎంపీ శివనాథ్, సూర్యనారాయణ తదితరులు

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: విశాఖపట్నంలోని గుల్లేపల్లి స్పోర్ట్స్ మైదానంలో ఈ నెల 23 నుంచి 28వ తేదీ వరకు నిర్వహించే 5వ జాతీయ స్థాయి వీల్‌ఛైర్ క్రికెట్ టోర్నీ గోడ పత్రికను ఆంధ్రా క్రికెట్ సంఘం అధ్యక్షుడు, ఎంపీ కేశినేని శివనాథ్ మంగళవారం విజయవాడ గురునానక్ కాలనీలోని తన కార్యాలయంలో ఆవిష్కరించారు. టోర్నీ నిర్వాహకుడు యడ్లపల్లి సూర్యనారాయణ, ఆంధ్రా దివ్యాంగుల క్రికెట్ సంఘం సభ్యులు మేక శ్రీనివాసరావు, కె.సురేష్ తదితరులు పాల్గొన్నారు.

విధి నిర్వహణలో అలసత్వం వద్దు

సింహాచలం, న్యూస్‌టుడే: దేవస్థానం వివిధ విభాగాల అధికారులు, సిబ్బంది విధి నిర్వహణలో అలసత్వం వీడాలని ఈవో జె. వెంకటరావు ఆదేశించారు. మంగళవారం ఆయన కొండ దిగువన వివిధ ప్రాంతాల్లో పర్యటించారు. సింహాచలం దేవస్థానం సంస్కృత [illegible] పాఠశాలను సందర్శించి బోధన, వసతులు, ఇతర సదుపాయాలపై ఆరా తీశారు. విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనం బస్టాండ్ ఆవరణలోని భవనంలో తయారు చేయడంపై అసహనం వ్యక్తం చేశారు. పాఠశాల ఆవరణలోనే వంటలు జరిగేలా వంట గది ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. గ్యారేజిని పరిశీలించి బస్సుల నిర్వహణ తీరుపై ఆరా తీశారు. మరమ్మతుకు గురైన బస్సును రెండు రోజుల్లో బాగు చేయించడంతో పాటు కాలం చెల్లిన వాహనాలను వేలం వేసే చర్యలు వేగవంతం చేయాలని ఆదేశించారు. వేంకటేశ్వర స్వామి ఆలయానికి వచ్చే భక్తులకు అసౌకర్యం లేకుండా చూడాలన్నారు. పలుచోట్ల ఆలయ మార్గం తెలిసేలా సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. ఈవో వెంట ఏఈవో రమణమూర్తి, రవాణా విభాగం ఏఈ గోవర్ధన్, పలువురు విభాగాధిపతులు పాల్గొన్నారు.

బస్సుల నిర్వహణపై ఆరా తీస్తున్న సింహాచలం ఈవో వెంకటరావు

ఎట్టకేలకు 'మార్గం' సుగమం

సబ్బవరం, న్యూస్‌టుడే: అసకపల్లి-లంకెలపాలెం రహదారిపై వైకాపా హయాంలో ప్రయాణికులు, వాహన చోదకులు రాకపోకలకు నిత్యం ఇబ్బందులకు గురయ్యేవారు. కీలకమైన రహదారికి తక్షణ మరమ్మతులు చేపట్టాలని పలుమార్లు వినతులిచ్చినా ఎవరూ పట్టించుకోలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు కృషి మేరకు రూ.2.50 కోట్ల నిధులు మంజూరయ్యాయి. సంబంధిత నిధులతో బీటీ లేయర్ వేయించి రహదారి రూపురేఖలు మార్చడంతో ప్రయాణికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

నులిపురుగుల నివారణ మాత్రల పంపిణీ

పరవాడ, న్యూస్‌టుడే: నులిపురుగుల రహిత సమాజ స్థాపనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ అన్నారు. నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా పరవాడ జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. అనంతరం కలెక్టర్‌తోపాటు డీఎంహెచ్‌వో హైమావతి బాలికలతో ఆల్బెండజోల్ మాత్రలు మింగించారు. స్టేట్ నోడల్ అధికారి నిర్మల గ్లోరి, డీఈవో అప్పారావునాయుడు, డాక్టర్ రంజిత్, శాంతి, ఎన్జీవో రాజు, హారిక, జయశ్రీ, కొప్పా, ఎంతమంది పాల్గొన్నారు. ★ లంకెలపాలెం జడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు వార్డు కార్పొరేటర్ రౌతు శ్రీనివాసరావు మాత్రలు వేశారు. ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు. ★ వాడచీపురుపల్లి పీహెచ్‌సీ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో, పాఠశాలల్లో చిన్నారులకు పీహెచ్‌సీ వైద్యాధికారి కనక దుర్గ ఆధ్వర్యంలో ఈ మాత్రలు వేశారు. పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థినికి మాత్రలు వేస్తున్న కలెక్టర్ విజయకృష్ణన్

వేపగుంట, న్యూస్‌టుడే: 94వ వార్డు పరిధి వేపగుంట జడ్పీ పాఠశాలలో కార్పొరేటర్ బల్ల శ్రీనివాసరావు, జిల్లా అదనపు వైద్యాధికారి ఆర్. రమేశ్, పాఠశాల ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయుడు సింహాచలం నాయుడు విద్యార్థులకు నులి పురుగుల నివారణ మాత్రలు వేశారు. ఆరోగ్య సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. 93వ వార్డు పరిధి గొల్లనారాయణపురంలో యూపీహెచ్‌సీ వైద్యాధికారిణి జి.ఎస్. సింధూజ, ప్రధానోపాధ్యాయిని కనక రత్నం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. తినడానికి ముందు ప్రతి ఒక్కరూ చేతులు శుభ్రం చేసుకోవాలని సూచించారు. ఏఎన్ఎం, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు

వేపగుంట జడ్పీ పాఠశాలలో..

సబ్బవరం పీహెచ్‌సీ పరిధిలో..

సబ్బవరం, న్యూస్‌టుడే: సబ్బవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో, ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల్లోని విద్యార్థులకు ఈ మాత్రలు వేశారు. సబ్బవరంలోని డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో డీవో చంద్రశేఖర్ దేవ్ విద్యార్థులకు ఈ మాత్రలు వేశారు. మండలంలో మొత్తం 13,339 మందికి ఈ మాత్రలు వేయాల్సి ఉండగా 12,918 మందికి పంపిణీ చేసినట్లు సబ్బవరం పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ చక్రవర్తి పేర్కొన్నారు. ఎంపీడీవో పి. పద్మజ, ఎంఈవో రవీంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్యసేవలు అందించాలి

పీహెచ్‌సీ వద్ద ఓ రోగి ఆరోగ్య పరిస్థితిపై వివరాలు తెలుసుకుంటున్న డీఎంహెచ్‌వో హైమావతి

వాడచీపురుపల్లి(పరవాడ), న్యూస్‌టుడే: పీహెచ్‌సీకి వచ్చే ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలని డీఎంహెచ్‌వో హైమావతి సూచించారు. పరవాడ మండలం వాడచీపురుపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ)ను మంగళవారం ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలోని దస్త్రాలను, పరిసరాలను, మందుల గదిని పరిశీలించారు. బయోమెట్రిక్ విధానాన్ని విధిగా పాటించాలని, రోగులకు మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. వైద్యులు అప్పారావు, ఫాతిమాబేగంతో మాట్లాడి పీహెచ్‌సీ వివరాలు తెలుసుకున్నారు. నులిపురుగుల నివారణ మాత్రలు విద్యార్థులందరికీ వేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

నిర్వహణ కొరవడి.. అధ్వానంగా మారి..

96వ వార్డులో దయనీయంగా పార్కులు

పెందుర్తి, న్యూస్‌టుడే: పెందుర్తి జోన్ పరిధిలోని పలు పార్కులను యంత్రాంగం సక్రమంగా నిర్వహించకపోవడంతో దయనీయంగా మారుతున్నాయి. ★ 96వ వార్డు పెందుర్తిలోని సాయి దివ్యనగర్‌లో పార్కు స్థలం నిరాదరణకు గురైంది. ఈ పార్కులో ఒక బోరు, కూర్చునేందుకు బెంచీలున్నాయి. పార్కు చుట్టూ ఎలాంటి రక్షణ గోడ, కంచె లేకపోవడంతో పశువులు సంచరిస్తున్నాయి. ఎక్కడికక్కడ మురుగు నిలిచిపోయి పరిసరాలు అపరిశుభ్రంగా మారాయి. ఆదివారాలు, సెలవు రోజుల్లో యువత ఈ ప్రాంగణంలో క్రికెట్ ఆడుతుంటారు. వినాయక చవితి వంటి ఉత్సవాలు నిర్వహిస్తారు.

ప్రశాంతినగర్‌లో తుప్పు పట్టిన పిల్లల ఆట వస్తువులు

పెందుర్తి సాయిదివ్యనగర్‌లో ఇలా..

ఫోకస్

★ పెందుర్తి ప్రశాంతినగర్‌లోని పార్కు పూర్తిగా నిర్వహణ లోపంతో ఉంది. రక్షణ గోడ లేదు. గతంలో ఏర్పాటు చేసిన పిల్లల ఆట వస్తువులు తుప్పు పట్టి శిథిలావస్థకు చేరి ప్రస్తుతం వినియోగానికి అనుకూలంగా లేవు.

★ ప్రశాంతినగర్ పోర్టు కల్యాణ మండపం పక్కనే ఉన్న మరో పార్కు పూర్తిగా తుప్పలతో నిండిపోయింది. పిచ్చిమొక్కలు, అపరిశుభ్ర పరిసరాలు నెలకొన్నాయి. పాముల సంచారం అధికంగా ఉందని నివాసితులు వాపోతున్నారు. పార్కులో బెంచీలున్నా నిరుపయోగంగా మారాయి. ★ ఆయా పార్కులకు ప్రహరీలు నిర్మించి స్థలాలు కబ్జాకు గురి కాకుండా కాపాడాల్సి ఉంది. అలాగే పిల్లలు, యువత ఆటలాడుకునేందుకు వీలుగా చర్యలు చేపడితే ప్రయోజనకరంగా ఉంటుందని పలువురు అభిప్రాయపడుతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు ఆ దిశగా కృషి చేయాలని కోరుతున్నారు.

పోర్టు కల్యాణ మండపం వద్ద..

ఘనంగా ఐబీఎస్‌సీ వార్షికోత్సవం

మాట్లాడుతున్న మెడ్‌టెక్‌జోన్ సీఈవో డాక్టర్ జితేంద్రశర్మ

పరవాడ, న్యూస్‌టుడే: పరిశ్రమలు, విద్యాసంస్థలను అనుసంధానం చేసేందుకు విశాఖ మెడ్‌టెక్ జోన్‌లో ఇన్నోవేషన్ అండ్ బయోమెడికల్ స్కిల్ సెంటర్ (ఐబీఎస్‌సీ)ను ఏర్పాటు చేసి ఎనిమిదేళ్లు పూర్తయింది. ఈ నేపథ్యంలో మెడ్‌టెక్ జోన్‌లో నిర్వహించిన ఐబీఎస్‌సీ వార్షికోత్సవంలో మెడ్‌టెక్ జోన్ సీఈవో డాక్టర్ జితేంద్రశర్మ ముఖ్యఅతిథిగా ప్రసంగించారు. ఐబీఎస్‌సీ దేశ వ్యాప్తంగా 133కి పైగా విశ్వవిద్యాలయాలు, సంస్థలతో భాగస్వామ్యం ఏర్పరచుకుందన్నారు. తాజాగా మరో 72 సంస్థలతో అవగాహన ఒప్పందాలు(ఎంవోయూ) చేసుకుందన్నారు. భారత్‌లో మెడ్‌టెక్, బయోమెడికల్ రంగంలో మానవ వనరులను తీర్చిదిద్దేందుకు వీలుగా గత ఎనిమిదేళ్లలో ఈ కేంద్రం ద్వారా 10వేల మందికి శిక్షణ ఇచ్చారన్నారు. నిపుణులు, వైద్య పరికరాల తయారీదారుల నిమిత్తం 65కిపైగా నైపుణ్య శిక్షణ కార్యక్రమాలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ఐబీఎస్‌సీ కార్యనిర్వాహక డైరెక్టర్ నరేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తరాంధ్ర బీసీ సంక్షేమ సంఘం యువజన అధ్యక్షుడిగా సంతోష్

సీతంపేట, న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర యువజన అధ్యక్షుడిగా తేజ సంతోష్ నియమితులయ్యారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు చేతులమీదుగా ఇటీవల అమరావతిలో నిర్వహించిన కార్యక్రమంలో నియామక ఉత్తర్వులు అందుకున్నారు. నగరంలోని జిల్లా కార్యాలయంలో మంగళవారం సంతోష్ మీడియా సమావేశం నిర్వహించి మాట్లాడారు. బీసీ సంక్షేమ సంఘాన్ని ఉత్తరాంధ్రలో బలోపేతం చేయడమే లక్ష్యంగా పని చేస్తానన్నారు. కార్యక్రమంలో పలువురు సంఘం నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా పోలమాంబ పండగ

పరవాడ, న్యూస్‌టుడే: పరవాడ మండలం ఈ.భోనంగి ఫార్మాసిటీ పునరావాసకాలనీ ప్రజల ఆరాధ్యదేవత శ్రీపోలమాంబ అమ్మవారి పండగను మంగళవారం ఘనంగా నిర్వహించారు. భక్తులు ఉదయం నుంచే అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. సర్పంచి బొద్దపు శ్రీనివాసరావు, ఆలయ కమిటీ ఛైర్మన్ బుగిడి రామగోవిందరావు, నాయకులు మేడశెట్టి అప్పారావు, మేడశెట్టి బాలాజీనాయుడు, బొండా శ్రీను, చందక గోవిందు, చందక కృష్ణ తదితరులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయం వద్ద భక్తులకు ప్రసాద వితరణ చేపట్టారు. సాయంత్రం అమ్మవారి ఘటాలను మేళతాళాలు, బాణసంచా కాల్పుల నడుమ పురవీధుల్లో ఊరేగించి అనంతరం అనుపోత్సవం నిర్వహించారు. రాత్రి 8గంటల నుంచి సాంస్కృతిక ప్రదర్శనలు జరిగాయి. ఉత్సవకమిటీ ప్రతినిధులు, నిర్వాహకులు పాల్గొన్నారు.

భక్తుల పూజలందుకున్న అమ్మవారు

నూరు శాతం ఉత్తీర్ణతకు కృషి చేయాలి

మాట్లాడుతున్న ఎంపీడీవో పద్మజ

సబ్బవరం, న్యూస్‌టుడే: ఈ ఏడాది పదో తరగతి పరీక్షల్లో నూరు శాతం ఉత్తీర్ణత సాధించేందుకు ఉపాధ్యాయులంతా కృషి చేయాలని సబ్బవరం ఎంపీడీవో పి.పద్మజ సూచించారు. ఆమె మంగళవారం సబ్బవరం మండలం ఆరిపాక జెడ్పీ హైస్కూలును సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. ఎస్.ఎస్.సి. పరీక్షలు మార్చి 16 నుంచి జరగనున్నందున విద్యార్థులు సమయాన్ని వృథా చేయకుండా ప్రణాళికాబద్ధంగా చదువుకోవాలన్నారు. అనంతరం ఆమె మధ్యాహ్న భోజన పదార్థాలను పరిశీలించారు. ఎంఈవో రవీంద్రబాబు, స్కూల్ కమిటీ ఛైర్మన్ మళ్ల యోగి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

న్యాయం చేయాలని ఆందోళన

వన్‌టౌన్, న్యూస్‌టుడే: న్యాయం చేయాలని కోరుతూ బాధిత కుటుంబం ఆందోళన నిర్వహించింది. ఆ వివరాలు...వేపగుంట ప్రాంతానికి చెందిన కె.వెంకట్రావు(65) ఈనెల 14న రోడ్డు ప్రమాదంలో గాయపడడంతో గోపాలపట్నంలోని ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించారు. 16వ తేదీన బాధితుడికి శస్త్రచికిత్స చేయగా, మృతి చెందాడు. ఆసుపత్రి యాజమాన్యం, వైద్యుల నిర్లక్ష్యంతోనే వెంకట్రావు మృతి చెందాడని ఆరోపిస్తూ కుటుంబీకులు ఆందోళన చేశారు. మంగళవారం కేజీహెచ్‌లో మృతదేహానికి శవపరీక్ష పూర్తి చేశారు. ఈ విషయాన్ని కలెక్టర్ హరేంధిరప్రసాద్ దృష్టికి తీసుకెళ్లామని, సంబంధిత ఆసుపత్రిపై విచారణకు ఆదేశించారని మృతుడి కుమారుడు శ్యామ్‌ప్రసాద్ తెలిపారు.

విద్యార్థులకు అవగాహన

సబ్బవరం, న్యూస్‌టుడే: విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సబ్బవరం సీఐ రామచంద్రరావు అన్నారు. సబ్బవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో, డిఫెన్స్ అకాడమీలో మంగళవారం జరిగిన వేర్వేరు కార్యక్రమాల్లో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా వాహనాలు నడిపేటప్పుడు తీసుకోవలసిన జాగ్రత్తలు, పాటించాల్సిన నిబంధనలు వివరించారు. అనంతరం మత్తు పదార్థాలకు దూరంగా ఉంటానని, నిబంధనలు పాటిస్తూ వాహనాలు నడుపుతామని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు.

మాట్లాడుతున్న సీఐ రామచంద్రరావు

వేంకటాద్రిపై నేటి నుంచి ఫాల్గుణ పక్షోత్సవాలు

మహాలక్ష్మి అమ్మవారు

పెందుర్తి, న్యూస్‌టుడే: వేంకటాద్రిపై శ్రీనివాసుడి సన్నిధిలో కొలువైన మహాలక్ష్మి అమ్మవారి తిరునక్షత్రాన్ని పురస్కరించుకుని బుధవారం నుంచి ఫాల్గుణ పక్షోత్సవాలు వైభవోపేతంగా జరుగుతాయని ఆలయ ప్రధానార్చకులు మహర్షి రామానుజాచార్యులు తెలిపారు. మార్చి 3న ఫాల్గుణ పౌర్ణమి నాడు చేపట్టే మహాలక్ష్మి అమ్మవారి జయంతి వరకు ఈ వేడుకలు జరుగుతాయని వివరించారు. ఇందులో భాగంగా ప్రతిరోజు అమ్మవారి సన్నిధిలో శ్రీసూక్త సహిత కుంకుమార్చనలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. మార్చి 3న లక్ష్మీ హవనం, పూర్ణాహుతితో ఈ వేడుకలు పరిసమాప్తమవుతాయని తెలిపారు. భక్తులు ఈ వేడుకలను విజయవంతం చేయాలని కోరారు.

22 నుంచి పైడిమాంబ ఉత్సవాలు

గోడపత్రికలను ఆవిష్కరిస్తున్న గ్రామపెద్దలు, నాయకులు

పరవాడ, న్యూస్‌టుడే: పరవాడ పైడిమాంబ అమ్మవారి ఉత్సవాలు ఈనెల 22 నుంచి 24వ తేదీ వరకు మూడురోజుల పాటు ఘనంగా నిర్వహించనున్నారు. ఈమేరకు సంబంధిత గోడపత్రికలను పంచాయతీ కార్యాలయం వద్ద మంగళవారం సర్పంచి సిరిపురపు అప్పలనాయుడు, ఎంపీటీసీ సభ్యుడు పైలా శ్రీనివాసరావు, ఇతర నాయకులు చుక్క రామునాయుడు, పైలా సన్యాసిరావు చేతులమీదుగా ఆవిష్కరించారు. ఈ వేడుకల సందర్భంగా ఆయా రోజుల్లో ప్రతిరోజు రాత్రి పౌరాణిక, సాంఘిక నాటక ప్రదర్శనలు ఉంటాయన్నారు. ఈనెల 24న ఉదయం 4 గంటల నుంచి అమ్మవారి దర్శనాలు, సాయంత్రం అనుపోత్సవం ఉంటుందని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

పోలమాంబ తొలి ఘటాల వేడుక ప్రారంభం

దేశపాత్రునిపాలెం(పరవాడ), న్యూస్‌టుడే: జీవీఎంసీ 79వవార్డు దేశపాత్రునిపాలెంలో ఈనెల 24వ తేదీన జరగనున్న పోలమాంబ పండగ సందర్భంగా అమ్మవారి తొలిఘటాల వేడుక మంగళవారం రాత్రి ఘనంగా ప్రారంభమైంది. మేళతాళాల నడుమ అమ్మవారి ఘటాలను గ్రామపురవీధుల్లో ఊరేగించారు. భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు. బాణసంచా వెలుగులు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో గ్రామపెద్దలు, ఉత్సవ, ఆలయ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

శ్రీనివాసుడి బ్రహ్మోత్సవాలకు వేళాయె..

నాయుడుతోట(వేపగుంట), న్యూస్‌టుడే: నాయుడుతోట సమీప రవినగర్ శేషాద్రి శిఖరంపై గల కల్యాణవేంకటేశ్వరస్వామి ఆలయంలో ఈనెల 19వతేదీ నుంచి 24వ తేదీ వరకు వైభవంగా నిర్వహించేందుకు దేవాదాయశాఖ అధికారులు, అర్చకులు ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా ఆలయాన్ని విద్యుద్దీపాలతో ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు. ఈనెల 19న సాయంత్రం 3 నుంచి 5 గంటల వరకు రవినగర్ పరిసర కాలనీల్లో స్వామివారి శోభాయాత్రతో వేడుకలు ప్రారంభిస్తారు. అనంతరం యాగశాల ప్రవేశాలు జరగనున్నాయి. ప్రతీరోజూ ఉదయం 5 గంటల నుంచి; సాయంత్రం 4 గంటల నుంచి పూజలు ప్రారంభమవుతాయని నిర్వాహకులు తెలిపారు.

కమనీయం నరహరి నిత్య కల్యాణం

సింహాచలం, న్యూస్‌టుడే: శ్రీవరాహలక్ష్మీ నృసింహ స్వామివారి నిత్య కల్యాణోత్సవం మంగళవారం సింహగిరిపై కమనీయంగా జరిగింది. అర్చకులు స్వామివారి ఉత్సవమూర్తి గోవిందరాజ స్వామిని దేవేరుల సమేతంగా అలంకరించి ఆలయ కల్యాణ మండపంలోని ఉత్సవ వేదికపై ఆసీనులను చేశారు. వేదమంత్రాలు, నాదస్వర మంగళవాయిద్యాల నడుమ దేవతామూర్తుల పరిణయ వేడుకను జరిపించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామిని సేవించారు.

(c) eenadu

భీమిలి

సినిమాలు
చిట్టివలస (తగరపువలస), న్యూస్‌టుడే
గణేశ్ - మన శంకర వరప్రసాద్ గారు
రాములమ్మ - భర్త మహాశయులకు విజ్ఞప్తి
తాతా - సీతా పయనం
సప్తగిరి - ఫంకీ

రాసపోలమ్మకు ప్రత్యేక అలంకరణ

చిట్టివలస(తగరపువలస), న్యూస్‌టుడే: భీమిలి మండలం మజ్జివలస గ్రామదేవత రాసపోలమ్మను గ్రామస్థులు మంగళవారం ప్రత్యేకంగా అలంకరించారు. తులసి, తెలుపు, ఎరుపు రంగుల పూల దండలతో ముస్తాబు చేశారు. పరిసర గ్రామాల ప్రజలు అమ్మవారిని దర్శించుకుని పూజలు, అభిషేకాలు నిర్వహించారు.

ప్లాస్టిక్ సంచుల విక్రేతలపై జరిమానా

భీమునిపట్నం, న్యూస్‌టుడే: భీమిలి పరిధిలో ప్రజారోగ్య అధికారులు మంగళవారం పలు దుకాణాల్లో విస్తృత తనిఖీలు నిర్వహించారు. నిషేధిత పాలిథీన్ సంచులను స్వాధీనం చేసుకున్నారు. భీమిలి జోన్ శానిటరీ సూపర్‌వైజర్ బి.ఎం. నాయుడు ఆధ్వర్యంలో సిబ్బంది కిరాణా, చికెన్ దుకాణాల్లో తనిఖీలు చేపట్టారు. 15 కేజీల పాలిథీన్ సంచులను స్వాధీనం చేసుకున్నారు. 10 మంది దుకాణదారులకు రూ.3,500 జరిమానా విధించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ జి.శివ, మేస్త్రీ ఆర్.రవి, శానిటేషన్ కార్యదర్శులు సురేష్, మనోజ్, త్రివేణి, ప్రసాద్ పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా

99122 22247 సమయం: ఉ॥ 10 నుంచి మ॥ ఒంటి గంట మధ్య

ఎండాడ, న్యూస్‌టుడే: ?: బేతని పాఠశాల (పీఎంపాలెం) పరిసరాల్లో విద్యుత్ దీపాలు వెలగడం లేదు. – శర్మ, పీఎంపాలెం ✓: విద్యుత్ దీపాలకు మరమ్మతులు చేపడతాం. – అన్నంనాయుడు, డీఈ.

?: మధురవాడ వంతెన కింద తరచూ ట్రాఫిక్ అంతరాయం ఏర్పడుతోంది. – కుమార్ ✓: ట్రాఫిక్ అంతరాయం లేకుండా చర్యలు తీసుకుంటాం. – పీఎంపాలెం ట్రాఫిక్ పోలీసులు

?: మారికవలస (మధురవాడ)లో పందుల బెడద తీవ్రంగా ఉంది. – బాబురావు, బక్కన్నపాలెం ✓: పందుల నివారణకు చర్యలు తీసుకుంటాం. – రాజారవికుమార్, ఆరోగ్య అధికారి.

?: ఆనందపురం పూల మార్కెట్ వెళ్లే దారిలో తీవ్ర ట్రాఫిక్ అంతరాయం ఏర్పడుతోంది. – స్థానికులు. ✓: ట్రాఫిక్ అంతరాయం లేకుండా చర్యలు చేపడతాం. – ఆనందపురం ట్రాఫిక్ పోలీసులు.

?: శాంతినగర్ (ఎండాడ) దారిలో నిత్యం వాహనాలను రోడ్డుపై నిలిపేస్తున్నారు. – ఎండాడ వాసులు ✓: పరిశీలించి చర్యలు తీసుకుంటాం. – ప్రభాకర్, సీఐ.

ప్రైవేటు లేఅవుట్‌కు రహదారి

అభివృద్ధి నిధుల మళ్లింపుపై విమర్శలు

భీమునిపట్నం, న్యూస్‌టుడే

ప్రధాన రహదారుల మరమ్మతులకు కేటాయించిన నిధులతో ప్రైవేటు లేఅవుట్‌లోని రోడ్డు మరమ్మతులకు ఉపయోగించడం పట్ల స్థానికంగా చర్చనీయాంశమవుతోంది. జీవీఎంసీ ఇంజినీరింగ్ అధికారుల అత్యుత్సాహం పలు సందేహాలకు తావిస్తోంది. భీమిలి జోన్‌లోని రెండో వార్డు పరిధిలోకి వచ్చే భీమిలి-తగరపువలస రోడ్డులో మినీ స్టేడియం పక్కన ఇటీవల ప్రైవేటు వ్యక్తులు ఏర్పాటు చేసిన లేఅవుట్‌లో 210 ప్లాట్లతో బహుళ అంతస్తుల నివాస సముదాయం నిర్మించారు. ప్రధాన రహదారి నుంచి ఇందులోకి వెళ్లేందుకు ఉన్న కిలోమీటరు పొడవైన రోడ్డు గుంతలమయంగా తయారైంది. అక్కడ ప్రజా వసతులను ఆయా సంస్థలు కొన్నేళ్ల పాటు చూడాలి. అయితే భీమిలి జోన్‌లోని రెండో వార్డుకు కేటాయించిన రూ.19.50 లక్షల నిధుల్లో కొంత మొత్తాన్ని ఈ ప్రైవేటు లేఅవుట్ రోడ్డుకు మళ్లించి సర్వాంగ సుందరంగా మరమ్మతులు చేశారు. ఎవరి బాగు కోసం ఈ పనులు చేపట్టాల్సి వచ్చిందని స్థానికులు ఆరోపిస్తున్నారు.

ప్రైవేటు లేఅవుట్‌లో రోడ్డుకు మరమ్మతులు ఇలా..

నమ్మివానిపేటలో దర్శనమిస్తున్న గోతులు

✦ భీమిలి జోన్ రెండో వార్డులో ప్రజలు వినియోగించే అనేక రోడ్లు గోతులమయంగా ఉన్నాయి. నమ్మివానిపేట, ఏత కుమ్మరిపాలెం రోడ్లపై ఎక్కడికక్కడ గుంతలతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. వీటికి మరమ్మతులు చేయాలని పలుమార్లు పీజీఆర్ఎస్‌లో వినతిపత్రాలు సమర్పించినా పట్టించుకోలేదు. ప్రస్తుతం ప్రైవేటు లేఅవుట్‌లోని 80 శాతం పైబడి నివాసితులకు జీవీఎంసీ ఇంకా ఆస్తి పన్ను విధించలేదు. అయినా ప్రైవేటు లేఅవుట్లలో నిధులు ఖర్చు చేస్తున్నారు. భీమిలి జోన్ పరిధిలో మిగిలిన ప్రాంతాల్లోనూ జరుగుతున్న పనుల్లో లోటుపాట్లను పరిశీలించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని స్థానికులు పేర్కొంటున్నారు.

భీమిలి జోన్ సమాచారం

వార్డు	కేటాయించిన నిధులు
1వ వార్డు	రూ.3.10 లక్షలు
2వ వార్డు	రూ.19.45 లక్షలు
3వ వార్డు	రూ.12.50 లక్షలు
4వ వార్డు	రూ.7.10 లక్షలు

★ **పరిశీలించి చర్యలు తీసుకుంటాం..:** ప్రజావసరాలకు విరుద్ధంగా ప్రైవేటు లేఅవుట్‌లో రోడ్డు మరమ్మతు పనులు జరిగినట్లు తేలితే సంబంధిత సిబ్బందిపై చర్యలు తీసుకుంటాం. కింది స్థాయి ఇంజినీరింగ్ సిబ్బంది చేసిన ప్రతిపాదనల మేరకు ఈ రోడ్డుకు నిధులు కేటాయించాం. క్షేత్రస్థాయిలో పరిశీలించి తప్పిదం జరిగితే ఇక్కడ జరిగిన పనులకు బిల్లులు నిలిపివేస్తాం. – వెంకటవాసు, కార్యనిర్వాహక ఇంజినీర్, పబ్లిక్ వర్క్స్ విభాగం జీవీఎంసీ భీమిలి జోన్

ఏయూలో విద్యార్థులు, వాలంటీర్ల ఘర్షణ

ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే: ఆంధ్ర విశ్వవిద్యాలయంలో మంగళవారం సాయంత్రం విద్యార్థులు, వాలంటీర్ల మధ్య వివాదం చోటుచేసుకుంది. ఆ వివరాలిలా..సాయంత్రం ఆరున్నర గంటల సమయంలో బాస్కెట్ బాల్ మైదానంలో ఆర్.ఎస్.ఎస్. వాలంటీర్లు 12 మంది కవాతు చేస్తుండగా ఎస్.ఎఫ్.ఐ విద్యార్థులు వచ్చి అడ్డుకున్నారు. దాంతో ఇరు వర్గాల మధ్య వివాదం చోటు చేసుకుంది. విషయం తెలుసుకున్న ఏయూ సెక్యూరిటీ డిప్యూటీ ఆఫీసర్ రాజు సిబ్బందితో వెళ్లి వారిని చెదరగొట్టి పంపించేశారు. తర్వాత రాత్రి 7.30 గంటల సమయంలో ఇరువర్గాలు మళ్లీ వాగ్వాదానికి దిగాయి. ఆ సమయంలో సుమారు 2 వందల మంది విద్యార్థులు అక్కడకు చేరుకోగా.. ఇరువర్గాల మధ్య తోపులాట జరిగి కొందరు స్వల్పంగా గాయపడినట్లు తెలిసింది. వీసీ సూచన మేరకు మూడో పట్టణ పోలీసుల జోక్యంతో గొడవ సద్దుమణిగిందని ఏయూ వర్గాలు తెలిపాయి. ● ఈ ఘటనపై ఏబీవీపీ అధ్యక్షుడు పి.వి.ఎస్. మాధవ్ ఓ ప్రకటనలో తీవ్రంగా స్పందించారు. ఆర్.ఎస్.ఎస్. ఒక జాతీయ వాద సంస్థ అని, ఆ సంస్థకు చెందిన 'సేవక్'లపై దాడికి [illegible] బాధ్యులను అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.

గెజిటెడ్ టీచర్ల సంఘం డైరీ ఆవిష్కరణ

భీమునిపట్నం, న్యూస్‌టుడే: భీమిలి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ కళాశాల గెజిటెడ్ టీచర్ల అసోసియేషన్ (ఏపీజీసీజీటీఏ)-2026 డైరీని ఆవిష్కరించారు. కళాశాల ప్రధానాచార్యులు డా.పి.సురేఖ చేతులమీదుగా డైరీని ఆవిష్కరించి అధ్యాపకులకు అందజేశారు. సంఘం జిల్లా అధ్యక్షుడు, భీమిలి డిగ్రీ కళాశాల ఉప ప్రధానాచార్యులు డా.సి.హెచ్.విష్ణుమూర్తి, ఇతర సీనియర్ అధ్యాపకులు ప్రసాదరావు, విద్యాసాగర్, సహదేవుడు పాల్గొన్నారు.

డైరీని ఆవిష్కరిస్తున్న ప్రధానాచార్యులు డా.సురేఖ, అధ్యాపకులు

పైపులైన్‌కు మరమ్మతులు

పద్మనాభం, న్యూస్‌టుడే: కృష్ణాపురం గ్రామంలో పైపులైను మరమ్మతులకు గురై తాగునీరు వృథాగా పోతోందని 'ఈనాడు'లో 'ప్రాణాధారం నేలపాలు' శీర్షికన వార్త ప్రచురితమైంది. స్పందించిన ఎంపీడీవో కె.రూపేష్ పంచాయతీ సిబ్బందికి ఆదేశాలిచ్చి మరమ్మతులు చేయించారు. దీనిపై స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

గొట్లపల్లి పాఠశాల డీఈవో సందర్శన

ఆనందపురం, న్యూస్‌టుడే: మండలంలోని గొట్లపల్లి ఉన్నత పాఠశాలను జిల్లా విద్యాశాఖ అధికారి ప్రేమకుమార్ మంగళవారం సందర్శించారు. పదో తరగతి విద్యార్థులకు జరుగుతున్న ప్రీ ఫైనల్ పరీక్ష నిర్వహణ విధానాన్ని పరిశీలించారు. అనంతరం విద్యార్థులకు పలు సూచనలు చేశారు. పాఠశాలలో ప్రభుత్వ కార్యక్రమాల అమలు తీరును పరిశీలించారు.

పరీక్షా పత్రాన్ని పరిశీలిస్తున్న డీఈవో ప్రేమకుమార్

కొనసాగుతున్న నిరసన

ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే: ఆంధ్ర విశ్వవిద్యాలయంలో అతిథి అధ్యాపకులు చేపట్టిన దీక్ష అయిదో రోజుకు చేరింది. వీరికి ఎస్.ఎఫ్.ఐ, ఎ.ఎస్.ఎఫ్.ఐ, సీఐటీయూ సభ్యులు మద్దతు తెలిపినట్లు సురేష్ మీనన్ తెలిపారు. ఏయూలో అతిథి అధ్యాపకులు శాంతియుతంగా పోరుబాట సాగిస్తున్నారని, వారి సమస్యలపై సానుకూలంగా స్పందించాలని వక్తలు కోరారు.

ఆట పరికరాల ఏర్పాటు

ఈనాడు కథనానికి స్పందన

కొమ్మాది, న్యూస్‌టుడే: కొమ్మాది చెరువు ప్రాంగణంలో వ్యాయామ శాలలో నిర్వహణ పట్టించుకోకపోవడంతో ఆట పరికరాలు నేలకూలాయని 'ఈనాడు'లో 'నిర్వహణ కొరవడి.. లక్ష్యం తరలింది' శీర్షికతో జీవీఎంసీ కథనం ప్రచురితమైంది. స్పందించిన సంబంధిత అధికారులు మరమ్మతులు చేపట్టడంతో పాటు చిన్నారులు ఆడుకునేందుకు కొత్త ఆట పరికరాలను ఏర్పాటు చేశారు. స్థానిక ప్రజలు వీటిని సక్రమంగా వినియోగించుకోవడంతో పాటు నిర్వహణ బాధ్యతను తీసుకోవాలని అధికారులు సూచించారు.

కొమ్మాది చెరువు ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఆట పరికరాలు

అభివృద్ధి పనులకు అంచనాలు

తగరపువలస, న్యూస్‌టుడే: జీవీఎంసీ ఒకటో వార్డు పరిధిలోని తగరపువలస రాజవీధి, రామవీధి, శ్రీనగర్ ప్రాంతాల్లో ఇంజినీరింగ్ అధికారులు మంగళవారం పర్యటించారు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు తెదేపా నాయకులతో కలిసి క్షేత్రస్థాయిలో రోడ్లు, కాలువలను పరిశీలించారు. పాడైన వాటిని బాగు చేయడానికి, కొత్తవి నిర్మించడానికి అంచనాలు రూపొందించారు. కార్యక్రమంలో పబ్లిక్ వర్క్స్ ఈఈ వెంకటవాసు, ఏఈ సురేష్, తెదేపా వార్డు అధ్యక్షుడు తమ్మిన సూరిబాబు, మాజీ కౌన్సిలర్లు, నాయకులు కొప్పల కృష్ణ, కోసూరి రాంబాబు, పందిరి నాని, గిడుతూరి పూర్ణ, దేవి, మధు, రామారావు పాల్గొన్నారు.

వార్డులో పర్యటిస్తున్న అధికారులు, నాయకులు

విధి నిర్వహణలో అలసత్వం వద్దు

సింహాచలం, న్యూస్‌టుడే: దేవస్థానం వివిధ విభాగాల అధికారులు, సిబ్బంది విధి నిర్వహణలో అలసత్వం వీడాలని ఈవో జె.వెంకటరావు ఆదేశించారు. మంగళవారం ఆయన కొండ దిగువన వివిధ ప్రాంతాల్లో పర్యటించారు. సింహాచలం దేవస్థానం సంస్కృతోన్నత పాఠశాలను సందర్శించి బోధన, వసతులు, ఇతర సదుపాయాలపై ఆరా తీశారు. విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనం బస్సులో ఆవరణలోని భవనంలో తయారు చేయడంపై అసహనం వ్యక్తం చేశారు. పాఠశాల ఆవరణలోనే వంటలు జరిగేలా వంట గది ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. గ్యారేజిని పరిశీలించి బస్సుల నిర్వహణ తీరుపై ఆరా తీశారు. మరమ్మతుకు గురైన బస్సును రెండు రోజుల్లో బాగు చేయించడంతో పాటు కాలం చెల్లిన వాహనాలను వేలం వేసే చర్యలు వేగవంతం చేయాలని ఆదేశించారు. వేంకటేశ్వర స్వామి ఆలయానికి వచ్చే భక్తులకు అసౌకర్యం లేకుండా చూడాలన్నారు. పలుచోట్ల ఆలయ మార్గం తెలిపేలా సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. ఈవో వెంట ఏఈవో రమణమూర్తి, రవాణా విభాగం ఏఈ గోవర్ధన్, పలువురు విభాగాధిపతులు పాల్గొన్నారు.

బస్సుల నిర్వహణపై ఆరా తీస్తున్న సింహాచలం ఈవో వెంకటరావు

'జేఈఈ మెయిన్'లో కె.కె.ఆర్ గౌతమ్ సత్తా

ఆనందపురం, న్యూస్‌టుడే: జేఈఈ మెయిన్ ఫలితాల్లో ఆనందపురం పరిధి కె.కె.ఆర్.గౌతమ్ విద్యాలయ విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించినట్లు ప్రిన్సిపల్ కె.వీరరావు మంగళవారం తెలిపారు. ఎల్.సత్యవివేక్ 99.93 పర్సంటైల్‌తో పాటు 81 మంది విద్యార్థులు 99.92 నుంచి 98 మధ్య పర్సంటైల్ వచ్చినట్లు పేర్కొన్నారు. విజేతలను అభినందించారు. కార్యక్రమంలో డీన్ కె.శేషుబాబు, కె.వెంకటరమణ మూర్తి, ఎ.వేణుగోపాలకృష్ణ పాల్గొన్నారు.

ఉత్తమ పర్సంటైల్ విద్యార్థులతో యాజమాన్యం

క్విజ్ పోటీల్లో ప్రతిభ

చిట్టివలస(తగరపువలస), న్యూస్‌టుడే: తగరపువలస-భీమిలి రోడ్డులోని మూలకుద్దు కేరళన్ పాఠశాల విద్యార్థులు ఎవర్‌స్టీల్ నిర్వహించిన సైన్స్ క్విజ్ పోటీల్లో విజయం సాధించారు. జిల్లా వ్యాప్తంగా పలు పాఠశాలల విద్యార్థులు పాల్గొన్న ఈ పోటీల్లో అవినాశ్ నంద (పదో తరగతి), అభినయ (తొమ్మిదో తరగతి), సొజాత (ఎనిమిదో తరగతి), షణ్ముఖ్‌సాయి, విష్ణువర్ధన్ (ఏడో తరగతి)లతో కూడిన బృందం ప్రథమస్థానాన్ని పొందింది. జాతీయ సైన్స్ దినోత్సవంలో భాగంగా నిర్వహించిన ఈ పోటీల్లో విజేతలకు వచ్చేనెల 2న బహుమతులను ప్రదానం చేయనున్నట్లు పాఠశాల అధినేత అలీవర్‌రాయ్, ప్రిన్సిపల్ తెలిపారు.

సాధన చేద్దాం.. మెరుగైన ఫలితాలు సాధిద్దాం

కొమ్మాది, న్యూస్‌టుడే: శత శాతం ఉత్తీర్ణతే ధ్యేయంగా పదోతరగతి విద్యార్థులపై విద్యాశాఖ ప్రత్యేక దృష్టి సారించింది. ఇందుకు వారిని సంసిద్ధులను చేయాలనే సంకల్పంతో వంద రోజుల ప్రణాళికను పకడ్బందీగా అమలు చేస్తోంది.

● వందరోజుల ప్రణాళికలో భాగంగా ప్రతి రోజు నిర్దేశించిన సబ్జెక్టుపై శ్రద్ధగా చదివించడం, సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు విద్యాశాఖ అందజేసిన ప్రశ్నాపత్రంతో పరీక్షలు నిర్వహించడం జరుగుతోంది. మార్కులను వెంటనే ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. తక్కువ మార్కులు వచ్చిన విద్యార్థులపై మరింత శ్రద్ధ పెట్టి ప్రత్యేక శిక్షణ అందిస్తున్నారు.

● తరగతులకు డుమ్మా కొడుతూ చదువులో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి రెసిడెన్షియల్ శిక్షణ ఇచ్చే ప్రక్రియను ఈ ఏడాది నుంచి చేపడుతున్నారు. ఇందుకు మూడు కేంద్రాలైన ఎంపీయూపీ పాఠశాల (సింహాచలం), ఏపీ గిరిజన గురుకుల ప్రతిభా పాఠశాల (శ్రీకృష్ణాపురం), మారికవలసలో ఉన్న ఏపీ గిరిజన గురుకుల ప్రతిభా పాఠశాలలో నిర్వహిస్తున్నారు. ఉచిత భోజనం, వసతి అందిస్తున్నారు. సబ్జెక్టుల వారీగా నిష్ణాతులైన ఉపాధ్యాయులతో శిక్షణ ఇస్తున్నారు.

వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ

మారికవలస రాజీవ్‌గృహకల్ప కాలనీలో విద్యార్థుల తల్లిదండ్రులకు సూచనలిస్తున్న డీఈవో ప్రేమకుమార్

● **ఇంటింటికీ వెళ్లి ఆరా..:** పదో తరగతి పరీక్షలకు గడువు సమీపిస్తుండటంతో సమయం సద్వినియోగంపై ఉపాధ్యాయులు బృందాలుగా వీడి వెళ్లి తల్లిదండ్రులు, విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నారు. డీఈవో ప్రేమకుమార్ ఆధ్వర్యంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు కలిసి సాయంత్రం విద్యార్థుల వద్దకు వెళ్లి ఏ విధంగా చదువుతున్నారో వారి తల్లిదండ్రులతో సమావేశమై సలహాలు, సూచనలు అందిస్తున్నారు.

● **తల్లితండ్రులకు సూచనలు ఇలా..:** పిల్లల మానసిక స్థితిగతుల్ని అర్థం చేసుకోవాలి. మృదువుగా, స్ఫూర్తిని కలిగించేలా మాట్లాడాలి. ఆరోగ్యకర ఆహారం ఇవ్వాలి. చదువుకునేందుకు అనువుగా ఇంట్లో ఆహ్లాదకర వాతావరణం కల్పించాలి. చదివే సమయం, వ్యాయామం, ఆహారం తదితరాలకు సంబంధించి తగిన సలహాలివ్వాలి. మార్కులపై ఒత్తిడి చేయకూడదు.

● మార్చి 16 నుంచి పరీక్షలు జరగనున్నాయి. సామర్థ్యాలకు అనుగుణంగా విద్యార్థులను విభజించి తర్ఫీదునిస్తున్నాం. అత్యధికంగా ట్రిపుల్ ఐటీ సీట్లు సాధించే దిశగా బోధిస్తున్నాం. మెరుగైన ఫలితాలు సాధిస్తాం.
– మొలుగు వెంకటరావు, ప్రధానోపాధ్యాయులు, చంద్రంపాలెం ఉన్నత పాఠశాల

కమనీయం నరహరి నిత్య కల్యాణం

సింహాచలం, న్యూస్‌టుడే: శ్రీవరాహలక్ష్మీ నృసింహ స్వామివారి నిత్య కల్యాణోత్సవం మంగళవారం సింహగిరిపై కమనీయంగా జరిగింది. అర్చకులు స్వామివారి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని దేవేరుల సమేతంగా అలంకరించి ఆలయ కల్యాణ మండపంలోని ఉత్సవ వేదికపై ఆశీనులను చేశారు. వేదమంత్రాలు, నాదస్వర మంగళవాయిద్యాల నడుమ దేవతామూర్తుల పరిణయ వేడుకను జరిపించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామిని సేవించారు. అర్చకులు వేదమంత్రాలతో ఆశీర్వదించి కల్యాణ తలంబ్రాలు, శేషవస్త్రాలు అందజేశారు.

స్వామి, అమ్మవార్లు

నిత్య కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు

భైరవస్వామికి అమావాస్య పూజలు

సింహాచలం, న్యూస్‌టుడే: భైరవవాకలో కొలువైన సింహాచలం దేవస్థానం ఉప దేవాలయం భైరవస్వామి సన్నిధిలో అమావాస్య తిథిని పురస్కరించుకుని విశేష పూజలు, అభిషేకాలు జరిగాయి. అర్చకులు భైరవుడికి పంచామృతాలు, జలాలతో అభిషేకం నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో భైరవుడిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. సింహాచలం దేవస్థానం ఆధ్వర్యంలో భక్తులకు ఏర్పాట్లు చేశారు.

దర్శనానికి బారులుతీరిన భక్తులు

సింహగిరిపై వైభవంగా అమావాస్య తిరువీధి

సింహాచలం, న్యూస్‌టుడే: అమావాస్య తిథిని పురస్కరించుకుని మంగళవారం సాయంత్రం సింహగిరిపై అప్పన్న స్వామి తిరువీధి వేడుకగా జరిగింది. అర్చకులు దేవేరుల సమేతుడైన గోవిందరాజ స్వామిని పట్టు పీతాంబరాలు, ఆభరణాలతో అలంకరించి పల్లకిలో కొలువుదీర్చారు. పండితుల వేద పారాయణలు, నాదస్వర మంగళవాయిద్యాల నడుమ సింహగిరి మాడవీధుల్లో దేవతామూర్తుల తిరువీధి శోభాయమానంగా జరిగింది. భక్తజనం స్వామిని దర్శించుకుని గోవింద నామస్మరణ చేశారు.

సింహగిరి మాడవీధుల్లో స్వామి, అమ్మవార్ల తిరువీధి వేడుక

అడివివరం పైడితల్లమ్మ పరస రేపు

అడివివరం (సింహాచలం), న్యూస్‌టుడే: సింహాద్రి అప్పన్న స్వామి సోదరీమణి, అడివివరం గ్రామ దేవత శ్రీపైడితల్లి అమ్మవారి పరస మహోత్సవం గురువారం ఘనంగా నిర్వహించనున్నట్లు ఈవో జె.వెంకటరావు తెలిపారు. ఆ రోజు ఉదయం నుంచి అమ్మవారికి విశేష పూజలు జరుగుతాయని వివరించారు. భక్తులకు ఇబ్బంది లేకుండా దర్శనాలు కల్పించేందుకు క్యూలైన్లు, తాగునీరు, ప్రసాద వితరణ, ఇతర సదుపాయాలు కల్పించనున్నట్లు పేర్కొన్నారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

షూటింగ్ బాల్ పోటీల్లో సత్తా

భీమునిపట్నం, న్యూస్‌టుడే: రాష్ట్ర స్థాయి షూటింగ్ బాల్ పోటీల్లో ద్వితీయ స్థానంలో నిలిచిన విశాఖ జిల్లా జట్టు తరపున పాల్గొన్న భీమిలి సెడార్ స్కూలుకు చెందిన ఇద్దరు విద్యార్థులను పాఠశాల యాజమాన్యం అభినందించింది. శ్రీ సత్యసాయి జిల్లా ధర్మవరం బాలికల మున్సిపల్ హైస్కూల్‌లో ఈనెల 13 నుంచి 15 వరకు జరిగిన 17 ఏళ్లలోపు విభాగంలో పోటీలు నిర్వహించారు. విశాఖ జిల్లా తరపున వివిధ హైస్కూళ్లకు చెందిన 12 మంది క్రీడాకారుల బృందం పాల్గొని ద్వితీయ స్థానాన్ని కైవసం చేసుకుంది. ఇందులో పాల్గొన్న సెడార్ పాఠశాల తొమ్మిదో తరగతి విద్యార్థులు కె.నందనిఖిల్, ఎ.సాశ్వంత్‌లను మంగళవారం పాఠశాల యాజమాన్య ప్రతినిధులు, ఫిజికల్ డైరెక్టర్ పి.సునీల్ అభినందించారు.

చిట్టివలస (తగరపువలస), న్యూస్‌టుడే: సత్యసాయి జిల్లా ధర్మవరంలో ఇటీవల జరిగిన ఆంధ్రప్రదేశ్ 44వ సబ్ జూనియర్ అండర్-17 షూటింగ్ బాల్ అంతర జిల్లాల రాష్ట్రస్థాయి పోటీల్లో విశాఖ జిల్లా జట్టు రన్నరప్‌గా నిలిచింది. జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహించిన చిట్టివలస జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు సాయిరోహిత్, హేమకేశ్‌లను పాఠశాలలో మంగళవారం అభినందించారు. మండల విద్యాశాఖాధికారిణి శివరాణి, ప్రధానోపాధ్యాయులు ఆదినారాయణ, విద్యా కమిటీ ఛైర్మన్ చిట్టిబాబు, పీఈటీలు అచ్యుతరావు, అప్పలరాజు, తదితరులు పాల్గొన్నారు.

హోరాహోరీగా ఫుట్‌బాల్ పోటీలు

విజయనగరంలోని రాజీవ్ క్రీడా మైదానంలో మంగళవారం ఫుట్‌బాల్ పోటీలు ఉత్సాహంగా సాగాయి. ఉత్తరాంధ్ర చిట్టి వైష్ణవి స్మారక సెవెనర్స్ పేరిట నిర్వహించగా.. ఎనిమిది జట్లు పాల్గొన్నాయి. తొలి సెమీ ఫైనల్‌లో కొమ్మాది(విశాఖ)పై నెల్లిమర్ల బృందం విజయం సాధించింది. రెండో సెమీస్‌లో స్టార్‌ఫ్లెక్సీ(విశాఖ), టౌన్‌స్పోర్ట్స్ క్లబ్(విజయనగరం) హోరాహోరీగా తలపడ్డాయి. 1- 1 గోల్స్ రావడంతో మ్యాచ్ డ్రా అయ్యింది. పెనాల్టీ షూట్‌అవుట్‌లోనూ 3- 3 గోల్స్ రావడంతో ఫలితం తేల్చడానికి టాస్ వేశారు. ఇందులో ఆతిథ్య జట్టు స్పోర్ట్స్ క్లబ్‌కు అనుకూలంగా ఫలితం రావడంతో ఫైనల్ చేరింది. నెల్లిమర్లపై 2-0తో జయకేతనం ఎగురవేసింది.
– న్యూస్‌టుడే, విజయనగరం బాబామెట్ట

ఎయిమ్స్ ప్రస్థానం అద్వితీయం మంత్రి లోకేశ్

ఈనాడు, అమరావతి – న్యూస్‌టుడే, మంగళగిరి, తాడేపల్లి: మంగళగిరి ఎయిమ్స్ ప్రస్థానం అద్వితీయం. బోధన, పరిశోధన, రోగి సంరక్షణ అనే మూడు స్తంభాలపై నిలిచి ఉంది. నమ్మకం అనే నాలుగో స్తంభాన్ని కూడా చేర్చాలని కోరుకుంటున్నానని రాష్ట్ర ఐటీ, విద్య శాఖల మంత్రి నారా లోకేశ్ ఆకాంక్షించారు. మంగళవారం మంగళగిరి ఎయిమ్స్‌లో నిర్వహించిన రెండో స్నాతకోత్సవంలో ఆయనతోపాటు కేంద్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి అనుప్రియ పటేల్ ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. తొలుత ఎయిమ్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అహెంతమ్ శాంతాసింగ్ ఆసుపత్రి ప్రగతి నివేదిక వివరించారు. అనంతరం విద్యార్థులకు వైద్య పట్టాలు పంపిణీ చేశారు. మొత్తం 58 మంది వైద్య పట్టాలు అందుకోగా.. ముగ్గురు బంగారు పతకాలతో మెరిశారు.

నులి పురుగుల నివారణకు చర్యలు

పద్మనాభం పరిధిలో విద్యార్థులతో మాత్రలు మింగిస్తున్న ఎంఈవో-2 బాబూలాల్

చంద్రంపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో..

గ్రామీణభీమిలి, తగరపువలస, న్యూస్‌టుడే: చిట్టివలస సంతపేట అంబేడ్కర్ ఉన్నత పాఠశాలలో నులి పురుగుల నివారణ మాత్రలను పంపిణీ చేశారు. యూపీహెచ్‌సీ వైద్యురాలు ప్రవల్లిక, ప్రధానోపాధ్యాయులు వై.జగన్నాథస్వామి పాల్గొన్నారు. చేపలుప్పాడ పరిధి చిన ఉప్పాడ జడ్పీ ఉన్నత పాఠశాలలో హెచ్ఎం కవిత.. కృష్ణంరాజుపేట మండల పరిషత్తు ప్రాథమికోన్నత పాఠశాలలో జడ్పీటీసీ సభ్యులు వెంకటప్పడు మాత్రలను పంపిణీ చేశారు.

మధురవాడ, న్యూస్‌టుడే: చంద్రంపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో గ్రామ పెద్దలు పిళ్లా రాము, పి.మోహన్‌కృష్ణ, డి.రాము, పి.శ్రీను, జి.కామేశ్వరరావు, వైద్య సిబ్బంది ఉమామహేశ్వరి, ఆశా కార్యకర్త జి.కనకమహాలక్ష్మి, కె.శ్రీదేవి, తదితరులు పాల్గొన్నారు.

✦ సునీల్‌శర్మ (వాంబే) కాలనీలోని జిల్లా పరిషత్, నగరంపాలెం ఎంపీపీ పాఠశాలల్లో వైద్యులు లక్ష్మీమానస పర్యవేక్షణలో జరిగిన కార్యక్రమంలో భాజపా మండలాధ్యక్షుడు ఎండ అప్పారావు, ప్రధానోపాధ్యాయిని కె.గీతాదేవి తదితరులు పాల్గొన్నారు.

పద్మనాభం, న్యూస్‌టుడే: రేవిడి-వెంకటాపురం జిల్లా పరిషత్, ప్రాథమిక పాఠశాలలో ఎంఈవోలు పి.రమణ, ఎస్.బాబూలాల్ చేతులమీదుగా 261 మంది విద్యార్థులకు మాత్రలను పంపిణీ చేశారు. ప్రధానోపాధ్యాయుడు వి.శంకరరావు, మాజీ ఎంపీటీసీ సభ్యుడు ఆవాల గంగరాజు, తదితరులు పాల్గొన్నారు.

కొమ్మాది, న్యూస్‌టుడే: 6వ వార్డులో జాతీయ నులి పురుగుల దినోత్సవం పురస్కరించుకుని ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో యూపీహెచ్‌సీ వైద్యులు సల్మాన్ తన సిబ్బందితో కలిసి విద్యార్థులకు మాత్రలను పంపిణీ చేశారు. ప్రధానోపాధ్యాయులు సుదర్శన్ పట్నాయక్, తెదేపా 6వ వార్డు ప్రధాన కార్యదర్శి లొడగల జానకీరామ్, జనసేన వార్డు ఉపాధ్యక్షులు సునీల్ మనోహర్, తదితరులు పాల్గొన్నారు.

ఆరో వార్డు పరిధిలో మాత్రలు పంపిణీ చేస్తున్న వైద్యులు, నాయకులు

కర్పూరి ఠాకూర్‌కు నివాళి

చిట్టివలస (తగరపువలస), న్యూస్‌టుడే: తగరపువలస నాయీ బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో భారతరత్న, బిహార్ మాజీ ముఖ్యమంత్రి కర్పూరి ఠాకూర్ వర్ధంతి చిట్టివలసలో మంగళవారం నిర్వహించారు. సంఘం అధ్యక్షులు శంకర్, విశాఖ జిల్లా గౌరవాధ్యక్షులు రమణ, అధ్యక్షులు గణపతిరావు, తదితరులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి అంజలి ఘటించారు. సంఘం ప్రతినిధులు గోవాడ సురేష్, పైడిరాజు, వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

ఠాకూర్ చిత్రపటం వద్ద అంజలి ఘటిస్తున్న నాయీ బ్రాహ్మణ సంఘం ప్రతినిధులు

బహిరంగ ప్రకటన

ఇందుమూలముగా యావన్మందికి తెలియజేయునది ఏమనగా మా క్లయింట్లు అయిన విజయనగరం జిల్లా, నెల్లిమర్ల మండలం మరియు గ్రామం, అనబాన వీధి, డోర్ నెం. 29-160కు వాస్తవ్యులు ఆవాల సత్యం గారి కుమారుడు సూర్యారావు గారు నాకిచ్చిన జోగట్టాపై ఈక్రింది బహిరంగ ప్రకటన జారీచేయడమైనది.

ఈదిగువ షెడ్యూల్ ఆస్తి భీమునిపట్నం S.R.O లో రిజిస్ట్రీ కాబడిన DOC No. 1391/2010 ర క్రయ దస్తావేజు మూలముగా హరి వెంకటేశ్వరరావు గారి కుమారుడు సూర్య ప్రకాశరావు గారికి దఖలు పడినటువంటి ఆస్తిని. వీరి వద్ద నుండి నా క్లయింట్లు కొనుగోలు చేసుకొని క్రయ పురోణీ జరిపించుకొనియున్నారు.

సదరు ఆస్తిపై ఎవరికైనను ఎట్టి క్లయిములు, అభ్యంతరములు వగైరాలు ఉన్నచో ఈదినము నుండి 7 రోజులలోగా ఈ క్రింది ఎడ్రసుకు లిఖిత పూర్వకముగా, సంబంధించిన రికార్డులతో వచ్చి కలియవలెను. అట్లు కానియెడల సదరు ఆస్తి నిర్వివాద ఆస్తిగా పరిగణించి పైవ్యక్తుల నుండి నా క్లయింటు కొనుగోలు చేయగలరు. తరువాత వచ్చే ఎట్టి అభ్యంతరములైనా పరిగణించబడవనియు అవి యేవియు నా క్లయింటును బంధింపజాలవనియు ఈప్రకటన ద్వారా తెలియజేయడమైనది.

షెడ్యూల్

All that site admeasuring 220 Sq.yds or 184.8 Sq.meters situated in Plot No. 63 & 64 of Block-C, SWAGRUHA Phase-1 layout, together with 10 years Construction Residential R.C.C Ground Floor House measuring 1173 Sft, covered by Survey Nos. 68/ 6,7,8,9,11 & 16 of Chittivalasa Village, Chillapeta Road Area, Ward No. 14, Block No.63, and Assessment No. 1089011839, Bheemunipatnam, Visakhapatnam District.

NORTH : 40 feet Wide Road, **SOUTH** : Others Land, **EAST** : Plot No. 65 at Present Park, **WEST** : Plot No. 62

ముమ్మిడిశెట్టి సునీల్ న్యాయవాది

భీమునిపట్నం, తేది. 17.02.2026 — ప్లాటు నెం. 304, బ్లు జే మెజెస్టిక్ అపార్టుమెంటు, ఫుట్‌బాల్ గ్రౌండ్ వెనుక, భీమునిపట్నం, విశాఖపట్నం జిల్లా - 531163. సెల్: 9849668442.

(c) eenadu

విశాఖ తూర్పు

● నేడు విద్యుత్తు సరఫరాకు అంతరాయం

ఆరిలోవ, మద్దిలపాలెం, న్యూస్‌టుడే : హనుమంతువాక, కేఆర్ఎంకాలనీ విద్యుత్తు ఫీడర్లలో నిర్వహణ, మరమ్మతుల నేపథ్యంలో బుధవారం విద్యుత్తు సరఫరాకు అంతరాయం ఉంటుందని జోన్-3 ఈఈ సింహాచలంనాయుడు, జోన్-1 ఈఈ పి.శ్రీనివాసరావు మంగళవారం వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు పెదగదిలి, సాలిపేట, చినగదిలి, నేతాజీనగర్, దీనదయాల్ పురంలో, ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు కేఆర్ఎంకాలనీ, సీఎంఆర్ శ్మశాన వాటిక ఏరియా, యర్రాజీకాలనీ, మద్దిలపాలెం శివాలయం ప్రాంతాల్లో సరఫరా ఉండదన్నారు.

షూటింగ్ బాల్ పోటీల్లో సత్తా

భీమునిపట్నం, న్యూస్‌టుడే: రాష్ట్ర స్థాయి షూటింగ్ బాల్ పోటీల్లో ద్వితీయ స్థానంలో నిలిచిన విశాఖ జిల్లా జట్టు తరఫున పాల్గొన్న భీమిలి సెడార్ స్కూల్‌కు చెందిన ఇద్దరు విద్యార్థులను పాఠశాల యాజమాన్యం అభినందించింది. శ్రీ సత్యసాయి జిల్లా ధర్మవరం బాలికల మున్సిపల్ హైస్కూల్లో ఈనెల 13 నుంచి 15 వరకు జరిగిన 17 ఏళ్లలోపు విభాగంలో పోటీలు నిర్వహించారు. విశాఖ జిల్లా తరఫున వివిధ హైస్కూళ్ల నుంచి ఎంపికైన 12 మంది క్రీడాకారుల బృందం పాల్గొని ద్వితీయ స్థానాన్ని కైవసం చేసుకుంది. ఇందులో పాల్గొన్న సెడార్ పాఠశాల విద్యార్థులను మంగళవారం యాజమాన్య ప్రతినిధులు అభినందించారు.

మేమున్నాం.. మీకు తోడుగా

సమయం: ఉ॥ 10 నుంచి మ॥ ఒంటి గంట మధ్య

పెదవాల్తేరు, ఎంవీపీ కాలనీ: 8008574769

మద్దిలపాలెం: 9912120229

శివాజీపాలెం(మద్దిలపాలెం), న్యూస్‌టుడే: ?: 20వ వార్డు రామలక్ష్మీ అపార్టుమెంట్ ప్రాంతంలో రహదారిపై చెత్త పోగులు ఉన్నాయి. దుర్వాసనతో అటుగా రాకపోకలు సాగించలేకపోతున్నాం. – సునీల్, రామలక్ష్మీ అపార్టుమెంట్ ప్రాంతం ✓: తక్షణమే సిబ్బందిని పంపించి సమస్యను పరిష్కరిస్తాం. – ప్రకాష్, వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్

ఆటోమోటివ్ కూడలి(మద్దిలపాలెం), న్యూస్‌టుడే: ?: 23వ వార్డు మద్దిలపాలెం ఆటోమోటివ్ కూడలి వెనుకభాగంలోని కాలువల్లో పూడికలు తొలగించడంలేదు. దోమలు వృద్ధి చెంది ఇళ్లలోకి వస్తున్నాయి. – భాస్కరరావు, ఆటోమోటివ్ ప్రాంతం. ✓: సిబ్బందితో కాలువల్లో పూడిక తొలగిస్తాం. – సత్యనారాయణ, శానిటరీ ఇన్‌స్పెక్టర్

ఆరిలోవ, న్యూస్‌టుడే: ?: 13వ వార్డు ధారపాలెం రోడ్ నెంబరు-5లో రెండు వీధి దీపాలు వెలగడం లేదు. – చంద్రమౌళి, బంగారుతల్లి నగర్ ✓: దీపాలకు మరమ్మతులు చేయించి వెలిగేలా చూస్తాం. – రాజేష్, ఏఈ

హనుమంతువాక (విశాలాక్షినగర్), న్యూస్‌టుడే: ?: హనుమంతువాక కూడలిలో ఉదయం, సాయంత్రం ట్రాఫిక్ రద్దీ అధికంగా ఉంటోంది. ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణం చేసి సమస్యను పరిష్కరించాలి. – బుడ్డిగ సత్యనారాయణ మూర్తి, ✓: అధికారుల దృష్టికి సమస్య తీసుకెళ్లి తగిన చర్యలు తీసుకుంటాం. – ధర్మేంద్ర, ట్రాఫిక్ ఎస్సై.

స్పందనకు వందనం

కేఆర్ఎంకాలనీ(మద్దిలపాలెం), న్యూస్‌టుడే: 20వ వార్డు మద్దిలపాలెం గాయత్రి స్కూల్ నుంచి చైతన్యనగర్‌కి వెళ్లే మార్గంలోని కాలువల్లో మురుగు పొంగిపోయి రహదారిపై ప్రవహిస్తోందని మంగళవారం 'ఈనాడు'లో ప్రచురితమైన వార్తకు వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ స్పందించారు. సిబ్బంది చేత కాలువలో పూడిక తొలగించి మురుగుపారుదల అయ్యేలా చేశారు.

విశాలాక్షినగర్, న్యూస్‌టుడే : హనుమంతువాక, పాతడెయిరీఫారం కూడళ్లలోని బస్‌స్టాపులకు దూరంగా బస్సులు నిలపడంతో ప్రయాణికులు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై 'ఈనాడు'లో వార్తలు ప్రచురితమయ్యాయి. ట్రాఫిక్ ఎస్సై ధర్మేంద్ర స్పందించి.. తమ సిబ్బందితో పర్యవేక్షణ ఏర్పాటు చేసి బస్‌స్టాపుల వద్దే బస్సులు నిలిపేలా చర్యలు చేపట్టారు.

కన్నేసి.. కబ్జా చేసి..!

ఆక్రమణకు గురైన డెయిరీ స్థలాలు

విశాలాక్షినగర్, న్యూస్‌టుడే : తూర్పు నియోజకవర్గంలోని హనుమంతువాక నుంచి ముడసర్లోవ పార్క్ వరకు పలుచోట్ల ఉన్న డెయిరీఫారం స్థలాలు ఆక్రమణకు గురవుతున్నాయి. ఆక్రమణలపై పలుమార్లు ఫిర్యాదులు చేస్తున్నా...అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.

ఇదీ పరిస్థితి..: » గతంలో డెయిరీఫారం నిర్వహణకు 380 ఎకరాల భూమిని నాటి ప్రభుత్వం సేకరించింది. అప్పట్లో రైతులకు నష్టపరిహారం అందించారు. ఆ తర్వాత డెయిరీఫారం నిర్వహణ అటకెక్కింది.

» ఆ భూముల్లో హెల్త్ సిటీకి 140, విమ్స్‌కు 100, ఈపీడీసీఎల్‌కు 5 ఎకరాలు కేటాయించగా, ఆలయాల పేరిట 5, శ్మశానవాటికలకు 5, నివాసాలకు 15 ఎకరాలు ఆక్రమణకు గురయ్యాయి.

» సుందర్‌నగర్, బీఎన్ఆర్‌నగర్, ఆరిలోవ పరిధి సూర్యతేజనగర్ ప్రాంతాల్లోని డెయిరీఫారం భూముల్ని స్థానిక నాయకులు ఆక్రమించి, ఇతర ప్రాంతాల నుంచి వలస వచ్చిన వారికి విక్రయించేశారు.



వెటర్నరీ కాలనీలో స్థలాన్ని ఆక్రమించి భవన నిర్మాణ సామగ్రి విక్రయిస్తున్న దృశ్యం

» **సరైన రక్షణ లేక..:** హనుమంతువాక నుంచి దీనదయాల్‌పురం వరకు ఉన్న సింహాచలం దేవస్థానం భూముల రక్షణకు నలుగురు అధికారులు, పది మంది సిబ్బంది రక్షణ వ్యవస్థ ఏర్పాటు చేశారు. దీంతో ఆక్రమణలు తగ్గాయి. కానీ పశుసంవర్ధక శాఖకు చెందిన డెయిరీ భూములకు అలాంటి రక్షణ వ్యవస్థ లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి.. మిగులు భూములకు రక్షణ వ్యవస్థ ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.

చర్యలు చేపడుతున్నాం.. !

పశుసంవర్ధక శాఖకు సంబంధించి పెదగదిలి అపోలో ఆసుపత్రి పక్కన ఆక్రమణకు గురైన స్థలంలో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశాం. తోటగరువు జిల్లా పరిషత్తు పాఠశాల ఎదురుగా ఉన్న స్థలంలోసర్వే నిర్వహించాం. జాతీయ రహదారి పక్కన ఆక్రమణదారులను హెచ్చరించాం. తోటగరువు గెడ్డకు ఆనుకుని ఉన్న స్థలంలో వెలసిన ఆలయాల వద్ద హెచ్చరిక బోర్డులు పెట్టాం. పోలీసుల సహకారంతో భూ ఆక్రమణదారులపై కేసులు పెట్టి, కలెక్టర్‌కు ఫిర్యాదు చేశాం. ఆయా స్థలాల చుట్టూ రక్షణ గోడ నిర్మాణానికి చర్యలు చేపడతాం.

– డాక్టర్ నీలయ్య, డీడీ, పశుసంవర్ధక శాఖ

మారని గెడ్డలు.. మురికి కూపాలు..!

శివాజీపాలెం గెడ్డలో..

శివాజీపాలెం(మద్దిలపాలెం), న్యూస్‌టుడే: జీవీఎంసీ 22వ వార్డు శివాజీపాలెం, పీతలవానిపాలెం, బాలాజీనగర్ ప్రాంతాల్లోని గెడ్డల్లో వ్యర్థాలు భారీగా పేరుకుపోయాయి. మురుగు నిలిచిపోయి దోమలు వృద్ధి చెంది ఇళ్లల్లోకి ప్రవేశిస్తున్నాయని స్థానికులు వాపోతున్నారు. పారిశుద్ధ్య సిబ్బందికి పలుమార్లు విన్నవించినా పట్టించుకోవడంలేదని వాపోయారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

పొంచి ఉన్న ప్రమాదం

విశాలాక్షినగర్, న్యూస్‌టుడే : జీవీఎంసీ 8వ వార్డు ఆదర్శనగర్‌లోని పలు వీధుల్లో విద్యుత్ స్తంభం అడుగు భాగంలో మట్టి మొత్తం కాలువల్లోకి జారిపోవడంతో ప్రమాదకరంగా మారాయి. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ఆదర్శనగర్ ఆర్, ఏడో వీధుల్లో సమస్య తీవ్రత ఎక్కువగా ఉందని, అధికారులు స్పందించి.. తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

వాహనాల వేగానికి కళ్లెం

చినగదిలి(ఆరిలోవ), న్యూస్‌టుడే : హనుమంతువాక నుంచి ధారపాలెం వరకు ఉన్న బీఆర్టీఎస్ మధ్య మార్గంలో వాహనాల వేగం తగ్గించి, ప్రమాదాలు నివారించేందుకు ట్రాఫిక్ పోలీసులు తగిన చర్యలు చేపట్టారు. పెదగదిలి, చినగదిలి, ముడసర్లోవ, శ్రీకృష్ణాపురం, పైనాపిల్‌కాలనీ ప్రాంతాల్లో బారికేడ్లు ఏర్పాటు చేశారు. బీఆర్టీఎస్ మధ్య మార్గంలో వేగంగా ప్రయాణిస్తున్న వాహనాలతో ప్రమాదాలు జరుగుతున్న తీరుపై 'ఈనాడు'లో పలుమార్లు వార్తలు ప్రచురితమయ్యాయి. దీంతో స్పందించిన ఆరిలోవ ట్రాఫిక్ ఎస్సై ధర్మేంద్ర ఆధ్వర్యంలో ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. వాహనాల వేగానికి కళ్లెం వేసేలా రోజూ రాత్రి 7 గంటల నుంచి ఉదయం 7 గంటల వరకు బారికేడ్లు అడ్డుగా ఉంచుతామని ఆరిలోవ సీఐ మల్లేశ్వరరావు తెలిపారు.

శ్రీకృష్ణాపురం బీఆర్టీఎస్ మధ్య మార్గంలో ఏర్పాటు చేసిన బారికేడ్లు

సత్తా చాటిన గురుకుల విద్యార్థులు

కె.కామరాజు

ఆరిలోవ, న్యూస్‌టుడే : శ్రీకృష్ణాపురంలోని బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో ఇంటర్ చదువుతున్న కె.కామరాజు జేఈఈ మెయిన్ ఫలితాల్లో 63.16 పర్సంటైల్ స్కోర్ చేసి, ఎస్సీ కేటగిరీలో అర్హత సాధించాడని ప్రిన్సిపల్ పి.శ్రీనివాసరావు తెలిపారు. గురుకులం నుంచి 26 మంది విద్యార్థులు జేఈఈ పరీక్ష హాజరవ్వగా ముగ్గురు 53 పర్సంటైల్, ఇద్దరు 50 పర్సంటైల్, ముగ్గురు 48 పర్సంటైల్, మిగిలిన వారు 30 నుంచి 45 పర్సంటైల్ సాధించారని ఆయన పేర్కొన్నారు.

★ గురుకుల పాఠశాలలో ఈ విద్యా ఏడాది నుంచే ఇంటర్ విద్యార్థులకు జేఈఈ, ఐఐటీ శిక్షణ ఇస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఏజెన్సీ ప్రాంత విద్యార్థులకు ఇంజినీరింగ్, వైద్య విద్యను అందుబాటులోకి తీసుకురావాలన్న లక్ష్యంతో శ్రీకృష్ణాపురం గురుకుల పాఠశాలను ఎంపిక చేశారు. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం ఉమ్మడి జిల్లాల్లోని గురుకుల పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులను ఎంపిక చేసి ఇక్కడ శిక్షణ ఇస్తున్నారు. సెప్టెంబరు నుంచి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నామని, మెరుగైన పర్సంటైల్ రాకపోయినా, మార్కులు ఆశాజనకంగా వచ్చాయని అధ్యాపకురాలు నవనీత వాణి, ప్రిన్సిపల్ పి.శ్రీనివాసరావు పేర్కొన్నారు.

రెండో రోజు కొనసాగిన ఆందోళన

హెచ్‌బీకాలనీ(మద్దిలపాలెం), న్యూస్‌టుడే: శ్మశానవాటిక అభివృద్ధిని దేవాదాయశాఖ అధికారులు అడ్డుకోవడాన్ని కొత్తవెంకోజీపాలెం గ్రామ సేవా సంఘం, పాతవెంకోజీపాలెం గ్రామస్థులు, శ్రీసీతారామ సేవా సంఘం సభ్యులు రెండో రోజు రిలే నిరాహార దీక్ష చేపట్టారు. జీవీఎంసీ 15వ వార్డు కొత్తవెంకోజీపాలెంలోని శ్రీజ్ఞానానంద, రామానంద ఆశ్రమం పక్కనే ఉన్న శ్మశానవాటికకు రహదారి సదుపాయం లేకపోవడంతో ఆయా సంఘాల సభ్యులు తమ సొంత నిధులతో సిమెంట్ రోడ్డు నిర్మాణం చేసుకుంటుంటే అధికారులు గ్రామస్థులపై చర్యలు తీసుకుంటామని చెప్పడం ఎంతవరకు సమంజసమన్నారు. గ్రామ సేవా సంఘం అధ్యక్షుడు ఆదారి సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి పీలా ప్రేమకిరణ్, సభ్యులు కె.వి.ఎస్.అప్పారావు, శ్రీసీతారామ సేవా సంఘం అధ్యక్షుడు కర్రి వెంకటసూరి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

నిరసన తెలుపుతున్న గ్రామ సేవా సంఘాల సభ్యులు, నాయకులు

ఆదిత్యాలయంలో నిత్యాన్నదానానికి విరాళం

శ్రీకాకుళం జిల్లా అరసవల్లిలో కొలువైన సూర్యనారాయణస్వామి ఆలయంలో నిత్యాన్నదాన పథకానికి విశాఖపట్నానికి చెందిన మహేశ్వర్ రూ.1,11,116 విరాళంగా అందజేశారు. ఆదిత్యాలయంలో మంగళవారం పూజల అనంతరం ఈవో కేఎన్‌వీడీ ప్రసాద్‌ను ఆయన కార్యాలయంలో కలిసి చెక్కు ఇచ్చారు. అర్చకులు వేదాశీర్వచనం పలికి ప్రసాదాలు అందజేశారు. ఈవో ఆదిత్యుని చిత్రపటాన్ని బహూకరించారు.

– న్యూస్‌టుడే, శ్రీకాకుళం నగరం

ఏయూలో విద్యార్థులు, వాలంటీర్ల ఘర్షణ

ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే: ఆంధ్ర విశ్వవిద్యాలయంలో మంగళవారం సాయంత్రం విద్యార్థులు, వాలంటీర్ల మధ్య వివాదం చోటుచేసుకుంది. ఆ వివరాలిలా..సాయంత్రం ఆరున్నర గంటల సమయంలో బాస్కెట్ బాల్ మైదానంలో ఆర్.ఎస్.ఎస్. వాలంటీర్లు 12 మంది కవాతు చేస్తుండగా ఎస్.ఎఫ్.ఐ విద్యార్థులు వచ్చి అడ్డుకున్నారు. దాంతో ఇరు వర్గాల మధ్య వివాదం చోటు చేసుకుంది. విషయం తెలుసుకున్న ఏయూ సెక్యూరిటీ డీన్ ఇమ్మానియేల్ రాజు సిబ్బందితో వెళ్లి వారిని చెదరగొట్టి పంపించేశారు. తర్వాత రాత్రి 7.30 గంటల సమయంలో ఇరువర్గాలు మళ్లీ వాగ్వాదానికి దిగాయి. ఆ సమయంలో సుమారు 2 వందల మంది విద్యార్థులు అక్కడకు చేరుకోగా.. ఇరువర్గాల మధ్య తోపులాట జరిగి కొందరు స్వల్పంగా గాయపడినట్లు తెలిసింది. వీసీ సూచన మేరకు మూడో పట్టణ పోలీసుల జోక్యంతో గొడవ సద్దుమణిగిందని ఏయూ వర్గాలు తెలిపాయి. ★ ఈ ఘటనపై రాష్ట్ర భాజపా అధ్యక్షుడు పి.వి.ఎన్.మాధవ్ ఓ ప్రకటనలో తీవ్రంగా స్పందించారు. ఆర్.ఎస్.ఎస్. ఒక జాతీయ వాద సంస్థ అని, ఆ సంస్థకు చెందిన సేవక్‌లపై దాడిని ఖండిస్తూ బాధ్యులను అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.

ఎయిమ్స్ ప్రస్థానం అద్వితీయం

★ మంత్రి లోకేశ్ ★ ఘనంగా స్నాతకోత్సవం

ఈనాడు, అమరావతి – న్యూస్‌టుడే, మంగళగిరి, తాడేపల్లి: మంగళగిరి ఎయిమ్స్ ప్రస్థానం అద్వితీయం. బోధన, పరిశోధన, రోగి సంరక్షణ అనే మూడు స్తంభాలపై నిలిచి ఉంది. నమ్మకం అనే నాలుగో స్తంభాన్ని కూడా చేర్చాలని కోరుకుంటున్నానని రాష్ట్ర ఐటీ, విద్య శాఖల మంత్రి నారా లోకేశ్ ఆకాంక్షించారు. మంగళవారం మంగళగిరి ఎయిమ్స్‌లో నిర్వహించిన రెండో స్నాతకోత్సవంలో ఆయనతోపాటు కేంద్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి అనుప్రియ పటేల్ ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. తొలుత ఎయిమ్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అహెంతమ్ శాంతాసింగ్ ఆసుపత్రి ప్రగతి నివేదిక వివరించారు. అనంతరం విద్యార్థులకు వైద్య పట్టాలు పంపిణీ చేశారు. మొత్తం 58 మంది వైద్య పట్టాలు అందుకోగా.. ముగ్గురు బంగారు పతకాలతో మెరిశారు.

రాష్ట్ర మంత్రి లోకేశ్‌ను సన్మానిస్తున్న అహెంతమ్ శాంతాసింగ్. వేదికపై కేంద్ర సహాయ మంత్రి అనుప్రియ పటేల్, ఎయిమ్స్ అధ్యక్షుడు తపన్‌కుమార్ సాహో, డీన్ రామ్మోహన్ తదితరులు.

ఉత్తమ ప్రతిభ చూపినందుకు...:

మంగళగిరి ఎయిమ్స్‌లో 2019 బ్యాచ్‌లో ఎంబీబీఎస్ పూర్తి చేశా. నాన్న పోలినాయుడు బిల్డర్, అమ్మ విజయ గృహిణి. సిద్ధాంతపరమైన పరిజ్ఞానాన్ని రోగులపై ప్రయోగిస్తూ.. క్లినికల్ నైపుణ్యాలు, చికిత్స చేసే విధానంలో ఉత్తమ ప్రతిభ చూపినందుకు బెస్ట్ ఇంటర్న్ కింద బంగారు పతకం అందించారు.

– డాక్టర్ యోగ్యతా పూజారి, విశాఖపట్నం

సమస్యలు పరిష్కరించాలి

ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే: ఆంధ్ర విశ్వవిద్యాలయంలో అతిథి అధ్యాపకుల నిరసన దీక్ష అయిదో రోజుకు చేరింది. వీరికి ఎస్.ఎఫ్.ఐ, ఎ.ఎస్.ఎఫ్.ఐ, సీఐటీయూ సభ్యులు మద్దతు తెలిపినట్లు సురేష్ మీనన్ తెలిపారు. ఏయూలో అతిథి అధ్యాపకులు శాంతియుతంగా పోరుబాట సాగిస్తున్నారని, వారి సమస్యలపై సానుకూలంగా స్పందించాలని వక్తలు కోరారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

నిరసన తెలుపుతున్న అతిథి అధ్యాపకులు

బాలుడిని గుర్తిస్తే వివరాలు తెలపండి

పాతబస్టాండ్, న్యూస్‌టుడే: శ్రీకాకుళం నగరంలోని శాంతా కల్యాణ్ అనురాగ నిలయంలో ఆశ్రయం పొందుతున్న బాలుడిని గుర్తించిన వారు వివరాలు తెలియజేయాలని జిల్లా బాలల రక్షణ అధికారి కేవీ రమణ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. తన పేరు సోయల్, సెంతిఏరాసియాగా చెబుతున్న ఈ బాలుడు 2023 సెప్టెంబరు 25న చెన్నై రైల్వే స్టేషన్‌లో పోలీసులకు దొరికాడు. అక్కడి రైల్వే పోలీసులు నార్త్ జోన్ బాలల సంక్షేమ సమితికి అప్పగించగా విచారించిన అధికారులు శ్రీకాకుళం అని భావించి విశాఖపట్నం కార్యాలయానికి చేర్చారు. అక్కడి నుంచి 2024 ఫిబ్రవరి 27న శ్రీకాకుళం బాలల సంక్షేమ సమితికి పంపారు. అప్పటి నుంచి గుర్తించడానికి కౌన్సెలింగ్ చేసినా వివరాలు చెప్పలేకపోతున్నాడు. ప్రస్తుతం విశాఖలోని ప్రభుత్వ బాలల సంక్షేమ సమితి కార్యాలయంలోని బాలుర రక్షిత గృహంలో ఉన్నాడు. వివరాలు తెలిసిన బంధువులు, తల్లిదండ్రులు తగిన ఆధారాలతో సహా కార్యాలయానికి వస్తే అప్పగించనున్నట్లు పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 94400 30230, 99896 34481కు ఫోన్ చేయాలని సూచించారు.

పరిశుభ్రతతో నులి పురుగుల నివారణ

ఆరిలోవ అంగన్‌వాడీ కేంద్రంలో..

జీవీఎంసీ 18వ వార్డులో..

కేఆర్ఎంకాలనీ(మద్దిలపాలెం), న్యూస్‌టుడే: పరిసరాల పరిశుభ్రతతో పిల్లల్లో నులి పురుగుల నివారణ సాధ్యపడుతుందని ఛైల్డ్‌రైట్స్ అవేర్నెస్ ఫోరం రాష్ట్ర కన్వీనర్ గొండు సీతారాం అన్నారు. కేఆర్ఎంకాలనీ అంగన్‌వాడీ కేంద్రంలోని పిల్లలకు మంగళవారం ఆల్బెండజోల్ మాత్రలు వేశారు. అంగన్‌వాడీ కార్యకర్త సుబ్బలక్ష్మి చిన్నారుల తల్లులు పాల్గొన్నారు. డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని విద్యార్థులకు డాక్టర్ నరేంద్ర చేతులమీదుగా మాత్రలు పంపిణీ చేశారు. కళాశాల ప్రిన్సిపల్ ఐ.విజయబాబు, వైస్ ప్రిన్సిపల్ పి.జయ, అధ్యాపకులు ఎన్.రాజేశ్వరరావు, కె.రవిబాబు, పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

టీఐసీపాయింట్(ఆరిలోవ), విశాలాక్షినగర్, న్యూస్‌టుడే: జీవీఎంసీ 11, 12, 13, 18వ వార్డుల్లోని అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రాథమిక పాఠశాలల విద్యార్థులకు మంగళవారం మధ్యాహ్నం నులిపురుగుల నివారణ మందులు వేశారు. వైద్యులు కిరణ్ లలితాదేవి, జి.మహిత, ప్రియాంక, సిబ్బంది బాలమ్మ, కనకరత్నం, శివలక్ష్మి, సుధ, అన్నపూర్ణ, కార్పొరేటర్లు కెల్లా సునీత, గొలగాని మంగవేణి, నాయకులు సన్యాసిరావు, పాల్గొన్నారు.

విద్యార్థులకు వితరణ

ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే: ఆంధ్ర విశ్వవిద్యాలయ ప్రాంత మానవతా యూనిట్ ఆధ్వర్యంలో మానవతా సంస్థ సభ్యులు కొవటి తాతాజీ సమకూర్చిన రూ.పది వేలతో ఏయూ తెలుగు, ఆంగ్ల మాధ్యమ పాఠశాలలో పదో తరగతి విద్యార్థులు 140 మందికి పరీక్ష అట్టలను (ప్యాడ్స్) ఉచితంగా అందజేశారు. ఏయూ ఏరియా మానవతా యూనిట్ ఛైర్‌పర్సన్ ఆచార్య కె.సీతామాణిక్యం మాట్లాడుతూ దాతకు కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు సలోమి, డాక్టర్ కె.పల్లవి, డాక్టర్ కె.అర్జునుడు, డాక్టర్ వి.హరిబాబు, డాక్టర్ సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ వాతావరణంపై అవగాహన కలిగి ఉండాలి

ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే: వాతావరణంపై అందరికీ అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని భారత ప్రభుత్వ భూవిజ్ఞానశాస్త్ర విభాగం కార్యదర్శి డాక్టర్ ఎం.రవిచంద్రన్ అన్నారు. ఇండియన్ మెటీరియలాజికల్ సొసైటీ విశాఖ ప్రాంతీయ కేంద్రం, ఏయూ మెటీరియాలజీ - ఓషనోగ్రఫీ విభాగం సంయుక్తంగా ఇంజినీరింగ్ కళాశాల ప్రాంగణంలోని డాక్టర్ వై.వి.ఎస్.మూర్తి ఆడిటోరియంలో నిర్వహించిన ఆచార్య పి.కోటేశ్వరం స్మారక ప్రసంగంలో ఆయన భారత దేశ ప్రగతి, భద్రతలో భూ విజ్ఞానశాస్త్రం పాత్ర అంశంపై ప్రసంగించారు. తొలుత పి.కోటేశ్వరం చిత్రపటానికి పూలమాలవేసి నివాళి అర్పించారు. వికసిత్ భారత్ సాకారం చేయడంలో భారత భూ విజ్ఞానశాస్త్రం పాత్ర ఎంతో ఉందన్నారు. ఏయూ వీసీ ఆచార్య జీపీ రాజశేఖర్ మాట్లాడుతూ ఏయూలో భారత భూ విజ్ఞానశాస్త్ర విభాగం, ఐఐటీఎం సహకారంతో ఏర్పాటు చేస్తున్న ప్రయోగశాలలు ఎంతో ప్రాధాన్యతను సంతరించుకుంటాయని అన్నారు. అనంతరం ఏయూ తరఫున డాక్టర్ ఎం.రవిచంద్రన్‌ను వీసీ సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఐఎంఎస్ ఛైర్మన్ ఆచార్య ఎస్.ఎస్.వి.ఎస్.రామకృష్ణ, విభాగాధిపతి ఆచార్య సీవీనాయుడు, బి.ఒ.ఎస్. ఛైర్మన్ ఆచార్య పి.సునీత, విభాగ విశ్రాంత ఆచార్యులు, సీనియర్ ఆచార్యులు, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జ్యోతి వెలిగిస్తున్న డాక్టర్ రవిచంద్రన్, చిత్రంలో వీసీ ఆచార్య రాజశేఖర్

IN THE HONORABLE COURT OF THE SPECIAL JUDGE FOR TRAIL AND DISPOSAL OF COMMERCIAL DISPUTES AT VISAKHAPATNAM

CEP No. 16/2025

Between:
Union of India, Rep. by its Director General, Naval Project, through its Authorized Signatory.
...Petitioner/DHR

And
M/s Infinite Shipping & ENG Private Ltd., Rep. by its Director Sri.Narava Raja Sekhar. **...Respondent/JDR**

NOTICE

To Respondent:
M/s Infinite Shipping & ENG Private Ltd.,Rep. by its Director Sri. Narava Raja Sekhar, Hindu, aged 45 years, Office at Door No.7-5-42,1st Floor, Opp. District Sport Authority. Pandurangapuram, Visakhapatnam-530003.

Take Notice that the above-named CEP No.16/2025 filed against the respondent/JDR for recovery of amount of Rs.18,10,16,448.52 with subsequent interest and cost. That the Honourable Court sent notices on several occasions that the respondent failed to receive the same and avoiding the summons issued by the Honourable Court.

That the Honourable Court was pleased to order notice to by way of paper publication. That the matter stands posted to 27-02-2026, for the respondent's/JDR's appearance personally or through an advocate at 10:30 A.M before the Honourable Court, failing which the matter shall be decided by the Honourable Court in your absenc

S SREERAMAMURTHY, ADVOCATE
Central Govt. Standing Counsel
Office address at Door No.1-63.
Sandeepini Nagar, Yendada,
Visakhapatnam-530045,
Andhra Pradesh.
Ph No.9849633707.

Visakhapatnam
Date:17-02-2026.

విద్యార్థులు ప్రశ్నించేతత్వాన్ని అలవాటు చేసుకోవాలి

ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే: ప్రతి విద్యార్థి ప్రశ్నించే తత్వాన్ని అలవాటు చేసుకోవాలని, తద్వారా తన జ్ఞానాన్ని అభివృద్ధి చేసుకోవడం సాధ్యపడుతుందని ఏయూ ఉపకులపతి ఆచార్య జీపీ రాజశేఖర్ అన్నారు. ఆంధ్ర విశ్వవిద్యాలయాన్ని సందర్శించడానికి వచ్చిన కేంద్రీయ విద్యాలయం విద్యార్థులతో ఏయూ ఇంజినీరింగ్ కళాశాల గౌతమబుద్ధ ఆడిటోరియంలో ఆయన సంభాషించారు. ఈ సందర్భంగా విద్యార్థులు అడిగిన పలు ప్రశ్నలకు ఆయన సమాధానమిచ్చారు. వీసీ మాట్లాడుతూ లక్ష్యాన్ని నిర్దేశించుకుని కష్టించేతత్వాన్ని కలిగి ఉండాలన్నారు. తరగతి గదిలో శాస్త్ర సంబంధమైన అంశాలపై తమ సందేహాలను అధ్యాపకులను అడిగి ఎప్పటికప్పుడు నివృత్తి చేసుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థులంతా ఏయూలోని పలు ప్రయోగశాలలు, ఆ హబ్ సందర్శించారు. ప్రిన్సిపల్ ఆచార్య ఎం.శశి, డీన్ అవుట్‌రీచ్ ఆచార్య కె.రమాసుధ, ఆచార్య జి.ఎం.జె.రాజు తదితరులు పాల్గొన్నారు.

ఓ విద్యార్థి అడిగిన ప్రశ్నకు సమాధానం చెబుతున్న వీసీ ఆచార్య రాజశేఖర్

నగర సుందరీకరణకు చర్యలు

సిబ్బందికి సూచనలు ఇస్తున్న జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్

పెదవాల్తేరు, న్యూస్‌టుడే: విశాఖలో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న ఐఎఫ్ఆర్-2026 నేపథ్యంలో నగరాన్ని పరిశుభ్రంగా ఉంచాలని జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్ అధికారులను ఆదేశించారు. ఐఎఫ్ఆర్‌లో భారత రాష్ట్రపతి, గవర్నర్, ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, విదేశీ ప్రముఖులు హాజరవుతున్నారన్నారు. ఇందుకోసం నగరాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవడానికి కలిసికట్టుగా కృషి చేద్దామన్నారు. బీచ్‌రోడ్డులో మంగళవారం సాయంత్రం ఆయన పర్యటించారు. 17, 18, 19 తేదీల్లో ఐ.ఎఫ్.ఆర్ జరుగుతున్నందున పారిశుద్ధ్య పనుల కోసం షిఫ్టుకు 365 మందిని ఏర్పాటు చేశామన్నారు. ఈ లెక్కన ప్రతి రోజు 1095 మంది ఉంటారన్నారు. 6 స్వీపింగ్ మిషన్లు, 8 చిన్న స్వీపింగ్ మిషన్లు, 4 బీచ్ క్లీనింగ్ మిషన్లు ఏర్పాటు చేశామన్నారు.

స్థలం చూపించకుండా పట్టాలిచ్చారు

పెదవాల్తేరు, న్యూస్‌టుడే: వైకాపా హయాంలో పేద ప్రజలకు పంపిణీ చేసిన ఇళ్ల పట్టాలపై విచారణ జరిపించాలని, స్థలాలు చూపించకుండా పట్టాలు ఇచ్చారని భాజపా జిల్లా ఇన్‌ఛార్జి అధ్యక్షులు కృష్ణంరాజు ఆరోపించారు. ఈ మేరకు ఆర్డీవోకు వినతిపత్రం అందజేశారు. ప్రతివారం నిర్వహించే జనతా వారధి కార్యక్రమంలో భాగంగా సమస్యలు పరిష్కరించాలన్నారు. 2024కు ముందు స్థలాలు చూపించకుండా ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 30 లక్షల మందికి పైగా ఇళ్ల పట్టాలు ఇచ్చినట్లు ప్రకటించుకున్నారన్నారు. ఈ విషయంపై సమగ్ర విచారణ జరిపించాలని కోరారు. రాష్ట్ర కార్యదర్శి ఉమ్మడి సుజాత రాజ్, వారధి జిల్లా కన్వీనర్ శ్రీనివాసరావు, జిల్లా ప్రధాన కార్యదర్శులు రమేష్, దామోదర్ యాదవ్ పాల్గొన్నారు.

ఆర్డీవోకు వినతిపత్రం అందజేస్తున్న భాజపా జిల్లా నాయకులు కృష్ణంరాజు, తదితరులు

(c) eenadu

విశాఖ ఉత్తరం

• విశాఖ ఉత్తరం • విశాఖ దక్షిణం

ఆదిత్యాలయంలో నిత్యాన్నదానానికి విరాళం

శ్రీకాకుళం జిల్లా అరసవల్లిలో కొలువైన సూర్యనారాయణస్వామి ఆలయంలో నిత్యాన్నదాన పథకానికి విశాఖపట్నానికి చెందిన మణికేశ్వరి రూ.1,11,116 విరాళంగా అందజేశారు. ఆదిత్యాలయంలో మంగళవారం పూజల అనంతరం ఈవో కేఎన్‌వీడీ ప్రసాద్‌ను ఆయన కార్యాలయంలో కలిసి చెక్కు ఇచ్చారు. అర్చకులు వేదాశీర్వచనం పలికి ప్రసాదాలు అందజేశారు. ఈవో ఆదిత్యుని చిత్రపటాన్ని బహూకరించారు. – న్యూస్‌టుడే, శ్రీకాకుళం నగరం

మేమున్నాం.. మీకు తోడుగా

సమయం: ఉ॥ 10 నుంచి మ॥ ఒంటి గంట మధ్య
విశాఖ ఉత్తరం: 8008574796
విశాఖ దక్షిణం: 8008574977

మురళీనగర్, న్యూస్‌టుడే: ?: సెక్టార్-8 స్విమ్మింగ్‌పూల్ వెనుక రహదారిలో గత వారం రోజులుగా వ్యర్థాలు తొలగించకపోవడంతో పరిసరాలు అధ్వానంగా ఉన్నాయి. – ప్రసాద్ ✓: సిబ్బందిని పంపించి వ్యర్థాలు తొలగించేలా చేస్తాం. – సుధాకర్, వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్

జగదాంబకూడలి, న్యూస్‌టుడే : ?: జీవీఎంసీ 29వ వార్డు జగదాంబకూడలి సమీప లేపాక్షి కూడలిలో ఆటోలను ఇష్టానుసారంగా పార్కింగ్ చేస్తున్నారు. దీంతో బస్సు ప్రయాణికులు, పాదచారులు, వాహనచోదకులు ఇబ్బందులు పడుతున్నారు. తరచూ ట్రాఫిక్ నిలిచిపోతుంది. –రమణమ్మ, ప్రయాణికురాలు. ✓: పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటాం. –దివాకర్, మహారాణిపేట సీఐ

మాధవధార, న్యూస్‌టుడే: ?:జీవీఎంసీ 51వ వార్డు గాంధీనగర్‌లోని గెడ్డ వ్యర్థాలతో నిండిపోయి మురుగు ముందుకు కదలడం లేదు. తీవ్ర దుర్వాసన వస్తోంది. – ఎల్. అప్పారావు ✓: సిబ్బందిని పంపించి గెడ్డ శుభ్రతకు తగు చర్యలు తీసుకుంటాం. – వెంకటరమణ, శానిటరీ ఇన్‌స్పెక్టర్

నిబంధనలు పాటించండి.. వేడుకకు సహకరించండి..

మాధవధార, అక్కయ్యపాలెం, న్యూస్‌టుడే

నగరంలోని ఆర్కే బీచ్‌లో నేటి నుంచి మూడు రోజుల పాటు నిర్వహించనున్న ఇంటర్నేషనల్ ఫ్లీట్ రివ్యూ(ఐఎఫ్ఆర్), మిలన్ సదస్సుకు వివిధ దేశాల నుంచి ప్రతినిధులు వస్తుండటంతో పోలీసులు, రవాణా శాఖ అధికారులు ప్రత్యేక ఏర్పాటు చేస్తున్నారు. నిబంధనలు పాటించి ఆయా వేడుకలను విజయవంతం చేయాలని ప్రజలకు, ఆటో డ్రైవర్లు, భారీ, ఇతర వాహనదారులకు అవగాహన కల్పిస్తున్నారు. ప్రయాణికులు, ఇతర వాహనదారులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా వాహనాలను నడపాలని డీటీఓ ఆర్.సి.హెచ్.శ్రీనివాస్ తెలియజేశారు. ఆటో డ్రైవర్లు పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించవద్దని, ఆయా వాహనాలకు సంబంధించిన అన్నిరకాల ధ్రువపత్రాలు సంబంధిత డ్రైవర్ వద్ద ఉంచుకోవాలని తెలిపారు. తనిఖీల్లో పట్టుబడితే మాత్రం కేసులు నమోదు చేస్తామన్నారు.

అవాంఛనీయ ఘటనలు జరగకుండా..: ఈ మూడు రోజులు నగరంలో ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఉండేందుకు స్పెషల్ బ్రాంచ్ పోలీసులు ముందస్తు చర్యలు చేపడుతున్నారు. ఆయా కాలనీల, వ్యాపార, విద్యా సంస్థలు, ఆలయాల కమిటీ ప్రతినిధులకు, ప్రజా సంఘాల నాయకులకు నోటీసులు అందజేస్తున్నారు. కొత్త వ్యక్తులు, ఎవరైనా అనుమానాస్పదంగా తిరుగుతున్నా వెంటనే తమకు సమాచారం ఇవ్వాలని సూచిస్తున్నారు. చట్ట వ్యతిరేక నినాదాలు చేయడం, బ్యానర్లు, ప్లకార్డులు, నల్ల జెండాలు పట్టుకుని నిరసనలు చేపట్టవద్దని అలాచేస్తే తీవ్రమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తున్నారు.

రైల్వేన్యూకాలనీ శిర్డీ సాయిబాబా ధ్యాన మందిరం కమిటీ సభ్యులకు నోటీసులు అందజేస్తున్న పోలీసులు

300 వాహనాలు ఏర్పాటు: ఐఎఫ్ఆర్‌లో పాల్గొనేందుకు రాష్ట్రపతి, సీఎం, కేంద్ర, రాష్ట్ర మంత్రులు, రాజకీయ పార్టీల నాయకులు, అధికారులు, వివిధ సంస్థల ప్రతినిధులు వస్తుండటంతో ప్రొటోకాల్ నిమిత్తం రవాణా శాఖ నుంచి 300 వరకు వాహనాలు ఏర్పాటు చేశామని వీటితో పాటు నేవీ అధికారులకు మరో వెయ్యికి పైగా వాహనాలు సమకూర్చినట్లు డీటీఓ తెలిపారు.

దాతల సహకారంతో ఆలయాల అభివృద్ధికి కృషి

మాధవధార, న్యూస్‌టుడే: మాధవధారలో ఉన్న సింహాచలం దేవస్థానం ఉప ఆలయాలను దాతల సహకారంతో అభివృద్ధి చేస్తామని, ఆలయాల ప్రాంగణంలో ఉన్న పలు సమస్యలను పరిష్కరిస్తామని సింహాచలం దేవస్థానం ఈవో వెంకటరావు పేర్కొన్నారు. ఆయన మంగళవారం మాధవధారలో పర్యటించారు. ఈ సందర్భంగా స్వామిఅమ్మవార్లను దర్శించుకున్నారు. నిరంతరం ప్రవహించే జలధార, మెట్ల మార్గం, చుట్టుపక్కల ఉన్న తోటలు, ఆలయాల శుభ్రత, పలు సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఏమైనా సమస్యలుంటే స్థానికులు, భక్తులు నేరుగా తనకు ఫిర్యాదు చేయవచ్చునని తెలిపారు. కార్యక్రమంలో ఆలయాల అర్చకులు, దేవస్థానం సిబ్బంది పాల్గొన్నారు.

సిబ్బందికి సూచనలిస్తున్న ఈవో వెంకటరావు

న్యాయం చేయాలని ఆందోళన

వన్‌టౌన్, న్యూస్‌టుడే : న్యాయం చేయాలని కోరుతూ బాధిత కుటుంబం ఆందోళన నిర్వహించింది. ఆ వివరాలు... వేపగుంట ప్రాంతానికి చెందిన కె.వెంకట్రావు(65) ఈనెల 14న రోడ్డు ప్రమాదంలో గాయపడడంతో గోపాలపట్నంలోని ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించారు. 16వ తేదీన బాధితుడికి శస్త్రచికిత్స చేయగా, మృతి చెందాడు. ఆసుపత్రి యాజమాన్యం, వైద్యుల నిర్లక్ష్యంతోనే వెంకట్రావు మృతి చెందాడని ఆరోపిస్తూ కుటుంబీకులు ఆందోళన చేశారు. మంగళవారం కేజీహెచ్‌లో మృతదేహానికి శవపరీక్ష పూర్తి చేశారు. ఈ విషయాన్ని కలెక్టర్ హరేంధిరప్రసాద్ దృష్టికి తీసుకెళ్లామని, సంబంధిత ఆసుపత్రిపై విచారణకు ఆదేశించారని మృతుడి కుమారుడు శ్యామ్ ప్రసాద్ తెలిపారు.

శవాగారం వద్ద నిరసన తెలుపుతున్న కుటుంబీకులు

అందంగా.. ఆకట్టుకునేలా..

జ్ఞానాపురం, న్యూస్‌టుడే : అంతర్జాతీయ యుద్ధనౌకల సమీక్ష-2026ను పురస్కరించుకుని కాన్వెంట్ కూడలిలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. జీవీఎంసీ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో స్థానిక కూడలిలోని డివైడర్‌పై కృష్ణజింకల బొమ్మలు, చక్రం నమూనాలతో పాటు, నీటి ఫౌంటెయిన్ సిద్ధం చేశారు.. పచ్చదనం కోసం మొక్కలు నాటారు. ఎక్కడికక్కడ విద్యుత్తు దీపాలు ఏర్పాటు చేయడంతో పరిసరాలు అందంగా మారి, పలువురిని ఆకట్టుకుంటున్నాయి. ఇన్నాళ్లు పోర్టు కాలుష్యం దుమ్ము, ధూళితో నిండిన ప్రాంతాలు సుందరంగా దర్శనమివ్వడంతో పలువురు ఫొటోలు తీసుకుంటున్నారు.

కూడలిలో కృష్ణ జింకల బొమ్మలు

చక్రం నమూనా

చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి

జగదాంబకూడలి, న్యూస్‌టుడే: కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ గుర్తుతెలియని వృద్ధుడు మృతి చెందాడు. మంగళవారం మహారాణిపేట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జనవరి 1న జగదాంబకూడలి బస్‌స్టాప్‌లో 70 ఏళ్ల వృద్ధుడు స్పృహ లేకుండా పడి ఉండటాన్ని స్థానికులు గుర్తించి 108 ద్వారా కేజీహెచ్‌లో చేర్పించారు. నాటి నుంచి చికిత్స పొందుతున్న వృద్ధుడు సోమవారం అర్ధరాత్రి దాటిన తర్వాత మృతి చెందాడు. మృతదేహాన్ని కేజీహెచ్ శవాగారంలో భద్రపరిచారు. బంధువులు ఎవరైనా ఉంటే స్టేషన్‌లో సంప్రదించాలని పోలీసులు సూచించారు.

భైరవస్వామికి అమావాస్య పూజలు

సింహాచలం, న్యూస్‌టుడే: భైరవవాకలో కొలువైన సింహాచలం దేవస్థానం ఉప దేవాలయం భైరవస్వామి సన్నిధిలో అమావాస్య తిథిని పురస్కరించుకుని విశేష పూజలు, అభిషేకాలు జరిగాయి. అర్చకులు భైరవుడికి పంచామృతాలు, జలాలతో అభిషేకం నిర్వహించారు.

ఎయిమ్స్ ప్రస్థానం అద్వితీయం

• మంత్రి లోకేశ్
• ఘనంగా స్నాతకోత్సవం

ఈనాడు, అమరావతి – న్యూస్‌టుడే, మంగళగిరి, తాడేపల్లి: మంగళగిరి ఎయిమ్స్ ప్రస్థానం అద్వితీయం. బోధన, పరిశోధన, రోగి సంరక్షణ అనే మూడు స్తంభాలపై నిలిచి ఉంది. నమ్మకం అనే నాలుగో స్తంభాన్ని కూడా చేర్చాలని కోరుకుంటున్నానని రాష్ట్ర ఐటీ, విద్య శాఖల మంత్రి నారా లోకేశ్ ఆకాంక్షించారు. మంగళవారం మంగళగిరి ఎయిమ్స్‌లో నిర్వహించిన రెండో స్నాతకోత్సవంలో ఆయన పాల్గొన్నారు. కేంద్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ సహాయ మంత్రి అనుప్రియ పటేల్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. తొలుత ఎయిమ్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అహంతెమ్ శాంతాసింగ్ ఆసుపత్రి ప్రగతి నివేదిక వివరించారు. అనంతరం విద్యార్థులకు వైద్య పట్టాలు పంపిణీ చేశారు. మొత్తం 58 మంది వైద్య పట్టాలు అందుకోగా.. ముగ్గురు బంగారు పతకాలతో మెరిశారు.

మంత్రి లోకేశ్‌కు సన్మానిస్తున్న అహంతెమ్ శాంతాసింగ్, వేదికపై కేంద్ర సహాయ మంత్రి అనుప్రియ పటేల్, ఎయిమ్స్ అధ్యక్షుడు తపన్‌కుమార్ సాహు, డీన్ రామ్మోహన్ తదితరులు

ఉత్తమ ప్రతిభ చూపినందుకు..

మంగళగిరి ఎయిమ్స్‌లో 2019 బ్యాచ్‌లో ఎంబీబీఎస్ పూర్తి చేశా. [illegible] అమ్మ విజయ గృహిణి. సిద్ధాంత పరమైన పరిజ్ఞానాన్ని రోగులపై ప్రయోగిస్తూ.. క్లినికల్ నైపుణ్యాలు, చికిత్స చేసే విధానంలో ఉత్తమ ప్రతిభ చూపినందుకు బెస్ట్ ఇంటర్న్ కింద బంగారు పతకం అందించారు.
– డాక్టర్ యోగ్యతా పూజారి, విశాఖపట్నం.

బురద నీరు తాగేదెలా..?

తాటిచెట్లపాలెం, న్యూస్‌టుడే: జీవీఎంసీ 46వ వార్డు మధురానగర్‌లో మంచినీటి చేతిపంపు నుంచి బురద నీరు వస్తుండటంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు. కొండవాలు ప్రాంతం కావడంతో జీవీఎంసీ నీటి కొళాయిలు [illegible] చాలామంది ఈ చేతిపంపుపై ఆధారపడుతున్నారు. [illegible] 60వ నెంబరు బోరు నుంచి గత కొద్ది రోజులుగా బురదతో కూడిన ఎర్రని నీరు వస్తుండటంతో కనీసం వాడుకకు కూడా వినియోగించలేకపోతున్నామని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బోరు లోపల మట్టి కూరుకుపోవడంతో ఈ సమస్య తలెత్తుతోందని మరమ్మతులు చేసి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

బోరు నుంచి వచ్చిన బురద నీటిని చూపుతున్న యువకుడు

'నెప్'తో ప్రైవేటీకరణ వైపు అడుగులు

సీతంపేట, న్యూస్‌టుడే: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న నూతన విద్యా విధానం(నెప్) వల్ల ప్రభుత్వ విద్య క్రమంగా ప్రైవేటీకరణ వైపు వెళ్లిపోతుందని ఆల్ ఇండియా సేవ్ ఎడ్యుకేషన్ కమిటీ(ఏఐఎస్ఈసీ) రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్.గోవిందరాజులు ఆరోపించారు. నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతిని పురస్కరించుకొని ఆల్ ఇండియా డెమొక్రటిక్ స్టూడెంట్స్ ఆర్గనైజేషన్(ఏఐడీఎస్‌వో) ఆధ్వర్యంలో పౌర గ్రంథాలయంలో మంగళవారం జిల్లా స్థాయి విద్యార్థుల సదస్సు నిర్వహించారు. ఏఐడీఎస్‌వో నగర అధ్యక్షులు కె.అభిలాష్ అధ్యక్షత వహించి మాట్లాడారు. దేశంలో సుమారు 1.24 లక్షల పాఠశాలలకు కేవలం ఒకే ఒక్క ఉపాధ్యాయుడు ఉన్నారన్నారు. ఇది ప్రభుత్వ బాధ్యతా రాహిత్యానికి నిదర్శనం అని అన్నారు. ఏఐడీఎస్‌వో రాష్ట్ర కార్యదర్శి మహేశ్ మాట్లాడుతూ విద్యార్థులు ఎదుర్కొంటున్న ప్రస్తుత సంక్షోభాలను వివరించారు. గొప్ప వ్యక్తుల జీవిత చరిత్రలను పాఠ్యాంశాల నుంచి తొలగించడం వల్ల విద్యార్థుల్లో నైతిక విలువలు లోపిస్తున్నాయన్నారు. కార్యక్రమంలో ఏఐడీఎస్‌వో నగర ఉపాధ్యక్షుడు బి.సంతోష్‌కుమార్, రేవంత్, మున్నా తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఏఐఎస్ఈసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్.గోవిందరాజులు

ఉత్తరాంధ్ర బీసీ సంక్షేమ సంఘం యువజన అధ్యక్షుడిగా సంతోష్

సంతోష్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న సంఘం నాయకులు

సీతంపేట, న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర యువజన అధ్యక్షుడిగా తేజ సంతోష్ నియమితులయ్యారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు చేతులమీదుగా ఇటీవల అమరావతిలో నిర్వహించిన కార్యక్రమంలో నియామక ఉత్తర్వులు అందుకున్నారు. నగరంలోని జిల్లా కార్యాలయంలో మంగళవారం సంతోష్ మీడియా సమావేశం నిర్వహించి మాట్లాడారు. బీసీ సంక్షేమ సంఘాన్ని ఉత్తరాంధ్రలో బలోపేతం చేయడమే లక్ష్యంగా పని చేస్తానన్నారు. కార్యక్రమంలో పలువురు సంఘం నాయకులు పాల్గొన్నారు.

దిక్కులు చూస్తున్న నిర్లక్ష్యం

కంచరపాలెం, న్యూస్‌టుడే: కాలనీల్లో చీకట్లు తొలగించేందుకు కూడళ్లలో ఎక్కడికక్కడ హైమాస్టు దీపాలు ఏర్పాటు చేసేందుకు సంబంధిత అధికారులు రింగ్‌పోల్స్ తెప్పించారు. వాటిని ఏర్పాటు చేయకపోవడంతో స్తంభాలు తుప్పుపట్టి దిక్కులు చూస్తున్నాయి. జీవీఎంసీ 47, 48 వార్డు పరిధిలోని రాంజీ ఎస్టేట్ పాఠశాల స్తంభాలను తీసుకొచ్చి అక్కడ పడేశారు. నెలలు గడుస్తున్నా వీటిని ఏర్పాటు చేయక పోవడంతో స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాత్రి వేళల్లో చీకట్లు అలముకోవడంతో నానా అవస్థలు పడుతున్నామని చెబుతున్నారు. అధికారులు తక్షణమే స్పందించి రింగ్‌పోల్‌ను ఏర్పాటు చేయాలని వారంతా కోరుతున్నారు.

రాంజీ ఎస్టేట్ పాఠశాల వద్ద పడేసిన విద్యుత్తు స్తంభం

పచ్చదనం పెంపునకు చర్యలు

ట్రీ గ్యాలరీలో మొక్కలు నాటుతున్న దృశ్యం

తాటిచెట్లపాలెం, న్యూస్‌టుడే: కంచరపాలెం పైవంతెనపైనున్న ట్రీ గ్యాలరీల్లో కొత్త మొక్కలు ఏర్పాటుకు జీవీఎంసీ అధికారులు చర్యలు చేపట్టారు. గతంలో పచ్చదనం కోసం కొన్నిచోట్ల ఇనుప గ్రిల్స్ ఏర్పాటు చేసి చిన్నచిన్న పూలకుండీలతో అందమైన మొక్కలు ఉంచారు. అయితే వీటి నిర్వహణపై తగినంత శ్రద్ధ కనబరచకపోవడంతో ఈ మొక్కలన్నీ ఎండిపోయాయి. ఈ సమస్యపై ఇటీవల 'ఈనాడు'లో 'నిర్వహణ లేక పచ్చదనం మాయం' శీర్షికతో ప్రచురించిన వార్తకు జీవీఎంసీ అధికారులు స్పందించారు. ట్రీ గ్యాలరీల్లో కొత్త మొక్కలు ఉంచుతున్నారు.

విద్యతోనే ఉన్నత శిఖరాలు

జగదాంబకూడలి, న్యూస్‌టుడే : విద్యతోనే ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చునని ఆచార్య జీఎస్ఎన్.రాజు అన్నారు. సూర్యాబాగ్ సమీప పాపాహోంలో ఆశ్రయం పొందుతున్న డి.కారుణ్య, డి.అరవింద్, ఆర్.వరుణ్, జి.నిఖిల్ పుట్టిన రోజు వేడుకలు మంగళవారం నిర్వహించారు. ఆచార్య జీఎస్ఎన్.రాజు ముఖ్యఅతిథిగా హాజరై వారితో కేక్ కట్ చేయించారు. దాతల సాయాన్ని సద్వినియోగం చేసుకుంటూ, చదువులో రాణించాలని సూచించారు. కార్యక్రమంలో పాపాహోం ఉపాధ్యక్షులు పి.వెంకటేశ్వరరావు, కోశాధికారి రమేష్ చంద్‌జైన్, సభ్యులు ఎంవీ.రాజశేఖర్, భారత వికాస్ పరిషత్, లయన్స్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

కేక్ కట్ చేస్తున్న ఆచార్య జీఎస్ఎన్.రాజు, బాలురు

బడ్జెట్‌లో బీసీలకు పెద్దపీట

మాట్లాడుతున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్

వన్‌టౌన్, న్యూస్‌టుడే : రాష్ట్రంలో బీసీల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని, రాయితీలతో కూడిన స్వయం ఉపాధి పథకాలు అమలు చేస్తుందని విశాఖ దక్షిణం ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ అన్నారు. మంగళవారం అసెంబ్లీలో బీసీలకు లబ్ధి చేకూర్చే పథకాలు, వాటి వివరాలకు సంబంధించిన అంశాలపై ఎమ్మెల్యే మాట్లాడారు. బడ్జెట్‌లో బీసీలకు అధిక కేటాయింపులు చేసినందుకు సీఎం చంద్రబాబుకు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. స్వర్ణకారులు, కల్లుగీత కార్మికులు, నాయీబ్రాహ్మణులు, చేనేత కార్మికులకు ప్రత్యేక పథకాలు, రాయితీలు అమలు చేయడం అభినందనీయమన్నారు. అలాగే ఆదరణ పథకాన్ని అమలు చేయాలని, బీసీ కార్పొరేషన్లకు నిధులు మంజూరు చేయాలని, స్వయం ఉపాధి పథకాలు అమలు చేయాలని వంశీకృష్ణ కోరారు.

కమనీయం నరహరి నిత్య కల్యాణం

స్వామి, అమ్మవార్లు

సింహాచలం, న్యూస్‌టుడే: శ్రీవరాహలక్ష్మీ నృసింహ స్వామి వారి నిత్య కల్యాణోత్సవం మంగళవారం సింహగిరిపై కమనీయంగా జరిగింది. అర్చకులు స్వామివారి ఉత్సవ మూర్తి గోవిందరాజ స్వామిని దేవేరుల సమేతంగా అలంకరించి ఆలయ కల్యాణ మండపంలోని ఉత్సవ వేదికపై ఆశీనులను చేశారు. వేదమంత్రాలు, నాదస్వర మంగళవాయిద్యాల నడుమ దేవతామూర్తుల పరిణయ వేడుకను జరిపించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామిని సేవించారు. అర్చకులు వేదమంత్రాలతో ఆశీర్వదించి కల్యాణ తలంబ్రాలు, శేషవస్త్రాలు అందజేశారు.

ప్రతి ఆరు నెలలకు మాత్రలు పంపిణీ చేస్తాం: సీడీపీఓ

మాధవధార, న్యూస్‌టుడే: పిల్లలు వ్యాధుల బారిన పడకుండా ఉండేందుకు ప్రతి ఆరు నెలలకొకసారి నులి పురుగుల నివారణ మాత్రలు(ఆల్బెండజోల్) మాత్రలు వేసుకోవాలని అర్బన్ ఐసీడీఎస్ సీడీపీఓ నీలిమ పేర్కొన్నారు. నియోజకవర్గంలోని పలు అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారులకు మంగళవారం ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ మాత్రలు వేసుకోవడం వల్ల రక్తహీనత, ఆకలి మందగించడం, నీరసం, ఆందోళన, కడుపునొప్పి, వికారం, వాంతులు, విరేచనాలు, బరువు తగ్గడం వంటి వ్యాధుల నుంచి ఉపశమనం పొందవచ్చునన్నారు. నియోజకవర్గంలోని 17 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పరిధిలో అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశామన్నారు. తప్పిపోయిన వారికి ఈనెల 24న మళ్లీ రెండోసారి పంపిణీ చేస్తామని తెలియజేశారు.

మర్రిపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు మాత్రలు వేస్తున్న సీడీపీఓ నీలిమ

నులి పురుగుల నివారణతో ఆరోగ్యం

జగదాంబకూడలి, న్యూస్‌టుడే : నులి పురుగుల నివారణతో బాలల ఆరోగ్యం మెరుగుపడుతుందని పలువురు వక్తలు సూచించారు. మంగళవారం జీవీఎంసీ 38వ వార్డులో తెదేపా కార్పొరేటర్ గోడి విజయలక్ష్మి ఆధ్వర్యంలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో విద్యార్థులకు నులి పురుగుల నివారణ మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్యులు, తెదేపా నాయకులు గోడి నరసింహాచారి, రమేష్, పి.మూర్తి, బ్రహ్మాజీ, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

38వ వార్డులో బాలుడికి మందు వేస్తున్న దృశ్యం

అక్కయ్యపాలెం(దొండపర్తి), న్యూస్‌టుడే: దొండపర్తి సమీపంలోని నెహ్రూబజార్ అంగన్‌వాడీ కార్యకర్త ఎం.గజలక్ష్మి ఆధ్వర్యంలో స్థానిక పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది చిన్నారులకు నులి పురుగుల మాత్రలు అందజేశారు. ఏఎన్ఎం కృష్ణవేణి, ఆశా వర్కర్లు రాజ్యలక్ష్మి, శ్యామల తదితరులు పాల్గొన్నారు.

నెహ్రూబజార్ అంగన్‌వాడీ కేంద్రంలో..

బాలుడిని గుర్తిస్తే వివరాలు తెలపండి

సోయల్ (అధికారులు తెలిపిన పేరు)

పాతబస్టాండ్, న్యూస్‌టుడే: శ్రీకాకుళం నగరంలోని శాంతా కల్యాణ్ అనురాగ నిలయంలో ఆశ్రయం పొందుతున్న బాలుడిని గుర్తించిన వారు వివరాలు తెలియజేయాలని జిల్లా బాలల రక్షణ అధికారి కేవీ రమణ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. తన పేరు సోయల్, సెంతిఎరాసియాగా చెబుతున్న ఈ బాలుడు 2023 సెప్టెంబరు 25న చెన్నై రైల్వే స్టేషన్‌లో పోలీసులకు దొరికాడు. అక్కడి రైల్వే పోలీసులు నార్త్ జోన్ బాలల సంక్షేమ సమితికి అప్పగించగా విచారించిన అధికారులు శ్రీకాకుళం అని భావించి విశాఖపట్నం కార్యాలయానికి చేర్చారు. అక్కడి నుంచి 2024 ఫిబ్రవరి 27న శ్రీకాకుళం బాలల సంక్షేమ సమితికి పంపారు. అప్పటి నుంచి గుర్తించడానికి కౌన్సెలింగ్ చేసినా వివరాలు చెప్పలేకపోతున్నాడు. ప్రస్తుతం విశాఖలోని ప్రభుత్వ బాలల సంక్షేమ సమితి కార్యాలయంలోని బాలుర రక్షిత గృహంలో ఉన్నాడు. వివరాలు తెలిసిన బంధువులు, తల్లిదండ్రులు తగిన ఆధారాలతో సహా కార్యాలయానికి వస్తే అప్పగించనున్నట్లు పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 94400 30230, 99896 34481కు ఫోన్ చేయాలని సూచించారు.

విద్యార్థులు ప్రశ్నించేతత్వాన్ని అలవాటు చేసుకోవాలి

ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే: ప్రతి విద్యార్థి ప్రశ్నించే తత్వాన్ని అలవాటు చేసుకోవాలని, తద్వారా తన జ్ఞానాన్ని అభివృద్ధి చేసుకోవడం సాధ్యపడుతుందని ఏయూ ఉపకులపతి ఆచార్య జీపీ రాజశేఖర్ అన్నారు. ఆంధ్ర విశ్వవిద్యాలయాన్ని సందర్శించడానికి వచ్చిన కేంద్రీయ విద్యాలయం విద్యార్థులతో ఏయూ ఇంజినీరింగ్ కళాశాల గౌతమబుద్ధ ఆడిటోరియంలో ఆయన సంభాషించారు. ఈ సందర్భంగా విద్యార్థులు అడిగిన పలు ప్రశ్నలకు ఆయన సమాధానమిచ్చారు. వీసీ మాట్లాడుతూ లక్ష్యాన్ని నిర్దేశించుకుని కష్టించేతత్వాన్ని కలిగి ఉండాలన్నారు. తరగతి గదిలో శాస్త్ర సంబంధమైన అంశాలపై తమ సందేహాలను అధ్యాపకులను అడిగి ఎప్పటికప్పుడు నివృత్తి చేసుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థులంతా ఏయూలోని పలు ప్రయోగశాలలు, ఆ హబ్ సందర్శించారు. ప్రిన్సిపల్ ఆచార్య ఎం.శశి, డీన్ అవుట్‌రీచ్ ఆచార్య కె.రమాసుధ, ఆచార్య జి.ఎం.జె.రాజు తదితరులు పాల్గొన్నారు.

ఓ విద్యార్థి అడిగిన ప్రశ్నకు సమాధానం చెబుతున్న వీసీ ఆచార్య రాజశేఖర్

20న ఆధార్ నమోదు శిబిరం

మురళీనగర్, న్యూస్‌టుడే: జీవీఎంసీ 49వ వార్డు ఎన్‌జీజీఓస్‌కాలనీ సంక్షేమ కార్యాలయంలో ఈనెల 20న ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఆధార్ కార్డు నమోదు ప్రక్రియ నిర్వహించనున్నట్లు అసోసియేషన్ సభ్యులు మంగళవారం తెలిపారు. ఇండస్ట్రియల్ ఎస్టేట్ తపాలా కార్యాలయం ఆధ్వర్యంలో జరగనున్న ఈ శిబిరంలో నూతనంగా ఆధార్ కార్డుల నమోదు, పాత కార్డుల్లో సవరణలు, బయోమెట్రిక్ నవీకరణ వంటివి చేయనున్నారు. కాలనీవాసులంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అసోసియేషన్ సభ్యులు కోరారు.

చెస్ విజేతలకు అభినందన

సీతంపేట, న్యూస్‌టుడే: ఆంధ్ర విశ్వవిద్యాలయం అంతర కళాశాల చెస్ ఛాంపియన్‌షిప్ పోటీలను ఈ నెల 13, 14వ తేదీల్లో గాయత్రి విద్యా పరిషత్ ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించారు. ఈ పోటీల్లో డాక్టర్ లంకపల్లి బుల్లయ్య కళాశాల ఇంజినీరింగ్ విద్యార్థులు ద్వితీయ స్థానాన్ని కైవసం చేసుకున్నారు. ఈ సందర్భంగా కళాశాల కార్యదర్శి డాక్టర్ జి.మధుకుమార్ మంగళవారం విద్యార్థులను అభినందించారు.

విద్యార్థులను అభినందిస్తున్న డాక్టర్ మధుకుమార్

ఏయూలో విద్యార్థులు, వాలంటీర్ల ఘర్షణ

ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే: ఆంధ్ర విశ్వవిద్యాలయంలో మంగళవారం సాయంత్రం విద్యార్థులు, వాలంటీర్ల మధ్య వివాదం చోటుచేసుకుంది. ఆ వివరాలిలా..సాయంత్రం ఆరున్నర గంటల సమయంలో బాస్కెట్ బాల్ మైదానంలో ఆర్.ఎస్.ఎస్. వాలంటీర్లు 12 మంది కవాతు చేస్తుండగా ఎస్.ఎఫ్.ఐ విద్యార్థులు వచ్చి అడ్డుకున్నారు. దాంతో ఇరువర్గాల మధ్య వివాదం చోటు చేసుకుంది. విషయం తెలుసుకున్న ఏయూ సెక్యూరిటీ డీన్ ఇమ్మానియేల్ రాజు సిబ్బందితో వెళ్లి వారిని చెదరగొట్టి పంపించేశారు. తర్వాత రాత్రి 7.30 గంటల సమయంలో ఇరువర్గాలు మళ్లీ వాగ్వాదానికి దిగాయి. ఆ సమయంలో సుమారు 2 వందల మంది విద్యార్థులు అక్కడకు చేరుకోగా.. ఇరువర్గాల మధ్య తోపులాట జరిగి కొందరు స్వల్పంగా గాయపడినట్లు తెలిసింది. వీసీ సూచన మేరకు మూడో పట్టణ పోలీసుల జోక్యంతో గొడవ సద్దుమణిగిందని ఏయూ వర్గాలు తెలిపాయి. ★ ఈ ఘటనపై రాష్ట్ర భాజపా అధ్యక్షుడు పి.వి.ఎన్.మాధవ్ ఓ ప్రకటనలో తీవ్రంగా స్పందించారు. ఆర్.ఎస్.ఎస్. ఒక జాతీయ వాద సంస్థ అని, ఆ సంస్థకు చెందిన సేవక్‌లపై దాడిని ఖండిస్తూ బాధ్యులను అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.

(c) eenadu

గాజువాక

• గాజువాక • విశాఖ పశ్చిమం

ఆలయానికి బంగారం వితరణ

ఆలయ కమిటీ ప్రతినిధులకు బంగారం అందజేస్తున్న రామఅప్పారావు తదితరులు

అగనంపూడి, న్యూస్‌టుడే : అగనంపూడి పరిధి కొండయ్యవలస కాలనీలోని శ్రీ బంగారమ్మ తల్లి ఆలయ పునర్ నిర్మాణానికి సర్వహిత చారిటబుల్ ట్రస్టు సలహాదారుడు పట్టా రామఅప్పారావు తన వంతు సహకారం అందించారు. మంగళవారం ఆలయం వద్ద ఏర్పాటైన కార్యక్రమంలో 15 గ్రాముల బంగారాన్ని ట్రస్టు వ్యవస్థాపకుడు గుదే సుశీలగజేంద్ర రావు చేతుల మీదుగా ఆలయ కమిటీ ప్రతినిధులకు ఇచ్చారు. మాజీ సైనికుడు మేడిశెట్టి ఉమామహేశ్వర రావు, ఆలయ కమిటీ ప్రతినిధులు మాదాసు గణేష్, రామకృష్ణ, పి.వసంత్ తదితరులు పాల్గొన్నారు.

సామాజిక భవనం నిర్మించాలని వినతి

ఎమ్మెల్యే పల్లాకు వినతి అందజేస్తున్న రాజారావు, శంకరరావు తదితరులు

శ్రీనగర్(గాజువాక), న్యూస్‌టుడే : గాజువాక నియోజకవర్గంలో పద్మశాలి సామాజిక వర్గానికి కల్యాణ వేదికకు అనువైన స్థలాన్ని కేటాయించాలని ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావుకు ఏపీ పద్మశాలి సంఘం రాష్ట్ర కన్వీనర్ పప్పు రాజారావు, వార్డు తెదేపా ఇన్‌ఛార్జి పప్పు శంకరరావులు వినతిపత్రంలో కోరారు. సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడినపద్మశాలీలకు ఎలాంటి సామాజిక భవనం, వసతుల్లేక ఇబ్బందులు పడుతున్నారని గుర్తుచేశారు.

మేమున్నాం.. మీకు తోడుగా

సమయం: ఉ॥ 10 నుంచి మ॥ ఒంటి గంట మధ్య

గాజువాక: 98494 65088

పశ్చిమం (గోపాలపట్నం): 95428 96869

న్యూస్‌టుడే, గాజువాక, పెదగంట్యాడ

సమస్య: భానోజీతోట రోడ్డు నెంబర్-4లో వీధికుక్కల బెడద ఎక్కువగా ఉంది. ఇదే పరిస్థితి సీతానగరం ఎన్టీఆర్ విగ్రహం సెంటర్లోనూ కనిపిస్తోంది. –సోమయ్య, బీసీరోడ్డు, శ్రీనివాస్, సీతానగరం, **సమాధానం:** సిబ్బందిని పంపి చర్యలు తీసుకుంటాం. –కిరణ్‌కుమార్, ఏఎంఓహెచ్, **?:** తోకాడ, ఆటోనగర్ దారిలో మురుగుగుంట ప్రమాదకరంగా మారింది. తగిన చర్యలు తీసుకోవాలి. –సుబ్బారావు, తోకాడ, **✔:** ఇబ్బందుల్లేకుండా చూస్తాం. –కిరణ్‌కుమార్, ఏఎంఓహెచ్

హమ్మయ్య! చెత్త తొలగించారు

స్పందనకు వందనం

గాజువాక, పెదగంట్యాడ, న్యూస్‌టుడే: నడుపూరు రోడ్డులో పేరుకుపోయిన చెత్తకుప్పలను ఎట్టకేలకు జీవీఎంసీ సిబ్బంది తొలగించారు. 'ఈనాడు'లో పారిశుద్ధ్య సమస్యపై వచ్చిన వార్తలకు సంబంధిత అధికారులు స్పందించి గ్రీన్‌బెల్టు జాగాలో వేసిన చెత్తను తొలగించారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ తాతారావు ఆయా పనులకు పరిశీలించారు.

పేరుకే జోనల్ కార్యాలయం!

సిబ్బంది కొరతతో విభాగాలు ఖాళీ

ఇలా ఖాళీగా..

అగనంపూడి, న్యూస్‌టుడే: అగనంపూడిలో జీవీఎంసీ జోనల్ కార్యాలయం ఏర్పాటు చేసి నెలన్నర దాటిపోయినా నేటికీ పూర్తిస్థాయి పౌర సేవలు అందించడం లేదు. సిబ్బంది కొరతకు తోడు మౌలిక సౌకర్యాల లేమితో కీలక విభాగాలు ఖాళీగా దర్శనమిస్తుండడంతో పేరుకే కార్యాలయం అన్న చందంగా మారింది.

★ ప్రజల చెంతకే సుపరిపాలన అందించాలన్న లక్ష్యంతో గత ఏడాది రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం మహా విశాఖ నగర పాలక సంస్థ(జీవీఎంసీ)లో జోన్ల సంఖ్యను పదికి పెంచింది. నూతన సంవత్సరం సందర్భంగా జనవరి 1న అగనంపూడి పరిధి పెదమడక కాలనీలో అట్టహాసంగా నూతన కార్యాలయాన్ని ప్రారంభించారు. జోనల్ కమిషనర్‌గా మనీషా త్రిపాఠిని నియమించారు. ఇతర జోన్లలో పనిచేస్తున్న కొంతమంది దిగువస్థాయి సిబ్బందిని ఇక్కడికి బదిలీపై తీసుకొచ్చారు. ప్రజా ఆరోగ్యం, పట్టణ ప్రణాళిక, రెవెన్యూ, ఇంజినీరింగ్ వంటి కీలకమైన విభాగాలకు సిబ్బంది కొరత వేధిస్తోంది. దీంతో సజావుగా సేవలు అందించలేని పరిస్థితి ఏర్పడింది.

ఇన్‌ఛార్జిలతోనే.. జీవీఎంసీ పరిధిలో ఇతర కార్యాలయాల్లో పనిచేస్తున్న అధికారులను, ఇంజినీర్లను ఇక్కడ ఇన్‌ఛార్జిలుగా నియమించారు. నీటి సరఫరా, విద్యుత్తు, ప్రజా ఆరోగ్యం, పట్టణ ప్రణాళిక వంటి విభాగాల్లో గాజువాక జోన్‌లో విధులు నిర్వర్తిస్తున్న అధికారులకే ఇక్కడ ఇన్‌ఛార్జిలుగా బాధ్యతలు అప్పగించారు. మిగతా విభాగాల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది. దీంతో రెండు, మూడు జోన్లకు తిరిగి పని చేయాల్సి రావడం అధికారులకు సవాల్‌గా మారుతోంది. స్థానిక కార్యాలయంపై పూర్తిస్థాయి దృష్టిపెట్టలేకపోవడంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు.

మౌలిక సదుపాయాల కొరత.. జోనల్ కార్యాలయంలో కుర్చీలు, బల్లలు ఏర్పాటు చేశారు. కొన్ని విభాగాలకు ఇటీవల కంప్యూటర్లు వచ్చాయి. ఇంకా సౌకర్యం, ప్రజా ఫిర్యాదుల విభాగాల్లో కంప్యూటర్లు ఏర్పాటు చేయాలి. వాటిని నిర్వహించడానికి ఆపరేటర్లను నియమించాలి. ముగ్గురు జూనియర్ అసిస్టెంట్లు ఉన్నారు. అన్ని విభాగాలు సమర్థంగా నడవాలంటే మరో ముగ్గురి అవసరం ఉంది. ప్రజల నుంచి వచ్చే దరఖాస్తులు, ఫిర్యాదులను భద్రపరచడానికి బీరువాలు లేవు. సిబ్బంది పని చేయడానికి అవసరమైన స్టేషనరీ సామగ్రి, ప్రింటర్లు ఏర్పాటు చేయలేదు.

అధికారులు దృష్టిపెట్టాలి: ఇకనైనా అగనంపూడి జోనల్ కార్యాలయంపై జీవీఎంసీ అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు. ప్రభుత్వ లక్ష్యం నెరవేరేలా తక్షణం పూర్తిస్థాయి సిబ్బందిని నియమించి మెరుగైన సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఐఎఫ్ఆర్‌కి సిద్ధమైన నౌకలు

సింధియా, న్యూస్‌టుడే: తూర్పు నావికాదళం ముఖ్య కేంద్రం విశాఖపట్నం సాగరతీరాన బుధవారం జరగబోయే యుద్ధ నౌకల సమీక్ష ఏర్పాట్లను నావికాదళ ప్రధాన అధికారి దినేష్ కుమార్ త్రిపాఠి పరిశీలించారు. అంతా సిద్ధమా అన్నట్లు.. నౌకలపై ఉన్న సిబ్బందికి చేతులు ఊపి ఉత్సాహపరిచారు.

ఐఎఫ్ఆర్ కోసం మోహరించిన యుద్ధ నౌకలకు అభివాదం చేస్తున్న దినేష్ కుమార్ త్రిపాఠి

విధ్వంసం నుంచి వికాసం దిశగా..

సింధియా, న్యూస్‌టుడే : గత ప్రభుత్వ పాలనలో విధ్వంసమైన రాష్ట్ర ప్రగతిని వికాసం దిశగా ప్రస్తుత రాష్ట్ర బడ్జెట్ రూపొందించడం జరిగిందని పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు అన్నారు. మంగళవారం అసెంబ్లీ సమావేశంలో ఆయన బడ్జెట్‌పై మాట్లాడారు. నాడు చేసిన అప్పులను తీర్చడానికి బ్యాంకర్ల ద్వారా వడ్డీని తగ్గించడం మంచి పరిణామంగా పేర్కొన్నారు. ఉపాధి రంగాలకు ఊతమిచ్చేలా బడ్జెట్ ఉందన్నారు.

ఏయూలో విద్యార్థులు, వాలంటీర్ల ఘర్షణ

ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే: ఆంధ్ర విశ్వవిద్యాలయంలో మంగళవారం సాయంత్రం విద్యార్థులు, వాలంటీర్ల మధ్య వివాదం చోటుచేసుకుంది. ఆ వివరాలిలా..సాయంత్రం ఆరున్నర గంటల సమయంలో బాస్కెట్ బాల్ మైదానంలో ఆర్.ఎస్.ఎస్. వాలంటీర్లు 12 మంది కవాతు చేస్తుండగా ఎస్.ఎఫ్.ఐ విద్యార్థులు వచ్చి అడ్డుకున్నారు. దాంతో ఇరు వర్గాల మధ్య వివాదం చోటు చేసుకుంది. విషయం తెలుసుకున్న ఏయూ సెక్యూరిటీ డీన్ ఇమ్మానియేల్ రాజు సిబ్బందితో వెళ్లి వారిని చెదరగొట్టి పంపించేశారు. తర్వాత రాత్రి 7.30 గంటల సమయంలో ఇరు వర్గాలు మళ్లీ వాగ్వాదానికి దిగాయి. ఆ సమయంలో సుమారు 2 వందల మంది విద్యార్థులు అక్కడకు చేరుకోగా.. ఇరువర్గాల మధ్య తోపులాట జరిగి కొందరు స్వల్పంగా గాయపడినట్లు తెలిసింది. వీసీ సూచన మేరకు మూడో పట్టణ పోలీసుల జోక్యంతో గొడవ సద్దుమణిగిందని ఏయూ వర్గాలు తెలిపాయి. ★ ఈ ఘటనపై రాష్ట్ర భాజపా అధ్యక్షుడు పి.వి.ఎన్.మాధవ్ ఓ ప్రకటనలో తీవ్రంగా స్పందించారు. ఆర్.ఎస్.ఎస్. ఒక జాతీయ వాద సంస్థ అని, ఆ సంస్థకు చెందిన సేవక్‌లపై దాడిని ఖండిస్తూ బాధ్యులను అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.

రాష్ట్రస్థాయి షూటింగ్ బాల్ పోటీల్లో ప్రతిభ

విశాఖ జిల్లా షూటింగ్ బాల్ జట్టుతో నిర్వాహకులు

అగనంపూడి, న్యూస్‌టుడే : రాష్ట్రస్థాయి అండర్-17 విభాగం షూటింగ్ బాల్ పోటీల్లో విశాఖ జిల్లా జట్టు సభ్యులు ప్రతిభ కనబరిచారు. రాష్ట్ర షూటింగ్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 13 నుంచి 15వ తేదీ వరకూ అనంతపురం జిల్లా ధర్మవరంలో పోటీలు నిర్వహించారు. రాష్ట్రంలోని తొమ్మిది జిల్లాల నుంచి జట్లు హాజరవగా విశాఖ జిల్లా తరపున ప్రాతినిధ్యం వహించిన బాలురు ప్రతిభ కనబరిచి ద్వితీయ స్థానాన్ని కైవసం చేసుకున్నారు. ఈ సందర్భంగా మంగళవారం విశాఖ జిల్లా షూటింగ్ బాల్ జట్టు మేనేజరు సునీల్‌కుమార్, కోచ్ రామకృష్ణ బాలురను ప్రత్యేకంగా అభినందించారు.

స్మారక క్రికెట్ పోటీలు ప్రారంభం

సింధియా(నెహ్రూనగర్), న్యూస్‌టుడే: మాజీ ఎంపీ పెతకంశెట్టి అప్పల నరసింహం 90వ జయంతి పురస్కరించుకుని మంగళవారం 58వ వార్డు అన్నపూర్ణనగర్ సమీపాన ఆయన అభిమానులు క్రీడా పోటీలను నిర్వహించారు. ఈనెల 19న ఆయన జయంతి సందర్భంగా యువతకు క్రీడాస్ఫూర్తిని నింపేందుకు ఈ తరహా పోటీలు దోహదపడతాయని నిర్వాహకులు వెల్లడించారు. విజేతలకు 19న బహుమతులను అందజేస్తున్నట్టు వివరించారు.

క్రికెట్ ఆడుతున్న క్రీడాకారులు

నేవల్ యూనిట్లకు సెలవు

మూసేసిన ఐఎన్‌సీఎస్ విభాగం

సింధియా, న్యూస్‌టుడే : అంతర్జాతీయ ఫ్లీట్ రివ్యూ నిర్వహిస్తున్న కారణంగా ఈస్టర్న్ నేవల్ కమాండ్ పరిసరాల్లో నెలకొన్న పలు నేవల్ యూనిట్లకు యాజమాన్యాలు సెలవు ప్రకటించాయి. ఈఎన్‌సీ ప్రధాన కార్యాలయం ఐఎన్ఎస్ సర్కార్స్ ప్రాంగణంలోని చోళాలో రాష్ట్రపతికి బస ఏర్పాట్లు చేసిన సంగతి తెలిసిందే. భద్రత దృష్ట్యా నేవల్ డాక్‌యార్డు, వీరబాహు, ఎస్‌బీసీ, ఐఎన్‌సీఎస్ వంటి ప్రధాన సంస్థల్లో మంగళవారం మధ్యాహ్నం నుంచే ఉద్యోగులను ఇళ్లకు పంపేశారు. అలాగే ఈనెల 18, 19న కూడా కొన్ని సంస్థలకు సెలవు ప్రకటించినట్టు ఉద్యోగ వర్గాలు తెలిపాయి.

హెచ్చరిక లేఖ ఉపసంహరించుకోవాలని ధర్నా

ఉక్కు యాజమాన్య ప్రతినిధికి వినతిపత్రం అందజేస్తున్న ఉక్కు అఖిల పక్ష కార్మిక సంఘాల నాయకులు

ఉక్కునగరం, న్యూస్‌టుడే : ఉక్కు కార్మికులకు హెచ్చరిక లేఖను అందించాలన్న నిర్ణయాన్ని ఉక్కు యాజమాన్యం ఉపసంహరించుకోవాలని అఖిలపక్ష కార్మిక సంఘాల నాయకులు డి.ఆదినారాయణ డిమాండ్ చేశారు. మంగళవారం స్మృత్యంజలి పార్కువద్ద అఖిలపక్ష కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యాజమాన్యం అనైతికంగా కార్మికుల జీతాలు.. ఉత్పత్తి ఆధారంగా ముడిపెట్టి చెల్లింపులు కొనసాగించడం దుర్మార్గమన్నారు. కార్యక్రమంలో అఖిలపక్ష కార్మిక సంఘాల నాయకులు జె.అయోధ్యరామ్, పీవీ రమణమూర్తి, డి.అప్పారావు, డి.సురేష్‌బాబు, యు.రామస్వామి, జె.రామకృష్ణ, వి.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్తు ఉండని ప్రాంతాలు

కరాస, న్యూస్‌టుడే : మరమ్మతుల పనుల నేపథ్యంలో నరసింహనగర్, ఇందిరానగర్, శంకర్ థియేటర్ పరిసర ప్రాంతాలు, గోపాలపట్నం పెట్రోల్‌బంకు, రాజమండ్రి సిల్క్‌హౌస్ షాపింగ్‌మాల్ ప్రాంతాల్లో బుధవారం ఉదయం తొమ్మిది గంటల నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకు విద్యుత్తు అంతరాయం కలుగుతుందని జోన్-3 ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు బి.సింహాచలం తెలిపారు.

ఘనంగా పోలమాంబ జాతర

అగనంపూడి, న్యూస్‌టుడే : అగనంపూడి దరి ఫార్మాసిటీ పునరావాస కాలనీలోని ఈదులపాక వాసుల ఆరాధ్య దేవత శ్రీ పోలమాంబ అనుపు జాతర మంగళవారం ఘనంగా జరిగింది. ఉదయం నుంచి అమ్మవారికి ప్రత్యేకంగా పూజలు నిర్వహించారు. సాయంత్రం అమ్మవారి ఘటాలను ఊరేగింపుగా తీసుకెళ్లారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. ఆలయ కమిటీ ప్రతినిధులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

జేఈఈ మెయిన్‌లో ప్రతిభ

కరాస, న్యూస్‌టుడే : మేహద్రిగెడ్డలో ఉన్న డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ గురుకులం(బాలికలు)లో ఇంటర్మీడియట్ ఎం.పి.సి చదువుతున్న **శిరగం విఘ్నేశ్వరి** జేఈఈ మెయిన్‌లో 82.65 పర్సంటైల్ సాధించింది. విఘ్నేశ్వరి భవిష్యత్తులో మరింత రాణించి ఉన్నత శిఖరాలకు చేరాలని ఉపాధ్యాయులు ఆమెను అభినందించారు.

నగర సుందరీకరణకు చర్యలు

పెదవాల్తేరు, న్యూస్‌టుడే: విశాఖలో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న ఐఎఫ్ఆర్-2026 నేపథ్యంలో నగరాన్ని పరిశుభ్రంగా ఉంచాలని జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్ అధికారులను ఆదేశించారు. ఐఎఫ్ఆర్‌లో భారత రాష్ట్రపతి, గవర్నర్, ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, విదేశీ ప్రముఖులు హాజరవుతున్నారన్నారు. ఇందుకోసం నగరాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవడానికి కలిసికట్టుగా కృషి చేద్దామన్నారు. బీచ్‌రోడ్డులో మంగళవారం సాయంత్రం ఆయన పర్యటించారు. 17, 18, 19 తేదీల్లో ఐ.ఎఫ్.ఆర్ జరుగుతున్నందున పారిశుద్ధ్య పనుల కోసం షిఫ్ట్‌కు 365 మందిని ఏర్పాటు చేశామన్నారు. ఈ లెక్కన ప్రతి రోజు 1095 మంది ఉంటారన్నారు.

నులిపురుగుల మందు పంపిణీ

చిన్నారులకు మాత్రలు వేస్తున్న ఎంఈఓలు రమణాజీ, శ్రీనివాస్, కార్పొరేటర్ లక్ష్మీబాయి తదితరులు

గాజువాక, పెదగంట్యాడ, న్యూస్‌టుడే : జాతీయ నులిపురుగుల నివారణ దినం సందర్భంగా అంగన్వాడీ కేంద్రాలు, పీహెచ్‌సీల్లో చిన్నారులకు నులిపురుగుల నివారణ మందులను వేశారు.

★ గాజువాక, పెదగంట్యాడ పీహెచ్‌సీ పరిధిలో జరిగిన కార్యక్రమంలో వైద్యాధికారులు డాక్టర్లు శ్రీనివాస్, పైడి హేమలత, సంపత్‌బాబు, నెల్లిముక్కు పాఠశాలలో మండల విద్యాశాఖ అధికారులు రమణాజీ, శ్రీనివాస్, 75వ వార్డులో కార్పొరేటర్ పులి లక్ష్మీబాయి, ఎంపీహెచ్ఓ తనకాల సత్యనారాయణ, రాము తదితరులు పాల్గొన్నారు. వార్డు జనసేన ఇన్‌ఛార్జి ముసలయ్య, తదితరులు పాల్గొన్నారు.

కూర్మన్నపాలెం, న్యూస్‌టుడే: జీవీఎంసీ 87వ వార్డు కార్పొరేటర్ బొండా జగన్ పాఠశాల విద్యార్థులకు మాత్రలు అందజేశారు.

కరాస, న్యూస్‌టుడే : జీవీఎంసీ 57వ వార్డులో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర గవర కార్పొరేషన్ డైరెక్టర్ పెంటకోట అజయ్‌బాబు, ప్రధానోపాధ్యాయుడు నాయుడు, ఆశా వర్కర్లు, ఏఎన్ఎంలు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

అగనంపూడి, న్యూస్‌టుడే : అగనంపూడిలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు మంగళవారం నులి పురుగుల నివారణ మందులను పంపిణీ చేశారు. వార్డు తెదేపా అధ్యక్షుడు కరణం జగదీష్, అండిబోయిన మంగరాజు తదితరులు పాల్గొన్నారు.

మల్కాపురం, న్యూస్‌టుడే : జీవీఎంసీ 40వ వార్డు ఏకేసీకాలనీలో జరిగిన నులిపురుగుల నివారణ మందుల పంపిణీ కార్యక్రమాల్లో వార్డు కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

86వ వార్డు కార్పొరేటర్ కోటేశ్వరరావు ఆధ్వర్యంలో..

★ మల్కాపురం జీవీఎంసీ ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు లంక అరుణకుమారి, తదితరులు పాల్గొన్నారు.

కాలి బాటలు.. ఖాళీ చేయాలి

దర్పణం

పెదగంట్యాడ, న్యూస్‌టుడే : మున్సిపల్ రోడ్డులో ఫుట్‌పాత్‌పై రాకపోకలు సాగించేవారికి అడ్డుగా ఉన్న తీగలు ఆందోళన కలిగిస్తున్నాయి. చినగంట్యాడ పోలీసు స్టేషన్ కూడలి నుంచి జగ్గు సెంటర్‌కు వెళ్లేంత వరకూ దారికి ఇరువైపులా కాలిబాటలు నడవడానికి వీల్లేకుండా ఉన్నాయి. విరిగిన సిమెంటు పలకలు, తీగలు, విద్యుత్తు స్తంభాలు ఆందోళన కలిగిస్తున్నాయి. ఈ మార్గంలో పెరుగుతున్న రద్దీని దృష్టిలో పెట్టుకుని కాలిబాటలను అందుబాటులోకి తేవాలని పలువురు కోరుతున్నారు.

గ్రంథాలయం ముందర.. చిందరవందర

ఫోకస్

గాజువాక, న్యూస్‌టుడే : పేరుకుపోయిన చెత్త కుప్పలు, చెట్ల కొమ్మల వ్యర్థాలతో గాజువాక శాఖా గ్రంథాలయం వద్ద అధ్వాన పరిస్థితులు నెలకొన్నాయి. దీనివల్ల గ్రంథాలయానికి వచ్చే పాఠకులు ఇక్కడి పరిస్థితులు చూసి అసహనం వ్యక్తంచేస్తున్నారు. వీటిని వెంటనే తొలగించాల్సిన అవసరం ఉంది.

ఆన్‌లోడ్ చేసే వరకు ఆగాల్సిందేనా..

క్లిక్ క్లిక్

అక్కిరెడ్డిపాలెం, న్యూస్‌టుడే : బీహెచ్‌పీవీ నుంచి మిందికి వెళ్లే మార్గంలో రహదారికి అడ్డంగా వాహనాలు పార్కింగ్ చేయడంతో అటుగా రాకపోకలు సాగించేవారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మింది ఆసుపత్రికి, గ్రామంలోకి, చెరువుకు, స్టూడియో పరిసర వీధులకు వెళ్లేందుకు ఇదే ప్రధాన మార్గం. గోదాములకు వచ్చిన లారీలు ఇలా దారికి అడ్డంగా పెట్టి అన్‌లోడింగ్ చేస్తుండటం వల్ల రాకపోకలకు ఇబ్బందులు తప్పడం లేదు.

అలంకారప్రాయమేనా..?

నేటి చిత్రం

మల్కాపురం, న్యూస్‌టుడే : మల్కాపురం నేవీ కల్యాణి ఆసుపత్రి కూడలిలో ట్రాఫిక్ ఐలాండ్ ఏర్పాటు చేశారు. అయితే ఏ ఉద్దేశంతో దీనిని ఏర్పాటు చేశారో అది నెరవేరడం లేదు. దీంతో ఆకతాయిలకు, భిక్షాటన చేసేవారికి అడ్డాగా మారింది. దీన్ని ప్రచారాలకు కూడా వాడుకుంటున్నారు. దీన్ని ఉపయోగంలోకి తేవడమో.. తొలగించడమో చేయాల్సిన అవసరం ఉంది.

మందుల కోసం తప్పని ప్రయాస

అగనంపూడి, న్యూస్‌టుడే : అగనంపూడి ప్రాంతీయ ఆసుపత్రిలో రోగులు మందులు తీసుకోవడానికి ఇబ్బంది తప్పడం లేదు. ఉదయం 10 నుంచి 12 గంటలలోపు రద్దీ ఎక్కువగా ఉండడంతో అధిక సమయం వరుసలో నుంచోవాల్సి రావడం వల్ల రోగులు అవస్థ పడుతున్నారు. మందుల పంపిణీకి మరో కేంద్రం ఏర్పాటు చేసి పురుషులకు, స్త్రీలకు వేర్వేరుగా మందులను పంపిణీ చేస్తే సమస్య పరిష్కారమయ్యే అవకాశం ఉంది.

'రాష్ట్ర బడ్జెట్‌లో దళితులకు మొండి చెయ్యి'

కరాస, న్యూస్‌టుడే : రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన తాజా బడ్జెట్‌లో దళితుల సంక్షేమానికి తగిన ప్రాధాన్యం ఇవ్వలేదని దళిత హక్కుల పోరాట సమితి పేర్కొంది. సమితి సభ్యులు ఎన్ఎస్‌టీఎల్ గేటు ఎదురుగా ఉన్న అంబేడ్కర్ విగ్రహం దగ్గర బుధవారం సాయంత్రం నిరసన ప్రదర్శన చేపట్టారు. ప్రభుత్వానికి దళితుల అభివృద్ధి పట్ల నిజమైన చిత్తశుద్ధి ఉంటే బడ్జెట్‌ను సవరించి దళితులకు కేటాయింపులు పెంచాలని డిమాండ్ చేశారు.

నిరసన ప్రదర్శనలో పాల్గొన్న దళిత హక్కుల పోరాట సమితి సభ్యులు

కమనీయం నరహరి నిత్య కల్యాణం

సింహాచలం, న్యూస్‌టుడే: శ్రీవరాహలక్ష్మీ నృసింహ స్వామివారి నిత్య కల్యాణోత్సవం మంగళవారం సింహగిరిపై కమనీయంగా జరిగింది. అర్చకులు స్వామివారి ఉత్సవమూర్తి గోవిందరాజ స్వామిని దేవేరుల సమేతంగా అలంకరించి ఆలయ కల్యాణ మండపంలోని ఉత్సవ వేదికపై ఆశీనులను చేశారు. వేద మంత్రాలు, నాదస్వర మంగళవాయిద్యాల నడుమ దేవతామూర్తుల పరిణయ వేడుకను జరిపించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామిని సేవించారు. అర్చకులు వేదమంత్రాలతో ఆశీర్వదించి కల్యాణ తలంబ్రాలు, శేషవస్త్రాలు అందజేశారు.

సింహగిరిపై వైభవంగా అమావాస్య తిరువీధి: అమావాస్య తిథిని పురస్కరించుకుని మంగళవారం సాయంత్రం సింహగిరిపై అప్పన్న స్వామి తిరువీధి వేడుకగా జరిగింది. అర్చకులు దేవేరుల సమేతుడైన గోవిందరాజ స్వామిని పట్టు పీతాంబరాలు, ఆభరణాలతో అలంకరించి పల్లకిలో కొలువుదీర్చారు. పండితుల వేద పారాయణలు, నాదస్వర మంగళవాయిద్యాల నడుమ సింహగిరి మాడవీధుల్లో దేవతామూర్తుల తిరువీధి శోభాయమానంగా జరిగింది. భక్తజనం స్వామిని దర్శించుకుని గోవింద నామస్మరణ చేశారు.

గడప గడపకు 'వాట్సప్ గవర్నెన్స్'

అవగాహనకు ప్రత్యేక బృందాలు

అవగాహన కలిగిస్తున్న సిబ్బంది

గాజువాక, న్యూస్‌టుడే : ప్రభుత్వ సేవలను మరింత సులభంగా అందించేందుకు అందుబాటులోకి తెచ్చిన వాట్సాప్ గవర్నెన్స్ సేవలను ప్రతి గడపకు చేరవేసేలా ప్రభుత్వం ప్రత్యేక మార్గదర్శకాలను జారీ చేసింది. దీనిలో భాగంగా వార్డు సచివాలయ సిబ్బందితో కూడిన బృందాలు ప్రతి శుక్రవారం విధిగా ఈ ప్రచారంలో పాలుపంచుకుంటున్నాయి.

★ కొత్త డిజిటల్ విధానం ద్వారా వివిధ సేవలు కావల్సిన వారు జోనల్ కార్యాలయం, సచివాలయాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా ఇంటివద్దే మొబైల్ వాట్సాప్ ద్వారా సేవలు పొందవచ్చని ప్రచారం చేస్తున్నారు. ఈనెల 6 నుంచి వార్డుల వారీగా అవగాహన, ప్రచారం చేపట్టారు.

గాజువాక జోన్‌లో సచివాలయాలు : 84
సర్వే సిబ్బంది : 599
మొత్తం కుటుంబాలు: 1,10,501
ఇప్పటికి అవగాహన కలిగించిన కుటుంబాలు : సుమారు 35,000

ఏమి చేస్తున్నారంటే..

★ వాట్సాప్ గవర్నెన్స్ సేవల ప్రాముఖ్యాన్ని ప్రతి ఇంటికి వెళ్లి తెలియజేయడం, పౌరులకు సేవల జాబితాను వివరించడం, ప్రతిఇంట్లో కనీసం ఒక వ్యక్తిచేత ఒక సేవ అయినా వాట్సాప్ ద్వారా అప్లయ్ చేయించాల్సిన బాధ్యతను సిబ్బందికి అప్పగించారు.

★ ప్రతి ఇంటి నుంచి యాప్‌లో పేర్లకు అనుగుణంగా కుటుంబ సభ్యుల వివరాలను తెలుసుకుని ఈకేవైసీ తీసుకుంటున్నారు.

★ ఏ సేవలు, ఎన్నిరోజుల్లో అందుతాయో వివరిస్తూ నివాసితుల సందేహాలను నివృత్తి చేస్తున్నారు.

ముఖ్య సేవలివీ..

వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా పొందగలిగే కొన్ని ముఖ్యసేవలు ఇలా ఉన్నాయి.

★ తితిదే, ఇతర దేవస్థాన దర్శనాల టిక్కెట్లు ★కరెంటు బిల్లులు, రేషన్, రైస్ కార్డు సంబంధ సేవలు ★ జనన, మరణ ధ్రువీకరణ పత్రాలు ★ ఆదాయ, కుల, నివాస సర్టిఫికెట్లు ★ పింఛను సంబంధిత సేవలు, డీబీటీ సేవలు, వసతి, ఆరోగ్యం, విద్య వంటి సోషల్ స్కీముల సమాచారం ★ జీఎస్‌డబ్ల్యూఎస్ సాధారణ సేవలు తదితరాలు

★ గాజువాకలో 1.10 లక్షల కుటుంబాలకు గానూ ప్రతిఒక్క వార్డు కార్యదర్శి కనీసం రోజుకు 50 ఇళ్లకు వెళ్లి అవగాహన, వాట్సాప్ గవర్నెన్స్ సేవలను వినియోగించుకునేలా చేయాలి. ఇలా సిబ్బంది విడమర్చి చెబుతుండడంతో గృహ యజమానులు ఆసక్తిగా తెలుసుకుంటున్నారు. ఇప్పటికే కొందరు ఈ సేవలను పొందుతున్నారని, ఇంకా 70శాతం మందికి అవగాహన కలిగించాల్సి ఉందని చెబుతున్నారు.

గాజువాకలో వాట్సాప్ గవర్నెన్స్ సేవలను అనేకమంది సద్వినియోగం చేసుకుంటున్నారని, మరింతగా అవగాహనకు అన్ని విభాగాల అధికారులు, సిబ్బందికి బాధ్యతలు అప్పగించినట్లు జోనల్ కమిషనర్ బీఆర్ఎస్ శేషాద్రి తెలిపారు. ఇప్పటికే ఏకీకృత కుటుంబ సర్వే చురుగ్గా సాగుతోందని పేర్కొన్నారు.

8వ వర్ధంతి

మీరు మానుండి దూరమై నేటికి 8 సంవత్సరాలు గడిచినమా మీయొక్క మధుర జ్ఞాపకాలు స్మరిస్తూ... మీ పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తూ...

కీ.శే. గంధం పాపారావు గారు

జననం: 26-12-1941 మరణం: 18-2-2018

భార్య: గంధం ఫాల్గుణం

కుమారుడు - కోడలు: గంధం వెంకటరావు - రత్నవేణి

కుమార్తెలు - అల్లుళ్లు: ఆకుల సరోజిని - సన్యాసిరావు (లేటు), పంచా జయలక్ష్మి (కనక) (లేటు) - గోవిందరావు

మరియు మనుమలు, మనుమరాళ్లు

11వ వర్ధంతి

మంచికి, మానవత్వానికి మారుపేరుగా నిలిచి, కుటుంబ ఉన్నతికి అహర్నిశలు శ్రమించిన మీరు మానుండి దూరమై నేటికి 11 సం॥లు గడిచినను మీయొక్క జ్ఞాపకాలు ఎల్లప్పుడూ మా మదిలో మెదులుతూనే ఉంటాయి. మీ పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తూ...

కీ.శే. గొర్స చిన్నారావు గారు

Employ No. 100023, Retd.

VISAKHAPATNAM STEEL PLANT

జననం: 01-04-1954 మరణం: 18-02-2015

భార్య : జయమ్మ

తల్లి : సన్నమ్మడు (లేటు)

తండ్రి : గొర్స రామూర్తి (లేటు)

కుమారులు : రమేష్, మధు, సురేష్

కుమార్తె : తేలాసరి జ్యోతి

అల్లుడు : అప్పలాచారి

చెల్లెళ్ళు : నూకరత్నం, వరలక్ష్మి

మరియు కోడళ్ళు, మనుమలు, మనుమరాళ్ళు, బంధుమిత్రులు

(c) eenadu



ఎత్తు వేసేయ్.. చిత్తు చేసేయ్..

విజయనగరంలోని రాజీవ్ క్రీడా మైదానంలో శాప్ లీగ్- చదరంగం పోటీలు మంగళవారం ప్రారంభమయ్యాయి. అండర్-13, 15, 17, 19 విభాగాల్లో 250 మంది బాల, బాలికలు తలపడ్డారు. ఒక్కో కేటగిరీ ఇద్దరు చొప్పున 8 మంది బాలికలు, 8 మంది బాలురు రాష్ట్రస్థాయికి ఎంపిక చేసినట్లు డీఎస్‌డీవో వెంకటేశ్వరరావు తెలిపారు. ఈనెల 21, 22వ తేదీల్లో తిరుపతిలో జరిగే మీట్‌కు వెళ్లనున్నారని, టీఏ, డీఏతో పాటు దుస్తులను ప్రభుత్వమే అందిస్తుందని వెల్లడించారు. స్కూల్ గేమ్స్ కార్యదర్శులు గోపాల్, విజయలక్ష్మి, చదరంగం సంఘం జిల్లా కార్యదర్శి జ్వాలాముఖి తదితరులు పాల్గొన్నారు. – న్యూస్‌టుడే, విజయనగరం బాబామెట్ట

కదలని స్వచ్ఛ రథం

ముందుకు రాని ఆపరేటర్లు

విజయనగరం అర్బన్, న్యూస్‌టుడే: జిల్లాలో 'స్వచ్ఛరథం' పథకం అమలు ప్రక్రియ ముందుకు కదలడం లేదు. కొన్ని మండలాల్లో ఆపరేటర్లు ముందుకు రాకపోవడంతో ఈ పరిస్థితి కనిపిస్తోంది. పొడి చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాల సేకరణ కోసం ఈ వాహనాలను ఉపయోగించనున్నారు. తడి, పొడి వేరు చేయడం, గ్రామాల్లో పారిశుద్ధ్యం మెరుగు, ప్లాస్టిక్ నిషేధం, పర్యావరణ పరిరక్షణకు గాను ఈ కార్యక్రమాన్ని తీసుకొచ్చారు. రోజుకో పంచాయతీలో తిరిగేలా షెడ్యూల్ రూపొందించనున్నారు. 200 కిలోలు తక్కువ కాకుండా వ్యర్థాలను సేకరించాలి. బదులుగా కిరాణా, ఇతర సరకులు అందించాలి. కానీ క్షేత్రస్థాయిలో అడుగులు పడడం లేదు.

ఆర్థిక సంఘం నిధులతో

పథకం నిర్వహణకు మండల పరిషత్తుల 15వ ఆర్థిక సంఘం నిధులు ఖర్చుచేసేలా ఇప్పటికే ఆదేశించాం. ఆసక్తిగలవారు ముందుకు రావాలని జడ్పీ సీఈవో బి.వి. సత్యనారాయణ తెలిపారు. ఇప్పటికే ఐదు మండలాల్లో ఆపరేటర్ల నియామకం పూర్తయింది, ఆయా ప్రాంతాల్లో ఈనెల 21న వాహనాలను ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఖర్చును భరించలేని పరిస్థితిలో రూ.50 వేలు ఇస్తామని, విధిగా నెలకు రూ.5 వేల చొప్పున చెల్లించాలన్నారు.

ఎంపీడీవోలకు బాధ్యత..

జిల్లాలో జనవరి 17న ప్రారంభించాలని నిర్ణయించారు. ఇందులో భాగంగా మండలానికొకరు చొప్పున 27 మంది ఆపరేటర్లను నియమించాలని ఎంపీడీవోలకు బాధ్యతలు అప్పగించారు. కొన్ని మండలాల్లో స్పందించని పరిస్థితి నెలకొంది. వాహనాలను సమకూర్చుకోవాల్సి రావడమే ఇందుకు కారణంగా తెలుస్తోంది. నెలకు అద్దె రూపేణా ఒక వాహనానికి రూ.20 వేల నుంచి రూ.25 వేల వరకు చెల్లిస్తారు. వ్యర్థాల సేకరణకు అనుగుణంగా వాహనాలను మార్పు చేయాలి. ఎంపీడీవోలు మార్పులను ఆపేక్ష ఉండడంతో కొందరు మాత్రమే స్పందించారు. ఈ నేపథ్యంలో ఆర్థికసాయం అవసరమని డిమాండు వినిపిస్తోంది.

రెండు పూటలా వెయ్.. వారం రోజులు వాడేయ్..!

వైద్యుల్లా చెప్పేస్తున్న కొందరు ఔషధ దుకాణదారులు

అక్రమాలు బయటపడుతున్నా చర్యలు శూన్యం

'విజయనగరం అంబటిసత్రం సమీపంలోని ఓ మందుల దుకాణం యజమాని మత్తెక్కించే దగ్గు మందు, కాలం చెల్లిన ఔషధాలు విక్రయించాడు. డెహ్రాడూన్ నుంచి ప్రతి నెలా దిగుమతి చేసుకునేవాడు. 100 మి.లీ. సీసాను రూ.46కు కొనుగోలు చేసి రూ.150కు విక్రయించేవాడు. ఇలా వేల సీసాలు అమ్మేశాడు. విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులకు పట్టుబడినా అప్పటికే చాలా సరకు బయటకు వెళ్లిపోయింది. 2019 నుంచి కొనుగోలు, అమ్మకాలకు సంబంధించి రికార్డులే లేనట్లు గుర్తించారు'

చీటీ లేకుండానే..

వైద్యుల సిఫార్సులు లేకుండా మందుల అమ్మకం నేరం. అయితే దాదాపు 90 శాతం దుకాణాల్లో ప్రిస్క్రిప్షన్ లేకుండానే అంటగడుతున్నారు. జ్వరం, ఒళ్లు నొప్పులు, తలనొప్పి, దగ్గు.. ఇలా ఏదున్నా రెండు, మూడు వారాలకు ఇచ్చేస్తున్నారు. రూపాయి ఉంటే రూ.30 తీసుకుంటున్నారు. ఎప్పుడు వేయాలి.. ఏం తినాలో వారే చెప్పేస్తున్నారు.

ఇలాంటి కేసులు ఉమ్మడి జిల్లాలో అయిదారు బయటపడ్డాయి. వినియోగదారులను మోసం చేస్తూ కొందరు విచ్చలవిడిగా మందులు విక్రయించేస్తున్నారు. తనిఖీలు మొక్కుబడిగా సాగుతుండడం, పలువురు ఔషధ నియంత్రణ శాఖ అధికారులు వసూళ్లలో నిమగ్నం కావడంతో ఈ దుస్థితి నెలకొంది. దీంతో పెద్దఎత్తున నకిలీ మందులు రోగులకు చేరుతున్నాయి.

తనిఖీలు తూతూమంత్రం: రెండు జిల్లాల్లో 2,176 మందుల దుకాణాలకు లైసెన్సులు జారీ చేశారు. ఇందులో కొందరు హోల్‌సేల్ వ్యాపారులున్నారు. ప్రస్తుతం 1,822 దుకాణాలు పని చేస్తున్నాయి. ఉన్నవాటిలో అత్యధిక శాతం నిబంధనలు పాటించడం లేదు. తనిఖీలు చేయాల్సిన అధికారులూ లేరు.

సిబ్బంది కొరత

విజయనగరం, బొబ్బిలి, పార్వతీపురంలో ఒక్కో డ్రగ్ ఇన్‌స్పెక్టర్ పని చేస్తున్నారు. నెలకు 40 దుకాణాలను పరిశీలించాలి. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వార్షిక ప్రణాళిక అమలు చేయాలి. రెండు నెలల క్రితం పార్వతీపురం ఇన్‌స్పెక్టర్‌గా టెక్కలి ఇన్‌స్పెక్టర్‌కు అదనపు బాధ్యతలు అప్పగించారు. విజయనగరం ఏడీ రజితకు గత అక్టోబరులో డీడీగా పదోన్నతి లభించింది. నాటినుంచి ఇక్కడ అదనపు బాధ్యతల్లోనే ఉన్నారు. కింది స్థాయి సిబ్బంది కొరత సైతం వేధిస్తోంది.

చర్యలు తప్పవు..

ఎప్పటికప్పుడు దాడులు చేస్తున్నామని, గుర్తించిన అక్రమాలపై కేసులు నమోదు చేస్తున్నామని ఔషధ నియంత్రణ విభాగం ఉప సంచాలకురాలు రజిత తెలిపారు. కాలం చెల్లిన మాత్రలు అమ్మినా, అమ్మకాలు, మందుల నిల్వలకు సంబంధించి లెక్కల్లో తేడా కనిపించినా చర్యలు తప్పవని హెచ్చరించారు. – ఈనాడు, విజయనగరం

ఇంటర్ పరీక్షలపై సందేహాలా..?

ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు ఈనెల 23 నుంచి ప్రారంభం కానున్నాయి. ఇప్పటికే ప్రయోగ పరీక్షలు పూర్తయ్యాయి. ఈ ఏడాది ప్రథమ సంవత్సరం ప్రశ్నపత్రంలో కొన్ని మార్పులు చేశారు. ఒక మార్కు ప్రశ్నలు ఇవ్వనున్నారు. ఈ నేపథ్యంలో వీటిపై ఏ విధంగా అవగాహన పెంపొందించుకోవాలి.. మారిన విధానానికి అనుగుణంగా ఎలా ముందుకెళ్లాలి? సాధన? ఇతర సందేహాల నివృత్తి కోసం నేరుగా డీఐఈవో తవిటినాయుడుతో మాట్లాడే అవకాశాన్ని 'ఈనాడు' మీకు కల్పిస్తోంది. మీరు చేయాల్సిందల్లా ఒక్క ఫోన్ కాల్ మాత్రమే. – న్యూస్‌టుడే, విజయనగరం అర్బన్

ఈనాడు ఫోన్ ఇన్ కార్యక్రమం

తేదీ: 18/02/26 (బుధవారం)	సమయం: మధ్యాహ్నం 2-4 గంటల వరకు	సంప్రదించాల్సిన నంబరు: 93929 11825

కొంగవానిపాలెం సర్వేయర్ సస్పెన్షన్

భోగాపురం, న్యూస్‌టుడే: నకిలీ సంతకాలు చేసి ఎఫ్-లైన్ దరఖాస్తులను అక్రమంగా ఆమోదించిన వ్యవహారంలో గ్రామ సర్వేయర్‌ను సస్పెండ్ చేస్తూ జిల్లా సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ శాఖ మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. మండలంలోని కొంగవానిపాలెం గ్రామ సచివాలయంలో విధులు నిర్వహిస్తున్న గ్రామ సర్వేయర్ గ్రేడ్-2 ఎస్.శంకర్ అధికారిక పత్రాలు, ఎఫ్-లైన్ రిజిస్టర్‌లో డిప్యూటీ తహసీల్దారు పి.హరి సంతకాలను నకిలీగా చేశారని ఆరోపణలు వెలుగుచూశాయి. అంతేకాకుండా కంప్యూటర్ ఆపరేటర్ వద్ద నుంచి డిజిటల్ కీ తీసుకొని డిప్యూటీ తహసీల్దారు లాగిన్ ద్వారా ఎఫ్-లైన్ ధరఖాస్తులను అనుమతి లేకుండా ఆమోదించినట్లు విచారణలో బయటపడింది. దీనిపై డిప్యూటీ తహసీల్దారు నివేదిక, కార్యాలయం నుంచి వచ్చిన వివరాల ఆధారంగా సర్వేశాఖ ఉన్నతాధికారులు విచారణ చేపట్టి ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే టి.యెగ్నేశ్వరరావు ఆదేశాలు మేరకు శంకర్‌ను సస్పెండ్ చేశారు. ఈ ఘటన స్థానికంగా చర్చనీయాంశమైంది.

20న బీఈడీ దూరవిద్య కౌన్సెలింగ్

విజయనగరం విద్యావిభాగం, న్యూస్‌టుడే: తిరుపతిలోని పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో 2026-27 విద్యాసంవత్సరానికి సంబంధించి బీఈడీ దూరవిద్య ప్రవేశాలకు ఈనెల 20న కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు అధ్యయన కేంద్రం సమన్వయకర్త ఎన్.శ్రీనివాస్ మోహన్ తెలిపారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుని, మెరిట్ ఆధారంగా మెయిల్స్ వచ్చిన మహిళా ఇన్‌సర్వీసు ఉపాధ్యాయినులు మాత్రమే అర్హులని పేర్కొన్నారు. కరకవలసలోని డా.పీవీజీ రాజాసాహెబ్ ఎడ్యుకేషన్ కళాశాలకు ఒరిజినల్ ధ్రువపత్రాలతో రావాలన్నారు.

విద్యార్థులూ వెళ్లిరండి..

హెచ్ఎం ఉమామహేశ్వరి, ఎస్కార్ట్ టీచర్‌తో విద్యార్థినులు

చీపురుపల్లి, న్యూస్‌టుడే: దిల్లీలో జరుగుతున్న ఇండియా ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్‌లో పాల్గొనే అవకాశాన్ని చీపురుపల్లి బాలుర జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థినులు రుత్తల హర్షిత (9వ తరగతి), పీవీఎల్ ప్రణవి (8వ తరగతి) దక్కించుకున్నారు. వీరు బుధవారం దిల్లీ బయలుదేరి వెళ్తారు. 19న వారు రూపొందించిన ప్రాజెక్టులను ప్రదర్శించనున్నారు. వారికి ఎస్కార్ట్ టీచర్‌గా పాఠశాల భౌతికశాస్త్రం ఉపాధ్యాయిని పి.అనురాధ వెళ్లనున్నారు. రాకపోకలకు విమాన టికెట్లు, అక్కడ రెండు రోజులు బస ఏర్పాట్లు కేంద్ర ప్రభుత్వమే చూస్తోంది. గ్రామాల్లో పరిశుభ్రత కార్యక్రమాలు, పారిశుద్ధ్య కార్మికులకు సంబంధించి కార్యకలాపాలను ఏఐతో జతచేసి ప్రాజెక్టును రూపొందించారు. దేశవ్యాప్తంగా 3,500కి పైగా సైన్స్, ఐటీ ప్రాజెక్టులను విద్యార్థులు పంపారు. వీటిలో 50 ప్రాజెక్టులను ఉత్తమమైనవిగా ఎంపికచేసి అటల్ ఇన్నోవేషన్ మిషన్ ఆధ్వర్యంలో సమ్మిట్‌లో ప్రదర్శించనున్నారు.

మంచంపై తండ్రి.. ఆసుపత్రిలో కుమారుడు

ఆర్థికంగా చితికిపోతున్న కుటుంబం

న్యూస్‌టుడే- చీపురుపల్లి, చీపురుపల్లి గ్రామీణం

ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ధనుంజయదొర

కిరాణా దుకాణం నడిపి కుటుంబాన్ని నెట్టుకొస్తున్న తండ్రి తీవ్ర అనారోగ్యం పాలై మంచానికి పరిమితమయ్యాడు. నేనున్నా నాన్న.. మీకేం కాదు.. కుటుంబానికి అండగా ఉంటా అని ధైర్యం చెప్పే కుమారుడు రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఆసుపత్రిలో ఉన్నాడు. అటు తండ్రి.. ఇటు కుమారుడి పరిస్థితితో కుటుంబం విలవిల్లాడిపోతోంది.

చీపురుపల్లి పట్టణంలోని కొత్తగవిడివీధికి చెందిన ఉంగరాల బాలాజీ, సుప్రియ దంపతులకు కిరాణా దుకాణమే ఆధారం. వీరికి ఇద్దరు సంతానం. కుమారుడు ధనుంజయదొర విజయనగరంలో డీఎల్ఎంటీ కోర్సు, కుమార్తె స్థానికంగా తొమ్మిదో తరగతి చదువుతున్నారు. 2021లో బాలాజీ క్యాన్సర్ బారినపడ్డారు. హైదరాబాద్‌లోని బసవతారకం ఆసుపత్రిలో చికిత్స పొందారు. కొంతవరకు కోలుకున్నా.. మంచానికే పరిమితమయ్యారు. మల, మూత్ర విసర్జన వ్యవస్థ పాడవడంతో బ్యాగులను అమర్చారు. వాటిని ఎప్పటికప్పుడు మార్చుతుండాలి. ఈ క్రమంలో 2023లో హెర్నియా బారినపడ్డారు. విజయనగరంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో శస్త్రచికిత్స చేయించగా.. కోలుకున్నారు. 2025 అక్టోబర్‌లో మరోసారి హెర్నియా బయటపడింది. మళ్లీ శస్త్రచికిత్స చేయించారు. ఈసారి విఫలమై శరీరమంతా ఇన్ఫెక్షన్ అయ్యి తీవ్ర అనారోగ్యానికి గురయ్యారు. విశాఖపట్నంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించారు. అప్పటి నుంచి అక్కడే వైద్యం పొందుతున్నారు. రెండు రోజులకోసారి ఇంటి నుంచి తీసుకెళ్లి తీసుకొస్తున్నారు. ఈ వైద్యానికి రూ.20 లక్షల వరకు ఖర్చయిందని భార్య సుప్రియ తెలిపారు. బాలాజీ తండ్రి నారాయణ ఆర్మీ విశ్రాంత ఉద్యోగి. కుటుంబ సంపాదనంతా వైద్యానికే ఖర్చుచేసి పూర్తిగా చితికిపోయారు.

ఇంతలోనే విషాదం

ఇంతటి బాధలో ఉన్న కుటుంబాన్ని కుమారుడి రోడ్డు ప్రమాదం ఘటన తీవ్ర విషాదంలో నింపేసింది. ఈనెల 9న ధనుంజయదొర తండ్రిని విశాఖపట్నం ఆసుపత్రి నుంచి ఇంటికి తీసుకొచ్చారు. మరుసటి రోజు కళాశాలకు ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా గుర్ల మండలం గుజ్జింగివలస వద్ద ఎదురుగా వచ్చిన మరో ద్విచక్ర వాహనం ఢీకొంది. చేయి, భుజం, కాళ్లు, పాదాల వద్ద తీవ్ర గాయాలయ్యాయి. కాలు భాగంలో రెండుచోట్ల ఎముకలు విరిగిపోయాయి. విజయనగరంలోని ఓ ఆసుపత్రిలో రెండు శస్త్రచికిత్సలు జరిగాయి. ప్రస్తుతం చికిత్స పొందుతున్నాడు.

ఇల్లాలి బాధ వర్ణనాతీతం

సుప్రియ రోజూ భర్తకు సపర్యలు చేసి, కుమారుడి వద్దకు పరుగులు తీస్తోంది. ఆర్థికంగా చితికిపోవడం.. భర్త మంచానపడి.. కుమారుడు ఆసుపత్రిలో.. ఏం చేయాలో పాలుపోని దుస్థితిలో తీవ్ర మనోవేదనకు గురవుతున్నారు. ధనుంజయదొర స్నేహితులు విషయాన్ని సామాజిక మాధ్యమాల్లో పెడితే కొంత ఆర్థిక తోడ్పాటు అందింది. దాతలు స్పందించి ఆదుకోవాలని కుటుంబీకులు కోరుతున్నారు.

ఇంటి వద్ద మంచానికి పరిమితమైన తండ్రి బాలాజీకి సపర్యలు చేస్తున్న కుమార్తె

పకోడి కోసం వెళ్తే.. రూ.2.15 లక్షలు పట్టుకుపోయారు!

రాజాం, న్యూస్‌టుడే: రేగిడి మండలం బూరాడ గ్రామానికి చెందిన పల్ల వెంకటరమణరావు కుటుంబ అవసరాల కోసం రాజాం పట్టణంలోని ఒక బ్యాంకులో సోమవారం బంగారు నగలు కుదవ పెట్టి రూ.2.15 లక్షలు రుణం తీసుకున్నారు. నగదును ఒక పాలిథీన్ సంచిలో పెట్టి ద్విచక్ర వాహనం ముందు ఉండే ట్యాంక్ కవరులో ఉంచి ఇంటికి బయలుదేరారు. మార్గమధ్యలో పొనుగుటివలస కూడలి వద్ద పకోడి కొనుగోలు చేసేందుకు వాహనాన్ని పక్కన నిలిపారు. తిరిగి వచ్చేసరికి ముందు ఉంచిన నగదు కవర్‌ను ఆగంతుకులు చోరీచేశారు. బాధితుడు మంగళవారం సంతకవిటి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సంతకవిటి హెచ్‌సీ రామకృష్ణ తెలిపారు.

వీరు వెళ్లరు.. వారు చెప్పరు!

- సహకరించని సిబ్బంది, ప్రజలు
- కుటుంబ సర్వేకు ఆటంకాలు

న్యూస్‌టుడే- రాజాం

ఏకీకృత కుటుంబ సర్వేకు అడుగడుగునా ఆటంకాలు ఎదురవుతున్నాయి. కొన్ని సచివాలయాల పరిధిలో సిబ్బంది సహకరించకపోవడం, ఇంకొన్ని చోట్ల జనం సమాచారం ఇచ్చేందుకు ఆసక్తి చూపకపోవడంతో నత్తనడకన సాగుతోంది. ఈనెల 10 నాటికే దీన్ని పూర్తి చేయాలని ప్రభుత్వం నిర్దేశించినా పూర్తికాకపోవడంతో ఈనెల 20 వరకు పెంచారు. మరో మూడు రోజుల్లో గడువు ముగుస్తున్నా.. ఇంకా 15.89 శాతం కుటుంబాల నుంచి సమాచారం రాలేదని గుర్తించారు. జిల్లాలోని 5,541 మంది సచివాలయాల సిబ్బందికి సర్వే బాధ్యతలను అప్పగించారు.

సర్వే పరిశీలిస్తున్న జిల్లా స్వర్ణ వార్డు, గ్రామ పర్యవేక్షణాధికారిణి రోజారాణి

ఇళ్లకు వెళ్తున్న సిబ్బందికి జనం ప్రశ్నలు సంధిస్తున్నారు. సమగ్ర సమాచారం సేకరించాల్సి ఉండడంతో అన్నీ చెప్పేందుకు వెనుకంజ వేస్తున్నారు. మీకెందుకు సమాచారం ఇవ్వాలని కొందరు ఎదురు తిరుగుతున్నారు. ఇందులో నమోదైన డేటా మున్ముందు అన్నింటినీ పరిగణనలోకి తీసుకుంటారని, వివరాలు ఇచ్చేందుకు నిరాకరిస్తే.. వారే ఇబ్బందులు పడాల్సి ఉంటుందని జిల్లా స్వర్ణ గ్రామం, స్వర్ణ వార్డు అధికారిణి రోజారాణి తెలిపారు. అనుమానం ఉంటే ఉద్యోగి గుర్తింపు కార్డు చూపించమని అడగొచ్చని, ఎవరూ భయపడాల్సిన పన్లేదన్నారు.

పలువురికి షోకాజ్ నోటీసులు

సచివాలయాల్లోని కొన్ని శాఖల పరిధి ఉద్యోగులు చాలాచోట్ల సహకరించడం లేదని గుర్తించారు. వీరికి లక్ష్యాలు తక్కువగా పెట్టినా ప్రగతి ముందుకెళ్లడం లేదు. విజయనగరం నగరపాలిక పరిధి గంజిపేట సచివాలయాన్ని స్వర్ణవార్డు, గ్రామ పర్యవేక్షణాధికారి రోజారాణి మంగళవారం పరిశీలించారు. అడ్మిన్ ఒక్కరే సర్వేలో పాల్గొన్నట్లు గుర్తించారు. పలువురికి షోకాజ్ నోటీసులు జారీ చేశారు. విజయనగరంలో 13,840, బొబ్బిలిలో 1,994, నెల్లిమర్ల 1,007, రాజాం 1,341 కుటుంబాల సమాచారం ఇంకా సేకరించాల్సి ఉందని గుర్తించారు.

ఇదీ సర్వే పరిస్థితి..

ప్రాంతం	సచివాలయాలు	కుటుంబాలు	పూర్తయినవి	పెండింగ్
గ్రామీణం	530	5,04,186	4,23,053	81,133
పట్టణాలు	96	1,21,079	1,02,897	18,182

కష్టపడేవారికి పదవులిస్తేనే ఫలితం

తెదేపా సమావేశంలో పలువురి అభిప్రాయం

ఈనాడు, విజయనగరం

పార్టీ అభివృద్ధికి కష్టపడేవారికి పదవులు కట్టబెడితే సత్ఫలితాలు ఉంటాయని తెదేపా నాయకులు అభిప్రాయపడ్డారు. మంగళగిరిలోని ఆ పార్టీ కేంద్ర కార్యాలయంలో విజయనగరం పార్లమెంటు పరిధిలోని ఎమ్మెల్యేలు, నియోజకవర్గాల పార్టీ సమన్వయకర్తలు, పార్లమెంటు అధ్యక్షుడితో పార్టీ అనుబంధ విభాగాల కార్యవర్గ నియామకాలకు సంబంధించి మంగళవారం చర్చించారు. కార్యకర్తల్లో ఎదిగే లక్షణాలున్న వారిని ఎంపిక చేస్తే అన్నివిధాలా పార్టీకి మేలు జరుగుతుందన్నారు. సమావేశానికి రణస్థలం నియోజకవర్గ ప్రతినిధిగా ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, చీపురుపల్లి ఎమ్మెల్యే కిమిడి కళావెంకటరావు, విజయనగరం ఎమ్మెల్యే అదితి గజపతిరాజు, రాజాం ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్, నెల్లిమర్ల సమన్వయకర్త కర్రోతు బంగార్రాజు, పార్టీ జిల్లా అధ్యక్షుడు కిమిడి నాగార్జున, ప్రధాన కార్యదర్శి ప్రసాదుల వరప్రసాద్ హాజరయ్యారు. బొబ్బిలి ఎమ్మెల్యే బేబినాయన అనారోగ్యం కారణంగా, గజపతినగరం ఎమ్మెల్యే, మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అత్యవసర పనుల కారణంగా అనుమతి తీసుకుని హాజరు కాలేదని తెలిసింది. ఈ అంశంపై మరోసారి చర్చించి తుది నిర్ణయం తీసుకునేందుకు ఈ నెల 24న సమావేశం కావాలని వారు నిర్ణయించారు.

పునాదుల బలోపేతానికి సూచనలు

గ్రామ స్థాయి నుంచి పార్టీ పునాదులు బలోపేతానికి తెదేపా నాయకత్వం అన్ని చర్యలు తీసుకుంటోంది. బలహీనంగా ఉన్న పోలింగ్ బూత్‌ల పరిధిలోని నాయకులకు మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు, సీనియర్ నాయకుడు గన్ని వీరాంజనేయులు, విజయనగరం పార్లమెంటు పార్టీ అధ్యక్షుడు కిమిడి నాగార్జున శిక్షణ తరగతుల్లో సూచనలు చేశారు. ప్రత్యేక దృష్టిసారించి ఓటింగ్ పెంపునకు ఎలా కృషిచేయాలో వారు వివరించారు. ప్రజల మనసు గెలుచుకునేలా ప్రణాళికలు రూపొందించి అమలు చేయాలన్నారు.

ప్రత్యర్థిని ఫుట్‌బాల్ ఆడేశారు..

విజయనగరంలోని రాజీవ్ క్రీడా మైదానంలో మంగళవారం ఫుట్‌బాల్ పోటీలు ఉత్సాహంగా సాగాయి. ఉత్తరాంధ్ర చిట్టి వైష్ణవి స్మారక సెవెనర్స్ పేరిట నిర్వహించగా.. ఎనిమిది జట్లు పాల్గొన్నాయి. తొలి సెమీ ఫైనల్‌లో కొమ్మాది(విశాఖ)పై నెల్లిమర్ల బృందం విజయం సాధించింది. రెండో సెమీస్‌లో స్టార్‌ఫ్లెక్సీ(విశాఖ), టౌన్‌స్పోర్ట్స్ క్లబ్(విజయనగరం) హోరాహోరీగా తలపడ్డాయి. 1- 1 గోల్స్ రావడంతో మ్యాచ్ డ్రా అయ్యింది. పెనాల్టీ షూట్‌అవుట్‌లోనూ 3- 3 గోల్స్ రావడంతో ఫలితం తేల్చడానికి టాస్ వేశారు. ఇందులో ఆతిథ్య జట్టుకు అనుకూలంగా ఫలితం రావడంతో ఫైనల్‌కు చేరింది. నెల్లిమర్లపై 2-0తో జయకేతనం ఎగరవేసింది.
– న్యూస్‌టుడే, విజయనగరం బాబామెట్ట

కంచం కడగాలంటే కుస్తీ పట్టాల్సిందే

ఏదో వింత వస్తువు కనిపిస్తే చూడటానికి విద్యార్థినులంతా గుమిగూడారనుకునేరు..! అదేం కాదండి.. చీపురుపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనం అనంతరం కంచాలు కడుక్కునేందుకు అవస్థలివి. పాఠశాలలో 763 మంది చదువుతున్నారు. ట్యాంకు నుంచి నీటిని సరఫరా చేసే కుళాయిలు ఉన్నా సరిపోవడం లేదు. పాఠశాల ఆవరణలో ఉన్న రెండు చేతి బోర్లలో ఒకటి కొద్ది రోజుల కిందట పాడైంది. దీంతో మధ్యాహ్నం భోజనం చేశాక కంచాలు శుభ్రం చేసుకోవడానికి అవస్థలు పడుతున్నారు. బోరుకు మరమ్మతులు చేయిస్తామని, నీటి సమస్య తీర్చేందుకు చర్యలు తీసుకుంటామని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఐ.రామకృష్ణ తెలిపారు. – న్యూస్‌టుడే, చీపురుపల్లి

భానుడు మళ్లీ ఉదయించాలని

పండంటి బిడ్డ పుడితే మురిసిపోయిందా తల్లి
తమ ఇంట వెలుగులొచ్చాయని..
భాను అని పేరుపెట్టి బారసాల చేసింది..
విద్యుత్తు తీగ కంటి వెలుగును దూరం చేస్తే
బతుకు చీకటిమయంగా మారి కన్నీరుపెట్టింది..
–ఇది ఓ అమ్మ కథ

నువ్వు తల్లివి కాబోతున్నావ్..
నాలుగేళ్ల వివాహ బంధంలో
నాలుగు నెలల క్రితమే కమ్మని మాట వింది..
అంతలోనే అనుకోని విషాదం
కడుపులో బిడ్డను చూసి సంతోషించాలా..
కట్టుకున్నవాడు ఇక లేడని బాధపడాలా..
ఏం చేయలేని నిస్సహాయ స్థితి
–ఇది మరో ఇల్లాలి వేదన

కంట నీరు పంటికింద బిగపట్టి..
ఇద్దరూ సమాజహితం కోరారు..
అవయవదానంతో కొందరికైనా ఊపిరిపోసి..
వాళ్లలో తమ ప్రాణాన్ని చూడాలనుకున్నారు..

బ్రెయిన్ డెడ్ యువకుడి అవయవాలు దానం

భాను (దాచిన చిత్రం)

శృంగవరపుకోట, న్యూస్‌టుడే : మండలంలో బొడ్డవర గ్రామానికి చెందిన మాసాడ కొండబాబు(భాను)(33) గత శుక్రవారం కిల్తంపాలెం పంచాయతీ రాయవానిపాలెంలో విద్యుత్తు తీగలు సరిచేసేందుకు స్తంభం ఎక్కి విద్యుదాఘాతానికి గురై కిందపడ్డారు. సిమెంటు రోడ్డుపై పడడంతో తలకు తీవ్ర గాయమైంది. కుటుంబీకులు ఎస్.కోటలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చేర్చారు. పరిస్థితి విషమంగా ఉండడంతో విశాఖలోని మరో ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. ఇతని బ్రెయిన్‌డెడ్ అయినట్లు ఆసుపత్రి వైద్యులు సోమవారం సాయంత్రం చెప్పడంతో కన్నీరుమున్నీరయ్యారు. ఆసుపత్రి వైద్యులు అవగాహన కల్పించడంతో అవయవదానానికి కుటుంబీకులు ముందుకొచ్చారు. దీంతో కాలేయం, కిడ్నీ, కార్నియాలను వైద్య సిబ్బంది సేకరించారు.

భార్య నాలుగు నెలల గర్భిణి

భాను స్థానికంగా ఎలక్ట్రికల్ పనులు చేస్తుంటాడు. తండ్రి దేముడు, తల్లి మంగలకు పెద్దకుమారుడైన ఇతనికి నాలుగేళ్ల క్రితం రమణితో వివాహమైంది. ఈమె గరివిడి మండలం మందిరివలసలో గ్రామ సర్వేయరు. ప్రస్తుతం నాలుగు నెలల గర్భిణి. కొద్ది నెలల్లో తల్లిదండ్రులం కాబోతున్నామంటూ ఉప్పొంగిపోయారు. ఇంతలోనే ఆ ఇంట విషాదం చోటుచేసుకుంది.

జ్ఞాపకాల మదిలో...
జాతస్య హిధ్రువో మృత్యుః ధ్రువం జన్మ మృతస్యచ
తస్మాద పరిహార్యేర్థే నత్వం శోచితు మర్హసి

మీరు చూపిన ఆత్మీయత..
అనురాగం మా అభివృద్ధికి వేసిన పూబాట..
మీరు భౌతికంగా దూరమైనా మా చెంత ఉన్నట్లే ఉంది..
ఏమిచ్చి రుణం తీర్చుకోము మా యదలోతుల్లోని భావాలను అక్షరరూపంలో నివేదించడం తప్ప...
నిర్యాణం, వర్ధంతి, జయంతి
ఈనాడు యాడ్స్ ద్వారా తెలియజేయండి
5% అదనం
ఈనాడు ప్రకటనల విభాగం
9000866020, 8008597609

ఈ- నారీతో జీవనోపాధులు మెరుగు

మయూరి కూడలి: స్వయం సహాయక సంఘాలకు ప్రభుత్వాలు ఇస్తున్న రూ.కోట్ల నిధులు దుర్వినియోగం కాకుండా ఈ-నారీ వ్యవస్థ దోహదపడుతుందని, జీవనోపాధులు మెరుగుపడతాయని వెలుగు ఏపీడీ సావిత్రి అన్నారు. మంగళవారం విజయనగరంలోని టీటీడీసీ ప్రాంగణంలో జరిగిన శిక్షణ కార్యక్రమంలో మాట్లాడారు. డీపీఎంలు రాజ్‌కుమార్, చిరంజీవి, లక్ష్మునాయుడు, రవికుమార్ పాల్గొన్నారు.

ఐఐటీ సీటు సాధిస్తా

విజయనగరం విద్యావిభాగం, న్యూస్‌టుడే: జేఈఈ అడ్వాన్స్‌డ్ ద్వారా ఐఐటీ సీటు సాధించాలన్నదే తన లక్ష్యమని విజయనగరానికి చెందిన వల్లంటి దీపక్‌చంద్ర పేర్కొన్నారు. జేఈఈ మెయిన్‌లో 99.90 పర్సంటైల్ సాధించారు. ముంబయి లేదా చెన్నై ఐఐటీలో కంప్యూటర్‌సైన్స్ చదువుతానని తెలిపారు. ఏడో తరగతి వరకు విజయనగరంలో చదివిన దీపక్ విశాఖపట్నంలో ఎనిమిదో తరగతి పూర్తి చేసి, తొమ్మిది నుంచి విజయవాడలో చదువుతున్నాడు. తల్లిదండ్రులు జ్యోతి, సత్యనారాయణ ఉపాధ్యాయ వృత్తిలో ఉన్నారు.

మెరిశారు.. మురిశారు

జేఈఈ మెయిన్స్ పరీక్ష ఫలితాల్లో ఉమ్మడి జిల్లా విద్యార్థులు సత్తా చాటారు. మంచి పర్సంటైల్‌తో ప్రతిభ చూపారు. న్యూస్‌టుడే, వంగర, పాలకొండ, పార్వతీపురం, గరుగుబిల్లి, గజపతినగరం

పాలవలస భార్గవనాయుడు

◆ కొత్తకోట (గ్రామం), వంగర మండలం ● 99.99 ■ అప్పలరాము (ఉపాధ్యాయుడు), లలిత కుమారి (గృహిణి)

ఉత్తరావెల్లి సాయి అభిజిత్ నాయుడు

◆ మద్దివలస, వంగర మండలం ● 98.997 ■ గణేష్‌నర్సీ, పార్వతి (సర్పంచి)

పాలవలస హరిరామ్ ప్రసాద్

◆ కొత్తకోట, వంగర మండలం ● 98.91 ■ పాలవలస రాంబాబు, పద్మ (రియల్ ఎస్టేట్)

బి.పూర్ణచంద్ర

◆ బురదవెంకటాపురం, గరుగుబిల్లి ● 99.112 ■ నారాయణ స్వామి (ఉపాధ్యాయుడు), తల్లి గృహిణి

గొర్లె నిహారిక

◆ పురిటిపెంట, గజపతినగరం మండలం ● 99.78 ■ శ్రీనివాసనాయుడు, లక్ష్మి

సారిక కృష్ణమనోజ్ నాయుడు

◆ తూర్పువీధి (పార్వతీపురం) ● 99.65 ■ సులోచన నాయుడు(గృహిణి), కృష్ణం నాయుడు(వ్యాపారి)

పెంట శ్రీశాంత్

◆ గరుగుబిల్లి, హిక్కింవలస గ్రామం ● 99.98 ■ తండ్రి శ్రీనివాసరావు, తల్లి వసంతలక్ష్మి

సూచిక: ◆ గ్రామం ● పర్సంటైల్ ■ తల్లి దండ్రులు

స్టోర్ రూములో సరకులు పరిశీలిస్తున్న సీనియర్ సివిల్ జడ్జి కృష్ణప్రసాద్

ఖైదీలపై వివక్ష తగదు

శృంగవరపుకోట, న్యూస్‌టుడే: ఖైదీలపై వివక్ష చూపించరాదని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఎ.కృష్ణప్రసాద్ అన్నారు. జాతీయ న్యాయ సేవాధికార సంస్థ, జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆదేశాల మేరకు మంగళవారం ఎస్.కోటలోని సబ్ జైలును మంగళవారం సందర్శించారు. ఖైదీలకు న్యాయ విజ్ఞాన సదస్సుపై అవగాహన కల్పించారు. వారిపట్ల వివక్ష చూపిస్తే కఠిన చర్యలుంటాయని హెచ్చరించారు. జైలులో లీగల్ ఎయిడ్ క్లినిక్‌ను తనిఖీ చేశారు. న్యాయవాదులు, పారా లీగల్ వాలంటీర్ల నిర్వహిస్తున్న విధుల గురించి ఆరా తీశారు. ఖైదీలతో మాట్లాడుతూ.. నేర ప్రవృత్తిని విడిచిపెట్టి మంచి పౌరులుగా మెలగాలని హితవు పలికారు. జైలులో ఉన్న న్యాయ సహాయం అందించడానికి ఏర్పాటు చేసిన జైల్ లీగల్ ఎయిడ్ క్లినిక్‌ను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కారాగారంలో అందుతున్న సౌకర్యాలపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. లీగల్ సర్వీసెస్ సిబ్బంది, సబ్‌జైలు సూపరింటెండెంట్ సత్యనారాయణ పాల్గొన్నారు.

పరిమితికి మించితే చర్యలు

అయ్యన్నపేట, న్యూస్‌టుడే: పరిమితికి మించి అధిక లోడుతో ప్రయాణిస్తున్న వాహనాలపై కఠిన చర్యలు తప్పవని ఎస్పీ దామోదర్ మంగళవారం ఓ ప్రకటనలో హెచ్చరించారు. ఎండుగడ్డి, కర్రలు, ఇటుక, ఇసుక, గ్రావెల్, మట్టి, సిమెంట్.. తదితర లోడులతో వెళ్లేవారు తప్పనిసరిగా నిబంధనలు పాటించాలన్నారు. ఒకవేళ యజమాని ఒత్తిడి తెస్తే సమీప పోలీసు స్టేషన్ లేదా ట్రాఫిక్ అధికారులకు సమాచారం అందించాలని, లేని పక్షంలో లైసెన్సు రద్దు చేస్తామన్నారు. ఓవర్ లోడింగ్‌ను నియంత్రించేందుకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తామన్నారు. ఈ విషయంలో పోలీసులకు సహకరించాలన్నారు.

అమెరికా అమ్మ ఇక లేరు

చార్లెస్ డి లార్జ్(పాతచిత్రం)

కొత్తవలస, న్యూస్‌టుడే: దత్తిలో హోమ్స్ ఆఫ్ ది ఇండియన్ నేషన్(హోయినా) అనాథ ఆశ్రమ వ్యవస్థాపకురాలు, అమెరికాకు చెందిన చార్లెస్ డి లార్జ్(91) ఇకలేరు. అమెరికాలోని తన నివాసంలో సోమవారం మృతిచెందారని క్యాంపస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డా.గ్లోరీ జెన్స్, మేనేజర్ శ్రీనివాస్‌కుమార్ మంగళవారం తెలిపారు.

అమెరికాలో పుట్టి..

చార్లెస్ డి లార్జ్ 1935లో జన్మించారు. అప్పట్లో మదర్ థెరెస్సాతో కలిసి చెన్నైలో సేవలు అందించారు. ఈ క్రమంలో 1978లో మద్రాసులో బాలికల హోమ్‌ను ప్రారంభించారు. తర్వాత బాపట్లలో బాలుర హోమ్‌ను నెలకొల్పారు. సేవలకు గానూ అప్పట్లో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నుంచి ప్రశంసలు అందుకున్నారు. కొత్తవలస మండలం దత్తి రెవెన్యూలో 25 ఎకరాల భూమిని కొనుగోలు చేసి 2001లో బాల, బాలికల కోసం ప్రత్యేక వసతి గృహాలు నిర్మించి ఇక్కడ కూడా ఒక హోమ్‌ను ప్రారంభించారు. చెన్నై, బాపట్లలో ఉన్న బాలికలు, బాలురును ఇక్కడకు తీసుకొచ్చి.. భర్త బ్రూస్ లార్జ్‌తో కలిసి నిర్వహించారు.

ఉచిత విద్య, వసతి..

కులమతాలకు అతీతంగా నిరుపేదలు, అనాథలు, దివ్యాంగ పిల్లలకు ప్రవేశాలు కల్పించి ఉచిత విద్య, భోజన, వసతి సదుపాయాలు అందించారు. కళలు, సంప్రదాయ నృత్యాలు, ఆత్మరక్షణ నైపుణ్యాలలో శిక్షణ ఇస్తున్నారు. వ్యక్తిగత విరాళాలు, చర్చిలు, సేవా సంస్థల ద్వారా నిధులు సమకూర్చుకుని పిల్లల భవిష్యత్తును తీర్చిదిద్దుతున్నారు. ఏడాదికి రెండు, మూడు సార్లు అమెరికా నుంచి ఇక్కడకు వచ్చి పిల్లల బాగోగులు చూస్తుండేవారు. ఆశ్రయం పొందుతున్నవారితో పాటు నిర్వాహకులు, ఉద్యోగులు, స్థానికులు 'మామ్' అని పిలుస్తుంటారు. పెద్దలంతా అమెరికా అమ్మ అని అంటారు. స్థానికంగా ఉన్న హోమ్‌లో ప్రస్తుతం 125 మంది ఉన్నారు. చార్లెస్ మృతితో విషాదఛాయలు అలుముకున్నాయి.

కొత్తవలస మండలం దత్తిలోని హోయినా ఆశ్రమంలో నివాళులర్పిస్తున్న చిన్నారులు

మధుర ఫలం.. కవర్లతో భద్రం

న్యూస్‌టుడే- రాజాం

జిల్లాలో మామిడి తోటలు విస్తారంగా సాగవుతున్నాయి. దిగుబడి సమయంలో నాణ్యతను బట్టే కాయల రేటు ఉంటుంది. పిందె దశలో తగిన జాగ్రత్తలు తీసుకోకపోతే రైతుకు తీవ్ర నష్టం జరుగుతుంది. దీన్ని గుర్తించిన ప్రభుత్వం ఉద్యానశాఖ ద్వారా పిందె దశ నుంచే వాటికి కవర్లు తొడిగి సంరక్షించేలా చర్యలు చేపట్టింది. కవరు, కూలీల ఖర్చులో 50 శాతం రాయితీ ఇస్తూ రైతులను ఆదుకుంటోంది. అవగాహన లేకపోవడంతో రైతులు సద్వినియోగం చేసుకోలేకపోతున్నారు. జిల్లాలో 82,500 ఎకరాల్లో మామిడి తోటలు ఉన్నాయి.

సంతకవిటి మండలం తాలాడలో మామిడి పిందెలకు కవర్లు (పాతచిత్రం)

ఒక హెక్టారుకు రాయితీ ఇలా..

★ ఒక హెక్టారుకు 15 వేల కవర్లు అవసరం ★ ఒక్కో కవరు ధర రూ.2.50 ★ మొత్తం విలువ: రూ.37,500 ★ ఇందులో 50శాతం రాయితీ: 18,750 ★ కవర్లు తొడిగేందుకు కూలీల ఖర్చులు: రూ.12,500 ★ ఇందులో 50 శాతం రాయితీ: రూ.6,250 ★ ఒక హెక్టారుకు అందించే మొత్తం రాయితీ: రూ.25 వేలు

గరిష్ఠంగా అయిదెకరాలు..

రెండు నుంచి అయిదెకరాల లోపు ఉన్న రైతులకు ఉద్యానశాఖ 50 శాతం రాయితీ సమకూర్చుతోంది. కాయలను ఆశించే పురుగులు, తెగుళ్ల నుంచి బయట పడేందుకు ఇది రక్షణ కవచంలా నిలుస్తుంది. కాయ నాణ్యత పెరిగితే మార్కెట్లో సాధారణ కాయలకంటే అధిక ధర పలుకుతుంది. ఒక్కో రైతు గరిష్ఠంగా రెండు హెక్టార్లు(అయిదు ఎకరాలు) వరకు రాయితీ పొందొచ్చు. రెండు హెక్టార్లకు రూ.50 వేల వరకు ఉద్యానశాఖ రాయితీ అందిస్తోందని రాజాం ఉద్యానశాఖ అధికారిణి ఉమామహేశ్వరి తెలిపారు.

ఉద్యానశాఖ అధికారులను సంప్రదించాలి..

★ ఫ్రూట్ కవర్లు ఏర్పాటు చేస్తే వాతావరణ పరిస్థితులు, తెగుళ్లను తట్టుకుని ఆకర్షణీయ రంగుతో దిగుబడి వస్తుంది. ★ నిమ్మకాయ పరిమాణంలో ఉన్నప్పుడు తొడిగితే నాణ్యమైన దిగుబడి సాధించొచ్చు. ★ రైతు సేవా కేంద్రాల్లోని ఉద్యానశాఖ అధికారులను సంప్రదించాలి. వారికి అర్జీ ఇస్తే అర్హతను బట్టి కవర్లు ఏర్పాటు చేస్తారు. ★ రైతులు కూడా మార్కెట్లో కొనుగోలు చేసుకోవచ్చు. ★ దరఖాస్తు 1బీ, ఆధార్, బ్యాంకు ఖాతా సమర్పించాలి.

ఒక్కో రైతుకు రూ.50వేలు రాయితీ

గోడప్రతులను ఆవిష్కరిస్తున్న ఏపీఎన్‌జీజీవో నాయకులు

'సాగర సంగ్రామం' విజయవంతానికి పిలుపు

విజయనగరం విద్యావిభాగం, న్యూస్‌టుడే: ఏపీసీపీఎస్‌ఈఏ(ఆంధ్రప్రదేశ్ కాంట్రిబ్యూటరీ పింఛను పథకం ఉద్యోగుల సంఘం) ఆధ్వర్యంలో ఈనెల 22న విశాఖపట్నంలో జరిగే 'సాగర సంగ్రామం' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఏపీఎన్‌జీజీవో అధ్యక్ష, కార్యదర్శులు సురేష్, శ్రీధర్ పిలుపునిచ్చారు. విజయనగరంలోని ఎన్‌జీవో భవనంలో మంగళవారం సంబంధిత గోడప్రతులను ఆవిష్కరించారు. పెండింగ్‌లో ఉన్న డీఏ బకాయిలు విడుదల చేయాలని, అందరికీ ఆమోదయోగ్యమైన పింఛను విధానాన్ని అమలు చేయాలని డిమాండు చేశారు. జిల్లా అధ్యక్షుడు వి.రమణ, రాష్ట్ర కార్యదర్శి కె.ధనుంజయ్ తదితరులు పాల్గొన్నారు.

లింగసమానత్వం పాటించాలి

మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో జీవనరాణి

విజయనగరం అయ్యన్నపేట, న్యూస్‌టుడే: లింగవివక్ష చూపకుండా సమాత్వం పాటిస్తూ, మహిళలపై జరుగుతున్న హింసను అరికట్టాలని డీఎంహెచ్‌వో జీవనరాణి పిలుపునిచ్చారు. మంగళవారం తన కార్యాలయంలో జరిగిన సమావేశంలో మాట్లాడారు. అల్ట్రాసౌండ్ స్కానింగ్ సెంటర్లు, ఎంఆర్ఐ, ఇతర స్కాన్ సెంటర్లు తప్పనిసరిగా నిబంధనలు పాటించాలని ఆదేశించారు. పనిచేసే వైద్యుల అర్హత పత్రాలను అందించాలని, లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. పీసీపీఎన్డీటీ నోడల్ అధికారి అచ్యుతకుమారి, డిప్యూటీ డీఎంహెచ్‌వో సూర్యనారాయణ, ఎస్సై శిరీషా తదితరులు పాల్గొన్నారు.

పూర్వపు డీఎంపై చర్యలకు విజిలెన్స్ సిఫార్సు

ఈనాడు, విజయనగరం

పౌర సరఫరాల సంస్థ పూర్వపు జిల్లా మేనేజరు మీనాకుమారి హయాంలో జరిగిన అవినీతి ఆరోపణలపై విజిలెన్స్, ఫోర్స్‌మెంట్ అధికారులు విచారణ పూర్తి చేశారు. వైకాపా ప్రభుత్వ హయాంలో అసిస్టెంటు మేనేజరు (సాంకేతిక)గా పని చేస్తూ అప్పటి ప్రభుత్వ పెద్దల ఆశీస్సులతో మేనేజరుగా మూడేళ్ల పాటు కొనసాగిన ఆమెపై వెల్లువెత్తిన ఆరోపణలపై జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి, రాష్ట్ర హోం మంత్రి అనిత గత జూన్‌లో జరిగిన డీఆర్సీలో విచారణకు ఆదేశించారు. ఈక్రమంలో మూడు, నాలుగు అంశాల్లో అక్రమాలు వెలుగుచూసినట్లు తెలిసింది.

★ ధాన్యం సేకరణకు రైతులు వినియోగించిన గోనె సంచులకు సంబంధించి నగదు వారి పేరిట కాకుండా తమకు అనుకూలమైన మిల్లర్లకు చెల్లించారు. ఆన్‌లైన్‌లో రైతుల ఖాతాల్లో నగదు జమ చేయకుండా నిబంధనల గీత దాటారు. ఈ సంస్థకు సేవలందించే సాఫ్ట్‌వేర్ సంస్థ మేనేజరుతో కుమ్మక్కై సుమారు రూ.కోటికి పైగా ఖాతాలకు మళ్లించారని, వారి నుంచి తమ సంబంధీకుల ఖాతాలకు జమ చేయించినట్లు ఆరోపణలు ఎదుర్కొన్నారు. ఈ చెల్లింపులపై బ్యాంకు లావాదేవీలు పరిశీలించగా సుమారు రూ.50 లక్షలకు పైగా గోల్‌మాల్ జరిగిందని తేల్చినట్లు తెలిసింది. ★ సంస్థలో డేటా ఎంట్రీ ఆపరేటర్ల పోస్టులకు పొరుగు సేవల ప్రాతిపదికన నియామకానికి ఎంపిక చేసిన తీరులోనూ నిబంధనలు పాటించలేదు. నియామకాల్లో ప్రతిభ జాబితాలో ముందున్న వారికి అన్యాయం జరిగిందని ఆరోపణలు ఎదుర్కొన్నారు. వీటిపై దస్త్రాలను పరిశీలించిన విజిలెన్స్ అధికారులు వాటి నిగ్గు తేల్చారు.

పప్పు.. తప్పు: రేషన్ కందిపప్పు నాశిరకంగా ఉన్నా సరఫరాదారు పంపిన లారీ నుంచి అన్‌లోడ్ చేయించారు. శ్రీకాకుళం జిల్లాలో తిరస్కరించిన 25 మెట్రిక్ టన్నుల పప్పు సరఫరాదారుతో కుమ్మక్కై తీసుకున్నారని ఆరోపణలు ఎదుర్కొన్నారు. ఆరేడు నెలల విచారణ అనంతరం పూర్వపు డీఎం సహా ఆమెకు సహకరించిన అధికారులపై శాఖాపరమైన చర్యలతో పాటు క్రిమినల్ చర్యలు తీసుకోవాలని విజిలెన్స్ అధికారులు తమ నివేదికలో ప్రభుత్వానికి సిఫార్సు చేసినట్లు సమాచారం.

పంటకాలువలో పడి వలస కూలీ మృతి

ఆదినారాయణ (పాత చిత్రం)

చీపురుపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: రెక్కాడితే గానీ డొక్కాడని కుటుంబం.. పొట్ట చేత పట్టుకుని పని కోసం జిల్లాలు దాటాడు. కుమార్తె భవిష్యత్తు బాగుండాలని కలలు కన్నాడు. పని అంతా సక్రమంగా ఉందని, బెంగ పెట్టుకోకుండా జాగ్రత్తగా ఉండండని భార్యతో ఫోన్‌లో మాట్లాడిన మాటలే ఆఖరివి అవుతాయని వారు అనుకోలేదు. ప్రమాదవశాత్తు పంట కాలువలో పడి వ్యక్తి మృతిచెందిన ఘటన పల్నాడు జిల్లా నర్సరావుపేట మండలంలో చోటుచేసుకుంది. బాధిత కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం.. చీపురుపల్లి మండలం జి.ములగాం గ్రామానికి చెందిన కక్కి ఆదినారాయణ(40) తాపీ పని చేస్తుంటారు. 20 రోజుల క్రితం గ్రామానికి చెందిన మరో నలుగురితో కలిసి పల్నాడు జిల్లా నర్సరావుపేట మండలం వెళ్లారు. అక్కడ ఒక వెంచర్‌లో పనికి కుదిరారు. సమీపంలోని హనుమాన్ నగరంలో నివాసం ఉంటున్నారు. శివరాత్రి మరుసటిరోజు సోమవారం పనికి సెలవు ఇచ్చారు. మధ్యాహ్నం సమయంలో తన సహచరుడు శనపతి భోగితో కలిసి రావిపాడు-లింగంగుంట్ల వెళ్లే దారిలో బహిర్భూమికి వెళ్లారు. ఆ సమయంలో ఆదినారాయణ ప్రమాదవశాత్తు కాలువలో పడిపోయాడు. అందులోని బండరాయి తలకు గట్టిగా తగలడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న కుటుంబసభ్యులు, గ్రామ నాయకులు అక్కడికి వెళ్లారు. మంగళవారం మృతదేహంతో బయల్దేరారు. ఈయనకు కుమార్తె అమూల్య, భార్య భాగ్యలక్ష్మి ఉన్నారు. భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు నర్సరావుపేట రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారన్నారు.

ఆర్టీసీ బస్సును ఢీకొన్న వ్యాన్

● అయిదుగురికి గాయాలు

ప్రమాదంలో దెబ్బతిన్న వ్యాన్

బొండపల్లి, న్యూస్‌టుడే: ట్రాక్టర్‌ను ఓవర్‌టేక్ చేసే క్రమంలో ఆర్టీసీ బస్సును వ్యాన్ ఢీకొని అయిదుగురు గాయపడిన ఘటన మండలంలో చోటుచేసుకుంది. ఎస్సై మహేష్ తెలిపిన వివరాల ప్రకారం.. మంగళవారం గొట్లాం జాతీయ రహదారి సమీపంలో ట్రాక్టర్‌ను అధిగమించే క్రమంలో పార్వతీపురం నుంచి విజయనగరం వెళ్తున్న ఆర్టీసీ బస్సును విజయనగరం నుంచి గజపతినగరం వస్తున్న వ్యాన్ ఢీకొంది. ఈ ప్రమాదంలో వ్యాన్ డ్రైవర్‌తో పాటు అందులోని నలుగురు ప్రయాణికులు గాయపడ్డారు. వారిలో పురంనేని రమేష్(30) తల, కాళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను విజయనగరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఘటనపై కేసు నమోదు చేశామని, గాయపడిన మిగతావారి వివరాలు తెలియాల్సి ఉందని ఎస్సై చెప్పారు.

చరవాణుల దొంగ అరెస్టు

విజయనగరం అయ్యన్నపేట, న్యూస్‌టుడే: విజయనగరం రైల్వేస్టేషన్‌లో చరవాణుల దొంగను జీఆర్‌పీ పోలీసులు అరెస్టు చేశారు. ఎస్సై బాలాజీరావు వివరాల ప్రకారం.. బొబ్బిలి మండలం పారాది గ్రామానికి చెందిన పి.శ్రీను కొన్ని రోజులుగా రైలు ప్రయాణికుల నుంచి చరవాణులు ఎత్తుకెళ్తున్నాడు. బాధితుల ఫిర్యాదు మేరకు జీఆర్‌పీ, ఆర్పీఎఫ్ సిబ్బంది నిఘా పెట్టి మంగళవారం అదుపులోకి తీసుకున్నారు. అతడి నుంచి రూ.30 వేలు విలువైన మొబైల్‌ను స్వాధీనం చేసుకున్నారు. రిమాండుకు తరలించామని ఎస్సై వెల్లడించారు.

'రెవెన్యూ అధికారి వైఖరిపై ధర్నా చేపడతాం'

జామి, న్యూస్‌టుడే: జామి తహసీల్దారు వి.కృష్ణంరాజు వైఖరిపై విజయనగరంలోని కలెక్టరు కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తామని ఆంధ్రప్రదేశ్ గోసంరక్షణ సమైఖ్య రాష్ట్ర అధ్యక్షుడు రామకృష్ణ తెలిపారు. ఈ మేరకు మంగళవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ప్రతి మూడు నెలలకోసారి జంతు సంక్షేమ కమిటీ సమావేశాలు నిర్వహించాల్సి ఉండగా సంవత్సరం నుంచి జరగడం లేదన్నారు. పశువులు అక్రమంగా తరలిస్తున్నా చర్యలు తీసుకోవడం లేదని, వీటన్నింటికీ నిరసనగా ఆందోళన చేపడతామన్నారు. సత్యనారాయణ, బి.సంధ్యారాణి, పైడితల్లి తదితరులు పాల్గొన్నారు.

EENADU eClassifieds

REAL ESTATE

PLOT FOR SALE

విజయనగరం సిటీ లిమిట్స్ భోగాపురం రోడ్ ఆనుకొని లోన్ సదుపాయంతో ఉడా ప్లాట్స్ కలవు. సంప్రదించండి: 7799334841

REPAIRS

TV REPAIR

భాస్కర్ ఎలక్ట్రానిక్ 32" LEDTV రూ.8,999/- 2సం||లు వారంటితో S.కోట నుండి 30కి||మీ||లోపు LEDTV ఇంటికి వచ్చి బాగు చేయబడును. C:8500188608.

ప్రకటన చిన్నదైనా స్పందన అతివేగం ఈనాడు క్లాసిఫైడ్స్ 5 లైన్ల ప్రకటన కేవలం 315 /- (GST 5% అదనం) మాత్రమే సంప్రదించండి: 8008597609

TO LET

COMMERCIAL

VZM Town Siddarthanagar GST Office Opposite, Ground floor 2100 Sft suitable Banks, Office near RTC Complex road ✆ 9701129889, 9100994599.

JOBS

Wanted Teachers for Reputed Schools in A.P & Telangana, Contact: Sneha Placements Service. Ph: 94402 46409.

విజయవాడ ప్లాస్టిక్ పరిశ్రమ నందు పనిచేయుటకు హెల్పర్స్ కావలెను. అర్హత: 10th, ఇంటర్, ITI, డిప్లొమా. Email: infoampp2016@gmail.com ✆ 62810 45178. అడ్రస్: అమరావతి పాలీప్యాక్, D.No: 25-38, 4వ క్రాస్ రోడ్, కబేళా, VJA-12

త్రినేత్ర హోంకేర్‌లో వృద్ధులను/పేషెంట్స్‌ను /పిల్లలను చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఫ్రీ వసతి, భోజనం. జీ: 18K. ✆ 8520980099, 8520874499

హరేకృష్ణ హోంకేర్‌లో వృద్ధులను/ పేషంట్స్ / పిల్లలను చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఫ్రీవసతి, భోజనం జీ:18-20K ✆ 96404 68899, 96402 58899

Tea Shop లో పనిచేయుటకు Boy కావలెను. వసతి భోజనం మంచి జీతం కలదు. ద్వారకానగర్ విశాఖపట్నం Ct: 8500711637.

FACULTY/ TEACHERS

గాజువాక విశాఖడిఫెన్స్ అకాడమీలో హాస్టల్లో ఉండి పనిచేయుటకు Physical Education Teacher కావలెను. జీ:10K+ ఫుడ్& అకామిడేషన్. 9848577745, 9666694545.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతి స్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

నాలుగు ఎకరాల్లో ఆక్రమణ గుర్తింపు

జలాశయ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఎస్ఈ అప్పలనాయుడు, ఇతర అధికారులు, రైతు సంఘ నాయకులు

మెంటాడ, న్యూస్‌టుడే: గుర్లగెడ్డ మినీ జలాశయం ఎడమ ప్రధాన కాలువ పరిధిలో సర్వే నంబరు 11లో నాలుగు ఎకరాలు ఆక్రమణకు గురైనట్లు ప్రాథమికంగా గుర్తించామని నీటి పారుదల శాఖ అధికారులు తెలిపారు. మంగళవారం జలాశయ ప్రాంతాన్ని ఆ శాఖ ఎస్ఈ పి.అప్పలనాయుడు, ఈఈ ఎం.వి.రమణలతోపాటు పలువురు ఇంజినీరింగ్ అధికారుల బృందం పరిశీలించింది. ఈ సందర్భంగా గతంలో ఎడమ, కుడి ప్రధాన కాలువలో చేపట్టిన పనులు, వాటి ప్రస్తుత స్థితిగతులు, మట్టికట్టలను చూశారు. అనంతరం విలేకర్లతో ఎస్ఈ మాట్లాడుతూ.. గతేడాది సెప్టెంబరులో రూ.17 కోట్ల అంచనా వ్యయంతో అసంపూర్తి పనులకు, డిజైన్ల మార్పు ఎక్కడ చేయాల్సి ఉందోనన్న వివరాలతో ప్రభుత్వానికి నివేదికలు పంపనున్నట్లు తెలిపారు. ఆరోపణలపై ఆ శాఖ అధికారులు మాట్లాడుతూ.. ఎడమ ప్రధాన కాలువ మొత్తం 25 ఎకరాలు కాగా.. అందులో 4 ఎకరాలు ఆక్రమణకు గురైనట్లు సర్వేలో తేలిందన్నారు. సర్వే పూర్తయిన తర్వాత ఆక్రమణలు ఉన్నాయని నిర్ధారణ అయితే చట్టరీత్యా తగిన చర్యలు తీసుకుంటామన్నారు. ఇరిగేషన్ డీఈఈలు నవీన్, రామునాయుడు, ఏఈ రాకేష్‌కుమార్, రైతు సంఘాల నాయకులు ఆర్.అప్పలనాయుడు, పి.అప్పలనాయుడు, వ్య.కా.సంఘ నాయకులు ఆర్.రాములు తదితరులున్నారు.

రామతీర్థం హుండీ ఆదాయం రూ.47.62 లక్షలు

కానుకలు లెక్కిస్తున్న ఆలయ అధికారులు, సిబ్బంది

నెల్లిమర్ల, న్యూస్‌టుడే: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థం దేవస్థానంలో మహా శివరాత్రి జాతరతో పాటు గడిచిన 27 రోజులకు సంబంధించిన హుండీ ఆదాయాన్ని మంగళవారం ఆలయ పర్యవేక్షణాధికారులు డి.శ్రీనివాసరావు, జి.శ్యామ్‌ప్రసాద్ సమక్షంలో లెక్కించారు. రూ.47,62,196 వచ్చిందని ఈవో వై.శ్రీనివాసరావు తెలిపారు. బంగారం 30.55 గ్రాములు, వెండి 5.300 కిలోలు వచ్చినట్లు వెల్లడించారు. భక్తుల దర్శనం టికెట్లు, స్వామివారి ప్రసాదాల ద్వారా రూ.21,53,480 సమకూరిందన్నారు. బొబ్బిలి వేణుగోపాలస్వామి దేవస్థానం ఈవో సీహెచ్‌టీవీఆర్.లక్ష్మణరావు, అర్చకస్వాములు, పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

ఈనాడు

దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించండి

Cell: 80085 97609

ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి

Cell: 80081 11237

డీమ్డ్ టు బీ వర్సిటీగా జీఎంఆర్ కళాశాల

రాజాం, న్యూస్‌టుడే: రాజాంలోని జీఎంఆర్ ఇంజినీరింగ్ కళాశాల డీమ్డ్ టు బీ విశ్వవిద్యాలయంగా గుర్తింపు పొందిందని జీఎంఆర్ వరలక్ష్మి ఫౌండేషన్ సీఈవో అశ్వినీసక్సేనా తెలిపారు. కేంద్ర విద్యాశాఖ యూజీసీ చట్టం కింద నోటిఫై చేసినట్లు వెల్లడించారు. ఇది మరిన్ని విభిన్న కోర్సులు, పరిశోధనలకు దోహదపడుతుందని సంతోషం వ్యక్తం చేశారు.

చికెన్ ధరలు

రకం	(బ్యాగ్)లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
బ్రాయిలర్	130	230	240

అంగన్‌వాడీలకు బడ్జెట్‌లో కేటాయింపులు పెంచాలి

ఇన్‌ఛార్జి పీడీ సుజాతకు వినతిపత్రం ఇస్తున్న కార్యకర్తలు

విజయనగరం అయ్యన్నపేట, న్యూస్‌టుడే: అంగన్‌వాడీ కార్యకర్తలను ఆదుకునేందుకు బడ్జెట్‌లో కేటాయింపులు పెంచాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి టీవీ.రమణ డిమాండు చేశారు. మంగళవారం ఐసీడీఎస్ ఇన్‌ఛార్జి పీడీ ఎల్.సుజాత, ఇన్‌ఛార్జి సీడీపీవో ఎం.సత్యవతికి వినతి పత్రాలు అందజేశారు. 2019 నుంచి వేతనాలు పెరగలేదని, గతంలో జరిగిన ఒప్పందాలను అమలు చేయాలని కోరారు. అర్హతగల మినీ వర్కర్లకు ఉద్యోగోన్నతులు కల్పించాలన్నారు. అన్నిరకాల ప్రభుత్వ పథకాలు అందేలా చూడాలన్నారు. ఈనెల 23 నుంచి 27 వరకు రిలే నిరాహార దీక్షలు చేపడుతున్నట్లు ప్రకటించారు. నాయకులు జగన్‌మోహన్‌రావు, సునీత, వి.లలితకుమారి, డి.ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.

పశువైద్య విద్యార్థుల ప్రతిభ

గరివిడి, న్యూస్‌టుడే: గరివిడి పశువైద్య కళాశాల విద్యార్థులు వెటర్నరీ అసోసియేషన్ ఆఫ్ ఇండియా(న్యూదిల్లీ) నిర్వహించిన జాతీయ స్థాయి లఘుచిత్రాల నిర్మాణంలో సత్తా చాటారు. వన్ హెల్త్ ప్రోగ్రాంలో భాగంగా పోటీలు అంతర్జాలంలో జరిగాయి. విద్యార్థులు వి.చరిత్రశ్రీ, బి.సన్ను, ఎన్ని అనన్య, జ్యోత్స్న, ప్రవల్లికల బృందం జంతువుల నుంచి మనుషులకు సంక్రమించే వ్యాధులు, నియంత్రణలో పశువైద్యుల పాత్రను వివరిస్తూ లఘు చిత్రం తీశారు. దీని ఫలితాలు మంగళవారం విడుదల చేశారు. దీనికి జాతీయస్థాయిలో ద్వితీయ బహుమతి లభించింది. విద్యార్థులను కళాశాల అసోసియేట్ డీన్ మక్కెన శ్రీను, విద్యార్థి విభాగం అధికారి బీఆర్ అంబేద్కర్ తదితరులు మంగళవారం అభినందించారు.

విద్యార్థులను అభినందిస్తున్న కళాశాల అసోసియేట్ డీన్ శ్రీను, అధ్యాపకులు

కూరగాయల ధరలు

రాజాం రైతుబజారులో సోమవారం కూరగాయల ధరలు (కిలో రూ.లలో).. ● టమాటా: 15 ● వంకాయలు: 40 ● దొండ: 60 ● బీర: 50 ● బెండ: 50 ● కాకర: 50 ● చిక్కుడు: 35 ● ఆనపకాయ (ఒకటి): 26 ● అరటి (డజను): 20 ● మునగ: 80 ● ఆలు: 30 ● బంగాళదుంపలు: 20 ● అల్లం: 80 ● వెల్లుల్లి: 120 ● పచ్చిమిర్చి: 80 ● క్యాబేజీ: 20 ● క్యారెట్: 42

తెరపై ఈనాడు

✦ ఎస్‌వీసీ సీతారామ: ఫంకీ ✦ ఎస్‌వీసీ సీతారామా: కపుల్‌ఫ్రెండ్లీ ✦ ఎస్‌వీసీ అప్సర: మన శంకరవరప్రసాద్‌గారు – న్యూస్‌టుడే, రాజాం ✦ లక్ష్మీ థియేటర్: కపుల్ ఫ్రెండ్లీ ✦ వాసవి: ఫంకీ ✦ టీబీఆర్ స్క్రీన్-1: మన శంకర వరప్రసాద్‌గారు ✦ టీబీఆర్ స్క్రీన్-2: మనసంతా నువ్వే – న్యూస్‌టుడే, బొబ్బిలి

బొబ్బిలి

●బొబ్బిలి ●రాజాం ●గజపతినగరం ●చీపురుపల్లి

ఆదమరిస్తే ఆపద

సంతకవిటి మండలం మల్లయ్యపేట- కావలి ఆర్ అండ్ బీ రహదారి 7 కి.మీల మేర ప్రమాదకరంగా ఉంది. ఈ రహదారి మొత్తం గుంతలమయం కాగా కుడి ప్రధాన కాలువపైనే ఉంది. బూరాడపేట, పనసపేట, వాల్తేరు గ్రామాల సమీపంలో కోతకు గురైంది. రక్షణ చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు, చోదకులు కోరుతున్నారు. ప్రతిపాదనలు పంపించామని ఏఈ సతీష్ కుమార్ తెలిపారు. – న్యూస్‌టుడే, సంతకవిటి

కనకమహాలక్ష్మి జాతరకు భారీ బందోబస్తు

సిబ్బంది, కమిటీ సభ్యులతో మాట్లాడుతున్న డీఎస్పీ

చీపురుపల్లి, న్యూస్‌టుడే: చీపురుపల్లిలో ఈనెల 22 నుంచి మూడు రోజుల పాటు జరగనున్న కనకమహాలక్ష్మి అమ్మవారి జాతరకు భారీ పోలీసు బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నట్లు డీఎస్పీ ఎస్. రాఘవులు తెలిపారు. సీఐ జి.శంకరరావు, ఎస్సై ఎల్.దామోదరరావుతో కలిసి మంగళవారం ఆలయం వద్ద ఏర్పాట్లను పరిశీలించారు. దర్శనాల క్యూలైన్ల ఏర్పాటు, వాహనాల పార్కింగ్ స్థలాలు, సాంస్కృతిక కార్యక్రమాల ప్రధాన వేదిక వద్ద భారీ గేట్ల ఏర్పాటు పరిశీలించారు. జనాల తాకిడి ఎక్కువ, ఆ సమయంలో ఉంటుంది... అక్కడ చేపట్టాల్సిన చర్యలపై తెదేపా మండలాధ్యక్షుడు రౌతు కామునాయుడు, ఆలయ కమిటీ ఛైర్మన్ గవిడి నాగరాజు, ఈవో ఎస్.నాజీబాబు, కమిటీ సభ్యులతో చర్చించారు. దేవస్థానం వద్దకు వీవీఐపీ వాహనాలు తప్ప ఇతర వాహనాలకు అనుమతి లేదని డీఎస్పీ స్పష్టం చేశారు. ఊరేగింపులు, ప్రభ సంబరాల ఏర్పాట్లపై మాట్లాడారు. భక్తులకు ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు.

పైడితల్లి యాత్రకు ముమ్మరంగా ఏర్పాట్లు

రాజాం గ్రామీణం, న్యూస్‌టుడే: రాజాం పట్టణంలోని పోలిపల్లి పైడితల్లి అమ్మవారి యాత్రకు భారీ ఏర్పాట్లు చేస్తున్నట్లు పట్టణ సీఐ అశోక్‌కుమార్ తెలిపారు. మంగళవారం ఆలయ ఈవో బీవీ మాధవరావు, ధర్మకర్త వాకచర్ల దుర్గాప్రసాద్‌తో కలిసి ఏర్పాట్లు పరిశీలించారు. ఈ నెల 22 యాత్ర ప్రారంభమవుతుందని తెలిపారు. వందో యాత్ర కావడంతో వైభవంగా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

కాలువలు నిర్మిస్తాం.. కష్టాలు తీరుస్తాం

న్యూస్‌టుడే – బొబ్బిలి

బొబ్బిలి పురపాలిక పరిధిలోని వార్డుల్లో సమస్యలపై 'ఈనాడు' ఆధ్వర్యంలో కమిషనర్ రామలక్ష్మితో మంగళవారం నిర్వహించిన ఫోన్ ఇన్ కార్యక్రమానికి విశేష స్పందన వచ్చింది. పట్టణవాసులు సమస్యలను నేరుగా కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. పుర విభాగాధిపతులంతా హాజరై ఆయా శాఖలకు సంబంధించిన సమస్యలను నమోదు చేసుకున్నారు. పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకోవాలని కమిషనర్ అధికారులను ఆదేశించారు. దీర్ఘకాలిక పనులకు ప్రతిపాదనలు తయారు చేయాలన్నారు. పుర ప్రణాళికాధికారి రామావతార్యులు, డీఈ శరత్‌కుమార్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ మురళి, పట్టణ ప్రణాళిక విభాగాధికారి ఫిలిప్ హాజరయ్యారు.

ఫోన్‌లో సమస్యలు వింటున్న కమిషనర్, కార్యక్రమంలో పుర విభాగాధిపతులు

ఈనాడు ఫోన్ ఇన్ కార్యక్రమం

? సమస్య ?: 20వ వార్డులో రైల్వేస్టేషన్ వెళ్లే దారి అధ్వానంగా ఉంది. ఇబ్బందులు పడుతున్నాం. – గౌని ప్రసాద్ కమిషనర్ ● సిమెంటు రహదారికి అంచనాలు తయారు చేస్తాం. నిధులు కేటాయించి, పనులు చేపడతాం.

? ఆసుపత్రి రహదారిలో కాలువలు ఆక్రమించి వ్యాపారాలు సాగిస్తున్నారు. ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోంది. – బొబ్బాది వెంకటరమణ ● పోలీసు సహకారంతో ఆక్రమణలు తొలగిస్తాం.

? స్వామివారి వీధి రెండో లైను అంబేడ్కర్ విగ్రహం పక్కన పురపాలిక పబ్లిక్ ట్యాప్ వద్ద నీరు పక్కకు వెళ్లక ఇబ్బంది పడుతున్నాం. ఓ చిన్న కుళాయి అందించి నీటి సమస్య తీర్చాలి. – బుల్లెమ్మ, స్వామివారి వీధి ● రెండు రోజుల్లో సమస్య పరిష్కారమవుతుంది. కుళాయిలు అక్రమంగా కట్టడాలు చేసి డ్రైనేజీ, నీటి చౌర్యానికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకుంటాం.

? శ్రీరామ్‌నగర్ వీధిలో కాలువలు నిర్మించాలి. 29, 30 వార్డుల మధ్య వర్షంలో దోమల బెడద ఎక్కువగా ఉంది. – నాగేశ్వరరావు, కోడవలిడి ● కాలువల్లో పూడిక తొలగించడంతో పాటు డ్రైన్ వేయిస్తాం. అవసరమైతే కొత్త డ్రైనేజీ నిర్మాణానికి చర్యలు తీసుకుంటాం.

? పాతబొబ్బిలి పలు వీధుల్లో రహదారులు లేవు. చినుకు పడితే చిత్తడే. నిరంతరం ఇళ్లల్లోకి వస్తుంది. – ఎం.విజయ్‌మోహనరావు, ఉపాధ్యాయుడు ● సీసీ రహదారి నిర్మాణానికి నిధులు కేటాయించాం. టెండర్లు కూడా పూర్తయ్యాయి.

? పట్టణంలోని ఇందిర వ్యాలయంలో విద్యుత్తు సౌకర్యం పూర్తిస్థాయిలో లేదు. – ఆర్.జగదీశ్ ● కాలనీలో విద్యుదీకరణ అంశం ఎమ్మెల్యే దృష్టికి వచ్చింది. ఎంపీ లాడ్స్ వస్తున్నాయి. ఆయా పనులకు కేటాయిస్తాం.

పాతబొబ్బిలి ప్రసాద్ నగర్ కాలనీలో తాగునీటికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. కుళాయిల నుంచి సక్రమంగా రావడం లేదు. – మిందు రామకృష్ణ, విశ్రాంత ఉపాధ్యాయుడు ● పూర్తిస్థాయిలో నీరు వచ్చేలా చూస్తాం. వేసవిలో ఇబ్బంది లేకుండా ట్యాంకర్లతో సరఫరా చేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తాం.

? అయిదో వార్డు ఆనందిలో పక్కా రహదారి లేదు. – కృష్ణ ● పరిశీలించి, రహదారి నిర్మాణానికి అంచనాలు తయారు చేస్తాం.

? ఇందిరమ్మకాలనీలో కాలువలు లేవు. మురుగునీరు ఇళ్లల్లోనే ఉంటోంది. అప్రోచ్ రహదారులు లేక అవస్థలు పడుతున్నాం. – చంద్రశేఖర్ ● కాలనీ అభివృద్ధికి ప్రతిపాదనలు తయారు చేస్తున్నాం.

? ప్రభుత్వ కార్యాలయాలు ఎక్కువగా ఉండే ఆసుపత్రి దారిలో సామాజిక మరుగుదొడ్లు లేవు. పనుల నిమిత్తం వచ్చేవారు ఇబ్బందులు పడుతున్నారు. – కృష్ణదాసు, ఉపాధ్యాయుడు ● కౌన్సిల్‌లో నిర్ణయం తీసుకుని అంచనాలు తయారు చేస్తాం.

మేమున్నాం.. మీకు తోడుగా

(10 AM TO 1 PM)

బొబ్బిలి	80085 74367
గజపతినగరం	80085 74332
రాజాం	80085 74308
గరివిడి	80085 74348

? రాజాం పట్టణంలోని పోలీస్‌స్టేషన్ రోడ్డులో కాలువలో చెత్త నిల్వ ఉంది. దుర్వాసన వస్తోంది. - స్థానికులు ✦ చెత్తను వెంటనే తొలగింపజేస్తాం. - ప్రసాద్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ – న్యూస్‌టుడే, రాజాం పట్టణం

? పెణసాం గ్రామంలోని పలువీధుల్లో పది రోజులుగా తాగునీరు సరఫరా కావడం లేదు. - స్థానికులు ✦ తక్షణమే తాగునీరు అందేలా చూస్తాం. - విజయ్‌కుమార్, డిప్యూటీ ఎంపీడీవో – న్యూస్‌టుడే, గంట్యాడ గ్రామీణం

? సీతారాంపురం గ్రామంలో పాడి పశువులను రోడ్డుపైనే ఉంచుతున్నారు. వీధి కాలువలు వ్యర్థాలతో నిండుతున్నాయి. - స్థానికులు ✦ ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. - సుజాత, కార్యదర్శి – న్యూస్‌టుడే, గజపతినగరం

? బుడతనాపల్లి యాదవ వీధిలో పరిసరాలు అధ్వానంగా ఉన్నాయి. రోజూ సేకరించిన చెత్తను ఇక్కడ పడేస్తున్నారు. - స్థానికులు ✦ తక్షణమే పారిశుద్ధ్య పనులు చేపడతాం. - క్రాంతిప్రియ, సచివాలయ కార్యదర్శి – న్యూస్‌టుడే, గంట్యాడ గ్రామీణ

వంతెన శిథిలం.. రాకపోకలకు భయం

బొబ్బిలి మండలం వెంగళరాయసాగర్ ప్రధాన కాలువపై ఏళ్ల కిందట నిర్మించిన వంతెన శిథిలావస్థకు చేరుకుంది. చిత్రకోట బొడ్డవలస, వెలగవలస గ్రామాల ప్రజలు దీని మీదుగానే రాకపోకలు సాగిస్తుంటారు. వంతెన కింద ఇనుప ఊచలు తుప్పు పట్టాయి. గోడలు శిథిలమయ్యాయి. ఎప్పుడు ఏం జరుగుతుందోనని భయంగా ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొత్త వంతెన నిర్మించాలని కోరుతున్నారు. పరిశీలించి, చర్యలు తీసుకుంటామని ఇరిగేషన్ ఏఈ సుధీర్ అన్నారు. – న్యూస్‌టుడే, బొబ్బిలి గ్రామీణం

గోషాడ ఘోష పట్టదా?

గుర్ల మండలం గోషాడలో నెలల తరబడి పారిశుద్ధ్య పనులు చేపట్టకపోవడంతో డంపింగ్ యార్డును తలపిస్తోంది. కాలువలు మురుగుతో నిండాయి. పంచాయతీ అధికారులు తమకు పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. వ్యర్థాలు తొలగించకపోతే అనారోగ్యం బారిన పడే ప్రమాదముందని స్థానికులు వాపోతున్నారు. విషయం ఈవోపీఆర్డీ ఈశ్వరరావు వద్ద ప్రస్తావించగా.. వెంటనే వ్యర్థాలు తొలగింపజేస్తామన్నారు. – న్యూస్‌టుడే, గుర్ల

నిధులు రాక.. పనులు పూర్తికాక

గరివిడి మండలం కోడూరు, దేవాడ గ్రామీణ బీటీ రహదారుల పనులు అసంపూర్తిగా నిలిచిపోయాయి. రెవెన్యూ కార్యాలయం నుంచి కోడూరు వరకు బీటీ రోడ్డు పనులకు రూ.1.8 కోట్లు, దేవాడ నుంచి దుమ్మెద వరకు రూ.1.3 కోట్లతో పనులు ప్రారంభించారు. మట్టి, మెటల్ వేశారు. బిల్లులు రాక వదిలేశారు. నిధులు విడుదల కాగానే పెండింగ్ పనులు పూర్తి చేయిస్తామని పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారి హరికృష్ణ చెబుతున్నారు. – న్యూస్‌టుడే, గరివిడి

త్రీఫేజ్ లేదు.. శుద్ధజలం అందదు

గుర్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో రూ.4 లక్షలతో రెండేళ్ల క్రితం ఏర్పాటు చేసిన రెండు వాటర్ ప్లాంట్లు నిరుపయోగంగా ఉన్నాయి. ప్లాంట్లు పనిచేయాలంటే త్రీఫేజ్ విద్యుత్తు సదుపాయం అవసరం. అది లేకపోవడంతో దిష్టిబొమ్మల్లా దర్శనమిస్తున్నాయి. విద్యార్థులకు శుద్ధజలం అందక ఇబ్బంది పడుతున్నారు. విషయం ట్రాన్స్‌కో ఏఈ నారన్నాయుడు వద్ద ప్రస్తావించగా.. త్రీఫేజ్ ఏర్పాటు చేయాలంటే రూ.3 లక్షలు విద్యుత్తు శాఖకు చెల్లించాల్సి ఉందన్నారు. ఆ డబ్బులు చెల్లిస్తే త్రీఫేజ్ సదుపాయం కల్పిస్తామని తెలిపారు. – న్యూస్‌టుడే, గుర్ల

పశువుల కొట్టం కాదు.. బోరు

వంగర మండలం సంగాం గ్రామంలో సంగమేశ్వరస్వామి దేవాలయానికి వెళ్లేదారిలో మంచినీటి బోరు పాడైంది. సమీపంలో వేంకటేశ్వరస్వామి ఆలయం ఉండడంతో భక్తులకు ఇబ్బంది ఎదురవుతోంది. దీనికితోడు కొంతమంది మంచినీటి బోరుకు పశువులు కడుతున్నారు. ప్రస్తుతం సంగమేశ్వరస్వామి జాతర జరుగుతోంది. వేసవి వస్తోంది. ఇబ్బందులు ఎదురవకుండా బోరు బాగుచేయాలని భక్తులు కోరుతున్నారు. విషయం ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ చిన్నయ్య వద్ద ప్రస్తావించగా.. బోరు బాగు చేయిస్తామన్నారు. – న్యూస్‌టుడే, వంగర

'కార్యదర్శిపై దుర్భాషలాడడం తగదు'

రేగిడి, న్యూస్‌టుడే: విధి నిర్వహణలో ఉన్న పంచాయతీ కార్యదర్శిపై దుర్భాషలాడి మానసికంగా ఇబ్బంది పెట్టడం తగదని మండలంలోని పంచాయతీ కార్యదర్శులు మంగళవారం ఎంపీడీవో కార్యాలయం వద్ద నిరసన చేపట్టారు. ఈనెల 16న చినశిర్లాం గ్రామంలో జరిగిన ఉపాధిహామీ సామాజిక తనిఖీ గ్రామసభకు ప్రత్యేకంగా ఆహ్వానించలేదని తెదేపా నాయకుడు ఎం.శ్రీనివాసరావు పంచాయతీ కార్యదర్శి బిందుశేఖర్‌పై దుర్భాషలాడి, మానసికంగా ఇబ్బంది పెట్టారన్నారు. చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో శ్యామలాకుమారికి ఫిర్యాదు చేశారు.

ఎంపీడీవో కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న కార్యదర్శులు

మెరుగైన విద్యాబోధన అందించాలి

గంట్యాడ, గ్రామీణం: గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించి మెరుగైన విద్యాబోధన అందించాలని రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యుడు కె.మల్లేశ్వరరావు అన్నారు. మంగళవారం గంట్యాడ మండలం తాటిపూడి గిరిజన ఆశ్రమ పాఠశాలను సందర్శించారు. మౌలిక సదుపాయాలు, విద్యాబోధన, మధ్యాహ్న భోజనం తదితరాలపై ఆరా తీశారు. విద్యార్థులతో మాట్లాడి బాగా చదువుకోవాలని సూచించారు. ఉత్తమ ఫలితాలు సాధించాలన్నారు. ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ నీలకంఠేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వ్యర్థాల నిర్వహణలో జాగ్రత్తలు అవసరం

గోడప్రతులతో పారిశుద్ధ్య కార్మికులు

బొబ్బిలి, న్యూస్‌టుడే: ఘన వ్యర్థాల నిర్వహణలో పారిశుద్ధ్య కార్మికులు జాగ్రత్తలు తీసుకోవాలని పురపాలిక అధ్యక్షుడు రాంబార్కి శరత్‌బాబు అన్నారు. స్వచ్ఛాంధ్ర- స్వర్ణాంధ్రలో భాగంగా పుర కార్యాలయంలో కార్మికులకు మంగళవారం శిక్షణ జరిగింది. భద్రతా ప్రమాణాలపై అవగాహన కల్పించారు. కార్మికుల భద్రతకు సంబంధించిన కిట్ల వినియోగంపై గోడప్రతులు అందజేశారు. కమిషనర్ రామలక్ష్మి, ఎన్‌జీవో జిల్లా సమన్వయకర్త వి.నారాయణమ్మ, రిసోర్సు పర్సన్ సాయికిరణ్ పాల్గొన్నారు.

మల్లంపేటలో తాగునీటి కష్టాలు

బొబ్బిలి: పట్టణంలోని మల్లంపేటలో తాగునీటి కష్టాలు దాపురించాయి. రైల్వే విస్తరణ పనులు జరుగుతున్న నేపథ్యంలో రైల్వేస్టేషన్‌కు సమీపంలో పైపులైన్లు మరమ్మతులకు గురయ్యాయి. దీంతో రిజర్వాయర్‌కు నీరు వెళ్లడం లేదు. మంగళవారం నుంచి పైపులైన్ల మరమ్మతులు పనులు చేపట్టారు. త్వరితగతిన సరఫరాను పునరుద్ధరించాలని కమిషనర్ రామలక్ష్మి ఇంజినీరింగ్ విభాగం అధికారులకు ఆదేశించారు. పైపులైన్ల మార్గంలో ఎలాంటి తవ్వకాలు చేపట్టకూడదని రైల్వే సిబ్బందికి తెలియజేయాలని సూచించారు.

కారు ఇంజిన్‌లో మంటలు

బొబ్బిలి గ్రామీణం: విశాఖ నుంచి బొబ్బిలి మీదుగా బలిజిపేట వెళ్తున్న కారు ఇంజిన్ నుంచి మంటలు చెలరేగిన ఘటన బొబ్బిలి మండలం కమ్మవలస సమీపంలో మంగళవారం జరిగింది. చోదకుడు అప్పారావు వాహనం నిలుపుదల చేయడంతో అందులో ప్రయాణిస్తున్న అయిదుగురు సురక్షితంగా బయటపడ్డారు. స్థానికులు స్పందించి, అందుబాటులో ఉన్న నీరు తెచ్చి కొంతవరకు మంటలు అదుపు చేశారు. బొబ్బిలి అగ్నిమాపక వాహనం వచ్చి పూర్తిగా అదుపుచేసింది. ఎలాంటి ప్రాణనష్టం లేకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. ఇంజిన్‌లో ఏర్పడిన సాంకేతిక లోపం కారణంగా మంటలు వచ్చాయని అగ్నిమాపక సహాయక అధికారి కృష్ణ చెప్పారు.

కౌన్సిల్ మెంబర్‌గా నియామకం

తెర్లాం, న్యూస్‌టుడే: రాష్ట్ర ఆరోగ్య సంరక్షణ కౌన్సిల్ మెంబరుగా తెర్లాం మండలం పెరుమాళి పీహెచ్‌సీ ఆప్తాల్మిక్ అధికారి ఎస్.వసంతరావు నియమితులయ్యారు. కుటుంబ ఆరోగ్య సంక్షేమ శాఖ నుంచి విడుదలైన ఉత్తర్వులను సోమవారం రాత్రి అందుకున్నట్లు మంగళవారం తెలిపారు. ఆప్తాల్మిక్ సైన్సెస్ ప్రొఫెషనల్ విభాగం కింద నియమించారన్నారు.

ఆటో చోదకులకు అవగాహన

బొబ్బిలి, న్యూస్‌టుడే: రహదారి భద్రతా నియమాలపై ఆటో చోదకులు అవగాహన కలిగి ఉండాలని సీఐ నారాయణరావు అన్నారు. మంగళవారం సాయంత్రం పట్టణంలో ఆటో చోదకులకు అవగాహన కల్పించారు. రహదారుల మధ్య ఆటోలు ఆపకూడదని, ప్రయాణికులతో మర్యాదగా ప్రవర్తించాలని సూచించారు. ఆటోలపై డ్రగ్స్ వద్దు బ్రో అని రాసి యువతకు అవగాహన కల్పించాలని కోరారు. ట్రాఫిక్ ఎస్సై జ్ఞానప్రసాద్ పాల్గొన్నారు.

పర్యావరణాన్ని కాపాడుకుందాం

బాడంగి, న్యూస్‌టుడే: క్లాప్ ప్రోగ్రామ్ కింద చెత్తను సేకరించి, పర్యావరణాన్ని పరిరక్షించడానికి స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్, పంచాయతీరాజ్ శాఖల ఆధ్వర్యంలో గ్రామాలు, పట్టణాల్లో స్వచ్ఛ రథం ప్రారంభించనున్నట్లు ఎంపీడీవో రామకృష్ణ తెలిపారు. మంగళవారం బాడంగిలో మాట్లాడారు. ప్లాస్టిక్ రహితంగా మార్చేందుకు ఈ కార్యక్రమం ఉపయోగపడుతుందన్నారు. ప్లాస్టిక్, గాజు, ఇనుము, కాగితాలు వంటి వ్యర్థాలు తీసుకుని నిత్యావసరాలు అందజేస్తారన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి

బాడంగి, న్యూస్‌టుడే: ఇటీవల బాధ్యతలు స్వీకరించిన బొబ్బిలి రూరల్ సీఐ ఎస్.శ్రీనివాస్ మంగళవారం బాడంగి పోలీస్‌స్టేషన్‌ను ఆకస్మికంగా సందర్శించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి చేస్తామని, యువత మాదకద్రవ్యాల బారిన పడకుండా అవగాహన కల్పిస్తామన్నారు. గంజాయి రవాణాపై కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పారు.

పేరుకే పట్టణం.. సమస్యలతో సావాసం

న్యూస్‌టుడే– రాజాం పట్టణం

రాజాం పట్టణంలోని సారథి ఇందిరమ్మ కాలనీలో రాళ్లు తేలిన రహదారి

రాజాం పురపాలక సంఘం పరిధిలోని తొమ్మిదో వార్డు ప్రజలు సమస్యలతో సతమతమవుతున్నారు. పలు కాలనీల్లో కనీస సౌకర్యాలు లేక అవస్థలు ఎదుర్కొంటున్నారు. కాలువలు పూడికతో నిండి మురికి కూపాల్లా కనిపిస్తున్నాయి. దోమలు, దుర్వాసనతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. రహదారులు సరిగ్గా లేవు. ఉన్నవి గోతులతో నిండి ఉన్నాయి. పురపాలిక సంఘానికి వెళ్లి విన్నవిస్తున్నా ఫలితం లేదని వాపోతున్నారు.

● పురపాలిక: రాజాం ● వార్డు: 9
● ప్రాంతాలు: బంగారమ్మ చెరువు గట్టు, పుచ్చల వీధి, మేదర వీధి, కోనేరు గట్టు, ఆంజనేయపురం, సారథి ఇందిరమ్మ కాలనీ, కంచర వీధి
● నివాస గృహాలు: 678 ● జనాభా: 1,823

ఇవీ ప్రధాన ఇక్కట్లు..

✦పట్టణం నుంచి సారథి ఇందిరమ్మ కాలనీకి వెళ్లే రహదారి గోతులతో నిండి ఉంది. అడపాదడపా తాత్కాలిక మరమ్మతులు చేపడుతున్నారు. ✦ ఇందిమ్మ కాలనీలో రహదారి, కాలువలు నిర్మించకపోవడంతో దోమలు, దుర్వాసన అధికంగా ఉన్నాయి. శ్మశానవాటికకు రహదారి అసంపూర్తిగా ఉంది. ప్రహరీ లేదు. ✦ కంచరవీధి, పుచ్చలవీధిలో సీసీ రోడ్లు 20 ఏళ్ల క్రితం నిర్మించినవి. వర్షాకాలంలో గుంతల్లో నీరు నిల్వ ఉంటోంది. ✦ బోర్లకు మరమ్మతులు చేపట్టడంలేదు. ✦ ఆంజనేయపురం, కోనేరు గట్టు, మేదరవీధి, బంగారమ్మ చెరువు గట్టు వీధుల్లో రోడ్డు, కాలువల నిర్వహణ సక్రమంగా లేదు.

దశలవారీగా పనులు చేస్తాం..

ఇందిరమ్మ కాలనీతో పాటు 9వ వార్డు పరిధిలోని అన్ని సమస్యలు గుర్తించాం. వాటిని పరిష్కరించడానికి అవసరమైన నిధులు కేటాయిస్తాం. దశలవారీగా పనులు చేపడతాం. – ఆకురాతి రామచంద్రరావు, పుర కమిషనర్

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు.. బొబ్బిలి గ్రామీణం: బొబ్బిలి మండలం చిలకమ్మవలస సమీపంలో నిబంధనలకు వ్యతిరేకంగా రియల్‌ఎస్టేట్ వెంచర్ వేస్తున్నారని కాశిందొరవలస సర్పంచి దాలమ్మ సోమవారం అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఆర్డీవో రామ్మోహనరావు, తహసీల్దారు శ్రీను మంగళవారం ఆ స్థలాన్ని పరిశీలించారు. చదును చేసిన భూమిని, తవ్విన బోర్లను పరిశీలించారు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవన్నారు.

నులిపురుగుల నివారణతో ఆరోగ్యం

మెరకముడిదాం కేజీబీవీలో విద్యార్థులతో మాత్రలు మింగిస్తున్న డీడీవో హేమసుందర్

న్యూస్‌టుడే బృందం: నులిపురుగుల నివారణతోనే మంచి ఆరోగ్యం లభిస్తుందని జిల్లా క్షయవ్యాధి నివారణ అధికారిణి రాణి అన్నారు. మరుపల్లి కేజీబీవీలో విద్యార్థులతో మాత్రలు వేయించారు. ప్రతి ఆరునెలలకు ఒకసారి తప్పనిసరిగా మాత్రలు వేసుకోవాలని చీపురుపల్లి డీడీవో హేమసుందర్ అన్నారు. గర్భాం, మెరకముడిదాం పీహెచ్‌సీల పరిధిలోని పాఠశాలల్లో మాత్రలు మింగించారు. ✦ బొబ్బిలి ఎంపీడీవో రవికుమార్, ఐసీడీఎస్ పీవో విజయలక్ష్మి, పిరిడి పీహెచ్‌సీ వైద్యాధికారి రఘువంశీ పిరిడిలో మాత్రలు ఇచ్చారు. ✦ ఇన్‌ఛార్జి ఎంపీడీవో వెంకటరమణ, ఎంఈవో జె.త్రినాథరావు తెర్లాం ఉన్నత పాఠశాలలో, రాజాం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పురపాలిక కమిషనర్ రామచంద్రరావు ఆల్బెండజోల్ మాత్రలు వేయించారు.

తప్పుల్లేని ఓటర్ల జాబితా సిద్ధం చేయండి

మాట్లాడుతున్న డీడీవో కిరణ్‌కుమార్

దత్తిరాజేరు, న్యూస్‌టుడే: స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ఓటర్ల జాబితాల్లో తప్పులు లేకుండా చూడాలని డీడీవో కిరణ్ కుమార్ అన్నారు. మంగళవారం దత్తిరాజేరు మండల పరిషత్తు కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశమయ్యారు. ✦ సంతకవిటి, రేగిడి: ఒకే కుటుంబంలోని ఓటర్లు ఒకేచోట ఉండేలా జాబితాలు సిద్ధం చేయాలని ఎంపీడీవోలు కె.సురేష్ కుమార్, శ్యామలాకుమారి ఆదేశించారు. ✦ బొబ్బిలి గ్రామీణం, రామభద్రపురం, తెర్లాం: ఓటర్ల జాబితా తప్పుల్లేకుండా తయారు చేయాలని ఎంపీడీవోలు రవికుమార్, రత్నం, డిప్యూటీ ఎంపీడీవో వెంకటరమణ, తహసీల్దారు జి.హేమంత్‌కుమార్ సూచించారు.

నిధులు విదల్చరు.. గోడు పట్టించుకోరు

న్యూస్‌టుడే – మెంటాడ

ఆంధ్ర జలాశయానికి అనుబంధంగా హై లెవెల్ కెనాల్ పూర్తయితే సాగునీటి సమస్య తీరుతుందని రైతులు ఎన్నో ఏళ్ల నుంచి ఎదురుచూస్తున్నారు. ఎన్ని ప్రభుత్వాలు మారినా సమస్య మాత్రం తీరడంలేదు. ప్రభుత్వం నిధులు మంజూరు చేసి, చర్యలు తీసుకుంటే మెంటాడ, గజపతినగరం, దత్తిరాజేరు మండలాల పరిధిలోని 16 గ్రామాల్లోని సుమారు 3,233 ఎకరాలకు సాగునీరు పుష్కలంగా అందుతుందని వేడుకుంటున్నారు.

హై లెవెల్ కెనాల్‌లో ఏపుగా పెరిగిన పనికిరాని మొక్కలు

రూ.60 లక్షలతో ప్రతిపాదనలు..

2025-26 సంవత్సరంలో హై లెవెల్ కెనాల్ పరిధిలో స్లూయిస్ నిర్మాణం కోసం రూ.60 లక్షలతో ప్రతిపాదనలు పంపినట్లు సంబంధిత కెనాల్ ఏఈ రాకేష్‌కుమార్ తెలిపారు. 2026- 27లో నిర్వహణ వ్యయానికి రూ.10 లక్షలు, కాలువల్లో పూడిక, తుప్పల తొలగింపు తదితరాల వాటికి రూ.10 లక్షలతో ప్రతిపాదనలు పంపామన్నారు.

మంత్రికి వినతి..

ఆంధ్ర జలాశయం మిగులు నీరు హై లెవెల్ కెనాల్ ద్వారా కొండలింగాలవలసకు సమీపంలోని కూనేటిగెడ్డకు మళ్లించి, అక్కడి నుంచి పలు గ్రామాలకు సాగునీరు అందించాలనేది లక్ష్యం. అప్పట్లో చేపట్టిన ఈ కెనాల్ పనుల్లో లోపాలతో కాలువ పూడికలతో నిండి ఉంది. మదుములు ఎత్తుగా ఉండటం తదితర కారణాలతో సాగునీరు సక్రమంగా ప్రవహించడంలేదు. వర్షాల సమయాల్లో జలాశయం నిండిపోతే మిగులు నీటిని చంపావతి నదిలోకి విడిచి పెడుతున్నారే తప్ప, సద్వినియోగం చేసుకునేందుకు చర్యలు తీసుకోవడంలేదు. సమస్యను పరిష్కరించాలని పలువురు నేతలు కొన్ని నెలల క్రితం మంత్రి సంధ్యారాణిని కలిసి వినతిపత్రం అందజేశారు.

వైభవంగా నీలకంఠేశ్వరస్వామి తీర్థం

గంట్యాడ గ్రామీణం, న్యూస్‌టుడే: నీలావతి నీలకంఠేశ్వరస్వామి తీర్థం మంగళవారం వైభవంగా నిర్వహించారు. వేకువజాము నుంచే భక్తులు చేరుకుని స్వామివారికి మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. గంట్యాడ ఎస్సై సాయికృష్ణ ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

పకడ్బందీగా పరీక్షలు

బొబ్బిలి, న్యూస్‌టుడే: బొబ్బిలి పట్టణంలోని పదో తరగతి పరీక్షా కేంద్రాలను విద్యాశాఖాధికారులతో కలిసి తహసీల్దారు శ్రీను మంగళవారం పరిశీలించారు. విద్యుత్తు, తాగునీటి సౌకర్యం, ఫర్నిచర్, ప్రహరీ వంటి సౌకర్యాలు పరిశీలించి అధికారులకు సూచన చేశారు. పరీక్షల నిర్వహణ సమయంలో సమీపంలో జిరాక్స్ కేంద్రాలు మూసివేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు.

పంచాయతీ ఖాతాలు సరిచేసుకోండి

బొబ్బిలి గ్రామీణం, న్యూస్‌టుడే: గ్రామ పంచాయతీల ఖాతాలన్నీ సక్రమం చేసుకోవాలని ఉప ఖజానా అధికారి పద్మనాభం కోరారు. మంగళవారం మండల పరిషత్తు కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో అవగాహన సమావేశం నిర్వహించారు. ఇటీవల మార్పులు చోటుచేసుకున్నాయని, రిజర్వుబ్యాంకు నిబంధనలు పాటించి అకౌంట్స్ సరిచేసుకోవాలన్నారు.

పనిభారం తగ్గించాలని నిరసన

గుర్ల, న్యూస్‌టుడే: తమపై పనిభారాన్ని తగ్గించాలని వీఆర్వోలు నిరసన చేపట్టారు. మంగళవారం గుర్ల తహసీల్దారు కార్యాలయం వద్ద నినాదాలు చేశారు. ✦ బొబ్బిలి గ్రామీణం: బొబ్బిలిలో తహసీల్దారు శ్రీనుకు వినతి ఇచ్చారు. చంద్రశేఖర్, రవి అప్పారావు, గౌరీశంకరరావు పాల్గొన్నారు.

శ్రద్ధాంజలి

అనురాగ ఆప్యాయతలు మాకు పంచి ఇచ్చి కుటుంబశ్రేయస్సుకు అహర్నిశలు శ్రమించిన మీరు మా నుండి దూరమైనందుకు చింతిస్తూ.. మీ పవిత్రమైన ఆత్మకు శాంతి కలగాలని భగవంతుని ప్రార్థిస్తూ.. అశ్రునయనాలతో...

కీ.శే. శ్రీమతి దాసరి లక్ష్మిగారు
గరిడ గ్రామం, గుర్లమండలం
మరణం : 06-02-2026

భర్త : దాసరి పాపినాయుడు
కుమారుడు - కోడలు
దాసరి శివప్రసాదరావు - నాగమణి
వైస్‌ఛైర్మన్, AMC మెరకముడిదాం, చీపురుపల్లి నియోజకవర్గం
మరియు కుటుంబసభ్యులు, బంధుమిత్రులు

పెద్దకర్మ : తేది 18-02-2026 బుధవారం మా స్వగృహం గరిడ గ్రామంలో జరుపబడును. సెల్ : 9490461703, 9603513611

18వ వార్షికోత్సవ శుభాకాంక్షలు

यूनियन बैंक ऑफ इंडिया Union Bank of India
A Government of India Undertaking
आन्ध्रा Andhra | Corporation

బొబ్బిలి శాఖ - 1, వైష్ణవవీధి

గమనిక: టెలికాం భవనం ఎదురుగా ఉన్న శాఖను అదే లైన్‌లో వైష్ణవవీధిలోకి మార్చబడినది

విశిష్ట సేవలందిస్తున్న బ్రాంచ్ మేనేజర్ మరియు సిబ్బందికి హార్దిక వార్షికోత్సవ శుభాకాంక్షలు. – ఖాతాదారులు

(c) eenadu

మేమున్నాం.. మీకు తోడుగా (10 AM TO 1 PM)

విజయనగరం పట్టణం	80089 02900
విజయనగరం గ్రామీణం	80085 74317
ఎస్.కోట	80085 74326
భోగాపురం	70959 54646

?: ముడిదాం నుంచి సుంకరిపేట వెళ్లే రహదారిలో వీధిదీపాలు వేయాలి - స్థానికులు
● పరిశీలించి, కొత్తవి వేస్తాం. - శ్రీనివాసరావు, ఈవోపీఆర్డీ - న్యూస్‌టుడే, విజయనగరం గ్రామీణం

?: అంబటిసత్రం, కొట్లమాదప్పవీధి దారిలో కాలువ నుంచి మురుగునీరు వస్తోంది. - ఎన్.బాలకృష్ణారావు, స్థానికులు
● అక్కడికి సిబ్బందిని పంపించి చర్యలు తీసుకుంటాం. - నరసింహారెడ్డి, డీఈ - న్యూస్‌టుడే, విజయనగరం పట్టణం

?: 'పెదతాడివాడ ఎస్ఆర్ నగర్‌లో ప్రధాన పక్కన చెత్త కుప్పలుగా పేరుకుపోయాయి. - స్థానికులు ● పరిశీలించి తొలగిస్తాం. - అప్పలనాయుడు, కార్యదర్శి - న్యూస్‌టుడే, డెంకాడ

దీపాలు వెలిగాయ్

స్పందనకు వందనం

విజయనగరం పట్టణం: విజయనగరంలోని ఎత్తుబ్రిడ్జి టౌన్, కోదండరామ గల్లిలో వీధి దీపాలు వెలగడం లేదని ఆయా కాలనీవాసులు 'మేమున్నాం... మీకు తోడుగా'కు ఫిర్యాదు చేశారు. సమస్యను ఏఈ ప్రసాద్ దృష్టికి తెళ్లగా స్పందించి బాగు చేయించారు.

వ్యర్థాల తొలగింపు

విజయనగరం పట్టణం, ఎల్.కోట: దాసన్నపేట న్యూడార్లింగ్ హైట్స్ అపార్ట్‌మెంట్ ఎదురుగా ఉన్న పార్కు సమీపంలో వ్యర్థాలు పేరుకుపోవడంపై 'ఈనాడు'లో ప్రచురితమైన చిత్ర కథనానికి అక్కడి శానిటరీ కార్యదర్శి కరుణ స్పందించి, కార్మికులతో పారిశుద్ధ్య పనులు చేయించారు. ★ కిత్తన్నపేటలో కాలువలు అధ్వానంగా ఉండడంపై డిప్యూటీ ఎంపీడీవో కుమార్ స్పందించి, శుభ్రం చేయించారు.

తెరపై ఈనాడు

★ ఎస్వీసీ: పంకీ ★ శ్రీకృష్ణ: కపుల్ ఫ్రెండ్లీ ★ ఆదిత్య: నిలవే ★ లీలామహల్: మనసంతా నువ్వే ★ రజని ప్రీమియర్-1: కపుల్ ఫ్రెండ్లీ, పంకీ ★ శివరంజని ప్రీమియర్-2: మనసంతా నువ్వే, మన శంకరవరప్రసాద్‌గారు ★ హేమగిరి: మన శంకరవరప్రసాద్‌గారు ★ సప్తగిరి: సీతా పయనం, విత్ లవ్ - న్యూస్‌టుడే, కంటోన్మెంట్

విజయనగరం

•విజయనగరం •నెల్లిమర్ల • ఎస్.కోట

ఆగితే వెలగవు.. వెలిగితే ఆరవు

- న్యూస్‌టుడే, విజయనగరం పట్టణం

విజయనగరం నగరపాలక సంస్థ పరిధిలోని పలు ప్రాంతాల్లో వీధిదీపాలు వెలగడం లేదు. కొన్నేళ్లుగా ఈ పరిస్థితి ఉన్నా బాగుచేసేందుకు చర్యలు కొరవడుతున్నాయి. కొన్ని రాత్రి, పగలు వెలుగుతూనే ఉంటున్నాయి. గతంలో తెదేపా ప్రభుత్వ హయాంలో ఈఈఎస్ఎల్ సంస్థకు నిర్వహణ బాధ్యతలు అప్పగించారు. 2016 నుంచి ఏడేళ్ల పాటు ఒప్పందం చేసుకున్నారు. అప్పట్లో వేసిన దీపాలే చాలాచోట్ల ఇంకా దర్శనమిస్తున్నాయి. వెలుతురు తగ్గిపోవడంతో అంధకారం కనిపిస్తోంది. 2023లో సంస్థ వైదొలిగింది. ఆ సమయంలో వైకాపా అధికారంలో ఉండడంతో తదుపరి చర్యలు ఆగిపోయాయి. అప్పటి నుంచి నగరపాలిక అధికారులే పర్యవేక్షిస్తున్నారు. త్వరితగతిన చర్యలేక ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

సీఎంఆర్ కూడలి నుంచి ఎన్సీఎస్ థియేటర్ దారిలో అంధకారం

నిర్వహణకు భారీగా ఖర్చు..

వీధిదీపాల నిర్వహణకు ఏటా రూ.1.82 కోట్ల మేర ఖర్చు చేస్తున్నారు. నెలకు రూ.24 లక్షలకు పైగా విద్యుత్తు బిల్లు వస్తోంది. అయినప్పటికీ కష్టాలు తప్పడం లేదు.

రూ.30 లక్షలతో..

కొత్తగా రూ.30 లక్షలతో 350 దీపాలు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని నగరపాలక సంస్థ ఈఈ ప్రసాద్ తెలిపారు. సెంటర్ డివైడర్ల వద్ద రూ.13 లక్షలతో 42 స్తంభాలు వేసి, దీపాలు బిగిస్తామని చెప్పారు. ఎక్కడా అంధకారం సమస్య లేకుండా చూస్తామన్నారు.

పడిపోయినా..

నగరంలోని సీఎంఆర్ కూడలి నుంచి ఎన్సీఎస్ సినిమా థియేటర్ దారిలో హుద్‌హుద్ తుపాను సమయంలో సెంటర్ డివైడర్‌లోని విద్యుత్తు స్తంభాలు నేలకొరిగాయి. వాటిని ఇంత వరకు పునరుద్ధరించలేదు. చాలాచోట్ల ఇదే పరిస్థితి ఉంది. దీంతో ఆయా ప్రాంతాల్లో అంధకారం అలుముకుంటోంది. రైల్వే స్టేషన్, కలెక్టరేట్, గంటస్తంభం వైపు వెళ్లడానికి ఇదే ప్రధాన దారి. కలెక్టరేట్ ఇన్ గేట్, జాతీయ రహదారిని ఆనుకొని ఉన్న ప్రదీప్ నగర్ నుంచి వైకూడలి వరకు దీపాలు లేవు.

ప్రస్తుతం ఇలా..

20 వాట్ల దీపాలు	13,589
30-36	3,636
60-72	1,424
90- 200	1403
హైమాస్ట్‌లు	85

రెండుపూటలా..

★ కొన్ని లైన్లలో మూడో తీగ లేకపోవడం, స్విచ్‌బోర్డులు పెట్టకపోవడంతో రాత్రి, పగలు అన్న తేడా లేకుండా వెలుగుతున్నాయి. దీంతో విద్యుత్తు వృథా అవుతోంది. కేవల్‌పురం, లంకాపట్నం, పెద్దవారి కూడలి, కొత్తగ్రహారం, జగదాంబనగర్, బంగారపు, బచ్చిన్నకోనేరు, జొన్నగుడ్డి, ఎస్వీఎన్ నగర్, ప్రదీప్‌నగర్, గంజిపేట, వైఎస్సార్ నగర్ తదితర చోట్ల ఈ పరిస్థితి ఉంది ★ 1, 2, 5, 35, 42, 43, 47వ డివిజన్లలో కొత్త స్తంభాలు వేయాలి. కొన్ని నెలలుగా స్థానికులు డిమాండు చేస్తున్నా పనులు చేపట్టలేదు. ★ అంబేడ్కర్ కూడలి నుంచి సింహాద్రినగర్ దారి, దాసన్నపేట, ఐస్‌ఫ్యాక్టరీ- దాసన్నపేట, ఆనంద గజపతి ఆడిటోరియం, ట్యాంక్ బండ్ రోడ్డు ప్రాంతాల్లో తెల్లారక ముందే ఆగిపోతున్నాయి ★ శివారు కాలనీలు, విలీన పంచాయతీల్లో చాలాచోట్ల వెలుగుల్లేవు.

జోడెడ్ల జోరు

వేపాడ మండలంలోని ఎం.సింగవరంలో ఆంజనేయ జాతర సందర్భంగా మంగళవారం ఎడ్ల పరుగు పోటీలు నిర్వహించారు. వివిధ ప్రాంతాలకు చెందిన 12 జతల ఎడ్లు పాల్గొన్నాయి. వల్లంపూడికి చెందిన సిద్ధి వినాయక, వావిలపాడు నుంచి వచ్చిన మరిడి మాంబ, తుమ్మికాపల్లికి చెందిన పంచముఖ ఆంజనేయస్వామి ఎడ్ల జోడీ మూడు స్థానాల్లో నిలిచాయి. తెదేపా వేపాడ మండలాధ్యక్షుడు గొంప వెంకటరావు, బానాది ఎంపీటీసీ సభ్యురాలు తులసి, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. - న్యూస్‌టుడే, వేపాడ

బాలల్లో నులిపురుగుల నివారణ తప్పనిసరి

జామి, న్యూస్‌టుడే: జిల్లాలోని పలు పీహెచ్‌సీలు, పాఠశాలలు, కళాశాలల్లో జాతీయ నులిపురుగుల నివారణ దినాన్ని మంగళవారం నిర్వహించారు. విద్యార్థులతో ఆల్బెండజోల్ మాత్రలు మింగించారు. జామి మండలం కుమరాం కస్తూర్బా విద్యాలయంలో చైల్డ్ అండ్ హెల్త్ జేడీ ఎల్.బీఎస్. హెచ్.దేవి, డీఎంహెచ్‌వో జీవనరాణి, సమగ్ర శిక్షా ఏపీసీ ఎ.రామారావు, పాఠశాల ప్రిన్సిపల్ బి.జ్యోతి మాత్రలు అందించారు.

కుమరాం కస్తూర్బాలో అవగాహన కల్పిస్తున్న జేడీ దేవి, చిత్రంలో డీఎంహెచ్‌వో జీవనరాణి, సమగ్ర శిక్షా ఏపీసీ రామారావు తదితరులు

● కొత్తవలస: వియ్యంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో 4,802 మందికి వేయించినట్లు వైద్యాధికారి గోపాలకృష్ణ, జడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గోవిందరాజులు తెలిపారు. ● నెల్లిమర్ల: మొయిద, కొండవెలగాడ ఉన్నత పాఠశాలల్లో 300 మంది విద్యార్థులతో మాత్రలు మింగించినట్లు రాష్ట్ర ఎన్ఐఈపీ రాష్ట్ర కన్సల్టెంట్ సత్యవతి, వైద్యులు శిరీష, ధనుంజయ్ పేర్కొన్నారు. వైద్య సిబ్బంది అప్పలనాయుడు, ఎ.మాధవి తదితరులు ఉన్నారు. ● లక్కవరపుకోట: మండలంలోని 5,725 మందితో మాత్రలు మింగించామని వైద్యాధికారి అనిల్‌కుమార్, తహసీల్దారు రమేష్, ఎంపీడీవో ఎంవీఏ దొర, ఎంఈవోలు కూర్మారావు, శ్రీనివాస్ తెలిపారు.

న్యాయం చేయాలని వినతి

శృంగవరపుకోట, న్యూస్‌టుడే: తమకు న్యాయం చేయాలంటూ జిందాల్ నిర్వాసితులు మంగళవారం సాయంత్రం తాటిపూడి పర్యటనలో ఉన్న రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యుడు మల్లేషును కలిసి వినతిపత్రం అందించారు. తమ భూములను తీసుకొని జిందాల్ యాజమాన్యం మోసం చేసిందని, దీన్ని ప్రశ్నిస్తే పోలీసులు ఇబ్బందులు పెడుతున్నారని వాపోయారు. దీనిపై స్పందించి, చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని నిర్వాసితులు తెలిపారు. కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకుడు ఆదాడ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

అల్లుకున్న నిర్లక్ష్యం!

ఇప్పటికే నగరంలో తరచూ విద్యుత్తు సరఫరాకు అంతరాయం కలుగుతోందని, లోవోల్టేజీ సమస్యలు, ఒరిగి ఉన్న తీగలు, స్తంభాలపై ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. నియంత్రికలు, ఫ్యూజు బాక్సుల నిర్వహణను గాలికొదిలేశారనే ఆరోపణలున్నాయి. స్థానిక కలెక్టరు కార్యాలయానికి వెళ్లే దారిలోని రెడ్ క్రాస్ సొసైటీ భవనం సమీపంలో విద్యుత్తు స్తంభం, తీగలకు ఇలా లతలు అల్లుకున్నాయి. కొన్ని మీటర్ల దూరంలో చుట్టేశాయి. దీంతో తరచూ నిప్పులు రాలుతున్నాయని, అంతరాయం ఏర్పడుతోందని అక్కడివారు చెబుతున్నారు. సిబ్బందిని పంపించి వెంటనే తొలగింపజేస్తామని ఏపీఈపీడీసీఎల్ విజయనగరం టౌన్ సర్కిల్ ఈఈ పి.త్రినాథరావు తెలిపారు. - న్యూస్‌టుడే, విజయనగరం పట్టణం

ఇలా వదిలేస్తే ఎలా?

ఎస్.కోట శివారు గ్యాస్ గోదాము నుంచి మాలిన వాని చెరువు వద్ద ఆర్అండ్‌బీ తారు రోడ్డు వరకు మార్గం అధ్వానంగా ఉండడంతో చోదకులు రాకపోకలకు భయపడుతున్నారు. ఈ మార్గానికి ఇరువైపులా వ్యర్థాలను పోగులుగా వేయడంతో, బెర్మ్ ఎత్తుగా మారాయి. వర్షం పడితే రోడ్డుపై నీరు నిలిచి చెరువును తలపిస్తోంది. ప్రమాదాలు సైతం చోటుచేసుకుంటున్నాయి. దీనిపై ఆర్అండ్‌బీ జేఈ వీరభద్రస్వామి వద్ద ప్రస్తావించగా స్థానికులు కొందరు రాత్రివేళ నిర్మాణ వ్యర్థాలను రోడ్డు పక్కనే వేస్తున్నారని, తొలగించేలా చర్యలు తీసుకుంటామన్నారు. - న్యూస్‌టుడే, శృంగవరపుకోట

పొంచి ఉన్న ముప్పు

నగరంలో పలుచోట్ల కల్వర్టులు ప్రమాదకరంగా ఉన్నాయి. సిమెంటు పలకలు వేయకపోవడంతో ముప్పు పొంచి ఉంది. ధ్వంసమైన ప్రాంతాల్లో మరమ్మతులు చేయడం లేదు. స్థానిక గౌడవీధి దారిలో కొన్ని నెలలుగా ఈ పరిస్థితి ఉన్నా.. చర్యలు తీసుకోవడం లేదు. చిన్నారులు పడిపోతున్నారని అక్కడివారు చెబుతున్నారు. పలకలు ఏర్పాటు చేస్తామని డీఈఈ శ్రీనివాసరావు తెలిపారు. - న్యూస్‌టుడే, విజయనగరం పట్టణం

రాళ్ల దారిలో అవస్థలు

డెంకాడ మండలంలోని గొడిపాలెం నుంచి పేడాడ మీదుగా బంటుపల్లికి వెళ్లే రహదారి రాళ్లు తేలి అధ్వానంగా దర్శనమిస్తోంది. ఈ మార్గం మీదుగే భోగాపురం నుంచి విజయనగరం వెళ్లేందుకు వందలాది మంది నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. గుంతలలో పడి ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందోనని వాహన చోదకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సమస్యను ఎంపీడీవో భవాని వద్ద ప్రస్తావించగా చర్యలు తీసుకుంటామన్నారు. - న్యూస్‌టుడే, డెంకాడ

ఎక్కడికక్కడే వ్యర్థాలు

విజయనగరం నగరపాలక సంస్థ పరిధిలో పలుచోట్ల వ్యర్థాలు దర్శనమిస్తున్నాయి. డంపర్ బిన్లు మరమ్మతులకు గురికావడంతో వాటిని వాడడం లేదు. కొందరు స్థానికులు రోడ్లపైనే చెత్త వేస్తున్నారు. స్థానిక ధర్మపురికి వెళ్లే ప్రధాన దారిలో ఈ పరిస్థితి కనిపిస్తోంది. పందులు చేరుతుండడంతో దుర్వాసన వస్తోంది. అటుగా వెళ్లేవారు ఇబ్బంది పడుతున్నారు. పరిశీలించి, చర్యలు తీసుకుంటామని సహాయ కమిషనరు కె.అప్పలరాజు తెలిపారు. - న్యూస్‌టుడే, విజయనగరం పట్టణం

ప్రతిఒక్కరూ సేవాభావంతో పనిచేయాలి

కంటోన్మెంట్, న్యూస్‌టుడే: పండిత్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ సేవాభావంతో సమాజ నిర్మాణానికి పాటుపడాలని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యదర్శి కేతినేని సురేంద్రమోహన్ పిలుపునిచ్చారు. మంగళవారం నగరంలోని పార్టీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు ఉప్పలపాటి రాజేష్‌వర్మ అధ్యక్షతన జరిగిన సమావేశంలో మాట్లాడారు. పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. రాష్ట్ర కార్యదర్శి రెడ్డి పావని, కోటగిరి నారాయణరావు, కొండల శ్రీనివాస్, పతివాడ రాజేష్, వేమకోటి గిరిబాబు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న భాజపా రాష్ట్ర కార్యదర్శి సురేంద్రమోహన్

విద్యుత్తు సమస్యలను పరిష్కరించాలి

మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాధవి

భోగాపురం, న్యూస్‌టుడే: రాష్ట్ర శాసనసభ సమావేశాల్లో విద్యుత్తు ప్రమాదాల నివారణ అంశంపై నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం మాధవి మంగళవారం మాట్లాడారు. ఇళ్లకు సమీపంలో ఉన్న తీగలు, స్తంభాల వల్ల ప్రాణ నష్టం కలుగుతోందని, తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. రాష్ట్రంలో గతేడాది వందలాది మరణాలు సంభవించాయని, 90 రోజుల్లో సమస్యల పరిష్కారానికి కార్యాచరణ రూపొందించాలన్నారు. ఈ అంశంపై ఆ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ స్పందిస్తూ.. ప్రతి జిల్లాకు రూ.4 కోట్ల చొప్పున నిధులు మంజూరు చేశామని వెల్లడించారు. భద్రతా ప్రమాణాల కోసం బడ్జెట్‌లో అదనంగా నిధులు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. అత్యవసరంగా స్తంభాల మార్పు, లైన్ల ఎత్తు పెంపు తదితర పనులు చేపడతామని హామీ ఇచ్చారు.

పాత భవనాల తొలగింపు పనులు ప్రారంభం

ఎస్.కోట: ఎస్.కోటలోని పాత కోర్టు భవనాల తొలగింపు పనులను మంగళవారం మేజిస్ట్రేట్ కనకలక్ష్మి ప్రారంభించారు. శిథిలావస్థకు చేరుకోవడంతో కొత్త భవన నిర్మాణానికి రూ.8.50 కోట్లు మంజూరయ్యాయి. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జి.సూరిదేముడు, న్యాయవాదులు పాల్గొన్నారు. త్వరలోనే కొత్త భవనాలు అందుబాటులోకి వస్తాయని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు తెలిపారు.

పూజలో పాల్గొన్న మేజిస్ట్రేట్ కనకలక్ష్మి

వైభవంగా పైడితల్లి జాతర

జామి: జాగరం గ్రామంలో పైడితల్లి పండగ మంగళవారం ఘనంగా జరిగింది. పెద్దఎత్తున భక్తులు తరలివచ్చి అమ్మవారికి పసుపు, కుంకుమ సమర్పించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

వేపాడలో వీఆర్వోల నిరసన

వేపాడ: గ్రామ స్థాయిలో వీఆర్వోలు పని ఒత్తిడితో ఇబ్బంది పడుతున్నారని ఆ సంఘం మండలాధ్యక్షుడు జి.అప్పలరాం అన్నారు. వేపాడ తహసీల్దారు కార్యాలయ ఆవరణలో సిబ్బందితో కలిసి నిరసన తెలిపారు.

ఉచిత కంటి వైద్య శిబిరం

విజయనగరం గ్రామీణం: మలిచర్ల, సుంకరిపేట పంచాయతీల్లో పుష్పగిరి కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య, హోమియోపతి శిబిరాలు నిర్వహించారు. ఎంపీటీసీ రాజేష్ బాబు, తెదేపా నాయకులు పోలినాయుడు, అప్పలనాయుడు పాల్గొన్నారు.

ఐవోసీఎల్ నమూనా డ్రిల్

లక్కవరపుకోట, న్యూస్‌టుడే: రంగారాయపురం గ్రామ సమీపంలో బుధవారం ఐవోసీఎల్ యాజమాన్యం మాక్‌డ్రిల్ చేయనున్నట్లు తహసీల్దారు రమేష్ ఒక ప్రకటనలో తెలిపారు.

సంక్షిప్త సమాచారం

19 నుంచి పారాయణం

కంటోన్మెంట్: ఎస్వీఎస్ రోడ్డులో ఉన్న పంచముఖ ఆంజనేయస్వామి ఆలయంలో ఈనెల 19 నుంచి ఏప్రిల్ 1 వరకు హనుమాన్ చాలీసా పారాయణం నిర్వహించనున్నట్లు దేవాలయ కమిటీ అధ్యక్షుడు వెంకటాచలం తెలిపారు. ఆహ్వానప్రతులను ఆవిష్కరించారు.

వల్లంపూడి ఎస్సైకు సత్కారం

వేపాడ: వల్లంపూడి ఎస్సై సుదర్శన్‌ను మండలంలోని 18 సచివాలయాల మహిళా పోలీసులు సత్కరించారు. మండలంలో ఇటీవల జరిగిన దొంగతనాల కేసులను ఛేదించడంలో కీలక పాత్ర పోషించారన్నారు. దొంగలను పట్టుకొని బంగారం, విలువైన వస్తువులను రికవరీ చేయడంతో బాధితులు ఆనందం వ్యక్తం చేశారన్నారు.

సీసీ కెమెరాల వితరణ

జామి, న్యూస్‌టుడే: ఆర్మీ విశ్రాంత ఉద్యోగి జామి గ్రామానికి చెందిన చలుమూరి జగన్ తాను చదువుకున్న స్థానిక జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలకు రూ.30 వేల విలువైన మూడు సీసీ కెమెరాలను అందజేశారు. హెచ్ఎం వి.శేఖర్‌కుమార్ పాల్గొన్నారు.

అమ్మవారికి ప్రత్యేక పూజలు

డెంకాడ, న్యూస్‌టుడే: మండలంలోని జొన్నాడలో వెలసిన పైడితల్లి అమ్మవారి జాతర సందర్భంగా ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు.

విద్యుత్తు అంతరాయం నేడు

డెంకాడ: నిర్వహణ పనుల నిమిత్తం గొలగాం, మాన్యం కల్లాలు, గంట్లాం ఎస్సీ కాలనీ, డి.తాళ్లవలస గ్రామాల్లో బుధవారం ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ పి.అప్పలస్వామి నాయుడు తెలిపారు.

స్టాండింగ్ కమిటీ సమావేశం

విజయనగరం పట్టణం: నగరపాలక సంస్థ స్టాండింగ్ కమిటీ సమావేశం మేయరు వెంపడాపు విజయలక్ష్మి అధ్యక్షతన బుధవారం సాయంత్రం 4 గంటలకు జరగనుంది.

మెనూ ప్రకారం భోజనం

డెంకాడ, న్యూస్‌టుడే: మెనూ ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని డీఈవో మాణిక్యం నాయుడు అన్నారు. మండలంలోని మోపాడ జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల, కేజీబీవీ పాఠశాలను సందర్శించారు.

ఎట్టకేలకు పనులు

పనులను పరిశీలిస్తున్న రైల్వేశాఖ సహాయ ఇంజినీరు అయ్యప్పస్వామి

లక్కవరపుకోట, న్యూస్‌టుడే: ఎల్.కోట రైల్వే స్టేషన్ సమీపంలో ఉన్న రైల్వే అండర్ బ్రిడ్జి వర్షాల సమయంలో నీటితో నిండి అధ్వానంగా తయారవుతోంది. వాహనాల రాకపోకలు నిలిచిపోతున్నాయి. పాదచారులు కూడా వెళ్లలేని పరిస్థితులు నెలకొన్నాయి. దీనిపై 'ఈనాడు'లో పలుమార్లు కథనాలు ప్రచురితమయ్యాయి. ఎట్టకేలకు అధికారులు చర్యలు తీసుకున్నారు. ఇనుప తలుపు ఏర్పాటు చేశామని, మరి మరికొన్ని పనులు చేస్తున్నట్లు రైల్వేశాఖ జూనియర్ ఇంజినీరు కేవీ.అయ్యప్పస్వామి తెలిపారు.

ఈనాడు కథనానికి స్పందన

బాల్య వివాహాలకు వ్యతిరేకంగా ప్రచారం

కొత్తవలస, న్యూస్‌టుడే: బాల్య వివాహాల వల్ల జరిగే అనర్థాలను తెలియజేస్తూ జిల్లా బాలల రక్షణ విభాగం, మిషన్ వాత్సల్య, మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ, బెజ్జిపురం యూత్ క్లబ్ ఆధ్వర్యంలో కొత్తవలస మండలంలోని అప్పన్నదొరపాలెంలో మంగళవారం ప్రచారం నిర్వహించారు. బాల్య వివాహ నిరోధక చట్టంలో ఉన్న అంశాలపై అవగాహన కల్పించారు. ఎక్కడైనా బాల్య వివాహాలు చేస్తే టోల్‌ఫ్రీ నంబరుకు సమాచారం ఇవ్వాలన్నారు. సమీపంలోని పోలీస్‌స్టేషన్, అంగన్‌వాడీ కేంద్రాలను సైతం ఆశ్రయించవచ్చన్నారు. ఐసీడీఎస్ వియ్యంపేట పీవో ఆర్.ఉమాదేవి, అంగన్‌వాడీ కేంద్రాల పర్యవేక్షకులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

నష్టపరిహారం చెల్లించాలి

విజయనగరం అర్బన్, న్యూస్‌టుడే: ఏళ్ల తరబడి సాగులో ఉన్న భూమిని భోగాపురం విమానాశ్రయానికి చెందిన సీఐఎస్ఎఫ్ సిబ్బందికి కేటాయించడం తగదని భోగాపురం మండలం తూడెం పంచాయతీ బసవపాలెం గ్రామానికి చెందిన రైతులు వాపోయారు. మంగళవారం కలెక్టరేట్ వద్ద నిరసన తెలిపారు. జీడి, నీలగిరి, మామిడి, సరుగుడు, కొబ్బరి తోటలు పెంచుతున్నామని, ఫలసాయంతో జీవనోపాధి పొందుతున్నామని పేర్కొన్నారు. తగిన నష్టపరిహారం ఇప్పించాలని విన్నవించారు.

వినతిపత్రాలతో బసవపాలెం గ్రామస్థులు

గుర్తింపు సంఖ్యతో రైతులకు మేలు

'న్యూస్‌టుడే'తో ఏడీఏ భానులత

కొత్తవలస, న్యూస్‌టుడే: తెదేపా ప్రభుత్వం రైతుల కోసం 11- 14 అంకెల విశిష్ట గుర్తింపు సంఖ్య(ఫార్మర్ రిజిస్ట్రీ ఐడీ)ని తప్పనిసరి చేసింది. ఇది పీఎం కిసాన్, రైతు భరోసా, ఎరువుల రాయితీలు, పంటల బీమా, బ్యాంకు రుణాలు సులభంగా పొందేందుకు దోహదపడుతుంది. అన్నదాతలు వారి ఆధార్ అనుసంధానమైన చరవాణి నంబరు వినియోగించి 'ఆంధ్రప్రదేశ్ ఫార్మర్ రిజిస్ట్రీ' పోర్టల్ ద్వారా గానీ, గ్రామ, వార్డు సచివాలయం, మీ-సేవ, రైతు సేవా కేంద్రాల్లో ఈ-కేవైసీ ద్వారా ఉచితంగా నమోదు చేసుకోవచ్చు. కొత్తవలస వ్యవసాయ సబ్ డివిజన్ పరిధిలోని అయిదు మండలాల్లో 50,149 మందికి గానూ ఇప్పటివరకు 8,075 మంది రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సి ఉందని **ఏడీఏ బి.భానులత** తెలిపారు. మిగిలిన వారు ఈ నెలాఖరులోగా నమోదు చేసుకోవాలని సూచించారు. సంబంధిత అంశాలపై 'న్యూస్‌టుడే' ముఖాముఖిలో మాట్లాడారు.

★ సబ్ డివిజన్‌లోని అయిదు మండలాల్లో 50,149 మంది రైతుల్లో ఇప్పటి వరకు 42,074 మంది రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. ఇంకా 8,075 మంది నమోదు కావాలి. కొత్తవలస మండలంలో 8,429కి 2,278 మంది, వేపాడలో 9,863- 1,949, శృంగవరపుకోటలో 10,584- 1,738, లక్కవరపుకోటలో 11,735 మంది 1,719, జామి మండలంలో 9,538కి 391 మంది రిజిస్ట్రేషన్ చేసుకోవాలి.

నమోదు ఇలా..

★ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలకు, పంటల అమ్మకాలకు ఈ ఐడీ విధిగా అవసరం. వెబ్‌సైట్ ద్వారా https://apfr.agristack.gov.in/farmer rigistry-ap నమోదు చేసుకోవచ్చు. ఆఫ్‌లైన్‌లో అయితే గ్రామ, వార్డు సచివాలయం, రైతు సేవా కేంద్రంలో నమోదు చేసుకోవాలి. ఇందుకోసం ఆధార్ కార్డు, భూమి పాసు పుస్తకం, బ్యాంక్ ఖాతా వివరాలు, ఆధార్‌తో అనుసంధానమైన చరవాణి నంబరును తప్పనిసరిగా అందజేయాలి.

ఈ యాప్‌లు ఉపయోగపడతాయి..

ఆండ్రాయిడ్ చరవాణి ఉన్న రైతులంతా 'ఏపీ ఎయిమ్స్' యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకొని ఫోన్‌లో ఇన్‌స్టాల్ చేసుకోవాలి. దీంతో వ్యవసాయ సమాచారం ఎప్పటికప్పుడు తెలుస్తుంది. రైతే స్వయంగా ఈ-క్రాప్ నమోదు చేసుకోవచ్చు. ఇలా నమోదు చేసుకున్న సమాచారం వీఏఏలకు వస్తుంది. వీఏఏలు నమోదు చేసిన సమాచారం సరిగా ఉందో, లేదో రైతు స్వయంగా తెలుసుకోవచ్చు. శృంగవరపుకోట, జామి, లక్కవరపుకోటల్లో ఉన్న డ్రోన్ సేవలు పొందాలంటే 'డ్రోన్ మార్ట్ యాప్' డౌన్‌లోడ్ చేసుకొని ఇన్‌స్టాల్ చేసుకుంటే వ్యవసాయ పనులు సులువుగా చేసుకోవడానికి ఉపయోగపడుతుంది. 'ఊబరైజేషన్ యాప్'లో వివిధ రకాల వ్యవసాయ పరికరాల వివరాలు, సర్వీస్ ప్రొవైడర్ల జాబితా అందుబాటులో ఉంచారు. ఈ మూడు రకాల యాప్‌లు వ్యవసాయంలో విప్లవాత్మకమైన మార్పులు, ఈ సేవలన్నీ రైతులంతా పొందాలంటే ఆ యాప్‌లు విధిగా వారి చరవాణుల్లో ఉండాలి. ఈ యాప్ డౌన్‌లోడ్ చేసుకోవడంలో ఏవైనా సందేహాలు, సమస్యలుంటే రైతు సేవా కేంద్రం సహాయకులు, మండల వ్యవసాయాధికారిని సంప్రదించవచ్చు.

రైతులకు తప్పుల్లేని పాసు పుస్తకాల పంపిణీ: జేసీ

పూసపాటిరేగ, న్యూస్‌టుడే: అన్నదాతలకు తప్పుల్లేని పాసు పుస్తకాలు పంపిణీ చేయాలని జేసీ ఎస్.సేధు మాధవన్ అధికారులను ఆదేశించారు. మంగళవారం పూసపాటిరేగ మండల కేంద్రంలోని తహసీల్దారు కార్యాలయాన్ని సందర్శించారు. పాసు పుస్తకాల పరిశీలన ప్రక్రియను తనిఖీ చేశారు. రైతుల నుంచి సరైన వివరాలు సేకరించి ఎటువంటి తప్పులు లేకుండా చూడాలన్నారు. షెడ్యూల్ ప్రకారం అందజేయాలన్నారు. జాయింట్ ఎల్‌పీఎం, మ్యుటేషన్, ఇతర భూ సమస్యలను సకాలంలో పరిష్కరించాలన్నారు. తహసీల్దారు రమణ, ఉప తహసీల్దారు సంజీవ్, సీఎస్‌డీటీ మురళీ తదితరులు పాల్గొన్నారు.

అధికారులతో మాట్లాడుతున్న సేధు మాధవన్

అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి

సమావేశంలో మాట్లాడుతున్న కమిషనరు బాలస్వామి

విజయనగరం పట్టణం, న్యూస్‌టుడే: భవనాలు, లేఅవుట్ల క్రమబద్ధీకరణకు ప్రభుత్వం ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కమిషనరు కె.బాలస్వామి కోరారు. మంగళవారం తన కార్యాలయంలో ప్రణాళికా అధికారులు, సిబ్బంది, కార్యదర్శులతో సమీక్షించారు. ఎల్ఆర్ఎస్ పథకం అమలుపై ఆరా తీశారు. ఏసీపీలు హరిబాబు, రమణమూర్తి, టీపీవో అప్పలరాజు, టీపీఎస్ అనిత పాల్గొన్నారు. ● కొత్తపేట కుమ్మరివీధిలోని కుక్కల సంతాన నిరోధక శస్త్రచికిత్సల కేంద్రాన్ని కమిషనర్ తనిఖీ చేశారు. అక్కడి పరిసరాలు అపరిశుభ్రంగా ఉండడంపై మండిపడ్డారు. ప్రజారోగ్య అధికారి కె.సాంబమూర్తి, ఈఈ ప్రసాద్, డీఈఈ శ్రీనివాసరావు ఉన్నారు.

(c) eenadu

నా ఘోష.. కంఠశోష

భీమవరం మండలం గొల్లవానితిప్ప వద్ద పూడ్చేసిన డ్రెయిన్ గర్భం

భీమవరం కలెక్టరేట్, న్యూస్‌టుడే

ఆయ్.. నేనండీ..

- మీరంతా జిల్లాలోనే అత్యంత కీలకంగా చెప్పుకొనే మేజర్ డ్రెయిన్‌ని.
- నందమూరు అక్విడెక్టు వద్ద మొదలై భీమవరం శివారున పాత పాడు వద్ద సముద్రంలో కలిసిపోతాను.
- వానాకాలంలో నిమిషానికి 23 వేల క్యూసెక్కుల నీటిని దిగువకు తీసుకెళ్లేది నేనే.
- ఆ సామర్థ్యాన్ని మరింత పెంచుకోవాలని నాకూ ఉంది.
- కానీ అలా చేయకపోగా ఆక్రమణలతో చిక్కిశల్యమయ్యేలా చేస్తున్నారు.
- నా అంచుల్లో మట్టిని ఇష్టారాజ్యంగా తవ్వేస్తూ నన్ను మరింత బలహీనపరుస్తున్నారు.
- కొన్నిచోట్ల టన్నుల కొద్దీ చెత్తను తెచ్చి నా ఒడిలో వేస్తున్నారు.
- ఇకనైనా మేల్కోకుంటే మీకే నష్టం. వరదలు.. అధిక వర్షాల సమయంలో ఎగువ నుంచి వచ్చే నీటిని సకాలంలో సముద్రంలోకి తీసుకెళ్లలేను. దాని ఫలితం మీరే అనుభవించాలి. పంట పొలాలు, ఆవాస ప్రాంతాలు మునిగిపోతాయి.

జిల్లాలో 60.5 కి.మీ పొడవున ప్రవహించి.. ఉండ్రాజవరం, తణుకు, అత్తిలి, తాడేపల్లిగూడెం, పెంటపాడు, గణపవరం, పాలకోడేరు, ఉండి, భీమవరం, మొగల్తూరు మండలాల ప్రజలందరికీ ఎంతో మేలు చేసే నేనంటే ఎందుకింత చిన్నచూపు. ఒకప్పుడు రోజులో సగటున భీమవరం నుంచి కృష్ణా జిల్లాకు 30 లాంచీలు తిరిగేవి. ప్రజల రాకపోకలకు కీలకంగా ఉన్నానని మురిసిపోయే దాన్ని. ఇప్పుడు నన్నే లేకుండా చేస్తున్న వారిని ఏమీ చేయలేక మౌనంగా రోదిస్తున్నా. జిల్లా కేంద్రంలో నా పరిస్థితి మరింత దిగజారింది. ఆక్రమణలతో విలవిల్లాడుతున్నాను. జిల్లా అధికారులు, ఎంతో మంది రాజకీయ ప్రముఖులు నిత్యం నన్ను చూస్తుంటారు. అయినా నా ఆక్రందన వారికి వినిపించదు. ఇప్పటికైనా నన్ను కాపాడాలని కోరుకుంటున్నాను.

- ఇట్లు.. మీ యనమదుర్రు డ్రెయిన్

లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే కఠిన చర్యలు: డీఎంహెచ్‌వో

ఈనాడు-ఏలూరు: ఏలూరు జిల్లాలోని స్కానింగ్ కేంద్రాల్లో ఎవరైనా లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే వారిపై, దీనికి బాధ్యులైన వైద్యులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని డీఎంహెచ్‌వో అమృతం హెచ్చరించారు. మంగళవారం 'ఈనాడు'లో 'అమ్మా.. లోలోపల ఎంత ఏడుస్తున్నానో' శీర్షికన ప్రచురితమైన కథనానికి ఆమె స్పందించారు. స్కానింగ్ కేంద్రాల్లో డెకాయ్ ఆపరేషన్లు కొనసాగిస్తామన్నారు. ప్రజలు కూడా ఎక్కడైనా నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తుంటే టోల్‌ఫ్రీ నంబరు: 1800 425 6131కు సమాచారం ఇవ్వాలని కోరారు.

మార్గం సుగమం.. పశ్చిమకు మణిహారం

వశిష్ఠ గోదావరిపై వారధి నిర్మాణానికి వీడిన గ్రహణం

నరసాపురం, గ్రామీణ, మొగల్తూరు, న్యూస్‌టుడే: జిల్లాలో జాతీయ రహదారి 216 రహదారికి ఉన్న అవరోధాలు తొలగాయి. ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాలను అనుసంధానం చేసేందుకు వశిష్ఠ గోదావరిపై దశాబ్దాల కిందట తలపెట్టిన వంతెన నిర్మాణానికి న్యాయపరమైన చిక్కులు వీడాయి. ఈ మేరకు సుప్రీంకోర్టు సోమవారం తీర్పు వెలువరించడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రాజుల్లంక వద్ద వంతెన నిర్మించే ప్రాంతం

నరసాపురం-సఖినేటిపల్లి మధ్య వశిష్ఠ గోదావరిపై వంతెన నిర్మించాలని ప్రజలు అయిదు దశాబ్దాలుగా ప్రభుత్వాలను కోరుతూనే ఉన్నారు. ఇప్పటి వరకు కోర్టులో పెండింగ్‌లో ఉండిపోవడంతో ఎవరూ దీన్ని పట్టించుకోలేదు. దీనిపై గతేడాది దిల్లీలోని నేషనల్ హైవే అథారిటీ (ఎన్‌హెచ్ఏఐ) అధికారులతో పలుమార్లు కేంద్రమంత్రి శ్రీనివాసవర్మ చర్చలు జరిపారు. జిల్లా అభివృద్ధిలో రహదారి ఆవశ్యకతను ఎన్‌హెచ్ఏఐ అధికారులతో పాటు, అదనపు సొలిసిటర్ జనరల్ (ఏఎస్‌జీ), సీనియర్ న్యాయవాదులకు పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు.

ఇదీ సమస్య: గతంలో వంతెన నిర్మాణానికి అప్పటి ముఖ్యమంత్రులు శంకుస్థాపనలు చేశారు. తెదేపా హయాంలో డీపీఆర్ సిద్ధం చేశారు. వైకాపా ప్రభుత్వం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని రామేశ్వరం-నరసాపురం గ్రామీణ మండలం రాజుల్లంక మధ్య నిర్మాణానికి భూసేకరణ చేపట్టారు. రూ.550 కోట్లతో ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంతో నిర్మించడానికి టెండర్లు పిలిచింది. గుడిమెల్లంకలో ఒక రైతు అభ్యంతరం వ్యక్తం చేస్తూ హైకోర్టు, సుప్రీంకోర్టులను ఆశ్రయించారు. తాజాగా ఆ కేసును డిస్మిస్ చేయడంతో వంతెన నిర్మాణానికి మార్గం సుగమమైంది. అలాగే జిల్లాలో 22.17 కిలోమీటర్ల పొడవున్న 216 రహదారి బైపాస్‌కు 96 శాతం భూసేకరణ పూర్తయింది. 750 మీటర్లకు మాత్రమే వివాదం నెలకొంది. 'ఈ విషయాన్ని సవివరంగా తెలియజేశాం. జిల్లా ప్రయోజనాల దృష్ట్యా పెండింగ్ ప్రాజెక్టులపై దృష్టి సారించామని' కేంద్రమంత్రి శ్రీనివాసవర్మ తెలిపారు.

క్రమబద్ధీకరణకు మరో అవకాశం!

150 గజాల లోపు ఇళ్లకు ఉచితం

నరసాపురం, మొగల్తూరు, న్యూస్‌టుడే: ప్రభుత్వ స్థలాల్లో పేదలు నిర్మించుకున్న గృహాల క్రమబద్ధీకరణకు రాష్ట్ర ప్రభుత్వం మరో అవకాశం కల్పించింది. ఈ పథకాన్ని గతంలోనే అమలులోకి తెచ్చినా వినియోగించుకోని వారి కోసం గడువు పొడిగించారు. అర్హులు ఈ ఏడాది డిసెంబరు 31 లోపు దరఖాస్తు చేసుకోవచ్చు.

అర్హతలు ఇవీ.. 2019 అక్టోబరు 15కు ముందు నిర్మించిన ఇళ్లకు ఇది వర్తిస్తుంది. 150 గజాల లోపు స్థలంలో ఇల్లు నిర్మించుకున్న వారికి ఉచితంగా క్రమబద్ధీకరణ చేస్తారు. 150 నుంచి 450 గజాల స్థలంలో నిర్మాణం చేసుకున్న వారు రిజిస్ట్రేషన్ విలువలో 50 శాతం రుసుము చెల్లించాల్సి ఉంటుంది. చెరువులు, కాలువలు, కుంటలు, రక్షణ శాఖకు చెందిన భూముల్లో నిర్మించిన ఇళ్లకు క్రమబద్ధీకరణ వర్తించదని ఆర్డీవో దాసి రాజు సూచించారు.

అద్దెకు శేషమహల్ రోడ్డు 6లో రైతన్నా.. ఇదిగో నీకో యాప్!

అడ్డంగా వస్తాయ్.. ప్రమాదంలో పడేస్తాయ్

వాహనదారులను బెంబేలెత్తిస్తున్న కుక్కలు

ఈనాడు డిజిటల్, భీమవరం, తణుకు, నరసాపురం, పాలకొల్లు మార్కెట్, న్యూస్‌టుడే: రహదారిపై అకస్మాత్తుగా వచ్చే కుక్కలను తప్పించబోయి ప్రమాదాల బారిన పడుతున్న సంఘటనలు ఇటీవల పెరుగుతున్నాయి. సమస్య చిన్నదిగా అనిపించినా... వాటిని తప్పించే క్రమంలో నియంత్రణ కోల్పోయి కిందపడి కొందరు గాయాల పాలవుతుంటే.. మరికొందరు ప్రాణాలు కోల్పోతున్నారు.

పెదతాడేపల్లి రహదారిపై కుక్కలు

జిల్లాలో జరుగుతున్న వాహన ప్రమాదాలకు రెండు శాతం శునకాలు కూడా ఒక కారణమని అధికారులు చెబుతున్నారు. ఒక్కసారిగా రోడ్లపైకి రావడంతో వాహన చోదకుడు గాబరా పడి హఠాత్తుగా బ్రేక్ వేయడం లేదా మలుపు తిప్పడం చేస్తున్నారు. ఫలితంగా వెనుక వచ్చే వాహనాలు ఢీకొట్టడం, రోడ్డుపక్కకు జారిపడటం వంటి ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. వీధి కుక్కల సంఖ్య పెరగడం సమస్యను మరింత తీవ్రతరం చేస్తోంది. అన్ని రహదారుల్లోనూ వీటి సంచారం ఎక్కువైంది.

ఇవీ కారణాలు

చెత్త నిర్వహణ లోపాలు, ఆహార అవశేషాలు రహదారికి ఇరువైపులా పడేయడంతో అవి రోడ్లపైకి వస్తున్నాయి. ఒక్కోచోట వీధి దీపాలు వెలగకపోవడంతో రాత్రి వేళల్లో, వేగంగా వచ్చిన వారు వాటిని గమనించడం లేదు.

నవంబరు

☛ ఇంజినీరింగ్ చదువుతున్న తూర్పుతాళ్లుకు చెందిన హర్షిత్ సీతారాంపురంలోని కళాశాలకు వెళ్తుండగా కుక్క అడ్డురావడంతో కిందపడ్డాడు. కాళ్లకు బలమైన గాయాలు కావడంతో మూడు నెలలు విశ్రాంతి తీసుకోవాల్సి వచ్చింది. వైద్యానికి సుమారు రూ.30 వేలు ఖర్చయింది.

☛ పీఎంలంకకు చెందిన రామాడి సత్యనారాయణ భార్యతో కలిసి పేరుపాలెం వెళ్తుండగా మార్గమధ్యలో శునకాన్ని తప్పించే క్రమంలో అదుపు తప్పి పడిపోవడంతో తీవ్ర గాయాలపాలయ్యారు.

డిసెంబరు

☛ పెరవలికి చెందిన రాజు తణుకులో చిరు వ్యాపారం ముగించుకుని ఇంటికి వెళ్తున్న సమయంలో జాతీయ రహదారిపై కుక్క అడ్డురావడంతో తప్పించబోయి కింద పడ్డాడు. కాలికి బలమైన గాయాలు కావడంతో మూడు నెలలు విశ్రాంతి తీసుకోవాల్సి వచ్చింది.

☛ పాలకొల్లు నుంచి భీమవరం వస్తున్న ఓ చిరుద్యోగి పెన్నాడ వద్ద శునకాన్ని తప్పించబోయి కింద పడ్డాడు. చెయ్యి విరగడంతో మూడు నెలలుగా సిమెంటు కట్టుతో నెట్టుకొస్తున్నారు.

జనవరి

☛ యలమంచిలి మండలం కొంతేరు గ్రామానికి చెందిన కత్తుల రూతూ (47) ద్విచక్ర వాహనంపై నరసాపురం వెళ్తుండగా పాలకొల్లు మండలం సగంచెరువు సమీపాన శునకం అడ్డురావడంతో వాహనం అదుపు తప్పి పడిపోయారు. తలకు తీవ్రమైన గాయమవడంతో ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందారు.

☛ యలమంచిలి మండలం ఆర్యపేటకు చెందిన జి.వెంకట తాతాజీ (20), బి.కమలాకర్ ద్విచక్ర వాహనంపై మేడపాడు వెళ్లి వస్తుండగా శునకం అడ్డు రావడంతో కిందపడి గాయాల పాలయ్యారు. కమలాకర్ స్వల్పంగా బయట పడగా తాతాజీ తలకు బలమైన గాయమవడంతో ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు.

మనోహరం.. జలవిహారం

భీమవరం ఆధ్యాత్మికం, న్యూస్‌టుడే: శివరాత్రి కల్యాణ మహోత్సవాలు ముగింపులో భాగంగా పంచారామక్షేత్రం గునుపూడి సోమేశ్వరజనార్దనస్వామి ఆలయంలో పార్వతీ పరమేశ్వరులు చంద్రపుష్కరిణిలో హంసవాహనంపై విహరించారు. బాణసంచా కాల్పులు భక్తులకు కనువిందు చేశాయి. అనంతరం స్వామివార్ల గ్రామోత్సవం జరిగింది. అర్ధరాత్రి పుష్పోత్సవం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి వేడుకలను తిలకించారు.

20న ఉద్యోగుల గ్రీవెన్స్

ఏలూరు కలెక్టరేట్, న్యూస్‌టుడే: కలెక్టరేట్‌లోని గోదావరి సమావేశ మందిరంలో జిల్లాలోని ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి 20న ప్రత్యేక గ్రీవెన్స్ నిర్వహించనున్నారు. ఈ మేరకు కలెక్టర్ వెట్రిసెల్వి ఉత్తర్వులు జారీ చేసినట్లు ఏపీఎన్జీవోల సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ తెలిపారు. దీన్ని సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.

ఆ సంకల్పమే బతికించెట్టు

కొయ్యలగూడెం గ్రామీణ, న్యూస్‌టుడే: కనకాద్రిపురం (ఆరిపాటిదిబ్బలు) వద్ద పొంగుటూరు రహదారిపై ఇటీవల వందల ఏళ్ల నాటి పెద్దపెద్ద రావిచెట్లు వరుసగా నిలబడి కనిపిస్తూ.. బాటసారులకు ఆశ్చర్యం కలిగిస్తున్నాయి. ఆ ప్రాంతంతో పరిచయం ఉన్నవారికి ఇంతకు ముందు అవి అక్కడ ఉన్నట్టు గుర్తులేక విస్మయం చెందుతున్నారు. ఆ చెట్లన్నీ కొమ్మలు నరికేసి మొండి మొదళ్లు మాత్రమే ఉన్నాయి. ఇంతకూ అవేమిటంటే.. రాజమహేంద్రవరం ప్రాంతానికి చెందిన వ్యక్తులు వీటిని అక్కడ నాటారు. అందుకోసం కొయ్యలగూడెం, బుట్టాయగూడెం, పోలవరం పరిసర ప్రాంతాల్లో అక్కడక్కడా తొలగించిన భారీ వృక్షాలను సేకరించి, శాస్త్రీయ విధానంలో తవ్విన గుంతల్లో నాటుతున్నారు. అవన్నీ తిరిగి చిగురించేలా సుమారు ఆరు నెలల పాటు సంరక్షించనున్నారు. ఆ తర్వాత బోన్సాయ్ చెట్ల తరహాలో వాటిని తీర్చిదిద్దుతామని వారు చెబుతున్నారు.

వరి ఉప ఉత్పత్తులతో పరిశ్రమలు

70 శాతం నిధులిచ్చి ప్రోత్సాహం

భీమవరం కలెక్టరేట్, న్యూస్‌టుడే: అన్నపూర్ణ.. పచ్చని పశ్చిమ. ఏటా ఇక్కడ పండించే ధాన్యంతో బియ్యం ఆడిస్తున్నారు. తర్వాత వచ్చే ఉప ఉత్పత్తుల ఆధారంగా జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు ప్రయత్నాలు ప్రారంభమయ్యాయి. ఇందుకు ప్రభుత్వం నుంచి ఎలాంటి సహకారం అందుతుందో జిల్లాలోని రైస్ మిల్లర్లతో కలెక్టర్ నాగరాణి, జేసీ రాహుల్‌కుమార్‌రెడ్డి ఇటీవల అవగాహన సదస్సు నిర్వహించారు. దానికి ఆ రంగంలో నిపుణులు, పారిశ్రామికవేత్తలు హాజరయ్యారు. ఉప ఉత్పత్తులతో పరిశ్రమలపై వివరించారు. దీంతో చాలా మంది వాటిని జిల్లాలో ఏర్పాటు చేసేందుకు ఆసక్తి చూపించారు. తద్వారా అనేక మందికి ఉపాధి దొరికే అవకాశం కలుగుతుంది.

ఇలా చేయొచ్చు.. ఊక: దీన్ని కాల్చగా వచ్చిన దాని నుంచి సిలికా అనే తెల్లని బూడిదను తయారు చేస్తారు. ఇప్పటికే ఇలాంటి పరిశ్రమ తణుకులో ఉంది. సిలికాను టైర్ల తయారీలో వినియోగిస్తారు.

తవుడు: దీని నుంచి బ్రాన్ ఆయిల్ తయారు చేస్తారు. ఇది ఆరోగ్యానికి చాలా మంచిది.

నూకలు: పౌష్టికాహారంలో వీటిని బాగా వినియోగిస్తున్నారు.

సాగు - 2.20 లక్షల ఎకరాలు

ఉత్పత్తి (లక్షల టన్నులు)	
ధాన్యం	- 14
తవుడు	- 1.5
నూకలు	- 50
ఊక	- 2.20

ఎవరు...ఎలా చేయొచ్చు?

రైస్ మిల్లర్లు పది మంది సంఘంగా ఏర్పడితే ప్రభుత్వం నేరుగా నిధులు ఇస్తుంది. ఉదాహరణకు ఉప ఉత్పత్తులతో పరిశ్రమ ఏర్పాటుకు రూ.ఐదు కోట్లు పెట్టుబడి అయితే దానిలో 70 శాతం గ్రాంటుగా ప్రభుత్వం అందజేస్తుంది. 30 శాతం సొంతంగా పెట్టుబడి పెట్టుకోవాలి.

కలెక్టర్, జేసీ ఆదేశాల మేరకు మా వంతు కృషి చేస్తున్నాం. రైస్‌మిల్లర్లు పరిశ్రమల ఏర్పాటుకు ఆసక్తిగా ఉన్నారు. త్వరలోనే జిల్లాలో ఏర్పాటయ్యే అవకాశముంది. **- ఇబ్రహీం, పౌర సరఫరాల సంస్థ డీఎం**

కొల్లేటి కొంగు బంగారం.. పెద్దింట్లమ్మ

నేటి నుంచి అమ్మవారి జాతర

కైకలూరు, న్యూస్‌టుడే: కొల్లేటిని కాంచే కొంగు బంగారం పెద్దింట్లమ్మ.. నూటొక్క దేవతలకే పెద్దమ్మగా.. పార్వతీదేవి ప్రతిరూపంగా అమ్మవారి శోభ దశదిశలా విరాజిల్లుతోంది. విశాల నేత్రాలతో తొమ్మిది అడుగుల ఎత్తు పద్మాసన భంగిమలో దర్శనమిచ్చే అమ్మవారిని చూస్తే మనసు ఉప్పొంగుతుంది. 11వ శతాబ్దానికి ముందే కొల్లేరు సంరక్షిణిగా ఉండేవారు. వేంగి-చాళుక్య రాజులు కొలిచారని చరిత్ర చెబుతోంది. మత్స్యకారుల ఇంటి దేవతగా పూజలందుకుంటున్న పెద్దింట్లమ్మ జాతర మహోత్సవాలు బుధవారం నుంచి మార్చి 3 వరకు జరగనున్నాయి.



ముస్తాబైన ఆలయం

అపురూపం.. కల్యాణ ఘట్టం.. జాతరలో అపురూపమైన ఘట్టం జలదుర్గా సమేత గోకర్ణేశ్వరస్వామి దివ్య కల్యాణం. అమ్మవారి విగ్రహం చెంతనే జలదుర్గామాత కొలువై ఉండగా.. దేవస్థానానికి మూడు మైళ్ల దూరంలో ఉన్న గోకర్ణపురంలో గోకర్ణేశ్వరస్వామి కొలువుదీరారు. ఈ నెల 28న ఫాల్గుణ శుద్ధ ద్వాదశి రోజు అర్ధరాత్రి నుంచి తెల్లవారుజాము వరకు కల్యాణ మహోత్సవం నిర్వహిస్తారు.

అలంకరణలో అమ్మవారు

భక్తి పారవశ్యంలోకి తీసుకువెళ్లే అమ్మవారి ప్రభల జాతరను కళ్లారా వీక్షించే అనుభూతి వర్ణనాతీతం. గ్రామస్థులు ప్రభలతో కలిసి ఆడిపాడుతూ పందిరిపల్లిగూడెం నుంచి పుట్టింటి సారెను సాయంత్రానికి అమ్మవారి సన్నిధికి చేరుస్తారు. ఆకట్టుకునే దేవతామూర్తుల వేషధారణలో పల్లకిలో ఊరేగుతూ గోకర్ణేశ్వరుడూ ఇక్కడికి చేరుకుంటారు. జాతరకు లంక గ్రామాల బంధు గణం రెండురోజుల ముందే చేరుకోవడంతో మరో సంక్రాంతిని తలపిస్తోంది.

గర్భస్రావాలపై నివేదికలు లోపాలతో ఎలా ఇచ్చారు

నందాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో దస్త్రాలు పరిశీలిస్తున్న శైలజ

బుట్టాయగూడెం, న్యూస్‌టుడే: మన్యం గ్రామాల్లో గర్భస్రావాలకు సంబంధించి లోపాలతో కూడిన నివేదికలు ఎలా ఇచ్చారని.. రాష్ట్ర మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ రాయపాటి శైలజ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కేఆర్‌పురం ఐటీడీఏలో వైద్య, స్త్రీ, శిశు సంక్షేమ శాఖల అధికారులు, సిబ్బందితో మంగళవారం ఆమె సమీక్షా సమావేశం నిర్వహించారు. గర్భస్రావాలు ఎక్కువ సంఖ్యలో నమోదు కావడంలో ఏలూరు జిల్లా రాష్ట్రంలో మూడో స్థానంలో ఉందని, అందుకు కారణాలపై ప్రశ్నించారు. మన్యం గ్రామాల్లో తొమ్మిది నెలల్లో 281 గర్భస్రావాలు నమోదు కావడానికి కారణాలపై సమీక్షించారు. ఎక్కువ సంఖ్యలో నమోదైన సంబంధిత పీహెచ్‌సీల సిబ్బందిని నిలదీశారు. తప్పుడు నివేదికలు అందజేయడంపై అసహనం వెలిబుచ్చారు. సరిచూసుకోకుండా ఇలా ఎలా ఇచ్చారంటూ ప్రశ్నించారు. ఇది వాస్తవమా కాదా, నిజమైతే కారణాలు ఏమిటి అనే దానిపై క్షేత్రస్థాయి పరిశీలన చేసి రెండు రోజుల్లో నివేదిక అందజేయాలని అధికారులను ఆదేశించారు.

రొయ్యా.. రైతు మీసం మెలేయాలి

ఉండి, భీమవరం అర్బన్, న్యూస్‌టుడే: ఉమ్మడి జిల్లాలో రొయ్యల రైతులు వేసవి పంటపై ఆశలు పెంచుకున్నారు. కొన్నిరోజులుగా మంచు, చలిగాలుల ప్రభావం తగ్గుతోంది. పగటిపూట ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. ఇప్పటికే సుమారు 65 శాతం ఖాళీగా ఉన్న చెరువుల్లో కొత్తగా సీడ్ వదిలే పనిలో సాగుదారులు నిమగ్నమయ్యారు. ఇదే అదనుగా నాణ్యత లోపించిన పిల్లలను మార్కెట్‌లో విచ్చలవిడిగా విక్రయించేస్తున్నారు. పీసీఆర్ పరీక్షల్లో నాణ్యమైనవి గుర్తిస్తేనే చెరువుల్లో వదలాలని మత్స్య శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు.

బ్లీచింగ్, ముగ్గుతో శుద్ధి చేసిన చెరువు

కొన్ని నెలలుగా వీహెచ్‌పీ, వైట్‌స్పాట్, వైట్ గట్, వైట్ ఫీగల్ వంటి వ్యాధులు కుదిపేస్తున్నాయి. వేసవిని గ్యారంటీ పంటగా భావిస్తుంటారు. ఖాళీ చెరువులను బ్లీచింగ్, ముగ్గుతో శుద్ధి చేసిన తర్వాత ఆరబెట్టి నీరెట్టి సాగుకు ఉపక్రమిస్తున్నారు. కాకినాడ, నెల్లూరు, బాపట్ల, విశాఖ, పుదుచ్చేరి తదితర సముద్ర తీర ప్రాంతాల్లోని హేచరీల్లో సీడ్ కొనుగోలు చేస్తున్నారు. పిల్లకు 35 పైసలు, రవాణాకు మరో 5 పైసల చొప్పున ఖర్చవుతోంది.

వ్యాధుల రహిత సీడ్ మేలు.. సముద్రంలో సేకరించిన తల్లి రొయ్యలతో హేచరీల్లో సీడ్ ఉత్పత్తి చేస్తారు. స్పాన్, జోయ, మైసిస్, పోస్టు లార్వా (పీఎల్) పేరుతో పిలుస్తారు. ఒకే సైజున్న వాటినే సేకరించాలి. వైట్‌స్పాట్, ఈహెచ్‌పీ, ఐహెచ్‌హెచ్ఎన్‌వీ పరీక్షల్లో వ్యాధుల్లేవని నిర్ధరించిన వాటినే చెరువులో వదలాలి. వాటికి నీటి ఉష్ణోగ్రత, ఒత్తిడిని తట్టుకునే శక్తి ఉంటుంది. పీఎల్ 14-15 రోజులున్న సీడ్ చెరువులో వదిలితే మంచిది. పీహెచ్ 7.5 - 8.5, ఆక్సిజన్ 4 పీపీఎంకి మించి ఉండాలి. ఎకరానికి లక్ష లోపు సీడ్ వదలాలి. నాలుగు చెక్ ట్రేలతో మేత యాజమాన్యం చర్యలు చేపట్టాలి. ఆక్వాకు 28-32 మధ్య నీటి ఉష్ణోగ్రతలుంటే అనుకూలం.

- ఎన్.వీరభద్రరావు, ఏ.శ్రీనివాసరావు, మత్స్య శాస్త్రవేత్తలు

ఉమ్మడి జిల్లాలో ఇలా..

చెరువుల విస్తీర్ణం :	2,82,331 ఎకరాల్లో
రొయ్యలు సాగు:	1,22,000
తాజాగా సీడ్ వదిలే విస్తీర్ణం:	సుమారు 70 వేలు
ఒక సీజన్‌కు అవసరమైన పిల్లల సంఖ్య:	840 కోట్లు

ఆసుపత్రులకు ప్రాణదాతలు కావలెను

- తణుకు జిల్లా ప్రభుత్వాసుపత్రిలో ఆర్.ఎం.వో డాక్టర్ ఎ.వి.ఆర్.ఎస్ తాతారావు విధుల్లో ఉండగానే అస్వస్థతకు గురయ్యారు. ఈసీజీ తీయించుకున్నారు. ఇంటికి వెళ్తుండగా గుండెపోటుతో మార్గమధ్యలోనే మృతి చెందారు.
- పాలకోడేరు మండలం గొల్లలకోడేరు సమీపంలో జరిగిన రహదారి ప్రమాదంలో యువకుడైన శ్రీను తీవ్రంగా గాయపడ్డాడు. మూత్ర పిండాల దగ్గర గాయమైందని వైద్యులు నిర్ధారించారు. భీమవరం ప్రాంతీయ ఆసుపత్రికి తీసుకురాగా.. ఇక్కడ నెఫ్రాలజీ లేరని మెరుగైన చికిత్సకు కాకినాడ పంపించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు.

భీమవరం పట్టణం, ఆకివీడు, న్యూస్‌టుడే: కొవిడ్ తర్వాత గుండె, మూత్రపిండాలు, శ్వాసకోశ తదితర అనారోగ్య సమస్యలు ఎక్కువయ్యాయి. గుండెపోటు అయితే వయసుతో సంబంధం లేదు. ఇలాంటి వ్యాధులకు సత్వరం వైద్యం అందించాల్సిన వైద్యులు ప్రాంతీయ, సామాజిక ఆసుపత్రుల్లో లేరు. మిగిలిన వైద్యులైనా పూర్తిస్థాయిలో ఉంటారా అంటే అదీ లేదు. దాంతో ప్రాథమిక చికిత్స తర్వాత వేరే చోటుకు రిఫర్ చేయడానికే పరిమితం అవుతున్నారు.

అందుబాటులో ఉన్నా.. గుండెనొప్పి వస్తే స్టెమి పేరిట ఎన్టీఆర్ వైద్యసేవలో ప్రభుత్వం వైద్యం చేస్తోంది. సామాజిక, ప్రాంతీయ, జిల్లా ఆసుపత్రుల్లో ఇది అందుబాటులో ఉంది. నొప్పి వచ్చిన మొదటి గంట లోపు వైద్య పరీక్షలు చేసి రూ.45 వేలు ఖరీదైన టెనెక్టెప్లేస్ ఇంజెక్షన్ చేస్తారు. ఛాతి నొప్పి, ఎడమ భుజం లాగడం, ఆకస్మిక ఆయాసం, గుండె దడ, స్పృహ కోల్పోవడం వంటివి గుండెపోటు లక్షణాలు. ఇవి గుర్తించిన మొదటి గంట అత్యంత కీలకం కావడంతో దాన్ని గోల్డెన్ అవర్‌గా పిలుస్తారు. ఇలాంటి అత్యవసర వైద్యానికి ఇంజెక్షన్ ఇచ్చిన తర్వాత వైద్యులు లేక సమీపంలోని ఎన్టీఆర్ వైద్యసేవ ఆసుపత్రికి పంపిస్తున్నారు. ఒక్కోసారి అలా తరలించే సమయాల్లో రోగి ప్రాణాలు విడుస్తున్నారు. ఇక మూత్రపిండాల వ్యాధులకు చికిత్స చేసే వైద్యులు లేకపోగా చికిత్సకు ప్రైవేటు ఆసుపత్రులను ఆశ్రయించాలి.

అక్కడ ఖాళీ.. ★ ఆకివీడు సామాజిక ఆసుపత్రిలో వైద్యుడు ఏడాది నుంచి లేరు. జనరల్ సర్జన్ పోస్టు 6 నెలలుగా ఖాళీగా ఉంది. ★ ఆచంట సామాజిక ఆసుపత్రిలో జనరల్ సర్జన్ పోస్టు భర్తీ కాకపోవడంతో పెనుగొండ నుంచి వారంలో రెండు రోజులు అక్కడి వైద్యుడు వచ్చి చికిత్స అందిస్తారు.

ప్రాంతీయ ఆసుపత్రులు-	4
సామాజిక ఆసుపత్రులు-	3
పరీక్షలకు వచ్చే రోగులు- రోజుకు	1350కి పైగా
వివిధ విభాగాల్లో వైద్యుల ఖాళీలు-	13

★ ప్రాంతీయ ఆసుపత్రుల్లో అయితే 18 నుంచి 20 పోస్టులు ఉండాలి. వాటిలో చాలాచోట్ల మూడు నాలుగు పోస్టులు ఖాళీగానే ఉన్నాయి. ★ కొన్ని పోస్టులను ఇటీవల భర్తీ చేశామని డీసీహెచ్ఎస్ డాక్టర్ పి.సూర్యనారాయణ తెలిపారు. మిగిలిన పోస్టులను రెండ్రోజుల్లో భర్తీ చేసే అవకాశాలున్నాయన్నారు. కార్డియాక్, నెఫ్రాలజీ తదితర పోస్టులు లేకపోయినా అనుబంధ వైద్యులతో వైద్యం అందిస్తున్నామని చెప్పారు.

(c) eenadu

జిల్లా రిజిస్ట్రార్‌గా శివయ్య

భీమవరం అర్బన్, న్యూస్‌టుడే: స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ భీమవరం జిల్లా రిజిస్ట్రార్‌గా జి.శివయ్యను ప్రభుత్వం నియమించింది. ఇప్పటి వరకు పెంటపాడు సబ్‌రిజిస్ట్రార్‌గా పని చేసిన ఆయన పదోన్నతిపై డీఆర్‌గా నియమితులయ్యారు. ఈయన గతంలో గునుపూడి, అత్తిలి సబ్‌రిజిస్ట్రార్‌గా కూడా పని చేశారు. త్వరలో జిల్లా అధికారిగా బాధ్యతలు చేపట్టనున్నారు. అందరినీ సమన్వయం చేసుకుని శాఖాపరంగా ప్రజలకు సత్వర సేవలందించేందుకు కృషి చేస్తానని ఆయన తెలిపారు.

ఐక్యతతోనే సమస్యల పరిష్కారం

భీమవరం వన్‌టౌన్, న్యూస్‌టుడే: విద్యుత్తు రంగ ఉద్యోగులను, కాంట్రాక్టు కార్మికులను ప్రభుత్వం పట్టించుకోవడంలేదని యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు దుగ్గిరాల సూరిబాబు విమర్శించారు. భీమవరం సీఐటీయూ కార్యాలయంలో మంగళవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యుత్తు రంగంలో యూనియన్లు ఐక్యంగా లేకపోవడంతో ప్రభుత్వం విద్యుత్తు కార్మిక సమస్యలను గాలికొదిలేసిందన్నారు. పీఆర్‌సీ కమిటీ, డీఏ బకాయిలు, ఉద్యోగోన్నతులు, కార్మికుల క్రమబద్ధీకరణ చేయడంలేదన్నారు. కేంద్ర ప్రభుత్వం విద్యుత్తు సరవణ బిల్లు తీసుకువస్తే విద్యుత్తు ఛార్జీలు భారీగా పెరుగుతాయన్నారు. మార్చి 8, 9 తేదీల్లో భీమవరంలో నిర్వహించే యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర జనరల్ కౌన్సిల్ సమావేశంలో కార్మికుల ఐక్య పోరాటాలకు కార్యాచరణ రూపొందించనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాసులు, వాసుదేవరావు, బలే రాములు, పాండురంగ రాజు, పజీరుద్దీన్, జానకిరాములు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో చదరంగం పోటీలు మంగళవారం జరిగాయి. భీమవరం డీఎన్నార్ కళాశాల ఆవరణలో జరిగిన పోటీల్లో అండర్-13, 15, 17, 19లో 52 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ పోటీల్లో విజేతలను రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు డీఎస్‌డీఓ ఎ.వి.మోహన్‌రావ్ తెలిపారు. శిక్షకులు జి.వీరన్న పర్యవేక్షించారు.

చదరంగం ఆడుతున్న క్రీడాకారులు

అద్దెకు శేషమహల్ రహదారి

న్యూస్‌టుడే, తాడేపల్లిగూడెం అర్బన్

- ఆక్రమణలతో కుచించుకుపోతున్న కీలక దారి
- ట్రాఫిక్ సమస్యతో నిత్యం నరక యాతన

తాడేపల్లిగూడెం పట్టణంలో అత్యంత ప్రధానమైన ప్రాంతాల్లో శేష్‌మహల్ రోడ్డు ఒకటి. కీలకమైన ఈ మార్గాన్ని ఎక్కడికక్కడ ఆక్రమించేస్తుండడంతో రోజురోజుకూ కుచించుకుపోతోంది. ఉదయం 9 నుంచి 11, సాయంత్రం 5 నుంచి 8 గంటల మధ్య ఆ రోడ్డులో రాకపోకలకు వాహనదారులు హడలిపోతున్నారు. నిత్యం నరకంగా ఉంటోందని వాపోతున్నారు. పట్టణంలో పేరొందిన బంగారు ఆభరణాలు, వస్త్ర దుకాణాలు, ఆసుపత్రులు, విద్యా సంస్థలు, సినిమా హాళ్లు.. తదితర అవసరాల కోసం ఈ ప్రాంతానికి రావాల్సిందే. నిత్యం వేలాది మంది ప్రజలు వివిధ పనుల మీద ఈ రోడ్డులో రాకపోకలు సాగిస్తుంటారు. అసలే వెడల్పు తక్కువగా ఉన్న ఈ రహదారి ఆక్రమణల కారణంగా చిక్కిపోయింది.

➡ రహదారికి ఇరువైపులా తోపుడు, తినుబండారాల బళ్లు, పండ్లు, కూరగాయల దుకాణాలతో ఆక్రమించేశారు. కొంద్రుప్రోలు వెళ్లే ఆటోలను కోదండరామాలయం పక్కనే నిలిపి ఉంచడంతో కొన్ని సందర్భాల్లో ద్విచక్రవాహనంతో వెళ్లాలన్నా కష్టంగా ఉంటోంది.

నలువైపులా నిలిచిపోయిన వాహనాలు

అటు.. ఇటు వాహనాలు.. ఎదురుగా బస్సు..మధ్యలో అంబులెన్స్

➡ పట్టణంలోని వంద పడకల ప్రభుత్వాసుపత్రికి అంబులెన్సులు ఇతర అత్యవసర వాహనాలు ఇదే మార్గంలో వెళ్లాలి. ట్రాఫిక్‌లో ఇరుక్కున్న సందర్భంలో వాటికి దారి ఇచ్చేందుకు అవకాశం లేదు. అలాంటి సందర్భాల్లో ట్రాఫిక్ నియంత్రించాల్సిన పోలీసులు కానరావడం లేదు. దీంతో ఈ రోడ్డులో ప్రయాణించాలంటే అవస్థలు తప్పడంలేదు.

➡ మరోవైపు ఈ రోడ్డులో ఉన్న కొన్ని భవనాల యజమానులు సెట్‌బ్యాక్ నిబంధనకు తిలోదకాలిచ్చారు. అత్యధిక దుకాణదారులు మురుగు కాల్వల్ని ఆక్రమించి నిర్మాణాలు చేపట్టారు. దీంతో దుకాణాలకు వచ్చే వినియోగదారులు వారి వాహనాలను రోడ్డుపైనే అడ్డదిడ్డంగా నిలపాల్సి వస్తోంది.

➡ ఇప్పటికైనా మున్సిపల్, పోలీసు ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు ఆక్రమణలు తొలగించి సమస్య పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు. అత్యవసర వాహనాలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా చూడాలని, ట్రాఫిక్ సమస్య పరిష్కరించాలని రోగుల బంధువులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.

➡ మున్సిపల్ అధికారులు, పోలీసు సిబ్బంది ఈ రోడ్డును పట్టించుకున్న దాఖలాలు లేవు. దీంతో రహదారిని ఆక్రమించేసి చిరువ్యాపారులకు అద్దెకివ్వడం, మరికొందరు రహదారిపైనే విక్రయాలు సాగిస్తూ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. కొంతమంది మున్సిపల్ ఉద్యోగులు, పోలీసులకు చిరు వ్యాపారుల నుంచి నెలవారీ మామూళ్లు అందుతున్నాయనే ఆరోపణలున్నాయి.

దేహదారుఢ్య పోటీల్లో అదరగొట్టిన కుర్రాళ్లు

రాజానగరం, న్యూస్‌టుడే: యువత చదువుతో పాటు ఆస్వాదంగాల్లో రాణించాలని వీసీ ప్రసన్నశ్రీ పేర్కొన్నారు. నన్నయలో మంగళవారం ఇంటర్ కాలేజిమేట్ వెయిట్‌లిఫ్టింగ్ మెన్ విశ్వవిద్యాలయం ఎంపికలు నిర్వహించారు. వివిధ విభాగాల్లో జరిగిన పోటీల్లో యూనివర్సిటీ అనుబంధ కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విజేతలకు వీసీ ఎస్.ప్రసన్నశ్రీ చేతుల మీదుగా పతకాలు అందించారు.

విజేతలతో వీసీ ప్రసన్నశ్రీ, అధ్యాపకులు

విజేతల వివరాలు: ✦ 60 కిలోల విభాగం: ఎస్.పూర్ణ సతీష్, కె.జగదీష్‌కుమార్ (డీఎన్ఆర్ కళాశాల, భీమవరం), ఆర్.కార్తికేయన్ (ఐడియల్ కళాశాల, కాకినాడ) మొదటి మూడు స్థానాల్లో నిలిచారు. ✦ 65 కిలోలు: వై.భరత్(ఆదిత్య కళాశాల, ఏలూరు), పి.సూరిబాబు(గోపన్నపాలెం), ఎ.జగదీష్(పాలకొల్లు). ✦ 70 కిలోలు: ఎల్.వి.సూర్యప్రకాశ్, బి.సాయిప్రశాంత్, బి.దుర్గాప్రసాద్(పీఆర్ కళాశాల, కాకినాడ). ✦ 75 కిలోలు: ఎం.సాయిశ్రీకర్(సీ.ఆర్.రెడ్డి కళాశాల, ఏలూరు), బి.మహేష్, డి.అయ్యప్పకుమార్ (పీఆర్ కళాశాల, కాకినాడ) తొలి మూడు స్థానాల్లో నిలిచారు. ✦ 80 కిలోలు: పి.విజయ చాముండేశ్వర్ (పీఆర్ కళాశాల, కాకినాడ) ✦ 85 కిలోలు: షేక్‌మున్సూర్ (బీవీ రాజు కళాశాల, భీమవరం), 90 కిలోలు: కె.పవన్‌సాయి (పీఆర్ కళాశాల, కాకినాడ), 95 కిలోలు: కె.పాండురంగ వరప్రసాద్ (డా.సి.ఎస్.ఎన్.కళాశాల, భీమవరం) పతకాలు సొంతం చేసుకున్నారు. ✦ మిస్టర్ నన్నయ విశ్వవిద్యాలయం 2025-26 (బోటీని కె.పాండురంగ వరప్రసాద్ (డా.సి.ఎస్.ఎన్.డిగ్రీ అండ్ పీజీ కళాశాల, భీమవరం), ✦ బెస్ట్‌ఫిజిక్ మెన్ టీమ్ చాంపియన్ షిప్ (పి.ఆర్. ప్రభుత్వ కళాశాల, కాకినాడ) కైవసం చేసుకున్నారు.

ఉద్యాన వర్సిటీలో అంతర్జాతీయ సదస్సు

ఉద్యాన విశ్వవిద్యాలయం, న్యూస్‌టుడే: వెంకట్రామన్నగూడెం ఉద్యాన విశ్వవిద్యాలయంలో గ్లోబల్ కనెక్టింగ్ కార్యక్రమంలో భాగంగా బ్రీడింగ్, జెనెటిక్స్, జినోమిక్సును ఉపయోగించి నిమ్మలో వ్యాధి నిరోధక శక్తి కలిగిన కొత్త రకాలను వృద్ధి చేయడమే ఇన్‌ఛార్జి వీసీ ధనుంజయరావు అధ్యక్షతన మంగళవారం వర్చువల్‌గా అంతర్జాతీయ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా అమెరికాలోని యూనివర్సిటీ ఆఫ్ కాలిఫోర్నియాకు చెందిన ప్రఖ్యాత శాస్త్రవేత్త చంద్రికా రాముడు మాట్లాడుతూ రాయలసీమలో బత్తాయి, నిమ్మ పంటలను ఆశించే సిట్రస్ గ్రీనింగ్ తెగులు రైతులకు సవాలుగా మారిందన్నారు. దీని నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సదస్సులో చర్చించారు. ముఖ్య బ్రీడింగ్ స్థాయిలో జన్యుపరమైన మార్పులు చేయడం ద్వారా ఆస్ట్రేలియా లైమ్ వంటి రకాలు సిట్రస్ గ్రీనింగ్ తెగులును తట్టుకుంటుందని ఆమె వివరించారు. ఈ సాంకేతికతను వర్సిటీకి సమకూర్చాలని ఇన్‌ఛార్జి వీసీ కోరారు. దీనికి అవసరమైన అవగాహన ఒప్పందం (ఎంవోయూ) త్వరలో జరుగుతుందని డైరెక్టర్ ఆఫ్ ఇండస్ట్రియల్ అండ్ ఇంటర్నేషనల్ ప్రోగ్రామ్స్ (డీఐపీ) రుథ్ తెలిపారు. రిజిస్ట్రార్ మాధవి, పరిశోధన సంచాలకుడు రామానందం తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఇన్‌ఛార్జి వీసీ ధనుంజయరావు, పక్కన రుథ్

వసతి గృహాల విద్యార్థులూ నేరుగా ఫోన్ చేయొచ్చు: కలెక్టర్

భీమవరం కలెక్టరేట్, న్యూస్‌టుడే: వసతి గృహాల్లో ఉండే విద్యార్థులు విద్యాపరంగా ఏ సమస్యలున్నా ఫోన్ చేసి తన దృష్టికి తేవొచ్చని కలెక్టర్ నాగరాణి అన్నారు. ఆమె మంగళవారం తన క్యాంపు కార్యాలయం నుంచి సాంఘిక సంక్షేమాధికారులు, వసతి గృహాల అధికారులతో వీసీ నిర్వహించారు. పదోతరగతి, ఇంటర్మీడియట్ విద్యార్థులు కష్టపడి చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలని సూచించారు. కొందరు పరీక్షలంటే భయపడతారని వారిలో ధైర్యాన్ని పెంపొందించాలని సూచించారు. ...

మాట్లాడుతున్న నాగరాణి

గోదారమ్మకు అమావాస్య హారతి

నరసాపురం పట్టణం, న్యూస్‌టుడే: హిందూ ధర్మ పరిరక్షణ, పవిత్ర నదుల సంరక్షణ సంకల్పదీక్షలో భాగంగా నరసాపురం వశిష్ఠ పుష్కర ఘాట్‌లో మాఘ మాసం అమావాస్య సందర్భంగా మంగళవారం రాత్రి పవిత్ర వశిష్ఠ గోదావరికి హారతి ఇచ్చారు. నరసాపురం విశ్వ హిందూ పరిషత్, భజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. ముందుగా మహిళా భక్తులు సామూహిక విష్ణు సహస్రనామ పారాయణం చేశారు. అనంతరం నెల్లూరు ఆర్‌ఎస్‌ఎస్ ప్రాంత కుటుంబ ప్రబోధన్ ప్రముఖ్ పుట్ట శేష ఆధ్యాత్మిక ప్రసంగం ఆకట్టుకుంది. మహిళలు గోదావరిలో దీపాలు అర్పించారు. పలు ప్రాంతాల నుంచి భక్తులు పెద్దఎత్తున పాల్గొని తిలకించారు.

తేనెటీగల పెంపకంతో పంటల్లో అధికోత్పత్తి

ఉండి, న్యూస్‌టుడే: తేనెటీగల పెంపకంతో పంటల్లో మరింత అధిక ఉత్పత్తి సాధించొచ్చని మార్టేరు వరి పరిశోధనా స్థానం ఏడీఆర్ టి.శ్రీనివాస్ తెలిపారు. ఉండి కృషి విజ్ఞాన కేంద్రంలో శాస్త్రీయ పద్ధతిలో తేనెటీగల పెంపకంపై రాష్ట్రస్థాయిలో మూడు రోజుల శిక్షణ తరగతులు మంగళవారం ప్రారంభమయ్యాయి. ...

ఉద్యాన తోటల్లో ఆశించే తేనెటీగలపై శిక్షకులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు

రామేశ్వరస్వామి హుండీల ఆదాయం రూ.8 లక్షలు

పెనుమంట్ర, న్యూస్‌టుడే: సత్యనారాయణపురంలోని రామేశ్వరస్వామి దేవస్థానం హుండీల ఆదాయాన్ని మంగళవారం లెక్కించారు. మహాశివరాత్రి ఉత్సవాల నేపథ్యంలో దర్శనం, అభిషేకం టిక్కెట్లు, విరాళాల రూపేణా రూ.4,44,713, హుండీల రూపంలో రూ.3,63,920 రాగా.. మొత్తం రూ.8,08,633 ఆదాయం వచ్చినట్లు దేవస్థానం కార్యనిర్వాహణాధికారి పి.వేణుగోపాలరావు తెలిపారు. దేవాదాయ శాఖాధికారులు, గ్రామ పెద్దలు పర్యవేక్షించారు. కార్యక్రమంలో వివిధ ఆలయాధికారులు, సత్యసాయి సేవా ప్రతినిధులు పాల్గొన్నారు.

కొబ్బరి రైతుకు కడుపు కోత!

యలమంచిలి, న్యూస్‌టుడే: పెరట్లో రెండు కొబ్బరి చెట్లుంటే చాలు వృద్ధాప్యంలో సంతానం అండ లేకపోయినా బతికేయవచ్చనేది గోదావరి జిల్లాల్లో నానుడి. ప్రభుత్వం అందిస్తున్న వృద్ధాప్య పింఛనుతో పాటు ప్రస్తుత కొబ్బరి ధరలకు ఇది సరిగ్గా అతికినట్టు సరిపోతుంది. అంతటి విలువైన కొబ్బరి చెట్లు వశిష్ఠ గోదావరి తీరంలో నది కోతకు గురవుతుండటం అన్నదాతలకు గుండె కోతగా మారింది. ఏళ్ల తరబడి పెంచిన చెట్లు ఒక్కొక్కటిగా కళ్లెదుటే నదీగర్భంలో కలిసిపోవడం ఆవేదనకు గురిచేస్తోందని కొబ్బరి రైతులు వాపోతున్నారు. ప్రభుత్వం చర్యలు తీసుకుని గ్రోయిన్లు నిర్మించాలని కోరుతున్నారు.

యలమంచిలిలో గోదావరిలోకి పడిపోతున్న కొబ్బరి చెట్లు

ఉరేసుకొని యువకుడి ఆత్మహత్య

తణుకు, న్యూస్‌టుడే: పట్టణ పోలీస్ ఠాణా పరిధిలో అనుమానాస్పద స్థితిలో యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన మంగళవారం వెలుగు చూసింది. ఎస్సై కె.శ్రీనివాస్ తెలిపిన వివరాల మేరకు.. కాకినాడ జిల్లా గండేపల్లి గ్రామానికి చెందిన కొమ్మకూరి సూరిబాబు(27) తణుకు రైల్వే స్టేషన్ రోడ్డులోని ఒక ఇంట్లో పది రోజుల కిందట అద్దెకు దిగాడు. అయిదేళ్ల కిందట తణుకు పట్టణంలోని ఇరగవరం కాలనీకి చెందిన తిరుమల అనే యువతిని ప్రేమ వివాహం చేసుకున్న సూరిబాబు స్థానికంగా ఓ వస్త్ర దుకాణంలో సేల్స్‌మేన్‌గా పనిచేస్తున్నాడు. వారికి సోఫియా(4) అనే అమ్మాయి ఉంది. ఇక్కడ అద్దెకు వచ్చిన నుంచి భార్య తిరుమల అప్పుడప్పుడు వచ్చి వెళ్తోంది. ఈ క్రమంలో సోమవారం మధ్యాహ్నం ఇంట్లో గడియ పెట్టుకున్న సూరిబాబు తలుపులు తీయకపోవడంతో ఇంటి యజమాని అనుమానంతో సూరిబాబు భార్యతోపాటు పోలీసులకు సమాచారం అందించారు. సోమవారం అర్ధరాత్రి ఎస్సై శ్రీనివాస్ ఆధ్వర్యంలో సిబ్బంది ఇంటి తలుపులు పగులగొట్టి చూడగా ఉరేసుకొని ఉన్నాడు. కుటుంబ సభ్యులకు సమాచారం అందించిన పోలీసులు మంగళవారం ఉదయం మృతదేహాన్ని తణుకు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై శ్రీనివాస్ తెలిపారు.

సూరిబాబు (పాత చిత్రం)

పోక్సో కేసులో నిందితుడి అరెస్టు

నరసాపురం, పట్టణం న్యూస్‌టుడే: దళిత బాలికను మాయమాటలతో మోసగించిన నిందితుడిని డీఎస్పీ జి.శ్రీవేదఅరవింద మంగళవారం పోక్సో, ఎస్సీ, ఎస్టీ నిరోధక చట్టం కేసులో అరెస్టు చేశారు. దీనికి సంబంధించి పట్టణ ఎస్సై సీహెచ్ జయలక్ష్మి తెలిపిన సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణానికి చెందిన కొవ్వెల కళ్యాణ్(28)కు 2024లో ఇంటర్మీడియట్ చదువుతున్న పట్టణానికి చెందిన బాలిక(17) సామాజిక మాధ్యమంలో పరిచయమైంది. కళ్యాణ్ తనకు వివాహమైన సంగతి దాచి ఆ బాలికను ప్రేమిస్తున్నానని, పెళ్లి చేసుకుంటానని మాయమాటలతో శారీరకంగా అనుభవించాడు. అప్పటి నుంచి ఆమెతో చనువుగా మసులుతున్నాడు. ఈ నెల 13న బాలిక కుటుంబ సభ్యులు ఇంటి వద్ద లేరని తెలుసుకొని అక్కడకు వెళ్లాడు. అదే సమయంలో బాలిక కుటుంబ సభ్యులు ఇంటికి వచ్చారు. కళ్యాణ్‌ను పట్టుకుని దొంగగా భావించి పోలీసులకు సమాచారం అందించారు. అనంతరం ఆ వ్యక్తి బాలికతో చనువుగా ఉన్న ఫొటోలు చరవాణిలో చూసి అఘాయిత్యానికి పాల్పడినట్లు నిర్ధారించి ఫిర్యాదు చేశారు. దీనిపై బాలిక కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కళ్యాణ్‌పై పోక్సో, ఎస్సీ ఎస్టీ నిరోధక చట్టప్రకారం కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు. నిందితుడిని డీఎస్పీ అరెస్టు చేసి కోర్టులో హాజరు పరచగా రిమాండు విధించారన్నారు.

బాలిక కుటుంబ సభ్యులపై కేసు.. బాలిక కుటుంబ సభ్యులు తనను కొట్టి గాయపరిచారని కొవ్వెల కళ్యాణ్ ఫిర్యాదు చేశాడని ఎస్సై జయలక్ష్మి తెలిపారు. నిందితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.

రైతన్నా.. ఇదిగో నీకో యాప్!

ఏపీఏఎంఐఎస్ 2.0తో సమస్త సమాచారం

కొయ్యలగూడెం గ్రామీణ, జంగారెడ్డిగూడెం గ్రామీణ, కాళ్ల, న్యూస్‌టుడే: రైతులకు తక్షణ సేవలు సమర్థంగా అందించడానికి వ్యవసాయ శాఖ ఆంధ్రప్రదేశ్ అగ్రికల్చర్ ఇన్‌ఫర్మేషన్ అండ్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ (ఏపీఏఐఎంఎస్ 2.0 APAMIS 2.0) పేరుతో చరవాణి యాప్‌ను అందుబాటులోకి తెచ్చింది. ఈ యాప్‌లో రైతులు తమ పొలాల వివరాలు, సర్వే నంబర్లు, మ్యాప్‌లు, మొదలైన అన్ని వివరాలను ఎప్పుడు కావాలంటే అప్పుడు చూసుకోవచ్చు. ఆ పొలాల్లో సాగు చేసే పంటల వివరాలు, ఈ-పంట తదితర ప్రభుత్వ కార్యక్రమాల నమోదు పరిశీలించుకోవచ్చు. గూగుల్ ప్లేస్టోర్ నుంచి యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి. ఆధార్ నంబర్‌తో రిజిస్టర్ చేసుకుని ఎం.పిన్ నంబరును ఏర్పాటు చేసుకోవాలి. ఆధార్ నంబర్(యూజర్ ఐడీ)తో లాగిన్ అయితే మనం పొలం సమాచారం కోసం ఎక్కడికో వెళ్లక్కర్లేకుండా మన అరచేతిలోని ఫోన్‌లోనే తెలుసుకోవచ్చు.

ఏమేం ఉంటాయంటే.. ముందుగా 'నా పొలాలు' అనే ఆప్షన్‌ను ఎంచుకుంటే అందులో పొలం సమాచారం, వాతావరణం, సలహాలు అని మూడు విభాగాలు ఉంటాయి. పొలం సమాచారంలో వ్యవసాయ సూచనలు, ముందస్తు చీడపీడల సమాచారం, పంటనష్టం, మార్కెట్ ధరలు, వార్తలు, ముఖ్య అధికారుల వివరాలు తదితర సమాచారం ఉంటుంది. వాతావరణం ఆప్షన్‌లో పొలం ఉన్న ప్రాంతంలో అయిదు రోజులకు సంబంధించిన వాతావరణం, ఉష్ణోగ్రతల వివరాలను తెలుసుకోవచ్చు. సలహాలు ఆప్షన్‌లో నేలల ఆరోగ్యం, చీడపీడల సమాచారం అందుబాటులో ఉంటుంది.

మార్కెట్ ధరల సమాచారం.. ➡ నా పొలాలు ఐచ్ఛికంలో మార్కెట్ ధరలు ట్యాబ్‌ను క్లిక్ చేస్తే పంటలకు సంబంధించి రానున్న అయిదు రోజుల మార్కెట్ ధరల అంచనాలను చూడొచ్చు. తమ పంటలకు సంబంధించి రాష్ట్రంలో ఉన్న ఇతర మార్కెట్ల సమాచారాన్ని కూడా రైతులు తెలుసుకోవచ్చు.

➡ ముఖ్య అధికారుల వివరాలు ట్యాబ్‌ను క్లిక్ చేస్తే తమ పరిధిలోని రైతు సేవా కేంద్రం, మండల, జిల్లా వ్యవసాయాధికారులు, రీజినల్ కోడింగ్ సెంటర్లు, జిల్లా ప్రయోగశాలలు, కృషి విజ్ఞాన కేంద్రాలు, ప్రయోగశాలలు తదితర కార్యాలయాల అధికారుల వివరాలు అందుబాటులో ఉంటాయి.

➡ పంట నష్టం ట్యాబ్‌ను క్లిక్ చేస్తే రైతులు తమ దరఖాస్తు ఏ స్థితి(స్టేటస్)లో ఉందన్న వివరాలు తెలుస్తాయి. పంట నష్టపోయిన రైతుల జాబితా కూడా చూడొచ్చు. కర్షకుల సందేహాలు, అభిప్రాయాలను తెలియజేయవచ్చు. ఇంకా పలు రకాల పంటల వీడియోలను కూడా యాప్‌లో అందుబాటులో ఉంటాయి.

చరవాణులకు నోటిఫికేషన్లు.. తమ పంటలకు సంబంధించి అవసరమైన సూచనలు, సలహాలు, ఏవైనా తెగుళ్లు, కీటకాలు ఆశించే ప్రమాదం ఉన్నప్పుడు, తుపాను రాక తదితర సందర్భాలను నోటిఫికేషన్ల రూపంలో రైతుల చరవాణులకు అందుతుంటాయి.

నరసింహుడిగా.. సూర్యనారాయణుడు

అమావాస్య సందర్భంగా ఏలూరు పవరుపేటలోని సూర్య దేవాలయంలో మంగళవారం సూర్యభగవానుడికి ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం పంచామృతాభిషేకాలు, అర్చనలు చేసి.. లక్ష్మీనరసింహ స్వామిగా అలంకరించారు. భక్తులు స్వామి వారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

- న్యూస్‌టుడే, పవరుపేట (ఏలూరు ఆధ్యాత్మికం)

ప్రేమికుడి ఇంటి ఎదుట నిరసన

- నిశ్చితార్థమైనా..పెళ్లికి నిరాకరించిన యువకుడు
- న్యాయం చేయాలని యువతి ఆందోళన

కైకలూరు, న్యూస్‌టుడే: ఫేస్‌బుక్‌తో పరిచయమైన ఓ జంట ప్రేమ నిశ్చితార్థం వరకు చేరుకుంది. కట్నకానుకలను జేబులో వేసుకొని.. తీరా పెళ్లికి నిరాకరించాడు ఆ ప్రేమికుడు. బాధితురాలు తెలిపిన వివరాల ప్రకారం.. కైకలూరుకు చెందిన తస్లీమ్‌కు తల్లిదండ్రులు చనిపోయారు. ముగ్గురు సంతానాన్ని మేనత్త పెంచి పెద్ద చేయగా ఇటీవల ఆమె మృతి చెందింది. డిగ్రీ పూర్తి చేసిన యువతి అయిదేళ్ల కిందట హైదరాబాద్‌లో ఉద్యోగం చేస్తున్న సమయంలో ఫేస్‌బుక్‌లో కైకలూరుకే చెందిన అల్ఫార్ హుస్సేన్ పరిచయమయ్యాడు. అది కాస్తా ప్రేమగా మారి.. శారీరక సంబంధానికి దారి తీసింది. పెళ్లి చేసుకోవాలని ఎన్నిసార్లు కోరినా దాటవేస్తూ వచ్చాడు. ఎప్పటికైనా ఆమెనే చేసుకుంటానని రూ.100 బాండ్ పేపరుపై రాసిచ్చాడు.

అల్ఫార్ గృహం ఎదుట తస్లీమ్, బంధువుల నిరసన

తమకు సంబంధం లేదన్న కుటుంబ సభ్యులు.. యువతి ప్రేమ వ్యవహారాన్ని బంధువులకు తెలపగా 2023లో ఇరు కుటుంబాలు పెళ్లికి ఒప్పుకొని బంధువుల సమక్షంలో నిశ్చితార్థం చేసుకున్నారు. ఈ ఏడాది జనవరి 4న పెళ్లి నిర్ణయించి కట్న కానుకలుగా రూ.5 లక్షలు, 12 కాసుల బంగారు ఆభరణాలు, 125 గ్రాముల వెండి వస్తువులు, సెంటున్నర స్థలం ముందే ముట్టజెప్పారు. అదే సమయంలో యువకుడు రోడ్డు ప్రమాదంలో గాయపడగా పెళ్లి వాయిదా వేశారు. ఇటీవల పూర్తిగా పెళ్లికి నిరాకరించడంతో అతని కుటుంబ సభ్యులను ప్రశ్నించగా తమకు సంబంధం లేదన్నారు. దీంతో యువతి మంగళవారం ఆమె బంధువులు, ముస్లిం పెద్దలతో కలిసి తనకు న్యాయం చేయాలని నిరసనకు దిగింది. అంతకు ముందు కైకలూరు పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బంధువులు తెలిపారు.

బ్రాయిలర్ ధరలు (కృష్ణాజిల్లా)
(కిలో 1 కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -115 రిటైల్ ధర 142 చికెన్ విత్ స్కిన్ - 206 చికెన్ స్కిన్‌లెస్ - 234.
అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 128, 137, 148 చికెన్ విత్ స్కిన్ - 240 చికెన్ స్కిన్‌లెస్ - 250.

అందాల గోదారి.. చిత్రీకరణలకు పూలదారి!

పాలకొల్లు, పోడూరు, న్యూస్‌టుడే: '30 ఇయర్స్ ఇండస్ట్రీ ఇక్కడ' అంటూ వెండితెరపై తన హాస్యపు ఖడ్గం దూసి ప్రేక్షకులను కడుపుబ్బా నవ్వించిన నటుడు బాలిరెడ్డి పృథ్వీరాజ్. ప్రస్తుతం పశ్చిమ గోదావరి, అంబేడ్కర్ కోనసీమ జిల్లాల సరిహద్దుల్లో వశిష్ఠ గోదావరి ప్రాంతంలో జరుగుతున్న సినిమా చిత్రీకరణలో పాల్గొనడానికి వచ్చిన ఆయన 'న్యూస్‌టుడే' ముఖాముఖిలో మాట్లాడుతూ వశిష్ఠ గోదావరి వెంబడి విశిష్ట అందాలు వెండితెరపై మరింత నిండుదనం తీసుకువస్తాయన్నారు. ఆ విశేషాలు ఆయన మాటల్లోనే..

పృథ్వీరాజ్

✪ పుట్టింది కాకినాడ జిల్లా చొల్లంగి. నాన్న సుబ్బారావు రైల్వేశాఖ ఉద్యోగి కావడంతో తాడేపల్లిగూడెంలో పెరిగాను. పెంటపాడు డిగ్రీ కళాశాలలో చదివా. ✪ నాన్న రంగస్థల నటుడు కావడంతో సీనియర్ నటులు ఎం.ప్రభాకరరెడ్డి, కైకాల సత్యనారాయణ, గిరిబాబుతో పరిచయాలున్నాయి.

✪ సీనియర్ హాస్యనటుడు రేలంగిది తాడేపల్లిగూడెం కావడంతో బాల్యంలో ఆయనను చూడటానికి తరచూ వారింటికి వెళ్లేవాళ్లం. రోజూ చూస్తున్నా.. అస్తమానూ వస్తారెందుకని ఆయన ఆగ్రహం వ్యక్తం చేసినా దానిలోనూ హాస్యం ఉట్టిపడేది.

✪ ఈవీవీ దర్శకత్వంలో ఆ ఒక్కటి అడక్కు, కృష్ణవంశీ ఖడ్గం, శ్రీఆంజనేయం, కోడిరామకృష్ణ దేవతలు సినిమాల్లో పేరుతెచ్చిన పాత్రలు లభించాయి. ✪ దేవుళ్లు సినిమాలో వేంకటేశ్వరస్వామి పాత్ర చేయగా ఎస్పీ బాలు డబ్బింగ్ చెప్పడం నా అదృష్టం.

ఇక్కడ అనువైన వాతావరణం.. ✦ కూటమి ప్రభుత్వం వచ్చాక గోదావరి జిల్లాలు పర్యాటకంగా అభివృద్ధి చెందుతున్నాయి. విదేశాలకు దీటైన లొకేషన్లు, నదుల అందాలు పశ్చిమ గోదావరి సొంతం. తక్కువ ఖర్చుతో ప్రశాంత వాతావరణంలో సినిమాలు చిత్రీకరించడానికి ఇక్కడ వాతావరణం అనువుగా ఉంటుంది. జూనియర్ ఆర్టిస్టులు జిల్లాలో కోకొల్లలుగా ఉన్నారు. ✦ ప్రతిరోజు సినిమాల్లో పనిచేయడం.. ఎన్నికలప్పుడు ప్రచార యుద్ధంలోకి దిగడం ఇలా రెండు రంగాల్లోను రాణించాలనుకుంటున్నాను.

జేఈఈ మెయిన్స్‌లో ఆదిత్య విద్యార్థుల ప్రతిభ

రాజమహేంద్రవరం, న్యూస్‌టుడే: జేఈఈ మెయిన్స్-2026 ఫలితాల్లో ఆదిత్య విద్యార్థులు జాతీయస్థాయిలో అత్యుత్తమ పర్సంటైల్స్‌తో సత్తా చాటారని ఛైర్మన్ ఎన్.శేషారెడ్డి మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను అభినందించారు. ఆదిత్య విద్యా సంస్థల కార్యదర్శి ఎన్.కృష్ణ దీపక్‌రెడ్డి మాట్లాడుతూ ఎన్.శ్రీసాయివైభవ్ 99.99, వివిఎస్ఎస్ రాఘవరావు, గంజి శ్రీజన్ 99.98, బుడి శ్రీరామ్ 99.97, సత్యం భువనచంద్ర 99.96 పర్సంటైల్‌ను సాధించారన్నారు. మొత్తం 41 మంది విద్యార్థులు 99, ఆపైన పర్సంటైల్‌తో అత్యుత్తమ ప్రతిభ కనబర్చారన్నారు. డైరెక్టర్లు ఎన్.లక్ష్మీరాజ్యం, ఎన్.శృతి, ఎన్.సుగుణ, కోఆర్డినేటర్ కె.లక్ష్మీకుమార్, అకడమిక్ డైరెక్టర్ రాఘవరెడ్డి, గంగిరెడ్డి, ప్రిన్సిపల్స్ జె.మెయిన, పి.సత్యనారాయణరెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ ఫణీంద్ర తదితరులు విద్యార్థులు, అధ్యాపకులను అభినందించారు.

శ్రీసాయి వైభవ్ | రాఘవరావు | శ్రీజన్ | శ్రీరామ్

92.7 FM Rajamahendravaram
ఈఎఫ్ఎమ్ కార్యక్రమాలు
సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ॥ 5 - ఉ॥ 7
ఈ-మార్నింగ్స్	ఉ॥ 7 - ఉ॥ 11
నువ్వా నేనా	ఉ॥ 11 - మ॥ 2
సత్యభామ	మ॥ 2 - సా॥ 5
లైట్ తీస్కో	సా॥ 5 - రా॥ 9
సరదాగా కాసేపు	రా॥ 9 - రా॥ 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా॥ 12 - తె॥ 5

/Eenadufm
For Advertising on Eenadu FM Contact
9000180626, 9989993175

EENADU Classifieds

BUSINESS SERVICES

బంగారం బ్యాంకులలో/ ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈరోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్). Ph: 81422 92071.

TO LET

COMMERCIAL

ఏలూరు శనివారపుపేట సొసైటీ బ్యాంక్ ప్రక్కన మెయిన్‌రోడ్‌కు ఆనుకుని G+1 కమర్షియల్ బిల్డింగ్ వ్యాపార సంస్థలకు అద్దెకు. ✆ 99700 00901.

JOBS

Wanted DRA Tele Callers, Field Executives & Team Leaders Banking Sector Attractive Salaries and Incentives, ✆ 98493 94835, 70753 45527.

Wanted Teachers for Reputed Schools in A.P & Telangana, Contact: Sneha Placements Service. Ph: 94402 46409.

ఏలూరు జ్ఞాపికా TVS షోరూమ్ పాతబస్టాండ్, సత్రంపాడులో వర్క్‌చేయుటకు కావలెను. సేల్స్ ఎగ్జిక్యూటివ్స్ 10-14 వేలు, టెలీకాలర్స్ 14-18 వేలు, డేటా ఆపరేటర్స్ 9-14 వేలు, సేల్స్ ఆపరేటర్స్ 9-14 వేలు వర్క్‌షాపు మేనేజర్స్ 14-25 వేలు ట్రైనీ టెక్నీషియన్స్ 12-25 వేలు, హెల్పర్స్ 9-12 వేలు సంప్రదించండి. ✆ 70957 09292, 94922 25959.

త్రినేత్ర హోంకేర్‌లో వృద్ధులను/ పేషెంట్స్‌ను/ పిల్లలను చూసుకొనుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఫ్రీ వసతి, భోజనం. జీ: 18K. ✆ 8520980099, 8520874499

ఏలూరులోని ఫైర్ స్టేషన్ దగ్గరలోని క్లినిక్‌లో పనిచేయుటకు సెక్యూరిటీగార్డ్సు కావలెను. శాలరీ 14,000+esi+epfo. సెల్: 98852 95999, 9581251999.

బిజినెస్ ఎగ్జిక్యూటివ్స్/ బిజినెస్ మేనేజర్స్ కావలెను. డిగ్రీ, 5 సం॥ల మార్కెటింగ్ రంగంలో అనుభవం, 30 సం॥ల లోపు వారు రెజ్యూములను kamathamjob@gmail.com కు పంపగలరు.

హరేకృష్ణ హోంకేర్‌లో వృద్ధులను/ పేషంట్స్ను/ పిల్లలను చూసుకొనుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఫ్రీవసతి, భోజనం జీ: 18-20K ✆ 96404 68899, 96402 58899

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతి స్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తా పత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనలద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలు చేసే ప్రకటన కర్తను బ్లాక్-లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

నెక్ సూచించిన కోడిగ్రుడ్ల ధర
★ For the Information of Trade & Industry
★ గోదావరి జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గ్రుడ్డు ధర రూ. 5.15 పైII
తణుకు ఆఫీసు: 08819-224254

(c) eenadu

భీమవరం

• భీమవరం • ఉండి

స్వచ్ఛ భీమవరంగా తీర్చిదిద్దుదాం

డంపింగ్‌యార్డును పరిశీలిస్తున్న కమిషనర్ రామచంద్రారెడ్డి, అధికారులు

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: భీమవరం పట్టణాన్ని సుందరంగా తీర్చిదిద్దేందుకు ప్రజలు సహకరించాలని కమిషనర్ కె.రామచంద్రారెడ్డి కోరారు. స్వచ్ఛసర్వేక్షణ్‌లో భాగంగా పట్టణంలోని అన్ని ప్రాంతాలను శుభ్రంగా ఉంచాలన్నారు. చెత్తను రహదారుల పక్కన, డ్రెయిన్లలో వేయకుండా పారిశుద్ధ్య సిబ్బందికి అందజేయాలన్నారు. రోజూ సేకరించే చెత్తను సేంద్రియ ఎరువుగా చేసేందుకు అనువైన ప్రాంతాలను అధికారులతో కలిసి మంగళవారం పరిశీలించారు.

రైతుల సహకారంతో పంట కాలువ అభివృద్ధి

బొండాడ(కాళ్ల), న్యూస్‌టుడే: రైతుల సహకారంతో పంట కాలువ అభివృద్ధి చేపట్టనున్నట్లు డీసీ ఛైర్మన్ తోట పండిబాబు అన్నారు. మంగళవారం రైతులతో కలిసి పరిశీలించారు. గ్రామంలోని సంగంబోడె ఆక్రమణలకు గురై నీటి ప్రవాహానికి ఆటంకం మారిందని రైతులు తన దృష్టికి తీసుకొచ్చినట్లు చెప్పారు. బొండాడ నుంచి బొండాడపేట వరకు సుమారు 2 కిలోమీటర్ల మేర మరమ్మతులు చేయడానికి రైతులు ముందుకొచ్చారని తెలిపారు. త్వరలోనే పనులు ప్రారంభిస్తామని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో నీటి సంఘం అధ్యక్షులు మందపాటి కృష్ణమూర్తి, సర్పంచి గుండ మధుసూదనరావు, ఏఎంసీ డైరెక్టర్ గొర్ల లక్ష్మణ్, రైతులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

భీమవరం పట్టణం:	80085 74471	గునుపూడి:	80085 74474
భీమవరం గ్రామీణం:	80085 74533	వీరవాసరం:	80085 74475
పాలకోడేరు:	80085 74467	ఉండి:	80085 74526
ఆకివీడు:	80085 74525	కాళ్ల:	94401 04042

భీమవరం గునుపూడి, న్యూస్‌టుడే: ? 13వ వార్డులో యర్రంశెట్టి వారి వీధి, గూడూరి ఆంజనేయులు వీధుల్లో డ్రెయినును శుభ్రం చేయడం లేదు. - గంట మోహనరావు, స్థానికుడు.
✔ పారిశుద్ధ్య సిబ్బందిని పంపించి శుభ్రం చేయిస్తాను. - జె.సత్యనారాయణరాజు, పురపాలక పారిశుద్ధ్య అధికారి.

భీమవరం గ్రామీణ, న్యూస్‌టుడే: ? కొవ్వాడ అన్నవరంలో డ్రెయినేజీ సౌకర్యం లేక మురుగునీరు రోడ్లపైకి చేరుతుంది. -బాబి
✔ సమస్య పరిష్కారానికి చర్యలు చేపడతాం. -శ్యాం, పంచాయతీ కార్యదర్శి

ఉండి, న్యూస్‌టుడే: ? ఉండి రాజులపేట నుంచి రైల్వే స్టేషనుకు వెళ్లే ప్రాంతంలో మురుగునీరు నిలిచిపోతోంది. -సత్యనారాయణ, ఉండి.
✔ ఈ ప్రాంతాన్ని పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకుంటాం. - అనిల్‌కుమార్, గ్రామ పంచాయతీ అభివృద్ధి అధికారి, ఉండి.

రేపటి నుంచి అలుగులమ్మ జాతర

చెరుకువాడ(ఉండి), న్యూస్‌టుడే: చెరుకువాడలోని అలుగులమ్మ జాతర మహోత్సవాలు గురువారం నుంచి ప్రారంభమవుతున్నాయని ఆలయ కమిటీ తెలిపింది. ఈనెల 20, 21 తేదీల్లో అమ్మ వారికి కుంకుమ పూజలు, 22న గ్రామోత్సవం, 23న జలాభిషేకం, 25న చలివిడి పానకాలు, గరగల జాతర మహోత్సవాలు జరుగుతాయని పేర్కొంది.

పూలరథంలో తిరుగు ప్రయాణం

భీమవరం ఆధ్యాత్మికం, న్యూస్‌టుడే: పంచారామక్షేత్రమైన గునుపూడి సోమేశ్వరజనార్దనస్వామి రథోత్సవ తిరుగు ప్రయాణం మంగళవారం ఉదయం వేడుకగా సాగింది. మహిళా భక్తులు, యువత అధిక సంఖ్యలో పాల్గొని రథాన్ని ఆలయానికి తీసుకెళ్లారు. సోమవారం రాత్రి అరటి పండ్ల గెలల అలంకరణలో ఆలయం నుంచి రథంపై నాలుగు వారి బజారుకు చేరుకున్నారు. ఉదయం పుష్పాలంకరణలో తిరుగు ప్రయాణంలో దారి పొడవునా భక్తులు దేవుడి రథంపై పుష్ప వృష్టి చేసి, హారతులిచ్చి నైవేద్యాలు సమర్పించారు. అనంతరం ఆలయం ఎదుట చంద్ర పుష్కరిణిలో త్రిశూల స్నానం, వసంతోత్సవం నిర్వహించారు.

నేత్రపర్వంగా జల విహారం

భీమవరం ఆధ్యాత్మికం, న్యూస్‌టుడే: శివరాత్రి మహోత్సవాల ముగింపు సందర్భంగా భీమవరం వీరమ్మ కాలువలో ఉమాసోమ సమేత భీమేశ్వరస్వామి, జనార్దన స్వామివార్ల తెప్పోత్సవం నేత్రపర్వంగా జరిగింది. మంగళవారం రాత్రి ఆలయానికి సమీపాన బీవీరాజు పార్కు వద్ద వీరమ్మ కాలువలో ప్రత్యేకంగా తీర్చిదిద్దిన హంస వాహనంలో స్వామి అమ్మవార్ల ఉత్సవమూర్తులను కొలువుదీర్చి జల విహారం చేయించారు.

వీరమ్మ కాలువలో హంస వాహనంలో భీమేశ్వర, జనార్దనస్వామివార్లు

తెప్పోత్సవంలో స్వామివార్లు

ప్రత్యేక అలంకరణలో శక్తీశ్వరుడు

భీమవరం గ్రామీణ, న్యూస్‌టుడే: యనమదుర్రులోని శక్తీశ్వరాలయంలో ఉన్న శివుడ్ని, పార్వతీదేవిని మంగళవారం ప్రత్యేకంగా అలంకరించారు. అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయం ఎదురుగా ఉన్న చెరువులో రాత్రి తెప్పోత్సవం ఘనంగా నిర్వహించారు. గ్రామస్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

నిధులొస్తేనే మిగిలిన పనులు ముందుకు!

పునాదుల్లోనే నాడు-నేడు నిర్మాణాలు

ఉండి, భీమవరం గ్రామీణ, న్యూస్‌టుడే: గత ప్రభుత్వ హయాంలో నాడు-నేడు పేరిట భీమవరం, ఉండి నియోజకవర్గాల్లోని వివిధ పాఠశాలల్లో చేపట్టి మధ్యలో వదిలేసిన నిర్మాణాలు ఇప్పటికీ అక్కరకు రాకుండాపోయాయి. కొన్నైతే పునాదుల్లోనే వదిలేశారు. మరికొన్ని చేపట్టకుండానే రద్దుచేశారు. రెండో విడతలో మంజూరైన పనుల్లో అత్యధికంగా ఈపరిస్థితి నెలకొంది.

ఘనకార్యంగా చెప్పుకొని!

నాడు-నేడు పనులపై నాడు ఎంతో గొప్పగా చెప్పుకొచ్చింది. తొలి విడతలో కొంతవరకూ పర్వాలేదనే రీతిలో సాగాయి. రెండో విడతకొచ్చేసరికి ఆశించిన స్థాయిలో నిధులు కేటాయించలేకపోయారనే అపవాదు నాడు మూటగట్టుకున్నారు. తొలుత ప్రతిపాదించిన పనుల సంఖ్యనూ కుదించేశారు. పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్, ఎస్‌ఎస్‌ఏ తదితర శాఖలకు అదనపు తరగతి గదుల పనులు అప్పగించారు. వాటికి గుమ్మాలు, తలుపులు, రంగుల తదితర నిర్మాణ సామగ్రి సరఫరాను వేర్వేరు కంపెనీలకిచ్చారు. పాఠశాలల్లో తల్లిదండ్రుల కమిటీ ఛైర్మన్, ప్రధానోపాధ్యాయుడితో ప్రత్యేక పర్యవేక్షణలో చేపట్టారు.

ఇది యండగండి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో రెండు తరగతుల నిర్మాణం కోసం వేసిన పునాదులు. ఒక్కొక్క తరగతి నిర్మాణం కోసం అప్పట్లో రూ.13.50 లక్షలు మంజూరు చేశారు. పునాదు లేసిన తరువాత అవసరమైన నిధులు మంజూరు కాలేదు. దీంతో మూడేళ్ల నుంచి ఈ పనులు నిలిచిపోయాయి.

ఎక్కడికక్కడ నిలిచి

మహదేవపట్నంలో రెండు గదుల నిర్మాణాలు పూర్తయ్యాయి. రంగులు రాకపోవడంతో ఆపనులు నిలిచాయి. యండగండి, ఉణుదుర్రు ఉన్నత పాఠశాలల్లో పునాదుల్లోనూ నిర్మాణాలు నిలిచిపోయాయి. గొల్లవానితిప్పలో అదనపు గదుల నిర్మాణాలు ఆగిపోవడంతో అక్కడి విద్యార్థులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఉత్తరపాలెం ప్రాథమిక పాఠశాల చుట్టూ ప్రహరీకి పునాదులేసిన తరవాత అర్ధంతరంగా ఆపేయాలని ఆదేశాలివ్వడంతో నిర్మాణ కమిటీ తెల్లముఖం వేసిందని చెబుతున్నారు. మూడేళ్ల నుంచి ఇదే స్థితి ఇక్కడ కొనసాగుతోంది.

ఆ బిల్లులు రావే

ఆకివీడు, పాలకోడేరు, కాళ్ల, భీమవరం, వీరవాసరం మండలాల్లో నిర్మాణాలు వేర్వేరు దశల్లో నిలిచిపోయాయి. కొన్నైతే ప్రతిపాదనలోనే రద్దయ్యాయి. అప్పట్లో చేసిన పనులకు తాలుకు బిల్లులే దాదాపు రూ.10 కోట్ల వరకు చెల్లించాల్సి ఉంటుందని సమాచారం. 'కొన్నిచోట్ల ప్రధానోపాధ్యాయులు సొంత నగదు వెచ్చించి చేసిన పనులకు బిల్లులు రాలేదు. ఉన్నతాధికారులకు ఈఅంశాన్ని తెలియజేశాం. ఈప్రభుత్వం అనుమతిస్తే తిరిగి చేపట్టే అవకాశాలుంటాయి' అని పంచాయతీ రాజ్ డీఈ శ్రీనివాసరావు తెలిపారు.

నేడు బడ్జెట్ సమావేశం

ఆకివీడు, న్యూస్‌టుడే: ఆకివీడు నగర పంచాయతీ కార్యాలయంలోని సమావేశ మందిరంలో బుధవారం ఉదయం 11 గంటలకు బడ్జెట్ సమావేశాన్ని నిర్వహించనున్నట్లు కమిషనర్ కృష్ణమోహన్ తెలిపారు.

నల్లబ్యాడ్జిలు ధరించి వీఆర్వోల నిరసన

ఉండి, న్యూస్‌టుడే: రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా నల్లబ్యాడ్జీలు ధరించి వీఆర్వోలు మంగళవారం ఉండిలో నిరసన వ్యక్తం చేశారు. ఆ సంఘ మండల అధ్యక్షుడు ఎస్.చిన్నారావు మాట్లాడుతూ పనిభారం తగ్గించాలని, యూఎల్‌పీఎస్ సర్వేలో ఇచ్చిన మెమోలను వెంటనే నిలుపుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వీఆర్వోలు, గ్రామ సర్వేయర్లు, వీఆర్ఏల సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు. తమ సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని సంఘ ప్రతినిధులు ఆర్ఐ కార్తిక్‌కు అందజేశారు.

పిల్లల్లో రక్తహీనత లోపం తొలగించండి : జేసీ

మోగల్లులో విద్యార్థికి నులిపురుగు నివారణ మాత్ర వేస్తున్న రాహుల్‌కుమార్‌రెడ్డి

పాలకోడేరు, న్యూస్‌టుడే: పిల్లలందరికీ నులిపురుగు నివారణ మాత్రలను పంపిణీ చేసి రక్తహీనత లోపాన్ని పూర్తి స్థాయిలో తొలగించాలని జేసీ టి.రాహుల్‌కుమార్ రెడ్డి సూచించారు. మోగల్లులో వైద్యఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన నులిపురుగు నివారణ మాత్రల పంపిణీ కార్యక్రమాన్ని ఆయన పర్యవేక్షించారు. రాష్ట్ర పరిశీలకులు శిరీష, జిల్లా వైద్య ఆరోగ్యాధికారిణి గీతాబాయి తదితరులతో కలిసి ఆయన పంపిణీ తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక ఉన్నత పాఠశాలలో పలువురు విద్యార్థులకు నులిపురుగు నివారణ మాత్రలను వేశారు. పాలకోడేరు పీహెచ్‌సీ పరిధిలో 10,152 మంది విద్యార్థులకు 9,441 మందికి మాత్రలు పంపిణీ చేశామని వైద్యాధికారి గులాబ్‌రాజ్ కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్‌సీడీ సమన్వయకర్త కిషోర్, ఏవో భావన, వి.క్రాంతి కుమార్, సీహెచ్‌వో సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఆకివీడు, న్యూస్‌టుడే: ఆకివీడు పట్టణం, మండలంలోని అన్ని గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలతో పాటు ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థలన్నిటిలో విద్యార్థులకు నులిపురుగుల నివారణ కోసం ఆల్బెండజోల్ మాత్రలను అందజేశారు. ఎంఈవో ఎ.రవీంద్ర, ఎంపీడీవో బాబూరావు, పెదకాపవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి ఎం.రమేష్, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

ఉపసభాపతికి క్షమాపణ చెప్పాలి

కాళ్ల, న్యూస్‌టుడే: అభివృద్ధే ధ్యేయంగా పని చేస్తున్న ఉప సభాపతి కనుమూరు రఘురామకృష్ణరాజుకు పొత్తూరి వెంకటేశ్వరరాజు బహిరంగ క్షమాపణ చెప్పాలని కాళ్ల మండల పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. సంతమార్కెట్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ రాష్ట్రంలోనే మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దాలని రఘురామ చేస్తున్న అభివృద్ధి ఓర్వలేక తప్పుడు ప్రచారం చేస్తున్నారని, ఆయనను పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని పేర్కొన్నారు. పార్టీలో పదవులు దక్కలేదని దుష్ప్రచారం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశంలో మండలాధ్యక్షుడు వెంకటరత్నప్రసాద్, ఎంపీపీ శిరీషా విశ్వనాథరాజు, డీసీ ఛైర్మన్లు వెంకటశివరామరాజు, ఫణిబాబు, శివరామరాజు, సర్పంచి సోమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మైనార్టీల సంక్షేమానికి కృషి

మాట్లాడుతున్న తెదేపా పట్టణాధ్యక్షుడు మద్దుల రాము

భీమవరం అర్బన్, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం మైనార్టీల సంక్షేమానికి కట్టుబడి ఉందని ముస్లిం మైనార్టీ కార్పొరేషన్ డైరెక్టర్ షబీనా, తెదేపా పట్టణాధ్యక్షుడు మద్దుల రాము అన్నారు. భీమవరంలోని ఆ పార్టీ కార్యాలయంలో మంగళవారం పార్టీ పట్టణ మైనార్టీ విభాగం అధ్యక్షుడు ఎస్కే రబ్బానీ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. మైనార్టీల సంక్షేమం కోసం రాష్ట్ర బడ్జెట్‌లో వేల కోట్లు కేటాయించి నిబద్ధత చాటుకున్నారన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేరుస్తున్నారని పేర్కొన్నారు. రాష్ట్రాభివృద్ధి కోసం అంతా ఆయనకు అండగా నిలవాలన్నారు. సమావేశంలో తెదేపా పట్టణ కమిటీ ప్రధాన కార్యదర్శి చెల్లబోయిన సుబ్బారావు, ఏఎంసీ డైరెక్టర్ ఎండీ ఖలీల్, నాయకులు షాబు, ఫిరోజ్, గౌస్‌మొహిద్దీన్, రజియాబేగం తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి దశలోనే సద్గుణాలు అలవర్చుకుందాం

శిక్షణలో పాల్గొన్న స్కౌట్స్ విద్యార్థులు

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: విద్యార్థి దశలో నేర్చుకున్న మంచి లక్షణాలు జీవితాంతం కొనసాగుతాయని భీమవరం డీవైఈవో ఎం.రమేశ్ అన్నారు. భీమవరంలోని చింతలపాటి బాపిరాజు పాఠశాలలో స్కౌట్స్ విద్యార్థులకు 5 రోజుల పాటు నిర్వహిస్తున్న శిక్షణ తరగతులను ఆయన మంగళవారం పర్యవేక్షించారు. సేవా, స్నేహభావం, నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవాలన్నారు. స్కౌట్స్ జిల్లా కన్వీనర్ ఉంగరాల నాగేశ్వరరావు, ప్రధానోపాధ్యాయుడు బి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

శ్రద్ధాంజలి

చెదిరిపోదు మీ రూపం. మరిచిపోదు మా హృదయం.. మీరెప్పుడూ మాతోనే మా హృదయాంతరాలలోనే.. మీ పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తూ..

శ్రీ B.R.P.K.K. సింహ గారు
రిటైర్డ్ తహశీల్దార్ (వీరవాసరం)
భీమవరం
జననం : 20-07-1953, మరణం : 09-02-2026

తల్లి : B. సత్యవతి

భార్య : B.V. రత్నమాల (Rtd H.M)
మరియు కుటుంబ సభ్యులు

పెద్దకర్మ : ది. 19-02-2026 (గురువారం) భీమవరంలో మా స్వగృహం నందు జరుపబడును.

అమ్మవార్లకు అమావాస్య పూజలు

ద్రాక్ష పండ్ల అలంకరణలో బాలాత్రిపురసుందరి

భీమవరం ఆధ్యాత్మికం, న్యూస్‌టుడే: అమావాస్య సందర్భంగా మెంటేవారి తోటలో బాలాత్రిపుసుందరి అమ్మవారికి మంగళవారం విశేష పూజలు చేశారు. సుమారు 108 కిలోల ద్రాక్ష పండ్లతో అలంకరించారు. గునుపూడి గ్రామ దేవత ఆదిలక్ష్మి, రాజ్యలక్ష్మి, పోలేరమ్మ ఆలయంలో అమ్మవారి గరగకు సహస్ర నామ కుంకుమ పూజలు నిర్వహించారు.

దాసాంజనేయుడికి పంచామృతాభిషేకం

భీమవరం ఆధ్యాత్మికం, న్యూస్‌టుడే: కొత్త బస్టాండ్ సమీపాన ఉన్న దాసాంజనేయస్వామి ఆలయంలో స్వామివారికి విశేషాభిషేకాలు నిర్వహించారు. మంగళవారం ఉదయం స్వామివారికి పంచామృతాలతో అభిషేకం, సహస్ర నామ పూజలు చేశారు. రాత్రి స్వామివారికి వివిధ రకాల పుష్పాలు, తమలపాకులతో నేత్రపర్వంగా అలంకరించి పూజలు నిర్వహించారు.

శ్రీవారికి అష్టదళ పాదపద్మారాధన

భీమవరం ఆధ్యాత్మికం, న్యూస్‌టుడే: మాఘమాసం చివరి మంగళవారం సందర్భంగా జువ్వలపాలెం రోడ్డులో ఉన్న పద్మావతీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామి వారికి విశేష పూజలు నిర్వహించారు. రాత్రి స్వామివారి మూలవిరాట్‌కు, ఉత్సవమూర్తులకు స్వర్ణ పుష్పాలతో అష్టదళ పాదపద్మారాధన నేత్రపర్వంగా నిర్వహించారు.

భీమేశ్వరస్వామి సేవలో షణ్ముఖశర్మ

కలవపూడి(కాళ్ల), న్యూస్‌టుడే: శివాలయాలు నిర్మించడంతోపాటు వాటి నిర్వహణ పద్ధతి ప్రకారం ఆచరించాలని ప్రముఖ రచయిత సామవేదం షణ్ముఖశర్మ అన్నారు. కాళ్ల మండలం కలవపూడిలోని ఉమా భీమేశ్వరస్వామి దర్శనం నిమిత్తం వచ్చిన ఆయనకు మంగళవారం సాయంత్రం గ్రామస్థులు, భక్తులు ఘన స్వాగతం పలికారు. ఆలయంలో ప్రత్యేక పూజల అనంతరం భక్తులను ఉద్దేశించి ప్రవచనం చేశారు.

ఆరేడు పంట కాలువల్లోకి ఆక్వా జలాలు

ఆరేడు(ఉండి), న్యూస్‌టుడే: ఆరేడు పంట కాలువలోకి ఆక్వా కాలుష్య జలాలు చేరకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని వ్యవసాయ రైతు సంఘం ప్రతినిధులు మంగళవారం డిమాండ్ చేశారు. రబీ సీజన్‌కు సరైన రీతిలో సాగునీరందటంలేదని ఈసంఘ ప్రతినిధులు మాదాసి గోపి, రాంబాబు, ధనుంజయ్, సోములు, పున్నయ్య తదితరులు మంగళవారం నిరసన తెలిపారు. సాగునీటిని ఆక్వా చెరువుల్లోకి తోడకుండా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తిచేశారు.

నిబంధనలు పాటించాలి

దుంపగడప(ఆకివీడు), న్యూస్‌టుడే: దుంపగడప వీవీగిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం రోడ్డు భద్రతపై అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రిన్సిపల్ కె.సుజాత రోడ్డు భద్రత నియమ నిబంధలను విద్యార్థులకు తెలియజేశారు. వేగంగా వాహనాలు నడపడం వల్ల జరిగే నష్టాలను వివరించారు. ద్విచక్రవాహన చోదకులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, లైసెన్సు ఉండాలని ఏఎస్సై సత్యనారాయణ చెప్పారు. అనంతరం ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇది ఇక్కడే.. చెత్త అక్కడే

భీమవరం గ్రామీణ, న్యూస్‌టుడే: పల్లెల్లో చెత్త సేకరణ కోసం ప్రభుత్వాలు లక్షలు...వేలు ఖర్చు చేసి రిక్షాలు సమకూరుస్తున్నా వాటి నిర్వహణలో స్థానిక అధికారులు విఫలమవుతున్నారు. భీమవరం మండలం గొల్లవానితిప్పలో ఇలా రోడ్డు పక్కన చెత్తరిక్షాను ఏడాదిపైగా వదిలేశారు. ఇది తుప్పుపట్టిపోతూ మట్టిలో కలిసిపోతోంది. వీటికి మరమ్మతులు చేయించి వినియోగంలోకి తెచ్చే అవకాశం ఉన్నా అధికారులు, పాలకులు పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు.

26 నుంచి ప్రజా చైతన్య పాదయాత్ర

భీమవరం వన్‌టౌన్, న్యూస్‌టుడే: ప్రజా సమస్యల పరిష్కారంలో ప్రభుత్వాలు విఫలమవుతున్నాయని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 2 ఏళ్లు పూర్తికావస్తున్నా ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నేటికీ అమలు చేయలేదని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు బి.బలరాం విమర్శించారు. ప్రభుత్వ వైఫల్యాలు, హామీల అమలులో లోపాలను ప్రశ్నిస్తూ ఈనెల 26 నుంచి సీపీఎం ప్రజా చైతన్య పాదయాత్రలు చేపట్టనున్నట్లు మంగళవారం సీపీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తెలిపారు. ఈనెల 26 ఆకివీడు పరిధిలోని తాళ్లకోడులో యాత్రను రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ప్రారంభిస్తారన్నారు. మార్చి 23న కలెక్టరేట్ వద్ద భారీ బహిరంగ సభ నిర్వహిస్తామన్నారు.

జేఈఈ మెయిన్స్‌లో ప్రతిభ

ఉత్తమ పర్సంటైల్ సాధించిన విద్యార్థులతో తిరుమల యాజమాన్యం

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: జేఈఈ మెయిన్స్-2026 పరీక్ష ఫలితాల్లో భీమవరంలోని తిరుమల విద్యాసంస్థలకు చెందిన విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారని విద్యాసంస్థల ఛైర్మన్ నున్న తిరుమలరావు తెలిపారు. భీమవరం తిరుమల విద్యార్థి సీహెచ్ ధనుంజయ బాలాజీ 99.91 పర్సంటైల్, పి.మోహిత్ కృష్ణసాయి 99.88, జె.హసిక్ లక్ష్మణ్‌కుమార్ 99.80, జి.మోనిషా 99.80. బి.కుషాల్ 99.76, పి.వర్షిత్ 99.74, ఐ.రోహిత్‌కుమార్ 99.73, కె.వెంకట సత్యసాయి 99.45, పి.దుర్గ వినయ్ సాత్విక్ 99.37, జి.హరి చరణ్‌సాయిస్వామి 99.07, బి.యశ్వంత్ 99.06 పర్సంటైల్ సాధించారన్నారు. దాదాపు 120 మంది విద్యార్థులు ఉత్తమ పర్సంటైల్‌తో ఎన్ఐటీ, ఐఐఐటీల్లో సీట్లు సాధించగలరని డైరెక్టర్లు ఎస్.సాయిరాజు, పి.శీనివాస వర్మ, జి.సతీశ్‌బాబు తెలిపారు.

మెరిసిన కవలలు

ఏజీఎస్ఎస్. రిత్విక్

ఏజీబీకే. కౌషిక్

వీరవాసరం, న్యూస్‌టుడే: జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో వీరవాసరం గ్రామానికి చెందిన కవల అన్నదమ్ములు 99 పర్సంటైల్‌కుపైగా సాధించి ప్రతిభ చాటారు. గ్రామానికి చెందిన బాలాజీ, దంపతుల కవల కుమారులు ఏజీఎస్ఎస్ రిత్విక్ 99.91, ఏజీబీకే కౌషిక్ 99.76 పర్సంటైల్ సాధించారు. తల్లిదండ్రులు, కళాశాలలో ప్రత్యేక శిక్షణ తరగతుల్లో సాధన చేయడంతో 99 పర్సంటైల్ సాధించామన్నారు.

అదనపు కట్నం కోసం వేధింపులపై ఫిర్యాదు

ఆకివీడు, న్యూస్‌టుడే: అదనపు కట్నం కోసం వేధిస్తున్న భర్త, అతని కుటుంబ సభ్యులపై భార్య ఫిర్యాదు చేశారు. ఆకివీడు మండలం దుంపగడప గ్రామానికి చెందిన నక్క మరియమ్మకు కోనసీమ జిల్లా రామచంద్రపురానికి చెందిన గంట సురేష్‌కుమార్‌తో గతేడాది అక్టోబరులో వివాహమైంది. భర్త, అతని కుటుంబ సభ్యులు అదనపు కట్నం కోసం వేధిస్తున్నట్లు భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు మంగళవారం రాత్రి కేసు నమోదు చేసినట్లు ఎస్సై నాగరాజు తెలిపారు.

భర్త అదృశ్యంపై...

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: భీమవరం ఒకటోపట్టణం బ్యాంకుకాలనీకి చెందిన కె.రాంబాబు ఆచూకీ ఈ నెల 4 నుంచి లేదని అతని భార్య శివపార్వతి ఫిర్యాదు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగిరాలేదని ఫిర్యాదులో పేర్కొనగా ఎస్సై బి.వై కిరణ్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారన్నారు.

అవకతవకలు బయటపడతాయనే ఆరోపణలు

వీరవాసరం, న్యూస్‌టుడే: వీరవాసరం డ్వాక్రా ఏపీఎం జ్యోతిరాణిపై మండలానికి చెందిన పలువురు వీవోఏలు ఇటీవల కలెక్టర్‌కు పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు చేశారు. దీనిని ఖండిస్తున్నట్లు ఏపీఎం జ్యోతిరాణి మంగళవారం ప్రకటనలో పేర్కొన్నారు. గత ఏడాది నందమూరుగరువు గ్రామ సంఘంలో వీవోఏలు రూ.కోటికి పైగా అవకతవకలకు పాల్పడ్డారని ఇందులో రూ.40 లక్షల వరకూ రికవరీ చేయడం జరిగిందని మిగిలిన నగదు రికవరీ విషయంలో పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. మండల వ్యాప్తంగా వీరవాసరం, తోలేరు, కొణితివాడ తదితర గ్రామ సంఘాల్లో నగదు, ధాన్యం కొనుగోళ్ల కమీషన్ల సొమ్ములో అవకతవకలు జరిగాయని వీటిపై విచారణ చేయాలని కోరడంతో కొందరు వీవోఏలు రాజకీయ నాయకుల అండదండలతో కలెక్టరుకు ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు. కొందరు వీఏలను విధిగా సమావేశాలు నిర్వహించాలని చెప్పడం, నగదు లావాదేవీలపై విచారణ చేస్తాననే అనుమానంతోనే ఇలా అసత్య ఫిర్యాదు చేస్తున్నారని పేర్కొన్నారు.

రంజాన్ నెల ప్రారంభ శుభాకాంక్షలతో...

అభిరామ్ హాస్పిటల్స్

డా. ఎమ్. వీరాస్వామి, M.S. (Gen Surg.) - జనరల్ సర్జరీ స్పెషలిస్ట్

సమగ్ర శస్త్రచికిత్స సంరక్షణ

- హైడ్రోసిల్
- హెర్నియా రిపేర్
- అపెండెక్టమీ (24-గంటల నొప్పి ఉపశమనం)
- పైల్స్ & ఫిస్టులా
- థైరాయిడ్ ఆపరేషన్లు
- గర్భాశయ తొలగింపు
- కుటుంబ నియంత్రణ (ట్యూబెక్టమీ, వాసెక్టమీ)
- సున్తీ
- కణితి మరియు మాస్ తొలగింపు
- డయాబెటిక్ ఫుట్ అల్సర్ సంరక్షణ
- పేగు అడ్డంకి శస్త్రచికిత్స
- స్కిన్ గ్రాఫ్టింగ్ (ప్లాస్టిక్ సర్జరీ)
- పిత్తాశయ రాళ్ల తొలగింపు
- రొమ్ము కణితి తొలగింపు
- వరికోస్ వెయిన్స్ చికిత్స
- కాలిన గాయాల సంరక్షణ

అదే రోజు డిశ్చార్జ్ | ముందస్తు డిశ్చార్జ్ | కనీస యాక్సెస్ శస్త్రచికిత్సలు | 24/7 అత్యవసర సేవలు & శస్త్రచికిత్స

అన్ని జనరల్ శస్త్రచికిత్సా విధానాలు | 24-గంటల డాక్టర్ లభ్యత

J.P. రోడ్, వాటర్ ట్యాంక్ దగ్గర, భీమవరం-2. ఫోన్: 08816-223728

శ్రద్ధాంజలి

జననం: 4-1-1936
నిర్యాణం 13-2-2026

కీ॥శే॥ గోకరాజు వెంకటరంగరాజు గారు
జువ్వలపాలెం, కాళ్ళ మండలం

ప్రేమ, ఆప్యాయతలు మాపై చూపించి మంచితనం, మానవత్వం జీవిత విలువలు మాకు నేర్పించి, మా భవిష్యత్తుకై బంగారు బాటలు వేసిన మీ ఆలోచనలు, ఆశయాలు మా మదిలో పదిలం. అనంత లోకాలకు వెళ్లిన మీ పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తూ..

భార్య: గోకరాజు లక్ష్మీకాంతం
కుమారులు: వెంకట రంగ సుబ్బరాజు (పెదబాబు) కోడళ్లు: లక్ష్మీపద్మ
వెంకట నరసింహరాజు (చినబాబు) శైలజ
మనుమరాలు: మంతెన శ్వేత - వెంకటపతి రాజు మునిమనుమరాలు: శ్రీదివ్య
మనుమడు: గోకరాజు లక్ష్మణ్‌రాజు - నీలిమ మునిమనుమడు: ధృవ్

దశాహం: ది. 23-2-2026 సోమవారం జువ్వలపాలెంలోని మా స్వగృహమునందు జరుగును

(c) eenadu

నరసాపురం

• నరసాపురం • పాలకొల్లు • ఆచంట

త్రిశూలోత్సవం

హాజరైన భక్తులు

ఆచంట, న్యూస్‌టుడే: మహాశివరాత్రి కల్యాణ మహోత్సవాల్లో చివరి రోజు మంగళవారం ఆచంట ఉమారామలింగేశ్వరస్వామి ఆలయంలో వైభవంగా త్రిశూలోత్సవం నిర్వహించారు. ఆలయం వద్ద రామగుండం పుష్కరిణికి మహిళలు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఆనందోత్సాహాల మధ్య పుణ్యస్నానాలు చేశారు. ఉత్సవ మూర్తులకు పూజలు చేసి పల్లకిలో గ్రామోత్సవం నిర్వహించారు. ఆలయాన్ని అందంగా అలంకరించి పుష్పోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయానికి పెద్ద సంఖ్యలో విచ్చేసిన భక్తులకు కుంకుమ భరిణెలు, ప్రసాదాలు పంచారు. ఐదు రోజులు పాటు నేత్రపర్వంగా నిర్వహించిన ఉత్సవాలు ముగిశాయి.

పల్లకీసేవకు ఉత్సవమూర్తులు

పెనుమంట్ర, న్యూస్‌టుడే: శివరాత్రి మహోత్సవాల్లో భాగంగా మంగళవారం జుత్తిగ ఉమావాసుకీ రవిసోమేశ్వరస్వామి దేవస్థానంలో స్వామి, అమ్మవార్లకు త్రిశూల స్నానం చేయించారు. ఆలయ అర్చకులు ర్యాలీ వాసుశర్మ, సాయి గణేష్‌శర్మ, రామకృష్ణ శర్మ, వాస్తు పండితుడు వేమూరి వెంకటేశ్వర శర్మ ఆధ్వర్యంలో సత్తిరాజు వెంకట గోపాలకృష్ణమూర్తి, సత్యకళ దంపతులచే మహన్యాస పూర్వక రుద్రాభిషేకం, రుద్ర హోమం, పూర్ణాహుతి, పుష్ప యాగోత్సవం జరిపించారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ ప్రత్యేకాధికారి సాయి ప్రసాద్, భక్తులు పాల్గొన్నారు.

క్రిమినల్ కేసుల పరిష్కారానికి కృషి

మాట్లాడుతున్న న్యాయమూర్తి రాజ్యలక్ష్మి

నరసాపురం, న్యూస్‌టుడే: జాతీయ లోక్‌అదాలత్‌లో భాగంగా నరసాపురం న్యాయస్థానాల్లో వచ్చే నెల 14న నిర్వహించనున్న లోక్‌అదాలత్‌లో క్రిమినల్ కేసుల పరిష్కారానికి చొరవ చూపాలని జూనియర్ డివిజన్ అదనపు సివిల్‌జడ్జి ఎస్.రాజ్యలక్ష్మి సూచించారు. లోక్ అదాలత్ సన్నద్ధతలో భాగంగా మంగళవారం పోలీసు సిబ్బందితో నిర్వహించిన సమీక్షా సమావేశంలో న్యాయమూర్తి మాట్లాడారు. ఆయా కేసుల్లో ఇరు పక్షాలకు ముందస్తుగా నోటీసులు అందించాలని సూచించారు. ఇరు వర్గాలకు సమన్యాయం జరిగేలా కృషిచేయాలన్నారు. ఈ సమావేశంలో సీఐ దుర్గాప్రసాద్, పలువురు ఎస్సైలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

వాళ్లు కడుతుంటారు.. వీరు చూస్తుంటారు!

పట్టణంలో యథేచ్ఛగా ఆక్రమణలు

పాలకొల్లు, న్యూస్‌టుడే: పల్లెలనుంచి పట్టణాల వరకు ప్రభుత్వ పోరంబోకు భూముల్లో ఆక్రమణదారులు చొరబడుతున్నారు. పాలకొల్లు, ఆచంట నియోజకవర్గాల్లో ఊరూరా ఆక్రమణలతో కబ్జాల పర్వం కొనసాగుతోంది. ప్రధాన రహదారుల నుంచి డ్రెయిన్లు, పంట కాలువలు, పురపాలిక స్థలాలు ఆక్రమణలతో నిండిపోతున్నా అడిగేవారు ఉండటం లేదు.

బ్రాడీపేటలో ప్రధాన రహదారికి ఆనుకుని మార్జిన్ లేకుండా నిర్మిస్తున్న కట్టడం ఇది. నిత్యం రద్దీగా ఉండే ఈ ప్రాంతంలో కొందరు ముందుకొచ్చి నిర్మాణాలు చేపడుతున్నా.. అధికారులు పట్టించుకోవడం లేదు. పాలకొల్లు పట్టణంలో రోజురోజుకూ పెరిగిపోతున్న ఆక్రమణల తీరుకు ఇది నిదర్శనం.

ఇదీ పరిస్థితి

- పాలకొల్లు పట్టణంలో టాక్సీ స్టాండు నుంచి దిగమర్రు ఛానల్ వెంబడి ఆక్రమణలు విపరీతంగా ఉన్నాయి. కొంద రైతే ఆలయాలు నిర్మించుకుని పక్కనే వ్యాపారాలు చేస్తున్నారు.
- దమ్మయ్యపర్తి డ్రెయిన్ ఆధునికీకరణ పనుల సమయంలో తొలగించిన ఆక్రమణల్లో కొందరు మళ్లీ వచ్చి చేరుతున్నారు.
- పోడూరు మండలం జిన్నూరు నుంచి పాలకొల్లు వరకు నరసాపురం ప్రధాన కాలువ గట్టు నిండా ఆక్రమణలతో దుకాణాలు వెలిశాయి. దీనివల్ల తాగునీరు కలుషితమయ్యే దుస్థితి కొనసాగుతోంది.
- యలమంచిలి మండలం కట్టుకాల్వ నుంచి ఇలపకుర్రు వరకు వల్లూరు డ్రెయిన్ వెంబడి, దొడ్డిపట్ల ప్రధాన రహదారిలో విలువైన పోరంబోకు భూములను ఆక్రమించి భవంతులు, వాణిజ్య సముదాయాలు నిర్మించేశారు.

దీనిపై పురపాలిక కమిషనర్ బి.విజయసారథి స్పందిస్తూ ఆక్రమణదారులకు నోటీసులిస్తామన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

నరసాపురం	: 80085 74504	ఆచంట:	90631 44737
పాలకొల్లు	: 80085 74510	వాసవీ పెనుగొండ:	80085 74469
పోడూరు	: 90631 44741	పెనుమంట్ర:	91212 29087

నరసాపురం పట్టణం, న్యూస్‌టుడే: ? పట్టణంలోని మాలెం వారి వీధిలో డ్రెయిన్లలో పూడిక సక్రమంగా తొలగించడం లేదు. దోమల బెడద ఎక్కువగా ఉంది. **-టి.కేశవరావు**

✔ పూడిక తొలగించేందుకు చర్యలు తీసుకుంటాం. **-పాత్రుడు, శానిటరీ ఇన్‌స్పెక్టర్, పురపాలక సంఘం**

పాలకొల్లు గ్రామీణ, న్యూస్‌టుడే: ? మండలంలో పూలపల్లి శాంతి నగర్‌లో పిచ్చిమొక్కలు పెరిగిపోవడంతో రాత్రి సమయంలో విషపురుగులు సంచరిస్తున్నాయి. **-కార్తిక్, స్థానికుడు**

✔ మొక్కలను తొలగిస్తాం. **-పి.శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి**

భక్తాంజనేయ స్వామికి అభిషేకాలు

నరసాపురం పట్టణం, న్యూస్‌టుడే: నరసాపురం పట్టణం మొగల్తూరు రోడ్డులోని భక్తాంజనేయ స్వామి ఆలయాలతో పాటు రుస్తుంబాదు సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం స్వామికి పంచామృతాభిషేకాలు, సహస్ర నామార్చనలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివార్ల విశేష పూజల్లో పాల్గొన్నారు.

బాలగణపతికి.. నరసాపురం పట్టణం, న్యూస్‌టుడే: నరసాపురం పట్టణం వస్త్రావాదారుల వీధి వసుపులమ్మ, మహాలక్ష్మమ్మ గుడి వద్ద కొలువైన బాల గణపతి ఆలయ 22వ వార్షికోత్సవంలో భాగంగా మంగళవారం స్వామికి పంచామృతాభిషేకం, ప్రత్యేక పూజలు, సహస్ర నామార్చనలు నిర్వహించారు.

వాసవీ పెనుగొండ, న్యూస్‌టుడే: స్థానిక వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం ఆలయ అర్చకుడు కందుకూరి సాయి పూజలు, అభిషేకాలు చేశారు. వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు.

వీరభద్రస్వామికి ప్రత్యేక పూజలు

దీపాలంకరణ

పాలకొల్లు ఆధ్యాత్మికం, న్యూస్‌టుడే: పాలకొల్లు కొత్తపేటలో భద్రకాళీ సమేత వీరభద్రస్వామి ఆలయంలో మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం స్వామి, అమ్మవార్లకు పూజలు చేశారు. రాత్రి ఆలయ ప్రాంగణంలో దీపాలంకరణలు చేసి పంచహారతులు ఇచ్చారు.

పుష్పోత్సవం

రామేశ్వరస్వామి

అమ్మవారు

ఆచంట, న్యూస్‌టుడే: ఆచంట ఉమారామేశ్వరస్వామి ఆలయంలో మహాశివరాత్రి మహోత్సవాల సందర్భంగా మంగళవారం రాత్రి పుష్పోత్సవం నిర్వహించారు. స్వామి అమ్మవార్లను ప్రత్యేక పుష్పాలతో అలంకరించారు.

ముగిసిన మాఘమాస ఆధ్యాత్మిక ప్రవచనాలు

పెనుమంట్ర, న్యూస్‌టుడే: జుత్తిగ ఉమావాసుకీ రవిసోమేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో జరుగుతున్న శివమహా పురాణం, మాఘ మాస వైభవ ప్రవచనాలు మంగళవారం ముగిశాయి. గ్రామ సర్పంచి తమనంపూడి వీర్రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమం పదిహేను రోజుల పాటు సాగింది. ఆధ్యాత్మిక పండితుడు వారణాసి రామ్మోహనశర్మ తన ప్రవచనాల ద్వారా శివ రూపం, తత్వం, భక్తి తదితర అంశాలను వివరించారు.

26 నుంచి కల్యాణ మహోత్సవాలు

పాలకొల్లు ఆధ్యాత్మికం, న్యూస్‌టుడే: పాలకొల్లు యడ్లబజారులోని కనకదుర్గ దేవస్థానంలో ఈ నెల 26 నుంచి కల్యాణ మహోత్సవాలు నిర్వహిస్తామని ఆలయ ఛైర్మన్ తులా రామలింగేశ్వరరావు మంగళవారం తెలిపారు. మంత్రి నిమ్మల రామానాయుడు దంపతులచే అంకురార్పణ, ధ్వజారోహణ ఉత్సవాలను ప్రారంభిస్తామన్నారు. 27న కనకదుర్గ, మల్లేశ్వరస్వామి వార్ల కల్యాణం, 28న అమ్మవారి జాతర, మార్చి 1న 5116 కలశాలతో పూజ కార్యక్రమాలు, సాయంత్రం ఊంజల్ సేవ, లక్ష దీపాలంకరణ, 2న దర్బార్ సేవ, 3న పూర్ణాహుతి, త్రిశూలస్నానం, 4న అమ్మవారికి లక్షచామంతులతో, 5న లక్ష గాజులతో పూజ, అమ్మవారికి సారె మహోత్సవం, 8న పుష్పోత్సవం కార్యక్రమాలు నిర్వహిస్తామని వివరించారు.

నేటి నుంచి ఆలయ ప్రతిష్ఠాపన ఉత్సవాలు

యలమంచిలి, న్యూస్‌టుడే: యలమంచిలి గ్రామదేవత మాలెసోమేశ్వరదేవి ఆలయ ప్రతిష్ఠాపన ఉత్సవాలు బుధవారం ప్రారంభమవుతాయి. తొలిరోజు కుంకుమ పూజలు, హోమాలు నిర్వహించనున్నారు. గ్రామస్థులతో పాటు ఇతర ప్రాంతాల్లో స్థిరపడిన వారంతా ఉత్సవాలకు హాజరవుతున్నారు.

పోడూరు, న్యూస్‌టుడే: జగన్నాథపురంలో పునఃనిర్మితమైన రామేశ్వర స్వామి ఆలయంలో ఈ నెల 28న ప్రతిష్ఠించనున్న శివలింగం మంగళవారం ఆలయానికి చేరింది. దాత, ఎన్‌ఆర్‌ఐ దశిక లక్ష్మీనరసింహం సుమారు రూ. లక్ష వ్యయం చేసి మధ్యప్రదేశ్‌లోని ఓంకారేశ్వరం నుంచి శివలింగం, పానపట్టం రప్పించారు. వీటితో పాటు రూ.5 లక్షల విలువైన బంగారు యంత్రాలు సిద్ధం చేశారు. సుమారు రూ.కోటితో పునఃనిర్మించిన ఈ ఆలయానికి లక్ష్మీనరసింహం రూ.33,33,333 విరాళంగా అందజేసినట్లు ఆలయ కమిటీ ఛైర్మన్ రామమోహనరావు తెలిపారు.

కనులపండువగా గ్రామోత్సవం

సింహవాహనంపై వాసవీ కన్యకాపరమేశ్వరి

వాసవీ పెనుగొండ, న్యూస్‌టుడే: మహాశివరాత్రి మహోత్సవాల్లో భాగంగా మంగళవారం రాత్రి స్థానిక నగరేశ్వర, మహిషాసురమర్దని, వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవార్ల గ్రామోత్సవం కనులపండువగా నిర్వహించారు. నంది వాహనంపై నగరేశ్వరస్వామిని, సర్ప వాహనంపై మహిషాసురమర్దని, పుష్పవాహనంపై విఘ్నేశ్వరస్వామిని, సింహవాహనంపై వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారిని అధిరోహింపజేసి ప్రభలతో మేళతాళాలు, వివిధ నృత్యాలతో బాణసంచా కాల్పులతో పురవీధుల్లో గ్రామోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ఆవరణలో భీమవరానికి చెందిన కూచిపూడి నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. ఆలయ ఈవో గుబ్బల రామపెద్దిరాజు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

పూడికతీత పనులు సక్రమంగా చేపట్టాలి: రామరాజు

నల్లిక్రీక్ పూడిక పనులను పరిశీలిస్తున్న పొత్తూరి తదితరులు

నరసాపురం గ్రామీణ, న్యూస్‌టుడే: నరసాపురం మండలం పెద మైనవానిలంక నుంచి బియ్యపుతిప్ప వరకు చేపట్టిన నల్లిక్రీక్ (సముద్ర పాయ) పూడికతీత పనులు సక్రమంగా చేపట్టాలని డ్రెయినేజీ శాఖ అధికారులను తెదేపా నియోజకవర్గ ఇన్‌ఛార్జి పొత్తూరి రామరాజు కోరారు. పూడిక తీత పనులు నిర్దేశించిన విధంగా జరగడం లేదని, పాత సముద్రపాయ నుంచి కాకుండా పక్కనే ఉన్న భూముల మీదుగా తవ్వడంతో తాము భూములను కోల్పోయే పరిస్థితి ఏర్పడిందని ఆయా గ్రామాల రైతులు కూటమి నాయకుల దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై స్పందించిన పొత్తూరి రామరాజు, కూటమి నాయకులు నల్లిక్రీక్ పూడికతీత పనులను బాధిత రైతులతో కలిసి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా రామరాజు డ్రెయినేజీ శాఖ అధికారులతో మాట్లాడుతూ పాత నల్లిక్రీక్ సముద్ర పాయ నుంచే తవ్వాలని సమీపంలోని రైతుల భూముల మీదుగా పూడికతీత పనులు చేపట్టి రైతులకు నష్టం కలిగించవద్దన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ ఛైర్మన్ జక్కం శ్రీమన్నారాయణ, తెదేపా మండల అధ్యక్షుడు వాతాడి ఉమామహేశ్వరరావు, వేములదీవి సాగునీటి సంఘ అధ్యక్షుడు అడ్డాల శ్రీనివాస్ పాల్గొన్నారు.

పనిభారం తగ్గించాలి

నినాదాలు చేస్తున్న వీఆర్వోలు, వీఆర్ఏలు, సర్వేయర్లు

వాసవీ పెనుగొండ, న్యూస్‌టుడే: గ్రామ రెవెన్యూ అధికారులపై పనిభారం తగ్గించాలని, అపరిష్కృత డీఏలు, బిల్లులు చెల్లించాలని మండల వీఆర్వోలు, వీఆర్ఏలు, సర్వేయర్లు డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో తమ న్యాయమైన డిమాండ్లు నెరవేర్చాలని కోరుతూ ఆందోళన చేపట్టారు. కార్యక్రమంలో షేక్ యాకూబ్, ఎ.సీతారాం, బి.నరసింహారావు, జగదీష్, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన

ప్రదర్శన చేస్తున్న సిబ్బంది

పాలకొల్లు గ్రామీణ, న్యూస్‌టుడే: జాతీయ ప్రకృతి వ్యవసాయ మిషన్ కింద ఎంపికైన గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయాన్ని విస్తరించాల్సిన అవసరం ఉందని ఆ విభాగం ఇన్‌ఛార్జ్ పి.అప్పారావు అన్నారు. పాలకొల్లు మండలం లంకలకోడేరు, వెలివెల గ్రామాల్లో పంచాయతీ కార్యాలయం వద్ద గ్రామసభ మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పించడమే ముఖ్య ఉద్దేశం అన్నారు. కార్యక్రమంలో సర్పంచి చొప్పల రజని, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

ఠాకూర్ జీవితం స్ఫూర్తిదాయకం

ఆచంట, న్యూస్‌టుడే: పేదవర్గాల అభ్యున్నతికి కృషి చేసిన కర్పూరి ఠాకూర్ జీవితం స్ఫూర్తిదాయకమని నాయకులు అన్నారు. మంగళవారం ఆచంటలో క్షవర వృత్తిదారుల సంఘం ఆధ్వర్యంలో మాజీ సీఎం ఠాకూర్ వర్ధంతి నిర్వహించి నివాళులర్పించారు. తోటపల్లి సత్యనారాయణ, పిచ్చుకల విశ్వనాథం తదితరులు మాట్లాడారు.

దీపాలు వెలగవు.. డ్రెయిన్లు శుభ్రం చేయరు

కదలని మురుగు

పాలకొల్లు మార్కెట్, న్యూస్‌టుడే: పాలకొల్లు పట్టణం 29వ వార్డులోని డ్రెయిన్లు శుభ్రంగా లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కార్మికులు రెండు రోజులకు ఒకసారి వచ్చి శుభ్రం చేస్తున్నా మురుగు ముందుకు కదలడం లేదని స్థానికులు వాపోతున్నారు. దీంతో దోమల బెడద అధికంగా ఉంటుందని, రాత్రులు నిద్ర ఉండటం లేదని చెబుతున్నారు. ● ఖాళీ స్థలాల్లోని పిచ్చిమొక్కలు ఏపుగా పెరగడం, స్థానికులు చెత్త, వ్యర్థాలు అక్కడే వేస్తుండటంతో విషపు కీటకాలు చేరుతున్నాయి. రాత్రి వేళలో తిరగడానికి మహిళలు, చిన్నారులు భయాందోళన చెందుతున్నారు. ● స్థానిక వీవర్స్ కాలనీలో కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. వార్డులో ఎక్కడ చూసినా విచ్చలవిడిగా తిరిగి దాడులకు దిగుతున్నాయి. ● చింతలతోట, దేశాలమ్మగుడి వీధుల్లో కొన్ని చోట్ల వీధి దీపాలు వెలగడం లేదు.

పరిశీలిస్తాం: డ్రెయిన్ల శుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటాం. వార్డులోని ఖాళీ స్థలాలకు నోటీసులు ఇస్తున్నాం. సమస్యను పరిశీలించి చర్యలు తీసుకుంటాం. **-బి.విజయసారథి, పురపాలక కమిషనర్**

29 వార్డు నివేదన

జనాభా : 2,200

ప్రాంతాలు: మేదర్ల వారి వీధి, చింతలతోట, దేశాలమ్మ గుడి వీధులు, వీవర్స్ కాలనీ

పొంచి ఉన్న ప్రమాదం



వాసవీ పెనుగొండ గ్రామీణ, న్యూస్‌టుడే: చినమల్లం జడ్పీ పాఠశాల పక్కన ఉన్న మలుపు వద్ద విద్యుత్తు పరివర్తకం ప్రమాదకరంగా ఉంది. నిత్యం ఈ మార్గంలో పాఠశాలకు వెళ్లే చిన్నారులు రాకపోకలు సాగిస్తుంటారు. పరివర్తకం తక్కువ ఎత్తులో ఉండటం, దాని చుట్టూ రక్షణ గోడ లేకపోవడంతో ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ఈ సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఎలాంటి చర్యలు తీసుకోలేదని గ్రామస్థులు చెబుతున్నారు. ఈ విషయమై ఎల్ఐ సువర్ణకుమార్ మాట్లాడుతూ ఉన్నతాధికారులకు తెలియజేశామన్నారు.

ముప్పు ముంగిట ప్రయాణం...!

పెనుమంట్ర, న్యూస్‌టుడే: మల్లిపూడి- తణుకు మార్గంలో సోమరాజు ఇల్లింద్రపర్రు శివారు దానమ్మ ఆలయ ప్రాంతంలో మలుపు అత్యంత ప్రమాదకరంగా మారింది. ఒక వైపు గోస్తనీ- వేల్పూరు కాలువ, మరో పక్క పంట కాలువ ఉండటం ఆపై రహదారి అంచు పూర్తిగా పాడవడంతో ఏ క్షణాన ఏ ప్రమాదం జరుగుతుందోనని భయపడుతున్నారు. వాహనాలు ఎదురెదురుగా వచ్చినా తప్పుకోవడానికి వీలు లేకుండా మారింది. సమీపంలో కాలువవైపు రహదారి కోతకు గురికావడంతో సమస్య జటిలంగా తయారైంది. కనీసం ఇక్కడ వీధి దీపాలు కూడా లేవు. ఈ విషయమై ఆర్అండ్‌బీ ఏఈ యశ్వంత్ మాట్లాడుతూ రహదారి అంచులను మెరుగు పరుస్తామని చెప్పారు.

నిధుల వ్యయం.. నిరుపయోగం

నరసాపురం, న్యూస్‌టుడే: గత ప్రభుత్వం రూ.కోట్లు వెచ్చించి చేపట్టిన నిర్మాణాలు పూర్తవకపోవడంతో ప్రజల దాహార్తి తీరడం లేదు. పట్టణంలోని పీచుపాలెం, చినమామిడిపల్లిలో రెండు ఓహెచ్‌ఆర్‌లు నిర్మించారు. ఒక్కోటి 850కేఎల్ సామర్థ్యంతో సుమారు రూ.3 కోట్లు అంచనాతో ట్యాంకులు నిర్మించారు. కానీ వాటికి పంపింగ్ మెయిన్, పట్టణంలోని ఆయా ప్రాంతాలకు అనుసంధానం చేస్తూ పైపులైన్ల నిర్మాణం చేయలేదు. దీంతో అవి నిరుపయోగంగా మారాయి. ప్రజలకు తాగునీటి ఇబ్బందులు తీరలేదు. ‘న్యూస్‌టుడే’ సమస్యను పురపాలక సంఘ డీఈ ఆర్.గంగావరప్రసాద్ దృష్టికి తీసుకెళ్లగా పట్టణంలో తాగునీటి పథకం ఆధునికీకరణకు అమృత 2.0లో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించామని తెలిపారు.

నిత్యావసరాలు, నగదు అందిస్తున్న సభ్యులు

వాకర్స్ క్లబ్ సాయం

పాలకొల్లు మార్కెట్, న్యూస్‌టుడే: పాలకొల్లు పట్టణానికి చెందిన అప్పారావు, యలమంచిలి మండలం చింతదిబ్బకు చెందిన ఆనందరావు కొంత కాలంగా అనారోగ్యంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. స్థానిక వాకర్స్ క్లబ్ వారికి రూ.10 వేల ఆర్థిక సాయం, నిత్యావసరాలు అందించారు. క్లబ్ అధ్యక్షుడు తటవర్తి సుధాకరరావు, సభ్యులు షేక్ పీర్ సాహెబ్, మానెం బసవరాజు, సలాది రామచంద్రరావు, పోతుల ఉమాశంకర్ పాల్గొన్నారు.

రణభేరికి తరలివెళ్లిన యూటీఎఫ్ నాయకులు

మొగల్తూరు, న్యూస్‌టుడే: సమస్యల పరిష్కారం కోరుతూ ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ ఆధ్వర్యంలో విజయవాడలో నిర్వహించిన రణభేరి సమావేశానికి మండలానికి చెందిన పలువురు యూటీఎఫ్ నాయకులు ప్రత్యేక వాహనాలపై మంగళవారం తరలివెళ్లారు. జిల్లా కార్యదర్శి కొల్లాటి బ్రహ్మయ్య, మండల శాఖ అధ్యక్ష, కార్యదర్శులు ఉంగరాల వెంకన్నబాబు, జి.తాతారావుల ఆధ్వర్యంలో పలువురు ఉపాధ్యాయులు తరలివెళ్లారు.

బయలుదేరుతున్న ఉపాధ్యాయ సంఘాల నాయకులు

ప్రతిజ్ఞ చేస్తున్న మహిళలు, అంగన్వాడీలు

బాల్య వివాహం చట్టరీత్యా నేరం

పాలకొల్లు మార్కెట్, న్యూస్‌టుడే: బాల్య వివాహ్ ముక్త్ భారత్ 100 రోజుల కార్యక్రమంలో భాగంగా జిల్లా బాలల సంరక్షణ యూనిట్ మిషన్ ఆధ్వర్యంలో పాలకొల్లు బెత్లెహేంపేట అంగన్వాడీ కేంద్రంలో మంగళవారం అవగాహన సదస్సు జరిగింది. ఈ కార్యక్రమానికి సంస్థాగత సేవల రక్షణ అధికారి పి.మమతశ్రీ పాల్గొని మాట్లాడుతూ బాల్య వివాహం చేసుకోవడం, పోత్సహించడం నేరమని, అందుకు చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం అందరితో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పి.సత్యవేణి తదితరులు పాల్గొన్నారు.

జారితే గోదారే..

నరసాపురం, న్యూస్‌టుడే: పట్టణంలోని పంటు రేవు నుంచి ఎన్టీఆర్ ఘాట్ వరకు ఉన్న గోదావరి గట్టు పలుచోట్ల దిగబడింది. గట్టుపై గుంతలు ఏర్పడ్డాయి. అవి నేరుగా గోదావరిలోకి ఉండటంతో ప్రమాదం పొంచి ఉంది. రాత్రి సమయంలో పాదచారులు వాటిని గమనించకపోతే గోదావరిలోకి జారిపడే ప్రమాదం ఉంది. వాహన చోదకులు ప్రమాదాల బారిన పడే అవకాశం ఉంది. ‘న్యూస్‌టుడే’ ఈ సమస్యను పురపాలక డీఈ ఆర్.గంగావరప్రసాద్ దృష్టికి తీసుకెళ్లగా వెంటనే గుంతలను పూడ్పించి సమస్య పరిష్కరిస్తానన్నారు.

26 నుంచి ప్రజా చైతన్య పాదయాత్ర

భీమవరం వన్‌టౌన్, న్యూస్‌టుడే: ప్రజా సమస్యల పరిష్కారంలో ప్రభుత్వాలు విఫలమవుతున్నాయని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 2 ఏళ్లు పూర్తికావస్తున్నా ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నేటికీ అమలు చేయలేదని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు బి.బలరాం విమర్శించారు. ప్రభుత్వ వైఫల్యాలు, హామీల అమలులో లోపాలను ప్రశ్నిస్తూ ఈనెల 26 నుంచి సీపీఎం ప్రజా చైతన్య పాదయాత్రలు చేపట్టనున్నట్లు మంగళవారం సీపీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తెలిపారు. ఈనెల 26 ఆకివీడు పట్టణ పరిధిలోని తాళ్లకోడులో యాత్రను రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ప్రారంభిస్తారన్నారు. మార్చి 23న జిల్లా కలెక్టరేట్ వద్ద భారీ బహిరంగ సభ నిర్వహిస్తామన్నారు.

నులిపురుగుల నివారణతో ఆరోగ్యం

పోడూరు, మొగల్తూరు, పాలకొల్లు, న్యూస్‌టుడే: నులిపురుగు నివారణతో విద్యార్థులు సంపూర్ణ ఆరోగ్యంతో ఉండగలరని పోడూరు వైద్యాధికారి సుప్రజ అన్నారు. జాతీయ నులిపురుగు నివారణ దినోత్సవం సందర్భంగా పోడూరు జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులతో మంగళవారం ఆల్బెండజోల్ మాత్రలు మింగించారు. ఏఎన్ఎం, ఆరోగ్య సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ● నులిపురుగు నిర్మూలనా కార్యక్రమంలో భాగంగా మొగల్తూరు మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, అంగన్వాడీల చిన్నారులకు సోమవారం మాత్రలు పంపిణీ చేశారు. నియోజకవర్గంలో 8496 మంది విద్యార్థులకు 98శాతం మందికి నులిపురుగు నివారణా మాత్రలు వేశామని మొగల్తూరు పీహెచ్‌సీ వైద్యాధికారిణి కేవీఎల్ పార్వతి తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దారు కె.రాజకిశోర్, ఎంఈవో యు.శామ్యేలుజాన్, డిప్యూటీ ఎంపీడీవో ఎం.నవీన్‌కిరణ్ తదితరులు పాల్గొన్నారు. ● యువత ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని దాసరి నారాయణరావు మహిళా కళాశాల ప్రిన్సిపల్ శోభారాణి సూచించారు. కళాశాలలో విద్యార్థులకు నులిపురుగు మాత్రలు పంపిణీ చేశారు. ఏఎన్ఎంలు అన్నామణి, జ్యోత్స్నరాణి పాల్గొన్నారు.

పోడూరు: విద్యార్థికి మాత్రలు వేస్తున్న సుప్రజ

చెత్త కుప్పలు.. ఆరోగ్యానికి తిప్పలు

నరసాపురం పట్టణం, పాలకొల్లు మార్కెట్, న్యూస్‌టుడే

నరసాపురం పట్టణ పరిధిలో ప్రధాన కాలువ గట్టుపై చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలు వేసి నీరు కలుషితం చేస్తున్నారు. వేములదీవి కాలువ గట్టు రహదారి, జవదాల పేట, గ్రేస్ నగర్, చినమామిడిపల్లి, రెల్లిపేట తదితర ప్రాంతాల్లో రహదారి, కాలువ గట్లపై వేసిన చెత్తతో స్థానికులు, ప్రజల రాకపోకలకు ఇబ్బందికరంగా ఉంటుంది.

నరసాపురం, పాలకొల్లు పురపాలక పరిధిలో ప్రధాన కాలువతో పాటు సాగు, మురుగునీటి కాలువ గట్లపై చెత్త, వ్యర్థాలను వేస్తుండటంతో పారిశుద్ధ్యం అధ్వానంగా మారుతోంది. పలు చోట్ల చెత్త సేకరణ సక్రమంగా లేక ఇళ్లలోని వ్యర్థాలు, హోటళ్లు, వివిధ దుకాణాల్లోని వ్యర్థాలను రహదారులపై వేస్తున్నారు. రోజుల తరబడి చెత్త నిల్వ ఉండటంతో కుళ్లి దుర్వాసన.. దోమల బెడదతో ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. పలు చోట్ల గుట్టలుగా చేరిన చెత్త కుప్పలను తగలబెట్టడంతో దట్టమైన పొగతో వాహనదారులు, నివాసితులు ఇబ్బందులు పడుతున్నారు.

పాలకొల్లు పట్టణంలో సాయిబాబా ఆలయం నుంచి టిడ్కో గృహాల సముదాయానికి వెళ్లే రహదారిని డంపింగ్ యార్డులా మారుస్తున్నారు. దీంతో కాలువ నీరు కలుషితం అవుతోంది. అటుగా రాకపోకలు సాగించే పాదచారులు, వాహన చోదకులు దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నారు.

చర్యలు తీసుకుంటాం.. పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నాం. చెత్త ఎక్కడపడితే అక్కడ వేయొద్దంటూ ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. చెత్త సక్రమంగా తొలగించేలా చర్యలు తీసుకుంటాం.
- ఆర్.వెంకటరామిరెడ్డి, పురపాలక కమిషనర్, నరసాపురం

పాలకొల్లులో..

పాలకొల్లు పట్టణంలోని వెలమగూడెం, రాజీవ్ నగర్, మారుతి థియేటర్ వంటి ప్రాంతాల్లో ఇదే పరిస్థితి కనపడుతోంది. పాలకొల్లు, నరసాపురం ప్రధాన కాలువ ద్వారా అన్ని ప్రాంతాల్లోని తాగునీటి చెరువులకు, పంట పొలాలకు వినియోగించే ఈ నీరు కలుషితమవుతోంది. మరోవైపు ఈ చెత్త కుప్పలుగా కాలువలోకి జారి పూడిపోతున్నాయి. శివారు ప్రాంతాలకు నీరు లాగటంలేదని రైతులు ఆందోళన చెందుతున్నారు.

వస్త్ర దుకాణంలో చోరీ

తణుకు, న్యూస్‌టుడే: సజ్జాపురంలోని వస్త్రదుకాణంలో మంగళవారం తెల్లవారుజామున గుర్తు తెలియని నలుగురు వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. లక్ష్మణ్ అనే వ్యక్తి రాఘవేంద్ర టెక్స్‌టైల్స్ పేరుతో వస్త్ర దుకాణం నిర్వహిస్తున్నారు. అదే భవనం పైఅంతస్తులో ఆయన నివాసముంటున్నారు. మంగళవారం తెల్లవారుజాము 3.15 గంటల సమయంలో నలుగురు వ్యక్తులు వచ్చి షట్టర్ పగులగొట్టి ఇద్దరు వ్యక్తులు లోపలకు చొరబడ్డారు. క్యాష్ కౌంటర్‌లో ఉంచిన సుమారు రూ.11వేలు నగదు చోరీ చేశారు. ఈ దృశ్యాలన్నీ సీసీ కెమెరాలో నమోదయ్యాయి. యజమాని లక్ష్మణ్ ఇచ్చిన ఫిర్యాదుతో తణుకు పట్టణ ఎస్సై కె.శ్రీనివాస కేసు నమోదు చేసి సీసీ ఫుటేజీ ఆధారంగా దర్యాప్తు చేపట్టారు.

తీర్థంలో ఆరు ద్విచక్ర వాహనాలు..

ఆచంట, న్యూస్‌టుడే: ఆచంట మహాశివరాత్రి ఉత్సవాల్లో ద్విచక్ర వాహనాలు పోగొట్టుకున్నామంటూ పలువురు ఆవేదన వ్యక్తం చేశారు. ఆచంట పరిసర ప్రాంతాల్లో ఆరు బైకులు పోయాయని పోలీసుల దృష్టికి తీసుకొచ్చారు. వీటిలో సరైన పత్రాలు లేనివి కూడా ఉన్నాయి. దీనిపై ఆచంట ఎస్సై కె.వెంకటరమణను సంప్రదించగా సీసీ కెమెరా ఫుటేజీ ఆధారంగా ఇప్పటికే ఇద్దరు నిందితులను గుర్తించినట్లు తెలిపారు. విచారణ చేసి చర్యలు తీసుకుంటామన్నారు.

ప్రకటన

In the Court of the Principal Civil Judge (Junior Division), Tanuku
O.S. 283/2025

Between:
Plaintiff: Uppalapati Sunil Baba
Defendant: Puchhala Sowjanya W/o Tirupathi Rao, House No. 5-8/1, Jampeta, Vadali - 534 324, Penugonda Mandal, W.G.Dt.

వాది ప్రతివాదిపైన ది. 4-4-2025వ తేదీన Plaint Schedule ఆస్థి విషయములో వ్రాసిన Sale agreement time లో యిచ్చిన రూ. 10,00,000-00 (పదిలక్షల రూపాయలు) దావా తేదీ లగాయితు 18% వడ్డీతో తనకు యివ్వవలసినదిగాను పై సొమ్ముకు Plaint Schedule ఆస్థిపై Charge కోరుతూ దావా చేయగా ప్రతివాది Suit summons తీసుకోకుండా evade చేయుచున్నందున యీ Publication తేదీ లగాయితు నెల రోజులలోగా పై కోర్టు వారి ఎదుట హాజరై Vakalat దాఖలు చేయని యెడల పరోక్షమందు తీర్మానించబడును.

Sd/- **D.Radha,** B.A., B.L.,
Advocate, Tanuku
Cell: 98850 12183
Tanuku
17-2-2026

(c) eenadu

తాడేపల్లిగూడెం
• తాడేపల్లిగూడెం • తణుకు

తణుకులో రూ.12.95 కోట్లతో అభివృద్ధి పనులు

తణుకు, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత తణుకు మున్సిపాలిటీ పరిధిలో అభివృద్ధి పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయని ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ వెల్లడించారు. ఈ మేరకు మంగళవారం ప్రకటన విడుదల చేశారు. ప్రస్తుతం రోడ్లు, డ్రెయినేజీలు, పార్కులతోపాటు పారిశుద్ధ్యం, తాగునీరు తదితర పనులకు రూ.12.95 కోట్లతో 42 పనులు కొనసాగుతున్నాయన్నారు. వైకాపా ప్రభుత్వ హయాంలో అభివృద్ధిని పూర్తిస్థాయిలో నిర్లక్ష్యం చేశారని ఆరోపించారు. ప్రస్తుతం రూ.1.28 కోట్లతో 3 ప్రభుత్వ భవనాల నిర్మాణంతోపాటు, రూ.2.71 కోట్లతో 11 డ్రెయినేజీలు, రూ.4.98 కోట్లతో 13 పార్కులు, రూ.2.76 కోట్లతో 10 రోడ్లు, రూ.3.36 కోట్లతో 3 తాగునీటి సరఫరా పనులు, రూ.5.51 కోట్లతో పారిశుద్ధ్య నిర్వహణ, మరో రూ.2.78 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు చేస్తున్నామని వివరించారు. ప్లాస్టిక్ రహిత పట్టణంగా తీర్చిదిద్దేందుకు వ్యాపారులు, ప్రజలు సమన్వయంతో సహకరించాలని ఆయన కోరారు.

శంకర మఠంలో నవావరణార్చన

సర్వమంగళ అమ్మవారు

తాడేపల్లిగూడెం అర్బన్, న్యూస్‌టుడే: చిన్నవంతెన వద్ద శంకరమఠంలోని ఉమాచంద్రమౌళీశ్వర స్వామి సర్వమంగళ అమ్మవారి దేవస్థానంలో అమ్మవారికి మంగళవారం సాయంత్రం నవావరణార్చన నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు వచ్చి పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు.

బంగారు ధనుస్సును దర్శించిన భక్తులు

తాడేపల్లిగూడెం అర్బన్, న్యూస్‌టుడే: అయోధ్య నుంచి చల్లా శ్రీనివాస్ శాస్త్రి ఆధ్వర్యంలో తీసుకొచ్చిన బంగారు ధనుస్సు, రాములవారి పాదుకలను మంగళవారం భక్తుల దర్శనార్థం ఏలూరు రోడ్డులోని మహంకాళమ్మ ఆలయానికి తీసుకొచ్చారు. నవోదయ ఫ్రెండ్స్ యూనియన్ అధ్యక్షుడు యెగ్గిన నాగబాబు ఆధ్వర్యంలో సాయంత్రం 5 నుంచి రాత్రి 8 గంటల వరకు ఆలయంలో ఉంచారు. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారి పాదుకలను, స్వర్ణ ధనుస్సును దర్శించుకున్నారు. అనంతరం పాదుకలు, ధనుస్సును భీమవరం మండలంలోని ప్రజల దర్శనార్థం తీసుకెళ్తున్నట్లు పేరిచర్ల ఫౌండేషన్ అధ్యక్షుడు పేరిచర్ల మురళీకృష్ణంరాజు తెలిపారు.

అంజన్నకు తమలపాకుల సేవ

అత్తిలి గ్రామీణం, న్యూస్‌టుడే: అత్తిలి పెద్దవంతెన వద్ద కొలువైన పంచముఖ ఆంజనేయుడికి మంగళవారం తమలపాకులతో ప్రత్యేక పూజలు, వివిధ పండ్లతో విశేష అభిషేకాలు నిర్వహించారు. స్వామిని రకరకాల పుష్పాలు, తమలపాకులతో విశేషంగా అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామిని దర్శించుకున్నారు.

వైభవంగా పుష్పోత్సవం

ఇరగవరం, న్యూస్‌టుడే: మహాశివరాత్రి సందర్భంగా రేలంగి తాటకేశ్వర, మహేశ్వరస్వామి, కె.ఇల్లిందలపర్రు ఉమా చోడేశ్వరస్వామివార్లకు మంగళవారం ఉదయం త్రిశూల స్నానం ఆచరించారు. రాత్రి పుష్పోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించి కలగ శివ, ఉయలూరి వెంకట్రావు ఆధ్వర్యంలో ఆలయాల అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. విగ్రహాలను పూలతో అలంకరించారు. పుష్పోత్సవాన్ని భక్తులు తిలకించారు.

ఇండోర్ స్టేడియం పరిశీలన

గణేష్‌నగర్(తాడేపల్లిగూడెం వన్‌టౌన్), న్యూస్‌టుడే: పట్టణంలో నిర్మిస్తున్న ఇండోర్ స్టేడియం గత వైకాపా ప్రభుత్వ హయాంలో నిర్లక్ష్యానికి గురైందని.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పనులు వేగవంతం చేశామని ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ తెలిపారు. తుది దశకు వచ్చిన పనులను నాయకులతో కలిసి మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఏపీ టిడ్కో సహకార అభివృద్ధి సంక్షేమ బోర్డు డైరెక్టర్ ఆకాశపుస్వామి, నియోజకవర్గ భాజపా బాధ్యుడు ఈతకోట తాతాజీ, పెంటపాడు మండల జనసేన అధ్యక్షుడు పుల్లా బాబి, నాయకులు చాపల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆటో..అటో..ఇటో

* బడి పిల్లలకు భద్రత కరవు
* పరిమితికి మించి ప్రమాదకరంగా నడుపుతున్న చోదకులు

తణుకు, న్యూస్‌టుడే: విద్యార్థుల్ని తరలించే ఆటోలు పుష్పక విమానాలను తలపిస్తున్నాయి. ఆటో చోదకులు పరిమితికి మించి బాలల్ని తరలిస్తున్నారు. పేద, మధ్య తరగతి కుటుంబాల తల్లిదండ్రులు బడి బస్సుల ఫీజులు భరించలేక, మరి కొంత మంది బస్సు సౌకర్యాలు లేక పిల్లలను ఆటోల్లో పంపిస్తున్నారు. దీన్నే ఆసరాగా చేసుకొని కొందరు చోదకులు ఒక్కో ఆటోలో పది నుంచి పదిహేను మందిని తరలిస్తూ ప్రమాదాలకు కారణమవుతున్నారు. దీంతో బడికి వెళ్లిన చిన్నారులు తిరిగి ఇంటికి క్షేమంగా వచ్చేవరకు తల్లిదండ్రులు బిక్కుబిక్కుమంటూ ఎదురు చూడాల్సిన దుస్థితి.

కిక్కిరిసి ప్రమాదకరంగా ప్రయాణిస్తున్న చిన్నారులు

నిబంధనలు తుంగలోతొక్కి తణుకు రవాణా శాఖ కార్యాలయం పరిధిలో సుమారు 230 వరకు పాఠశాలలు, కళాశాలల విద్యార్థుల్ని తరలించేందుకు 1000 వరకు ఆటోలుంటాయి. కొన్ని ఆటోల్లో 10 నుంచి 15 మంది వరకు పిల్లల్ని కుక్కుతున్నారు. డ్రైవరు సీటుకు ఇరువైపులా కూడా విద్యార్థులను కూర్చోబెట్టి నడుపుతున్నారు. పుస్తకాల బ్యాగులు, క్యారియర్లను ఆటోలకు ఇరువైపులా వేలాడదీయడంతో పక్కన వెళ్లే వాహన చోదకులకు తగిలి ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. పలువురు అధిక వేగంగా వెళ్లడం వల్ల ఒక్కోసారి ఆటోలు అదుపు తప్పి బోల్తాకొడుతున్నాయి. ఇలాంటి సందర్భాల్లో అధికారులు తనిఖీలు చేసి మమ అనిపిస్తున్నారని.. అలా కాకుండా నిరంతరం నిఘా ఉంచి శాశ్వత చర్యలు చేపట్టాలని పలువురు తల్లిదండ్రులు కోరుతున్నారు.

ఇవీ నిబంధనలు.. ● ఆటోలో డ్రైవరుతో కలిసి పెద్దలైతే నలుగురు.. పిల్లలైతే ఆరుగురు ప్రయాణించవచ్చు. ● డ్రైవర్ పక్కన ఎవర్నీ కూర్చోబెట్టకూడదు. ● డ్రైవర్‌కు లైసెన్స్, ఆటో సామర్థ్య ధ్రువీకరణ పత్రం తప్పనిసరి ● విద్యార్థులను తీసుకెళ్లే ఆటోల వివరాలు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్లో నమోదు చేయించి ప్రత్యేక గుర్తింపు సంఖ్య పొందాలి. ● పిల్లల్ని పాఠశాలలకు తీసుకువెళ్లే ఆటోలపై స్కూల్ ఆటో అని రాయాలి.

కొన్ని ఘటనలు.. ✷ గత నవంబరులో 12 మందిని ఎక్కించుకొని పాఠశాలకు వెళ్తున్న సమయంలో దువ్వ శివాలయం సమీపంలో అదుపు తప్పడంతో ఆటో బోల్తాకొట్టి నలుగురు గాయపడ్డారు. ఆ సమయంలో డ్రైవర్ ఫోన్ మాట్లాడుతున్నట్లు స్థానికులు చెప్పారు.

✷ అదే నెలలో తేతలిలో 10 మంది విద్యార్థులతో వెళ్తున్న ఆటో జాతీయ రహదారిపై సైక్లిస్టును ఢీకొని బోల్తా కొట్టింది. సైక్లిస్టుతోపాటు ఓ విద్యార్థినికి తీవ్ర గాయాలుకాగా, మరి కొంత మందికి స్వల్ప గాయాలయ్యాయి. చోదకుడికి లైసెన్స్‌కూడా లేకపోవడం గమనార్హం.

కూటమి పాలనలో ప్రతి పేదవాడికీ న్యాయం

వినతులు స్వీకరిస్తున్న వలవల బాబ్జి తదితరులు

భాగ్యలక్ష్మిపేట, నవాబ్‌పాలెం(తాడేపల్లిగూడెం వన్‌టౌన్), న్యూస్‌టుడే: ప్రతి పేదవాడికి న్యాయం జరిగేలా కూటమి ప్రభుత్వ పాలన కొనసాగిస్తోందని రాష్ట్ర భవన నిర్మాణ ఇతర కార్మికుల సంక్షేమ బోర్డు చైర్మన్ వలవల బాబ్జి అన్నారు. నియోజకవర్గ ప్రజల నుంచి ఫిర్యాదుల స్వీకరణలో భాగంగా భాగ్యలక్ష్మిపేటలోని తన నివాస కార్యాలయంలో మంగళవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. పలువురి నుంచి అర్జీలు స్వీకరించి ఆయా సమస్యల్ని అధికారులు త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకున్నారు. అనంతరం నవాబ్‌పాలెంలో బైబిల్ మిషన్ చర్చి ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. చర్చి నిర్వాహకులు బాబ్జీని సత్కరించారు. పట్టణ, గ్రామీణ తెదేపా అధ్యక్షులు పట్నాల రాంపండు, పరిమి రవికుమార్, రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ గొర్రెల శ్రీధర్, ఏపీ బ్రాహ్మణ, వైశ్య కార్పొరేషన్ డైరెక్టర్లు సర్వి వీసు కృష్ణమోహన్, పద్మరాజు మురళీతోపాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

బీసీలకు సామాజిక భవనం కేటాయించడం అభినందనీయం

తణుకు, న్యూస్‌టుడే: తణుకు పట్టణంలోని మహాత్మా జ్యోతిరావు పూలే సామాజిక భవనం ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ బీసీలకు కేటాయించడంపై పలువురు బీసీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు మంగళవారం ఆ భవనంలో నాయకులు దొమ్మేటి వెంకట సుధాకర్ అధ్యక్షతన మొదటి సమావేశం నిర్వహించి రాధాకృష్ణకు ధన్యవాదాలు తెలుపుతూ తీర్మానం చేశారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. కమిటీలో నసపల రమణ, బొబ్బరాంబాబు, కడియాల సూర్యనారాయణ, తమరపు రమణయ్య, వావిలాల సరళాదేవి, ఒమ్మి రాంబాబు, తమరపు సత్యనారాయణ తదితరులను ఎన్నుకున్నట్లు సుధాకర్ తెలిపారు.

సాంకేతిక విద్యకు ప్రాధాన్యం: పత్సమట్ల

నారాయణపురం (ఉంగుటూరు), న్యూస్‌టుడే: విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని.. కూటమి ప్రభుత్వం సాంకేతిక విద్యకు ప్రాధాన్యమిస్తోందని ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు అన్నారు. నారాయణపురం శ్రీఅరవింద శతజయంతి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పీఎం-ఉషా నిధులతో ఇన్నోవేషన్ ఇంక్యుబేషన్ కేంద్రం ఏర్పాటు చేయనున్నారు. ఇందులో భాగంగా రూ.5 లక్షలతో కొనుగోలు చేసిన డ్రోన్‌ను ధర్మరాజు మంగళవారం ప్రారంభించి మాట్లాడారు. అనంతరం కళాశాలలో నిర్వహించిన నాక్ జాతీయ సదస్సు కరపత్రాలను ఆవిష్కరించారు. స్థానికంగా నెలకొన్న సమస్యలను ప్రధానాచార్యులు కె.వి.ఎస్.శ్రీనివాస్ దృష్టికి తీసుకురాగా, వాటిని పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. సర్పంచి అలకనంద, సీడీసీ సభ్యులు సత్యనారాయణ, రంగరాజు, జానకి రామరాజు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు వితరణ

అత్తిలి గ్రామీణం, న్యూస్‌టుడే: బల్లిపాడు జడ్పీ ఉన్నత పాఠశాలకు అదే గ్రామానికి చెందిన గ్రామ తెదేపా అధ్యక్షుడు గారపాటి శివకృష్ణ ఆశోక్ రూ.17వేల విలువగల కలర్ ప్రింటర్‌ను మంగళవారం అందజేశారు. నాయకులు గారపాటి దర్శయ్య, ఉపాధ్యాయులు ఆకుల రామచంద్రరావు, ప్రధానోపాధ్యాయురాలు భరణి తదితరులు పాల్గొన్నారు.

ఆధార్ సేవలు సద్వినియోగం చేసుకోండి

పెంటపాడు(తాడేపల్లిగూడెం వన్‌టౌన్), న్యూస్‌టుడే: ఆధార్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని తాడేపల్లిగూడెం పోస్టల్ సూపరింటెండెంట్ ముత్యాల శ్రీనివాస్ సూచించారు. పెంటపాడు పోస్టాఫీసులో ఏర్పాటు చేసిన ఆధార్ కేంద్రాన్ని మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ కేంద్రంలో ఆధార్, బయోమెట్రిక్, అప్లికేషన్స్, మొబైల్ నంబరు ఆధార్‌కు అనుసంధానించడం, తదితర సేవలు అందుతాయన్నారు. పెంటపాడు పోస్టాఫీసు పరిధిలోని ఆరు గ్రామాల ప్రజలు ఈ సేవలు వినియోగించుకోవాలని సూచించారు. స్థానిక పోస్ట్ మాస్టర్ టి.నారాయణ, పోస్టల్ ఏపీ ఆధార్ ఆపరేటర్ పి.సాయి తదితరులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

తాడేపల్లిగూడెం	99488 53114
తణుకు	85558 50851
తణుకు గ్రామీణం	63005 79402
అత్తిలి	91548 46774

తాడేపల్లిగూడెం వన్‌టౌన్, న్యూస్‌టుడే: ? కడకట్ల శీలివారి వీధిలో పందుల సంచారంతో పరిసరాలు కాలుష్యమవుతున్నాయి - **ప్రకాష్, స్థానికుడు**

✔ యజమానులపై చర్యలు చేపడతాం - **సోమేశ్వరరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్**

? సుబ్బారావుపేటలోని డీఎస్ చెరువు వ్యర్థాలతో నిండిపోయి దుర్గంధం వెదజల్లుతోంది - **సందీప్, స్థానికుడు**

✔ వ్యర్థాలు తొలగింపజేస్తాం - **ఎం.ఏసుబాబు, పురపాలక కమిషనర్**

నేడు విద్యుత్తు సరఫరా ఉండని ప్రాంతాలు

తాడేపల్లిగూడెం వన్‌టౌన్, న్యూస్‌టుడే: జువ్వలపాలెం విద్యుత్తు ఉపకేంద్రం పరిధిలో బ్రేకర్ల మార్పులో భాగంగా బుధవారం మార్కెట్ ఫీడర్, 'ఈనాడు' ఫీడర్లకు ఉదయం ఎనిమిది నుంచి 9.30 గంటల వరకు సరఫరా నిలిపివేస్తామని తూర్పు ప్రాంత విద్యుత్తు పంపిణీ సంస్థ తాడేపల్లిగూడెం కార్యనిర్వాహక ఇంజినీర్ కె.నరసింహమూర్తి తెలిపారు. ఇందులో భాగంగా జువ్వలపాలెం, శివాలయం రోడ్డు, శ్రీదేవి పుంత, రిక్షాపుంత, సావిత్రిపేట, మార్కెట్ ఏరియా, తణుకు రోడ్డు, తాళ్ల ముదునూరుపాడు, భాగ్యలక్ష్మిపేట, యాగర్లపల్లి, హోసన్నా మందిర్ ప్రాంతాలకు విద్యుత్తు నిలుపుదల ఉంటుందన్నారు. ✦ జువ్వలపాలెం విద్యుత్తు ఉపకేంద్రం పరిధిలో లైన్ల మరమ్మతుల్లో భాగంగా బుధవారం ఉదయం ఎనిమిది నుంచి 11 గంటల వరకు సరఫరాకు అంతరాయం ఉంటుందని తూర్పు ప్రాంత విద్యుత్తు పంపిణీ సంస్థ తాడేపల్లిగూడెం కార్యనిర్వాహక ఇంజినీర్ కె.నరసింహమూర్తి తెలిపారు. ఇందులో భాగంగా పెంటపాడు మండలంలోని కె.పెంటపాడు, దర్శిపర్రు, బల్లిపాడు, వల్లూరుపాడు, అలంపురం, ప్రత్తిపాడు గ్రామాలకు సరఫరా నిలుపుదల ఉంటుందన్నారు.

తణుకు, న్యూస్‌టుడే: ఇరగవరం మండలం ఉప కేంద్రం పరిధిలో లైన్ల మరమ్మతులు, నిర్వహణ పనుల కోసం బుధవారం విద్యుత్తు సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆ శాఖ డివిజనల్ ఇంజినీర్ కె.నరసింహామూర్తి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 01.30 గంటల వరకు ఇరగవరం మండలంలోని అన్ని గ్రామాలకు సరఫరా ఉండదని తెలిపారు.

సాగు నీటిని సమర్థంగా వినియోగించుకోవాలి

ఇరగవరం, న్యూస్‌టుడే: పంటబోదెల విధానంలో సాగు నీటిని సమర్థంగా వినియోగించుకోవాలని వ్యవసాయాధికారి వై.రామచంద్రరావు చెప్పారు. కొత్తపాడు, అర్జునుడుపాలెం, కంతేరు, ఇరగవరం ప్రాంతాల్లోని పంట చేలను మంగళవారం ఆయన పరిశీలించారు. వంతుల వారీగా నీటి సరఫరా ఉన్నందున పోటీలు పడకుండా అందరికీ సాగు నీరు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన

పాలకొల్లు గ్రామీణ, న్యూస్‌టుడే: జాతీయ ప్రకృతి వ్యవసాయ మిషన్ కింద ఎంపికైన గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయాన్ని విస్తరించాలని ఆ విభాగం ఇన్‌ఛార్జి పి.అప్పారావు అన్నారు. పాలకొల్లు మండలం లంకలకోడేరు, వెలివెల గ్రామాల్లో పంచాయతీ కార్యాలయం వద్ద గ్రామసభ నిర్వహించారు.

వస్త్ర దుకాణంలో చోరీ

తణుకు, న్యూస్‌టుడే: సజ్జాపురంలోని వస్త్రదుకాణంలో మంగళవారం తెల్లవారు జామున గుర్తు తెలియని నలుగురు వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. లక్ష్మణ్ అనే వ్యక్తి రామచంద్ర టెక్స్‌టైల్స్ పేరుతో వస్త్ర దుకాణం నిర్వహిస్తున్నారు. అదే భవనం పైఅంతస్తులో ఆయన నివాసముంటున్నారు. మంగళవారం తెల్లవారు జాము 3.15 గంటల సమయంలో నలుగురు వ్యక్తులు వచ్చి షట్టర్ పగులగొట్టి ఇద్దరు వ్యక్తులు లోపలకు చొరబడ్డారు. క్యాష్ కౌంటర్‌లో ఉంచిన సుమారు రూ.11వేలు నగదు చోరీ చేశారు. ఈ దృశ్యాలన్నీ సీసీ కెమెరాలో నమోదయ్యాయి. యజమాని లక్ష్మణ్ ఇచ్చిన ఫిర్యాదుతో తణుకు పట్టణ ఎస్సై కె.శ్రీనివాస్ కేసు నమోదు చేసి సీసీ పుటేజీ ఆధారంగా దర్యాప్తు చేపట్టారు.

బంగారు గొలుసు..

ఉంగుటూరు: కైకరానికి చెందిన కొయ్యాని పాప, ఆమె భర్త పైడితల్లి మంగళవారం ప్రకాశం జిల్లా చీమకుర్తిలోని కుమార్తె ఇంటికి వెళ్లేందుకు బయల్దేరారు. ఇంటి నుంచి జాతీయ రహదారి వద్దకు నడిచి వస్తుండగా.. మార్గం మధ్యలోని పెద్దింట్లమ్మ ఆలయం వద్ద కొచ్చే సరికి ఇద్దరు యువకులు ద్విచక్ర వాహనంపై వచ్చి వివాహిత మెడలోని 3 కాసుల బంగారు గొలుసు లాక్కొని పారిపోయారు. బాధితురాలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు చేబ్రోలు పోలీసులు తెలిపారు.

రక్తహీనతకు నులిపురుగులే కారణం

తణుకు, న్యూస్‌టుడే: రక్తహీనతకు నులిపురుగులు కారణమవుతాయని, వాటి నివారణకు ప్రతి ఒక్కరూ చేతుల శుభ్రత పాటించాలని మున్సిపల్ కమిషనర్ టి.రామ్‌కుమార్ పేర్కొన్నారు. నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా మంగళవారం స్థానిక జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో మాత్రలు తినిపించిన అనంతరం ఆయన మాట్లాడారు.

అత్తిలి గ్రామీణం: చిన్నారులకు మందు వేస్తున్న పీడీ శ్రీలక్ష్మి

✦ ముత్యాలవారి వీధిలోని అంగన్వాడీ కేంద్రంలో సూపర్‌వైజర్ పి.మహాలక్ష్మితో కలిసి ఐసీడీఎస్ సీడీపీవో శ్రీలక్ష్మి చిన్నారులకు మాత్రలు వేసి మాట్లాడారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చిన్నారులు పరిశుభ్రతకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. వైద్యులు జ్యోతి, స్వరూప పాల్గొన్నారు.

✦ ఎస్‌కేఎస్‌డీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపల్ ఏడుకొండలు అధ్యక్షతన అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నులిపురుగుల కారణంగా రక్తహీనత, బలహీనత, పోషకాహార లోపాలు పెరుగుతున్నాయి.

అత్తిలి గ్రామీణం, న్యూస్‌టుడే: వ్యక్తిగత పరిశుభ్రతతోనే ఆరోగ్యం సాధ్యమవుతుందని అత్తిలి, మంచిలి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులు నాగరాజు, కిరణ్ తెలిపారు. అత్తిలి, మంచిలి, బల్లిపాడు ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులకు వారు మాత్రలు వేశారు. ✦ ఉనికిలి, లక్ష్మీనారాయణపురంలో జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీలక్ష్మి అంగన్వాడీ చిన్నారులకు నులిపురుగుల మందు అందించారు.

ఇరగవరం, న్యూస్‌టుడే: రేలంగి ఉన్నత పాఠశాలలో ఎంపీడీవో ఎ.శ్రీనివాసు, ఇరగవరంలో ఎంఈవో శ్రీనివాసరావు విద్యార్థులకు మాత్రలు వేశారు. వైద్యులు విజయ్ కుమార్, సాయి గిరిరెడ్డి, ఎంపీహెచ్ఈవో ప్రసాదరావు పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం అర్బన్, న్యూస్‌టుడే: పట్టణంలోని అన్ని ప్రాథమిక, ఉన్నత పాఠశాలల విద్యార్థులు, అంగన్వాడీ పిల్లలకు మున్సిపల్ కమిషనర్ ఎం.ఏసుబాబు అల్‌బెండజోల్ మాత్రలను పిల్లలచేత మింగించారు.

పెంటపాడు(తాడేపల్లిగూడెం వన్‌టౌన్), న్యూస్‌టుడే: పెంటపాడు మండలంలోని పాఠశాలల విద్యార్థులకు మాత్రలు వేశామని ఎంఈవో-1 శ్రీనివాస్ తెలిపారు.

జేఈఈ మెయిన్స్‌లో తిరుమల విద్యార్థుల ప్రతిభ

తణుకు, న్యూస్‌టుడే: జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో తణుకులోని తిరుమల ఐఐటీ అండ్ మెడికల్ అకాడమీ విద్యార్థి ఎన్.లోకేశ్ వినయ్ 99.7 పర్సంటైల్ సాధించారని తిరుమల విద్యా సంస్థల ఛైర్మన్ నున్న తిరుమలరావు తెలిపారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. తమ విద్యార్థులు కె.హేమన్య లక్ష్మీ 99, జి.చరణ్ సాయిష్ 98.9, టి.జశ్వంత్ 98.67, జి.ప్రజ్ఞశ్రీ 98.54, యం.గీతా సౌమ్యశ్రీ 98.52, బి.మౌర్య సంతోష్ కుమార్ 98.25, ఎస్.లాస్య 98 పర్సంటైల్ సాధించారని అందులో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తణుకులో స్థాపించిన మొదటి బ్యాచ్ కొద్దిమంది విద్యార్థులతోనే అత్యుత్తమ ఫలితాలు సాధించామన్నారు. ప్రతిభ చాటిన విద్యార్థులు, తల్లిదండ్రులను ఆయన అభినందించారు.

లోకేశ్ వినయ్‌ను అభినందిస్తున్న తిరుమలరావు

పాస్‌పోర్ట్ పోయినది

ఆకుల ఐశ్వర్య S/o నాగేశ్వరరావు D.No.5-142 మెయిన్ రోడ్, దువ్వ, తణుకు మండలం, ప.గో.జిల్లా. నేను దువ్వ గ్రామంలో 2 నెలల క్రితం నా పాస్‌పోర్ట్ (నెం: AA376972) పోగొట్టుకున్నాను. దొరికిన వారు ఈ క్రింది నంబరుకు తెలియజేయగలరు.

సెల్: 94946 49029

వేలం ప్రకటన

మహారాజశ్రీ తణుకు సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) వారి కోర్టులో
E.P.నెం.25/2025 in O.S.No.429/2014
Between :
వట్టికూటి చెంచయ్య ...DHR
మరియు
కొత్తల అమరనాథ్ ...JDR
DHR వేయించిన వేలం ప్రకటన
పై నెంబరు E.P. లో శ్రీ కోర్టు వారిచే ఈ దిగువ షెడ్యూలు ఆస్తిని ది.02-03-2026 సం.రము తేదీన ఉదయం గం.10.30 ని.లకు బహిరంగ వేలము వేయబడును గాన పాటదారులు పాల్గొనవలసినదిగా పేపరు ప్రకటన జారీచేయడమైనది.
షెడ్యూలు : ప.గో.జిల్లా, తణుకు మండలం, తణుకు సబ్ రిజిస్ట్రీ తణుకు మున్సిపాలిటీలో పరిధిలో పడమర 50 చ.గ.లు స్థలము 157 చ.గ.ల స్థలములో ఆర్.యస్.నెం.368/6 లోని ప్లాటు నెం.13, పాత డోర్ నెం.10-137/ఏ1, క్రొత్త డోర్ నెం.10-22-6, అందులో ఆర్‌సిసి భవనము ఈ దిగువ హద్దుల మధ్య: తూర్పు : కొత్తల జ్యోతి స్థలం, పడమర : 24 అ.లు వెడల్పు గల రోడ్, ఉత్తరం : పూడి అచ్చాయమ్మ స్థలం, దక్షిణం : పెంట వెంకటేశ్వర రావు.
పై హద్దుల మధ్య 50 చ.గ.ల స్థలం ఇందలి ఆర్‌సిసి భవనము, తలుపులు, ద్వారబంధములతో సహా.
డిహెచ్ఆర్ విలువ : రూ.5,00,000/-
అమీనా విలువ : రూ.80,00,000/-
మార్కెట్ విలువ : రూ.15,47,600/-
యమ్.యస్.భగవాన్లు
తణుకు అడ్వకేట్, తణుకు
తేది :17-02-2026 సెల్ : 98668 89422

తూకాల్లో వ్యత్యాసం.. కాటాలో మోసం

తణుకు, న్యూస్‌టుడే: తూకాల్లో మోసాలపై తణుకులో మంగళవారం తూనికలు, కొలతల శాఖ అధికారులు మెరుపు దాడి చేశారు. పట్టణంలోని పలు చేపలు, కోడి మాంసం, పండ్ల దుకాణాల్లో తూకాల్లో వ్యత్యాసాలతోపాటు కాటా మోసాలు బయటపడ్డాయి. ఎన్టీఆర్ పార్కు సమీపంలోని రామకృష్ణ కోడి మాంసం దుకాణంలో కిలోకు 100 గ్రామాల వ్యత్యాసంతోపాటు కాటాకు సీళ్లు లేకపోవడం గుర్తించారు. అనంతరం ఉండ్రాజవరం కూడలి సమీపంలోని లక్ష్మీ గణపతి లైవ్‌ఫిష్ దుకాణంలో తనిఖీలు చేసి 5 కిలోలకు 725 గ్రామాలు వ్యత్యాసం, కాటాకు సీళ్లు లేకపోవడం గుర్తించారు.

చేపల దుకాణంలో కేసు నమోదు చేస్తున్న అధికారులు

మరో రెండు పండ్ల దుకాణాలతోపాటు పైడిపర్రులోని చేపల దుకాణాల్లో వ్యత్యాసాలు గుర్తించి కాటాలను సీజ్ చేసినట్లు తూనికలు, కొలతల శాఖ ఇన్‌స్పెక్టర్ టి.రాంబాబు తెలిపారు.

ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలి

తణుకు, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి పీవీ.ప్రతాప్ కోరారు. యూటీఎఫ్ ఆధ్వర్యంలో మంగళవారం విజయవాడలో తలపెట్టిన రణభేరి 2.0 ధర్నాకు తణుకు నుంచి బయలుదేరిన ఉపాధ్యాయుల బస్సుకు ఆయన జెండా ఊపి మాట్లాడారు. ఈ సందర్భంగా 12వ పీఆర్‌సీకి వెంటనే ఛైర్మన్‌ను నియమించాలని, 29శాతం ఐఆర్ ప్రకటించాలని, పెండింగ్ డీఏలు విడుదల చేయాలని తదితర సమస్యలు పరిష్కరించాలని కోరారు. జయకుమార్, శివప్రసాద్‌రాజు, వీరన్న, రాఘవులు, సురేష్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

బస్సుకు జెండా ఊపుతున్న ప్రతాప్

మంచి నీటి ట్యాంక్ గొట్టాలు శిథిలం

15 వార్డు నివేదన

జనాభా : 2,479

ప్రాంతాలు: వీరభద్రాపురం, రోటరీనగర్, పాతపేట, గమళ్ల గూడెం, రాజరాజేశ్వరి పుంత, అయ్యప్పనగర్, ఎస్సీ కాలనీ.

తుప్పు పట్టిన మంచి నీటి ట్యాంక్ గొట్టాలు

తణుకు గ్రామీణం, న్యూస్‌టుడే: తణుకు పురపాలక సంఘం పరిధి 15వ వార్డులో పలు సమస్యలు తిష్ఠ వేశాయి. ముఖ్యంగా ఎస్సీ కాలనీలోని మంచి నీటి ట్యాంకు గొట్టాలు తుప్పుపట్టి శిథిలావస్థకు చేరాయి. మోటరు నుంచి నీరు వెళ్లే గొట్టం పాడవడంతో నీరు లీకవ్వకుండా సంచులతో కట్టారు. వార్డులో దాదాపు 500 కుటుంబాలకు నీటి సరఫరా చేసే ఈ ట్యాంకు నిర్వహణ, మరమ్మతులు గాలికి వదిలేయడంతో వేసవిలో నీటి ఎద్దడి తలెత్తే ఆస్కారం ఉందని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మురుగు నీరు, అంతర్గత రహదారులు, దోమల బెడద, కుక్కల స్వైరవిహారంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. డ్రెయిన్లలో పూడికతీత సక్రమంగా చేయక దుర్వాసన వెదజల్లుతోంది. మురుగు నీరు రోజుల తరబడి నిలిచి పోవడంతో దోమలు విజృంభించి తరచూ జ్వరాల బారిన పడుతున్నామని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొన్ని ప్రాంతాల్లో వీధి దీపాలు వెలగక రాత్రి సమయాల్లో రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు చెబుతున్నారు. అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. వాటర్ ట్యాంక్‌ను పరిశీలించి మరమ్మతులు చేయిస్తామని మున్సిపల్ డీఈ కె.ఈశ్వర్ రెడ్డి తెలిపారు.

పని ఒత్తిడి తగ్గించండి

అత్తిలి గ్రామీణం, న్యూస్‌టుడే : పంచాయతీ, రెవెన్యూ విభాగాల్లో విపరీతమైన ఒత్తిడితో పనిచేస్తున్నామని వీఆర్వోలు ఆందోళన వ్యక్తం చేశారు. గ్రామ రెవెన్యూ అధికారులు ఏ జాబ్ చార్టు ప్రకారం విధులు నిర్వహించాలో తెలియని అయోమయస్థితిలో ఉన్నారని అత్తిలి మండల గ్రామ రెవెన్యూ అధికారులు వాపోయారు. మంగళవారం అత్తిలి తహసీల్దార్ కార్యాలయం వద్ద రాష్ట్ర వీఆర్వోల సంఘం అధ్యక్షుడు భూపతిరాజు రవీంద్రరాజు ఆధ్వర్యంలో తహసీల్దార్ దశిక వంశీకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీఆర్వోలు తీవ్ర పని ఒత్తిడితో అనారోగ్యాల పాలవుతున్నారని, పని ఒత్తిడి తగ్గించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ సందర్భంగా సమస్యలు పరిష్కరించాలంటూ నినాదాలు చేశారు. వీఆర్వోలు, సర్వేయర్లు, గ్రామ సహాయకులు పాల్గొన్నారు.

నిరసనలో రవీంద్రరాజు, అత్తిలి మండల వీఆర్వోలు

ఇరగవరం, న్యూస్‌టుడే: గ్రామ స్థాయిలో పనిచేస్తున్న రెవెన్యూ సిబ్బంది సమస్యలు పరిష్కరించాలని కోరుతూ రెండోరోజు మంగళవారం మధ్యాహ్నం భోజన విరామ సమయంలో తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు.

నిఘా లేక.. చోరీలు ఆగక

గణపవరం బస్టాండు నుంచి వివిధ ప్రాంతాలకు నిత్యం 90కి పైగా బస్సు సర్వీసులు నడుస్తున్నాయి. ఇక్కణ్నుంచి రోజూ వందల మంది స్వస్థలాలకు చేరుకుంటున్నారు. బస్టాండులో సీసీ కెమెరాలు లేకపోవడంతో.. ఇటీవల చోరీలు అధికమయ్యాయి. నిత్యం ఏదొక దొంగతనం వెలుగు చూస్తున్నా.. అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు. - న్యూస్‌టుడే, గణపవరం

అమృతమూర్తికి అశ్రునివాళి
ఎప్పటికీ మాతోనే....
కుమారుడు: సుంకర బదరీనాథ్ స్వామీజీ కోడలు: పద్మిని
సెల్: 97000 27272
కుమార్తెలు: అల్లుళ్ళు:
దూలపల్లి సుబ్బలక్ష్మి - శివానంద బదరీనారాయణ, ఉండ్రాజవరం
నల్లూరి అన్నపూర్ణ - సోమేశ్వర చంద్రశేఖర్, తణుకు
మొగల్లపు సుజాత - దుర్గాతీర్థప్రసాద్ (దత్తుడు), ముక్కామల
మనుమలు, మనుమరాళ్లు:
B. వెంకటకృష్ణ - చాందినీకృష్ణ, డా॥ B. శ్రీరామ్ - డా॥ శ్రీసుప్రియ,
డా॥ M. లక్ష్మీకాంతి - డా॥ G. రత్నాకరరావు,
M. రేణుకాదేవి - A. వీరయ్యబాబు,
N. చంద్రసేన - శివకృష్ణ - Ch. లక్ష్మీ తేజస్విని,
N. రామకృష్ణ, M. వీరేంద్రనాధ్ చౌదరి, N. వంశీకృష్ణ, S. లక్ష్మీశిరీష,
S. కృష్ణసాహిత్య, S. వెంకట శివరామకృష్ణారావు
మరియు మునిమనుమలు, మునిమనుమరాళ్ళు

కీ.శే. శ్రీమతి సుంకర వరలక్ష్మి గారు
W/o వెంకట శివరామకృష్ణారావు గారు (లేట్)
నిర్యాణం: 7-2-2026, మండపాక, తణుకు మండలం
పెద్దకర్మ: ది. 22-02-2026 ఆదివారం మండపాకలో జరుపబడును.

(c) eenadu

ఈనాడు
వైఎస్సార్ కడప

బుధవారం ఫిబ్రవరి 18, 2026

భయం వీడితే.. తలొంచవా పర్వతాలే!

ప్రముఖ పర్యాటక ప్రాంతమైన గండికోట సాహస కృత్యాలకూ వేదిక. పర్వతారోహకులకు శిక్షణ ఇవ్వడం ఇక్కడి ప్రత్యేకత. తర్ఫీదు పొందడానికి వివిధ రాష్ట్రాల నుంచి విద్యార్థులు, యువత వస్తున్నారు. తెలంగాణ రాష్ట్రం నుంచి పాఠశాల, కళాశాలలకు చెందిన 120 మంది విద్యార్థులు ఇక్కడి అడ్వెంచర్ స్పోర్ట్స్ అకాడమీలో సాహస కృత్యాలపై శిక్షణ పొందుతున్నారు. రాక్ క్లైంబింగ్, రాపెల్లింగ్, ట్రెక్కింగ్, ట్రెక్ లీడర్‌షిప్, జిప్‌లైన్ ఇన్‌స్ట్రక్టర్ ట్రైనింగ్, వాటర్ స్పోర్ట్స్ భద్రతా మార్గదర్శకాల్లో నైపుణ్యాలను నేర్చుకుంటున్నారు. ఇందులో భాగంగా మంగళవారం ఇలా సాధన చేశారు.
- న్యూస్‌టుడే, జమ్మలమడుగు గ్రామీణ

రోగులు గాలికి.. మందులు లోనికి

ఈ దృశ్యాలు ప్రొద్దుటూరు జిల్లా ఆసుపత్రిలోనివి. రోగులకు వినియోగించాల్సిన చక్రాల కుర్చీలు, స్ట్రెచర్లను పక్కదారి పట్టిస్తున్నారు. రోజూ వంద కొంది వందల వరకు ఓపీ నమోదవుతుంది. నడవ లేని రోగులు, వృద్ధులు అనారోగ్యంతో వస్తుంటారు. అటువంటి వారి సౌకర్యం ఇటీవల దాతలు చక్రాల కుర్చీలు, స్ట్రెచర్లు సమకూర్చారు. సిబ్బంది వాటిని మందుల పెట్టెలు, వస్తువులు తీసుకెళ్లేందుకు వినియోగిస్తున్నారు. ఈ విషయమై ఆసుపత్రి సూపరింటెండెంట్ ఆనంద్ బాబు మాట్లాడుతూ.. మందులు రవాణాకు ప్రత్యేక ట్రాలీలు ఉన్నాయన్నారు. చక్రాల కుర్చీలు, స్ట్రెచర్లను ఇతర పనులకు వాడకుండా చూస్తామని తెలిపారు. - న్యూస్‌టుడే, ప్రొద్దుటూరు వైద్యం

బ్రహ్మరథం పట్టిన భక్తజనం

జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రాల్లో ఒకటైన రాజంపేట మండలం హత్యరాల త్రేతేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు మంగళవారంతో ముగిశాయి. చివరి రోజు హత్యరాల అగ్రహారంలో రథోత్సవాన్ని కనులపండువగా నిర్వహించారు. తొలుత కామాక్షి త్రేతేశ్వరుడిని రథంపై కొలువుదీర్చారు. అనంతరం మహిళా భక్తులు తాడు లాగుతూ ఓం నమశివాయ అంటూ ముందుకు సాగారు. - న్యూస్‌టుడే, రాజంపేట గ్రామీణ

ఆర్థికాభివృద్ధిలో గనులు కీలకం

సమీక్షిస్తున్న కలెక్టర్ శ్రీధర్. పక్కన డీఎఫ్‌వో వినీత్ కుమార్

జిల్లా సచివాలయం, న్యూస్‌టుడే: జిల్లా ఆర్థికాభివృద్ధిలో గనుల నిర్వహణ ఎంతో కీలకమని.. ఆ దిశగా సంబంధిత అధికారులు ప్రత్యేక దృష్టిసారించాలని కలెక్టర్ శ్రీధర్ ఆదేశించారు. ఖనిజ వనరులు, గనుల నిర్వహణపై అమరావతి నుంచి గనుల శాఖ ప్రధాన కార్యదర్శి విజయానంద్ దృశ్యమాధ్యమంలో జిల్లా ఉన్నతాధికారులతో సోమవారం పలు అంశాలపై దిశానిర్దేశం చేశారు. అనంతరం క్షేత్రస్థాయి అధికారులతో కలెక్టర్ మాట్లాడారు. జిల్లాలో అపారంగా ఉన్న ఖనిజ వనరులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. రెవెన్యూ, అటవీ భూముల రికార్డుల ప్రకారం కేటాయింపులు, స్థలాల విస్తీర్ణాన్ని సమన్వయంతో చేపట్టాలని సూచించారు. సమీక్షలో జిల్లా అటవీ శాఖాధికారి వినీత్ కుమార్, మైన్స్ డీడీ సుబ్రహ్మణ్యం, విజిలెన్స్ అధికారి మూర్తి, పరిశ్రమల శాఖ జీఎం చాంద్‌బాషా, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

గురుకులాల్లో ప్రవేశాలకు 1న పరీక్ష

జిల్లా సచివాలయం, న్యూస్‌టుడే: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలల్లో ఐదో తరగతి ప్రవేశాలకు మార్చి 1వ తేదీ ఉదయం 9.30 గంటలకు పరీక్ష నిర్వహిస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ సమన్వయకర్త ఉదయశ్రీ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇంటర్ మొదటి ఏడాది ప్రవేశాలకు మార్చి 1వ తేదీ మధ్యాహ్నం 12 నుంచి 3 గంటల వరకు పరీక్ష ఉంటుందని పేర్కొన్నారు. పరీక్షకు పది రోజుల ముందే హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు.

ఆనందాల.. ఆత్మీయ కూటమి

ప్రజా ప్రతినిధులకు మంత్రి లోకేశ్ విందు

ఈనాడు, కడప: ఆత్మీయ పలకరింపులు.. సరదా కబుర్లు.. యోగక్షేమాలపై కుశలప్రశ్నలతో కూటమి ప్రజాప్రతినిధుల విందు ఆద్యంతం సందడిగా సాగింది. విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ పార్లమెంట్ ఉండవల్లిలోని నివాసంలో నిర్వహిస్తున్న నియోజకవర్గాల వారీ ప్రజాప్రతినిధుల ఆత్మీయ సమావేశానికి కడప, రాజంపేట పార్లమెంట్ నియోజకవర్గాల ప్రజాప్రతినిధులు మంగళవారం రాత్రి హాజరయ్యారు. వీరికి తొలుత లోకేశ్ స్వాగతం పలికారు. అందరి వద్దకు వెళ్లి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఆయా ప్రజాప్రతినిధులు గతంలో ఇచ్చిన వినతుల్లో పరిష్కారమైనవి, కానివి తదితర వివరాలతో నివేదికలు అందించారు. విందు ఆరగించిన అనంతరం ఆడపడుచులకు మంగళగిరి పట్టుచీరలు అందించారు. సమావేశం ముగిసిన తర్వాత గేటు వరకు వచ్చి సాగనంపారు. ఈ ఆత్మీయ కలయికలో కూటమి ఎమ్మెల్యేలు రెడ్డెప్పగారి మాధవి(కడప), ఆదినారాయణ రెడ్డి(జమ్మలమడుగు), పుత్తా కృష్ణ చైతన్యరెడ్డి(కమలాపురం), ఎన్. వరదరాజులు రెడ్డి(ప్రొద్దుటూరు), పుట్టా సుధాకర్ యాదవ్(మైదుకూరు), మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి(రాయచోటి), నల్లారి కిశోర్‌కుమార్ రెడ్డి(పీలేరు), షాజహాన్ బాషా(మదనపల్లె), ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి, తెదేపా పొలిట్‌బ్యూరో సభ్యుడు ఆర్. శ్రీనివాసరెడ్డి కుటుంబ సభ్యులతో సహా హాజరయ్యారు. తెదేపా కడప పార్లమెంట్ అధ్యక్షుడు భూపేష్‌రెడ్డి అనారోగ్యం కారణంగా హాజరుకాలేదు.

రూ. 30 కోట్లు చెత్తలో పోసినట్లేనా!

త్రిశంకు స్వర్గంలా ఎకో పార్కు పరిస్థితి

కడప నగరపాలక, న్యూస్‌టుడే: రూ. 30 కోట్లు ఖర్చు పెట్టి అట్టహాసంగా పనులు చేపట్టారు. చెత్త కనుమరుగవుతుందని జనం సంతోషించారు. ఏళ్లు గడుస్తున్నా ప్రారంభానికి నోచలేదు. ఇప్పుడు వినియోగంలోకి రాకుండానే శిథిలావస్థకు చేరింది. శాఖల మధ్య సమన్వయ లోపం.. చిత్తశుద్ధి లేమి ఈ దుస్థితిని తెచ్చి పెట్టాయి.

ఎండు గడ్డి పెరిగి కళావిహీనంగా మారిన ఎకో పార్కు

ఇదీ అసలు విషయం

కడపలోని ఉక్కాయపల్లి కంపోస్ట్ యార్డు నగరానికి పెను విపత్తుగా మారుతోందని పర్యావరణవేత్తలు ఆందోళన వ్యక్తం చేశారు. చెత్త కాసారం ప్రక్షాళనకు పాలకులూ కదిలారు. మొత్తం 11 ఎకరాల విస్తీర్ణంలోని ఈ డంపింగ్ యార్డు శుద్ధికి ప్రపంచ బ్యాంకు ముందుకొచ్చింది. చెత్త దిబ్బలను తొలగించి పర్యావరణహితమైన ఉద్యానవనం ఏర్పాటుకు దాదాపు రూ. 30 కోట్ల నిధులిచ్చింది.

గోప్యంగా నిర్మాణం

ప్రతిష్ఠాత్మకమైన ఈ ప్రాజెక్టును కాలుష్య నియంత్రణ మండలి అధికారులు పర్యవేక్షించారు. రాంకీ ఇన్‌ఫ్రా పేరుతో పనులు చేపట్టారు. నగర పాలక సంస్థకు చెందిన ఆ స్థలంలో పనులను అత్యంత గోప్యంగా 2020 నాటికి పూర్తి చేశారు. నిబంధనల ప్రకారం ఎకో పార్కును నగర పాలక సంస్థకు స్వాధీనం చేయాలి. ఈ విషయం ఇప్పటికీ సందిగ్ధంగానే ఉంది.

లోపాలే అసలు అనర్థం

ఎకో పార్కును నగర పాలక సంస్థకు స్వాధీనం చేయడానికి వైకాపా జమానాలో విశ్వప్రయత్నాలు సాగాయి. పరిశీలించిన కేఎంసీ ఇంజినీర్లు అనేక లోపాలను గుర్తించి స్వాధీనం చేసుకోలేమని తేల్చి చెప్పారు. పైనుంచి వచ్చిన ఆదేశాలతో నిర్వహణకు దరఖాస్తులు ఆహ్వానించినా ఎవరూ ముందుకు రాలేదు. ఇదే సమయంలో తమ బాధ్యత తీరిపోయిందని అటు గుత్తేదారు- కాలుష్య నియంత్రణ మండలి అధికారులు చేతులు దులుపుకొన్నారు. తాము ఇంకా స్వాధీనం చేసుకోలేదని ఇటు కేఎంసీ అధికారులు సంబంధం లేనట్టు వ్యవహరించారు.

మొదలు పెట్టకుండానే శిథిలం

భారీ వ్యయంతో చేపట్టిన పార్కు పరిస్థితి ఇప్పుడు త్రిశంకు స్వర్గంలా మారింది. బాధ్యత లేదని అధికార యంత్రాంగం వ్యవహరించడంతో మౌలిక స్వరూపమే మారిపోయింది. సౌర విద్యుత్తు ఉపకరణాలు, అందుకు కేటాయించిన గది ఇప్పటికే శిథిలమయ్యాయి. పార్కులో అడుగు పెట్టలేని రీతిలో పిచ్చిమొక్కలు పెరిగాయి. ప్రభుత్వం ఇప్పటికైనా దృష్టిసారించి రూ. 30 కోట్ల పనులకు ఈ స్థితి తలెత్తడానికి కారణాలపై దృష్టి సారించి.. పార్కును ప్రక్షాళన చేసి కడప వాసులకు ఉపయోగ పడేలా తీర్చిదిద్దాల్సిన అవసరం ఉంది.

సమ్మె కట్టిన సహకార సిబ్బంది

మూతపడిన గాలివీడు సహకార సంఘ కార్యాలయం

కడప వ్యవసాయం, న్యూస్‌టుడే: ఉద్యోగ విరమణ వయసు పెంచాలని, పీఆర్సీ అమలు చేయాలని, కొత్తగా నియమించుకున్న సిబ్బంది తొలగింపు తగదని కోరుతూ ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల సిబ్బంది సోమవారం నుంచి సమ్మెలోకి వెళ్తున్నట్లు ప్రకటించారు. దీంతో ఉమ్మడి కడప జిల్లాలోని కార్యాలయాలు తెరుచుకోలేదు. సేవలు స్తంభించాయి.

● **నిలిచిపోయిన లావాదేవీలు:** సహకార సంఘాల్లో పనిచేసే కార్యదర్శులు, క్లర్కులు, అటెండర్ల సమ్మెతో వ్యాపార లావాదేవీలు నిలిచిపోయాయి. ఉమ్మడి కడప జిల్లా పరిధిలోని 75 సంఘాల పరిధిలో ఈ మొత్తం సుమారు రూ. 1,500 కోట్ల వరకు ఉంటుందని ఉద్యోగులు తెలిపారు. ఇందులో పంట రుణాలు, దీర్ఘకాలిక రుణాలు, వ్యవసాయేతర రుణాలు ఎక్కువ. ఆర్థిక సంవత్సరం ముగుస్తున్న నేపథ్యంలో సంఘాలు సమ్మెకు దిగడంతో అప్పులు వసూలు, ఇతర లావాదేవీలపై ప్రభావం పడుతోంది.

కాబోయే అమ్మకు ఆపద

ఆందోళన కలిగిస్తున్న రక్తహీనత

ఒంటిమిట్ట, న్యూస్‌టుడే: పండంటి శిశువుకు జన్మనివ్వాల్సిన అమ్మను రక్తహీనత వేధిస్తోంది. పౌష్టికాహార లోపమే చాలా మంది గర్భిణులకు శాపమై చుట్టుముడుతోంది. గర్భధారణ నిర్ధారణ అయ్యాక ప్రభుత్వాసుపత్రుల్లో ప్రతి నెలా 9వ తేదీ ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ (పీఎంఎస్ఎంఏ) కార్యక్రమంలో భాగంగా చేస్తున్న వైద్య సేవలు సకాలంలో అందక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సాధారణంగా గర్భిణి ఒంట్లోని 100 గ్రాముల రక్తంలో 12-14 గ్రాముల హిమోగ్లోబిన్ ఉండాలి. గతేడాది ఏప్రిల్ నుంచి ఈ ఏడాది జనవరి వరకు పరీక్షలు చేసిన వారిలో 21.16 శాతం మందిలో ఏడు గ్రాములలోపే ఉన్నట్లు వెలుగులోకి వచ్చింది.

ఒంటిమిట్ట పీహెచ్‌సీకి వైద్య పరీక్షల కోసం వచ్చిన గర్భిణులు

అదుపులోకి రాని మరణాలు

జిల్లాలో గత పది నెలల కాలంలో పుట్టిన 28 రోజుల్లోపే నవజాత శిశువులు 156 మంది, నెల నుంచి ఏడాది లోపు వయసు ఉన్న వారు 180 మంది, ఏడాది నుంచి అయిదేళ్లలోపు 226 మంది మృత్యువాత పడ్డారు. అదేవిధంగా ఎనిమిది మంది తల్లులు కన్నుమూశారు. మునుపటి కంటే మరణాల శాతం గణనీయంగా తగ్గినట్లు వైద్యాధికారులు చెబుతున్నా ఇంకా పూర్తి స్థాయిలో అదుపు కాలేదు.

పోషకాహారం అందుతున్నప్పటికీ..

పల్లె, పట్టణ ప్రాంతాల్లో నివాసం ఉంటున్న గర్భిణులకు 2,389 అంగన్‌వాడీ కేంద్రాల తర్వాత ప్రతి నెలా పౌష్టికాహారం పంపిణీ చేస్తున్నారు. ఒక్కో గర్భిణికి పాలు నెలకు అయిదు లీటర్లు, బియ్యం మూడు కిలోలు, కంది పప్పు 1 కిలో, నూనె 450 మి.లీ, కోడిగుడ్లు 25, అటుకులు కిలో, రాగి పిండి రెండు కిలోలు, వేరుసెనగ చిక్కీ, ఎండు కర్జూరాలు, బెల్లం 250 గ్రాముల వంతున అందజేస్తున్నారు. ఇవన్నీ సమకూరితే కాబోయే అమ్మ ఒంట్లో రక్తహీనత అనే సమస్య ఉండదు. మరి ఇవన్నీ ఏమవుతున్నాయనే ప్రశ్న తలెత్తుతోంది. మరోవైపు ప్రభుత్వాసుపత్రుల్లో ఐరన్ మందు బిళ్లలు ఇస్తున్నా రక్తంలో తగినంత హిమోగ్లోబిన్ ఉండటం లేదు.

సమతుల ఆహారం తీసుకోవాలి

గర్భ నిర్ధారణ జరిగిన తర్వాత ప్రసవం వరకు నిత్యం సమతుల ఆహారం తీసుకోవాలి. తాజా కూరగాయాలు, ఆకుకూరలు, ఫలాలు తింటే మంచిది. మాంసాహారులైతే మాంసం, చేపలు, కోడిగుడ్లు తినాలి. పాలు తాగాలి. రక్తంలో హిమోగ్లోబిన్ 12 గ్రాములకు తగ్గకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. ప్రభుత్వాసుపత్రుల్లో ప్రతి నెలా 9న నిర్వహించే పీఎంఎస్ఎంఏ కార్యక్రమంలో వైద్య పరీక్షలు తప్పకుండా చేయించుకోవాలి. వైద్యులు ఇస్తున్న మందులను క్రమం తప్పకుండా వాడాలి. తగినంత వ్యాయామం చేయాలి.

- డాక్టర్ కె.నాగరాజు, డీఎంహెచ్‌వో, కడప

జిల్లాలో గర్భిణుల సమాచారం
(2025 ఏప్రిల్ - 2026 జనవరి వరకు)

నమోదైన గర్భిణుల సంఖ్య 36,116	టీనేజ్‌లో గర్భిణులు 720
హైరిస్క్ ఉన్న వారు: 9,074 మంది	7 గ్రాముల్లోపు హిమోగ్లోబిన్: 7,643

ఏసీబీ ఆన్ డ్యూటీ

కడప నేరవార్తలు, న్యూస్‌టుడే: అవినీతి నిరోధక శాఖ అవినీతి అధికారుల భరతం పడుతోంది. లంచం తీసుకుంటున్నారని కచ్చితమైన సమాచారం వస్తే చాలు దాడులు చేస్తోంది. 2025లో ఒక్క దాడీ లేదు. ఏడాది మొత్తం ఆ శాఖ స్తబ్ధుగా ఉండిపోయింది. అదే సమయంలో ప్రభుత్వ కార్యాలయాల్లో అవినీతి 'కట్టలు' తెచ్చుకుంది. ఇటీవల జిల్లాకు కొత్త ఏసీబీ డీఎస్పీ నియమితులయ్యారు. దీంతో కార్యకలాపాలు కాస్త ఊపందుకున్నాయి. ఒకటిన్నర నెలలో అయిదుగురు అవినీతి అధికారులను పట్టుకుని కేసులు నమోదు చేసింది.

దొరుకుతున్నారు లంచావతారులు

● విద్యుత్తు స్తంభాల ఏర్పాటుకు రూ. 15 వేలు లంచం తీసుకుంటూ అన్నమయ్య జిల్లా గాలివీడులో ఆ శాఖ అధికారులు దొరికిపోయారు. ● రైతుకు అవసరమైన పత్రం కోసం రైతు నుంచి నగదు తీసుకుంటూ ఒంటిమిట్ట మండలం చింతరాజుపల్లె గ్రామానికి చెందిన వీఆర్‌వో శ్రీనివాసులు ఏసీబీకి పట్టుబడ్డారు. ● అన్నమయ్య జిల్లా మదనపల్లెలో విద్యాశాఖ కార్యాలయంలో నిధుల మంజూరు కోసం రూ. 45 వేలు లంచం తీసుకుంటుండగా అన్నమయ్య జిల్లా మదనపల్లె విద్యాశాఖ ఏడీ రాజశేఖర్, సీనియర్ అసిస్టెంట్ మహబూబ్‌బాషాలను ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. ● సదరం పత్రాల కోసం రూ. 30 వేలు ముక్కు పిండి వసూలు చేస్తు కడప ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి సిబ్బంది సుబ్బయ్య, వెంకటేష్ దొరికిపోయారు. ● పులివెందుల ఆర్డీవో కార్యాలయంలో డీటీగా విధులు నిర్వహించే నాగేంద్ర కుమార్‌బాబు పాసు పుస్తకాలకు రూ. 10 వేల డబ్బులడిగి పట్టుబడ్డారు.

● **ఇవిగో ఫోన్ నంబర్లు:** జిల్లాలో అవినీతిని నిర్మూలించాలంటే ప్రజలు సహకరించాలని ఏసీబీ డీఎస్పీ సీతారామారావు సూచించారు. ప్రభుత్వ పనులు చేసేందుకు డబ్బులడిగితే టోల్‌ఫ్రీ నంబరు 1064, ఏసీబీ డీఎస్పీ 9440446191, ఏసీబీ సీఐ 9866213944కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయొచ్చన్నారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని తెలిపారు.

ఆర్టీసీ కండక్టర్లకు 942 పవర్ బ్యాంకులు

పవర్‌బ్యాంక్‌తో రీజినల్ కోర్ గ్రూప్ అధికారి

కడప చిన్నచౌకు, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం ఆర్టీసీ కండక్టర్లకు పవర్‌బ్యాంక్‌లు సరఫరా చేశారు. అందులో భాగంగా జిల్లాకు 942 ఇచ్చారు. వాటన్నింటిని బుధవారం జిల్లాలోని ఆరు డిపోలకు పంపించారు. కండక్టర్ల వద్ద ఉండే టిమ్స్ పరికరాలకు తరచూ ఛార్జింగ్ సమస్య తలెత్తుతుండటంతో టిక్కెట్లు జారీకి ఇబ్బందికరంగా ఉంటోంది. కొన్ని బస్సుల్లో ఎలాంటి ఛార్జింగ్ పాయింట్ల సదుపాయం లేదు. దీంతో వారం దరికీ పరికరాలు సరఫరా చేయాలని నిర్ణయించారు. జిల్లాకు వచ్చిన వాటిలో బద్వేలు డిపోనకు 129, జమ్మలమడుగు 127, కడప 158, మైదుకూరు 130, పులివెందుల 150, ప్రొద్దుటూరు డిపోనకు 248 పవర్‌బ్యాంక్‌లు ఇచ్చారు. ఒక్కో పరికరానికి రూ. 3,499 చొప్పున ఖర్చు చేశారు.

గంగమ్మ జాతరకు ప్రత్యేక బస్సులు

కడప చిన్నచౌకు, న్యూస్‌టుడే: అన్నమయ్య జిల్లా లక్కిరెడ్డిపల్లె మండలం అనంతపురంలో జరిగే గంగమ్మ జాతరకు 18, 19 తేదీల్లో 70 ప్రత్యేక బస్సు సర్వీసులను ఏర్పాటు చేసినట్లు ఆర్టీసీ ఆర్ఎం గోపాల్‌రెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కడప డిపో నుంచి 40 బస్సులు.. పులివెందుల నుంచి 30 బస్సులు రాకపోకలు సాగిస్తాయన్నారు. రెండు రోజుల పాటు తిరిగే ఈ బస్సుల్లో స్త్రీశక్తి పథకం సైతం వర్తిస్తుందని వివరించారు.

వేపకు విపత్కాలం.. ఏమిటి దోమ!

జిల్లాలో ఎక్కడ చూసినా ఇప్పుడు వాడుముఖం పట్టిన వేపచెట్లే కనిపిస్తున్నాయి. టి మస్కిటో బగ్ వీటిని ఆశించి రసం పీల్చేస్తుండటంతో నిలువునా ఎండిపోతున్నాయి. వీటిని కొందరు నరికేస్తున్నారు. అయితే దోమ ఆశించిన చెట్లకు ఇమిడిక్లోఫిడ్ మందు 0.4 మి.లీ. ను లీటరు నీటిలో కలిపి పిచికారీ చేస్తే చెట్టు తిరిగి చిగురుస్తుందని ఊటుకూరు వ్యవసాయ శాస్త్రవేత సునీల్ కుమార్ తెలిపారు. అందుకు నిదర్శనమే చిత్రాల్లో కనిపిస్తున్న చెట్లు. చెన్నూరు సమీపంలో సగం చెట్టు ఎండిపోగా.. మిగతా సగం పచ్చగా కనిపించింది. ప్రొద్దుటూరులో పూర్తిగా వాడిన చెట్టుకు మందు పిచికారీ చేసి నీళ్లు పెట్టడంతో తిరిగి చిగురించింది.

- ఈనాడు, కడప

భూముల మ్యుటేషన్లపై డేగ కన్ను

360 డిగ్రీల ఆడిటింగ్ మొదలు

ఈనాడు, కడప: భూముల చుట్టూ వివాదాలు ముసురుకుంటున్నాయి. అవికాస్తా శాంతిభద్రతలకు గొడ్డలిపెట్టుగా మారుతున్నాయి. భూ యాజమాన్య మార్పుల్లో అక్రమాలు, నకిలీ పత్రాలతో కాజేసిన వైనాలు వెలుగులోకి వస్తున్నాయి. దీంతో రికార్డులను పారదర్శకంగా ఉంచడం, ప్రభుత్వ భూములను పరిరక్షించడం లక్ష్యంగా జిల్లా వ్యాప్తంగా మ్యుటేషన్లపై రెవెన్యూ శాఖ ప్రత్యేక ఆడిట్ చేపట్టనుంది. దరఖాస్తు సమర్పణ దగ్గర నుంచి సమస్య పరిష్కారమయ్యే వరకు ఈ ఆడిటింగ్ వ్యవస్థ పని చేయనుంది.

స్వీకరణ.. తిరస్కరణపై నిఘా

మ్యుటేషన్ సమస్యల పరిష్కారానికి కలెక్టర్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ప్రతి నెలా 1,500 నుంచి 2 వేల వరకు అవుతున్నాయి. వీటిలో పారదర్శకతకు కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ చేపట్టారు. యంత్రాంగానికి శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించడంతో పాటు ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌ను అందుబాటులోకి తేనున్నారు. దరఖాస్తు స్వీకరించడం, తిరస్కరించడంపై ప్రత్యేక బృందం నిఘా ఉంటుంది. ప్రతి దరఖాస్తును 360 డిగ్రీల ఆడిటింగ్ చేస్తుంది.

మారిస్తే క్రిమినల్ కేసులు

కొన్ని చోట్ల సరైన నోటీసులు ఇవ్వకుండా మ్యుటేషన్లు నమోదు చేయడం, వారసత్వ ధ్రువీకరణలో లోపాలు, సర్వే నంబర్లలో పొరబాట్లు వంటి అంశాలు వెలుగుచూశాయి. ప్రభుత్వ భూములను వ్యక్తిగత పేర్లకు మార్చిన కేసులు కూడా ఉన్నాయి. ఈ నేపథ్యంలో అక్రమ మ్యుటేషన్లు నిర్ధారణైతే వాటిని రద్దు చేసి సంబంధిత అధికారులపై క్రమశిక్షణా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరిస్తున్నారు. అవసరమైతే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామంటున్నారు. ఆడిట్ ద్వారా తిరిగి ప్రభుత్వ ఖాతాలోకి భూములను తీసుకొస్తామని, భూ రికార్డుల శుద్ధితో భవిష్యత్తులో వివాదాలు తగ్గుతాయని తెలిపారు.

(c) eenadu

స్టార్టప్ కడప స్ఫూర్తిదాయకం

జిల్లా సచివాలయం, న్యూస్‌టుడే : స్టార్టప్ కడప లక్ష్యం యువతకు స్ఫూర్తిదాయకమని కలెక్టర్ శ్రీధర్ స్పష్టం చేశారు. మంగళవారం రాత్రి కడప కలెక్టరేట్‌లో పీ4 విధానంలో జరిగే అంశాలపై విద్యావేత్తలైన పీ4 భాగస్వాములతో కలిసి ఆయన సమీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. అధునాతన సదుపాయాలతో అన్ని రకాల మౌలిక వసతులతో రూపుదిద్దుకోనున్న స్టార్టప్ కడప కేంద్రానికి దాతలు పునాదులు వేస్తూ వ్యాపార అవకాశాల కేంద్రంగా తీర్చిదిద్దే దిశగా కీలక పాత్ర పోషించనున్నారన్నారు. దేశ విదేశాల్లో స్థిరపడిన జిల్లా వాసుల సహకారంతో వారిని అనుసంధానం చేసుకుని స్టార్టప్ కడప హబ్‌ను ముందుకు తీసుకెళ్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో డీఆర్వో విశ్వేశ్వరనాయుడు, వైవీయూ వీసీ రాజశేఖర్, కేఎస్ఆర్ఎం విద్యాసంస్థల ఛైర్మన్ చంద్ర ఓబుల్‌రెడ్డి, ఆర్జీయూకేటీ డైరెక్టర్ గోపాలరాజు, కేఎంసీ ఛైర్మన్ మనోజ్‌రెడ్డి, డీఆర్‌డీఏ పీడీ రాజ్యలక్ష్మి, పరిశ్రమల శాఖ జీఎం చాంద్‌బాషా, గృహనిర్మాణశాఖ పీడీ రాజారత్నం తదితరులు పాల్గొన్నారు.



పీ4 దాతలతో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్

చురుగ్గా వసతి గృహ నిర్మాణాలు

● ప్రొద్దుటూరు, కలసపాడు భవనాలకు రూ.6 కోట్ల కేటాయింపు

ప్రొద్దుటూరు, న్యూస్‌టుడే : సాంఘిక సంక్షేమ వసతి గృహాలకు సొంత భవనాల సమస్య వెంటాడుతోంది. కొన్ని చోట్ల ఎప్పుడో నిర్మించిన పాత భవనాలు శిథిలావస్థకు చేరాయి. పైకప్పు పెచ్చులూడి పడుతున్నాయి. వర్షానికి ఉరుస్తున్నాయి. ఈ సమస్యను అధిగమించేందుకు సొంత భవనాల నిర్మాణానికి కూటమి సర్కారు చర్యలు చేపట్టింది. ప్రధాన మంత్రి అనుసుచిత్ జాతి అభ్యుదయ్ యోజన (పీఎం అజయ్) నిధులు రూ.18 కోట్లు కేటాయించింది. వైఎస్సార్ కడప జిల్లాలో ప్రొద్దుటూరు, కలసపాడు, శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లాలో మనుబోలు, తిరుపతి జిల్లాలో చంద్రగిరి, చిత్తూరు జిల్లాలో పలమనేరు, గుడియాతంల్లో కలిపి మొత్తం ఆరు భవనాలు నిర్మించనున్నారు. వంది మంది విద్యార్థులు వసతి పొందేందుకు ఒక్కొక్క భవనానికి రూ.3 కోట్లు ఖర్చు చేసి ప్రొద్దుటూరు సంజీవనగర్, కలసపాడులో జీ+1 తరహాలో భవన నిర్మాణాలు చేపట్టారు. సెప్టెంబర్ 2025 నుంచి జూన్ 2026లోపు భవనాలు పూర్తి చేయాలని గడువు ఉంది. అయితే క్షేత్రస్థాయిలో ప్రొద్దుటూరులో పాడుబడిన ఎస్సీ బాలికల వసతి భవనాన్ని కూల్చివేశారు. ఆ స్థలంలో కొత్త భవనాన్ని చేపట్టారు. ప్రస్తుతం గ్రౌండ్ ఫ్లోర్ స్లాబ్ పూర్తయి పై అంతస్తుకు పిల్లర్ల పనులు సాగుతున్నాయి. ఇదే మాదిరి కలసపాడు నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. నిర్దిష్ట గడువులోపు భవనాలను పూర్తి చేసి వసతి గృహాలకు అందుబాటులోకి తేవాలని విద్యార్థులు కోరుతున్నారు.

ప్రొద్దుటూరులో ఎస్సీ బాలికల వసతి గృహానికి నూతన భవనం నిర్మాణమిలా

అదనపు సమయం అవసరం

ఈ విషయమై ఏపీఈడబ్ల్యూఐడీసీ ఏఈ ఆజాం 'న్యూస్‌టుడే'తో మాట్లాడుతూ త్వరగా పనులు పూర్తి చేసేందుకు ఇప్పుడిచ్చిన గడువు సరిపోదని, అదనంగా మరో రెండు నెలలు అవసరమవుతోందన్నారు.

మాత్ర మింగిద్దాం.. నులి పురుగులను నివారిద్దాం

కడప విద్య, సుండుపల్లి, న్యూస్‌టుడే: ఆరోగ్యకరమైన ఆహార అలవాట్లతో నులి పురుగుల సంక్రమణను నివారించవచ్చని రాష్ట్ర పరిశీలకుడు వాసుబాబు, జిల్లా వైద్యాధికారి నాగరాజు, ఆర్‌బీఎస్‌కె పీవో అరిఫుల్లా అన్నారు. సుండుపల్లిలో జాతీయ నులి పురుగుల నిర్మూలన దినోత్సవం నిర్వహించారు. విద్యార్థులకు మాత్రలు పంపిణీ చేశారు. కడప కోటిరెడ్డి ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో విద్యార్థినులకు అల్బెండజోల్ మాత్రలు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా హెల్త్ ఎడ్యుకేటర్ ఓబులేసు పాల్గొని మాట్లాడుతూ.. ఇంట్లో తయారు చేసిన ఆహారాన్ని మాత్రమే తినాలన్నారు. ప్రిన్సిపల్ సలీం బాషా, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

సుండుపల్లి: కేజీబీవీ పాఠశాలలో విద్యార్థినికు మాత్ర వేస్తున్న రాష్ట్ర పరిశీలకుడు అలెగ్జాండర్, జిల్లా వైద్యాధికారి నాగరాజు

పీఎంశ్రీ పథకానికి 50 పాఠశాలలు

ఎర్రగుంట్ల, న్యూస్‌టుడే: పీఎంశ్రీ పథకానికి ఎంపికైన పాఠశాలలు వేగంగా అభివృద్ధి చెందుతాయని జిల్లా విద్యాశాఖాధికారి షంషుద్దీన్ అన్నారు. పట్టణంలో పీఎంశ్రీ పథకానికి ఎంపికైన జిల్లా పరిషత్తు బాలుర ఉన్నత పాఠశాలను మంగళవారం ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో 50 పాఠశాలలు పీఎంశ్రీ పథకానికి ఎంపికైనట్లు వివరించారు. నో బ్యాగ్ డేతో విద్యార్థుల్లోని నైపుణ్యాలు వెలికితీసేందుకు ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మానిటరింగ్ ఆఫీసర్ విజయభాస్కర్, ఎంఈవో శివప్రసాద్, ప్రధానోపాధ్యాయులు భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు సూచనలిస్తున్న జిల్లా విద్యాశాఖాధికారి షంషుద్దీన్

జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో విద్యార్థుల సత్తా

శ్రావణిసాయి

యశస్ చంద్రారెడ్డి

ముక్కర సాకేత్

భరత్‌కుమార్‌రెడ్డి

చక్రాయపేట (వేంపల్లె), సిద్దవటం, కడప విద్య, న్యూస్‌టుడే: జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో పలు ప్రైవేట్ యాజమాన్యాలకు చెందిన విద్యార్థులు సత్తా చాటారు. వేంపల్లెలోని శ్రీచైతన్య పాఠశాల పూర్వ విద్యార్థి శ్రావణిసాయి 99.89 పర్సెంటైల్, ఉషాకిరణ్‌కు స్కూల్‌కు చెందిన యశస్ చంద్రారెడ్డి 99.66 ర్యాంకులు సాధించారు. వారిని కరస్పాండెంట్‌లు చక్రపాణిరెడ్డి, రమణారెడ్డిలు అభినందించారు. సిద్దవటం మండలం వంతాటిపల్లెకు చెందిన ముక్కర సాకేత్ 99.99 పర్సెంటైల్ సాధించాడని అతని తల్లిదండ్రులు ముక్కర వెంకటసుబ్బారెడ్డి, నిర్మలాదేవిలు తెలిపారు. వేంపల్లెకు చెందిన భరత్‌కుమార్‌రెడ్డి 99.62 పర్సెంటైల్ సాధించినట్లు అతని తండ్రి వెంకట కొండారెడ్డి తెలిపారు.

నాణ్యత మరిచారు.. పింఛన్‌లో కోతేశారు

ఈనాడు, కడప: జిల్లాలో ఇద్దరు విశ్రాంత ఇంజినీరింగ్ అధికారులపై రాష్ట్ర ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంది. ఈ మేరకు మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. నరేగాతో పాటు 14వ ఆర్థిక సంఘం నిధులతో చేపట్టిన సిమెంట్ రహదారుల నిర్మాణంలో అక్రమాలకు పాల్పడినట్లు విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ నిగ్గు తేల్చింది. ప్రొద్దుటూరు మండలంలో సిమెంట్ రహదారులతో పాటు మురుగు నీటి కాలువల నిర్మాణంలో నియమావళిని ఉల్లంఘించినట్లు నివేదికలో పేర్కొంది. ఈ అక్రమంలో విశ్రాంత డిప్యూటీ ఇంజినీర్ ఎస్ హైదర్ పెన్షన్‌లో ఏడాది పాటు 10 శాతం కోత విధిస్తూ ఉత్తర్వుల్లో పేర్కొంది. అదేవిధంగా కమలాపురం ఎస్సీ కాలనీలో జరిగిన అక్రమాలకు సంబంధించి విశ్రాంత డీఈ పి. నాగేశ్వరరావుపైనా వేటేసింది. ఏడాది పాటు 5 శాతం పెన్షన్‌లో కోత విధిస్తూ ఆదేశించింది.

రాష్ట్ర స్థాయి చదరంగం పోటీలకు ఎంపిక

కడప క్రీడలు, న్యూస్‌టుడే: రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ (శాప్) లీగ్ జిల్లా స్థాయి చదరంగం ఎంపికలకు జిల్లా నలుమూలల నుంచి 92 మంది హాజరయ్యారు. డీఎస్‌డీవో షేక్ గౌసబాషా పర్యవేక్షణలో టోర్నమెంట్ డైరెక్టర్ అనీష్ దర్బారీ ఎంపికలు చేపట్టారు. ముఖ్య అతిథులుగా ఏపీ పీఈటీఎస్-ఎస్ఏ పీఈ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రవీణ్‌కిరణ్, ఎస్‌జీఎఫ్ సెక్రటరీ శ్రీకాంత్‌రెడ్డిలు హాజరై టోర్నమెంట్‌ను ప్రారంభించారు. డీఎస్‌డీవో షేక్ గౌసబాషా మాట్లాడుతూ... జిల్లా స్థాయిలో ప్రతిభ కనబరచిన వారు ఈ నెల 21, 22 తేదీల్లో తిరుపతిలోని శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో చేపట్టే రాష్ట్ర స్థాయి చదరంగం పోటీల్లో పాల్గొంటారన్నారు. అనంతరం రాష్ట్రస్థాయి చెస్ పోటీలకు పలువురిని ఎంపిక చేశారు. ఎంపికైన వారిలో కటారి వినోద్, స్వరూప్, అనురాగ్ ప్రీతమ్, అభిశయ్ ప్రీతమ్, గంగానాగేంద్ర, నిఖిల్‌సాయి, మేదా సుబ్బు, శాన్విప్రియ, ధన్విత, కటారి సజ్యోత్స్న, సంజన, నీలాపురం పర్ణియా అమీర్‌లు ఉన్నారు.

చదరంగం ఎంపికల్లో పోటీ పడుతున్న చిన్నారులు

నిత్యపూజ కోన ఆలయ హుండీ ఆదాయం లెక్కింపు

సిద్దవటం, న్యూస్‌టుడే : జిల్లాలో ప్రముఖ శైవ క్షేత్రమైన సిద్దవటం మండలం వంతాటిపల్లె శివారు లంకమలలో ఉన్న శ్రీ నిత్యపూజాస్వామికి భక్తుల కానుకల ద్వారా రూ.22.69 లక్షల ఆదాయం వచ్చినట్లు ఆలయ ఛైర్మన్ రాజేంద్రప్రసాద్, ఇన్‌ఛార్జి ఈవో శ్రీధర్ మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. దేవాదాయశాఖ పరిధిలో ఉన్న ఆలయంలో ఈనెల 14వ తేదీ నుంచి 16 వరకు జరిగిన శివరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఈ ఆదాయం వచ్చినట్లు చెప్పారు. తలనీలాల పోగు వేలం ద్వారా రూ.7.10 లక్షలు, టికెట్ల ఆదాయం రూ.29,400, కల్యాణ చదివింపుల రూ.9,120, కల్యాణ లడ్డూ రూ.25,116, హుండీల ఆదాయం రూ.14.96 లక్షలు, ఇతర రూ.6,043 వేలు కలిపి మొత్తం రూ.22.69 లక్షలు సమకూరినట్లు పేర్కొన్నారు. బంగారం 7.92 గ్రాములు, వెండి 775 గ్రాములు వచ్చినట్లు తెలిపారు.

నేడు పారిశ్రామిక వినియోగదారుల పరిష్కార వేదిక

తిరుపతి (జీవకోన), న్యూస్‌టుడే: ఏపీఎస్పీడీసీఎల్ సర్కిల్ పరిధిలోని తిరుపతి, చిత్తూరు, నెల్లూరు, కడప, కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీసత్యసాయి, అన్నమయ్య జిల్లాల్లోని పారిశ్రామిక విద్యుత్తు వినియోగదారుల సమస్యల సత్వర పరిష్కారం కోసం బుధవారం పరిష్కార వేదిక నిర్వహిస్తున్నట్టు సంస్థ సీఎండీ శివశంకర్ లోతేటి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. తిరుపతిలోని సంస్థ కార్పొరేట్ కార్యాలయంలో ఉదయం 10.30 నుంచి 11.30 గంటల వరకు ఉంటుందని తెలిపారు. ఎస్ఈల పరిధిలో పరిష్కారం కానీ సమస్యలను నేరుగా తమ దృష్టికి తీసుకురావొచ్చునని చెప్పారు.

భారత్ విస్తార్ యాప్‌తో రైతు శ్రేయస్సు

చింతకొమ్మదిన్నె, న్యూస్‌టుడే : భారత్ విస్తార్ మొబైల్ యాప్ రైతు శ్రేయస్సు కోసమేనని కృషి విజ్ఞాన కేంద్రం సమన్వయకర్త అంకయ్యకుమార్ అన్నారు. మంగళవారం కృషి విజ్ఞాన కేంద్రంలో భారత్ విస్తార్ జాతీయ స్థాయి ప్రారంభోత్సవ ప్రత్యక్ష వీక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కేవీకే సమన్వయకర్త మాట్లాడుతూ రాజస్థాన్‌లోని జయపూర్‌లో కేంద్ర వ్యవసాయశాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. రైతులకు ప్రత్యక్ష వీక్షణ ద్వారా కార్యక్రమాన్ని ప్రదర్శించారు. కృత్రిమ మేధస్సు ఆధారిత సమగ్ర డిజిటల్ వ్యవస్థ ద్వారా పనిచేసే భారత్ విస్తార్ అనే మొబైల్ యాప్ వెబ్‌పోర్టర్‌ను రైతుల కోసం ప్రారంభించినట్లు అంకయ్యకుమార్ పేర్కొన్నారు.

రామయ్య బ్రహ్మోత్సవాలకు రూ.21.50 లక్షలు

ఒంటిమిట్ట, న్యూస్‌టుడే: ఒంటిమిట్ట కోదండ రామాలయంలో వచ్చే నెల (మార్చి) 26 నుంచి ఏప్రిల్ 5 వరకు శ్రీరామనవమి వార్షిక బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా తితిదే పాలన అధికారుల పర్యవేక్షణలో చేపట్టనున్న పనులకు రూ.21.50 లక్షలు ఖర్చు చేయడానికి తితిదే ఉన్నతాధికారులు అనుమతిచ్చారు. వీటిని వేదపండితులు, రుత్వికులు, అర్చకులు, సహాయకుల సంభావన, పూజా కైంకర్యాలు, స్వామి వారి పల్లకీ ఊరేగింపునకు, ఇనాం సేవకులకు అధికారులు, సిబ్బంది విడిది తదితర వాటికి ఖర్చు చేయనున్నారు.

హత్య కేసులో ఒకరికి జైలు శిక్ష

నిందితుడు సూరిబాబుతో పోలీసులు

ప్రొద్దుటూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: అత్తను హత్య చేసిన ఘటనలో ప్రొద్దుటూరు మండలం నక్కలదిన్నెకు చెందిన కమతం సూరిబాబుకు యావజ్జీవ కారాగార శిక్ష, రూ.10 వేలు జరిమానా విధిస్తూ ప్రొద్దుటూరు రెండో అదనపు జిల్లా న్యాయమూర్తి కె.సత్యకుమారి తీర్పు వెల్లడించారు. ప్రొద్దుటూరు పట్టణం వివేకానంద నగర్‌కు చెందిన జక్కం గ్రేసమ్మ(50) తన భర్తతో మనస్పర్థలు రావడంతో ఆమె శంకరాపురంలోని పెద్ద కుమార్తె వద్ద ఉంటూ కూలీ పనులకు వెళ్లేవారు. వచ్చిన డబ్బును సైతం పెద్ద కుమార్తెకే ఇచ్చేవారు. అది గమనించిన రెండో కుమార్తె భర్త సూరిబాబు తనకు కూడా డబ్బులు ఇవ్వాలని అత్తతో గొడవ పడుతుండేవారు. ఈ క్రమంలో 2021 మార్చి 2న గ్రేసమ్మ నక్కలదిన్నెలోని రెండో కుమార్తె వద్దకు వెళ్లారు. కొంత కాలం తరువాత శంకరాపురం వెళ్లేందుకు సిద్ధం అయిన ఆమెను ద్విచక్రవాహనంపై తీసుకెళ్తానని చెప్పి మార్గం మధ్యలో హత్య చేశారు. ఈ ఘటనపై గ్రామీణ ఠాణా పోలీసులు అప్పట్లో కేసు నమోదు చేశారు. నేరం రుజువు కావడంతో సూరిబాబుకు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు.

మిడ్నాపూర్ కడప ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో
EP No. 283/2019 in DRK No. 114/2019
మార్గదర్శి చిట్‌ఫండ్ (ప్రైవేట్ లిమిటెడ్), ప్రొద్దుటూరు. ...పిటిషనరు / DHr
Vs
బి చంద్ర మోహన్‌రెడ్డి మరియు ఇద్దరు ...రెస్పాండెంట్స్ / JDR's
రెస్పాండెంట్ నెం.5 కకు U/O 21R64 నోటీసు

JDr No.5 ... D.No.1/167, ... E.P. ... 27.02.2026 ... JDr No.5 ... E.P.ని ...

SCHEDULE

R.C.C. Mahadi Midde house and vacant site bearing Door No.11/62-5-1C (New Municipal Corporation Ward No.54) situated in Kagithalapenta, Chemmumiapeta Village Majara, Chemmumiapeta Village, Kadapa Municipal Corporation Area, Kadapa Rural Sub-District, Kadapa District in sarkar punji D.No.516 of Ac.3.41 cents pyki Ac.3.00 cents pyki Ac. 0.03 cents 800 Square links or 0.015 Hectors bearing plot No.8 within this site the above door number house, Mahadi Midde constructed in an extent of Ac.0.02 cents 438 Square links and the same is bounded by:
East : House bearing New Door No.54/84-2-1 sold by Patan Mahammad Ali Khan to Others, West : Road, North: Sandu and house bearing D.No.11/84, New Municipal Corporation Door No.54/84-1-1, South : New Municipal Corporation D.No.54/62-5-1-2 sold by Beebe Jan and Patan Ali Khan to Others. Within these Boundaries: East - West : 37.5 feet or 11.43 meters, North - South: 28.5 feet or 8.69 meters i.e.,118 sq yards or Ac. 0.02 cents and 438 Sq. Links within these site the measurements of R.C.C. house are East - West : 35.6 feet or 10.85 meters, North - South: 23.4 feet or 7.13 meters ground floor of an extent of 833.04 Sq. feet and the measurements of the first floor R.C.C. Midde is East - West : 35.6 feet or 10.85 meters, North - South: 23.4 feet or 7.13 meters i.e., 833.04 Sq.feet. Including roof, doors, electric fittings, H.S.C. No.82408, 102168, electric meters, tap connection, tap deposit and current motor and with all easementary rights.
(కోర్టు వారి ఉత్తర్వు మేరకు)
వాయిదా: 27-02-2026 G.Sreenivasulu Naidu Advocate, Kadapa.

ఈఆర్పీ లాగిన్‌పై సీఈఓల ఫిర్యాదు

కడప గ్రామీణ, న్యూస్‌టుడే : ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల ఉద్యోగులు తమ ఈఆర్పీ లాగిన్ కావడంపై ఫిర్యాదు చేశారు. మంగళవారం వైఎస్ఆర్ కడప జిల్లా కేంద్రంలో ఉన్న డీపీడీఎం ప్రసాద్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ నెల 16 నుంచి సంఘాల ఉద్యోగులందరూ సమ్మెలో ఉన్నారని, అలాంటి సమయంలో ఈఆర్పీలు లాగిన్ అయ్యాయని, వాటిని ఎవరు లాగిన్ చేశారో చెప్పాలని కోరారు. తాము విధుల్లో ఉంటేనే వాటిని లాగిన్ చేస్తామని, లేకుండానే చేశారంటే అందులో పలు సందేహాలు వ్యక్తమవుతున్నాయని వారు పేర్కొన్నారు. ఉమ్మడి జిల్లా (వైఎస్ఆర్ కడప, అన్నమయ్య, తిరుపతి) డీసీసీబీ పరిధిలో ఉన్న సంఘాల ఉద్యోగులందరూ సమ్మెలో ఉన్నారని ఏపీ రాష్ట్ర ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు రెడ్డిబాబు పేర్కొన్నారు. కోట్లాది రూపాయల లావాదేవీలకు సంబంధించిన అంశమని, ఉద్యోగులుగా తాము లేకున్నా 75 సంఘాల్లో సుమారు 30 సంఘాలకు సంబంధించి ఈఆర్పీ లాగిన్ అయ్యాయన్నారు. ఎవరు చేశారో తెలుసుకోవాలని కోరారు. సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు.



డీపీడీఎం ప్రసాద్‌కు వినతి పత్రం అందజేస్తున్న ఉమ్మడి జిల్లా సహకార సంఘాల కార్యదర్శులు

పారిశుద్ధ్య కార్మికుల తొలగింపు దుర్మార్గం

సర్వజన ఆసుపత్రి, న్యూస్‌టుడే : ఉన్నఫలంగా తమను విధుల నుంచి తొలగించడం అన్యాయమని రిమ్స్ పారిశుద్ధ్య కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. రిమ్స్ ఐపీ, ఓపీ, అత్యవసర విభాగాల్లో గత మూడు రోజులుగా వారు విధులు బహిష్కరించి నిరసన తెలుపుతున్నారు. మంగళవారం రిమ్స్ పరిపాలన విభాగం వద్ద ధర్నా చేశారు. రిమ్స్ ప్రారంభమైనప్పటి నుంచి విధులు నిర్వహిస్తున్న తమను నూతన కాంట్రాక్ట్ సంస్థ కొత్త నిబంధనల పేరుతో తొలగిస్తుండటం అన్యాయమని వారు పేర్కొన్నారు. ఆ నిర్ణయంతో తమ కుటుంబాలు రోడ్డున పడతాయని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా అధికారులు తమకు న్యాయం చేయాలని కోరారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి మనోహర్, నాయకులు రిమ్స్ అధికారులతో మాట్లాడారు. కార్యక్రమంలో రిమ్స్ పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.

నిరసన వ్యక్తం చేస్తున్న రిమ్స్ పారిశుద్ధ్య కార్మికులు

నేటి నుంచి గంగమ్మ జాతర

గంగమ్మ దేవత

చింతకొమ్మదిన్నె, న్యూస్‌టుడే: మండల పరిధిలోని బుగ్గలేటిపల్లె సమీపంలోని గంగమ్మ ఆలయంలో బుధ, గురువారాల్లో గంగ జాతర వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో కృష్ణనాయక్ తెలిపారు. మహాశివరాత్రి అనంతరం రెండు రోజుల తరువాత ఏటా గంగమ్మ జాతర నిర్వహించడం ఆనవాయితీ. ఈ సందర్భంగా జిల్లా నలుమూలల నుంచి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ ఛైర్మన్ మాధవరెడ్డి తెలిపారు.

శనగ రైతులను ఆదుకోండి : ఎంపీ

మాట్లాడుతున్న ఎంపీ అవినాష్‌రెడ్డి

జిల్లా సచివాలయం, న్యూస్‌టుడే : ప్రకృతి పుణ్యమా అని జిల్లాలో శనగపంట బాగా వచ్చిందని అయితే ధర లేకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని కడప ఎంపీ అవినాష్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం కడపలో కలెక్టర్ శ్రీధర్‌ను కలిసి శనగరైతులు పడుతున్న ఇబ్బందులను ఆయనకు వివరించారు. అనంతరం ఎంపీ విలేకరులతో మాట్లాడారు. మార్కెట్ ధర కంటే రైతులు క్వింటాకు రూ.1,200కు తక్కువగా విక్రయిస్తున్నారన్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి క్వింటా రూ.5,575కు కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలన్నారు. రాయలసీమ ఎత్తిపోతల పథకం ప్రతి రైతు సెంటుమెంట్ అని దాన్ని ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఎంపీ అన్నారు. కృష్ణా జలాలను తెలంగాణ ప్రభుత్వం ఎడమ కాలువ నుంచి రోజుకు 8 నుంచి 10 టీఎంసీల నీరు తీసుకెళ్తుంటే చూస్తూ ఉన్నామన్నారు. రాయలసీమ ఎత్తిపోతల పథకం నిర్మించుకుంటే 800 అడుగుల్లోనే రోజుకు 2 టీఎంసీలను మనం వాడుకునే అవకాశం ఉటుందన్నారు. ఈ పథకాన్ని విస్మరిస్తే రైతుల సమస్యలు మరచినట్లు అవుతుందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రభుత్వం తీసుకొచ్చిన బడ్జెట్ కేవలం అంకెలగారెడిగానే ఉందన్నారు.

ఉరేసుకుని యువకుడి బలవన్మరణం

నిఖిల్ (పాత చిత్రం)

చింతకొమ్మదిన్నె, న్యూస్‌టుడే: మండలంలోని ఇందిరానగర్‌లో నిఖిల్ (28) అనే యువకుడు మంగళవారం ఉరివేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు. గతేడాది అతని తల్లి అనారోగ్యంతో మృతి చెందగా తండ్రి రామకృష్ణతో కలిసి ఉంటున్నాడు. ఆటో డ్రైవర్‌గా పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో కొన్ని రోజులుగా ముభావంగా ఉంటున్నాడు. ప్రేమ వ్యవహారమై మనస్తాపానికి గురై ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఆత్మహత్య చేసుకున్నాడు. అతని తండ్రి ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చిన్నకొమెర్లలో నగదు, ఆభరణాల అపహరణ

మైలవరం, న్యూస్‌టుడే: మైలవరం మండలం చిన్నకొమెర్లలోని జయరామకృష్ణారెడ్డి ఇంట్లో దొంగతనం జరిగింది. గుర్తు తెలియని వ్యక్తులు ఇంటి కటాంజనాన్ని గ్యాస్ కట్టర్‌తో కోసి లోపలికి ప్రవేశించారు. ఇంట్లోని బీరువాలో ఉన్న రూ.6 లక్షల నగదు, 45 తులాల బంగారం, 1 కేజీ వెండి ఆభరణాలు దోచుకెళ్లారు. బాధిత కుటుంబం సోమవారం రాత్రి మిద్దెపై నిద్రించడంతో దాన్ని ఆసరాగా తీసుకున్న దుండగులు ఇంట్లోకి చొరబడి చోరీకి పాల్పడ్డారని బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. జమ్మలమడుగు డీఎస్పీ వెంకటేశ్వరావు, జమ్మలమడుగు రూరల్ సీఐ భాస్కర్‌రెడ్డి, ఎస్సై లక్ష్మీనారాయణలు చోరీ జరిగిన ప్రాంతాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు.

బంగారు గొలుసు లాక్కెళ్లిన దుండగులు

బి.కోడూరు, న్యూస్‌టుడే: ద్విచక్రవాహనంపై వెళ్తున్న మహిళ మెడలో నుంచి బంగారు గొలుసును దుండగుడు లాక్కెళ్లిన ఘటన బి.కోడూరు మండల పరిధిలో మంగళవారం చోటుచేసుకుంది. ఎస్సై సూర్యనారాయణరెడ్డి వివరాల మేరకు రామచంద్రపురానికి చెందిన జయలక్ష్మి, నరసింహులు దంపతులు వైద్యం నిమిత్తం పోరుమామిళ్లకు ద్విచక్ర వాహనంలో వెళ్లి తిరిగి వస్తున్నారు. ఈ క్రమంలో గుర్తు తెలియని వ్యక్తులు వారిని వెంబడించి విజయనగర్ కాలనీ కొత్త రోడ్డు వద్ద ఆమె మెడలోని గొలుసును లాక్కొని పారిపోయారు. బాధితులు స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

EENADU Classifieds

BUSINESS SERVICES

త్రినేత్ర హోంకేర్‌లో వృద్ధులను/ పేషెంట్స్‌ను/పిల్లలను చూసుకొనుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. శ్రీ వసతి, భోజనం. జీ: 18K. ✆ 8520980099, 8520874499

BUSINESS OFFER

బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్, ఫైనాన్స్‌లో తాకట్టులో ఉన్నవి మా డబ్బుతో విడిపించి కొనబడును. (అధీకృత పోలీస్ డిపార్ట్‌మెంట్) గోల్డెన్ ట్రేడింగ్ కం. ✆ 7382114647.

మార్కెటింగ్ స్టాఫ్ కావలెను. శ్రీ విజయ రాఘవేంద్ర ఎంటర్ ప్రైజెస్ (Microtech Solar Distributor) కడప మరియు ప్రొద్దుటూరు. సెల్: 90327 22205, 91211 96955.

JOBS

Wanted Teachers for Reputed Schools in A.P & Telangana, Contact: Sneha Placements Service. Ph: 94402 46409.

హరేకృష్ణ హోంకేర్‌లో వృద్ధులను/ పేషెంట్స్‌ను/ పిల్లలను చూసుకొనుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ప్రీవసతి, భోజనం జీ: 18-20K ✆ 96404 68899, 96402 58899

ప్రముఖ కంపెనీ నందు పని చేయుటకు సేల్స్ ప్రమోటర్స్ కావలెను. బైక్, 5G మొబైల్ ఫోన్ ఉండవలెను. క్వాలిఫికేషన్: డిగ్రీ. ✆ 9030919155, 7674929147.

ఈనాడు క్లాసిఫైడ్స్ 5 లైన్ల ప్రకటన రూ॥ 330/- మాత్రమే Contact: KDP: 9989997626 8008514248 PDTR: 8008597620 ప్రకటనలపై జి.ఎస్.టి. 5% అదనం

గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారుల సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలు చేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే హక్కు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

కెనరా బ్యాంక్ Canara Bank
కడప 7 రోడ్స్ బ్రాంచ్ (13190)
సిండికేట్ బ్యాంక్ బిల్డింగ్ 7రోడ్స్, పిబి నెం 47, కడప, వైయస్ఆర్ జిల్లా, ఆంధ్రప్రదేశ్-516001

స్థిరాస్తులు అమ్మకానికి వేలం అమ్మకం ప్రకటన

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్సు, 2002 లోని 8(6) & 9 నిబంధనలతో చదవబడు సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్టు, 2002 క్రింద స్థిరాస్తుల అమ్మకానికి ఇ-వేలం ప్రకటన.

సెక్యూర్డ్ క్రెడిటార్ అయిన కెనరా బ్యాంక్, కడప 7 రోడ్స్ బ్రాంచ్ వారికి ఋణగ్రహీతలు: శ్రీమతి రాధిక బండారు, భర్త: యుగౌరి శంకర్, శ్రీమతి మద్దూ ఎర్రమ దేవి, భర్త: బండారు కాండవ కృష్ణ మరియు హామీదారు: శ్రీ బండారు తాండవ కృష్ణ, తండ్రి: లేట బండారు వెంకట రామయ్య వారు తేది 31.01.2026 నాటికి చెల్లించవలసిన బకాయి రూ.67,63,398.95/- + తేది 01.02.2026 నుండి తదుపరి వడ్డీ, ఖర్చులు మరియు ఛార్జీలు కలిపి మొత్తమును రాబట్టుకొనుటకు కెనరా బ్యాంక్, కడప 7 రోడ్స్ బ్రాంచ్ అధీకృత అధికారిచే నిర్మాణాత్మక/భౌతిక స్వాధీనం చేసుకున్న, సెక్యూర్డ్ క్రెడిటార్‌కు ఛార్జ్/తనఖాపెట్టిన దిగువ వివరించిన స్థిరాస్తిని తేది 06.03.2026 న "ఎక్కడ ఎలా ఉన్నది" "అక్కడ అలా" మరియు "అక్కడ ఏముున్నదో అది" అనే ప్రాతిపదికన విక్రయించబడునని ప్రజానీకానికి మరియు ముఖ్యంగా పైన తెలిపిన ఋణగ్రహీతలు & హామీదారులకు తెలియచేయడమైనది.

ఇ-వేలం తేది & సమయం: 06.03.2026, ఉ॥ 11.00 గం. నుండి మ॥ 01.00 గం.ల వరకు
(అమ్మకం ముగిసేవరకు ప్రతి 5 నిమిషముల వ్యవధిలో అపరిమిత పొడిగింపుతో)
రిజర్వు ధరలో 10% ధరావత్తు సొమ్మును M/s. పిఎస్‌బి అలియన్స్ ప్రైవేట్ లిమిటెడ్ (baanknet) పోర్టల్ యొక్క ఇ-వ్యాలెట్‌లో నేరుగా గాని లేదా ఆ పోర్టల్‌లో చలానా జెనరేట్ చేసుకొని చలాన్‌లోని ఖాతా వివరములకు ధరావత్తును RTGS/NEFT ద్వారా తేది: 05.03.2026, సా॥ 4.00 గం.ల లోపుగా పొందుపరచి జమచేయాలి.

ఒకవేళ ఎన్‌కంబ్రెన్సులు ఏమైనా ఉన్నచో వాటితో కలిపి స్థిరాస్తి వివరములు:
కడప జిల్లా, కడప అర్బన్ సబ్-జిల్లా, కడప మున్సిపల్ కార్పొరేషన్ పరిధి, కడప సిటీ, వై.యస్.నగర్-1, సర్కార్ పుంజ, డి.నెం. 896/1A, 896/1B, వార్డు నెం. 4 (కొత్త వార్డు నెం. 39), డోర్ నెం. 4/508-9, 4/508-10 (కొత్త డోరు నెంబర్లు 39/508-9 & 39-508-10) నందు ఎ.0.02 సెంట్లు 400 చ॥లింకులు లేదా 2.40 సెంట్లు లేదా 116.16 చ॥గ॥ విస్తీర్ణంలోని ఇంటి ఆస్తి యొక్కటు. హద్దులు: తూర్పు: డి.నెం.8/582-2 గల పుల్లన్నగారి గోపాల్ ఇల్లు, పడమర: డి.నెం.8/543 గల గొర్ల లలితమ్మ ఇల్లు, ఉత్తరం: రోడ్డు, దక్షిణం: మండపల్లి లక్ష్మమ్మ ఇల్లు & ట్యాంక్ బండ్. టైటిల్ హోల్డర్: శ్రీమతి రాధిక బండారు & మద్దూ ఎర్రమ దేవి.

రిజర్వు ధర: రూ. 27,00,000/- ధరావత్తు సొమ్ము: రూ. 2,70,000/-

గమనిక: బ్యాంకుకు తెలిసి/తెలియని బకాయిలు/ట్యాక్సులు ఏవైనా ఉన్నచో వేలం కొనుగోలుదారు మాత్రమే వాటిని భరించవలసి ఉంటుంది మరియు చివరి మొత్తం బిడ్డ సొమ్ముకు అది అదనం.

అమ్మకానికి సంబంధించిన సవివరమైన నియమ నిబంధనల కొరకు కెనరా బ్యాంక్ వెబ్‌సైట్ www.canarabank.bank.in లో ఏర్పాటు చేసిన "ఇ-వేలం" లింకును రిఫర్ చేయండి లేదా కెనరా బ్యాంక్, కడప ప్రాంతీయ కార్యాలయం, అధీకృత అధికారిని ఆఫీసు పనివేళలలో సంప్రదించగలరు. ఫోన్: 79016 26769. ఇ-వేలం విధానం కొరకు సర్వీసు ప్రొవైడర్‌ను సంప్రదించండి: మెస్సర్స్ పిఎస్‌బి అలయన్స్ (baanknet), వెబ్‌పోర్టల్ https://baanknet.com/ హెల్ప్‌డెస్క్: 8291220220, ఇ-మెయిల్: support.baanknet@psballiance.com
తేది: 17.02.2026, ప్రదేశం: కడప సం/- అధీకృత అధికారి, కెనరా బ్యాంక్

సౌత్‌జోన్ క్రికెట్ పోటీల్లో.. చిత్తూరు, కర్నూలు జట్ల విజయం



గోవర్ధన్‌రెడ్డి కర్నూలు (131 పరుగులు)



గోకుల్‌సాయి చిత్తూరు (95 పరుగులు)



యోగాంజనేయులు కడప (86 పరుగులు)

కడప క్రీడలు, న్యూస్‌టుడే : ఏసీఏ సౌత్‌జోన్ అండర్-12 అంతర్ జిల్లాల వన్డే క్రికెట్ పోటీల్లో చిత్తూరు, కర్నూలు జట్లు గెలుపొందాయి. కర్నూలు జట్టు సభ్యుడు గోవర్ధన్‌రెడ్డి సెంచరీ చేశాడు. అలాగే కడప, చిత్తూరు, కర్నూలు క్రీడాకారులు యోగాంజనేయులు, భానువర్షిత్‌రెడ్డి, గోకుల్‌సాయి, ధనుష్, నీలేష్ అర్ధ సెంచరీలు చేసి రాణించారు. వైఎస్ఆర్ఆర్-ఏసీఏ స్టేడియం, కేఎస్ఆర్ఎం క్రికెట్ మైదానంలో మంగళవారం క్రికెట్ పోటీలు జరిగాయి.

చిత్తూరుదే గెలుపు

వైఎస్ఆర్ఆర్-ఏసీఏ స్టేడియంలో జరిగిన మ్యాచ్‌లో చిత్తూరు జట్టు 16 పరుగుల తేడాతో గెలుపొందింది. టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ చేసిన ఆ జట్టు నిర్ణీత 35 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 220 పరుగులు చేసింది. జట్టులో గోకుల్ సాయి 95, ధనుష్ 65 పరుగులు చేశారు. 221 పరుగుల విజయ లక్ష్యంతో బ్యాటింగ్‌ను ఆరంభించిన కడప జట్టు 33.3 ఓవర్లలో 203 పరుగులు చేసి ఆలౌట్ అయ్యింది. జట్టులో యోగాంజనేయులు 86, భానువర్షిత్‌రెడ్డి 54 పరుగులు చేసినప్పటికీ జట్టును గెలిపించలేకపోయారు. చిత్తూరు బౌలర్లలో పునీత్‌సాయిరెడ్డి 4, భువన్‌సాయి 3 వికెట్లు తీసుకున్నారు.

కర్నూలు జట్టు ఆధిపత్యం

ఈ టోర్నమెంట్‌లో కర్నూలు జట్టు రెండో విజయాన్ని నమోదు చేసుకుంది. మొదటి మ్యాచ్‌లో చిత్తూరుపై గెలుపొందిన ఆ జట్టు కేఎస్ఆర్ఎం క్రికెట్ మైదానంలో మంగళవారం జరిగిన మ్యాచ్‌లోనూ అనంతపురం జట్టుపై 156 పరుగుల భారీ తేడాతో గెలుపొంది రెండో విజయాన్ని తన ఖాతాలో నమోదు చేసుకుంది. ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచిన కర్నూలు జట్టు తొలుత బ్యాటింగ్ చేసి నిర్ణీత 35 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 261 పరుగులు చేసింది. జట్టులో గోవర్ధన్‌రెడ్డి 131 పరుగులు, నీలేష్ 84 పరుగులు చేసి ఆ జట్టుకు భారీ స్కోరు అందించారు. ఆపై అనంతపురం జట్టు 35 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 125 పరుగులు మాత్రమే చేసింది. జట్టులో తౌఫిక్ 33, హన్విక్ రెడ్డి 24 పరుగులు చేశారు. కర్నూలు బౌలర్లలో సూర్య, ఖలీద్ మూడు వికెట్లు తీసుకోగా వరుణ్‌కుమార్‌కు 2 వికెట్లు దక్కాయి.

నీలేష్ కర్నూలు (84 పరుగులు)

ధనుష్ చిత్తూరు అర్ధ సెంచరీ



భానువర్షిత్‌రెడ్డి కడప అర్ధ శతకం

మేమున్నాం.. మీకు తోడుగా.. (10 AM to 1 PM) రాజంపేట : 9441872651 బద్వేలు గ్రామీణ : 8008573493

?: మండలంలోని లక్ష్మీపాళెంలో పలువురు వృథా నీరు ప్రధాన వీధుల్లోకి వదులుతున్నారు. దాంతో రాకపోకలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. చర్యలు తీసుకోవాలి.
- దామోదర్, న్యాయవాది, లక్ష్మీపాళెం

✓: సచివాలయ కార్యదర్శికి తెలిపి సమస్యను పరిష్కరిస్తాం.

?: వనంపుల గ్రామంలో పలు వీధిదీపాలు వెలగడం లేదు. రాత్రి వేళల్లో విషపురుగుల సంచారంతో భయాందోళనకు గురవుతున్నాం.
- నరసింహులు, స్థానికుడు

✓: సిబ్బందిని పంపి మరమ్మతులు చేయించి వీధిదీపాలు వెలిగేలా చూస్తాం.

?: నక్కలగండిలో తాగునీటి శుద్ధి కేంద్రం మరమ్మతులకు గురయ్యి నిరుపయోగంగా మారింది. **- గుర్రయ్య, స్థానికుడు**

✓: పరిశీలించి యంత్రాన్ని అందుబాటులోకి తీసుకొస్తాం. **(పై సమస్యలకు బద్వేలు ఎంపీడీవో డి. మల్లేశ్వరి సమాధానం చెప్పారు.)**

?: బద్వేలు పురపాలిక ముబారక్ నగర్‌లోని కాలువల్లో చెత్త పేరుకుపోయి మురుగు పారడం లేదు. **- జహంగీర్, స్థానికుడు**

✓: సిబ్బందిని పంపి పూడిక తీయిస్తాం.

?: స్థానిక నెల్లూరు రోడ్డులోని ఆరోగ్యపురంలో ఇంటింటి చెత్త సేకరణ సక్రమంగా జరగడం లేదు. **- ఆనంద్, ఉపాధ్యాయుడు**

✓: పారిశుద్ధ్య సిబ్బందిని పంపి చెత్త సేకరణ సక్రమంగా జరిగేలా చర్యలు తీసుకుంటాం.

(పై సమస్యలకు బద్వేలు పురపాలిక కమిషనర్ నరసింహారెడ్డి సమాధానం చెప్పారు.)
- న్యూస్‌టుడే, బద్వేలు గ్రామీణ

20న బద్వేలులో ఉద్యోగ మేళా

బద్వేలు గ్రామీణ, న్యూస్‌టుడే: పట్టణంలోని ఎస్‌బీవీఆర్ డిగ్రీ కళాశాలలో ఈ నెల 20వ తేదీన ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జాబ్ మేళా నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ కె.వెంకటసుబ్బారెడ్డి, జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి సి.విజయ్‌వినీల్ కుమార్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మేళాలో 13 కంపెనీలు పాల్గొంటాయని చెప్పారు. పది, ఇంటర్, డిగ్రీ ఆపై చదువుకున్న నిరుద్యోగులు తమ ధ్రువపత్రాలతో హాజరు కావాలని వారు కోరారు.

రాజంపేట

•రాజంపేట •బద్వేలు

అక్షరాస్యతపై అవగాహన సదస్సు

బ్యాంక్ సేవలపై వివరిస్తున్న కళాజాతా బృందం

రాజంపేట గ్రామీణ, న్యూస్‌టుడే: మండలంలోని వరదయ్యగారిపల్లెలో ఆంధ్ర ప్రదేశ్ గ్రామీణ బ్యాంక్ ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు గ్రామ సభను ఏర్పాటు చేసి ప్రత్యేక కళాకారులచే బ్యాంకు సేవలను ప్రజలకు తెలిసేలా సేవలు, ప్రయోజనాలను ప్రదర్శన చేసి వివరించారు. బంగారం, వ్యవసాయ, వ్యక్తిగత రుణాలు, సైబర్‌నేరాలతో పాటు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న బీమా ప్రయోజనాలపై అవగాహన కల్పించారు.

కళ్లెదుటే జలనిధి..
ఆయకట్టుకు అందనిది

ఒంటిమిట్ట, న్యూస్‌టుడే: ఒంటిమిట్ట చెరువు జలసిరితో నిండుగా కన్పిస్తోంది. గతేడాది సెప్టెంబరు, డిసెంబరు నెలల్లో కురిసిన వర్షాలకు నిండుకుండలా దర్శనమిస్తోంది. కానీ, సాగు కాలువల దుస్థితి, అధికారులు నీరు వదలకపోవడం లాంటి సమస్యలతో అన్నదాతల్లో ఆందోళన నెలకొంది. జలనిధి ఉన్నా ఆయకట్టుకు చేరడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

● నీటిని వదిలిన దాఖలాల్లేవు

ఒంటిమిట్ట చెరువు అంతర్గత విస్తీర్ణం 194.81 ఎకరాలు ఉండగా.. దీని కింద 1,014.28 ఎకరాల ఆయకట్టు సాగవుతోంది. వీటి కింద ఒంటిమిట్ట, మలకాటిపల్లె, సాలాబాదు, రాచపల్లె, చెంచుగారిపల్లె, పెద్దకొత్తపల్లి, నర్వకాటిపల్లె, చెర్లోపల్లి, నడింపల్లి, పోలుబుచ్చయ్యగారిపల్లె రైతుల భూములు ఉన్నాయి. కురిసిన వర్షాలతో నాలుగేళ్ల తర్వాత జలకళ సంతరించుకుంది. గతేడాది డిసెంబరు 15న రాజంపేట తెదేపా బాధ్యుడు జగన్‌మోహన్‌రాజు జల హారతి పూజలు చేశారు. ఇప్పటికీ రెండు నెలలు కావస్తున్నా.. తూము తెరిచి నీటిని వదిలిన దాఖలాలు లేవు.

● అంతే కాకుండా ప్రధాన కాలువలో పూడిక చేరింది.

పంటలు సాగు చేయక అడవిలా పెరిగిన కంప చెట్లు

అధ్వానంగా సాగునీటి కాలువలు

గతంలో ఏర్పాటు చేసిన జల జాడలు ఆక్రమణలతో కుదించుకుపోయాయి. పలు చోట్ల పిచ్చిమొక్కలతో అధ్వానంగా మారాయి. సోమశిల వెనుక జలాలను తరలింపునకు ఏర్పాటు చేసిన శ్రీరామ ఎత్తిపోతల పథకానికి నిర్వహణ నిధుల్లేక కాలువలు, పంపుహౌస్ పైపులు పగిలిపోతున్నాయి. తదితర సమస్యలతో నీరు వదిలినా ఇబ్బందులు తలెత్తుతాయి. ఉన్నతాధికారులైన చర్యలు తీసుకోవాలని కర్షకులు కోరుతున్నారు.

రైతులు అడిగితే నీరిస్తాం

గతేడాది కురిసిన భారీ వర్షాలతో ఒంటిమిట్ట చెరువు నిండింది. పంటల సాగు కోసం నీరివ్వాలని రైతులు అడిగితే విడుదల చేయడానికి సిద్ధంగా ఉన్నాం. తటాకం పరిధిలో కొన్ని అభివృద్ధి పనులు చేపట్టడానికి రూ.10 లక్షలు నిధులివ్వాలని ప్రతిపాదనలు పంపాం. అనుమతి రాగానే చేపడతాం. **- సాయికిశోర్, ఏఈ, జలవనరుల శాఖ, కడప**

కోలాహలంగా బండలాగుడు ప్రదర్శన

రాజంపేట గ్రామీణ, న్యూస్‌టుడే: మండలంలోని హత్యరాల త్రేతేశ్వర స్వామి వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా మంగళవారం ఎద్దుల బండలాగుడు ప్రదర్శనను ఘనంగా నిర్వహించారు. రాజంపేట తెదేపా నియోజకవర్గ బాధ్యుడు చమర్తి జగన్మోహనరాజు ఈ ప్రదర్శనను ప్రారంభించారు. స్వామివారిని రోజుల్లో సుమారు లక్ష మంది భక్తులు దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు, ఆలయ అధికారులు, పోలీసులు పాల్గొన్నారు.

ప్రదర్శనను ప్రారంభిస్తున్న తెదేపా నియోజకవర్గ బాధ్యుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు, ఆలయ చైర్మన్, మాజీ చైర్మన్లు

కవితా పురస్కారం ప్రదానం

నందలూరు: నందలూరుకు చెందిన గణిత ఉపాధ్యాయుడు, రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర కార్యదర్శి కవి అశోక్ కుమార్ బ్రహ్మం గారి మఠంలో నిర్వహించిన జాతీయ మహాకవి సమ్మేళనంలో శ్రీకృష్ణ దేవరాయల కవితా పురస్కారం అందుకున్నారు. మల్లె జన్నంచయ్య శ్రీకృష్ణదేవరాయ అన్న కీర్తన కవిత రచించి గానం చేసినందుకు పురస్కారం దక్కింది. రాయల భువన విజయ సాహిత్య వేదిక అధ్యక్షుడు రామ్మోహన్, శ్రీకృష్ణదేవరాయల ఫౌండేషన్ ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. అచలానంద స్వామి పీఠాధిపతులు విరజానంద స్వామి, మాజీ రాజ్యసభ సభ్యులు తులసిరెడ్డి, జిల్లా రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి సుబ్రహ్మణ్యం, పోతన సాహిత్య పీఠం అధ్యక్షులు శివశంకర, సుమన పాల్గొన్నారు.

వేడుకగా చెన్నకేశవస్వామి తిరునాల

తిరునాలలో చాందినీబండ్లు, భక్తులు

సుండుపల్లి, న్యూస్‌టుడే: సుండుపల్లి-సానిపాయి మార్గం ఉప్పరపల్లి సమీపంలోని చెన్నకేశవస్వామి తిరునాల మంగళవారం వేడుకగా ముగిసింది. మొక్కులు ఉన్న భక్తులు కట్టిన చాందినీబండ్లు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. అంకాలమ్మ, మడికాళ్ళమ్మ గంగమ్మలకు బోనాలు సమర్పించారు. శ్రీదేవి, భూదేవి సమేత చెన్నకేశవస్వామిని దర్శించుకొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

మారుతీనగర్: నగర పరిధిలోని విజయదుర్గాదేవి ఆలయంలో మంగళవారం రాహుకేతు పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. తెల్లవారుజాము నుంచి ప్రత్యేక పూజలు, అలంకరణలు చేశారు. పంచామృతాభిషేకం నిర్వహించి రాహుకాల పూజలు చేశారు.

ఉపాధి సిబ్బంది పనితీరుపై ఆగ్రహం

కాశినాయన, న్యూస్‌టుడే: మండలంలో ఉపాధిహామీ సిబ్బంది పనితీరు నిర్లక్ష్యంగా ఉందని ఆ పథకం జిల్లా అదనపు సంచాలకులు రామలింగారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. 2024-25వ ఆర్థిక సంవత్సరంలో ఉపాధి హామీ పథకం నిధుల వ్యయంపై మంగళవారం సామాజిక తనిఖీ ఓపెన్ ఫోరం నిర్వహించారు. ప్రతి కుటుంబానికి 100 రోజులు పని కల్పించడం, పని ప్రదేశాల్లో నామ పలకాలు లేకపోవడం, మస్టర్ల నమోదులో అవకతవకలు ఉండటంతో అధికారులపై ఆయన అసహనం వ్యక్తం చేశారు. సమావేశంలో డీవీవో జుబేదా, ఏపీడీ మైథిలి, బాధ్య ఎంపీడీవో ఉపేంద్రారెడ్డి, నాగార్జున సిబ్బంది పాల్గొన్నారు.

సత్యాన్ని అనుసరిస్తేనే సమాజాభివృద్ధి

కరపత్రాలు ఆవిష్కరిస్తున్న జవివే జిల్లా అధ్యక్షుడు, ఉపాధ్యాయులు

సిద్దవటం, న్యూస్‌టుడే: ప్రతి ఒక్కరూ సత్యాన్ని అనుసరించినప్పుడే సమాజాభివృద్ధి సాధ్యమని జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు సమీర్‌బాష అన్నారు. మండలంలోని భాకరాపేట శివారు ఏపీఎస్పీ పదకొండో బెటాలియన్‌లో ఉన్న జడ్పీ పాఠశాలలో మంగళవారం బ్రూనో 'సత్యాన్వేషణ దినం' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఉపాధ్యాయులతో కలిసి కరపత్రాలు ఆవిష్కరించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం.పోతులూరయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉద్యోగుల కృషితోనే ఆర్టీసీకి ఆదాయం

రాజంపేట, న్యూస్‌టుడే: ఆర్టీసీ ఉద్యోగుల సమిష్టి కృషితోనే రాజంపేట ఆర్టీసీ డిపో జిల్లాలోనే అత్యధిక ఆదాయం సాధించినట్లు డిపో మేనేజర్ గోవర్ధన్ తెలిపారు. ఈమేరకు స్థానిక డిపో గ్యారేజీలో మంగళవారం గ్యారేజీ సిబ్బంది, డ్రైవర్లు, కండెక్టర్లకు స్వీట్లు పంపిణీ చేసి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శివరాత్రికి హత్యరాల, గుండాలకోన, నిత్యపూజకోన, పెద్దూరు గుండాలకోనకు 41 ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేయగా వీటి ద్వారా రూ.14.94 లక్షలు ఆదాయం వచ్చిందన్నారు. గత ఏడాది రూ.12.45 లక్షలు వచ్చినట్లు తెలిపారు. డిపో ఆదాయం కూడా భారీగా పెరిగిందని చెప్పారు. కార్యక్రమంలో డిపో సహాయ మేనేజర్ మాధవిలత, గ్యారేజీ ఇన్‌ఛార్జి రాజు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగులకు స్వీట్లు పంపిణీ చేస్తున్న ఆర్టీసీ డీఎం గోవర్ధన్

బద్వేలులో కర్పూరి ఠాకూర్ వర్ధంతి

బద్వేలు గ్రామీణ: బిహార్ మాజీ ముఖ్యమంత్రి కర్పూరి ఠాకూర్ వర్ధంతి కార్యక్రమాన్ని మంగళవారం బద్వేలులో నిర్వహించారు. స్థానిక సుందరయ్య భవన్‌లో సీపీఎం పట్టణ కార్యదర్శి శ్రీనివాసులు, నాయకులతో కలిసి ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మహనీయుల ఆశయ సాధన సమితి ఆధ్వర్యంలో అధ్యక్షుడు గురుమూర్తి ఠాకూర్ చిత్రపటానికి అంజలి ఘటించారు.

తాగునీటి వృథా... ఎవరికీ పట్టదా!

మండలంలోని మాధవరం-1 పరిధి అలీనగర్‌లో పది రోజులుగా తాగునీరు వృథాగా పోతోంది. అయినా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదు. పైపులైన్ పగిలిపోవడంతో ఈ పరిస్థితి నెలకొంది. గ్రామంలో సుమారు నాలుగు వందల కుటుంబాలు ఉంటాయి. సక్రమంగా నీరు అందక వారు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బంగారుపేట నుంచి అలీనగర్‌కు ఏర్పాటు చేసిన పెన్నా తాగునీటి పైపులైనుకు ఇదే దుస్థితి ఉందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి వృథాను అరికట్టాలని విన్నవిస్తున్నారు. **- న్యూస్‌టుడే, సిద్దవటం**

ఎగిసే మంటలు.. ఇలా ఆర్పాలి

సిద్దవటం, కడప నేరవార్తలు, న్యూస్‌టుడే : కడప శివారులోని సిద్దవటం మండలం భాకరాపేట వద్ద ఉన్న హెచ్‌పీసీఎల్‌లో మంగళవారం జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి శరత్‌బాబు, జిల్లా సహాయ అగ్నిమాపక అధికారి యోగేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో మాక్ డ్రిల్ నిర్వహించారు. కర్మాగారంలో అనుకోకుండా ఏదైనా ప్రమాదం జరిగితే మంటలను ఎలా ఆర్పాలో అగ్నిమాపక సిబ్బంది ప్రదర్శించి చూపించారు. వేసవి రానున్న దృష్ట్యా అగ్నిప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలని కర్మాగార సిబ్బందికి సూచించారు.

ఏ ఊరికి ఎటు వెళ్లాలో?

మండల కేంద్రంలోని ప్రధాన రహదారి పక్కన వివిధ మార్గాలు, దూరాలు తెలిపే నామపలకం కింద పడిపోయింది. ప్రధాన రహదారిలోని ఆక్రమణ తొలగింపు పనులతో ఈ పరిస్థితి నెలకొంది. తిరిగి ఏర్పాటు చేయకపోవడంతో కొత్తగా వచ్చే వారు ఇబ్బందులు పడుతున్నారు. ఎటు వెళ్లాలో తెలియక సతమతమవుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, సుండుపల్లి**

సిబ్బంది కొరత.. పశు వైద్యశాల మూత

శేఖరాజుపల్లె పంచాయతీ పరిధి ముమ్మడిగుంటపల్లెలో గ్రామీణ పశువైద్యశాల సిబ్బంది లేక కొన్ని రోజులుగా మూతపడింది. దాంతో పశుపోషకులు ఇబ్బందులు పడుతున్నారు. పంచాయతీ పరిధిలో ముమ్మడిగుంటపల్లె, శేఖరాజుపల్లె, మోహిదీన్‌సాహెబ్‌పల్లె, బ్రాహ్మణపల్లె గ్రామాలున్నాయి. అధిక శాతం మంది పాడిపైనే ఆధారపడ్డారు. అధికారులు చర్యలు తీసుకోవాల్సి ఉంది. భాకరాపేట పశు వైద్యాధికారి శివశంకర్ మాట్లాడుతూ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామన్నారు. **- న్యూస్‌టుడే, సిద్దవటం**

చెరువు ఆక్రమణపై ఫిర్యాదు

సుండుపల్లి: సుండుపల్లి పరిధిలోని రాతిచెరువు, అప్పన్నకుంట, మాచిరెడ్డిగారిపల్లి పంచాయతీ పరిధి కానిగమాను కుంటలో జరుగుతున్న ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలని తెదేపా నాయకులు, భాజపా నాయకులు మంగళవారం సబ్‌కలెక్టర్ భావనకు వినతిపత్రం అందజేశారు. ఈ విషయమై మండల, జిల్లా అధికారులకు ఇప్పటికే ఫిర్యాదు చేసినా వారు స్పందించడం లేదన్నారు. దీనిపై చొరవ తీసుకుని ఆక్రమణలు జరగకుండా చూడాలని సబ్ కలెక్టర్‌ను కోరారు.

మౌలిక వసతుల కల్పనకు వినతి

పోరుమామిళ్ల, న్యూస్‌టుడే: జగనన్న కాలనీల్లో మౌలిక వసతులు కల్పించాలని సీపీఎం మండల కార్యదర్శి భైరవప్రసాద్ కోరారు. గుంటూరు బాపనయ్య కాలనీవాసులతో కలిసి మంగళవారం ఎంపీడీవో కార్యాలయం ఉద్యోగులకు వినతి పత్రం అందజేశారు. కాలనీ ఏర్పాటై ఏళ్లు గడుస్తున్నా.. ఇప్పటికీ ఇంటి చిరునామాలు లేవన్నారు. అలాగే వసతులు కల్పించాలని విన్నవించారు. నాయకులు సోమయ్య, రవి, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

నిధుల స్వాహాకు యత్నం

వీరబల్లి: వంగిమళ్ల పంచాయతీ నిధులు దుర్వినియోగం కాకుండా చూడాలని తెదేపా నాయకుడు ప్రతాప్‌రెడ్డి, రామ్మోహనరెడ్డి మంగళవారం డిప్యూటీ ఎంపీడీవో జ్యోతిస్వరాజ్‌కు వినతి పత్రం అందజేశారు. నిధులు దుర్వినియోగం చేసి గతంలో చెక్‌పవర్ కోల్పోయిన పాలకులు అధికారులతో కుమ్మక్కై స్వాహాకు ప్రయత్నిస్తున్నారని తెలిపారు. ప్రత్యేక దృష్టిపెట్టి అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.

నులిపురుగులను నివారిద్దాం

ఒంటిమిట్ట జడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థికి అల్బెండజోల్ మాత్ర వేస్తున్న ఎంపీడీవో సుజాతమ్మ

కడుపులో ఉండే నులిపురుగులను నివారించేందుకు అల్బెండజోల్ మాత్రలు తీసుకోవాలని పలువురు వైద్యులు, వక్తలు సూచించారు. జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా మంగళవారం రాజంపేట, బద్వేలు నియోజకవర్గాల్లో పలు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడాది నుంచి 19 సంవత్సరాల వయస్సు ఉన్న విద్యార్థులకు అల్బెండజోల్ మాత్రలను అందించారు. పలు చోట్ల వైద్యులు, మండల ఎంపీడీవోలు, ఉపాధ్యాయులు పాల్గొని విద్యార్థులకు తగు జాగ్రత్తలు సూచించారు. **- న్యూస్‌టుడే, రాజంపేట కస్టర్ బృందం**

పోరుమామిళ్లలో నులిపురుగుల మాత్రలను మింగిస్తున్న వైద్యురాలు మేరిఎలిషా

పాలకొండల్లో మంటలు

సుండుపల్లి: రాయవరం, దేవాండ్లపల్లి సమీపంలోని పాలకొండల్లో సోమవారం రాత్రి మంటలు వ్యాపించాయి. దాంతో పలు విలువైన వృక్షాలు కాలి బూడిదయ్యాయి. ఈ విషయమై సానిపాయి రేంజి అధికారి వైసీరెడ్డి మాట్లాడుతూ అటవీ, రక్షణ సిబ్బంది శ్రమించి మంటలు అదుపు చేశారని.. సుమారు రెండు వేల ఎకరాలకు మంటలు వ్యాపించి నష్టం వాటిల్లిందని తెలిపారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామని వివరించారు. ప్రజలు సహకరించాలని కోరారు.

బ్యాంకు సేవలు సద్వినియోగం చేసుకోవాలి

రాయవరం(సుండుపల్లి), న్యూస్‌టుడే : ఖాతాదారులు బ్యాంకులు అందించే సేవలు సద్వినియోగం చేసుకోవాలని ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు రాయవరం శాఖా మేనేజరు హరీష్ కోరారు. మంగళవారం కావలిపల్లెలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు.

ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవాలు సురక్షితం

సుండుపల్లి, న్యూస్‌టుడే: ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాలు సురక్షితమని జిల్లా వైద్యాధికారి కె.నాగరాజు అన్నారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం ఆయన తనిఖీ చేశారు. మందుల లభ్యత, ఓపీ, ప్రసవాలు తదితర అంశాలపై సమీక్షించారు. ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవాలు పెరిగేలా కృషి చేయాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు దిలీప్‌గుప్త, పర్హానా ఖానం, సిబ్బంది పాల్గొన్నారు.

కార్మిక వ్యతిరేక విధానాలపై ఉద్యమం

పోరుమామిళ్ల: ఏఐటీయూసీ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా కార్యదర్శి పిడుగు మస్తాన్ కోరారు. పట్టణంలోని ఆ సంఘం కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడారు..కార్మికుల సమస్యలపై చర్చించేందుకు ఈ నెల 22, 23న కడపలో మహాసభలను నిర్వహిస్తామని తెలిపారు. కేంద్రం అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానలపై ఉద్యమిస్తామని చెప్పారు. కార్మికులందరూ పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు. సంఘం నాయకులు పీరయ్య, సఫా, కేశవ, గురయ్య పాల్గొన్నారు.

పన్ను బకాయిల వసూళ్లపై దృష్టి

బద్వేలు, న్యూస్‌టుడే: బద్వేలు పురపాలకలో మొండి బకాయిల వసూళ్ల కోసం 23 బృందాలను ఏర్పాటు చేసినట్లు పురపాలక కమిషనర్ నరసింహారెడ్డి తెలిపారు. స్థానిక పురపాలక సభా భవనంలో మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పన్ను బకాయిలను చెల్లించాలని ఇళ్ల వద్దకు వెళ్లి తెలిపినా బకాయి దారుల్లో స్పందన లేదన్నారు. ఇలా స్పందించకుంటే నోటీసులు జారీ చేస్తామన్నారు. ఆ తరువాత జప్తు చేయడంతో పాటు బకాయిదారుల జాబితాను బహిరంగ ప్రదేశాల్లో పెడతామన్నారు. సమావేశంలో పురపాలక మేనేజరు హరినాథ్, ఆర్వో గంగిరెడ్డి, ఆర్ఐ రఘునాథరెడ్డి, షఫీ తదితరులు పాల్గొన్నారు.

అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ నరసింహారెడ్డి

ఆర్టీసీ ఉద్యోగులపై కక్ష ధోరణి తగదు

రాజంపేట, న్యూస్‌టుడే: ఆర్టీసీ ఉద్యోగుల పట్ల డిపో మేనేజర్ వ్యవహరిస్తున్న కక్షపూరిత ధోరణి మానుకోవాలని ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా నాయకుడు శేఖర్ అన్నారు. స్థానిక డిపో ఎదుట మంగళవారం ఈయూ నాయకులు ఆందోళన కార్యక్రమాన్ని చేపట్టారు. స్త్రీ శక్తి పథకం వచ్చాక ప్రయాణికుల సంఖ్య పెరిగిందని, దానికి అనుగుణంగా బస్సులు వేయలేదని తెలిపారు. దీంతో ఇబ్బందులు తలెత్తున్నాయన్నారు. పలు పార్టీల అనుబంధ సంఘాలతో డిపో మేనేజర్ అనుకూలంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. నాయకులు మౌలా, చలపతి, వల్లి, బలరాం తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ గ్యారేజీ ఎదుట ఆందోళన కార్యక్రమంలో మాట్లాడుతున్న ఈయూ జిల్లా నాయకుడు బి.సి.శేఖర్

బాలిక అదృశ్యంపై ఫిర్యాదు

రాజంపేట, న్యూస్‌టుడే: ఇంటర్మీడియట్ చదువుతున్న బాలిక అదృశ్యమైందని ఆమె తల్లి ఫిర్యాదు చేసినట్లు పట్టణ పోలీసులు మంగళవారం తెలిపారు. మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలిక రోజూ పట్టణంలోని ఓ ప్రైవేట్ ట్యూషన్‌కి వెళ్తుంది. ఈ క్రమంలో సోమవారం ట్యూషన్‌కి వెళ్లిన బాలిక తిరిగి ఇంటికి వెళ్లలేదు. దాంతో ఆమె తల్లి పోలీసులను ఆశ్రయించినట్లు తెలిపారు.

నకిలీ పత్రాలతో మోసం

పోరుమామిళ్ల: భూమి కొనుగోలు విషయంలో నకిలీ ధ్రువపత్రాలు చూపి డబ్బులు తీసుకుని ఇద్దరు వ్యక్తులు మోసగించినట్లు బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై హనుమంతు తెలిపారు. స్థానిక పోలీసు స్టేషన్‌లో మంగళవారం ఆయన మాట్లాడారు. మండలంలోని రెడ్డినగర్‌కు చెందిన బలరామిరెడ్డి, ఎస్టీకాలనీకి చెందిన నారాయణలు రంగసముద్రం పరిధిలోని 74 సెంట్ల భూమిని కలసపాడు మండలం చింతలపల్లికి చెందిన సత్యనారాయణకు 1.30 కోట్లకు విక్రయించేందుకు ఒప్పందం కుదుర్చుకున్నారు. అందుకుగాను ముందుగా రూ.45 లక్షల నగదును అడ్వాన్సుగా తీసుకున్నారు. రోజులు గడుస్తున్నా రిజిస్ట్రేషన్ చేయించకుండా జాప్యం చేస్తున్నారు. ఈ క్రమంలో మోసపోయినట్లు గ్రహించిన బాధితుడు పోలీసులను ఆశ్రయించారు.

దుమ్ము దారులు గతం..
తారు రోడ్లతో అభివృద్ధి పథం

అట్లూరు, న్యూస్‌టుడే: గ్రామీణాభివృద్ధికి కూటమి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతోంది. అందులో భాగంగా గతంలో ఆగిన రహదారులకు బిల్లులు మంజూరు చేయడంతో పాటు రహదారుల బాగుకు చర్యలు చేపట్టింది. ఈ క్రమంలో నియోజకవర్గంలో పలు రహదారులు రూపు మారుతోంది. దాంతో స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. నియోజకవర్గంలోని చాలా గ్రామాలకు మట్టి దారులే దిక్కుగా ఉండటంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. వీటి బాగుకు గతంలో గ్రామీణ రోడ్డు ప్రాజెక్టు (ఏపీఆర్ఆర్‌పీ) ద్వారా పనులు ప్రారంభించినా.. వైకాపా ప్రభుత్వం నిధులు ఇవ్వకపోవడంతో గుత్తేదారులు పనులు ఆపేశారు. దాంతో అధ్వాన రహదారులపైనే ప్రజలు రాకపోకలు సాగించాల్సి వచ్చింది. కూటమి ప్రభుత్వం రాగానే బద్వేలు నియోజకవర్గంలో సుమారు 34 పనులకు బిల్లులు చెల్లించారు. వీటిలో సగానికి పైగా గుత్తేదారులు ప్రారంభించారు. అట్లూరు మండలంలోని పాతఅట్లూరు- వరికుంట రోడ్డు, దేవనగర్- గుజ్జులవారిపల్లె, లింగాలకుంట-తంబళ్లగొంది, సీపీ రోడ్డు - బీబీసాహెబ్‌పేట, మాడపూరు - చినరాచపల్లెకు వెళ్లే మార్గాల్లో తారురోడ్లు పూర్తి చేశారు.

అట్లూరు మండలం చినరాచపల్లెకు కొత్తగా నిర్మించిన తారురోడ్డు

మిగిలినవీ పూర్తి చేస్తాం

ఏపీఆర్ఆర్‌పీ నిధులతో చేపట్టిన తారురోడ్ల నిర్మాణ పనులు ఊపందుకున్నాయి. అట్లూరు, బద్వేలు మండలాల్లో పలు చోట్ల పూర్తి చేశాం. ప్రస్తుతం గోపవరం మండలాల్లో కొనసాగుతున్నాయి. 2023లో మంజూరైన అన్నింటినీ క్రమంగా నిర్మిస్తాం. **- జిలానిబాషా, పంచాయతీరాజ్ డీఈ**

ఉద్యాన వనం ఏర్పాటుకు డిమాండ్

బద్వేలు గ్రామీణ, న్యూస్‌టుడే: పురపాలికలోని ఎన్జీవో కాలనీలో ఉన్న 96 సెంట్ల ప్రభుత్వ స్థలంలో పార్కు, లైబ్రరీ ఏర్పాటు చేయాలని పట్టణ అభివృద్ధి అధ్యక్షుడు వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా స్థానిక ఆర్డీవో కార్యాలయంలో మంగళవారం సొసైటీ సభ్యులు నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ..బద్వేలు పురపాలికగా మారి 15 సంవత్సరాలు గడిచినా నేటికీ పూర్తి స్థాయిలో మౌలిక వసతులు సమకూరడం లేదని అన్నారు. మురుగు కాలువల పరిస్థితి దారుణంగా ఉండటంతో దోమలు వ్యాప్తి చెంది ప్రజలు రోగాల బారిన పడుతున్నారన్నారు. వీటి నివారణకు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.

పరపతి సంఘం నుంచి యూరియా పంపిణీ

అట్లూరు, న్యూస్‌టుడే : అట్లూరు సహకార పరపతి సంఘం ద్వారా రైతులకు యూరియా పంపిణీ చేపట్టనున్నట్లు సీఈవో సుబ్బారెడ్డి మంగళవారం తెలిపారు. బుధవారం వేమలూరు, కామసముద్రం, మాడపూరు గ్రామ పంచాయతీ రైతులు పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్‌తో రావాలని ఆయన కోరారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సీఈవో సూచించారు.

దుప్పట్ల అందజేత

పోరుమామిళ్ల, న్యూస్‌టుడే: ఫౌండేషన్ 'ఫర్ చిల్డ్రన్స్ ఇన్ నీడ్' సంస్థ వ్యవస్థాపకులు డాక్టర్ గీతా, తోమాస్‌రెడ్డి మంగళవారం బాలికలకు దుప్పట్లు పంపిణీ చేశారు. స్థానిక కేజీబీవీ పాఠశాల విద్యార్థినులకు సుమారు 272 మందికి దుప్పట్లను అందజేశారు. కార్యక్రమంలో ట్రస్టు ప్రతినిధులు, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 99899 97626
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 91771 11468

(c) eenadu

ప్రొద్దుటూరు

• ప్రొద్దుటూరు • జమ్మలమడుగు • మైదుకూరు

భూసార పరీక్షలు తప్పనిసరి

రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏవో అమర్‌నాథ్‌రెడ్డి

దువ్వూరు, న్యూస్‌టుడే: రైతులంతా తప్పనిసరిగా భూసార పరీక్షలు చేయించుకోవాలని ఏవో అమర్‌నాథ్ రెడ్డి తెలిపారు. మండలంలోని పెద్దజొన్నవరంలో మంగళవారం ఆయన పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులకు పంటల యాజమాన్యం- సస్య రక్షణ చర్యలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకురాలు సుప్రియ పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM to 1 PM)
ప్రొద్దుటూరు : 9966349431
జమ్మలమడుగు: 9494294241
మైదుకూరు : 8008573447

?: చిన్నముడియం ఎస్సీ కాలనీలో విద్యుత్తు తీగలు ప్రమాదకరంగా కిందికి వేలాడుతున్నాయి. అధికారులు చర్యలు తీసుకోవాలి. **- స్థానికులు**

✓: విద్యుత్తు తీగలు కిందకు వేలాడకుండా చర్యలు తీసుకుంటాం. **- మునికృష్ణ, ఇన్‌ఛార్జి విద్యుత్తు లైన్‌మెన్**

?: పెద్దముడియం పాత పోలీసు స్టేషన్ వద్ద పైపులైను లీకేజీతో నీరంతా వృథా అవుతోంది. **- స్థానికుడు**

✓: నీరు వృథా కాకుండా చర్యలు తీసుకుంటాం.
- నాగ లింగేశ్వరరెడ్డి, కార్యదర్శి, పెద్దముడియం
- న్యూస్‌టుడే, పెద్దముడియం

స్పందించారు.. పరిష్కరించారు

● కొండాపురం ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో దెబ్బతిన్న పైపులైన్‌కు మరమ్మతులు చేపట్టారు. తాగునీటి పైపులైను లీకేజీ అవుతోందని ఈ నెల 11న 'నీటివృథా.. తప్పని వ్యధ' శీర్షిక కథనం ప్రచురితమైంది. స్పందించిన ఎంపీడీవో నాగప్రసాద్ నీరు వృథా కాకుండా మరమ్మతులు చేయించారు.

● ఆర్‌అండ్‌ఆర్ కాలనీలోని కొన్ని విద్యుత్తు దీపాలు వెలగడం లేదని ఈ నెల 8న మేమున్నాం..మీకు తోడుగాలో భాగంగా సమస్య ప్రచురితమైంది. స్పందించిన విద్యుత్తుశాఖ ఏఈ వీరారెడ్డి చర్యలు తీసుకున్నారు.

● రామిరెడ్డిపల్లెలోని వీధుల్లో పారిశుద్ధ్యం అధ్వానంగా ఉందని ఈ నెల 8న మేమున్నాం..మీకు తోడుగాలో సమస్య ప్రచురితమైంది. స్పందించిన సచివాలయ సిబ్బంది గ్రామంలో పారిశుద్ధ్య పనులు చేయించారు. **- న్యూస్‌టుడే, కొండాపురం**

ఆశ పడితే.. అధోగతే!

● అమాయకులే లక్ష్యంగా మోసాలు

ప్రొద్దుటూరులో అరెస్టు చేసిన నిందితులను చూపుతున్న పోలీసులు

ప్రొద్దుటూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: ఓ వైపు సైబర్ నేరాలు ఆందోళన కలిగిస్తుంటే.. మరో వైపు మోసాలు సైతం వణుకు పుట్టిస్తున్నాయి. అమాయకులను లక్ష్యంగా చేసుకుని నేరగాళ్లు రెచ్చిపోతున్నారు. తియ్యటి మాటలతో ప్రజలను నమ్మించి రూ.లక్షలు దండుకుంటున్నారు. ఆపై పత్తా లేకుండా పోతున్నారు. చివరకు మోసపోయామని గ్రహించి పోలీస్ స్టేషన్ల బాట పట్టే బాధితుల సంఖ్య ఎక్కువైంది. మరి కొందరు బయటకు పొక్కితే పరువు పోతుందని తెలియనివ్వడం లేదు.

డబ్బుపై వ్యామోహం ముంచుతోంది

ప్రజలకు డబ్బు మీదున్న ఆశను ఆయుధంగా మార్చుకుని నేరగాళ్లు పంజా విసురుతున్నారు. రెట్టింపు డబ్బులిస్తామని కొందరు.. రంగురాళ్లు వజ్రాలవుతాయని.. గుప్తనిధుల పేరుతో ఇలా అనేక రకాల మోసాలకు తెరలేపుతున్నారు. ఎలాంటి కష్టం లేకుండానే డబ్బు వస్తుందని ప్రజలు నమ్మి మోసపోతున్నారు. ఈ నేరగాళ్ల ఆగడాలను కట్టడి చేసేందుకు పోలీసులు అనేక అవగాహన కార్యక్రమాలు చేపట్టారు. అయినా ప్రజల్లో మార్పు రావడం లేదు. సులువుగా డబ్బు వస్తుందని ఎవరైనా చెబితే అనుమానించాలని లేదంటే మోసపోతారని పోలీసులు చెబుతున్నారు.

నమోదైన కేసుల వివరాలు	
ఏడాది	కేసులు
2023	32
2024	37
2025	21

వీటిలో కొన్ని

ప్రొద్దుటూరుకు చెందిన ఓ వ్యక్తిని నేరగాళ్లు రూ.33 లక్షలు నగదు ఇస్తే చాలు రూ.50 లక్షలు మీ బ్యాంక్ ఖాతాలో జమ చేస్తామని నమ్మించింది. దీనికి ఆశపడిన ఆ వ్యక్తి రూ.33 లక్షలు సంచిలో భద్రపరిచి వారికి అందజేశాడు. ఆ సొమ్ము తన ఖాతాకు జమ కాకపోవడంతో మోసగాళ్లను ప్రశ్నించాడు. దీంతో ఆ మోసగాళ్లు మీ డబ్బును మీరు తీసుకెళ్లండి అంటూ మరో పేపర్లతో నిండిన బ్యాగును అతనికి ఇచ్చి వెళ్లిపోయారు. బాధితుడు బ్యాగును పరిశీలించగా డబ్బుకు బదులు పేపర్లు ఉన్నాయి. ఆ కేసులో పోలీసులు ఐదుగురిని అరెస్టు చేశారు.

★ గుప్త నిధుల పేరుతో మోసాలకు పాల్పడుతున్న ఏడుగురిని ప్రొద్దుటూరు పోలీసులు గతేడాది అరెస్టు చేశారు. నిందితులు ముందుగానే భూమిలో విగ్రహం, రంగురాళ్లు పూడ్చి గుప్త నిధులున్నాయంటూ ఎరవేసి బాధితుల నుంచి రూ.లక్షలు వసూలు చేసి మోసం చేశారు.

★ రైస్ పుల్లింగ్ పేరుతో ముగ్గురు మహిళలు రూ.1.30 కోట్లు వసూలు చేసి ఓ వ్యాపారిని మోసం చేసిన ఘటన 2024 సంవత్సరంలో చోటుచేసుకుంది. ఇరిడియం లోహం చాలా ఖరీదైందని దాన్ని తీసుకుంటే అధిక లాభాలు వస్తాయని మాయమాటలు చెప్పారు. పలు దఫాలుగా డబ్బులు వసూలు చేసి బురిడీ కొట్టించారు. ఇలా అనేక ఘటనలు ప్రొద్దుటూరులో వెలుగులోకి వచ్చాయి.

శుభ్రత పాటిస్తే.. ఆరోగ్యం మన చేతుల్లోనే

విద్యార్థికి మాత్ర వేస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో గీత, అధికారులు

ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, మైదుకూరు నియోజకవర్గాల్లో జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం వైద్యులు, అధికారులు కార్యక్రమాలు నిర్వహించారు. ప్రొద్దుటూరులో డిప్యూటీ డీఎంహెచ్‌వో గీత పాల్గొని మన ఆరోగ్యం మన చేతుల్లోనే ఉందన్నారు. అనంతరం విద్యార్థులతో ఆల్బెండజోల్ మాత్రలు మింగించారు. దువ్వూరులో ఎంపీడీవో సుబ్బారెడ్డి పాల్గొని మాట్లాడారు. చాపాడులో జిల్లా మలేరియా అధికారిణి మనోరమ పాల్గొని విద్యార్థులకు మందులను అందించారు. **- న్యూస్‌టుడే, కర్షర్ బృందం**

భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు

గజవాహనంపై ఊరేగుతున్న గోవిందమాంబ సమేత వీరబ్రహ్మేంద్రస్వామి

బ్రహ్మంగారిమఠం, న్యూస్‌టుడే: శివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గోవిందమాంబ సమేత వీరబ్రహ్మేంద్రస్వామి మంగళవారం గజవాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం నుంచే వీరబ్రహ్మ సుప్రభాతం, నామ సంకీర్తనం వంటి పలు పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం బ్రహ్మంగారిమఠం, ఈశ్వరిదేవి అమ్మవారి మఠంలో మఠాధిపతులు వీరభద్ర వెంకటాద్రిస్వామి, వీరశివకుమారస్వామి ఆధ్వర్యంలో భక్తులకు మహాప్రసాదాన్ని అందించారు. రాత్రి వీరబ్రహ్మేంద్రస్వామి వారు పుష్పరథోత్సవంపై భక్తులకు దర్శనమిచ్చారు.

ప్రత్యేక అలంకరణలో గంగమ్మతల్లి

కొండాపురం: మండల పరిధి గండ్లూరులోని గంగమ్మ తల్లి దేవాలయం వార్షికోత్సవ వేడుకలను మంగళవారం వైభవంగా నిర్వహించారు. ముందుగా అమ్మవారిని అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు తీర్థ, ప్రసాదాలను అందజేశారు.

మైదుకూరు డిపోనకు రూ.16.57 లక్షల ఆదాయం

మైదుకూరు, న్యూస్‌టుడే: శివరాత్రి సందర్భంగా మైదుకూరు డిపో నుంచి శైవ క్షేత్రాలకు నడిపిన 44 బస్సులతో రూ.16.57 లక్షల ఆదాయం సమకూరినట్లు డిపో మేనేజర్ శ్రీలత మంగళవారం తెలిపారు. కి.మీకు రూ.74.43 ఆదాయం వచ్చినట్లు చెప్పారు. సీట్ల ఆక్యుపెన్సీ రేషియో 104 శాతం ఉన్నట్లు వెల్లడించారు.

CHANGE OF SURNAME

I, **BACHCHU SRIDEVI**, W/o **BACHCHU KIRAN KUMAR** (Old Name), resident of D.No. 18/207, Sanjeevakondiahgari Street, Prodattur Town & Mandal, YSR Kadapa Dist, AP hereby declare that I have change my name as **BACHU SRIDEVI** (New Name) for all future purposes.

CHANGE OF SURNAME

I, **BACHCHU KIRAN KUMAR**, S/o **BACHCHU VEERABRAHMAIAH** (Old Name), resident of D.No. 18/207, Sanjeevakondiahgari Street, Prodattur Town & Mandal, YSR Kadapa Dist, AP hereby declare that I have change my name as **BACHU KIRAN KUMAR** (New Name) for all future purposes.

ఆదాయానికి గండి కొడితే కఠిన చర్యలు

ప్రొద్దుటూరు పట్టణం, న్యూస్‌టుడే: పురపాలక పరిధిలోని కూరగాయల మార్కెట్, మాంసపు మార్కెట్లలో గెజిట్ ప్రకారమే పన్ను వసూలు చేస్తున్నామని కమిషనర్ రవిచంద్రారెడ్డి స్పష్టం చేశారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. భాజపా నాయకులు విమర్శిస్తున్నట్లు అవినీతి ఏమీ జరగలేదన్నారు. దీనిపై సహాయక కమిషనర్ మంజునాథగౌడ్ అధ్యక్షతన విచారణ చేయిస్తున్నారు. అధికారులు అవినీతికి పాల్పడి, పురపాలక ఆదాయానికి గండికొడితే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో సహాయక కమిషనర్ మంజునాథగౌడ్, ఆర్వో మధుసూదనబాబు, ఆర్ఐ రమేష్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కమిషనర్ రవిచంద్రారెడ్డి, సహాయక కమిషనర్ మంజునాథగౌడ్, ఆర్వో మధుసూదనబాబు

అక్రమ పన్ను వసూళ్లు ఆపాలని డిమాండ్

ప్రొద్దుటూరు పట్టణం, న్యూస్‌టుడే: ప్రొద్దుటూరు పురపాలకలో కూరగాయల, మాంసపు మార్కెట్లలోని వ్యాపారులు పన్నులు చెల్లించొద్దని భాజపా జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వెంకటసుబ్బారెడ్డి, కృష్ణ ప్రదీప్‌రెడ్డిలు చెప్పారు. పట్టణంలోని కూరగాయల మార్కెట్, చేపలు, చికెన్ షాపుల యజమానులతో మంగళవారం వారు మాట్లాడి అక్రమ పన్ను వసూళ్లపై వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ.. పురపాలకలో అవినీతికి పాల్పడుతున్న అధికారులపై ఏసీబీ దాడులు చేయాలన్నారు. వెంటనే అక్రమ పన్ను వసూళ్లు ఆపాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు కిరణ్, జిల్లా కార్యదర్శి జయలక్ష్మి, సుధాకర్‌రెడ్డి, గ్రామీణ అధ్యక్షుడు మురళీరెడ్డి, నరేంద్రరావు, గౌరీశంకర్, విక్రాంత్ పాల్గొన్నారు.

వ్యాపారులతో మాట్లాడుతున్న భాజపా నాయకులు

చదువుతో పాటు క్రీడలూ అవసరం

పెద్దముడియం, న్యూస్‌టుడే: విద్యార్థులకు శారీరక, మానసిక స్థితిని పెంపొందించాలంటే చదువుతో పాటు క్రీడలు అవసరమని తెదేపా జిల్లా పార్లమెంట్ అధికార ప్రతినిధి వంగల బ్రహ్మానందరెడ్డి అన్నారు. జంగాలపల్లె జిల్లా ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు మంగళవారం ఆయన క్రీడా పరికరాలను పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పాఠశాలకు కావాల్సిన సౌకర్యాల కల్పనలో తన వంతు సహాయం చేస్తానన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

22న చిత్రలేఖనం పోటీలు

ప్రొద్దుటూరు, న్యూస్‌టుడే: రోటరీ క్లబ్, నేత్ర వైద్యశాల ఆధ్వర్యంలో ఈ నెల 22న ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్లో 8, 9వ తరగతి చదివే విద్యార్థులకు నియోజకవర్గ స్థాయి చిత్రలేఖనం పోటీలు నిర్వహిస్తున్నామని క్లబ్ ప్రెసిడెంట్ గజ్జల వెంకటేశ్వర్ రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. లైఫ్ ఆఫ్ ట్రీ అనే అంశంపై చిత్రాలను గీయాల్సి ఉంటుందన్నారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు 9542855150 ఈ నంబరును సంప్రదించాలని కోరారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

ప్రొద్దుటూరు, న్యూస్‌టుడే: ప్రొద్దుటూరులో ఆత్మహత్య చేసుకున్న చేనేత కార్మికులు చెన్నా లక్ష్మీకాంత్ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని ఏపీ పద్మశాలి సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దశరథరామయ్య, కార్యదర్శి వెంకటేశ్వర్లు కోరారు. మంగళవారం వారు బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి ఆర్థిక సాయం చేశారు. చేనేత రంగాన్ని సర్కారు నిర్లక్ష్యం చేయడంతోనే ఆయన ఆత్మహత్యకు పాల్పడ్డారని విమర్శించారు.

హోరాహోరీగా ఎడ్ల ప్రదర్శన

మెళ్లచెరువు, న్యూస్‌టుడే: మహా శివరాత్రి వేడుకల సందర్భంగా సూర్యాపేట జిల్లా మేళ్లచెరువులో ఎడ్ల పందేలు మంగళవారం హోరాహోరీగా సాగాయి. న్యూ కేటగిరీ విభాగంలో పోటీ పడేందుకు మొత్తం 10 జతలు వచ్చాయి. వీటిలో మంగు రమాదేవి(ఇర్లపాలెం, పల్నాడు జిల్లా) గిత్తలు 5,367 అడుగుల దూరం బండ లాగి ప్రథమ బహుమతిని సాధించాయి. పుచ్చకాయల శేషాద్రి చౌదరి(ముప్పాళ్ల, ప్రకాశం జిల్లా) గిత్తలు 5,250 అడుగుల దూరం లాగి ద్వితీయ బహుమతిని గెలుచుకున్నాయి.

★ ఆరు పళ్ల విభాగంలో నెల్లూరి రామకోటయ్య(కేసానుపల్లి, పల్నాడు జిల్లా) గిత్తలు ప్రథమ బహుమతిని, వెంకటసాయి భవిత్‌రెడ్డి (ప్రొద్దుటూరు, కడప జిల్లా), అనంతనేని శ్రీకావ్య మధు (యనమలకుదురు, కృష్ణా జిల్లా) గిత్తలు ద్వితీయ స్థానంలో నిలిచాయి.

సెల్‌ఫోన్‌తో కంటి ఆరోగ్యానికి ముప్పు

ప్రొద్దుటూరు వైద్యం, న్యూస్‌టుడే: సెల్‌ఫోన్ ఎక్కువగా వినియోగించడం ద్వారా కంటి ఆరోగ్యానికి ముప్పు కలుగుతుందని వైద్యాధికారులు భరత్, మురళీకృష్ణ అన్నారు. స్థానిక పవర్‌హౌస్ రోడ్డులోని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు కంటి అద్దాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... పోషక విలువలతో కూడిన ఆహారం తసుకోవాలన్నారు. శారీరక వ్యాయామం కోసం క్రీడలు ఆడాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ అధికారి వెంకటేశ్వర్లు, ఆప్తాల్మిక్ అధికారి రమణారెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థులకు కంటి అద్దాలు పంపిణీ చేస్తున్న అధికారులు

సాగు నీటి పథకాలపై ప్రత్యేక దృష్టి

చాపాడు, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో కేసీ కాలువ రూ.156 కోట్లు, అలగనూరు ప్రాజెక్టు నిర్మాణం కోసం రూ.36 కోట్లు కేటాయించడంపై కేసీ కాలువ ప్రాజెక్టు వైస్ చైర్మన్ గురివిరెడ్డి, తెదేపా జిల్లా అధికార ప్రతినిధి మునీశ్వర్‌రెడ్డి, పీసీసీ వైస్ చైర్మన్ నరసింహారెడ్డి, మండలశాఖ అధ్యక్షుడు వెంకటసుబ్బారెడ్డి, జిల్లా ముస్లిం మైనారిటీ కార్యదర్శి అక్బర్‌సలీం హర్షం వ్యక్తం చేశారు. మంగళవారం వారు చాపాడులో మాట్లాడారు. కేసీ ఆయకట్టు కింద రెండో పంటకు నీరిచ్చిన ఘనత తెదేపాకే దక్కుతుందన్నారు. జిల్లాలో వరి రైతుల నుంచి ఎక్కువ ధాన్యం సేకరించి చాపాడు సహకార సంఘం రాష్ట్ర స్థాయిలో గుర్తింపు పొందిందన్నారు. సాగు నీటి పథకాలపై కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టిసారించిందన్నారు.

మాట్లాడుతున్న కేసీ కాలువ ప్రాజెక్టు వైస్‌చైర్మన్ గురివిరెడ్డి, పక్కన నాయకులు

కూటమి అభివృద్ధిని ఓర్వలేకే విమర్శలు

ప్రొద్దుటూరు వైద్యం, న్యూస్‌టుడే: రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేకనే కూటమి ప్రభుత్వంపై రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి విమర్శిస్తున్నారని తెదేపా రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లెల లింగారెడ్డి అన్నారు. స్థానిక కార్యాలయంలో మంగళవారం ఆయన మాట్లాడారు. బిల్‌గేట్స్ లాంటి వారే రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం పాలనను ప్రశంసించారన్నారు. గత వైకాపా పాలనలో అక్రమాలు, అరాచకాలతో రాష్ట్రాన్ని నాశనం చేశారని విమర్శించారు. కూటమి ప్రభుత్వంలో అభివృద్ధి గాడిలో పడిందన్నారు. రామునాయుడు, టప్పాబాషా పాల్గొన్నారు.

మాట్లాడుతున్న తెదేపా రాష్ట్ర ఉపాధ్యక్షుడు లింగారెడ్డి పక్కన నాయకులు

రాజకీయాలకు అతీతంగా పథకాల అమలు

జమ్మలమడుగు, న్యూస్‌టుడే: మండల పరిధిలోని కట్టకింద మారెమ్మ గుడి వద్ద తెలుగునాడు విద్యుత్తు డైరీ, క్యాలెండర్‌ను తెదేపా కడప పార్లమెంట్ అధ్యక్షుడు భూపేష్‌రెడ్డి ఆవిష్కరించారు. మంగళవారం ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో రాజకీయాలకు అతీతంగా అర్హులకు సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. కార్యక్రమంలో తెలుగునాడు విద్యుత్తు యూనియన్ నాయకులు, రాష్ట్ర క్రిస్టియన్ సెల్ ఉపాధ్యక్షుడు రమేష్ రెడ్డి పాల్గొన్నారు.

క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న తెదేపా కడప పార్లమెంట్ అధ్యక్షుడు భూపేష్‌రెడ్డి

మెడికల్ మాఫియాపై చర్యలకు విజ్ఞప్తి

జమ్మలమడుగు గ్రామీణ, న్యూస్‌టుడే: ప్రజలపై మెడికల్, ఫార్మా మాఫియా చేస్తున్న దోపిడీని అరికట్టాలని సీపీఐ నాయకులు అన్నారు. ఈ మేరకు వారిపై చర్యలు తీసుకోవాలని మంగళవారం స్థానిక ఆర్డీవో కార్యాలయంలో ఏవో అక్బాల్‌బాషాకు వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వ రంగంలో సరైన వైద్య సేవలందక ప్రజలు ప్రైవేటును ఆశ్రయిస్తున్నారన్నారు. వైద్య సేవలు, మందుల నాణ్యతా లోపాలను పట్టించుకోవడం లేదన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి చర్యలు తీసుకోవాలన్నారు. సీపీఐ పట్టణ కార్యదర్శి రాంప్రసాద్, విజయకుమార్, నారాయణ, నాగేంద్ర పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

మైదుకూరు, న్యూస్‌టుడే: పట్టణంలోని బద్వేలు రోడ్డులో గుర్తు తెలియని వృద్ధుడి (60) మృతదేహాన్ని స్థానికులు మంగళవారం గుర్తించారు. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో మృతదేహాన్ని ప్రొద్దుటూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అనారోగ్యంతో మృతి చెంది ఉండొచ్చని సీఐ కె.రమణారెడ్డి చెప్పారు.

వేధింపులు తాళలేక ఆత్మహత్యాయత్నం

ప్రొద్దుటూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: భర్త వేధిస్తున్నాడని ఓ మహిళ ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన పట్టణంలోని రామేశ్వరంలో మంగళవారం చోటుచేసుకుంది. ఎస్సై శ్రీనివాసులు తెలిపిన వివరాల ప్రకారం.. రామేశ్వరానికి చెందిన రామమూర్తి, లక్ష్మీరాజేశ్వరిని 2011లో వివాహం చేసుకున్నారు. రామమూర్తి మద్యానికి బానిసై భార్యను వేధించేవారు. ఈ విషయమై పలుమార్లు అతన్ని పెద్దలు మందలించినా మార్పు రాలేదు. సోమవారం రాత్రి కూడా అతను మద్యం తాగి రాజేశ్వరితో గొడవపడటంతో ఒంటిపై పెట్రోలు పోసుకుని నిప్పు అంటించుకున్నారు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఆమెను కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన వివరించారు.

రైల్వే డీఆర్ఎం చంద్రశేఖర్‌గుప్తాకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

సమస్యలు పరిష్కరించాలని వినతి

కొండాపురం, ఎర్రగుంట్ల, న్యూస్‌టుడే: ఎర్రగుంట్ల, కొండాపురం రైల్వేస్టేషన్‌లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని సీపీఐ, వైకాపా నాయకులు కోరారు. ఈ మేరకు గుంతకల్లులో డీఆర్ఎంను మంగళవారం వారు కలిసి వినతి పత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడారు. నంద్యాల, రేణిగుంట డెమో రైళ్లలో టాయిలెట్లతో కూడిన బోగీలను ఏర్పాటు చేయాలన్నారు. వీటి పరిష్కారానికి డీఆర్ఎం సానుకూలంగా స్పందించినట్లు వారు వివరించారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు సుబ్బారెడ్డి, జిల్లా కౌన్సిల్ మెంబర్ మనోహర్‌బాబు, వైకాపా నాయకుడు చంద్రమోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

పని ఒత్తిడి తగ్గించాలని వీఆర్వోల నిరసన

జమ్మలమడుగు గ్రామీణ, న్యూస్‌టుడే: వీఆర్వోలపై పని ఒత్తిడి తగ్గించాలని వీఆర్వోల సంఘం రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ ఏఎస్ విజ్ చైతన్య కోరారు. ఏపీ అమరావతి రెవెన్యూ ఎంప్లాయిస్ యూనియన్ జేఏసీ పిలువు మేరకు మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద వీఆర్వోలు నల్ల బాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. అనంతరం వారు మాట్లాడారు. జాబ్ చార్టులో స్పష్టత లేకుండా ఒకేసారి అన్ని పనులు చేయడంతో పని ఒత్తిడి పెరుగుతోందన్నారు. దీంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వీఆర్వోల సంఘం నాయకులు శ్రీను, సిద్ధయ్య, ఓబులేసు, హుస్సేన్, మనోజ్ పాల్గొన్నారు.

రాజుపాలెం: రీసర్వేలో పాల్గొన్న వారికి స్వర్ణ గ్రామపంచాయతీ సర్వేలో మినహాయింపు ఇవ్వాలని రెవెన్యూ అధికారులు కోరారు. ఈ మేరకు రాష్ట్ర జేఏసి ఇచ్చిన పిలుపుతో వీఆర్వోలు, గ్రామ సర్వేయర్లు స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట మంగళవారం నిరసన వ్యక్తం చేశారు. అనంతరం వారు తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం ఉపాధ్యక్షుడు అశోక్ కుమార్, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయం వద్ద నినాదాలు చేస్తున్న వీఆర్వోలు

నాణ్యమైన విద్యుత్తు సరఫరాకు కృషి

ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, న్యూస్‌టుడే: రానున్న వేసవి కాలంలో ప్రజలకు అంతరాయం లేకుండా విద్యుత్తును అందించాలని విద్యుత్తుశాఖ ఎస్ఈ రమణ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన ప్రొద్దుటూరు, జమ్మలమడుగు మండలాల్లో పర్యటించారు. ముందుగా సిరిగేపల్లెలో పర్యటించి విద్యుత్తు సమస్యలు తెలుసుకుని కొన్నింటిని అక్కడికక్కడే పరిష్కరించారు. అనంతరం ప్రొద్దుటూరు పురపాలక, శివారులోని కూడళ్ల వద్ద పర్యటించి స్మార్ట్ మీటర్ల వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పించారు. స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేసుకోవడంతో గృహ, భవన యజమానులకు బహుళ ప్రయోజనాలు ఉంటాయన్నారు.

అధికారులతో మాట్లాడుతున్న విద్యుత్తుశాఖ ఎస్ఈ రమణ

ఆర్టీపీపీలో సన్మాన సభ

ఎర్రగుంట్ల, న్యూస్‌టుడే: నేషనల్ థర్మల్ పవర్ కార్పొరేషన్ నుంచి డాక్టర్ ఎంవీఆర్ ఆర్టీపీపీ సంస్థ పర్ఫామెన్స్ ఎక్సలెన్సీ అవార్డును అందుకున్న నేపథ్యంలో సీఈ వాసుదేవరావును ఉద్యోగులు, అధికారులు, కార్మికులు సన్మానించారు. మంగళవారం ఆర్టీపీపీలోని సమావేశ భవనంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర విద్యుత్తు ఉత్పత్తి రంగంలో ఈ అవార్డు రావడం ఆనందంగా ఉందన్నారు. అధికారుల బృందం, ఉద్యోగులు, కాంట్రాక్టు కార్మికుల సమిష్టి కృషితో ఈ అవార్డు సాధించినట్లు వివరించారు.

మహానంది గొడవయ్యగారి జూనియర్ సివిల్ జడ్జి కోర్టు, మైదుకూరు

OS No. 67/2023

Canara Bank (erstwhile Syndicate Bank), Represented by its Branch Manager, Khajipeta Branch, YSR Kadapa District. ..... వాది

V/s

D.Ganganna, S/o Gangalah, Hindu, aged about Years, Agriculture & Business, residing at Kothuru Village, Khajipeta Mandal, YSR Kadapa District. .... 2వ ప్రతివాది

పై కేసు 31.03.2026వ తేదీన ఉదయం గం. 10.30 ని.లకి పై తెలిపిన కోర్టు నందు వాయిదా ఉన్నది. కావున మీరు స్వయంగా గానీ, మీ తరఫున వకీలు ద్వారా గానీ హాజరయ్యి, మీ అక్షేపణలు తెలుపుకొనవలెను. లేనియెడల మీ పరోక్షమునందు కేసు తీర్మానించబడును.

By Order of the Court

కె.వెంకటసుబ్బయ్య, B.A., B.L., వాది తరఫు న్యాయవాది, Cell : 9704890225.

మహానంది గొడవయ్యగారి జూనియర్ సివిల్ జడ్జి కోర్టు, మైదుకూరు

OS No. 107/2023

Canara Bank (erstwhile Syndicate Bank), Represented by its Branch Manager, Khajipeta Branch, Khajipeta Mandal, YSR Kadapa District. ..... వాది

V/s

1. Putha Venkata Narayana Reddy, S/o P. Konda Reddy, Hindu, aged about Years, Agriculturist & Business, residing at Kothagiripalli Village, Kotturu Post, Khajipeta Mandal, Kadapa District.
2. Guttireddy Nagi Reddy, S/o G. Chinna Nagi Reddy, Hindu, aged about Years, Agriculturist & Business, residing at Kothagiripalli Village, Kotturu Post, Khajipeta Mandal, Kadapa District.

1వ మరియు 2వ ప్రతివాదులకు సమన్లు

పై కేసు 30.03.2026వ తేదీన ఉదయం గం. 10.30 ని.లకి పై తెలిపిన కోర్టు నందు వాయిదా ఉన్నది. కావున మీరు స్వయంగా గానీ, మీ తరఫున వకీలు ద్వారా గానీ హాజరయ్యి, మీ అక్షేపణలు తెలుపుకొనవలెను. లేనియెడల మీ పరోక్షమునందు కేసు తీర్మానించబడును.

By Order of the Court

కె.వెంకటసుబ్బయ్య, B.A., B.L., వాది తరఫు న్యాయవాది, Cell : 9704890225.





(c) eenadu

కడప

• కడప • పులివెందుల • కమలాపురం

భక్తిశ్రద్ధలతో రాహుకాల పూజలు

అమ్మవారు

పూజలకు హాజరైన భక్తులు

మారుతీనగర్, న్యూస్‌టుడే : స్థానిక బిల్టప్ సమీపంలో వెలసిన విజయదుర్గాదేవి ఆలయంలో మంగళవారం రాహుకేతు పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మహాకాళి, మహాలక్ష్మి, మహా సరస్వతి స్వరూపిణీ అయిన విజయదుర్గాదేవి అమ్మవారికి తెల్లవారుజాము నుంచి ప్రత్యేక పూజలు, అలంకరణలు చేశారు. వేదమంత్రాల నడుమ పంచామృతాభిషేకం నిర్వహించి అనంతరం రాహుకాల పూజలు చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

ఈ-పంట నమోదు పక్కాగా చేయండి

కడప వ్యవసాయం, : జిల్లాలో ఈ-పంట నమోదు పక్కాగా చేయాలని వ్యవసాయశాఖ జిల్లా అధికారి చంద్రానాయక్ అన్నారు. మంగళవారం ఆయన కడపలోని తన కార్యాలయ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వం అమలు చేసే ప్రతి కార్యక్రమ ఫలాలు రైతులకు చేరేలా చూడాలన్నారు. కార్యక్రమంలో ఏడీలు లక్ష్మీమాధవి, మాధవి, రైతు సేవా కేంద్రం సిబ్బంది, పాల్గొన్నారు.

చింతకొమ్మదిన్నె : ఖరీఫ్ సీజన్ ప్రారంభానికి ముందే భూసార పరీక్ష ఫలితాలు పూర్తి చేయాలని జిల్లా వ్యవసాయాధికారి చంద్రానాయక్ అన్నారు. మంగళవారం ఆయన మండలంలోని భూసార పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఈ ఏడాది ఇచ్చిన లక్ష్యాలను సకాలంలో పూర్తి చేసి రైతులకు అందించాలన్నారు. కార్యాలయంలోని పలు దస్త్రాలను పరిశీలించారు. వ్యవసాయాధికారులకు పలు సూచనలు సలహాలు ఇచ్చారు.

శిరస్త్రాణం ధరింపు తప్పనిసరి

ఏడురోడ్ల కూడలిలో వాహనాలను తనిఖీ చేస్తున్న డీఎస్పీ వెంకటేశ్వర్లు, సీఐ చిన్నపెద్దయ్య

కడప నేరవార్తలు, న్యూస్‌టుడే: రోడ్డు ప్రమాదాలపై వాహనదారులు అప్రమత్తంగా ఉండాలని కడప డీఎస్పీ వెంకటేశ్వర్లు అన్నారు. కడప ఏడు రోడ్ల కూడలి వద్ద మంగళవారం డీఎస్పీ ఆధ్వర్యంలో వాహనదారులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. చోదకులకు కౌన్సెలింగ్ చేశారు. శిరస్త్రాణం ధరించాలని, సీటు బెల్ట్ పెట్టుకోవాలని సూచించారు. ముమ్మరంగా వాహనాల తనిఖీలు చేపట్టారు. పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోవద్దని ఆటో చోదకులకు సూచించారు. కార్యక్రమంలో సీఐ చిన్న పెద్దయ్య, ఎస్సై ప్రదీప్ పాల్గొన్నారు.

పెండ్లిమర్రి : వాహన చోదకులు రహదారి నియమాలు పాటిస్తూ ప్రయాణం సాగించినప్పుడే సురక్షితంగా గమ్యం చేరవచ్చని ఎస్ఐ తులసీ నాగప్రసాద్ పేర్కొన్నారు. మంగళవారం ప్రధాన రహదారిలో పెండ్లిమర్రిలో వాహనాలు తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా వాహన చోదకులు ప్రతి ఒక్కరూ శిరస్త్రాణం తప్పనిసరిగా ధరించాలని, వాహనానికి సంబంధించిన పత్రాలు కలిగి ఉండాలని ఆయన వాహనదారులకు సూచించారు. సరైన పత్రాలులేని వాహనాలకు జరిమానా విధించారు.

మురుగు కదలక.. దుర్వాసన వీడక

నగరపాలక అధికారుల నిర్లక్ష్యం

కుమ్మరికుంట కాలువలో పేరుకుపోయిన వ్యర్థాలు

కడప చిన్నచౌకు, న్యూస్‌టుడే : నగరపాలక సంస్థ అధికారులు నగరంలోని కొన్ని ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనపై నిర్లక్ష్యం వహిస్తున్నారు. ఇందుకు నిదర్శనం ఖలీల్‌నగర్, కుమ్మరికుంట, నకాష్ తదితర ప్రాంతాల్లో నెలకొన్న మురుగు వ్యవస్థే చక్కటి ఉదాహరణ. ఈ ప్రాంతాల్లో ప్రాంతాల్లో పారిశుద్ధ్యం లోపించింది. కాలువలు అధ్వానంగా ఉన్నాయి. చెత్తాచెదారం, వ్యర్థాలతో కాలువలు నిండిపోయాయి. ప్రజలు వాటి మధ్యనే జీవనం సాగిస్తున్నారు. రెండు రోజుల్లో రంజాన్ మాసం ప్రారంభమవుతున్న నేపథ్యంలో ఆయా కాలనీల్లో పారిశుద్ధ్యంపై దృష్టి సారించి శుభ్రం చేయాలని ప్రజలు కోరుతున్నారు.

● మున్సిపల్ అధికారులు, పాలకులు ఆ కాలనీల వైపు కన్నెత్తి చూడటం లేదు. కుమ్మరికుంటలోని కాలువల్లో పూడిక పేరుకుపోయింది. చాలాచోట్ల చెత్తాచెదారం, వ్యర్థాలతో నిండిపోయింది. నెలల తరబడి కాలువలు శుభ్రం చేయడం లేదు. మురుగు పారక పరిసరాలు దుర్వాసన వస్తున్నాయి. దోమలు ఉద్ధృతి పెరిగి.. స్థానికులకు నిద్ర కరవైంది. పూడిక తొలగించకపోవడంతో వర్షం కురిసినప్పుడు కాలువలు నిండి మురుగు రోడ్డెక్కుతోంది.

● ఖలీల్‌నగర్‌లో కాలువలు ప్రమాదకరంగా ఉన్నాయి. కనీసం వాటిపై బండలు కూడా వేయలేదు. పిల్లలు పొరపాటున కాలువల్లో పడే పరిస్థితులున్నాయి. రోడ్డు కూడా చాలా చిన్నగా ఉండటంతో వాహనదారులు అదుపు తప్పితే నేరుగా కాలువలోకి దూసుకెళ్తారు. రోడ్లు కూడా అధ్వానంగా ఉన్నాయి.

ఖలీల్‌నగర్‌లో ప్రమాదకరంగా కాలువ

పూడిక తీయడం లేదు : కుమ్మరికుంట, ఖలీల్‌నగర్, నకాష్ తదితర ప్రాంతాల్లో మురుగు వ్యవస్థ అధ్వానంగా మారింది. కాలువలు పూడికలు, చెత్తాచెదారంతో నిండిపోయాయి. దోమల బెడద అధికంగా ఉంది. రోజూ కాలువలు శుభ్రం, ఫాగింగ్ చేయాలి. - మస్తాన్, కుమ్మరికుంట

రెవెన్యూ ఉద్యోగుల నిరసన

వీఎన్ పల్లె : నినాదాలు చేస్తున్న వీఆర్‌వోలు, సర్వేయర్లు, వీఆర్ఏలు

వీరపునాయునిపల్లె, న్యూస్‌టుడే : వీఆర్‌వోలు పని ఒత్తిడి వల్ల రోడ్డు ప్రమాదాల బారిన పడుతున్నారని, ఆత్మహత్యలు చేసుకుంటున్నారని, వాటికి ఉన్నతాధికారులే కారణమని వీఆర్‌వోలు, సర్వేయర్లు, వీఆర్ఏలు ఆరోపించారు. మంగళవారం వీరపునాయునిపల్లె తహసీల్దారు కార్యాలయం ఎదుట భోజన విరామ సమయంలో వారు నిరసన తెలిపారు. కార్యక్రమంలో వీఆర్‌వోలు రఫీ, లివింగ్‌స్టోన్, బాబా, బాషావల్లి, మల్లికార్జున, మహేశ్‌బాబు సర్వేయర్లు సాగర్, శివ, మనీషా, రాజు, వీఆర్ఏలు సుబ్బయ్య, మధు, లక్ష్మీనారాయణ, ముస్తఫా, అమీనా, లక్ష్మి, కేశవ పాల్గొన్నారు.

పెండ్లిమర్రి : వీఆర్వోలపై పనిభారం తగ్గించాలని కోరుతూ మంగళవారం పెండ్లిమర్రి తహసీల్దారు కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దారు నరసింహులుకు వీఆర్వోలు వినతి పత్రం సమర్పించారు. వీఆర్వోలు ఇబ్బందులు ప్రభుత్వం గుర్తించి తగు చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

వేరుసెనగ పంట పరిశీలన

కమలాపురం, న్యూస్‌టుడే : వేరుసెనగ విత్తన 40 నుంచి 50 రోజుల మధ్య కాలంలో ఎకరాకు 200 కిలోల చొప్పున జిప్సం వాడితే గింజ నాణ్యత పరిమాణం, నూనె శాతం పెరుగుతుందని ఊటుకూరు ఆర్ఎస్ఏ ప్రిన్సిపల్, శాస్త్రవేత్త డాక్టర్ సునీల్‌కుమార్ అన్నారు. మంగళవారం మండలంలోని పెద్ద చెప్పలి, దాదిరెడ్డిపల్లె, దేవరాజుపల్లె గ్రామాల్లో సాగులో ఉన్న వరి, వేరుసెనగ పంటలను పరిశీలించి సూచనలు చేశారు. ఏడీఏ నరసింహారెడ్డి, ఏవో సరస్వతి మాట్లాడారు. వీపీఏ శ్రీలత, రైతులు పాల్గొన్నారు.

శనగ రైతులను ఆదుకోరూ..

చక్రాయపేట (వేంపల్లె): ప్రభుత్వం శనగ కేంద్రాలను ఏర్పాటు చేసి రైతులను ఆదుకోవాలని మాజీ ఎంపీ, రాష్ట్ర కాంగ్రెస్ ముఖ్య అధికార ప్రతినిధి తులసిరెడ్డి డిమాండు చేశారు. మంగళవారం వేంపల్లెలోని చింతల మడుగుపల్లెలో శనగ పంటలను కాంగ్రెస్ నాయకులతో కలిసి ఆయన పరిశీలించారు. అనంతరం రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడుతో మాట్లాడారు.

CHANGE OF NAME

I Ramireddy Vanaja Kumari (Old Name), W/o Bhupati Raju Viswanatha Varma, resident of 2/6, Lomada, Kadapa Dist. A.P. 516401, Here by declare that I have changed my name as **Bhupati Raju Vanaja Kumari (New Name)** for all purposes.

నైపుణ్యాలుంటేనే ఉజ్వల భవిత

మారుతీనగర్: మారుతున్న కాలానికి అనుగుణంగా ఆధునిక జ్ఞానంతో పాటు ఉద్యోగ నైపుణ్యాలు ఒడిసి పట్టుకున్న వారే ముందు వరుసలో ఉంటారని వైవీయూ ఉప కులపతి ఆచార్య రాజశేఖర్ పేర్కొన్నారు. వైవీయూ ప్లేస్‌మెంట్ సెల్, మ్యాజిక్ బస్ సంస్థ ఆధ్వర్యంలో విశ్వవిద్యాలయ విద్యార్థుల ప్రయోజనార్థం ఉద్యోగ నైపుణ్యాలపై 8 రోజుల శిక్షణ తరగతులు వీసీ మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ.. శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకుని తర్వాత జరగబోయే ప్లేస్‌మెంట్ డ్రైవ్‌లో ఉద్యోగం సాధించాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ ఆచార్య శ్రీనివాస్, ప్లేస్‌మెంట్ సెల్ డైరెక్టర్ ప్రొఫెసర్ విజయభాస్కర్, మ్యాజిక్ బస్ సంస్థ ప్రోగ్రాం మేనేజరు వెంకటప్రసాద్, ప్లేస్‌మెంట్ సెల్ సభ్యులు డాక్టర్ మురళీధర్‌రెడ్డి, సుశీల్‌కుమార్ పాల్గొన్నారు.

విద్యుత్తు సరఫరా వేళలు మార్పు

వేముల : వేంపల్లి సబ్‌స్టేషన్ పరిధిలో ఉండే వ్యవసాయ బోరు బావులకు విద్యుత్తు సరఫరా వేళలు మార్పు చేసినట్లు విద్యుత్తు శాఖ ఏఈ శ్రీనివాసులు తెలిపారు. ఇదివరకు పగటి వేళలో తొమ్మిది గంటలు విద్యుత్తు సరఫరా అయ్యేదన్నారు. మంగళవారం నుంచి రెండు విడతల్లో తొమ్మిది గంటలు సరఫరా చేస్తున్నట్లు చెప్పారు. ఉదయం 6 నుంచి 11 గంటల వరకు, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 6 గంటల వరకు రెండు విడతల్లో తొమ్మిది గంటలు విద్యుత్తు సరఫరా చేస్తామన్నారు. ఈ విషయాన్ని వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

రైల్వే అండర్ బ్రిడ్జి పనులు చేయాలి

మారుతీనగర్: నగరంలోని యర్రముక్కపల్లె - అంగడివీధి రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేయాలని సీపీఎం నగర కార్యదర్శివర్గ సభ్యులు రామ్మోహన్ డిమాండు చేశారు. మంగళవారం స్థానిక యర్రముక్కపల్లె కూడలిలో ముఖ్య నాయకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు కుమారస్వామిరెడ్డి, రామకృష్ణారెడ్డి, నరసింహ, తిమ్మయ్య, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

క్రీస్తు ప్రేమ అత్యున్నతమైనది

దైవసేవకులు దాసరి ప్రసాద్‌ను సత్కరిస్తున్న పాస్టర్లు

అరవిందనగర్ (కడప), న్యూస్‌టుడే : క్రీస్తు ప్రేమ మానవాళికి అత్యున్నతమైనదని, ఆయన ప్రేమ కోసం అందరూ ప్రార్థించాలని దైవ సేవకులు దాసరి ప్రసాద్ పేర్కొన్నారు. మంగళవారం కడప నగరంలోని పేట ఏబీఎం ప్రార్థన మందిరంలో పాస్టర్ సుధాకర్ ఆధ్వర్యంలో దైవసేవకుల ఆత్మీయ సదస్సు జరిగింది. ఈ సందర్భంగా గుంతకల్లు పట్టణానికి చెందిన దైవ సేవకులు ప్రసాద్ మాట్లాడుతూ బైబిల్‌లోని ప్రతి వ్యాక్యం ఆణిముత్యాల్లాంటివని, ప్రతి దినం వాటిని చదువుకుంటే వారి కుటుంబాలపై దేవుడు గొప్ప కార్యక్రమాలతో మేలుచేస్తాడని స్పష్టం చేశారు. అనంతరం నూతన సంవత్సర క్యాలెండర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఏబీఎం జిల్లా అధ్యక్షుడు మళ్లం విజయభాస్కర్, బిషప్‌లు శామ్యూల్‌బాబు, దేవన్న, పాస్టర్లు దేవదీరాజ్, విజయశేఖర్, దేవ ప్రసాద్, ప్రసన్నకుమార్, జాన్సన్, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

అట్రాసిటీ కేసులపై చర్యలు శూన్యం

మారుతీనగర్, న్యూస్‌టుడే : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత జిల్లాలో దళిత, గిరిజనులపై దాడులు విపరీతమయ్యాయని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం జిల్లా కార్యదర్శి బండి జకరయ్య, రాష్ట్ర కమిటీ సభ్యులు సుబ్బన్న ఆందోళన వ్యక్తం చేశారు. మంగళవారం స్థానిక జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. బ్రహ్మంగారి మఠంలో దళిత యువకుని హత్య, సంబంధం లేకపోయినా దళితుని ఇంటిపై దాడి, కులం పేరుతో దూషణ, కడప యర్రముక్కపల్లె కూడలిలో ఇంటి కూల్చివేత జరిగినా అధికారులు తీసుకున్న చర్యలు శూన్యమని ఆరోపించారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులపై అధికారులు చర్యలు తీసుకోవడం లేదన్నారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు దేవుని కడప నరసింహ, నగర కార్యదర్శి నరసింహ పాల్గొన్నారు.

అనుమతుల్లేని విద్యాసంస్థలపై చర్యలేవి ?

కడప విద్య : అనుమతులు లేని విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ మంగళవారం కడపలోని ఎంఈవో కార్యాలయం ఎదుట రెవల్యూషనరీ స్టూడెంట్ యూనియన్ (ఆర్ఎస్‌యూ) ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్ఎస్‌యూ నాయకులు మాట్లాడుతూ నిబంధనలు పాటించని విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలని డిమాండు చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యుడు గురుమోహన్, జిల్లా ఉపాధ్యక్షుడు కొండయ్య, నగర కార్యదర్శి జశ్వంత్ సాయి, కార్యదర్శి వంశీ, నాయకులు ప్రేమ్, కిరణ్, సందీప్, ప్రమోద్ తదితరులు పాల్గొన్నారు.

నేడు దిన్నెపాటి గంగమ్మ తిరునాల

పులివెందుల: పులివెందులలోని శ్రీదిన్నెపాటి గంగమ్మ అమ్మవారి తిరునాల బుధవారం నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. ఆలయంలో గంగమ్మకు తెల్లవారుజామున నుంచి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు, కుంకుమార్చనలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆలయం వద్ద బండలాగుడు ప్రదర్శన నిర్వహిస్తున్నామన్నారు.

SHRIRAM Finance

శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్

రిజిస్టర్డ్ ఆఫీస్: శ్రీ టవర్స్, ప్లాట్ నెం.14ఎ, సౌత్ ఫేజ్, ఇండస్ట్రియల్ ఎస్టేట్, గిండీ, చెన్నై- 600032, వెబ్‌సైట్: www.shriramfinance.me. బ్రాంచ్ కార్యాలయము : డి.నెం.19/228 & 229, 2వ అంతస్తు, బివిఆర్ టవర్స్, గోకుల్ టవర్స్ ఎదురుగా, కడప

డిమాండ్ నోటీసు

శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ (గతంలో శ్రీరామ్ సిటీ యూనియన్ ఫైనాన్స్ లిమిటెడ్‌గా ఉండి శ్రీరామ్ ట్రాన్స్‌పోర్టు ఫైనాన్స్ లిమిలెడ్‌తో విలీనమైన తరువాత ఎన్‌సిఎల్‌టి బెంచ్-2 చెన్నై తేది: 09.11.2022వారి ఆదేశాలతో శ్రీరామ్ ఫైనాన్స్ లిమిలెడ్ గా రూపాంతరం చెందిన తర్వాత కార్పొరేట్ ఫైనాన్స్ మంత్రిత్వ శాఖ లేఖ తేది: 30.11.2022 ద్వారా శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్‌గా పేరు మార్పునకు ఆమోదము లభించినది) ఈ కంపెనీ కంపెనీల చట్టం, 2013 క్రింద రిజిష్టరు కాబడినది మరియు ఆర్‌బిఐ నందు కూడా నాన్ బ్యాంకింగ్ ఫైనాన్స్ వ్యాపార కార్యకలాపాలు నిర్వహించుటకు రిజిష్టరు కాబడి వారి రిజిష్టరు కార్యాలయం: శ్రీ టవర్స్, ప్లాట్ నెం.14ఎ, సౌత్ ఫేజ్, ఇండస్ట్రియల్ ఎస్టేట్, గిండీ, చెన్నై-600032 నందు నమోదు కాబడినదని తెలియజేయడమైనది. బ్రాంచ్ కార్యాలయము: కడప-1 (ఇకపై కంపెనీ / లెండర్‌గా వ్యవహరించబడతారు)

ఈక్రింద పేర్కొన్న రుణగ్రహీత /సహరుణగ్రహీతలు / గ్యారంటీదారులు శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ (ఎస్ఎఫ్ఎల్) వారి వద్ద రుణ సౌకర్యము పొంది ఉన్నారు. రుణ సౌకర్యము పొందిన తర్వాత సదరు రుణగ్రహీతలు/ గ్యారంటీదారులు రుణము మరియు దానిపై వడ్డీని తిరిగి చెల్లించుటలో పలుమార్లు విఫలమైనారు.కావున సదరు అకౌంట్ రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా నియమ నిబంధనలు అనుసరించి నిరర్థక ఆస్తులుగా వర్గీకరించబడినది. తదుపరి శ్రీరామ్‌ఫైనాన్స్ లిమిటెడ్ (ఎస్ఎఫ్ఎల్) యొక్క అధీకృత అధికారి గారు సెక్యూరిటీ మరియు ఆర్థిక ఆస్తుల పునర్నిర్మాణం మరియు భద్రతా చట్టం, 2002 నిబంధన క్రింద సెక్యూరిటైజేషన్ మరియు రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ మరియు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 (సదరు యాక్ట్) మరియు దాని ద్వారా ఆపాదించబడిన అధికారాలను బట్టి రూలు 3తో చదువబడిన సెక్షన్ 13(2) ప్రకారం సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) నియమాల (పేర్కొన్న నియమాలు) ను అనుసరించి ఋణగ్రహీత / గ్యారంటీదారులు /తనఖాదారులకు డిమాండ్ నోటీసును మరియు దానిపై అంగీకరింపబడిన వడ్డీ రేటుతో పాటు ఉత్పన్నమగు ఖర్చులు, ఇతర ఛార్జీలను నోటీసు అందుకున్న 60 రోజులలోపు చెల్లించవలసినదిగా కోరి వున్నారు.

వారు చివరగా తెలిపిన అడ్రసుకు జారీ చేసిన సదరు నోటీసు వారికి చేరక రిటర్న్ అయినది. కావున ఇందుమూలముగా పబ్లిక్ నోటీసు ద్వారా వారికి సదరు విషయము తెలియజేయడమైనది. సదరు చట్టములో సెక్షన్ 13 యొక్క సబ్‌సెక్షన్(8) ద్వారా రుణగ్రహీతకు తెలియజేయడమేమనగా సెక్యూర్డ్ ఆస్తులను విడిపించుకొనుటకు గల అవకాశమును వారి దృష్టికి తీసుకురావడమైనది.

రుణగ్రహీతలు, సహ రుణగ్రహీతలు, గ్యారంటీదారుల పేర్లు మరియు చిరునామా

1) బి.నాగేంద్ర తండ్రి బి.లక్ష్మయ్య, డి.నెం.37-1040-3, నెహ్రూ నగర్, కడప - 516002
2) బొరెడ్డి గుర్రమ్మ, భర్త బి.లక్ష్మయ్య, డి.నెం.2/1029, నెహ్రూనగర్, చిన్నచౌక్, కడప - 516002
3) కాశెట్టి హర్షవర్ధన్, తండ్రి కాశెట్టి వెంకటరామయ్య, డి.నెం.41/677, శంకరాపురం, కడప - 516002

ఎన్‌పిఏ తేది: 10.05.2025 డిమాండ్ నోటీసు తేది: 14.01.2026
ఋణ మొత్తం రూ.20,00,000 (ఇరవై లక్షల రూపాయలు మాత్రమే)
రుణఅగ్రిమెంట్ నెం. CUDP2TF2406270006
బకాయి అమౌంట్: రూ.24,70,940/- (ఇరవై నాలుగు లక్షల డెబ్బై వేల తొమ్మిది వందల నలభై రూపాయలు మాత్రమే)

స్థిరాస్తి వివరములు

వైయస్.ఆర్. కడపజిల్లా, కడప సబ్‌జిల్లా,కడప మున్సిపల్‌కార్పొరేషన్ చిన్నచౌక్ గ్రామలెక్కధాఖలా వార్డు నెం.2, నెహ్రూనగర్ రెసిడెన్షియల్ ఏరియా, సర్వే నెం. 59/బి1 లో ఎ.0.03సెంట్లు. ఇందున తూర్పువైపు విస్తీర్ణం ఎ.0.01 1/2 సెంట్లు లేదా 72.6 చ.గ. స్థలం ఇందున వున్న డి.నెం.37/1040-3 గల ఇల్లు. హద్దులు: తూర్పు: ఎం.వెంకటరమణయ్య స్థలం, పడమర: ఎం.గంగయ్య, స్థలం, ఉత్తరం: కె.సి.కెనాల్ దక్షిణం: 14 లింకుల వెడల్పు గల రోడ్డు. ఈ హద్దుల మధ్య స్థలానికి కొలతలు: తూర్పు నుండి పడమర: 23 3/4 లింకులు లేదా 4.77 మీ. ఉత్తరం నుండి దక్షిణం: 63 లింకులు లేదా 12.80 మీ. వెరశి 72.6 చ.గ., ద్వారములు, ద్వారబంధనములు, ఎలక్ట్రికల్ ఫిట్టింగ్‌లు మరియు ఫిక్చర్లు తదితరాలతో సహా.

ఈ పరిస్థితులలో రుణగ్రహీతలు, సహ రుణగ్రహీతలు మరియు గ్యారంటీదారులకు తెలియజేయడమేసగా ఈ పత్రికా ప్రకటన వెలువడిన రోజు నుండి 60 రోజులలోపు పైన పేర్కొన్న ఋణ మొత్తము భవిష్యత్ వడ్డీతోపాటు మరియు ఇతర ఖర్చులను చెల్లించవలెను. 60 రోజుల వ్యవధి దాటిన తర్వాత సెక్యూరిటైజేషన్ మరియు రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ మరియు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 యొక్క సెక్షన్ 13(4)ను అనుసరించి రుణగ్రహీత, తనఖాదారుకు చెందిన సెక్యూర్డ్ ఆస్తులను స్వాధీన పరచుకొనుటకు చర్యలు చేపట్టబడునని తెలియజేయడమైనది.

సదరు చట్టంలోని సెక్షన్13(13)ను అనుసరించి రుణగ్రహీతకు చెందిన సెక్యూర్డ్ ఆస్తులపై మా సంస్థ ముందస్తు అనుమతి లేకండా ఇతరులకు బదలాయించుట, అమ్మకము మరియు లీజుకు ఇవ్వడం ఇంకా ఏ ఇతర లావాదేవీలు చేయరాదని తెలియజేయడమైనది.

ప్రదేశం: కడప సం/- అధీకృత అధికారి,
తేది: 17.02.2026 శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్

ట్రిపుల్ ఐటీ ఇన్‌ఛార్జి డైరెక్టర్ నియామకం

చక్రాయపేట (వేంపల్లె), న్యూస్‌టుడే : ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ కుమారస్వామిగుప్తా అధికారిక పర్యటనపై దుబాయి వెళ్లడంతో ఆయన స్థానంలో నూజివీడు క్యాంపస్‌లో సివిల్ ఇంజినీరింగ్ ఆచార్యులు ఎస్ఎస్ఎస్‌వీ గోపాల్‌రాజును ఇన్‌ఛార్జి డైరెక్టర్‌గా నియమించారు. మంగళవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు.

సమస్యలపై ఎంపీకి రైతుల విన్నపం

పులివెందుల, న్యూస్‌టుడే : పంటకు గిట్టుబాటు ధర విషయంపై రైతులు మంగళవారం పులివెందులలో కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డిని కలిశారు. వైకాపా కార్యకర్తలు, ప్రజలు, రైతులు పలు సమస్యలు ఆయనకు వివరించారు. బుడ్డ శనగకు మద్దతు ధర కల్పించాలని, బీమా చెల్లింపు తదితర సమస్యలు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై కలెక్టర్‌కు వివరించామని ఎంపీ పేర్కొన్నారు.

వైవీయూలో క్రీడా పోటీలు

వై.వీయూ: యోగి వేమన విశ్వవిద్యాలయ, కళాశాల 21వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మంగళవారం వేమన క్రీడా మైదానంలో మహిళలకు క్రీడాపోటీలు వైవీయూ కుల సచివులు ఆచార్య పుత్తా పద్మ, వ్యాయామ క్రీడా శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ రామసుబ్బారెడ్డి ప్రారంభించారు. ఈ క్రీడా పోటీల్లో విద్యార్థులు, పరిశోధక విద్యార్థులు, బోధన, బోధనేతర మహిళా సిబ్బంది పోటీల్లో పాల్గొన్నారు.

ఉద్యోగోన్నతులు కల్పించాలని వినతి

కడప విద్య: ఇంటర్ విద్యా విభాగంలో నాన్ టీచింగ్ సిబ్బందికి ఉద్యోగోన్నతులు కల్పించాలని కోరుతూ మంగళవారం కడపలో ఆర్‌జేడీ సురేష్‌బాబుకు ఎంప్లాయీస్ సర్వీసెస్ అసోసియేషన్ నాయకులు వినతిపత్రం సమర్పించారు. ఆర్జేడీని కలిసిన వారిలో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాసులు, తిరుపతి జిల్లా అధ్యక్షుడు మునిచంద్ర, కడప జిల్లా అధ్యక్షుడు సురేష్, జోన్ 4 రాష్ట్ర కార్యదర్శి మల్లికార్జునరాజు తదితరులున్నారు.

భూ హద్దులు ఏర్పాటుకు వినతి

చక్రాయపేట, న్యూస్‌టుడే : చక్రాయపేట మండలంలోని కుమారకాలువ గ్రామంలో ఖాద్రియా మసీదుకు చెందిన భూములు సర్వే చేయించి హద్దులు ఏర్పాటు చేయాలని తెదేపా మైనార్టీ నాయకుడు కరీముల్లా కోరారు. మంగళవారం చక్రాయపేట తహసీల్దారు కార్యాలయంలో విజయకుమారికి ఆయన వినతి పత్రం అందజేశారు. మసీదు భూములు ప్రస్తుతం ఉన్న కమిటీ సభ్యులు సాగు చేసుకుంటున్నారన్నారు. మసీదుకు చెందిన భూములకు కొందరు వారి పేర్లతో పట్టాదారు పుస్తకాలు పొందారన్నారు.

పులివెందులలో ఇరు వర్గాల ఘర్షణ

పులివెందుల, న్యూస్‌టుడే : పులివెందులలోని నగరిగుట్టలో మంగళవారం రాత్రి ఇరు వర్గాల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. రవి, డేనియల్ ఇంటిపైన వేదకుమార్, మరికొందరు కలిసి రాళ్లు, బీరు సీసాలతో దాడి చేశారు. ఇంటి కిటికీ అద్దాలు పగలకొట్టారు. ఇంటి ముందు ఉన్న రెండు ద్విచక్ర వాహనాలు ధ్వంసం చేశారు. దీంతో రవి, డేనియల్‌కు సంబంధించిన వారు వచ్చి ఘర్షణకు దిగారు. ఈ విషయం తెలుసుకున్న పులివెందుల పట్టణ సీఐ సీతారామిరెడ్డి, తన సిబ్బందితో కలిసి ఘటనా స్థలానికి చేరుకుని ఇరు వర్గాలను చెదరగొట్టారు. ఘర్షణపై ఫిర్యాదు ఇవ్వలేదని సీఐ తెలిపారు.

నులిపురుగుల నివారణతో ఆరోగ్యం

చిన్నారులకు నులిపురుగుల మాత్ర వేస్తున్న వైద్యాధికారి శాంతికుమార్, ప్రిన్సిపల్ శ్రీనివాసులు

పులివెందుల, న్యూస్‌టుడే : పిల్లలు ఆరోగ్యంగా ఉంటేనే విద్యలో రాణిస్తారని బాకరాపురం పీహెచ్‌సీ వైద్యాధికారి శాంతికుమార్, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ ఎం.శ్రీనివాసులురెడ్డి అన్నారు. మంగళవారం పులివెందులలోని కడప రోడ్డులో ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో వైద్య సిబ్బందితో కలిసి విద్యార్థులకు నులిపురుగుల నివారణ కోసం మాత్రలను, ద్రావకాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఉన్న నులిపురుగుల వల్ల ఆరోగ్యం క్షీణిస్తుందని, వాటి నివారణకు ఆల్బెండజోల్ మాత్రలు మింగాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌వో ఎన్.సతీష్‌కుమార్, ఏఎన్ఎం ప్రేమలత పాల్గొన్నారు.

లింగాల : లింగాల ఉన్నత పాఠశాలలో మంగళవారం విద్యార్థులతో నులిపురుగు మాత్రలు తినిపించారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాసరెడ్డి, పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రసన్నకుమార్, ఎంఈవో రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

చోరీ ఘటనపై డీఎస్పీ ఆరా

చోరీ ప్రదేశాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ వేంకటేశ్వర్లు

చెన్నూరు : చెన్నూరు గ్రామంలో సోమవారం ఒకే రోజు నాలుగు ఇళ్లల్లో జరిగిన చోరీ ఘటనపై మంగళవారం డీఎస్పీ వేంకటేశ్వర్లు ఆరా తీశారు. ఘటన జరిగిన నేపథ్యం, బాధితులు పోగొట్టుకున్న వస్తువుల వివరాలు, ఘటనకు పాల్పడిన అనుమానితులకు చెందిన ఆధారాలను నేర విభాగ అధికారులతో కలిసి సేకరించారు. చోరీ ఘటన జరిగిన సమీపాన ఆ రాత్రి పని చేసిన చరవాణిల నంబర్లు, దుండగలు వాడిన చరవాణిల వివరాలపై ప్రత్యేక నిఘా ఉంచారు. కార్యక్రమంలో సీఐ కృష్ణారెడ్డి, పోలీసులు పాల్గొన్నారు.

బిహార్ మాజీ సీఎం ఠాగూర్‌కు నివాళి

మారుతీనగర్, న్యూస్‌టుడే : భారతరత్న బిహార్ మాజీ ముఖ్యమంత్రి కర్పూరి ఠాగూర్ వర్ధంతి సభను మంగళవారం స్థానిక నాయీబ్రాహ్మణ సంక్షేమ సంఘం జిల్లా కార్యాలయంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆ సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు ప్రసాద్ అధ్యక్షత వహించారు. ఠాగూర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆ సంఘం ప్రధాన కార్యదర్శులు చంద్రశేఖర్, రాణాప్రతాప్, నగర అధ్యక్షుడు శ్రీనివాసులు, ఆదినారాయణ, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఊపిరి బిగపట్టుకోవాల్సిందే!

ఐపీలోని జనరల్ మెడిసిన్ విభాగం వద్ద పేరుకుపోయిన వ్యర్థాలు

రిమ్స్‌ పారిశుద్ధ్య కార్మికులు విధులు బహిష్కరించడంతో ప్రతి వార్డులో చెత్త, వ్యర్థాలు పెద్ద ఎత్తున పేరుకుపోయాయి. రక్తపు గాయాలు శుభ్రం చేసిన దూది, వస్త్రం, కట్లు కట్టిన వస్త్రం, తినుబండారాలు తదితర వ్యర్థాలతో చెత్త కుండీలు నిండిపోయాయి. ఎవరూ వాటిని తరలించకపోవడంతో పరిసరాలు ముక్కుపుటాలు అదిరేపోయేలా దుర్వాసన వెదజల్లుతున్నాయి. ఊపిరి బిగపట్టుకుని వార్డుల్లో తిరగాల్సిన దుస్థితి నెలకొంది. దీంతో రోగులకు ఇన్‌ఫెక్షన్‌లు వస్తాయని వైద్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రత్యామ్నాయ సిబ్బందిని ఏర్పాటు చేసి పారిశుద్ధ్య పనులు చేపట్టాలని రోగులు కోరుతున్నారు.

- న్యూస్‌టుడే, సర్వజన ఆసుపత్రి

ఓపీలో జనరల్ మెడిసిన్ విభాగంలో అధ్వానంగా పరిసరాలు

SHRIRAM Finance

శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్

రిజిస్టర్డ్ ఆఫీస్: శ్రీ టవర్స్, ప్లాట్ నెం.14ఎ, సౌత్ ఫేజ్, ఇండస్ట్రియల్ ఎస్టేట్, గిండీ, చెన్నై- 600032, వెబ్‌సైట్: www.shriramfinance.me. బ్రాంచ్ కార్యాలయము : డి.నెం.19/228 & 229, 2వ అంతస్తు, బివిఆర్ టవర్స్, గోకుల్ టవర్స్ ఎదురుగా, కడప

డిమాండ్ నోటీసు

శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ (గతంలో శ్రీరామ్ సిటీ యూనియన్ ఫైనాన్స్ లిమిటెడ్‌గా ఉండి శ్రీరామ్ ట్రాన్స్‌పోర్టు ఫైనాన్స్ లిమిలెడ్‌తో విలీనమైన తరువాత ఎన్‌సిఎల్‌టి బెంచ్-2 చెన్నై తేది: 09.11.2022వారి ఆదేశాలతో శ్రీరామ్ ఫైనాన్స్ లిమిలెడ్ గా రూపాంతరం చెందిన తర్వాత కార్పొరేట్ ఫైనాన్స్ మంత్రిత్వ శాఖ లేఖ తేది: 30.11.2022 ద్వారా శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్‌గా పేరు మార్పునకు ఆమోదము లభించినది) ఈ కంపెనీ కంపెనీల చట్టం, 2013 క్రింద రిజిష్టరు కాబడినది మరియు ఆర్‌బిఐ నందు కూడా నాన్ బ్యాంకింగ్ ఫైనాన్స్ వ్యాపార కార్యకలాపాలు నిర్వహించుటకు రిజిష్టరు కాబడి వారి రిజిష్టరు కార్యాలయం: శ్రీ టవర్స్, ప్లాట్ నెం.14ఎ, సౌత్ ఫేజ్, ఇండస్ట్రియల్ ఎస్టేట్, గిండీ, చెన్నై-600032 నందు నమోదు కాబడినదని తెలియజేయడమైనది. బ్రాంచ్ కార్యాలయము: కడప-1 (ఇకపై కంపెనీ / లెండర్‌గా వ్యవహరించబడతారు)

ఈక్రింద పేర్కొన్న రుణగ్రహీత /సహరుణగ్రహీతలు / గ్యారంటీదారులు శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ (ఎస్ఎఫ్ఎల్) వారి వద్ద రుణ సౌకర్యము పొంది ఉన్నారు. రుణ సౌకర్యము పొందిన తర్వాత సదరు రుణగ్రహీతలు/ గ్యారంటీదారులు రుణము మరియు దానిపై వడ్డీని తిరిగి చెల్లించుటలో పలుమార్లు విఫలమైనారు.కావున సదరు అకౌంట్ రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా నియమ నిబంధనలు అనుసరించి నిరర్థక ఆస్తులుగా వర్గీకరించబడినది. తదుపరి శ్రీరామ్‌ఫైనాన్స్ లిమిటెడ్ (ఎస్ఎఫ్ఎల్) యొక్క అధీకృత అధికారి గారు సెక్యూరిటీ మరియు ఆర్థిక ఆస్తుల పునర్నిర్మాణం మరియు భద్రతా చట్టం, 2002 నిబంధన క్రింద సెక్యూరిటైజేషన్ మరియు రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ మరియు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 (సదరు యాక్ట్) మరియు దాని ద్వారా ఆపాదించబడిన అధికారాలను బట్టి రూలు 3తో చదువబడిన సెక్షన్ 13(2) ప్రకారం సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) నియమాల (పేర్కొన్న నియమాలు) ను అనుసరించి ఋణగ్రహీత / గ్యారంటీదారులు /తనఖాదారులకు డిమాండ్ నోటీసును మరియు దానిపై అంగీకరింపబడిన వడ్డీ రేటుతో పాటు ఉత్పన్నమగు ఖర్చులు, ఇతర ఛార్జీలను నోటీసు అందుకున్న 60 రోజులలోపు చెల్లించవలసినదిగా కోరి వున్నారు.

వారు చివరగా తెలిపిన అడ్రసుకు జారీ చేసిన సదరు నోటీసు వారికి చేరక రిటర్న్ అయినది. కావున ఇందుమూలముగా పబ్లిక్ నోటీసు ద్వారా వారికి సదరు విషయము తెలియజేయడమైనది. సదరు చట్టములో సెక్షన్ 13 యొక్క సబ్‌సెక్షన్(8) ద్వారా రుణగ్రహీతకు తెలియజేయడమేమనగా సెక్యూర్డ్ ఆస్తులను విడిపించుకొనుటకు గల అవకాశమును వారి దృష్టికి తీసుకురావడమైనది.

రుణగ్రహీతలు, సహ రుణగ్రహీతలు, గ్యారంటీదారుల పేర్లు మరియు చిరునామా

1) ఎన్.గురునాథ్ తండ్రి ఎన్.గురుదేవ, డి.నెం.2-2275, శాస్త్రి నగర్, అక్కాయపల్లి, రవీంద్ర నగర్, కడప - 516003
2) వీణ నాగెళ్ళ, భర్త ఎన్.గురునాథ్, డి.నెం.2-2275, శాస్త్రి నగర్, అక్కాయపల్లి, రవీంద్ర నగర్, కడప - 516003
3) నాగెళ్ళ బాలక్రిష్ణ, తండ్రి ఎన్.గురుదేవ, డి.నెం.2-2275, శాస్త్రి నగర్, అక్కాయపల్లి, రవీంద్ర నగర్, కడప - 516003

ఎన్‌పిఏ తేది: 07.09.2024 డిమాండ్ నోటీసు తేది: 17.01.2026
ఋణ మొత్తం రూ.50,00,000 (యాభై లక్షల రూపాయలు మాత్రమే)
రుణఅగ్రిమెంట్ నెం. CUDP2TF2309060008
బకాయి అమౌంట్: రూ.49,12,731/- (నలభై తొమ్మిది లక్షల పన్నెండు వేల ఏడు వందల ముప్పై ఒక్క రూపాయలు మాత్రమే)

స్థిరాస్తి వివరములు

ఐటం నెం.1: పత్రంనెం.5101/2014లోని ఆస్తి వివరములు:-వైయస్ఆర్ కడప జిల్లా కడప రిజిస్ట్రేషన్ జిల్లా, కడప అర్బన్ సబ్ జిల్లా, కడప సిటీ మరియు మున్సిపల్ కార్పొరేషన్ ఏరియా, అక్కాయపల్లి శాంతినగర్, సర్కారు మెట్ట డి.నెం.43/1లో ఎ.7.23సెంట్లు ఇందున ఎ.0.25సెంట్లలో ఎ.0.16 1/2 సెంట్లలో ఎ.0.05 సెంట్లు లేదా 0.20హెక్టార్లు గల ప్లాటు నెం.1 మరియు ఇందున నిర్మించిన డి.నెం.2/227-5-2 & 2/227-5-3, మున్సిపల్ కార్పొరేషన్ డి.నెం.57/227-5-2 & 57/227-5-3, అసెస్‌మెంట్ నెం.1013050887 & 1013050890 గల ఆర్‌సిసి ఇల్లు.హద్దులు: తూర్పు: ఎన్.సరస్వతి & ఎన్.లక్ష్మి యొక్క ప్లాటు నెం.2లోని స్థలం, పడమర: ఎస్.చాన్‌బాషా ఇల్లు ఉత్తరం: డ్రైనేజి కాలువ, దక్షిణం: రోడ్డు, ఈ హద్దుల మధ్య తూర్పు నుండి పడమర: ఉత్తరం వైపు 61 లింకులు లేదా 12.40 మీ. దక్షిణం వైపు: 62 లింకులు లేదా 12.60 మీ. మరియు ఉత్తరం నుండి దక్షిణం: తూర్పు వైపు 79 లింకులు లేదా 16.06మీ. పడమర వైపు: 82 లింకులు లేదా 16.67మీ. వెరశి ఎ.0.05 సెంట్లు లేదా 242 చ.గ. స్థలం మరియు ఇందున నిర్మించిన ఆర్‌సిసి బిల్డింగ్‌కు కొలతలు: తూర్పు నుండి పడమర: 38అ. లేదా 11.59మీ. వెరశి 1444 చ.అ. అన్ని ఫిక్చర్లు మరియు అనుబంధ స్థలంలోని టాప్ కనెక్షన్, మోటారు మరియు దక్షిణం వైపునున్న దారి హక్కుతో సహా.

ఐటం నెం.2: పత్రంనెం.1789/2015లోని ఆస్తి వివరములు:-వైయస్ఆర్ కడప జిల్లా కడప రిజిస్ట్రేషన్ జిల్లా, కడప అర్బన్ సబ్ జిల్లా, కడప సిటీ మరియు మున్సిపల్ కార్పొరేషన్ ఏరియా, అక్కాయపల్లి శాంతినగర్, సర్కారు మెట్ట డి.నెం.43/1లో ఎ.7.23సెంట్లు ఇందున ఎ.0.25సెంట్లలో ఎ.0.16 1/2 సెంట్లలో ఎ.0.05 సెంట్లలో ఎ.0.02 1/2 సెంట్లు లేదా 0.10హెక్టార్లలోని పడమర వైపునున్న ప్లాటు నెం.2 హద్దులు: తూర్పు: నాగెళ్ళ బాలక్రిష్ణ స్థలం, పడమర: ఐటంనెం.1లో చూపిన ఆస్తి, ఉత్తరం: డ్రైనేజి కాలువ, దక్షిణం:14అ. వెడల్పు గల రోడ్డు, ఈ హద్దుల మధ్య తూర్పు నుండి పడమర: ఉత్తరం వైపు 31 1/2 లింకులు లేదా 6.34 మీ. దక్షిణం వైపు: 32 లింకులు లేదా 6.44 మీ. మరియు ఉత్తరం నుండి దక్షిణం: తూర్పు వైపు 78 లింకులు లేదా 15.69 మీ. పడమర వైపు: 79 లింకులు లేదా 15.89మీ. వెరశి ఎ.0.02 1/2 సెంట్లు లేదా 121చ.గ. స్థలం అన్ని ఫిక్చర్లు మరియు అనుబంధ స్థలం, దక్షిణం వైపునున్న దారి హక్కుతో సహా.

ఈ పరిస్థితులలో రుణగ్రహీతలు, సహ రుణగ్రహీతలు మరియు గ్యారంటీదారులకు తెలియజేయడమేసగా ఈ పత్రికా ప్రకటన వెలువడిన రోజు నుండి 60 రోజులలోపు పైన పేర్కొన్న ఋణ మొత్తము భవిష్యత్ వడ్డీతోపాటు మరియు ఇతర ఖర్చులను చెల్లించవలెను. 60 రోజుల వ్యవధి దాటిన తర్వాత సెక్యూరిటైజేషన్ మరియు రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ మరియు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 యొక్క సెక్షన్ 13(4)ను అనుసరించి రుణగ్రహీత, తనఖాదారుకు చెందిన సెక్యూర్డ్ ఆస్తులను స్వాధీన పరచుకొనుటకు చర్యలు చేపట్టబడునని తెలియజేయడమైనది.

సదరు చట్టంలోని సెక్షన్13(13)ను అనుసరించి రుణగ్రహీతకు చెందిన సెక్యూర్డ్ ఆస్తులపై మా సంస్థ ముందస్తు అనుమతి లేకండా ఇతరులకు బదలాయించుట, అమ్మకము మరియు లీజుకు ఇవ్వడం ఇంకా ఏ ఇతర లావాదేవీలు చేయరాదని తెలియజేయడమైనది.

ప్రదేశం: కడప సం/- అధీకృత అధికారి,
తేది: 17.02.2026 శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్

(c) eenadu